ఈనాడు అల్లూరి సీతారామరాజు
మంగళవారం 30 డిసెంబరు 2025


# రంపచోడవరం కేంద్రంగా పోలవరం

ఈనాడు డిజిటల్, పాడేరు - న్యూస్‌టుడే, రంపచోడవరం

**పరిపాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లా**

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల సరిహద్దుల మార్పులు, చేర్పులు, కొత్త డివిజన్ల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు సోమవారం మంత్రులు, అధికారులతో మరోసారి సమీక్షించారు. జిల్లా ఏర్పాటుపై ఎటువంటి అభ్యంతరాలు లేకపోవడంతో మార్గం సుగమమైంది. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాలైన రంపచోడవరం నియోజకవర్గంలోని 12 మండలాలు, పోలవరం ముంపు ప్రభావిత మండలాలను కలిపి పోలవరం జిల్లాగా ఏర్పాటు చేసింది. ఈ నెల 31 తుది నోటిఫికేషన్ వెలువడనుంది. నూతన సంవత్సరం నుంచి రంపచోడవరం కేంద్రంగా కొత్త జిల్లా పాలన ప్రారంభంకానుంది.

● రంపచోడవరం నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న 11 మండలాలు, కొత్తగా ఏర్పడిన గుర్తేడు మండలంతో కలిపి పోలవరం జిల్లాను ఏర్పాటు చేశారు. రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, గంగవరం, వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలున్నాయి. చింతూరు డివిజన్‌లో చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, ఎటపాక మండలాలు ఉన్నాయి. రెండు డివిజన్లలోనూ ఐటీడీఏలు ఏర్పాటయ్యాయి. పోలవరం నియోజకవర్గానికి సంబంధించి పోలవరం, ఏలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాలున్నాయి. ప్రభుత్వం నిర్ణయంతో స్థానికంగా ఆదివాసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సంక్షిప్తంగా..**

| | |
|---|---|
| నియోజకవర్గం | రంపచోడవరం |
| మండలాలు | 11 |
| రెవెన్యూ డివిజన్లు | 2 |
| పంచాయతీలు | 186 |
| గ్రామాలు | 827 |
| జనాభా | 3,49,799 |
| పురుషులు | 1,70,465 |
| మహిళలు | 1,79,394 |

● గిరిజన నియోజకవర్గాలైన రంపచోడవరం, పోలవరంలో ఎటువంటి పరిశ్రమలు లేవు. వీరు అటవీ ఉత్పత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కొంతమంది గిరిజనులు పనుల కోసం విజయవాడ, హైదరాబాద్ తదితర పట్టణాలకు వలసపోతున్నారు. కూటమి ప్రభుత్వం తాజాగా ఈ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసింది. తద్వారా గిరిజనుల తలరాతలు మారనున్నాయి. నూతన జిల్లా ఏర్పాటుతో రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది. తద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

రంపచోడవరం ప్రధాన రహదారి

● **పోలవరం పేరు ఎందుకంటే..:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో రంపచోడవరం నియోజకవర్గాన్ని విలీనం చేయడం వల్ల ఇక్కడ ప్రజలు జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్లాలంటే 350 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాం. కొత్తగా ఏర్పాటయ్యే పోలవరం జిల్లాలో రంపచోడవరం నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన గుర్తేడు మండలంతో కలిపి 12 మండలాలే ఉన్నాయి. పోలవరం జాతీయ ప్రాజెక్టు కావడంతో జిల్లాకు పోలవరం పేరు పెట్టారు. **– శిరీషాదేవి, ఎమ్మెల్యే**

## ఉపాధ్యాయినులకు నిక్‌నేమ్స్.. విద్యార్థినికి దండన

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో నలుగురు ఉపాధ్యాయినులు ఓ విద్యార్థిని విచక్షణారహితంగా దండించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తొమ్మిదో తరగతి విద్యార్థిని కొంతమంది విద్యార్థినులతో ఉపాధ్యాయినులకు నిక్‌నేమ్స్ సూచిస్తూ ఓ కాగితంలో రాసింది. ఈ విషయం ఓ ఉపాధ్యాయిని దృష్టికి వెళ్లింది. కాగితంలో పేర్లున్న నలుగురు ఉపాధ్యాయినులు తొమ్మిదో తరగతి విద్యార్థినిని పిలిచి ఒకరి తర్వాత ఒకరు కర్రతో కొట్టారు. సమాచారం అందుకున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం పాఠశాలకు చేరుకుని ఆందోళన చేశారు.

# వైఢూర్యాల వేట.. అక్రమాల మేట

**గనులను కొల్లగొట్టేందుకు నిబంధనల ఉల్లంఘనలు**

ఈనాడు డిజిటల్, పాడేరు

గూడెంకొత్తవీధి మండలంలో సిగనాపల్లి రంగురాళ్ల క్వారీలో అక్రమాలు కొండలా పెరిగిపోతున్నాయి. అధికారుల్లో ఏ ప్రమత్తత ఉన్నా, స్థానికంగా అధికారులు ఎవరున్నా తవ్వకాలు ఆగడం లేదు. అవకాశం చిక్కినప్పుడు.. సందర్భం కలిసొచ్చినప్పుడు అక్రమార్కులంతా ఏకమై వాహనంలో నీరలా తవ్వకాలు సాగిస్తున్నారు. ఇక్కడి రత్నం అటవీ ప్రాంతంలోని ఎత్తయిన కొండపై ఉన్న క్వారీలో అలెక్స్ రకానికి చెందిన వైఢూర్యాలు లభిస్తుంటాయి. మార్కెట్‌లో వీటికి అధిక ధర పలుకుతుంది.

సిగనాపల్లి రంగురాళ్ల క్వారీ ప్రాంతం పూర్తిగా అటవీ శాఖ పరిధిలో ఉంది. గతంలో చింతపల్లి రేంజ్ పరిధిలో ఉండేది. ఇటీవల పెదవలస రేంజ్ పరిధిలోకి వచ్చింది. కొండపై అటవీ సిబ్బంది కాపలా ఉంచుతున్నా తవ్వకాలకు అడ్డుకట్ట పడకపోవడం గమనార్హం. అర్ధరాత్రి అడవిలోకి పదుల సంఖ్యలో గుర్తుతెలియని వ్యక్తులు గుంపులుగా వచ్చి తవ్వకాలకు పాల్పడుతున్నారు. ప్రాణ భయంతో తామేమీ చేయలేని పరిస్థితి నెలకొంటోందని కాపలా సిబ్బంది చెబుతున్నారు. ఒక్కోసారి కాపలా సిబ్బందిని ప్రలోభపెట్టడంలోనూ వ్యాపారులు ముందుంటున్నారు. ఈ వ్యవహారంలో వైకాపా నాయకులు చక్రం తిప్పుతున్నారు. సిగనాపల్లిలో తవ్వకాలకు సంబంధించి ఇటీవల గూడెంకొత్తవీధి పోలీసులు 18 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వారిలో వైకాపాకు చెందిన సర్పంచి భర్త, మరో మద్యం వ్యాపారి ఉన్నారు.

సిగనాపల్లి రంగురాళ్ల క్వారీ ప్రదేశంలో అటవీ సిబ్బంది విధులు

**చట్టంలో లొసుగులే అవకాశం:** రంగురాళ్ల తవ్వకాల విషయంలో ఇటు పోలీసులు.. అటు అటవీ అధికారులు కేసులు నమోదు చేస్తున్నా అవి బలహీనంగా ఉండటంతో నిందితులు సునాయాసంగా బయటకు వచ్చేస్తున్నారు. అసలు జైలుకెళ్లే అవసరమే లేకుండా పూచీకత్తులు, బైండోవర్లతో బయట పడుతున్నారు. ఏడేళ్లలోపు శిక్షపడే కేసుల్లో నిందితులకు 41 నోటీసులు ఇవ్వడం, సొంత పూచీకత్తుపై స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం చట్టంలో ఉంది. దీన్ని ఆసరాగా తీసుకుని నిందితులు కేసులను లెక్క చేయడం లేదు.

**గిరిజనులే బలిపశువులు:** రంగురాళ్ల తవ్వకాల్లో గిరిజనులను వ్యాపారులు పావులుగా వాడుకుంటున్నారు. ఎత్తయిన కొండపై రాత్రివేళల్లో ప్రమాదకరంగా తవ్వకాలు చేపట్టిస్తున్నారు. మట్టిపెళ్లలు విరిగిపడినా, క్వారీలోపల ఊపిరాడక పోయినా ప్రాణాలు కోల్పోయే పరిస్థితి. గతంలో మట్టిపెళ్లలు పడి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలపై అప్పటి ప్రభుత్వం తీవ్రంగా స్పందించి పలువురిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే.

**నిరంతర నిఘా:** క్వారీపై నిరంతర నిఘా కొనసాగుతోంది. ఇటీవల తవ్వకాలకు పాల్పడిన గిరిజనులు, వ్యాపారులు 14 మందిపై 1967 అటవీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశాం. తవ్వకాల విషయంలో అటవీ సిబ్బంది పాత్రపైనా సమగ్ర విచారణ నిర్వహిస్తున్నాం. తహసీల్దారు ఆదేశాలతో క్వారీ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. – వైవీ నరసింహారావు, డీఎఫ్‌వో, చింతపల్లి

# సాంకేతికతతో నేర నియంత్రణ

**వార్షిక సమీక్షలో ఎస్పీ అమిత్‌బర్దార్**

పాడేరు, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించి నేరాల నియంత్రణకు చర్యలు చేపడతామని ఎస్పీ అమిత్ బర్దార్ చెప్పారు. పాడేరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో వార్షిక నేర సమీక్ష నిర్వహించారు. 2025 నేర గణాంకాల నివేదికను వెల్లడించారు. ఇంటెలిజెన్స్ సమాచారం, తక్షణ స్పందన, బలగాల మోహరింపు, సమర్థంగా బీట్ వ్యవస్థ, స్పెషల్ డ్రైవ్, విజిబుల్ పోలీసింగ్, ఆధునిక సాంకేతికత, శాఖల సమన్వయంతో జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దార్, ఓఎస్డీ పంకజ్‌కుమార్ మీనా, డీఎస్పీలు నవజ్యోతిమిశ్రా, హేమంత్, అభిషేక్, సాయిప్రశాంత్

■ 'గతేడాది కంటే క్రైం రేటు ఈ ఏడాది 24 శాతం తగ్గింది. హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, మహిళలపై నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఎన్‌డీపీఎస్, ఐపీసీ తదితర విభాగాల్లో నమోదైన గణాంకాల'ను ఎస్పీ వెల్లడించారు.

■ '2025లో గంజాయి కేసులు 135 నమోదయ్యాయి. 14,484.38 కేజీల గంజాయి, 35.61 కేజీల ద్రవ గంజాయి పట్టుబడింది. 350 మంది నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచాం. మత్తు పదార్థాల వినియోగం వల్ల అనర్థాలపై పాఠశాలలు, కళాశాలల్లో 253 అవగాహన సదస్సులు నిర్వహించాం. 1,596 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాం'.

■ '138 గ్రామాల్లో గంజాయి సాగును అరికట్టి 325 కుటుంబాలు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టేలా ప్రోత్సహించాం. జిల్లా వ్యాప్తంగా 29,841 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు పండ్లమొక్కలు పంపిణీ చేశాం. 30,005.65 కేజీల గంజాయి, 35.26 కేజీల ద్రవ గంజాయిని దహనం చేశాం. గంజాయి కేసుల్లో నిందితులకు చెందిన రూ.4.41 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నాం. 41 పీఐటీ-ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేయగా 11 కేసుల విచారణ పూర్తయి శిక్షలు ఖరారయ్యాయి'.

■ '2024-25లో చేపట్టిన భద్రతా చర్యల వల్ల మావోయిస్టులకు సంబంధించి ఆంధ్రా ఒడిశా సరిహద్దులోని స్పెషల్ జోనల్ కమిటీ (ఎస్‌జెడ్‌సీ) నాయకత్వం పూర్తిగా దెబ్బతింది. 16 ఎదురుకాల్పుల ఘటనల్లో 18 మంది మావోయిస్టులు మృత్యువాత పడ్డారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. 49 మంది లొంగిపోయారు'.

■ 'స్ఫూర్తి, చేయూత, ప్రేరణ, నిర్మాణ్, సరళ్, క్రీడా పోటీలు, సంజీవని వైద్య శిబిరాలు, మైత్రి సమావేశాలతో గిరిజన యువత దృక్పథంలో మార్పు వచ్చింది. రైతులకు విత్తనాలు, రాయితీపై ట్రాక్టర్లు అందించారు. శక్తి యాప్ ద్వారా మహిళలకు తక్షణ సాయం అందుతోంది. సైబర్ నేరాల బారిన పడకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో మోసాల సంఖ్య తగ్గింది'.

■ 'గతేడాదితో పోలిస్తే రోడ్డు ప్రమాదాలు 14 శాతం తగ్గాయి. ఐదు కేసుల్లో జీవిత ఖైదు, ఒక కేసులో 20 ఏళ్లు, రెండు కేసుల్లో పదేళ్ల జైలు శిక్ష పడింది. లోక్‌అదాలత్‌లో 843 కేసులు పరిష్కారమయ్యాయి'.

■ 'జిల్లా వ్యాప్తంగా 530 సీసీ కెమెరాలు ఏర్పాటయ్యాయి. ఆరు డ్రోన్లు వినియోగంలో ఉన్నాయి. 60 పోక్సో కేసుల్లో ఛార్జిషీట్ వేశారు. 73 మందిని రౌడీషీట్ తెరిచాం. పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో మూడు నెలలుగా రద్దీ పెరిగింది. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

## కోలాటాలు.. చెట్టు భజనలు

హిందూ సమ్మేళనంలో భాగంగా సీలేరు పరిసర ప్రాంతాల్లోని ఐదు పంచాయతీలకు చెందిన గిరిజనులు ధారకొండలో కోలాటాలు, ధింసా నృత్యాలు, చెట్టు భజనలతో సోమవారం సందడి చేశారు. సమాజం, సనాతన ధర్మ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని, హిందువులంతా ఏకతాటిపైకి రావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఉమ్మడి విశాఖ జిల్లా ప్రచారక్ వెంకటరమణ పిలుపునిచ్చారు. భగవన్నామస్మరణతో శాంతి కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. – న్యూస్‌టుడే, సీలేరు

## కనులపండువగా తెప్పోత్సవం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: శ్రీరామగిరి రాములోరు సోమవారం అర్చకుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పావన గోదావరిపై విహరించారు. తొలుత ఆలయంలో మూలవరులకు, ఉత్సవరులకు అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవరులను పల్లకీలో ఉంచి కొండపై నుంచి గోదావరి తీరం వరకు భక్తజనుల జయజయధ్వానాలు, బాజాభజంత్రీలు, విద్యార్థుల కోలాటాలు, నృత్యాలతో ఊరేగించారు. గోదావరిలో తెప్పోత్సవానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోటులో ఉంచిన అర్చకుల బృందం శాస్త్రోక్తంగా తెప్పోత్సవ పూజలు చేసి, భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. సర్పంచి సంతోశ్, తహసీల్దారు సరస్వతి, ఆలయ కమిటీ ఛైర్మన్ సుదర్శనరావు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోదారిలో తెప్పోత్సవం (అంతర చిత్రం) ఉత్సవ విగ్రహాలు

## గుడిసె దారి కాదు.. వైకుంఠగిరి మార్గం

ప్రకృతి సహజసిద్ధ అందాలకు మన్యం నెలవు. అల్లూరి సీతారామరాజు - విజయనగరం జిల్లాలకు సరిహద్దునున్న ఎగువ కొండపర్తి గ్రామంలోని వైకుంఠగిరి వేంకటేశ్వర ఆలయానికి చేరుకునే మార్గం మెలికలు తిరిగి ఇక్కడకు వచ్చే వారికి సాహస యాత్రలా ఉంటుంది. మారేడుమిల్లి మండలం గుడిసె కొండపైకి వెళ్లే దారిని తలపిస్తోంది. అనంతగిరి మండలం కాశీపట్నం నుంచి కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డులో 33 మలుపులున్నాయి. వంపులు తిరిగిన రహదారిని ఓ పర్యాటకుడు డ్రోన్ కెమెరాతో తీసిన చిత్రమిది. – న్యూస్‌టుడే, అనంతగిరి

## వ్యవసాయ యంత్రాలకు అధిక రుణ పరిమితి

పాడేరు, న్యూస్‌టుడే: వ్యవసాయ యంత్రాల కొనుగోలుకు రైతులకు రుణ పరిమితి పెంచాలని కలెక్టర్ దినేష్‌కుమార్ బ్యాంకు అధికారులను కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన లీడ్ బ్యాంకు (యూనియన్ బ్యాంకు) ఆధ్వర్యంలో బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా ఉన్న ప్రతి రైతుకి రుణం ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. కౌలు రైతులకు, పశు సంవర్ధక, ఫిషరీస్, పట్టు పరిశ్రమలకు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను ఇన్‌ఛార్జి జేసీ శ్రీపూజ వివరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు డిజిటల్ ఎంసీపీ ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో త్వరలో గ్రామీణ స్వయం ఉపాధి కేంద్రాన్ని అరకులోయలో ప్రారంభించనున్నట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ మాతునాయుడు తెలిపారు. యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# కదిలే రైలును కమ్మేసిన నిప్పు

**సకాలంలో స్పందించిన యంత్రాంగం**

**✦ యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు**

అర్ధరాత్రి.. పట్టాలపై రైలు పరుగు తప్ప మరో శబ్దంలేదు.
అంతా అలసిసొలసి ఆదమరిచి నిద్రిస్తున్న వేళ..
ఉన్నట్టుండి కలకలం.. మంటలు అంటుకున్నాయనే కేకలు..
రైలు ఎక్కడాగిందో, ఏ ఊరు చేరిందో తెలియదు..
గబగబా రైలు దిగి చూస్తే.. కొద్దినిమిషాల క్రితం వరకు
తాము ప్రయాణించిన రైలులో అంతెత్తు మంటలు..
నోటమాట రాక అంతా భయంగా చూస్తుండిపోయారు.
ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఆదివారం అర్ధరాత్రి నాటి దృశ్యమిది.

కాలిపోయిన బోగీ, రైల్వే స్టేషన్‌లో భయంభయంగా ప్రయాణికులు

■ అగ్నిమాపక సిబ్బంది ఆగమేఘాలపై తరలివచ్చారు. ఎలమంచిలి నుంచి శకటం వెనువెంటనే చేరుకుంది. దీనికితోడు అనకాపల్లి నుంచి రెండు, నక్కపల్లి నుంచి ఒకటి చొప్పున అగ్నిమాపక వాహనాలు రప్పించారు. వీరంతా దాదాపు రెండుగంటలు పాటు నిర్విరామంగా శ్రమించి ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ఈనాడు డిజిటల్ అనకాపల్లి, ఎలమంచిలి న్యూస్‌టుడే: 'టాటా-ఎర్నాకుళం' ఎక్స్‌ప్రెస్‌లో అగ్నికీలలు రేగి రెండు బోగీలు దగ్ధమైన ఘటన సంచలనం కలిగించింది. ఈ రైలులోని బీ1, ఎం2 బోగీలకు నిప్పంటుకోవడం గమనించి హుటాహుటిన రైలులోని ప్రయాణికులందరినీ కిందకు దించేశారు. ఓపక్క వణికించే చలి.. మరోపక్క ఏం జరుగుతోందో తెలియక ప్రయాణికులంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. విపత్తును గుర్తించి ప్రయాణికులను అప్రమత్తం చేయడం మొదలు.. నష్టతీవ్రత పెరగకుండా నివారించడం, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు అందించడంలో యంత్రాంగం సఫలమైంది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే రైల్వే, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, అధికారులు సకాలంలో స్పందించారు. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సొనాకియా, ప్రత్యేక రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, రైల్వే డీఐజీ బి.సత్యఏసుబాబు, జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, కలెక్టర్ విజయ్‌కృష్ణన్ తదితరులు చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు.

■ పూర్తిగా కాలిపోయిన బోగీలతోపాటు పాక్షికంగా కాలిపోయిన బోగీలను రైలు నుంచి తప్పించారు. ఆ బోగీల్లో ప్రయాణికులను తరలించడానికి మూడు ఆర్టీసీ బస్సులను రప్పించారు. వాటిల్లో సామర్లకోట తరలించారు. మిగిలిన ప్రయాణికులను ఎక్కించుకుని రైలు బయలుదేరింది. రైళ్ల రాకపోకలు ఆలస్యం కాకుండా, పక్క ట్రాక్‌పై వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. 3.20 గంటలకు తిరుపతి-బిలాస్‌పూర్ రైలు ఎలమంచిలి స్టేషన్ మీదుగా వెళ్లింది.

సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న అధికారులు

■ ప్రయాణికులతో స్టేషన్ ఆవరణ కిక్కిరిసింది. సీఐ ధనుంజయరావు సహాయక చర్యలకు ఆటంకం లేకుండా ప్రయాణికులు అందరినీ బయటకు పంపించారు. ఎవరైనా గాయపడితే వెంటనే వైద్యసేవలందించేలా అంబులెన్స్‌లు రప్పించారు.

**ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ**
**పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా - 531024**

ఐఆర్‌సీఎస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖవారు ఆర్‌ఈసీ ఫౌండేషన్ సహకారంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు సంవత్సరాల కాలానికి అమలు చేయనున్న 'మీ ఇంటికి – మీ డాక్టర్' ప్రాజెక్టు కోసం క్రింది పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.

❖ **డాక్టర్** - అర్హత: MBBS/MD, నెలవారీ వేతనం: రూ.80,000
❖ **నర్స్** అర్హత: GNM / B.Sc, నెలవారీ వేతనం: రూ.25,000
❖ **ఫార్మసిస్ట్** - అర్హత: B. Pharma / డిప్లొమా ఇన్ ఫార్మసీ ☛ నెలవారీ వేతనం రూ. 18,000
❖ **డ్రైవర్** - హైవే వాహనాల డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. కనీసం ఐదు సంవత్సరాల అనుభవం అవసరం. నెలవారీ వేతనం: రూ.18,000

పై పోస్టులలో డాక్టర్, నర్స్, ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో కూడిన దరఖాస్తులను ircspdr@gmail.com మరియు redcrossap@gmail.com అనే ఈమెయిల్ ఐడీలకు **15 జనవరి 2026 లోపు** పంపవలసిందిగా కోరడమైనది.

**జిల్లా కలెక్టర్ మరియు ప్రెసిడెంట్**
IRCS, అల్లూరి సీతారామరాజు జిల్లా
Cell: 9441334001, 9441415881

## జి.మాడుగులలో 5.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రాజవొమ్మంగిలో దట్టంగా కురుస్తున్న మంచు

చింతపల్లి, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: జిల్లాలో చలితీవ్రత కొనసాగుతోంది. కొద్దిరోజులుగా మన్యం వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పాడేరు, అరకులోయతోపాటు రంపచోడవరం డివిజన్‌లోని రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం మండలాల పరిధిలో జాతీయ రహదారిపై మంచు వర్షంలా పడుతోంది. జి.మాడుగులలో సోమవారం ఉదయం 5.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి చెప్పారు. ముంచంగిపుట్టులో 6.9, అరకులోయ 8.0, పెదబయలు 9.4, చింతపల్లి 10.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు. ఉదయం 8.30 గంటల దాటినా 516-ఈ రహదారిపై మంచు తెరలు తొలగలేదు. వాహన చోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు వెళ్లే 516-ఈ రహదారిపై పలుచోట్ల పొగమంచు అధికంగా ఉంటోందని, వాహనచోదకులు జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.

## ఉడెన్‌బ్రిడ్జి మూసివేతకు నోటీసులు

అరకులోయ, న్యూస్‌టుడే: ఆంధ్రా ఊటీ అరకులోయ పరిధిలోని సుంకరమెట్ట వద్ద చెక్క వంతెనను తాత్కాలికంగా మూసివేయాలని కోరుతూ అటవీశాఖ అధికారులకు నోటీసులు జారీచేసినట్లు ఎస్.ఐ. గోపాలరావు తెలిపారు. వంతెన వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంక్రాంతి వరకు దీన్ని మూసివేయాలని ఆ నోటీసులు పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెక్క వంతెన ప్రాంతంలో నిలిచిన వాహనాలు

## ప్రతి సమస్యకు పరిష్కారం చూపండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: సమస్యలపై గిరిజనులు అందించే వినతులు పరిశీలించి పరిష్కారం చూపాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సహాయ కలెక్టర్ సాహిత్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రుక్మాంగదయ్యతో కలిసి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై 78 వినతులు వచ్చాయి. రంపచోడవరం మండలం సీమగండి నుంచి వేములకొండ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కుర్ల అబ్బాయిరెడ్డి, కొండ్ల శ్రీదేవి, మెహర్‌వాణి, గంగాభవాని వినతిపత్రం ఇచ్చారు. మారేడుమిల్లి మండలం కుట్రవాడ నుంచి పాములేరు వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని సర్పంచి రమాదేవి ఆధ్వర్యంలో స్థానికులు పీవోకు విన్నవించారు. రాజవొమ్మంగి మండలం లోదొడ్డి గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, పంట పొలాలను నాశనం చేస్తున్నాయని రైతులు సోమరాజు, సన్యాసిరావు, శ్రీను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఏపీవో రమణ, వెటర్నరీ డీడీ షరీఫ్, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో సరిత, ఏడీ రామ్మోహన్, పీహెచ్‌వో దేవదానం, జీసీసీ డీఎం జయశ్రీ, తహసీల్దారు బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, పీఆర్ డీఈ వెంకటరమణ, గిరిజన సంక్షేమ జేఈ సత్యనారాయణ, డ్వామా ఏపీడీ శ్రీనివాస విశ్వనాథ్, డీఎల్‌డీవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వినతులు ఇచ్చేందుకు వచ్చిన వారితో మాట్లాడుతున్న పీవో స్మరణ్‌రాజ్, సహాయ కలెక్టర్ సాహిత్

మధురమే..మధురమే..మధురమే..
ఈ క్షణములు ఇంకా మధురమే..
**పదవీ విరమణ శుభాకాంక్షలు**
మీ కుటుంబసభ్యులు, మీ బంధుమిత్రులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి, అభినందన చందనాలు. వారి భావి జీవితం సుఖమయంగా సాగాలని ఆకాంక్షిస్తూ, ఈనాడు ద్వారా వారికి అందించండి, పదవీ విరమణ శుభాకాంక్షలు.
మరిన్ని వివరాలకు :
8008709638

(c) eenadu

## పాపికొండలకు ఆరు పర్యాటక బోట్లు

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి సోమవారం ఆరు పర్యాటక బోట్లలో 418 మంది పర్యాటకులు పాపికొండల సందర్శనకు వెళ్లారు. పోలీసుల తనిఖీలు అనంతరం కంట్రోల్ రూం అధికారులు బోట్లకు పచ్చజెండా ఊపారు. అమ్మవారి ఆలయం పరిసరాల్లో వరద తగ్గడంతో స్థానికులు దుకాణాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. దండంగి, చినరమణయ్యపేట, పూడిపల్లి ప్రాంతాల్లో నిర్వాసితులు మొక్కజొన్న సాగుకు సన్నద్ధమవుతున్నారు. సీతపల్లి వాగు మీదుగా రాకపోకలు ప్రారంభమయ్యాయి.

### ఘాట్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఘాట్ రోడ్డులో ప్రయాణించాలంటేనే గంటల సమయం పడుతోంది. ఉదయం అరకులోయ నుంచి వాహనాలు అధిక సంఖ్యలో దిగువకు రావడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తైడా జంగిల్ బెల్స్ నుంచి శివలింగపురం సమీపంలోని ఒకటో నంబరు మలుపు వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతగిరి కాఫీ తోటల నుంచి వాహనాలు రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. కొంత సమయం తరువాత స్థానికులే ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

### ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుతో నిలిచిన విద్యుత్తు

ముంచంగిపుట్టు గ్రామీణం: మాచ్‌ఖండ్ జల విద్యుత్కేంద్రం పరిధిలోని మూడు క్యాంపుల్లో సోమవారం విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు కేంద్రంలో లోకల్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం 10.45 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఒనకడిల్లీ, మాచ్‌ఖండ్, జోలాపుట్ క్యాంపులకు సరఫరా నిలిపివేశారు.

### అక్రమ అరెస్టు తగదు

పాడేరు పట్టణం: సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి అప్పలరాజు అక్రమ అరెస్టు తగదని అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స పేర్కొన్నారు. అయనపై నమోదు కేసులను రద్దు చేయాలని ఒక ప్రకటనలో డిమాండు చేశారు.

# బౌండరీల మోత.. పరుగుల వరద..

ఉత్సాహంగా 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్'(ఈఎస్ఎల్)-2025

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానంలో 'ఈనాడు - ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో జరుగుతున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025' టోర్నీలో సోమవారం బ్యాటర్లు పరుగుల వరద పారించారు. వచ్చిన బంతిని వచ్చినట్టుగా చితక్కొడుతూ బౌండరీల మోత మోగించారు. తక్కువ బంతుల్లో అత్యధిక స్కోర్లు నమోదు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. 'ధనిక్ భారత్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే'గా కైట్స్ జూనియర్ కళాశాల క్రీడాకారుడు కె.ఆర్యన్ సోనీ మెరిశాడు.

**➠ శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల వర్సెస్ వీడీఏ డిగ్రీ కళాశాల జట్టు:** ఈ మ్యాచ్‌లో శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు 23 పరుగుల తేడాతో వీడీఏ డిగ్రీ కళాశాలపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. జట్టులో ఎన్.సతీష్ 28, ఐ.సుధీర్ 25 పరుగులు చేశారు. వీడీఏ డిగ్రీ కళాశాల బౌలర్ జి.నందన్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వీడీఏ డిగ్రీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. జట్టులో వి.వినయ్ 29 పరుగులు చేశాడు. శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు బౌలర్లు ఎస్.సంపత్, ఐ.సుధీర్ చెరో 2 వికెట్లు తీశారు.

గెలుపొందిన శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు

**➠ కైట్స్ జూనియర్ కళాశాల వర్సెస్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల:** ఈ మ్యాచ్‌లో కైట్స్ జూనియర్ కళాశాల జట్టు 61 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆ జట్టు బ్యాటర్లు చెలరేగడంతో 10ఓవర్లలో రెండు వికెట్లకు 126 పరుగులు చేసింది. కె.ఆర్యన్ సోనీ అత్యధికంగా 30 పరుగులు, సీహెచ్.తేజేశ్వర్ 25 పరుగులు చేశారు. ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల జట్టు బౌలర్ రవీంద్ర ఒక వికెట్ తీశాడు. అనంతరం భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి కేవలం 65 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టులో సాయికుమార్ 24 పరుగులు చేశాడు. కైట్స్ జూనియర్ కళాశాల జట్టు బౌలర్ మౌర్య ఒక వికెట్ తీశాడు.

ప్రతిభ చూపిన కైట్స్ జూనియర్ కళాశాల జట్టు

**➠ ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల వర్సెస్ మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల:** ఈ మ్యాచ్‌లో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 4 వికెట్ల తేడాతో మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది. జట్టులో జి.సాయి 16 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ జట్టు 8.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల జట్టు బౌలర్ కిరణ్ 2 వికెట్లు తీశాడు.

విజయం సాధించిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

కె. ఆర్యన్ సోనీ (30 పరుగులు)

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Gift Partner: KL UNIVERSITY (DEEMED TO BE)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
Dolphin Diagnostic Services
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు ఈతరం క్లబ్

**నేటి మ్యాచ్‌లు..** ■ **ఉదయం 8 గంటలకు:** సీనియర్ విభాగంలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ × గీతం డీమ్డ్ యూనివర్సిటీ ■ **ఉదయం 10 గంటలకు:** సీనియర్ విభాగంలో ఎన్ఎస్ఆర్ఐటీ(శొంఠ్యాం) × గాయత్రి విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కాలేజ్(రుషికొండ) ■ **మధ్యాహ్నం 12 గంటలకు:** జూనియర్ విభాగంలో శ్రీకశ్యప్ జూనియర్ కాలేజ్ × విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ కాలేజ్

**31-12-25 నాటి మ్యాచ్‌లు..** ■ **ఉదయం 8 గంటలకు:** సీనియర్ విభాగంలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ డిగ్రీ అండ్ పీజీ × బాబా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ■ **ఉదయం 10 గంటలకు:** సీనియర్ విభాగంలో అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ × గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ కాలేజ్(ఎంవీపీ) ■ **మధ్యాహ్నం 12 గంటలకు:** సీనియర్ విభాగంలోఏవీఎన్ డిగ్రీ కాలేజ్ × ఆంధ్రా మెడికల్ కాలేజ్

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్, ఇన్‌ఛార్జి జేసీ శ్రీపూజ, డీఎస్పీ అభిషేక్

పాడేరు: పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులను పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, వాటి స్థితిగతులపై ఎస్పీ అమిత్‌బర్దార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి నెలా చివరి వారంలో అట్రాసిటీ కేసులు, భూ సంబంధ వివాదాలను పరిష్కరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కమిటీ సభ్యులు వంతాల దేవదాస్, కుర్రా సీతారాం మాట్లాడుతూ.. చింతపల్లి, అరకులోయ ప్రాంతాల్లో భూసంబంధ సమస్యలపై అధికంగా కేసులు నమోదవుతున్నాయన్నారు. విద్యుత్తు సంబంధిత ఫిర్యాదులు తగ్గాయని పేర్కొన్నారు. చింతపల్లి డైట్ నగర్ కాలనీలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న వారు ఇంటి పట్టాలు కోరుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ శ్రీపూజ, డీఎస్పీ అభిషేక్ తదితరులు అధికారులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోదాంలో తనిఖీలు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు భవనాల్లో భద్రపరిచిన ఈవీఎంలను వివిధ ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ దినేష్‌కుమార్ తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును ఆరా తీశారు. ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రత ప్రమాణాలపై అధికారులకు, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు. డీఆర్‌ఓ అంబేడ్కర్, తహసీల్దార్, లక్ష్మణ్ రావు, పలు పార్టీల ప్రతినిధులు ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి నుంచి మీ ఇంటికి మీ డాక్టర్

పాడేరు, న్యూస్‌టుడే: మీ ఇంటికి మీ డాక్టర్ ప్రాజెక్టు ఫిబ్రవరి నుంచి జిల్లాలో అమలు కానుందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మొబైల్ హెల్త్ క్లినిక్ నిమిత్తం వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టు, డ్రైవరు పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. paderured-cross@gmail.com,redcrossap@gmail.com లో సంప్రదించవచ్చన్నారు. 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# పుచ్చ.. పెరిగిన విస్తీర్ణం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పుచ్చ సాగుకు బుచ్చెయ్యపేట మండలం చిరునామాగా మారింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అత్యధికంగా 400 ఎకరాల్లో ఇక్కడి రైతులు సాగు చేస్తున్నారు. గత ఏడాది దిగుబడులు బాగుండి మంచి ధర పలకడంతో ఈ ఏడాది మెరక ప్రాంతాల్లో బోర్లున్న చోట సాగుకు శ్రీకారం చుట్టారు. వేసవికి ముందే దిగుబడులు చేతికందేటట్లు చూస్తున్నారు. మామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా పుచ్చ సాగు చేయవచ్చని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు.

★ బుచ్చెయ్యపేటలో ఎక్కువ మంది రైతులు పుచ్చ సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 15 ఏళ్ల కిందట ఒకరిద్దరు సాగు చేశారు. రెండు, మూడు నెలల్లో పంట చేతికందడం, మార్కెట్ అవకాశాలుండటంతో ప్రస్తుతం 50 మందికిపైగా చుటుపక్కల గ్రామాల్లో భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. బుచ్చెయ్యపేటతోపాటు అయితంపూడి, కె.పి.అగ్రహారం, కొండపాలెం, పి.భీమవరం, చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి, కందిపూడి, వడ్డాది, లోదొడ్డి గ్రామాల్లో పుచ్చ తోటలున్నాయి.

బుచ్చెయ్యపేటలో సాగు చేసిన పుచ్చతోట

★ గతంలో సాధారణ పద్ధతిలోనే పండించే వారు. ఈ విధానంలో పెద్దగా దిగుబడులు వచ్చేవి కావు. పెట్టుబడి ఖర్చులూ అధికమయ్యేవి. ఇప్పుడు సాగు విధానాన్ని మార్చేశారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని పండిస్తున్నారు. మల్చింగ్, డ్రిప్ ద్వారా పుచ్చ సాగు చేస్తున్నారు. మొక్కల చుట్టూ నేల ఉపరితలాన్ని మల్చింగ్ షీట్లతో కప్పి ఉంచడంతో తేమ ఎక్కువ రోజులు ఉంటోంది. కలుపు సమస్య ఉండదు. డ్రిప్ ద్వారా అందిస్తున్న ఎరువులు ఆవిరి రూపంలో బయటకు పోకుండా మొక్కలకు పూర్తిగా అందేలా చేస్తుంది. కాయలు పెద్ద పరిమాణంలో వస్తున్నాయని బుచ్చెయ్యపేటకు చెందిన రైతు గాడి చిన్న చెబుతున్నారు.

**రైతేరాజు**

★ గతేడాది టన్ను కాయల ధర రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు పలికింది. ఎకరాకు 20 టన్నుల వరకు దిగుబడులు వచ్చాయి. బుచ్చెయ్యపేటకు చెందిన నలుగురు రైతులు పది ఎకరాల్లో సాగు చేయగా.. మూడు నెలల్లో పెట్టుబడి పోను ఒక్కొక్కరికి రూ.1.5 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 14 ఎకరాల్లో పుచ్చ సాగు చేస్తున్నట్లు రైతు అప్పారావు పేర్కొన్నారు.

# మొక్కజొన్న సాగుకు ఇదే అదును

అనకాపల్లి, న్యూస్‌టుడే: రబీలో మొక్కజొన్న సాగు చేసేందుకు ఇదే సరైన సమయం. ఉత్తర కోస్తా జిల్లాల్లో జనవరి 15 వరకు విత్తుకోవచ్చు.. ఆలస్యం చేస్తే ఆ ప్రభావం దిగుబడులపై పడుతుంది. రేగడి, గరప, ఇసుక నేలలు సాగుకు అనుకూలం. నీరు నిల్వ ఉండే భూములు పనికి రావని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దాడి ఉమామహేశ్వరరావు సూచిస్తున్నారు.

★ ఎకరాకు 7 నుంచి 9 కేజీల విత్తనం పడుతుంది. ★ వర్షాధారంగా సాగు చేసే రైతులు ఎకరాకు 36 కేజీల నత్రజని, 20 కేజీల భాస్వరం, 12 కేజీల పొటాష్ వేయాలి. నీటి వసతి ఉంటే నత్రజని 48 కేజీలు, భాస్వరం 24 కేజీలు, పొటాష్ 16 కేజీలు వేయాలి.

★ భాస్వరం, పొటాష్ చివరి దుక్కిలో వేయాల్సి ఉంటుంది. నత్రజని ఎరువును మూడు భాగాలుగా చేసుకుని విత్తే సమయం, మొక్కలకు నెల, రెండు నెలల వయసులో వేయాలి.

★ కలుపు నివారణకు విత్తిన రెండు, మూడు రోజులకు గింజలు మొలకెత్తక ముందే అట్రాజిన్ 1.5 కేజీ 500 లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారీ చేయాలి.

★ విత్తే సమయం, ఐదు ఆకుల దశ, పంట మోకాలు ఎత్తుకు ఎదిగినపుడు, పూత, గింజలు పాలుపోసుకునే, గట్టి పడే దశల్లో నీటి తడులు ఇవ్వాలి. ఆరు పర్యాయాలు తడులు పెడితే మంచి దిగుబడి సాధించవచ్చు.

| రకాలు | కాలపరిమితి (రోజుల్లో) | దిగుబడి ఎకరాకు (క్వింటాళ్లలో..) |
|---|---|---|
| డీహెచ్ఎం-1, 107, 109 | 85–90 | 22–25 |
| 103, 105 | 105–110 | 26–30 |
| త్రిశూల | 105–110 | 18–20 |
| అశ్విని, హర్ష | 100–105 | 18–20 |
| అంబర్ పాప్‌కార్న్ | 90–95 | 10 |
| మాధురి | 70–75 | 8 |

**రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా**

## నువ్వులో అనువైన రకాలివీ..

? ఎకరా విస్తీర్ణంలో నువ్వు వేయాలనుకుంటున్నా. సమయం ఉందా. ఉంటే రబీకి అనువైన రకాలేంటి. – ఊటుకూరి మహేష్, నాగులాపల్లి

✔: జనవరి నెలాఖరు వరకు వేసుకోవచ్చు. రబీలో వైఎల్ఎం 11, 17, శారద రకాలు అనుకూలం. 11, శారద రకాలు 80 రోజుల్లో పక్వానికి వస్తాయి. ఎకరాకు 400 కేజీల దిగుబడి రావచ్చు. 17 రకం 75 రోజులకు కోత కొస్తుంది. ఎకరాకు 350 కేజీల వరకు దిగుబడి వస్తుంది.

? రబీ వరికి అనువైన రకాలేంటి. – ఆడారి రమణబాబు, మునగపాక

✔: విజేత, పుష్యల, శ్రీసత్య, కాటన్‌దొర సన్నాలు, చంద్ర, తరంగిణి, జగిత్యాల సాంబ రకాలు అనుకూలం.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త దాడి ఉమామహేశ్వరరావు సమాధానాలు ఇచ్చారు. –న్యూస్‌టుడే, అనకాపల్లి

**సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి**

**రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సేద్యపు విభాగం శాస్త్రవేత్త సందీప్‌నాయక్ సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10- సా. 4 గంటల వరకు 86884 45135 నంబరుకు ఫోన్ చేయవచ్చు.**

# చిలకడ దుంపలతో.. నికర ఆదాయం



చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో గిరిజన రైతులు చిలకడ దుంపలను వాణిజ్యపరంగా సాగు చేస్తున్నారు. వీటి సాగుకు మన్యం వాతావరణం అనుకూలమని శాస్త్రవేత్తలు గుర్తించి రైతులను ప్రోత్సహిస్తున్నారు. పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో సుమారు 800 ఎకరాల్లో ఈ దుంపలు సాగవుతున్నాయి. చింతపల్లి, గూడెంకొత్తవీధి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో మాలీ రైతులు అధికంగా సాగు చేస్తున్నారు.

★ మన్యం నుంచి కోల్‌కతా, చెన్నై, ముంబై, ఢిల్లీ, ఒడిశాకు ఎగుమతి అవుతున్నాయి. గతంలో 80 నుంచి వంద కేజీల దుంపల ధర రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు ఉండేది. ఎగుమతులు పెరగడంతో ప్రస్తుతం రూ.800 చొప్పున ధర పలుకుతోంది. ఇతర పంటలతో పోలిస్తే పెట్టుబడి పోను నికర ఆదాయం వస్తుండటంతో రైతులు ఈ దుంపల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు సగటున రూ.40 వేల వరకు మిగులుతోందని చెబుతున్నారు.

**తగ్గిన బెల్లం ధరలు**

అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా అన్ని రకాల బెల్లం ధరలు తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.35, మధ్య రకాలు రూ.30, నాసి రకాలు రూ.65 ధరలు తగ్గాయి. –న్యూస్‌టుడే, అనకాపల్లి

| రకం | రంగులు | మధ్య | నాసి |
|---|---|---|---|
| గత వారం (రూ.) | 4,025 | 3,755 | 3,370 |
| ఈ వారం (రూ.) | 3,990 | 3,725 | 3,305 |

# గిరిజన బాలికల ఆరోగ్యంపై అలసత్వం వద్దు

సమావేశంలో మాట్లాడుతున్న పీఓ శ్రీపూజ చిత్రంలో డీడీ పరిమళ

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో 11 మండలాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సహాయ సంక్షేమాధికారులు, వార్డెన్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆశ్రమాల్లో గిరిజన విద్యార్థులకు అనారోగ్యం సోకితే తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వారి ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థులకు ఈనెల 6వ తేదీ నుంచి ఏర్పాటు చేసిన వంద రోజుల ప్రణాళికను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. వసతి గృహాల పెర్ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టం యాప్ పనితీరు, ప్రతి రోజు నిర్వహించే కార్యక్రమాలపై ఆరా తీశారు. ప్రతి పాఠశాలలో ఈ యాప్ ద్వారా నిర్వహణ జరగాలన్నారు. విద్య బోధనతోపాటు రోజువారీ కార్యక్రమాల ఫొటోలు తీసి నోటీస్ బోర్డులో పెట్టాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు పరిమళ, పాడేరు 11 మండలాల ప్రధానోపాధ్యాయులు, గిరిజన సహాయ సంక్షేమాధికారులు, వార్డెన్లు పాల్గొన్నారు.

# ఆశ్రమ విద్యార్థిని మృతిపై విచారణ

సీలేరు, న్యూస్‌టుడే: రక్తహీనతతో సీలేరు ఆశ్రమ పాఠశాల విద్యార్థిని నందిని మృతి చెందిన ఘటనపై ఇన్‌ఛార్జి సహాయ గిరిజన సంక్షేమాధికారి వినాయకరావు సోమవారం విచారణ చేపట్టారు. పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. సంఘటన పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీలేరు పీహెచ్‌సీకి చేరుకుని వైద్యాధికారి నారాయణరావు, సిబ్బందిని విచారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్లు చెప్పారు. విద్యార్థిని తండ్రితోపాటు పాఠశాల విద్యార్థులు, సిబ్బంది, వైద్యాధికారి, సిబ్బందిని విచారించినట్లు పేర్కొన్నారు. నివేదికను కలెక్టర్, ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా పరిషత్తు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం వెంట ఉన్నారు. విద్యార్థిని నందిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ కుమారి డిమాండ్ చేశారు. గాలికొండ పంచాయతీ నిమ్మలగొంది వచ్చిన ఏటీడబ్ల్యూఓతో మాట్లాడారు. సర్పంచి బుజ్జిబాబు, ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు పాల్గొన్నారు.

### వైద్యులను నియమించాలి

సీలేరు: సీలేరు పీహెచ్‌సీలో ఇన్‌ఛార్జి వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతోనే ఆశ్రమ పాఠశాల విద్యార్థిని నందిని మరణించిందని సీపీఎం మండల కార్యదర్శి బుజ్జిబాబు ఆరోపించారు. పీహెచ్‌సీకి పూర్తిస్థాయిల వైద్యులను నియమించాలని డిమాండు చేశారు.

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఏటీడబ్ల్యూవో వినాయకరావు

**రీ-టెండర్ నోటీస్**
**ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (EMRS)**
**రంపచోడవరం మరియు చింతూరు, ASR Dist., A.P.**
24x7 అందుబాటులో ఉండే విధంగా బొలెరో లేదా సుమో 4+1 సీట్లు పసుపు రంగు బోర్డు ఉన్న (కమర్షియల్) వాహనం డ్రైవర్‌తోపాటుగా నెలవారీ అద్దెకు రంపచోడవరం, చింతూరు స్కూల్స్ నందు పనిచేయుటకు సీల్డ్ కవర్ కొటేషన్స్‌ను ఆహ్వానిస్తున్నాము.
- కొటేషన్స్‌ను ది.3-1-2026 లోపు కింద సంతకం చేసి పంపించాలి.
- రంపచోడవరం స్కూల్ ఫోన్: 89858 77571, 94407 61446
- చింతూరు స్కూల్ ఫోన్: 83330 49525.

# శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయండి

పాడేరు, ఎటపాక, న్యూస్‌టుడే: ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ అమిత్‌బర్దార్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటైన సమావేశంలో 2025లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బంది ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఎస్పీ అభిషేక్, సీఐ దీనబంధు, స్పెషల్ బ్రాంచ్ సీఐ అప్పలనాయుడు పాల్గొన్నారు. ఎటపాక సీఐ ఎం.కన్నపరాజు, ఎస్సై అప్పలరాజు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ఉత్తమ సేవలు అందించిన పోలీస్ అధికారికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ అమిత్ బర్దార్

**ప్రమాణస్వీకార శుభాకాంక్షలు**
న్యాయవాది వృత్తిలో విశేష సేవలందించి, చోడవరం APP గా నియమితులై నేడు ప్రమాణస్వీకారం చేస్తున్న శ్రీ చీపురుపల్లి సూర్యనారాయణ గార్కి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీ చీపురుపల్లి సూర్యనారాయణ గారు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, చోడవరం
Hero RASHEED HERO ASSOCIATE DEALER
RASHEED MOTORS
చింతలవీధి, Y.Junction, పాడేరు.
ఫోన్: 9885556312.

SHAIK BASHEER JANI
Vice President BC Welfare AP Joint Action Committee, Anakapalli

# ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

అనంతగిరి, న్యూస్‌టుడే: పర్యాటకులతో వెళ్తున్న ఆటో సోమవారం అనంతగిరి ఘాట్‌రోడ్డులో బోల్తాపడి నలుగురు గాయపడగా.. వారికి సాయం అందించి ఆసుపత్రికి తరలించే విషయంలో సమగ్రశిక్షా ఏపీసీ స్వామినాయుడు చొరవ చూపించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన సుమారు ఏడుగురు పర్యాటకులతో అరకులోయ ప్రాంతం నుంచి బొర్రా గుహలకు వెళ్తున్న ఆటో అనంతగిరి సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రయాణికులపై ఆటో పడటంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమయంలో అటువైపుగా వెళ్తున్న సమగ్రశిక్షా అదనపు పథ సమన్వయకర్త (ఏపీసీ) స్వామినాయుడు తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులకు సాయమందించారు. అటుగా వెళ్తున్న వారిని పిలిచి వారితో కలిసి ఆటో కింద ఉండిపోయిన వారికి బయటకు తీసి సపర్యలు చేశారు. ఈలోపు స్థానికులు అందించిన సమాచారం మేరకు వచ్చిన 108 అంబులెన్సు రావడంతో గాయపడిన వారిని అనంతగిరి ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ లైకోన్, పర్యాటకుడు తనీష్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా... రోహిత్, విజయ్ స్వల్పంగా గాయపడ్డారు. ఏపీసీ స్వామినాయుడు చొరవకు స్థానికులు ఆయనను అభినందించారు.

బోల్తాపడిన ఆటో

# భార్యను కర్రతో కొట్టి చంపిన భర్త

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో భార్యను కర్రతో కొట్టి చంపి భర్త పరారైన ఘటన అనంతగిరి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బీంపోలు పంచాయతీ నేరేళ్లవలస గ్రామానికి చెందిన మూతిబోయిన శ్రీను, భార్య లక్ష్మి (41) గ్రామానికి దూరంగా పొలంలోని గుడిసెలో జీవనం సాగిస్తున్నారు. మద్యం మత్తులో ఆదివారం రాత్రి శ్రీను భార్యతో గొడవపడ్డాడు. ఆ సమయంలో కర్రతో కొట్టి చంపేసి, మృతదేహాన్ని గుడిసె పక్క స్థలంలో పడేసి పరారయ్యాడని గ్రామస్థులు తెలిపారు. సోమవారం ఉదయం లక్ష్మి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు అనంతగిరి పోలీసులకు సమాచారం అందించారు. అరకులోయ సీఐ హిమగిరి, అనంతగిరి ఎస్ఐ శంకరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శ్రీను తరచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడని, ఆదివారం రాత్రి గొడవ తీవ్రం కావడంతో అమెను కర్రతో బలంగా కొట్టాడని, అధిక రక్తస్రావం కావడంతో లక్ష్మి మృతి చెందిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడు శ్రీను పరారయ్యాడని గాలించి పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### మంత్రుల దృష్టికి సమస్యలు

గంగవరం, న్యూస్‌టుడే: స్థానికంగా నెలకొన్న సమస్యలను మంత్రులు అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, గుమ్మిడి సంధ్యారాణి దృష్టికి తీసుకువెళ్లినట్లు అల్లూరి జిల్లా ఆదివాసీ గొడ సంఘం అధ్యక్షుడు రామ్మూర్తి, మెహర్‌బాబా పేర్కొన్నారు.

**చికెన్ ధరలు** (కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 131 | 130 |
| లైవ్ | 158 | 150 |
| డ్రెస్డ్ | 229 | 270 |
| స్కిన్‌లెస్ | 261 | 280 |

(c) eenadu

## డీఎస్సీ అభ్యర్థులకు మన్యంలో ఉచిత శిక్షణ

అరుకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ మండలంలో సబ్ ఇన్‌స్పెక్టర్, ఉపాధ్యాయ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చేందుకు స్థానిక పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, సుమారు 150 మందికి అరకులోయ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఎంపిక పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎస్సై గోపాలరావు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. కాకినాడకు చెందిన క్యాంప్ ఇన్‌స్టిట్యూట్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సోమవారం జరిగిన పరీక్షకు హాజరైన అభ్యర్థులు పోలీసులు కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అరుకులోయలో డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

## అస్తవ్యస్త నిర్మాణాలతో తప్పని అవస్థలు

ఐదేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించేందుకు ఏర్పాటైన అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలులేక స్థానికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భవనాలు మంజూరైనా.. చాలాచోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని 28 పంచాయతీల్లో 370 గ్రామాలు ఉండగా.. 300 చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో సగానికిపైగా కేంద్రాలకు భవనాల్లేవు. జామిగుడ పంచాయతీ కేంద్రంలో రెండేళ్ల కిందట భవన నిర్మాణం ప్రారంభించినా.. ఇప్పటికీ పిల్లర్ల దశ దాటలేదు. చిన్నారులకు అంగన్‌వాడీ కార్యకర్త తన ఇంటి వరండాలోనే పోషకాహారం అందిస్తూ ఆటపాటలతో బోధన చేస్తున్నారు. గంగంగడ పంచాయతీ తురకలవలసలో ఐదేళ్ల కిందట భవన నిర్మాణం ప్రారంభించి స్లాబు పూర్తయ్యాక వదిలేశారు. ఇక్కడ కేంద్రాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా భవనాలను పూర్తి చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెదబయలు

జామిగుడలో పిల్లర్ల దశలో నిలిచిన భవన నిర్మాణం

## గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఈశ్వరరావు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. కార్యవర్గం వివరాలను ఎన్నికల ప్రధాన అధికారి పలాసి కృష్ణారావు ప్రకటించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా మసాడ ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ముత్య శేషాద్రి, మహిళా ప్రధాన కార్యదర్శిగా శెట్టి శాంతకుమారి, కోశాధికారిగా వలసాని కొండలరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మినుముల ప్రసాదరావు ఎన్నికయ్యారు. జోన్-1 (అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ), జోన్-2 (పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల), జోన్-3 (పెదబయలు, ముంచంగిపుట్టు) జోన్-4 (చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు) కార్యదర్శులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికల అధికారులుగా జీవీవీ ప్రసాద్, రామ్మూర్తినాయుడు, నాగేశ్వరరావు, జయపరంగి ప్రసాద్, గంగప్పడాల్, కాంతారావు, దర్మన్న తదితరులు వ్యవహరించారు.

నూతన కార్యవర్గ సభ్యులు

### ఎమ్మెల్సీ అనంతబాబుపై ఫిర్యాదు

మారేడుమిల్లి: ఎమ్మెల్యే శిరీషాదేవిపై వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుపై కూటమి నాయకులు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. శేషుకుమార్, సుబ్బారావు, దుర్గాప్రసాద్, అప్పాజీ, సత్య, సన్యాసిరెడ్డి, రాంబాబు, బలరామ్ తదితరులు ఎస్సై శ్రీనివాసరావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.

### నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చింతపల్లి: పట్టణంలో మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ పి.వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

### పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: లాగరాయి జడ్పీ పాఠశాలకు ఉపాధ్యాయుడు చప్పా సత్యనారాయణమూర్తి మైక్ సెట్, స్టాండ్ ఫ్యాన్ బహూకరించారు. ఆయన భార్య హేమలత జ్ఞాపకార్థం అందజేసినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు రాము నాయుడు, జంగమయ్య, సత్యనారాయణ, విజయ్ పాల్గొన్నారు.

### ఆవిర్భావ దినోత్సవం రేపు

చింతూరు, న్యూస్‌టుడే: ఆదివాసీ సంక్షేమ పరిషత్తు ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని గ్రామాలు, ఆదివాసీ గూడెల్లో జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. శ్రీను, రవి, రమణారెడ్డి, దుర్గారావు, చెల్లమ్మ పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యనందించాలి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారి పురోభివృద్ధికి తోడ్పడాలని మండల విద్యాశాఖ అధికారి-2 గెన్ను ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మారుమూల సొవ్వా ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన తీరును అడిగి తెలుసుకున్న రికార్డులు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు పాటిస్తే ప్రయాణం సురక్షితం

ఎటపాక, న్యూస్‌టుడే: రహదారి నిబంధనలు పాటిస్తే ప్రయాణం సురక్షితంగా సాగుతుందని చింతూరు డివిజన్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ చలపతిరావు సూచించారు. తోటపల్లి, నెల్లిపాక ప్రధాన, జాతీయ రహదారులపై సోమవారం వాహనచోదకులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గతుకుల రోడ్లపై అవస్థల ప్రయాణం

బందిగుంట సమీపంలో దెబ్బతిన్న రోడ్డు

మన్యంలో మారుమూల ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గతుకుల దారులపై రాకపోకలు సాగించేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. అరడకోట పంచాయతీ బందిగుంట, బొంగారం రోడ్డు మరమ్మతుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బందిగుంట సమీపంలోని మాటిని గతంలో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయగా ప్రస్తుతం పెచ్చులూడి గోతులు పడ్డాయి. ఈ మార్గంలో వనభంగి, బందిగుంట గ్రామస్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఘాటీ ఎక్కే సమయంలో వాహనాలు కుదుపులకు లోనవుతుండటంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పెదబయలు గ్రామీణం

## వైద్యుల్లేక రోగుల ఇక్కట్లు

పెదబయలు పీహెచ్‌సీలో వారపు సంత రోజున వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. ఈ ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు అందాల్సి ఉన్నా.. వైద్యుల్లేక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంతరోజు మండల కేంద్రానికి మారుమూల ప్రాంతాల నుంచి రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. ఇద్దరు వైద్యుల్లో ఒకరిని కిలగాడ ఆసుపత్రికి డిప్యుటేషన్‌పై పంపగా, మరో వైద్యులు సెలవుపై వెళ్లడంతో సమస్య ఉత్పన్నమైంది. అత్యవసర సమయాల్లో వైద్యం అందని పరిస్థితి. దీనిపై వైద్యాధికారిణి సత్యశ్రీ మాట్లాడుతూ.. వ్యక్తిగత పనులపై ఐదు రోజులు సెలవు పెట్టినట్లు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పెదబయలు గ్రామీణం

పెదబయలు పీహెచ్‌సీలో వేచి ఉన్న రోగులు, విద్యార్థులు

## పంచాయతీరాజ్ ఉద్యోగుల కార్యవర్గ ఎన్నిక

ప్రమాణ స్వీకారం చేస్తున్న అధ్యక్షుడు పూర్ణయ్య, ఉపాధ్యక్షుడు వీఎస్ఎన్ మూర్తి తదితరులు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం పెదబయలు మండల కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గంగాధర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఎల్. పూర్ణయ్య, ఉపాధ్యక్షుడిగా వీఎస్ఎన్ మూర్తి, కార్యదర్శిగా కె. రామారావు, సంయుక్త కార్యదర్శిగా ఎం.జోగారావు, కోశాధికారిగా జి.సిద్దేశ్వరరావు, కౌన్సిలర్లుగా బి.ప్రవీణ్‌కుమార్, పి. మురళీకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఎన్నికల పరిశీలకులు నాగరాజు ప్రమాణస్వీకారం చేయించారు.

## ఏకలవ్య, నవోదయ నమూనా పరీక్షకు స్పందన

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలం గాంధీనగర్ మండల పరిషత్తు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో నర్సీపట్నం ది రేస్ అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏకలవ్య, నవోదయ నమూన పరీక్షకు విశేష స్పందన లభించింది. మండలంలోని 45 మంది విద్యార్థులు పరీక్షను రాశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.మత్స్యరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జగదీష్, గణేష్, దర్శిత, గౌస్మితా శ్రీ, భవిష్య, ప్రవీణ్, మహీంద్రకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.

### అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యార్థుల మరణాలు

సీలేరు, న్యూస్‌టుడే: సంక్షేమాధికారుల నిర్లక్ష్యంతోనే ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు చోటుచేసుకుంటున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.విష్ణుమూర్తి ఆరోపించారు. సీపీఐ మండల కార్యదర్శి భగవాన్‌తో కలిసి సోమవారం మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సహాయకులు లేకపోవడంతో ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. సీలేరు, దారకొండ, సప్పర్ల పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత కారణంగా వైద్యసేవలు సక్రమంగా అందడం లేదన్నారు. అధికారులు స్పందించి ఆసుపత్రుల్లో సిబ్బందిని నియమించాలని కోరారు.

## కష్టపడి పనిచేస్తే గుర్తింపు : ఎమ్మెల్యే

రంపచోడవరం, న్యూస్‌టుడే: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే శిరీషాదేవి పేర్కొన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని విజయవంతానికి కృషి చేసిన 34 మంది ఉత్తమ కార్యకర్తలుగా ఎంపికయ్యారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వారందరినీ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి అభ్యర్థుల విజయానికి పాటుపడాలని సూచించారు. తెదేపా మండల అధ్యక్షుడు అనంత మోహన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి సింహాచలందొర, నాయకులు వెంకన్న, పెంటమ్మ, చోటు, సత్య, చిన్నా రెడ్డి పాల్గొన్నారు.

### తెదేపాకు కార్యకర్తలే బలం

హుకుంపేట న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తప్పకుండా గుర్తింపు దక్కుతుందని ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ దొన్ను దొర పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కష్టపడిన అరకు నియోజకవర్గంలో అయిదుగురు కార్యకర్తలకు అవార్డులు అందించి సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషిచేసిన జన్ని మత్స్యరాజు, రాజ్‌కుమార్, జగన్నాథం, సురేష్, కృష్ణారావులకు అవార్డులు ప్రశంసా పత్రాలు వచ్చాయన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు బొంజుబాబు, నేతలు సూర్యకాంతం, తులసిరావు, వెంకటరమణరాజుతదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: మండలంలోని అర్మ పంచాయతీ నడిమివలస గ్రామానికి చెందిన కిల్లో గోవిందు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు, నగదు సాయాన్ని తెదేపా అరకులోయ నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు బురిడి కొములునాయుడు అందజేశారు. కాఫీ బోర్డు సభ్యుడు విశ్వనాథం, జనసేన నాయకుడు అర్జున్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యకర్తలుగా ఎన్నికైన వారితో ఎమ్మెల్యే శిరీషాదేవి

హుకుంటపేటలో అవార్డులు అందిస్తున్న ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ దొన్ను దొర

## విధినిర్వహణలో అలసత్వం తగదు

అనంతగిరి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని సమగ్రశిక్షా ఏపీసీ స్వామినాయుడు అన్నారు. కొత్తవలస బాలుర పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల అంసెబ్లీ సమయానికి వెళ్లిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది వరకు విద్యార్థులు ఏకరూప దుస్తులు ధరించకుండా ఉండటం చూసిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతమంది విద్యార్థులు ఏకరూప దుస్తులు ధరించకపోవటానికి గల కారణాలేమిటని ప్రధానోపాధ్యాయుని ప్రశ్నించగా ఆయనిచ్చిన సమాధానంపై సంతృప్తి చెందని ఏపీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సీఆర్పీ, ఎంఈఓ-1, 2 లకు షోకాజ్‌లు జారీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు గంగరాజుతో కలిసి పాఠశాల భవనాలు పరిశీలించారు. భవనాలు పూర్తి అధ్వానంగా ఉన్నాయని జడ్పీటీసీ సభ్యుడు అన్నారు. భవనాన్ని పరిశీలించి.. తన సెల్‌ఫోన్‌లో పాడైపోయిన భవనాలకు సంబంధించిన ఫొటోలు తీసుకున్నారు.

జడ్పీటీసీ సభ్యుడు, హెచ్ఎంలతో మాట్లాడుతున్న ఏపీసీ

### బెర్రీబోరర్ పరిహారం చెల్లించాలి

అరకులోయ పట్టణం: కాఫీ కేజీ రూ.600కు కొనుగోలు, బెర్రీబోరర్‌తో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బాలదేవ్ డిమాండ్ చేశారు. గిరిజన సంఘం కార్యాలయంలో సంఘ నాయకులు చిన్నబాబు, బుజ్జిబాబుతో కలిసి సోమవారం మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న అరకు కాఫీ రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదున్నారు. అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పరిధిలో రెండు వేల మంది రైతులు కాఫీ తోటలకు బెర్రి బోరర్ సోకడంతో నష్టపోయారన్నారు.

### మెరుగైన వైద్యానికి ససేమిరా!

సీలేరు, న్యూస్‌టుడే: ప్రసవ సమయంలో శిశువు అస్వస్థతకు గురవడంతో మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించేందుకు వైద్య సిబ్బంది యత్నించగా కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. ఎస్సై యాసిన్, వైద్యాధికారి నారాయణరావు కౌన్సిలింగ్ చేయడంతో శిశువును చింతపల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు అంగీకరించారు. ఈ ఘటన సీలేరు పీహెచ్‌సీలో సోమవారం చోటుచేసుకుంది. దుప్పిలవాడ పంచాయతీ రాళ్లగెడ్డకు చెందిన కిల్లో రమేష్ భార్య భగవతి సీలేరు పీహెచ్‌సీలో మగబిడ్డకు జన్మనిచ్చారు. ప్రసవ సమయంలో శిశువు ఉమ్మనీరు తాగడంతో వైద్యాధికారి నారాయణరావు మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఆసుపత్రికి రిఫర్ చేశారు. బాలింత భర్త, బంధువులు అంగీకరించకపోవడంతో ఎస్సై యాసిన్ అక్కడకు చేరుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం అంబులెన్స్‌లో బాలింత, శిశువును చింతపల్లి తరలించారు.

బాలింత, చిన్నారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న ఎస్సై, వైద్యసిబ్బంది

## మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వండి

కొయ్యూరు, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో చదువుతోపాటు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. సుధ సూచించారు. మానసిక ఒత్తిడి నియంత్రణ పద్ధతులపై సోమవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్ రిసోర్స్ పర్సన్ డి.సుబ్బారావు అవగాహన కల్పించారు. ధ్యాన యోగ టెక్నిక్స్‌పై శిక్షకులు రామారావు పలు సూచనలు చేశారు. వైస్ ప్రిన్సిపల్ మహాలక్ష్మి, ఆంగ్ల అధ్యాపకురాలు మేరీపుష్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుధ

### ఒత్తిడిని జయించండి

చింతపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒత్తిడిని జయించడంపై (మైండ్ ఫుల్‌నెస్) సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రధాన వక్తలు బాలకృష్ణ, డిల్లీశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి మానసిక ఒత్తిడి కలగకుండా అనుకున్న లక్ష్యాలను ఎలా సాధించాలో వివరించారు. వైస్ ప్రిన్సిపల్ ఎం. శ్రీనివాసపాత్రుడు, కార్యక్రమ సమన్వయకర్త రవీంద్రనాయక్, కన్వీనర్ శ్రీనివాసరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

రంపచోడవరం, రాజవొమ్మంగి, సీలేరు, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. రంపచోడవరం మండలం ఐ. పోలవరం కొండపై వేంకటేశ్వరాలయంలో తితిదే అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హిందూ ధర్మ భక్త సేవా మండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి మాట్లాడుతూ.. తెల్లవారుజామున 3.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సీలేరు వెంకటేశ్వరస్వామి ఆలయం, రామాలయంలో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. కుంకుమ పూజలు, అన్నసంతర్పణ కొనసాగుతుందని నిర్వాహకులు చెప్పారు. రాజవొమ్మంగిలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశికి ముస్తాబైంది. ఉదయం 5 గంటల నుంచి అభిషేకాలు, 6.30 నుంచి ఉత్తర ద్వార దర్శనం, లక్ష తులసి పూజ, ప్రత్యేక పూజలు కొనసాగనున్నాయి.

### శబరిమాత ఆలయ సుందరీకరణ

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరంలో శబరి నది ఒడ్డునున్న శబరిమాత విగ్రహానికి భక్తుడు బండారు నాగేశ్వరరావు కొత్తగా రంగులు వేయించారు. ఈ ఏడాది వరదలకు మందిరం నీట మునిగి బురద పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో ఆలయం సుందరీకరణకు చర్యలు చేపట్టినట్లు ఆయన చెప్పారు.

సీలేరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

### వాడపల్లి దేవస్థానం ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా శ్రీనివాస్

ఎటపాక, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆలయాలకు నూతన డైరెక్టర్లుగా పలువుర్ని నియమించింది. వాడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా రంపచోడవరం నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్ నియమితులయ్యారు. డైరెక్టర్‌గా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన ఆయన్ను ఎటపాక మండల తెదేపా అధ్యక్షుడు పుల్లయ్య, నాయకులు మంగేశ్వరరావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రమేష్, చలపతిరావు, రాజేష్, మాధవరావు తదితరులు సత్కరించారు.

## నూతన సంవత్సర వేడుకలపై నిఘా

చింతపల్లి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం, సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయడంతోపాటు, భద్రతా చర్యలు చేపడతామని సీఐ ఎం.వినోద్ బాబు తెలిపారు. సంబరాల పేరుతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యాటక ప్రాంతాల్లో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వన్నారు. ఎస్సైలు వీరబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు, పక్కనే ఎస్సైలు వీరబాబు, వెంకటరమణ

సీలేరు(గూడెం కొత్త వీధి): నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేవారు అప్రమత్తంగా ఉండాలని జీకేవీధి ఎస్సై సురేష్ కోరారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: గంజాయి, మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని డొంకరాయి ఎస్సై చరణ్‌నాయక్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ఆశ్రమోన్నత బాలికల, జడ్పీ పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు.

### యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్, యాంటీ ర్యాగింగ్ తదితర అంశాలపై ఎస్సై శివకుమార్ సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్‌ను అరికట్టేందుకు అప్రమత్తతతో పాటు అవగాహన అవసరమన్నారు. ర్యాగింగ్ జోలికి వెళ్లి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు.

### విద్యా హక్కు చట్టంపై సదస్సు

అడ్డతీగల, న్యూస్‌టుడే: దుప్పులపాలెం మండల పరిషత్తు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యా హక్కు చట్టంపై పారాలీగల్ వాలంటీరు బాబూరావు సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. 'ప్రొటెక్ట్ టుడే.. సెక్యూర్ టుమారో' కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

## కల్వర్టు నిర్మాణం ప్రారంభం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: రామాలయానికి వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. జడ్పీ ఛైర్‌పర్సన్ రూ.5 లక్షలు మంజూరు చేయడంలో కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారి నుంచి రామాలయం వరకు ఉన్న మార్గంలో కల్వర్టు లేక రాకపోకలకు భక్తులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేసినట్లు సుభద్ర చెప్పారు. సర్పంచి సుభాష్‌చంద్ర, నాయకులు మూర్తి, ప్రసాదరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న నాయకులు

## మేమున్నాం.. మీకు తోడుగా

| పాడేరు | అరకులోయ: 63034 86346 |
|---|---|
| 89853 66570 | రంపచోడవరం: 94908 77172 |

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి - చింతూరు రహదారిలో వాలమూరు సమీపంలో కల్వర్టు వద్ద రహదారి కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. – చంద్రారెడ్డి, వాలమూరు, ✓: కోతకు గురైన కల్వర్టుకు మరమ్మతు చేపడతాం. – ప్రదీప్, ఆర్‌అండ్‌బీ ఏఈ

పెదబయలు, న్యూస్‌టుడే: పర్రెడ పంచాయతీ ఉర్రాడలో గ్రావిటీ పథకంతో పాటు బోరుబావి మూలకు చేరడంతో కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లి ఊట నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. – మాధవరావు, ఉర్రాడ, ✓: వేసవికి ముందే నీటి ఎద్దడి నివారణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. – జగదీష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: నందిమెట్టలో తాగునీటి బోరు మరమ్మతుకు గురయ్యింది. జల్‌జీవన్ మిషన్‌లో ట్యాంకు నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. ఊటనీటినే తాగునీటి అవసరాలకు వాడుతున్నాం. – నాగేష్, స్థానికుడు, ✓: బోరును పరిశీలించాం. మరమ్మతు చేయిస్తాం. ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి రక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు చేపడతాం. – రాజేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

## వైద్య శిబిరానికి స్పందన

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కొర్రా పంచాయతీ కేంద్రంలో టెర్డ్స్, మానవ హక్కుల సంరక్షణ ప్రతినిధులు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆ గ్రామ గిరిజనులతోపాటు పరిసర ప్రాంతాల వారు శిబిరంలో పాల్గొని కంటి సంబంధిత, బీపీ, మధుమేహం, సాధారణ పరీక్షలను నిర్వహించుకున్నారు. మానవ హక్కుల సంరక్షణ వైద్య నిపుణులు అమ్మాజీరావు ప్రత్యేక వైద్య పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం టెర్డ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వెంకటరావుతో కలిసి 200 మంది గిరిజన కుటుంబాలకు రగ్గులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు, గిరిజనులు పాల్గొన్నారు.

కొర్రా వైద్య శిబిరంలో పాల్గొన్న గిరిజనులు

## పవర్ కెనాల్ పనుల పరిశీలన

పవర్ కెనాల్ కాంక్రీటు గోడలకు ప్లాస్టరింగ్ పనులు

మోతుగూడెం, న్యూస్‌టుడే: డొంకరాయి పవర్ కెనాల్ 1, 2 రీచ్‌ల్లో రూ.2 కోట్లతో చేపట్టి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెల 20న ప్రారంభమైన పనులు జనవరి 7 వరకు కొనసాగనున్నాయి. డొంకరాయి నుంచి ఫోర్‌బే జలాశయం వరకు 16 కిలోమీటర్ల పొడవున పవర్ కెనాల్ మరమ్మతు పనులకు 350 మంది కూలీలను వినియోగిస్తున్నారు. ఈ పనులను సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజినీరు కేవీ రాజారావు, సివిల్ ఎస్ఈ హనుమా, ఈఈ నాగ శ్రీనివాసరావు పరిశీలించారు.

## ప్రకృతి వ్యవసాయ ఆధారిత పంటలతో ఆరోగ్యం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ ఆధారిత పంటలు జనం ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడతాయని సెంట్రల్ ఫర్ పీపుల్స్ పారెస్ట్రీ ప్రోగ్రాం అధికారి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని లక్క గ్రామంలో సెంట్రల్ ఫర్ పీపుల్స్ పారెస్ట్రీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ఆదివాసీ సంప్రదాయ ఆహార పంటల పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. గిరిజన రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ప్రాజెక్టు సమన్వయకర్తలు శశికుమార్, కమల, సామాజిక కార్యకర్తలు లక్ష్మీ, మాలతి, గిరిరైతులు పాల్గొన్నారు.

లక్కలో రైతులకు టార్పాలిను అందజేస్తున్న సీసీఎఫ్ ప్రతినిధులు

(c) eenadu

## లోగో కళావిహీనం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ(ఏఎన్‌యూ) ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన వర్సిటీ లోగో కళావిహీనంగా మారింది. విశ్వవిద్యాలయం పేరు, సత్యేసర్వం ప్రతిష్ఠితం సూక్తి..మధ్యలో పూర్ణ కుంభం..పచ్చదనంతో ఏర్పాటు చేసిన లోగో సరైన నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారింది. అధికారులు చొరవ చూపి విశ్వవిద్యాలయ దీప్తిని ప్రతిబింబించేలా ప్రాంగణాన్ని చక్కగా తీర్చిదిద్దాలని విద్యార్థులు కోరుతున్నారు.

- ఈనాడు, అమరావతి

## రెవెన్యూ క్లినిక్ ప్రారంభం

జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఆవరణలోని ఎస్.ఆర్.శంకరన్ హాలు వద్ద సోమవారం రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని ఎన్ని రోజుల్లోగా పరిష్కరిస్తారో కూడా స్పష్టత ఇచ్చారు.

- న్యూస్‌టుడే, కలెక్టరేట్

# పడేస్తే కుదరదు.. వ్యవస్థ వదలదు

ఈనాడు – అమరావతి

- ఎక్కడబడితే అక్కడ భవనాల వ్యర్థాలు
- కట్టడి చేసేందుకు పక్కా ప్రణాళిక

భవనాల శిథిలాలు ఇకపై ఎక్కడబడితే అక్కడ పడేస్తామంటే కుదరదు. రహదారుల పక్కన.. ఖాళీ స్థలాల్లో గుట్టలుగా పోసేస్తే శిక్షార్హులైనట్టే. ఈ మేరకు జీఎంసీ అధికారులు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. అతిక్రమించినవారిపై జరిమానాలు విధించేలా, కఠిన చర్యలు చేపట్టేలా కొత్త ఏడాది నుంచే అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు.

భవన శిథిలాల వ్యర్థాల గుట్ట

గుంటూరు నగరపాలక సంస్థలో సుమారు 2.50 లక్షల భవనాలున్నాయి. పాతవి తొలగింపు.. కొత్త నిర్మాణాలు పెరిగాయి. శంకర్‌విలాస్ పైవంతెన తొలగింపు పనులతో ఈ ప్రక్రియ కొంతకాలంగా ఎక్కువగా ఉంది. రాజధాని నిర్మాణ పనులు ఊపందుకోవడంతో గుంటూరు శివారు ప్రాంతాల్లో కొత్త కట్టడాలు జోరందుకున్నాయి. పాత భవనాలను తొలగించినప్పుడు వ్యర్థాలను దూరప్రాంతాలకు తరలించి నిబంధనల మేరకు క్రమపద్ధతిలో నిర్వీర్యం చేయాలి. కొన్నిచోట్ల వీటిని కొనుగోలు చేసి అవసరమైనవారికి విక్రయించేవారూ ఉన్నారు. ఎక్కువమంది అడ్డదారిలో తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో నగర శివారు ప్రాంతాలు, రహదారుల వెంబడి, ఖాళీ స్థలాల్లో గుట్టలుగా పోయిస్తున్నారు. రాత్రివేళల్లో ఈ తరలింపు ఎక్కువగా ఉంటోంది.

### జీఎంసీకి తలనొప్పి

అడ్డగోలుగా వ్యర్థాలను పడేస్తుండడం జీఎంసీకి తలనొప్పిగా మారింది. మళ్లీ వాటిని వేరేచోటుకు తరలించడానికి సిబ్బంది, వాహనాలను వినియోగించాల్సి వస్తోంది. ఇకపై ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. ఈ విభాగంలో కొన్ని వాహనాలు, సిబ్బంది, యంత్ర పరికరాలను అందుబాటులో ఉంచుతారు. సంబంధిత భవన యజమానులు జీఎంసీని సంప్రదిస్తే చాలు. నిర్ణీత రుసుము కట్టించుకుని నిబంధనల మేరకు తరలిస్తారు. దీనివల్ల జీఎంసీకి ఆదాయం సమకూరుతుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలు కల్పిస్తున్నారు.

### ఉల్లంఘిస్తే జరిమానాలే..

నిబంధనలు ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. ప్రధాన కూడళ్ల సహా నగరం అంతటా సీసీ కెమెరాలున్నాయి. ఏ వాహనం.. ఏ మార్గంలో వెళ్లిందో వివరాలు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా సేకరించి సంబంధిత వ్యక్తులకు జరిమానా విధించనున్నారు. జీఎంజీ కమిషనర్ పులి శ్రీనివాసులు 'ఈనాడు'తో మాట్లాడుతూ.. భవన వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

## బీడీఎస్ సీట్ల భర్తీకి స్పెషల్ స్ట్రే రౌండు

**ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం:** ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి స్పెషల్ స్ట్రే వేకెన్సీ రౌండు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేర్కొంది. నీట్ యూజీ రాసిన అభ్యర్థులు ఈనెల 30న ఉ.11.30 నుంచి జనవరి 1న సాయంత్రం 6 గంటల్లోగా ఐచ్ఛికాలు ఇచ్చుకోవాలని సూచించారు. ఆంధ్రా పరిధిలో 43 బీడీఎస్ సీట్లు, ఎస్వీయూ పరిధిలో 20 సీట్లు అందుబాటులో ఉంచారు. ★ బీడీఎస్ యాజమాన్య కోటా సీట్ల స్ట్రే వేకెన్సీ రెండో రౌండు కౌన్సెలింగ్‌లో 13 సీట్లు భర్తీ కాగా, సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 31వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఆయా దంత వైద్య కళాశాలల్లో చేరాలని వర్సిటీ పేర్కొంది.

# పీడించి.. బెదిరించి..!

గుంటూరు జీజీహెచ్‌లో వాహనాల పార్కింగ్ మాటున దౌర్జన్యం

రోగుల సహాయకుల నుంచి వాహన రుసుం వసూలు చేస్తున్న గుత్తసంస్థ సిబ్బంది

ఈనాడు, అమరావతి

డబ్బుల కోసం పీడిస్తున్నారు..వెంటనే ఇవ్వకుంటే బెదిరింపులకు దిగుతున్నారు..అవమానకర మాటలు..వెరసి గుంటూరు సర్వజనాసుపత్రి(జీజీహెచ్)లో వాహనాల పార్కింగ్ మాటున గుత్తసంస్థ సిబ్బంది దౌర్జన్యం చేస్తున్నారు.

జీజీహెచ్‌కు నిత్యం 5 వేల మందికి పైగా రోగులు వస్తుంటారు. ఇందులో ఇన్‌పేషంట్లుగా 1500 నుంచి 2 వేల మంది వరకు చేరుతుంటారు. ఇంతటి కీలకమైన ఆసుపత్రిలో వాహనాల పార్కింగ్ అతి పెద్ద సమస్యగా మారింది. ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, సిబ్బంది కోసం సెల్లార్లలో కొన్ని ప్రాంతాలు కేటాయించారు. అయితే, రోగులు, వారి సహాయకులు ద్విచక్రవాహనాలు, కార్లు పెట్టుకోవాలంటే అవస్థగా మారింది. సరైన స్థలం లేకపోవడంతో సూపరింటెండెంట్ కార్యాలయం ముందు నుంచి అత్యవసర విభాగం వరకు ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ నిలుపుతున్నారు. కొన్నిచోట్ల ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఇదంతా ఓ ఎత్తయితే..ఇక్కడే పార్కింగ్ పేరుతో కొత్తరకం దోపిడీకి తెరతీయడంపై రోగులు బాహాటంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

### స్థలం ఆసుపత్రిది.. దోపిడీ గుత్తేదారుది..

అత్యవసర విభాగం, శవాగారం ముందున్న స్థలంలో ఓ గుత్తసంస్థ పార్కింగ్ పేరుతో వసూళ్ల దందాకు తెరతీసింది. ద్విచక్రవాహనానికి రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. అత్యవసర చికిత్స కోసం హడావుడిగా వస్తోన్న రోగులకు ఇది తలనొప్పిగా మారింది. సరిపడా చిల్లర ఇవ్వలంటూ కొందరిని ఇబ్బంది పెడుతున్నారు. అత్యవసర కేసులతో వచ్చామని సహాయకులు చెబుతున్నా వినిపించుకోకుండా బెదిరిస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే బలవంతంగా వాహనాన్ని బయటకు పంపిస్తున్నారు. తాము రూ.8 లక్షలకు టెండరు పాడుకున్నామని..డబ్బు కట్టకుంటే వాహనం పెట్టడానికి వీల్లేదంటూ గుత్తసంస్థ సిబ్బంది తెగేసి చెబుతుండటంతో రోగులు హతాశులవుతున్నారు. ఆసుపత్రిలో వరుస వాహన చోరీలు జరుగుతుండగా, వాహనాలకు మాత్రం ఎవరూ బాధ్యత వహించని దుస్థితి. రైల్వేస్టేషన్, బస్టాండ్..ఇలా ఎక్కడైనా పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలం కేటాయింపు, షెడ్డు ఏర్పాటు చేయడం పరిపాటి. జీజీహెచ్ ప్రాంగణంలో ఆరుబయట గోడల వెంట వాహనాలు పెట్టినా పార్కింగ్ పేరుతో పీడిస్తుండడం వారికే చెల్లింది.

### 'ప్రైవేటు' జేబు నింపడానికా..?

ప్రస్తుత గుత్తసంస్థకు పార్కింగ్‌ను మూడు నెలల క్రితం రూ.8 లక్షలకు కట్టబెట్టడమన్నది ఆసుపత్రి అధికారుల మాటల సారాంశం. అయితే, ఇందులో గుత్తేదారు జేబులు నింపడం తప్ప రోగులకు మేలు జరగడం లేదు. కేవలం ఆదాయమే పరమావధిగా భావించి అధికారులు మిన్నకుండిపోవడంతో గుత్తసంస్థ సిబ్బంది ఇష్టారాజ్యంగా మారింది. ఇప్పటికైనా టెండరు రద్దు చేసి ఉన్న సెక్యూరిటీ సిబ్బందితో పార్కింగ్ పక్కాగా నిర్వహిస్తే బాగుంటుందన్న అభిప్రాయం రోగుల సహాయకుల నుంచే వ్యక్తమవుతోంది.!!

## శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఉత్తర ద్వార దర్శనం నేడు

విద్యుత్తు కాంతులలో తూర్పు గాలిగోపురం

**తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే:** దక్షిణ భారతదేశంలోని ప్రముఖ దేవాలయాల్లో మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయం ఒకటి. ఏటా వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని 30న తెల్లవారుజామున ఉత్తర ద్వారం నుంచి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. వేకువజామున నాలుగు గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా నృసింహస్వామి దర్శనమిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంచి, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకున్న అనంతరం శ్రీకృష్ణదేవరాయలు ముఖ మండపంలో భక్తులకు బంగారు శంఖం ద్వారా తీర్థం ఇవ్వనున్నారు. 1820లో తంజావూర్ మహారాజు ఆలయానికి అందజేసిన దక్షణావృత బంగారు శంఖానికి ప్రత్యేకత ఉంది. దీనిలో నుంచి అన్ని వేళలా ఓంకారం వినిపిస్తుంటుంది. ప్రతి ముక్కోటి ఏకాదశి నాడు దీన్ని బ్యాంక్ లాకర్ నుంచి బయటకు తెచ్చి అర్చకులకు అందజేస్తారు. భక్తులకు ఎస్‌బీఐ సహకారంతో 20 ఎంఎల్ సామర్థ్యం గల 5 వేల శంఖుతీర్థం సీసాలను ఉచితంగా ఇవ్వనున్నారు. అన్ని ప్రాంతాల్లోనూ సామాన్యులకు ఉచిత తీర్థంతో పాటు ఉచితంగా దర్శనం కల్పించనున్నట్లు దేవాలయ సహాయ కమిషనర్ కోగంటి సునీల్ కుమార్ తెలిపారు.

# ఆసుపత్రిలో చేరకున్నా.. చికిత్స పొందానని బీమా కాజేశారు

- సంతకాలు ఫోర్జరీ చేసి నగదు క్లెయిమ్ చేసుకున్నారు
- డీఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు షేక్‌నైనా

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** తాను ఆసుపత్రిలో చేరకున్నా.. చికిత్స చేయించుకున్నట్లు బీమా సంస్థ నుంచి అక్రమంగా నగదు క్లెయిమ్ చేసుకున్నారని గుంటూరు కోబాల్ట్‌పేటకు చెందిన షేక్‌నైనా వాపోయారు. ఈ మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదికలో డీఎస్పీ అజీజ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఎస్పీ విచారించి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బాధితుడు షేక్‌నైనా విలేకర్లతో మాట్లాడారు. "నేను న్యాయవాద వృత్తిలో ఉన్నాను. నాతో పాటు నా కుటుంబ సభ్యులందరికీ ఓ ప్రముఖ సంస్థలో ఆరోగ్య బీమా తీసుకున్నాను. ఫిబ్రవరిలో నేను ఓ అనారోగ్య సమస్యపై కొత్తపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిని సంప్రదించాను. వైద్యం చేయించుకుంటే బీమా క్లెయిం చేసుకోవచ్చా అని అడిగాను. నా సమస్యకు సంబంధించి బీమా వర్తించదని వారు చెప్పారు. దాంతో ఆ ఆసుపత్రికి వెళ్లలేదు. అయితే, కొద్ది రోజుల కిందట నేను సదరు ఆసుపత్రిలో రోగిగా చేరానని, జులై 29 నుంచి ఆగస్టు 8 వరకు అక్కడ చికిత్స తీసుకున్నానని ఆ ఆసుపత్రి వారు బిల్లులు తయారు చేసుకున్నారు. నా సంతకాన్ని ఫోర్జరీ చేశారు. నా ఆధార్, పాన్‌కార్డులను సేకరించారు.

వివరాలు చెబుతున్న షేక్‌నైనా

అవన్నీ బీమా సంస్థకు పంపించి రూ.2,81,440 ఆసుపత్రి వాళ్లు కాజేశారు. దీనికి సంబంధించిన సమాచారం నా ఫోన్‌కు రావడంతో నివ్వెరపోయాను. నా అనుమతి లేకుండా ఫోర్జరీ సంతకాలతో బీమా నగదు స్వాహా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాను. కేసు నమోదు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పటికైనా ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులు, సిబ్బందిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరాను' అని చెప్పారు.

## స్ట్రెచర్ కోసం ఎదురు చూస్తూ.. ఎండలో మాడుతూ..

కొమ్మలు లేకుండా మోడులా ఉన్న చెట్టు..దాని కింద విరిగిన కాలుకు కట్టుతో కదల్లేని స్థితిలో ఓ వృద్ధుడు. .సోమవారం మధ్యాహ్నం 2 గంటల వేళ తీక్షణంగా ఉన్న ఎండ..స్ట్రెచర్ తేవడానికి వెళ్లిన సహాయకుల కోసం ఎదురు చూస్తూ అరచెయ్యి అడ్డుపెట్టి ఇలా పడుకున్నారు..అర్ధగంటకు పైగా ఇదే పరిస్థితిలో ఇబ్బంది పడ్డారు. గుంటూరు జీజీహెచ్‌లోని అత్యవసర వైద్య విభాగం ముందు ఈ దృశ్యం కనిపించింది. ప్రత్తిపాడు ప్రాంతానికి చెందిన ఇతనికి కాలు విరగ్గా..గతంలో చికిత్స కోసం వచ్చి వెళ్లారు. మళ్లీ సోమవారం మధ్యాహ్నం రాగా..ఎండలో ఇలా ఇబ్బంది పడాల్సి వచ్చింది.

- ఈనాడు, అమరావతి

# తమలపాకుకు తెగుళ్లు.. రైతుల దిగాలు

ఈనాడు–అమరావతి, న్యూస్‌టుడే–పొన్నూరు

ఈనాడు పరిశీలన

మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేస్తున్న తమలపాకులు

ఆయుర్వేద సుగుణాలు ఉన్న తమలపాకును శుభకార్యాల్లో తాంబూలంగానే కాకుండా పాన్ తయారీలోనూ ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. నాణ్యమైన తమలపాకు తోటలకు కేంద్రంగా గుంటూరు జిల్లా గుర్తింపు తెచ్చుకుంది. జిల్లాలో తమలపాకు తోటల సాగు నానాటికీ తగ్గిపోతోంది. పొన్నూరు, చేబ్రోలు మండల పరిసర ప్రాంతాల్లో గతంలో 800 ఎకరాల్లో ఈ పంట విస్తీర్ణం ఉండగా...ఇప్పుడు 500 ఎకరాలకు పరిమితమైంది. తమలపాకు తోటలను వేరుకుళ్లు తెగులు దెబ్బతీస్తుండగా..గత మూడు, నాలుగేళ్లుగా నత్తలు పంటను గుల్ల చేస్తున్నాయి. దీంతో దిగుబడి ఊహించని రీతిలో పడిపోతుందని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో పొన్నూరు, చింతలపూడి, ములుకుదురు, మాచవరం, నిడుబ్రోలు, అంగలకుదురు, రేవేంద్రపాడు తదితర ప్రాంతాల్లో రైతులు తమలపాకు తోటలు సాగు చేస్తున్నారు. ఎకరం తోటకు సుమారు రూ.3 లక్షల వరకు రైతులు పెట్టుబడి పెడుతున్నారు. అయితే వేరుకుళ్లు తెగులుతో తోటలు దెబ్బతింటుండగా..ఇటీవల కాలంలో నత్తల వల్ల నష్టం రెట్టింపు అయిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నత్తతో ఆకులకు రంధ్రాలు పడుతున్నాయని, అవిశె ఆకులను సైతం అవి తినడంతో ఎండకు రంగు మారి దిగుబడి గణనీయంగా తగ్గుతుందని వాపోతున్నారు.

### ధర పెరిగినా దక్కని ఊరట

ప్రస్తుతం వంద పంతాల ధర రూ.3500 నుంచి రూ.4 వేలు ధర పలుకుతున్నా దిగుబడులు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో ఆదాయం రావడం లేదని రైతులు చెబుతున్నారు. తెగుళ్ల, ప్రకృతి వైపరీత్యాలు, నత్తల దాడి వల్ల అనుకున్న స్థాయిలో దిగుబడి రావడం లేదని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఉద్యాన పంటల్లాగానే తమలపాకు రైతులకు ప్రభుత్వం రాయితీల రూపంలో అండగా నిలవాలని కోరుతున్నారు.

### నష్టాలే మిగులుతున్నాయ్

అవిశ ఆకు తీగలు కట్టడానికి ఎకరాకు రూ.10 వేలు అవుతుంది. మంచి ధర లేనప్పుడు ఎదురు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. దిగుబడులు అధికంగా ఉన్నప్పుడు రేటు పతనమవుతోంది. ప్రస్తుతం ధర బాగున్నా దిగుబడులు లేవు. అలవాటైన వ్యాపకం కావడంతో ఒడుదొడుకులు ఎదురైనా కొనసాగిస్తున్నాం. వేరుకుళ్లు బెడద ఉంటోంది. నత్తల సమస్య గత రెండేళ్ల నుంచి పెరిగింది. నత్తలు అవిశ ఆకును తినేయడంతో చెట్లు ఎండిపోతున్నాయి. మళ్లీ అవిశ మొక్కలు నాటుకోవడం.. ఆసరాగా వెదురు బొంగులను నిలబెట్టాల్సి రావడంతో పెట్టుబడి అమాంతం పెరుగుతోంది. అవిశ గింజలు రాయితీపై ఇచ్చి అండగా నిలిస్తే కొంత ఊరట కలుగుతుంది.

– రవూఫ్, తమలపాకు రైతు, ములుకుదురు

## ఎన్‌హెచ్ 544-డి విస్తరణకు మరో ముందడుగు

**వినుకొండ:** అనంతపురం - గుంటూరు జాతీయ రహదారి 544-డి విస్తరణకు ముందడుగు పడింది. వినుకొండ నుంచి గుంటూరు వరకు ఇప్పుడున్న రెండు వరుసల రహదారిని నాలుగుగా మార్చేందుకు అవసరమైన భూసేకరణకు నోటిఫికేషన్ జారీ అయింది. దీనిలో భాగంగా జిల్లాలోని గ్రీన్‌ఫీల్డ్‌లో హద్దులు పెట్టేందుకు (పెగ్‌మార్క్ కోసం) నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా షెడ్యూల్ ప్రకటించి అధికార బృందాలను ఏర్పాటు చేసింది. జనవరి 9 నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. సర్వే పూర్తికి స్థానిక రెవెన్యూ అధికారుల సహకారం కోరుతూ జేసీకి ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం లేఖ రాశారు.

**85 కి.మీ. విస్తరణ..** వినుకొండ నుంచి గుంటూరు వరకు 85 కి.మీ. రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఈ ఏడాది మార్చిలో జాతీయ రహదారుల విభాగం 3ఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. తర్వాత డీపీఆర్ పూర్తి కావడంతో రహదారి నిర్మించేందుకు హద్దులు గుర్తించి స్తంభాలు పాతాలని నిర్ణయించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు వేర్వేరుగా షెడ్యూల్ విడుదల చేశారు. పర్యవేక్షణకు ప్రత్యేకంగా ముగ్గురు అధికారులను నియమించారు.

# అధ్యయనం మొదలు..!

ఏఎన్‌యూలో అతిథి అధ్యాపకుల గత నియామకాలపై దృష్టి

ఈనాడు, అమరావతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గతంలో జరిగిన అతిథి అధ్యాపకుల నియామకాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందా..విద్యార్హతలు, ప్రతిభను పక్కన పెట్టి అప్పటి ప్రభుత్వ పెద్దలు, నాటి ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్దపీట వేయడంపై ప్రస్తుతం లోతైన అధ్యయనం జరుగుతోందా.. అన్న ప్రశ్నలకు అవుననే సమాధానమే లభిస్తోంది. ప్రస్తుతం పనిచేస్తోన్న సదరు ఉద్యోగులకు సంబంధించిన విద్యార్హతలు, నైపుణ్యాలపై సమగ్రంగా పరిశీలన చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. అప్పటి ఉపకులపతి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపైనా ప్రస్తుతం సునిశితంగా ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంతో సహా అనేక అవకతవకలపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరగడం తెలిసిందే. సుమారు నెలరోజుల పాటు సమగ్రంగా తనిఖీ చేసిన నిఘా వర్గాలు..మొత్తం పరిస్థితిని నివేదించాయి. ఎక్కడెక్కడ ఏ రీతిలో నిబంధనలు ఉల్లంఘించారన్న దానిపై అందులో పేర్కొన్నట్లు సమాచారం. ఆ కోవలోనే అతిథి అధ్యాపకుల వ్యవహారంపైనా వివరించగా..ప్రస్తుతం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

**అన్నీ చూస్తున్నారు..** అప్పట్లో అతిథి అధ్యాపకుల నియామకానికి సంబంధించి విభాగాల వారీగా ఉన్న అవసరం ఏమిటి.. నియామకానికి ఏఏ స్థాయిల్లో అనుమతులు తీసుకున్నారు..నిబంధనలు ఏం చెబుతున్నాయి.. అందుకు భిన్నంగా ఎక్కడెక్కడ ఉల్లంఘనలు జరిగాయి..విద్యార్హత విషయంలో పొంతన ఉందా.. నైపుణ్యాల తీరుతెన్నులు ఎలా ఉన్నాయి..అడ్డగోలుగా నియామకాలు ఏఏ విభాగాల్లో జరిగాయి.. బోధనానుభవం లేని వారు ఎవరైనా ఉన్నారా.. కుటుంబీకులకు, బంధువులకూ కొందరు ఉద్యోగులు అవకాశాలు ఇప్పించుకున్న క్రమంలో అలాంటి వారెవరున్నారు..ఇలా అనేక కోణాల్లో ఆరా తీస్తున్నారు. ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన కొందరు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించిన నేపథ్యంలో వాటిపైనా కూపీ లాగుతున్నారు. అలాగే, ఇప్పటి వరకు వారి పనితీరూ మదింపు చేస్తున్నారు. ఎవరెవరు తరగతులకు సక్రమంగా వస్తున్నారు..ఎవరు రావడం లేదు.. బోధనా తీరుతెన్నులు ఎలా ఉన్నాయన్న కోణంలోనూ విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బోధనా ప్రమాణాలు పెంచి..రాజకీయ, సిఫార్సుల జోక్యాన్ని తగ్గించే క్రమంలో తొలుత అతిథి అధ్యాపకుల గత నియామకాల వ్యవహారంపై దృష్టి పెట్టడం చర్చనీయాంశమైంది..!

# సైబర్ నేరాల్లో రూ.1.47 కోట్లు వెనక్కి తెప్పించాం

అత్యాచార కేసులు, రోడ్డు ప్రమాదాలు తగ్గాయి

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీలు రమణమూర్తి, హనుమంతు

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే :** ఈ ఏడాదిలో 1090 చోరీ కేసులు నమోదు కాగా రూ.11.88 కోట్ల సొత్తు రికవరీ చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం పోలీసు కార్యాలయంలో 2025 వార్షిక నేరగణాంకాల వివరాలు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో అన్నిరకాల నేరాలు 13 శాతం తగ్గాయన్నారు. 2024లో అన్ని రకాల నేరాలు 10,257 నమోదుకాగా, 2025లో 8937 నమోదైనట్లు తెలిపారు. 2024లో 1054 చోరీ కేసుల్లో రూ.10.67 కోట్ల సొత్తు అపహరణకు గురవ్వగా రూ.4.01 కోట్లు సొత్తు రికవరీ చేశామన్నారు. ఈఏడాది రూ.18.48 కోట్ల సొత్తు చోరీ జరిగితే, అందులో రూ.11.88 కోట్ల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహిళలపై నేరాలు గత ఏడాదికంటే ఒకశాతం పెరిగాయన్నారు. 2024లో 1040 కేసులు కాగా, 2025లో 1052 కేసులు నమోదైనట్లు చెప్పారు. అత్యాచారం కేసులు ఈ ఏడాది ఆరు శాతం తగ్గాయని తెలిపారు. 2024లో 81 కేసులు, 2025లో 76 కేసులు నమోదైనట్లు చెప్పారు. రోడ్డుప్రమాదాలు ఈ సంవత్సరం 25 శాతం తగ్గాయని వెల్లడించారు. 2024లో 429 ప్రమాదాల్లో 439 మంది చనిపోగా, 2025లో 322 ప్రమాదాల్లో 335 మంది మరణించినట్లు చెప్పారు. సైబర్ నేరాలు ఈ ఏడాది పదిశాతం తగ్గాయన్నారు. 2024లో 113 కేసులు, 2025లో 102 కేసులు నమోదైనట్లు చెప్పారు. ఈ ఏడాది రూ.1.47 కోట్ల సొత్తును సైబర్ నేరస్థుల నుంచి వెనక్కి తెప్పించామని తెలిపారు. ఈ ఏడాది 91 గంజాయి కేసుల్లో 403 మందిని అరెస్టు చేసి 221 కిలోల గంజాయి జప్తు చేశామని తెలిపారు.

**తరచూ నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ చట్టం నమోదు..** తరచూ నేరాలకు పాల్పడుతున్న గంజాయి విక్రేతలు, రౌడీషీటర్లపై పీడీ చట్టం నమోదు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 11 మంది రౌడీషీటర్లను పీడీ చట్టంపై రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి పంపించామని చెప్పారు. గంజాయి నేరాలకు పాల్పడుతున్న 13 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం నమోదు చేశామన్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి కోడిపందేలు, జూదం, వ్యభిచారం, సింగిల్‌నంబర్, చౌకబియ్యం, గంజాయి, మత్తుపదార్థాల రవాణా తదితర నేరాలపై మూడు నెలల్లో 64 కేసులు నమోదు చేసి 307 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది నిందితులకు శిక్షల శాతం భారీగా పెరిగిందని చెప్పారు. 2024లో 5,060కి.. కేవలం 606 కేసుల్లో మాత్రమే శిక్షలు పడగా, 2025లో 9,214కి 3997 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఏఎస్పీలు రమణమూర్తి, హనుమంతు పాల్గొన్నారు.

# సంస్కృతి ప్రతిబింబం.. హస్తకళలకు చేయూత..

6 నుంచి 18 వరకు సారస్ ప్రదర్శన

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

**కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే:** సారస్ ప్రదర్శనను జనవరి 6 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు-నరసరావుపేట రోడ్డులోని రెడ్డి కళాశాల ఎదురుగా ఖాళీ స్థలంలో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా జాతీయ స్థాయి సారస్ కార్యక్రమం జరుగుతుందని, దేశంలోని ఆయా రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే చేనేతలు, హస్తకళలు, ఇతర సామగ్రి ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయన్నారు. 600 మందికి పైగా చేనేత, హస్తకళాకారులు, సాంస్కృతిక కళాకారులు వస్తున్నారని, 250కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. మినీ భారత సమ్మేళనంలో గుంటూరు సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రకంగా జిల్లా విశిష్టత చాటిచెప్పేలా వేదికను మలచాలన్నారు. ఫుడ్ కోర్టులు ఉంటాయని, ఆహార పదార్థాల తయారీలో ఎటువంటి కలుషితం జరగరాదని, నాణ్యతలో లోపాలు ఉండకూడదని సూచించారు.

### మహిళల భద్రత..పర్యావరణ పరిరక్షణ

దేశం నలుమూలల నుంచి పాల్గొనే స్వయం సహాయక సంఘాల సభ్యుల సురక్షిత, భద్రత మన బాధ్యతని, వారి అభిమానం చూరగొనేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ హిత సామగ్రిని వినియోగిస్తూ ప్లాస్టిక్ నిషేధిత జోన్‌గా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సమావేశంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, సెర్ప్ డిప్యూటీ సీఈవో ఎ.కల్యాణచక్రవర్తి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# సిక్సర్లు కొట్టిన ఉత్సాహం ఫైనల్స్ నేడే

EENADU SPORTS LEAGUE 2025

**గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే:** 'ఈనాడు' ఆధ్వర్యంలో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహిస్తున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025' క్రికెట్ టోర్నమెంట్ చివరి అంకానికి చేరుకుంది. సోమవారం జరిగిన సెమీఫైనల్స్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. మంగళవారం జూనియర్స్, సీనియర్స్ పురుషులతో పాటు మహిళల విభాగంలో ఫైనల్స్ జరగనున్నాయి.

Aster Ramesh HOSPITALS We'll Treat You Well

**ఎన్నారైటీ జట్టు విజయపథం..** జూనియర్స్ విభాగంలో సెమీఫైనల్స్ మ్యాచ్ ఎన్నారైటీ కళాశాల(విశదల)-చలపతి డిప్లొమా కళాశాల (మోతడక) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన చలపతి కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఎన్నారైటీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. తర్వాత బరిలోకి దిగిన చలపతి జట్టు 6 వికెట్లు కోల్పోయి 80 పరుగులే చేసింది. చివరి ఓవర్‌లో విజయానికి 8 పరుగులు కావాల్సి ఉండగా.. చలపతి జట్టు లక్ష్యం అందుకోలేకపోయింది. చరణ్ 23 బంతుల్లో (4×4) 25 పరుగులు చేసి ఎన్నారైటీ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.



గ్రౌండ్-1

**హిందూ కళాశాల జట్టు జయకేతనం...** జూనియర్స్ విభాగంలో సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల(చీరాల)-హిందూ జూనియర్ కళాశాల (గుంటూరు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన హిందూ కళాశాల 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. బరిలోకి దిగిన సెయింట్ ఆన్స్ జట్టు 7 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. బసవయ్య 31 బంతుల్లో (7×4) 38 పరుగులు చేసి జట్టు విజయానికి ప్రధాన కారకుడయ్యాడు.

గ్రౌండ్-2

**వీవీఐటీ మహిళా జట్టు గెలుపుబావుటా..** మహిళల విభాగంలో సెమీఫైనల్స్ మ్యాచ్ వీవీఐటీ(నంబూరు)-విజ్ఞాన్ యూనివర్సిటీ (వడ్లమూడి) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు బౌలింగ్ తీసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన వీవీఐటీ కళాశాల 10 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. తర్వాత విజ్ఞాన్ జట్టు 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులే చేసింది. వీవీఐటీ మహిళా జట్టులో రుచిత (4×4) 21 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించారు.

గ్రౌండ్-1


Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు


**ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..**

చరణ్ | రుచిత | బసవయ్య | శ్రీరామ్ | హర్ష

**నేడు జరిగే మ్యాచ్‌లు..** వేదిక: చలపతి హిల్‌వ్యూ స్టేడియం

గ్రౌండ్-1 ★ జూనియర్స్ ఫైనల్స్ ఉదయం 8 గంటలకు హిందూ కళాశాల × ఎన్నారైటీ ★ సీనియర్స్ ఫైనల్స్.. ఉదయం 11 గంటలకు జేసీ లా కళాశాల × కేఎల్ యూనివర్సిటీ

గ్రౌండ్-2 ★ మహిళల ఫైనల్స్ ఉదయం 10 గంటలకు వీవీఐటీ ఇంజినీరింగ్ కళాశాల × ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల.

**కేఎల్‌యూదే పైచేయి..** సీనియర్స్ విభాగంలో సెమీఫైనల్స్ మ్యాచ్ ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల జట్టు(గుంటూరు)-కేఎల్‌యూ యూనివర్సిటీ(వడ్డేశ్వరం) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కేఎల్‌యూ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. అనంతరం ఆర్‌వీఆర్‌జేసీ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 72 పరుగులకే పరిమితమైంది. హర్ష రెండో ఓవర్లో మూడు కీలక వికెట్లు తీయడంతో పాటు నాలుగో ఓవర్లో మరో వికెట్ తీసి జట్టు విజయానికి కారకుడయ్యాడు.

**కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జేసీ లా కళాశాల గెలుపు..** సీనియర్స్ విభాగంలో సెమీఫైనల్స్ కేబీఆర్ డిగ్రీ కళాశాల (నరసరావుపేట)-జేసీ లా కళాశాల(గుంటూరు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కేబీఆర్ కళాశాల జట్టు బౌలింగ్‌ను ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన జేసీ లా కళాశాల జట్టు 10 ఓవర్లకు ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 97 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బరిలోకి దిగిన కేబీఆర్ జట్టు 5 వికెట్లు కోల్పోయి 87 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్‌లో 6 బంతులకు 25 పరుగులు చేయాల్సి ఉండగా కేబీఆర్ కెప్టెన్ రజాక్ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టినా.. మూడో బాల్‌కి వికెట్ కోల్పోవడంతో ఓటమిపాలైంది. జేసీ లా కళాశాల కెప్టెన్ శ్రీరామ్ 35 బంతుల్లో (6×4, 4×6) 57 పరుగులతో జట్టుకు విజయం అందించాడు.

గ్రౌండ్-2

## ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచేలా పని చేయండి

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** మంచి అవకాశం ఇచ్చాం.. ప్రభుత్వం, పార్టీ ప్రతిష్ఠ పెంచేలా పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మిర్చియార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు సీఎం చంద్రబాబును సోమవారం కలిశారు. మిర్చియార్డు ఛైర్మన్‌గా నియమించినందుకు సీఎంకు అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ మిర్చియార్డుకు వచ్చే రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని, రైతులు నష్టపోకుండా మంచి ధర దక్కేలా చూడాలన్నారు. పారదర్శకంగా సేవలందించాలని సూచించారు. బాధ్యతగా పని చేస్తానని అప్పారావు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రజల వద్దకు ప్రవీణ్.. 100 రోజులు.. 100 గ్రామాలు కార్యక్రమం గురించి చంద్రబాబుకు ఎమ్మెల్యే ప్రవీణ్ వివరించారు. నియోజకవర్గంలోని సమస్యలపై ఆయన సీఎంకు వినతిపత్రం అందజేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన భాష్యం ప్రవీణ్, కుర్రా అప్పారావు


**పొగాకు బోర్డు, గుంటూరు**
వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య విభాగము, భారత ప్రభుత్వము (ఐ.యస్.ఓ.9001:2015 గుర్తింపు పొందిన సంస్థ)
జి.టి. రోడ్డు, గుంటూరు-522004. ఫోన్ : 0863-2358399, 2358499.

**టెండరు నోటీసు**
2025-26 FCV పొగాకు ఆక్షన్స్ కొరకు ఆంధ్రప్రదేశ్‌లో గల పొగాకు బోర్డు వేలం కేంద్రాల వద్ద 1) పొగాకు బేళ్ళను హ్యాండిల్ చేయుటకు మరియు 2) ట్రాలీస్ మరమ్మత్తులు/ సర్వీసింగు కొరకు అనుభవము కలిగిన కాంట్రాక్టర్లు మరియు ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.
పైన తెలుపబడిన పనుల కొరకు టెండరు ఫారములు తదితర వివరముల కొరకు రీజినల్ మేనేజరు, ఒంగోలు, రాజమండ్రి మరియు మేనేజరు(ఆక్షన్స్), పొగాకు బోర్డు, గుంటూరు వారిని సంప్రదించగలరు. టెండరు ఫారములు మరియు నియమ నిబంధనలు పొగాకు బోర్డు వెబ్‌సైట్ (www.tobaccoboard.com) నుండి కూడా పొందవచ్చును.
పైన తెలుపబడిన పనుల నిమిత్తము పూర్తి చేసిన టెండరు ఫారాలను టెండరు నియమ నిబంధనలలో తెలిపిన ధరావతు సొమ్ముతో సహా తేది.21-01-2026 సాయంత్రం గం॥ 3.00 లలోగా పొగాకు బోర్డు, గుంటూరు నందు టెండరు బాక్సులో డిపాజిట్ చేయవలెను. అసంపూర్తిగా ఉన్న టెండర్లు తిరస్కరించబడును మరియు ఏ విధమైన కారణం చూపకుండానే స్వీకరించిన టెండర్లలో ఏదైనా లేదా అన్నింటిని తిరస్కరించేందుకు కార్యనిర్వహణాధికారి, పొగాకు బోర్డు వారు సర్వహక్కులు కలిగియున్నారు.
స్థలము : గుంటూరు, తేది: 29-12-2025 సం/- కార్యదర్శి


## నిర్మాణ పనుల్లో పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలు తప్పనిసరి

**తుళ్లూరు, న్యూస్‌టుడే :** అమరావతి నిర్మాణ పనుల్లో గుత్తేదారులు పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలు చేపట్టాలని రాజధాని గ్రామాల ప్రజలు కోరారు. సోమవారం వెంకటపాలెం, నేలపాడు, మల్కాపురం, రాయపూడిలో సీఆర్డీఏ, ఏడీసీఎల్, పీఎంసీ, పీజీఎంసీ అధికారులు స్టేక్ హోల్డర్స్ సంప్రదింపుల సమావేశాలు నిర్వహించారు. రాజధాని నిర్మాణ పనుల్లో పర్యావరణ, సామాజిక నిర్వహణ ప్రణాళిక మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజల భాగస్వామ్యంతో సమావేశాలు నిర్వహించారు.

☛ అమరావతి ప్రాజెక్టులో నిర్మాణ పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పనుల వల్ల కలిగే పర్యావరణ, సామాజిక అంశాలపై గ్రామస్థుల అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పనులు వల్ల రహదారులపై విపరీతంగా దుమ్ము వస్తోందని, నీళ్లు చల్లే ఏర్పాట్లు చేయాలని, నిర్మాణ పనుల్లో తవ్వి తీసే మట్టి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుత్తేదార్ల వద్ద ఉన్న అంబులెన్స్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, రహదారులకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు నివారించాలని కోరారు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని, నిర్మాణ వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వీటిపై గుత్తేదారు సంస్థల ప్రతినిధులు, పీఎంసీ, పీజీఎంసీ ప్రతినిధులు సమగ్ర వివరణ ఇచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పీజీఎంసీ నుంచి మగేష్, శశికిరణ్, గాజుల అరుణ్ కుమార్, సీఆర్డీఏ సామాజిక సంక్షేమ విభాగం డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, గుత్తేదారు సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న పీజీఎంసీ అధికారులు, గుత్తేదారు సంస్థల ప్రతినిధులు

## తెనాలి తహసీల్దార్‌కు సీఎం ప్రశంస

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. తెనాలి తహసీల్దార్ కార్యాలయానికి ఇటీవల ఐఎస్‌వో ధ్రువపత్రం అందిన నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయ పిలుపు మేరకు.. సోమవారం సాయంత్రం తహసీల్దార్, ముఖ్యమంత్రిని సచివాలయంలోని ఛాంబర్‌లో కలిశారు. బ్రిటీష్ కాలం నాటి పురాతన కార్యాలయాన్ని సకల సౌకర్యాలతో ఆధునికీకరించడం.. అర్జీదారులు, ప్రజలకు ప్రత్యేక వసతుల ఏర్పాటు, మెరుగైన సేవలు అందించిన క్రమంలో ఐఎస్‌వో ధ్రువపత్రం అందుకున్నామని ఆయన ముఖ్యమంత్రికి వివరించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ సంపూర్ణ సహకారంతోనే ఇది సాధ్యమైందని చెప్పారు. మంచి ప్రయత్నం చేశారని, సేవల స్ఫూర్తిని కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయన్ను అభినందించారు. రెవెన్యూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆయనతో పాటు ఉన్నారు.

గోపాలకృష్ణను అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

## ఎరువుల విక్రయాలు నిలిపివేత

**చేబ్రోలు, న్యూస్‌టుడే:** రాష్ట్ర ఎరువుల తనిఖీ బృందం సోమవారం చేబ్రోలు మండలంలోని పలు దుకాణాలను తనిఖీ చేసింది. వడ్లమూడిలోని మూడు దుకాణాల్లో రైతుల సంతకాలు లేకుండా ఎరువులు విక్రయించినట్లు గుర్తించారు. ఆయా దుకాణాల్లో మొత్తం రూ.15,19,870 విలువ చేసే 85.4 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో ఏడీఏలు సునీల్, సురేష్ బాబు, రామకోటేశ్వరి, ఏవో ప్రియదర్శిని పాల్గొన్నారు.

## సమస్యల వేగవంత పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్

**కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే:** రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీజీఆర్ఎస్ కార్యక్రమానికి సమాంతరంగా రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనికి సోమవారం 45 అర్జీలు అందాయి. గుంటూరు కలెక్టరేట్ ఆవరణలోని ఎస్.ఆర్.శంకరన్ హాలు వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్ రెండు విభాగాలుగా ఏర్పాటు చేశారు. తొలుత బాధితుల అర్జీలు మండలాల వారీగా విభజించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక బల్ల ఏర్పాటు చేసి, అక్కడ ఆయా మండలాల డీటీలు అందుబాటులో ఉన్నారు. సమస్యను డీటీలు క్లుప్తంగా రాసి తహసీల్దారుకు పంపారు. మినీ శంకరన్ హాలులో ఏర్పాటు చేసిన వేదికలో ఆర్డీవోలు, తహసీల్దార్లు ఆ అర్జీ ఎన్ని రోజుల్లోగా పరిష్కరిస్తారో తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రెవెన్యూ అర్జీలను దరఖాస్తుదారులతో సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయించడంతో పాటు నోటీసులు సిద్ధం చేసి సర్వే తేదీని దరఖాస్తుదారులకు తెలియజేస్తున్నారన్నారు. ఈ ప్రక్రియను తెనాలి సబ్ కలెక్టర్, గుంటూరు ఆర్డీఓ నిరంతరం పర్యవేక్షిస్తూ తహసీల్దార్లకు సూచనలు ఇవ్వాలన్నారు.

### 7న సర్వే చేస్తామన్నారు

మా అమ్మకు తాడేపల్లి మండలం గుండిమెడలో 5.5 సెంట్ల భూమి ఉంటే.. ఆన్‌లైన్‌లో 5 సెంట్లే నమోదు చేశారు. మిగిలిన అర సెంటు భూమిని సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. రెవెన్యూ క్లినిక్‌లో అర్జీ రాసిచ్చా. దరఖాస్తు నమోదు చేయించి జనవరి 7న సర్వే చేస్తామని.. వాస్తవమైతే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. **- దానబోయిన వెంకట శివాజీ, చింతలపూడి, దుగ్గిరాల మండలం**

### కమిటీ ద్వారా పరిష్కరించాలి

అంకిరెడ్డిపాలెంలో మాకు 29 ఎకరాల భూమి ఉంది. 2006లో అది ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు పేర్కొనడంతో కోర్టును ఆశ్రయించగా.. అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఇప్పుడు అధికారులు అది చెరువు భూమి అంటున్నారు. చెరువు భూమి అయితే ఏళ్లుగా అక్కడ వందలాది మందిని నివాసాలు ఎలా ఏర్పాటు చేసుకోనిచ్చారో చెప్పడం లేదు. చెరువు నుంచి వ్యవసాయ భూమిగా మార్చాలని కోరుతున్నాం. అది కలెక్టర్ పరిధిలో లేదు. కలెక్టర్ స్థాయి దాటి పరిష్కరించాల్సిన అంశాలపై ప్రత్యేక కమిటీ వేసి విచారిస్తేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

**- ఎన్.పాండురంగప్రసాద్, సత్యనారాయణ, గుంటూరు**

## డాక్టర్ నందకిశోర్‌కు అవార్డు ప్రదానం

**పట్నంబజారు:** ఐఎంఏ ఏటా జాతీయ స్థాయిలో ఇచ్చే ఉత్తమ రాష్ట్ర అధ్యక్షుడి అవార్డు 2024-25 సంవత్సరానికి ఏపీ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన డాక్టర్ గార్లపాటి నందకిశోర్‌కు లభించింది. ఈ అవార్డును అహ్మదాబాద్‌లో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన ఐఎంఏ జాతీయ సదస్సులో గుజరాత్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ శంకర్‌చౌదరి, రాజ్యసభ సభ్యులు మాన్య నాయక్, ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ బన్సాలి, జాతీయ కార్యదర్శి సర్బరీ దత్త సమక్షంలో ఐసీసీ ఛైర్మన్ జైషా నుంచి డాక్టర్ నందకిశోర్ అందుకున్నారు. 2024-25 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి వైద్యులను అనేక సమాజ హిత విషయాల్లో చైతన్య పరిచినందుకు ఈ అవార్డును అందజేశారు.


EENADU e Classifieds

BUSINESS SERVICES

**బంగారం కొనబడును.** బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

SENIOR Electrician: Q: DIP in Electrical, Con: Arjuna solvent extraction pvt. ltd. Perecherla, Gnt. ✆ 96662 99986.

**తెనాలి దగ్గర** దుగ్గిరాలలోని ప్రముఖ కాఫీ పరిశ్రమలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ మరియు ప్యాకింగ్ బాయ్స్ కావలెను. రూమ్ మరియు క్యాంటీన్ సౌకర్యం కలదు. ✆ 92980 11777, 8096161777.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

**ప్రముఖ హోటల్‌లో** పనిచేయుటకు రూమ్ బాయ్స్ కావలెను. భోజనం వసతి సదుపాయం కల్పించబడును. సంప్రదించండి. ఫోన్: 9966846756, 7801062777.

**కుంకుపాడు అడ్డంకి** చుట్టుప్రక్కల పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం॥ డ్యూటీ, భోజనం + రూమ్ కలదు. 9149986335, 9652689259.

**గుంటూరులో నివాసము** ఉంటున్న పేషంట్స్‌ను చూసుకొనుటకు భార్య & భర్త మరియు ఆయాలు అర్జంట్‌గా కావలెను. సంప్ర॥ ✆ 7842845772.

**ఉద్యోగం చేస్తూనే** అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

**గుంటూరు మాస్టర్‌మైండ్స్** కాలేజి నందు హాస్టల్ ఇన్‌చార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్ర. ✆ 89784 80429.

**గుంటూరు మాస్టర్** మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జీస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీ: 14000/- నుండి 21000/- వరకు. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యిఉండాలి. వివరముల కొరకు సంప్ర. ✆ 9248713335.

**బిజినెస్ మేనేజర్స్/** బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, ఫ్రెషర్స్, వేతనం: రూ.20,000/- + వెహికల్ అలెవెన్స్. 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

**గుంటూరు, AT** అగ్రహారం మా ఇంట్లో ఇంటి పని, వంట పనిచేయుటకు ఆడ పనిమనిషి కావలెను. హిందువులు మాత్రమే. ✆ 97037 54657.

**75సం॥ మహిళను** చూసుకొనుటకు మా ఇంటివద్దనే వుండి ఏ బాదరాబందీలేని 45సం॥లోపు ఒంటరి మహిళా కావలెను. భోజన, వసతి కలదు. 63054 95510.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541


**మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)**

| | |
|---|---|
| వచ్చిన బస్తాలు: | 56,257 |
| అమ్మకాలు: | 53,482 |
| నిల్వలు: | 11,060 |

**నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)**

| | |
|---|---|
| 334 | 10,000-17,000 |
| నంబర్ 5 | 12,000-15,300 |
| 273 | 11,000-17,000 |
| 341 | 11,000-17,000 |
| సూపర్ 10 | 12,000-16,500 |

**నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ**

| | |
|---|---|
| తేజ | 10,000-16,500 |
| బాడిగ | 11,000-17,000 |
| దేవనూరు డీలక్స్ | 11,000-17,500 |
| ఆర్మూర్ | 10,000-13,000 |

**ఏసీ కామన్ వెరైటీ**

| | |
|---|---|
| 334 | 10,500-16,700 |
| నంబర్ 5 | 11,000-15,000 |
| 341 | 11,000-16,500 |
| 4884 | 12,000-14,000 |
| సూపర్ 10 | 12,000-14,300 |

**ఏసీ స్పెషల్ వెరైటీ**

| | |
|---|---|
| తేజ | 10,000-14,800 |
| బాడిగ | 10,000-16,500 |
| దేవనూరు డీలక్స్ | 12,000-17,300 |
| తాలు | 5,200-7,700 |

- న్యూస్‌టుడే, మిర్చియార్డు


91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297


## ఉప ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలతో పోస్టు

### పోలీసులకు జనసేన నేతల ఫిర్యాదు

**తాడేపల్లి, న్యూస్‌టుడే :** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈనెల 24న తాడేపల్లి మండలం ఇప్పటంలో ఇండ్ల నాగేశ్వరమ్మ అనే వృద్ధురాలిని పరామర్శించి.. అనంతరం ఆమెతో కలిసి దిగిన ఫొటోను సామాజిక మాధ్యమంలో పెట్టి.. అనుచిత వ్యాఖ్యలు జోడించిన వ్యక్తిపై ఇప్పటం జనసేన నాయకులు సోమవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగేశ్వరమ్మను ఓదార్చిన సందర్భంలో తీసిన ఫొటోను బంగారురాజు అనే సామాజిక మాధ్యమ ఖాతాలో అభ్యంతర, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టు పెట్టారని.. పవన్ కల్యాణ్‌పై వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యవహరించారని ఫిర్యాదులో తెలిపారు. పోస్టు పెట్టిన వ్యక్తిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన ఇప్పటం గ్రామ అధ్యక్షుడు గాజుల రాంబాబు ఫిర్యాదు చేశారు. పోస్టు ప్రతులను పోలీసులకు అందజేశారు. నాయకులు సామల నాగేశ్వరరావు, తాడేపల్లి మండలం యువజన విభాగం అధ్యక్షులు తిరుమలశెట్టి నరసింహారావు, నగర ఉపాధ్యక్షుడు సాధు చంద్రశేఖర్, జొన్నా రాజేష్, బడె కోమలి, శంకరశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు


**బ్రాయిలర్ ధరలు (కిలో \ కి రూ.లలో)**
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 142, రిటైల్ ధర - 169, చికెన్ విత్‌స్కిన్ - 245, చికెన్ స్కిన్‌లెస్ - 279.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 147, 156, 167 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.


## పెళ్లికి ఒప్పుకోలేదని డ్రగ్స్ డ్రామా!

✦ పోలీసులను బురిడీ కొట్టించిన మహిళ
✦ బాలికకు మత్తు పదార్థాల కేసులో ట్విస్టు

**నెహ్రూనగర్ (గుంటూరు):** ఇంటర్ చదువుతున్న బాలికకు డ్రగ్స్ అలవాటు చేశారంటూ ఆమె తల్లి చేసిన ఆరోపణలపై పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. 15 రోజుల కిందట గుంటూరుకు చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించి ప్రభుత్వాసుపత్రిలో చేరింది. తన కుమార్తెకు ఓ డ్రగ్స్ ముఠా బలవంతంగా మత్తు పదార్థాలు అలవాటు చేసి ఆమె భవిష్యత్తును పాడు చేశారంటూ మానసిక క్షోభతో ఆత్మహత్యకు యత్నించినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న ఈగల్ విభాగ ఐజీ ఆకే రవికృష్ణ, ఎస్పీ వకుల్ జిందాల్ ఆసుపత్రికి వచ్చి బాధితురాలిని పరామర్శించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. వెంటనే ఎస్పీ ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశించారు. తూర్పు డీఎస్పీ అజీజ్, లాలాపేట సీఐ శివప్రసాద్‌తో లోతుగా దర్యాప్తు చేయించారు.

**యువకులకు డ్రగ్స్ అలవాటు లేదని తేలింది - ఎస్పీ వకుల్ జిందాల్**

బాలికకు డ్రగ్స్ అలవాటు కేసు విషయమై సోమవారం పోలీసు కార్యాలయంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎస్పీ వకుల్ జిందాల్ సమాధానం ఇచ్చారు. 'బాధితురాలు డ్రగ్స్ ముఠాగా ఆరోపించిన ఘటన చాలా సీరియస్‌గా తీసుకొని విచారించాం. ఆరుగురిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేశాం. వారి రక్త నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపించాం. ఇటీవల ఆ నివేదికలు వచ్చాయి. అందులో ఆ యువకులకు డ్రగ్స్ అలవాటు లేదని తేలింది. ఆత్మహత్యకు యత్నించిన మహిళ ఎందుకు తన కుమార్తెకు డ్రగ్స్ అలవాటు చేశారని ఆరోపించిందో అనుమానం వచ్చి లోతుగా దర్యాప్తు చేశాం. తన కుమార్తె తాము చూపించిన అబ్బాయిని పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకోవడం లేదని అందుకే ఆత్మహత్యకు యత్నించినట్లు తేలింది. ఇదే తరహాలో ఆ మహిళ కొన్ని సంవత్సరాల కిందట హైదరాబాద్‌లోనూ ఆత్మహత్యాయత్నం చేసుకొని అప్పుడు అక్కడ పోలీసులకు డ్రగ్స్ ముఠాలు ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపిస్తూ తప్పుడు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది' అని ఎస్పీ చెప్పారు.


ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589


(c) eenadu

# మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

## మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితం నాశనం

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ భానోదయ, ప్రిన్సిపల్ రాధిక తదితరులు

**గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే :** గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తాత్కాలిక ఉత్సాహం ఇచ్చినా జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయని.. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సౌత్ డీఎస్పీ భానోదయ అన్నారు. పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సంకల్పం- మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదని.. ఈ సమయంలో ప్రలోభాలు, ఆకర్షణలకు లోనై మద్యం, ధూమపానం, గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు అలవాటు పడి వాటికి బానసలుగా మారి విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని చెప్పారు. అనంతరం సంకల్పం గోడపత్రిక ఆవిష్కరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ వంశీధర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక పాతూరి తదితరులు పాల్గొన్నారు.

## లోకేశ్ సొంత నిధులతో శ్మశానవాటిక అభివృద్ధి

సమాధుల తోటను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, అబద్ధయ్య

**తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే :** మంగళగిరి శాసనసభ్యుడు, మంత్రి నారా లోకేశ్ సొంత నిధులతో పట్టణంలోని బాప్టిస్ట్‌పేట సంఘ సమాధి తోటను అభివృద్ధి చేశారని పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక శ్మశానవాటికకు విశ్రాంతగది, సీసీరోడ్డు, నీటి సదుపాయం, సిమెంటు బల్లలు, విద్యుత్తు దీపాలు, గోడలకు రంగులు, మరుగుదొడ్లను ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. పాస్టర్ కొడాలి విజయ్, బాప్టిస్ట్‌పేట సంఘ కాపరి ఇల్లూరి జోసఫ్, సంఘ పెద్దలు కలకోటి బోయాజ్, నందిగం వసంతరావు, దేశయ్య, జేమ్స్, ప్రేమ్‌కుమార్, పాస్టర్ రవికుమార్, తెదేపా పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ ఎర్రగుంట్ల భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం బందోబస్తు పర్యవేక్షించిన ఎస్పీ

**తాడేపల్లి, న్యూస్‌టుడే :** మంగళగిరి జాతీయ రహదారిపై ఉన్న సీకే కన్వెన్షన్‌లో సోమవారం వివాహ వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరైన సందర్భంగా అవసరమైన బందోబస్తును ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల మళ్లింపు వాటి పార్కింగ్ ఏర్పాట్లు, వీవీఐపీ, వీఐపీ రాకపోకల మార్గాల్లో తనిఖీ చేశారు. జిల్లా అదనపు ఏఎస్పీలు రవికుమార్, హనుమంత్, గుంటూరు ఉత్తర మండల డీఎస్పీ మురళీకృష్ణ, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, ఎస్‌బీడీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు బ్రహ్మం, వీరాస్వామి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

వైద్యురాలు రాజకుమారిని సన్మానిస్తున్న వివిధ విభాగాధిపతులు, అధ్యాపకురాళ్లు

**తాడికొండ, న్యూస్‌టుడే :** మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ వైద్యురాలు శనక్కాయల రాజకుమారి ఆధ్వర్యంలో పాలీసిస్టిక్ ఓవరీ డిసీజ్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో ప్రధానంగా తలెత్తే పాలీసిస్టిక్ ఓవరీ డిసీజ్ సమస్యలు వివరించారు. ప్రస్తుత జీవనశైలి, ఒత్తిడి, ఆహార అలవాట్లు ఈ సమస్యకు ప్రధాన మూలమని తెలిపారు. నిత్యం సరైన వ్యాయామం, సమతుల ఆహారం తీసుకుంటే పీసీఓడీని నియంత్రివచ్చని సూచించారు. ఫాస్ట్‌ఫుడ్ అధికంగా తీసుకుంటే వచ్చే ఊబకాయం, హార్మోన్ల అసమతుల్యత, రక్తహీనత, జీర్ణకోశ సమస్యలు వంటి దుష్ప్రభావాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసను ఎదుర్కోవాలంటే విద్యార్థినులు తమ హక్కులు తెలుసుకుని ధైర్యంగా ముందుకు రావాలని అన్నారు. అనంతరం రాజకుమారిని వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కొల్లా నాగ శ్రీనివాసరావు, డీన్ కె.కిరణ్‌కుమార్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ తులసిరాణి, విభాగాధిపతి శాంతిప్రియ పాల్గొన్నారు.

## ఆటలకు అందలం

ప్రభుత్వం బడులకు పరికరాలు అందజేత

**మేడికొండూరు, న్యూస్‌టుడే**

సరఫరా చేసిన ఆట పరికరాలు

**రాష్ట్ర** ప్రభుత్వం సర్కారు బడులు బలోపేతం చేస్తోంది. ఈ నేపథ్యంలో మరో పక్క క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పాఠశాల స్థాయిలో పిల్లలు ఆటలపై పట్టు సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం సర్వ శిక్షా ద్వారా సర్కారు బడులకు వివిధ రకాల ఆట పరికరాలు ఉచితంగా అందించింది. పిల్లల వయసును బట్టి ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు వేర్వేరుగా అందించారు.

★ దీంతో విద్యార్థులు తమకు ఇష్టమైన ఆట సాధన చేసి పట్టు సాధించే అవకాశం ఉంది. ఇది ఆయా రంగాల్లో వారు రాణించేందుకు దోహద పడుతుంది. మరో పక్క క్రీడా రంగం బలపడుతుంది. పిల్లలు శారీరక, మానసిక వికాసానికి ఆటలు ఉపయుక్తంగా ఉంటాయి. తద్వారా విద్యార్థులు ఉత్సాహంగా బడికి వచ్చేందుకు దోహద పడుతుంది. పిల్లల వయసును బట్టి చెస్, క్యారమ్స్, తాడాట, ఫుట్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, షాట్‌పుట్, క్రికెట్ ఆటలకు సంబంధించిన పరికరాలు సరఫరా చేశారు. ఇప్పటికే బడికి ఒక కిట్టు చొప్పున అందాయి.

**క్రీడా పరికరాల మంజూరుకు తాడికొండ నియోజకవర్గంలో ఎంపిక చేసిన పాఠశాలల వివరాలిలా..**

| మండలం | బడులు |
|---|---|
| మేడికొండూరు | 50 |
| ఫిరంగిపురం | 51 |
| తాడికొండ | 45 |
| తుళ్లూరు | 42 |

## రేవేంద్రపాడు పాఠశాల ప్రాజెక్టుకు రాష్ట్ర తృతీయ స్థానం

రాష్ట్ర స్థాయి పోటీలో తమ నమూనా గురించి న్యాయనిర్ణేతకు వివరిస్తున్న విద్యార్థులు

**రేవేంద్రపాడు (దుగ్గిరాల), న్యూస్‌టుడే :** రేవేంద్రపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఒకేషనల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో తృతీయ స్థానం పొందినట్లు హెచ్‌ఎం బీవీ కృష్ణారావు తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ విభాగంలో ఒకేషనల్ టీచర్ ఝాన్సీ పర్యవేక్షణలో విద్యార్థులు 'రెసిడెన్షియల్ హౌస్ వైరింగ్ కనెక్షన్ విత్ రిమోట్ కంట్రోల్ ఆపరేటింగ్ స్విచెస్' ప్రాజెక్టు తయారు చేశారు. విద్యార్థులు చంద్రకిరణ్, దుర్గ, భవిత, అజ్మ, బాలహన్సిక, మనోజ్‌ను హెచ్‌ఎంతో పాటు మరో ఇద్దరు ఒకేషనల్ ఉపాధ్యాయులు కల్యాణి, జనార్దనరావు, ఉపాధ్యాయులు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు అభినందించారు. విద్యార్థులు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు నుంచి జ్ఞాపిక, ప్రశంసా పత్రం, రూ.10 వేలు అందుకున్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు పల్లపాడు పాఠశాల ప్రాజెక్టు ఎంపిక

ప్రాజెక్టు చూపుతున్న విద్యార్థులు, ప్రధానోపాధ్యాయిని, సైన్స్ ఉపాధ్యాయిని

**పల్లపాడు (వట్టిచెరుకూరు) :** మండలంలోని పల్లపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు రూపొందించిన ఆటోమాటిక్ రెయిన్ డిటెక్టర్, క్లాత్ రిమూవర్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. గతంలో ఇది మండల, జిల్లాస్థాయిలో ఉత్తమంగా ఎంపికైంది. ప్రధానోపాధ్యాయిని ఎం.శ్రీలత దేవి, సైన్స్ ఉపాధ్యాయిని ఝాన్సీ సహకారంతో ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులు కొర్రపాటి శాయి నరసింహ, షేక్ దీవెన, తాటిహేమ, తేజస్వినిని పలువురు అభినందించారు.

## జగన్మోహిని అలంకారంలో నృసింహుని దర్శనం

**తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే :** వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని మంగళగిరిలోని శ్రీలక్ష్మీ నృసింహ స్వామి సోమవారం రాత్రి జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ఏకాదశి కార్యక్రమాలు

చిన్నారుల కూచిపూడి నృత్యం

**తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే :** మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి ఆలయం వద్ద వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణం, కూచిపూడి నృత్యం, తిరుమల కల్యాణం, భక్తిరంజన కార్యక్రమం, జానపద నృత్యం, కచేరీ ఏర్పాటు చేశారు. డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను అలరించాయి.

## భూసేకరణ ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలి

**పెదనందిపాడు, న్యూస్‌టుడే :** గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు పరిపాలన అనుమతులు లభించి 2025 ఆగస్టున నోటిఫికేషన్ జారీ అయి నిధులు కూడా కేటాయించారని .. ఈ ఆర్థిక సంవత్సరంలో (2026 మార్చి లోపు) భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసి రైతుల వద్ద తీసుకున్న భూమికి వారి ఖాతాల్లో డబ్బు జమ చేయకపోతే నిధులు మురిగిపోయే ప్రమాదం ఉందని నల్లమడ రైతు సంఘ నాయకులు సోమవారం ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. భూసేకరణ అవార్డును ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లించి నిధులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘ నాయకులు రాజమోహనరావు, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, లావు అంకమ్మ చౌదరి పాల్గొన్నారు.

## పింఛనుదారుల ప్రయోజనాలు కాపాడండి

మాట్లాడుతున్న నాగరాజు

**పెదనందిపాడు, న్యూస్‌టుడే :** విశ్రాంత ఉద్యోగుల పాలిట ఆశాదీపం డీఎస్ నకారా అని ఆ సంఘ (ఏపీఎస్‌జీఆర్‌ఈ) రాష్ట్ర నాయకుడు నాగరాజు అన్నారు. పెదనందిపాడు మండల యూనిట్ రజతోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పింఛనుదారుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. సంఘ జిల్లా కార్యదర్శి లూర్దురెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం రివర్స్ పీఆర్సీ ఇచ్చి మోసం చేసిందని.. కూటమి ప్రభుత్వం ఒక డీఏ ఇచ్చిందని.. ఇంకా ఐదు ఇవ్వాల్సి ఉందన్నారు. పొన్నూరు ఎస్టీవో ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ఉత్తమ సేవలు అందించడమే ధ్యేయమని చెప్పారు. సీనియర్ పింఛనుదారులను సత్కరించారు. కార్యక్రమంలో పెదనందిపాడు కళాశాల ప్రిన్సిపల్ వీరరాఘవయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సుభానీసాహెబ్, పెదనందిపాడు యూనిట్ అధ్యక్షుడు జె.రామారావు, కార్యదర్శి బి.లక్ష్మణరాజు, కోశాధికారి కె.ఉమా మహేశ్వరరావు, నాగభూషణం, రాష్ట్ర నాయకుడు సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

### వేడుకలు ప్రశాంతంగా చేసుకోండి

**మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే :** నూతన సంవత్సరం వేడుకలను శాంతియుతంగా చేసుకోవాలని గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ సోమవారం సూచించారు.


**టెండర్ ప్రకటన**

గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, మందడం గ్రామం, నందు గల శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానమునకు చెందిన ఈ క్రింద తెలిపిన పనులకు గాను రిజిస్టర్ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనులకు గాను టెండర్ షెడ్యూల్సును మందడం గ్రామం నందు గల శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం ఆఫీసు నందు తేదీ 30-12-2025 నుండి ది.05-01-2026 సాయంత్రం గం.04-00 వరకు మాత్రమే టెండర్ దరఖాస్తులు పొందవచ్చును. టెండర్ దరఖాస్తులతో పాటు టెండర్ ధరావత్తు ఫైకము డి డి గాని, నగదు గాని చెల్లించి రసీదును పొంది ఇందుతో జతపరచవలెను. పూర్తి చేసిన టెండర్లు ది.13-01-2026 ఉదయం 12-00 గంటల వరకు స్వీకరించబడి, అదే రోజు సాయంత్రం గం.4 గంటలకు సీల్డ్ టెండర్లను కార్యనిర్వహణాధికారి వారిచే తెరువబడును. పూర్తి వివరముల కొరకు పై దేవస్థానము కార్యాలయం నందు పని దినములలో సంప్రదించగలరు.

| పని పేరు | అంచనా విలువ | టెండరు ధరావత్తు | టెండర్ షెడ్యూల్ ఖరీదు | పని పూర్తి చేయు కాలము |
|---|---|---|---|---|
| దేవాలయమునకు పంచరంగులు వేయుట | 5 లక్షలు | రూ. 5000/- | రూ.500/- | 3 నెలలు |

ఇట్లు: కార్యనిర్వాహణాధికారి


## రాజధాని రైతు కుటుంబానికి న్యాయం చేయాలి

నిరసన తెలుపుతున్న నాయకులు

**తుళ్లూరు, న్యూస్‌టుడే :** ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మందడం గ్రామానికి చెందిన రాజధాని రైతు దొండపాటి రామారావు (రాములు) కుటుంబానికి న్యాయం చేయాలని, రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కోరారు. గతంలో వైకాపా ప్రభుత్వం .. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీ చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి ఇచ్చి సరిపెట్టారని, కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుత్వం అమరావతిపై నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాయపూడి సమీపంలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం ఎదుట నాయకులు రామారావు చిత్రంతో ఉన్న బ్యానరు, జెండాలు పట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం సీఆర్డీఏ అదనపు కమిషనర్ ఎ.భార్గవతేజకు వినతి పత్రం అందించారు. రాజధాని డివిజన్ సీపీఎం కార్యదర్శి ఎం.రవి, వెంకటేశ్వర్లు, శివశంకర్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈవో కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ

కార్యక్రమంలో తెదేపా నాయకులు, అధికారులు

**ప్రత్తిపాడు (కాకుమాను), న్యూస్‌టుడే :** ప్రత్తిపాడులో మండల విద్యా వనరుల కేంద్రం నిర్మాణానికి తెదేపా మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరాంప్రసాద్, ఎంపీడీఓ శివపార్వతి సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శివరాంప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్ నుంచి రూ.53 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో రమాదేవి, లీలారాణి, ఏఈ రాంబాబు, సర్పంచి జగన్‌మోహన్‌రావు, ఎంపీటీసీ మధుసూదన్, సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఏపీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పెంటారెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## వక్ఫ్‌భూముల కేటాయింపుపై నిరసన

**తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే :** స్థానిక చినకాకానిలో పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు వక్ఫ్‌భూములు కేటాయించడంపై సీపీఎం నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు నాయకత్వంలో వినతిపత్రం అందజేశారు. ముస్లింల అభ్యున్నతికి వినియోగించాల్సిన భూముల్ని పారిశ్రామిక పార్క్ పేరుతో కార్పొరేట్ సంస్థలకు ఇచ్చేందుకు ప్రభుత్వం యోచిస్తోందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి, జొన్నా శివశంకరరావు, జేవీ రాఘవులు, వెంకటరెడ్డి, జవహర్‌లాల్, వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు

**వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే :** ప్రకృతి వ్యవసాయంతో రైతులు నష్టాల నుంచి గట్టెక్కి లాభాల వైపు నడవచ్చని వట్టిచెరుకూరు మండల వ్యవసాయ శాఖ అధికారి సునీత సూచించారు. వట్టిచెరుకూరులో పొదుపు సంఘాల మహిళలకు నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని, పండించే పంట ఉత్పత్తులు అత్యంత నాణ్యతగా ఉంటాయని వెల్లడించారు. వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్లాట్ల కొనుగోళ్లలో బీసీలకు 75 శాతం రాయితీకి వినతి

**తాడేపల్లి, న్యూస్‌టుడే :** ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో బీసీలకు ప్లాట్ల కొనుగోలులో 75 శాతం రాయితీ ఇవ్వాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌కు ఏపీబీసీ ఎంటర్‌ప్రెన్యూర్ ఫోరం సోమవారం వినతిపత్రం అందజేసింది. బీసీ వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు ఇప్పటికే కొనుగోలు రాయితీలకు సంబంధించిన జీవోలను అమలు చేయాలని కోరారు. ప్రతినిధులు ఎస్.రామరాజు, కోటేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, చిరంజీవిరాజు తదితరులు తెలిపారు.

### సమాజసేవలో విద్యార్థులు

**తాడికొండ:** మోతడక చలపతి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో పని చేస్తున్న సైబర్ బ్లూమ్స్ విద్యార్థులు సోమవారం మంగళగిరికి చెందిన పీజీఎం చిల్డ్రన్స్ హోమ్‌లోని చిన్నారులకు నిత్యావసర సరకులు అందించారు. ప్రిన్సిపల్ కె.నాగ శ్రీనివాసరావు, అధ్యాపకులు ప్రేమ్‌చంద్, మురళీకృష్ణ, ఏడుకొండలు, నళిని పాల్గొన్నారు.

### పేలుళ్ల ధాటికి భయంతో బతుకుతున్నాం

**ఫిరంగిపురం :** మండలంలోని గొల్లపాలెం సమీపంలోని గ్రానైట్ క్వారీల్లో ప్రతి రోజూ చేస్తున్న పేలుళ్లతో తమ ఇళ్లపై రాళ్లు పడుతున్నాయని, దీంతో ప్రాణభయంతో బతకాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోయారు. చర్యలు తీసుకోవాలని అధికారులకు సోమవారం వారు విజ్ఞప్తి చేశారు.

### రక్షణ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

**తాడేపల్లి :** గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని గిరిజన ప్రజా సమైఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తాడేపల్లిలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ రాష్ట్ర కార్యాలయంలో కార్యదర్శి గౌతమిని కలిసి సమస్యలు వివరించినట్లు ఆయన అన్నారు. ప్రసాద్‌నాయక్, అంజినాయక్, హనుమంత్ నాయక్ పాల్గొన్నారు.

### అవీ ఇవీ

### నేటి చిన్నారులే రేపటి శాస్త్రవేత్తలు

**తాడేపల్లి :** చిన్నతనం నుంచే నూతన ఆలోచనలు అలవరుచుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్ వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ విజయ భాస్కరరావు సూచించారు. నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని స్థానిక గీతాంజలి పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు.

### లారీ ఢీ కొని ఒకరికి గాయాలు

**మేడికొండూరు :** ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. గుంటూరుకు చెందిన ఎం.ఏసుదాసు పల్నాడు జిల్లా సత్తెనపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై సోమవారం ఇంటికి బయలుదేరాడు. పేరేచర్ల కూడలి వద్ద లారీ.. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ప్రమాదంలో ఏసుదాసు కొంత దూరం వెళ్లి కింద పడటంతో గాయపడ్డాడు. వాహనం లారీ కింద భాగంలో ఇరుక్కుపోయింది. స్థానికులు గమనించి చికిత్సకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

### ఇంట్లో బంగారం చోరీ

**మేడికొండూరు :** మండలంలోని వరగానికి చెందిన దొండా శేషురెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు నవంబరు 1న ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంట్లో పరిశీలించగా తలుపులు, బీరువా తెరిచి ఉన్నాయి. దొంగలు బీరువాలోని రూ.1.24 లక్షలు విలువైన బంగారం, రూ.10 వేలు చోరీ చేసినట్లు గుర్తించారు. శేషురెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### పెండింగ్ వేతనాలు విడుదల చేయండి

**తాడేపల్లి :** ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు చెల్లించాల్సిన వేతనాలను విడుదల చేయాలని ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకులు ఆ శాఖ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌కు సోమవారం వినతి ప్రతం అందజేశారు. 2023- 24 సంవత్సరానికి రాష్ట్రంలో సుమారు 14,500 మంది ఉద్యోగులకు 8 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని విడుదల చేయాలని కోరారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### సోదరుడి అదృశ్యంపై ఫిర్యాదు

**తుళ్లూరు, న్యూస్‌టుడే :** ఉద్దండరాయునిపాలెంలో గొర్రెలు మేపుతూ జీవిస్తున్న కొనతం శివనాగరాజు (30) కనిపించటం లేదని సోమవారం అతని సోదరుడు నాగరాజు తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

## ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక

**తెనాలి టౌన్:** తెనాలి మండలంలో గత కొన్ని రోజులుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సోషల్ ఆడిట్ తనిఖీలు జరుగుతున్నాయని.. అందుకు సంబంధించి బహిరంగ ప్రజా వేదిక కార్యక్రమం, పట్టణ కొత్తపేటలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్లు అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే సభకు అన్ని గ్రామాల నుంచి అధికారులు, సిబ్బంది సంబంధిత దస్త్రాలతో హాజరవుతారని పేర్కొన్నారు.

## నేటి చిన్నారులే రేపటి శాస్త్రవేత్తలు

**తాడేపల్లి :** చిన్నతనం నుంచే నూతన ఆలోచనలు అలవరుచుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్ వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ విజయ భాస్కరరావు సూచించారు. నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని స్థానిక గీతాంజలి పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు.

# తెనాలి

•తెనాలి •పొన్నూరు

## హుండీల లెక్కింపు

**పొన్నూరు, న్యూస్‌టుడే:** పట్టణ పరిధి జీబీసీ రహదారిలోని సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని వివిధ దేవాలయాల్లో మూడు నెలలకు గాను భక్తులు రూ. 15,83,150 కానుకలు సమర్పించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి గద్దె వెంకట అమరనాథ్ సోమవారం వెల్లడించారు. హుండీల లెక్కింపు బాపట్ల డివిజన్ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మాదినేని గోపి పర్యవేక్షణలో జరిగింది. దేవాలయ ఛైర్మన్ జీఎంఎస్ గుప్తా, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

**తెనాలి మార్కెట్ యార్డులో..**

**నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)**

అత్యధికం:2300
అత్యల్పం: 1300
సగటు: 1700

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

### మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? ఐతానగర్ గోలిడొంక రోడ్డులో పైపులైన్ పగిలి తాగునీరు వృథా అవుతుంది. జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. - **విజయలక్ష్మి, ఐతానగర్** ✔ సత్వరం మరమ్మతులు చేయిస్తాం.

? చెంచుపేట ఉడా కాలనీ ఈద్గా రోడ్డు చివర కాలువలు పూడిపోయాయి. దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.
✔ పూడికలు తొలగింపజేసి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. - **రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్**
– కమలాకర్, చెంచుపేట

? యడ్లలింగయ్య కాలనీలో తరుచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. - **మస్తాన్**
✔ సమస్యను గుర్తించి సత్వరం పరిష్కరిస్తాం. - **బి.అశోక్‌కుమార్, విద్యుత్తు విభాగ డీఈ**

★ తెనాలి పట్టణ నాజరుపేట మామిడి బత్తుల వారి వీధిలో వీధి దీపాలు వెలగక పోవడంపై ఈ నెల 13న 'రెండు నెలలుగా వెలగని వీధి దీపాలు' శీర్షికన ఈనాడులో చిత్ర వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఇంజినీరింగ్ విభాగ అధికారులు నూతన దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు మరమ్మతులు చేయించారు. సమస్యను పరిష్కరించారు.

★ తెనాలి పట్టణ నాజరుపేటలో కల్వర్టు వద్ద కాలువ పూడిందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బంది స్పందించి.. సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? పొన్నూరు పరిధిలోని 12వ వార్డులో మూడు రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. - **పి.రాంబాబు, 12వ వార్డు** ✔ వీధి దీపానికి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. - **షేక్ హసీనా, పురపాలక సంఘం సహాయ ఇంజినీరు**

? పొన్నూరు పరిధి సాంబశివనగర్‌లోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. - **ఎన్.తులసి, సాంబశివనగర్**
✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. - **పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**

★ పట్టణ పరిధిలోని 14వ వార్డులో చెత్తను తొలగించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

# ప్రయాణం.. కాకూడదు ప్రమాదం

**వాహన చోదకుల్లో నిబంధనలు పాటించని వారే అధికం**

న్యూస్‌టుడే, తెనాలి టౌన్

రోడ్లపై వాహనాలు నడుపుతున్న వారిలో నిబంధనలు పాటించని వారే అధికంగా ఉంటున్నారా..? అనిపిస్తుంది కేసుల నమోదు తీరు చూస్తుంటే. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు తెనాలి సబ్ డివిజన్ పరిధిలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. వాహనాలు నడిపే వారికి లైసెన్సులు లేకపోవడం, మైనర్లు వాహనాలు నడపడం, సరైన ధ్రువపత్రాలు లేకపోవడం, ముగ్గురు అంతకు మించి ఒకే వాహనంపై పయనించడం, ప్రధాన మార్గాల్లోనూ శిరస్త్రాణం ధరించకపోవడం, ఫోను మాట్లాడుతూ నడపడం వంటి అనేక అంశాలు ఈ తనిఖీల ద్వారా వెల్లడవుతున్నాయి.

★ ఈ నెల 21న తెనాలి నలువైపులా నాకా బంది నిర్వహించి వాహన తనిఖీలు చేయగా.. ఆ ఒక్క రోజే 120 కేసులు నమోదు కావడం పరిస్థితికి దర్పణం పడుతోంది. తెనాలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు వాహనాలపై నమోదైన ఈ చలాన్ల వివరాలు ఇలా ఉన్నాయి.

| పోలీస్ స్టేషన్ | నమోదైన కేసుల వివరాలు |
|---|---|
| తెనాలి వన్ టౌన్ | 1319 |
| తెనాలి టూ టౌన్ | 3530 |
| తెనాలి త్రీ టౌన్ | 1223 |
| తెనాలి రూరల్ | 579 |
| కొల్లిపర | 1265 |
| పొన్నూరు టౌన్ | 786 |
| పొన్నూరు రూరల్ | 733 |
| చేబ్రోలు | 407 |

తెనాలి గ్రామీణ మండలంలో వాహన తనిఖీల్లో పోలీసులు

### అవగాహన ఫ్లెక్సీల ఏర్పాటు..

ప్రమాదాల నివారణలో భాగంగా తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని కూడలి ప్రాంతాల్లో పోలీసులు అవగాహన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వేగం, దూకుడు, శిరస్త్రాణం లేకుండా వాహనాలు నడపడం వల్ల జీవితాలు తారుమారు అవుతాయని, ఒకరి తప్పు వల్ల చాలా మంది నష్టపోతున్నారని తెలియచేస్తూ సచిత్రంగా ఇవి కనిపిస్తున్నాయి.

### మైనర్ల డ్రైవింగ్ చాలా వరకు తగ్గించాం..

లైసెన్సులు, ధ్రువపత్రాలను చాలా మంది చూపించడం లేదు. ఇతరుల వాహనాన్ని డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు నడుపుతున్నట్లు అనేక తనిఖీల్లో గుర్తించాం. ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలి. అనుకోని చిన్న ప్రమాదం పెద్ద కష్టాన్ని తెస్తుంది. నిరంతర తనిఖీల ద్వారా చాలా వరకు మైనర్లు వాహనాలు నడపడాన్ని నియంత్రించాం. ఈ తనిఖీలు ఇకపై కూడా కొనసాగుతాయి. - **బి.జనార్దనరావు, డీఎస్పీ**

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

వెనిగండ్లలోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో రమణకుమార్

**పెదకాకాని, న్యూస్‌టుడే:** వెనిగండ్లలోని రెండు ఎరువుల దుకాణాల్లోని 4.35 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేసినట్లు ఏవో రమణకుమార్ తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, తక్కెళ్లపాడు, వెనిగండ్ల గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యూరియా నిల్వలు, వాటి విక్రయాలు ఇతర ఎరువుల లభ్యత గురించి తెలుసుకున్నారు. వెనిగండ్లలోని రెండు ఎరువుల దుకాణాల్లో ఉన్న రూ.1.4 లక్షల సరకుకు సంబంధించి సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటి అమ్మకాలు నిలిపివేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అధిక ధరలకు విక్రయించినా, సరైన పత్రాలు తీసుకోకుండా వ్యాపారాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సమస్యలన్నీ పరిష్కరిస్తాం

అర్జీదారుతో మాట్లాడుతున్న ఏవో శ్రీధర్‌బాబు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఏవో శ్రీధర్ బాబు అర్జీలు స్వీకరించారు. ఒప్పంద ఉద్యోగం ఇప్పిస్తానని నగదు తీసుకుని మోసం చేశారని, గృహ సముదాయంలోని ప్లాట్లకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని, ఆక్రమణలు తొలగించాలని, కోడలు ఇంటి నుంచి గెంటేసిందని, బిల్డర్ ఇబ్బంది పెడుతున్నారని, బిల్లులు విడుదల కాలేదని తదితర అంశాలపై అర్జీలు అందాయని ఆయన చెప్పారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీనిచ్చారు. ★ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో దీప్తి 9 అర్జీలు స్వీకరించారు. యడ్లలింగయ్య కాలనీ శివారులోని 30 కుటుంబాలకు ఆధార్ కార్డులు లేవని.. దాంతో వారి పిల్లలు అంగన్‌వాడీ కేంద్ర సేవలు పొందే అవకాశం లేకుండా పోయిందని.. ఆ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు అర్జీలో పేర్కొన్నారు.

## ఆధునిక హంగులతో తెనాలి రైల్వే స్టేషన్

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** చారిత్రక గుర్తింపుతో జంక్షన్‌గా ఉన్న తెనాలి రైల్వేస్టేషన్ ఆధునిక రూపు సంతరించుకోనుంది. అమృత్ భారత్ స్టేషన్‌గా ఎంపికైన నేపథ్యంలో సుమారు రూ. 32 కోట్లతో మొదలైన అభివృద్ధి, ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. రైల్వే లైనుల పెంపు, ప్రయాణికులకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ క్రమంలో పనులు ముగిసిన తర్వాత స్టేషన్ ఇలా ఉండబోతుందంటూ రైల్వే అధికారులు విడుదల చేసిన నమూనా చిత్రం ప్రజలను ఆకట్టుకుంటోంది. స్టేషన్ లోపల, వెలుపల పనులు కొనసాగుతున్నాయని, త్వరలో పూర్తవుతాయని స్టేషన్ మేనేజర్ వెంకటరమణ తెలిపారు.

అధికారులు విడుదల చేసిన నమూనా చిత్రం

## పదో వార్డులో అధ్వానంగా పారిశుద్ధ్యం

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** పట్టణ పరిధిలోని 10వ వార్డులో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని వార్డు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాలువల్లో పూడిక తీత పనులు నిర్వహించకపోవడంతో దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నట్లు వాపోతున్నారు. అధికారుల, పాలకుల సొంత పనులు చేయడం వల్ల వార్డుల్లో వారానికోసారి విధులకు వస్తున్నట్లు కార్మికులు వారి ఇబ్బందుల గురించి చెబుతున్నారని వారు పేర్కొన్నారు. ఆప్కాస్ కింద అవసరమైన అదనపు కార్మికులను తీసుకోవడానికి ప్రభుత్వం అనుమతించడం లేదని అధికారులు, పాలకులు చెబుతున్నట్లు తెలిపారు. ఈ సాకుతో ముడుపులు తీసుకుని సిల్ట్, బదిలీ కార్మికులను నియమించడం పరిపాటి అయిందని ప్రజల నుంచి ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ కార్మికుల్లో ఎక్కువ మందిని సొంత పనులకు వాడుకుని పారిశుద్ధ్య పనులు చేయించినట్లు దస్త్రాల్లో చూపి బిల్లులు తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

## ముక్కోటి వేడుకలకు సర్వం సిద్ధం

**పొన్నూరు, న్యూస్‌టుడే:** పట్టణ పరిధిలోని శ్రీసుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి దేవాలయంలో మంగళవారం నిర్వహించే ముక్కోటి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ కామేశ్వరమ్మ సోమవారం వెల్లడించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఉత్తర ద్వారం ద్వారా భక్తులు దర్శించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు వరుస క్రమంలో వచ్చేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశామని చెప్పారు.

క్యూలైన్ల ఏర్పాటు..

## అమ్మిన వారే అభ్యంతరం చెబుతున్నారు

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** నడక దారి హక్కు స్థలాన్ని విక్రయించిన విక్రయదారే నడవడానికి అభ్యంతరం చెబుతున్నాడని కొనుగోలుదారు కమిషనర్ రామఅప్పలనాయుడుకు అర్జీ అందించారు. సోమవారం పురపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు అందజేశారు.

## క్షయ నిర్మూలన లక్ష్యంగా పనిచేయాలి

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** 2030 కల్లా జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జిల్లా టి.బి. నియంత్రణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస సూచించారు. సోమవారం జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన హ్యాండ్ ఎక్స్‌రేపై శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏఐ, హ్యాండ్ ఎక్స్‌రేను ఉపయోగించి అనుమానితులకు టి.బి.ఉందో లేదో గుర్తించవచ్చని తెలిపారు. పలువురు టి.బి. విభాగ అధికారులు పాల్గొన్నారు. పల్లికొండ రవికుమార్ పర్యవేక్షించారు.

హ్యాండ్ ఎక్స్‌రేపై శిక్షణ ఇస్తూ..

## శేష జీవితం ఆనందంగా గడపాలి

చలపతిరావు దంపతులను సత్కరిస్తున్న డిప్యూటీ డీఈవో సుభాని

**చేబ్రోలు:** ఎంతోమందికి విద్యా బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు పదవీ విరమణ అనంతరం శేష జీవితం ఆనందంగా గడపాలని పల్నాడు జిల్లా డిప్యూటీ డీఈవో సుభాని అన్నారు. చేబ్రోలులోని సూర్యదేవర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా.. చేబ్రోలు మండల విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.చలపతిరావు మరో రెండు రోజుల్లో పదవీ విరమణ చేస్తున్నందున సోమవారం పాఠశాలలో ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల ఉపాధ్యాయులు, పలువురు ఎంఈవోలు, ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం సభ్యులు పాల్గొని చలపతిరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

## 'కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు'

రాష్ట్రంలోని 8 వేల మంది పాస్టర్లకు రూ. 50 కోట్లను విడుదల చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, మరింత మంది అర్హులకు అవకాశం కల్పించాలని తెనాలి క్రిస్టియన్ మైనారిటీ సెల్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మల్లవరపు విజయ్‌కుమార్, కారుమూరు జక్రయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి బ్రదర్ సాల్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

## ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

తెనాలిలోని ఎరువుల దుకాణాలను సోమవారం వ్యవసాయ విభాగ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ధరల పట్టికలు స్పష్టతతో ప్రదర్శించాలని, ఏ రోజు వివరాలు ఆ రోజు దస్త్రాల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. గన్నవరం సహాయ వ్యవసాయ సంచాలకులు సునీల్, అధికారులు సురేష్‌బాబు, కిశోర్, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

## యుద్ధ క్రీడల సాధనతో ఆత్మవిశ్వాసం పెంపు

నిత్యం యుద్ధ క్రీడల సాధన వల్ల క్రమ శిక్షణ, శారీరక ఆరోగ్యం, మానసిక సంతులనం ఏర్పడతాయని, ఆత్మవిశ్వాసం పెరుగుతోందని కరాటే మాస్టర్ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. తెనాలి హరిహంసిక తైక్వాండో అకాడమీలో విద్యార్థులకు సోమవారం కర్రసాము, నాన్‌చాక్, కటాస్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. అకాడమీ గురువు సత్యనారాయణ (చిన్నా మాస్టర్) కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన సందర్భంగా అభినందించి ధ్రువపత్రాన్ని అందించారు. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

## విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేత

విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని.. బంగారు భవితకు పునాది వేసుకోవాలని సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కంకిపాటి రమేష్‌కుమార్ పేర్కొన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో తెనాలి కొత్తపేట దొడ్డపనేని ఇందిర పురపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 151 మంది విద్యార్థినులకు సోమవారం ఆయన స్టడీ మెటీరియల్ అందించారు. మండల విద్యాశాఖాధికారి మేకల లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయుడు రాఘవయ్య, సొసైటీ ప్రతినిధులు సుధాకర్, సురేష్, రామకృష్ణారెడ్డి, మార్కండేయులు, సత్యదేవ్, వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

## కల్కి అవతారంలో వైకుంఠుడు

ముక్కోటి మహోత్సవాల సందర్భంగా పట్టణ వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వర ఆలయంలో స్వామివారు సోమవారం కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అర్చకులు స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. - **న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**

## రహదారులపై మద్యం తాగితే జైలుకే

**కొల్లిపర, న్యూస్‌టుడే:** బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై మద్యం తాగుతున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్‌సీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. రాత్రివేళ కాల్వకట్టలపై, రోడ్లపై మద్యం తాగుతూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇప్పటి వరకు 150 ఎంట్రీలు

**తెనాలి టౌన్:** తెనాలిలో జనవరి 11న నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ గురించి మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి వివరాలు తెలిపినట్లు మా ఏపీ వ్యవస్థాపకుడు, దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. తెనాలి మండలం పెదరావూరు స్టూడియోలో సోమవారం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 150 ఎంట్రీలు వచ్చాయని, జనవరి 1 నుంచి పరిశీలన ప్రారంభించి 11న బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తామని మంత్రి వివరించినట్లు పేర్కొన్నారు.

**ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్**

చేబ్రోలు (జి) బ్రాంచి, చేబ్రోలు గ్రామం, గుంటూరు జిల్లా.

సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 యొక్కసెక్షన్ 13(2)ప్రకారము డిమాండ్ నోటీసు

[illegible]

తేది : 09-12-2025
స్థలము : చేబ్రోలు

సం/- అధీకృత అధికారి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, చేబ్రోలు (జి) బ్రాంచి, గుంటూరు జిల్లా.

## 'ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్' సమావేశాల బ్రోచర్ ఆవిష్కరణ

**నంబూరు(పెదకాకాని), న్యూస్‌టుడే:** నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్సిటీ(వీవీఐటీయూ)లో సోమవారం 'ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్' 48వ వార్షిక సమావేశాల బ్రోచర్‌ను డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి, వీవీఐటీయూ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రో ఛాన్సలర్ మహదేవ్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు ఆవిష్కరించారు. జనవరి 3, 4 తేదీల్లో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. మొవ్వా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. వైజ్ఞానిక పద్ధతుల్లో చరిత్ర అధ్యయనాన్ని ప్రోత్సహించడం, రాష్ట్ర చరిత్ర పరిశోధనల ప్రగతిని మూల్యాంకనం చేయడం ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ముఖ్య అతిథిగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌తో పాటు దేశవ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యురాలు వాసిరెడ్డి ప్రత్యూష, రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఏఎన్‌యూ హిస్టరీ ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్, డాక్టర్ గిరిబాబు, మోదుగుల రవికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి, విద్యాసాగర్, మహదేవ్, ప్రత్యూష తదితరులు

## నిందితులకు 14 రోజుల రిమాండ్

**కొల్లిపర:** ఆసుపత్రి ఆస్తుల ధ్వంసం, రోగిపై దాడి కేసులో నిందితులకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ తెనాలి రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ ఆదేశాలు జారీచేశారని ఎస్సై ఎన్‌సీ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ నెల 28న కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స కోసం వచ్చిన తోట సూర్యనారాయణ, సెక్యూరిటీ గార్డు తిరుపతిరావుపై దాడికి పాల్పడిన నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరిచామని చెప్పారు.

## నగల చోరీపై ఫిర్యాదు

**కొల్లిపర, న్యూస్‌టుడే:** అత్తోటకు చెందిన యర్రు సువర్ణ ఇంట్లో రూ. 60 వేలు విలువైన వెండి, బంగారు నగలను దొంగలు చోరీ చేశారు. ఇంటికి తాళం వేసి విజయవాడకు వెళ్లి తిరిగి వచ్చి చూడగా నగలు కనిపించలేదని... బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హత్య కేసులోని ఇద్దరికి గతంలోనూ నేర చరిత్ర

**చేబ్రోలు:** చేబ్రోలు మండలంలోని నారాకోడూరు ఎస్సీ కాలనీకి చెందిన మృత్యుంజయరావు హత్య కేసు నిందితుల్లో ఇద్దరికి గతంలోనూ నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఏడాది సెప్టెంబరు 19న ఓ వ్యక్తి పుట్టిన రోజు పార్టీలో వేజండ్లకు చెందిన యువకులపై కత్తితో దాడి చేయగా.. చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ దాడిలో పాల్గొన్న ఇరువురు యువకులే హత్య కేసులో ప్రధాన నిందితులుగా గుర్తించినట్లు సమాచారం. హత్య కేసులో ఇప్పటికే నారాకోడూరుకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకోగా.. గుంటూరు, కొత్తరెడ్డిపాలెంకు చెందిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

## చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి

**పొన్నూరు, న్యూస్‌టుడే:** గృహ నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన వ్యవసాయ కూలీ పురుగు మందు తాగి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. గ్రామీణ పోలీసులు కథనం ప్రకారం.. పొన్నూరు మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన వెంకట్రావు(40) వ్యవసాయ కూలీ. గృహ నిర్మాణ పనుల కోసం కొంత అప్పు చేశారు. కూలీ పనులకు వెళ్లగా వచ్చిన ఆదాయం కుటుంబ అవసరాలకు మాత్రమే సరిపోతున్నాయి. ఇతర ఆదాయ వనరులు లేకపోవడంతో అప్పు రూ.10 లక్షలు అయింది. అప్పు తీర్చలేక మనస్తాపానికి గురై ఈ నెల 24న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు గ్రామీణ ఎస్సై శ్రీహరి తెలిపారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## పరీక్షల నిర్వహణపై టీసీఎస్ ఆసక్తి

**ఏఎన్‌యూ:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని పరీక్షల నిర్వహణపై టాటా కన్సెల్టెన్సీ సర్వీస్(టీసీఎస్) ఆసక్తి చూపిస్తోంది. ఈ మేరకు టీసీఎస్ ప్రతినిధులు పరీక్షల నిర్వహణపై ఏఎన్‌యూ అధికారులకు సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పరీక్షా పత్రాల తయారీ, మూల్యాంకనం తామే నిర్వహిస్తామని చెప్పినట్లు తెలిసింది. డిజిటల్ డిగ్రీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా అన్ని సక్రమంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. టీసీఎస్ ప్రతిపాదనను పరిశీలించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వర్సిటీ అధికారులు హామీ ఇచ్చినట్లు సమాచారం. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, రెక్టార్ శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, సీడీఈ సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్, యూజీ, పీజీ పరీక్షల విభాగం సమన్వయకర్తలు ఆచార్య సుబ్బారావు, ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, సీఈ ఆలపాటి శివప్రసాద్, ఏసీఈ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి రెడ్డి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

**మంగళగిరి గ్రామీణం:** పట్టణంలోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణంలో మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 పోటీలు తొమ్మిదో రోజు రసవత్తరంగా జరిగాయి. మొదటి మ్యాచ్ బాషా 786 వర్సెస్ ఏఆర్కే బుల్స్ మధ్యలో నిర్వహించగా ఏఆర్కే బుల్స్ విజయం సాధించింది. నవులూరు నవాబ్స్ వర్సెస్ హెలిపాడ్ సీసీ జట్ల మ్యాచ్‌లో హెలిపాడ్ జట్టు, మురళీ లెవెన్ పార్క్ రోడ్ వర్సెస్ సీకే పెద్ది లెవెన్ జట్ల మ్యాచ్‌లో మురళీ లెవెన్ పార్క్ రోడ్డు, ఎలైట్ లెవెన్ వర్సెస్ శివపార్వతి జట్ల పోటీలో శివపార్వతి జట్టు, టెక్ 7 వర్సెస్ లెవెన్స్ జట్ల మ్యాచ్‌లో లెవెన్స్ జట్టు విజయం సాధించాయి.

(c) eenadu

# గుంటూరు తూర్పు

## గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

**నెహ్రూనగర్:** గంజాయి, మత్తు పదార్థాలు వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. సోమవారం బుచ్చయ్యతోటలో సంకల్పం పేరుతో డ్రగ్స్, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి తాగినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ వీరయ్య చౌదరి మాట్లాడారు. తెదేపా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ పాల్గొన్నారు.

## గీతా మందిరం ఛైర్మన్ పదవిపై తీవ్ర ఉత్కంఠ

**గుంటూరు, న్యూస్‌టుడే:** ఏటుకూరు రోడ్డులోని గీతా మందిరం ఛైర్మన్ పదవిపై ఆర్యవైశ్యుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గతంలో గీతా మందిరం ఛైర్మన్‌గా అభయశ్రీ రత్నప్రసాద్ ఉన్నారు. మూడేళ్ల పదవీ కాలం పూర్తి కావడంతో ప్రస్తుతం ఈ పదవి దక్కించుకొనేందుకు పలువురు ఆర్య వైశ్యులు పోటీ పడ్డారు. ఇటీవల గీతా మందిరం ఛైర్మన్‌గా వెలుగూరి అభయశ్రీ రత్నప్రసాద్‌ను తిరిగి నియమిస్తూ ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ నియామక పత్రం అందజేశారు. మరోవైపు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ బలపరిచిన నూతన అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం సాయంత్రం నిర్వహించేందుకు వ్యాపార వర్గాలతో పాటు, ఆర్య వైశ్యులకు ఆహ్వానాలు అందాయి. ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రత్నప్రసాద్ సైతం ప్రమాణం చేసేందుకు ఏర్పాట్లు చేయటంలో బిజీ అయ్యారు. దీంతో ఈ పదవి ఎవరిని వరిస్తుందా అని ఆర్యవైశ్యులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

## సమస్యలపై మున్సిపల్ కార్మికుల ధర్నా

**నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే:** మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు అన్నారు. సోమవారం జీఎంసీ కార్యాలయం ఎదుట కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మేయర్ కోవెలమూడి రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు కోట మాల్యాద్రి, చినబోతుల వెంకట్రావు, భూపతి రమణ, నూనె డానియేలు, రావుల అంజిబాబు, అరుణ్‌కుమార్, చైతన్య పాల్గొన్నారు.

**స్పీడ్ బ్రేకర్లు నిర్మించండి.. నగరపాలకసంస్థ:** అభివృద్ధి పనుల్లో భాగంగా నగరంలో నిర్మిస్తున్న రహదార్లపై అవసరమైన ప్రతిచోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ కోరారు. సోమవారం జీఎంసీ ప్రజాఫిర్యాదులు పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు.

## సిబ్బంది కొరతతో ఇబ్బంది

### వీధి దీపాల మరమ్మతుల్లో జాప్యం

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే

కంకరగుంట బ్రిడ్జిపై ఫ్యూజ్ బాక్స్ వద్ద మరమ్మతులు

**న**గరపాలకసంస్థ విద్యుత్తు విభాగం నిర్వహణలో అధికారులు పూర్తిగా విఫలమతున్నారు. ఇంజినీరింగ్ పరిధిలో ఉండే ఈవిభాగానికి ఒక డీఈఈ, ఏఈ స్థాయి అధికారితోపాటు ప్రతి డివిజన్‌కు ఎలక్ట్రీషియన్లు, లైన్ మెన్లు ఉండాలి. ఆమేరకు సిబ్బంది లేకపోవడంతో వీధి దీపాల నిర్వహణ దయనీయంగా ఉంది. ఫలితంగా శివారు, విలీన గ్రామాల్లోని పలుప్రాంతాల్లో అంధకారం అలముకుంటోంది. ఇటీవల వరకు పనిచేసిన ఓ అధికారి వీధిదీపాల నిర్వహణను పక్కన పెట్టి కొత్త దీపాలు, సామగ్రి కొనుగోలులో అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆయన మార్కెట్ ధరలకు మించి దీపాలు, సామగ్రి కొనుగోలు చేసి కమీషన్ల రూపంలో పెద్ద మొత్తంలో నిధులు కాజేసినట్లు సమాచారం. దీంతో ఆయనను పక్కన పెట్టి మరో అధికారికి విధులు అప్పగించారు. ఇటీవల కమిషనర్ విద్యుత్తు విభాగం పనితీరుపై అసహనం వ్యక్తం చేసినా పనితీరులో ఏమాత్రం మార్పు రాలేదు.

| | |
|---|---|
| డివిజన్లు | 57 |
| నగర విస్తీర్ణం(చ.కి.మీ) | 145 |
| విద్యుత్తు దీపాలు | 34,363 |
| ఎలక్ట్రీషియన్లు | 22 |
| హెల్పర్లు | 43 |

**రెండుమూడు డివిజన్ల బాధ్యతలు అప్పగించడంతో..** నగరంలో 57 డివిజన్లు ఉండగా కూడళ్లు, డివైడర్లపై, వీధుల్లో 20, 60 వాట్లలు, హైమాస్ట్ లైట్లు 34 వేలకు పైగా ఉన్నాయి. వీటిలో పెద్ద సంఖ్యలో వీధి దీపాలు వెలగక ఆయా ప్రాంతాల్లో చీకట్లు అలముకుంటున్నాయి. లైట్లు మరమ్మతులకు ఎలక్ట్రీషియన్ ఒకరు, హెల్పర్ ఒకరు చొప్పున ప్రతి డివిజన్‌కు ఉండాలి. 22 మందే ఎలక్ట్రీషియన్లు ఉండటంతో ఒకరికే రెండు మూడు డివిజన్లు అప్పగించడంతో మరమ్మతులు, నిర్వహణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇటీవల సిబ్బందికి రక్షణ పరికరాలు ఇచ్చారు. సిబ్బందిని పెంచేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**వీటిపై దృష్టి పెట్టాలి..**

డివైడర్ల మధ్య, ఎత్తైన స్తంభాలు ఎక్కేందుకు వినియోగించే లాడర్ వెహికల్ కాలం చెల్లిపోవడంతో తరచూ మరమ్మతులకు గురవుతోంది. దీంతో ఉద్యాన విభాగానికి చెందిన వాహనం వినియోగించుకుంటున్నారు. వెంటనే లాడర్ వెహికల్ ఏర్పాటు చేయాలి.

★ ఇప్పటికే నగరం చుట్టూ ఉన్న ప్రాంతాల్లో నివాసాలు పెరిగిపోవడంతో విద్యుత్తు స్తంభాలు కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. వీటికి 2 వేల వరకు నూతన దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

★ వార్డు సచివాలయాల వారీగా మౌలిక సదుపాయాల కార్యదర్శులు వీధి దీపాల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షిస్తే ఉపయోగం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

## భూసేకరణ చట్టంపై అధికారులతో మాట్లాడతా

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** అంజుమన్ భూముల కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన భూ సేకరణ చట్టం విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. అంజుమన్ షాదీఖానాలో సోమవారం ముస్లిం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు అంజుమన్ భూముల కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన భూ సేకరణ చట్టం ప్రకటన విరమించుకోవాలి అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ కలీం అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభానీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన భూసేకరణ చట్టం విరమించుకోవాలన్నారు. మహమ్మద్ కలీం మాట్లాడుతూ..పట్టాదారు పాస్ పుస్తకాలు అంజుమన్ పేరిట ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ భూమిగా ఎలా ప్రకటిస్తుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, సీపీఎం నాయకులు నళినీకాంత్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

సమస్యలు వింటున్న కమిషనర్ శ్రీనివాసులు

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** జీఎంసీకి వివిధ మార్గాల ద్వారా వస్తున్న ప్రజాఫిర్యాదులను నిర్దేశిత సమయం లోపు పరిష్కరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ముందుగా ఆయన ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మొత్తం 12 ఫిర్యాదులురాగా వెంటనే వాటిని విభాగాల అధికారులకు పంపి పరిష్కరించాలని సూచించారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక 7, ఇంజినీరింగ్ 11, రెవెన్యూ 7, ప్రజారోగ్య విభాగం 4, ఉపా సెల్ 1, పరిపాలన ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని తెలిపారు. మేయర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తెస్తే త్వరగతిన పరిష్కారమవుతాయనే ఆశతో వస్తారని, అందుకు తగిన విధంగా సత్వర పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

## ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఫిబ్రవరి 12న తలపెట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. నాయకులు చిన ఆంజనేయులు, అంజిబాబు, సురేష్‌బాబు, వీరబాబు పాల్గొన్నారు.

## 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** నగరంలో జఠిలమవుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. సోమవారం పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్టాండు చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్రైవేట్ బస్సుల నిలుపుదల కారణంగా నిత్యం ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. ప్రైవేటు బస్సుల నిలుపుదల కోసం పోలీసులు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలన్నారు. నగరంలో చేపడుతున్న 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పాతగుంటూరు సి.ఐ. వెంకట ప్రసాద్, ట్రాఫిక్ సి.ఐ. అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

STATE OF NORTH CAROLINA
COUNTY OF CABARRUS
IN THE GENERAL COURT OF
JUSTICE DISTRICT COURT DIVISION
FILE NO. 25CV008040-120

ASHA KAKARLA, PLAINTIFF,
V.
VENKAT ABISETTI
DEFENDANT

TO: VENKAT ABISETTI,
the above-named Defendant:

NOTICE OF SERVICE BY PUBLICATION

Take notice that a pleading seeking relief against you has been filed in the enti-tled action. The nature of the relief being sought is as follows: DIVORCE. You are required to make defense to such pleading no later than thirty (30) days from the first date of publication of this Notice, and upon your failure to do so, the party seeking relief against you will apply to the Court for the relief sought.

This the 13th day of December 2025,

ASHA KAKARLA
Plantiff, NC, USA.
Phone no.001-9808758262
12/23/2025; 12/30/2025; 01/06/2026

## డ్రెయినేజీ పక్కాగా ఏర్పాటు చేసుకోవాలి

**నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే:** నగరపాలకసంస్థ పరిధిలో బహుళ అంతస్తుల భవనాలకు తగిన డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసుకుని, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ కృష్ణబాబునగర్, వికాస్‌నగర్, జేకేసీ నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ ధ్రువపత్రానికి దరఖాస్తు చేసుకున్న భవనాలను, ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య, అభివృద్ధి పనులు పరిశీలించి ఆదేశాలు జారీ చేశారు.

★ పర్యటనలో భాగంగా చుట్టుగుంట కూడలి వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆహారం తీసుకునే వారి సంఖ్యకు అనుగుణంగా అక్షయపాత్ర వారికి ఇండెంట్ పెట్టుకోవాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనకు నోడల్ అధికారులు దృష్టి సారించాలని చెప్పారు.

## విద్యార్థినులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

వైద్యురాలు రాజకుమారిని సన్మానిస్తున్న వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు

**తాడికొండ, న్యూస్‌టుడే :** మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ వైద్యురాలు శనక్కాయల రాజకుమారి ఆధ్వర్యంలో పాలీసిస్టిక్ ఓవరీ డిసీజ్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో ప్రధానంగా తలెత్తే పాలీసిస్టిక్ ఓవరీ డిసీజ్ సమస్యలు వివరించారు. ప్రస్తుత జీవనశైలి, ఒత్తిడి, ఆహార అలవాట్లు ఈ సమస్యకు ప్రధాన మూలమని తెలిపారు. నిత్యం సరైన వ్యాయామం, సమతుల ఆహారం తీసుకుంటే పీసీఓడీని నియంత్రివచ్చని సూచించారు. ఫాస్ట్‌ఫుడ్ అధికంగా తీసుకుంటే వచ్చే ఊబకాయం, హార్మోన్ల అసమతుల్యత, రక్తహీనత, జీర్ణకోశ సమస్యలు వంటి దుష్ప్రభావాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసను ఎదుర్కోవాలంటే విద్యార్థినులు తమ హక్కులు తెలుసుకుని ధైర్యంగా ముందుకు రావాలని అన్నారు. అనంతరం రాజకుమారిని వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కొల్లా నాగ శ్రీనివాసరావు, డీన్ కె.కిరణ్‌కుమార్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ తులసిరాణి, విభాగాధిపతి శాంతిప్రియ పాల్గొన్నారు.

## మోహిని అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే :** దేవాదాయశాఖకు చెందిన ఆర్ అగ్రహారంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు సోమవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. స్వామి వారు మోహిని అలంరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం వేకువజాము 5 గంటల నుంచి స్వామివారి ఉత్తరద్వార దర్శనం ప్రారంభమవుతుందని ఈవో ఆంజనేయులు తెలిపారు.

**ఉత్తర ద్వార దర్శనం నేడు**

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** సంగడిగుంట మంత్రివారివీధిలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సంకా నాగరాజు తెలిపారు. సోమవారం దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ తలుపులు తీసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 5.30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఆలయ అధ్యక్షుడు పరుచూరు కృష్ణ కిషోర్, సెక్రటరీ కొలిశెట్టి చంద్ర కాశీ విశ్వనాధం, ట్రెజరర్ పబ్బిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దైనందిని, కాలమానినిల ఆవిష్కరణ

**గుంటూరు విద్య, న్యూస్‌టుడే:** యూటీఎఫ్ 2026 దైనందిని, కాలమానిని, జీవో బుక్‌ను జిల్లా పాలనాధికారి తమీమ్ అన్సారియా సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్‌లు యూటీఎఫ్ ద్వారా పదోతరగతి విద్యార్థుల కోసం ముద్రించిన మోడల్ పేపర్స్ బుక్, డ్రగ్స్ పారదోలుదాం..కరపత్రాలను అందించి వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.హనుమంతరావు, ఎండీ షకీలాబేగం, వెంకటేశ్వర్లు, సీహెచ్.ఆదినారాయణ, ఎం.కోటిరెడ్డి, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు విద్య:** ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 దైనందిని, కాలమానినిని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. 50 ఏళ్లుగా వెలువడుతున్న జీవో కాపీ పుస్తకాన్ని డీఈవో డాక్టర్ సలీంబాషా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ ఏపీటీఎఫ్ డైరీ, జీవోబుక్ ఉపాధ్యాయ సర్వీస్ నిబంధనలుతో ఉపాధ్యాయ కరదీపికగా ఉపకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగశివన్నారాయణ, గుడిపాటి దాస్, పి.లక్ష్మీనారాయణ, చక్కా వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్య

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** సంగడిగుంట 7వ లైనుకు చెందిన షేక్ బాజీ సైదా (35) ఆదివారం సాయంత్రం ఉరి వేసుకొని మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. షేక్ బాజీ సైదా తాపీ పనులు చేస్తుంటారు. రెండేళ్ల కిందట అతని భార్య ఉరి వేసుకొని మృతి చెందారు. బాజీ సైదా కుటుంబ సభ్యుల కారణంగానే ఆమె మృతి చెందిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి బాజీ సైదా కోర్టు వాయిదాలకు తిరుగుతున్నారు. ఈ విషయమై మనస్తాపానికి గురైన అతను ఆదివారం సాయంత్రం ఉరి వేసుకొని మృతి చెందినట్లు సైదా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

### అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే :** లాల్‌పురం రోడ్డులో సోమవారం రాత్రి ఓ వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. అతని పేరు, ఊరు వివరాలు తెలియకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

## ఆలయంలో చోరీ

**పట్నంబజారు :** ఆర్.అగ్రహారం రాయబహుదూర్ మేడ సమీపంలోని బాబా రాందేవ్ అంజేశ్వర్ మహదేవ్ ఆలయంలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి మూడు కిలోల వెండి ఆభరణాలు చోరీ చేశారు. ఆలయ ట్రస్టీ రాజ పురోహిత్ జగదీష్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

## వినతులు వినవలె

అర్జీలు స్వీకరిస్తున్న ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు భానోదయ, అజీజ్, అరవింద్

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే :** పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలి వచ్చారు. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు భానోదయ, అజీజ్, అరవింద్ ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశించారు.

**నగదు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయడం లేదు..** స్థిరాస్తి వ్యాపారం చేస్తుంటాను. ఎడ్లపాడు వద్ద 9 ఎకరాలు రూ.1.33 కోట్లకు విక్రయిస్తామని ముగ్గురు నా వద్ద ముందస్తుగా రూ.83 లక్షలు తీసుకున్నారు. ఆరు నెలలకు రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. మిగిలిన రూ.50 లక్షలు ఇస్తానంటుంటే రిజిస్ట్రేషన్ చేయడం లేదు. నా వద్ద తీసుకున్న నగదు తిరిగి ఇవ్వడం లేదు - **అల్లాభక్షు, దేవాపురం**

**ధాన్యం తీసుకొని బెదిరిస్తున్నాడు..** 2021లో పొన్నూరుకు చెందిన ఓ వ్యాపారి మాతోపాటు మొత్తం 14 మంది వద్ద రూ.41 లక్షల విలువ చేసే ధాన్యం కొనుగోలు చేశారు. పది రోజుల్లో డబ్బులు ఇస్తానని చెప్పాడు. ఆ తర్వాత అతను చనిపోయాడు. అతని కుమారుడు డబ్బులు ఇస్తానని ఒప్పుకొని ఇప్పుడు మీకు చేతనైంది చేసుకోమని బెదిరిస్తున్నాడు. అతన్ని ఇబ్బంది పెడుతున్నామని మాపై కేసు పెట్టాడు.

- **అపర్ణ, శ్రీనివాసరావు, సుబ్బాయమ్మ**

**నకిలీ పత్రాలు సృష్టించారు: జాన్, సత్య**

పొన్నూరులో ఐదు దశాబ్దాల కిందట మా నాన్న స్థలంలో మేము ఇల్లు కట్టించుకున్నాం. ఇటీవల బ్యాంకువాళ్లు ఆ ఇంటిపై రుణం తీసుకున్నారని రూ.8 లక్షలు కట్టాలని నోటీసులు ఇచ్చారు. మేము ఒక్క రూపాయి తీసుకోలేదు. విచారిస్తే ఓ వ్యక్తి మా ఇంటిని కొనుగోలు చేసినట్లు తప్పుడు నకిలీ సృష్టించి రుణం తీసుకున్నట్లు తెలిసింది.

## మార్కెట్లోకి టీవీఎస్ సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్

వినియోగదారుడికి వాహనాన్ని అందిస్తున్న సీఈవో రాఘవేంద్ర

**గోరంట్ల, న్యూస్‌టుడే:** పయనీర్ టీవీఎస్ సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఆర్బిటర్‌ను సోమవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా అడ్మిన్ ఇన్‌ఛార్జి మహేష్ వాహన ప్రత్యేకతలను వివరించారు. 3.1 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో ఒక్క ఛార్జింగ్‌పై 158 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చన్నారు. 14 అంగుళాల ఫ్రంట్ వీల్, క్రూయిజ్ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్, 34 లీటర్ల భారీ బూట్ స్పేస్ సదుపాయం ఉందన్నారు. స్కూటర్‌ను మొదటగా నమోదు చేసుకున్న వినియోగదారుడికి టీవీఎస్ సీఈవో రాఘవేంద్ర వాహనాన్ని అందించారు. కార్యక్రమంలో పయనీర్ టీవీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూములు అన్యాక్రాంతం కాకుండా చూడండి

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే :** హిందూ ఆలయాల భూములు కాపాడడంలో అలసత్వం ప్రదర్శించడం తగదని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చెట్టి నిరంజనరావు సూచించారు. సోమవారం గుంటూరులో దేవాదాయశాఖ డీసీ కేబీ శ్రీనివాస్‌ను కలసి వినతిపత్రం అందించారు. విశాఖలోని సింహాచలం దేవస్థానంతో పాటు పలు ఆలయాల భూములు ఇతరులకు బదిలీ చేసే ఆలోచన తక్షణ విరమించాలనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సభ్యులు మల్లేశ్వరరావు, అనిల్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలతో జీవితం నాశనం చేసుకోవద్దు

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** మత్తు పదార్థాలు విక్రయించే వారి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని లాలాపేట సీఐ శివప్రసాద్ సూచించారు. హిందూ కాలేజీలో సోమవారం జరిగిన సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడి తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై అసీమ్ పాల్గొన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని సీఐ శివప్రసాద్ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

## కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు అందరూ కృషి చేయాలని యువజన కాంగ్రెస్ గుంటూరు జోనల్ ఎన్నికల అధికారి త్రిభువన అన్నారు. సోమవారం రాజీవ్‌గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా జనవరి 7 నుంచి 16 వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. జనవరి 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు అన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వ కార్యక్రమం జరుగుతుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గాల్లో జరగనున్న సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పవన్‌తేజ, పగడాల ప్రసాద్, బిళ్లా సునీల్, షేక్ మున్ని, గాలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

# గుంటూరు పశ్చిమ

## సంక్షిప్తతే కవితకు జీవం

**గుంటూరు సాంస్కృతికం:** గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రతినెలా నిర్వహిస్తున్న కవిత్వంతో కాసేపు కార్యక్రమం ఈ నెల గ్రూపు సభ్యులు మేడిశెట్టి సుభద్రాకృష్ణ నివాసంలో సోమవారం జరిగింది. కార్యక్రమంలో సాహిత్య విమర్శకురాలు సీహెచ్. సుశీలమ్మ, భూసురపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా కవి పాణిరావు రచించిన నీరెల్లిపోతున్నా నది నాతోనే వచన కవితా సంపుటిని డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు విశ్లేషించారు. సుశీలమ్మ మాట్లాడుతూ కవితల్లో సంక్షిప్తతకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కవిత గాఢత పెరిగి మనసుకు హత్తుకుంటుందన్నారు. జీవితసారం మొత్తం అందులో చూపించవచ్చన్నారు. ఈపూరి వెంకటరెడ్డి కవుల ప్రాముఖ్యం, తెలుగుభాష ఔన్నత్యాన్ని కీర్తిస్తూ పద్యగానం చేశారు. కవులు స్వీయ, సమకాలీన కవితలు చదివి వినిపించారు. అనంతరం భూసురపల్లి వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించారు. బండికల్లు జమదగ్ని, నానా, శ్రీవశిష్ఠ సోమేపల్లి, సోమేపల్లి విజయలక్ష్మి, భూసురపల్లి విజయలక్ష్మి, నారిశెట్టి విజయలక్ష్మి, మేడిశెట్టి సుభద్రాక్రిష్ణ, సంబరాజు రమణి, తాటికోల పద్మావతి, యక్కంటి పద్మావతి, సనత్ కుమార్, కనక దుర్గ పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM
**80086 22566, 97042 53525, 80085 74897**

? కావేరినగర్‌లో రహదారి పక్కన కాలువల్లో మురుగు ముందుకు కదలడంలేదు. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. దోమల బెడద ఎక్కువైంది. - **స్థానికులు** ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీసేలా చర్యలు తీసుకుంటాం. -**నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

**చెత్త తొలగింపు:** కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ పక్క వీధిలో డస్ట్ బిన్ దగ్గర చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి సిబ్బందితో చెత్త తరలించేలా చర్యలు తీసుకున్నారు. - **న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

స్పందనకు వందనం

## కూటమి నేతల మధ్య పూర్తి సమన్వయం

**పట్టాభిపురం:** గుంటూరు పశ్చిమ అభివృద్ధిపై కూటమి నేతల మధ్య పూర్తి సమన్వయం ఉందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి వెల్లడించారు. గత ఎన్నికల్లో అధిష్ఠానం పశ్చిమ సీటు కేటాయించిన మొదటి రోజు నుంచే రవీంద్ర అండగా నిలిచారన్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మేయర్ రవీంద్రతో పాటు కూటమి ప్రజాప్రతినిధులు అందరినీ సమన్వయం చేసుకుంటూ.. పని చేస్తున్నామన్నారు. రవీంద్ర మేయర్‌గా ఎన్నికైన దగ్గర నుంచి పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. విలీన గ్రామాల అంశంపై ముందుగా చర్చ జరిగిన వాస్తవమని, పశ్చిమ నియోజకవర్గానికి సంబంధం లేని పెదకాకాని గ్రామాన్ని విలీన గ్రామాల్లో చేర్చడంపై మాత్రమే అభ్యంతరం తెలిపానన్నారు. మేయర్ రవీంద్రను వ్యక్తిగతంగా వ్యతిరేకించినట్లు భావించడం సరికాదన్నారు. కూటమి నేతల ఐక్యతపై అసత్య ప్రచారాలకు తావివ్వద్దని ఎమ్మెల్యే మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## సిబ్బంది కొరతతో ఇబ్బంది

### వీధి దీపాల మరమ్మతుల్లో జాప్యం

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే

**న**గరపాలకసంస్థ విద్యుత్తు విభాగం నిర్వహణలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఇంజినీరింగ్ పరిధిలో ఉండే ఈవిభాగానికి ఒక డీఈఈ, ఏఈ స్థాయి అధికారితోపాటు ప్రతి డివిజన్‌కు ఎలక్ట్రీషియన్లు, లైన్‌మెన్లు ఉండాలి. ఆమేరకు సిబ్బంది లేకపోవడంతో వీధి దీపాల నిర్వహణ దయనీయంగా ఉంది. ఫలితంగా శివారు, విలీన గ్రామాల్లోని పలుప్రాంతాల్లో అంధకారం అలముకుంటోంది. ఇటీవల వరకు పనిచేసిన ఓ అధికారి వీధిదీపాల నిర్వహణను పక్కన పెట్టి కొత్త దీపాలు, సామగ్రి కొనుగోలులో అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆయన మార్కెట్ ధరలకు మించి దీపాలు, సామగ్రి కొనుగోలు చేసి కమీషన్ల రూపంలో పెద్ద మొత్తంలో నిధులు కాజేసినట్లు సమాచారం. దీంతో ఆయనను పక్కన పెట్టి మరో అధికారికి విధులు అప్పగించారు. ఇటీవల కమిషనర్ విద్యుత్తు విభాగం పనితీరుపై అసహనం వ్యక్తం చేసినా పనితీరులో ఏమాత్రం మార్పు రాలేదు.

కంకరగుంట బ్రిడ్జిపై ఫ్యూజ్ బాక్స్ వద్ద మరమ్మతు చేస్తున్న సిబ్బంది

| | |
|---|---|
| డివిజన్‌లు | 57 |
| నగర విస్తీర్ణం(చ.కి.మీ) | 145 |
| విద్యుత్తు దీపాలు | 34,363 |
| ఎలక్ట్రీషియన్లు | 22 |
| హెల్పర్లు | 43 |

**రెండుమూడు డివిజన్ల బాధ్యతలు అప్పగించడంతో..** నగరంలో 57 డివిజన్లు ఉండగా కూడళ్లు, డివైడర్లపై, వీధుల్లో 20, 60 వాట్‌లు, హైమాస్ట్ లైట్లు 34 వేలకు పైగా ఉన్నాయి. వీటిలో పెద్ద సంఖ్యలో వీధి దీపాలు వెలగక ఆయా ప్రాంతాల్లో చీకట్లు అలముకుంటున్నాయి. లైట్లు మరమ్మతులకు ఎలక్ట్రీషియన్ ఒకరు, హెల్పర్ ఒకరు చొప్పున ప్రతి డివిజన్‌కు ఉండాలి. 22 మందే ఎలక్ట్రీషియన్లు ఉండటంతో ఒకరికే రెండు మూడు డివిజన్లు అప్పగించడంతో మరమ్మతులు, నిర్వహణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇటీవల సిబ్బందికి రక్షణ పరికరాలు ఇచ్చారు. సిబ్బందిని పెంచేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**వీటిపై దృష్టి పెట్టాలి..**

డివైడర్ల మధ్య, ఎత్తైన స్తంభాలు ఎక్కేందుకు వినియోగించే లాడర్ వెహికల్ కాలం చెల్లిపోవడంతో తరచూ మరమ్మతులకు గురవుతోంది. దీంతో ఉద్యాన విభాగానికి చెందిన వాహనం వినియోగించుకుంటున్నారు. వెంటనే లాడర్ వెహికల్ ఏర్పాటు చేయాలి.

★ ఇప్పటికే నగరం చుట్టూ ఉన్న ప్రాంతాల్లో నివాసాలు పెరిగిపోవడంతో విద్యుత్తు స్తంభాలు కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. వీటికి 2 వేల వరకు నూతన దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

★ వార్డు సచివాలయాల వారీగా మౌలిక సదుపాయాల కార్యదర్శులు వీధి దీపాల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షిస్తే ఉపయోగం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

**కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో):**

టమాట 43, వంగ 24, బెండ 34, పచ్చిమిర్చి 40, కాకర 52, బీర 45, క్యాలిఫ్లవర్ 28, క్యాబేజి 24, క్యారెట్ 29, దొండ 39, బంగాళదుంప 25, ఉల్లిపాయలు 30, గోరుచిక్కుళ్లు 44, దోస 36, సొర 22, పొట్ల 34, అరటికాయ 10, పెద్దచిక్కుళ్లు 35, చామదుంప 22, బీట్‌రూట్ 22, కీర దోసకాయ 29, బీన్స్ 69, క్యాప్సికమ్ 49, కొత్తిమీర 20, ఆకుకూరలు 10, నిమ్మకాయలు 25, అల్లం 75, వెల్లుల్లి 150. - **న్యూస్‌టుడే, పట్టాభిపురం**

## విద్యార్థినులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

**తాడికొండ, న్యూస్‌టుడే :** మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ వైద్యురాలు శనక్కాయల రాజకుమారి ఆధ్వర్యంలో పాలీసిస్టిక్ ఓవరీ డిసీజ్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో ప్రధానంగా తలెత్తే పాలీసిస్టిక్ ఓవరీ డిసీజ్ సమస్యలు వివరించారు. ప్రస్తుత జీవన శైలి, ఒత్తిడి, ఆహార అలవాట్లు ఈ సమస్యకు ప్రధాన మూలమని తెలిపారు. నిత్యం సరైన వ్యాయామం, సమతుల ఆహారం తీసుకుంటే పీసీఓడీని నియంత్రివచ్చని సూచించారు. ఫాస్ట్‌ఫుడ్ అధికంగా తీసుకుంటే వచ్చే ఊబకాయం, హార్మోన్ల అసమతుల్యత, రక్తహీనత, జీర్ణకోశ సమస్యలు వంటి దుష్ప్రభావాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసను ఎదుర్కోవాలంటే విద్యార్థినులు తమ హక్కులు తెలుసుకుని ధైర్యంగా ముందుకు రావాలని అన్నారు. అనంతరం రాజకుమారిని వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కొల్లా నాగ శ్రీనివాసరావు, డీన్ కె.కిరణ్‌కుమార్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ తులసిరాణి, విభాగాధిపతి శాంతిప్రియ పాల్గొన్నారు.

వైద్యురాలు రాజకుమారిని సన్మానిస్తున్న వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు

## ముక్కోటికి వైష్ణవాలయాల ముస్తాబు

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** ఏటా ముక్కోటి ఏకాదశి పర్వదినానికి నగరంలోని వైష్ణవాలయాలన్నీ ముస్తాబయ్యాయి. మంగళవారం తెల్లవారు జామున మూడు గంటల నుంచే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు క్యూలైన్లను ఆలయాల నిర్వాహకులు సిద్ధం చేశారు. పలు దేవాలయాల్లో లక్ష్మీనృసింహ, సుదర్శన తదితర యాగాల నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయం, అరండల్‌పేట మోహనరంగనాయక స్వామి ఆలయం, రామాలయం, ఆర్.అగ్రహారం వెంకటేశ్వర స్వామి, రాజ్యలక్ష్మీ సమేత నరసింహస్వామి తదితర ఆలయాల దగ్గర ఏర్పాట్లు పూర్తయ్యాయి.

**గోరంట్ల:** గోరంట్ల అన్నపూర్ణనగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వేకువజాము నుంచే ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయంలో స్వామి దర్శనం అనంతరం దక్షిణావృత శంకుతో భక్తులకు తీర్థం అందించనున్నట్లు కమిటీ ఛైర్మన్ కంచర్ల ఆంజనేయులు, అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ తెలిపారు.

గోరంట్ల ఆలయంలో ఏర్పాట్లు

## పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని గుంటూరు పశ్చిమ వలయ డీఎస్పీ అరవింద్ సూచించారు. పట్టాభిపురం ఠాణాలో సోమవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. యువత మత్తు పదార్థాలు వాడకుండా చూడాలని, గంజాయి స్థావరాలను గుర్తించి విక్రేతలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. నేరాల కట్టడికి పోలీసు నిఘా ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ అరవింద్

### చట్టాల అమలు పర్యవేక్షణకు సభ్యుల నియామకం

**కలెక్టరేట్:** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, అత్యాచార నిరోధక చట్టం, మాన్యువల్ స్కావెంజింగ్ ఉపాధి నిషేధాన్ని అమలు చేసే చట్టం, ఏపీ దేవదాసీల చట్టాల అమలును పర్యవేక్షించేందుకు అనధికార సభ్యులను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా నియమించినట్లు జిల్లా షెడ్యూల్ కులాలు, సంక్షేమ శాఖ అధికారి యు.చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పర్యవేక్షణకు.. ముడావత్ శ్రీను నాయక్, చిలువూరి విజయ్ కుమార్, సారి యేసురత్నం, కంతేటి బ్రహ్మయ్య, టి.మోహన్‌గాంధీ, మద్దిరాల శివనాగేశ్వర రాజేంద్ర ప్రసాద్, ఎం.అనురాధ, మాన్యువల్ స్కావెంజింగ్ ఉపాధి నిషేధాన్ని అమలు చేసే చట్టం పర్యవేక్షణకు.. గుడెపు అశ్వనికుమార్, కె.సునీల్‌కుమార్, రెడ్డి రమణమ్మ, మాతంగి హేమలత, ఏపీ దేవదాసీలు చట్టం పర్యవేక్షణకు కొరిటిపాటి పావని, ఎన్.ప్రశాంతిలను నియమించినట్లు తెలిపారు.

### మురుగు నీటితో తిప్పలు

**న**గరంలో రెడ్డిపాలెం గ్రామం విలీనమై పుష్కర కాలం దాటినా శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించలేదు. రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి అగతవరప్పాడు, వెనిగండ్ల గ్రామాల వైపు వెళ్లే రహదారిలో బహుళ అంతస్తుల భవనాల నుంచి మురుగు నీరు కాలువలోకి చేరుతుంది. జీఎంసీ సీసీ డ్రెయిన్ నిర్మించకపోవడంతో మురుగు నీరు కాలువ నుంచి ముందుకు వెళ్లడం లేదు. దాంతో మురుగు నుంచి వస్తున్న దుర్వాసనతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రెయిన్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. -**న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు**

### రోడ్డుపైనే నిర్మాణ సామగ్రి

**అ**రండల్‌పేటలో డ్రెయిన్ల పనులు చేపట్టిన గుత్తేదారులు కంకరతో పాటు ఇతర నిర్మాణ సామగ్రిని రహదారి పైనే నిల్వ చేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరండల్‌పేట 3వ లైన్‌లో కంకరను రోజులుగా నిల్వ చేయడంతో రాకపోకలు సాగించేటపుడు వాహనాల చక్రాలు కంకర పైనుంచి వెళ్లడంతో జారుతోంది. గుత్తేదారులు రోడ్డుకు పక్కగా కంకర, సిమెంటు, ఇతర నిర్మాణ సామగ్రి పెట్టుకుని వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. -**జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే**

### 6 నుంచి ఉరుసు ఉత్సవాలు

**గవర్నర్‌పేట:** గుంటూరులో హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా బాబా 134వ ఉరుసు ఉత్సవాలు జనవరి 6 నుంచి ప్రారంభించనున్నట్లు దర్గా ధర్మకర్త రావి రామ్మోహన్‌రావు తెలిపారు. సోమవారం గవర్నర్‌పేటలో ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 6న చాందిని అలంకరణ, అన్నదానం, రాత్రి సందల్, 7న గంధం పంపిణీ, 8న గ్యార్మిషరీఫ్, తెల్లవారుజామున ప్రసాదం పంపిణీ, అన్నదానం చేస్తామన్నారు. 9న బాబా వారికి భక్తిశ్రద్ధలతో చద్దర్లు ఫకీర్లకు పంచుతామని వివరించారు. 10న బాబా ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచడంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. రావి డూండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### డ్రెయినేజీ పక్కాగా ఏర్పాటు చేసుకోవాలి

**నగరపాలకసంస్థ:** బహుళ అంతస్తుల భవనాలకు తగిన డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసుకుని, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ కృష్ణబాబునగర్, వికాస్‌నగర్, జేకేసీ నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ ధ్రువపత్రానికి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించారు.

STATE OF NORTH CAROLINA
COUNTY OF CABARRUS
IN THE GENERAL COURT OF JUSTICE DISTRICT COURT DIVISION
FILE NO. 25CV008040-120
ASHA KAKARLA, PLAINTIFF,
V.
VENKAT ABISETTI
DEFENDANT
TO: VENKAT ABISETTI,
the above-named Defendant:
NOTICE OF SERVICE BY PUBLICATION
Take notice that a pleading seeking relief against you has been filed in the enti-tled action. The nature of the relief being sought is as follows: DIVORCE.
You are required to make defense to such pleading no later than thirty (30) days from the first date of publication of this Notice, and upon your failure to do so, the party seeking relief against you will apply to the Court for the relief sought.
This the 13th day of December 2025,
ASHA KAKARLA
Plantiff, NC, USA.
Phone no.001-9808758262
12/23/2025; 12/30/2025; 01/06/2026

## సమస్యల పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తి ముఖ్యం

**కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 348 అర్జీలు నమోదయ్యాయి. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీదారులు సంతృప్తి పెంచేలా నిర్దేశిత సమయం లోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, సీపీవో శేషశ్రీ, జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, జేడీఏ ఎం.పద్మావతి, డీపీవో నాగసాయికుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

*వికలాంగ పింఛను పునరుద్ధరించాలి*
*ఎ.పి.చిరంజీవి, పాతగుంటూరు*

పుట్టుకతోనే దివ్యాంగుడిని కావడంతో పింఛను పొందుతున్నాను. తండ్రి ప్రభుత్వ ఉద్యోగిగా చేస్తూ చనిపోయారు. దీంతో అమ్మకు పింఛను ఇస్తున్నారు. నేను అమ్మ వద్దే ఉంటున్నాను. ఆమెకు పింఛను వస్తుందని నాకు వికలాంగ పింఛను నిలిపేశారు. నేను ఎటువంటి పనులు చేయలేని పరిస్థితి. అమ్మకు వచ్చే పింఛను ఆమె అవసరాలకు సరిపోతుంది. నా ఆరోగ్య అవసరాలకు ఇబ్బందులు పడుతున్నా. అధికారులు స్పందించి పింఛను పునరుద్ధరించాలి.

*ఇంటికి తాళం..*
*ఆరుబయటే ఉంటున్నా*

అమ్మను చూసుకోవడం లేదని సోదరుడు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు నా ఇంటికి సీల్ వేశారు. అమ్మను చూసుకుంటున్నానని చెప్పినా వినిపించుకోవడం లేదు. అధికారులు స్పందించి ఇంటికి వేసిన సీల్ తీయించాలి. కొద్ది రోజులుగా చలిలో ఆరుబయటే ఉండడంతో ఆరోగ్యం సహకరించడం లేదు.

**- బి.సుబ్బారావు, పాలడుగు, మేడికొండూరు మండలం**

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**గోరంట్ల, న్యూస్‌టుడే:** లూర్దు హైస్కూల్ 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం గోరంట్లలో సోమవారం జరిగింది. సుమారు 40 సంవత్సరాల తర్వాత వారంతా సోమవారం కలుసుకుని నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు శ్యాంసుందర్, పిచ్చయ్య, డి.శేఖర్‌బాబు, రామచంద్ర, సాంబశివరావు, వెంకటేశ్వరమ్మలు ఈ వేడుకను నిర్వహించారు. చదువుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ. నాడు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థుల కమిటీ నిర్ణయించింది.

అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

## మార్కెట్లోకి టీవీఎస్ సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్

**గోరంట్ల, న్యూస్‌టుడే:** పయనీర్ టీవీఎస్ సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఆర్బిటర్‌ను సోమవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా అడ్మిన్ ఇన్‌ఛార్జి మహేష్ వాహన ప్రత్యేకతలను వివరించారు. 3.1 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో ఒక్క ఛార్జింగ్‌పై 158 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చన్నారు. 14 అంగుళాల ఫ్రంట్ వీల్, క్రూయిజ్ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్, 34 లీటర్ల భారీ బూట్ స్పేస్ సదుపాయం ఉందన్నారు. స్కూటర్‌ను మొదటగా నమోదు చేసుకున్న వినియోగదారుడికి టీవీఎస్ సీఈవో రాఘవేంద్ర వాహనాన్ని అందించారు. కార్యక్రమంలో పయనీర్ టీవీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం అందుకున్న వినియోగదారుడితో సీఈవో రాఘవేంద్ర

## కుమ్మర శాలివాహన సంఘం డైరీ ఆవిష్కరణ

**ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా 2026 డైరీని బృందావన్ గార్డెన్ సెంటర్‌లోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పారెళ్ల బసవేశ్వరరావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని సంఘీలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆకారపు అంకమ్మరావు, ప్రధాన కార్యదర్శి పిడతల నాగమల్లేశ్వరరావు, కోశాధికారి నిమ్మకూరు రమేష్, యువజన అధ్యక్షుడు మామిళ్లపల్లి సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు యనగందుల పూర్ణచంద్రరావు, తాడికొండ నియోజకవర్గ అధ్యక్షుడు వరికల్లు నాగమల్లేశ్వరరావు, నాయకులు కొండవీటి రాములు, నిడమానూరు రమేష్, రాజవరపు శివ నాగేశ్వరరావు, వల్లూరి రామాంజనేయులు, ముట్లూరి పూర్ణచంద్రరావు, యలమందరావు, అద్దంకి అనిల్, అద్దంకి గోపి, జిల్లా, పట్టణ, యువజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సంఘ సభ్యులు

### రైతులకు మెరుగైన సేవలు అందించాలి

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** రైతులకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గల్లా మాధవి సూచించారు. మిర్చియార్డు ఛైర్మన్‌గా నియమితులైన కుర్రా అప్పారావు వారిద్దరినీ కలిశారు. తన నియామకానికి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మిర్చియార్డు పాలకవర్గం కూర్పుపై చర్చించారు. వచ్చే సీజన్‌లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, రైతులు నష్టపోకుండా మంచి ధర లభించేలా చూడాలన్నారు. వ్యాపారుల్ని సమన్వయం చేసుకుంటూ అన్ని వర్గాల వారిని మెప్పిస్తూ పనులు చక్కబెట్టాలన్నారు. అక్రమాలు, అవినీతికి అడ్డుకట్ట వేయాలని సూచించారు.

### కత్తితో వీరంగం.. ఇద్దరిపై కేసు

**పట్టాభిపురం:** మద్యం మత్తులో కత్తి పట్టుకుని చంపుతానని బెదిరిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్న ఇద్దరిపై అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. శారదాకాలనీకి చెందిన పఠాన్ అహమ్మద్ ఖాన్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 27వ తేదీ రాత్రి అదే ప్రాంతానికి చెందిన పఠాన్ మస్తాన్, ఆయన తండ్రి బుడే ఇద్దరూ మద్యం తాగి వచ్చారు. అహమ్మద్ ఖాన్ ఇంటి ముందు పిల్లలు ఆడుకుంటుండగా మద్యం మత్తులో ఇద్దరూ రాళ్లు వేశారు. ఆటో అద్దాలు పగులగొట్టి కత్తి తీసుకుని చంపుతానని మస్తాన్ బెదిరించాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### బావను చితకబాదిన కేసులో నిందితుల అరెస్టు

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** సోదరిని వేధిస్తున్నాడని బావను చితకబాదిన కేసులో బావమరిదితో సహా అయిదుగుర్ని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. కొరిటెపాడు హనుమయ్యనగర్‌కు చెందిన పాటిబండ్ల సుమన్‌కు, భార్య పార్వతికి మధ్య విభేదాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పార్వతి సోదరుడు స్వర్ణభారతినగర్‌కు చెందిన గణేష్, ఊరే సైదులు, వసుకుల అజయ్, మేకల శివమణి, ఊరే రోహిత్‌కుమార్ తదితరులు చంద్రమౌళీనగర్ మూడోలైనులోని ఓ దుకాణం వద్ద సుమన్‌తో పాటు సునీల్‌ను చితకబాదారు. దీంతో సుమన్‌కు గాయాలయ్యాయి. ఈ కేసులో అయిదుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు.

(c) eenadu

# ఎన్‌హెచ్ ప్రగతిపై సమీక్షకు రంగం సిద్ధం

## మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ఆధ్వర్యంలో సమావేశం

**ఈనాడు, అమరావతి:** కృష్ణా జిల్లాలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల ప్రగతిపై మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ఆధ్వర్యంలో జనవరి-2న మచిలీపట్నంలో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ప్రస్తుతం అవి ఏ దశలో ఉన్నాయి.. ఆటంకాలు ఏమైనా ఉన్నాయా.. నిధుల పరిస్థితి ఏమిటి.. భూసేకరణ సమస్యల వంటి అనేక అంశాలపై చర్చించేందుకు సమావేశం వేదిక కానుంది. **కీలక అంశాలు ఇవే:** ★ ప్రస్తుతం జిల్లాలో నిర్మాణంలో ఉన్న గుడివాడ-కంకిపాడు, పల్లపల్లి-పామర్రు గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణంలో ఇబ్బందులపై చర్చిస్తారు. బందరు పోర్టుకు అనుసంధానం, నిర్మాణంలో ఉన్న రెండు రహదారుల ప్రగతిపై ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడతారు. అమరావతి ఓఆర్ఆర్ కృష్ణా జిల్లాకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. తర్వాత చేపట్టాల్సిన అభ్యంతరాల స్వీకరణ, భూసేకరణ వంటి అంశాలపై ప్రధానంగా చర్చ జరగనుంది. ★ విజయవాడ-మచిలీపట్నం రహదారికి కన్సల్టెన్సీ తయారు చేసిన డీపీఆర్ లోపభూయిష్టంగా ఉందని విజయవాడలో జరిగిన భాగస్వాముల సదస్సులో అన్ని వర్గాలు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. విజయవాడ నగరంతో పాటు ఆటో నగర్, కానూరు, తాడిగడప, పోరంకి, పెనమలూరులో పై వంతెనలు లేక ట్రాఫిక్ సమస్య వేధిస్తోందని తెలిపారు. డీపీఆర్ మార్చి సిద్ధం చేయాలని ఎంపీ సూచించారు. దీని పురోగతిపై ఎంపీ ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడనున్నారు. ★ హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా మచిలీపట్నం వరకు ఏర్పాటు చేస్తామంటున్న పూర్వోదయ సీటీ రోడ్డు గురించి కూడా అధికారులతో చర్చిస్తారు. ★ ఈ సమావేశంలో ఎన్‌హెచ్ఏఐ, మోర్త్ ఆర్‌వోలు, పీడీలు, అమరావతి ఎన్‌హెచ్ పీడీ, ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ అధికారులు, ఆర్డీవోలు, అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాల్గొంటారు.

**ఉత్తర ద్వార దర్శనం నేడు**

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని మంగళగిరి నృసింహస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులకు బంగారు శంఖంతో తీర్థం ఇవ్వనున్నారు.

విద్యుత్తు కాంతులలో తూర్పు గాలిగోపురం

# 90 ఏళ్లుగా.. అతిథులకు విడిది

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

భారతీయుల ఉసురు తీసిన ఆంగ్లేయులు దివిసీమ ప్రజలకు అవసరమైన కట్టడాలను అందించారు. దివిసీమ ముఖద్వారమైన పులిగడ్డలో 1936లో నిర్మించిన అతిథి గృహం ఈ కోవకు చెందినదే. శత వసంతాలకు చేరువలో ఉన్న దీనికి కొద్దిపాటి మరమ్మతులు చేస్తే మరి కొన్నేళ్లు వినియోగించవచ్చు. కృష్ణానదిపై బహుళ ప్రయోజనకరమైన ఆక్విడెక్టు నిర్మాణం చేపట్టిన సమయంలో ఆ పనులన్నీ పర్యవేక్షించేందుకు వచ్చే ఇంజినీర్లు, బ్రిటిష్ అధికారుల విశ్రాంతి కోసం దీన్ని రూపొందించారు. నాటి నుంచి నేటి వరకు అతిథులను స్వాగతం పలుకుతూ.. వారి సేద తీర్చే విడిదిగా ఈ కట్టడం వినియోగపడుతోంది. ప్రస్తుతం జలవనరుల శాఖ అధీనంలో ఉంది. దీన్ని భావితరాలకు అందించడం కోసం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చిన్నపాటి మరమ్మతులు చేయిస్తూ సంరక్షిస్తున్నారు. ఇప్పటికీ చెక్కుచెదరక అపురూపమైన కట్టడంగా దివిసీమ చరిత్ర పుటల్లో నిలుస్తోంది. ★ ఈ అతిథిగృహ ప్రాంగణంలో 100 ఏళ్లనాటి ఊడల మర్రి, మర్రి వృక్షాలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఉసిరి వనాలు, సంపెంగ సువాసనలు వెదజల్లుతున్నాయి.

# ఎనిమిదేళ్లుగా.. కడుతూనే ఉన్నారు!

## గర్భిణులు, బాలింతల కష్టాలూ పట్టవు

ఈనాడు, అమరావతి

విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో ఒకే ఒక్క భవనం.. అదీ రెండంతస్తుల్లో నిర్మించడానికి ఏకంగా ఎనిమిదేళ్లు పైగా పట్టింది. 2017లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వచ్చి మంచాల కొరతతో గర్భిణులు ఎదుర్కొంటున్న బాధలు చూసి చలించిపోయి.. వెంటనే రూ.18 కోట్లు మంజూరు చేసిన భవనమిది. దీని నిర్మాణ విషయంలో వైద్యారోగ్యశాఖ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో చెప్పడానికి ఈ ఎనిమిదేళ్ల తాత్సారమే నిదర్శనం. పునాదుల దశ వరకు వచ్చిన సమయంలో వైకాపా సర్కారు గద్దెనెక్కడంతో అక్కడితో ఐదేళ్లు ఆ నిర్మాణానికి మంగళం పాడారు. మళ్లీ 2023 డిసెంబరులో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.23.75కోట్లతో అవే పునాదులపై కొత్తగా క్రిటికల్ కేర్ బ్లాక్ పేరుతో శంకుస్థాపన చేసి నిర్మాణం ఆరంభించారు. ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు.. రెండేళ్లయినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు.

పాతాసుపత్రిలో నిర్మించిన రెండంతస్తుల క్రిటికల్ కేర్ బ్లాక్

**ఎన్నాళ్లు బాధలు పడాలి..**

ఆసుపత్రిని పదేళ్ల నుంచే మంచాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ పదేళ్లలో ప్రసవాల కోసం వచ్చే గర్భిణుల సంఖ్య రెట్టింపు అయ్యింది. వారికి మంచాలను కేటాయించలేక వైద్య సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఒకే మంచంపై ఇద్దరేసి బాలింతలు, వారి బిడ్డలను పెట్టుకుని పడుకోవాల్సిన దయనీయమైన పరిస్థితి.

**మార్చికే పూర్తయిన భవనం..**

క్రిటికల్ కేర్ బ్లాక్ భవన నిర్మాణం గత మార్చి నాటికే పూర్తయిపోయింది. ఏప్రిల్‌లో తుది దశ పనులు పూర్తి చేసి భవనం ప్రారంభిస్తామని చెప్పారు. ఇప్పటికి ఏడు నెలలు గడిచిపోయింది. గర్భిణులు, బాలింతలకు అత్యవసరమని తెలిసినా ఇంత జాప్యం చేస్తున్నారు.

క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఆరంభిస్తే తప్ప ఈ బాధలు తీరవు. భవనం అందుబాటులోకి వస్తే రెండు అంతస్తుల్లో కలిపి ఆక్సిజన్ పైప్‌లైన్‌తో అనుసంధానించిన 125 అధునాతన మంచాలు, నాలుగు ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ రూం, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ ఐసీయూలుంటాయి.

**ఏప్రిల్ నుంచి సాగదీత..** సర్కారు నుంచి బిల్లుల సమస్య ఉందని ఏప్రిల్ తర్వాత నుంచి పనులు నెలల తరబడి సాగదీశారు. తాజాగా భవనం తుది దశ పనులు సైతం పూర్తి చేశారు. ముందువైపు ర్యాంప్ కూడా సిద్ధమైంది. ప్రస్తుతం భవనంలో లిఫ్టులు, మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ల పనులు చేపట్టాలి. ఇవి పూర్తయ్యాక ఆరంభిస్తామని వైద్యారోగ్యశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. అవి ఎప్పటికి పూర్తిచేస్తారో.. ఎప్పుడు భవనం అందుబాటులోకి తీసుకొస్తారనేదానికి సమాధానం లేదు.

# ఏముందీ.. ఐడియా!

## సమాధానాలు ఇస్తేనే నగదు బదలాయింపు

✦ 'నా పేరు మీద నాన్ బెయిలబుల్ కేసు నమోదైందని, అరెస్టు వారెంట్ జారీ అయిందని నన్ను ఎవరూ భయపెట్టలేదు' ✦ డిజిటల్ అరెస్టు లేదని నాకు తెలుసు. సీబీఐ, కస్టమ్స్, ఈడీ, పోలీస్ అని ఎవరూ వీడియో కాల్ చేసి భయపెట్టలేదు.' ఇలా... చరవాణిలో వరుసగా వచ్చే ప్రశ్నలకు సంతృప్తికర సమాధానాలు ఇస్తేనే. . మీ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు బదిలీ అవుతుంది. ✪ సైబర్ నేరాల నియంత్రణకు

ఏఐ ఆధారిత టూల్‌ను పరిశీలిస్తున్న బ్యాంకర్లు

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ 'సైబర్ సురక్ష' పేరుతో వినూత్న కార్యక్రమం చేపట్టింది. డిజిటల్ అరెస్టు పేరుతో ప్రజలను భయపెట్టి, వారి నుంచి నేరగాళ్లు రూ.లక్షలు కొట్టేస్తున్నారు. రకరకాలుగా మభ్యపెట్టి.. భయపెట్టి బ్యాంకులకు పంపించి.. వారి ఖాతాల నుంచి డబ్బులు తమ ఖాతాలకు బదలాయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఖాతాదారులకు అవగాహన కలిగించేందుకు విజయవాడ పోలీసులు 'సైబర్ సురక్ష' అనే ఏఐ ఆధారిత టూల్‌ను రూపొందించారు. ఖాతాదారుల చరవాణిలో ఈ టూల్ సాయంతో 'సైబర్ సురక్ష' నుంచి సమాధానాలు తెలుసుకుంటున్నారు. ✪ ముందు గూగుల్ బ్రౌజర్‌లో ntrpolice.in అనే దానిలోకి లాగిన్ అవ్వాలి. 'డిజిటల్ కన్‌సెంట్ ఫర్ బ్యాంక్ కస్టమర్స్' క్లిక్ చేయాలి. ఇంగ్లిషు/తెలుగు ఎంపిక చేసుకోవాలి. మీ పేరు, చరవాణి నంబరుతో రిజిస్టరైతే.. మీకు వరుసగా 5 ప్రశ్నలు వస్తాయి. వాటిని గట్టిగా చదివి.. సమాధానాలు ఇవ్వాలి. వాటిని ఏఐ నమోదు చేసి సక్రమంగా ఉంటే ఒక కోడ్ వస్తుంది. దానిని బ్యాంకర్లకు చూపిస్తేనే మీ డబ్బులు బదలాయిస్తారు.

\- విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

# బీడీఎస్ సీట్ల భర్తీకి స్పెషల్ స్ట్రే రౌండు

**ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే:** బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి స్పెషల్ స్ట్రే వేకెన్సీ రౌండు నిర్వహిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేర్కొంది. నీట్ యూజీ రాసిన అభ్యర్థులు ఈనెల 30వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి జనవరి ఒకటో తేదీ సాయంత్రం 6 గంటల్లోగా ఐచ్ఛికాలు ఇచ్చుకోవాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 43 బీడీఎస్ సీట్లు, ఎస్వీయూ పరిధిలో 20 సీట్లు అందుబాటులో ఉంచారు. ★ బీడీఎస్ యాజమాన్య కోటా సీట్ల స్ట్రే వేకెన్సీ రెండో రౌండు కౌన్సెలింగ్‌లో 13 సీట్లు భర్తీ కాగా, సీట్లు పొందిన విద్యార్థులు డిసెంబరు 31వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఆయా దంత వైద్య కళాశాలల్లో చేరాలని వర్సిటీ పేర్కొంది.

# ప్రమాదం గుర్తించినా.. ప్రాణాలు దక్కలేదు!

**ఈనాడు డిజిటల్, నున్న, అనకాపల్లి, ఎలమంచిలి, న్యూస్‌టుడే:** అనకాపల్లి జిల్లా ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగి ఏసీ బోగీలో ప్రాణాలు కోల్పోయిన నున్నకు చెందిన చంద్రశేఖర్ సుందర్ మృతదేహానికి ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇద్దరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం చేశారు. విశాఖ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ బృందం సభ్యులు వచ్చి కొన్ని ఆధారాలు సేకరించారు. సుందర్ కుమార్తె కృతికతోపాటు కుటుంబ సభ్యులు బంధువులు విజయవాడ, విశాఖపట్నం నుంచి హుటాహుటిన ఇక్కడికి చేరుకున్నారు. ఎలమంచిలి మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో విషాదం అలముకుంది. చంద్రశేఖర్ సుందర్ బి1 కోచ్‌లో 12 వ నెంబరు బెర్తులో పడుకోగా.. ఈయన మృతదేహం 20 నంబరు బెర్తు వద్ద గుర్తించారు. దీనినిబట్టి ఇతను తన బెర్తు నుంచి కొంతదూరం నగదు బ్యాగ్‌తో వచ్చి అక్కడ కుప్పకూలాడని భావిస్తున్నారు. కుమార్తె కృతిక తన తండ్రి రైలు బోగీలోంచి తనకు అగ్నిప్రమాదంపై ఫోన్ చేసి చెప్పారని పోలీసులకు చెప్పడంతో వెంటనే గ్రామీణ ఎస్సై ఉపేంద్ర ఎస్పీ కార్యాలయానికి ఈ ఫోన్ నంబర్ పంపి.. ఆయన ఎక్కడ ఉన్నాడో గుర్తించే పనిలోపడ్డారు. సోమవారం తెల్లవారుజామున 3.45 గంటల వరకూ ఆయన ఫోన్ లాస్ట్ సిగ్నల్ చూపించింది. లోకేషన్ అక్కడే చూపించడంతో బోగీలోనే చనిపోయాడని పోలీసులు అంచనాకు వచ్చారు. సీఐ ధనుంజయరావు బోగీలో టార్చిలైట్ వేసి పరిశీలించగా చేయి కనిపించింది. దీంతో ఆయన బోగీలో సజీవ దహనం అయ్యారని రైల్వే అధికారులు సమాచారం అందించారు.

రోదిస్తున్న సుందర్ కుమార్తె

చంద్రశేఖర్ సుందర్ సీటు వద్ద ఫోరెన్సిక్ నిపుణుల పరిశీలన

## సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు..

# నలుగురి రిమాండ్ పొడిగింపు

**పటమట, న్యూస్‌టుడే:** సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు కొమ్మా కోటేశ్వరరావు(ఏ2), తేలప్రోలు రాము(ఏ3), వజ్రకుమార్(ఏ6), ఎర్రంశెట్టి రామాంజనేయులు(ఏ9)కు న్యాయమూర్తి రిమాండ్ పొడిగించారు. సోమవారంతో నలుగురి నిందితుల రిమాండ్ గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో పోలీసులు నెల్లూరు జైలు నుంచి వర్చువల్‌గా విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.భాస్కరరావు ఎదుట వారిని హాజరుపరచగా... వచ్చే నెల 12వ తేదీ వరకు రిమాండ్ పొడిగించారు. ఇదే కేసులో వంశీతో సహా మరో పది మంది బెయిల్‌పై ఉన్నారు. వారంతా సోమవారం విచారణకు హాజరు కావాల్సి ఉండగా... వంశీతో సహా మరో నలుగురు విచారణకు రాలేదు.

# ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** వచ్చే ఏడాది జులైలో జరిగే ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ -2026 ప్రవేశ పరీక్షకు ఎన్టీఆర్ జిల్లాలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రభుత్వ ఐటీఐలో రూ.500 చెల్లించి దరఖాస్తు పొందాలని చెప్పారు. ఐటీఐ స్టేట్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో 2019 నుంచి ప్రవేశాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హత పొందిన అభ్యర్థులు జనవరి 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ప్రభుత్వ ఐటీఐలో పూరించిన దరఖాస్తులను అందించాలని పేర్కొన్నారు. వివరాలకు 94906-39639లో సంప్రదించవచ్చని చెప్పారు.

# సంక్రాంతి కత్తులకు పదును

## ★ ఆర్డర్లపై రహస్యంగా తయారీ ★ జిల్లాలో ఆరుచోట్ల పోలీసుల దాడులు

ఈనాడు, అమరావతి

**సం**క్రాంతి సమీపిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల రహస్యంగా కత్తులు తయారవుతున్నాయి. బరుల్లో పందేలకు దిగే కోళ్లకు వీటిని కడతారు. కత్తులకు పదును పెట్టేందుకు చాలా చోట్ల గదులు అద్దెకు తీసుకుని యంత్రాలతో పనిచేస్తున్నారు. పెద్ద సంఖ్యలో వీటి కోసం ఆర్డర్లు వస్తున్నాయి. ఇటువంటి కేంద్రాలపై ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు బృందాలుగా విడిపోయి ఆరుచోట్ల దాడులు చేసి కత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసుల నమోదుకు స్థానిక పోలీసు స్టేషన్లలో నిందితులను అప్పగించారు.

కోడి కత్తుల తయారీ యంత్రాలు

### మూడు వేలకుపైగా స్వాధీనం

★ విస్సన్నపేటలో నడకుదురు సర్వేశ్వరరావు ఓ గదిని అద్దెకు తీసుకుని ఐదు యంత్రాలతో సంక్రాంతి కత్తులకు పదునుపెడుతున్నాడు. పోలీసులు ఇతడిని అదుపులోకి తీసుకుని 1,600 కత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అతని నుంచి 47,530 నగదును సీజ్ చేశారు. రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని అంపాపురంలో విజయబాబు నుంచి 600 కత్తులు, ఓ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ★ మైలవరంలో సుంకర కిశోర్ నుంచి 350 కత్తులు, ఒక యంత్రాన్ని, సుంకర నరేంద్ర నిరంజన్‌రావు నుంచి 70 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నంలో వల్లభాపురం నాగరాజు నుంచి 300 కత్తులు, జి.కొండూరు మండలం చెవిటికల్లులో వెంకటనాగాచారి నుంచి 164 కత్తులు, ఒక యంత్రాన్ని దాడుల్లో సీజ్ చేశారు.

### నూజివీడు, విస్సన్నపేటలో...

★ కత్తులకు పదును పెడుతున్న వీరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా.. ఏలూరు నూజివీడుతో పాటు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో ఇవి తయారవుతున్నట్లు తేలింది. వీటిని ఆర్డర్ల మేరకు నిందితులు కొనుగోలు చేసి పదును పెట్టి అమ్ముతుంటారు. లేనిపక్షంలో ఎవరైనా కొనుగోలు చేసి తీసుకొస్తే పదునుపెట్టి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో తయారీ కేంద్రాలపై పోలీసులు నిఘా పెట్టారు. త్వరలో వీటిపై దాడులు చేసే అవకాశం ఉంది.

# సమష్టి కృషితో స్వచ్ఛాంధ్ర

ఈ-ఆటో నడుపుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో డీపీవో అరుణ

**కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే:** సమష్టి కృషితో స్వచ్ఛాంధ్ర సాధిద్దామని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వివిధ గ్రామ పంచాయతీలకు 8 ఈ-ఆటోలు, చెత్త సేకరణ కోసం 171 తోపుడు బండ్లు పంపిణీ చేశారు. కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారిణి అరుణ స్వయంగా ఈ-ఆటోలు నడిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం 10 సూత్రాల అమలు ద్వారా 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. డీఎల్‌పీవో రహంతుల్లా, డీపీవో కార్యాలయ పరిపాలనాధికారి సీతారామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉంగుటూరు పోస్టుమ్యాన్ అరెస్టు

## పోస్టుమాస్టర్‌తో కలిసి రూ.కోటిన్నర స్వాహా

**ఉంగుటూరు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే:** ఉంగుటూరులో ఖాతాదారులకు చెందిన రూ.కోటిన్నర మేర నగదును పోస్టుమాస్టర్‌తో కలిసి స్వాహా చేసిన పోస్టుమ్యాన్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక పోస్టాఫీస్‌లో కందవల్లి శేఖర్ పదమూడేళ్లుగా పోస్టుమ్యాన్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలోనే నివసిస్తూ అందరికి సుపరిచితుడైన శేఖర్.. సేవింగ్, ఎఫ్‌డీ ఇతర పోస్టల్ పథకాలకు సంబంధించి పోస్టాఫీస్‌లో చెల్లించాలని ఖాతాదారులు ఇచ్చిన నగదును పోస్టుమాస్టర్‌తో కలిసి స్వాహా చేశాడు. ఖాతాదారులకు నకిలీ స్టాంపులు, పాస్‌పుస్తకాలను అందజేశాడు. ఈనెల 2న ఎఫ్‌డీ నగదు తీసుకొనేందుకు ఓ మహిళ పోస్టాఫీసుకు వెళ్లగా ఆమె పేరుమీద ఎటువంటి డిపాజిట్లు లేవని సిబ్బంది తెలిపారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చి ఇతర ఖాతాదారులను కూడా ఇలానే మోసగించినట్లు అధికారులు గుర్తించారు. గుడివాడ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు రెండ్రోజుల క్రితం పోస్టుమ్యాన్ శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఖాతాదారులకు సంబంధించిన సుమారు 300 పాస్ పుస్తకాలను అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం సోమవారం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు శేఖర్‌కు గన్నవరం కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై గోవింద్ వెల్లడించారు.

# విద్యుత్తుశాఖ, దుర్గగుడి అధికారుల చర్చలు

## పరిష్కారానికి సీఎండీ వద్ద సమాలోచనలు

**సూర్యారావుపేట:** విద్యుత్తుశాఖ, దుర్గగుడి మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకునేందుకు ఇరు విభాగాల అధికారుల మధ్య సోమవారం చర్చలు జరిగాయి. విద్యుత్తు సీఎండీ పుల్లారెడ్డి ఎదుట సమావేశమయ్యారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఏం చేయాలనే అంశంపైనే ప్రధానంగా చర్చించారు. దుర్గగుడికి విద్యుత్తును రెండు రోజుల కిందట నిలిపేయడాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్రంగా పరిగణించింది. వెంటనే సమస్యను పరిష్కరించుకోవాలంటూ.. ఇరుశాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. విద్యుత్తు, దేవాదాయశాఖ.. ఇద్దరు మంత్రులు జోక్యం చేసుకుని.. సమస్యకు సరైన పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇరు శాఖల అధికారులు ఎవరి వాదన వాళ్లు వినిపించుకున్నారు.

**విద్యుత్తుశాఖ అధికారుల వాదన :** రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానం కావడంతో.. తాత్కాలికంగా మాత్రమే సౌర విద్యుత్తు ప్లాంట్ నుంచి వచ్చే విద్యుత్తును గ్రిడ్‌కు తీసుకునేందుకు అనుమతి ఇచ్చాం. అందుకే రెండు రకాల విధానాల్లో ఏదో ఒకటి దేవస్థానం ఎంపిక చేసుకుంటే.. ఆ ప్రకారం శాశ్వతంగా విద్యుత్తును తీసుకునే ఏర్పాటు చేస్తాం. ఒకటోది. . ఓపెన్ యాక్సెస్‌లో ఇవ్వడం, రెండోది నెట్ మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు పంపించడం.. వీటిలో ఏదో ఒకటి ఎంపిక చేసుకోవాలని సూచించారు. ✪ **దుర్గగుడి అధికారుల వాదన :** తాము రూ.5కోట్లతో ఏర్పాటు చేసిన ప్లాంట్ ద్వారా.. ఉత్పత్తి అయ్యే విద్యుత్తుకు సరైన లెక్కలు చూపించాలి. మిగతా బ్యాలెన్స్ ఏమైనా కట్టాల్సి వస్తే.. దానిని కడతాం. విద్యుత్తు అధికారులు సూచించిన రెండు విధానాల్లో ఏదో ఒకటి ఎంపిక చేసుకుంటాం.

**నేడు మంత్రి వద్ద పంచాయితీ..** సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు.. ఇరుశాఖల అధికారులు విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి ఎదుట మంగళవారం సమావేశం కానున్నారు. తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరగబోతోంది.

# నిందితుల మధ్య.. వందల కాల్స్

## పిల్లల విక్రయాల కేసులో కీలక ఆధారాలు

**పి**ల్లల రవాణా, విక్రయాల్లో కింది స్థాయి నుంచి దిల్లీ వరకు పలు దశల్లో నిందితుల మధ్య సంభాషణలు నడిచాయి. వందల కాల్స్ మాట్లాడుకున్నారు. రెగ్యులర్ కాల్స్‌తో పాటు వాట్సప్‌లోనూ తరచూ మాట్లాడుకున్న ఆధారాలు లభించాయి. విజయవాడకు పిల్లల్ని తెప్పించేందుకు ఉత్తరాది ముఠాలతో డీల్ కుదుర్చుకునేందుకు ప్రధాన నిందితురాలు ఫోన్ నుంచి కాల్స్ వెళ్లినట్లు గుర్తించారు. దిల్లీ, ముంబయి నుంచి కూడా సరోజినికి చాలా కాల్స్ ఉన్నాయి. సాంకేతిక విశ్లేషణలో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

**గ్రూప్ కాల్స్‌లో సంభాషణలు:** ఇప్పటి వరకు పోలీసులు ముంబయి, దిల్లీ ముఠాల మధ్య సంబంధాలు ఉండకపోవచ్చని భావించారు. అయితే ముఠాలోని వారి కాల్ డేటా విశ్లేషణలో పలు కీలకమైన విషయాలు బయటకు వచ్చాయి. రెండు గ్యాంగులకు సంబంధాలు ఉన్నట్లు వెల్లడైంది. ఈ రెండు ముఠాల్లోని కిరణ్ శర్మ, ప్రియాంక, భర్తి, సతీష్, అనిల్, కవిత, నూరి, కాజల్ తరచూ ఫోన్లలో మాట్లాడుకున్నారని వెలుగుచూసింది. వీరందరి మధ్య వందల కాల్స్ నడిచాయి. బలగం సరోజిని నుంచి వీరి నడుమ కూడా పెద్ద సంఖ్యలో కాల్స్ ఉన్నాయి. అహ్మదాబాద్, దిల్లీ, విజయవాడలో ఉండి.. వీరు గ్రూప్ కాల్స్‌లో ఒకరికొకరు సంభాషించుకున్నారు. పలుసార్లు వాట్సప్ కాల్స్ కూడా నమోదయ్యాయి. వీటి ద్వారా కూడా కాన్ఫరెన్స్ కాల్స్ చేసుకుని పిల్లల విక్రయాల గురించి తరచూ చర్చించుకునే వారని తెలిసింది. సరోజిని ఫోన్ నుంచి కింది స్థాయిలో బ్లెస్సీ, నందిని, విజయలక్ష్మి, ఫరీనాతోనూ ఎక్కువగా కాల్స్ ఉన్నాయి.

**నేరచరిత్రపై వివరాల సేకరణ:** విజయవాడలో నమోదైన నాలుగు కేసుల్లో అరెస్టు అయిన నిందితుల వేలిముద్రల ఆధారంగా దేశవ్యాప్తంగా ఇంకా ఏయే స్టేషన్లలో వీరిపై కేసులు ఉన్నాయన్నది పరిశీలిస్తున్నారు. సరోజినిపై ఏడు, అనిల్‌పై ఒకటి, కవితపై రెండు, విజయలక్ష్మిపై ఆరు, కిరణ్ శర్మ, ఫరీనాలపై నాలుగేసి కేసులున్నాయి. విజయవాడకు చెందిన శారదపై దేశవ్యాప్తంగా పలు కోర్టుల్లో చాలా పీటీ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈమెను యూపీలోని హర్దోయి జైలు నుంచి తెచ్చి విజయవాడ కోర్టులో హాజరుపర్చారు. అనంతరం తిరిగి యూపీకి పంపించారు.

**కస్టడీలో విచారిస్తే..**

నిందితులుగా భావిస్తున్న కిరణ్‌శర్మ, భర్తి, బలగం సరోజినిలను కస్టడీకి తీసుకుని విచారిస్తే కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మహిళా స్టేషన్, కొత్తపేట, భవానీపురం, నున్న పోలీసులు వీరిపై ఇప్పటికే పీటీ వారెంట్లు వేశారు. అనంతరం కస్టడీ పిటిషన్లు కూడా వేశారు. ఇంకా అరెస్టు కావాల్సిన వారి కోసం ప్రత్యేక బృందాలు రెండు రోజుల్లో వెళ్లనున్నాయి.

\- ఈనాడు, అమరావతి

# ఆట ప్రారంభం

విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి కృష్ణా జిల్లా 28వ అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల ప్రాంతీయ స్పోర్ట్స్ మీట్-2025 ఘనంగా ప్రారంభమైంది. దీన్ని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు ప్రారంభించారు.

# రండి.. భూ సమస్య పరిష్కరించుకోండి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

**భూ** సంబంధిత సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూహక్కు.. భూరక్ష పథకం కారణంగా ఇప్పటికీ ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రధానంగా రీసర్వే కష్టాలు వారిని వెంటాడుతూనే ఉన్నాయి. ✪ ఈ సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం తాజాగా రెవెన్యూ క్లినిక్‌ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. కొంతమందికి ఉన్న భూమి కంటే ఎక్కువ వస్తే.. ఇంకొందరికి తగ్గిపోయింది. ఇలాంటి సమస్యలు అన్ని చోట్లా ఉన్నా వాటిని పరిష్కరించకుండానే సర్వే పూర్తయిందని చెప్పడంపై అప్పట్లోనే ప్రజలు ఆందోళనకు దిగారు. ఇవే కాకుండా పట్టాదారు పాసుపుస్తకాల జారీలో జరుగుతున్న జాప్యం, భూముల ఆక్రమణలు, అడంగళ్ సవరణలు, సర్వే సమస్యలు, దేవాదాయ, వక్ఫ్ భూముల ఆక్రమణలు ఇలా రెవెన్యూ పరంగా అనేక సమస్యలతో ప్రజలు దీర్ఘకాలికంగా ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ క్లినిక్‌లతో ఈ సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు.

### జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ క్లినిక్‌ల ఏర్పాటు

### కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా 5 కౌంటర్లు...

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా నిర్దేశిత కార్యాలయాల్లో ఈ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన క్లినిక్‌ను కలెక్టర్ బాలాజీ ప్రారంభించారు. కలెక్టరేట్‌లో ఐదు కౌంటర్‌లు ఏర్పాటు చేయడంతోపాటు విభాగాల వారీగా అర్జీల స్వీకరణకు ప్రత్యేకంగా ఉద్యోగులకు విధులు కేటాయించారు. ఇందులో వచ్చే అర్జీలను వీలైనంతవరకు అక్కడికి అక్కడే పరిష్కరిస్తారు. వీలుకానివి ఉంటే వారం రోజుల్లో పరిష్కరించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. తొలి రోజు జిల్లా వ్యాప్తంగా 77 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బందరు డివిజన్‌లోని తహసీల్దారు కార్యాలయాల నుంచి 13, గుడివాడ డివిజన్‌లో 11, ఉయ్యూరు డివిజన్ పరిధిలో 7 చొప్పున అర్జీలు అందాయి. గుడివాడ ఆర్డీవో కార్యాలయంలో 2 అర్జీలు వస్తే కలెక్టరేట్‌లో నిర్వహించిన క్లినిక్‌కు అధికంగా 44 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ క్లినిక్‌లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఉద్యోగులు

(c) eenadu

## రెవెన్యూ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలి

సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

**కలెక్టరేట్(మచిలీపట్నం):** జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ నవీన్‌తో కలిసి ఆయన వీటిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ క్లినిక్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లతో నిర్వహించిన సదస్సులో ప్రజలకు ఉపయోగపడే రెవెన్యూ క్లినిక్ విధానాన్ని అన్ని జిల్లాల్లో చేపట్టాలని ఆదేశించారని తెలిపారు. ప్రయోగాత్మకంగా కలెక్టరేట్‌లో క్లినిక్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్న ఆవిష్కరణలే పెద్ద మార్పు తెస్తాయి

ప్రదర్శనలను తిలకిస్తున్న తేజస్వి

**నున్న, న్యూస్‌టుడే:** చిన్న ఆవిష్కరణలు పెద్ద మార్పునకు దారితీస్తాయని ఏపీ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు జాతీయ స్థాయి టెక్ ఎక్స్‌పో అన్‌సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌డీజీలు), ఇన్నో వికాస్-2025ను ఆమె సోమవారం ప్రారంభించారు. గ్రామ స్థాయి లేదా విద్యార్థి స్థాయిలో అభివృద్ధి చేయబడిన చిన్న ప్రాజెక్టులు కూడా ప్రపంచ సవాళ్లకు పరిష్కారాలను అందించగలవని ఆమె తెలిపారు. ఈ ఎక్స్‌పోలో 40 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 800 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా దాదాపు 212 వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరెడ్ల కీర్తి, ప్రిన్సిపల్ పరమేశ్వరరావు పాల్గొన్నారు.

## కంభంపాటి రామ్మోహన్‌కు కేంద్ర మంత్రి పరామర్శ

వెంకటనరసమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రామ్మోహన్ బంధువులు

**పెద్దఅవుటపల్లి (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే:** తెదేపా సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు కంభంపాటి రామ్మోహనరావు మాతృమూర్తి వెంకటనరసమ్మకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సోమవారం నివాళులర్పించారు. వెంకటనరసమ్మ ఇటీవల మరణించగా ఆమె పెద్ద కర్మను సోమవారం గన్నవరం శివారు ఎస్ఎం కన్వెన్షన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మతోపాటు మాజీ ఎంపీలు లగడపాటి రాజగోపాల్, కేవీపీ రామచంద్రరావు, పల్లంరాజు, నేతలు నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్యేలు బుచ్చయ్యచౌదరి, గద్దె రామ్మోహన్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, గద్దె అనురాధ, రెడ్డప్పగారి శ్రీనివాస్‌రెడ్డి, కోగంటి సత్యం తదితరులు పాల్గొని నివాళులర్పించారు. రామ్మోహనరావు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు** (కిలో1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

## సెమీఫైనల్స్‌కు సీనియర్, జూనియర్ జట్లు

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Regional Sponsor: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Beverage Partner: CMR SHOPPING MALL
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner, FM Partner, TV Partner: ఈనాడు.నెట్, ఈ FM, ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

KAMINENI HOSPITALS VIJAYAWADA

**న్యూస్‌టుడే- విజయవాడ క్రీడలు**

కానూరులోని కేవీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025 ఉత్కంఠగా సాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో సీనియర్స్ విభాగంలో పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల, వాసవి ఇంజినీరింగ్ కళాశాల జట్లు, జూనియర్స్ విభాగంలో విశ్వశాంతి జూనియర్ కళాశాల జట్లు సెమీ ఫైనల్స్‌లో ప్రవేశించాయి.

**ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..**

పి.ప్రభు టి.ఇస్మాకు కె.వరుణ్‌రెడ్డి

### 10 పరుగుల ఆధిక్యంతో విజయం

తొలి మ్యాచ్‌లో పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 పరుగుల తేడాతో కేబీఎన్ డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన కేబీఎన్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన పొట్టి శ్రీరాములు కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. పి.ప్రభు 43 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ ఎం.కార్తీక్ ఎనిమిది పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీసుకున్నాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన కేబీఎన్ కళాశాల జట్టు ఆరు వికెట్ల నష్టానికి 66 పరుగులు మాత్రమే చేసింది. మహేంద్ర 40 పరుగులు చేశాడు. ప్రత్యర్థి బౌలర్ వి.జోయ్ శ్యామ్ ఏడు పరుగులు ఇచ్చి రెండు, పి.నిఖిల్ అయిదు పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పి.ప్రభు ఎంపికయ్యాడు.

### ఆరు వికెట్ల తేడాతో గెలుపు

రెండో మ్యాచ్‌లో వాసవి ఇంజినీరింగ్ కళాశాల జట్టు ఆరు వికెట్ల తేడాతో ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన లయోలా జట్టు నిర్ణీత పది ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. ఎస్.లక్ష్మీనరసింహ 33 పరుగులతో క్రీజులో నిలవగా.. వై.అరవింద్ 18 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ సీహెచ్ వంశీ మూడు పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన వాసవి కళాశాల జట్టు 8.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టి.ఇస్మాకు 30 పరుగులతో క్రీజులో నిలవగా.. ఎస్‌కే రఫీక్ 12 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ కె.రోహిత్ 16 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా టి.ఇస్మాకు నిలిచాడు.

### సెంచరీ దాటిన పరుగులు

మూడో మ్యాచ్‌లో విశ్వశాంతి జూనియర్ కళాశాల జట్టు 45 పరుగుల తేడాతో దీక్ష జూనియర్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన దీక్ష జట్టు బౌలింగ్ తీసుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన విశ్వశాంతి జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. కె.వరుణ్‌రెడ్డి 28, వరుణ్ కిండో 25 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ కె.అజేయుడు 14 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన దీక్ష జట్టు అయిదు వికెట్లు కోల్పోయి 58 పరుగులకే పరిమితమైంది. ఎస్‌కే గౌస్ 16 పరుగులు చేశాడు. ప్రత్యర్థి బౌలర్ ఎండీ సిద్దిక్ మూడు పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కె.వరుణ్‌రెడ్డి ఎంపికయ్యాడు.

**నేటి మ్యాచ్‌ల వివరాలు**

★ పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల × వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల (మొదటి మ్యాచ్)
★ శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల × నలంద డిగ్రీ కళాశాల (రెండో మ్యాచ్)
★ విశ్వశాంతి జూనియర్ కళాశాల × ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల (మూడో మ్యాచ్)


**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, కృష్ణా జిల్లా**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**
టెండర్ నోటిఫికేషన్ నెం. PDS.3/7/Stage-II Tenders/2025-27 తేది. 29-12-2025
2025-27 ఆర్థిక సంవత్సరమునకు జిల్లా పట్టణ ప్రాంతములో గల **అవనిగడ్డ** మరియు **ఉయ్యూరు** మండలస్థాయి గోదాములు నుండి సకాలంలో సంబంధిత మండలములకు అనుసంధానము చేయబడిన చౌకధరల దుకాణములకు మరియు పాఠశాలలకు, హాస్టళ్లకు మరియు ప్రభుత్వము వారు నిర్ణయించిన మరి ఏ ఇతర స్థలములకు ప్రజా పంపిణీ పథకం మరియు ఇతర ప్రభుత్వ పథకముల క్రింద నిత్యావసర వస్తువుల రెండవ దశలో రవాణా చేయుటకు ఇ-బిడ్డర్స్ ఏ.పి. ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కోరబడుచున్నవి. టెండరు ఫారం / నోటిఫికేషన్ వివరములు www.apeprocurement.gov.in ద్వారా పొందగలరు.
1. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ, సమయం: 30-12-2025 సాయంత్రం 4:00 గం. నుండి.
2. బిడ్ దాఖలు చేయు ఆఖరి తేదీ, సమయం: 06-01-2026 మధ్యాహ్నం 12:00 గం. వరకు.
3. పూర్తి వివరాలకు సెల్ నెం: 77020 03540 & 99634 79157లకు సంప్రదించగలరు.
Sd/- ఎం. నవీన్, IAS, జిల్లా జాయింట్ కలెక్టర్ & E.O.E.D.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, కృష్ణా జిల్లా.



**ప్రకటన**

నా క్లయింటు, మెస్సర్స్ ఉద్యాన్ ప్రాజెక్ట్సు, విజయవాడ, భాగస్వామ్య సంస్థ రిజిస్టర్డ్ నెం. 193/2023, తరపున మేనేజింగ్ పార్టనర్ శ్రీ నర్రా శ్రీకాంత్‌బాబు, తండ్రి (లేటు) నర్రా రామమోహనరావు, నిడమానూరు గ్రామ వాస్తవ్యుల నుండి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా,

నాక్లయింటు, ఈదిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి సంబంధించిన స్థల యజమానులైన 1) శ్రీ కొప్పురావూరి జయశివరామ్, తండ్రి అమరనాథం, శ్రీ కొప్పురావూరి శ్రీకృష్ణ, తండ్రి అమరనాథం, 3) శ్రీమతి తూనుగుంట్ల ఝాన్సీలక్ష్మి, భర్త పూర్ణచంద్రరావు, 4) శ్రీ కొప్పురావూరి అభినవ్, తండ్రి శ్రీకృష్ణ మరియు 5) శ్రీ పిన్నమనేని తిరుమలరావు, తండ్రి (లేటు) పి.ఎస్.కె.కుటుంబరావు గార్లకు సంబంధించి ఏకఖండంగా చేసికొనియున్న షెడ్యూలు దాఖలా ఆస్తినందు పెక్కు అంతస్తులుగా గల విల్లాలను, అపార్టుమెంట్లను నిర్మాణము చేయుటకు వారితో షరతులతో కూడిన డెవలప్‌మెంట్ ఒప్పందము చేసుకొనుటకు సూత్రప్రాయముగా అంగీకారము తెలియజేసి వారితో రిజిస్టర్డ్ ఒప్పందము చేసుకొనుటకు సంసిద్ధులైయున్నారు.

స్థల యజమానులలో ఒకరైన శ్రీ కొప్పురావూరి జయశివరామ్, తండ్రి అమరనాథం వారి స్వార్జితపు సొమ్ముతో ది. 11-05-1989న క్రయ దస్తావేజు నెం. 3926/1989, సబ్ రిజిస్ట్రీ, విజయవాడగా ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 159/3రులో య. 0.60 సెంట్ల భూమిని మరియు ది. 06-06-1989న క్రయ దస్తావేజు నెం. 4704/1989, సబ్ రిజిస్ట్రీ, విజయవాడగా డిటో సర్వే నెంబరునందు య. 0.60 సెంట్ల భూమిని క్రయం పొంది, తదాది వారి సర్వ స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములలోయున్న య. 1.20 సెంట్ల భూమిని,

స్థల యజమానులలో రెండవవారైన, శ్రీ కొప్పురావూరి శ్రీకృష్ణ, తండ్రి అమరనాథం వారి స్వార్జితపు సొమ్ముతో ది. 05-06-1989న క్రయ దస్తావేజు నెం. 4664/1989, సబ్ రిజిస్ట్రీ, విజయవాడ ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 159/3రులో య. 0.60 సెంట్ల భూమిని మరియు ది. 15-05-1989న క్రయ దస్తావేజు నెం. 4010/1989న సబ్ రిజిస్ట్రీ, విజయవాడగా డిటో సర్వే నెంబరు నందు య. 0.60 సెంట్ల భూమిని క్రయంపొంది తదాది వారి సర్వస్వాధీన యాజమాన్య హక్కు భుక్తములలో యున్న య. 1.20 సెంట్ల భూమిని,

స్థల యజమానురాలలో మూడవ వారైన, శ్రీమతి తూనుగుంట్ల ఝాన్సీలక్ష్మి, భర్త పూర్ణచంద్రరావు ది. 31-03-1995న వారి తండ్రిగారైన శ్రీ కొప్పురావూరి అమరనాథం, తండ్రి చినకోటయ్య నెం. 3157/1995రు, సబ్ రిజిస్ట్రీ, విజయవాడగా వ్రాసి రిజిస్ట్రీ చేసియున్న దఖలు దస్తావేజు దాఖలా సంక్రమింపబడి తదాది వారి సర్వ స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములలో యున్న ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 195/1ఎ, 1బి, 1సిర్లు దాఖలా య. 0.50 సెంట్ల భూమిని,

స్థల యజమానులలో నాలుగవ వారైన శ్రీ కొప్పురావూరి అభినవ్, తండ్రి శ్రీకృష్ణ గారికి వారి తాతగారైన శ్రీ కొప్పురావూరి అమరనాథం, తండ్రి చినకోటయ్య ది. 23-02-2022న నెం. 1334/2022రు, జిల్లా రిజిస్ట్రీ, విజయవాడ తూర్పు, గుణదలగా వ్రాసి రిజిస్ట్రీ చేసియున్న దఖలు దస్తావేజు దాఖలా ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 195/1ఎరుగా య. 0.07 సెంట్లు, నెం. 195/1బి రుగా య. 0.43 సెంట్ల భూమి మరియు నెం. 195/1సి రుగా య. 0.52 సెంట్లు భూమి ఏకఖండంగాగల య. 1.02 సెంట్ల భూమి సంక్రమింపబడిన దరిమిలా అందు నెం. 195/1సి రులోని భాగమైన య. 0.20.60 సెంట్ల భూమిని పరివర్తన దస్తావేజు దాఖలా ఇతరులకు సంక్రమింపచేయగా మిగిలియున్న య. 0.81.4 సెంట్ల భూమి మరియు తత్ పరివరివర్తన దస్తావేజు దాఖలా ఆర్.ఎస్. నెం. 195/2బి రులోని య. 0.05.1/4 సెంట్ల భూమి సంక్రమింపబడిన తదాది వారి సర్వ స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములతోయున్న య. 0.86.65 సెంట్ల భూమిని,

స్థల యజమానులలో ఐదవ వారైన, శ్రీ పిన్నమనేని తిరుమలరావు, తండ్రి (లేటు) పి.ఎస్.కె. కుటుంబరావు గారు ది. 01-11-2023న క్రయ దస్తావేజు నెం. 7379/2023, జిల్లా రిజిస్ట్రీ, విజయవాడ తూర్పు, గుణదలగా సంక్రమించియున్న ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 195/1సి రుగా య. 0.20.6 సెంట్లు భూమిని,

పైన ఉదహరించిన 1 నుండి 5ర్లు స్థలయజమానులు వారి వారి విస్తీర్ణములను ఏకఖండంగా చేసుకొని, అందు పెక్కు అంతస్తులతో కూడిన, విల్లాలను/అపార్టుమెంట్ కాంప్లెక్సులను నిర్మించుట వారికి లాభదాయకమని భావించి, నా క్లయింటును సంప్రదించగా, నా క్లయింటు సూత్రప్రాయముగా అంగీకరించి వారితో ఒప్పందము చేసికొనుటకు సంసిద్ధులైయున్నారు. మరియున్నూ, సదరు స్థల యజమానులు షెడ్యూలు దాఖలా ఆస్తి తమ సర్వ స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములలో యున్న నిర్వివాదమైన ఆస్తియన్నీ, నా క్లయింటుకు తెలియచెప్పిన దరిమిలా, నా క్లయింటు సదరు నిర్మాణము చేయుటకు సూత్రప్రాయముగా అంగీకరించి, వారితో ఒప్పందము చేసుకొనుటకు సంసిద్ధులైయున్నారు. సదరు విషయమై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ, క్లెయిములు గానీ, మరి యే యితర మనోవర్తి దావాలు, హక్కులు గానీ ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి ఏడు రోజులలో లిఖితపూర్వకముగా తగిన ఆధారములతో ఈ దిగువ చిరునామాకు రిజిస్టరీ పోస్టు తిరుగు రశీదు ద్వారా తెలియచేయవలసినదిగా కోరడమైనది. సదరు గడువు తేదీలోగా చట్టప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ, క్లెయిములు గానీ రానియెడల నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి, సదరు స్థలయజమానులతో పరస్పర అంగీకారంతో కూడిన రిజిస్టర్డ్ ఒప్పందమును చేసికొనగలరు. తదుపరి వచ్చు క్లెయిములు నా క్లయింటును గానీ సదరు ఆస్తిని గానీ ఏ విధంగానూ బైండు చేయజాలవు.

**షెడ్యూలు:** ఎన్.టి.ఆర్. జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయ పరిధి, విజయవాడ రూరల్ మండలం, ఎనికేపాడు గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన, ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 159/3, 195/1ఎ, 195/1బి, 195/1సి మరియు 192/2బిర్లు దాఖలా ఏకఖండంగా గల య. 3.97.25ట్లు లేక హె. 1.616ర్లు భూమికి **హద్దులు. తూర్పు:** వల్లభనేని రాజేష్ మరియు స్వరూపరాణి గార్ల ఆస్తి. **దక్షిణం:** వల్లభనేని మాధవరావు మరియు ఇతరుల ఆస్తి, **పడమర:** పల్లవి రైస్ మిల్ వారి భూమి. **ఉత్తరం :** గ్రామ పంచాయతీ రోడ్డు మరియు ఇతరుల ఆస్తి. ఈ పైనాలుగు హద్దుల మధ్య య. 3.97.25 ట్లు లేక హె. 1.616ర్లు భూమి మరియు యావత్ యీజ్‌మెంట్ హక్కులతో సహాయున్నూ.

**Dr. ధారా సత్యనారాయణ,** Advocate,
డోరు నెం. 36-12-13/3, డా. కీలారు బుచ్చిబాబు వీధి, మొఘల్రాజపురం,
విజయవాడ-520 010, **Cell No. 94403 20435. Phone No. 0866 - 2573736.**
విజయవాడ, ది. 27-12-2025


## రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఖోఖో ఆడుతున్న బాలికలు

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే ఉమ్మడి కృష్ణా జిల్లా 28వ అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల రీజనల్ స్పోర్ట్స్ మీట్-2025ని వారు ప్రారంభించారు. బెలూన్లు, కపోతాలు ఎగురవేశారు. రాష్ట్ర సాంకేతిక విద్య ప్రాంతీయ సంచాలకుడు జీవీ రామచంద్రరావు, ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, డిపార్ట్‌మెంట్ అధికారి సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. ❖ చెస్ బాలురు విభాగంలో డీవీఆర్ అండ్ డాక్టర్ హెచ్ఎస్ఎంఐసీ కళాశాల (కంచికచర్ల) ప్రథమ, ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ద్వితీయ, బాలికల విభాగంలో శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల (కలవపాముల) ప్రథమ, ఎంవీఆర్ కళాశాల (పరిటాల) ద్వితీయ, బ్యాడ్మింటన్ బాలురు సింగిల్స్‌లో వీకేఆర్ అండ్ వీఎన్‌బీ (గుడివాడ) ప్రథమ, ఎంఐసీ కళాశాల (కంచికచర్ల) ద్వితీయ, డబుల్స్‌లో ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ప్రథమ, నూజివీడు పాలిటెక్నిక్ కళాశాల (నూజివీడు) ద్వితీయ, టేబుల్ టెన్నిస్ బాలురు సింగిల్స్, డబుల్స్‌లో ఎంవీఆర్ (పరిటాల) ప్రథమ, ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ద్వితీయ, బాలికల సింగిల్స్, డబుల్స్‌లో ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ప్రథమ, శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల (కలవపాముల) ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

## సాంకేతికతతో జలసమస్యలకు పరిష్కారం

సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్ వైఆర్.సత్యాజీరావు. చిత్రంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సీఈవో ప్రఖర్‌జైన్ తదితరులు

**కానూరు, న్యూస్‌టుడే:** నూతన సాంకేతిక పరిజ్ఞానంతో జల సమస్యలకు పరిష్కారాలు కనుగొని నీటి నిర్వహణను మెరుగుపరచటమే జలశక్తి హ్యాకథాన్- 2025 ముఖ్య ఉద్దేశమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ డైరెక్టర్ డాక్టర్ వైఆర్ సత్యాజీరావు అన్నారు. సోమవారం సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జలశక్తి మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంటు ఆఫ్ వాటర్ రిసోర్సెస్, రివర్ డెవలప్‌మెంటు రీజువనేషన్ నేతృత్వంలో జలశక్తి హాకథాన్-2025 ప్రాంతీయ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీటి నాణ్యతతో వచ్చిన మార్పులు, మందుల వ్యర్థాలు మైక్రోప్లాస్టిక్స్ వలన కలుగుతున్న కాలుష్యంపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తాము నివసిస్తున్న ప్రాంతం లేదా గ్రామంలో నీటి సమస్యలు ఏమైనా ఉంటే గుర్తించి సాధ్యమైన పరిష్కారాన్ని 10 లైన్లలో జల వనరుల శాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రియల్ టైమ్ గవర్నన్స్ సొసైటీ సీఈవో ప్రఖర్‌జైన్ మాట్లాడుతూ విద్యార్థి దశలో చేసే ప్రాజెక్టులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, సమాజంలోని వాస్తవ సమస్యలకు పరిష్కారాలుగా మారాలన్నారు. సెంట్రల్ గ్రౌండు వాటర్ బోర్డు రీజినల్ డైరెక్టర్ ఎన్.జ్యోతికుమార్, నేషనల్ ఎక్స్‌పర్ట్ ఆన్ వాటర్ అండ్ శానిటేషన్ హైజీన్ డైరెక్టర్ వరప్రసాదరావు, శాస్త్రవేత్త ఎస్వీ.విజయ్‌కుమార్, వైస్‌ఛాన్సలర్ పి.వెంకటేశ్వరరావు, సివిల్ విభాగాధిపతి మల్లికార్జున, ప్రో వైస్‌ఛాన్సలర్ ఏవీ.రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులకు రిమాండ్ పొడిగింపు

**ఈనాడు, అమరావతి:** మావోయిస్టులకు కోర్టులు రిమాండ్ పొడిగించాయి. పటమట కేసులో అరెస్టు అయి నెల్లూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్న నలుగురు మావోయిస్టులకు వచ్చే నెల 12వ తేదీ వరకు పొడిగించారు. వీరిని కారాగారం నుంచి వర్చువల్ విధానంలో నాలుగో ఏసీజేఎం కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపర్చాగా రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. పెనమలూరు కేసులో 26 మంది మావోలు రాజమహేంద్రవరం కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. వీరిని కూడా జైలు నుంచే వర్చువల్‌లో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చారు. వీరికి వచ్చే నెల 8వ తేదీ వరకు రిమాండ్ పొడిగించారు. వీరికి న్యాయసహాయం కోసం న్యాయసేవాధికార సంస్థ లాయర్ శాంతిని నియమించింది. ఇప్పటికే వీరి కస్టడీ కోసం వేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు కోసం 31వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

## మసీదు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

సమావేశంలో మాట్లాడుతున్న గుడివాడ ఎమ్మెల్యే రాము

**గుడివాడ, న్యూస్‌టుడే:** మైనారిటీలలో విద్వేషాలు పెంపొందించటం కూటమి ప్రభుత్వ నైజం కాదని ఐక్యతే బలం అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మేదర బజారులో రూ.75 లక్షలతో నిర్మించిన గుల్జార్ చౌక్ మసీదు షాపింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ప్రారంభించారు. గత ప్రభుత్వం నిర్మాణం చేయకుండా ఆపిందని విమర్శించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొడాలి నాని మైనారిటీల ఐక్యతను దెబ్బతీశారన్నారు. మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం వైకాపా ప్రభుత్వం చేసిన అన్యాయం, తెదేపా చేసిన సాయాన్ని వివరించారు. నాయకులు శ్రీకాంత్, మురళీ, రవి కుమార్, బాబ్జి, జగన్ మోహన్‌రావు, ముజాహిదీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎంవీ కృష్ణారావు విగ్రహావిష్కరణ

**నాగాయలంక, న్యూస్‌టుడే:** మండలంలోని టి.కొత్తపాలెంలో మంగళవారం ఉదయం 9 గంటలకు దివంగత మండలి వెంకట కృష్ణారావు విగ్రహావిష్కరణ జరుగుతుంది. గ్రామంలోని భ్రమరాంబ అమ్మవారి ఆలయ సమీపంలో ఎంవీ కృష్ణారావు శత జయంతి నిర్వాహక కమిటీ టి.కొత్తపాలెం కన్వీనర్ బండ్రెడ్డి హరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విగ్రహ ఆవిష్కర్తగా ఏపీ ప్రెస్ అకాడమీ అధ్యక్షులు ఆలపాటి సురేష్ కుమార్ పాల్గొంటారు. ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. కాన్సర్ స్క్రీనింగ్ బస్ ద్వారా ఉచిత వైద్య పరీక్షలు చేస్తారు.

## ఆడపిల్లలకు జన్మనిచ్చానని పుట్టింటికి పంపేశారు..

బాధితుల సమస్య తెలుసుకుంటున్న ఏఎస్పీ సత్యనారాయణ

**మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే:** ఆడపిల్లకు జన్మనిచ్చినందుకు రెండేళ్లుగా తాను పడుతున్న అవస్థల నుంచి విముక్తి కల్పించాలని ఓ మాతృమూర్తి జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ఆశ్రయించింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం జిల్లా వివిధ ప్రాంతాల నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన వారి వద్ద నుంచి ఏఎస్పీ సత్యనారాయణ, ఇతర అధికాధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. మచిలీపట్నంకు చెందిన ఓ మహిళ తనకు చల్లపల్లి మండలానికి చెందిన వ్యక్తితో వివాహం అయ్యిందని, రెండేళ్ల క్రితం ఆడపిల్లకు జన్మనిచ్చాననే కారణంతో పుట్టింటికి పంపేశారని, అప్పటి నుంచి మానసికంగా అనేక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంది. యనమలకుదురుకు చెందిన మరో వివాహిత.. తన భర్త 2014లో మరణించాడని, అప్పటి నుంచి అత్తింటివారి ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందని, తాజాగా తనను, ఇద్దరు పిల్లల్ని ఇంటి నుంచి గెంటివేశారని వాపోయింది. విచారించి న్యాయం చేయాలని వేడుకుంది. వివిధ వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన దాదాపు 43 ఫిర్యాదులను పరిశీలించిన ఏఎస్పీ వాటిని విచారించి చట్ట పరిధిలో సత్వర న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## జంగారెడ్డిగూడెం కల్తీ సారా మరణాలన్నీ జగన్‌రెడ్డి హత్యలే: కొల్లు

**భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెంలో జరిగిన 29 కల్తీ సారా మరణాలు జగన్‌రెడ్డి హత్యలేనని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మంత్రి విజయవాడ కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేశారు. 2019-24 మధ్య కాలంలో జరిగినన్ని అక్రమాలు ప్రపంచంలో ఎక్కడా ఏ నాయకుడూ చేసి ఉండడన్నారు. మద్యం వ్యాపారం మొత్తాన్ని గుప్పెట్లో పెట్టుకుని కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్దారన్నారు. ధరల బాదుడుతో ప్రజలు నాటు సారాకు అలవాటు పడడంతో వైకాపా నేతలు సారా వ్యాపారం ప్రారంభించారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో జరిగిన అక్రమాలన్నీ సిట్ విచారణలో బయటకు వస్తున్నట్లు కొల్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం నాణ్యతకు ప్రాధానమిచ్చామని, 13 స్థాయిల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కల్తీని నిరోధించడం కోసం సురక్ష యాప్ తీసుకువచ్చామన్నారు. జగన్ అక్రమాలన్నీ బయటకు వస్తుండడంతో కూటమి ప్రభుత్వంపై కుట్రలు చేయాలని ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయారన్నారు. గత ఐదేళ్లూ ములకల చెరువు, ఇబ్రహీంపట్నంలో కల్తీ మద్యం తయారు చేసిన అనుభవంతో మళ్లీ తయారు చేసి ఆ నెపాన్ని ప్రభుత్వంపై వేయాలనుకున్నారని ఆరోపించారు. తాజాగా నెల్లూరులో ఒక వృద్ధుడితో ఐదు మద్యం బాటిళ్లు కొనుగోలు చేయించి, అతనికి తెలియకుండా వీడియోలు తీసి బెల్టుషాపుల కోసం అంటూ సోషల్ మీడియాతో హడావుడి చేశారన్నారు.


91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297



EENADU Classifieds

**AUTO**
**VEHICLES FOR SALE**

AP39SJ-1204 ESCORTS KUBOTA Euro 42 Plus Tractor-2023 Model is for Sale in as is where is Condition ★ Sundaram Finance Ltd. ✆ 94409 09726

AP40 AT-3203 MAHINDRA 575 DI XP Plus TRACTOR-2023 Model is for Sale in as is Where is Condition ★ Sundaram Finance Ltd. ✆ 94409 09726.

**BUSINESS SERVICES**

బంగారం కొనబడును.బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. ✆ 81422 92071

BOOK YOUR COLOUR CLASSIFIED ₹ 1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

**JOBS**

Wanted Lady Office Assistant with 2years Exp. in Tally ERP 9 & Accounts. Srinivasa Pharma, Ramavarappadu. ✆ 79977 24048

ప్రముఖ రియల్ ఎస్టేట్స్‌లో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. జీతం+ కమీషన్ ఇవ్వబడును. సంప్ర ✆ 93906 65999.

ఎన్టీఆర్, క్రిష్ణ జిల్లాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థలో కలెక్షన్ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అనుభవం+ఫ్రెషర్స్. టూ వీలర్. ✆ 90322 31756, 63004 90073

విజయవాడలోని షోరూమ్‌కి లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. టైమింగ్స్ 10AM-8PM, గాంధీనగర్, విజయవాడ. శాలరీ: 12000/-. ✆ 93922 22771

VJA బందరురోడ్డు వీసెంట్ రోడ్ షాపింగ్‌మాల్స్ నందు హౌస్ కీపింగ్‌లో అనుభవం గల లేడీస్/బాయ్స్ కావలెను (విడిగా రూమ్ కలదు). ✆ 97044 33644.

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్‌కి అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్. A:25-30Y, S:18-25K, Q:డిగ్రీ. లేడీటెలీకాలర్ కావలెను. ✆ 99495 58181, 81215 58181

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

# మచిలీపట్నం

•మచిలీపట్నం •పెదన

## ప్రతిభ చాటి.. బహుమతులు పట్టి..

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే:** నగరంలోని లేడియాంపిల్లో, నారాయణ కళాశాలల్లో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వర్తమాన, జనరల్ నాలెడ్జ్ అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించగా ఆయా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. లేడియాంపిల్లో కళాశాలలో నిర్వహించిన పోటీల్లో పి.సారిక(ఇంటర్ ప్రథమ), కె.తనుశ్రీ(ఇంటర్ ద్వితీయ), ఎస్కే ఆరిఫా(ఇంటర్ ప్రథమ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రిన్సిపల్ పి.లక్ష్మి, అధ్యాపకులు లంకిశెట్టి హరినాథ్ బాబు, మున్వర్, పార్వతి, సురేశ్‌లు విజేతలకు బహుమతులు అందించారు. ★ నారాయణ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఎన్.తరుణ్‌తేజ(ఇంటర్ ద్వితీయ), జి.విజయ్(ఇంటర్ ద్వితీయ), ఐ.రాజు(ఇంటర్ ద్వితీయ)లు విజేతలుగా నిలిచారు. వారికి ప్రిన్సిపల్ ఎన్.సతీశ్, అధ్యాపకులు ఎంబీఎల్ సాయినాథ్, సీహెచ్ ప్రవీణ్‌కుమార్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు.

లేడియాంపిల్లో కళాశాలలో విజేతలతో ప్రిన్సిపల్ లక్ష్మి తదితరులు

నారాయణ విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

## ఈవీఎం గోదాముల తనిఖీ

**కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే:** కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ డీకే బాలాజీ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. గోదాముల సీళ్లు, ద్వారాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గోదాముల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరును ఆరా తీశారు. విద్యుత్ సౌకర్యం సక్రమంగా ఉందా.. లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. డీఆర్వో చంద్రశేఖర్, ఈవీఎం నోడల్ అధికారి నిత్యానందం, తెదేపా జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, ఆయా పక్షాల ప్రతినిధులు సిలార్‌దాదా, పంతం గజేంద్రరావు, బాలాజీ, బూర సుబ్రహ్మణ్యం, బత్తిన దాస్, ఎన్నికల విభాగం అధికారి శ్యామ్‌నాథ్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ

## ధర వరలు

**రైతుబజారు కూరగాయల ధరలు(కిలో రూ.లో):** టమాట 48, వంగ 20, బెండ 34, పచ్చిమిర్చి 40, కాకర 50, క్యాబేజీ 22, క్యారెట్ 32, దొండ 36, బంగాళదుంప 25, ఉల్లిపాయలు 30, గోరుచిక్కుడు 40, దోస 40, సొర 20,18, అరటికాయ 7,8, చిక్కుళ్లు 30, బీర 40, చామదుంప 26, మునగ 15/14, కంద 44, బీట్‌రూట్ 32, కీరదోస 34, బీన్స్ 76, క్యాప్సికం 56, అలసందలు 40, చిలకడదుంప 35, కొత్తిమీర 14/07, పుదీనా 15/05 మంగళవారం ఉదయం 7 గంటలవరకు ఈ ధరల వర్తిస్తాయి.

## సినిమాలు

**రేవతి:** ఈషా
**మినీరేవతి:** శంబాల
**సిరికృష్ణ:** అఖండ-2
**సిరివెంకట్:** ఛాంపియన్

# రెండు రోజులే గడువు..

## విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణకు చివరి అవకాశం

**మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే**

ఇటీవల పెడన, బందరు నియోజకవర్గాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఎక్కువ మంది అధికలోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి జరిమానాలు విధించారు. బందరులో అధికలోడు వినియోగిస్తున్న వారికి రూ.10 లక్షలకు పైగా జరిమానా విధించారు. ఇలా ఎక్కువ మంది వినియోగదారులకు అవగాహన లేకపోవడంతో కూటమి ప్రభుత్వం అదనపు

| సెక్షన్ | నమోదైన సర్వీసులు | వచ్చిన ఆదాయం (రూ॥ల్లో) |
|---|---|---|
| బందరు డి-1 | 531 | 12,00,100 |
| బందరు డి-2 | 401 | 10,02,750 |
| బందరు డి-3 | 428 | 11,74,650 |
| చిన్నాపురం | 108 | 2,34,600 |
| పెడన | 351 | 7,40,000 |
| గూడూరు | 411 | 8,47,300 |
| బంటుమిల్లి | 483 | 10,94,550 |
| కృత్తివెన్ను | 827 | 16,68,500 |

లైన్ ఏర్పాటు పనుల్లో కార్మికులు

లోడును క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు కల్పించింది. ఈ గడువు రెండు రోజుల్లో ముగియనుంది.

### రెండు నియోజకవర్గాలో 3,540 కనెక్షన్లు..

బందరు డివిజన్ వ్యాప్తంగా 2,57,350 సర్వీసులు ఉంటే వాటిలో అత్యధికంగా 2,29,15ల కనెక్షన్లు గృహ వినియోగానికి సంబంధించినవే. ఇప్పటి వరకు బందరు, పెడన నియోజకవర్గాల్లో 3,540 సర్వీసులు మాత్రమే క్రమబద్ధీకరణకు నమోదై ఉన్నాయి. బందరు, కృత్తివెన్ను మండలాల్లో మాత్రం కాస్త ఎక్కువమంది క్రమబద్ధీకరించుకున్నారు. క్రమబద్ధీకరించుకోకుండా అలాగే ఉంటే గృహోపకరణాలు పాడైపోవడం, ఫ్యూజులు కాలిపోవడమే కాకుండా అధికారుల తనిఖీల్లో పట్టుబడితే అధిక మొత్తంలో జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది.

### సద్వినియోగం చేసుకుంటే మేలు: గోవిందరావు, ఈఈ

50 శాతం రాయితీతో అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవడానికి ఈనెలాఖరు వరకు మాత్రమే గడువు ఉంది. ఇప్పటికే రెండు సార్లు గడువు పెంచారు. ఇకపై పెంచకపోవచ్చు. వినియోగదారులు విద్యుత్తు శాఖ కార్యాలయాలు, మీ-సేవ కేంద్రాలతోపాటు ఆన్‌లైన్‌లో విద్యుత్తు శాఖ వెబ్‌సైట్ ద్వారా నిర్దేశించిన రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని కోరుతున్నాం.

## ఉద్యోగ మేళా నేడు

**పెడన గ్రామీణం:** పెడన పట్టణ విజయానంద డిగ్రీ కళాశాలలో, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30న ఉదయం 9 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ నరేశ్ తెలిపారు. ఇందులో 15 కంపెనీలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి నుంచి పది, ఇంటర్, డిగ్రీ, బీఈ, బీటెక్, ఫార్మసీ అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. విద్యార్థులు రెజ్యూమ్, ఆధార్, ఫొటోలు, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని చెప్పారు. వివరాలకు ఫోన్ నంబర్లు88977 72488, 99664 89796లలో సంప్రదించాలని వివరించారు.

## కమిషనర్ బాధ్యతల స్వీకారం

కొండయ్యకు స్వాగతం పలుకుతున్న అధికారులు

**పెడన, న్యూస్‌టుడే:** మున్సిపల్ కమిషనర్‌గా డి.కొండయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానని చెప్పారు. వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు నూతన కమిషనర్‌కు స్వాగతం పలికారు. అనంతరం చైర్‌పర్సన్ కటకం నాగమణిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## రెవెన్యూ క్లినిక్ ప్రారంభం

**పెడన, న్యూస్‌టుడే:** మండల రెవెన్యూ కార్యాలయంలో భూ వివాదాల పరిష్కారానికి 'రెవెన్యూ క్లినిక్‌'ను సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆర్వోఆర్, అడంగల్‌లకు సంబంధించి రైతుల ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలన్న లక్ష్యంగా ఈ క్లినిక్ ప్రారంభించామని తహసీల్దార్ అనిల్‌కుమార్ చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించిన ఏదైనా ఫిర్యాదులు ఉంటే క్లినిక్ దృష్టికి తీసుకు రావాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు. మండల సర్వేయర్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సల్మా, మండల పరిషత్తు ఏవో కటకం శివ ప్రసాద్ పాల్గొన్నారు.

## జడ్పీ పాఠశాలల పరిశీలన

**పెడన గ్రామీణం:** మండలంలో నందిగామ, నందమూరు జడ్పీ పాఠశాలల సోమవారం ఉదయం నిర్వహిస్తున్న స్టడీ అవర్లను ఎంఈవో-2 వై.వి.హరనాథ్ పరిశీలించి విద్యార్థుల పుస్తకాలు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రగతిని అంచనా వేసి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు.

## పరిశ్రమల ఏర్పాటుకు రాయితీ

**గూడూరు, న్యూస్‌టుడే:** పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ ఏడీఏ మనోజ్ తెలిపారు. మండల పరిధిలోని కప్పలదొడ్డి గ్రామంలో వాసవ్య మహిళా మండలి, హెచ్‌పీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కలంకారీ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చిన ఔత్సాహికులకు ఉద్యమ్ నమోదు పత్రాలు అందజేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు, కలంకారి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు అందుకున్న మహిళలతో ఉద్యోగులు, సంస్థల ప్రతినిధులు

## బాల్య వివాహాల నియంత్రణ సామాజిక బాధ్యత

**గూడూరు, న్యూస్‌టుడే:** బాల్యవివాహాల నియంత్రణ సామాజిక బాధ్యతని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.ఉషశ్రీ తెలిపారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని ముక్కొల్లు, కంకటావ గ్రామాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీలు, సదస్సులు, మానవహారం నిర్వహించారు. హెచ్‌ఎం శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు ప్రసంగించారు. బాల్య వివాహాలు చట్ట రీత్యానేరమని, అలాంటి వివాహాలు చేసినా ప్రోత్సహించినా చట్ట రీత్యా నేరమన్నారు. వివిధ విభాగాల ఉద్యోగులు జి.హేమలత, అరుణాదేవి, కాగిత కోమలి, భవాని, ఉదయలక్ష్మి, సీహెచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం

## అబ్దుల్ వాహాబ్ మృతి సమాజానికి తీరని లోటు

**భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే:** ఇస్లాం మత ప్రబోధకుడు, ముస్లిం ఆధ్యాత్మికవేత్త మౌలానా ముఫ్తీ అబ్దుల్ వాహాబ్ మృతి సమాజానికి తీరని లోటని ముస్లిం సంక్షేమ సంఘ కన్వీనర్ సద్రుద్దీన్ ఖురేషి సోమవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఇస్లామియా విద్య, ఖురాన్, హదీస్ విశ్వాసులకు అల్లా మార్గాన్ని ప్రజలకు తెలియజేసిన గొప్ప ఆధ్యాత్మికవేత్త అబ్దుల్ వాహాబ్ అని ఖురేషి అన్నారు.

## హెల్త్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వినతి

**భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే:** మచిలీపట్నంలో రెండు ఏళ్లుగా ఖాళీగా ఉన్న హెల్త్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసి ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించాలని ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం మచిలీపట్నంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నగరంలో హోటళ్లు, రెస్టారెంట్లు కల్తీ పదార్థాలతో ఆహారాన్ని తయారీ చేస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నాయని ఆరోపించారు. హోటళ్లు, రెస్టారెంట్లపై పర్యవేక్షణ చేయడానికి కార్పొరేషన్‌లో హెల్త్ ఆఫీసర్ లేకపోవడం దారుణమన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తక్షణమే హెల్త్ ఆఫీసర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

## పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే:** పొదుపు చేయడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. నగరంలోని 50వ డివిజన్‌లో నిర్వహించిన స్వయం సహాయక సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వయం సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. వీటి ద్వారా తీసుకునే రుణాలతో మహిళలు స్వయం ఉపాధి కల్పించుకోవాలని సూచించారు. ప్రతి నెల కొంత పొదుపు చేసుకుంటే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. కూటమి నాయకులు గడ్డం రాజు, పమ్మి సతీష్, నాగరాజు, రామినాయుడు, వంపుగడల చౌదరి, గోవిందు, వాసు, సూరిబాబు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ

## ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

**చిన్నాపురం(మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే:** చిన్నాపురంలోని వేంకటాచల ఆలయంలో సోమవారం స్వామికి పూజలు నిర్వహించారు. పండితులు రంగారావు నేతృత్వంలో విష్ణు సహస్రనామ పూజలు చేశారు. మంగళవారం ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఆలయ ధర్మకర్త మండలి ఛైర్మన్ పెదవలి సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## ఉద్యోగాలకు ఎంపిక

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే:** నగర శివారులోని వైజేఆర్ డీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి సోమవారం నియామక పత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్ టి.రవికుమార్ మాట్లాడుతూ 113 మంది అభ్యర్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందగా 60 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ప్రాంగణ ఎంపిక అధికారి జె.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని డీవైఈవో శేఖర్‌సింగ్ అన్నారు. బందరు డివిజన్‌లోని ఆయా పాఠశాలల రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు సోమవారం నగరంలోని రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు చేరేలా చూడలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. రిసోర్సుపర్సన్‌లు అంబటిపూడి సుబ్రహ్మణ్యం, ఏఎస్‌వీడీ ప్రసాద్, వెంకట్రావులతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై తక్షణ చర్యలు

**పెడన, న్యూస్‌టుడే:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ చెప్పారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన రెండు ప్రధాన సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు. మండల పరిషత్తు ఏవో కటకం శివ ప్రసాద్, ఉపాధి హామీ ఏపీవో వజీర్, ఎంఈవో వై.వి.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగ్ యాప్‌లకు బానిసై చోరీలు

నిందితుడిని చూపుతున్న ఎస్సై

**పెడన, న్యూస్‌టుడే:** పెడన పట్టణంలో జరిగిన మూడు చోరీ కేసులను పోలీసులు చేధించారు. వీరభద్రపురానికి చెందిన రామిశెట్టి మణికంఠ(29) చోరీలు చేస్తున్నట్లు దర్యాప్తులో వెలుగు చూడడంతో నిందితుడిని సోమవారం అరెస్టు చేసి మచిలీపట్నం కోర్టులో ప్రవేశపెట్టారు. మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. దీనికి సంబంధించి ఎస్సై గంట్ల సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 15న పట్టణంలోని వీరభద్రపురానికి చెందిన వీరా స్వామి ఇంట్లోకి చోరీ జరిగింది. తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. అంతకముందు పల్లోటి కాలనీ, మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లోనూ ఈ తరహా చోరీలు జరిగాయి. బంగారు ఆభరణాలు లక్ష్యంగా చోరీలు జరగడం, ఈ మూడు ఒకే రీతిలో ఉండడంతో వివిధ కోణాల్లో దర్యాప్తు చేశారు. వీరా స్వామి ఇంటికి సమీపంలో నివసిస్తున్న రామిశెట్టి మణికంఠ చెడు వ్యసనాలకు గురైనట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని వేలిముద్రలు సేకరించారు. వాటిని 15న జరిగిన చోరీ కేసులో లభించిన వాటిని పరిశీలించగా. . రెండు సరిపోలడంతో దర్యాప్తు వేగవంతం చేసి నిందితుడు ఇచ్చిన సమాచారంతో స్థానికంగా ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టిన 60 గ్రాముల బంగారం, 130 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బెట్టింగ్ యాప్‌లకు బానిసై చోరీలకు పాల్పడుతున్నట్లు ఎస్సై చెప్పారు.

**ఒంటిల్లులో..** **కృత్తివెన్ను, న్యూస్‌టుడే:** పది కోడి పుంజులు, ఒక బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని కృత్తివెన్ను ఎస్సై ఎ.పైడిబాబు సోమవారం తెలిపారు. ఈ నెల 25న మండలంలోని సీతనపల్లి పంచాయతీ ఒంటిల్లు గ్రామంలో చోరీ జరిగిందని ఫిర్యాదు చేయడంతో విచారణ చేస్తున్నామన్నారు. అందులో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించగా.. గుడ్లవల్లేరు మండలం చింతలగుంట గ్రామానికి చెందిన కొప్పర్తి అచ్చిబాబు, నెహ్రూనగర్‌కు చెందిన పేరం కొండలరావు చోరీ చేసినట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. కేసు చేధించినందుకు ఎస్‌డీపీవో సీహెచ్ రాజా.. ఎస్సై పైడిబాబును, సిబ్బందిని అభినందించారు.

## ఉత్తమ విధానాల అమలుపై దృష్టి

**కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే:** ఇతర జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను జిల్లాకు అనుకూలంగా అమలు చేసేందుకు చొరవ చూపాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన పలు సూచనలు చేశారు. ఈ అర్జీలతో పాటు సీఎం కార్యాలయం నుంచి వచ్చే వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్ని కార్యాలయాల్లో ఇవ్వాల్సిన పదోన్నతులు, ఇంక్రిమెంట్లకు సంబంధించిన ఉత్తర్వులు సిద్ధం చేసి నూతన సంవత్సరం సందర్భంగా జనవరి ఒకటో తేదీన ఇచ్చేలా చూడాలన్నారు. పరిశ్రమలు విరివిగా నెలకొల్పేలా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో సమన్వయం చేసుకుని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఎనికేపాడు సొరంగం మూసివేయక ముందే దిగువన ఉండే మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపుకోవాలని, లేని పక్షంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్, అధికారులు

### పూలబొకేలు.. మిఠాయిలు తీసుకురావద్దు

నూతన సంవత్సరం సందర్భంగా ఎవరూ పూలబొకేలు, మిఠాయిలు తదితరాలు తీసుకురావద్దని, వీటి బదులు అవసరమైన వారికి సహాయం చేసేలా ముందుకు రావాలన్నారు. కలెక్టరేట్‌లో సంక్రాంతి లోపే అమృతకృష్ణ పేరుతో శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. జేసీ నవీన్ ఇతర అధికారులతో కలిసి జిల్లా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. ★ వీబీ జీ రామ్‌జీ పథకాన్ని పునరుద్ధరించి మరింత బలోపేతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు పవన్‌కుమార్, వెంకటేశ్వరరావులు వినతిపత్రం ఇచ్చారు. ★ వంట గ్యాస్ తూకం తక్కువగా వస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో గతంలో మాదిరి వినియోగదారులకు తూకం వేసి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘ నాయకులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం తదితరులు కోరారు. ★ తమ ప్రమేయం లేకుండా బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని మోసం చేసిన ఏపీఎం, సీసీ, బుక్‌కీపర్‌లను విచారించి తమకు న్యాయం చేయాలని గన్నవరానికి చెందిన స్వయం సహాయక సంఘ సభ్యులు లక్ష్మి, లలిత తదితరులు ఫిర్యాదు చేశారు. ★ ప్రత్యేకించి హిందువుల నివాస గృహాల మధ్య పంచాయతీ అనుమతులు లేకుండా ఆరాధన స్థలం పేరుతో నిర్మాణం చేపట్టి పలు కుటుంబాలను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బందరు మండలం ఎస్ఎన్‌గొల్లపాలెం వాసులు రమేష్, శ్రీనివాసరావు తదితరులు అర్జీ సమర్పించారు.

## ఘనంగా లక్ష బిల్వార్చన

**బంటుమిల్లి, న్యూస్‌టుడే :** మండలంలోని ముల్లపర్రులోని శ్రీ పార్వతి సమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం శాస్త్రోత్సంగా లక్షబిల్వార్చన, అమ్మవారికి కుంకమార్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శన, అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలంకరణలో నాగేశ్వరస్వామి

**పెడన, న్యూస్‌టుడే:** శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి భక్తులకు స్వామివార్ల ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం హరికృష్ణ చెప్పారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామి వార్ల కల్యాణం, 31న ఉదయం 11.30గంటలకు మహా సుదర్శన హోమం, జనవరి 1న సాయంత్రం 5గంటలకు స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

## బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే శిక్షార్హులు

**బంటుమిల్లి:** బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీడీపీవో సముద్రవేణి సూచించారు. మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. వీటి వల్ల శారీరకంగా, మానసికంగా అనేక రకాల ఇబ్బందులు ఉంటాయని చెప్పారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే విద్యార్థులు ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలియజేయాలని సూచించారు. బాలికలను వేధిస్తే ఫోక్సో చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని, ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలపాలని సూచించారు. హెచ్‌ఎం విజయకుమారి, సూపర్‌వైజర్ శ్రావణ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, సుబ్రహ్మణ్యేశ్వరమ్మ, కృష్ణ కుమారి పాల్గొన్నారు.

## నిధులు మార్చి లోపు ఖర్చు చేయాలి

**కలెక్టరేట్(మచిలీపట్నం):** మత్స్య సంపద వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సమకూర్చే గ్రీన్ క్లైమేట్ నిధులను మార్చి లోపు ఖర్చు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్‌డీఏ, మత్స్య, అటవీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన.. నిధుల వినియోగంపై దిశానిర్దేశం చేశారు. మత్స్యకారులకు పెద్ద ఎత్తున జీవనోపాధి కల్పించాలన్నారు. గ్రీన్ క్లైమేట్ నిధులతో పీతలు, సముద్రనాచు, అలంకార చేపల పెంపకం వంటి యూనిట్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉందన్నారు. 27 పీతల యూనిట్లు ఏర్పాటు చేసేందుకు గుర్తించిన 64 మంది లబ్ధిదారులతో చర్చించి ఫిబ్రవరి రెండో వారంలోపు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 25 సముద్ర నాచు పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసేందుకు 80 మంది సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఏడాది మరో 500 పీతల పిల్లల పెంపకం యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి 4న మత్స్యకారులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మత్స్యశాఖ జేడీ నాగరాజ, డీఎఫ్‌వో సునీత, గ్రీన్ క్లైమేట్ ఫండ్ ప్రాజెక్టు మేనేజర్ ఉష, జిల్లా సమన్వయకర్త ప్రభాకరరావు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మన బాధ్యత

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే:** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం బాధ్యతగా భావించాలని గౌడ సంఘ సభ్యులు పేర్కొన్నారు. నగరంలోని గొడుగుపేటకు చెందిన వంకా రమేష్ అనారోగ్య సమస్యల కారణంగా ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆర్థికంగా ఆయన పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని మచిలీపట్నం గౌడ సంఘం రూ.17,500, గుంటూరుకు చెందిన గీతా బంధు ట్రస్టు రూ.15,000 కలిపి మొత్తం రూ.32,500 సోమవారం గౌడ సంఘ సభ్యులు రమేష్‌కు అందించారు. చల్లపల్లి జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, నాయకులు కొనకళ్ల భానుప్రసాద్, పడమట నాగరాజు, కట్టా దుర్గ, పడమట రామ్మోహనరావు, పి.నవకాంత్, గున్నం నాగబాబు, కొండేటి సుబ్రహ్మణ్యం, మరీదు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఉచిత న్యాయ సాయం

మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే:** వృద్ధులకు అందిస్తున్న ఉచిత న్యాయసాయాన్ని వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య అన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ విశ్రాంత ఎంప్లాయిస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సోమవారం నగరంలోని ఎన్ఎంయూ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వృద్ధులకు అండగా ఉన్న చట్టాలు, న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. జిల్లా ప్రజారవాణా శాఖాధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్ టి.పెద్దిరాజులు విశ్రాంత ఉద్యోగులకు శాఖాపరంగా అండగా ఉంటామని చెప్పారు. సంఘ అధ్యక్షులు పీవీ ఈశ్వరరావు, నాయకులు వైఎస్ రావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే:** శిక్షణ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాలోని పలు గ్రంథాలయాలకు కంప్యూటర్‌లు, టీవీలను అందించారు. సోమవారం ఫౌండేషన్ ప్రతినిధి చల్లపల్లి కిరణ్మయి వాటి నిర్వహణ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ ఉద్యోగులు ఆమెను సత్కరించారు. రవికుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్ అందించిన వసతులు యువతకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఉప గ్రంథాలయ అధికారి వెంకటరమణ, ఉద్యోగులు బి.విజయ్‌కుమార్, కేవీవీఎన్ బసవేశ్వరరావు, ఐ.రాజారావు పాల్గొన్నారు.

## అప్పలరాజును విడుదల చేయాలి

మాట్లాడుతున్న నరసింహారావు

**బంటుమిల్లి, న్యూస్‌టుడే :** అనకాపల్లి జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజును విడుదల చేయాలని సీఐటీయూ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వై నరసింహారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రం బంటుమిల్లిలోని గుండాబత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై పోరాడుతున్న వారిపై ప్రభుత్వం పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, లంకదాసుల అజయ్ ఘోష్, మాజేటి శివ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ గోడ నిర్మాణానికి కృషి

కల్వర్టు పరిశీలిస్తున్న ఫణికుమార్, అధికారులు

**మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే:** నగరంలోని ఈడేపల్లిలో బస్ స్టాండ్ వెనుక ప్రాంతంలో ఉన్న కల్వర్టుకు రక్షణగోడ లేక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో చిత్రకథనం ప్రచురితమైంది. దీనిపై కొందరు ప్రజాదర్బార్‌లో ఫిర్యాదులు కూడా చేశారు. స్పందించిన నగరపాలకసంస్థ కమిషనర్ బాపిరాజు అధికారులను ఆదేశించారు. దీంతో డీఈ వి.కృష్ణ, ఏఈ జ్వాలాదీప్తి, సచివాలయ ఉద్యోగులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించిన బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్ మాట్లాడుతూ త్వరలోనే రిటైనింగ్‌వాల్ నిర్మించేందుకు కృషి చేస్తామని అన్నారు.

**ఆక్వాకల్చర్ స్టీవార్డ్‌షిప్ కౌన్సిల్ ష్రింప్ ప్రమాణాల ప్రకారం జీవ వైవిధ్యం - పర్యావరణ మరియు భాగస్వామ్య - సామాజిక ప్రభావ అంచనాల కోసం ప్రజా సంప్రదింపుల సమావేశం**

ఆక్వాఫార్మ్ పేరు: **శ్రీ VJ ఆక్వా ఫార్మ్- సైట్ 1 & 2**
చిరునామా: **కోన గ్రామం, మచిలీపట్నం మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్**
**GPS:16.100539, 81.110285 (సైట్ 1) 16.102956, 81.120305 (సైట్ 2)**
**సంప్రదింపు తేదీలు మరియు సమయం:**
07-01-2026 మరియు 08-01-2026 &10.30 Hrs
**స్పాన్సర్:** నెక్కంటి సీ ఫుడ్స్ లిమిటెడ్, ఓషన్ డ్రైవ్ లేఅవుట్, గుడ్లవానిపాలెం, ఎదురుగా భూలోకమాత ఆలయం, సాగర్ నగర్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530 045
మీ సూచనలు మరియు అభిప్రాయాలను Services@greenranks.com ఇమెయిల్ ద్వారా తెలుపవచ్చు.
**గ్రీన్ రన్క్స్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్**
www.greenranks.com

(c) eenadu

# పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

## మాజీ ఉపరాష్ట్రపతికి స్వాగతం

భారత మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం ఉదయం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం పుష్పగుచ్ఛం అందజేసి మన స్వాగతం పలికారు. అనంతరం జగదీప్ ధన్‌ఖడ్ రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు. - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

## ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

వేంకటేశ్వరస్వామి ఆలయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా హనుమాన్‌జంక్షన్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాల నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేందుకు వీలుగా సన్నాహాలు చేశారు. ఆలయ ధర్మకర్తలు కాకాని వెంకటేశ్వరరావు, అరుణ, తవ్వా పూర్ణచంద్రరావు, ఈవో కిశోర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ అవాంతరాలు రాకుండా పోలీసులతో సమీక్షించారు. ముక్కోటిని పురస్కరించుకుని స్వామివారికి ధర్మకర్త కుటుంబం తరఫున కాసు బంగారు ఆభరణ పుష్పాలను సమర్పించనున్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

మచిలీపట్నం(గొడుగుపేట): ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని డీవైఈవో శేఖర్‌సింగ్ అన్నారు. బందరు డివిజన్ లోని పాఠశాలల రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు సోమవారం నగరంలోని రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు చేరేలా చూడాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం.. ✦ కానూరు పంటకాలువ రోడ్డులో కొన్ని రోజులుగా చెత్త తీయటం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. ఈవిషయంపై న్యూస్‌టుడే కమిషనర్ షేక్ నజీర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన సిబ్బందిని పంపి చెత్త తీయించి సమస్య పరిష్కరించారు. ✦ యనమలకుదురు శివసాయిపురి నగర్‌లో కొన్ని రోజులుగా కాల్వల్లో పూడిక తీయక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. ఈవిషయం న్యూస్‌టుడే కమిషనర్ షేక్‌నజీర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన సిబ్బందిని పంపి పూడిక తీయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, కానూరు, యనమలకుదురు

## మైనరూ.. తగ్గాలి మీ జోరు!

☛ నాలుగు రోజుల కిందట హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ వృద్ధుడు రోడ్డు దాటుతుండగా, అమిత వేగంతో దూసుకొచ్చిన ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన వాహనం నడుపుతుంది, వెనక ఉంది బాలలే.

☛ జంక్షన్ బైపాస్ సర్వీసు రోడ్డులో మూడు రోజుల కిందట ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముగ్గురు వ్యక్తులు ఎటు వెళుతున్నారో తెలియని రీతిలో ఎదురుగా వస్తున్న ఓ కారు, రెండు ద్విచక్ర వాహనాలపైకి దూసుకొచ్చారు. తీవ్ర భయాందోళనకు గురైన వాహనదారులు ఒక్కసారిగా తమ వాహనాలను నిలిపేయడంతో ప్రమాదం తప్పింది.

☛ గన్నవరం సెయింట్ జాన్స్ పాఠశాల రోడ్డులో బాలురు నిరంతరాయంగా మితిమీరిన వేగంతో, భయం గొలిపేలా హారన్లు కొడుతూ, అకస్మాత్తుగా బ్రేకులు వేస్తూ దుందుడుకు విన్యాసాలు చేస్తున్నారు. రద్దీ సమయంలోనూ వీరు పేట్రేగిపోతున్నారు.

న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

వాహనం నడపటంలో నైపుణ్యం, అర్హతలు, నిబంధనలపై అవగాహన లేకుండా బాలురు ద్విచక్ర వాహనాలపై దూసుకుపోవడం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో నిత్యం నెలకొనే ట్రాఫిక్ రద్దీకి తోడు, వీరి జోరుతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కాలినడకన వెళుతున్న వారిని దాదాపు ఢీకొట్టినంత పనిచేస్తున్నారు. తప్పు తమదే అయినా, ఎదుటివారే తప్పు చేసినట్లుగా దూషించడం, గేలి చేయడం, గొడవలకు దిగడం వంటి వీరి పోకడతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. అంతర్గత రహదారుల్లో సైతం కొందరు ఇదే దూకుడు కొనసాగిస్తున్నారు.

జాతీయ రహదారిపై వాహనం నడుపుతున్న బాలుడు, వెనక మరో ఇద్దరు

కొరవడిన నిఘా: నిబంధనలను ఉల్లంఘించి రాకపోకలు సాగించే వాహనదార్లపై తరచూగా చర్యలు తీసుకోకపోవడంతో వీరిలో భయం లేకుండా పోయిందన్న వాదన వినిపిస్తోంది. సిబ్బంది కొరతను పోలీసులు సాకుగా చూపుతున్నా, ప్రజా భద్రత విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదంటున్నారు. మైనర్లు, లైసెన్సులు లేనివారు నడిపే వాహనాలను స్వాధీనం చేసుకుని, కఠినంగా వ్యవహరిస్తేనే ఈ ధోరణికి అడ్డుకట్ట పడుతుందని పలువురు సూచిస్తున్నారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ధోరణిని ఉపేక్షించబోమని, మైనర్లు వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేసి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌కు ఇస్తామన్నారు.

## పెరగనున్న రబీ వరి విస్తీర్ణం

కంకిపాడు, ఉయ్యూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: పెనమలూరు నియోజకవర్గంలో రబీ సీజన్‌లో వరి విస్తీర్ణం గత ఏడాదితో పోల్చితే 20 శాతం పెరగనుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అధికారిక అనుమతి లేకపోయినా భూగర్భజలాలు అందుబాటులో ఉండడంతో బోర్ల ద్వారా సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే 40 శాతం మంది రైతులు నారుమళ్లు పోశారని చెబుతున్నారు. రబీ వరికి యూరియా, డీఏపీ ఎరువుల అవసరం మరింత ఉంటుంది. కీలక సమయంలో కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలో భాగంగా అవసరమైన ఎరువుల పరిమాణంపై మండల అధికారులు నివేదిక పంపారు. అపరాలు, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలకు అనుకూలం కాని చోట, లోతట్టు భూముల్లో దాళ్వా సాగు అనివార్యం అవుతోంది. దీంతోపాటు ధాన్యం ధర అనుకూలతను దృష్టిలో ఉంచుకుని దాళ్వాకు మొగ్గు చూపుతున్నారు.

ఉప్పులూరు పరిధిలో దాళ్వా వరి నారుమడి

## భూవివాదాల పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: భూవివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గన్నవరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన క్లినిక్‌ను ఆర్డీవో ప్రారంభించారు. అనంతరం రెవెన్యూ క్లినిక్‌ల ప్రాధాన్యం, ఉద్దేశాలను ప్రజలకు వివరించారు పలు అర్జీలను స్వీకరించిన ఆర్డీవో.. వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటశివయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసేందుకు వీలుగా వచ్చే నెల 2 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.మురళీకృష్ణ తెలిపారు. రీసర్వే పూర్తయిన 17 గ్రామాల్లో 7,185 మంది రైతులకు కొత్త పుస్తకాలు జారీ అయినట్లు చెప్పారు. ఈ నెల 2న బిళ్లనపల్లి, అంపాపురం, 3న బాపులపాడు, శేరీనరసన్నపాలెం, 5న బండారుగూడెం, రంగన్నగూడెం, దంటగుంట్ల, 6న కొత్తపల్లి, రామన్నగూడెం, సింగన్నగూడెం, 7న ఓగిరాల, కురిపిరాల, కొయ్యూరు, 8న బొమ్ములూరు, కండ్రిక, 9న చిరివాడ, శోభనాద్రిపురం గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు.

కంకిపాడు గ్రామీణం: మండల ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని తహసీల్దారు భావన్నారాయణ అన్నారు. సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యలపై అర్జీల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 22ఏ సమస్యలు, ఆర్‌ఓఆర్, పట్టాదారు పాస్‌పుస్తకాలు, రీసర్వే, ఇతర రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, మండల సర్వేయర్ రాంబాబు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు అరుణ్‌బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గన్నవరంలో అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

## చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

సదస్సులో పాల్గొన్న అధికారులు, డ్వాక్రా మహిళలు

కంకిపాడు, న్యూస్‌టుడే: సంపూర్ణ ఆరోగ్యానికి చౌకగా లభించే చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని కంకిపాడు మండల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. ప్రధానమంత్రి కృషి వికాస్‌లో భాగంగా సోమవారం కంకిపాడులో డ్వాక్రా మహిళలకు చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పెరడు, మిద్దె తోటలు, పుట్ట గొడుగుల పెంపకంతో ప్రయోజనాలు తెలియజేశారు. వివిధ రకాల ఆహార పదార్థాలను చేసి చూపారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ కె.జ్యోతిరమణి, ఏడీఏ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారులు ఉషారాణి, పద్మజ, విస్తరణాధికారులు భవాని, వాణి, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్ల

తిరునాళ్ల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో సత్యకుమార్, రెక్టర్ జోసఫ్, వివిధశాఖల అధికారులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ క్యాథలిక్ పుణ్యక్షేత్రమైన ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి బ్రదర్ జోసఫ్‌తంబి వర్ధంతి మహోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయనున్నట్లు రెక్టర్ ఫాదర్ పి.జోసఫ్ అన్నారు. ఏటా జనవరి 13, 14, 15 తేదీల్లో నిర్వహించే తిరునాళ్లకు సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్తు, వైద్య ఆరోగ్య, పోలీసు అధికారుల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. పరిసరాల్లో రోడ్లపై ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు అందుబాటుతోపాటు ప్రజలు భౌతికదూరం పాటించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. పార్కింగ్ ఇతర వసతులను పోలీసుశాఖ సమన్వయంతో ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో సత్యకుమార్, ఎస్సై మూర్తి, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నృత్య రూపకం

మంతెన (కంకిపాడు), న్యూస్‌టుడే: 'స్వచ్ఛ సుందర మంతెన' ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని 'సీనియర్ సిటిజన్స్ సంక్షేమ' భవనంలో 'మానవత' సంఘం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో గ్రామానికి చెందిన బాలికలు పాల్గొన్నారని సంఘ వ్యవస్థాపక ప్రతినిధులు పెండ్యాల రామారావు, విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర', వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్‌లతో ప్రమాదం, నియంత్రణ ఇతివృత్తాలతో కూడిన లఘుప్రదర్శన ఇచ్చినట్లు పేర్కొన్నారు. సంఘ ప్రతినిధులు దావులూరి సాంబశివరావు, టి.నరసింహారావు తదితరులు బాలబాలికలను అభినందించారు.

నృత్య ప్రదర్శనలో మంతెన బాలికలు

## జీతాల్లో కోతలు విధిస్తే ఆందోళన

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 104 సేవలను నిర్వహించే భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం తీరుకు నిరసనగా ఆ సంఘ నాయకులు స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. గత ఏడు నెలలుగా కాంట్రాక్ట్ దక్కించుకున్న సదరు సంస్థ ఉద్యోగులను దోపిడీ చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. ప్రధానంగా ఉద్యోగుల జీతాల్లో కోతలు విధించిందన్నారు. క్యాజువల్ లీవ్‌లను రద్దుచేసిందన్నారు. పాత కాంట్రాక్టు సంస్థ చెల్లించిన ఆఖరి నెల జీతం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు వి.ఆర్.ఫణికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్ల అవస్థలకు తెర

ఈడుపుగల్లు- ఉప్పులూరు రహదారి అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. సుమారు నాలుగు కిలోమీటర్ల విస్తరణ, అభివృద్ధికి రూ.4.20 కోట్లు కేటాయించడం విదితమే. జాతీయ రహదారి- పంచాయతీ కార్యాలయం మధ్య శిథిలమైన రెండు కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, విద్యా సంస్థల క్యాంపస్‌లు విస్తరించడంతోపాటు గన్నవరం విమానాశ్రయానికి చేరడానికి ఈ మార్గాన్ని వాహనదారులు అధికంగా ఉపయోగించుకుంటున్నారు. పదేళ్లుగా తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధుల కోసం ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించారు. పనుల నాణ్యత, నిర్ణీత సమయంలో పూర్తయ్యేవిధంగా అధికారులు పర్యవేక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఈడుపుగల్లు (కంకిపాడు)

ఈడుపుగల్లు- ఉప్పులూరు రహదారిపై కల్వర్టు నిర్మాణ పనుల్లో కార్మికులు

## సమస్య తీవ్రం.. చర్యలు శూన్యం

రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, న్యూస్‌టుడే

రామవరప్పాడు నుంచి నిడమానూరు వరకు జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలతో ఇటు వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా సర్వీస్ ఆటోలతో ఎక్కువగా ట్రాఫిక్ సమస్య వస్తోంది. సిటీ బస్సులు తక్కువగా ఉండడంతో రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, ప్రభుత్వాసుపత్రి, బెంజ్ సర్కిల్ వైపు వెళ్లే వారు ఎక్కువగా ఆటోలను ఆశ్రయిస్తుంటారు. దీంతో నిత్యం అయిదు వేల ఆటోలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. రామవరప్పాడు రింగ్, రామవరప్పాడు రైల్వే స్టేషన్ వంతెన, ప్రసాదంపాడు సెంటర్, ఎనికేపాడు ఎస్‌ఆర్‌కే కళాశాల ఎదుట, నిడమానూరు రామానగర్ సెంటర్ వద్ద ఆటోలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు ఆటోలు నడిపే వారు ప్రయాణికులను ఎక్కించేకునేందుకు కనీసం సైడ్ సిగ్నల్ కూడా వేయకుండా ఒక్కసారిగా రోడ్డు మధ్యలో నుంచి ఎడమ చేతి వైపునున్న ఫుట్‌పాత్ వైపు నడుపుతున్నారు. దీంతో వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు సమస్యపై దృష్టి సారించి ఆటో డ్రైవర్లకు తరచూ కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు నిత్యం పెట్రోలింగ్ చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రసాదంపాడు సెంటర్‌లో రోడ్డుపై నిలిపిన ఆటో

## బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ప్రస్తుత ఆధునిక సమాజంలోనూ బాల్య వివాహాలు జరుగుతుండటం విచారకరమని, వీటిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతిశిరీష పేర్కొన్నారు. సోమవారం పెరికీడు చింతా సీతయ్య జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే 112, 181 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. ప్రిన్సిపల్ కృపావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు రజిని, పుష్ప, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ శాంతిశిరీష

## చురుగ్గా ప్రహరీ నిర్మాణ పనులు

ఈడుపుగల్లు (కంకిపాడు), న్యూస్‌టుడే : జిల్లాలోని వివిధ ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థులు ఈడుపుగల్లులోని సాంఘిక సంక్షేమ గృహంలో వసతి పొందుతున్నారు. ప్రధాన భవనం, మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా తదితర సౌకర్యాల మెరుగుకు గత ఐదేళ్లుగా నిధులు కేటాయించలేదు. వసతుల లేమితో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. దీనిపై స్థానిక అధికారుల నివేదిక మేరకు జాతీయ రహదారివైపు ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించగా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సాంఘిక సంక్షేమ బోర్డ్ ఛైర్మన్ బాలకోటయ్య ఆదివారం ఈ వసతి గృహాన్ని సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన 'ముస్తాబు' పథకం కింద ఈ గృహానికి కొత్తరూపు తీసుకొస్తానని ఆయన హామీ ఇవ్వడంతో పూర్వ వైభవం వస్తుందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కోడికత్తులు స్వాధీనం

నున్న(అంబాపురం), న్యూస్‌టుడే: విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా జరిగే కోడిపందేల బరులలో విక్రయించేందుకు సిద్ధం చేసిన 520 కోడి కత్తులను విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి సోమవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన శనగశెట్టి విజయబాబు అలియాస్ పండు(62) 520 కోడికత్తులతో పాటు సాన పట్టే రెండు యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుకు కొత్తపేట పోలీసులకు అప్పగించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ కుమార్, మరో టాస్క్‌ఫోర్స్ సీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. కొత్తపేట సెక్టార్ ఎస్.ఐ. హరిప్రసాద్‌కు అప్పగించారు.

అంబాపురం గ్రామంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న కోడికత్తులు

## అభివృద్ధి పనులకు శ్రీకారం

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరులో రూ.కోటి విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సోమవారం ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన ట్యాంకును ప్రారంభించగా, రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న వెల్‌నెస్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ ఏడాదిన్నరలోనే నియోజకవర్గంలో రూ.కోట్లాది వ్యయంతో రహదార్లు, డ్రైన్లు, ప్రజోపకరమైన ప్రభుత్వ భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి లింగాల భాస్కర్, మాజీ సర్పంచి ధనకోటేశ్వరరావు, ఎంపీడీవో ప్రణవి, మండల వైద్యాధికారి శ్రీనివాస్, తెదేపా నేతలు ఆనంద్, ప్రభాకరరావు, సుబ్బారావు, శ్రీనివాస్, భాస్కర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడేప్రసాద్

### తెదేపా నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

తెదేపా నేతలు అబ్దుల్‌గౌస్, గొల్లపూడి ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన తెలుగుదేశం పార్టీ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగ్గా తెదేపా నేతలు సలీం, ఇర్ఫాన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి సోమవారం కంకిపాడుకు చెందిన మల్లెల సూర్యనారాయణ రూ.1,11,111 విరాళం అందజేశారు. దాత కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ జగదీష్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న జగదీష్

ఆలయ నిర్మాణానికి రూ.25 వేలు.. హనుమాన్‌జంక్షన్: బాపులపాడు ధర్మకోనేరు చెరువు వద్ద నిర్మిస్తున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయానికి ఉపసర్పంచి దుట్టా శివన్నారాయణ రూ.25 వేలు విరాళంగా అందజేశారు. సోమవారం ఆలయ నిర్మాణకర్తలు గూడపాటి రత్నశేఖర్, కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్‌కు ఈ మొత్తాన్ని అందించారు.

విరాళం అందిస్తున్న శివన్నారాయణ

## కార్యకర్తల బాగోగులే ముఖ్యం

ఈడుపుగల్లు తెదేపా బూత్‌కన్వీనర్‌ను పరామర్శిస్తున్న కొనకళ్ల నారాయణ, తదితరులు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తల బాగోగులే పార్టీకి ముఖ్యమని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. సోమవారం ఈడుపుగల్లు గ్రామంలో బూత్ కన్వీనర్ షేక్.శ్రీనును పరామర్శించిన ఆయన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. స్థానికంగా ఉన్న సమస్యలను, పార్టీ పరిస్థితిని ఆరాతీశారు. పార్టీ బలోపేతానికి ఎల్లప్పుడూ కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు సీతారామయ్య, కొండవీటి శివయ్య, షేక్.సలాం, సుభాన్‌వలి, వన్నూర్ తదితరులు పాల్గొన్నారు.

## దోమల చక్రం అంటుకొని వృద్ధురాలి మృతి

పెనమలూరు: దోమల చక్రం అంటుకొని ఒళ్లు కాలిన వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీదున్నీసా(87) కానూరు సనత్‌నగర్ నివాసి. కొద్ది రోజుల క్రితం ఈమె రోడ్డు ప్రమాదంలో గాయపడగా అప్పటి నుంచి కుమార్తె నాగుల్‌బేగ్ ఇంట్లో ఉంటున్నారు. ఈ నెల 27వ తేదీ రాత్రి నాగుల్‌బేగ్ తల్లి నిద్రించే చోట దోమల చక్రం వెలిగించి పచారీ దుకాణానికి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి దోమల చక్రం అంటుకొని తల్లి ఒళ్లుకాలింది. వెంటనే అమీదున్నీసాను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు.

## దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.26 లక్షల ఆస్తి నష్టం

గవర్నర్‌పేట: హనుమాన్‌పేట అచ్యుతరామయ్య వీధిలోని ఒక దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించి రూ.26 లక్షల విలువైన సరకు దగ్ధమైనట్లు గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కానూరుకు చెందిన మాచర్ల కిరణ్‌బాబు హనుమాన్‌పేటలో ప్లాస్టిక్, రెగ్జిన్, లెనిన్ వ్యాపారం చేస్తుంటారు. ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో దుకాణం వద్ద కూలీగా పనిచేసే శ్రీనివాస్.. ఆయనకు ఫోన్ చేశారు. దుకాణం నుంచి మంటలు వస్తున్నాయని చెప్పడంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. అప్పటికే దుకాణం మొత్తం కాలిపోయింది. రూ.26 లక్షల విలువైన సరకు కాలిపోయినట్లు గవర్నర్‌పేట పోలీసులకు ఈ నెల 27న ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మసీదుకు నిధులు మంజూరు చేయరూ..

ఉయ్యూరుగ్రామీణం, న్యూస్‌టుడే : ఉయ్యూరు మండలం పెద ఓగిరాలలో మసీదు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, పోతురెడ్డి, మస్లిం, మైనార్టీ ప్రముఖులు అబ్దుల్ కాలేషా, షేక్ అహ్మద్‌లు సోమవారం మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్‌ను కోరారు. నగరంలోని కార్యాలయంలో ఉన్న మంత్రిని కలిసి ఈమేరకు వినతి పత్రాన్ని అందజేయగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రాష్ట్ర మంత్రి ఫరూక్‌తో దండమూడి చౌదరి, పోతురెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాయకులు

## చర్చిలో ఎంపీ శివనాథ్ ప్రార్థనలు

పటమట, న్యూస్‌టుడే: బెంజ్ సర్కిల్ సమీపంలోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చిలో ఎంపీ కేశినేని శివనాథ్ సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బిషప్ జోసెఫ్ రాజారావు, ఫాదర్ మువ్వల ప్రసాద్ ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. ప్రజలకు మేలు చేసే ప్రతి కార్యక్రమానికి తన వంతు మద్దతు ఉంటుందని ఎంపీ స్పష్టం చేశారు.

## ఎంతో మంది విద్యార్థుల్లో విద్యా వెలుగులు

కలవపాముల (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే : కలవపాముల జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కలపాల సరోజిని ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థులు(1978-79) ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభ నిర్వహించి ఆమెను సత్కరించారు. ఎందరికో విద్యా బుద్ధులు నేర్పించి వారి ఉన్నతికి కారణమైన సరోజిని సేవలను పలువురు కొనియాడారు. గ్రామ సర్పంచి బాలస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదాకర్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సరోజిని దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

## అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

ఉయ్యూరుగ్రామీణం: గండిగుంట పంచాయతీ పరిధిలో కోట్ల రూపాయలు విలువ చేసే కామన్ సైట్ల అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పంచాయతీ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ జి.సాయిప్రసాద్‌కు ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వివిధ సర్వేనంబర్లలోని దాదాపు 4.6 ఎకరాలను నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయించారని, వీటిని రిజిస్ట్రేషన్ చేసిన అప్పటి సబ్‌రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకుని రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని, భూములను తిరిగి గ్రామ పంచాయతీకి స్వాధీనం చేయించాలని కోరినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

# గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

మాట్లాడుతున్న న్యాయవాది శైలజ

## బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

పామర్రు, న్యూస్‌టుడే: బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని న్యాయవాది శైలజ అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాలపై నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు నేరమని, ఆ విధంగా ఎవరైనా చేస్తే శిక్ష తప్పదు అని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో, చల్లపల్లి రెడ్‌క్రాస్ సబ్‌బ్రాంచ్ పర్యవేక్షణలో సోమవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ హనుమంతరావు, ఆర్.వి. కృష్ణమోహన్, రెడ్‌క్రాస్ సబ్‌బ్రాంచ్ చైర్మన్ లీలాప్రసాద్, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, పి.శంకర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, తదితరులు

## ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

పామర్రు: పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. సోమవారం స్థానిక పీ-4 కార్యాలయంలో మొవ్వ మండలం దిసుమర్తిలోని కె.ఉషారాణి వైద్య ఖర్చుల కోసం రూ.80 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉషారాణి కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

అయ్యంకి(కూచిపూడి): మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పర్యటించి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. తెదేపా సీనియర్ నాయకుడు నన్నపనేని వీరేంద్ర, మాజీ సర్పంచి తాతా వీరయ్యప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై 'రెవెన్యూ క్లినిక్' దృష్టి

చల్లపల్లి: భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. తహసీల్దార్ డి.వనజాక్షి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సీలింగ్ భూమి పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలని, రీసర్వేలో తప్పులు సరిచేయాలని అర్జీలను అందజేశారు. డీటీ శ్రీలత, ఆర్ఐ మంటసాల కృష్ణమోహన్, రీసర్వే డీటీ నిర్మల పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో భూ సమస్యలపై వినతులు అందజేశారు.

మంటాడ(పమిడిముక్కల), న్యూస్‌టుడే: రెవెన్యూ, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఉయ్యూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో బి.ఎస్.హేలాషారోన్ తెలిపారు. డివిజన్ పరిధిలోని రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కోడూరు, న్యూస్‌టుడే: కోడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్‌ను ప్రారంభించినట్లు తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి తెలిపారు. ప్రజలు రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీలు సమర్పించాలని కోరారు.

నాగాయలంక: భూ సమస్యలపై రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్ కోరారు. సోమవారం వివిధ సమస్యలపై రైతుల నుంచి పత్రాలను స్వీకరించారు. డీటీ మండలి కేశవి, వీఆర్వో జీవీఎస్ సాయిబాబు పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్య శిబిరం

దక్షిణచిరువోలులంక (అవనిగడ్డ గ్రామీణం): రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని దక్షిణచిరువోలులంక, నదీ గర్భగ్రామాల్లో సోమవారం జనసేన నేత మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. పశువుల్లో గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ, కృత్రిమ గర్భధారణ వంటి వైద్యసేవలను అందించారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎన్.చిన నరసింహులు, ఏడీఏ డాక్టర్ బి.సాంబశివరావు, మండల పశువైద్యులు డాక్టర్లు షఫీ, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రకం.. శ్రీకాకుళ క్షేత్రం

### ముక్కోటి ఏకాదశి 'ఉత్తర ద్వార దర్శనం' ఏర్పాట్లు

శ్రీకాకుళం(ఘంటసాల), న్యూస్‌టుడే

ఆంధ్ర మహా విష్ణువు, ఆంధ్ర వల్లభుడు, ఆంధ్ర నాయకుడు.. ఇలా ఎన్నో పేర్లతో భక్తుల పూజలను అందుకుంటున్నారు శ్రీకాకుళేశ్వర స్వామి. జిల్లాలోని ఈ క్షేత్రానికి చారిత్రకంగా, పౌరాణికంగా ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆంధ్రుల తొలి రాజధాని శ్రీకాకుళంలో ఆవిర్భవించిన శ్రీకాకుళేశ్వరుడు భక్తుల కోర్కెలు తీర్చే వల్లభుడిగా ఖ్యాతి చెందారు. 108 పుణ్యక్షేత్రాలలో శ్రీకాకుళాన్ని 57వ క్షేత్రంగా పేర్కొంటారు. ఇక్కడి స్వామి స్వయంభువుగా వెలసి పాపాలను హరిస్తున్నట్లు భక్తులు నమ్ముతారు. బ్రహ్మకు ఆకుళమైనందుకు కాకుళం అని పేరు వచ్చిందని శ్రీహరి అక్కడే ప్రతిష్ఠితుడైనందుకు శ్రీకాకుళేశ్వరుడిగా కీర్తినొందారని పురాణ కథనం.

విద్యుద్దీపాలంకరణలతో శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయం

**ఆముక్తమాల్యదకు శ్రీకారం ఇక్కడే:** విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు కళింగ దేశానికి దండెత్తడానికి ముందుగా క్రీ.శ. 1518లో శ్రీకాకుళం విచ్చేసి శ్రీకాకుళేశ్వరుని దర్శించారని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆలయ ప్రాంగణంలో బస చేసిన రాయలుకు ఆంధ్రమహా విష్ణువు కలలో కన్పించి.. ఆంధ్ర మహాకావ్యం రచించమని ఆదేశించినట్లు తనుకన్న కలకు ప్రతిగా అక్కడే మండపంలో ఆముక్తమాల్యద గ్రంథ రచనను ప్రారంభించారట. దీంతో ఈ మండపానికి 'ఆముక్తమాల్యద మండపం' అని పేరు వచ్చినట్లు తెలుస్తోంది. ముక్కోటి ఏకాదశి(వైకుంఠ ఏకాదశి)నాడు స్వామి అమ్మవార్ల 'ఉత్తర ద్వార దర్శనం' చేసుకుంటే సర్వపాప హరణం జరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు విచ్చేయడం ప్రతి ఏటా ఆనవాయితీగా వస్తోంది.

వైకుంఠ ఏకాదశి నాడు శ్రీకాకుళంలోని రాజ్యలక్ష్మి సమేత శ్రీకాకుళేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉప కమిషనర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు పేర్కొన్నారు. ఈనెల 30 తెల్లవారుజామున 4 గంటలకు స్వామి అమ్మవార్లకు సహస్ర నామార్చన పూజలు, ఉదయం 10 గంటలకు దేవతామూర్తులకు ఆస్థాన పూజా కార్యక్రమం, ఉదయం 11.16 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్తరద్వార దర్శనం, వేలాది మందిచే గరుడ వాహనంపై దేవతామూర్తుల గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు తీర్థప్రసాద వినియోగం, రాత్రి 8 గంటలకు రాజాధివాసంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

పెదపారుపూడిలో..

అవనిగడ్డలో..

# ప్రతిభ వెలికితీసేందుకు పోటీలు దోహదం

పెదపారుపూడి: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని పెదపారుపూడి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.నాగమల్లేశ్వరరావు అన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా సోమవారం ఆ పాఠశాలలోని విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. ఇందులో టి.జీవనిసుచి, డి.నవహారిక, పి.గాయత్రి(9వ తరగతి) విద్యార్థులు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి హెచ్ఎం నాగమల్లేశ్వరరావు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: వివిధ రకాలైన ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల మేధాశక్తికి పదును పెడతాయని ఏవీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.గంగాధర్‌రావు చెప్పారు. సోమవారం ఈనాడు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు ప్రారంభించారు. పోటీలో 68 మంది పాల్గొనగా ధనుంజయ ప్రథమ, విజయసాగర్ ద్వితీయ, కోమలి తృతీయ స్థానాలు సాధించారు.

గుడివాడ, న్యూస్‌టుడే: విద్యతో సమాజంలోని ఆర్థిక అసమానతలు దూరం చేయవచ్చని విద్యా వికాస్ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల డైరెక్టర్ సాంబశివరావు పేర్కొన్నారు. స్థానిక టీచర్స్ కాలనీలోని పాఠశాలలో ఈనాడు ప్రతిభా పాటవ పోటీలలో భాగంగా క్విజ్‌ను సోమవారం నిర్వహించారు. విజేతలుగా పి.ప్రణీత్ చంద్ర ప్రథమ, జి.రేష్మ ద్వితీయ, ఎస్.లక్ష్మీ సంజనశ్రీ తృతీయ స్థానాలను సాధించారు. వారికి డైరెక్టర్, ప్రధానోపాధ్యాయుడు నాగ మల్లేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆశీర్వాదం, ఇన్‌ఛార్జిలు డి.విజయలక్ష్మీ, సీహెచ్. ఉమాదేవి బహుమతులు అందించారు.

గుడివాడలో..

సబ్జెక్టు ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే మండలి, డీఈవో యు.వి.సుబ్బారావు

# విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

చల్లపల్లి, న్యూస్‌టుడే: ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడటం ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రతి జడ్పీ పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. గత ఏడాది అవనిగడ్డ నియోజకవర్గంలో 92శాతం ఉత్తీర్ణులయారని, ఈ దఫా నూరు శాతం ఉత్తీర్ణత కోసం సబ్జెక్టు నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో కృష్ణా జిల్లాను పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో-5లో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సబ్జెక్టు ఉపాధ్యాయులను సన్మానించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, ముమ్మనేని నాని, ఎంఈఓలు కందుల సుజాత, పి.వెంకటేశ్వరరావు, ఎన్.శివశంకర్, మోమిన్, జి.ఎన్.బి.గోపాల్, సనకా శ్రీక్రాంత్, ఆలా వెంకటరమణ, ఈవో పి.వి.మాధవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## వీవీ ఫార్మసీ కళాశాలలో సదస్సు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక వీవీ ఫార్మసీ కళాశాలలో సోమవారం 'ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఫర్ లిబిడోమిస్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. యూఎస్ఏ డెట్రాయిట్ వేన్ స్టేట్ యూనివర్శిటీకి చెందిన రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ పి.గోవిందయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆధునిక సాంకేతికత ద్వారా ప్రస్తుతం ఈ లిబిడోమిస్‌కు సంబంధించి ఫ్యాటీ యాసిడ్ ప్రొఫైలింగ్‌పై పలు పరిశోధనలు జరుగుతున్నట్లు వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, కోఆర్డినేటర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## హైస్కూల్‌కు కుర్చీల అందజేత

పెంజెండ్ర(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని పెంజెండ్ర హైస్కూల్‌కు సోమవారం పూర్వ విద్యార్థి బొప్పన కృష్ణప్రసాద్ రూ.10 వేల విలువైన కుర్చీలను వితరణగా అందజేసినట్లు హెచ్ఎం మహాలక్ష్మి తెలిపారు.

# అభియోగాలపై డీవైఈవో విచారణ

కోడూరు, న్యూస్‌టుడే: కోడూరు మండల విద్యాశాఖాధికారి-1 టీవీఎం.రామదాసుపై పీఆర్టీయూ జిల్లా శాఖ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావుకు ఇచ్చిన అభియోగాలపై సోమవారం కోడూరులోని ఎమ్మార్సీ భవనంలో ఉయ్యూరు డీవైఈవో ఐ.పద్మారాణి విచారణ జరిపారు. మండలంలో బాలోత్సవం నిర్వహణలో అవకతవకలు, ఎన్ఎంఎంఎస్ పరీక్షల కోసం విద్యార్థులకు నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక తరగతుల నిర్వహణ, పాఠశాలల విలీనం సమయంలో అవకతవకలు వంటి ఆరోపణల నేపథ్యంలో అవనిగడ్డ ఎంఈవో ఎన్.శివశంకర్, తోట్లవల్లూరు ఎంఈవో బి.సురేష్‌లతో కూడిన బృందం ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఎంఈవో రామదాసు నుంచి కూడా వివరణ తీసుకున్నారు. డీపీఆర్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సంఘాలలో ఉన్న అత్యధిక ఉపాధ్యాయులు ఎంఈవో-1కి మద్దతు పలికారు. ఆరోపణలు చేసిన పీఆర్టీయూ జిల్లా నాయకులు ఆధారాలు సమర్పించలేక విచారణ సరిగా జరగలేదంటూ బయటకు వెళ్లిపోయారు. రామదాసుపై ఆరోపణలు చేస్తున్న పీఆర్టీయూ జిల్లా నాయకుడు అవనిగడ్డ టీచర్స్ కోపరేటివ్ సొసైటీ నుంచి లక్షల్లో రుణం పొంది తిరిగి చెల్లించడం లేదంటూ డీపీఆర్టీయూ జిల్లా నాయకులు జీవీఎస్ పెరుమాళ్లు డీవైఈవోకి వినతి పత్రాన్ని అందించారు.

డీవైఈవో పద్మారాణికి సమాధానాలను అందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

## బీసీ ఉద్యోగుల మహాసభ విజయవంతం చేయాలి

గుడివాడ: గుడివాడ నియోజకవర్గంలోని బీసీలు జనవరి 4వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న అమరావతి బీసీ ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని గుడివాడ బీసీ ఐక్య వేదిక నేతలు పిలుపు నిచ్చారు. సంఘ కార్యాలయంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ ఏపీ బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘానికి గుడివాడ నియోజకవర్గ బీసీ ఐక్య వేదిక పూర్తి మద్దతును ఇస్తుందన్నారు. ఈ సభకు జనవరి 4వ తేదీ ఉదయం 8 గంటలకు గుడివాడలోని పులె విగ్రహం వద్ద నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక నాయకులు ఆర్.మల్లేశ్వరరావు, గులిపల్లి ప్రభాకర్, అగస్తి ఆదివిష్ణువు, శివాజీ, కె.ఎన్.రాజా, దుర్గారావు, సోమశేఖర్, ఏ.పాండు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నేతలు

## గుంతలు... అవస్థలు

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: ఫ్లైఓవర్ నిర్మాణ పనుల వల్ల ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా గుడివాడ ఐఎంఏ హాలు రహదారికి వాహనాల తాకిడి అధికంగా పెరిగింది. అందులో భాగంగా సోమవారం ఎరువుల లోడ్‌తో ప్రయాణిస్తున్న లారీ అదుపుతప్పి గుంతలో దిగబడిపోయింది. గంటల తరబడి గుంతలోనే లారీ ఉండడంతో ఇతర వాహనదారులు విసిగిపోయారు. ఇటీవలే మంచినీటి పైపులైన్ పనుల నిమిత్తం మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది రహదారిని తవ్వి సరిగా పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. 15 రోజుల కిందట ఆర్టీసీ బస్సు ఇదే రహదారిలో గుంతలో పడింది. అధికారులు స్పందించి గుంతలను పూడ్చించాలని, తవ్విన చోట చదును చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## నడవని ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికులకు ఇక్కట్లు

మచిలీపట్నం నుంచి కాజ, కోసూరు మీదుగా మొవ్వకు వచ్చే ఆర్టీసీ బస్సులు నిలిపేయడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బందరు ఆర్టీసీ డ్రైవర్‌పై ఇరువురు యువకులు దాడి చేసిన ఘటనలో బస్సులు ఆపారు. ఇది జరిగి పది రోజులైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై దృష్టి సారించలేదు. దాంతో పాఠశాల, కళాశాలలకు వచ్చే విద్యార్థులతో పాటు ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మొవ్వ(కూచిపూడి)

## సమష్టి కృషితోనే సత్ఫలితాలు సాధ్యం

కృష్ణాపురం(పమిడిముక్కల): సమష్టి కృషితోనే సత్ఫలితాలు సాధించగలమని, గ్రామాల్లోని తెదేపా నాయకులు, కార్యకర్తలు విభేదాలు మరచి ఏకతాటి మీద నడవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమారరాజా కోరారు. కృష్ణాపురంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో స్థానికుడు, తెదేపా నాయకుడు మోటూరు వెంకట సుబ్బయ్య పార్టీకి అందిస్తున్న సేవలను ప్రశంసించారు. రామగోపాల్, వెంకటేశ్వరరావు, జయరామ్ పాల్గొన్నారు.

## పాస్‌పోర్ట్ పోయినది

కృష్ణాజిల్లా, పామర్రు మండలం, కసుమూరు గ్రామ కాపురస్థుడనైన **కోనేరు లాలా లజపతిరాయ్, తండ్రి: కోనేరు నారాయణరావు** అను నేను తెలియజేయునది ఏమనగా... ది.19-12-2025 తేదీన పామర్రు పట్టణంలోని శివరామ సెంటర్ వద్ద బైకు పై వెళ్తుండగా **పాస్‌పోర్ట్ నెం. V040425** రు కలిగిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ దిగువ నెంబరుకు తెలుపగలరు.

✆ 99636 74706

## పోయినవి

గుడివాడ రాజేంద్రనగర్‌లో ఉంటున్న వీరమాచనేని పూర్ణచంద్రరావు S/o లేటు సత్యనారాయణకు చెందిన స్థలం దస్తావేజులు నెం.1968/2002 (విశాఖపట్నం, మధురవాడ సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్టర్ అయినవి) ది.20-12-2025వ తేదీన ఇంటి దగ్గర నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా దారి మధ్యలో పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు: **వీరమాచనేని పూర్ణచంద్రరావు**
S/o లేటు సత్యనారాయణ
రాజేంద్రనగర్ గుడివాడ, సెల్: **93953 63489**

## 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

అవనిగడ్డ: 104 అంబులెన్స్ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఆరు మండలాల 104 సిబ్బంది ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. గతంలో ఇచ్చిన హామీ లను కూడా ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వారు కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్ల వినయ్, గుంటూరు నాంచారయ్య, పుట్టి స్వాతి, బూరేపల్లి శ్యామ్‌బాబు, దాసి పోతురాజు, కె.సాయికృష్ణ, ఎన్.వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళాలు

ముళ్లపూడి(పమిడిముక్కల): ముళ్లపూడిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకోదండ రామ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు తోట శేషసాయి మానస రూ.50,116, లంక హిమ బిందు(యూఎస్ఏ)రూ.25,116, గంధం అనిల్ కుమార్, దుర్గా భవాని రూ.10,116, గులకల వీరేంద్ర రూ.5,116 విరాళంగా ఇచ్చినట్టు ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు.

## మహాసభలపై ర్యాలీ

గుడివాడ(సత్యనారాయణపురం): విశాఖలో జరగనున్న సీఐటీయు జాతీయ స్థాయి మహాసభలను జయప్రదం చేయాలని సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయు కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, ఆర్.కొండ, ఐద్వా పట్టణ కార్యదర్శి రజిని, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, సురేంద్ర, నాగేంద్రం, శ్రీను, ఎం.యూన్సీ, అజీజ్, నాని పాల్గొన్నారు.

## మండలి వెంకట కృష్ణారావుకు నివాళి

కోడూరు, న్యూస్‌టుడే: మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా కోడూరులోని ప్రధాన కూడలి వద్ద ఉన్న వెంకట కృష్ణారావు విగ్రహానికి కోడూరు మండల మత్స్యకార విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు వస్త్ర దానం

గుడివాడ: జడ జానన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గుడ్‌మెన్ పేటలోని హోలీ చర్చిలో పేదలకు దుస్తులను ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకర్ పంపిణీ చేశారు. ట్రస్టు నిర్వాహకుడు జడ జాన్‌రాజు, తెదేపా వార్డు అధ్యక్షుడు వేశపోగు ఇమ్మానియేలు, హోలీ చర్చి సభ్యులు పాల్గొన్నారు.

## జూదరుల అరెస్టు

గుడివాడ: గుడివాడ మండలం వలివర్తిపాడు గ్రామ శివారు పొలాల వద్ద కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై గుడివాడ రూరల్ పోలీసులు దాడి చేసి సోమవారం ముగ్గురిని అరెస్టు చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రెండు కోళ్లు, రెండు కత్తులు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోడికత్తుల స్వాధీనం

గుడ్లవల్లేరు: స్థానిక మార్కెట్‌యార్డు వద్ద సోమవారం నిషేధిత కోడికత్తులు కలిగి ఉన్న కుంభ రామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 240 కోడికత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ సత్యనారాయణ వెల్లడించారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు గ్రామంలో మంగళవారం విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం సరఫరా ఉండదన్నారు.

## శ్రీకృష్ణాశ్రమంలో సామూహిక ఉపనయనాలు

పెదముత్తేవి(కూచిపూడి), న్యూస్‌టుడే : మొవ్వ మండలం పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమంలో సోమవారం సామూహిక ఉపనయనాలు జరిగాయి. శ్రీసీతా రామయతీంద్రులకు శ్రీకృష్ణ సాక్షాత్కారం జరిగిన సందర్భంగా పలువురికి ముముక్షుజన మహాపీఠాధిపతి ముత్తీవి గౌరకృష్ణగురుదేవుల సమక్షంలో సామూహిక ఉపనయనాలు నిర్వహించారు. తుర్లపాటి రాధాకృష్ణ, ఆనంద్, ఆత్మకూరు లక్ష్మణదాస్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో గౌరకృష్ణ గురుదేవులు

## విద్యతోనే మాదిగల అభివృద్ధి

గుడివాడ: మాదిగలు విద్యలో ముందుంటేనే ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతారని రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ నాయకుడు కంచర్ల సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక రైలుపేటలో చంద్రయ్య కాలువ వద్ద 8వ ప్రపంచ మాదిగ దినోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వేల్పుల నాగబాబును సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పలపాటి ఆశీర్వాదం, కె.జె.విక్టర్ పాల్, కొదమల గంగాధర్, పసలాది శేఖర్, వర్ల సుబ్బారావు, రాజేష్, కొత్రా మరియదాసు పాల్గొన్నారు.

సంఘీభావం వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

## రగ్గుల పంపిణీ

చంద్రాల(గుడ్లవల్లేరు): మండలంలోని చంద్రాలలో సోమవారం మండల తెదేపా అధ్యక్షులు కొస రాజు బాపయ్యచౌదరి దంపతులు తన మనవరాలు ఆద్య జన్మదినం సందర్భంగా 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. 60 మంది పాఠశాల విద్యార్థులకు రగ్గులు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నేతలు అడుసుమిల్లి చిట్టిబాబు, వెంకట్రావ్, ఏఎంసీ ఛైర్మన్ రవికుమార్, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ పాల్గొన్నారు.

బాలలకు రగ్గులు అందజేస్తున్న బాపయ్యచౌదరి దంపతులు, రవి, వెంకట్రావ్

## సస్యరక్షణ, కలుపు నివారణపై అవగాహన

**అవనిగడ్డ:** కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల శాస్త్రవేత్తల బృందం సోమవారం స్థానిక మినుప పంటను పరిశీలించారు. సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ మినుము సాగులో కాండం గజ్జి, బంగారు తీగ యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. యాజమాన్యం కోసం మెటలాక్సిల్, ప్లస్ మాంకోజెబ్ మందును 400గ్రా చొప్పున ఎకరానికి పిచికారి రూపంలో చేయకుండా నేలను తడిపే విధంగా చూసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ రేవతి పాల్గొన్నారు.

**నాగాయలంక :** మండలంలోని టి.కొత్తపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో శాస్త్రవేత్తల బృందం మినుము పంట సాగులో మెలైన యాజమాన్య పద్ధతులపై సోమవారం అవగాహన కల్పించారు.

## కార్మికులకు దుప్పట్ల వితరణ

అవనిగడ్డ: గాంధీక్షేత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు తన పుట్టిన రోజు వేడుకను స్థానిక వంతెన కూడలిలో మండలి కృష్ణారావు విగ్రహం వద్ద సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. పంచాయతీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కృష్ణారావు విగ్రహానికి పూలమాల వేశారు. మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

## బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

కోడూరు: ఆప్కాబ్ సహకార ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో కోడూరు మండలం డీసీసీబీ మేనేజరు ఎం.వెంకటేశ్వర్లు, నందిగామ బ్యాంకు మేనేజరు శ్రీరామ్ ప్రతిభ కనబర్చారు. వీరిని మచిలీపట్నం కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యాంకుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

విజేతలతో సీఈవో శ్యాం మనోహర్

## జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి

పామర్రు: పింఛనర్లు, కుటుంబ పింఛనర్లు, ఇతర ప్రభుత్వ పింఛనర్లు జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలని పామర్రు ఉప ఖజానా అధికారి డి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు వీటిని సమర్పించవచ్చన్నారు.

## రీసర్వేకు సహకరించండి

పమిడిముక్కల, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా జనవరి 2 నుంచి ప్రారంభమయ్యే భూసర్వేకు రైతులందరూ సహకరించాలని డిప్యూటీ తహసీల్దారు జోబాబు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టరు కిరణ్ కుమార్ కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన భూ సమస్యల పరిష్కార గ్రామ సభలో వారు మాట్లాడారు. భూసర్వే పరిధిని సంబంధిత రైతులకు ముందస్తుగా తెలియజేస్తారన్నారు. సర్పంచి ముళ్లపూడి సునీత, డీసీ అధ్యక్షుడు నాదెళ్ల సుబ్రహ్మణ్యం, మండల సర్వేయరు సురేష్ కుమార్, వీఆర్వో కె.శివప్రసాద్ పాల్గొన్నారు.

## సహకార సంఘ ఉద్యోగుల నిరసన

మోపిదేవి, న్యూస్‌టుడే : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ సిబ్బంది తమ డిమాండ్ల సాధనలో భాగంగా నిరసనకు విజయవాడ తరలి వెళ్లటంతో కార్యాలయాల్ని సోమవారం మూసివేశారు. దీంతో లావాదేవీలు నిలిచిపోయాయి. రైతులు ఇబ్బందులు పడ్డారు.

(c) eenadu

## సైబర్ మోసాలా.. అవగాహన పెంచుకోండిలా..!

★ డీసీపీ కె.కృష్ణ ప్రసన్నతో ఫోన్ ఇన్ నేడు

ఈనాడు మీతోడు

సైబర్ నేరాలు నిత్యకృత్యమయ్యాయి. ఏ లింక్ క్లిక్ చేస్తే ఏమవుతుందో? బ్యాంకు ఖాతా ఎప్పుడు ఖాళీ అవుతుందో అని అందరూ బెంబేలెత్తిపోతున్నారు. పెట్టుబడులు, పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజల కష్టార్జితాన్ని దోచేస్తున్నారు. డబ్బులు పోతే తిరిగి వస్తాయన్న నమ్మకం పూర్తిగా పోయింది. వీటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కావాల్సిన సాయం తదితర అంశాలపై 'ఈనాడు' సైబర్ క్రైం డీసీపీ కె.కృష్ణ ప్రసన్నతో ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టింది. ప్రజలు తమకున్న సందేహాలనూ నివృత్తి చేసుకోవచ్చు. మీరు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో దిగువ నంబరుకు ఫోన్ చేయడమే. - ఈనాడు, అమరావతి

80085 74651 | 30.12.25 మంగళవారం | ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

## రేషన్ అక్రమాలపై జేసీ గరంగరం

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే** : జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ తీరుపై జేసీ ఎస్.ఇలక్కియా ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ డీలర్లు, పౌరసరఫరాల శాఖ అధికారుల్లో మార్పు రాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. ఓ ఏఎస్‌వో, మరో తనిఖీ అధికారి తీరును తప్పుబట్టారు. సస్పెన్షన్ చేయడానికి వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. ఇటీవల ఆమె అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో రేషన్ దుకాణాల ఆకస్మిక తనిఖీకి వెళ్లారు. వాంబేకాలనీ, ఎల్.బి.ఎస్.నగర్, కండ్రిక తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అదే సమయంలో రెండు రేషన్ దుకాణాలకు తాళాలు వేసి ఉన్నాయి. తర్వాత ఓ డివిజనల్ స్థాయి అధికారిని తనిఖీలకు పంపారు. అక్రమాలు గుర్తించినట్లు సమాచారం. రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు సరఫరా చేయకుండా, ముందుగానే విక్రయిస్తున్నట్లు ఆమెకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇలాంటి అక్రమాలు చెల్లవని, పేదలకు బియ్యాన్ని సరఫరా చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. రేషన్ డీలర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సోమవారం అంతర్గత సమావేశం నిర్వహించారు. పీడీ యాక్టు, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై నిత్యం తనిఖీలు ఉంటాయని, అక్రమాలను గుర్తిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.



## 90 ఏళ్లుగా... అతిథులకు విడిది

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

భారతీయుల ఉసురు తీసిన ఆంగ్లేయులు దివిసీమ ప్రజలకు అపురూపమైన కట్టడాలను అందించారు. దివిసీమ ముఖద్వారమైన పులిగడ్డలో 1936లో నిర్మించిన అతిథి గృహం ఈ కోవకు చెందినదే. శత వసంతాలకు చేరువలో ఉన్న దీనికి కొద్దిపాటి మరమ్మతులు చేస్తే మరి కొన్నేళ్లు వినియోగపడుతుంది. కృష్ణానదిపై బహుళ ప్రయోజనకరమైన అక్విడెక్టు నిర్మాణం చేపట్టిన సమయంలో ఆ పనులన్నీ పర్యవేక్షించేందుకు వచ్చే ఇంజినీర్లు, బ్రిటిష్ అధికారుల విశ్రాంతి కోసం దీన్ని రూపొందించారు. నాటి నుంచి నేటి వరకు అతిథులకు స్వాగతం పలుకుతూ.. వారి సేద తీర్చే విడిదిగా ఈ కట్టడం వినియోగపడుతోంది. ప్రస్తుతం జలవనరుల శాఖ అధీనంలో ఉంది. దీన్ని భావితరాలకు అందించడం కోసం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చిన్నపాటి మరమ్మతులు చేయిస్తూ సంరక్షిస్తున్నారు. ఇప్పటికీ చెక్కుచెదరక అపురూపమైన కట్టడంగా దివిసీమ చరిత్ర పుటల్లో నిలుస్తోంది. ★ ఈ అతిథిగృహ ప్రాంగణంలో 100 ఏళ్లనాటి ఊడల మర్రి, మద్ది వృక్షాలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఉసిరి వనాలు, సంపెంగ సువాసనలు వెదజల్లుతున్నాయి.

## ఎనిమిదేళ్లుగా.. కడుతూనే ఉన్నారు!

గర్భిణులు, బాలింతల కష్టాలూ పట్టవు

ఈనాడు, అమరావతి

విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో ఒకే ఒక్క భవనం.. అదీ రెండంతస్తుల్లో నిర్మించడానికి ఏకంగా ఎనిమిదేళ్లకు పైగా పట్టింది. 2017లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వచ్చి మంచాల కొరతతో గర్భిణులు ఎదుర్కొంటున్న బాధలు చూసి చలించిపోయారు.. వెంటనే రూ.18 కోట్లు మంజూరు చేసిన భవనమిది. దీని నిర్మాణం విషయంలో వైద్యారోగ్యశాఖ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో చెప్పడానికి ఈ ఎనిమిదేళ్ల తాత్సారమే నిదర్శనం. పునాదుల దశ వరకు వచ్చిన సమయంలో వైకాపా సర్కారు గద్దెనెక్కడంతో అక్కడితో ఐదేళ్లు ఆ నిర్మాణానికి మంగళం పాడారు. మళ్లీ 2023 డిసెంబరులో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.23.75కోట్లతో అవే పునాదులపై కొత్తగా క్రిటికల్ కేర్ బ్లాక్ పేరుతో శంకుస్థాపన చేసి నిర్మాణం ఆరంభించారు. ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు.. రెండేళ్లయినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు.

పాతాసుపత్రిలో నిర్మించిన రెండంతస్తుల క్రిటికల్ కేర్ బ్లాక్

**ఎన్నాళ్లు బాధలు పడాలి..**

ఆసుపత్రిని పదేళ్ల నుంచే మంచాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ పదేళ్లలో ప్రసవాల కోసం వచ్చే గర్భిణుల సంఖ్య రెట్టింపు అయ్యింది. వారికి మంచాలను కేటాయించలేక వైద్య సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఒకే మంచంపై ఇద్దరేసి బాలింతలు, వారి బిడ్డలను పెట్టుకుని పడుకోవాల్సిన దయనీయమైన పరిస్థితి.

**మార్చికే పూర్తయిన భవనం..**

క్రిటికల్ కేర్ బ్లాక్ భవన నిర్మాణం గత మార్చి నాటికే పూర్తయిపోయింది. ఏప్రిల్‌లో తుది దశ పనులు పూర్తి చేసి భవనం ప్రారంభిస్తామని చెప్పారు. ఇప్పటికి ఏడు నెలలు గడిచిపోయింది. గర్భిణులు, బాలింతలకు అత్యవసరమని తెలిసినా ఇంత జాప్యం చేస్తున్నారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ ఆరంభిస్తే తప్ప ఈ బాధలు తీరవు. భవనం అందుబాటులోకి వస్తే రెండు అంతస్తుల్లో కలిపి ఆక్సిజన్ పైప్‌లైన్‌తో అనుసంధానించిన 125 అదనపు మంచాలు, నాలుగు ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ రూం, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ ఐసీయూలొస్తాయి.

**ఏప్రిల్ నుంచి సాగతీత..** సర్కారు నుంచి బిల్లుల సమస్య ఉందని ఏప్రిల్ తర్వాత నుంచి పనులను నెల తరబడి సాగదీశారు. తాజాగా భవనం తుది దశ పనులు సైతం పూర్తి చేశారు. ముందుభాగంలో ర్యాంప్ కూడా సిద్ధమైంది. ప్రస్తుతం భవనంలో లిఫ్టులు, మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ల పనులు చేపట్టారు. ఇవి పూర్తయ్యాక ఆరంభిస్తామని వైద్యారోగ్యశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. అవి ఎప్పటికి పూర్తిచేస్తారో.. ఎప్పుడు భవనం అందుబాటులోకి తీసుకొస్తారనేదానికి సమాధానం లేదు.

## ఏముందీ.. ఐడియా!

సమాధానాలు ఇస్తేనే నగదు బదలాయింపు

✦ 'నా పేరు మీద నాన్ బెయిలబుల్ కేసు నమోదైందని, అరెస్టు వారెంట్ జారీ అయిందని నన్ను ఎవరూ భయపెట్టలేదు' ✦ డిజిటల్ అరెస్టు లేదని నాకు తెలుసు. సీబీఐ, కస్టమ్స్, ఈడీ, పోలీస్ అని ఎవరూ వీడియో కాల్ చేసి భయపెట్టలేదు.' ఇలా... చరవాణిలో వరుసగా వచ్చే ప్రశ్నలకు సంతృప్తికర సమాధానాలు ఇస్తేనే. . మీ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు బదిలీ అవుతుంది. ✪ సైబర్ నేరాల నియంత్రణకు

ఏఐ ఆధారిత టూల్‌ను పరిశీలిస్తున్న బ్యాంకర్లు

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ 'సైబర్ సురక్ష' పేరుతో వినూత్న కార్యక్రమం చేపట్టింది. డిజిటల్ అరెస్టు పేరుతో ప్రజలను భయపెట్టి, వారి నుంచి నేరగాళ్లు రూ.లక్షలు కొట్టేస్తున్నారు. రకరకాలుగా మభ్యపెట్టి.. భయపెట్టి బ్యాంకులకు పంపించి.. వారి ఖాతాల నుంచి డబ్బులు తమ ఖాతాలకు బదలాయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఖాతాదారులకు అవగాహన కలిగించేందుకు విజయవాడ పోలీసులు 'సైబర్ సురక్ష' అనే ఏఐ ఆధారిత టూల్‌ను రూపొందించారు. ఖాతాదారుల చరవాణిలో ఈ టూల్ సాయంతో 'సైబర్ సురక్ష' నుంచి సమాధానాలు తెలుసుకుంటున్నారు. ✪ ముందు గూగుల్ బ్రౌజర్‌లో ntrpolice.in అనే దానిలోకి లాగిన్ అవ్వాలి. 'డిజిటల్ కన్‌సెంట్ ఫర్ బ్యాంక్ కస్టమర్స్' క్లిక్ చేయాలి. ఇంగ్లిషు/తెలుగు ఎంపిక చేసుకోవాలి. మీ పేరు, చరవాణి నంబరుతో రిజిస్టరైతే.. మీకు వరుసగా 5 ప్రశ్నలు వస్తాయి. వాటిని గట్టిగా చదివి.. సమాధానాలు ఇవ్వాలి. వాటిని ఏఐ నమోదు చేసి సక్రమంగా ఉంటే ఒక కోడ్ వస్తుంది. దానిని బ్యాంకర్లకు చూపిస్తేనే మీ డబ్బులు బదలాయిస్తారు.

- విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

## బీడీఎస్ సీట్ల భర్తీకి స్పెషల్ స్ట్రే రౌండు

**ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే:** ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి స్పెషల్ స్ట్రే వేకెన్సీ రౌండు నిర్వహిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేర్కొంది. నీట్ యూజీ రాసిన అభ్యర్థులు ఈనెల 30వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి జనవరి ఒకటో తేదీ సాయంత్రం 6 గంటల్లోగా ఐచ్ఛికాలు ఇచ్చుకోవాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 43 బీడీఎస్ సీట్లు, ఎస్వీయూ పరిధిలో 20 సీట్లు అందుబాటులో ఉంచారు. ★ బీడీఎస్ యాజమాన్య కోటా సీట్ల స్ట్రే వేకెన్సీ రెండో రౌండు కౌన్సెలింగ్‌లో 13 సీట్లు భర్తీ కాగా, సీట్లు పొందిన విద్యార్థులు డిసెంబరు 31వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఆయా దంత వైద్య కళాశాలల్లో చేరాలని వర్సిటీ పేర్కొంది.

## యూరియా పక్కదారి పడితే సస్పెన్షన్ వేటే

'ఈనాడు' కథనానికి కలెక్టర్ లక్ష్మీశ స్పందన

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే** : జిల్లాలో యూరియా పక్కదారి పడితే సంబంధిత అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తామని, నిబంధనలను ఉల్లంఘిస్తే డీలర్ల లైసెన్స్‌లను రద్దు చేస్తామని కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. 'యూరియా దందా.. అంతే లేదయా' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యూరియా అక్రమ రవాణా, నిల్వలు, పక్కదారి పట్టించడం వంటివి అరికట్టేందుకు అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా అమలు చేస్తున్నట్టు తెలిపారు. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుందన్నారు. సమన్వయ శాఖలు క్రియాశీలంగా వ్యవహరించాలన్నారు. అక్టోబరు ఒకటి నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జిల్లాలో మొత్తం 17,707 టన్నుల యూరియా విక్రయాలు జరిగినట్టు చెప్పారు. రానున్న మూడు రోజులకు 339 టన్నుల యూరియా అవసరం కాగా, ప్రస్తుతం 5,236 టన్నులు సొసైటీలు, మార్క్‌ఫెడ్ గోదాములు, రిటైల్/హోల్ సేల్ తదితరాల చోట్ల అందుబాటులో ఉందన్నారు. అన్నదాతలు ఎరువులు కొనుగోలు చేసి, రసీదులు పొందాలని సూచించారు. రైతులకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. డీఏవో విజయకుమారి, ఆర్డీవోలు, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈ ఉద్యానం.. పంచదు ఆహ్లాదం

వాంబేకాలనీలో ఉన్న పాతడంపింగ్ యార్డును మోడల్ పార్కుగా మార్చేందుకు 2020 వైకాపా హయాంలో రూ.10కోట్లతో పనులు మొదలుపెట్టి ప్రారంభ దశలోనే ఆపేశారు. కంపచెట్లు పెరిగి, విద్యుత్తు స్తంభాలు పడిపోయి, ఆటవస్తువులు విరిగిపోయి నిరుపయోగంగా మారాయి. రాత్రి వేళలో ఈ ప్రదేశం అసాంఘిక శక్తులు, నేరగాళ్లకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. – ఈనాడు, అమరావతి

## ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** వచ్చే ఏడాది జులైలో జరిగే ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ -2026 ప్రవేశ పరీక్షకు ఎన్టీఆర్ జిల్లాలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రభుత్వ ఐటీఐలో రూ.500 చెల్లించి దరఖాస్తు పొందాలని చెప్పారు. ఐటీఐ స్టేట్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో 2019 నుంచి ప్రవేశాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హత పొందిన అభ్యర్థులు జనవరి 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ప్రభుత్వ ఐటీఐలో పూరించిన దరఖాస్తులను అందించాలని పేర్కొన్నారు. వివరాలకు 94906-39639లో సంప్రదించవచ్చని చెప్పారు.

## సంక్రాంతి కత్తులకు పదును

★ ఆర్డర్లపై రహస్యంగా తయారీ ★ జిల్లాలో ఆరుచోట్ల పోలీసుల దాడులు

ఈనాడు, అమరావతి

సంక్రాంతి సమీపిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల రహస్యంగా కత్తులు తయారవుతున్నాయి. బరుల్లో పందేలకు దిగే కోళ్లకు వీటిని కడతారు. కత్తులకు పదును పెట్టేందుకు చాలా చోట్ల గదులు అద్దెకు తీసుకుని యంత్రాలతో పనిచేస్తున్నారు. పెద్ద సంఖ్యలో వీటి కోసం ఆర్డర్లు వస్తున్నాయి. ఇటువంటి కేంద్రాలపై ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు బృందాలుగా విడిపోయి ఆరుచోట్ల దాడులు చేసి కత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసుల నమోదుకు స్థానిక పోలీసుస్టేషన్లలో నిందితులను అప్పగించారు.

కోడి కత్తుల తయారీ యంత్రాలు

**మూడు వేలకుపైగా స్వాధీనం**

★ విస్సన్నపేటలో నడకుదురు సర్వేశ్వరరావు ఓ గదిని అద్దెకు తీసుకుని ఐదు యంత్రాలతో సంక్రాంతి కత్తులకు పదునుపెడుతున్నాడు. పోలీసులు ఇతడిని అదుపులోకి తీసుకుని 1,600 కత్తులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అతని నుంచి 47,530 నగదును సీజ్ చేశారు. రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని అంపాపురంలో విజయబాబు నుంచి 600 కత్తులు, ఓ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ★ మైలవరంలో సుంకర కిశోర్ నుంచి 350 కత్తులు, ఒక యంత్రాన్ని, సుంకర నరేంద్ర నిరంజన్‌రావు నుంచి 70 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నంలో వల్లభాపురం నాగరాజు నుంచి 300 కత్తులు, జి.కొండూరు మండలం చెవిటికల్లులో వెంకటనాగాచారి నుంచి 164 కత్తులు, ఒక యంత్రాన్ని దాడుల్లో సీజ్ చేశారు.

**నూజివీడు, విస్సన్నపేటలో...**

★ కత్తులకు పదును పెడుతున్న వీరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా.. ఏలూరు నూజివీడుతో పాటు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో ఇవి తయారవుతున్నట్లు తేలింది. వీటిని ఆర్డర్ల మేరకు నిందితులు కొనుగోలు చేసి పదును పెట్టి అమ్ముతుంటారు. లేనిపక్షంలో ఎవరైనా కొనుగోలు చేసి తీసుకొస్తే పదునుపెట్టి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో తయారీ కేంద్రాలపై పోలీసులు నిఘా పెట్టారు. త్వరలో వీటిపై దాడులు చేసే అవకాశం ఉంది.

## అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు..

## భూ సేకరణకు ప్రతిపాదనలు

11 గ్రామాల్లో 1972.70 ఎకరాలు గుర్తింపు

రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణకు తొలి దశ ప్రతిపాదనలు పంపించారు. నందిగామ డివిజన్‌లో కంచికచర్ల, వీరులపాడు మండలాల మీదుగా ఓఆర్ఆర్ రోడ్డు నిర్మాణం జరగనుంది. దీని కోసం ఈ రెండు మండలాల్లో 11 గ్రామాల పరిధిలో 1972.70 ఎకరాలు గుర్తించారు. అనంతరం మూడు(ఏ) నోటిఫికేషన్‌కు కలెక్టర్ ద్వారా నేషనల్ హైవే అథారిటీ సంస్థకు ప్రతిపాదనలు పంపించారు.

దీనిలో భాగంగా ఓఆర్ఆర్ నిర్మించేందుకు అవసరమైన భూములు వాటి సర్వే నంబర్లు, విస్తీర్ణం వివరాలను నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి కె.బాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు సేకరించారు. దీని ప్రకారం 79,83,248.53 చదరపు మీటర్ల భూమి సేకరించాలని నిర్ణయించారు. దీనిని హైవే అథారిటీ సంస్థ పరిశీలించి ఒకే చేశాక భూ సేకరణకు 3డీ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. దీనిలో రైతుల పేర్లు, భూమి విస్తీర్ణం, రెవెన్యూ గ్రామం తదితర వివరాలు సమగ్రంగా ఉంటాయి. దీనిపై రైతులకు ఏమైనా అభ్యంతరాలుంటే అధికారులు స్వీకరించి పరిశీలన చేస్తారు. దీనిపై ఆర్డీవో కె.బాలకృష్ణ మాట్లాడుతూ ఓఆర్ఆర్ భూసేకరణకు అవసరమైన భూములు గుర్తించినట్లు తెలిపారు. దీనిపై ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపినట్లు వెల్లడించారు.

సేకరించనున్న భూములు..

| గ్రామం | ఎకరాలు |
|---|---|
| కంచికచర్ల | 570.80 |
| పేరకలపాడు | 60.13 |
| మున్నలూరు | 150.44 |
| మోగులూరు | 267.54 |
| కునికినపాడు | 1.18 |
| పొన్నవరం | 162.19 |
| జగన్నాథపురం | 33.64 |
| చెన్నారావుపాలెం | 173.38 |
| గూడెం మాధవరం | 41.01 |
| జుజ్జూరు | 297.39 |
| తిమ్మాపురం | 214.99 |

- నందిగామ, కంచికచర్ల, న్యూస్‌టుడే

**తాకితే రాలుతోంది.. అదిరితే కూలుతోంది..**

నగరంలోని పూర్ణానందపేట ఏలూరు లాకుల వద్ద ఉన్న రెండో వంతెన రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. పాదచారులు పుట్‌పాత్‌పై వెళ్తూ ముట్టుకుంటే పెచ్చులు రాలిపడుతోంది. పెద్ద వాహనాలు వచ్చినప్పుడు వంతెన కాస్తంత అదిరినా రక్షణ గోడ కొద్దికొద్దిగా కూలిపోతోంది. -ఈనాడు, అమరావతి

## విద్యుత్తుశాఖ, దుర్గగుడి అధికారుల చర్చలు

పరిష్కారానికి సీఎండీ వద్ద సమాలోచనలు

**సూర్యారావుపేట:** విద్యుత్తుశాఖ, దుర్గగుడి మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకునేందుకు ఇరు విభాగాల అధికారుల మధ్య సోమవారం చర్చలు జరిగాయి. విద్యుత్తు సీఎండీ పుల్లారెడ్డి ఎదుట సమావేశమయ్యారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఏం చేయాలనే అంశంపైనే ప్రధానంగా చర్చించారు. దుర్గగుడికి విద్యుత్తును రెండు రోజుల కిందట నిలిపేయడాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్రంగా పరిగణించింది. వెంటనే సమస్యను పరిష్కరించుకోవాలంటూ.. ఇరుశాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. విద్యుత్తు, దేవాదాయశాఖ.. ఇద్దరు మంత్రులు జోక్యం చేసుకుని.. సమస్యకు సరైన పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇరు శాఖల అధికారులు ఎవరి వాదన వాళ్లు వినిపించుకున్నారు.

**విద్యుత్తుశాఖ అధికారుల వాదన :** రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానం కావడంతో.. తాత్కాలికంగా మాత్రమే సౌర విద్యుత్తు ప్లాంట్ నుంచి వచ్చే విద్యుత్తును గ్రిడ్‌కు తీసుకునేందుకు అనుమతి ఇచ్చాం. అందుకే రెండు రకాల విధానాల్లో ఏదో ఒకటి దేవస్థానం ఎంపిక చేసుకుంటే.. ఆ ప్రకారం శాశ్వతంగా విద్యుత్తును తీసుకునే ఏర్పాటు చేస్తాం. ఒకటోది. . ఓపెన్ యాక్సెస్‌లో ఇవ్వడం, రెండోది నెట్ మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు పంపించడం.. వీటిలో ఏదో ఒకటి ఎంపిక చేసుకోవాలని సూచించారు. ✪ **దుర్గగుడి అధికారుల వాదన :** తాము రూ.5కోట్లతో ఏర్పాటు చేసిన ప్లాంట్ ద్వారా.. ఉత్పత్తి అయ్యే విద్యుత్తుకు సరైన లెక్కలు చూపించాలి. మిగతా బ్యాలెన్స్ ఏమైనా కట్టాల్సి వస్తే.. దానిని కడతాం. విద్యుత్తు అధికారులు సూచించిన రెండు విధానాల్లో ఏదో ఒకటి ఎంపిక చేసుకుంటాం.

**నేడు మంత్రి వద్ద పంచాయితీ..** సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు.. ఇరుశాఖల అధికారులు విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి ఎదుట మంగళవారం సమావేశం కానున్నారు. తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరగబోతోంది.

## నిందితుల మధ్య.. వందల కాల్స్

పిల్లల విక్రయాల కేసులో కీలక ఆధారాలు

ఈనాడు, అమరావతి

పిల్లల రవాణా, విక్రయాల్లో కింది స్థాయి నుంచి దిల్లీ వరకు పలు దశల్లో నిందితుల మధ్య సంభాషణలు నడిచాయి. వందల కాల్స్ మాట్లాడుకున్నారు. రెగ్యులర్ కాల్స్‌తో పాటు వాట్సప్‌లోనూ తరచూ మాట్లాడుకున్న ఆధారాలు లభించాయి. విజయవాడకు పిల్లల్ని తెప్పించేందుకు ఉత్తరాది ముఠాలతో డీల్ కుదుర్చుకునేందుకు ప్రధాన నిందితురాలు ఫోన్ నుంచి కాల్స్ వెళ్లినట్లు గుర్తించారు. దిల్లీ, ముంబయి నుంచి కూడా సరోజినికి చాలా కాల్స్ ఉన్నాయి. సాంకేతిక విశ్లేషణలో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

**గ్రూప్ కాల్స్‌లో సంభాషణలు:** ఇప్పటి వరకు పోలీసులు ముంబయి, దిల్లీ ముఠాల మధ్య సంబంధాలు ఉండకపోవచ్చని భావించారు. అయితే ముఠాలోని వారి కాల్ డేటా విశ్లేషణలో పలు కీలకమైన విషయాలు బయటకు వచ్చాయి. రెండు గ్యాంగులకు సంబంధాలు ఉన్నట్లు వెల్లడైంది. ఈ రెండు ముఠాల్లోని కిరణ్ శర్మ, ప్రియాంక, భర్తి, సతీష్, అనిల్, కవిత, నూరి, కాజల్ తరచూ ఫోన్లలో మాట్లాడుకున్నారని వెలుగు చూసింది. వీరందరి మధ్య వందల కాల్స్ నడిచాయి. బలగం సరోజిని నుంచి వీరి నడుమ కూడా పెద్ద సంఖ్యలో కాల్స్ ఉన్నాయి. అహ్మదాబాద్, దిల్లీ, విజయవాడలో ఉండి. . వీరు గ్రూప్ కాల్స్‌లో ఒకరికొకరు సంభాషించుకున్నారు. పలుసార్లు వాట్సప్ కాల్స్ కూడా నమోదయ్యాయి. వీటి ద్వారా కూడా కాన్ఫరెన్స్ కాల్స్ చేసుకుని పిల్లల విక్రయాల గురించి తరచూ చర్చించుకునే వారని తెలిసింది. సరోజిని ఫోన్ నుంచి కింది స్థాయిలో బ్లెస్సీ, నందిని, విజయలక్ష్మి, ఫరీనాతోనూ ఎక్కువగా కాల్స్ ఉన్నాయి.

**నేరచరిత్రపై వివరాల సేకరణ:** విజయవాడలో నమోదైన నాలుగు కేసుల్లో అరెస్టు అయిన నిందితుల వేలిముద్రల ఆధారంగా దేశవ్యాప్తంగా ఇంకా ఏయే స్టేషన్లలో వీరిపై కేసులు ఉన్నాయన్నది పరిశీలిస్తున్నారు. సరోజినిపై ఏడు, అనిల్‌పై ఒకటి, కవితపై రెండు, విజయలక్ష్మిపై ఆరు, కిరణ్ శర్మ, ఫరీనాలపై నాలుగేసి కేసులున్నాయి. విజయవాడకు చెందిన శారదపై దేశవ్యాప్తంగా పలు కోర్టుల్లో చాలా పీటీ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈమెను యూపీలోని హర్దోయి జైలు నుంచి తెచ్చి విజయవాడ కోర్టులో హాజరుపర్చారు. అనంతరం తిరిగి యూపీకి పంపించారు.

**కస్టడీలో విచారిస్తే..**

నిందితులుగా భావిస్తున్న కిరణ్‌శర్మ, భర్తి, బలగం సరోజినిలను కస్టడీకి తీసుకుని విచారిస్తే కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మహిళా స్టేషన్, కొత్తపేట, భవానీపురం, నున్న పోలీసులు వీరిపై ఇప్పటికే పీటీ వారెంట్లు వేశారు. అనంతరం కస్టడీ పిటిషన్లు కూడా వేశారు. ఇంకా అరెస్టు కావాల్సిన వారి కోసం ప్రత్యేక బృందాలు రెండు రోజుల్లో వెళ్లనున్నాయి.

## ఆట ప్రారంభం

విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి కృష్ణా జిల్లా 28వ అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల ప్రాంతీయ స్పోర్ట్స్ మీట్–2025 ఘనంగా ప్రారంభమైంది. దీన్ని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు ప్రారంభించారు.

## రుణమొస్తే మామూళ్లు.. ప్రశ్నిస్తే చిక్కుముళ్లు

☛ వెలుగు రుణాల్లో బుక్ కీపర్లు, సీసీల దందా

☛ ఒక్కో గ్రూపు నుంచి రూ.4వేలకు పైగా వసూళ్లు

ఈనాడు, అమరావతి

డ్వాక్రా రుణాల ద్వారా మహిళలకు ఆర్థిక దన్నుగా నిలవాలన్న ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. వెలుగు సంఘాలకు రుణమొస్తే చాలు మామూళ్ల పేరిట బుక్‌కీపర్లు, సీసీలు దోచేస్తున్నారు. ప్రశ్నించిన వారికి రుణాలు రాకుండా కొర్రీలు వేస్తున్నారు. దీంతో చేసేది లేక సంఘాల సభ్యులు సైతం అడిగింది ఇచ్చి మిన్నకుంటున్నారు.

జిల్లాలో 24వేల సంఘాలున్నాయి. 2,52,000 మంది సభ్యులున్నారు. ఈ ఏడాది రూ.591కోట్లు రుణాలిచ్చారు. ఒక్కో సంఘానికి అవసరాన్నిబట్టి రూ.20లక్షల వరకు రుణం ఇస్తారు.

రూ.20 లక్షల వరకు...

**మా రూటే..సపరేటు...**

★ రుణం మంజూరై ఖాతాలో ఎప్పుడు జమవుతుందా అని చాలా మంది బుక్‌కీపర్లు, సీసీ ఎదురుచూస్తున్నారు. జమ అయితే వసూళ్ల దందా మొదలు పెడుతున్నారు. ★ ఏ.కొండూరు మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల రూ.18లక్షల రుణం మంజూరైంది. మొత్తం 12 మంది సభ్యులు కాగా గ్రూపు అధ్యక్షురాలు ఒక్కొక్కరి నుంచి రూ.500 చొప్పున రూ.6వేలు కోత వేశారు. ఇదేమిటని అడిగితే మనకు రుణం ఇప్పించిన బుక్ కీపర్, నుంచి సీసీ, ఏపీఎంకి ఇవ్వాలని బదులిచ్చారు. ★ తిరువూరు మండలంలోని మరో గ్రామంలో 10 మంది సభ్యుల వెలుగు సంఘానికి రూ.20లక్షల రుణం మంజూరైంది. సంఘం కార్యదర్శి రూ.4వేలు వసూలు చేసి బుక్‌కీపర్, సీసీకి ముట్టజెప్పారు. రూ.20లక్షల రుణమిస్తే కనీసం రూ.5వేలు కూడా ఇవ్వలేరా అంటూ బుక్‌కీపర్ దబాయించడం గమనార్హం.

**అధికారులకు తెలిసినా నిర్లక్ష్యమే..**

★ వెలుగు సంఘాలు రుణం మంజూరైనప్పుడు బుక్‌కీపర్లు, సీసీలకు నచ్చింది ఇవ్వడంతో మొదలైన ఈ వ్యవహారం చిలికి చిలికి గాలి వానలా మారింది. ప్రస్తుతం డిమాండ్ చేసి మరీ వసూలు చేసే పరిస్థితికి వచ్చింది. ఒక్కో సంఘం నుంచి రుణంలో రూ.4వేల నుంచి రూ.6వేల వరకు వసూలు చేస్తున్నారు. ★ ఇదంతా అధికారులకు తెలిసినా ప్రారంభంలో నిర్లక్ష్యం చేశారు. దీంతో బుక్‌కీపర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మామూళ్ల బేరం ముందే తెగ్గొట్టిన తర్వాతనే రుణ ప్రక్రియ చేస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు హెచ్చరించడం తప్ప కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ★ డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు మాట్లాడుతూ.. సభ్యులు ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. అక్రమంగా వసూళ్లు చేసే వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

(c) eenadu

## భక్తులను బంధువుల్లా ఆత్మీయంగా చూడాలి

**ఈనాడు, అమరావతి:** ఇంద్రకీలాద్రికి వచ్చే ప్రతి భక్తుడిని బంధువుల్లా చూసి వారికి ఆత్మీయంగా సేవలందించాలని దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సూచించారు. భక్తులు సంతృప్తిగా అమ్మవారి దర్శనం చేసుకుని, ప్రసాదం స్వీకరించి వెళ్లినప్పుడే ఆలయ ప్రతిష్ఠ పెరుగుతుందన్నారు. దుర్గగుడిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందిస్తున్న సేవలను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. దర్శనాలు, ప్రసాదం, పూజలు సహా అన్ని సేవల టిక్కెట్లు ఆన్‌లైన్‌లోనే తీసుకునేలా పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం అదనపు ఆన్‌లైన్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్లు, ఆలయ పరిసరాల్లో నిరంతరం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ శుభ్రంగా ఉంచాలన్నారు. వినియోగంలో లేని సామగ్రి ఎక్కడైనా ఉంటే వెంటనే గుర్తించి అక్కడి నుంచి తొలగించాలని ఆదేశించారు. ఆలయంలోని అన్నదానం, ప్రసాదంపోటు సహా జరుగుతున్న అన్ని ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రసాదాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని సూచించారు. భక్తుల సంతృప్తి స్థాయి పెరిగేలా అన్ని కోణాల్లోనూ పరిశీలించి సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### బ్రాయిలర్ ధరలు (కిలో ||కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.

**అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

## ముక్కోటి ఏకాదశి వేళ అప్రమత్తం

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. చిన్న అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా చూడాలన్నారు. సంయుక్త బృందాలు.. తనిఖీలు/పర్యవేక్షణలు చేయాలని పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వెంకటేశ్వరస్వామి ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. ముఖ్యంగా రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం, ప్రసాదాల పంపిణీ, వైద్య సేవలు తదితరాలపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు కంట్రోల్ రూమ్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. క్యూలైన్లు, బారికేడింగ్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్నపాటి తప్పిదం పెద్ద ప్రమాదానికి దారితీస్తుందనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేయాలని సూచించారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎన్.షణ్ముగం, ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రకటన/పోయినది

మా క్లయింట్ అయిన క్యానం హరిచంద్రప్రవీణ్, S/o. భగవాన్ దాస్, వయస్సు : 54 సం||లు., నివాసం: డోరు నెం. 23-1-4/ఎ, దాట్లవారివీధి, బి.ఆర్.టి.ఎస్. రోడ్డు, సత్యనారాయణపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ వాస్తవ్యులు గారి సంజాయిషీ పొంది తెలియజేయునది..

మా క్లయింట్ క్యానం హరిచంద్రప్రవీణ్ గారి తండ్రి గారు అయిన క్యానం భగవాన్ దాస్ గారు ది. 15/03/1994 తేదీన వెలిశెట్టి సుభద్రమ్మ గారి చేత సీతారాంపురంలో రెవెన్యూ వార్డు 11, డోరు నెం. 33-5-56 దాఖలా 49.6 చ.గ. స్థలమును గిఫ్ట్‌గా పొంది దానిని విజయవాడ సబ్ రిజిస్ట్రారు కార్యాలయం నందు డాక్యుమెంట్ నెం. 911/1994గా స్థిరాస్తి దఖలు దస్తావేజును రిజిస్టర్ చేయించుకొనివున్నారు.

సదరు భగవాన్ దాస్ గారు ది. 8/12/2002వ తేదీన పరమపదించారు. దర్మిలా నాక్లయింట్ అయిన క్యానం హరిచంద్రప్రవీణ్ సదరు ఆస్తి ఒరిజినల్ దస్తావేజులను తీసుకుని ది. 20/12/2025, 12.30 గం||లకు మధురానగర్ ఫుడ్ కోర్టు నుండి బయలుదేరి గుణదల పడవలరేవు సెంటర్‌కు వెళ్ళి చూడగా సదరు డాక్యుమెంట్ కలిగిన బ్యాగ్ కనబడలేదు. నాక్లయింట్ వెంటనే గుణదల పడవలరేవు సెంటర్ నుండి మధురానగర్ ఫుడ్ కోర్టు వరకు వెతికిననూ పైన తెలిపిన డాక్యుమెంట్‌తో కూడిన బ్యాగ్ కనబడివుండలేదు. అవి మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. కావున దయవుంచి ఎవరికైనా సదరు డాక్యుమెంట్ కలిగిన బ్యాగ్ దొరికినచో ఈక్రింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు. ఒకవేళ ఎవరైన సదరు నా క్లయింట్‌కు సంబంధించి పైన తెలిపిన ఒరిజినల్ దస్తావేజును ఉపయోగించి ఏవిధమైన లావాదేవీలు జరిపినచో నా క్లయింట్ తీసుకునే సివిల్ మరియు క్రిమినల్ కేసులకు బాధ్యులగుదురు.

ఇట్లు: **సి.హెచ్. వీర్రాజు**, అడ్వకేట్
# 24-11/2-31, భావాజీపేట, 3వ లైన్, దోనేపూడివారివీధి, విజయవాడ-3. ఫోన్ నెం: 98491 39522, 95058 19363

## అట్లప్రగడలో మైనింగ్ లీజు బదలాయింపు

**ఈనాడు, అమరావతి:** ఎ.కొండూరు మండలం అట్లప్రగడ గ్రామంలోని సర్వే నంబర్లు 84/14, 15లో మొత్తం 1.725 హెక్టార్ల విస్తీర్ణంలో క్వార్ట్జ్, మైకా ఖనిజాల మైనింగ్‌కు శ్రీదుర్గా మైన్స్‌కు అనుమతి ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రామిశెట్టి కిరణ్‌కుమార్ పేరుతో 2042 ఏడాది వరకు ఉన్న లీజు అనుమతిని.. శ్రీదుర్గామైన్స్‌కు గతంలోనే బదలాయించారు. దీనికి తాజాగా బదిలీ లీజ్ డీడ్ అమలు చేసేందుకు గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.


GOVERNMENT OF ANDHRA PRADESH
THE ANDHRA PRADESH SHILPARAMAM ARTS, CRAFTS AND CULTURAL SOCIETY
Plot No.56, Door no.54-16-1/18C, Road No.2, Central Excise Colony, Loyola College Road, Vijayawada-520008

SHORT TENDER NOTICE

Tender Notice No.393/AP Shilparamam/DC(HL)/ Crafts Mela/UH/VSKP/2025-26, dated: 29-12-2025

SLEALED TENDERS are invited for Superstructure,erection of octonum stalls 100 nos for "All-India Crafts Mela" sponsored by O/o DC(HL), MoT, GoI, New Delhi to be conducted at Shilparamam,Visakhapatnam from 08.01.2026 to 22.01.2026. The details of Tender documents are available with the O/o CEO, The APSACCS, Vijayawada on payment of Rs.1,000/- by way of DD in favour of CEO, The APSACCS, Vijayawada. Issue of Tender documents from 30.12.2025@10am to 02.01.2026@1.00pm.Last date for submission of Tenders on 02.01.2026@2.00pm at Office of the CEO, AP SACCS, Vijayawada Tenders will be opened on the same day at 3.00pm.For details, Website: www:https://shilparamam.ap.gov.in. please contact this no: 88866 52012.

Sd/- Chief Executive Officer



OFFICE OF THE EXECUTIVE ENGINEER
AP EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, NTR DISTRICT, VIJAYAWADA

'E' Procurement Short Tender Notice

Short Tender Notice No.06/DB/EE/APEWIDC/NTR/2025-26, Dated 29-12-2025.

Tenders are invited for Repairs to Disabled Hostel building and Repairs to SC Shopping Complex at NTR District work of 2 Nos. (Vide NIT. Nos. 16 to 17) of APEWIDC., Division in NTR District on e-procurement platform of Government of Andhra Pradesh. Further Details are can be viewed 'E' Procurement market place i.e., www.apeprocurement.gov.in.

Bid Document Downloading Start Date from: 30-12-2025.
Bid Document Downloading End Date: 06-01-2026 up to 3.00 PM.
Bid Submission Closing Date : 06-01-2026 up to 4.00 PM.
Bid Opening Date : 06-01-2026 @ 4.30 PM.

Note: Tender Published through online Executive Engineer, APEWIDC, Krishna, Machilipatnam

Sd/- Executive Engineer, APEWIDC, NTR, Vijayawada


### ప్రకటన

నా క్లయింటు, మెస్సర్స్ ఉద్యాన్ ప్రాజెక్టు, విజయవాడ, భాగస్వామ్య సంస్థ రిజిస్టర్డ్ నెం. 193/2023, తరపున మేనేజింగ్ పార్టనర్ శ్రీ నర్రా శ్రీకాంత్‌బాబు, తండ్రి (లేటు) నర్రా రామమోహనరావు, నిడమానూరు గ్రామ వాస్తవ్యుల నుండి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా,

నాక్లయింటు, ఈదిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి సంబంధించిన స్థల యజమానులైన 1) శ్రీ కొప్పురావూరి జయశివరామ్, తండ్రి అమరనాథం, శ్రీ కొప్పురావూరి శ్రీకృష్ణ, తండ్రి అమరనాథం, 3) శ్రీమతి తూనుగుంట్ల యూన్నీలక్ష్మి, భర్త పూర్ణచంద్రరావు, 4) శ్రీ కొప్పురావూరి అభినవ్, తండ్రి శ్రీకృష్ణ మరియు 5) శ్రీ పిన్నమనేని తిరుమలరావు, తండ్రి (లేటు) పి.ఎస్.కె.కుటుంబరావు గార్లకు సంబంధించి ఏకఖండంగా చేసికొనియున్న షెడ్యూలు దాఖలా ఆస్తినందు పెక్కు అంతస్తులుగా గల విల్లాలను, అపార్టుమెంట్లను నిర్మాణము చేయుటకు వారితో షరతులతో కూడిన డెవలప్‌మెంట్ ఒప్పందము చేసుకొనుటకు సూత్రప్రాయముగా అంగీకారము తెలియజేసి వారితో రిజిస్టర్డ్ ఒప్పందము చేసుకొనుటకు సంసిద్ధులైయున్నారు.

స్థల యజమానులలో ఒకరైన శ్రీ కొప్పురావూరి జయశివరామ్, తండ్రి అమరనాధం వారి స్వార్జితపు సొమ్ముతో ది. 11-05-1989న క్రయ దస్తావేజు నెం. 3926/1989, సబ్ రిజిస్ట్రీ, విజయవాడగా ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 159/3రులో య. 0.60 సెంట్ల భూమిని మరియు ది. 06-06-1989న క్రయ దస్తావేజు నెం. 4704/1989, సబ్ రిజిస్ట్రీ, విజయవాడగా డిటో సర్వే నెంబరునందు య. 0.60 సెంట్ల భూమిని క్రయం పొంది, తదాది వారి సర్వ స్వాధీన యాజమాన్య హక్కు, భుక్తములలోయున్న య. 1.20 సెంట్ల భూమిని,

స్థల యజమానులలో రెండవవారైన, శ్రీ కొప్పురావూరి శ్రీకృష్ణ, తండ్రి అమరనాధం వారి స్వార్జితపు సొమ్ముతో ది. 05-06-1989న క్రయ దస్తావేజు నెం. 4664/1989, సబ్ రిజిస్ట్రీ, విజయవాడ ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 159/3రులో య. 0.60 సెంట్ల భూమిని మరియు ది. 15-05-1989న క్రయ దస్తావేజు నెం. 4010/1989న సబ్ రిజిస్ట్రీ, విజయవాడగా డిటో సర్వే నెంబరు నందు య. 0.60 సెంట్ల భూమిని క్రయంపొంది తదాది వారి సర్వస్వాధీన యాజమాన్య హక్కు, భుక్తములలో యున్న య. 1.20 సెంట్ల భూమిని,

స్థల యజమానురాలలో మూడవ వారైన, శ్రీమతి తూనుగుంట్ల యూన్నీలక్ష్మి, భర్త పూర్ణచంద్రరావు ది. 31-03-1995న వారి తండ్రిగారైన శ్రీ కొప్పురావూరి అమరనాధం, తండ్రి చినకోటయ్య నెం. 3157/1995రు, సబ్ రిజిస్ట్రీ, విజయవాడగా వ్రాసి రిజిస్ట్రీ చేసియున్న దఖలు దస్తావేజు దాఖలా సంక్రమింపబడి తదాది వారి సర్వ స్వాధీన యాజమాన్య హక్కు, భుక్తములలో యున్న ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 195/1ఎ, 1బి, 1సిర్లు దాఖలా య. 0.50 సెంట్ల భూమిని,

స్థల యజమానులలో నాలుగవ వారైన శ్రీ కొప్పురావూరి అభినవ్, తండ్రి శ్రీకృష్ణ గారికి వారి తాతగారైన శ్రీ కొప్పురావూరి అమరనాధం, తండ్రి చినకోటయ్య ది. 23-02-2022న నెం. 1334/2022రు, జిల్లా రిజిస్ట్రీ, విజయవాడ తూర్పు, గుణదలగా వ్రాసి రిజిస్ట్రీ చేసియున్న దఖలు దస్తావేజు దాఖలా ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 195/1ఎరుగా య. 0.07 సెంట్లు, నెం. 195/1బి రుగా య. 0.43 సెంట్ల భూమి మరియు నెం. 195/1సి రుగా య. 0.52 సెంట్లు భూమి ఏకఖండంగాగల య. 1.02 సెంట్ల భూమి సంక్రమింపబడిన దరిమిలా అందు నెం. 195/1సి రులోని భాగమైన య. 0.20.60 సెంట్ల భూమిని పరివర్తన దస్తావేజు దాఖలా ఇతరులకు సంక్రమింపచేయగా మిగిలియున్న య. 0.81.4 సెంట్ల భూమి మరియు తత్ పరివరివర్తన దస్తావేజు దాఖలా ఆర్.ఎస్. నెం. 195/2బి రులోని య. 0.05.1/4 సెంట్ల భూమి సంక్రమింపబడిన తదాది వారి సర్వ స్వాధీన యాజమాన్య హక్కు, భుక్తములతోయున్న య. 0.86.65 సెంట్ల భూమిని,

స్థల యజమానులలో ఐదవ వారైన, శ్రీ పిన్నమనేని తిరుమలరావు, తండ్రి (లేటు) పి.ఎస్.కె. కుటుంబరావు గారు ది. 01-11-2023న క్రయ దస్తావేజు నెం. 7379/2023, జిల్లా రిజిస్ట్రీ, విజయవాడ తూర్పు, గుణదలగా సంక్రమించియున్న ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 195/1సి రుగా య. 0.20.6 సెంట్లు భూమిని,

పైన ఉదహరించిన 1 నుండి 5ర్లు స్థలయజమానులు వారి వారి విస్తీర్ణములను ఏకఖండంగా చేసుకొని, అందు పెక్కు అంతస్తులతో కూడిన, విల్లాలను/అపార్టుమెంట్ కాంప్లెక్సులను నిర్మించుట వారికి లాభదాయకమని భావించి, నా క్లయింటును సంప్రదించగా, నా క్లయింటు సూత్రప్రాయముగా అంగీకరించి వారితో ఒప్పందము చేసికొనుటకు సంసిద్ధులైయున్నారు. మరియున్నూ, సదరు స్థల యజమానులు షెడ్యూలు దాఖలా ఆస్తి తమ సర్వ స్వాధీన యాజమాన్య హక్కు, భుక్తములలో యున్న నిర్వివాదమైన ఆస్తియన్నీ, నా క్లయింటుకు తెలియచెప్పిన దరిమిలా, నా క్లయింటు సదరు నిర్మాణము చేయుటకు సూత్రప్రాయముగా అంగీకరించి, వారితో ఒప్పందము చేసుకొనుటకు సంసిద్ధులైయున్నారు. సదరు విషయమై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ, క్లెయిములు గానీ, మరి యే యితర మనోవర్తి దావాలు, హక్కులు గానీ ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి ఏడు రోజులలో లిఖితపూర్వకముగా తగిన ఆధారములతో ఈ దిగువ చిరునామాకు రిజిస్టర్డ్ పోస్టు తిరుగు రశీదు ద్వారా తెలియచేయవలసినదిగా కోరడమైనది. సదరు గడువు తేదీలోగా చట్టప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ, క్లెయిములు గానీ రానియెడల నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి, సదరు స్థలయజమానులతో పరస్పర అంగీకారంతో కూడిన రిజిస్టర్డ్ ఒప్పందమును చేసికొనగలరు. తదుపరి వచ్చు క్లెయిములు నా క్లయింటును గానీ సదరు ఆస్తిని గానీ ఏ విధంగానూ బైండు చేయజాలవు.

**షెడ్యూలు:** ఎన్.టి.ఆర్. జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయ పరిధి, విజయవాడ రూరల్ మండలం, ఎనికేపాడు గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన, ఎనికేపాడు గ్రామ ఆర్.ఎస్. నెం. 159/3, 195/1ఎ, 195/1బి, 195/1సి మరియు 192/2బిర్లు దాఖలా ఏకఖండంగా గల య. 3.97.25ట్లు లేక హె. 1.616ర్లు భూమికి **హద్దులు. తూర్పు:** వల్లభనేని రాజేష్ మరియు స్వరూపరాణి గార్ల ఆస్తి. **దక్షిణం:** వల్లభనేని మాధవరావు మరియు ఇతరుల ఆస్తి. **పడమర:** పల్లవి రైస్ మిల్ వారి భూమి. **ఉత్తరం :** గ్రామ పంచాయతీ రోడ్డు మరియు ఇతరుల ఆస్తి. ఈ పై నాలుగు హద్దుల మధ్య య. 3.97.25 ట్లు లేక హె. 1.616ర్లు భూమి మరియు యావత్ యీజ్‌మెంట్ హక్కులతో సహాయున్నూ.

**Dr. ధారా సత్యనారాయణ**, Advocate,
డోరు నెం. 36-12-13/3, డా. కీలారు బుచ్చిబాబు వీధి, మొఘల్రాజపురం,
విజయవాడ-520 010, Cell No. 94403 20435. Phone No. 0866 - 2573736.
విజయవాడ, ది. 27-12-2025

---

## సెమీఫైనల్స్‌కు సీనియర్, జూనియర్ జట్లు


Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Digital Partner: ETV Bharat, ఈనాడు.నెట్ FM Partner: Mee FM TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Organised by ఈనాడు


న్యూస్‌టుడే - విజయవాడ క్రీడలు

కానూరులోని కేవీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రజెంట్స్) 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025 ఉత్కంఠగా సాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో సీనియర్ విభాగంలో పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల, వాసవి ఇంజినీరింగ్ కళాశాల జట్లు, జూనియర్ విభాగంలో విశ్వశాంతి జూనియర్ కళాశాల జట్టు సెమీఫైనల్స్‌లో ప్రవేశించాయి.

KAMINENI HOSPITALS VIJAYAWADA

### ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..

పి.ప్రభు టి.ఇస్సాకు కె.వరుణ్‌రెడ్డి

### 10 పరుగుల ఆధిక్యంతో విజయం

తొలి మ్యాచ్‌లో పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 పరుగుల తేడాతో కేబీఎన్ డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన కేబీఎన్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన పొట్టి శ్రీరాములు కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. పి.ప్రభు 43 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ ఎం.కార్తిక్ ఎనిమిది పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన కేబీఎన్ కళాశాల జట్టు ఆరు వికెట్ల నష్టానికి 66 పరుగులు మాత్రమే చేసింది. మహేంద్ర 40 పరుగులు చేశాడు. ప్రత్యర్థి బౌలర్ వి.జోయ్ శ్యామ్ ఏడు పరుగులు ఇచ్చి రెండు, పి.నిఖిల్ అయిదు పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పి.ప్రభు ఎంపికయ్యాడు.

### ఆరు వికెట్ల తేడాతో గెలుపు

రెండో మ్యాచ్‌లో వాసవి ఇంజినీరింగ్ కళాశాల జట్టు ఆరు వికెట్ల తేడాతో ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన లయోలా జట్టు నిర్ణీత పది ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. ఎస్.లక్ష్మీనరసింహ 33 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. వై.అరవింద్ 18 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ సీహెచ్ వంశీ మూడు పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన వాసవి కళాశాల జట్టు 8.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టి.ఇస్సాకు 30 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ఎస్కే రికిబ్ 12 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ కె.రోహిత్ 16 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా టి.ఇస్సాకు నిలిచాడు.

### సెంచరీ దాటిన పరుగులు

మూడో మ్యాచ్‌లో విశ్వశాంతి జూనియర్ కళాశాల జట్టు 45 పరుగుల తేడాతో దీక్ష జూనియర్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన దీక్ష జట్టు బౌలింగ్ తీసుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన విశ్వశాంతి జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. కె.వరుణ్‌రెడ్డి 28, వరుణ్ కిండో 25 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ కె.అజేయుడు 14 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన దీక్ష జట్టు అయిదు వికెట్లు కోల్పోయి 58 పరుగులకే పరిమితమైంది. ఎస్కే గౌస్ 16 పరుగులు చేశాడు. ప్రత్యర్థి బౌలర్ ఎండీ సిద్ధిక్ మూడు పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కె.వరుణ్‌రెడ్డి ఎంపికయ్యాడు.

### నేటి మ్యాచ్‌ల వివరాలు

- ★ పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల × వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల (మొదటి మ్యాచ్)
- ★ శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల × నలంద డిగ్రీ కళాశాల (రెండో మ్యాచ్)
- ★ విశ్వశాంతి జూనియర్ కళాశాల × ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల (మూడో మ్యాచ్)

## రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే ఉమ్మడి కృష్ణా జిల్లా 28వ అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల రీజనల్ స్పోర్ట్స్ మీట్-2025ని వారు ప్రారంభించారు. బెలూన్లు, కపోతాలు ఎగురవేశారు. ఎంపీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా సీఎం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల మైదానాలు కేశినేని ఫౌండేషన్ ద్వారా తన సొంత నిధులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించడంలో సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్య ప్రాంతీయ సంచాలకుడు జీవీ రామచంద్రరావు, ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, డిపార్ట్‌మెంట్ అధికారి సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో ఆడుతున్న బాలికలు

● చెస్ బాలురు విభాగంలో డీవీఆర్ అండ్ డాక్టర్ హెచ్ఎస్ఎంఐసీ కళాశాల (కంచికచర్ల) ప్రథమ, ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ద్వితీయ, బాలికల విభాగంలో శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల (కలవపాముల) ప్రథమ, ఎంవీఆర్ కళాశాల (పరిటాల) ద్వితీయ, బ్యాడ్మింటన్ బాలురు సింగిల్స్‌లో వీకేఆర్ అండ్ వీఎన్‌బీ (గుడివాడ) ప్రథమ, ఎంఐసీ కళాశాల (కంచికచర్ల) ద్వితీయ, డబుల్స్‌లో ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ప్రథమ, నూజివీడు పాలిటెక్నిక్ కళాశాల (నూజివీడు) ద్వితీయ, టేబుల్ టెన్నిస్ బాలురు సింగిల్స్, డబుల్స్‌లో ఎంవీఆర్ (పరిటాల) ప్రథమ, ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ద్వితీయ, బాలికల సింగిల్స్, డబుల్స్‌లో ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ (గుడ్లవల్లేరు) ప్రథమ, శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల (కలవపాముల) ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.


మా కస్టమర్లకు & శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు
2026
స్పెషల్ కేక్స్ లభించును
NOTE We have only One Branch in Vijayawada
Navrang Bakery
నవరంగ్ బేకరీ
కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు, నవరంగ్ థియేటర్ దగ్గర
విజయవాడ-2. ఫోన్: 0866-2576908, 2576927.
@navrangbakeryofficial


## సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రారంభం

**ఆటోనగర్, న్యూస్‌టుడే:** అనుభవం కలిగిన డైరెక్టర్ల సారథ్యంలో ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ రూ.5 వేల కోట్ల టర్నోవర్ సాధించిందని ఎండీ ఎం.నరేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం ఆటోనగర్‌లో సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ 44వ శాఖను మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు ప్రారంభించారు. మానం మాట్లాడుతూ 1997లో ప్రారంభించిన సొసైటీ... ఆదాయం పొందే విషయంలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఎండీ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో మరో రెండు శాఖలు ప్రారంభిస్తామని ప్రకటించారు. లక్షా పది వేల మంది సభ్యులతో రూ.2500 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు. గత సంవత్సరం రూ.100 కోట్ల నికర లాభం వచ్చిందని వెల్లడించారు. ఎఫ్‌డీలపై నెలవారీ వడ్డీలతో పాటు తనఖా, బంగారంపై రుణ సౌకర్యం ఉందని అన్నారు. మాజీ ఐపీఎస్ అధికారి ఎ.రవిచంద్ర, విశ్రాంత ఆంధ్రాబ్యాంకు జనరల్ మేనేజర్ బి.రామబ్రహ్మం మాట్లాడుతూ.. సహకార రంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ బ్యాంకును మరింత వృద్ధిలోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. వైస్ ఛైర్మన్ వీపీఎస్ రాజు, సలహాదారు వెంకట సుబ్బయ్య, ఆటోనగర్ బ్రాంచ్ మేనేజర్ స్రవంతి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మానం ఆంజనేయులు

## ఉద్యోగ సంఘ కాలమానిని ఆవిష్కరణ

ఏపీ జలవనరులు, ఆర్అండ్‌బీ, ప్రజారోగ్యం, పీఆర్, మున్సిపల్ ఉద్యోగుల రాష్ట్ర అసోసియేషన్ రూపొందించిన 2026 సంవత్సర కాలమానిని, దైనందినులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సచివాలయంలో సోమవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.కలందర్, ప్రధాన కార్యదర్శి వి.జి.నాయుడు, గౌరవాధ్యక్షుడు డి.జి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎ.ధర్మారావు పాల్గొన్నారు. - **ఎన్టీఆర్ కలెక్టరేట్**

### ధర వరలు

వంకాయలు-20/24, టమాటా-47, బెండ-34, పచ్చిమిర్చి-40, కాకర-50, బీర-34/40, క్యాలీ ఫ్లవర్-30/25, క్యాబేజి-22, క్యారెట్-32, దొండ-36, బంగాళదుంప-24, ఉల్లిపాయలు-30, గోరుచిక్కుళ్లు-40, దోస-32/40, సొర-18/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-76, మునగ-14/15, కీరదోస-34, బీన్స్-76, క్యాప్సికమ్-56 , కొత్తిమీర-6/12 (నిన్నటివి). - **ఎన్టీఆర్ కలెక్టరేట్**

## ప్రణాళికాబద్ధంగా ఉర్దూ భాషాభివృద్ధి

**విద్యాధరపురం, న్యూస్‌టుడే:** ప్రణాళికబద్ధంగా ఉర్దూ భాషను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకొని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. భారతీయ భాషల్లో ఉర్దూకు ఘన చరిత్ర, అధిక ప్రాధాన్యం ఉందన్నారు. ఉర్దూ నుంచి ఉద్భవించిన కవితలు, గేయాలు, పద్యాలు బాహ్య ప్రపంచంలో విస్తరించాయని చెప్పారు. మహ్మద్ ఇక్బాల్, గాలిబ్ వంటి ప్రముఖుల కవితలు స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నింపాయన్నారు. సిక్కులు, హిందువులు సైతం ఉర్దూను ప్రేమించేవారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయంలోనే కర్నూల్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్ మీరా ఉర్దూ భాషా విశిష్ఠత గురించి వివరించారు. ఈసందర్భంగా ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూక్ షుబ్లీ పర్యవేక్షణలో నిర్వహించిన క్రికెట్ పోటీలో విజేతలకు మంత్రి ఫరూక్, ఎంపీ శివనాథ్ ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్ పాల్గొన్నారు.

వేదికపై మంత్రి ఫరూక్, ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బోడే ప్రసాద్, కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా తదితరులు

## పీజీఆర్ఎస్‌లో జిల్లాను ప్రథమంగా నిలబెడదాం

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా అధికారులను కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ఆయా సమస్యల పరిష్కారానికి బాధ్యాతాయుతంగా పని చేసి, పీజీఆర్ఎస్‌లో జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందు వరుసలో నిలబెట్టాలని సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ.. భూములు, తాగునీరు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మొత్తం 202 అర్జీలు స్వీకరించారు. వీటిలో అధికంగా రెవెన్యూ శాఖకు 49, పురపాలక/పట్టణాభివృద్ధి 40, వైద్య.. ఆరోగ్య శాఖ 23, డీఆర్డీఏ 15, పోలీస్ 12, విద్యుత్తు 9, మిగతావి ఇతర విభాగాలకు చెందినవి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ నాంచారరావు, జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా


91.9 FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297



EENADU e Classifieds

AUTO
VEHICLES FOR SALE

AP39SJ-1204 ESCORTS KUBOTA Euro 42 Plus Tractor-2023 Model is for Sale in as is where is Condition ★ Sundaram Finance Ltd. ✆ 94409 09726

AP40 AT-3203 MAHINDRA 575 DI XP Plus TRACTOR-2023 Model is for Sale in as is Where is Condition ★ Sundaram Finance Ltd. ✆ 94409 09726.

BUSINESS SERVICES

బంగారం కొనబడును.బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. ✆ 81422 92071

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

JOBS

Wanted Lady Office Assistant with 2years Exp. in Tally ERP 9 & Accounts. Srinivasa Pharma, Ramavarappadu. ✆ 79977 24048

ప్రముఖ రియల్ ఎస్టేట్స్‌లో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. జీతం+ కమీషన్ ఇవ్వబడును. సంప్ర ✆ 93906 65999.

ఎన్టీఆర్, కృష్ణ జిల్లాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థలో కలెక్షన్ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అనుభవం+ఫ్రెషర్స్. టూ వీలర్. ✆ 90322 31756, 63004 90073

విజయవాడలోని షోరూమ్‌కి లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. టైమింగ్స్ 10AM-8PM, గాంధీనగర్, విజయవాడ. శాలరీ: 12000/-. ✆ 93922 22771

VJA బందరురోడ్డు టీసెంట్ రోడ్ షాపింగ్‌మాల్స్ నందు హౌస్ కీపింగ్‌లో అనుభవం గల లేడీస్/బాయ్స్ కావలెను (విడిగా రూమ్ కలదు). ✆ 97044 33644.

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్‌కి అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్. A:25-30Y, S:18-25K, Q:డిగ్రీ. లేడీటెలీకాలర్ కావలెను. ✆ 99495 58181, 81215 58181

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

# తిరువూరు

• తిరువూరు • మైలవరం

## 2 నుంచి రెవెన్యూ గ్రామ సభలు

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** తిరువూరు నియోజకవర్గంలో భూములు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జనవరి 2 నుంచి 9 వరకు నిర్వహించనున్న రెవెన్యూ గ్రామసభల వివరాలను తహసీల్దార్లు సోమవారం తెలిపారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో 2025 నాటికి 12 గ్రామాల్లో రీసర్వే పూర్తి కాగా, రైతులకు ఇచ్చేందుకు 9,747 కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అధికారులు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో వీటిని పంపిణీ చేసేందుకు ఆయా గ్రామాల్లో షెడ్యూల్ మేరకు గ్రామ సభలు నిర్వహిస్తారు. సోమవారం జిల్లా రెవెన్యూ కార్యాలయం నుంచి కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు మండల కేంద్రాల్లోని రెవెన్యూ కార్యాలయాలకు చేరాయి.

### మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? తాతకుంట్ల గ్రామంలోని పలు కాలనీల్లో వీధుల వెంట పిచ్చిచెట్లు పెరిగాయి. **- స్థానికులు** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. **- గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, తాతకుంట్ల** – న్యూస్‌టుడే, విస్సన్నపేట

? మునగపాడులోని పాలకేంద్రం సమీపంలో కృష్ణా జలాల పైపులైన్ లీకై నీరంతా గ్రామంలోని సీసీ రోడ్డుపై వృథాగా పోతుంది. **- చిట్టెం వెంకటేశ్వరరావు, గ్రామస్థుడు** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికడతాం. **- దయానంద్ సీపీడబ్ల్యూఎస్ స్కీం సహాయక ఇంజినీరు** – న్యూస్‌టుడే, జి.కొండూరు

? ఎన్టీటీపీఎస్ పాత గేటు వద్ద రక్షిత నీటి పైపులైన్ లీకైంది. కొన్ని రోజుల నుంచి నీరు పోతున్నాయి. ఈ విషయాన్ని నీటి సరఫరా సిబ్బందికి తెలియజేసినా స్పందన లేదు. **- షరీఫ్, స్థానికుడు** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- వాసు, తాగునీటి సరఫరా పర్యవేక్షకుడు** – న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

## రహదారులపై కొత్త ఏడాది వేడుకలొద్దు

**ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే :** నూతన సంవత్సర వేడుకల పేరుతో రహదారులపై, కూడళ్లలో ఎటువంటి కార్యక్రమాలకు అనుమతులు లేవని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. విజయవాడ కమిషనరేట్ వ్యాప్తంగా ఇటువంటి వాటిపై ఉన్నతాధికారులు తగు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇబ్రహీంపట్నం స్టేషన్ పరిధిలోని రెండు జాతీయ రహదారులతో పాటు గ్రామాలు, పురపాలికల్లోని ప్రధాన వీధుల్లో ఎక్కడా వేడుకలు నిర్వహించకూడదని చెప్పారు. అటువంటి కార్యక్రమాలు ఎవరైనా తలపెడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## రక్షణ పరికరాలు లేక.. విధులు సాగక..

**ఇబ్రహీంపట్నం (గ్రామీణం, కొండపల్లి), న్యూస్‌టుడే**

... దీంతో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా చలిలో విధులు నిర్వహించడం వల్ల కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఎక్కువ మంది జలుబు, దగ్గు, గొంతు నొప్పి జ్వరాలతో బాధపడుతున్నారు. తమ కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదని నియోజకవర్గ పరిధిలోని పారిశుద్ధ్య ...

చలిలో వీధి శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

### ఏడాదికి రెండేసి చొప్పున..

... కతో పాటు 56 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 750 మంది కార్మికులు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. వీరందరూ రోజు 169 కిలో మీటర్ల పొడవునా ఉన్న రోడ్లను శుభ్రం చేయాలి. ఇంటింటా తిరిగి 370 టన్నులకు పైగా చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు, సంపద ...

... స్థానిక సంస్థల అధికారుల వద్ద ప్రస్తావించగా వారు ఇలా స్పందించారు. కార్మికులు చలికి ఇబ్బందులు పడకుండా స్థానిక సంస్థల పరంగా చొరవ తీసుకుంటామని తెలిపారు. స్వెట్టర్ల కొనుగోలుకు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని చెప్పారు.

## విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

## స్పందించారు.. చర్యలు తీసుకున్నారు

## వర్గీకరణతో మాదిగలకు మేలు

... ఇది మందా కృష్ణమాదిగ నేతృత్వంలో సాకామైందని చెప్పారు. మాదిగల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక తిరువూరు రోడ్డులోని అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరాస్వామి, బెనర్జీ, ఏసు, జమలయ్య పాల్గొన్నారు.

## ప్రతిభ చాటారు.. విజేతగా నిలిచారు

బహుమతులు పొందిన వారితో అధ్యాపకులు

**మైలవరం, న్యూస్‌టుడే :** స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు జనరల్ నాలెడ్జి అంశంపై క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో కె.నందిని, సీహెచ్.రామ్‌చరణ్(హెచ్ఈసీ, ప్రథమ ఏడాది), టి.మయూష్‌సాయి(ఒకేషనల్, మొదటి సంవత్సరం) విద్యార్థులు వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. వీరికి కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కేపీ శ్వేత, అధ్యాపకులు బహుమతులు అందజేసి అభినందించారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

## పన్ను వసూలు వేగవంతం చేయండి

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే :** ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని తిరువూరు డీడీవో ఎ.వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం రెడ్డిగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమై మాట్లాడారు. గ్రామాల వారీగా ఇంటి పన్నులు వసూళ్ల వివరాలు తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమీక్షిస్తున్న వెంకటరమణ

## అన్నదాతలకు విస్తృత సేవలందిస్తాం

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే :** రెడ్డిగూడెం పీఏసీఎస్ పరిధిలో రైతులకు సకాలంలో రుణాలు అందించడం, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అమలులో ఆదర్శంగా నిలవడం, సిబ్బంది పనితీరు తదితర అంశాల్లో రాష్ట్ర స్థాయిలో రెండు స్థానం సాధించి, అవార్డు పొందడం హర్షణీయమని పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీఎస్‌కు రూ.25 వేలు చెక్కుతో పాటు అవార్డు అందజేసినట్లు ఆయన చెప్పారు. రాబోయే రోజుల్లో అన్నదాతల ఆర్థికాభివృద్ధి, సాంకేతిక సాయంతో రుణాలు పంపిణీ, సంక్షేమ పథకాలు అమలులో మరింత వేగం పెంచుతామన్నారు.

అవార్డు అందుకుంటున్న రెడ్డిగూడెం పీఏసీఎస్ సిబ్బంది

## షాబుఖారీ దర్గా ఉరుసు ప్రారంభం

**కొండపల్లి, న్యూస్‌టుడే :** కొండపల్లి సయ్యద్ షాబుఖారీ దర్గా ఉరుసు మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. మొదటి రోజు జరిగిన ఉరుసు మహోత్సవానికి జిల్లాయేతర ముస్లిం భక్తులు చేరుకొని దర్గా ఆవరణలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫకీర్ల మేళతాళాలు హోరెత్తించాయి. అంతకు ముందు ఏడీసీపీ రామకృష్ణ దర్గా వద్దకు చేరుకొని ఉరుసు కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. లంగర్ ఖానా ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తెదేపా నాయకుడు జంపాల సీతారామయ్య ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలను ఉరుసు, దర్గా అభివృద్ధి కమిటీలు, ముజావర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పర్యవేక్షించారు.

కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న ఏడీసీపీ రామకృష్ణ

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** ధనుర్మాస సందర్భంగా తిరువూరు, గంపలగూడెం మండలాల్లోని వైష్ణవాలయాల్లో సోమవారం అర్చకుల ఆధ్వర్యంలో గోదారంగ నాయక స్వామికి పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో మూలవిరాట్‌లను అలంకరించారు. భక్తులు గోదాదేవి తిరుప్పావై పాశురాలు పఠించారు.

ఊటుకూరు రామాలయంలో గోదాదేవికి పూజ చేస్తున్న అర్చకుడు

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** మండలంలోని శివ క్షేత్రాల్లో సోమవారం అర్చకులు శివలింగాలకు పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. కొత్తపల్లి గుడిలో కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉమాగౌరీశంకరునికి పూజలు జరిపారు. ఎ.కొండూరు మండలం కంభంపాడు శివాలయంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

**గంపలగూడెం:** తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని భావించి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచే ఉత్తర ద్వారంలో ఉత్సవమూర్తుల దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

గోసవీడు: అలంకరణలో శ్రీకృష్ణపరమాత్మ

**మైలవరం, న్యూస్‌టుడే :** ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్వీ.సుధాకరరావు నేతృత్వంలో నిర్వహించే వేడుకల్లో భాగంగా ప్రతి ఏటా తెల్లవారుజాము 4 గంటల నుంచే దర్శన అవకాశాలను కల్పిస్తున్నారు. దాంతో పాటు స్థానిక కోదండ రామాలయం, వినాయకుడి గుడి, శిర్డీ సాయిబాబా మందిరాల్లోనూ ఏర్పాట్లు జరిగాయి.

**కొండపల్లి:** కొండపల్లి చెన్నకేశవ, రామాలయం, ఇబ్రహీంపట్నం వెంకటేశ్వర స్వామి ఆలయాల ప్రాంగణంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశామని అర్చకులు తెలిపారు.

## వ్యవసాయ విద్యుత్తుకు వినతి

**ఎన్టీఆర్ కలెక్టరేట్:** వ్యవసాయ భూముల్లో విద్యుత్తు సౌకర్యం పొందడానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరుతూ మైలవరం మండలం పుల్లూరుకు చెందిన పలువురు గిరిజనులు విజయవాడ కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రాలు అందజేశారు. తమకు అటవీ భూముల హక్కు పత్రాలు మంజూరయ్యాయని, బోర్లు వేసినా.. విద్యుత్తు కనెక్షన్లు లేవని వివరించారు.

అర్జీలు పూరిస్తున్న గిరిజనులు

## ప్రజా.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

**తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే**

| రెవెన్యూ కార్యాలయం | అర్జీలు | పరిష్కారం |
|---|---|---|
| డివిజనల్ రెవెన్యూ | 377 | 321 |
| ఎ.కొండూరు | 196 | 181 |
| గంపలగూడెం | 535 | 512 |
| రెడ్డిగూడెం | 177 | 170 |
| తిరువూరు | 604 | 583 |
| విస్సన్నపేట | 361 | 348 |

తిరువూరు డివిజన్‌లోని రెవెన్యూ కార్యాలయాల్లో ఈ సంవత్సర కాలంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ఈ నెల 22 వరకు ప్రజల నుంచి 2,250 వినతులు అందగా వాటిలో 2,115 సమస్యలు పరిష్కరించినట్లు ఆర్డీవో కె.మాధురి వివరించారు. మిగిలిన 135 దరఖాస్తులను కూడా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు ఆమె చెప్పారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కూడా ఆర్డీవో కార్యాలయం, తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం రెవెన్యూ కార్యాలయాలకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో మొత్తం 20 అర్జీలు అందాయని వెల్లడించారు. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖలకు సంబంధించిన అర్జీలు అధికంగా వచ్చాయన్నారు. ఇవన్నీ సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారు.

ఆర్డీవో మాధురికి దరఖాస్తు అందజేస్తున్న ఫిర్యాదుదారు

## వాగా.. డంపింగ్ యార్డా?

రెడ్డిగూడెం పంచాయతీలోని కోతుల వాగులో కొందరు చెత్త, వ్యర్థాలు పడవేయడంతో డంపింగ్ యార్డుగా మారుతుంది. ప్రస్తుతం వాగులో నీటి ప్రవాహం లేకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని వాగు సమీపంలోని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యర్థాలను కుక్కలు రహదారిపైకి తీసురావడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

## కోతలు.. తరచూ ప్రమాదాలు

మండలంలోని గణపవరం నుంచి అడవినెక్కలం అడ్డరోడ్డు వరకు వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. దాదాపు ఆరు కిలో మీటర్ల పొడవున ఉన్న రోడ్డు అంచులు దీర్ఘకాలంగా కోతకు గురయ్యాయి. దీంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లాల్సి వస్తే పూర్తిగా నిలిచిపోవాల్సి వస్తోంది. ఆగకుండా ముందుకు వెళ్తే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ఒక యువకుడు ప్రాణాలు సైతం కోల్పోవడానికి కోతకు గురైన అంచులే కారణమని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కనీసం గ్రావెల్‌తో అయినా రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

## యూరియా కొంటే బిల్లులు తీసుకోవడం తప్పనిసరి

**తిరువూరు టౌన్, న్యూస్‌టుడే :** తిరువూరులోని పలు ఎరువుల దుకాణాల్లో గుంటూరు డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వారి కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు విక్రయిస్తున్నారా? లేదా అని రికార్డులు పరిశీలించారు. లైసెన్స్‌ల్లో స్టోర్ ధ్రువపత్రం లేని దుకాణదారులకు షోకాజ్ నోటీసులు అందించారు. 6,840 టన్నుల యూరియా అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అన్నదాతలు యూరియా కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. స్థానిక వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారిణి పాల్గొన్నారు.

**గంపలగూడెం:** మండలం నుంచి సరిహద్దులో ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలకు యూరియా అక్రమంగా తరలించకుండా 14 చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి వి.హరీష్ కుమార్ సోమవారం తెలిపారు. మండలంలో ఈ ఏడాది రబీలో సాగు చేసిన పంటలకు కొరత లేకుండా 520 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందన్నారు.

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే :** మండల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఏవో డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు చేపట్టారు. యూరియా నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. ఎవరైనా యూరియాను ఎక్కువ ధరకు విక్రయిస్తే వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

**జి.కొండూరు, న్యూస్‌టుడే :** జి.కొండూరు మండల వ్యాప్తంగా యూరియా నిల్వలు 147 టన్నులు ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి సూరిబాబు తెలిపారు. సొసైటీల్లో 88, గ్రోమోర్ 40, ప్రైవేటు దుకాణాల్లో 19 టన్నుల చొప్పున అందుబాటులో ఉంచామని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తిరువూరు: దస్త్రాలు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

రెడ్డిగూడెం: తహసీల్దార్ సుశీలాదేవి, ఏవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు

## కార్మికులకు అండగా సీఐటీయూ

**మైలవరం, న్యూస్‌టుడే :** దేశవ్యాప్తంగా అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.సుధాకర్ పేర్కొన్నారు. ఈ నెల 31 నుంచి విశాఖపట్నంలో నిర్వహించనున్న సంఘం మహాసభల్లో పాల్గొనే కార్మికులకు సోమవారం గుర్తింపు కార్డులు అందించారు. వీటికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొండపల్లిలో ద్విచక్ర వాహన ర్యాలీ

**విస్సన్నపేట :** సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార జాతను సంఘ విస్సన్నపేట మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు విస్సంపల్లి నాగరాజు, మేకల జ్ఞానరత్నం, మర్రిబోయిన అప్పారావు, పోతురాజు శ్రీనివాసరావు, గంజిన బోయిన రాము తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట : ప్రచార జాతను ప్రారంభిస్తున్న సీఐటీయూ, ప్రజా సంఘాల శ్రేణులు

**కొండపల్లి:** సీఐటీయూ మహాసభల నేపథ్యంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కొండపల్లి పారిశ్రామిక వాడలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్, గోపాలకృష్ణ, రంగబాబు, బాలరాంబాబు, భాస్కర్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం : గుర్తింపు కార్డులు అందిస్తున్న సుధాకర్ తదితరులు

## మైలవరం విద్యార్థి ప్రతిభ

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని 'డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా సమర్థవంతమైన, త్వరితగత పరిష్కారం', వినియోగదారుల హక్కులు, వారి ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో సాంకేతికత పాత్ర ...

## వెల్వడంలో కార్డన్ సెర్చ్

**మైలవరం:** మండలంలోని వెల్వడంలో సోమ...

## వృద్ధురాలి నేత్రదానం

## పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలి

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే :** పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలని రూరల్ ...

## నమూనా పరీక్షా పత్రాలు పంపిణీ

## టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

## యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

### బహిరంగ ప్రకటన

నా క్లయింటు యన్.టి.ఆర్. జిల్లా, మైలవరం మండలం, మైలవరం గ్రామం కాపురస్తురాలైన షేక్ షహీదాబేగం, W/o రబ్బాని, తండ్రి సయ్యద్ అబ్దుల్ ఖాదర్ తెలుపుకొను బహిరంగ ప్రకటన.

నా క్లయింటు మైలవరం గ్రామంలో ది. 1-2-1994వ తేదీన షేక్ శిలార్ సాహెబ్ కుమారుడు షేక్ ఆదాం వద్ద ది. 1-2-1994 1వ వార్డు ఖాళీ నివేశన స్థలం కొనుగోలు చేసి మైలవరం సబ్ రిజిస్ట్రారు ఆఫీసు నందు ...

V.T. KISHORE, Advocate
D.No. 14-76, Mylavaram,
NTR Dist. 521230

# విజయవాడ తూర్పు

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM 80085 74652

❖ 3వ డివిజన్ బాయిజ్ రహదారి, కనకదుర్గ నగర్ ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి రవీంద్ర మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల పొగ, మందులు చల్లించారు.

❖ నాలుగో డివిజన్ కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి సాంబశివ రావు ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పూడిక తీయించారు.

❖ 13వ డివిజన్ ఆటోనగర్ చెక్ పోస్టు సెంటర్ కృష్ణా నగర్ 13-57/5 విద్యుత్ స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి రమేష్ బాబు ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

స్పందనకు వందనం

## పేదలకు చీరలు.. దుప్పట్ల పంపిణీ

కృష్ణలంక, న్యూస్‌టుడే: క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాణిగారితోట సెంటర్‌లో సోమవారం పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఉస్రేల రాహేల్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టిన పంపిణీ కార్యక్రమానికి పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజా కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు, ఆళ్లమళ్ల సుబ్రహ్మణ్యం, సంగుల పేరయ్య, బంక శివ, పాశం అంజనేయులు, వేముల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 18 ఫిర్యాదులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రమాదాల నివారణకు వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ ధ్యానచంద్రకు వినతులు అందాయి. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ఆయన వినతులు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ సమస్యలను గడువులోపు పరిష్కరించాలని, అది తిరిగి ఉత్పన్నం కాకుండా చూడాలని సూచించారు. వివిధ సమస్యలపై 18 ఫిర్యాదులు అందాయి. అధికారులు కె.సంజయ్ రత్నకుమార్, కె.అర్జునరావు, సత్యకుమారి, అమృత్, లత, బి.సత్యనారాయణమూర్తి, చంద్రశేఖర్, నరేష్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిధులు రాక.. నిర్వహణ లేక!

### కళావిహీనంగా పోషణ్ వాటికలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

విద్యాబుద్ధులు నేర్చుకునే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన కూరగాయలతో కూడిన ఆహారం అందించాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాల్లో పోషణ్ వాటికలు ఏర్పాటు చేశారు. నిర్వహణకు రూ.10 వేల చొప్పున కేటాయించారు. కూరగాయలు, ఆకుకూరలు సాగు చేశారు. పంట పూర్తయిన తర్వాత మళ్లీ వేయడానికి నిధులు మంజూరు చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఫలితంగా ఎక్కువ కేంద్రాల్లో సాగు ఆగిపోయింది. కళకళలాడే ప్రాంగణాలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి.

**మొత్తం 13 కేంద్రాల్లో ఏర్పాటు...** తూర్పు నియోజకవర్గంలో 93 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 13 సామాజిక భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను పోషణ్ వాటికలకు ఎంపిక చేశారు. విత్తనాల కొనుగోలు, మట్టి, చుట్టూ కంచె ఏర్పాటు తదితర ఖర్చులకు నిధులు కేటాయించారు. ఆకుకూరలు, కూరగాయల సాగు చేశారు. వాటిని మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఉత్పత్తులతో ఆహారాన్ని అందించడం వల్ల చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఎంతో ఆనందించారు.



లబ్బీపేట మదర్‌థెరెసా పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇలా...

☛ పోషణ్ వాటికలు కొద్ది నెలలే కొనసాగాయి. 19వ డివిజన్ లబ్బీపేటలోని మదర్‌థెరెసా పాఠశాల ప్రాంగణంలో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. అక్కడ కొంత స్థలంలో పోషణ్ వాటిక ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. చాలా కేంద్రాల్లో ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. నవంబరులో కురిసిన వర్షాలకు కొన్ని చోట్ల మట్టి కొట్టుకుపోయింది. మళ్లీ మట్టి పోయాలి. కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు కొనాలి. ఆ ఖర్చులు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆర్థిక భారం కావడంతో నిర్వహణకు ఆసక్తి చూపడం లేదు. గతంలో మాదిరిగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే పోషణ్ వాటికలు నిర్వహణ కొనసాగుతుంది.

### సాగు చేసేలా చర్యలు తీసుకుంటాం

పోషణ్ వాటికలను అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. గత నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల పలు కేంద్రాల్లో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరల తోటలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల విత్తనాలు వేసినా ఫలితం లేకుండా పోయింది. మళ్లీ బాగు చేయించి విత్తనాలు వేయించి సాగు చేసేలా చర్యలు తీసుకుంటాం. - భానుమతి, సీడీపీవో

## ప్రతిభ చూపారు.. బహుమతి పట్టారు

గెలిచిన విద్యార్థులతో పటమట శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ సునీత, డీన్ వెంకటేశ్వర్లు

ప్రతిభావంతులతో త్రివేణి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పుష్పలత, అధ్యాపకులు

విజేతలతో అశోక్‌నగర్ శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ శ్రీరంజని, డీన్ గోపాల్‌రావు తదితరులు

పటమట, న్యూస్‌టుడే: పటమటలోని శ్రీచైతన్య పాఠశాల, త్రివేణి జూనియర్ కళాశాల, అశోక్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కరెంట్ ఎఫైర్స్'పై క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పటమట శ్రీచైతన్యలో జి.సత్యశ్రీ (9వ తరగతి) ప్రథమ, ఐ.ధావన్ (9వ తరగతి) ద్వితీయ, జి.మణిదీప్(9వ తరగతి) తృతీయ బహుమతి సాధించారు. వారికి ప్రిన్సిపల్ సునీత, డీన్ వెంకటేశ్వర్లు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. త్రివేణిలో లక్ష్మీప్రసన్న (ఇంటర్ ఫస్ట్ ఇయర్) ప్రథమ, బి.లక్ష్మి(ఇంటర్ ఫస్ట్ ఇయర్) ద్వితీయ, ఎం.మనీషా(ఇంటర్ సెకండ్ ఇయర్) తృతీయ బహుమతి సాధించారు. వారికి ప్రిన్సిపల్ పుష్పలత, అధ్యాపకులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అశోక్‌నగర్ శ్రీచైతన్యలో ఎస్.రేవతి (8వ తరగతి) ప్రథమ, ఎ.పల్లవి (9వ తరగతి) ద్వితీయ, బి.తణ్మయి (8వ తరగతి) తృతీయ బహుమతి సాధించారు. వారికి ప్రిన్సిపల్ శ్రీరంజని, డీన్ గోపాల్‌రావు బహుమతులు అందజేశారు.

## మార్పునకు సిద్ధం కాకపోతే భవిష్యత్తు శూన్యం

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: నేర్చుకోవడం ఆపవద్దని, శాశ్వత విద్యార్థిగా ఉండాలని అమెరికాలోని మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయం ఉపాధ్యక్షుడు, అజ్యూర్ ఎ.ఐ. హెడ్, పీబీ సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థి వీరమాచనేని జితేంద్ర కుమార్ సూచించారు. అన్నీ తెలుసనే భావన వీడాలని, ఏమీ తెలియదనే ఆత్మసూక్షతను గుర్తించడం కూడా ముఖ్యమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటేనే భారత ఆర్థిక వ్యవస్థలో అపార ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల భాగంగా సోమవారం విజయవాడ సిద్ధార్థ కళాశాలలోని పీబీ సిద్ధార్థ కళాశాల వెబినార్ హాలులో ఇలస్ట్రియస్ సిద్ధార్థియన్ పేరుతో జితేంద్రకుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన కంప్యూటర్ సైన్స్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. తాను మైక్రోసాఫ్ట్‌లో 30 ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రస్తుతం కార్పొరేట్ ఉపాధ్యక్షుడి స్థాయికి చేరుకున్నానని తెలిపారు. పని పట్ల అభిరుచి, నిరంతర శ్రమే అందుకు కారణమని అన్నారు. విద్యార్థులకు తమ మీద నమ్మకం, చేసే పనిలో నిజాయతీ ఉండాలని సూచించారు. ఏఐ దేవదూతగా ఎదగాలని, మార్పునకు సిద్ధం కాకపోతే భవిష్యత్తు లేదని అన్నారు. యువత తన సొంత సాంకేతిక ఆలోచనలను వ్యాపారంగా మలచుకోవాలని సూచించారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలిత ప్రసాద్, ప్రిన్సిపల్‌లు మేకా రమేష్, సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జితేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న పాలడుగు లక్ష్మణరావు, లలిత ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు

## ముక్కోటికి సర్వం సిద్ధం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పున్నమ్మతోట, లబ్బీపేటలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానాల్లో భక్తుల ఉత్తర ద్వార దర్శనానికి నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.

❖ పున్నమ్మతోటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి 12.05 నిమిషాలకు తిరుప్పావై, ధనుర్మాస కైంకర్యాల అనంతరం రాత్రి 1.30 నుంచి మంగళవారం రాత్రి 9 గంటల వరకు భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నట్లు తనిఖీ అధికారి లలితారమాదేవి తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ❖ లబ్బీపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున 4 నుంచి రాత్రి పది గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. ఎంజీ రోడ్డు నుంచి ఆలయం వరకు రావడానికి బ్యాటరీ కారు అందుబాటులో ఉంటాయి. వృద్ధులు, దివ్యాంగులు వాహనాన్ని వినియోగించుకోవచ్చని ఆలయ ఇన్‌ఛార్జి చిలుకూరి రామ్మోహన్‌రావు, మేనేజర్ శర్మ తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో పున్నమ్మతోటలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం

## ప్రధాన రహదార్ల అభివృద్ధికి రూ.100 కోట్లు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గ పరిధిలో ప్రధాన రహదార్లను విస్తరించి అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబు రూ.100 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. హైటెన్షన్ రోడ్డుతో పాటు బల్లెం వారి వీధి రోడ్డు విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన కరెన్సీనగర్ బొప్పన ఉషారాణి రోడ్డు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. గద్దె మాట్లాడుతూ గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే చాలా రోడ్లు నిర్మించామని గుర్తు చేశారు. మహానాడు రోడ్డు విస్తరణ, హైటెన్షన్ రోడ్డు నిర్మాణాలతో ఈ ప్రాంతానికి ఎంతో సౌకర్యం కలిగిందని అన్నారు. త్వరలో బల్లెం వారి వీధి రహదారిని 80 అడుగులకు విస్తరించి సెంట్రల్ లైటింగ్ పనులు మొదలుపెడతామని తెలిపారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించడానికి రూ.1500 కోట్లతో మద్రాస్ ఐఐటీ నిపుణులతో డీపీఆర్ రూపొందిస్తున్నామని, ఎంపీ శివనాథ్‌తో వెళ్లి సీఎంను మరోసారి కలిసి చర్చిస్తామన్నారు. నాయకులు తాడి బాబూరావు, గద్దె రమేష్, కృష్ణ మోహన్, చలసాని రమణ, నారాయణరావు, గల్లా రవి, కృష్ణార్జునరావు, ఈఈ సామ్రాజ్యం, ఏఈ దీక్షిత్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్

## ఖాళీ స్థలంలో చెత్త... స్థానికుల అవస్థ

మూడో డివిజన్ కరెన్సీ నగర్ డీవీ రావు వీధిలోని ఖాళీ స్థలంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. చెట్ల కొమ్మలు ఎండినా తొలగించడం లేదు. సమీప ఇళ్లలోని వారంతా అక్కడ చెత్త పడేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త తొలగించి బ్లీచింగ్ చల్లించాలని స్థానికులు కోరుతున్నారు. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

## సహాయ వైద్య అధికారి అన్నపూర్ణకు సర్కిల్-2 అదనపు బాధ్యతలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ సర్కిల్-2 సహాయ వైద్య అధికారి (ఏఎంవోహెచ్)గా అదనపు బాధ్యతలు సర్కిల్-1 సహాయ వైద్య అధికారి అన్నపూర్ణకు అప్పగిస్తూ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం సర్కిల్-2లో సహాయ వైద్య అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీహెచ్. బాబూ శ్రీనివాసన్ ఈనెల 31న ఉద్యోగ విమరణ చేస్తున్నారు. అతన్ని తిరిగి ఒప్పంద పద్ధతిన విధుల్లోకి తీసుకునేందుకు అధికారులు ప్రతిపాదన తెచ్చారు. నెలకు గౌరవ వేతనంగా రూ.37,100 చొప్పున ఏడాదికి రూ.4,45,200 చెల్లించేందుకు నిర్ణయించారు. ఆ ప్రతిపాదనకు పాలకపక్షం ఆమోదం కూడా తెలిపింది. అధికారులు, పాలకుల వైఖరిపై విమర్శలు చెలరేగాయి. 'ఈనాడు'లో ఈ నెల 26న 'కాసులిచ్చుకో.. కొనసాగించుకో!' శీర్షికన కథనం కూడా ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ ధ్యానచంద్ర ఖాళీ అవుతున్న సర్కిల్-2 సహాయ వైద్య అధికారి బాధ్యతలను అన్నపూర్ణకు అప్పగిస్తూ ఆదేశాలిచ్చారు. బాబూ శ్రీనివాస్‌ను తిరిగి విధుల్లోకి తీసుకునే అంశాన్ని తాత్కాలికంగా పక్కనపెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## మ్యాన్‌హోళ్లు పొర్లుతున్నా పట్టించుకోరా?

కృష్ణలంక 22వ డివిజన్ కొత్త మిషన్ రోడ్డులో పలు మ్యాన్‌హోళ్లు దీర్ఘకాలంగా పొంగి పొర్లుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతుండడంతో పాటు రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతోంది. పలుమార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తక్షణం మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయాలని కోరుతున్నారు. - కృష్ణలంక, న్యూస్‌టుడే

## రహదారిపైనే వ్యర్థాలు.. దుర్వాసనతో బెంబేలు

రాణిగారితోట 18వ డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. కరెంటు ఆఫీసు సమీపంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేయకపోవడంతో వ్యర్థాలు పోగై అపరిశుభ్రత నెలకొంటోంది. వీధి కుక్కలు వ్యర్థాలను చెల్లాచెదురు చేస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - కృష్ణలంక, న్యూస్‌టుడే

## ఫుట్‌పాత్‌లపై పడుకోవడమా.. దారుణం

### నిరాశ్రయుల విషయమై హైకోర్టు ఆందోళన

ఈనాడు, అమరావతి: నిరాశ్రయులు, అనాథలు రాత్రివేళల్లో ఫుట్‌పాత్‌ల మీద నిద్రించడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై దృష్టి పెట్టాలని రాష్ట్రప్రభుత్వానికి స్పష్టంచేసింది. షెల్టర్ హోంల నిర్వహణ విషయంలో అనుభవం ఉన్న స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించింది. విజయవాడతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఆశ్రయ/వసతి గృహాలు (షెల్టర్ హోం) ఏర్పాటు విషయంలో తీసుకుంటున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ వేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నవారిని తక్షణమే ఆశ్రయ కేంద్రాలకు తరలించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్‌కు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈనెల 31కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

☛ విజయవాడ కృష్ణా బ్యారేజ్ ఫుట్‌పాత్‌లపై నిరాశ్రయులు రాత్రి వేళల్లో దయనీయ స్థితిలో నిద్రపోతున్నారని వారికి ఆశ్రయం కల్పించే విషయంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ న్యాయవాది ఆది రామకృష్ణుడు పిల్ వేశారు. ఆయన నేరుగా వాదనలు వినిపిస్తూ.. పట్టణ నిరాశ్రయుల పథకం (షెల్టర్ ఫర్ అర్బన్ హోంలెస్-ఎస్‌యూహెచ్) కింద నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కొన్ని ప్రాంతాల్లో షెల్టర్ హోంలు ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా ఎంతోమంది ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఫుట్‌పాత్‌లపై నిద్రించడం ప్రమాదకరమని, చలికాలంలో పరిస్థితి దారుణంగా ఉంటుందని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా, మహిళలకు ఆశ్రయ హోంలు లేవని తెలుసుకొని విస్మయం వ్యక్తం చేసింది. ఈ విషయంలో జాప్యం చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. విజయవాడ నగరపాలక సంస్థ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. మహిళలకు షెల్టర్ హోంలు ఏర్పాటు ప్రతిపాదన ఉందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

☛ కోర్టుకు సహాయకులుగా వ్యవహరించేందుకు అమికస్ క్యూరీగా నియమితులైన సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ... గతంలో షెల్టర్ హోంలను స్వచ్ఛంద సంస్థలు నిర్వహించేవన్నారు. గత ప్రభుత్వం సొమ్ము చెల్లించకపోవడంతో హోంల నిర్వహణ నుంచి ఎన్‌జీవోలు తప్పుకున్నాయన్నారు.

## మత్తు నిందితుల కోసం అన్వేషణ

ఈనాడు, అమరావతి: డ్రగ్స్ కేసులో కీలకమైన నిందితుల కోసం అన్వేషణ సాగుతోంది. ఈ నెల 21న ఎండీఎంఏ తీసుకుంటూ దొరికిన కేసులో ఇప్పటికే ముగ్గురు అరెస్టు అయ్యారు. దొరికినట్లే దొరికి మాచవరం స్టేషన్ నుంచి కారులో పరారైన రాజేష్ ఆచూకీ ఇంకా దొరకలేదు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నప్పుడు ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారైన తర్వాత కారును ఎగ్జిక్యూటివ్ క్లబ్‌లోని పార్కింగ్‌లో సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఏపీ దాటి హైదరాబాద్ నగరంలోకి వెళ్లి తలదాచుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడికి హైదరాబాద్‌లో చాలా మంది స్నేహితులు ఉన్నారు. వారి కాల్స్‌పై నిఘా పెట్టారు. వారి ఫోన్లకు వస్తున్న, వెళ్తున్న కాల్స్‌ను విశ్లేషిస్తున్నారు. కామన్‌గా ఉండే నంబర్లపై దృష్టి పెట్టారు. మరోవైపు బెంగళూరు ఎండీఎంఏ అమ్మిన మహేష్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందం గాలిస్తోంది. ఈ బృందం విశాఖపట్నం, నెల్లూరు, హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో నిందితుల కోసం అన్వేషిస్తోంది. ఈ కేసులో మరికొంత మందిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది.


**IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE (SENIOR DIVISON); AT NANDIGAMA**

I.A.No.356/2024 IN O.S.No.348/2014

Between:
**Jarabana Mallikarjuna Chowdary** ...Petitioner/Plaintiff.

And

1. Jarabana Sivarama Krishna Chowdary.
2. Smt. Kilaru Lakshmi (DIED)
3. Kilaru Satyanarayana (Proposed 8th defendant)
4. Amirineni Lohitha (Proposed 9th defendant)
5. Meka Yamini (Proposed 10th defendant)

...Respondents

**R 8 Address-(Proposed 8th defendant)** Kilaru Satyanarayana, S/o Kilaru Subba Rao, Resident of D.No.74-10-5/D/1. Vishnu Priya Residency, North East Corner Building, Road Number-9, Electricity Colony, Vijayawada, N.T.R. District.

**R9 Address:-(Proposed 9th defendant)** Amirineni Lohitha, W/o Amirineni Amaranath, D/o Kilaru Satyanarayana, Resident of Survey No.1009, Hi-tech City Main Road, Beside Malaysian Town Ship, KPHB Colony 5th Phase, Kukatpally, Hyderabad, Telangana State.

**R 10 Address: (Proposed 10th defendant)** Meka Yamini, W/o Meka Barghava Siva Tej, D/o Kilaru Satyanarayana, Resident of Survey No.1009, Hi-tech City Main Road, Beside Malaysian Town Ship, KPHB Colony 5th Phase, Kukatpally, Hyderabad, Telangana State.

పై నెంబరు దావా వాది, ప్రతివాదుల మీద వాటాలు పంచమని పార్టీషన్ దావా వేసియున్నారు. సదరు దావాలో రెండవ ప్రతివాది అయిన కిలారు లక్ష్మి మరణించినందున, వారి వారసులను చేర్చమని వాది L.R. పిటీషను సదరు దావాలో దాఖలు చేసియున్నారు. సదరు L.R. పిటీషన్ నెంబరు I.A.No.356/2024 సదరు L.R. పిటీషన్‌లో కిలారు లక్ష్మి వారసులు అయిన కిలారు సత్యనారాయణ, అమిరినేని లోహిత, మేక యామినిలకు శ్రీ కోర్టు వారి నుండి ఎన్నిమార్లు నోటీసుల నిమిత్తము బేటాలు కట్టినన్నూ, సదరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ప్రత్యామ్నాయ అమలు నిమిత్తం ఈ పత్రికా ప్రకటన ద్వారా అమలు చేసే విధంగా ఆర్డరు పొందియున్నారు. కావున దావాలో Proposed Defendants 8 to 10 వారలకు సదరు పిటీషన్‌పై ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనుటకు గాను ది.19-1-2026వ తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెనని, లేని యెడల మీకు పరోక్షంగా తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కోర్టు : నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

వాయిదా తేది: 19-1-2026, సమయం: ఉదయం 10.30గం.లకు

ఇట్లు.. **బండారు శుభాకరరావు,** న్యాయవాది

నెహ్రూనగర్, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ ✆ 98483 16059

నందిగామ, తేది: 27-12-2025


## రిమాండ్ పొడిగింపు

పటమట, న్యూస్‌టుడే: సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు కొమ్మా కోటేశ్వరరావు(ఏ2), తేలప్రోలు రాము(ఏ3), వజ్రకుమార్(ఏ6), ఎర్రంశెట్టి రామాంజనేయులు(ఏ9)కు న్యాయమూర్తి రిమాండ్ పొడిగించారు. సోమవారంతో నలుగురి నిందితుల రిమాండ్ గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో పోలీసులు నెల్లూరు జైలు నుంచి వర్చువల్‌గా విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.భాస్కరరావు ఎదుట వారిని హాజరుపరచగా... వచ్చే నెల 12వ తేదీ వరకు రిమాండ్ పొడిగించారు. ఇదే కేసులో వంశీతో సహా మరో పది మంది బెయిల్‌పై ఉన్నారు. వారంతా సోమవారం విచారణకు హాజరు కావాల్సి ఉండగా... వంశీతో సహా మరో నలుగురు విచారణకు రాలేదు.

## సౌత్ జోన్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగిన 36వ సౌత్ జోన్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి ఆడిన జిల్లా స్విమ్మర్లు సత్తా చాటారని జిల్లా ఆక్వాటిక్ సంఘం కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. ఎన్.పావని సరయు 200 మీ., 400 మీ. వ్యక్తిగత మెడ్లీ, 50 మీ., 100 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో నాలుగు పసిడి, 200 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజతం కైవసం చేసుకోవడంతో పాటు వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకుందని చెప్పారు. బి.పృథ్వీరాజ్ 200 మీ. ఫ్రీ స్టైల్‌లో కాంస్యం, కొంగర సింధూర 100 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజతం కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న పావని సరయు

## అన్న క్యాంటీన్లలో సమస్యలు లేకుండా చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్లలో సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. అజిత్‌సింగ్‌నగర్, గులాబీతోట తదితర ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... అన్న క్యాంటీన్ల ద్వారా అందించే ఆహారం నాణ్యత ప్రమాణాలతో ఉండాలని అన్నారు. బాధ్యులైన అధికారులు క్యాంటీన్లలో ప్రజలకు అందించే టోకెన్లను తనిఖీ చేయాలని సూచించారు. ఆహార నాణ్యతను ముందుగా పరిశీలించాలని అన్నారు. క్యాంటీన్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అధికారులు ప్రభుదాస్, శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

## మురుగు నిండి.. దోమలు దండి

ఒక వైపు చలి.. మరోవైపు దోమల తాకిడితో కృష్ణలంక ప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే కృష్ణలంకలో దోమలు తక్కువగా ఉండేవి. అందుకు భిన్నంగా ప్రస్తుతం వాటి వృద్ధి అనూహ్యంగా పెరిగింది. డ్రెయిన్లలో మురుగు పారుదల సక్రమంగా లేకపోవడం, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడమే కారణాలుగా స్థానిక ప్రజలు చెబుతున్నారు.

☛ కృష్ణలంక 20వ డివిజన్ కరకట్ట పరిధిలో రణదివేనగర్ ఉంది. గతంలో డివిజన్ మురుగు నేరుగా కృష్ణానదిలో కలిసేది. రక్షణ గోడ నిర్మాణం అనంతరం మురుగు కరకట్ట దిగువకు చేరుతోంది. డ్రెయిన్ తరహా నిర్మాణం లేకపోవడంతో మురుగు పెద్ద మొత్తంలో పేరుకుపోతోంది.

☛ పద్మావతి ఘాట్ పరిధిలో 21, 22 డివిజన్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం బాగా లేకపోతే ఆ ప్రభావం ఆయా డివిజన్లపై ఉంటుంది. దీర్ఘకాలం మురుగు నిల్వతో దోమల లార్వా వృద్ధి చెంది పరిసర డివిజన్లపై ప్రభావం చూపుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దోమలు నివారణ చర్యలు చేపట్టాలని ఆయా స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కృష్ణలంక

22వ డివిజన్‌లో పారుదల లేని డ్రెయిన్

## అదిరే... అదిరే..

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : సిద్ధార్థ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు సోమవారం నిర్వహించారు. డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థినులను స్వాగతిస్తూ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులు శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలు చేసి అలరించారు. సినీ పాటలకు స్టెప్‌లు వేసి అదరకొట్టారు. డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్ వి.వి.ఎస్.కుమార్, ఎస్.పద్మజ, విద్యార్థి విభాగం కమిటీ కన్వీనర్ పి.వి.దుర్గావతి పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థినుల నృత్యం

## చర్చిలో ఎంపీ ప్రత్యేక ప్రార్థనలు

పటమట, న్యూస్‌టుడే: బెంజ్ సర్కిల్ సమీపంలోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చిలో ఎంపీ కేశినేని శివనాథ్ సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బిషప్ జోసెఫ్ రాజారావు, ఫాదర్ మువ్వల ప్రసాద్ ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. ప్రజలకు మేలు చేసే ప్రతి కార్యక్రమానికి తన వంతు మద్దతు ఉంటుందని ఎంపీ స్పష్టం చేశారు.

(c) eenadu

# నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

## ప్రతిభా పాటవ పోటీల్లో సత్తా

విజేతలతో పాఠశాల ప్రిన్సిపల్ నరసింహారావు

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని సెయింట్ మేరీస్ విద్యాలయంలో 'ఈనాడు', ఈటీవీ ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో విద్యార్థులకు అంతర్జాతీయ, జాతీయ సంఘటనలు, నియామకాలు, రాజకీయాలు, క్రీడలు, జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. సుమారు 72 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బి.యశ్వంత్(8వ తరగతి) కె.అనురాగ శ్రీవల్లభ(8వ తరగతి) వెంకటకౌశిక్(9వ తరగతి)లకు పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.నరసింహారావు బహుమతులు ప్రదానం చేసి వారిని అభినందించారు.

## లెజ్యూమ్ కళలో తర్ఫీదు

శిక్షణ పొందుతున్న విద్యార్థులు

**నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే:** నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు లెజ్యూమ్ కళలో తర్ఫీదు పొందుతున్నారు. ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వరి శిక్షణ ఇస్తున్నారు. చేతిలో గొలుసు దండలు పట్టుకుని ఈ కళను ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. ముఖ్యఅతిథులు వచ్చిన సమయంలో స్వాగతించడానికి, వ్యాయామపరంగా ఈ కళ ఉపయోగపడుతుందని పీడీ చెప్పారు.

## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

**చందర్లపాడు, న్యూస్‌టుడే:** వెలదికొత్తపాలెంలో పల్లె పండగ-2లో మంజూరైన పనులకు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సోమవారం శంకుస్థాపన చేశారు. మండలంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ప్రహరీల నిర్మాణానికి, అంతర్గత, డొంక రోడ్ల అభివృద్ధికి రూ.1.28 కోట్లు మంజూరు చేసినట్లు ఆమె చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. వీబీ జీ రామ్‌జీ పథకం ద్వారా గ్రామీణులకు ఉపాధి లభించడంతో పాటు సంపద సృష్టి జరుగుతోందన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు మేకల సుధాకర్, కొల్లి రామారావు, సహకార సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్, ఉన్నం నరసింహారావు, పంచాయతీరాజ్ ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌బీ రోడ్లకు మోక్షమెప్పుడో?

నందిగామ గ్రామీణం, చందర్లపాడు, న్యూస్‌టుడే

మాగల్లు తాళ్లదొంక వద్ద దెబ్బతిన్న రోడ్డు

నందిగామ సెక్షన్ పరిధిలోని నందిగామ, చందర్లపాడు మండలాల్లో ఆర్‌అండ్‌బీ రహదారులు గుంతలతో రూపు కోల్పోయాయి. నందిగామ-జొన్నలగడ్డ రహదారి కంపచెట్లతో మూసుకుపోయింది. రెండు వరుసల రోడ్డు క్రమంగా సింగిల్‌గా కనిపిస్తోంది. మునేటి పెద్ద వంతెన నుంచి దారి పొడవునా గుంతలతో దర్శనమిస్తోంది. మాగల్లు తాళ్లదొంక వద్ద గుంతలతో ద్విచక్ర వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రివేళ గుంతల్లో జారిపడుతున్నారు. ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. టైర్లు పగిలి, పంక్చర్లు పడుతున్నాయి. పల్లగిరి-దాములూరు రహదారిపై గుంతలతో పాటు కంపచెట్లు పెరిగాయి. రుద్రవరం-సోమవరం నడుమ కల్వర్టును అభివృద్ధి చేయాలి. రాఘవాపురం-కమ్మవారిపాలెం, నందిగామ-రామన్నపేట రహదారులపై గుంతలపడి ద్విచక్ర వాహనచోదకులు నిత్యం బాధపడుతున్నారు. అడవిరావులపాడు వద్ద నల్లవాగుపై చప్టాకు రెండు వైపులా అప్రోచ్ రహదారిపై గుంతలు పడ్డాయి. రహదారి మార్జిన్లు ప్రమాదకరంగా మారాయి. కొణతమాత్మకూరు-కూడలి రహదారిని విస్తరించాల్సి ఉంది. గత ఏడాది వరదలకు పడిన గుంతను గ్రావెల్‌తో పూడ్చిన తరువాత అభివృద్ధి చేయలేదు. నందిగామ-చందర్లపాడు రహదారిపై పలుచోట్ల గుంతలతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. కంచికచర్ల మండలంలో కీసర-పెండ్యాల, కీసర-గండేపల్లి, వీరులపాడు మండలంలో పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పాలకులు, అధికారులు ఇప్పటికైనా వీటి అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపాం:** దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ కోటేశ్వరరావు వివరణ కోరగా రహదారుల అభివృద్ధికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కొండూరు- జొన్నలగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారి అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. మిగిలిన రహదారుల అభివృద్ధికి త్వరలో నిధులు విడుదల అవుతాయని చెప్పారు.

## అందుబాటులో యూరియా

**నందిగామ, న్యూస్‌టుడే:** నందిగామ సబ్ డివిజన్‌లో పైర్లకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్ తెలిపారు. రబీలో మొక్కజొన్నకు తొలి విడత యూరియా వేశారన్నారు. ప్రస్తుతం 1028 టన్నులు అందుబాటులో ఉందన్నారు. వచ్చే నెల రెండో వారానికి 755 టన్నులు అవసరమని తెలిపారు. అధిక ధరలకు విక్రయించకుండా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. దుకాణాల వద్ద నిల్వలు, ధర ప్రదర్శించే బోర్డులు ఏర్పాటు చేయించామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి వెళ్లకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉద్యోన్నతి

**నందిగామ, న్యూస్‌టుడే:** నందిగామ నియోజకవర్గంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ప్రధాన కేంద్రాల కార్యకర్తలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు స్థానిక కాకాని నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం వారికి ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అప్‌గ్రేడ్ ఉత్తర్వులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మహిళా, శిశు సంక్షేమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. గ్రామీణ స్థాయిలో తల్లి, శిశువుల ఆరోగ్యం, పోషణ, విద్యా అవగాహనకు మరింత కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందజేయాలని సూచించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి లక్ష్మీభార్గవి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నందిగామ: అలంకరణలో వాసవీమాత

గోళ్లమూడిలో శంభులింగేశ్వరస్వామి

పల్లగిరిపై భవానీశంకరుని వాయులింగం

## వైభవంగా ధనుర్మాస వేడుకలు

**నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే:** నందిగామ వాసవీమాత మందిరంలో ధనుర్మాస వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారి మూలమూర్తిని పుష్పాలతో అలంకరించారు. మహిళలు లలితా విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పల్లగిరిపై భవానీ శంకరుని వాయులింగానికి అభిషేకం చేశారు. వచ్చే జనవరి 3న తెల్లవారుజామున శివము క్కోటి వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. గోళ్లమూడి శివాలయంలో శంభులింగేశ్వరస్వామికి అభిషేకం చేశారు.

## సనాతన హైందవ ధర్మ పరిరక్షణకు కృషి

హిందూ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న స్వామిజీలు

**కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే:** ప్రతి భారతీయుడు సనాతన హైందవ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని గౌడీయ మఠం పీఠాధిపతి భక్తి సుందర మంగళ మహారాజ్ స్వామి అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల వేడుకలో భాగంగా నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనం కీసరలో సోమవారం నిర్వహించారు. హిందూ ధర్మం దేశానికి ఆత్మ వంటిదని అన్నారు. హిందువుల ఐకమత్యమే ధర్మ రక్షణకు మూల స్తంభమని అన్నారు. హిందూ ధర్మ జీవన విధానం, సమాజంలో పౌర బాధ్యతలు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. పలువురు స్వామీజీలు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం

అవగాహన సదస్సులో ఔత్సాహికులు

**జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే:** చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు చదువుకుని ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలపై మండల పరిధి జుజ్జూరులో జల్లి ఏసోబు సామాజిక భవనంలో సోమవారం ఎంఎస్‌ఎంఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏజెడ్ క్వాలిటీ డెవలప్‌మెంట్ కంపెనీ సీఈవో కల్ల జగపతి పాల్గొని యువతకు పలు సూచనలు చేశారు. పోటీతత్వం, ఉత్పాదన, ఎగుమతులను పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయన్నారు. ముందుకు వచ్చిన యువ పారిశ్రామికవేత్తలకు వారికి రూ.3లక్షల వరకు రుణ సదుపాయంతో పాటు రాయితీ ఇస్తున్నారన్నారు. నందిగామ పట్టణ భాజపా మాజీ అధ్యక్షుడు కామేశ్వరరావు, మాజీ మండలాధ్యక్షుడు కణితి సుబ్బారావు, సీనియర్ నాయకులు జోగా, ప్రసాద్, చిన్నతరహా పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి కుప్పలతో అవస్థలు

**నం**దిగామ శివాలయం ఎదురుగా మట్టికుప్పలతో భక్తులు, వాహనచోదకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవల శివాలయానికి తూర్పు, ఉత్తరం, పడమర వైపున ప్రహరీలను కూల్చారు. అనంతరం మట్టికుప్పలను రహదారి పక్కనే వదిలేశారు. దీని వల్ల రోడ్డు ఇరుకుగా మారడంతో పాటుప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే ఈ మట్టికుప్పలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం**

## నిబంధనలు బేఖాతర్!

**ని**బంధనలకు విరుద్ధంగా టిప్పర్లు పరిమితికి మించి కంకర రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పరిటాల సమీపంలో క్వారీల నుంచి నిత్యం వందల సంఖ్యలో కంకర ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు అవసరమైన ఈ కంకరను సరఫరాదారులు నిబంధనలు పాటించకుండా టిప్పర్లలో అధిక లోడు చేయించుకుని ప్రమాదకరంగా రవాణా సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక లోడుతో సాగుతున్న రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పరిటాల(కంచికచర్ల)**

## శిథిల ట్యాంకు తొలగించరూ..

**కు**నికినపాడు ఎంపీపీ పాఠశాల ఆవరణలో దశాబ్దాల క్రితం నిర్మించిన తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు శిథిల స్థితికి చేరింది. దీంతో పైపులైన్ల ద్వారా బోరు నుంచి నేరుగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో శిథిల ట్యాంకు ఉండడంతో అక్కడ చదివే చిన్నారుల తల్లి తండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు వినియోగంలో లేని కారణంగా దానిని తొలగించడమే మేలని, ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కునికినపాడు(కంచికచర్ల)**

## జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

జేసీ, డీఈవోల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సాయి ఉత్తేజ్

**దొడ్డదేవరపాడు(వీరులపాడు), న్యూస్‌టుడే:** జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వక్తృత్వ, వ్యాస రచన పోటీల్లో దొడ్డదేవరపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. స్వర్గం సాయి ఉత్తేజ్(8వ తరగతి) వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా.. పాలది సాయిజస్వంత్ వక్తృత్వంలో ప్రథమ స్థానం సాధించాడు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య భవన్‌లో వీరికి జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, డీఈవో చంద్రకళ ప్రసంసా పత్రాలు అందజేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన

బ్యాంకు వినియోగదారులతో మాట్లాడుతున్న ఎస్సై అభిమన్యు

**వీరులపాడు:** బ్యాంకు ఖాతాకు సంబంధించిన వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుకోవాలని, అపరిచితులకు ఖాతా వివరాలు తెలియజేయకూడదని ఎస్సై అభిమన్యు అన్నారు. సైబర్ నేరాలపై బ్యాంకు ఖాతాదారులకు వీరులపాడులో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. డిజిటల్ అరెస్టుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

## కాకతీయ సేవా సమితి నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడు మార్షల్ స్టాలిన్, ప్రధాన కార్యదర్శి రాజేష్, కోశాధికారి శ్రీనివాసరావు

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని కాకతీయ సేవా సమితి కార్యాలయంలో సేవా సమితి కుటుంబ సభ్యులందరూ కలిసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొల్లి మార్షల్ స్టాలిన్, ప్రధాన కార్యదర్శిగా బొజ్జా రాజేష్, కోశాధికారి కాటా శ్రీనివాసరావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సేవా సమితి వ్యవస్థాపకులు, మాజీ అధ్యక్షులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## రూ.96.58 కోట్లతో బడ్జెట్ ఆమోదం

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఛైర్మన్ మాట్లాడుతూ ఆస్తి పన్ను నుంచి రూ.6.80 కోట్లు స్టాంప్ డ్యూటీ రూ.3.20 కోట్లు, షాపింగ్ కాంప్లెక్స్ అద్దె, మార్కెట్ తదితర పద్దుల ద్వారా రూ.70 లక్షలు, ఖాళీ స్థలాలపై పన్నులు రూ.17 లక్షలు, నీటి పన్ను రూ.కోటి, ఫీజు, యూజర్ ఛార్జీలు రూ.5.1 కోట్లు, 15వ ఆర్థిక సంఘం గ్రాంటు రూ.6 కోట్లు, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంటు రూ.50 లక్షలు ఇతర గ్రాంట్ల ద్వారా రూ.73.20 కోట్లు.. వెరసి రూ.96.58 కోట్లు ఆదాయం వస్తుందని తెలిపారు. అలాగే పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకు, విద్యుత్తు బిల్లులు, పరిపాలన, స్టేషనరీ, వెహికల్ తదితరాలకు రూ.16.21 కోట్లు ఖర్చులు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ పలు వార్డుల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశం జరుగుతున్న సమయంలో ఆటోనగర్ కాలుష్య బాధితులు కార్యాలయం ఎదుట ధర్నా చేయగా ఈ అంశాన్ని కౌన్సిలర్లు సమావేశంలో ప్రస్తావించారు. ఆటోనగర్‌లోని కర్మాగారాలన్నింటినీ అధికారులు వెళ్లి పరిశీలించి ఎలాంటి కాలుష్యం లేదని నిర్ధారించే వరకు వాటిని తాత్కాలికంగా మూసివేయాలని ఛైర్మన్ కౌన్సిల్ పెట్టడంతో కౌన్సిలర్లు దానికి మద్దతు తెలిపి ఆమోదించారు.

## కాలుష్య కర్మాగారాల మూసివేతకు డిమాండ్

నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు, సీపీఐ నాయకులు

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** జగ్గయ్యపేట ఆటోనగర్‌లో ఉన్న కాలుష్య కర్మాగారాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఆటోనగర్ కాలుష్య బాధితులు పురపాలక సంఘం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పురపాలక సంఘంలో సోమవారం కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సందర్భంగా వారు కౌన్సిల్ సమావేశాన్ని అడ్డగించే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని నివారించారు. ఆటోనగర్‌లో కాలుష్యం కావాలా? ప్రజల ప్రాణాలు కావాలా? ఎంతకాలం ఈ నిరీక్షణ అని నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ నాయకులకు, అధికారులకు ఎన్నోసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ వెంకటకృష్ణారావు, కాలుష్య బాధితులు, కౌన్సిలర్లు ఆటోనగర్‌ను సందర్శించి అక్కడ బోరులో నుంచి వస్తున్న నీటిని పరిశీలించారు.

## రసాయనాలు వదులుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోండి

కలెక్టర్ లక్ష్మీశతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** ప్రమాదకర రసాయనాలు వదులుతున్న పరిశ్రమలపై కఠిన తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్రలు కలెక్టర్ లక్ష్మీశను కోరారు. సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. వాతావరణం విషతుల్యం అవుతోందని ఆటోనగర్, పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు అత్యంత ప్రమాదకరమైన లెడ్ నైట్రేట్ వంటి రసాయనాలను గాలిలోకి వదులుతున్నాయని, దీనివల్ల ప్రజలు తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, ఈ నీరు తాగి మూగజీవాలు మరణించడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట ప్రాంతంలో అన్ని పరిశ్రమలను వెంటనే తనిఖీ చేయాలని, కాలుష్య నియంత్రణ యంత్రాలు సరిగా లేని పరిశ్రమలను తక్షణమే సీజ్ చేయాలని కోరారు. కలెక్టర్ రానున్న పది రోజుల్లో కమిటీని పంపించి, పరిశ్రమలను తనిఖీ చేయిస్తామని, అప్పటికీ తీరు మారకపోతే కఠిన చర్యలకు వెనకాడబోమని స్పష్టం చేశారు.

## తిరుపతమ్మ ఆలయ ఛైర్మన్‌గా రమేష్

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** స్థానిక తిరుపతమ్మ ఆలయ ఛైర్మన్‌గా తెదేపా సీనియర్ నాయకుడు చుంచు రమేష్‌బాబును ఎంపిక చేశారు. ఈ మేరకు తెదేపా అధిష్ఠానానికి ఛైర్మన్, ఇతర ధర్మకర్తల పేర్లు సూచిస్తూ జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రతిపాదనలు పంపించారు. జనసేన, భాజపా పార్టీల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తల మండలి పేర్లు ఖరారు చేసినట్లు తెలిసింది. అనంతరం తెదేపా ప్రధాన కార్యాలయానికి ఆలయ పాలకవర్గ నియామకం కోసం పేర్లు పంపారు. వీటిని అధిష్ఠానం పరిశీలించి ప్రభుత్వానికి పంపనుంది. అనంతరం ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది.

### అవీ ఇవీ

### అన్నదానానికి విరాళం

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** స్థానిక తిరుపతమ్మ దేవాలయంలో దీక్షా స్వాముల అన్నదానానికి విజయవాడ భవానీపురానికి చెందిన పోలిశెట్టి సందీప్ అన్నదానానికి 20 క్వింటాళ్ల బియ్యం, క్వింటా కందిపప్పు, 90 కేజీల మంచి నూనె సోమవారం వితరణ చేశారు. ఆలయ వేదపండితుడు, అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. సందీప్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### గోశాలకు వరిగడ్డి వితరణ

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** స్థానిక తిరుపతమ్మ అమ్మవారి గోశాలకు పలువురు దాతలు వరిగడ్డి వితరణ చేశారు. పెనుగంచిప్రోలుకు చెందిన ఆలయ మాజీ ఛైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు 600, సుబ్బాయిగూడెంకు చెందిన వెల్ది ప్రభాకరరావు 500, మణుగూరు చెందిన గురజాల గోపీ 600తో పలువురు దాతలు కలిపి 3300 వరి గడ్డి కట్టలు గోశాలకు అందజేశారు.

### ఎమ్మెల్యేను కలిసిన దూదేకుల సంఘం అధ్యక్షుడు

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** ఇటీవల దూదేకుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా షేక్ పుల్లాసాహెబ్ సోమవారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. తాతయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న దూదేకులందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు.

### తాతయ్య దంపతుల పూజలు

పట్టణంలోని శ్రీరంగస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య దంపతులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

## నేడు ఉత్తర ద్వార దర్శనం

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని పావన కృష్ణా నది తీరంలో యోగానంద లక్ష్మీనరసింహస్వామి, భవానీ ముక్తేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల్లో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం స్వామివార్లకు గ్రామోత్సవం, గరుడ వాహన సేవ, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## దేశ సంక్షేమానికి ప్రత్యేక ప్రార్థనలు

దుస్తులు పంపిణీ చేస్తున్న రత్నకుమార్

**నందిగామ, న్యూస్‌టుడే:** స్థానిక బైపాస్ రోడ్డులో జీసస్ క్రైస్ట్ ప్రేయర్ టవర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రీస్తు ప్రార్థనా మందిరంలో సోమవారం ప్రపంచ పుస్తక క్లబ్‌లో చేరిన వ్యక్తులు, సువార్తికులు, పాస్టర్లకు ఉచిత విమాన ఇంటర్నేషనల్ ప్రార్థన సెమినార్ నిర్వహించారు. దీనిలో ఒలీవ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ బ్రదర్ రత్నకుమార్ పుస్తక క్లబ్ విశిష్టత గురించి వివరించారు. అనంతరం వస్త్రాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, గోల్డ్ బైబిల్, మహిళలకు దుస్తులు అందజేశారు. నూతన సంవత్సర సందర్భంగా దేశాభివృద్ధి, క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ జాన్‌బాబు, ఫాదర్ టి.బాలరాజు, కన్వీన్ డానియేల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## 390 మందికి వైద్య సేవలు

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని తక్కెళ్లపాడులో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 390 మంది వైద్య సేవలు పొందారు. ఇందులో 265 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 139 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వారికి త్వరలోనే ఫౌండేషన్ తరపున కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. 70 మందికి ఆపరేషన్ అవసరం కాగా.. త్వరలో విజయవాడ శంకర్ నేత్రాలయం వారిచే ఉచితంగా చేయిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

## 'పోలీసుల వైఖరి సరికాదు'

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** పత్తికొండ కోర్టు ప్రాంగణంలో పోలీసుల అక్రమ చర్యలను నిరసిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ పోలీసుల అక్రమ చర్యలను ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదులు శ్రీనివాసరావు, ఆంజనేయులు, నాగేశ్వరరావు, వెంకటకృష్ణ, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలో న్యాయవాదులు


అమృతమూర్తికి అశ్రుతాంజలులు

జూటూరు వెంకటేశ్వర్లు (అబ్బులు) గారి దివ్య సహచరి శ్రీమతి సుజాత గారు

సాధారణ ఆచార్యుని నుండి విద్యారంగ మహామహుడిగా ఎదిగిన ఆయన విజయ సింహాసనానికి మూలాధారమై నిశ్శబ్ద సేవతో, నిత్యానురాగంతో గృహం అనే ఆలయాన్ని ప్రకాశింపజేసి, ఆకస్మికంగా దివి నుండి భువికేగిన వారి దివ్యాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. బాధాతప్త హృదయాలతో..

కీ॥శే॥ శ్రీమతి సుజాత గారు
W/o. జూటూరు వెంకటేశ్వర్లు (అబ్బులు) గారు
ప్రిన్సిపాల్: JRC కాలేజి, జగ్గయ్యపేట

JRC విద్యా సంస్థలు
JRC - VBDC - AMMANI - LIFE SKILLS
యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు


(c) eenadu

# విజయవాడ పశ్చిమ

## ప్రతిభ చూపి.. బహుమతులు సాధించి..

హాజరైన విద్యార్థులు

విజేతలతో డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జ్యోత్స్న

**విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:** పాతబస్తీ వించిపేట శ్రీ విద్యాంజలి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను సోమవారం నిర్వహించారు. పాఠశాల స్థాయిలో వర్తమాన వ్యవహారాలు, జనరల్ నాలెడ్జ్, క్రీడలపై క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. వీటిల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎం.అర్చన (9వ తరగతి), కె.మానస (8వ తరగతి), షేక్.ఇర్ఫాన్ (7వ తరగతి) నిలిచారు. వారికి పాఠశాల డైరెక్టర్ పెప్పాల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జ్యోత్స్న బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

**స్పందనకు వందనం:** ✦ వించిపేట అప్పర్‌రైల్వే యార్డులో రాత్రుల్లో పలువురు మద్యం తాగుతున్నారని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన 2వ పోలీసులు రాత్రుల్లో ఆ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు. ✦ భవానీపురం ఐరన్‌యార్డు ప్రధాన గేటు వద్ద లారీ డ్రైవర్లు మద్యం తాగుతున్నారని, నడిచేందుకు ఇబ్బందిగా ఉందని మహిళలు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన భవానీపురం పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు. **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

? భవానీపురం ఐరన్‌యార్డులో కుక్కలు అధికంగా ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- కోటేశ్వరరావు, స్థానికుడు.**
✔ చర్యలు తీసుకుంటాం. **- సోమశేఖరరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్**
? కమ్మరి వీధిలో ఐదో లైన్‌లో రోడ్డుపై చెత్త తీయడం లేదు. **- కుమార్, స్థానికుడు.**
✔ చెత్త తరలిస్తాం. **- నరసింహారావు, స్థానిక శానిటరీ అధికారి**
? వించిపేట నైజాంగేటు ప్రాంతంలో రంగుమారిన మంచినీరు సరఫరా అవుతుంది. **- సురేంద్ర, స్థానికుడు.**
✔ పైపులైన్ లీకేజీ ఉందేమో పరిశీలిస్తాం. **- రామకృష్ణ, మంచినీటి విభాగం, ఏఈ**
**- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

## సహాయ వైద్య అధికారి అన్నపూర్ణకు సర్కిల్-2 అదనపు బాధ్యతలు

స్పందనకు వందనం

**విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** నగరపాలక సంస్థ సర్కిల్-2 సహాయ వైద్య అధికారి (ఏఎంవోహెచ్)గా అదనపు బాధ్యతలు సర్కిల్-1 సహాయ వైద్య అధికారి అన్నపూర్ణకు అప్పగిస్తూ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం సర్కిల్-2లో సహాయ వైద్య అధికారి బాధ్యతలు నిర్వహిస్తున్న సీహెచ్.బాబూ శ్రీనివాసన్ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఆయన్ని తిరిగి ఒప్పంద పద్ధతిన విధుల్లోకి తీసుకునేందుకు అధికారులు ప్రతిపాదన తెచ్చారు. నెలకు గౌరవ వేతనంగా రూ.37,100 చొప్పున ఏడాదికి రూ.4,45,200 చెల్లించేందుకు నిర్ణయించారు. ఆ ప్రతిపాదనను పాలకపక్షం ఆమోదం కూడా తెలిపింది. అధికారులు, పాలకుల వైఖరిపై విమర్శలు చెలరేగాయి. 'ఈనాడు'లో ఈ నెల 26న 'కాసులిచ్చుకో...కొనసాగించుకో!' శీర్షికన కథనం కూడా ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ ధ్యానచంద్ర ఖాళీ అవుతున్న సర్కిల్-2 సహాయ వైద్య అధికారి బాధ్యతలను అన్నపూర్ణకు అప్పగిస్తూ ఆదేశాలిచ్చారు. బాబూ శ్రీనివాస్‌ను తిరిగి విధుల్లోకి తీసుకునే అంశాన్ని తాత్కాలికంగా పక్కనపెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## హిందువులు కలిసికట్టుగా ఉండాలి

మాట్లాడుతున్న శ్రీభారతీనంద మహారాజ్ స్వామీజీ

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** హిందువులందరూ ఐక్యంగా.. కలిసికట్టుగా ఉండాలని విశాఖపట్నానికి చెందిన ఓం భారత్ శక్తి పీఠం వ్యవస్థాపకుడు శ్రీభారతీనంద మహారాజ్ స్వామి తెలిపారు. గొల్లపాలెంగట్టు శ్రీదాసాంజనేయస్వామి ఆలయం వద్ద తానాజీనగర్ లోని బీఆర్ అంబేడ్కర్ బస్తీ కమిటీ నిర్వాహకులు కొంపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . హిందువులంతా కలిసి ముందుకు సాగితే దేశం మరింత శక్తివంతంగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం అన్న ప్రసాదం వితరణ చేశారు. సమ్మేళనంలో ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ, వ్యాపార వేత్త చింతలపూడి పవన్, న్యాయవాది కనిశెట్టి విశాలి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు చర్యలు

సిగ్నల్స్ ఏర్పాటుకు పరిశీలిస్తున్న వీఎంసీ డీఈ బసిరెడ్డి, సీఐ సురేష్‌బాబు తదితరులు

**చిట్టినగర్:** నియోజకవర్గంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు అధికారులు సిద్ధమయ్యారు. పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్‌పై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు వీఎంసీ, పోలీసు అధికారులు స్పందించారు. ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి నగరపాలక సంస్థ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఏ ప్రాంతంలో ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో పోలీసు అధికారుల సూచన మేరకు మార్కింగ్ చేస్తున్నారు. నగర పాలక సంస్థ ఎలక్ట్రికల్ విభాగం డీఈ బసిరెడ్డి, ఏఈ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ సురేష్‌బాబు, గుత్తేదారు కలిసి చిట్టినగర్ కూడలిలో సోమవారం పరిశీలించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు పాయింట్లు గుర్తించి మార్కింగ్ చేశారు. జనవరి 2వ తేదీ నుంచి పనులు ప్రారంభించనున్నట్లు డీఈ తెలిపారు.

## శ్రీవారి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం నేడు

విద్యుత్తు కాంతుల్లో శ్రీవారి ఆలయం

**చిట్టినగర్:** చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత స్థిత శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ అర్చకులు రత్నమాచార్యులు సోమవారం తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజాము 3 గంటలకు స్వామి వారికి తిరుప్పావై సేవ, సప్తద్వార పూజ, సహస్ర నామార్చన, విశేష పూజలు అనంతరం ఉదయం 5.30 గంటలకు ఉత్తర ద్వారా దర్శనం భక్తులకు అందించనున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో 160 కేజీల ప్రసాదం దర్శనం అనంతరం భక్తులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

## రూ.6 లక్షలతో సీసీ రోడ్డు

పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సత్యబాబు

**చిట్టినగర్** గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతంలో రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసినట్లు 50వ డివిజన్ కార్పొరేటర్ బి. సత్యబాబు తెలిపారు. పనులు వెంటనే ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. నగరాభివృద్ధికి, కొండ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు.

## సినిమాలు

★ **శంబాల, అఖండ-2:** జీ-3 (రాజ్-యువరాజ్), జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్ (గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్ (పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి (భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్ (కానూరు). ★ **ఛాంపియన్, ఈషా:** జీ-3(రాజ్-యువరాజ్), ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **వృషభ, దండోర:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్ (గవర్నర్‌పేట), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **బ్యాడ్ గర్ల్స్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు). ★ **పతంగ్:** పీవీపీ మాల్(బందరు రోడ్డు). * **అఖండ-2:** అలంకార్, శైలజ. ★ **శంబాల:** జయరామ్. **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

## రైలు ప్రమాదంపై విజయవాడలో విచారణ

**విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే:** విజయవాడ డివిజన్ పరిధిలోని ఎలమంచిలి రైల్వేస్టేషన్ వద్ద రైలు నంబరు 18189 టాటానగర్-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ఈ నెల 31, జనవరి 1వ తేదీల్లో విజయవాడలోని సత్యనారాయణపురం ఈటీటీసీలో విచారణ జరుగుతుందని రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే భద్రతా కమిషనర్ మాధవి నేతృత్వంలో జరిగే ఈ విచారణలో రైలు ప్రమాదానికి సంబంధించి వివరాలు, సాక్ష్యం ఇవ్వాలనుకునే ప్రజలు, ప్రయాణికులు నేరుగా హాజరుకావచ్చని తెలిపారు. రైల్వే భద్రతా కమిషనర్, రైల్ నిర్మాణ భవన్, సరోజిని దేవీ రోడ్, సికింద్రాబాద్ పేరుతోనూ లేఖ ద్వారా సమాచారం అందించవచ్చన్నారు. ఫోన్ నంబరు 040-27820104 లోనూ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## జగన్మాత సేవలో త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి

ఆశీర్వచన మండపంలో జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్ కుటుంబం

**ఇంద్రకీలాద్రి:** కనకదుర్గమ్మను త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

# మా మొర ఆలకించండి

## కొండప్రాంత వాసుల వినతులు

**చిట్టినగర్, న్యూస్‌టుడే**

| |
|---|
| పశ్చిమ జనాభా: సుమారు 4 లక్షలు |
| కొండలపై జనాభా: సుమారు 1.5 లక్షలు |
| ఓటర్లు: సుమారు 80 వేలు పైనే |
| కొండలపై ఇళ్లు: సుమారు 50 వేలు |


రిజిస్ట్రేషన్లకు నోచని కొండ ప్రాంతంలోని ఇళ్లు

**భౌ**గోళిక పరిస్థితుల నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గం ఎక్కువ శాతం కొండలను ఆవరించి ఉంది. దశాబ్దాల నుంచి కొండలను ఆక్రమించుకుని ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వారికి అన్ని విధాలుగా మౌలిక సదుపాయాలు కల్పించారు. 2017లో తెదేపా హయాంలో కొండ ప్రాంతాల్లోని నివసించే వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించి, బ్యాంకు రుణాలు పొందేలా చేస్తామని చెప్పారు. అందుకు నివాసితులు దరఖాస్తులు చేసుకున్నారు. అధికారులు సర్వే కూడా నిర్వహించారు. అనంతరం వైకాపా అధికారంలోకి వచ్చి జగనన్న పట్టా పేరుతో కాలాయాపన చేసి వదిలేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలంటూ ప్రజలు తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

### శుభకార్యాలకు అక్కరకొస్తుందని

**ద**శాబ్దాల కాలం నుంచి కొండ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నాం. విద్యుత్తు, తాగునీరు, మెట్లు, రోడ్లు, రక్షణ గోడలు వంటి అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తూ వస్తున్నారు. పూర్తి హక్కు కల్పించలేని పరిస్థితి. పిల్లల చదువులు, శుభకార్యాలు, ఇతర అవసరాలకు బ్యాంకులో ఇల్లు తనఖా పెట్టుకోలేం. బయట వడ్డీలకు తెస్తే అధిక భారమవుతుంది. రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించి మా భవనానికి భరోసా కల్పించాలని కటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం. **- మీరావలి, మార్కుపేట**

### ఎదురు చూపులు తప్పడం లేదు

**కొం**డ ప్రాంతాల్లో నివాసితులకు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పట్టాలు ఇచ్చారు. నాటి నుంచి నేటి వరకు పాలకులు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామని చెబుతున్నారు. కానీ కాలం గడుస్తున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ఇళ్ల నిర్మించుకోవాలన్నా, చిరు వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలన్నా ఇంటిపై బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నాం ఎవరు కూడా మా సమస్య పట్టించుకోవడం లేదు. **- శివలీల, గొల్లపాలెంగట్టు**

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 18 ఫిర్యాదులు

**విజయవాడ నగరపాలక సంస్థ:** ప్రమాదాల నివారణకు వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ ధ్యానచంద్రకు వినతులు అందాయి. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను గడువు లోపు పరిష్కరించాలని, ఆయా సమస్యలు తిరిగి ఉత్పన్నం కాకుండా చూడాలని సూచించారు. డ్రెయిన్ పైపుల లీకులు, రహదారి ఆక్రమణ, అక్రమ నిర్మాణ సమస్యలపై ప్రజలు 18 ఫిర్యాదులు అందించారు.

## సోదర భావానికి చర్చిలు వేదికలు కావాలి

ఎంపీ శివనాథ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నిర్వాహకులు జాకబ్

**విద్యాధరపురం, న్యూస్‌టుడే:** ప్రపంచ శాంతి, సోదర భావానికి చర్చిలు వేదిక కావాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. సితార సెంటరు సమీపంలోని ఫిలదెల్ఫియా చర్చిని సోమవారం సందర్శించిన ఎంపీ శివనాథ్‌కు నిర్వాహకులు సాదర స్వాగతం పలికారు. చర్చి నిర్వాహకులు చల్లా జాకబ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని వర్గాలకు నూతన సంవత్సరం ఆనందోత్సాహాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మైలవరపు కృష్ణ, చిననుబ్బయ్య, ఆర్. మాధవ్, నరసింహ చౌదరి, రేగళ్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళాలు


దాత సూర్యనారాయణకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న జగదీష్

దాత జగన్‌మోహన్‌రావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితుడు

**విద్యాధరపురం, న్యూస్‌టుడే:** శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు రూ.2,11,227 విరాళాన్ని సోమవారం అందజేశారు. కృష్ణా జిల్లా కంకిపాడు చెందిన మల్లెల సూర్యనారాయణ రూ.1,11,111, విజయవాడ పాయకాపురానికి చెందిన కోళ్లిగడ్డ జగన్‌మోహనరావు రూ.1,00,116 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ జగదీష్, వేదపండితుడు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## తక్షణ స్పందనకు పురస్కారం

ఏటీఎం శ్యాం ప్రసాద్, ఆర్టీసీ కానిస్టేబుల్ రెడ్డిలకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, పక్కన అధికారులు

**విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే:** విజయవాడ బస్ స్టేషన్‌లో ఈనెల 27న ఆర్టీసీకి చెందిన ఏసీ బస్సులో మంటలు వస్తుండడంతో తక్షణమే స్పందించి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా మంటలు ఆర్పారు. ఇందుకు చొరవ చూపిన ఆర్టీసీ కానిస్టేబుల్ రెడ్డి, బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ బి.శ్యాంప్రసాద్‌ను ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ప్రశంసా పత్రంతో పాటు నగదు సోమవారం తన కార్యాలయంలో బహుమతి అందించి సత్కరించారు.

## అన్న క్యాంటీన్లలో సమస్యలు లేకుండా చర్యలు

**విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** అన్న క్యాంటీన్లలో సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. అజిత్‌సింగ్‌నగర్, గులాబీ తోట తదితర ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... అన్న క్యాంటీన్ల ద్వారా అందించే ఆహారం నాణ్యత ప్రమాణాలతో ఉండాలని అన్నారు.

## 500 కోడి కత్తుల పట్టివేత

కత్తులతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి, సీఐలు, ఎస్సైలు

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** సంక్రాంతి పండగకు కోడి పందేలు వేసేందుకు తయారు చేసిన కోడి కత్తులను టాస్క్‌ఫోర్స్, కొత్తపేట పోలీసులు పట్టుకున్నారు. విజయవాడ శివారు గ్రామీణ ప్రాంతం అంబాపురంలో శనగశెట్టి విజయబాబు అలియాస్ పండు సంక్రాంతికి కోడి పందేలు వేసేందుకు కోడి కత్తులు సిద్ధం చేస్తారు. మైలవరంలో ఈ కత్తులు తయారై సాన పెట్టేందుకు విజయబాబు వద్దకు కొందరు నిర్వాహకులు తెచ్చారని సమాచారం. ఈ విషయం తెలియడంతో టాస్క్‌ఫోర్స్, కొత్తపేట పోలీసులు సంయుక్తంగా విజయబాబు ఇంటిపై సోమవారం దాడి చేశారు. 500 కత్తులను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి, సీఐలు కె.శ్రీధర్‌కుమార్, సుబ్రహ్మణ్యం, కొత్తపేట ఎస్సై హరిప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపేట సీఐ చిన కొండలరావు తెలిపారు.

## సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

**విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే:** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సంక్రాంతి పండుగకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ★ **07460 :** కాకినాడ టౌన్-వికారాబాద్ ప్రత్యేక రైలు జనవరి 8వ తేదీ సాయంత్రం 6.20 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి 9వ తేదీ ఉదయం 8 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది. ★ **07461:** వికారాబాద్-పార్వతీపురం ప్రత్యేక రైలు జనవరి 9, 11 తేదీల్లో వికారాబాద్‌లో రాత్రి 8.30గంటలకు బయలుదేరి 12వతేదీ మధ్యాహ్నం 2.30గంటలకు పార్వతీపురం చేరుకుంటుంది. ★ **07462:** పార్వతీపురం-వికారాబాద్ ప్రత్యేక రైలు జనవరి 10 తేదీల్లో సాయంత్రం 6.30 గంటలకు పార్వతీపురంలో బయలుదేరి 11వ తేదీ ఉదయం 11.30 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది. ★ **07463:** పార్వతీపురం-కాకినాడటౌన్ ప్రత్యేక రైలు 12వ తేదీ సాయంత్రం 6.30కి పార్వతీపురంలో బయలుదేరి 13వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు కాకినాడ టౌన్ చేరుతుంది. ★ **07464:** సికింద్రాబాద్-పార్వతీపురం ప్రత్యేక రైలు జనవరి 8వ తేదీ రాత్రి 10 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి 09వ తేదీ మధ్యాహ్నం 2.30గంటలకు పార్వతీపురం చేరుకుంటుంది.

### తిరుగు ప్రయాణంలో..

★ **07465:** పార్వతీపురం-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు 9వ తేదీ సాయంత్రం 6.30కి పార్వతీపురంలో బయలుదేరి 10వ తేదీ ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ★ **07186:** వికారాబాద్-కాకినాడటౌన్ ప్రత్యేక రైలు జనవరి 7, 9 తేదీల్లో కాకినాడ టౌన్‌లో సాయంత్రం 4.45కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు ★ **07185:** వికారాబాద్-కాకినాడటౌన్ ప్రత్యేక రైలు జనవరి 8వ తేదీ సాయంత్రం 5.35కి వికారాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.30కి కాకినాడటౌన్ చేరుతుంది. ★ **07187:** వికారాబాద్-కాకినాడటౌన్ ప్రత్యేక రైలు జనవరి 10వ తేదీ రాత్రి 7 గంటలకు వికారాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11 గంటలకు కాకినాడటౌన్ చేరుకుంటుంది.

## వేధిస్తున్న భర్తపై ఫిర్యాదు

**విద్యాధరపురం, న్యూస్‌టుడే:** మద్యానికి బానిసైన వేధిస్తున్న భర్తపై భార్య పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. గొల్లపూడి ప్రాంతానికి చెందిన అమర్‌బాబు, సుజాతలకు 16 ఏళ్ల కిందట వివాహమైంది. వివాహ సమయంలో రూ.3 లక్షలు కట్నంతోపాటు బంగారం, ద్విచక్ర వాహనాన్ని కూడా తన తల్లిదండ్రులు ఇచ్చినట్లు సుజాత ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉద్యోగం చేయకుండా మద్యానికి బానిసై తన ఇద్దరు కుమారులతోపాటు తనను కొట్టి హింసిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ తాపీ మేస్త్రీ మృతి

**విద్యాధరపురం, న్యూస్‌టుడే :** హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఎం. రాములు మెట్ల మీద నుంచి జారి పడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 27న తాపీ పని చేసేందుకు వెళ్లిన సమయంలో భవనం మెట్లపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు ఆయన్ను ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రైలు కింద పడి ప్రయాణికుడి ఆత్మహత్య

**విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే:** కొండపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం రైలు కింద తలపెట్టి ఒక గుర్తు తెలియని ప్రయాణికుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సి. హెచ్. రాజా అరవిందనాథ్ తెలిపారు. మృతుని వయస్సు సుమారు 25 సంవత్సరాలు ఉంటాయని, తెలుపు రంగు టీషర్టు, నలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించినట్లు చెప్పారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే విజయవాడ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత

చెక్కు అందజేస్తున్న చల్లంరాజు సత్రం పాలకమండలి ఛైర్మన్ శివ, సభ్యులు

**విద్యాధరపురం, న్యూస్‌టుడే:** పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఎంతో ఉపశమనం కలిగిస్తాయని చల్లం రాజు వెంకటశేషయ్య ధర్మసత్రం పాలకమండలి ఛైర్మన్ ఎం.శివ తెలిపారు. పాతబస్తీలోని గాంధీజీ మున్సిపల్ స్కూల్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు 120 మందికి చల్లం రాజు వెంకటశేషయ్య ధర్మ సత్రం తరపున రూ.5,60,000 నగదును ఉపకార వేతనాల కింద అందజేశారు. ఈసందర్భంగా శివ మాట్లాడుతూ.. ట్రస్టు నిర్వాహకుల ఆదేశాలనుసారం ఏటా విద్యార్థులకు ఉపకార వేతనాలు, పేదలకు అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్రం కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి, పాలక మండలి సభ్యులు రామిరెడ్డి, లక్ష్మణరావు, ఆనంద్, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు ఖాతాల్లో నగదు మాయం

**విజయవాడ నేరవార్తలు:** గొల్లపూడికి చెందిన ఒక యువకుడి (23) బ్యాంకు ఖాతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.3.32 లక్షలు మాయం చేసినట్లు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. యువకుడికి ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంకుల్లో రెండు ఖాతాలు ఉన్నాయి. ఈ నెల 14 నుంచి 18 మధ్య కాలంలో వాటి నుంచి విడతల వారీగా రూ.3.32 లక్షలు కనిపించకుండా పోయాయి. ఆలస్యంగా గుర్తించిన అతడు.. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఏపీకే ఫైల్‌ను క్లిక్ చేసి ఉంటారని, ఖాతాలను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు డబ్బులు మాయం చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## 'మత్తు' నిందితుల కోసం అన్వేషణ

### గాలిస్తున్న ప్రత్యేక బృందాలు

**ఈనాడు, అమరావతి:** డ్రగ్స్ కేసులో కీలకమైన నిందితుల కోసం అన్వేషణ సాగుతోంది. ఈ నెల 21న ఎండీఎంఏ తీసుకుంటూ దొరికిన కేసులో ఇప్పటికే ముగ్గురు అరెస్టు అయ్యారు. దొరికినట్లే దొరికి మాచవరం స్టేషన్ నుంచి కారులో పరారైన రాజేష్ ఆచూకీ ఇంకా దొరకలేదు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నప్పుడు ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారైన తర్వాత కారును ఎగ్జిక్యూటివ్ క్లబ్‌లోని పార్కింగ్‌లో సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఏపీ దాటి హైదరాబాద్ నగరంలోకి వెళ్లి తలదాచుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడికి హైదరాబాద్‌లో చాలా మంది స్నేహితులు ఉన్నారు. వారి కాల్స్‌పై నిఘా పెట్టారు. వారి ఫోన్లకు వస్తున్న, వెళ్తున్న కాల్స్‌ను విశ్లేషిస్తున్నారు. కామన్‌గా ఉండే నంబర్లపై దృష్టి పెట్టారు. మరోవైపు బెంగళూరు ఎండీఎంఏ అమ్మిన మహేష్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందం గాలిస్తోంది. ఈ బృందం విశాఖపట్నం, నెల్లూరు, హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో నిందితుల కోసం అన్వేషిస్తోంది. ఈ కేసులో మరికొంత మందిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది.

## వచ్చే నెల 4న హిందూ సమ్మేళనం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

**చిట్టినగర్:** భారతీయ సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటుగా హిందువులను ఒక తాటిపైకి తీసుకు వచ్చేందుకు హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి పాలకమండలి సభ్యులు అవ్వారు బుల్లబ్బాయి తెలిపారు. హిందూ సమ్మేళనం కరపత్రం లలితాంబిక పీఠం ఆలయంలో అమ్మవారి సన్నిధిలో ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. వచ్చేనెల 4న పాల ఫ్యాక్టరీ ఆవరణలో జరిగే హిందూ సమ్మేళనానికి హిందు బంధువులందరు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెవర శ్రీనివాసరావు, తెలుగుంట్ల సుధాకర్, మారుతీ, శివకుమార్, ప్రవీణ్‌కుమార్, సుందరి, విజయకుమారి పాల్గొన్నారు.

(c) eenadu

# విజయవాడ మధ్య

హాజరైన విద్యార్థులు, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న హుస్సేన్

## క్విజ్ పోటీల్లో ప్రతిభ

**అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే :** స్థానిక లూనా సెంటర్‌లోని ఎం.కె.బేగ్ మున్సిపల్ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా వర్తమాన వ్యవహారాలపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. బి.యశస్విని(8వ తరగతి), ఎ.నవ్య శ్రీసాయి(9వ తరగతి), డి.దాక్షాయణి(9వ తరగతి) తొలి మూడు స్థానాల్లో గెలుపొందారు. వీరికి ప్రిన్సిపల్ ఎం.హుస్సేన్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

## ఉత్తమ ఫలితాలు సాధించండి

**అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే :** స్థానిక ఎం.కె.బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో ఉపయోగపడే భౌతిక, రసాయన శాస్త్ర పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. వీటిని ప్రధానోపాధ్యాయుడు ఎం.హుస్సేన్ తన సొంత నిధులతో 132 మందికి సమకూర్చారు. మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులు రవిబాబు, సైదా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## అడుగడుగునా గుంతలే..!

### భయపెడుతున్న గుణదల-నున్న బైపాస్ రోడ్డు

పెద్ద గుంతలతో అధ్వానంగా రహదారి

**మధురానగర్, న్యూస్‌టుడే**

గుణదల ఒకటో డివిజన్ నుంచి నున్నకు వెళ్లే బైపాస్ రోడ్డు వాహన చోదకులను భయపెడుతోంది. అడుగడుగునా ఏర్పడ్డ గుంతల్లో వాహనం నడపాలంటే చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. గుణదల దాని పరిసర ప్రాంత ప్రజలు ఎక్కువగా ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అజిత్‌సింగ్‌నగర్, పైవంతెన వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండడంతో.. చోదకులు నున్న వెళ్లేందుకు ఎక్కువగా ఈ మార్గాన్ని వినియోగిస్తుంటారు. మరోవైపు రామవరప్పాడు పైవంతెన మీదుగా వచ్చే వాహనాలు ఇన్నర్‌రింగ్ రోడ్డులో నుంచి ఈ బైపాస్‌రోడ్డులోకి చేరి, అక్కడి నుంచి నున్న వైపు వెళతాయి. ఇంత ప్రాముఖ్యమైన ఈ రహదారిని గత కొద్ది సంవత్సరాలుగా పట్టించుకోకపోవడంతో గుంతలు బాగా పెరిగిపోయాయి. ద్విచక్ర వాహనాల చోదకులు అదుపుతప్పి కిందపడిపోతున్నారు. ప్రమాదాల బారినపడుతున్నారు.

| | |
|---|---|
| రహదారి పేరు : | గుణదల-నున్న బైపాస్‌రోడ్డు |
| ద్విచక్ర వాహనాలు : | 5వేలు |
| కార్లు, ఇతర వాహనాలు : | 1000 |
| రాకపోకలు సాగించే జనం : | 8 వేల మంది |

**తగ్గనున్న దూరం :** గుణదల వాసులు నున్న వైపు వెళ్లాలంటే ఈ మార్గాన్ని ఎక్కువగా వినియోగిస్తారు. అజిత్‌సింగ్‌నగర్, రామవరప్పాడు పై వంతెనల వైపు వెళ్లకుండా.. ఇటు వెళితే కనీసం 3 నుంచి 7 కిలోమీటర్లు కలిసి వస్తుంది. దీం తో ఈ మా ర్గం కీలకంగా మారిం ది. గత ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులు చేయకపోవడంతో.. చాలా చోట్ల గోతులు పడ్డాయి. ఇటీవల భారీ వాహనాల రాకపోకలు పెరగటంతో మరింత శిథిలావస్థకు చేరింది. పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు వీలులేకుండా పోయే వరకు చూడకుండా.. కొత్త రోడ్డు వేయాలని, లేకపోతే తాత్కాలికంగా గోతులను పూడ్చాలని వాహన చోదకులకు కోరుతున్నారు.

**ఉద్యోగులకు ఇబ్బందులు :** ఈ మార్గంలో నున్న పవర్ గ్రిడ్ ఉంది. ఇటు వైపు వివిధ ప్రైవేట్ సంస్థలు, కార్యాలయాలు ఉన్నాయి. వీరంతా ఈ మార్గాన్నే ఎక్కువగా వినియోగిస్తుంటారు. గోతుల కారణంగా ఈ రహదారిలో వెళ్లే ఉద్యోగులు అష్టకష్టాలు పడుతున్నారు.

## ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం పరిధిలోని శిశు గృహాలు, చిల్డ్రన్ హోమ్స్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆయాలు, చౌకీదార్, సహాయకులు, వంట పనివారు, నైట్ వాచ్ ఉమెన్, ఎడ్యుకేటర్, యోగా, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ టీచర్లు తదితర 20 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. 82 మంది అభ్యర్థినులు హాజరయ్యారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు వారిని ఇంటర్వ్యూ చేశారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ రుక్సానా సుల్తానా బేగం, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

**సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే :** సనాతన ధర్మం హిందూ ధర్మం, సంస్కృతి భారతదేశపు ఆత్మ అని.. దాన్ని కాపాడుకోవాలని లలితా పీఠం పీఠాధిపతి ఆదిత్యానంద భారతీ స్వామీజీ అన్నారు. ఆర్ఎస్ఎస్ సంస్థ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం గులాబీతోటలోని అమరావతి వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సనాతన ధర్మం ప్రతిరూపమే హిందూ సమ్మేళనమని చెప్పారు. సమాజ శ్రేయస్సు కోసం ఏకతాటిపై నడవాలని కోరారు. న్యాయవాది సతీష్ మాట్లాడుతూ.. అందరిలో దైవత్వాన్ని చూడడమే హిందూ ధర్మం ప్రత్యేకత అని చెప్పారు. దేశ, సంస్కృతి, పండగల గురించి తెలుసుకోవడానికి ఇలాంటి సమ్మేళనాలు దోహదపడతాయని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సి.వి.సదాశివ, పి.చంద్రశేఖర్, జి.సీతారావమ్మ, లక్ష్మీకుమారి, బండారు వెంకటేశ్వరరావు, విశ్వనాథ్, పసుపులేటి పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761


**అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే :** అజిత్‌సింగ్‌నగర్ ఎక్స్ఎల్ ప్లాంట్ సమీప మలుపులో ప్రమాదకరంగా గుంత ఉంది. ద్విచక్ర వాహనదారులు రాత్రివేళ గుర్తించలేకపోతున్నారు. దీనిపై 'ఈనాడు'లో ఈ నెల 28న 'మలుపులో ప్రమాదకర గుంత' శీర్షికతో వార్త ప్రచురితమైంది. వీఎంసీ సిబ్బంది స్పందించి.. గుంత పూడ్చారు. రాకపోకలు సజావుగా సాగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**?** : అజిత్‌సింగ్‌నగర్ అయ్యప్పస్వామి ఆలయం వీధిలో రోడ్డుపై చెత్త పడవేస్తున్నారు. **– రేణుక, స్థానికురాలు**

✔ చెత్త తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. **- బాబూ శ్రీనివాసన్, ఏఎంవోహెచ్ – న్యూస్‌టుడే, పాయకాపురం**

## రూ.15 లక్షలతో సీసీ రోడ్డు

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే :** గవర్నర్‌పేట గోపువారి వీధిలో రూ.15 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు గవర్నర్‌పేటలో రూ.45 లక్షలతో 3 రోడ్ల నిర్మాణానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం గోపువారి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. నాణ్యతలో రాజీపడవద్దని సదరు గుత్తేదారుకు కార్పొరేటర్ సూచించారు.

## 6 నుంచి ఉరుసు ఉత్సవాలు

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే :** గుంటూరులో హిందూ ముస్లింలు ఐక్యంగా ఆరాధించే హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా బాబా 134వ ఉరుసు ఉత్సవాలు జనవరి 6 నుంచి ప్రారంభించనున్నట్లు దర్గా ధర్మకర్త రావి రామ్మోహన్‌రావు తెలిపారు. 10వ తేదీ వరకు కొనసాగుతాయి. భక్తులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. సోమవారం గవర్నర్‌పేటలో ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 6న చాందిని అలంకరణ, అన్నదానం, రాత్రి సందల్ (గంధం), 7న గంధం పంపిణీ, 8న ఆదివారం గ్యార్మిషరీఫ్, తెల్లవారుజామున ప్రసాదం పంపిణీ, అన్నదానం చేస్తామన్నారు. 9న బాబా వారికి భక్తిశ్రద్ధలతో చద్దర్లు (శేషవస్త్రాలు) ఫకీర్లకు పంచుతామని వివరించారు. 10వ తేదీన బాబా ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచడంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన వివరించారు. రావి దూండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదాల ఫిర్యాదులే అధికం

**విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే :** నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 60 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఎస్.వి.డి.ప్రసాద్, ఏడీసీపీ ఎం.రాజారావు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అత్యధికంగా భూవివాదాలు, నగదు లావాదేవీలపై 27, కుటుంబ కలహాలు 7, మోసాలు 5, దొంగతనాలు 5, కొట్లాటలు 3, మహిళా సంబంధ నేరాలు 3, ఇతర ఫిర్యాదులు 10 చొప్పు వచ్చాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపించి సత్వరం పరిష్కరించాలని వారు ఆదేశించారు.

వివరాలు తెలుసుకుంటున్న ఏడీసీపీ రాజారావు

## వ్యవసాయ విద్యుత్తుకు వినతి

**ఎన్టీఆర్ కలెక్టరేట్ :** వ్యవసాయ భూముల్లో విద్యుత్తు సౌకర్యం పొందడానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరుతూ మైలవరం మండలం పుల్లూరుకు చెందిన పలువురు గిరిజనులు విజయవాడ కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రాలు అందజేశారు. తమకు అటవీ భూముల హక్కు పత్రాలు మంజూరయ్యాయని, బోర్లు వేసినా.. విద్యుత్తు కనెక్షన్లు లేవని వివరించారు.

## 18న శ్రీకృష్ణదేవరాయలు జయంతి

**గాంధీనగర్, న్యూస్‌టుడే :** దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగు భాషకు పూర్వ వైభవం తెచ్చిన శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలను జనవరి 18న హనుమాన్‌పేటలోని కృష్ణప్రియ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణదేవరాయ ఉద్యోగ ఐకాస రాష్ట్ర కన్వీనర్ పోమరౌతు రామకృష్ణ తెలిపారు. సోమవారం గాంధీనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయలు జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ హైడ్రా కమిషనర్ ఆవుల రంగనాథ్‌కు 'రాయల్' బిరుదు ప్రదానం, ప్రముఖులకు పురస్కారాలు అందజేస్తున్నట్లు చెప్పారు. కాపు, జలిజ నాయకులు, ఉద్యోగులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆహ్వాన కమిటీ సభ్యులు జె.శ్రీనివాస్, కె.నారాయణ, కె.కృష్ణమోహన్, జె.రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన శ్రీనివాస్, నారాయణ తదితరులు

## పెండింగ్‌లో కుష్ఠు సర్వే సొమ్ము

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** ఆశా కార్యకర్తలకు పెండింగ్‌లో ఉన్న కుష్ఠు సర్వే సొమ్ము చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ. ఈ ఏడాది రెండు విడతలుగా 28 రోజుల పాటు సర్వే చేసినట్లు చెప్పారు. మెటీరియల్ సరఫరా లేక పోవడంతో ఫార్మాట్‌లను ఆశాలనే జిరాక్సు తీయించుకున్నట్లు వివరించారు. డీఎంహెచ్‌వో ఎం.సుహాసినీ, జిల్లా కుష్ఠు నివారణ అధికారి భానునాయక్ స్పందిస్తూ.. రెండో విడత సర్వేకి బడ్జెట్ పెట్టినట్టు తెలిపారు. జిల్లా ఆశా వర్కర్ల సంఘం నాయకులు ఇ.దుర్గాలక్ష్మి, టి.హవేలా కుమారి, పి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ❖ రీ సర్వే నేపథ్యంలో పూర్వార్జిత భూములకు సంబంధించి వన్ బీ అడంగల్ సర్వే కాలమ్‌లో ఇతరులుగా నమోదు చేస్తున్నారని, పూర్వీకుల పేర్లను రాయాలని కోరుతూ.. ఏపీ రైతు సంఘాల సమాఖ్య నేతలు చెరుకూరి వేణుగోపాల్, కోటిరెడ్డి విన్నవించారు.

కలెక్టర్ లక్ష్మీశకు వివరిస్తున్న కమల, ఆశా కార్యకర్తలు

## మహాసభల విజయవంతానికి ప్రచారం

ద్విచక్రవాహనాల ప్రదర్శనలో కార్యకర్తలు

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే :** విశాఖపట్నంలో జనవరి 4న నిర్వహించే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆలిండియా మహాసభల ఆవశ్యకతను వివరిస్తూ సోమవారం నగరంలో ద్విచక్రవాహనాల ప్రదర్శన నిర్వహించారు. హనుమాన్‌పేట నుంచి ప్రారంభమై.. కండ్రిక, సత్యనారాయణపురం, గవర్నర్‌పేట, గాంధీనగర్, రైల్వేస్టేషన్, బస్టేషన్, బీసెంట్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో తిరిగారు. నాయకులు వై.సుబ్బారావు, ఎం.సోమేశ్వరరావు, ఎం.బాబూరావు, టి.ప్రవీణ్ తదితరులు మాట్లాడారు. సమావేశానికి తరలిరావాలని కోరారు.

## 'ఉపాధి పథకం పేరు మార్పు తగదు'

నిరసన తెలుపుతున్న రఘువీరారెడ్డి, పల్లంరాజు, శోభనాద్రీశ్వరరావు, రుద్రరాజు, శివాజీ, బాబూరావు, నరసింహారావు తదితరులు

**విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే :** మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాజకీయ, రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గాంధీ పేరు స్థానంలో వీబీ జీ రామ్ జీ పేరు పెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడలో ఏపీసీసీ నాయకుడు కొలనుకొండ శివాజీ నేతృత్వంలో సమాలోచన సదస్సు నిర్వహించారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, జనసమ్మేళన, రైతు, కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. రైతులు, రైతు కూలీలకు మధ్య చిచ్చుపెట్టి, రైతు కూలీల నోట్లో మట్టికొట్టేందుకే ఈ కొత్త పథకం అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. నిధుల పంపిణీలో కేంద్రం వాటా తగ్గించాలనే ఉద్దేశంతో ఉన్నారన్నారు. 40 శాతం నిధులు రాష్ట్రాలపై వేస్తే.. రాబోయే రోజుల్లో ఏపీతో సహా అనేక రాష్ట్రాలు అమలు చేయలేక చేతులెత్తేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**దురదృష్టకరం:** కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు మాట్లాడుతూ.. లక్షలాది మందిని దారిద్ర్య రేఖ నుంచి బయటకు తెచ్చిన ఈ చట్టం పేరు మార్చడం దురదృష్టకరమన్నారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. బిల్లులపై చర్చ లేకుండానే భాజపా ప్రభుత్వం చట్టాలు మార్చేస్తోందని దుయ్యబట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ.. గాంధీ పేరును యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు మాట్లాడుతూ.. పథకం పేరు మార్పు పేద ఉపాధిపై దాడి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కేశవరావు, నరసింహారెడ్డి, నరసింహారావు, లక్ష్మారెడ్డి, ఆదియోకుమార్, కామక్ష ప్రభాకర్, అక్కిరాజు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## జీవో నంబరు-36 అమలుకు డిమాండ్

ధర్నాలో రఘురామ్, ఈశ్వర్రావు, వెంకట్రామయ్య, వెంకటేశ్వరరావు, రవీంద్రనాథ్ తదితరులు

**గాంధీనగర్, న్యూస్‌టుడే :** జీవో నంబరు 36 అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఐకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు ప్రతి పీఆర్సీకి ఒకసారి వేతన సవరణ చేయాలని, అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. ఖాళీలను భర్తీ చేయాలని, గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, పదవీ విరమణ వయసు 62ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. జనవరి 5వ తేదీ నుంచి ధర్నా చౌక్‌లో రిలే నిరాహార దీక్షలు చేపడతామని చెప్పారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ.. సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు తోట వెంకట్రామయ్య, మొవ్వ వెంకటేశ్వరరావు, సి.హెచ్.నరసింహారావు, కె.వి.ఎస్.రవికుమార్, సి.హెచ్.బాబూరావు, వై.కేశవరావు, ఆర్.రవీంద్రనాథ్, పి.అజయ్‌కుమార్, ఎన్.సి.హెచ్.శ్రీనివాస్, గంగారావు, పి.సత్యనారాయణ, రామాంజనేయులు, వివిధ జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మికి చెక్కు అందజేస్తున్న ఈవో సుబ్బారెడ్డి

**మాచవరం, న్యూస్‌టుడే :** ఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న 20 మంది పేద విద్యార్థులకు రూ.6వేల చొప్పున చల్లంరాజు వెంకట శేషయ్య ధర్మ సత్రం వారు రూ.1.20 లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. వీటిని ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మికి సోమవారం సత్రం ఈవో బి.సుబ్బారెడ్డి అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యమని ఆయన చెప్పారు. అధ్యాపకుడు బాలసుబ్రహ్మణ్యం, ధర్మసత్రం సభ్యులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**సూర్యారావుపేట, న్యూస్‌టుడే :** సూర్యారావుపేట ప్రకాశం రోడ్డులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని ఓ వ్యక్తి (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. కుడి చేతిపై పచ్చబొట్టు ఉందని, అది నేపాలీ భాష కావచ్చని భావిస్తున్నారు. కుడి కాలు, చేతికి, మెడకు నల్లని తాడు కట్టి ఉంది. సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిస్తే స్టేషన్‌లో సంప్రదించాలని వారు కోరారు.

## వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

**గాంధీనగర్, న్యూస్‌టుడే :** కొత్త హాజీసవాదకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యంపై సోమవారం సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నందిపాగు వక్రయ్య(33) మానసిక స్థితి సరిగా లేదు. అతను నోరి ఆస్పత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఈ నెల 26న వేకువనే బయటకు వెళ్లిపోయాడు. ఆస్పత్రి వాసులు ఆచూకీ కోసం ప్రయత్నించి, ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## దుకాణంలో అగ్నిప్రమాదం

**రూ.26 లక్షల ఆస్తి నష్టం**

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే :** హనుమాన్‌పేట అద్బుతరావు వీధిలోని ఒక దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించి రూ.26 లక్షల విలువైన సరకు దగ్ధమైనట్లు గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడకు చెందిన మాచర్ల కిరణ్‌బాబు హనుమాన్‌పేటలో ప్లాస్టిక్, రెగ్జిన్, లెదర్ వ్యాపారం చేస్తుంటారు. ఈ నెల 26న తేదీ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో దుకాణం పక్కనే పని చేసే శ్రీనివాస్.. ఆయనకు ఫోన్ చేశారు. దుకాణం నుంచి మంటలు వస్తున్నాయని చెప్పడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అప్పటికే దుకాణం మొత్తం కాలిపోయింది. రూ.26లక్షల విలువైన సరకు కాలిపోయినట్లు గవర్నర్‌పేట పోలీసులకు ఈ నెల 27న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.15 లక్షల బీమా అందజేత



చెక్కు అందిస్తున్న రమేష్‌కుమార్‌సింగ్, సంజయ్‌కుమార్ ప్రసాద్, నరసింహారావు

**అరండల్‌పేట (సీతారాంపురం), న్యూస్‌టుడే :** ఏపీఎస్‌డీఆర్ అండ్ ఎఫ్ఎస్ (రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖ) హెడ్ కానిస్టేబుల్ అన్వర్ బాషా ఈ నెల 20న అనారోగ్యంతో మృతిచెందారు. బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) ఎన్టీఆర్ కాలనీ శాఖ నుంచి రూ.15 లక్షల బీమా మంజూరైంది. సదరు చెక్కును బాషా భార్య మొహమ్మద్ మోతికి బీవోబీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ రమేష్‌కుమార్‌సింగ్ అందజేశారు. ఏపీఎస్‌డీఆర్ అండ్ ఎఫ్ఎస్, బీవోబీ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు బ్యాంకు తక్షణమే బీమా మొత్తాన్ని అందించింది. సోమవారం అరండల్‌పేటలోని జిల్లా అగ్నిమాపక కేంద్రంలో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అగ్నిమాపకాధికారి బి.నరసింహారావు, ఆటోనగర్ స్టేషన్ అగ్నిమాపకాధికారి జి.వి.రామారావు, హైదరాబాద్ డిఫెన్స్ బ్యాంకింగ్ అడ్వైజర్ బ్రిగేడియర్ సంజయ్‌కుమార్ ప్రసాద్ పాల్గొన్నారు.

## అలరించిన 'యువ తరంగం'

**విజయవాడ సాంస్కృతికం :** నూతన సంవత్సరం-2026 కళాకారుల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని శతావధాని కళాశాల అధ్యక్షుడు నిదమర్తి రామ సత్యనారాయణ ఆకాంక్షించారు. సోమవారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై మహాకవి సావిత్రి సాహిత్య సాంస్కృతిక కళాపీఠం వ్యవస్థాపకులు, ప్రముఖ వయొలిన్ విద్వాంసుడు అద్దంకి 'యువ తరంగం' సినీ సంగీత విభావరి నిర్వహించారు. అయినంపూడి వీరభద్రరావు, చింతయారు చిట్టిబాబు హాజరై మాట్లాడారు. నేటి యువతరానికి వేదిక కల్పిస్తున్న విద్యాసాగర్‌ను అభినందించారు. గాయకులు సినీ గేయాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు.

## బ్యాంకు ఖాతాల్లో నగదు మాయం

**విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే :** గొల్లపూడికి చెందిన ఒక యువకుడికి (23) బ్యాంకు ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.3.32 లక్షలు మాయం చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసు కేసు నమోదు చేశారు. యువకుడికి ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంకుల్లో రెండు ఖాతాలు ఉన్నాయి. ఈ నెల 14 నుంచి 18 మధ్య కాలంలో వాటి నుంచి విడతల వారీగా రూ.3.32 లక్షలు కాజేసినట్లుగా తెలియడంతో అప్రమత్తమయ్యారు. గుర్తించిన అతడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. తనకు తెలియకుండా అతడు ఏపీకే ఫైల్‌ను క్లిక్ చేసి ఉంటారని, ఖాతాలను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు డబ్బులు మాయం చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

**గాంధీనగర్, న్యూస్‌టుడే :** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.యుగంధర్, పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. సోమవారం వారు దాసరి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి.. మాటతప్పారని విమర్శించారు. 1.37 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం (నేడు) చలో విజయవాడకు పిలుపునిస్తామని హెచ్చరించారు. జనవరి 3న విద్యార్థి సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

## శస్త్ర చికిత్సలకు అనుమతులు హర్షణీయం

**గాంధీనగర్, న్యూస్‌టుడే :** కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేద వైద్యులకు అనుమతిస్తూ మంజూరు చేసిన 58 రకాల శస్త్రచికిత్సలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ అనుమతులు ఇవ్వడం హర్షణీయమని విశ్వ ఆయుర్వేద పరిషత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాహితీ అన్నారు. సోమవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వేల సంవత్సరాల పూర్వమే ఆయుర్వేద వైద్యులు శస్త్రచికిత్సలు చేశారని గుర్తు చేశారు. ఆయుర్వేదంలోనూ టెక్నాలజీని ఉపయోగించి చికిత్సలు చేయవచ్చన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉత్తర్వుల రూపంలో ఇవ్వాలని కోరారు. ఫిబ్రవరి 6, 7 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే ఆయుర్వేద వైద్య సదస్సు గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ గురుమూర్తి, నల్లు ధరణీకుమార్, చలపతిరావు, ప్రశాంత్, పూర్ణ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


**SBI భారతీయ స్టేట్ బ్యాంక్**

హోమ్ లోన్ సెంటర్-1 (ఆర్ఎసిపిసి-1), కె.కె.టవర్స్, మొదటి అంతస్థు, యం.జి.రోడ్డు, విజయవాడ-520 010, యన్‌టిఆర్ జిల్లా.

Appendix – IV –A
[See Provison to rule 8(6) R/w 9(1)]

**స్థిరాస్తి ఈ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన తేది.16-01-2026**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకపు నోటీసు రూల్ 8(6) ఆర్/డబ్ల్యు రూల్ 9(1) ప్రకారం

భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద జారీచేయబడిన నోటీసు ప్రకారం దిగువ ఋణ ఖాతాలలో **"ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగానే ఏది ఉన్నది ఉన్నట్లుగానే మరియు ఏది ఉంటే అది ఉన్నది ఉన్నట్లుగానే"** అనే నిబంధనపై బ్యాంక్ బకాయిలను మరియు వడ్డీను వసూలు చేయటానికి విక్రయించే హక్కుతో దిగువ ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. కావున బకాయిలను తిరిగి చెల్లించటంలో విఫలమైన తరువాత దిగువ అధీకృత అధికారి పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద ఇవ్వబడిన అధికారాన్ని ఉపయోగించి సదరు ఆస్తిని విక్రయించడం ద్వారా బ్యాంకు బకాయిలను రాబట్టుకొనుటకు ప్రతిపాదిస్తున్నారు. **https://www.baanknet.com** వెబ్ పోర్టల్‌లో పేర్కొన్న ఇ-వేలం ఫ్లాట్‌ఫాం ద్వారా దిగువ సంతకం చేసిన వ్యక్తి ద్వారా అమ్మకం జరుగుతుంది.

<u>ఋణగ్రహీత(ల) పేరు:</u> **1. శ్రీ కుర్రా మారుతి శంకర్, తండ్రి: వెంకటేశ్వరరావు,** 2వ అంతస్థు, బి-5, చంద్రహాస అపార్ట్‌మెంట్, పెట్రోల్ బంక్ ప్రక్కన, ఆంధ్రప్రభ కాలని, విజయవాడ-520 013, యన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్. **2. శ్రీమతి కుర్రా సుశీల, తండ్రి: బాలసుబ్బారావు వేల్పుల, భర్త: కుర్రా మారుతి శంకర్,** డోర్ నెం: 41-29/1-25, చలసాని నగర్, రాణిగారి తోట, విజయవాడ-520 013, యన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

<u>బకాయి మొత్తం:</u> **ది.04-06-2025 నాటికి రూ.1,37,69,216/- (అక్షరాల ఒకకోటి ముప్పైఏడులక్షల అరవైతొమ్మిదివేల రెండువందల పదహారు రూపాయలు మాత్రమే) & ది.29-12-2025 నాటికి రూ.1,45,81,448/- (అక్షరాల ఒకకోటి నలభైఐదులక్షల ఎనభైఒక్కవెయ్యి నాలుగువందల నలభైఎనిమిది రూపాయలు మాత్రమే)** (ఏవైనా చెల్లింపులు ఉంటే తగ్గించగా) తదుపరి వడ్డీ, ఖర్చులు.

<u>స్థిరాస్తి వివరము:</u> కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, విజయవాడ గ్రామం, రీ సర్వే నెం. 18/4 లోని ఉత్తర భాగం 207.33 చ॥గ॥లు శ్రీమతి కుర్రా సుశీల, భర్త: మారుతి శంకర్ గారికి చెందిన డాక్యుమెంట్ నెం.3578/2013, తేది:15-05-2013. **హద్దులు: తూర్పు:** 30 అడుగుల వెడల్పుగల రోడ్డు-30.0 అడుగులు, **దక్షిణం:** ఇతరుల ఆస్థి-62.2 అడుగులు, **పడమర:** సుందరరావు గారి ఆస్థి-30.0 అడుగులు, **ఉత్తరం:** పి. కనకదుర్గా గారి ఆస్థి-62.2 అడుగులు. ఈ నాలుగు హద్దుల మధ్య గల విస్తీర్ణం 207.33 చ॥గ॥లు లేక 173.35 చ॥మీ॥లు (ఆర్‌సిసి భవనము నిర్మించబడుచున్నది స్టిల్ట్ & జి+2).

**రిజర్వు ధర: రూ.1,51,33,000/- ధరావత్తు: రూ.15,13,300/- బిడ్ పెంపుదల: రూ.10,000/-**
**ఇ-వేలం తేదీ & సమయం: 16-01-2026 ఉ॥ గం॥ 11.00 ల నుండి సా॥ గం॥ 05.00 ల వరకు**

సొమ్మును సమర్పించుటకు **A/c No:30733231487, IFSC Code: SBIN0011098, Name of the Bank, SBI, SARC, (RACPC-1, Vijayawada, NTR District)** వెబ్‌పోర్టల్ **https://www.baanknet.com** (యూజర్ ఐడి & పాస్‌వర్డ్ ఉచితంగా **https://www.baanknet.com** లో రిజిష్టర్ చేసుకొన్న పేరు మీద లభించును) ద్వారా పాస్‌వర్డ్ & లాగిన్ ఐడి కలిగివుండవలెను.

తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలములో పాల్గొనుటకు ముందుగా **M/s PSB Alliance PVT Ltd.,** టోల్ ఫ్రీ నెం: **+91 8291220220** వారి వెబ్ పోర్టల్ **https://www.baanknet.com** మరియు పై లభించు ఇ-వేలపు నియమ నిబంధనల పూర్తి వివరములు పరిశీలించవలసినదిగా బిడ్డర్లను కోరుచున్నాము. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తుల తనిఖీ కొరకు చీఫ్ మేనేజర్-మొబైల్ నెం.9424690028, ఇ-మెయిల్ ఐడి: **sbi.05252@sbi.co.in** మరియు రికవరీ ఏజెన్సీ: **M/s.Sarah Associates: 9849189726 & 7396223738** వారిని బ్యాంకు పనిదినములలో సంప్రదించవచ్చును. నియమ నిబంధనలు వర్తిస్తాయి.

ప్రదేశం : విజయవాడ
తేది : 29-12-2025

సం/- అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్


(c) eenadu

నక్కపల్లి, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశిని పురస్క రించుకుని ఉపమాక వెంకన్న ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి దర్శనార్థం ఉమ్మడి విశాఖ తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు రాను న్నారు. ఇక్కడి కొండపై స్వామి వారు నిజరూపం ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్నారు. ఏర్పాట్లలో భాగంగా భాగంగా ఆలయం బయ టినుంచి లోపల వరకు ప్రత్యేక క్యూలైన్ సిద్ధం చేస్తున్నారు. ఆలయాన్ని పూలతో అందంగా అలంకరిస్తున్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్క రించుకుని మంగళవారం రాత్రి 8 వాహనాల్లో స్వామి వారు వివిధ రూపాల్లో తిరువీధుల్లో ఊరేగనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు అవసరమైన బందో బస్తు ఏర్పాటు చేస్తున్నారు.

**వైకుంఠ దర్శనానికి ఉపమాకలో ప్రత్యేక ఏర్పాట్లు**

## సప్పర వాహనంపై సేవ

నక్కపల్లి, న్యూస్‌టుడే: ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఉపమాక వెంకన్న ఆలయంలో సోమవారం ఉత్సవమూర్తు లకు సప్పర వాహనంపై తిరువీధి సేవ జరిపారు. ప్రధానా ర్చకులు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకం, నిత్యారాధన చేశారు. తర్వాత స్వామి, అమ్మవార్లను సప్పర వాహనంలో అలంక రించి తిరువీధులలో ఊరేగించారు. దీంతో పాటు పాశురవిన్నపం తర్వాత గోదాదేవి పల్లకీతో స్వామివారిని అనుసరించారు.

ఉపమాక ఆలయం నుంచి సేవకు వెళుతున్న ఉత్సవమూర్తులు

**పొగమంచు మాటున సూరీడు**

ప్రస్తుతం జిల్లాలో ఉదయాన్నే పొగ మంచు దట్టంగా అలముకుంటోంది. అనకాపల్లి శివారు జాతీయ రహదారి పక్కన ఉదయం 8 గంటల సమయం లోనూ మంచు కమ్ముకున్న దృశ్యం ఇది. – ఈనాడు, అనకాపల్లి



బీ1 బోగీకి మంటలు అంటు కుంది: రాత్రి 12.45 గంటలు

12:55 ఎలమంచిలి స్టేషన్ ప్లాట్‌ఫాంపై రైలు ఆగింది

1:07 ప్రయాణికులు రైలు నుంచి దిగిపోయారు

1:15 మొదటి అగ్నిమాపక శకటం స్టేషన్‌కు రాక

3:25 అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేశారు

4:00 కాలిన బోగీలు రైలు నుంచి వేరు చేసింది

5:06 రైలులో ఒకరి మృతదేహం గుర్తింపు

7:41 ఎలమంచిలి నుంచి రైలు బయలుదేరింది

ట్రాక్‌పై రాకపో కల పునరుద్ధరణ ప్రారంభం: 11.00

అర్ధరాత్రి.. పట్టాలపై రైలు పరుగు తప్ప మరో శబ్దంలేదు.
అంతా ఆదమరిచి నిద్రిస్తున్న వేళ..
ఉన్నట్టుండి కలకలం.. మంటలు అంటుకున్నాయనే కేకలు..
రైలు ఎక్కడాగిందో, ఏ ఊరు చేరిందో తెలియదు..
గబగబా రైలు దిగి చూస్తే.. కొద్దినిమిషాల క్రితం వరకు
తాము ప్రయాణించిన రైలులో అంతెత్తు మంటలు..
నోటమాట రాక అంతా భయంగా చూస్తుండిపోయారు.
ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఆదివారం అర్ధరాత్రి నాటి దృశ్యమిదీ.

పూర్తిగా కాలిపోయిన బోగీలు

# కదిలే రైలును కమ్మేసిన నిప్పు

**సకాలంలో స్పందించిన యంత్రాంగం** ✦ **యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు**

ఈనాడు డిజిటల్ అనకాపల్లి, ఎలమంచిలి న్యూస్‌టుడే

'టాటా-ఎర్నాకుళం' ఎక్స్‌ప్రెస్‌లో అగ్నికీలలు రేగి రెండు బోగీలు దగ్ధమైన ఘటన సంచలనం కలిగించింది. ఈ రైలులోని బీ1, ఎం2 బోగీలకు నిప్పంటుకోవడం గమ నించిన వెంటనే హుటాహుటిన రైలులోని ప్రయాణికులం దరినీ కిందకు దించేశారు. ఓపక్క వణికించే చలి.. మరో పక్క ఏం జరుగుతోందో.. ఎప్పటికి తిరిగి బయలుదేర తామో తెలియని అయోమయ పరిస్థితులతో ప్రయాణికు లంతా ఎలమంచిలి స్టేషన్ ఆవరణలో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. విపత్తును గుర్తించి ప్రయాణికులను అప్రమత్తం చేయడం మొదలు.. నష్టం పెరగకుండా నివా రించడం, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు అందించ డంలో యంత్రాంగం సఫలమైంది. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సొనాకియా, ప్రత్యేక రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, రైల్వే డీజీ బి.సత్యఏసుబాబు, జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, కలెక్టర్ విజయ్‌కృష్ణన్ తదితర అధికా రులు దగ్గరుండి సహాయక చర్యలు పర్యవేక్షించారు.

**సమగ్ర విచారణ చేస్తున్నాం:** ఎలమంచిలి స్టేషన్‌కు కొన్ని నిమి షాల్లో రైలు చేరుతుండగా.. సిబ్బంది మంటలను గుర్తించి స్టేష న్‌లో నిలుపుదల చేశారు. రైలులో మంటలు చెలరేగడానికి గల కార ణాలను క్లూస్‌టీంలు విచారణ చేస్తున్నాయి. సమగ్ర విచారణ తర్వాత వివరాలు వెల్లడిస్తాం. – సత్య ఏసుబాబు, డీజీ, రైల్వే

**టీటీఈ నిద్ర లేపారు**

సేలం వెళ్లడానికి దువ్వాడలో రైలు ఎక్కాను. రైలు అప్పటికే బాగా ఆల స్యంగా రావడంతో ఎక్కిన వెంటనే పడుకున్నాను. బి1 లో ప్రయాణిస్తున్న నన్ను టీటీఈ వచ్చి రైలు కాలిపో తోంది. అత్యవసరంగా దిగిపోవాలని చెప్పారు. అప్పటికే బోగీలో మంటలు పెద్దగా వస్తున్నాయి. తలదగ్గర పెట్టు కున్న హ్యాండ్ బ్యాగ్ మాత్రమే తీసు కుని సీటు కింద ఉన్న లగేజి వది లేసి బయ టకు పరుగు తీశాను. నావెనుక చాలామంది కంగా రుగా దిగారు. చిన్నతొక్కిసలాట జరి గింది. టీటీఈ సకాలంలో లేపడంతో ప్రాణాలతో బయటపడ్డాం. – సూర్యప్రకాష్ విశాఖపట్నం

**అరుపులు విని లేచాను..** పశ్చిమబెంగాల్లో ఉంటున్న నేను పాల్ఘాట్ వెళ్లడానికి ఈ రైలు ఎక్కాను. బయలుదేరిన దగ్గర నుంచే ఆల స్యంగా నడుస్తోంది. గాఢ నిద్రలో ఉండగా బోగీలో ఒక్కసారిగా అరుపులు, కేకలు విని పించడంతో ఉలిక్కిపడి లేచాను. అప్పటికే ఒకవైపు నుంచి బోగీలో మంటలు వస్తు న్నాయి. దట్టంగా ఉన్న పొగతో దిగడానికి కూడా దారి సరిగా కనిపించలేదు. మరో పది నిమిషాలు లోపల ఆ పొగలో ఉంటే చనిపోయే వాళ్లం. – ఎస్.కె.రెహమాన్

ప్రమాదానికి గురైన టాటానగర్-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్

**కట్టుబట్టలే మిగిలాయి..** భార్య, ఇద్దరు పిల్ల లతో టాటానగర్ నుంచి ఎర్నాకుళం బయలు దేరాం. బోగీలో మంటలు వస్తున్నాయని కోచ్ బాయ్ కంగారుగా వచ్చి చెప్పాడు. ఇద్దరం చెరో బిడ్డను పట్టుకుని పరుగున కిందికి దిగాం. కట్టు బట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. చేతిలో రూపాయి లేదు. టికెట్లు, ఆధార్ కార్డులు, బ్యాగ్‌లో పెట్టిన ఫోన్ కాలిపోయాయి. భార్య బిడ్డలను స్టేషన్ బయట దించి మళ్లీ బోగీ వద్దకు వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. – మస్తగిరి విస్వాజ్, టాటానగర్

**పొగతో ఊపిరాడలేదు:** మా బోగీలో మంటల కన్నా పొగే ఎక్కువ ఉంది. ఐదు నిమిషాల్లో మొత్తం అందరం దిగిపోయాం. అప్పటికే మేము ప్రయాణిస్తున్న ఎం-2 బోగీ సగం వరకూ మంటలు వచ్చేశాయి. ఒకపక్క నుంచే మంటలు రావడం వల్ల బయటకు రాగలిగాం. బొబ్బిలిలో రైలు ఎక్కాను. – గొల్లాపు కిరణ్, బొబ్బిలి

**పాలు, బిస్కెట్లు అందించాం..** రైలులో మంటలు గుర్తించి.. సిబ్బంది ప్రయాణికులను అప్రమత్తం చేయడంతోనే పెను ప్రమాదం తప్పింది. లోకోపైలట్ స్టేషన్‌లో రైలు ఆపడంతో మంచి జరిగింది. కానీ.. ఓ వ్యక్తి మృతి చెందడం బాధాకరం. వారి కుటుంబానికి రైల్వే శాఖ అండ కుంటుంది. బోగీలు కాలిపోవడం వల్ల రైలు దిగిపోయిన ప్రయాణికులకు పిల్ల లకు పాలు, పెద్దలకు బిస్కెట్లు రెవెన్యూ శాఖ తరఫున అందించి ఏర్పాటు చేశాం. అగ్నిమాపక సిబ్బంది సకా లంలో చేరుకుని నష్టాన్ని తగ్గించారు. – విజయకృష్ణన్, జిల్లా కలెక్టర్

**పోలీసుల సేవలు అభినంద నీయం:** రైలు బోగీలో మంటలు చెలరేగడానికి కారణమేంటనేది నిపుణుల కమిటీ నిర్ధారించాల్సి ఉంది. పోలీసులు సకాలంలో స్టేషన్‌కు చేరుకుని రైల్వే అధికారు లకు సహకరించారు. సీఐలు, ఎస్‌ఐ లు వెంటనే ఇక్కడికి చేరుకు న్నారు. రెండు గంటల్లో మంటలు అదుపు చేయడం అన్నది ఒక రికార్డు. ప్రయాణికులు అప్రమ త్తంగా ఉండటం వల్ల ప్రాణనష్టం తగ్గింది. అధికారులు అందించిన సేవలు అభినందనీయం. – తుహిన్ సిన్హా, ఎస్పీ

చలిలో ప్లాట్‌ఫాంపై భారీగా నిరీక్షిస్తున్న ప్రయాణికులు

తిరిగి బయలుదేరే సమయాన రైలు ఎక్కుతూ..

పరిశీలిస్తున్న రైల్వే డీజీ సత్య ఏసుబాబు, అధికారులు

మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

■ **అగ్నిమాపక సిబ్బంది** ఆగమేఘా లపై తరలివచ్చారు. ఎలమంచిలి నుంచి శకటం వెనువెంటనే చేరుకుంది. దీనికి తోడు అనకాపల్లి నుంచి రెండు, నక్కపల్లి నుంచి ఒకటి చొప్పున అగ్నిమాపక వాహ నాలు రప్పించారు. వీరంతా దాదాపు రెండుగంటలు పాటు నిర్విరామంగా శ్రమించి ఎట్టకేలకు మంటలను అదుపు లోకి తీసుకొచ్చారు.

రైల్వేస్టేషన్‌లో సిబ్బందితో ఎస్పీ తుహిన్‌సిన్హా

■ **పోలీసులు:** సుమారు రెండు వేలమంది ప్రయాణికులతో స్టేషన్ ఆవరణ కిక్కిరిసింది. స్థానిక సీఐ ధనుంజయరావు సహాయక చర్య లకు ఆటంకం లేకుండా ప్రయాణి కులు అందరినీ బయటకు పంపిం చారు. ఎవరైనా గాయపడితే వెంటనే వైద్యసేవలందించేలా అంబులెన్స్‌లు రప్పించారు.

కాలిన బోగీలో డీఆర్ఎం మోహిత్

■ **రైల్వే:** పూర్తిగా కాలిపోయిన బోగీలతోపాటు పాక్షికంగా కాలిపోయిన బోగీని రైలు నుంచి తప్పించారు. ఆ బోగీల ప్రయాణికుల కోసం మూడు పల్లెవెలుగు బస్సులను రప్పించి.. వాటిలో వీరిని సామర్లకోట తరలించారు. మిగిలిన ప్రయాణికులను ఎక్కించుకుని రైలు బయలుదేరింది. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా రైళ్ల రాకపోకలకు పెద్దగా ఆలస్యం కాకుండా పక్కట్రాక్‌పై నుంచి రాకపోకలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. 3.20 గంటలకు తొలిగా తిరుపతి-బిలాస్‌పూర్ రైలు ఎలమంచిలి స్టేషన్‌కు చేరుకుని, తిరిగి పయనమైంది.

# కావాలి.. ₹58 కోట్లు!

**సకాలంలో నిధులిస్తేనే ఆయకట్టుకు మేలు**

**శాశ్వత మరమ్మతులకు రైతుల ఎదురుచూపు**

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

సాగునీటి వనరులన్నీ సక్ర మంగా ఉంటే పొలాలకు సమృ ద్ధిగా నీరు అందుతుంది. తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయి. అవి మరమ్మతు లకు గురై ఏళ్ల తరబడి శాశ్వత మరమ్మతుకు నోచుకోకపోతే ఎప్పుడు గండిపడుతుందో... పొలాలను ముంచెత్తి ఎక్కడ నష్టపోతామని రైతులు బెంగ పడుతుంటారు. వ్యవసాయం ప్రాధాన్యాంశంగా సకాలంలో నిధుల విడుదల చేస్తేనే ఆయకట్టుకు మేలు జరుగుతుంది. జలవనరులశాఖ నర్సీపట్నం డివిజన్‌లోని నాలుగు నియోజకవర్గాల్లో చెరువులు, ఆనకట్టలు, కాలువలు, జలాశయాల కింద 1,23,676 ఎకరాల ఆయకట్టు ఉంది. మొంథా తుపాను సమయంలో సాగునీటి కట్టడాలు పలుచోట్ల దెబ్బతి న్నాయి. కాలువలకు గండ్లు పడ్డాయి. మొత్తంగా మర మ్మతులకు రూ.58 కోట్లు అవసరమని అంచనా.

కుంగిన రావణాపల్లి గట్టుకు ఇలా ఇసుకబస్తాలు వేశారు

**నాణ్యంగా పనులు...** ఏప్రిల్ మొదటి వారంలో నిధులిస్తే పనులన్నీ నాణ్యతగా చేయడానికి వీలుంటుంది. రానున్న ఖరీఫ్ పంట కాలానికి సాగునీటి వనరులన్నీ సిద్ధం చేసుకోవచ్చు. తాండవ ప్రాజెక్టు కాలువలకు అత్యవసరంగా రూ.12 కోట్లు అవసరం. ఈ విషయం సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లాం. – కరక సత్యనారా యణ, తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్

**నిధుల కోసం నివేదిక పంపాం..** క్షేత్ర పరిశీలన చేసి 261 చోట్ల శాశ్వత మర మ్మతులు అవసరమని గుర్తించాం. ఇందుకోసం రూ.58 కోట్లు ఖర్చవుతా యని అంచనా వేశాం. నవంబరులో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికా రుల ఆమోదానికి పంపాం. నిధులు విడు దల కాగానే పనులు చేపడతాం. వచ్చే ఏడాది ఖరీఫ్‌కి ఆయకట్టుకు ఇబ్బంది లేకుండా చూడాలన్నదే ఆశయం. – వెలమల బాలసూర్యం, ఈఈ, జలవనరులశాఖ

**ఇవిగో ఉదాహరణలు..**

✦ నర్సీపట్నం నియోజకవర్గం గొలు గొండ మండలంలోని రావణాపల్లి జలా శయం ప్రధాన గట్టు నాలుగు నెలల క్రితం రెండు అడుగుల మేర కుంగిపో యింది. తాత్కాలికంగా ఇసుకబస్తాలు వేసి నీటి లేకుండా చూశారు. శాశ్వత మరమ్మతుకు రూ.2.20 కోట్లు అవసరం. గట్టు పటిష్ఠ పర్చకపోతే గండి పడే ప్రమాదం ఉంది. ఏడాదిన్నర క్రితం రావ ణాపల్లి మదుం కోతకు గురైంది. ఇప్ప టికీ ఇసుక బస్తాలే దిక్కు.

✦ మాకవరపాలెం మండలంలో జాగారం గెడ్డకు గండిపడి పొలాలు ముంపునకు గురయ్యాయి. రక్షణ గోడకు రూ.40 లక్షలు అవసరం.

✦ ఎలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం రజాల గ్రామం సమీ పంలో శారదానది కుడి వరదగట్టు అక్టో బరు నెలాఖరులో 140 మీటర్ల మేర కొట్టుకుపోయింది. వ్యవసాయ భూములు మునిగిపోయాయి. చేపల చెరువులకు నష్టం జరిగింది. శాశ్వత మరమ్మతులకు రూ. 2 కోట్లు అవసరమని అంచనా. ఇదే మండలం కొత్తూరు వద్ద ఏడుముళ్ల డ్యాం ఎగువ భాగంలో శారదానది కుడి గట్టు 120మీటర్ల మేర దెబ్బతింది. మర మ్మతుకు రూ. 1.6 కోట్లు అవసరమని అంచనా వేశారు.

✦ చోడవరం నియోజకవర్గం రావిక మతం మండలం చీమలపాడు వద్ద అక్వి డక్ట్ రాతికట్టు జారిపోయింది. మర మ్మతుకు రూ.30 లక్షలు కావాలి.

✦ పాయకరావుపేట నియోజకవ ర్గంలో ముతా ఆనకట్ట, భూమి ఆనకట్ట గేట్లు పనిచేయడం లేదు. ఎస్.రాయ వరం మండలం సోముదేవుపల్లి వద్ద వరాహ నది గట్టు 200 మీటర్లు కోతకు గురైంది. మరమ్మతుకు రూ.10 కోట్లు కావాలి. ప్రతిపాదన దస్త్రం ఆర్థికశాఖ అనుమతి కోసం చూస్తోంది.

# అతి త్వరలో ఆరంభం

ఈనాడు డిజిటల్, అనకాపల్లి– నక్కపల్లి, న్యూస్‌టుడే: అడ్డురోడ్డు కూడలిని రెవెన్యూ డివిజన్‌గా ప్రభుత్వం ఖరారు చేయడంతో నూతన ఏడాది ఆరంభం నుంచే పరిపాలన మొదలు పెట్టేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జిల్లాల, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, మార్పుచేర్పులకు సంబం ధించి అమరావతిలో జరిగిన మంత్రి వర్గ సమావేశంలో తుది ఆమోదం లభించడంతో నక్కపల్లి స్థానే అడ్డురో డ్డును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఖరారు చేశారు. ఈ మేరకు కొత్త సంవత్సరం నుంచే పరిపాలన మొదలు పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆర్‌డీఓ పరిపాలన కోసం మంత్రి అనిత ఆదేశాలతో అడ్డురోడ్డు మార్కెట్ సమీపంలోని పంచాయతీ కార్యాలయం, రైతు సేవా కేంద్రాలను అధికా రులు, కూటమి నాయకులు పరిశీలించారు. ప్రస్తుతం ఇక్కడ మాత్రమే ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. డివిజన్ ఏర్పాటు చేసి, తర్వాత సొంత భవన నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం తహసీల్దారు కార్యాలయం మండల కేంద్రమైన ఎస్.రాయవరంలో ఉంది. ఈ రెండింటికి మధ్య పది కిలో మీటర్ల దూరం ఉంటుంది. భవిష్యత్తులో దీన్ని ఆర్‌డీఓ కార్యాలయం వద్దకే తీసు కువచ్చేలా చూస్తే ప్రజలకు రాకపోకల భారం తగ్గనుంది. ఇక్కడ రెవెన్యూ డివి జన్ ఏర్పాటుపై ఈ ప్రాంత వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం వివిధ వ్యాపారాలతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎంతో కీల కమైన ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటవు తుండటంతో అడ్డురోడ్డుతో పాటు చుట్టు పక్కల గ్రామాలు అభివృద్ధి చెందుతా యని భావిస్తున్నారు. ప్రస్తుతం కార్యా లయం ఏర్పాటుతో తాత్కాలికంగా నర్సీపట్నం ఆర్డీఓనే ఇన్‌ఛార్జిగా కొనసాగిస్తారా? మరెవరికైనా బాధ్యతలు అప్పగిస్తారానేది తెలియాల్సి ఉంది.

అడ్డురోడ్డు ప్రధాన రహదారి విహంగ వీక్షణం

**కరిగిపోతూ.. కలిసిపోతూ..!**

కెరటాల ఉద్ధృతితో ఆర్కేబీచ్ తరచూ కోతకు గురవుతోంది. కురుసురా సబ్‌మెరైన్ సమీపంలో ఇప్పటికే కొంత భాగం తీరంలో కలిసిపోయింది. దీని నివారణకు భారీ రాళ్లు ఏర్పాటు చేస్తు న్నారు. అయినా పరిస్థితి అదుపులోకి రాలేదు. – ఈనాడు, విశాఖపట్నం

## సింగపూర్‌కు అదనపు విమాన సర్వీసులు

ఈనాడు, విశాఖపట్నం: సంక్రాంతి పర్వదినం వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ అంతర్జా తీయ విమానాశ్రయం నుంచి సింగపూ ర్‌కు 'స్కూట్' ఎయిర్‌లైన్స్ అదనపు సర్వీసులు నడపనుంది. ప్రస్తుతం సోమ, బుధ, శుక్ర, శనివారాల్లో విశాఖ-సింగపూర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తున్నాయి. వీటికి అదనంగా జన వరి 11, 18 తేదీల్లో విశాఖ-సింగపూర్, సింగపూర్-విశాఖ మధ్య సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.

## అడ్డురోడ్డు రెవెన్యూ డివిజన్‌తో రెండు నియోజకవర్గాల అభివృద్ధి

**'న్యూస్‌టుడే'తో మంత్రి అనిత**

నక్కపల్లి, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం అడ్డు రోడ్డు కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాలు మరింత అభివృద్ధి చెంద నున్నాయని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అమరావతి నుంచి సోమ వారం ఆమె ఫోన్‌లో 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. అందరికీ అందుబాటులో, ఆమోద యోగ్యంగా ఉండేందుకు అడ్డురోడ్డు కూడలిలో నూతన డివిజన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీన్ని మంత్రివర్గం సోమవారం ఆమోదించింద న్నారు. నక్కపల్లి మండలంలో ఏర్పాటవు తున్న ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు, బల్క్‌డ్రగ్, బొమ్మల పరిశ్రమలు ఈ ప్రాంత అభివృద్ధికి మరింత దోహదం చేస్తాయన్నారు. త్వర లోనే సబ్ డివిజన్ పోలీసు కార్యాలయాన్ని అడ్డురోడ్డులో ఏర్పాటు చేయించనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో పెదగుమ్ము లూరు ప్రధాన రహదారిని అనుకుని ఉన్న పెద్ద చెరువును ట్యాంక్‌బండ్ తరహాలో అభి వృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు అడ్డురోడ్డు నర్సీపట్నం రోడ్డును రూ. 24 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, దీని ద్వారా తమది చేతల ప్రభుత్వమని మరో సారి నిరూపించామన్నారు. తితిదే నిధులతో ఉపమాక వెంకన్న ఆలయం మరింత అభి వృద్ధి చేస్తామని చెప్పారు.

## వెల్‌నెస్ కేంద్రాల పూర్తికి నిధులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఆయుష్మాన్ భారత్ కింద ఏర్పా టైన వెల్‌నెస్ కేంద్రాల్లో అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేసేం దుకు రూ.29 కోట్లు మంజూరయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 424 గ్రామాల్లో ఈ సెంటర్ల ఏర్పాటుకు గతంలో ప్రతిపాదించారు. వివిధ దశల్లో నిలిచిపోయిన 158 కేంద్రాలను పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్రాలు సంయుక్తంగా నిధులను విడుదల చేశాయి. కేంద్ర ఆరోగ్య మిషన్ నుంచి రూ.26 కోట్లు, ఒక్కో కేంద్రా నికి రూ.32 లక్షల చొప్పున ఆరు కేంద్రా లకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.92 కోట్లు, మరో రెండిం టికి రూ.55 లక్షల చొప్పున రూ.1.1 కోట్లు విడుదల అయ్యాయని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం మేనేజింగ్ అధికారి ప్రశాంతి చెప్పారు. ప్రభుత్వ ఆదేశా లకు అనుగుణంగా గడువులోగా పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్ ఈఈ శివప్రసాద్ పేర్కొన్నారు.

గురంధరపాలెంలో అసంపూర్తిగా వెల్‌నెస్ కేంద్ర భవనం

# ఇదే తరుణం..

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూము ల్లోని పేదల నివాసాల క్రమబద్ధీకరణకు గడువు దగ్గర పడింది. ఈనెల 31తో దీనికి సమయం ముగుస్తుంది. అర్హులైన వారంతా తొందర పడితే ఎంతో మేలని అధికారులు సూచిస్తున్నారు. గతంలో చంద్రన్న పట్టాలుగా పేర్కొనే వీటి కోసం అయిదేళ్లుగా జనం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు ఈ పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొలిక్కి రావడంతో దరఖాస్తులకు ఆహ్వానించారు. జిల్లాలో 233 మంది ఇవి అందజే శారు. 100 చదరపు గజా ల్లోపు ఆపైన 500 చ.గజా ల్లోపు నివాసాల క్రమబద్ధీక రించనున్నారు.

● గతంలో 100 చద రపు గజాల లోపు ఆక్రమ ణలను ఉచితంగా క్రమబ ద్ధీకరించాలని, ఆపైన వాటికి ఆ ప్రాంత మార్కెట్ ధర చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. రెండేళ్ల తరువాత పట్టా లకు రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించారు. ఈ లోగా వైకాపా అధికారంలోకి రావడంతో వీటిని పట్టించుకోలేదు. కూటమి రాకతో వీటిని రిజిస్ట్రే షన్ చేయాలని నిర్ణయించారు. దీనికి సంబం ధించి అవగాహన లేక చాలా మంది ఈ అవకా శాన్ని వినియోగించుకోలేక పోతున్నారు.

● పట్టా పొందిన వారు బ్యాంకుల్లో రుణాలు పొందడం తదితర ప్రయోజనాలు పొందవచ్చు. జిల్లాలో వంద చ.గజాల లోపు నివాసాల వారు 181 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 36 తిరస్కరించారు. నర్సీపట్నం మండలంలో 24 మంది దర ఖాస్తు చేసుకోగా వారిలో ముగ్గురు మాత్రమే అర్హు లుగా నిర్ధారణ అయ్యారని తహసీల్దారు రామారావు తెలి పారు. చాలా మంది అవగా హన లేక గ్రామకంఠాల్లోని వాటికి దాఖలు చేశారన్నారు. నెలాఖరులోగా పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయనున్న దృష్ట్యా ఈ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

● ఈ సదుపాయం కోసం లబ్ధిదా రులు సచివాలయాల్లో దరఖాస్తు చేయాలి. ఇవి సంబంధిత అధికారుల లాగిన్లలోకి వచ్చిన తరువాత క్షేత్రస్థా యిలో పరిశీలించి దరఖాస్తుదారుని అర్హత నిర్ధారిస్తారు. అభ్యంతరం కాని ప్రభుత్వభూముల్లో 296 జీఓ, అలాగే 388 జీఓ అనుసరించి నివాసాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తారు. బంజరు, కొండపోరంబోకు స్థలాల్లోని వాటిని మాత్రమే పరిగణనలోకి తీసు కుంటారు.

## 'అతడు లేకుండా ఉండలేను.. కన్నవారికి చెడ్డపేరు తేలేను'

కోటవురట్ల, న్యూస్‌టుడే: తనవల్ల తల్లిదండ్రులకు చెడ్డపేరు రాకూడదని.. ఓ లేఖ రాసి ఇంట్లో ఎవరూ లేని సమయంలో 17 ఏళ్ల బాలిక ఆత్మహత్య చేసు కుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోటవురట్ల శివారు రాట్నాలపాలేనికి చెందిన ఓ బాలిక స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో సోమ వారం ఫ్యానుకు చీర కట్టుకుని ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకుంది. 'లోకేశ్ అనే కుర్రాడిని తాను ప్రేమి స్తున్నానని, అతను లేకపోతే జీవించలేనని... అలాగే పందూరు గ్రామానికి చెందిన పప్పల కుమార్ అనే మరో యువకుడిని కూడా ప్రేమిస్తున్నానని.. తన కారణంగా తల్లిదండ్రులకు చెడ్డపేరు రాకూడదనే అభి ప్రాయంతో ఆత్మహత్య చేసుకుంటున్నాను' ఆ బాలిక ఆత్మహత్యకు ముందు ఓ లేఖ రాసిందని పోలీసులు తెలిపారు. లేఖను స్వాధీనం చేసుకున్నామన్నారు. అయితే జూనియర్ కళాశాల దగ్గరలో పప్పల కుమార్ తమ కుమార్తెతో గొడవ పడ్డాడని, ఈ కార ణంగానే ఆమె ఆత్మహత్య చేసుకుందని, మృతురాలి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కుమార్‌ను అదుపులోకి తీసు కుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై రమేష్ చెప్పారు.

## ప్రమాదం గుర్తించినా ప్రాణాలు దక్కలేదు!

**సుందర్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి**

ఈనాడు డిజిటల్ అనకాపల్లి, ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగి ఏసీ బోగీలో ప్రాణాలు కోల్పోయిన విజయవాడకు చెందిన చంద్రశేఖర్ సుందర్ మృతదేహానికి ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. ఇద్దరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం చేశారు. విశాఖ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ బృందం నమూనాలు సేకరించింది. కొన్ని ఆధారాలు సేకరించారు. సుందర్ కుమార్తె కృతికతోపాటు కుటుంబ సభ్యులు బంధువులు విజయవాడ, విశాఖపట్నం నుంచి హుటాహుటిన ఇక్కడికి చేరుకున్నారు. మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో విషాదం అలుముకుంది. చంద్రశేఖర్ సుందర్ బీ1 కోచ్‌లో 12 వ నంబరు బెర్తులో పడుకోగా మృతదేహం 20వ నంబరు బెర్తు వద్ద గుర్తించారు. తన బెర్తు నుంచి కొంతదూరం నగదు బ్యాగ్‌తో వచ్చి అక్కడ కుప్పకూలాడని భావిస్తున్నారు. కుమార్తె కృతిక తన తండ్రి రైలు బోగీలో అగ్నిప్రమాదంపై ఫోన్ చేసి చెప్పారని పోలీసులకు చెప్పడంతో వెంటనే గ్రామీణ ఎస్పీ ఉపేంద్ర ఎస్పీ కార్యాలయానికి ఈ ఫోన్ నంబరు పంపి.. ఆయన ఎక్కడ ఉన్నాడో గుర్తించే పనిలోపడ్డారు. సోమవారం తెల్లవారుజామున 3.45 గంటల వరకు ఆయన ఫోన్ లాస్ట్ సిగ్నల్ చూపించింది. లొకేషన్ అక్కడే చూపించడంతో బోగీలోనే చనిపోయాడని పోలీసులు అంచనాకు వచ్చారు. సీఐ ధనుంజయరావు బోగీలో టార్చిలైట్ వేసి పరిశీలించగా చేయి కనిపించింది. దీంతో ఆయన బోగీలో సజీవ దహనం అయ్యారని రైల్వే అధికారులు సమాచారం అందించారు.

సుందర్ కుమార్తె కృతిక

## బౌండరీల మోత.. పరుగుల వరద..

ఉత్సాహంగా 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025'

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానంలో 'ఈనాడు - ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో జరుగుతున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025' పోటీల్లో సోమవారం బ్యాటర్లు పరుగుల వరద పారించారు. వచ్చిన బంతిని వచ్చినట్లుగా చితక్కొడుతూ బౌండరీల మోత మోగించారు. తక్కువ బంతుల్లో అత్యధిక స్కోర్లు నమోదు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. 'ధనిక్ భారత్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే'గా క్రెట్స్ జూనియర్ కళాశాల క్రీడాకారుడు కె.ఆర్యన్ సోనీ నిలిచారు.

➡ **శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల వర్సెస్ వీడీఏ డిగ్రీ కళాశాల జట్లు:** ఈ మ్యాచ్‌లో శ్రీకశ్యప్ డిగ్రీ జట్టు 23 పరుగుల తేడాతో వీడీఏ డిగ్రీ కళాశాలపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. జట్టులో ఎన్.సతీష్ 28, ఎ.సుధీర్ 25 పరుగులు చేశారు. వీడీఏ డిగ్రీ కళాశాల బౌలర్ జి.నందన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వీడీఏ డిగ్రీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. జట్టులో వి.వినయ్ 29 పరుగులు చేశారు. శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు బౌలర్లు ఎస్.సంపత్, ఎ.సుధీర్ చెరో 2 వికెట్లు తీశారు.

గెలుపొందిన శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు

➡ **క్రెట్స్ జూనియర్ కళాశాల వర్సెస్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల:** ఈ మ్యాచ్‌లో క్రెట్స్ జూనియర్ కళాశాల జట్టు 61 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆ జట్టు బ్యాటర్లు చెలరేగడంతో 10ఓవర్లలో రెండు వికెట్లకు 126 పరుగులు చేసింది. కె.ఆర్యన్ సోనీ అత్యధికంగా 30 పరుగులు, సీహెచ్.తేజేశ్వర్ 25 పరుగులు చేశారు. ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల జట్టు బౌలర్ రవీంద్ర ఒక వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి కేవలం 65 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టులో సాయికుమార్ 24 పరుగులు చేశారు. క్రెట్స్ జూనియర్ కళాశాల జట్టు బౌలర్ మౌర్య ఒక వికెట్ తీశారు.

ప్రతిభ చూపిన క్రెట్స్ జూనియర్ కళాశాల జట్టు

➡ **ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల వర్సెస్ మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల:** ఈ మ్యాచ్‌లో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 4 వికెట్ల తేడాతో మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది. జట్టులో జి.సాయి 16 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ జట్టు 8.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల జట్టు బౌలర్ కిరణ్ 2 వికెట్లు తీశారు.

విజయం సాధించిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

కె. ఆర్యన్ సోనీ (30 పరుగులు)

**నేటి మ్యాచ్‌లు..** ■ **ఉదయం 8 గంటలకు:** సీనియర్ విభాగంలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ × గీతం డీమ్డ్ యూనివర్సిటీ ■ **ఉదయం 10 గంటలకు:** సీనియర్ విభాగంలో ఎన్ఎస్ఆర్ఐటీ(సాంకేతిక) × గాయత్రి విద్య పరిషత్ ఇంజినీరింగ్ కాలేజ్(రుషికొండ) ■ **మధ్యాహ్నం 12 గంటలకు:** జూనియర్ విభాగంలో ఎస్ఎఫ్ఎస్ జూనియర్ కాలేజ్ × విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ కాలేజ్

**31-12-25 నాటి మ్యాచ్‌లు..** ■ **ఉదయం 8 గంటలకు:** సీనియర్ విభాగంలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ డిగ్రీ అండ్ పీజీ × బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ■ **ఉదయం 10 గంటలకు:** సీనియర్ విభాగంలో అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ × గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ కాలేజ్(ఎంవీపీ) ■ **మధ్యాహ్నం 12 గంటలకు:** సీనియర్ విభాగంలోఏవీఎన్ డిగ్రీ కాలేజ్ × ఆంధ్రా మెడికల్ కాలేజ్

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL
Gift Partner: KL UNIVERSITY (DEEMED TO BE)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
Dolphin Diagnostic Services
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు ఈతరం క్లబ్

## సీపీఎం బంద్ అడ్డగింత

**నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలింపు**

ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ నాయకులు సోమవారం చేపట్టిన ర్యాలీ, బంద్‌ను పోలీసులు అడ్డుకున్నారు. రేవుపోలవరం కూడలి నుంచి ధర్మవరం - అగ్రహారం, రాజయ్యపేట, కోటవురట్ల మండలం అణుకు గ్రామాల ప్రజలతో కలిసి అప్పలరాజు తల్లి లచ్చుమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు రమణ తదితరులు ర్యాలీగా ప్రధాన కూడలికి వచ్చారు. సీఐ రామకృష్ణ, ఎస్సై విభీషణరావు సిబ్బందితో ర్యాలీని అడ్డుకున్నారు. సెక్షన్ 30 అమలులో ఉన్నందున ర్యాలీకి అనుమతి లేదని, వెనక్కి వెళ్లిపోవాలని ఆదేశించారు. నాయకులంతా రోడ్డుపై బైఠాయించడంతో వారిని అరెస్టుచేసి ఎస్.రాయవరం స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే ఎందుకు అడ్డుకున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు పోలీసులను ప్రశ్నించారు. గొట్టివాడ శివారు అణుకు గిరిజనులతో ప్రధాన రహదారి పక్కన సీపీఎం నాయకులు చిరంజీవి తదితరులు నిరసన తెలిపారు. ఉపమాక రోడ్డు నుంచి జాతీయ రహదారికి వస్తుండగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం తదితరులను డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు అడ్డుకున్నారు. నాయకులు ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా లోకనాథం, రాజేష్, శ్రీరామ్, శంకర్ తదితరులను అరెస్టు చేసి అడ్డురోడ్డు సర్కిల్ కార్యాలయానికి తరలించారు. రాజయ్యపేటలో మహేశ్‌ను గృహనిర్బంధం చేశారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

**నిర్బంధం తగదు:** ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో చేపట్టిన బంద్‌ను అడ్డుకునేందుకు పోలీసులు నాయకులను గృహ నిర్బంధం చేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆరోపించారు. ఎస్.రాయవరం పోలీసు స్టేషన్‌లో సీపీఎం నాయకులతో మాట్లాడారు. అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని, పరిశ్రమల ఏర్పాటుకు బలవంతపు భూసేకరణ అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు.

## వేగవంతమైన న్యాయం అందించే బాధ్యత పోలీసులదే!

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: చట్ట పరిధిలోని ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 60 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో ఆయన నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్ఓలకు ఆదేశాలు జారీచేశారు. ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

### నిఘా వ్యవస్థ బలోపేతం చేయాలి

జిల్లాలో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయాలని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. జిల్లా స్పెషల్ బ్రాంచి (ఎస్బీ) డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జి.ఆర్.ఆర్.మోహన్ ఎస్పీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు ముందస్తు సమాచారం సేకరించేలా చొరవ చూపాలన్నారు.

## ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడిగా సూర్యనారాయణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షునిగా పి.సూర్యనారాయణ ఎన్నికయ్యారు. అనకాపల్లిలో సోమవారం జరిగిన ఎన్నికల్లో అసోసియేట్ అధ్యక్షులుగా పి.దాలినాయుడు, ఉపాధ్యక్షులుగా ఎ.జె.సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్, డి.ఆనందరావు, ఎస్.సత్యనారాయణ, వీఎస్‌వీ శ్రీనివాసరావు, పి.రేవతి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా శేషుకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రమణబాబు, కోశాధికారిగా త్రినాథ్‌ను ఎన్నుకున్నారు.

## ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

నెహ్రూచౌక్ (అనకాపల్లి): ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వై.శ్రీనివాసరావు (అనకాపల్లి), ఎస్.దుర్గాప్రసాద్ (బుచ్చెయ్యపేట) ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా ధర్మారావు (ఎస్.రాయవరం), ఉపాధ్యక్షులుగా అప్పారావు, మహాలక్ష్మినాయుడు, జయలక్ష్మి, గోవిందరావు, గణపతి, కార్యదర్శులుగా దాసు, దేముడుబాబు, శ్యామ్‌కుమార్, విజయశ్రీ, రాష్ట్ర కౌన్సిలర్‌గా దొర, గణేష్, విజయలక్ష్మి, సన్యాసినాయుడు, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఆళ్ల రవి, రామ్మూర్తిని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వెంకటపతిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్ తెలిపారు.

## పుచ్చ.. పెరిగిన విస్తీర్ణం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పుచ్చ సాగుకు బుచ్చెయ్యపేట మండలం చిరునామాగా మారింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అత్యధికంగా 400 ఎకరాల్లో ఇక్కడి రైతులు సాగు చేస్తున్నారు. గత ఏడాది దిగుబడులు బాగుండి మంచి ధర పలకడంతో ఈ ఏడాది మెరక ప్రాంతాల్లో బోర్లున్న చోట సాగుకు శ్రీకారం చుట్టారు. వేసవికి ముందే దిగుబడులు చేతికందనున్నాయి. మామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా పుచ్చ సాగు చేయవచ్చని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు.

★ బుచ్చెయ్యపేటలో ఎక్కువ మంది రైతులు పుచ్చ సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 15 ఏళ్ల కిందట ఒకరిద్దరు సాగు చేశారు. రెండు, మూడు నెలల్లోనే పంట చేతికందడం, మార్కెట్ ఆశాజనకంగా ఉండటంతో ప్రస్తుతం 50 మందికిపైగా చుటుపక్కల గ్రామాల్లో భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. బుచ్చెయ్యపేటతోపాటు అయితంపూడి, కె.పి.అగ్రహారం, కొండపాలెం, పి.భీమవరం, చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి, కందిపూడి, వడ్డాది, లోపూడి గ్రామాల్లో పుచ్చ తోటలున్నాయి.

బుచ్చెయ్యపేటలో సాగు చేసిన పుచ్చతోట

★ గతంలో సాధారణ పద్ధతిలోనే పండించేవారు. ఈ విధానంలో పెద్దగా దిగుబడులు వచ్చేవి కావు. పెట్టుబడి ఖర్చులూ అధికమయ్యేవి. ఇపుడు సాగు విధానాన్ని మార్చేశారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని పండిస్తున్నారు. మల్చింగ్, డ్రిప్ ద్వారా పుచ్చ సాగు చేస్తున్నారు. మొక్కల చుట్టూ నేల ఉపరితలాన్ని మల్చింగ్ షీట్లతో కప్పి ఉంచడంతో తేమ ఎక్కువ రోజులు ఉంటోంది. కలుపు సమస్య ఉండదు. డ్రిప్ ద్వారా అందిస్తున్న ఎరువులు ఆవిరి రూపంలో బయటకు పోకుండా మొక్కలకు పూర్తిగా అందేలా చేస్తుంది. కాయలు పెద్ద పరిమాణంలో వస్తున్నాయని బుచ్చెయ్యపేటకు చెందిన రైతు గాడి చిన్న చెబుతున్నారు.

**రైతేరాజు**

★ గతేడాది టన్ను కాయల ధర రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు పలికింది. ఎకరాకు 20 టన్నుల వరకు దిగుబడులు వచ్చాయి. బుచ్చెయ్యపేటకు చెందిన నలుగురు రైతులు పది ఎకరాల్లో సాగు చేయగా.. మూడు నెలల్లో పెట్టుబడి పోను ఒక్కొక్కరికి రూ.1.5 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 14 ఎకరాల్లో పుచ్చ సాగు చేస్తున్నట్లు రైతు **అప్పారావు** పేర్కొన్నారు.

## రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా — నువ్వులో అనువైన రకాలివీ..

? ఎకరా విస్తీర్ణంలో నువ్వు వేయాలనుకుంటున్నా. సమయం ఉందా. ఉంటే రబీకి అనువైన రకాలేంటి. – **ఊటుకూరి మహేష్, నాగులాపల్లి**

✔: జనవరి నెలాఖరు వరకు వేసుకోవచ్చు. రబీలో వైఎల్ఎం 11, 17, శారద రకాలు అనుకూలం. 11, శారద రకాలు 80 రోజుల్లో పక్వానికి వస్తాయి. ఎకరాకు 400 కేజీల దిగుబడి రావచ్చు. 17 రకం 75 రోజులకు కోత కొస్తుంది. ఎకరాకు 350 కేజీల వరకు దిగుబడి వస్తుంది.

? రబీ వరికి అనువైన రకాలేంటి. – **ఆడారి రమణబాబు, మునగపాక**

✔: విజేత, పుష్యల, శ్రీసత్య, కాటన్‌దొర సన్నాలు, చంద్ర, తరంగిణి, జగిత్యాల సాంబ రకాలు అనుకూలం.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త **దాడి ఉమామహేశ్వరరావు** సమాధానాలు ఇచ్చారు. –న్యూస్‌టుడే, అనకాపల్లి

**సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి**

రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సేద్యపు విభాగం శాస్త్రవేత్త సందీప్‌నాయక్ సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10- సా. 4 గంటల వరకు 86884 45135 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

## మొక్కజొన్న సాగుకు ఇదే అదును

అనకాపల్లి, న్యూస్‌టుడే: రబీలో మొక్కజొన్న సాగు చేసేందుకు ఇదే సరైన సమయం. ఉత్తర కోస్తా జిల్లాల్లో జనవరి 15 వరకు విత్తుకోవచ్చు.. ఆలస్యం చేస్తే ఆ ప్రభావం దిగుబడులపై పడుతుంది. రేగడి, గరప, ఇసుక నేలలు సాగుకు అనుకూలం. నీరు నిల్వ ఉండే భూములు పనికి రావని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దాడి ఉమామహేశ్వరరావు సూచిస్తున్నారు.

★ ఎకరాకు 7 నుంచి 9 కేజీల విత్తనం పడుతుంది. ★ వర్షాధారంగా సాగు చేసే రైతులు ఎకరాకు 36 కేజీల నత్రజని, 20 కేజీల భాస్వరం, 12 కేజీల పొటాష్ వేయాలి. నీటి వసతి ఉంటే నత్రజని 48 కేజీలు, భాస్వరం 24 కేజీలు, పొటాష్ 16 కేజీలు వేయాలి.

★ భాస్వరం, పొటాష్ చివరి దుక్కిలో వేయాల్సి ఉంటుంది. నత్రజని ఎరువును మూడు భాగాలుగా చేసుకుని విత్తే సమయం, మొక్కలకు నెల, రెండు నెలల వయసులో వేయాలి.

★ కలుపు నివారణకు విత్తిన రెండు, మూడు రోజులకు గింజలు మొలకెత్తక ముందే అట్రాజిన్ 1.5 కేజీ 500 లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారీ చేయాలి.

★ విత్తే సమయం, ఐదు ఆకుల దశ, పంట మోకాలు ఎత్తుకు ఎదిగినపుడు, పూత, గింజలు పాలుపోసుకునే, గట్టి పడే దశల్లో నీటి తడులు ఇవ్వాలి. ఆరు పర్యాయాలు తడులు పెడితే మంచి దిగుబడి సాధించవచ్చు.

| రకాలు | కాలపరిమితి (రోజుల్లో) | దిగుబడి ఎకరాకు (క్వింటాళ్లలో..) |
|---|---|---|
| డీహెచ్ఎం-1, 107, 109 | 85–90 | 22–25 |
| 103, 105 | 105–110 | 26–30 |
| త్రిశూల | 105–110 | 18–20 |
| అశ్విని, హర్ష | 100–105 | 18–20 |
| అంబర్ పాప్‌కార్న్ | 90–95 | 10 |
| మాధురి | 70–75 | 8 |

## చిలకడ దుంపలతో.. నికర ఆదాయం

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో గిరిజన రైతులు చిలకడ దుంపలను వాణిజ్యపరంగా సాగు చేస్తున్నారు. వీటి సాగుకు మన్యం వాతావరణం అనుకూలమని శాస్త్రవేత్తలు గుర్తించి రైతులను ప్రోత్సహిస్తున్నారు. పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో సుమారు 800 ఎకరాల్లో ఈ దుంపలు సాగవుతున్నాయి. చింతపల్లి, గూడెంకొత్తవీధి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో మాలీ రైతులు అధికంగా సాగు చేస్తున్నారు.



★ మన్యం నుంచి కోల్‌కతా, చెన్నై, ముంబై, ఢిల్లీ, ఒడిశాకు ఎగుమతి అవుతున్నాయి. గతంలో 80 నుంచి వంద కేజీల దుంపల ధర రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు ఉండేది. ఎగుమతులు పెరగడంతో ప్రస్తుతం రూ.800 చొప్పున ధర పలుకుతోంది. ఇతర పంటలతో పోలిస్తే పెట్టుబడి పోను నికర ఆదాయం వస్తుండటంతో రైతులు ఈ దుంపల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు సగటున రూ.40 వేల వరకు మిగులుతోందని చెబుతున్నారు.

**తగ్గిన బెల్లం ధరలు**

అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా అన్ని రకాల బెల్లం ధరలు తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.35, మధ్య రకాలు రూ.30, నాసి రకాలు రూ.65 ధరలు తగ్గాయి. –న్యూస్‌టుడే, అనకాపల్లి

| రకం | రంగులు | మధ్య | నాసి |
|---|---|---|---|
| గత వారం (రూ.) | 4,025 | 3,755 | 3,370 |
| ఈ వారం (రూ.) | 3,990 | 3,725 | 3,305 |

EENADU e Classifieds

BUSINESS SERVICES

**లోకేష్ గోల్డ్** లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

**శ్రీవల్లి గోల్డ్** లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

**ఆంధ్రప్రదేశ్‌లోGovt. ఉద్యోగస్తులకు,** రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదాలేదా నెలవారీవడ్డీకి పర్సనల్‌లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ 7386201191

REAL ESTATE

GENERAL

**సిటీ లిమిట్స్‌లో** గల బిల్డింగ్స్ పై గల ఓపెన్ స్పేస్ అమ్మదలచినవారు సంప్రదించండి మరియు మా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కొలేటరల్ సెక్యూరిటీ కావలెను. వివరాలకై : 9963585556.

FLAT FOR SALE

GENERAL

FLATS FOR SALE 3 BHK 1580 Sft. E/W/Facing, Premium Specifications, Walkable Distance from BRTS Road, SUJATHANAGAR. Book Now to Avail Discount 9989077663, 9441935055

2BHK 1200 Sft. New Flats All Eminities Ready to Occupy. Bank Loan. Nr. S.D.Peetam. Chinnamushidiwada. 9246671972, 8639234521

2BHK FLAT FOR SALE
2BHK Flat Sale in decent condition + Utility + 2 Balconies area of 1248 sft with carpark
@ DUTCH HOUSE APTS, Opp. Park Hotel, RK Beach Road, Vizag.
Agents not entertained
✆ 98440 97400

LAND FOR SALE

GENERAL

**పూసపాటిరేగ మం** గోవిందపురంరోడ్డు, హైవేకి ½km తార్రోడ్డుఫేసింగ్ 9ఎకరాలు కొబ్బరితోట & 4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం. 9440255187.

PLOT FOR SALE

VZM ROAD

VZM-VSP NHకు ప్రక్కన చెల్లూరు రాయపూర్ బైపాస్‌కు దగ్గర్లో VMRDA & RERA అప్రూవ్డ్ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో అన్ని ఫేసింగ్స్‌లో ప్లాట్లు కంపెనీ ధరకు అమ్మకమునకు కలవు. సంప్ర : 9492342274/ 8074112636.

JOBS

REQUIRED
A multi crore real estate company wanted staff immediately in our new projects.
❖WELL EXPERIENCED MARKETING STAFF
❖EXPERIENCED DIGITAL FEMALE MARKETERS
Age: 30 Years and above.
Qualifications: Any Degree
INTERVIEW : 30th & 31st Dec 2025
Time : 10 A.M. to 6 P.M
K. MADHU BABU, Dy. G.M
B.S. LAYOUT, VIZAG
✆7277275678

Job Opportunity: 30సంవత్సరముల అనుభవంగల రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు టీం కలిగి ఉన్న చీఫ్ మేనేజర్స్ కావలెను. 10,000 జీతం+ 2,40,000 ఇన్‌సెంటివ్. వయసు 35+ M/F. Con : 9346202030, 7675964466.

**ప్రముఖ రియల్** ఎస్టేట్ సంస్థ నందు మార్కెటింగ్ చేయుటకు స్త్రీలు/ పురుషులు కావలెను. ఆకర్షణీయమైన జీతము + ఇన్సెంటివ్స్ . సంప్ర: 9502911068.

**వైజాగ్ ప్రముఖ** షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం.10,000-12,000+ఫుడ్ రూము. ✆ 9030588502/9704637370.

**కౌంటర్ సేల్స్‌మెన్స్** (Q: ఇంటర్ / డిగ్రీ వ॥ 30స॥ లోపు) కావలెను. భువనేశ్వర్ పెయింట్స్ & హార్డ్‌వేర్, మర్రిపాలెం, వైజాగ్. సెల్: 9703009555.

**హోటల్ శ్రీకృష్ణ** ఎడెన్ కూర్మన్నపాలెంలో పనిచేయుటకు రూమ్‌బాయ్స్ 35 సం॥లు వయస్సులోపు వారు కావలెను. ఉచిత భోజనం & వసతి కల్పించబడును. ✆ 9866221503.

**విశాఖపట్నం (సిరిపురం,** ఆటోనగర్) ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్, SO లు కావలెను. జీతం:18,000-20,000. డ్యూటీ: 12 గం॥. PF-ESI కలదు. 7989870438.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

## ఈవీఎం గోదాం తనిఖీ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదాంను సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గోదాంలో భద్రపరచిన ఈవీఎం పరికరాలు, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బంది, అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ, ఎన్నికల సూపరింటెండెంట్ నాయుడు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ముషిడిపల్లి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగయ్యపేట శివారు సీతంపేటకు చెందిన యువకుడు **జుంజూరు అర్జున్** (35) మృతి చెందాడు. ఆనందపురం సమీపంలోని ఓ రెస్టారెంటులో చెఫ్‌గా పని చేస్తున్న అతడు పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ముషిడిపల్లి కూడలి దాటాక అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గోతిలో పడిపోయాడు. ఆ సమయంలో అటుగా వస్తున్న కొందరు గమనించి వాహన నంబర్‌ను ఆన్‌లైన్‌లో చెక్ చేసి, ఫోను నంబరు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని అర్జున్‌ను కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తమ్ముడు అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ చెప్పారు. అర్జున్ భార్య బిడ్డను ప్రసవించిన ఏడు రోజులకు తీవ్ర అస్వస్థతకు గురై మరణించింది. ఇప్పుడు అతడి మరణంతో రెండేళ్ల వయసున్న కుమారుడు అనాథ అయ్యాడు.

## రాజయ్యపేట తీరానికి కొట్టుకొచ్చిన బోటు

నక్కపల్లి, న్యూస్‌టుడే: సముద్రంలో చేపల వేట సాగించే భారీ బోటు ఒకటి నక్కపల్లి మండలం రాజయ్యపేట తీరానికి సోమవారం కొట్టుకొచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హార్బర్ పరిధిలో వేట సాగించే ఈ పెద్ద బోటు రాజయ్యపేటకు కొద్ది దూరానికి వచ్చింది. దాదాపు పది టన్నుల బరువు ఉండటంతో ఒడ్డుకు 100 మీటర్ల దూరంలో ఇసుకలో కూరుకుపోయి నిలిచిపోయింది. స్థానికులు పలువురు పడవలోకి వెళ్లి పరిశీలించారు. ఇందులో కేవలం డీజిల్ క్యాన్లు మాత్రమే ఉన్నాయని, మత్స్యకారులు ఎవరూ లేరని గుర్తించారు. ముందు జాగ్రత్తగా పోలీసులు, మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. తెప్పపై ఉన్న రిజిస్ట్రేషన్ నంబరును బట్టి కాకినాడ ప్రాంతానికి చెందినదిగా ప్రాథమికంగా తేల్చారు. ఎవరూ లేకుండా ఇటువైపునకు ఎలా కొట్టుకు వచ్చిందో తెలుసుకునేందుకు యత్నిస్తున్నట్లు స్థానిక మత్స్యకారులతోపాటు, పోలీసులు వెల్లడించారు.

తీరంలో నిలిచిన బోటు

**చికెన్ ధరలు** (కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 131 | 130 |
| లైవ్ | 158 | 150 |
| డ్రెస్డ్ | 229 | 270 |
| స్కిన్‌లెస్ | 261 | 280 |

# అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

## రైలులోనే కేరళ రాష్ట్ర కబడ్డీ జట్టు

ఈనాడు డిజిటల్ అనకాపల్లి, ఎలమంచిలి, న్యూస్‌టుడే: ప్రమాదానికి గురైన ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లోనే కేరళ రాష్ట్ర మహిళా కబడ్డీ జట్టు ప్రయాణిస్తోంది. కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి 12 మంది యువతులు కోచ్ మాయతో కలిసి కోల్‌కతా వచ్చారు. పోటీల్లో పాల్గొని తిరిగి కేరళకు టికెట్లు దొరక్కపోవడంతో వీరంతా టాటానగర్ వెళ్లి అక్కడ ఈ రైలులో జనరల్ బోగీ ఎక్కి ప్రయాణిస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న రైలులో ఏసీ బోగీలు కాలిపోవడంతో ఆందోళనకు గురయ్యారు.

ప్లాట్‌ఫాంపై క్రీడాకారులు

## రైళ్ల ఆలస్యంతో తప్పని ఇబ్బందులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఎలమంచిలి వద్ద రైలు ప్రమాదం నేపథ్యంలో రైళ్లన్నీ ఆలస్యంగా నడిచాయి. తుని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు పడిగాపులు కాశారు. ఈస్ట్‌కోస్ట్, సింహాద్రి, జన్మభూమి తదితర రైళ్లన్నీ రెండు నుంచి మూడు గంటల ఆలస్యంగా నడిచాయి.

ఎలమంచిలి గ్రామీణం: ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదం బాధాకరమని జనసేన ఉత్తరాంధ్ర రాజకీయాల సమన్వయకర్త సుందరపు సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం సంఘటనా స్థలాన్ని కూటమి నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ప్రమాదానికి సంబంధించిన విషయాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు వేగవంతం చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. నాయకులు రమేష్‌నాయుడు, కొఠారు శ్రీను, పల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరా తీస్తున్న సతీష్‌కుమార్

## గంటల వ్యవధిలో రైల్వే విద్యుత్తు లైన్ పునరుద్ధరణ

ఈనాడు డిజిటల్ అనకాపల్లి, ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో ఏసీ బోగీలు కాలిపోయిన ప్రమాదంలో దెబ్బతిన్న విద్యుత్తు లైన్లకు రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. ఇతర ప్రాంతాల నుంచి సిబ్బందిని రప్పించి రైలు ఇంజిన్‌కు విద్యుత్తు సరఫరా చేసే తెగిపోయిన తీగల స్థానంలో కొత్తవి వేయించారు. సాయంత్రానికి ఒకటో నంబరు ప్లాట్‌ఫాంలో ప్రధాన మార్గంలో రైళ్ల రాకపోకలు సాగేలా చేశారు. కాలిపోయిన తీగలను తొలగించారు. ప్రత్యేక వాహనాలను రప్పించి వాటి సాయంతో కొత్త తీగలు వేయించారు. స్టేషన్ ఆవరణలోని కాలిపోయిన వ్యర్థాలను తొలగించారు. రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి ట్రాక్‌ను పరిశీలించిన అనంతరం ఈ మార్గంలో రైళ్లను అనుమతించారు. అప్పటివరకూ రెండో లైన్లో రైళ్లను తిప్పారు. ప్రమాదం జరిగాక 24 గంటలు గడవక ముందే అన్ని పనులు పూర్తి చేసి రికార్డు నెలకొల్పారు. ఇటు విజయవాడ, తుని, అటు అనకాపల్లి, విశాఖపట్నం నుంచి వచ్చి రైల్వే అధికారుల వాహనాలతో స్టేషన్ ఆవరణ నిండిపోయింది. మంటలు ఆర్పుతున్న ఎలమంచిలికి చెందిన ఇద్దరు సిబ్బంది కాస్త అస్వస్థతకు గురయ్యారు. ఈ పొగ చాలా ప్రమాదకరమైందని అధికారులు చెబుతున్నారు.

ప్రధాన విద్యుత్తు లైన్ మరమ్మతు పనులు

### పొగతో ఉక్కిరిబిక్కిరి

ఈనాడు డిజిటల్ అనకాపల్లి, ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న రైలు ప్రమాదంతో వచ్చిన పొగ పరిసర ప్రాంతాలను చుట్టుముట్టింది. రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ పొగ వ్యాపించింది. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు పొగ వ్యాపించడంతో ఏమి జరిగిందోనని ఆందోళకు గురయ్యారు. అపార్టుమెంట్లలోకి ఈ పొగ చేరి ఇక్కడ నివసిస్తున్న వారిని ఊపిరాడకుండా చేసింది. ఒక పక్క మంచు మరోపక్క దట్టమైన పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తెల్లవారేసరికి విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో జనం స్టేషన్‌కు తరలివచ్చారు. వీరిని నిలువరించడానికి రైల్వే అధికారులు స్టేషన్‌కు వచ్చే ప్రధాన రహదారుల్లోనూ, బుకింగ్ కౌంటర్ వద్ద ఆంక్షలు విధించారు. ఎల్లో రిబ్బన్‌లు కట్టించి ఇతరులు ఎవరూ లోపలికి రాకుండా కట్టడి చేశారు.

## రెవెన్యూ క్లినిక్‌తో భూసమస్యలకు సత్వర పరిష్కారం

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: భూ సంబంధిత సమస్యలను రెవెన్యూ క్లినిక్ ద్వారా సత్వరం పరిష్కరిస్తామని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) భారీగా అర్జీదారులు తరలివచ్చారు. కలెక్టర్‌తోపాటు డీఆర్వో సత్యనారాయణ అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై 410 అర్జీలు వచ్చాయి. వీటిని శాఖల వారీగా విభజించి సంబంధిత అధికారులకు పంపించారు. కలెక్టరేట్‌లో కొత్తగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేశారు. దీనిపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూగగ 60 అర్జీలను పరిష్కారానికి పంపిస్తున్నామని వీటిని కచ్చితంగా పరిష్కరించాలన్నారు. ఒకే భూమిపై పలువ రిజిస్ట్రేషన్లకు సంబంధించి సబ్‌రిజిస్ట్రార్ల నుంచి నివేదికలు తెప్పించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

▮కశింకోట మండలం సింగవరం గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ప్రకటించాలని కలెక్టరేట్ వద్ద గ్రామస్థులు, నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సారపల్లి నానిబాబు, కె.ఎం.నాయుడు, కన్నయ్యయాదవ్ మాట్లాడుతూ గురువుభీమవరం పంచాయతీ పరిధిలో ఉన్న సింగవరాన్ని విడదీయాలన్నారు. మరోవైపు గురువుభీమవరానికి చెందిన గ్రామస్థులు కలెక్టరేట్‌కు చేరుకొని పంచాయతీని విభజించవద్దని నినాదాలు చేశారు. ▮పూడిమడక పంచాయతీని జనాభా పరంగా రెండుగా విభజించాలని మత్స్యకార నాయకులు, గ్రామస్థులు ప్లకార్డులతో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు వాసుపల్లి శ్రీనివాసరావు, జగన్నాథరావు, అప్పారావు మాట్లాడుతూ ఒకే పంచాయతీ పరిధిలో 20 వేల జనాభాతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ▮గోపాలపురం శివారు వెంకటరమణ పేటలో ప్రభుత్వ స్థలం కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరుకొండ సన్యాసిరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ విజయ కృష్ణన్ హామీ ఇచ్చారని తెదేపా మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తెలిపారు. కలెక్టర్‌లో ఆర్డీవో రమణ, ఎన్ఏఓబీ ఉప కలెక్టర్ మనోరమ, తహసీల్దార్ రమేష్‌బాబు, సర్పంచి మైలపల్లి శ్రీను, మత్స్యకారులతో కలెక్టర్ వివిధ అంశాలపై చర్చించారు.

కలెక్టరేట్ వద్ద సింగవరం గ్రామస్థుల ధర్నా

## జోనల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తికి ఎడమచేతి శస్త్రచికిత్స అయిన నేపథ్యంలో ఆయనను సోమవారం పలువురు పరామర్శించారు. షటిల్ ఆడుతూ ప్రమాదానికి గురైన చక్రవర్తి ఎడమచేతికి గాయం కావడంతో శస్త్రచికిత్స చేశారు. ఆయనను ఎమ్మెల్యే కొణతాల కలిసి వాకబు చేశారు.

## ఆర్థిక స్వావలంబన సాధించాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బ్యాంకుల ద్వారా తీసుకుంటున్న రుణాలను స్వయం ఉపాధికి ఉపయోగించుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎంపీడీఓ చిన్నారావు కోరారు. పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్త్రీశక్తి భవనంలో గ్రామసంఘాల సహాయకులకు ఉద్యమ కార్డు నమోదుపై శిక్షణ ఇచ్చారు. పరిశ్రమలశాఖాధికారిణి హేమని ప్రియదర్శిని, ఏపీఎం శ్రీనివాసరావు, సమాఖ్యసంఘం అధ్యక్షురాలు శివలక్ష్మి, కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కొండకర్ల, దప్పితూరు, జగన్నాథపేట, దిబ్బపాలెం, ఎం.జగన్నాథపురం, యర్రవరం, ఉప్పవరం, మర్రివరం, నరేంద్రపురం గ్రామాలకు మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్తు స్తంభాలు మార్పు కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు ఉండదన్నారు.

## బహిరంగంగా మద్యం సేవించినవారిపై కేసులు

కశింకోట, న్యూస్‌టుడే: నూతనసంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న పలువురిని సోమవారం రాత్రి పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

## యాదవ సంఘ అధ్యక్షుడిగా వెంకట్రావు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి నియోజకవర్గ యాదవ సంఘ అధ్యక్షునిగా బోడి వెంకట్రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షులుగా ఒమ్మి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గోకువాడ లోవకృష్ణ, ఉపాధ్యక్షులుగా బొబ్బిలి గోవిందరాజులు, కార్యదర్శిగా పుట్టా సత్యఅప్పారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ సంఘ గౌరవ అధ్యక్షునిగా బొట్టా ఆదినారాయణ, అధ్యక్షులుగా భర్నికాన పువ్వుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సారిపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కోన దుర్గాప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## అనుమతులు లేని ప్లాట్లు కొనొద్దు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక పంచాయతీ పరిధిలో అనుమతులు లేని ప్లాట్లు కొనవద్దని పంచాయతీ కార్యదర్శి రమేష్ సూచించారు. లేఅవుట్లలో ఏర్పాటు చేసిన వీఎంఆర్‌డీఏ ఫ్లెక్సీలను సోమవారం పంచాయతీ కార్యదర్శి రమేష్ తొలగించారు.

## రక్షణ గోడ శిథిలం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పెద్దిపాలెంలోని గోపాలపట్నం ఆవ వద్ద రక్షణ గోడ శిథిలమైంది. మంగవరం నుంచి పెద్దిపాలెం వెళ్లే దారిలో వంపు మార్గం ఉంది. ఇక్కడ ఆవ నీరు పంట కాలువలకు చేరేందుకు స్లూయిస్‌లు ఏర్పాటు చేశారు. ఆవలోకి పడిపోకుండా ఉండేందుకు వీలుగా రక్షణగోడ నిర్మించారు. గోడలో సగభాగం ఇప్పటికే కుప్పకూలింది. వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## అంచులు.. ప్రమాద ఘంటికలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: కోతకు గురైన రహదారుల అంచులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. గోపాలపట్నం-పెంటకోట రోడ్డులో రెండువైపులా అంచులు కోతకు గురయ్యాయి. పెంటకోట, గోపాలపట్నం, నక్కపల్లి మండలంలోని బంగారమ్మపేట తదితర గ్రామాల నుంచి నిత్యం వాహనచోదకులు పెద్ద ఎత్తున ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారికి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## కదలని మురుగు..!

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: [illegible]లూరులో ప్రధాన రహదారి పక్కన మురుగు నిలిచిపోతోంది. ఇక్కడ వాడుక నీరంతా రోడ్డు పక్కన గుంతలో చేరుతుంది. గుంత నిండిన తరువాత రోడ్డుపై ప్రవహిస్తోంది. రోజుల తరబడి నిలిచిపోవడంతో దోమల బెడద ఎక్కువై కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు మురుగు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉత్తర ద్వార దర్శనానికి ముమ్మర ఏర్పాట్లు

అనకాపల్లి పట్టణం, గ్రామీణం, కొత్తూరు, ఎలమంచిలి గ్రామీణం, అచ్యుతాపురం, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని దేముడిగుమ్మం వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకోవడానికి వీలుగా బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఆలయంలో చేపట్టిన ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. అధికారులు, పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ జోలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గాంధీనగరం ఆంజనేయస్వామి, రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయాలకు భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో క్యూలైన్లు సిద్ధం చేశారు. హరిపాలెం-అందలాపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం మంగళవారం నిర్వహిస్తున్నట్లు సమరసతా ఫౌండేషన్ సబ్ డివిజనల్ కన్వీనర్ బీవీ.రమణ తెలిపారు. కొండపైకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసింది. దార్లపూడిలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే వైకుంఠ ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

## కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం

### నెరవేరిన హామీ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పెంటకోట వద్ద కల్వర్టు నిర్మాణ పనులు పదేళ్ల తర్వాత పట్టాలెక్కాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మంత్రి వంగలపూడి అనిత నెరవేర్చారు. గ్రామానికి సమీపంలో పాయకరావుపేట నుంచి పెంటకోట వెళ్లే రోడ్డులో ఉన్న కల్వర్టు 2015లో కూలిపోయింది. దీన్ని కొత్తగా నిర్మించాలని అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న అనిత రూ.18 లక్షలు మంజూరు చేశారు. దీంతోపాటు తాత్కాలికంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు కేటాయించారు. గుత్తేదారు డైవర్షన్ రోడ్డు వేసి కల్వర్టు నిర్మాణాన్ని వదిలేశారు. వైకాపా హయాంలో దీని పనులను ఏమాత్రం పట్టించుకోలేదు. గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన అనిత కల్వర్టు నిర్మాణం పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. దీనిలోభాగంగానే పెంటకోట, అరట్లకోటలో ఉన్న రెండు కల్వర్టుల నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు చేయించారు. ఈ పనులకు ఇటీవలే శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. దశాబ్దాల సమస్యకు తెరపడిందని శ్రీరాంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు చిక్కాల శ్రీనివాసరావు పేర్కొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి ఏర్పాట్లు

## విద్యకు తొలి ప్రాధాన్యం

కశింకోట, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడమే లక్ష్యమని వి.ఎస్.సూరిబాబు అన్నారు. కశింకోట బాలసదనంలో సోమవారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. బాలసదనం సూపరింటెండెంట్ సీహెచ్.వరలక్ష్మి, క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలో ప్రతినిధులు, చిత్రంలో విద్యార్థులు

## అధికారుల తీరుపై మండిపాటు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: బీల్యరకాలనీలో నల్లమారమ్మ తల్లి ఆలయాభివృద్ధిని అడ్డుకునేందుకు సోమవారం నోటీసులతో వచ్చిన అధికారులను గ్రామస్థులు అడ్డుకున్నారు. భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయమని, 30 ఏళ్లకు పైగా నడుస్తోందన్నారు. నాయకులు మళ్ల శ్రీను, యల్లపు వెంకటరావు, మొల్లేటి శివాజీ, మేడేపల్లి పాపారావు, బుద్ద నాగేశ్వరరావు, నూకరాజు, కాండ్రేగుల రాజు తదితరులు పాల్గొన్నారు. దీనిపై డీపీఓ సందీప్‌ను వివరణ కోరగా నోటీసులు మాత్రమే అందజేస్తున్నామని, ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

ఆలయం వద్ద గ్రామస్థుల నినాదాలు

## నిధులున్నా పనుల అడ్డగింత

మునగపాక, న్యూస్‌టుడే: నిధులు మంజూరైనా నిబంధనల సాకుతో అడ్డుకొంటున్నారని ఎంపీటీసీ సభ్యులు మద్దాల వీరునాయుడు, సుందరపు తాతాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మునగపాక మండల ప్రజాపరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. [illegible] జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ తెలిపారు. పలు చోట్ల విద్యుత్తు స్తంభాలు విరిగిపోయే స్థితిలో ఉన్న సిబ్బంది వాటిని మార్చు చేయలేదని కాండ్రేగుల వెంకటలక్ష్మి, యల్లపు వెంకటభాస్కరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఉషారాణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బంద్‌పై పోలీసుల చర్యలు సరికాదు

కొత్తూరు (అనకాపల్లి), పాయకరావుపేట, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సీపీఎం నాయకుడు అప్పలరాజుపై పీడీ యాక్టు కేసు పెట్టి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ చేపట్టిన బంద్‌పై పోలీస్ చర్యలను ఖండిస్తున్నామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. సంఘీభావం ప్రకటించేందుకు వెళ్తున్న వారిని ముందస్తు అరెస్టు అన్యాయమని పేట సీపీఐ మండల కార్యదర్శి వి.అర్జునరావు పేర్కొన్నారు. అచ్యుతాపురంలో సీఐటీయూ, ముఠా కార్మికుల సంఘం నాయకులు నిరసనకు దిగారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసేవారిపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రజాసంఘాల నాయకులు అప్పలనాయుడు, ఒమ్ములనాయుడు, రామునాయుడు, అప్పలకొండ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

## స్తంభాన్ని ఢీకొన్న వ్యాన్

రాంబిల్లి, న్యూస్‌టుడే: ఎలమంచిలి-గాజువాక రహదారిలో కొత్తూరు మేజర్ శారదానది పైవంతెన వద్ద వ్యాన్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. ఆదివారం రాత్రి 11 గంటలకు ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో విద్యుత్తు స్తంభం విరిగిపోయింది. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ప్రమాదంతో నిలిచిపోయిన విద్యుత్తు సరఫరాను సోమవారం పునరుద్ధరించారు.

ఒరిగిపోయిన విద్యుత్తు స్తంభం

## 'అధికారుల ఇష్టారాజ్యంగా విద్యాశాఖ'

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యాశాఖను ప్రభుత్వం గాలికి విడిచిపెట్టేసిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జుల వలరాజు, బందెల నాసర్‌జీ ఆరోపించారు. అనకాపల్లిలో సోమవారం సోమవారం జరిగిన ఏఐఎస్ఎఫ్ బహిరంగ సభలో వారు ప్రసంగించారు. అధికారుల ఇష్టారాజ్యంగా విద్యాశాఖ మారిందన్నారు. విద్యార్థులు, పాఠశాలల సమస్యల పరిష్కారాన్ని పూర్తిగా విడిచి పెట్టేశారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను నేటికీ విడుదల చేయలేదన్నారు. వైద్యం, విద్య పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని, వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్, జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు, జగదీష్, ఏసుబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

వేదికపై ప్రతినిధుల సంఘీభావం

## జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో అనకాపల్లి విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ ఏడాది అక్టోబరులో జరిగిన ఆన్‌లైన్ పోటీల్లో 27 మంది రెండోస్థాయికి ఎంపికయ్యారు. వీరికి ఈ నెలలో నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో 19 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో ఆరుగురికి ప్రథమ, ఏడుగురికి ద్వితీయ, ఆరుగురికి తృతీయ బహుమతులు లభించాయి. వీరిని ట్రైనర్ బొండాడ సునీత అభినందించారు.

పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులు

## మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722
ఎలమంచిలి- 80085 74726
పాయకరావుపేట- 80085 74750

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయి ఆదర్శనగర్‌లో సాయిబాబా గుడి సమీపంలో మురుగు పేరుకుపోయింది. డ్రైనేజీ శుభ్రం చేయించాలి. దోమల బెడద ఎక్కువగా ఉంది. – సత్యనారాయణ, స్థానికుడు, ✓: శుభ్రత మెరుగు పరుస్తాం. మురుగు తీయిస్తాం. – కె.డేవిడ్, ఈవో

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కడపాలెం రోడ్డుపై వాడకనీరు నిల్వ ఉండిపోతుంది. నీటిపై వాలిన ఈగలు, దోమలతో అనారోగ్యానికి గురవుతున్నాం. – మసేనమ్మ, కడపాలెం, ✓: వాడకనీరు రోడ్డుమీద రాకుండా చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య నిర్వహణకు అందరూ సహకరించాలి. – సరస్వతీ, పంచాయతీ కార్యదర్శి, పూడిమడక.

అనకాపల్లి పట్టణం, బర్మాకాలనీలో కల్వర్టు మరమ్మతులకు గురైంది. – శ్యామలరావు, అనకాపల్లి, ✓: మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – గోపాలకృష్ణ, జీవీఎంసీ ఈఈ

ఎలమంచిలి, న్యూస్‌టుడే ఎలమంచిలిలో పంటకాలువ దగ్గర కొందరు బహిరంగంగా మద్యం తాగుతున్నారు. వీరితో ఈమార్గంలో వెళ్లే మహిళలకు ఇబ్బందిగా ఉంది., ✓: ఈమార్గంలో నిఘా వేస్తాం. ఎవరినైనా ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు. – సావిత్రి, పట్టణ ఎస్సై

ఎలమంచిలి, న్యూస్‌టుడే ఎలమంచిలి రాజీవ్ క్రీడామైదానంలో తుప్పలు పెరిగిపోయాయి. ఇక్కడ పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. – ఎం.రమేష్ ఎలమంచిలి, ✓: తుప్పలు తొలగించి శుభ్రం చేయిస్తాం. – ప్రసాదరాజు, కమిషనర్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే అచ్యుతాపురంలో మురుగు నీరంతా దుప్పితూరు చెరువులోకి విడుదల చేస్తున్నారు. – సోమేశ్, దుప్పితూరు, ✓: మురుగు చెరువులో కలవకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. – చిన్నారావు, ఎంపీడీఓ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేటలోని బృందావనంలో రేషన్ దుకాణం పక్కనే ఉన్న డ్రైనేజీలో మురుగు పేరుకుపోయింది. చెత్త తొలగించడం లేదు. దుర్వాసన వస్తోంది. – శివ, స్థానికుడు, ✓: కాలువలో చెత్త తొలగించేందుకు చర్యలు చేపడతాం. – కె.డేవిడ్, ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేటలోని ప్రధాన రహదారిపై రాత్రి సమయాల్లో పశువులు పడుకుంటున్నాయి. రోడ్డు చీకటిగా ఉండటంతో వీటిని గుర్తించలేక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – దొర, స్థానికుడు, ✓: పశువులు రోడ్లపై ఉండకుండా చర్యలు చేపడతాం. యజమానులకు తాఖీదులు జారీ చేస్తాం. – కె.డేవిడ్, ఈవో

## జోరుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: చోడిపల్లి కేంద్రంగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పలువురు కొండ వెనుక రహస్యంగా తవ్వకాలకు పాల్పడుతున్నారు. పట్టపగలే ట్రాక్టర్లలో వీటిని రవాణా చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో రామన్నపాలెం మీదుగా తరలిస్తున్నారు. అచ్యుతాపురంలో అధికారిక క్వారీలు లేకపోవడంతో ట్రాక్టర్ యాజమానులు ఎంత అడిగితే అంత డబ్బులు చెల్లించి గ్రావెల్ అవసరాలను తీర్చుకుంటున్నారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ట్రాక్టర్ గ్రావెల్ ధర రూ. 5 వేల వరకు పలుకుతోంది. వీటిని కట్టడి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు.

ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రావెల్

## రైతులకు అందుబాటులో యూరియా

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అనకాపల్లి డివిజన్ పరిధిలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లోని దుకాణాల్లో యూరియా నిల్వలను సోమవారం ఆయన పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించండి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: మీటర్ రీడర్స్ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, సంఘ అధ్యక్ష కార్యదర్శులు శంకరరావు, శ్రీనివాసరావు కోరారు. సోమవారం ర్యాలీ, కూడళ్లలో ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా సంస్థలో చిత్తశుద్ధితో పనిచేస్తున్న సిబ్బందిని పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వీరి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా సరైన భరోసా ఇవ్వలేదన్నారు. ప్రతినిధులు తులసి, అప్పలకొండ, చిరంజీవి, శ్రీనివాసరావు, రమేష్, వియ్యపు రాజు, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సంఘ ప్రతినిధుల ధర్నా

## ఆకట్టుకున్న నాటకోత్సవాలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జార్జిక్లబ్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన నాటకోత్సవాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, ఎంపీ కార్యాలయం ఇన్‌ఛార్జి విజయ్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన స్వర్ణసూర్య డ్రామా కళాకారులు ప్రదర్శించిన 'స్త్రీ మాత్రే నమః', కాకినాడ కళాకారులు 'కన్నీటి విలువెంత' ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జార్జిక్లబ్ అధ్యక్షులు బీఎస్ఎంకే జోగినాయుడు, కార్యదర్శి బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, పగడాల వీరభద్రరావు, కె.ఎం.నాయుడు పాల్గొన్నారు.

నాటికలో ఓ సన్నివేశం

## రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పరిధిలో ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. నక్కపల్లి పోలీసు స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. తొలుత కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. జాతీయ రహదారి పరిధిలో గస్తీ పెంచాలని, స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు తదితర వాటిపై అన్నివర్గాల వారికి అవగాహన కల్పించాలన్నారు. విద్యాలయాల వద్ద విద్యార్థినులకు ఆకతాయిల ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P 49/2021 IN O.S 66/2021
గంగులకుర్తి సత్య వరప్రసాద్.......DHR
Vs
భర్నికాన రమణ బాబు.............JDR
వేలం ప్రకటన
పై నెంబర్ ఆమలులో DHR కు చెల్లించవలసిన అమలు బాకీ JDR చెల్లింపక పోవుటచే JDR యొక్క ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని 20-1-2026 వ తేదీన వేలం వేయాలని పై కోర్టు వారు నిర్ణయించారు. కావున 20-1-2026 వ తేదీని ఉదయం 10:30 నిమిష ముల నుండి సాయంత్రం 5 గంటలలోపు పై కోర్టులో వేలం వేయబడును. వేలంపాటలో పాల్గొదలిచినవారు కోర్టు వారి ఇస్తిహార్ షరతులకు లోబడి వేలంపాటలో పాల్గొనవచ్చును.
వేలం ఆస్తి వివరాలు
Item No-1
Visakhapatnam District, Present Anakapalli District, Anakapalli sub-Register, Anakapalli Municipality, Present GVMC, bearing Assessment No1087016745 and old assessment no 1087016743, house 2-no 22-8/4, old door no 2-22-8/2, in ward No 32, Block No-1, T.S No 5/1 of part of RCC slabbed house situated at Sriram Nagar, Vijayara marajupeta GVMC bounded as follows: East- joint lane of co-parceners and adjacent to the house of Bobbili apparao South-Property of Barnikana Bhaskara Rao. West-Road. North- Road.
Item No-2
Visakhapatnam district, present Anakapalli district, Anakapalli Sub-Register, Anakapalli Municipality,Present GVMC, bearing Assessment No-1087009204 and house No-2-4-13, in ward Bi, 2, Block No-1, T.S no 5/1 of part, of two portions old tiled house situated at Vijayaramarajupeta. Bounded as follows:-
East- joint lane of this property and co-parceners property,
South-House of koyya Dasara Bulloud.
West-property of Barnikana pydiraju.
North- 3 feet lane and above that the house of Barnikana Narasingarao, Barnikana Baskara Rao.
Item No-1&2 – DHR value Rs 6,00,000/-.
Amin value–Rs 14,00,000/-.
Market value--Rs 20,07,940/- Item No-1.
Market value- Rs 8,93,000/- Item No-2.
V. Rajasekhar.
Advocate for DHR. Anakapalli.
cell:-9848480118.

# నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

## అందరూ ప్రశంసించేలా..

బహుమతులు అందజేస్తున్న మహతి స్కూల్ ప్రిన్సిపల్ ఉషారాణి

చోడవరం, న్యూస్‌టుడే: క్విజ్ పోటీల్లో విశేషంగా రాణించి బాలబాలికలు అందరి ప్రశంసలు అందుకున్నారు. సాధారణ సిలబస్‌లోపాటు జాతీయ, అంతర్జాతీయ అంశాల్లో అడిగిన ప్రశ్నలకు చక్కటి జవాబులు ఇచ్చారు. పట్టణంలోని మహతి స్కూల్‌లో సోమవారం ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో ఎక్కువమంది క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపారు. వీరిలో కె. మేఘనశ్రీ, పి. దేవయాని, ఎస్. గ్రీష్మ విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపల్ పి. ఉషారాణి వారికి ప్రశంసాపత్రంతో పాటు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ఎం. రోషిణి, బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

## ఆకట్టుకున్న మెప్మా ఉత్పత్తులు

విక్రయిస్తున్న రంగులు

నర్సీపట్నం: సబ్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఏర్పాటైన మెప్మా అర్బన్ మార్కెట్టులోని మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు అందరిని ఆకట్టుకున్నాయి. ఇందులో వస్త్రాలు, మిల్లెట్స్, మట్టి పాత్రలు, చీరలు, లక్క బొమ్మలు, సంక్రాంతి ముగ్గుల రంగులు, పిండి వంటలు వంటివి విక్రయానికి సిద్ధం చేశారు. అమ్మకాల ద్వారా మొత్తం రూ. 31,400 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: ఈషా, దండోరా, వృషభ, అఖండ-2, ఆడి 2: ఛాంపియన్, అనకొండ, ఆడి3: శంబాల, బ్యాడ్ గాళ్స్, ఆడి 4: అవతార్, అఖండ-2, రాజు: అఖండ-2, బంగార్రాజు: ఈషా, శంబాల చోడవరం: శ్రీసాయిలక్ష్మి: ఛాంపియన్, సాయిలక్ష్మి: శంబాల పూర్ణా: అఖండ-2

## ఎక్కడున్నారండి.. స్మార్ట్‌కార్డులు తీసుకోండి!

**జిల్లాలో మిగిలిన 22 వేల కార్డులు.. నెలాఖరులోగా పొందవచ్చు**

చీడికాడ, న్యూస్‌టుడే: రేషన్ పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత తీసుకురావడానికి పౌరసరఫరాల శాఖ పాతబియ్యం కార్డుల స్థానంలో కొత్తగా ఏటీఎం కార్డు పరిమాణంలో స్మార్ట్ కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలో వీటి పంపిణీ కొద్దిరోజులుగా జరుగుతోంది. ఇంకా కొందరు కార్డులను తీసుకోలేదు. ఎవరైనా పొందనివారుంటే తక్షణమే తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులు సూచిస్తున్నారు.

★ జిల్లాలోని అన్ని మండలాల్లో 5.34 లక్షల కుటుంబాలకు బియ్యం కార్డులు ఉన్నాయి. వీరందరికీ ప్రభుత్వం స్మార్ట్ కార్డులను అందిస్తోంది. ఇప్పటివరకు 5.12 లక్షల కార్డులను లబ్ధిదారుల కుటుంబాలకు అందజేశారు. ఇంకా 22 వేల వరకు కార్డులు మిగిలిపోయాయి. ఇంకా స్మార్ట్ బియ్యం కార్డులు తీసుకోలేని వారికి సంబంధిత అధికారులు, రేషన్ డీలర్ల ద్వారా సమాచారం ఇస్తున్నా.. కొందరు రావడంలేదు. వీటిలో కొన్ని మరణించిన వారి కార్డులు ఉన్నాయి. మిగిలిన కార్డులను ఈ నెలాఖరులోగా సంబంధిత లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు

**మృతి చెందినవారి కార్డుల తొలగింపు..**

మృతి చెందిన వారిపేరున ఉన్న స్మార్ట్ కార్డులను రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించారు. ఆయా మండలాల్లో తహసీల్దార్ ధ్రువపత్రం చేసి, గుర్తించిన తర్వాత తొలగింపు ఉంటుంది. జిల్లాలో 96 శాతం రేషన్ స్మార్ట్ కార్డులు లబ్ధిదారులకు ఇప్పటికే పంపిణీ జరిగింది. మరో 22వేల వరకు కార్డులు మిగిలి ఉన్నాయి. వాటిలో సగం మంది వరకు మరణించిన వారివే ఉన్నా.. మిగిలినవీ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయిన వారివి ఉంటాయని అంచనా వేస్తున్నాం. ఈ నెలాఖరు వరకు స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతోంది. ఎవరైనా ఉంటే.. సంబంధిత సచివాలయంలో సంప్రదించి పొందవచ్చు. - కె.వి.ఎల్.ఏ.ఎన్.మూర్తి, జిల్లా పౌరసరఫరాల అధికారి

## ఆక్రమించి.. అక్రమ ఇసుక నిల్వ కేంద్రంగా

చోడవరం, న్యూస్‌టుడే: గజపతినగరంలోని ర.భ. శాఖ బంగ్లా అక్రమాలకు కేంద్రబిందువుగా మారుతోంది. దీనిపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇక్కడి పరిసరాలను కొందరు సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. పశువులను కట్టేందుకు పాకలను ఏర్పాటు చేసుకున్నారు. అక్కడున్న పక్కా నిర్మాణాలను సైతం సొంతం చేసుకున్నారు. మరికొందరు భవనం ఆవరణ ఖాళీగా ఉండటమే అదనుగా చేసుకొని ఇసుకను అక్రమంగా నిలవచేస్తూ ఎంచక్కా సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఇక్కడ ఐదెకరాల్లో మామిడి చెట్ల మధ్య భవనం, వాచ్‌మెన్ గది, గుర్రాలశాలతో విలసిల్లేది. ప్రస్తుతం ఆ ఆనవాళ్లు అన్నీ మాయమైపోయాయి. బంగ్లా వెనకభాగం జుత్తాడ గ్రామానికి వెళ్లే రహదారివైపు ఉన్న స్థలమంతా ఆక్రమణకు గురైంది. ప్రభుత్వాస్తిని గాలికొదిలేయడంపై ఇంజినీరింగ్‌శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బంగ్లా ఆవరణలో ఆక్రమణలు

## దండిసురవరం పంచాయతీకి సొంతగూడు

చీడికాడ, న్యూస్‌టుడే: దండిసురవరం పంచాయతీకి సొంతగూడు సమకూరనుంది. ఇక్కడ పంచాయతీ కార్యాలయం లేకపోవడంతో అరకొర వసతులతో పాలకవర్గం, పంచాయతీ సిబ్బంది, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి రూ. 33 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు బొబ్బాది తాతారావు చెప్పారు. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి కూటమి నాయకులు, దండిసురవరం, కట్టువాని అగ్రహారం గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు చెప్పున్నారు.

నిర్మాణ దశలో ఉన్న భవనం

## ఉట్టిపడుతున్న తెలుగుదనం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: చౌడువాడలో సతకంపట్టు రామాలయానికి చెందిన సీతారాముల ఉత్సవ విగ్రహాలతో సోమవారం వేకువజామున మేలుకొలుపును నిర్వహించారు. ఇంటింటికి తిరిగి భక్తిగీతాలు పాడుతూ ఆశీర్వచనాలు పలికారు. భక్తులు ఉత్సవ విగ్రహాలకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు అందజేసారు.

## అర్జాపురంలో లేగ దూడల ప్రదర్శన

రావికమతం, న్యూస్‌టుడే: టి. అర్జాపురంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం లేగ దూడల ప్రదర్శన జరిగింది. తట్టబంద పశువైద్య కేంద్రం ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి డాక్టర్ నూకేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఏడీఏ డాక్టర్ సురేష్, డాక్టర్ దుర్గా ప్రసాద్, పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య లేగదూడల ప్రదర్శనను ప్రారంభించారు. జెర్సీ, ముర్రా, హెచ్.ఎఫ్, ఒంగోలు తదితర జాతులకు చెందిన 53 పెయ్యిలను ప్రదర్శించారు. పశువైద్యులు బాలతేజ, సురేష్, ప్రతాప్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పలుదూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. స్థానిక పశు సంవర్ధక సహాయకుడు కొప్పుల ప్రసాద్, గోపాల మిత్ర రాజాన శ్రీను, అద్దెపల్లి శ్రీను, అప్పలనాయుడు, శివ, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రదర్శనకు తీసుకొచ్చిన లేగదూడలు

## మరోమారు గ్రామసభ వాయిదా

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని తట్టబంద పంచాయతీ విభజనపై గ్రామాల ప్రజల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ పంచాయతీలోని ఏడు గ్రామాల ప్రజలు రెండుగా విడిపోయారు. పలువురు సానుకూలం ఉండగా.. మరికొందరు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఓ కొలిక్కి రాకపోవడంతో అధికారులు సైతం గ్రామసభను వాయిదావేసి వెళ్లిపోయారు.

★ పంచాయతీ విభజనకు సంబంధించి గ్రామసభ నిర్వహించడం ఇది మూడోసారి. ఇప్పటికే రెండు దఫాలుగా సభ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయగా సర్పంచి గోకాడ రమణ, మాజీఉప సర్పంచి సింబోతు నాయుడు వర్గీయులు మధ్య ఘర్షణలు జరగడంతో వాయిదా పడింది. సోమవారం మరోమారు గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, మండల పరిషత్ కార్యాలయ ఏవో సీతారామస్వామి, పంచాయతీ కార్యదర్శి విజయ సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. ఇందులో పంచాయతీ విభజనకు వ్యతిరేకంగా మెజారిటీ ప్రజలు అధికారులకు స్పష్టం చేశారు. భూములు, రెవెన్యూ, ఇతరత్రా ఆదాయ వనరుల సమస్యలు పరిష్కరించాకే పంచాయతీ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరారు.

గ్రామ సభకు తరలివచ్చిన జనం

## పారదర్శకంగా పురపాలక బడ్జెట్ : పద్మావతి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపట్టిన బడ్జెట్ పారదర్శకంగా ఉందని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. మున్సిపల్ సమావేశంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సోమవారం ఆమె మాట్లాడుతూ రాబడి-ఖర్చు అంచనాలను వాస్తవికంగా ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు అంకెల గారడీ బడ్జెట్‌లు పెట్టేవారన్నారు. కౌన్సిల్‌కు మరో మూడునెలల పదవీ కాలమే ఉన్నందున ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. సభాపతి అయ్యన్న వీఎంఆర్‌డీఏ ద్వారా డ్రెయినేజీలు, కల్వర్టులు, రోడ్ల పనులకు రూ. 9.11కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. రూ. 75 లక్షల ఖర్చుతో ఉత్తరవాహిని కల్యాణమండపం పనులు మొదలు కానున్నాయన్నారు. తెదేపా అధికారంలోకి వచ్చాక రెండువేల వీధి దీపాలను మరమ్మతు చేయించామని, ఐదు వందల కొత్తలైట్లను కొనుగోలు చేశామని తెలిపారు. 125 కొత్త కరెంట్‌పోల్స్ ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. పారిశుద్ధ్య విభాగానికి అవసరమైన కాంపాక్టర్, పొక్లెయిన్, రెండుట్రాక్టర్లు, తోపుడు బండ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. సమావేశానికి ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం ప్రాంతీయ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమానికి తనను పిలవలేదని, ఆసుపత్రి పర్యవేక్షకురాలిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అక్రమ కట్టడాల వల్ల మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోందని వైకాపా కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, మాకిరెడ్డి బుల్లిదొర ఆరోపించారు. ఇప్పటికీ ఇలాంటి నిర్మాణాలు కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ తనొచ్చిన తరువాత మూడువందల భవనాలపై ఛార్జిషీట్లు వేశామని పేర్కొన్నారు. వారంతా ఇప్పుడు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం కింద రెగ్యులర్ చేయించుకుంటున్నారని వివరించారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా కామిరెడ్డి సత్యనారాయణ నియామకానికి కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు ప్రతిపాదించగా చింతకాయల పద్మావతి సహా సభ్యులంతా ఆమోదం తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా కౌన్సిలర్ పద్మావతి

## ఒకరోజు ముందే పింఛన్లు

చీడికాడ, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛను సొమ్ము లబ్ధిదారులకు ఒకరోజు ముందుగానే ప్రభుత్వం అందజేయనుంది. జనవరి నెలకు సంబంధించిన పింఛను ఈనెల 31వ తేదీ నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అందిస్తారని ఎంపీడీఓ హేమసుందరరావు చెప్పారు. చీడికాడ మండల వ్యాప్తంగా 23 పంచాయతీల్లో 8,428 మంది అన్ని రకాల పింఛను లబ్ధిదారులు ఉన్నారని, వీరికి రూ. 3.6 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

నాతవరం, దేవరాపల్లి : సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. దేవరాపల్లిలోనూ పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఎం.వి. సువర్ణ రాజు తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొంటారన్నారు.

## మత్తు జోలికి పోవద్దు...

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మత్తు జోలికి పోయి బంగారు భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు కె.కోటపాడు ఇన్‌స్పెక్టర్ పి. పైడపు నాయుడు హితవు పలికారు. దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్.ఐ. పి. సత్యనారాయణ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి వాటికి అలవాటు పడిన వారి జీవితాలు నేర చరిత్రతో ముడిపడతాయన్నారు. వాటి జోలికి పోమంటూ డ్రగ్స్‌కి వ్యతిరేకంగా వారందరిచేత సీఐ ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు శక్తి యాప్ ఆవశ్యకతను వారికి వివరించారు. కె.కోటపాడు, ఎ.కోడూరు ఎస్ఐలు డి. ధనుంజయ్, డి.లక్ష్మీనారాయణ, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎస్. నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## గోవాడ వంతెనపై ట్రాఫిక్ జామ్

చోడవరం గ్రామీణం : గోవాడ వంతెనపై సోమవారం రాత్రి ట్రాఫిక్ నిలిచిపోయింది. వంతెనపై చెరకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ చక్రం విరిగిపోవడంతో వెంకన్నపాలెం, చోడవరం వైపు వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై జోగారావు, సిబ్బంది సంఘటన స్థలికి చేరుకొని క్రమబద్ధీకరించారు.

## నూతన సంవత్సర వేడుకలపై నిఘా

చింతపల్లి: నూతన సంవత్సరం, సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిఘా ఏర్పాటు చేయడంతోపాటు, భద్రతా చర్యలు చేపడతామని సీఐ వినోద్‌బాబు తెలిపారు. సంబరాల పేరుతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఏపీటీఎఫ్ కౌన్సిలర్‌గా తమ్మయ్యనాయుడు

రోలుగుంట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్‌గా మండలంలోని కొమరవోలు ఎంపీపీ స్కూలు విధులు నిర్వహిస్తున్న పీఈటి తమ్మయ్యనాయుడు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు పి.వి. రమణ, అశోక్‌సామ్రాట్ తెలిపారు. తద్వారా తమ్మయ్యనాయుడు సమస్యలపై కౌన్సిల్ సమావేశాల్లో చర్చిస్తారని తెలిపారు. తమ్మయ్యనాయుడుకి మండలానికి చెందిన ఏపీటీఎఫ్ సభ్యులు, సహోపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## రాజగోపాల్‌కు పురస్కారం



నర్సీపట్నం గ్రామీణం : సైన్స్ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులను ప్రోత్సహిస్తున్న చెట్టుపల్లి జడ్పీ హైస్కూల్ భౌతికశాస్త్ర అధ్యాపకుడు ఏవీ రాజగోపాల్‌కు సీవీరామన్, మేడం క్యూరీ ప్రతిభా పురస్కారం దక్కింది. కేవీఆర్ మరియు జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీస్ లక్ష్మణరావు ఈ పురస్కారాన్ని అందజేశారు. విద్యార్థులు జాతీయసైన్స్ పోటీల్లో రాణించడంలో ఆయన కృషిని ప్రశంసించారు.

## జైలు పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

చోడవరం, న్యూస్‌టుడే: కారాగారంలో గదులతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సబ్ జైలు అధికారులకు స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ జైలును సందర్శించారు. జైలు లోపల పరిసరాలు, వంట గదిని చూశారు. నిందితులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బయటకు వెళ్లి సత్ప్రవర్తనను కలిగి ఉండాలని ఉద్బోధించారు. ప్యానల్ న్యాయవాదులు జి.వి.పి. రాజు, కె. అప్పలనాయుడు, సబ్ జైలు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలు పరిసరాలను పరిశీలిస్తున్న హరి నారాయణ

## రబీసాగుకు యూరియా సిద్ధం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని రైతుల కోసం 106 టన్నుల యూరియాను సిద్ధం చేశామని వ్యవసాయ అధికారిణి ఎస్. విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీలర్ల వద్ద 41.35 టన్నులు, చిల్లర వర్తకుల దగ్గర 65 టన్నుల చొప్పున అందుబాటులో ఉందన్నారు. రైతుసేవా కేంద్రాలకు దీనిని సరాఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

మాకవరపాలెం, న్యూస్‌టుడే: రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఈ అప్పారావు సోమవారం చెప్పారు. కొండలఅగ్రహారం రైతుసేవా కేంద్రం, మండలంలోని ఏడు ఎరువుల దుకాణాల్లో 7.3 టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 83310 56398, 83746 24736 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

కె.కోటపాడు : రబీ కాలానికి సరిపడా యూరియాను ప్రభుత్వం సిద్ధం చేసిందని ఏఓ సోమశేఖర్ తెలిపారు. 48 మెట్రిక్ టన్నుల యూరియాను రెండు రోజుల్లో చౌడువాడ, కె.కోటపాడే పీఏసీఎస్‌ల ద్వారా అందిస్తామన్నారు. 1125 మంది రైతుల ద్వారా 2950 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.

## ముక్కోటి ఏకాదశికి ఆలయాల ముస్తాబు

చోడవరం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశిని సందర్భంగా మంగళవారం ఉత్తరద్వార దర్శనానికి చోడవరం పట్టణం, పరిసర ప్రాంతాల ఆలయాలను ముస్తాబు చేశారు. విద్యుత్తు దీపాలతో పాటు వివిధ రకాల ఫలాలతో అలంకరణలు ఆలయ అర్చకులు, సేవకులు నిర్వహించారు. పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు శాంతారామాచార్యులు, సహాయ అర్చకులు వాసులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి. సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వింజమూర్తి శంకర్ తెలిపారు. డా. ఇందిరా కుమారి సౌజన్యంతో స్వామికి పట్టు వస్త్రాలు, పుష్పాలంకరణ, ప్రసాద వితరణ జరుగుతుందని వాసు పేర్కొన్నారు.

నర్సీపట్నం అర్బన్, కె.కోటపాడు, దేవరాపల్లి, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశికి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అన్నవరం దేవస్థానం దత్తతలో ఉన్న ఉత్తరవాహిని తీరంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో ఉదయం పల్లకీసేవ, అనంతరం ఉత్తరద్వార దర్శనం, నవరాత్రులు నిర్వహిస్తారు. కె.కోటపాడులోని కేశవస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తరద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అర్చకులు తాతా వెంకటరమణమూర్తి శర్మ తెలిపారు.

★ దేవరాపల్లి, మారేపల్లి పాండవుల కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాల్లో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేస్తారు.

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది వెంకన్న గిరిప్రదక్షణ మంగళవారం నిర్వహించనున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 4 గంటల నుంచి భక్తులు స్వామివారి కొండ చుట్టూ ప్రదక్షిణ చేయనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గత ఏడేళ్లుగా గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నారు.

## విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

నర్సీపట్నం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల (ప్రధాన)లోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి రాజాన సూర్యచంద్ర ఆధ్వర్యంలో అభ్యాసన పుస్తకాలు పంపిణీ చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గఫూర్ పాల్గొన్నారు. జన సైనికుల చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సీఐ ప్రత్యేకంగా అభినందించారు. ఇందులో నాయకులు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, దొరబాబు, అలివేలు మంగ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేస్తున్న జనసేన నాయకులు

ఆటోడ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న వామనమూర్తి

## ప్రజా ఉద్యమాలను అణచివేత తగదు

రావికమతం: అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపడం ప్రభుత్వాలకు మంచిదికాదని ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పేర్కొన్నారు. కొత్తకోటలో సోమవారం ఆటో డ్రైవర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సముద్ర తీర ప్రాంతంలో మత్స్యకారులకు ఉపాధి లేకుండా చేసే ప్రభుత్వ విధానాలను నిలదీసినందుకు ఉద్యమకారులపై పీడీ యాక్ట్ చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గపు చర్యని చెప్పారు. జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. అప్పలరాజు అరెస్టును ఖండించారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకోండి

దేవరాపల్లి, న్యూస్‌టుడే : ములకలాపల్లి అగ్ని ప్రమాద బాధిత కుటుంబం షేక్ ఈశ్వరమ్మ, అప్పాసాహెబ్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని భాజపా మైనార్టీ సంఘ నాయకులు కోరారు. ఈ కుటుంబాన్ని రాష్ట్ర భాజపా మైనార్టీ మోర్చా కార్యదర్శి షేక్ ఇబ్రహీం భాషా, జిల్లా అధ్యక్షుడు షేక్ బాబాజీ తదితరులు సోమవారం పరామర్శించారు. మండల భాజపా అధ్యక్షురాలు సత్యవేణి, కార్యదర్శి త్రినాథ్, ఖాదర్, సన్యాసిరావు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక లోపాలుంటే తెలియజేయాలి !

రోలుగుంట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం సరఫరా చేసిన మొబైల్ ఫోన్లలో లోపాలుంటే ఈనెల 30వ తేదీలోగా తెలియజేసి సరిచేయించాలని రావికమతం సీడీపీఓ మంగతాయారు విజ్ఞప్తిచేశారు. ఈమేరకు రోలుగుంట, బుచ్చంపేట సెక్టార్ల పరిధిలో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. రావికమతం ఐసీడీఎస్ పరిధిలోని చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో అంగన్‌వాడీ సిబ్బందికి ఎమ్మెల్యే రాజు చేతులమీదుగా ఫోన్లను అందజేయగా వీటి పనితీరుపై ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. లోపాలుంటే తెలియజేయాలన్నారు. బుచ్చయ్యపేట, రావికమతం సూపర్‌వైజర్లు ఎస్కే. భేగం, హైమా పాల్గొన్నారు.

**కొత్త ఫోన్లు అందజేత**

బుచ్చెయ్యపేట : అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన 5జీ ఫోన్లు బాగా పని చేస్తున్నాయని యూనియన్ నాయకులు అమ్మాజీ, వరలక్ష్మి సోమవారం ఓప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీలకు సంబంధించి అన్ని పనులు సులభతరంగా చేసుకుంటున్నామన్నారు. ఎటువంటి జాప్యం లేకుండా పనులన్నీ సకాలంలో పూర్తిచేస్తున్నామని చెప్పారు.

రోలుగుంటలో సమావేశమైన కార్యకర్తలు

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

దేవరాపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని కాశీపురం చర్చిలో జరిగిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణలో ఎంపీడీఓ ఎం.వి. సువర్ణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిస్సీ మినిస్ట్రీస్ 2026 సంవత్సర క్యాలెండర్‌ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. పాస్టర్ గొర్లె టైటస్, గ్రేస్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫాస్టర్ జయ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ సువర్ణరాజు, పాస్టర్ టైటస్ దంపతులు

## మేమున్నాం.. మీకు తోడుగా

| | |
|---|---|
| నర్సీపట్నం - 80085 74743 | చోడవరం - 80085 74732 |
| మాడుగుల - 80085 74740 | చీడికాడ - 80085 74742 |

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానికంగా బీసీ కాలనీ వాసులు రాకపోకలు సాగించే రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోంది. వీధుల్లో చెత్తకుండీలు ఏర్పాటు చేయాలి. - ఇటంశెట్టి సూరిబాబు, న్యాయవాది, ✓: రోడ్లపై వ్యర్థాలు వేయవద్దని, ఇంటింటికి వచ్చే పారిశుద్ధ్య సిబ్బంది తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని స్థానికులకు అవగాహన కల్పించడంతో రెండు చెత్త డబ్బాలు పంపిణీ చేస్తున్నాం. - మేరీజోన్స్, ఈవోఆర్డీ

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేట శివారు గవిరంపేట వద్ద ప్రధాన రహదారి పక్కన పైపులైను దెబ్బతిని తాగునీరు వృథాగా పోతుంది. దీంతో రోడ్డు బురదగా మారడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. - సూరిబాబు, లింగంపేట, ✓: స్థానికులు సమాచారం మేరకు దెబ్బతిన్న పైపులైను పరిశీలించాం. మరమ్మతు చేయిస్తాం. - సంతోష్, సర్పంచి

?: రేవళ్ల గ్రామంలో తాగునీటి పథకం బిరడాలు పాడై నీరు వృథా అవుతోంది. పరిసరాల్లో నాచుపట్టి అపరిశుభ్రంగా తయారైయింది. - సూర్యనారాయణ, నివాసితుడు, ✓: తాగునీటి పథకాన్ని పరిశీలించి బిరడాలు మార్పిస్తాం. - శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

దాసును సన్మానిస్తున్న నాయకులు

## తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు తమరాన దాసును సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. లింగభూపాలపుర అగ్రహారానికి చెందిన దాసును తెదేపా అధిష్ఠానం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన సంగతి తెలిసిందే. ఈమేరకు కోమళ్లపూడిలో మండలానికి చెందిన నాయకులందరూ ఆయన్ని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆస్తులను గుర్తించండి..

చోడవరం, న్యూస్‌టుడే: వెంకన్నపాలెం గ్రామంలో రెవెన్యూ స్థలాల నుంచి సంపద సృష్టించి దోచుకుపోతున్నవారి భరతం పట్టేందుకు రీసర్వే పక్కాగా చేపట్టాలని సీపీఐ, సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల డిప్యూటీ తహసీల్దారు సాయికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, ఎస్.ఎ. నాయుడు, సిటు ప్రతినిధి రొంగలి దేముడు నాయుడు ఉన్నారు.






(c) eenadu

**తెరపై ఈనాడు**

లక్ష్మీకాంత్ స్క్రీన్-1: **శంబాలా** (మార్నింగ్, ఫస్ట్ షో), **ఈషా** (మ్యాట్నీ, సెకండ్ షో)
స్క్రీన్-2: **ఛాంపియన్**

### ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను చెల్లింపునకు అవకాశం

**పెందుర్తి, న్యూస్‌టుడే:** జీవీఎంసీకి చెల్లించాల్సిన రెండవ అర్ధ సంవత్సర ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి ఛార్జీలను ఈ నెల 31వ తేదీలోగా వడ్డీ లేకుండా చెల్లించాలని పెందుర్తి జోన్ జెడ్సీ శంకర్రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా పన్నులను www.gvmc.gov.in పోర్టల్ ద్వారా క్రెడిట్, డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, యూపీఐ విధానాల్లో చెల్లించుకునే సదుపాయం కల్పించినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పెందుర్తి

### డిగ్రీ కళాశాలలో నేడు ఉద్యోగ మేళా

**పెందుర్తి, న్యూస్‌టుడే:** స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి టి.డేవిడ్‌రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి కళాశాల ఆవరణలో జరిగే ఈ మేళాలో 12 సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేస్తారని వివరించారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని వారికి ఉద్యోగాలు కల్పిస్తారని తెలియజేశారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

**సబ్బవరం, న్యూస్‌టుడే:** ?: సబ్బవరం శివారు చిన గొల్లలపాలెం వెళ్లే దారిలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద పెరిగింది. –వి.అప్పలనాయుడు, గొల్లలపాలెం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –సి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం.

?: సబ్బవరం జోడుగుళ్ల సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. –ఎస్.నాగేంద్ర, ఆదినారాయణపాలెం. ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం.

**పెందుర్తి, న్యూస్‌టుడే:** ?: పురుషోత్తపురం మహతి పాఠశాల వెనుక ప్రాంతంలో డోర్ నంబరు 3-19 ఇంటి వద్ద వీధిదీపం కొన్నాళ్లుగా వెలగక రాత్రివేళ ఇబ్బంది పడుతున్నాం. – ఉషారాణి, పురుషోత్తపురం ✓: వెలగని వీధిదీపానికి త్వరలో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. – సోమేశ్, వీధిదీపాల నిర్వహణ ఏఈ, 95వ వార్డు

**పరవాడ, న్యూస్‌టుడే:** ?: పరవాడ గొర్లె వానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉంది. – సంతోష్, స్థానికుడు ✓: వెంటనే శునకాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. – మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ

## 'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు..

**అల్పాహారం లేక ఆకలితో తప్పని అవస్థలు**

**పరవాడ, న్యూస్‌టుడే**

సర్కారు బడుల్లో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను డిసెంబరు 6 నుంచి అమలు చేస్తున్నారు. ఇందుకోసం విద్యార్థులకు సాధారణ తరగతులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఉదయం 8 గంటలకు పాఠశాలకు వచ్చి సాయంత్రం 5 గంటల వరకు విద్య అభ్యసిస్తున్నారు. వివిధ పాఠశాలల్లో ఉదయం బోధన (రెమిడియల్ టీచింగ్), సాయంత్రం వరకు చదివించడం, తర్వాత ఒక్కో సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితిలో పాఠశాల నుంచి విద్యార్థులు ఇంటికి తిరిగొచ్చేసరికి సాయంత్రం 6గంటలు అవుతోంది. దీంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడుతూ...నీరసించిపోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, దాతలు స్పందించి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించాలని తద్వారా ఆకలి ఇబ్బందులు తీరుతాయని చెబుతున్నారు.

లంకెలపాలెం హైస్కూల్లో అదనపు తరగతి నిర్వహిస్తున్న దృశ్యం

**నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు.. వాటిలో పదో తరగతి విద్యార్థుల వివరాలు**

| మండలం | పాఠశాలలు | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| పెందుర్తి | 12 | 786 |
| పరవాడ | 13 | 798 |
| సబ్బవరం | 08 | 472 |
| మొత్తం | 33 | 2056 |

### ఎక్కువ శాతం మంది పేదవారే..

పెందుర్తి నియోజకవర్గంలోని 32 జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో పదో తరగతి విద్యార్థులు 2056 మంది చదువుతున్నారు. మార్చి 16 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు సుమారు 75 రోజుల సమయం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులే చదువుతున్నారు. వీరి తల్లిదండ్రులు ఎక్కువ మంది రోజువారీ కూలీలుగా, వ్యవసాయదారులుగా పనిచేస్తున్నారు. విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి బస్సులు, సైకిళ్లు, ఆటోలు తదితర వాటిపై పాఠశాలకు వస్తున్నారు. ఉదయం 8 గంటలకే పాఠశాలకు చేరుకోవాల్సి ఉండడం, ఇంటి వద్ద సమయానికి వంట కాకపోవడం, సమయం లేదని అల్పాహారం తినకుండా రావడం చేస్తున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం మినహా సాయంత్రం ఎలాంటి స్నాక్స్ లేకపోవడంతో ఆకలితో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

### కంపెనీల యాజమాన్యాలు స్పందించాలని వేడుకోలు

ప్రత్యేక తరగతుల కారణంగా విద్యార్థులు బయట దుకాణాల వద్ద అల్పాహారం తింటున్నారు. డబ్బులు లేనివారు ఆకలితో ఉంటున్నారు. కొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో ఉదయం పూట అల్పాహారం అందిస్తున్నారు. సాయంత్రం ఉండడం లేదు. విద్యార్థులు గత్యంతరం లేక పాఠశాలల్లో పెట్టే మధ్యాహ్న భోజనంతో నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం, దాతలు ముందుకొచ్చి పది విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించగలిగితే మరింత ఉత్సాహంగా చదివి.. నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఆరోగ్యంగా, చురుగ్గా ఉంటారని తల్లిదండ్రులు అంటున్నారు. ఇప్పటికైనా దాతలు, ఎన్టీపీసీ, ఫార్మా కంపెనీల యాజమాన్యాలు, ముందుకొచ్చి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించాలని కోరుతున్నారు.

## గెడ్డల్లో ఆక్రమణలు అడ్డుకోవాలి

**వేపగుంట (పెందుర్తి), న్యూస్‌టుడే:** జీవీఎంసీ పెందుర్తి జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గెడ్డల ఆక్రమణలు అడ్డుకట్ట వేయాలని పలువురు ఫిర్యాదు చేశారు. వేపగుంటలోని జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జెడ్సీ శంకర్రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 16 అర్జీలు రాగా వాటిలో ఆక్రమణలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. పెందుర్తి బ్యాంకు కాలనీ, చినముషిడివాడ సప్తగిరినగర్, తదితర ప్రాంతాల్లోని గెడ్డల్లో ఆక్రమణలు తొలగించాలని పలువురు ఫిర్యాదు చేశారు. 95వ వార్డు శివాజీనగర్, 97వ వార్డు సుజాతనగర్ సీ-2 జోన్, చీమలపల్లి సమీప ఎస్‌బీఐ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించాలని మరికొందరు విన్నవించారు. ఇంటి పన్నులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని పలువురు అర్జీలిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ శంకర్రావు

## బాలల ఆరోగ్య సంరక్షణకు పటిష్ఠ చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**వన్‌టౌన్, న్యూస్‌టుడే:** జిల్లాలో బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భద్రతను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో బాలలకు సంబంధించిన అంశాలపై మూడు సమావేశాలు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జేసీ మయూర్ అశోక్, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అక్రమ రవాణా, బాల్య వివాహాల నిరోధం, పునరావాసం కోసం తగిన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ బాలికలకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు అన్ని రకాల టీకాలు వేయాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలు ఆవిష్కరించారు. ఐసీడీఎస్ జిల్లా అధికారి కె.వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ■ ప్రభుత్వ పింఛనుదారులకు ఉచిత సేవలు

**చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే:** జనవరి 5వ తేదీ నుంచి చినముషిడివాడలోని పెందుర్తి ప్రాంత రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం కార్యాలయంలో పింఛనుదారులకు ఉచితంగా జీవన ప్రమాణ ధ్రువీకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అల్లం కృష్ణారావు, వై.కామరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం కార్యాలయంలో జరిగిన కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. చినముషిడివాడ కార్యాలయంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జీవన ప్రమాణ ధ్రువీకరణ సేవలు అందిస్తామన్నారు. అనారోగ్య కారణాలతో కార్యాలయానికి రాలేని వారు 83746 65696 నంబరుకు ఫోన్ చేసి చిరునామా తెలియజేస్తే ఇంటి వద్దకు వెళ్లి సేవలందిస్తామన్నారు. ఈహెచ్ఎస్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానం వల్ల వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఆ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

## 3డీ ప్రింటింగ్ నైపుణ్యంపై అవగాహన

**వేపగుంట (పెందుర్తి), న్యూస్‌టుడే:** ఇంజినీరింగ్ విద్యార్థులు 3డీ ప్రింటింగ్ నైపుణ్యాన్ని సాధించడం ద్వారా అదనపు అర్హత జోడించుకోవచ్చని అధ్యాపకులు పేర్కొన్నారు. నరవలోని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో 3డీ ప్రింటింగ్‌పై జరిగిన నాలుగు రోజుల కార్యశాల సోమవారం ముగిసింది. ఒడిశాకు చెందిన 3డీ ప్రింటింగ్ నిపుణుడు షబ్బీర్‌సింగ్ పాల్గొని మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు ఉచిత క్యాడ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకునే విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రదీప్‌వర్మ, విభాగాధిపతులు శాంతారావు, జీవన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

## మృతుడి నేత్రాలు దానం

**పెందుర్తి, న్యూస్‌టుడే:** పెందుర్తి మండలం చింతలగ్రహారం గ్రామానికి చెందిన పుల మరశెట్టి శ్రీను (52) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం తెలుసుకున్న పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను మృతుడి కుటుంబ సభ్యులను సంప్రదించి నేత్రదానం చేయాలని కోరారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు నగరానికి చెందిన మోహిసిన్ నేత్రనిధి కేంద్రం టెక్నీషియన్ కృష్ణ మృతుడి కళ్ల నుంచి కార్నియా సేకరించారు. కుటుంబ సభ్యులకు నేత్రదానం ధ్రువీకరణపత్రం అందజేశారు.

మృతుడి బంధువులకు నేత్రదానం ధ్రువపత్రం అందిస్తున్న టెక్నీషియన్ కృష్ణ

## కళాశాలకు వితరణ

**ఇస్లాంపేట(పరవాడ), న్యూస్‌టుడే:** సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 77వవార్డు పరిధి ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.లక్ష వెచ్చించి బోటనీ, జువాలజీ ల్యాబ్‌కు చెందిన పరికరాల(సామగ్రి)ను వితరణగా సమకూర్చింది. ఈమేరకు కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ల్యాబ్ పరికరాలను ప్రిన్సిపల్ వివేకానందరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ఎన్టీపీసీ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. ఇటీవల సంబంధిత యాజమాన్యం ఫిజిక్స్ ల్యాబ్ పరికరాలు కూడా అందించినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ పరికరాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ వివేకానందరావు

బాటజంగాలపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

## రీసర్వే సద్వినియోగం చేసుకోండి

**సబ్బవరం, న్యూస్‌టుడే:** ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే కార్యక్రమానికి రైతులంతా హాజరై ఈ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. ఈ మేరకు సబ్బవరం మండలం బాటజంగాలపాలెంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడారు. ఎవరి భూములు వారు దగ్గరుండి నమోదు చేయించుకుంటే భవిష్యత్తులో తప్పులు దొర్లే అవకాశం ఉండదన్నారు. అనంతరం బాటజంగాలపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ వీరయ్య, సర్వేయర్ లాలం అప్పారావు, సర్పంచి పడాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సౌర విద్యుత్‌పై అవగాహన

**సబ్బవరం, న్యూస్‌టుడే:** సోలార్ ఎనర్జీని ఉపయోగించడం ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.రామకృష్ణ అన్నారు. ఆయన సోమవారం సబ్బవరం పంచాయతీ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై స్థానికులకు అవగాహన కల్పించారు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకునేందుకు విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్ ఎనర్జీ వినియోగించాలని కోరారు. అనంతరం సూర్యఘర్‌పై అవగాహన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ సబ్బవరం సెక్షన్ కార్యాలయం ఏడీఈ సురేష్, ఏఈలు దుర్గాప్రసాద్, నాయుడు, సర్పంచి డి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు తదితరులు

## వేంకటాద్రిపై నేడు ఉత్తర ద్వార దర్శనం

**పెందుర్తి, న్యూస్‌టుడే:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం వేంకటాద్రిపై ఉత్తర ద్వారంలో శ్రీనివాసుడి దర్శనానికి యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈవో నీలిమ, ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పుష్పాలంకరణతో ముస్తాబు చేశారు. వైకుంఠ ద్వారాన్ని చెరకు గడలతో తీర్చిదిద్దారు. వేకువజామున 3.30 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులు ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకోవచ్చని రామానుజాచార్యులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వేంకటాద్రిపై గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

చెరకు గడలతో తీర్చిదిద్దిన వైకుంఠ ద్వారం

ఆలయానికి పుష్పాలంకరణ

## అయ్యవారి సన్నిధిలో అమ్మవారి వైభవం

**పెందుర్తి, న్యూస్‌టుడే:** వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం విశేష ఆరాధనలు, తిరుప్పావై సేవాకాలం జరిగింది. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు చేసి ధూపదీప సేవలు చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి విశేష ఆరాధనలు చేశారు. తిరుప్పావై 14వ పాశురాన్ని విన్నపం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సామూహిక తిరుప్పావై పాశుర పారాయణం చేశారు. అర్చకులు తీర్థగోష్ఠి నిర్వహించి ప్రసాద వితరణ చేపట్టారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈవో నీలిమ పేర్కొన్నారు.

వేంకటాద్రిపై పూజలందుకుంటున్న ఆండాళ్ అమ్మవారు

**వేపగుంట, న్యూస్‌టుడే:** నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ఉత్తర ద్వారంలో భక్తులు దర్శించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. చింతలగ్రహారం, లక్ష్మీనరసింహనగర్ కృష్ణాలయాల్లో, సింహపురికాలనీ, వేపగుంట, నరవ, కోటనరవ, సత్తివానిపాలెం, గవరజగ్గయ్యపాలెం, ఆర్.ఆర్.వెంకటాపురం రామాలయాల్లో, దేవతామూర్తులు భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చేలా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఆలయాలకు వెళ్లే సమయంలో భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలని, అవకాశం ఉన్నంతవరకు రద్దీ ప్రదేశాలకు బంగారు ఆభరణాలతో వెళ్లకపోవడమే మంచిదని పెందుర్తి పోలీసులు సూచించారు.

కల్యాణవేంకటేశ్వరస్వామి

### ■ సమస్యలు పరిష్కరించరూ..

**లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే:** 79వ వార్డులో వీధిదీపాలు, రింగ్‌లైట్లు ఏర్పాటు చేయాలని వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు సోమవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

## రాకపోకలకు నిత్యం ఇక్కట్లే..

**పరవాడ, న్యూస్‌టుడే:** పరవాడ మండలం ఊటగెడ్డ కూడలి నుంచి ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బి రహదారి శిథిలావస్థకు చేరుకుని గుంతలమయంగా మారింది. రహదారి పొడవునా గుంతలు పడడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ఎన్టీపీసీ కార్మికులు, ఉద్యోగులు, 20 గ్రామాల ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. ఎంతో ప్రాధాన్యం గల రహదారి దెబ్బతిని ప్రమాదకరంగా మారినా కనీస మరమ్మతులు చేపట్టలేదని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్టీపీసీకి వెళ్లే మార్గంలో రహదారి ఇలా..

## ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

**సబ్బవరం, న్యూస్‌టుడే:** ఈనెల 23 నుంచి అసకపల్లి శివారు నక్కవానిపాలెంలో సబ్బవరం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈసందర్భంగా ప్రిన్సిపల్ బి.శంకర్ వాలంటీర్లనుద్దేశించి ప్రసంగించారు. ఈ శిబిరం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ సొసైటీకి చెందిన బి.సంధ్యారాణి మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

## మృతుని కుటుంబానికి చేయూత

**పరవాడ, న్యూస్‌టుడే:** పరవాడ మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన డి.వరహాలరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు వాడచీపురుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 2000-01 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి విద్యార్థులంతా మృతుని కుటుంబానికి రూ.63వేలు ఆర్థిక సాయం చేశారు. సంబంధిత మొత్తాన్ని సోమవారం మృతుని భార్యకు అందించి పిల్లల చదువుకు ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుమూర్తిరెడ్డి, మహాలక్ష్మినాయుడు, బంగార్రాజు, వరహాలరావు, నర్సింగరావు, దేముడు, కనకారావు, సంతోష్, కల్పన పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

## చలికాలం.. వ్యాధులతో జాగ్రత్త సుమా..!

**పెందుర్తి సీహెచ్‌సీ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ దొర**

ముఖాముఖి

చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. విశాఖ జిల్లాలోని పెందుర్తి మండలంలో ఇటీవల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలంతా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ హెచ్ఆర్‌కె దొర సూచించారు. పలు ఆరోగ్య పరమైన అంశాలపై సోమవారం 'న్యూస్‌టుడే' నిర్వహించిన ముఖాముఖిలో వెల్లడించిన వివరాలు, సూచనలు ఆయన మాటల్లోనే.

– న్యూస్‌టుడే, పెందుర్తి

★ ఇటీవల ఆసుపత్రికి దగ్గు, జలుబు, జ్వరంతో వస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది. రోజుకు 300పైగా ఓపీ ఉండగా 8 నుంచి 10 మంది ఆసుపత్రిలో చేరుతున్నారు. సాధారణ వైరల్ జ్వరాలే అయినప్పటికీ జాగ్రత్తలు తీసుకోవాలి. వరుసగా రెండు రోజులు జ్వరం తగ్గకపోతే వెంటనే వైద్య సాయం పొందాలి.

★ చల్లని నీరు, శీతల పానీయాలు తాగకూడదు. గోరువెచ్చని నీరు తాగాలి. గొంతు నొప్పి అధికంగా ఉంటే ఉప్పు నీరు పుక్కిలించాలి. ముక్కు దిబ్బడకు వేడి నీటితో ఆవిరి పట్టాలి.

★ ఉదయపు నడకకు వెళ్లే వారు తప్పనిసరిగా తల, చెవులకు రక్షణ కల్పించాలి. 60ఏళ్లు దాటిన వారు చలిలో నడవకపోవడమే మంచిది. మంచు కారణంగా వర్టిగో సమస్య వచ్చి కింద పడిపోయే ప్రమాదం ఉన్నందున ఎండ వచ్చాక వాకింగ్‌కు వెళ్లడమే మేలు.

★ చిన్న పిల్లలు బయట ఆహారాన్ని పూర్తిగా విడనాడాలి. ప్రస్తుత కాలంలో జీర్ణశక్తి తక్కువగా ఉంటున్న నేపథ్యంలో గోరువెచ్చని నీరు పట్టాలి.

★ కాలంతో సంబంధం లేకుండా ఏడాదిలో ఎక్కువగా జ్వరం, జలుబు, గొంతునొప్పితో బాధపడే వారు వైద్యుల సూచన మేరకు ఇన్‌ఫ్లుయెంజా టీకా వేయించుకోవడం మంచిది.

★ పెందుర్తి ఆసుపత్రిలో గుండె జబ్బులకు సంబంధించిన స్టెమీ వైద్యం అందుబాటులో ఉంది. ఛాతి నొప్పి, భుజం లాగడం, చెమటలు పట్టడం, బీపీ అధికంగా ఉండడం వంటి సమస్యలున్న వారికి ఈసీజీ తీసి స్టెమీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తాం. గుండె వైద్య నిపుణుల సూచన మేరకు అవసరమైన వారికి రూ.35వేలు విలువ చేసే ఇంజక్షన్ చేసి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు పంపిస్తాం. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు 8 మందికి ఈ సేవలు అందించాం.

★ కుక్కకాటుతో జాగ్రత్తలు పాటించాలి. కుక్క కరిచిన వెంటనే చల్లని నీటితో గాయాన్ని కడగాలి. పెద్ద గాయమైతే కట్టు కట్టాలి. ఆసుపత్రికి వస్తే టీటీ ఇంజక్షన్ చేసి యాంటీ రేబిస్ టీకా ఇస్తాం. మరీ పెద్ద గాయాలైతే ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజక్షన్ చేస్తాం. కుక్క కాటు చికిత్సకు సంబంధించి నిర్ణీత గడువులో సూచించిన ప్రకారం తప్పనిసరిగా వైద్యం పొందాలి.

★ చాలా మంది మందుల దుకాణాలకు వెళ్లి అనారోగ్య సమస్యలకు యాంటీ బయాటిక్స్ వాడుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. వైద్యుల సలహా లేకుండా యాంటీ బయాటిక్స్ వాడడం సరికాదు. చిన్న పిల్లలు, ఇతర వ్యాధులున్న వారికి ఈ చర్య ప్రమాదకరం. వైద్యులను సంప్రదించి అవసరమైన మేరకే ఆయా మందులు వాడాలి.

## రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

**రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే:** పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.
★ **విశాఖ-అరకు (08525/26):** ఈనెల 30 నుంచి జనవరి 18 వరకు ప్రతి రోజు ఉదయం 8.40 గంటలకు విశాఖలో బయలుదేరి 12.30 గంటలకు అరకు చేరుకోనున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు మధ్యాహ్నం 2 గంటలకు అరకులో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు విశాఖ చేరుకుంటుందన్నారు.

## జీవీఎంసీకి 100 వినతులు

**కార్పొరేషన్, న్యూస్‌టుడే :** మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 100 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ కేతన్‌గార్గ్ వాటిని స్వీకరించారు. భీమిలికి 6, మధురవాడకు 16, తూర్పు జోన్‌కు 15, పశ్చిమానికి 7, ఉత్తరానికి 6, దక్షిణానికి 12, పెందుర్తికి 7, అగనంపూడి జోన్‌కు 2, గాజువాకకు 7, అనకాపల్లికి 1, ప్రధాన కార్యాలయానికి 21 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో పరిపాలనకు 14, రెవెన్యూకు 11, ప్రజారోగ్యానికి 6, ప్రణాళికకు 43, ఇంజినీరింగ్‌కు 18, ఉద్యానవన విభాగానికి 3, యూసీడీకి 5 ఫిర్యాదులున్నాయి.

## నూతన నియామకం

**సబ్బవరం, న్యూస్‌టుడే:** ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అనకాపల్లి జిల్లాకు సంబంధించి సోమవారం సబ్బవరంలో ఎన్నిక జరగ్గా.. ఎన్జీవోల ఛైర్‌పర్సన్‌గా సబ్బవరం పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌సీ)గా పనిచేస్తున్న యడ్ల స్వర్ణలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.


స్వర్ణలతను సత్కరిస్తున్న ఎన్జీవోలు, చిత్రంలో డాక్టర్ ఎన్ఎస్ఆర్ చక్రవర్తి తదితరులు


**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయ శాఖ శ్రీ సోమేశ్వరస్వామి వారి దేవస్థానం**
అప్పికొండ(V), పెదగంట్యాడ (M), విశాఖపట్నం జిల్లా
**టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన**
ఆర్.సి. నెం.4/2025-26 తేది: 29-12-2025

ఈ క్రింద వివరములు గుర్చి టెండరు కమ్ బహిరంగ వేలం తేది 09-01-2026 శుక్రవారం ఉదయం 10:00 గంటలకు దేవస్థానం వద్ద నిర్వహించబడును. సీల్డ్ టెండర్లు మరియు కొటేషన్లు తేది: 09-01-2026 శుక్రవారం ఉదయం 10:00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరువబడును. టెండరు షెడ్యూల్ తేది.01.01.2026 నుండి 09.01.2026 ఉదయం 08:00 గంటల వరకు విక్రయించబడును.

| క్ర.సం | వివరములు | లైసెన్సు కాలపరిమితి | ప్రథమ ధరావత్తు |
|---|---|---|---|
| 1 | పూల అలంకరణ (ప్రధాన ఆలయం, రెండు ఉపాలయాలు) | తేది.15.02.2026 | కొటేషన్ ప్రకారం |
| 2 | షామియానా పెండాల్స్ | తేది.15.02.2026 & తేది.16.02.2026 | కొటేషన్ ప్రకారం |
| 3 | సరుకులు సప్లై (అన్నదానం, పులిహోర ప్రసాదం, లడ్డుప్రసాదములకు అవసరమైన సరుకులు సరఫరా చేయుటకు) | తేది.15.02.2026 & తేది.16.02.2026 | కొటేషన్ ప్రకారం |
| 4 | ప్రసాదం మరియు అన్నదానం తయారీ నిమిత్తం కుక్ మరియు సహాయకులు | తేది.15.02.2026 & తేది.16.02.2026 | కొటేషన్ ప్రకారం |
| 5 | భక్తులచే స్వామివారికి సమర్పించి వదిలివేయబడిన కొబ్బరిచెక్కలు సగభాగం ప్రోగు చేసుకొనుటకు | తేది.15.02.2026 & తేది.16.02.2026 | 10,000/- |
| 6 | తాత్కాలిక క్యూ లైన్లు నిర్మాణం & నిర్వహణ | తేది.15.02.2026 & తేది.16.02.2026 | కొటేషన్ ప్రకారం |

మరిన్ని సీల్డ్ టెండర్లు వివరముల కొరకు దేవస్థానం పనివేళలలో కార్యాలయము నందు సంప్రదించగలరు. మిగిలిన వివరములు దేవస్థాన కార్యాలయము నందు పనివేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును. దేవస్థానం కార్యాలయము ఫోన్ నెం: 8328319532.

విశాఖపట్నం
తేది: 29.12.2025

కె.పద్మావతి
కార్యనిర్వహణాధికారి


(c) eenadu

## పేరుకే.. అత్యవసర విభాగం!

అత్యవసర విభాగంలో రోగుల పరిస్థితి ఇలా

**అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే:** ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అత్యవసర విభాగంలో పడకల ఏర్పాటు కలగా మారింది. నాలుగు నెలల కిందట రూ.8 లక్షలు వెచ్చించి విస్తరణ పనులు చేపట్టిన అధికారులు ఇప్పటి వరకు ఆ దిశగా ఆలోచించిన పాపానపోలేదు. విస్తరణ పనుల్లోనూ వైద్యులు, సిబ్బంది ఉండేందుకు అవసరమయ్యే క్యాబిన్లు ఏర్పాటు చేశారు. తర్వాత ఎనిమిది పడకలు పట్టేందుకు మాత్రమే ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉంది.

**రోగుల సేవలపై ప్రభావం**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలతో, ప్రమాదాల్లో గాయపడి, ఇతరత్రా అత్యవసర పరిస్థితుల్లో వచ్చే ప్రాణాలు పోయే పరిస్థితి కనిపిస్తోంది. మరో వైపు ఇంత ప్రాధాన్యం ఉన్న విభాగంలో ప్రస్తుతం మూడు వెంటిలేటర్లు, 14 ఆక్సిజన్, మూడు సాధారణ పడకలు ఉన్నాయి.

● రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి తెల్లవారు జాము వరకూ 200 మందికి పైగా ఓపీ సేవలు పొందుతుంటారు. పడకలు లేక ఒకే పడకపై ఇద్దర్ని ఉంచి సేవలందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులపై 'ఈనాడు' వరుస కథనాలు ఇవ్వడంతో ఉన్నతాధికారులు విస్తరణ పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించి అనుమతి ఇచ్చారు.

**కొరవడిన అధికారుల సమన్వయం**

క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో కేవలం విభాగాలను ఏర్పాటు చేసి వదిలేశారు. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి దృష్టికి తీసుకెళ్లగా తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని, విభాగం విస్తరణపై సంబంధిత అధికారులతో ఒకసారి మాట్లాడానని, త్వరగతిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రారంభిస్తామన్నారు.

సందర్శకుల కోసం సొంత సొమ్ముతో నిర్మించిన షెల్టర్

## మనసున్న జైలరు

మహేశ్వరుడు

**గుత్తి, న్యూస్‌టుడే:** ప్రభుత్వం ప్రతినెలా ఆయనకు జీతం ఇస్తుంది. విధులు నిర్వహిస్తే చాలనుకోకుండా సొంత డబ్బు వెచ్చిస్తూ రిమాండు ఖైదీలకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. జైలును దేవాలయంగా మార్చారు. ఖైదీల్లో మానసిక పరివర్తన తెస్తున్నారు. ఆయనే గుత్తి ప్రత్యేక సబ్ జైలు పర్యవేక్షకులు మహేశ్వరుడు. నంద్యాల జిల్లాకు చెందిన ఆయన ఏడాది కిందట జైలరుగా వచ్చారు. జైలు ముందు డ్రైనేజీ లేక మురుగు పారుతుండటంతో పురపాలిక అధికారులపై ఒత్తిడి తెచ్చి కాలువ, రోడ్డు ఏర్పాటు చేయించారు. ఖైదీలను చూసేందుకు వచ్చే సందర్శకులు ఎండా, వానకు ఇబ్బందులు పడుతుండటంతో సుప్రీంకోర్టు న్యాయవాది దివంగత వరప్రసాద్ సహకారంతోపాటు తన సొమ్ము రూ.50 వేలు వెచ్చించి షెల్టరు నిర్మించారు. జైలులో ఓ గుడిని కట్టించారు. ఖైదీల్లో మంచి ప్రవర్తనను పెంపొందించేందుకు ఆలయంలో రోజూ వారితో పూజలు చేయిస్తున్నారు. ఆవరణలో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. శుద్ధజలం ఏర్పాటు చేశారు. ఖైదీల బ్యారక్‌లో చదరంగం బోర్డును సమకూర్చారు. త్వరలో టీవీలను ఏర్పాటు చేస్తామని జైలరు చెప్పారు.

## అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

**ఉరవకొండ:** గుర్తింపు కార్డు కలిగిన కౌలు రైతులందరికీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆ సంఘం జిల్లాస్థాయి సమావేశంలో పలువురు మాట్లాడారు. తదుపరి తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం ఇచ్చారు.

## ప్రాణాలకు పొగమంచు!

● ఉమ్మడి జిల్లాలో కలవరపెట్టిన ఘటనలు
● ప్రయాణ వేళ అప్రమత్తత అవసరం

పొగమంచు ఉమ్మడి జిల్లా వాసులను కలవరపెడుతోంది. దీనికి తోడు చలి గజగజ వణికిస్తోంది. నెల రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. రాత్రివేళల్లో వాతావరణ పరిస్థితుల కారణంగా జనం బయటికి రాని పరిస్థితి తలెత్తుతోంది. పొగ మంచుతో ఎదుటి వ్యక్తి స్పష్టంగా కనిపించని పరిస్థితి కొనసాగుతోంది. రాత్రివేళ ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. చోదకులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల నుంచి బయటపడవచ్చు.

- అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే

'ఇరవై రోజుల కిందట ఓ యువతి బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు తెల్లవారుజామున వెళ్తుండగా శ్రీసత్యసాయి జిల్లా మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టింది. పొగ మంచు కారణంగానే యువతి అక్కడికక్కడే మృతి చెందింది.'

'ఈనెల 20న 44వ జాతీయ రహదారిపై కర్ణాటక నుంచి మంత్రాలయం వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. అంతకంటే రెండు రోజుల ముందు పామిడి మండలం ఎద్దులపల్లి వద్ద ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో అవ్వ, మనవడు మృతిచెందారు. ఇవన్నీ పొగమంచు కారణంగానే జరిగాయి.'

**వాహనచోదకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

● పొగమంచు వల్ల గమ్యస్థానానికి చేరడం ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. నిర్ణీత సమయం కంటే కాస్త ముందుగానే బయల్దేరాలి. తొందరపాటును నివారించడం ద్వారా డ్రైవింగ్‌పై ఏకాగ్రత పెరుగుతుంది.
● ముందు వెళ్తున్న వాహనాలు, రోడ్డు స్పష్టంగా కనిపించవు. ఇలాంటప్పుడు అతివేగం, ఓవర్‌టేక్ అత్యంత ప్రమాదకరం.
● పొగమంచులో హైబీమ్ లైట్ల నుంచి వచ్చే కాంతి విచ్ఛిన్నమై చూపులో స్పష్టత లోపిస్తుంది. దీనికి 'లో బీమ్' హెడ్‌లైట్లు మాత్రమే వాడాలి. ఇదే రీతిలో ఫాగ్ లైట్లు శ్రేయస్కరం.
● ముందూ..వెనక వెళ్లే వాహనాలకు తగినంత దూరం ఉండాలి. దీనివల్ల వాహనాలు హఠాత్తుగా బ్రేక్ వేసినా, అంచనా తప్పినా దాన్ని ఢీకొనకుండా నివారించవచ్చు.
● వాహనాన్ని నడిపేటప్పుడు కిటికీ అద్దాలను కొద్దిగా దించడం వల్ల పొగమంచు ఒకే దగ్గర కేంద్రీకృతం కాకుండా విచ్ఛిన్నమవుతుంది. పొగమంచు ఎక్కువగా ఉంటే సురక్షిత ప్రదేశంలో ఆగిన తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించాలి.
● వాహనానికి ముందు, వెనుక ఉన్న కిటికీ అద్దాలను శుభ్రంగా ఉంచుకోవాలి. అవసరాన్ని బట్టి వైపర్లు, డీఫ్రాస్టర్లను వాడుతూ అద్దాలు స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి.

## అయ్యో పాపం

● కాన్పు తర్వాత బాలింత మృతి
● మృతదేహంతో వస్తుండగా ప్రమాదంలో శిశువు దుర్మరణం

ఆ దంపతులది అన్యోన్య దాంపత్యం. వీరికి రెండేళ్ల కిందట వివాహం కాగా.. ఇల్లాలు మొదటి కాన్పులో ఆడపిల్లకు జన్మనిచ్చింది. తర్వాత రెండో ప్రసవంలో కూడా ఆడబిడ్డకు పురుడు పోసుకుంది. ఆ ఇద్దర్నీ బాగా పెంచి మంచి బతుకునిద్దామనుకున్నారు. విధి చిన్నచూపు చూసింది.. కాన్పు సమయంలో తల్లి మృత్యుఒడికి చేరగా.. ఆమె మృతదేహాన్ని తీసుకొస్తుండగా క్రమంలో జరిగిన ప్రమాదంలో శిశువు సైతం మృత్యువాత పడటం అందర్నీ కలిచివేసింది. చూసిన వారంతా అయ్యో పాపం అంటూ కన్నీరుకార్చారు.

మృత శిశువుతో పెద్దమ్మ సల్మా

**పెనుకొండ, న్యూస్‌టుడే :** హిందూపురం మండలంలోని బసవనపల్లికి చెందిన నజ్మా(28)కు రెండేళ్ల కిందట బత్తలపల్లికి చెందిన కలీమ్‌తో వివాహం జరిగింది. వీరికి ఓ బాలిక సంతానం. రెండో ప్రసవం కోసం నజ్మా ఆదివారం హిందూపురం ప్రభుత్వ వైద్యశాలలో చేరింది. అదే రోజు సాధారణ ప్రసవం ద్వారా ఆడశిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తీవ్ర రక్తస్రావం, రక్తపోటు పెరగడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో బాలింతను పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. సోమవారం మహాప్రస్థానంలో బాలింత మృతదేహంతో బసవనపల్లికి వెళుతుండగా మార్గమధ్యలో పెనుకొండ వద్దకు రాగానే పొగమంచు కారణంగా అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈఘటనలో నవజాత శిశువు దుర్మరణం చెందింది. ఇదే ఘటనలో ఆశాకార్యకర్త పద్మావతి, బాలింత భర్త కలీమ్, బంధువులు సల్మా, సైపుల్లా, రిజ్వాన్, వాహన చోదకుడు శ్రీకాంత్ గాయాలపాలయ్యారు. వీరిని పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈఘటనపై పెనుకొండ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తెదేపా బలోపేతానికి సమష్టిగా పనిచేద్దాం

**పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పూలనాగరాజు బాధ్యతల స్వీకారం**

పూలనాగరాజు, శ్రీధర్‌చౌదరిలకు నియామక పత్రం అందిస్తున్న వెంకటశివుడు యాదవ్, దగ్గుపాటి ప్రసాద్

**రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే :** జిల్లాలో తెదేపాను మరింత బలోపేతం చేసేందుకు సయన్వయంతో కలిసి పని చేస్తామని నూతన అధ్యక్షుడు పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి పేర్కొన్నారు. సోమవారం అనంతపురంలోని రాంనగర్‌లో ఉన్న జిల్లా తెదేపా కార్యాలయానికి అధ్యక్షుడు పూలనాగరాజు కుటుంబ సభ్యులతో చేరుకున్నారు. మాజీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కుటుంబ సభ్యులతో కలిసి ముందుగా పురోహితులతో ప్రత్యేక పూజలు చేయించారు. తర్వాత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వెంకటశివుడుయాదవ్ నుంచి పదవీ బాధ్యతలతో పాటు నియామకపు పత్రాన్ని పూల నాగరాజు అందుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఎమ్మెల్యేలను, ఎంపీ, ఇతర ముఖ్య నాయకులందరితో కలిసి పని చేస్తామన్నారు. పంచాయతీ, పురపాలిక ఎన్నికలలోపు అందర్నీ ఏకతాటిపైకి తెచ్చి అన్ని స్థానాల్లో తెదేపా జెండా ఎగరవేయాలన్నదే తమ ప్రధాన ఆశయమన్నారు. అందరూ సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా మీడియా సమన్వయకర్తలు బీవీ వెంకట్రాముడు, దబ్బర కుమార స్వామినాయుడు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మార్కెటింగ్ మరింత చేరువ

**అనంత సంక్షేమం, న్యూస్‌టుడే :** అతివలు ఉత్పత్తి చేసే ఏతరహా ఉత్పత్తులకైనా ఆన్‌లైన్ మార్కెటింగ్ చేరువ చేస్తే విక్రయాలు పెరిగి జీవనోపాధులు పెంపొందుతాయని సెర్ప్ జీవనోపాధుల రాష్ట్ర సంచాలకులు పద్మావతి పేర్కొన్నారు. సోమవారం శిక్షణ సాంకేతిక అభివృద్ధి కేంద్రంలో జీవనోపాధులపై అధికారులకు, ఏపీఎంలు, సీసీలకు అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు శైలజ, అదనపు ప్రాజెక్టు డైరెక్టరు రాధారాణి, సెర్ప్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రాజశ్రీ పాల్గొన్నారు.

## అసంపూర్తి దారిలో అవస్థల ప్రయాణం

గుత్తి పట్టణంలోని గుంతకల్లుకు వెళ్లే సీసీ రహదారి నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. దీంతో పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఒకవైపే రోడ్డు నిర్మించి గుత్తేదార్లు పనులను ఆపేశారు. దీంతో గుంతకల్లు నుంచి వస్తున్న వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే గుత్తి చెరువు కట్ట వద్ద కొంత మేర రోడ్డు వదిలేశారు. దాదాపు మూడు కిలోమీటర్లు రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

## పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

**ఆరునెలల్లోనే బాధితురాలికి న్యాయం**

**ధర్మవరం, పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన గుట్టకిందపల్లి గ్రామస్థుడు నరసింహులును దోషిగా నిర్ధారిస్తూ ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 వేల జరిమానా విధిస్తూ అనంతపురం జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి చిన్నబాబు సోమవారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి ప్రభుత్వం ద్వారా రూ.75 వేలు పరిహారం చెల్లించాలని ఆదేశించారు. వివరాలను శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. ధర్మవరం మండలం గొట్లూరు గ్రామ శివారులో మే 5న నాలుగేళ్ల బాలికతో నరసింహులు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ధర్మవరం గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు నరసింహులుపై పోక్సో కేసు నమోదైంది. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ, దర్యాప్తు అధికారి ఎస్సై శ్రీనివాసులు, కోర్టు మానిటరింగ్ సీఐ బొజ్జప్ప, కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ రామాంజనేయులు సమర్థంగా పనిచేశారని ఎస్పీ సతీష్‌కుమార్ కితాబు ఇచ్చారు. ఆరు నెలల వ్యవధిలోనే బాధితురాలికి న్యాయం జరిగిందని, దోషికి శిక్ష పడిందన్నారు. మైనర్లపై నేరాలకు పాల్పడే వారిపట్ల చట్టం కఠినంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

బాధితుల సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ జగదీశ్

## సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే :** ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ జగదీశ్ జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్‌లోనే ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్సు హాల్లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 70 ఫిర్యాదులు వచ్చాయి. పిటీషనర్లతో నేరుగా మాట్లాడి వారి ఫిర్యాదులను తెలుసుకున్నారు. అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. దంపతుల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ అధికారిణి అశ్విని మణిదీప్, డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రెవెన్యూ క్లినిక్‌కు శ్రీకారం

● అర్జీలపై అక్కడికక్కడే స్పందన ● పీజీఆర్‌ఎస్‌లో 467 వినతులు

సమస్యను నమోదు చేస్తున్న కలెక్టరేట్ కోఆర్డినేటర్ యుగేశ్వరిదేవి, భూ విభాగం పర్యవేక్షకుడు రియాజుద్దీన్

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో భాగంగా 'రెవెన్యూ క్లినిక్'కు శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం ఆదేశాల ప్రకారం సోమవారం రెవెన్యూ భవన్ హాలులోనే ప్రత్యేకంగా ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆనంద్, డీఆర్‌ఓ మాలోల, ప్రత్యేక ఉప కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, మల్లికార్జునుడు, రామ్మోహన్, జేడీపీ ఉమామహేశ్వరమ్మ తదితరులు ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. మొత్తంగా 467 అర్జీలు దాఖలయ్యాయి. ఈ ప్రక్రియలో భాగంగా రెవెన్యూ అర్జీల పరిష్కారం కోసం ప్రత్యేక క్లినిక్‌ను నెలకొల్పారు. కలెక్టరేట్ సమన్వయ అధికారి(కో ఆర్డినేషన్) యుగేశ్వరిదేవి, భూ విభాగం పర్యవేక్షకుడు రియాజుద్దీన్ ఈ క్లినిక్‌లో రెవెన్యూ ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించి పని చేశారు. కలెక్టర్‌కు ఇచ్చిన రెవెన్యూ అర్జీలను మాత్రమే క్లినిక్‌కు సిఫార్సు చేశారు. ఇక్కడికి వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడారు. సంబంధిత తహసీల్దారు, ఆర్డీఓ కార్యాలయ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా అక్కడికక్కడ స్పందించారు. మండలాల వారీగా సమస్యలను నమోదు చేసుకున్నారు.

**నమోదులో జాప్యం**

రెవెన్యూ భవన్ ఆవరణలో అర్జీదారుల కోసం ప్రత్యేక కుర్చీలు వేయడం సంతోషకరం. బాధితుల కోసం ప్రభుత్వ సిబ్బందితోనే అర్జీలు రాయిస్తున్నారు. కాని.. ఈ వినతులను నిర్దేశిత పీజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి రసీదు ఇవ్వాలి. ఇందుకు పది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కాని.. అర్జీల నమోదులో తీవ్ర జాప్యం సాగుతోంది. గంటలకొద్దీ బాధితులు నిరీక్షించాల్సి వస్తోంది. అంతేకాదు.. ఏ కౌంటర్‌లోనూ ప్రింటర్లు పని చేయడం లేదు. కౌంటర్లల్లో అర్జీలను నమోదు చేసుకుంటున్నారంతే. రసీదు తీసుకోడానికి ఆవరణలోనే మరొక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా తీవ్ర జాప్యం అవుతోంది. నమోదు, రసీదుల జారీ సమయంలో సాగుతున్న జాప్యాన్ని నివారించాల్సి ఉంది. మూడు వారాలుగా ఇదే తతంగం కొనసాగుతోంది.

## 14 మంది వైకాపా నాయకుల అరెస్టు

**రాప్తాడు, న్యూస్‌టుడే :** మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు సందర్భంగా రాప్తాడు మండలం పుల్లలరేవు గ్రామంలో పొడవాటి కత్తితో కేకు కోసి హల్‌చల్ చేసిన కేసులో పద్నాలుగు మందిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కత్తి పట్టుకొని కేకలు వేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించడంతో అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో పుల్లలరేవుకు చెందిన శివరాజు, బిల్లేముత్యాలు, బి.రామంజినేయులు, కొండారెడ్డి, చంద్రశేఖర్, ప్రతాప్, గణవర్ధన్, పూర్ణమల్లారెడ్డి, జయచంద్ర, చెన్నకేశవరెడ్డి, దాసరిఓబులేసు, బిల్లే మురళి, ఆదెప్ప, శంకర్ ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం అనంతపురం కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.



భూగర్భ వంతెన పనులకు

## తొలగిన అడ్డంకులు

గుంతకల్లులోని రైల్వే మోరీ

**పరిహారం కింద రూ.2.31 కోట్లు**

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** గుంతకల్లు పట్టణంలోని ధర్మవరం రైల్వేగేటును తొలిగించి వాహనాల రాకపోకల కోసం నిర్మించాలనుకున్న భూగర్భ వంతెన పనులు ప్రారంభించడానికి అడ్డంకులు తొలగాయి. ఆయా పనుల కారణంగా నివాస గృహాలను కోల్పోయే వారికి పరిహారాన్ని అందించేందుకు మున్సిపల్ అధికారులు సోమవారం రూ.2.31 కోట్లను రెవెన్యూ అధికారులకు అందజేశారు. రైల్వే అధికారులు వారి వాటా కింద రూ.1.80 కోట్లను ముందే ఇచ్చారు. వంతెన నిర్మాణానికి రైల్వే అధికారులు రెండేళ్ల కిందటే టెండర్లు పిలిచి పనులను గుత్తేదారుకు అప్పగించారు. అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి పనులకు భూమిపూజ చేశారు. ఇప్పటికీ ఇళ్ల తొలగింపు పనులు చేయకుండానే కాలం గడిపారు. ప్రస్తుతం పరిహారాన్ని చెల్లించే ప్రక్రియను రెవెన్యూ అధికారులు చేపట్టనున్నారు.

**రూ.8 కోట్లతో 'సీ' ఆకారంలో నిర్మాణం**

వంతెన నిర్మాణం, డిపాజిట్‌ను చెల్లించడానికి ఎంపీ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, మున్సిపల్ అధ్యక్షురాలు భవానీ కృషి చేశారు. వంతెనను 'సీ' ఆకారంలో నిర్మించేందుకు రైల్వే రూ.8 కోట్లు కేటాయించింది. జనవరి 2 నుంచి పనులు పట్టాలెక్కనున్నాయి. ఈక్రమంలో వందేళ్ల నుంచి ప్రజలు వినియోగించిన గుంతబావి వద్ద ఉన్న మోరీ మూతపడనుంది. ఇక నుంచి గేటు మూసిన సమయంలో వాహన చోదకులు ఇతర మార్గాల్లో సమీప కాలనీలకు వెళ్లాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

## స్త్రీ, శిశు సంక్షేమానికి తూట్లు!

**ప్రతిపాదనల్లోనే అదనపు అంగన్‌వాడీ కేంద్రాలు**

గుత్తి మండలం తురకపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం

**గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు, ఉరవకొండ, న్యూస్‌టుడే :** స్త్రీ, శిశు సంక్షేమం కోసం అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు కావడం లేదు. మూడు, నాలుగేళ్ల నుంచి గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాల నుంచి అధికారులు కేంద్ర ప్రభుత్వానికి అదనపు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదలను పంపుతున్నారు. మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. వాస్తవానికి ప్రతి 600 జనాభాకు ఒక మినీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. వెయ్యి జనాభా ఉన్న ఆవాసాల్లో మెయిన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదు.

**ఎదురుచూపులే మిగిలాయి!**

కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాల కోసం ప్రజలు ఏళ్లతరబడిగా నిరీక్షిస్తున్నారు. గతంలోని తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ కాలనీలను ఏర్పాటు చేయగా వైకాపా ప్రభుత్వంలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటవుతున్న కాలనీల్లోని పేదలకు అంగన్‌వాడీ సేవలు అందటంలేదు. ఫలితంగా చిన్నారులు, బాలింతలు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

● యుక్త వయస్సు బాలికలకు స్వయం ఉపాధికి ఉపాధి పనుల్లో శిక్షణ కరవు అవుతోంది. ఏడాదికిందట యుక్త వయస్సు బాలికలకు బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ ఇప్పించారు. పట్టణాలకు దూరంగా ఉంటున్న కాలనీల్లోని పేదలు స్వయం శిక్షణకు దూరంగా ఉంటున్నారు.

| నియోజకవర్గం | ఉన్న కేంద్రాలు | ఇంకా కావాల్సింది |
|---|---|---|
| గుంతకల్లు | 269 | 35 |
| తాడిపత్రి | 302 | 55 |
| ఉరవకొండ | 325 | 45 |

**కేంద్రానికి మంత్రి లేఖ రాసినా?**

ఇటీవల రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తన నియోజకవర్గంలో కేంద్రాల మంజూరు విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆయనే స్వయంగా లేఖరాసినట్లు తెదేపా వర్గాలు చెబుతున్నాయి. పట్టణాలు, గ్రామాలు రోజురోజుకు విస్తరిస్తున్నా దృష్టి సారించడం లేదు.

**ఉత్తర్వులు రాగానే పనులు**

-సాజియాబేగం, సీడీపీవో, తాడిపత్రి

అదనపు కేంద్రాల కోసం ప్రతిపాదలను ప్రభుత్వానికి పంపుతున్నాం. ఏడాది కిందట కేంద్రాల మంజూరు కోరుతూ ప్రతిపాదించాం. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి మంజూరు ఉత్తర్వులు రాలేదు. అక్కడి నుంచి ఉత్తర్వులు వస్తే అవసరమైన చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.




(c) eenadu

# దక్షిణ భారతస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపిక

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండలోని కరిబసవస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత సహాయకునిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ దక్షిణ భారత స్థాయి గణిత విభాగం వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం సత్యనారాయణ తెలిపారు. ఆయన ఉపాధ్యాయుల విభాగంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో అధికారులు, దక్షిణ భారతస్థాయికి 'టచ్ ఎంజాయ్ అండ్ లర్న్ మ్యాథ్స్' అంశంలో ఎంపిక చేశారన్నారు.

ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న హెచ్‌ఎం తదితరులు


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
**ది ఆంధ్రప్రదేశ్ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ మరియు కల్చరల్ సొసైటీ**
ప్లాట్ నెం.56, డోర్ నెం.54-16-1/18సి, రోడ్ నెం.2, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, లయోలా కాలేజి రోడ్, విజయవాడ -520008

**టెండరు ప్రకటన**

టెండరు ప్రకటన నెం.406/ ఎ.పి. శిల్పారామం/ పార్కింగ్ టెండర్/ ఎటిపి / 2025, ది.29-12-2025

శిల్పారామం, అనంతపురము వద్ద లీజు ప్రాతిపదికన " పార్కింగ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ " ఆపరేషన్ మరియు నిర్వహణ కోసం సమర్థులైన మరియు అర్హత కలిగిన ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. పైన పేర్కొన్న టెండరు పత్రాన్ని AP SACCS website:https://shilparamam.ap.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండరు దరఖాస్తును విజయవాడ శిల్పారామంలోని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కార్యాలయం నుండి రూ.5,000/- దరఖాస్తు ధర ఏదైన షెడ్యూలు వాణిజ్య బ్యాంక్ నుండి "Chief Executive Officer, the APSACCS" పేరు మీద పొందిన డి.డి. విజయవాడలో చెల్లుబాటు అగునట్లు చెల్లించి పొందవచ్చును. టెండరు షెడ్యూల్ జారీ తేది.30.12.2025. టెండర్లు సమర్పించడానికి చివరి తేది.08.01.2026 మధ్యాహ్నం 3 గంటలు. మరిన్ని వివరాలకు విజయవాడలోని పరిపాలన అధికారి మొబైల్ నెంబరు: 88866 52023 ను సంప్రదించగలరు.

సం/- ముఖ్య కార్యనిర్వహణ అధికారి



**SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
బ్రాంచి ఆఫీస్: 1వ అంతస్తు, సూర్య టవర్స్, సి.బి. రోడ్డు, తాడిపత్రి

**(రూల్ 8 (1) ప్రకారం) భౌతిక స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం [illegible]

తేది: 26.12.2025 ప్రదేశం: తాడిపత్రి — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



**SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.

**(రూల్ 8 (1) ప్రకారం) భౌతిక స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

[illegible]

తేది: 27-12-2025 — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



**SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
బ్రాంచి ఆఫీస్: 1వ అంతస్తు, సూర్య టవర్స్, సి.బి. రోడ్డు, తాడిపత్రి

**(రూల్ 8 (1) ప్రకారం) భౌతిక స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

[illegible]

తేది: 26.12.2025 ప్రదేశం: తాడిపత్రి — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



**SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
బ్రాంచి ఆఫీస్: 1వ అంతస్తు, సూర్య టవర్స్, సి.బి. రోడ్డు, తాడిపత్రి

**(రూల్ 8 (1) ప్రకారం) భౌతిక స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

[illegible]

తేది: 26.12.2025 ప్రదేశం: తాడిపత్రి — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్


# క్రికెట్ తుది సంగ్రామం నేడే

## ఉత్కంఠ రేపుతున్న ఈఎస్ఎల్-2025 పోటీలు

**అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే:** ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సమర్పణలో ఈఎస్ఎల్-2025 జిల్లాస్థాయి క్రికెట్ తుది సమరానికి సర్వం సిద్ధమయ్యాయి. మంగళవారం జరిగే పోటీలకు అనంతలోని రాయలసీమ క్రికెట్ మైదానం ముస్తాబైంది. టర్ఫ్ పిచ్‌పై జరిగే సంగ్రామంలో జూనియర్, సీనియర్ విభాగంలో నాలుగు జట్లు పోటీ పడనున్నాయి. జూనియర్ విభాగంలో ఎస్ఎస్‌బీఎన్ జూనియర్ కళాశాల, అనంతపురం శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల జట్లు తలపడనున్నాయి. ఈఎస్ఎల్ క్రికెట్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను ఎస్ఎస్‌బీఎన్ జట్టు ఐదుసార్లు సొంతం చేసుకుంది.

రెండుసార్లు రన్నరప్ టైటిల్ సాధించింది. రాయలసీమ రాకర్స్‌గా మూడుసార్లు టైటిల్ నిలబెట్టుకుంది. ఎనిమిదోసారి ఫైనల్ పోరుకు సిద్ధమైంది. శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల జట్టు ప్రథమంగా ఫైనల్‌కు చేరుకుంది. ఈసారి ఛాంపియన్‌గా నిలవడానికి సిద్ధమైంది.

- డిఫెండింగ్ ఛాంపియన్లను మట్టి కరిపించిన ఎస్వీ, ఎస్ఎస్‌జీఎస్ జట్లు సీనియర్ విభాగం ఫైనల్‌కు ప్రథమంగా ప్రవేశించాయి.


హరిత మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ "మంచి చికిత్సకోసం ఉత్తమైన భరోసా" 1వ క్రాస్, మారుతి నగర్, అనంతపురం.


**పోటీల వివరాలు**

- ఉదయం 9 గంటలకు జూనియర్ విభాగం శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల × ఎస్ఎస్‌బీఎన్ జూనియర్ కళాశాల
- మధ్యాహ్నం ఒంటి గంటకు అనంతపురం ఎస్వీ డిగ్రీ కళాశాల × గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల

**వేదిక:** అనంత క్రీడా గ్రామంలోని రాయలసీమ క్రికెట్ మైదానం


Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE www.mits.ac.in
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV
Organised by ఈనాడు



**SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.

**(రూల్ 8 (1) ప్రకారం) భౌతిక స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

[illegible]

తేది: 27-12-2025 ప్రదేశం: అనంతపురం — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



**SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.

**(రూల్ 8 (1) ప్రకారం) భౌతిక స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

[illegible]

తేది: 26.12.2025 — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్


# శిశుగృహ నియామక పత్రాల అందజేత

**అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే:** ఐసీడీఎస్ అనుబంధ శిశుగృహలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియ ముగిసింది. కలెక్టర్ ఆనంద్ ఆమోదించిన ఎంపిక జాబితా ప్రకారం ఆశాఖ పీడీ అరుణకుమారి నియామక పత్రాలను అందజేశారు. సోమవారం తన కార్యాలయంలో ఎంపికైన వారికి నియామక పత్రాలను పంపిణీ చేశారు. మేనేజర్‌గా టి.భాగ్యలక్ష్మి, సోషల్ వర్కర్‌గా టి.శ్రీలక్ష్మి, ఏఎన్ఎంగా కె.శ్రావణికుమారి, ఆయాలుగా ఎ.శారద, ఎ.కుళ్లాయమ్మ, ఎం.మైన, కె.ఎ.జ్యోత్స్న, పి.వరలక్ష్మి, చౌకీదార్‌గా ఎస్.అంజలి ఎంపిక అయ్యారు. వీరిలో ఆయా కుళ్లాయమ్మ మాత్రమే నియామక పత్రాన్ని తీసుకోలేదు. తక్కిన ఎనిమిది మంది పత్రాలను తీసుకున్నారు. ఒకట్రెండు రోజుల్లో పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. మరోవైపు.. ఒక ఆయా పోస్టు ఎంపిక జరగలేదు. ఎస్సీ-జీ1 కేటగిరికి చెందిన పోస్టుకు దరఖాస్తులు దాఖలు కాలేదు. మిగతా అన్ని రకాల పోస్టులు భర్తీ అయినట్లే.

# బీటెక్ విద్యార్థి బలవన్మరణం

**కంబదూరు, న్యూస్‌టుడే:** చదువుపై ఇష్టం లేక.. తల్లిదండ్రులకు ఎదురు చెప్పలేక.. మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చేటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల వివరాల మేరకు.. కంబదూరు మండలంలోని గూళ్యం గ్రామానికి చెందిన కమ్మ గోవిందు-సునీత దంపతులు ఏకైక కుమారుడు చరణ్(19) అనంతపురంలోని ఓ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల గ్రామంలో సుబ్రహ్మణేశ్వరస్వామి వేడుక సందర్భంగా ఇంటిల్లిపాదితో కలసి సంతోషంగా గడిపారు. చదువుపై ఇష్టం లేని చరణ్ సోమవారం కళాశాలకు వెళ్లకుండా.. ఉదయాన్నే టమాటా పంటకు నీరు పెట్టొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి అక్కడ చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనాస్థలానికి చేరుకుని విగత జీవిగా ఉన్న కుమారుడిని చూసి విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై లోకేశ్ తెలిపారు.

చరణ్

# మహిళలను కించపరిచేలా పోస్టులు

## నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

**ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే:** సామాజిక మాధ్యమాల్లో అతివలను అవమానించేలా పోస్టులు పెట్టిన నిందితుడు నాగేంద్రను ఎస్సై మల్లికార్జునరెడ్డి అరెస్టు చేశారు. నల్లమాడ సీఐ శ్రీనివాస్ సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన కోటం నాగేంద్ర స్త్రీలను ఇష్టానుసారంగా వ్యాఖ్యానిస్తూ పోస్టులు పెట్టినట్లు ఓడీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అతడిపై నిఘా పెట్టిన పోలీసులు ఉదయం కదిరి ఆర్టీసీ బస్టాండులో అరెస్టు చేసినట్లు తెలిపారు. నాగేంద్ర స్త్రీలు, మహిళా ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతుంటాడని, గతంలోనూ శింగనమల పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదైనట్లు సీఐ వెల్లడించారు. నిందితుడిని కదిరి కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు. నల్లమాడ సర్కిల్ పరిధిలో ఎవరైనా మహిళలపై పోస్టులు పెట్టినా, అవమానకరంగా మాట్లాడినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.


**EENADU Classifieds**

**REAL ESTATE**

**అనంతపురంటౌన్‌లో** టవర్‌క్లాక్ దగ్గర కమలానగర్ నందు DCMS రోడ్లో 5 అంతస్థుల కమర్షియల్ బిల్డింగ్ అమ్మకానికి కలదు. స్థలం 10 సెంట్లు. 17,000 Sqf సెల్లార్ పార్కింగ్ కలదు. బాడుగలు నెలకు 5 లక్షలు. ✆ 9948266888

**FLAT FOR SALE**

**నూతన సంవత్సర** స్పెషల్ ఆఫర్ 3 BHK, 2 BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అనంతపురం నడిబొడ్డున గల మీనాక్షి అపార్ట్‌మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. సెల్: 7416560179, 9515651111.

**PLOT FOR SALE**

**హిందూపురంలో** వెల్‌డెవలప్ ఓపెన్ ప్లాట్స్ బెంగళూరు రోడ్‌లో, లేపాక్షి రోడ్‌లో, సేవామందిర్ రోడ్‌లో కావాలనుకునే వారు 8143917999కి కాల్ చేయ్యండి.

**JOBS**

**బెంగుళూరులో** పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854

**కావలెను:** M.G.B Mobiles (మహీంద్రా కార్ షోరూమ్) నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేయుటకు డిగ్రీ పూర్తి చేసినవారు కావలెను. ఆటోమొబైల్ సేల్స్ నందు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకొనవచ్చును. సంప్ర: 8333929186.

**ATP టౌన్** నందు పనిచేయుటకు యువతి యువకులు అర్జెంటుగా కావలెను. Q: 10th to Degree Cell: 9703131570.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS — 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

రాయదుర్గం
• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

## రైతుల సహకారంతో రీసర్వేకు కృషి

**కణేకల్లు:** భూ హక్కులకు భంగం కలగకుండా చేపడుతున్న భూముల రీసర్వేకు రైతులు సహకారం అందించాలని తహసీల్దారు బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. సోమవారం రైతులతో గ్రామసభ నిర్వహించి ఆయన మాట్లాడారు. జనవరి 2 నుంచి 10350 ఎకరాల్లో రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. బ్రహ్మసముద్రం, బెణికల్లు గ్రామాలలోనూ రీసర్వే కొనసాగుతుందన్నారు. డీటీ విజయ్, సర్వేయర్ గోవిందప్ప, ఆర్ఐ సందీప్ వీఆర్వో భీమప్ప పాల్గొన్నారు.

**రాయదుర్గం గ్రామీణం:** వేపరాళ్లలో సోమవారం మీ భూమి- మీ హక్కు, రీసర్వేపై ఏర్పాటు చేసిన గ్రామ సభ, అవగాహన ర్యాలీలో తహసీల్దార్ నాగరాజు మాట్లాడారు. సాంకేతిక, ఆధునికతతో భూమి రీసర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ మణికాంత్, వీఆర్ఓ విష్ణువర్ధన్‌రెడ్డి, వన్నూరప్ప, వేపరాళ్ల, కెంచానపల్లి, కాశీపురం రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**శెట్టూరు, న్యూస్‌టుడే:** నాలుగో విడత భూ రీసర్వేకు మూడు గ్రామాలు ఎంపికైనట్లు తహసీల్దారు ఈశ్వరమ్మ సోమవారం స్థానికంగా పేర్కొన్నారు.

## వస్త్ర పరిశ్రమలో ఉపాధిపై ఆరా

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండ ప్రాంతంలో వస్త్ర పరిశ్రమను ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించడానికి సెర్ప్ రాష్ట్ర డైరెక్టర్ పద్మావతి పేర్కొన్నారు. దీనివల్ల కలిగే ప్రయోజనాన్ని సోమవారం ఆమె డీఆర్డీఏ పీడీ శైలజ, చేనేత, జౌళిశాఖ ఏడీ వరప్రసాద్‌తో కలిసి ఉరవకొండలో కుట్టుతో ఉపాధి పొందుతున్న మహిళలతో చర్చించారు.

మాట్లాడుతున్న సెర్ప్ రాష్ట్ర డైరెక్టర్ పద్మావతి తదితరులు

# రైతుబజార్ల ఏర్పాటుకు సన్నాహాలు

**న్యూస్‌టుడే, రాయదుర్గం, కణేకల్లు**

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రైతుబజార్లు అందుబాటులోకి రానున్నాయి. వాటికి ఉన్న ఆదరణ దృష్ట్యా కొత్తవాటి ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రాయదుర్గం పట్టణంలో కంపోస్టు యార్డు సమీపంలోని సీఎఫ్‌సీ ఎదుట రైతు బజార్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం సుమారు 50 సెంట్ల స్థలం సేకరణకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఉల్లి, కూరగాయలు, బియ్యం ఇతరత్రాలు బహిరంగ మార్కెట్‌లో విపరీతంగా పెరిగినప్పుడు ప్రభుత్వం రైతుబజార్ల ద్వారా వీటిని వినియోగదారులకు రాయితీపై అందజేసే అవకాశం ఉంటోంది.

### రాత్రిపూట హోల్‌సేల్ విక్రయాలు

హోల్‌సేల్ మార్కెట్‌ను శాంతినగర్ బళ్లారి రోడ్డు పక్కన నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి 3 గంటల వరకు ఇక్కడ క్రయ విక్రయాలు జరుగుతుండటం గమనార్హం. గతంలో మాదిరిగా తెల్లవారుజామున హోల్‌సేల్ వ్యాపారాలు నిర్వహించాలని పలువురు చేసిన విన్నపాలను పట్టించుకునే వారే కరవయ్యారు.

### రోడ్డుపై అమ్మకాల నివారణకు...

రాయదుర్గం పట్టణంలో రైతుబజార్లు లేకపోవటంతో వివిధ గ్రామాల నుంచి కూరగాయలు తీసుకొచ్చిన రైతులు మార్కెట్ వద్దే రోడ్ల మీద విక్రయాలు చేస్తున్నారు. దీంతో దారి ఇరుకుగా మారటంతో తరచుగా రవాణాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం జరిగాయి. రోడ్లపై వ్యాపారులను మార్కెట్‌లోకి రావాలని ఒత్తిడి చేస్తే... రాజకీయ జోక్యంతో మళ్లీ అక్కడే వ్యాపారాలు కొనసాగుతున్నాయి. టవర్‌క్లాక్, ఓబుళాచారి రోడ్డులో సగం వరకు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలతోపాటు చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. కణేకల్లు ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రూ.లక్షలు ఖర్చుచేసి నిర్మించిన కూరగాయల మార్కెట్‌లో వ్యాపారాలు చేయకుండా.. యథావిధిగా దారుల్లో, రోడ్ల పక్కనే తోపడు బళ్లపైన అమ్మకాలు కొనసాగిస్తుండటం గమనార్హం.

రాయదుర్గంలో రైతుబజార్ ఏర్పాటు చేయనున్న ప్రాంతం

### ఇబ్బందుల్లేకుండా చర్యలు

రాయదుర్గంలో ఎవరికీ ఇబ్బందులు లేకుండా సీఎఫ్‌సీ వద్ద రైతు బజారు ఏర్పాటుకు నిర్ణయించాం. సీఎఫ్‌సీ వద్ద ఉన్న చెత్తను తరలించి స్థలాన్ని చదునుచేసి ఏర్పాట్లు చేస్తాం. -వి.దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

## వరాహ పంచలోహ కవచం బహూకరణ

**రాయదుర్గం, న్యూస్‌టుడే:** పట్టణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామికి సోమవారం స్థానిక భక్తులు ముంగర నారాయణరాజు, ఆతడి కుమారుడు పవన్‌కుమార్ వరాహ రూప పంచలోహ కవచాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశులు, అర్చకుడు బాల మురళీకృష్ణకు అందజేశారు.

పంచలోహ కవచాన్ని అందజేస్తున్న భక్తులు

## ప్రత్యేక బస్సులు నడపాలని వినతి

**బొమ్మనహాళ్, న్యూస్‌టుడే:** కళాశాల, పాఠశాలల వేళలకు అనుగుణంగా ప్రత్యేకంగా బస్సులు నడపాలని సీఐటీయూ నాయకుడు ఓబుళేసు, విద్యార్థి సంఘం నాయకులు పద్మరాజు, ముత్యాల కోరారు. సోమవారం తహసీల్దార్ మునివేలు, సప్లయ్‌హౌస్ ఆఫీసర్ కుమారేబాషకు పలువురు విద్యార్థులు వినతిపత్రాలు అందజేశారు. ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం డిపోల నుంచి బస్సులు వేయాలని కోరారు. ఉంతకల్లు క్రాస్‌లో బస్సులు ఆపకపోవడంతో నానా అవస్థలు పడుతున్నట్లు విద్యార్థులు వాపోయారు. ఈ సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు.

## పట్టణాభివృద్ధికి కృషి చేయండి

**కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే:** వాల్మీకులకు మంచి అవకాశం వచ్చింది, కళ్యాణదుర్గం పట్టణాభివృద్ధికి కృషి చేయాలని ఆ వర్గానికి చెందిన ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం కోరారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ తలారి గౌతమిసోమశేఖర్ ఎన్నికైన సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించిన సందర్భంగా పలువురు మాట్లాడారు.

ఛైర్‌పర్సన్ గౌతమిసోమశేఖర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

## పోటీతత్వంతోనే ఉన్నతికి బాటలు

**కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే:** పోటీ పరీక్షల్లో ప్రతిభచాటి ఉన్నతికి బాటలు వేసుకోవాలని చైతన్య విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ బాబు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని చైతన్య విద్యానికేతన్‌లో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఎంతో ఆసక్తితో పోటీ పరీక్షల్లో పాల్గొన్నారు. వీరిలో 8వ తరగతి చదువుతున్న హరీష్, ఉమాశ్రీ, 9వ తరగతి చదువుతున్న శ్రీనందిని నివాస్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ బాబు, ఉపాధ్యాయులు దినేష్, చంద్రశేఖర్, ప్రభాకర్, నవీన్‌లు బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ బాబు, ఉపాధ్యాయులు

## పిల్లల ఎదుగుదలకు చర్యలు తీసుకోవాలి

**విడపనకల్లు, న్యూస్‌టుడే:** విడపనకల్లు అంగన్వాడీ కేంద్రంలో ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో 64 మంది కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన 100 రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. పాఠశాలకు వెళ్లే పిల్లలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పుష్పవతి, విజయ, పద్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది

## నేడు ఉద్యోగమేళా

**రాయదుర్గం, న్యూస్‌టుడే:** పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 30, 31వ తేదీల్లో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి తెలిపారు. బీటెక్, డిప్లొమా, ఐటీఐ, ఇంటర్ మీడియట్, డిగ్రీ పూర్తిచేసిన వారు మంగళ, బుధ వారాల్లో పాలిటెక్నిక్ కళాశాలలో హాజరు కావాలన్నారు. ఇతర సమాచారం కోసం 9898400832 సెల్ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

## నీటి పథకం పైపులకు మరమ్మతులు

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** కళ్యాణదుర్గం శ్రీరామిరెడ్డి నీటి పథకం పంప్‌హౌస్ నుంచి పలు నియోజకవర్గాలకు వెళ్లే తాగునీటి ప్రధాన పైపులు ఐదేళ్లుగా లీకేజీ కావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సోమవారం 'లీకేజీలకు మరమ్మతు కరవు' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి సంబంధిత అధికారులు స్పందించి సోమవారం పైపులైన్ల లీకేజీలను సరిచేయించారు.

## మరమ్మతు చేస్తే ఉపయోగం..

గుమ్మఘట్ట మండలంలోని భూతయ్యదొడ్డి గ్రామంలో ట్యాంకు నిరుపయోగంగా మారింది. విద్యుత్తు లేని సమయంలో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంటుందని దీన్ని నిర్మించారు. అయితే బోరు నుంచి ట్యాంకుకు నీటిని సరఫరా చేసే పైపులైను దెబ్బతింది. దానికి మరమ్మతు చేయకపోవడంతో దిష్టిబొమ్మగా దర్శనమిస్తోంది. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టి తీసుకెళ్లగా వారంలోగా మరమ్మతు చేస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, గుమ్మఘట్ట**

## రహదారుల్లో మట్టి.. నిత్యం ప్రమాదాలు!

కర్ణాటకలోని మొలకాల్మూరు నుంచి రాయదుర్గం, కళ్యాణదుర్గం మీదుగా అనంతపురం వెళ్లే 544 డీడీ జాతీయ రహదారిపై మట్టి పేరుకుపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. బళ్లారి బైపాస్‌లో బాలికల వసతి గృహం వద్ద, బోరంపల్లి గ్రామంలోకి వెళ్లే దారిలో మట్టి ఎక్కువగా పేరుకుపోయింది. దారుల్లోని మట్టిని తొలగించేలా అధికారులు చొరవ తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆయా శాఖల అధికారులను వివరణ కోరగా ఒకరిపై ఒకరు చెప్పుకొంటున్నారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**

## మురుగు తొలగించరూ..!

రాయదుర్గం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల సమీపంలో మురుగు ముందుకు కదలడం లేదు. పాఠశాల కింది భాగంలో మేదర వీధికి వెళ్లే దారిలో పడమ వైపున సుమారు పది రోజులుగా మురుగు తొలగించకపోవడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం సాయంత్రం దోమల ఉద్ధృతి పెరుగుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మురుగు తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాయదుర్గం**

## తాగునీరు కలుషితం..!

ఉరవకొండ గవిమఠం ప్రాంగణంలోని ఓహెచ్ఎస్ఆర్ నుంచి సీపీఐ నగర్ వైపు వెళ్తున్న పైపులైన్‌లో ఎయిర్ వాల్వ్ వద్ద తాగునీరు లీకవుతుండటంతో అపరిశుభ్రత ఏర్పడుతోంది. నిత్యం నీటి సరఫరా ఆగినప్పుడు అపరిశుభ్రమైన నీరు పైపుల్లోకి చేరి తద్వారా ఇళ్లలోకి వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాత్రిపూట పాదచారులు, ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుర్తించి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

## భూముల అన్యాక్రాంతం పట్టించుకోరా?

**బొమ్మనహాళ్, న్యూస్‌టుడే:** వివిధ గ్రామాల్లో దేవాలయ భూములు అన్యాక్రాంతమౌతున్నా సంబంధిత రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ తాలూకా నాయకులు నాగార్జున, రైతు సంఘం తాలూకా నాయకులు గౌస్‌పీరా తదితరులు కోరారు. సోమవారం రెవెన్యూ అధికారులకు దేవాలయ భూములు రక్షించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు స్వామి, తేజసుల్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## వేడుకలు సామరస్యంగా జరుపుకోండి: డీఎస్పీ

**డి.హీరేహాళ్, న్యూస్‌టుడే:** నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ సామరస్యంగా జరుపుకోవాలని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పేర్కొన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంతమైన వాతావరణంలో 2026 నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు. డి.హీరేహాళ్ స్టేషన్ పరిధిలో కేసులు తగ్గడానికి కృషి చేసిన గ్రామీణ సీఐ వెంకటరమణ, ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బందిని ఆయన అభినందించారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు రంగయాదవ్, నాగరాజు, మల్లికార్జున, రామాంజినేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ రవిబాబు, సీఐ వెంకటరమణ, ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి

## స్థానికంగా సమస్యలు పరిష్కరించాలి

**కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే:** రెవెన్యూ సమస్యలు మండలస్థాయిలో, తహసీల్దార్ కార్యాలయాల్లో పరిష్కారం కావాలని ఆర్డీవో వసంత బాబు సూచించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో పలు సమస్యలపై బాధితులు ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## 48 గంటల్లో చోరీ నిందితుల అరెస్టు

**రాయదుర్గం పట్టణం:** చోరీ జరిగిన 48 గంటల్లోనే సొత్తుతోపాటు నిందితుడిని అరెస్టు చేసినట్లు గ్రామీణ సీఐ వెంకటరమణ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం... కణేకల్లు ప్రభుత్వ ఆసుపత్రి వెనకాల నివాసం ఉంటున్నలతీఫ్- తభుసమ్ దంపతులు ఈనెల 27న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి పది తులాల బంగారం, ఒక కిలో వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారంగా నిందితులు అఫ్జాన్ రజాక్ వలిని సోమవారం అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. కణేకల్లు ఇన్‌ఛార్జి ఎస్సై నబీరసూల్, గుమ్మఘట్ట ఎస్సై చెన్నరాయుడు, పీఎస్సై నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

## కష్టపడితేనే పార్టీలో గుర్తింపు

**బెళుగుప్ప, న్యూస్‌టుడే:** తెదేపాలో కష్టపడిన వారికి గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, సీనియర్ నాయకుడు రాధాకృష్ణలు పేర్కొన్నారు. తెదేపా జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన ప్రసాద్‌ను సోమవారం సన్మానించిన సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తిమ్మప్ప, సునీల్, తమ్మినేని పవన్, మురళి, శ్యామ్, వెంకటేశులు పాల్గొన్నారు.

ప్రసాద్‌ను సత్కరిస్తున్న తెదేపా నాయకులు

## సెల్‌టవర్ నిర్మాణంపై అభ్యంతరం

**కణేకల్లు, న్యూస్‌టుడే:** ఆరో వార్డులోని రాంనగర్ కాలనీలో ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని పలువురు సోమవారం తహసీల్దారు బ్రహ్మయ్యను కోరారు. టవర్ ఏర్పాటు తగదని స్థానికులైన మాబు, గోపాల్ రెడ్డి, అనిల్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

## యూటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

**శెట్టూరు, న్యూస్‌టుడే:** శెట్టూరు ఎంపీడీవో కార్యాలయంలో యూటీఎఫ్ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు సోమవారం డైరీ, కాలమానిని తహసీల్దారు ఈశ్వరమ్మ, ఎంపీడీవో జిలానీబాషా, ఎంపీపీ లక్ష్మీదేవి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో శెట్టూరు మండలం ఉప ఎంపీపీ క్రిష్టప్ప, ఎంఈవో-1, 2 శ్రీధర్, వాణీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి స్పందన

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండ మండలం చిన్న ముష్టూరులో సోమవారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో పయ్యావుల కేశవ్ సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. పలువురికి వైద్యసేవలు చేయగా, 26 మందికి ఆపరేషన్లు చికిత్సలు అవసరమని సూచించారు. ఆప్తాలమిక్ అధికారులు వశికేరి, మారెన్న, మల్లికార్జున, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

**అ వీ.. ఇ వీ.. అ న్నీ..**

## కంది కొనుగోళ్లు ప్రారంభించండి: సీపీఐ

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** కంది పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి సరైన మార్కెట్టు సదుపాయం లేక రైతులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఉరవకొండలో కంది రైతులతో మాట్లాడారు.

## శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సెల్వన్ రాజ్ సూచించారు. సోమవారం ఆయన ఉరవకొండలోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

## శుద్ధజల కేంద్రం పునరుద్ధరించాలని వినతి

**కుందుర్పి, న్యూస్‌టుడే:** కుందుర్పి మండల ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని శుద్ధజల కేంద్రాన్ని పునరుద్ధరించాలని కోరుతూ.. తెదేపా కూటమి నాయకులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ ఓబిళేషుకు వినతిపత్రం అందజేశారు.

## రెండు రైళ్ల రాకపోకల్లో మార్పు

**రాయదుర్గం, న్యూస్‌టుడే:** రాయదుర్గం మీదుగా ప్రయాణించే కదిరిదేవరపల్లి- తిరుపతి, కరటగి- యశ్వంత్‌పూర్ రైళ్ల రాకపోకల్లో మార్పులు జరిగినట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు.

## పాఠశాల తనిఖీ

**వజ్రకరూరు:** వజ్రకరూరు మండలంలోని కేజీబీవీ పాఠశాలను సోమవారం ఎంఈఓ తిమ్మప్ప తనిఖీ చేశారు. విద్యార్థులకు 'పాల్ ల్యాబ్' కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్సైకి సన్మానం

**గుమ్మఘట్ట, న్యూస్‌టుడే:** కొత్తగా విధుల్లోకి చేరిన ఎస్సై చిన్నరాయుడుని వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు గోనబావి దురుగేష్ సోమవారం సన్మానించారు. మండలంలోని వడ్డేర్ల స్థితిగతులను చర్చించారు. కార్యక్రమంలో వడ్డె హనుమన్న, పాపారాయుడు, సన్నన్న, బీటీప్రాజెక్టు చిన్నకిష్టప్ప పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంతాపం

**బ్రహ్మసముద్రం:** నాగిరెడ్డిపల్లికి చెందిన తెదేపా నాయకురాలు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగమ్మ(75) మృతిచెందగా.. సోమవారం ఎమ్మెల్యే సురేంద్రబాబు నివాళి అర్పించారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ శ్రీరాములు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు వన్నూరుస్వామి, నాగరాజు, పలువురు తెదేపా నాయకులు ఉన్నారు.

## వేదావతి హగరిలో కలప దుంగలు

**రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** రాయదుర్గం- అనంతపురం జాతీయ రహదారిలోని వేపరాళ్ల క్రాస్- గుండ్లపల్లి వద్ద వేదావతి హగరి వంతెన కింద నీటిలో గుర్తుతెలియని వ్యక్తులు ఎర్ర చందనం దుంగలు దాచినట్లు సోమవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై ప్రసాద్, అటవీశాఖ డీఆర్ఓ దామోదర్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అక్కడ 63 కలప దుంగలు నీలగిరి, నేరేడు చెట్లవని ఉన్నట్లు గుర్తించారు. ఆ కలపను నేరుగా వ్యవసాయ పరికరాలకు ఉపయోగిస్తే పురుగు పడుతుందని నీటిలో కొన్నాళ్లు నానబెడితే బాగుంటాయని వేసి ఉంటారని అటవీశాఖ అధికారులు చెప్పారు. దీనిపై దర్యాప్తు కొనసాగిస్తామన్నారు.

**క్రైమ్.. కార్నర్**

## కర్ణాటక మద్యం పట్టివేత

**రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** అనంతపురం డీపీఈవో, ఎక్సైజ్ డీసీ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలో కర్ణాటక మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ మహేష్ కుమార్ తెలిపారు. శాంతినగర్‌లో కర్ణాటక మద్యం అమ్ముతున్న ఓ మహిళను అరెస్టు చేసి 102 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**రాయదుర్గం గ్రామీణం:** బీఎన్‌హళ్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ప్రమాదంలో గుమ్మఘట్ట మండలం బేలోడుకు చెందిన అంజి, ఆంజనేయులకు తీవ్ర గాయాలపాలయ్యారు. ఇందులో ఆంజనేయులు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం అనంతపురం తరలించారు.

## దాడి కేసులో ఐదుగురి అరెస్టు

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండ మండలం రేణుమాకులపల్లిలో ఈనెల 28న బోయ పాతకక్షల నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా ధనుంజయ అనే వ్యక్తిపై దాడిచేసిన ఐదుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ మహానంది తెలిపారు.

## చెట్టు నుంచి జారిపడి ఒకరి మృతి

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** చెట్టు మీది నుంచి వ్యక్తి జారిపడి మృతిచెందిన ఘటన ఉరవకొండ మండలంలో చోటుచేసుకుంది. సీఐ మహానంది తెలిపిన వివరాలిలా... కోనాపురానికి చెందిన బోయ రాజశేఖర్(32) ఆదివారం చింత కాయలు కోయడానికి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

## నియంత్రిక ధ్వంసం.. రాగి తీగ చోరీ

**కళ్యాణదుర్గం గ్రామీణం:** దాసంపల్లిలో రెండు నియంత్రికలను దొంగలు ధ్వంసం చేసి సామగ్రిని చోరీ చేసినట్లు సోమవారం స్థానిక రైతులు తిమ్మరాయుడు, జయన్న, ప్రవీణ్, ఎర్రిస్వామి, తిమ్మప్ప, వన్నూరప్ప వాపోయారు. ఈ ఘటనపై కళ్యాణదుర్గం గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

## ధాన్యం లారీ బోల్తా

**కణేకల్లు, న్యూస్‌టుడే:** గోనేహాళ్, గనిగెర క్రాస్ నడుమ సోమవారం కణేకల్లు క్రాసింగు వైపు వెళ్తున్న ధాన్యం లారీ అదుపుతప్పి బోల్తాపడింది. పెను ప్రమాదం తప్పడంతో డ్రైవరు, క్లీనరు సురక్షితంగా బయటపడ్డారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**కంబదూరు:** మహిళలు, చిన్నారులపై జరుగుతున్న సైబర్ నేరాలు, ఏటీఎం మోసాలపై జాగ్రత్తగా ఉండాలని 'శక్తి టీమ్' సభ్యుడు అక్కులన్న పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీవల్లి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## ఆలయాల ముస్తాబు

**కళ్యాణదుర్గం, రాయదుర్గం, బ్రహ్మసముద్రం:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలో వైష్ణవాలయాలు ముస్తాబు అయ్యాయి. ● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సహకారంతో ప్రతిఏడాది జనవరి 26వ నుంచి ప్రారంభమయ్యే కోట పట్టాభి రామస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ కోశాధికారి కార్తీక్, సభ్యులు ప్రదీప్, మల్లికార్జునబాబు, బుట్నా తిమ్మరాజులు తెలిపారు. ● వైష్ణవాలయాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉత్తర ద్వారదర్శనాలకు ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ● ఎర్రకొండాపురంలో శ్రీచిత్రలింగేశ్వర స్వామి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

## క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

**శెట్టూరు, న్యూస్‌టుడే:** జిల్లాస్థాయి పారా స్పోర్ట్స్ ఆటల పోటీల్లో శెట్టూరు ఆదర్శ, ఉన్నత పాఠశాలల్లో 7, 9 తరగతులు చదివే విద్యార్థులు ప్రతిభచాటారు. ఆదర్శ పాఠశాల నుంచి రాజేష్ పరుగు పందెంలో మొదటి స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో రేష్మభాను మొదటిస్థానం, శెట్టూరు ఉన్నత పాఠశాల వెంకటేష్ మొదటిస్థానంలో గెలుపొందినట్లు ప్రిన్సిపల్ అనుమాయమ్మ, హెచ్.ఎం ఫిరోజ్‌ఖాన్ సోమవారం తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో 2.వాణీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఉరవకొండ:** ఉరవకొండ మండలం షేక్షానుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, పట్టణంలోని ఏవీఆర్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జూడో లీగ్ జోనల్ పోటీల్లో ప్రతిభ చాటినట్లు హెచ్ఎంలు స్వర్ణలత, విక్రమ్ సోమవారం వేర్వేరుగా తెలిపారు. వారిలో కొంత మంది విద్యార్థులు బంగారు పతకాలను సొంతం చేసుకుని, సెంట్రల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

శెట్టూరు ఎంఈవో, హెచ్ఎంలతో విజేతలు

# వ్యర్థాలకు నిప్పు... భూసారానికి ముప్పు

నిప్పు పెట్టడంతో కాలుతున్న వరి దిబ్బలు

**న్యూస్‌టుడే, కణేకల్లు, రాయదుర్గం**

పరిశ్రమలు, వాహనాల రద్దీతోపాటు వాయు కాలుష్యంతో పట్టణాలు మగ్గుతున్నాయి. గ్రామాల్లో పచ్చని పంట పొలాల్లో ఈ సమస్యలు ఉండవు.. కాని కొన్నాళ్లుగా అవగాహన లేని కొందరు రైతులు మొక్కజొన్న, వరి కోతల అనంతరం వాటి వ్యర్థాలకు నిప్పుపెట్టి కాల్చుతుండటంతో ప్రాణవాయువు నాణ్యత తగ్గి, భూసారానికి ముప్పు వాటిల్లుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

***పంట సాగుకు ఆలస్యమవుతుందని..:*** నియోజకవర్గంలో హెచ్చెల్సీ ఆయకట్టు, వ్యవసాయ బోరు, చెరువుల కింద 50 వేల ఎకరాల్లో వరి, 25 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. యంత్రాలతో పంట కోత అనంతరం వరి దుబ్బలు, మొక్కజొన్న కయ్యలు, చొప్ప, పొలాల్లో పడిన వ్యర్థాలు కుళ్లడానికి చాలారోజులు పడుతుంది. రెండో పంటకు సన్నద్ధమయ్యే క్రమంలో సమయం చాలదని రైతులు పంట వ్యర్థాలకు నిప్పుపెట్టి కాల్చేస్తున్నారు. దీనివల్ల మిథేన్, కార్బన్‌డయాక్సైడ్ వంటి విషవాయువులు వెలువడి వాయు కాలుష్యం పెరుగుతుందని కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త మల్లికార్జున పేర్కొన్నారు. కోతల అనంతరం పొలాన్ని కలియదున్ని నీరుపెట్టి, సల్ఫర్, జిప్సమ్, సూపర్‌ఫాస్ఫేట్ చల్లుకుంటే అంతా కుళ్లిపోతుందన్నారు. తద్వారా వాయు కాలుష్యం ఉండదు. ఎరువుల వ్యయం తగ్గి, భూసారం కోల్పోకుండా ఆశాజనకంగా పంట దిగుబడులు పొందే అవకాశం ఏర్పడుతోందని శాస్త్రవేత్త చెప్పారు.

(c) eenadu

## నిబంధనలపై అవగాహన ముఖ్యం

ప్రసంగిస్తున్న ఏడీఆర్ఎం సుధాకర్

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** రైల్వేలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది రైల్వే నిబంధనల గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఏడీఆర్ఎం సుధాకర్ వెల్లడించారు. యూనియన్ డివిజనల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం అవగాహన సదస్సు జరిగింది. బోర్డు నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. కార్యక్రమంలో డీటీఓ ప్రసాద్, మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, అధ్యక్షుడు బి.ఎం. బాషా, కోశాధికారి శ్రీనివాసశర్మ, పింఛ నర్ల విభాగం కార్యదర్శి మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

# గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

## తాడిపత్రిలో రూ.5 కోట్లు దోపిడీ చేశారు!

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో స్థానిక సంస్థల ప్రతినిధుల పోర్టల్ సంతకాలతో రూ.5కోట్ల మేర దోపిడీ చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయించాలని ఆ ప్రాంత మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తాడిపత్రి ప్రాంత ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో కలిసి కలెక్టర్ ఆనంద్‌కు వినతి అందజేశారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం, సాధారణ, మండల నిధి నుంచి పనులు చేయకుండా నకిలీ బిల్లులు సృష్టించి, పోర్టల్ సంతకాలతో తినేశారని ఆరోపించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి సొంత వీవీసీ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ప్రభాకర్‌రెడ్డి.. పోలీసు ప్రైవేట్ లిమిటెడ్ అన్న పేరుతో ఈ దందా సాగిస్తున్నారని ఆరోపించారు.

### మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

**సమస్య:** గుంతకల్లులో డీఎంఎం రోడ్డులో కృపాకర్ మెడికల్ స్టోర్ దగ్గర ఉండే చెత్తకుండీ నిండిపోవడంతో పశువులు వచ్చి అక్కడే నిలుస్తున్నాయి - **నరేశ్, వాహన చోదకుడు.**

**సమాధానం:** చెత్తను తొలగిస్తాం, సమస్యను పరిష్కరిస్తాం - **వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** గుంతకల్లులో ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో రోగుల వార్డుల్లో కిటికీలు దెబ్బతినడంతో చలితో పాటు దోమల బెడదతో రోగులు అవస్థ పడుతున్నారని ఆదివారం 'ఆసుపత్రిలో కిటికీలకు అతుకులు' చిత్రవార్త 'ఈనాడు' లో ప్రచురితం కావడంతో సూపరింటెండెంట్ జయవర్ధన్‌రెడ్డి స్పందించారు. సమస్యను ఈఈ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వార్డుల్లో రోగులకు ఇబ్బందులు లేకుండా కిటికీలు కొత్తవి వేయించాలని ఇంజినీర్లను కోరినట్లు ఆయన వివరించారు.

## అక్రమార్కులను నిలువరించరా!

### పురపాలికకు రావాల్సిన రూ. 7.2 కోట్ల ఆదాయం స్వాహా

కొందరు కూరగాయల మార్కెట్‌లో రోడ్డు పక్కన వ్యాపారాలు కొనసాగిస్తూ..

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** కొందరు బహిరంగంగా మున్సిపాలిటీ ఆదాయానికి గండికొడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లు తెరవడంలేదు. దీంతో పురపాలికకు రావాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లింది. ఈ తతంగం గత 25 సంవత్సరాల నుంచి మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో కొనసాగుతోంది. అక్రమాలను నిలువరించడంలో యంత్రాంగం విఫలమవుతోంది.

**ఏళ్లుగా ఇదే తంతు**

మున్సిపల్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారాలు చేసుకునే వారి కోసం 25 సంవత్సరాల కిందట 11 షెడ్లను నిర్మించారు. వాటిని దాదాపు 40 విభాగాలు చేశారు. తరువాత వాటిని వేలం వేసి వ్యాపారులకు అందించారు. ఈ ప్రక్రియ అప్పట్లో అధికారులు చేపట్టకపోవడంతో రాజకీయ నాయకుల అండ ఉన్న కొందరు హస్తగతం చేసుకున్నారు. వీళ్లు వ్యాపారాలు నుంచి రూ. 2 నుంచి 4 లక్షల వరకు గుడ్‌విల్ వసూలు చేసుకుని ఒక్కో షెడ్డును వారికే నెలకు రూ. 4 నుంచి 8 వేలకు అద్దెకు ఇచ్చి వసూలు చేసుకుంటున్నారు. వారు ఒక్క పైసా కూడా చెల్లించకపోవడంతో పురపాలిక ఆదాయానికి ఇప్పటి వరకు రూ. 7.20 కోట్లు గండిపడింది. షెడ్లను అధికారులు అద్దెకిచ్చి ఉంటే ఈ ఆదాయం నేరుగా మున్సిపాలిటీకి లభించేది.

**చెప్పడమే తప్పా పనులేవీ?**

కూరగాయల మార్కెట్‌లో గతంలో ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పడమే కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కొందరు కూరగాయల వ్యాపారులు షెడ్లు నోచుకోక మార్కెట్‌లో జరుగుతున్న రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీని వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా జరుగుతున్న అక్రమాలకు అధికారులు చెక్‌పెట్టి, అందరూ మున్సిపల్ గదుల్లో వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

**మున్సిపల్ ఆదాయాన్ని పెంచుతాం**

- నయాం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్

షెడ్లను ఆక్రమించుకుని డబ్బులు వసూలు చేసుకుంటున్నారన్న విషయం నా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. పాతవి తొలగించి కొత్త షెడ్లను నిర్మిస్తాం. వీటిని వ్యాపారులకు ఇచ్చి మున్సిపల్ ఆదాయం పెంచేందుకు కృషిచేస్తాం. వ్యాపారుల నుంచి అద్దె వసూలు చేస్తున్న వారిని నిలువరిస్తాం.

## తెలుగు మహాసభలకు గుత్తి వాసి

నాగముని

**గుత్తి గ్రామీణం:** విద్యుత్తు శాఖలో సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్న గుత్తి వాసి నాగమునికి తెలుగు మహాసభల నుంచి ఆహ్వానం అందినట్లు తెలిపారు. వచ్చే నెల 3,4,5 తేదీల్లో గుంటూరులో తెలుగు మహాసభలు ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగనున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యంలో రాణిస్తుండటంతో ఈ అవకాశం వచ్చిందన్నారు. తెలుగు భాషను ప్రతి ఒక్కరు రక్షించుకోవాలని సూచించారు.

## రాయలసీమ దళిత సమ్మేళనం

ఐక్యత చాటుతున్న దళిత సంఘాల నాయకులు

**గుంతకల్లు:** దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు, రాయలసీమ దళిత సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. సోమవారం అంబేడ్కర్‌నగర్‌లోని సామాజిక భవనంలో రాయలసీమ దళితుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రమేశ్, చలపతి, భీమలింగ, నరసింహులు, ఆనంద్, గోపి, ప్రమీలా, సునిత తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన నమూనాల ప్రదర్శన

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** గుత్తి రోడ్డులో స్పిన్నింగ్ మిల్లు ఎయిడెడ్ హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి విజ్ఞాన నమూనాల ప్రదర్శన జరిగింది. ఎస్‌జేపీ ఉన్నత పాఠశాల, రాజేంద్ర ప్రసాద్ స్కూల్, బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ, దోనెలుడికి గ్రామం హైస్కూల్ కు చెందిన విద్యార్థులు తయారీ చేసిన నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. ఎంఈవో-1 మస్తాన్‌రావు, ఎంఈవో-2 సుబ్బరాయుడు ప్రదర్శనను పరిశీలించారు. మిల్లు స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రదర్శన నిర్వహించినట్లు ఎంఈవోలు తెలిపారు.

## అక్రమ నిర్మాణాలు తొలగించండి: సీపీఎం

**గుంతకల్లు:** గుంతకల్లు రైల్వే జంక్షన్ రోడ్డు పక్కన కొత్తగా నిర్మించిన షాపింగ్ గదులు రోడ్డును ఆక్రమించి నిర్మించారని సీపీఎం నాయకులు వెల్లడించారు. ఆక్రమణలను తొలగించాలని సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేసి, అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. వీటి నిర్మాణం వల్ల ప్రజలకు, వాహనాల రాకపోకలకు, ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. ఆందోళనా కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. శ్రీనివాసులు, నాయకులు మారుతిప్రసాద్, నాగరాజు, రమేశ్, రంగమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

## 2న పాసుపుస్తకాల జారీ

**యల్లనూరు:** మండలంలో రీ సర్వే చేసిన భూములకు తర్వాలో పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తామని తహసీల్దార్ రాము అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలిపారు. జనవరి 2నుంచి 9వతేదీ వరకు మండలంలో రీ సర్వే చేసిన గ్రామాలకు ఇస్తామని స్పష్టంచేశారు. ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తామని తహసీల్దార్ వివరించారు.

## రైతులకు న్యాయం చేస్తాం : ఎస్ఈ

**నార్పల న్యూస్‌టుడే:** మంగపట్నం వద్ద పులివెందుల బ్రాంచ్ కెనాల్ మూసివేయడంతో సోమవారం ముచుకుంటపల్లి, రామాపురం, కునుకుంట్ల గ్రామాలకు చెందిన రైతులు తుంపెర హెచ్చెల్సీ డీప్ కట్ వద్దకు భారీగా చేరుకున్నారు. దీంతో విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, జేఈ శ్రీనివాసులు అక్కడకు చేరుకొని రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ రావు మాట్లాడుతూ రైతన్నలకు అన్యాయం చేయబోమని, సాగునీరు ఇచ్చే బాధ్యత తమదని భరోసానిచ్చారు. పీఎల్‌బీ గేట్లను తెరిచి నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

## ప్రతిభా పాటవ పోటీలు

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** సమకాలీన అంశాలను తెలుసుకోవడానికి, పోటీపరీక్షల్లో రాణించడానికి వార్తాపత్రికలు చాలా ఉపయోగపడతాయని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అన్నారు. పాఠశాలలో సోమవారం 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో వర్తమాన అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన క్విజ్‌పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో విద్యార్థులు జ్యోత్స్న, ఇందుమతి, శ్వేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. వారికి ప్రధానోపాధ్యాయుడు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతకల్లు : పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు

తాడిపత్రి: బహుమతులు అందజేసిన ఉపాధ్యాయులు

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** తాడిపత్రిలోని విజయనగర్ కాలనీలో ఉన్న పద్మవాణి పాఠశాలలో సోమవారం ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు ప్రస్తుత అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో మొదటి, రెండవ, మూడవ బహుమతులు సాధించిన అర్జ్హాపర్వీన్, మహమ్మద్ ఇర్ఫాన్, తేజశ్వనీలకు పాఠశాల ఛైర్మన్ నాగపీరయ్య, పలువురు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

## వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

**పామిడి, న్యూస్‌టుడే:** పట్టణంలోని భోగేశ్వర చెన్నకేశవ స్వామి ఆలయం ముక్కోటి ఏకాదశి వేడుకలకు ముస్తాబు చేశారు. మంగళవారం ఉదయం తెల్లవారుజామున నుంచి స్వామివారికి అభిషేకం, విశేష పూజలు చేసి ఉత్తర ద్వారం నుంచి దర్శనం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణయ్య తెలిపారు.

**గుత్తి గ్రామీణం:** గుత్తి మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన ప్రసిద్ధ బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశికి ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో శోభ తెలిపారు. 30వ తేది నుంచి జనవరి 1వ తేది వరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు స్పష్టంచేశారు.

**గార్లదిన్నె గ్రామీణం:** కేశవాపురంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా మంగళవారం ఉదయం 5గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం ప్రారంభమవుతుందని, స్వామివారి పల్లకీ సేవ, అన్నదాన సదుపాయం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**గుంతకల్లు పట్టణం:** గుంతకల్లులో రాజేంద్రనగర్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఉదయం ఉత్తరద్వారంలో స్వామివారిని దర్శించుకోవడానికి ఆలయకమిటీ ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్‌టీ స్ట్రీట్‌లో కోదండరామ ఆలయంలో ఉత్తరద్వారంలో దర్శనం ఉంటుందని ఈవో పేర్కొన్నారు.

**పెద్దవడుగూరు:** ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు పెద్దవడుగూరులోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. మంగళవారం తెల్లవారుజామున నుంచి పూజలను చేపట్టనున్నట్లు ఆలయ అర్చకులు జయరామారావు తెలిపారు.

గార్లదిన్నె గ్రామీణం: కేశవాపురం ఆలయంలో సత్యనారాయణ స్వామి పూజ

పెద్దవడుగూరు: విద్యుత్తు దీపాలతో చెన్నకేశవస్వామి ఆలయం

## యాడికిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ తదితరులు

**యాడికి, న్యూస్‌టుడే:** చింతవనం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రధాన మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా మారడంతో దీనిని మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలని సోమవారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి అధికారులను, స్థానిక నాయకులను ఆదేశించారు. మొదట ఆంజనేయ స్వామి కాలనీలో రూ. 10లక్షలతో సీసీ రోడ్డు పనులు, వ్యవసాయ మార్కెట్‌లో దాదాపు రూ. 20లక్షలతో ఏర్పాటు చేసిన నీటి సరఫరా మోటార్లను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీయగా నేత కార్మికులకు 24వేలు ఇవ్వాలని, పింఛన్ కావాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో డీఈ యల్లమనాయుడు, ఎంపీడీవో వీరరాజు, జేఈ వరప్రసాద్, నాయకులు రంగయ్య, దడియాల ఆది, పరిమిశ్రీహరి, రుద్రమనాయుడు, చరణ్, క్లాస్ వన్ గుత్తేదారుడు హరినాథ్‌రెడ్డి, మాదాల అనిల్, తిరునాథ్‌రెడ్డి, దేవేంద్ర, విశ్వనాథ్, బొట్టుశేఖర్, విజయలక్ష్మి, బట్టా అనిత, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

**ఆటల్లో ప్రతిభ చాటితే అనేక అవకాశాలు**

**తాడిపత్రి:** విద్యార్థులు ఆటల్లో ప్రతిభ చాటితే అనేక అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక అరబిందో పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. పలు క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పాల్గొని, మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొంటే శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

## పాఠశాలకు అ'పూర్వ' సాయం

చెక్కును హెచ్‌ఎంకు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** గుంతకల్లులో ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న ఆడిటోరియం ఆధునికీకరణకు 1979-80 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. 1.55లక్షల విరాళ చెక్కును సోమవారం హెచ్‌ఎం మురళీకృష్ణకు అందించారు. దీంతో పాటు రూ. 50వేల విలువ చేసే ఫర్నిచర్‌ను అందజేశారు. దాతలు శ్రీనివాసులు, వినోద్‌కుమార్, గోవిందరాజులు, బాలాజీ, రంగనాథ్, ప్రసాద్, విజయానంద్, భాస్కర్, ధనుంజయ, లేపాక్షి, మురళి, వీరప్రతాప్, రామాంజినేయులు, సికే మురళి, మధు, గురురాజు వెంకటేశం సాయం అందించి గొప్ప మనస్సును చాటుకున్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మురుగు కూపంలా..

**తాడిపత్రి** మండలంలోని పెద్దపొలమడ గ్రామంలో ఖాళీ స్థలాలు మురుగు నిండిపోయాయి. కొన్ని నెలల కిందట కురిసిన వర్షాలకు, ఆ వరద ఎక్కడికి పోలేక మురుగు కూపంలా మారింది. దీంతో జమ్ము, ముళ్ల పొదలతో నిండి దుర్వాసన వస్తోంది. దీంతో విషపురుగులు సంచరిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు నిల్వ లేకుండా చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తాడిపత్రి పట్టణం

## కడుపు నొప్పితో బాలిక ఆత్మహత్య

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** గుంతకల్లులో మోదీనాబాదుకు చెందిన ఓ బాలిక కడుపు నొప్పి భరించలేక ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు షకినాబీ పెద్దకుమార్తె జుబేదాబేగం పట్టణంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గతకొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఇటీవల ఎక్కువ కావడంతో ఇంట్లో రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. సోమవారం ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుత్తు మోటారు తీగల చోరీ

**గార్లదిన్నె, న్యూస్‌టుడే:** మండల పరిధిలో ఎం.కొత్తపల్లి గ్రామంలో వ్యవసాయ పొలాల్లో విద్యుత్తు మోటార్లకు అమర్చిన తీగలను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. మురళీ, సూరి, మరో ఇద్దరి రైతుల పొలాల్లో తీగలను ఎత్తుకెళ్లినట్లు సోమవారం మోటారును ఆన్ చేయడానికి వెళ్లినప్పుడు గుర్తించామని వారు వివరించారు. గతంలోను ఇలాగే చోరీకి గురయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**పెద్దపప్పూరు:** మండలపరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## విద్యుత్తు సమస్యలు తీర్చండి

**గా**ర్లదిన్నె మండల పరిధిలోని సంజీవపురం గ్రామ సమీపంలో వ్యవసాయ తోటలకు వెళ్లే రోడ్డుపై విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో ఉండి, గాలి వీచిన సమయంలో వేలాడుతున్నాయి. ప్రమాదాలు జరగక ముందే ఈ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదే విధంగా కొట్టాలపల్లి గ్రామంలో పాతబడిన విద్యుత్తు స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, గార్లదిన్నె

## గురువు పాఠం.. చిట్టి చేతులతో సాయం!

అనాథకు దుప్పటి పంపిణీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న బాలబాలికలు చదువులోనే కాకుండా అభాగ్యులకు సాయం అందించడంలోనూ ముందున్నారు. పాత గుంతకల్లులో డాక్టర్ రాజేంద్రప్రసాద్ పురపాలిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు డబ్బుని పొదుపు చేసి ఉపాధ్యాయుడి సాయంతో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**ఉపాధ్యాయుడి ఆలోచనతో..**

సాటి మనుషులుగా సమాజంలో ఉన్న అభాగ్యులకు ఏదైనా సాయం చేయాలని ఉపాధ్యాయుడు ప్రతాప్ విద్యార్థులకు నిత్యం తెలిపేవారు. ఆయన మాటలకు స్ఫూర్తి పొందిన విద్యార్థులు రూపాయి నుంచి రూ. 10 వరకు పొదుపు చేసి, ఆ మొత్తాన్ని విరాళంగా అందిస్తున్నారు. పిల్లలు ఇచ్చిన డబ్బుకి తన వంతుగా మిగతా మొత్తాన్ని సమకూర్చుకుని నిరాశ్రయులకు దుప్పట్లు అందిస్తున్నారు.

★ 2018 ఏడాది నుంచి 2019 ఫిబ్రవరి నెల వరకు మహాత్మగాంధీ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయుడితో కలిసి అవసరమైన వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. తరువాత కోవిడ్ కారణంగా కొనసాగించలేకపోయారు. ప్రస్తుతం మళ్లీ ప్రారంభించారు.

★ ఆరు నెలల కిందట ప్రతాప్ ఆంగ్ల ఉపాధ్యాయుడిగా రాజేంద్రప్రసాద్ హైస్కూల్‌కి పదోన్నతిపై వచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఇక్కడి విద్యార్థులతో కొనసాగిస్తున్నారు. ఈ నెలలో 9వ తరగతి విద్యార్థులతో కలిసి అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పదో తరగతి సీ సెక్షన్ విద్యార్థులు అమృత వర్షిణి బాల కల్యాణ ఆశ్రమంలో 40 మంది విద్యార్థులకు కంచాలు అందజేశారు.

## ప్రపంచ గతిని మార్చిన శాస్త్రవేత్త చార్లెస్ బాబేజ్

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** కంప్యూటర్‌ను కనుగొని ప్రపంచ గతినే మార్చిన గొప్ప శాస్త్రవేత్త ఛార్లెస్ బాబేజ్ అని స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు లక్ష్మయ్య, కంప్యూటర్ సైన్స్ ఇన్‌ఛార్జీ పావని అన్నారు. కళాశాలలో బాబేజ్ జయంతి సందర్భంగా చిత్ర పటానికి నివాళి అర్పించారు. ప్రస్తుతం ప్రపంచాన్ని కంప్యూటర్ రంగం శాసిస్తోందని, పారిశ్రామిక రంగంలో కూడా చాలా ప్రధానంగా మారాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ రవిశంకర్‌శర్మ, అధ్యాపకులు వరలక్ష్మి, కిశోర్, శివశంకర్, శ్రీనివాసులు, జీవనజ్యోతి, విక్టోరియా రాణి, రాజశేఖర్ పాల్గొన్నారు.

## 'పాత వార్డెన్ కావాలి'

వసతిగృహం వద్ద నిరసన తెలుపుతున్న బాలికలు

**శింగనమల, న్యూస్‌టుడే :** మండల కేంద్రంలో కేజీబీవీ (టైప్ ఫోర్) వసతిగృహంలో పనిచేస్తున్న వార్డెన్ నల్లమ్మను బదిలీ చేయడంతో విద్యార్థినిలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మాకు పాత వార్డనే కావాలని, ఆమె స్థానంలో ఇతరులు వస్తే ఇబ్బందిగా ఉంటుందని వివరించారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు వసతిగృహం బయటే ఉండటంతో, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మీఓ నరసింహరాజు సమస్యను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బండారు శ్రావణితో వాట్సప్ కాల్ ద్వారా మాట్లాడించారు. సమస్యను పరిష్కరిస్తామని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో నిరసన విరమింపజేశారు. అలాగే నూతన వార్డన్, ట్యూటర్ వచ్చే వరకు కేజీబీవీ గీతరాణి ఇన్‌ఛార్జ్‌గా ఉంటారని ఎమ్మీఓ తెలిపారు.

## 'వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దు'

**శింగనమల, న్యూస్‌టుడే :** సీపీఐ (ఎమ్‌ఎల్), న్యూ డెమొక్రసి పార్టీ నాయకులు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయొద్దని మండల కేంద్రలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపి, తహసీల్దార్ శేషారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

## నూతన కాలమానిని ఆవిష్కరణ

**యాడికి, న్యూస్‌టుడే:** ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన కాలమానిని సోమవారం విద్యాధికారులు కాసెప్ప, సీతారామంజనేయులు ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఏపీటీఎఫ్ సంఘం ముందుంటుందని పేర్కొన్నారు. అనంతరం కాలమానితో పాటు డైరీలను పంపిణీ చేశారు. అధ్యక్షుడు నూర్ మహమ్మద్, కార్యదర్శి రామంజినేయులు, జిల్లా కౌన్సిలర్ నబీ రసూల్ సభ్యులు కృష్ణమూర్తి, చంద్రశేఖర్, రవికుమార్, జయరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సులభ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టండి

ఎంపీడీవో బారన్ సాహెబ్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**పెద్దవడుగూరు, న్యూస్‌టుడే:** గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రమైన పెద్దవడుగూరుకు వివిధ పనులపై వచ్చిన ప్రజలకు సౌకర్యంగా ఉండేలా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి దస్తగిరి, నాయకులు సోమవారం ఎంపీడీవో బారన్ సాహెబ్‌ను కోరారు. ముఖ్యంగా పలు గ్రామాల నుంచి పొదుపు సంఘాల మహిళలు బ్యాంకుల వద్దకు వస్తే అత్యవసర సమయంలో ఉపయోగించుకునేందుకు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. పంచాయతీ స్థలాల్లో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టి పరిష్కారం చూపాలని వారు కోరారు.

(c) eenadu

# అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

## 'అందరికీ అందుబాటులో ఉంటాం'

**రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే :** జిల్లా తెదేపా కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న పార్టీ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూలనాగరాజు, శ్రీధర్‌చౌదరి సోమవారం ఘనంగా సత్కరించారు. తెదేపా శ్రేణులతో కార్యాలయం కిటకిటలాడింది. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కమ్మ భవన్‌కు నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఆహ్వానించారు. కమ్మ సంఘం అధ్యక్షుడు నాగన్న, సీనియర్ నాయకులు సరిపూటి సూర్యనారాయణ, పూల నాగరాజు, శ్రీధర్‌చౌదరిలను శాలువా కప్పి సత్కరించారు. పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటామని సన్మాన గ్రహీతలు అన్నారు.

## ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

**తపోవనం (అనంత గ్రామీణం):** అప్రెంటిస్ శిక్షణ ఇస్తున్న వివిధ రకాల సంస్థల్లో మూడేళ్ల పని అనుభవం ఉన్న అభ్యర్థులు ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్షకు ప్రైవేటుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఐటీఐ ప్రిన్సిపల్ రాయపురెడ్డి తెలిపారు. ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాలతో వివిధ ట్రేడుల్లో పరీక్ష రాయడానికి అవకాశం కల్పించినట్లు ఆయన వివరించారు. ఐటీఐకి సంబంధించిన ట్రేడుల్లో మాత్రమే ప్రైవేటుగా పరీక్షలు నిర్వహించి ఎన్‌టీసీ సర్టిఫికెట్ జారీ చేయడానికి ప్రభుత్వం అద్భుత అవకాశం కల్పించినట్లు తెలిపారు. అభ్యర్థులు పనిచేసిన కంపెనీలు, ట్రేడ్ వివరాలతో పాటు సర్వీస్ సర్టిఫికెట్‌ను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. వచ్చే నెల 28లోగా అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, అప్రెంటిస్ సలహాదారుడిని సంప్రదించాలని ఆయన సూచించారు.

## తుది పోరుకు ఏఎస్‌ఏ, సదరన్ స్ట్రైకర్స్ జట్లు

**అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే :** ఏఎస్‌ఏ ఆహ్వాన క్రికెట్ పోటీల్లో అనంత స్పోర్ట్స్ అకాడమీ, సదరన్ స్ట్రైకర్స్ జట్టు విజయపరంపర సాగిస్తున్నాయి. సోమవారం జరిగిన సెమీఫైనల్ పోటీల్లోనూ ప్రత్యర్థులను చిత్తుచేసి ఫైనల్‌కు చేరాయి. అనంత క్రీడాగ్రామంలో జరిగిన తొలి సెమీస్‌లో సదరన్ జట్టు విజయవాడ జట్టుపై 4 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లకు 144 పరుగులు చేసింది. ఇంచార (28), వైదేహీ యాదవ్ (22) బ్యాటింగ్‌లో రాణించారు. తర్వాత బ్యాటింగ్ చేసిన సదరన్ జట్టు 6 వికెట్లకు 148 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. కొడాలి గీతిక (33), యషాదితి (33) రాణించి జట్టును గెలిపించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు యసాదితికి ప్రదానం చేశారు. మరో సెమీస్‌లో ఏఎస్‌ఏ జట్టు చిత్తూరు జట్టుపై 8 వికెట్ల తేడాతో సునాయసంగా నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 20 ఓవర్లలో 3 వికెట్లకు 101 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఏఎస్‌ఏ జట్టు 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. అర్షియా (54) అర్ధశతకంతో అలరించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకుంది. మూడోస్థానం కోసం నిర్వహించిన వర్గీకరణ పోటీలో విజయవాడ జట్టు చిత్తూరు జట్టుపై 9 వికెట్ల తేడాతో అవలీలగా గెలిచింది. ఇంచారా (71) అద్వితీయమైన బ్యాటింగ్‌తో అలరించి జట్టును గెలిపించింది. మూడోస్థానం సాధించిన విజయవాడ జట్టుకు ట్రోఫీని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ.యుగంధర్‌రెడ్డి, మాజీ రంజీ క్రికెటర్ షాబుద్దీన్, సీనియర్ అంపైర్ మహేష్, ఆర్డీటీ గ్రాస్‌రూట్ మేనేజరు వంశీకృష్ణల చేతుల మీదుగా అందజేశారు.

మూడోస్థానం సాధించిన విజయవాడ జట్టు

# అతిథి భవనం.. అసౌకర్యాలమయం

**అనంత నగరపాలక, న్యూస్‌టుడే :** నగరపాలక అతిథి భవనం అసౌకర్యాలకు నిలయంగా మారింది. పలువురు ముఖ్యమంత్రులు, గవర్నర్లు, మంత్రులు బస చేసిన అతిథి గృహం పాడుబడిన బంగ్లాను తలపిస్తోంది. ఐదేళ్లుగా పూర్తిగా విస్మరించారు. ఎవరు పడితే వారు కాసేపు సేద తీరేందుకు వినియోగిస్తున్నా పట్టించుకోవడం లేదు. అనంతపురం నగరపాలక సంస్థకు సంబంధించిన అతిథి భవనం అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఎదురుగా ఉంది. నిర్వహణ లేక పోవడంతో రోజు రోజుకు మరింత దయనీయంగా మారిపోతోంది. ఆంగ్లేయుల హయాంలోనే నిర్మించిన భవనానికి 1997లో అప్పటి మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్ చౌదరి హయాంలో ఆధునీకరించారు. దీనికి తోడు అదనపు గదులు నిర్మాణం చేపట్టారు. అవన్నీ వినియోగంలో లేవు.

● రెండేళ్ల కిందటే పాలకవర్గం ఆధ్వర్యంలో అతిథి గృహాన్ని పరిశీలించి కొత్తది నిర్మాణం చేయాలని ప్రతిపాదించినా ఇప్పటి దాకా కార్యరూపం దాల్చలేదు.

### గోడలు రంగులు వెలిసి

అతిథి గృహంలో కూడా పలు పాత వస్తువులు గదుల్లో పడేశారు. ఏళ్లుగా వాడిన కుర్చీలు, ఇతరత్రా సామాన్లు ఉంచారు. గోడలు రంగులు వెలిశాయి. గోడల మీద మొక్కలు పెరిగాయి. గదులు కూర్చోవడానికి అనువుగా లేవు. వినియోగంలోకి తీసుకొస్తే ఉపయుక్తంగా ఉన్నా నగరపాలక పట్టించుకోవడం లేదు.

### వ్యర్థాలకు నిలయంగా

అతిథులు సేద తీరేందుకు నిర్మించిన భవనం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఖాళీ ప్రదేశంలో నగరంలో తొలగించిన విభాగినులు, పాత పైపులు, చెత్త బిన్నులు, ఇతరత్రా వ్యర్థాలు పడేశారు. ఏళ్ల తరబడి అక్కడే ఉండటంతో అందులో విష పురుగులు సంచరిస్తున్నాయి. ఎక్కడైనా ఖాళీ ప్రదేశంలో ఉంచకుండా అతిథి గృహంలో ఉంచడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 8008573011

రాంనగర్: 8008573001

కమలానగర్: 7032975446

**సమస్య :** మారుతీనగర్ గుడ్‌చిల్డ్రన్ పాఠశాల సమీపంలో విద్యుత్తు స్తంభం నంబరు ఈ-30/బి9కు ఉన్న వీధి దీపాలు నెలరోజులుగా వెలగడం లేదు. **- నాగేశ్వరరావు**

**సమాధానం :** సిబ్బందిని పంపి వెంటనే వీధి దీపం వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

సమస్య : రాంనగర్ ఆర్డీ కార్యాలయం సమీపంలో ఉన్న సచివాలయం పక్కనే చెత్త పడేస్తున్నారు. **- నరహరి**

**సమాధానం :** వీలైనంత త్వరగా చెత్తను తొలగిస్తాం.

**(పై ప్రశ్నలకు ఎంహెచ్‌ఓ పావని, డీఈ దాక్షాయిణి సమాధానాలు ఇచ్చారు.)**

– న్యూస్‌టుడే, అశోక్‌నగర్

## రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవోగా హఫీజ్‌బాషా

**జేఎన్‌టీయూ:** జేఎన్‌టీయూలోని రతన్ టాటా ఇన్నోవేషన్‌హబ్ నూతన సీఈవోగా హఫీజ్‌బాష నియమితులయ్యారు. ఆయన సోమవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జనవరి 5 నుంచి ఆయన అధికారిక బాధ్యతలు స్వీకరించనున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పండ్లతోటలు, సూక్ష్మనీటి పారుదల, పునరుత్పాదకశక్తి ఆధారిత స్టార్టప్‌లపై దృష్టి సారించాలన్నారు. రైతుల ఆదాయం పెంపు, నీటి వినియోగసామర్థ్యం మెరుగుదల, శాశ్వత అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

## అమ్మఒడి వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ

**అనంత సాంస్కృతికం :** నగరంలోని హెచ్ఎల్సీ కాలనీ కొల్హాపూర్ మహ లక్ష్మీ ఆలయ నిర్వాహకులు ఆకుతోటపల్లి అమ్మఒడి వృద్ధాశ్రమంలో సోమవారం దుప్పట్ల పంపిణీ చేశారు. ఎజీఎస్ఆర్‌ఆర్గనైజేషన్ సౌజన్యంతో ఆశ్రమంలోని 25 మందికి అందజేశారు. మహాలక్ష్మి ఆలయంలో భజనలు, భక్తి గానలహరి నిర్వహించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి దేవనూర్ సుందరం విజయకుమార్, ఎస్‌జీఎస్ఆర్ వ్యవస్థాపకురాలు ఏజీ ప్రమీలమ్మ,సాయి హర్షిత్, నాగప్రసాద్, రామకృష్ణ, శివమ్మ చేయూతనందించారు.

## ప్రతిభా పాటవ పోటీలు

కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో విజేతలతో ప్రిన్సిపల్ నాగరత్నమ్మ, అధ్యాపకులు

**అనంతపురం విద్య, న్యూస్‌టుడే:** ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థులకు విజ్ఞాన వారధులని పలువురు ప్రధానాచార్యులు పేర్కొన్నారు. ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో జీసస్‌నగర్‌లోని భాష్యం, నీరుగంటివీధిలోని లక్ష్మి పాఠశాల, కోవూరునగర్‌లోని విశ్వభారతి, సప్తగిరి సమీపంలోని కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా జనరల్‌నాలెడ్జి, వర్తమాన అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

**విజేతలు వీరే:** భాష్యం పాఠశాలలో జరిగిన పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని మాధుర్య ప్రథమ, 7వ తరగతి విద్యార్థులు హర్షవర్ధన్ ద్వితీయ, మోక్షసాయి తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్ బాలకృష్ణ బహుమతులు అందజేశారు.

● లక్ష్మీ పాఠశాలలో జరిగిన పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు జోషిత ప్రథమ, మహమ్మద్ హుసేన్ రబ్బానీ ద్వితీయ, నవంతిక తృతీయ బహుమతులు అందుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ ప్రార్థనారెడ్డి బహుమతులు అందజేశారు.

● విశ్వభారతి పాఠశాలలో జరిగిన పోటీల్లో 9వ తరగతి విద్యార్థి వర్ధన్‌సాయి ప్రథమ,చ 8వ తరగతి విద్యార్‌తలు గీతికసాయిశ్రీ ద్వితీయ, అక్షిత్‌రెడ్డి తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు కరస్పాండెంట్ సుగుణాకర్ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయురాలు తులసి తదితరులు పాల్గొన్నారు.

● కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన పోటీల్లో ఇంటర్ విద్యార్థులు భావనా ప్రథమ, నజిమా ద్వితీయ, స్నేహప్రిస్కిల్లా తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ నాగరత్నమ్మ బహుమతులు అందజేశారు.

బహుమతులతో భాష్యం పాఠశాల విజేతలు

లక్ష్మీ పాఠశాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

విశ్వభారతి పాఠశాలలో విజేతలకు బహుమతులు

## 'పీడీని విధుల్లో నుంచి తొలగించాల్సిందే'

**అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే:** కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా, అనుచితంగా ప్రవర్తిస్తున్న పీడీ శ్రీనివాస్ ప్రసాద్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్‌బీ, వైకాపా విద్యార్థి, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం.. తదితర ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అనంత కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. తొలుత ఆ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రధాన గేటుముందు నడిరోడ్డుపై బైఠాయించి నిరసన చేశారు. ఐకాస నాయకులు మాట్లాడుతూ పీడీ వ్యవహారంపై ఇప్పటికే అనేక దఫాలుగా ఫిర్యాదు చేశామని, స్వయంగా విద్యార్థినులే లిఖిత పూర్వక ఆర్జేడీకి ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఓబిలేసు, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు చంద్రశేఖర్ యాదవ్, సురేశ్ యాదవ్, విజయ్, వినోద్, కైలాష్ పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘాల ఐకాస నాయకులు

## 'పని హక్కును కాలరాసేందుకు కుట్ర'

**ఆజాద్‌నగర్ (అనంతపురం):** 2005-ఉపాధి చట్టాన్ని బలోపేతం చేసి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కేశవరెడ్డి డిమాండ్ చేశారు. కొత్త ఉపాధి చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ వచ్చే జనవరి 10న కర్నూలులో జరిగే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను నాయకులు సోమవారం నగరంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనం ఆవరణలో ఆవిష్కరించారు. నాయకులు తిమ్మరాయుడు,సూర్యనారాయణ, నాగేంద్ర, రామంజి, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ ర్యాలీ విజయంతో ప్రశంసలు

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఇటీవల జిల్లాలో 'డ్రగ్స్ వద్దు బ్రో- సైకిల్ తొక్కు బ్రో' అవగాహన ర్యాలీ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, యువకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రాలను ఎస్పీ జగదీశ్ సోమవారం తన ఛాంబర్‌లో అందజేశారు. ర్యాలీని జిల్లా పోలీస్ శాఖ , ప్రత్యేంగా ఈగల్ టీమ్‌తో కలిసి సమన్వయంగా నిర్వహించారు.

## 'అనంత నగరంలో కప్పం చెల్లించాలి'

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:**అనంత నగరంలో పరిపాలన పూర్తిగా కుంటుపడింది. ప్రతి దానికి కూటమి నేతలకు కప్పం చెల్లించాల్సి వస్తోంది. కమిషనర్ ఎమ్మెల్యేకు తొత్తుగా వ్యవహరిస్తూ నగర పారిశుద్ధ్యాన్ని గాలికి వదిలేశారని అనంత మేయర్ వసీం, ఉప మేయర్ వాసంతి సాహిత్య, తదితరులు ఆరోపించారు. మేయర్, వైకాపా నాయకులు కలిసి అనంత నగర సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించారు. రోడ్లు, డ్రైనేజీ.. వంటి పనులకు కేవలం భూమి పూజలు చేసి కూటమి నేతలు చేతులు దులుపుకొంటున్నారు. ఎక్కడా పనులే మొదలు కాలేదన్నారు.

## కొత్త ఏడాది ఆగమనవేళ సందడి

**అనంతపురం విద్య, న్యూస్‌టుడే:** రాంనగర్‌లోని క్రిసెంట్ పాఠశాలలో నూతన ఏడాదికి స్వాగతం పలుకుతూ గోల్డెన్‌గ్లోరీ పేరుతో చిన్నారులు సందడి చేశారు. 2025 సంవత్సరానికి వీడ్కోలు, 2026 సంవత్సరానికి స్వాగతం చెబుతూ ఈ కార్యక్రమం చేపట్టారు. క్రిసెంట్ విద్యాసంస్థల అధినేత కేఎం సఫీవుల్లా, వైస్‌ఛైర్మన్ షమీం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారులు వివిధ వేషధారణలు, నృత్యాలతో సందడి చేశారు.

క్రిసెంట్ పాఠశాలలో వివిధ వేషధారణలో చిన్నారులు

## వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

**అనంత సాంస్కృతికం:** వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు నగరంలోని దేవాలయాలన్నీ సర్వాంగ సుందరంగా సిద్ధమయ్యాయి. ప్రధానంగా వైష్ణవాలయాల్లో ఆయా ఏర్పాట్లతో కళకళలాడుతున్నాయి. పాతూరు లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అర్ధరాత్రి 1గంటకు, అశోక్‌నగర్ సత్య దేవాలయం, ఆర్ఎఫ్ రోడ్డు, రాంనగర్ వేంకటేశ్వరాలయాల్లో 4 గంటలకు, శివశక్తి ఆలయంలో 4.30కు, హౌసింగ్‌బోర్డు భక్తాంజనేయ స్వామి దేవాలయం, జడ్పీఎదురు సాయి గీతామందిరంలో 5గంటలకు, హౌసింగ్‌బోర్డు వేంకటేశ్వరాలయం, శివబాలయోగి ఆశ్రమంలో 5.30కు,కొత్తూరు వాసవీ దేవాలయంలో 6గంటలకు ఉత్తరద్వార దర్శనం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తి గీతాలను ఆలపించేందుకు ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేశారు. సత్యదేవాలయలో సాయంత్రం 5గంటలకు శ్రీనివాస కళ్యాణోత్సవం జరుగుతుంది.

భద్రతా ఏర్పాట్లపై డీఎస్పీ శ్రీనివాసరావుతో చర్చిస్తున్న ఎస్పీ జగదీశ్

**అనంత నేరవార్తలు:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండటంతో ఎస్పీ జగదీశ్ సోమవారం అనంతపురం నగరంలోని పురాతన లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానాన్ని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన భద్రత, బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

## వంద రోజుల ప్రణాళిక అమలవ్వాలి : డీఈవో

**అనంతపురం విద్య, న్యూస్‌టుడే** : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం మెరుగుపడాలని డీఈవో ప్రసాద్‌బాబు ఆదేశించారు. అనంత గ్రామీణం పాపంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో సోమవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశాల్లోని ప్రశ్నలను అడిగారు. పిల్లలు పరీక్షలు రాస్తున్న తీరును ఆరా తీశారు.

విద్యార్థుల అభ్యసనపై ఆరా తీస్తున్న డీఈవో ప్రసాద్‌బాబు

## మా భూమిని కాపాడండయ్యా!

మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** వందేళ్ల కిందట తమ వంశీకులు కొనుగోలు చేసిన భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని నగరానికి చెందిన జీటీ నాగప్ప కుటుంబీకులు ఎస్పీ జగదీశ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితుల్లో ఒకరు రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. నగరంలోని పాపంపేట పంచాయతీలోని తపోవనం సమీపంలో తమకు తాత ముత్తాతల వారసత్వంగా వచ్చిన 43 సెంట్ల భూమి ఉందన్నారు. సదరు భూమికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయన్నారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికిరాత్రే తమ భూమి చుట్టూ కంచె వేశారని వాపోయారు. భూమిని ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్ పర్సన్ తుల్జాపూర్ స్వప్న పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

**అనంత నగరపాలక, న్యూస్‌టుడే :** నగరంలోని పలు ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ కమిషనరు పావని, ఎస్ఈ రాజశేఖర్ ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో స్థలాలు సర్వే చేయడంలో జాప్యం అవుతోందని బాధితులు ఫిర్యాదు చేశారు. నగరపాలక షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో గడువు ముగిసిన వాటికి వేలం వేయాలని, ఎస్సీ,ఎస్టీలకు ప్రాధాన్యమివ్వాలని రామాంజినేయులు, యల్లమ్మలు కోరారు. నగరంలోని డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని, టిడ్కో ఇళ్లకు చెల్లించిన సొమ్ము వెనక్కి ఇప్పించాలని బాధితులు అర్జీలు అందజేశారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనరు పావని, ఎస్ఈ రాజశేఖర్

## సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి

**ఆర్కేనగర్ (అనంతపురం),న్యూస్‌టుడే :** సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం కోరుతూ జిల్లా కేంద్రంలో కార్మికులు .. నాయకులతో కలిసి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జెండాలతో నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడారు. విశాఖపట్నంలో జనవరి 4న బహిరంగ సభ ఉంటుందన్నారు. నాయకులు ముర్తుజా, గోపాల్, వెంకటనారాయణ, ఎర్రిస్వామి, తిరుమలేశు, నల్లమ్మ, వరలక్ష్మి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అత్తారింటి వేధింపులకు వివాహిత బలి

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే :** అత్తారింట్లో వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం నగరంలోని త్రీటౌన్ పరిధిలో సోమవారం జరిగింది. ధర్మవరం పట్టణానికి చెందిన ఖైరూన్‌బీ (28)ని నగరంలోని రంగస్వామినగర్‌కు చెందిన పప్పూరు అహమ్మద్‌కి ఇచ్చి వివాహం జరిపించారు. కొంతకాలం కాపురం సవ్యంగా సాగినా ఆ తర్వాత అత్త , భర్త వేధింపులు ప్రారంభించారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న తన అమ్మను సరిగా చూసుకోలేదని భర్త శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలో వేధింపులకు తాళలేక మానసికంగా కలత చెందిన ఖైరూన్ బీ సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో సీలింగ్ ఫ్యానుకు ఉరిబిగించుకుని బలవన్మరణానికి పాల్పడింది. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించినా బతకలేదు. మృతురాలి తల్లి రసూల్‌బీ ఫిర్యాదుతో మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సాగాలి

**కనగానపల్లి, న్యూస్‌టుడే** : పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని రాష్ట్ర అకాడమిక్ మానిటరింగ్ అధికారి సలీమ్ పేర్కొన్నారు. సోమవారం ఆదర్శపాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలకు ఉదాహరణలను జోడించి బోధించినప్పుడే పిల్లల మెదడులో నిక్షిప్తమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సూచిస్తున్న రాష్ట్ర ఏఎంఓ సలీమ్

## పరిశోధనల భవన నిర్మాణానికి శంకుస్థాపన

**ఎస్కేయూ, న్యూస్‌టుడే :** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీ భవన నిర్మాణానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య అనిత సోమవారం భూమి పూజ నిర్వహించారు. పీఎం ఉషా నిధులు రూ.5కోట్లతో ఈ భవనం నిర్మించనున్నారు. రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పలువురు ప్రిన్సిపాళ్లు, ఆచార్యులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** అనంతపురంలోని సోమనాథనగర్‌లో ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. రహమత్‌నగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ (21) సోమనాథనగర్‌లో ఓ ఇంటిపై బ్యానర్ కడుతుండగా పైభాగంలో ఉన్న విద్యుత్తు తీగలు చేతులు తగిలి అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

## అండర్ పాస్‌తో అందరికీ అగచాట్లు

**తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే:** ఎన్‌హెచ్‌ఏ ఇంజినీర్ల అనాలోచిత నిర్మాణం వల్ల అందరికీ అగచాట్లు తప్పడం లేదు. అనంతపురం గ్రామీణ మండలం పాములరాయి నుంచి 544-డి అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించారు. జాతీయ రహదారి-44 నుంచి కిలో మీటరు దూరంలో అండర్ పాస్ రహదారి నిర్మించారు. విచిత్రమేమింటే ఈ వంతెన నిర్మాణ ఎత్తు తక్కువగా ఉన్నందున అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాములరాయి నుంచి సర్వీస్ రోడ్డుపై పొలాల దగ్గరకు వెళ్లే ఎద్దుల బండ్లు, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు ఈ సబ్‌వే కింద రావాలి. రైతుల వరి పొలాల నుంచి వచ్చే నీరంతా సబ్‌వేలో చేరుతోంది. ఆ నీరు ఎటూ వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో అక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. ఎద్దుల బళ్లు ఇరుక్కుపోతున్నాయి. ఎన్‌హెచ్‌ఏ అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది.

ఇరుక్కుపోయిన ఎద్దుల బండిని తోస్తున్న రైతు

## కల్వర్టుపై ఇనుప కడ్డీలు!

అసలు సమస్య కంటే కొసరు సమస్య ప్రమాదకరంగా మారింది. నగరంలోని రాంనగర్ సిద్ధార్థ ఉద్యానం పడమర వైపు నుంచి రుద్రంపేటకు తిరిగే కూడలిలో ఇనుప కడ్డీలు ప్రమాదకరంగా మారాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చే కార్లు, ద్విచక్రవాహనాలు కల్వర్టు మీద వెళతాయి. పూర్తిగా దెబ్బతిని కడ్డీలు బయటకు వచ్చాయి. వాహనాలు వెళ్లే సమయంలో అవి గుచ్చుకుంటే ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదాలను తిప్పించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

## జాతీయస్థాయి పోటీలకు నూతిమడుగు విద్యార్థులు

**ఎస్కేయూ, న్యూస్‌టుడే :** కంబదూరు మండలం నూతిమడుగు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 5 మంది విద్యార్థులు జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఒకేపాఠశాల నుంచి 5 మంది విద్యార్థులు ఎంపికకావడం విశేషం. ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సంజీవరాయుడు, దాదావలి ఆ విద్యార్థులను అభినందించారు.

● పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కీర్తన అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. బాలిక జనవరి 17 నుంచి దిల్లీలో జరిగే జాతీయస్థాయి అండర్-14 స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొంటుంది.

● అండర్-19 బేస్బాల్ పోటీలకు 9వ తరగతి చదువుతున్న గుర్నాథ్, అఫ్రీన్‌బాను ఎంపికయ్యారు. దిల్లీలో జనవరి 24 నుంచి జరిగే జాతీయస్థాయి పోటీలకు వెళ్తారు.

● అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీలకు 10వ తరగతి చదువుతున్న మనోజ్ ఎంపికయ్యాడు. పోటీలు జనవరి 30 నుంచి మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరగనున్నాయి.

● అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలకు 10వ తరగతి విద్యార్థిని రాధిక ఎంపికైంది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాస్పూర్‌లో ఫిబ్రవరి 4 నుంచి జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు సంజీవరాయుడు, దాదావలి

(c) eenadu

## శాస్త్రోక్తం.. అధ్యయనోత్సవం

పవిత్ర ధనుర్మాసంలో భాగంగా పదకొండో రోజైన సోమవారం ఒంటిమిట్ట కోదండ రామాలయంలో అధ్యయనోత్సవాలు అద్భుతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత సీతారామ లక్ష్మణమూర్తులను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి రంగ మండపంలో కొలువుదీర్చారు. రుగ్వేదం, యజుర్వేదం, సామ వేదం, అథర్వణ వేదాలను శాస్త్రోక్తంగా పారాయణం చేశారు. రామాలయం వెలుపల రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. కనులారా తిలకించి పారవశ్యం చెందారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

## హాకీ.. పోటా పోటీ

అస్మిత లీగ్‌లో ఇండియా సౌత్ జోన్ సబ్ జూనియర్ బాలికల హాకీ పోటీలు పులివెందులలో హోరాహోరీగా సాగుతున్నాయి. కేరళ - కర్ణాటక, తమిళనాడు - ఆంధ్రప్రదేశ్ జట్లు సోమవారం నాలుగో రోజు తలపడ్డాయి. కేరళపై కర్ణాటక ఏడు గోల్స్ తేడాతో విజయం సాధించింది. తమిళనాడుపై ఆంధ్రప్రదేశ్ జట్టు ఆరు గోల్స్ చేసి విజయం సాధించింది. - న్యూస్‌టుడే, పులివెందుల

## మారిన కడప గడప

### 36 నుంచి 40కి పెరిగిన మండలాలు

ఈనాడు, కడప: మదనపల్లె కేంద్రంగా మరోమారు ఆవిర్భవించిన అన్నమయ్య జిల్లాతో వైఎస్సార్ కడప స్వరూపంలోనూ మార్పుచేర్పులు చోటుచేసుకున్నాయి. వైకాపా హయాంలో 2022లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. అప్పట్లో పులివెందుల, కమలాపురం, కడప, మైదుకూరు, బద్వేలు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాలతో వైఎస్సార్ కడపను ఏర్పాటు చేశారు. 11,228 చదరపు కి.మీ విస్తీర్ణంలో 36 మండలాలు, ఒక కడప కార్పొరేషన్, 7 పురపాలక సంఘాలు, 557 గ్రామ పంచాయతీలు, 20.61 లక్షల జనాభాతో అవతరించింది. తాజా మార్పులతో ప్రస్తుతం 36 మండలాలు ఉండగా.. ఇకపై ఆ సంఖ్య 40కి పెరగనుంది. ● అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య కూడా ఏడు నుంచి ఎనిమిది కానుంది. రాజంపేటను కడప జిల్లాలో కలపడంతో ఈ సంఖ్య పెరిగింది. పురపాలక సంఘాలు కూడా 7 నుంచి 8 కానున్నాయి. కొత్తగా చేరిన మండలాల్లో రాజంపేట, నందలూరు, సుండుపల్లి, వీరబల్లి ఉండనున్నాయి. రాజంపేట రెవెన్యూ డివిజన్లో ఆరు మండలాలు మాత్రమే ఉండనుండగా.. అట్లూరును చేర్చాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకు సంబంధించిన తుది నోటిఫికేషన్ బుధవారం వెలువడనుంది. గతంలో రాజంపేట నియోజకవర్గం ఉమ్మడి కడప జిల్లాలోనే ఉండేది. తాజా మార్పులతో మళ్లీ కడప చెంతనే చేరినట్లైంది.



# మదనపల్లె కేంద్రంగా అవతరించే అన్నమయ్య

### 5 నియోజకవర్గాలు.. 25 మండలాలు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- మదనపల్లె గ్రామీణ: గత వైకాపా ప్రభుత్వం హేతుబద్ధత లేకుండా ఆరు నియోజకవర్గాలతో 2022లో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేసింది. ఆ పైల్లో పార్లమెంట్ కేంద్రంగా జిల్లా కేంద్రాలు ఏర్పాటయ్యాయి.. అన్నమయ్యలో మాత్రం రాజంపేటను కాదని రాయచోటిలో నెలకొల్పారు. వైకాపా చేసిన ఆ తప్పిదాన్ని ప్రజాభిప్రాయ సేకరణ మేరకు కూటమి ప్రభుత్వం సరిదిద్దాల్సిన పరిస్థితి తలెత్తింది. జిల్లా కేంద్రం ఏర్పాటు చేసిన మూడేళ్లకే మార్పు చేయాల్సిన ఆవశ్యకత తెలిపింది. ఈ నేపథ్యంలో మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా మార్పుచేర్పులతో కొత్తగా మళ్లీ అవతరించనుంది. ఈ మేరకు ఆంగ్ల నూతన సంవత్సరమైన జనవరి 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించే దిశగా అధికారులు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు.

● పునర్విభజనలో భాగంగా మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాలతో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేస్తూ.. రాయచోటి స్థానంలో మదనపల్లెను జిల్లా కేంద్రంగా నిర్ణయిస్తూ రాష్ట్ర మంత్రి మండలి సోమవారం ఆమోదించింది.

● మంత్రి మండలి నిర్ణయంతో ఇప్పటి వరకు రాయచోటి కేంద్రంగా ఉన్న జిల్లాలోని రైల్వేకోడూరు తిరుపతిలో విలీనమవుతుంది. రాజంపేట కడపలో కలుస్తుంది.

● కొత్తగా చిత్తూరు నుంచి పుంగనూరు అన్నమయ్యలోకి వచ్చి చేరింది.

● మొత్తంగా మదనపల్లె కేంద్రంగా జిల్లా 25 మండలాలతో జిల్లా ఏర్పాటవుతోంది. ● మదనపల్లె, రాయచోటితో పాటు కొత్తగా ఏర్పాటయ్యే పీలేరు రెవెన్యూ డివిజను జిల్లాలో ఉండనున్నాయి.

● రాయచోటి(6), పీలేరు(6), తంబళ్లపల్లె(6), మదనపల్లె(3), పుంగనూరు నుంచి సదుం, సోమల, పుంగనూరు, చౌడేపల్లి మండలాలు అన్నమయ్య జిల్లాలో చేరనున్నాయి.

● పుంగనూరులోని మరో రెండు మండలాలైన రొంపిచెర్ల, పులిచెర్ల చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోనే ఉండనున్నాయి.



అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం పేరుతో బోర్డు ఏర్పాటుకు ప్రస్తుతమున్న బోర్డును తొలగిస్తున్న కూలీలు

### ● ఖరారైన కార్యాలయాలు!

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వేదికగా నూతన కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు కానుంది. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయ ముఖద్వారం ఉన్న బోర్డును సోమవారం తొలగించారు. కొత్త బోర్డు ఏర్పాటు చేయనున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని డీడీవో భవనంలోకి మార్పు చేయనున్నారు. ఎస్పీ కార్యాలయాన్ని బీటీ కళాశాల లేదా రుక్మిణీదేవి అరుందలే కాలేజ్(రేస్ కళాశాల)లో ఏర్పాటు చేసేలా ప్రతిపాదించారు. రాయచోటి కేంద్రంగా ఉన్న జిల్లాలో పని చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, వివిధ విభాగాధిపతులు ఇకపై మదనపల్లె నుంచి విధులు నిర్వహిస్తారు.

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలతో ర్యాలీ చేస్తున్న నాయకులు

## కోడూరులో క్షీరాభిషేకాలు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: జిల్లాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలో కలుపుతూ రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడంపై రైల్వేకోడూరు ఐకాస నాయకులు పట్టణంలో సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఐకాస అధ్యక్షుడు ముత్యాల పెంచలయ్య, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ఆధ్వర్యంలో టోల్‌గేట్ వద్ద బాణసంచా కాల్చారు. రంగులు చల్లుకుని సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి ర్యాలీ నిర్వహించారు.

ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, తెదేపా నాయకులు

## రాయచోటిలో నిరసన సెగలు

రాయచోటి, రామాపురం, న్యూస్‌టుడే: రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలని కోరుతూ రాయచోటిలో సోమవారం ఆందోళనలు కొనసాగాయి. తెదేపా, వైకాపా, కాంగ్రెస్, ఇతర పార్టీల నేతలతో పాటు పట్టణంలోని అన్ని విద్యా సంస్థల విద్యార్థులు, కార్మిక, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తరలి వచ్చారు. మదనపల్లె వద్దు.. రాయచోటి ముద్దు అంటూ నినదించారు. శివాలయం కూడలి నుంచి కర్నూల్- చిత్తూరు జాతీయ రహదారిపై భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. నేతాజీ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ● మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అధ్వర్యంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు రామాపురంలో ఆందోళన చేశారు. కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిపై బైఠాయించారు. మదనపల్లె వద్దు.. రాయచోటినే కొనసాగించాలని నినాదాలు చేశారు.

## కార్గోతో ఆర్టీసీకి ఆదాయం

పీలేరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా 85 పట్టణాల్లో డోర్ డెలివరీ సౌకర్యం కల్పించినట్లు జిల్లా కార్గో అధికారి శరత్‌బాబు తెలిపారు. పీలేరు కార్గో కార్యాలయంలో డోర్ డెలివరీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు డోర్ డెలివరీ సౌకర్యం ఉంటుందన్నారు. యాభై కిలోల వరకు బస్టాండ్ నుంచి పది కిలో మీటర్ల పరిధి వరకు అందించనున్నట్లు చెప్పారు. సామగ్రికి పూర్తి భద్రత ఉంటుందని.. పండ్లు, నిషేధిత వస్తువులను తీసుకోమని తెలిపారు. పీలేరు, రాయచోటి, మదనపల్లె-1, మదనపల్లె-2, రాజంపేట డిపోల్లో మదనపల్లె-2 డిపో నుంచి కార్గో ఆదాయం ఎక్కువగా వస్తోందని వివరించారు. ఆర్టీసీ బస్సుల పైకప్పును కూడా ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకు ఇస్తామని.. ఏజెంట్లు కూడా కార్గో వస్తువులను బుక్ చేయవచ్చని తెలిపారు. కార్గో బుకింగ్‌తో జిల్లాలో నెలకు రూ. 30 లక్షల వరకు ఆదాయం వస్తోందని వివరించారు. శరత్‌బాబు వెంట పీలేరు ఆర్టీసీ సీఐ ధనంజయులు, బస్టాండ్ మేనేజర్ బాబు నాయక్, కార్గో సిబ్బంది తిరుమలయ్య, రోషన్ ఉన్నారు.

పీలేరులో వినియోగదారులకు పార్శిల్ అందిస్తున్న కార్గో అధికారి శరత్‌బాబు

## బియ్యం.. పంచదారతో సరి

### సంక్రాంతి కానుకగా గోధుమ పిండి

చిన్నమండెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పేదలకు చౌక ధరల దుకాణాల ద్వారా సరఫరా చేసే రేషన్ సరకులను జనవరి నెలకు కూడా బియ్యం, పంచదారతోనే సరి పెడుతోంది. అదే సమయంలో బియ్యం మూడు కిలోల బదులు రాగులు తీసుకునే వెసులుబాటు కల్పించింది. సంక్రాంతి పండగ కానుకగా కిలో గోధుమ పిండి రూ. 20కే ఇవ్వనుంది. ఈ పిండి ప్రస్తుతానికి జిల్లా కేంద్రాలకే పరిమితమైంది. అందుకుగాను 27 టన్నుల గోధుమ పిండి ఇప్పటికే రాయచోటికి వచ్చింది.

చౌక దుకాణంలో పంపిణీకి లారీ నుంచి రేషన్ సరకులు దించుతున్న హమాలీలు

● కందిపప్పునకు ఎదురుచూపులే: సంక్రాంతి పండగకైనా కందిపప్పు ఇస్తారనుకున్న లబ్ధిదారుల ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో రూ. 120 నుంచి రూ. 140 వరకు పలుకుతోంది. అదే రేషన్ దుకాణంలో రూ. 67కు లభిస్తుంది. ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడంతో డీలర్లు ఇవ్వలేకపోతున్నారు. ఈ విషయంపై జిల్లా పౌరసరఫరాల అధికారిణి సుమతి మాట్లాడుతూ.. గోధుమ పిండి జిల్లా కేంద్రంలో పంపిణీ చేస్తామని, రాగులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కందిపప్పు ప్రభుత్వం నుంచి వస్తే సరఫరా చేస్తామని తెలిపారు.

| | |
|---|---|
| జిల్లాలో మండలాలు: | 30 |
| చౌక ధరల దుకాణాలు: | 1,123 |
| రేషన్ కార్డుల సంఖ్య: | 5 లక్షలకు పైగా |
| వచ్చిన స్మార్ట్ కార్డులు: | 4.87 లక్షలు |
| పంపిణీ అయినవి: | 95 శాతం |

తంబళ్లపల్లె కోర్టుకు జనార్దన్‌రావును తీసుకొస్తున్న ఎక్సైజ్ పోలీసులు

## మేం చెప్పినట్టు రాస్తేనే సంతకం పెడతాం

### నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులు

ఈనాడు, కడప: ములకలచెరువు, మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్న అద్దెపల్లి జనార్దన్‌రావు(ఏ1)తో పాటు జగన్మోహన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాస్‌రావు, రమేష్‌బాబు, అల్లాబక్షలను విచారణ నిమిత్తం ఎక్సైజ్ పోలీసులు నాలుగు రోజుల క్రితం కస్టడీకి తీసుకున్నారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు తంబళ్లపల్లె కోర్టులో వీరిని హాజరు పరచాల్సి ఉంది. జనార్దన్‌రావుతో పాటు మిగిలిన నిందితులు మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో గత మూడు రోజులుగా విచారిస్తున్నారు. నిందితులు వెల్లడించిన అంశాలతో పోలీసులు స్టేట్‌మెంట్ తయారు చేశారు. అయితే పోలీసులు తాము చెప్పిన విషయాలతో కాకుండా తమ ఇష్టం వచ్చినట్లు రిపోర్ట్ తయారు చేశారని, తాము చెప్పినట్లు చేస్తేనే సంతకాలు చేస్తామంటూ నిందితులు పట్టుబట్టినట్టు సమాచారం. ఈ పరిణామంతో కార్యాలయంలో కొద్దిసేపు ఉత్కంఠ ఏర్పడింది. స్టేట్‌మెంట్ మళ్లీ నమోదు చేయడంతో సంతకాలు చేసినట్లు సమాచారం. అనంతరం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి మధ్యాహ్నం 1:30కు తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరిచారు.

## పక్కదారి పడుతున్న పేదల ముద్ద

గాలివీడు, న్యూస్‌టుడే: పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు నల్లబజారుకు తరలిస్తున్నారు. చౌక దుకాణాల ద్వారా నెల నెలా రేషన్ కార్డున్న వారికి ఒక్కొక్కరికి అయిదు కిలోల చొప్పున డీలర్లు బియ్యాన్ని అందిస్తున్నారు. వీటిని అధిక ధర ఆశ చూపి కార్డుదారుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇందుకుగాను ఏకంగా వాహనాలు ఏర్పరుచుకుని నెలలోని రెండో వారంలో ఇంటింటికీ తిరుగుతూ బహిరంగంగానే బియ్యాన్ని సేకరిస్తున్నారు. అనంతరం పట్టణాలకు తరలించి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పేదల బియ్యం పక్కదారి పట్టకుండా పర్యవేక్షించాల్సిన అధికారులేమో చోద్యం చూస్తున్నారు.

ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం బస్తాలు

## అరచేతిలో పల్లె ప్రగతి

కలికిరి, న్యూస్‌టుడే: పల్లెసీమలు ప్రగతికి పట్టుగొమ్మలు. గ్రామాలు బాగుంటేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. ఊళ్లో చేపడుతున్న పనులు.. వాటికి ప్రభుత్వం కేటాయించిన నిధులు. ఎంత ఖర్చు చేశారో మీకు తెలుసా? ఈ వివరాలు తెలుసుకోవాలనే ప్రయత్నం చేసినా కొందరు అధికారులు చెప్పరు. అలాగని నిరాశ చెందాల్సిన పని లేదు. చరవాణి ద్వారా మీ గ్రామ ఆర్థిక పరిస్థితి.. ప్రగతి వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు.

● ఉందిగా స్వరాజ్ యాప్: ఊరి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు '2020'లో కేంద్ర ప్రభుత్వం 'గ్రామ స్వరాజ్య' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్లే-స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీలను వరుసగా ఎంచుకోవాలి. అనంతరం అప్రూవ్డ్ యాక్టివిటీస్‌పై క్లిక్ చేస్తే పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఇతర పనులకు ఎంత వెచ్చించారో తెలుస్తుంది.




స్వరాజ్ యాప్ చిత్రం

● కొన్ని సందర్భాల్లో యాప్‌లోనూ సమాచారం ఉండకపోవచ్చు. అప్పుడు వెనక్కి వచ్చి ఫైనాన్షియల్ ప్రోగ్రెస్‌ను తెరవాలి. ఇందులో ఆర్థిక సంవత్సరాన్ని ఎంపిక చేసుకుంటే పంచాయతీకి ఎన్ని నిధులు వచ్చాయి? ఎంత ఖర్చయింది. ఏయే పనులకు ఎంత వెచ్చించారనే సమాచారం తెలుస్తుంది.

రైతేరాజు 6లో

## అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: అనపకాయల సీజన్ మొదలైంది. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో రైతులు ఈ పంటను విస్తారంగా పండిస్తారు. మంచుకి దిగుబడి వస్తోంది. వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసి చెన్నైతో పాటు చిత్తూరు, తిరుపతి తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం రోజుకు 40 నుంచి 50 మెట్రిక్ టన్నులు ఎగుమతి చేస్తున్నారు. రైతులు మార్కెటింగ్ చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో దళారులపై ఆధారపడి విక్రయించుకోవాల్సి వస్తోంది. ఇదే అదనుగా కొందరు దోపిడీకి పాల్పడుతున్నారు. కిలో అనపకాయలను రూ. 30కి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో రూ. 50కి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మేలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎగుమతికి సిద్ధం చేస్తున్న అనపకాయలు

## వినియోగించుకుంటే అధనం

### అదనపు లోడు క్రమబద్ధీకరణకు 31 గడువు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సాధారణంగా కిలోవాట్‌కు రూ. 2 వేలు, డిపాజిట్ రూ. 200, దరఖాస్తు రుసుం రూ. 50 చొప్పున మొత్తం రూ. 2,250 దరఖాస్తుదారు చెల్లిస్తే విద్యుత్తు మీటరు మంజూరవుతుంది. అనంతరం చాలా మంది తమ ఇళ్లలో టీవీ, ఫ్రిజ్, ఎయిర్ కూలర్, ఏసీ, గీజర్, హీటర్, మైక్రోవేవ్స్ తదితర విద్యుత్తు ఉపకరణాలు వినియోగిస్తుంటారు. దీంతో దరఖాస్తు చేసుకున్న కిలోవాట్ కన్నా అధికంగా వినియోగమవుతుంది. ఈ ప్రభావం వేసవిలో ఆయా ప్రాంతాల్లోని నియంత్రికలపై పడుతుంటుంది. అదనపు లోడు పెరిగి సరఫరాలో అంతరాయం తలెత్తుతుంటుంది. ఈ నేపథ్యంలో నియంత్రికల సామర్థ్యం పెంపుతో పాటు.. అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు భర్తీకి స్వచ్ఛంద అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ చొప్పున చెల్లింపునకు అవకాశం కల్పించారు. కేటగిరీ-1లో నిర్దేశిత కిలోవాట్ కన్నా అధికంగా విద్యుత్తు వినియోగించే వారు స్వచ్ఛంద క్రమబద్ధీకరణ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన రెండో దఫా పొడిగింపు గడువు ఈ నెల 31తో ముగియనుంది. ఉమ్మడి జిల్లాల పరిధిలో గత మార్చి నుంచి జూన్ అనంతరం ఆగస్టు నుంచి ఈ నెల 29 వరకు మొత్తం 3,733 మంది వినియోగదారులు ఎస్పీడీఎసీఎల్‌కు రూ. 73.81 లక్షలు చెల్లించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీలోపు గడువు ముగియనున్నందున మిగిలిన వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లేకుంటే సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి రాయితీలతో సంబంధం లేకుండా రుసుం వసూలు చేస్తారని తెలిపారు.

| డివిజన్ | నగదు చెల్లించిన వినియోగదారులు | ఎస్పీడీసీఎల్‌కు వచ్చిన జమ (రూ.లక్షల్లో) |
|---|---|---|
| ప్రొద్దుటూరు | 1,025 | 19.69 |
| కడప | 1,386 | 28.36 |
| పులివెందుల | 218 | 03.48 |
| మైదుకూరు | 353 | 06.79 |
| రాజంపేట | 549 | 11.49 |
| రాయచోటి | 202 | 03.98 |

## అనాథలకు ఆత్మబంధువులు

### 6,800 మృతదేహాలకు అంతిమ సంస్కారం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగు యూనియన్ బ్యాంకు(ఆంధ్రా బ్యాంకు)లో పనిచేస్తున్న మోరే లక్ష్మణరావు 2014 మార్చి 3న మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ స్థాపించారు. ఇప్పటి వరకు సుమారు 6,800 అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి చేసి ఆత్మబంధువులుగా నిలుస్తున్నారు. సంస్థలో 364 మంది సభ్యులున్నారు. వీరంతా జమ్మలమడుగుతో పాటు ప్రొద్దుటూరు, ముద్దనూరు, ఎర్రగుంట్ల, మైదుకూరు, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాలకు వెళ్లి అంతిమయాత్రలో మేమున్నామంటున్నారు. వీటితోపాటు రక్తదానం, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, పెళ్లిళ్లలో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి పేదలకు అందించడమూ చేస్తున్నారు.

మైలవరం మండలం వేపరాలలో వృద్ధురాలి అంత్యక్రియలు చేసేందుకు రంగు నీళ్ల కాలువ దాటేందుకు ఇబ్బంది పడుతున్న మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు

● ఆ ఘటనతో ముందుకొచ్చాం: కరోనా సమయంలో అంత్యక్రియల నిర్వహణకు అంతా ఇబ్బంది పడ్డారు. వైరస్ భయంతో అయినవారూ కానివారయ్యారు. అనంతపురంలో ఓ మృతదేహాన్ని ముళ్లపొదల్లో పడేశారు. ఆ ఉదంతాన్ని చూసి చలించాం. ఫౌండేషన్ స్థాపించి అంతిమ సంస్కారాలకు ముందుకొచ్చాం.
- మోరే లక్ష్మణరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు, మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్, జమ్మలమడుగు

● కుటుంబ సభ్యుల ప్రోత్సాహం: వేళకాని వేళల్లో అనాథ శవాలకు అంత్యక్రియలు చేయాలని ఫోన్లు వస్తుంటాయి. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో అటువంటి వాటిని పూర్తిచేయగలుగుతున్నాం.
- షేక్. అహ్మద్ హుసేన్, జమ్మలమడుగు పట్టణ అధ్యక్షుడు, మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్

● కుళ్లిన వాటినీ మోస్తుంటాం: భిక్షాటన చేసేవారు, రోడ్డు ప్రమాదాల్లో చనిపోయినవారి మృతదేహాలను తీసుకుపోయేందుకు ఎవరూ రారు. సమాచారం అందగానే మేము అంత్యక్రియలను చేస్తున్నాం. కొన్నిసార్లు కుళ్లిపోయిన శవాలనూ మోస్తుంటాం.
- కుళ్లాయిరెడ్డి, జమ్మలమడుగు ఉపాధ్యక్షుడు, మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్

● కడుపు నిండా భోజనం: శుభకార్యాల్లో కొన్నిసార్లు భోజనం మిగిలి పోతుంటుంది. వాటిని తీసుకొచ్చి అనాథ వృద్ధులు, భిక్షాటన చేసేవారిని గుర్తించి అందజేస్తుంటాం. అలాంటి వారికి చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నాం.
- షేక్ మునీర, మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యురాలు

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్డ్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి :
కడప : 99899 97626
మదనపల్లి : 80080 01768

(c) eenadu

## కేఎస్‌ఆర్‌ఎం సునాయాస విజయం

కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల (కడప) జట్టు పది వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు) జట్టు పది ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 34 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో అనిష్ 12 పరుగులు చేశారు. కేఎస్‌ఆర్‌ఎం బౌలర్లలో డి.గణేష్, జగదీష్, వి.గణేష్ తలా ఒక్కో వికెట్ తీసుకున్నారు. అనంతరం కేఎస్‌ఆర్‌ఎం జట్టు 1.2 ఓవర్లలో వికెట్లేమీ కోల్పోకుండా 36 పరుగులు చేసింది. జట్టులో వి.గణేష్ 8 బంతుల్లోనే అజేయంగా 29 పరుగులు(4-ఫోర్లు, 2-సిక్సర్లు) చేసి జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు.

## రమణ రాణింపు.. రిమ్స్ గెలుపు

లయోలా డిగ్రీ కళాశాల (పులివెందుల) టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాల (రిమ్స్, కడప) జట్టు పది ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. జట్టులో రమణ 41 పరుగులు (2-ఫోర్లు, 3-సిక్సర్లు) చేశారు. లయోలా డిగ్రీ కళాశాల బౌలర్ చైతన్య 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం లయోలా కళాశాల బ్యాటింగ్ చేపట్టి పది ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 52 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో ఇర్ఫాన్ అజేయంగా 16 పరుగులు(2-ఫోర్లు) చేశాడు. రిమ్స్ మెడికల్ కళాశాలకు చెందిన అజయ్, దినేష్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. రమణ బ్యాటింగ్‌లో రాణించడంతో రిమ్స్ మెడికల్ కళాశాల జట్టు 62 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

# ఆకాశమే హద్దుగా చెలరేగారు

### ఆసక్తికరంగా ఈనాడు క్రికెట్ పోటీలు

**కడప క్రీడలు, న్యూస్‌టుడే:** యువ క్రికెటర్లు తమ సత్తా చాటుకునేందుకు వేదికగా నిలుస్తున్న ఈనాడు మెగా క్రికెట్ టోర్నీలో గెలుపే లక్ష్యంగా.. ఆకాశమే హద్దుగా యువ క్రికెటర్లు చెలరేగి ఆడుతున్నారు. ఒక పక్క బ్యాటర్లు తమ జోరును కొనసాగిస్తూ పరుగుల వరద పారిస్తుండగా.. మరో వైపు బౌలర్లు నిప్పులు చెరిగే బంతులను విసురుతూ సత్తా చాటుతున్నారు. ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రెజెంట్స్) ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025 క్రికెట్ పోటీలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. కడప నగర శివారులోని కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం క్రికెట్ మైదానాల్లో సీనియర్ మెన్ విభాగంలో జరుగుతున్న ఈ పోటీల్లో సోమవారం స్టార్ ఆఫ్ ది క్రికెటర్లుగా పార్థసారథి, శివతేజ నిలిచారు.

## పార్థసారధి మెరిసె.. ఆదిత్య గెలిసె

మొదట బ్యాటింగ్ చేసిన శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ (ప్రొద్దుటూరు) జట్టు పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. జట్టులో విష్ణు 36 పరుగులు (2-ఫోర్లు, 3-సిక్సర్లు) చేశారు. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (మదనపల్లె) బౌలర్లు అశోక్ 2 వికెట్లు తీసుకోగా.. పార్థసారథి, తేజవర్ధన్ చెరో వికెట్ తీసుకున్నారు. అనంతరం ఆదిత్య కళాశాల జట్టు బ్యాటింగ్ చేసి 7.3 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 91 పరుగులు చేసి గెలుపొందింది. జట్టులో పార్థసారధి 19 బంతుల్లోనే అజేయంగా 39 పరుగులు (1-సిక్స్, 6-ఫోర్లు), తేజవర్ధన్ అజేయంగా 23 పరుగులు (1-ఫోర్, 1-సిక్స్) చేశారు. పార్థసారథి ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరచడంతో ఆదిత్య కళాశాల జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది.

EENADU SPORTS LEAGUE 2025

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

పార్థసారధి (39 పరుగులు నాటౌట్, ఒక వికెట్)

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

శివతేజ (3 వికెట్లు, హ్యాట్రిక్)

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Beverage Partner: CMR SHOPPING MALL
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL DEEMED TO BE UNIVERSITY
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ఈటీవీ
Organised by: ఈనాడు

★ **నేటి మ్యాచ్‌లు (30-12-2025):** కేఎస్‌ఆర్‌ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్): ◆ ఉదయం 8.00 గంటలకు: గవర్నమెంట్ డెంటల్ కాలేజ్ (రిమ్స్), కడప - స్మిరిటీ డిగ్రీ కాలేజ్ (కడప) ◆ ఉదయం 10.00 గంటలకు: సీతా డిగ్రీ కాలేజ్ (కడప) - ఫాతిమా మెడికల్ కాలేజ్ (కడప) ◆ మధ్యాహ్నం 1 గంటకు: ఎస్‌డీహెచ్ఆర్ (రాయచోటి) - అన్నమాచార్య (రాజంపేట) కేఓఆర్‌ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్): ◆ ఉదయం 8.00 గంటలకు: పి.రామిరెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (కడప) - నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (కడప) ◆ ఉదయం 10.00 గంటలకు: వైఎస్ఆర్ ఫైన్ ఆర్ట్స్ కాలేజ్ (కడప) - వైవీయూ ఇంజినీరింగ్ కాలేజ్ (ప్రొద్దుటూరు) ◆ మధ్యాహ్నం 1 గంటకు: కేఓఆర్‌ఎం ఇంజినీరింగ్ కాలేజ్ (కడప) - శ్రీహరి డిగ్రీ కాలేజ్ (కడప)

## సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలదే హవా

తొలుత బ్యాటింగ్ చేసిన సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాల (ప్రొద్దుటూరు) జట్టు పది ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. జట్టులో సుబ్బారెడ్డి 20 పరుగులు (1-ఫోర్, 1-సిక్స్), లోకనాథ్ 15 పరుగులు (3-ఫోర్లు) చేశారు. సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల (కమలాపురం) బౌలర్లు రేవంత్‌కుమార్‌రెడ్డి 3, విష్ణు 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల జట్టు బ్యాటింగ్ చేసి 9 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో ఆర్డర్ 39 పరుగులు (4-ఫోర్లు, 1-సిక్స్), శేషాద్రి అజేయంగా 19 పరుగులు (2-ఫోర్లు) చేశారు. సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది.

## షామీర్ ఆల్‌రౌండ్ ప్రతిభ.. గెలిచిన శ్రీవైష్ణవి కళాశాల

షామీర్‌బాషా ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరచడంతో శ్రీవైష్ణవి డిగ్రీ కళాశాల జట్టు (రాజంపేట) 49 పరుగుల తేడాతో ఘన విజయాన్ని సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీవైష్ణవి కళాశాల జట్టు 8 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. జట్టులో షామీర్‌బాషా 24 బంతుల్లో అజేయంగా 46 పరుగులు (6-ఫోర్లు, 1-సిక్స్), వెంకటేష్-21 పరుగులు (4-ఫోర్లు), యల్లమ్మరాజు అజేయంగా 19 పరుగులు (1-ఫోర్, 1-సిక్స్) చేశారు. శ్రీవేదవ్యాస డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు) జట్టులో రవి రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం శ్రీవేదవ్యాస జట్టు 8 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 57 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులో భువనేష్, రవికుమార్ చెరో 11 పరుగులు చేశారు. శ్రీవైష్ణవి కళాశాల బౌలర్లు షామీర్‌బాష, లోకేష్, క్లైప్ తలా ఒక్కో వికెట్ తీసుకున్నారు.

## హ్యాట్రిక్ వికెట్లు తీసిన శివతేజ.. గెలిచిన ఎస్ఆర్ఎన్‌బీ

శివతేజ వరుస బంతుల్లో వికెట్లు తీసి హ్యాట్రిక్ సాధించాడు. ఇతను 1.3 ఓవర్లు బౌలింగ్ చేసి పది పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసి.. ఎస్ఆర్ఎన్‌బీ డిగ్రీ కళాశాల (బద్వేలు) గెలుపులో ముఖ్య భూమిక పోషించాడు. మరో బౌలర్ ప్రశాంత్ రెండు వికెట్లు తీసి అతనికి అండగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఎస్ఆర్ఎన్‌బీ జట్టు పది ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి సరిగ్గా వంద పరుగులు చేసింది. జట్టులో నాసీర్ 20 పరుగులు (3-ఫోర్లు), వినయ్‌వర్ధన్ 17 పరుగులు (1-ఫోర్, 1-సిక్స్) చేశారు. ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాల(కడప) బౌలర్ నవీన్ 4, చెన్నకేశవ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 58 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులో గిరివర్ధన్ 12 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో ఎస్ఆర్ఎన్‌బీ జట్టు 42 పరుగుల తేడాతో గెలిచింది.

# 7వ డేటా సైన్స్ మిషిన్ లెర్నింగ్ సదస్సు

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఏడో అంతర్జాతీయ డేటా సైన్స్ మిషిన్ లెర్నింగ్ సదస్సును సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో జాతీయ స్థాయిలో ప్రముఖ విశ్వవిద్యాలయం ప్రతినిధులు, ప్రముఖ వ్యాపార సంస్థల సీఈవోలు పాల్గొనడం జరిగిందని అన్నమాచార్య విశ్వవిద్యాలయం వీసీ సాయిబాబారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మల్లికార్జునరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సదస్సుకు మొత్తం 298 పరిశోధన పత్రాలను ఆన్‌లైన్ ద్వారా సమర్పించారన్నారు. ఇందులో 66 పత్రాలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. డేటా సైన్స్, బిగ్ డేటా అనాలిసిస్, మెషిన్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, ఐఓటీ, స్మార్ట్ సిస్టమ్స్, వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, జనరేటివ్ ఏఐ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, బ్లాక్ చెయిన్ అప్లికేషన్స్ వంటి అంశాలపై ఈ పరిశోధన పత్రాలు వాటి విశ్లేషణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మలేషియాలోని క్యాట్స్ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ హుస్ఫైరి జెన్, ఒమాన్‌లోని విశ్వవిద్యాలయం హెచ్‌వోడీ డాక్టర్ నాసర్ ఆల్ హర్రాసి, అన్నమాచార్య విశ్వవిద్యాలయం ప్రతినిధులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న వీసీ, రిజిస్ట్రార్‌లు


**రాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**I.P.No. 16/2025**

పసుపులేటి వెంకటేష్, తండ్రి పి.వెంకటేష్, వయస్సు 40 సం॥లు, R/o D.No. 52/99-63, మాసపేటగేట్, కె.రామాపురం, రాయచోటి (టౌన్ & మం), అన్నమయ్య జిల్లా. ... పిటీషనర్

V/s

1. కల్లూరు ముబారక్, తండ్రి గఫూర్, ముస్లిం, R/o D.No.12/30, దుదేకులపల్లి, కె.రామాపురం, రాయచోటి (టౌన్ & మం), అన్నమయ్య జిల్లా. సెల్ : 9502065209
2. కె.మోహన్‌కుమార్, తండ్రి వెంకటరాజు, ప్రొ॥ ఆఫ్ శ్రీ బాలాజీ డిజిటల్స్, O/o D.No. 9-91-15, దామినేడు, తిరుపతి రూరల్ & జిల్లా. సెల్ : 9849046429.
3. బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, O/o షిప్ అంతస్తు, సాయి ఆర్కేడ్ నెం. 42/112113114, మెయిన్ రోడ్, SKDR కాలనీ, ఎన్జీవో కాలనీ, కడప టౌన్, వై.ఎస్.ఆర్.కడప జిల్లా.
4. HDFC Bank Ltd., IFSC Code HDFC0002380, O/o D.No. 24/127-1, పిహెచ్ హాస్పిటల్ ప్రక్కన, రాజంపేట రోడ్, రాయచోటి (టౌన్ & మం), అన్నమయ్య జిల్లా.
5. Axis Bank Ltd., O/o D.No. 37/215, కడప-చిత్తూరు హైవే, సబ్ స్టేషన్ ఎదురుగా సంజీవనగర్ కాలనీ, రాయచోటి (టౌన్ & మం), అన్నమయ్య జిల్లా.
6. Cholamandalam Investment & Finance Company Ltd., O/o D.No. 39/622-75-1, RTC బస్టాండ్ రోడ్, వై.ఎస్.నగర్, కడప టౌన్ & జిల్లా.
7. ఎ.నాగభూషణం, తండ్రి తెలియదు, హిందూ, వ్యాపారం, R/o మంగళ కాలనీ, కె.రామాపురం, రాయచోటి (టౌన్ & మం), అన్నమయ్య జిల్లా.
8. రెడ్డిచెర్ల సరస్వతి, భర్త రవికుమార్, హిందూ, వ్యాపారం, R/o మంగళ కాలనీ, కె.రామాపురం, రాయచోటి (టౌన్ & మం.), అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్స్

**నోటీసు ప్రకటన**

పై నెంబరు దావాలో రెస్పాండెంట్స్ అయిన మీపైన పిటీషనరును ఇన్‌సాల్వెన్సీగా తీర్మానించమని ఐ.పి. పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 16.01.2026వ తేదీ ఉ॥ 10.30 గం॥లకు సదరు కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా ఐచ్ఛితముగా తెలియజేయడమైనది.

ఇట్లు : శ్రీ సి.సునీల్‌కుమార్‌రెడ్డి, B.A., B.L.,
శ్రీ పి.నాగార్జున, M.A., LL.B.,
పిటీషనర్ తరఫున అడ్వకేట్స్, రాయచోటి.


# పీజీఆర్ఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

**రాయచోటి, న్యూస్‌టుడే :** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలకు సత్వరం పరిష్కారం చూపాలని డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి సమస్యకు ప్రజల నుంచి వచ్చే స్పందనను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందన్నారు. అధికారులు ఫిర్యాదులను వంద శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏలోని దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. అర్జీలు చేత పట్టుకుని పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగకుండా చూడాలన్నారు. ప్రజల సమస్యలు సావధానంగా వినాలన్నారు. చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగించాలని, ఈ ప్రాంత ప్రజల మనోభావాలు, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని దాన్ని కొనసాగించాలని జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి అర్జీ అందజేశారు. అన్నమయ్య జిల్లాను విభజించవద్దని, వెనుకబడిన ప్రాంతమైన రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడు విశ్వనాథరెడ్డి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆ వైకాపా నేత భూమి ఆక్రమించారు

### తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

**ఈనాడు, అమరావతి :** తన స్థలాన్ని ఆక్రమించిన వైకాపా నేతపై చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా పీలేరు మండలం తలుపుల గ్రామానికి చెందిన సుధీర్ కోరారు. రెవెన్యూ సర్వేలో ఆక్రమణ తేలిందని.. కానీ రాజకీయ ప్రోద్బలంతో గత వైకాపా ప్రభుత్వంలో తనను వేధించారని వాపోయారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. కోర్టు తీర్పును ధిక్కరిస్తూ తన భూ వ్యవహారంలో జోక్యం చేసుకుంటున్న వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని విశాఖపట్నానికి చెందిన చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు.

# కానిస్టేబుల్‌పై బదిలీ వేటు

**నిమ్మనపల్లె, న్యూస్‌టుడే:** వైకాపా నాయకులకు వత్తాసు పలుకుతూ అధికార పార్టీ ఉండేది మూడేళ్లే అంటూ వ్యంగ్యంగా మాట్లాడిన కానిస్టేబుల్ వెంకటేశ్‌ను బదిలీ చేసినట్లు ఎస్.ఐ విష్ణునారాయణ తెలిపారు. ఈ నెల 21న వైకాపా, తెదేపా నాయకుల మధ్య ఫ్లెక్సీల విషయమై తవలం క్రాస్‌లో వాగ్వాదం జరుగుతుండగా కానిస్టేబుల్ వారిని నిలువరించేందుకు వెళ్లారు. అక్కడ వైకాపా నాయకులకు వత్తాసు పలుకుతూ తెదేపా ఉండేది మూడేళ్లు మాత్రమే.. తరువాత వచ్చేది వైకాపా ప్రభుత్వమేనని కూటమి నాయకులను హెచ్చరించారు. కానిస్టేబుల్ తీరును నిరసిస్తూ కూటమి నాయకులు ఎస్.ఐ.కు ఫిర్యాదు చేశారు. విచారించిన డీఎస్పీ మహేంద్ర కానిస్టేబుల్‌ను పీటీఎం మండలానికి బదిలీ చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

# రూ.61.70 లక్షల విలువైన ఎర్ర చందనం స్వాధీనం

### ● ఇద్దరు కూలీల అరెస్టు, రెండు వాహనాలు జప్తు

**రాయచోటి, న్యూస్‌టుడే :** వీరబల్లి మండలం గురప్పగారిపల్లె పంచాయతీ కురవపల్లి వద్ద అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్రచందనం దుంగలను వాహనంలో తరలిస్తుండగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ బృందం, వీరబల్లి పోలీసులు దాడులు నిర్వహించారన్నారు. దుంగలు తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన రమేశ్వర్ధన్ (38), వీరబల్లి మండలం గడికోటకు చెందిన ఉప్పుతోళ్ల చంద్రమోహన్ (37)లను పోలీసులు అరెస్టు చేశారన్నారు. వారి నుంచి రూ.67.70 లక్ష విలువైన ఏ గ్రేడ్ రకం 18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారన్నారు. దుంగలు అక్రమ రవాణాకు వినియోగించిన ఇన్నోవా, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎర్రచందనం పట్టుకునేందుకు కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కేసు నమోదు చేసి పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరిచారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి, డీఎస్పీ ఎం.ఆర్ కృష్ణమోహన్, రాయచోటి రూరల్ సీఐ రోషన్, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ సీఐ కొండారెడ్డి, ఎస్ఐలు సుస్మిత, ఎస్.కె. హుస్సేన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన ఎర్రచందనం, కూలీలు, వాహనాలతో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, పోలీసు అధికారులు


EENADU Classifieds

**TO LET**

కడప, చిన్నచౌకు, MS రోడ్డు, ఆంజనేయస్వామి గుడి వద్ద కమర్షియల్ భవనం బాడుగకు కలదు. హాస్పిటల్స్, ఏజెన్సీస్, స్కూల్స్‌కు. ✆ 9885357707.

**COMMERCIAL**

సిద్ధవటం కోర్టు సమీపమున మెయిన్ రోడ్డులో ఉషా గార్డెన్, ఫంక్షన్ హాలు, రూములు బాడుగకు గానీ లీజుకు ఇవ్వబడును. Cell : 9949741939.

**JOBS**

Wanted Wardens Male-2, Female-2 Kadapa. Contact No: 9154944970, 9154944955.

RK Service (Servise Partner to Amazon) Supervisor - Porumamilla, Delivery Boys - Porumamilla, Badvel, Vempalli, Proddatur, Mydukur. Contact: 9666011667,9010120150.

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854

కడపలో డా॥ పరమేశ్వర రావు ENT (చెవి, ముక్కు, గొంతు) హాస్పిటల్ నందు పని చేయుటకు ఇద్దరు నర్సులు, కాంపౌండర్స్ & ఇంట్లిలో పని చేయుటకు ఇద్దరు ఆడవారు కావలెను. కడప వారికి ప్రాధాన్యత. ✆ 9492410402

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటీ డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


# వంద క్యూసెక్కుల కృష్ణా జలాలు విడుదల

### ● వెలిగల్లులో పెరుగుతున్న నీటి మట్టం

హంద్రీ-నీవా కాలువ నీటి ప్రవాహం

వెలిగల్లు జలాశయంలోకి కృష్ణా జలాలను అనుసంధానం ప్రక్రియ విజయవంతమైంది. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్ణయం తీసుకుంది. హంద్రీ - నీవా కాలువ ద్వారా ఆదివారం నుంచి 100 క్యూసెక్కుల నీటిని వెలిగల్లుకు విడుదల చేస్తున్నారు. వెలిగల్లులో ఇప్పటికే 4.23 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు. ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరో ఆరు క్యూసెక్కుల నీటిని రాయచోటి, గాలివీడుకు రక్షిత మంచినీటి పథకాలకు రోజూ సరఫరా అవుతోంది. జలాశయంలో తగ్గుముఖం పట్టిన నీటి నిల్వలతో ఆందోళనలు చెందేవారు. అయితే కృష్ణా జలాలు సరఫరా చేస్తుండటంతో వెలిగల్లులో నీటి మట్టం తగ్గడం లేదని అభిప్రాయపడుతున్నారు. కృష్ణా జలాలు వెలిగల్లు జలాశయానికి చేరడంతో జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

## మిరప తెగుళ్లను నివారిద్దాం!

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** మారుతున్న వాతావరణం దృష్ట్యా మిరప పంటను తెగుళ్లు కాటేస్తున్నాయి. రసం పీల్చే పురుగుల వ్యాప్తి చెందటంతో చీడలు ఆశించి నష్టాన్ని కలుగజేస్తున్నాయని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.మానస తెలిపారు. ఆకుముడత (జెమిని వైరస్) ఇది తెల్ల దోమ ద్వారా సోకుతుంది. ఈ వైరస్ ఆశించిన మొక్కల లేత ఆకులు ముడుచుకుపోతాయి. ఈ వైరస్ సోకిన మొక్కలకు పూత రాదు, వచ్చినా పిందె కట్టదు. మిరపలో ఆకుముడత అనే లక్షణం వైరస్, తామర పురుగు, సూక్ష్మ పోషకాల లోపంతో వచ్చిందా అని రైతులు గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి. కుకుంబర్ మొజాయిక్ వైరస్ పేనుబంక సంక్రమిస్తుంది. మొక్కల్లో ఎదుగుదల ఉండక పొట్టిగా ఉంటాయి. ఆకు ఆకారం మారి.. కొనలు సాగి ఉంటాయి. పూత, కాత సక్రమంగా రాదు. మొవ్వకుళ్లు తామర పురుగుల ద్వారా వస్తుంది. ప్రధాన పొలంలో నారు నాటిన రెండు వారాల తరువాత 15 రోజుల వ్యవధిలో నాలుగుసార్లు మందులను పిచికారీ చేయాలి. వేపపిండి వేసుకోవాలి. పేనుబంక నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా మిథైల్ డెమటాసీన్ 2 మి.లీ, ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగులను అదుపు చేయాలంటే ఫిప్రోనిల్ 0.3 శాతం గుళికలు నాటిన 15 రోజులకు, 45 రోజులకు ఎకరాకు ఎనిమిది కిలోలు చొప్పున భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు వేయాలి. ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా డైఫెన్థియురాన్ 1.5 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి తామర పురుగులను కట్టడి చేయవచ్చు. తెల్లదోమ ఉంటే 5 శాతం వేపగింజల కషాయం, ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రాములు పిచికారీ చేసి అదుపు చేయవచ్చునన్నారు.

చిట్కా

**ప్రశ్న: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంటను మారుకా మచ్చల పురుగు, శనగ పచ్చ పురుగులు ఆశించి నష్టాన్ని కలుగజేస్తున్నాయి. నివారణకు ఏ రకం మందులు పిచికారీ చేయాలో తెలియజేయండి?**

**- ఎస్.చెన్నకృష్ణారెడ్డి, రైతు, ముద్దనూరు**

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

**సమాధానం:** ప్రస్తుతం పూత దశలో పంట ఉంది. మారుకా మచ్చల పురుగు ఆశించకుండా రైతులు నివారణ చర్యలు చేపట్టాలి. తొలి పూత దశలోనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేదా పూత/కాయ దశలో నొవాల్యురాన్ 1 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలపాలి. వీటిల్లో ఒక రకం మందును ఎంపిక చేసుకొని 13-0-45 రకం పోషకాన్ని కలిపి పిచికారీ చేస్తే పురుగును అదుపు చేయవచ్చు.

**- డాక్టర్ వి.మాధురి, డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధనా స్థానం, ఊటుకూరు**

**- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

# చామంతి.. చీడ వదిలిద్దామిలా!

వేరుకుళ్లు సోకిన మొక్కలు

**కడప, న్యూస్‌టుడే:** చామంతి పూలకు ఈ సీజన్‌లో మంచి గిరాకీ ఉంటుంది. అయితే ఈ తోటకు చీడలు ఆశించడంతో చామంతి మొగ్గల రంగు, పరిమాణం తగ్గి పంట దిగుబడిని దెబ్బతీస్తున్నాయి. సకాలంలో రైతులు స్పందించి యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపడితేనే పూల నాణ్యత పెరిగి మంచి గిరాకీ లభిస్తుంది. చామంతి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మానస సూచించారు.

**ఆకుమచ్చ :** నల్లని లోతైన గుండ్రని మచ్చలు ఆకులపై ఏర్పడి పత్రాలు ఎండిపోతాయి. నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తెల్లతుప్పు:** ఈ రకం చీడ ఆశించిన మొక్కలు సరిగ్గా ఎదగవు. ఆకుల అడుగు భాగంలో తెల్లని ఉబ్బెత్తు మచ్చలు కనిపిస్తాయి. నివారణకు అజాక్సీస్ట్రోబిన్ 1 మి.లీ లేదా ట్రైఫ్లోఆక్సీస్ట్రోబిన్+ట్రిబ్యూకొనజోల్ 0.75 గ్రాములు లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

**ఫైటోప్లాస్మా :** ఈ తెగులు సోకిన మొక్కల్లోని అన్ని భాగాలు, పుష్పాలు ఆకుపచ్చగా మారి గుబురుగా కనిపిస్తాయి. ఈ తెగులును అరికట్టడానికి ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**వేరుకుళ్లు :** భూమిలో తేమ, వర్షాల వేళ, మంచు కురిసే సమయంలో ఈ వ్యాధి సోకుతుంది. పూల మొక్కలు వాడిపోయి, ఆకులు రాలిపోతాయి. నివారణకు పొలంలో నీరు నిల్వకుండా, పారుదలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మెటలాక్సిల్ ఎం.జడ్‌ను 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్టు మొదల్లో పోయాలి. ట్రైకోడెర్మావిరిడిని రెండు కిలోలను పశువుల ఎరువుతో కలిపి వేసుకోవాలి. ఇలా చేస్తే వెంటనే తెగులు తగ్గుముఖం పడుతుంది.

**ఎండు తెగులు:** ఈ చీడ లక్షణాలు కనిపించిన మొక్కల నుంచి తీసుకున్న కొమ్మ కత్తిరింపుల ద్వారా ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. రసాయన ఎరువుల, పురుగు మందుల పిచికారీ అధికంగా చేయడం, పంట మార్పిడి చేయకుండా ఒకే భూమిలో చామంతిని సాగు చేయడంతో తెగుళ్లు అధికమవుతాయి. ట్రైకోడెర్మావిరిడి రెండు కిలోలతోపాటు పశువుల ఎరువుతో కలిపి వేసుకోవాలి. ఇలా చేయలేని పక్షంలో ద్రవ రూపంలో ట్రైకోడెర్మావిరిడిని ఎకరాకు లీటరు చొప్పున బిందు పరికరాల ద్వారా నీటిలో విడుదల చేయాలి. రిడోమిల్ 2 గ్రాములు లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లు బాగా తడిచేలా పోయాలి. ఇలా చేస్తే ఈ తెగులును అదుపు చేయవచ్చు.

# వల పన్నుదాం.. దానిమ్మను కాపాడుకుందాం!

రైతేరాజు

పందిరి కాదు..దానిమ్మ పంటకు రక్షణగా ఉంచిన గ్రోకవర్లు

**లింగాల, న్యూస్‌టుడే:** శీతాకాలంలో పొగ మంచు, తెగుళ్ల ప్రభావం నుంచి 'దానిమ్మ' పంటను రక్షించుకోవడానికి వినూత్నంగా పార్నపల్లె, వెలిదండ్ల, లింగాల, కర్ణపాపాయపల్లె, నల్లపురెడ్డిపల్లె గ్రామాల పుడమిపుత్రులు తెరలు ఏర్పాటు చేస్తున్నారు. దానిమ్మ పంటలో మంచి నాణ్యమైన దిగుబడులు తీయడానికి ఇప్పటి వరకు రైతులు చీరలను పంటపై కప్పి కాపాడుతూ వచ్చారు. తాజాగా దానిమ్మ చెట్లపై గ్రోకవర్లు రక్షణగా ఉంచుతున్నారు. తద్వారా దానిమ్మకు సంకటంగా మారిన బ్యాక్టీరియా, మచ్చ తెగులు నుంచి రక్షణ కలుగుతోంది. ఇలా చేయడం ద్వారా చెట్లకు పొగ మంచు, గాలుల ప్రభావం తగ్గి కాయలకు కొమ్మల రాపిడి, ముళ్ల రాపిడి నుంచి నష్టం ఉండదు. రసం పీల్చే పురుగులైన తామర పురుగు, నల్లి, దోమ నష్టం తగ్గుతుంది. కాయలపై సూర్యరశ్మి తీవ్రత తగ్గి కాయలకు మంచి రంగు, రుచిని తాజాదనం సంతరించుకుంటాయని పార్నపల్లెకు చెందిన రైతు జొన్నలగడ్డ రంగానాయుడు, వెలిదండ్లకు చెందిన రైతు శివరామకృష్ణారెడ్డి తెలిపారు. మొక్క నాటిన ఏడాదిన్నర తర్వాత దిగుబడులు అందుతాయని, క్రమేణా 10 టన్నుల వరకు దిగుబడులు పొందవచ్చని చెప్పారు. గ్రోకవరు పలుచటి వస్త్రంలా ఉంటుందని, వీటిని వాడటం ద్వారా సస్యరక్షణ ఖర్చు తగ్గుతోందని పులివెందుల ఉద్యానాధికారి గువ్వా రాఘవేంద్రారెడ్డి తెలిపారు.

స్ఫూర్తి

# మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

## ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రమీల

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే:** ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులపై విభాగాధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పురపాలకసంఘం కమిషనర్ ప్రమీల సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజలు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని సంబంధిత అధికారులకు బదిలీ చేసి నిర్ణీత కాలంలో సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ శ్రావణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటసుబ్బయ్య, వేణుగోపాల్, టీపీఎస్ రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రం తనిఖీ

వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ లక్ష్మీప్రసాద్

**కలికిరి:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్) డా.లక్ష్మీప్రసాద్ సూచించారు. సోమవారం కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్త భవనం మాత శిశు రక్షణ కోసం వినియోగించాలని, పాత ఆసుపత్రి భవనంలోకి ఓపీడీ బ్లాక్, వార్డులను వెంటనే మార్చాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ పవన్‌కుమార్, వైద్యులు శశికుమార్‌రాజు, ఆశాలత, వెంకటేష్, అన్వేష్, ఇన్‌ఛార్జి హెడ్ సిస్టర్ వనజమ్మ, ఫార్మసిస్ట్ నవీన పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే:** రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించిన విద్యార్థినిని కురబలకోట మండలం అంగళ్లు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మీ, పీడీ రమేష్‌బాబు, సర్పంచి విశ్వనాథ్‌రెడ్డి సోమవారం పాఠశాలలో అభినందించారు. గత వారం కృష్ణాజిల్లాలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్- 17 బాలికల క్రికెట్ పోటీల్లో విద్యార్థిని నేత్ర రాణించిందన్నారు. తాను ప్రాతినిధ్యం వహించిన జిల్లా జట్టు రెండో స్థానంలో నిలిచిందన్నారు.

విద్యార్థిని నేత్రతో ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మీ, పీడీ రమేష్‌బాబు, సర్పంచి విశ్వనాథ్‌రెడ్డి

## ఇవిగో సమస్యలు.. పరిష్కరించండి

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** సమస్యలపై వచ్చిన అర్జీలను విచారించి నివేదిక ఇవ్వాలని మండలాల అధికారులను సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆమె నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై సబ్‌కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. వాటిని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

**వాటిలో కొన్ని..**

● మదనపల్లె మండలం భవానీనగర్‌లో రోడ్లు, మురుగు నీటి కాలువలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ ప్రాంత ప్రజలు వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వారు సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

● తమకు పెద్దల నుంచి వచ్చిన ఆస్తిని రెవెన్యూ అధికారులు ఇతరుల పేరున 1బీ మంజూరు చేశారని ములకలచెరువు మండలం మద్దినాయనివారిపల్లెకు చెందిన వెంకటరమణనాయుడు ఆరోపించారు. హంద్రీనీవా కాలువలకు సంబంధించిన పరిహారం ఇతరులు తీసుకున్నారని బాధితుడు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ● నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లెలో తన తల్లి సుబ్బమ్మ పేరుపై ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టా స్థలంలో కొంత భాగాన్ని ఇతరులు కబ్జాకు పాల్పడి, అక్రమంగా తాత్కాలిక ఇంటిని నిర్మించుకున్నారని నరసింహులు ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ● మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టలోని గంగమ్మగుడి వద్ద ఆర్టీసీ బస్సు ఆపడం లేదని ఆ ప్రాంతవాసులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బస్సు ఆపాలని కోరితే ఇటీవల ఓ ఆర్టీసీ కండక్టర్, డ్రైవరు దురుసుగా మాట్లాడారని, దీనిపై విచారించి అమ్మచెరువుమిట్టలో బస్సును నిలిపేలా తీసుకోవాలని కోరారు. ● 1బీ అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక పంపాలని ఆయా మండల అధికారులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ చల్లాకల్యాణి

## కొత్త జిల్లాకు మదనపల్లె పేరును పెట్టాలి

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే:** కొత్తగా ఏర్పాటు కానున్న జిల్లాకు మదనపల్లె పేరును పెట్టాలని మదనపల్లె జిల్లా సాధన సమితి కన్వీనర్ శివప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య పేరుతోనే జిల్లా ఉంటుందని, జిల్లా కేంద్రంగా మదనపల్లె అంటూ మంత్రి వర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు హర్షించడంలేదన్నారు. మదనపల్లె జిల్లాగా ఏర్పాటు చేసే బాధ్యత మాదని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలన్నారు.

**మదనపల్లె గ్రామీణ:** కూటమి ప్రభుత్వం మదనపల్లె చరిత్రను అవమానిస్తుందని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి కృష్ణప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ ఆరోపించారు. ఎస్టీయూ కార్యాయలంలో సీపీఐ మదనపల్లె నియోజకర్గ సమితి ఆధ్వర్యంలో నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నాలుగు నియోకవర్గాలతో మదనపల్లె జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేస్తామని చెప్పారు. నేడు మదనపల్లె జిల్లా చేయడం లేదని, అన్నమయ్యజిల్లానే కొనసాగిస్తూ మదనపల్లె కేవలం జిల్లా కేంద్రంగా ఉంటుందని ఏపీ క్యాబినెట్‌లో తీర్మానం చేసిందనే వార్తలు వస్తున్నాయన్నారు.

## రీసర్వేకు రైతులు సహకరించాలి

రీసర్వే అవగాహన ర్యాలీలో పాల్గొన్న తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్ తదితరులు

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** రీసర్వేకు రైతులు, గ్రామ ప్రజలు సహకరించాలని రాష్ట్ర హజ్‌కమిటీ డైరెక్టర్, తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్ పిలుపునిచ్చారు. సోమవారం పోతబోలు రెవెన్యూ గ్రామంలో రీసర్వేపై డీటీ మౌలాలి ఆధ్వర్యంలో అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 2 నుంచి రెవెనూ గ్రామంలో రీ సర్వే నిర్వహిస్తున్నామని రైతుల తమ వద్ద ఉన్న భూ పత్రాలను అధికారులకు చూపించి రీసర్వే చేయించుకోవాలని సూచించారు.

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** జనవరి 2నుంచి ప్రారంభించనున్న నాల్గోవిడత రీసర్వేను సమన్వయంతో పూర్తిచేయాలని తహసీల్దారు కిషోర్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం రెవెన్యూ గ్రామాధికారులతో, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. 1,2,3 విడతల్లో వలసపల్లె, కాశీరావుపేట, ములకలదిన్నె, తేనీగలవారిపల్లె, పెంచుపాడు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. నాల్గోవిడత కింద బసినికొండ, పోతబోలు, కోళ్లబైలు, కొత్తవారిపల్లె, చిన్నతిప్పసముద్రం రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

## బీసీ కుల గణన చేపట్టాలని నిరసన

సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

**మదనపల్లె గ్రామీణ:** ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటుచేసి బీసీ కుల గణన చేపట్టాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బహుజన సేన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన పూర్తయ్యాకనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాల తరహా జనగణన, కులగణన నిర్వహించాలన్నారు. బీసీల ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటుచేయాలని, ఈ అసెంబ్లీలో బీసీ బిల్లు తీర్మానం చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ ఏఐటీయూసీ ముబారక్, వడ్డెర సంఘం నాయకులు కృష్ణప్ప, పౌరహక్కుల సంఘం నాయకులు నాగేశ్వరరావు, వాల్మీకి సంఘం నాయకులు శ్రీనివాసులు, విద్యార్థి సంఘం నాయకులు ఉత్తన్న, మైనార్టీ నాయకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## దేవుని భూములు అన్యాక్రాంతం కానివ్వం

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి దేవాస్థాన భూముల మార్పిడి ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని విశ్వహిందూ పరిషత్ మదనపల్లె జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామ్మోహన్, సురేష్‌బాబు అన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా విశాఖపట్నం జిల్లాలో శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన భూములను ఏదో ఒక వారికి అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. దీన్ని విశ్వహిందూ పరిషత్ తీవ్ర అభ్యంతరం తెలుపుతుందన్నారు. ఆలయ భూములను అన్యాక్రాంతం చేసే ఆలోచనలను ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ చల్లాకల్యాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## 31న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం

**నిమ్మనపల్లె, న్యూస్‌టుడే:** మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ గుండ్లబురుజు ఎస్సీకాలనీలో ఈనెల 31 ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు తపస్విని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే:** ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం తన ఇంటి వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన ఆయా శాఖ అధికారులకు ఫోన్‌చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం నియోజకవర్గంలో సీఎం సహాయ నిధి కింద ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీలో రూ.8లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాయకులు నవీన్‌చౌదరి, ఫణికర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

పెద్దతిప్పసముద్రంలో కాలమానిని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ సంఘ సభ్యులు

**పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే:** సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరించడంలో యూటిఎఫ్ సంఘం కృషి చేస్తోందని సంఘ అధ్యక్షుడు శివ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం నూతన కాలమానిని సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు విద్యాభివృద్ధికి యూటీఎఫ్ సంఘం సభ్యులు కృషి చేయాలన్నారు.

**కంభంవారిపల్లి:** కంభంవారిపల్లె ఆదర్శ పాఠశాల ఆవరణంలో సోమవారం ఎంఈవోలు రెడ్డి బాషా, సుబ్రహ్మణ్యం రెడ్డిలు యూటీఎఫ్ డైరీ, క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు, డైరీలో ఉపాధ్యాయులకు సంబంధించిన విలువైన సమాచారం అందులో ఉందని తెలిపారు. అనంతరం యూటీఎఫ్ రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్స్‌ను కంభంవారిపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేశారు.

## ఉప కేంద్రాల సామర్థ్యం పెంపునకు చర్యలు

**మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** డివిజన్‌లోని ఆయా మండలాల్లోని ఉప కేంద్రాల సామర్థ్యం పెంపునకు చర్యలు చేపట్టనున్నామని విద్యుత్తుశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.గంగాధరం తెలిపారు. స్థానిక ఉత్తర విభాగానికి చెందిన ఉప కేంద్రంలో సామర్థ్యం పెంపునకు చేపట్టిన మరమ్మత్తు పనులను సోమవారం ఏఈలు రమేష్, రామలక్ష్మణ్‌తో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఉప కేంద్రం 70 ఏళ్ల క్రితం ప్రారంభమైనా సామర్థ్యం పెరగలేదన్నారు. ఫలితంగా ఆయా కేంద్రాలకు విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడేదన్నారు. ఈ నేపథ్యంలో సమస్యను లోతుగా అధ్యయనం చేసి సామర్థ్యం పెంపుతో పాటు ఆధునికరీతిలో మరమ్మత్తు పనులు చేపట్టామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం బాగా పెరిగిందని, అందువల్ల అన్ని ఉప కేంద్రాల్లో సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసేందుకు చర్యలు చేపట్టామన్నారు.

## ఐఈటీఈ సభ్యత్వ ధ్రువపత్రాల అందజేత

విద్యార్థులతో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే:** ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ శాస్త్రవేత్త ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) విద్యార్థిశాఖ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. పరిశ్రమల్లో తాజా సాంకేతిక పరిణామాలు, భవిష్యత్ ఉద్యోగ అవకాశాల గురించి తెలుసుకోవాలన్నారు. పరిశ్రమలకు తగ్గట్టుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఐఈటీఈ సభ్యత్వ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.రాంమోహన్‌రెడ్డి, అధ్యక్షుడు నాగమల్లారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ కమిటీకి దరఖాస్తుల ఆహ్వానం

**మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** యోగభోగేశ్వర ఆలయ కమిటీకి ధర్మకర్తల మండలిలో సభ్యుల నియామకానికి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోందని దేవదాయశాఖ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి 15వ తేదీ లోగా అర్హులైన సభ్యులు తమ దరఖాస్తులను జిల్లా సహాయ కమిషనర్‌కు పంపాలని దేవదాయశాఖ సూచించింది.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారం పతకం

విద్యార్థిని అర్షియా అంజూమ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే:** జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ అర్షియా అంజుమ్ బంగారు పతకం సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 26 నుంచి 28 వరకు హర్యానాలో జరిగిన యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ గేమ్స్ నేషనల్ చాంపియన్ షిప్ 2025 కరాటే పోటీల్లో అండర్- 17 విభాగంలో విద్యార్థిని బంగారు పతకం సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు సుధాకర్, కరాటే మాస్టర్ మణిసాయి అభినందించారు.

## సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే:** సైబర్ సెక్యూరిటీపై ఇంజినీరింగ్ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని విజయవాడకు చెందిన సుప్రజ టెక్నాలజీ ఫౌండర్ సంతోష్ అన్నారు. సోమవారం మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సైబర్ సెక్యూరిటీ)విభాగం వారు ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీపై వారం రోజుల కార్యశాల ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను ఎదుర్కొనే లక్ష్యంతో ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరమన్నారు. సైబర్ పరిజ్ఞానం కలిగిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్ రంగం, ప్రభుత్వ సంస్థల్లో విస్తృత అవకాశాలుంటాయన్నారు. మెంటర్ హఫీద్, సెక్యూరిటీ అనలిస్టులు కృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

## వైజ్ఞానిక పోటీల్లో విద్యార్థుల సత్తా

**బి.కొత్తకోట, న్యూస్‌టుడే:** బి.కొత్తకోట మండలం గట్టు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు డి.సిద్ధార్థరెడ్డి, కె.గౌరీప్రియలు రాష్ట్ర, జిల్లా స్థాయి వైజ్ఞానిక పోటీల్లో సత్తాచాటారు. వీరిని సోమవారం గట్టు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సి.లలితకుమారితో పాటు ఎంఈఓలు ఆర్.రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారిలు అభినందించారు.

## ఉత్తర ద్వార దర్శనం నేడు

**కలికిరి, న్యూస్‌టుడే:** కలికిరి మండలం గుండ్లూరు గ్రామంలో వెలసిన ప్రాచీన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ధర్మకర్త వేణుగోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించడంతో పాటు ప్రత్యేక పూజలు, సేవలు, ఉత్సవ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటలకు నుంచి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందన్నారు.

## మత్తుకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ

**పెద్దమండ్యం, న్యూస్‌టుడే:** విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండి ఆటలకు దగ్గరగా ఉండాలని ఎస్సై శ్రావణి అన్నారు. మండలంలోని కలిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. పిల్లల నడవడికపై కూడా తల్లితండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తాగునీటి బావి స్థలం ఆక్రమణ

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** తాగునీటి చేతబావి స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని మాలమహానాడు నాయకులు చంద్రయ్య, మనోహర్‌లు ఆరోపించారు. సోమవారం తహసీల్దారు కిషోర్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కొత్తపల్లె పంచాయతీ రంగారెడ్డికాలనీలోని తాగునీటి బావి స్థలాన్ని పూడ్చేసి కబ్జాకు పాల్పడుతున్నారని, ఈ స్థలం ప్రభుత్వానికి సంబంధించినదిగా స్థానికులు చెబుతున్నారని, దీనిపై దస్త్రాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సురేంద్ర, మోహన్, గంగాధర్, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలు తప్పనిసరి

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే:** పంటసాగులో రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే భూమి సారవంతం కోల్పోతుందని వ్యవసాయాధికారిణి జి.సుధారాణి తెలిపారు. సోమవారం చంద్రాకాలనీలోని బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భూమి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసారపరీక్షల ప్రకారమే ఎరువులను వినియోగించాలని తెలిపారు. అనంతరం విద్యార్థినిలకు మట్టి నమూనాలను సేకరించే పద్ధతిని నేర్పించారు.

## న్యాయం చేయాలని మాజీ సైనికుడికి వినతి

**మదనపల్లె విద్య:** రియల్టర్లు దాడిచేసి రక్తం వచ్చేలా కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమపైనే కేసు నమోదు చేశారని పీలేరు మండలం బోరుమల్లవారిపల్లెకు చెందిన మాజీ సైనికుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం మాజీ సైనికుల సంఘం నాయకులతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు పూర్వికుల నుంచి వచ్చిన 1.27 ఎకరాల భూమి ఉందన్నారు. దీన్ని పక్కనే భూమి కొనుగోలు చేసిన రియల్టర్లు అమర్‌నాథ్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఉమేష్‌గుప్తలు తమ భూమిని ఈ నెల 25న ఆక్రమించుకునేందుకు యత్నించడంతో పాటు భూమిలో ఉన్న చెట్లు జేసీబీతో తొలగించారన్నారు. దీన్ని అడ్డుకునేందుకు వెళ్లిన తనతో పాటు మామ మహేశ్వర్‌రెడ్డిపై వారు దాడి చేసి కొట్టారన్నారు. దీనిపై పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు విచారణ చేయకుండా ఇరువర్గాలపై కేసు నమోదు చేశారన్నారు. అధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

## పారదర్శకంగా ఉపాధి పనులు

**పీలేరు, న్యూస్‌టుడే:** పారదర్శకంగా ఉపాధి పనులు చేయించాలని పీలేరు ఎంపీడీవో శివశంకరయ్య అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఉపాధి హామి పథకం సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మారిన సామాజిక తనిఖీ నిబంధనలు తెలియజేస్తూ రెండు నెలల వరకు సామాజిక తనిఖీ ఉంటుందన్నారు. ఆ పనులకు సంబంధించిన రికార్డులు సమయానికి సామాజిక సిబ్బందికి అందజేయాలన్నారు. మంగళవారం నుంచి రాష్ట్ర సామాజిక తనిఖీ రీసోర్స్ పర్సన్ సూర్య ఆధ్వర్యంలో ఈ తనిఖీ ప్రారంభిస్తారన్నారు.

## వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా ఉదయ్‌కుమార్


ఉదయ్‌కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే:** వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మదనపల్లె మండలం జడ్పీటీసీ ఉదయ్‌కుమార్‌ను సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. బెంగళూరు బస్టాండు సమీపంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## గోవిందమాలధారులు తిరుమలకు పాదయాత్ర

**రామసముద్రం, న్యూస్‌టుడే:** రామసముద్రం మండలం నుంచి గోవింద మాలధారులు తిరుమలకు పాదయాత్రగా బయలు దేరారు. గోవిందమాల ధరించి పసుపు వస్త్రాలతో సుమారు వెయ్యిమంది తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి పయనమయ్యారు. గత కొన్నేళ్లుగా వైకుంఠ ఏకాదశి రోజున తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్లు వారు చెప్పారు. వర్షాలు కురిసి చెరువులు కుంటలు నిండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో పాదయాత్ర చేస్తున్నట్లు వారు తెలిపారు.

## గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి

**కంభంవారిపల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని కలికిరివాండ్లపల్లెలో గుడెసెలు వేసుకొని, నివాసం ఉంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ కోరారు. గిరిజనుల ఇళ్లపై దాడులు చేయడం, గుడెసెలు తొలగిస్తామని బెదరించడం సమంజసం కాదని అన్నారు.

**CHANGE OF NAME**

I, J.D.KEERTANA (old name), D/o J.V.Dinakar Naidu and W/o Palyam Navinramanarayana, resident of D.No.16-106-18, Siva Jyothi Nagar, Sai Chitra Theatre, Madanapalle Post and Town, Chittoor Dist., Andhra Pradesh -517325. Henceforth be known as KEERTANA JALA DINAKAR (new name).

## మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే:** కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. తంబళ్లపల్లె మండలం చెట్లవారిపల్లెకు చెందిన రాజేంద్ర సోమవారం ఇంటి వద్దనే విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని తంబళ్లపల్లె పోలీసులకు తెలియజేశారు.

## పల్లె దారులు.. ప్రయాణానికి అవస్థలు

**ములకలచెరువు, న్యూస్‌టుడే:** తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రానికి వెళ్లే రోడ్లతో పాటు పల్లె దారులు కూడా అధ్వానంగా మారాయి. ఆయా మార్గాల్లో ప్రయాణిస్తున్నప్పుడు ప్రమాదాలకు గురవుతున్నామని చోదకులు వాపోతున్నారు. గత వైకాపా పాలనలో రోడ్ల నిర్మాణాలను విస్మరించింది. వాహన చోదకుల నుంచి పెద్దెత్తున విమర్శలు వచ్చినా అధికారులు మరమ్మతులు దిశగా చర్యలు చేపట్టడంలేదని ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గంలోని ములకలచెరువు, పీటీఎం, పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాలతో పాటు ఇతర మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది.

● ములకలచెరువు నుంచి తంబళ్లపల్లెకు వెళ్లే మార్గంలో తారు రోడ్డుపై కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. గూడుపల్లి సమీపంలోని కట్టపై చిన్నపాటి వర్షానికి కట్టపై మట్టి ఉండడంతో బురదగా మారుతోంది. దీంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. తంబళ్లపల్లె మండలంలో సైతం పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.

● పీటీఎం మండలంలో మద్దయ్యగారిపల్లి నుంచి కందుకూరుకు, చేలూరుకు వెళ్లే మార్గాలు గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉన్నాయి.

● బి.కొత్తకోట మండలంలో పలు రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. బి.కొత్తకోట - బడికాయలపల్లి, రంగసముద్రం మార్గాలు గుంతలు ఏర్పడి ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. పెద్దమండ్యం మండలంలో పాపేపల్లి నుంచి గాలివీడు రోడ్డు అధ్వానంగా ఉంది. ఎల్లుట్ల నుంచి కేశపురం వరకు వెళ్లే రోడ్డు దుస్థితి కూడా ఇలానే ఉంది.

గుంతలు ఏర్పడిన బెట్టకొండ- కందుకూరు మార్గం

### ప్రమాదాల బారిన పడుతున్నాం

పీటీఎం మండలం, కందుకూరు నుంచి కర్ణాటక రాష్ట్రం చేలూరుకు వెళ్లే రోడ్డు మార్గంలో ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా మారింది. కందుకూరు నుంచి చెట్లవారిపల్లి వరకు రోడ్డు గుంతల మయంగా మారింది. ద్విచక్ర వాహనంలో కందుకూరు నుంచి చేలూరుకు వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాను. ఇప్పటి వరకు ఆరోగ్యం కుదురుకోలేదు. నిత్యం వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం పడితే వర్షపు నీటితో గుంతలు నిండిపోతాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

**- అంజాద్‌ఖాన్, కందుకూరు.**

### ప్రభుత్వానికి నివేదించాం

పీటీఎం మండలంలోని అంకిరెడ్డిపల్లి పనులు ప్రారంభించాం. కొన్ని రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. అనుమతులు రాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

**- రాజేంద్ర, జేఈ, పంచాయతీ రాజ్**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

15వ వర్ధంతి

ఆప్యాయత, ప్రేమానురాగాలకు ప్రతిరూపమై మా అందరి హృదయాలలో మమతానురాగాలను పంచి, మా కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన కీ॥శే॥ రాచపల్లి నాగరాజు గారు మా నుండి దూరమై 15 సం॥ కాలం గడిచిననూ మీ మధురస్మృతులు మరువలేకున్నాము. దైవ సన్నిధిలో మీ పవిత్ర ఆత్మకు శాంతి ప్రసాదించాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య: రాచపల్లి రామక్రిష్ణమ్మ

కీ॥శే॥ రాచపల్లి నాగరాజు గారు
Retd. Post Master
రెడ్డీస్ కాలనీ, మదనపల్లి
మరణం: 30-12-2010

కుమార్తె: రాగల సాయిలక్ష్మి
అల్లుడు: రాగల లక్ష్మీపతి
మనుమరాండ్రు: దక్షిత, ధన్యశ్రీ
మనుమడు: రిశ్వంత్ రాజా

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

## ఉత్తర ద్వార దర్శనానికి ఆలయాల ముస్తాబు

రాజంపేటలోని విద్యుద్దీపాలతో శ్రీవారి ఆలయం

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే :** ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తితిదే డిప్యూటీ ఈవో ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం తాళ్లపాక గ్రామంలోని సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. తాళ్లపాక, అన్నమయ్య విగ్రహం వద్ద ఉన్న శ్రీవారి ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో క్యూలైన్లు, చలువ పందిళ్లు, దాతల సహకారంతో అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, స్వామి దర్శనం తర్వాగా చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, ఆలయ అర్చకులు రఘు స్వామి, పార్థసారథి, అధికారులు పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు:** పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, మండలంలోని శాంతినగర్ వద్ద ఉన్న శ్రీవేణుగోపాల స్వామి దేవాలయాల్లో మంగళవారం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సుదర్శనశర్మ, రమణయ్య తెలిపారు.

**చిట్వేలి, పుల్లంపేట:** ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పుల్లంపేట, చిట్వేలి మండలాల్లోని ఆలయాలను సోమవారం విద్యుద్దీపాలతో అలంకరించారు. మారెమ్మ ఆలయంలో అన్నదానం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రి అఖండ భజన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

**చిన్నమండెం :** చిన్నమండెం బలిజపల్లెలోని శ్రీసీతారాముల వారి ఆలయంలో మంగళవారం ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. దేవగుడిపల్లెలో వెలిసిన శ్రీమండెం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అభిషేక పూజలు ఉంటాయని అర్చకులు తెలిపారు.

కోడూరులో వేంకటేశ్వర స్వామి ఆలయం

పుల్లంపేటలో భావనారుషి ఆలయంలో ఏర్పాట్లు

## ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

**ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే :** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు శ్రీకృష్ణకు జిల్లా విద్యాశాఖ అధికారి శుక్రవారం షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఈ నెల 18వ తేదీన 'ఈనాడు'లో 'క్రమశిక్షణ.. క్రమశిక్షణా' శీర్షికన కథనం ప్రచురితమైంది. అలస్యంగా స్పందించిన విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయుడికి నాలుగు రోజుల కిందట షోకాజ్ నోటీసు పంపారు. అప్పటికీ ఆయన వివరణ ఇవ్వకపోవడంతో సోమవారం ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఈవో నాగయ్య పాఠశాలకు వచ్చి తోటి ఉపాధ్యాయులను విచారించారు. ఈ ప్రధానోపాధ్యాయుడి వివరణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు ఇచ్చిన వివరణను ఉన్నతాధికారులకు అందించిన తర్వాత తదుపరి విచారణ జరుగుతుందన్నారు.

## అనుసంధాన దారి..
## వంతెన నిర్మిస్తే సరి

**గాలివీడు, న్యూస్‌టుడే:** గాలివీడు పంచాయతీ పరిధిలోని గ్రామీణ ప్రాంత కాలనీలను కలుపుతూ నిర్మించిన అనుసంధాన రోడ్డుకు కుషావతి నది అడ్డుగా నిలిసింది. ఈతోటి వాండ్లపల్లె మాలపల్లె నుంచి పత్తూరిమాలపల్లె వరకు అనుసంధానం రోడ్డుతో పాటు మార్గం మధ్యలోని కుషావతి నదిపై పైపులైను వంతెన (కల్వర్టు) నిర్మించాలని నిర్ణయించారు. అందుకు వైకాపా పాలనలో నిధులు మంజూరు చేయడంతో రెండు పల్లెల నుంచి సిమెంటు రహదారి పనులు నది వరకు పూర్తి చేశారు. నదిపై కల్వర్టు పనులు మాత్రం చేపట్టలేదు. వేసిన సీసీ రోడ్డు లక్ష్యానికి దూరంగా మారింది. ఏళ్లనాటి దారి సమస్య తీరలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. నదిపై పైపు వంతెన నిర్మించాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుసంధాన రహదారిని పూర్తి చేసి పెండింగ్ పనుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ తెలిపారు. అనుమతి రాగానే కల్వర్టు పనులు చేపడతామన్నారు.

ఈతోటివాండ్లపల్లె మాలపల్లెలను కలుపుతూ కుషావతి నది వరకు నిర్మించిన సీసీ రోడ్డు

పత్తూరు మాలపల్లెను కలుపుతూ కుషావతి నది వరకు వేసిన సీసీ రోడ్డు

## మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

**చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే :** ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. సోమవారం చిట్వేలి మండలంలోని కె.కందులవారిపల్లెలో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు, గాండ్లపాలెంలో అర్వో వాటర్ ప్లాంటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుడా ఛైర్మన్ రూపానందరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు, ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

## మున్సిపల్ కౌన్సిలర్ల రాజీనామా

**రాయచోటి, న్యూస్‌టుడే :** అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని తొలగింపు నిర్ణయాన్ని నిరసిస్తూ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పి. దశరథరామిరెడ్డి, కౌన్సిలర్లు పి. మదన్‌మోహన్ రెడ్డి, విజయమ్మలు పదవులకు రాజీనామా చేశారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ రవిరెడ్డికి రాజీనామా పత్రాన్ని అందజేశారు. గత మూడేళ్లుగా జిల్లా కేంద్రం అనేక విధాలుగా అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా కేంద్రం తొలగించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునః సమీక్షించాలని వారు కోరారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా తాము పదవులకు రాజీనామా చేస్తున్నామని, రెండు సార్లు ఓటు వేసి ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌ఛార్జి కమిషనర్ రవిరెడ్డికి రాజీనామా పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ మదన్‌మోహన్‌రెడ్డి

## రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలని నిరసన

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

**రాయచోటి, న్యూస్‌టుడే :** అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని అలాగే కొనసాగించాలని రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి కోర్టు గేట్ ఎదుట నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 2022 ఏప్రిల్‌లో జిల్లా కేంద్రం ఏర్పాటైనప్పటి నుంచి అన్ని విధాలా అభివృద్ధి చెందుతూ వస్తోందన్నారు. జిల్లా కేంద్రానికి కావాల్సిన అర్హతలు అన్నీ రాయచోటికి ఉన్నాయని, గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, ఆ మేరకు రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలని డిమాండు చేశారు. కలెక్టరేట్ ఎదుట న్యాయవాదులు నినాదాలు చేశారు. అనంతరం డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు టి. ఈశ్వర్, రెడ్డిబాషా, పి. రెడ్డెయ్య, సుంకు రవీంద్ర, దర్బార్‌బాషా, రెడ్డప్పరెడ్డి, రామాంజనేయులు, వీరభద్ర, నాగమల్లు, లక్ష్మీదేవి, శివమ్మ, కృష్ణమ్మ, వరలక్ష్మి, అలియాస్‌బాషా, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఐకాస నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

**రాజంపేట, న్యూస్‌టుడే :** రాజంపేటను జిల్లా చేయాలని రాజంపేట జిల్లా సాధన సమితి నాయకులు సోమవారం 20వ రోజు రిలే దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా వారు అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లాను మూడు ముక్కలుగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాని రాజంపేటను జిల్లా చేసుకోవడానికి తాము ఇచ్చిన పిలుపునకు ప్రజలు, ఉద్యోగులు, కార్మిక సంఘాలు, వివిధ పార్టీలు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తూ ఇన్ని రోజులు ఉద్యమానికి ఊపిరి పోశారని తెలిపారు. ఈ సందర్భంగా అందరికీ ఐకాస నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

### తెదేపా ఆధ్వర్యంలో ఆందోళన

**చిన్నమండెం, న్యూస్‌టుడే :** అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిలో ఉండాలని చిన్నమండెం మండల తెదేపా నాయకులు జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సోమవారం చిన్నమండెంలోని పార్టీ కార్యాలయం నుంచి తెదేపా మండల అధ్యక్షుడు రెడ్డెప్ప ఆధ్వర్యంలో కడప - బెంగళూరు ప్రధాన రహదారిపై నినాదాలు చేస్తూ రాయచోటికి వెళ్లారు. అఖిల కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డెప్ప మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు కలిగిన రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలని డిమాండు చేశారు.

అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న ఐకాస నాయకులు

## కడప జిల్లాలో కలపండి

**రాయచోటి, న్యూస్‌టుడే :** అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి తొలగించి తీరని అన్యాయం చేశారని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నాయకులు తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఉండాలని లేనిపక్షంలో కడప జిల్లాలో కలపాలని రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవిశంకర్ డిమాండు చేశారు. ప్రభుత్వం పునరాలోచించి రాయచోటిని జిల్లా కేంద్రంగా ఉంచాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీటీఏ నాయకులు

## నిర్ణయం ఉపసంహరణకు డిమాండ్

**రాయచోటి, న్యూస్‌టుడే :** గతంలో రాష్ట్రం విడిపోయేటప్పుడు అవరి బంతి ఉందని అప్పటి ముఖ్య నాయకుడు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొంత మంది వ్యవహారంలాంటి తీరుతో నేడు అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెకు తరలిపోయిందన్నారు. రాయచోటి ప్రాంత ప్రజలను ఆవేదనకు గురి చేశారని ఆయన విమర్శించారు. ఏ రోజూ తాను పదవులకు అరువులు సాచలేదన్నారు. వైకాపా ప్రభుత్వం ఇచ్చిన జిల్లాను కక్ష సాధింపు, స్వార్థంతో కూటమి ప్రభుత్వం మూడు ముక్కలు చేయడం దుర్మార్గమన్నారు. స్వార్థపూరిత నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకుని రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలని డిమాండు చేశారు.

## అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం హామీ

**రాయచోటి, న్యూస్‌టుడే :** రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని తెదేపా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడును కలిశారు. రాయచోటి నుంచి జిల్లా కేంద్రాన్ని తొలగించడంపై సీఎంతో చర్చించామన్నారు. విధి లేని పరిస్థితుల్లోనే మార్పు చేయాల్సి వచ్చిందని సీఎం చెప్పారన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల ప్రజలు రాయచోటితో కలిసి ఉండేందుకు ఇష్టపడకపోవడంతోనే ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. రాయచోటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సీఎం హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో హోమం

**సుండుపల్లి:** సుండుపల్లె, చెన్నకేశవ ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి గోవింద మాలాధారుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హోమం పూజలు నిర్వహించారు. గోవింద మాల ధరించిన భక్తులు వైకుంఠ ఏకాదశి రోజున వేంకటేశ్వరస్వామి దర్శనం నిమిత్తం మంగళవారం పాదయాత్రగా వెళ్లనున్న నేపథ్యంలో హోమం, గణపతి పూజ నిర్వహించారు.

## క్రీడలతో మానసికోల్లాసం

**నందలూరు, న్యూస్‌టుడే :** క్రీడలు విద్యార్థుల జీవితాల్లో మానసిక ఉల్లాసంతోపాటు ఆత్మవిశ్వాసాన్ని, మనోధైర్యాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కాట్ గ్రూప్ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు వేపగుంట సామ్రాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ పోటీలు ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనుదీప్, భావన, త్రినాథ్, సుధాకర్, నరసింహారెడ్డి, గుణ యాదవ్, ఇబ్బు, గ్రీష్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**రాయచోటి :** ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భూ ఆస్తి వివాదాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలపై బాధితులు అర్జీలు అందజేశారు. బాధితుల సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో టెలీ కాన్ఫరెన్సు ద్వారా సమస్య పరిష్కారం కాకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. బాధితులను పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుకోకుండా నిర్ణీత గడువులోపు సమస్య పరిష్కరించి న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన తెలియజేశారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించినప్పుడే ఫిర్యాదుల పరంపర తగ్గుతుందన్నారు. అర్జీదారుల సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించి తగు నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని ఆయన ఆదేశించారు.

## విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే :** పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వర్తమాన అంశాలు, జనరల్ నాలెడ్జ్‌పై పోటీ పరీక్షలు నిర్వహించగా - మొదటి, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.కార్తీక్ కుమార్, పి.యువరాజ్, ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.కిన్నెర వరుసగా విజేతలుగా నిలిచారు. వారికి కళాశాల డైరెక్టర్ వసుంధర బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ● పట్టణంలోని శ్రీ ధరణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. వర్తమాన అంశాలు, జనరల్ నాలెడ్జ్‌పై పోటీ పరీక్షలు ఏర్పాటు చేశారు. ఏడు, ఎనిమిది, తొమ్మిదో తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో తొమ్మిదో తరగతి చదువుతున్న వి.రెడ్డికుమార్ రాజు, జె.జతిన్‌కుమార్, ఏడో తరగతి విద్యార్థి ఎం.ప్రణన్య విజేతలుగా నిలిచారు. కరస్పాండెంట్ నాగరాజు, ప్రిన్సిపల్ సుకుమార్ వారికి బహుమతులు అందజేశారు.

**రాయచోటి గ్రామీణ :** రాయచోటిలోని ఐకే జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలపై సోమవారం ప్రతిభా పాటవ పోటీలు (క్విజ్) నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జోహ, షమీన, ద్వితీయ సంవత్సర విద్యార్థి నాజిహిన్ విజేతలుగా నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ రియాజ్ అహ్మద్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్వీ జూనియర్ కళాశాల డైరెక్టర్ వసుంధర, అధ్యాపకులు

గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న ధరణి విద్యానికేతన్ కరస్పాండెంట్ నాగరాజు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపల్ రియాజ్ అహ్మద్

## చోరీకొచ్చి మహిళపై హత్యాయత్నం

**సంబేపల్లె, న్యూస్‌టుడే :** మండలంలోని గుట్టపల్లె కస్పాలో పట్టపగలే ఓ దుండగుడు చోరీ చేసేందుకొచ్చి ఓ మహిళను గొంతు నులిమి గోడకేసి బాది పరారైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సంబేపల్లె ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ గుట్టపల్లె కస్పాలో జాతీయ రహదారి పక్కన రాళ్లపల్లి రెడ్డెయ్య, రెడ్డెమ్మ దంపతులు నివాసం ఉన్నారన్నారు. సోమవారం ఉదయం పది గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఇంటి బయట ఒంటరిగా ఉన్న రెడ్డెమ్మను తాగడానికి నీళ్లు అడిగాడన్నారు. ఆమె నీళ్లు తీసుకురావడానికి ఇంట్లోకి వెళ్లింది.. అతను ఆమె వెనుక వెళ్లి గొంతు నులిమి గోడకేసి బాదినట్లు తెలిపారు. మహిళ కేకలు వేయడంతో పక్కింటి వారు రావడంతో గుర్తు తెలియని వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై కోన వైపు పారిపోయినట్లు చెప్పారు. గుర్తు పట్టకుండా ఉండేందుకు దుండగుడు ఎర్రని హెల్మెట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మహిళపై దాడి సమయంలో పెనుగులాటలో అతని సెల్‌ఫోన్ ఇంట్లోనే పడిపోయింది. చెప్పులు బయట వదిలేసి పారిపోయాడు. జరిగిన ఘటనపై బాధితులు సంబేపల్లె ఎస్ఐ రవికుమార్‌కు ఫోన్‌లో సమాచారమిచ్చారు. ఎస్ఐ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి సెల్‌ఫోన్, చెప్పులను స్వాధీనం చేసుకున్నారు. కాల్ డేటా ద్వారా నిందితుడిని త్వరలో గుర్తిస్తామని ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**నందలూరు, న్యూస్‌టుడే :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, బీసీ, ఎస్సీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల పరిషత్ అధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కె. ఆర్.ఎస్. ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి ప్రతి అధికారి, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు అమరేశ్వరి, వైస్ ఎంపీపీలు తుమ్మల భావన, అనుదీప్, మండల కోఆప్షన్ సభ్యులు కలీమ్, సర్పంచులు మోహన్‌రెడ్డి, గీతా, నరసింహారెడ్డి, రాము, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

## రైతులకు అందుబాటులో యూరియా

**రాజంపేట గ్రామీణ :** పెనగలూరు మండల వ్యాప్తంగా 46.5 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని పెగనలూరు మండల ఏవో సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ, ఇతర రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు సమీప కేంద్రాల్లో తీసుకోవచ్చన్నారు.

## స్క్రబ్ టైఫస్‌పై అవగాహన

**లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే :** స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లె బాలుర ఉన్నత పాఠశాలలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ విష్ణుశివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జయరామయ్య మాట్లాడారు.

## యూటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

**పుల్లంపేట, న్యూస్‌టుడే :** విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు తోడ్పడాలని ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సంస్కృత పాఠశాలలో యూటీఎఫ్ కాలమానిని, దైనందినిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**రాజంపేట:** రాజంపేట రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్లు రేణిగుంట రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. శవ పరీక్షల నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

**చిన్నమండెం :** విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఏఎస్ఐ రఘురామయ్య అన్నారు. చిన్నమండెం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడారు. పాఠశాల ఎస్వో సాయిదివ్య పాల్గొన్నారు.

## చిట్వేలి కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

**చిట్వేలి (పుల్లంపేట) :** భవిష్యత్తుకు ఉత్తమ లక్ష్యాన్ని ఎన్నుకోవడంలో కేజీబీవీ విద్యార్థులు మండల టాపర్లుగా నిలిచారని కేజీబీవీ ప్రిన్సిపల్ తులసి తెలిపారు. సోమవారం మండల స్థాయి కెరీర్ ఫెస్టివల్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు ఆమె తెలిపారు. వారిని అభినందించారు.

## రీ సర్వేతోనే రెవెన్యూ సమస్యలు పరిష్కారం

పీవీజీ పల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

**పుల్లంపేట, న్యూస్‌టుడే :** రీ సర్వేతోనే రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దారు పుల్లారెడ్డి పేర్కొన్నారు. పుల్లంపేట మండలంలోని తొమ్మిది రెవెన్యూ గ్రామాల్లో 2026 జనవరి 2 నుంచి రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం పీవీజీపల్లెలో రీ సర్వేపై ర్యాలీ నిర్వహించి ఆయా రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడారు. అనంతయ్యగారిపల్లె, కొమ్మనవారిపల్లె, దొండ్లోపల్లె, వత్తలూరు, టీవీఎన్ఆర్ పురం, పెరియవరం, ఎ.చెన్నమాంబపురం, శ్రీరంగరాజపాలెం, పుల్లంపేట రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేయనున్నారని తెలిపారు. ఈ రీ సర్వేలో రైతులు, ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ప్రజలు, రైతులు, నాయకులు సహకరించి రీసర్వే విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## తిరుమలకు పాదయాత్ర

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే :** కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిని అన్నమయ్య నడిచిన కాలిబాట ద్వారా వెళ్లి దర్శించుకోనున్నట్లు భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌నాయుడు తెలిపారు. సోమవారం అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద పాదయాత్రకు సంబంధించిన ప్రచార గోడ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 17న గోవిందమాల ధరించి అన్నమయ్య స్వగ్రామం తాళ్లపాక నుంచి తిరుమలకు నడిచి వెళ్తున్నామన్నారు. పాదయాత్రలో పాల్గొనే భక్తులకు భోజన వసతి కల్పిస్తామని తాళ్లపాక అన్నమాచార్య సేవా సమితి అధ్యక్షుడు భీమిశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక అన్నమాచార్య సేవా సమితి సభ్యులు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌నాయుడు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు






(c) eenadu

## ముక్కలైన వాహనం.. అవస్థల ప్రయాణం

ఇరుకు రోడ్డుపై చాసిస్ విరిగిపోయిన భారీ వాహనం

చెన్నై-కోల్‌కతా 16వ నంబరు జాతీయ రహదారిపై భారీ వాహనం చాసిస్ ఒక్కసారిగా విరిగిపోవడంతో మొరాయించింది. విజయవాడ వైపు నుంచి చెన్నైకు లోడుతో వెళుతున్న భారీ వాహనం ఆదివారం అర్ధరాత్రి తర్వాత మార్టూరు మండలం డేగరమూడి సమీపంలో జాతీయ రహదారి సర్వీసు మార్గంలో వెళుతూ మధ్యలోకి విరిగి రోడ్డుపై నిలిచింది. కొద్దిరోజులుగా డేగరమూడి-రాజుపాలెం కూడలి వద్ద అండర్‌పాస్ నిర్మాణ పనులు జరుగుతున్న తరుణంలో మార్టూరు వద్ద ఆరువరుసల ఎక్స్‌ప్రెస్ హైవేను మూసేయడంతో సేవా మార్గంలోనే రాకపోకలు సాగుతున్నాయి. ఇరుకైన సేవా మార్గంలో భారీ వాహనం మధ్యలోకి విరిగిపోయి నిలవడంతో ఒంగోలు వైపు వెళ్లే వాహనదారులు సోమవారం మధ్యాహ్నం వరకు అవస్థలు పడ్డారు. పెట్రోలింగ్, హైవే పోలీసులు చర్యలు చేపట్టడంతో అనంతరం రాకపోకలు సాగాయి. -న్యూస్‌టుడే, మార్టూరు

## ధాన్యం కొనుగోలులో సమస్యలపై ఫోన్‌ఇన్ రేపు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ఆర్ఎస్‌కేల వద్ద ధాన్యం కొనుగోలులో సమస్యలు..తేమ శాతంలో ఇబ్బందులు..నగదు చెల్లింపుల్లో జాప్యం ఉన్నా రైతులు ఫిర్యాదు చేయవచ్చు. మిల్లర్లు ఎవరైనా మోసానికి పాల్పడుతున్నా ఫోన్ కాల్‌లో నేరుగా చెప్పవచ్చు. రైతులు సమస్యలు జాయింట్ కలెక్టర్‌కు వివరించేలా 'ఈనాడు ఫోన్ ఇన్' నిర్వహిస్తోంది. కార్యక్రమంలో జేసీ భావన అందుబాటులో ఉంటారు. మీరు చేయాల్సిందల్లా ఫోన్ చేయడమే.

ఈనాడు మీతోడు

99634 79161 | 31.12.25 బుధవారం

ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటలు

# ప్రకాశంలోకి అద్దంకి

న్యూస్‌టుడే, అద్దంకి

అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లాలో చేర్చడంపై అద్దంకి ప్రజలు చేసిన పోరాటం ఫలించింది. యువగళం పాదయాత్రలో యువనేత లోకేశ్ ఇచ్చిన హామీ నెరవేరనుంది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో ప్రకాశం జిల్లాలోకి అద్దంకి నియోజకవర్గం విలీనం కానుంది. గత వైకాపా ప్రభుత్వం పార్లమెంటు నియోజకవర్గ పరిధిని జిల్లాగా మారుస్తున్నామని 2022 మార్చి 4న ప్రకటించింది. ఆ మేరకు ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారు. తదనుగుణంగా అదే ఏడాది ఏప్రిల్ 4 నుంచి అద్దంకి నియోజకవర్గం బాపట్ల జిల్లాలోకి మార్చారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ నేపథ్యంలో 2023 డిసెంబరులో యువగళం పాదయాత్రలో లోకేశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశంలో కలుపుతామంటూ హామీ ఇచ్చారు. సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశంలో కలుపుతూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం లభించింది. అద్దంకిని రెవెన్యూ డివిజన్ చేయాలంటూ 2018లో ప్రజా సంఘాల నేతలు ఆందోళన చేశారు. ఎట్టకేలకు అద్దంకి రెవెన్యూ డివిజన్ కల సాకారం కానుంది. రెండు రోజుల్లో గెజిట్ ప్రకటించనుండగా, నూతన సంవత్సరంలో కార్యాలయ పనులు ప్రారంభమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గానూ ఏర్పాటు..** అద్దంకి రెవెన్యూ డివిజన్ పరిధిలో అద్దంకి, దర్శి నియోజకవర్గాలుంటాయని ప్రాథమిక నోటిఫికేషన్‌లో ఉంచారు. గత నెల 27న అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేయడం, రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఏర్పాటుకు సంబంధించి ఈ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. తర్జనభర్జనల అనంతరం పూర్తిస్థాయిలో అద్దంకి, దర్శి నియోజకవర్గాలను అద్దంకి రెవెన్యూ డివిజన్‌లో ఉంచారు. మొత్తం పది మండలాలతో పూర్తిస్థాయిలో అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. గెజిట్ విడుదల కానుండటంతో కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపడంతో పాటు రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# కొలువుదీరేలా.. అవకాశాలు

న్యూస్‌టుడే, బాపట్ల

**ప్రతిభావంతులకు కంపెనీలు పెద్దపీట**

ఇంజినీరింగ్ విద్యార్థులకు కొలువుల జాతర వస్తోంది. ఇంజినీరింగ్ కోర్ బ్రాంచీలైన సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈలో బీటెక్ పూర్తి చేసిన ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. చెన్నై, హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న నిర్మాణ, ఆటోమొబైల్, విద్యుత్తు పరికరాల తయారీ కంపెనీలు ప్రాంగణ నియామకాలు నిర్వహించి ప్రతిభావంతులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నాయి. వీరికి తక్కువ వేతనమే ఇస్తున్నా మూడు, నాలుగేళ్లు పని చేస్తే ఆ అనుభవంతో భవిష్యత్తులో పెద్ద కొలువులు సాధించే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ కోర్సులు చదివిన వందల మంది విద్యార్థులు ఐటీ కంపెనీల్లో కొలువులు దక్కించుకుంటున్నారు. ఇన్ఫోసిస్, టీసీఎస్, పెగా, యాక్సెంచర్, సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్, జెన్‌ట్రీ కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేపట్టాయి.

❖ ఉమ్మడి జిల్లాలో 50 ఇంజినీరింగ్ కళాశాలలు, అయిదు డీమ్డ్ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. బీటెక్ పూర్తి చేసి ఏటా 12 వేల మందికి పైగా ఇంజినీరింగ్ పట్టభద్రులు బయటకు వస్తున్నారు. నిరుడితో పోలిస్తే ఈ సంవత్సరం ఐటీ కంపెనీలు నియామకాలు పెంచాయి. ఇంజినీరింగ్ చివరి సంవత్సర విద్యార్థులు సర్టిఫికేషన్ కోర్సులు చేసి ఆన్‌లైన్, మౌఖిక పరీక్షల్లో ప్రతిభ చూపి కొలువులు దక్కించుకుంటున్నారు. కొందరు విద్యార్థులు మూడు కంపెనీలు నిర్వహించిన నియామక పోటీల్లో సత్తా చాటి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అత్యధిక వేతనం ఇచ్చే కంపెనీలో చేరటానికి మొగ్గు చూపుతున్నారు. పెగా కంపెనీ ఏడాదికి రూ.11 లక్షలు వేతనం చెల్లించటానికి ముందుకు వచ్చింది. చివరి సంవత్సరం రెండో సెమిస్టర్ ఆరంభం అవుతున్న జనవరి మూడో వారం నుంచే ఉద్యోగాలకు ఎంపిక చేసిన విద్యార్థులను ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కింద తీసుకుంటోంది. ఈ సమయంలో నెలకు రూ.25 వేలు చెల్లిస్తోంది. ఇది పూర్తి కాగానే వేతన ప్యాకేజీ కింద చెల్లింపులు చేయనున్నారు.

❖ ఇంజినీరింగ్ కోర్ బ్రాంచీల్లో బీటెక్ పూర్తి చేస్తున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు గతంలో కన్నా మెరుగ్గా లభిస్తున్నాయి. ఉద్యోగానికి ఎంపికైన వారికి నెలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వేతనంతో పాటు ఉచితంగా వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నాయి. వేతనం కొంత తక్కువగా ఉన్నా విద్యార్థులు ఆయా కంపెనీల్లో చేరడానికి ఇష్టపడుతున్నారు. అనుభవం గడించిన వారికి మంచి వేతనంతో తర్వాత పెద్ద కంపెనీల్లో కొలువులు లభిస్తున్నాయి.

**పెగా కంపెనీలో పనిచేయడానికే మొగ్గు**

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో టీసీఎస్, యాక్సెంచర్, పెగా కంపెనీలు ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామక పరీక్షలు రాశా. బీటెక్‌లో తొమ్మిదికిపైగా జీపీఏ సాధించా. సీఎస్ఈ చదువుతూనే ప్రత్యేకంగా సిస్టమ్ ఆర్కిటెక్ట్, సీనియర్ సిస్టమ్ ఆర్కిటెక్ట్ సర్టిఫికేషన్ కోర్సులు చేశా. నైపుణ్యాలు పెంచుకోవడానికి అవి ఉపయోగపడ్డాయి. మూడు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యా. పెగాలో ఏడాదికి రూ.11 లక్షల వేతనంతో పాటు 5 వేల షేర్లు ఇస్తామని ఆఫర్ చేశారు. ఆ కంపెనీలో ఉద్యోగంలో చేరుతున్నా.

– షేక్ అఫ్రీన్ షెహనాజ్, బీఈసీ సీఎస్ఈ విద్యార్థి

## చెట్టు మోడు బారి.. చెయ్యే నీడలా మారి!

కొమ్మలు లేకుండా మోడులా ఉన్న చెట్టు..దాని కింద విరిగిన కాలుకు కట్టుతో కదల్లేని స్థితిలో ఓ వృద్ధుడు..సోమవారం మధ్యాహ్నం 2 గంటల వేళ తీక్షణంగా ఉన్న ఎండ..స్ట్రెచర్ తేవడానికి వెళ్లిన సహాయకుల కోసం ఎదురు చూస్తూ అరచెయ్యి అడ్డుపెట్టి ఇలా పడుకున్నారు..అర్ధగంటకు పైగా ఇదే పరిస్థితిలో ఇబ్బంది పడ్డారు. గుంటూరు జీజీహెచ్ లోని అత్యవసర వైద్య విభాగం ముందు ఈ దృశ్యం కనిపించింది. ప్రత్తిపాడు ప్రాంతానికి చెందిన ఇతనికి కాలు విరగ్గా..గతంలో చికిత్స కోసం వచ్చి వెళ్లారు. మళ్లీ సోమవారం మధ్యాహ్నం రాగా..ఎండలో ఇలా ఇబ్బంది పడాల్సి వచ్చింది.

-ఈనాడు, అమరావతి

ఆకట్టుకున్న విన్యాసాలు

ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన పశ్చిమ బెంగాల్ క్రీడాకారులు

## యోగాతో ఆరోగ్యం

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: జాతీయ యోగాసన పోటీల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారుల ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. జిల్లెళ్లమూడి అమ్మ ఆశ్రమంలో రాష్ట్ర యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ యోగాసనాల పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకుంటే ఆరోగ్యంతో ఆనందంగా జీవిస్తారన్నారు. బాలురు, బాలికల విభాగాల్లో పశ్చిమబెంగాల్ జట్లు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచాయి. త్రిపుర ద్వితీయ స్థానంలో నిలిచింది. వ్యక్తిగత బాలుర విభాగంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన వినోద్ చౌదరి, బాలికల విభాగంలో అన్నాషా భౌమిక్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజేతలకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, సత్యసాయి స్వామీజీ, ఇండియన్ యోగా ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ పురోహిత్, ప్రధాన కార్యదర్శి మృణాల్ చక్రవర్తి, ఏపీ యోగా అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ కళ్లం హరినాథరెడ్డి, అధ్యక్షుడు కూన కృష్ణదేవరాయలు, ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్ బహుమతులు అందజేశారు. విశ్వజననీ పరిషత్ ట్రస్టు ఛైర్మన్ బ్రహ్మాండం రవీంద్రబాబు, వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, యోగా సంఘం ప్రతినిధులు గురజాల శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, చాపల సుబ్రహ్మణ్యం, రెడ్డి నాగరాజు, శీలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## లోగో కళావిహీనం



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ) ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన వర్సిటీ లోగో కళావిహీనంగా మారింది. విశ్వవిద్యాలయం పేరు, సత్యేసర్వం ప్రతిష్ఠితం సూక్తి..మధ్యలో పూర్ణకుంభం..పచ్చదనంతో ఏర్పాటు చేసిన లోగో సరైన నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారింది. అధికారులు చొరవ చూపి విశ్వవిద్యాలయ దీప్తిని ప్రతిబింబించేలా ప్రాంగణాన్ని చక్కగా తీర్చిదిద్దాలని విద్యార్థులు కోరుతున్నారు. -ఈనాడు, అమరావతి

# పీడించి.. బెదిరించి!

## గుంటూరు జీజీహెచ్‌లో వాహనాల పార్కింగ్ మాటున దౌర్జన్యం

ఈనాడు, అమరావతి

డబ్బుల కోసం పీడించేస్తున్నారు..వెంటనే ఇవ్వకుంటే బెదిరింపులకు దిగుతున్నారు..అవమానకర మాటలు..వెరసి గుంటూరు సర్వజనాసుపత్రి(జీజీహెచ్)లో వాహనాల పార్కింగ్ మాటున గుత్తసంస్థ సిబ్బంది దౌర్జన్యం చేస్తున్నారు.

జీజీహెచ్‌కు నిత్యం 5 వేల మందికి పైగా రోగులు వస్తుంటారు. ఇందులో ఇన్‌పేషంట్లుగా 1500 నుంచి 2 వేల మంది వరకు చేరుతుంటారు. ఇంతటి కీలకమైన ఆసుపత్రిలో వాహనాల పార్కింగ్ అతి పెద్ద సమస్యగా మారింది. ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, సిబ్బంది కోసం సెల్లార్లలో కొన్ని ప్రాంతాలు కేటాయించారు. అయితే, రోగులు, వారి సహాయకులు ద్విచక్రవాహనాలు, కార్లు పెట్టుకోవాలంటే అవస్థగా మారింది. సరైన స్థలం లేకపోవడంతో సూపరింటెండెంట్ కార్యాలయం ముందు నుంచి అత్యవసర విభాగం వరకు ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ నిలుపుతున్నారు. కొన్నిచోట్ల ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఇదంతా ఓ ఎత్తయితే..ఇక్కడే పార్కింగ్ పేరుతో కొత్తరకం దోపిడీకి తెరతీయడంపై రోగులు బాహాటంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

రోగి సహాయకుల నుంచి వాహన రుసుం వసూలు చేస్తున్న గుత్తసంస్థ సిబ్బంది

**స్థలం ఆసుపత్రిది.. దోపిడీ గుత్తేదారుది..**

అత్యవసర విభాగం, శవాగారం ముందున్న స్థలంలో ఓ గుత్తసంస్థ పార్కింగ్ పేరుతో వసూళ్ల దందాకు దిగుతోంది. ద్విచక్రవాహనానికి రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. అత్యవసర చికిత్స కోసం హడావుడిగా వస్తోన్న రోగులకు ఇది తలనొప్పిగా మారింది. సరిపడా చిల్లర ఇవ్వాలంటూ కొందరిని ఇబ్బంది పెడుతుండగా, అత్యవసర కేసులతో వచ్చామని సహాయకులు చెబుతున్నా వినిపించుకోకుండా బెదిరిస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే బలవంతంగా వాహనాన్ని బయటకు పంపిస్తున్నారు. తాము రూ.8 లక్షలకు వేలం పాడుకున్నామని..డబ్బు కట్టకుండా వాహనం పెట్టడానికి వీల్లేదంటూ గుత్తసంస్థ సిబ్బంది తెగేసి చెబుతుండటంతో రోగులు హతాశులవుతున్నారు. ఆసుపత్రిలో వరుస వాహన చోరీలు జరుగుతుండగా, అందుకు మాత్రం ఎవరూ బాధ్యత వహించని దుస్థితి. రైల్వేస్టేషన్, బస్టాండ్..ఇలా ఎక్కడైనా పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలం కేటాయింపు, షెడ్లు ఏర్పాటు చేయడం పరిపాటి.

**'ప్రైవేటు' జేబు నింపడానికా..?**

ప్రస్తుత గుత్తసంస్థకు పార్కింగ్‌ను మూడు నెలల క్రితం రూ.8 లక్షలకు కట్టబెట్టామన్నది ఆసుపత్రి అధికారుల మాటల సారాంశం. అయితే, ఇందులో గుత్తేదార్ల జేబులు నింపడం తప్ప రోగులకు మేలు జరగడం లేదు. కేవలం ఆదాయమే పరమావధిగా భావించి అధికారులు మిన్నకుండిపోవడంతో గుత్తసంస్థ సిబ్బంది ఇష్టారాజ్యంగా మారింది. ఇప్పటికైనా టెండరు రద్దు చేసి ఉన్న సెక్యూరిటీ సిబ్బందితో పార్కింగ్ పక్కాగా నిర్వహిస్తే బాగుంటుందన్న అభిప్రాయం రోగుల సహాయకుల నుంచే వ్యక్తమవుతోంది.

# అధ్యయనం మొదలు!

## ఏఎన్‌యూలో అతిథి అధ్యాపకుల గత నియామకాలపై దృష్టి

ఈనాడు, అమరావతి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గతంలో జరిగిన అతిథి అధ్యాపకుల నియామకాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందా..విద్యార్హతలు, ప్రతిభను పక్కన పెట్టి అప్పటి ప్రభుత్వ పెద్దలు, నాటి ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్దపీట వేయడంపై ప్రస్తుతం లోతైన అధ్యయనం జరుగుతోందా.. అన్న ప్రశ్నలకు అవుననే సమాధానమే లభిస్తోంది. ప్రస్తుతం పనిచేస్తోన్న సదరు ఉద్యోగులకు సంబంధించిన విద్యార్హతలు, నైపుణ్యాలపై సమగ్రంగా పరిశీలన చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. అప్పటి ఉపకులపతి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపైనా ప్రస్తుతం సునిశితంగా ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంతో సహా అనేక అవకతవకలపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరగడం తెలిసిందే. సుమారు నెలరోజుల పాటు సమగ్రంగా తనిఖీ చేసిన నిఘా వర్గాలు..మొత్తం పరిస్థితిని నివేదించాయి. ఎక్కడెక్కడ ఏ రీతిలో నిబంధనలు ఉల్లంఘించారన్న దానిపై అందులో పేర్కొన్నట్లు సమాచారం. ఆ కోవలోనే అతిథి అధ్యాపకుల వ్యవహారంపైనా వివరించగా..ప్రస్తుతం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

**అన్నీ చూస్తున్నారు..** అప్పట్లో అతిథి అధ్యాపకుల నియామకానికి సంబంధించి విభాగాల వారీగా ఉన్న అవసరం ఏమిటి.. నియామకానికి ఏఏ స్థాయిల్లో అనుమతులు తీసుకున్నారు..నిబంధనలు ఏం చెబుతున్నాయి.. అందుకు భిన్నంగా ఎక్కడెక్కడ ఉల్లంఘనలు జరిగాయి..విద్యార్హత విషయంలో పొంతన ఉందా.. నైపుణ్యాల తీరుతెన్నులు ఎలా ఉన్నాయి..అడ్డగోలుగా నియామకాలు ఏఏ విభాగాల్లో జరిగాయి.. బోధనానుభవం లేని వారు ఎవరైనా ఉన్నారా.. కుటుంబీకులకు, బంధువులకూ కొందరు ఉద్యోగులు అవకాశాలు ఇప్పించుకున్న క్రమంలో అలాంటి వారెవరున్నారు..ఇలా అనేక కోణాల్లో ఆరా తీస్తున్నారు. ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన కొందరు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించిన నేపథ్యంలో వాటిపైనా కూపీ లాగుతున్నారు. అలాగే, ఇప్పటి వరకు వారి పనితీరూ మదింపు చేస్తున్నారు. ఎవరెవరు తరగతులకు సక్రమంగా వస్తున్నారు..ఎవరు రావడం లేదు.. బోధనా తీరుతెన్నులు ఎలా ఉన్నాయన్న కోణంలోనూ విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బోధనా ప్రమాణాలు పెంచి..రాజకీయ, సిఫార్సుల జోక్యాన్ని తగ్గించే క్రమంలో తొలుత అతిథి అధ్యాపకుల గత నియామకాల వ్యవహారంపై దృష్టి పెట్టడం చర్చనీయాంశమైంది..!

## 15 శాతం నేరాలు తగ్గాయ్

బాపట్ల: పోలీసు శాఖ చేపట్టిన పటిష్ఠ చర్యల ద్వారా జిల్లాలో ఈ ఏడాది 15.33 శాతం నేరాలు తగ్గాయని ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వార్షిక నేర నివేదికను ఎస్పీ వెల్లడించారు. ప్రభుత్వ ప్రాధాన్య అంశాలైన గంజాయి నిర్మూలన, మహిళలు, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి పని చేస్తున్నామన్నారు. గతేడాదితో పోలిస్తే పోక్సో కేసులు 36 శాతం, సైబర్ నేరాలు 37 శాతం, చోరీలు ఏడు శాతం తగ్గాయని పేర్కొన్నారు. చోరీ, సైబర్ నేరాల్లో రూ.3.62 కోట్ల నగదు రికవరీ చేసినట్లు వివరించారు. ట్రయల్ మానిటరింగ్ ద్వారా కోర్టుల్లో వివిధ కేసుల్లో 1319 మంది నిందితులకు జైలు శిక్షలు పడ్డాయన్నారు. గతంతో పోలిస్తే కేసుల్లో శిక్షలు పడటం 200 శాతం అధికమన్నారు. ఐదు సైబర్ నేరాల కేసుల్లో అంతర్రాష్ట్ర నేరస్థులను అరెస్టు చేశామన్నారు. రోడ్డు భద్రత కోసం ప్రత్యేకంగా తొమ్మిది పోలీసు బృందాలను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ఐదు శక్తి బృందాలు నియమించి, కళాశాలలు, పాఠశాలలు, పట్టణాలు, గ్రామాల్లో 2611 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రౌడీషీటర్లకు ప్రతి వారం కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వారి కదలికలపై నిఘా ఉంచామని చెప్పారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా పెంచి నేరాలు నియంత్రిస్తున్నామన్నారు. మహిళలపై నేరాలు తగ్గాయని, రోడ్డు ప్రమాదాలు నాలుగు శాతం పెరిగాయని తెలిపారు. ఎన్‌హెచ్‌లపై 15 బ్లాక్ స్పాట్లు గుర్తించి ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు చేపట్టామన్నారు. 19 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.


మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

## ఎన్‌హెచ్ 544-డి విస్తరణకు మరో ముందడుగు

వినుకొండ: అనంతపురం - గుంటూరు జాతీయ రహదారి 544-డి విస్తరణకు ముందడుగు పడింది. వినుకొండ నుంచి గుంటూరు వరకు ఇప్పుడున్న రెండు వరుసల రహదారిని నాలుగుగా మార్చేందుకు అవసరమైన భూసేకరణకు నోటిఫికేషన్ జారీ అయింది. దీనిలో భాగంగా జిల్లాలోని గ్రీన్‌ఫీల్డ్‌లో హద్దులు పెట్టేందుకు (పెగ్‌మార్క్ కోసం) నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా షెడ్యూల్ ప్రకటించి అధికార బృందాలను ఏర్పాటు చేసింది. జనవరి 9 నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. సర్వే పూర్తి చేసేందుకు స్థానిక రెవెన్యూ అధికారుల సహకారం కోరుతూ జేసీకి ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం లేఖ రాశారు.

**85 కి.మీ విస్తరణ..** వినుకొండ నుంచి గుంటూరు వరకు 85 కి.మీ. రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఈ ఏడాది మార్చిలో జాతీయ రహదారుల విభాగం 3ఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. తర్వాత డీపీఆర్ పూర్తి కావడంతో రహదారి నిర్మించేందుకు హద్దులు గుర్తించి స్తంభాలు పాతాలని నిర్ణయించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు వేర్వేరుగా షెడ్యూల్ విడుదల చేశారు. పర్యవేక్షణ కు ప్రత్యేకంగా ముగ్గురు అధికారులను నియమించారు.

పల్నాడు జిల్లాలో జనవరి 9 వరకు, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలో వచ్చే నెల 10 నుంచి 12 వరకు హద్దులు నిర్ణయించే ప్రక్రియ పూర్తి చేయాలని నిర్దేశించారు. తర్వాత ఆయా మండలాల సర్వే, రెవెన్యూ అధికారులు నష్టపరిహారం చెల్లించేందుకు సేకరించిన భూముల విస్తీర్ణం, వాటి విలువలు లెక్కిస్తారు.

## పింఛనుదారులకు ముందుగానే పండగ

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: జనవరి ఒకటో తేదీ నూతన సంవత్సరం. ఆ రోజున అందజేయాల్సిన పింఛన్లను ఈనెల 31నే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు సెర్ప్ అధికారులకు ఆదేశాలిచ్చింది. దీంతో మంగళవారమే పింఛను డబ్బులు బ్యాంకుల నుంచి సచివాలయ సిబ్బంది డ్రా చేయనున్నారు. దీంతో ఒక రోజు ముందుగానే లబ్ధిదారులు నగదు అందుకోవడంతో వారికి నూతన సంవత్సరం వచ్చినట్లయింది. ఉదయం ఏడుగంటల నుంచి వీటిని లబ్ధిదారులకు అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూరు శాతం పింఛన్ల పంపిణీ అదేరోజు అయ్యేవిధంగా చూడాలని ఆదేశాలు వెలువడ్డాయి. అనివార్య కారణాలతో ఎవరైనా తీసుకోవడానికి రాకపోతే రెండో తేదీన వారికి అందజేయాలి.

జిల్లాలో పింఛన్లు పొందే వారి సంఖ్య: **2,25,485**

మంజూరైన నగదు: రూ.**96.57** కోట్లు

# పరిహారం.. ప్రహసనం

**న్యాయం చేయడంలో ఎడతెగని జాప్యం**

న్యూస్‌టుడే, బాపట్ల

మిగ్‌జాం తుపాను బాధిత అన్నదాతలు కొందరికి నేటికీ నష్టపరిహారం అందలేదు. మిగ్‌జాం తుపాను 2023 డిసెంబరు 4న బాపట్ల మండలం సూర్యలంక సమీపంలో తీరం దాటింది. ఆ సమయంలో కురిసిన భారీవర్షాలకు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పటి వైకాపా ప్రభుత్వం పరిహారం పంపిణీలో జాప్యం చేసింది. ఎన్నికల ముందు కొద్దిమందికి మాత్రమే పెట్టుబడి రాయితీ అందింది. ఎన్నికలు ముగిసిన తర్వాత పరిహారం ఇవ్వలేదు. సాగుదారులు అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయారు. ❖ పంట కోత, నూర్పిడి దశలో తుపాను వచ్చింది. కుంభవృష్టి కురిసింది. లక్ష ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరి పొలాలు నీట మునిగి వారం వరకు నీరు బయటకు వెళ్లలేదు. కోత కోసిన వరి కంకులకు మొలకలు వచ్చాయి. ధాన్యం రంగుమారి తడిసి దెబ్బతింది. మొక్కజొన్న, అపరాలు, మిర్చి, పొగాకు పైర్లు ముంపు బారినపడి చనిపోయాయి. ఉద్యాన పంటల రైతులు నష్టపోయారు. అప్పటి సీఎం జగన్ బాపట్ల వచ్చి నేరుగా పంటలు దెబ్బతిన్న పొలాల్లోకి వెళ్లలేదు. రైతుల్ని పరామర్శించలేదు. అప్పట్లో జగన్ తీరుపై పెద్దఎత్తున విమర్శలొచ్చాయి.

❖ అప్పుడు ప్రతిపక్ష నేత హోదాలో తెదేపా అధినేత చంద్రబాబు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ముంపు బారిన పడిన పొలాల వద్దకు వెళ్లి పంట నష్టాన్ని పరిశీలించి అన్నదాతలను పరామర్శించారు. పర్చూరు మండలంలో మిర్చి రైతులకు తెదేపా ద్వారా ఆర్థిక సాయం చేశారు. తుపాను డిసెంబరు మొదటి వారంలో రాగా సంక్రాంతి నాటికి రైతుల బ్యాంకు ఖాతాలో పంట నష్ట పరిహారం జమ చేస్తామని జగన్ ఆర్భాటంగా ప్రకటించారు. 2024 మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ ముందు కొంతమంది రైతులకే తూతూమంత్రంగా పరిహారం విడుదల చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిన పరిహారం సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత జూన్, జులైలో కొందరు రైతులకు పెట్టుబడి రాయితీ అందింది. 5,538 మంది రైతులకు రూ.5.78 కోట్ల మేర పరిహారం నిలిచిపోయింది.

**పలుమార్లు అర్జీలు అందజేసినా..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీజీఆర్ఎస్‌లో కలెక్టరేట్లో, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయాల్లో పరిహారం బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సాగుదారులు పలుమార్లు అర్జీలు అందజేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇంకా పరిహారం సొమ్ము విడుదల కాలేదు. సాయం ఎప్పుడు అందుతుందా అని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. దీనిపై జిల్లా ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి అన్నపూర్ణ మాట్లాడుతూ మిగ్‌జాం తుపానుకు పంట నష్టపోయి పరిహారం అందని రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపించామన్నారు. నిధులు విడుదల కాగానే సాగుదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పారు.

(c) eenadu

# సిక్సర్లు కొట్టిన ఉత్సాహం ఫైనల్స్ నేడే

EENADU SPORTS LEAGUE 2025

**గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే:** 'ఈనాడు' ఆధ్వర్యంలో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహిస్తున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025' క్రికెట్ టోర్నమెంట్ చివరి అంకానికి చేరుకుంది. సోమవారం జరిగిన సెమీ ఫైనల్స్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. మంగళవారం జూనియర్స్, సీనియర్స్ పురుషులతో పాటు మహిళల విభాగంలో ఫైనల్స్ జరగనున్నాయి.

Aster Ramesh HOSPITALS We'll Treat You Well

గ్రౌండ్-1

**ఎన్నారైటీ జట్టు విజయపథం..** జూనియర్స్ విభాగంలో సెమీఫైనల్స్ మ్యాచ్ ఎన్నారైటీ కళాశాల(విశదల)-చలపతి డిప్లొమా కళాశాల (మోతడక) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన చలపతి కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఎన్నారైటీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. తర్వాత బరిలోకి దిగిన చలపతి జట్టు 6 వికెట్లు కోల్పోయి 80 పరుగులే చేసింది. చివరి ఓవర్‌లో విజయానికి 8 పరుగులు కావాల్సి ఉండగా.. చలపతి జట్టు లక్ష్యం అందుకోలేకపోయింది. చరణ్ 23 బంతుల్లో (4×4) 25 పరుగులు చేసి ఎన్నారైటీ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

గ్రౌండ్-2

**హిందూ కళాశాల జట్టు జయకేతనం...** జూనియర్స్ విభాగంలో సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల(చీరాల)-హిందూ జూనియర్ కళాశాల (గుంటూరు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన హిందూ కళాశాల 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. బరిలోకి దిగిన సెయింట్ ఆన్స్ జట్టు 7 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. బసవయ్య 31 బంతుల్లో (7×4) 38 పరుగులు చేసి జట్టు విజయానికి ప్రధాన కారకుడయ్యాడు.

**వీవీఐటీ మహిళా జట్టు గెలుపుబావుటా..** మహిళల విభాగంలో సెమీ ఫైనల్స్ మ్యాచ్ వీవీఐటీ(నంబూరు)-విజ్ఞాన్ యూనివర్సిటీ (వడ్లమూడి) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు బౌలింగ్ తీసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన వీవీఐటీ కళాశాల 10 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. తర్వాత విజ్ఞాన్ జట్టు 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులే చేసింది. వీవీఐటీ మహిళా జట్టులో రుచిత (4×4) 21 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించారు.


Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET

Protein Partner
NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Regional Sponsor
CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS

District Sponsor
CITY Chalapathi Institute of Technology MOTHADAKA CAMPUS

Beverage Partner
CMR SHOPPING MALL The joy of life

Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)

Digital Partner
ఈనాడు.నెట్ ETV BHARAT

TV Partner
ETV ఆంధ్రప్రదేశ్

Organised by ఈనాడు


**ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..**

చరణ్ | రుచిత | బసవయ్య | శ్రీరామ్ | హర్ష

**నేడు జరిగే మ్యాచ్‌లు..** వేదిక: చలపతి హిల్‌వ్యూ స్టేడియం

గ్రౌండ్-1 ★ **జూనియర్స్ ఫైనల్స్** ఉదయం 8 గంటలకు హిందూ కళాశాల × ఎన్నారైటీ ★ **సీనియర్స్ ఫైనల్స్..** ఉదయం 11 గంటలకు జేసీ లా కళాశాల × కేఎల్ యూనివర్సిటీ

గ్రౌండ్-2 ★ **మహిళల ఫైనల్స్** ఉదయం 10 గంటలకు వీవీఐటీ ఇంజినీరింగ్ కళాశాల × ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల.

**కేఎల్‌యూదే పైచేయి..** సీనియర్స్ విభాగంలో సెమీఫైనల్స్ మ్యాచ్ ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల జట్టు(గుంటూరు)-కేఎల్‌యూ యూనివర్సిటీ(వడ్డేశ్వరం) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కేఎల్‌యూ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. అనంతరం ఆర్‌వీఆర్‌జేసీ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 72 పరుగులకే పరిమితమైంది. హర్ష రెండో ఓవర్లో మూడు కీలక వికెట్లు తీయడంతో పాటు నాలుగో ఓవర్లో మరో వికెట్ తీసి జట్టు విజయానికి కారకుడయ్యాడు.

**కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జేసీ లా కళాశాల గెలుపు..** సీనియర్స్ విభాగంలో సెమీఫైనల్స్ కేబీఆర్ డిగ్రీ కళాశాల (నరసరావుపేట)-జేసీ లా కళాశాల(గుంటూరు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కేబీఆర్ కళాశాల జట్టు బౌలింగ్‌ను ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన జేసీ లా కళాశాల జట్టు 10 ఓవర్లకు ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 97 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బరిలోకి దిగిన కేబీఆర్ జట్టు 5 వికెట్లు కోల్పోయి 87 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్‌లో 6 బంతులకు 25 పరుగులు చేయాల్సి ఉండగా కేబీఆర్ కెప్టెన్ రజాక్ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టినా.. మూడో బాల్‌కి వికెట్ కోల్పోవడంతో ఓటమిపాలైంది. జేసీ లా కళాశాల కెప్టెన్ శ్రీరామ్ 35 బంతుల్లో (6×4, 4×6) 57 పరుగులతో జట్టుకు విజయం అందించాడు.

## దేవాలయాల పరిరక్షణే లక్ష్యం

**పర్చూరు, న్యూస్‌టుడే:** దేవాలయాల పరిరక్షణే విశ్వహిందూ పరిషత్ ముఖ్య ఉద్దేశంతో పాటు లక్ష్యమని తాళ్లాయపాలెం శ్రీ శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి అన్నారు. విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో హిందువుల్లో ఐక్యతను సాధిస్తూ గడప లోపలే కులం.. గడప దాటితే హిందువులమనే భావన పెంపొందించడమే ధ్యేయమని తెలిపారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక శ్రీ అద్దంకి నాంచారమ్మ దేవాలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ దేశం, సమాజం, ధర్మం, సమాజ హితం కోసం పంచపరివర్తన కార్యక్రమంలో భాగంగా అంటరానితనం నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ లక్ష్యమన్నారు. దేవాలయాల ఆస్తుల పరిరక్షణతోపాటు ఆలయాల్లో అన్యమతస్తులు లేకుండా చూడటమే విశ్వహిందూ పరిషత్ ఉద్దేశమన్నారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని మాట్లాడుతూ దేవాలయాల్లో దీపం పెట్టే పరిస్థితి ఉన్నంతవరకు హిందూ ధర్మం సజీవంగా ఉంటుందని, యువత హిందూ ధర్మ సంరక్షణలో కీలక పాత్ర పోషించాలన్నారు. దేవాలయాల అభివృద్ధి, సంప్రదాయాల పరిరక్షణకు ఐక్యంగా ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ కె.రామకృష్ణ, అన్నదానం చిదంబరశాస్త్రి, కోట శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, తులసి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, పక్కన భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని

## సెల్‌ఫోన్ల రికవరీపై ప్రత్యేక దృష్టి

**బాపట్ల, న్యూస్‌టుడే:** చోరీకి గురైన, ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక పోలీసు బృందాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మూడు నెలల్లో రూ.74.60 లక్షల విలువైన 373 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. ఫోన్లు పోగొట్టుకున్న వారు పోలీస్‌స్టేషన్‌తో పాటు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. వెబ్‌సైట్లో పోయిన ఫోన్ ఐఎంఈఐ నంబరు, ఫోన్ బిల్లు, ధ్రువీకరణ పత్ర వివరాలు నమోదు చేయాలని చెప్పారు. మొబైల్ రికవరీ సమాచారం పొందడానికి వాడుకలో ఉన్న ఫోన్ నంబరు తెలపాలన్నారు. రికవరీ చేసిన ఫోన్లను యజమానులకు ఎస్పీ అందజేశారు. వేగంగా స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఎస్పీలు రామాంజనేయులు, శ్రీనివాసరావు, మొయిన్ పాల్గొన్నారు.

మహిళకు సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

### మహిళల భద్రతకు ప్రాధాన్యం

**చీరాల అర్బన్, న్యూస్‌టుడే:** మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్పీ ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటోందన్నారు. రెండో పట్టణ పోలీసు స్టేషన్‌ని సోమవారం రాత్రి ఆయన తనిఖీ చేసి మాట్లాడుతూ ఇతరులకు ఇబ్బంది లేకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున అత్యవసర నంబర్ల నుంచి వచ్చే ఫోను కాల్స్‌కు పోలీసులు స్పందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో డీఎస్పీ మహ్మద్ మొయిన్, సీఐ నాగభూషణం, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


**పొగాకు బోర్డు, గుంటూరు**

వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య విభాగము, భారత ప్రభుత్వము (ఐ.యస్.ఓ.9001:2015 గుర్తింపు పొందిన సంస్థ)
జి.టి. రోడ్డు, గుంటూరు-522004. ఫోన్: 0863-2358399, 2358499.

**టెండరు నోటీసు**

**2025-26 FCV** పొగాకు ఆక్షన్స్ కొరకు ఆంధ్రప్రదేశ్‌లో గల పొగాకు బోర్డు వేలం కేంద్రాల వద్ద **1) పొగాకు బేళ్ళను హ్యాండిల్ చేయుటకు మరియు 2) ట్రాలీస్ మరమ్మత్తులు/ సర్వీసింగు** కొరకు అనుభవము కలిగిన కాంట్రాక్టర్లు మరియు ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

పైన తెలుపబడిన పనుల కొరకు టెండరు ఫారములు తదితర వివరముల కొరకు రీజినల్ మేనేజరు, ఒంగోలు, రాజమండ్రి మరియు మేనేజరు(ఆక్షన్స్), పొగాకు బోర్డు, గుంటూరు వారిని సంప్రదించగలరు. టెండరు ఫారములు మరియు నియమ నిబంధనలు పొగాకు బోర్డు వెబ్‌సైట్ (www.tobaccoboard.com) నుండి కూడా పొందవచ్చును.

పైన తెలుపబడిన పనుల నిమిత్తము పూర్తి చేసిన టెండరు ఫారాలను టెండరు నియమ నిబంధనలలో తెలిపిన ధరావతు సొమ్ముతో సహా తేది.21-01-2026 సాయంత్రం గం॥3.00 లలోగా పొగాకు బోర్డు, గుంటూరు నందు టెండరు బాక్సులో డిపాజిట్ చేయవలెను. అసంపూర్తిగా ఉన్న టెండర్లు తిరస్కరించబడును మరియు ఏ విధమైన కారణం చూపకుండానే స్వీకరించిన టెండర్లలో ఏదైనా లేదా అన్నింటిని తిరస్కరించేందుకు కార్యనిర్వహణాధికారి, పొగాకు బోర్డు వారు సర్వహక్కులు కలిగియున్నారు.

స్థలము : గుంటూరు, తేది: 29-12-2025 సం/- కార్యదర్శి


## తీరం.. బడ్డీకొట్లలో మద్యం!

**వేటపాలెం, న్యూస్‌టుడే:** తీరం వెంట ఉన్న బడ్డీ కొట్టుల్లో శీతల పానీయాలతో పాటు మద్యం విక్రయిస్తున్నారు. పర్యాటకులకు స్పష్టంగా కనిపించేలా వీటిని దుకాణాల్లో ఉంచుతున్నారు. రామాపురంలో కొత్తగా ఏర్పాటు చేసిన బంకుల్లో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం తాగడం వల్లే సముద్రస్నానాలు చేసే యువత ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పే అధికారులు.. బహిరంగంగా జరిగే విక్రయాల గురించి తెలియదా... తెలిసినా పట్టించుకోవడం లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనికితోడు ఇదే ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని కొంతమంది గుట్టుచప్పుడుగా విక్రయిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వీటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కూల్‌డ్రింక్ బాటిళ్లలో మద్యం సీసాలు (వృత్తంలో)

## సముద్ర నాచు పెంపకంతో ఉపాధి

**బాపట్ల, న్యూస్‌టుడే:** సముద్రంలో నాచు పెంపకం ద్వారా మత్స్యకారులకు అదనపు ఆదాయం లభిస్తుందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో నిర్వహించిన మత్స్య శాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన సోమవారం మాట్లాడారు. సముద్ర నాచు పెంపకం యూనిట్ స్థాపనకు ప్రభుత్వం నూరు శాతం రాయితీపై నిధులు ఇస్తుందన్నారు. కేంద్రం నలభై శాతం, రాష్ట్రం 60 శాతం రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. తీర ప్రాంత వాసులకు ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లాలో 50 యూనిట్లు స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. చినగంజాం మండలం ఏటిమొగ గ్రామంలో మత్స్యకారులను లబ్ధిదారులుగా ఎంపిక చేసి పథకాన్ని వర్తింపజేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కొక్కరికి రూ.16 వేల నగదు ఇవ్వనున్నట్లు చెప్పారు. మత్స్యశాఖ డీడీ గాలిదేవుడు, పీడీ లవన్న పాల్గొన్నారు.

**సౌర విద్యుత్తు ప్రాజెక్టుకు భూములు..** అద్దంకి నియోజకవర్గం బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో సౌర విద్యుత్తు ప్రాజెక్టుకు 1168 ఎకరాల భూమిని రైతుల నుంచి త్వరగా సేకరించి అందజేయనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. భూసేకరణ కోసం రూ.120 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. భూమి కేటాయిస్తే ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతాయన్నారు. జాతీయ రహదారుల నిర్మాణానికి భూములు వేగంగా కేటాయించాలని ఆదేశించారు. భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం సత్వరమే అందించాలన్నారు. జిల్లాలో 46 హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణానికి అవసరమైన భూమి గుర్తించాలన్నారు. జేసీ భావన, అధికారులు పాల్గొన్నారు.

**ఉపాధి పనులు పూర్తికి ఆదేశం ..** వీబీజీరామ్‌జీ కింద గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులు సత్వరమే పూర్తి చేయాలని డ్వామా అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, కంపోస్టు పిట్లు లక్ష్యం మేరకు తవ్వించాలన్నారు. పక్కా గృహాలు, పంచాయతీ కార్యాలయాల భవన నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. రైతులతో మాట్లాడి పంట కాల్వల గట్లపై కొబ్బరి మొక్కలు నాటించాలన్నారు. డ్వామా పీడీ విజయలక్ష్మి, పశు సంవర్ధక శాఖ జేడీ వేణుగోపాల్, గృహనిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


**EENADU Classifieds**

**BUSINESS SERVICES**

**బంగారం కొనబడును.** బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

**JOBS**

SENIOR Electrician: Q: DIP in Electrical, Con: Arjuna solvent extraction pvt. ltd. Perecherla, Gnt. ✆ 96662 99986.

**తెనాలి దగ్గర** దుగ్గిరాలలోని ప్రముఖ కాఫీ పరిశ్రమలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ మరియు ప్యాకింగ్ బాయ్స్ కావలెను. రూమ్ మరియు క్యాంటీన్ సౌకర్యం కలదు. ✆ 92980 11777, 8096161777.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

**ప్రముఖ హోటల్‌లో** పనిచేయుటకు రూమ్ బాయ్స్ కావలెను. భోజనం వసతి సదుపాయం కల్పించబడును. సంప్రదించండి. ఫోన్: 9966846756, 7801062777.

**కుంకుపాడు అద్దంకి** చుట్టుప్రక్కల పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం॥ డ్యూటీ, భోజనం + రూమ్ కలదు. 9149986335, 9652689259.

**గుంటూరులో నివాసము** ఉంటున్న పేషంట్స్‌ను చూసుకొనుటకు భార్య & భర్త మరియు ఆయాలు అర్జంట్‌గా కావలెను. సంప్ర॥ ✆ 7842845772.

**ఉద్యోగం చేస్తూనే** అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

**గుంటూరు మాస్టర్‌మైండ్స్** కాలేజి నందు హాస్టల్ ఇన్‌చార్జిస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్ర. ✆ 89784 80429.

**గుంటూరు మాస్టర్ మైండ్స్** కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జిస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జిస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీ: 14000/- నుండి 21000/- వరకు. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యుండాలి. వివరముల కొరకు సంప్ర. ✆ 9248713335.

**బిజినెస్ మేనేజర్స్/** బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, ఫ్రెషర్స్, వేతనం: రూ.20,000/- + వెహికల్ అలెవెన్స్, 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

**గుంటూరు, AT** అగ్రహారం మా ఇంట్లో ఇంటి పని, వంట పనిచేయుటకు ఆడ పనిమనిషి కావలెను. హిందువులు మాత్రమే. ✆ 97037 54657.

**75సం॥ మహిళను** చూసుకొనుటకు మా ఇంటివద్దనే వుండి ఏ బాదరాబందీలేని 45సం॥లోపు ఒంటరి మహిళా కావలెను. భోజన, వసతి కలదు. 63054 95510.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

## సమస్యలకు తక్షణ పరిష్కారం

**బాపట్ల, న్యూస్‌టుడే:** సమస్యలపై పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 231 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల సమస్యలను కలెక్టర్, జేసీ విన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో ప్రజలకు 300 రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయని తెలిపారు. సమస్యలపై ప్రజలు ముందుగా మండల స్థాయిలో తహసీల్దారుకు అర్జీలు ఇవ్వాలని సూచించారు. అక్కడ పరిష్కారం కాని పక్షంలో ఆర్డీవో కార్యాలయంలో విన్నవించుకోవాలని చెప్పారు. ఆర్డీవో వద్ద న్యాయం జరగకపోతే కలెక్టరేట్‌కు రావాలని సూచించారు. విధి నిర్వహణలో అధికారులు నిర్లిప్తంగా ఉండరాదన్నారు. మండల స్థాయిలోనే అర్జీలు క్షుణ్ణంగా విచారించి పరిష్కరించి న్యాయం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జేసీ భావన, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్ లవన్న పాల్గొన్నారు.

## సమన్వయలోపం... రహదారి ఛిద్రం

**తిమ్మరాజుపాలెం (పర్చూరు), న్యూస్‌టుడే:** రెండు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో ఆ ప్రాంతవాసులకు మరో సమస్య తలెత్తనుంది. మండల పరిధి తిమ్మరాజుపాలెంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేసేలా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు పనులు చేపట్టారు. గ్రామంలోని ఒకటో వార్డులోని ఓ వీధిలో కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ఇటీవల కాలంలో నిర్మించిన సిమెంట్ రోడ్డును మధ్యకు పగులకొట్టారు. దీంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన రహదారి ఛిద్రమై ప్రజాధనం దుర్వినియోగమవుతోందని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపించడం, పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతోనే ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వి.అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా మంచినీటి కుళాయిలు ఏర్పాటుచేసే వ్యక్తులు పంచాయతీ వద్ద ఎటువంటి అనుమతులు పొందలేదని, దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

సిమెంట్ రోడ్డును మధ్యకు పగులకొట్టారిలా..

## రహస్యంగా జంతువుల చర్మాలు వేరుచేసే ప్రక్రియ

**మార్టూరు, బల్లికురవ, అద్దంకి, న్యూస్‌టుడే:** మూడు మండలాల సరిహద్దులో.. మూతపడిన కంకర యూనిట్ వద్ద చనిపోయిన జంతువుల నుంచి చర్మాలు, మాంసం వేరు చేసే ప్రక్రియ రహస్యంగా కొనసాగుతోంది. బల్లికురవ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వారు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. మార్టూరు మండలం జంగమహేశ్వరపురం రెవెన్యూ భూముల్లో ఇది జరుగుతోందని అద్దంకి మండలానికి చెందిన వారు ఆరోపిస్తున్నారు. జంతువుల చర్మాలను వేరు చేస్తున్నట్లు వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి. కేంద్రం వద్ద గల ఐసు పెట్టెల్లో ఏం నిల్వ చేశారో తెలియరాలేదు. ఒక వేళ మాంసం నిల్వ చేసేందుకు ఈ పెట్టెల్లో ఉంచి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారా అనే అనుమానం స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బాపట్ల జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బి.వేణుగోపాల్‌ను వివరణ కోరగా మాంసం తరలించేందుకు తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు.

జంతువు చర్మం వేరుచేస్తున్న యువకులు

**బ్రాయిలర్ ధరలు** (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 142, రిటైల్ ధర - 169, చికెన్ విత్‌స్కిన్ - 245, చికెన్ స్కిన్‌లెస్ - 279.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 147, 156, 167 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.


**91.9 FM Vijayawada** ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297


## ద్విచక్ర వాహన చోదకుడి దుర్మరణం

**పాతమాగులూరు (సంతమాగులూరు):** మినీ వాహనం అదుపు తప్పి ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం చెందిన ఘటన అమరావతి-అనంతపురం జాతీయ రహదారిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం ఇంటులూరు గ్రామానికి చెందిన వై.రమేష్ (23) వ్యవసాయ పనుల నిమిత్తం సంతమాగులూరు ప్రాంతానికి వచ్చారు. పని నిమిత్తం నరసరావుపేటకు మరో వ్యక్తి డి.శివశంకర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పాతమాగులూరు వద్దకు రాగానే వెనుక నుంచి నరసరావుపేట వైపు వెళుతున్న మినీ వాహనం అదుపు తప్పి ఢీకొట్టింది. కింద పడ్డ రమేష్‌కు తీవ్రంగా, శివశంకర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. రమేష్‌ను చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### చికిత్స పొందుతూ మరొకరు..

**మార్టూరు:** కుటుంబ కలహాల నేపథ్యంలో మార్టూరులోని నెహ్రూనగర్‌కు చెందిన జె.తిరుపతిరావు(24) ఈనెల 24న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. నాటి నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు అక్కడి వైద్యులు తెలిపిన సమాచారం మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు మార్టూరు పోలీసులు వెల్లడించారు.


ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

# బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

## నేడు బాపట్లలో మెగా ఉద్యోగమేళా

**బాపట్ల, న్యూస్‌టుడే:** ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మెగా ఉద్యోగ మేళా మంగళవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 17 బహుళజాతి కంపెనీలు ఉదయం తొమ్మిది గంటల నుంచి ఉద్యోగ మేళాలో పాల్గొంటాయన్నారు. అర్హులైన విద్యార్థుల ఆధారంగా నెలకు రూ.10 నుంచి 20 వేల వేతనం ఉంటుందన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు నిరుద్యోగ యువత విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలతో హాజరై ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ఉపయోగించుకుని కొలువులు సాధించాలని కలెక్టర్ సూచించారు.

## అర్హులకు కుట్టు మిషన్లు, పింఛన్లు

మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**బాపట్ల, న్యూస్‌టుడే:** బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేయాలంటూ కలెక్టరేట్ వద్ద మహిళలు సోమవారం ధర్నా చేశారు. విషయం తెలుసుకుని కలెక్టర్ కార్యాలయం నుంచి బయటకు వచ్చి మహిళలతో మాట్లాడారు. త్వరలో కుట్టుమిషన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పలువురు దివ్యాంగులు కలెక్టరేట్‌కు వచ్చి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని వినతిపత్రాలిచ్చారు. అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పారు.

### మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? నగరం శివారు కాపులపాలెం రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. రహదారికి ఇరువైపులా పొలాలు ఉండటం వల్ల విషపురుగులు రోడ్డుపై సంచరిస్తున్నాయి. - రాఘవులు, సానికుకు. ✔ వెలగని దీపాలను తొలగించి వాటి స్థానంలో కొత్త దీపాలను ఏర్పాటు చేయిస్తాం. -వెంకటేశ్వర్లు, కార్యదర్శి, నగరం. - న్యూస్‌టుడే, నగరం

**స్పందనకు వందనం.. వీధిదీపాలు ఏర్పాటు**

**రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** రేపల్లె 17వ వార్డులో మూడు చోట్ల వీధిదీపాలు వెలగడంలేదని ఈనాడులో వార్త ప్రచురితమవగా అధికారులు దృష్టి సారించారు. స్పందించిన మున్సిపల్ ఏఈ శామ్యూల్ సోమవారం కార్మికులను పంపి మూడు చోట్ల వీధిదీపాలు ఏర్పాటు చేయించారు.

నూతన కార్యవర్గ సభ్యులు

## ఎన్జీవో అసోషియేషన్ కార్యవర్గం ఎన్నిక

**బాపట్లటౌన్, న్యూస్‌టుడే:** బాపట్ల జిల్లా ఎన్జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి షరీఫ్ తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం 17 నామినేషన్లు సక్రమంగా ఉండగా ఏకగ్రీవమైనట్లు చెప్పారు. అధ్యక్షుడిగా పి.నాగేశ్వరరావు, కార్యదర్శిగా బి.ప్రసాదరావు, కోశాధికారిగా డి.నాగేశ్వరరావు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎన్జీవో అధ్యక్షులు రామకృష్ణ, జి.శ్రీనివాసరావు, కె.శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**నెహ్రూనగర్, అంకమ్మచెట్టు, (రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే**

**అమృత్ 2.0 పథకం కింద రూ.40 కోట్లు కేటాయింపు**

రేపల్లె మున్సిపాలిటీలో తాగునీటి సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం లభించనుంది. పట్టణంలోని 28 వార్డుల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా తాగునీరు అందించడానికి ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద రూ.40 కోట్లు కేటాయించడంతో పట్టణ శివారు తాగునీటి చెరువు సమీపంలో 7.5 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్, మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు, పాతపైపులైను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. టెండర్ల ప్రక్రియ పూర్తి అయినవెంటనే అభివృద్ధి పనులు వేగంగా సన్నాహాలు చేస్తున్నారు.

**మూడేళ్లుగా కష్టాలు..**

పట్టణంలో 60 వేల వరకు జనాభా ఉన్నారు. వేసవిలో శివారు ప్రజలకు నీరందక అవస్థలు పడుతున్నారు. 1, 18, 24, 28 వార్డులకు రెండ్రోజులకోసారి ట్యాంకర్లతో సరఫరా చేయాల్సిన పరిస్థితి. వైకాపా పాలనలో తాగునీటి కోసం పురపాలక రహదారులపై నీటి బిందెలు పట్టుకుని, డ్రమ్ముల వద్ద ప్రజలు వేచి ఉండాల్సి వచ్చేది. దీంతో పాలకవర్గం నిర్మించిన ప్రధాన పైపు లైనుకు తరచూ లీకేజీలు పడి లక్షల లీటర్ల నీరు వృథాగా నేలపాలయ్యేది. సరఫరా అయ్యే నీరు రంగుమారి, దుర్వాసన రావడంతో తాగేందుకు ఆసక్తి చూపేవారు కాదు. దీంతో దాహార్తి తీర్చుకునేందుకు వేసవిలో ప్రైవేటు వ్యాపారుల నుంచి ఎక్కువ ధర వెచ్చించి నీరు కొనుక్కునేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో పురపాలకసంఘం ఆధీనంలోని 15వ ఆర్థిక సంఘం, టీడీపీ నిధులు రూ.కోటితో 2 కిలోమీటర్ల పొడవున ప్రధాన పైపు లైను పనులు చేస్తున్నారు. రూ.40 లక్షలతో ఇప్పటికే తాగునీటి పథకానికి రంగులు, నాలుగు విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేశారు. దీంతో త్వరలో తమ ఇబ్బందులు తీరనున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సీఎం సహాయనిధి మంజూరు పత్రం అందజేత

బాధితురాలికి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**ఇంటూరు, (అమృతలూరు), న్యూస్‌టుడే:** ఇంటూరుకు చెందిన సుజాత అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించుకున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. రూ.6 లక్షలు మంజూరయ్యాయి. బాధితురాలికి గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎల్‌వోసీ రూపంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు.

**ఆనందబాబుకు సన్మానం.. భట్టిప్రోలు:** బాపట్ల పార్లమెంటరీ కమిటీలో భట్టిప్రోలుకు చెందిన కటకం కుమారస్వామికి కార్యనిర్వహణ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు కుమారస్వామి, గ్రామంలోని తెదేపా నాయకులు సోమవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు, పార్టీ నాయకులు గొట్టుముక్కల లెనిన్, కుక్కల వెంకటేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, కనపర్తి సుందరరావు, డీసీ ఛైర్మన్ యర్రంశెట్టి కర్ణశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వాలి


ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

**బాపట్ల, న్యూస్‌టుడే:** రేపల్లెలో రోడ్డు విస్తరణలో గృహాలు, స్థలాలు కోల్పోయిన 93 మందికి మూడున్నరేళ్లు గడిచినా పరిహారం, టీడీఆర్ బాండ్లు పురపాలక అధికారులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భాజపా నేతలు శ్రీనివాసరాజు, కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పరిహారం కోసం అధికారుల చుట్టూ బాధితులు తిరిగి అలసిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టడాలకు సత్వరమే పరిహారం, స్థలాలకు టీడీఆర్ బాండ్లు అందజేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధితులు సత్యసాయిబాబు, సుబ్రహ్మణ్యం, లింగమూర్తి అవినాష్, అర్జీలు అందజేశారు.

**ఆర్‌యూబీ వెంటనే నిర్మించాలి..** మండల పరిధిలోని భర్తిపూడిలో ఆర్‌యూబీ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయించాలని కోరుతూ కలెక్టర్‌కు సర్పంచి ఆచంట అమరేష్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2023 ఆగస్టులో ఆర్‌యూబీ పేరుతో రైల్వేగేటు మూసివేసి వాహనాల రాకపోకలను రైల్వే అధికారులు నిలిపివేశారన్నారు. ఇంత వరకు రైల్వే అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు.

## రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

అవగాహన ర్యాలీలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది

**భట్టిప్రోలు, న్యూస్‌టుడే:** రైతులు రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు అన్నారు. అద్దేపల్లి అమ్మవారి చెట్టువద్ద సోమవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ ప్రస్తుతం సర్వే ద్వారా భూముల్లో ఎటువంటి పొరపాట్లు ఉన్నా వెంటనే సరిచేస్తామని తెలిపారు. అనంతరం పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.

**కొల్లూరు:** జనవరి 2 నుంచి కొల్లూరు పరిధిలోని భూముల రీ సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సభలో ఆయన మాట్లాడుతూ నోటీసుల ద్వారా రీ సర్వే వివరాలు తెలియజేస్తామని, సమాచారం ఆధారంగా రైతులు తమ పొలాల హద్దులను అధికారులకు చూపించడంతోపాటు పొలం దస్తావేజులు, పాసుపుస్తకం, ఆధార్‌కార్డు నకళ్లను అందజేయాలని సూచించారు.

**ప్యాపర్రు, ఇంటూరు, (అమృతలూరు), న్యూస్‌టుడే:** భూములు సర్వే చేయించుకుని వివరాలను రైతులు నమోదు చేయించుకోవాలని తహసీల్దారు నెహ్రూబాబు అన్నారు. రీ సర్వే సందర్భంగా నాలుగో విడత ఎంపికైన ప్యాపర్రు, ఇంటూరు గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. జనవరి 2 నుంచి జరుపనున్న రీ సర్వేకు రైతులు అందుబాటులో ఉండాలన్నారు.

**సమగ్ర సర్వే చేయాలని వినతి..**

**భట్టిప్రోలు:** లంకగ్రామాల సొసైటీ భూములను సక్రమంగా రీ సర్వే చేయాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో సొసైటీ భూముల రైతులు తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం సాగులో ఉన్నవారికి వారసత్వ కుటుంబ సభ్యులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పప్పుల మనోజ్, మురుగుడు సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

## వంతెన గతి ఇంతేనా!

**మం**డలంలోని చందోలు నుంచి పోడిపాలెం వెళ్లే మార్గంలో అరమండ వాగుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన కింది భాగం, పక్కన ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. పెచ్చులూడి పడుతుండటంతో వాహనదారులు రాకపోకలకు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ రవీంద్ర మాట్లాడుతూ పరిశీలించి ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తానన్నారు. **– న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం)**

## వ్యర్థాలు తొలగించండి సారూ!

**ప**ట్టణంలోని త్రవ్వకాలువ కట్టమీద వ్యర్థాలు పోస్తున్నారు. అవి మురిగి దుర్వాసన వెదజల్లుతోంది. వ్యర్థాలను కాలువకట్టమీద డపింగ్ చేయవద్దని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కరుణ మాట్లాడుతూ మున్సిపాలిటీ సిబ్బందిని పంపి వెంటనే తొలగించి అక్కడ వ్యర్థాలు వేయకుండ చూస్తామన్నారు.
**– న్యూస్‌టుడే, ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజ్ (బాపట్లటౌన్)**

## సరస్వతమ్మ త్యాగం మరువలేనిది

నివాళులర్పిస్తున్న సాయిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు

**బాపట్లటౌన్, న్యూస్‌టుడే :** బాపట్ల ప్రాంతంలో మహిళల విద్యావ్యాప్తికి విశేషంగా కృషి చేసిన వారిలో అగ్రగణ్యులు వెలగపూడి సరస్వతమ్మ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. ఆమె జయంతి సందర్భంగా పట్టణంలోని సరస్వతి మెమోరియల్ బాలికల పాఠశాల, కళాశాలలో సోమవారం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాయిబాబు మాట్లాడుతూ 1915లో ఆమె ప్రారంభించిన ఎస్ఎంజీ పాఠశాల డిగ్రీ స్థాయికి ఎదిగి ఎంతో మంది మహిళలను విద్యావంతులుగా రూపొందిస్తుందన్నారు. పాఠశాల అభివృద్ధికి సరస్వతమ్మ తన జీవితాన్ని త్యాగం చేసిందన్నారు. విద్యార్థులు ఆమెను ఆదర్శంగా తీసుకుని మహిళాభివృద్ధికి పాటుపడాలన్నారు. నివాళులు అర్పించిన వారిలో కళాశాల ప్రిన్సిపల్ దుర్గాప్రసాదరావు, పాఠశాల హెచ్‌ఎం శివపార్వతి, అధ్యాపకులు విద్యార్థులు ఉన్నారు.

## ఆదమరిస్తే చెరువులోకే!

**ఖా**జీపాలెం ప్రధాన రహదారి నుంచి శ్మశాన వాటికకు వెళ్లే సీసీ రహదారి చెరువు వద్ద అంచులు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రహదారి కోతకు గురైన చోట కనపడకుండా ముళ్ల కంప వేయటంతో రాకపోకలు సాగించాలంటే గ్రామస్థులు, వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. పక్కనే ఉన్న చెరువులో పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ముళ్లకంప తొలగించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి ప్రసాదరావు మాట్లాడుతూ పరిశీలించి మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.**– న్యూస్‌టుడే, ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం)**

## ఆలయాల్లో ద్వార దర్శనాలకు ఏర్పాట్లు

**బాపట్ల, న్యూస్‌టుడే:** బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేశారు.

**సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో..**

**గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్, తితిదే ఆధ్వర్యంలో మత్స్యకార, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నిర్మించిన వైష్ణవాలయాల్లో మంగళవారం ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. సోమవారం గుళ్లపల్లి శివాలయం వద్ద ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉన్న ఇటు వంటి ఆలయాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు తమకు దగ్గర్లోని వైష్ణవ ఆలయాల్లో స్వామివార్లను దర్శించి ఆయా కాలనీల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నేతలు జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, పడమటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి

**ధనుర్మాస పూజలు.. చెరుకుపల్లి:** ధనుర్మాసం సందర్భంగా చెరుకుపల్లి చెన్నకేశవస్వామి, వేణుగోపాలస్వామి, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఉత్తర ద్వారదర్శనానికి ఏర్పాటు చేసినట్లు ఆలయాల పాలకమండలి సభ్యులు తెలిపారు.

**గోదాదేవి, రంగనాయకస్వామికి.. అమృతలూరు:** అమృతలూరు శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో గోదాదేవి, రంగనాయకస్వామికి సోమవారం అభిషేకం, పూజలు నిర్వహించారు.

పూజలో పాల్గొన్న భక్తులు

## అద్దె భవనాలు.. అరకొర వసతులు

**సచివాలయాలకు కనిపించని బోర్డులు**

**న్యూస్‌టుడే, ఇసుకపల్లి, అంకమ్మచెట్టు (రేపల్లె అర్బన్)**

ఉప్పూడి రోడ్డులో బోర్డులేని సచివాలయం

**రే**పల్లెలో పలు సచివాలయాలను గుర్తించడం ప్రజలకు పెద్ద సవాలుగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చి 18 నెలలవుతున్నా చాలాచోట్ల బోర్డులు ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో పెట్టిన బోర్డులు తొలగించి కొత్తవి పెట్టించడం మరిచారు. పనుల నిమిత్తం వచ్చే వారు ఆయా సచివాలయాలను వెతుకోవాల్సి వస్తోంది. పట్టణంలో 28 వార్డుల్లో 14 సచివాలయాలున్నాయి. ఆరుచోట్ల మున్సిపాలిటీ భవనాల్లో కొనసాగుతుండగా మిగిలినవి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కార్యాలయాల్లో సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండరని, కూర్చునేందుకు కూడా సరైన సదుపాయాలు లేవని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాలకు బోర్డులు ఏర్పాటు చేయాలని, ఉద్యోగులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ✦ విధుల్లో భాగంగానే సిబ్బంది క్షేత్రస్థాయికి వెళుతుంటారని, కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతామని రేపల్లె సచివాలయాల పర్యవేక్షణ అధికారి శివప్రసాద్ చెప్పారు. బోర్డులు లేని చోట వెంటనే ఏర్పాటు చేయిస్తామని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూస్తామని తెలిపారు.

## రహదారి ఛిద్రం.. ప్రమాద భరితం

**ఉ**ల్లిపాలెం నుంచి రేపల్లె అర్ అండ్‌బీ రహదారిని కలిపే అనుసంధాన రహదారి ఛిద్రమైంది. నిజాంపట్నం మండలం అడవులదీవి, కూచినపూడి, గుర్నాధనగర్‌తో పాటు నగరం మండలం పరిధిలోని అల్లపర్రు, కట్టవ, శ్రీరాంపురం, ఉల్లిపాలెం, మంత్రిపాలెం గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దొరగారి వంతెన నుంచి ఉల్లిపాలెం రామాలయం వరకు సుమారు రెండు కిలో మీటర్ల రోడ్డులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారని స్థానికులు గుర్తుచేశారు. ఈ విషయమై ఎంపీడీవో బొర్రా శ్రీనివాస్ మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. **– న్యూస్‌టుడే, ఉల్లిపాలెం (నగరం)**

### అవీ ఇవీ

**తుపాన్ సాయం ఇంకెప్పుడిస్తారు?**

**పొన్నపల్లి (చెరుకుపల్లి గ్రామీణ):** మండలంలోని పొన్నపల్లి చెరువు కట్టపై నివసిస్తున్న గిరిజనులకు తుపాన్ సాయం అందలేదని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో వచ్చిన తుపాన్ సమయంలో అధికారులు ఇక్కడి చెరువు కట్టలపై ఉంటున్న 30 కుటుంబాల వారిని దగ్గర్లోని ఎంపీయూపీ పాఠశాల భవనం, పక్కనే ఉన్న సచివాలయ భవనంలో ఉంచారు. తరువాత అధికారులు వారి పేర్లు నమోదు చేసి ఇళ్లకు పంపించారు. వీరికి నిత్యావసర సరకులు, రూ. 2వేల ఆర్థిక సాయం అందలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే సాయం అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

**31న క్రీడాపోటీలు**

**గూడవల్లి (చెరుకుపల్లి గ్రామీణ):** నెహ్రూ యువ కేంద్రం గుంటూరు ఆధ్వర్యంలో మత్తి శివశంకరరావు ట్రస్ట్ సౌజన్యంతో ఈనెల 31న గూడవల్లి వనజాచంద్ర పబ్లిక్ పాఠశాల వద్ద యువకులకు జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకుడు మత్తి భాస్కరరావు తెలిపారు. సోమవారం పాఠశాల వద్ద ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువకులు ఈ పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, 100మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్ జంప్ పోటీలు ఉంటాయన్నారు. బుధవారం ఉదయం 9గంటలకు పాఠశాలకు చేరుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.

**నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం**

**రేపల్లె అర్బన్:** విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేపల్లె 5వ వార్డు, రెడ్డిమిల్లు ఏరియా నుంచి పల్స్ ఆసుపత్రి వరకు సరఫరా ఉండదని డీఈ శ్యాంసుధాకరబాబు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

**పాఠశాలకు బీరువా బహూకరణ**

**జంపని (వేమూరు):** జంపని ఉన్నత పాఠశాల అభివృద్ధికి సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలు మేరీథెరీసమ్మ అందిస్తున్న సహకారం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు బదరీనారాయణ అన్నారు. ఆమె ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా పాఠశాలకు ఇనుప బీరువా, సభావేదిక డెకరేషన్ కర్టన్‌ను బహూకరించారు.

**రేపల్లెలో నాలుగు అర్జీలు**

**రేపల్లె అర్బన్:** రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలు నాలుగు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. ఇందులో పొలం ఆన్‌లైన్లో నమోదు, ముస్లిం శ్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేయించాలి. 22ఏ జాబితా నుంచి భూమిని తొలగించాలని రెండు అర్జీలు ఉన్నాయి.

## అధ్వాన దారితో అవస్థలు

**రే**పల్లె అర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నిజాంపట్నం మండలం అచ్యుతపురం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున రోడ్డు అధ్వానంగా మారింది. నగరం నుంచి ముత్తుపల్లి రెడ్లపాలెం వరకు రహదారి ప్రమాదకరంగా మారింది. రహదారికి ఇరువైపుల పంట కాలువలు ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు పదికిపైగా ప్రమాదాలు చోటు చేసుకోగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఆర్టీసీ బస్సులతో పాటు పాఠశాలలకు చెందిన పలు బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. ఇటీవల ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సుకు ప్రమాదం తప్పింది. నిజాంపట్నం, కూచినపూడి, అడవులదీవి, అచ్యుతపురం ప్రజలు అవస్థలు పడుతున్నారు. కీలకమైన ఈ అనుసంధాన రహదారిని అధికారులు అభివృద్ధి చేయాలని తీరం ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నగరం**

## మాజీ ఉప సర్పంచి మృతి

**వేమూరు, న్యూస్‌టుడే:** మండలంలోని వరహాపురం పంచాయతీ మాజీ ఉప సర్పంచి యల్లమాటి భూషణం(70), గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన ఐదుసార్లు వార్డు సభ్యునిగా, రెండు సార్లు ఉప సర్పంచిగా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న వేమూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జె.విజయబాబు నివాళులర్పించారు.

## ఆటో బోల్తా.. ఒకరికి తీవ్రగాయాలు

**అమృతలూరు, న్యూస్‌టుడే:** అమృతలూరు మండలం మూల్పూరు గ్రామం మలుపులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. పెరవలిపాలెం గ్రామం నుంచి మొక్కజొన్న పనుల కోసం ఏడుగురు ఆటోలో వస్తున్నారు. మూల్పూరు గ్రామం వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడి కోటేశ్వరమ్మకు తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాసరావు, అంజలికి స్వల్ప గాయాలు కాగా క్షతగాత్రులను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## ఎరువు.. పర్యవేక్షణ కరవు..!

**ఆర్ఎస్‌కే, సొసైటీల్లో లభించని యూరియా**

**కేంద్రాల చుట్టూ తిరుగుతున్న రైతులు**

**న్యూస్‌టుడే, వేమూరు, కొల్లూరు**

వేమూరులో సాగైన మొక్కజొన్న

**వే**మూరు నియోజకవర్గంలో ఏటా ఈసీజన్‌లో 94 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయి. ఇందులో 35వేల ఎకరాల్లో తెల్లజొన్న, 20వేల ఎకరాల్లో మొక్కజొన్న, మిగతా 39వేల ఎకరాల్లో అపరాలు సాగుచేస్తారు. రేపల్లె నియోజకవర్గంలో అక్కడక్కడ తెల్లజొన్న, మొక్కజొన్న సాగవుతుంది. ప్రస్తుతం డెల్టా ప్రాంతంలో మొక్కజొన్న విత్తి 20 రోజులు అవుతోంది. దీనికి యూరియాతోపాటు కాంప్లెక్స్ ఎరువులు కలిపి చల్లాల్సి ఉంది. నియోజకవర్గంలో రైతులకు అవసరం మేరకు యూరియా లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు.

**ఇండెంట్ ప్రకారం నగదు చెల్లించకనే..** జిల్లాలో అవసరానికి సరిపడా యూరియా ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నా రైతులకు అందడంలేదు. ఖరీఫ్‌లో సొసైటీలకు, ఆర్ఎస్‌కేలకు యూరియా సరఫరా చేసినా నగదు పలు సొసైటీలు, ఆర్ఎస్‌కేలు మార్క్‌ఫెడ్ ఖాతాల్లో జమచేయ లేదు. దీంతో ఎరువులు కావాలని ఇండెంట్ పెట్టినా సరఫరా చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సొసైటీలు, రైతుసేవా కేంద్రాలు సమయానికి యూరియా ఇండెంట్ ప్రకారం నగదు చెల్లించడం లేదు. ✦ వేమూరు మండలం జంపనికి చెందిన కౌలురైతు చుండూరు ఫ్రాన్సిస్ మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాడు. మొదటి దఫాగా డీఏపీతోపాటు, యూరియా కలిపి చల్లాలి అనుకున్నాడు. మండలంలోని జీడీసీసీఎంఎస్, సొసైటీలో, ఆర్‌ఎస్కేలో యూరియా లభించలేదు. రైతు తెనాలిలోని దుకాణాల్లో ఎరువులు కొనడానికి వెళితే బాపట్ల జిల్లా వారికి ఇక్కడ ఇవ్వడం కుదరదని చెప్పారు. కొల్లూరులోని గ్రోమోర్‌కు వెళ్లిగా వేమూరు మండలం వారికి ఇక్కడ ఇవ్వమన్నారు. ఇలానే చాలా మంది రైతులు యూరియా కోసం అగచాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవతీసుకుని రైతులకు సకాలంలో యూరియా అందించాలని కోరుతున్నారు.✦ ఈవిషయంపై జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణను వివరణ కోరగా జిల్లాలో యూరియా కొరత లేదని చెప్పారు. ఇండెంట్ల ప్రకారం మార్క్‌ఫెడ్‌కు నగదు జమ అయ్యేలా చర్యలు చేపడతామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు సిద్ధంగా ఉంచుతామన్నారు.

7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
గత ఏడు సంవత్సరాలుగా (ప్రారంభం: 30-12-2018)గా మా వైద్యశాల అభివృద్ధికి తోడ్పడిన వారందరికీ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ... కృతజ్ఞతలతో...
హారిక ప్రజా వైద్యశాల, రేపల్లె
స్త్రీల మరియు ప్రసూతి వైద్య నిపుణులు
డా॥ కసుకుర్తి రత్నరాజు, M.B.B.S., DA
డా॥ ఎం.రత్నకుమారి, M.B.B.S., DGO
సంప్రదించు వేళలు: ఉదయం 7 నుండి 9 గంటల వరకు
సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు
సెల్: 94942 45650
ఎమర్జెన్సీ కేసులు అన్నివేళలా చూడబడును

(c) eenadu

# చీరాల

•చీరాల •అద్దంకి •పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? మండల పరిధి తిమ్మరాజుపాలెంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెంది రోగాలు బారినపడే ప్రమాదం ఉంది. స్థానికుడు, తిమ్మరాజుపాలెం ✔ రెండ్రోజుల్లో డ్రైనేజీలను శుభ్రపరిచి, బ్లీచింగ్ చల్లిస్తాం. వి.అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, తిమ్మరాజుపాలెం - న్యూస్‌టుడే, పర్చూరు

? పల్లెపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు దక్షిణం వైపు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రులు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించండి. ఏడుకొండలు, పల్లెపాలెం ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, రెండు రోజుల్లో వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తాం. - కొర్రపాటి రాజామోహన్, గ్రామ కార్యదర్శి, పల్లెపాలెం

- న్యూస్‌టుడే, చినగంజాం

## బకాయిలు విడుదల చేయాలి

చీరాల, న్యూస్‌టుడే: అప్కోకు ఇవ్వాల్సిన బకాయిలు మొత్తం ఒక్కసారే విడుదల చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం చీరాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఇచ్చిన ఉచిత విద్యుత్తు హామీ అమలు చేయాలన్నారు. రుణమాఫీ అందజేసి, వృత్తిదారులను కాపాడాలన్నారు. పి.కొండయ్య, హేమసుందర్, రాధాకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో స్వామిత్వ గ్రామ సభలు

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.ఎల్.గుడిపాడు, వైదన గ్రామాల్లో సోమవారం స్వామిత్వ గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ ఎంపీడీవో సుమతి హాజరై, మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించండి

అద్దంకి, న్యూస్‌టుడే: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కాపూరి రమేష్ అన్నారు. జనవరి 4న విశాఖపట్నంలో చేపట్టిన అఖిల భారత మహాసభల నేపథ్యంలో అద్దంకిలో సోమవారం సాయంత్రం ద్విచక్రవాహన ప్రదర్శన నిర్వహించారు. తంగిరాల వెంకటేశ్వర్లు, పేసా బాక ఆదాం, ఉసురుపాటి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా అబ్దుల్ ఖాదర్

షేక్ అబ్దుల్ ఖాదర్

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా అద్దంకి ఉప ఖజానాధికారి షేక్ అబ్దుల్ ఖాదర్‌ను నియమించారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కేఆర్.సూర్యానారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొంత కాలంగా అద్దంకి తాలూకా యూనిట్ అధ్యక్ష పదవి ఖాళీగా ఉండటంతో పాటు ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగుల చర్యలు లేకుండా పోయాయి. ఆమేరకు తక్షణం ఉద్యోగుల్ని ఏకం చేయడం, సభ్యత్వ నమోదు తదితర కార్యకలాపాలు పెంచేందుకు బొత్సాహికుడైన ఉప ఖజానాధికారి షేక్ అబ్దుల్ ఖాదర్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడునెలల కాలంలో ఉద్యోగ సంఘ సమావేశాలు నిర్వహించి వారిలో చైతన్యం నింపాలని సూచించారు.

## ఆమంచిని కలిసిన ఎమ్మెల్యే ఉమా

పందిళ్లపల్లి (వేటపాలెం): జిల్లాలో ఓ శుభ కార్యక్రమానికి విజయవాడ సెంట్రల్ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా పందిళ్లపల్లిలో ఉన్నటువంటి మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆయన ఇంట్లో స్నేహపూర్వకంగా కలిశారు. బొండాకు ఆమంచి స్వాగతం పలికారు. అనంతరం తన మిత్రులు, అభిమానులను ఎమ్మెల్యేకి పరిచయం చేశారు.

## హరేరామ.. హరేకృష్ణ

యద్దనపూడి, న్యూస్‌టుడే

ఆ గ్రామంలో రామనామ సప్తాహం ఓ పండగ. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని హరేరామ.. హరేకృష్ణ నామజపం వారంరోజులపాటు మార్మోగాల్సిందే. వానొచ్చినా.. వరదొచ్చినా క్రమం తప్పకుండా 72 వసంతాలుగా భక్త బృందాలతో రేయింబవళ్లు రామనామాన్ని ఆపకుండా ఏడు రోజులు భక్తిశ్రద్ధలతో జపించడం ఆనవాయితీ. భక్తులతో బ్యాచ్‌లవారీగా పగలు, రేయి రామనామాన్ని సంకీర్తన బద్ధంగా ఆలపించేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. భక్తబృందాలకు గ్రామస్థులే తమ ఇంట్లో వసతి, సౌకర్యాలు కల్పించి తమ కుటుంబీకులుగా ఆదరించడం యద్దనపూడి మండలంలోని విజంపాడు గ్రామంలో చూడొచ్చు.

రామభక్తుడిగా పేరొందిన గ్రామానికి చెందిన దివంగత తూబాటి రామస్వామి బాబు శ్రీసీతారామ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏడు దశాబ్దాల క్రితం ఆరంభించిన అఖండ హరేరామ, హరేకృష్ణ నామ సప్తాహాన్ని గ్రామస్థుల సహకారంతో ఏటా ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. వైష్ణవ గురువు ఆచార్య తేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులతో భక్త మండలి ప్రతి నియలు ఈ కార్యాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు శ్రమిస్తుంటారు. సప్తాహం ప్రారంభమైన రోజు నుంచి గ్రామస్థులు తమ ఇళ్లకు వచ్చే బంధువులు, భక్తులతో కలిసి పిండి వంటలతో ముందస్తు సంక్రాంతి జరుపుకొంటారు.

- నామ సప్తాహానికి 72 వసంతాలు
- ముక్కోటి వచ్చిందంటే.. విజంపాడు గ్రామానికి పెద్ద పండగే

రామనామాన్ని ఆలపిస్తున్న భక్త బృంద సభ్యులు

### వారం రోజులు అన్నదానం

సప్తాహం నిర్వహించే వారం రోజుల పాటు దాతల సాయంతో అన్నదానం నిర్వహిస్తారు. భక్తులు, భక్త బృందాలకు నిత్యం రెండుపూటలా భోజనం, అల్పాహారం అందించేలా రామాలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షిస్తారు. చివరిగా ముక్కోటి పర్వదినాన సప్తాహ దీక్షకు పూర్ణాహుతి పలకడం ఆనవాయితీ. అనంతరం పెద్దఎత్తున అన్నదానం నిర్వహిస్తారు.

### ప్రత్యేకంగా నగర సంకీర్తన

రామాలయం వద్ద ప్రారంభమయ్యే నామ సప్తాహం నిర్విరామంగా ఏడు రోజులు సాగే నగర సంకీర్తన ప్రత్యేకతను చాటుతోంది. ప్రతిరోజు విజంపాడు ప్రధాన వీధుల్లో సంకీర్తన చేసుకుంటూ ప్రత్యేక వాహనంలో సంకీర్తన చేసుకుంటూ గ్రామోత్సవం జరుపుతారు.

### దాతల ఔదార్యంతో..

మా గ్రామస్థులకు ముక్కోటి పర్వదినమంటే ఓ పండగ వచ్చినట్లే. మా పెద్దలు చూపిన మార్గంలో ఏటా ఈ సప్తాహం ద్వారా ముందుకు సాగుతున్నాం. వానలొచ్చినా, వరదలొచ్చినా, ప్రకృతి సహకరించక రైతులు ఇబ్బందులు పడుతున్నా సప్తాహాన్ని మాత్రం క్రమం తప్పక వారంరోజులు నిర్వహిస్తాం. దాతల ఔదార్యంతో అన్నదానం కొనసాగిస్తాం. - సాదినేని శ్రీనివాసరావు, ఛైర్మన్, శ్రీసీతారామస్వామి దేవస్థానం, విజంపాడు

## గ్రామాల అభివృద్ధితోనే నిజమైన పురోగతి

చీరాల, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధి చెందినపుడే నిజమైన పురోగతి సాధించినట్లని ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య పేర్కొన్నారు. సోమవారం బుర్లవారిపాలెంలో రూ.1.23 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధిలో ముందుంచడమే తన లక్ష్యమన్నారు. బుర్లవారిపాలెంలో రూ.35 లక్షలతో నూతన పంచాయతీ, రూ.55 లక్షలతో సామాజిక ఆరోగ్య కేంద్రం, రూ.33 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీటిని నాణ్యతతో నిర్ణీత వ్యవధిలో నిర్మించాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. మున్సిపల్ ఛైర్మన్ ఎం.సాంబశివరావు, ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, ఎంపీడీవో విజయ, జేఈ రామచంద్రుడు, గంజి పురుషోత్తం, బుర్ల రాంబాబు, సిద్ది బుచ్చేశ్వరరావు, రజని తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

## వారబందీ అమలు

రైతులకు సూచనలిస్తున్న డీఈ లక్ష్మీనారాయణ

సంతమాగులూరు, న్యూస్‌టుడే: జల వనరుల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంతమాగులూరు ఎన్నెస్పీ సబ్ డివిజన్ పరిధిలో వారబందీ విధానం అమలు చేయనున్నట్లు సంతమాగులూరు ఎన్నెస్పీ డీఈ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక ఎన్నెస్పీ సబ్ డివిజన్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ నీటి సంఘాల అధ్యక్షుల సమావేశం సోమవారం నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలోని మేజర్లకు ప్రతి బుధ, గురువారాలు వారబందీ విధానం అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వారంలో ఐదు రోజులు మేజర్ కాలువలకు నీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. రైతులు సహకరించి, సాగర్ జలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక డీసీ, నీటి సంఘాల అధ్యక్షులు వారబందీ విధానం లేకుండా నిరంతరాయంగా నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. అనంతరం డీఈ మాట్లాడుతూ.. నీటి సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలోని సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు రబీ సీజన్‌లో వరి సాగు చేపట్టవద్దని సూచించారు. డీసీ అధ్యక్షులు కామను శ్రీనివాసరావు, కంచేటి యలమందయ్య పాల్గొన్నారు.

## కమిషనర్ బాధ్యతల స్వీకరణ

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల పురపాలక సంఘ కమిషనర్‌గా దానియేలు జోసఫ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ని ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగా వచ్చిన, బదిలీపై వెళుతున్న కమిషనర్లు జోసఫ్, అబ్దుల్ రషీద్‌లను ఛైర్మన్ సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్కరించారు. వైస్ ఛైర్మన్ సుబ్బయ్యతదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన భూమి కేటాయించాలని వినతి

వినతులు పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో చంద్రశేఖరనాయుడు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పలు సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. అక్కాయిపాలెం పంచాయతీ అబ్దుల్ కలాం, జేపీకే కాలనీల్లో శ్మశానభూమి కేటాయించాలని, మొండా తుపాను పరిహారం అందించాలని, కొడవలివారిపాలెం రెవెన్యూ పరిధిలో ఆలేరు వాగు కోసం తీసుకున్న భూమికి పరిహారం ఇప్పించాలనే వినతులతో పాటు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

## పమిడిపాడు మేజర్‌లో తగ్గిన నీటిమట్టం

కాలువలో నీరిలా..

జె.పంగులూరు, న్యూస్‌టుడే: సాగర్ జలాలు పమిడిపాడు మేజర్‌లో నీటి ప్రవాహ పరిమాణం నాలుగు రోజులుగా తగ్గడంతో కొండమూరు, అలవలపాడు, తూర్పు తక్కెళ్లపాడు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగర్ ప్రధాన కాలువ ప్రవాహ మార్గంలో 37వ మైలు రామకూరు లాకుల వద్ద నీటి ప్రవాహ సామర్థ్యం 330 క్యూసెక్కులు ఉండగా నాలుగు రోజులుగా ప్రవాహం తగ్గిందని రైతులు తెలుపుతున్నారు. సోమవారం ఉదయం 130 క్యూసెక్కుల మాత్రమే నీటి పరిమాణం ఉంటున్నారు. దీంతో పమిడిపాడు మేజర్‌లో ప్రవాహ నీటి మట్టం తక్కువగా ఉంది. ఈ మేజరులో సుమారు 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న, మిరప, పొగాకు, శనగ పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంటలకు నీటి తడులు అందించాల్సిన సమయంలో ప్రవాహం తగ్గడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణం నీటి పరిమాణం పెంచి పంటలకు నీరు అందించాలని కర్షకులు కోరుతున్నారు. ఈ విషయమై ఎన్నెస్పీ ఏఈ వేణును వివరణ కోరగా నీటి పరిమాణం పెంచాలని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. మంగళవారం మధ్యాహ్నానికి నీటి పరిమాణం పెంచి, చివరి ఆయకట్టు రైతులకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ముక్కోటికి ఆలయాలు ముస్తాబు

కోలాట శిక్షణలో మహిళలు

చీరాల అర్బన్, వేటపాలెం, అద్దంకి, పర్చూరు, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశికి వైష్ణవాలయాన్ని ముస్తాబయ్యాయి. చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని ఆలయాలను ఆయా కమిటీల ఆధ్వర్యంలో విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఆలయాల్లో మంగళవారం తెల్లవారుజామునుంచి ఉత్తర ద్వారా భక్తులు స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. కొన్ని చోట్ల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీ

బల్లికురవ, న్యూస్‌టుడే: రైతులు అధికారులకు సహకరిస్తూ రీసర్వేను విజయవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష అన్నారు. మండలంలోని ఉప్పమాగులూరులో సోమవారం రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహించారు. గ్రామమంతా తిరిగి రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించారు. ఆర్ఐ పోతురాజు, సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్వో అశోక్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ దేవినేని నరేంద్ర, ఆమర్నేని వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## నామ్ రహదారిపై నడవాలంటే కష్టమే!

అద్దంకి, న్యూస్‌టుడే:

నామ్ రహదారిపై ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతుంది. రహదారి విస్తరణ పూర్తికాకపోవడంతో ఇరుకు దారిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇదే సమయంలో ఆదివారం, సెలవు రోజుల్లో తాత్కాలిక మాంసం విక్రయశాలలు వెలుస్తున్నాయి. రోడ్డుకు ఆటంకం కలిగిస్తున్నామన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. ఒకరికొకరు పోటాపోటీగా బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. మాంసంప్రియుల ద్విచక్రవాహనాలు రోడ్డుపై నిలుపుతున్నారు. తెలంగాణ, తమిళనాడు ప్రాంతాలకు ప్రయాణించే వాహనాలు ఇటుగానే వెళుతుంటాయి. దీనికితోడు సంక్రాంతి నేపథ్యంలో దూరప్రాంతాల్లో ఉండే ఉద్యోగులు, వ్యాపారులు స్వస్థలాలకు ప్రత్యేక వాహనాల్లో వెళుతున్న క్రమంలో ఆటంకాలు లేకుండా సాగేందుకు పట్టణంలో ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంది.

భవానీ కూడలిలో నిలిచిపోతున్న వాహనాలు

అద్దంకి భవానీ కూడలిలో ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు వైపులా వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డుపైనే ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. రహదారి వెంబడి ఆక్రమణ లేదు. తక్షణం రోడ్డు వెంబడి దుకాణాదారులతో సమావేశం నిర్వహించాలి. సరిహద్దులు నిర్ణయిస్తూ దాన్ని దాటి ముందుకు రావద్దని సూచనలు చేయాలి. అలాగే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు, దించేందుకు అనువైన ప్రదేశాలు నిర్ణయించాలి.

**ఇద్దరు పోలీసు సిబ్బంది పహారా కాస్తున్నా..**

జన కారణంగా రవాణాకు ఇబ్బంది కలుగుతున్న సంగతి గుర్తించి అటు పురపాలక, ఇటు పోలీసు అధికారులు కఠిన నిర్ణయం తీసుకోకపోతే ట్రాఫిక్ సమస్య తీరేలా కనిపించడం

## రాళ్లకు తీసిన గుంతలు.. వర్షం కురిస్తే చెరువులు

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: ఏల్చూరు లక్ష్మీనరసింహస్వామి కొండ అంచున మట్టి కోసం తీసిన గోతులు ప్రమాదకరంగా మారాయి. పది వేల మందికి పైగా ప్రజలు గ్రామంలో నివసిస్తున్నారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న ప్రకృతి సిద్ధంగా ఏర్పడ్డ కొండలు గ్రామంలోని కార్మికులకు ప్రధానమైన ఆదాయ వనరు. గ్రానైట్ ఫ్యాక్టరీల రాకముందు ఈ ఊరిని ఆనుకొని ఉన్న కొండల నుంచి భవన నిర్మాణ పునాదులకు ఉపయోగించే సైజు రాళ్లు, రైల్వే కంకర, శ్లాబ్ కంకర రాష్ట్రం నలుమూలలకు తరలేది. ఇక్కడున్న కుటుంబాల్లో మూడో వంతు కార్మికులు కొండల అంచుల్లో ఉన్న రాళ్లను వెలికితీసి సైజులుగా, కంకరగా మలిచేవారు. ప్రస్తుతం గ్రానైట్ కర్మాగారాలు ఏర్పడటంతో కొండల నుంచి సైజు రాళ్లు తీసే కార్మికుల సంఖ్య తగ్గిపోయింది. గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద వచ్చిన వృథా రాళ్లను, కంచెకు ఉపయోగించే రాళ్లు తీసేందుకు పలు పోతుండటంతో ఈ కొండ నుంచి సైజు రాళ్లు తీసే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. ప్రస్తుతం రైల్వే కంకర, శ్లాబ్ కంకర మాత్రమే ఈ కొండ నుంచి కార్మికులు తీస్తున్నారు. ఈ క్రమంలో కస్తూర్బా బాలికా విద్యాలయం వెనుక ప్రాంతం నుంచి గ్రామం ప్రధాన కూడలి వరకు కొండల అంచులో రాళ్ల కోసం తీసిన గోతులు ప్రమాదకరంగా మారాయి. వర్షం కురిసినపుడు ఈ గోతుల్లో నీరు నిలిచి, చెరువులను తలపిస్తున్నాయి. తాజాగా ఈ గోతుల అంచున గత ప్రభుత్వం కొండరికి గృహ నిర్మాణాలు చేపట్టింది. దీంతో ఈ ప్రాంతంలో జన సంచారం అధికంగా ఉంటోంది. ఉన్నతాధికారులు స్పందించి పటిక రాలకు పైగా విస్తీర్ణం ఉన్న ఈ గోతులను పూడ్చేసి నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు అందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఏల్చూరు కొండ అంచులో ప్రమాదకరంగా ఉన్న గోతులు

## రైతుబజారు ఏర్పాటుకు ఏకగ్రీవ ఆమోదం

పర్చూరు: రైతుల సౌకర్యార్థం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనలతో పర్చూరులో రైతుబజారు ఏర్పాటు చేయనున్నట్లు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు చెప్పారు. సోమవారం స్థానిక మార్కెట్‌యార్డులో పాలకవర్గ సమావేశమైంది. రైతుబజారు ఏర్పాటుపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఛైర్మన్ మాట్లాడుతూ పొలాలకు వెళ్లే లింక్ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఈ ఏడాది సెస్ కింద రూ.2.08 కోట్లు వసూలు చేశామన్నారు. మార్కెట్ యార్డు కూరగాయల మార్కెట్‌లో కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న దుకాణాలకు వేలంపాటలు ఏర్పాటు చేసి, ప్రస్తుత దుకాణదారులకే కేటాయిస్తామన్నారు. కార్యదర్శి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోండి

మోటుపల్లి (చినగంజాం), న్యూస్‌టుడే: ప్రభుత్వ రాయితీ పథకాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని చినగంజాం డిస్ట్రిబ్యూటరీ రైతుల సంఘం ఛైర్మన్ పోద వీరయ్య, వెలుగు డీఆర్డీఏ పర్చూరు ప్రాంతీయ అధికారి ఎల్.లక్ష్మారెడ్డి అన్నారు. మోటుపల్లిలో పీఎంఈజీపీ పథకం కింద హౌస్ వ్యాపారం నిర్వహించేందుకు బి.నాగమణి రూ.8.40 లక్షలు, రూ.5 లక్షలు ఆర్థిక సహాయం... నిమిత్తం 35 శాతం రాయితీ కింద రూ.లక్షలు, డి.కవితకు పేపరు ప్లేట్ల తయారీ మిషన్‌కే 35 శాతం రాయితీ కింద రూ.3.50 లక్షల రుణాలు ఇప్పించినట్లు ఏపీఎం జి.పెదసుబ్బారావు తెలిపారు. ఆ నిధులతో ఏర్పాటు చేసిన దుకాణాలను చిన గంజాం ఎస్బీఐ మేనేజర్ మారం సుమన్, ఎంపీడీవో ధనలక్ష్మి ప్రారంభించారు. సర్పంచి పద్మమోడి సాంబశివరావు, నాయకులు వల్లమడి సత్యనారాయణ, కొక్కిలగడ్డ రామాంజనేయులు, సీసీ మాధవి పాల్గొన్నారు.

పేపరు ప్లేట్ల తయారీ మిషన్‌ను ప్రారంభించిన అధికారులు, నాయకులు

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఇసుకదర్శి(మార్టూరు), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఆయన్ను పలు గ్రామాల ప్రజలు కలిసి సమస్యలపై వినతులు అందించారు. ప్రజలకు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఐదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా అభివృద్ధి దిశగా సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

ఎమ్మెల్యే ఏలూరిని కలిసి సమస్యలు తెలుపుతున్న గ్రామాల ప్రజలు

## జిల్లా కార్యవర్గంలో చోటు

జె.పంగులూరు: ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు జంపాని వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కమిటీలో స్థానం సంపాదించిన వారిని మండల అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు వెంకన్న, రూపంజల్లతో పాటు సభ్యులు అభినందించారు. బాపట్ల జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా వరప్రసాద్ యూటీఎఫ్ ప్రకాశం జిల్లా కార్యదర్శిగా ఎన్నికైనట్లు రావి శ్రీనివాసరావు తెలిపారు. వరప్రసాద్‌ను ఆ సంఘ ప్రతినిధులు అభినందించారు.

## క్రీడా పరికరాలు అందజేత

పర్చూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈవోలు ఎ.శివకోటేశ్వరరావు, వి.వెంకటరమణయ్య చెప్పారు. ప్రభుత్వం అందజేసిన ఆటల క్రీడా పరికరాలను సోమవారం మండలంలోని ఉప్పుటూరు క్లస్టర్ పరిధి పాఠశాలలకు అందజేశారు. హెచ్ఎం జి.వసుంధరాదేవి, పీఈటీలు రమాదేవి, సరళాదేవి పాల్గొన్నారు.

## అనంతమ్మ పురమందిర ఆస్తులు పరిరక్షించండి

ఇంకొల్లు: ఇంకొల్లుకు చెందిన కరి అనంతమ్మ పేరిట ఏర్పాటు చేసిన పురమందిర ఆస్తులను పరిరక్షించాలని తహసీల్దారుకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ట్రస్టు ఏర్పాటు, విలువైన స్థలాల్లో కూడిన వివరాలు తెలియజేశారు. 1970లో 9 సెంట్ల విస్తీర్ణంలో పురమందిరం(బుల్లెమ్మస్త్రం) పేరిట భవనం ఏర్పాటు చేశారు. దీని నిర్వహణకు మొత్తం 3.13 ఎకరాలు ఏర్పాటుచేసి, ముగ్గురు సభ్యులతో ట్రస్టీ ఏర్పాటు చేశారు. సభ్యులు ఆయా మృతిచెందడంతో ఈ ఆస్తులు అన్యాక్రాంతమవుతాయని కొందరు కోర్టులను ఆశ్రయించారు. ఇటీవల కొందరు సంఘం పేరిట ఆ స్థలాల్లో బోర్డులు ఏర్పాటుచేసి కంచె వేశారు. ఈ స్థలాలను వీలునామాలో పేర్కొన్న విధంగా గ్రామ శ్రేయస్సుకు మాత్రమే వినియోగించాలని, సంఘాలకు హక్కులేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. సమగ్ర విచారణ జరిపి గ్రామస్థులు, ఆక్రమణదారులతో సమావేశం ఏర్పాటుచేసి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

## సంతమాగులూరు మండలాన్ని పల్నాడు జిల్లాలో కలపాలి

గుంటూరు: అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు మండలాన్ని పల్నాడు జిల్లాలో కలపాలని గ్రామస్థులు కోరారు. తెదేపా నేత ఏలూరి ప్రసాద్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్లు సోమవారం తెలిపారు. ప్రసాదరావు మాట్లాడుతూ 'సంతమాగులూరు మండలాన్ని పల్నాడులో కలిపే డిమాండ్ తో ఇప్పటికే ప్రజలు సంతకాల సేకరణ జరిపి, ఉద్యమిస్తున్నారు. నరసరావుపేట ఈ మండలానికి కేవలం 13 కిలోమీటర్ల దూరంలో ఉంది. భూమి రిజిస్ట్రేషన్లు ఇప్పటికీ నరసరావుపేటలోనే జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లాతో పోలిస్తే రవాణా సౌకర్యాలు నరసరావుపేటకు మెరుగ్గా ఉన్నాయి. ప్రభుత్వం న్యాయం చేయకపోతే కోర్టులను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

## ప్రకృతి సేద్య కూరగాయలతో ఆరోగ్యం

ఇంకొల్లు: ప్రకృతి వ్యవసాయంతో పండించే కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని పంచాయతీరాజ్ శాఖ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ శిక్షకుడు వెంకటస్వామిగౌడ్ అన్నారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ప్రకృతి వ్యవసాయ విధానాలతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు అమ్మకం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మార్కెట్ ధరకంటే తక్కువకే ఇక్కడ కూరగాయలు విక్రయిస్తున్నట్లు వెంకటస్వామి గౌడ్ తెలిపారు.

## గ్రామాల్లో భాజపా ఉన్నతికి కృషి

మేదరమెట్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో భాజపా ఉన్నతికి కృషి చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు భువనాగరాణి అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలో భాజపా శ్రేణులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 ఏళ్ల పార్టీ అభివృద్ధికి కృషి చేసిన భాజపా కార్యకర్తలను సన్మానం చేశారు. సీహెచ్.భాస్కర్‌రెడ్డి, రేగుల రామాంజనేయులు, కె.కోటేశ్వరరావు, డి.సురేష్ బాబు, పి.దయానందరావు, జి.మాధవి, పి.రమేష్, డి.శ్రీరామ్, నరసరాజు, సైదా, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా రెవెన్యూ సంఘ సభ్యులకు అభినందనలు

పర్చూరు, కారంచేడు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన కారంచేడు తహసీల్దార్ బి.నాగరాజును పలువురు ప్రభుత్వ ఉద్యోగులు అభినందించారు. సోమవారం కార్యాలయంలో ఆయన్ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మరో ఉపాధ్యక్షులుగా పర్చూరు మండలం ఎన్నికైన డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.మాధవీలత నియామకం కావడంతో ఆమెను తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, వీఆర్వోలు అభినందించారు.

## ప్రజలకు అందుబాటులో విద్యుత్తు సేవలు

వేలమూరిపాడు(అద్దంకి), న్యూస్‌టుడే: ప్రజలకు విద్యుత్తు సిబ్బంది, సేవలు అందుబాటులో ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. సంస్కరణల్లో భాగంగా వేలమూరిపాడు, ఎస్సీ కాలనీ, బీసీ పవకాండ పునరావాస కాలనీల్లోని నూతన విద్యుత్తు నియంత్రికలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ జ్యోతి రామారావు, ఏఈ కె.ఆర్.వి.ఎస్.శివప్రసాద్, స్థానిక నేత జ్యోతి దామోదరం, గ్రామీణ ఇంజినీరు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నేరం

నాగులపాలెం(పర్చూరు), న్యూస్‌టుడే: చట్టరీత్యా బాల్య వివాహాలు నేరమని సీడీపీవో జి.సుభద్ర చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలన పందరి జల రావాంపై ప్రచార కార్యక్రమాన్ని సోమవారం నాగులపాలెంలో నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఇవి జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 100,181, 112, 1098 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

## పీజీఆర్ఎస్‌కు నాలుగు అర్జీలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి నాలుగు అర్జీలు అందాయని తహసీల్దార్ జె.ప్రభాకరరావు తెలిపారు. అధికారులు ధనలక్ష్మి, పెద సుబ్బారావు, బ్రహ్మం, చంద్రశేఖర్, బసవరాణి తదితరులు పాల్గొన్నారు.

## మనడబ్బు, మనలెక్కల యాప్‌తో ప్రయోజనం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: మన డబ్బు, మన లెక్కలు యాప్ ద్వారా డ్వాక్రా సంఘాలకు ప్రయోజనం కలుగుతుందని బాపట్ల జిల్లా పీడీ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఇంకొల్లు, పర్చూరు, కారంచేడు మండలాల గ్రామ సంఘాల సహాయకులకు శిక్షణ ఏర్పాటు చేశారు. బ్యాంకు లింకేజ్ డీపీఎం లక్ష్మణరావు, ఏపీఎం అనూరాధ, రిసోర్స్‌పర్సన్ విజయభాస్కర్, మోహనరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

## అద్దంకిలో నేత్రదానం

అద్దంకి: అద్దంకిలో సోమవారం 216వ నేత్రదానం జరిగింది. పట్టణానికి చెందిన దుంపూరి సూర్యనారాయణ(70) కన్నుమూశారు. విషయం తెలుసుకున్న రోటరీక్లబ్ బాధ్యులు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల్ని ఒప్పించారు. గుంటూరు శంకర్ నేత్రాలయానికి చెందిన వైద్యబృందం, డాక్టర్ శృతిక ఆధ్వర్యంలో మృతుడి నేత్రాలు సేకరించారు.

## విశ్రాంత ఎంఈవో కన్నుమూత

అద్దంకి, న్యూస్‌టుడే: విశ్రాంత మండల విద్యాధికారి చెన్నుపల్లి సుబ్బారాయుడు(82) సోమవారం కన్నుమూశారు. తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన ఈయన కొంతకాలం ప్రధానోపాధ్యాయుడు, అనంతరం మండల విద్యాధికారిగా సేవలందించారు. ఈయన 2004లో ఉద్యోగ విరమణ చేసిన అనంతరం అద్దంకిలోని కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. సోమవారం మృతదేహాన్ని స్వగ్రామం తిమ్మాయపాలెం తరలించి అక్కడే ఖననం నిర్వహించారు.

## పూర్వపు రోటరీ సహాయ గవర్నర్ శ్రీలక్ష్మి మృతి

అద్దంకి: రోటరీక్లబ్ పూర్వపు సహాయ గవర్నర్, డిగ్రీ కళాశాల జువాలజీ పూర్వపు అధ్యాపకురాలు నర్రా శ్రీలక్ష్మి(68) సోమవారం కన్నుమూశారు. ఆమె 2016లో ఉద్యోగ విరమణ చేశారు. 2017-18లో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షురాలుగా, 2020-21లో రోటరీ సహాయ గవర్నర్‌గా పనిచేశారు.

(c) eenadu

ఈనాడు
చిత్తూరు
మంగళవారం డిసెంబరు 30, 2025 

## పొట్టేలు.. రూ.45 వేలు

కర్ణాటకలో పేరొందిన గొర్రెల జాతుల్లో బన్నూరు జాతి ప్రసిద్ధి. మండ్య, బందూర్‌గానూ పిలుస్తారు. పుంగనూరు ప్రాంతం కర్ణాటకకు సరిహద్దు కావడంతో వాటి పెంపకం ఇక్కడా సాగుతోంది. రుచికరమైన మాంసం, ఏడాదికి ఒకటిన్నర కిలో నుంచి రెండున్నర కిలోల వరకు ఉన్ని ఉత్పత్తి అవుతోంది. పొడవైన చెవులు, ఉన్నితో ఉండటంతో చూపరులను ఆకర్షిస్తోంది. పట్టణానికి చెందిన ఓ ఫామ్‌లో ఈ పొట్టేలును పెంచుతున్నారు. ఏడాదిన్నర వయసు ఉన్న ఈ పొట్టేలు విలువ రూ.45వేలు పలుకుతోంది. – న్యూస్‌టుడే, పుంగనూరు

## ఆలకించి.. భరోసా ఇచ్చి: ఎస్పీ

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడి

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమానికి 50 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ తుషార్‌డూడి ఫిర్యాదులు స్వీకరించారు. చిత్తూరు నగరంలోని హరిజనవాడకు చెందిన చక్రవర్తి.. జీఎస్టీ సమస్య నుంచి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశాడు. ఎలాంటి తుక్కు(స్క్రాప్) వ్యాపారం చేయకున్నా జీఎస్టీ రూ.41.81 లక్షలు చెల్లించాలని నోటీసులు వచ్చాయని వాపోయాడు. సదరు సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేశానని, జీతం చెల్లించడానికి బ్యాంకు ఖాతా అడిగితే ఇచ్చానే తప్ప.. వారి వ్యాపారానికి, తనకు సంబంధం లేదన్నాడు. ఆరోపణలను ఎదుర్కొంటున్న తుప్పు వ్యాపారి రిజ్వాన్ ఎస్పీని కలిసి సదరు ఫిర్యాదుపై సంజాయిషీ ఇచ్చాడు. సదరు ఫిర్యాదును సంబంధిత స్టేషన్ అధికారికి సిఫార్సు చేశారు.

# ప్రజాభీష్టం.. పాలనా సౌలభ్యం

**ఈనాడు- చిత్తూరు, తిరుపతి:** ప్రజాభీష్టం.. పాలనా సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకుని జిల్లాల పునర్విభజనకు కేబినెట్ సోమవారం ఆమోదం తెలిపింది. వైకాపా హయాంలో అస్తవ్యస్తంగా జరిగిన విభజనను చక్కదిద్దేలా అడుగులు వేసింది. గూడూరు ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ఆ నియోజకవర్గంలోని గూడూరు, కోట, చిల్లకూరు మండలాలను నెల్లూరు జిల్లాలో కలపనున్నారు. వాకాడు, చిట్టమూరు మండలాలు మాత్రం తిరుపతిలోనే కొనసాగనున్నాయి. వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు గతంలో నెల్లూరు జిల్లాలో ఉండగా నవంబరు 27న ఇచ్చిన ప్రాథమిక గెజిట్‌లో తిరుపతి జిల్లాలో చేర్చాలని అభిప్రాయపడగా.. ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. దీంతో వారి సెంటిమెంట్‌ను గౌరవిస్తూ ఆ మూడు మండలాలను నెల్లూరులోనే కొనసాగించాలని నిర్ణయించారు. గూడూరు రెవెన్యూ డివిజన్ అలాగే ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఈ నెల 31న జిల్లాల విభజనపై తుది నోటిఫికేషన్ విడుదల చేస్తారు. జనవరి 1 నుంచి ఈ మార్పులు అమలులోకి రానున్నాయి.

### నెరవేరిన కోడూరు ప్రజల ఆకాంక్ష

వైకాపా హయాంలో 2022లో జిల్లాల విభజన చేపట్టినప్పుడే రైల్వేకోడూరును అన్నమయ్య జిల్లాకు బదులు 52 కి.మీ. దూరంలోని తిరుపతిలో చేర్చాలని ప్రజలు డిమాండ్ చేశారు. రాయచోటి 93 కి.మీ. దూరంలో ఉందని జిల్లా కేంద్రం చేరుకోవడానికి దాదాపు 3 గంటలు పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రతిపాదన ప్రాథమిక గెజిట్‌లో లేకున్నా ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా మంత్రివర్గం సానుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు, చిట్వేల్, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు మండలాలు తిరుపతి జిల్లాలో చేరతాయి. దీంతో ప్రస్తుతం ఉన్న 34 మండలాలు కాస్త 36కు పెరగనున్నాయి.

- తిరుపతి జిల్లాలోకి రైల్వేకోడూరు నియోజకవర్గం
- గూడూరులోని మూడు మండలాలు నెల్లూరులోకి
- పుంగనూరులోని నాలుగు మండలాలు మదనపల్లెకు



అన్నమయ్య జిల్లాలో కలుస్తున్న నాలుగు మండలాలు

జిల్లా స్వరూపం ఇలా..

| జిల్లా | డివిజన్లు పాత | డివిజన్లు కొత్త | మండలాలు పాత | మండలాలు కొత్త | జనాభా పాత | జనాభా కొత్త |
|---|---|---|---|---|---|---|
| తిరుపతి | 4 | 3 | 34 | 36 | 29,04,254 | 29,47,547 |
| చిత్తూరు | 4 | 4 | 32 | 28 | 18,72,951 | 16,43,224 |
| అన్నమయ్య | 3 | 3 | 30 | 25 | 16,97,308 | 14,22,605 |

● గూడూరు నుంచి నెల్లూరుకు 51 కి.మీ. జాతీయ రహదారి బాగుండటంతో గంటలోనే అక్కడికి చేరుకోవచ్చు. ఇంత సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా గత ప్రభుత్వంలో 96 కి.మీ. దూరంలోని తిరుపతిలో చేర్చడంతో అప్పట్లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వంలోనూ ప్రాథమిక గెజిట్‌లో మార్పులు చేయకపోవడంతో ప్రజాసంఘాలు ఉద్యమించాయి. ఈ నేపథ్యంలో నాడు జరిగిన తప్పును ఇప్పుడు సరిదిద్దారు. దీంతో కృష్ణపట్నం పారిశ్రామిక నగరం (క్రిస్ సిటీ) నెల్లూరు జిల్లాలోకే వెళ్లనుంది. వాకాడు మండలం తిరుపతిలోనే కొనసాగుతున్నందున దుగరాజపట్నంలోని నౌకా నిర్మాణ కేంద్రం ఇక్కడే ఉండనుంది.

### నెల్లూరుకు క్రిస్‌సిటీ.. తిరుపతికి నౌకానిర్మాణ కేంద్రం

### అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లె..

ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి ఉండగా మదనపల్లెకు మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ జిల్లాలో తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటితోపాటు పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం మండలాలు చేరుతాయి. పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలు మాత్రం చిత్తూరు జిల్లాలోనే ఉంటాయి. మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయాలని అక్కడి ప్రజలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. 2022లో జరిగిన జిల్లాల విభజన సమయంలోనూ ఉవ్వెత్తున ఉద్యమించినా నాటి ప్రభుత్వం తలొగ్గలేదు. కూటమి అధికారంలోకి వస్తే మదనపల్లె జిల్లా కావడం ఖాయమని ఎన్నికల సమయంలో చంద్రబాబు, నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగానే మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటు చేశారు.

**డివిజన్ల మార్పులు**

చిట్టమూరు, వాకాడు మండలాలు సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లోకి; రైల్వేకోడూరు నియోజకవర్గం తిరుపతిలోకి; బంగారుపాళ్యం చిత్తూరు డివిజన్‌లోకి చేర్చుతారు.

### చిత్తూరు మరీ చిన్నగా అవుతుందనే..

నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, వడమాలపేట మండలాలు ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఉన్నాయి. నిండ్ర, విజయపురం, నగరి చిత్తూరులో కొనసాగుతున్నాయి. అటు పుంగనూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు అన్నమయ్య జిల్లాకు, ఇటు నగరిలోని ఈ మూడు మండలాలు తిరుపతిలో చేరితే చిత్తూరు జిల్లా మరీ చిన్నగా అవుతుంది. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం నిండ్ర, విజయపురం, నగరి మండలాలను తిరుపతిలో చేర్చే ప్రతిపాదనను విరమించుకుంది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో 32 మండలాలు ఉండగా తాజా నిర్ణయంతో ఈ సంఖ్య 28కు తగ్గింది.

## సీజీఎస్టీ స్కామ్‌లో ఏడు సంస్థల లైసెన్సులు రద్దు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: సీజీఎస్టీ స్కామ్‌లో ఏడు బోగస్ సంస్థల లైసెన్సులను అధికారులు సోమవారం రద్దు చేశారు. నకిలీ సంస్థలు సృష్టించి దొంగ బిల్లులతో చేయని వ్యాపారాన్ని చేసినట్లు చూపి సీజీఎస్టీ రిటర్న్స్‌ను కాజేసినట్లు గుర్తించారు. జిల్లాలో హరిఓం ట్రేడర్స్, హేమ స్టీల్స్, సంతోష్ కాంట్రాక్ట్ వర్క్స్, సాయిక్రిష్ణ కాంట్రాక్ట్ వర్క్స్, అభి ఎంటర్‌ప్రైజెస్, హేమ చంద్ర కాంట్రాక్ట్ వర్క్స్, పెద్ద మస్తాన్ ఎంటర్‌ప్రైజెస్‌ల లైసెన్సులు రద్దు చేశారు. తుక్కు మాఫియా చేతిలో మోసపోయిన నగరానికి చెందిన విజయచక్రవర్తి వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ నుంచి ప్రధానమంత్రి వరకూ ఫిర్యాదు చేశాడు. తాజాగా పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

**మనీ లాండరింగ్‌పై అనుమానాలు..?**

తుక్కు మాఫియా మనీ లాండరింగ్ కూడా చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. విదేశీ హవాలా మాఫియాతో సంబంధాలు ఉన్నట్లు ఆధారాలు సేకరించారు. అమాయకుల ఐడీ ప్రూఫ్‌తో వందల కొద్దీ నకిలీ సంస్థలను రిజిస్ట్రేషన్ చేయించి లావాదేవీలు జరపడంతో సదరు అక్రమాలు అమాయకుల మెడకు చుట్టుకుంటున్నాయి.

## రాయుడు హత్య కేసుపై విచారణ

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి జనసేన పార్టీకి చెందిన పేట చంద్రశేఖర్‌ను తమిళనాడు పోలీసులు సోమవారం విచారించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని అతని మొబైల్ దుకాణానికి వచ్చిన పోలీసులు పలు విషయాలపై ఆరా తీశారు. జనసేన నియోజకవర్గ మాజీ సమన్వయకర్త వినుత కోట వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆ పార్టీ కార్యకర్త రాయుడు ఈ ఏడాది జులై 8వ తేదీన హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యోదంతంపై ఇప్పటికే వినుత కోట దంపతులు జైలుకు వెళ్లారు. కేసు విచారణ నేపథ్యంలో పేట చంద్రశేఖర్‌పై అభియోగాలు వచ్చాయి. ఈ విషయమై కేసు విచారణ నిమిత్తం తమిళనాడు పోలీసులు శ్రీకాళహస్తికి వచ్చి విచారణ జరిపారు. తొలుత రేణిగుంటలో విచారణ జరపాలని అనుకున్నా మళ్లీ నిర్ణయం మార్చుకొని శ్రీకాళహస్తికి వచ్చినట్లు తెలిసింది. చంద్రశేఖర్‌ను తమిళనాడుకు తీసుకెళ్లి విచారణ జరపాలని అనుకున్నారు. వారి వ్యక్తిగత న్యాయవాదులు విన్నపం మేరకు ఇక్కడే విచారించి వెళ్లిపోయారు.

# ఏడుకొండల వైభవం

### నేటి నుంచి వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల, న్యూస్‌టుడే: ఏడుకొండల వాడి పదిరోజుల వైకుంఠద్వార దర్శనానికి తిరుమల ముస్తాబైంది. అధికారులు కళ్లు చెదిరే ఏర్పాట్లు చేశారు. తిరుమల విద్యుద్దీపాలు, పూల అలంకరణలతో దేదీప్యమానంగా వెలుగుతోంది.

**ఎటుచూసినా పూలరాశులు..**

శ్రీ రంగనాథస్వామి ఆలయ సెట్టింగ్‌ను పరిశీలిస్తున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

తితిదే ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పూల అలంకరణలు కట్టిపడేస్తున్నాయి. మందిరంలోని ధ్వజస్తంభం, బలిపీఠాన్ని చూడచక్కగా ముస్తాబు చేశారు. వైకుంఠదర్శన మార్గంలో ప్రత్యేకమైన పూలతో అలంకరించారు. వైకుంఠ ప్రదక్షిణ చేసే భక్తులకు దైవలోకాన్ని చూసిన అనుభూతి పొందేలా తితిదే ముస్తాబు చేసింది. తిరుమల వ్యాప్తంగా పదిరోజులపాటు 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల ఫలాలను, నాలుగు టన్నుల కట్ ఫ్లవర్స్ వినియోగించనున్నారు.

● తిరుమలలో ఏర్పాట్లను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం సాయంత్రం తితిదే బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, నరేష్‌కుమార్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్‌వో మురళీకృష్ణ తదితరులతో కలిసి పరిశీలించారు.

**ముందస్తు జాగ్రత్తలు..**

● పది రోజుల వైకుంఠద్వార దర్శనానికి ఇబ్బందులు తలెత్తకుండా తితిదే ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. అందులో భాగంగా సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ)టోకెన్ల జారీని ఈ నెల 28 నుంచి జనవరి 8వ తేదీ వరకు రద్దు చేశారు. ● ఆదివారం శ్రీవారిని 85,823 మంది భక్తులు దర్శించుకోగా.. రూ.4.80 కోట్ల హుండీ కానుకలు లభించాయి. ● సోమవారం భక్తుల రద్దీ భారీగా తగ్గిపోవడంతో గంటల్లోనే సర్వదర్శనం భక్తులకు దర్శనం లభించింది. క్యూలైన్లన్నీ ఖాళీగా మారాయి. ● రాత్రి 8.30 గంటలకు వరకు సర్వదర్శనం క్యూలైన్‌లోకి భక్తులను అనుమతించి ఆపై నిలిపివేశారు.

లేపాక్షి కూడలిలో విద్యుత్తు వెలుగులు

**గదుల కేటాయింపు ఇలా..**

● తిరుమలకు చేరుకునే భక్తులకు వసతికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదటి మూడు రోజులు ఈ-డిప్ కలిగిన భక్తులకు తిరుమలలోని కేంద్రీయ విచారణ కేంద్రం (సీఆర్వోలో) ఈ-డిప్ టోకెన్, ఆధార్ కార్డులో రిజిస్ట్రేషన్ చేసుకుంటే మొబైల్‌కు వచ్చే ఎస్ఎంఎస్ ఆధారంగా గదులను కేటాయిస్తారు. గదులు అందుబాటులో ఉన్నంత వరకు మాత్రమే ఈ విధానంలో ఇస్తారు. దర్శన టికెట్లు కలిగిన వీఐపీలకు శ్రీపద్మావతి, ఎంబీసీ, సన్నిధానంలో గదులను కేటాయిస్తారు.

**భద్రతకు ప్రాధాన్యం**

భక్తుల భద్రతకు పోలీసు విభాగం నుంచి 2000 మంది, తితిదే విజిలెన్స్ నుంచి 1100 మందిని నియమించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లోని ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. ప్రతి రెండు గంటలకు ఒక పర్యాయం రద్దీ సమాచారాన్ని క్యూలైన్‌లోని భక్తులకు, తితిదే ఎస్వీబీసీ, మీడియా, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయనున్నారు.

**తెల్లవారుజాము నుంచే..**

● ముందుగా వీఐపీ బ్రేక్ దర్శనాలకు అవకాశం ఇస్తారు. ● ఈ నెల 30, 31, జనవరి 1వ తేదీ వరకు 1,89,000 మందికి దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ● క్యూలైన్‌లో ప్రవేశించే మార్గంలోనే టోకెన్లు స్కాన్ చేస్తారు. ● నిర్దేశిత సమయానికి క్యూలైన్‌లోకి వచ్చే భక్తులకు రెండు గంటల్లో దర్శనం కల్పించేలా ఏర్పాటు చేశారు. ● జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు సర్వదర్శనానికి భక్తులు ఎవరైనా రావచ్చు. వారికి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. ● సామాన్య భక్తుల కోసం పదిరోజుల్లో 182 గంటలు దర్శన సమయాన్ని కల్పించారు.

● 7,70,000 మందికి దర్శనం కల్పించడానికి తితిదే ఏర్పాట్లు పూర్తి చేసింది.

● ఈ-డిప్ కలిగిన భక్తులను మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 11 గంటల వరకు కృష్ణ తేజ ప్రవేశమార్గం నుంచి, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏటీజీహెచ్ అతిథి గృహం నుంచి అనుమతిస్తారు.

కమాండ్ కంట్రోల్‌లో పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

## ఈ నంబర్లు సేవ్ చేసుకోండి..

తిరుపతి (తితిదే): వైకుంఠ ఏకాదశి దృష్ట్యా తిరుపతి, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సమయంలో ఏదైనా ఇబ్బంది కలిగినా లేదా సమాచారం కావాలన్నా ఈ నంబర్లు సంప్రదించవచ్చు.

● ప్రధాన సహాయ కేంద్రాలు (24 //7 లభ్యత)
● తితిదే హెల్ప్‌లైన్ (టోల్ ఫ్రీ): 155257
● విచారణ కార్యాలయం: 0877-2277777

**వైద్య సహాయం.. / తిరుమలలో అస్వస్థతకు గురైతే**

● అశ్విని ఆసుపత్రి (తిరుమల): 0877-2263457, 2263458
● అంబులెన్స్ సేవలు: 0877-2263666 లేదా 108
● మెయిన్ హాస్పిటల్ (తిరుపతి): 0877-2287777

**భద్రత మరియు పోలీసు... / దొంగతనాలు జరిగినా లేదా ఎవరైనా తప్పిపోయినా**

● విజిలెన్స్ ఆఫీస్: 0877-2263333
● తిరుమల క్రైమ్ పార్టీ: 0877-2263939
- తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్: 0877-2263833

## రూ.కోట్ల విలువజేసే స్థలంపై కన్ను

**దర్గాగా కబ్జాకు రంగం సిద్ధం**

**చిత్తూరు శివారులో అక్రమార్కుల హవా**

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూమిపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది.. అనుకున్నదే తడవుగా కబ్జాకు ఉపక్రమించారు.. ఇక అందులో నిర్మాణాలు చేపట్టడమే తరువాయి.. ఇదీ చిత్తూరు నగర సమీప గంగాసాగరం వద్ద ఉన్న పట్టుపరిశ్రమ శాఖ ఏడీ కార్యాలయ స్థల కబ్జా కమామీషు.. ఆ.. అడిగేదెవరు.. చూడొచ్చిందెవరులే అన్నట్లు ఆక్రమణకు దర్గాగా ఉపక్రమించడం గమనార్హం.

చిత్తూరు నగర సమీప గంగాసాగరం వద్ద పట్టు పరిశ్రమ శాఖ ఏడీ కార్యాలయం కొనసాగుతోంది. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో ఏడీ కార్యాలయంతో పాటు పట్టు రీలింగ్ యూనిట్, రైతులకు అవగాహన నిమిత్తం పట్టు మొక్కలు సాగు చేపట్టేవారు. ప్రస్తుతం ఆ స్థలం రూ.కోట్ల విలువ చేస్తోంది. ఈ స్థలానికి కంచె లేకపోవడంతో ఆక్రమణకు గురవుతోంది. ఇప్పటికే ఆ ప్రాంత వాసులు ఆక్రమించుకోగా మరికొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే బహిరంగ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎంతో విలువైన ఈ స్థలం అన్యాక్రాంతమవుతున్నట్లు రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. మూడేళ్ల క్రితం ఇక్కడ పనిచేసిన అధికారుల నిర్లక్ష్యం కారణంగానే స్థలం అన్యాక్రాంతమైందని ఆ శాఖ అధికారులే పేర్కొన్నారు. వెంటనే సర్వే చేయకపోతే ఇదికాస్తా ఆక్రమణకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఆ ప్రాంత వాసులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టు పరిశ్రమ శాఖ అధికారులు మేల్కొని విలువైన ఆ స్థలాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**సర్వేకు ఆదేశం..**

మరోవైపున సదరు స్థలం ఆక్రమణకు గురవకుండా తక్షణమే రెవెన్యూ అధికారులతో సర్వే చేసి హద్దులు గుర్తించాలని, చుట్టూ కంచె ఏర్పాటుకు ప్రతిపాదన పంపాలని రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు ఆదేశించడం గమనార్హం. ఆయన ఆదేశాలతోనైనా జిల్లా అధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## క్రీడానగరికి 28.37 ఎకరాలు

ఈనాడు– తిరుపతి: క్రీడా నగరి (స్పోర్ట్స్ సిటీ) కోసం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)కు దామినేడులో 28.37 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ కేబినెట్ సోమవారం నిర్ణయం తీసుకుంది. శెట్టిపల్లిలో ఇంటి స్థలాలు పొందుతున్న లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇచ్చారు. దుగరాజపట్నంలో గ్రీన్ ఫీల్డ్ నౌకాశ్రయం, నౌకా నిర్మాణ కేంద్రం స్థాపనకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సముద్ర మండలికి అనుమతించింది.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వానేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

## శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో వికసిత భారత్

### ముగిసిన భారతీయ విజ్ఞాన సమ్మేళనం

స్టాళ్ల వద్ద విద్యార్థుల రద్దీ

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: వికసిత భారత్ సాధనలో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో పాటు భావ కాలుష్యం, అవినీతి రాహిత్యం, విలువలు పాటించడం చాలా కీలకమని వక్తలు అభిప్రాయపడ్డారు. దేశంలో అన్ని రంగాల సర్వతోముఖాభివృద్ధిపై విస్తృత చర్చ జరిపేందుకు వేదికగా నిలిచిన భారతీయ విజ్ఞాన సమ్మేళనం సోమవారంతో ముగిసింది. 32 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి విచ్చేసిన 1,250 మంది ప్రతినిధులు, ప్రముఖ పరిశోధన, విద్యా, వైద్య రంగాల ప్రదర్శనలతో ఆకట్టుకుంది. సోమవారం 'శాస్త్ర సాంకేతిక విద్యలో భారతీయ జ్ఞానపరంపర' అనే అంశంపై గాంధీనగర్ ఐఐటీ ఆచార్యులు రాఘవనరసింహన్ తిరునారాయణన్ నేతృత్వంలో ప్రత్యేక చర్చ జరిగింది. భారతీయ జ్ఞాన పరంపర భూమికతో, శాస్త్రసాంకేతిక పరిజ్ఞాన సమన్వయంతో సరికొత్త ఆవిష్కరణలు రావాలని వక్తలు అభిప్రాయపడ్డారు. అనంతరం ఐఐటీ ముంబయి ఆచార్యులు కె.సుబ్రహ్మణియన్ 'భారతీయ జ్ఞాన పరంపర- సుస్థిర అభివృద్ధి' అనే అంశంపై ప్రసంగించారు. 'ఇంటిగ్రేషన్ ఆఫ్ ఐకేఎస్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ' అనే అంశంపై హైదరాబాద్ జెఎన్‌టీయూ అధ్యాపకులు శ్రీహరిరావు మాట్లాడారు.

# పీఎం కుసుమ్‌కు.. స్థలాల సమస్య

- వచ్చే ఏడాది జూన్‌కు సౌర ప్లాంట్ల పూర్తి
- కుప్పంలో పనులు వేగవంతం

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు): వ్యవసాయ రంగంలో విద్యుత్తు సమస్యలు అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. 'పీఎం కుసుమ్' పథకంతో సౌర వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించాయి. ప్రభుత్వ, ప్రైవేటు బీడు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్యానళ్లు ఏర్పాటు చేసి తద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్తును ఫీడర్లకు అనుసంధానం చేసి వ్యవసాయ రంగానికి అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. జిల్లాలో ఈ పథకానికి స్థలాల కొరత అడ్డంకిగా మారింది.

● పథకం: పీఎం కుసుమ్ (కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం)
● జిల్లా లక్ష్యం: 220 మెగావాట్లు
● అవసరమైన స్థలం: వెయ్యి ఎకరాలు
● కుప్పం నియోజకవర్గం: 141 మెగావాట్లు
● పురోగతి: 48 మెగావాట్ల ప్లాంట్ పనులు వేగవంతం
● మిగిలిన ప్లాంట్ల పనులు త్వరలో ప్రారంభం
● కుప్పం మినహా జిల్లాలో సౌర విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం: 80 మెగావాట్లు
● ఎంత స్థలం అవసరం: 320 ఎకరాలు
● స్థల సేకరణ స్థితి: పరిశీలన దశ

అంచనా వ్యయం: రూ.1200 కోట్లు

**రాష్ట్ర స్థాయి అధికారులు దృష్టిసారిస్తేనే..**

స్థలాల ఎంపికలో రాష్ట్ర స్థాయి అధికారులు దృష్టిసారిస్తే తప్ప పీఎం కుసుమ్ పథకం వేగవంతమయ్యే పరిస్థితి లేదు. ప్రభుత్వ, దేవాదాయ శాఖ స్థలాల ఎంపిక, ఒప్పందంలో సంబంధిత శాఖల అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే గుర్తించిన స్థలాలను ఒప్పందం ప్రక్రియ పూర్తి చేసి ప్రాజెక్టు పనులు చేపడితేనే నిర్దేశిత గడువులోగా పూర్తవుతాయి.

**ఇదీ ఒప్పందం:** కుప్పం, చిత్తూరు జిల్లాలో 220 మెగావాట్లు సౌర విద్యుత్తు ఉత్పత్తికి మేఘ ఇంజినీరింగ్, అర్జున్ ఇన్‌ఫ్రా చేపట్టేలా ఎస్పీడీసీఎల్‌తో ఒప్పందం. ఇటీవల రెండు కంపెనీలు పవర్ పర్చేజింగ్ అగ్రిమెంట్(పీపీఏ) చేసుకున్నాయి. 2026 జూన్ లోగా పనులు పూర్తిచేసి సౌర విద్యుదుత్పత్తి ప్రారంభించాలని గడువు నిర్దేశించారు.

**త్వరలో పనులు ప్రారంభం..**

వీలైనంత త్వరగా ప్లాంట్ల పనులు ప్రారంభిస్తాం. కుప్పంలో పనులు వేగంగా జరుగుతున్నాయి. స్థలాల ఎంపిక దాదాపు పూర్తయింది. అధికారులు పరిశీలించి ఒప్పంద ప్రక్రియ పూర్తిచేయనున్నారు. – అయూబ్‌ఖాన్, ఎస్పీడీసీఎల్, డైరెక్టర్(ప్రాజెక్టు)

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు, ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...
పూర్తి వివరాలకు:
80085 13290

(c) eenadu

# పరుగే శ్వాసగా.. విజయమే లక్ష్యంగా..!

## రసవత్తరంగా ఈఎస్ఎల్ క్రికెట్ మ్యాచ్‌లు

సిద్ధార్థ, కేకేసీ జట్ల మధ్య మ్యాచ్

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రజెంట్స్) 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్-2025) క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్ క్రికెట్ మైదానం, ఎస్వీయూ స్టేడియం వేదికగా సీనియర్స్ విభాగంలో జరుగుతున్న పోటీల్లో పలు కళాశాలల జట్లు అద్భుత పోరాట పటిమను ప్రదర్శిస్తున్నాయి. సోమవారం జరిగిన 'ఈనాడు' క్రికెట్ మ్యాచ్‌ల వివరాలు ఇలా ఉన్నాయి.

### గ్రౌండ్-1: ఎస్వీ హై స్కూల్ మైదానం

### సిద్ధార్థ విజయకేతనం

విజేత సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా వంశీ

తొలి మ్యాచ్‌లో కేకేసీ హోమియోపతిక్ వైద్య కళాశాల పుత్తూరు, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పుత్తూరు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన కేకేసీ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 70 పరుగులు చేసింది. తర్వాత బరిలోకి దిగిన సిద్ధార్థ జట్టు 7 ఓవర్లలో వికెట్ నష్టానికి 73 పరుగులతో విజయకేతనం ఎగురవేసింది. జట్టులో వంశీ 24 బంతుల్లో 36 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

### శ్రీవిద్యానికేతన్ కైవసం

శ్రీవిద్యానికేతన్ జట్టు సంబరాలు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అద్వైత్

రెండో మ్యాచ్ గేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ తిరుపతి, శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన గేట్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన శ్రీవిద్యానికేతన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన గేట్ జట్టు 9 ఓవర్లలో 32 పరుగులకు ఆలౌటైంది. శ్రీవిద్యానికేతన్ 61 పరుగుల తేడాతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. జట్టులో అద్వైత్ 22 బంతుల్లో 30 పరుగులు, ఒక ఓవర్‌లో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

### విజయం సాధించిన అన్నమాచార్య

అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అజయ్

మూడో మ్యాచ్‌లో విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల చిత్తూరు, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ తిరుపతి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అన్నమాచార్య ఫీల్డింగ్ ఎంచుకుంది. విజ్ఞానసుధ నిర్ణీత 10 ఓవర్లలో 45 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్ చేసిన అన్నమాచార్య 5.1 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి విజయం సాధించింది. జట్టులో అజయ్ 7 బంతుల్లో 11 పరుగులు, రెండు ఓవర్లలో మెయిడెన్‌తో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు.

### గ్రౌండ్-2: ఎస్వీయూ మైదానం

### కుప్పం ప్రభుత్వ కళాశాల ప్రతిభ

కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా విఘ్నేష్

తొలి మ్యాచ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కుప్పం, శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిటమ్స్) చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సిటమ్స్ బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్ చేపట్టిన కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన సిటమ్స్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 70 పరుగులకే పరిమితమైంది. దీంతో కుప్పం డిగ్రీ కళాశాల జట్టు 26 పరుగుల తేడాతో గెలుపొందింది. జట్టులో విఘ్నేష్ (21 బంతుల్లో 4×3, 6×1) 38 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

### వాక్ ఓవర్‌తో.. ఎన్‌బీకేఆర్ గెలుపు

వాక్ ఓవర్‌తో తదుపరి మ్యాచ్‌కు అర్హత సాధించిన ఎన్‌బీకేఆర్

రెండో మ్యాచ్ గోకుల్‌కృష్ణ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సూళ్లూరుపేట, ఎన్‌బీకేఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యానగర్ జట్ల మధ్య జరగాల్సి ఉండగా గోకుల్‌కృష్ణ జట్టు గైర్హాజరుకావడంతో ఎన్‌బీకేఆర్ జట్టుకు వాక్ ఓవర్ లభించింది.

### కృష్ణతేజ కళాశాల సత్తా

కృష్ణతేజ ఫార్మసీ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎ.కార్తిక్

శ్రీవిద్య డిగ్రీ కళాశాల, పుత్తూరు, కృష్ణతేజ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, తిరుపతి జట్ల మధ్య జరిగిన మూడో మ్యాచ్ ఆసక్తికరంగా సాగింది. టాస్ గెలిచిన శ్రీవిద్య నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. 78 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కృష్ణతేజ జట్టు 7 ఓవర్లలో 2 వికెట్లు నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో ఎ.కార్తిక్ (19 బంతుల్లో 4×3, 6×2) 35 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

Title Sponsor — Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Protein Partner — నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner — CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor — MITS DEEMED TO BE UNIVERSITY www.mits.ac.in MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner — KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner — ఈనాడు.నెట్ FM Partner TV Partner
Organised by ఈనాడు

**నేడు 30.12.2025**

**గ్రౌండ్-1: ఎస్వీ ఉన్నత పాఠశాల మైదానం (సీనియర్స్)**

- ఉదయం 8:00 : వేదవ్యాస డిగ్రీ కళాశాల, పుత్తూరు × ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాల, తిరుపతి
- ఉదయం 10:30 : ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, గూడూరు × పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిత్తూరు
- మధ్యాహ్నం 2:00 : బీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, తిరుపతి × విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, చిత్తూరు

**గ్రౌండ్-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్)**

- ఉదయం 8:00 : ఎస్వీ ఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూళ్లూరుపేట × ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.
- ఉదయం 10:30 : మోహన్‌బాబు యూనివర్సిటీ, రంగంపేట × సిద్ధార్థ ఎడ్యుకేషనల్ అకాడమీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సి.గొల్లపల్లి
- మధ్యాహ్నం 2:00 : విజయం డిగ్రీ కళాశాల, చిత్తూరు × ఎస్వీయూ కాలేజెస్, తిరుపతి

**రేపు 31.12.2025**

**గ్రౌండ్-1: ఎస్వీ ఉన్నత పాఠశాల మైదానం (సీనియర్స్, జూనియర్స్)**

- ఉదయం 8:00 : సీకాం డిగ్రీ కళాశాల, తిరుపతి × ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరు (సీనియర్స్)
- ఉదయం 10:30 : ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, తిరుపతి × గీతం జూనియర్ కళాశాల, రామాపురం (జూనియర్స్)
- మధ్యాహ్నం 2:00 : శ్రీవివేకానంద జూనియర్ కళాశాల, పలమనేరు × ప్రభుత్వ ఐటీఐ, కుప్పం (జూనియర్స్)

**గ్రౌండ్-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్)**

- ఉదయం 8:00 : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి × ఎస్వీ కాలేజ్ ఆఫ్ కామర్స్, తిరుపతి
- ఉదయం 10:30 : చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి × నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, గూడూరు

## డయల్ యువర్ సీఎండీకి 50 వినతులు

తిరుపతి (నగరం): ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి 50 వినతులు వచ్చాయి. సీఎండీ శివశంకర్ లోతేటి అధికారులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. ● చిత్తూరు (మిట్టూరు): 'డయల్ యువర్ ఎస్ఈ'కు ఏడు వినతులు వచ్చాయని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ పేర్కొన్నారు. అంతరాయం లేని నాణ్యమైన సరఫరా, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఈ కార్యాలయంలో సోమవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయా సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## రైతు ఉత్పత్తిదారుల సంస్థలు బలోపేతం

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైతు ఉత్పత్తిదారుల సంస్థల్ని బలోపేతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ఎఫ్‌పీవో జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటల ఉత్పత్తి, మార్కెటింగ్‌కు సంబంధించి జిల్లాలో 31 ఎఫ్‌పీవోలు ఉన్నాయని చెప్పారు. ఎఫ్‌పీవోలకు అవసరమైన రుణ సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యూరియాకు ప్రతిపాదనలు పంపండి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: జిల్లాలో రబీ సీజన్ ఊపందుకుంది. వరి పంట విస్తారంగా సాగవుతోంది. మండలాల వారీగా పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా యూరియా, ఇతర ఎరువుల సరఫరాకు ఏవోలు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ సోమవారం తెలిపారు. ప్రతిపాదనల ప్రకారం రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేస్తామన్నారు. యూరియా కొరత లేదని, అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

## మీ బడిలో వసతులున్నాయా..?

### ☛ సర్వే నిర్వహిస్తున్న ప్రభుత్వం

పుంగనూరు, న్యూస్‌టుడే: మీ పాఠశాలకు ప్రహరీ ఉందా..? ప్రవేశ ద్వారం బాగుందా..? వంటశాల పరిసరాలు శుభ్రంగా ఉన్నాయా..? మధ్యాహ్న భోజనం ఎక్కడ వండుతున్నారు? అంటూ పలు వివరాలను పాఠశాలల్లో జరుగుతున్న సర్వేలో అడుగుతున్నారు.

పాఠశాలలో వసతులపై ఆరా తీస్తున్న సీఆర్పీ

ఈ సమాచారం ఆధారంగా పాఠశాలకు ఒకటి నుంచి నాలుగు కేటగిరీలుగా విభజిస్తున్నారు. ఇలా మండల, జిల్లా పరిషత్, ఎయిడెడ్, గురుకులాల్లో సర్వే సాగుతోంది. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న సీఆర్ఎంటీలు ఈ వివరాలు సేకరిస్తున్నారు. తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి సమగ్ర వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్నారు.

### ఈ అంశాల్లో పరిశీలన

తరగతి గదుల్లో వెలుతురు, విద్యుత్తు, ఫ్యాన్లు ఉన్నాయా, స్విచ్ బోర్డుల పరిస్థితి వంటివి సర్వేలో పరిశీలిస్తున్నారు. గ్రీన్ చాక్ బోర్డులు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవసరమైన కుర్చీలు, టేబుళ్లు ఎన్ని ఉన్నాయి? ఎన్ని అవసరమో గుర్తిస్తున్నారు. అలాగే పాఠశాల ఆవరణలో వ్యర్థాల నిర్వహణ, బడితోట, ఆర్వో ప్లాంట్ పనితీరు, ప్రమాదాలకు ఆస్కారం ఉన్న కట్టడాలు, గుంతలు, విద్యుత్తు తీగలు, పరికరాలు వంటివి పరిశీలిస్తున్నారు. సర్వే వేగంగా జరుగుతోందని సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి వెంకట్రమణ తెలిపారు.

**జిల్లా వివరాలిలా.. ప్రాథమిక పాఠశాలలు: 1,981 ప్రాథమికోన్నత: 47 ఉన్నత: 380**

## మిగిలింది రెండ్రోజులే..

### ■ అదనపు లోడు క్రమబద్ధీకరణకు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఇక రెండ్రోజులే గడువు. 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరణ ఈ నెల 31తో ముగియనుంది. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని అదనపు లోడుకు డిపాజిట్ చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని ఎస్పీడీసీఎల్ అధికారులు పట్టణాలు, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రాయితీతో కిలోవాట్ అదనపు లోడుకు రూ. 1,250, రెండు కిలోవాట్లకు రూ. 2,450, మూడు కిలోవాట్లకు రూ. 3,650, నాలుగు కిలోవాట్లకు రూ. 4,850, ఐదు కిలో వాట్లకు రూ. 6,050 డిపాజిట్ చేసి క్రమబద్ధీకరించుకోవాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ కోరారు.

**రూ.99.22లక్షల ఆదాయం..**

జిల్లాలో ఇప్పటివరకు 5,451 మంది వినియోగదారులు 8,269 కిలోవాట్ల అదనపు లోడు క్రమబద్ధీకరించుకున్నట్లు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ పేర్కొన్నారు. తద్వారా విద్యుత్తు సంస్థకు రూ. 99,22,800 ఆదాయం సమకూరిందన్నారు. రాయితీ సౌకర్యాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**జిల్లాలో ఇప్పటి వరకు దరఖాస్తులు, సమకూరిన ఆదాయం వివరాలిలా..**

| డివిజన్ | దరఖాస్తులు | సమకూరిన ఆదాయం(రూ.లలో) |
|---|---|---|
| చిత్తూరు రూరల్ | 537 | 10,52,400 |
| చిత్తూరు నగరం | 3641 | 67,12,800 |
| పుంగనూరు | 1273 | 21,57,600 |

## మహిళా వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉష

తిరుపతి (మహిళా వర్సిటీ): శ్రీపద్మావతి మహిళా వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా బయోటెక్నాలజీ విభాగం ఆచార్యులు ఆర్.ఉష నియమితులయ్యారు. సోమవారం వీసీ వి.ఉమ అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో రిజిస్ట్రార్ నియామకంపై నిర్ణయం తీసుకున్నారు. ఆచార్య రజిని 2023 జనవరి 5 నుంచి రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. మూడేళ్ల కాలపరిమితి ముగియడంతో నూతన రిజిస్ట్రార్ అదేరోజు బాధ్యతలు తీసుకోనున్నారు. ఉష 21 ఏళ్ల బోధన, పరిశోధనానుభవంలో పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె పరిశోధనల్లో రెండింటికి పేటెంట్ పొందారు. ఆమె మార్గదర్శకత్వంలో 10 మంది పరిశోధక విద్యార్థినులు పీహెచ్‌డీలు అందుకున్నారు. ● పాలకమండలిలో ఇటీవల జరిగిన సీఏఎస్ ఎంపికలకు ఆమోదం లభించింది. ఐదుగురు అధ్యాపకులకు పదోన్నతులు లభించనున్నాయి. ఇంజినీరింగ్ కళాశాలలో రెండు అంతస్తుల భవన నిర్మాణానికి, ఇద్దరు ప్రొఫెసర్ల నియామకానికి ఆమోదం లభించింది.

◗ జస్టిస్ రామకృష్ణారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో రవీంద్రబాబు ◗ జస్టిస్ అశోక్ ఎస్ కినాగికి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కిశోర్ ◗ జస్టిస్ అభిషేక్‌రెడ్డికి చిత్రపటాన్ని ఇస్తున్న ఏఈవో రవీంద్రబాబు ◗ జస్టిస్ నీరజ్ తివారీకి జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో ◗ జస్టిస్ కార్తీక్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

## గణనాథుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రామకృష్ణారెడ్డి, పుల్లా కార్తీక్, కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్ ఎస్ కినాగి, పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డి, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నీరజ్ తివారీ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా సోమవారం దర్శించుకున్నారు. పాలకమండలి ఛైర్మన్ ఎం.మణినాయుడు, ఈవో పెంచల కిశోర్, ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. దర్శన అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ప్రొటోకాల్ ఏఈవో ధనపాల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై వినతులు అందాయి. డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర అధికారులు ఉన్నారు.

అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పీజీఆర్ఎస్‌కు వందల సంఖ్యలో అర్జీదారులు తరలివచ్చారు. సర్వర్ మొరాయించడంతో అర్జీలు కొన్నింటినే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగిలిన వాటిని ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయకనే నేరుగా అధికారులకు వద్దకు పంపడం గమనార్హం. ■ వచ్చే సీజన్‌లో ప్రభుత్వమే రైతుల నుంచి మామిడి కొనుగోలు చేసి ఎగుమతి చేసి మంచి ధర చెల్లించాలని, మామిడి రైతుల్ని ఆదుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నాయకులు ధనంజయ నాయుడు, రవి విన్నవించారు. ■ గ్రామ కంఠం భూముల్ని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని యాదమరి మండలం ఓటేరుపల్లి సర్పంచి భగవతి విన్నవించారు. నడింపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 32/2 ఎల్‌పీఎం నంబరు 24లో ఉన్న గ్రామ కంఠం భూమి కె.కొత్తూరులో ఉందన్నారు. ఇది నిషేధిత జాబితాలో ఉన్న కారణంగా రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ■ బైరెడ్డిపల్లె మండలం నారాయణప్ప చెరువులో చేపలు పట్టేందుకు అనుమతి మంజూరు చేయాలని జంగాల అగ్రహారానికి చెందిన రైతులు విన్నవించారు. ■ సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని విశ్వహిందూ పరిషత్ చిత్తూరు విభాగం సభ్యులు విన్నవించారు.

## టీ తాగి వస్తుండగా లారీ ఢీకొని వృద్ధుడి మృతి

గుడిపాల, న్యూస్‌టుడే: మండలంలోని 189. కొత్తపల్లె ఎస్సీ కాలనీకి చెందిన నేషన్(65) సోమవారం తమ గ్రామ సమీప ముట్టుకూరు పల్లె వద్ద ఉన్న ఓ దుకాణంలో టీ తాగి మళ్లీ రోడ్డుపై వస్తున్నాడు. తమిళనాడు నుంచి వేగంగా వస్తున్న లారీ అతడిని ఢీకొనడంతో తల, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కుమారుడి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

## వ్యాధులు గుర్తించండి

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: మురికివాడల్లో నివసిస్తున్న వారు.. ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో పనిచేసే కూలీలకు క్షయ, ఆస్తమా, సిలికోసిస్ వ్యాధులు వచ్చే ప్రమాదాలు ఉన్నాయని, వాటి నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం టీబీ అలర్ట్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వైద్యులకు శిక్షణ నిర్వహించారు.

## ముగిసిన ఓపెన్ చెస్ టోర్నీ

చెస్ పోటీల్లో ఆటగాళ్లు

చిత్తూరు(క్రీడలు): చిత్తూరులోని ఆర్కే ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆద్యంతం రసవత్తరంగా సాగిన ఏపీ ఓపెన్ చెస్ టోర్నీ ముగిసింది. ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ చదరంగం పోటీలు మేధాశక్తికి పదును పెడుతుందన్నారు. ఆటగాళ్లు గెలుపోటములు సమానంగా స్వీకరించి జీవితలో ఉన్నత స్థాయిని అధిరోహించాలన్నారు. 11 కేటగిరీల్లో జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్ని కైవసం చేసుకున్న ఆటగాళ్లకు మొత్తంగా రూ.1.29 లక్షల విలువజేసే నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఏపీ చెస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బాబుప్రసాద్‌రెడ్డి, పాఠశాల నిర్వాహకులు రవి, కోమల, దినేష్, డీఎస్ పిళ్లై, కిషోర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

## 60 టన్నుల ఎరువుల విక్రయాలు నిలిపివేత

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలోని ఎరువుల దుకాణాలపై ప్రత్యేక తనిఖీ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. రాష్ట్రంలో తలెత్తిన యూరియా సమస్యపై వ్యవసాయ శాఖ ఐదు జిల్లాలకు ప్రత్యేక తనిఖీ అధికారులను నియమించింది. ఈ క్రమంలో జిల్లా ప్రత్యేక తనిఖీ అధికారి సాలురెడ్డి పర్యవేక్షణలో బంగారుపాళ్యం, వి.కోట, బైరెడ్డిపల్లె, కుప్పం మండలాల్లోని ఎరువుల దుకాణాలపై దాడులు చేపట్టి తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి 'ఓ' ఫారం లేకుండా విక్రయిస్తున్న రూ.15 లక్షల విలువజేసే 60 టన్నుల కాంప్లెక్స్ ఎరువుల అమ్మకాలు నిలిపేశారు. ఎరువుల నిల్వ, అమ్మకం రికార్డులు పరిశీలించారు. దుకాణాల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సాలురెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి

## రైతుల విజ్ఞాన యాత్ర

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) సౌజన్యంతో సోమవారం జిల్లాకు చెందిన రైతులు విజ్ఞానయాత్రకు వెళ్లారు. ఈ యాత్ర బస్సును వ్యవసాయ శాఖ చిత్తూరు డివిజన్ ఏడీ ఉమ జెండా ఊపి ప్రారంభించారు. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీవోఈ), తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి, తిరువణ్ణామలై, వేలూరులోని కృషి విజ్ఞాన కేంద్రాలను వారు సందర్శిస్తారు. క్షేత్రస్థాయిలో రైతులు పండిస్తున్న నూతన వంగడాలు, ఆధునిక సాగు పద్ధతులు పరిశీలించి అవగాహన పొంది జిల్లా రైతులకు తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఏడీ ఉమ

EENADU Classifieds

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

గూడూరుకు 5 కి.మీ. పరిధిలో 1 3/4 ఎకరము పొలము అమ్మబడును. వివరములకు సెల్: ✆ 96522 14810.

PLOT FOR SALE

GENERAL

తిరుపతికి అతి సమీపంలో చెన్నై to తిరుపతి హైవే పక్కన కమర్షియల్ ప్లాట్ కొలతలు 100 x 170 (472 అం.) వెంగళరాజు కండ్రిగ. ✆7993145689.

JOBS

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854

TOURS AND TRAVELS

వేదవిద్యా పరిషత్‌వారిచే కాశీయాత్ర ప్రతినెల & మహాశివరాత్రి ప్రత్యేక యాత్ర రుద్రహోమంతో.. 2) బద్రి-కేదార్ మొ॥ చార్‌ధామ్‌యాత్ర 2026 సం॥ నమోదు రూ. 1000/- ఇతర యాత్రలకై సంప్ర॥ కాల్ & వాట్సాప్ ✆ 98737 90017, 93941 42516.

EENADU THE CLASSIFIEDS WAY
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

# చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

## కాలమానిని ఆవిష్కరణ

**చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రూపొందించిన 2026 కాలమానిని కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాజా, లోకనాథ్, రామచంద్రయ్య, జయచంద్ర, ఉషారాణి, బ్రహ్మయ్య, భాస్కర్, నవీన్‌సాయి పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

## నేడు కౌన్సిల్ సమావేశం

**పుత్తూరు, న్యూస్‌టుడే:** మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 30న మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక బడ్జెట్ సమావేశం, అనంతరం 12.30 గంటలకు సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) చిత్తూరు నగరం: 80085 74598 నగరి: 9866112017 గంగాధరనెల్లూరు: 80085 74605 పూతలపట్టు: 9505557466

**న్యూస్‌టుడే, చిత్తూరు నగరం:** సమస్య: సంతపేట వన్నియర్ వీధిలోని కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. -స్థానికులు

సమాధానం: కాలువలో పూడిక తొలగింపజేసి పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం.

– లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

**న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు:** సమస్య: స్థానిక నీవానదిలో వంతెన పక్కనే ఇసుక తవ్వకాల వల్ల వంతెన పాడయ్యే ప్రమాదం ఉంది. -రాణి, స్థానికులు

సమాధానం: గ్రామ సేవకులచే ప్రత్యేక నిఘా పెట్టి ఇసుక తవ్వే వారిపై చర్యలు తీసుకుంటాం.

– భాస్కర్, వీఆర్వో, జీడీనెల్లూరు

## నూతన స్తంభం ఏర్పాటు

స్పందనకు వందనం

మటంపల్లి వద్ద వాలిన విద్యుత్తు స్తంభం సమస్యపై ట్రాన్స్‌కో ఏఈ తులసిప్రసాద్ స్పందించి నూతన స్తంభాన్ని ఏర్పాటుచేయించారు. -న్యూస్‌టుడే, పెనుమూరు

**గుంతల పూడ్చివేత..** చిత్తపార గ్రామం నుంచి ధర్మరాజుల పురానికి వెళ్లే రోడ్డులో ఏర్పడిన గుంతలను పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ జేసీబీ సాయంతో గుంతలు పూడ్చివేయించారు. -న్యూస్‌టుడే, గుడిపాల

**తాగునీటి కనెక్షన్ల అందజేత..** మకరపట్టు కాలనీలో కొత్తగా నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకు నుంచి కనెక్షన్లు ఇచ్చే సమయంలో కొన్ని ఇళ్లు వదిలేసిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి శివయ్య స్పందించారు. ఆధార్ కార్డు ఆధారంగా ప్రతి ఇంటికి కొత్త కనెక్షన్‌ను సంబంధిత గుత్తేదారుచే ఇప్పించారు. -న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు

సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీదేవి

## మహిళా సంఘాలు రాష్ట్రానికి ఆదర్శం కావాలి

**చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే:** జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు రాష్ట్రానికి ఆదర్శం కావాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశంలో పీడీ మాట్లాడారు. ఉన్నతి రుణాలను ఎస్సీ, ఎస్టీ సంఘాలు సద్వినియోగం చేసుకుని తమ ఆదాయ వనరులు పెంపొందించుకోవాలన్నారు. జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమంలో 58 వేల మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇది పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కేవలం పాడి పరిశ్రమపైనే ఆధారపడకుండా మిషనరీ ద్వారా యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా సంఘ సభ్యులు ముందుకు రావాలని, తద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా అముద(కార్వేటినగరం), కార్యదర్శిగా ప్రసన్న(పూతలపట్టు), కోశాధికారిగా గౌతమి(కుప్పం), ఉపాధ్యక్షురాలుగా రజియా(యాదమరి), ఉప కార్యదర్శిగా సరళ(గుడిపాల)ను ఎన్నుకున్నారు.

## కేసు విచారణకు ఏపీపీ మార్పు

**చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే:** కేసు విచారణకు పీపీని మార్పు చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నంబరు 16/2024 కేసు ప్రస్తుతం స్థానిక ప్రధాన జిల్లా సెషన్స్ కోర్టులో కొనసాగుతోంది. దీని విచారణకు పీపీని మార్పు చేయాలని ఫిర్యాదుదారు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో స్థానిక ఆరో అదనపు జిల్లా కోర్టు ఏపీపీని ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున వాదించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## నేడు దాసరాపల్లెలో ఉచిత వైద్య శిబిరం

**గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే:** తూగుండ్రం పంచాయతీ దాసరాపల్లె ఎస్టీ కాలనీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు.

# వంకలు.. ఆలయ భూముల దురాక్రమణలు

• ఆలకించి పరిష్కరించండి
• బాధితుల కన్నీటి వేదన

**న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు), కలెక్టరేట్**

వంకలు, పంట కాలువలు, ఆలయ భూములు దురాక్రమణలకు గురవుతున్నాయి.. ఆలయ భూముల్లో ఇళ్లు నిర్మిస్తున్నారు.. వంకలు దురాక్రమణతో కనుమరుగవుతున్నాయని, అధికారులు స్పందించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని పలు గ్రామాల ప్రజలు అధికారులకు ఆవేదనా భరితులై విన్నవించారు.. సమస్యల పరిష్కారానికి నెలల తరబడి మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నామని, తమ గోడు ఆలకించే వారే కరవయ్యారని వాపోయారు.. చేసేదేమీలేక విసిగి వేసారి ఎంతో శ్రమకోర్చి కలెక్టరేట్‌కు వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు.. ఉన్నతాధికారుల స్పందించి సమస్యలు పరిష్కరించాలని కన్నీటిపర్యంతమయ్యారు.

### నివాస స్థలాలు ఇప్పించండి..

నివాస స్థలాలు ఇప్పించాలంటూ చిత్తూరు నగరం వీరభద్ర కాలనీకి చెందిన ఈశ్వరి, ప్రియాంక, యమున విన్నవించారు. గత 30 ఏళ్లుగా చిత్తూరులో ఉంటున్నామని, ఇప్పటివరకు సొంత నివాస స్థలం, ఇల్లు తమకు లేవన్నారు. న్యాయం చేయాలని వేడుకున్నారు.

మురకంబట్టు రైతులు

### వంకను అక్రమంగా మూసేశారు..

రైతుల పొలాలకు వెళ్లే బండిబాట, వర్షపు నీరు వెళ్లే వంకను అక్రమంగా మూసేశారని చిత్తూరు నగర పరిధి మురకంబట్టుకు చెందిన కొందరు రైతులు ఫిర్యాదు చేశారు. కొన్నేళ్లుగా ఈ మార్గంలో పొలాలకెళ్లి పనులు చేసుకుంటున్నామన్నారు. అయితే చిత్తూరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఈ బండిబాటను, పెద్ద వంకను అక్రమంగా చదును చేసి ప్రహరీ నిర్మాణానికి పునాదులు వేస్తున్నాడన్నారు. తాము అభ్యంతరం చెప్పినా నిర్లక్ష్యంగా, దౌర్జన్యం చేస్తున్నాడని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

### ఆలయ భూములు పరిరక్షించండి..

ఆలయ భూములను పరిరక్షించాలంటూ యాదమరి మండలం కాశిరాళ్ల గ్రామస్థులు అధికారులకు విన్నవించారు. మండలంలోని కాశిరాళ్ల విష్ణేశ్వర స్వామి ఆలయ భూములు 4.75 ఎకరాలు, కొత్తూరులోని ముత్యాలమ్మ ఆలయ భూములు 6.75 ఎకరాలు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. ఇప్పటికే కొందరు అందులో ఇల్లు నిర్మిస్తున్నారని, దీనిపై రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించు కోలేదన్నారు. ఆలయ భూముల దురాక్రమణ అడ్డుకోవాలని కోరారు.

కాశిరాళ్ల గ్రామస్థులు

పులిగుండు ఎస్టీ కాలనీ వాసులు

### సాగు భూమికి పట్టాలివ్వండి..

తమ సాగులో ఉన్న భూమికి పట్టాలు జారీ చేయాలంటూ పెనుమూరు మండలం గుంటిపల్లి పంచాయతీ పులిగుండు ఎస్టీ కాలనీ వాసులు వేడుకున్నారు. ఈ కాలనీలో 15 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, తమకు ప్రభుత్వం పదెకరాల సాగు భూమి కేటాయించిందన్నారు. పట్టాలు అందజేసి న్యాయం చేయాలని విన్నవించారు.

ధర్నా చేస్తున్న న్యాయవాదులు

## పత్తికొండ సీఐపై చర్యలు తీసుకోవాలి

**పుత్తూరు, న్యూస్‌టుడే:** పత్తికొండ సీఐపై చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సురేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో న్యాయవాదులు సోమవారం కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ర్యాలీ నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ పత్తికొండ సీఐ ఓ కేసుకు సంబంధించి ముద్దాయి కోర్టులో ఉండగా ముందస్తు అనుమతి లేకుండా అక్కడి నుంచి తీసుకెళ్లాడని, కనీసం యూనిఫాం ధరించలేదన్నారు. ఇటీవల పోలీసులు న్యాయవాదులతో దురుసుగా ప్రవరిస్తున్నారని, దీనిపై తాము నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలోని న్యాయమూర్తులు ఈ సమస్య పరిష్కరించాలని కోరారు.

### పారిశ్రామిక సందర్శనతో విలువైన సమాచారం..

**పుత్తూరు, న్యూస్‌టుడే:** విద్యార్థులు పారిశ్రామిక సందర్శనతో విలువైన సమాచారం తెలుసుకోవచ్చని కామర్స్ విభాగాధిపతి దేవకి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం విద్యార్థులు సోమవారం మోడరన్ రైస్‌మిల్లు సందర్శించారు. సమన్వయ కర్త తిరుమలయ్య, అధ్యాపకులు వాసవి, గంగయ్య, శ్రీనివాసులు, జ్యోతి, లక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

**చిత్తూరు నగరం, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యలపై అందే ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్ 2, టిడ్కోకు 4, ప్రజారోగ్యం 3, పింఛను 1 చొప్పున మొత్తం 10 వినతులు అందాయి. నగరపాలక సహాయ సిటీ ప్లానర్ నాగేంద్ర, ఎంహెచ్‌వో లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో సత్తా చాటాలి

జట్టును అభినందిస్తున్న ఎంఈవో తిరుమలరాజు

**పుత్తూరు, న్యూస్‌టుడే:** తిరుపతి జిల్లా స్థాయిలో పుత్తూరు ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు సత్తా చాటాలని ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. తిరుపతి జిల్లా జట్టుకు ఎంపికైన ఉపాధ్యాయుల క్రికెట్ జట్టును సోమవారం వారు అభినందించారు. వారు మాట్లాడుతూ లీప్ క్రికెట్‌లో భాగంగా తిరుపతి డివిజన్ స్థాయిలో ఈ జట్టులో రాజేష్, పళని, గిరిబాబు తమ ప్రతిభ చూపి విజయానికి కృషి చేశారని, తద్వారా తిరుపతి జిల్లా స్థాయి జట్టుకు ఎంపికయ్యారన్నారు. జిల్లా స్థాయిలో రాణించి పుత్తూరు పేరు ఇనుమడింపజేయాలని కోరారు.

## ఎస్పీని కలిసిన.. శిక్షణ ఎస్పీ తరుణ్ పహ్వా

ఎస్పీ తుషార్‌డూడికి మొక్క అందజేస్తున్న శిక్షణ ఎస్పీ తరుణ్ పహ్వా

**చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే:** జిల్లాలో శిక్షణ నిమిత్తం వచ్చిన శిక్షణ ఎస్పీ డా.తరుణ్ పహ్వా సోమవారం ఎస్పీ తుషార్ డూడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీని పరిచయం చేసుకుని పూల మొక్క అందజేశారు. హరియాణా రాష్ట్రంలోని చర్కీ దాద్రీ జిల్లాకు చెందిన తరుణ్ పహ్వా 2020లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని 2024లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2024వ బ్యాచ్ కేడర్‌కు ఎంపికై ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం ఆరు నెలల ప్రొబేషనరీ శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చారు.

## హద్దుమీరితే చర్యలు

**పాలసముద్రం:** నిబంధనలు ఉల్లంఘించి నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రజలు పోలీసులకు సహకరించి ఇళ్ల వద్దనే కుటుంబీకులతో కలిసి వేడుకలు నిర్వహించుకోవాలన్నారు.

### ఐదేళ్లు సరిపోలేదా..?

ఐదేళ్లయినా మండలంలోని వెప్పాలమానుచేను గ్రామంలో అంగన్‌వాడీ భవనం పూర్తి కాలేదు. దీంతో పిల్లలు సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. గతంలో భవన వసతి లేక పోవడంతో శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక పాఠశాల భవనంలో నడిచేది. పక్కా భవనం కోసం నాడు-నేడు పథకం కింద నిధులు మంజూరయ్యాయి. పాఠశాల కమిటీ సభ్యుల్లో ఒకరు భవన నిర్మాణాన్ని నత్తనడకన కొనసాగిస్తుండగా ప్రభుత్వం మారడంతో అప్పట్నుంచి అసంపూర్తిగానే నిలిచింది. ఐదేళ్లయినా పూర్తికాక, వేరే మార్గం అద్దె భవనంలో కొనసాగిస్తోంది. దీంతో ప్రభుత్వం ప్రతి నెలా అద్దె చెల్లిస్తోంది. -న్యూస్‌టుడే, గుడిపాల

## వైకుంఠ ఏకాదశికి ప్రసన్న వెంకన్న ఆలయం ముస్తాబు

కార్వేటినగరం: ముస్తాబైన వేణుగోపాలస్వామి ఆలయం, వడమాలపేట: వైకుంఠ ద్వార ప్రవేశం

**వడమాలపేట, కార్వేటినగరం:** వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయ ఆవరణలో క్యూలైన్లు, చలువ పందిళ్లు, విద్యుదీపాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. 30న మంగళవారం ఏకాదశిన వేకువజామున 12.05-1.30 గంటల సమయంలో తిరుప్పావైతో స్వామి వారిని మేల్కొలిపి ధనుర్మాస కైంకర్యాలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 1.35 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు తిరువీధి ఉత్సం నిర్వహించనున్నామని ఆలయాధికారి వేణుగోపాల్‌రాజు తెలిపారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తెదేపా నాయకులు

**బంగారుపాళ్యం, న్యూస్‌టుడే:** క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపునకు పునాదని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పేర్కొన్నారు. వజ్రాలపురం బోయకొండ సమీప మైదానంలో ఈ నెల 24నుంచి 29వరకు వరకు జరిగిన క్రికెట్ పోటీల్లో విజేతలైన తగ్గువారిపల్లె జట్టుకు మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి టేకుమంద జట్టుకు రూ.ఏడు వేలు, జ్ఞాపికలు అందజేశారు. వజ్రాలపురం బోయకొండ ఆలయ ధర్మకర్త కృష్ణప్ప కుమారుడు గోపి, బొమ్మాయిపల్లె గౌరీయూత్ సభ్యులు బహుమతి నగదు విరాళంగా ఇచ్చారు. రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, తెదేపా మండల గౌరవాధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు, అధ్యక్షులు ధరణీప్రసాద్ నాయుడు, సింగిల్‌విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు, జిల్లా ఈడిగ సాధికార సంక్షేమ సమితి అధ్యక్షులు నాగరాజు, తెదేపా మండల కార్యదర్శి జనార్దన్, సర్పంచి నీరజాక్షులుగౌడ్ పాల్గొన్నారు.

సుధాదేవ్ వర్మకు జ్ఞాపిక అందజేస్తున్న ఛైర్మన్ మణినాయుడు, ఈవో కిశోర్
● వసుంధరకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఛైర్మన్, ఈవో

## వరసిద్ధుడి సన్నిధిలో ప్రముఖులు

**కాణిపాకం, న్యూస్‌టుడే:** వరసిద్ధి వినాయకస్వామిని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సతీమణి సుధాదేవ్ వర్మ, సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర, తెలంగాణ రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ శ్రీనివాసులు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఏపీ ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయక్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఏపీ సీఎం టూర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేశ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా సోమవారం దర్శించుకున్నారు. పాలక మండలి ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్, ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. దర్శన అనంతరం ప్రముఖులకు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ప్రొటోకాల్ ఏఈవో ధనపాల్, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి పాల్గొన్నారు.

## రీసర్వేతో శాశ్వత పరిష్కారం

**పూతలపట్టు, న్యూస్‌టుడే:** ఆకణాంబట్టు గ్రామంలో జనవరి 2నుంచి భూ సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. గ్రామంలో ఆయన తన సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచి మణి, డీటీ మునికృష్ణ పాల్గొన్నారు. **నిండ్ర:** రీసర్వేతో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని ఆర్డీవో కార్యాలయ డివిజనల్ సర్వేయర్ ప్రసాద్ అన్నారు. కచ్చరవేడు, ఇరుగువాయి గ్రామాల్లో రీసర్వే జనవరి 2 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. తహసీల్దారు ఈశ్వర్, సర్వేయర్లు పాల్గొన్నారు. **పెనుమూరు:** రీసర్వేతో శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తెలిపారు. కలవకుంట సచివాలయం వద్ద సర్పంచి రామచంద్రయ్య అధ్యక్షతన రైతులతో గ్రామసభ నిర్వహించారు.

**వేములో రక్తదాన శిబిరం..పూతలపట్టు:** పి.కొత్తకోటలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర నాయుడు ప్రారంభించారు. 150 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ నవీన్ కిలారి, కార్యక్రమ ఇన్‌ఛార్జి చెన్నయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

**విజయవంతం చేయండి..ఐరాల, న్యూస్‌టుడే:** ఐరాల వారపుసంతలో మంగళవారం జరిగే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మండల హిందూ సమ్మేళన ఆహ్వాన కమిటీ సమితి సోమవారం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి స్వామి విచ్చేయనున్నారని తెలిపారు.

**విద్యా సామగ్రి వితరణ.. బంగారుపాళ్యం:** స్థానిక గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్ సోమవారం విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణయ్య ఉచితంగా అందజేశారు. హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య, యూటీఎఫ్ నాయకులు మొగిలయ్య పాల్గొన్నారు.

**బాధ్యతగా పనిచేయాలి..కార్వేటినగరం, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని ఎంఈవోలు విజయ్‌కుమార్, మనోజ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో యూటీఎఫ్ కాలమాన పట్టికను వారు సోమవారం ఆవిష్కరించారు. నాయకులు వేణుగోపాల్, పీతాంబరం, సురేష్, ప్రకాష్, చక్రవర్తి, మహేష్, ప్రవీణ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## డీఈవోకు సత్కారం

డీఈవో రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

**చిత్తూరు విద్య, న్యూస్‌టుడే:** ఎస్టీయూ రూపొందించిన కాలమానిని, డైనందినిని డీఈవో రాజేంద్రప్రసాద్ తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం డీఈవోను.. ఎస్టీయూ నాయకులు సత్కరించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, షేక్ ఇలియాజ్, నాయకులు గంటా మోహన్, పురుషోత్తం, దేవరాజులురెడ్డి, యువరాజు, చంద్రన్, రాధాకుమారి పాల్గొన్నారు.

## కుక్కలను నియంత్రించండి

**పుత్తూరు:** పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని ది హిల్ ట్రెక్కర్స్ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షుడు సుమన్, సభ్యురాలు లక్ష్మి సోమవారం కమిషనర్ నాగేశ్వరరావును కలిసి విన్నవించారు. పిల్లలను పాఠశాలలకు ఒంటరిగా పంపాలన్నా తల్లిదండ్రులు భయపడుతున్నారన్నారు. కుక్కల పునరుత్పత్తి జరగకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తమకు హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## మహిళలకు దుస్తుల పంపిణీ

**చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే:** క్రిస్మస్, నూతన ఆంగ్ల సంవత్సరాది వేడుకల్ని సోమవారం చెన్నమ్మగుడిపల్లెలోని ప్యూర్ గాస్పల్ చర్చిలో నిర్వహించారు. మహిళలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయానంద రెడ్డి, చర్చి పాస్టర్ రమేష్‌ప్రసాద్ పాల్గొన్నారు.

# క్వారీల కాలుష్యాన్ని అరికట్టండి

■ రూ.15.13 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం

**నగరి, న్యూస్‌టుడే:** నగరి పరిసరాల క్వారీల నుంచి వచ్చే కాలుష్యం, టిప్పర్ల ట్రాఫిక్‌ని అరికట్టాలని మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిప్పర్లను రాత్రివేళ నడిపేలా చూడాలన్నారు. సంక్రాంతి లోగా వీధి దీపాలు సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, పలుచోట్ల నీటి సరఫరా పైపుల లీకులు అరికట్టాల న్నారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ఫాగింగ్ చేయాలన్నారు. వైస్ ఛైర్మన్ వెంకటరత్నంరెడ్డి మాట్లాడుతూ హైవే విస్తరణ పనుల కారణంగా రోడ్లు ప్రమాద భరితంగా మారాయని, గ్రావెల్ తరలించే వాహనాల నుంచి మట్టి రోడ్డుపై పడి ద్విచక్ర వాహనదారులు క్షతగాత్రులవుతున్నారన్నారు. దీన్ని పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల విషయంలో ప్రొటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు. 2025-26 సంవత్సరానికి రూ.15.13 కోట్ల అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. కమిషనర్ కృష్ణారెడ్డి, మేనేజర్ శేఖర్, డీఈఈ రవీంద్రరెడ్డి, డీటీ మేఘవర్ణం, హౌసింగ్ డీఈఈ భాస్కర్, మెప్మా సీఎంఎం ప్రసాద్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి

ఎమ్మెల్యే మురళీమోహన్‌ను సత్కరిస్తున్న నాయకులు

**యాదమరి, న్యూస్‌టుడే:** తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమితులైన హేమగిరి(చిట్టి), కార్యదర్శిగా నియమితులైన ధరణీప్రకాష్.. సోమవారం ఎమ్మెల్యే మురళీమోహన్‌ను సత్కరించారు. లక్ష్మీనగర్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిసి తమకు పార్టీ పదవులు ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల నాయకులతో సమన్వయం చేసుకుని పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు మురార్జీ, ప్రధాన కార్యదర్శి రబీ, జనసేన మండల అధ్యక్షుడు కుమార్, నాయకులు వినాయకం గౌండర్, రాజమాణిక్యం, లక్ష్మీపతి, మనోజ్ పాల్గొన్నారు. **పూతలపట్టు:** కమ్మగుట్టపల్లె శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. ఆయన గ్రామానికి విచ్చేసి ఏర్పాట్లు పరిశీలించాక విలేకర్లతో మాట్లాడారు. తెదేపా మండల కన్వీనర్ దొరబాబు, యువరాజులనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

**చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని అపోలో విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ పోతురాజు అన్నారు. తాళంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో అపోలో విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రకాష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, వీఆర్వో ఆనంద నాయుడు, అపోలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త హేమాద్రిరెడ్డి, గాయత్రి పాల్గొన్నారు.

## తిరువక్కారై ఆలయంలో పూజలు

**చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే:** తమిళనాడులోని తిరువక్కారై శివాలయంలో సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పూజలు చేశారు. అక్కడి ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఉప మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు బాలాజీ, సురేష్, రవి తదితరులు ఉన్నారు.

## ఓంశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

**నగరి, న్యూస్‌టుడే:** ఓంశక్తి ఆలయంలో నూతనం సంవత్సరం క్యాలెండర్‌ని సోమవారం ఆవిష్కరించారు. ప్రత్యేక అభిషేకం, పూజలు చేసి భక్తులకు క్యాలెండర్లు పంపిణీ చేశారు. దాతలు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

## 'మోసం చేసి భూమి రాయించుకున్నారు'

**వెదురుకుప్పం:** కలిమిచేను గ్రామానికి చెందిన మునిలక్ష్మికి తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురం రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 88-4ఎలో 0.76 ఎకరాల భూమిని.. ఆమె తండ్రి రాజారెడ్డి దాన సెటిల్మెంటు కింద రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ భూమిపై తనకు హక్కుపత్రాలు ఉన్నా తన చిన్నాన్న.. తనకు మాయమాటలు చెప్పి సంతకాలు చేయించుకుని ఆపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని బాధిత మహిళ మునిలక్ష్మి సోమవారం విలేకరులకు తెలిపారు. విషయం తెలిసి తన భర్త.. పెద్దల సమక్షంలో పంచాయితీ చేయగా తమపై దాడి చేశాడని వాపోయారు. పోలీసులు సోమవారం స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారని, న్యాయం చేయాలని కోరారు.

## నాలుగు టిప్పర్లు స్వాధీనం

**నగరి, న్యూస్‌టుడే:** అపరిమిత లోడ్‌తో గ్రావెల్ తరలిస్తున్న రికార్డులు లేని నాలుగు టిప్పర్లను సోమవారం సీజ్ చేశామని ఎంవీఐ వాసుదేవరెడ్డి తెలిపారు. ఆర్డీవో ఆదేశాలతో, రెవెన్యూ అధికారులతో కలిసి తమిళనాడు వెళ్తున్న వాహనాలు తనిఖీ చేసి మూడు వాహనాలకు ఒక్కోదానికి రూ.24,280, ఒకదానికి రూ.18,280 చొప్పున అపరాధం విధించామన్నారు.

(c) eenadu

# పలమనేరు

●పలమనేరు ● కుప్పం ●పుంగనూరు

## కాస్త ఆలకించి.. సమస్యలు తీర్చండి సారూ..

వినతులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:** సమస్యలు పరిష్కరించాలంటూ కడా పీడీ వికాస్ మర్మత్‌ను ప్రజలు వినతుల ద్వారా కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కడా ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఆయా శాఖాధికారులను ఆయన ఆదేశించారు.

### రీ-సర్వేలో పేరు మారి..

శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె గ్రామ రెవెన్యూలో నాకు వారసత్వంగా 3.30 సెంట్ల భూమి ఉంది. రీ-సర్వేలో భాగంగా రెవెన్యూ రికార్డుల్లో ఆన్‌లైన్‌లో వేరొకరి పేరు మారింది. సమస్యను పరిష్కరించాలని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. **- రామప్ప, మఠం, శాంతిపురం**

### ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి..

శాంతిపురం మండలం పెద్దూరు రెవెన్యూలో 2.66 సెంట్ల డీకేటీ భూమి ఉంది. ఆ భూమిని పరిశ్రమల స్థాపనకు తీసుకున్నారు. దానికి సంబంధించిన నష్టపరిహారం ఇంకా అందించలేదు. అధికారులు స్పందించి నష్టపరిహారం వచ్చేలా చూడాలి. **- గంగమ్మ, పెద్దూరు, శాంతిపురం**

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని శివాలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పాతపేట శ్రీచెన్నమల్లికార్జునస్వామి, నాగిరెడ్డిపల్లె శ్రీసోమేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణతో అర్చనలు, పూజలు జరిపారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు.

**గుడుపల్లె:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని కనమనపల్లె శ్రీనివాసాలయం, గుడుపల్లె వేంకటేశ్వరాలయం, శెట్టిపల్లె వేణుగోపాలస్వామి, కుప్పిగానిపల్లె తిమ్మరాయస్వామి తదితర ఆలయాల్లో నిర్వాహకులు ఆలయాలను విద్యుత్తు దీపాలతో ముస్తాబు చేశారు.

కనమనపల్లెలో.. ముస్తాబైన శ్రీనివాసాలయం

## మలుపుల్లో పోతున్నాయ్ ప్రాణాలు..!

### ✦ జాతీయ రహదారిలో ప్రమాదాల పరంపర

**శాంతిపురం, న్యూస్‌టుడే:** శాంతిపురం మండలం మొరసనపల్లె సమీపంలోని జాతీయ రహదారిలో 'ఎస్' ఆకారంలోని మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కుప్పం-పలమనేరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా.. మలుపును సరి చేయాల్సి ఉన్నా.. భూసేకరణలో ఏర్పడిన నిర్లక్ష్యం వాహనదారులకు శాపంగా మారింది.

మొరసనపల్లె వద్ద ప్రమాదకర మలుపులో వాహనాల రద్దీ

### నిత్యకృత్యంగా..

పలమనేరు నియోజకవర్గ పరిధిలోని వి.కోట.. కుప్పం నియోజకవర్గ పరిధిలోని నడుమూరు తమిళనాడు సరిహద్దు వరకు జాతీయ రహదారిలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరగడం సర్వసాధారణంగా మారింది. వాహనాల రద్దీతో పాటు మితిమీరిన వేగం కారణంగా అనర్థాలు చోటు చేసుకొంటున్నాయి. ముఖ్యంగా టెంపోలు, ద్విచక్ర వాహనాలు వేగనియంత్రణ లేనందున ప్రమాదాలకు గురవుతున్నట్లు స్పష్టమవుతోంది.

### విస్తరణలో నిర్లక్ష్యం..

దశాబ్దం కిందట జాతీయ రహదారి విస్తరణ చేపట్టారు. మలుపులను సరి చేసేందుకు భూసేకరణ చేపట్టినా.. చాలా చోట్ల పనులు జరగలేదు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడటం.. గుత్తేదారుల ఇష్టారాజ్యంగా మలుపులను విస్మరించి.. రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఆంధ్ర-తమిళనాడు అంతరాష్ట్ర మార్గంలో క్రమేణా వాహనాల రద్దీ విపరీతమైంది. తదనుగుణంగా రోడ్డు అభివృద్ధి, మలుపులను సరిచేయకపోవడంతో ప్రమాదాలు అధికమయ్యాయి.

### ఎక్కడెక్కడంటే..

కుప్పం మండలంలోని నడుమూరు అటవీ ప్రాంతంతో పాటు వెండుగంపల్లె, మున్సిపాలిటీ పరిధి తంబిగానిపల్లె చెక్‌పోస్టు, రాజీవ్ కాలనీ పైవంతెన, ఎమ్మార్‌రెడ్డి సర్కిల్ లింక్ రోడ్డు, చప్పిడిగరుగులు వద్ద మలుపులను సరి చేయలేదు. ✦ గుడుపల్లె మండలంలో నలగాంపల్లె మిట్ట, గణేశ్‌పురం, ✦ శాంతిపురం మండలంలో పోడూరు, కడపల్లె, శివపురం, తులసినాయనపల్లె, పెద్దబొమ్మనపల్లె, మఠం, కూతేగానిపల్లె, శ్రీరామాపురం, రామకుప్పం పరిధిలో రాజుపేటరోడ్డు తదితర చోట్ల మలుపుల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## అమరావతికి రొంపిచెర్ల విద్యార్థులు

**రొంపిచెర్ల, న్యూస్‌టుడే:** అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు రొంపిచెర్ల కస్తూర్బా విద్యార్థులు బయలుదేరినట్లు ప్రత్యేకాధికారి సుజాత తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ఇద్దరు, ఇంటర్ విద్యార్థులు ఇద్దరు వెళ్లినట్లు చెప్పారు.

మాట్లాడుతున్న రవీంద్రబాబు

## ఏఐ ప్రావీణ్యం సాధించాలి

**పలమనేరు, న్యూస్‌టుడే:** కృత్రిమ మేధస్సుపై ప్రావీణ్యం సాధించాలని స్థానిక మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సుపై కళాశాలలో ఐదు రోజుల వర్కుషాపును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## చర్యలు తప్పవు

**పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** కొత్త ఏడాదిని పురస్కరించుకుని పట్టణంలో మద్యం తాగి అల్లర్లు చేసినా, ద్విచక్ర వాహనాలపై శబ్దాలు చేస్తూ తిరిగినా చర్యలు తప్పవని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కార్యకర్తలతో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీఎస్ మునిరత్నం

## కార్యకర్తలే పార్టీకి బలం

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:** తెదేపా కార్యకర్తలే పార్టీకి బలమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని విజయవంతం చేసిన 85 మందికి ఉత్తమ కార్యకర్తలుగా ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ రాజశేఖర్, నాయకులు వెంకటేష్, సత్యేంద్రశేఖర్, కస్తూరి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు చాపల వితరణ

**శాంతిపురం, న్యూస్‌టుడే:** మండలంలోని నాలుగు క్లస్టర్ల పరిధిలో 23 అంగన్‌వాడీ కేంద్రాలకు పలమనేరులోని శ్రీపురం సీతారామయ్య ట్రస్టు తరపున చాపలు, కప్పులను వితరణగా అందజేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో. . ట్రస్టు తరపున వాటిని అంగన్‌వాడీ సిబ్బందికి అందజేసినట్లు సీడీపీవో కల్పన, పర్యవేక్షకురాలు ద్రాక్షాయణి తెలిపారు.

## ఎస్పీని కలిసిన.. శిక్షణ ఎస్పీ తరుణ్ పహ్వా

**చిత్తూరు(నేరవార్తలు):** జిల్లాలో శిక్షణ నిమిత్తం వచ్చిన శిక్షణ ఎస్పీ డా.తరుణ్ పహ్వా సోమవారం ఎస్పీ తుషార్‌డూడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీని పరిచయం చేసుకుని పూల మొక్క అందజేశారు. హరియాణాలోని ఛర్ఖీ దాద్రీ జిల్లాకు చెందిన తరుణ్ పహ్వా 2020లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని 2024లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2024వ బ్యాచ్ కేడర్‌కు ఎంపికైన ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకుని ప్రస్తుతం ఆరు నెలల ప్రొబేషనరీ శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చారు.

ఎస్పీ తుషార్‌డూడికి మొక్క అందజేస్తున్న శిక్షణ ఎస్పీ తరుణ్ పహ్వా

## రీసర్వేతో భూములకు భద్రత

అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్ తదితరులు

**బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** రీసర్వే ప్రాజెక్టు ద్వారా రైతుల భూములకు భద్రత కల్పించడం జరుగుతుందని తహసీల్దార్ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. లక్ష్మనపల్లెలో సోమవారం రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ భూములతో పాటు రైతుల భూములను నిశితంగా సర్వే చేసి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రీసర్వేలో ఏదైనా పొరపాటు జరిగితే రైతులు అధికారుల దృష్టికి తీసుకొస్తే తప్పిదాలను సవరించి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రఘుచంద్ర గుప్తా, కార్యదర్శి ప్రభుదాస్ పాల్గొన్నారు.

## ప్రకృతి సాగులో భాగస్వాములను చేయండి

**రామకుప్పం:** తక్కువ పెట్టుబడితో ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధించేటట్లు రైతులను చైతన్యవంతులను చేయాలని కుప్పం ఏఎంసీ ఛైర్మన్ జీఎం రాజు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనం వద్ద రైతులు, వ్యవసాయ సిబ్బందితో ప్రకృతి సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒకే పొలంలో ఎక్కువ పంటలను సాగుచేసి అంతరంగా, కషాయాలు, విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ సీతాపతి, ఏఎంసీ డైరెక్టర్లు మునెప్ప, ప్రసన్నకుమార్, పవన్‌కుమార్, మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, రామకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జి శంకర్‌చలం తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు అందజేస్తున్న ఏఎంసీ ఛైర్మన్

**కల్లూరు:** ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని వ్యవసాయాధికారి మాధవి సూచించారు. సోమవారం కల్లూరు రైతు సేవా కేంద్రంలో ప్రకృతి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

**పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య:** పట్టణంలోని షికారీ కాలనీలో కాలువలను శుభ్రం చేయాలి. కాలువలో రాళ్లు చేరడంతో మురుగు ప్రవహించడం లేదు. దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. - మెహబూబ్, పలమనేరు

**సమాధానం:** కాలువలను శుభ్రం చేయడానికి చర్యలు తీసుకుంటాం. - ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

### కాలువలు శుభ్రం

**పలమనేరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని రంగాపురం వీధిలో మున్సిపల్ సిబ్బంది మురుగు కాలువలను శుభ్రం చేశారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందంటూ 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆ మేరకు శుభ్రత చర్యలు చేపట్టారు.

## నేడు ఆర్.ఆర్ కాలనీలో వైద్య శిబిరం

**చౌడేపల్లె:** మండలంలోని దిగువపల్లె పంచాయతీ ఆర్.ఆర్. కాలనీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లీలామాధవి సోమవారం తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పాఠశాలకు మోటారు వితరణ

**సోమల, న్యూస్‌టుడే:** స్థానిక ఉన్నత పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. బోరు మోటారు సరిగా లేకపోవడంతో గుర్తించిన పూర్వ విద్యార్థి నగేష్ నీళ్ల మోటారును సోమవారం వితరణగా అందించారు. ప్రధానోపాధ్యాయుడు హేమసుధాకర్, నాయకులు మునివెంకటప్ప, జ్యోతీశ్వరుడు, సదాశివయ్య పాల్గొన్నారు.

## ఇక్కడ ఎందుకు పడేశారు..?

గంగవరం మండలం పత్తికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 2 కి.మీ దూరంలోని నాలుగు రోడ్ల వద్ద మందులను కుప్పగా పడేశారు. గడువు తీరిన మందులైనా రోడ్డు మీద పడేయకూడదని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

దీంతో పర్యావరణం దెబ్బతినే ప్రమాదముందని వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.
**- న్యూస్‌టుడే, పలమనేరు**

## పరిసరాల శుభ్రత ఇలాగేనా...!

మండల పరిధి తుర్లపల్లె పంచాయతీ కేంద్రంలోని రైతు సేవా కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఇక్కడ ముళ్లపొదలు పెరిగి, చెత్తాచెదారంతో పాములకు నిలయంగా మారింది. ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించే అధికారులు ప్రభుత్వ కార్యాలయల వద్ద ఇలా అపరిశుభ్రంగా పెట్టుకోవడం సిబ్బంది నిర్లక్ష్యం కాదా..? అని స్థానికులు అంటున్నారు. **– న్యూస్‌టుడే, పెద్దపంజాణి**

## ప్రయాణం సాగేదెలా..?

పుంగనూరు-తిరుపతి ప్రధాన మార్గంలో తారు రోడ్డు పైకి చెట్లు, పిచ్చిమొక్కలు చొచ్చుకొస్తున్నాయి. దీంతో పలుచోట్ల రోడ్డు ఇరుకుగా తయారవుతోంది. ఈ కారణంగా మలుపులో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు చెట్ల కొమ్మలు గాలికి రోడ్లపై పడటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.
**– న్యూస్‌టుడే, పుంగనూరు**

## గుడిచెంబగిరిపై చిన్న చూపేలా.?

గుడిచెంబగిరి గ్రామంలో వీధులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. అడుగుడుగునా పైపు లైను లీకేజీలు, అధ్వాన కాలువలు ఉండటంతో మురుగు రోడ్లపై పారుతోంది. వంద కుటుంబాలున్న ఈ గ్రామంలో ప్రజారోగ్యం క్షీణించే స్థాయికి చేరుకుంటోంది. పాలకులు, అధికారులకు విన్నవిస్తున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శుభ్రత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.
**– న్యూస్‌టుడే, గుడిచెంబగిరి(గుడుపల్లె)**

## కర్లగట్ట విద్యార్థినికి కాంస్యం

రోషిణి

**శాంతిపురం, న్యూస్‌టుడే:** మండలంలోని కర్లగట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని రోషిణి రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు గుణశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయిని జ్యోతి తెలిపారు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ విభాగం జూడో పోటీల్లో మూడో స్థానం సాధించి కాంస్యం సాధించినట్లు పేర్కొన్నారు.

## నియామకం

**పెద్దపంజాణి, న్యూస్‌టుడే:** బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడిగా చలమంగళం గ్రామానికి చెందిన ఎం.ప్రభాకర్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు, జిల్లా పార్టీ ఇన్‌ఛార్జి శివాడి గోవిందు తెలిపారు. మండల కేంద్రంలో పలమనేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమరనారాయణ అధ్యక్షతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కుమార్, ప్రధాన కార్యదర్శిగా కన్నయ్య, పార్టీ ఇన్‌ఛార్జిలుగా రమణ, నాగరాజలను ఎన్నుకున్నట్లు వివరించారు.

కాలమాన పట్టిక ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

## నూతన కాలమానిని ఆవిష్కరణ

**చౌడేపల్లె, న్యూస్‌టుడే:** స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో సోమవారం 2026 కాలమానిని ఆవిష్కరించారు. దినచర్యను సైతం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో కేశవరెడ్డి, ఆ సంఘ మండల అధ్యక్షుడు సహదేవయ్య, కార్యదర్శి లోకనాథరెడ్డి, కోశాధికారి దుర్గం రమేష్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**గుండ్లసాగరం(గుడుపల్లె), న్యూస్‌టుడే:** గుండ్లసాగరం వద్ద సోమవారం ట్రాక్టర్, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. కనమనపల్లెకు చెందిన మురుగేష్, కుమార్తె భువనేశ్వరి, మనవడు దేవాన్స్ కుప్పం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుండ్లసాగరం సమీపంలో ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు కుప్పంలోని ఓ ఆసుపత్రికి తరలించారు.

## వందశాతం ఫలితాలు సాధించాలి

**కల్లూరు, న్యూస్‌టుడే:** రాబోవు పది పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలని ఎంఈవో సిద్ధరామయ్య సూచించారు. సోమవారం మంగళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమీక్షించారు.

## ఉపాధి పనుల తనిఖీ

**కల్లూరు, న్యూస్‌టుడే:** పులిచెర్ల మండలంలోని కావేటిగారిపల్లె, ఎల్లంకివారిపల్లె, పాళెం, కల్లూరు గ్రామ పంచాయతీల్లో విజిలెన్స్ బృందం సోమవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. ఉపాధి పనుల్లో ముఖ్యంగా రైతుల పొలాల్లో తవ్విన పంట సంజీవని కుంటల కొలతలతో పాటు, జీపీఎస్ ద్వారా చేపట్టిన పనుల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మిగిలిన పంచాయతీల్లో కూడా తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు.

## పంటలపై ఒంటరి ఏనుగు దాడి

**కల్లూరు, న్యూస్‌టుడే:** మండలంలోని పాళెం పంచాయతీ కోటపల్లెలో పంటలపై ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. గ్రామానికి చెందిన గోపి, దాము పొలంలోని మామిడి చెట్లను బోరుబావి పైపులను ధ్వంసం చేసింది.

## క్రీడల్లో గెలుపోటములు సహజం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తెదేపా నాయకులు

**బంగారుపాళ్యం, న్యూస్‌టుడే:** క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపునకు పునాదని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పేర్కొన్నారు. వజ్రాలపురం బోయకొండ సమీప మైదానంలో ఈ నెల 24నుంచి 29వ రకు వరకు జరిగిన క్రికెట్ పోటీల్లో విజేతలైన తగ్గువారిపల్లె జట్టుకు మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి టేకుమంద జట్టుకు రూ.ఏడు వేలు, జ్ఞాపికలు అందజేశారు. వజ్రాలపురం బోయకొండ ఆలయ ధర్మకర్త కృష్ణప్ప కుమారుడు గోపి, బొమ్మాయిపల్లె గౌరీయూత్ సభ్యులు బహుమతి నగదు విరాళంగా ఇచ్చారు. రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, తెదేపా మండల గౌరవాధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు, అధ్యక్షులు ధరిణీప్రసాద్ నాయుడు, సింగిల్‌విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు, జిల్లా ఈడిగ సాధికార సంక్షేమ సమితి అధ్యక్షులు నాగరాజు, తెదేపా మండల కార్యదర్శి జనార్దన్, సర్పంచి నీరజాక్షులుగౌడ్ పాల్గొన్నారు.

**ఏపీపీ మార్పు.. చిత్తూరు(న్యాయవిభాగం):** కేసు విచారణకు పీపీని మార్పు చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నంబరు 16/2024 కేసు ప్రస్తుతం స్థానిక ప్రధాన జిల్లా సెషన్స్ కోర్టులో కొనసాగుతోంది. దీని విచారణకు పీపీని మార్పు చేయాలని ఫిర్యాదుదారు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో స్థానిక ఆరో అదనపు జిల్లా కోర్టు ఏపీపీని ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున వాదించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## నేడు శ్రీనివాసపురంలో ఉచిత వైద్య శిబిరం

**కల్లూరు, న్యూస్‌టుడే:** కలెక్టరు ఆదేశాల మేరకు చల్లావారిపల్లె పంచాయతీ శ్రీనివాసపురంలో గిరిజన వికాసం కార్యక్రమం కింద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు.

## ఆలయాలు సిద్ధం

**సోమల, న్యూస్‌టుడే:** వైకుంఠ ఏకాదశికి మండలంలోని కందూరు మిట్టపల్లెలోని వెంకట్రమణ స్వామి, ఆవులపల్లెలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి, కమ్మపల్లెలో వెంకటేశ్వర స్వామి ఆలయాలను నిర్వాహకులు సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

## 1993 నుంచి తీరని సమస్య

**పలమనేరు, న్యూస్‌టుడే:** రెవెన్యూ సమస్యలు తరాలు మారినా తీరడం లేదు. తండ్రి, తర్వాత కుమారుడు సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ అర్జీలు పట్టుకుని తిరుగుతున్నారు. ఎప్పటికి తీరుతుందోననే అనుమానాలు వారి మెదళ్లను తొలిచేస్తున్నా పట్టువదలక ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీవో భవాని హామీ ఇచ్చారు.

### ఎవరికి ఎంత వస్తుందో తేల్చాలి..?

మాది గంగవరం మండలం జేఆర్‌కొత్తపల్లె గ్రామం. 1993 నుంచి మేము భూమికి పట్టా పుస్తకాల కోసం తిరుగుతూనే ఉన్నాం. మాకు పుస్తకాలు రాలేదు. సర్వే నంబరు 18-3లో మొత్తం 4.92 ఎకరాల భూమి ఉంది. అందులో ముగ్గురం వ్యవసాయం చేసుకుంటున్నాం. రికార్డుల ప్రకారం ఎవరికి ఎంత ఉందో తేల్చి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాల్సిన అధికారులు కాలయాపన చేస్తున్నారు. **- మురగేష్, జెఆర్‌కొత్తపల్లె**

### తండ్రికి బదులుగా కుమారుడు

గ్రామానికి చెందిన మునెప్ప తన ఎకరా భూమికి పట్టాదారు పాసు పుస్తకం కోసం తిరిగి అలసిపోయాడు. ఇప్పుడు ఆరోగ్యం సహకరించకపోవడంతో కుమారుడు వరదను ఆర్డీవో కార్యాలయానికి పంపుతున్నారు. ప్రస్తుతం తన హక్కులు తెలిపే పత్రాలను తీసుకుని వరద తన తండ్రికి బదులుగా కార్యాలయానికి వచ్చారు. పాస్ పుస్తకం ఇవ్వడానికి అధికారులు జాప్యం చేస్తున్నారని వాపోయారు.

### సమస్య వారసత్వంగా..

జేఆర్‌కొత్తపల్లెకు చెందిన బాలాజీ తనకు అడంగల్ ఉన్నా పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడానికి అధికారులు తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండ్రి చెంగప్ప ఇదే సమస్యతో తిరిగి తిరిగి రెండేళ్ల కిందట మృతి చెందారు. ఇప్పుడు నేను సమస్యను వారసత్వంగా తీసుకుని తిరుగుతున్నా. ఇప్పటికైనా అధికారులు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరారు.

## తిమ్మయ్యగారిపల్లెలో గిరిజన వికాసం

**బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** నెల్లిపట్ల పంచాయతీ తిమ్మయ్యగారిపల్లెలో మంగళవారం ఉదయం 9 గంటలకు గిరిజన వికాసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం, పౌరహక్కులు, ఉపాధిహామీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు

**చౌడేపల్లె, న్యూస్‌టుడే:** చిన్నారులకు సాధారణ వైద్యసేవలందించడానికి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లను సోమవారం సరఫరా చేసింది. పుంగనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి మండలంలోని 56 అంగన్‌వాడీ కేంద్రాలకు కిట్లు చేరాయి.

## ప్రతి సోమవారం ప్రజాదర్బార్

**పుంగనూరు, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పురపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్థానిక అధికారుల పరిధిలో పరిష్కారం కాని సమస్యలను కలెక్టరు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పుర ఛైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, కమిషనరు మధుసూదనరెడ్డి, తహసీల్దారు రాము పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

IN THE COURT OF THE CIVIL JUDGE
(SENIOR DIVISION), PUNGANUR
S.O.P. No.2/2025
పిటీషనర్లు : 1. వి.రాజమ్మ,
2. వి.సుధాకర్ బాబు
రెస్పాండెంట్స్ : -NIL-
పబ్లిక్ నోటీసు
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై కనిన పిటీషనర్లు చనిపోయిన వి.సునీల్‌కుమార్ అను ఆయనకు వారసులై సదరు వి.సునీల్‌కుమార్ 20-11-2024వ తేదీన క్యాన్సర్ వ్యాధితో తిరుపతిలో గల ఎస్.వి. ఇన్‌స్టిట్యూట్ క్యాన్సర్ కేర్ మరియు అడ్వాన్స్ రీసర్చ్ ఆసుపత్రిలో మరణించినాడు. కావున అపోలో ఫార్మసీ, బెంగళూరు వారు Death Benefits కొరకు రూ.10,02,000/- అతని వారసులకు లేదా తల్లిదండ్రులకు ఇవ్వతలచినారు. పై పైకమును తీసుకొనుటకు పై కోర్టు ద్వారా వారసత్వపు సర్టిఫికెట్టు జారీచేయమని పిటీషన్ దాఖలు చేసియున్నారు. పై పిటీషను శ్రీ కోర్టు వారు 05.01.2026వ తేదీకి వాయిదా పెట్టి పై వారి పేరుతో వారసత్వపు సర్టిఫికెట్టు జారీచేయుటకు ఏదైనా అభ్యంతరాలు వున్న యెడల పై తేదీ నాడు ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ అభ్యంతరము చేయవలెను. అట్లు లేనంతట ఎలాంటి అభ్యంతరాలు లేవని కోర్టు వారు పిటీషనర్లకు వారసత్వపు సర్టిఫికెట్టును జారీచేయుదురు.
(By Order of the Court)
K.Sreenivasulu, B.A., LL.B.,
Advocate, Punganur.
Enrol No.AP/3436/1999

(c) eenadu

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాల పునర్విభజన, నియోజకవర్గాల విలీనంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రూపురేఖలు మారుతున్నాయి. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలో విలీనం చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో జిల్లా స్వరూపం మారనుంది.

# కొత్త కూర్పు.. తూర్పుగోదావరిలోకి మండపేట నియోజకవర్గం

## జిల్లా స్వరూపం మార్పు

| వివరం | ప్రస్తుతం | కొత్తగా |
|---|---|---|
| నియోజకవర్గాలు | 7 | 6 |
| జనాభా(లక్షల్లో..) | 17.19 | 14.69 |
| విస్తీర్ణం(చ.కి.మీ) | 2,081.2 | 1,790.00 |
| రెవెన్యూ డివిజన్లు | 3 | 3 |
| మండలాలు | 22 | 19 |
| పురపాలికలు | 4 | 3 |
| ఓటర్లు | 15,31,161 | 13,10,743 |

**6..** ప్రస్తుతం జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. రాజోలు, పి.గన్నవరం, అమలాపురం ఎస్సీ రిజర్వుడు కాగా, ముమ్మిడివరం, కొత్తపేట, రామచంద్రపురం, మండపేటలు జనరల్ స్థానాలు. మండపేట తూర్పుగోదావరిలో విలీనంతో ఆరు అసెంబ్లీ స్థానాలు మాత్రమే ఉంటాయి. మండపేట అమలాపురం పార్లమెంట్ పరిధిలోనే కొనసాగనుంది.

**19..** మండలాల సంఖ్య 22 నుంచి 19కు తగ్గనుంది. పురపాలికలు నాలుగు నుంచి మూడు అయ్యాయి. 43 పంచాయతీలు, 2.50 లక్షల మంది జనాభా తగ్గనున్నారు.


మండపేట నియోజకవర్గం (రేఖాచిత్రంలో నలుపు ప్రాంతం)

రామచంద్రపురం, కె.గంగవరం మండలాలతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ యథావిధిగా కొనసాగుతుందని మంత్రివర్గ సమావేశంలో ప్రకటించారు.

### డివిజన్‌లో 2 మండలాలే..

ప్రస్తుతం జిల్లాలోని అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. మండపేట తూర్పుగోదావరిలో విలీనం కావడంతో రామచంద్రపురం డివిజన్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జిల్లా మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించారు.

### 4 అభ్యంతరాలే..

మండపేటను తూర్పుగోదావరిలో విలీనం చేయొద్దంటూ కేవలం నాలుగు అభ్యంతరాలు మాత్రమే నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. వీటిని ఈ నెల 27న సీఎంవో కార్యాలయం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

# ముక్కోటికి వాడపల్లి ఆలయం సిద్ధం

## నేడు ఉత్తర ద్వార దర్శనం

పుష్పాలంకరణలో ఆలయం

ఆత్రేయపురం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారు మంగళవారం శేషపాన్పుపై ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని సుగంధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.



# ఆ రోజుల్లో ఆతిథ్యమా..?

## సంక్రాంతికి కోనసీమలో గదుల కొరత

● హైదరాబాద్‌కు చెందిన పది మంది యువకులు సంక్రాంతి సంబరాలు చూద్దామని కోనసీమకు వచ్చేందుకు నిర్ణయించుకున్నారు. హోటల్‌లో గదులు తీసుకుందామనుకుంటే జనవరిలో చాలా వరకు నిండిపోయాయి. దీంతో కోనసీమలో అతిథి గృహాలను వెతికే పనిలో పడ్డారు. సంక్రాంతి రోజుల కంటే ముందుగానే అవి నిండిపోయాయని తెలుసుకున్నారు.

● రాజోలు సమీపంలోని దిండిలో పర్యాటకశాఖ అతిథి గృహాల్లో 30 వరకు గదులుండగా.. జనవరి 11 నుంచి 20 వరకు ఖాళీలు లేవు. జాతీయ రహదారి ఆనుకుని అతిథి గృహాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

సంక్రాంతి అంటే కోనసీమ గుర్తుకొస్తుంది. స్థానికుల బంధువులు, స్నేహితులతోపాటు ఇతరులూ ఈ ప్రాంతానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో వారికి వసతి సమస్య నెలకొంది. గతేడాదితో పోల్చితే ఇప్పుడు ముందుగానే హోటళ్లలో గదులు బుక్ చేసుకున్నారు. రాజోలు, అమలాపురం, ముమ్మిడివరంలో జరిగే సంక్రాంతి సంబరాలు, కోడిపందేలు చూసేందుకు ఈ ఏడాది భారీ సంఖ్యలో జనం వచ్చే అవకాశాలున్నాయి.

అమలాపురం పట్టణంలోని విడిదిల్లో ఆకట్టుకునే విద్యుత్తు కాంతులు

సంక్రాంతి పండగను ఆస్వాదం కోసం జరుపుకోవాలని అతిథులు ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా మండువా లోగిళ్లు, కొబ్బరి తోటల్లో చూడముచ్చటగా ఉండే

### మండువా లోగిళ్లు.. విడిదిల్లు..

ఇక్క కోసం అన్వేషిస్తున్నారు. గదుల ధరల అధికంగా ఉన్నప్పటికీ ముందుగానే బుక్ చేసుకునేందుకు అలాంటి వాటి కోసమే పరితపిస్తున్నారు.

మామిడికుదురు మండలం పెదపట్నంలంకలోని మన మండువా ఇల్లు ఎంతో ఆకట్టుకుంటుంది. ఇక్కడ ఒకరోజు ఉండేందుకు రూ.30వేలు పైగానే తీసుకుంటున్నారు. పాతకాలం నాటి జ్ఞాపకాలను ఈ మండువా లోగిళ్లలో ఉంచడంతో అతిథులు ఆకర్షితులవుతున్నారు. వీటిలో ఆరు నుంచి ఎనిమిది వరకు గదులున్నాయి.

### అన్వేషణ..

ఇదే గ్రామంలోని ఓ ప్రైవేటు రిసార్టులోని గదుల వద్దనూ ఉండటంతో వాటిని వినియోగించేందుకు అతిథులు ఆసక్తి చూపుతున్నారు. రాజోలు సమీపంలోని దిండి రిసార్ట్ వద్ద ఉంది. అమలాపురం పట్టణంలోని కోనసీమ విడిదిల్లు పేరుతో ఓ గృహాన్ని అతిథుల విడిది సిద్ధం చేశారు. ఏడు గదులుండే దీనికి రోజుకు రూ.15వేలు వరకు తీసుకుంటున్నారు. దీన్ని అందంగా తీర్చిదిద్దారు.

# తప్పులు.. సరిదిద్దకుంటే తిప్పలు

## పదో తరగతి విద్యార్థుల వివరాల సవరణకు ఎదురుచూపు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

పదో తరగతి వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. యూడైస్‌లో వివరాల ఆధారంగా పరీక్ష రుసుం చెల్లించిన విద్యార్థులకు హాల్‌ టికెట్లు రానున్నాయి. హాల్‌ టికెట్‌లో వచ్చే పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రం (మార్కుల లిస్ట్) అదే వివరాలతో వస్తాయి. పరీక్ష ఫీజు గడువు ముగిసిన తర్వాత రెండు రోజులు మాత్రమే ఎడిట్ (సవరణ)కు అవకాశం ఇచ్చి తర్వాత మూసేయడంతో చాలా మంది సవరణ చేసుకోలేకపోయారు.

పదో తరగతి విద్యార్థులు

జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి 19,604 మంది పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. ఫీజు చెల్లింపునకు తుది గడువు ముగిసింది. ప్రవేశం పొందినప్పుడు ఇచ్చిన వివరాల ప్రకారం వీరి వివరాలు యూడైస్‌లో నమోదు చేశారు. వాటి ఆధారంగా హాల్ టికెట్లు ఇస్తామని విద్యాశాఖ తెలపడంతో ఆందోళన మొదలైంది. చాలా మంది విద్యార్థుల ఆధార్ కార్డ్, యూడైస్ వివరాల్లో తేడాలు ఉన్నాయి. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డుల్లోని వివరాలు ఒకలా ఉండి.. విద్యార్థులకు హాల్ టికెట్ మరోలా ఉంటే.. ఇబ్బందుల తలెత్తుతాయి.

### రెండు రోజుల్లో ఎలా సాధ్యం..?

విద్యార్థుల వివరాలు ఎడిట్ (సవరణ) ఆప్షన్ రెండు రోజులు ఇచ్చారు. 22, 23 తేదీల్లో వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించారు. తల్లిదండ్రులకు అవగాహన లేక.. ఆ సమయంలో అందుబాటులో లేక పోవడం.. వంటి సమస్యలతో కొందరికి వీలుపడలేదు.

### ఆ 49 మంది ఎక్కడ..?

జిల్లాలో 19,604 మంది విద్యార్థులకు 49 మంది పరీక్ష ఫీజు చెల్లించ లేదు. సుదీర్ఘకాలం నుంచి పాఠశాలకు రాకపోవడం, గ్రామాంతరం వెళ్లిన వారిగా గుర్తించి డ్రాప్ అవుట్ జాబితాలో చేర్చారు.

### సవరణకు అవకాశం కోరాం

పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వక ముందే వారి వివరాలు సరిపోల్చి సవరణలు చేయడానికి మరో సారి ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరాం. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉంది.
-బి.హనుమంతరావు, డీసీఈబీ కార్యదర్శి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్

# దాచుకున్నది 82.66 కోట్లు.. తీసుకున్నది 4.20 కోట్లు

## పదేళ్లకు పైబడి నిర్వహించని ఖాతాల పరిస్థితి

నగదు వివరాలు: (రూ.కోట్లలో)

| వివరం | ఖాతాలు | నగదు |
|---|---|---|
| వ్యక్తిగత | 4,58,644 | 66.27 |
| సంస్థలు | 6,984 | 12.26 |
| ప్రభుత్వ | 5,062 | 04.13 |

● అమలాపురం మండలం సమనసకు చెందిన ఓ వ్యక్తికి ఎస్‌బీఐలో ఖాతా ఉంది. కొన్నాళ్ల క్రితం ఆయన మృతి చెందారు. కుటుంబ సభ్యులు సంబంధిత బ్యాంకు ఖాతా పాస్ పుస్తకంతో బ్యాంకుకు వెళ్లి వివరాలు తెలుసుకోగా ఖాతాలో రూ.3,01,448 ఉన్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన ధ్రువపత్రాలు అందజేసి ఆ మొత్తం చెక్కు రూపంలో తీసుకున్నారు.

● మామిడికుదురుకు చెందిన ఓ వ్యక్తి ఎస్‌బీఐలో 17 ఏళ్ల కిందట ఖాతా ప్రారంభించి తర్వాత నగదు వదిలేశారు. ఇటీవల బ్యాంకు అధికారులు కుటుంబ సభ్యులకు ఖాతాకు సంబంధించిన విషయం తెలియజేశారు. వారు పత్రాలు అందించడంతో రూ.2.10 లక్షల నగదు మనవడుకు అందించారు.

న్యూస్‌టుడే, అమలాపురం

పదేళ్లకు పైబడి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని నగదు తీసుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కల్పించిన అవకాశానికి క్షేత్ర స్థాయిలో ఆదరణ కొరవడింది. ఖాతాదారులు, వారు లేకుంటే వారసులు సంబంధిత పత్రాలు చూపించి నగదు తీసుకునే వెసులుబాటును ఆర్బీఐ కల్పించింది. లావాదేవీలు నిలిచిన ఖాతాల్లో రూ.82.66 కోట్లు నగదు ఉండగా.. రూ.4.20 కోట్లు మాత్రమే తీసుకున్నారు. బ్యాంకు ఖాతా తెరిచిన సమయంలో నామినీ వివరాలు నమోదు చేయకపోవడం, ఖాతాదారుల నామినీలు సైతం మృతి చెందడం, వారి వారసులు, కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాల్లో స్థిర పడడం వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడినట్లు భావిస్తున్నారు. 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మీ డబ్బు- మీ హక్కు పేరుతో ప్రత్యేక కార్యక్రమం తీసుకు వచ్చింది. ఖాతాల్లోని నగదు తిరిగి పొందవచ్చు.' అని ఎల్డీఎం కేశవవర్మ అన్నారు.

ఖాతాదారుని కుటుంబ సభ్యులకు నగదుకు సంబంధించిన చెక్కు అందిస్తున్న అధికారులు

# అంతర్వేది రథం శకలాల నిమజ్జనం 3న

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీ నరసింహుడి ఆలయం వద్ద దగ్ధమైన పాత రథం శకలాలను జనవరి 3న నిమజ్జనం చేయడానికి దేవాదాయ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి దివ్య రథం (పాతది) 2020 సెప్టెంబరు 5న అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. అప్పటి వైకాపా ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికీ విచారణలోనే ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. రథం శకలాలు ఉంటే అరిష్టమని భావించి వాటిని గోదావరిలో నిమజ్జనం చేయాలని అర్చకులు, స్థానికులు పోలీస్ అధికారులను కోరారు. విచారణలో ఉందంటూ ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దేవాదాయశాఖ కమిషనర్, డీజీపీని కలిసి రథం శకలాలను నిమజ్జనం చేయించాలని కోరారు. అనుమతులు ఇవ్వడంతో జనవరి 3న గోదావరిలో నిమజ్జనం చేయనున్నారు.

దగ్ధమైన పాత రథం

# ఐఐటీ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రతిభ

ముమ్మిడివరం: ఐఐటీ మద్రాసు నిర్వహిస్తున్న స్కూల్ కాన్సెప్ట్ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు బిజినెస్ మేటర్స్, మ్యాథ్స్, కంప్యూటింగ్‌పై సర్టిఫికెట్ కోర్సుల్లో ముమ్మిడివరం జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. శిరిగినీడి రిషి అమృత 100/100, రాచకొండ చంద్రిక 80/100 మార్కులు సాధించినట్లు ఆంగ్ల ఉపాధ్యాయిని డా. సురేఖారాణి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

# 2026.. ఆచరిద్దాం ఈ ఆరు..!

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, గాంధీనగర్

నేడు కొలువు సాధించాలంటే చదువు ఒక్కటే సరిపోవడం లేదు. ఆయా సంస్థలు అభ్యర్థుల నుంచి అదనపు నైపుణ్యాలు ఆశిస్తున్నాయి. టెక్ యుగంలో ఏడాదికో సాంకేతిక విప్లవం తెరపైకి వస్తుంది. వీటిని అందిపుచ్చుకున్నవారికే పరిశ్రమలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. జేఎన్టీయూ, అనుబంధ కళాశాలల్లో ప్రాంగణ ఎంపికల (క్యాంపస్ రిక్రూట్‌మెంట్) కోలాహలం మొదలైంది. 2026లో యువత ఆరు సూత్రాలు ఆచరిస్తే లక్ష్యాలు అందుకోవడానికి అవకాశం ఉందని నిపుణులంటున్నారు.

**అదనపు నైపుణ్యాలతో అందుకోండి అవకాశం..**

1 ● **లక్ష్యాలపై స్పష్టత :** కొత్త ఏడాదిలో చదువు, నైపుణ్యం, ఉద్యోగం ఏది ముఖ్యమో నిర్ణయించుకుని అందుకు అనుగుణంగా స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. వాటిని సాధించేలా కార్యచరణ రూపొందించుకోవాలి.

2 ● **కొత్త అంశాల నేర్పు :** చదువుతో పాటు కొత్త విషయాలు నేర్చుకోవడంపై దృష్టిసారించాలి. ఆన్‌లైన్ కోర్సుల ద్వారా కొత్త అంశాలపై పట్టు సాధించడానికిఅవకాశం ఉంటుంది.

3 ● **నైపుణ్యం ఉన్నతి:** కృత్రిమ మేధ, క్వాంటమ్ టెక్నాలజీ, డెటా అనాలిటిక్స్, డిజిటల్ మార్కెటింగ్ వంటి నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేటు స్కిల్ కోర్సులను వినియోగించుకోవాలి.

4 ● **సమయ పాలన:** టైం టేబుల్ సిద్ధం చేసుకుని ఆచరించాలి. సామాజిక మాధ్యమాల వినియోగంపై నియంత్రణ ఉండాలి.

5 ● **ఆరోగ్యమే మూలధనం:** చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా ఉద్యోగ సాధనకు ముఖ్యం. రోజూ వ్యాయామం చేయడం ద్వారా మానసిక ఆరోగ్యం సాధిస్తారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ధ్యానం చేస్తే మంచి ఫలితాలొస్తాయి.

6 ● **ఉద్యోగ సన్నద్ధత:** మీ బయోడెటాను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలి. కొత్త నైపుణ్యాలన్నీ రెజ్యూమ్‌లోనే కనిపించాలి. ఉద్యోగ మేళాలు, నోటిఫికేషన్లపై దృష్టి సారించి విధిగా దరఖాస్తులు చేస్తుండాలి.

● ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జేఎన్టీయూకే, అనుబంధ కళాశాలలు: 33
● ఏటా కళాశాలల నుంచి బయటకొచ్చే ఇంజినీరింగ్ విద్యార్థులు: 10,600
● సగటు ఉత్తీర్ణత : 84 శాతం
● ప్రాంగణ ఎంపికలకు ఎంపికయ్యేవారి శాతం: 72
● జేఎన్టీయూలో ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 120 మంది వరకు ఉద్యోగాలు సాధించారు. మరో 300 మంది పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు.

'కోర్ బ్రాంచుల విద్యార్థులు కోడింగ్, ఏఐ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడాలి. క్లౌడ్ కోర్సుల్లో గ్లోబల్ సర్టిఫికేట్లు ఉంటే ప్రాధాన్యం ఇస్తున్నారు.' అని జేఎన్టీయూకే నియామక అధికారి డాక్టర్ ఎ.కరుణ అన్నారు.






**రైతేరాజు** అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

# గోదావరిలో హైలెస్సా..

## కోటిపల్లి రేవులో పంటు ప్రయాణాలు పునరుద్ధరణ

పామర్రు, న్యూస్‌టుడే: కోనసీమ ముఖద్వారంగా భాసిల్లుతున్న కోటిపల్లి-ముక్తేశ్వరం రేవు నుంచి పంటు ప్రయాణాలు సోమవారం నుంచి పునరుద్ధరించారు. ఈ ఏడాది జులైలో వరదలొచ్చినపుడు గోదావరిలో ప్రవాహం ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో పంటు రాకపోకలను రద్దు చేశారు. అప్పటి నుంచి పలు కారణాలతో పంట్లను రేవులోనే కట్టేశారు. అధికారుల నుంచి అన్ని అనుమతులు రావడంతో నిర్వాహకులు నదిలో ప్రయాణం ప్రారంభించారు. బోట్స్‌మెన్ సొసైటీకి నెలకు రూ.7.37 లక్షల అద్దె చెల్లించే ప్రాతిపదికన రేవును అప్పగించామని ఎంపీడీవో ఎన్.శ్రీనివాసు వెల్లడించారు. వీరు మార్చి నెలాఖరు వరకు పంట్లను నడుపుతారని వివరించారు.


రేవు నుంచి ప్రయాణికులతో బయలుదేరిన పంటు


ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669


# కూటమి పాలనలో ఆలయాల సమగ్రాభివృద్ధి

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కూటమి పాలనలో దేవాలయాలు సమగ్రాభివృద్ధి సాధిస్తున్నాయని ఎంపీ హరిష్‌మాథుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం వారు కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాడపల్లి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ శ్రీవారి ఆలయం కీర్తి నలుదిక్కులా వ్యాపించే విధంగా నూతన పాలకమండలి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం పాలకమండలి అధ్యక్షుడిగా ఆత్రేయపురానికి చెందిన ముదునూరి వెంకటరాజు, సభ్యులుగా కొత్తపేట నియోజకవర్గానికి చెందిన శిష్టా సూర్యకుటుంబరావు, కాసా చాముండేశ్వరి, పెండెం కుమారి, సలాది నాగేశ్వరరావు, సరెళ్ల సరిత, ఏపుగంటి విజయకుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, యెల్లమిల్లి చంద్రకుమారి, మస్కపల్లి త్రిమూర్తులు (ప్రత్యేక ఆహ్వానితులు), కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ (పెద్దాపురం, కాకినాడ జిల్లా), దళపర్తి శ్రీలక్ష్మి (పామర్రు, కృష్ణా జిల్లా), గోసాల అప్పలనరస (పాయకరావుపేట, అనకాపల్లి జిల్లా), చలుమూరి రాంబాబు (ఆచంట, ప.గో జిల్లా), పెండ్యాల భవాని (పాలకొల్లు, ప.గో జిల్లా), గంగవరపు పద్మావతి (ఒంగోలు, ప్రకాశం జిల్లా), కొండపల్లి రామచందర్‌రావు (మహబూబాబాద్, తెలంగాణ), వాడపల్లి సుందర శేషావతారం (ఎక్స్ అఫీషియో, ఆలయ అర్చకుడు)లతో ఈవో నల్లం సూర్యచక్రధరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

కొలువు దీరిన పాలకమండలితో ఎంపీ హరిష్‌మాథుర్, ఎమ్మెల్యే బండారు తదితరులు

# ప్రక్షాళన.. కార్యాచరణ

## డ్రెయిన్ ఆధునికీకరణకు శంకుస్థాపన నేడు

న్యూస్‌టుడే, మామిడికుదురు, మలికిపురం

కొబ్బరి రైతుల పాలిట దుఃఖదాయినిగా మారిన శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణకు కార్యాచరణ మొదలుకానుంది. రూ.20.62 కోట్లతో పనులు చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ డ్రెయిన్ సమస్యను సీఎం, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో కార్యాచరణ సిద్ధమైంది. కరవాక నుంచి కేశవదాసుపాలెం వరకు 22.9 కి.మీ మేర ఉన్న శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ కారణంగా సుమారు 2 వేల ఎకరాల్లోని దాదాపు రెండు లక్షల కొబ్బరి చెట్లు మోడువారాయి. సముద్ర జలాలు డ్రెయిన్‌లోకి పోటెత్తి తోటలను ముంచెత్తుతుండడంతో సుమారు 1,200 మంది రైతు కుటుంబాలు నష్టపోయాయి. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గత నెల 26న కేశనపల్లి వచ్చి క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి, జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్, డ్రెయినేజీ, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో సమీక్షించారు.

### ఆక్రమణల తీరిలా..

మేజర్ డ్రెయిన్‌ను ఆనుకుని ఆక్రమణల్లో సుమారు 220 ఎకరాల్లో కొబ్బరి చెట్లున్నాయి.

చింతలమోరిలో కొబ్బరి చెట్లతో ఆక్రమణలకు గురైన మేజర్ డ్రెయిన్

మరో 350 ఎకరాల్లో చెరువులు విస్తరించినట్లు సర్వేలో గుర్తించారు. కేశవదాసుపాలెంలో కొన్ని ఇళ్లు కూడా ఆక్రమణల్లో నిర్మితమైనట్లు నిర్ధారించారు. గతంలో డ్రెడ్జింగ్ చేసి తీసిన మట్టిని కొంతమంది తరలించుకుపోవడంతో అక్కడ గట్లు బలహీనంగా ఉన్నట్లు గుర్తించారు.

### ఆటంకాలు లేకుండా..

శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌కు కేశనపల్లిలో 8.5 కి.మీ నుంచి వీవీమెరక పరిధిలోని 16.5 కి.మీ మేర పూర్తిస్థాయిలో డ్రెడ్జింగ్ చేయనున్నారు. మామిడికుదురు మండలం కరవాక నుంచి శంకరగుప్తం వరకు 14.5 కిలోమీటర్ల మేర రెండువైపులా 6 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల ఎత్తున గట్లను పటిష్ఠం చేయాలని నిర్ణయించారు. 'కలెక్టర్ ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో ఆధునికీకరణ చేపడతాం. గుర్తించిన ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తాం' అని ఏఈఈ ఆనంద్‌కిరణ్ అన్నారు.


**Karur Vysya Bank** Smart way to bank
**ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్**
డివిజినల్ ఆఫీస్, డి.నెం.47-10-15, ఫస్ట్ ఫ్లోర్, ఎ.జి.ఎవెన్యూ, పొల్లాక్స్ స్కూల్ ఎదురుగా, 2వ లైన్, ద్వారకానగర్, విశాఖపట్నం - 530 016. ఫోన్: 0891-2511706

**స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) నందలి నిబంధనలతో చదవుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా (1) మెస్సర్స్ ఎస్‌వీఎస్ టెంట్ హౌస్ & లైటింగ్, ప్రొప్రయిటర్ : ఫణి కుమార్ మద్దుల, తండ్రి : శ్రీరాములు, డి.నెం. 4-43, గోపాలం గారి వీధి, తాటిపాక గ్రామం, రాజోలు మండలం, డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా - 533249. మరియు (2) శ్రీ సత్యనారాయణ మద్దుల, తండ్రి : వెంకట లక్ష్మీ రత్నం, డి.నెం. 4-43, గోపాలం గారి వీధి, తాటిపాక గ్రామం, రాజోలు మండలం, డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా - 533249, వారి నుండి రావల్సిన బకాయి రూ.12,03,871.22 పై. (అక్షరాల పన్నెండు లక్షల మూడు వేల ఎనిమిది వందల డెబ్బై ఒక్క రూపాయల ఇరవై రెండు పైసలు మాత్రమే) (అకౌంట్ నెం. 4870280000000030) + తేది.01.12.2025 నుండి తదుపరి వడ్డీ మరియు వ్యయాలు మొదలగునవి రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, రాజోలు బ్రాంచ్, రాజోలు యొక్క అధీకృత అధికారియైన సెక్యూర్డ్ క్రెడిటార్‌చే స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులను 05-02-2026 న "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అలానే ప్రాతిపదికన" విక్రయించబడును.

**స్థిరాస్తుల వివరములు:**

షెడ్యూలు-ఎ : తూర్పుగోదావరి జిల్లా, మామిడికుదురు ఎస్ఆర్ఓ, మామిడికుదురు మండలం, పెదపట్నం గ్రామం, ఆర్.ఎస్.నెం.39 సబ్ డివైజ్‌డ్ ఆర్.ఎస్.నెం.39/4పి లోని ఎ.2.25 సెంట్లు విస్తీర్ణం, ఆర్.ఎస్.నెం.40/1 లోని ఎ.0.20 సెంట్లు విస్తీర్ణం, మొత్తం విస్తీర్ణం కలిపి ఎ.2.45 సెంట్లు భూమి షెడ్యూలు ఆస్తి T.L.P. No.44/2015/DTCPO/KKD లోని కాకినాడ యొక్క డిస్ట్రిక్ట్ టౌన్ & కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్ వారి ద్వారా ఇంటి స్థలములుగా విభజించబడినది, దీనిలో ప్లాట్ నెం.19 లోని 193.6 చ॥గ॥లు విస్తీర్ణం గల ఖాళీ స్థలం అన్నీ ఈజిమెంటరీ హక్కులతో రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.1972/2015, తేది.28.09.2015 ప్రకారం శ్రీ మద్దుల సత్యనారాయణ, తండ్రి : వెంకట లక్ష్మీ రత్నం గారి పేరున కలదు మరియు యావత్తు ఆస్తి బ్యాంక్‌నకు రిజిష్టర్డు ఎమ్ఓడి నెం.965/2017, తేది.01.07.2017 ద్వారా సెక్యూర్డ్‌గా కలదు. హద్దులు : తూర్పు: ప్లాట్ నెం.18 లోని స్థలం - 49'.9", పడమర : ప్లాట్ నెం.20 లోని స్థలం - 49'.9", దక్షిణం : ప్లాట్ నెం.16 లోని స్థలం - 35'.0", ఉత్తరం : 33 అ॥ల వెడల్పు గల రోడ్డు - 35'.0". అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.

షెడ్యూలు-బి : తూర్పుగోదావరి జిల్లా, మామిడికుదురు ఎస్ఆర్ఓ, మామిడికుదురు మండలం, పెదపట్నం గ్రామం, ఆర్.ఎస్.నెం.39 సబ్ డివైజ్‌డ్ ఆర్.ఎస్.నెం.39/4పి లోని ఎ.2.25 సెంట్లు విస్తీర్ణం, ఆర్.ఎస్.నెం.40/1 లోని ఎ.0.20 సెంట్లు విస్తీర్ణం, మొత్తం విస్తీర్ణం కలిపి ఎ.2.45 సెంట్లు భూమి షెడ్యూలు ఆస్తి T.L.P. No.44/2015/DTCPO/KKD లోని కాకినాడ యొక్క డిస్ట్రిక్ట్ టౌన్ & కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్ వారి ద్వారా ఇంటి స్థలములుగా విభజించబడినది, దీనిలో ప్లాట్ నెం.18 లోని 193.6 చ॥గ॥లు విస్తీర్ణం గల ఖాళీ స్థలం అన్నీ ఈజిమెంటరీ హక్కులతో రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.1973/2015, తేది.28.09.2015 ప్రకారం శ్రీ మద్దుల సత్యనారాయణ, తండ్రి : వెంకట లక్ష్మీ రత్నం గారి పేరున కలదు మరియు యావత్తు ఆస్తి బ్యాంక్‌నకు రిజిష్టర్డు ఎమ్ఓడి నెం.965/2017, తేది.01.07.2017 ద్వారా సెక్యూర్డ్‌గా కలదు. హద్దులు : తూర్పు: ప్లాట్ నెం.17 లోని స్థలం - 49'.9", పడమర : ప్లాట్ నెం.19 లోని స్థలం - 49'.9", దక్షిణం : ప్లాట్ నెం.16 లోని స్థలం - 35'.0", ఉత్తరం : 33 అ॥ల వెడల్పు గల రోడ్డు - 35'.0". అన్నీ ఈజిమెంటరీ హక్కులతో కలదు.

**రిజర్వు ధర : రూ.32,00,000/-   ధరావత్తు : రూ.3,20,000/-**

**బిడ్డు పెంపుదల మొత్తం : రూ.50,000/-**

అమ్మకం యొక్క ఇతర వివరములు మరియు నియమ నిబంధనల కొరకు **www.bankauctions.in** ని చూడండి (ఇ-వేలం యొక్క ప్రొవైడర్ వెబ్ చిరునామా) లేదా **అధీకృత అధికారి, ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, రాజోలు బ్రాంచ్, మొబైల్ నెం.9502643131, 9618567676, 9473474007.**

**SARFAESI చట్టం, 2002 యొక్క రూల్ 8(6) & 6(2) క్రింద 30 రోజుల చట్టబద్ధ ప్రకటన**

చెల్లింపు తేదీ వరకు వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు పైన తెలిపిన బకాయిలను వేలం తేదీలోపు చెల్లించవలెనని, లేనిచో, షెడ్యూల్ ఆస్తి వేలం వేయబడుతుందని/విక్రయించబడుతుందని మరియు మిగిలిన బకాయిలు ఏవైన ఉన్నట్లయితే, వడ్డీ మరియు ఖర్చులతో పాటు వసూలు చేయబడతాయని ఋణగ్రహీత/లు మరియు గ్యారంటర్/లకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. **SARFAESI చట్టం, 2002** సవరణకు అనుగుణంగా ఈ నోటీసు జారీచేయబడినది.

తేది: 29-12-2025
స్థలం: విశాఖపట్నం

అధీకృత అధికారి
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్,
రాజోలు బ్రాంచ్, రాజోలు



(c) eenadu

# పరుగుల జోరు.. కుర్రాళ్ల హుషారు..

ఉత్సాహంగా ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025

రాజానగరం, శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ఫోర్లు, సిక్సర్లతో క్రీడాకారులు మెరుపులు మెరిపించారు. బౌలర్లు చుక్కలు చూపించారు. మొత్తంగా బ్యాటర్లు పైచేయి సాధించి విజయతీరాలకు చేర్చారు. జీజీయూ ప్రాంగణంలోని రెండు మైదానాల్లో నిర్వహిస్తున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' (ప్రెజెంట్స్) 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025' క్రికెట్ టోర్నీ సోమవారం ఉత్సాహంగా సాగింది.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే.. మురళీకృష్ణ (59 పరుగులు)

## అభేద్యమైన విజయం..

కిట్స్ కళాశాల దివిలి (కాకినాడ) జట్టు, ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (కాకినాడ) మధ్య పోటీలో ఐడియల్ జట్టు విజయం సాధించింది. కిట్స్ కళాశాల జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐడియల్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 89 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కిట్స్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 67 పరుగులు మాత్రమే చేసింది. 22 పరుగుల ఆధిక్యంతో ఐడియల్ కళాశాల జట్టు విజయం సాధించింది. క్రీడాకారులు అభేద్యంగా చేసిన కీలకమైన 31 పరుగులు జట్టు విజయానికి తోడ్పడ్డాయి.

ప్రతిభ చూపిన ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (కాకినాడ)

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
Medical Partner: GSL
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
FM Partner: ఈ FM Mee FM
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

విజయానందంలో ఐడియల్ ఇంజినీరింగ్ క్రీడాకారులు

## మెరిసిన ఐడియల్ ఇంజినీరింగ్..

కాకినాడ ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల, రాజమహేంద్రవరం జీఎస్ఎల్ వైద్య కళాశాల జట్ల మధ్య పోరులో ఐడియల్ విజయం సాధించింది. జీఎస్ఎల్ టాస్ గెలిచి ఐడియల్ జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. ఈ జట్టులో అభిరామ్ 22 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీఎస్ఎల్ జట్టు మొదటి నుంచి నెమ్మదిగా ఆడుతూ వచ్చింది. ఐడియల్ జట్టు క్రీడాకారులు తెలివిగా కేవలం ఆఫ్ సైడ్ మాత్రమే ఫీల్డింగ్ పెట్టి బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. దీంతో జీఎస్ఎల్ క్రీడాకారులు పరుగులు చేయడంలో తడబడ్డారు. చివరకు 5 వికెట్ల నష్టానికి 65 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలయ్యారు.

సత్తా చాటిన బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

## కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి..

బీవీఎస్ఎల్ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం), బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల (అమలాపురం) జట్ల మధ్య పోరులో మురళీకృష్ణ 28 బంతుల్లో 59 పరుగులు సాధించి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడారు. బీవీసీ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన బీవీఎస్ఎల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన బీవీసీ జట్టులో కెప్టెన్ మురళీకృష్ణ విజృంభించారు. సిక్సర్లు, ఫోర్లతో మోత మోగించారు. దీంతో బీవీసీ జట్టు కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 89 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా సాధించింది.

## ఇలా గెలుపొందిన కైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కాకినాడ, పెదపూడి), కాకినాడలోని కైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య మధ్యాహ్నం మ్యాచ్ జరగాల్సి ఉండగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాజరు కాలేదు. దీంతో న్యాయ నిర్ణేతలు వాకోవర్ ఇచ్చి కైట్ జట్టును విజేతగా ప్రకటించారు.

## అలా గెలిచిన గైట్..

స్పేసెస్ డిగ్రీ కళాశాల (పాయకరావుపేట), గైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు స్పేసెస్ డిగ్రీ జట్టు హాజరుకాకపోవడంతో న్యాయనిర్ణేతలు వాకోవర్ ఇచ్చి గైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్టును విజేతగా ప్రకటించారు.

### నేటి మ్యాచ్‌లు (30.12.2025)

**గ్రౌండ్ - 1**

▲ ఉదయం 8 గంటలకు: ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల (పేట్రోలు, కాకినాడ) x ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం). ▲ ఉదయం 11 గంటలకు: ఎస్ఏ మీటం డిగ్రీ కళాశాల(సఖినేటిపల్లి, కోనసీమ) x ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూజీ (రాజమహేంద్రవరం). ▲ మధ్యాహ్నం 2 గంటలకు: జేఎన్‌టీయూ(కాకినాడ) x వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల(రామచంద్రపురం).

**గ్రౌండ్ - 2**

▲ ఉదయం 8 గంటలకు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (తుని) x ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం). ▲ ఉదయం 11 గంటలకు: ప్రైడ్ ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ) x బీహెచ్ఎస్ఆర్, వీఎల్ఎం డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం).

### రేపటి మ్యాచ్‌లు (31.12.2025)

**గ్రౌండ్ - 1**

▲ ఉదయం 8 గంటలకు: గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం) x ఏకేఆర్జీ డిగ్రీ కళాశాల (నల్లజర్ల). ▲ ఉదయం 11 గంటలకు: గైట్ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) x వీఎస్ఎం డిగ్రీ కళాశాల (రామచంద్రపురం). ▲ మధ్యాహ్నం 2 గంటలకు: ఎస్ఎస్ పీఆర్‌జీ కళాశాల (కొవ్వూరు) x అవంతి డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం).

**గ్రౌండ్ - 2**

▲ ఉదయం 8 గంటలకు: కైట్ (2) ఇంజినీరింగ్ కళాశాల x ఐడియల్ కాలేజీ (ఇంద్రపాలెం). ▲ ఉదయం 11 గంటలకు: ఆదిత్య యూనివర్సిటీ x జీఎస్ఎల్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ.

# లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులు, దేవాదయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్, పార్కింగ్, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్తు, వైద్య సేవలకు అవసరమైన స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలన్నారు. జనవరి 28న కల్యాణోత్సవం, 29న రథోత్సవం, ఫిబ్రవరి 1న చక్రస్నానం, 2న తెప్పోత్సవం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు నేరుగా ఆలయం వద్దకు వెళ్లే విధంగా రహదారులు నిర్మించాలన్నారు. మూడు క్యూలైన్లలో భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకునేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయం సమీపంలో జనవరి 26 నుంచి 5 రోజుల పాటు మద్యం అమ్మకాలను పూర్తిగా నిలుపుదల చేయాలన్నారు. ఎస్పీ రాహుల్‌మీనా మాట్లాడుతూ ఉత్సవాల బందోబస్తుకు 1500 మంది పోలీసులను వినియోగించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జేసీ నిశాంతి, ఆర్డీవో కె.మాధవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జలప్రసాదం యూనిట్ వితరణ

దాత కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఛైర్మన్ వెంకటరాజు తదితరులు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి సన్నిధికి వచ్చే భక్తులకు సురక్షిత తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో వెలుమూరి ఇన్‌ఫ్రా పేరిట రాజమహేంద్రవరానికి చెందిన దాతలు వెలుమూరి భీమశంకర్, సత్యనారాయణ కుటుంబ సభ్యులు రూ.20 లక్షల విలువైన జలప్రసాదం యూనిట్‌ను వితరణ చేశారు. ఈ యూనిట్‌ను ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు ప్రారంభించారు. ఇది గంటకు 2 వేల లీటర్ల శుద్ధి జలం అందిస్తుంది. దాతలకు స్వామివారి శేషవస్త్రాలు కప్పి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈవో నల్లం సూర్యచక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని కలిసిన సాయి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో సాయి, పళ్లంరాజు. చిత్రంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: జిల్లా తెదేపా అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన గుత్తుల సాయి, గంధం పల్లంరాజు, ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావులు వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిశారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి వీరు ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారని వారు తెలిపారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడిని కలిశారు. వారితోపాటు అమలాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్ ఉన్నారు.

# భిక్షాటన సొమ్ముతో అన్నదానం

భోజనం వడ్డిస్తున్న సాధువు జోగయ్య(వృత్తంలో..)

కాట్రేనికోన: హిందూ ఆలయాల వద్ద భిక్షాటన చేయగా వచ్చిన సొమ్మును ఓ సాధువు అన్నదానానికి వినియోగిస్తున్నారు. కర్నూలుకు చెందిన జోగయ్య దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఆలయాలను సందర్శిస్తుంటారు. అందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలోని కుండలేశ్వరాలయంలో సుమారు నెలన్నరగా ఉన్నారు. ఇక్కడ భిక్షాటన చేయగా వచ్చిన సొమ్ముతో సోమవారం 200 మందికి భోజనం ఏర్పాటు చేశారు. 11 ఏళ్లుగా శ్రీశైలం, ద్రాక్షరామ, పిఠాపురం, పాదగయ, కాశీ, ప్రయాగ తదితరచోట్ల అన్నదానానికి భిక్షాటన సొమ్ము మొత్తం అందించినట్టు ఆయన తెలిపారు.

# బాధితులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, తదితరులు

ద్రాక్షారామ: వెంకటాయపాలెం శిరోముండనం ఘటనకు 30 ఏళ్లు పూర్తయినా ఇప్పటివరకు బాధితులకు ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం నష్టపరిహారం అందలేదని, వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని దళిత ఐక్య పోరాట వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వెంకటాయపాలెంలో శిరోముండన ఐక్యవేదిక కోకన్వీనరు చీకట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత ఏడాది విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఈ కేసులో నిందితులైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో పాటు మరో 8 మందికి 18 నెలలు జైలు శిక్ష విధించిందని, వారి శిక్షాకాలాన్ని పెంచాలని బాధితులు అప్పీలుకు వెళ్లగా ఇంతవరకు బెంచ్‌పైకి రాలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో శిరోముండనం బాధితులు కోటి చినరాజు, చల్లపూడి పట్టాభిరామయ్య, పోరాట వేదిక కన్వీనరు వెంటపల్లి భీమశంకరం, గుబ్బల శ్రీను, బి.సిద్దు పాల్గొన్నారు.

# వృద్ధురాలిని హత్య చేసి.. గోనెసంచిలో చుట్టి

- బంగారంపై ఆశతో డ్రైవర్ దుశ్చర్య

నాచారం, న్యూస్‌టుడే: నమ్మకంతో ఇల్లు అద్దెకు ఇచ్చిన యజమానురాలిని గొంతునులిమి హత్య చేశాడో కారుడ్రైవరు. మృతదేహాన్ని గోనెసంచిలో మూటగట్టి గోదావరిలో విసిరేశాడు. ఇంత దారుణానికి ఒడిగట్టింది ఆ మహిళ మెడలోని బంగారం కోసమే. నిందితులను సోమవారం నాచారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ధనుంజయ వివరాల ప్రకారం.. మల్లాపూర్ బాబానగర్‌లో సూరెడ్డి సుజాత(65) ఒంటరిగా ఉంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కొత్తపల్లిఅగ్రహారానికి చెందిన ఎం.అంజిబాబు అలియాస్ అంజి డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఆరు నెలల కిందట నగరానికి వచ్చాడు. రెండు నెలల కిందట సుజాత ఇంట్లో అద్దెకు చేరాడు. ఒంటరిగా ఉన్న ఆమెకు ఇంటి పనులు చేసేవాడు. మెడలో బంగారు గొలుసు, చేతిగాజులను సొంతం చేసుకోవాలనుకున్నాడు. ఈ నెల 19న రాత్రి గొంతు నులిమి హత్య చేశాడు. ఎవరికీ అనుమానం కలగకుండా మృతదేహాన్ని గోనెసంచిలో చుట్టి ఇంట్లోనే పెట్టి తాళం వేశాడు. 11 తులాల బంగారాన్ని దోచుకున్నాడు. పెరవలి మండలం ఖండవల్లిలో ఉన్న స్నేహితుడు నుక్కంటి యువరాజు, అమలాపురం మండలం వేమవరానికి చెందిన నూకల దుర్గారావుకు ఫోన్‌లో హత్య విషయం చెప్పి సొంతూరు వెళ్లాడు. 20న ముగ్గురు కలిసి అక్కడే కారు అద్దెకు తీసుకుని అదేరోజు అర్ధరాత్రి మల్లాపూర్‌కు చేరుకుని మృతదేహాన్ని డిక్కీలో వేసుకుని బయలుదేరారు. కృష్ణలంక వద్ద గోదావరిలో విసిరేశారు. మొయినాబాదులో ఉంటున్న సుజాత చెల్లెలు సువర్ణలత ఫోన్ చేసినా స్పందన రాలేదు. అనుమానం వచ్చి 24న మల్లాపూర్‌లోని ఇంటికి రాగా అక్కడ లేకపోవడంతో నాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను అరెస్టు చేసి బంగారం, చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

## ధరవరలు

**అంబాజీపేట కొబ్బరి మార్కెట్**

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | 17,000 |
| పాతకాయ: గండేరా | 27,000 |
| గటగట | 25,000 |
| కొత్తకాయ: గండేరా | 26,000 |
| గటగట | 24,000 |
| నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ | 14,000-15,000 |
| కొత్త (పచ్చి) కాయ | 13,000-14,000 |
| కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

**వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో**

| | |
|---|---|
| ఫారంరేటు | 135-00 |
| రిటైల్ లైవ్ | 162-00 |
| డ్రెస్డ్ | 235-00 |
| స్కిన్‌లెస్ | 267-00 |

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం ఏ ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 9849138626.

శ్రీసాయిగోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం, ఏబ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆరోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 94933 38823.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీకి పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ 7386201191.

JOBS

కొత్తగా ఇంటర్నెట్ బాక్సులు వేయుటకు 10 మంది ఫీల్డ్ స్టాఫ్ కావలెను. నెలకు 15K (12+3). వేద నెట్, సత్యవతినగర్, కొవ్వూరు, కాంటాక్ట్ సెల్: 99899 55770.

రాజమండ్రిలో మా ఆఫీసునందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్(F) & టెలికాలింగ్ (M&F) మరియు ఆఫీస్ అసిస్టెంట్స్(M) కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. పాతసోమాలమ్మ గుడి రోడ్డు, దివ్య హాస్పిటల్‌దగ్గర. ✆ 85006 44978, 93461 45948.

కావలెను: Vicks & Tide Company నందు పనిచేయుటకు (1) సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ★ (2) డెలివరి బాయ్స్ ★ లొకేషన్ అమలాపురం, రాజోలు, రాజమండ్రి. Age: 18-45. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటివ్స్. ✆ 88861 23489, 95059 31234

రాజమండ్రి కోరుకొండ రోడ్డులో మా ఇంటివద్ద 2 సంవత్సరాల పిల్లల ఆలన పాలన చూసుకొనుటకు ★ కేర్‌టేకర్స్ కావలెను. Cont. Cell: 99898 76799.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-65 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ANDHRA PRADESH INDUSTRIAL INFRASTRUCTURE CORPORATION LIMITED
APIIC The Future is Here
(An undertaking of A.P. Govt.)
O/o ZONAL MANAGER, INDUSTRIAL PARK, KAKINADA - 533 005 Ph. No. 0884 - 2344225
'e'- Procurement Notice
Tender Notice No : 06 & 07/ZM/APIIC/KKD/2025-26 Dt. 29-12-2025
Zonal Manager/APIIC Limited, Kakinada invites bids for the following works.

| Tender Notice No. | Name of Work | Estimated Contract Value (ECV) |
|---|---|---|
| 06 | Raising of Existing Drain Wall and Sill levels in Road No.3 at IP-Vakalapudi,Kakinada District with IALA Funds(2nd Call) | Rs. 26,14,234/- |
| 07 | Strengthening of the Existing BT Cross Roads Nos.1& 4 in IP, Dowleswaram, East Godavari District IALA Funds | Rs. 28,69,868/- |

| | | | |
|---|---|---|---|
| 1) | Bid Document Downloading Start Date | : | From 29/12/2025 at 08:00 PM |
| 2) | Bid Document Downloading End Date | : | 13/01/2026 up to 01:00 PM |
| 3) | Last Date & Time for Receipt of Bids | : | 13/01/2026 at 03:00 PM |
| 4) | PQ Stage Opening Date & Time | : | 13/01/2026 at 03:30 PM |
| 5) | Commercial Stage Date & Time | : | 14/01/2026 @ 11:00 AM |

The details of tender notice and bid documents can be downloaded from website www.apeprocurement.gov.in (or) https://tender.apeprocurement.gov.in
ZONAL MANAGER

# చిన్న కమతం.. పెద్ద ఫలితం

న్యూస్‌టుడే, పి.గన్నవరం

స్ఫూర్తి

పలు రకాల ఆకుకూరలు పండిస్తున్న ఆదిమూలం పల్లంరాజు

చిన్న కమతంతో అధిక ఆదాయం పొందుతున్నారు కోనసీమలోని కొంతమంది. ఒకే పంటను నమ్ముకుంటే రైతుకు అంతగా గిట్టుబాటు ఉండదు. కొన్ని సందర్భాల్లో డిమాండ్ లేకపోతే నష్టం వస్తుంది. అదే ఒకే భూమిలో రకరకాల పంటలు సాగుచేస్తే లాభాల బాట పట్టొచ్చు. గత కొన్నేళ్లుగా ఇదే విధానం అవలంబిస్తున్నారు పి.గన్నవరం మండలం ఆదిమూలంవారిపాలేనికి చెందిన రైతు ఆదిమూలం పల్లంరాజు.

**కౌలుకు తీసుకుని..**

పల్లంరాజు గ్రామంలోని 30 సెంట్ల మాగాణిని కౌలుకు తీసుకున్నారు. దీన్ని ఏడు భాగాలుగా విభజించారు. ఒక్కోదాంట్లో గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, మెంతికూర, పుదీనా వేశారు.

**జులై నుంచి డిసెంబరు వరకు..**

30 సెంట్ల భూమికి ఖరీఫ్, రబీ సాగుకోసం యజమానికి రూ.15 వేలు కౌలు చెల్లిస్తారు. ఖరీఫ్‌లో జూన్ నెలలో భూమిని గాడులు తీసి దిబ్బలుగా చేసి ఆయా రకాల ఆకు కూరలకు సంబంధించి విత్తనాలు చల్లుతారు. జులై నుంచి డిసెంబరు వరకు ఏడు నెలల పాటు దిగుబడి తీసి ఆయనే మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఏడు నెలలకు పెట్టుబడి వ్యయం రూ.18 వేలు అవుతుంది. ఖర్చులన్నీ పోను 30 సెంట్ల భూమిమీద నికర ఆదాయం వస్తుంది. జనవరి నుంచి ఈ తోటలు తొలగించి దీంట్లో రబీ కింద వరిసాగు ప్రారంభిస్తారు. దీనిమీద కూడా 12 బస్తాలు తక్కువ కాకుండా దిగుబడి వస్తుంది. ఈ ధాన్యం విక్రయించి కౌలు చెల్లిస్తారు. ఇలా తక్కువ విస్తీర్ణంలో ఆదాయం పొందుతున్నారు.

# చేపల్లో ఎర్రమచ్చల వ్యాధితో నష్టం

తెలుసుకుందాం..

ఉప్పలగుప్తం: చేపల చెరువుల్లో ఏరోమోనాస్ హైడ్రోఫిల్ బ్యాక్టీరియా కారణంగా చేపలకు అన్ని కాలాల్లోనూ ఎర్రమచ్చల వ్యాధి సోకుతుంది. దీని లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉప్పలగుప్తం ఎఫ్‌డీవో బి.హేమానంద్ వివరించారు.

**ఇవీ లక్షణాలు**

వ్యాధి సోకిన చేపలు నీటి ఉపరితలానికి వచ్చి ఈదుతుంటాయి. శరీరం, మొప్పలు, రెక్కల వద్ద ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి. కొన్నిసార్లు పొట్ట నీటితో ఉబ్బినట్టు కనిపిస్తాయి. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే ల్యాబ్‌లో పరీక్షించి వ్యాధిని గుర్తించొచ్చు.

**నివారణ, జాగ్రత్తలు**

5 శాతం బ్రోమిన్ ద్రావణాన్ని వ్యాధి తీవ్రతను బట్టి ఎకరా చెరువుకు 300 మి.లీ. నుంచి లీటరు వరకు పిచికారీ చేయాలి. అనుమతించిన యాంటీబయోటిక్స్‌ను పది గ్రాముల మేతలో కలిపి టన్ను చేపలకు పది రోజుల పాటు అందించాలి. చెరువులో ప్రాణవాయువు 5 పీపీఎం తగ్గకుండా చూసుకోవాలి. విటమిన్ మిక్సర్‌ను మేతలో కలిపి పది రోజులు అందించాలి. బ్రోమిన్, క్లోరిన్‌తో శుద్ధి చేసిన నీటిని చెరువుల్లోకి తోడాలి.

# రైతేరాజు

## ఉద్యాన తోటల్లో నీటి వృథాకు అడ్డుకట్ట

తాడిపర్రులో గొట్టాల ద్వారా సాగునీటి సరఫరా ఇలా..

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలకు సాధారణంగా విద్యుత్తు మోటార్ల ద్వారా సాగునీరు అందిస్తుంటారు. పొలంలో బోదె తవ్వించి గట్లు వేయిస్తారు. ఈ పద్ధతిలో గట్లు తెగితే నీరు బయటకు పోతుంది. ఏడాదికి మూడు పర్యాయాలు బోదెలు, గట్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. దీనికి ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన యువరైతు నార్ని హరి అడ్డుకట్ట వేశారు. ఉన్నత విద్య అభ్యసించిన ఈయన తాడిపర్రులోని తన మూడెకరాల సాగు విషయంలో నూతన పద్ధతులను అవలంబించారు. 20 అడుగుల పొడవు కలిగిన సుమారు 130 గొట్టాలు భూమిలో ఏర్పాటు చేశారు. ఏ భాగంలో నీరు అవసరమో అక్కడ వాల్వ్ తిప్పితే నీరు ప్రవహిస్తుంది. ఒకే పర్యాయం అన్ని భాగాల్లో నీరు సరఫరా అయ్యే ఏర్పాట్లు కూడా ఉన్నాయి. ఈ పైపులు సుమారు 40 సంవత్సరాల వరకు పనిచేస్తాయి. మొత్తం రూ.2 లక్షల వ్యయమైంది. గట్ల పైబడి నీరు పొర్లిపోతుందనే ఇబ్బంది లేదు. సాధారణ పద్ధతిలో 5 గంటల్లో ఎకరా పొలానికి సాగునీరు సరఫరా చేయగా ఈ పైపులైను విధానం ద్వారా 3 గంటల్లోనే పూర్తవుతుందన్నారు. బహుళ ప్రయోజనాలు ఉన్న ఈ శాశ్వత పరిష్కార పద్ధతిని పరిసర గ్రామాల రైతులు సైతం అనుసరిస్తున్నట్లు రైతు హరి చెబుతున్నారు.

నార్ని హరి

# వరినారు పెంపకంలో మెలకువలు

మీ కోసం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: రైతులు ప్రస్తుతం రబీ వరి నారుమడులు వేయడం ప్రారంభించారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆరోగ్యకరమైన నారు పొందొచ్చని ఆత్రేయపురం వ్యవసాయాధికారి పట్టాభిరామయ్య సూచించారు. సాధారణంగా దాళ్వాలో కాండంతొలిచే పురుగు, అగ్గితెగులు ఉద్ధృతంగా ఉంటుంది. వీటి నివారణకు నారు నాటడానికి వారం రోజుల ముందుగా ఎకరాకు సరిపోయే మడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు చల్లుకోవాలి. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 3 గ్రాములు పిచికారీ చేయాలి. చలి నుంచి రక్షించుకోవాలి నారుమడిని సిద్ధం చేసే సమయంలో డీఏపీ 5 కిలోలు, పొటాష్ 2 కిలోల చొప్పున వేయాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే ఎదుగుదల లోపిస్తుంది. మడికి సాయంత్రం, రాత్రి సమయంలోనే నీరు పెట్టాలి. ఉదయం తొలగించాలి. ఎదుగుదల సరిగా లేకపోతే 13-0-45 ఎరువును 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ముందుగా విత్తనశుద్ధితో నిద్రావస్థ తొలగించాలి. దొడ్డురకం విత్తనమైతే 20 కిలోలు, సన్నరకమైతే 15 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

ఆత్రేయపురంలో వేసిన నారుమడి

(c) eenadu

# రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులు

## కల్యాణ వైభవం.. భక్తజన పారవశ్యం

**మామిడికుదురు:** గెద్దాడలోని శ్రీలక్ష్మీ ఆండాళ్‌తాయారు సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం వార్షిక కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, విశేషార్చనలు, అభిషేకం, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. పూలు, తులసి మాలలతో మూలవిరాట్టును మనోహరంగా అలంకరించారు. అర్చకులు స్వామివారి కల్యాణ క్రతువును వేదమంత్రోచ్చారణలతో చేసి ప్రతి ఘట్టాన్ని కమనీయంగా వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**రాజోలు, న్యూస్‌టుడే:** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని రాజోలు సీఐ టి.వి.నరేష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. 31వ తేదీ రాత్రి యువకులు రోడ్లపైకి రావద్దని ఇళ్లలోనే వేడుకలు చేసుకోవాలన్నారు. మైనర్లు, లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇస్తే వారి తండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ప్రజలంతా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రధాన కూడళ్ల వద్ద నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ప్రభల ఉత్సవాలు.. ట్రాఫిక్ సమస్యలా..?

‘ఈనాడు’ ఆధ్వర్యంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజులతో ‘ఫోన్ ఇన్’ కార్యక్రమం జరగనుంది. కోనసీమ వ్యాప్తంగా సంక్రాంతి మర్నాడు కనుమరోజు (జనవరి16)న ప్రభల ఉత్సవాలు నిర్వహిస్తారు. కొత్తపేట పోలీస్ సబ్ డివిజన్ పరిధి అంబాజీపేట మండలం జగ్గన్నతోట, ఇతర ప్రాంతాల్లో ప్రభల తీర్థాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు, ఉత్సవంలో మద్యం, మాంసం దుకాణాల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, పెద్దబూరల విక్రయాలతో ఇబ్బందులను వారి దృష్టికి తీసుకురావచ్చు. మహిళా భక్తులకు ఏర్పాట్లు, ఇతర అంశాల్లో సూచనలు, సలహాలను ఇవ్వొచ్చు. – న్యూస్‌టుడే, అంబాజీపేట

| తేదీ: నేడు (మంగళవారం)<br>సమయం: ఉదయం<br>10 నుంచి 11 గంటల వరకు.<br>సంప్రదించాల్సిన చరవాణి నంబర్లు | సుంకర మురళీమోహన్, డీఎస్పీ,<br>కొత్తపేట: 87126 92109<br>రుద్రరాజు భీమరాజు, సీఐ,<br>పి.గన్నవరం: 87126 92105 |
|---|---|

## కచేరీతో అదరగొట్టారు

గీతాలాపనలో శ్రేయ, శృతి

**అంబాజీపేట, న్యూస్‌టుడే:** కోరివారిఅగ్రహారంలోని భువనేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు సంగీత కచేరీలతో మారుమోగింది. గ్రామానికి చెందిన కొత్తూరి సత్యనారాయణమూర్తి(చిట్టిబాబు) మునిమనుమరాళ్లు ఉపాధ్యాయుల శ్రేయ, శృతి కాలిఫోర్నియాలో ఉంటున్నారు. వీరు హాజరై త్యాగరాజస్వామి, అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వీరు సంగీతంపై పట్టు సాధించారు. ప్రతిభను గుర్తించిన స్థానికులు స్థానికంగా కచేరీ నిర్వహించాలని కోరడంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ కవలలు ఆలపించిన కీర్తనలకు అంతా మంత్రముగ్ధులయ్యారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ: 10 - మ: 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 | పి.గన్నవరం: 80085 74229 | కొత్తపేట: 90323 93884

స్పందనకు వందనం

### చెత్తకుప్పల తొలగింపు

**మామిడికుదురు:** గ్రామ పరిధిలోని ముస్లిం వీధిలో రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలతో దుర్వాసన వ్యాపించి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి గౌస్ మొహిద్దీన్, కార్యదర్శి డి.కృష్ణాజీ వద్ద ప్రస్తావించగా స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో అక్కడి పరిసరాలను శుభ్రం చేయించారు.

**రావులపాలెం గ్రామీణం:** ఈతకోటలో ప్రధాన రహదారి చెంతన వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న సమస్యను పంచాయతీ కార్యదర్శి శర్మ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

### వీధి దీపాల ఏర్పాటు

**ఆత్రేయపురం:** తాడిపూడి గ్రామంలో వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపిన విషయాన్ని సర్పంచి ముదునూరి సుబ్బలక్ష్మి వద్ద ప్రస్తావించగా స్పందించి లైన్లకు మరమ్మతులు చేయించి వీధి దీపాలు వేయించారు.

## మహిళలకు శిక్షణ.. ఉపాధి కల్పన

### ఆర్థిక స్వావలంబనకు రోటరీ చేయూత

న్యూస్‌టుడే – మలికిపురం

మహిళలకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి పొందడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు రోటరీ సేవా సంస్థ కృషి చేస్తోంది. రోటరీ జిల్లా 3020 పరిధిలోని 86 క్లబ్‌ల ఆధ్వర్యంలో మహిళలకు కంప్యూటరు ప్రోగ్రాం, ఫ్యాషన్ డిజైనింగ్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్, పూలతో అగరబత్తీ, ఇంటిని శుభ్రం చేసుకునే లిక్విడ్ల తయారీపై శిక్షణ చేస్తోంది. మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రస్తుతం మోరిలో కుట్టు శిక్షణ కేంద్రంలో 52 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. గతంలో సఖినేటిపల్లిలంకలో, రాజోలు క్లబ్ ఆధ్వర్యంలో పొదలాడ, చెన్నడం గ్రామాల్లో కుట్టుశిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 2 వేల మంది మహిళలకు శిక్షణ ఇచ్చామని, వచ్చే ఏడాది జులై నెలాఖరుకల్లా 3 వేల మందికి శిక్షణ పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు రోటరీ ప్రతినిధులు తెలిపారు. శిక్షణ పొందిన వారికి వృత్తి పరమైన వ్యాపారాలు, కంపెనీల ఏర్పాటుకు బ్యాంకు రుణాల విషయంలో రోటరీ క్లబ్‌లు సహాయ సహకారాలు అందిస్తున్నాయని పేర్కొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మోరిలో కుట్టు శిక్షణ కేంద్రం

### పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యం

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో రోటరీ జిల్లా 3020 పరిధిలో జిల్లా గవర్నరు వై.కల్యాణచక్రవర్తి సహకారంతో ఒకేషనల్ ఛైర్మన్ ఉగ్గిన శ్రీనివాస్‌తో కలిసి వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే శిక్షణ పొందిన మహిళల్లో కొందరు తమ సంస్థల ద్వారా ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. జనవరి 31న కాకినాడలో నిర్వహించే రోటరీ కాన్ఫరెన్స్‌లో వారి ఉత్పత్తుల ప్రదర్శనతోపాటు విక్రయించుకునే అవకాశం కల్పించాం.

– ఉగ్గిన శ్రీనివాసరావు, రోటరీ జిల్లా ఒకేషనల్ ఛైర్మన్, రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020

## సిద్ధివినాయకుని సేవలో ప్రముఖులు

దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దాట్ల, తెదేపా అధ్యక్షుడు గుత్తుల

**అయినవిల్లి, న్యూస్‌టుడే:** అయినవిల్లి సిద్ధివినాయకస్వామిని సోమవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తెదేపా అధ్యక్షుడు గుత్తుల సాయి దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు స్వామివారి తీర్థప్రసాదం, వేదాశీర్వచనం అందజేశారు.

## వాడపల్లిలో కొలువుదీరిన పాలకవర్గం

అధ్యక్షుడు వెంకటరాజుకు చిత్రపటం అందిస్తున్న ఈవో

**ఆత్రేయపురం, న్యూస్‌టుడే:** కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారం సందర్భంగా ఆలయంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయి. అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజును ఈవో సూర్యచక్రధరరావు సత్కరించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో జనం హాజరయ్యారు. సెల్ఫీ పాయింట్‌గా అభివృద్ధి చేసిన స్వాతంత్ర్య సమరయోధుల స్థూపాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ఎంపీ గంటి హరీష్ మాధుర్ ప్రారంభించారు. ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్, ప్రసాదం కౌంటర్ ప్రారంభించారు. రూ.80 లక్షలతో నిర్మించనున్న రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏపీబిల్డింగ్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, జిల్లా తెదేపా అధ్యక్షుడు గుత్తుల సాయి, భాజపా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, రాజోలు తెదేపా ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి, బండారు సంజీవ్, కూసంపూడి బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన జనం

## శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరణకు ఏర్పాట్లు

కేశనపల్లిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

**మలికిపురం, న్యూస్‌టుడే:** శంకరగుప్తం మేజరు డ్రెయినులో డ్రెడ్జింగ్, గట్ల పటిష్ఠ పనులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ డ్రెయినేజీ అధికారులతో కలిసి మంగళవారం సమీక్షించారు. డ్రెయినేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కిషోర్, డీఈఈ బి.మోహన్, ఏఈ ఆనందకిరణ్, స్థానిక సర్పంచి యెనుముల నాగుతో చర్చించారు. శంకుస్థాపనకు సంబంధించి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శిలాఫలకం ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. చివరకు తుపాను ఆశ్రయ భవనం వద్ద శిలాఫలకం ఏర్పాటు చేశారు. పవన్‌కల్యాణ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడితో కలిసి తిరుపతిలో మంగళవారం ఉదయం 9 గంటలకు వర్చువల్‌గా శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. స్థానిక తీర గ్రామాల ప్రజలు, రైతులు తిలకించే విధంగా పెద్ద తెరలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. జిల్లా కలెక్టరు ఆర్.మహేశ్‌కుమార్, ఆర్డీవో మాధవి, డ్రెయినేజీ సీఈ కె.శేషుబాబు, ఎస్‌ఈ గోపీనాథ్ పాల్గొంటారని చెప్పారు.

## జడ్‌ఈడీ సర్టిఫికెట్‌తో పరిశ్రమలకు మేలు

**ఆలమూరు, న్యూస్‌టుడే:** జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్ సర్టిఫికేషన్ ద్వారా ఎన్నో లాభాలున్నాయని ఏజెడ్ క్వాలిటీ డెవలప్‌మెంట్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పోతుమూడి శేషారత్నం అన్నారు. సోమవారం ఆమె అధ్యక్షతన డీఆర్డీఏ మహిళా సమాఖ్య వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఈ సర్టిఫికేషన్ ద్వారా మేలు జరుగుతుందని, నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం, వ్యర్థాలను తగ్గించడం, శక్తిని ఆదా చేయడం వంటి ప్రయోజనాలు ఉంటాయన్నారు. గ్లోబల్ మార్కెట్‌లో ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి ఈ సర్టిఫికేషన్ ఉపయోగపడుతుందన్నారు. మహిళా సమాఖ్య ఏపీఎం వి సత్తిబాబు, పలు పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

## ముక్కోటికి ముస్తాబు

ఆలమూరులో జనార్దనస్వామివారి ఆలయం

అప్పనపల్లిలో పూలు, పండ్లతో అలంకరణ

**మామిడికుదురు, న్యూస్‌టుడే:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానంలో మంగళవారం తెల్లవారుజామున 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. ఆలయాన్ని పలురకాల పరిమళభరిత పుష్పాలు, వివిధ పండ్లతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దర్శనాన్ని రద్దు చేసి పూర్తిగా ఉచిత దర్శనం ఏర్పాటు చేసినట్లు ఏసీ ఎం.సత్యనారాయణ రాజు, వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు.

**ఆలమూరు:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా నవ జనార్దన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో వివిధ ఫల, పుష్పాలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంటోంది. చింతలూరు శ్రీవేంకటేశ్వరస్వామి, జొన్నాడ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేకువజామునే ఉత్తరద్వార దర్శనం ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

**అయినవిల్లి:** సిద్ధివినాయకస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం అమలాపురానికి చెందిన రామడుగుల వెంకటరమణమూర్తి, పద్మావతి దంపతులు రూ.1,16,116 విరాళం అందజేశారు. వారికి ఆలయ ఏసీ సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం అందజేశారు.

## దెబ్బతిన్న పైప్‌లైన్.. తాగునీరు వృథా

సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం-మలికిపురం యలంకాయ కాలువ గట్టు వద్ద తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. దీనిని అరికట్టి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శిరీషను వివరణ కోరగా పరిశీలించి మరమ్మతులు చేస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

## రక్షణ గోడ నిర్మించరూ..

ర్యాలి వియర్ కాలువపై ఉన్న వంతెనకు రక్షణ గోడలు దెబ్బతినడంతో వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటుగా రైతులు సైకిళ్లపై అరటి గెలలను తరలిస్తుంటారు. ఒక్కోసారి అదుపుతప్పి కింద పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని మండల పంచాయతీరాజ్ ఏఈ వీరభద్రరావు వద్ద ప్రస్తావించగా మరమ్మతుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

## తూరలు ఛిద్రమై.. రక్షణ కరవై

ఆదుర్రు పరిధి మోరిపోలంలో కొత్తగా వేసిన రోడ్డు మార్గం మధ్యలో డ్రెయిన్‌పై ఉన్న శిథిల పైపు కల్వర్టుకు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో స్థానిక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంచుల వద్ద అగాధంగా మారడంతో వాహనాలు, పాఠశాల బస్సుల రాకపోకల సమయంలో కలవరపడుతున్నారు. ఈ విషయాన్ని ర.భ. శాఖ ఏఈఈ సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా ప్రతిపాదనలు చేసి నిధులు వచ్చిన వెంటనే రక్షణ కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

## దెబ్బతిన్న వంతెన రెయిలింగ్

పి.గన్నవరం నుంచి రావిపాడు మీదుగా నరేంద్రపురం వెళ్లే ర.భ.శాఖ రహదారిలో రాజులపాలెం శివారు మర్రిపూడి వద్ద గోరింకల ప్రధాన మురుగు కాలువపై వంతెన రెయిలింగ్ పాడై ప్రమాదకరంగా మారింది. రెయిలింగ్‌తో పాటు వింగ్‌వాల్స్ కూడా దెబ్బతిన్నాయి. దీనిపై ర.భ.శాఖ డీఈఈ జి.రాజేంద్ర వివరణ కోరగా.. ఇక్కడ రెండు వరుసల వంతెన నిర్మాణానికి గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. – న్యూస్‌టుడే, పి.గన్నవరం

## అల్లుకున్న ప్రమాదం

వెలువలపల్లి గ్రామ ప్రధాన రహదారిలో అయినవిల్లి వైపు కాలువ అంచున విద్యుత్తు స్తంభాలకు పచ్చని పాదులు, పొదలు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. రాకపోకల సమయంలో పశువులు, ఇతర జీవాలు తాకితే ప్రమాదానికి గురవుతాయని స్థానికులు వాపోతున్నారు. వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, అయినవిల్లి

## ప్రదర్శనగా ప్రమాణస్వీకారానికి..

**కొత్తపేట, న్యూస్‌టుడే:** ఏడు వారాల వెంకన్నబాబుగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి దేవస్థానం పాలకవర్గ సభ్యులుగా కొత్తపేట నియోజకవర్గానికి చెందిన తమ్మన సాయిప్రసాద్, యల్లమిల్లి చంద్రకుమారి, సరెళ్ళ సరిత, చింతపల్లి సత్యనారాయణ, మసకపల్లి త్రిమూర్తులు నియమితులయ్యారు. వీరు సోమవారం వాడపల్లిలో ప్రమాణస్వీకారం చేశారు. తొలుత కొత్తపేట నుంచి మేళతాళాలు, బాజాభజంత్రీలు, బాణసంచాతో ప్రదర్శనగా వాడపల్లి దేవస్థానానికి చేరుకున్నారు. వారు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి తమ వంతు సహకారం అందించి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

## మనస్తాపంతో యువతి ఆత్మహత్య

**రాజోలు, న్యూస్‌టుడే:** పెళ్లి సంబంధాలు చెడగొడుతున్నారన్న మనస్తాపంతో రాజోలుకు చెందిన అప్పన నాగప్రియ (25) సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపారు. ఆమె తండ్రి అప్పన వెంకటరామయ్య(దొరబాబు) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తమ సామాజికవర్గానికి చెందిన కొందరు సంఘ సభ్యులు తమ కుటుంబాన్ని వేధింపులకు గురిచేస్తున్నారని, తన కుమార్తెకు పెళ్లి సంబంధాలు కుదరకుండా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## గ్యాస్ లీకై మంటలు.. మహిళకు గాయాలు

**ఆత్రేయపురం, న్యూస్‌టుడే:** ఆత్రేయపురం బులిపేటలో సోమవారం రాత్రి కాకిలేటి పాప వంట చేస్తుండగా గ్యాస్ లీకై సిలిండర్ నుంచి మంటలు చెలరేగి చుట్టుముట్టడంతో గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో కొత్తపేట ఆసుపత్రికి తరలించారు. కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సిలిండర్ పేలిపోతుందేమోనని చుట్టుపక్కల నివాసితులు పరుగులు తీశారు. మంటలు ఆరిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## పిచ్చికుక్క స్వైరవిహారం

**అంబాజీపేట, న్యూస్‌టుడే:** అంబాజీపేట కూడలిలో ఓ పిచ్చికుక్క సోమవారం రాత్రి స్వైరవిహారం చేసింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అవతల ఉన్న కూరగాయల దుకాణం వద్ద నిలిచి ఉన్న పోతాయిలంకకు చెందిన వ్యక్తిని, మరో ఇద్దరిని కరిచింది. అనంతరం కూడలిలో కలియ తిరగడంతో అంతా భయంతో పరుగులు తీశారు. క్షతగాత్రులు అమలాపురంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీధి కుక్కల నియంత్రణపై అధికారులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

## మార్గ సూచికల్లేక భక్తులకు ఇబ్బందులు

గూగుల్ మ్యాప్ సూచనతో ఇరుకు రహదారిలోకి వెళ్తున్న వాహనం

**సఖినేటిపల్లి:** అంతర్వేది సందర్శనకు, లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు గూగుల్ మ్యాప్‌తో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి అంతర్వేది రావాలంటే నరసాపురం-సఖినేటిపల్లి గోదావరి దాటి రావాలి. దారి తెలియని వారు కారులో గూగుల్ మ్యాప్ పెట్టుకుని వస్తుంటారు. గూగుల్ మ్యాప్‌లో సఖినేటిపల్లి బోను నుంచి ఏటుగట్టు రహదారిని చూపిస్తుంది. దీనిప్రకారం ప్రయాణం చేసి ఇబ్బంది పడుతున్నారు. ఏటుగట్టు బోను నుంచి గుడిమూల వరకు 4.5 కిలోమీటర్లు ఇరుకైన మట్టి రహదారి కావడంతో ముందుకు వెళ్లలేక, తిరిగి వెనుకకు వెళ్లి రామేశ్వరం, టేకిశెట్టిపాలెం మీదుగా ప్రయాణం చేయాల్సివస్తోంది. దీనివల్ల వ్యయప్రయాసలతోపాటు సమయం వృథా అవుతోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి సూచికబోర్డులు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

## భవిష్య నిధి, ప్రభుత్వ బీమాపై వినతి

**కొత్తపేట, న్యూస్‌టుడే:** భవిష్య నిధి ఖాతాలో 2002 జనవరి, 2024 మే నెలలకు సంబంధించిన సొమ్ము జమ చేయడానికి అవసరమైన షెడ్యూల్‌ను జిల్లా పరిషత్ భవిష్యనిధి విభాగానికి అందించాల్సిందిగా కోరుతూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేష్‌బాబు సోమవారం కొత్తపేట ఎంఈవో హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వ బీమా పట్టాలు పొందేందుకు యాప్ ద్వారా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కూడా ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలని ఆయన కోరారు.

## రీసర్వేకు సహకరించండి

**మలికిపురం:** రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేపై సిబ్బందికి సహకరించాలని తహసీల్దారు టి.శ్రీనివాసరావు కోరారు. గూడపల్లి, గుబ్బపాలెం, జి.పల్లిపాలెం, శంకరగుప్తం, అడవిపాలెం, చింతలమోరి గ్రామాల్లో సోమవారం రీసర్వేపై అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. భూములకు సంబంధించిన సమాచారానికి సాంకేతిక భద్రత ఉంటుందని చెప్పారు.

## చెత్త సేకరణ వాహనం ప్రారంభం

**మలికిపురం, న్యూస్‌టుడే:** గ్రామాల్లో చెత్త సేకరణకు పంచాయతీ సిబ్బందికి ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మలికిపురం పంచాయతీ కార్యాలయానికి కొత్తగా సమకూర్చిన చెత్త సేకరణ వాహనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో అన్ని కుటుంబాలకు తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేసినట్లు సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, కార్యదర్శి తాడి ఏసుబాబు చెప్పారు. చెత్త వాహనం ఇంటికి వచ్చినప్పుడు ఆ బుట్టల్లో వేసిన చెత్తను సిబ్బందికి ఇవ్వాలని సూచించారు.

## రోజువారీ సంత.. సదుపాయాల్లేక చింత

న్యూస్‌టుడే, రాజోలు, మామిడికుదురు

తాటిపాకలో శిథిలస్థితిలో షెడ్

రాజోలు నియోజకవర్గంలోని మేజర్ పంచాయతీల్లో నిత్యం జరిగే వ్యాపారాల నిర్వహణకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఉన్న షెడ్లను ఆధునికీకరించకపోవడం, గతంలో తొలగించిన వాటి స్థానే కొత్త నిర్మాణాలు చేపట్టకపోవడంతో వ్యాపారులు, వినియోగదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

● రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో పలు గ్రామాల్లోని ప్రజలకు ప్రధాన వాణిజ్య కేంద్రమైన తాటిపాక కూడలిలో నిత్యం దుకాణాలు నిర్వహించే రేకుల షెడ్లు పైకప్పులు ఛిద్రమై కూలేస్థితికి చేరాయి. వర్షాల సమయంలో వ్యాపారాలు నిర్వహించడం కష్టతరంగా ఉంటోందని ఆవేదన చెందుతున్నారు.

● నియోజకవర్గం కేంద్రం రాజోలులోని డైలీ మార్కెట్ వ్యర్థాలతో అస్తవ్యస్తంగా మారుతోంది. దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. తాగునీటి సౌకర్యం కూడా కొరవడింది.

● మలికిపురంలో దుకాణాల షెడ్లు శిథిలస్థితికి చేరడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల నుంచి అనేకమంది వినియోగదారులు ఇక్కడికి వస్తుంటారు. వీటిస్థానే కొత్తవి నిర్మించి, మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది.

● మామిడికుదురు మండలం నగరంలోని వారపుసంత షెడ్లను గతంలో తొలగించారు. వాటి స్థానే కొత్త నిర్మాణాలు చేపట్టకపోవడంతో రెండో వీధిలోని రహదారిపైనే దుకాణాలు పెట్టుకుని అవస్థలు పడుతున్నారు. ఇక్కడి చెత్తకుప్పలను తొలగించి అవసరాల మేరకు షెడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

### ఆమోదం రాగానే పనులు చేపడతాం

రాజోలు, తాటిపాక కూడళ్ల సమీపంలో నిత్యం దుకాణాలు నిర్వహించే చోట్ల శిథిల షెడ్లను తొలగించి కొత్తవి నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. ఆమోదం రాగానే పనులు మొదలుపెడతాం. మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతాం. పరిసరాలు శుభ్రంగా ఉండేలా సంబంధిత పంచాయతీ అధికారులకు సూచిస్తాం.

– కె.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో, రాజోలు

## క్రీస్తు బోధనలు ఆచరణీయం: ఎమ్మెల్యే గిడ్డి

**అంబాజీపేట:** క్రీస్తు బోధనలు ఆచరించడం ద్వారా సమాజంలో శాంతిసందేశం ఇవ్వొచ్చని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మాచవరంలోని భారత్‌నగర్ మన్నా చర్చిలో సోమవారం రాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పాస్టర్ కె.ఎజ్రా ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కె.వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు అరిగెల సూరిబాబు, సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

## కూచిపూడి కళావైభవంలో విద్యార్థినుల ప్రతిభ

**ఆలమూరు:** హైదరాబాదులో భారత్ ఆర్ట్ అకాడమీ, తెలంగాణ ప్రభుత్వం గిన్నిస్ వరల్డ్ రికార్డ్ రిజిస్ట్రేషన్ కోసం 27న నిర్వహించిన కూచిపూడి కళావైభవం-2లో ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూలు విద్యార్థినులు సీహెచ్ ప్రణీత, కె.శరణ్య, ఐ.చైత్రిక, టి.మణిశ్రీ, ఎస్‌ఎల్.మీనాక్షి, ఎ.జోషినీగాయత్రి పాల్గొన్నారని కరస్పాండెంట్ ముల్లారావు తెలిపారు. ప్రశంసాపత్రాలను, పతకాలు అందుకున్న విద్యార్థినులను సోమవారం పాఠశాలలో ముల్లారావు అభినందించారు.

## ఒకరోజు ముందే పింఛను

**కొత్తపేట, న్యూస్‌టుడే:** నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని జనవరి 2026 నెలకు సంబంధించి ఒకరోజు ముందుగానే పింఛను పంపిణీ చేయాలని నిర్ణయించిందని ఎంపీడీవో పి.యస్.నరేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 31వ తేదీనే మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉదయం 6.30 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. పింఛనుదారులందరూ తమ నివాసాల్లో అందుబాటులో ఉండాలని కోరారు.

## బోర్డుపై తొలగిన జగన్ చిత్రం

**మలికిపురం:** మలికిపురంలోని ఆరోగ్య ఉప కేంద్రం వద్ద ఉన్న బోర్డుపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాన్ని తొలగించారు. ఈ కేంద్రం వద్ద ఉన్న బోర్డుపై మాజీ సీఎం చిత్రం ఉన్న క్రమంలో ‘ప్రభుత్వం మారినా అదే తీరా..’ శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనానికి మోరి పీహెచ్‌సీ సిబ్బంది స్పందించారు. బోర్డుపై జగన్ చిత్రాన్ని తొలగించి శుభ్రం చేశారు.

## పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అప్పగింత

**పి.గన్నవరం, న్యూస్‌టుడే:** ఆర్టీసీ బస్సులో ఓ యువతి పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను పోలీసులు తిరిగి అప్పగించారు. వివరాలిలా.. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన మాకినీడి సౌమ్యశ్రీ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈ నెల 26న స్వగ్రామానికి వచ్చే క్రమంలో రాజమహేంద్రవరంలో రాజోలు డిపో బస్సు ఎక్కారు. రావులపాలెంలో దిగి అక్కడి నుంచి ర్యాలి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లిన తరువాత ల్యాప్‌టాప్ మరిచిపోయిన విషయాన్ని గ్రహించి వెంటనే రావులపాలెం బస్టాండ్‌లో సిబ్బందికి తెలియజేశారు. అనంతరం పి.గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించి నాగుల్లంకకు చెందిన మహిళ వద్ద ఉన్నట్లు తెలుసుకుని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాధిత యువతికి ల్యాప్‌టాప్ అందజేశామని హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

(c) eenadu

# అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం నగర పంచాయతీ, మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాంబాబు తెలిపారు. ముమ్మిడివరం, కొత్తలంక, కర్రివానిరేవు, గాడిలంక, అన్నంపల్లి, చింతపల్లిలంక, చినకొత్తలంక, గేదెల్లంక, కొమానపల్లి, వరగలంక, వడ్లిగూడెం, గోదశివరి పాలెం గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ఐ.పోలవరం: మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కె.రాంబాబు తెలిపారు. టి.కొత్తపల్లి, కేశనకుర్రు, తిళ్లకుప్ప, జి.వేమవరం, జి.మూలపొలం, గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాటా - 44, వంకాయలు నలుపు - 34, తెలుపు - 30, బెండకాయలు - 48, పచ్చిమిర్చి - 43, కాకరకాయ - 44, బీరకాయలు - 52, కాలీఫ్లవర్ - 26, క్యాబేజీ - 32, క్యారెట్ - 24, 34, దొండకాయలు - 38, బంగాళదుంపలు - 20, ఉల్లిపాయలు - 20, 30, గోరుచిక్కుడు - 45, దోసకాయలు - 26, చిక్కుడుకాయలు - 26, చేమదుంపలు - 43, కంద - 45, బీట్‌రూట్ - 36, కీరదోసకాయలు - 35, అల్లం - 75, క్యాప్సికం - 65, చిలకడదుంపలు - 40, గుమ్మడి - 30, ముల్లంగి -45, ఉసిరి -80, నిమ్మకాయలు -90, అనపకాయ -28, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ -20, ఆకుకూరలు కట్ట -10, 15, కొత్తిమీర కట్ట - 15, కొబ్బరికాయ - 25.

## నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏసీ సత్యనారాయణరాజు

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలోని నిత్యాన్నదాన ట్రస్ట్‌కు సోమవారం అమలాపురానికి చెందిన రామడుగుల వెంకటరమణమూర్తి, పద్మావతి దంపతులు రూ.1,16,116 విరాళం అందజేశారు. వారికి ఆలయ ఏసీ సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం అందజేశారు.

## హిందూ ధర్మంతో సామాజిక సామరస్యం

మాట్లాడుతున్న స్వామీజీ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: హిందూ ధర్మంలో సామాజిక సామరస్యం ఎంతో ముఖ్యమైన అంశమని పెనుగొండ వాసవీ పీఠాధిపతులు ప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీ అన్నారు. సీహెచ్ గున్నేపల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సీతారామస్వామి ఆలయం వద్ద గొలకోటి వెంకటరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన హిందూ సమ్మేళన సభలో ప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీ పాల్గొని అనుగ్రహభూషణం చేశారు. మరోవక్త కె.లోవారెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ గడిచిన వందేళ్లలో ఎన్నో సంస్కరణల కోసం కృషి చేసిందన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గాలిదేవర బుజ్జి, నంద్యాల వెంకటరెడ్డి నాయుడు, పెన్మత్స గోపాలకృష్ణంరాజు, నరహరశెట్టి కిరణ్‌కుమార్, నల్లా ఆండాల్‌దేవి, గ్రంధి నానాజీ, బొంతు కనకారావు, సలాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారుల సంతృప్తే ప్రామాణికం

వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న జేసీ నిశాంతి

అమలాపురం కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం విజయవంతానికి అర్జీదారులే సంతృప్తే ప్రామాణికమని జేసీ నిశాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సుమారు 280 మంది తమ సమస్యలపై అర్జీలు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. వినతులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు.

## నూతన సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు

యానాం, న్యూస్‌టుడే: డిసెంబరు 31వ తేదీ రాత్రి ఆంగ్ల నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి పుదుచ్చేరిలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి లక్ష్మీనారాయణన్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైట్‌టౌన్ బీచ్ మార్గంలో 31వ తేదీ రాత్రి సినీ సంగీత కార్యక్రమం, బాణ సంచా ప్రదర్శనలతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది 19 లక్షల మంది ఈ ప్రాంతాన్ని సందర్శించారన్నారు. నూతన సంవత్సర ఆరంభ వేడుకల్లో పాల్గొనేందుకు గతేడాది 50వేల మంది వచ్చారన్నారు.

## స్పందించాలి.. పరిష్కరించాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: తమ సమస్యలకు పరిష్కార మార్గాలు చూపి సాంత్వన కలిగించాలని పలువురు అర్జీదారులు కోరుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ నిశాంతి, ఇతర అధికారులను కలిసి పలు గ్రామాల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాము గ్రామాల్లో అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వాటి పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు రావాల్సి వచ్చిందన్నారు.

### కాలువపై ఆక్రమణలు

మేమంతా అమలాపురం మండలం వన్నె చింతలపూడి నుంచి వచ్చాం. మా గ్రామంలో రాజారావు తూము నుంచి నాగావారి ఇంటి వద్ద వరకు ఉన్న పంట కాలువ ఆక్రమణలకు గురై సాగు నీరు దిగువకు పూర్తి స్థాయిలో రావడం లేదు. ఏటా రబీలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. స్థానిక అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. కలెక్టర్‌కు వినతి ఇచ్చాం. ఆయన స్పందించి ఆక్రమణలు తొలగించి పూర్తి స్థాయిలో సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

విశ్వహిందూ పరిషత్తు సభ్యులు

### దేవస్థానం భూములు పంచవద్దు

పారిశ్రామిక వాడల అభివృద్ధి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాలకు చెందిన భూములను తీసుకుంటుంది. దీనివల్ల దేవాలయాల పోషణ భారంగా మారుతుంది. ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన ప్రభుత్వమే వాటిని ఇతర సంస్థలకు ఇచ్చేయడం దారుణం. విశాఖపట్నంలోని సింహాచలం దేవస్థానానికి చెందిన భూముల్లో 256 ఎకరాలను పరిశ్రమల శాఖకు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వీటిని తక్షణం ఉపసంహరించుకుని, దేవాలయాలను సంరక్షించాలని కోరుతున్నాం.

-విశ్వహిందూ పరిషత్తు, బజరంగ దళ్ సభ్యులు

### అర్హత ఉన్నా దక్కని పింఛను

మా అబ్బాయికి ప్రస్తుతం ఆరేళ్లు. పుట్టిన నుంచి దివ్యాంగుడు. మొదట్లో సదరం ధ్రువీకరణ పత్రం మంజూరు కాక ఇప్పటి వరకు పింఛను రాలేదు. జీజీహెచ్ వైద్యులు పరీక్షించి 85 శాతం వైకల్యంతో సదరం ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ప్రస్తుతం నెలకు రూ.5 వేల వరకు మందులకు ఖర్చు అవుతుంది. పింఛను మంజూరు చేస్తే కొంత మేర ఆర్థిక భరోసా కలుగుతుంది. న్యాయం చేయాలని అధికారులను కోరాం.

-బయ్యా దుర్గ

### కనీస సమాచారం ఇవ్వలేదు

మాది అల్లవరం మండలం బెండమూర్లంక. ఓడలరేవు తీరంలో సముద్ర కోతను అరికట్టేందుకు ఓఎన్జీసీ సంస్థ రాళ్లను తరలిస్తోంది. వీటిని సముద్ర తీరం వద్దకు తరలించేందుకు రైతులకు చెందిన భూముల నుంచి రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తున్నారు. విలువైన మా భూములు నష్టపోతున్నాం. దీనిపై మాకు కనీస సమాచారం ఇవ్వలేదు. అడుగుతుంటే నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం.

-యాళ్ల సురేష్

## 25శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

యానాం: పాండిచ్చేరి యూనివర్సిటీ (పీయూ)లోని అన్ని కోర్సుల్లో పుదుచ్చేరి విద్యార్థులకు 25శాతం రిజర్వేషన్ కేటాయించాలని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను సీఎం ఎన్.రంగసామి కోరారు. పీయూ స్నాతకోత్సవ వేడుకలో పాల్గొనేందుకు సోమవారం వచ్చిన ఉపరాష్ట్రపతికి సీఎం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పుదుచ్చేరిలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఉప రాష్ట్రపతి పాల్గొన్నారు.

## రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వి.ఎస్.దివాకర్ అన్నారు. సమనస పంచాయతీ కార్యాలయం వద్ద త్వరలో చేపట్టబోయే రీసర్వేకు సంబంధించిన గ్రామ సభను సర్పంచి పరమట శ్యామ్‌కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. మాజీ సర్పంచి నడింపల్లి ఉదయబాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు భూపతిరాజు లవవర్మ, మామిళ్లపల్లి సుబ్బరాజు, వార్డుసభ్యుడు చంటిరాజు, కోడూరి రామ్మూర్తి, కరెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చూపి.. విజేతలుగా నిలిచి

విజేతలతో నంద్యాల మనువిహార్

అమలాపురం గ్రామీణం : విద్యార్థులు అన్ని అంశాలపై ఆసక్తి పెంచుకుని విభిన్న రంగాల్లో రాణించాలని డిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ నంద్యాల మనువిహార్ అన్నారు. సమనసలోని డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను సోమవారం నిర్వహించారు. జనరల్ నాలెడ్జ్ క్విజ్ కాంపిటేషన్‌లో జరిగిన పోటీల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. యనమండ్ర విశ్వశ్రీ, జంపన చందనప్రియ, కోళ్ల కీర్తి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ నంద్యాల మనువిహార్ అందించారు. పాఠశాల ఛైర్మన్ నంద్యాల సూర్యనారాయణమూర్తి నాయుడు, పాఠశాల పరీక్ష నిర్వహణ అధికారి యర్రంశెట్టి శ్రీనాగవెంకటవరప్రసాద్ పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

కొంకాపల్లి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: కొంకాపల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 7, 8, 9, తరగతుల విద్యార్థినులు వర్తమాన అంశాలు, జనరల్ నాలెడ్జ్ అంశాలపై నిర్వహించిన రాత పరీక్షలో పాల్గొన్నారు. జె. కార్తీక్, కారెం మంజూష, పెదిరెడ్డి లాస్యశ్రీ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రధానోపాధ్యాయిని సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు ఎంఎస్ఎన్ ప్రసాద్, జి.రవి, శ్రీనివాస్, మూర్తి, అనూష, సతీష్ అందజేశారు.

విజేతలతో హెచ్ఎం ఎం.సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రసాద్, అనూష, సతీష్

## యానాం ప్రజా ఉత్సవాలపై సమావేశం

యానాం, న్యూస్‌టుడే: జనవరి 6 నుంచి 9 వరకు స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించనున్న 22వ ప్రజాఉత్సవాలు నిర్వహణ ఏర్పాట్లుపై పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ సోమవారం సాయంత్రం అధికారులతో సమావేశం నిర్వహించారు. పుదుచ్చేరి కళలు, సాంస్కృతికశాఖ ఈ ఏడాది ఉత్సవాల నిర్వహణకు రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఎల్జీ, సీఎం తదితర ప్రముఖులు వచ్చే అవకాశం ఉండడంతో చేపట్టాల్సిన ఏర్పాట్లు, ఆహ్వానప్రతులు, భద్రతాచర్యలు వంటి పలు అంశాలపై చర్చించారు. కమిషనర్ రాఘవన్, ప్రజాపనులశాఖ ఏఈ కాళహస్తి జ్యోతిరాజు, విద్యుత్‌శాఖ ఏఈ ముగ్గళ్ల వీరవెంకట సత్యనారాయణ, ఆరోగ్యశాఖ డీడీ డాక్టర్ టి.రవిశంకర్ బృందం పాల్గొన్నారు.

## వంద రోజుల ప్రణాళిక పక్కాగా అమలు

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు సూచించారు. కొత్తలంక జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అమలు చేస్తున్న యాక్షన్ ప్లాన్‌లో ఎక్కడా అలసత్వం వహించకూడదన్నారు. షైనింగ్ స్టార్స్‌గా ఉన్న విద్యార్థులను రైజింగ్ స్టార్స్‌గా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సంబంధిత ఉపాధ్యాయులదేనని అన్నారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు.

నియామక పత్రాలతో అభ్యర్థులు

## ఉద్యోగ మేళాలో 787 మంది ఎంపిక

యానాం, న్యూస్‌టుడే: యానాం ప్రాంత యువతకు ఉద్యోగావకాశాల కల్పనకు ఇకపై ఏటా రెండు పర్యాయాలు ఉద్యోగ మేళా నిర్వహిస్తామని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రకటించారు. స్థానిక యర్రాగార్డెన్లో ఆదివారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో భాగంగా సోమవారం ఓల్డేజ్‌హోంలో రెండో విడత పరీక్షలను నిర్వహించారు. 2,200 మంది పేర్లు నమోదు చేసుకోగా 1500 మంది హాజరయ్యారు. 787 మందిని వివిధ సంస్థలు ఎంపిక చేయగా.. వారికి మల్లాడి నియామక పత్రాలు అందజేశారు. దొమ్మేటిపేట పారిశ్రామికవాడలో మూతపడిన పరిశ్రమలో రొయ్య మేత తయారీ పరిశ్రమను మార్చిలో తిరిగి ప్రారంభించడానికి చేస్తున్న చర్యల్లో భాగంగా 750 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయని మల్లాడి తెలిపారు. ఓల్డేజ్‌హోం ప్రతినిధులు పెండెం సూర్యప్రకాష్, గంగయ్య, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు, ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## పరుగు పోటీలో ప్రతిభ

100మీటర్లు పరుగు విజేత డి.స్వాతిపూర్ణిత

యానాం : పుదుచ్చేరిలో రాష్ట్ర స్థాయి పాఠశాలల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. యానాం విద్యార్థినులు 100 మీటర్లు, హైజంప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాలు సాధించినట్లు జోనల్ గేమ్స్ కార్యదర్శి కొప్పనాతి భాస్కర్ తెలిపారు. అండర్-14 విభాగం 100 మీటర్ల పరుగులో రీజెన్సీ పబ్లిక్‌స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని డి.స్వాతిపూర్ణిత, హైజంప్‌లో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హైస్కూల్ విద్యార్థిని సీహెచ్ మౌనిక ప్రథమ స్థానం సాధించారు. ఎస్టీపీపీ విద్యార్థిని ఉదయలక్ష్మి- 800 మీటర్ల పరుగులో తృతీయ స్థానంలో నిలిచింది.

## కళాశాల విద్యార్థికి గాయాలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే : కళాశాల బస్సు నుంచి దిగుతుండగా అది కదలడంతో విద్యార్థి గాయపడ్డాడు. ఉంగరాల హేమంత్ సాయి సుభాష్ అమలాపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం కళాశాల నుంచి తిరిగి వస్తూ ఉప్పూడిలో ఇంటికి వెళ్లేందుకు బస్సు దిగుతుండగా డ్రైవర్ ముందుకు పోనివ్వడంతో జారిపడి గాయాలపాలయ్యాడు. కాట్రేనికోన ఎస్సై అవినాష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీనిపై విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

## రామస్వామితోటలో క్రిస్మస్ వేడుక

కాట్రేనికోన, న్యూస్‌టుడే : రామస్వామితోటలోని చర్చిలో క్రిస్మస్ వేడుకను మాకే దానియేల్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమలాపురం నుంచి వచ్చిన పాస్టర్ విజయ్‌కుమార్ మాట్లాడారు. పిల్లల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కొంతమందికి హెల్మెట్‌లను అందించారు. గంటి సుధాకర్, నరసింహమూర్తి, బాలయోగి, హరికిషోర్, శ్యామ్‌సన్, సంఘవిశ్వాసులు స్థానికులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: భీమనపల్లిలోని ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని సోమవారం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఫాదర్ నత్త పాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చల్లపల్లి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దేవరపల్లి సుబ్బన్న, జానకమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు దేవరపల్లి వెంకటరమణ, ప్రేమకుమారి చేతుల మీదుగా దుస్తులు అందించారు.

## 'విలీనం చేస్తే కలిసొచ్చేదేం లేదు..!'

### పురపాలికలో చేరేది లేదంటూ పంచాయతీ పాలకవర్గం తీర్మానం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కామనగరువు పంచాయతీలో సగభాగాన్ని అమలాపురం పట్టణంలో విలీనం చేస్తే కలిసొచ్చేదేమీలేదని ఇప్పటికే పట్టణానికి శివారునున్న ప్రాంతాలు అభివృద్ధి చెందలేదని జడ్పీటీసీ సభ్యుడు శ్రీహరిరామ్‌గోపాల్ అన్నారు. కామనగరువు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి నక్కా అరుణకుమారి అధ్యక్షతన సోమవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పంచాయతీని విలీనం చేయడంపై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామంలో కొంత భాగాన్ని పురపాలికలో విలీనం చేయడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు సర్పంచి అరుణకుమారి చెప్పుకొచ్చారు. జడ్పీటీసీ సభ్యుడు శ్రీహరిరామ్‌గోపాల్ మాట్లాడుతూ గ్రామంలో అగ్రవర్ణాల ప్రాంతాలు, పంచాయతీ రహదారి ప్రాంతం అభివృద్ధి చెందిందని ఎస్సీ, బీసీ కాలనీల్లో అభివృద్ధి లేదని చెప్పడంతో గ్రామానికి చెందిన నందుల సత్తిబాబు కలుగజేసుకుని గ్రామంలో అందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నారని, కులాల మధ్య చిచ్చుపెట్టేలా మాట్లాడటం సరికాదన్నారు. కాస్త రసాభాస వాతావరణం నెలకొంది. నక్కావారిపేట, బాలయోగి కాలనీ, అబ్బిరెడ్డి కాలనీ ప్రాంతాలను పట్టణంలో విలీనం చేయాలని పలువురు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. అమలాపురం నీటి సంఘం అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు) మాట్లాడుతూ 1958లో కామనగరువు పురపాలక సంఘంలోనే ఉండేదని ఆ తర్వాత పంచాయతీగా రూపాంతరం చెందిందని గుర్తు చేశారు. కామనగరువును అమలాపురం పురపాలక సంఘంలో కలపాలని లేకుంటే పంచాయతీగానే కొనసాగించాలన్నారు. తమ ప్రాంతంలో ఇప్పటికే ఏ విధమైన అభివృద్ధి లేదని పితానివారిపాలేన్ని విలీనం చేయాలని ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల అనిత పేర్కొన్నారు. ఉపసర్పంచి రాజులపూడి భాస్కరరావు మాట్లాడుతూ కొంతమేర మాత్రమే విలీనం చేయడం ఎంతవరకు సబబు కాదని విలీనంతో అభివృద్ధి చెందే పరిస్థితి లేకపోగా కొత్త సమస్యలు వస్తాయని అన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు మెండు గంగాభవాని, కార్యదర్శి ఆర్.ఎస్.ఎస్.సూరపరాజు, పి.ఆదినారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు

అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ రాహుల్‌మీనా

## పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం

అమలాపురం పట్టణం : ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యమని ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. అమలాపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యాలయం ఛాంబర్‌లో ఎస్పీ రాహుల్‌మీనా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 25 మంది అర్జీదారుల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు.

## అన్న సమారాధనకు విరాళం

ఛైర్మన్‌కు విరాళం అందిస్తున్న బంగారు వర్తక సంఘం ప్రతినిధులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అమలాపురం వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు అన్న సమారాధన చేసేందుకు వెండి, బంగారం, డైమండ్ వర్తక సంఘం సభ్యులు రూ.74వేలు సమకూర్చారు. సోమవారం ఆలయ ఛైర్మన్ కంచిపల్లి సత్యనారాయణకు విరాళం అందించారు. బోణం సత్యవరప్రసాద్, సత్తిబాబు, వాసిరెడ్డి వాసు, యర్రంశెట్టి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ● తిక్కా రామ వెంకటేశ్వరరావు, సరస్వతి దంపతులు అమలాపురం వేంకటేశ్వర స్వామి వారికి 8.5 ఇత్తడితో పీఠం చేయించి బహూకరించారు.

## ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంచిపల్లి అబ్బులు సోమవారం తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యకుమార్ మాట్లాడుతూ భక్తులు, దాతల సహాయంతో భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు.

## వేగం మితిమీరితే కఠిన చర్యలు

ముమ్మిడివరం : మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడిపినా, విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలా సాగర్ హెచ్చరించారు. ముమ్మిడివరంలోని ప్రధాన కూడళ్లలో పాఠశాల, కళాశాల విద్యార్థినులు, మహిళలు వేసి ఉండే చోట్ల మితిమీరిన వేగంతో ఆకతాయి చేష్టలు చేస్తున్న పలువురు యువకుల్ని సోమవారం ఎస్సై అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మితిమీరిన వేగంతో యువకులు ప్రమాదాల బారిన పడితే తల్లిదండ్రులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్సై అన్నారు.

## సర్వేలకు సహకరించండి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : 'మీ అందరికీ ఫోన్లు చేసే ఓపిక లేక.. రోజులో ఎంతమందితో మాట్లాడను.. డిజిటల్ సహాయకులకు ఫోన్ చేసి ఎంతమంది సిబ్బంది ఉన్నారో తెలుసుకుని, వారందరికీ సమాచారం చెప్పాల్సి వస్తోంది..' అని సచివాలయాల మండలస్థాయి అధికారి జి.రవి ఆవేదన వ్యక్తం చేశారు. సమనసలో సోమవారం సచివాలయాన్ని సందర్శించేందుకు వచ్చిన ఆయన యుఎఫ్ఎస్ సర్వే చేయకపోవడంపై మండిపడ్డారు. సర్వేలు, ఇతర పనులు చేయకుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ఏ పనిచేసినా ఫొటోలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయాలని సూచించారు. యుఎఫ్ఎస్ సర్వే సక్రమంగా చేయకుంటే సచివాలయ సిబ్బందితోపాటు తాను బాధ్యత వహించాల్సి వస్తోందన్నారు. పంచాయతీ కార్యదర్శి మణికంఠ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా పేదలకు అందిస్తున్న సామాజిక భద్రతా పింఛన్లను నూతన సంవత్సరం సందర్భంగా లబ్ధిదారులకు ఒక రోజు ముందుగానే అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టర్ మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి పింఛన్ల పంపిణీపై సమీక్ష చేశారు. ఈ నెల 30న బ్యాంకుల నుంచి సచివాలయాల వారీగా నగదు విత్‌డ్రా చేసుకుని 31వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీ ప్రారంభించాలన్నారు.

## మహిళా క్లబ్ సేవలు ప్రశంసనీయం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం పట్టణంలో వాకర్స్ మహిళాక్లబ్‌కు పుత్సా కృష్ణకామేశ్వర్, గోటేటి గంగాధర్‌లు ఎనలేని సేవలు అందించారని అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి తెలిపారు. భూపయ్యఅగ్రహారంలో వాకర్స్ మహిళాక్లబ్ సమావేశం కార్యదర్శి లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ఉత్తమ అధ్యక్షురాలిగా అవార్డు పొందిన అనంతలక్ష్మి, కృష్ణకామేశ్వర్, గంగాధర్‌లను అభినందించారు. పోలిశెట్టి అనంతలక్ష్మి, విజయలక్ష్మి, రామతులసి, సుబ్బలక్ష్మి, సత్యకుమారి, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేత

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం భారతీయ స్టేట్ బ్యాంకు ఖాతాదారుడి పేరున ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద మంజూరైన రూ.2 లక్షలు ప్రమాద బీమా చెక్కును బాధిత కుటుంబానికి బ్యాంకు మేనేజరు వై.ఎల్ శ్రీధర్ సోమవారం అందజేశారు. లంక ఆఫ్ ఠాణేలంకకు చెందిన కొప్పిశెట్టి గంగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. అతని పేరున ఎస్బీఐ ముమ్మిడివరం మెయిన్ బ్రాంచిలో తన ఖాతా నుంచి పీఎంఎస్‌బీవై బీమా చేశారు. ఆ కుటుంబానికి మంజూరైన ప్రమాద బీమా చెక్కును బ్యాంకు అధికారులు మృతుడి భార్య రాజేశ్వరికి అందజేశారు.

## ఏఐజీఎన్ఐటీఈ ఎంతో మేలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే : విద్యార్థులను వివిధ రంగాల్లో ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు, సాంకేతిక ప్రతిభను వెలికితీసేందుకు నేషనల్ లెవల్ వన్‌డే హాక్‌థాన్(ఏఐజీఎన్ఐటీఈ) ఎంతో ఉపయోగపడుతుందని కాకినాడ జేఎన్‌టీయూ డైరెక్టరు డా.ఎన్ బాలాజీ, ప్రొ.ఎన్.రామకృష్ణయ్య అన్నారు. చెయ్యేరులోని శ్రీనివాస స్వయంప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, వి క్యూబ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నేషనల్ లెవల్ వన్‌డే హాక్‌థాన్ ఏఐజీఎన్ఐటీఈ ప్రారంభించారు. డీవీఎన్ఎస్ వర్మ, సురేష్ బాబు, వై.వెంకట్, రత్నరాజు, గణపతిరాజు,అరుణ్‌కుమార్, రవికుమార్, పి.మోహన్, సాయిప్రియ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు

## ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్ల లోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి నూతన క్యాలెండర్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు సోమవారం ఆవిష్కరించారు. ఆలయ ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణతో కలిసి స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈఓ సత్యనారాయణ, పర్యవేక్షణాధికారి కఠారి శ్రీనివాసరాజు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, మాజీ ఛైర్మన్‌లు పాల్గొన్నారు.

క్యాలెండర్లు చూపిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు తదితరులు

(c) eenadu

# మండపేట

•మండపేట •రామచంద్రపురం

## రాష్ట్ర రగ్బీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

పవన్

మణికంఠ

రామచంద్రపురం: ఇందిరాగాంధీ పురపాలకోన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు పోలిశెట్టి వీర లోకేశ్ పవన్, రెడ్డిగణేష్ మణికంఠ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం చేగొండి వీరవెంకట సత్యనారాయణ తెలిపారు. ఈనెల 27న పిఠాపురంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభతో రాష్ట్రస్థాయికి అర్హత సాధించి కర్నూలులో జరిగే పోటీలకు వెళ్లారని పేర్కొన్నారు.

## ముగిసిన దశావతారాల పూజలు

అంగర, న్యూస్‌టుడే: అంగరలోని రుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా నిర్వహిస్తున్న దశావతార పూజలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. దేవస్థానం అర్చకులు సంపర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాల్లో చివరి రోజు స్వామివారిని కల్కి అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం కల్పించి సామూహిక పుష్పార్చన నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

కల్కి అవతారంలో శ్రీవేణుగోపాలస్వామి

## రెండు మండలాలు, పట్టణంతో రెవెన్యూ డివిజన్

### రాష్ట్రంలో ఇదొక రికార్డు: మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ రాష్ట్రంలో ఒక రికార్డుగా మిగులుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోమవారం మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. అమరావతిలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌ను కొనసాగించేందుకు ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేశారని పేర్కొన్నారు. దీంతో వైకాపా మోసపూరిత ప్రచారానికి తెరపడినట్లయిందన్నారు. కొంతకాలంగా రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ ఎత్తేస్తున్నారని ప్రజలను తప్పుదారి పట్టించారని, రెవెన్యూ డివిజన్‌తో పాటు యథావిధిగా సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయం రామచంద్రపురంలోనే కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. రామచంద్రపురం, కె.గంగవరం రెండు మండలాలు, ఒక పట్టణంతో పరిపాలన సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు సుభాష్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రితో కరచాలనం చేస్తున్న మంత్రి సుభాష్

## తిరుమలలో ఎమ్మెల్యేకు అభినందన

మండపేట, న్యూస్‌టుడే: మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేస్తూ సోమవారం క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనానికి తిరుమల చేరుకున్న ఆయనకు పలువురు ఫోన్లుచేసి అభినందించారు. శ్రీవారి దర్శనం నిమిత్తం తిరుమల చేరుకున్న రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ దంపతులు ఎమ్మెల్యేను అతిథి గృహంలో కలిసి సత్కరించారు.

ఎమ్మెల్యే జోగేశ్వరరావును సత్కరిస్తున్న లీలాకృష్ణ దంపతులు

### కూటమి నాయకుల సంబరాలు..

కూటమి నాయకులు సోమవారం రాత్రి పట్టణంలోని కరాచీ సెంటరులో కేక్‌కోసి మిఠాయిలు పంపిణీచేశారు. పార్టీ జెండాలు పట్టుకుని ర్యాలీగా తిరుగుతూ సంబరాలు చేసుకున్నారు. కూటమి నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, మల్లిపూడి గణేశ్వరరావు, ఉంగరాల రాంబాబు, కోన సత్యనారాయణ, వాదా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలో రాంబాబు, కూటమి నాయకులు

## బృహత్ ప్రణాళిక అమల్లో మరింత జాప్యం

### గెజిట్ నోటిఫికేషన్ విడుదల ఎప్పుడు..?

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణాన్ని భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) అమల్లో మరింత జాప్యం చోటుచేసుకుంటోంది. దీనిపై ప్రభుత్వం జీవో విడుదల చేసి అభ్యంతరాల సేకరణకు ఇచ్చిన 90 రోజుల గడువు ముగిసినా గెజిట్ ఆమోదం పొందలేదు. దీనివల్ల పట్టణంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. పురపాలక సంఘం ఇటీవల ప్రత్యేక గ్రేడ్ స్థాయికి చేరినా బృహత్ ప్రణాళిక మాత్రం గెజిట్ అమలుకు నోచుకోక పడకేసింది.

**తొలి నుంచి ఆలస్యమే..**

రాష్ట్రంలోని ప్రతి పట్టణానికి 20 సంవత్సరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చేపట్టే అభివృద్ధి పనులతో పాటు పెరుగుతున్న జనాభా, పట్టణ విస్తరణ పనులను చేర్చుతూ బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) తయారు చేస్తారు. మండపేటకు సంబంధించి 2018 నాటికే 20 సంవత్సరాలు పూర్తవడంతో అప్పట్లోనే ప్రభుత్వం ఏజెన్సీలను నియమించి నూతన ప్రణాళిక తయారుచేయాలని ఆదేశాలు జారీచేసింది. దీనిపై చర్చించేందుకు 2019 ఎన్నికలకు ముందు పట్టణంలోని ప్రముఖులతో ఉమ్మడి సమావేశాల్ని నిర్వహించారు. సంబంధిత ఏజెన్సీ సిబ్బంది పురపాలక పరిధిలో కొలతలు వేసి బృహత్ ప్రణాళిక తయారుచేశారు. గత ప్రభుత్వ హయాంలోనే డ్రాఫ్ట్ ప్లాన్ వచ్చినప్పటికి కొన్ని మార్పులు, చేర్పులు చేస్తూ ప్లాన్‌ను ఆమోదం కోసం పంపారు. అప్పటి నుంచి డ్రాఫ్ట్ ప్లాన్ ఆమోదించినట్లు ప్రభుత్వం నుంచి ఎలాంటి జీవో విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ సంవత్సరం జూన్ 25వ తేదీన ఆమోదం తెలుపుతూ జీవో విడుదలైంది. దీనికి 90 రోజుల గడువులో అభ్యంతరాలు సేకరించి మళ్లీ కౌన్సిల్ ఆమోదం ద్వారా ప్రభుత్వానికి పంపాల్సి ఉండగా పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతో మూడు నెలలు దాటిన తరువాత కౌన్సిల్ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదించారు. దీనికి ఇంతవరకు పూర్తిస్థాయిలో ఆమోదం తెలిపినట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాలేదు.

మండపేట పట్టణం డ్రోన్ చిత్రం

**ఇవీ ఉపయోగాలు..**

భవిష్యత్తులో రెండు దశాబ్దాల పట్టణావసరాలను దృష్టిలో ఉంచుకుని సమీపంలోని అయిదు గ్రామాలను విలీనం చేస్తూ జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) విధానంలో ప్లాన్‌ను తయారుచేశారు. సమీపంలోని అర్తమూరు, తాపేశ్వరం, ఇప్పనపాడు, ఏడిద, మారేడుబాక గ్రామాలను కొత్తగా పట్టణ పరిధిలోకి తీసుకువచ్చారు. ప్లాన్ పూర్తిగా అమల్లోకి వస్తే ఆయా గ్రామాల్లో నిర్మాణాలకు కొత్త నిబంధనల ప్రకారం చేపట్టాల్సి ఉంటుంది. భవిష్యత్తులో ఆయా గ్రామాలు మండపేటలో విలీనం కానున్న దృష్ట్యా పట్టణ జనాభా పెరిగి సెలెక్షన్ గ్రేడ్ స్థాయికి మున్సిపాలిటీ స్థాయి పెరిగే అవకాశం ఉంది. అదే జరిగితే అధికారుల సంఖ్య పెరుగుతుంది. కొత్త ప్లాన్ అమల్లోకి వస్తే గత ప్లాన్ ప్రకారం పారిశ్రామికవాడగా ఉన్న విజయలక్ష్మినగర్, సత్యశ్రీరోడ్డు, వంటి ప్రాంతాలను శ్వేత నివాస ప్రాంతాలుగా గుర్తిస్తారు. ఫలితంగా స్థిరాస్తి రంగం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలకు అనుమతులు రాక గృహాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరుకుగా ఉండే ప్రధాన రహదారులన్నీ ప్లాన్ ఆమోదంతో విస్తరణకు నోచుకుంటాయి. ట్రాఫిక్ అంతరాయాల నివారణకు రింగురోడ్డు ఏర్పడుతుంది. ఇన్నేళ్ల బృహత్ ప్రణాళిక అమలులోనే సాకారమవుతాయని అధికారులు చెబుతున్నారు.

**జనవరిలో గెజిట్ వస్తుంది..**

మాస్టరు ప్లాన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేయడానికి గడువు ముగియడంతో కౌన్సిల్ తీర్మానంతో గత నవంబరులో ఆమోదానికి పంపించాం. దీనిపై ప్రభుత్వం వచ్చే జనవరిలో పచ్చజెండా ఊపి గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు ఆమోదం తెలిపే అవకాశం ఉంటుంది.

– టి.వి.రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

## రామావతారంలో వేంకటేశ్వరుడు

రాయవరం: రాయవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడో రోజైన సోమవారం దశావతార మహోత్సవాలు వైభవంగా సాగాయి. ప్రత్యేక పూజల నంతరం మూలవిరాట్‌ను రామావతారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అంతకుముందు ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు శోభనాద్రి ప్రసాద వితరణ చేశారు. వేంకటేశ్వర భక్త సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆలయం వద్ద ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నారు.

## పింఛన్ల కోసం దరఖాస్తులు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మూడు అర్జీలు వచ్చాయని ఆర్డీవో అఖిల తెలిపారు. వృద్ధాప్య పింఛను కోరుతూ ఒకటి, పింఛను కావాలని మరొకటి, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి పింఛను మంజూరుచేయించాలని మూడో వినతి వచ్చాయని ఆర్డీవో తెలిపారు.

## ఉత్తర ద్వార దర్శనానికి సిద్ధం

మండపేట, న్యూస్‌టుడే: హిందువులకు అతి ముఖ్యమైన పర్వదినం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనాలకు విచ్చేసే భక్తుల కోసం పట్టణంలోని జనార్దనస్వామి ఆలయం, కలువపువ్వు సెంటరులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానానికి ఉత్తరం వైపు అయిదు వరుసలతో క్యూలు, బారికేడ్లు పెట్టారు. దీనివల్ల ఎంతమంది వచ్చినా క్యూలోనే ఇబ్బందిలేకుండా సాఫీగా దర్శనం చేసుకునేలా అవకాశం కల్పిస్తున్నారు. మంగళవారం వేకువజామున నాలుగు గంటల నుంచే దర్శనాలు కల్పిస్తున్నారు. భక్తులు అందించిన విరాళాలతో వివిధ రకాల పూలతో తోరణాలు నెలకొల్పి ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. సంగీత విభావరి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించనున్నాయి.

ఉత్తరద్వార దర్శనాలకు ఏర్పాటుచేసిన క్యూలు

**రామచంద్రపురంలో...**

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంలోని వైష్ణవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. రాజగోపాల్ సెంటర్‌లోని సీతారామభక్త ఆంజనేయస్వామి ఆలయాన్ని విద్యుదీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తిరంజని భజన కార్యక్రమాలతో ముక్కోటి పూజలు ప్రారంభించేలా నిర్వాహకులు చర్యలు చేపట్టారు. తెల్లవారుజామున 4.30 గంటలకే కలశస్థాపనతో వేడుకలు మొదలవుతాయి. ద్రాక్షారామకు చెందిన రెండు భజన బృందాలతో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు ఏకాహ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా ఉత్తరద్వార దర్శనాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. హౌసింగ్‌బోర్డు గోవింద క్షేత్రంగా పిలిచే శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ఏడుటేకి గుమ్మాలను ధవళవస్త్రాలతో ఉత్తర ద్వారంగా అలంకరించారు. మార్కెట్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. శివాలయంవీధిలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక దర్శనాలు కల్పిస్తున్నారు.

రామచంద్రపురంలో విద్యుత్తు వెలుగుల్లో ఆలయం

## పెండింగ్ రుణాల మంజూరుకు చర్యలు

మండపేట, న్యూస్‌టుడే: టిడ్కో లబ్ధిదారులకు కేటాయించాల్సిన రుణాలు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని, ఆయా బ్యాంకర్లతో మాట్లాడి అవసరమైన దస్త్రాలు సమర్పించి వెంటనే మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు వెల్ఫేర్, ప్లానింగ్ కార్యదర్శులు, రిసోర్స్‌పర్సన్లు, మెప్మా సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాలుపొందిన లబ్ధిదారులంతా త్వరగా గృహ ప్రవేశాలు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ విషయంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న వార్డు సభ్యులు

## ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని వినతి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ పంచాయతీ పాలకవర్గ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సోమవారం కార్యదర్శి సత్యనారాయణకు పలువురు వార్డు సభ్యులు వినతిపత్రం సమర్పించారు. పాలకవర్గంలోని మొత్తం 14 మంది సభ్యులు గత మూడు సమావేశాలకు హాజరుకాకపోవడంతో కోరం లేక వాయిదాపడ్డాయి. సభ్యుల గైర్హాజరుతో తీర్మానాలపై చర్చ జరగక అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామని సర్పంచి కొత్తపల్లి అరుణ ఇటీవల కలెక్టరుకు వినతి పత్రం సమర్పించారు. దీనిపై సభ్యులు స్పందిస్తూ తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ఒంటెత్తుపోకడలకు వ్యతిరేకమని పేర్కొంటూ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కార్యదర్శికి వినతిపత్రం అందించారు. సర్పంచి ఏకపక్ష నిర్ణయాలతో సభ్యులు సమావేశాలకు దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి పెన్నాడ బుచ్చిరాజు, సభ్యులు పాల్గొన్నారు.

## విలీన విజయోత్సవాలు

రాయవరం, న్యూస్‌టుడే: మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంతో సోమవారం విలీన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాయవరంలో గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు ఆధ్వర్యంలో కూటమి నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నిరంతరం విలీనంపై దృష్టిసారించి నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన ఘనత ఎమ్మెల్యే వేగుళ్లకే దక్కుతుందని చెప్పారు. తిరుమలలో ఉన్న ఎమ్మెల్యే వేగుళ్లకు పలువురు చరవాణి ద్వారా అభినందనలు తెలిపారు. ఎన్టీఆర్ కూడలిలో బాణసంచా కాల్చుతూ, మిఠాయిలు పంచుతూ హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దేవిశెట్టి కోటేశ్వరరావు (చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

**అంగర:** మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడంపై రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ విలీనానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ అంశంలో ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వాటిని సమర్థంగా ఎదుర్కొని విలీనం చేయడానికి చేసిన కృషి అభినందనీయమన్నారు.

బాలికలను ఓదార్చుతున్న పూర్వ విద్యార్థులు

## బాధిత కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ఇటీవల మృతిచెందిన ఉట్రుమిల్లి గ్రామానికి చెందిన పితాని రాధాకృష్ణ కుటుంబానికి రామచంద్రపురంలోని ఎస్‌కేపీజీ పాఠశాల 1996-97 బ్యాచ్ విద్యార్థులు రూ.లక్ష ఆర్థికసాయం సోమవారం అందించారు. రాధాకృష్ణతో కలిసి చదువుకున్న వీరు బాధిత కుటుంబ సభ్యులకు అండగా నిలవాలని తీర్మానించారు. మృతుని ఇద్దరు కుమార్తెలను ఓదార్చి తగిన విధంగా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిల్లి ప్రసాద్, స్వరాజ్‌కుమార్, పిల్లి రాంబాబు, వరహాలరావు, దుర్గాదేవి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

## క్విజ్‌లో ప్రతిభ.. విజేతల ధీమా

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

క్విజ్‌లో పాల్గొన్న నారాయణ పాఠశాల విద్యార్థులు

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని నారాయణ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ప్రతిభను చాటారు. జాతీయ, అంతర్జాతీయ సంఘటనలు, నియామకాలు, రాజీనామాలు, క్రీడలు, ప్రముఖుల మరణాలు, పుస్తకాలు, వాటి రచయితలు, సినిమాలు, ముఖ్య దినోత్సవాలు, ఎబ్రివేషన్లు, రాష్ట్రాలు.. వాటి రాజధానులు, ఆవిష్కరణలు, ఆవిష్కర్తలు, జనరల్ నాలెడ్జికి సంబంధించిన క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో 7వ తరగతి విద్యార్థి ఎస్.నాని ప్రథమ బహుమతి, 8వ తరగతి విద్యార్థి ఎస్.హర్షిత్ ద్వితీయ బహుమతి, 9వ తరగతి విద్యార్థిని ఎస్.ప్రసన్నలక్ష్మి తృతీయ బహుమతి సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయురాలు బి.పావని 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను అందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా శ్రీనివాసరెడ్డి, షేకర్‌బాబు, సోమశేఖర్ వ్యవహరించారు.

విజేతలతో నారాయణ ప్రధానోపాధ్యాయురాలు పావని

ప్రతిభాపాటవ పోటీలో విద్యా వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు

**విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో..**

విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఎబ్రివేషన్లు, జనరల్ నాలెడ్జికి సంబంధించిన క్విజ్ పోటీలో ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎన్.శ్రావణి ప్రథమ బహుమతి, ప్రథమ సంవత్సరం విద్యార్థిని బి.పల్లవి ద్వితీయ బహుమతి, షేక్ ఆలీష్‌బాబా తృతీయ బహుమతి అందుకున్నారు. వీరికి కళాశాల కరస్పాండెంట్ వ్రె సత్యనారాయణ, ప్రిన్సిపల్ టి.దుర్గారావు బహుమతులు అందించారు. ఎం.దుర్గాభరణి, వి.వెన్నెల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

విజేతలతో కరస్పాండెంట్ సత్యనారాయణ

## హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

పామర్రు, న్యూస్‌టుడే: మన దేశం కర్మ, యోగ, దేవ, భూమి అని. హిందూ ధర్మంతో పెనవేసుకున్న దేశంలో హిందూ ధర్మాన్ని కాపాడడానికి ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందని ప్రపంచ వాసవీ మహా పీఠాధీశ్వరులు శ్రీధర్ స్వామీజీ అన్నారు. కోటిపల్లిలోని గౌతమీ గోదావరి తీరంలో సోమవారం హిందూ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పాశ్చాత్య సంస్కృతికి దూరంగా ఉండాలని హితవు పలికారు. ఉమ్మడి కుటుంబాల ఆవశ్యకత వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ ప్రముఖ్ వీరభద్రరాజు మాట్లాడుతూ హిందూ సంస్కృతి, ధర్మం, ప్రస్తుతం నడుస్తున్న విపరీత ధోరణుల గురించి వివరించారు. రామచంద్రపురం శాఖ నిర్వాహకుడు సూర్యనారాయణ ప్రబోధ గీతాలు ఆలపించి అలరించారు. కె.గంగవరం శరణ్య పాఠశాల చిన్నారులు పౌరాణిక అంశాలపై భరతనాట్యంతో ఆకట్టుకున్నారు. కూటమి నాయకుడు వాసంశెట్టి సత్యం, భాజపా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కర్రి చిట్టిబాబు, కూటమి నాయకులు పప్పుల మసేను వెంకన్న (శ్రీనుబాబు) తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న శ్రీధర్ స్వామీజీ

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని ద్వారపూడి జడ్పీ బాలికోన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని నిచ్చెనకోళ్ల కౌసల్య విజ్ఞప్తి చేసింది. తన పుట్టినరోజు సందర్భంగా పాఠశాల ఆవరణలో సోమవారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి మామిడిమొక్కలు నాటిన ఆమె ప్రతి ఒక్కరూ ప్రత్యేక సందర్భాల్లో ఒక మొక్కైనా నాటాలని కోరింది. కార్యక్రమంలో హెచ్‌ఎం బత్తిన రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు కర్రి సునీత, జ్యోతి, విద్యా కమిటీ ఛైర్మన్ కె.మురళి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సారథి ధర్మరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న విద్యార్థి

## నూరు శాతం ఉత్తీర్ణతకు వంద రోజుల ప్రణాళిక

కాజులూరు, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ప్రస్తుత వంద రోజులు కీలకమైన కాలమని, ఉత్తీర్ణత శాతం పెంపునకు సమర్థవంతమైన ప్రణాళిక అవసరమని దత్తత అధికారి ఎంపీడీవో జె.రాంబాబు చెప్పారు. సోమవారం కుయ్యేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. వంద రోజుల ప్రణాళిక వివరాలు అడిగి తెలుసుకుని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రణాళికలో భాగంగా విద్యార్థుల మానసిక స్థైర్యాన్ని పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## అభ్యంతర ఫ్లెక్సీలు తొలగించాలని వినతి

రాయవరం, న్యూస్‌టుడే: పసలపూడిలో భాజపా, జనసేన నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలపై దురుద్దేశపూర్వకంగా వైకాపా నాయకులు తమ ఫ్లెక్సీలు బిగించడంపై భాజపా నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారు. సోమవారం ఎంపీపీ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. తాము ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలపై వైకాపా నాయకులు బ్యానర్లు పెట్టించడం గత ఏప్రిల్‌లోనూ జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలాంటి సంస్కృతిని చూసీచూడనట్లు వదిలేస్తే గ్రామాల్లో ఉద్రిక్తతలకు కారణమవుతాయని ఆందోళన వ్యక్తంచేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకీ రాంబాబు, మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్, జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి శివయ్య, చిరట్ల సుబ్బారావు, చింతా తమ్మిరెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి బ్రహ్మయ్యచౌదరి, మద్దా మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న భాజపా నాయకులు

## చిత్రలేఖనంలో బహుమతులు

మండపేట: మండపేటకు చెందిన మదర్‌థెరిసా ఫైన్ ఆర్ట్స్ అకాడమీ 19వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆన్‌లైన్ చిత్రలేఖనం పోటీలో 200 మంది బహుమతులు సాధించినట్లు అకాడమీ అధ్యక్షుడు మందపల్లి సత్యానందం తెలిపారు. విజేతలకు సర్టిఫికెట్లు, పేదలకు వస్త్రదానం చేశారు.

## నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

మండపేట: రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సూచించారు. సోమవారం 18వ వార్డులో రూ.27 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను ఆమె పరిశీలించారు.

## సాగునీటి వృథాకు తలుపులతో అడ్డుకట్ట

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం ప్రధాన పంటకాలువ పక్కనున్న కొండయ్యకాలువ నుంచి మూడు రోజులుగా వృథాగా పోతున్న సాగునీటి ప్రవాహాన్ని ఎట్టకేలకు అరికట్టారు. ఈ కాలువకు నీటిని విడుదలచేసే సర్‌ప్లస్ తలుపులు విరిగిపోవడంతో విలువైన సాగునీరు వృథాగా పోయింది. దీంతో స్పందించిన నీటి సంఘాల ప్రతినిధులు పాడైన గేట్ల స్థానంలో సోమవారం రెండు కొత్త తలుపులు బిగింపజేశారు. రూ.లక్ష వ్యయంతో తలుపులతో పాటు, గడ్డర్లు, మూడు అంగుళాల ఛానల్‌కు ఆరుబార్లు ఏర్పాటుచేస్తున్నామని కూళ్ల డీసీ ఛైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. మాచర నీటి సంఘం అధ్యక్షుడు కొరపాటి జానకిరామయ్య, మాజీ అధ్యక్షుడు త్రిపురశెట్టి నాని, జల వనరుల శాఖ అధికారులతో కలిసి పూజలు నిర్వహించి గేట్లను ప్రారంభించారు. ఆయా పనులను గోదావరి తూర్పు డివిజన్ ఈఈ వీవీరామకృష్ణ పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సాగునీటి సంఘాల సమన్వయంతో పనులు పూర్తిచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి సాకా శ్రీనివాస్, ఏఈలు కృష్ణత్రిమూర్తులు, సాధు సుందర్‌సింగ్, లాకు సూపరింటెండెంట్ సత్యవతి పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న నీటి సంఘాల నాయకులు, అధికారులు

(c) eenadu

# ఈనాడు తూర్పుగోదావరి

మంగళవారం డిసెంబరు 30, 2025



# కొత్త కూర్పు.. జిల్లాలో మార్పు

టి.నగర్, న్యూస్‌టుడే: జిల్లాల పునర్విభజన, నియోజకవర్గాల విలీనంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తూర్పుగోదావరి జిల్లా రూపురేఖలు మారనున్నాయి. ఇప్పటివరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలో విలీనం చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. దీంతో జిల్లా స్వరూపం మారనుంది.




**8..** ప్రస్తుతం జిల్లాలో రాజమహేంద్రవరం నగరం, గ్రామీణం, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలు ఉన్నాయి. మండపేట చేరడంతో అసెంబ్లీ స్థానాలు 8కు చేరతాయి. మండపేట పార్లమెంట్ పరిధి మాత్రం అమలాపురంలోనే కొనసాగుతుంది.

## తూర్పుగోదావరిలోకి మండపేట నియోజకవర్గం

**22..** జిల్లాలో 19 మండలాలు ఉండగా, మండపేటలోని మూడు మండలాలు కలవడంతో ఆ సంఖ్య 22కు చేరుతుంది. 299 గ్రామాలు ఉండగా ఆ సంఖ్య దాదాపు 320 దాటనుంది. 2.5 లక్షల జనాభా అదనంగా పెరుగుతుంది. రెవెన్యూ డివిజన్‌లో ఎలాంటి మార్పులు ఉండవు.

| | ప్రస్తుతం | కొత్త |
|---|---|---|
| నియోజకవర్గాలు | 7 | 8 |
| జనాభా(లక్షల్లో) | 18.32 | 20.5 |
| రెవెన్యూ డివిజన్లు | 2 | 2 |
| మండలాలు | 19 | 22 |
| పురపాలికలు | 3 | 4 |

## సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ రేపు

### రూ.102 కోట్లు విడుదల

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): జిల్లాలో 2,34,076 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఈనెల 31న పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జనవరి సంబంధించిన పింఛన్లను ఒకరోజు ముందుగా ఇవ్వనున్నట్లు వివరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశమందిరం నుంచి జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 31న పింఛన్ల పంపిణీకి రూ.102.82 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.

## అడ్డంగా నరికేసి.. అక్రమంగా నొక్కేసి..

### కాలువ గట్లపై అనధికారికంగా చెట్ల నరికివేత

☛ రెండు నెలల క్రితం గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలో 50 ఏళ్లనాటి మర్రి చెట్టును అనధికారికంగా నరికేశారు. దాన్ని రాజమహేంద్రవరం శివారులోని ఓ ప్రాంతానికి తరలిస్తుండగా రాజానగరం వద్ద అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు.

☛ విజయవాడ ప్రాంతానికి చెందిన ముగ్గురు గుత్తేదార్లు కొవ్వూరు డివిజన్‌లోని కాలువ గట్లపై చెట్లు తీసుకునేందుకు అనుమతులు తీసుకున్నారు. వివాదాల కారణంగా ఒక్కరే మిగిలారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తుండటంతో మిగిలిన ఇద్దరూ ఫిర్యాదు చేయడంతో నిలిపేశారు.

రాజానగరం, కడియం, గోపాలపురం, న్యూస్‌టుడే: కొంతమంది అక్రమార్కులు మట్టి, ఇసుకనే కాదు చెట్లను సైతం వదలట్లేదు. అనధికారికంగా నరికి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాలు, రహదారి పక్కన చెట్లు నరకాలంటే కచ్చితంగా అనుమతులు తీసుకోవాలి. అభివృద్ధి పనులకు అయినా సరే తొలగించాలంటే అనుమతులు తప్పనిసరి. అలాంటిదేం లేకుండా కాలువ గట్లపై చెట్లను నరికేస్తున్నారు.

చెరుకుమిల్లి సమీపంలో కాలువ గట్లపై అనధికారికంగా నరికిన దుంగలు

### టన్ను కలప.. రూ.8వేలు..

గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, తాళ్లపూడి, చాగల్లు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో సమస్య ఎక్కువగా ఉంది. వేప, చింత, నిద్రగన్నేరు, జామాయిల్, జీడిమామిడి తదితర చెట్లకు మార్కెట్లో డిమాండ్ ఉంది. కొవ్వూరు డివిజన్‌లోని 20 గ్రామాల పరిధిలో రోజుకు 200 నుంచి 250 టన్నుల కలప అనధికారికంగా తరలిస్తున్నట్లు సమాచారం. మంచి రకం టన్ను రూ.8 వేలకు టింబర్‌లకు విక్రయిస్తున్నారు. సాధారణ రకమైతే టన్ను రూ.3వేల నుంచి రూ.4వేలు చొప్పున పొగాకు బ్యారెన్లు, ఇటుక బట్టీలకు అమ్ముకుంటున్నారు. నెలకు రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది.

### అక్కడి నుంచి ఇక్కడకు..

తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 11 గంటల మధ్యలో నరికేస్తున్నారు. ఆపై ఆటోలు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. తనిఖీలు లేకపోవడంతో యథేచ్ఛగా సాగిపోతోంది. గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో పొగాకు బ్యారెన్లు ఉండటంతో కలప, పుల్లలకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లోని అటవీ ప్రాంతాల్లోని చెట్లను నరికి ఈ ప్రాంతాల్లో అధిక రేటుకు విక్రయిస్తుండటం గమనార్హం.

❖ అనుమతులు లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో చెట్లు నరకడం నేరమని డీఎఫ్‌వో ప్రభాకరరావు హెచ్చరించారు. కేసు నమోదుతో పాటు చర్యలు తీసుకుంటామన్నారు.

## ముక్కోటికి వాడపల్లి సిద్ధం

ఆత్రేయపురం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారు మంగళవారం శేషపానుపై ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని సుగంధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.

## చూడండి.. కనికరించండి..!

ఈ చిత్రం కదలలేని స్థితిలో ఉన్న వ్యక్తి పేరు తమ్మన గోపాలశివగణేష్ (15). పుట్టినప్పటి నుంచి మంచానికే పరిమితం అయ్యారని తల్లి వాపోతున్నారు. బొమ్మూరు మురళీకొండకు చెందిన గోపాలశివగణేష్ బహుళ వైకల్యంతో బాధపడుతున్నారు. తల్లి గీతాకుమారి గృహిణి కాగా తండ్రి వెంకటేశ్వరరావు ఒక దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్నారు. వచ్చే వేతనంతో కుటుంబాన్ని నెట్టుకురావడమే కష్టమవుతోంది. సాధారణ దివ్యాంగులకు ఇచ్చే రూ.6 వేల పింఛను ఔషధాలకు కూడా సరిపోవట్లేదని, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికిచ్చే రూ.15వేల పింఛను ఇవ్వాలని కోరుతున్నారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో అర్జీ అందించారు.

-న్యూస్‌టుడే, వీఎల్‌పురం

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

## 'రెవెన్యూ క్లినిక్'తో భూసమస్యలకు పరిష్కారం

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో ప్రతి వారం జరిగే పీజీఆర్ఎస్‌తో పాటు రెవెన్యూ క్లినిక్ నిర్వహించడం ద్వారా భూసంబంధ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా సంయుక్త కలెక్టర్ వై.మేఘా స్వరూప్ అన్నారు. జిల్లాలో తొలిసారిగా రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లాలోని 19 మండలాల తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా భూసంబంధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ ఫిర్యాదులకు సంబంధించిన మూడు అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటికి సంబంధించి సమస్య ఏ స్థాయిలో ఉందో గుర్తించి తగిన ఎండార్స్‌మెంట్ జారీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి అవసరం లేకుండా ఒకే వేదికపై భూసంబంధ సమస్యలు పరిష్కరించడమే రెవెన్యూ క్లినిక్ ప్రధాన ఉద్దేశమన్నారు.

కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు

## పలు రైళ్లు ఆలస్యం.. ప్రయాణికుల నిరీక్షణ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: యలమంచిలి వద్ద టాటానగర్-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ బోగీల్లో అగ్నిప్రమాదం కారణంగా జిల్లా మీదుగా పలు రైళ్లు 3-5 గంటలు ఆలస్యంగా నడిచాయి. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఈ క్రమంలో హెల్ప్‌డెస్క్ పెట్టారు.

❖ విశాఖపట్నం వైపు నుంచి వచ్చే ఈస్ట్‌కోస్ట్ ప్రధాన రైల్వేస్టేషన్‌కు ఉదయం 6.53కు రావాల్సింది 11.33 గంటలకు వచ్చింది. ❖ 6.03కు రావాల్సిన పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ 11.20 గంటలకు, 7.44కు రావాల్సిన బెంగళూరు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 12.48 గంటలకు, 9.19కు చేరాల్సిన జన్మభూమి 12.08 గంటలకు వచ్చింది. 10.13కు చేరాల్సిన తిరుచ్చిరాపల్లి సూపర్‌ఫాస్ట్ మధ్యాహ్నం 2 గంటలకు, 10.38కు రావాల్సిన సింహాద్రి మధ్యాహ్నం 1.35 గంటలకు, 11.03కు రావాల్సిన స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ 12 గంటలకు వచ్చాయి. ◆ ప్రమాదానికి గురైన ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ ప్రధాన రైల్వేస్టేషన్‌కు బుధవారం ఉదయం 11.37 గంటలకు వచ్చింది.

రాజమహేంద్రవరం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

### మూడు రైళ్లు రద్దు

యలమంచిలి రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రైలు బోగీల్లో అగ్నిమాద ఘటన కారణంగా రాజమహేంద్రవరం, విశాఖపట్నం, కాకినాడ మధ్య నడిచే మూడు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. సోమవారం విశాఖపట్నం-రాజమహేంద్రవరం(67286), విశాఖపట్నం-కాకినాడ ఓడరేవు(17268) రైళ్లు రద్దుకాగా మంగళవారం రాజమహేంద్రవరం-విశాఖపట్నం(67285) రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## ఆందోళన వీడి.. స్వస్థలాలకు పయనమై..

### రైలు ప్రమాద బాధితులకు సామర్లకోటలో సాంత్వన

సామర్లకోట, గ్రామీణం: అనకాపల్లి జిల్లా యలమంచిలి పరిధిలో టాటానగర్-ఎర్నాకుళం రైలు బోగీల్లో అగ్నిప్రమాద ఘటన నుంచి బయటపడిన 124 మందిని అధికారులు ప్రత్యేక బస్సుల్లో సామర్లకోట స్టేషన్‌కు చేర్చి.. ఇక్కడ్నుంచి వారి గమ్యస్థానాలకు పంపించారు. సోమవారం ఉదయం 8 గంటలకు సామర్లకోట వచ్చిన వారికి రైల్వేస్టేషన్ వద్ద వారికి భీమేశ్వర లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అల్పాహారం, తాగునీరు అందించారు. స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో మూడు విశ్రాంతి గదుల్లో వారిని ఉంచారు. అనంతరం అధికారులు సామర్లకోట స్టేషన్‌కు రప్పించిన అదే రైలులోని కాలిపోయిన మూడు బోగీలను తొలగించి, మిగిలిన బోగీలను ఉదయం 9.10 గంటలకు సామర్లకోట రైల్వేస్టేషన్‌లోని రెండో నంబరు ప్లాట్ ఫారంపై ఉంచారు. రాజమహేంద్రవరం నుంచి తెచ్చిన ప్రత్యేక బోగీలను అమర్చి ప్రయాణికులకు రిజర్వేషన్ నంబర్ల ప్రకారం సీట్లు కేటాయించారు.

### కేకలు వేసి అందరినీ లేపా..



వేగంగా వెళ్తున్న రైలు బోగీలో దట్టమైన పొగలు కమ్మాయి. భయంతో కేకలేసి.. అందర్నీ నిద్రలేపా. చైన్ లాగి రైలును ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు వ్యాపించడంతో లగేజీ తెచ్చుకునే వీలు లేకుండాపోయింది.

- బి.శివకుమార్, విజయనగరం

## ప్రభుత్వ ఖాతాల్లో మగ్గుతున్న నిధులు..!

ఈనాడు, కాకినాడ

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల పథకాల అమలు, కార్యాలయాల నిర్వహణ పేరుతో తెరిచిన బ్యాంకు ఖాతాల్లో రూ.15 కోట్ల వరకు నిధులు మగ్గుతున్నాయి. ఇటీవల ఖాతాదారులు క్లెయిమ్ చేయని సొమ్ముపై వారి వారసులకు సమాచారం ఇచ్చి ఆధారాలతో వచ్చిన వారికి అప్పగించాలని ఆర్బీఐ ఆదేశించింది. అదే క్రమంలో ప్రభుత్వశాఖల ఖాతాల్లో నిధుల సమాచారం ఇచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వశాఖల పరిధిలో అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు 4,952 వరకు ఉన్నాయి.

**ఉపసంహరణకు ఈ నెలాఖరుతో ముగియనున్న గడువు**

### 74 శాఖల పరిధిలో..

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 74 వరకు ప్రభుత్వ శాఖలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పద్దుల రూపంలో ఆయశాఖలకు నిధులు మంజూరు చేస్తూ వచ్చాయి. వాటిలో కొంత ఖర్చుచేసిన తర్వాత నిధులు సరిపోక, పథకం కాలపరిమితి దాటడం, ఇతరత్రా సాంకేతిక కారణాలతో మిగిలిన మొత్తం ఖాతాల్లో వదిలేశారు. కొత్త ఖాతాలు తెరవడం, బదిలీల్లో అధికారులు మారుతుండటంతో పాత ఖాతాలు మరిచారు. కొన్ని శాఖలు డిపాజిట్ మొత్తాలను సైతం విత్‌డ్రా చేయకుండా వదిలేశాయి. ఇలాంటి ఖాతాల్లో సొమ్ములన్ని లెక్కగట్టగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.155 కోట్లు ఉంటే.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.14.9 కోట్లు ఉన్నాయని గుర్తించారు. 'అధికారుల పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాలను నవీకరించుకోవాలి. ఏయే శాఖల్లో ఎన్ని ఖాతాలు మనుగడ లేకుండా ఉన్నాయో అధికారులకు సమాచారం ఇచ్చాం. బ్యాంకుకు వెళ్లి ఆధార్‌తో ఈకేవైసీ చేయించుకుంటే పునరుద్ధరణలోకి వస్తాయి. ఈ నెల 31 లోగానే ఆ ప్రక్రియ పూర్తిచేయాలి.' అని ఖజానా శాఖ ఉప సంచాలకులు గణేశ్‌కుమార్ తెలిపారు.

| జిల్లా | లావాదేవీలు జరగని ఖాతాలు | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|
| కాకినాడ | 2,381 | 7.58 |
| తూర్పుగోదావరి | 1,117 | 3.27 |
| అంబేడ్కర్ కోనసీమ | 1,454 | 4.05 |

## 2026.. ఆచరిద్దాం ఈ ఆరు..!

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, గాంధీనగర్

నేడు కొలువు సాధించాలంటే చదువు ఒక్కటే సరిపోవడం లేదు. ఆయా సంస్థలు అభ్యర్థుల నుంచి అదనపు నైపుణ్యాలు ఆశిస్తున్నాయి. టెక్ యుగంలో ఏడాదికో సాంకేతిక విప్లవం తెరపైకి వస్తుంది. వీటిని అందిపుచ్చుకున్నవారికే పరిశ్రమలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. జేఎన్టీయూ, అనుబంధ కళాశాలల్లో ప్రాంగణ ఎంపికల (క్యాంపస్ రిక్రూట్‌మెంట్) కోలాహలం మొదలైంది. నూతన ఏడాదిలో ఫిబ్రవరి, మార్చి వరకు కొలువుల జాతర కొనసాగనుంది. 2026లో యువత ఆరు సూత్రాలు ఆచరిస్తే లక్ష్యాలు అందుకోవడానికి అవకాశం ఉందని నిపుణులంటున్నారు.

**అదనపు నైపుణ్యాలతో అందుకోండి అవకాశం..**

1. ● **లక్ష్యాలపై స్పష్టత:** కొత్త ఏడాదిలో చదువు, నైపుణ్యం, ఉద్యోగం ఏది ముఖ్యమో నిర్ణయించుకుని అందుకు అనుగుణంగా స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. వాటిని సాధించేలా కార్యచరణ రూపొందించుకోవాలి.

2. ● **కొత్త అంశాల నేర్పు:** రోజువారీ చదువుతో పాటు కనీసం ఒక గంట కొత్త విషయాలు నేర్చుకోవడంపై దృష్టిసారించాలి. పుస్తకాలు, ఆన్‌లైన్ కోర్సులు చేయడం ద్వారా కొత్తకొత్త అంశాలపై పట్టు సాధించడానికి అవకాశం ఉంటుంది. పత్రికలు విధిగా చదవాలి.

3. ● **నైపుణ్యం ఉన్నతి:** కృత్రిమ మేధ, క్వాంటమ్ టెక్నాలజీ, డేటా అనాలిటిక్స్, డిజిటల్ మార్కెటింగ్ వంటి నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేటు స్కిల్ కోర్సులను వినియోగించుకోవాలి.

4. ● **సమయ పాలన:** రోజువారీ టైం టేబుల్ సిద్ధం చేసుకుని ఆచరించాలి. మొబైల్, సామాజిక మాధ్యమాల వినియోగంపై నియంత్రణ ఉండాలి. మంచి స్నేహితులు, మెంటార్ల ఎంపిక చేసుకుని వారి సూచనలు పాటించాలి.

5. ● **ఆరోగ్యమే మూలధనం:** చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా ఉద్యోగ సాధనకు ముఖ్యం. రోజూ వ్యాయామం చేయడం ద్వారా మానసిక ఆరోగ్యం సాధిస్తారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ధ్యానం చేస్తే మంచి ఫలితాలొస్తాయి.

6. ● **ఉద్యోగ సన్నద్ధత:** మీ బయోడేటాను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలి. కొత్త నైపుణ్యాలన్నీ రెజ్యూమ్‌లోనే కనిపించాలి. నెలకు రెండు మూడు అప్లికేషన్లు తయారుచేయాలి. ఉద్యోగ మేళాలు, నోటిఫికేషన్లపై దృష్టి సారించి విధిగా దరఖాస్తులు చేస్తుండాలి.

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జేఎన్టీయూకె, అనుబంధ కళాశాలలు: 33
- ఏటా కళాశాలల నుంచి బయటకొచ్చే ఇంజినీరింగ్ విద్యార్థులు: 10,600
- సగటు ఉత్తీర్ణత : 84 శాతం
- ప్రాంగణ ఎంపికలకు ఎంపికయ్యేవారి శాతం: 72
- జేఎన్‌టీయూలో ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 120 మంది వరకు ఉద్యోగాలు సాధించారు. మరో 300 మంది పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు.

'కోర్ బ్రాంచుల విద్యార్థులు కోడింగ్, ఏఐ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడాలి. సాప్, క్లౌడ్ కోర్సుల్లో గ్లోబల్ సర్టిఫికెట్లు ఉంటే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు కచ్చితంగా చేయాలి, రెజ్యూమ్‌ను తయారు చేయడంలోనూ జాగ్రత్తలు పాటించాలి.' అని జేఎన్‌టీయూకే నియామక అధికారి డాక్టర్ ఎ.కరుణ తెలిపారు.

## చెప్పినా తీసుకెళ్లరే..!

### కార్గో కేంద్రాల్లో పేరుకుపోతున్న పార్సిళ్లు

వి.ఎల్.పురం: వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో జిల్లాకు వచ్చే పార్సిళ్లలో కొన్ని డెలివరీ కావడం లేదు. చరవాణి ద్వారా సంబంధిత వినియోగదారులకు సమాచారం అందించినా వీటిని తీసుకెళ్లడంలేదు. మరికొన్నింటికి ఆయా వ్యక్తుల ఫోన్ నంబర్లు పని చేయకపోవడంతో ఆ పార్సిళ్లు ఎవరివో కూడా తెలియని పరిస్థితి. వారాలు, నెలలపాలు వాటిని భద్రపరిచేందుకు నానాతంటాలు పడుతున్నారు. ప్రైవేటు సంస్థలతో పోలిస్తే ఆర్టీసీ లాజిస్టిక్స్‌లో రవాణా ఛార్జీ తక్కువ కావడం.. సురక్షితంగా అనుకున్న సమయానికి పార్సిల్ చేరుతుందనే భరోసా ఉండటం.. బీమా సౌకర్యం సైతం ఉండటంతో ఎక్కువ మంది ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకుంటున్నారు.

### బహిరంగ వేలం వేసి..

జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలోని కార్గో కేంద్రాల ద్వారా రోజూ 1,600 వరకు పార్సిళ్ల బుకింగ్ జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి డెలివరీ కేంద్రాలకు వచ్చేవి 1,100 కాగా. .వీటిలో రాజమహేంద్రవరం కేంద్రానికి వచ్చే పార్సిళ్లే 900 వరకు ఉంటున్నాయి. తీసుకెళ్లకుండా వదిలేసిన వాటిలో ఎక్కువగా పాత పేపర్లు, పుస్తకాలు, వస్త్రాలు, కాలంచెల్లిన ఔషధాలు, పాత ఎలక్ట్రికల్ వస్తువులు ఉంటున్నాయి. రెండు నెలలు దాటినా తీసుకెళ్లని పార్సిళ్లకు వేలం వేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నాలుగు సార్లు వేలం నిర్వహించారు.

### 48 గంటలు దాటితే అదనపు రుసుము

డెలివరీ కేంద్రాలకు చేరిన వాటిని 48 గంటల వ్యవధిలో తీసుకెళ్లాలి. ఈ వ్యవధి దాటితే ఒక్కొక్క పార్సిల్‌ను భద్రపరిచినందుకు రూ.5 (రోజుకు) చొప్పున అదనపు రుసుము విధిస్తారు.

## పంథా మార్చి.. నకిలీ వే బిల్లులతో ఏమార్చి!

ఈనాడు, రాజమహేంద్రవరం: ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యాలకు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. మొన్నటి వరకు నిడదవోలు నియోజకవర్గం ప్రాంతం నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక రవాణా చేస్తూ దందా కొనసాగించారు. అటువంటి వాహనాలపై అధికారులు కేసులు నమోదు చేయడంతో.. అక్రమార్కులు పంథా మార్చారు. తాజాగా నకిలీ బిల్లులు సృష్టించి రవాణా చేస్తున్నారు. రీచ్ దక్కించుకున్న గుత్తేదారు, లారీ నిర్వాహకులు అంతా ఈ కుట్రలో భాగస్వాములవుతున్నారు.

### ప్రక్కిలంక కేంద్రంగా...

▮▮▮ తాళ్లపూడి మండలం ప్రక్కిలంక ఇసుక రీచ్ నుంచి నకిలీ వేబిల్లులతో ఇష్టారాజ్యంగా ఇసుక తరలుతోంది. ఇక్కడి నుంచి రోజుకు సగటున 350 మెట్రిక్ టన్నుల ఇసుక వెళ్తుండగా, అక్రమంగా ఎంత తరలిస్తున్నారన్న అంశాన్ని అధికారులు నిర్ధారించాల్సి ఉంది. అసలు బిల్లు పోలిన విధంగా నకిలీ బిల్లులు సృష్టించి ప్రింట్ తీసి, యథేచ్ఛగా వినియోగించడం గమనార్హం.

▮▮▮ గతంలో రీచ్‌లపై స్థానిక రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ, కేసుల నమోదు కనిపించేంది. కొద్ది కాలంలో అటువంటి పరిస్థితి లేకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రీచ్ నిర్వాహకులకు నాయకుల అండదండలుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

▮▮▮ కొన్ని రోజుల నుంచే ఈ తరహా మోసానికి తెరలేపినట్లు తెలుస్తోంది. జిల్లాలో దాదాపు 33 రీచ్‌లుండగా రోజుకు దాదాపు 15,000 టన్నుల ఇసుక ఉత్పత్తి అవుతోంది. ఈ దందా మిగతా చోట్లా కొనసాగుతుందనే అనుమానాలున్నాయి.

### తాళ్లపూడిలో గుర్తించిన అధికారులు

తాళ్లపూడి మండలం ప్రక్కిలంక నుంచి వస్తున్న రెండు లారీలను భూగర్భ గనుల శాఖ అధికారులు ఆదివారం తనిఖీలు చేయగా అసలును పోలిన నకిలీ బిల్లులున్నట్లు గుర్తించారు. వీటిపైనా క్యూర్ కోడ్ ఇతర నంబర్లున్నా అవేవీ పని చేయవు. వాస్తవానికి ఒరిజనల్ బిల్లుమీద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఏ రీచ్ నుంచి లారీ వచ్చిందో ఆ రీచ్ ఐడీ నంబరు, ఇతర వివరాలన్నీ ఇసుక యాప్‌లో కనిపిస్తాయి. ఈ లారీల వద్ద ఉన్న బిల్లును స్కాన్ చేస్తే సంబంధంలేని వివరాలు రావడంతో అధికారులు నిర్ఘాంతపోయారు. లారీలపై కేసులు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 'ప్రక్కిలంక-1 రీచ్ నుంచి నకిలీ బిల్లులతో వెళ్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించాం. ఇప్పటికే ఆ రీచ్ ఐడీని బ్లాక్ చేశాం. అనుమతుల రద్దుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తాం. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడినా, సహకరించినా చట్టపరమైన చర్యలు తప్పవు.' అని జిల్లా గనులశాఖ అధికారి ఫణిభూషణ్ రెడ్డి అన్నారు.

## చుక్కల పీత.. సుందర నేత్ర..

యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ చేపలరేవులో వేటకు వెళ్లిన మత్స్యకారుడి వలకు నాలుగు వందల గ్రాముల బరువున్న ఓ పీత చిక్కింది. దీని శరీరంపై పది ఎరుపు రంగు చుక్కలతో ఆకర్షణీయంగా ఉంది. దీనిని పది చుక్కల పీతగా పిలుస్తారని, శరీరం చాలా గట్టిగా ఉండడం వల్ల స్థానికంగా తినడానికి ఎవరూ ఇష్టపడరని మత్స్యకారులు పేర్కొన్నారు.

-న్యూస్‌టుడే, కొత్తపల్లి

## అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు

అమలాపురం కలెక్టరేట్: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో దీనిపై చర్చించారు. జనవరి 28న కల్యాణోత్సవం, 29న రథోత్సవం, ఫిబ్రవరి 1న చక్రస్నానం, 2న తెప్పోత్సవం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించాలన్నారు. ఆర్టీసీ బస్సులు నేరుగా ఆలయం వద్దకు వెళ్లేలా రహదారులు నిర్మించాలన్నారు. మూడు క్యూలైన్లలో భక్తులు దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయం సమీపంలో జనవరి 26 నుంచి 5 రోజుల పాటు మద్యం అమ్మకాలను పూర్తిగా ఆపేయాలన్నారు. ఎస్పీ రాహుల్‌మీనా మాట్లాడుతూ ఉత్సవాల బందోబస్తుకు 1500 మంది పోలీసులను వినియోగించనున్నట్లు చెప్పారు.




(c) eenadu

EENADU SPORTS LEAGUE 2025

# పరుగుల జోరు.. కుర్రాళ్ల హుషారు..

ఉత్సాహంగా ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే.. మురళీకృష్ణ (59 పరుగులు)

రాజానగరం, శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఫోర్లు, సిక్సర్లతో క్రీడాకారులు మెరుపులు మెరిపించారు. బౌలర్లకు చుక్కలు చూపించారు. మొత్తంగా బ్యాటర్లు పైచేయి సాధించి విజయతీరాలకు చేర్చారు. జీజీయూ ప్రాంగణంలోని రెండు మైదానాల్లో నిర్వహిస్తున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రెజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025' క్రికెట్ టోర్నీ సోమవారం ఉత్సాహంగా సాగింది.

## అద్భుతమైన విజయం..

కిట్స్ కళాశాల దివిలి (కాకినాడ) జట్టు, ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (కాకినాడ) మధ్య పోటీలో ఐడియల్ జట్టు విజయం సాధించింది. కిట్స్ కళాశాల జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐడియల్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 89 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కిట్స్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 67 పరుగులు మాత్రమే చేసింది. 22 పరుగుల ఆధిక్యంతో ఐడియల్ కళాశాల జట్టు విజయం సాధించింది. క్రీడాకారుడు అబేద్య చేసిన కీలకమైన 31 పరుగులు జట్టు విజయానికి తోడ్పడ్డాయి.

ప్రతిభ చూపిన ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (కాకినాడ)

విజయానందంలో ఐడియల్ ఇంజినీరింగ్ క్రీడాకారులు

## మెరిసిన ఐడియల్ ఇంజినీరింగ్..

కాకినాడ ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల, రాజమహేంద్రవరం జీఎస్ఎల్ వైద్య కళాశాల జట్ల మధ్య పోరులో ఐడియల్ విజయం సాధించింది. జీఎస్ఎల్ టాస్ గెలిచి ఐడియల్ జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించగా నిర్ణీత 10 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. ఈ జట్టులో అభిరామ్ 22 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీఎస్ఎల్ జట్టు మొదటి నుంచి నెమ్మదిగా ఆడుతూ వచ్చింది. ఐడియల్ జట్టు క్రీడాకారులు తెలివిగా కేవలం ఆఫ్ సైడ్ మాత్రమే ఫీల్డింగ్ పెట్టి బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. దీంతో జీఎస్ఎల్ క్రీడాకారులు పరుగులు చేయడంలో తడబడ్డారు. చివరకు 5 వికెట్ల నష్టానికి 65 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలయ్యారు.

సత్తా చాటిన బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

## కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి..

బీఎస్ఎల్ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం), బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల (అమలాపురం) జట్ల మధ్య పోరులో మురళీకృష్ణ 28 బంతుల్లో 59 పరుగులు సాధించి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. బీవీసీ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన బీఎస్ఎల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన బీవీసీ జట్టులో కెప్టెన్ మురళీకృష్ణ విజృంభించాడు. సిక్సర్లు, ఫోర్లతో మోత మోగించాడు. దీంతో బీవీసీ జట్టు కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 89 పరుగుల విజయలక్ష్యాన్ని సునాయాసంగా సాధించింది.

## ఇలా గెలుపొందిన కైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కాకినాడ, పెరుమాళ్లపురం), కాకినాడలోని కైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య మధ్యాహ్నం మ్యాచ్ జరగాల్సి ఉండగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాజరు కాలేదు. దీంతో న్యాయ నిర్ణేతలు వాకోవర్ ఇచ్చి కైట్ జట్టును విజేతగా ప్రకటించారు.

## అలా గెలిచిన గైట్..

సీఎస్ డిగ్రీ కళాశాల (పాయకరావుపేట), గైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు సీఎస్ డిగ్రీ జట్టు హాజరుకాకపోవడంతో న్యాయనిర్ణేతలు వాకోవర్ ఇచ్చి గైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్టును విజేతగా ప్రకటించారు.

### నేటి మ్యాచ్‌లు (30.12.2025)

**గ్రౌండ్ - 1**

ఉదయం 8 గంటలకు: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (పెద్దాపురం, కాకినాడ) x ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం). ▲ ఉదయం 11 గంటలకు: ఎస్‌ఏవీఎం డిగ్రీ కళాశాల (సెంట్రల్‌పల్లి, కోనసీమ) x ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూనిట్ (రాజమహేంద్రవరం). ▲ మధ్యాహ్నం 2 గంటలకు: జేఎన్‌టీయూ (కాకినాడ) x వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల (రామచంద్రపురం).

**గ్రౌండ్ - 2**

ఉదయం 8 గంటలకు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (తుని) x ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం). ▲ ఉదయం 11 గంటలకు: ప్రైడ్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ) x బీహెచ్‌ఎస్ఎస్, వీఎల్ఎం డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం).

### రేపటి మ్యాచ్‌లు (31.12.2025)

**గ్రౌండ్ - 1**

ఉదయం 8 గంటలకు: గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం) x ఏకేఆర్‌జీ డిగ్రీ కాలేజీ (నల్లజర్ల). ▲ ఉదయం 11 గంటలకు: గైట్ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) x వీఎస్ఎం డిగ్రీ కళాశాల (రామచంద్రపురం). ▲ మధ్యాహ్నం 2 గంటలకు: ఏపీఎస్, పీఆర్ కళాశాల (కొవ్వూరు) x అవంతి డిగ్రీ కాలేజీ (రాజమహేంద్రవరం).

**గ్రౌండ్ - 2**

ఉదయం 8 గంటలకు: కైట్ (2) ఇంజినీరింగ్ కళాశాల x ఐడియల్ కాలేజీ (జంభపాలెం). ▲ ఉదయం 11 గంటలకు: ఆదిత్య యూనివర్సిటీ x జేఎస్ఎల్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ.


Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Gift Partner: KL UNIVERSITY (DEEMED TO BE)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner: ఈనాడు.నెట్
Medical Partner: GSL
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
FM Partner: Mee FM
TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

తెదేపాలో చేరిన వారితో ఎమ్మెల్యే మద్దిపాటి, తదితరులు

## గోపాలపురంలో వైకాపాకు ఎదురుదెబ్బ

● ఎంపీపీ, వైస్ ఎంపీపీ సహా పలువురు తెదేపాలో చేరిక

గోపాలపురం: గోపాలపురంలో వైకాపాకు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన మండల పరిషత్తు అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర క్రీడాసాధికార సంస్థ మాజీ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, గోపాలపురం ఉపసర్పంచి వింత ప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు మంగళవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సమక్షంలో తెదేపాలో చేరారు.. గోపాలపురంలో మండల పార్టీ అధ్యక్షుడు కొర్లపాటి రాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే తెదేపా కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పనిచేస్తుంటే కొందరు వైకాపా శ్రేణులు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

### ధరవరలు

**అంబాజీపేట కొబ్బరి మార్కెట్**

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి | 17,000 |
| కురిడీ (వెయ్యింటికి): | |
| పాతకాయ: గండేరా | 27,000 |
| గటగట | 25,000 |
| కొత్తకాయ: గండేరా | 26,000 |
| గటగట | 24,000 |
| నీటి కాయ (వెయ్యింటికి): | |
| పాత (ముక్కుడు) కాయ | 14,000-15,000 |
| కొత్త (పచ్చి) కాయ | 13,000-14,000 |
| కొబ్బరినూనె మార్కెట్: | |
| 15 కిలోలు | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

**వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో**

| | |
|---|---|
| ఫారంరేటు | 135-00 |
| రిటైల్ లైవ్ | 162-00 |
| డ్రెస్డ్ | 235-00 |
| స్కిన్‌లెస్ | 267-00 |

## ఏఈవోల సమస్యల పరిష్కారానికి వినతి



రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండరు ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

వి.ఎల్.పురం: రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవరావు తెలిపారు. సోమవారం సాయంత్రం అమరావతిలోని సచివాలయంలో సీఎంను కలిసి ఏఈవోల ప్రధాన సమస్యలు వివరించినట్లు ఆయన తెలిపారు. 12 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఏఈవోలను ఆర్ఎస్‌కేల్లో నియమించరాదని, జాబ్‌చార్ట్, నామినీ క్లైచర్ మార్పు తదితర సమస్యలను పరిష్కరించాలని వినతి ఇచ్చామన్నారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు వేణుమాధవ్ తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాష్ట్ర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ పాల్గొన్నారు.

## కూటమి పాలనలో ఆలయాల సమగ్రాభివృద్ధి

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కూటమి పాలనలో దేవాలయాల సమగ్రాభివృద్ధి సాధిస్తున్నాయని ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం వారు కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాడపల్లి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ శ్రీవారి ఆలయం కీర్తి నలుదిక్కులా వ్యాపించే విధంగా నూతన పాలకమండలి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం పాలకమండలి అధ్యక్షుడిగా ఆత్రేయపురానికి చెందిన ముదునూరి వెంకటరాజు, సభ్యులుగా కొత్తపేట నియోజకవర్గానికి చెందిన శిష్టా సూర్యకుటుంబరావు, కాసా చాముండేశ్వరి, పెండెం కుమారి, సలాది నాగేశ్వరరావు, సరెళ్ల సతీశ, ఏపుగంటి విజయకుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, యెల్లంపల్లి చంద్రమౌళి, ద్వారంపూడి త్రిమూర్తులు (ప్రత్యేక ఆహ్వానితులు), కొల్లబోయిన శ్రీనివాసరావు (పెద్దాపురం, కాకినాడ జిల్లా), దశపర్తి శ్రీలక్ష్మి (పామర్రు, కృష్ణా జిల్లా), గోసాల ఉప్పలరసు (పాయకరావుపేట, అనకాపల్లి జిల్లా), చెంబుమూరి రాంబాబు (ఆచంట, ప.గో జిల్లా), పెండ్యాల భవానీ (పాలకొల్లు, ప.గో జిల్లా), గంగవరపు పద్మావతి (ఒంగోలు, ప్రకాశం జిల్లా), కొండపల్లి రామచందర్‌రావు (మహబూబాబాద్, తెలంగాణ), వాడపల్లి సుందర శేషావతారం (ఎక్స్ అఫీషియో, ఆలయ అర్చకుడు)లతో ఈవో నల్లం సూర్యచక్రధరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

కొలువుదీరిన పాలకమండలితో ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు తదితరులు

## వృద్ధురాలిని హత్య చేసి.. గోనెసంచిలో చుట్టి

● బంగారంపై ఆశతో డ్రైవర్ దుశ్చర్య

నాచారం, న్యూస్‌టుడే: నమ్మకంతో ఇల్లు అద్దెకు ఇచ్చిన యజమానురాలిని గొంతునులిమి హత్య చేశాడో కారుడ్రైవరు. మృతదేహాన్ని గోనెసంచిలో మూటగట్టి గోదావరిలో విసిరేశాడు. ఇంత దారుణానికి ఒడిగట్టింది ఆ మహిళ మెడలోని బంగారం కోసమే. నిందితులను సోమవారం నాచారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ధనుంజయ వివరాల ప్రకారం.. మల్లాపూర్ బాబానగర్‌లో సూరెడ్డి సుజాత(65) ఒంటరిగా ఉంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కొత్తపల్లిఅగ్రహారానికి చెందిన ఎం.అంజిబాబు అలియాస్ అంజి డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఆరు నెలల కిందట నగరానికి వచ్చాడు. రెండు నెలల కిందట సుజాత ఇంట్లో అద్దెకు చేరాడు. ఒంటరిగా ఉన్న ఆమెకు ఇంటి పనులు చేసేవాడు. మెడలో బంగారు గొలుసు, చేతిగాజులను సొంతం చేసుకోవాలనుకున్నాడు. ఈ నెల 19న రాత్రి గొంతు నులిమి హత్య చేశాడు. ఎవరికీ అనుమానం కలగకుండా మృతదేహాన్ని గోనెసంచిలో చుట్టి ఇంట్లోనే పెట్టి తాళం వేశాడు. 11 తులాల బంగారాన్ని దోచుకున్నాడు. పెరవలి మండలం ఖండవల్లిలో ఉన్న స్నేహితుడు నుక్కంటి యువరాజు, అమలాపురం మండలం వేమవరానికి చెందిన నూకల దుర్గారావుకు ఫోన్‌లో హత్య విషయం చెప్పి సొంతూరు వెళ్లాడు. 20న ముగ్గురు కలిసి అక్కడే కారు అద్దెకు తీసుకుని అదేరోజు అర్ధరాత్రి మల్లాపూర్‌కు చేరుకుని మృతదేహాన్ని డిక్కీలో వేసుకుని బయలుదేరారు. కృష్ణలంక వద్ద గోదావరిలో విసిరేశారు. మొయినాబాదులో ఉంటున్న సుజాత చెల్లెలు సువర్ణలత ఫోన్ చేసినా స్పందన రాలేదు. అనుమానం వచ్చి 24న మల్లాపూర్‌లోని ఇంటికి రాగా అక్కడ లేకపోవడంతో నాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను అరెస్టు చేసి బంగారం, చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.


EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మణప్పురం ఏ ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 9849138626.

శ్రీసాయిగోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం, ఏబ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆరోజు మార్కెట్ రేటికి కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 94933 38823.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీకే పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ 7386201191.

JOBS

కొత్తగా ఇంటర్నెట్ బాక్సులు వేయుటకు 10 మంది ఫీల్డ్ స్టాఫ్ కావలెను. నెలకు 15K (12+3). వేద నెట్, సత్యవతినగర్, కొవ్వూరు, కాంటాక్ట్ సెల్: 99899 55770.

రాజమండ్రిలో మా ఆఫీస్‌నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్(F) & బిల్లింగ్ (M&F) మరియు ఆఫీస్ అసిస్టెంట్స్(M) కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. పాతసోమాలమ్మ గుడి రోడ్డు, దివ్య హాస్పిటల్‌దగ్గర. ✆ 85006 44978, 93461 45948.

కావలెను: Vicks & Tide Company నందు పనిచేయుటకు (1) సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ★ (2) డెలివరి బాయ్స్ ★ లొకేషన్ అమలాపురం, రాజోలు, రాజమండ్రి. Age: 18-45. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటివ్స్. ✆ 88861 23489, 95059 31234

రాజమండ్రి కోరుకొండ రోడ్డులో మా ఇంటివద్ద 2 సంవత్సరాల పిల్లల ఆలన పాలన చూసుకొనుటకు ★ కేర్‌టేకర్స్ కావలెను. Cont. Cell: 99898 76799.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-65 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



పొగాకు బోర్డు, గుంటూరు
వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య విభాగము, భారత ప్రభుత్వము (ఐ.యస్.ఓ.9001:2015 గుర్తింపు పొందిన సంస్థ)
జి.టి. రోడ్డు, గుంటూరు-522004. ఫోన్ : 0863-2358399, 2358499.

టెండరు నోటీసు

2025-26 FCV పొగాకు ఆక్షన్స్ కొరకు ఆంధ్రప్రదేశ్‌లో గల పొగాకు బోర్డు వేలం కేంద్రాల వద్ద 1) పొగాకు బేళ్ళను హ్యాండిల్ చేయుటకు మరియు 2) ట్రాలీస్ మరమ్మత్తులు/ సర్వీసింగు కొరకు అనుభవము కలిగిన కాంట్రాక్టర్లు మరియు ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.
పైన తెలుపబడిన పనుల కొరకు టెండరు ఫారములు తదితర వివరముల కొరకు రీజినల్ మేనేజరు, ఒంగోలు, రాజమండ్రి మరియు మేనేజరు(ఆక్షన్స్), పొగాకు బోర్డు, గుంటూరు వారిని సంప్రదించగలరు. టెండరు ఫారములు మరియు నియమ నిబంధనలు పొగాకు బోర్డు వెబ్‌సైట్ (www.tobaccoboard.com) నుండి కూడా పొందవచ్చును.
పైన తెలుపబడిన పనుల నిమిత్తము పూర్తి చేసిన టెండరు ఫారాలను టెండరు నియమ నిబంధనలలో తెలిపిన ధరావతు సొమ్ముతో సహా తేది.21-01-2026 సాయంత్రం గం॥ 3.00 లలోగా పొగాకు బోర్డు, గుంటూరు నందు టెండరు బాక్సులో డిపాజిట్ చేయవలెను. అసంపూర్తిగా ఉన్న టెండర్లు తిరస్కరించబడును మరియు ఏ విధమైన కారణం చూపకుండానే స్వీకరించిన టెండర్లలో ఏదైనా లేదా అన్నింటిని తిరస్కరించేందుకు కార్యనిర్వహణాధికారి, పొగాకు బోర్డు వారు సర్వహక్కులు కలిగియున్నారు.
స్థలము : గుంటూరు, తేది: 29-12-2025 సం/- కార్యదర్శి



హెచ్చరిక: కోర్టు ఇంజంక్షన్ ను జారీ చేసారు

నామవరం గ్రామం, రాజానగరం మండలం, తూర్పుగోదావరి జిల్లా ఆర్.ఎస్ సం. 36 ప్రస్తుత సబ్‌డివిజన్ ఆర్.ఎస్.నం. 36-2ఎలోని ఎ.4.00 ఏకరాల విస్తీర్ణపు భూమి శ్రీ పిచ్చుకల సత్తిరాజు, తండ్రి పేరు వీరవెంకట సత్యనారాయణ మూర్తికి చెంది ఉన్నది. VII అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), రాజమహేంద్రవరం వారు ఓ.ఎస్.నం.1092.2025లో 16.12.2025 తేది నాటి ఉత్తర్వు ద్వారా, పూర్తి ఆస్తిపై యాడ్-ఇంటీరిం ఇంజంక్షన్‌ను జారీ చేసారు, ఇది అమలులో ఉన్నది. అనుమతి లేని ప్రవేశం, జోక్యం లేదా అతిక్రమణ, నిషేధించబడింది మరియు చట్టప్రకారం వ్యవహరించబడుతుంది.మా క్లయింట్ యొక్క సదరు ఆస్తి విషయమై ఇతరులు ఎవరైనా క్రయ విక్రయాలు కానీ, మరే విధమైన లావాదేవీలు జరిపించినను లేక సదరు ఆస్తిలో అక్రమంగా ప్రవేశించిన యెడల మా క్లయింట్ తీసుకోబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యతలు వహించగలరని ఇందుములంగా తెలియచేయడమైనది.
జి. ఎస్.ఎస్ మురళీ మోహన్ (న్యాయవాది)
8-9-18, వెంకాయలవారి వీధి, రాజమహేంద్రవరం-533101.
సెల్: 9397909167, ఫోన్: 0883-2476911
రాజమహేంద్రవరం
తేది: 28-12-2025



ANDHRA PRADESH INDUSTRIAL INFRASTRUCTURE CORPORATION LIMITED
APIIC The Future is Here
(An undertaking of A.P. Govt.)
O/o ZONAL MANAGER, INDUSTRIAL PARK, KAKINADA - 533 005 Ph. No. 0884 - 2344225

'e'- Procurement Notice

Tender Notice No : 06 & 07/ZM/APIIC/KKD/2025-26 Dt. 29-12-2025
Zonal Manager/APIIC Limited, Kakinada invites bids for the following works.

| Tender Notice No. | Name of Work | Estimated Contract Value (ECV) |
|---|---|---|
| 06 | Raising of Existing Drain Wall and Sill levels in Road No.3 at IP-Vakalapudi,Kakinada District with IALA Funds(2nd Call) | Rs. 26,14,234/- |
| 07 | Strengthening of the Existing BT Cross Roads Nos.1& 4 in IP, Dowleswaram, East Godavari District IALA Funds | Rs. 28,69,868/- |

| | | | |
|---|---|---|---|
| 1) | Bid Document Downloading Start Date | : | From 29/12/2025 at 08:00 PM |
| 2) | Bid Document Downloading End Date | : | 13/01/2026 up to 01:00 PM |
| 3) | Last Date & Time for Receipt of Bids | : | 13/01/2026 at 03:00 PM |
| 4) | PQ Stage Opening Date & Time | : | 13/01/2026 at 03:30 PM |
| 5) | Commercial Stage Date & Time | : | 14/01/2026 @ 11:00 AM |

The details of tender notice and bid documents can be downloaded from website www.apeprocurement.gov.in (or) https://tender.apeprocurement.gov.in
ZONAL MANAGER


## చిన్న కమతం.. పెద్ద ఫలితం

న్యూస్‌టుడే, పి.గన్నవరం

స్ఫూర్తి

చిన్న కమతంతో అధిక ఆదాయం పొందుతున్నారు కోనసీమలోని కొంతమంది. ఒకే పంటను నమ్ముకుంటే రైతుకు అంతగా గిట్టుబాటు ఉండదు. కొన్ని సందర్భాల్లో డిమాండ్ లేకపోతే నష్టం వస్తుంది. అదే ఒకే భూమిలో రకరకాల పంటలు సాగుచేస్తే లాభాల బాట పట్టొచ్చు. గత కొన్నేళ్లుగా ఇదే విధానం అవలంబిస్తున్నారు పి.గన్నవరం మండలం ఆదిమూలంవారిపాలేనికి చెందిన రైతు ఆదిమూలం పల్లంరాజు.

పలు రకాల ఆకుకూరలు పండిస్తున్న ఆదిమూలం పల్లంరాజు

**కౌలుకు తీసుకుని..**

పల్లంరాజు గ్రామంలోని 30 సెంట్ల మాగాణిని కౌలుకు తీసుకున్నారు. దీన్ని ఏడు భాగాలుగా విభజించారు. ఒక్కో దాంట్లో గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, మెంతికూర, పుదీనా వేశారు.

**జులై నుంచి డిసెంబరు వరకు..**

30 సెంట్ల భూమికి ఖరీఫ్, రబీ సాగుకోసం యజమానికి రూ.15 వేలు కౌలు చెల్లిస్తారు. ఖరీఫ్‌లో జూన్ నెలలో భూమిని గాడులు తీసి దిబ్బలుగా చేసి ఆయా రకాల ఆకు కూరలకు సంబంధించి విత్తనాలు చల్లుతారు. జులై నుంచి డిసెంబరు వరకు ఏడు నెలల పాటు దిగుబడి తీసి ఆయనే మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఏడు నెలలకు పెట్టుబడి వ్యయం రూ.18 వేలు అవుతుంది. ఖర్చులన్నీ పోను 30 సెంట్ల భూమిమీద నికర ఆదాయం వస్తుంది. జనవరి నుంచి ఈ తోటలు తొలగించి దీంట్లో రబీ కింద వరిసాగు ప్రారంభిస్తారు. దీనిమీద కూడా 12 బస్తాలు తక్కువ కాకుండా దిగుబడి వస్తుంది. ఈ ధాన్యం విక్రయించి కౌలు చెల్లిస్తారు. ఇలా తక్కువ విస్తీర్ణంలో ఆదాయం పొందుతున్నారు.

## చేపల్లో ఎర్రమచ్చల వ్యాధితో నష్టం

తెలుసుకుందాం.. నివారణ, జాగ్రత్తలు

ఉప్పలగుప్తం: చేపల చెరువుల్లో ఏరోమోనాస్ హైడ్రోఫిల్ బ్యాక్టీరియా కారణంగా చేపలకు అన్ని కాలాల్లోనూ ఎర్రమచ్చల వ్యాధి సోకుతుంది. దీని లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉప్పలగుప్తం ఎఫ్‌డీవో బి.హేమానంద్ వివరించారు.

**ఇవీ లక్షణాలు**

వ్యాధి సోకిన చేపలు నీటి ఉపరితలానికి వచ్చి ఈదుతుంటాయి. శరీరం, మొప్పలు, రెక్కల వద్ద ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి. కొన్నిసార్లు పొట్ట నీటితో ఉబ్బినట్టు కనిపిస్తాయి. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే ల్యాబ్‌లో పరీక్షించి వ్యాధిని గుర్తించొచ్చు.

5 శాతం బ్రోమిన్ ద్రావణాన్ని వ్యాధి తీవ్రతను బట్టి ఎకరా చెరువుకు 300 మి.లీ. నుంచి లీటరు వరకు పిచికారీ చేయాలి. అనుమతించిన యాంటీబయోటిక్స్‌ను పది గ్రాముల మేతలో కలిపి టన్ను చేపలకు పది రోజుల పాటు అందించాలి. చెరువులో ప్రాణవాయువు 5 పీపీఎం తగ్గకుండా చూసుకోవాలి. విటమిన్ మిక్సర్‌ను మేతలో కలిపి పది రోజులు అందించాలి. బ్రోమిన్, క్లోరిన్‌తో శుద్ధి చేసిన నీటిని చెరువుల్లోకి తోడాలి.

## రైతేరాజు

### ఉద్యాన తోటల్లో నీటి వృథాకు అడ్డుకట్ట

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలకు సాధారణంగా విద్యుత్తు మోటార్ల ద్వారా సాగునీరు అందిస్తుంటారు. పొలంలో బోదె తవ్వించి గట్లు వేయిస్తారు. ఈ పద్ధతిలో గట్లు తెగితే నీరు బయటకు పోతుంది. ఏడాదికి మూడు పర్యాయాలు బోదెలు, గట్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. దీనికి ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన యువరైతు నార్ని హరి అడ్డుకట్ట వేశారు. ఉన్నత విద్య అభ్యసించిన ఈయన తాడిపర్రులోని తన మూడెకరాల సాగు విషయంలో నూతన పద్ధతులను అవలంబించారు. 20 అడుగుల పొడవు కలిగిన సుమారు 130 గొట్టాలు భూమిలో ఏర్పాటు చేశారు. ఏ భాగంలో నీరు అవసరమో అక్కడ వాల్వ్ తిప్పితే నీరు ప్రవహిస్తుంది. ఒకే పర్యాయం అన్ని భాగాల్లో నీరు సరఫరా అయ్యే ఏర్పాట్లు కూడా ఉన్నాయి. ఈ పైపులు సుమారు 40 సంవత్సరాల వరకు పనిచేస్తాయి. మొత్తం రూ.2 లక్షల వ్యయమైంది. గట్ల పైబడి నీరు పొర్లిపోతుందనే ఇబ్బంది లేదు. సాధారణ పద్ధతిలో 5 గంటల్లో ఎకరా పొలానికి సాగునీరు సరఫరా చేయగా ఈ పైపులైను విధానం ద్వారా 3 గంటల్లోనే పూర్తవుతుందన్నారు. బహుళ ప్రయోజనాలు ఉన్న ఈ శాశ్వత పరిష్కార పద్ధతిని పరిసర గ్రామాల రైతులు సైతం అనుసరిస్తున్నట్లు రైతు హరి చెబుతున్నారు.

తాడిపర్రులో గొట్టాల ద్వారా సాగునీటి సరఫరా ఇలా..

నార్ని హరి

## వరినారు పెంపకంలో మెలకువలు

మీ కోసం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: రైతులు ప్రస్తుతం రబీ వరి నారుమడులు వేయడం ప్రారంభించారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆరోగ్యకరమైన నారు పొందొచ్చని ఆత్రేయపురం వ్యవసాయాధికారి పట్టాభిరామయ్య సూచించారు. సాధారణంగా దాళ్వాలో కాండంతొలిచే పురుగు, అగ్గితెగులు ఉద్ధృతంగా ఉంటుంది. వీటి నివారణకు నారు నాటడానికి వారం రోజుల ముందుగా ఎకరాకు సరిపోయే మడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు చల్లుకోవాలి. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 3 గ్రాములు పిచికారీ చేయాలి. చలి నుంచి రక్షించుకోవాలి నారుమడిని సిద్ధం చేసే సమయంలో డీఏపీ 5 కిలోలు, పొటాష్ 2 కిలోల చొప్పున వేయాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే ఎదుగుదల లోపిస్తుంది. మడికి సాయంత్రం, రాత్రి సమయంలోనే నీరు పెట్టాలి. ఉదయం తొలగించాలి. ఎదుగుదల సరిగా లేకపోతే 13-0-45 ఎరువును 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ముందుగా విత్తనశుద్ధితో నిద్రావస్థ తొలగించాలి. దొడ్డురకం విత్తనమైతే 20 కిలోలు, సన్న రకమైతే 15 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

ఆత్రేయపురంలో వేసిన నారుమడి

(c) eenadu

# రాజమహేంద్రవరం

## నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దేవీచౌక్: అత్యవసర మరమ్మతుల నిమిత్తం మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దానవాయిపేట, గాంధీ పురం-2, గానుగవీధి, గోరక్షణ పేట, గాంధీపార్కు ప్రాంతం, టీటీడీ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ధనుర్మాస పూజలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నగరంలోని పలు ఆలయాల్లో ధనుర్మాస పూజలు వైభవంగా జరుగుతున్నాయి. దేవాదాయశాఖ ఆధీనంలోని వేంకటేశ్వర మఠంలో స్వామి వారికి సోమవారం తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు ఖండవల్లి పవన్ కుమార్ ఆచార్యులు నిర్వహణలో సుప్రభాతం, అర్చన, బాలభోగం, హారతి నిర్వహించారు. ఆలయ ఆవరణలో గోవింద దీక్ష తీసుకున్న భక్త మహిళలు విష్ణు సహస్రనామ పారాయణం, తిరుప్పావై పఠించారు. స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

వి.ఎల్.పురం: దివ్యాంగుల సంక్షేమానికి, వారికి అన్నివిధాలా సహకారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్, సంక్షేమ శాఖ ఆధ్వర్యాన పలువురు విభిన్న ప్రతిభావంతులకు రూ.లక్ష విలువైన కృత్రిమ అవయవాలు, ఇతర ఉపకరణాలు అందజేశారు. పది మందికి వినికిడి పరికరాలు, ఎనిమిది మందికి కృత్రిమ అవయవాలు, ఇద్దరికి చక్రాల కుర్చీలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. జేసీ మేఘా స్వరూప్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఎ.వై.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలు, పరికరాలు అందిస్తున్న కలెక్టర్, చిత్రంలో జేసీ తదితరులు

## జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 214 అర్జీలు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి 214 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ క్లినిక్‌కు అందిన భూసంబంధ సమస్యలపై 103 ఉన్నాయి. అప్షన్‌మెంట్లకు సంబంధించిన ఫిర్యాదులు 20 నమోదుకాగా ఇళ్ల స్థలాల కేటాయింపుపై వచ్చిన అర్జీలు అధికంగా ఉన్నాయి.

**మున్సిపల్ కార్యాలయంలో..** టి.నగర్: ప్రజా సమస్యల పరిష్కారం చేయడం అన్ని విభాగాల బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై 16 మంది అర్జీలు అందజేశారు. ఇంజినీరింగ్ 7, రెవెన్యూ 2, టౌన్ ప్లానింగ్ 4, అడ్మినిస్ట్రేషన్ 1, వార్డు సచివాలయం 1, పంచాయతీ రాజ్ 1 అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, సెక్రటరీ శైలజావల్లి, ఎంహెచ్‌ఓ వినాయక్, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రజా సమస్యలకు సత్వర న్యాయం చేసేలా పోలీసు అధికారులు పని చేయాలని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో స్వయంగా మాట్లాడి 30 ఫిర్యాదులు స్వీకరించారు.

### జలప్రసాదం యూనిట్ వితరణ

ఆత్రేయపురం: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి సన్నిధికి వచ్చే భక్తులకు సురక్షిత తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో వెలుమూరి ఇన్‌ఫ్రా పేరిట రాజమహేంద్రవరానికి చెందిన దాతలు వెలుమూరి భీమశంకర్, సత్యనారాయణ కుటుంబ సభ్యులు రూ.20 లక్షల విలువైన జలప్రసాదం యూనిట్‌ను వితరణ చేశారు. ఈ యూనిట్‌ను ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు ప్రారంభించారు.

దాత కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఛైర్మన్ వెంకటరాజు తదితరులు

## కసరత్తు దశలోనే బృహత్తర ప్రణాళిక..!

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం మాస్టర్ ప్లాన్ పరిధి విస్తరించారు. భవిష్యత్తు అవసరాలు దృష్టిలో పెట్టుకొని సమీపంలోని అయిదు మండలాల్లో 18 గ్రామ పంచాయతీలను కలిపి గతంలో కొత్తగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. తద్వారా కొత్తగా చేర్చిన గ్రామ పంచాయతీలను కలిపి జనాభా 6.37 లక్షలకు పెరుగుతుంది. జనాభా పెరిగితే కేంద్రం అర్బన్ ప్రాంతాలకు విడుదల చేసే నిధులు కూడా పెరుగుతాయి. దీంతో నగరానికి అదనంగా అభివృద్ధికి నిధులు విడుదలవుతాయి. దీంతో పాటు పది లక్షల జనాభా విస్తీర్ణం కలిగిన నగరాల్లో రాజమహేంద్రవరం చేరుతుంది. ఈ మేరకు కొత్త స్కీమ్‌ల ద్వారా పథకాలు వర్తిస్తాయి. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (రుడా)కు అనుసంధానంగా మాస్టర్ ప్లాన్ పరిధి విస్తరణకుల ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం దీనిపై కసరత్తు చేస్తోంది

### అభ్యంతరాలపై నివేదిక

కొత్త ప్లాన్ అమల్లో భాగంగా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం నగర విస్తీర్ణం 44.5 చ.కిమీ. కొత్త ప్లాన్ ప్రకారం 162 చ.కిమీగా నిర్ధారించారు. అర్బన్‌లో జనాభా 2011 లెక్కల ప్రకారం 3.45 లక్షలు ఉండగా అదనంగా మరో లక్ష మందికి పైగా ఉంటారు. కొన్ని గ్రామాలను చేర్చడంతో అదనంగా మరో లక్షన్నరకు పైగా జనాభా పెరుగుతున్నారు. వాస్తవానికి 2017లో అర్బన్‌లో దీనిని ఆమోదించారు. అప్పట్లోనే పరిధి విస్తరించాలనే ప్రతిపాదనలు ఉన్నా.. పక్కన పెట్టారు. ప్రస్తుతం గ్రామాల అభివృద్ధి, విస్తరణ దృష్టిలో పెట్టుకొని మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు సిద్ధపడ్డారు. గతంలో కొంత మంది లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు.

### సాంకేతికతను వినియోగించుకుని..

ప్లాన్‌ను జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ విధానంలోకి మార్పు చేస్తున్నారు. గతంలో అర్బన్‌లో ఉన్న 50 డివిజన్లకు చెందిన మాస్టర్ ప్లాన్‌తోపాటు కొత్తగా పరిధి విస్తరణతో కలుస్తున్న గ్రామాల నైసర్గిక స్వరూపం పూర్తిగా ఆన్‌లైన్‌లో చేర్చడం జరుగుతుంది. 2017లో ఈ టెక్నాలజీ అందుబాటులో లేకపోవడంతో జీఐఎస్ విధానం అమలు కాలేదు. ఈ విధానం ద్వారా అనధికార నిర్మాణాలు, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయవచ్చు. అంతర్జాలంలో నేరుగా మాస్టర్ ప్లాన్ వీక్షించవచ్చు. పైగా ఎప్పటికప్పుడు అనుమతులు, కట్టడాలు, మార్పులు చేర్పులు ఎవరైనా తెలుసుకునే అవకాశం ఉంది. మరోవైపు మాస్టర్ ప్లాన్ పరిధి విస్తరణతో గ్రామాల విలీనం తెరపైకి వస్తోంది. ఈ సారి మాస్టర్ ప్లాన్ విస్తరించడంతో రాజమహేంద్రవరంతోపాటు గ్రామాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేస్తారు.

## వైకుంఠ ఏకాదశి దర్శనాలకు సర్వం సిద్ధం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నగరంలోని వైష్ణవాలయాల్లో మంగళవారం వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా విశేష పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ● దేవాదాయశాఖ అధీనంలోని దేవీచౌక్ రోడ్డులో ఉన్న వేంకటేశ్వరమఠంలో మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతసేవతో మొదలుకుని నిత్యార్చన, బాలభోగం, పాశురపఠనం, విశేష పూజలు నిర్వహించి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. ● వరహాలయ వీధిలోని లక్ష్మీవల్లభ ఆలయంలో లక్ష్మీనారాయణులు, రంగనాథస్వామి, గోదాదేవి అమ్మవార్లకు అర్చన, విశేష అలంకారం ఉంటుంది. ● నల్లమందు సందులోని వేంకటేశ్వర ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, అలంకరణ, పూజ హారతి నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ● ఆనంకళాకేంద్రం ఆవరణలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష అలంకారం, పూజలు, వైకుంఠద్వార దర్శనం ఉంటుంది. ● నగరంలోని సీతంపేట రామాలయం, ఏవీఏరోడ్డు ఆలయం, కోరుకొండ రోడ్డులోని లక్ష్మీనరసింహస్వామి తదితర ఆలయాల్లో విశేష పూజలు జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు.

సీతంపేట రామాలయంలో శ్రీవారికి అలంకరణ

● సీతంపేట రామాలయంలో మంగళవారం తెల్లవారుజామున 18రకాల పండ్ల రసాలతో స్వామివారికి అభిషేకం, లక్ష చామంతి పూలతో పూజ, విశేష హారతులు ఉంటాయి. సోమవారం సాయంత్రం ఆలయమంతా రంగవల్లులతో అలంకరించి శ్రీవారి మూలవిరాట్‌కు బంతి, చామంతి, గులాబీ, మరువం తదితర పూలతో విశేషంగా ముస్తాబు చేశారు.

### గోవింద నామాల నఖచిత్రం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా నగరానికి చెందిన నఖ చిత్రకారుడు రవి పరస.. గోవింద నామాలను నఖచిత్రం గీశారు. ఈ సందర్భంగా పలువురు ఆసక్తిగా తిలకించారు.



## 2 నుంచి గ్రామసభలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: దేవాదాయ భూములకు సంబంధించి ప్రాపర్టీ రిజిస్టర్‌లో ఉన్న భూములకు తప్పనిసరిగా 1బి రికార్డులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల్లో స్పష్టత లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడకూడదని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్జీదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. వచ్చేనెల 2 నుంచి 9 వరకు గ్రామసభలు నిర్వహించి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేయాలన్నారు. జేసీ మాట్లాడుతూ రెవెన్యూ క్లినిక్‌లో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

## తపాలా కార్యాలయంలో బుకింగ్ వేళల మార్పు

దేవీచౌక్: రాజమహేంద్రవరంలోని ఇల్లి తోట ఉప తపాలా కార్యాలయంలో కౌంటర్ బుకింగ్ వేళల్లో మార్పు చేశారు. గతంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు ఉండగా వినియోగదారుల సౌకర్యార్థం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్చారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు.

## మేధో వికాసం

### ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో దానవాయిపేటలోని భాష్యం పాఠశాలలో క్విజ్ పోటీలు సోమవారం జరిగాయి. జోనల్ విభాగాధిపతి వి.ఆంజనేయులు మాట్లాడుతూ ఇలాంటి పోటీల్లో పిల్లలు పాల్గొనడంతో వారిలో ప్రతిభ బయటకు వస్తుందన్నారు. వీటిలో వై.శ్రీచర్ల (9వ తరగతి), ఎండీ సఫా ఫాతిమా (8వ తరగతి), ఇ.నిత్య నవ్యశ్రీ (9వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను వి.ఆంజనేయులు, ప్రిన్సిపల్ జె.వెంకటేశ్వరరావు అందించారు.

విజేతలతో భాష్యం పాఠశాల సిబ్బంది

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

**అక్షర శ్రీ విద్యానికేతన్‌లో..** స్థానిక తిలక్‌రోడ్డులోని అక్షర శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో క్విజ్ పోటీలు జరిగాయి. ఇందులో సి.హెచ్.రమ్యశ్రీ (9వ తరగతి), కె.జీవన్ హృతిక్ (8వ తరగతి), కె.నవ్యశ్రీ (7వ తరగతి) మొదటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను డైరెక్టర్ టి.నాగరత్నం, ఎన్.లావణ్య అందజేశారు.

విజేతలతో పాఠశాల సిబ్బంది

పోటీలో పాల్గొన్న చిన్నారులు

## కబడ్డీ జిల్లా మహిళా జట్టు ఎంపిక

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: భీమవరంలోని వీరవాసరంలో జనవరి 2 నుంచి 5వరకు జరిగే మహిళల కబడ్డీ జట్టును సోమవారం ఎంపిక చేశారు. ఎస్‌కేవీటీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కబడ్డీ జిల్లా సంఘ కార్యదర్శి బురిడి త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా మహిళల జట్టు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరుపాణ్యం, సంఘ కోశాధికారి ఎస్‌వీ కుమార్, పీడీలు కిషోర్‌బాబు, శ్రీనివాస్, వీరబాబు, గంగాధర్, సువర్ణ, ధనలక్ష్మి, పీవీ దుర్గ పాల్గొన్నారు.

### రహదారిపైనే వ్యర్థాలు..

వీరభద్రపురంలోని కస్తూరిబా వీధిలో కొంత మంది రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. నగరంలో నిత్యం వ్యర్థాలు వేసే ప్రాంతాలను గుర్తించి నగరపాలక సంస్థ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. మళ్లీ కొత్త ప్రాంతాల్లోని రోడ్లపై చెత్త వేస్తుండటంతో అధికారులు, స్థానికులకు తలనొప్పిగా మారింది. తగిన చర్యలు తీసుకోవాలని వారు స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దేవీచౌక్

### కుంగిన ఇనుప గ్రిల్..

కోటిపల్లి బస్టాండ్ వద్ద బస్సులు బయటకు వచ్చే మార్గంలో స్లాబు కుంగిపోయింది. నెలరోజులుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవట్లేదు. నగరంలోనే ఎక్కువ రద్దీ ప్రాంతాల్లో ఒకటి కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

### తెరిచిన ప్రమాదం..

కోరుకొండ రోడ్డులోని సింహాచల్‌నగర్‌లో మార్గం మధ్యలో విద్యుత్తు స్తంభాలకు ఫ్యూజ్ పెట్టెలు ప్రమాదకరంగా ఉన్నాయి. తీగలు కిందకు వేలాడుతున్నాయి. కోరుకొండ, గోకవరం ప్రాంతాల నుంచి ఈ మార్గంలోనే ప్రయాణిస్తారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

### చెబుతున్నా వినరే..!

నగర సుందరీకరణకు నగరపాలక సంస్థ అధికారులు ఎంత కృషి చేస్తున్నా కొంత మంది నిర్లక్ష్యంతో సరైన ఫలితాలు రావట్లేదు. పలుచోట్ల గోడలకు రంగులు వేసి, చెత్త వేయరాదు అని సూచికలు పెట్టారు. కానీ కొందరు అక్కడే వ్యర్థాలు వేసి, కాల్చేస్తున్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

### ఆదమరిస్తే అంతే..

రాజమహేంద్రవరం నగర శివారు కాతేరు పరిధిలోని శాంతినగర్ ఆరో వీధిలోని రోడ్డు మలుపులో డ్రైనేజీపై పలక పూర్తిగా దెబ్బతింది. వారం రోజుల నుంచి ప్రమాదకరంగా కనిపిస్తుంది. రాత్రి పూట ప్రయాణించేవారు గమనించకపోతే పడిపోవచ్చు. వర్షాలు పడినప్పుడు తరచూ సమస్య ఎదురవుతుంది. సంబంధిత అధికారులు స్పందించి పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

హాజరైన అధికారులు, ఉద్యోగులు

## సీఐడీ కార్యాలయ అధికారులకు అవగాహన

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న వైట్ కాలర్ నేరాలు, ఆర్థిక నేరాలపై సమర్థమైన దర్యాప్తు నిర్వహణకు సీఐడీ అధికారులు, సిబ్బందికి సోమవారం ప్రత్యేక అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరంలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో ఏపీపీడీఎఫ్ఈ చట్టం, న్యాయ విధానాలపై సీఐడీ ప్రాంతీయ అధికారిణి అస్మా ఫర్హీన్ పర్యవేక్షణలో శాఖాపరమైన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత ఏఎస్పీ వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ చిట్‌ఫండ్స్, కోఆపరేటివ్ సొసైటీలు వంటి సంస్థల ద్వారా జరుగుతున్న ఆర్థిక నేరాలకు సంబంధించి దర్యాప్తులో పాటించాల్సిన విధానాలు, నేరస్థుల ఆస్తుల అటాచ్‌మెంట్ ప్రక్రియ గురించి వివరించారు. సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రాధాకృష్ణరాజు మాట్లాడుతూ ఆస్తుల వేలం ప్రక్రియలో దర్యాప్తు అధికారి కోర్టులో అనుసరించాల్సిన న్యాయపరమైన విధానాలను వివరించారు. అదనపు పీపీలు నామ సూర్యనారాయణ, కనకలింగేశ్వరరావు, ఆర్.ప్రసాద్, సీఐడీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీస్తు బోధనలు అనుసరణీయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: క్రీస్తు బోధనలు అనుసరణీయమని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సంఘ కాపరుల క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జవహర్ మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, దయ, కరుణ పాటించాలన్నారు. దహించు అగ్ని వ్యవస్థాపకుడు బిషప్ థామస్ మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే విధంగా అందరూ ఉండాలని క్రిస్మస్ ప్రార్థన చేశారు. కార్యక్రమానికి హాజరైన విశాఖపట్నం జీఎస్‌టీ కమిషనర్ పి.ఆనంద్ కుమార్, సినీనటుడు, ప్రపంచ సువార్తీకుడు పాస్టర్ రాజా ప్రసంగించారు. దుస్తులు పంపిణీ చేశారు.

థామస్‌ను అభినందిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జవహర్, చిత్రంలో సినీనటుడు రాజా తదితరులు

## అంతర్జాతీయ సదస్సుకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

దేవీచౌక్, న్యూస్‌టుడే: ఒడిశాలోని భువనేశ్వర్ కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన 62వ ఆల్ ఇండియా పొలిటికల్ సైన్స్ అసోసియేషన్(ఐపీఎస్ఏ) సదస్సులో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ఆర్థిక సహకారంతో అయిదుగురు విద్యార్థినులు రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె.సీతామహాలక్ష్మి నేతృత్వంలో ఈ సదస్సుకు హాజరై తమ పరిశోధన పత్రాలు ప్రదర్శించారు. డాక్టర్ సీతామహాలక్ష్మి భారత రాజ్యవ్యవస్థ నిర్మాణంలో బృహస్పతి, శుక్ర, యాజ్ఞవల్క్యుల కృషి అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. వివిధ ప్యానెల్‌లో పరిశోధన పత్రాలు సమర్పించిన యూజీ విద్యార్థుల కృషిని నిర్వాహకులు ప్రశంసించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి

## కత్తి పట్టించడం దారుణం: శ్రీనివాస్

టి.నగర్: మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు సందర్భంగా జరిగిన వేడుకల్లో పైశాచికత్వం బయటపడిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న పిల్లలతో కత్తులు పట్టించి, నడిరోడ్డుపై మేకపోతులను బలిస్తూ, రక్తం చల్లుతూ రప్పారప్పా అంటూ తిరగడం దారుణమన్నారు. మీ పిల్లలతో కూడా ఇలాగే చేస్తారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తుందన్నారు. నగరంలో ఇప్పటివరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద 341 మందికి రూ.3.28 కోట్లు సాయం అందిందన్నారు. రూ.7.39 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. అనంతరం 49 మందికి రూ.34.70 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు.

## స్వర్ణాంధ్రా సేవలు గర్వకారణం

వార్షిక డైరీ ఆవిష్కరించిన వృద్ధులు, దివ్యాంగులశాఖ అదనపు సంచాలకుడు శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: వృద్ధులు, నిరాశ్రయులు, మహిళల కోసం 28 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న స్వర్ణాంధ్రా సేవలు గర్వకారణమని జిల్లా వృద్ధులు, దివ్యాంగుల శాఖ అదనపు సంచాలకుడు ఎ.వై.శ్రీనివాస్ ప్రశంసించారు. సోమవారం లాలాచెరువులోని వృద్ధుల కేంద్రంలో స్వర్ణాంధ్రా సేవాసంస్థ 2026 ఏడాది వార్షిక డైరీని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సంతోష్, రోటరీ క్లబ్ పూర్వపు అధ్యక్షుడు సి.పి.రెడ్డితో కలిసి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు కృషి అభినందనీయమన్నారు. వృద్ధులు, దివ్యాంగుల శాఖ సూపరింటెండెంట్ కె.రాజు, వై.హరికృష్ణ, మీరాకుమారి పాల్గొన్నారు.

## 5న వక్క సాగుపై రైతుల సదస్సు

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: వక్క సాగుపై జనవరి 5న దొరయ్య తోటలో రైతులతో సెమినార్ నిర్వహించనున్నట్లు పలువురు తెలిపారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వక్క రైతులు దొరయ్య చౌదరి, బాలాజీ, చక్రపాణి మాట్లాడారు. కర్ణాటక, తమిళనాడు, కేరళలో సాగు బాగుందని, ప్రభుత్వ ప్రోత్సాహాలతో పాటు బోర్డు కూడా ఉందన్నారు. మనకు ప్రోత్సాహకాలు, రాయితీలు లేవన్నారు. సాయం అందిస్తే మార్కెటింగ్ సమస్యలు కూడా తగ్గుతాయన్నారు.

## బజారేమో లోపల.. రైతులేమో బయట

దేవీచౌక్, న్యూస్‌టుడే: కోరుకొండ రోడ్డులోని మార్కెట్‌యార్డులో నిర్మించిన రైతుబజారు నిరుపయోగంగా మారింది. రైతుబజారు లోపల కనపడకుండా ఉండటంతో రైతులు బయటే దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. గతంలో ఇక్కడ ఉన్న రైతుబజారు తర్వాత మూతపడింది. స్థానికుల కోరిక మేరకు 2017లో మళ్లీ ఇక్కడ ఏర్పాటుచేశారు. తర్వాత 2019లో రూ.8.50 లక్షలతో షెడ్డు నిర్మించారు. గతంలో నటరాజ్‌కు అనుబంధంగా ఉన్న ఈ బజారు 2022లో పూర్తిస్థాయి రైతుబజారుగా ఏర్పాటుచేసి ఎస్టేట్ అధికారిని నియమించారు. ఇక్కడ ఒక కిరాణాతో సహా 12 దుకాణాలు ఉన్నాయి. కోరుకొండ రోడ్డుకు అనుకుని రైతుబజారు నిర్మించాలని అధికారులు రూ.32 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. దీనికి మంజూరు లభించినా కార్యరూపం దాల్చలేదు. మళ్లీ ఇప్పుడు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీనికి మంచి ఆదాయమే లభిస్తుంది. సాయంత్రం అయితే తగిన సదుపాయాలు లేకపోవడంతో రైతులు తమ వ్యాపారాలను త్వరగా ముగించాల్సి వస్తోంది. వర్షాకాలంలో లోపల నిర్వహించుకోవడంతో ఆదాయం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న రైతుబజారులో రైతులు, డ్వాక్రా సభ్యులు తమ కూరగాయలు, కాటాలు పెట్టుకునేందుకు ఉపయోగించుకుంటున్నారు. రోడ్డు ముఖంగా నిర్మిస్తే వినియోగదారులకు కనిపిస్తుందని, వ్యాపారం బాగుంటుందని అంటున్నారు.

బయట దుకాణాలు నిర్వహిస్తున్న రైతులు

ఖాళీగా మార్కెట్‌యార్డు

| | | | | | |
|---|---|---|---|---|---|
| రైతుబజారులోని దుకాణాలు: | 12 | రోజుకు వచ్చే వినియోగదారులు: | 100-120 మంది | రోజుకు ఆదాయం: | రూ.50వేల నుంచి రూ.60వేలు |

## ఉద్యోగుల హక్కుల అమలుకు నిరసన

వి.ఎల్.పురం: హక్కుల అమలుకు చర్యలు తీసుకోవాలని డక్కన్ క్రానికల్ ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్వతంత్ర కార్మిక సంఘాల సమాఖ్య(ఎఫ్ఐటీయూ), ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ(ఓపీడీఆర్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేశారు. డక్కన్ క్రానికల్ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకుని లేబర్ కోర్టు, హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయించాలని, న్యాయస్థానం తీర్పు ప్రకారం జీతాలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేజ్ బోర్డు జీతాల బకాయిలు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు.

(c) eenadu

# రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

## జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌కు 214 అర్జీలు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి 214 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ క్లినిక్ భూసంబంధ సమస్యలపై ఫిర్యాదులు 103 ఉన్నాయి. ఆన్‌లైన్‌కు సంబంధించిన ఫిర్యాదులు 20 నమోదుకాగా వీటిలో ఇళ్ల స్థలాల కేటాయింపుపై వచ్చిన అర్జీలు అధికంగా ఉన్నాయి. భూమిలేని పేదలు, మాజీ సైనికులకు ప్రభుత్వ భూముల కేటాయింపునకు సంబంధించిన అర్జీలు 14, హక్కుల రికార్డులు(ఆర్ఓఆర్)కు సంబంధించిన అంశాలలో భూమి స్వభావం, వర్గీకరణ, విస్తీర్ణం దిద్దుబాట్లు, ఆర్ఓఆర్ చట్టం కింద అప్పీలు, పట్టాదారుల తప్పు నమోదు వంటి అంశాలపై ఫిర్యాదులు 18 ఉన్నాయి.

## ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యలకు సత్వర న్యాయం చేసేలా పోలీసు అధికారులు పని చేయాలని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో స్వయంగా మాట్లాడి 30 ఫిర్యాదులను స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. సంబంధిత అధికారులతో ఫోన్లో చర్చించి వెంటనే సత్వర పరిష్కారం చూపాలని సూచించారు.

## పార్టీ బలోపేతానికి కార్యకర్తలదే కీలకపాత్ర

కోరుకొండ: పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కీలక పాత్ర పోషిస్తున్నారని తెదేపా జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ (బీవీఆర్) చౌదరి పేర్కొన్నారు. బూరుగుపూడి వద్ద తెదేపా కార్యాలయంలో సోమవారం జరిగిన సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉత్తమ కార్యకర్తలను సత్కరించారు. అంకితభావంతో పనిచేసిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలను గుర్తిస్తూ ఉత్తమ ప్రశంసా పత్రాలను పంపిణీ చేసి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి బీవీఆర్ ప్రసంగించారు. కార్యక్రమంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యకర్తలను సత్కరించిన బీవీఆర్

## సత్తా చాటి.. పతకాలు పట్టి

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బొమ్మూరు మారుతీ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. మ్యూజికల్ ఫామ్, పాయింట్ ఫైట్ 34 కేజీల విభాగంలో ఆర్జెన్ విలియమ్స్(స్వర్ణ), ఎం.రిషిత(స్వర్ణ, రజత), 28 కేజీల విభాగంలో ఎం.సహన(స్వర్ణ, రజత) పతకాలను సాధించారు. ఈ క్రీడాకు ఎం.గణేష్, ఎన్.గిరి వెంకటరమణలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

## జాతరకు పందిరిరాట ముహూర్తం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కనుమ పండగను పురస్కరించుకుని కొని మండలంలోని కుతుకులూరులో భక్తాంజనేయస్వామి వారి జాతర మహోత్సవానికి సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పందిరిరాట ప్రతిష్ఠ చేశారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. తిరుమలరెడ్డి, ఆలయకమిటీ సభ్యులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పందిరిరాటను ప్రతిష్ఠిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

## బాధిత కుటుంబానికి చేయూత

కడియం : కడియపులంక పరిధి దోశాలమ్మకాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఎల్లంశెట్టి సముద్రం ఇల్లు కాలిబూడిదై నిరాశ్రయులుగా మారారు. సోమవారం అతని కుటుంబానికి టీవీసీ ట్రస్ట్ అధ్యక్షుడు తాడాల విష్ణుచక్రవర్తి రూ.10 వేలు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో తాడాల కృష్ణకుమార్, కొత్తపల్లి శివాజీ, సాపిరెడ్డి కామేష్ పాల్గొన్నారు.

## రాయితీ రుణాలు.. ప్రగతి బాటలు

మరికొందరికి ఉపాధి..

డ్వాక్రా రుణంతో పాటు స్త్రీనిధి ద్వారా బ్యాంకు రుణం తీసుకున్నాను. వాటితో పర్యావరణానికి ఉపకరించే పేపర్ ప్లేట్లు (భోజనం ప్లేట్లు) తయారు చేసే యంత్రాలు కొనుగోలు చేశాను. వాటితో రోజుకు సుమారు 5వేల ప్లేట్ల వరకు తయారు చేస్తున్నాం. ప్రస్తుత తరుణంలో మార్కెట్ బాగుండటంతో మంచి రాబడి వస్తోంది. కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండటంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నా. - సిహెచ్.పూర్ణిమాదేవి, తూర్పుగోనగూడెం

రాజానగరం, న్యూస్‌టుడే: ప్రోత్సాహం ఉంటే కానీ నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అలాంటి వారి కోసం ప్రభుత్వం వివిధ పథకం రూపంలో ఆర్థికసాయం అందిస్తోంది. రుణాలు మంజూరు చేస్తోంది. రాజానగరం నియోజకవర్గానికి చెందిన కొంతమంది మహిళలు మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాల ద్వారా చైతన్యం పొందారు. సొంతంగా చిరు వ్యాపారాలు ప్రారంభించారు. రాయితీ రుణాలు తీసుకుని వాటిని మరింత విస్తరించారు. నేడు కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండటంతో పాటు మరికొందరికి ఉపాధి చూపుతున్నారు.

కుటుంబమంతా కలిసి..

శ్రీకృష్ణపట్నం గ్రామానికి చెందిన రాజేశ్వరి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. ఆర్థికంగా భర్తకు చేయూతగా ఉండాలనే ఉద్దేశంతో వాటర్‌ప్లాంట్, టీ టైమ్ ఏర్పాటు చేసుకున్నాం. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలతో వాటిని అభివృద్ధి చేసుకున్నాం. నేడు కుటుంబం మొత్తం దీని మీదే పనిచేస్తున్నాం. ప్రతినెలా మంచి ఆదాయం ఆర్జిస్తున్నాం. - ఎం.సత్యవతి, శ్రీకృష్ణపట్నం

### మార్కెట్‌కు అనుగుణంగా..

గత కొంతకాలంగా దుస్తుల ఎంబ్రాయిడరీపై మహిళల్లో ఆసక్తి పెరిగింది. ఉపాధి కోసం తొలుత టైలరింగ్, కుట్టు, అద్దకం వంటి పనులు ప్రారంభించాను. మార్కెట్‌లో మారుతున్న పోకడలకు అనుగుణంగా మార్పులు చేసుకుంటూ వస్తున్నా. రాయితీ రుణం తీసుకుని వ్యాపారం మరింత విస్తరించాను. మంచి లాభాలు వస్తున్నాయి. నాతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉంది. - టి.ఉషామాధవి, హౌసింగ్‌బోర్డుకాలనీ

## అంతరిక్షయానం ఓ అద్భుత పయనం

కడియం, న్యూస్‌టుడే: అంతరిక్షయానం ఓ అద్భుత పయనమని రోదసిలో ప్రయాణించనున్న దంగేటి జాహ్నవి విద్యార్థులకు సూచించారు. సోమవారం కడియం జడ్పీ ఉన్నత పాఠశాలలోని చిన్నారులకు నాసా, ఇస్రో, చంద్రయాన్-3పై ఆమె ప్రత్యేక తరగతులు నిర్వహించి అవగాహన కల్పించారు. వాటికి సంబంధించిన కొన్ని వీడియోలను విద్యార్థులకు చూపించి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి జీవీఎన్ఎస్ నెహ్రూ అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు జాహ్నవిని సన్మానించారు. ఎంఈవోలు నాగేశ్వరరావు, మణికుమార్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడియంలో విద్యార్థులు ఉపాధ్యాయులతో దంగేటి జాహ్నవి

## సేవా కార్యక్రమాల్లో భాగస్వాములుకండి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద బోధనలతో చైతన్యవంతులైన యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఉత్తరకాశీ అద్వైతాశ్రమ ప్రతినిధి స్వామి సూర్యభాష్యరేంద్ర సరస్వతి మహారాజ్ అన్నారు. అనపర్తి వర్తక సంఘం కల్యాణ మండపంలో శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ యువజన దినోత్సవం, వందేమాతరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా భారతమాత, స్వామి వివేకానంద చిత్రపటాలకు పూలమాలలు వేశారు. వివేకానంద సాహిత్యంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన 60 మంది విద్యార్థులు, 20 మంది ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు ఎ.శర్వాణి, కల్యాణి ధనలక్ష్మి, డి.లక్షీసంజనలకు స్వామి వివేకానంద సాహిత్య ప్రతిభా పురస్కారం పేరిట రూ.1000 చొప్పున నగదు, జ్ఞాపిక అందజేశారు. సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, తహసీల్దారు అనీల్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ మిషన్ సభ్యుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో స్వామి సరస్వతి మహారాజ్

## నేడు నరసన్న ఉత్తరద్వార దర్శనం

కోరుకొండ, న్యూస్‌టుడే: ప్రసిద్ధి చెందిన కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ముక్కోటి పర్వదినం పురస్కరించుకుని ఉత్తరద్వార దర్శనం జరుగుతుంది. తెల్లవారు జాము 4 గంటలకు ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు. ఉదయం 5.30 గంటలకు ఉత్తరద్వారం గుండా స్వామివారు విశేష అలంకరులై భక్తులకు దర్శనం ఇస్తారు. పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. ముక్కోటి సందర్భంగా సోమవారం కింద ఆలయంలోని స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. అలంకరణ తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం ఇచ్చారు.

విశేష అలంకరణతో శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం

### వైష్ణవాలయాల్లో ఏర్పాట్లు..

రాజానగరం: వైష్ణవాలయాలలో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. ఆలయాలను వివిధ రకాల పూలతో, రంగురంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. దివాన్‌చెరువులోని డీబీవీ రాజు టౌన్‌షిప్‌లో వెలసి ఉన్న లక్ష్మీపద్మావతి, గోదా ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఆలయ ప్రధానార్చకులు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేకువజామున మూడు గంటల నుంచి స్వామి వారికి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. నాలుగు గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందన్నారు. ఆలయ వ్యవస్థాపకులు డీబీవీ రాజు కుంటుంబ సభ్యులు తొలి దర్శనం చేసుకుంటారని అన్నారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన దాతల దర్శనం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారని చెప్పారు. రాత్రి 9 గంటల వరకు స్వామి వారిని దర్శించుకోవచ్చని చెప్పారు. మంగళవారం స్వామి వారి జన్మ నక్షత్రం కావడంతో మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు.

లక్ష్మీనరసింహస్వామి

బొమ్మూరు వెంకటేశ్వరనగర్‌లో..

### ఆలయాల ముస్తాబు..

బొమ్మూరు : బొమ్మూరు వెంకటేశ్వరనగర్‌లోని శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, కైంకర్యాల అనంతరం భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకుంటారని పేర్కొన్నారు. ● స్థానిక వెంకటగిరికొండపై వేంచేసిన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం మూలమూర్తికి విశేష పూజలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త కామిని ప్రసాద్ చౌదరి అన్నారు. ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశామన్నారు. ● హుకుంపేట మూడుగుళ్లలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు.

## బుద్ధుడిగా భజేనారాయణుడు

రంగంపేట, న్యూస్‌టుడే: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వడిశలేరు శ్రీభజేనారాయణస్వామి ఆలయంలో దశావతార మహోత్సల్లో సోమవారం బుద్ధుడి అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, ఊరేగింపు ఉంటాయని ఈవో ఎం.రాంబాబు, ఆలయ కమిటీ ఛైర్మన్ మలిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.

గెలుపొందిన బహుమతులతో జ్యోతిబాఫులె గురుకుల విద్యార్థులు

## పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

బొమ్మూరు, న్యూస్‌టుడే: ఇటీవల రాజమహేంద్రవరం ఎస్‌కేవీటి కళాశాలలో నిర్వహించిన సంసద్ ఖేల్ మహోత్సవ్ జిల్లాస్థాయి పోటీల్లో బొమ్మూరులోని మహాత్మ జ్యోతిబాపులే గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వాలీబాల్, కోకోలో ప్రథమ, టెన్నికాయిట్‌లో ద్వితీయ, కబడ్డీలో తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారని ప్రిన్సిపల్ ఇంద్ర లక్ష్మీ తెలిపారు. పాఠశాల తరఫున వివిధ పోటీల్లో 27 మంది విద్యార్థులు పాల్గొనడం విశేషమన్నారు. శిక్షకురాలు రమ్య తర్ఫీదు వల్ల విజయాలు సాధించారని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉత్తమ విద్యార్థులకు నగదు బహుతులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలు మండలం కొంకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు దాత నగదు బహుమతులు అందించారని ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. పదిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి, ప్రస్తుతం ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న ప్రతిభావంతులకు స్థానికులు కర్రి హరినాథరెడ్డి కుమారుడు, ఎన్ఆర్ఐ సత్యనారాయణరెడ్డి రూ.20 వేల నగదు అందించారని వివరించారు.

## చట్టాలపై అవగాహన అవసరం

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని దోసకాయలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు చట్టాలపై పోలీసులు అవగాహన కల్పించారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై అలెగ్జాండర్, ఏఎస్ఐ రామకృష్ణ వారికి పలు అంశాలను వివరించారు. పోక్సో చట్టం, ఇన్‌స్టాగ్రామ్, సైబర్ నేరాలు, వాట్సాప్ దురలవాట్లు, 18 ఏళ్లు నిండకుండా డ్రైవింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్.అమ్మాజీ, ఉపాధ్యాయులు బి.సాంబశివరావు, రెడ్డి, సత్యనారాయణ, పీసీలు శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం, సాయికుమారి తదితరులు పాల్గొన్నారు.

## రంగంపేట ఆర్యవైశ్య సంఘం ఎన్నిక

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేట ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ఎన్నిక సోమవారం జిల్లా అధ్యక్షుడు బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షునిగా ఉప్పల వెంకట్రాజు, కార్యదర్శిగా గళ్లా వీర్రాజు, సహాయ కార్యదర్శిగా బవిరిశెట్టి సత్తిబాబు, కోశాధికారిగా కుసుమంచి రాజేష్ ఎంపికయ్యారు. మండల అధ్యక్షుడు మండవిల్లి రాజా, ఉపాధ్యక్షుడు మండ శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనరు నడిపల్లి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

## టిప్పర్ లారీని ఢీకొని విద్యార్థి మృతి

**కడియం :** టిప్పర్ లారీని ఢీకొని విద్యార్థి మృతిచెందిన ఘటన కడియం పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ అల్లు వెంకటేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం.. జేగురుపాడు పరిధి పాములమెట్టకు చెందిన జగతా వీరవెంకట సత్యశివశంకర్(19) రాజమహేంద్రవరంలోని రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. కళాశాల నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. కడియం నుంచి అనపర్తి వెళ్లే రహదారిలో ముందు వెళ్తున్న కారును తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న గ్రావెల్ టిప్పర్ లారీని బలంగా ఢీకొట్టాడు. దాంతో బైకుపై నుంచి కిందపడి తలకు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. లారీని కడియం పోలీసుస్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి శవపంచనామా నిమిత్తం పంపించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ ధనలక్ష్మి ప్రసన్న తెలిపారు.

## నిరుపయోగంగా భారత్ సేవా నిర్మాణ సేవా కేంద్రం

రాజానగరంలో వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన భారత్ సేవా నిర్మాణ సేవా కేంద్రం నిరుపయోగంగా మిగిలింది. చుట్టూ తుప్పలు మొలిచి సదరు భవనం నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా తయారైంది. లక్షలాది రూపాయలతో నిర్మించిన ఈ సేవా కేంద్రాన్ని ఒక్కసారి కూడ వినియోగించలేదు. అధికారులు సైతం దీన్ని పట్టించుకోకుండా వదిలేశారు. ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

## రోడ్డుపైకి మురుగు.. నిర్వహణ కనుమరుగు

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు శృతి ఆసుపత్రి ప్రధాన రహదారి వద్ద కొన్ని రోజుల నుంచి కాలువ మురుగు రోడ్డుపైకి పారుతుంది. నిత్యం అధికారులు ఈ మార్గాన రాకపోకలు సాగిస్తుంటారు. అయినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. రోడ్డుకు మరోపక్క కల్వర్టు పగిలి ఇనుప ఊచలు కనిపిస్తున్నాయి. రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలపై గ్రామకార్యదర్శి కాశీ స్పందిస్తూ చర్యలు తీసుకుంటామన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ

రంగంపేట, న్యూస్‌టుడే: జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో రంగంపేట శ్రీవుండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రాజమహేంద్రవరంలోని శ్రీసత్యసాయి గురుకుల పాఠశాలలో ఇటీవల నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో 700 ప్రాజెక్టులు కొలువుదీరాయి. ఇందులో ప్రతిభచాటిన బి.పల్లవి, ఎం.దీక్షిత నవ్య, జి.భాస్కరి, బిందురమ్యశ్రీ, ఎ.శ్రీసాయిదుర్గా, ఎం.సీతామహాలక్ష్మిలను సోమవారం ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అభినందించారు. వీరికి శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులు వి.రమ్యసుధ, పి.సావిత్రి, భారతిలను సత్కరించారు.

రంగంపేట విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రధానోపాధ్యాయుడు

## పీఎం ఉజ్వల యోజనతో మహిళలకు మేలు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎం ఉజ్వల యోజన 3.0 పథకంతో మహిళలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి పాతవూరులోని రజక కమ్యూనిటీ హాల్లో పలువురు మహిళలకు సోమవారం ఆయన ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించారు. కట్టెల పొయ్యి నుంచి మహిళలను దూరంగా ఉంచాలనే ప్రధాని మోదీ ఉజ్వల యోజనకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, తమలంపూడి సుధాకర్‌రెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

## 2 నుంచి గ్రామసభలు..

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: దేవాదాయ భూములకు సంబంధించి ప్రాపర్టీ రిజిస్టర్‌లో ఉన్న భూములకు తప్పనిసరిగా 1బి రికార్డులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల్లో స్పష్టత లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడకూడదని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్జీదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. వచ్చే నెల 2 నుంచి 9 వరకు గ్రామసభలు నిర్వహించి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. జేసీ మాట్లాడుతూ రెవెన్యూ క్లినిక్‌లో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

## మహిళా కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

శ్యామలాసెంటర్ : భీమవరంలోని వీరవాసరంలో జనవరి 2 నుంచి 5వ రకు జరిగే మహిళల కబడ్డీ జట్టును సోమవారం ఎంపిక చేశారు. ఎస్‌కేవీటీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కబడ్డీ జిల్లా సంఘ కార్యదర్శి బురిడి త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా మహిళల జట్టు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరుపాణ్యం, సంఘ కోశాధికారి ఎస్‌వీ కుమార్, పీడీలు కిషోర్‌బాబు, శ్రీనివాస్, వీరబాబు, గంగాధర్, సువర్ణ, ధనలక్ష్మి, పీవీ దుర్గ పాల్గొన్నారు.

## యువ సంక్షేమ పథకాలపై అవగాహన

రాజానగరం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని యువజన వ్యవహారాల శాఖ - సెట్రాజ్ యువతకు సంబంధించిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు యువ అవగాహన కార్యక్రమాన్ని జీజీయూలో సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ కె.ఎన్.వి.గౌతమ్‌రాజ్ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి, సెట్రాజ్ తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అందుబాటులో ఉన్న అవకాశాలను తెలియజేశారు. జీజీయూ ఫార్మసీ కళాశాల డీన్ డా.ఎం.డి.ధనరాజు మాట్లాడుతూ వికసిత భారత్‌లో యువతే ప్రధాన భాగమని పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసం, నాయకత్వం, వృత్తి అభివృద్ధి కోసం ప్రభుత్వ కార్యక్రమాల్లో యువత చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ప్రొఫెసర్ డా.సి.గోపి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్‌మీరా మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెట్రాజ్ ప్రతినిధి

## కసరత్తు దశలోనే బృహత్తర ప్రణాళిక..!

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం మాస్టర్ ప్లాన్ పరిధి విస్తరించారు. భవిష్యత్తు అవసరాలు దృష్టిలో పెట్టుకొని సమీపంలోని అయిదు మండలాల్లో 18 గ్రామ పంచాయతీలను కలిపి గతంలో కొత్తగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. తద్వారా కొత్తగా చేర్చిన గ్రామ పంచాయతీలను కలిపి జనాభా 6.37 లక్షలకు పెరుగుతుంది. జనాభా పెరిగితే కేంద్రం అర్బన్ ప్రాంతాలకు విడుదల చేసే నిధులు కూడా పెరుగుతాయి. దీంతో నగరానికి అదనంగా అభివృద్ధికి నిధులు విడుదలవుతాయి. దీంతో పాటు పది లక్షల జనాభా విస్తీర్ణం కలిగిన నగరాల్లో రాజమహేంద్రవరం చేరుతుంది. ఈ మేరకు కొత్త స్కీమ్‌ల ద్వారా పథకాలు వర్తిస్తాయి. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (రుడా)కు అనుసంధానంగా మాస్టర్ ప్లాన్ పరిధి విస్తరణకుల ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం దీనిపై కసరత్తు చేస్తోంది

### అభ్యంతరాలపై నివేదిక

కొత్త ప్లాన్ అమల్లో భాగంగా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం నగర విస్తీర్ణం 44.5 చ.కిమీ. కొత్త ప్లాన్ ప్రకారం 162 చ.కిమీగా నిర్ధారించారు. అర్బన్‌లో జనాభా 2011 లెక్కల ప్రకారం 3.45 లక్షలు ఉండగా అదనంగా మరో లక్ష మందికి పైగా ఉంటారు. కొన్ని గ్రామాలను చేర్చడంతో అదనంగా మరో లక్షన్నరకు పైగా జనాభా పెరుగుతున్నారు. వాస్తవానికి 2017లో అర్బన్‌లో దీనిని ఆమోదించారు. అప్పట్లోనే పరిధి విస్తరించాలనే ప్రతిపాదనలు ఉన్నా.. పక్కన పెట్టారు. ప్రస్తుతం గ్రామాల అభివృద్ధి, విస్తరణ దృష్టిలో పెట్టుకొని మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు సిద్ధపడ్డారు. గతంలో కొంత మంది లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు.

### సాంకేతికతను వినియోగించుకుని..

ప్లాన్‌ను జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ విధానంలోకి మార్పు చేస్తున్నారు. గతంలో అర్బన్‌లో ఉన్న 50 డివిజన్లకు చెందిన మాస్టర్ ప్లాన్‌తో పాటు కొత్తగా పరిధి విస్తరణతో కలుస్తున్న గ్రామాల నైసర్గిక స్వరూపం పూర్తిగా ఆన్‌లైన్‌లో చేర్చడం జరుగుతుంది. 2017లో ఈ టెక్నాలజీ అందుబాటులో లేకపోవడంతో జీఐఎస్ విధానం అమలు కాలేదు. ఈ విధానం ద్వారా అనధికార నిర్మాణాలు, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయవచ్చు. అంతర్జాలంలో నేరుగా మాస్టర్ ప్లాన్ వీక్షించవచ్చు. పైగా ఎప్పటికప్పుడు అనుమతులు, కట్టడాలు, మార్పులు చేర్పులు ఎవరైనా తెలుసుకునే అవకాశం ఉంది. మరోవైపు మాస్టర్ ప్లాన్ పరిధి విస్తరణతో గ్రామాల విలీనం తెరపైకి వస్తోంది. ఈ సారి మాస్టర్ ప్లాన్ విస్తరించడంతో రాజమహేంద్రవరంతోపాటు గ్రామాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేస్తారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

పెదపూడి, న్యూస్‌టుడే: ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారిని పెదపూడి ఎంపీపీ మెయిన్ పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులు రాణి, పి.సత్యనారాయణ, కె.సాయిబాబు, ఆర్.వినయ్‌హానక్, ఎం.శ్రీనివాస్ వినీల్‌లతో పాటు ఈనెలాఖరులో పదవీ విరమణ చేయనున్న ఎస్.వెంకటేశ్వర్లు, డి.సరళ, బి.ఎమాల్యారాణిలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎఈవో-1, 2 విశ్వనాథం, సి.వి.వి.సత్యనారాయణ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు


### పాస్‌పోర్ట్ పోయినది

**వరిగేటి శారద,** W/o మోషే, కోటి గ్రామం, కోరుకొండ మండలం, తూ॥గో॥ జిల్లా అనే నా యొక్క పాస్‌పోర్ట్ నెం. **R5903652** గలది తీసుకొని కోటి గ్రామం నుండి కోరుకొండ ఆటోలో వచ్చు సమయంలో పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలుపగలరు.

**వరిగేటి శారద, W/o మోషే**
అంబేద్కర్ నగర్, కోటి గ్రామం,
కోరుకొండ మండలం


(c) eenadu

# కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

**కొవ్వూరు పట్టణం:** రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ బి.అచ్యుతకుమారి తెలిపారు. డివిజన్‌స్థాయిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో కార్యాలయంలో సోమవారం రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాలకు అర్హత, ఆక్రమణలు తదితర 13 అంశాలపై అర్జీలు వచ్చాయి.

**తాళ్లపూడి:** స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్‌తోపాటు రెవెన్యూ క్లినిక్ నిర్వహించినట్లు తహసీల్దార్ లక్ష్మీలావణ్య తెలిపారు. రీసర్వే, 22-ఏ, జాయింట్ పట్టాల సమస్యలపై అర్జీలు అందాయని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రజా సమస్యలపై దృష్టి

**కొవ్వూరు పట్టణం:** సంస్థాగత నిర్మాణంతో పార్టీని బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా పని చేస్తామని భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. కొవ్వూరు యానాదికాలనీలో నాయకులతో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. తాగునీటి సమస్యతో పాటు దశాబ్దాల క్రితం నిర్మించిన పైపులైన్లు ధ్వంసమయ్యాయని, తుప్పు పట్టాయని స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. నాగేంద్ర స్పందించి పురపాలక కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లుకు సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు. అనంతరం స్థానిక మహిళ నాయకురాలు దార్లంక పద్మావతితోపాటు పలువురు భాజపాలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బీవీ ముత్యాలరావు, తురగా భాస్కర్, రావూరి వెంకట ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులం.. దయచూపండి..!

★ బడ్డీకొట్టు తొలగించాలని ఇబ్బందిపెడుతున్నారు ★ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు

**నిడదవోలు, న్యూస్‌టుడే:** నిడదవోలు ఎన్జీఆర్‌కాలనీకి చెందిన పాతాళా శ్రీను, పాతాళా దాలినాయుడు దివ్యాంగులు. కనీసం నడవలేరు. ఎక్కడికి వెళ్లాలన్నా మూడు చక్రాల సైకిలే ఆధారం. అది కూడా ఎవరైనా కూర్చోబెట్టాలి. నెలవారీ వచ్చే పింఛను నుంచి కొంత ఆదా చేసి, మరికొంత బయట అప్పు చేసి సుమారు రూ.90 వేలతో హౌసింగ్ ఆసుపత్రి చెర్రీ రహదారి పక్కన జీవనం కోసం చిన్న బడ్డీకొట్టు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం ఆసుపత్రి యాజమాన్యం పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బడ్డీకొట్టు తొలగించాలని లేని పక్షంలో క్రేన్‌తో తామే తొలగిస్తామని నోటీసు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి యాజమాన్యం అనుమతితోనే బడ్డీకొట్టు పెట్టుకున్నామని, ఇప్పుడు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. దానిని వేరే ప్రాంతానికి తరలించాలంటే రూ.12 వేల వరకు ఖర్చవుతుందన్నారు. పింఛన్ తప్ప ఏటువంటి ఆసరా లేదని, ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ విషయం పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆసుపత్రి చెర్రీ బడ్డీకొట్టు పెట్టడం వల్ల తమకు ఇబ్బందిగా ఉందని ఆసుపత్రి యాజమాన్యం తమ దృష్టికి తీసుకొచ్చిందని వారు తెలిపారు. సంతమార్కెట్‌లో ఉన్న పురపాలక వాణిజ్య సముదాయంలో ఖాళీగా ఉన్న దుకాణంలో నామినల్ అద్దె ప్రాతిపదికన అందిస్తామని చెబుతున్నారు.

దివ్యాంగ సోదరులు ఏర్పాటు చేసుకున్న బడ్డీ దుకాణం

## ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

**నిడదవోలు :** మండలంలోని తిమ్మరాజుపాలెంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ముగిసాయి. విన్నర్స్‌గా తిమ్మరాజుపాలెం, రన్నర్స్‌గా తాడిమళ్ల జట్లు నిలిచాయి. విన్నర్ జట్టుకు రూ.25 వేల నగదుతోపాటు కప్పు అందచేశారు. రన్నర్ జట్టుతోపాటు క్రీడాకారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో దేవులపల్లి రవిశంకర్, అయినీడి పల్లారావు, బండి సత్యనారాయణ, కొమ్మిన వెంకటేశ్వరరావు, బండి ప్రసాద్, బండి రవి చందర్, కాకర్ల వెంకటేశ్వరరావు, జోషి తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

| ✆ ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు |
|---|---|
| మండపేట: 80085 74183 | రామచంద్రపురం: 80085 74191 |
| కపిలేశ్వరపురం: 97044 16418 | పామర్రు: 80085 74228 |
| ద్రాక్షారామ : 80085 74192 | ద్వారపూడి : 91543 96553 |

### రహదారి శుభ్రం..

స్పందనకు వందనం

**తాళ్లపూడి:** మండలంలోని ప్రక్కిలంక భక్తాంజనేయస్వామి ఆలయం నుంచి గ్రామంలోకి వెళ్లే ఏటవాలు రహదారిలో పేరుకుపోయిన వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఇటీవల 'మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురితమైన ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి నందిరాజు స్పందించి పనులు శుభ్రం చేయించారు.

## సంక్రాంతి సంబరాలకు వేళాయె..!

న్యూస్‌టుడే, గోపాలపురం

**సంక్రాంతి** పండగ సందర్భంగా జిల్లాస్థాయిలో వివిధ ఆటల పోటీల నిర్వహణకు గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం సిద్ధమైంది. స్థానికుడు ఘంటా మధుకృష్ణ ఏర్పాటు చేసిన ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సహకారంతో మంగళవారం నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఐదేళ్ల కిందట వీటిని ప్రారంభించి అంతర జిల్లా స్థాయిలో క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది రాష్ట్రస్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ ఏడాది సమయం తక్కువ ఉండటంతో క్రికెట్, వాలీబాల్, ముగ్గులు పోటీలతో సరిపెడుతున్నారు.

### వాలీబాల్ పోటీల్లో...

గత ఏడాది వాలీబాల్ పోటీల్లో 8 జిల్లా జట్లు పాల్గొన్నాయి. ఈ ఏడాది ఎక్కువ మంది క్రీడాకారులతో పోటీలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలోని ఏ జిల్లా నుంచి అయిన వచ్చి ఆడే విధంగా ఏర్పాట్లు చేశారు. దీంతో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే జట్ల మధ్య జనవరి 11, 12, 13 తేదీల్లో దీపాల వెలుగులో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 50,000, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 40,000, రూ. 30,000 నగదుతోపాటు కప్పు అందిస్తారు.

దీపాల వెలుగులో వాలీబాల్ పోటీలు (పాత చిత్రం)

### నేటి నుంచి క్రికెట్ పోటీలు...

టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది వివిధ ప్రాంతాలకు చెందిన 30 జట్లు వచ్చాయన్నారు. ఆ టోర్నీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ. 1,00,000, రూ. 75,000, రూ. 50,000 నగదుతో పాటు కప్పు, జ్ఞాపిక అందిస్తారన్నారు. మ్యాచ్ ఆఫ్ ది సిరీస్, ఉత్తమ బ్యాట్స్‌మెన్, ఉత్తమ బౌలర్‌కు నగదుతోపాటు జ్ఞాపిక ఉంటాయన్నారు.

## స్వచ్ఛ సాకారానికి యువత ప్రతిన బూనాలి

**కొవ్వూరు పట్టణం:** నాతో పాటు నేనుండే పరిసరాలు శుభ్రంగా ఉండాలని.. ఆరోగ్యకర సమాజం సాకారానికి నావంతు కృషి చేస్తానని యువత ప్రతిన బూనాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిపుణుడు వి.ప్రదీప్ అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏబీఎన్ కళాశాల, కొవ్వూరు పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉన్నత భారత్ సమన్వయకర్త డాక్టర్ వై.రమేష్, ఎన్ఎస్ఎస్ పీవో వై.రవీంద్ర, పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమానికి కృషి

**కొవ్వూరు పట్టణం:** ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఏపీటీఎఫ్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘానికి చెందిన నూతన క్యాలెండర్లు, డైరీలను సోమవారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. తెదేపా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, కొవ్వూరు మండల తెదేపా అధ్యక్షుడు బేతిన నారాయణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, ఆర్మ్‌డ్ పోలీసు విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బీవీఆర్‌కు అభినందన

**చాగల్లు :** తెదేపా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బి.వెంకటరమణ చౌదరిని సోమవారం రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆళ్ల హరిబాబు, నాయకులు సూరపనేని చిన్ని, బి.శివనాగేంద్ర, గారపాటి శ్రీదేవి కలిసి అభినందనలు తెలిపారు.

## రీసర్వేపై గ్రామ సభలు

**గోపాలపురం :** నాలుగో విడత భూముల రీసర్వేపై చిట్యాల, గంగోలు సచివాలయాల వద్ద డిప్యూటీ తహసీల్దార్ సాంబశివరావు ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం గ్రామస్థులు, రెవెన్యూ అధికారులు ర్యాలీ చేపట్టారు. వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## ఉండ్రాజవరంలో క్రిస్మస్ వేడుకలు

**ఉండ్రాజవరం:** ఉండ్రాజవరంలోని యెహోవా ప్రార్థన మందిరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన సంఘకాపరులు దైవ సందేశమిచ్చారు. చిన్నారులు ప్రదర్శించిన నాటికలు, గీతాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

## 'మన డబ్బులు మన లెక్కలపై ర్యాలీ

**దేవరపల్లి :** మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో దేవరపల్లిలో సోమవారం స్వయం సహాయక సంఘాల సభ్యులు మన డబ్బులు-మన లెక్కలు అంశంపై ర్యాలీ నిర్వహించారు. అధ్యక్షురాలు గద్దె రమాదేవి, ఇన్‌ఛార్జి ఏపీఎం సుజినీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభోత్సవాలు.. భూమిపూజ

**గోపాలపురం :** గోపాలపురంలో నూతనంగా నిర్మించిన రెండు అంగన్‌వాడీ కేంద్ర భవనాలు, గోకులం షెడ్డును ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సోమవారం ప్రారంభించారు. స్థానిక రజక పేటలో భూరెడ్డి బంగారయ్య పేరిట వారి కుమారులు సుమారు రూ.2 లక్షలతో చేపట్టే వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నున్న మోహన్‌రావు, సుభాష్ చంద్రబోస్, రాజాబాబు, జ్యేష్ఠ శ్రీధర్, బూరెడ్డి వాసు, వడ్లమూడి రమేష్‌బాబు తదితరులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## చురుగ్గా పారిశుద్ధ్య పనులు

**ఉండ్రాజవరం :** ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో సోమవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను డిప్యూటీ ఎంపీడీవో కట్టమూరి ఆంజనేయ శర్మ తదితరులు పర్యవేక్షించారు. ఇంటింటా చెత్త సేకరణ, తడి, పొడి చెత్త విభజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## క్విజ్ పోటీలతో మేధస్సుకు పదును

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

**కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే :** 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కొవ్వూరు మండలంలోని కుమారదేవం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్' అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని సమాధానాలను రాసి ప్రతిభ చాటారు. పి.మణికంఠ (7వ తరగతి), కె.తేజగగన్, ఎం.పండు (9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.చంద్రశేఖర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో కుమారదేవం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్

### చాగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో...

**చాగల్లు:** 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో చాగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. 'జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్' అంశాలపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పి.బాల వెంకట సాయికిరణ్(9వ తరగతి) ప్రథమ, 7వ తరగతి విద్యార్థులు కె.రాకేష్ ద్వితీయ, కె.పూజ తృతీయ బహుమతులు సాధించారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు, ప్రశంసా పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.వాసవి చేతుల మీదుగా విజేతలకు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాధానాలు రాస్తున్న విద్యార్థులు

విజేతలతో చాగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

## చెరువు.. పట్టించుకున్న వారు కరవు

**చాగల్లు** మండలం చిక్కాలపాలెం వాసుల తాగునీటి అవసరాలు తీర్చిన చెరువు ఇది. కాలక్రమంలో బోర్లు, కొళాయిలు అందుబాటులోకి రావడంతో దీనిని పట్టించుకున్న వారే కరవయ్యారు. దీంతో పూడిక, పిచ్చి మొక్కలు పెరిగి, చెత్తా చెదారంతో నిండి కనిపిస్తోంది. ఈ చెరువు దుస్థితిపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శి సంధ్యారాణి దృష్టికి తీసుకు వెళ్లగా చెరువులో పూడిక తొలగించి, పంచాయతీకి ఆదాయవ సమకూరేలా చేపల పెంపకానికి వేలంపాట నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, చాగల్లు

## మురుగు పారక.. దుర్వాసన వీడక

**దేవరపల్లి** మండలంలోని యర్నగూడెంలో పాత బరోడా బ్యాంకు రోడ్డులో మురుగు కాలువ అధ్వానంగా తయారవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నివాసాల్లో వాడుకున్న నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దుర్వాసన వ్యాపించి దోమలు విజృంభిస్తున్నాయని సుమారు పది కుటుంబాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి అమ్మిరాజు వద్ద ప్రస్తావించగా కాలువను బాగుజేయించి మురుగు పారుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, దేవరపల్లి

## క్వార్టర్లు శిథిలం.. ఆవరణ అధ్వానం

**కొవ్వూరు** ప్రధాన తాగునీటి సరఫరా విభాగం నడిచే ప్రాంగణం పిచ్చి మొక్కలతో చిట్టడవిని తలపిస్తోంది. విష పురుగుల సంచరిస్తున్నాయి. పురపాలక విద్యుత్తు విభాగం ఉద్యోగి, ఫిట్టరు కోసం దశాబ్దాల కిందట ఇక్కడ రెండు క్వార్టర్లు నిర్మించారు. అవి శిథిల స్థితికి చేరి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. ఈ అంశాన్ని పురపాలక కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా పుష్కరాల అభివృద్ధి ప్రణాళికలో భవన నిర్మాణం, తాగునీటి సరఫరా మెరుగుపర్చే పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు. – న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

## యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**నల్లజర్ల, న్యూస్‌టుడే:** యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈవో సత్యనారాయణ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మనోహర్‌కుమార్, భవానీ, మండలశాఖ అధ్యక్షుడు ఆలీఅహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

**పెరవలి:** యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఎంఈవోలు బి.బాలసుబ్రహ్మణ్య స్వరూప్, షేక్ సూర్జాన్ ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.వెంకటరాముడు, జిల్లా గౌరవాధ్యక్షుడు విప్పర్తి వెంకటరమణ, మండల అధ్యక్షుడు పి.నరేంద్ర, కార్యదర్శి డీవీఎస్ తారాకృష్ణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సెలవుల దరఖాస్తు పుస్తకాలు..

**ఉండ్రాజవరం:** యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన కాజువల్ సెలవుల దరఖాస్తు పుస్తకాలను ఎంపీడీవో శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించి, ఉద్యోగులకు పంపిణీ చేశారు. ఎంఈవోలు శారదజ్యోత్స్న, సక్సేనారాజు, డిప్యూటీ ఎంపీడీవో శేషుబాబు, యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసు, అసోసియేట్ అధ్యక్షుడు వి.కృష్ణప్రసాదు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'ప్రతిపక్షాలపై నిందలు వేసి లబ్ధిపొందాలని చూస్తున్నారు'

**నల్లజర్ల:** కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలపై నిందలు వేసి లబ్ధిపొందాలని చూస్తోందని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆరోపించారు. నల్లజర్లలో వైకాపా మండలశాఖ అధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం నివాసం వద్ద సోమవారం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇటీవల తూర్పు చోడవరంలో జగన్ ఫ్లెక్సీ ఎదుట రక్తాభిషేకం చేసిన వైకాపాకు చెందిన ఏడుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్న తీరు, తర్వాత జరిగిన పరిణామాలపై చర్చించారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించి నడవలేని స్థితిలో ఉన్న యువకులను కిలోమీటరు దూరం కాలినడకన ఆసుపత్రికి తీసుకెళ్లడం దారుణమన్నారు. వనిత మాట్లాడుతూ ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వెలగా శ్రీరామమూర్తి, కూచిపూడి సతీష్, వాసు, బంకా అప్పారావు, బళ్లనాని, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

**నల్లజర్ల:** విద్యుత్తు ఉప కేంద్రంలో ఆర్డీఎస్ పనుల నిమిత్తం సింగరాజుపాలెంలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు.

## పుల్లయ్య మాస్టారి మృతి తీరని లోటు

**కొవ్వూరు పట్టణం :** మాదిగల సంక్షేమానికి శ్రమించిన మహోన్నత వ్యక్తి పుల్లయ్య మాస్టారి మృతి తీరని లోటని బాబూ జగ్జీవన్‌రామ్ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పెనుమాక జయరాజు అన్నారు. స్థానిక కేజీఎం పాఠశాలలో శ్రీరాముల పుల్లయ్య సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు. పలువురు ఆయన సేవలను కొనియాడారు. సాల్మన్‌రాజు, ఎ.గరటరావు, శ్రీరాముల రాజు, బొల్లిపో మధు, కేబీ గాంగేయుడు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**కొవ్వూరు పట్టణం :** గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ పి.విశ్వం సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ సమీపంలోని నదిలో సుమారు 35-40 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అయ్యప్ప మాల ధరించి గుర్తుగా శరీరంపై నల్లటి వస్త్రాలున్నాయన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు పట్టణ స్టేషనును సంప్రదించాలని సీఐ కోరారు.

## ప్రాధాన్య క్రమంలో పల్లెల అభివృద్ధి

**కొవ్వూరు పట్టణం:** ప్రాధాన్య క్రమంలో పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం తోగుమ్మిలో రూ.40 లక్షలతో చేపట్టిన పనులను ప్రారంభించి, రూ.30 లక్షలతో చేపట్టే పనులకు సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో రహదారి, కొత్త కాలనీలో రూ.10 లక్షలతో మరో రహదారి నిర్మించారన్నారు. కొత్తకాలనీలో పీఎంఏజేవై నిధులు రూ.20 లక్షలతో అయిదు డ్రెయిన్లు, అదే ప్రాంతంలో రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. నాయకులు యూవీఎస్ నారాయణ, మద్దిపాటి సత్యనారాయణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, గారపాటి రామచంద్రరావు, తోరం నగేష్, మద్దినాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తోగుమ్మిలో రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

దేవరపల్లిలో విద్యుత్తు కాంతులతో వెంకన్న ఆలయం

## ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

**దేవరపల్లి:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్థానికంగా కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, రాత్రి 7 గంటలకు ఉభయ దేవేరులతో కూడిన స్వామివారి తిరుచ్చి ఉత్సవం జరుగుతుందని ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. వచ్చే నెల 14న గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తామన్నారు.

**ఉండ్రాజవరం:** ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉండ్రాజవరంలో కొలువైన భూదేవి, శ్రీదేవి సమేత కేశవస్వామిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు. మోర్త, వేలివెన్ను, పాలంగి, సూర్యారావుపాలెం, పసలపూడి, వెలగదుర్రు, ఉండ్రాజవరం, తాడిపర్రు, వడ్లూరులో గోపాలస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

## రోడ్డు పక్కన బండ్ల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

**నిడదవోలు :** నిడదవోలు సామాజికాసుపత్రి ఎదురుగా రోడ్డు పక్కన పెట్టిన ఐస్ విక్రయ వాహనాలను ఎట్టకేలకు తొలగించారు. వీటి కారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులతో పాటు గణపతికూడలి నుంచి సంత మార్కెట్‌కు వచ్చే వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీనిపై ఈనెల 17న 'ఈనాడు'లో 'మార్జిన్‌లో ఇలా.. రాకపోకలు ఎలా' శీర్షికన ప్రచురితమైన కథనానికి పురపాలక అధికారులు స్పందించి వీటి తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

## న్యూటన్‌కు పురస్కారం

**నిడదవోలు :** మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గాను నిడదవోలుకు చెందిన డాక్టర్ విప్పర్తి ఐజక్ న్యూటన్ పండుకు రాజమహేంద్రవరం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మెమోరియల్ ట్రస్ట్ సేవా సామ్రాట్ జీవిత కాలం సాఫల్య పురస్కారం ప్రకటించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు కె.కృష్ణమూర్తి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు పండు తెలిపారు.

**CHANGE OF NAME**

I , MOLLA MOULANA MOHIDDIN, S/o. Molla Janna Saheb, D.No. 2-134/1, Peravali (M), E.G.Dist., A.P., Have Changed my name from Moula Mohidden Molla (Old Name) to Molla Moulana Mohiddin (New Name) here after called as Molla Moulana Mohiddin for all purposes.




## సింగిల్ టెండర్ ఆమోదం ముమ్మాటికీ అవినీతే

సమావేశంలో కౌన్సిలర్ కామిశెట్టి ధ్వజం

**నిడదవోలు, న్యూస్‌టుడే :** గత కొంత కాలంగా పట్టణంలో అభివృద్ధి పనులకు సంబంధించి సింగిల్ టెండర్ల ఆమోదం అవినీతేనని 21వ వార్డు కౌన్సిలర్ కామిశెట్టి వెంకటసత్యనారాయణ ధ్వజమెత్తారు. నిడదవోలు పురపాలక సంఘ సాధారణ, అత్యవసర సమావేశాలు ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. పురపాల పనులకు సంబంధించి సింగిల్ టెండర్ల ఆమోదంపై 'ఈనాడు'లో 'మేమింతే..!' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనాన్ని వెంకట సత్యనారాయణ ఉటంకిస్తూ గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా, పలు సందర్భాల్లో కౌన్సిలర్లు వ్యతిరేకించినా అధికారులకు పట్టడం లేదన్నారు. దీనిని వైకాపా కౌన్సిలర్లంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. దీనిపై డీఈ సత్యనారాయణ మాట్లాడుతూ అంచనా విలువ కన్నా తక్కువకు టెండర్ వేస్తే ఆమోదించవచ్చునన్నారు.

మాట్లాడుతున్న కౌన్సిలర్ సత్యనారాయణ (అంతర చిత్రం) ఛైర్మన్ ఆదినారాయణ

పట్టణంలో పలు సంఘాలకు స్థలాలు కేటాయించే అంశంపై చర్చ జరిగింది. ప్రస్తుతం పట్టణంలోని కమ్యూనిటీ హాల్స్ నిర్వహణ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్నాయని, దీనివల్ల వాటిపై వస్తున్న ఆదాయం ఎక్కడికి వెళ్తుందో కూడా తెలియడం లేదని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

### రహదారి ఎక్కడో చూపించండి...

తన వార్డులోని సోడేవారివీధి, దర్గా వీధుల్లో రోడ్లు నిర్మించాలని కోరుతున్నానని ఫలితం ఉండడం లేదని 9వ వార్డు కౌన్సిలర్ ఉసురుమర్తి జాన్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. గత సమావేశంలో అడిగితే వారం రోజుల్లో నిర్మిస్తామని ఏఈ చెప్పారని, ఎక్కడ నిర్మించారో చూపించాలన్నారు. దీనిపై ఏఈ హేమంత్, డీఈ సత్యనారాయణ మాట్లాడుతూ టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, 15 రోజుల్లో రహదారుల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. వైస్‌ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్ మాట్లాడుతూ ఏబీఎస్ టౌన్‌హాల్‌కు భూమిని ఇచ్చారని, ప్రస్తుతం అది కొంతమంది కబంధ హస్తాల్లో అన్ని వర్గాల వారికి సభ్యత్వం కల్పించాలన్నారు. కమిషనర్ తోట కృష్ణవేణి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

(c) eenadu

# ఈనాడు కర్ణాటక

మంగళవారం డిసెంబరు 30, 2025 5

స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలను పరిశీలిస్తున్న సీమంత్‌కుమార్‌సింగ్ తదితరులు

# గుప్పుమన్న మత్తు పదార్థాలు

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగాన్ని అడ్డుకోవడానికి పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలోనే సోమవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రూ.2.50 కోట్ల విలువ చేసే 1,700 గ్రాముల ఎండీఎంఏ గుళికలు, 60 ఎక్స్‌టీసీ పిల్స్, 100 ఎల్ఎస్‌డీ స్లిప్స్, ఐదుగ్రాముల కొకైన్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ వెల్లడించారు. నైజీరియాకు చెందిన క్రిస్టోఫర్ (45), హెచ్ఎస్ఆర్ లేఔట్ నివాసి నవీన్ రాజ్ (26) అనే వ్యక్తులను ఈ కేసులో అరెస్టు చేసినట్లు తెలిపారు. వ్యాపారం వీసాతో భారత్‌లో అడుగుపెట్టిన క్రిస్టోఫర్. దిల్లీ, ముంబయిలో ఉంటున్న విదేశీయులకు తక్కువ ధరలకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నాడని వివరించారు. ఇదివరకే ఓసారి సోలదేవనహళ్లి పోలీసులు అతడిని అరెస్టు చేశారు. మరో నిందితుడు నవీన్‌రాజ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తూ ఈ సరకు చేరవేతలో భాగస్వామిగా మారినట్లు తేల్చారు. ఈ వారం రోజుల్లోనే డ్రగ్స్ సరఫరా దారులను ఎక్కడికక్కడ కట్టడి చేయగలిగినట్లు వివరించారు.

### కాంగ్రెస్ నేతకు కటకటాలు

**దావణగెరె:** మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న ఆరోపణలపై దావణగెరెకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎస్‌జీ వేదమూర్తి (53), రాజస్థాన్‌కు చెందిన రామ్ స్వరూప్ (33), ధోలారామ్ (36), దేవ్ కిషన్ (35)లను అరెస్టు చేశామని ఎస్పీ ఉమా ప్రశాంత్ తెలిపారు. డిసెంబరు 22న అన్వర్ పాషా, పారస్, కృష్ణమూర్తి, ధోని అలియాస్ మంజునాథ్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 290 గ్రాముల మాదక ద్రవ్యాలను జప్తు చేసుకున్నారు. నిందితుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా తాజాగా వీరిని అరెస్టు చేశామని సోమవారం ఆమె వివరించారు.

# రాజకీయం.. కొత్త రంగులు!

రాష్ట్రాన్నేలే నాయకుడువెరో.. కోట్ల డాలర్ల ప్రశ్న ప్రజలను వెన్నాడుతోంది. 2026లో మార్పులు తథ్యమేననే సంకేతాలు వస్తున్నా అది ఏ ముహూర్తానో తెలియని సందిగ్ధావస్థ రాజకీయ పండితులకే నిద్ర పట్టనివ్వడం లేదు. బలమున్న నాయకుడు నేనేనంటూ సిద్ధు.. ఆ బలానికి నా బలగమే ఊతమంటూ డీకే మాటల కత్తులు నూరుతున్నా అధిష్ఠానం మిన్నకుండటమే తాజా రాజకీయం.

దోస్తీ- కుస్తీ: సిద్ధు కుర్చీ దక్కించుకునే ప్రయత్నంలో డీకే

**ఈనాడు, బెంగళూరు :** కర్ణాటక రాజకీయాలు 2025లోనే కాదు 2023 విధానసభ ఎన్నికల ఫలితాల రోజు నుంచే సంచలనాలకు వేదికగా మారాయి. 135 సీట్లతో ఘన విజయం సాధించిన కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నాయకత్వం వహించినా ఆయన పీఠానికి భరోసా దొరకని పరిస్థితి. రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీపై ఏఐసీసీ స్థాయిలో ఒప్పందం కుదిరిందన్న వాదనకు ఇప్పటికీ స్పష్టత దొరకలేదు. కానీ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రుల మధ్య నాయకత్వ పోరు గత నెల 20నుంచి ఊపందుకుంది. నేటికీ కర్ణాటక, దిల్లీల మధ్య అధికార పంపిణీపై రాజకీయ కోలాటం సాగుతూనే ఉంది. అధిష్ఠానం సైతం రాష్ట్ర రాజకీయ నాటకానికి తెరదించే ప్రయత్నం చేయకపోవటం ఆసక్తికరం. జనవరి తొలివారం తమను భేటీ చేయాలని అధిష్ఠానం సూచించిన నేపథ్యంలో 2026 కర్ణాటక రాజకీయాల్లో పెనుమార్పు తథ్యంగా కనిపిస్తోంది.

### అటో ఇటో..

గత నెల రోజులుగా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి శిబిరాల్లో అంతుచిక్కని అయోమయం కొనసాగుతోంది. వీరిద్దరి మద్దతుదారులు గడువులు ప్రకటిస్తూ నాయకత్వ మార్పును స్వాగతిస్తున్నారు. అధిష్ఠానం ఎంత వారిస్తున్నా తమదైన శైలిలో వ్యాఖ్యలు చేస్తూ రాజకీయాలను కుదరులేకుండా చేస్తున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బెంగళూరుకు వచ్చిపోతున్నా ఈ అంశంపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించక, సీఎం, డీసీఎంలు ఏమీ లేనట్లుగా వ్యవహరిస్తూనే

### సిద్ధు కొనసాగితే..

రెండున్నరేళ్ల పాటు సిద్ధరామయ్య కొనసాగటం కొత్తతరం నేతల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. డీకే నాయకత్వంలో తమ రాజకీయ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు యత్నిస్తున్న యువనేతలు ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించే ప్రమాదం లేకపోలేదు. ముఖ్యంగా బెంగళూరు నగరం, గ్రామీణ, పాత మైసూరు, మధ్య కర్ణాటక ప్రాంతంలోని ఒక్కలిగ వలయాల్లో రాజకీయ మార్పునకు అవకాశం ఉంది. ఇప్పటికే భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర డీకేకు సీఎం పీఠాన్ని అందించి తాను డీసీఎంగా ఉండేందుకు ఆసక్తిగా ఉన్నారని ఆ పార్టీ వర్గాల సమాచారం. తాను పార్టీ సిపాయినని పదేపదే చెప్పే డీసీఎం తన శ్రమకు కూలి ఇవ్వకపోతే విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నా ఆశ్చర్యపోనక్కరలేదు. ఆయన రాజకీయ భవిష్యత్తును 2026 తొలివారమే నిర్ణయించనుంది.

2025కు వీడ్కోలు పలికారు. కానీ 2026లో ఇదే ధోరణి కొనసాగే అవకాశం ఏమాత్రం లేదు. అటోఇటో తేల్చుకునేందుకు ఇద్దరు కీలక నేతలు సమాయత్తం అవుతున్నారు.

### డీకే నాయకుడైతే..

డీకే శివకుమార్‌కు అనివార్యంగా నాయకత్వ పగ్గాలు అందిస్తే 2026లో సిద్ధరామయ్య అహింద విశ్వరూపాన్ని ప్రదర్శించే అవకాశాలు సుస్పష్టం. ఇప్పటికే ఆ వర్గానికి చెందిన నేతలను సిద్ధం చేసిన సిద్ధరామయ్య సతీశ్ జార్కిహొళి, కె.రాజణ్ణ, జమీర్ అహ్మద్, జి.పరమేశ్వర్‌లతో శిఖరస్థాయి నిర్ణయాలు తీసుకున్నారని తెలుస్తోంది. ఏదైనా అధిష్ఠానం కూడా తన వైపే ఉందని పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి తనను తొలగిస్తే కాంగ్రెస్‌లో జరిగే పరిణామాలపై దిల్లీ పెద్దలకు హెచ్చరిస్తున్నారు. అత్యధిక సంఖ్యలో ఉన్న అహింద సముదాయం తన వైపు ఉండటంతో కనీసం దళితనేతకు సీఎం పదవి ఇచ్చినా సంతృప్తి చెందగలరు. ఇన్ని పరిణామాలను ముందుగానే అంచనా వేయగలిగిన అధిష్ఠానానికి 2026 ఏడాది పెను సవాలుగా మారనుందన్నది అక్షర సత్యంగా కనిపిస్తోంది.

### ఏదైనా సంచలనమే..

నాయకత్వ మార్పు ఉన్నా..లేకున్నా అధికార, విపక్షాల్లో రాజకీయాలు వేగంగా కదులుతాయి. సిద్ధరామయ్యను తొలగిస్తే అహింద సముదాయంలో, ఆయనే కొనసాగితే డీకే శిబిరంలో అసహనం ప్రజ్వలిస్తుంది. ఈ రెండూ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించటం ఖాయంగా కనిపిస్తుంది. ఇప్పటికే అధికార పంపిణీపై ఒప్పందమేమీ జరగలేదని ముఖ్యమంత్రి, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డీకే బృందం సవాలు చేయటంతో ఈ నాయకత్వ పోరును ముదిరిపోటంతో అధిష్ఠానానికి సవాలుగా మారింది.

# కట్టుతప్పితే గట్టి చర్యలు

**నూతన సంవత్సర వేడుకల వేళ.. మునుపెన్నడూ లేనంతగా బెంగళూరు నగరంలో భద్రత కట్టుదిట్టం చేశారు. ప్రత్యేకించి మహిళలపై ఎలాంటి దాష్టీకాలూ చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలకు హోం శాఖ ఉపక్రమించింది. ఈ అంశంపై సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి విస్పష్ట ఆదేశాలు జారీ చేశారు.**

నిఘా కోసం స్తంభాలకు అమర్చిన సీసీ కెమెరాలు

కట్టుతప్పకుండా.. యువత వరుసలో వెళ్లేందుకు ఓ వీధిలో ఏర్పాట్లు

**బెంగళూరు (శివాజీనగర), న్యూస్ టుడే :** కొత్త ఏడాది వేడుకల్లో మహిళల సురక్షతకు పెద్ద పీట వేస్తున్నామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. హోంతో పాటు, వివిధ శాఖల అధికారులు, మంత్రి పరమేశ్వర్, డీజీపీ డాక్టర్ ఎంఏ సలీం, నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్‌లతో ఆయన సోమవారం ఈ అంశంపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వేడుకల అనంతరం ఆయా ప్రాంతాల నుంచి నగరంలోని ఇతర భాగాలకు బీఎంటీసీ బస్సులు, మెట్రో సదుపాయాన్ని కొనసాగించాలని ఆదేశించారు.

● కొత్త ఏడాదిని స్వాగతించేందుకు బుధవారం రాత్రికే ఎంజీ రోడ్డు బ్రిగేడ్ రోడ్డు, కోరమంగల, కమర్షియల్ వీధి, ఇందిరానగర, చర్చి వీధి, ఇతర ప్రాంతాలకు ఏటా లక్షలాది మంది చేరుకుంటారు. వేడుకల వేళ బాణసంచా కాల్చడంపై నిషేధం విధించారు. నిర్బంధిత ప్రదేశాల్లోకి వెళ్లడం, గుంపులు చేరడం, పోలీసులను దారి తప్పించేలా అత్యవసర నంబర్లకు ఫోన్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ హెచ్చరించారు. నిర్లక్ష్యంగా, వాహనాలు నడపడం, డ్రాగ్ రేసులకు పాల్పడినా శిక్ష తప్పదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా భద్రత కోసం ఆధునిక సదుపాయాలను వినియోగించుకుంటున్నామని తెలిపారు. భద్రత కోసం 20 వేల మంది పోలీసులను వినియోగిస్తుండగా, ఇతర జిల్లాల నుంచి 1200 మందిని, మహిళల భద్రత కోసం చెన్నమ్మ దళాలను క్రియాశీలకంగా వినియోగించుకుంటున్నామని వివరించారు. నగరంలోని 50 ఉపరితల వంతెనలపై రాకపోకలను నిషేధిస్తామని చెప్పారు. భద్రతలో భాగంగా నాలుగు కంట్రోల్ రూమ్‌లు, 78 కావలి మంచెలు, 164 మహిళా సహాయ డెస్కులు, 55 అంబులెన్సులను అందుబాటులో ఉంచుతామన్నారు.

### మహిళలకు ప్రత్యేక రక్షణ

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :** కొత్త ఏడాది ఆగమన వేళ.. ఎంజీ రోడ్డు, చర్చివీధి, బ్రిగేడ్ రోడ్డు పరిసరాల్లో కనీసం మూడు లక్షల మంది యువతరం ప్రతినిధులు గుమిగూడుతారని నిఘావర్గాలు అంచనాకు వచ్చాయి. ఈ సమాచారం నేపథ్యంలోనే భద్రతకు ప్రత్యేక బలగాలు ముందస్తు కాపలా ప్రారంభించినట్లు నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ వెల్లడించారు. ఆయన బెంగళూరులో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఆరోజు రాత్రి 10 గంటలకు మెట్రో సంచారాన్ని బంద్ చేస్తామని, వేడుకలు ముగిసిన తరువాత.. అర్ధరాత్రి ఈ సేవలు పునరుద్ధరించనున్నట్లు వివరించారు. బ్రిగేడ్, ఎంజీ రోడ్డుతో పాటు.. కోరమంగల, ఇందిరానగర, వైట్‌ఫీల్డ్, నీలాద్రి రహదారి, ఎలక్ట్రానిక్ సిటీలో ఎక్కువ సంఖ్యలో మహిళా పోలీసులను వినియోగిస్తామన్నారు. ఎంజీ రోడ్డు చుట్టు పక్కల 250 పైగా సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తామన్నారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మఫ్టీ పోలీసుల కాపలా, ప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది, బాంబుల నియంత్రణ దళం అందుబాటులో ఉండనున్నట్లు చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని సహించబోమన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లు, హోటళ్లపై నిఘా పెంచామన్నారు. వేడుకలు శాంతియుతంగా కొనసాగడానికి అందరూ సహకరించాలని కోరారు.

కోరమంగలలో పరిస్థితి సమీక్షిస్తున్న కొత్వాల్ సీమంత్‌కుమార్‌సింగ్ తదితరులు

### రేవణ్ణ నిర్దోషి!

హెచ్‌డీ రేవణ్ణ

**బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే :** తన ఇంటి పనిమనిషిని లైంగికంగా వేధించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణను చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించింది. బాధితురాలి ఫిర్యాదుతో రేవణ్ణను ఏ1గా, ఆయన పెద్దకుమారుడు ప్రజ్వల్‌ను ఏ2గా హొళెనరసీపుర ఠాణాలో 2024 ఏప్రిల్ 28న కేసు నమోదైంది. అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలు రుజువు కావడంతో ప్రజ్వల్‌కు జీవితాంతం కారాగారంలో ఉండాలని చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం ఇదివరకే తీర్పు ఇచ్చింది. ఇదే కేసులో రేవణ్ణ లైంగిక దౌర్జన్యానికి పాల్పడినట్లు రుజువు చేయలేకపోవడంతో నిర్దోషిగా ప్రకటిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

### మల్లేశ్వరంలో 'లక్కీ భాస్కర'

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :** జాతీయ బ్యాంకు మేనేజరు ఒకరు ఖాతాదారులను నమ్మించి రూ.3.11 కోట్లు మోసగించిన సంఘటన నగరంలో వెలుగులోకి వచ్చింది. మల్లేశ్వరం 13వ క్రాస్‌లో ఉన్న కెనరాబ్యాంకు శాఖలో 'లక్కీభాస్కర్' సినిమా తరహాలో అక్కడి మేనేజర్ రఘు 41 మంది ఖాతాదారులను మోసగించారని సంబంధిత పోలీసు అధికారులు ధ్రువీకరించారు. ఖాతాదారుల నుంచి ఖాళీ చెక్కులు, ఓటీపీ తీసుకుని వారు కుదవ పెట్టిన బంగారు నగలుపై రుణం తీసుకున్నారు. ఆ రుణం నేనే తీర్చుతానని నమ్మించి వారిని బురిడీ కొట్టించాడు. ప్రతి మూడునెలలకు ఓసారి బ్యాంకులో నగలపై లెక్కగట్టడం ఆనవాయితీ. పైఅధికారులు తనిఖీకి వచ్చిన సమయంలో వ్యవహారం 'తేడా' వచ్చినట్లు తేలింది. ఖాతాదారులకు చెందిన రూ.3.11 కోట్ల మొత్తాన్ని రఘు ఏకంగా 'రుణం' రూపంలో కొట్టేశాడని గుర్తించారు. ఉన్నతాధికారుల ఫిర్యాదుతో స్థానిక పోలీసుఠాణాలో కేసు నమోదు చేసుకుని మేనేజర్ కోసం గాలిస్తున్నారు.

### 'ప్రజాపోరు'కు ముందడుగు

**హాసన, న్యూస్‌టుడే :** 'నాకు ఇప్పుడు 93 ఏళ్లు. అయినా పోరాట పటిమ తగ్గలేదు. జనవరి 23 నుంచి ప్రజాపోరును మళ్లీ ప్రారంభిస్తా' అని మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవేగౌడ ప్రకటించారు. తన పుట్టిన ఊరు హరదనహళ్లిలో ఇంటి దేవుడు దేవేశ్వర స్వామి ఆయన సోమవారం పూజలు చేసుకున్నారు. తనకు గతంలో కొద్దిగా ఆరోగ్య సమస్యలు ఎదురయ్యాయని, ఇప్పుడు పూర్తిగా కోలుకున్నానని చెప్పారు. కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుల రుణాల మాఫీ, కర్ణాటక పబ్లిక్ పాఠశాలల ఏర్పాటు, హాసనకు మెడికల్ కళాశాల మంజూరు చేశారని గుర్తు చేశారు. ఏడాది అనంతరం ఇంటి దేవుడిని దర్శించుకున్న దేవేగౌడతో పాటు ఆయన కుమారుడు హెచ్‌డీ రేవణ్ణ, తదితరులు ఉల్లాసంగా కనిపించారు.

# ముద్దు బిడ్డలను మూటగట్టి..

**చిత్రదుర్గం:** వారంతా కన్నవారికి ముద్దుబిడ్డలు. చివరికి ప్రమాదంలో చిక్కి.. మంటల్లో కరిగిపోయారు. వారంతా బూడిదకుప్పగా మారిన వేళ.. ఎవరు ఎవరో గుర్తించడానికి వైద్య నిపుణులు అనేక పరీక్షలు నిర్వహించి.. చివరికి సంబంధీకులకు మృతదేహాల ఆనవాళ్లు అప్పగించగలిగారు. హిరియూరు తాలూకా గొర్లత్తు గ్రామ సమీపాన 'సీబర్డ్' బస్సు గురువారం మంటల్లో కాలిపోయిన వేళ. ఏడుగురు మరణించిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో ఐదుగురి మృతదేహాలను సోమవారం సంబంధీకులకు అప్పగించిన వేళ.. విషాదం కన్నీటి వరదై పారింది

✦ ఈ ప్రమాదంలో బెంగళూరుకు చెందిన బిందు (28), ఆమె కుమార్తె గ్రేయ (5), హాసన జిల్లా చెన్నరాయపట్టణకు చెందిన మానస (26), నవ్య (27), ఉత్తర కన్నడ జిల్లా కుమట నివాసి రష్మి మహాలే (25) గుర్తు పట్టడానికి వీలు లేనంతగా సజీవ దహనమయ్యారు. వారి మృతదేహాల ఆనవాళ్లను డీఎన్ఏ పరీక్షల అనంతరం తేల్చగలిగారు. బిందు, గ్రేయ మృతదేహాలను చూసిన వెంటనే బిందు భర్త దర్శన్ కన్నీటి పర్యంతమయ్యారు. సంతోషంగా కొత్త సంవత్సరాన్ని ఆస్వాదించడానికి గోకర్ణకు బయలుదేరి ఇలా ప్రమాదంలో చిక్కారని ఆయన వాపోయారు. కనీసం ముఖాలనూ చూడలేకపోయానని విలపించారు.

ప్రమాదం నాటి చేదు జ్ఞాపకమిదీ..

నవ్య మృతదేహ గుర్తులను, నగలను మంజునాథ్‌కు అప్పగిస్తున్న పోలీసులు

బిందు మృతదేహ ఆనవాళ్లను, నగలను భర్త దర్శన్‌కు అప్పగించే వేళ..

✦ హాసన జిల్లా చన్నరాయపట్టణకు చెందిన నవ్య మృతదేహాన్ని తండ్రి మంజునాథ్‌కు అప్పగించినపుడు దుఃఖాన్ని ఆపుకోలేక గుండెలు బాదుకున్నారు. ఆ కుటుంబ సభ్యుల ఆక్రందనలు మిన్నంటాయి. కష్టపడి చదివి, ఉద్యోగం పొందినా.. సంతోషం ఎక్కువ రోజులు నిలువ లేదని విలపించారు. ఆమెకు వివాహ నిశ్చితార్థం పూర్తి చేసిన సమయంలో ఇలా జరిగిందని ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఆమెతో పాటు చదివి ఉద్యోగంలో చేరిన మరో యువతి మానస ఇదే ప్రమాదంలో మరణించారు. ఇద్దరికీ ఒకేచోట అంత్యక్రియలు నిర్వహిస్తామని మానస మేనమామ చెన్నకేశవ తెలిపారు. ఇలాంటి పరిస్థితే కుమటకు చెందిన యువతి రష్మి కుటుంబసభ్యులూ ఎదుర్కొన్నారు. ఆమె సోదరుడు వినాయక విలపిస్తూ.. భస్మాన్ని స్వీకరించి, తీసుకెళ్లారు. వారంతా గమ్యస్థానాలు చేరడానికి వాహనాలు సమకూర్చామని చిత్రదుర్గం ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు తెలిపారు.

### 'ధర్మస్థల'పై సిట్ నివేదిక

**మంగళూరు, న్యూస్‌టుడే :** ధర్మస్థలలో వందలాది మృతదేహాలను ఖననం చేశామని ప్రకటించుకున్న నిందితులపై ఇప్పటి వరకు నిర్వహించిన దర్యాప్తు నివేదికను ప్రత్యేక దర్యాప్తుదళం బెళ్తంగడిలోని న్యాయస్థానంలో దాఖలు చేసింది. ధర్మస్థల ఘటనను సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికునితో పాటు గిరీశ్ మట్టణ్ణనవర్, కె జయంత్, సుజాతా భట్ దిల్లీకి వెళ్లారని నివేదికలో పేర్కొన్నారు. తమతో పాటు ఒక కపాలాన్ని కూడా వారు రైల్లో తీసుకువెళ్లారనేది అభియోగం. సర్వోన్నత న్యాయస్థానం వద్దకు వెళ్లే ముందు వీరు హోటల్‌లో గదులను అద్దెకు తీసుకున్నారు. పుర్రెను తన సంచిలో ఉంచుకుని, జయంత్ నిద్రపోయాడు. ఆ సమయంలో చెడ్డ కలలు రావడంతో ఆ సంచిని గిరీశ్ మట్టణ్ణనవర్‌కు ఇచ్చి జయంత్ వెనక్కు తిరిగి వచ్చాడని పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఒక అభియోగపత్రాన్ని సిట్ దాఖలు చేసింది. అందులో సహ కార్యకర్తలు మహేశ్ శెట్టి తిమరోడి, విఠల గౌడ తదితరుల పేర్లను కూడా సిట్ పేర్కొన్న విషయం తెలిసిందే.

# కోగిలు బాధితులకు పక్కా ఇళ్లు

ముఖ్యమంత్రి, మంత్రి జమీర్‌తో చర్చల్లో పాల్గొన్న శివకుమార్

**ఈనాడు, బెంగళూరు :** జాతీయస్థాయిలో రాజకీయ దుమారం రేపిన బెంగళూరు శివారు కోగిలు మురికివాడల కూల్చివేత బాధితులకు సర్కారు అభయ హస్తం అందించింది. కేరళ సర్కారు రాజకీయాలు, ఏఐసీసీ అగ్రనేత కేసీ వేణుగోపాల్ ఆదేశాలతో విమర్శలు ఎదుర్కొన్న సర్కారు యుద్ధ ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకుంది. సోమవారం వసతి మంత్రి జమీర్ అహ్మద్, బెంగళూరు ఇన్‌ఛార్జ్ మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ సంఘటన స్థలాన్ని సందర్శించగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సాయంత్రం తన అధికార నివాసంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సర్కారు తీసుకున్న నిర్ణయాలు నిజమైన బాధితులతో పాటు అధికారుల వంచనకు గురైన వారికి కూడా ఊరట కల్గించాయి.

***1న కొత్తింటికి..:*** కూల్చివేతతో గూడు కోల్పోయిన బాధితులకు జనవరి 1న బయప్పనహళ్లిలో ఇళ్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. సంఘటన ప్రాంతం నుంచి కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బయప్పనహళ్లిలో సర్వే నంబరు 23లో 1,087 ఇళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సముదాయ కట్టడాల్లో బాధితులకు ఇళ్లు కేటాయిస్తామన్నారు. కోగిలులో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి కూడా మానవతా దృక్పథంతో ప్రత్యామ్నాయ నివాస సదుపాయం కల్పిస్తామన్నారు. ఒక ఇంటికి రూ. 11.20 లక్షలు వ్యయం చేయగా, జనరల్, ఎస్సీ, ఎస్టీ, అల్ప సంఖ్యాకులకు కేంద్ర, రాష్ట్ర రాయితీలతో ఉచితంగా ఇచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. జీబీఏ నుంచి రూ5 లక్షలు, జనరల్ వారికి అన్ని రాయితీలతో రూ. 8.70 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 9.50 లక్షలకు ఈ ఇళ్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఆపై రూ. 2 లక్షల వరకు రుణ సదుపాయం కూడా ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. మరెక్కడా ఇళ్లు లేని పేదలకు పూర్తి రాయితీతో ఈ ఇళ్లు కేటాయించగా, ఇతరులకు అర్హతల ప్రకారం రాయితీ, రుణ సదుపాయం దక్కుతుందన్నారు.

### రాజకీయాలేల?

బెంగళూరును మురికివాడల రహిత నగరంగా మార్చాలన్న సంకల్పంతో సర్కారు ఈ చర్యలు తీసుకుందని, ఇక్కడి వారికి తాఖీదులు ఇచ్చినా వారు ఈ స్థలాలను ఖాళీ చేయలేదని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఈ సందర్భంగా వివరించారు. చెత్త నిర్వహణ కేంద్రం, రాళ్ల క్వారీలకు వినియోగించే ఈ ప్రాంతం నివాసయోగ్యం కాదన్నారు. ఈ సంఘటనను కేరళ ప్రభుత్వం రాజకీయం చేయాలని చూస్తోందన్నారు. 'కేసీ వేణుగోపాల్ మా పార్టీ అగ్రనేత. ఆయన గతంలో కూడా ఎన్నోసార్లు మాకు సలహాలిచ్చారు. ఈ సంఘటనలోనూ తన అధికార హోదాలోనే ఆదేశాలిచ్చారు. ఇది పార్టీ అంతర్గత వ్యవహారం' అని భాజపా చేస్తున్న ఆరోపణలకు డీకే బదులిచ్చారు.

మహిళ గుర్తింపు కార్డును పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి

హోం మంత్రికి వ్యతిరేకంగా పోస్టరు ప్రదర్శిస్తున్న భారతీశెట్టి, చలువాది నారాయణస్వామి, ప్రకాశ్ తదితరులు

# 'చందనసీమలో గంజాయి వాసన'

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే :** కర్ణాటకలో శాంతిభద్రతలను కాపాడడంతో, మాదక ద్రవ్యాల నియంత్రణలో హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ పూర్తిగా విఫలమయ్యారని భాజపా ఆరోపించింది. ఒకప్పుడు చందనసీమగా ఉన్న కర్ణాటక ఇప్పుడు గంజాయి బీడు (ప్రాంతం)గా మారిందని విధాన పరిషత్తులో ప్రతిపక్ష నాయకుడు చలువాది నారాయణస్వామి ఆరోపించారు. మాదక ద్రవ్యాలను తయారు చేస్తున్నారని మహారాష్ట్ర నుంచి వచ్చిన పోలీసులు దాడులు చేసే వరకు స్థానిక పోలీసులకు తెలియకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విషయానికీ 'నాకు తెలియదు' అని చెబుతూ పరమేశ్వర్ కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. కోగిలు లేఅవుట్‌లో ఐదేళ్లుగా రోహింగ్యాలు ఉంటున్నారని సమాచారం, ఫిర్యాదులు వచ్చినా ప్రభుత్వం ఆలస్యంగా స్పందించిందని తప్పుబట్టారు. కబ్జా భూమిని ప్రభుత్వం స్వాధీనపరుచుకుంటే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఎందుకు స్పందించారని ప్రశ్నించారు. ఇళ్లు కూల్చి, ఇప్పుడు వారికి పునరావాసాన్ని ఎందుకు కల్పిస్తున్నారో ప్రజలకు బదులివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు కేసీ వేణుగోపాల్ కూడా ప్రభుత్వ వ్యవహారాల్లో తలదూర్చుతున్నారని ఆరోపించారు. దీనిపై తాము పోరాటాన్ని చేస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు భారతీ శెట్టి, ప్రకాశ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# ఆభరణాల చోరుల వేట

● ప్రాథమిక వివరాల గుర్తింపు

**మైసూరు, న్యూస్‌టుడే :** హుణసూరు బైపాస్ రోడ్డులోని స్కై ఆభరణాల దుకాణంలో ఆదివారం మధ్యాహ్నం దోపిడీకి సంబంధించి నిందితుల ప్రాథమిక వివరాలు గుర్తించామని, వారిని త్వరలో బంధిస్తామని జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ ధీమా వ్యక్తం చేశారు. దుకాణంలోకి ప్రవేశించిన నిందితులు ఐదు నిమిషాల్లోనే రూ.11 కోట్ల విలువైన ఏడు కిలోల ఆభరణాలతో పరారయ్యారు. కొద్ది రోజుల కిందటే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు నిందితులు నగల దుకాణానికి సమీపంలోని లార్జిలో గదిని అద్దెకు తీసుకున్నారు. దోపిడీకి ముందే వారు గదిని ఖాళీ చేశారు. సీసీ కెమెరాలో రికార్డయిన చిత్రాల ఆధారంగా పరారీలో ఉన్న నిందితుల అరెస్టుకు ఐదు ప్రత్యేక బృందాలు రంగంలోకి దించామని ఆయన తెలిపారు. దోపిడీలో ఐదుగురు పాల్గొనగా, వారిలో ఇద్దరు మాత్రమే మాస్కు ధరించారు. ద్విచక్ర వాహనాలపై వచ్చిన నిందితుల చేతిలో తుపాకులు ఉన్నాయని, వారు హిందీలో మాట్లాడుకున్నారని గుర్తించారు. ఇద్దరు రెండు చేతుల్లో తుపాకులు పట్టుకోగా, మరో ముగ్గురు తలా ఒక తుపాకీని పట్టుకున్నారు. దోపిడీ అనంతరం కేఆర్ నగర వైపు వెళ్లారని సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించారు.

### తుపాకీతో కాల్చుకుని భర్త ఆత్మహత్య

**కలబురగి, న్యూస్‌టుడే :** భార్యతో గొడవ పడిన ఖండురాజ్ దవళజి (36) అనే వ్యక్తి తన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కలబురగి జిల్లా పోలీసులు వెల్లడించారు. నగరంలోని శివశక్తి కాలనీకి చెందిన ఖండురాజ్ తన భార్య ప్రియతో ఆదివారం గొడవ పడ్డాడు. భర్త తీరుతో ఆవేదనకు గురై ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ విషయానికి రాజ్ కలత చెంది.. ఆదివారం అర్ధరాత్రి నాటు తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తించారు. చౌక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9121167525

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 9945050116



(c) eenadu

# వినూత్న పథం.. విజయమే లక్ష్యం

ప్రభుత్వ సరళాదేవి సతీశ్చంద్ర అగరవాల్ డిగ్రీ కళాశాల నుంచి వస్తున్న విద్యార్థులు

కాలగమనం కళ్లెదుటే గిర్రున తిరిగింది..
ఏడాదికాలం గడిచిపోయే గడియ దగ్గరపడింది..
మళ్లీ చివురించే కొత్త ఆశల లోకాలవైపు మనసు చూస్తోంది..
గతమెంతో ఘనం.. భవితెంత అభయం.. నేడెక్కడ మన పయనం..
అనుకుంటే..మనసుంటే.. కాలానికి కళ్లెమేసి..
ఆకాంక్షలు నెరవేర్చుకునే పథం మనవెంటే..
అడగడుగునా అడ్డుకునే ఆ ప్రతికూలతల్ని కూల్చేసి..
ఆశయాల బాటలో విజయాల నిచ్చెన వేద్దాం..
2025 నాటి చేదు, తీపి జ్ఞాపకాలు, జయాపజయాలు..
2026లో కోటి కాంతుల వెలుగులు నింపే జీవితం కోసం
కృత్రిమ మేధ అండగా.. లక్ష్య సాధనకు అడ్డు లేదిక..
రండి నూతన వత్సరం అమూల్య అవకాశాల కల్పవృక్షం..
కోటి ఆశలతో స్వాగతిద్దాం.. ఆశయాలు సాధిద్దాం

**న్యూస్‌టుడే, బళ్లారి**

దేశ జనాభాలో 40 శాతం 30 ఏళ్లలోపు వారే ఉన్నారు. ప్రపంచ దేశాల్లో భారతదేశంలోనే యువత ఎక్కువగా ఉన్నారు. వారిపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంది. 2025 ఏడాదికి వీడ్కోలు పలికి 2026 ఏడాదికి యూత్ స్వాగతం పలకడానికి మూని వేళ్లపై నిలబడింది. అక్కడితో ఆగిపోకుండా యువత నూతన సంవత్సరంలో ఆన్‌లైన్‌లో వివిధ కోర్సులు నేర్చుకుని, నైపుణ్యం, సాంకేతిక విద్యవైపు పరుగులు తీయాలి. ఉన్నత విద్యతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడి పలువురికి ఆదర్శంగా నిలిచేందుకు తీర్మానాలు చేసుకుంటున్నారు. బళ్లారి జిల్లా జనాభా 18 లక్షలు ఉండగా, వారిలో 8 లక్షల మంది యువత (30 ఏళ్లలోపు) ఉన్నారు. వారిలో 'న్యూస్‌టుడే' 18 నుంచి 22 ఏళ్ల మధ్య యువతీ యువకుల్లో సుమారు 300 మంది నుంచి నూతన సంవత్సర తీర్మానాలపై సర్వే చేసింది. ఈ సందర్భంగా వారు పలు ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

## నవ్యాలోచనల సమ్మిళితం

నూతన సంవత్సరంలో వివిధ కోర్సులను ఆన్‌లైన్ ద్వారా నేర్చుకుని నైపుణ్యం మెరుగుపరుచుకునేందుకు చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు. సాంకేతిక విద్యను నేర్చుకుని ఉద్యోగంలో స్థిరపడతామని అభిప్రాయపడ్డారు. పలువురు యువకులు ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవుతామని, జీవితంలో స్థిరపడేందుకు పునాది వేసుకుంటామని చెప్పారు.

● మరికొందరు వ్యాపార రంగంలో రాణించడానికి కృషి చేస్తామన్నారు. తక్కువ సంఖ్యలో యువతీ, యువకులు డిగ్రీ, పీజీ తర్వాత కొలువా, వ్యాపారమా, అంకుర సంస్థల స్థాపనపై ఆలోచిస్తామని మనసులో మాట చెప్పారు.

## అమ్మాయిలూ భళా..

ఉన్నత చదువులు చదివాం. నైపుణ్య, సాంకేతిక, వృత్తిపర శిక్షణ లేకపోవడంతో ముందుకు వెళ్లలేక పోతున్నాం. పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు, ప్రభుత్వం నిర్వహిస్తున్న వృత్తిపర శిక్షణను ఉపయోగించుకుంటామని పేర్కొన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, బ్యూటీ పార్లర్ కోర్సులను నేర్చుకుని ఇంటి వద్దే ఉపాధి కల్పించుకుంటామని చెప్పడం గమనార్హం. డిగ్రీ, పీజీలో వాణిజ్య, వ్యాపార గణాంక శాస్త్రాలను పూర్తి చేశాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అకౌంట్స్, ట్యాలీ, బేసిక్ కంప్యూటర్ వంటి కోర్సులు నేర్చుకుని స్థిరపడుతామని మరి కొందరు తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేట్ ఉద్యోగాల కోసం ఇంటి వద్ద పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నామని కొందరు, ఇంటి వద్ద చిన్న పనులు చేసుకుంటూ, కుటుంబపోషణకు సహాయపడుతామని తక్కువ సంఖ్యలో అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

● కొత్త ఏడాదిలో సమున్నత గమ్యాల నిర్దేశం
● నైపుణ్యం, సాంకేతిక విద్యపై యువత దృష్టి
● 'న్యూస్‌టుడే' సర్వేలో వెల్లడి

## భావప్రసార నైపుణ్యాల్లేక..

ఎక్కువ మంది ప్రాంగణ ఎంపికలు, సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేటు రంగంలో కలల కొలువుల సాధనకు సమాచార, భావప్రసార నైపుణ్యాలు, ఆంగ్లభాషణలో తడబాటు అడ్డంకిగా మారినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త ఏడాదిలో అన్ని భయాలను పారదోలి కోరుకున్న కొలువు, రంగంలో రాణించాలని యువతకు శుభాకాంక్షలు చెప్పేద్దాం.

**యువత అభిప్రాయాలు శాతాల్లో..**

● సాంకేతిక, నైపుణ్య శిక్షణ, ఆన్‌లైన్ కోర్సులు అభ్యసిస్తాం
● ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తాం
● వ్యాపార రంగంలో స్థిరపడాలని ఉంది
● స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా కల్పించుకుంటాం
● ఉన్నత విద్య పూర్తయ్యాకే కొలువుపై దృష్టి సారిస్తాం




# అభివృద్ధి సాధకుడు సిద్ధరామయ్య

హరపనహళ్లి కార్యక్రమంలో మాట్లాడుతున్న పట్టణాభివృద్ధిశాఖ మంత్రి భైరతి సురేశ్

**హొసపేటె, న్యూస్‌టుడే:** అభివృద్ధి సాధకుడు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో రాష్ట్రంలో ప్రగతి వేగం పుంజుకుందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ పేర్కొన్నారు. విజయనగర జిల్లా హరపనహళ్లిలో సోమవారం పట్టణాభివృద్ధి శాఖ నుంచి ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనుల భూమిపూజ, ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండున్నరేళ్లలో పట్టణాభివృద్ధి శాఖకు రూ.14 వేల కోట్లు, అందులో విజయనగర జిల్లాకు రూ.360 కోట్ల నిధులు విడుదల చేశారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. శాసన సభ్యురాలు ఎం.పి.లతామల్లికార్జున మాట్లాడుతూ వెనుకబడిన తాలూకా హరపనహళ్లి అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు విడుదల చేయాలని కోరారు. బస్టాండ్ ఆధునికీకరణకు రూ.10 కోట్లు అవసరమన్నారు. కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకంలో తాగునీటి సరఫరా పనులు, చెరువు నిర్మాణం, విద్యార్థి నిలయాల నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తెగ్గినమఠ సద్యోజాత స్వామీజీ, డీసీ కవిత మన్నికేరి, జిల్లా ప్రాంతీయ సంచాలకుడు మనోహర్, నగరసభ కమిషనర్ రేణుకా దేశాయి, తహసీల్దార్ బి.వి.గిరీశ్‌బాబు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**బళ్లారి, న్యూస్‌టుడే:** విద్యార్థులు, అధ్యాపకులు బహిరంగ ప్రదేశాల్లో లభించే శక్తి పానీయాల(ఎనర్జీ డ్రింక్స్)కు దూరంగా ఉండాలని సంపన్మూల వ్యక్తి డా.కిరణ్‌కుమార్ కులకర్ణి విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ సరళాదేవి సతీశ్చంద్ర అగరవాల్ డిగ్రీ కళాశాల, బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్రీడాశాఖ సంయుక్తంగా సోమవారం బీడీఏ ఫుట్‌బాల్ సభాభవనంలో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల వినియోగ నిరోధక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు వెళ్లాలి. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఆధునిక యుగంలో తాలూకా, జిల్లా స్థాయిలో క్రీడాకారులు మత్తు పదార్థాలు వాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. ఎస్పీ డా.శోభారాణి మాట్లాడుతూ యువతీ, యువకులపై దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యాశాఖ నోడల్ అధికారి డా.శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో రక్షణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదటి సారిగా ప్రభుత్వ సరళదేవి సతీశ్చంద్ర అగరవాల్ కళాశాల నేతృత్వంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రహ్లాద్ చౌదరి, అధ్యాపకులు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, డా.శశిధర కల్లూరు, డా.సరోజ్, కుంచం నరసింహలు, దొడ్డ బసవరాజ్, పంపనగౌడ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ డా.శోభారాణి, ప్రధాన ఆచార్యుడు డా.ప్రహ్లాద్ చౌదరి తదితరులు

హాజరైన విద్యార్థులు, తదితరులు

# అన్నదాతల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

**హొసపేటె, న్యూస్‌టుడే:** అన్నదాతల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం తగదని గరగ నాగలాపుర మఠాధిపతి నిరంజన ప్రభు దేశికేంద్రస్వామి పేర్కొన్నారు. కర్ణాటక రైతు సంఘం, హరిత సేన ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో స్వామీజీ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రంలో అన్ని పార్టీలకు చెందిన ప్రభుత్వాలు అధికారం చేపట్టాయి, ఒక్కరూ అన్నదాతను ఆదుకునే ప్రయత్నాలు చేయలేదని ఆవేదన వెలిబుచ్చారు. విత్తనం వేసినప్పటి నుంచి ఉత్పత్తులను విపణికి తరలించేవరకూ అడుగడుగునా రైతులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నా, వాటి పరిష్కారానికి ఏలికలు చిత్తశుద్ధితో పనిచేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్రాధ్యక్షుడు వాసుదేవ మేటి మాట్లాడుతూ అన్నదాతల సమస్యల పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో రేయింబవుళ్లు కృషి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ నాయకురాలు రాణిసంయుక్త, హుడా అధ్యక్షుడు మొహ్మద్ ఇమామ్ నియాజి, సంఘం జిల్లాధ్యక్షుడు సి.ఎ.గాళెప్ప పాల్గొన్నారు. అంతకుముందు వడకరాయ ఆలయం నుంచి ఇండోర్ స్టేడియం వరకూ ప్రదర్శన నిర్వహించారు.

పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న రైతులు, కూలీలు, నాయకులు

# తుంగభద్ర క్రస్ట్‌గేట్ల పనులు తృప్తికరం

**గంగావతి,న్యూస్‌టుడే:** తుంగభద్ర జలాశయానికి క్రస్ట్ గేట్లు అమర్చే పనులపై గంగావతి శాసనసభ్యుడు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన సోమవారం ఈ పనులను పరిశీలించారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా 18వ గేటును అమర్చే పనులు నాలుగు రోజుల్లో పూర్తవుతుందన్నారు. లోపాలు ఉంటే సరిచేసుకుని మిగతా గేట్లను సైతం వేగంగా అమర్చుతారన్నారు. 23 గేట్లకు సరిపడా సామగ్రిని సమకూర్చుకున్నట్లు చెప్పారు. 33 గేట్ల కోసం మూడు బృందాలను నియమించారన్నారు. ఏప్రిల్, మేలోగా పనులు పూర్తయ్యే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. మరో యాభై ఏళ్ల జలాశయం సుభద్రంగా ఉండాలన్న లక్ష్యంతో రెండో పంటకు నీరు ఇవ్వలేదన్నారు. పనులను అనుభవం ఉన్న సంస్థకు అప్పగించారన్నారు. దేశంలో పలుచోట్ల వీరు జలాశయాలకు 132 గేట్లు అమర్చారన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట పనుల పర్యవేక్షకుడు కిరణ్ ఉన్నారు.

పనులు పరిశీలిస్తున్న శాసనసభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి

## ప్రగతిపై సభ్యులకు వివరాలివ్వండి

**హొసపేటె, న్యూస్‌టుడే:** తుంగభద్ర క్రస్ట్‌గేట్ల బిగింపు పనులను సోమవారం సాయంత్రం తుంగభద్ర మండలి తెలంగాణ సభ్యుడు రహీముద్దీన్, కర్ణాటక సభ్యుడు ఎజాజ్ హుసేన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డి, పర్యవేక్షక ఇంజినీర్ నారాయణ్‌నాయక్ పనుల ప్రగతిపై సభ్యులకు వివరాలందించారు. వచ్చే నీటి ఏడాది మే చివరికల్లా 33 గేట్ల బిగింపు పనులు పూర్తిచేయాలని సభ్యులు సూచించారు. అవసరమైతే అదనంగా నిపుణ సిబ్బంది, యంత్రాలను వాడి పనులను వేగంగా ముగించాలన్నారు. ఇంజినీర్లు జ్ఞానేశ్వర్, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల సంక్షేమానికి పెద్దపీట

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీశ్, డీసీ కె.నాగేంద్రప్రసాద్, ఎస్పీ డా.శోభారాణి, జడ్పీ సీఈవో మహమ్మద్ హ్యారీస్ సుమైర్ తదితరులు

**బళ్లారి, న్యూస్‌టుడే:** పాత్రికేయులు ఎలాంటి ఒత్తిడికి లొంగకుండా ప్రజలకు అనుకూలంగా.. నిష్పాక్షిక జర్నలిజాన్ని కొనసాగించాలి.. కొత్తగా ఎంపికైన సభ్యులు చురగ్గా పనిచేయాలని పాత్రికేయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివానంద తగడూర్ పిలుపునిచ్చారు. బళ్లారి వాణిజ్య, పరిశ్రమ సంస్థ సభాభవనంలో సోమవారం సంఘానికి నూతనంగా ఎంపికైన సభ్యులు ప్రమాణ స్వీకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల మీడియా పేరుతో నకిలీ జర్నలిస్టులను సృష్టిస్తున్నారు. అబద్ధాలు చెప్పే, నిజాయితీ లేని జర్నలిస్టుల కారణంగా మీడియాకు కళంకం వస్తోందని విచారం వ్యక్తం చేశారు. నేర నేపథ్యం ఉన్నవారు కూడా తాము జర్నలిస్టులమని చెప్పుకొంటూ పాత్రికేయ రంగానికి ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇలాంటి వారిని ప్రజలు దూరంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామీణ శాసనసభ్యుడు బి.నాగేంద్ర మాట్లాడుతూ పాత్రికేయుల ప్రయోజనాలను కాపాడటానికి తాను కట్టుబడి ఉన్నానన్నారు. ప్రస్తుతం పత్రికాభవనం పైభాగంలో గదులు నిర్మించడానికి తన వంతు సహకరిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం పాత్రికేయుల సంక్షేమ నిధికి రూ.2లక్షల నగదు అందజేశారు. నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమానికి రూ.2లక్షలు ప్రకటించారు. పాత్రికేయుల సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీష్ మాట్లాడుతూ నిజమైన పాత్రికేయులు పాత్రికేయ రంగాన్ని కాపాడుతున్నారని పేర్కొన్నారు. లిక్కర్ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజు, మేయర్ పూజారి గాదెప్ప, జిల్లా పాలనాధికారి కె.నాగేంద్రప్రసాద్, ఎస్పీ డా.శోభారాణి, జడ్పీ సీఈవో మహమ్మద్ హ్యారీస్ సుమైర మాట్లాడారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకేష్, సంఘం కార్యదర్శి సోమశేఖర్ కెరెగౌడ, రాష్ట్ర కమిటీ సభ్యుడు బసవరాజ్ హరనహళ్లి, జిల్లా అధ్యక్షుడు వీరభద్రగౌడ, డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, జిల్లా రాజ్యోత్సవ పురస్కారం అందుకున్న గంగాధరగౌడను, ఎన్నికలను సక్రమంగా నిర్వహించిన నాగరాజు స్వామిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి కులకర్ణి, కె.ఎం.మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా, రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు సత్కారం

జిల్లా పాత్రికేయ సంక్షేమ నిధికి రూ.2లక్షలు అందజేస్తున్న గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర

# ఆయకట్టు రైతుల ప్రయోజనాలు కాపాడండి

**హొసపేటె, న్యూస్‌టుడే:** తుంగభద్ర ఆయకట్టు రైతులను దృష్టిలో పెట్టుకుని కొత్త క్రస్ట్ గేట్ల బిగింపు పనులు నిర్ణయించిన గడువులోపు పూర్తి చేయాలని తుంగభద్ర మండలి అధ్యక్షుడు అధ్యక్షుడు ఎస్.ఎన్.పాండే, సభ్యులు ఇంజినీర్లకు సూచనలిచ్చారు. సోమవారం హొసపేటె (టీబీడ్యాం)లోని మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్డు సమావేశంలో వారు మాట్లాడారు. రెండో పంటకు నోచుకోక రైతులు తీవ్ర నష్టాన్ని అనుభవించారు, రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కొత్త గేట్ల బిగింపు పనులకు అదనంగా కార్మికులను నియమించుకుని వేగం పెంచాలని సూచించారు. వచ్చే ఏడాది జూన్ మొదటిలోగా గేట్ల బిగింపు పనులు పూర్తికావాలని ఆదేశించారు. మండలి ఇంజినీర్లు రోజూ దగ్గరుండి పనులను పర్యవేక్షించాలని స్పష్టంచేశారు. సమావేశంలో కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఆంధ్ర సభ్యుడు నరసింహమూర్తి, కర్ణాటక సభ్యుడు ఎజాజ్ హుసేన్, తెలంగాణ సభ్యుడు రహీముద్దీన్, పర్యవేక్షక ఇంజినీరు నారాయణ్ నాయక్, ఎస్డీవో జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే అసమానతలకు అడ్డుకట్ట

**చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే:** వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందటానికి, సామాజిక, ప్రాంతీయ అసమానతలు తొలగటానికి ఆ ప్రాంతంలో విద్యారంగం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర చిన్నపరిశ్రమల అభివృద్ధి మండలి అధ్యక్షుడు టి.రఘుమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రతిభావంత విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో అధికంగా చదివే శోషిత, వెనుకబడిన వర్గాలు, పేదలు, గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం నూతన తరగతి గదులు, ప్రయోగశాలలు, వసతి గృహాలు, గ్రంథాలయాలు, కంప్యూటర్ లాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాలను ఉపయోగించుకొని మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా పీయూ విద్యాశాఖ అధికారి తిమ్మయ్య, మొలకాల్మూరు కళాశాల ప్రధానాచార్యుడు గోవిందప్ప, తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వీరేశ్ పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే రఘుమూర్తి

## రోడ్డుప్రమాదంలో ఇద్దరి మృతి

**హుబ్బళ్లి, న్యూస్‌టుడే :** ధార్వాడ శివార్లలోని జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి అనంతరం సంభవించిన రోడ్డు ప్రమాదంలో కిషన్ ఖానవాలె (30), కిరణ ఖడవాకర్ (32) అనే యువకులు మరణించారు. వీరిద్దరూ వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని యరికొప్ప సమీపాన ఎదురుగా వచ్చిన లారీ సోమవారం ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. కిందపడిన వీరిద్దరిపై నుంచి లారీ చక్రాలు వెళడంతో అక్కడికక్కడే మరణించారు.

EENADU Classifieds
JOBS
బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+ PF+ జీ-17K ✆ 7019632854

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

# బాల్య వివాహాలతో అనర్థాలే అధికం

**బళ్లారి, న్యూస్‌టుడే:** బాల్య వివాహాలతో కలిగే గర్భం, ప్రసవాలు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. తల్లి, నవ జాత శిశువు ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డా.యల్లా రమేష్‌బాబు పేర్కొన్నారు. సండూరు తాలూకా చోరనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వ్యాప్తిలోకి వచ్చే గ్రామాల్లో సోమవారం 18 ఏళ్లలోపు బాలికలు గర్భం దాల్చడంపై ఇంటింటి ప్రచారం, అవగాహన కార్యక్రమాలను డీహెచ్‌వో నేతృత్వంలో నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల పాఠశాలకు దూరంగా ఉండే సంఖ్య పెరుగుతోంది. దీంతో బాలికలు తమ విద్యను పూర్తి చేయడం సాధ్యం కావడం లేదన్నారు. బాల్య వివాహాలతో మానసిక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కుటుంబం, పిల్లలు బాధ్యతతో ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. బాల్య వివాహాలతో లింగ అసమానత, పేదరికం, దేశ ఆర్థికాభివృద్ధిపై ప్రభావం చూపుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయస్సులోనే పెళ్లి చేస్తే ఆస్తిలో భాగం కోరడం లేదని భావన ఉందన్నారు. బాల్య వివాహ చట్టం-2006 బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండాలని నిర్దేశిస్తుందన్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం 2012 వైవాహిక స్థితితో సంబంధం లేకుండా మైనర్‌తో లైంగిక సంబంధాన్ని అత్యాచారంగా గుర్తిస్తుందన్నారు. బాల్య వివాహాలతో పాటు వరకట్న వేధింపులకు పాల్పడితే చట్టాలు కఠినంగా ఉంటున్నట్లు వివరించారు. అధికారులు డా.వీరేంద్రకుమార్, డా.భారత్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న డీహెచ్‌వో యల్లా రమేష్‌బాబు, వైద్య అధికారులు

# అవగాహనతోనే ప్రమాదాల నియంత్రణ

## జనవరి 1 నుంచి 30వ తేదీ వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు

**బళ్లారి, న్యూస్‌టుడే:** రాష్ట్ర, జిల్లా, తాలూకా స్థాయి న్యాయసేవా ప్రాధికార సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 30 వరకు జిల్లాల్లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమని వెల్లడించారు. సోమవారం న్యాయమూర్తి విలేకరులతో మాట్లాడుతూ న్యాయసేవా ప్రాధికార సంస్థలతో పాటు, పోలీస్ శాఖ, ట్రాఫిక్, విద్యాశాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర, జాతీయ రహదారుల అథారిటీ, ప్రజాపనుల శాఖ, న్యాయవాదుల సంఘం, బీమా కంపెనీలు, ఎన్జీవోలు, పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు సముదాయ ఆరోగ్య కేంద్రాలు, క్లబ్బులు, ఆసుపత్రులు, తదితర శాఖలు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించాలని ఆదేశించినట్లు చెప్పారు. రోడ్డు నిబంధనలు పాటించడం, ప్రమాదాల నివారణ, సురక్షితమైన ప్రయాణం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడం, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, వీధి నాటకాలు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ప్రమాదాలను తగ్గించడానికి, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. బాలలు వాహనాలు నడపకూడదన్నారు. నగరంలో వాహనాల సంఖ్య పెరిగింది. వాటిని సరైన స్థలంలో పార్కింగ్ చేయాలి. ఈ విషయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలాలను గుర్తించాలి. రోడ్డు భద్రతా అవగాహన ప్రచారాన్ని విజయవంతం చేసి, ప్రమాదాలను నివారించాలని న్యాయమూర్తి కోరారు.

రాజేష్ ఎన్.హొసమని, న్యాయమూర్తి

# నిప్పంటుకుని సరకు వాహనం బుగ్గి

**హొసపేటె, న్యూస్‌టుడే:** ఇంజిన్‌లో ఏర్పడ్డ సమస్యతో మంటలు వ్యాపించి సరకు వాహనం కాలిపోయిన ఘటన హొసపేటె తాలూకా మరియమ్మనహళ్లి సమీపం 50వ జాతీయ రహదారిలో సోమవారం జరిగింది. హొసపేటె నుంచి హగరిబొమ్మనహళ్లి తాలూకా వరదాపుర వెళ్తున్న టాటా ఏస్ వాహనం డీజిల్ ట్యాంకర్‌లో లీకేజీ కనిపించి నిప్పంటుకుంది. మంటలు వ్యాపించిన వెంటనే అందులో ఉన్న చోదకుడు, సహాయకుడు కిందకు దూకడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేలోగా వాహనం దాదాపు అగ్నికి ఆహుతైంది.

# జీవరాశుల మనుగడకు జలమే ఆధారం

**సిరుగుప్ప, న్యూస్‌టుడే:** భూమిపై ఆవాసం ఉండే సకల జీవరాశులకు నీరే ప్రధానమని మాజీ శాసనసభ్యుడు ఎం.ఎస్.సోమలింగప్ప, టి.ఎం.చంద్రశేఖరయ్య స్వామి ,జాతీయ స్వాభిమాన ఆందోళన ప్రతినిధి బసవరాజ్ పాటిల్, మాజీ శాసనసభ్యుడు మహిమా పాటిల్ పేర్కొన్నారు. జాతీయ స్వాభిమాన ఆందోళన, నిర్మల తుంగభద్ర అభియాన సమితి, పర్యావరణ ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన నిర్మల తుంగభద్ర అభియాన కార్యక్రమాన్ని సోమవారం తాలూకా క్రీడా మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అనేక జీవ నదులు నేడు మనందరి నిర్లక్ష్యం, కర్మాగారాల నుంచి విడుదలయ్యే విషపూరిత జలాలు, వ్యవసాయ భూమి నుంచి విడుదలయ్యే రసాయనిక కలుషితాలు, ప్రజలు ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులు వంటి వాటితో వాగులు, వంకలు, కాలువల ద్వారా తుంగభద్ర నదికి చేరుతున్నాయి. ఫలితంగా నీరు కలుషితమై తాగేందుకు కాదు కదా, వాడుకునేందుకు ఉపయోగకరంగా లేదని వాపోయారు. ఇప్పటికైనా జాగృతి పొంది కలుషితాలు, వ్యర్థాలు నదుల్లోకి వదలకుండా అందరూ కలిసి కట్టుగా నది పరిరక్షణకు కృషి చేద్దామని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ పట్టణ ప్రధాన రహదారులు, కూడళ్ల మీదుగా జాగృతిజాతా నిర్వహించారు. బసవమఠం బసవభూషణ స్వామి, హాళేకోట మఠ్రిస్వామి మఠం సిద్ధబసవ స్వామి సాన్నిధ్యం వహించారు. సంస్థల ప్రతినిధులు మధుసూదన కారిగనూరు, ఆర్.బసవలింగప్ప, బి.ఎం.సతీష్, హెచ్.కె.మల్లికార్జునయ్య స్వామి, నరసింహనయక్, జె.నరసింహమూర్తి, నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

జెండా ఊపి నిర్మల తుంగభద్ర జాతాను ప్రారంభిస్తున్న స్వామీజీలు, ప్రతినిధులు

(c) eenadu

# బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

## ఆసక్తిని పెంచే అభ్యాస ఉత్సవం

**బళ్లారి, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లో అభ్యాస ఆసక్తిని పెంచడానికి అభ్యాస ఉత్సవం సహాయపడుతుందని ప్రధానోపాధ్యాయుడు పి.పరమేశ్వరప్ప పేర్కొన్నారు. తాలూకా బసవపురలో సోమవారం ఏర్పాటు చేసిన అభ్యాస ఉత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంచడానికి ప్రభుత్వం కార్యకలాపాలను ప్రారంభించిందన్నారు. ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు గవిసిద్ధప్ప మాట్లాడుతూ అభ్యాస ఉత్సవంలో చదవడం, కథల ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇస్తే సులువుగా అర్థమవుతుందన్నారు. హ్యాపీ గణితం, మస్తిష్క పరీక్ష, క్విజ్, చిన్న కథలు రాయడం వంటివి చేస్తే మంచిదన్నారు. పలు పాఠశాలల విద్యార్థుల మధ్య పోటీలు నిర్వహిస్తే పోటీతత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అసుండి పాఠశాలను కొనసాగించాలని ధర్నా

**బళ్లారి, న్యూస్‌టుడే:** కేపీఎస్ మాగ్నెట్ పేరుతో అసుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మూసివేయడం సరికాదని ఏఐడీఎస్‌వో నేతృత్వంలో సభ్యులు విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం పాఠశాల ముందు ఆందోళన నిర్వహించారు. ఏఐడీఎస్‌వో జిల్లా కార్యదర్శి కంబళి మంజునాథ నేతృత్వంలో నిరసన తెలియజేసి మాట్లాడారు. ఆందోళనలో ఏఐడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు ఈరణ్ణ, సభ్యులు బసవరాజు, హోన్నూర స్వామి, మోహన్, బసవరాజస్వామి, బాషా పాల్గొన్నారు.

అసుండి గ్రామంలో నిరసన తెలియజేస్తున్న ఏఐడీఎస్‌వో సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**బళ్లారి, న్యూస్‌టుడే:** బళ్లారి నగర జెస్కాం ఉపవిభాగం-2 వ్యాప్తి 11 కె.వి. ఫీడర్‌లో మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నెల 30న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం పరిధిలోని సంగనకల్లు రహదారి, ఎస్.ఎన్.పేటె, జిల్లా ఆసుపత్రి, రాఘవ కళా మందిరం, అనంతపురం రహదారి, వడ్డరబండ, అగడి మారెప్ప కాంపౌండ్, రూపనగుడి రహదారి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని ఆయన పేర్కొన్నారు.

## దివ్యాంగులకు రాయితీతో బస్సు పాసులు

**బళ్లారి, న్యూస్‌టుడే:** కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ, బళ్లారి విభాగం-2026 జనవరి 1 నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు దివ్యాంగులకు రాయితీలో బస్సు పాసులు నవీకరణ చేసుకోవడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బళ్లారి విభాగం నియంత్రణాధికారి ఇనాయత్ బాగ్‌బాన్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు రాయితీతో బస్సులో వెళ్లడానికి 2025 డిసెంబరు 31వ తేదీ వరకు ఉంటుంది. ఈ ఏడాది 2026 నవీకరణ చేసుకోవడానికి అవకాశం కల్పించాం. దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## జనవరి 5న తపాలాశాఖలో డాక్ అదాలత్

**బళ్లారి, న్యూస్‌టుడే:** తపాలా శాఖ బళ్లారి విభాగ ఆధ్వర్యంలో జనవరి 5న ఉదయం 11 నుంచి బళ్లారి విభాగం తపాలా శాఖ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. శాఖలో విధులు నిర్వహించి విశ్రాంతి పొందిన వారు పింఛను, ఇతర సమస్యలను పరిష్కరించుకోవడానికి అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. పింఛనుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కువెంపు తత్వాలు.. సమాజ సందేశాలు

**బళ్లారి, న్యూస్‌టుడే:** జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత, రాష్ట్రకవి కువెంపు సార్వత్రిక మానవత్వ సందేశాన్ని ప్రపంచానికి వ్యాప్తి చేయడం ద్వారా కన్నడ సాహిత్య ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చారని బిడ్జర్ మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, బళ్లారి నగర పాలికె సంయుక్తంగా సోమవారం ఏర్పాటు చేసిన రాష్ట్రకవి కువెంపు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కవులు, సూర్యోదయం, సూర్యాస్తమయ సమయంలో అందమైన ప్రకృతి ద్వారా సాహిత్య రచనలు చేసేవారు. ప్రకృతిని వర్ణించడం ద్వారా కువెంపు సమాజాన్ని మార్చారని ఆయన అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఉండాలని, మతం, సంస్కృతి, ఆహారాలు, కులాలకు దూరంగా ఉండి సార్వత్రిక మానవుడిగా ఎదగాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం యువతీ, యువకులు ఆదర్శవంతమైన వ్యక్తుల జీవితాల ఆధారంగా పుస్తకాల నుంచి మంచి ఆదర్శాలను పెంపొందించుకోవాలన్నారు. మండలి అధ్యక్షుడు చిదానందప్ప కువెంపు సాహిత్యం, ఆదర్శాలను వివరించారు. ఆకాశవాణి వ్యాఖ్యాత అమాతి బసవరాజ్ విశిష్ట ఉపన్యాసం చేశారు. కువెంపు కన్నడ సాహిత్యాన్ని ఊహించలేని ఎత్తుకు తీసుకువెళ్లారు. అనేక ఉద్యమాలకు ప్రేరణగా నిలిచారన్నారు. బళ్లారికి చెందిన జడేష్ ఎమ్మిగనూరు సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖాధికారి నాగరాజ, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు యల్లనగౌడ శంకరబండ, విశ్రాంత అధికారి దొరస్వామి కొట్రప్ప తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి: కువెంపు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముండరగి నాగరాజు, చిదానందప్ప, నాగరాజు

ప్రతిజ్ఞ చేస్తున్న కళాకారులు, సిబ్బంది, విద్యార్థులు

**గంగావతి, న్యూస్‌టుడే:** విశ్వమానవ కువెంపు జయంతిని కొప్పళ పరిపాలనా భవనంలో సోమవారం ఘనంగా ఆచరించారు. జిల్లా పాలనాధికారి సురేశ ఇట్నాళ ఆయన చిత్రపటానికి పుష్పార్చన చేసి మాట్లాడారు. కువెంపు మానవ మతం.. విశ్వపథం అనే సందేశం అందరికీ ఆదర్శం అన్నారు. కథలు, నవలలు, కవితలు, గ్రంథాలు ఇలా అన్ని రకాల సాహిత్యం అందించి కన్నడ కవుల్లో అగ్రస్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా గురుకుల సంగీత పాఠశాల విద్యార్థినులు కువెంపు గేయాలను ఆలపించారు. అదనపు జిల్లాధికారి సిద్ధరామేశ్వర, రచయిత సావిత్రి మజుందార్, మహంతేశ మల్లనగౌడర్, కన్నడ, సాంస్కృతిక శాఖ సహాయక సంచాలకు కర్ణ కుమార్ పాల్గొన్నారు.

కొప్పళలో కువెంపు గేయాలను ఆలపిస్తున్న విద్యార్థినులు

కంప్లి: కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తదితరులు

### కంప్లిలో విశ్వ మానవ దినోత్సవం

**కంప్లి, న్యూస్‌టుడే:** కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం విశ్వ మానవ దినోత్సవం ఆచరించారు. కువెంపు చిత్ర పటానికి పూల మాల వేసి పూజలు జరిపారు. కువెంపు జీవితం గురించి పలువురు మాట్లాడారు. ఉప తహసీల్దార్ రవీంద్ర కుమార్, అధికారులు టి.ఎం.బసవరాజ్, మాలతేశ్ దేశ్‌పాండే, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన చదరంగ పోటీ

**సింధనూరు, న్యూస్‌టుడే:** సింధనూరు ఆనంద్ పబ్లిక్ స్కూలులో ఆదివారం ఉదయం నుంచి రాత్రి బాగా పొద్దుపోయేదాకా ఏడు రౌండ్లుగా సాగిన ర్యాపిడ్ చెస్ టోర్నమెంటు ఘనంగా ముగిసింది. స్థానిక సుభద్ర అకాడమీ నిర్వహించిన ఈ టోర్నమెంటులో పాల్గొనేందుకు కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి 290 మంది ఆటగాళ్లు ఉత్సాహం కనబర్చారు. ఓపెన్ పోటీలు, అండర్ 1600 రేటింగ్‌తో పాటూ వివిధ వయసు కేటగిరీల్లో నిర్వాహకులు పోటీలు జరిపారు. అకాడమీ సోమవారం విజేతల వివరాలను వెల్లడించింది. వివిధ కేటగిరీల్లో ఆడి విజేతలుగా నిలిచిన అమ్మాయిలు, అబ్బాయిలు షీల్డులు, నగదు బహుమతులు అందుకొని ఆనందాన్ని చాటారు. ఓపెన్ మెయిన్ కేటగిరిలో బళ్లారికి చెందిన భోగవ వేదాంతరెడ్డి విజేతగా నిలిచారు. ఇక వయసుల వారీ పోటీల్లో అండర్-10 అబ్బాయిల్లో విగ్నేశ్‌రెడ్డి, అమ్మాయిల్లో సునందిని విజేతలయ్యారు. అండర్-14 అబ్బాయిల్లో అనీశ్ మోరే, అమ్మాయిల్లో చింతన విజేతలు. అండర్-18 అబ్బాయిల్లో చక్రి రాజలబండి విజేత కాగా అమ్మాయిల్లో సింధనూరు గాంధీనగర్‌కు చెందిన జి.హాసిని విజేతగా షీల్డు అందుకుంది.

స్మరణికలు, నగదు బహుమతులు అందుకుని ఆనందాన్ని చాటుతున్న విజేతలు

## జంప్ రోప్‌లో జాతీయ పోటీలకు ఎంపిక

జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న సంస్థ అధ్యక్షుడు సూరి బాబు

**శ్రీరామనగర్, న్యూస్‌టుడే:** శ్రీరామనగర్ శ్రీవిద్యానికేతన్ పీయూ కళాశాల విద్యార్థులు జంప్ రోప్‌లో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. హనుమసాగరలో జరిగిన రాష్ట్రస్థాయి పీయూ కళాశాలల జంప్ రోప్ పోటీల్లో విద్యార్థులు రవి తేజ, సమర్థ్ ప్రథమ స్థానాల్లో నిలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించారు. జులాయినగర్‌లోని ఇదే కళాశాల విద్యార్థులు శ్రేయస్, మణిశంకర్, ఉల్లాస్ సైతం జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. విద్యా సంస్థ అధ్యక్షుడు నెక్కంటి సూరిబాబు, ఉపాధ్యక్షుడు ఆదర్శ ఉపన్యాసకులు విద్యార్థులను అభినందించారు.

## కూచిపూడిలో గనినాడు విద్యార్థినుల సత్తా

**బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే:** భారత్ ఆర్ట్స్ అకాడమీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తాధ్వర్యంలో ఈనెల 27న హైదరాబాదు గచ్చిబౌలి క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కూచిపూడి కళావైభవం..మహాబృంద నాట్య ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించామని సూర్య కళాఅకాడమీ నాట్యాచార్యుడు కె.సి. సుంకణ్ణ తెలిపారు. ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ మూడు నెలలుగా నగరానికి చెందిన మా అకాడమీలో 66 మంది విద్యార్థినులు తిల్లాన, తరంగంలో కూచిపూడి నృత్య సాధన చేశారు. హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని సుమారు 40 నిమిషాల పాటు కూచిపూడి విభాగంలో నృత్యం చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సాధించారన్నారు. నిర్వాహకులు కళాకారులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారని తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ కళాకారులు, నాట్యాచార్యుడిని మిత్రులు, కళాసంస్థలు, పోషకులు అభినందించారు.

హైదరాబాదులో జరిగిన నృత్యోత్సవంలో పాల్గొని జ్ఞాపికను అందుకున్న విద్యార్థినులు

కూచిపూడి నృత్యంలో పాల్గొని ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందుకున్న విద్యార్థినులు

### భళా .. సాయి నిధి

**కంప్లి:** కంప్లి విద్యాసాగర ఇంటర్నేషనల్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.సాయినిధి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. బి.మహాలక్ష్మి, రవి వర్మ దంపతుల కుమార్తె అయిన సాయి నిధి 27న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన 'కూచిపూడి కళా వైభవం-2' సామూహిక నృత్యంలో పాల్గొని ఈ రికార్డు సొంతం చేసుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 5 వేల మంది కళాకారులు ఒకే సారి ఈ సామూహిక నృత్యంలో పాల్గొన్నారని పాఠశాల ప్రిన్సిపల్ పి.నాగేశ్వర రావు తెలిపారు.

బి.సాయి నిధి

## కరవే అధ్యక్షుడిగా మల్లికార్జున

**కంప్లి, న్యూస్‌టుడే:** కన్నడ రక్షణ వేదిక (నారాయణ గౌడ) కంప్లి తాలూకా అధ్యక్షుడిగా 10.ముద్దాపుర గ్రామ బళె మల్లికార్జున నియమితులయ్యారు. కంప్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో వేదిక నాయకులు ఈ బాధ్యతను అప్పగించారు. తాలూకాలో కన్నడ భాష, సంస్కృతి పరిరక్షణకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

బళె మల్లికార్జున

## గ్రామీణాభివృద్ధికి శాయశక్తులా కృషి

**మాన్వి,న్యూస్‌టుడే:** నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని రాయచూరు గ్రామీణ శాసనసభ్యుడు బసనగౌడ దద్దల్ పేర్కొన్నారు. తాలూకాలోని కురిడి, గోర్కల్, అరోలి తదితర గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, సామూహిక వివాహాలు, ద్యావమ్మ దేవి జాతర ఏర్పాట్లలో పాల్గొని మాట్లాడారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత పల్లెల్లో కనీస సదుపాయాలు కల్పించానన్నారు. రూ.25లక్షలతో నిర్మిస్తున్న కనక సముదాయ భవనం స్థానికుల అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. ఐదేళ్ల తర్వాత ద్యావమ్మ దేవి జాతర నిర్వహిస్తున్నామని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రూ.కోటితో దేవస్థాన రహదారి నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ భీమరాయ రామసంద్ర, తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి ఖలీద్ అహ్మద్, జెస్కాం శాఖ ఏఈఈ వైద్యనాథ్‌స్వామి, తాలూకా వైద్యాధికారి డాక్టర్ శరణబసవరాజ్, గ్రామ పంచాయతీల అధ్యక్షులు, సభ్యులు, స్థానిక ప్రముఖులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్

## సామాజిక మాధ్యమాల్లో నిందలు..నిందితుడికి జైలు

**హొసపేటె, న్యూస్‌టుడే:** సామాజిక మాధ్యమాల్లో అబ్కారీ అధికారులను అసభ్య పదజాలంతో నిందించి పోస్టులు పెట్టిన వ్యక్తికి హగరిబొమ్మనహళ్లి తాలూకా న్యాయస్థానం 3 నెలల సాధారణ జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. ప్రభుత్వ న్యాయవాది టి.రాఘవేంద్ర తెలిపిన మేరకు కేసు, తీర్పు వివరాలు ఇలా ఉన్నాయి.. 2022 డిసెంబరులో హగరి బొమ్మనహళ్లివాసి రవికుమార్ సామాజిక మాధ్యమాల్లో హగరిబొమ్మనహళ్లి తాలూకా అబ్కారీ అధికారులను నిందిస్తూ పోస్టులు పెట్టాడు. అబ్కారీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై సరళ న్యాయస్థానానికి అభియోగపత్రాన్ని సమర్పించారు. కేసు విచారణ చేపట్టిన న్యాయవాది డి.కె.మధుసూదన వాదనలు విన్న తరువాత నేరం రుజువుకావడంతో నిందితుడు రవికుమార్‌కు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు ఎస్‌ఎఫ్‌ఐ కృషి

**సిరుగుప్ప, న్యూస్‌టుడే:** విద్యార్థుల భవిష్యత్తుకు ఎస్‌ఎఫ్‌ఐ కృషి చేస్తోందని సమాఖ్య తాలూకా అధ్యక్షుడు, రాష్ట్ర సమితి సభ్యుడు నాగరాజు పేర్కొన్నారు. ఎం.సూగురు గ్రామంలో సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ 56వ సంస్థాపన దినోత్సవాన్ని విద్యార్థులు, గ్రామస్థులతో కలిసి ఆచరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చదువులు, ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించినప్పుడల్లా పోరాటాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి నిలయాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి, నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. నిరసనలో విద్యార్థులు వసంత్‌కుమార్, మల్లికార్జున, రవికుమార్, మఠస్వామి పాల్గొన్నారు.

ఎం.సూగురులో ఎస్‌ఎఫ్‌ఐ సంస్థాపన దినోత్సవం ఆచరిస్తున్న విద్యార్థులు

## ఆలయంలో పూజలు

**శ్రీరామనగర్, న్యూస్‌టుడే:** గంగావతి తాలూకా కోటయ్య పురంలోని సీతారామ స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా సోమ వారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున మహిళలు సామూహికంగా తిరుప్పావై పారాయణం నిర్వహించారు. అభిషేకం, అర్చన, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరిగాయి.

గోదా దేవి రంగనాథ స్వామి

## విశ్వకర్మ కుల అధ్యయన నివేదిక అవైజ్ఞానికం

**కారటగి, న్యూస్‌టుడే:** విశ్వకర్మ కుల అధ్యయన నివేదిక అవైజ్ఞానికమని విశ్వకర్మ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేశ్, కారటగి తాలూకా అధ్యక్షుడు సూగూరేశ్వర తెలిపారు. కారటగిలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మైసూరు విశ్వవిద్యాలయ అధ్యాపకుడు డి.సి.నంజుండప్ప విశ్వకర్మ కుల అధ్యయనం చేసి ప్రభుత్వానికి సమర్పించిన 900 పేజీల నివేదిక సరిగా లేదు. విశ్వకర్మ సముదాయంలో 41 ఉప కులాలు ఉన్నాయి. చాలా రాష్ట్రాల్లో విశ్వకర్మ సముదాయం దళిత, గిరిజన జాబితాలో ఉండగా ఇక్కడ వెనుకబడిన (బీసీ) జాబితాలో ఉంది. అన్ని రంగాల్లోనూ సముదాయం పూర్తిగా వెనుకబడి ఉంది. ప్రభుత్వం ఆ నివేదికను పునః పరిశీలించాలన్నారు. నాయకులు హనుమేశ్, బి.కాళప్ప, భీమేశ్, శ్రీశైలప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్వకర్మ సముదాయ నాయకులు

## ఉత్తమ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల బాధ్యత కీలకం

**హొసపేటె, న్యూస్‌టుడే:** ఉత్తమ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల బాధ్యత కీలకమని జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి పేర్కొన్నారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన కర్ణాటక యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ విజయనగర జిల్లా నూతన సభ్యుల అధికార స్వీకార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో ఎన్నో తప్పులు జరుగుతుంటాయి, వాటిని కనుగొని పరిష్కాం మార్గం సూచించేలా వార్తలు రాయాలని ఆమె పిలుపునిచ్చారు. మంచి, చెడులు రెండూ మన మందు ఉంటాయి, మంచినే ఎన్నుకుని సమాజానికి ఉత్తమ సందేశం ఇవ్వాలని సూచించారు. అధికార యంత్రాంగం కూడా తెలియకుండా పలు తప్పులు చేసే అవకాశం ఉంటుంది, వాటిని వార్తల్లోకి ఎక్కించి అధికారులకు చురకలంటించాలని అన్నారు. ఎస్పీ జాహ్నవి, యూనియన్ రాష్ట్రాధ్యక్షుడు శివానంద్ తగడూరు, ప్రధాన కార్యదర్శి లోకేశ్, హుడా అధ్యక్షుడు మహ్మద్ ఇమామ్ నియాజి, వార్తాధికారి ధనంజయప్ప, వికాస్‌బ్యాంక్ అధ్యక్షుడు విశ్వనాథ్ హిరేమఠ్, యూనియన్ జిల్లాధ్యక్షుడు పి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ, రాష్ట్రసమితి సభ్యుడు వెంకోబనాయక పాల్గొన్నారు.

పాత్రికేయుల సంఘం సభ్యుల అధికార స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలనాధికారి కవితా మన్నికేరి

## హక్కు పత్రాలివ్వకుంటే పోరుబాట తప్పదు

**మాన్వి, న్యూస్‌టుడే:** పట్టణంలోని సర్వే నంబర్ 631, 54, 81/అ, 17 ఎకరాల మేర ప్రభుత్వ భూములున్నాయని, కొన్ని సర్వేనంబర్లు రాష్ట్ర గవర్నర్ పేరున ఉన్నాయని వీటిని ఇళ్లులేని పేదలకు కేటాయించాలని కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ సమితి అసంఘటిత కార్మిక విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి.బాబా డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన మహిళలు పురపాలక సంఘం ముఖ్యాధికారి పరశురామ్ దేవమానేను కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ భూముల్లో ఉంటున్న ప్రజలకు ఇంటి స్థలాలను కేటాయించి, హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెల రోజుల లోపు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఇళ్లులేని పేదలతో బసవ కూడలి వద్ద రాస్తారోకో చేపడతామని ఆయన తెలిపారు.

పురపాలక సంఘం ముఖ్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న పట్టణ మహిళలు

## సింధనూరు ప్రీమియర్ లీగ్ విజేత అగ్రి టైటాన్స్

**సింధనూరు, న్యూస్‌టుడే:** సింధనూరు ఎఫ్ఆర్‌సీఎస్ మైదానంలో రెండు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన సింధనూరు అగ్రి క్రికెట్ ప్రీమియర్ లీగ్-2025 పోటీలో అగ్రి టైటాన్స్ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన అంతిమ పోరులో టైటాన్స్ జట్టు అన్‌బీటబుల్ జట్టుపై విజయం సాధించింది. సింధనూరు తాలూకాలోని ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు, వివిధ ఎరువుల ఉత్పత్తి సంస్థల ఉద్యోగులు ఆటగాళ్లుగా ఈ లీగ్ జరిగింది. సింధనూరు తాలూకా అగ్రి స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సంఘం ఆధ్వర్యంలో ఈ టోర్నమెంటు ఏర్పాటు కాగా మొత్తం ఆరు జట్లు తలపడ్డాయి. ఆల్ రౌండ్ ప్రతిభ చాటిన గూడపాటి రమేశ్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచి బహుమతిని అందుకున్నారు.

## ముక్కోటికి వైష్ణవాలయాల ముస్తాబు

**బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే:** వైకుంఠ ఏకాదశి పర్వదినానికి నగరంలోని వేంకటేశ్వర ఆలయాలు, పాండురంగస్వామి, చెన్నకేశవ ఆలయాలు, బాలాజీ క్యాంపులో వెలసిన లక్ష్మీ బాలాజీ పద్మావతి ఆలయాలను ముస్తాబు చేశారు. బాలాజీ క్యాంపు ఆలయ ధర్మకర్త వేములపల్లి రాధాప్రసాదు మాట్లాడుతూ సుమారు 50వేల మంది భక్తులు దర్శనానికి వస్తారన్నారు. విష్ణుసహస్రనామపఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, శ్రీవారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులందరికీ పంచేందుకు 60 వేల లడ్డూలను సిద్ధం చేశామని తెలిపారు. నాలుగు రోజులుగా ఆలయ శుద్ధీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. రాఘవేంద్ర కూడలిలోని వేంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ద్వారం ఏర్పాటు చేశారు. పటేల్‌నగర్ వేంకటేశ్వర ఆలయం, నాగులచెర్వు శ్రీనివాస దేవస్థానం, కమింగురోడ్డు పాండురంగాలయం, బ్రాహ్మణ వీధి చెన్నకేశవ ఆలయం, సంజీవరాయ, వేంకటేశ్వర ఆలయం, సత్యనారాయణ పేట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశికి సర్వం ముస్తాబు చేశారు. భక్తుల కోసం చలువపందిళ్లు, నీటివసతి, దర్శన బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ ధర్మకర్తలు కోరారు.

బాలాజీక్యాంపులో భక్తులకు పంచేందుకు సిద్ధం చేసిన లడ్డూలు

కమింగురోడ్డులో ముస్తాబైన పాండురంగాలయం

రాఘవేంద్రకూడలి వేంకటేశ్వర ఆలయంలో వైకుంఠద్వారం సిద్ధం చేస్తున్న భక్తులు

### తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

| 29-12-2025 (ఉ॥ 8 గంటలకు) | ప్రస్తుతం | గత సంవత్సరం |
|---|---|---|
| నీటిమట్టం (అడుగుల్లో) | 1610.76 | 1627.01 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 000 | 590 |
| అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 9,018 | 8,927 |
| నీటి నిల్వ (టి.ఎం.సి) | 39.090 | 83.249 |

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

## సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**మాన్వి, న్యూస్‌టుడే:** ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర చిన్ననీటి శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. ఆయన స్థానిక ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌తో కలిసి సిరివారలో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సిరివార కేంద్రంగా మినీ విధానసౌధ, తాలూకా క్రీడాప్రాంగణం, అగ్నిమాపక ఠాణా, వెనుకబడిన తరగతులకు మెట్రిక్ అనంతర వసతి నిలయం, వాల్మీకి భవనం, హైటెక్ గ్రంథాలయం, ముఖ్య రహదారి నిర్మాణ పనులకు ఏకకాలంలో శంకుస్థాపన చేశామని వీటిని అంతే వేగంగా పూర్తి చేసి తాలూకా ప్రజలకు అంకితం ఇస్తామన్నారు. వీటి నిర్మాణాలకు రూ. 34 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరోపక్క అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, ప్రముఖులు ఎన్.గిరిజాశంకర్, శరణయ్య గుడదిన్ని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఎన్.ఎస్.బోసురాజు

(c) eenadu

కాలగమనం కళ్లెదుటే గిర్రున తిరిగింది..
ఏడాదికాలం గడిచిపోయే గడియ దగ్గరపడింది..
మళ్లీ చివురించే కొత్త ఆశల లోకాలవైపు
మనసు చూస్తోంది..
గతమెంత ఘనం.. భవితెంత అభయం..
నేడెక్కడ మన పయనం..
అనుకుంటే.. మనసుంటే.. కాలానికి కళ్లెమేసి..
ఆకాంక్షలు నెరవేర్చుకునే పథం మనవెంటే..
అడగడుగునా అడ్డుకునే ఆ ప్రతికూలతల్ని కూల్చేసి..
ఆశయాల బాటలో విజయాల నిచ్చెన వేద్దాం..
2025 నాటి చేదు, తీపి జ్ఞాపకాలు, జయాపజయాలు..
2026లో కోటి కాంతుల వెలుగులు నింపే జీవితం కోసం
కృత్రిమమేధ అండగా.. లక్ష్య సాధనకు అడ్డు లేదిక..
రండి నూతన వత్సరం అమూల్య అవకాశాల కల్పవృక్షం
కోటి ఆశలతో స్వాగతిద్దాం.. ఆశయాలు సాధిద్దాం

# వినూత్న పథం.. విజయమే లక్ష్యం

- కొత్త ఏడాదిలో సమున్నత గమ్యాల నిర్దేశం
- నైపుణ్యం, సాంకేతిక విద్యపై యువత దృష్టి
- 'న్యూస్‌టుడే' సర్వేలో వెల్లడి

ప్రభుత్వ సరళాదేవి సతీశ్చంద్ర అగరవాల్ డిగ్రీ కళాశాల నుంచి వస్తున్న విద్యార్థులు

**బళ్లారి, న్యూస్‌టుడే:** దేశ జనాభాలో 40 శాతం 30 ఏళ్లలోపు వారే ఉన్నారు. ప్రపంచ దేశాల్లో భారతదేశంలోనే యువత ఎక్కువగా ఉన్నారు. దీంతో యువతపై దేశాభివృద్ధి ఆధారపడి ఉంది. 2025 ఏడాదికి వీడ్కోలు పలికి 2026 ఏడాదికి యువత స్వాగతం పలకడానికి మూనివేళ్లపై నిలబడింది. అక్కడితో ఆగిపోకుండా యువత నూతన సంవత్సరంలో ఆన్‌లైన్‌లో నూతన కోర్సులు నేర్చుకుని. నైపుణ్యం, సాంకేతిక విద్యవైపు పరుగులు తీయాలి. ఉన్నత విద్యతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడి పలువురికి ఆదర్శంగా నిలిచేందుకు ఇష్టపడుతున్నారు. బళ్లారి జిల్లా జనాభా 18 లక్షలు ఉండగా, వారిలో 8 లక్షల మంది యువత (30 ఏళ్లలోపు) ఉన్నారు. వారిలో 'న్యూస్‌టుడే' 18 నుంచి 22 ఏళ్ల మధ్య యువతీ యువకుల్లో సుమారు 300 మందిని నూతన సంవత్సర తీర్మానాలపై సర్వే చేసింది. ఈ సందర్భంగా వారు ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

### యువత అభిప్రాయాలు శాతాల్లో..

- సాంకేతిక, నైపుణ్య శిక్షణ, ఆన్‌లైన్ కోర్సులు అభ్యసిస్తాం
- ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తాం
- వ్యాపార రంగంలో స్థిరపడాలని ఉంది
- స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా కల్పించుకుంటాం
- ఉన్నత విద్య పూర్తయ్యాకే కొలువుపై దృష్టి సారిస్తాం




### నవ్యాలోచనల సమ్మిళితం

నూతన సంవత్సరంలో వివిధ కోర్సులను ఆన్‌లైన్ ద్వారా నేర్చుకుని నైపుణ్యం మెరుగుపరుచుకునేందుకు చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు. సాంకేతిక విద్యను నేర్చుకుని ఉద్యోగంలో స్థిరపడతామని అభిప్రాయపడ్డారు. పలువురు యువత ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవుతామని, జీవితంలో స్థిరపడేందుకు పునాది వేసుకుంటామని చెప్పారు.

● మరికొందరు వ్యాపార రంగంలో రాణించడానికి కృషి చేస్తామన్నారు. తక్కువ సంఖ్యలో యువతీ, యువకులు డిగ్రీ, పీజీ తర్వాత కొలువా, వ్యాపారమా, అంకుర సంస్థల స్థాపనపై ఆలోచిస్తామని మనసులో మాట చెప్పారు.

### అమ్మాయిలూ భళా..

ఉన్నత చదువులు చదివాం. నైపుణ్య, సాంకేతిక, వృత్తిపర శిక్షణ లేకపోవడంతో ముందుకు వెళ్లలేక పోతున్నాం. పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు, ప్రభుత్వం నిర్వహిస్తున్న వృత్తిపర శిక్షణను ఉపయోగించుకుంటామని పేర్కొన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, బ్యూటీ పార్లర్ కోర్సులను నేర్చుకుని ఇంటి వద్దే ఉపాధి కల్పించుకుంటామని చెప్పడం గమనార్హం. డిగ్రీ, పీజీలో వాణిజ్య, వ్యాపార గణాంక శాస్త్రాలను కోర్సులను పూర్తి చేశాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అకౌంట్స్, ట్యాలీ, బేసిక్ కంప్యూటర్ వంటి కోర్సులను నేర్చుకుని స్థిరపడుతామని మరికొందరు తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేట్ ఉద్యోగాల కోసం ఇంటి వద్ద పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నామని కొందరు, ఇంటి వద్ద చిన్న పనులు చేసుకుంటూ, కుటుంబపోషణకు సహాయపడుతామని తక్కువ సంఖ్యలో అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

### భావప్రసార నైపుణ్యాల్లేక..

ఎక్కువ మంది ప్రాంగణ ఎంపికలు, సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేటు రంగంలో కలల కొలువుల సాధనకు సమాచార, భావప్రసార నైపుణ్యాలు, ఆంగ్లభాషణలో తడబాటు అడ్డంకిగా మారినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త ఏడాదిలో అన్ని భయాలను పారదోలి కోరుకున్న కొలువు, రంగంలో రాణించాలని యువతకు శుభాకాంక్షలు చెప్పేద్దాం.

## మహిళపై లైంగిక వేధింపులు

**బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే :** నగరంలోని ఒక మాల్‌లో క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఓ మహిళ (28)ను లైంగికంగా వేధించిన ఘటనలో అసోంకు చెందిన మనోజ్ చంద్ (27) అనే డెలివరీ బాయ్‌ను మహదేవపుర ఠాణా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. క్రిస్మస్‌ను పురస్కరించి డిసెంబరు 25న తన భర్త, కుమార్తెతో కలిసి బాధిత మహిళ మాల్‌కు వెళ్లారు. క్రిస్మస్ ట్రీ వద్ద నిలబడి ఉన్న సమయంలో మద్యం మత్తులో ఉన్న నిందితుడు ఆమెను అసభ్యంగా తాకి పరారయ్యాడు. వెంటనే బాధితురాలు భర్తకు, అక్కడే విధుల్లో ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వడంతో భద్రతా సిబ్బంది వేట ప్రారంభించి, అరెస్టు చేసినట్లు పోలీసులు సోమవారం ఇక్కడ ధ్రువీకరించారు.

## శిథిల జీవనం.. భవిత వికలం

శిథిలాల నడుమే తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్న నిర్వాసితులు

వ్యర్థాల నిర్వహణకు కేటాయించిన రెండెకరాల భూమిలో ఫకీర్ లేఅవుట్, వసీం లేఅవుట్ల పేరిట నెలకొల్పిన అక్రమ నిర్మాణాలను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార తొలగించాక.. అక్కడి పేదల బతుకు దయనీయంగా మారింది. గత మూడు దశాబ్దాలుగా తాము ఇక్కడే ఉంటున్నామని, బలవంతంగా పంపించేందుకు ప్రయత్నించడం సరికాదని 200కు పైగా కుటుంబాలు వాదిస్తూ వచ్చాయి. న్యాయస్థానం ఆదేశాలతో గత వారం ఆ నిర్మాణాలను అధికారులు కుప్పకూల్చారు. ఆ శిథిలాల నడుమే, తాత్కాలికంగా గుడారాలు వేసుకుని ఆ కుటుంబాలు ఉంటున్నాయి. ఆ లేఅవుట్లలో నేటి తాజా పరిస్థితికి ఈ చిత్రాలు అద్దం పడుతున్నాయి.

-న్యూస్‌టుడే, బెంగళూరు గ్రామీణం

క్యారంబోర్డు ఆడుతున్న బాలలు, పక్కనే మంచంపై పడుకుని నిద్రలో జారిన కార్మికుడు



వేయించిన వేరుసెనక్కాయల విక్రేత బండిపై ఉంచుకుని గణపతి విగ్రహం

వేరుసెనక్కాయలు, గింజల అలంకరణలో కాడు మల్లేశ్వరుడు

# చిత్రమైన వేరుసెనగ!

మాణి వృత్తాంతగళు ప్రదర్శన

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే :** కాడు మల్లేశ్వరం ఆలయ వీధిలో ప్రతి ఏటా వేరుసెనగ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఈ జాతరకు సంబంధించిన చిత్రాలను ప్రముఖ ఛాయాచిత్రగ్రాహకుడు కందవార వెంకటేశ్ తన కెమెరాతో బంధించారు. అందులో నుంచి ఎంపిక చేసిన 50 చిత్రాలను బెంగళూరులోని ప్రభుత్వ చిత్రకళా పరిషత్‌లో ప్రదర్శనకు ఉంచారు. ముఖ్యమంత్రికి మాధ్యమ సలహాదారుడు కేవీ ప్రభాకర్, కాడు మల్లేశ్వర గెళయర బళగ అధ్యక్షుడు, విశ్రాంత పోలీసు అధికారి బీకే శివరాం ఈ ప్రదర్శనను సంయుక్తంగా ప్రారంభించారు. మన దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రలో వేరుసెనగ సాగు ఎక్కువ. పంట సాగుకు 1400-1533 మధ్య బీజం పడిందనేది చరిత్ర. మాణి (స్పానిష్), అమేండోయిం (పోర్చుగీస్), పిస్తాశె దె తెర్కె (ఫ్రెంచ్)తో పాటు ఆయా ప్రాంతాల్లో దీన్ని ఎర్త్ నట్, మంకీనట్, గోబర్, షిప్ నట్, మనీలానట్ అని వ్యవహరిస్తారు. భారత్‌లో 1500వ సంవత్సరంలో దీని సాగు ప్రారంభం కాగా. . మైసూరు, మలబార్, దక్షిణ కన్నడ జిల్లాల్లోని పసుపు తోటల్లో అంతర్ పంటగానూ సాగు చేసేవారు. సుంకేనహళ్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో వేరుసెనగ సాగును ఒక ఎద్దు వచ్చి నాశనం చేసి వెళ్లేదని, అలా చేయవద్దని స్థానిక రైతులు ప్రార్థనల అనంతరం అది ఒక బెట్టపైకి వెళ్లి శిలలా మారిందని భక్తులు విశ్వసిస్తుంటారు. నేటి బసవనగుడిలో ఏటా వేరుసెనగ జాతరను నిర్వహించడానికి ఈ కథే ఊతమిస్తోంది. అనంతర కాలంలో మల్లేశ్వర ఆలయం వీధిలోనూ ఈ జాతరను ప్రారంభించారు. ఒక గింజ నుంచి మూడు, నాలుగు గింజల వేరుసెనక్కాయలను జాతరలో విక్రయించుకునేందుకు రైతులు వస్తుంటారు. తరం మారినా, నేటి తరం యువత పెద్ద సంఖ్యలో నగర జాతరల్లో పాల్గొంటున్నారు. ఈ చిత్ర ప్రదర్శన బుధవారం రాత్రి ఏడు గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు వెల్లడించారు.

## ఎమ్మెల్యే సలగర్‌పై కేసు

**బీదర్, న్యూస్‌టుడే :** గత విధానసభ ఎన్నికల వేళ తమ దూరపు బంధువు నుంచి తీసుకున్న రూ. 99 లక్షల రుణాన్ని తిరిగి చెల్లించని భాజపా ఎమ్మెల్యే శరణు సలగర్‌పై కేసు నమోదైందని బీదర్ జిల్లా పోలీసులు ధ్రువీకరించారు. తీసుకున్న రుణానికి ఇచ్చిన చెక్కులన్నీ వరుసగా గోడకు కొట్టిన బంతుల్లా వెనక్కు రావడంతో రుణం ఇచ్చిన వ్యక్తి బ్యాంకులో విచారణ చేయగా.. ఎమ్మెల్యే తన ఖాతాను రద్దు చేసుకున్నారని గుర్తించి నోటీసులు జారీ చేశారు. నోటీసులకు స్పందించకపోవడంతో ఎమ్మెల్యే తనను వంచించారని నగర ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

## సైఫుద్దీన్ హత్యకేసు.. నిందితులపై కోకా చట్టం

**ఉడుపి, న్యూస్‌టుడే :** మల్పె ఠాణా పరిధిలో గత సెప్టెంబరు 27న ఎకేఎంఎస్ ట్రావెల్స్ బస్సుల యజమాని సైఫుద్దీన్ హత్యకు గురయ్యారు. ఈ కేసులో ఇప్పటికే మహ్మద్ ఫైజల్ ఖాన్ (27), మహ్మద్ షరీఫ్ (37), అబ్దుల్ షుకుర్ (43), రిదా షబనా (27), మహ్మద్ సియాన్ (31) అనే వ్యక్తులను అరెస్టు చేయగా, ప్రధాన నిందితుడు ఇప్పటికీ పరారీలో ఉన్నాడు. నిందితులు అందరిపై కోకా చట్టంపై కేసు నమోదు చేశామని ఎస్పీ హరిరామ్ శంకర్ తెలిపారు. దర్యాప్తు అవధిని 90 రోజుల నుంచి 180 రోజులకు పొడిగించి, మైసూరులోని కోకా కేసులను విచారణ చేసే ప్రత్యేక న్యాయస్థానానికి కేసు బదిలీ చేశామని చెప్పారు.

భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

అమృతనగరలో స్వామివారి కోవెల ప్రవేశద్వారానికి సింగారాలు

## ముక్కోటి దేవతల దర్శనానికి వేళాయె!

ఆధ్యాత్మిక సమాచారం

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :** ముక్కోటి ఏకాదశి వేడుకలకు వైష్ణవాలయాలు సిద్ధమయ్యాయి. రాష్ట్రంలోని లక్ష్మీదేవేశ్వర శ్రీమహావిష్ణు అంశ కోవెళ్లలో ఉత్తర ద్వారం గుండా ప్రవేశించడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం తెల్లవారుజామునే భక్తులను శ్రీస్వామి దర్శనానికి అనుమతిస్తారు. రాజధాని నగరంతోపాటు మాలూరు సమీప చిన్నతిరుపతి, బాగేపల్లి గడిదం వేంకటేశ్వరాలయం మొదలు అనేకానేక ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లపై శ్రద్ధ చూపారు. బెంగళూరు అమృతనగరలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర దేవస్థానం వైకుంఠ ఏకాదశికి ముస్తాబు అయింది. భారీ సంఖ్యలో భక్తులు రానున్నారు. అందుకు తగినట్లు ఏర్పాట్లు చేశారు. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఇక్కడ పూజలు ప్రారంభిస్తామని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ రామ జోగేశ్వరరావు తెలిపారు. తెల్లవారు జామున నుంచి వైకుంఠ ద్వార పూజ, అభిషేకం, వస్త్రసేవ, అలంకార సేవ, ప్రసాద పంపిణీ చేపడతారు. భక్తుల కోసం ప్రత్యేకంగా లడ్డూ ప్రసాదం అందిస్తారు.

## భక్తులకు లడ్డూల వితరణ

**జేపీనగర, బెంగళూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే :** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల కోసం లక్ష లడ్డూలను పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్సీ శరవణ ప్రకటించారు. శరవణ చారిటబుల్ ట్రస్టు ఆవరణలో ఆయన లడ్డూలకు సోమవారం పూజలు చేశారు. నగరంలోని వివిధ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు ఈ లడ్డూలను పంపిస్తున్నామని తెలిపారు. ట్రస్టు తరఫున గత కొన్నేళ్లుగా వివిధ ధార్మిక, సామాజిక, మానవీయ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. ఆయా ఆలయాల నుంచి వచ్చిన ప్రతినిధులు లడ్డూలను అందుకుని వెళ్లారు.

లడ్డూలకు పూజ చేస్తున్న శరవణ

## సర్వ మంగళ రథ సంబరం

**బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే :** శ్రీమంజునాథుడి పట్టమహిషి, మంగళూరు గ్రామ దేవత మంగళాదేవి అమ్మవారి ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో ఆదివారం మహారథోత్సవం భక్తుల కనుల పండగలా సాగింది. ఉదయం మహాభిషేకాలు, పూజలు, వేదఘోషల మధ్య హోమాల్లో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం పెద్ద రంగపూజ, అనంతరం ప్రాంగణంలో ఉత్సవ విగ్రహ ఊరేగింపు పూర్తి చేశారు. సంధ్యా సమయ అనంతరం మహారథంలో మంగళాదేవి ఊరేగింపు సాగింది. ఈ రథోత్సవాన్ని వీక్షించడానికి వేలాది భక్తులు కదలివచ్చారు. జమ్మి పూజ, పాలకి బలి, తదితర విధివిధానాలతో ఈ ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

దివ్య మంగళాదేవి విగ్రహం

కనుల పండగలా సాగిన రథోత్సవం

ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహ ఊరేగింపు

## బనశంకరి కోవెలలో హోమం

**బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే :** రాజధాని నగర శక్తి దేవతల కేంద్రం.. బనశంకరి అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం సహస్ర మోదక మహాగణపతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమాలను నిర్వహించారు. అమ్మవారితో పాటు ఉపాలయాల్లోని శాకంబరి దేవి, పర్వత మల్లికార్జున స్వామిలను వివిధ రకాల పూలతో అలంకరించారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు నిత్యం వేకువ జామునే బనశంకరి అమ్మవారికి సుప్రభాత సేవ, ప్రత్యేక పంచామృతాభిషేక సేవలను నిర్వహిస్తున్నామని ఆలయం ఈఓ ఎన్.కృష్ణప్ప తెలిపారు.

పుష్పాలంకరణలో బనశంకరి అమ్మవారు

EENADU Classifieds
JOBS
బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+ PF+ జీ-17K © 7019632854

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

## వైమానిక వ్యవస్థల కోసం ఐఐటీఎంతో ఒప్పందం

**ఈనాడు, బెంగళూరు :** భారతీయ వైమానిక యుద్ధ వ్యవస్థలకు స్వదేశీ పరిజ్ఞానంతో డిజిటల్ కమ్యూనికేషన్ సిస్టమ్ తయారీ కోసం భారతీయ వైమానిక దళం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్‌డీఐ)- ఐఐటీ (మద్రాస్) ఒప్పందం చేసుకున్నాయి. బెంగళూరులో సోమవారం నిర్వహించిన ఈ ఒప్పంద కార్యక్రమంలో ఎస్‌డీఐ కమాండెంట్ ఎయిర్ వైస్ మార్షల్ గురుహరి, ఐఐటీఎం డైరెక్టర్ ఆచార్య వి.కామకోటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుహరి మాట్లాడుతూ రక్షణ వ్యవస్థల్లో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానాన్ని వినియోగించటం, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థల్లో ఆత్మనిర్భర్ ఉత్పాదనలు పెంచేందుకు ఈ ఒప్పందం ఉపకరిస్తుందన్నారు. భారతీయ రక్షణ వ్యవస్థలకు ఆధునిక కమ్యూనికేషన్ సాంకేతికత, సైబర్ భద్రత కల్పించే బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తున్నామని ఐఐటీఎం డైరెక్టర్ ఆచార్య కామకోటి వెల్లడించారు. ఈ ఒప్పందంతో ప్రపంచశ్రేణి పరిశోధన వ్యవస్థలు రూపుదాల్చుతాయన్నారు. అత్యున్నత స్థాయి డేటా వినిమయం, రక్షణ వ్యవస్థల్లో సమర్థ ఆపరేషన్ నైపుణ్యం, నెట్‌వర్కింగ్ వ్యవస్థల్లో అడ్వాన్స్‌డ్ అల్గారిథమ్స్ అభివృద్ధి చేయటం ఈ ఒప్పందంలోని కీలకాంశాలని ఇరు సంస్థల అధికారులు వెల్లడించారు. వర్తమాన వైమానిక ప్రగతి అంశంలో ఇదెంతో కీలక ఒప్పందంగా విశ్లేషించారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరి మృతి

**హుబ్బళ్లి, న్యూస్‌టుడే :** ధార్వాడ శివార్లలోని జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి అనంతరం సంభవించిన రోడ్డు ప్రమాదంలో కిషన్ ఖానవాలె (30), కిరణ ఖడవాకర్ (32) అనే యువకులు మరణించారు. వీరిద్దరూ వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని యరికొప్ప సమీపాన ఎదురుగా వచ్చిన లారీ సోమవారం ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. కిందపడిన వీరిద్దరిపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మరణించారు. ధార్వాడ గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కోతల నివారణకు గట్టి చర్యలు

**బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే :** అన్ని ప్రాంతాల్లో విద్యుత్తుకు డిమాండ్ నానాటికీ ఎక్కువవుతోందని ఇంధన శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి గౌరవ్ గుప్త వెల్లడించారు. వేసవిలో విద్యుత్తు కోతలు లేకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని కర్ణాటక విద్యుత్తు మండలి ఇంజినీర్లకు సూచించారు. ఆనందరావు కూడలిలోని మండలి ఆడిటోరియంలో మండలి ఇంజినీర్ల సంఘం సోమవారం నిర్వహించిన సువర్ణ మహోత్సవాలు, 2026 దినచరి విడుదల చేసి మాట్లాడారు. ఆశించిన స్థాయిలో వర్షపాతం లేకపోతే విద్యుత్తు కోతలు అనివార్యం అవుతాయన్నారు. విద్యుత్తు వినియోగం ఎక్కువైతేనే మండలికి లాభం వస్తుందన్నారు. విద్యుత్తు కొరత ఉన్నప్పుడు సౌర విద్యుత్తు, పవన విద్యుత్తును సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. యువ ఇంజినీర్లకు పదోన్నతులకు చర్యలు తీసుకోవాలని సంఘం అధ్యక్షుడు సి బసవణ్ణ విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఇంజినీర్లను నియమించుకుని 22 ఏళ్లయిందని, సిబ్బంది కొరతను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పాత పింఛను వ్యవస్థను జారీ చేయడం, ఇంజినీర్లకు నగదు రహిత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని వినతి పత్రాన్ని అందించారు. ఎమ్మెల్యేలు టీడీ రాజేగౌడ, రమేశ్ బండిసిద్ధేగౌడ, సంఘం ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంఘం సభ్యులతో కలిసి చెకప్ కార్డును ఆవిష్కరించి ప్రదర్శిస్తున్న గౌరవ్ గుప్త

## సహకార రంగ సేవలే కీలకం

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే :** దేశంలో వ్యవసాయ రంగంలో మార్పులకు సహకార రంగం పాత్ర కీలకమని ఇఫ్కో అధ్యక్షుడు దిలీప్ సంగాణి పేర్కొన్నారు. జీకేవీకేలో నిర్వహించిన మెగా కో-ఆపరేటివ్, రైతుల సదస్సులో ఇఫ్కో అభివృద్ధి చేసిన 'ధరామృత'ను సోమవారం విడుదల చేసి మాట్లాడారు. సేంద్రీయ ఎరువుల వినియోగం, ఆయా ప్రభుత్వాలు అందుబాటులోకి తీసుకువచ్చిన వ్యవసాయ సాంకేతికతలను అన్నదాతలకు చేర్చుతూ, వివిధ ఎరువులు, సూక్ష్మ పోషకాలను రైతులకు అందించడంతో పాటు, వాటి ప్రయోజనాలను పొందేందుకు జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నామని గుర్తు చేశారు. సంస్థ ప్రతినిధి కేజే పటేల్‌తో పాటు ఇతర ప్రతినిధులు, ఆయా జిల్లాల నుంచి వచ్చిన రెండు వేల మంది రైతులు సదస్సులో పాల్గొన్నారు.

రిబ్బను కత్తిరిస్తున్న దిలీప్ సంగాణి, కేజే పటేల్, ఇతర ప్రతినిధులు

## బుల్లితెర నటి నందిని బలవన్మరణం

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే :** బుల్లితెర నటి సీఎం నందిని రాజరాజేశ్వరి నగర నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విజయనగర జిల్లా పరప్పనహళ్లి తాలూకా కొట్టూరుకు చెందిన ఆమె తండ్రి మహాబలేశ్వరప్ప వృత్తి రిత్యా ఉపాధ్యాయుడు. గౌరి అనే ధారావాహికలో దుర్గ, కనక అనే రెండు పాత్రలను పోషిస్తున్న ఆమె జీవ హూవాగిదె, సంఘర్ష, మధుమగళు, నీనాదె నా ధారావాహికలతో పాటు, కొన్ని తెలుగు, తమిళ ధారావాహికల్లో నటించింది. చెన్నైలో చిత్రీకరణ పూర్తి చేసుకుని నగరానికి వచ్చిన ఆమె ఆదివారం రాత్రి తన నివాసంలో ఆత్మహత్య చేసుకుందని గుర్తించారు. మరణోత్తర పరీక్షలు పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు సోమవారం అప్పగించారు. చిగటేరిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. రాజరాజేశ్వరినగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నటి సీఎం నందిని

### బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

| | |
|---|---|
| బీన్స్- | 65 |
| క్యారెట్- | 65 |
| బీరకాయలు- | 55 |
| క్యాబేజి- | 50 |
| క్యాలీఫ్లవర్(ఒక్కోటి)- | 30 |
| సొరకాయ- | 55 |
| దొండకాయలు- | 45 |
| పొట్లకాయ- | 45 |
| పచ్చి మిరపకాయలు- | 70 |
| కాకర కాయలు- | 55 |
| టమాటా(నాటు)- | 70 |
| టమాటా(సాధారణ)- | 55 |
| గుమ్మడి- | 35 |
| ఆలుగడ్డ- | 45 |
| ఉల్లి(మేలురకం)- | 40 |
| ఉల్లి(సాధారణ)- | 35 |
| వెల్లుల్లి- | 160 |
| సాంబారు ఉల్లి- | 165 |
| బీట్‌రూట్- | 55 |
| వంకాయలు- | 55 |
| బెండకాయలు- | 55 |
| ముల్లంగి- | 55 |
| నిమ్మకాయ- | 120 |

### పండ్లు, ఫలాలు ధరలు

| | |
|---|---|
| వాషింగ్టన్ ఆపిల్- | 385 |
| సిమ్లా ఆపిల్- | 265 |
| గ్రీన్ ఆపిల్- | 325 |
| అరటి కాయలు- | 35 |
| సపోటా- | 65 |
| పైనాపిల్- | 65 |
| బొప్పాయి- | 35 |
| ఆరంజి- | 95 |
| బత్తాయి- | 65 |

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

(c) eenadu

# బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

## సంచార రద్దీ పరిశీలన

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** కృష్ణ బీజీఎల్ కూడలి నుంచి గొరగుంటపాళ్య కూడలి వరకు నిత్యం నెలకొంటున్న సంచార రద్దీని బెంగళూరు ఉత్తర నగర పాలికె కమిషనర్ సునీల్‌కుమార్ సోమవారం ఇక్కడ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఆమార్గంలో సాగుతున్న పనులను సమీక్షించిన ఆయన త్వరగా పూర్తి చేయాలని సూచించారు. విస్తరణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై అధికారులతో చర్చించారు. ఎంఈఎస్ రహదారి విస్తరణ కార్యక్రమాన్ని గురించి అధికారులు ఆయనకు వివరించారు. నిత్యం సంచార రద్దీ మయం. ప్రజలు రహదారి దాటే పరిస్థితి కూడా ఉండదు. తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. వాహనాలు రహదారిలో సాఫీగా సంచరించే విధంగా పలు పనులు చేపడతామని ఆయన తెలిపారు.

## ఎంజీ రోడ్డులో వాహన సంచారంపై ఆంక్షలు

**బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే:** నూతన సంవత్సర వేడుకలు జరిగే ఎంజీ రోడ్డు చుట్టు పక్కల రహదారుల్లో సంచార పోలీసులు ఆంక్షలు విధించారు. ఈనెల 31వ తేదీ సాయంత్రం నుంచి జనవరి 1వ తేదీ తెల్లవారు వరకు వాహన సంచారంపై ఆంక్షలు అమలులో ఉంటాయి. రాత్రి 10 గంటల నుంచి ఎంజీ రోడ్డు, బ్రిగేడ్‌రోడ్డు, చర్చిస్ట్రీట్‌లో వాహనాల రాకపోకలను నిషేధించారు. ఆ రహదారుల్లో సంచరించే వాహనదారులు కబ్బన్‌రోడ్డు గుండా ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు. ఎంజీ రోడ్డు అనిల్ కుంబ్లే కూడలి నుంచి మెయోహాల్ వరకు వాహనాలు నిలుపుదలను నిషేధించారు. చర్చి వీధి, బ్రిగేడ్ రోడ్డులో వాహనాలు పార్కింగ్ అవకాశం కల్పించలేదు. శివాజీనగర బీఎంటీసీ షాపింగ్ కాంప్లెక్స్, కామరాజ రోడ్డు, గరుడామాల్‌లో వాహనాలు పార్కింగ్‌కు అవకాశం కల్పించారు.

హో సూ రు క బు ర్లు

## ఆనందోత్సాహాలతో కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం

**హోసూరు, న్యూస్‌టుడే:** కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎ. మురళీధరన్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకలకు నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలతో హాజరయ్యారు. తాలుక ఎం.జీ.రోడ్డులోని గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ అధ్యక్షుడు త్యాగరాజ్, మహదేవ, శివప్పరెడ్డి, మహిళ విభాగం నుంచి సరోజ, లలిత, కన్యాకుమారి, నాయకులు బాగలూరు ఎల్లప్ప, ముత్తప్ప, గుణశేఖర్‌రెడ్డి, వి.జి.పి.నగరు అబ్బాస్, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మురళీధరన్, కార్యకర్తలు

## పలు పార్టీల కార్యకర్తలు డీఎంకేలో చేరిక

**హోసూరు, న్యూస్‌టుడే:** నగర శివారు నంజాపురానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన వందల మంది కార్యకర్తలు డీఎంకేలో చేరారు. సోమవారం వారు పెద్దబేళగొండపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.ప్రకాశ్ సమక్షంలో డి.ఎం.కె. సభ్యత్వం పొందారు. ఆయన కార్యకర్తలకు శాలువాలు కప్పి గౌరవంగా స్వాగతించారు. కార్యకర్తలను డి.ఎం.కె. హోసూరు యూనియన్ కార్యదర్శి తొరపల్లి రామమూర్తి.. ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. కార్యక్రమంలో రైతు విభాగం నాయకుడు కొత్తగొండపల్లి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వై.ప్రకాష్ సమక్షంలో డి.ఎం.కె. సభ్యత్వం పొందిన కార్యకర్తలు

## కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని వినతి

**హోసూరు,న్యూస్‌టుడే:** రాష్ట్రంలో 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో హోసూరు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తాను పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు ఒన్నలవాడి అబ్బాస్ పేర్కొన్నారు. ఈమేరకు వినతిపత్రాన్ని సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు ఎస్.ఎ.మురళీధరన్‌కు తన సన్నిహితులతో కలిసి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అబ్బాస్ కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. కార్యక్రమానికి టౌన్‌కమిటీ అధ్యక్షుడు త్యాగరాజన్, జిల్లా కోశాధికారి మహదేవ, సీనియరు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.

హోసూరు అసెంబ్లీ టికెట్ కోరుతూ కాంగ్రెస్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఒన్నలవాడి అబ్బాస్

## 50వేల లడ్డూల ప్రసాదం సిద్ధం

**డెంకణీకోట న్యూస్‌టుడే:** తేరుపేటలోని సౌందరవల్లి సమేత బేటరాయస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశేష పూజలకు సర్వం సిద్ధం చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ ఆలయానికి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి స్థానికులతో కలిపి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. భక్తులకు లడ్డూలను ప్రసాదంగా ఇవ్వడానికి ఆలయ కమిటీ 50000 లడ్డూలను సిద్ధం చేసింది.

వితరణకు సిద్ధం చేస్తున్న సిబ్బంది

## పరిసరాల పరిశుభ్రతకు పాదయాత్ర

**బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే:** హెసరుఘట్ట భారతీయ ఉద్యానవనాల పరిశోధన సంస్థ, హెసరుఘట్ట, హురళిచిక్కనహళ్లి గ్రామపంచాయతీలు సంయుక్తంగా సోమవారం ఇక్కడ పరిశుభ్రమైన పరిసరాల కోసం నడక కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యుడు విశ్వనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యకరమని, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అన్ని ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ తుషార్ కాంతి బెహరా మాట్లాడుతూ స్థానికులతో కలిసి స్వచ్ఛత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెసరుఘట్టగ్రామ పంచాయతీ అధ్యక్షురాలు హెచ్.ఎస్.రంజిని మధుసూదన్, నోడల్ అధికారి డాక్టర్ బి.బాలకృష్ణలతో పాటు స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, సంస్థ అధికారులు, శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వచ్ఛత కోసం నడక కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వనాథ్ తదితరులు

## మాజీ కార్పొరేటర్ కన్నుమూత

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే:** గోవిందరాజనగరలో భాజపా సీనియరు నాయకుడు, మాజీ కార్పొరేటర్ గంగభైరయ్య (76) ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. సంఘపరివార్‌కు చెందిన నాయకునిగా రాజకీయాల్లోకి వచ్చి రెండు సార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ప్రతిపక్ష నాయకునిగా వరుసగా నాలుగేళ్లు సేవలు అందించారు. అద్వాణి, యడియూరప్ప, రామచంద్రేగౌడ, అనంతకుమార్ తదితరులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. దొడ్డబళ్లాపుర తాలూకా చిక్కమధురెలో సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర, కేంద్ర మంత్రి వి సోమణ్ణ, విపక్ష నేత అశోక్, మాజీ కార్పొరేటర్ ఉమేశ్ శెట్టితో పాటు పలువురు నేతలు గంగభైరయ్య కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు.

## అలరించిన సంగీత కచేరి

**బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే:** స్థానిక వయ్యాలికావల్‌లోని శ్రీవెంకటేశ్వర దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందుధర్మ పరిషత్ ఏర్పాటు చేసిన ఊంజల్ సంగీతోత్సవంలో విదుషి రమ్యా సుధీర్ తన సుమధుర గళంతో ఆలపించిన అన్నమయ్య కీర్తనలు, హరిదాసుల కీర్తనలు ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేశాయి. విద్వాన్ టి.ఎన్.రమేశ్ (కీబోర్డు), జగదీశ్(తబలా) పక్కవాద్యాలతో కచేరీని మరింత రక్తి కట్టించారు. అనంతరం కార్యక్రమ సంచాలకులైన డా. భుజంగరావు వందన సమర్పణ చేసి విద్వాంసులను సత్కరించారు.

ఆలపిస్తున్న రమ్యా సుధీర్

## చెట్లకు రక్షణ ఏర్పాట్లు

### శరవేగంగా కాంక్రీట్ తొలగింపు పనులు

ఆర్‌టీనగర పాదచారి మార్గంలో కాంక్రీట్‌తో కప్పి ఉన్న చెట్ల మొదళ్లు

**బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే:** వృక్షో రక్షిత.. రక్షితః విధానాన్ని గ్రేటర్ బెంగళూరు ప్రాధికార చక్కగా అమలు పరుస్తోంది. రాష్ట్ర రాజధాని బెంగళూరులో రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్ల మొదళ్ల చుట్టూ వేసిన కాంక్రీట్‌ను తొలగించే కార్యక్రమాన్ని శ్రీఘంగా చేపట్టింది. పాదులు నెలకొల్పి పటిష్ఠం చేస్తోంది. దీంతో నాశనమవుతున్న వృక్షాలను మళ్లీ బతికించినట్లు అవుతుందని అధికారులు తెలిపారు. రహదారి, పాదచారి మార్గంలో కాంక్రీట్, తారు వేసేటప్పుడు వృక్షం మొదలు చుట్టు వేసి కప్పివేస్తున్నారు. దీనివల్ల చెట్టు ఆరోగ్యం, పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడుతోంది. సహజసిద్ధంగా చెట్టుకు అందించాల్సిన గాలి, నీరు, సూర్యరశ్మి వేర్లకు అందక త్వరగా వృక్షాలు ఎండిపోతున్నాయి. వేర్లు బలహీనపడటంతో చిన్నగాలికీ చెట్లు విరిగి వాహనాలు, ప్రజలు, రహదారులపై పడుతున్నాయి. పాదచారి మార్గంలో వివిధ సంస్థలు కేబుళ్లు, తాగునీటి పైపులు అమర్చేందుకు తవ్వకాలు వివిధ సంస్థలు చేపడుతున్నాయి. ఆ సమయంలో అడ్డం వచ్చే వేర్లను నరికి వేస్తున్నారు. దాని వల్ల చెట్టు బలహీనపడుతుంది. ఇంకా పలు కారణాలతో చెట్లు త్వరగా బలహీనపడి నేలకు ఒరుగుతున్నాయి. చెట్టు చుట్టూ వేసిన కాంక్రీట్, తారు, రాళ్లను చదరపు మీటరు వరకు తొలగించాలని జాతీయ హరిత న్యాయస్థానం ఆదేశించింది. చెట్టు చుట్టూ కనీసం ఒక చదరపు మీటరు వరకు తారు సిమెంట్ వేయకూడదని సూచించింది. ఆదేశాలను ప్రాధికార అమలు చేయడం మొదలు పెట్టింది. ఆయా విభాగాల పాలికెల అటవీ విభాగం సిబ్బంది కాంక్రీట్, తారు, రాళ్లు వేసిన చెట్లను గుర్తించి వాటిని తొలగించి పాదులు చేయడం మొదలు పెట్టినట్లు చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు తెలిపారు.

చెట్టు మొదలు చుట్టూ కొత్తగా పాదులు

## దేవాలయాలకు ప్రత్యేక శోభ

**బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా నగరంలోని వైష్ణవ దేవాలయాలు ఒక దాన్ని మించి మరొకటి అలంకృతమౌతున్నాయి. ఈ క్రమంలో నగరంలోని బలమురి శ్రీశేష మహాగణపతి ఆలయం యథావిధిగా ప్రతి పర్వదినం మాదిరిగానే ఈసారి సరికొత్త అలంకరణను సంతరించుకుంటోంది. మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా అరటి ఆకులు, అరటి ఈనె, అరటి బోదెలు, అరటి పువ్వులు, గెలలతో దేవాలయం చూడచక్కని రీతిలో సాక్షాత్కరిస్తోంది. సుమారు 15వేల మంది భక్తులు ఉదయం 4 గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం రానున్నట్లు ఆలయ మేనేజర్ తెలిపారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించినట్లు ఆయన తెలిపారు. మరికొన్ని గంటల్లో స్వామి వారి దివ్య దర్శనం కోసం భక్తులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారన్నారు.

## ఉత్తమ జీవితానికి నాణ్యమైన విద్య అవసరం

**పావగడ,న్యూస్‌టుడే:** విద్యార్థులు ఉత్తమమైన జీవితాన్ని రూపొందించుకోవాలంటే నాణ్యమైన విద్యను అభ్యసించాలని అక్షర దాసోహ అసిస్టెంటు డైరెక్టర్ పండిత గంగాధర్ విద్యార్థులకు సూచించారు. ఆయన తాలూకాలోని దొడ్డహళ్ళి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-2000 విద్యా సంవత్సర పదో తరగతి పాత విద్యార్థుల గురువందనా కార్యక్రమంలో సోమవారం పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నేడు ఇంతటి వారై ఎదురుగా ఉన్నందుకు చాలా సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉపన్యాసకులు మధుగిరి హెచ్.వి.గోవిందరాజు శెట్టి, కొరటగెరె తిమ్మసంద్ర ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషగిరి పాఠశాల, విద్యార్థుల గురించిన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు.

అపూర్వ కలయికలో గురువులతో పాత విద్యార్థులు

## పరుగు విజేతలకు పురస్కారాల ప్రదానం

**బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే:** కర్ణాటక, మైసూరు అథ్లెటిక్స్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్రాస్‌కంట్రీ పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. మైసూరు చాముండీ విహార్ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీలు పురుష, మహిళల విభాగాల్లోనే కాక వేర్వేరు వయో విభాగాల్లో కూడా ఏర్పాటు చేశారు. పురుషుల విభాగంలో నిర్వహించిన 10 కిలోమీటర్ల పోటీలో బెంగళూరు అర్బన్‌కు చెందిన ఓంకార్ రాజేంద్ర పన్నాహల్‌కర్ అగ్రస్థానాన్ని పొందగా, బెంగళూరుకే చెందిన కరన్ గెహందూల్, తుమకూరుకు చెందిన గురుప్రసాద్ వరుసగా రెండు, మూడుస్థానాల్లో నిలిచారు. విజేతలకు నగదు పురస్కారాలు కూడా అందజేశారు. మహిళల విభాగంలో 10 కిలోమీటర్ల రేస్‌లో బెంగళూరుకు చెందిన ఎన్.తేజస్విని-1, ఆరాధన-2, ప్రియాంక-3 స్థానాలను కైవసం చేసుకున్నారు. బాలురు విభాగం అండర్-20 ఎనిమిది కిలోమీటర్ల పరుగులో బెంగళూరుకు చెందిన కల్యాణ్ అగ్రస్థానం, రామనగరకు చెందిన అఖిల్‌కుమార్, బెంగళూరుకు చెందిన శైలేశ్‌కుష్వా ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. బాలికల గ్రూపు ఆరు కిలోమీటర్ల పోటీలో బెళగావికి చెందిన వైష్ణవీ రావల్, ధార్వాడకు చెందిన ఆర్.శిల్పా హొసమనీ, తమన్న వరుసగా తొలి మూడు స్థానాలను సాధించారు. అండర్-18 గ్రూపు బాలుర విభాగం ఆరు కిలోమీటర్ల రేస్‌లో కొడుగుకు చెందిన ప్రవీణ్ అర్జున్, కొప్పళకు చెందిన చంద్రశేఖర బసవరాజ్, బెంగళూరుకు చెందిన లక్ష్మణ్ సిద్ధప్ప హిరాలీ వరుసగా తొలి మూడు స్థానాలను అలంకరించారు. బాలికల గ్రూపు నాలుగుకిలోమీటర్ల పరుగులో నాగిని(దక్షిణకన్నడ), చరిష్మా, అక్షర(బెళగావి) వరుసగా తొలి మూడు స్థానాలను చేపట్టారు. విజేతలకు మైసూరు పేట జ్ఞాపికను, నగదు బహుమతిని అందించారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమంలో మైసూరు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు ఎస్.సోమశేఖర్, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి ఎం.ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైసూరు పేట, జ్ఞాపికలతో వివిధ విభాగాల్లో గెలుపొందినవారు

## కంబళ పోటీల్లో సరికొత్త నమోదు



జాకీ మాస్తీకట్టి స్వరూప్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

**బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే:** తుళునాడులో జానపద క్రీడగా పేరుగాంచిన కంబళ పోటీల్లో మాస్తీకట్టి స్వరూప్‌కుమార్ కొత్త రికార్డు నెలకొల్పాడు. లోక్‌సభ సభ్యుడు కె.బ్రిజేష్‌చౌట నేతృత్వంలో ఆదివారం మంగళూరులోని బంగ్రకూళూరిన గోల్డ్ పింఛ్ సిటీ రామలక్ష్మణ జోడు కెరెలో జరిగిన సీనియర్ విభాగం ఫైనల్ పోటీల్లో శ్రీకా సందీప్‌శెట్టి యాజమాన్యంలోని గాంధీ మైదాన సంతూ, సూరత్కల్ పాంచ దున్నలతో స్వరూప్‌కుమార్ బరిలో దిగి విజేతగా నిలిచాడు. ఈ దున్నలతో 125 మీటర్ల గమ్యాన్ని 10.87 సెకన్లలో చేరి కొత్త రికార్డును నమోదు చేశాడు. 2021లో జరిగిన కంబళ పోటీల్లో శ్రీనివాసగౌడ 125 మీటర్ల దూరాన్ని 10.95 సెకన్లలో పూర్తి చేశాడు. ఈ దూరాన్ని వంద మీటర్లతో సరి పోల్చితే స్వరూప్‌కుమార్ 8.69 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. గతంలో శ్రీనివాసగౌడ 100 మీటర్ల ఈ దూరాన్ని 8.78 సెకన్లలో ముగించాడు. ఈ సందర్భంగా స్వరూప్ మాట్లాడుతూ 'మూడేళ్ల కిత్రం కంబళ పోటీలో జూనియర్ విభాగంలో పాల్గొన్నాను. ఈసారి సీనియర్ విభాగంలో తలపడ్డా.. రికార్డు సృష్టిస్తానని అనుకోలేదు. ఇది నా అదృష్టం అని' చెప్పాడు. ఇంతవరకు అతను మూడు సీనియర్ విభాగాల్లో పాల్గొన్నాడు. ప్రస్తుత పోటీలో రికార్డు నమోదు చేశాడు. గత ఏడాది ఈ దున్నలు రెండోస్థానాన్ని పొందాయి. పట్టుదల, గమ్యాన్ని చేరాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన స్వరూప్ రికార్డు అందుకున్నాడు. కంబళ సమితి అధ్యక్షుడు దేవీప్రసాద్‌శెట్టి మాట్లాడుతూ బరిలో గెలుపొందాలనే.. ఈ మూగజీవాలకూ ఉంటుందని గతంలో ఉసేన్‌బోల్ట్ 100 మీటర్ల రేస్‌లో చేసిన రికార్డును శ్రీనివాసగౌడ తుడిచేశాడు. తాజాగా స్వరూప్ సరికొత్త రికార్డు సృష్టించాడన్నారు. సంప్రదాయకంగా నిర్వహిస్తున్న కంబళ క్రీడలో కొత్త మార్పులు చేశారు. రాష్ట్ర కంబళ సంఘం, జిల్లా కంబళ సమితి కొత్త నియమాలనుసారంగా 2025-26 సీజన్‌లో సబ్ జూనియర్ విభాగాన్ని తీసేశారు. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు 24 గంటల్లో పోటీలు ముగించాల్సిన నేపథ్యంలో సబ్ జూనియర్ విభాగాన్ని రద్దు చేశారు.

గాంధీ మైదాన సంతూ, సూరత్కల్ పాంచ దున్నలతో బరిలో దిగిన స్వరూప్‌కుమార్

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**పావగడ,న్యూస్‌టుడే:** పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయం వెనుక గొర్రెల సంత మైదానంలో కంపచెట్ల మధ్య రఘు(39) అనే యువకుడు మృతదేహం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనగా పోలీసులు భావిస్తున్నారు. భార్య ఉషారాణి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకొని ఘటనా స్థలానికి చేరుకున్న డివైఎస్పీ మంజునాథ, సిఐ ఎం.ఆర్.సురేశ్ ఫోరెన్సిక్ నిపుణులను పిలిపించి తనిఖీ చేపట్టారు.

## రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు..

**బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే:** నగరంలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. రాజాజినగర పోలీసుఠాణా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు దీపక్(17) మృతి చెందారు. ఆదివారం రాత్రి సిమెంట్ మిక్సర్ లారీ కార్మికుడిని ఢీకొనటంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

● పీణ్యా పోలీసుఠాణా పరిధిలోని టి.దాసరహళ్లి వద్ద ఆదివారం రాత్రి కె.ఎస్.ఆర్టీసీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనటంతో కొబ్బరి కాయల వ్యాపారి తిమ్మరాజు(25)మృతి చెందారు. కేసు దర్యాప్తులో ఉంది.

● నెలమంగల సంచార పోలీసుఠాణా పరిధిలోని జాతీయ రహదారి తుమకూరు రోడ్డు టీసీఐ ఉపరితల వంతెన వద్ద లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనటంతో ద్విచక్రవాహనదారుడు మధు(28) మృతి చెందారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

## నాడగీతకు వందేళ్లు

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే:** మహాకవి కువెంపు నాడగీతను రచించి వందేళ్లయిందని బసవ రమానంద స్వామి తెలిపారు. కువెంపు జయంతిని పురస్కరించుకుని మల్లేశ్వరం ఐదో అడ్డ రోడ్డు కూడలిలోని విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సీఎన్ అశ్వత్థ నారాయణ, కర్ణాటక గాంధీ స్మారకనిధి అధ్యక్షుడు వోడే కృష్ణ, కర్ణాటక రక్షణ వేదికె అధ్యక్షుడు హెచ్ శివరామేగౌడ, విశ్రాంత పోలీసు అధికారి బసవరాజ మాలగత్తి తదితరులతో కలిసి నివాళి అర్పించి మాట్లాడారు.

కన్నడ గీతాలాపన చేస్తున్న విద్యార్థినులు

## ఆస్తి కోసం తల్లిపై కొడుకు దాడి

**ముళబాగిలు, న్యూస్‌టుడే:** తల్లి పేరు మీద ఉన్న పిండి మిల్లు, ఇంటిని తన పేరిట బదిలీ చేయాలంటూ మాతృమూర్తిపైనే ఓ కొడుకు దాడి చేసిన ఘటన తాలూకాలోని దేవరాయసముద్ర గ్రామంలో చోటుచేసుకుంది. ఈ దాడిలో గాయపడిన వృద్ధురాలు నారాయణమ్మను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతోంది. ఆమెకు ముగ్గురు కొడుకులు ఒక కూతురు సంతానం. పెద్ద కొడుకు సుబ్రహ్మణ్యానికి ఏ ఉద్యోగం లేదు. దాంతో ఆస్తి పంచి ఇవ్వాలని తల్లిపై పదే పదే దాడికి పాల్పడే వాడు. పంచాయితీకి పిలిచి మందలించినా అతని తీరు మారలేదు. తల్లిపై దాడి చేస్తున్న అన్నను వారించడానికి యత్నించిన తమ్ముడు, మరదలికీ స్వల్ప గాయాలయ్యాయి. ముళబాగిలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కువెంపు రచనలు మనందరికీ గర్వకారణం

కువెంపు చిత్ర పటానికి పుష్పార్చన చేస్తున్న మంత్రి పరమేశ్వర్, ఎమ్మెల్యే జ్యోతిగణేష్, బరగూరు రామచంద్రప్ప

**తుమకూరు, న్యూస్‌టుడే:** నగరంలోని అమాని చెరువులోగల గ్లాస్‌హౌస్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జిల్లా కన్నడ సాహిత్య సమ్మేళనం, రాష్ట్ర కవి కువెంపు జయంత్యుత్సవాలను ప్రారంభించిన హోం మంత్రి, జిల్లా బాధ్యమంత్రి జి.పరమేశ్వర్ ప్రసంగించారు. కన్నడ రక్షణ, కన్నడ సాహిత్యం, సంస్కృతి పెంపొందడానికి మనందరం కట్టుబడి ముందుకు సాగుదామన్నారు. ఏ భాషకు లభించనన్ని జ్ఞానపీఠ్ అవార్డులు (మొత్తం 8) కన్నడకు లభించడం మనకు ఎంతో గర్వకారణంగా పేర్కొన్నారు. సమ్మేళనంలో పాల్గొన్న సాహితీ వేత్త నాడోజ ప్రొ.బరగూరు రామచంద్రప్ప.. కువెంపు చిత్ర పటానికి పుష్పార్చన చేసిన అనంతరం కల్పసుధె స్మరణ సంచికను ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మెల్యే జ్యోతిగణేష్, జిల్లా కన్నడసాహిత్యపరిషత్తు అధ్యక్షుడు సిద్ధలింగప్ప జిల్లాధికారి శుభాకల్యాణ్, సీఈఓ ప్రభు, ఎస్పీ అశోక్ సాహిత్య సమ్మేళనం ప్రతినిధులు జిల్లా వ్యాప్తంగా గల సాహితీవేత్తలు ప్రభుత్వ ఉద్యోగులు విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్నారు.

**పావగడ,న్యూస్‌టుడే:** పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో పేరొందిన కువెంపు జయంతి వేడుకలను సోమవారం తహసీల్దారు వై.రవి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కువెంపు చిత్రపటాన్ని పుష్పాలతో అలంకరించి పూజలాచరించారు. కార్యక్రమంలో ఆర్.ఐ.రాజగోపాల్, రాజేష్, రైతు సంఘం జిల్లాధ్యక్షుడు పూజారప్ప, తాలూకాధ్యక్షుడు శివు, సభ్యులు గోపాల్, కృష్ణప్ప, వెంకటమణ తదితరులు పాల్గొన్నారు.

**బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే:** బెంగళూరు నగర విశ్వవిద్యాలయం ప్రసార విభాగాన్ని, విశ్వమానవ దినాచరణను విధానపరిషత్ సభ్యురాలు, సినీనటి డా.ఉమాశ్రీ, విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ.బి.రమేశ్, కర్ణాటక జానపద పరిషత్ అధ్యక్షుడు ప్రొ.పి.చి.బోరలింగయ్య, కువెంపు చిత్రపటానికి పూలు సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమవారం సెంట్రల్ విశ్వవిద్యాలయం ఆవరణలోని జ్ఞాన జ్యోతి సభాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శివమొగ్గ కువెంపు విశ్వవిద్యాలయం సీనియర్ అధ్యాపకుడు ప్రొ.జి.ప్రశాంతనాయక్, రిజిస్ట్రార్లు ఏ.నవీన్‌జోసెఫ్, ప్రొ.రమేశ్ బి.కుడేనట్టి తదితరులు పాల్గొన్నారు.

**చిత్రదుర్గ, న్యూస్‌టుడే:** జాతీయ కవి కువెంపు చాటి చెప్పిన విశ్వమానవ సందేశాన్ని అందరూ పాటించాలని, అతని అడుగుజాడల్లో నడవాలని జిల్లా సహాయక కమిషనర్ మహబూబ్ జిలాని ఖురేశి పేర్కొన్నారు. సోమవారం ఇక్కడ జిల్లా పాలనాధికారి కార్యాలయంలో కువెంపు జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళులు సమర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నగరాభివృద్ధి అధ్యక్షుడు తాజ్‌పీర్, కన్నడ సంస్కృతి శాఖ సహాయక డైరెక్టర్ డా గుర్నాథ్, అధ్యాపకులు హేమంతరాజ్, ఆయుష్ అధికారి చంద్రకాంత్, తహసీల్దార్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పావగడలో కువెంపు జయంతిని ఆచరిస్తున్న ప్రముఖులు

**చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే:** కన్నడ సాహిత్యాన్ని యువత వద్దకు తీసుకువెళ్లేందుకు కన్నడ సంఘాలు శ్రమించాలని సమాజసేవకుడు డాక్టర్ సదాశివ పిలుపునిచ్చారు. కువెంపు జయంతిని పురస్కరించుకున్ని చిక్కబళ్లాపురలో శివరామేగౌడ వర్గానికి చెందిన కన్నడ సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో సత్కారాన్ని అందుకుని మాట్లాడారు. వేదికె జిల్లా అధ్యక్షుడు జీకే లోకేశ్, ఇతర ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ, అశ్వత్థ నారాయణ తదితరులు

నివాళులు సమర్పించిన సహాయక కమిషనర్ మహబూబ్ జిలాని తదితరులు

సెంట్రల్ యూనివర్సిటీలో కువెంపు చిత్రపటానికి పూలు సమర్పిస్తున్న ఉమాశ్రీ, రమేశ్ తదితరులు

చిక్కబళ్లాపురలో కువెంపు విగ్రహం వద్ద కన్నడ సంఘాల ప్రతినిధులు

(c) eenadu

# బళ్లారి

● బళ్లారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

## శరవేగంగా విస్తరణ పనులు

ప్రహరీని తొలగిస్తున్న జేసీబీ

**రాయచూరు:** నగరంలో సోమవారం జేసీబీలు దుమ్ములేపాయి. నగర పాలక సంస్థ ఆమ్‌తలాబ్ ట్యాంకు బండ్(మావిన చెరువు) రహదారి విస్తరణ పనులను ప్రారంభించింది. గతంలో 20 అడుగుల వరకు విస్తరించారు. మరో 8 అడుగులు వెడల్పు చేయటానికే తొలగింపులు చేపట్టారు. ఇళ్ల పహరీలు, షెడ్లు, బంకులను జేసీబీలతో కూల్చేశారు. సంచార సమస్యను నివారించేందుకు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ వ్యవస్థ కల్పించిన తర్వాతే విస్తరించాలని వ్యాపారులు డిమాండు చేయడంతో కొంత సేపు గందరగోళం ఏర్పడింది. పోలీసులు సర్దిచెప్పి పంపారు.

## 31న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**రాయచూరు, న్యూస్‌టుడే:** జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ నెల 31న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సంక్షేమ శాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు రంగమందిరంలో ప్రారంభమవుతుందని చెప్పారు. జడ్పీ, మహిళా శిశు సంక్షేమ, యువ సబలీకరణ, కన్నడ, సంస్కృతి అధికారులు హాజరవుతారని వివరించారు.

## రైల్వే టికెట్ కౌంటర్ స్థలం మార్పు

**రాయచూరు, న్యూస్‌టుడే:** రాయచూరు రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో రిజర్వేషన్, సాధారణ టికెట్ కౌంటర్‌ను తాత్కాలికంగా మార్చారని రైల్వే సలహా సమితి సభ్యుడు ఎ.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31 నుంచి స్టేషన్ ప్రవేశ ద్వారానికి దగ్గర్లోని ఫుడ్‌ట్రాక్‌లో నెలకొల్పిన కేంద్రాల్లో టికెట్లు ఇస్తారని వివరించారు. స్థలం మార్పునకు సహకరించాలని ప్రయాణికులను కోరుతున్నారు. అమృత భారత్ పథకం కింద ఏడాది క్రితం పనులను మొదలు పెట్టారు.

## కువెంపు సేవలు నిరుపమానం

**రాయచూరు, న్యూస్‌టుడే:** తాలూకా కన్నడ సాహిత్య పరిషత్, కర్ణాటక రక్షణ వేదిక సంయుక్తంగా సోమవారం నగరంలోనిపారా వైద్య కళాశాలలో జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత కువెంపు జయంతిని నిర్వహించింది. చిత్రపటానికి ఎమ్మెల్సీ వసంత్‌కుమార్ పూజలు చేసి, ప్రముఖులతో కలిసి నివాళులు అర్పించారు. వసంతకుమార్ మాట్లాడుతూ జ్ఞానపీఠ్ పురస్కారాన్ని స్వీకరించిన కర్ణాటక తొలి కవి కువెంపుగా పేర్కొన్నారు. కన్నడ భాష, నేల, జలాలను రక్షించుకునేందుకు కన్నడిగులు పోరుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రాయచూరు రిపోర్టర్స్ గిల్డ్ అధ్యక్షుడు విజయకుమార్ జాగటకల్ ప్రసంగిస్తూ కన్నడ సాహిత్య రంగానికి కువెంపు అపారమైన, అనిర్వచనీయమైన సేవలందించారని కొనియాడారు. కరవే జిల్లా అధ్యక్షుడు అశోకకుమార్ జైన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కన్నడలోనే మాట్లాడాలని, కన్నడేతరులకు మన భాషను నేర్పించాలని కోరారు. తాలూకా కసాప అధ్యక్షుడు విజయ్, గౌరవ కార్యదర్శి రావుత రావ్ బరూరు, సంగమేష్ మంగా, ప్రతిభా గోనాళ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటానికి వసంత్ పూజలు

## సర్వాంగ సుందరంగా శ్రీవారి ఆలయం

ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు

**రాయచూరు, న్యూస్‌టుడే:** వైకుంఠ ఏకాదశికి నగరంలోని నవోదయనగర్ వెంకన్న ఆలయంలో సర్వం సిద్ధం చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బ్యారికేడ్లు నిర్మించారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా శ్రీనివాసుడు, భూదేవి, శ్రీదేవి ఉత్సవ మూర్తులను దర్శించుకోవచ్చు. తర్వాత మూలవిరాట్‌ను వీక్షించి తరిస్తారు. నవోదయ కళాశాలల, ఆలయ సమితి అధ్యక్షుడు సుంకి రాజేంద్ర రెడ్డి, ఆయన సతీమణి సుంకి స్వాతిరెడ్డి బ్రహ్మ ముహూర్తంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేస్తారు. మంగళవారం తెల్లవారు ఐదు గంటలకు ప్రారంభయ్యే దర్శనాలు రాత్రి 9 గంటల వరకు కొనసాగుతాయి. రంగురంగుల విద్యుత్తు దీపాల అలంకరణతో దేవస్థానం శోభాయమానంగా వెలుగొందుతోంది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కోవెల లోపల, వెలుపలా అదనపు భద్రతా సిబ్బందిని నియమించారు. కార్లు, ద్విచక్ర వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.

### వైకుంఠ ఏకాదశికి సిద్ధం

కళకళ్లాడుతున్న ఆలయం

### తిరుమల తరహాలో

సువిశాలమైన ప్రాంతంలో 15 ఏళ్ల క్రితం గుడిని నిర్మించారు. తిరుమల శ్రీనివాసుడికి నిర్వహిస్తున్న పూజా పద్ధతులు, విధానాలను కొనసాగిస్తున్నందున, శ్రావణ, కార్తిక మాసాల్లో శ్రీవారి అర్చకులతోనే పూజలు చేయిస్తున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున ఏడు కొండలవాడి వద్దకు వెళ్లలేని వారు ఇక్కడికే వస్తుండడంతో భక్తుల సంఖ్య రెట్టింపవుతోంది. స్వామి వారిని తిలకించాలంటే కనీసం రెండు గంటలు సమయం పడుతోంది.

### నిర్వహణ.. పరిశీలన

ఆలయ సమితి ఛైర్మన్ రాజేంద్రరెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ తాడిపత్రి శ్రీనివాస్ సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఎవరికీ ఇబ్బంది కల్గించొద్దని సెక్యూరిటీకి సూచించారు. 20వేల మందికి పైగా వస్తారని అంచనా వేశామని అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

వివరాలు తెలుపుతున్న స్వామీజీ

## జనవరి 12 నుంచి పాలుమత సమ్మేళనం

**రాయచూరు, న్యూస్‌టుడే:** దేవదుర్గ తాలూకా తింతిణి వంతెనకు దగ్గర్లోని కాగినెలె మహా సంస్థానం గురుపీఠంలో జనవరి 12 నుంచి 14 వరకు పాలుమత సాహిత్య సమ్మేళనం, పూజారులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గురుపీఠం స్వామీజీ సిద్ధరామానందపురి వెల్లడించారు. ఆయన సోమవారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. విద్వాంసులు, పరిశోధకుల ఉపన్యాసాలు మూడు రోజులు కొనసాగుతాయని తెలిపారు. బీసీ కమిషన్ మాజీ అధ్యక్షుడు ద్వారకానాథ్ 13న, కన్నడ ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తం 14న ప్రసంగిస్తారని వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారనే అంచనాతో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. శివరాత్రి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 15న సామూహిక వివాహాలు, 1108 దంపతులతో 1108 శివలింగాలకు పూజలు, రాత్రంతా సంగీత, నృత్య, నాటకాల ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

## ప్రభుత్వ బడులే ముద్దు.. పబ్లిక్ పాఠశాలలు వద్దు

**రాయచూరు, న్యూస్‌టుడే:** 'ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేసేందుకే కర్ణాటక పబ్లిక్ పాఠశాలలను తెరుస్తున్నారు. ఈ స్కూళ్ల స్థాపనను ఇచ్చిన ఆదేశాన్ని విరమించుకునే వరకు తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు, యువత కలిసికట్టుగా పోరాటం చేయాలని' ఏఐడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు హయ్యాళప్ప పిలుపునిచ్చారు. జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం రాయచూరు తాలూకా దేవసూగూరు క్రాస్ 1, యాదవ్ కాలనీ లోని సర్కారీ బడుల వద్ద విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేపట్టారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. హయ్యాళప్ప ప్రసంగిస్తూ ఈ పాఠశాలలను మూసివేసి 1.5 నుంచి 2.5 కిలోమీటర్ల దూరంలోని స్కూళ్లలో విలీనం చేస్తే, పేద పిల్లలు అంతదూరం వెళ్లలేక చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఒక విద్యార్థి ఉన్నా సరే పాత పాఠశాలలను కొనసాగిస్తామన్న విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప మాటల్లో కాక చేతల్లో చూపి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి బసవరాజ్, పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు హల్లప్ప, ఉపాధ్యక్షుడు బసనగౌడ, పూర్వ విద్యార్థుల సంఘటన అధ్యక్షుడు మంజునాథ్ హాజరయ్యారు.

దేవసూగూరు పాఠశాల వద్ద ప్రదర్శన

## మంత్రి లేక స్తంభించిన గిరిజన ప్రగతి

**రాయచూరు, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంత్రి వర్గాన్ని విస్తరిస్తే ఎస్టీ వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలకు అమాత్య పదవులు ఇవ్వాలని కల్యాణ కర్ణాటక వాల్మీకి నాయక్ సంఘం విభాగ కార్యదర్శి ఎన్.రఘువీరనాయక్ ఒత్తిడి తెచ్చారు. ఆయన సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 70 లక్షల జనాభా కల్గిన ఎస్టీ సామాజిక వర్గం నుంచి 14 మంది శాసనసభ్యులు ఉన్నా..మంత్రి మండలిలో తగిన ప్రాధాన్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఇద్దరికి, క్యాబినెట్ నుంచి తొలగింపునకు గురైన రాజణ్ణకు మంత్రి పదవులివ్వాలన్నారు. గిరిజనుల అభివృద్ధి ఆశించినంత జరగడం లేదు, నిధుల లేమితో వాల్మీకి భవనాల నిర్మాణం ఆగిపోయింది, వసతి నిలయాల్లో మౌలిక వసతులు కల్పించడం లేదని వాపోయారు. ప్రతి తాలూకాలో రెండు ఏకలవ్య పాఠశాలలు స్థాపించాలని, ప్రస్తుతం జిల్లాలో రెండే ఉండటం శోచనీయమన్నారు. సమావేశంలో ప్రతినిధులు మల్లికార్జున, రమేశ్, రాము, నరేంద్ర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రఘువీర

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్

## గ్రామీణాభివృద్ధికి శాయశక్తులా కృషి

**మాన్వి, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని రాయచూరు గ్రామీణ శాసనసభ్యుడు బసనగౌడ దద్దల్ పేర్కొన్నారు. తాలూకాలోని కురిడి, గోర్కల్, అరోలి తదితర గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, సామూహిక వివాహాలు, ద్యావమ్మ దేవి జాతర ఏర్పాట్లలో పాల్గొని మాట్లాడారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత పల్లెల్లో కనీస సదుపాయాలు కల్పించానన్నారు. రూ.25లక్షలతో నిర్మిస్తున్న కనక సముదాయ భవనం స్థానికుల అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. 5ఏళ్ల తర్వాత ద్యావమ్మ దేవి జాతర నిర్వహిస్తున్నామని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రూ.కోటితో దేవస్థాన రహదారి నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ భీమరాయ రామసంద్ర, తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి ఖాలీద్ అహ్మద్, జెస్కాం శాఖ ఏఈఈ వైద్యనాథ్‌స్వామి, తాలూకా వైద్యాధికారి డాక్టర్ శరణబసవరాజ్, గ్రామ పంచాయతీల అధ్యక్షులు, సభ్యులు, స్థానిక ప్రముఖులు ఉన్నారు.

## సింధనూరు ప్రీమియర్ లీగ్ విజేత అగ్రి టైటాన్స్

**సింధనూరు, న్యూస్‌టుడే:** సింధనూరు ఎఫ్ఆర్‌సీఎస్ మైదానంలో రెండు రోజులపాటు ఉత్సాహంగా సాగిన సింధనూరు అగ్రి క్రికెట్ ప్రీమియర్ లీగ్-2025 పోటీలో అగ్రి టైటాన్స్ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన అంతిమ పోరులో టైటాన్స్ జట్టు అన్‌బీటబుల్ జట్టుపై విజయం సాధించింది. సింధనూరు తాలూకాలోని ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు, వివిధ ఎరువుల ఉత్పత్తి సంస్థల ఉద్యోగులు ఆటగాళ్లుగా ఈ లీగ్ జరిగింది. సింధనూరు తాలూకా అగ్రి స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సంఘం ఆధ్వర్యంలో ఈ టోర్నమెంటు ఏర్పాటు కాగా మొత్తం ఆరు జట్లు తలపడ్డాయి. ఆల్ రౌండ్ ప్రతిభ చాటిన గూడపాటి రమేశ్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచి బహుమతిని అందుకున్నారు.

**తుంగభద్ర జలాశయం నీటిమట్టం**

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

| 29-12-2025 (ఉ॥ 8 గంటలకు) | ప్రస్తుతం | గత సంవత్సరం |
|---|---|---|
| నీటిమట్టం (అడుగుల్లో) | 1610.76 | 1627.01 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 000 | 590 |
| అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 9,018 | 8,927 |
| నీటి నిల్వ (టి.ఎం.సి) | 39.090 | 83.249 |

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

## సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి బోసురాజు

**మాన్వి, న్యూస్‌టుడే:** ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర చిన్ననీటి శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. ఆయన స్థానిక ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌తో కలిసి సిరివారలో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సిరివార కేంద్రంగా మినీ విధానసౌధ, తాలూకా క్రీడాప్రాంగణం, అగ్నిమాపక ఠాణా, వెనుకబడిన తరగతులకు మెట్రిక్ అనంతర వసతి నిలయం, వాల్మీకి భవనం, హైటెక్ గ్రంథాలయం, ముఖ్య రహదారి నిర్మాణ పనులకు ఏకకాలంలో శంకుస్థాపన చేశామని వీటిని అంతే వేగంగా పూర్తి చేసి తాలూకా ప్రజలకు అంకితం ఇస్తామన్నారు. వీటి నిర్మాణాలకు రూ. 34 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరోపక్క అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, ప్రముఖులు ఎన్.గిరిజాశంకర్, శరణయ్య గుడదిన్ని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళలకు ప్రత్యేక రక్షణ

ద్విచక్రవాహనంపై మహిళా పోలీసుల గస్తీ

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే:** కొత్త ఏడాది ఆగమన వేళ.. ఎంజీ రోడ్డు, చర్చి వీధి, బ్రిగేడ్ రోడ్డు పరిసరాల్లో కనీసం మూడు లక్షల మంది యువతరం ప్రతినిధులు గుమికూడుతారని నిఘా వర్గాలు అంచనాకు వచ్చాయి. ఈ సమాచారం నేపథ్యంలోనే భద్రతకు ప్రత్యేక బలగాలు ముందస్తు కాపలా ప్రారంభించినట్లు నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ వెల్లడించారు. ఆయన బెంగళూరులో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఆరోజు రాత్రి 10 గంటలకు మెట్రో సంచారాన్ని బంద్ చేస్తామని, వేడుకలు ముగిసిన తరువాత.. అర్ధరాత్రి ఈ సేవలు పునరుద్ధరించనున్నట్లు వివరించారు. బ్రిగేడ్, ఎంజీ రోడ్డుతో పాటు.. కోరమంగల, ఇందిరానగర, వైట్‌ఫీల్డ్, నీలాద్రి రహదారి, ఎలక్ట్రానిక్ సిటీలో ఎక్కువ సంఖ్యలో మహిళా పోలీసులను వినియోగిస్తామన్నారు. ఎంజీ రోడ్డు చుట్టు పక్కల 250 పైగా సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తామన్నారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మఫ్టీ పోలీసుల కాపలా, ప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది, బాంబుల నియంత్రణ దళం అందుబాటులో ఉండనున్నట్లు చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని సహించబోమన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లు, హోటళ్లపై నిఘా పెంచామన్నారు. వేడుకలు శాంతియుతంగా కొనసాగడానికి అందరూ సహకరించాలని కోరారు.

## కాంగ్రెస్ నేతకు కటకటాలు

దావణగెరెలో స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలు, నగదు

**దావణగెరె, న్యూస్‌టుడే:** మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న ఆరోపణలపై దావణగెరెకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎస్‌జీ వేదమూర్తి (53), రాజస్థాన్‌కు చెందిన రామ్ స్వరూప్ (33), ధోలారామ్ (36), దేవ్ కిషన్ (35)లను అరెస్టు చేశామని ఎస్పీ ఉమా ప్రశాంత్ తెలిపారు. డిసెంబరు 22న అన్వర్ పాషా, పారస్, కృష్ణమూర్తి, ధోని అలియాస్ మజునాథ్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 290 గ్రాముల మాదక ద్రవ్యాలను జప్తు చేసుకున్నారు. నిందితుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా తాజాగా వీరిని అరెస్టు చేశామని సోమవారం ఇక్కడ నిర్వహించిన సమాచారంలో ఆమె వివరించారు. మొదట అరెస్టయిన వారి నుంచి వీరు మాదక ద్రవ్యాలు కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు విక్రయించుకోవడంతో పాటు, వాటిని వినియోగించేవారని తెలిపారు. ఈ కేసులో కాంగ్రెస్ నేత ఉన్న విషయమై మంత్రి భైరతి సురేశ్ స్పందిస్తూ నేరం చేస్తే ఎవరినైనా పోలీసులు అరెస్టు చేస్తారని పేర్కొన్నారు.

## రాజాజీనగర్.. సైకిల్ రాజా!

దారిలో సైక్లిస్టులతో మాట్లాడుతున్న సురేశ్‌కుమార్

**బెంగళూరు (గ్రామీణ), న్యూస్‌టుడే:** రాజాజీనగర ఎమ్మెల్యే, న్యాయశాఖ మాజీ మంత్రి ఎస్.సురేశ్‌కుమార్ (70) నిత్యం సైకిల్‌పై పది కిలోమీటర్లకుపైగా తిరిగి రావడం అలవాటు. వారాంతం.. శనివారమైతే వంద కిలోమీటర్లకు తగ్గేదే లేదు. 'రాజాజీనగర పెడల్ పవర్' పేరిట ఆయన బృందంలో 50 మమంది సభ్యులు ఉన్నారు. క్రిస్మస్ సమయంలో బెంగళూరు నుంచి కన్యాకుమారికి 702 కి.మీ. ప్రయాణించి ఆదివారం నాడు గమ్యాన్ని చేరుకున్నారు. వివేకానంద స్మారకం వద్దకు వెళ్లి తన చిరకాల వాంఛను నెరవేర్చుకున్నారు. స్మారకాన్ని నిర్మిస్తున్న సమయంలో 51 ఏళ్ల కిందట (1954)లోనూ తన స్నేహితుడు, హిరియూరుకు చెందిన వెంకటేశ్ తన్యాసి గౌండర్, రాజాజీనగర నివాసి సోమనాథ్‌లతో సైకిల్‌పై నాలుగు రోజులు ప్రయాణించి వివేకా రాక్ వద్దకు వెళ్లి వచ్చారు. గత నవంబరు 11న ఆయన 70వ ఏడాదిలోకి అడుగు పెట్టారు. తన పుట్టిన రోజును మరపురానిదిగా చేసుకునేందుకు మరోసారి కన్యాకుమారి యాత్రకు వెళ్లానని ఆయన చెప్పారు. వివేకా రాక్ నుంచి సూర్యోదయం, సూర్యాస్తమయం చూడడం చక్కని అనుభూతి అని ఆయన పేర్కొన్నారు.

పురపాలక సంఘం ముఖ్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న పట్టణ మహిళలు

## హక్కు పత్రాలివ్వకుంటే రాస్తారోకో చేపడతాం

**మాన్వి, న్యూస్‌టుడే:** పట్టణంలోని సర్వే నంబర్ 631, 54, 81/అ, 17 ఎకరాల మేర ప్రభుత్వ భూములున్నాయని, కొన్ని సర్వేనంబర్లు రాష్ట్ర గవర్నర్ పేరున ఉన్నాయని వీటిని ఇళ్లులేని పేదలకు కేటాయించాలని కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ సమితి అసంఘటిత కార్మిక విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి.బాబా డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన మహిళలు పురపాలక సంఘం ముఖ్యాధికారి పరశురామ్ దేవమానేను కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ భూముల్లో ఉంటున్న ప్రజలకు ఇంటి స్థలాలను కేటాయించి, హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెల రోజుల లోపు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఇళ్లులేని పేదలతో బసవ కూడలి వద్ద రాస్తారోకో చేపడతామని ఆయన తెలిపారు.

యక్షగాన ప్రదర్శనతో ఉర్రూతలూగించిన విద్యార్థులు

## మురిపించిన యక్షగాన ప్రదర్శన

**బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే :** నాగరబావిలోని ప్రముఖ విద్యాసంస్థ 'ఆక్స్‌ఫర్డ్'లో సాంస్కృతిక వేడుకలు సోమవారం ఉదయం నుంచి పెద్దఎత్తున నిర్వహించారు. విద్యాలయ వార్షికోత్సవాలు సెంట్రల్ కళాశాల పరిధి 'జ్ఞానజ్యోతి సభాభవనం'లో ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా బెంగళూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బి.రమేశ్, ముఖ్య అతిథులుగా కాంబోడియా దేశ విద్యావేత్త కార్తీక్ థల్లం, రాజరాజేశ్వరి వైద్య కళాశాల నేత్ర వైద్యనిపుణుడు డాక్టర్ బి.ఆర్.ప్రకృత్ పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేకించి యక్షగాన ప్రదర్శన ఆబాల గోపాలాన్నీ మురిపించింది.

వేయించిన వేరుసెనక్కాయల బండిపై విక్రేత ఉంచిన గణపతి విగ్రహం

వేరుసెనక్కాయలు, గింజల అలంకరణలో కాడు మల్లేశ్వరుడు

## చిత్రమైన వేరుసెనగ!

### మాణి వృత్తాంతగళు ప్రదర్శన

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే :** కాడు మల్లేశ్వరం ఆలయ వీధిలో ప్రతి ఏటా వేరుసెనగ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఈ జాతరకు సంబంధించిన చిత్రాలను ప్రముఖ ఛాయాచిత్రగ్రాహకుడు కందవార వెంకటేశ్ తన కెమెరాతో బంధించారు. అందులో నుంచి ఎంపిక చేసిన 50 చిత్రాలను బెంగళూరులోని ప్రభుత్వ చిత్రకళా పరిషత్‌లో ప్రదర్శనకు ఉంచారు. ముఖ్యమంత్రికి మాధ్యమ సలహాదారుడు కేవీ ప్రభాకర్, కాడు మల్లేశ్వర గెళయర బళగ అధ్యక్షుడు, విశ్రాంత పోలీసు అధికారి బీకే శివరాం ఈ ప్రదర్శనను సంయుక్తంగా ప్రారంభించారు. మన దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రలో వేరుసెనగ సాగు ఎక్కువ. పంట సాగుకు 1400-1533 మధ్య బీజం పడిందనేది చరిత్ర. మాణి (స్పానిష్), అమేండోయిం (పోర్చుగీస్), పిస్తాశె దె తెర్కె (ఫ్రెంచ్)తో పాటు ఆయా ప్రాంతాల్లో దీన్ని ఎర్త్ నట్, మంకీనట్, గోబర్, షిప్ నట్, మనీలానట్ అని వ్యవహరిస్తారు. భారత్‌లో 1500వ సంవత్సరంలో దీని సాగు ప్రారంభం కాగా.. మైసూరు, మలబార్, దక్షిణ కన్నడ జిల్లాల్లోని పసుపు తోటల్లో అంతర్ పంటగానూ సాగు చేసేవారు. సుంకేనహళ్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో వేరుసెనగ సాగును ఒక ఎద్దు వచ్చి నాశనం చేసి వెళ్లేదని, అలా చేయవద్దని స్థానిక రైతులు ప్రార్థనల అనంతరం అది ఒక బెట్టపైకి వెళ్లి శిలలా మారిందని భక్తులు విశ్వసిస్తుంటారు. నేటి బసవనగుడిలో ఏటా వేరుసెనగ జాతరను నిర్వహించడానికి ఈ కథే ఊతమిస్తోంది. అనంతర కాలంలో మల్లేశ్వర ఆలయం వీధిలోనూ ఈ జాతరను ప్రారంభించారు. ఒక గింజ నుంచి మూడు, నాలుగు గింజల వేరుసెనక్కాయలను జాతరలో విక్రయించుకునేందుకు రైతులు వస్తుంటారు. తరం మారినా, నేటి తరం యువత పెద్ద సంఖ్యలో నగర జాతరల్లో పాల్గొంటున్నారు. ఈ చిత్ర ప్రదర్శన బుధవారం రాత్రి ఏడు గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు వెల్లడించారు.

## ముగిసిన ర్యాపిడ్ చెస్ టోర్నమెంటు

**సింధనూరు, న్యూస్‌టుడే:** సింధనూరు ఆనంద్ పబ్లిక్ స్కూలులో ఆదివారం ఉదయం నుంచి రాత్రి బాగా పొద్దుపోయేదాకా ఏడు రౌండ్లుగా సాగిన ర్యాపిడ్ చెస్ టోర్నమెంటు ఘనంగా ముగిసింది. స్థానిక సుభద్ర అకాడమీ నిర్వహించిన ఈ టోర్నమెంటులో పాల్గొనేందుకు కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి 290 మంది ఆటగాళ్లు ఉత్సాహం కనబర్చారు. ఓపెన్ పోటీలు, అండర్ 1600 రేటింగ్‌తో పాటూ వివిధ వయసు కేటగిరీల్లో నిర్వాహకులు పోటీలు జరిపారు. అకాడమీ సోమవారం విజేతల వివరాలను వెల్లడించింది. వివిధ కేటగిరీల్లో ఆడి విజేతలుగా నిలిచిన అమ్మాయిలు, అబ్బాయిలు షీల్డులు, నగదు బహుమతులు అందుకొని ఆనందాన్ని చాటారు. ఓపెన్ మెయిన్ కేటగిరిలో బళ్లారికి చెందిన భోగవ వేదాంతరెడ్డి విజేతగా నిలిచారు. ఇక వయసుల వారీ పోటీల్లో అండర్-10 అబ్బాయిల్లో విగ్నేశ్‌రెడ్డి, అమ్మాయిల్లో సునందిని విజేతలయ్యారు. అండర్-14 అబ్బాయిల్లో అనీశ్ మోరే, అమ్మాయిల్లో చింతన విజేతలు. అండర్-18 అబ్బాయిల్లో చక్రి రాజలబండి విజేత కాగా అమ్మాయిల్లో సింధనూరు గాంధీనగర్‌కు చెందిన జి.హాసిని విజేతగా షీల్డు అందుకుంది.

జ్ఞాపికలు, నగదు బహుమతులు అందుకుని ఆనందాన్ని చాటుతున్న విజేతలు

## శిథిల జీవనం.. భవిత వికలం

శిథిలాల నడుమే తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్న నిర్వాసితులు

వ్యర్థాల నిర్వహణకు కేటాయించిన రెండెకరాల భూమిలో ఫకీర్ లేఅవుట్, వసీం లేఅవుట్ల పేరిట నెలకొల్పిన అక్రమ నిర్మాణాలను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార తొలగించాక.. అక్కడి పేదల బతుకు దయనీయంగా మారింది. గత మూడు దశాబ్దాలుగా తాము ఇక్కడే ఉంటున్నామని, బలవంతంగా పంపించేందుకు ప్రయత్నించడం సరికాదని 200కు పైగా కుటుంబాలు వాదిస్తూ వచ్చాయి. న్యాయస్థానం ఆదేశాలతో గత వారం ఆ నిర్మాణాలను అధికారులు కుప్పకూల్చారు. ఆ శిథిలాల నడుమే, తాత్కాలికంగా గుడారాలు వేసుకుని ఆ కుటుంబాలు ఉంటున్నాయి. ఆ లేఅవుట్లలో నేటి తాజా పరిస్థితికి ఈ చిత్రాలు అద్దం పడుతున్నాయి.

-న్యూస్‌టుడే, బెంగళూరు గ్రామీణం

క్యారంబోర్డు ఆడుతున్న బాలలు, పక్కనే మంచంపై పడుకుని నిద్రలో జారిన కార్మికుడు

(c) eenadu

ఈనాడు ఒడిశా

మంగళవారం డిసెంబరు 30, 2025



## ముందు విన్నపం... తర్వాత విధ్వంసం

### కేంద్రపడలో రెండు దుకాణాలను కూల్చేసిన మహిళలు

దుకాణాన్ని తొలగిస్తున్న మహిళలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న మద్యం దుకాణాలను తొలగించాలని పలుమార్లు అధికారులను వేడుకున్నా చర్యలు తీసుకోకపోవడంతో అతివలంతా ఒక్కటై వాటిని కూల్చివేశారు. కేంద్రపడ జిల్లాలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. రాజ్‌కనిక పోలీసుస్టేషన్ పరిధి మదపొడ, బొండియా గ్రామాల్లో అక్రమంగా నడుపుతున్న రెండు మద్యం దుకాణాలతో స్థానిక మహిళలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికితోడు ఇంటి యజమానులు సంపాదనంతా మద్యానికి తగలేస్తుండటాన్ని వీరు జీర్ణించుకోలేకపోయారు. దీంతో వీటిని కూల్చేయాలని నిర్ణయించుకున్న మహిళలంతా రోడ్డుపైకి వచ్చారు. వీరి రాకను గమనించిన దుకాణాల సిబ్బంది అక్కడ నుంచి పరారయ్యారు. తమవెంట తెచ్చుకున్న గడ్డపార, ఇతరత్రా సామగ్రితో దుకాణాలను కూల్చేసి, అందులో ఉన్న సరకును ధ్వంసం చేశారు. ఇకపై మద్యం దుకాణాలను తెరిచేందుకు ఎవరూ సాహసించరాదని ఇలా చేశామన్నారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మహిళలను శాంతింపజేశారు. దీనిపై రాజ్‌కనిక ఐఐసీ సంజయ్‌కుమార్ మల్లిక్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో అక్రమంగా మద్యం దుకాణాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతానికి వీరు పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు వెనుదిరిగారు.

## కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య

భువనేశ్వర్, న్యూస్‌టుడే: చుట్టూ అడవి.. ఎముకలు కొరికే చలి.. అయినా ఆ అయిదేళ్ల బాలుడు చలనం లేని తల్లిదండ్రుల వద్ద రాత్రంతా కాపలా ఉన్నాడు. దేవ్‌గఢ్ జిల్లా రియామాల్ సమితిలోని జయంతాపలికి చెందిన దుష్మంతమాఝి, రింకిమాఝి దంపతులు. కుండెయిగొలా ఠాణా పోలీసులు సోమవారం విలేకర్లకు తెలిపిన వివరాల మేరకు... శనివారం దంపతుల కుమారుడు గౌరవ్ మాఝి(5)తో కలిసి దగ్గరలోని అత్తవారి గ్రామం ఝురాబొరొణికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. ఆదివారం సాయంత్రం చీకటి పడిన తర్వాత స్వగ్రామం (జయంతాపవి) వస్తూ గొడవ పడ్డారు. ఊరు శివారులోని ఒక అడవి వద్ద బైకు ఆపి ముగ్గురూ ఆగారు. దంపతులు పురుగు మందు తాగి పిల్లాడికి కూడా ఇచ్చారు. అదృష్టవశాత్తూ బాలుడు దానిని ఉమ్మేశాడు. తల్లిదండ్రులు కింద పడిపోవడంతో బాలుడు చలిగాలిలో రాత్రంతా వారి వద్ద కాపలా ఉన్నాడు. ఆదివారం ఉదయం అడవి దారిన రోడ్డుపైకి వచ్చిన పిల్లాడు ఆ మార్గంలో వస్తున్న లారీని ఆపి సాయం అర్థించాడు. విషయం దుష్మంత రక్త సంబంధీకులు, గ్రామస్థులంతా తెలుసుకొని అక్కడికి వచ్చి వారిద్దరినీ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికే రింకి మృతి చెందింది. ఆదివారం రాత్రి దుష్మంత మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలుడు నోటికి పురుగుమందు తగిలినందున కటక్ ఎస్సీబీ ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం బాలుడ్ని కటక్ శిశుభవన్‌కి తరలించారు. పూర్తిగా కోలుకున్నా అనాథగా మిగిలాడు.

## జాతీయ బ్యాడ్మింటన్‌లో తన్వికి రజతం

బహుమతి, రజత పతకంతో తన్వి పత్రి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: విజయవాడ (ఆంధ్రప్రదేశ్)లోని చెన్నుపతి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి తన్వి పత్రి రన్నర్‌గా నిలిచింది. టోర్నీలో ఆదివారం నిర్వహించిన మహిళా సింగిల్స్ కేటగిరీలో ఫైనల్ మ్యాచులో తన్వి 21-17, 12-21, 14-21 సెట్లతో సూర్య కరిష్మా తిమిరితో ఆడి ఓటమిపాలై ద్వితీయ స్థానం దక్కించుకుని రజత పతకం కైవసం చేసుకుంది. రాష్ట్ర క్రీడా శాఖ ఆ వివరాలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేసి ఆమెకు అభినందనలు తెలిపింది.

## సందర్శకులతో కొరాపుట్ జిల్లా కిటకిట

జలపాతాల వద్ద పర్యాటకులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని మరింత ఆనందంగా, ప్రత్యేక ప్రాంతంలో నిర్వహించుకోవాలన్నది ఎక్కువమంది అభిలాష. అలాంటివారికి ఇప్పుడు కొరాపుట్ జిల్లా వేదికైంది. పర్యాటక రంగంలో విశేషంగా ఆకట్టుకుంటున్న కొరాపుట్ జిల్లా గత వారం రోజులుగా పర్యాటకులతో కిటకిటలాడుతూ రద్దీగా మారింది. క్రిస్మస్ సెలవులు, కొత్త సంవత్సరాన్ని వినూత్నంగా జరుపుకోవడానికి ఆసక్తి చూపుతూ జిల్లాకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు అధికంగా తరలివస్తున్నారు. జలపాతాలు, పర్వతాలు, పచ్చని పరిసరాలు, అందమైన మంచు ప్రాంతాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి.

### పర్యాటకుల రాకతో పెరిగిన ఆదాయం

సిమిలిగుడ, కొరాపుట్, జయపురం వంటి ముఖ్య పట్టణాల్లో జనవరి 10 వరకు లాడ్జీలు, హోటళ్లు అన్నీ నిండి పోయాయి. ప్రభుత్వ అతిథి భవనాలు, పంత్ నివాస్‌ల్లోనూ ఇదే పరిస్థితి. దేవ్‌మాలి పర్వతం, తోలోమాలి, దుదుమా జలపాతానికి ఎక్కువమంది రావడం విశేషం. పర్యాటక కేంద్రాల వల్ల హోటళ్లు, లాడ్జీలు, వాహనాలకు కాసుల పంట పండుతోంది. అద్దె వాహనాలు సైతం దొరకడం కష్టంగా ఉంది. తొలిసారిగా దేవ్‌మాలి పర్వతంపై జిల్లా యంత్రాంగం రాత్రివేళలో బస చేయడానికి వీలు కల్పించడంతో రాత్రివేళలో కూడా పర్వతంపై సందడి నెలకొంటోంది. కొంతమంది పర్యాటకులు స్వయంగా వంటలు చేసుకోవడం, ఆనందంగా గడపడం, కేరింతలు, జలక్రీడలు, నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంటుంది. వాతావరణానికి అనుకూలంగా నైట్ ఫైర్ క్యాంప్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే పర్యాటకపరంగా కొరాపుట్ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే సదుపాయాలు అంతంత మాత్రం కాగా ఇంకా అభివృద్ధి చెందితే పర్యటకులు రెట్టింపు సంఖ్యలో వచ్చే అవకాశాలున్నాయి.

దేవ్‌మాలి పర్వతంపై ఏర్పడిన రద్దీ

## టాటాపవర్ కార్యాలయం ఘెరావ్

### పోలీసులతో కాంగ్రెస్ నేతల ఘర్షణ

కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నేతలు

పార్టీ నేతలు, పోలీసులు తోపులాట

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ ప్రధాన కార్యాలయాన్ని కాంగ్రెస్ నేతలు సోమవారం ఘెరావ్ చేశారు. ప్రధాన ద్వారానికి తాళం వేసే ప్రయత్నం చేశారు. దీనిని అడ్డుకున్న పోలీసులతో ఘర్షణకు దిగారు. పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్‌దాస్, కాంగ్రెస్ సభాపక్షం (సీఎల్పీ) నేత రామచంద్రకడం, ఇతర నాయకులు పార్టీ కార్యాలయం టాటాపవర్ ఆఫీస్ వరకు ర్యాలీగా వచ్చారు. ఇక్కడ బైఠాయించిన వారంతా స్మార్ట్ మీటర్ల పేరిట వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న ఛార్జీలకు స్వస్తి పలకాలని, 300 యూనిట్ల వరకు వినియోగదారులకు ఉచిత విద్యుత్తు, ఛార్జీల నుంచి అన్నదాతలకు పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు తీసుకోని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు ఉద్యమిస్తారని భక్తచరణ్ హెచ్చరించారు. తర్వాత జరిగిన ఘెరావ్‌ను అడ్డుకున్న పోలీసులు నేతలు, కార్యకర్తల్ని వాహనాల్లోకి ఎక్కించి దూరంగా తరలించారు.

## టీపీఎస్ఓడీఎల్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆందోళన

ప్రసంగిస్తున్న త్రినాథ బెహర. చిత్రంలో డీసీసీ (తూర్పు) అధ్యక్షుడు రశ్మిరంజన్ పట్నాయక్, ఇతర నాయకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దక్షిణ ఒడిశా జిల్లాల్లో విద్యుత్తు సరఫరా బాధ్యతలు నిర్వహిస్తున్న 'టాటా పవర్ సదరన్ ఒడిశా డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్' (టీపీఎస్ఓడీఎల్) ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గంజాం జిల్లా కాంగ్రెస్ కమిటీ, తూర్పు (డీసీసీ, ఈస్ట్) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక టీపీఎస్ఓడీఎల్ ప్రధాన కార్యాలయం బయట ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. డీసీసీ (తూర్పు) అధ్యక్షుడు రశ్మిరంజన్ పట్నాయక్ నాయకత్వంలో జరిగిన ఇందులో గోపాల్‌పూర్ మాజీ ఎమ్మెల్యే త్రినాథ బెహర, నేతలు భొకాళి సెఠి, బృందావన ఖొటెయి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు బనజా పండా తదితరులు పాల్గొన్నారు. విద్యుత్తు సరఫరా సంస్థ వినియోగదారులకు వేధింపులకు గురి చేస్తోందని వారు దుయ్యబట్టారు. ఆ సంస్థ వినియోగదారుల నుంచి అక్రమంగా అదనపు భద్రతా డిపాజిట్ (ఏఎస్‌డీ) వసూలు చేస్తోందని, దీన్ని చెల్లించబోమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

## కట్టిపడేసిన కృష్ణలీలల ప్రదర్శన

బరగఢ్, న్యూస్‌టుడే: ప్రపంచంలోనే అతిపెద్ద ఓపెన్ ఎయిర్ థియేటర్‌గా పేరుగాంచిన బరగఢ్ ధనుయాత్ర ఉత్సవం ఘనంగా జరుగుతోంది. మధుర నగరంగా మారిన బరగఢ్ వీధుల్లో కృష్ణలీలల ప్రదర్శనలు భక్తులను కట్టిపడేశాయి. కృష్ణుడు బాల్యంలో చేసిన లీలలు, అసుర సంహార ఘట్టాలు, కంస దర్పానికి ఎదురుదెబ్బలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కృష్ణుడి బాల్య లీలలు, పోతన, శకటాసుర వధ ఘట్టాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాల మేళవింపుతో కళాకారులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. వేలాదిగా వచ్చిన భక్తులు, పర్యాటకులతో బరగఢ్ పట్టణం కిక్కిరిసిపోయింది. ధనుయాత్ర ఉత్సవం ఒడిశా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు.

ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

కంస పాత్రధారి అభినయం

## దుబాయ్‌కి నవరంగపూర్ కూరగాయలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఇప్పటివరకు పొరుగు జిల్లాలకు, రాష్ట్రాలకు నవరంగపూర్ కూరగాయలు ఎగుమతి అయ్యాయి. కానీ మొట్టమొదటిసారిగా జిల్లాకు చెందిన ఐదుగురు రైతులు తాము పండించిన కూరగాయలు దుబాయ్‌కు పంపారు. ఉమ్మర్‌కోట్ సమితి బడకుమారి గ్రామానికి చెందిన సుజిత్‌దాస్, సత్యజిత్ దాస్, సంజయ్‌రాయ్, పింటు సర్కార్, రాయ్‌ఘర్ సమితి సర్గులి గ్రామానికి చెందిన బిజయ్‌హల్దార్‌లు వెయ్యి కిలోల కూరగాయలు విక్రయించినట్లు సమాచారం. ఇందులో 200 కిలోల దొండకాయలు, 160 కిలోల చిన్న బంగాళాదుంపలు, 160 కిలోల పొటల్స్, 200 కిలోల వెల్లుల్లి, 160 కిలోల బీన్స్, 120 కిలోల బొప్పాయిలు ప్యాకింగ్ చేసి భువనేశ్వర్‌కు పంపి, అక్కడ నుంచి కార్గో విమానంలో దుబాయ్‌కు పంపించినట్లు ఉద్యానాధికారి సుబేంధు త్రిపాఠి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యానశాఖ గేట్ ఫౌండేషన్ సహాయంతో రైతుల ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించే బాధ్యతను ఎగ్రి బిజినెస్ స్టార్టప్ విల్లా మార్ట్ ప్రైవేటు లిమిటెడ్‌కు అప్పగించింది. ఈ ఏడాది జిల్లాలో 6,000 హెక్టార్ల భూమిలో కూరగాయలు పండించినట్లు, విక్రయాలు బాగా జరిగితే ఇకపై క్రమం తప్పకుండా విదేశాలకు ఎగుమతి చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## సునాబెడలో చిరుత సంచారం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: నువాపడ జిల్లా సునాబెడలో చిరుత సంచారం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. దీనికి సంబంధించి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కొందరు వ్యక్తులు చిరుత కదలికలను గుర్తించి వీడియో పోస్టు చేశారు. గరియాబంధ్ జిల్లా మెయిన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి డియద్ గ్రామానికి చెందిన వీరు కారులో సునాబెడ వస్తుండగా చూశారు. నువాపడ జిల్లా కొమ్నా సమితి మీదుగా వెళ్లే సునాబెడ-దతునామా రహదారిలో చిరుత సంచరిస్తుండటాన్ని ఛత్తీస్‌గఢ్ వాసులు గుర్తించారు. కారు సాయంత్రం 7.30 గంటల సమయంలో అంబొనల్లా ప్రాంతం సమీపాన చేరుకునే క్రమంలో రహదారిని దాటుతూ చిరుత కనిపించింది. కారు హెడ్‌లైట్ పడేసరికి చిరుత అక్కడే ఆగి 10 నిమిషాల పాటు సంచరించినట్లు తెలిపారు. ఈ విషయమై సునాబెడ వన్యప్రాణుల డివిజన్ ఏసీఎఫ్ సంజీవ్ బొనగోల మాట్లాడుతూ అభయారణ్యంలో చిరుతల సంఖ్య పెరిగిందన్నారు. కదలికలపై నిఘా పెట్టాల్సిందిగా అటవీ సిబ్బందికి దిశానిర్దేశం చేశామన్నారు.

## పిలిస్తే పలికే తల్లి.. నారాయణి

మా నారాయణి తల్లికి పూజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని సుప్రసిద్ధ శక్తిపీఠాల్లో 'మా నారాయణి' ఒకటి. జిల్లాలోని కళ్లికోటకు 20 కి.మీ. దూరంలో 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి నాలుగు కి.మీ. లోపల కొండపై తల్లి కొలువైంది. ప్రముఖ తాంత్రిక పీఠంగా ఖ్యాతిగాంచిన ఇక్కడ భక్తితో తల్లిని పిలిస్తే పలుకుతుందని భక్తుల నమ్మకం. దీంతో ఒడిశాతోపాటు రాష్ట్రేతర ప్రాంతాల నుంచి భక్తులు మా నారాయణి దర్శనానికి వస్తుంటారు. ప్రస్తుతం ఇక్కడ నిత్యం వన భోజనాలతో సందడి నెలకొంది.

### ఎదురెదురుగా కొలువైన అమ్మవారు.. శివయ్య

శక్తిపీఠంలో కొలువైన నారాయణి మందిరంలోనే ఎదురుగా మహాదేవుని మందిరముంది. తొలుత భక్తులు శివయ్యను దర్శించుకుని తర్వాత నారాయణిని పూజిస్తారు. అనంతరం అదే ఆవరణలోని పార్వతీదేవి మందిరాన్ని దర్శించుకుంటారు. ఈ శక్తిపీఠం సుమారు ఆరు శతాబ్దాల పురాతనమైందని మందిరం ప్రధాన అర్చకుడు తూఫాన్ చంద్ర శత్పథి విలేకరులకు చెప్పారు. అప్పట్లో కళ్లికోట ప్రాంతాన్ని పాలించే రాజవంశీయులు దీన్ని అభివృద్ధి చేశారని ఆయన తెలిపారు. శక్తిపీఠంలో నిత్యపూజలతోపాటు ప్రతి సంక్రమణం రోజున విశేష పూజలు నిర్వహిస్తామని శత్పథి పేర్కొన్నారు.

శివయ్య మందిరం

### ప్రకృతి అందాలకు నిలయం

జాతీయ రహదారి నుంచి శక్తిపీఠం వరకూ పక్కా రహదారి సౌకర్యముంది. రహదారికి ఇరువైపులా ఎత్తయిన చెట్లు.. దట్టమైన అడవుల మధ్య కొండపై కొలువైన ఈ ప్రాంతం ప్రకృతి అందాలకు నిలయం. ఇక్కడ బ్రహ్మపుర అటవీ డివిజన్ ఆధ్వర్యంలో ఎకో పార్కు కూడా నిర్మాణమైంది. శక్తిపీఠానికి వన భోజనాలకు వస్తున్న వారు వంటలు చేసుకునేందుకు అవసరమైన నీటి కోసం ఎనిమిది అడుగుల ఎత్తున ఓ ట్యాంకును ఏర్పాటు చేశారు. ట్యాంకుకు పదికిపైగా కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. శుద్ధమైన తాగునీరు సౌకర్యంలేక వన భోజనాలకు వస్తున్న వారు సొంతంగా తాగునీటిని తెచ్చుకుంటున్నారని భక్తులు పి.ధర్మారావు, సంఘమిత్ర, ప్రజ్ఞా పుష్ప మంజరిలు విలేకరులకు చెప్పారు. వంటలు చేసుకునేందుకు పైకప్పు రేకులతో గదులున్నాయని వారు పేర్కొన్నారు. మహిమాన్వితమైన శక్తిపీఠం, పరిసరాల్లోని ప్రకృతి అందాలు సందర్శకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయని వారు పేర్కొన్నారు.

### రూ.1.69 కోట్లతో అభివృద్ధి పనులు

నారాయణి శక్తిపీఠంలో రూ.1.69 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మందకొడిగా సాగుతున్నాయని, ఇవి త్వరగా పూర్తయ్యేలా గంజాం జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలని శక్తిపీఠం అర్చకులు కోరారు. వన భోజనాలకు భారీగా తరలి వస్తున్న సందర్శకులతో వ్యర్థాలు బాగా పేరుకుపోతున్నాయని, వీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరిచే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సందర్శకులు పేర్కొన్నారు. నిర్వహణ లోపం కారణంగా ఆవరణలోని పుష్కరిణి కలుషితమైందని, తాగునీటి కుళాయిలు దెబ్బతిన్నాయని, వీటిని పునరుద్ధరించాలని వారు కోరారు.

వన భోజనాల సందడి

## అలరిస్తున్న నృత్యోత్సవాలు

జగన్నాథ మంగళాచరణ నృత్యరూపకం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని రవీంద్ర మండపంలో జరుగుతున్న అంతర్జాతీయ ఒడిస్సీ నృత్యోత్సవాలు సందర్శకులను అలరిస్తున్నాయి. ఆదివారం రాత్రి ప్రముఖ నృత్యకారిణి గురు సంగీతాదాస్ ఆధ్వర్యంలో శుభశ్రీ శుభస్మితా మహాపాత్ర్, ఈశాని మిశ్ర, రక్షితా పాత్ర్, ఆనందిత, అజయ్ గంగాధర్, శుభశ్రీరాయ్, ఆద్రితా చటోపాధ్యాయ తదితర కళాకారిణులు ప్రదర్శించిన రామాయణ, భాగవత నృత్యరూపకాలు సమ్మోహనం చేశాయి. మంగళవారం నృత్యోత్సవాల ముగింపు కార్యక్రమం జరగనుంది.

భాగవత కావ్యం నృత్యరూపకం

## చదువుల తల్లికి 60 వసంతాలు

గోపాలపూర్, న్యూస్‌టుడే

దక్షిణ ఒడిశా జిల్లాల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న చదువుల తల్లి బ్రహ్మపుర విశ్వవిద్యాలయానికి (భంజవిహార్) 59 వసంతాలు నిండాయి. జనవరి 2న 60వ ఆవిర్భావ వేడుకకు సన్నద్ధమైంది. ఈ సందర్భంగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారికి యంత్రాంగం సత్కరించనుంది.

- ప్రముఖ కవి ప్రఫుల్ల, ఇతర కళాకారులకు సత్కారం
- జనవరి 2న భంజవిహార్ ఆవిర్భావ వేడుక

### త్యాగధనుల ఉద్యమ ఫలం భంజవిహార్

దళిత, ఆదివాసీలకు నిలయమైన దక్షిణ జిల్లాల్లో ఉన్నత విద్యా పరిమళాలు గుబాళించాలి, జ్ఞాన జ్యోతులు ప్రకాశించాలన్న ధ్యేయంతో 1960లో కొంతమంది త్యాగధనులు బ్రహ్మపురలో విశ్వవిద్యాలయం ఏర్పాటు ఉద్యమం చేపట్టారు. 1967 జనవరి 2న పూర్తయింది. గోపాల్‌పూర్‌కి చేరువలో సుమారు 260 ఎకరాల విస్తీర్ణంలో కవిసామ్రాట్ ఉపేంద్ర భంజదేవ్ పేరిట భంజవిహార్‌గా అయిదు పోస్ట్‌గ్యాడ్యుయేషన్ (పీజీ) విభాగాలతో ప్రారంభమైన వర్సిటీ అంచెలంచెలుగా విస్తరించింది. ప్రస్తుతమిది 25 పీజీ విభాగాలు, మరో అయిదు సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులు, పరిశోధనా కేంద్రాలతో విరాజిల్లుతోంది. ఈ వర్సిటీ ఆధీనంలో దక్షిణ ఒడిశాలోని 162 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఎమ్కేసీజీ వైద్య కళాశాల, న్యాయ, ఆయుర్వేద, హోమియో కళాశాలలున్నాయి.

దక్షిణ ఒడిశా విజ్ఞాన జ్యోతి భంజవిహార్

### పలువురికి సన్మానం...

భంజవిహార్ ఆవిర్భావ వేడుకల్లో ఏటా ప్రముఖులను సన్మానిస్తుంటారు. యంత్రాంగం ఇదివరకు కవిసామ్రాట్ భంజదేవ్ పేరిట 'ఉపేంద్రభంజ' జాతీయ పురస్కారం ఏర్పాటు చేసింది. సరస్వతీ పుత్రులను ఎంపిక చేసి రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రంతో సత్కరిస్తోంది. దక్షిణ ఒడిశా జిల్లాల్లో కళామతల్లికి సేవలందిస్తున్న మరో ఇద్దరికి 'లోక సంస్కృతి సమ్మాన్' అవార్డులు కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి భంజవిహార్ వీసీ ఆచార్యిణి గీతాంజలి దాస్ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో 2026 సంవత్సరానికి అవార్డు గ్రహీతల ఎంపిక జరిగింది. జాతీయస్థాయిలో ఖ్యాతిగాంచిన ప్రముఖ కవి ఆచార్య ప్రఫుల్ల కుమార్ మహంతి భంజదేవ్ పురస్కారానికి ఎంపికయ్యారు. దక్షిణ ఒడిశా సంస్కృతి సమ్మాన్ అవార్డులు హృషీకేశ్ పాణిగ్రహి, జగదీశ్ పాణిగ్రహి అందుకోనున్నారు. భంజవిహార్‌లో ఉన్నత విద్య అభ్యసించి రాణించిన పూర్వ విద్యార్థులు ఆచార్య యు.కె.రావు, సురేంద్రకుమార్‌లనూ యంత్రాంగం సత్కరించాలని నిర్ణయించింది.

### ఈసారి వేడుకల్లో అతిథులు వీరు

ఈసారి ఆవిర్భావ వేడుకలకు 'సైక్లోన్ మ్యాన్' (తుపానుల అధ్యయనవేత్త)గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన భారత వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ, దిల్లీ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ప్రత్యేక ఆహ్వానితునిగా ఆంధ్రా విశ్వవిద్యాలయం (విశాఖ) వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ పాల్గొననున్నారు.

### నిరంతరం శ్రమిస్తున్నాం

భంజవిహార్ వీసీ ఆచార్యిణి **గీతాంజలి** సోమవారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వర్సిటీలో అభివృద్ధి పనులు, ఉన్నత విద్యా ప్రమాణాలు, పరిశోధనలు ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. దక్షిణ ఒడిశాలోని గిరిజన విద్యార్థులకు ఉచిత విద్య, వసతి తదితర సౌకర్యాలు కల్పిస్తూ ఆదివాసీల ప్రగతికి వర్సిటీ ధ్యేయంగా చేసుకుందన్నారు. 2026లో తెలుగుపీఠం ఏర్పాటవుతుందన్న ఆశాభావం ఉందని చెప్పారు. ఉపాధి కల్పనకు అవకాశం ఉన్న కోర్సులు ప్రారంభించడానికి శ్రమిస్తున్నామన్న వీసీ వర్సిటీ ప్రతిష్ఠ పెంచడం ధ్యేయమన్నారు.

(c) eenadu

## పల్లా కళాకారుల్ని ప్రోత్సహిస్తాం

● పింఛన్లు పెంచిన సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రాచీన కళలు అంతరించకూడదన్న ధ్యేయంతో తమ ప్రభుత్వం పల్లా, దస్కఠియా, గహనీ గానకారుల్ని ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. ఆదివారం రాత్రి పల్లాకారుల సంఘం స్వర్ణోత్సవం కేంఝర్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న జనచైతన్య కార్యక్రమాల్లో గాన కళాకారుల సేవలు వినియోగించుకుని ఆర్థిక సాయం చేస్తామన్నారు. రూ.3,000కి పెంచారు రాష్ట్రంలో 40 నుంచి 80 ఏళ్ల వయసు గల కళాకారులకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.2,000లు పింఛను చెల్లిస్తోంది. ఈ మొత్తాన్ని రూ.3,000లకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. 80 ఏళ్లు దాటిన వారికి ఇప్పటి వరకు నెలకు రూ.2,500లుగా ఉన్న పింఛను రూ.3,500లకు పెంచామన్నారు. దీని మూలంగా రాష్ట్రంలోని 47,704 మంది కళాకారులకు ప్రయోజనాలు కలుగుతుందని వివరించారు.

పల్లాకారులతో సీఎం మోహన్

## రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాశాఖ సౌజన్యంతో రాష్ట్ర పారా క్రీడల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. భువనేశ్వర్‌లోని రాష్ట్ర క్రీడాశాఖ బ్యాడ్మింటన్ ఇండోర్ హాల్లో ఏర్పాటైన వీటిని రాష్ట్ర క్రీడా శాఖ ఓఎస్‌డీ సొనాలీ చాంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అంగవైకల్యమైనా ఏమాత్రం వెనుకాడకుండా ఆత్మస్థైర్యంతో క్రీడల్లో ఉత్సాహంగా పోటీపడటం హర్షణీయమన్నారు. ప్రారంభ కార్యక్రమంలో అంతర్జాతీయ మాజీ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అమరేంద్ర బెహరా, కోచ్ శిబప్రసాద్ దాస్, టోర్నీ నిర్వాహక సంఘం అధ్యక్షుడు కమల్‌కాంత్ రథ్, కార్యదర్శి సునీల్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులు వివిధ కేటగిరీల్లో నిర్వహిస్తున్న పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన యాభైమంది పారా పురుషులు, మహిళా క్రీడాకారులు సింగిల్స్, డబుల్స్ మ్యాచులలో పోటీపడుతున్నారు.

క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న సొనాలి చాంద్

బ్యాడ్మింటన్ ఆడుతున్న మహిళా పారా క్రీడాకారిణి

## తీరంలో సందడి..

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: కాల ప్రవాహంలో మరో ఏడాది (2025) తెరమరుగవడానికి ఎంతో సమయం లేదు. నూతన సంవత్సరం (2026) పాదం మోపనుంది. స్వాగతించడానికి అంతా సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో గతానుభవాలు, మధుర స్మృతులు పంచుకోవడానికి సందర్శనీయ స్థలాలకు పెద్దసంఖ్యలో పర్యాటకులొస్తున్నారు. తూర్పుతీర సుందరిగా ఖ్యాతిగాంచిన గోపాల్‌పూర్ తీర పట్టణం క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సందర్శకులతో సందడిగా మారింది. బీచ్ రోడ్‌లోని సాధారణ, నక్షత్రాల హోటళ్లన్నీ హౌస్‌ఫుల్ అయ్యాయి. ఆయాచోట్ల జీరో నైట్ (డిసెంబరు 31 రాత్రి) న్యూఇయర్ (జనవరి 1) వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్‌ఏసీ, పోలీసు యంత్రాంగాలు విస్తృత ఏర్పాట్లు, గట్టి బందోబస్తు చేపట్టాయి.

గోపాల్‌పూర్ తీరంలో సందర్శకుల హేల

## ఈసీఐ సమావేశం వాయిదా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్ర ఎన్నికల కమిషనర్ (ఈసీఐ) జ్ఞానేష్‌కుమార్ అర్ధాంతరంగా ఆదివారం రాత్రి 10.30 గంటలకు దిల్లీ ప్రయాణమయ్యారు. ఆయన తండ్రి అనారోగ్యం పాలైనట్లు సమాచారం అందడంతో వెంటనే జ్ఞానేష్ దంపతులు హస్తిన తిరుగుముఖం పట్టారు. సోమవారం భువనేశ్వర్‌లోని ఎన్నికల అధికారి కార్యాలయంలో జరగాల్సి ఉన్న బూత్‌స్థాయి ఎన్నికల అధికారుల సమావేశం వాయిదా పడింది. ప్రయాణానికి ముందుగా జ్ఞానేష్ విలేకర్లతో మాట్లాడుతూ తమ ఒడిశా పర్యటన మధుర స్మృతులు మిగిల్చిందన్నారు. భువనేశ్వర్‌కి త్వరలో మళ్లీ వస్తానని చెప్పారు.

భువనేశ్వర్‌లోని ముక్తేశ్వరాలయం ఆవరణలో జ్ఞానేష్ దంపతులు

## పాత్రికేయులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: పాత్రికేయులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చొ కోరారు. సిమిలిగుడ ప్రెస్ క్లబ్ 25వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మచ్చొ పాల్గొని పాత్రికేయులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా అటవీ శాఖ అధికారి కె.వి.భాస్కరరావు మాట్లాడుతూ పత్రికా రంగంలో పని చేసేవారు చిత్తశుద్ధితో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. పురపాలక సంస్థ అధ్యక్షులు రాజేంద్ర కుమార్ పాత్ర్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మిత మెలకా, క్లబ్ అధ్యక్షులు అజయ్‌కుమార్ సాహు, మనోజ్‌కుమార్ పట్నాయక్, దొండపాణి మహాపాత్ర్ తదితరులు పాల్గొన్నారు.

వేదికపై ఎమ్మెల్యే మచ్చొ

## కటక్ రైజింగ్ స్టూడెంట్స్ జట్టు గెలుపు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మహాత్మాగాంధీ క్రీడామైదానంలో జరుగుతున్న అటల్ బిహారీ వాజ్‌పేయీ స్మారక టీ-20 క్రికెట్ టోర్నీలో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీఫైనల్ మ్యాచులో కటక్ రైజింగ్ స్టూడెంట్స్ జట్టు 27 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచులో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన రైజింగ్ స్టూడెంట్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన కేసింగ క్రికెట్ సంఘం జట్టు మొత్తం ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసి ఓటమి పాలైంది. రైజింగ్ జట్టు క్రీడాకారుడు దీపక్ కుమార్ మహతో 50 పరుగులు చేయడంతో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ బహుమతి అందుకున్నారు.

దీపక్ కుమార్ మహతోకు బహుమతి అందజేస్తున్న టోర్నీ కమిటీ ప్రతినిధులు

## జిల్లా చదరంగం విజేతలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గంజాం జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో జరిగిన జిల్లా చదరంగం పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఇందులో వివిధ విభాగాల్లో శ్రీహాన్ సాబత్, సుశాంత్ కుమార్ సాహు, ప్రమోద్ కుమార్ సేనాపతి, అనుశ్రీ పాడి, ఖుష్బూ స్వయిన్, ఆదిత్య పాత్ర్, అరిజిత్ కుమార్ పాత్ర్, దిబ్యాంశు నాయక్, రామేశ్వర్, స్నేహాశిస్ రౌత్, బి.యష్ వర్ధన్, గౌతమ్ రెడ్డి, అన్షుమాన్ నాహక్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. పోటీల అనంతరం ముగింపు కార్యక్రమంలో అతిథులుగా హాజరైన కార్పొరేటర్ సవితా సాహు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేష్ తరిణి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జీడీసీఏ అధ్యక్షుడు పీకే సాహు, కార్యదర్శి కేకే శర్మ తదితరులు పాల్గొన్నారు.

మూడు స్థానాల విజేతలు. చిత్రంలో కార్పొరేటర్ సవితా సాహు తదితరులు

## తెరుచుకున్న శిఖర్‌చాండి ఆలయ గేటు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: గజరాజుల బెడద కారణంగా గత కొద్ది రోజులుగా మూతపడ్డ శిఖర్‌చాండి ఆలయం గేటు సోమవారం తెరిచారు. ఇటీవల కొండపై తిష్ఠ వేసిన రెండు ఏనుగులు భరత్‌పూర్ అటవీ ప్రాంతానికి తిరిగి వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. భక్తులు, పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

## తరగతి గదికి శిలాన్యాసం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలో ఉన్న దంతన్ పట్టణ దంతన్ ఉన్నత పాఠశాలలో కొత్త తరగతి గదికి సోమవారం ఎంపీ జూన్ మాలియా శిలాన్యాసం చేశారు. పలువురు అతిథులు హాజరయ్యారు.

## నేడు ఉత్తర ద్వార దర్శనం

రాయగడ, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం గుండా వెళ్లి స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. బాలాజీనగర్ కల్యాణ వేంకటేశ్వర సన్నిధానంలో సోమవారం తిరుప్పావై 14వ పాశురాం గానం చేసి, గోదా తాండవ కృష్ణులకు విశేష పూజలు చేశారు

పూజలు అందుకున్న గోదా తాండవ కృష్ణులు

## ఘనంగా 'నట ఉత్సవ్-2025'

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: సినీ, బుల్లితెర, రంగస్థల ప్రముఖుడు 'మంచ్ రత్న' నారాయణ సామల్ స్మారకార్థం లక్ష్య, నీలేంద్రి నారాయణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 'నట ఉత్సవ్-2025' ఘనంగా నిర్వహించారు. స్థానిక గిరి మార్కెట్‌లోని ప్రకాశం మినీ హాల్లో నిర్వహించిన ఇందులో రంగస్థల ప్రముఖులు సుశీలా కహర్, గోకులి పండా, లింగరాజ నాహక్, తేజ్‌రాజ్, వెంకట్‌విహారి ప్రహరాజ్ తదితరుల్ని నిర్వాహకులు సత్కరించారు. బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి, బ్రహ్మపుర మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రమేష్‌చంద్ర చ్యవుపట్నాయక్, రాష్ట్ర క్యాజు నిగమ్ మాజీ అధ్యక్షుడు సుభాష్ మహరణా తదితరులు అతిథులు పాల్గొన్నారు.

సత్కారం అందుకున్న రంగస్థల నటి సుశీలా కహర్. చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

## రైతు సమస్యలు పరిష్కరించాలి

బరగఢ్, న్యూస్‌టుడే: బరగఢ్ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం బరగఢ్ జిల్లా బిజద ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదిత్య గోయల్‌కి వినతిపత్రం అందించారు. బిజద నేతలు స్నేహాంగిని ఛురియా, దేబేష్ ఆచార్య పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా తైక్వాండో పోటీలకు పూజ

బస్టాండు వద్ద పూజతో ఉపాధ్యాయురాలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: అండర్-14 ఆల్ ఇండియా తైక్వాండో పోటీలు పంజాబ్‌లోని జనవరి 6-11 వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో తలపడేందుకు రాష్ట్రం తరపున నవరంగపూర్‌కు చెందిన ఉత్కళ్ బాలిక ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న పూజ బంజారా ఎంపికైంది. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి పూజ టీచర్ ఎ.గీతతో పంజాబ్ బయలుదేరింది.

## జాతీయ కరాటే పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులకు పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఉత్కళ కరాటే స్కూల్లో జరుగుతున్న 15వ జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పతకాలు గెలుచుకున్నారు. రెండో రోజు సోమవారం జూనియర్, కేడెట్, అండర్ -13 కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో పలువురు రాష్ట్ర పురుషులు, మహిళా క్రీడాకారులు పతకాలు కైవసం చేసుకున్నట్లు కరాటే స్కూల్ నిర్వాహకుడు, కోచ్ హరిప్రసాద్ పట్నాయక్ మధ్యాహ్నం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఒడిశా రాష్ట్ర కరాటే సంఘం ప్రతినిధులు, సలహాదారుడు సనత్‌కుమార్ నాయక్ తదితరులు విజేతలకు అభినందనలు తెలిపారు.

పతకాలతో క్రీడాకారిణులు. చిత్రంలో సంఘం ప్రతినిధులు

## రాష్ట్ర తైక్వాండో పోటీల్లో పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భద్రక్‌లోని బిజు పట్నాయక్ ఇండర్ హాల్లో ఈనెల 26 నుంచి 28వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ తైక్వాండో పోటీల్లో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ బ్రహ్మపుర (టాబ్) క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఇందులో వివిధ కేటగిరీలలో నిర్వహించిన పూమ్‌సెయి, క్యురుగి అంశాల్లో పోటీపడిన సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ క్రీడాకారులు 26 పసిడి, 9 రజత, 3 కాంస్య పతకాలు గెలుచుకున్నట్లు టాబ్ కార్యదర్శి, కోచ్ సత్యనారాయణ త్రిపాఠి సోమవారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. మధ్యాహ్నం బ్రహ్మపురకి చేరుకున్న పతకాల క్రీడాకారులకు టాబ్ కార్యాలయంలో సాయంత్రం సత్కరించి అభినందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పతకాలతో వివిధ కేటగిరీల క్రీడాకారులు

## మునిగుడలో రక్తదాన శిబిరం

రాయగడ గ్రామీణం, మునిగుడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా మునిగుడ ప్రభుత్వ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అమో ఒడిశా సంస్థ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. 21 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు అమో ఒడిశా ప్రతినిధి శివప్రసాద్ దొర తెలిపారు.

## కోనా మోహనరావు మృతి

రాయగడ, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపారవేత్త, వంశీ కళాశాల ఛైర్మన్ కోనా మోహనరావు(70) మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం తుది శ్వాస విడిచారు.

కోనా మోహనరావు (పాతచిత్రం)

## బిజద రాష్ట్ర కార్యవర్గంలో రాయగడ యువకులు

రాయగడ, న్యూస్‌టుడే: బిజద యువ జనతాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా స్థానిక దేవాశిష్ ఖడంగ, బిజు ఛాత్ర దళ్ సాధారణ కార్యదర్శిగా బినాయక్ పొల్లయి నియమితులయ్యారు. వీరికి బిజద నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

దేవాశిష్ ఖడంగ

బినాయక్ పొల్లయి

## బిజద ఛాత్ర విభాగ కార్యదర్శిగా సుమిత్

నవరంగపూర్, న్యూస్‌టుడే: బిజద జిల్లా విద్యార్థి నేత సుమిత్ పూజారిని బిజద రాష్ట్ర విద్యార్థి సాధారణ కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీలు ప్రదీప్‌మాఝి, రమేష్‌మాఝి, జిల్లా బిజద అధ్యక్షుడు మనోహర్ రంధారి తదితరులు సుమిత్‌కు శుభాకాంక్షలుథ తెలియజేశారు.

సుమిత్ పూజారి

## పూర్వ విద్యార్థుల సమావేశం

బ్రహ్మపుర నగరం: సిటీ హైస్కూల్లో 1987వ సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమావేశం సోమవారం జరిగింది. ఉదయం స్థానిక పార్కు వీధిలోని కామత్ హోటల్‌లో నిర్వహించారు. కె.హరగోపాల్ సుబుద్ధి, జి.కాశీవిశ్వనాథం, జి.వి.బాల, జమ్ముల శ్రీనివాస్ పర్యవేక్షించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన సిటీ హైస్కూలు విశ్రాంత ఉపాధ్యాయులు డి.విజయ రామకృష్ణ దంపతుల్ని పూర్వ విద్యార్థులు సత్కరించి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

రామకృష్ణ మాస్టారు దంపతుల్ని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

## సంగీత...సాహిత్య ..మేళవింపు

రాజన ఇందిర, కళాకారులను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న కులకర్ణి

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడలో అద్భుతమైన గీతాలు, సంప్రదాయ నృత్యాలతో కనుల పండువగా సాగుతున్న చౌయితి ఉత్సవం సంగీత, సాహిత్య మేళవింపని రాష్ట్ర వాణిజ్య, రవాణా, ఉక్కు, గనుల శాఖల మంత్రి బిభూతి జెనా అన్నారు. ఆదివారం రాత్రి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కలెక్టర్ ఆశుతోష్ కులకర్ణి, మంత్రి జెనాలు జిల్లాలోని పురపాలక సంస్థలు, ఎన్ఏసీ అధ్యక్షులు, కౌన్సిలర్‌లను సత్కరించారు.

## ప్రజలను మోసగిస్తున్న భాజపా

పర్లాఖెముండి: భాజపా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఎమ్మెల్యే దాశరథి గమాంగ్ అన్నారు. సోమవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం నుంచి టాటా విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి కార్యాలయానికి తాళం వేసి నిరసన చేపట్టారు. పది డిమాండ్లతో రాసిన వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బిజయ్ కుమార్ సాహుకు అందజేశారు. డిమాండ్లు పరిష్కారం కాకపోతే రానున్న రోజుల్లో తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే దాశరథి, కార్యకర్తలు

## బీజేపీ పరివర్తన సంకల్ప సభ

మాట్లాడుతున్న సుభేందు అధికారి

ఖరగ్‌పూర్: పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నాయకుడు సుభేందు అధికారి ఝార్‌గ్రామ్ జిల్లా సంకరాయిల్ పరిధిలో పరివర్తన సంకల్ప సభలో ఆదివారం పాల్గొన్నారు. ● సివిక్ వాలంటరీ పోలీసు తులసీరావు(ఉదయ్) హత్యకు గురైన సంగతి తెలిసిందే. దీనికి నిరసనగా ఆదివారం సుభేందు అధికారి పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. హత్యకు కారణమైన వారిని నాలుగు రోజుల్లో అరెస్టు చేయకపోతే పోలీస్ స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

## నందన్‌కానన్‌లో టాయ్ ట్రైన్ పునఃప్రారంభం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని నందన్‌కానన్ వన్యప్రాణుల ప్రదర్శనా కేంద్రంలో టాయ్ ట్రైన్ సేవలు పునఃప్రారంభమయ్యాయి. సోమవారం నందన్‌కానన్ 66వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి గణేశ్‌రామ్‌సింగ్ ఖుంటియా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన టాయ్ ట్రైన్‌ను ప్రారంభించారు. పలు నూతన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

టాయ్ ట్రైన్ సరదా

## మేళాతో రైతులకు మేలు

వేదికపై ఎమ్మెల్యేలు రూపేష్, దాశరథి, జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు తదితరులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని గజపతి క్రీడా మైదానంలో మత్స్య, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే జిల్లాస్థాయి మత్స్య, పశు సంపద మేళా సోమవారం ప్రారంభించారు. ఈ మేళాకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు రూపేష్ పాణిగ్రాహి, దాశరథి గమాంగ్, అతిథులుగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మునీంద్రా, జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రూపేష్ మాట్లాడుతూ ఇలాంటి మేళాలు జిల్లాలో నిర్వహించడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి నిరోద్‌చంద్ర నాయక్, సెంచూరియన్ డీన్ రాజ్‌కిషోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ● గజపతి జిల్లా మోహన నియోజకవర్గం రాయగడ సమితి కుములిసింగి గ్రామ రహదారి అధ్వానంగా ఉందని, ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదు అందడంతో సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి తెలిపారు.

## విద్యార్థుల విజయంలో టీచర్ల పాత్ర కీలకం: ఏఎస్పీ

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: విజయవంతమైన విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు సారథులుగా నిలుస్తారని అదనపు ఎస్పీ ఆదిత్య సేన్ అన్నారు. నవరంగపూర్ జిల్లా టెంటులిఖుంటి సమితి ఖాతిగూడ జవహర్ నవోదయ పాఠశాలలో సోమవారం జరిగిన రజతోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. పాఠశాల అధ్యక్షుడు పితబాస్ ప్రహరాజ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## అపూర్వ కలయిక

జయపురం, న్యూస్‌టుడే: జయపురం ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో 1975 సంవత్సరంలో ఆరో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ ఏడాది స్వర్ణోత్సవం(50వ సంవత్సరం) సందర్భంగా వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఉపాధ్యాయులు నర్సింహ పాణిగ్రాహి, చూడామణి ఆచారిలకు సన్మానించారు.

కలుసుకున్న స్నేహితులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా గురండి ఠాణా పరిధిలోని పాటికోట-ఏడో మైలు గ్రామ మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందగా, యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పర్లాఖెముండి పట్టణంలో పరీక్ష ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో మరో ద్విచక్ర వాహనానికి ఢీకొని గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించగా ప్రియాంక బొడోరైత్(26) మృతిచెందగా, జికారియా సబర్ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వీరు ఆర్.ఉదయగిరి ఠాణా పరిధిలోని పుత్రపొడ గ్రామానికి చెందినవారుగా గుర్తించినట్లు, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామకృష్ణ పాణిగ్రాహి తెలిపారు.

## వలస కార్మికుడి మృత్యువాత



నవరంగపూర్: కుటుంబాన్ని పోషించుకునేందుకు తమిళనాడుకు వలస వెళ్లిన నవరంగపూర్ జిల్లాకు చెందిన కార్మికుడు అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడు పపదహండి సమితి పాత్రి పంచాయతీ కుంబారముండాగూడ గ్రామానికి చెందిన వైకుంఠ నాయక్(26)గా గుర్తించారు. ఆదివారం ఉదయం హఠాత్తుగా వైకుంఠ అనారోగ్యానికి గురవ్వడంతో స్నేహితులు అతడ్ని ఆసుపత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్నాడని ఆరోగ్యం పూర్తిగా క్షీణించటంతో మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.

## కారుపై సరకు లారీ బోల్తా

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా పట్టపూర్ ఠాణా పరిధిలోని తప్తపాణి ఘాటీ రోడ్డులో ఖెముండిఖాళొ గ్రామం సమీపాన సోమవారం మధ్యాహ్నం జీడి బస్తాలున్న ఓ లారీ అదుపుతప్పి కారుపై పడింది. జీడి బస్తాలన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. కారులో చోదకుడు, మరో నలుగురు చిక్కుకోగా, లారీ చోదకుడు అందులో చిక్కుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో కారుపై బోల్తాపడ్డ లారీని భారీ క్రేన్‌తో పక్కకు తొలగించారు. కట్టర్‌తో కారు, లారీ తలుపులు కోసి, ఆయా వాహనాల్లో చిక్కుకున్న ప్రయాణికులు, చోదకుల్ని కాపాడి దిగపాహండిలోని ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. వీరిలో తీవ్ర గాయాలైన కారు చోదకుడికి ప్రాథమిక చికిత్స అనంతరం స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. పునరుద్ధరణ కార్యక్రమాల వల్ల ఈ ఘాటీ రోడ్డులో ఇరువైపులా గంటకుపైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దుర్ఘటనకు గురైన వాహనాల్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రాయగడ జిల్లా నుంచి బ్రహ్మపురవైపు జీడి బస్తాలతో వస్తున్న లారీ ఖెముండిఖాళొ వద్ద అదుపుతప్పి పక్కనుంచి వెళుతున్న కారుపై బోల్తా పడింది.

## అటవీ అధికారులపై కలప స్మగ్లర్ల దాడి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అటవీ అధికారులపై కలప స్మగ్లర్ల దాడికి పాల్పడిన ఘటన బాలేశ్వర్ జిల్లా నీలగిరి అటవీ డివిజన్ పరిధిలో చోటు చేసుకుంది. అటవీశాఖ వర్గాల సమాచారం మేరకు సజానగర్ సెక్షన్ ఫారెస్టర్ బురురాం హన్సదా నేతృత్వంలో సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పీతహ పంచాయతీ సిమిలిహుడా సమీపాన రాత్రి 10 గంటల సమయంలో వీరి రాకను గుర్తించిన కలప స్మగ్లర్లు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో హన్సదాకు గాయాలు కాగా పెట్రోలింగ్ వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో వాహనంలో పరారైన అటవీ సిబ్బంది పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి కలపతో పాటు వారు తెచ్చిన వాహనంతో స్మగ్లర్లు పరారీ అయ్యారు. ఆ తరువాత పోలీసులు, అటవీ అధికారులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 15 నుంచి 20 మంది స్మగ్లర్లు ఈ దాడికి పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు.

## విదేశీ నకిలీ మద్యం స్వాధీనం

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్‌లోని కొట్పాడ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న బొండాగూడ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి అబ్కారీ ఇన్‌స్పెక్టర్ శశికాంత్ రథ్ నేతృత్వంలో అధికారులు దాడి చేసి సుమారు రూ.20 లక్షలు విలువ చేసే 1,546 లీటర్ల విదేశీ నకిలీ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు రథ్ చెప్పారు. మాల్‌ఛామాల్ గ్రామానికి చెందిన అమిత్ గుప్తా, పంకజ్ గుప్తా, బొండాగుడలో మద్యం తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. నిందితులు పరారయ్యారని, త్వరలో వారిని అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం

## దోపిడీ సొత్తు స్వాధీనం: ముగ్గురి అరెస్టు

బ్రహ్మపుర నగరం: వివిధ బ్యాంకుల వద్ద ఖాతాదారులుగా ఉంటూ.. నగదు లావాదేవీలు చేస్తున్నవారిని గుర్తించి, చాకచక్యంగా వారి నుంచి సొమ్ము దోచుకుంటున్న ముగ్గురు సభ్యుల ముఠాను గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.97 లక్షలు నగదు, ఓ ద్విచక్ర వాహనం తదితరాలు స్వాధీనం చేసుకున్నట్లు గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును బాధితులకు అందజేశామని పేర్కొన్నారు. పరారీలో ఉన్న ముఠాలోని మరో సభ్యుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. గంజాం జిల్లాతోపాటు కటక్, ఖుర్ధా జిల్లాల్లోని వివిధ నేర ఘటనలతో నిందితులకు ప్రమేయమున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

## కారులో మంటలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పర్యాటకులతో వెళుతున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా కాలిపోయిన ఘటన పూరీ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఐదుగురు పర్యాటకులు పూరీ నుంచి చిలకా వస్తుండగా బ్రహ్మగిరి పోలీసుస్టేషన్ పనసపొడ సమీప హైవేలో ఈ కారులో ఏదో శబ్దం వచ్చింది. వెంటనే చోదకుడు వాహనాన్ని ఆపి కిందకు దిగి చూడగా మంటలు చెలరేగడాన్ని గమనించి ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో వారంతా దిగిపోయారు. సీఎన్‌జీ ట్యాంకు పగిలి మంటలు చెలరేగి ఉంటాయని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పర్యాటకులు అనుగుల్ జిల్లాకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు.

## మత ప్రచారం చేయొద్దంటూ ఫిర్యాదు

పర్లాఖెముండి: పట్టణంలోని మైక్ ద్వారా మత ప్రచారం చేస్తున్న కొంతమందిని విశ్వహిందూ పరిషత్ సభ్యులు అడ్డుకున్నారు. సభ్యులు వారికి ప్రచారం చేయొద్దంటూ చెప్పడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం మత ప్రచారకులను పోలీసులకు అప్పగించారు. విశ్వహిందూ పరిషత్ కార్యకర్త సత్యనారాయణ సాహు ఠాణాలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సభ్యులు తెలిపారు.

## పెట్రోల్ బంకు సీజ్

రాయగడ గ్రామీణం: రాయగడలోని కల్యాణి సింగుపూర్‌లో ఉన్న పెట్రోల్ బంకును విజిలెన్స్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. బంకులో పెట్రోల్ కొలతల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ఫిర్యాదు రావడంతో విజిలెన్స్ అధికారులు ఆదివారం సాయంత్రం తనిఖీ చేశారు. విజిలెన్స్ బృందం ఓ వినియోగదారుడితో లీటరు పెట్రోల్ కొనుగోలు చేయించారు. అనంతరం ఆయిల్‌ను కొలిస్తే 900 ఎమ్.ఎల్. ఉంది. దీంతో బంకును సోమవారం సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

(c) eenadu

## అయ్యో.. ఆలివ్‌రిడ్లే..!

తీరంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. మత్స్యకారుల వలలకు చిక్కుకుని చనిపోతుండటంతో తీరానికి చేరిన తర్వాత ఒడ్డున పడేస్తున్నారు. ఎక్కువగా ఇంజిన్ బోట్లకు తగిలి గాయపడి మృతి చెందుతున్నాయి. సంతానోత్పత్తికి తీరానికి వచ్చిన సమయంలో కళేబరాలుగా మారుతున్నాయి. ఈ విషయమై అటవీ శాఖ టెరిటోరియల్ సెక్షన్ అధికారి టి.శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఆలివ్‌రిడ్లే తాబేళ్లు వలలకు చిక్కినప్పుడు సురక్షితంగా సముద్రంలోకి విడిచిపెట్టాలని మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించామని చెప్పారు. బుడగట్లపాలెంలో సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా గుడ్లు కనిపిస్తే సమాచారమివ్వాలని.. సంరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అల్లివలస తీరంలో మృతి చెందిన ఆలివ్‌రిడ్లే తాబేళ్లను చిత్రంలో చూడొచ్చు.

– న్యూస్‌టుడే, రణస్థలం

## ఎన్‌ఏసీ ఉపాధ్యక్షుడి తొలగింపు

రఘురాం సాహు

కాశీనగర్, న్యూస్‌టుడే: కాశీనగర్ ఎన్‌ఏసీ 11వ వార్డు కౌన్సిలర్, ఉపాధ్యక్షుడైన రఘురాం సాహు తన పదవితో పాటు ఎన్‌ఏసీ ఉపాధ్యక్ష పదవి కోల్పోయారు. ఓ నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టు రఘురాం సాహు పొందారని, ఆయన కౌన్సిలర్‌గా ఉంటూ తన పేరుతో క్రాంటాక్ట్‌లు చేయడమేంటని దాసరింకి రామారావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనలనుసరించి సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో రఘురాం సాహుకు ఈ ఏడాది జూన్ 30న షోకాజ్ నోటీసు జారీ చేసింది. 21 రోజుల్లో సంబంధిత విభాగానికి తన వివరణను సమర్పించాలని కోరింది. తన వివరణను సమర్పించడానికి ఒక నెల గడువు పొడిగించాలని సాహు అభ్యర్థించారు. సంబంధించిన శాఖ ఈ అభ్యర్థనతో ఏకీభవించలేదు. పురపాలిక చట్టం సెక్షన్ 38-ఎ ప్రకారం సాహును పదవి నుంచి తొలగించినట్లు డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

## పాడి పరిశ్రమతోనే సుస్థిర ఆదాయం

మాట్లాడుతున్న కలెక్టరు ప్రభాకరరెడ్డి, జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఏహెచ్‌వో మన్మథరావు

పార్వతీపురం, న్యూస్‌టుడే: వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో కూడా రైతులు సుస్థిర ఆదాయాన్ని పొందే రంగంగా పాడిపరిశ్రమ నిలుస్తుందని, రైతులు అంతా పశుపోషణ, పాడి అభివృద్ధి దిశగా చైతన్యవంతం కావాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి అన్నారు. సోమవారం పార్వతీపురంలోని ఒక ఫంక్షన్ హాలులో జరిగిన పశుసంవర్ధకశాఖ, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, ఉపాధిహామీ శాఖలతో ఏకీకృత సమావేశంలో మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు పశుపోషణ, పాడి పరిశ్రమలపై అవగాహన కల్పించేలా కార్యాచరణను అమలుచేస్తే, భవిష్యత్తులో మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉపాధి హామీ పథకంలో 'గోశాలలు' అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవడానికి రైతులు సంఘాలుగా ఏర్పడి ముందుకు రావాలన్నారు. గుడ్ల ఉత్పత్తి, వ్యవసాయ వ్యర్థాలతో ఎరువుల తయారీ తదితర పరిశ్రమలను ప్రోత్సహించాలని చెప్పారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జేడీ మన్మథరావు, డ్వామా పీడీ రామచంద్రరావు, ఉద్యాన, వ్యవసాయ, మత్స్య శాఖల అధికారులు సత్యనారాయణరెడ్డి, అన్నపూర్ణ, సంతోష్ పాల్గొన్నారు.

## స్వేచ్ఛగా విన్నవించుకొనేందుకే పీజీఆర్‌ఎస్

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: బాధితులు తమ సమస్యలను స్వేచ్ఛగా విన్నవించుకునే అవకాశం కల్పించడమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) ప్రధాన లక్ష్యమని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన వినతులు స్వీకరించారు. సాలూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నకిలీ గిరిజన సలహాదారుగా చెలామణి అవుతున్నారని, నియోజకవర్గ పరిధిలో అనేక మంది గిరిజన రైతులు, రాజకీయ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని, అసాంఘిక కార్యక్రమాలను పురిగొల్పుతూ భయపెడుతున్న ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సాలూరు మండలం కుదుమూరు రెవెన్యూ పరిధిలోని పొలంవలసకు చెందిన వ్యక్తులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన భర్త అయిదారు నెలల క్రితం మృతిచెందారని, ఆయన మరణంపై తనకు అనుమానాలున్నాయని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. వీటితోపాటు భూ తగాదాలు, కుటుంబ కలహాలు, భార్యాభర్తల గొడవలు తదితర వాటిపై ఫిర్యాదులొచ్చాయి. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారితో ఫోనులో మాట్లాడి వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టి.. చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీఆర్బీ ఎస్సై రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఎస్పీ మాధవరెడ్డి

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

పార్వతీపురం, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పర్వదినం నేపథ్యంలో మంగళవారం జిల్లాలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో భక్తులకు సులభంగా దైవదర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఇన్‌ఛార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.

## పరిసరాలిలా.. ఆరోగ్యం ఎలా?

రాజాం మండలం గుయ్యానవలసలో సీసీ రహదారులు, కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాడుకనీరు ఇళ్ల ముందు నిల్వ ఉండటంతో వీధుల్లోని పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడదతో వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. విషయం.. ఎంపీడీవో ఆనందరావు వద్ద ప్రస్తావించగా.. కాలువల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

## వనరులు అపారం.. వినియోగించుకుంటే ఆదాయం!

● అటవీ ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తే సత్ఫలితాలు

న్యూస్‌టుడే, హరిపురం (మందస)

అడవిని నమ్ముకుని బతికే గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా యంత్రాంగం పని చేయాలి. వారి ఆదాయ మార్గాలు పెంచాలి. అందుకు తగినట్లు ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.

– ఇటీవల సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు

జిల్లాలోని అడవుల్లో సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్లు, పలు రకాల ఉత్పత్తులు సమృద్ధిగా లభిస్తున్నాయి. కొన్ని మాత్రమే మార్కెట్‌కు వెళ్తున్నాయి. మిగిలిన వాటికి గిట్టుబాటు లేక గిరిజనులు నష్టపోతున్నారు. గతంలో తెదేపా హయాంలో సెర్ప్ సౌజన్యంతో వనమూలికలు సేకరించేవారు. రూ.లక్షల విలువ చేసే వన మూలికలు బహుళ జాతి కంపెనీలకు ఎగుమతి అయ్యేవి. పదేళ్ల కిందట ఈ ప్రక్రియ నిలిచిపోయింది. చిరుధాన్యాలు సాగు చేసి దళారులను నమ్మి మోసపోతున్నారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుంది. గిరిజన రైతుల ఆదాయం పెరుగుతుంది.



● ఈ మొక్క పేరు శతావరి. మహేంద్రగిరుల్లో విస్తారంగా లభించే వనమూలికల్లో ఇదొక రకం. తిప్పతీగ, అడ్డసారం, ముషిడికి, నరమామిడి వంటి జాతులకు తూర్పు కనుమలు పుట్టినిల్లు. గతంలో వెలుగు ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో గిరిజన ప్రాంతాల్లోని మహిళలు సేకరించే వారు. నెలకు సుమారు 10 టన్నులు ఎగుమతి చేసేవారు. మంచి ఆదాయం వచ్చేది.

● అటవీ ఉత్పత్తుల్లో కుంకుడు కాయలు ప్రధానమైనవి. సీకాయలు, కరక్కాయలు, కాగు పిక్కలు, ముషిడికి పిక్కలు వంటి అనేక జాతులు కొండ ప్రాంతాల్లో లభిస్తాయి. వీటిని గిరిజనులు సేకరించి మార్కెట్ చేసి ఆదాయం పొందేవారు. కొన్నేళ్ల కిందట ఈ ప్రక్రియ ఆగిపోవడంతో గిరిజనులకు ఉపాధి భారంగా మారింది.

### అవగాహన లోపం

గిరిజన యువతకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. అటవీ ఉత్పత్తులు, పంటల సేకరణకు కొన్ని గ్రామాలను యూనిట్‌గా చేసి రూ.15 లక్షలతో భవనం నిర్మించారు. చాలా చోట్ల అవి అలంకారప్రాయంగా మారాయి. తండాల్లో 300 మందిని భాగస్వాములను చేస్తూ వన్‌ధన్ వికాస కేంద్రాలను నెలకొల్పారు. ఒక్కో సభ్యుడికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. అవగాహన లేక చాలా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి.

| మండలం | జనాభా | కుటుంబాలు |
| --- | --- | --- |
| హిరమండలం | 8,389 | 1,487 |
| కొత్తూరు | 11,978 | 2,508 |
| మందస | 12,038 | 2,592 |
| మెలియాపుట్టి | 14,990 | 2,774 |
| పాతపట్నం | 10,388 | 2,164 |
| నందిగాం, కంచిలి, సోంపేట | 5,064 | 972 |

### ప్రణాళికలు రూపొందిస్తున్నాం

ఐటీడీఏ పరిధిలో పథకాల నిర్వహణ, ఫలితాలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తాం. అటవీ ఉత్పత్తుల సేకరణ, వన్‌ధన్ కేంద్రాలు సక్రమంగా నడిచేలా యువతలో చైతన్యం తీసుకొస్తాం. పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటాం. పక్కాగా అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

స్వప్నిల్ జగన్నాథ్, ఐటీడీఏ పీవో, సీతంపేట

## సూపర్ స్పెషాలిటీ వైద్యమే లక్ష్యం

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

'నిరుపేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. అందులో భాగంగానే వైద్యుల నియామకంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై దృష్టి సారించాం. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశాం' అని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ తెలిపారు. ఆసుపత్రి ఆసుపత్రి అభివృద్ధికి, సమస్యల పరిష్కారం దిశగా తీసుకుంటున్న చర్యలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన వివరించారు.

ముఖాముఖి

### సాధారణ ప్రసవాలు పెంచుతాం..

మాతా, శిశు సంరక్షణ విభాగానికి ఓపీ ఎక్కువగానే ఉంటోంది. ప్రత్యేక గదులు లేకపోవడంతో ప్రసవాల సంఖ్య తగ్గుతోంది. ఎన్టీఆర్ వైద్య సేవ అందుబాటులో ఉండటంతో గర్భిణుల కుటుంబ సభ్యులు డెలివరీలు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచడంతో పాటు మౌలిక వసతులు మెరుగుపరుస్తాం.

### ఓపీల పర్యవేక్షణకు కమిటీ..

అవుట్ పేషెంట్స్(ఓపీ) సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విభాగాల వారీగా ఓపీలో ఉండాల్సిన వైద్యుల జాబితా తయారుచేశాం. ఆ మేరకు ఆయా రోజుల్లో సంబంధిత వైద్యులు సేవలందించాలి. దీనిపై పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశాం. పారిశుద్ధ్య నిర్వహణను గాడిలో పెట్టి ఓపీలు మరింత పెరిగేలా కృషి చేస్తాం.

### క్షయ రోగులకు ప్రత్యేకంగా..

ఆసుపత్రి మధ్యలో క్షయ విభాగం ఉండటంతో ఇతర రోగులు ఇబ్బంది పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై దీనిపై ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలోనూ చర్చించాం. ప్రత్యేకంగా మల్టీ డ్రగ్ రెసిడెంట్ భవనం నిర్మించి అక్కడ వారికి చికిత్స అందించాలని నిర్ణయించాం. త్వరలోనే కార్యాచరణ ప్రారంభిస్తాం.

### ట్రామాకేర్ యూనిట్‌ను ఆధునికీకరిస్తాం..

కొన్ని అత్యవసర పరిస్థితులు, తలకు తీవ్రగాయాలైన సమయాల్లోనే రోగులను విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నాం. ట్రామా కేర్ యూనిట్‌ను ఆధునికీకరించి అత్యవసర కేసులకు ఇక్కడే వైద్యం అందించేందుకు సామగ్రిని కొద్ది నెలల్లో సమకూరుస్తాం. ప్రస్తుతం కార్డియాలజిస్ట్, సీటీవీ సర్జన్, న్యూరాలజిస్టు తదితర వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారు. అవసరమైన పరికరాల్లేక పోవడంతో సూపర్ స్పెషాలిటీ సేవలందించలేకపోతున్నారు. ఫిబ్రవరి నాటికి ఆ సమస్యలను అధిగమిస్తాం.

### సిబ్బంది కొరత అధిగమిస్తాం..

జీజీహెచ్‌లో 900 పడకలున్నాయి. ఆ మేరకు ఎఫ్‌ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు, జీడీఏలు లేరు. 321 మందికి కేవలం 109 మంది మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు వచ్చిన వెంటనే నియామకాలు చేపడతాం.

## పాఠశాల పరిసరాలు దుర్గంధ భరితం

గంట్యాడ మండలం నీలావతి గ్రామంలో మండల పరిషత్తు పాఠశాల దగ్గర్లో శుభకార్యాలకు సంబంధించిన వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. దీంతో పాటు బహిరంగ మల విసర్జన చేయడంతో దుర్వాసన భరించలేక నానా అవస్థలు పడుతున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. ఈ కారణంగా తరగతి గదులను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. విషయంపై గంట్యాడ డిప్యూటీ ఎంపీడీవో విజయ్‌కుమార్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా వెంటనే పరిశీలించి, వ్యర్థాలను తొలగింపజేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

## వ్యర్థాలు తొలగేలా.. పరిశుభ్రత పెరిగేలా

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చెత్త రహిత గ్రామ పంచాయతీలే లక్ష్యంగా పంచాయతీరాజ్ శాఖ పది రోజుల ప్రణాళికతో పంచాయతీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. వచ్చే నెల 5న నిర్వహించే ప్రత్యేక గ్రామసభల్లో ఆయా గ్రామ పంచాయతీలను చెత్తరహిత పంచాయతీలుగా ప్రకటించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీనిలో భాగంగా చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో స్థాయి నుంచి పంచాయతీ కార్యదర్శి వరకు ప్రతిరోజు పర్యటించి, పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

రామలింగాపురంలో చెత్త సేకరణ

### ఇదీ ప్రణాళిక..

ఈ నెల 26 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేలా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్‌శాఖ ఆదేశాలిచ్చింది. దీనిలో భాగంగా రోజువారీ వ్యర్థాలను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసి దాన్ని సమీపంలోని సంపద తయారీ కేంద్రాలకు తరలించి ఎరువుగా మార్చే ప్రక్రియ నిర్వహించాలి. చెత్త సంపద తయారీ కేంద్రాల్లో తయారైన ఈ సేంద్రియ ఎరువును 50:50 నిష్పత్తిలో గ్రామ పంచాయతీ, రైతులు వినియోగించుకునేలా ఒప్పందం చేసుకోవాలి. ఈ దిశగా యంత్రాంగం అడుగులు కదుపుతోంది.

### సిబ్బందికి ఆదేశాలిచ్చాం..

సబ్ డివిజన్ పరిధిలో ఎనిమిది మండలాల్లో ఆయా గ్రామ పంచాయతీలను చెత్త రహిత పంచాయతీలుగా ప్రకటించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలిచ్చాం. సేంద్రియ ఎరువు తయారీకి దూరంగా ఉన్న కేంద్రాలను అందుబాటులోకి తెస్తాం. సబ్ డివిజన్ పరిధిలో 249 గ్రామ పంచాయతీలు ఉండగా.. 173 గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. మొత్తంగా 542 మంది హరిత రాయబారులు పనిచేస్తున్నారు.

– కె.హేమసుందర్, డీడీవో

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. మండలంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. వీటి వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలియజేశారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడాలని సూచించారు

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

అచ్చెన్నాయుడు

పార్వతీపురం, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పర్వదినం నేపథ్యంలో మంగళవారం జిల్లాలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో భక్తులకు సులభంగా దైవదర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఇన్‌ఛార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, వారిని నియంత్రించేలా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. ఇబ్బందులు లేకుండా తాగునీరు, వైద్యసేవలు అందుబాటులో ఉంచాలన్నారు. దేవాదాయశాఖ, రెవెన్యూ, పోలీసు శాఖలు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## నీళ్లు రాక.. అవస్థలు తీరక

సంతకవిటి మండలం గరికిపాడు గ్రామంలో తాగునీటి పైపులైను మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామంలోని కొన్ని వీధులకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రామచంద్ర వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

## ఇదేనా.. అభివృద్ధి?

పూండినౌపడా రోడ్డు నుంచి పీఎంపురం, రెయ్యిపాడు మీదుగా మంచినీళ్లపేట వరకు ఉన్న ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి గుంతలతో అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాత్కాలిక మరమ్మతుల కింద రూ.80లక్షల నిధులు మంజూరు చేశారు. ఏడాది కిందట పలు చోట్ల గ్రావెల్ వేసి వదిలేశారు. దీనిపై ఆర్ అండ్‌బీ శాఖ జేఈ జగదీష్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

## వృథాగా వర్మీ కంపోస్టు తొట్టె

కవిటి మేజర్ పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రానికి సమీపంలో సేంద్రియ ఎరువుల తయారీ కోసం నిర్మించిన వర్మీ కంపోస్టు తొట్టె పనికిరాని మొక్కలతో వృథాగా ఉంది. తొట్టెను శుభ్రం చేసి ఎరువులు తయారు చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ ఈవో ఎం.రవిని వివరణ కోరగా పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

## సగం.. సగం పనులు

ఎగువ ప్రాంతాల నుంచి వాడుక, వర్షపునీరు కంద్రవీధి వద్ద ఉన్న కోమటి చెరువుకు చేరాలి. అందుకు కంద్రవీధి కూడలి నుంచి కంద్రకాలనీ వరకు సిమెంటు కాలువ నిర్మించి సగంలో వదిలేశారు. దీంతో ఎగువ నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. కాలువను పాత జాతీయ రహదారి వరకు పూర్తిగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పుర కమిషనర్ రమేష్‌ను వివరణ కోరగా.. పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## కాలువ అడ్డదిడ్డం.. చెత్త అడ్డం

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో డాక్టర్ కణితీస్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ సమీపంలో కాలువ నిర్మాణం అడ్డదిడ్డంగా చేపట్టడంతో చెత్త ముందుకు కదలడం లేదు. దీంతో మురుగునీరు నిల్వ ఉంటోంది. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కార్మికుల్ని పంపించి మురుగునీరు కదిలేలా చర్యలు తీసుకుంటామని పారిశుద్ధ్య విభాగ ఇన్‌ఛార్జి ఉదయ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

## గుంత.. రాకపోకలకు చింత

బెనుగానిపేట సమీపంలో ప్రధాన రహదారి పక్కనే నాలుగు అడుగుల గుంత ప్రయాణికులను భయపెడుతోంది. ఇక్కడ నుంచి సమీప ప్రాంతాలకు తాగునీరు పంపించేందుకు మ్యాన్ హోల్ నిర్మించారు. చాలా కాలంగా దానికి పలకలు వేయడం లేదు. దీంతో అటుగా వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ విష్ణుమూర్తికి వివరణ కోరగా సరిచేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

## పద్మవ్యూహం.. బయటకు రావడం కష్టం

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని పలు ప్రాంతాలు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. కొత్తగా ఎవరైనా ఆ ప్రాంతాలకు వస్తే అక్కడి నుంచి బయట పడాలంటే ఇబ్బందులు తప్పవు. ఇళ్ల నిర్మాణాలు అడ్డదిడ్డంగా ఉండటంతో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదు. సరైన రహదారులు, కాలువలు లేవు. దీంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

★ పుర పరిధి 20వ వార్డులోని శివాజీ నగర్ అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అధిక శాతం మంది ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. గత 25 ఏళ్లుగా నిర్మాణాలు పెరుగుతూ వస్తున్నాయి. ఇక్కడ సుమారు 3,000 మంది జనాభా ఉంటారు. ఆరంభం నుంచి ఇళ్ల నిర్మాణాలు అడ్డదిడ్డంగా చేపట్టడంతో ఇప్పుడు ఒక వీధి నుంచి మరో వీధికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. 8 అడుగుల వెడల్పు ఉన్న రహదారులు ఒక్కటీ లేదు.

శివాజీనగర్‌లో అధ్వానంగా ప్రధాన రహదారి

★ ఈ ప్రాంతం నుంచి పురపాలక సంఘానికి ఏటా రూ.లక్షల్లో పన్నులు వస్తున్నా సగం ప్రాంతాలకు రహదారులు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కల్పన జరగలేదు. వాడుక నీరంతా ఇళ్ల పరిసరాల్లోనే దర్శనమిస్తోంది. దీంతో దోమల బెడద అధికంగా ఉంటోంది. పారిశ్రామికవాడ రహదారి నుంచి శివాజీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పనులు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షం పడితే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

| పురపాలక సంఘం | పలాస కాశీబుగ్గ | వార్డులు | 31 | జనాభా | 64వేల మంది |
| --- | --- | --- | --- | --- | --- |

★ పలు వీధులకు విద్యుత్తు సౌకర్యం కూడా ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. ఈ ప్రాంతంలో జీడి కర్మాగారాలు సైతం ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న ఇలాంటి ప్రాంతాలపై పాలకులు, అధికారులు దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. దీనిపై పుర డీఈ కనకరాజు స్పందిస్తూ శివాజీనగర్ తదితర ప్రాంతాల్లోని పలు వీధుల్లో రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## జాతరకు శ్రీకారం..

చదురుగుడికి చేరుకున్న పెదపోలమాంబ

అమ్మవారి ఘటాన్ని తీసుకొస్తున్న పూజారి కుటుంబీకులు

మక్కువ, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ జాతరకు శ్రీకారం చుట్టారు. సోమవారం సాయంత్రం గ్రామంలోని నడిమి వీధిలో అమ్మవారి ఘటాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఆహ్వానం పలికారు. పూజారి కుటుంబీకుల పూజల అనంతరం మేళతాలాలతో చదురుగుడికి తీసుకొచ్చారు. మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు చేశారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

### అమ్మవారికి తొలి వేడుక..

ఏటా శంబర పోలమాంబ జాతరకు ముందు ఆమె మేనత్త అయిన పెద పోలమాంబకు పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో పెద్దమ్మవారిని గ్రామానికి తీసుకొచ్చి వారంపాటు పూజలు నిర్వహిస్తారు. జనవరి 5న తొలేళ్లు, 6న ప్రధాన ఉత్సవం, 7న అంపకోత్సవం చేపడతారు. జనవరి 12న పోలమాంబను గ్రామానికి తీసుకొస్తారు. రెండు వారాల పాటు పూజలుంటాయి. జనవరి 26న తొలేళ్లు, 27న సిరిమానోత్సవం, 28న అంపకోత్సవం ఉంటుంది. ట్రస్టుబోర్డ్ ఛైర్మన్ నైదాన తిరుపతిరావు, ఈవో శ్రీనివాస్, ఎంపీటీసీ టి.పోలినాయుడు, ఉప సర్పంచి అల్లు వెంకటరమణ, పూజారి కుటుంబీకులు, భక్తులు పాల్గొన్నారు.

ఈనాడు తమిళనాడు
మంగళవారం డిసెంబరు 30, 2025


## 101వ సారి రక్తదానం చేసిన సమాజ సేవకుడు

రక్తదానం చేస్తున్న అరుళ్ శ్రీనివాసన్

**వేలూరు, న్యూస్‌టుడే:** తమిళనాడుకు చెందిన సమాజ సేవకుడు 101వ సారి రక్తదానం చేసి మంచి మనసు చాటారు. తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపం విన్నమంగళం గ్రామానికి చెందిన అరుళ్ శ్రీనివాసన్ సమాజ సేవకుడు. ఆయన ఇప్పటివరకు 100 సార్లు రక్తాన్ని దానం చేశారు. తాజాగా సునామీ మృతుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని ఆంబూరులోని శృతి ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో 101వ సారి రక్తదానం చేశారు.

## జాలర్ల నిరవధిక సమ్మె

**ప్యారిస్, న్యూస్‌టుడే:** మండపం జాలర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. రామనాథపురం జిల్లా మండపం నార్త్ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లిన ఆమోస్టిన్, జోన్ దాస్, అన్‌రోస్‌లను సరిహద్దులు దాటి వచ్చారని ఆరోపిస్తూ శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలో అరెస్టు చేసిన జాలర్లను విడిపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ జాలర్ల సంఘాల తరఫున మండపం వద్ద సుమారు 1300 మంది మత్స్యకారులు సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు.

## కీళడిలో 11వ విడత తవ్వకాలకు అనుమతి

**ప్యారిస్, న్యూస్‌టుడే:** కీళడిలో 11వ విడత పురావస్తు తవ్వకాలకు కేంద్ర పురావస్తుశాఖ అనుమతించింది. శివగంగై జిల్లా కీళడిలో 10వ విడత తవ్వకాల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి తమిళనాడు పురావస్తుశాఖ సమర్పించిన నేపథ్యంలో ప్రస్తుతం 11వ విడత తవ్వకాలకు అనుమతి లభించింది. ఈ తవ్వకాల ద్వారా వైగై నదీ తీరంలో దాగి ఉన్న మిగిలిన రహస్యాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు చేశారు. కీళడి మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న కొందగై, అగరం, మణలూర్ తదితర ప్రాంతాల్లో విస్తృత పరిశోధనలు చేయనున్నారు. ఇప్పటివరకు జరిగిన తవ్వకాల్లో సుమారు 20 వేలకి పైగా పురాతన వస్తువులను గుర్తించారు.

## అలా ఆర్డర్.. ఇలా ఇంటికి!

- వేగంగా అందుతున్న 'ఆన్‌లైన్' ఉత్పత్తులు
- చెన్నైలో పెద్దఎత్తున నిల్వ కేంద్రాలు

ఈ-కామర్స్ మార్కెట్‌లో ఉత్పత్తుల్ని కొనేందుకు రాష్ట్రవాసులు అమితంగా ఆసక్తి చూపుతున్నారు. ఎంత వేగంగా ఆర్డర్ ఇంటికొస్తే అంత మేలు అనే తరహాలో వినియోగదారులు మారుతున్నారు. 10 నిమిషాల నుంచి 30 నిమిషాల్లో ఉత్పత్తులు చేరేలా ఈ-కామర్స్ స్థావరాలు ఏర్పాటయ్యాయి. ఈ కోణంలో దేశంలోనే చెన్నై, ఇతర ద్వితీయ, తృతీయస్థాయి నగరాలు దూసుకెళుతున్నాయి. **- ఈనాడు-చెన్నై**

ఆన్‌లైన్ ఆర్డర్లను వేగంగా అందించేందుకు ఏర్పాటయ్యే ఉత్పత్తుల నిల్వ, సరఫరా కేంద్రాల్ని డార్క్ స్టోర్లుగా పిలుస్తున్నారు. ఇలాంటివి తమిళనాడు వ్యాప్తంగా 262 ఉన్నాయి. ఒక్క చెన్నైలోనే 190కి మించి ఏర్పాటయ్యాయి. ఇంతపెద్ద ఎత్తున ఈ-కామర్స్ సంస్థల కేంద్రాలు ఏర్పాటవడంలో రాష్ట్రం బాగా ముందుంది. తొలి రెండు స్థానాల్లో మహారాష్ట్ర, కర్ణాటక ఉండగా.. మూడోస్థానంలో తమిళనాడు నిలిచింది. తాజాగా సావిల్స్ ఇండియా జరిపిన సర్వేలో ఇది తేలింది.

### టాప్ నగరాల్లో..

అక్టోబరు మాసానికి డార్క్ స్టోర్‌ల విస్తీర్ణం ఒక్క చెన్నై నగరంలోనే 10లక్షల చ.అడుగులుగా ఉన్నట్లు నివేదికలో వివరించారు. ఒక్కో కేంద్రం సగటున 5,300 చ.అ మేర ఏర్పాటైంది. ప్రతి 1000 మంది జనాభాకు 80చ.అ మేర విస్తీర్ణంలో కేంద్రాలు ఏర్పాటై ఉత్పత్తులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. బెంగళూరులో ఇది 150చ.అ.గా ఉంది. భవిష్యత్తులో చెన్నై మరింతగా ముందుకెళ్తుందనే అంచనాలున్నాయి. మరోవైపు అత్యంత వేగంగా ఈ కేంద్రాల ఏర్పాటు జరుగుతున్న ద్వితీయ, తృతీయ నగరాలు చూస్తే.. టాప్-10లో తిరుప్పూర్, కోయంబత్తూర్ ఉండగా, టాప్ 10-20లో తిరుచ్చి, ఈరోడ్.. టాప్ 20-50లో మదురై, సేలం, వేలూర్, కరూర్ ఉన్నాయి.

### ఎంత ఉపయోగమంటే..

వినియోగదారులు వెతికే ఉత్పత్తుల్లో ఏవేవి తక్కువ వ్యవధిలో అందించగలరో.. ఆయా కామర్స్ సంస్థలు ఆన్‌లైన్‌లో ప్రకటిస్తున్నాయి. వాటి ఆధారంగా లొకేషన్ ప్రాధాన్యంగా ఆర్డర్స్ ఇస్తున్నారు. ఇలా వచ్చిన ఆర్డర్.. స్థానికంగా వారి చిరునామా ఆధారంగా దగ్గర్లోని డార్క్ స్టోర్‌కు అనుసంధానమై వెంటనే డెలివరీ అయ్యేందుకు దోహదపడుతోంది. ఈ కేంద్రాల పరిధిలో ప్రాంతాలవారీగా మైక్రో మార్కెట్లు వెలుస్తున్నాయి. ఇక్కడ ప్రత్యేకించి డెలివరీ సిబ్బంది అందుబాటులో ఉంటారు. డార్క్ స్టోర్ నుంచి ఈ మైక్రో మార్కెట్‌కు ఉత్పత్తి రాగానే అక్కడి సిబ్బంది వేగంగా అందించేలా ఏర్పాట్లు ఉన్నాయి. 30 నిమిషాల్లోనే డెలివరీ చేస్తున్నారని చెబుతున్నారు.

### 10 నిమిషాల్లోనే ఇచ్చేలా..

ఫ్లిప్‌కార్ట్ సంస్థ మరో అడుగు ముందుకేసి తమ ఆర్డర్లను 10 నిమిషాల్లోనే చేరవేస్తామని చెబుతోంది. ఇందుకోసం చెన్నై నగరంలోని 22 కీలక ప్రాంతాల్ని ఎంపికచేసింది. వేలచ్చేరి, రాయపేట్టై, పెరంబూర్, సైదాపేట్, ఆవడిలాంటి బిజీ ప్రాంతాలు ఇందులో ఉన్నాయి. నిత్యావసర సరకులు, మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులతో పాటు ఆవిన్, ఆరోక్య, హట్సన్ లాంటి పేరుగాంచిన పాల ఉత్పత్తులు ఈ కేంద్రాల్లో ఉంచుతోంది.

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుని చెన్నై టీనగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయాన్ని పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన దృశ్యం

## అన్బుమణికి ఏం తక్కువ చేశాను?

- చిల్లర వ్యక్తులతో కలిసి అవమానిస్తున్నారు
- పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్

**టీనగర్, సేలం, న్యూస్‌టుడే:** పాట్టాలి మక్కల్ కట్చి(పీఎంకే)కి చెందిన 95 శాతం మంది తన పక్షానే ఉన్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు. మంగళవారం సేలంలో జరిగిన పార్టీ కార్యవర్గ, సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఏ తండ్రికీ రాకూడని పరిస్థితి తనకు వచ్చిందన్నారు. అన్బుమణికి ఏం తక్కువ చేశాను, తాను పదవులపై ఆశ పడలేదని, దునే ఆయన ఆ స్థాయికి వెళ్లగలిగారని తెలిపారు. ఇప్పుడు కొందరు చిల్లర వ్యక్తులతో కలిసి తనను అవమానిస్తున్నారని, తనను చంపేయాలని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారికి ఆయన పదవులు ఇస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. పీఎంకే కార్యకర్తలు ఉన్నంత వరకు తనకు భయంలేదని, వారిని తలచుకుని తాను నిద్ర పోతున్నానన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయవంతమైన కూటమి ఏర్పాటు చేస్తానని చెప్పారు. అన్బుమణి వెనుక ఐదు శాతం మంది కూడా లేరని, కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ఆయన డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో అన్బుమణికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

కన్నీళ్లు పెట్టుకున్న రామదాస్‌ను ఓదార్చుతున్న కుమార్తె శ్రీకాంతి

### పసుమై తాయగం అధ్యక్షురాలిగా..

పీఎంకే అనుబంధ సంస్థ 'పసుమై తాయగం' నూతన అధ్యక్షురాలిగా రామదాస్ కుమార్తె శ్రీకాంతి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆ పదవిలో ఉన్న అన్బుమణి భార్య సౌమ్య అన్బుమణిని తొలగిస్తూ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

### ఆయనకు పదవులు ఎలా వచ్చాయి?

రామదాస్ 40 ఏళ్ల కృషితో పీఎంకే ఏర్పడిందని, ఆ పార్టీపై ఆయనకు తప్ప మరెవరికీ హక్కు లేదని శ్రీకాంతి తెలిపారు. ఈ రోజు పార్టీపై హక్కు కోరుతున్న అన్బుమణికి పదవులు ఎలా వచ్చాయని, రామదాస్ లేకపోతే ఆయనకు గుర్తింపు ఎక్కడ ఉంటుందని నిలదీశారు. అధికారం కావాలంటే అన్బుమణి కొత్త పార్టీ పెట్టుకోవాలన్నారు. 25 కంటే ఎక్కువ మంది సభ్యులతో తాము అసెంబ్లీలోకి అడుగుపెడతామని ధీమా వ్యక్తం చేశారు.

**పార్టీ అధ్యక్షుడిగా...** సర్వసభ్య సమావేశంలో రామదాస్‌ను పార్టీ అధ్యక్షుడిగా, జీకే మణి గౌరవ అధ్యక్షుడిగా, శ్రీకాంతి(గాంధీమతి) పరశురాన్‌ను కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాబోయే ఎన్నికల్లో పొత్తులపై నిర్ణయం తీసుకునే పూర్తి అధికారాన్ని రామదాస్‌కు కట్టబెడుతూ మొత్తం 27 తీర్మానాలు ఆమోదించారు.

## మహిళా శక్తితో మళ్లీ అధికారంలోకి వస్తాం: సీఎం స్టాలిన్

సభకు వస్తూ అభివాదం చేస్తున్న సీఎం స్టాలిన్

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** మహిళా శక్తితో డీఎంకే మళ్లీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. డీఎంకే మహిళా విభాగ మహానాడు తిరుప్పూర్ జిల్లా పల్లడంలోని కారనాంపేట్టైలో 'వెల్లుం తమిళ్ పెన్గల్' పేరిట సోమవారం సాయంత్రం జరిగింది. స్టాలిన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమ పార్టీ మేనిఫెస్టోనే కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈసారి మేనిఫెస్టో తయారీ బాధ్యత కనిమొళికి అప్పగించామన్నారు. మహిళలకు పార్లమెంట్, అసెంబ్లీలో రిజర్వేషన్లు అందించేందుకు భాజపాకు ఇష్టం లేదని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. మహిళా మహానాడును చూసి భాజపా, అన్నాడీఎంకేలకు నిద్ర ఉండదన్నారు. ఆత్మవిశ్వాసం కలిగిన ఈ మహిళా విభాగం ఉన్నంత వరకు తమిళనాడులోకి వాళ్లు చొరబడలేరన్నారు. అమిత్‌షా కలలు రాష్ట్రంలో ఎప్పటికీ ఫలించవని చెప్పారు. తమిళనాడు ఎప్పుడూ దిల్లీకి ఔట్ ఆఫ్ కంట్రోల్‌లోనే అన్నారు. ద్రావిడ మోడల్ 2.0 ద్వారా రాష్ట్రంలో మరిన్ని పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఎంపీ కనిమొళి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు, సామాజిక న్యాయాన్ని కాపాడగలిగిన ఒకే ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. మహిళా విభాగం తరఫున భారత రాజ్యాంగ పుస్తకప్రతిని జ్ఞాపికగా ముఖ్యమంత్రికి అందించారు.

స్టాలిన్‌కు రాజ్యాంగ పుస్తకప్రతిని అందిస్తున్న మహిళా విభాగం ప్రతినిధులు

## స్టాలిన్ కట్టుకథలు జనం నమ్మరు

అభివాదం చేస్తున్న ఎడప్పాడి పళనిసామి

**మామల్లపురం, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వ పాలన మరో 3 అమావాస్యల్లో ముగుస్తుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి పేర్కొన్నారు. చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూర్ నియోజకవర్గం కేళంబాక్కంలో పార్టీ ప్రచారసభ నిర్వహించారు. ఎడప్పాడి పళనిసామి మాట్లాడుతూ డీఎంకేను ఎదుర్కొనేందుకు ఎంజీఆర్ అన్నాడీఎంకేను స్థాపించారని, ఆయనబాటలోనే జయలలిత కూడా దుష్టశక్తిగా వ్యతిరేకిస్తూ వచ్చారు. అన్నాడీఎంకే పాలనలో హామీలను 95 శాతం నెరవేర్చామని, డీఎంకే మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 5 శాతం మాత్రమే నెరవేర్చిందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంపై స్టాలిన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఆయన కట్టుకథలను జనం నమ్మరని తెలిపారు. ఎమ్మెల్యే మరకదం కుమరవేల్ పళనిసామికి జ్ఞాపిక అందించారు. భాజపా నేత తమిళిసై సౌందరరాజన్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### శాశ్వత డీజీపీని నియమిస్తేనే ప్రజలకు భద్రత

**సైదాపేట:** శాశ్వత డీజీపీని నియమిస్తేనే ప్రజలకు భద్రత లభిస్తుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తెలిపారు. చెన్నై శోలింగనల్లూరు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచార సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... డీఎంకే పాలనలో ఎవరికీ భద్రత లేదని విమర్శించారు. శాంతిభద్రతల డీజీపీని కూడా నియమించలేని చేతకాని ప్రభుత్వం ప్రస్తుతం పాలన సాగిస్తోందన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని 2026 ఎన్నికల్లో ప్రజలు ఇంటికి పంపుతారని పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. * వచ్చే ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున పోటీకి దరఖాస్తుల పంపిణీ సోమవారం కూడా కొనసాగింది. పలువురు నిర్వాహకులు దరఖాస్తులు తీసుకున్నారు.

శోలింగనల్లూరు సమావేశానికి తరలివచ్చిన కార్యకర్తలు, ప్రజలు

## పవర్‌లిఫ్టింగ్‌లో పతకాల మోత

- రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన మహిళలు

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** వారంతా పాఠశాల, కళాశాల విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులు. శరీర ఆరోగ్యానికి, బరువు తగ్గించుకునేందుకు చెన్నై మైలాపూర్‌లోని ఫిట్‌నెస్ ప్యారడైస్ అనే జిమ్‌లో చేరారు. చెన్నై జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ తరఫున తొలిసారిగా రాష్ట్రస్థాయిలో మహిళలు పవర్‌లిఫ్టింగ్, డెడ్‌లిఫ్ట్ పోటీలు ఇటీవల జరిగాయి. పోటీల్లో ఆ జిమ్‌కు చెందినవారు 29 పతకాలు కైవసం చేసుకున్నారు. ఇందులో 11 బంగారు, 12 వెండి, 6 కాంస్య పతకాలు ఉన్నాయి.

### రెండు విభాగాల్లో..

ఆరునెలలుగా శిక్షణ తీసుకుంటున్నాను. శరీర బరువు తగ్గించుకోవడానికి ఇక్కడికి వచ్చాను. ఆ తర్వాత పోటీ గురించి తెలియడంతో సాధన కొనసాగించాను. రాష్ట్రస్థాయిలో సబ్‌జూనియన్ విభాగంలో పవర్‌లిఫ్టింగ్ అండ్ డెడ్‌లిఫ్ట్ రెండింటిలోనూ బంగారు పతకం సాధించడం సంతోషంగా ఉంది. జాతీయస్థాయిలో పతకం సాధించాలి. **-స్మిత, 12వ తరగతి విద్యార్థిని**

### వెన్ను నొప్పి భరించి..

తనూజ

ఐటీలో ఉద్యోగం చేస్తున్న తనూజ పవర్‌లిఫ్టింగ్‌లో జూనియర్, సీనియర్ విభాగాల్లో వెండి, డెడ్‌లిఫ్ట్‌లో బంగారం గెలిచారు. చదువుకుంటూనే ఉద్యోగం చేస్తున్న షాలిని బంగారు పతకం సాధించారు. గృహిణిగా ఉన్న 42ఏళ్ల అనూజ వెన్నునొప్పిని భరించి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని నాలుగు పతకాలు దక్కించుకున్నారు.

### అమ్మతో కలిసి..

శిక్షణకు వచ్చినప్పుడు జిమ్ నిర్వాహకుడు పవర్‌లిఫ్టింగ్ గురించి వివరించి ప్రోత్సహించారు. నాతోపాటు అమ్మ కామాక్షి కూడా పవర్‌లిఫ్టింగ్‌కు వచ్చారు. చెన్నై జిల్లాస్థాయిలో డెడ్‌లిఫ్ట్ పోటీలో పాల్గొని బంగారు పతకం గెలిచాను. ఇప్పుడు జూనియర్ విభాగంలో పవర్‌లిఫ్టింగ్, డెడ్‌లిఫ్ట్ రెండింటిలోనూ బంగారు, సీనియర్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. అమ్మ 95 కిలోల డెడ్‌లిఫ్ట్‌లో వెండి పతకం సాధించారు. **- దీక్ష, ఐటీ ఉద్యోగిని**

### ప్రోత్సహిస్తున్నా..

ఇక్కడికి బరువు తగ్గాలని వచ్చే మహిళలు బరువులు ఎత్తేందుకు ఆసక్తి చూపుతుంటారు. కొంతమంది కండరాలు దెబ్బతింటాయని భయపడేవాళ్లు. ఫిట్‌నెస్ శిక్షణతోపాటు పవర్‌లిఫ్టింగ్‌ను కూడా ప్రోత్సహిస్తున్నాం. సబ్‌జూనియర్, జూనియర్ విభాగంలో ధ్రువీకరణపత్రం, పతకం పొందితే కళాశాల స్పోర్ట్స్ కోటాలో చేరేందుకు, జాతీయస్థాయిలో విజేతలుగా నిలిస్తే ఉద్యోగవకాశాలు కూడా లభిస్తాయి. 26 ఏళ్లుగా జిమ్ నడుపుతున్నాను. నా సతీమణి హేమ, స్నేహితుడు ఆనంద్ సాయంగా ఉండి శిక్షణ ఇస్తున్నారు. **- మహదేవన్, జిమ్ నిర్వాహకుడు**

## బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు ఫోన్ మాట్లాడకూడదు

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు ఫోన్ మాట్లాడకూడదని చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(ఎంటీసీ) ఆదేశించింది. పాఠశాల విద్యార్థులను సురక్షితంగా తీసుకెళ్లాలని, దివ్యాంగులు ఎక్కేటప్పుడు, దిగే సమయంలో సహకరించాలని, వారికి కేటాయించిన సీట్లలో కూర్చోబెట్టాలని సంస్థ ప్రకటనలో సూచించింది. బస్సు నడిపేటప్పుడు తమ ఫోన్లను డ్రైవర్లు కండక్టర్లకు అప్పగించాలని పేర్కొంది. బస్సులో పాటలు వినడానికి కూడా డ్రైవర్లు సెల్‌ఫోన్ ఉపయోగించకూడదని తెలిపింది.

## అదనపు సీట్లు వస్తే ఆనందమే

ఎంపీ దురై వైగో

**ప్యారిస్, న్యూస్‌టుడే:** డీఎంకే కూటమిలో అదనపు సీట్లు లభిస్తే సంతోషమే అని ఎంపీ దురై వైగో తెలిపారు. నాగర్‌కోవిల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమకు ఎన్ని సీట్లు అనేది ముఖ్యం కాదని, రాష్ట్రంలో మతవాద శక్తులు ఎదగకూడదన్నారు. కుల, మత ఘర్షణలు ఏర్పడే పరిస్థితి రాకూడదని తొమ్మిదేళ్లుగా డీఎంకే కూటమిలో ఉన్నట్లు చెప్పారు. తగిన సీట్లను డీఎంకే కేటాయిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ భాజపా, అన్నాడీఎంకే కూటమిలో చేరరని, అందుకు అవకాశమే లేదన్నారు. ఆయన మొదటి నుంచే మతవాద శక్తులకు వ్యతిరేకంగా ఉన్నారన్నారు.

## ఆలయాల్లో మొదటి గౌరవం భగవంతుడికే: హైకోర్టు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** ఆలయాల్లో మొదటి గౌరవం భగవంతుడికే ఇవ్వాలని మద్రాసు హైకోర్టు తెలిపింది. కాంచీపురం దేవరాజస్వామి ఆలయంలో తమ ఆశ్రమ మఠాధిపతికి 1992 నుంచి అందిస్తున్న పంచముద్ర మొదటి గౌరవాన్ని 2023 నుంచి నిలిపేయడాన్ని సవాలు చేస్తూ శ్రీరంగం శ్రీమత్ ఆండవన్ ఆశ్రమం తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తులు ఎస్.ఎం.సుబ్రమణియం, జస్టిస్ కుమరప్పన్ ధర్మాసనం విచారించింది. దేవాదాయశాఖ తరఫున.. కాంచీపురం కామకోటి పీఠం, శంకర మఠం, శ్రీఅహోబిల మఠం, నాంగునేరి శ్రీవాణామలై మఠం, మైసూర్ శ్రీపరకాల జీయర్ మఠం, ఉడుప్పి శ్రీ వ్యాసరాయర్ మఠం తదితర మఠాధిపతులకు మాత్రమే ప్రత్యేక గౌరవం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయాల్లో మొదటి గౌరవం ఎప్పుడూ భగవంతుడికే ఇవ్వాలని, మఠాధిపతులకు ప్రత్యేక గౌరవాన్ని ఎప్పటికీ హక్కుగా కోరడం కుదరదని అనంతరం న్యాయమూర్తులు తెలిపారు. పిటిషన్‌ను ముగించేస్తూ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. మఠాధిపతులకు గౌరవం ఇవ్వడంపై దేవాదాయశాఖ చట్ట ప్రకారం సంబంధిత అధికారులే నిర్ణయం తీసుకోవాలన్నారు.

## ఓపీఎస్ పయనమెటు?

- టీవీకేతో కూటమికి మద్దతుదారుల ఆసక్తి
- త్వరలో నిర్ణయం తీసుకోనున్న ఒ.పన్నీర్‌సెల్వం

**సైదాపేట, న్యూస్‌టుడే:** మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కళగం సమన్వయకర్త ఒ.పన్నీర్‌సెల్వం రాబోయే ఎన్నికల్లో ఎటువైపు వెళ్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఎడప్పాడి పళనిసామి ఉన్నంత వరకు అన్నాడీఎంకేలో చేరే ప్రసక్తే లేదని, 2026 ఎన్నికల్లో ఈపీఎస్‌కు తగిన గుణపాఠం చెబుతానని ఆయన తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎవరి వెంట నడుస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

### తక్కువ సీట్ల కేటాయింపుతో..

భాజపా తమిళనాడు ఎన్నికల ఇన్‌చార్జి పీయూష్ గోయెల్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ఇటీవల భేటీ అయిన సంగతి తెలిసిందే. టీటీవీ దినకరన్‌కు 6 సీట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చిన ఈపీఎస్, ఓపీఎస్‌కు 3 స్థానాలు కేటాయిస్తానని చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఇది తెలిసి ఓపీఎస్ దిగ్భ్రాంతి చెందినట్లు తెలిసింది. అన్నాడీఎంకే వెంట వెళ్లనని చెప్పడానికి ఇది కూడా ఓ కారణమని సమాచారం.

### విజయ్ వైపు మొగ్గు..

ఓపీఎస్ నేతృత్వంలో ఇటీవల జరిగిన కళగం సమావేశంలో 80 మంది జిల్లా కార్యదర్శులు, 60 మంది రాష్ట్ర నిర్వాహకులు పాల్గొన్నారు. వారిలో 90 శాతం మంది తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో కూటమి ఏర్పాటు చేయాలని చెప్పినట్లు తెలిసింది. అదే సమయంలో కొందరు డీఎంకేతో జట్టు కడితే రాజకీయ భవిష్యత్తు బాగుంటుందని చెప్పినట్లు సమాచారం. ఎక్కువ మంది ఆసక్తి మేరకు టీవీకేతో పొత్తుకు ఓపీఎస్ సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. అందులో భాగంగానే అన్నాడీఎంకేలో చేరే ప్రసక్తే లేదని ప్రకటించినట్లు చెబుతున్నారు. త్వరలో విజయ్‌తో కూటమి చర్చలు జరిపి 38 సీట్లు కోరే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. పొంగల్ సమయానికి ఒ.పన్నీర్‌సెల్వం రాజకీయ భవిష్యత్తు, కూటమి వ్యవహారాలు స్పష్టతకు వస్తాయని రాజకీయ విశ్లేషకుల అంచనా.

## కొనసాగిన ఉపాధ్యాయుల ఆందోళన

**ప్యారిస్, న్యూస్‌టుడే:** సెకండరీ స్కూల్ టీచర్ల ఆందోళన సోమవారం నాలుగోరోజుగా కొనసాగింది. మెరినా కామరాజర్ సాలైలో ర్యాలీగా వెళ్తున్న టీచర్లు, పోలీసుల మధ్య తోపులాట ఏర్పడింది. పోలీసులు ర్యాలీని అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వారిని పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు.

ఉపాధ్యాయినిని అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు

## విజయ్‌ను సీఎంగా అంగీకరించేవారు కూటమిలో చేరొచ్చు

**కోయంబత్తూర్, న్యూస్‌టుడే:** విజయ్‌ను ముఖ్యమంత్రిగా అంగీకరించేవారు మాత్రమే కూటమిలో చేరగలరని టీవీకే కార్యనిర్వాహక కమిటీ ప్రధాన సమన్వయకర్త సెంగోట్టైయన్ తెలిపారు. సోమవారం కోయంబత్తూర్ విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జననాయగన్' సినిమా ఆడియో ఆవిష్కరణ మలేషియానే ఆశ్చర్యపరిచేలా జరిగిందన్నారు. జనవరి మొదటివారానికి తమ కూటమిలో ఎవరు చేరుతారో తెలుస్తుందన్నారు.

## ప్రముఖ నిర్మాత ఎస్.కృష్ణస్వామి కన్నుమూత

**చెన్నై, న్యూస్‌టుడే:** డాక్యుమెంటరీ, బుల్లితెర చిత్రాల నిర్మాత, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎస్.కృష్ణస్వామి (87) గుండె సంబంధిత సమస్యతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయనకు కుమార్తెలు లత, గీత, కుమారుడు భరత్ ఉన్నారు. ప్రముఖ సినీ దర్శకుడు కె.సుబ్రమణియం, గాయని మీనాక్షి సుబ్రమణియం దంపతులకు చెన్నైలో 1937లో కృష్ణస్వామి జన్మించారు. 1960లో అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో డాక్యుమెంటరీ చిత్రాలకు సంబంధించిన విద్యను అభ్యసించారు. 1963లో కృష్ణస్వామి అసోసియేట్స్ పేరిట నిర్మాణ సంస్థను ప్రారంభించారు. సింధు నాగరికత నుంచి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కాలం వరకు ఉన్న సుమారు 5వేల ఏళ్ల భారతదేశ సుదీర్ఘ చరిత్రను, రాజకీయ మార్పులను వివరించేలా 'ఇండస్ వ్యాలీ టు ఇందిరాగాంధీ' అనే డాక్యుమెంటరీ చలనచిత్రాన్ని నిర్మించారు. ఇది 1976 డిసెంబరులో విడుదలైంది. కంచి మఠం గురించి వివరించేలా 'జయశంకర (1991), పలు మతాల్లోని భావసారూప్యతను వివరించి ప్రజల్లో సోదరభావం, అవగాహన పెంపొందించేలా 'తొడర్బాన్(1992)' వంటి చిత్రాలనూ నిర్మించారు. 1987లో హవాయి నగరంలోని వాటుముల్ ఫౌండేషన్ నుంచి 'హానర్ సమ్మస్' పురస్కారం, 2005లో లాస్ ఏంజెల్స్‌లోని అమెరికన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ అండ్ వీడియో వేడుకల్లో జీవిత సాఫల్య పురస్కారం, 2020లో ముంబయి అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో డాక్టర్ వి.శాంతారామ్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. 2009లో పద్మశ్రీ పురస్కారంతో ఆయన్ను భారత ప్రభుత్వం సత్కరించింది. దర్శక దిగ్గజం సత్యజిత్ రేకు ఆయన సన్నిహితుడు. ఆయన మృతికి కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం, పలువురు సినీరంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

(c) eenadu

## తమిళుల చరిత్రను దాచి పెడుతున్న ఉత్తర భారతీయులు

**మంత్రి ఈవీ వేలు**

మాట్లాడుతున్న ఈవీ వేలు

**వేలూరు, న్యూస్‌టుడే:** ఉత్తర భారతీయులు తమిళుల చరిత్రను దాచి పెడుతున్నారని రాష్ట్ర మంత్రి ఈవీ వేలు ఆరోపించారు. తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపం మోతుకొల్లై ప్రాంతంలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తరఫున సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ఈవీ వేలు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఉత్తర భారతీయులు తమిళుల చరిత్రను దాచి పెడుతున్నారని, స్టాలిన్ అధికారంలోకి వచ్చినప్పుడు మొదటి ప్రయత్నంగా తమిళుడు ఎవరో ప్రపంచానికి చాటడానికి కృషి చేశారన్నారు. దక్షిణాదిన ఆదిత్య నల్లూరు, శివగంగై, కొర్కై, కిజాడి వంటి ప్రదేశాలలో పురావస్తుశాఖ నిర్వహించిన అధ్యయనంలో 5,300 సంవత్సరాల క్రితమే తమిళులు ఇనుప కత్తులను తయారుచేసి ఉపయోగించారని తెలిసిందన్నారు. దీన్నిబట్టి మన నాగరికత ఎంత పురాతనమైందో అందరూ ఆలోచించాలని కోరారు.

## ఐఐటీఎంతో బెంగళూరు ఐఏఎఫ్ ఒప్పందం

ఒప్పందపత్రాలతో వి.కామకోటి, ఎంజే శంకర్ రామన్, ఆర్.గురుహరి తదితరులు

**వడపళని, న్యూస్‌టుడే:** బెంగళూరులోని భారత వైమానిక దళం(ఐఏఎఫ్) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్‌డీఐ) ఎయిర్‌బోర్న్ అప్లికేషన్ల కోసం ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఐఐటీ డైరెక్టర్, ఆచార్యులు వి.కామకోటి, ప్రవర్తక్ టెక్నాలజీస్ సీఈఓ డాక్టర్ ఎంజే శంకర్ రామన్, ఎస్‌డీఐ కమాండెంట్ ఎయిర్ వైస్ మార్షల్ ఆర్.గురుహరి ఒప్పంద పత్రాలు మార్చుకున్నట్లు ఐఐటీఎం సోమవారం ప్రకటనలో పేర్కొంది. కామకోటి మాట్లాడుతూ జాతీయ భద్రతను బలోపేతం చేసే అత్యాధునిక, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో భారత్‌ను శక్తివంతం చేయగలదన్నారు.

## బూజు తెగులుతో నష్టపోతున్న వరి రైతులు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** అందియూర్ జిల్లాలోని మైఖేల్‌పాళయం, పుదుపాలయం, శంకరప్పాళయం, ఎన్నమంగళం, చిన్నతంబిపాళయం, అత్తాని, వట్టక్కాడు, తోణిమడువు తదితర ప్రాంతాల్లో వరి ఎక్కువగా సాగు చేశారు. గత రెండు వారాలుగా మంచు తీవ్రత అధికమైంది. దీంతో తోణిమడువు, వట్టక్కాడు ప్రాంతాలలో వరి పైరుకు బూజు తెగులు ఆశించింది. మొక్క అడుగు భాగం గోధుమ రంగుకు మారడంతో పాటు ఆకులు ఎండిపోయాయి. మొత్తం విస్తీర్ణంలో 30శాతం ఈ తెగులు బారినపడిందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖాధికారులు పంటలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

**టీనగర్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రాలు వైకుంఠ ఏకాదశి వేడుకలకు ముస్తాబవుతున్నాయి. 30న ఉత్తరద్వార దర్శనం కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుచ్చి శ్రీరంగంలోని రంగనాథ స్వామి ఆలయంలో 22 రోజుల పాటు కొనసాగే వైకుంఠ ఏకాదశి వేడుకలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పగల్ పత్తు(పగటి వేడుకలు) జరుగుతున్నాయి. ఏకాదశి రోజున నంపెరుమాళ్‌గా పేర్కొంటున్న ఉత్సవమూర్తి రత్నాంగిగా, మూల విరాట్ ముత్తంగిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 4.45కు పరమపద వాసల్(వైకుంఠ ద్వారం) తెరుచుకోనుంది.

చెన్నై తిరువళ్లిక్కేణిలోని పార్థసారథి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు

### మీసై పెరుమాళ్ సన్నిధిలో..

చెన్నైలోని చారిత్రక తిరువళ్లిక్కేణి శ్రీపార్థసారథి స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు చెన్నై నగర పోలీసు కమిషనర్ పర్యవేక్షణలో సుమారు 600 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా షెడ్లు, తాగునీరు, వైద్య శిబిరాలను సిద్ధం చేశారు. తెల్లవారుజామున 4.30కు ఉత్తరద్వార దర్శనం ప్రారంభమవనుంది. గంభీరమైన మీసకట్టుతో అలరారే మీసై పెరుమాళ్‌ను ఉత్తరద్వారం గుండా దర్శించుకోవడం ఇక్కడి విశేషం.

### టీనగర్ తితిదే ఆలయంలో..

చెన్నై టీనగర్ వెంకటనారాయణ రోడ్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తిరుమల తరహాలోనే వైకుంఠ ఏకాదశి నాడు వైకుంఠ ద్వారాన్ని ధనుర్మాస పూజల అనంతరం తెరుస్తారు. పుష్పాలతో ఆలయ ముఖద్వారం, గర్భాలయం, వైకుంఠద్వారాన్ని అత్యంత సుందరంగా అలంకరిస్తారు.

### ప్రత్యేక ఏర్పాట్లు..

కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయాన్ని వేలాదిమంది భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. మదురైలోని అళగర్ కోయిల్, తంజావూరులోని నాచ్చియార్ కోయిల్, శ్రీవిల్లిపుత్తూర్‌లోని ఆండాళ్ అమ్మవారి ఆలయం, కుంభకోణంలోని సారంగపాణి ఆలయం, ఒప్పిలియప్పన్ ఆలయం, తిరువళ్లూర్ జిల్లాలోని వీరరాఘవ స్వామి ఆలయం, చెన్నై శివారులోని తిరునీర్‌మలై, తిరువిడందైలోని పెరుమాళ్ ఆలయాల్లోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఖైదీలు తయారుచేసిన తోలు చెప్పులకు గిరాకీ

**వేలూరు, న్యూస్‌టుడే:** వేలూరు కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు పలు డిజైన్లలో తోలు చెప్పులను తయారు చేస్తున్నారు. వాటికి గిరాకీ పెరిగిందని జైలు అధికారులు చెబుతున్నారు. ఐటీ ఉద్యోగుల నుంచి ఆదరణ కనబడుతోందని తెలిపారు. ప్రస్తుతం ఖైదీలు 15 డిజైన్లలో తయారు చేస్తున్నారని, ఇటీవల చెన్నైలో జరిగిన ఓ ప్రదర్శనలో స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించారని చెప్పారు. అదేవిధంగా మహిళలకు కూడా వివిధ డిజైన్లలో తయారు చేస్తున్నారని, బెల్టులు, పర్సులు, తోలు సంచులు, ల్యాప్‌టాప్ బ్యాగులు వంటివీ తయారు చేసి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జైళ్లను శిక్షా స్థలాలుగా కాకుండా సంస్కరణ పాఠశాలలుగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ముఖ్యంగా ఖైదీలు విడుదలైన తర్వాత స్వయం ఉపాధి పొందేవిధంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

## శ్రీరంగనాథస్వామి సేవలో కేంద్ర మంత్రి జైశంకర్

ఆలయ ప్రాంగణంలో జైశంకర్ తదితరులు

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** తిరుచ్చి శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ సోమవారం సందర్శించారు. ఆదివారం సాయంత్రం కుటుంబంతో కలిసి బెంగళూర్ నుంచి విమానంలో తిరుచ్చికి విచ్చేశారు. సోమవారం ఉదయం తిరుచ్చి తిరువానైక్కావల్ జంబుకేశ్వస్వామిని, అనంతరం శ్రీరంగనాథస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం తరఫున స్వాగతం పలికి దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

## 'ప్రవీణ్ చక్రవర్తి అభిప్రాయం తప్పు'

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** తమిళనాడుపై అధిక రుణభారం ఉందన్న ప్రొఫెషనల్స్ కాంగ్రెస్, డేటా అనలిస్ట్ ప్రవీణ్ చక్రవర్తి అభిప్రాయాన్ని కరూర్ ఎంపీ జ్యోతిమణి ఖండించారు. ఆమె తన ఎక్స్‌లో.. రాష్ట్రాన్ని ఉత్తరప్రదేశ్‌తో పోల్చడం సరికాదన్నారు. రాష్ట్రం తీసుకుంటున్న రుణాలను విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, సామాజిక న్యాయం, నగర ప్రాంతాల మౌలిక సదుపాయాలకు ఉపయోగిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు కూడా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. తమిళనాడు పన్నులలో ప్రధాన వాటాదారు. కానీ, అధికార వికేంద్రీకరణలో చాలా తక్కువ పొందుతోందని, అదే సమయంలో యూపీ లాంటి రాష్ట్రాలు గణనీయంగా ఎక్కువ పొందుతున్నాయని ఎత్తిచూపారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఉదయనిధి స్టాలిన్

## గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన

**సైదాపేట, న్యూస్‌టుడే:** చెన్నై హార్బర్ నియోజకవర్గంలోని బ్రాడ్వే ప్రకాశం రోడ్డులో చెన్నై మహానగర పాలక సంస్థ తరఫున ఏర్పాటు చేసిన వీధి దీపాలను ఆదివారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించారు. అదేవిధంగా సీఎండీఏ తరఫున రూ.23.06 కోట్లతో అత్యాధునిక గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సీఎండీఏ ఛైర్మన్, మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## వలల్లో చిక్కుతున్న విష సర్పాలు

**ఆందోళన చెందుతున్న జాలర్లు**

వలల్లో చిక్కిన పాములు

**మామల్లపురం, న్యూస్‌టుడే:** చేపల వేటకు వెళ్లే జాలర్ల వలల్లో సముద్రపు సర్పాలు, ఇతర విష కీటకాలు చిక్కుతుండటంతో జాలర్లు ఆందోళన చెందుతున్నారు. చెంగల్పట్టు జిల్లా మత్స్యకారులు గానాత్తూర్ నుంచి ఇడైక్కళినాడు పట్టణ పంచాయతీ సమీపం ఆలంబరై కుప్పం వరకు చేపల వేట కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. సముద్రపు తాబేళ్లు సంతానోత్పత్తి కోసం డిసెంబరు నుంచి గుడ్లు పెట్టడానికి తీర ప్రాంతాలను చేరుకుంటున్నాయి. ఈ సంతానోత్పత్తి ఫిబ్రవరి వరకు ఉంటుంది. అలా తీరానికి వచ్చే తాబేళ్లు జాలర్ల వలల్లో చిక్కుతూ పడవలు ఢీకొని మృతి చెందుతున్నాయి. ఇదిలా ఉండగా ఏడాది చివరి రోజుల్లో సముద్రపు పాములు, ఇతర విష కీటకాలు వలల్లో చిక్కుతున్నందున జాలర్లు ఆందోళన చెందుతున్నారు. సముద్రంలో అనేక రకాల సర్పాలు ఉన్నా అందులో విషపూరితమైనవి వలల్లో పడుతున్నాయి.

## ధర్మపురిలో గూడ్స్ రైళ్ల టెర్మినస్ అభివృద్ధి

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ధర్మపురి రైల్వే స్టేషన్‌లో సరకు రైళ్ల టెర్మినస్ అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి సరకు రైళ్లను నడపడానికి అనువుగా ప్రత్యేక మార్గం, టెర్మినస్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు మార్గాలను ఏర్పాటు చేసి సరకు రైళ్లను నిలిపి లారీల ద్వారా వస్తువులను లోడింగ్, అన్ లోడింగ్ చేస్తున్నారు. ధర్మపురి కొండ మార్గమైనందున మొదట్లో గూడ్స్ రైళ్లకు వ్యాగన్లు తక్కువగానే ఉన్నాయి. క్రమక్రమంగా వాటి సంఖ్య పెంచారు. ప్రస్తుతం 42 వ్యాగన్లతో నడుపుతున్నారు. స్టేషన్‌లో ఏడాదికి సుమారు 2.50 లక్షల టన్నుల సరకును నిర్వహిస్తున్నారు. అయితే రైళ్లలోంచి సరకు దించి లారీలలో ఎక్కించే ప్రాంతంలోని మార్గం దెబ్బతింది. దీంతో సుమారు ఒకటిన్నర కి.మీ దూరానికి కొత్తగా తారు రోడ్డు, 6 ప్రాంతాలలో హైమాస్ట్ లైట్లు, ఏజెంట్లు, కార్మికులకు విశ్రాంతి గదులతో పాటు పలు కనీస సౌకర్యాలను కల్పిస్తున్నారు.

## అడవి సరిహద్దులో కందకం ఏర్పాటు చేయండి

పొలాల్లో సంచరిస్తున్న ఏనుగు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ఈరోడ్ జిల్లా అందియూర్ సమీపం బర్గూర్ అటవీ ప్రాంతంలోని కాక్కాయనూర్ గ్రామంలో 70కి పైగా కుటుంబాలున్నాయి. వీరు రాగి, సజ్జ, కర్రపెండలం తదితర పంటలు సాగు చేస్తున్నారు. గ్రామానికి వెళ్లే మార్గానికి అడ్డంగా ఏనుగు మార్గాలు ఉన్నందున రాత్రి సమయాల్లో ప్రజలు తిరగట్లేదు. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా సాయంత్రం వేళల్లో అడవి నుంచి బయటకు వస్తున్న ఓ ఏనుగు పంట పొలాల్లో చొరబడి ధ్వంసం చేస్తోంది. అటవీశాఖ సిబ్బంది మూడు రోజులుగా ఏనుగును తరమడానికి యత్నిస్తున్నా వీలుకాలేదు. ఈ క్రమంలో అడవి సరిహద్దులో కందకం ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## పార్కులో ఆక్రమణలు తొలగించాలని వినతి

**వేలూరు, న్యూస్‌టుడే:** వేలూరు సమీపం సత్తువాచ్చారి వద్ద ఉన్న సీఎంసీ కాలనీలో ఓ పార్కు ఉంది. పార్కు స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకుని ప్రార్థనా మందిరం నిర్మించారని ఆరోపిస్తూ మద్రాసు హైకోర్టులో కేసు దాఖలైంది. కేసును విచారించిన న్యాయమూర్తి జస్టిస్ సుబ్రహ్మణ్యం.. వెంటనే ప్రార్థనా మందిరాన్ని తొలగించాలని ఆదేశించారు. అయితే కోర్టు ఆదేశాలను అధికారులు ఇప్పటివరకు అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో అఖిల భారత హిందూ మహాసభ డివిజనల్ ఇన్‌ఛార్జీ శ్రీనివాసన్ నేతృత్వంలో సోమవారం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. పార్కు స్థలంలో ఆక్రమణలను వెంటనే తొలగించడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

కాంచీపురం సమీపం కలకాట్టూర్‌లోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం తరఫున కొత్తగా నిర్మించిన భవనాన్ని, 12 జ్యోతిర్లింగాల దర్శనాన్ని ఆదివారం సాయంత్రం ప్రారంభించి అక్కడ ఏర్పాటు చేసిన 'భావి భారతం' అనే బొమ్మల ప్రదర్శనను తిలకిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి
- కాంచీపురం, న్యూస్‌టుడే

## న్యాయ జ్వాలలో డీఎంకే కాలిపోతుంది

**నయినార్ నాగేంద్రన్**

**సైదాపేట, న్యూస్‌టుడే:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో న్యాయమనే జ్వాలలో డీఎంకే కాలిపోతుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. కరూరు జిల్లా కులిత్తలై వద్ద మద్యం మత్తులో ఏడేళ్ల బాలికపై ఓ యువకుడు లైంగిక దాడి చేశాడన్న వార్త దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. మద్యం కారణంగా రాష్ట్రంలో మహిళలు, పిల్లలకు భద్రత కరవైందన్నారు. నాలుగున్నరేళ్లుగా మహిళల భద్రత ప్రశ్నార్థకం మారిందని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## పులుల గణన ప్రారంభం

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల అభయారణ్యంలోని 10 అటవీ సర్కిళ్లలో సోమవారం నుంచి పులుల గణన ప్రారంభమైంది. సంచారం, పాదాల ముద్రలు, ఆవాస ప్రాంతాల ఆధారంగా లెక్కిస్తారు. సత్యమంగళం, ఆసనూర్, తాళవాడి, భవానిసాగర్, కడంబూర్, జీరహళ్లి, విళాముడి తదితర ప్రాంతాలలో పనులు జరుగుతున్నాయి. ఒక్కో బృందానికి నలుగురు చొప్పున 75 బృందాలు 5 రోజులపాటు పనులలో నిమగ్నమయ్యాయని అటవీశాఖ అధికారులు తెలిపారు.

## కారుణ్య నియామకపత్రాల అందజేత

**అరక్కోణం, న్యూస్‌టుడే:** రాణిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చంద్రకళ నేతృత్వంలో సోమవారం కారుణ్య నియామక పత్రాలను అందచేసే కార్యక్రమం జరిగింది. మంత్రి ఆర్.గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని రెవెన్యూ శాఖలో పనిచేస్తూ మరణించిన వారి వారసులు ఆరుగురికి కారుణ్య ప్రాతిపదికన నియామక పత్రాలను అందజేశారు.

## మళ్లీ ఆస్పత్రిలో చేరిన సీపీఐ నేత నల్లకన్ను

**చెన్నై, న్యూస్‌టుడే:** సీపీఐ సీనియర్ నేత నల్లకన్ను ఆరోగ్య సమస్యలతో మళ్లీ ఆస్పత్రిలో చేరారు. గత కొన్నేళ్లుగా వయోధిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆగస్టులో ఇంట్లో జారి కిందపడటంతో తలకు గాయమైంది. దీంతో నందనంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. తర్వాత మెరుగైన చికిత్సల నిమిత్తం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి మార్చారు. అక్కడ ఆరోగ్యం మెరుగుపడటంతో డిశ్చార్జి చేశారు. ఈ నేపథ్యంలో మూత్రవిసర్జన సంబంధిత సమస్యతో ఆయనను ఆదివారం రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నెల 26న ఆయన 101వ వసంతంలోకి అడుగుపెట్టడం గమనార్హం.

## భాజపా యువజన విభాగ సమావేశం

**టీనగర్, న్యూస్‌టుడే:** సేలం జిల్లా ఓమలూరులో సోమవారం రాత్రి భాజపా సేలం డివిజన్ యువజన విభాగ సమీక్ష సమావేశం జరిగింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జరిగిన సమావేశానికి పార్టీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు ఎస్‌జీ సూర్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాజకీయ సమీకరణాల గురించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా అన్నాడీఎంకే-భాజపా కూటమి బలహీనపడిందని వస్తున్న వార్తలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## నేడు, రేపు 'మెము' సర్వీసు రద్దు

**వడపళని, న్యూస్‌టుడే:** చెన్నై ఎగ్మూరు-విళుపురం సెక్షనులోని ఓలకూర్ యార్డులో జరుగుతున్న ఇంజినీరింగు పనుల కారణంగా 30, 31 తేదీల్లో ఈ కింది మెము సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసినట్టు దక్షిణ రైల్వే సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ● 66045 తాంబరం-విళుపురం మెము 09.45 రైలు తొళుప్పేడు వరకు నడుస్తుంది. ● 66046 విళుపురం-చెన్నై బీచ్ 13.40 రైలు తొళుప్పేడు నుంచి బయలుదేరుతుంది.

## తిరునెల్వేలిలో భవనాల పరిశీలన

**టీనగర్, న్యూస్‌టుడే:** తిరునెల్వేలి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్.సుకుమార్ మంగళవారం స్థానిక ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలోని భవనాలను తనిఖీ చేశారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా ఇంజినీరింగ్ కళాశాలలోని భవనాలను ప్రతిపాదించారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించే హాళ్లను కలెక్టర్ పరిశీలించారు.

## అదుపుతప్పి కిందపడిన నటుడు విజయ్

రద్దీలో చిక్కుకున్న విజయ్

**చెన్నై, న్యూస్‌టుడే:** చెన్నై విమానాశ్రయంలో అభిమానుల రద్దీలో చిక్కుకుని ముందుకెళ్లే ప్రయత్నంలో నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ కిందపడిపోయారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన 'జననాయగన్' చిత్రం ఆడియో ఆవిష్కరణ ముగించుకుని ఆదివారం రాత్రి ప్రత్యేక విమానంలో విజయ్ చెన్నై చేరుకున్నారు. ఆయన్ను చూసేందుకు భారీగా అభిమానులు తరలి వచ్చారు. విమానాశ్రయం నుంచి బయటికొచ్చిన విజయ్‌ను పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు, అభిమానులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. వ్యక్తిగత భద్రతా సిబ్బంది, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది ఆయన్ను సురక్షితంగా కారు వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. కారును సమీపించిన వెంటనే అభిమానుల రద్దీలో విజయ్ చిక్కుకుని అదుపుతప్పి కింద పడిపోయారు. వెంటనే ఆయన్ను భద్రతా అధికారులు పైకిలేపి కారులో ఎక్కించారు. అక్కడి నుంచి నీలాంకరైలోని నివాసానికి వెళ్లిపోయారు.

## పుదుచ్చేరికి మరిన్ని పథకాలు

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** పుదుచ్చేరి కోసం గొప్ప ప్రాజెక్టులు త్వరలో రానున్నాయని ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ తెలిపారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఉపరాష్ట్రపతికి విమానాశ్రయంలో లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్, ముఖ్యమంత్రి రంగసామి, స్పీకర్ సెల్వం తదితరులు స్వాగతం పలికారు. అనంతరం కంబన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి కుమరగురుపల్లం ప్రాంతంలో రూ.45.5కోట్లతో నిర్మించిన 216 గృహాలను లబ్ధిదారులకు అప్పగించారు. అనంతరం మాట్లాడుతూ.. పుదుచ్చేరిలో 10 కోట్ల మంది రైతులకు ఏడాదికి రూ.6వేలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని పథకాలతో పుదుచ్చేరి కొత్తరూపు సంతరించుకుంటుందన్నారు.

లబ్ధిదారురాలికి ఇంటి తాళం అందిస్తున్న ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, సీఎం రంగసామి

### రామేశ్వరానికి ఉపరాష్ట్రపతి రాక నేడు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** ఉప రాష్ట్రపతి రామేశ్వరం రానున్న నేపథ్యంలో డ్రోన్ ఎగురవేసేందుకు నిషేధం విధించారు. కాశి తమిళ సంగమం 4.0 ముగింపు వేడుకలు మంగళవారం రామేశ్వరంలో జరగనున్నాయి. ఇందులో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సహాయ మంత్రి ఎల్.మురుగన్ తదితరులు పాల్గొననున్నారు. జిల్లా కలెక్టరు సిమ్రన్ జిత్‌సింగ్ కాలోన్, ఎస్పీ సందీష్ విలేకరులతో మాట్లాడుతూ... సాయంత్రం 3.30కు మండపంలోని ప్రజా పనులశాఖ హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ కానున్నారని, అక్కడి నుంచి రోడ్డు మార్గంగా కార్యక్రమం జరిగే ప్రాంతానికి చేరుకుంటారన్నారు. ముగింపు వేడుకల్లో సుమారు 5 వేల మంది పాల్గొంటారని, 700 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పాంబన్, మండపం, తంగచ్చిమటం, రామేశ్వరం ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో డ్రోన్ ఎగురవేసేందుకు నిషేధం విధించినట్లు చెప్పారు.

## విమానాశ్రయం పేరు మార్చాలి

కేంద్ర మంత్రికి వినతి సమర్పిస్తున్న ఎల్.మురుగన్

**సైదాపేట, న్యూస్‌టుడే:** టుటికోరిన్ విమానాశ్రయం పేరు తూత్తుక్కుడి విమానాశ్రయంగా మార్చాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ కోరారు. కోయంబత్తూరు విమానాశ్రయ విస్తరణ త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, చెన్నై విమానాశ్రయంలో ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు మురుగన్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## పుదుచ్చేరిలో పర్యాటకులకు ఉచిత బస్సు సేవలు

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** నూతన సంవత్సరం వేడుకలు జరుపుకొనేందుకు పర్యాటకులు పెద్దసంఖ్యలో పుదుచ్చేరి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఎస్పీ నిత్యా రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. 31న రాత్రి బీచ్‌రోడ్డు, నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ప్రజలు, పర్యాటకులు అధికంగా గుమిగూడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి జనవరి 1న ఉదయం 9 వరకు వైట్‌టౌన్ ప్రాంతం లోపలికి వాహనాలు వెళ్లేందుకు అనుమతిలేదన్నారు. పుదుచ్చేరి బీచ్‌కు వచ్చే వారి కోసం 10చోట్ల తాత్కాలిక పార్కింగ్ వసతి కల్పించామన్నారు. పార్కింగ్ స్థలాల నుంచి బీచ్‌కు చేరుకునేందుకు 30 తాత్కాలిక ఉచిత బస్సు సేవలు అందుబాటులోకి తెస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధాన మార్గాల్లో సీసీటీవీ కెమెరాలు అమర్చామని పేర్కొన్నారు.

## జనవరి 6 నుంచి 9 వరకు సెయిలింగ్ పోటీలు

సమావేశంలో ఉదయనిధి, అధికారులు

**సైదాపేట, న్యూస్‌టుడే:** అంతర్జాతీయ జూనియర్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్-2026, 5150 ట్రయథ్లాన్-2026 పోటీల ఏర్పాట్లపై ఆలోచనా సమావేశం సోమవారం చెన్నై సచివాలయంలో జరిగింది. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ నేతృత్వం వహించారు. జనవరి 6 నుంచి 9 వరకు సెయిలింగ్ పోటీలు జరగనున్నాయి. 13 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. ట్రయథ్లాన్ పోటీలు జనవరి 10, 11న నిర్వహించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, యువజన సంక్షేమ, క్రీడాభివృద్ధి శాఖ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ సభ్య కార్యదర్శి మేఘనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెన్నై చెరువుల్లో సమృద్ధిగా నీరు

**ఊత్తుకోట:** పూండి, పుళల్, చోళవరం, చెంబరంబాక్కం, కన్నన్‌కోట్టై, వీరాణం చెరువుల్లో నిల్వజేసే నీటితో చెన్నై నగర తాగునీటి అవసరాలు తీరుతున్నాయి. ఈ చెరువుల్లో మొత్తం 13.220 టీఎంసీల నీటిని నిల్వజేయవచ్చు. మహానగరానికి నెలకు సగటున ఒక టీఎంసీ నీరు అవసరమవుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పూండి, పుళల్, చెంబరంబాక్కం చెరువులు పూర్తిగా నిండాయి. కన్నన్‌కోట్టై, వీరాణం చెరువుల్లో 94 శాతం నీరుంది. 6 చెరువుల్లో మొత్తం 12.460 టీఎంసీల నీరుండటంతో ఏడాది వరకు చెన్నై అవసరాలకు ఇబ్బంది లేదని జలవనరుల శాఖాధికారులు వెల్లడించారు.

స్వర్ణోత్సవ పుస్తకంతో ఉదయనిధి స్టాలిన్ తదితరులు

## వ్యాపారులకు అండగా డీఎంకే

**సైదాపేట, న్యూస్‌టుడే:** డీఎంకే ఎల్లప్పుడూ వ్యాపారులకు అండగా, స్నేహితుడిగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. చేపాక్కం-ట్రిప్లికేన్ నియోజకవర్గంలోని ట్రిప్లికేన్ వ్యాపారుల సంఘం స్వర్ణోత్సవం కలైవానర్ అరంగంలో జరిగింది. ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. వ్యాపారులు కష్టపడి పని చేసే వారని తెలిపారు. వారిపై డీఎంకేకు ఎల్లప్పుడూ ప్రత్యేక ప్రేమ ఉంటుందన్నారు. ప్రజల దైనందిన జీవితాన్ని సులభతరం చేసేది వ్యాపారులేనన్నారు. వ్యాపారుల సంఘం స్వర్ణోత్సవ పుస్తకాన్ని విడుదల చేశారు. మంత్రి శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** నామక్కల్ సౌత్ ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో 1978లో ప్లస్‌టూ చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. నామక్కల్-తిరుచెంగోడు రోడ్డులోని ఓ ప్రైవేట్ క్యాంటీన్‌లో కార్యక్రమం జరిగింది. పలు రంగాల్లో స్థిరపడిన సుమారు 100 మంది పాల్గొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

## జనవరిలో శ్రీవారి ఆలయంలో విశేష పర్వదినాలు

**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో 2026 జనవరి నెలలో విశేష పర్వదినాలు జరగనున్నాయి. ఆ మేరకు 4వ తేదీ స్వామివారి ప్రణయ కలహ మహోత్సవం, 8న పెద్ద శాత్తుమొర, 12న అధ్యయనోత్సవాలు సమాప్తి, 13న శ్రీవారు తిరుమల నంబి సన్నిధికి వేంచేపు, 14న భోగి, 15న మకర సంక్రాంతి, సుప్రభాత సేవ పునఃప్రారంభం, 16న కనుమ, పార్వేట మండపానికి వేంచేపు, 18న పురందరదాసుల ఆరాధన మహోత్సవం, 23న వసంత పంచమి, 25న రథసప్తమి జరుగుతాయి.

## మెట్రో మొదటి దశలోఅసంపూర్తిగా ఎస్కలేటర్ల నిర్మాణం

ఓ స్టేషనులో పూర్తి కాని ఎస్కలేటర్

**వడపళని, న్యూస్‌టుడే:** మెట్రో మొదటి దశలోని పలు స్టేషన్లలో దాదాపు రెండేళ్లయినా అదనపు ఎస్కలేటర్ల నిర్మాణం పూర్తి కాలేదు. కొన్ని స్టేషన్లలో పైకి వెళ్లడానికి, కిందకు దిగడానికి ఎస్కలేటర్లు లేవు. తిరుమంగళం, అన్నానగర్ ఈస్ట్, గవర్నమెంట్ ఎస్టేట్, థౌజండ్ లైట్స్, ఎగ్మూరు, నెహ్రూ పార్క్, తేనాంపేట స్టేషన్లలో కాన్‌కోర్స్ లేదా ప్లాట్‌ఫారమ్ కాన్‌కోర్స్ లెవల్స్‌తో రోడ్డు వరకు అనుసంధానించేందుకు ఎస్కలేటర్లు తగినంతగా లేవు. ❖ 2023 ప్రారంభంలో సీఎంఆర్ఎల్ ప్రయాణికుల విజ్ఞప్తిని పరిశీలించి మరికొన్ని ఎస్కలేటర్లు కొనుగోలు చేసి అమర్చే పనులు కూడా ప్రారంభించింది. 55 స్టేషన్లలో ఏర్పాటు చేయాల్సి ఉండగా 22 స్టేషన్లలో మాత్రమే పూర్తి చేయగలిగారు. నిత్యం మెట్రోలో పయనించే బాలాజీ మాట్లాడుతూ ఉదయం 8.30 సమయంలో థౌజండ్‌లైట్స్ స్టేషనులో లిఫ్టు చాలా రద్దీగా ఉండటంతో చాలాసేపు వేచి ఉండాల్సి వస్తోందన్నారు.

### వచ్చే ఏడాది ఫిబ్రవరికల్లా..

ప్రయాణికులు లేని సమయంలో అంటే అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున 4 గంటల మధ్య మాత్రమే ఎస్కలేటర్లకు కావాల్సిన సామగ్రి తీసుకు రావడానికి వీలవుతుందని, అప్పుడే అమర్చగలుగుతామని సీఎంఆర్ఎల్ అధికారులు పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా ముగించేందుకు ప్రయత్నిస్తున్నామని, 2026 ఫిబ్రవరి చివరికల్లా మొత్తం పూర్తి చేయగలమని తెలిపారు.

## విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

విద్యార్థినికి ఉపకార వేతనం అందజేస్తున్న కలెక్టరు కలైసెల్వి, మొబిస్ సంస్థ ప్రతినిధులు

**కాంచీపురం, న్యూస్‌టుడే:** కాంచీపురం కలెక్టరు కార్యాలయంలో 'నమ్మ స్కూల్-నమ్మ ఊరు పళ్లి' పథకం కింద కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసే కార్యక్రమం సోమవారం జరిగింది. పాఠశాల విద్యాశాఖ, హ్యుందాయ్ సంస్థలో భాగమైన మొబిస్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టరు కలైసెల్వి, మొబిస్ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ హూబిన్ హూ విద్యార్థులకు రూ.1.97 కోట్ల ఉపకార వేతనాలు అందజేశారు.

(c) eenadu

## మళ్లీ సూపర్ డీలక్స్ కాంబినేషన్

త్యాగరాజన్ కుమారరాజా

**చెన్నై, న్యూస్‌టుడే:** దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా 'అరణ్యకాండం', 'సూపర్ డీలక్స్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. 2019లో విడుదలైన 'సూపర్ డీలక్స్' చిత్రంలో నటుడు విజయ్ సేతుపతి ట్రాన్స్‌జెండర్‌గా నటించి జాతీయ పురస్కారం అందుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో త్యాగరాజన్ కుమారరాజా, నటుడు విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో మరో చిత్రం రూపొందనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయని, త్వరలో ఖరారవుతాయని, చిత్రీకరణ పనులు 2026 నుంచి ప్రారంభంకానున్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం.

## వెట్రిమారన్ దర్శకత్వంలో నటించనున్న కమల్?

**చెన్నై, న్యూస్‌టుడే:** తమిళ చిత్రసీమలో విజయవంతమైన దర్శకుల్లో వెట్రిమారన్ ఒకరు. ప్రస్తుతం ఉత్తర చెన్నై కథా నేపథ్యంలో శింబు కథానాయకుడిగా 'అరసన్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ పనులు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో ఆయన తర్వాతి చిత్రంపై పలు వార్తలు వినిపిస్తున్నాయి. కమల్‌హాసన్‌తో ఓ చిత్రాన్ని రూపొందించడానికి తొలివిడత చర్చలు జరుగుతున్నట్లు కోలీవుడ్ సమాచారం. దీని గురించి త్వరలో అధికారిక ప్రకటన వెలువడనుందని చెబుతున్నారు.

## టాస్మాక్ దుకాణాలకు వ్యతిరేకంగా ఆందోళన జనవరి 12న

విలేకరులతో మాట్లాడుతున్న అర్జున్ సంపత్

**ప్యారిస్, న్యూస్‌టుడే:** స్వామి వివేకానంద జయంతి రోజున రాష్ట్రంలో ఉన్న టాస్మాక్ దుకాణాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టనున్నట్లు హిందూ మక్కల్ కట్చి అధ్యక్షుడు అర్జున్ సంపత్ తెలిపారు. తూత్తుకుడిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వదేశీ వస్తువుల కొనుగోలుపై పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో దక్షిణాది జిల్లాలు పారిశ్రామిక, విద్యాపరంగా వెనుకబడి ఉన్నాయని, ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

ఆనకట్ట నుంచి బయటికి తీసిన పరికరం

## ముల్లైపెరియార్ ఆనకట్ట స్థిరత్వంపై ముగిసిన అధ్యయనం

**ట్రిప్లికేన్, న్యూస్‌టుడే:** ముల్లైపెరియార్ ఆనకట్ట స్థిరత్వాన్ని పరిశీలించేందుకు సెంట్రల్ జియోలాజికల్ సర్వే శాస్త్రవేత్తలు సబ్ మెర్సిబుల్ ఆర్‌ఓవీ ఉపయోగించి చేపట్టిన అధ్యయనం ముగిసింది. సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి నలుగురు శాస్త్రవేత్తల బృందం 22న సర్వే ప్రారంభించింది. ఇందుకోసం ఆర్‌ఓవీ పరికరాన్ని ఉపయోగించారు. అధ్యయన ఫలితాలను దిల్లీలోని జాతీయ ఆనకట్ట భద్రతా అథారిటీకి అందిస్తామని పేర్కొన్నారు.

## ఒకే చిరునామాతో 93 మంది ఓటర్లు

ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న అధికారులు

**ట్రిప్లికేన్, న్యూస్‌టుడే:** తేని జిల్లా బోడి యూనియన్‌లోని అనైకరైపట్టి పరిధిలోకి వచ్చే ముందల్, ఆది ద్రావిడకాలనీ, ముట్టం సహా ఐదు గ్రామాల్లో ఒకే డోర్ నంబరుతో 93 ఓట్లు ఉన్నాయి. ముసాయిదా జాబితాలో ఈ ఓట్లను గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. గత ఓటరు జాబితాలోనూ ఇలాగే ఉందని గుర్తించారు. చిరునామాలు తనిఖీ చేయగా వార్డు నంబరు ఓటర్ల డోరు నంబరుగా మారిందని, సరిచేస్తున్నట్లు జిల్లా అధికారి చంద్రశేఖర్ తెలిపారు.

## ప్రజలపై అప్పుల భారం మోపుతున్న డీఎంకే

తమిళిసై

**కోయంబత్తూరు, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రజలపై డీఎంకే ప్రభుత్వం భారీగా అప్పుల భారాన్ని మోపుతోందని భాజపా సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ ఆరోపించారు. కోయంబత్తూరు విమానాశ్రయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... మహిళలు హద్దులు దాటి రాజకీయ, సామాజిక రంగాల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అయితే రాష్ట్రంలో మహిళలు చాలా అసురక్షిత పరిస్థితిలో ఉన్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మార్పు అవసరమన్నారు. రాష్ట్రంలో ఒక్కొక్కరిపై రూ.1.27లక్షల అప్పు ఉందని, నెలకు రూ.8వేల వడ్డీ పడుతుందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

## రవాణా సంస్థ పేరు మార్చాలని ఆందోళన

బస్సులపై స్టిక్కర్లు అంటిస్తున్న ఎన్టీకే కార్యకర్తలు

**రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే:** రాష్ట్ర రవాణా సంస్థ (స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్-ఎస్‌టీసీ) తరఫున రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బస్సులు తిరుగుతున్నాయి. ఈ క్రమంలో సంస్థ పేరును తమిళనాడు రాష్ట్ర రవాణా సంస్థగా పేరు మార్చాలని నామ్ తమిళర్ కట్చి ఎప్పటినుంచో డిమాండు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యకర్తలు సోమవారం తిరువళ్లూరులో ప్రభుత్వ బస్సులపై మార్చిన పేరున్న స్టిక్కర్లు అంటించి ఆందోళన చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి సెందిల్ కుమార్ అధ్యక్షత వహించారు. స్టిక్కర్లు అతికించిన కార్యకర్తలు 25 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గాంధీ

## నూతన భవనం ప్రారంభం

**అరక్కోణం, న్యూస్‌టుడే:** ఆర్కాడు సమీపంలోని ఆయిర మంగళం పంచాయతీ స్వయంబాడిలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ శాఖ తరఫున రూ.19.52 లక్షలతో నూతనంగా నిర్మించిన పాల ఉత్పత్తిదారుల సహకారం సంఘం భవనాన్ని సోమవారం మంత్రి ఆర్.గాంధీ ప్రారంభించారు. కలెక్టర్ చంద్రకళ, ఆర్కాడు ఎమ్మెల్యే జేఎల్ ఈశ్వరప్పన్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న క్రీడాకారులు

## ఇండోర్ స్టేడియం గుమ్మిడిపూండిలో నిర్మించాలి

**గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే:** తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం పూవలంబేడులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో రూ.3 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మించనున్నారు. పూవలంబేడు గ్రామం గుమ్మిడిపూండి నుంచి 15 కి.మీ దూరంలో ఉంది. తాలూకా కేంద్రమైన గుమ్మిడిపూండిలో బాక్సింగ్, సిలంబం, కబడ్డీతో పాటు 35కు పైగా క్రీడా సంఘాలు ఉన్నాయి. వీటిల్లో వందలాది మంది శిక్షణ పొందుతున్నారు. వీరు పూవలంబేడులో కాకుండా గుమ్మిడిపూండిలోనే ఇండోర్ స్టేడియం నిర్మించాలనే డిమాండుతో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు.

## టీఎంసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న శేఖర్

**గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే:** తమిళ్ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు జీకే వాసన్ 61వ జన్మదినం సందర్భంగా తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం ఎళావూరులో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని పార్టీ జిల్లా కార్యదర్శి శేఖర్ ప్రారంభించారు. 61మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. వారికి శేఖర్ ధ్రువపత్రాలు అందజేశారు. సేకరించిన రక్తాన్ని చెన్నై జీహెచ్‌లోని బ్లడ్ బ్యాంకుకు అప్పగిస్తామని శేఖర్ తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారిముత్తు, జిల్లా ఉపాధ్యక్షుడు అశోకన్, కోశాధికారి దాస్ తదితరులు పాల్గొన్నారు.

## చెస్ ర్యాంకింగ్‌లో చెన్నై బాలిక సత్తా

రయానికా శివరామ్

**సైదాపేట, న్యూస్‌టుడే:** చెన్నైకి చెందిన ఆరేళ్ల చెస్ క్రీడాకారిణి రయానికా శివరామ్ అంతర్జాతీయ చెస్ ర్యాంకింగ్‌లో చోటు దక్కించుకుంది. ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ (ఎఫ్ఐడీఈ) రేటింగ్‌లో 9 స్థానంలో నిలిచింది. మొత్తం 1,429 పాయింట్లు సాధించింది. తద్వారా ఎఫ్ఐడీఈ రేటింగ్‌లో చోటు సాధించిన తమిళనాడుకు చెందిన అత్యంత చిన్న వయస్కురాలిగా రయానికా శివరామ్ రికార్డు సృష్టించింది.

నందకుమార్ ● ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించే పనిలో.. ● విత్తనపు బంతులు తయారుచేస్తూ..

# ఆ ఇంజినీర్‌కు అడవులే ప్రపంచం

### లక్షలాది విత్తనాలు నాటుతున్న ఈరోడ్ యువకుడు

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** ఈరోడ్ జిల్లాకు చెందిన 37ఏళ్ల నందకుమార్‌కు అడవులే ప్రపంచం. అక్కడి జంతువులే ఆత్మీయులు. అంతరించిపోతున్న అడవులను పునరుద్ధరించే పనులు చేపడుతున్నారు. అటవీశాఖ సహాయంతో లక్షలాది విత్తనాలు నాటుతున్నారు. ఇంతకీ అడవి అంటే ఎందుకు ఇష్టమో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం..

**అటవీశాఖతో కలిసి..**

సత్యమంగళం సొంతూరు. వ్యవసాయ కుటుంబం. చిన్నప్పటి నుంచే అడవితో బంధం ఏర్పడింది. 2012లో ఇంజినీరింగ్ ముగించినా మళ్లీ నా కాళ్లు అడవినే వెతుక్కుంటూ వచ్చాయి. చెట్లు, వన్యప్రాణులను అర్థం చేసుకోవడం ప్రారంభించాను. అడవులు ఎందుకు నాశనమవుతున్నాయి, మానవులు, వన్యప్రాణుల మధ్య సంఘర్షణకు కారణమేమిటి తదితర అనేక ప్రశ్నలకు సమాధానం మానవులే అని కనుగొన్నప్పుడు అపరాధ భావన కలగడం ప్రారంభమైంది. అటవీశాఖ, కొండప్రాంత ప్రజలు, గిరిజనుల వద్దకు వెళ్లి వాటన్నింటికి సమాధానాలు వెతికాను. దాదాపు ఆరేళ్ల ప్రయాణం ఎన్నో విషయాలు నేర్పింది. జంతువులకు ఆహారం ఇచ్చే అడవిని మనిషే నాశనం చేస్తున్నాడు. అందుకే అవి నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తున్నాయి. తద్వారా మనిషి, జంతువులకు మధ్య ఘర్షణలు ఏర్పడుతున్నాయి. అడవులను సంరక్షించే ఉద్దేశంతో 2018లో బయోడైవర్సిటీ కన్జర్వేషన్ ట్రస్ట్ ఫౌండేషన్ ప్రారంభించాను. ఇప్పుడు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 650 మంది సభ్యులు ఉన్నారు.

**అవగాహన కార్యక్రమాలు..**

నాశనమైన అడవులను తిరిగి సృష్టించాలని నిర్ణయించుకున్నాం. అందుకు అటవీశాఖ కూడా సహకరించింది. కొన్ని మొక్కలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పెరుగుతాయి. ఆ వివరాలు కొండప్రాంత ప్రజలు, అటవీశాఖ సిబ్బంది నేర్పించారు. ఎక్కువగా పాత చెట్ల కోసం వెతుకుతాం. బలమైన విత్తనాలు సేకరిస్తాం. అటవీశాఖ మార్గదర్శకత్వంలో మా బృందం విత్తన బంతులు తయారు చేసి విసురుతుంది. విత్తనాలు సేకరించడానికి ఆరునెలలు, వాటిని విత్తడానికి ఆరునెలలు పడుతుంది. ఎండాకాలాల్లో జంతువుల కోసం అటవీశాఖ ఏర్పాటు చేసిన తొట్టెల్లో నీటిని నింపుతుంటాం. ఇప్పటివరకు లక్షలాది విత్తనాలు సేకరించి నాటాం. 2024లో మాత్రమే 10 లక్షల విత్తనాలు నాటాము. అడవుల్లో మరో ముఖ్య సమస్యగా ఉన్న ప్లాస్టిక్‌ను తొలగించే పనులు కూడా కొనసాగిస్తున్నాం. అటవీ సంరక్షణ, మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు.

# దక్షిణ రైల్వేలో కోచింగ్ టెర్మినళ్ల విస్తరణ

\- న్యూస్‌టుడే, వడపళని

ఎగ్మూరు స్టేషను నమూనా

దేశంలో రానున్న ఐదేళ్లలో ప్రధాన నగరాల్లో రైళ్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలని రైల్వే శాఖ యోచిస్తోంది. అందులో భాగంగా దక్షిణ రైల్వేలో కోచింగ్ టెర్మినళ్ల విస్తరణకు చెన్నై, కోయంబత్తూరు, ఎర్నాకుళం (కొచ్చి) స్టేషన్లు అభివృద్ధి చెందనున్నాయి. సబర్బన్, సుదూర ప్రాంతాలకు కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు ప్రధాన స్టేషన్ల పునరాభివృద్ధి, కొత్త టెర్మినళ్లు, బహుళ ప్రాజెక్టులు చేపట్టామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

### చెన్నై ఎగ్మూరు స్టేషన్

ఇక్కడి స్టేషన్‌ను విమానాశ్రయం తరహాలో అభివృద్ధి చేస్తున్నారు. ఏసీ వసతితో రెండు కొత్త టెర్మినళ్లు రానున్నాయి. ప్లాట్‌ఫారాలపైకి చేరుకునేందుకు 33 లిఫ్టులు, 31 ఎస్కలేటర్లు, 14వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో కాన్‌కోర్స్, అన్ని ప్లాట్‌ఫారాలను కవర్ చేసే విధంగా 32వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో పైకప్పు, 400 కార్లు, 200 ద్విచక్ర వాహనాలు పార్కు చేసుకునే విధంగా బహుళ అంతస్తుల పార్కింగు భవనం, వెయిటింగు హాళ్లు, రిటైరింగ్ గదులు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, ఫుడ్‌కోర్టులు, దుకాణాలు, 7.6 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం అందుబాటులోకి రానున్నాయి.

### సబర్బన్‌లో కొత్త ప్రాజెక్టులు

అత్తిపట్టు-గుమ్మిడిపూండి 22.52 కి.మీ వరకు 3, 4 లైన్లు, తాంబరం, చెంగల్పట్టు మధ్య 30.02 కి.మీ వరకు 4వ లైను, అంబత్తూరు, విల్లివాక్కం మధ్య 6.4 కి.మీ వరకు 5, 6 ట్విన్ సింగిల్ లైను నిర్మాణం కానున్నాయి. ఇవి కాకుండా ఇరుగూర్ - పోదనూరు, గుమ్మిడిపూండి - గూడూరు, అరక్కోణం - చెంగల్పట్టు, గూడువాంజేరి - శ్రీపెరంబుదూరు తదితర ప్రాంతాలకు సమగ్ర నివేదికలకు పనులు చేపట్టేందుకు అడ్డు తొలిగింది.

### తాంబరం

అన్ని ప్లాట్‌ఫారాలు అనుసంధానించే విధంగా 9 లిఫ్టులు, 10 ఎస్కలేటర్లు, ఆధునికీకరించిన బుకింగ్ కౌంటర్లు, కాన్‌కోర్స్, సబర్బన్, దూర ప్రయాణాలకు మధ్య మెరుగైన ఏకీకరణ, పార్కింగు సదుపాయం, డ్రాప్ ఆఫ్ జోన్‌లు, మెరుగైన వెయిటింగు హాలు, రిటైరింగ్ గదులు రానున్నాయి.

### పెరంబూరు

చెన్నై సెంట్రల్, ఎగ్మూరులో రద్దీ నియంత్రణకు పెరంబూరులో ప్రతిపాదిత కొత్త టెర్మినల్ నిర్మిస్తున్నారు. 2025 ఏప్రిల్ 23న రూ.342 కోట్ల అంచనా వ్యయంతో రైల్వే బోర్డుకు దక్షిణ రైల్వే నుంచి సమగ్ర నివేదిక అందజేశారు. ఏడు ప్లాట్‌ఫారాలు రానున్నాయి. చెన్నై బీచ్, ఎగ్మూరు మధ్య 4.30 కిలోమీటర్ల దూరానికి నాలుగో లైను నిర్మాణం పూర్తయింది. వేళచ్చేరి, సెయింట్ థామస్ మౌంట్ మధ్య ఎమ్మార్టీఎస్ రెండో దశ విస్తరణ పనులు పూర్తి కావస్తున్నాయి.

### కోయంబత్తూరు

కోయంబత్తూర్ జంక్షన్‌లో రద్దీ నియంత్రణకు పొదనూర్ రెండో జంక్షన్‌గా అభివృద్ధి చేస్తున్నారు. రూ.100 కోట్లతో టెర్మినల్‌లో అధునాతన వసతులు, స్టెబిలింగ్ లైన్లు, పిట్ లైన్లు, యార్డుల పునర్వ్యవస్థీకరణ పనులు జరుగుతున్నాయి. ప్లాట్‌ఫారాల స్థాయి పెంపు, ప్రయాణికులకు కావలసిన వసతులను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.24 కోట్లతో చేపట్టారు. పనులు చివరి దశలో ఉన్నాయి.

### కోయంబత్తూరు నార్త్

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ.11.5 కోట్ల వ్యయ అంచనాతో కోయంబత్తూరు నార్త్‌లో కూడా పనులు ప్రారంభించారు.

## నదిలో మునిగి ఇద్దరు మహిళల మృతి

**వేలూరు, న్యూస్‌టుడే:** తిరుపత్తూరు జిల్లా నాట్రాంపల్లి సమీపం పుదుపేట్టై ప్రాంతానికి చెందిన కృష్ణన్ కుమార్తెలు కోకిల(18), మధుప్రియ(22), అదే ప్రాంతానికి చెందిన జయకాంతన్ భార్య శుభశ్రీ(22), ఈమె తమ్ముడు తంబిదురై(20), జయకాంతన్ స్నేహితుడు ప్రవీణ్ తదితరులు కలిసి సత్రంపల్లి వద్ద ప్రవహిస్తున్న పాలారు నదికి సోమవారం స్నానానికి వెళ్లారు. నదిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కోకిల, శుభశ్రీ మునిగిపోయారు. తోటివారు ఇద్దరిని ఒడ్డుకు తీసుకొచ్చి నాట్రాంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఇద్దరూ మరణించారని తెలిపారు. తిమ్మపేట పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

**చెరువులో మునిగి వ్యవసాయ కూలీ...**

మునుస్వామి (పాతచిత్రం)

**గుమ్మిడిపూండి:** తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం ప్రాంతానికి చెందిన మునుస్వామి (45) వ్యవసాయ కూలీ. ఈయన గ్రామ పొలిమేరలోని చెరువు కట్ట వద్ద ఆదివారం సాయంత్రం ఆవులు మేపుతుండగా ఓ ఆవు నీటిలో దిగి ప్రమాదానికి గురైంది. దానిని కాపాడే ప్రయత్నంలో మనుస్వామి లోతులో మునిగిపోయాడు. అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

**చెట్టు విరిగి మీదపడటంతో కూలీ...**

**వేలూరు:** తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపం వెంకటసముద్రం గ్రామానికి చెందిన సురేష్(39) చెట్లను నరికే కూలీ. ఈయన మరికొందరు కూలీలతో కలిసి ఆదివారం వీరంకుప్పం వద్ద కొబ్బరి తోటలోని చెట్లను నరుకుతుండగా ఓ చెట్టు ప్రమాదవశాత్తు విరిగి సురేష్‌పై పడింది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఉమ్రాబాద్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

**చికిత్స పొందుతూ భవన నిర్మాణ కార్మికుడు...**

**అరక్కోణం:** రాణిపేట జిల్లా వాలాజాపేట సమీపం పూండి మందవెళ్లి వీధికి చెందిన సంబంధం(65) భవన నిర్మాణ కార్మికుడు. ఈయన గత 25వ తేదీ స్థానికంగా రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు వాలాజాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కుటుంబీకులు అడుకంపారై ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. వాలాజాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పర్యాటకుల వ్యాను బోల్తా.. 5 మందికి గాయాలు

ప్రమాదానికి గురైన వ్యాను

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** చెన్నై నుంచి ఈనెల 26వ తేదీన 15 మంది పర్యాటకులు ఊటీ వెళ్లారు. అక్కడ పర్యాటక ప్రాంతాలను సందర్శించి ఆదివారం సాయంత్రం చెన్నైకి వ్యానులో బయలుదేరారు. కొయ్యల వంతెన సమీపంలో వెళ్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. అటుగా వెళ్తున్నవారు వ్యానులో చిక్కుకున్నవారిని బయటకు తీశారు. 5 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని మేట్టుపాలయం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కున్నూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కలెక్టరేట్‌లో వ్యాపారి ఆత్మాహుతియత్నం

**టీనగర్, న్యూస్‌టుడే:** తిరునెల్వేలి జిల్లా వళ్లియూర్ పంచాయతీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో గతంలో దుకాణాలు నడిపిన పాత వ్యాపారులకు వేలం పాట లేకుండానే దుకాణాలు కేటాయిస్తామని అధికారులు గతంలో హామీ ఇచ్చారు. అయితే చెప్పినట్లు దుకాణాలు కేటాయించకపోవడంతో వ్యాపారులు ఆక్రోశానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో కూరగాయల వ్యాపారి ప్రభాకరన్ నిరసన తెలుపుతూ మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మాహుతికి యత్నించారు. అక్కడున్న పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు.

## బుల్లితెర నటి రాణి దంపతులపై కేసు నమోదు

నటి రాణి

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** నామక్కల్ జిల్లా తిరుచెంగోడు ప్రాంతానికి చెందిన దినేష్‌రాజ్ అనే వ్యక్తి కరూర్ నగరంలోని కోవై రోడ్డులో హోటల్ నిర్వహిస్తున్నారు. ఈయనకు వృత్తిపరంగా డబ్బులు అవసరం కావడంతో తనకు పరిచయమున్న చెన్నై వలసరవాక్కానికి చెందిన బాలాజీ అలియాస్ బాలమురుగన్‌ను సంప్రదించారు. బాలాజీ తనకు కరూర్‌లో స్నేహితులున్నారని చెప్పి వడివేలు అనే వ్యక్తిని పరిచయం చేశారు. వడివేలు తన స్నేహితుడు ఆరుముగం హోటల్ నిర్వహిస్తున్నట్టు చెప్పి అతని నుంచి రూ.10 లక్షలు తీసుకుని బాలాజీకి ఇచ్చారు. దినేష్‌రాజ్‌కి సొంతమైన రూ.80 లక్షల విలువైన కారు, 5 సవర్ల బంగారు నగలను బాలాజీ తీసుకుని తన భార్య అయిన బుల్లితెర నటి రాణికి చూపించి తెచ్చిస్తానని చెప్పాడు. చెప్పిన ప్రకారం తీసుకురాకపోవడంతో దినేష్‌రాజ్ కరూర్‌లో ఆరుముగం సమక్షంలో బాలాజీని నిలదీశారు. అప్పుడు బాలాజీ చిన్న కత్తితో దాడి చేసినట్టు తెలుస్తోంది. దినేష్‌రాజ్ ఫిర్యాదు మేరకు కరూర్ పోలీసులు బాలాజీ, ఆయన భార్య రాణి, స్నేహితుడు పురుషోత్తమన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 10 కిలోల గంజాయి స్వాధీనం

**పొన్నేరి, న్యూస్‌టుడే:** తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ సమీపం మొండిఅమ్మన్ నగర్‌లో చోళవరం సీఐ శశికుమార్ నేతృత్వంలో పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని సోదా చేశారు. 10 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రం ఇడుక్కి జిల్లాకు చెందిన అకిల్‌ని అరెస్టు చేశారు.

## ఉద్యోగం పేరిట రూ.14లక్షల మోసం

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** తిరువారూర్ జిల్లా తిరుత్తురైపూండి ప్రాంతానికి చెందిన బీర్ ముహ్మద్ విదేశంలో పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆయన భార్య వాట్సాప్‌కు ఓ సందేశం వచ్చింది. అందులో... ఇంటి నుంచే పనిచేస్తే లక్షల్లో సంపాదించవచ్చని ఉంది. వెంటనే ఆమె అందులోని ఫోన్ నంబరును సంప్రదించగా.. మొదట రూ.2లక్షలు పెట్టుబడి పెట్టాలని చెప్పారు. నమ్మిన మహిళ రూ.14.42లక్షలు చెల్లించింది. తర్వాత వారి నుంచి ఎలాంటి సమాచారం లేదు. మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

రైలులో భయంగొలిపేలా రీల్స్ చేసిన బాలురు

## మందలించడంతో వలస కార్మికుడిపై కత్తులతో దాడి

**తిరుత్తణి, న్యూస్‌టుడే:** రైలులో భయంగొలిపేలా రీల్స్ చేస్తుండగా అడ్డుకోవడంతో నలుగురు బాలురు కలిసి కార్మికుడిపై కత్తులతో దాడి చేసిన ఘటన తిరుత్తణిలో చోటుచేసుకుంది. ఈనెల 27వ తేదీ చెన్నై నుంచి తిరుత్తణికి రైలులో ప్రయాణిస్తున్న మహారాష్ట్రకు చెందిన వలస కార్మికుడు సూరజ్(34)పై అదే రైలులో ప్రయాణించిన నలుగురు బాలురు కత్తితో బెదిరించారు. ఆయన మెడపై కత్తి పెట్టి వీడియో చిత్రీకరించారు. దీంతో సూరజ్ వారిని మందలించాడు. కోపంతో బాలురు సూరజ్‌ను తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి స్టేషన్‌లో బలవంతంగా దించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఆయన తల, ముఖం, చేతులపై కత్తులతో దాడి చేసి వెళ్లిపోయారు. దాడి చేస్తున్న దృశ్యాలను సెల్‌ఫోన్‌లో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సూరజ్ ప్రస్తుతం తిరువళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు నలుగురు బాలురను అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించారు. ఈ వ్యవహారం సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారడంతో రాజకీయ నాయకులు కూడా దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు.

## కుమారుడిని హత్య చేసిన తండ్రి అరెస్టు

వెస్లీ (పాతచిత్రం)

**మామల్లపురం, న్యూస్‌టుడే:** చెంగల్పట్టు సమీపం పెరుంతండలం పంచాయతీ ఓవర్‌టన్ పేటకు చెందిన జాన్సన్ కుమారుడు వెస్లీ(29) ఫుడ్ డెలివరీ సంస్థలో పనిచేస్తున్నాడు. ఇతనికి అదే ప్రాంతానికి చెందిన ఓ యువతితో వివాహం చేయడానికి పెద్దలు నిర్ణయించారు. ఇదిలా ఉండగా వధువు తరఫువారు వెస్లీ గురించి విచారించగా చెడు అలవాట్లు ఉన్నాయని తెలిసింది. దీంతో ఆదివారం జరగాల్సిన నిశ్చితార్థం ఆగిపోయింది. వెస్లీ ఆగ్రహంతో ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. నిశ్చితార్థం ఆగిపోవడానికి మీరే కారణమని దూషించాడు. ఆగ్రహించిన జాన్సన్ కుమారుడిని ఇనుపరాడ్డుతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చెంగల్పట్టు తాలూకా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## పేరుమోసిన రౌడీషీటర్...

బాలమురుగన్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

**వేళచ్చేరి, ట్రిప్లికేన్:** రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 90 కేసులతో సంబంధమున్న పేరుమోసిన రౌడీషీటర్‌ను తెన్‌కాశి పోలీసులు పెరంబలూర్ జిల్లాలో అరెస్టు చేశారు. తెన్‌కాశి జిల్లా కడియం సమీపం కళ్యాణిపురం ప్రాంతానికి చెందిన బాలమురుగన్‌పై తిరునెల్వేలి, తెన్‌కాశి సహా రాష్ట్రంలోని అనేక పోలీస్ స్టేషన్లలో హత్యలు, దోపిడీ తదితర సుమారు 90 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క కడియం స్టేషన్‌లోనే 11 కేసులు ఉన్నాయి. ఇతను గత కొద్ది నెలలుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో పెరంబలూర్ జిల్లా పాడలూర్ సమీపంలోని కొండ ప్రాంతంలో తల దాచుకున్నట్లు తెన్‌కాశి పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు పెరంబలూర్ జిల్లా పోలీసుల సహకారంతో పాడలూర్ ప్రాంతంలో కొండల్లో దాగి ఉన్న బాలమురుగన్‌ను ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు. రాత్రి తెన్‌కాశికి తీసుకెళ్లి సోమవారం తెల్లవారు జామున కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

# గిరి.. భక్తజన ఝరి

## వైభవంగా శేషాచల ప్రదక్షిణ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రంలో కొలువైన శ్రీవారి గిరి ప్రదక్షిణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ తొలిమెట్టు వద్ద నుంచి ప్రారంభమైన ప్రదక్షిణ శేషాచల పర్వతం చుట్టూ ఆరు కి.మీ. మేర సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు గోవింద నామస్మరణతో తరించారు.

కిటకిటలాడిన భక్తజనం, అంతరచిత్రంలో స్వామివారు

తొలుత శ్రీవారి రథాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రచార రథంలో కొలువైన స్వామికి అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో మూర్తితో కలిసి జెండా ఊపి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు, గోవింద స్వాములు స్వామిని శరణు వేడుతూ అత్యంత భక్తి శ్రద్ధలతో శేషాచలం చుట్టూ తిరిగారు. ప్రచార రథంలో కొలువుతీరిన స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించిన భక్తకోటి పరమానందాన్ని పొందింది. మార్గం మధ్యలో భక్తులకు దాతల సహకారంతో టీ, కాఫీ, పాలు, తాగునీరు అందించారు.

మంగళవారం వైకుంఠ ద్వార దర్శనం కోసం ముస్తాబు

వివరాలు 6లో

### స్వామివారి నిజరూప దర్శనం

గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం భక్తులకు, గోవింద స్వాములకు శ్రీవారి నిజరూప దర్శన భాగ్యం కల్పించారు. దీంతో క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ ఈఈ భాస్కర్, డీఈ సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## దీవించమ్మా.. మావుళ్లమ్మ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ అమ్మవారు సోమవారం భక్తులకు పునఃదర్శనమిచ్చారు. ఉదయం 11.30 గంటలకు ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ, ఆగమ పండితుడు జంధ్యాల గంగాధరశర్మ, వేదపండితులు పూజలు నిర్వహించారు. తొలిగా ఆవు దూడలతో అమ్మవారికి దర్శనం కల్పించారు. భక్తులు అద్దంలో అమ్మవారి ప్రతిబింబాన్ని చూసిన తర్వాత మావుళ్లమ్మను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అమ్మవారిని దర్శించుకున్నారు. జనవరి 13 నుంచి ఆలయ వార్షిక మహోత్సవాల ప్రారంభం సందర్భంగా మూలవిరాట్‌కు, ఆభరణాలకు ప్రత్యేక ముస్తాబు చేసే నిమిత్తం ఈ నెల 17 నుంచి దర్శనం నిలిపివేశారు.

---

## కొయ్యలగూడెంలో ఆయుధాగారం

**ఏర్పాటుకు నౌకాదళ అధికారుల సంసిద్ధత**

ఈనాడు-ఏలూరు: కేంద్ర రక్షణ శాఖకు సంబంధించిన నౌకాదళ ఆయుధాగారాన్ని కొయ్యలగూడెం మండలంలో ఏర్పాటు చేయడానికి విశాఖ నేవీ అధికారులు అంగీకరించారు. ఈ ప్రాంతంలో నేవీ డిపో ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదని జిల్లా యంత్రాంగానికి తెలియజేశారు. ఈనెల 18న వారు కొయ్యలగూడెం వచ్చి స్థలాన్ని పరిశీలించారు. పర్యటన విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఇంతకు ముందే జీలుగుమిల్లి మండలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించగా.. ఆ ప్రాజెక్టు వల్ల గిరిజన సంఘాలు ఆందోళనలు చేశాయి. ప్రాజెక్టు చేజారిపోకుండా ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ప్రత్యామ్నాయంగా కొయ్యలగూడెం మండలంలో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ముందుగానే అక్కడి రైతులతో సంప్రదింపులు జరిపి భూములు ఇవ్వటానికి స్థానిక నాయకులు, రైతులను ఒప్పించారు.

**రెండు జాతీయ రహదారుల మధ్య..** కొయ్యలగూడెం మండలం మీదుగా ఒక వైపు ఖమ్మం-దేవరపల్లి, మరోవైపు జీలుగుమిల్లి వయా బుట్టాయగూడెం, పోలవరం వెళ్లే జాతీయ రహదారులు ఉన్నాయి. దీంతో వీటి మధ్య ఉన్న ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఉండటంతో రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తవని నేవీ అధికారులు భావించి ఇక్కడ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిసింది. రూ.2500 కోట్లతో ఈ ప్రాజెక్టు పెట్టనుంది. ఏడాది క్రితమే కేంద్రం అంగీకరించింది.

**భూసేకరణకు చర్యలు..** ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతం కొయ్యలగూడెం మండలంలో ఉన్నా జాతీయ రహదారులకు అనుసంధానం కావడానికి కొంత పక్కనే ఉన్న గోపాలపురం నియోజకవర్గంలో 2, 3 గ్రామాల పరిధిలో భూములు సేకరించాల్సి వస్తోంది. ఈ మేరకు భూసేకరణకు చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు సూచించినట్లు ఎంపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

---

## ఆ చావులు.. సారాజ్యంలోనివే!

**• తేల్చిన సిట్ • 25 కుటుంబాల్లో తీరని విషాదం**

ఈనాడు-ఈటీవీ కథనం

**2022 మార్చి...** ప్రశాంతమైన జంగారెడ్డిగూడెం ఉలిక్కిపడింది.. ఏ ఇంట చూసినా.. రోదనలు.. ఆర్తనాదాలు.. ఏం జరిగిందని తెలుసుకునే లోపే.. 25 ప్రాణాలను బలితీసుకుంది సారా.. ఈ విషాదకర ఘటన జరిగి మూడేళ్లయినా.. ఇంకా ఆ కుటుంబాల్లో విషాదం తొలగలేదు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అప్పటి వైకాపా ప్రభుత్వం వీటిని సారా మరణాలు కాదని కొట్టేసింది. ప్రతిపక్షాలు, ప్రజలు గగ్గోలు పెట్టినా కాదని బుకాయించింది. కొందరు న్యాయంపొందాలని ఆశతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. అప్పటి పోస్టుమార్టం నివేదిక, మృతుల శరీర భాగాల్లో గుర్తించిన రసాయనాల ఆధారంగా.. అవి కల్తీ సారా మరణాలని దర్యాప్తు బృందం తాజాగా నిర్ధరించింది.

**వీధిన పడ్డ కుటుంబాలు..** మృతుల్లో అత్యధికులు శ్రామికులు, రోజు వారీ కూలీలు. ఇంటికి ఆధారమైన రక్త సంబంధీకులను కోల్పోయిన కుటుంబాల పరిస్థితి ఒక్కసారిగా తలకిందులై వీధిన పడ్డాయి. భర్తలను కోల్పోయిన భార్యలు తమ పిల్లల కోసం చిన్నచిన్న పనులు చేస్తూ నెట్టుకొస్తున్నారు.

**రేపు ఇంట్లో వేడుకనగా..** మా అబ్బాయి పితాని రమణ చనిపోయాక మా మనవలు ఇద్దరిని చదివించలేక మాన్పించాం. నా కోడలు విజయలక్ష్మి హోటల్‌లో పనిచేస్తోంది. నేను పారిశుద్ధ్య పనులు చేస్తున్నా. రేపు మా మనవరాలి పుష్పాలంకరణ వేడుకనగా ముందు రోజు నా కొడుకు చనిపోవడం మా కుటుంబంలో తీరని వేదన మిగిల్చింది. - పితాని లక్ష్మి

**ఒడిశా నుంచి వచ్చి ఒంటరై..** పొట్ట కూటి కోసం ఒడిశా నుంచి వచ్చాం. నా భర్త ఉపేంద్ర టైల్స్ అతికించే పని చేసేవారు. మాకు ఇద్దరు పిల్లలు. కల్తీసారా తాగి చనిపోయే నాటికి 30 ఏళ్లు. ఆయన బతికుండగా నేను ఎప్పుడూ గడప దాటలేదు. ఇప్పుడు ఇద్దరు పిల్లలతో దుర్భర జీవితం అనుభవిస్తున్నాం. కూలికి వెళ్తే రోజు రూ.200 ఇస్తున్నారు. - సునాని ప్రియ

**పోస్టుమార్టం నివేదికా ఇవ్వలేదు**

మా నాన్న అప్పారావు చనిపోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోస్టుమార్టం నివేదిక మాత్రం ఇవ్వలేదు. అప్పట్లో చంద్రబాబు చేసిన రూ.లక్ష సాయం అమ్మ వెంకటలక్ష్మికి వైద్యం చేయించడానికి ఉపయోగపడింది. ప్రస్తుతం పక్షవాతం, బోదకాలుతో ఇబ్బంది పడుతోంది. - ఎం.లీలాప్రకాష్

**దుర్భర జీవితం నెట్టుకొస్తున్నాం..** మా అబ్బాయి చదువు మానేసి పనులు చేసుకుంటున్నాడు. మా అమ్మాయిని 8వ తరగతిలోనే మాన్పించేశా. నా భర్త పోశియ్య జీవించి ఉంటే మా పిల్లలకు ఈ దుస్థితి వచ్చేది కాదు. వంట పనులు చేసే ఆయన మమ్మల్ని ఎంతో బాగా చూసుకునేవారు. ఆయన చనిపోయాక మేము వీధిన పడ్డాం. దుర్భర జీవితంతో బతుకుతున్నాం. - వెంకటలక్ష్మీ దుర్గ

---

## అమ్మను తలచి.. భక్తితో కొలిచి..!

ఏలూరు పడమర వీధి గంగానమ్మ జాతర నేత్రపర్వంగా సాగుతోంది. అమ్మవారు కొలువుదీరిన మేడ ప్రాంగణంలో పంబలి రామారావు మహిళా వేషధారణలో సోమవారం రేడ కపిరి ముగ్గు వేశారు. నృత్యం చేస్తూ జాతర చరిత్రను వివరించారు. - న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం

## రాజకీయ అండ.. రాబందులు నిండా!

మండల కేంద్రం ఉంగుటూరులోని (నీలాద్రిపురం రోడ్డు పక్కన) జిరాయితీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రింబవళ్లు తేడా లేకుండా పొక్లెయిన్‌తో మట్టి తవ్వేసి.. టిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమార్కులకు రాజకీయ నాయకుల అండదండ ఉండటంతో.. అటు వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. - న్యూస్‌టుడే, ఉంగుటూరు

---

## పండగకు ప్రయాణమా?

**వాట్సాప్‌లో ఆర్టీసీ బస్సు టికెట్లు పొందండి**

నూజివీడు, మండవల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ తీవ్రంగా ఉంటుంది. వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు సొంతూళ్లు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు అదనంగా బస్సులు నడపనుంది.

టికెట్ బుకింగ్ కోసం బస్టాండ్, నెట్ సెంటర్‌కు వెళ్లి సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సులువుగా టికెట్ పొందే అవకాశం కల్పించారు. సంక్రాంతి సీజన్‌తో పాటు సాధారణ సమయాల్లోనూ ఈ సేవలను పొందొచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారిణి షేక్ షబ్నం తెలిపారు.

**ఇలా చేయాలి..**

వాట్సప్ ద్వారా ఆర్టీసీ బస్సు టికెట్లు బుక్ చేసుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన 95523 00009 నంబరును సేవ్ చేసుకోవాలి. దానికి వాట్సాప్‌లో హాయ్ అని సంక్షిప్త సందేశం పంపి.. ఆర్టీసీ సేవలను క్లిక్ చేస్తే టికెట్ బుకింగ్ ఐచ్ఛికం వస్తుంది.

ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే నిర్ధారణ సందేశం మీ వాట్సాప్‌కే వస్తుంది.

● ప్రయాణ వివరాలు, బయలుదేరే ప్రదేశం, చేరాల్సిన గమ్యం, తేదీ, వివరాలు నమోదు చేయాలి. ఏఏ సమయంలో ఏ బస్సులు ఉన్నాయో వివరాలు చూపిస్తుంది. బస్సు ఎంపిక చేసుకుని ఖాళీగా ఉన్న సీటును బుకింగ్ చేసుకోవచ్చు.

## అర్జీలతో వచ్చాం.. మీ కోసం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. పలువురు నిరక్షరాస్యులు కలెక్టరేట్ ఆవరణలో సిబ్బందితో వినతులు రాయించుకున్నారు. జేసీ అభిషేక్ గౌడ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. 313 వినతులు అందాయన్నారు. ఆయా సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## కలెక్టర్ పేరిట నకిలీ ఖాతా

**బెదిరింపులకు పాల్పడిన స్కామర్లు**

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు సామాన్యులే కాదు.. కలెక్టర్లనూ మోసగిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఏకంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతా తెరిచి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపుతున్నారు. వాటిని అంగీకరించే వారిని బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్నారు. కలెక్టర్ పేరిట జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారిని ఇటీవల కొందరు స్కామర్లు డబ్బులు ఇవ్వాలంటూ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడినట్లు తెలిసింది. మరి కొందరినీ బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి వెళ్లింది.

**అధికారిక పేజీ నిలుపుదల..** పాలనా సౌలభ్యం నిమిత్తం వెట్రిసెల్వి పేరుతో కలెక్టరేట్ సిబ్బంది కలెక్టర్ పేజీ(ఎఫ్‌బీ) ఖాతా తెరిచారు. ఇందులో పాలనాపరమైన విషయాలు పోస్టు చేస్తుంటారు. దీన్ని అవకాశంగా తీసుకున్న స్కామర్లు నకిలీ ఖాతా సృష్టించి అక్రమాలకు పాల్పడుతుండటంతో.. అధికారిక పేజీ నిలుపుదల చేసినట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. తన పేరిట ఎఫ్‌బీ ద్వారా పంపే ఎలాంటి పోస్టులు, అభ్యర్థనలకు ప్రజలు అంగీకరించవద్దంటూ కలెక్టర్ వెట్రిసెల్వి వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నారు.

## గిన్నిస్‌బుక్‌లో నాట్యమయూరాలు

భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం-2 పేరిట హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల 4,608 మంది కళాకారులు 40 నిమిషాల పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. కైకలూరు శ్యామలా నాట్య కళామండలి నిర్వాహకురాలు కె.లక్ష్మీజ్యోతి ఆధ్వర్యంలోని సుమారు 20 మంది చిన్నారులు ఈ వేడుకలో నృత్య ప్రదర్శన చేసి.. గిన్నిస్ బుక్ ప్రతినిధుల చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు తదితరులు చిన్నారులకు అభినందనలు తెలియజేశారు. - న్యూస్‌టుడే, కైకలూరు

### సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా జనవరి 7, 8, 9 తేదీల్లో కాకినాడ టౌన్- వికారాబాద్ (07186, 07460), 8, 9, 10, 11 తేదీల్లో వికారాబాద్- కాకినాడ టౌన్ (07185, 07187, 07461), 8న సికింద్రాబాద్- పార్వతీపురం (07464), 9న పార్వతీపురం- సికింద్రాబాద్ (07465) రైళ్లు తిరుగుతాయని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్వో నస్రత్ ఎం. మండ్రూకర్ తెలిపారు.

### రైల్వే సహాయ కేంద్రం ఏర్పాటు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా యలమంచిలి సమీపంలో టాటానగర్- ఎర్నాకులం(18189) రైలు అగ్ని ప్రమాదానికి గురైన నేపథ్యంలో ఏలూరు రైల్వేస్టేషన్‌లో 75693 05268 నంబరుతో సహాయ కేంద్రం అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు చెప్పారు.

### వసతి గృహాల పర్యవేక్షకులకు తాకీదులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ వసతి గృహాల్లో ఆదివారం ఆహార పట్టిక అమలు చేయకపోవడంపై 'ఆకలా.. తిను.. అడగొద్దు మెనూ' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన కథనానికి సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విశ్వమోహనరెడ్డి స్పందించారు. ఉంగుటూరు మండలం బొమ్మిడి, పోలవరం వసతి గృహాల పర్యవేక్షకులు కె.బాలమ్మ, ఎస్‌సీహెచ్‌వీవీఎస్ కుమార్‌కు తాకీదులు ఇచ్చారు.

## ఎన్నాళ్లు తిరగాలో.. ఎన్నేళ్లు అడగాలో

**పింఛన్ల కోసం దరఖాస్తుల వెల్లువ**

-న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్

• నూజివీడుకు చెందిన రమణ, నాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడికి పుట్టుకతో వైకల్యం. కూలి పనులు చేసుకుని జీవించే రమణ తన రెండో కుమారునికి దివ్యాంగుల కేటగిరీలో పింఛను ఇప్పించాలని కోరుతూ ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నారు. ఇంతవరకు మంజూరు కాలేదు. చాలీచాలని సంపాదనతో కుటుంబ భారాన్ని మోయడం అతనికి ఎంతో ఇబ్బందిగా ఉంటోంది.

• ఆగిరిపల్లికి చెందిన జనార్దన్ లారీ చోదకునిగా పనిచేసేవారు. వయసు పైబడటంతో ఆయన పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నారు. ఈయనకు 60 ఏళ్లు పైబడటంతో వృద్ధాప్య పింఛను కోసం ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు మంజూరు కాలేదు. ఈయన ఆలనా పాలనా చూసేవారు లేక జీవితాన్ని ఎంతో దుర్భరంగా గడుపుతున్నారు.

2024 జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో వివిధ కేటగిరీల్లో సుమారు 18వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అంతకు ముందు వరకు మాత్రమే కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

పింఛను పొందే భర్త చనిపోతే స్పౌజ్ కేటగిరీ కింద భార్యకు పింఛను మంజూరు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇంత వరకు సుమారు 1,600 మందికి మంజూరు చేశారు. ఇవి మినహా మిగతా వారెవరికీ కొత్తగా ఇవ్వలేదు.

**ఆన్‌లైన్‌లో నమోదైతేనే అర్హత..** అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో నమోదైతేనే మంజూరు చేస్తారు. గత రెండేళ్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. మండల, డివిజన్, పురపాలక కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 200 నుంచి 300 వరకు అర్జీలు అందుతుండగా అందులో 60 నుంచి 80 వరకు పింఛన్లకు సంబంధించినవే ఉంటున్నాయి. పింఛన్ల కోసం ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన తర్వాత వాటిని ఆన్‌లైన్ చేసి అర్హులకు మంజూరు ఇస్తామన్నారు.

---

## తెదేపాను మరింత బలోపేతం చేస్తా బడేటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: తెదేపాను జిల్లాలో మరింత బలోపేతం చేస్తానని ఆ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన ఆయన.. స్థానిక తెదేపా జిల్లా కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే చంటి, చిత్రంలో చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్, ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు, ట్రైకార్ ఛైర్మన్ శ్రీనివాస్

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ముందుకు సాగుతానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం విజయ ఢంకా మోగించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కానుక ఇద్దామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వైకాపా నేతలు అనుసరిస్తున్న విధానాలను తిప్పికొడతామన్నారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా మరణాలను మసిపూసి మారేడుకాయ చేయాలనుకున్న అప్పటి సీఎం జగన్‌కి సిట్ నివేదిక చెంపపెట్టని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన చంటికి పలువురు ఆధ్యాత్మిక గురువులు ఆశీర్వచనాలు ఇచ్చారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ట్రైకార్ ఛైర్మన్ శ్రీనివాస్, నాయకులు వి.నరసింహారావు, పి.శివప్రసాద్, ఎం.పార్థసారథి పాల్గొన్నారు.

## మన్యంలో ఇక హలో.. హలో

**తొలగనున్న సంకేతాల సమస్య**

కుక్కునూరు మండలం మారుమూల ఆదివాసీ గ్రామంలో వచ్చీరానీ సిగ్నళ్లకు ప్రత్యామ్నాయంగా ఎత్తైన ఏంటెనా వర్షానికి తడవకుండా గొడుగు పెట్టిన దృశ్యం

కుక్కునూరు, కొయ్యలగూడెం, న్యూస్‌టుడే

హలో హలో.. సిగ్నల్ సరిగా లేదు. ఎత్తైన ప్రదేశానికి వచ్చి చేస్తా.. జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం మండలాల్లోని మారుమూల గ్రామాల వారికి ఫోన్ చేస్తే... తరచూ వినిపించే మాటలివి. ఈ మూడు మండలాల్లో సమాచార సంబంధాలు లేని పల్లెలు కోకొల్లలు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాకు 45 సెల్‌టవర్లు మంజూరు చేసింది. 'డిజిటల్ భారత్ నిధి' పథకం కింద కేంద్రం కొత్త టవర్ల ఏర్పాటు ఖర్చును భరిస్తుండగా, కావాల్సిన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోంది.

కొత్త టవర్లలో ఎక్కువ శాతం సమాచార వ్యవస్థ అందుబాటులో లేని ఏజెన్సీ గ్రామాల్లో ఏర్పాటు చేయబోతున్నారు. సామర్థ్యానికి మించి ఫోన్లు ఉండి, తరచూ అంతరాయం ఏర్పడుతున్న మైదాన ప్రాంతాల్లోనూ కొన్నింటిని నిర్మించనున్నారు.

**సర్వేలు పూర్తి...** ఈ టవర్ల ఏర్పాటుకు సంబంధించి సర్వేలు దాదాపు పూర్తయ్యాయి. ఇక స్థలాన్ని ఆయా కంపెనీలకు అప్పగించడమే తరువాయి. వేలేరుపాడు, పోలవరం మండలాల్లో కొన్ని ప్రదేశాలు అటవీ ప్రాంతంలో ఉండటంతో ఆ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం కోరుతున్నారు.

**ప్రకృతి విపత్తుల సమయంలో..** ప్రధానంగా ఏటా జులై-సెప్టెంబరు నెలల్లో వచ్చే గోదావరి వరదల సమయంలో తీరప్రాంతాలకు సమాచార సంబంధాలు లేక అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. వరదలతో ఏ గ్రామం ఏ స్థితిలో ఉంది..ఆ గ్రామస్థులు ఎక్కడ తలదాచుకున్నారు..వంటి సమాచారం అధికారులకు చేరడం లేదు. అక్కడక్కడా హామ్ రేడియోలను వినియోగించి, బాధితుల జాడ తెలుసుకొంటున్నారు. తుపాన్లు, అగ్ని ప్రమాదాలు, వ్యాధులు, బాధల సమయంలో మండల కేంద్రానికి సమాచారం అందించే సౌకర్యం కరువైంది.





(c) eenadu

# ఇంటర్ విద్యలో కీలక మార్పులు

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** ఇంటర్మీడియట్ విద్యలో కూటమి ప్రభుత్వం కీలక సంస్కరణలు తీసుకొచ్చింది. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అమలు చేస్తోంది. మారిన సిలబస్ ప్రకారం ప్రశ్నాపత్రాలు మార్పు చేసింది. పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభం కానున్నాయి.

**ఆరు పేపర్లు**

జిల్లాలో 18,217 మంది మొదటి సంవత్సరం విద్యార్థులున్నారు. గతంలో ఆరు పేపర్లుండగా.. తాజాగా అయిదు పేపర్లు ఉంటాయి. తొలిసారిగా ఒక మార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టారు. ఆరో పేపరుగా ఎంపీసీ విద్యార్థులు జీవశాస్త్రం, బైపీసీ విద్యార్థులు గణితం తీసుకునే వెసులుబాటు కల్పించారు. ఆరో పేపరు ఉత్తీర్ణత తప్పనిసరి కాదు. ఆరో సబ్జెక్టులో ఉత్తీర్ణత కాకపోయినా అయిదు సబ్జెక్టుల మార్కులతో మెమో ఇస్తారు. మొదటి సంవత్సరం పరీక్ష విధానంలో వచ్చిన మార్పులపై అవగాహన కల్పించామని ఆర్ఐవో యోహాను తెలిపారు.

**యాజమాన్యం**

| కళాశాలలు | | విద్యార్థులు |
|---|---|---|
| ప్రభుత్వ | 19 | 2,279 |
| ఏపీఎస్‌డబ్ల్యూఆర్ | 6 | 434 |
| ఏపీటీడబ్ల్యూఆర్ | 3 | 280 |
| కేజీబీవీ | 3 | 71 |
| హైస్కూల్ ప్లస్ | 26 | 412 |
| ఎయిడెడ్ | 2 | 395 |
| ప్రైవేటు | 81 | 14,346 |

**జీవశాస్త్రంగా జంతు, వృక్ష శాస్త్రాలు**

జంతు, వృక్ష శాస్త్రాలు కలిపి జీవశాస్త్రం సెక్షన్- 1, 2గా ప్రశ్నాపత్రం 85 మార్కులకు ఉంటుంది. 24 పేజీల బుక్‌లెట్లు రెండు ఇస్తారు. సెక్షన్-1లో వృక్షశాస్త్రం 43, సెక్షన్-2లో జంతుశాస్త్రం 42 మార్కులకు ఉంటాయి.

**వంద మార్కులకు గణితం**

గణితం 1ఏ, 1బీగా ఒక్కో పేపరు 75 మార్కుల చొప్పున 150 మార్కులకు ఉండేది. ఇప్పుడు ఒక పేపరే 100 మార్కులకు ఉంటుంది.

**అప్పుడు 60.. ఇప్పుడు 85**

భౌతిక, రసాయన శాస్త్రాలు ఒక్కో పేపరు 60 మార్కులకు ఇచ్చేవారు. ఇప్పుడు 85 మార్కుల చొప్పున ప్రశ్నాపత్రాలుంటాయి. కొత్త విధానంలో 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలతో పేపరు ఇస్తారు.

**29 మార్కులకే ఉత్తీర్ణత**

భౌతిక, రసాయన, జీవశాస్త్రం సబ్జెక్టులకు మొదటి 85 మార్కులకు ఉత్తీర్ణత శాతం 35% లెక్కన 29. 75 మార్కులు రావాల్సి ఉండగా దీన్ని 29కి తగ్గించారు.

## దరఖాస్తు గడువు 28

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** ఐటీఐ అఖిల భారత ట్రేడ్ పరీక్ష రాయడానికి అర్హులైన అభ్యర్థులు జనవరి 28లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రధానాచార్యుడు డి. భూషణం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 21 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. ఐటీఐ ట్రేడుల్లో నైపుణ్యం కలిగి, అప్రెంటిస్ శిక్షణ ఇస్తున్న సంస్థల్లో, ఎంఎస్‌ఎంఈల్లో కనీసం మూడేళ్లపాటు పనిచేసి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 08812-230269 నంబరును సంప్రదించాలన్నారు.

# స్వల్ప కాలం.. అధిక లాభం..

## బంతిపూల సాగులో సత్ఫలితాలు సాధిస్తున్న యువ రైతు

**జంగారెడ్డిగూడెం (గ్రామీణ), న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన బి.నరేశ్‌కు చిన్ననాటి నుంచి వ్యవసాయమంటే చాలా ఇష్టం. దీంతో తండ్రికి తోడుగా నడిచారు. స్వల్ప కాలంలోనే ఆదాయం వచ్చే రకాలను సాగు చేయాలనే దృఢ నిశ్చయంతో ముందుకు సాగుతూ అందరి మన్ననలు పొందుతున్నారు.

సామాజిక మాధ్యమాల ద్వారా కూరగాయలతోపాటు పూలతోటల పెంపకం తదితర వాటిని నిశితంగా పరిశీలించారు. దీంతో బంతిపూల సాగును చేయాలని నిశ్చయించుకున్నారు. ఇక్కడి వాతావరణం బంతి పూలకు అనువుగా ఉంటుందని లేదో తెలుసుకునేందుకు తనకు కొంత కున్న ఎకరంలో మట్టి నమూనా పరీక్షలు చేయించడంతోపాటు తోటి రైతుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. అంతా బాగా ఉందని తేలడంతో బెంగళూరు నుంచి బంతిపూల మొక్క ఒక్కటి రూ.4.8 కొనుగోలు చేసి ఎకరాకు 8 వేల మొక్కలు

జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో నరేశ్ పండిస్తున్న బంతి తోట

నాటారు. ప్రస్తుతం ఆదాయం బాగుండటంతో బంతితో పాటు చామంతి ఇతర పూల తోటలను పెంచేందుకు ప్రణాళిక చేశారు.

**ఉత్తమ సస్యరక్షణ చర్యలతో..**

మొక్కలు నాటే ముందు భూమిలో పశువుల పేడ, ఇతర వ్యర్థాలను వేసి దున్నుతారు. అనంతరం మొక్కలు నాటి వాటి మొదట్లో కొంచెం పశువుల పేడ, ఇతర సేంద్రియ ఎరువులను మొక్క ఎదుగుదలకు వాడుతున్నారు. బీజామీద నివారణకు జీవామృతం, ఇతర సేంద్రియ కషాయాలతోపాటు రసాయనాలను వినియోగించి ఎకరాకు 3 టన్నులకు పైగా దిగుబడి సాధిస్తున్నారు.

**ఖర్చులు తక్కువ..**

'పూల సాగుకు కూలీలతోపాటు ఎరువుల ఖర్చులు చాలా తక్కువ. అంతరపంటగా వేస్తే బాగుంటుంది. ఏడాది పొడవునా పూల సాగు చేస్తే రూ.2 లక్షల ఆదాయం వస్తోంది..' అని రైతు నరేశ్ తెలిపారు.

వచ్చిన పూలను బస్సుల్లో నింపి జంగారెడ్డిగూడెం మార్కెట్‌లో కిలో రూ.50కు పైగా విక్రయిస్తున్నారు.



**ప్రశ్న:** మినప పంటలో ఆకులపై రంధ్రాలు పడి మచ్చలు వస్తున్నాయి. నివారణ ఎలా ?
- **కొరద సోమయ్య, లింగపాడు**

**సమాధానం:** పచ్చ పురుగులతో నెడుగా విత్తిన మినుము ఆకులు, కొమ్మలను పొగాకు లద్దె పురుగు కొరికి తినేస్తాయి. దీని వల్ల ఆకులకు రంధ్రాలు పడతాయి. వీటి నివారణకు ఎకరానికి 1500 పీపీఎం వేప నూనె లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అనుమచ్చ తెలుగు నివారణకు మెటలాక్సిల్+మాంకోజెబ్ 2 గ్రా./లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

డా. పి.విజయలక్ష్మి ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకటరామన్నగూడెం

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

మీరూ అడగొచ్చు ✆ వాట్సాప్ 73826 33692

## వరి సాగులో నారే కీలకం

**మార్టేరు, న్యూస్‌టుడే:** ఆరోగ్యకరమైన నారు తయారు చేసుకోవడం ద్వారా వరిలో సాగులో మంచి దిగుబడి పొందేందుకు అవకాశం ఉంటుందని మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. నారుమడి తయారీ, విత్తన మొలక, ఇతర విషయాలను ఆయన వివరించారు. ● దృఢమైన నారును పొందాలంటే నేలను చక్కని దుక్కి 10-12 రోజుల ముందు బాగా దున్ని, కలుపు లేకుండా చదును చేయాలి. ● ప్రతి 100 చదరపు మీటర్ల(రెండున్నర సెంట్లు) ఒక కిలో నత్రజని ఎరువు ఇవ్వాలి ముందు వేసుకోవాలి. అరకిలో భాస్వరం, అరకిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉంటే సమయంలో భాస్వరం రెట్టింపు వేయాల్సి ఉంటుంది. ప్రతి సెంటుకు ఐదు కిలోల విత్తనం అవసరం. విత్తనం ఎక్కువ అయితే నారు బలహీనంగా తయారవుతుంది. నాటిన తర్వాత మూన తిరగడం ఆలస్యమవుతుంది. ● మొలక కట్టిన విత్తనం వేయడం మంచిది. విత్తనాన్ని 16-24 గంటల నీటిలో నానబెట్టి 36 గంటలు మండె కట్టినట్లయితే మొలక త్వరగా వస్తుంది.

## పండుగప్పలో నష్ట నివారణ ఇలా

**నరసాపురం, న్యూస్‌టుడే:** ఆక్వా చెరువుల్లో సాగుచేస్తున్న పండుగప్ప (సీబాస్) చేపలకు ఇటీవల వ్యాధులు విజృంభిస్తున్నాయి. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వాటిలో వ్యాధుల ఉధృతి తగ్గించి నష్టాల నుంచి గట్టెక్కవచ్చని మత్స్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. వీటి ప్రభావంతో చేపల మృత్యువాత వాటిల్లుతుంటాయి. తాటాకు, జలగ, రెడ్‌డిసీజ్ వంటివి సోకి అవి మృత్యువాత పడుతున్నాయి. ఐదేసిల వాటికి ఆహారం రొయ్య తలకాయలు, ఇతర వ్యాధికారక చేపలు విని భీమవరానికి చెందిన ఆక్వా నిపుణుడు అడబాల గోపాలరావు సూచించారు.

వ్యాధి సోకిన చేపలు

**ఇవీ కారణాలు**

స్ట్రెప్టోకోకస్, విబ్రియో వంటి బ్యాక్టీరియా ప్రభావంతో పండుగప్ప చేపలకు రెడ్‌డిసీజ్ సోకుతుంది. దీని ప్రభావంతో చేప శరీరంపై ఎర్రటి మచ్చలు, పుండ్లు ఏర్పడతాయి. వాటి కళ్లు పైకి పొడుచుకువస్తాయి. పేగు వరుస వస్తుంది. ఫ్లావో, కాలమ్‌నారిస్ అనే బ్యాక్టీరియా ప్రభావంతో పండుగప్పలకు తాటాకు తెగులు సోకుతుంది. దీని ప్రభావంతో మొప్పల మొప్పైలపై, కింద భాగంలో మచ్చలు ఏర్పడి పాలిపోతాయి. తోకభాగము తినేసినట్లు ఉంటుంది. మొప్పలకు లెర్నాంత్రోపస్ వంటి పరాన్న జీవులు అతుక్కుని రక్తం పీల్చడంతో చేపలు బలహీనపడి వ్యాధులు సోకుతాయి.

**నిపుణుల సూచనలివే..**

నీటి నాణ్యత బాగుండేలా చూడటం, చెరువు నీటిలో విషవాయువులు పెరగకుండా చూడటం ద్వారా రెడ్‌డిసీజ్, తాటాకు తెగులు సోకకుండా నివారించవచ్చు. ఈ తెగుళ్ల నివారణకు ప్రభుత్వ అనుమతి ఉన్న వ్యాధి నిరోధక మందులు, జలగ నివారణకు పురుగు మందులను నిపుణుల సూచనల మేరకు వినియోగించాలని గోపాలరావు సూచించారు.

## చలిలో జీవాలు జాగ్రత్త

**నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే:** శీతాకాలంలో చలిగాలులతో గొర్రెలు, మేకలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారి విజయకుమార్ తెలిపారు. మేకలు, గొర్రెలకు చలిగాలులు తగలకుండా ఆవాసాలు ఏర్పాటు చేయాలి. బలవర్ధకమైన గ్రాసం అందించాలి. ✦ జీవాలకు న్యూమోనియా సాధారణం. దీని నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. వాటి కొంపలో పాముల నివారణకు కొంత పొడి వేయాలి. పీపీఆర్, పొంగు నివారణకు టీకాలు వేయించాలి. ✦ మగ జీవాలు, గర్భిణులు, పిల్లలు, పెరుగుతున్న గుంపులను వేర్వేరు కొట్టాల్లో ఉంచాలి. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం సమయాల్లో కాకుండా 10గంటల నుంచి మధ్యాహ్నం వరకే మేపాలి. ✦ చలి, తేమ ప్రభావంతో ఫుట్ రాట్(కాలి తెగులు) సోకే ప్రమాదం ఉంది. దీని నివారణకు 5శాతం కాపర్ సల్ఫేట్, 10శాతం జింక్ సల్ఫేట్‌తో వాటి కాళ్లు, డెక్కలు శుభ్రపరచాలి.

# బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాలి

**చింతలపూడి, న్యూస్‌టుడే:** బాల్య వివాహాలు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తీవ్ర హాని కలిగిస్తాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. 'బాల్య వివాహ నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన పెంపొందితేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. చదువుకునే వయస్సులో వారికి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. పర్యావరణ పరిరక్షణ సంబంధించిన న్యాయ అంశాలపై విద్యార్థు

మాట్లాడుతున్న రత్నప్రసాద్

లకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ క్రాంతికుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎంఈవో కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**ఉపకారాగారం తనిఖీ.. చింతలపూడి, న్యూస్‌టుడే:** చింతలపూడి ఉపకారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిందితులకు అందించే ఆహారం, తాగునీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా నిందితులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు జైలు సూపరింటెండెంట్ కృపానందం తదితరులు పాల్గొన్నారు.

## డీటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం చేపట్టారు.. రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి పరిశీలకుడిగా, ఎన్.శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా కె.కాంతారావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, కుమారి, ఎస్‌వీ సుబ్బారావు, కార్యదర్శులుగా ఎం.రవి, బి.వెంకటేశ్వరరావు, పి.విద్యాసాగర్, ఆడిట్ కమిటీ కన్వీనరుగా ఎం.ఏసుదాసు, సభ్యులుగా డి.వరప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎన్.శ్రీనివాసరావు, కె.సురేశ్ కుమార్ ఎన్నికయ్యారు.

కాంతారావు, ఆదినారాయణ

## మంచం కింద బియ్యం!

**డీఎస్‌వో ఆదేశాలతో బయటకు తీసిన సీఎస్ డీటీ**

**పోలవరం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో అక్రమంగా దాచి ఉంచిన ఏడు బస్తాల(175 కిలోలు) బియ్యం జంగారెడ్డిగూడెం సహాయ పౌరసరఫరాల అధికారి జి.వెంకటేశ్వరరావు బయటకు తీశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఆదేశాల మేరకు సోమవారం పట్టిసీమ వీఆర్వో రమాదేవిని వెంటబెట్టుకుని ఆశ్రమ పాఠశాలకు వెళ్లారు. స్టోరూములోని బియ్యం, సరుకుల నిల్వలను పరిశీలించి సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. డీఎస్‌వో నుంచి వచ్చిన వీడియో, ఫొటోలు బట్టి పక్క గది తలుపు తాళం తీయించారు. అందులో మంచాల అడుగు భాగంలో బియ్యం బస్తాలున్నట్లు గుర్తించి వీఆర్వోతో పంచనామా రాయించారు. నివేదిక డీఎస్‌వోకు అందజేస్తామని డీటీ చెప్పారు. కొద్ది సేపటికి ఐటీడీఏ నుంచి డీడీ జగన్నాథరావు వచ్చి ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అంతర్గత విచారణ చేసి నివేదిక అధికారులకు అందజేస్తామని, లోపలకు రావడానికి బయట వారికి అనుమతి లేదని వెంటనే వెళ్లిపోవాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న వార్డెన్‌ను తప్పించి మరో ఉపాధ్యాయుడికి ఈ నెల 12న వార్డెన్ బాధ్యతలు అప్పగించారు. మంచం అడుగున బియ్యం దాచిన విషయం తనకు తెలియదని వార్డెన్ గగ్గోలు పెట్టాడు. ఆశ్రమ పాఠశాల నుంచే డీఎస్‌వోకు వీడియోలు, ఫొటోలు పంపి ఉంటారని సిబ్బంది భావిస్తున్నారు.

## పరిశ్రమల భవిష్యత్తును మార్చే క్వాంటమ్ టెక్నాలజీ

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** క్వాంటమ్ టెక్నాలజీ పరిశ్రమల భవిష్యత్తును మార్చనుందని ఐబీఎం ఇండియా క్వాంటమ్ మాజీ లీడ్ డా.ఎల్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం రాత్రి నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రతిష్ఠాత్మకంగా ఎర్లీ సాంకేతిక టెక్నోత్సవ్ 25- క్వాంటమ్ టెక్నాలజీ 2.0 ప్రారంభోత్సవం నిర్వహించారు. ఏపీటీసీఎస్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్వాంటమ్ మిషన్ ద్వారా శాస్త్రీయ పరిశోధనలు ప్రోత్సహిస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీసీ ఎం.విజయకుమార్, డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఏవో లక్ష్మణరావు, అకడమిక్ డీన్ చిరంజీవి, ఈసీఈ అధ్యాపకుడు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న ఎల్వీ సుబ్రహ్మణ్యం, అతిథులు

# మోదెల.. వెలుగులీనేలా!

## గ్రామానికి సౌర విద్యుత్తు కాంతులు

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఏళ్లుగా విద్యుత్తు వెలుగులకు నోచుకోని బుట్టాయగూడెం మండలం మోదెల కాంతులీనుతోంది. ఎట్టకేలకు గిరిజన గ్రామానికి సౌర విద్యుత్తు సదుపాయం ఒనగూరింది. గ్రామంలో విద్యుత్తు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ ఎస్టీ కమిషన్‌కు గిరిజనులు వినతి పత్రం పంపారు. కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ గ్రామంలో పర్యటించి.. అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి ఇటీవల సమీక్షించారు. గ్రామంలో వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. తొలుత గ్రామంలోని 23 ఇళ్లకు విద్యుత్తు అందించేందుకు రూ.12.5 లక్షలతో 5కేడబ్ల్యూపి గ్రిడ్‌ను ఏర్పాటు చేసి సౌర విద్యుత్తు అందించారు. ఈ నేపథ్యంలో మోదెల గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి జేసీ అభిషేక్ గౌడ, విద్యుత్తు ఎస్ఈ సాల్మన్‌రాజుకు పూల మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

జేసీ అభిషేక్ గౌడ, విద్యుత్తు ఎస్ఈ సాల్మన్‌రాజుకు పూలమొక్క ఇస్తున్న గ్రామస్థులు

## విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలుపై విద్యాశాఖాధికారులతో సోమవారం సమీక్షించి మాట్లాడారు. తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్య స్థాయి తెలుసుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో సర్కారు బడుల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఆమె దిశానిర్దేశం చేశారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పారిజాతగిరిపై ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో మంగళవారం జరగనున్న ముక్కోటి ఏకాదశికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు తొలి దర్శనం 5 గంటలకు ఉంటుందన్నారు. 10 వేల మందికిపైగా భక్తులు స్వామిని దర్శించే అవకాశం ఉందన్నారు. ముక్కోటి సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షిణ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుశ్మిత సోమవారం మధ్యాహ్నం ఆలయాన్ని దర్శించారు. ఏర్పాట్లు పర్యవేక్షించారు. వీరికి ఈవో శ్రీనివాస్, ఆలయ ఛైర్మన్ రామకృష్ణ తదితరులు ముక్కోటి ఏర్పాట్లను వివరించారు. సీఐ సుభాష్, ఎస్సై వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల గురించి ఏఎస్పీ తదితరులకు వివరిస్తున్న ఈవో శ్రీనివాస్


**పొగాకు బోర్డు, గుంటూరు**

వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య విభాగము, భారత ప్రభుత్వము (ఐ.యస్.ఓ.9001:2015 గుర్తింపు పొందిన సంస్థ)
జి.టి. రోడ్డు, గుంటూరు-522004. ఫోన్: 0863-2358399, 2358499.

**టెండరు నోటీసు**

2025-26 FCV పొగాకు ఆక్షన్స్ కొరకు ఆంధ్రప్రదేశ్‌లో గల పొగాకు బోర్డు వేలం కేంద్రాల వద్ద 1) పొగాకు బేళ్ళను హ్యాండిల్ చేయుటకు మరియు 2) ట్రాలీస్ మరమ్మత్తులు/ సర్వీసింగు కొరకు అనుభవము కలిగిన కాంట్రాక్టర్లు మరియు ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.
పైన తెలుపబడిన పనుల కొరకు టెండరు ఫారములు తదితర వివరముల కొరకు రీజినల్ మేనేజరు, ఒంగోలు, రాజమండ్రి మరియు మేనేజరు(ఆక్షన్స్), పొగాకు బోర్డు, గుంటూరు వారిని సంప్రదించగలరు. టెండరు ఫారములు మరియు నియమ నిబంధనలు పొగాకు బోర్డు వెబ్‌సైట్ (www.tobaccoboard.com) నుండి కూడా పొందవచ్చును.
పైన తెలుపబడిన పనుల నిమిత్తము పూర్తి చేసిన టెండరు ఫారాలను టెండరు నియమ నిబంధనలలో తెలిపిన ధరావతు సొమ్ముతో సహా తేది.21-01-2026 సాయంత్రం గం॥ 3.00 లలోగా పొగాకు బోర్డు, గుంటూరు నందు టెండరు బాక్సులో డిపాజిట్ చేయవలెను. అసంపూర్తిగా ఉన్న టెండర్లు తిరస్కరించబడును మరియు ఏ విధమైన కారణం చూపకుండానే స్వీకరించిన టెండర్లలో ఏదైనా లేదా అన్నింటిని తిరస్కరించేందుకు కార్యనిర్వహణాధికారి, పొగాకు బోర్డు వారు సర్వహక్కులు కలిగియున్నారు.
స్థలము : గుంటూరు, తేది: 29-12-2025 సం/- కార్యదర్శి


## 11న రాష్ట్రస్థాయి శరీర సౌష్ఠవ పోటీలు

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** పాలకొల్లులో జనవరి 11న రాష్ట్ర స్థాయి శరీర సౌష్ఠవ (బాడీ బిల్డింగ్) పోటీలు నిర్వహిస్తున్నట్లు న్యూ నవ్యాంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఖండవల్లి వాసు తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

## నేడే ఉత్తర ద్వార దర్శనం

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 30న ముక్కోటి పర్వదినాన భక్తులు ఆలయ ఉత్తర ద్వారం నుంచి వెండి గరుడ వాహనంపై కొలువైన శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఇందుకోసం శ్రీవారి ఆలయం ముస్తాబైంది. రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. మంగళవారం ఉదయం 5 గంటలకు ఆలయ ఉత్తర ద్వారాలు తెరిచి దర్శనం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 35 వేల మందికి పైగా భక్తులు వస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా తాత్కాలిక క్యూలు ఏర్పాటు చేశారు. శ్రీవారి ఉత్తర ద్వారాన్ని, ఆలయ ప్రాకారాన్ని పుష్పాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

విద్యుద్దీపకాంతులతో ఆలయం

## నేత్రపర్వం.. శ్రీవారి గ్రామోత్సవం

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ధనుర్మాసం సందర్భంగా ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తొళక్కం వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ వేడుక కనుల పండవగా జరిగింది. మహిళా భక్తులు అడుగడుగునా కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. గ్రామంలో ఊరేగుతున్న స్వామిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించారు.

**నేటి నుంచి అధ్యయనోత్సవాలు**

ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 9 వరకు అధ్యయనోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ ఉత్సవాల సమయంలో సాయం కాలం జరగాల్సిన ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# ప్రతి భక్తుడికీ సంతృప్తికర దర్శనం : కలెక్టర్

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ముక్కోటి ఏకాదశి రోజున ప్రతి ఒక్క భక్తుడికి సంతృప్తికరమైన దర్శనం కలిగేలా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ముక్కోటి ఏర్పాట్లను ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం దేవస్థానం అతిథి గృహంలో అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీవారిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకునే అవకాశం ఉందన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్లలో భక్తుల మధ్య తోపులాటలు లేకుండా, చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భద్రతను పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాల ద్వారా అన్ని ప్రదేశాల్లో పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ, డీఎంహెచ్‌వో డా.పి.జె.అమృతం, డీఎస్పీ శ్రావణ్ కుమార్, ట్రైనీ ఐపీఎస్ జయశర్మ, ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న వెట్రిసెల్వి, ప్రతాప్ శివకిశోర్, వెంకటరాజు

## విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

**ప్రధానోపాధ్యాయుడిపై కేసు**

**పోడూరు, న్యూస్‌టుడే:** అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడిపై సోమవారం పోడూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై సుధాకరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో ఓ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న మైలే నాగేశ్వరరావు ఈ నెల 26న 4, 5 తరగతులు చదువుతున్న బాలికలను పాఠశాల భవనం పైకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించారు. భయాందోళనలకు గురైన ఆ బాలికలు భవనంపై నుంచి కిందకు వచ్చి అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినికి విషయం చెప్పారు. ఆమె విద్యార్థినుల తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో సోమవారం గ్రామస్థులు, విద్యాకమిటీ ఛైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలకు వచ్చి హెచ్ఎంను నిలదీయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)**
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 లేయర్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

## పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం

**ఏపీనిట్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** పాలిటెక్నిక్ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలున్నాయని.. సాంకేతిక విద్యలో నైపుణ్యం మెరుగుపరచుకోవాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025ను జిల్లా క్రీడల పరిశీలకుడు గుణరంజన్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఆర్ట్స్, సైన్స్, సాంకేతిక తదితర రంగాల విద్యకు సంబంధించిన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి 12 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 550 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, షటిల్, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఫణీంద్ర ప్రసాద్, ఏపీ టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

## కేసులు ఎత్తివేయాలని కోరుతూ ధర్నా

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** ఇనుమూరులో గిరిజనులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని కోరుతూ జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 57 గిరిజన కుటుంబాలు సాగు చేసుకుంటున్న మొక్కజొన్న పంటను నాశనం చేసి గిరిజన మహిళలపై దాడి చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దారు, ఎస్సైలపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించి తప్పుడు కేసులు ఎత్తివేయాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో కార్యాలయ అధికారి సోమేశ్వరరావుకు అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు


92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

వెహికల్ ఫర్ సేల్ In as is where is Condition 2023 SCV TATA ACE HT Diesel. రిజి.నెం. AP 39 UP 7303. సుందరం ఫైనాన్స్ లి॥, భీమవరం. ✆ 94409 09782, 94935 45721.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

LAND FOR SALE

2 ఎకరాల 20 సెంట్లు చేపల చెరువు అమ్మకం. దొడ్డనపూడి గ్రామం కాళ్ల మండలం, భీమవరం, ప॥ గో॥ జిల్లా, సెల్: 8500405678, 9885912559

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

JOBS

ప్రముఖ వ్యాపార సంస్థకు అనుభవంగల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (Male) కావలెను. Q: ఇంటర్, డిగ్రీ. ✆ 95504 29786, 96763 93938.

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీ సర్వీసెస్ తణుకులో పనిచేయుటకు 25మంది సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8గం॥డ్యూటీ, W/H, జీతం: 15000/- + PF +ESI. ✆ 95818 58667

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


**నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర**

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.65 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

# ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

## రారండి.. జాతరకు!

కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

**ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వినిని పడమరవీధి గంగానమ్మ జాతర కమిటీ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలో అట్టహాసంగా కొనసాగుతున్న అమ్మవారి జాతరకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. జాతర ప్రాముఖ్యాన్ని ఆమెకు వివరించారు. కలెక్టర్ సైతం సానుకూలంగా స్పందించారు.

## బ్రహ్మోత్సవం.. నృత్యోత్సవం

**ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** స్థానిక ఆర్‌ఆర్ పేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కళా వేదికపై బ్రహ్మశ్రీ మైలవరపు లక్ష్మీనరసింహం యోగా విశిష్ట ఉపన్యాసం, చింతలపూడికి చెందిన కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలను ఆకట్టుకున్నాయి.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

| | | | |
|---|---|---|---|
| ఏలూరు అర్బన్: | 80085 74486 | ఏలూరు టూటౌన్: | 80085 74487 |
| దెందులూరు: | 80085 74535 | పెదపాడు, పెదవేగి: | 80085 74483 |
| భీమడోలు: | 80085 74527 | నిడమర్రు గ్రామీణం: | 97040 21765 |
| ఉంగుటూరు: | 94939 90333 | గణపవరం: | 99480 66777 |

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ? గణేశ్ కాలనీ శివారులో వీధి దీపం వెలగడం లేదు. శివారు ప్రాంతం కావడంతో రాత్రివేళ విష పురుగులు, సర్పాలు సంచరిస్తున్నాయి. పిల్లలు, పెద్దలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. **- వెంకటేశ్వరరావు**

✔ సిబ్బందిని పంపి మరమ్మతు చేయిస్తాం. అవసరమైతే కొత్తవి ఏర్పాటు బిగిస్తాం. **- పవన్, విద్యుత్తు ఏఈ**

**దెందులూరు, న్యూస్‌టుడే:** ? కొవ్వలి ప్రధాన రహదారిలో విద్యుత్తు తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయి. ఫలితంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. హెచ్చుతగ్గుల కారణంగా గృహోపకరణాలు కాలిపోతున్నాయి. **- బాబ్జి, స్థానికుడు**

✔ విద్యుత్తు తీగలకు తగిలే చెట్ల కొమ్మలు తొలగిస్తాం. సరఫరాకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. **శ్రీనివాసరావు, విద్యుత్తు ఏఈ**

**పెదపాడు:** ? ఏలూరు- వట్లూరు మార్గంలో ఊక లోడుతో ట్రాక్టర్లు, లారీలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ వాహనాలు రహదారి మొత్తం ఆక్రమిస్తుండటంతో.. వెనుక, ముందొచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- నారాయణరావు**

✔ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్తాం. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తాం. **- శ్రీనివాస్, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి**

# అడిగేదెవరు.. ఆపేదెవరు!

**పంట కాలువలపై యథేచ్ఛగా ఆక్రమణలు**

**పెదపాడు, న్యూస్‌టుడే:** పెదపాడు, పెదవేగి మండలాల్లోని పంట కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ర.భ.శా. రహదారుల అంచులు, ప్రభుత్వ పోరంబోకు స్థలాలను సైతం కొందరు అక్రమార్కులు వదలడం లేదు. ఈ రెండు మండలాలు ఏలూరు నగరానికి ఆనుకొని ఉండటంతో.. సెంటు స్థలం రూ.లక్షలు పలుకుతోంది. ఫలితంగా కొందరు ఇష్టానుసారంగా రహదారుల అంచులు, పంట బోదెలు ఆక్రమించుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొందరైతే ఏకంగా శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు.

పెదపాడు మండలం వట్లూరు రైల్వేస్టేషన్ నుంచి పెదవేగి మండలం కలపర్రు వరకున్న ర.భ.శా. రహదారి కిరువైపులా కొందరు పంట కాలువలు ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. వీటిని తొలగించాల్సిన ర.భ.శా., రెవెన్యూ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

**తమకేమీ పట్టనట్లు..** వీటిపై కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించకుంటే రాష్ట్ర, జాతీయ రహదారులు.. పంట కాలువలు మరింత కుచించుకుపోయే ప్రమాదముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ర.భ.శా. రహదారులు ఆక్రమించిన వారిని ఇప్పటికే హెచ్చరించాం. అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశించాం. మరోసారి పరిశీలించి ఆక్రమణలు తొలగిస్తాం' అని ర.భ.శా. పెదపాడు ఏఈ శేషుకుమార్ తెలిపారు.

ఏలూరు నగరం నుంచి పెదపాడు మండలం వట్లూరు మీదుగా పెదవేగి మండలం కలపర్రుకు వెళ్లే మార్గంలో.. పంట కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. ఈ రోడ్డు రోజురోజుకూ కుచించుకుపోవడంతో.. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

## మేధో వికాసం

**'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు**

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** స్థానిక శర్వాణీ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జిపై జరిగిన ప్రశ్నావళి పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ.పావనవల్లి, టి.మను, కె.భావన వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల సంచాలకుడు కె.మదన్‌మోహన్‌రాజు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానాచార్యురాలు సత్యశారద, ఉపాధ్యాయులు గంగారత్నం, పి.సురేశ్ పర్యవేక్షించారు.

★ స్థానిక ఎల్‌బీసీ పాఠశాలలో నిర్వహించిన పోటీలో బాలబాలికలు పాల్గొని తమలోని సృజనను వెలికితీశారు. దీక్షిత(ప్రథమ), కార్తిక్(ద్వితీయ), అఖిల సాయి(తృతీయ) స్థానాలు సొంతం చేసుకున్నారు. వారికి పాఠశాల సంచాలకుడు ఎంఎస్ రావు, కుమారస్వామి, సత్యనారాయణ, కిశోర్ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయినులు లక్ష్మి, శ్రీదేవి పర్యవేక్షించారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుందాం

జ్యోతి వెలిగిస్తున్న రవిశంకర్

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** అధ్యాపకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని బోధన సాగించాలని తిరుపతి ఐఐటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రవిశంకర్ అన్నారు. స్థానిక సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ, ఏటీఏఎల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యాన 'బయో మెడికల్ అనువర్తనాల్లో త్రీడీ ప్రింటింగ్ ఎదుర్కొనే సవాళ్ల'పై సోమవారం కార్యశాలను నిర్వహించారు. రవిశంకర్ మాట్లాడుతూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులు బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. త్రీడీ ప్రింటింగ్‌కు సంబంధించిన ప్రాథమిక సూత్రాలపై అవగాహన పెంచుకోవాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్, రీసెర్చి ఆచార్యుడు కె.వెంకటరావు సూచించారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, విద్యాసంస్థల యాజమాన్య కమిటీ సభ్యుడు కె.హరిరామకృష్ణరాజు, ప్రధానాచార్యుడు కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సేద్యంతో అధిక దిగుబడులు

మాట్లాడుతున్న డీఏవో హబీబ్‌బాషా

**దెందులూరు, న్యూస్‌టుడే:** రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి.. పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చుని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. మేదినరావుపాలెంలో రబీ సీజన్ పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల వినియోగంపై రెండ్రోజుల శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ బృందం ప్రాంతాలవారీగా రైతుల అభిప్రాయాలు సేకరించింది. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చింది. డాట్ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఫణికుమార్, ఎంఈవో శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

## మంత్రి కొండపల్లికి సన్మానం

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆర్టీసీ విజయవాడ ప్రాంతీయ ఛైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏలూరు పట్టణ తూర్పు కాపు సంక్షేమ సంఘం-2026 నూతన సంవత్సరాది కాలమానిని మంత్రి ఆవిష్కరించారు. ఆయన్ను సంఘ నాయకులు బాలాజీ, యుగంధర్ ప్రసాద్, లక్ష్మీనారాయణ, సాయిప్రసాద్ తదితరులు సన్మానించారు.

## గిరిజనుల సంక్షేమానికి మరింత కృషి

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** మన్యం గ్రామాల్లోని గిరిజనుల సంక్షేమాభివృద్ధికి, వారి అభ్యున్నతికి మరింత కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కాకి లక్ష్మి తెలిపారు. బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏను సోమవారం ఆమె సందర్శించారు. పీవో రాములు నాయక్‌తో కొద్దిసేపు సమావేశమయ్యారు. గిరిజన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమలు తదితర అంశాలపై చర్చించారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) రాష్ట్ర డైరెక్టర్ మడకం కన్నపరాజు తదితరులు పాల్గొన్నారు.

### చెత్త కుప్ప.. సమస్యల తిప్ప

నిడమర్రు మండలం పెదనిండ్రకొలను విద్యుత్తు ఉపకేంద్రం సమీపాన నిర్మించిన సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. గ్రామంలో పోగైన చెత్తాచెదారం తీసుకొచ్చి కేంద్రం వద్ద పడేస్తున్నారు. వాటికి కొందరు నిప్పు పెట్టడంతో.. ఆ ప్రాంతమంతా పొగ కమ్మేస్తోంది. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

### వంతెనపై గోడ.. భద్రత ఏడ?

నిడమర్రు మండలం దేవరగోపవరంలోని పంట కాలువపై నిర్మించిన వంతెనకిరువైపులా రక్షణ గోడ ఏర్పాటు చేయలేదు. వారధికి సమీపంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. దీని పైనుంచి నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళ పలువురు అదుపు తప్పి కాలువలో పడిపోతున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

### శిథిలమై.. ప్రమాదకరమై!

ఉంగుటూరు మండలం కాగుపాడులోని పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబు పెచ్చులూడి పడిపోతోంది. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు మొలవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఏళ్లుగా భవనం శిథిలావస్థలో ఉన్నా.. పట్టించుకునే నాథుడే కరవయ్యారు. **- న్యూస్‌టుడే, కాగుపాడు(ఉంగుటూరు)**

### మేట.. నిర్లక్ష్యమేనట!

ఏలూరు నగరం నుంచి పెదపాడు మండలం వట్లూరుకు మార్గంలో.. రహదారిపై ఇసుక పేరుకుపోయింది. ఈ దారిలో ఇసుకపై ద్విచక్ర వాహనదారులు వేగంగా వెళ్తూ.. అదుపు తప్పి పడిపోతున్నారు. ఈ తరహా ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నా.. అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. **- న్యూస్‌టుడే, పెదపాడు**

### దారి లేక.. దాటలేక

ఏలూరు నగరం రామచంద్రరావుపేటలోని పాత శ్రీనివాస థియేటర్ సమీప ప్రధాన రహదారికి ఇరువైపులా కార్లు, ద్విచక్ర వాహనాలు ఆపేస్తున్నారు. రోడ్డు కుచించుకుపోవడంతో.. ఈ దారిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హారన్ల మోతతో ఆ ప్రాంతమంతా మార్మోగుతోంది. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

## ఏలూరు సినిమాలు

| | |
|---|---|
| అంబిక డీలక్స్ | ఈషా |
| అంబిక మినీ | వృషభ |
| సాయి బాలాజీ | ఛాంపియన్ |
| బాలాజీ | శంబాల |
| సత్యనారాయణ 1 | అవతార్3 |
| సత్యనారాయణ 2 | అఖండ2 |
| సత్యనారాయణ 3 | పతంగ్ |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 1 | దండోర |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 2 | అనకొండ |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 3 | బ్యాడ్ గర్ల్స్ |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1 | ఛాంపియన్ |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2 | అఖండ 2 |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3 | శంబాల |

# ఆకతాయిల అడ్డా

**పర్యవేక్షణ లేమితో రెచ్చిపోతున్న మందుబాబులు**

గణపవరం మండలం జల్లికాకినాడలోని అసంపూర్తి రైతు సేవా కేంద్రం వద్ద పగిలిన మద్యం సీసాలున్న చిత్రమిది. గణపవరం, సరిపల్లె, కాశిపాడు తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితులున్నాయి.

అప్పన్నపేట ప్రాథమిక పాఠశాల భవనంపై మద్యం సీసాలు పేరుకుపోతున్నాయి. రోజూ ఆకతాయిల ఆగడాలు సాగుతున్నా ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. తెల్లారేసరికి భవనమంతా పగిలిన సీసాలు, చిందరవందరగా మాంసాహార పొట్లాలు ఉంటున్నాయి.

**న్యూస్‌టుడే, గణపవరం:** ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ప్రాంగణాలే లక్ష్యంగా చేసుకొని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. పని గంటలు పూర్తవగానే తమ అడ్డాగా మార్చుకుంటున్నారు. మద్యం దుకాణాల వద్ద నున్న గదుల్లా వినియోగించుకుంటున్నారు. రాత్రివేళల్లో పోలీసుల పహారా తక్కువగా ఉండటంతో.. మందుబాబులు అక్కడే పూటుగా మద్యం తాగుతున్నారు. ఆహార పదార్థాలు తిని విసిరేస్తుండడంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా, దుర్గంధభరితంగా తయారవుతున్నాయి.

**యథేచ్ఛగా కార్యకలాపాలు**

గ్రామాల్లో నిర్మానుష్య ప్రాంతాల మధ్యనున్న ప్రభుత్వ కార్యాలయాలు, అసంపూర్తి నిర్మాణాలు, ప్రహరీల్లేని చోట్ల కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఎక్కడ చూసినా మద్యం లభిస్తుండటం ఆకతాయిల ఆగడాలకు నిదర్శనం. 'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం' అని నిడమర్రు సీఐ నక్కా రజనీకుమార్ తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

ఏలూరు: ప్రచార జాత నిర్వహిస్తున్న నాయకులు

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కర్షక, కార్మిక, ఉద్యోగుల వ్యతిరేక విధానాలపై ఉద్యమించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ తెలిపారు. విశాఖపట్నం వేదికగా నిర్వహించనున్న అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ.. నగరంలో సోమవారం ప్రచార జాత చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. శ్రామిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచడం హేయమని ధ్వజమెత్తారు. నాయకులు ఇస్సాక్, రవికుమార్, గోపి, అమర్‌కుమార్, నాగేంద్ర మాదవ్, సంతోశ్, రజని, షేక్ షమీనా తదితరులు పాల్గొన్నారు.

**ఉంగుటూరు:** విశాఖలో వచ్చే నెల 4న నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాజన సభలను విజయవంతం చేయాలని సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. చేబ్రోలు, ఉంగుటూరు, బాదంపూడిలో సోమవారం పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అప్పారావు, లిల్లీగ్రేస్, సుజాత, యూన్సీ, విజయ, రత్నకుమారి పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో నేడు

**విద్యుత్తు సరఫరా నిలిపివేత.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** స్థానిక అశోక్‌నగర్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధి కొత్తపేట ఫీడర్‌లో మంగళవారం చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ అంబేడ్కర్ తెలిపారు. గుబ్బలవారి, మాగంటి వారి, శంకరమఠం, బెండపూడివారి వీధులతో పాటు పలు ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**భీమడోలు:** అంబరుపేట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో కొత్త తీగలు ఏర్పాటు చేస్తున్నందున.. అంబరుపేట, జి.కండ్రిగ ఫీడర్లలోని గ్రామాలకు మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ అంబేడ్కర్ తెలిపారు.

**మండల సమావేశం.. పెదవేగి(పెదపాడు):** పెదవేగి మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగేంద్రకుమార్ తెలిపారు. ఎంపీపీ రమ్య అధ్యక్షత వహిస్తారని. . అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.

**రీ సర్వేపై గ్రామసభ.. పెదపాడు:** స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రీ సర్వేపై గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎ.కృష్ణజ్యోతి తెలిపారు. పెదపాడులో జనవరి 2 నుంచి ప్రారంభం కానున్న రీ సర్వేపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

**నిడమర్రు గ్రామీణం:** దేవరగోపవరం, పెదనిండ్రకొలను గ్రామ సచివాలయాల్లో మంగళవారం భూముల రీ సర్వేపై గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు దుర్గాప్రసాద్ తెలిపారు. రైతులు సమస్యలపై వినతులు అందజేస్తే, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**పెదవేగి, న్యూస్‌టుడే:** లక్ష్మీపురంలో సర్పంచి మేకా కనకరాజు నేతృత్వంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. సర్పంచి మాట్లాడుతూ.. పంచాయతీలో జనవరి 4 వరకు పనులు కొనసాగించనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

ఏలూరు: ధ్రువపత్రం ఇస్తున్న తహసీల్దార్ విజయరాజు

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామీణ మండల తహసీల్దార్ విజయరాజు అన్నారు. చాటపర్రు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ క్లినిక్(పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు.

**పెదపాడు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. ప్రజల నుంచి తహసీల్దార్ ఎ.కృష్ణజ్యోతి అర్జీలు స్వీకరించి.. పలువురికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. సర్వేయర్ కోదండరామ్, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

**భీమడోలు:** భూములు, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే రెవెన్యూ క్లినిక్ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు బి.రమాదేవి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

## కళాశాల అభివృద్ధికి తోడ్పాటు

మాట్లాడుతున్న శ్రీరామ్

**దెందులూరు, న్యూస్‌టుడే:** గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల అభివృద్ధికి తోడ్పాటు నందిస్తానని ప్రవాసాంధ్రుడు, పూర్వ విద్యార్థి ఎలమంచిలి శ్రీరామ్ అన్నారు. సోమవారం ఆయన కళాశాలను సందర్శించగా.. బాలికల, బాలుర వసతి గృహాల్లో సదుపాయాల లేమిపై ప్రధానాచార్యుడు నతానియేలు వివరించారు. శ్రీరామ్ మాట్లాడుతూ.. కళాశాలలో చదివి అమెరికాలో స్థిరపడినట్లు చెప్పారు. కళాశాలలోని సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన్ను కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

**నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే:** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని నోడల్ అధికారి ఇంగర ఆశీర్వాదం అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. పరీక్షల సన్నద్ధతపై వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర కుమార్, సిబ్బంది ఉన్నారు.

## భక్తాంజనేయస్వామికి పూజలు

**గోపీనాథపట్నం(ఉంగుటూరు), న్యూస్‌టుడే:** గోపీనాథపట్నంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ముక్కోటి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టు సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామికి లక్ష చామంతి, శ్రీవేంకటేశ్వరస్వామికి లక్ష తులసీ దళాలతో సహస్రనామ పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వారికి అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

**నగర సంకీర్తన.. దెందులూరు:** ధనుర్మాసం సందర్భంగా దెందులూరులో రామదండు ఆధ్వర్యాన సోమవారం నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు గోదాదేవి విగ్రహాన్ని ఊరేగిస్తూ.. గోవిందుడి కీర్తనలు ఆలపిస్తూ, భజనలు చేస్తూ ముందుకు సాగారు. అంతకుముందు ఆలయంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేశారు.

## పాదచారిని ఢీకొన్న ద్విచక్ర వాహనం

**ఇద్దరికి గాయాలు**

**ఉంగుటూరు:** ఉంగుటూరుకు చెందిన మానే హేమ కాలువలో దుస్తులు ఉతికేందుకు కాలినడకన రోడ్డు దాటుతున్నారు. ఆమెను ఏలూరు నుంచి రావులపాలెం వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో హేమ, చోదకుడు సతీశ్‌కు గాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

**రహదారి ప్రమాదంలో.. గణపవరం:** హైదరాబాద్‌కు చెందిన యూట్యూబర్ రాము ద్విచక్ర వాహనంపై సోమవారం భీమవరం వెళ్తున్నారు. మార్గం మధ్యలోని గణపవరం మండలం సరిపల్లెలో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా బ్రేకులు వేసింది. దాన్ని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో రాము కాలికి తీవ్ర గాయమైంది. అతడిని 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరుకు తీసుకెళ్లారు. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## జూద స్థావరంపై దాడి

**పెదవేగి(పెదపాడు):** పెదవేగి మండలం జగన్నాథపురంలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. అయిదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.11,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిగోపాల్ తెలిపారు.

## ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

**ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** స్థానిక రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. నగరంలోని పలు వైష్ణవాలయాల్లోనూ విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

**ఏలూరు గ్రామీణ:** దెందులూరు, ఏలూరు గ్రామీణ మండలాల్లోని వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవరప్పాడు జనార్దనస్వామి, దెందులూరు విష్ణాలయం, శనివారపుపేట చెన్నకేశవస్వామి ఆలయాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచే స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

## చేయూతనివ్వడం అభినందనీయం


దుప్పటి ఇస్తున్న రమాదేవి తదితరులు

**భీమడోలు, న్యూస్‌టుడే:** దివ్యాంగులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని తహసీల్దారు రమాదేవి అన్నారు. స్థానిక శ్రీమాధురి కళాశాల ప్రాంగణంలో అఖిలాంధ్ర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యాన కరస్పాండెంట్ కె.ప్రేమ్‌కుమార్ దాతృత్వంతో సోమవారం దివ్యాంగులకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. సేవా సమితి అధ్యక్షురాలు కృష్ణకుమారి, బాలు, నాగభూషణం, రాము, దుర్గాప్రసాద్, అప్పారావు, థెరిసా, సుధా పాల్గొన్నారు.

# కదల్లేని స్థితి.. మారని పరిస్థితి!

**'మీ కోసం'లో బాధితుల వేడుకోలు**

**భార్యపైనే కుటుంబ భారం**

నా పేరు డి.దుర్గారావు. ఏలూరులో నివసిస్తున్నారు. నాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుమారు అయిదేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. ఏ పని చేయలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నా. కుటుంబ పోషణ భారమంతా నా భార్యపైనే పడింది. ఆమె పని చేస్తేనే కుటుంబ సభ్యుల ఆకలి తీరుతుంది. నాకు సామాజిక పింఛను మంజూరు చేయాలని కోరుతూ పలుమార్లు దరఖాస్తు చేస్తున్నా. ఫలితం లేకపోవడంతో.. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందిస్తారన్న ఆశతో కలెక్టరేట్‌కు వచ్చా.

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** వారు విధి వంచితులు. ఒకరు పక్షవాతం బారిన పడి.. మరొకరు చెట్టు పైనుంచి పడి మంచానికే పరిమితమయ్యారు. తమకు పింఛన్లు అందజేయాలంటూ మండల కార్యాలయాల్లో దరఖాస్తులు చేసినా, అవికాస్త బుట్టదాఖలయ్యాయి. విధిలేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యుల సహకారంతో సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. పేదరికంలో మగ్గుతోన్న తమకు ఆర్థిక తోడ్పాటునివ్వాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం)లో జిల్లా ఉన్నతాధికారులకు అర్జీలు అందజేశారు.

**నడుము విరిగింది**

నా పేరు ఎ.వెంకటేశ్వరరావు. మాది పెదవేగి మండలం జగన్నాథపురం గ్రామం. కొబ్బరి చెట్ల నుంచి కాయలు దింపుడు పని చేసేవాడిని. మూడేళ్ల క్రితం చెట్టు పైనుంచి జారిపడటంతో నడుము విరిగిపోయింది. అప్పట్నుంచి నడవలేకపోతున్నాను. దివ్యాంగుల విభాగంలో పింఛను ఇప్పించాలని పలుమార్లు మండల కార్యాలయంలో అర్జీలు పెట్టుకున్నా. ప్రయోజనం లేకపోవడంతో.. కలెక్టరేట్‌కు వచ్చా. ఇక్కడైనా సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నా.

● పెదపాడు మండలం వడ్డిగూడెంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. నీరందక గ్రామస్థులు గుటకలు మింగుతున్నారు. మూగజీవాలూ అల్లాడుతున్నాయి. సమస్య పరిష్కరించాలని గ్రామానికి చెందిన ఘంటసాల సుబ్బరాజు అర్జీ సమర్పించారు.

● అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈఎస్ఐ పథకం వర్తింపజేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు కేవీ రమణ, కె.విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

(c) eenadu

# పోలవరం

•పోలవరం • చింతలపూడి

## కుక్కునూరులో సీపీఎం ప్రదర్శన

**కుక్కునూరు, న్యూస్‌టుడే:** సీఐటీయూ జాతీయ మహాసభలను పురస్కరించుకొని జనవరి 4న విశాఖలో జరిగే బహిరంగసభను జయప్రదం చేయాలని సీపీఎం కోరింది. మహాసభల జయప్రదాన్ని కోరుతూ సోమవారం కుక్కునూరులో ఆ పార్టీ నాయకులు ప్రదర్శన చేశారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** గవరవరం ఉపకేంద్రం వద్ద మరమ్మతులు, ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం కన్నాపురం, పవర్‌గ్రిడ్ ఫీడర్ల పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కొయ్యలగూడెం టౌన్‌ఫీడర్, రాజవరం, కన్నాయగూడెం ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్ వి రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## రీ-సర్వేను రైతులు వినియోగించుకోండి

**జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** రీ-సర్వేతో గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని డీటీ కె.రమేశ్ తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం వేగవరం, తాడువాయి గ్రామాల్లో ఈ మేరకు సోమవారం గ్రామసభలు నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీలు చేపట్టారు. జనవరి 2 నుంచి జరగనున్న రీ- సర్వేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

తాడువాయిలో అవగాహన ర్యాలీ

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

**చింతలపూడి, న్యూస్‌టుడే:** ? భట్టువారిగూడెంలో సీసీ రహదారులు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. అంతర్గత దారులు గోతులమయంగా మారాయి. - **కిశోర్, భట్టువారిగూడెం.**

✔ సీసీ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే భట్టువారిగూడెంలో నిర్మాణం చేపడతాం.

**-రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.**

? చింతలపూడి నుంచి వెలగలపల్లి వెళ్లే రహదారి పక్కన భారీ వృక్షాలు ఉండటంతో కొమ్మలు విరిగి మీద పడేలా ఉన్నాయి. **-వినోద్, చింతలపూడి.**

✔ ఈ మార్గంలో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా రహదారి పక్కన ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తాం.

**-శ్రీకర్, ఆర్ అండ్ బీ డీఈ.**

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** ? తాగునీటి సరఫరా పైపులైను గేట్‌వాల్వు పాడవడంతో కుళాయిలకు నీరు సరఫరా జరగడం లేదు. - **వరదరాజు, మంగపతిదేవిపాలెం**

✔ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

**- రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి, రాజవరం**

## వేడుకల్లో శ్రుతిమించొద్దు..!

### 'న్యూస్‌టుడే'తో ఏఎస్పీ సుస్మిత

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** నూతన సంవత్సర వేడుకల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఏఎస్పీ సుస్మిత అన్నారు. జంగారెడ్డిగూడెంలోని ఆమె కార్యాలయంలో 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడారు. సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని, తాగి వాహనాలు నడిపితే వాహనాన్ని స్టేషన్‌కు తరలించడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డిసెంబరు 31 రాత్రి ఒంటి గంట తర్వాత ఎవరూ రోడ్లపై తిరగరాదని, బయటకు వస్తే నిర్ణీత కారణం చూపాల్సి ఉంటుందన్నారు. తోటి వారికి ఇబ్బందులు కలిగించకుండా పండగ వాతావరణంలో సంప్రదాయబద్ధంగా నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**విధిగా పాటించాలి...**

✦ మైనర్లు వాహనాలు నడపరాదు. వారికి వాహనాలు ఇచ్చిన యజమానులపై చర్యలతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ✦ డీజేలు, బాణసంచాల మోతలతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదు. ✦ ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసి నడపరాదు. ✦ ప్రత్యేక కార్యక్రమాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. ✦ ఏపీ పబ్లిక్ సేఫ్టీ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్టు 2013 ప్రకారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చాలి. ✦ వేడుకల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శించరాదు. ✦ నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో మహిళలతో అసభ్య ప్రవర్తనకు పాల్పడరాదు. ✦ జూదాల నిర్వహణ, ఆడటం చేయరాదు.

**సమాచారం ఇవ్వండి...**

'నూతన సంవత్సర వేడుకలను డివిజన్‌లోని ప్రజలు ఆనందోత్సాహాల నడుమ చేసుకోవాలి. వేడుకల ముసుగులో అశ్లీలత, జూదం, ఇతరత్రా కార్యక్రమాలు జరిగితే సంబంధిత పోలీసుస్టేషన్లకు లేదా హెల్ప్ లైన్ నంబర్ 112కు సమాచారం అందించండి.' అని ఏఎస్పీ సుస్మిత తెలిపారు.

## ఎంపీపీ పాఠశాలలో సమైక్య సంబరాలు

**జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేట గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో క్రిస్మస్, సంక్రాంతి పండగల నేపథ్యంలో సమైక్య సంబరాలను సోమవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జలగం రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భోగిమంటలు, విద్యార్థులకు భోగిపండ్లు పోయడం, క్రిస్మస్ కేకు కోయటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పండగల విశిష్టతను పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యార్థులు నిర్వహించిన క్రిస్మస్‌తాత, హరిదాసు వేషధారణ, సాంస్కృతిక నృత్యాలు పలువురిని అలరించాయి. గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాను పి.సురేశ్ విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు.

అక్కంపేట : విద్యార్థులకు భోగిపండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

## గాంగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

**కామవరపుకోట, న్యూస్‌టుడే:** అతి పురాతనమైన తడికలపూడి గంగా పార్వతీ సమేత గాంగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

**పోలవరం, న్యూస్‌టుడే:** మండలంలోని గూటాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అండాళ్ అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. సాయంత్రం వీధుల్లో ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వచ్చే భక్తులు ఉత్తర ద్వారా దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆలయంలో ఏర్పాట్లు చేశారు.

లక్ష్మీనృసింహస్వామి

## గిరిజనుల సంక్షేమానికి మరింత కృషి

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** మన్యం గ్రామాల్లోని గిరిజనుల సంక్షేమాభివృద్ధికి మరింత కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కాకి లక్ష్మి తెలిపారు. కేఆర్‌పురం ఐటీడీఏను సోమవారం సందర్శించి పీవో రాములు నాయక్‌తో కొద్దిసేపు సమావేశమయ్యారు. గిరిజన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమలు, తదితర అంశాలపై చర్చించారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) రాష్ట్ర డైరెక్టర్ మడకం కన్నపరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**పోలవరం, న్యూస్‌టుడే:** పోలవరం పంచాయతీ పరిధిలోని రామయ్యపేట పునరావాసకాలనీ ఎదురుగా జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన అభిమళ్ల సత్యనారాయణ కుటుంబానికి మండల జనసేన పార్టీ నాయకులు సోమవారం రూ. 22,500 ఆర్థిక సహాయం అందజేశారు.

## మీ కోసంలో అర్జీలు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో కార్యాలయ అధికారి సోమేశ్వరరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తన పేరున ఉన్న వ్యవసాయ విద్యుత్తు సర్వీసు మరో పేరున మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని టెక్కినవారిగూడెంకు చెందిన నులకాని కృష్ణారావు ఫిర్యాదు చేశారు. పాలకుంట గ్రామంలో అనధికారికంగా పొగాకు బ్యారన్ కడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్.జోగిరాజు ఫిర్యాదు చేశారు. తనకున్న 78 సెంట్ల భూమిలో 8 సెంట్లు విస్తీర్ణం తగ్గినందున న్యాయం చేయాలని పంగిడిగూడెంకు చెందిన బిళ్లా వెంకటరెడ్డి అర్జీ ఇచ్చారు. తన పేరున ఉన్న ఎకరం భూమిని ఆన్‌లైన్ చేయాలని పి.అంకంపాలెం గ్రామానికి చెందిన నూనె బ్రహ్మయ్య దరఖాస్తు చేశారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలు ఉన్న స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసపురానికి చెందిన శ్రీను ఫిర్యాదు చేశారు. వాడపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి శ్మశాన వాటిక మంజూరు చేయాలని ఎ.వెంకటస్వామి తదితరులు విన్నవించారు. మంగిశెట్టిగూడెంలో స్థలాలు ఆక్రమించిన మహిళపై చర్యలు తీసుకోవాలని బేతంపూడి సుబ్బారావు ఫిర్యాదు చేశారు.

## విద్యుత్తు సరఫరా ప్రారంభం

**ధర్మాజీగూడెం(చింతలపూడి), న్యూస్‌టుడే:** లింగపాలెం మండలంలో ఇకపై విద్యుత్తు సరఫరా అంతరాయాలు ఉండవని ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ సుధీవన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో రూ.23 కోట్లతో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో విద్యుత్తు సరఫరాను ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీవన్ కుమార్ మాట్లాడారు. ధర్మాజీగూడెంలో 40 ఏళ్ల కిందట నిర్మించిన 33/11 కేవీ ఉపకేంద్రం వల్ల వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కరించామని చెప్పారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈలు మనోహర్, బిందు, డీఈ రామారావు, ఏడీఈ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు

**కామవరపుకోట, న్యూస్‌టుడే:** కామవరపుకోట పంచాయతీ కొత్తూరులోని ఉండేల్ కట్ట చెరువు ఆక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్.రాజు సోమవారం ఎంపీడీవోకు మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. చెరువు ప్రాంతంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై చర్యలు చేపట్టాలని కోరారు.

## భూసమస్యలకు సత్వర పరిష్కారం

**జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), కామవరపుకోట, న్యూస్‌టుడే:** జీలుగుమిల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో ఎనిమిది అర్జీలు వచ్చినట్లు ఇన్‌ఛార్జి తహసీల్దారు ఉదయ్ భాస్కర్ తెలిపారు. అయిదు అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కామవరపుకోటలో తహసీల్దారు ఎలీషా ఫిర్యాదులు తీసుకున్నట్లు తెలిపారు.

## 'నిర్వాసితులకు జీవనోపాధి కల్పించాలి'

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి, నిర్వాసితులకు జీవనోపాధి చూపాలని భారత్ ఆదివాసీ పార్టీ జిల్లా అధ్యక్షుడు తెల్లం రవిప్రసాద్ కోరారు. బుట్టాయగూడెంలో సోమవారం నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

## 2 నుంచి పాసు పుస్తకాల పంపిణీ

**కొయ్యలగూడెం, టి.నరసాపురం, న్యూస్‌టుడే:** కొత్తగా వచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలను జనవరి 2వ నుంచి పంపిణీ చేయనున్నట్లు కొయ్యలగూడెం తహశీల్దారు నాగరాజు తెలిపారు. టి.నరసాపురం మండలంలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదార్ పాస్ పుస్తకాలను 3వతేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సత్య సాయిబాబా తెలిపారు.

## 'పోలవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి'

**పోలవరం, న్యూస్‌టుడే:** పోలవరాన్ని జిల్లా కేంద్రం చేయాలని జిల్లా సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు పోలవరంలో సోమవారం బంద్ పాటించి ప్రభుత్వ కార్యాలయాలు మూయించారు. బంద్‌కు వ్యాపారులు సహకరించడంతో దుకాణాలు మూతపడ్డాయి. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు నాళం గాంధీ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రెండేళ్లుగా ప్రత్యేక జిల్లా కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని దీనిని మరింత ఉద్ధృతం చేస్తామని చెప్పారు.

## తీరిన రహదారి కష్టాలు

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయగూడెం మండలం కొ. బొత్తప్పగూడెం అడ్డరోడ్డు నుంచి దండిపూడి మార్గంలోని గ్రామాల వారికి రహదారి కష్టాలు తీరాయి. నిమ్మలగూడెం, పాలకుంట, చింతలగూడెం, మంగయ్యపాలెం, దండిపూడి గ్రామాల వారికి ఇది ప్రధాన రహదారి. మారుమూల వేరుమద్దిగూడెం గ్రామస్థులు కూడా ఈ మార్గం నుంచి వెళ్తారు. అడుగడునా పెద్ద గోతులతో నిండి, రాళ్లు లేచిపోయి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రధానమంత్రి జన్‌మన్ కింద తారురోడ్డు నిర్మాణానికి రూ.2.81 కోట్లు మంజూరు చేసింది. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో 4.80 కి.మీ. మేర తారు రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలోని ఆయా గ్రామాలతో పాటు రామన్నగూడెం వద్ద ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస కాలనీ వాసులకు కూడా రాకపోకలకు ఈ రహదారి ఎంతో ఉపయోగం. నిమ్మలగూడెంలో 400 మీటర్ల మేర సీసీ రహదారి, మార్జిన్ల పనులు చేయాల్సి ఉందని పంచాయతీరాజ్ శాఖ ఏఈ అంకిరెడ్డి తెలిపారు.

దండిపూడిలో కొత్తగా నిర్మించిన రోడ్డు

## జూద శిబిరాలపై దాడి

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామశివారులో నిర్వహిస్తున్న జూద శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 12,120 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

**కొయ్యలగూడెం, న్యూస్‌టుడే:** గవరవరంలో జూద శిబిరంపై దాడి చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. సిరివేరు ప్రదీప్ మరో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 52 కార్డులు, రూ.4,200 స్వాధీనం చేసుకున్నామన్నారు.

**కోడి పందేలపై.. టి.నరసాపురం, న్యూస్‌టుడే:** సాయంపాలెంలో పోలీసులు కోడి పందేలపై దాడి చేశారు. ఈ దాడిలో పది మందిని అరెస్టు చేసి. . వారి వద్ద నుంచి 9 ద్విచక్ర వాహనాలు, రూ.3,100, ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై జయబాబు తెలిపారు.

## విద్యుత్తు నియంత్రికల్లో రాగి తీగ చోరీ

**కామవరపుకోట, న్యూస్‌టుడే:** ఆడమిల్లిలో చోరులు ఏకకాలంలో మూడు విద్యుత్తు నియంత్రికల్లోని రాగి తీగలు చోరీ చేశారు. నరాల సత్యనారాయణ, వేముల గణేశ్, కాట్రు మహాలక్ష్మిల పొలాల్లోని 25 కె.వి. ట్రాన్స్‌ఫార్మర్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి వాటిలోని రాగి తీగలను ఎత్తుకెళ్లారు. రైతులు విద్యుత్తు శాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## పబ్లిక్ ప్రకటన

లెటరు నెం. 138 తేది. 29-12-2025

ఇందుమూలముగా ప్రజలకు, భక్తులకు తెలియజేయునది ఏమనగా. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం, రాఘవాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానమును మరియు వాటి స్థిర చరాస్తులను హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోనికి చేర్చి, ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్ మరియు హిందూ రిలిజియస్ ఇనిస్టిట్యూషన్స్ మరియు ఎండోమెంట్స్ చట్టం 1987 (చట్టం నెం. 30/1987) నందలి సెక్షన్ 6 ప్రకారం పబ్లికేషన్ మరియు సెక్షన్ 43 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయుటకు గాను ఆలయ కమిటీ మరియు అర్చకులు కోరిన మేరకు నిర్ణయించుట జరిగినది.

కావున యిందు విషయమై ఎవ్వరికైనా ఎమైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్నయెడల ఈ ప్రకటన ఇచ్చిన తేదీ నుండి పది (10) రోజులలోపుగా లిఖితపూర్వకముగా శ్రీయుత జిల్లా ఎండోమెంట్సు ఆఫీసర్, దేవదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు వారికి అందజేయగలరు.

సం/- **తనిఖీదారు,** దేవదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు, ఏలూరు జిల్లా














# నూజివీడు

• నూజివీడు • కైకలూరు

## ముక్కోటి ఏకాదశికి ముస్తాబు

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో మంగళవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయం ముస్తాబైంది. వేకువజామున మూడు గంటలకు స్వామికి సుప్రభాత సేవ, విశేష అభిషేకాలు, స్నపన, ధనుర్మాస నిత్య అర్చనల నిర్వహణ అనంతరం స్వామిని ఆలయ ప్రధాన అర్చకుడు వేదాంతం శేషాచార్యులు తెలిపారు. ఉదయం ఐదు గంటలకు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో నీహార్ సాయి తెలిపారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారని తెలిపారు.

## జల్‌జీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తిచేయండి:ఎస్ఈ

**ముసునూరు, న్యూస్‌టుడే:** జల్‌జీవన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ త్రినాథ్‌బాబు అన్నారు. సోమవారం ముసునూరు మండలం వేల్పుచర్ల పంచాయతీ అన్నవరపుగూడెంలో 30 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను సకాలంలో అధిగమించాలని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రతి ఇంటికి సురక్షిత మంచినీటి కుళాయి ఏర్పాటు చేసే జల్‌జీవన్ పథకం విజయవంతం చేయాలన్నారు. నాణ్యతతో కూడిన ట్యాంకులు నిర్మించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు.

## మీసాల వేంకన్న ఆలయంలో చలువ పందిళ్లు

**కైకలూరు, న్యూస్‌టుడే:** కైకలూరులోని భూ సమేత వెంకటేశ్వరస్వామి(మీసాల వేంకన్న) దేవస్థానం ముక్కోటి ఏకాదశి వేడుకలకు ముస్తాబైంది. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయ ముఖద్వారం నుంచి స్వామి సన్నిధి వరకు ఏర్పాటు చేసిన గోవింద నామం, నమూనా గుడిగంటల చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించినట్లు ఈవో వీఎన్‌కే శేఖర్ తెలిపారు. క్యూలైన్లలో భక్తుల తోపులాట లేకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## నాడు నిర్లక్ష్యం.. నేడు నిరుపయోగం!

### ఆర్‌ఎస్‌కేల్లో మూలకు చేరిన యంత్రాలు

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** అన్నదాతలకు మెరుగైన సేవలందించాలన్న ఉద్దేశంతో వైకాపా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల(ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేసి కియోస్క్‌లు సరఫరా చేసింది. వైకాపా ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో నాడు-నేడు పనులు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, గ్రామ వార్డు సచివాలయాల పేరుతో హడావుడి చేయడం తప్ప చేసిందేమీ లేదు. ముఖ్యంగా రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు ఏర్పాటుకు రూ.లక్షల్లో ఖర్చు చేశారు. ఒక్కో యంత్రానికి రూ.70 వేలు, టీవీకి రూ.45 వేలు చొప్పున వెచ్చించారు. రాయితీపై ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కొనుగోలుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. కానీ అంతర్జాల సదుపాయం కల్పించకపోవడంతో సిబ్బంది చరవాణుల ద్వారా కొన్నాళ్లు వినియోగించారు. తర్వాత మూలకు చేర్చారు.

సమాచారం ఇలా..

| మండలం | కియోస్క్‌ల | రైతు సేవా కేంద్రాలు |
|---|---|---|
| నూజివీడు | 27 | 27 |
| ఆగిరిపల్లి | 19 | 19 |
| ముసునూరు | 16 | 16 |
| చాట్రాయి | 16 | 16 |

### యాప్‌లు రావడంతో..

చరవాణుల్లో సంబంధిత యాప్‌లు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం యంత్రాల జోలికి ఎవరూ పోవడం లేదు. నూజివీడు నియోజకవర్గంలో 78 రైతు సేవా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయడానికి వినియోగించిన ధనం వృథా అయినట్టే. కొన్ని నెలల పాటు వీటిని వినియోగించినా ప్రస్తుతం మూలకు చేరాయి. సరైన నిర్వహణ లేక బ్యాటరీలు పనిచేయకపోవడం, పలుచోట్ల విద్యుత్తు సరఫరా, ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడం తదితర సమస్యలతో నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల టీవీలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి. గత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా కియోస్క్‌లు, టీవీలు కొనుగోలు చేసిందని రైతు సంఘాల ప్రతినిధులు విమర్శిస్తున్నారు. ఆయా కంపెనీలకు లబ్ధి చేకూర్చడానికి పెద్ద ఎత్తున ప్రజా ధనాన్ని వృథా చేసి నిరుపయోగంగా మార్చిందని ఆరోపిస్తున్నారు.

మూలకు చేరిన కియోస్క్

### వినియోగంలోకి తెస్తాం...

ప్రస్తుతం గ్రామస్థాయిలో పని చేసే వీఏఏలు, ఎంపీఈఓలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలు, ఈ పంట నమోదు తదితర విషయాలన్నీ చరవాణి ద్వారా నమోదు చేస్తున్నారు. నేడు కియోస్క్‌లను ఎవరూ వినియోగించడం లేదు. పలు చోట్ల యంత్రాలు నిరుపయోగంగా మారాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తాం.

- జె.భవాని, ఏడీఏ, నూజివీడు

## మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

| | | | |
|---|---|---|---|
| నూజివీడు | 80085 74698 | ఆగిరిపల్లి | 9121229090 |
| ముసునూరు | 93983 81268 | చాట్రాయి | 8008574700 |
| కైకలూరు | 73060 88555 | మండవల్లి | 8106099008 |
| కలిదిండి | 90594 84862 | ముదినేపల్లి | 8008574693 |

**కైకలూరు, న్యూస్‌టుడే:** కైకలూరు విద్యాంజలి డిగ్రీ కళాశాలకు వెళ్లే మార్గంలో డ్రైనేజీ మురుగునీరు తిష్ట వేయడంతో రాకపోకలకు విద్యార్థులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. దీనిపై స్థానికుడు శేశన 'ఈనాడు' 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో పేరిరాజు దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచి సమస్య పరిష్కరించారు.

## కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షం: మాగంటి

నాయకులతో మాజీ ఎంపీ బాబు

**కైకలూరు, న్యూస్‌టుడే:** సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) అన్నారు. సోమవారం కైకలూరులోని నివాసానికి వచ్చిన ఆయన కూటమి నేతలతో సమావేశమై ముచ్చటించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వారి స్ఫూర్తితో భేషజాలకు పోకుండా మూడు పార్టీల నాయకులు ఐక్యంగా మెలగాలన్నారు. వైకాపా హయాంలో జగన్ రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, అతని పాలనను ప్రజలు మళ్లీ కోరుకునే పరిస్థితి లేదన్నారు. నాయకులు బలసాని జగన్మోహనరావు, లంకా రత్నారావు, కొత్తూరి విలియ్, కేడీఎస్ఎం నాయుడు, వీరాజున్న సుధ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** సింగరాయపాలెం లోని బావాజీ మఠంలోని కోదండ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. తిరుప్పావై సేవా కాలం వైభవోపేతంగా జరిగింది. వేకువజామున శ్రీవారికి ధూప దీప సేవలు నిర్వహించారు. సేవాకాలం నిర్వహించి తిరుప్పావై 14వ పాశురాన్ని పారాయణం చేశారు. మంగళవారం నిర్వహించే ఉత్తర ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు చేశారు.

## ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు పరిశీలన

క్యూలైన్ పరిశీలిస్తున్న వినూత్న

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** పట్టణంలోని వెంకటాచల స్వామి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లను నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న సోమవారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. క్యూలైన్లు, స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు తాగు నీరు, ప్రసాదం ఏర్పాట్లు తదితరాలపై ఆరా తీశారు. దేవాదాయశాఖ అధికారులు తాము చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. తహసీల్దారు భద్రు, పట్టణ ఎస్ఐ నాగేశ్వరరావు, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు రామకృష్ణ

## రీ సర్వేకు అందుబాటులో ఉండాలి

**కలిదిండి, న్యూస్‌టుడే :** ఎవరి భూమి ఎప్పుడు రీ సర్వే చేస్తారనే దానిపై అందరికీ నిర్ణీత తేదీలు కేటాయిస్తామని, దీనిపై నోటీసులు అందుకున్న రైతులు ఆ సమయంలో భూమి వద్ద అందుబాటులో ఉండాలని తహసీల్దారు రామకృష్ణ తెలిపారు. పెదలంక, భాస్కరరావుపేట, మూలలంక, కోరుకొల్లులో సోమవారం రీ సర్వే గ్రామ సభలు నిర్వహించారు. సర్వే చేసే సమయంలో రైతుల వద్ద భూమికి సంబంధించిన పత్రాలు దగ్గర పెట్టుకోవాలన్నారు. సర్వేయర్ రమేశ్, ఆర్ఐ శ్యామల, కూటమి నేతలు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌లో 32 ఫిర్యాదులు

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** నూజివీడు సబ్‌కలెక్టరు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 32 ఫిర్యాదులు అందాయి. నూజివీడు సబ్‌కలెక్టరు బొల్లిపల్లి వినూత్న ఆయా ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు పంపించారు. నూజివీడులో నిరుపయోగంగా ఉన్న ఎన్నెస్పీ క్వార్టర్ల స్థలంలో వెజిటబుల్, ఫ్రూట్ మార్కెట్‌ను ఫుడ్ జోన్‌ను ఏర్పాటు చేయాలని నూజివీడు జనసేన నాయకుడు ముత్యాల కామేశ్ కోరారు. వినియోగంలో లేని ఈ సేవా కేంద్రాన్ని కో ఆపరేటివ్ డివిజన్ ఆఫీసుకు కేటాయించాలన్నారు. అప్పారావు పాఠశాల వద్ద అంగన్‌వాడీ కేంద్రంను ఏర్పాటు చేయాలన్నారు. పలు వ్యక్తిగత సమస్యలను ప్రజలు సబ్‌కలెక్టరు దృష్టికి తీసుకుని వచ్చారు. స్పందించిన ఆమె ఆయా శాఖల అధికారులను ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు.

## తాజా విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలి

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** తాజా విషయాల పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బ్రదర్ సుజన్ రెడ్డి, బ్రదర్ జార్జిరెడ్డిలు తెలిపారు. సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో సెయింట్ థామస్ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ స్థానం కె.హేమంత్(9వ తరగతి), ద్వితీయం-కె.అభిరామ్(8వ తరగతి), తృతీయ స్థానాన్ని జె.శరణ్య(8వ తరగతి) దక్కించుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

నూజివీడులోని త్రివిధ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా క్విజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ స్థానం జె.సాయి చేతన్(పదో తరగతి), ద్వితీయ స్థానం సీహెచ్ శాంతి(పదో తరగతి), తృతీయ స్థానాన్ని ఎ.దినేష్ దక్కించుకున్నారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు బహుమతులు అందించారు.

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

**కైకలూరు, న్యూస్‌టుడే:** తెలంగాణలో నిర్వహించిన ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ -2025 జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కైకలూరు భాష్యం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్ వెయిట్ విభాగంలో 16 బంగారు, 4 రజతం, 4 కాంస్య పతకాలు సాధించి టోర్నీలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామాంజనేయులు సోమవారం స్థానిక పాఠశాలలో శిక్షకుడు గంటా శ్రీను, విద్యార్థులను ఘనంగా సత్కరించారు. సుమారు 500 మంది పాల్గొన్న ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు చేరువలో సాంకేతిక పరిజ్ఞానం

డ్రోన్ వినియోగాన్ని పరిశీలిస్తున్న డీపీఎం వెంకటేశ్

**మండవల్లి, న్యూస్‌టుడే:** సాగులో కష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్ తెలిపారు. మండవల్లి మండలం అయ్యవారిరుద్రవరంలో వీవో వరలక్ష్మి ఆధ్వర్యంలో మినుము పంటలో డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో మెరుగైన ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం 40 లీటర్ల బ్రహ్మాస్త్రం ద్రావణాన్ని డ్రోన్ ద్వారా పిచికారీ చేసి చూపించారు.

**ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు ఆదా.. చాట్రాయి, న్యూస్‌టుడే:** ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులను ఆదా చేయడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించవచ్చని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు తెలిపారు. చనుబండలో సోమవారం గ్రామసభ నిర్వహించి ర్యాలీ చేశారు.

## ఎండిన మోడు.. ఎవరికో కీడు

**ముసునూరు, న్యూస్‌టుడే:** గోగులంపాడు నుంచి నెహ్రూనగర్ వైపు వెళ్లే రహదారి పక్కన ఎండిపోయిన వృక్షాలు ప్రమాదకరంగా మారాయి. చింతలవల్లి నుంచి నిత్యం ఈ రహదారి గుండా పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. పదుల సంఖ్యలో చెట్లు ఎండిపోయాయి. చింతలవల్లి నుంచి సింహాద్రిపురం వైపు వెళ్లే పాత సచివాలయం సమీపం వద్ద మరో చెట్టు ఎండిపోయింది. ఈదురు గాలుల సమయంలో విరిగి రహదారిపై పడితే ప్రమాదాలు జరిగే అవకాశముందని వాహన చోదకులు వాపోతున్నారు. ఆర్ అండ్‌బీ డీఈ బాబూరావును వివరణ కోరగా పరిశీలించి తొలగిస్తామన్నారు.

## బడి ముందు మురుగు.. వేసేదెలా అడుగు..!

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల గేటు వద్ద పంచాయతీ కుళాయి నిర్లక్ష్యంగా వదిలేయడంతో నీరు నిలిచి విద్యార్థులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పాఠశాల వద్ద మురుగు లేకుండా తక్షణమే చర్యలు చేపడతామని డిప్యూటీ ఎంపీడీవో బి.ఆనంద్‌బాబు స్పష్టం చేశారు.

## ప్రమాదకరంగా నుచ్చుమిల్లి వంతెన

**మండవల్లి, న్యూస్‌టుడే:** మండవల్లి మండలం నుచ్చుమిల్లి ఊళ్లోకి వెళ్లేందుకు మోటూరు ఛానెల్‌పై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్థులు బిక్కు బిక్కు మంటూ కాలాన్ని వెళ్ల దీస్తున్నారు. ఈ వంతెనను నిర్మించి 30 ఏళ్లు పూర్తవడంతో వంతెన శ్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు వచ్చి ఎప్పుడు కూలుతుందోనన్న భయాందోళన నెలకొంది. 2000 జనాభా కలిగిన నుచ్చుమిల్లి గ్రామానికి ఈ వంతెన కూలితే సంబంధాలు తెగిపోయినట్లే. ఇప్పటికే పలుమార్లు వంతెను నిర్మించాలని అధికారులకు, నాయకులకు మెర పెట్టుకున్నా ప్రయోజనం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జలవనరుల శాఖ ఏఈ బేగ్‌ను వివరణ కోరగా అంచనాలు సిద్ధం చేసి పంపిస్తున్నట్లు తెలిపారు.

## ఆదమరిస్తే అంతే..!

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** నూజివీడు-విజయవాడ ప్రధాన రహదారిలో ఆగిరిపల్లి స్టేట్‌బ్యాంక్ కూడలి వద్ద రహదారి పక్కనే ఉన్న పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఇటీవల విజయవాడ వైపు వెళ్తున్న ఓ కారు గుంతలో పడింది. అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని, రాత్రి వేళల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ బాబూరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా... గుంతను పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.

## నాబార్డు ఎక్స్‌లెన్సీ పురస్కారం అందుకున్న అధ్యక్షురాలు

అవార్డు అందుకుంటున్న సొసైటీ అధ్యక్షురాలు

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** మండలంలోని ఎంఎన్ పాలెం ప్రాథమిక సహకార పరపతి సంఘానికి రాష్ట్ర స్థాయిలో నాబార్డు ఎక్స్‌లెన్సీ పురస్కారం దక్కింది. రైతు నేస్తం, కర్షకమిత్ర, పంట రుణాలు పంపిణీలో మిగిలిన సొసైటీలకు భిన్నంగా పని చేస్తుందని గుర్తించి 2025 సంవత్సరానికి ఎంపిక చేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు యనమదల సృజనకు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, కేడీసీ ఛైర్మన్ రఘురామ్, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఎస్ఎన్ గోస్వామి చేతుల మీదుగా పురస్కారం అందించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షురాలిని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

## ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విరాళం రూ.25 లక్షలు

కిచెన్, డైనింగ్ హాల్‌కు భూమి పూజ చేస్తున్న గ్రామస్థులు

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** మండలంలోని గొల్లపల్లిలో ఉన్న అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కిచెన్, డైనింగ్ హాల్ నిర్మాణానికి హైదరాబాద్‌లోని నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ (ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ గ్రూప్) ప్రతినిధులు రూ. 25 లక్షలు విరాళం అందించారు. ఈ నిధులతో సోమవారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో హెచ్ఎం శారద, ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, గ్రామస్థులు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ భవన నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన అనుమతులు మంజూరు చేయించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉర్దూ పాఠశాలకు రంగులు వేసిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్జీయూకేటీ ఎన్ఎస్ఎస్-1 వాలంటీర్లు మండలంలోని బోర్వంచలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని కొనసాగించారు. కోఆర్డినేటర్ పీవీ లక్ష్మణరావు ప్రోగ్రాం అధికారి బి.లక్ష్మణ్‌రావు నేతృత్వంలో వాలంటీర్లు ఉర్దూ ప్రాథమికపాఠశాలకు రంగులు వేసి విద్యార్థులకు శుభ్రమైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు. యూనిట్-3 విద్యార్థులు రావిచర్లలో 'టెక్నాలజీ మనకు వరం' అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్లాస్టిక్ నియంత్రణ, చెత్త సేకరణ, కాలుష్య ప్రభావాలు, పరిశుభ్రత ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. డా.అమరేంద్రకుమార్, ఏవో లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ లక్ష్యాలను దెబ్బతీస్తున్న అధికారులు'

మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరరావు

**కలిదిండి, న్యూస్‌టుడే :** ప్రజలకు మేలు జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలకు కొన్ని శాఖల అధికారులు తూట్లు పొడుస్తున్నారని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు విమర్శించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో అధికారుల పనితీరుపై ఎంపీపీ మండిపడ్డారు. రైతులందరికీ విద్యుత్తు రాయితీ ఇవ్వాలనే సంకల్పంతో అన్ని చెరువులకూ రిజిస్ట్రేషన్లు చేయించాలని ప్రభుత్వం గడువు ఇచ్చిందన్నారు. మూడు నెలల్లో 34 వేల ఎకరాలకుగాను కేవలం 9 వేలు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయని, ఆకస్మికంగా పథకం అమల్లోకి వస్తే మిగిలిన రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇది అధికారుల నిర్లక్ష్యమే అన్నారు. ఆక్వా సాగుదారులు తాము వాడిన విద్యుత్తుతో వాడని విద్యుత్తుకు కూడా రూ.లక్షల్లో బిల్లులు కడుతున్నారని, ఈ విషయం అధికారులకు తెలిసినా అవగాహన కల్పించడం లేదన్నారు. ఇదొక దోపిడీ అన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా రోడ్ల పక్కన ఆక్రమణలు ఎందుకు తొలగించడం లేదని ఆర్‌అండ్‌బీ అధికారులను నిలదీశారు. 23 గ్రామ పంచాయతీకుగాను 15 పంచాయతీల్లో రోడ్లు ఊడ్చడం లేదని, డ్రెయినేజీ శుభ్రం చేయడం లేదని ఫిర్యాదులొచ్చాయన్నారు. ఎంపీడీవో ఫణీంద్ర, ఉప ఎంపీపీ కనక దుర్గారాణి, అధికారులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు చేస్తున్న వైకాపా

మాట్లాడుతున్న సత్యనారాయణ

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** వైకాపా నాయకులు నూజివీడు నియోజకవర్గంలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం నూజివీడు పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నియోజకవర్గంలో రూ.50 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ట్రిపుల్‌ఐటీ తెచ్చామని చెప్పుకునే మీరు నియోజకవర్గంలో ఎవరికి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బీ, సీసీ రహదార్ల నిర్మాణం చురుగ్గా సాగుతున్నాయన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులు వాడుకోకుండా వెనక్కు పంపిన చరిత్ర మీదని ధ్వజమెత్తారు. గతంలో జూదం, మట్టి మాఫియాలను నిర్వహించి, తోటపల్లి మైనింగ్ అక్రమణ రవాణా కేసులో రూ. 3.10కోట్లు పెనాల్టీ కట్టిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

## మహిళ మృతిపై విచారణ

**కలిదిండి, న్యూస్‌టుడే :** ఇందిరా కాలనీకి చెందిన సిద్ధాబత్తుల విజయ నవంబరు 30న పాము కాటుతో మృతి చెందిన ఘటనపై స్థానిక పీహెచ్‌సీలో ఎన్‌సీడీ - ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి నరేంద్ర కృష్ణ సోమవారం విచారణ నిర్వహించారు. సరైన వైద్యం అందకపోవడం వల్లే తన భార్య విజయ మృతి చెందినట్లు ఆమె భర్త దుర్గారావు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై జిల్లా వైద్యాధికారి ఆదేశాలతో విచారణ నిర్వహించినట్లు చెప్పారు. బాధిత కుటుంబ సభ్యులతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యురాలు జాహ్నవి, స్టాఫ్ నర్సు వెంకటలక్ష్మి నుంచి వివరణ తీసుకున్నట్లు చెప్పారు. దీనిపై నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. దాని ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఆయన వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి..

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** మోర్సపూడి వద్ద ద్విచక్రవాహనం ఆదివారం రాత్రి ఢీకొంది. ఈ ప్రమాదంలో షేక్ హుస్సేన్ బీ(63)కి తీవ్ర గాపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. రూరల్ హెచ్‌సీ అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్జాపురంలో ఉన్న చాక్లెట్ కంపెనీలో పని చేసేందుకు ఆటో ఎక్కేందుకు రహదారి పక్కన నిలబడి ఉంది. నూజివీడు నుంచి బైక్‌పై హనుమాన్ జంక్షన్ వెళ్తున్న ఓ వ్యక్తి ఆమెను ఢీ కొట్టాడు. దీంతో బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. ఆమెను ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి మనుమడు ఎస్‌కే కరీముల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ అజయ్ తెలిపారు.

## రహదారిపై బైఠాయించిన వారిపై కేసు

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** నూజివీడు రూరల్ సీఐ కార్యాలయం ఎదుట ఆదివారం రాత్రి బైఠాయించి ట్రాఫిక్‌కు అవరోధం కల్గించిన మహిళలు, ఒక న్యాయవాదిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రాత్రి ఖమ్మం జిల్లా మధిరకు చెందిన మొండితోక సరోజ, ఏడుగురు మహిళలు, ఒక న్యాయవాది కలిసి రహదారిపై ఆందోళన చేశారన్నారు. ఈ మేరకు పట్టణ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు పెట్టినట్లు పేర్కొన్నారు.

## అవి ఇవి అన్నీ

**సత్వర పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్.. ముదినేపల్లి, న్యూస్‌టుడే:** రెవెన్యూ, భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌ను ప్రజలు సద్వినియోగపరచుకోవాలని తహసీల్దారు లతీఫ్ పాషా సూచించారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. ఇందులో వచ్చిన దరఖాస్తులను వీలైనంత త్వరితగతిన సంబంధిత అధికారులు పరిష్కరిస్తారన్నారు. ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లతీఫ్

**ముసునూరు, న్యూస్‌టుడే:** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రెవెన్యూ క్లినిక్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని తహసీల్దార్ ప్రశాంతి అన్నారు. సోమవారం ముసునూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**సహకార సంఘం సాయం.. ముదినేపల్లి, న్యూస్‌టుడే:** పెదపాలపర్రులో ఇటీవల మృతిచెందిన శతాధిక వృద్ధురాలు కోడూరు వీరరాఘవమ్మ కుటుంబాన్ని స్థానిక పీఏసీఎస్ డైరెక్టర్ పల్లపోతు ప్రసాద్ చేతులు మీదగా రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వీరరాఘవమ్మకు సొసైటీ సభ్యత్వం ఉండటంతో ఆమె కుటుంబానికి సంఘం నుంచి సాయం అందిస్తున్నామన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ముడిదొడ్డి వీర్రాజు కుటుంబానికి తెదేపా యువ నాయకుడు చల్లగుళ్ల ఆదిత్యచౌదరి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

**మహాసభలు విజయవంతం చేయాలని వినతి..**

**కలిదిండి, న్యూస్‌టుడే :** విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు కోరారు. ప్రజా సంఘాల ఆధ్వర్యాన కలిదిండిలో సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్మికులను పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలను సవరించే పనిలో ఉందని ఆరోపించారు. ఇలాంటి కార్మిక వ్యతిరేక నిర్ణయాలను దీటుగా ఎదుర్కోవడానికి అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. వీరవల్లి భాస్కరరావు, డీవీ సత్యనారాయణ, బి.రామనాగేంద్రరావు, పి.గోపి, జి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు జనవరి 4న విశాఖపట్నంలో జరుగుతాయని సీఐటీయూ నాయకుడు రాజు తెలిపారు. సోమవారం నూజివీడులో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ మహాసభల్లో పలు సమస్యలు చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నూజివీడు ప్రధాన కార్యదర్శి జి.రాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రాజకుమారి, పద్మ, ఝాన్సీ, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

**శత శాతం ఫలితాలు సాధించాలి.. మండవల్లి, న్యూస్‌టుడే:** పదోతరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని యూటీఎఫ్ మండల శాఖ, భైరవపట్నం తెలుగు ఉపాధ్యాయుడు వీవీ రాజారావు ఆర్థిక సహాయంతో లింగాల జడ్పీ ఉన్నత పాఠశాలలో మోడల్ పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. 40 మంది విద్యార్థులకు ఎంఈవో-2 రత్నసునాధం పుస్తకాలను అందించారు. ఇందులో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పిచ్చోడు మాస్టారు, హెచ్ఎంలు కోటేశ్వరరావు, రవికుమార్, మేడా శ్రీనివాసరావు, సనావుల్లా, ఆనంద్, రాజేశ్ పాల్గొన్నారు.

**స్టడీ మెటీరియల్ పంపిణీ.. నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** మండలంలోని గొల్లపల్లి ఏఆర్కే జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. 75 మంది విద్యార్థులకు నూజివీడు సిద్ధార్థ విద్యా సంస్థల డైరెక్టర్ జి.రవిబాబు, లెక్చరర్ పి.రాఘవేంద్రరావులు యూటీఎఫ్ వారు రూపొందించిన అన్ని సబ్జెక్టుల స్టడీ మెటీరియల్ అందజేశారు. పాఠశాల పీఎంసీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయిని శారద పాల్గొన్నారు.

(c) eenadu

## శెభాష్ జాహ్నవి

పీజీ వైద్యపరీక్షల ఫలితాల్లో → ప్రథమ స్థానం ←

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ(విజయవాడ) విడుదల చేసిన పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ) వైద్యవిద్య పరీక్షల తుది ఫలితాల్లో గైనకాలజీ విభాగంలో కాకినాడకు చెందిన డాక్టర్ శ్రీజాహ్నవి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ఆమె విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థిని తండ్రి కె.జయరాజు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారం, కళాశాల ప్రొఫెసర్లు, హెచ్‌ఓడీలు, సీనియర్ల సలహాలను పాటిస్తూ చదివానని, ఫస్ట్ ర్యాంకు రావడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇతర అవకాశాలు వచ్చినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు వైద్య సేవలు అందించాలనేది తన కోరికని తెలిపారు. పలువురు నగర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నేతలు జాహ్నవిని అభినందించారు.

## ముక్కోటికి అన్నవరం ముస్తాబు

అన్నవరం: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవుని దర్శనానికి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు. ప్రధానాలయంలో ఉత్తరద్వారానికి అనుకుని (ఆలయం లోపల వైపు) వేదికపై ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న తర్వాత మూలవిరాట్‌ను దర్శించుకునే విధంగా క్యూలైన్లు సిద్ధం చేశారు. ఏర్పాట్లను ఛైర్మన్ ఐ.వి.రోహిత్, ఈవో వి.త్రినాథరావులు పరిశీలించారు.

## యమపురికి వద్దు.. శిరస్త్రాణమే ముద్దు

రోడ్డు ప్రమాదాల నివారణకు జగ్గంపేట పోలీసులు వినూత్నంగా ప్రచారం చేపట్టారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాకారులతో యమధర్మరాజు, చిత్రగుప్తుడు వేషధారణతో ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్, సంతమార్కెట్, కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. అతివేగం వద్దు.. ప్రాణం ముద్దు, హెల్మెట్ ధరించు.. మరణాన్ని జయించు తదితర నినాదాలతో రద్దీ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. రానున్న డిసెంబరు 31, కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడపాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి

## ఒకరోజు ముందుగానే పింఛన్లు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: జనవరి నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఒకరోజు ముందుగానే ఈనెల 31న ఉదయం 6.30 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కొత్తగా 448 స్పౌజ్ పింఛన్లు మంజూరు అయ్యాయని చెప్పారు. జిల్లాలో మొత్తం 2,70,550 పింఛన్లకు రూ.117.94 కోట్ల సొమ్మును పంపిణీ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పీడీ వెల్లడించారు.

## 2026.. ఆచరిద్దాం ఈ ఆరు..!

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, గాంధీనగర్

నేడు కొలువు సాధించాలంటే చదువు ఒక్కటే సరిపోవడం లేదు. ఆయా సంస్థలు అభ్యర్థుల నుంచి అదనపు నైపుణ్యాలు ఆశిస్తున్నాయి. టెక్ యుగంలో ఏడాదికో సాంకేతిక విప్లవం తెరపైకి వస్తుంది. వీటిని అందిపుచ్చుకున్నవారికే పరిశ్రమలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. జేఎన్టీయూ, అనుబంధ కళాశాలల్లో ప్రాంగణ ఎంపికల (క్యాంపస్ రిక్రూట్‌మెంట్) కోలాహలం మొదలైంది. నూతన ఏడాదిలో ఫిబ్రవరి, మార్చి వరకు కొలువుల జాతర కొనసాగనుంది. 2026లో యువత ఆరు సూత్రాలు ఆచరిస్తే లక్ష్యాలు అందుకోవడానికి అవకాశం ఉందని నిపుణులంటున్నారు.

అదనపు నైపుణ్యాలతో అందుకోండి అవకాశం..

1. ● లక్ష్యాలపై స్పష్టత : కొత్త ఏడాదిలో చదువు, నైపుణ్యం, ఉద్యోగం ఏది ముఖ్యమో నిర్ణయించుకుని అందుకు అనుగుణంగా స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. వాటిని సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలి.

2. ● కొత్త అంశాల నేర్పు : రోజువారీ చదువుతో పాటు కనీసం ఒక గంట కొత్త విషయాలు నేర్చుకోవడంపై దృష్టిసారించాలి. పుస్తకాలు, ఆన్‌లైన్ కోర్సులు చేయడం ద్వారా కొత్తకొత్త అంశాలపై పట్టు సాధించడానికి అవకాశం ఉంటుంది. పత్రికలు విధిగా చదవాలి.

3. ● నైపుణ్యం ఉన్నతి: కృత్రిమ మేధ, క్వాంటమ్ టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, డిజిటల్ మార్కెటింగ్ వంటి నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేటు స్కిల్ కోర్సులను వినియోగించుకోవాలి.

4. ● సమయ పాలన: రోజువారీ టైం టేబుల్ సిద్ధం చేసుకుని ఆచరించాలి. మొబైల్, సామాజిక మాధ్యమాల వినియోగంపై నియంత్రణ ఉండాలి. మంచి స్నేహితులు, మెంటార్లు ఎంపిక చేసుకుని వారి సూచనలు పాటించాలి.

5. ● ఆరోగ్యమే మూలధనం: చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా ఉద్యోగ సాధనకు ముఖ్యం. రోజూ వ్యాయామం చేయడం ద్వారా మానసిక ఆరోగ్యం సాధిస్తారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ధ్యానం చేస్తే మంచి ఫలితాలొస్తాయి.

6. ● ఉద్యోగ సన్నద్ధత: మీ బయోడెటాను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలి. కొత్త నైపుణ్యాలన్నీ రెజ్యూమ్‌లోనే కనిపించాలి. నెలకు రెండు మూడు అప్లికేషన్లు తయారుచేయాలి. ఉద్యోగ మేళాలు, నోటిఫికేషన్లపై దృష్టిసారించి విధిగా దరఖాస్తులు చేస్తుండాలి.

- ● ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జేఎన్టీయూకె, అనుబంధ కళాశాలలు: 33
- ● ఏటా కళాశాలల నుంచి బయటకొచ్చే ఇంజినీరింగ్ విద్యార్థులు: 10,600
- ● సగటు ఉత్తీర్ణత : 84 శాతం
- ● ప్రాంగణ ఎంపికలకు ఎంపికయ్యేవారి శాతం: 72
- ● జేఎన్‌టీయూలో ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 120 మంది వరకు ఉద్యోగాలు సాధించారు. మరో 300 మంది పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు.

'కోర్ బ్రాంచుల విద్యార్థులు కోడింగ్, ఏఐ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడాలి. సాప్, క్లౌడ్ కోర్సుల్లో గ్లోబల్ సర్టిఫికేట్లు ఉంటే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు కచ్చితంగా చేయాలి, రెజ్యూమ్‌ను తయారు చేయడంలోనూ జాగ్రత్తలు పాటించాలి.' అని జేఎన్‌టీయూకే నియామక అధికారి డాక్టర్ ఎ.కరుణ తెలిపారు.

## ప్రభుత్వ ఖాతాల్లో మగ్గుతున్న నిధులు..!

ఉపసంహరణకు ఈ నెలాఖరుతో ముగియనున్న గడువు

ఈనాడు, కాకినాడ

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల పథకాల అమలు, కార్యాలయాల నిర్వహణ పేరుతో తెరిచిన బ్యాంకు ఖాతాల్లో రూ.15 కోట్ల వరకు నిధులు మగ్గుతున్నాయి. ఇటీవల ఖాతాదారులు క్లెయిమ్ చేయని సొమ్ముపై వారి వారసులకు సమాచారం ఇచ్చి ఆధారాలతో వచ్చిన వారికి అప్పగించాలని ఆర్బీఐ ఆదేశించింది. అదే క్రమంలో ప్రభుత్వశాఖల ఖాతాల్లో నిధుల సమాచారం ఇచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వశాఖల పరిధిలో అన్ క్లెయిమ్డ్ ఖాతాలు 4,952 వరకు ఉన్నాయి.

| జిల్లా | లావాదేవీలు జరగని ఖాతాలు | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|
| కాకినాడ | 2,381 | 7.58 |
| తూర్పుగోదావరి | 1,117 | 3.27 |
| అంబేడ్కర్ కోనసీమ | 1,454 | 4.05 |

### 74 శాఖల పరిధిలో..

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 74 వరకు ప్రభుత్వ శాఖలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పద్దుల రూపంలో ఆయశాఖలకు నిధులు మంజూరు చేస్తూ వచ్చాయి. వాటిలో కొంత ఖర్చుచేసిన తర్వాత నిధులు సరిపోక, పథకం కాలపరిమితి దాటడం, ఇతరత్రా సాంకేతిక కారణాలతో మిగిలిన మొత్తం ఖాతాల్లో వదిలేశారు. కొత్త ఖాతాలు తెరవడం, బదిలీల్లో అధికారులు మారుతుండటంతో పాత ఖాతాలు మరిచారు. కొన్ని శాఖలు డిపాజిట్ మొత్తాలను సైతం విత్‌డ్రా చేయకుండా వదిలేశాయి. ఇలాంటి ఖాతాల్లో సొమ్ములన్ని లెక్కగట్టగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.155 కోట్లు ఉంటే.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.14.9 కోట్లు ఉన్నాయని గుర్తించారు.

'అధికారుల పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాలను నవీకరించుకోవాలి. ఏయే శాఖల్లో ఎన్ని ఖాతాలు మనుగడ లేకుండా ఉన్నాయో అధికారులకు సమాచారం ఇచ్చాం. బ్యాంకుకు వెళ్లి ఆధార్‌తో ఈకేవైసీ చేయించుకుంటే పునరుద్ధరణలోకి వస్తాయి. ఈ నెల 31లోగానే ఆ ప్రక్రియ పూర్తిచేయాలి.' అని ఖజానాశాఖ ఉప సంచాలకులు గణేశ్ కుమార్ తెలిపారు.

## నాణ్యత నగుబాట..

కాకినాడ-రాజమహేంద్రవరం నగరాలను కలిపే ఏడీబీ రహదారిలో గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిరాదరణకు గురై ఎన్నో ప్రమాదాలకు కారణమైన ఈ మార్గాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొంది. అక్కడక్కడ పనులు మినహా అందుబాటులోకి వచ్చింది. నిర్మాణంలో నాణ్యతా లోపాలతో నెలలకే అనేక చోట్ల తారులేచిపోయింది. పెద్దాపురం మండలం రాయభూపాలపట్నం వెళ్లే కూడలి వద్ద పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది.

- ఈనాడు, కాకినాడ

## రోగులు చలించిపోవాల్సిందే!

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో రోగులు చలికి వణుకుతున్నారు. కిటికీల నుంచి చొచ్చుకుని వచ్చే చల్లని గాలులతో రోగులు అల్లాడిపోతున్నారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు విశాఖ మన్యం ప్రాంతాల నుంచి సైతం రోగులు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వస్తుంటారు. సుమారు 1500 రోగులు ఇన్‌పేషెంట్లుగా వైద్యం పొందుతున్నారు. జీజీహెచ్‌లో పలు సమస్యలు తిష్ఠవేశాయి. చలి కాలంలో రోగులు అవస్థలు అన్నీఇన్నీ కావు.

### ఎక్కడెక్కడ అంటే..

ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్స్, గుండె, గైనిక్, సర్జికల్, మెడికల్ తదితర వార్డులోని పలు కిటికీలు తలుపులు లేవు. మరికొన్నింటికి ఉన్నా అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. కిటికీ చట్రాలు తుప్పుపట్టి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. అసలే పురాతన భవనాలు కావడం, దానికి తోడు చలిగాలులు వీయడంతో రోగులు కంటి మీద కునుకు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

వార్డులో కిటికీలకు తలపుల్లేని వైనం

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం

-6లో

## చుక్కల పీత.. సుందర నేత్ర..

యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ చేపలరేవులో వేటకు వెళ్లిన మత్స్యకారుడి వలకు నాలుగు వందల గ్రాముల బరువున్న ఓ పీత చిక్కింది. దీని శరీరంపై పది ఎరుపు రంగు చుక్కలతో ఆకర్షణీయంగా ఉంది. దీనిని పది చుక్కల పీతగా పిలుస్తారని, శరీరం చాలా గట్టిగా ఉండడం వల్ల స్థానికంగా తినడానికి ఎవరూ ఇష్టపడరని మత్స్యకారులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, కొత్తపల్లి

## ఆందోళన వీడి.. స్వస్థలాలకు పయనమై..

రైలు ప్రమాద బాధితులకు సామర్లకోటలో సాంత్వన

సామర్లకోట, గ్రామీణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా యలమంచిలి పరిధిలో టాటానగర్-ఎర్నాకుళం రైలు బోగీల్లో అగ్నిప్రమాద ఘటన నుంచి బయటపడిన 124 మందిని అధికారులు ప్రత్యేక బస్సుల్లో సామర్లకోట స్టేషన్‌కు చేర్చి.. ఇక్కడ్నుంచి వారి గమ్యస్థానాలకు పంపించారు. సోమవారం ఉదయం 8 గంటలకు సామర్లకోట వచ్చిన వారికి రైల్వేస్టేషన్ వద్ద వారికి భీమేశ్వర లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అల్పాహారం, తాగునీరు అందించారు. స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో మూడు విశ్రాంతి గదుల్లో వారిని ఉంచారు. అనంతరం అధికారులు సామర్లకోట స్టేషన్‌కు రప్పించిన అదే రైలులోని కాలిపోయిన మూడు బోగీలను తొలగించి, మిగిలిన బోగీలను ఉదయం 9.10 గంటలకు సామర్లకోట రైల్వేస్టేషన్‌లోని రెండో నంబరు ప్లాట్‌ఫారంపై ఉంచారు. రాజమహేంద్రవరం నుంచి తెచ్చిన ప్రత్యేక బోగీలను అమర్చి ప్రయాణికులకు రిజర్వేషన్ నంబర్ల ప్రకారం సీట్లు కేటాయించారు. సామర్లకోట నుంచి 10.45 గంటలకు రైలును ఎర్నాకులం పంపించారు.

### లగేజీ, చరవాణి కాలిపోయాయి..

పొగలు రావడంతో ఉలిక్కిపడి రైలు దిగి పరుగులు తీశామని, తేరుకుని వెళ్లి చూసేసరికి బోగీల్లోని మా లగేజీ, చరవాణి కాలిపోయాయని పలువురు పేర్కొన్నారు. తమ బ్యాగులు, చరవాణిలు పాస్‌పోర్ట్‌లు, లగేజీ పోయాయని రైల్వే పోలీసులకు ప్రయాణికులు ఫిర్యాదు చేశారు.

### ఆలస్యంగా నడిచిన పలు రైళ్లు

సామర్లకోట: అగ్ని ప్రమాద ఘటనతో సోమవారం పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. పూరి-తిరుపతి, ఈస్ట్‌కోస్ట్, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లు గంట నుంచి 3 గంటలు ఆలస్యంగా నడిచాయి.

సామర్లకోట స్టేషన్‌లోకి వస్తున్న ప్రయాణికులు

### అధికారులు బాగా స్పందించారు..

ప్రమాదం తెలిసి ప్రాణభయంతో రైలు దిగి ఉరికాం. అధికారులు స్పందించి మాకు ధైర్యం చెప్పారు. అంతకు ముందు పొగతో వృద్ధులు, మహిళలు అల్లాడిపోయారు.

- శాంతకుమారి, ప్రయాణికురాలు, బొబ్బిలి

### కేకలు వేసి అందరినీ లేపా..

వేగంగా వెళ్తున్న రైలు బోగీలో దట్టమైన పొగలు కమ్మాయి. భయంతో కేకలేసి.. అందర్నీ నిద్రలేపా. చైన్ లాగి రైలును ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు వ్యాపించడంతో లగేజీ తెచ్చుకునే వీలు లేకుండాపోయింది.

- బి.శివకుమార్, విజయనగరం

## అంతర్వేది రథం శకలాల నిమజ్జనం 3న

అంతర్వేది: అంతర్వేది లక్ష్మీనరసింహుడి ఆలయం వద్ద దగ్ధమైన పాత రథం శకలాలను జనవరి 3న నిమజ్జనం చేయడానికి దేవాదాయ, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి దివ్య రథం (పాతది) 2020 సెప్టెంబరు 5న అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. అప్పటి వైకాపా ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది. రథం శకలాలు ఉంటే అరిష్టమని, వాటిని గోదావరిలో నిమజ్జనం చేయాలని అర్చకులు, స్థానికులు పోలీసులను కోరారు. విచారణలో ఉందంటూ ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంవచ్చాక రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ దేవాదాయశాఖ కమిషనర్, డీజీపీని కలిసి విన్నవించడంతో నిమజ్జనానికి అనుమతిచ్చారు.

## తూర్పుగోదావరిలోకి మండపేట

టి.నగర్, న్యూస్‌టుడే: జిల్లాల పునర్విభజన, నియోజకవర్గాల విలీనంపై ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయంతో తూర్పుగోదావరి జిల్లా రూపురేఖలు మారనున్నాయి. ఇప్పటివరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలోకి విలీనం చేసే ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. దీంతో జిల్లా స్వరూపం మారనుంది.

8.. ప్రస్తుతం జిల్లాలో రాజమహేంద్రవరం నగరం, గ్రామీణం, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలు ఉన్నాయి. మండపేట చేరడంతో అసెంబ్లీ స్థానాలు 8కు చేరుతుంది. మండపేట పార్లమెంట్ పరిధి మాత్రం అమలాపురంలోనే కొనసాగుతుంది.

22.. జిల్లాలో 19 మండలాలు ఉండగా, మండపేటలోని మూడు మండలాలు కలవడంతో ఆ సంఖ్య 22కు చేరుతుంది. 299 గ్రామాలు ఉండగా ఆ సంఖ్య దాదాపు 320 దాటనుంది. 2.5 లక్షల జనాభా అదనంగా పెరుగుతుంది.

### యథావిధిగా రామచంద్రపురం రెవెన్యూ డివిజన్

ప్రస్తుతం కోనసీమ జిల్లాలో అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. మండపేట తూర్పుగోదావరిలో విలీనం కావడంతో రామచంద్రపురం డివిజన్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జిల్లా మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించారు. రామచంద్రపురం, కె.గంగవరం మండలాలతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ యథావిధిగా కొనసాగుతాయని మంత్రి వర్గ సమావేశంలో ప్రకటించారు.

## పిల్లలూ.. ప్రధానితో మాట్లాడతారా!

'పరీక్షా పే చర్చా వేదిక'కు దరఖాస్తుల ఆహ్వానం

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

వార్షిక పరీక్షల ముందు విద్యార్థుల్లో భయం, ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడి, తల్లిదండ్రుల్లో ఆందోళన పోగొట్టేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ 2018 ఫిబ్రవరి నుంచి 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నేరుగా ఆయన మాట్లాడుతూ మార్గనిర్దేశం చేస్తున్నారు. ఆత్మస్థైర్యం నింపుతున్నారు. తద్వారా మంచి వాతావరణంలో పరీక్షలు ఎదుర్కొనేలా సన్నద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది కూడా 9వ ఎడిషన్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులను 'ఆన్‌లైన్'లో ఆహ్వానిస్తున్నారు.

### విధానం.. ప్రయోజనాలు ఇవీ..

● పరీక్షలకు సంబంధించి సందేహాలను తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రధాని సమాధానాలతో నివృత్తి చేసుకోవచ్చు.

● ప్రశ్న గరిష్ఠంగా 500 అక్షరాల్లో ఉండాలి. సంబంధిత ఎంట్రీలను కేంద్ర మానవవనరుల మంత్రిత్వశాఖ ఆహ్వానిస్తోంది.

● అన్ని ప్రభుత్వ యాజమాన్య, ప్రైవేటు పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులు.

● ఆసక్తిగలవారు తమ వివరాలను 'పరీక్షా పే చర్చా' యాప్‌లో నమోదు చేసుకోవాలి.

ఎలా చేయాలి..: innovateindia.mygov.in పై క్లిక్ చేయాలి. అడిగే ఆప్షన్లన్నింటినీ పూర్తి చేయాలి. ఓటీపీ రాగానే మళ్లీ లాగిన్ అవ్వాలి. ప్రాథమిక సమాచారం, వివరాలు నమోదు చేయాలి. తదుపరి తెరపై కనిపించే అయిదు బహుళైచ్ఛిక ప్రశ్నలలో ఒక దాన్ని(థీమ్)ను ఎంచుకుని 500 అక్షరాల లోపు ప్రశ్నను వివరించాలి.

✤ గడువు..: నమోదుకు 2026 జనవరి 11 గడువుగా పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా ప్రధానితో మాట్లాడేందుకు విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ద్వారా పీపీసీ కిట్లను బహుమతిగా అందజేస్తారు. టాప్ 10 లెజెండరీ ఎగ్జామ్ వారియర్స్‌కు ప్రధాన మంత్రి నివాసాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తారు.

### ప్రేరణ కలిగించే కార్యక్రమం..

పరీక్షలంటే భయం పోగొట్టి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ప్రేరణ కలిగించే కార్యక్రమమిది. ప్రధానితో మాట్లాడే అరుదైన అవకాశం పొందేందుకు ప్రతి పాఠశాల నుంచి పిల్లల నమోదు ఉండాలి. ఇప్పటివరకు కాకినాడ జిల్లాలో 90 వేలకుపైగా ఎంట్రీలు నమోదయ్యాయి. గడువులోపు ఇంకా పెరిగే అవకాశముంది. నమోదు ప్రక్రియ పూర్తికాగానే డైట్ ప్రిన్సిపల్ ఎంపిక జాబితాను సిద్ధం చేస్తారు.

- రమేష్, డీఈవో, జగన్మోహన్, సమగ్రశిక్షా ఏఎంవో

## గోదావరిలో హైలెస్సా..

కోటిపల్లి రేవులో పంటు ప్రయాణాలు పునరుద్ధరణ

పామర్రు, న్యూస్‌టుడే: కోనసీమ ముఖద్వారంగా భాసిల్లుతున్న కోటిపల్లి-ముక్తేశ్వరం రేవు నుంచి పంటు ప్రయాణాలు సోమవారం నుంచి పునరుద్ధరించారు. ఈ ఏడాది జులైలో వరదలొచ్చినపుడు గోదావరిలో ప్రవాహం ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో పంటు రాకపోకలను రద్దు చేశారు. అప్పటి నుంచి పలు కారణాలతో పంట్లను రేవులోనే కట్టేశారు. అధికారుల నుంచి అన్ని అనుమతులు రావడంతో నిర్వాహకులు నదిలో ప్రయాణం ప్రారంభించారు. బోట్స్‌మెన్ సొసైటీకి నెలకు రూ.7.37 లక్షల అద్దె చెల్లించే ప్రాతిపదికన రేవును అప్పగించామని ఎంపీడీవో ఎన్.శ్రీనివాసు వెల్లడించారు. వీరు మార్చి నెలాఖరు వరకు పంట్లను నడుపుతారని వివరించారు.

రేవు నుంచి ప్రయాణికులతో బయలుదేరిన పంటు

## 'రెవెన్యూ క్లినిక్'కు 110 అర్జీలు

సాంబమూర్తినగర్(కాకినాడ): భూ సంబంధిత సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని భూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో సోమవారం కలెక్టరేట్ వివేకానంద హాలు భవనంపై 'రెవెన్యూ క్లినిక్' కార్యక్రమం నిర్వహించారు. జేసీ అపూర్వ భరత్.. డీఆర్వోతో కలిసి రెవెన్యూ క్లినిక్ నిర్వహణను పరిశీలించి, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో భాగంగా ప్రతి సోమవారం ఈకార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సర్వే అంశాలు, ల్యాండ్ డి పట్టాకు సంబంధించిన ఏమైనా సమస్యలుంటే అర్జీదారునికి ముందుగా తెలియపర్చి క్షేత్ర పరిశీలన వెళతామని చెప్పారు. రెవెన్యూ అంశాలపై సంబంధించి మొత్తం 110 అర్జీలు దాఖలయ్యాయని డీఆర్వో తెలిపారు. పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి, ఏవో ఎస్.రామ్మోహన్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న సిబ్బంది

## అందుబాటులో ఎరువులు

సాంబమూర్తినగర్: జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి ఎరువుల కొరత లేదని, అవసరమైన యూరియా సరఫరా జరుగుతోందని జేసీ అపూర్వ భరత్ తెలిపారు. దాళ్వాకు అన్నిరకాల పంటలకుగాను 35,576 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందన్నారు. డిసెంబరు వరకు 14,861 మెట్రిక్ టన్నులకు గాను, ఇప్పటి వరకు 12,725 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని చెప్పారు. ఈనెల 29వ తేదీ నాటికి 5029 మె.ట. యూరియా అందుబాటులో ఉందని వివరించారు. ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు ఎంఆర్‌పీ ధరల ప్రకారం రుసుం చెల్లించి డీలరు నుంచి రసీదు పొందాలన్నారు. ప్రస్తుతం 722 లీటర్ల నానో యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

డెల్టా క్యాన్సర్ సెంటర్
A Unit of Rajamahendri Healthcare Private Limited
క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించండి. సురక్షితంగా జీవించండి.
నిష్ణాతులైన వైద్య నిపుణులు
అత్యాధునికమైన సాంకేతికతతో

సర్జికల్ ఆంకాలజీ | మెడికల్ ఆంకాలజీ | రేడియేషన్ ఆంకాలజీ
వెంకటేశ్వర నగర్, రాజమండ్రి. ✆ 9 613 613 613

(c) eenadu

EENADU SPORTS LEAGUE 2025

# పరుగుల జోరు.. కుర్రాళ్ల హుషారు..

ఉత్సాహంగా ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025

రాజానగరం, శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ఫోర్లు, సిక్సర్లతో క్రీడాకారులు మెరుపులు మెరిపించారు. బౌలర్లు చుక్కలు చూపించారు. మొత్తంగా బ్యాటర్లు పైచేయి సాధించి విజయతీరాలకు చేరారు. జీజీయూ ప్రాంగణంలోని రెండు మైదానాల్లో నిర్వహిస్తున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రెజెంట్స్) ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025' క్రికెట్ లీగ్ సోమవారం ఉత్సాహంగా సాగింది.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే.. మురళీకృష్ణ (59 పరుగులు)

## అభేద్యమైన విజయం..

కిట్స్ కళాశాల దివిలి (కాకినాడ) జట్టు, ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (కాకినాడ) మధ్య పోటీలో ఐడియల్ జట్టు విజయం సాధించింది. కిట్స్ కళాశాల జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐడియల్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 89 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కిట్స్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 67 పరుగులు మాత్రమే చేసింది. 22 పరుగుల ఆధిక్యంతో ఐడియల్ కళాశాల జట్టు విజయం సాధించింది. క్రీడాకారుడు ఐడియల్ చేసిన కీలకమైన 31 పరుగులు జట్టు విజయానికి తోడ్పడ్డాయి.

ప్రతిభ చూపిన ఐడియల్ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (కాకినాడ)

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
(Non-Govt. Public Charitable Trust)
"Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL
The joy of life
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor
GGU
GODAVARI GLOBAL UNIVERSITY
RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner
ఈనాడు.net
ETV BHARAT
Medical Partner
GSL
District Sponsor
TIRUMALA విద్యాసంస్థలు
FM Partner
TV Partner
Organised by ఈనాడు

విజయానందంలో ఐడియల్ ఇంజినీరింగ్ క్రీడాకారులు

## మెరిసిన ఐడియల్ ఇంజినీరింగ్..

కాకినాడ ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల, రాజమహేంద్రవరం జీఎస్ఎల్ వైద్య కళాశాల జట్ల మధ్య పోటీలో ఐడియల్ విజయం సాధించింది. జీఎస్ఎల్ టాస్ గెలిచి ఐడియల్ జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించగా నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. ఈ జట్టులో అభిరామ్ 22 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీఎస్ఎల్ జట్టు మొదటి నుంచి నెమ్మదిగా ఆడుతూ వచ్చింది. ఐడియల్ జట్టు క్రీడాకారుల తెలివైన బౌలింగ్, ఫీల్డింగ్ బ్యాటర్లను కట్టడి చేశాయి. దీంతో జీఎస్ఎల్ క్రీడాకారులు పరుగులు చేయడంలో తడబడ్డారు. చివరకు 5 వికెట్ల నష్టానికి 65 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలయ్యారు.

సత్తా చాటిన బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

## కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి..

బీఎస్ఎల్ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం), బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల (అమలాపురం) జట్ల మధ్య పోటీలో మురళీకృష్ణ 28 బంతుల్లో 59 పరుగులు సాధించి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడారు. బీవీసీ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన బీఎస్ఎల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన బీవీసీ జట్టులో కెప్టెన్ మురళీకృష్ణ విజృంభించాడు. సిక్సర్లు, ఫోర్లతో మోత మోగించాడు. దీంతో బీవీసీ జట్టు కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 89 పరుగుల విజయలక్ష్యాన్ని సునాయాసంగా సాధించింది.

## ఇలా గెలుపొందిన కైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కాకినాడ, పెదమాక్షేత్రం), కాకినాడలోని కైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య మధ్యాహ్నం మ్యాచ్ జరగాల్సి ఉండగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాజరు కాలేదు. దీంతో న్యాయ నిర్ణేతలు వాకోవర్ ఇచ్చి కైట్ జట్టును విజేతగా ప్రకటించారు.

## అలా గెలిచిన గైట్..

స్వెస్ డిగ్రీ కళాశాల (పాయకరావుపేట), గైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు స్వెస్ డిగ్రీ జట్టు హాజరుకాకపోవడంతో న్యాయనిర్ణేతలు వాకోవర్ ఇచ్చి గైట్ ఇంజినీరింగ్ కళాశాల జట్టును విజేతగా ప్రకటించారు.

### నేటి మ్యాచ్‌లు (30.12.2025)

**గ్రౌండ్ - 1**

▲ ఉదయం 8 గంటలకు: ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల (పెద్దాపురం, కాకినాడ) x ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం). ▲ ఉదయం 11 గంటలకు: ఎస్‌వీఎం డిగ్రీ కళాశాల(సవరవిల్లి, కోనసీమ) x ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూజీ (రాజమహేంద్రవరం). ▲ మధ్యాహ్నం 2 గంటలకు: జేఎన్‌టీయూ(కాకినాడ) x వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల(రామచంద్రపురం).

**గ్రౌండ్ - 2**

▲ ఉదయం 8 గంటలకు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (తుని) x ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం). ▲ ఉదయం 11 గంటలకు: ప్రైడ్ ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ) x బీహెచ్ఎస్ఆర్, వీఎల్ఎం డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం).

### రేపటి మ్యాచ్‌లు (31.12.2025)

**గ్రౌండ్ - 1**

▲ ఉదయం 8 గంటలకు: గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం) x ఏకేఆర్‌జీ డిగ్రీ కాలేజ్ (నల్లజర్ల). ▲ ఉదయం 11 గంటలకు: గైట్ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) x వీఎస్ఎం డిగ్రీ కాలేజీ (రామచంద్రపురం). ▲ మధ్యాహ్నం 2 గంటలకు: ఏబీఎన్, సీఆర్ఆర్ కళాశాల (కొవ్వూరు) x అవంతి డిగ్రీ కాలేజ్ (రాజమహేంద్రవరం).

**గ్రౌండ్ - 2**

▲ ఉదయం 8 గంటలకు: కైట్ (2) ఇంజినీరింగ్ కళాశాల x ఐడియల్ కాలేజీ (ఇంద్రపాలెం). ▲ ఉదయం 11 గంటలకు: ఆదిత్య యూనివర్సిటీ x జీఎస్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ.

పాలకమండలితో ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు తదితరులు

## కూటమి పాలనలో ఆలయాల సమగ్రాభివృద్ధి

వాడపల్లి(ఆత్రేయపురం): కూటమి పాలనలో దేవాలయాలు సమగ్రాభివృద్ధి సాధిస్తున్నాయని ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం వారు వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకార మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు వాడపల్లి ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించారన్నారు. అనంతరం పాలకమండలి అధ్యక్షుడిగా ముదునూరి వెంకటరాజు, పలువురు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

## విద్యార్థులకు డిగ్రీలే కాదు.. నైతిక విలువలు అవసరం

గాంధీనగర్: విద్య అనేది కేవలం ఉద్యోగాలు, డిగ్రీలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, కర్తవ్యబోధ, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించే శక్తిగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం జేఎన్‌టీయూకే ప్రాంగణంలో విద్యార్థి ఉన్నత విలువలు- సామాజిక పరివర్తన అంశంపై ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. బుద్ధిహీనతతో ఉంటే మనం చేసే పనిపై శ్రద్ధ చూపలేమన్నారు. లక్ష్యం పెట్టుకున్న వారు దాన్ని చేరేందుకు అవసరమైన సంకల్పానికి నిలబడగలిగే శక్తి కలిగి ఉండాలని చెప్పారు. మనం చేసే పనిని సంతోషంగా చేయడం అలవాటు చేసుకుంటే దేన్నయినా సాధించగమలని పేర్కొన్నారు. మన మాట్లాడే మాట సంస్కారవంతమైనదైతే దేశగతిని మార్చేస్తుందని ప్రముఖుల జీవితాలను ఉదాహరణలుగా వివరించారు. జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్, యూసీఈకే ప్రిన్సిపల్ ఎన్.మోహనరావు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

## వైద్యకళాశాలకు రూ.30 లక్షల బస్సు వితరణ

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం రూ.30 లక్షల విలువ చేసే బస్సును కాకినాడ సీ పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్(కేఎస్‌పీఎల్) వితరణగా అందజేసింది. దీనికి సంబంధించిన పత్రాలను కేఎస్‌పీఎల్ సీఈఓ మురళీధర్ సోమవారం కళాశాల ప్రిన్సిపల్ డా.విష్ణువర్ధన్‌కు అందజేశారు. కళాశాల పూర్వ విద్యార్థి, మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ చొరవతో ఈ బస్సు అందించారు. ఈ కార్యక్రమంలో కేఎస్‌పీఎల్ జనరల్ మేనేజర్ మూర్తి, కరీం, కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డా.విజయశేఖర్, డా.శశి, అనాటమి ప్రొఫెసర్ డా.సుధాకర్, క్యాంపస్ ఆఫీసర్ సతీష్, వార్డెన్ లలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ డా.విష్ణువర్ధన్‌కు పత్రాలు అందజేస్తున్న మురళీధర్

## ఆరోగ్యశ్రీ చికిత్సలపై సీఐడీ విచారణ చేయాలి

పిఠాపురం: కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జరుగుతున్న ఆరోగ్యశ్రీ చికిత్సలపై సీఐడీతో విచారణ చేయించాలని మాజీ ఎమ్మెల్యే వర్మ డిమాండ్ చేశారు. సోమవారం పిఠాపురంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో నమోదు చేసుకున్న వారికి శస్త్రచికిత్స మొదలుపెట్టిన తరువాత వైద్యానికి పూర్తిగా డబ్బులు రావని, కొంత రోగి భరించాలని బెదిరిస్తూ రూ.లక్షల వసూలు చేస్తున్నారన్నారు. ఆ ఒక్క ఆసుపత్రిలో చెందుర్తి, కొత్తసింహాద్రిపురం, పిఠాపురానికి చెందిన జేబిరత్నం, జి.కుమారి, కొండెపూడి పెద్దరాజు కుటుంబాలకు అన్యాయం జరిగిందన్నారు. కొన్ని సందర్భాల్లో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుందామంటే బిల్లులు ఇవ్వడం లేదన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు విచారణ చేపట్టి, క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు.

సమస్య తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

### ధరవరలు

**అంబాజీపేట కొబ్బరి మార్కెట్**

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | 17,000 |
| పాతకాయ: గండేరా | 27,000 |
| గటగట | 25,000 |
| కొత్తకాయ: గండేరా | 26,000 |
| గటగట | 24,000 |
| నీటి కాయ (వెయ్యింటికి): | |
| పాత (ముక్కుడు) కాయ | 14,000-15,000 |
| కొత్త (పచ్చి) కాయ | 13,000-14,000 |
| కొబ్బరినూనె మార్కెట్: | |
| 15 కిలోలు | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

**వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో**

| | |
|---|---|
| ఫారంరేటు | 135-00 |
| రిటైల్ లైవ్ | 162-00 |
| డ్రెస్డ్ | 235-00 |
| స్కిన్‌లెస్ | 267-00 |

## నాకు న్యాయం జరగలేదు.. చనిపోతా

● పీజీఆర్‌ఎస్‌లో పురుగు మందు డబ్బాతో అర్జీదారుడి కలకలం

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: తన సమస్యను పరిష్కరించమని గత రెండేళ్లుగా కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ కాకినాడకు చెందిన తాళ్లూరి కృష్ణమోహన్ అనే వ్యక్తి సోమవారం పీజీఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఎదుట పురుగుల మందు తాగేందుకు యత్నించి కలకలం సృష్టించాడు. పెద్దఎత్తున కేకలు వేస్తూ.. సామాన్య ప్రజలకు న్యాయం చేయలేని పీజీఆర్‌ఎస్ ఎందుకంటూ ప్రశ్నించారు. 'నాకు న్యాయం జరగలేదు.. నేను పురుగు మందు తాగి చనిపోతానంటూ..' బిగ్గరగా అరవడంతో అధికారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న పోలీసులు, సిబ్బంది అతని నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. అనంతరం కృష్ణమోహన్‌తో అధికారులు మాట్లాడారు. సంబంధిత శాఖ సిబ్బందిని పిలిపించి సమస్యపై ఆరా తీశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ విలేకర్లతో మాట్లాడారు. తనకు పెద్ద మార్కెట్‌లో 400 గజాల్లో సొంత ఇల్లు ఉందని, నలువైపులా కొందరు ఆక్రమించారని, అడిగితే నానా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గత రెండు సంవత్సరాలుగా కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు, పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలు అడుగుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పురుగు మందు తాగేందుకు ప్రయత్నిస్తున్న అర్జీదారుడు

పిఠాపురం
ఆర్.ఒ.సి.నెం. 63/2025-ఇ1 తేది:29-10-2025

**ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు**

పిఠాపురం పురపాలక సంఘమునకు సంబంధించి 1 నెం.BPS & LER రూ.23.00 మరియు 23 నెం. సాధారణ నిధుల రూ.145.15 వెరసి మెత్తం పనులు నెం 24 రూ.168.15 లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఈ క్రింది తెలిపిన సైట్‌లలో టెండర్లు కోరబడుచున్నవి. మిగిలిన వివరములు https://tender.apeprocurement.gov.in నందు మరియు ఇతర వివరముల కొరకు సెల్ నెం: 9849906523 ద్వారా తెలుసుకొనవచ్చును.
బిడ్డు డాక్యుమెంటు డౌన్ లోడ్ ప్రారంభ తేది: 05-01-2026 సాయంత్రం గం॥ 4.30
బిడ్డు డాక్యుమెంటు డౌన్ లోడ్ ఆఖరి తేది :19-01-2026 సాయంత్రం గం॥5.00
సం/- **కమిషనరు**
పిఠాపురం పురపాలక సంఘం

**తుని పురపాలక సంఘం**
388/2017/ఇ1 తేది: 29-12-2025

**"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**

తుని పురపాలక సంఘం నందు సాధారణ నిధులతో 5 పనులు చేపట్టి పూర్తి చేయుటకు "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపై టెండర్ ఆహ్వానించడమైనది. సదరు టెండర్‌కు సంబంధించిన ఇతర వివరములు ది.30-12-2025 ఉదయం గం.11.00 నుండి www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సంప్రదించవలసిన చిరునామా: కమిషనర్, తుని మున్సిపాలిటీ,
ఫోన్ నెం.98499 05806, 98499 19375, 08854-253506,
E-mail: tunimunicipality@gmail.com
సం/- **ఎ.వెంకటరావు,** కమిషనర్, తుని పురపాలక సంఘం

**ANDHRA PRADESH INDUSTRIAL INFRASTRUCTURE CORPORATION LIMITED**
APIIC The Future is Here
(An undertaking of A.P. Govt.)
O/o ZONAL MANAGER, INDUSTRIAL PARK, KAKINADA - 533 005 Ph. No. 0884 - 2344225

**'e'- Procurement Notice**
Tender Notice No : 06 & 07/ZM/APIIC/KKD/2025-26 Dt. 29-12-2025
Zonal Manager/APIIC Limited, Kakinada invites bids for the following works.

| Tender Notice No. | Name of Work | Estimated Contract Value (ECV) |
|---|---|---|
| 06 | Raising of Existing Drain Wall and Sill levels in Road No.3 at IP-Vakalapudi,Kakinada District with IALA Funds(2nd Call) | Rs. 26,14,234/- |
| 07 | Strengthening of the Existing BT Cross Roads Nos.1& 4 in IP, Dowleswaram, East Godavari District IALA Funds | Rs. 28,69,868/- |

| | | | |
|---|---|---|---|
| 1) | Bid Document Downloading Start Date | : | From 29/12/2025 at 08:00 PM |
| 2) | Bid Document Downloading End Date | : | 13/01/2026 up to 01:00 PM |
| 3) | Last Date & Time for Receipt of Bids | : | 13/01/2026 at 03:00 PM |
| 4) | PQ Stage Opening Date & Time | : | 13/01/2026 at 03:30 PM |
| 5) | Commercial Stage Date & Time | : | 14/01/2026 @ 11:00 AM |

The details of tender notice and bid documents can be downloaded from website www.apeprocurement.gov.in (or) https://tender.apeprocurement.gov.in
**ZONAL MANAGER**

EENADU e Classifieds

BUSINESS SERVICES

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

**బంగారం బ్యాంకులలో,** ముత్తూట్, మనప్పురం ఏ ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్, ✆ 9849138626.

**శ్రీసాయిగోల్డ్: తాకట్టులో** ఉన్న బంగారం, ఏబ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆరోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 94933 38823.

FINANCIAL SERVICES

**ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు,** రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీకి పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ 7386201191.

JOBS

**కొత్తగా ఇంటర్నెట్** బాక్సులు వేయుటకు 10 మంది ఫీల్డ్ స్టాఫ్ కావలెను. నెలకు 15K (12+3). వేద నెట్, సత్యవతినగర్, కొవ్వూరు, కాంటాక్ట్ సెల్: 99899 55770.

**రాజమండ్రిలో మా** ఆఫీస్‌నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్(F) & టెలికాలింగ్ (M&F) మరియు ఆఫీస్ అసిస్టెంట్స్(M) కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. పాతసోమాలమ్మ గుడి రోడ్డు, దివ్య హాస్పిటల్‌దగ్గర. ✆ 85006 44978, 93461 45948.

**కావలెను:** Vicks & Tide Company నందు పనిచేయుటకు (1) సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ★ (2) డెలివరి బాయ్స్ ★ లొకేషన్ అమలాపురం, రాజోలు, రాజమండ్రి. Age: 18-45. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటివ్స్. ✆ 88861 23489, 95059 31234

**రాజమండ్రి, కోరుకొండ** రోడ్డులో మా ఇంటివద్ద 2 సంవత్సరాల పిల్లల ఆలన పాలన చూసుకొనుటకు ★ కేర్‌టేకర్స్ కావలెను. Cont. Cell: 99898 76799.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-65 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

# చిన్న కమతం.. పెద్ద ఫలితం

న్యూస్‌టుడే, పి.గన్నవరం

స్ఫూర్తి

చిన్న కమతంతో అధిక ఆదాయం పొందుతున్నారు కోనసీమలోని కొంతమంది. ఒకే పంటను నమ్ముకుంటే రైతుకు అంతగా గిట్టుబాటు ఉండదు. కొన్ని సందర్భాల్లో డిమాండ్ లేకపోతే నష్టం వస్తుంది. అదే ఒకే భూమిలో రకరకాల పంటలు సాగుచేస్తే లాభాల బాట పట్టొచ్చు. గత కొన్నేళ్లుగా ఇదే విధానం అవలంబిస్తున్నారు పి.గన్నవరం మండలం ఆదిమూలంవారిపాలేనికి చెందిన రైతు ఆదిమూలం పల్లంరాజు.

పలు రకాల ఆకుకూరలు పండిస్తున్న ఆదిమూలం పల్లంరాజు

**కౌలుకు తీసుకుని..**

పల్లంరాజు గ్రామంలోని 30 సెంట్ల మాగాణిని కౌలుకు తీసుకున్నారు. దీన్ని ఏడు భాగాలుగా విభజించారు. ఒక్కోదాంట్లో గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, మెంతికూర, పుదీనా వేశారు.

**జులై నుంచి డిసెంబరు వరకు..**

30 సెంట్ల భూమికి ఖరీఫ్, రబీ సాగుకోసం యజమానికి రూ.15 వేలు కౌలు చెల్లిస్తారు. ఖరీఫ్‌లో జూన్ నెలలో భూమిని గాడులు తీసి దిబ్బలుగా చేసి ఆయా రకాల ఆకు కూరలకు సంబంధించి విత్తనాలు చల్లుతారు. జులై నుంచి డిసెంబరు వరకు ఏడు నెలల పాటు దిగుబడి తీసి ఆయనే మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఏడు నెలలకు పెట్టుబడి వ్యయం రూ.18 వేలు అవుతుంది. ఖర్చులన్నీ పోను 30 సెంట్ల భూమిమీద నికర ఆదాయం వస్తుంది. జనవరి నుంచి ఈ తోటలు తొలగించి దీంట్లో రబీ కింద వరిసాగు ప్రారంభిస్తారు. దీనిమీద కూడా 12 బస్తాలు తక్కువ కాకుండా దిగుబడి వస్తుంది. ఈ ధాన్యం విక్రయించి కౌలు చెల్లిస్తారు. ఇలా తక్కువ విస్తీర్ణంలో ఆదాయం పొందుతున్నారు.

# రైతేరాజు

## ఉద్యాన తోటల్లో నీటి వృథాకు అడ్డుకట్ట

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలకు సాధారణంగా విద్యుత్తు మోటార్ల ద్వారా సాగునీరు అందిస్తుంటారు. పొలంలో బోదె తవ్వించి గట్లు వేయిస్తారు. ఈ పద్ధతిలో గట్లు తెగితే నీరు బయటకు పోతుంది. ఏడాదికి మూడు పర్యాయాలు బోదెలు, గట్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. దీనికి ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన యువరైతు నార్ని హరి అడ్డుకట్ట వేశారు. ఉన్నత విద్య అభ్యసించిన ఈయన తాడిపర్రులోని తన మూడెకరాల సాగు విషయంలో నూతన పద్ధతులను అవలంబించారు. 20 అడుగుల పొడవు కలిగిన సుమారు 130 గొట్టాలు భూమిలో ఏర్పాటు చేశారు. ఏ భాగంలో నీరు అవసరమో అక్కడ వాల్వ్ తిప్పితే నీరు ప్రవహిస్తుంది. ఒకే పర్యాయం అన్ని భాగాల్లో నీరు సరఫరా అయ్యే ఏర్పాట్లు కూడా ఉన్నాయి. ఈ పైపులు సుమారు 40 సంవత్సరాల వరకు పనిచేస్తాయి. మొత్తం రూ.2 లక్షల వ్యయమైంది. గట్ల పైబడి నీరు పొర్లిపోతుందనే ఇబ్బంది లేదు. సాధారణ పద్ధతిలో 5 గంటల్లో ఎకరా పొలానికి సాగునీరు సరఫరా చేయగా ఈ పైపులైను విధానం ద్వారా 3 గంటల్లోనే పూర్తవుతుందన్నారు. బహుళ ప్రయోజనాలు ఉన్న ఈ శాశ్వత పరిష్కార పద్ధతిని పరిసర గ్రామాల రైతులు సైతం అనుసరిస్తున్నట్లు రైతు హరి చెబుతున్నారు.

తాడిపర్రులో గొట్టాల ద్వారా సాగునీటి సరఫరా ఇలా..

నార్ని హరి

## చేపల్లో ఎర్రమచ్చల వ్యాధితో నష్టం

తెలుసుకుందాం.. నివారణ, జాగ్రత్తలు

ఉప్పలగుప్తం: చేపల చెరువుల్లో ఏరోమోనాస్ హైడ్రోఫిల్ బ్యాక్టీరియా కారణంగా చేపలకు అన్ని కాలాల్లోనూ ఎర్రమచ్చల వ్యాధి సోకుతుంది. దీని లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉప్పలగుప్తం ఎఫ్‌డీవో బి.హేమానంద్ వివరించారు.

**ఇవీ లక్షణాలు**

వ్యాధి సోకిన చేపలు నీటి ఉపరితలానికి వచ్చి ఈదుతుంటాయి. శరీరం, మొప్పలు, రెక్కల వద్ద ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి. కొన్నిసార్లు పొట్ట నీటితో ఉబ్బినట్టు కనిపిస్తాయి. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే ల్యాబ్‌లో పరీక్షించి వ్యాధిని గుర్తించొచ్చు.

5 శాతం బ్రోమిన్ ద్రావణాన్ని వ్యాధి తీవ్రతను బట్టి ఎకరా చెరువుకు 300 మి.లీ. నుంచి లీటరు వరకు పిచికారీ చేయాలి. అనుమతించిన యాంటీబయోటిక్స్‌ను పది గ్రాముల మేతలో కలిపి టన్ను చేపలకు పది రోజుల పాటు అందించాలి. చెరువులో ప్రాణవాయువు 5 పీపీఎం తగ్గకుండా చూసుకోవాలి. విటమిన్ మిక్సర్‌ను మేతలో కలిపి పది రోజులు అందించాలి. బ్రోమిన్, క్లోరిన్‌తో శుద్ధి చేసిన నీటిని చెరువుల్లోకి తోడాలి.

## వరినారు పెంపకంలో మెలకువలు

మీ కోసం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: రైతులు ప్రస్తుతం రబీ వరి నారుమడులు వేయడం ప్రారంభించారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆరోగ్యకరమైన నారు పొందొచ్చని ఆత్రేయపురం వ్యవసాయాధికారి పట్టాభిరామయ్య సూచించారు. సాధారణంగా దాళ్వాలో కాండంతొలిచే పురుగు, అగ్గితెగులు ఉద్ధృతంగా ఉంటుంది. వీటి నివారణకు నారు నాటడానికి వారం రోజుల ముందుగా ఎకరాకు సరిపోయే మడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు చల్లుకోవాలి. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 3 గ్రాములు పిచికారీ చేయాలి. చలి నుంచి రక్షించుకోవాలి.

ఆత్రేయపురంలో వేసిన నారుమడి

నారుమడిని సిద్ధం చేసే సమయంలో డీఏపీ 5 కిలోలు, పొటాష్ 2 కిలోల చొప్పున వేయాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే ఎదుగుదల లోపిస్తుంది. మడికి సాయంత్రం, రాత్రి సమయంలోనే నీరు పెట్టాలి. ఉదయం తొలగించాలి. ఎదుగుదల సరిగా లేకపోతే 13-0-45 ఎరువును 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ముందుగా విత్తనశుద్ధితో నిద్రావస్థ తొలగించాలి. దొడ్డురకం విత్తనమైతే 20 కిలోలు, సన్న రకమైతే 15 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

(c) eenadu

# కాకినాడ

## రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట- 38, 40, వంకాయలు- 20, 30, 34, 46, బెండకాయలు- 54, పచ్చిమిర్చి- 40, 45, 46, కాకరకాయ- 60, బీర- 50, 56, క్యాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 32, క్యారెట్- 32, దొండకాయలు- 36, 40, బంగాళదుంపలు- 22, 25, ఉల్లి- 28, 32, దోసకాయలు- 34, చిక్కుళ్లు- 36, చేమదుంపలు- 30, బీట్‌రూట్- 26, కీరదోస- 30, బీన్స్‌కాయలు- 70, అల్లం- 68, క్యాప్సికం- 52, బొబ్బర్లు- 32, చిలకడదుంపలు- 38, ఒకటి చొప్పున ఆనపకాయ- 30, 35, పొట్లకాయ- 25, 30, అరటికాయ- 5, 7, మునగకాడ- 10, 12, మామిడికాయ- 10, 15, నిమ్మకాయలు(డజన్) - 18, 24.

## నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4(స్క్రీన్)- ఈషా, అనకొండ, అవతార్ ఫైర్ అండ్ యాష్, గుర్రం పాపిరెడ్డి, దురంధర్, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- చాంపియన్, అనకొండ, పతంగ్, లక్ష్మి- ఈషా, సత్యగౌరి - అవతార్ ఫైర్ అండ్ యాష్, తిరుమల- వృషభ, సీఅండ్‌సీ 1- శంబాల, సీఅండ్‌సీ 2- దండోరా, శ్రీప్రియ - ఛాంపియన్, పద్మప్రియ- అఖండ 2, సూర్య1(వాకలపూడి) - ఛాంపియన్ (ఉ,సా), ఈషా (మ,రా), సూర్య 2.- శంబాల.

## మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ. 10 - మ. 1
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

### దారి బాగుపడింది

స్పందనకు వందనం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ, జగన్నాథపురం వంతెన దిగువ నుంచి ఘాటీ కూడలి వరకు రహదారి గుంతలతో అధ్వానంగా మారిందని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మించారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. సోమవారం పాత నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో, అన్నదాన సమాజంలో వివిధ డివిజన్లకు సంబంధించి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వార్డుల వారీగా ప్రత్యేకంగా ప్రజాదర్బార్లు నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. అదనపు కమిషనర్ సుధాకర్, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, డీసీపీ కృష్ణారావు, టీపీవో తైజు, నగర తెదేపా అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఆయా డివిజన్ల తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొండబాబు

## మున్సిపల్ పింఛనుదారుల సమస్యలు పరిష్కరించాలి

సాంబమూర్తినగర్(కాకినాడ): పురపాలక శాఖలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జిల్లా ఆడిట్ అధికారి ద్వారా పెన్షన్ కమ్యుటేషన్ మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గం కోరింది. సోమవారం కాకినాడలో సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడు ఆర్.గోగురాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించారు. పెన్షన్ కమ్యుటేషన్ మంజూరును పురపాలక శాఖ సంచాలకుల ద్వారా ఇవ్వడంతో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో విశ్రాంత ఉద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దామెర మురళి, కోశాధికారి జి.వేణుగోపాలస్వామి, ఉపాధ్యక్షులు టీవీటీ రమణరావు, ఎంవీ రమణారెడ్డి, కార్యవర్గ నిర్వాహక కార్యదర్శి కె.సత్యనారాయణ, ప్రాంతీయ కార్యదర్శి ఎన్‌వీ రామారావు, వి.వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన సంఘ నాయకులు

# వేదన వినండి.. దయ చూపండి

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

ఏళ్లుగా తిరుగుతున్నా తన భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని.. పింఛను కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా మంజూరు చేయడం లేదని.. పూర్తి వికలాంగుడైన తన బిడ్డకు చేయూతనివ్వాలని.. పలువురు అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అర్జీలు అందజేశారు. కాళ్లరిగేలా తిరుగుతున్నామని, కనికరం చూపాలని వేడుకున్నారు.

### మంచానికే పరిమితమయ్యా..

రౌతులపూడి మండలం ఆర్.వెంకటాపురానికి చెందిన **కాది లక్ష్మీనాయుడు** వ్యవసాయ కూలీ. పక్షవాతానికి గురై పూర్తిగా లేవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. కుటుంబ పోషణ భారంగా మారింది. ఆర్థిక ఇబ్బందులతో మందులు కొనుగోలుకు అవస్థలు పడుతున్నానని, తనకు ఎన్టీఆర్ భరోసా పింఛను కింద రూ.15 వేలు మంజూరు చేయాలని అధికారులకు అర్జీ ఇచ్చారు. వీల్ ఛైర్ ఇవ్వాలని వేడుకుంటున్నారు.

### భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదు..

కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన **నమ్మి సత్యవాణి**కి పెద్దాపురం మండలం కొండపల్లిలో సర్వే నంబరు 371/1ఎ1లో ఎకరా 40 సెంట్ల మెట్ట భూమి ఉంది. భూమిని రిజిస్ట్రేషన్ చేయమని 2018 నుంచి గ్రామ, మండల రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెక్షన్ 22ఎ కింద దేవాదాయశాఖ పరిధిలో తన భూమి ఉందని చెప్పి అధికారులు సమాధానం చెబుతున్నారని, తనకు న్యాయం చేయాలని ఆమె అర్జీ సమర్పించారు.

### మందులకే చాలడం లేదు..

కాకినాడ నగరం 19వ డివిజన్ గోళీలపేటకు చెందిన **జయరాజు**కు ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. పుట్టుకతోనే పూర్తి వికలాంగుడు కావడంతో అన్నీ తానే చూసుకోవాల్సి వస్తోందని తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. రూ.6 వేలు పింఛను వస్తున్నా ఏ మాత్రం చాలడం లేదన్నారు. మందులకు, ఫిజియోథెరపీకి ఎంతో అధికారులు దయ చూపి రూ.15 వేలు పింఛను మంజూరు చేయాలని కోరుతున్నారు.

### 'అంత్యోదయ'తో ఆదుకోండయ్యా..

కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన **గుత్తుల సూర్యకాంతం** అనే వృద్ధురాలు తనకు అన్నపూర్ణ అంత్యోదయ పథకం కింద 35 కిలోల బియ్యం ఇప్పించాలని అధికారులను వేడుకుంటున్నారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో అర్జీ సమర్పించారు. తనకు ఒక కుమార్తె ఉందని, కడు పేదరికంతో కాలం వెళ్లదీస్తున్నామని, ఆదుకునే వారే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రస్తుతం 5 కేజీల బియ్యం వస్తోందని, 35 కిలోలు ఇచ్చి ఆదుకోవాలని విన్నవించారు.

## ముక్కోటికి చురుగ్గా ఏర్పాట్లు

ముస్తాబైన గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం

గాంధీనగర్: ముక్కోటి ఏకాదశిని నగరంలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లోని ఉత్తర ద్వారాలను ప్రత్యేకంగా అలకరించారు. ఆలయాల్లో క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్తు దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. జగన్నాథపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను జిల్లా ఎండోమెంట్ అధికారి కె.నాగేశ్వరరావు పరిశీలించి, ఈవో సత్యవాణికి సూచనలు చేశారు. గాంధీనగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో శ్రీనివాసు తెలిపారు

### జగన్మోహినిగా వేణుగోపాలుడు

గాంధీనగర్: ధనుర్మాసోత్సవాల సందర్భంగా దశావతార అలంకారాల్లో భాగంగా దేవాలయం వీధిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం తెల్లవారు జామునుంచే సుప్రభాతం, అర్చన అనంతరం తిరుప్పావై సేవాకాలం జరిగాయి. సాయంత్రం స్వామివారు జగన్మోహిని అవతారంలో పూజలందుకున్నారు. మెయిన్‌రోడ్డు రామాలయంలో సీతారామస్వామివారిని కల్కిఅవతారంలో అలంకరించారు.

## కాశీ విశ్వనాథుడికి విశేష అభిషేకాలు

గాంధీనగర్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం భానుగుడి రిజర్వుపోలీస్ లైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కాశీ విశ్వనాథ రూపమైన స్ఫటిక లింగానికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకించారు.

## కృషి, పట్టుదలతో విజయం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కృషి, పట్టుదలే విజయానికి పునాది బాటలు వేస్తాయని భాష్యం పాఠశాలల జోనల్ ఇన్‌ఛార్జి గోవిందరాజు, ప్రిన్సిపల్ టి.దివాకర్ అన్నారు. కాకినాడ విద్యుత్తునగర్‌లో గల భాష్యం పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ సంఘటనలు, నియామకాలు-రాజీనామాలు తదితర అంశాలపై క్విజ్, జనరల్ నాలెడ్జ్‌పై నిర్వహించిన పోటీలో జి.జగదీష్(7వ తరగతి) ప్రథమ, సిహెచ్.వెంకట్‌సాయి(8వ తరగతి) ద్వితీయ, ఎ.మనోజ్(9వ తరగతి) తృతీయ బహుమతి సాధించారు. ఉపాధ్యాయులు యు.శీలాభాను, జె.మణికంఠ పాల్గొన్నారు.

విజేతలతో ప్రిన్సిపల్ టి.దివాకర్

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

### అఖిల్ జూనియర్ కళాశాలలో..

సాంబమూర్తినగర్ (కాకినాడ): కాకినాడ శాంతినగర్‌లోని అఖిల్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం కళాశాలస్థాయి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. క్విజ్, జనరల్ నాలెడ్జ్‌పై నిర్వహించిన పోటీలో మహమ్మద్ ఫైజ్ ప్రథమ, టి.శరత్‌సంతోష్ ద్వితీయ, సిచ్.వినయ్ తృతీయ బహుమతి సాధించారు. కళాశాల డైరెక్టర్లు ఎ.సూర్యనారాయణ, ఎ.గంగాధర్ సత్యప్రసాద్, ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది రమాదేవి, పుష్ప, భార్గవి పాల్గొన్నారు.

విజేతలతో డైరెక్టర్ ఎ.గంగాధర్ సత్యప్రసాద్

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

## ఈ బోటు ఎవరిదో?

తీరంలో నిలిచిన బోటు ఇదే

నక్కపల్లి, న్యూస్‌టుడే: సముద్రంలో చేపల వేట సాగించే భారీ బోటు ఒకటి అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట తీరానికి సోమవారం కొట్టుకొచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హార్బర్ పరిధిలో వేట సాగించే దాదాపు పది టన్నుల బరువు గల పెద్ద బోటు ఒడ్డుకు 100 మీటర్ల దూరంలో ఇసుకలో కూరుకుపోయి నిలిచిపోయింది. స్థానికులు పలువురు పడవలోకి వెళ్లి పరిశీలించారు. ఇందులో కేవలం డీజిల్ క్యాన్లు మాత్రమే ఉన్నాయని, మత్స్యకారులు ఎవరూ లేరని గుర్తించారు. ముందుజాగ్రత్తగా పోలీసులు, మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. దానిపై ఉన్న రిజిస్ట్రేషన్ నంబరును బట్టి కాకినాడ ప్రాంతానికి చెందినదిగా ప్రాథమికంగా తేల్చారు. ఇక్కడకు ఎలా కొట్టుకు వచ్చిందో వివరాలు సేకరిస్తున్నారు.

## వంతెన.. ప్రమాదం అంచున

కాకినాడ వార్ఫ్‌రోడ్డులోని జగన్నాథపురం వైపు వెళ్లే వంతెన రెయిలింగ్ పూర్తిగా దెబ్బతింది. ఇరువైపులా గోడలు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. ఒక వైపు కొంతమేర గోడ లేకపోవడంతో రాకపోకల సమయంలో వాహనదారులు, పాదచారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

## అడ్డంగా పశువులు.. తప్పని వెతలు

కాకినాడ ఇంద్రపాలెం కూడలి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పశువులు తిష్ఠ వేశాయి. దీంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. అడ్డుగా ఉండటంతో పాటు వాహనదారులపై దాడి చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పశువులు సంచారం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, మసీదుసెంటర్

## కల్వర్టు.. ఇక్కట్లు

కాకినాడ శ్రీనగర్ ప్రధాన రహదారి కూడలి వద్ద కల్వర్టుపై స్లాబురాయి ఎగుడుదిగుడుగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం బారిన పడతామోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. స్థానికులు సూచిగా స్లాబురాయి కదలకుండా కర్రలను ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, మసీదుసెంటర్

## విద్యార్థులకు పోషకాల అల్పాహారం

నగరంలో అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్న 71 పాఠశాలలో చదువుతున్న సుమారు 16 వేల మంది విద్యార్థులకు ఉదయం పూట పోషకాలతో కూడిన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జేసీ అపూర్వ భరత్ విద్యార్థులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, ఫౌండేషన్ సభ్యులు వైకుంటేశ్వర దాసు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

## 31న హిందూ సమ్మేళనం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఈ నెల 31వ తేదీన బుధవారం భారీ ఎత్తున హిందూ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ నగరాధ్యక్షుడు ఆదిత్యశర్మ, హిందూ సమ్మేళన రమణయ్యపేట బస్తీ అధ్యక్షుడు బిఎస్.సీతాపతిరావు, శశికాంత్‌నగర్ బస్తీ అధ్యక్షుడు మండలిక వెంకటశాస్త్రి తెలిపారు. సోమవారం సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో జరిగిన సమావేశంలో వారు మట్లాడుతూ ఆర్టీవో కార్యాలయం రోడ్డులోని కోటయ్య కన్వెన్షన్‌లో జరిగే సమ్మేళనానికి ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ విజయాదిత్య, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు హాజరై ప్రసంగిస్తారన్నారు. నిర్వాహకులు ఆర్.వెంకటేశ్వరరావు, పి.నరేష్‌కుమార్, చోడిశెట్టి పద్దరాజు, టి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఐఎల్ఏ క్యాలెండర్ ఆవిష్కరణ

మసీదు సెంటర్ (కాకినాడ): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఏ) చేస్తున్న కృషి అభినందనీయమని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం ఐఎల్ఏ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐఎల్ఏ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్, బార్ అసోసియేషన్ కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు(చంటి), సీనియర్ న్యాయవాదులు జీవీ కృష్ణప్రకాష్, మూర్తి, ప్రసన్నకుమార్, యనమల రామం, వీరభద్రరావు, ఆల్తఫ్ అహ్మద్, ఐఎల్ఏ జిల్లా నాయకులు కోలా శ్రీహరి, జేవీ రమణ తదితరులున్నారు.

ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు

## బౌద్ధ ధర్మం ఆచరణీయం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: బౌద్ధ ధర్మం ఆచరణీయమని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం మాజీ ఉప కులపతి (వీసీ) డా.కె.బాబ్జి అన్నారు. స్థానిక ఎస్.అచ్చుతాపురం బుద్ధ విహార్‌లో సోమవారం బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) ఆధ్వర్యంలో 2026 బౌద్ధ దమ్మ క్యాలెండర్‌ను సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డా.భానుమతితో కలిసి బాబ్జి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బౌద్ధం మంచి జీవన విధానమని చెప్పారు. బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు గుత్తాల శ్రీరాములు, కార్యదర్శి ఎన్.పెద్దిరాజు, కోశాధికారి పంతగడ రాంప్రసాద్, డా.ఎం.పవన్‌కుమార్, అయితాబత్తుల రామేశ్వరరావు, పీవీ సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సారా కేసులో వ్యక్తికి ఏడాది జైలు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: సారా కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎ.నాగమల్లేశ్వరి సోమవారం తీర్పు వెలువరించారని కాకినాడ నార్త్ స్టేషన్ ఎక్సైజ్ సీఐ రామమోహనరావు తెలిపారు. కొత్త కాకినాడకి చెందిన కొనాడ ముత్యాలు 2020లో 20 లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేశారు. నిందితుడిపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటనపై ఒకటో పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. తాళ్లరేవు మండలం చొల్లంగిపేటకి చెందిన ఐ.లక్ష్మి, జ్యోతిబాబు దంపతులు తమ రెండేళ్ల కుమారుడు శామ్యూల్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కాకినాడ వచ్చారు. అనంతరం స్థానిక ఘాటీసెంటర్‌లో వెళ్తుండగా కారు ఢీకొంది. ముగ్గురూ గాయపడడంతో చికిత్సనిమిత్తం జీజీహెచ్‌లో చేర్చారు.

## సకాలంలో అర్జీలు పరిష్కరించాలి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను సంతృప్తికరంగా, సకాలంలో పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. జేసీతో పాటు ట్రైనీ కలెక్టర్ మనీషా, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో పి.త్రినాథ్, జీజీహెచ్ పరిపాలనాధికారి ఎన్.శ్రీధర్, డీఎంహెచ్ఓ డా.జె.నరసింహనాయక్, కాకినాడ డివిజన్ అభివృద్ధి అధికారి పి.వాసుదేవరావు తదితర అధికారులు పాల్గొన్నారు. వివిధ సమస్యలపై మొత్తం 400 అర్జీలు అందాయి.

### పీజీఆర్ఎస్‌కు 22 ఫిర్యాదులు

మసీదుసెంటర్(కాకినాడ): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి 22 మంది అర్జీలు ఇచ్చారు. వాటిపై ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడారు. సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి ఫిర్యాదు నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

## విద్యాభివృద్ధికి చేయూత

గాంధీనగర్, న్యూస్‌టుడే: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ అన్నారు. సోమవారం రోటరీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గోపీనాథ్ సొంత నిధులతో సమకూర్చిన కంప్యూటర్, ప్రింటర్లను కరపలోని జ్యోతిరావు పులె ఏపీ బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్‌కు క్లబ్ పూర్వపు గవర్నర్ డాక్టర్ ఎస్వీఎస్ రావు చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.వి.రామకృష్ణారావు, క్లబ్ కార్యదర్శి డాక్టర్ సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ్‌చక్రవర్తి, సభ్యులు పాల్గొన్నారు.

కంప్యూటర్ అందజేస్తున్న డాక్టర్ రావు, రోటరీ గోల్డ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ తదితరులు

## పైండా చలమయ్య సత్రం సభ్యుడి బాధ్యతల స్వీకరణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోని పైండా చలమయ్య సత్రం, శ్రీనివాస కల్యాణ మండపం ధర్మకర్తల మండలి సభ్యుడిగా పైండా వెంకటనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పైండా సత్రం ద్వారా విద్యార్థులకు ఉచిత భోజన సౌకర్యం తోపాటు, ఇతర సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరుస్తామన్నారు. ఈవో ఎస్.శ్రీదేవి, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు పైండా వెంకటేశ్వరరావు, పైండా శ్రీనివాస రామకృష్ణ, భాజపా రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.చెరియన్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు తరగతి గది నిర్మాణం పూర్తి చేయాలి

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: నగరంలోని గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా అభియాన్ నిధులతో చేపట్టిన అదనపు తరగతి గది నిర్మాణం పనులు ప్రారంభించి 5 సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు పూర్తి కాలేదని, వెంటనే నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని 41వ డివిజన్ భాజపా నాయకులు గోడి వెంకట్ కోరారు. దీనిపై సోమవారం పీజీఆర్ఎస్‌లో అధికారులకు అర్జీ సమర్పించారు. 1100 మంది చదువుతున్న ఈ పాఠశాలలో గదుల కొరత ఉందన్నారు.

## భూమార్పిడి విధానం విరమించుకోవాలి

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: సింహాచలం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం భూములు భూమార్పిడి విధానాన్ని ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు సోమవారం జేసీ అపూర్వ భరత్‌కు వినతి పత్రం అందజేశారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు రాజమహంతి రవిశంకర్ పట్నాయక్, గుండోజు ఉదయ భానోజీరావు అన్నారు.

## లయన్స్ క్లబ్‌ల సేవలు మరింత విస్తృతం చేయాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్‌ల సేవలు అన్ని వర్గాలకు అందేలా మరింత విస్తృతం చేయాలని లయన్స్‌క్లబ్ పూర్వపు జిల్లా గవర్నర్ బాదం బాలకృష్ణ, రీజనల్ ఛైర్మన్ దేవత పుత్రరావు పిలుపునిచ్చారు. సోమవారం సాంబమూర్తినగర్‌లోని ఫంక్షన్ హాల్లో లయన్స్ క్లబ్ రీజనల్ సదస్సును సత్యలక్ష్మీ మానసం పేరిట నిర్వహించారు. వారు మాట్లాడుతూ రీజనల్ పరిధిలోని అన్ని క్లబ్‌లు కలిసి శాశ్వత ప్రాజెక్టులు చేపట్టాలని సూచించారు. డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్లు చిట్నీడి శ్రీనివాసు, పెద్దిరెడ్డి ఉమామేశ్వరరావు, పాస్ట్ గవర్నర్ ఎం.విశ్వేశ్వరరావు, సదస్సు కమిటీ ఛైర్‌పర్సన్ ఎంవీఆర్ మోహన్‌కుమార్ సుబ్రహ్మణ్యం, రామలక్ష్మి, వెలగ సత్యదేవి, కొడాలి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అతిథులు

## ఎన్జీజీవో కార్యదర్శికి అభినందనలు

మూర్తిబాబును అభినందిస్తున్న జీజీహెచ్ సిబ్బంది

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పాలపర్తి మూర్తిబాబు ఇటీవల జరిగిన ఏపీఎన్జీజీవో ఎన్నికల్లో జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆసుపత్రి మినిస్టీరియల్ సిబ్బంది ఆయనను అభినందించారు. ఆఫీస్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, అకౌంటెంట్ సత్యనారాయణ రాజు, వై.సత్యనారాయణ, ఏసుబాబు, సాయి కిషర్, రాధదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ అల్లక మల్లిబాబు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు..
యక్కల సత్య ప్రసాద్ - శ్రీమతి వీరభారతి
హరిష్ - మిథిలేష్


(c) eenadu

# కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

## రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

పిఠాపురం: రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేయాలని తహసీల్దార్ గోపాలకృష్ణ సూచించారు. సోమవారం పిఠాపురం అంబేడ్కర్ భవన్‌లో పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. జాయింట్ ఎల్‌పీఎంలు, భూసర్వేల్లో తేడాలు వివిధం సరిచేయాలని సూచించారు. జనవరి 2 నుంచి జరిగే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ గురించి సూచనలిచ్చారు. తహసీల్దార్ రామ్‌కుమార్, ఆర్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ గురువులకు సత్కారం

పెదపూడి: ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని పెదపూడి ఎంపీపీ మెయిన్ పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులు రాజీ, పి.సత్యనారాయణ, కె.సాయిబాబు, ఆర్.విజయ్‌హార్ష్, ఎం.శ్రీనివాస్ వినీల్‌తో పాటు ఉద్యోగ విరమణ చేయనున్న ఎస్.వెంకటేశ్వర్లు, డి.సరళ, బి.విమల్యాల రాజేశ్‌లను సన్మానం చేశారు. ఎంఈవో-1, 2 విశ్వనాథం, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

పెదపూడిలో వేదికపై ఉపాధ్యాయులు

## రైతులకు యూరియా సక్రమంగా అందించండి

సర్పవరం: కాకినాడ గ్రామీణం తిమ్మాపురం రైతుసేవా కేంద్రంలో యూరియా రికార్డులు, నిల్వలను జాయింట్ కలెక్టర్ అపూర్వభరత్ సోమవారం పరిశీలించారు. ఏఈవో సత్యనారాయణను అడిగి నిల్వల వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. వెంట ఇతర అధికారులు ఉన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

సర్పవరం: కాకినాడ గ్రామీణం తిమ్మాపురంలో సోమవారం తెదేపా రాష్ట్ర కార్యదర్శి డా.వాసిరెడ్డి ఏసుదాసు ముద్రణ చేయించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ స్పీకర్ యనమల రామకృష్ణుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## మద్యంతో ఆహ్వానం వద్దు

పిఠాపురం: మద్యం తాగి యువత నూతన సంవత్సరానికి ఆహ్వానం పలకడం సరికాదని మద్యం, మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాట సంఘ జిల్లా నాయకుడు వేమగిరి తలుపులయ్య అన్నారు. సోమవారం గోకివాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. సూరిబాబు, ప్రేమలత, బేబీ తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ బైక్ ర్యాలీ

పెద్దాపురం: విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించనున్న అఖిల భారత మహాసభల విజయవంతం కోరుతూ సోమవారం పట్టణ సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు శ్రీనివాస్, సత్తిబాబు, రామారావు, రమణ, శ్రీను, సత్యనారాయణ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికీ..'గుర్తింపు'

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులు వీరు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నారు. పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులు అందించారు. రోజూ జరిగే ప్రార్థన కార్యక్రమంలో ఏకరూప దుస్తులు, ఐడీలు ధరించిన విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో మాదిరిగా కనిపిస్తున్నారు.

## బాలల ప్రతిభ.. బహుమాన ప్రభ

ప్రాజెక్టు ప్రదర్శనలో ఓబీఎస్ పాఠశాల విద్యార్థులు

పిఠాపురంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ ఆలోచనలతో ప్రతిభను సాధిస్తున్నారు. పోటీ పరీక్షల్లో సత్తా చాటుతూ బహుమతులు కైవసం చేసుకుంటున్నారు. వేదిక ఏదైనా ప్రత్యేకత చాటుతున్నారు. అటు చదువులో ముందు వరుసలో ఉంటూనే.. తమకు నచ్చిన రంగాల్లో రాణిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్న వారి చొరవకు పాఠశాల ఉపాధ్యాయులు కూడా తమ వంతు తోడ్పాటు అందిస్తున్నారు. మెలకువలు నేర్పుతూ విద్యార్థుల ప్రతిభను పదును పెడుతున్నారు. వారి విజయాల్లో పాలుపంచుకుంటున్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

### పర్యాటక ప్రగతికి బాట..

పిఠాపురంలోని ఓబీఎస్ మున్సిపల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక ప్రాజెక్టు తయారు చేసి జిల్లాలోనే ద్వితీయ స్థానంలో నిలిచి, రూ.3 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కోర్సుకు సంబంధించి ఏపీ టూరిజం శాఖ పోటీలు నిర్వహించింది. ఇందులో ఓబీఎస్ విద్యార్థులు టెంపుల్ సిటీగా పిఠాపురాన్ని వివిధంగా తయారు చేస్తే బాగుంటుందనే అంశంపై వివరించారు. ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పిఠాపురంలో రవాణా సౌకర్యాలు, లాడ్జీలు, ఇతర వ్యాపారాలు, రైళ్లు, బస్సుల సదుపాయం గురించి ప్రాజెక్టు తయారు చేసి పర్యాటక శాఖకు అందించారు. ప్రభుత్వ విభాగానికి పనికివచ్చే ప్రాజెక్టు అందించిన వీరిని అభినందిస్తూ.. జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ నగదు బహుమతి ఇచ్చారు.

### బహుముఖ ప్రజ్ఞా బాలిక..

మల్లాంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టి.లోహితసత్యశ్రీ వివిధ పోటీల్లో ప్రతిభ చాటుతోంది. జీవిత గ్రంథాలయ సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లాలో ద్వితీయ స్థానం, కబడ్డీ, షటిల్, చెస్ పోటీల్లోనూ రాణించింది. 2024 చెకుముకి సంబరాల్లో మండలంలో మొదటి బహుమతి, స్కూల్ లెవల్ హ్యాండ్ రైటింగ్‌లో ద్వితీయ స్థానం సాధించింది. ముఖ్యంగా 6, 7, 8 తరగతుల్లో ఏటా పర్సెంట్ మార్కులతో నగదు బహుమతి తీసుకుంది. సూరంపాలెం ఆదిత్య కళాశాలలో జరిగిన ఎన్‌సీసీ పోటీల్లో బెస్ట్ కేడెట్‌గా అవార్డు అందుకుంది. ఇటీవల విజయోత్సవాలు దిసోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

బెస్ట్ కేడెట్‌గా అవార్డు తీసుకుంటున్న లోహిత సత్యశ్రీ

## 31నే పింఛన్లు అందుకోండి

గొల్లప్రోలు: ప్రతి నెల ఒకటో తేదీన పంపిణీ చేసే పింఛన్లు ఈ సారి ఒకరోజు ముందుగానే అందించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 31న ఉదయం 6.30 గంటల నుంచి 2836 మందికి ఇవ్వనున్నారు. మండలంలో 7582 మందికి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సలాట్ రాజు తెలిపారు.

## పనులు నాసిరకమని ఫిర్యాదు

సామర్లకోట: పురపాలిక పరిధిలో 14వ వార్డు జగదీశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులు నాసిరకంగా ఉన్నాయని జనసేన నాయకులు పురపాలిక కమిషనర్ శ్రీవిద్యకు సోమవారం ఫిర్యాదు చేశారు. గతంలో శిథిలమైన ఇటీవల గుత్తేదారు పనులు ప్రారంభించారు, నాణ్యతాలోపంతో నిర్మించడం వల్ల వాహనాల రాకపోకలకు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. కమిషనర్ స్పందిస్తూ.. నాణ్యతను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులు అయ్యప్ప, పవన్‌కుమార్, వీరబాబు, దుర్గాప్రసాద్‌లకు చెప్పారు.

## ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోండి

సర్పవరం: రమణయ్యపేట కార్పొరేషన్ హైస్కూల్‌లో సోమవారం కాకినాడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్-2 సీఐ రామారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వాడకం, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ క్రైం, టోల్‌ఫ్రీ నంబర్ 112 తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎస్సై వెంకటరత్నం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ రామారావు

## అమ్మవారికి బంగారు ఆభరణాలు

పెద్దాపురం: పెద్దాపురం పట్టణానికి చెందిన పడాల రామలక్ష్మి, లింగం నాగమణి మరిడమ్మకు సోమవారం బంగారు నత్తు, అడ్డపూస కానుకగా సమర్పించారు. వేద పండితులు వారిని సత్కరించి తీర్థప్రసాదం అందించారు.

## మహాసభలు విజయవంతం చేయాలి

సర్పవరం: కాకినాడ గ్రామీణ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సీఐటీయూ నాయకులు ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరిగే అఖిల భారత మహాసభల విజయవంతానికి ప్రచారం చేశారు. అజయ్‌కుమార్, రాజా, నాగేశ్వరరావు, సూర్యం పాల్గొన్నారు.

## ఆ గుత్తేదార్లను నిషేధిత జాబితాలో పెట్టండి

పెద్దాపురం: వార్డుల్లో నిర్మాణ పనులు ప్రారంభించని గుత్తేదార్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని కౌన్సిలర్ యర్రా శ్రీను పట్టుపట్టారు. సోమవారం ఛైర్‌పర్సన్ తులసీ మంగతాయారు ఆధ్వర్యంలో జరిగిన పురపాలిక కౌన్సిల్ సమావేశంలో సభ్యులు మాట్లాడారు. కౌన్సిలర్ పప్పల దుర్గారావు కూడా ఇదే అంశం ప్రస్తావించగా.. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటామన్నారు. ఆరేళ్ల రాఘవులు మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో ఒప్పంద కార్మికుడి చేతుల్లో పారిశుద్ధ్య సామగ్రి ఉండటమేంటన్నారు. విజ్జపు రాజశేఖర్ వాణిజ్య సముదాయం ద్వారా ఆదాయం వచ్చేలా అద్దెలు నిర్ణయించాలన్నారు. రూ.2.91 కోట్లతో మిగులు బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఉపాధ్యక్షుడు సాయిప్రసాద్, కౌన్సిల్, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యుడు యర్రా శ్రీను

## వైకుంఠ ద్వార దర్శనభాగ్యం నేడు

పిఠాపురం: పిఠాపురంలో వైకుంఠ(ముక్కోటి) ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు సిద్ధం చేశారు. కుంతీమాధవస్వామి, వేణుగోపాలస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనం నేటి తెల్లవారుజాము నుంచే కల్పించారు. ✦ కరప: కరప, వేళంగి, యండమూరు, పెనుగుదురు, గురజనాపల్లి, కూరాడ, కొంగోడు, వాకాడ, చినమామిడాడ తదితర గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో ఏర్పాట్లు జరిగాయి. ✦ గొల్లప్రోలు: గొల్లప్రోలులోని సీతారామస్వామివారి దేవస్థానం(విష్ణాలయం)లో మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తామని పేర్కొన్నారు. ✦ పెద్దాపురం: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం బయట విద్యుద్దీపాలతో అలంకరించారు. అంతరాలయంలో పువ్వులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. మంగళవారం దర్శనంకోసం వచ్చే భక్తులకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కరప: వేళంగిలోని ఏడడుగుల వెంకన్న ఆలయంలో అలంకరణ

## కంచిరాజు సేవలు మరువలేనివి

కరప: తెదేపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, కరప మాజీ సర్పంచి చాగంటి సత్యవరద కంచిరాజు వర్ధంతిని సోమవారం వీఆర్వోల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చాగంటి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామస్థులతోపాటు తెదేపా కాకినాడ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవు వెంకటేశ్వరరావు నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు కంచిరాజు అందించిన సేవలు మరువలేనివన్నారు. నారాయణప్రసాద్, శ్రీనివాస్, ఈశ్వరరావు, నాగు, తాతారావు, సత్యారావు పాల్గొన్నారు.

### తేటగుండా నీరు.. తేదీ ఎవరేసేరు..?

మంచినీటి ట్యాంకును ప్రతి పదిహేను రోజులకోసారి శుభ్రపరచడంతోపాటు వాటి వివరాలు నమోదు చేయాల్సిఉండగా చాలా గ్రామాల్లో పాటించడం లేదు. పెద్దాపురప్పాడులో మంచినీటి ట్యాంకు వద్ద శుభ్రపరిచే వేళల వివరాల్లేకపోవడంపై గ్రామస్థులు విమర్శిస్తున్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావును అడగ్గా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

### బీటలొచ్చిన భవనం.. భయంగొల్పే వనం..

గొల్లప్రోలులోని పాత ఆంధ్రాబ్యాంకు వీధిలో కనిపిస్తున్న దీనిని వేలాడే ఉద్యాన వనం అనుకుంటున్నారా.. కానేకాదు. శిథిల భవనంపై పెరిగిన చెట్లు ఇవి. బీటల్లో పిచ్చి మొక్కలు పెరిగి ఇలా తయారైంది. దీనిని తొలగించక సమీప నివాసితులు భయాందోళన చెందుతున్నారు. యజమానులకు నోటీసులిచ్చామని టీపీవో నీలిమాదీప్తి తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

### చెత్తతో వెత.. చెరువు పూడ్చివేత..!

గొల్లప్రోలు మండలం తాటిపర్తి శివారు కోదండరామ చెరువు గర్భాన్ని చెత్తతో పూడ్చేస్తున్నారు. వీధులను శుభ్రపరచగా వచ్చిన వ్యర్థాలన్నింటినీ తెచ్చి ఇక్కడే పడేస్తున్నారు. చెత్తతో ఈ ప్రాంతం దుర్వాసనకు నిలయంగా మారింది. ఈ సమస్య గురించి డిప్యూటీ ఎంపీడీవో కుమార్‌ను అడగ్గా సిబ్బందిని పంపంచిన అక్కడ వెంటనే చర్యలు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

### కత్తిపెట్టి కోసినట్లు.. కష్టంగా దారి ఇట్లు!

పిఠాపురం మండలం జములపల్లిలో ర.భ.శాఖ దారి కోతకుగురై ప్రమాదకరంగా మారింది. వరదలకు పక్కనే ఉన్న కాలువలో నీరంతా పొంగి ప్రవహించింది. ఆ సమయంలో రోడ్డు పక్కన బెర్మ్ అంతా కొట్టుకుపోయి ఇలా మిగిలింది. ఎదురెదురు వాహనాలు తప్పుకొనే క్రమంలో పడిపోతున్నాయి. ఏఈ లోవరాజు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

### ఇలా వెళ్తారేం భయ్యా.. ఇబ్బందే కదయ్యా..

తాళ్లరేవు మండలం పి.మల్లవరం పరిధిలో జాతీయ రహదారిపై సోమవారం కనిపించిన చిత్రమిది. వ్యానులో కిక్కిరిసి ప్రమాదకర పరిస్థితిలో కొందరు ప్రయాణించారు. పి.మల్లవరం చెక్ పోస్టు కూడలిలో పోలీసులు ఆపి డ్రైవర్‌ను మందలించి విడిచిపెట్టారు. ఇకపై ఇలా ఎవరూ నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకోవాలని వీరిని చూసిన వారు అనుకున్నారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

## వాహన తనిఖీలు ముమ్మరం

తాళ్లరేవు: పి.మల్లవరం చెక్ పోస్టు వద్ద యానాం నుంచి తాళ్లరేవు వైపు వెళ్లే వాహనాల తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. యానాం నుంచి మద్యం తరలించే అవకాశం ఉండటంతో ప్రతి వాహనంపై పోలీసులు దృష్టి సారించారు. సోమవారం యానాం నుంచి కాకినాడ వెళ్లే వాహనాలను తనిఖీ చేశామని కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు.

## సారా కేసులో ఒకరికి జైలు

సర్పవరం: కొత్త కాకినాడకు చెందిన ముత్యాలను సారా కేసులో కోర్టులో సోమవారం ప్రవేశపెట్టగా న్యాయమూర్తి నాగమల్లీశ్వరి ఏడాది జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధించారని ఎక్సైజ్ సీఐ రామ్మోహన్‌రావు తెలిపారు.

## అపరిచితులు కనిపిస్తే చెప్పండి

గొల్లప్రోలు: అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ కోరారు. గొల్లప్రోలు రాయవరం రోడ్డులోని మార్కెట్ కూడలిలో సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. చోరీలు జరక్కుండా చర్యలు చేపట్టేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కోడిపందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే, పాల్గొనేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామన్నారు. అడిషనల్ ఎస్సై లక్షణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## హిందువుల ఐక్యతే బలం

తాళ్లరేవు: సనాతన ధర్మం, సంస్కృతి కుటుంబ వ్యవస్థను కాపాడుకుంటూ హిందువుల ఐక్యతే లక్ష్యమని ముఖ్య వక్తలు సంగాడి పూసలయ్య, కనికెళ్ల సత్య కుమార్ అన్నారు. తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో ధర్మశాస్తా ఆయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో యానాం సంఘం మండలం ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం బహిరంగ సభకు యానాం వర్తక సంఘం అధ్యక్షుడు నల్ల వెంకన్న అధ్యక్షతన సోమవారం జరిగింది. విశ్వహిందూ పరిషత్ ఆంధ్ర, తెలంగాణ సమన్వయకర్త కనికెళ్ల సత్య కుమార్, గాడిమొగ హరే కృష్ణ సత్సంగ కేంద్రం, రాధాకృష్ణ మందిరం అధ్యక్షుడు సంగాడి పూసలయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థినుల భరత నాట్యం ఆకట్టుకుంది. హిందూ సమ్మేళనం గౌరవాధ్యక్షుడు మోపూరి శ్రీనివాస్ కిరణ్, సర్పంచి టిళ్లపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న సంగాడి పూసలయ్య, కనికెళ్ల సత్యకుమార్

## వాడపల్లి పాలకమండలి సభ్యుడిగా శ్రీనివాస్‌యాదవ్

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలక మండలి సభ్యుడిగా పెద్దాపురానికి చెందిన కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

ఫోన్ చేయండి: కాకినాడ గ్రామీణం: 80085 74325
ఉ॥ 10 - మ॥ 1 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: గొల్లప్రోలు మార్కండేయపురం శివారు వ్యర్థాలతో కాలువ పూడుకుపోయి మురుగు నిలిచి వాసనొస్తోంది. - స్థానికులు
పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో వ్యర్థాలు తొలగింపజేశారు.
– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: పిఠాపురంలోని డ్రైవర్స్ కాలనీలో చెత్తకుప్పలు పేరుకుపోయి, వీధులు అధ్వానంగా ఉన్నాయి. - జయరాజ్
పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా వీధుల్లోకి కార్మికులను పంపించి శుభ్రం చేశారు.
– న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: వాకతిప్ప గ్రామం ప్రధాన రహదారి వెంట కాలువ పూడికతో మూసుకుపోయింది. - స్థానికులు
పరిష్కారం: ఎంపీడీవో లక్ష్మిరెడ్డి పారిశుద్ధ్య సిబ్బందితో పూడికతీత చేపట్టారు.
– న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: సర్పవరం గాంధీనగర్‌లోని మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. - ప్రకాశరావు
పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కి చెప్పగా సిబ్బందితో శుభ్రం చేయించారు.
– న్యూస్‌టుడే, సర్పవరం

సమస్య: కూరాడలో పందులను గ్రామంలోకి వదిలేస్తుండటంతో పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. - వెంకటేశ్వరరావు
పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌కు చెప్పగా వాటి యజమానులకు అవగాహన కల్పించారు.
– న్యూస్‌టుడే, కరప

సమస్య: స్థానిక పాతపెద్దాపురం రహదారిపై చెత్తపోగులున్నాయి. తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. - శ్రీనివాసరావు
పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులతో శుభ్రం చేయించారు.
– న్యూస్‌టుడే, పెద్దాపురం

## సందడిగా ముగ్గుల పోటీలు

పెదపూడి: సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పండగలను సరదాగా జరుపుకోవాలని పెదపూడి ఎస్సై ఎస్.తులసిరామ్ అన్నారు. సోమవారం పెదపూడిలో డా.బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. సర్పంచి కలవల కృష్ణమూర్తి, ఎంపీటీసీ వల్లూరి మరియ్యమ్మ, చందవోలు కృష్ణ పాల్గొన్నారు.

## బుద్ధిస్ట్ సొసైటీ కాలమానిని..

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీ పరిధిలోని జైభీమ్‌పేటలో త్రిరత్నబౌద్ధ ధమ్మ సంఘం మండల అధ్యక్షుడు జక్కల ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. వుంగరాల వెంకటేశ్వరరావు, టేకుమూడి ఈశ్వరరావు, గుత్తాల సుబ్రహ్మణ్యం, పినిపే నాగేంద్ర, కన్నీడి వెంకటరమణ పాల్గొన్నారు.

## నూరు శాతం ఉత్తీర్ణతకు వంద రోజుల ప్రణాళిక

కాజులూరు: పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ప్రస్తుత వంద రోజులు కీలకమైన కాలమని, ఉత్తీర్ణత శాతం పెంపునకు సమర్థవంతమైన ప్రణాళిక అవసరమని దత్తత అధికారి ఎంపీడీవో జె.రాంబాబు చెప్పారు. సోమవారం కుయ్యేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చేబ్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో త్రీఫేజ్ విద్యుత్తు పనులు చేస్తున్నామని ఈఈ ప్రభాకర్ సోమవారం తెలిపారు. దాంతో వన్నెపూడి, కొడవలి గ్రామాలకు మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని, సహకరించాలని కోరారు.

## భక్తులకు అన్నదానం

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం దగ్గర సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. స్వామివారి వార్షిక మహోత్సవాల ముగింపు సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. గొల్లప్రోలు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వచ్చి భోజనాలు చేశారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ప్రకృతి వ్యవసాయం మేలు

గొల్లప్రోలు: ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని దుర్గాడలోని గోగాయత్రి కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్ సిబ్బందికి శిక్షణనిచ్చారు. కోడిగుడ్లు, నిమ్మరసంతో ద్రావణం తయారీని ప్రత్యక్షంగా వివరించారు. వ్యవసాయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీజీఆర్‌ఎస్‌కు 47 అర్జీలు

పిఠాపురం: పిఠాపురం పాడా కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో అధికారులు 47 అర్జీలు స్వీకరించారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పురపాలిక ఇన్‌ఛార్జి కమిషనర్ రాజు ఆధ్వర్యంలో పీజీఆర్‌ఎస్ జరిగింది.

## విత్తన నిల్వ - శుద్ధీకరణకు వీలేదీ..?

కరప, న్యూస్‌టుడే: వ్యవసాయంలో ముఖ్యమైంది నాణ్యమైన విత్తనం. మనం పండించుకునే పంట నుంచే విత్తన సేకరణ చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో కరప శివారు పేపకాయలపాలెంలో విత్తన నిల్వ, శుద్ధీకరణ గోదాము నిర్మాణం చేపట్టారు. ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోక అలంకారప్రాయంగా మారింది. జిల్లాకు విత్తనశుద్ధి నిల్వ కేంద్రం తీసుకొచ్చారని సంతోషించిన రైతులు ఏళ్లు గడుస్తున్నా.. అది ప్రారంభానికి నోచుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే రైతే విత్తనం తయారు చేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఎవరైనా విత్తనాన్ని పండించుకోవాలనే రైతులు ముందుగా వ్యవసాయ కార్యాలయాల వద్ద సీడ్ ఫార్మర్‌గా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తారు. భారత ప్రభుత్వం నుంచి తీసుకొచ్చిన నిధులతో చేపట్టిన ఈ గోదాము ప్రస్తుతం ప్రారంభానికి నోచుకోకపోవటంపై రైతులు విమర్శిస్తున్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక విత్తన నిల్వ, శుద్ధీకరణ గోదాము నిర్మాణం చేపట్టగా కరప శివారు పేపకాయలపాలెంలో ఒక దానికి పనులు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో రూ.2.40 కోట్లు వెచ్చించి కరప, ముమ్మిడివరం, రాజానగరం, రంపచోడవరంలలో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మించేందుకు అప్పటి వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేయించగా 2021 జూన్‌లో కరప శివారు పేపకాయలపాలెంలో ఈ గోదాము నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం గోదాము నిర్మాణం చేపట్టి వదిలేశారు. వ్యవసాయాన్ని పండగ చేస్తామని గొప్పలు చెప్పడం తప్ప.. వైకాపా తమకు చేసిందేమీ లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాస్‌ను అడగ్గా ఉన్నతాధికారులకు వివరించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

కరపలో అలంకారప్రాయంగా గోదాము

జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ అల్లక మల్లిబాబు గారికి
హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు..
యక్కల సత్య ప్రసాద్ - శ్రీమతి వీరభారతి
హరీష్ - మిథిలేష్


(c) eenadu

# తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ఈనాడు కథనానికి స్పందన

## పాఠశాల భవన పునర్నిర్మాణానికి నిధులొచ్చాయ్..!

ప్రత్తిపాడు: మండలంలోని ఉపప్రణాళిక మన్యం బురదకోట పంచాయతీలోని కొండపల్లితండాలో పాఠశాల భవన పునర్నిర్మాణానికి జిల్లా కలెక్టరు షాన్‌మోహన్ రూ.8.5 లక్షలు మంజూరు చేశారని ఎంపీడీవో ఎం.బీర్ కుమార్‌బాబు తెలిపారు. కొండపల్లిలోని పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు, 12 మంది విద్యార్థులు ఉన్నారు. భవనం శిథిలమవ్వడంతో రామాలయంలో తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలను వేరే చోటకు మార్చొద్దని పిల్లలు చదువుకు దూరమవుతారు. ఈ సమస్యపై 'నమ్మండి.. ఇది బడి' శీర్షికన ఈనాడులో నవంబరు 11న కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో కలెక్టరుకు నివేదించగా సీఎస్ఆర్ నిధులు కేటాయించారు. వచ్చే విద్యాసంవత్సరానికి భవనం అందుబాటులోకి వస్తుందని ఎంపీడీవో తెలిపారు.

## అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చర్యలు

జగ్గంపేట గ్రామీణం: ప్రైవేటు డీలర్లు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎన్.విజయకుమార్ హెచ్చరించారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం డీలర్లు, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. జడ్.రాగంపేట సొసైటీ అధ్యక్షుడు కొండయ్య చౌదరి, అధికారులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి విశాఖలో మహాసభలు

తుని: విశాఖలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రచార జీపుజాత పట్టణంలోని గొల్లప్పారావు సెంటర్‌కు చేరింది. నాయకులు నక్కెళ్ల శ్రీనివాస్, వీరబాబు, అప్పారావు, కృష్ణ, రాజా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ భువనసుందరి(అంతర చిత్రం), హాజరైన కౌన్సిలర్లు

## పట్టణాభివృద్ధికి ప్రణాళిక

● రూ.20.33 కోట్ల బడ్జెట్‌కు సమావేశం ఆమోదం

తుని, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో ప్రజల సమస్యలు పరిష్కరించి, పూర్తిస్థాయిలో పట్టణాభివృద్ధికి పురపాలక అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళిక వేశారు. కార్యాలయంలో ఛైర్‌పర్సన్ నార్ల భువనసుందరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.20.33 కోట్లతో బడ్జెట్ రూపొందించారు. బడ్జెట్‌లో ప్రారంభ నిల్వ రూ.2.97 కోట్లు కాగా, పన్నులు, అద్దెలు, ప్రభుత్వ గ్రాంట్లు వంటివి మొత్తం రూ.17.36 కోట్లు వరకు ఆదాయం సమకూరుతుందని లెక్కకట్టి, మొత్తం రూ.20.33 కోట్లుగా చూపారు. దీని నుంచి ఆయా చెల్లింపులు, అభివృద్ధి పనులకు వ్యయం పోగా రూ.59.01 లక్షలు ముగింపు నిల్వగా చూపారు. దీనిని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం అజెండాలోని 38 అంశాలపై చర్చించి ఆయా వార్డుల్లో రోడ్లు, కాలువలు వంటివి నిర్మించడానికి నిధులు కేటాయిస్తూ తీర్మానాలు చేశారు. శూన్య గంటలో పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలు ప్రస్తావించారు. సభ ప్రారంభానికి ముందు ఇటీవల మృతి చెందిన మాజీ ఛైర్‌పర్సన్ బొండా రత్నావతికి నివాళి అర్పిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. సమావేశంలో కమిషనర్ ఎ.వెంకట్రావు, డీఈ సీహెచ్ నాగసతీష్, వైస్ ఛైర్మన్ ఆచంట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తడబడినా ముందడుగే..!

● ఏడాదిలో ప్రత్తిపాడు నియోజకవర్గం

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు, ఏలేశ్వరం

సమస్యలు తరుముతున్నా నియోజకవర్గ అభివృద్ధి 2025 దోహదపడింది. మౌలిక వసతులను మెరుగుపరిచింది. ఉపప్రణాళిక మన్యం అవసరాల వైపు చూసింది. గతేడాదితో పోలిస్తే బడ్జెట్ కేటాయింపులతో జరుగుతున్న పనుల విషయంలో తడబడినా వేగం పెరిగింది. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ముందడుగు వేసింది. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో ఏళ్ల తరబడి నిర్మిస్తున్న రహదారి పనులకు 30 కి.మీ. రోడ్లకు మరమ్మతులు పట్టడంతో 40కిపైగా గ్రామాల ప్రజలు సౌకర్యం పొందుతున్నారు. ఇందులో ఉత్తర కంచి-పెద్దిపాలెం రోడ్డు ఉంది. రూ.80 కోట్లు దారుల కోసం వెచ్చిస్తున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, అనుసంధాన దారులు బాగుపడుతున్నాయి. బురదకోట, వేళంగి తదితర 18 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగవుతోంది. ఉప ప్రణాళికా మణ్యంలోని గ్రామాల్లో ఎన్నో ప్రసవాలు జరిగేలా జాప్యం లేకుండా చేశారు. పెదమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక మండలం చేయాలనే డిమాండ్ కొత్త ఏడాదికి మిగిలింది.

### చీకట్లు తొలగేలా..

శంఖవరంలో విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణం ఏళ్ల తరబడి ఊరించి ఈ ఏడాది సాకారమైంది. 15 గ్రామాల చీకట్లు తొలగేందుకు సుమారు రూ.3 కోట్లతో పనులు జరుగుతున్నాయి. గాలివీస్తే చీకటి అలుముకునే గ్రామాల ప్రజలకు సబ్‌స్టేషన్‌తో కష్టాలు తొలగుతాయి. క్షేత్ర స్థాయిలో సిబ్బంది కొరత, సేవల లోపాలు మెరుగుపడాలి.

### సాగు సానుకూలం..

ఖరీఫ్ చివరిలో వాతావరణం సతాయించినా ఏలేరు, సుబ్బారెడ్డిసాగర్, పుష్కర కింద 9583 హెక్టార్లలో 52875 మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. కాలువలు బాగుచేతకు కూటమి ప్రభుత్వంలో నిధులు ఇవ్వడం మేలు అయింది. ఏలేరు ద్వారా రబీ సాగు జోరందుకుంది. శంఖవరంలోని పెదవాసన్నదొర చెరువు అభివృద్ధి, కొడవలి వద్ద పుష్కర లిఫ్ట్ తదితర పనులతో వెలితి ఉన్నా సాగు సానుకూలంగానే సాగింది.

ప్రత్తిపాడు-టి.రాయవరం మధ్య రోడ్డు పనులు

### ఇదో వెలితి..

ప్రత్తిపాడు సీహెచ్‌సీ 50 పడకల ఆసుపత్రిగా స్థాయిపెంచి రూ.8 కోట్లతో నిర్మిస్తున్న భవనం ఏళ్లు గడుస్తున్నాయి కానీ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఏలేశ్వరంలో సీహెచ్‌సీ భవనం కొత్తది కట్టినా వినియోగంలోకి రాలేదు. అప్పనపాలెం వంతెన, రమణయ్యపేట రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది.

## వేడుకల పేరుతో అతి వద్దు

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు, ఏలేశ్వరం

కొత్త సంవత్సరం రాక అందరిలోనూ ఉత్సాహం.. ఎవరి సందడి వారిదే. 365 రోజులు విజయవంతంగా నడవడానికి ఒక్క రోజు వేడుక అవరోధం కాకూడదని ముఖ్యంగా యువత ఇందుకు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు స్పష్టం చేశారు. ఆంగ్ల సంవత్సరాది వేళ యువతకు 'న్యూస్‌టుడే'తో ముఖాముఖిలో పలు సూచనలు చేశారు.

### మత్తు వద్దు బ్రో!

వేడుక పేరున మద్యం జోలికెళ్లొద్దు. కీలకమైన ప్రదేశాలు, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో పోలీసుల గస్తీ ఉంటుంది. రోడ్లపైనా, హైవేల వెంబడి వాహనాలపై పార్టీలు చేసుకుంటే జైలుకెళ్లక తప్పదు.

### డ్రోన్లతో నిఘా

సున్నిత ప్రదేశాలు, జనసమ్మర్ధ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సర్కిల్ పరిధిలో డ్రోన్ల నిఘా ఉంటుంది. రాకపోకలకు అంతరాయం కలిగించేలా ఉత్సాహం ప్రదర్శించొద్దు. నడిరోడ్లపై సంబరాలొద్దు.

### 'వేగం' వెర్రి వద్దు..

వాహనాలపై కుర్రాళ్లు హల్‌చల్ చేయొద్దు. పోటీపడి హైవేలపై వెళ్లొద్దు. రాత్రి 11 గంటలు దాటాక రోడ్లపై కనిపిస్తే స్టేషన్లో కూర్చోపెడతాం. బైకులకు సైలెన్సర్లు తీసి నడిపితే పెద్దమొత్తంలో అపరాధ రుసుముతో పాటు లైసెన్సులు రద్దు చేయిస్తాం.

### ఫ్లెక్సీల చిక్కులెందుకు..

అభిమాన నాయకులకో, సెలబ్రిటీలకో ఫ్లెక్సీలు ఏర్పాటు, వాటికోసం ఘర్షణకు దిగడం సరికాదు. రహదారులు మూసి ఏ చర్యలకు పాల్పడొద్దు. వాటి బదులుగా తోచిన సేవనో, నలుగురు మెచ్చే పనినో, గ్రామాభివృద్ధి కార్యక్రమాన్నో ఎంచుకోవాలి.

యువకులతో మాట్లాడుతున్న సూర్యఅప్పారావు

### తల్లిదండ్రులూ..

పిల్లలపై నిఘా ఉంచండి. పార్టీకి వెళ్తున్నామంటే ఆరా తీయండి. రాత్రి వేళ గడప దాటనీయొద్దు. బైకులు, కార్లు ఇచ్చి పంపడం సరికాదు. పిల్లల ఆనందం కోసం ఏదైనా చేద్దామనే ధోరణి ఉండకూడదు.

## మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 9866962946 జగ్గంపేట: 8008622066 ఉ॥ 10 - మ॥ 1

### స్లాబు రాళ్లను అమర్చాలి.

ఏలేశ్వరం, న్యూస్‌టుడే :

**సమస్య :** మండలంలోని సిరిపురంలో ఎస్సీ కాలనీలో కాలువలపై స్లాబు రాళ్లు లేవు. ప్రమాదాలు జరుగుతున్నాయి. సిమెంటు దిమ్మెలు ఏర్పాటుచేయాలి. – **కిషోర్, చిన్నింపేట.**

**సమాధానం :** సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. పంచాయతీకి తక్షణం ఆదేశాలిస్తాను. – **రామరాజు వర్మ, డిప్యూటీ ఎంపీడీవో, ఏలేశ్వరం.**

## పనుల వేగం పెంచండి

తుని, న్యూస్‌టుడే: ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న ఆయా అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని పురపాలక ఛైర్‌పర్సన్ నార్ల భువనసుందరి అధికారులను ఆదేశించారు. ఇసకలపేటలో రూ.70 లక్షలు, 8వ వార్డులో రూ.10 లక్షలతో శ్మశానవాటికల్లో జరుగుతున్న పనులను ఆమె కౌన్సిల్ సభ్యులతో కలిసి పరిశీలించారు.

## ప్రతిభ చూపి.. విజేతలుగా నిలిచి..

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ (క్విజ్) పోటీలు సోమవారం జరిగాయి. 'కరెంటు అఫైర్స్, జనరల్ నాలెడ్జ్' అంశాల్లో ఉన్న ప్రశ్నలకు విద్యార్థినులు సమాధానాలు రాశారు. న్యాయ నిర్ణేతలుగా పాఠశాల ఉపాధ్యాయులే వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో లోకవరపు సాయిశ్రీ (ప్రథమ), ఎస్.బిందు (ద్వితీయ), ఎం.మేఘన వసుంధర (తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఈనాడు సమకూర్చిన బహుమతులు, ప్రశంసాపత్రాలను హెచ్‌ఎం జి.జయంతి, ఉపాధ్యాయులు ఎన్ఎస్ ఆర్ఎంటి గిరి, డీవీఎల్ఎన్ ప్రసాద్, పీఎస్ఎస్ శివకుమార్, పైల అప్పలనాయుడు అందజేశారు.

జడ్పీహెచ్ఎస్‌లో సమాధానాలు రాస్తున్న విద్యార్థినులు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

భాష్యం పాఠశాలలో విద్యార్థులు

● పట్టణంలోని భాష్యం ఇంగ్లిష్ మీడియం స్కూల్లో జరిగిన పోటీల్లో ఎం.సాయి రుత్విక్, పి.చైతన్య, ఎ.లవ శ్రీకుమార్ వరుసగా మూడు స్థానాలు సాధించారు. వీరికి ప్రిన్సిపల్ ఆర్ఎస్ఎస్ రంగబాబు, వైస్ ప్రిన్సిపల్ ఎం.అశోక్, ఛాంప్ ప్రిన్సిపల్ ఎం.శ్రీలక్ష్మీ, ఉపాధ్యాయుడు ఎన్.ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందించిన ప్రిన్సిపల్ తదితరులు

## అవీ ఇవీ అన్నీ

### నూతన సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు

తుని గ్రామీణం: గెడ్లబీడు సాయి వేదికలో నూతన సంవత్సర వేడుకలకు తెదేపా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చింతంనీడి నాగసోమరాజ ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లను పార్టీ నాయకులు పరిశీలించారు.

### పోలీసుల ఆకస్మిక తనిఖీలు

తుని పట్టణం: పట్టణంలోని లాడ్జీల్లో పోలీసులు తనిఖీలు చేశారు. అనుమానిత వ్యక్తుల వివరాలు వేలిముద్రలు గుర్తించే యంత్రంతో పరిశీలించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు లగేజీని ముమ్మరంగా తనిఖీలు చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ ఎం.గీతారామకృష్ణ హెచ్చరించారు.

### లియోక్లబ్‌కు ఉత్తమ అవార్డు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలోని లియోక్లబ్‌కు బెస్ట్‌క్లబ్ అవార్డు లభించిందని డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలతో పాటు, గ్రామీణాభివృద్ధిపై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన అవార్డు లభించిందన్నారు.

### పేదల ఆకలితీరుస్తున్న అన్నక్యాంటీన్

జగ్గంపేట గ్రామీణం: పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లు ఉపయోగపడుతున్నాయని తెదేపా మండల పార్టీ అధ్యక్షులు జీను మణిబాబు అన్నారు. జగ్గంపేటలో అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డించారు. రాజపూడికి చెందిన జామి రాంబాబు(లేటు)జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు సహాయం అందజేశారు.

### ఉచిత ట్యూషన్ కేంద్రం ప్రారంభం

రౌతులపూడి: పారుపాకలో శ్రీసాయి అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ట్యూషన్ కేంద్రాన్ని హెచ్‌ఎం వెంకటశివగిరి, వరహాలబాబు, నాయకులు తిరుమల దొర ప్రారంభించారు.

### విద్యార్థులకు చట్టాలపై అవగాహన

కోటనందూరు: భీమవరపుకోటలోని జడ్పీఉన్నత పాఠశాలలో ఎస్సై టి.రామకృష్ణ విద్యార్థులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం తదితరాలపై సోమవారం అవగాహన కల్పించారు.

## కార్మికులకు భద్రత కల్పించాలి

మాట్లాడుతున్న బొబ్బ రవీంద్ర

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారంలో తెలుగునాడు ట్రేడ్ యూనియన్ చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఈపీడీసీయల్ కార్యదర్శి బొబ్బ రవీంద్ర అన్నారు. బాలాజీ నగర్‌లో కోన సత్యనారాయణమూర్తి అధ్యక్షతన టీఎన్‌టీయూసీ అనుబంధ తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. రవీంద్ర మాట్లాడుతూ.. జగ్గంపేట డివిజన్‌లో సుమారు 100 మంది కార్మికులు 327, 1104 యూనియన్ నుంచి తెలుగునాడు యూనియన్‌లోకి చేరడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షులు ఎం.గణేష్, కార్యదర్శి ఆర్.సత్యనారాయణ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు భారతి వెంకటేశ్వర్లు, అడ్వయిజన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

**జగ్గంపేట డివిజన్ నూతన కార్యవర్గం:** గౌరవ అధ్యక్షుడు గాడి రామకృష్ణ, డివిజన్ అధ్యక్షుడిగా డి.శివప్రసాద్, కార్యదర్శి టి.రామకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.వెంకటరమణ, అదనపు కార్యదర్శి సీహెచ్.లక్ష్మణ్, కోశాధికారి కె.వీరబ్రహ్మంలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటుకు చర్యలు

బాలాజీ సెంటర్‌లో అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు

తుని పట్టణం, న్యూస్‌టుడే: రద్దీగా ఉన్న ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించడానికి పురపాలక అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా తాజాగా బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో బాలాజీ సెంటర్‌లో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటునకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో గొల్లప్పారావు సెంటర్‌లో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని భావించినా, వివిధ కారణాలతో సాధ్యం కాలేదు. అయితే రూ.22.28 లక్షల వ్యయంతో బాలాజీ సెంటర్‌లో సిగ్నల్స్ ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం పురపాలక సంఘం వాటా 10 శాతం రూ.2.22 లక్షలు సదరు గుత్తేదారు సంస్థకు చెల్లించడానికి కౌన్సిల్లో ఆమోదం తెలిపారు.

ఆధ్యాత్మికం

## రూ.17 లక్షలతో గోశాలలో షెడ్డు

షెడ్డు ఎదుట బీడీఎల్ ప్రతినిధులు, ఆలయ అధికారులు

అన్నవరం: అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొండ దిగువన గోశాలలో రూ.17 లక్షల వ్యయంతో నిర్మించిన పశువుల షెడ్డును సోమవారం బీడీఎల్ ఎండీ ఎ.మాధవరావు, దేవస్థానం అధికారులుప్రారంభించారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా దీన్ని నిర్మించారు.

### కోదండ రామునికి పాదుకలు

రౌతులపూడి: ములగపూడిలోని శ్రీరామగిరిపై గల కోదండరాముని ఆలయానికి పంచలోహాలతో తయారైన పాదుకలు అందించారు. సామర్లకోటకు చెందిన భక్తులు గిరి ప్రదక్షిణలో ఊరేగింపు నిమిత్తం వాటిని అందించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### పూలంగి సేవకు ఏర్పాట్లు

కిర్లంపూడి: చిల్లంగిలోని భూసమేత వెంకటేశ్వరస్వామి వారికి పూలంగి సేవకు ఆలయకమిటీ, స్థానిక భక్తులు ఆలంకరణ సేవలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆలయం ఉత్తరద్వారం స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

### వాసవీమాత ఆలయానికి విరాళం

కిర్లంపూడి: కిర్లంపూడిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి నిత్య ధూపదీప నైవేద్యాల కోసం విశ్రాంత ఉపాధ్యాయుడు తమ్మన వీరభద్రరావు రూ.లక్ష విరాళాన్ని ఆలయకమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు.

### ఐదడుగుల అగరబత్తి..!

కోటనందూరు: గోవింద గిరి ఆధ్యాత్మిక క్షేత్రంలో ఐదడుగుల అగరబత్తి సువాసనలు వెదజల్లనుంది. ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. అంబికా దర్బారు అగరబత్తి సంస్థ ఆలయానికి ఐదడుగుల ఎత్తు ఉన్న రెండు అగరబత్తీలను సమకూర్చారని ఈ సందర్భంగ ధర్మకర్త గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు తెలిపారు.

అగరబత్తీలను చూపుతున్న ధర్మకర్త గోపాలకృష్ణ, భక్తులు

### బాణసంచా సామగ్రి స్వాధీనం

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉప్పరిగూడెంలో అక్రమంగా బాణసంచా తయారుచేస్తుండగా రూ.2,500 విలువైన సామగ్రి సీజ్ చేశామని ఎస్సై పాపారావు తెలిపారు. ఏవిధమైన అనుమతులు లేకుండా సామగ్రి కలిగి ఉన్న సీహెచ్ శ్రీనుపై కేసు నమోదు చేశామన్నారు.

### నాటుసారా శిబిరంపై దాడి

కోటనందూరు, న్యూస్‌టుడే: మండలంలోని భీమవరపుకోట శివారున నాటుసారా శిబిరంపై ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలోని సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 100 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కెమికల్ ఎనాలసిస్ నిమిత్తం 300 మిల్లీలీటర్ల చొప్పున నమూనాలను పంపించామని ఎస్సై తెలిపారు. సారా తయారుచేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

### శేషగిరిరావు మృతికి సంతాపం

తుని పట్టణం, న్యూస్‌టుడే: ప్రముఖ వైద్యుడు ఏలూరి శేషగిరిరావు మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఐఎంఏ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో డా.కెవి దుర్గాదాస్, చోడిశెట్టి త్రిమూర్తి స్వామి, కుసుమంచి సత్యనారాయణ, బొప్పనరాము తదితరులు పాల్గొన్నారు.

### వాసిరెడ్డి చిత్రపటానికి నివాళి

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడి మాజీ సర్పంచి వాసిరెడ్డి దేవుళ్లు మృతి తీరని లోటు అని మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. దేవుళ్లు చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళి అర్పించారు. దేవుళ్లు కుమారుడు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలును పరామర్శించారు.

### సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

శంఖవరం, న్యూస్‌టుడే: మండలంలోని కత్తిపూడి శాంసంగ్ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గ్రామానికి చెందిన దుకాణ యాజమాని తవ్వల రాజేష్‌కుమార్ ఉదయం దుకాణం తెరవడానికి వచ్చి చూడగా షట్టర్ లేపి దుకాణంలో చరవాణులు చోరీకి గురయ్యాయని గుర్తించారు. అన్నవరం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై శ్రీహరిబాబు క్లూస్ బృందంతో వచ్చి పరిశీలించారు. 13 స్మార్ట్‌ఫోన్‌లు చోరీకి గురయ్యాయని వాటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## బాల్యవివాహాలు సాంఘిక దురాచారం

మానవహారంగా విద్యార్థినులు

జగ్గంపేట గ్రామీణం, తొండంగి, న్యూస్‌టుడే: సమాజంలో బాల్య వివాహాలు సాంఘిక దురాచారం.. బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని సీడీపీవో ఎం.పూర్ణిమ అన్నారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో ప్రిన్సిపల్ లలితకుమారి ఆధ్వర్యంలో బాల్యవివాహ ముక్త్ భారత్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, న్యాయ సలహాదారు అప్పలకొండ, శ్రీహర్ష, అంగన్‌వాడి సూపర్‌వైజర్ సునీత, అమ్మాజీ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ● ప్రభుత్వం మహిళలు, బాలికల సంక్షేమానికి కల్పిస్తున్న చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని హెచ్‌ఎం చక్రాతి సత్యన్నారాయణ అన్నారు. కేపీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం బాల్యవివాహాలు, ర్యాగింగ్, తదితర వాటిపై సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు వివాహం చేసుకోకూడదన్నారు. అనంతరం విద్యార్థులంతా మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు శ్రీదేవి,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతంగా రాణించి ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలి

కిర్లంపూడి, న్యూస్‌టుడే: చదువులో బాగా రాణించి ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ పేర్కొన్నారు. సోమవరం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 'పది' విద్యార్థులకు బుజ్జయ్య యువసేన ఆధ్వర్యంలో సోమవారం అధ్యయన సామగ్రిని అందించారు. కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ ఈకార్యక్రమంలో పాల్గొని పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాలు, ప్రాథమిక పాఠశాలకు బీరువాను ఎస్సై సతీష్ చేతుల మీదుగా అందజేశారు. పేపకా

## యనమలను కలిసిన అధికార ప్రతినిధి

యనమలను సత్కరిస్తున్న వెంకటరమణ తదితరులు

శంఖవరం, న్యూస్‌టుడే: ఇటీవల కాకినాడ పార్లమెంట్ అధికార ప్రతినిధిగా నియమితులైన బద్ది వెంకటరమణ సోమవారం మాజీ మంత్రి యనమల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన్ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు పార్టీ సీనియర్ నాయకులు బద్ది రామారావు, టిఎన్ఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణ తదితరులు యనమలను కలిసిన వారిలో ఉన్నారు.

## సీనియర్ న్యాయవాది జాన్‌బాబు హఠాన్మరణం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేశ్వరంలో నివాసం ఉంటున్న సీనియర్ న్యాయవాది **బాద జాన్‌బాబు** (57) సోమవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ప్రత్తిపాడు బార్ అసోసియేషన్‌లో ఆయన కీలకపాత్ర వహిస్తున్నారు. జాన్‌బాబుకి భార్య నాన్సీ, కుమార్తె సువర్ణ ప్రియ ఉన్నారు. న్యాయవాది జాన్‌బాబు పార్థివదేహానికి ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి ఎల్.గోపీనాథ్, పలువురు న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు నివాళి అర్పించారు. న్యాయవాది అంత్యక్రియలు అడ్డతీగల మండలం తిమ్మాపురంలో మంగళవారం జరుగుతాయని బంధువులు తెలిపారు.

## గుంతతో చింత

రావికంపాడు నుంచి కేపీపురం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఎదురుగా వాహనాలు వచ్చినపుడు రహదారి పక్కకు వెళ్లేందుకు వీలులేకుండా ఉంది. కొన్ని సందర్భాల్లో ఆ గుంతల్లో పడి గాయపడుతున్నారు. ర.భ శాఖ అధికారులు స్పందించి ఆ గుంతలు పూడ్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తొండంగి

## వరద కాదు.. ఊటలు!

చింతలూరు- శరభవరం మధ్య పెద్ద చెరువు నుంచి వెల్లువెత్తుతోంది. వానా, వరదా కాదు.. ఎగువ నుంచి వచ్చే కొండ ఊటలు ఈ చెరువుకే చేరతాయి. ఏలేరు ఊటలు తోడవుతాయి. ఏడాది పొడవునా ఈ చెరువు నిండుకుండలా ఉంటుంది. నీటి చేరిక జోరుగా ఉండే ప్రవాహం దారికి అడ్డం పడుతుంది. వానా కాలంలో రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. ఇక్కడ వంతెన నిర్మించాలని ఏళ్లుగా చింతలూరు, వెంకటగరం పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

## రూ.లక్షలతో నిర్మించారు.. నిరుపయోగంగా వదిలేశారు

రూ.లక్షల నిధులతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలు నేడు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిపై అధికారులు దృష్టి సారించకపోవడంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. గండేపల్లిలోని సింగరంపాలెం వెళ్లే రోడ్డులో 2011లో రూ.5లక్షల నిధులతో మండల సమైక్య భవనం నిర్మించారు. అయితే నిర్మించిన కొద్ది కాలానికే నిరుపయోగంగా వదిలేయడంతో తుప్పలు పట్టి నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

(c) eenadu

# 2 ఆదోని మండలాలు

● 1,2 గా విభజన

పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఆదోని మండలాన్ని రెండు మండలాలుగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్ణయం తీసుకుంది. 46 గ్రామాలతో రాష్ట్రంలోనే అతిపెద్ద మండలంగా ఉంది.. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఆదోని కేంద్రంగానే రెండు మండలాల పరిపాలన కొనసాగేలా నిర్ణయం తీసుకున్నారు. ఆదోని-1, ఆదోని-2గా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

– న్యూస్‌టుడే, ఆదోని ఎస్కేడీ కాలనీ, గ్రామీణం

### ఎక్కడ ఏ ఏ గ్రామాలు

● ఆదోని మండలం-1 పరిధిలో 24 రెవెన్యూ గ్రామాలు కలుపుతూ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో ఆదోని, కల్లుబావి, వెంగళాపురం, పర్వతాపురం, మండిగిరి, ఎస్.కొండాపురం, ఇస్వీ, గోనబావి, దిబ్బనకల్లు, నెట్టేకల్లు, అరేకల్లు, బైచిగేరి, సలకలకొండ, విరుపాపురం, దొడ్డనగేరి, సాంబగల్లు, పువ్వనూరు, కపటి, బసరకోడు, చిన్నపెండేకల్లు, మాంత్రికి, దెయ్యాలగూడెం, సుల్తానపురం, పెసలబండ గ్రామాలు ఉన్నాయి.

● ఆదోని మండలం-2 పరిధిలో 22 రెవెన్యూ గ్రామాలు కలుపుతూ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, యడవల్లి, బలదూరు, చిన్నగోనేహాలు, చిన్నహరివాణం, మదిరె, కడితోట, హనవాలు, జి.హోసళ్లి, బసాపురం, వి.కొండాపురం, నాగనాథనహళ్లి, నారాయణపురం, చాగి, ఢణాపురం, గణేకల్లు, బల్లేకల్లు, పాండవగల్లు, కుప్పగల్లు, జాలిమంచి, పెద్దతుంబళం గ్రామాలు ఉన్నాయి.

### పునర్విభజన సమయంలో జిల్లా ఏర్పాటు పరిశీలన

ఆదోని జిల్లా అంశంపై సోమవారం అమరావతిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడుతో ఆదోని జిల్లా సాధన సమితి ఐకాస నాయకులు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ చర్చించారు. జిల్లా ఏర్పాటు చేయాలని ప్రజలను పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. స్పష్టమైన హామీ వచ్చేంతవరకు ఆందోళన విరమించేదిలేదని ఐకాస నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. "కొత్త జిల్లాల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఆదోని జిల్లా డిమాండు వచ్చినందున పరిశీలించలేకపోయాం.. ఆదోని జిల్లా చేస్తే కర్నూలు జిల్లాను ఎలా సర్దుబాటు చేయాలనే విషయంపై అధ్యయనం చేయాల్సి ఉంటుంది. సమయం లేదు.. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత తప్పకుండా పరిశీలిస్తామని" మంత్రి హామీ ఇచ్చారు. ఐకాస నాయకులు రఘురామయ్య, అశోకానందరెడ్డి, నూర్‌అహ్మద్, కృష్ణమూర్తిగౌడు, కోదండ, రామలింగ, అమరేశ్, గణేశ్, శేఖర్, కుంకునూరు వీరేశ్, దస్తగిరినాయుడు, రాజు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

### వైకుంఠవాసుడి ఉత్సవం

అహోబిలం లక్ష్మీనృసింహస్వామి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు విశేష అలంకృతులై కొలువుదీరారు. సాయంత్రం తిరువీధుల్లో విహరించారు.

### ఈఎస్‌ఎల్ క్రికెట్ తుది పోరు నేడే

గత ఏడు రోజులుగా పోటాపోటీగా కొనసాగుతున్న ఈఎస్ఎల్ క్రికెట్ పోరులో విజేత ఎవరో నేడు తేలనుంది. నగరంలోని పుల్లారెడ్డి కళాశాల మైదానంలో మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. జూనియర్స్ విభాగంలో ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ జూనియర్ కళాశాల (నంద్యాల) జట్టు ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల (కర్నూలు)తో తలపడనుంది. సీనియర్స్ విభాగంలో కర్నూలు మెడికల్ కళాశాల, శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు తలపడనున్నాయి. – ఈనాడు, కర్నూలు

# ధరణి సమస్యలకు చికిత్స

● కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్‌లు ● తరలొచ్చిన భూ బాధితులు

'భూ'సమస్యల పరిష్కారంపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది.. ఇందులో భాగంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు అనుబంధంగా రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అర్జీలు ఇవ్వడానికి బాధిత రైతులు భారీగా తరలొచ్చారు. అడంగల్ సవరణలు, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూముల సంబంధించి, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలు, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్వోఆర్, సర్వే రీ-సర్వే, దేవాదాయ, వక్ఫ్ భూములు తదితర అంశాలపై అర్జీలొచ్చాయి.

–న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

| అంశం | వచ్చిన దరఖాస్తులు | పరిష్కారం |
| --- | --- | --- |
| సర్వే | 8,867 | 7,544 |
| సబ్ డివిజన్ | 18,706 | 15,486 |

### భూమంత సమస్యలు

● ఈ ఏడాది జూన్ 15 నుంచి డిసెంబరు 12 వరకు రెవెన్యూ శాఖకు 7,469 అర్జీలొచ్చాయి. అత్యధిక అర్జీలొచ్చిన జాబితాలో కర్నూలు రెండో స్థానంలో ఉంది. నంద్యాల జిల్లాలో పీజీఆర్ఎస్ అర్జీలు పరిష్కరించినప్పటికీ అత్యధికంగా రీఓపెన్ అవుతున్నాయి. ఈ అంశంలో రాష్ట్ర సగటు 8.58 శాతం ఉండగా.. నంద్యాల జిల్లాలో 15.56 శాతం ఉండటం గమనార్హం.

● అదేవిధంగా గత జూన్ 15 నుంచి ఈనెల 12 వరకు భూ విస్తీర్ణంలో తేడాలకు సంబంధించి రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లా 12,510 అర్జీలతో మొదటి స్థానంలో ఉంది.

● ఎఫ్-లైన్ పిటిషన్లు వెల్లువలా వస్తున్నాయి.. క్షేత్రస్థాయికి వెళ్లకుండా పరిష్కరించినట్లు రైతులకు సమాచారం ఇస్తున్నారు.

కలెక్టరేట్‌కు తరలొచ్చిన భూ బాధితులు

### పకడ్బందీగా చేస్తేనే

● రెవెన్యూ క్లినిక్ విధానంలో మండల తహసీల్దారే నేరుగా బాధ్యత తీసుకోవాలి. అన్ని అర్జీలు ఒకచోట కాకుండా అంశాల వారీగా కౌంటర్లు పెట్టి స్వీకరించాలి.

● అర్జీదారుల ఎదుటే సంబంధిత సిబ్బందికి సమాచారం ఇచ్చి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి. కొన్నింటిని తక్షణమే సరిచేయాల్సి ఉంది.

### చుక్కల భూమిగా మార్చేశారు

–సలీంబాషా, దేవనకొండ

మాది కప్పట్రాళ్ల. సర్వే నంబరు 239-1బిలో 4.98 ఎకరాల పట్టా భూమి మా అమ్మ జైతున్‌బీ పేరున ఉంది. ఇది పట్టాభూమి. అయితే గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ చుక్కల భూములుగా మార్చేశారు. నాలుగైదు సార్లు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో, మండల తహసీల్దారుకు అనేక మార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. రెవెన్యూ క్లినిక్‌లో ప్రత్యేక ఉప కలెక్టర్లకు తమ భూమిని నిషిద్ధ జాబితా నుంచి తొలగించి.. పట్టాభూమిగా మార్పు చేయాలని విన్నవించా.

● ఆయా క్లినిక్‌లలో అడంగల్, 10(1) ఖాతాలు, ఎస్ఎఫ్ఏ (సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్), వెబ్‌ల్యాండ్, ఓఆర్ఎస్ఎంఎస్, మీసేవ, ఇతర అవసరమైన రికార్డుల్ని డిజిటల్, భౌతికంగా అందుబాటులో ఉంచుకోవాలి. 14 రకాల భూ సమస్యలకు సంబంధించి వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేసి అర్జీలను స్వీకరించాల్సి ఉండగా.. ఇవేవీ అందుబాటులో ఉంచలేదు.

● బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి.. వారి సమస్యలను ఆలకించి.. మీ సమస్యలను పరిష్కరిస్తాం మీరెళ్లండని పంపించేశారు. బాధితులకు ఎలాంటి రసీదులు ఇవ్వలేదు.

### శివాని భళా

జాతీయ, అంతర్జాతీయ స్థాయి జావెలిన్‌త్రో, షాట్‌పుట్ పోటీల్లో పలు పతకాలు సాధించి బాల వీర్ పురస్కారం అందుకున్న శివాని జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ డా.ఎ.సిరి పేర్కొన్నారు. దిల్లీలో నిర్వహించిన బాల్ వీర్ దివస్- 2025 కార్యక్రమంలో క్రీడా విభాగంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా పురస్కారం అందుకున్న మద్దికెర మండలానికి చెందిన క్రీడాకారిణి శివానిని కర్నూలు కలెక్టరేట్‌లో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపించిన శివాని విద్యార్థులకు, క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విజయ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

### సీఎం చంద్రబాబును కలిసిన గుడిసె కృష్ణమ్మ

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో సోమవారం ఆమె సీఎంను కలిసి పూలమొక్క అందజేశారు. జిల్లా పరిస్థితులపై సీఎం ఆమెతో కాసేపు చర్చించారు. అనంతరం విజయవాడలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మలను కృష్ణమ్మ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

# లీకులు చూడరు.. లాకులు వేయరు

విధులకు మస్కా కొడుతున్న లస్కర్లు ● రబీలో నీటి విడుదలపై ప్రభావం

రబీ వచ్చేసింది.. ఈ సీజన్లో ప్రతి నీటి చుక్కను ఎంతో జాగ్రత్తగా వాడుకోవాలి.. ఉమ్మడి జిల్లాలో ఐదు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. సాగు నీటి వినియోగంపై లస్కర్ల పాత్ర కీలకం.. కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్తను తొలగించడం లేదు.. డిస్ట్రిబ్యూటర్ల నిర్వహణను పట్టించుకోవడం లేదు. నీటి యాజమాన్య పద్ధతులు అత్యవసరం. లస్కర్ల పర్యవేక్షణ లేకపోవడం ప్రతిబంధకంగా మారింది. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

### ఏం చేయాలి.. ఏం చేస్తున్నారు

● ప్రతి 1,200 ఎకరాలకు సాగునీటి సరఫరాకు లేదా 12 కి.మీ.ల పొడవునా కాల్వ నిర్వహణకు ఒక లస్కర్ తప్పనిసరిగా ఉండాలి. వీరంతా తమ పరిధిలో రెగ్యులేటర్ నియంత్రణను పర్యవేక్షిస్తూ ఉండాలి.

● ప్రధాన కాల్వలు, గేట్ల నిర్వహణను లస్కర్లు చూసుకోవాల్సి ఉంది. గేట్లు ఎత్తి దించేందుకు వీలుగా గ్రీజింగ్ చేయాలి. షట్టర్లను పర్యవేక్షిస్తూ లోపాలుంటే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలి. కాలువల లోపలి భాగంలో, గట్లపై ముళ్లపొదలు, కంప చెట్లు పెరగకుండా చూసుకోవాలి. రెండు జిల్లాల్లో ఏ ప్రాజెక్టుల పరిధిలోనూ లస్కర్లు విధులు సక్రమంగా నిర్వహించడం లేదు.

గోనెగండ్ల: పీడీ డిస్ట్రిబ్యూటరీ వద్ద నీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

### దస్త్రంలోనే హాజరు

● కేసీ, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, హెచ్ఎన్ఎస్ఎస్ తదితర కాల్వల పరిధిలో 492 మంది లస్కర్లు పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది శ్రీశైలం రిజర్వాయరు ముంపు బాధితులే ఎక్కువగా ఉన్నారు. వీరికి నెలకు రూ.20 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. ప్రతి నెలా రూ.1950 కోత విధిస్తున్నారు.

● జిల్లాకు చెందిన చాలా మందిని వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు, దువ్వూరు, కడప ప్రాంతాల్లో నియమించారు. వీరికి వచ్చే రూ.20 వేల వేతనంతో ఆ ప్రాంతాలకు వెళ్లలేక జిల్లాలోనే ఉంటూ వ్యవహారం నడిపిస్తున్నారు.

### ఎక్కడుంటారో తెలియదు

● కేసీ కాల్వ పరిధిలో 240 మంది, ఎల్లెల్సీలో 116 మంది లస్కర్లు విధుల్లో ఉన్నట్లు దస్త్రాలు చెబుతున్నాయి. వీరిలో చాలా మంది జిల్లాలోనే లేరు. ఇతర ప్రాంతాల్లో మరో ఉద్యోగం చేస్తున్నారు.

● ఎల్లెల్సీ కింద కోడుమూరు సబ్ డివిజన్‌లో 64 మంది, ఆదోనిలో 13, ఆదోని-2లో 13, ఎమ్మిగనూరులో 17, జీడీపీ సబ్ డివిజన్‌లో 9 మంది పనిచేస్తున్నట్లు దస్త్రాల్లో ఉండగా వీరిలో 40 శాతం మంది కూడా విధుల్లో లేరు.

● కేసీ కాల్వ పరిధిలోని 240 మందిలో కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో ఆరుగురు, నంద్యాలలో 42 మంది, ఆళ్లగడ్డలో 21 మంది, వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 23 మంది ఏళ్లుగా విధులకు రావడం లేదు.

● హెచ్ఎన్ఎస్ఎస్‌లో పనిచేస్తున్న 45 మంది, ఎస్సార్బీసీలో పనిచేస్తున్న 41 మంది కనీసం అటువైపు చూడటం లేదు.

● శ్రీశైలం ముంపు బాధితులనే ఎల్లెల్సీలో కింద తుంగభద్ర ప్రాజెక్టు వివిధ సబ్ డివిజన్లలోని ఆదోని, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో నియమించారు. అంతదూరం వెళ్లలేక 'ఒప్పందం' చేసుకుంటున్నారు.

### ఉత్తర ద్వారం.. మోక్ష మార్గం



వైకుంఠ ఏకాదశి వేడుకల నిర్వహణకు జిల్లాలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. ప్రధాన ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తర ద్వారాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చేందుకు వేదికలు సిద్ధం చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శనం చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. – ఈనాడు, కర్నూలు

# కాంతిలీనని పథకం

● 'సూర్యఘర్'కు బ్యాంకర్ల కొర్రీలు

పీఎం 'సూర్యఘర్ యోజన'క బ్యాంకర్లు కొర్రీలు పెడుతున్నారు. కర్నూలు జిల్లాలో 6,46,025 మంది గృహ విద్యుత్తు వినియోగదారులు ఉన్నారు. లోఓల్టేజీ సమస్యలు, విద్యుత్తు సరఫరాలో అవాంతరాలను అధిగమించడం.. రూ.వేల విద్యుత్తు బిల్లుల నుంచి ఉపశమనం పొందేందుకు కేంద్రం ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు 1,581 యూనిట్లు మాత్రమే ఏర్పాటయ్యాయి. బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు ఇస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలవడం లేదు.

– న్యూస్‌టుడే, ఆదోని పాత పట్టణం

| యూనిట్ (కిలోవాట్) | వ్యయం (రూ.లక్షల్లో) | రాయితీ (రూ.వేలల్లో) |
| --- | --- | --- |
| 1 | 1 | 30 |
| 2 | 1.40 | 60 |
| 3 | 2.10 | 78 |

● కర్నూలు, నంద్యాల, ఆదోని తదితర పట్టణాల్లో వేలాది బహుళ అంతస్తు భవనాలున్నాయి. ఇక్కడ ఎవరైనా యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని భావిస్తే అపార్టుమెంటులో నివసిస్తున్న 10 కుటుంబాల వారు సంతకాలు చేయాల్సి రావడం అడ్డంకిగా మారింది. ఇలా.. సూర్యఘర్‌కు వివిధ వర్గాలవారు దూరమయ్యారు.

● గ్రామంలో వంద శాతం ఇళ్లకు సౌర ఫలకాలు ఏర్పాటుచేస్తే.. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.కోటి వరకు నిధులు విడుదల చేస్తుంది. కర్నూలు జిల్లాలో 484, నంద్యాల జిల్లాలో 489 గ్రామాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏ ప్రాంతంలోనూ ఈ అవకాశాన్ని వినియోగించుకోలేదు. గ్రామాలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉంది. అధికారులు చొరవ చూపకపోవడంతో పథకం అమలు అంతంతమాత్రంగానే ఉంది.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెద్దఎత్తున ఉన్న రైతులున్నారు. వీరు సోలార్ యూనిట్ కోసం బ్యాంకర్లను సంప్రదిస్తే సిబిల్ స్కోర్, లావాదేవీలు, గతంలో తీసుకున్న రుణాలపై ఆరా తీస్తున్నారు. వ్యక్తిగత వివరాలు అడుగుతుండటంతో వీరు పథకానికి దూరమవుతున్నారు. ఇంటి యజమాని అంగీకరించకపోవడంతో అద్దె ఇంట్లో ఉన్నవారు పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. 60 ఏళ్లు దాటినవారికి రుణం ఇవ్వడం లేదు.

### పరుగుల రాముడు

ఉన్నత చదువుకు తోడు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని గుర్తించిన పరశురాముడు అథ్లెటిక్స్‌లో అడుగుపెట్టి.. విజయ పథంలో దూసుకెళ్తున్నారు. జొహరాపురంలోని అల్లూరు సీతారామ్‌నగర్‌కు చెందిన ఇతను ఉస్మానియా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. 2022 నుంచి అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. ఈనెల 27న నంద్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీటర్ల విభాగంలో రజతం, 4×100 రిలే పరుగులో స్వర్ణ పతకాలు సాధించారు. 2026 జనవరి 12 నుంచి 15వ తేదీ వరకు బెంగళూరులో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికయ్యారు. 2025 జనవరి 6 నుంచి 10వ తేదీ వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగిన జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించారు. "జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో స్వర్ణ పతకాలు అందించాలన్న లక్ష్యంతో రోజుకు 4 గంటల పాటు సాధన చేస్తున్నట్లు చెబుతున్నారు" పరశురాముడు. – న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

### నిరుద్యోగులూ.. పేర్లు నమోదు చేసుకోండి

మీ కోసం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇతర విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత www.ncs.gov.in వెబ్‌సైట్‌లో జాబ్ సీకర్‌గా పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి పి.దీప్తి సూచించారు. నిరుద్యోగ యువత తమ చరవాణి నంబరు, ఆధార్‌కార్డు, మెయిల్ ఐడీ ద్వారా వారి వివరాలను పొందుపరచాలన్నారు. వెబ్‌సైట్‌లో వారికి ప్రైవేటు ఉద్యోగాల వివరాలు, కెరియర్ లిటరేచర్ లభిస్తుందన్నారు. ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే జిల్లాలో నిర్వహించే అన్ని జాబ్‌మేళాల సమాచారం తెలుస్తుందన్నారు. సందేహాల నివృత్తికి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# మలి దశలో కలవరం

● వృద్ధులపైనే సైబర్ నేరగాళ్ల గురి
● డిజిటల్ 'అరెస్టు' పేరుతో దోపిడీ
● రెండేళ్లలో రూ.3 కోట్లు కొట్టేశారు

కర్నూలు నగరం బాలాజీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి రాష్ట్ర ప్రభుత్వ శాఖలో పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. కూతురు పెళ్లి కోసం బ్యాంకు ఖాతాలో డబ్బు దాచుకున్నారు. సైబర్‌నేరగాళ్లు ఆయనకు ఫోన్‌చేసి తాము అనిశా అధికారులమని నమ్మించారు. ఓ కేసులో నువ్వు నిందితుడిగా ఉన్నావు.. అడిగినంత డబ్బు పంపకపోతే నిన్ను అరెస్టు చేస్తామని బెదిరించారు. భయపడిన బాధితుడు పలు దఫాలుగా వారి చెప్పిన ఖాతాలకు ఏకంగా రూ.47 లక్షలు పంపారు. మళ్లీ బెదిరించే సరికి దిక్కుతోచక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నేరవిభాగం, ఆదోని నేరవిభాగం

ఇలా వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో 2024 నుంచి ఇప్పటి వరకు ఆరుగురి నుంచి దాదాపు రూ.3 కోట్లు దోచుకున్నారు. ఓ వైద్యుడి నుంచి రూ.1.99 కోట్లు, ఓ వృద్ధురాలిని బెదిరించి రూ.27.60 లక్షలు దండుకున్నారు.

### భయపెడుతూ.. ఒత్తిడికి గురిచేస్తూ..

సైబర్ నేరగాళ్లు ప్రధానంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత వచ్చిన డబ్బును బ్యాంకు ఖాతాల్లో దాచుకుని ఉంటారని వారిని ఎంచుకుంటున్నారు. 2024 నుంచి ఇప్పటి వరకు డిజిటల్ అరెస్టుల బాధితుల కేసులు 6 నమోదు కాగా బాధితుల్లో ఐదుగురు 60 ఏళ్లు పైబడినవారు ఉండటం గమనార్హం. ప్రశాంత జీవితాన్ని సాగిస్తున్న వారిని భయాందోళనకు గురిచేసేలా నేరారోపణలు చేస్తున్నారు. పలు నేరాల అభియోగాలు మోపి నకిలీ అరెస్టు వారెంట్లు, లీగల్ నోటీసులను వాట్సప్ ద్వారా పంపుతున్నారు.

### ఇవీ పోలీసుల సూచనలు

● అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి తాము ఫలానా శాఖ అధికారులమని బెదిరిస్తే వెంటనే నమ్మకూడదు. వారు మోపే నేరారోపణలు శ్రద్ధగా వినాలి. వాట్సప్ వీడియోకాల్ ద్వారా వారు చూపించే కార్యాలయాలను చూసి మోసపోరాదు. దర్యాప్తు సంస్థల అధికారులు ఎప్పుడూ ఇలా ఫోన్లు చేయరు. నేరుగా ఇంటికి వచ్చి కలుస్తారు.

● సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసినప్పుడు కార్యాలయాలకు వచ్చి కలుస్తానని.. లేదంటే కాస్త గడువు ఇవ్వాలని దాటవేయాలి. తర్వాత పోలీసులను సంప్రదించి నిర్ధారించుకోవాలి.

● త్వరపడి మీ ఆధార్‌కార్డు, ఇతర వ్యక్తిగత సమాచారం నేరగాళ్లకు ఇవ్వరాదు. మోసపోయిన బాధితులు తక్షణమే టోల్‌ఫ్రీ నంబరు 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. సైబర్‌క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు వివరాలు నమోదు చేయాలి.

### యూనిఫాంలలో ఫొటోలు దిగి..

సైబర్ నేరగాళ్లు సినీ ఫక్కీలో నేరాలకు పాల్పడుతున్నారు. ఆదాయపు పన్ను, సీబీఐ కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయం, అనిశా కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఈడీ కార్యాలయాల సెట్టింగుల ముందు ఆయా శాఖల అధికారుల్లా యూనిఫాం ధరించి ఫొటోలు దిగి వాటిని వాట్సప్ ప్రొఫైల్ పిక్చర్‌గా పెడుతున్నారు. బాధితులకు వారు వాట్సప్ ద్వారా వీడియో కాల్ చేసినప్పుడు తెరపై ఆ ఫొటోలు కనిపిస్తాయి. సైబర్ నేరగాళ్ల వెనుక ఉండే కార్యాలయాల సెటప్‌లను చూసి.. వారు ఆంగ్లం మాట్లాడే తీరును బట్టి నమ్మేస్తున్నారు.

### అందుబాటులో 5,849 టన్నుల యూరియా

● సందేహాలుంటే ఫోన్ చేయొచ్చు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : రబీ సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 12,504 టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని జిల్లా వ్యవసాయాధికారిణి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. రాబోయే రెండు రోజులకు 750 టన్నుల యూరియా అవసరం కాగా సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, మార్క్‌ఫెడ్ గోదాములు, రిటైల్, హోల్‌సేల్, కంపెనీల గోదాముల్లో 5,849 టన్నులు అందుబాటులో ఉంచామని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి ఎరువుల కొరత లేదన్నారు. ఎవరైనా డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఇతర ప్రాంతాలకు మళ్లించినా, అధిక ధరలకు విక్రయించినా వారి లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువుల లభ్యతపై సందేహాలుంటే 83413 02863 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

"చెత్తగుట్టలు తొలగించాలి.. పచ్చదనం పెంచాలి.. పట్టణవాసులకు ఆహ్లాదం పంచాలి.. 2025 అక్టోబరు 2వ తేదీ నాటికి డంపింగ్ యార్డుల్లో చెత్త తొలగించి, మొక్కలు నాటి పచ్చదనం పెంచాలి.!!

- పురపాలికల్లో చెత్త శుద్ధి పనులపై కూటమి ప్రభుత్వ ఆదేశాలివి.

# ఉద్యానవనమాయ

● డంపింగ్ యార్డుల్లో చెత్తగుట్టలు

పుర అధికారుల పర్యవేక్షణాలోపంతో గడువు తీరినా.. నేటికీ డంపింగ్ యార్డుల్లో చెత్తకుప్పలు తొలగలేదు. గుట్టలుగా పేరుకుపోయాయి. అనుకున్న లక్ష్యం నెరవేరకపోవడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో పాటు ప్రజారోగ్యంపై ప్రభావం చూపనుంది. మరోసారి టెండర్లు పిలిచి, చెత్త శుద్ధి పనులు అప్పగించాలని నిర్ణయించారు. దీంతో వ్యర్థాల కుప్పలు లెక్కకట్టే పనులు ఆరంభించారు. నిధుల సమస్యలు అధిగమించేందుకు ప్రత్యేక ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని భావిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు పురపాలికలు, డోన్ పట్టణం

ఆదోని శివారులోని శిరుగుప్ప రహదారిలో డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలు

### టన్ను చెత్తశుద్ధికి రూ.900

● గత ప్రభుత్వం వైకాపా హయాంలో మున్సిపాలిటీల్లో తట్టెడు చెత్త శుద్ధి చేయలేదు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేక దృష్టి సారించింది. తొలగింపు బాధ్యతలు సౌరాష్ట్ర కంపెనీకి అప్పగించారు. టన్ను చెత్తశుద్ధికి రూ.800-900 చెల్లించేలా ఒప్పందం చేసుకొన్నారు. ఈ ఏడాది జులై నుంచి శ్రీకారం చుట్టారు. ప్రజారోగ్య విభాగం పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది.

| పురపాలిక | నిత్యం పోగయ్యే చెత్త (టన్నుల్లో) |
| --- | --- |
| ఆదోని | 70 |
| ఎమ్మిగనూరు | 60 |
| డోన్ | 29 |
| నంద్యాల | 100 |

● ఆదోని పట్టణంలో పదివేల టన్నుల చెత్తశుద్ధి పనులు సౌరాష్ట్ర కంపెనీకి అప్పగించారు. ఎమ్మిగనూరులో 40 వేలు, డోన్‌లో 50 వేలు, నంద్యాలలో 80 వేల టన్నుల చెత్తను శుద్ధి చేశారు. నంద్యాలలో శుద్ధి చేసిన దాంట్లో ఇంకా 30 వేల టన్నులు తరలించాల్సి ఉంది.

### వాతావరణ కాలుష్యం

● పట్టణాలు, నగరాలకు డంపింగ్ యార్డులు దగ్గరగా ఉండటంతో.. భూ, వాయు, జల కాలుష్యం ఏర్పడుతోంది. ఏళ్లుగా శుద్ధి పనులు చేయక, చెత్తను నిల్వ చేయడంతో వర్షానికి తడిసి, ఎండకు ఎండి.. భూమిలో పది మీటర్ల లోతులో కలిసిపోయాయి.

● యంత్రాంగం సరైన లెక్కలు వేయకపోవడం, తవ్వే కొద్దీ గుట్టలుగా చెత్త బయటకు వస్తోంది. ఇక్కడ పచ్చదనం పెంచాలంటే కనీసం పది మీటర్లు మేర మట్టిని తొలగించి, కొత్త మట్టి తెచ్చి పోస్తే.. తప్ప ఉద్యానవనాలుగా మారే పరిస్థితి లేదు.

● ప్రస్తుతం ఆదోనిలో 45 వేలు, ఎమ్మిగనూరులో 60 వేలు, డోన్‌లో 30 వేలు, నంద్యాలలో 30 వేలు టన్నులకు పైగా వ్యర్థాలు పోగయ్యాయి.

● అన్ని పురపాలికలు ఒకే కంపెనీకి పనులు అప్పగించడం, దీంతో శుద్ధి అనంతరం వచ్చేవి మండే స్వభావం కలిగినవి పరిశ్రమలకు కుప్పలు, తెప్పలుగా చేరుకుంటున్నాయి. దీంతో అక్కడి పరిశ్రమల్లో స్థలం లేక ఖాళీ అయ్యే వరకు పంపొద్దని సూచిస్తున్నారు.





(c) eenadu

## తిరుగులేని ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల

విజేతలుగా నిలిచిన ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో.. ఉదయం మొదటి మ్యాచ్ శ్రీ సుధ జూనియర్ కళాశాల (డోన్), ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన శ్రీ సుధ జూనియర్ కళాశాల జట్టు 7 వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. లోహిత్ 24 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సలతో 47 పరుగులు చేశారు. ప్రత్యర్థి జట్టు బౌలర్ మోజిత్ 16 పరుగులిచ్చి 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేదించి విజేతగా నిలిచింది.

EENADU SPORTS LEAGUE 2025

## నేటి ఫైనల్ మ్యాచ్‌లు

జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో..

**జూనియర్స్ విభాగంలో..**

☛ ఉదయం 8 గంటలకు : ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ జూనియర్ కళాశాల (నంద్యాల) Vs ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల (కర్నూలు)

**సీనియర్స్ విభాగంలో..**

☛ ఉదయం 10 గంటలకు : కర్నూలు మెడికల్ కళాశాల Vs శాంతిరామ్ మెడికల్ కళాశాల (నంద్యాల)

## శాంతిరామ్ మెడికల్ కళాశాల సత్తా

MEDICOVER HOSPITALS KURNOOL

కేవీఆర్ మైదానంలో రెండో మ్యాచ్.. శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల (కర్నూలు), శాంతిరామ్ మెడికల్ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన శాంతిరామ్ కళాశాల జట్టు 6 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. అనంత్ 21 బంతుల్లో 2 ఫోర్లతో 31 పరుగులు చేశారు. ప్రత్యర్థి జట్టు బౌలర్లు మనోజ్ 3, నిదిన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల జట్టు 5 వికెట్లకు 77 పరుగులే చేసింది. మనోజ్ 19 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలతో 42 పరుగులు చేశారు. ప్రత్యర్థి జట్టు బౌలర్ రోహిత్ 11 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు. శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు 14 పరుగుల తేడాతో గెలుపొందింది.

శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు విజయోత్సాహం

# గెలుపు లక్ష్యం.. హోరాహోరీ పోరాటం

☛ ఉత్కంఠగా సాగిన ఈఎస్ఎల్ క్రికెట్ సెమీఫైనల్ పోటీలు

☛ ఫైనల్లో ప్రవేశించిన నాలుగు జట్లు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రెజెంట్స్) 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్- 2025' క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లలో విజయమే లక్ష్యంగా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్‌లో చోటే లక్ష్యంగా ఆటగాళ్లు రెట్టించిన ఉత్సాహంతో ఆడారు. మొదట బ్యాటింగ్ చేసిన జట్లు బ్యాటర్లు చెలరేగిపోయారు. ఓవర్‌కి 8 రన్‌రేట్ తగ్గకుండా బ్యాటింగ్ చేశారు. తర్వాత బ్యాటింగ్ చేసిన జట్లు లక్ష్య చేదనలో తడబడి ఓటమి పాలయ్యాయి.

ఇరు జట్ల కెప్టెన్ల సమక్షంలో టాస్ వేస్తున్న ముఖ్య అతిథి, కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్

## చెలరేగిన ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల

ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల ఆటగాళ్ల ఆనందం

కర్నూలు వైద్య కళాశాల మైదానంలో మొదటి మ్యాచ్.. ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల (కర్నూలు), కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల (దూపాడు) జట్ల మధ్య జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల జట్టు 3 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. మల్లికార్జున 39 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సలతో 92 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల జట్టు 6 వికెట్ల నష్టానికి 55 పరుగులే చేసింది. ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల 86 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది.

**ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే**

★ బి.మల్లికార్జున (39 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సలతో 92 పరుగులు. 1 వికెట్)

## కర్నూలు వైద్య కళాశాల జయకేతనం

రెండో మ్యాచ్.. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (కర్నూలు), కర్నూలు వైద్య కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కర్నూలు మెడికల్ కళాశాల జట్టు 7 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. రేవంత్ 20 బంతుల్లో 6 ఫోర్లతో 36 పరుగులు చేశారు. ప్రత్యర్థి జట్టు బౌలర్ అబ్దీబ్ 16 పరుగులిచ్చి 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 89 పరుగులే చేయగలిగింది. మోహన్ 12 బంతుల్లో 3 ఫోర్లతో 22 పరుగులు చేశారు. ప్రత్యర్థి జట్టు బౌలర్లు నిరిన్, గోపాల్ చెరో మూడు వికెట్లు తీశారు. 17 పరుగుల తేడాతో కర్నూలు మెడికల్ కళాశాల జట్టు విజయం సాధించింది.

కర్నూలు మెడికల్ కళాశాల గెలుపు సంబరం

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL
Regional Sponsor
MITS DEEMED TO BE UNIVERSITY
MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner
ఈనాడు.నెట్
TV Partner
ETV BHARAT
ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

## న్యాయవాదుల ఆందోళన

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ కోర్టు ఘటనకు సంబంధించి చిప్పగిరి, పత్తికొండ ఎస్సైలు సతీశ్‌కుమార్, విజయ్‌కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పత్తికొండలో న్యాయవాదులు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. చేతులకు సంకెళ్లు వేసుకొని నాలుగు స్తంభాల కూడలి వద్ద ఆందోళనకు దిగారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. సంఘం అధ్యక్షుడు మధుబాబు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తీర్చండి

ఖాళీ బిందెలతో ధర్నా చేసి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు, గ్రామస్థులు

బల్లెకల్(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ మండలం బల్లెకల్ గ్రామ సచివాలయం ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ధర్నా చేశారు. తాగునీటి కోసం జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఎవరూ పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి లింగన్న అన్నారు. జేసీసం వాడుకోవడానికి కూడ నీరు సరఫరా చేయడం లేదన్నారు. రహదారులు, మురుగు, వీధి దీపాల తదితర సమస్యలతో అవస్థలు పడుతున్నారన్నారు. మహిళలకు ప్రధానంగా మరుగుదొడ్ల సమస్య వేధిస్తోందన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరేష్, ఉరుకుంద, రమేష్, నాగార్జున, లక్ష్మారెడ్డి, తిమ్మప్ప, తాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని మండల విభజనపై హర్షం

ఆదోనిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వివిధ గ్రామాల నాయకులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలాన్ని రెండుగా విభజిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదోని పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం సాయంత్రం 16 గ్రామాల నాయకులు క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. విజయోత్సవ ర్యాలీ చేపట్టి, సంబరాలు జరుపుకొన్నారు. నెల రోజులు పైగా 16 గ్రామాల ప్రజలు ఆందోళన చేయడంతో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోనేహాళ్ గోపాల్‌రెడ్డి, రామస్వామి, రామకృష్ణారెడ్డి, సుజ్ఞానమ్మ, చంద్రశేఖర్, శేషన్న, మల్లికార్జున, అయ్యాళి, నారాయణ, రాము, నరేంద్రకుమార్ రెడ్డి, విరూపాక్షి, పరమేష్, వరదప్ప, ప్రసాద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం రూ.3,73,66,587

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం గురు రాఘవేంద్రస్వామి మఠంలో 20 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. లెక్కింపులో కరెన్సీ రూ.3,62,69,247, నాణెలు రూ.10,97,340, మొత్తం మీదుగా రూ.3,73,66,587, బంగారం 87 గ్రాములు, వెండి 910 గ్రాముల ఆదాయం వచ్చినట్లు శ్రీమఠం అధికారులు తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్‌లు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సంబంధిత సమస్యలను వేగంగా, నాణ్యతతో పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్‌లను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డా.ఎ.సిరి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రత్యేక రెవెన్యూ క్లినిక్ నిర్వహించి భూ సంబంధిత సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రిసెప్షన్, రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేసి అర్జీలను స్వీకరించనున్నట్లు తెలిపారు. 22ఎ, చుక్కల భూములు, అడంగల్, ఇనాం భూముల దిద్దుబాటు, రీసర్వే, ఆర్‌వోఆర్ కేసులకు సంబంధించిన సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. జేసీ నూరుల్ ఖమర్ రెవెన్యూ క్లినిక్ నిర్వహణను పరిశీలించారు. ఉప కలెక్టర్లు కొండయ్య, అనురాధ, సునీతాబాయి, నాగ ప్రసన్నలక్ష్మి రెవెన్యూ అర్జీలు స్వీకరించారు.

◆ తహసీల్దారు కార్యాలయాల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా స్వీకరించిన రెవెన్యూ అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె పీజీఆర్ఎస్, పింఛన్ల పంపిణీ, పక్కాగృహాల నిర్మాణంలో పురోగతి, యూరియా లభ్యత తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు.

## ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రజల నుంచి వివిధ శాఖలకు అందుతున్న అర్జీలను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్, జేసీ నూరుల్ ఖమర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పింఛను ఇప్పించాలంటూ ఆదోని నుంచి వచ్చిన దివ్యాంగుడు మహమ్మద్ అలీ వద్దకే వెళ్లి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ డా.సిరి

## ఉద్యోగం ఇప్పిస్తామని మోసగించారు

బాధితుల సమస్య వింటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలులోని లక్ష్మీటౌన్‌షిప్‌కు చెందిన చరణ్‌రాజ్ ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను కోరారు. హైదరబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నికోలస్ అనే వ్యక్తి రూ.2.40 లక్షలు తీసుకుని మోసగించాడని నందికొట్కూరుకు చెందిన సాయిచరిత ఫిర్యాదు చేశారు. కర్నూలులోని కొత్తపేటలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ 101 ఫిర్యాదు పత్రాలు స్వీకరించారు. విచారణ జరిపించి చట్టం పరిధిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐలు రామయ్యానాయుడు, శివశంకర్, శ్రీనివాసనాయక్‌లు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి పథకంతో బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగింది

అధికారులతో మాట్లాడుతున్న ఎండీ

ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్త్రీశక్తి పథకంతో బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగింది.. ప్రభుత్వం కొత్త బస్సులు మంజూరు చేసిందని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమల్ రావు అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో సోమవారం ఆర్టీసీ బస్టాండును పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. గతంలో ఒక బస్సులో సగటున 34 మంది ఎక్కేవారు.. ప్రస్తుతం 94 శాతానికి చేరిందన్నారు. గతంలో 47 శాతం మంది మహిళలు ఉండేవారు.. ఇప్పుడు వారి సంఖ్య 67 శాతానికి పెరిగిందన్నారు. స్త్రీశక్తి పథకానికి నెలకు రూ.160కోట్లు చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు తక్కువ ఉన్నారు.. త్వరలో తాత్కాలిక పద్ధతిలో నియమించే అవకాశం ఉందన్నారు. కౌతాళానికి బస్సు సర్వీసు నడుపుతామన్నారు. ఎమ్మిగనూరు- విజయవాడ బస్సుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డీఎస్పీ భార్గవి, డిపో మేనేజర్ మద్దిలేటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని జిల్లా చేయకుంటే ఎన్నికలను బహిష్కరిస్తాం

ఆందోళన చేస్తున్న ఆదోని జిల్లా సాధన సమితి నాయకులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ఆదోని జిల్లాను ఏర్పాటు చేయకపోతే స్థానిక సంస్థ ఎన్నికలను బహిష్కరిస్తామని ఆదోని జిల్లా సాధన సమితి నాయకులు ఉదయ్, తిరుమలేశ్, కాజా, రమేష్, ఉదయ్‌కృష్ణ, అఫ్రీది, రఘు, దస్తగిరి, అఖండ హెచ్చరించారు. ఆదోని జిల్లా సాధన కోసం సోమవారం సమితి ఆధ్వర్యంలో ఐదు నియోజక వర్గాల విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఆదోని జిల్లా చేయాలంటూ.. నినాదాలు చేస్తూ.. గేట్లు ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదోని ప్రాంతాన్ని జిల్లా చేసేంత వరకు ఉద్యమాలు ఆపబోమన్నారు. అనంతరం కలెక్టర్ సిరికి వినతిపత్రం అందజేశారు

## శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్ : శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032
బ్రాంచి ఆఫీస్ : డి.నెం. 50-760-114ఎ, 2వ అంతస్తు, శాంసంగ్ స్మార్ట్ ప్లాజా పైన, గాయత్రి ఎస్టేట్, గుత్తి రోడ్డు, కర్నూలు - 518003.

(రూల్ 8 (1) ప్రకారం) **భౌతిక స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

**Ref : Loan Account No. KURN4TF1709280014**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం (శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, చెన్నైలోని ఎన్‌సిఎల్‌టి యొక్క ఆర్డర్ ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్'తో విలీనం చేయబడిందని సమాచారం. తదనంతరం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్' పేరు ది. 30-11-2022 నుండి "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా అమలులోకి వచ్చేలా మార్చబడినది. ది. 30-11-2022 నాటి ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్‌ను చూడగలరు) మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు : 1) జె. రామమోహన్‌రెడ్డి,** తండ్రి : జె. లక్ష్మిరెడ్డి, హెచ్.నెం. 4-23-3-5, బాలాజీ నగర్, కర్నూలు. **2) టి. చంద్రమౌళి శర్మ,** తండ్రి : టి. వీరయ్య, హెచ్.నెం. 43-253-1-జి2, అమృత అపార్ట్‌మెంట్, శంకల్‌బాగ్, కర్నూలు. ఓ.సి.సి. వెటర్నరీ ఆఫీస్ వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 38,68,563/-** (అక్షరాలా ముప్పై ఎనిమిది లక్షల అరవై ఎనిమిది వేల ఐదు వందల అరవై మూడు రూపాయలు మాత్రమే) + వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్ట్యువల్ ఛార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించ వలసినదిగా **తేది. 14-09-2022 న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సెక్షన్13 (4) సదరు చట్టం ప్రకారం సదరు చట్టములోని సెక్షన్ 14 కు అనుబంధమైన సదరు రూల్స్ సందలి రూల్ 9 ప్రకారము దిగువ పేర్కొన్న ఆస్తిని **తేది. 24-12-2025** న **భౌతికంగా స్వాధీనత** తీసుకోవడమైనదని ఋణగ్రహీతలకు ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ప్రస్తుతం చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 38,68,563/-** (అక్షరాలా ముప్పై ఎనిమిది లక్షల అరవై ఎనిమిది వేల ఐదు వందల అరవై మూడు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ మరియ ఇప్పటి వరకు కాంట్రాక్ట్యువల్ ఛార్జీలు మరియు పెనాల్టీలు మరియు తదుపరి వడ్డీ మరియు ఇతర కాస్టులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉండునని ప్రత్యేకించి ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

**ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్‌కి తనఖా పెట్టిన స్థిరాస్తుల వివరాలు :**

**స్థిరాస్తి వివరములు : KURN4TF1709280014** కి చెందిన ఆస్తి వివరాలు : కర్నూలు జిల్లా, కల్లూరు సబ్ డిస్ట్రిక్ట్, కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, కల్లూరు గ్రామ అకౌంట్స్, ఎస్.నెం. 686/1, ప్లాట్ నెం. 46కి తూర్పు పార్టు మరియు ప్లాట్ నెం. 47కి పడమర వైపు పార్ట్, ప్లాట్ నెం. 46కి చెందిన స్థలము కి తూర్పు నుండి పడమరకు 10 అ॥, ఉత్తరం నుండి దక్షిణం కు 75 అ॥, మొత్తం 750 చ॥అ॥లు లేదా 83.33 చ॥గ॥లు మరియు ప్లాట్ నెం. 47 పార్ట్‌కి చెందిన స్థలముకి తూర్పు నుండి పడమరకు 20 అ॥, ఉత్తరం నుండి దక్షిణంకు 75 అ॥ మొత్తం కలుపగా 1500 చ॥అ॥లు లేదా 166.66 చ॥గ॥లు, ఈ రెండు ఐటమ్స్ కలిపి 2250 చ॥అ॥లు లేదా 250 చ॥గ॥లు. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 47 పార్ట్, **పడమర :** ప్లాట్ నెం. 46 పార్ట్, **ఉత్తరం :** 40 అ॥ వెడల్పు రోడ్డు, **దక్షిణం :** ప్లాట్ నెం. 55 & 56.

ప్రదేశం : కర్నూలు
తేది : 24-12-2025

అధీకృత అధికారి
మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**HEALTH MEDICAL AND FAMILY WELFARE DEPARTMENT**
**GOVERNMENT GENERAL HOSPITAL, KURNOOL**
**Notification No.01/DE-ADDICTION CENTRE/GGH-KNL & NDL/2025, dated: 27-12-2025**

NOTIFICATION FOR RECRUITMENT TO CERTAIN VACANT POSTS IN DRUG DE-ADDICTION CENTRES AT GOVERNMENT GENERAL HOSPITAL, KURNOOL AND NANDYAL ON CONTRACT BASIS.

Applications are invited from the eligible candidates for recruitment to the following No. of posts on contract basis for the Drug De-Addiction Centre, GGH, Kurnool and for the Drug De-Addiction Centre, GGH, Nandyal initially for a period of one year, as noted below against each post:-

| S. No. | Name of the post | No. of Posts Vacant in Drug De-Addiction Centre at GGH, Kurnool | GGH, Nandyal |
|---|---|---|---|
| 1 | Doctor (Full time) | 1 | 1 |
| 2 | Project Coordinator cum Vocational Counsellor | 1 | 1 |
| 3 | Nurse (ANM) | 1 | 0 |
| 4 | Ward Boy | 1 | 2 |
| 5 | Counsellor/Social Worker/Psychologist | 2 | 2 |
| 6 | Peer Educator | 1 | 1 |
| 7 | Yoga Therapist/Dance/Music/Art Teacher | 1 | 1 |

Application Form, Roster Points and Eligibility details (PROSPECTUS) are uploaded to Kurnool District website https://kurnool.ap.gov.in and Nandyal District Website https://nandyal.ap.gov.in.

Eligible candidates should download the APPLICATION FORM from the Kurnool District website- https://kurnool.ap.gov.in (or) Nandyal District Website https://nandyal.ap.gov.in and to submit the Filled in Application Form in the O/o the Addl.DME /Superintendent, Government General Hospital, Kurnool from 30.12.2025 to 13.01.2026 between 10.30 AM to 5.00 PM.

**Sd/- Dr.K.Venkateswarlu,**
**ADME/Superintendent**
**GGH, Kurnool.**
**Member Convener**

**Sd/- Dr. A.Siri, I.A.S.,**
**District Collector/ Chairperson**
**District Selection Committee,**
**Kurnool.**

## రైలు దిగగానే ఆగిన గుండె

లక్ష్మీదేవి

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కృష్ణగిరి మండలం కటారుకొండకు చెందిన బోయిన లక్ష్మీదేవి (52) సోమవారం కర్నూలులోని కోట్ల రైల్వే స్టేషన్‌లో హఠాన్మరణం చెందారు. ఆమె భర్త బలరాముడు టైలర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీదేవి భర్తతో కలిసి కర్నూలు సర్వజన ఆసుపత్రికి వైద్యం చేయించుకునేందుకు బయలుదేరారు. సోమవారం ఉదయం స్థానిక కోట్ల రైల్వేస్టేషన్‌లో రైలు దిగారు. అక్కడే చిన్న సిమెంటు దిమ్మెపై కూర్చున్న లక్ష్మీదేవి కిందపడిపోయి ప్రాణాలు వదిలారు. అటువైపు వాకింగ్‌కు వచ్చిన కొందరు వైద్యులు ఆమెను పరిశీలించి గుండెపోటుతో మరణించినట్లు నిర్ధారించారు. భార్య హఠాన్మరణంతో భర్త కన్నీరుమున్నీరుగా విలపించారు.

## 2 కిలోల గంజాయి స్వాధీనం

☛ నలుగురి అరెస్టు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి 2.100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన కావేటి నాగశేషాద్రి, నందికొట్కూరు పట్టణం వాల్మీకి నగర్‌కు చెందిన షేక్‌మసూద్, కుమ్మరి హరినాథ్, నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామానికి చెందిన అనంత చిన్నయానందలు పట్టణం శివారులోని చాటలమ్మ, పొరకలమ్మ గుడి సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు వెళ్లి వారిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

## అంతుచిక్కని ఆవేదన

☛ తల్లీ పిల్లల కోసం కొనసాగుతున్న గాలింపు

గడివేముల, న్యూస్‌టుడే: ఎస్సార్బీసీ కాలువలో గల్లంతైన తల్లి, పిల్లల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం ఒండుట్ల గ్రామానికి చెందిన బుగ్గానిపల్లె ఎల్లాలక్ష్మి, తన కుమార్తెలు వైష్ణవి, సంగీతలతో మంచాలకట్ట గ్రామ సమీపంలో కాలువలోకి దూకారు. వారి ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం పుట్టీల సాయంతో స్థానికులు గాలించారు. తర్వాత ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది మర బోట్లతో గాలించారు. సంఘటనా స్థలం నుంచి గోరుకల్లు జలాశయం వరకు వెతికారు. డ్రోన్ సాయంతో గాలించినా సాయంత్రం 6 గంటల వరకు వారి జాడ తెలియరాలేదు. సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సై నాగార్జునరెడ్డి సంఘటనా స్థలంలో గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గల్లంతయిన తల్లీపిల్లల కోసం కుటుంబసభ్యులు, బంధువులు అక్కడే నిరీక్షిస్తున్నారు.

గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

నంద్యాల చెక్ పోస్ట్ దగ్గరలో మేము కొత్తగా నిర్మించబోయే అపార్ట్ మెంటులో ఫుల్ పేమెంట్ తో 3 flats (1400 Sft, 3 BHK, 1100 Sft, 2BHK) Cost to Cost అమ్మబడును. ఆసక్తి గలవారు సంప్రదించండి. ✆ 72078 97528, 96189 22589.

JOBS

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI + PF + జీ-17K ✆ 7019632854

YAC- వారి ముందడుగు మీడియాలో పనిచేయుటకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అభ్యర్థులు కావలెను. తేది: 3/1/26 సంప్ర: కాంకర్ కాలేజీ, సి-క్యాంప్, కర్నూలు. ✆ 73309 24873, 98854 85281.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

# ఆదోని
•ఆదోని •ఆలూరు •పత్తికొండ

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు, పాస్టర్లు

## పాస్టర్లకు గౌరవ వేతనంపై హర్షం

ఆదోని ఎస్కేడీ కాలనీ: ప్రభుత్వం పాస్టర్లకు గౌరవ వేతనం అందించి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని తెదేపా నేతలు పేర్కొన్నారు. ఆదోని పట్టణంలో తెదేపా సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో తెదేపా సీనియర్ నాయకులు జిందే శంకర్, గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ అరేకలు రామకృష్ణ తదితరులు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

ఆదోని పాతపట్టణం: ఎమ్మెల్యే డా.పార్థసారథి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం గుండె, కిడ్నీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు భాజపా నాయకులు మునిస్వామి, మహబుబ్‌బాషా, ఉరుకుందుగౌడ్, సాయిప్రసాద్ సోమవారం తెలిపారు. పట్టణంలో క్రాంతినగర్‌లోని ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని మద్దమ్మకుంట వద్ద పంట పొలాల్లో పనులు చేసుకునేందుకు విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలి. – గోపాల్, మద్దికెర
✔: పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. – రఫిక్, విద్యుత్తు ఏఈ, మద్దికెర

హొళగుంద, న్యూస్‌టుడే: ?: స్థానిక ఈడబ్ల్యూఎస్ కాలనీలో కొన్ని చోట్ల మురుగునీరు నిలిచి దోమలు పెరిగిపోతున్నాయి. – మాబుసాబ్, హొళగుంద
✔: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగుకాలువలు శుభ్రం చేయిస్తాం. –రాజశేఖర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: చిప్పగిరి మండలంలోని దేగులపాడు బీసీ కాలనీ చెత్తా చెదారంతో నిండిపోయి అధ్వానంగా మారింది. వెంటనే వీధులు శుభ్రం చేయాలి. – చిన్న మారయ్య, దేగులపాడు
✔: రెండు రోజుల్లో పరిసరాలు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లిస్తాం. – నీలకంఠ, సర్పంచి దేగులపాడు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలో విక్టోరియాపేట, లంగరబావివీధి, హనుమాన్‌పేట తదితర ప్రాంతాల్లో కొళాయిలకు తెల్లవారుజాము మూడు గంటలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. దీని కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. – ఈరన్న, ఆదోని
✔: నీటి విభాగం సిబ్బందికి సూచించి సమయం మార్పులు చర్యలు చేపడతాం. – కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

## జిల్లా సాధన కోసం పోరాటం కొనసాగిస్తాం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని ఆదోని జిల్లా సాధన సమితి నాయకులు జి.వీరేశ్, లలితమ్మ తదితరులు పేర్కొన్నారు. జిల్లా కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 44వ రోజుకు చేరుకోగా గంగ పుత్ర సంఘం నాయకులు దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు.

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా చేసే వరకు పోరాటం ఆగదని ఆలూరు బీజేపీ నాయకులు భూపేష్, కత్తి రామాంజనేయులు తేల్చి చెప్పారు. ఆలూరులో జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షల్లో సోమవారం పెద్దహోతూరు గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనకు కర్నూలు జిల్లా మొదటి పరిధిలోని ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు కె.ఆనందాచారి పిలుపునిచ్చారు. ఆదోనిని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ లోక్‌సత్తా ఆధ్వర్యంలో సోమవారం పత్తికొండ నాలుగు స్తంభాల కూడలిలో ఆందోళన చేపట్టారు. నాయకులు షరీఫ్, బి.సుధాకర్, ప్రసాద్, దస్తగిరి, రంగన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు

# ప్రజల కష్టాలు తీర్చేలా!

☛ ఓ వైపు మరమ్మతు పనులు.. మరోవైపు పంపింగ్
☛ పుర ప్రజల దాహార్తి తీర్చేందుకు అధికారుల కసరత్తు

పట్టణంలో వార్డులు: 42
జనాభా: రెండు లక్షలు
కుళాయిల సంఖ్య: 24,500
రోజు నీటి సరఫరా: 22 ఎంఎల్‌డీ

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ వాసుల దాహార్తి తీర్చేందుకు పురపాలక యంత్రాంగం కసరత్తు చేస్తోంది. తుంగభద్ర జలాశయం గేట్ల మరమ్మతుల కారణంగా జనవరి 10వ తేదీ తర్వాత నుంచి ఎల్లెల్సీ కాలువకు నీటిని నిలిపివేసే ఆలోచనలో ఉన్నారు. దీంతో తుంగభద్ర దిగువ కాలువ నీటిపై ఆధారపడిన పుర ప్రజల దాహార్తి తీర్చేందుకు.. దెబ్బతిన్న బసాపురం నీటి కుంటలో ఒకవైపు మరమ్మతు పనులు, మరోవైపు నీటి పంపింగ్ ప్రక్రియ సమాంతరంగా జరుగుతున్నాయి.

రోజు ఎల్లెల్సీ కాలువ నుంచి ఐదు 100 హెచ్‌పీ మోటార్ల ద్వారా వంద మిలియన్ లీటర్ల నీటిని బసాపురం నీటి కుంటకు పంప్ చేస్తున్నారు. ప్రస్తుతం 1200 మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యం ఉంది. కాలువకు నీరు నిలిచిపోయే సమయానికి 2100 మిలియన్ లీటర్ల నీటిని (దాదాపు 75 శాతం) నింపుకోవాలని భావిస్తున్నారు. మరోవైపు విస్తారంగా కురిసిన వానలతో రాంజల చెరువులో 900 మిలియన్ లీటర్ల నీటి నిల్వతో నిండుకుండలా ఉంది. బసాపురం, రాంజల చెరువుల నీటి నిల్వలు కలిపితే 3000 మిలియన్ లీటర్లు ఉంటుంది. దీంతో మూడు, నాలుగు నెలల పాటు పురప్రజలకు నీరందించ వచ్చని అంచనా. ఇక మధ్యలో వేసవి దాహార్తి తీర్చేందుకు కొన్ని రోజుల పాటు దిగువ కాలువకు నీరు వదిలే అవకాశముందని అధికారులు అంటున్నారు. అప్పుడు మరింత నీరు పంపింగ్ చేసుకునే వీలుంటుందని భావిస్తున్నారు.

బసాపురం నీటి కుంటలో పంపింగ్

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

మరోవైపు వార్డుల్లో చేతి పంపులు, మినీ నీటి ట్యాంకులు అందుబాటులో ఉన్నాయి. 42 వార్డుల్లో 150 చేతి పంపులు, 190 వరకు మినీ ట్యాంకులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కొన్ని మరమ్మతుకు గురయ్యాయి. వాటిని వినియోగంలోకి తేవాలని భావిస్తున్నారు. అవసరమైతే నీటి పొదుపు కోసం, సరఫరాలో ఓ రోజు పెంచే దానిపై సమాలోచనలు చేస్తున్నారు. ఇక జిల్లా అధికారులకు నీటి సమస్యలను వివరించి, ప్రత్యేకంగా గ్రాంటు విడుదలకు ప్రణాళిక చేస్తున్నారు. వీటి ద్వారా నీటి ట్యాంకర్లు సమకూర్చుకోవడం, యంత్రాలు, పంపింగ్, మరమ్మతులు, గొట్టాల నిర్మాణాలు వంటివి చేపట్టాలను కుంటున్నారు.

## కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎరువులు, యూరియా నిల్వలు ఉన్నా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే దుకాణ యజమానులపై చర్యలు తీసు

దుకాణం ఆవరణలో ధరల పట్టికను పరిశీలిస్తున్న అధికారులు

కుంటామని పత్తికొండ వ్యవసాయ సహాయ సంచాలకులు మోహన్‌విజయ్‌కుమార్ హెచ్చరించారు. పత్తికొండలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం తనిఖీ చేసి ధరల పట్టికలు పరిశీలించారు. ఆయన వెంట ఏవో వెంకటరాముడు ఉన్నారు.

దేవనకొండ: ఎరువుల దుకాణదారులు ధరల పట్టికను ఏర్పాటు చేయాలని పత్తికొండ ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, ఏవో ఉషారాణి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం వారు తనిఖీ చేశారు. దుకాణదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు రంగన్న, మల్లి పాల్గొన్నారు.

## లీకేజీలు కానరాకున్నాయి

మద్దికెరలో పైప్‌లైన్ లీకేజీలు సర్వసాధారణమయ్యాయి. మద్దికెర బస్టాండు నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో నీటిపథకం పైపులు పగిలిపోయి నెలలు గడుస్తున్నా వాటికి మరమ్మతులు చేయలేదు. దీంతో నీరు నిలిచి గుంతలు ఏర్పడ్డాయి. ఇదే మార్గంలో అధికారులు, పాలకులు తిరుగుతున్నా వారికి పట్టడం లేదంటూ గ్రామస్థులు విమర్శిస్తున్నారు. – న్యూస్‌టుడే, మద్దికెర

## 4 కి.మీ ప్రయాణం.. నరకప్రాయం

మండలంలోని తిమ్మాపురం రహదారి కంకర తేలి అధ్వానంగా మారింది. నేమకల్లు నుంచి తిమ్మాపురానికి 4 కి.మీ దూరం ఉండగా గ్రామానికి చేరేందుకు అరగంట సమయం పడుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మించిన 23 ఏళ్లు కావడంతో అధ్వానంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చిప్పగిరి

## భూ పత్రాలతో హాజరు కావాలి

హొళగుంద, న్యూస్‌టుడే: రీ సర్వే గ్రామ సభలకు రైతులు భూమి పత్రాలతో హాజరై అధికారులకు సహకరించాలని సర్వేయర్లు శ్రీనివాసులు నాయక్, మౌనేష్ ఆచారి, సురేంద్ర, నాగరాజు, సునీల్ కోరారు. హొళగుంద మండలం ఎల్లార్తి, చిన్నహ్యాట గ్రామాల్లో సర్పంచిలు చాముండేశ్వరి, హేసన్ అధ్యక్షతన సోమవారం రీ సర్వేపై గ్రామ సభ, అవగాహన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. భూ సర్వేలో అధికారులకు సమస్యలను తెలిపితే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రహ్లాద, గ్రామస్థులు పాల్గొన్నారు.

చిన్నహ్యాటలో అవగాహన ర్యాలీ చేపడుతున్న అధికారులు

దేవనకొండ, న్యూస్‌టుడే: రీ సర్వేలో భాగంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమంలో అల్లదుడకల, నల్లచెలిమల, గుండ్లకొండ గ్రామ రెవెన్యూలకు సంబంధించిన అర్జీలను ఆర్ఐలు భాస్కర్, రవి స్వీకరించారు. మొత్తం 299 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు సుదర్శనం తెలిపారు. మంగళవారం పి.కోటకొండ, చెల్లి చెలిమల రెవెన్యూలకు సంబంధించిన అర్జీలను స్వీకరిస్తామన్నారు.

## రంగనాథస్వామికి ఛత్రం బహూకరణ

ఆలయ ప్రధాన అర్చకునికి ఛత్రం అందిస్తున్న భక్తుడు

పెరవలి (మద్దికెర), న్యూస్‌టుడే: మండలంలోని పెరవలి రంగనాథస్వామి వారి వైకుంఠ ఏకాదశి రోజున స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవానికి వినియోగించే నూతన ఛత్రం(గొడుగు)ను భక్తులు సమర్పించారు. గ్రామానికి చెందిన సురేశ్ సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు కొమండూరి రంగనాథచార్యులకు అందజేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు.

మద్దికెర, న్యూస్‌టుడే: పెరవలిలో భూదేవి, రాజ్యలక్ష్మి సమేతుడైన రంగనాథస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. ధనుర్మాస పూజల్లో భాగంగా భక్తులు సోమవారం వేకువజాము నుంచే భారీగా తరలివచ్చారు.

## సామూహిక పఠన పూజలు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం సామూహిక పఠన పూజలు నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని విష్ణుసహస్ర నామావళి, లక్ష్మి అష్టోత్తరం, గోదాదేవి, గోవింద నామాలను సామూహికంగా పఠించి, భజనలు చేశారు. అంతకుముందు ఆలయ ఆవరణంలో లక్ష్మీరంగనాథస్వామి విగ్రహాలను ఊరేగించారు.

సామూహిక పఠనం చేస్తున్న భక్తులు

## వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పూర్తి

ఆధ్యాత్మికం

వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం వివిధ ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చే భక్తులను క్యూలైన్లలో పంపేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని, ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. – న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం, ఆదోని సాంస్కృతికం

అలంకరణలో స్వామివారు

## వైభవంగా నరసింహస్వామి రథోత్సవం

హోసూరు(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని హోసూరు నరసమ్మ తోటలో వెలసిన యోగి నరసింహస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆరాధనోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఉత్సవ మూర్తిని రథంలోకి చేర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య రథోత్సవం ఘనంగా సాగింది. హోసూరు, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రథోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. పత్తికొండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తుల భజనల మధ్య సాగుతున్న స్వామి రథోత్సవం

# ముట్టడీ

చేతులు ఎత్తి మొక్కి విన్నవిస్తున్న గ్రామస్థులు

ఆదోని ఎస్కేడీ కాలనీ, ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాలను విలీనం చేయొద్దంటూ మండలంలోని 16 గ్రామాల ప్రజలు సోమవారం ఆందోళన ఉద్ధృతం చేశారు. పట్టణంలో ప్రధాన రహదారిపై బైఠాయించడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్ బయటకు వచ్చి వినతిపత్రం స్వీకరించి మాట్లాడకుండా వెళ్లిపోవడంతో పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆయన బయటకు వచ్చి ఈ అంశాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు బసాపురం రామస్వామి, మదిరె వీరేశ్, వెంకటేశుచౌదరి, ప్రసాద్, సుజ్ఞానమ్మ, మల్లికార్జున, విరూపాక్షి, మణెమ్మ, మల్లి, చంద్ర, నారాయణ, రాఘవేంద్రరెడ్డి తదితరులు మాట్లాడుతూ.. తమ గ్రామాలను విలీనం చేస్తే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

● పెద్దహరివాణం మండల సాధన సమితి నాయకుడు ఆదినారాయణరెడ్డి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో నిలబడి ఉండడాన్ని గుర్తించిన 16 గ్రామాల ప్రజలు ఆయన వద్దకు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ క్రమంలో దాడికి యత్నించగా పక్కనే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన నేపథ్యంలో 16 గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. దుకాణాలను మూసివేసి మద్దతు తెలిపారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత ఆధ్వర్యంలో పట్టణ సీఐలు రామలింగమయ్య, అబ్దుల్ గౌస్, రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

పట్టణంలోని ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

## రాష్ట్ర స్థాయిలో ఆలూరు విద్యార్థుల ప్రతిభ

ఎస్పీడీ శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు తీసుకుంటున్న విద్యార్థులు

ఆలూరు గ్రామీణం, హాలహర్వి, న్యూస్‌టుడే: ఆలూరు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో విద్యార్థులకు నైపుణ్యం పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు రెండోస్థానంలో నిలిచారు. ఒకేషనల్ ఐటీఐ ఉపాధ్యాయుడు ప్రకాశ్ పర్యవేక్షణలో విద్యార్థులు గౌతమి, చంద్రకళ, మహమ్మద్ ఆజాం కలిసి తయారు చేసిన 'స్మార్ట్‌సిటీ విత్ స్మార్ట్ హౌస్ డ్రైనేజ్ మానిటరింగ్ సిస్టం' ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. దీంతో ఎస్పీడీ శ్రీనివాసరావు చేతులు మీదుగా నగదు బహుమతి అందుకున్నారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## వాలీబాల్ క్రీడాకారిణికి అభినందన

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పట్టణంలోని నేషనల్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.ఎం.రితిక ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ తెలిపారు. అండర్-17 వాలీబాల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థిని, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, గోవిందరాజులను అభినందించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

మాట్లాడుతున్న జనసేన మండల కన్వీనరు అరవింద్

## ఆలూరు అభివృద్ధికి పాటుపడుతాం

ఆస్పరి, న్యూస్‌టుడే: జిల్లాలో వెనుకబడిన ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతామని జనసేన మండల కన్వీనరు అరవింద్, కురవ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆస్పరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెంకప్ప నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజా సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు విశ్వనాథ్, మహేష్, వినోద్, హనుమేష్, మంజునాథ్, నరేష్, నాగరాజు పాల్గొన్నారు.

దేశ నాయకుల వేషధారణల్లో చిన్నారులు

## ఘనంగా హిందూ సమ్మేళనం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక రాజరాజేశ్వరి దేవాలయంలో సోమవారం హిందూ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వెల్దుర్తి సంఘ్ ప్రముఖ్ చిన్నబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో భాజపా మండల అధ్యక్షురాలు శాంతి, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షులు హరిసింహనాయుడు మాట్లాడారు.

## సహకార సంఘం ఛైర్మన్‌గా రాజశేఖర్

దేవనకొండ: మండల సహకార సంఘం ఛైర్మన్‌గా పల్లెదొడ్డి గ్రామానికి చెందిన ఈడిగ రాజశేఖర్‌ను నియమిస్తూ నియామక ఉత్తర్వులు వచ్చినట్లు తెదేపా మండల కన్వీనర్ విజయ్, మాజీ సర్పంచి ఉచ్చీరప్ప అన్నారు.

## సంక్షిప్త సమాచారం

పత్తికొండ గ్రామీణం: రేషన్ డీలర్లు వృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరకులు అందజేయాలని భాజపా నియోజకవర్గ కో-కన్వీనర్ గోవర్ధన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు తీసుకోవాలంటూ పార్టీ మండల కన్వీనర్ కరణం నరేశ్‌తో కలిసి ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

పత్తికొండ గ్రామీణం: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదల కడుపు కొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. పత్తికొండ చదువుల రామయ్య భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆలూరు గ్రామీణం: ఇకపై మండలంలో రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా రెవెన్యూ సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలన్నదే ధ్యేయమని ఆలూరు తహసీల్దారు శోభా సువర్ణమ్మ అన్నారు. సోమవారం ఆలూరు తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు.

ఆలూరు గ్రామీణం: బుధవారం నుంచి విశాఖలో నిర్వహించే సీఐటీయూ అఖిలభారత మహాసభలకు కార్మికులు తరలిరావాలని ఆ సంఘం జిల్లా నాయకులు దివాకర్, గోపాల్ పిలుపునిచ్చారు. చైతన్యప్రచార భేరిలో భాగంగా చేపట్టిన జీపుజాత సోమవారం ఆలూరుకు చేరుకుంది.

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు చూపించాలని ధర్నా చేపట్టారు. ఆదోని పట్టణం 16వ వార్డు ప్రజలు 250 మంది రూ.2100 డీడీ చెల్లించారన్నారు. అనంతరం తహసీల్దారు శేషఫణికి వినతి పత్రం అందజేశారు.

ఆస్పరి: ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు కోసం రూ.2.50 లక్షలు అడిగారంటూ అనవసర ఆరోపణలు చేయడం తగదని ఎంపీడీఓ గీతావాణి, ఈఓఆర్డీ అనసూయ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. పలు కూరబండను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదనకోసం రాగా అప్పటికే గడువు ముగిసిందని వారికి తెలిపామని చెప్పారు.

వెల్దుర్తి: మండలంలో పౌరహక్కుల దినోత్సవం ఏర్పాటు చేయాలంటూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు దాదిపోగు నవీన్ సోమవారం పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందించారు.

తుగ్గలి: గుంతకల్లు నుంచి నంద్యాల వైపు కొత్తగా పట్టాలు ఎక్కనున్న రైళ్లను తుగ్గలి రైల్వే స్టేషన్‌లో నిలపాలని భాజపా మండల అధ్యక్షుడు లక్ష్మన్న, తుగ్గలి గ్రామస్థులు సోమవారం రైల్వే స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

## ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండలం మేదేహాల్ గ్రామ శివారులో 167వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన నాగరాజు, విఠల్ తమ కారులో బెంగళూరుకు వెళ్తుండగా బళ్లారి వైపు నుంచి ఎదురుగా వస్తున్న బస్సు ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వారు సీటు బెల్టు ధరించడంతో చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. ఎలాంటి ప్రాణాపాయం సంభవించకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో కారు నుజ్జవగా బస్సు దెబ్బతింది. పోలీసులు విచారణ చేపట్టారు.

## సర్పంచి మృతికి నివాళి

హొళగుంద: మండలంలోని మార్లమడికి గ్రామ సర్పంచి పెద్ద యంకప్ప (84) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పలువురు అధికారులు, గ్రామపెద్దలు ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు.


పెద్ద యంకప్ప (పాత చిత్రం)

# ఆలోచన మెరిసి.. ఆదాయంతో మురిసి

☛ కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న మహిళలు

ఆలూరు గ్రామీణం, హాలహర్వి, న్యూస్‌టుడే: ఆ మహిళలు అందరిలా కాకుండా రొటీన్‌గా భిన్నంగా ఆలోచించారు. చేస్తున్న పనిలో ఆధునికతను జోడించారు. దీంతో కుటుంబానికి తోడుగా ఉంటూనే ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. సాంకేతికత అందిపుచ్చుకుని ముందుకు సాగుతున్న గ్రామీణ మహిళలపై కథనం.

### ఆధునిక యంత్రాలను తీసుకువచ్చి...

ఈ మహిళ పేరు ఉమామహేశ్వరి. ఆలూరు పట్టణానికి చెందిన ఈమె పొదుపు మహిళా గ్రూపులో సభ్యురాలు. తను నేర్చుకున్న కుట్టుమిషన్‌లో ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని మంచి నైపుణ్యం సాధించారు. బ్యాంకు రుణం తీసుకుని ఆధునిక మిషన్లను కొనుగోలు చేశారు. ఒక్కోటి రూ.4.80 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విలువ ఉంటుంది. చీరలు, జాకెట్లపై అందమైన డిజైన్‌లు వేస్తూ ఒక్కో దానికి రూ.500 నుంచి రూ.5 వేల వరకు తీసుకుంటున్నట్లు చెప్పారు. రోజుకు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. నెలకు రూ.50 వేల వరకు ఆర్జిస్తున్నారు. సంపాదించిన సొమ్ముతో బ్యాంకు రుణం చెల్లిస్తూనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఏడాదిగా బొటిక్ కూడా నడుపుతున్నట్లు తెలిపారు.

### రొట్టెలను తయారు చేస్తూ...

హాలహర్వి మండలం విరుపాపురానికి చెందిన ఈ మహిళ పేరు హేమావతి. ఈమె కూడా పొదుపు మహిళ. వారి బంధువులొకరు రొట్టెల తయారీ యంత్రం నడుపుతుంటం చూసి తాను స్ఫూర్తి పొందారు. అనుకున్నదే తడువుగా పొదుపు ద్వారా రుణం తీసుకోవాలని అధికారులను సంప్రదించారు. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద రూ.1.80 లక్షలు రుణం తీసుకున్నారు. ఇందులో 35 శాతం రాయితీ రూ.63,000 పోగా మిగిలిన మొత్తాన్ని కంతుల ద్వారా చెల్లించాలి. మిషన్ ప్రారంభమైనప్పటి నుంచి రోజుకు 500 నుంచి 700 రొట్టెలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. సగటున రోజుకు వెయ్యి రూపాయల ఆదాయం గడిస్తున్నట్లు చెప్పారు. మొత్తం ఖర్చులు పోను నెలకు రూ.18 వేల వరకు ఆదాయం వస్తోందన్నారు. వారికి ఉన్న వ్యవసాయ భూమిలో పనులు చేసుకుంటూనే అదనపు ఆదాయం గడిస్తున్నారు.

(c) eenadu

# ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

## ఘనంగా అయ్యకొండ కిస్తి

కిస్తి కోసం గుమికూడిన భక్తులు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పొన్నకల్లు గ్రామంలో గల అయ్యకొండ మీద ఉన్న హజరత్ సయ్యద్‌షా ఖాజమిన్నల్లా హుసేనివలిచిస్తీస్వాముల వారి కిస్తి సోమవారం ఘనంగా నిర్వహించారు. దర్గాను పూలు, వస్త్రాలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. ఉరుసుకు మండలంలోని గ్రామాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దర్గా పీఠాధిపతుల ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు.

## రెవెన్యూ సదస్సుకు 120 దరఖాస్తులు

సి.బెళగల్, న్యూస్‌టుడే : సి.బెళగల్ తహసీల్దారు కార్యాలయంలో సోమవారం వెంకటలక్ష్మీ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పోలకల్, కొండాపురం గ్రామాల్లోని రైతులు 120 దరఖాస్తులు సమర్పించారు. భూముల సర్వేనెంబర్లు రెవెన్యూ సిబ్బందితో విచారించి పరిష్కరిస్తామని తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

నందవరం, న్యూస్‌టుడే: ?: ఎమ్మిగనూరు-మంత్రాలయం జాతీయ రహదారి 167 డివైడర్‌కు, రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. తొలగించాలి. - రామకృష్ణ, వాహచోదకుడు

✔: కంపచెట్లు తొలగించేలా సంబంధిత అధికారులకు తెలియజేస్తాం. - ఎంపీడీవో పుల్లయ్య నందవరం మండలం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని చిన్నకడబూరు గ్రామంలో మురుగు కాల్వలు శుభ్రం చేయాలి. - గ్రామస్థులు, చిన్నకడబూరు

✔: గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. - ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ఖానాపురం వెళ్లే దారిలో ఎస్సీ కాలనీలో మురుగు కాలువల శుభ్రం చేయడం లేదు. రాత్రి పూట దోమల బెడద ఎక్కువైంది. - కిరణ్, స్థానికుడు

✔: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. - రాఘవేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్

## అవార్డు గ్రహీతకు సన్మానం

శివానిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా శివాని అందుకోవడం ఎంతో గర్వంగా ఉందని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పద్మావతి పేర్కొన్నారు. నవోదయలో సోమవారం క్రీడాకారిణి శివానికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివానికి సొంతంగా రూ.24వేలు సాయం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, బసవరాజుతదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమాజాన్ని చైతన్యపరచాలి

మాట్లాడుతున్న పీఠాధిపతి సుబ్రహ్మణ్యం

పోలకల్(సి.బెళగల్),న్యూస్‌టుడే: హిందూ సమాజాన్ని చైతన్య పరచి భారత్‌ను విశ్వగురువుగా నిలపాలని శ్రీలలితా పీఠం పీఠాధిపతి గురుసుబ్రహ్మణ్యం స్వాములు, గురుస్వామి రామాంజినేయులు పేర్కొన్నారు. పోలకల్‌లో సోమవారం సోమేశ్వరస్వామి ఆలయం సమీపంలో సర్వజ్యోతి పీఠాధ్యక్షుడు వి.రాజయ్య స్వామి అధ్యక్షతన హిందూ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో బొమ్మిరెడ్డి పల్లెపూడూరు లక్ష్మీరెడ్డి, పోలకల్ ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు

## రుణాలు.. స్వయం ఉపాధికి సోపానాలు

○ పొదుపుతో మహిళల రాణింపు

ఎమ్మిగనూరు, కోడుమూరు న్యూస్‌టుడే: మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. బ్యాంకులు రాయితీతో రుణాలు అందిస్తున్నాయి. ఈ మేరకు ఎమ్మిగనూరు పురపాలక సంఘం పరిధితో పాటు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలో పలు ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు వ్యాపారాల్లో రాణిస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళల విజయగాథపై న్యూస్‌టుడే అందిస్తున్న ప్రత్యేక కథనం

### 7600 గ్రూపులకు లబ్ధి

ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో దాదాపు 7600 పొదుపు గ్రూపుల్లో దాదాపు 76వేల మంది మహిళ సభ్యులు ఉన్నారు. ప్రతి గ్రూపు సభ్యులకు బ్యాంకు రుణాలు, రాయితీ కింద దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. ఈ ఏడాది బ్యాంకుల ద్వారా దాదాపు రూ.250 కోట్లు రుణాలు పంపిస్తున్నారు. చీరలు, పట్టు మగ్గాలు, కిరాణం అంగళ్లు, ఫినాయిల్ ఇతర వ్యాపారుల్లో రాణిస్తున్నారు. నిత్యం వ్యాపారంలో కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. గ్రామీణ ప్రాంతాల్లో పొట్టేలు, పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారు.

### నెలకు రూ.20 వేల వరకు ఆదాయం

పర్వీన్, ఎమ్మిగనూరు

కుటుంబానికి ఆసరాగా ఉండాలని ఉద్దేశంతో పొదుపు గ్రూపులో చేరాను. ముందుగా చిన్న అంగడిలో జూట్ బ్యాగ్‌లు తయారీ ప్రారంభించాను. కొన్ని రోజులు పాటు స్వయంగా చిన్నచిన్న బ్యాగ్‌లు తయారు చేశాను. పొదుపులో రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకొని వ్యాపారాన్ని ప్రారంభించాను. ప్రస్తుతం జూట్ బ్యాగులకు విపరీతంగా గిరాకీ పెరిగింది. దీంతో దిల్లీ, ముంబయి, హైదరాబాద్ నుంచి బ్యాగులను తెచ్చుకుని స్థానికంగా విక్రయిస్తున్నాను. ఒక్కొక్క బ్యాగ్ కనీసం రూ.200 నుంచి రూ.800 దాక ఉంటోంది. ఆన్‌లైన్‌లోనూ విక్రయిస్తున్నాను. నెలకు కనీసం రూ.20 వేలు ఆదాయం వస్తోంది.

### కుటుంబానికి ఆసరాగా

లలితమ్మ, చనుగొండ్ల

కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు చిన్న కొట్టు ఏర్పాటు చేసుకున్నా. దీంట్లో ఇంటి అవసరాలకు ఉపయోగపడే సరకులు, చిన్న పిల్లల తినుబండారాలు విక్రయిస్తూ నెలకు దాదాపుగా రూ.15వేల నుంచి రూ.20 వేలకు సంపాదిస్తున్నా. గ్రామానికి చెందిన మరొక మహిళా పొదుపు మహిళ సురేఖ సంఘంలో గత కొన్నేళ్లుగా సభ్యురాలిగా ఉన్నారు. ఆమెకు ఇటీవల రూ.75వేలు సున్నా వడ్డీ కింద రుణం మంజూరు అయింది. దీంతో చిన్న కొట్టు ఏర్పాటుకు సహకారం అందింది. బ్యాంకు లింకేజీ రుణం కింద రూ.లక్ష తక్కువ వడ్డీకి మంజూరు చేయడంతో దుకాణంలో సరుకులు కొనుగోలు చేశారు. రూ.10వేల నుంచి రూ.12 వేలు ఆమెకు మిగులుతోంది.

## చెత్త కుప్పల తొలగింపు

స్పందనకు వందనం

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి మండలం గౌడగల్లు గ్రామంలో చెత్త కుప్పలు, వ్యర్థ పదార్థాలు, కాలువల్లో మురుగు పేరుకుపోయి అధ్వానంగా మారింది. దీనిపై ఈనెల 28న 'ఈనాడు'లో 'చెత్త కుప్పలు.. ప్రజలకు తిప్పలు' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్యస్వామి, గ్రామ పంచాయతీ కార్యదర్శి అయ్యస్వామి, సర్పంచి శివమ్మ స్పందించి గ్రామంలోని చెత్తకుప్పలు వ్యర్థ పదార్థాలు, కాలువల్లో మురుగు తదితర వాటిని తొలగించారు.

## మురుగు కూపం.. దుర్గంధ భరితం

కోడుమూరు పట్టణంలోని స్థానిక సుందరయ్య నగర్ సమీపంలో ఈ దృశ్యం అపరిశుభ్రతకు అద్దం పట్టేలా ఉంది. గత కొన్నేళ్లుగా కోడుమూరు-ఆదోని ప్రధాన రహదారి పక్కనే దారివెంట మురుగునీటి కాల్వ ఏర్పాటు చేయకపోవడంతో ఇలా మురుగంతా ఓ ఇంటి స్థలంలోని మడుగును తలపించేలా నిల్వ ఉంది. స్థానిక గ్రామ పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కోడుమూరు.

## నిధులు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు

పట్టణంలోని బస్టాండు ఎదురుగా పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఎన్‌ఏపీ అతిథి గృహం శిథిలావస్థకు చేరింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన అతిథి గృహం నిర్వహణ లేక కార్యాలయం తలుపులు, కిటికీలు, ఫర్నీచర్ చెదలు పట్టిపోయాయి. ప్రస్తుతం అతిథి గృహాన్ని సామగ్రి నిల్వ ఉంచుకునే స్టోర్‌గా వినియోగిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

## లీకేజీలు నిత్యం.. తాగునీటికి కష్టం

కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో సంత బజారులో మురుగు కాలువలో తాగునీటి కుళాయి పైపు లీకేజీ కావడంతో అక్కడ నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. గ్రామంలోని ప్రజలు ఈ నీటిని తాగడం వల్ల రోగాలు వచ్చే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మంత్రాలయం గ్రామీణం(కౌతాళం)

## సిబ్బంది లేక.. సమస్యలు తీరక

పెద్దకడబూరులోని ఒకటో గ్రామ సచివాలయంలో సోమవారం సిబ్బంది లేక వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంబంధిత అధికారులకు సమస్యలను విన్నవిద్దామని వస్తే మధ్యాహ్నం 1.30 గంటల సమయానికి ఒక్కరూ లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. చాలా మంది పదోన్నతి, బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో కేవలం వెల్ఫేర్, మహిళా పోలీసు మాత్రమే ఉన్నారు. సోమవారం వెల్ఫేర్ ఉద్యోగి సెలవులో ఉండగా, మహిళా పోలీసు విధి నిర్వహణలో భాగంగా బయటికి వెళ్లడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. - న్యూస్‌టుడే, పెద్దకడబూరు

## ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరం సందర్భంగా డిసెంబరు 31న అర్ధరాత్రి వేళలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రాలయం సీఐ రామాంజులు హెచ్చరించారు. డీజేలు, టపాసులు కాల్చడం నిషిద్ధమన్నారు. యువత మద్యం మత్తులో వాహనాలు నడపడం, రహదారులను బ్లాక్ చేసి వేడుకలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

## హిందువులపై దాడులు గర్హనీయం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు గర్హనీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కాశీంవలి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఓ వ్యక్తిపై దాడి చేసి హత్య చేయడం దారుణమన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు షబ్బీర్, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నాలుగు గ్రామాల రైతులకు ప్రత్యేక రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. కల్లుకుంట, జాలవాడి, కంబదహాళ్, కంబళదిన్నె గ్రామాల నుంచి ముగ్గురు రైతులు రీ సర్వేలో తమ పట్టా భూములు ప్రభుత్వ భూములుగా మారడంతో తిరిగి పట్టా భూములుగా మార్చాలంటూ అర్జీలు సమర్పించినట్లు తహసీల్దారు గీతాప్రియదర్శిని తెలపారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లుకుంట గ్రామం వద్ద సూగూరు కాల్వ వంతెనపై ప్రమాకర రంధ్రం ఏర్పడింది. ఇక్కడ రాత్రిపూట ప్రయాణికులు ప్రమాదంలో చిక్కుకొక తప్పదు. సంబధిత అధికారులు స్పందించి రంధ్రాన్ని పూడ్చి వేయాలని కోరుతున్నారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలో పాడి పశువుల పెంపకంపై ఆసక్తి ఉండే రైతులకు బ్యాంకు ద్వారా రుణం పొందే అవకాశం ఉంది. ఆసక్తి గల రైతులు బ్యాంకు ఖాతా, ఆధార్, పాస్‌ఫొటోలు, రేషన్ కార్డు జిరాక్సులతో సంబంధిత గ్రామా సచివాలయాల్లో సంప్రదించాలని మండల పశు వైద్యాధికారి దినాకర్ తెలిపారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొని నూతన ఆలోచనలను ఆవిష్కరించాలని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం విద్యార్థులు వివిధ ప్రదర్శనలు ఇచ్చారు. సుధాకర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటనరసింహారెడ్డి, వీరేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : నాలుగు మండలాల్లో యూరియా అవసరం మేరకు అందుబాటులో ఉందని సోమవారం ఏడీఏ ఎస్.మహమ్మద్‌ఖాద్రీ తెలిపారు. ఎమ్మిగనూరులో 1856టన్నులు, గోనెగండ్లలో 411టన్నులు, నందవరంలో 212టన్నులు, మంత్రాలయంలో 242టన్నులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందనవసరం లేదన్నారు.

## ఎమ్మిగనూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

రాఘవేంద్రస్వామి విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఐకాస నాయకులు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఐకాస నాయకులు డిమాండు చేశారు. మంత్రాలయంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. రాఘవేంద్రస్వామి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఐకాస నాయకులు మాట్లాడుతూ..ఎమ్మిగనూరును జిల్లా చేసేంతవరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఐకాస నాయకులు రాజేష్, చిన్నిప్రసాద్, చార్లెస్, రంగయ్య పాల్గొన్నారు.

## రూ.14.92 కోట్లతో బడ్జెట్ ఆమోదం

గూడూరు, న్యూస్‌టుడే : నగరపంచాయతీ పాలకమండలి, అధికారుల సమన్వయంతో 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.14.92 కోట్ల అంచనతో వార్షిక బడ్జెట్‌కు ఆమోదం లభించింది. నగరపంచాయతీ కార్యాలయంలో ఛైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిషనర్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వార్షిక బడ్జెట్ సమావేశంలో ఉప ఛైర్మన్ అస్లాం, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. రూ.11 కోట్ల అంచనాలతో ఆరంభమై సవరణలతో రూ.14.92 కోట్లు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో మూల ధన రాబడి రూ.6 కోట్లు కాగా సాధారణ నిధులు రూ.3.17 కోట్లు మిగిలిన రూ.5.75 కోట్లు నీటి సరఫరా, పట్టణ ప్రణాళిక విభాగాల నుంచి వస్తాయని లెక్క చూపారు. ప్రజారోగ్యం, విద్యుత్తు నిర్వహణ, నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగాల నిర్వహణ ఖర్చులు, కమ్యునికేషన్, విద్య, పట్టణ ప్రణాళిక, కార్యాలయం నిర్వహణ ఖర్చులు చూస్తే సుమారు రూ.16 కోట్లపైగా వచ్చే అవకాశం ఉంది. కేవలం కార్మికుల వేతనాలు రూ.1.34 కోట్ల చెల్లించాల్సి ఉంది.

## ఒప్పంద కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరు, గూడూరు, గోనెగండ్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు గోపాల్, దివాకర్‌లు డిమాండ్ చేశారు. గూడూరులోని పాత ఆర్టీసీ బస్టాండు కూడలిలో సోమవారం జీపుజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేది వరకు విశాఖపట్టణంలో జరిగే 18వ సీఐటీయూ అఖిలభారత మహాసభల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి మోహన్, నాయకులు ప్రభాకర్, హుసేనయ్య కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

## పాసు పుస్తకాల్లో తప్పులపై విచారణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టాదారు పుస్తకాల్లో తప్పులపై దరఖాస్తులు తీసుకొని విచారణ చేపడతామని రెవెన్యూ స్పెషల్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం వివిధ గ్రామాలకు చెందిన పట్టదారు పుస్తకాల్లో తప్పులపై రైతులు ఫిర్యాదు చేశారు. ఈనెల 31వ తేదీ వరకు అన్నీ గ్రామాలకు చెందిన రైతులు ఫిర్యాదు చేయాలన్నారు. ఇప్పటి వరకు భూ సమస్యలపై దాదాపు వంద దరఖాస్తులను వచ్చాయన్నారు. వీటిని విచారణ జరుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## శక్తియాప్‌తో మహిళలకు రక్షణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : మహిళల రక్షణ కోసం ప్రభుత్వం శక్తియాప్‌ను రూపొందించిందని స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని శక్తిటీం సభ్యులు ఏఎస్ఐ నటరాజ్ అన్నారు. మహాయోగిలక్ష్మమ్మ అవ్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. నటరాజ్ మాట్లాడుతూ మహిళలకు భద్రత, నమ్మకం కలిగించే డిజిటల్ యాప్ అన్నారు. ప్రమాదంలో ఉన్నప్పుడు ఒక క్లిక్ చేస్తే పోలీసులకు సమాచారం చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మహబూబ్ బాషా, మద్దిలేటి, కిరణ్‌కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తిటీం ఏఎస్ఐ

## మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ అప్రూవల్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : పురపాలక సంఘంలో పరిశ్రమలు, దుకాణాలు, వాణిజ్యం, గృహాలు నిర్మించుకునేందుకు మాస్టర్ ప్లాన్ అప్రూవల్‌ను తెలిపినట్లు పురపాలక కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా జీవో విడుదల చేసిందన్నారు. జీవో ప్రకారం పట్టణం 38.73 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంటుందన్నారు.

## పదిలో ఉత్తీర్ణత పెంచేందుకు కృషి చేయండి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఏవో దస్తగిరి రెడ్డి

కోసిగి, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. డి.బెళగల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సలహాదారులుగా ఏవో వరప్రసాద్‌ను నియమించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై పర్యవేక్షణ అవసరం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమని పాఠశాల ప్రత్యేక అధికారి ఎంపీడీవో రాముడు సూచించారు. స్థానిక జీవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రామచంద్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆదోని జిల్లాగా ప్రకటించాలి

నందవరం, న్యూస్‌టుడే: వెనుకబడిన పశ్చిమ ప్రాంతాభివృద్ధి ఆదోని జిల్లాతోనే సాధ్యమంటూ నందవరం మండలం కనకవీడు జడ్పీ పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కాకే వెంకటేశప్ప ఒక కార్టూన్‌ను చిత్రీకరించారు. ఆదోని డివిజన్ నైసర్గికంగా, రాజకీయంగా, చారిత్రకంగా గొప్ప చరిత్ర కలిగిన ప్రాంతమైనా, ఇంతవరకు అభివృద్ధికి నోచుకోలేదన్నారు.

## ఆలయాల ముస్తాబు

కృష్ణదొడ్డి, సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని సి.బెళగల్, కృష్ణదొడ్డి గ్రామాల్లో ప్రముఖ వైష్ణవ క్షేత్రాలుగా ప్రసిద్ధిగాంచిన రంగనాథస్వామి, కోన వెంకటేశ్వరస్వామి ఆలయాలను సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆయా ఆలయాల నిర్వాహకులు ముస్తాబు చేశారు.

## వైభవంగా పక్కీరప్పస్వామి ఉరుసు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని నెరుడుప్పల గ్రామంలో శ్రీపక్కీరప్పస్వామి ఉరుసు మహోత్సవం వైభవంగా జరిగింది. ముజావర్లు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి గంధం సమర్పించారు. మండలంలోని వివిధగా గ్రామాలకు చెందిన భక్తులు స్వామి అశ్వాన్ని దర్శించుకొన్నారు. తెదేపా వైకాపా మండల నాయకులు స్వామిని దర్శించుకున్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే : సేంద్రీయ వ్యవసాయంతో పండించిన కూరగాయలు ఆరోగ్యకరమైనవని ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ పద్మ అన్నారు. ఏడీఏ కార్యాలయం ముందు సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు.

## గోనెగండ్ల సీఐగా చంద్రబాబు

గోనెగండ్ల: గోనెగండ్ల పోలీసుస్టేషన్ సీఐగా చంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఆయన చెప్పారు. సీఐని మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు.

## బాలికలు.. క్రీడల్లో మెరికలు

◆ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

కోసిగి, న్యూస్‌టుడే: చాలా పాఠశాలల్లో క్రీడా మైదానం, సౌకర్యాలు ఉన్నా విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపరు. అలాంటిది కోసిగి కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు క్రీడా మైదానం లేకున్నా.. ఆటల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. వీరి ఆసక్తి గమనించిన వ్యాయామ ఉపాధ్యాయురాలు సుమ పాఠశాలలోని కొంత స్థలంలో ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, ఆట్య పాత్య, బాస్కెట్ బాల్, నెట్‌బాల్ క్రీడలపై శిక్షణ ఇస్తున్నారు. దీంతో ఈ విద్యార్థినులు మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. పాఠశాలలో 240 మంది విద్యార్థినులు ఉండగా.. దాదాపు 50 మంది వివిధ క్రీడల్లో రాణిస్తున్నారు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి క్రీడా మైదానం కోసం స్థలం కేటాయించాలని ఉపాధ్యాయ బృందం విజ్ఞప్తి చేసింది.

### క్రీడల్లో రాణిస్తా

కోసిగి మండలం సాతనూరు(కొట్టాల) గ్రామానికి చెందిన భాగ్యమ్మ, వెంకటేష్ దంపతుల కుమార్తె రాజేశ్వరి కేజీబీవీలో 9వ తరగతి చదువుతోంది. గతంలో కోసిగిలో నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందెంలో 2వ స్థానంలో నిలిచింది. రిలే క్రీడలో మొదటి స్థానం, ఖోఖోలో జిల్లా స్థాయిలో మూడు సార్లు ఆడి ప్రతిభ చూపింది. ఆట్య పాత్య క్రీడలో 2 సార్లు మండలానికి 3వ స్థానం రావడానికి విశేష కృషి చేసింది. ఆర్చరీ క్రీడలో మండలం తరపున ఆడి 2వ స్థానం గెలుచుకుంది. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు రావులపాలెంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంది. భవిష్యత్తులో ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమని ఆ విద్యార్థిని చెబుతోంది.

### ప్రజలకు సేవ చేస్తా

కౌతాళం మండలంలోని తోవి గ్రామానికి చెందిన వీరేష్, లక్ష్మి దంపతుల కుమార్తె అమృత. కోసిగి కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. లాంగ్ జంప్‌లో మండలం నుంచి 2 సార్లు 3వ స్థానంలో నిలిచింది. కబడ్డీలో మండలం నుంచి రెండు సార్లు ఆడి ప్రతిభ చూపింది. ఆట్యా పాత్య క్రీడలో మండలం తరుపున ఆడి 3వ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై అక్కడ పథకాలు సాధించింది. కర్నూల్ జట్టు తరుపున జాతీయస్థాయి క్రీడలో పాల్గొని గుర్తింపు తెచ్చుకుంది. భవిష్యత్తులో ఐపీఎస్ కొలువు సాధించి ప్రజలకు సేవ చేస్తా అంటోంది ఈ బాలిక.

## డ్రైవర్ అప్రమత్తత.. తప్పిన ప్రమాదం

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డీజిల్ ట్యాంకు లీకై డీజిల్ కారుతుండగా డ్రైవరు గుర్తించి అప్రమత్తమవడంతో ప్రమాదం తప్పింది. సోమవారం ఎమ్మిగనూరు నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని కర్నూలుకు వెళ్తున్న బస్సు పలు మార్లు మోరాయిస్తూ గోనెగండ్ల వరకు చేరింది. డ్రైవరుకు అనుమానం వచ్చి బస్సు దిగి బస్సును పరిశీలించగా డీజిల్ ట్యాంకు లీకై కారుతున్నట్లు గుర్తించాడు. దీంతో అక్కడే బస్సును ఆపేసి ప్రయాణికులను దింపి మరో ఆర్టీసీ బస్సులో ఎక్కించి పంపించారు.

## జూదరుల అరెస్టు

నందవరం, న్యూస్‌టుడే: నందవరం మండల పరిధిలోని రాయచోటి గ్రామంలో జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై తిమ్మారెడ్డి తెలిపారు. గురజాలకు వెళ్లే రహదారి సమీపంలో పాఠశాల పక్కన కంపచెట్లలో జూదం ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని దాడులు చేశారన్నారు. 10 మందిలో 6మందిని అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.8,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

In the Court of the Prl.Sr Civil Judge Kurnool
E.P.No- 210/2017 In O.S.No- 205/2017
B.Parameswara Reddy - D.Hr
-V/s-
M.Srinivasa Reddy - J.Dr
వేలం ప్రకటన
పై నెంబర్ E.P.లో D.Hr తనకు రావలసిన E.P. మొత్తంనకు గాను J.Dr తాలూకు షెడ్యూలు ఆస్తిని వేలంనకు తెచ్చినాడు. వేలం వాయిదా 30.01.2026 తేదీన ఉన్నది. సవాలు దారులు పై వేలం తేదీన పగలు 10.30 గం॥ నుండి జరిగే వేలంలో పాల్గొని సవాలు పాడవచ్చును.
షెడ్యూలు: కర్నూలు జిల్లా, కోడుమూరు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, వర్కూరు గ్రామములోని ఆస్తి వివరములు. Sy.No- 64/1 AC-4.65 Cents, సగర్తాల గడ్డ చేను. తూర్పు- పులకుర్తి రోడ్డు, పడమర: సూర్యనారాయణ రెడ్డి భూమి, ఉత్తరం: రామాంజనేయులు భూమి, దక్షిణం: యం.బసిరెడ్డి భూమి.
D.Hr విలువ- రూ॥ - 2,50,000/-
అమినా విలువ- రూ॥ - 15,00,000/-
మార్కెట్ విలువ- రూ॥ - 11,62,500/-
ప్రస్తుతం విలువ- రూ॥ - 13,95,000/-
కోర్టువారి ఉత్తర్వుమేరకు
సి.ప్రభాకర్ రెడ్డి, D.Hr పరం
అడ్వకేటు, కర్నూలు. Cell: 93938 22296.

# కర్నూలు

• కర్నూలు • పాణ్యం

## సైనిక కుటుంబాలకు అండగా నిలుద్దాం

కలెక్టర్ డా.సిరికి చెక్కు అందజేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులు, మాజీ సైనికుల కుటుంబాలకు అండగా నిలవాలని కలెక్టర్ డా.ఎ.సిరి పిలుపునిచ్చారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీల మెప్మా మహిళా సంఘాల తరఫున సాయుధ దళాల సంక్షేమ నిధికి సేకరించిన రూ.2 లక్షల విరాళం చెక్కును స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం పొదుపు మహిళలు కలెక్టర్‌కు అందజేశారు. మెప్మా పీడీ శ్రీనివాసులు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్నరూత్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు టి.పద్మ, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## విద్యుత్తు వినియోగదారులకు నాణ్యమైన సేవలు

కర్నూలు వెంకటరమణ కాలనీ: జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ ఆర్.ప్రదీప్‌కుమార్ చెప్పారు. సోమవారం డయల్ యువర్ ఎస్‌ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు పలువురు వినియోగదారులు ఫోన్‌చేసి తమ సమస్యలు చెప్పారు. ఎస్‌ఈ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. డీఈఈ కమర్షియల్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85000 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ?: నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ రోడ్డు నంబరు 21లో వీధిదీపాలు సరిగా వెలగడం లేదు. - **స్థానికులు**

?: ముజఫర్‌నగర్‌లోని వీధుల్లో మురుగు కాలువలు పూడిపోయాయి. శుభ్రం చేయాలి. - **నాగరాజు**

✔: వీధిదీపాలను బాగుచేస్తాం. కాలువలు శుభ్రం చేయిస్తాం. - **నగరపాలక అధికారులు**

## ప్రతిభా పోటీలు.. విజయానికి బాటలు

విజేతలకు బహుమతులు అందిస్తున్న అధ్యాపకులు

క్విజ్ పోటీల్లో టౌన్ మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ప్రతిభా పోటీలు విద్యార్థుల విజయాలకు బాటలు వేస్తాయని ప్రిన్సిపల్ పద్మావతి పేర్కొన్నారు. నగరంలోని టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం క్విజ్ పోటీలు జరిగాయి. రాజ్యలక్ష్మి, రుహి సఫియా, శ్రీలక్ష్మి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ప్రిన్సిపల్, అధ్యాపకులు జలగంగాధర్, సురేష్‌చంద్ర, రాజనాయక్, తదితరులు బహుమతులు అందజేశారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర విద్యానికేతన్ (ఆర్‌వీఎన్ స్కూల్) విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం.శశాంక్, ఎం.జతిన్ సాయితేజ్, ఎం.బ్రిజిల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల డీన్ డా.మమత మోహన్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

పోటీల్లో పాల్గొన్న రవీంద్ర విద్యానికేతన్ విద్యార్థులు

బహుమతులు అందుకున్న విజేతలతో ఉపాధ్యాయులు

## మూడేళ్లు.. ముందుకుసాగని పనులు

• అసంపూర్తిగానే నగరపాలక కార్యాలయ నూతన భవనం • పురోగతిపై దృష్టిపెట్టని పాలకులు, అధికారులు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ప్రస్తుత నగరపాలక సంస్థ కార్యాలయ భవనం నిర్మించి నాలుగు దశాబ్దాలు దాటింది. అప్పటి జనాభా, సిబ్బంది అవసరాలకు అనుగుణంగా ఉన్న భవనం ఇప్పుడు సరిపోవడం లేదు. దీనికితోడు నిర్మాణం పాతబడింది. దీంతో నగరపాలక కార్యాలయ ఆవరణలోనే అధునాతన హంగులతో.. అన్ని సౌకర్యాలతో నూతన భవనాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. మూడేళ్లు దాటిన నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. పాలకవర్గంతో పాటు అధికారులు కూడా ఈ పనులపై దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా కార్యాలయ సిబ్బందితో పాటు ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

### ఇంతకాలం నిర్మించింది సగమే..

**క**ర్నూలు నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవన నిర్మాణం కోసం రూ.28 కోట్ల నిధులు కేటాయించారు. ప్రస్తుత కార్యాలయ ఆవరణలోనే 2022 ఆగస్టు 1న నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టి శిలాఫలకం ఆవిష్కరించారు. మొదట్లో పనులు కాస్త వేగంగా జరిగినా ఆ తర్వాత పూర్తి మందగించాయి. ఇప్పటివరకు 50 శాతం పూర్తయినట్లు చెబుతున్నారు. కొన్ని నెలలుగా ఎక్కడి పనులక్కడే నిలిచిపోయాయి. మొండి గోడలే దర్శనమిస్తున్నాయి.

అర్ధంతరంగా నిలిచిపోయిన నిర్మాణాలు

### 'అ'ధనం' ఇవ్వలేం..

**మొ**దట కేటాయించిన నిధులు సరిపోవని అదనంగా ఇవ్వాలని అధికారులు కోరినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనను ఉన్నతాధికారులు తోసిపుచ్చి మొదట ప్రతిపాదించిన రూ.28 కోట్లతోనే పనులను పూర్తి చేయాలని సూచించినట్లు తెలిసింది.

◆ ప్రస్తుతం సిబ్బంది విధులు నిర్వహిస్తున్న నగరపాలక కార్యాలయ భవనాన్ని సైతం కూల్చేయాల్సి ఉంది. దీంతో వెంకటరమణ కాలనీలోని నగరపాలక సైడ్‌ప్లాజాలో అధికారులు విధులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనుల కోసం భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారు. ఈ నిధులు నగరపాలక సంస్థకు అదనపు భారం అవుతాయని పలువురు భావిస్తున్నారు. ఆ నిధులను కాలనీల్లో అభివృద్ధి పనులకో.. లేదా కార్యాలయ నూతన భవనాన్ని పూర్తి చేసేందుకో వెచ్చిస్తే ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు.

### అందరికీ అసౌకర్యమే..

**నూ**తన నగరపాలక కార్యాలయ భవన నిర్మాణం చేపట్టడంతో పాత కట్టడాలను కూల్చేశారు. దీంతో పలు విభాగాల అధికారులు ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. పలువురు విభాగ అధికారులకు ప్రత్యేక గదులు కూడా లేకుండాపోయాయి. నిత్యం వందలాదిమంది ప్రజలు నగరపాలక కార్యాలయానికి వస్తుంటారు. దీనికితోడు సచివాలయ ఉద్యోగులు తరచూ కార్యాలయానికి వస్తున్నారు. అందరూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులున్నాయి. ఇక్కడ చోటులేకపోవడంతో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించాల్సి వస్తోంది.

## వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : వైకుంఠ ఏకాదశి వేడుకలకు కర్నూలు నగరంలోని ప్రధాన ఆలయాలు ముస్తాబయ్యాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు అన్ని ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్తు దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. నగర శివారులోని గోదాగోకుల క్షేత్రం, వెంకటరమణకాలనీలోని వేంకటేశ్వరస్వామి, కృష్ణానగర్ శ్రీనివాస మందిరం, బి.క్యాంపు విజ్ఞాన మందిరం, పార్కురోడ్‌లోని ఇస్కాన్ ఆలయం, గుత్తిరోడ్డులో ఉన్న సూర్యనారాయణ స్వామి కోవెల, సంకల్‌బాగ్ హరిహరక్షేత్రం, పాతబస్తీ లలితాపీఠం, భద్రావతి భావనారాయణ ఆలయం, గణేష్‌నగర్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు.

విద్యుత్తు వెలుగుల్లో గణేశ్‌నగర్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయం

కృష్ణనగర్‌లోని శ్రీనివాస మందిరంలో పుష్పాలంకరణ

## చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ తెలిపారు. పీడియాట్రిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలోని పీడియాట్రిక్ విభాగంలో శస్త్రచికిత్స చేయించుకొన్న చిన్నారులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో జన్మిస్తున్న చిన్నారులకు పీడియాట్రిక్ సర్జరీ విభాగం వైద్యులు శస్త్రచికిత్సలు చేసి ప్రాణాలు నిలుపుతున్నారని వివరించారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో పుట్టిన చిన్నారులను తల్లిదండ్రులు ఇక్కడికి తీసుకొచ్చి వైద్యం పొందాలని సూచించారు. పీడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ శివకుమార్, ప్రొఫెసర్ డాక్టర్ శారద, అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ శివరామ్‌నాయక్, నర్సింగ్ పర్యవేక్షకురాలు సావిత్రిబాయి పాల్గొన్నారు.

పీడియాట్రిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా కేకు కోస్తున్న డాక్టర్ చిట్టినరసమ్మ

## సర్వజన వైద్యశాలకు కంప్యూటర్ల వితరణ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : సర్వజన వైద్యశాలకు సహస్ర ఆసుపత్రి ఎండీ డాక్టర్ సీహెచ్ రాజేశ్ ఆధ్వర్యంలో రూ.2.60 లక్షల విలువైన నాలుగు కంప్యూటర్లను అందజేశారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లుకు సోమవారం వాటిని అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పర్యవేక్షకుడు మాట్లాడుతూ.. వైద్యశాలకు వచ్చే రోగుల రికార్డుల నిర్వహణకు ఈ కంప్యూటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, సహస్ర హాస్పిటల్ ప్రతినిధి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లుకు కంప్యూటర్లు అందిస్తున్న డా.సీహెచ్ రాజేశ్ తదితరులు

## గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : చర్చి సభ్యులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోల్స్ చర్చి అధ్యక్ష, కార్యదర్శులు సొలోమాన్, అనిల్‌నాథ్, క్రీడల కన్వీనర్ విజయ్ కుమార్, పాల్ సుధాకర్ సూచించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని కోల్స్ చర్చి సభ్యులకు స్థానిక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో సోమవారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాస్టర్లు ఆర్.అనిల్‌శామ్యూల్, జీవన్‌రావు, క్రిస్మస్ కమిటీ నిర్వాహక ఛైర్మన్ సుధీర్‌కుమార్, రెఫరీలుగా విన్సెంట్ గాంధీ, భీముడు, చిన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక్‌కు అండగా ఉంటాం : మంత్రి లోకేశ్

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు నగరానికి చెందిన వైద్య విద్యార్థి వినాయక్‌కు వైద్యసాయం అందిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికలో హామీ ఇచ్చారు. రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న వినాయక్ బోన్‌మ్యారోతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. అతని వైద్యానికి సహాయం చేయాలని అతని స్నేహితుడు శివ నారో లోకేశ్‌ను ఎక్స్ ద్వారా కోరారు. మంత్రి స్పందించి వినాయక్‌కు అండగా నిలుస్తామని సమాధానం ఇచ్చారు.

## నగరంలో పోలీసు యాక్ట్ 30 అమలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో పోలీసు యాక్ట్ 30 అమలులో ఉందని డీఎస్పీ బాబూప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31న పోలీసుల అనుమతి లేకుండా ఎవరూ బహిరంగ కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, డీజేలకు అనుమతి లేదని, బైకు సైలెన్సర్లు తీసి నడపరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సచివాలయాల సిబ్బందికి తాఖీదులు

కర్నూలు నగరపాలక, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని పలు వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 92 మంది సిబ్బందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. కుటుంబ సర్వేలో పురోగతి లేకపోవడంతో బాధ్యులకు తాఖీదులు ఇచ్చారు.

## 'బోగస్' ఉద్యోగులపై చర్యలు తీసుకోండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లో జేసీ నూరుల్ ఖమర్‌ను కలిసి సమస్యపై చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ఎస్టీ కులాలకు చెందని వారికి బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, జిల్లా అధ్యక్షుడు రామరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌నాయక్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## చదువుతోనే ఉన్నత శిఖరాలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : చదువు ద్వారానే ఎవరైనా ఉన్నత శిఖరాలకు చేరొచ్చని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని జి.పుల్లారెడ్డి దంత వైద్యశాల స్నాతకోత్సవాన్ని ప్రిన్సిపల్ నాగలక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా

పట్టభద్రులతో వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, దంత వైద్యులు

వీసీ మాట్లాడుతూ.. చదువు పూర్తి చేసుకున్న తర్వాత సమయాన్ని వృథా చేయకుండా క్లినిక్‌లు ప్రారంభించాలన్నారు. వైద్య రంగంలో డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వకుండా పేద వారికి ఉచిత వైద్య సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం బీడీఎస్, ఎండీఎస్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పి.సుబ్బారెడ్డి, డాక్టర్ పి.చంద్రశేఖర్, డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింహాచలం భూములు ఇతరులకు అప్పగించొద్దు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : సింహాచల వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములను గూగుల్ డేటా సెంటర్, ఇతర సంస్థలకు అప్పగించడాన్ని ప్రభుత్వం ఆపేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి కోరారు. ఈమేరకు సోమవారం వీహెచ్‌పీ నాయకులు కర్నూలు కలెక్టరేట్ సమీపంలోని గాంధీ

ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

విగ్రహం వద్ద ధర్నా చేశారు. కలెక్టర్ డా.సిరికి వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంతీయులు సండడి మహేశ్, దక్షిణాంధ్ర ప్రాంత సహ సేవా ప్రముఖ్ గురుమూర్తి, గోవిందరాజులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఈపూరి నాగరాజు, జిల్లా కార్యదర్శి గూడూరు గిరిబాబు, జిల్లా సహ కార్యదర్శి జంపాల నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రగ్బీ సాధనతో దేహ దారుఢ్యం

కరూనలు క్రీడలు, న్యూస్‌టుడే : విద్యార్థుల రగ్బీ క్రీడ సాధన చేయడం ద్వారా దేహ దారుఢ్యం మెరుగవుతుందని వైద్యుడు డా.శంకర్‌శర్మ పేర్కొన్నారు. నగర శివారులోని ఆదర్శ విద్యా మందిరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాల బాలికల రగ్బీ పోటీలను

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డా.శంకర్‌శర్మ

సోమవారం ఆయన ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు కవాతు చేశారు. రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సురేందర్ మాట్లాడుతూ పోటీలకు 15 జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చారని తెలిపారు. రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారుల జనవరి 14 నుంచి 21వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఏపీ తరఫున పోటీపడతారని వెల్లడించారు.

## వినతులకు సత్వర పరిష్కారం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర ప్రజలు అందజేసే అర్జీలను పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ ఆర్జీవీ కృష్ణ అధికారులకు సూచించారు. స్థానిక ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి 21 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా బలోపేతానికి కృషి చేస్తా

ఓర్వకల్లు న్యూస్‌టుడే : తెదేపా బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ పార్టీ కోశాధికారిగా నియమితులైన మహబూబ్

మహబూబ్‌బాషాను సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్థులు

బాషా పేర్కొన్నారు. ఓర్వకల్లు మండలంలోని హుసేనాపురం గ్రామంలో తెదేపా సీనియర్ నాయకుడు ఖాదర్‌బాషా తదితరులు సోమవారం ఆయన్ను సత్కరించారు. ఈసందర్భంగా మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. తెదేపా అధిష్ఠానం తనకు అప్పగించిన బాధ్యతలకు కట్టుబడి ఉంటానన్నారు. కార్యక్రమంలో కాల్వబుగ్గ ఆలయ కమిటీ ఛైర్మన్ కాటినేని నారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సంఘటితమైతేనే అభివృద్ధి సాధ్యం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కుర్ని కులస్థులు సంఘటితమైతేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. నగరంలోని డా.బ్రహ్మారెడ్డి ఆసుపత్రి సమావేశ మందిరంలో నగర కుర్ని సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, కుర్ని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దండు కృష్ణయ్య సోమవారం ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు గడిగే ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, కల్లూరు దైవాచార సంఘం అధ్యక్షుడు రాందాసు, భగవాన్ నగర దైవాచార సంఘం అధ్యక్షుడు మిటికీర్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న కుర్ని సంఘం నాయకులు

## ఇసుక ట్రాక్టర్ల సీజ్

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : లక్ష్మీపురం పరిధిలోని హంద్రీనది పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతున్న తీరుపై 'ఈనాడు'లో శనివారం 'ఇసుక తోడేళ్లు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన జిల్లా గనులు, భూగర్భశాఖ, కల్లూరు మండల రెవెన్యూ అధికారులు సోమవారం హంద్రీనది పరివాహక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి ఉలిందకొండ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

స్పందనకు వందనం

## అధ్యాపక వృత్తికి ఎనలేని గౌరవం

కర్నూలు విద్య : సమాజంలో అధ్యాపక వృత్తికి ఎనలేని గౌరవం లభిస్తుందని సీనియర్ ఉర్దూ అధ్యాపకులు మౌలానా సయ్యద్ జాకీర్‌సాబ్ పేర్కొన్నారు. నగరంలోని ఉస్మానియా యునాని వైద్యశాలలో అనాటమి డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ ఎల్.మహమ్మద్ హనీఫ్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. యునాని వైద్యులు సిద్దిఖీ, దిల్‌వర్‌బేగ్, ఇఖ్బాల్, మొయిన్ పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది విధుల్లో లేకపోవడంపై ఆగ్రహం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగాన్ని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో జనరల్ మెడిసిన్ వైద్యుడు, ఈసీజీ టెక్నీషియన్ విధుల్లో లేకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.

## మూడిళ్లలో నగలు, నగదు చోరీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు మండలం ప్రజానగర్‌లోని మూడిళ్లలో చోరీలు జరిగాయి. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే గఫూర్, ఫయాజ్, సత్తార్‌వలి కుటుంబాలు సమీప ఇళ్లలో నివసిస్తున్నాయి. వీరంతా వేర్వేరు పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లడం గుర్తించిన దొంగలు ఇళ్లలో చొరబడి దోచుకున్నారు. గఫూర్ ఇంట్లో అర తులం బంగారు, పది తులాల వెండి, రూ.50 వేల నగదు, ఫయాజ్ గృహంలో పది తులాల వెండి, రూ.10 వేల నగదు, సత్తార్‌వలి ఇంట్లో 2 తులాల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి అపహరణకు గురైనట్లు బాధితులు కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

## లిఖిత.. పరుగులో విజేత

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరానికి చెందిన పలువురు యువకులు ఉన్నత చదువు చదువుతూనే క్రీడల్లో రాణిస్తున్నారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్ సమీపంలో నివసించే ఉప్పరి లిఖిత అథ్లెటిక్స్‌లో రాణిస్తోంది. పరుగు పోటీల్లో తనకు తిరుగులేదని నిరూపిస్తోంది. బీటెక్ సీఎస్ఈ నాలుగో సంవత్సరం చదువుతున్న ఈమె.. చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇస్తూ.. నిత్యం మైదానంలో సాధన చేస్తోంది. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించింది. జాతీయస్థాయిలో స్వర్ణ పతకాలు సాధించాలన్న లక్ష్యంతో నిత్యం సాధన చేస్తున్నట్లు చెబుతోంది లిఖిత.



### అందుకున్న పతకాలు

◆ 2018 అక్టోబరులో రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగులో రజతం, 200 మీటర్ల విభాగంలో కాంస్య పతకం అందుకుంది. ◆ 2019 నవంబరులో నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీటర్లలో రజతం, 4100 మిక్స్‌డ్ రిలేలో స్వర్ణం పతకాన్ని సాధించింది. ◆ 2019 డిసెంబరు 18న తిరుపతిలోని తారకరామారావు మైదానంలో జరిగిన జాతీయస్థాయి మీట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించింది. ◆ 2023 అక్టోబరులో నంద్యాలలో జరిగిన జేఎన్‌టీయూ పరిధిలోని అంతర్ ఇంజినీరింగ్ కళాశాలల అథ్లెటిక్స్ మీట్‌లో 100 మీటర్ల పరుగులో స్వర్ణం గెలుపొందింది. ◆ 2024లో విజయవాడలోని లయోలా కళాశాల మైదానంలో జరిగిన దక్షిణ మండలం అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో జేఎన్‌టీయూకు ప్రాతినిధ్యం వహించింది. ◆ 2025 ఆగస్టు 28న కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 100, 200 మీటర్ల పరుగులో రజత పతకాలు అందుకుంది. ◆ 2025 అక్టోబరు 7న ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలు జిల్లాకు ప్రాతినిధ్యం వహించి.. త్వరలో జరిగే అసోసియేషన్ పోటీలకు ఎంపికైంది.

## లేబర్ కోడ్లను రద్దు చేయాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఎం.ఎ.గఫూర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సంఘం నాయకుడు సాయిబాబా అధ్యక్షతన సోమవారం నగరంలో నిర్వహించిన రెడ్‌షర్ట్ కవాతును సుందరయ్య కూడలి వద్ద ఆయన ప్రారంభించారు. గఫూర్ మాట్లాడుతూ కార్మికులకు 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నిర్మల, నరసింహులు, రఘుబాబు, రాముడు, రాధాకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కవాతు ప్రారంభిస్తున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఎం.ఎ.గఫూర్

## మద్యం అమ్మకాలు నియంత్రించాలని వినతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ప్రజల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని డిసెంబరు 30 నుంచి జనవరి 1వ తేదీ వరకు రాత్రి 7 గంటల వరకే మద్యం అమ్మకాలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ఐద్వా రాష్ట్ర నాయకురాలు నిర్మల, జిల్లా అధ్యక్షురాలు శ్యామల, కార్యదర్శి అరుణ, నగర కార్యదర్శి పద్మ కోరారు. ఈమేరకు సోమవారం వారు స్థానిక ఆబ్కారీశాఖ కార్యాలయంలో సీఐ రాజేంద్ర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో ఆయా రోజుల్లో యువత మద్యం తాగి రోడ్లపై తిరుగుతూ ఇబ్బందులు సృష్టించారని తెలిపారు. ఆదాయ పరంగా ఆలోచించకుండా ప్రజల మేలుకోరి అమ్మకాల సమయాన్ని కుదించాలని విన్నవించారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : బాల్య వివాహాలను కట్టడికి ప్రతిఒక్కరు సహకరించాలని ఐసీడీఎస్ పీడీ పి.విజయ, అధికారులు పిలుపునిచ్చారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహ ముక్త్ భారత్ పేరుతో కలెక్టరేట్ సముదాయంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహం విద్యార్థినులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది విజయకుమారి, జోత్స్న, సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శనలో వసతిగృహం విద్యార్థినులు

## పీహెచ్‌డీల ప్రదానం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయంలోని రూసా డిపార్ట్‌మెంట్‌లో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న డి.రంగనాథ్ స్టడీ ఆన్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్, గైడ్ విశ్వనాథరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయన్ను అభినందించారు.

◆ నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల భౌతికశాస్త్ర విభాగంలో విధులు నిర్వహిస్తున్న జి.అమీర్‌బాషా హైడ్రోథర్మల్ టెక్నిక్స్ అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందారు. ఈ పరిశోధన ఫలితాలు ఆధునిక పదార్థ శాస్త్రం ఎలక్ట్రానిక్స్, మాగ్నెటిక్ అనువర్తనాలకు ఉపయోగకరంగా ఉంటాయని గైడ్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి తెలిపారు.

(c) eenadu

ఈనాడు
నంద్యాల
మంగళవారం డిసెంబరు 30, 2025

కళాప్రదర్శన

శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల కోసం దేవస్థానం నిర్వహిస్తున్న కళారాధన భక్తులను ఆకట్టుకుంది. విశాఖపట్నానికి చెందిన ఎస్.కె.ఆర్.నృత్యాలయ బృందం పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్యాలు చేశారు. కళాకారులను దేవస్థానం అధికారులు స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. న్యూస్‌టుడే,శ్రీశైలం, నంది సర్కిల్

## ఈఎస్ఎల్ క్రికెట్ తుది పోరు నేడే

గత ఏడు రోజులుగా పోటాపోటీ కొనసాగుతున్న ఈఎస్ఎల్ క్రికెట్ పోరులో విజేత ఎవరో నేడు తేలనుంది. నగరంలోని పుల్లారెడ్డి కళాశాల మైదానంలో మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. జూనియర్స్ విభాగంలో ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ జూనియర్ కళాశాల (నంద్యాల) జట్టు ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల (కర్నూలు)తో తలపడనుంది. సీనియర్స్ విభాగంలో కర్నూలు మెడికల్ కళాశాల, శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు తలపడనున్నాయి. –ఈనాడు, కర్నూలు

## వైకుంఠవాసుడి ఉత్సవం

ఆళ్లగడ్డ గ్రామీణం , న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారు విశేష పూజలందుకుంటున్నారు. అధ్యయనోత్సవాల్లోని రాపత్తు ఉత్సవంలో భాగంగా స్వామి, అమ్మవారు విశేష అలంకృతులై వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరారు. సాయంత్రం పల్లకిపై ఆలయ తిరువీధుల్లో విహరించారు. అర్చకులు వేదప్రబంధ పారాయణాలు పఠించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ధనుర్మాస పూజల్లో భాగంగా గోదాదేవి సన్నిధిలో తిరుప్పావైలోని పాశురాలను విన్నవించారు.

# ధరణి సమస్యలకు చికిత్స

● కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్‌లు ● తరలొచ్చిన భూ బాధితులు

'భూ' సమస్యల పరిష్కారంపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది.. ఇందులో భాగంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు అనుబంధంగా రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. సోమవారం జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అర్జీలు ఇవ్వడానికి బాధిత రైతులు భారీగా తరలొచ్చారు. అడంగల్ సవరణలు, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూముల సంబంధించి, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలు, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్వోఆర్, సర్వే, రీ-సర్వే, దేవాదాయ, వక్ఫ్ భూములు తదితర అంశాలపై అర్జీలొచ్చాయి.
– న్యూస్‌టుడే, సచివాలయం

| అంశం | వచ్చిన దరఖాస్తులు | పరిష్కారం |
|---|---|---|
| సర్వే | 7,872 | 7,097 |
| సబ్ డివిజన్ | 13,772 | 11,355 |

### భూమంత సమస్యలు

● ఈ ఏడాది జూన్ 15 నుంచి డిసెంబరు 12 వరకు రెవెన్యూ శాఖకు 7,469 అర్జీలొచ్చాయి. అత్యధిక అర్జీలొచ్చిన జాబితాలో కర్నూలు రెండో స్థానంలో ఉంది. నంద్యాల జిల్లాలో పీజీఆర్ఎస్ అర్జీలు పరిష్కరించినప్పటికీ అత్యధికంగా రీఓపెన్ అవుతున్నాయి. ఈ అంశంలో రాష్ట్ర సగటు 8.58 శాతం ఉండగా.. నంద్యాల జిల్లాలో 15.56 శాతం ఉండటం గమనార్హం.
● అదేవిధంగా గత జూన్ 15 నుంచి ఈనెల 12 వరకు భూ విస్తీర్ణంలో తేడాలకు సంబంధించి నంద్యాలలో 8,716 అర్జీలతో మూడో స్థానంలో ఉండటం గమనార్హం.
● ఎఫ్-లైన్ పిటిషన్లు వెల్లువలా వస్తున్నాయి.. క్షేత్రస్థాయికి వెళ్లకుండా పరిష్కరించినట్లు రైతులకు సమాచారం ఇస్తున్నారు.

నంద్యాల కలెక్టరేట్‌కు తరలొచ్చిన భూ బాధితులు

### పకడ్బందీగా చేస్తేనే

● రెవెన్యూ క్లినిక్ విధానంలో మండల తహసీల్దారే నేరుగా బాధ్యత తీసుకోవాలి. అన్ని అర్జీలు ఒకచోట కాకుండా అంశాల వారీగా కౌంటర్లు పెట్టి స్వీకరించాలి.
● అర్జీదారుల ఎదుటే సంబంధిత సిబ్బందికి సమాచారం ఇచ్చి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి. కొన్నింటిని తక్షణమే సరిచేయాల్సి ఉంది.

### ఏడు కేంద్రాలు 373 అర్జీలు

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 'రెవెన్యూ క్లినిక్'కు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏడు కౌంటర్లు జనంతో కిక్కిరిసిపోయాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 373 దరఖాస్తులు అందజేశారు.
● రెవెన్యూకు సంబంధించిన వినతులు తొమ్మిది, అడంగల్ సవరణలు 106, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూముల సంబంధించినవి 65, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలు 65, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్వోఆర్ 33, సర్వే, రీ-సర్వే 63 దేవాదాయ, వక్ఫ్ భూములపై 32తో పాటు ఇతర వాటిపై అర్జీలు వచ్చాయి. -న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం
● ఆయా క్లినిక్‌లలో అడంగల్, 10(1) ఖాతాలు, ఎస్ఎఫ్ఏ (సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్), వెబ్‌ల్యాండ్, ఓఆర్‌సీఎంఎస్, మీసేవ, ఇతర అవసరమైన రికార్డుల్ని డిజిటల్, భౌతికంగా అందుబాటులో ఉంచుకోవాలి. 14 రకాల భూ సమస్యలకు సంబంధించి వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేసి అర్జీలను స్వీకరించాల్సి ఉండగా.. ఇవేవీ అందుబాటులో ఉంచలేదు. మొదటి రోజు హడావుడిగా చేశారు.. ఇకముందైనా పకడ్బందీగా చేస్తేనే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుంది.
● బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి ఎలాంటి రసీదులు ఇవ్వలేదు.

## ముక్కోటికి ముస్తాబు

మద్దిలేటయ్య క్షేత్రంలో మంగళవారం నిర్వహించే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఇప్పటికే క్యూలైన్లు, తాగునీరు, వైద్య శిబిరం సదుపాయాలను సిద్ధం చేశారు. – న్యూస్‌టుడే, బేతంచెర్ల

### శ్రీశైలంలో ఉదయం 3 గంటల నుంచే

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి ఉత్సవం నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరుస్తారు. వేకువజామున 3:30 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాల పూజలు, ఉదయం 4:30 గంటలకు మహమంగళ హారతిసేవ నిర్వహిస్తారు. తర్వాత శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ముఖ మండపంలో ఉత్తర ముఖంగా వేంచేబు చేసి అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులను రావణ వాహనంపై ఉంచి మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

## పరుగుల రాముడు

ఉన్నత చదువుకు తోడు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని గుర్తించిన పరశురాముడు అథ్లెటిక్స్‌లో అడుగుపెట్టి.. విజయ పథంలో దూసుకెళ్తున్నారు. జోహరాపురంలోని అల్లూరు సీతారామ్‌నగర్‌కు చెందిన ఇతను ఉస్మానియా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. 2022 నుంచి అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటూ.. నిత్య సాధనతో పోటీల్లో విజయాలు సాధిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఈనెల 27న నంద్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీటర్ల విభాగంలో రజతం, 4×100 రిలే పరుగులో స్వర్ణ పతకాలు సాధించారు. 2026 జనవరి 12 నుంచి 15వ తేదీ వరకు బెంగళూరులో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికయ్యారు. 2025 జనవరి 6 నుంచి 10వ తేదీ వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగిన జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించారు. " జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణ పతకాలు అందించాలన్న లక్ష్యంతో రోజుకు 4 గంటల పాటు సాధన చేస్తున్నట్లు చెబుతున్నారు" పరశురాముడు.
– న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

## కాళ్లరిగేలా తిరిగినా కనికరం లేదాయే

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: కులవృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న తనకు పని చేసుకోకుండా 'కాలు' అడ్డుపడిందని.. పింఛన్ ఇప్పించి న్యాయం చేయాలని కోరుతున్నా ఏళ్లుగా పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోతున్నారు. బండిఆత్మకూరు మండలం ఎ.కోడూరు గ్రామానికి చెందిన 50 ఏళ్ల మంగలి నరసింహులు క్షౌర వృత్తితో పాటు వ్యవసాయ కూలీగా వెళ్తుండేవారు. మూడేళ్ల క్రితం పొలంలో పొలం పని చేస్తుండగా.. సలికే పార కాలుకు తగిలి గాయమైంది. మూడు నెలల్లో గాయం తీవ్రం కావడంతో వైద్యులు శస్త్ర చికిత్స చేసి కాలు తీసేశారు. దీంతో అటు కులవృత్తి చేయలేక, కూలి పనికి వెళ్లలేని పరిస్థితి. వైద్యులు 85శాతం వైకల్యం ఉందని ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. కానీ పింఛన్ మాత్రం రావడం లేదు.

## తల్లడిల్లిన ప్రాణం

ఆళ్లగడ్డ గ్రామీణం , న్యూస్‌టుడే: ఆస్తి కోసం కుమారుడు వేధింపులకు గురిచేయడంతో మనస్తాపానికి గురై తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. బాచేపల్లె గ్రామానికి చెందిన రామసుబ్బమ్మ(50)కు రెండు ఎకరాల పొలం ఉంది. అందులో ఒక ఎకరా పొలం రాసి ఇవ్వాలని ఆమె కుమారుడు ప్రతాప్ తరచూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో ఆమె సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

## 31న పింఛన్ల పంపిణీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: డిసెంబరు 31వ తేదీన ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గనియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరికీ వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు.

# లీకులు చూడరు.. లాకులు వేయరు

విధులకు మస్కా కొడుతున్న లస్కర్లు ● రబీలో నీటి విడుదలపై ప్రభావం

రబీ వచ్చేసింది.. ఈ సీజన్లో ప్రతి నీటి చుక్కను ఎంతో జాగ్రత్తగా వాడుకోవాలి.. ఉమ్మడి జిల్లాలో ఐదు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. సాగు నీటి వినియోగంపై లస్కర్ల పాత్ర కీలకం.. కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్తను తొలగించడం లేదు.. డిస్ట్రిబ్యూటర్ల నిర్వహణను పట్టించుకోవడం లేదు. నీటి యాజమాన్య పద్ధతులు అత్యవసరం. లస్కర్ల పర్యవేక్షణ లేకపోవడం ప్రతిబంధకంగా మారింది.– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

### ఏం చేయాలి.. ఏం చేస్తున్నారు

● ప్రతి 1,200 ఎకరాలకు సాగునీటి సరఫరాకు లేదా 12 కి.మీ.ల పొడవునా కాల్వ నిర్వహణకు ఒక లస్కర్ తప్పనిసరిగా ఉండాలి. వీరంతా తమ పరిధిలో రెగ్యులేటర్ నియంత్రణను పర్యవేక్షిస్తూ ఉండాలి.
● ప్రధాన కాల్వలు, గేట్ల నిర్వహణను లస్కర్లు చూసుకోవాల్సి ఉంది. గేట్లు ఎత్తి దించేందుకు వీలుగా గ్రీజింగ్ చేయాలి. షట్టర్లను పర్యవేక్షిస్తూ లోపాలుంటే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలి. కాలువల లోపలి భాగంలో, గట్లపై ముళ్లపొదలు, కంప చెట్లు పెరగకుండా చూసుకోవాలి. ప్రధాన కాల్వల్లో ఇసుక మేటలను ప్రాథమిక స్థాయిలోనే తొలగించాలి. లస్కర్లు విధులు నిర్వహించడం లేదు.

రుద్రవరం: టి.లింగందిన్నె గ్రామ శివారులో తెలుగు గంగ 22వ బ్లాకు ఉప కాల్వ కరకట్ట కోతకు గురై నెలరోజులవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

### దస్త్రంలోనే హాజరు

● కేసీ, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, హెచ్ఎన్ఎస్ఎస్ తదితర కాల్వల పరిధిలో 492 మంది లస్కర్లు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.20 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. ప్రతి నెలా రూ.1950 కోత విధిస్తున్నారు. ఎందుకు 'కోత' పెడుతున్నారో అధికారుల వద్ద స్పష్టత లేదు.
● కేసీ కాల్వ లస్కర్లుగా జిల్లాకు చెందిన పలువురిని వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు, దువ్వూరు, కడప ప్రాంతాల్లో నియమించారు. అక్కడికి వెళ్లలేక జిల్లాలోనే ఉంటూ వ్యవహారం నడిపిస్తున్నారు.

### ఎక్కడుంటారో తెలియదు

● కేసీ కాల్వ పరిధిలో 240 మంది, ఎల్లెల్సీలో 116 మంది లస్కర్లు విధుల్లో ఉన్నట్లు దస్త్రాలు చెబుతున్నాయి. వీరిలో చాలా మంది జిల్లాలోనే లేరు. ఇతర ప్రాంతాల్లో మరో ఉద్యోగం చేస్తున్నారు.
● ఎల్లెల్సీ కింద కోడుమూరు సబ్ డివిజన్‌లో 64 మంది, ఆదోనిలో 13, ఆదోని-2లో 13, ఎమ్మిగనూరులో 17, జీడీపీ సబ్ డివిజన్‌లో 9 మంది పనిచేస్తున్నట్లు దస్త్రాల్లో ఉండగా వీరిలో 40 శాతం మంది కూడా విధుల్లో లేరు.
● కేసీ కాల్వ పరిధిలోని 240 మందిలో కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో ఆరుగురు, నంద్యాలలో 42 మంది, ఆళ్లగడ్డలో 21 మంది, వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 23 మంది ఏళ్లుగా విధులకు రావడం లేదు.
● హెచ్ఎన్ఎస్ఎస్‌లో పనిచేస్తున్న 45 మంది, ఎస్సార్బీసీలో పనిచేస్తున్న 41 మంది కనీసం అటువైపు చూడటం లేదు.
● శ్రీశైలం ముంపు బాధితులనే ఎల్లెల్సీలో కింద తుంగభద్ర ప్రాజెక్టు వివిధ సబ్ డివిజన్లలోని ఆదోని, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో నియమించారు. అంతదూరం వెళ్లలేక 'ఒప్పందం' చేసుకుంటున్నారు.

## రెవెన్యూ డివిజన్‌గా బనగానపల్లి

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లిలో ఎట్టకేలకు ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు ఆమోదముద్ర పడింది. సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగీకారం తెలిపారు. ఇది వరకే బనగానపల్లి రెవెన్యూ డివిజన్‌గా చేసిన ప్రకటనకు ఆమోదం లభించింది. నియోజకవర్గంలోని బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలు ఆర్డీవో పరిధిలోకి రానుంది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో స్థానికంగా రెవెన్యూ కార్యాలయం రావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో రెవెన్యూ డివిజన్ రావడంతో భూ సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేందుకు అవకాశం ఉంటుంది. పాత తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్డీవో కార్యాలయంగా మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పనులు వేగవంతం చేసి జనవరి నెలాఖరుకు కార్యాలయం ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# మలి దశలో కలవరం

● వృద్ధులపైనే సైబర్ నేరగాళ్ల గురి
● డిజిటల్ 'అరెస్టు' పేరుతో దోపిడీ
● రెండేళ్లలో రూ.3 కోట్లు కొట్టేశారు

కర్నూలు నగరం బాలాజీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి రాష్ట్ర ప్రభుత్వ శాఖలో పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. కూతురు పెళ్లి కోసం బ్యాంకు ఖాతాలో డబ్బు దాచుకున్నారు. సైబర్‌నేరగాళ్లు ఆయనకు ఫోన్‌చేసి తాము అనిశా అధికారులమని నమ్మించారు. ఓ కేసులో నువ్వు నిందితుడిగా ఉన్నావు.. అడిగినంత డబ్బు పంపకపోతే నిన్ను అరెస్టు చేస్తామని బెదిరించారు. భయపడిన బాధితుడు పలు దఫాలుగా వారి చెప్పిన ఖాతాలకు ఏకంగా రూ.47 లక్షలు పంపారు. మళ్లీ బెదిరించే సరికి దిక్కుతోచక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నేరవిభాగం, ఆదోని నేరవిభాగం

ఇలా వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో డిజిటల్ అరెస్టుల పేరుతో 2024 నుంచి ఇప్పటి వరకు ఆరుగురి నుంచి దాదాపు రూ.3 కోట్లు దోచుకున్నారు.

### భయపెడుతూ.. ఒత్తిడికి గురిచేస్తూ..

సైబర్ నేరగాళ్లు ప్రధానంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత వచ్చిన డబ్బును బ్యాంకు ఖాతాల్లో దాచుకుని ఉంటారని వారిని ఎంచుకుంటున్నారు. 2024 నుంచి ఇప్పటి వరకు డిజిటల్ అరెస్టుల బాధితుల కేసులు 6 నమోదు కాగా బాధితుల్లో ఐదుగురు 60 ఏళ్లు పైబడినవారు ఉండటం గమనార్హం. ప్రశాంత జీవితాన్ని సాగిస్తున్న వారిని భయాందోళనకు గురిచేసేలా నేరారోపణలు చేస్తున్నారు. పలు నేరాల అభియోగాలు మోపి నకిలీ అరెస్టు వారెంట్లు, లీగల్ నోటీసులను వాట్సప్ ద్వారా పంపుతున్నారు.

### ఇవీ పోలీసుల సూచనలు

● అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి తాము ఫలానా శాఖ అధికారులమని బెదిరిస్తే వెంటనే నమ్మకూడదు. వారు మోపే నేరారోపణలు శ్రద్ధగా వినాలి. వాట్సప్ వీడియోకాల్ ద్వారా వారు చూపించే కార్యాలయాలను చూసి మోసపోరాదు. దర్యాప్తు సంస్థల అధికారులు ఎప్పుడూ ఇలా ఫోన్లు చేయరు. నేరుగా ఇంటికి వచ్చి కలుస్తారు.
● సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసినప్పుడు కార్యాలయాలకు వచ్చి కలుస్తాననో.. లేదంటే కాస్త గడువు ఇవ్వాలని దాటవేయాలి. తర్వాత పోలీసులను సంప్రదించి నిర్ధారించుకోవాలి.
● త్వరపడి మీ ఆధార్‌కార్డు, ఇతర వ్యక్తిగత సమాచారం నేరగాళ్లకు ఇవ్వరాదు. మోసపోయిన బాధితులు తక్షణమే టోల్‌ఫ్రీ నంబరు 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. సైబర్‌క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు వివరాలు నమోదు చేయాలి.

### యూనిఫాంలలో ఫొటోలు దిగి..

సైబర్ నేరగాళ్లు సినీ ఫక్కీలో నేరాలకు పాల్పడుతున్నారు. ఆదాయపు పన్ను, సీబీఐ కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయం, అనిశా కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఈడీ కార్యాలయాల సెట్టింగుల ముందు ఆయా శాఖల అధికారుల్లా యూనిఫాం ధరించి ఫొటోలు దిగి వాటిని వాట్సప్ ప్రొఫైల్ పిక్చర్‌గా పెడుతున్నారు. బాధితులకు వారు వాట్సప్ ద్వారా వీడియో కాల్ చేసినప్పుడు తెరపై ఆ ఫొటోలు కనిపిస్తాయి. సైబర్ నేరగాళ్ల వెనుక ఉండే కార్యాలయాల సెటప్‌లను చూసి.. వారు మాట్లాడే తీరుతో అధికారులే ఫోన్ చేసినట్లు నమ్మేస్తున్నారు.

## టమాటా అధరహో

ప్యాపిలి మార్కెట్‌లో టమాటా ధర ఒక్కసారిగా పెరిగింది. గత 20 రోజుల నుంచి టమాటా ధర నిలకడగా ఉంది. సోమవారం ప్యాపిలి మార్కెట్‌కు చుట్టుపక్కల గ్రామాల నుంచి 150 టన్నుల సరకు వచ్చింది. 20 రోజుల క్రితం ధర తక్కువగా ఉండగా.. ప్రస్తుతం 25 కిలోల పెట్టె నాణ్యతను బట్టి రూ.600 నుంచి రూ.1000 వరకు పలికింది. ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ప్యాపిలి

## కొత్త ఏడాది మొక్కలు నాటండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మొక్కలు నాటి, విద్యా సామగ్రి అందజేసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను పెంచుతాయని తెలిపారు.

VIJAYA COLLEGE OF NURSING
KPS GROUP
M.Sc., Nursing
(Male & Female)
2025-2026 Admissions
Specialites :
I) Medical Surgical Nursing
II) Child Health Nursing
III) Obstetrics & Gynecological Nursing
IV) Community Health Nursing
(D.No. 8-122, Lakshmipuram (V), NH-44, Kurnool, A.P., PIN- 518218)
Cont : 94407 37726, 93816 77390.

## ఆటోఇటూ కుదుపు.. ప్రమాదాలకు పిలుపు

పొలం పనులకు వెళ్లే మహిళా కూలీలు ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణాలు చేస్తున్నారు. ఆటో పైన, వెనుక పరిమితికి మించి రాకపోకలు సాగిస్తున్నారు. వేగంగా ఆటో వెళ్తున్నప్పుడు అకస్మాత్తుగా బ్రేకులు వేసినప్పుడు ముందుకు తూలితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. నిద్రలో జారుకున్నా రోడ్డుపైపడి గాయాలపాలుకావాల్సిందే. చోదకులకు అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా అధికారులు చూడాలని వాహనదారులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

# ఉద్యానవనమాయ

● డంపింగ్ యార్డుల్లో చెత్తగుట్టలు

పరిశీలన

"చెత్తగుట్టలు తొలగించాలి.. పచ్చదనం పెంచాలి.. పట్టణవాసులకు ఆహ్లాదం పంచాలి.. 2025 అక్టోబరు 2వ తేదీ నాటికి డంపింగ్ యార్డుల్లో చెత్త తొలగించి, మొక్కలు నాటి పచ్చదనం పెంచాలి.!!
- పురపాలికల్లో చెత్త శుద్ధి పనులపై కూటమి ప్రభుత్వ ఆదేశాలివి.

పుర అధికారుల పర్యవేక్షణాలోపంతో గడువు తీరినా.. నేటికీ డంపింగ్ యార్డుల్లో చెత్తకుప్పలు తొలగలేదు. గుట్టలుగా పేరుకుపోయాయి. అనుకున్న లక్ష్యం నెరవేరకపోవడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో పాటు ప్రజారోగ్యంపై ప్రభావం చూపనుంది. మరోసారి టెండర్లు పిలిచి, చెత్త శుద్ధి పనులు అప్పగించాలని నిర్ణయించారు. దీంతో వ్యర్థాల కుప్పలు లెక్కకట్టే పనులు ఆరంభించారు. నిధుల సమస్యలు అధిగమించేందుకు ప్రత్యేక ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని భావిస్తున్నారు.
– న్యూస్‌టుడే, ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు పురపాలికలు, డోన్ పట్టణం

నంద్యాల పట్టణ శివారులోని డంపింగ్ యార్డులో కొనసాగుతున్న చెత్తశుద్ధి

● గత ప్రభుత్వం వైకాపా హయాంలో మున్సిపాలిటీల్లో తట్టెడు చెత్త శుద్ధి చేయలేదు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేక దృష్టి సారించింది. తొలగింపు బాధ్యతలు సౌరాష్ట్ర కంపెనీకి అప్పగించారు. టన్ను చెత్తశుద్ధికి రూ.800-900 చెల్లించేలా ఒప్పందం చేసుకొన్నారు. ఈ ఏడాది జులై నుంచి శ్రీకారం చుట్టారు. ప్రజారోగ్య విభాగం పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది.

టన్ను చెత్తశుద్ధికి రూ.900

| పురపాలిక | నిత్యం పోగయ్యే చెత్త (టన్నుల్లో) |
|---|---|
| ఆదోని | 70 |
| ఎమ్మిగనూరు | 60 |
| డోన్ | 29 |
| నంద్యాల | 100 |

### వాతావరణ కాలుష్యం

● పట్టణాలు, నగరాలకు డంపింగ్ యార్డులు దగ్గరగా ఉండటంతో.. భూ, వాయు, జల కాలుష్యం ఏర్పడుతోంది. ఏళ్లుగా శుద్ధి పనులు చేయక, చెత్తను నిల్వ చేయడంతో వర్షానికి తడిసి, ఎండకు ఎండి.. భూమిలో పది మీటర్ల లోతులో కలిసిపోయాయి.
● యంత్రాంగం సరైన లెక్కలు వేయకపోవడం, తవ్వే కొద్దీ గుట్టలుగా చెత్త బయటకు వస్తోంది. ఇక్కడ పచ్చదనం పెంచాలంటే కనీసం పది మీటర్లు మేర మట్టిని తొలగించి, కొత్త మట్టి తెచ్చి పోస్తే.. తప్ప ఉద్యానవనాలుగా మారే పరిస్థితి లేదు.
● ప్రస్తుతం ఆదోనిలో 45 వేలు, ఎమ్మిగనూరులో 60 వేలు, డోన్‌లో 30 వేలు, నంద్యాలలో 30 వేలు టన్నులకు పైగా వ్యర్థాలు పోగయ్యాయి.
● ఆదోని పట్టణంలో పదివేల టన్నుల చెత్తశుద్ధి పనులు సౌరాష్ట్ర కంపెనీకి అప్పగించారు. నంద్యాలలో 80 వేల టన్నుల చెత్తను శుద్ధి చేశారు. ఇంకా 30 వేల టన్నులు తరలించాల్సి ఉంది.
● అన్ని పురపాలికలు ఒకే కంపెనీకి పనులు అప్పగించడం, దీంతో శుద్ధి అనంతరం వచ్చేవి మండే స్వభావం కలిగినవి పరిశ్రమలకు కుప్పలు, తెప్పలుగా చేరుకుంటున్నాయి. దీంతో అక్కడి పరిశ్రమల్లో స్థలం లేక ఖాళీ అయ్యే వరకు పంపొద్దని సూచిస్తున్నారు.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు
శుభాకాంక్షలు తెలపండి
జి.ఎస్.టి. 5% అదనం

మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా?
అయితే వారికి అందించండి అభినందన చందనాలు.
ఆకాంక్షించండి వారి భావిజీవిత సుఖమయ ఆనందాలు.
తెలియజేయండి ఈనాడు ద్వారా ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు.
పూర్తి వివరాలకు: కర్నూలు: 99899 97628, 80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

(c) eenadu

## తిరుగులేని ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల

విజేతలుగా నిలిచిన ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో.. ఉదయం మొదటి మ్యాచ్ శ్రీ సుధ జూనియర్ కళాశాల (డోన్), ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన శ్రీ సుధ జూనియర్ కళాశాల జట్టు 7 వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. లోహిత్ 24 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 47 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ మహేశ్ 16 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది.

EENADU SPORTS LEAGUE 2025

## నేటి ఫైనల్ మ్యాచ్‌లు

**జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో..**

**జూనియర్స్ విభాగంలో..**

☛ **ఉదయం 8 గంటలకు :** ఈఎస్‌సీ (ప్రభుత్వ పాలిటెక్నిక్ జూనియర్ కళాశాల (నంద్యాల) Vs ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల (కర్నూలు)

**సీనియర్స్ విభాగంలో..**

☛ **ఉదయం 10 గంటలకు :** కర్నూలు మెడికల్ కళాశాల Vs శాంతిరామ్ మెడికల్ కళాశాల (నంద్యాల)

## శాంతిరామ్ మెడికల్ కళాశాల సత్తా

కేవీఆర్ మైదానంలో రెండో మ్యాచ్.. శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల (కర్నూలు), శాంతిరామ్ మెడికల్ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన శాంతిరామ్ కళాశాల జట్టు 6 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. ఆనంత్ 21 బంతుల్లో 2 ఫోర్లతో 31 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ మనోజ్ 3, నితిన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల జట్టు 5 వికెట్లు కోల్పోయి 77 పరుగులే చేసింది. మనోజ్ 19 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ రోహిత్ 11 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు 14 పరుగుల తేడాతో గెలుపొందింది.

MEDICOVER HOSPITALS KURNOOL

శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు విజయోత్సాహం

బాధితుల గోడు వింటున్న కలెక్టర్

## సమస్యలకు పరిష్కారం చూపాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి 151 దరఖాస్తులు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ రీఓపెన్ అయిన దరఖాస్తులపై ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలన్నారు.

### పథకాలు సద్వినియోగం చేసుకోండి

జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులు వినియోగించుకోకపోతే వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు.

# గెలుపే లక్ష్యం.. హోరాహోరీ పోరాటం

☛ **ఉత్కంఠగా సాగిన ఈఎస్ఎల్ క్రికెట్ సెమీఫైనల్ పోటీలు**

☛ **ఫైనల్‌లో ప్రవేశించిన నాలుగు జట్లు**

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రెజెంట్స్) 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్- 2025' క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన సెమీఫైనల్ పోటీల్లో ఎనిమిది జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్‌లో చోటే లక్ష్యంగా ఆటగాళ్లు రెట్టించిన ఉత్సాహంతో ఆడారు. మొదట బ్యాటింగ్ చేసిన జట్లు బ్యాటర్లు చెలరేగిపోయారు. ఓవర్కు 8 రన్‌రేట్ తగ్గకుండా బ్యాటింగ్ చేశారు. తర్వాత బ్యాటింగ్ చేసిన జట్లు లక్ష్య ఛేదనలో తడబడి ఓటమి పాలయ్యారు.

ఇరు జట్ల కెప్టెన్ల సమక్షంలో టాస్ వేస్తున్న ముఖ్య అతిథి, కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్

## చెలరేగిన ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల

ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల ఆటగాళ్ల ఆనందం

కర్నూలు వైద్య కళాశాల మైదానంలో మొదటి మ్యాచ్.. ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల (కర్నూలు), కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల (డూపాడు) జట్ల మధ్య జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల జట్టు 3 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. మల్లికార్జున 39 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 92 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల జట్టు 6 వికెట్ల నష్టానికి 55 పరుగులే చేసింది. ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల 86 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది.

**ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే**

★ బి.మల్లికార్జున (39 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో 92 పరుగులు. 1 వికెట్)

## కర్నూలు వైద్య కళాశాల జయకేతనం

రెండో మ్యాచ్.. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (కర్నూలు), కర్నూలు వైద్య కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కర్నూలు మెడికల్ కళాశాల జట్టు 7 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. రేవంత్ 20 బంతుల్లో 6 ఫోర్లతో 36 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ ఆధిత్ 16 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 89 పరుగులే చేయగలిగింది. మోహన్ 12 బంతుల్లో 3 ఫోర్లతో 22 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్లు నితిన్, గోపాల్ చెరో మూడు వికెట్లు తీశారు. 17 పరుగుల తేడాతో కర్నూలు మెడికల్ కళాశాల జట్టు విజయం సాధించింది.

కర్నూలు మెడికల్ కళాశాల గెలుపు సంబరం

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
NECC (Non-Govt. Public Charitable Trust)
"Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor
MITS DEEMED TO BE UNIVERSITY
MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner
ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner
ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు



## శ్రీవారికి చిత్ర కీర్తన

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లి కోటేష్ అన్నమయ్య కీర్తనలతో వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని గీశారు. డ్రాయింగ్ చార్టుపై గీతలు లేకుండా కలర్ పెన్నులు, వాటర్ కలర్స్‌తో చిత్రాన్ని మూడు గంటల వ్యవధిలో గీసినట్లు తెలిపారు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిస్టర్డ్ ఆఫీస్ : శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032
బ్రాంచి ఆఫీస్ : డి.నెం. 40-384, ఫ్లాట్ నెం. 28 నుండి 36, 2వ అంతస్తు, యుకాన్ ప్లాజా, పార్క్‌రోడ్డు, కర్నూలు - 518001

(రూల్ 8 (1) ప్రకారం) **భౌతిక స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

**Ref : Loan Account No. KURN2TF2307280010**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం (శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, చెన్నైలోని ఎన్‌సిఎల్‌టి యొక్క ఆర్డర్ ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్'తో విలీనం చేయబడిందని సమాచారం. తదనంతరం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్' పేరు ది. 30-11-2022 నుండి "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా అమలులోకి వచ్చేలా మార్చబడినది. ది. 30-11-2022 నాటి ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్‌ను చూడగలరు) మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు : 1) ఎస్. మన్‌సూర్ హుస్సేన్,** తండ్రి : ఎస్. సత్తార్ మియా, హెచ్.నెం. 15-8ఎ, సాయిబాబా పేట, నందికొట్కూరు, కర్నూలు (జిల్లా)-518401. **2) ఎస్. తబస్సుమ్,** భర్త : ఎస్. మన్‌సూర్ హుస్సేన్, హెచ్.నెం. 15-8ఎ, సాయిబాబా పేట, నందికొట్కూరు, కర్నూలు (జిల్లా)-518401. **3) ఎస్. మాబాషా,** తండ్రి : ఎస్. హుస్సేన్ సాహెబ్, హెచ్.నెం. 15-9హెచ్3, సాయిబాబా పేట, నందికొట్కూరు, కర్నూలు జిల్లా - 518401 వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 34,58,705/-** (అక్షరాలా ముప్పై నాలుగు లక్షల యాభై ఎనిమిది వేల ఏడు వందల ఐదు రూపాయలు మాత్రమే) + వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్చువల్ ఛార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించ వలసినదిగా **తేది. 28-06-2025 న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సెక్షన్13 (4) సదరు చట్టం ప్రకారం సదరు చట్టములోని సెక్షన్ 14 కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 9 ప్రకారము దిగువ పేర్కొన్న ఆస్తిని **తేది. 24-12-2025** న **భౌతికంగా స్వాధీనత** తీసుకోవడమైనదని ఋణగ్రహీతలకు ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ప్రస్తుతం చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 34,58,705/-** (అక్షరాలా ముప్పై నాలుగు లక్షల యాభై ఎనిమిది వేల ఏడు వందల ఐదు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ మరియు ఇప్పటి వరకు కాంట్రాక్చువల్ ఛార్జీలు మరియు పెనాల్టీలు మరియు తదుపరి వడ్డీ మరియు ఇతర కాస్ట్‌లు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉండునని ప్రత్యేకించి ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

**ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్‌కి తనఖా పెట్టిన స్థిరాస్తుల వివరాలు :**

స్థిరాస్తి వివరములు : **KURN2TF2307280010**కి చెందిన ఆస్తి వివరాలు : నంద్యాల జిల్లా, నందికొట్కూరు సబ్ డిస్ట్రిక్ట్, నందికొట్కూరు మున్సిపాలిటీ మరియు టౌన్, సర్వే నెం. 827/ఏ1 పైకి వద్ద ఎకరా 0.06.53 సెంట్లు లేదా 316.52 చ॥గ॥లు విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు :** హనుమంతరెడ్డి గారికి చెందిన స్థలము, **పడమర :** జాకీర్ హుస్సేన్ గారికి చెందిన స్థలము, **ఉత్తరం :** నాగరంగం మరియు ఇతరులకు చెందిన స్థలము, **దక్షిణం :** 20 అ॥ వెడల్పు రోడ్డు. పై సరిహద్దుల మధ్య తూర్పు నుండి పడమరకు 66.3 చ॥అ॥లు మరియు ఉత్తరం నుండి దక్షిణంకు 43 చ॥అ॥లు మొత్తం కలుపగా ఎకరా 0.06.53 సెంట్లు లేదా 316.52 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మరియు దానికి చెందిన అన్ని ఈజ్‌మెంట్ హక్కులు మరియు సౌలభ్య హక్కులతో సహా స్థలము.

ప్రదేశం : కర్నూలు
తేది : 24-12-2025
అధీకృత అధికారి
మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిస్టర్డ్ ఆఫీస్ : శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032
బ్రాంచి ఆఫీస్ : డి.నెం. 40-384, ఫ్లాట్ నెం. 28 నుండి 36, 2వ అంతస్తు, యుకాన్ ప్లాజా, పార్క్‌రోడ్డు, కర్నూలు - 518001

(రూల్ 8 (1) ప్రకారం) **భౌతిక స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

**Ref : Loan Account No. KURN2TF2210070006**

[illegible] ... బకాయి మొత్తం **రూ. 33,61,854/-** ... **10-07-2024 న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది. ... **24-12-2025** ... [illegible]

**ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్‌కి తనఖా పెట్టిన స్థిరాస్తుల వివరాలు :**

స్థిరాస్తి వివరములు : **KURN2TF2210070006** కి చెందిన ఆస్తి వివరాలు : [illegible]

ప్రదేశం : కర్నూలు
తేది : 24-12-2025
అధీకృత అధికారి
మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

## యాగంటి హుండీ ఆదాయం రూ.29 లక్షలు

బనగానపల్లి గ్రామీణం , న్యూస్‌టుడే: ఉమామహేశ్వరస్వామి ఆలయంలో 80 రోజుల కాలానికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 29,58,535 నగదు, 35 గ్రాముల బంగారం, 160 గ్రాముల వెండి సమకూరింది.

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**HEALTH MEDICAL AND FAMILY WELFARE DEPARTMENT**
**GOVERNMENT GENERAL HOSPITAL, KURNOOL**
**Notification No.01/DE-ADDICTION CENTRE/GGH-KNL & NDL/2025, dated: 27-12-2025**

NOTIFICATION FOR RECRUITMENT TO CERTAIN VACANT POSTS IN DRUG DE-ADDICTION CENTRES AT GOVERNMENT GENERAL HOSPITAL, KURNOOL AND NANDYAL ON CONTRACT BASIS.

Applications are invited from the eligible candidates for recruitment to the following No. of posts on contract basis for the Drug De-Addiction Centre, GGH, Kurnool and for the Drug De-Addiction Centre, GGH, Nandyal initially for a period of one year, as noted below against each post:-

| S. No. | Name of the post | No. of Posts Vacant in Drug De-Addiction Centre at | |
|---|---|---|---|
| | | GGH, Kurnool | GGH, Nandyal |
| 1 | Doctor (Full time) | 1 | 1 |
| 2 | Project Coordinator cum Vocational Counsellor | 1 | 1 |
| 3 | Nurse (ANM) | 1 | 0 |
| 4 | Ward Boy | 1 | 2 |
| 5 | Counsellor/Social Worker/Psychologist | 2 | 2 |
| 6 | Peer Educator | 1 | 1 |
| 7 | Yoga Therapist/Dance/Music/Art Teacher | 1 | 1 |

Application Form, Roster Points and Eligibility details (PROSPECTUS) are uploaded to Kurnool District website https://kurnool.ap.gov.in and Nandyal District Website https://nandyal.ap.gov.in.

Eligible candidates should download the APPLICATION FORM from the Kurnool District website- https://kurnool.ap.gov.in (or) Nandyal District Website https://nandyal.ap.gov.in and to submit the Filled in Application Form in the O/o the Addl.DME /Superintendent, Government General Hospital, Kurnool from 30.12.2025 to 13.01.2026 between 10.30 AM to 5.00 PM.

Sd/- Dr.K.Venkateswarlu, ADME/Superintendent GGH, Kurnool. Member Convener

Sd/- Dr. A.Siri, I.A.S., District Collector/ Chairperson District Selection Committee, Kurnool.

## 2 కిలోల గంజాయి స్వాధీనం

☛ **నలుగురి అరెస్టు**

నందికొట్కూరు, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి 2.100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన కావేటి నాగశేషాద్రి, నందికొట్కూరు పట్టణం వాల్మీకి నగర్‌కు చెందిన షేక్‌మసూద్, కుమ్మరి హరినాథ్, నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామానికి చెందిన అనంత చిన్మయానందలు పట్టణం శివారులోని చాటలమ్మ, పొరకలమ్మ గుడి సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు వెళ్లి వారిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

## పది నెలలు పని చేసినా వేతనం ఇవ్వలేదు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో దాదాపు 10 నెలలు పని చేసినా జీతం ఇవ్వక పోగా కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య అమర్యాదగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు మల్లికార్జునయ్య అనే అధ్యాపకుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 75 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ సునీల్ షొరాణ్ బాధితుల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. చట్ట పరిధిలో ఉన్న సమస్యలకు నిర్ణీత గడువు లోపల పరిష్కరించాలని ఆదేశించారు.

**కొన్ని సమస్యలు...**

● తన భార్య ఐదు తులాల బంగారాన్ని పెద్ద కోడలు తీసుకొని ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని స్థానిక షాదిక్‌నగర్‌కు చెందిన వృద్ధుడు బాదుల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

● తన భర్త బాలుగ్రం వివిధ ప్రైవేట్ బ్యాంకుల్లో తన ద్వారా రూ.30లక్షలకు పైగా రుణాలు తీసుకుని జీతం నుంచి ప్రతి నెలా రూ. 28వేలు ఈఎంఐ కట్టేలా చేశారని ఓ బాధితురాలు ఫిర్యాదు చేసింది. వేరే అమ్మాయిలతో తిరుగుతూ తనను మోసం చేస్తున్నాడని, ఆ డబ్బులు తనను కట్టమని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు.

● తన స్థలంలో బండిఆత్మకూరుకు చెందిన శ్రీనివాసులు, నరసింహుడు, వెంకటేశ్వర్లు అనే వ్యక్తులు బర్రెల కొట్టం వేసి ఆక్రమించారని.. వాటిని తొలగించమంటే బెదిరింపులకు గురి చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సునీల్ షొరాణ్

# అంతుచిక్కని ఆవేదన

☛ **తల్లీ పిల్లల కోసం కొనసాగుతున్న గాలింపు**

గడివేముల, న్యూస్‌టుడే: ఎస్సార్బీసీ కాలువలో గల్లంతైన తల్లి, పిల్లల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం ఒండుట్ల గ్రామానికి చెందిన బుగ్గానిపల్లె ఎల్లాలక్ష్మి, తన కుమార్తెలు వైష్ణవి, సంగీతలతో మంచాలకట్ట గ్రామ సమీపంలో కాలువలోకి దూకారు. వారి ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం పుట్టీల సాయంతో స్థానికులు గాలించారు. తర్వాత ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది మర బోట్లతో గాలించారు. సంఘటనా స్థలం నుంచి గోరుకల్లు జలాశయం వరకు వెతికారు. డ్రోన్ సాయంతో గాలించినా సాయంత్రం 6 గంటల వరకు వారి జాడ తెలియరాలేదు. సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సై నాగార్జునరెడ్డి సంఘటనా స్థలంలో గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గల్లంతయిన తల్లీపిల్లల కోసం కుటుంబసభ్యులు, బంధువులు అక్కడే నిరీక్షిస్తున్నారు.

గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

నంద్యాల చెక్ పోస్ట్ దగ్గరలో మేము కొత్తగా నిర్మించబోయే అపార్ట్ మెంటులో ఫుల్ పేమెంట్‌తో 3 flats (1400 Sft, 3 BHK, 1100 Sft, 2BHK) Cost to Cost అమ్మబడును. ఆసక్తి గలవారు సంప్రదించండి. ✆ 72078 97528, 96189 22589.

JOBS

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI + PF + జీ- 17K ✆ 7019632854

YAC- వారి ముందడుగు మీడియాలో పనిచేయుటకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అభ్యర్థులు కావలెను. తేది: 3/1/26 సంప్ర: కాంకర్ కాలేజీ, సి-క్యాంప్, కర్నూలు. ✆ 73309 24873, 98854 85281.

THE EENADU WAY CLASSIFIEDS
అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిస్టర్డ్ ఆఫీస్ : శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032
బ్రాంచి ఆఫీస్ : డి.నెం. 50-760-114ఎ, 2వ అంతస్తు, శాంసంగ్ స్మార్ట్ ప్లాజా పైన, గాయత్రి ఎస్టేట్, గుత్తి రోడ్డు, కర్నూలు - 518003.

(రూల్ 8 (1) ప్రకారం) **భౌతిక స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

**Ref : Loan Account No. KURN4TF2209260011**

[illegible] ... బకాయి మొత్తం **రూ. 49,21,860/-** ... **10-07-2024 న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది. ... **24-12-2025** ... [illegible]

**ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్‌కి తనఖా పెట్టిన స్థిరాస్తుల వివరాలు :**

స్థిరాస్తి వివరములు : **KURN4TF2209260011** కి చెందిన ఆస్తి వివరాలు : [illegible]

ప్రదేశం : కర్నూలు
తేది : 24-12-2025
అధీకృత అధికారి
మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిస్టర్డ్ ఆఫీస్ : శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032
బ్రాంచి ఆఫీస్ : డి.నెం. 50-760-114ఎ, 2వ అంతస్తు, శాంసంగ్ స్మార్ట్ ప్లాజా పైన, గాయత్రి ఎస్టేట్, గుత్తి రోడ్డు, కర్నూలు - 518003.

(రూల్ 8 (1) ప్రకారం) **భౌతిక స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

**Ref : Loan Account No. KURN4TF2303170005**

[illegible] ... బకాయి మొత్తం **రూ. 55,84,864/-** ... **28-06-2025 న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది. ... **24-12-2025** ... [illegible]

**ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్‌కి తనఖా పెట్టిన స్థిరాస్తుల వివరాలు :**

స్థిరాస్తి వివరములు : **KURN4TF2303170005** కి చెందిన ఆస్తి వివరాలు : [illegible]

ప్రదేశం : కర్నూలు
తేది : 24-12-2025
అధీకృత అధికారి
మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

## విజయ డెయిరీ డైరెక్టర్ల గృహ నిర్బంధం

నంద్యాల పట్టణం,నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల విజయ డెయిరీ డైరెక్టర్లు గంగుల విజయసింహారెడ్డి, వీపీ మధుసూదనరెడ్డిలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. చాగలమర్రి ముత్యాలపాడు పాల సొసైటీ ఎన్నికలకు సంబంధించిన సభ్యులపై కొద్ది రోజుల క్రితం విచారణ కమిటీని నియమించారు. ఇందులో విజయసింహారెడ్డితో పాటు మధుసూదనరెడ్డి, రవికాంత్‌రెడ్డిలు ఉన్నారు. సోమవారం ఈ ముగ్గురు విచారణ నిర్వహించాల్సి ఉంది. సొసైటీ సభ్యులు ఆరుగురిని విచారించాల్సి ఉండగా.. విజయ డెయిరీ వద్ద హైటెన్షన్ నెలకొంది. ఇరు వర్గాలు అక్కడికి చేరుకుంటే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉండడంతో విజయసింహారెడ్డి, మధుసూదనరెడ్డిలను పట్టణంలోని వారి స్వగృహాల్లో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. డెయిరీ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మధుసూదనరెడ్డిని వైకాపా జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎమ్మెల్యే బిజేంద్రనాథరెడ్డిలు పరామర్శించారు.

హౌస్ అరెస్టు చేయడంతో కూర్చున్న మధుసూదన్‌రెడ్డి

# నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

## ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు

వ్యాపారులతో మాట్లాడుతున్న పురపాలక కమిషనర్ శేషన్న

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని పురపాలక కమిషనర్ బండి శేషన్న వ్యాపారులను హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని నూనె పల్లెలో ఆయన పర్యటించారు. పలు దుకాణాలను తనిఖీ చేశారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పెద్ద ఆస్పత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో అల్పాహారం తీసుకున్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పుర కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పురపాలక కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన కమిషనర్ బేబి పురపాలక రెవెన్యూ శాఖ విభాగంలో బదిలీ అయ్యారు. వెంకటగిరి పురపాలక కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డి బదిలీపై వచ్చి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## మేమున్నాం... మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 67729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

మిడుతూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని కలమందలపాడు ఉన్నత పాఠశాల ముందు భాగంలో మురుగు ప్రవహిస్తోంది. వెంటనే తొలగించాలి. - **మౌలాలి, స్థానికుడు** ✔: సిబ్బందిని వెంటనే పంపించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - **శ్రీధర్, గ్రామ కార్యదర్శి, కలమందలపాడు** ?: మిడుతూరు బీసీ కాలనీలో విద్యుత్తు దీపాలు వెలగక రాత్రిపూట కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. - **అహమ్మద్, కాలనీవాసి** ✔: గ్రామ సర్పంచితో మాట్లాడి కాలనీలో నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తాం. - **కళ్యాణ్‌సింగ్, పంచాయతీ తాత్కాలిక కార్యదర్శి**

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: నంద్యాల పట్టణంలోని బాల్కొండ హాల్, బ్రాహ్మణ వీధుల్లో వీధి కుక్కల బెడద అధికమైంది. బయటికి వెళ్లాలంటే భయంగా ఉంది. **-సురేష్, ఈశ్వర్ స్థానికులు** ?: పట్టణంలోని నబినగర్, పొన్నా నగర్‌లో కాల్వలు సరిగా శుభ్రం చేయడం లేదు. దోమల బెడద అధికమైంది. - **ఇమ్రాన్, సాదిక్ స్థానికులు** ✔: పలు ప్రాంతాల్లో కుక్కలను పట్టించే కార్యక్రమం చేపట్టాం. సిబ్బందిని పంపి కాల్వలను శుభ్రం చేయిస్తాం. - **లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: సంగమేశ్వరం సర్కిల్‌లో రహదారి గుంతలమయంగా ఉంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-సుధాకర్, స్థానికుడు.** ✔: రహదారి గుంతలు పూడ్చివేయిస్తాం. **-షాహీర్ బాషా, పురపాలక ఏఈ.** ?: కుప్పలకుంట నుంచి పోలీసుపేట వెళ్లే మార్గంలోని మురుగు కాల్వలో పూడిక, వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. **-నాగన్న, స్థానికుడు.** ✔: కాల్వల్లో పూడిక తొలగిస్తాం. **-జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

పోటీల్లో పాల్గొన్న రాఘవ్ జూనియర్ కళాశాల విద్యార్థులు

బహుమతులు అందుకున్న విద్యార్థులు

## పోటీ పరీక్షలతో మేధస్సుకు పదును

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల మేధస్సు పెరుగుతుందని నంద్యాల రాఘవ్ విద్యాసంస్థల అధినేత అబ్బాస్‌ఖాన్, కళాశాల డైరెక్టర్ మాలి చంద్ర పేర్కొన్నారు. సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో రాఘవ్ జూనియర్ కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు శ్రీనివాస్, వివేక్, మధుచిన్మయులకు కళాశాల అధినేతతో పాటు ప్రిన్సిపల్ సుంకయ్య, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

పాల్గొన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి శ్రావణి, ద్వితీయ బహుమతి షబానాబేగం, తృతీయ బహుమతి జాస్మిన్ గెలుపొందారు. వారికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రాంబాబు, అధ్యాపకులు దేవి, వసంత, భాగ్యమ్మ, పుష్పలత, సునీత, సుధేష్ణ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొరవడిన చెత్తశుద్ధి

### ◆ ఎక్కడ చూసినా అస్తవ్యస్తంగా పరిసరాలు

కాంతినగర్ రహదారి పక్కన చెత్త

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం మెరుగుపర్చడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించింది. ప్రతి నెలా మూడో శనివారం అధికారులు, ప్రజలు శ్రమదానం, అవగాహన కార్యక్రమాలు, చెత్త నిర్వహణ వంటి పారిశుద్ధ్య పనులు చేయాలని నిర్దేశించింది. పట్టణాలకు, గ్రామాలను పరిశుభ్రంగా మార్చడానికి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అధికారులు చిత్తశుద్ధితో చేయకపోవడంతో వీధుల్లో, రహదారుల పక్కన చెత్త కుప్పలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో అపరిశుభ్ర వాతావరణం మధ్యన ప్రజలు జీవిస్తున్నారు. దుర్వాసన, దోమలతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అయినా అధికారులు తగిన చర్యలు చేపట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్ల పక్కనే చెత్త కుప్పలు

నంద్యాల పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. దాదాపు 2.5 లక్షల జనాభా నివాసం ఉంటున్నారు. ప్రతి రోజూ 110 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీన్ని తొలగించడానికి 440 మంది కార్మికులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. 12 ట్రాక్టర్లు, 5 చిన్న కంపాస్టర్లు, 2 పెద్ద కంపాస్టర్లు, 3 టిప్పర్లు, ఒక జేసీబీ, రెండు మినీ జేసీబీలు ఉన్నాయి. ఫాగింగ్ చేయడానికి 8 యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. కార్మికుల కొరత, వాహనాలు తరచూ కొన్ని మరమ్మతులకు గురవుతుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడంలేదు. దీంతో చెత్త డబ్బాలు నిండిపోయి రోడ్లన్నీ అధ్వానంగా కనిపిస్తున్నాయి. ఉదయాన్నే తరలించాల్సిన చెత్త కొన్ని చోట్ల మధ్యాహ్నమైనా రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలను పశువులు కలియబెడుతుండటంతో దుర్వాసన వస్తోంది. దీనివల్ల రోగాలు వ్యాపిస్తున్నాయి.

### అధ్వానంగా మురుగునీటి పారుదల

పట్టణంలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగునీరు పారడానికి చిన్న కాల్వలు 116 కి.మీ., మధ్యరకం కాల్వలు 26కి.మీ, పెద్ద కాల్వలు సుమారు 18కి.మీ. మేర ఉన్నాయి. కాల్వల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయాల్సి ఉన్నా పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారు. అయినా అధికారులు వారిపై చర్యలు తీసుకోవడంలేదు. కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి రోడ్లు, పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో దోమల బెడద అధికంగా ఉంటోంది. చీకటి పడితే ఆరుబయట దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రిళ్లు కంటిమీద కునుకులేకుండా పోతోందని ప్రజలు వాపోతున్నారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు, ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. కాల్వల్లో చెత్త తొలగించడం లేదని, ఫాగింగ్ చేయడంలేదని, దోమల మందు పిచికారి చేయడంలేదని, నీరు నిలిచిన ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయడం లేదని ప్రజలు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టి పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని కోరుతున్నారు. పట్టణంలో రోజూ సమయానికి పారిశుద్ధ్య పనులు, కాల్వల్లో పూడిక, ఫాగింగ్ చేయిస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ శర్మ తెలిపారు.

## కార్యకర్తలతో పార్టీకి అధినేతలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: తెదేపాకు కార్యకర్తలే అధినేతలని తెదేపా మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి, టీజీపీ ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు కంచర్ల మనోహర్ చౌదరి అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని అవార్డులకు ఎంపిక చేశారు. సోమవారం బండిఆత్మకూరులోని తెదేపా కార్యాలయంలో జాకీర్‌ఖాన్, సుబ్బయ్య, బుగ్గరాముడు, కృష్ణుడు, చాంద్‌బాష, మోక్షేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రమేష్, చిన్నరంగస్వామి, సురేష్‌రెడ్డి, రిజ్వాన్, జనార్దన్‌రెడ్డి, కొత్తూరయ్య, లక్ష్మీరెడ్డి తదితరులకు ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భైరెడ్డి సుబ్బారెడ్డి, వెంగళరెడ్డి పేట శ్రీను, కొరకంచి శంకర్, సాయిబాబారెడ్డి, మదన భూపాల్, పాపయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ.ఫిరోజ్ పంపిణీ చేశారు. స్థానిక మంత్రి ఫరూక్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం 43 మంది బాధిత కుటుంబ సభ్యులకు రూ.33,51,863ల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, తెదేపా నాయకులు తులసీశ్వరరెడ్డి, విశ్వనాథరెడ్డి, కౌన్సిలర్ కండే శ్యాంసుందర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

## గుంతతో ప్రమాద చింత

నంద్యాల పట్టణం బొగ్గులైన్‌లో రహదారిపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. పక్కన కాల్వలోకి మురుగు పారి గుంతలో నిలుస్తోంది. దీంతో గుంతను గమనించకుండా ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి గుంతను పూడ్చి వేయించాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

## తాగునీరు.. నేల పాలు

సున్నిపెంటలోని వెస్ట్రన్ కాలనీ నుంచి బీసీ పాఠశాలకు వెళ్లే రహదారిలో తాగునీరు పైపు లీకు కావడంతో నీరు రహదారిపై వృథాగా పోతోంది. కాలనీలో పది రోజులకు ఒక్కసారి తాగునీరు సరఫరా అవుతుంటే ఈ పైపుల లీకు వల్ల తాగునీరు వృథాగా పోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పైపులకు మరమ్మతు పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్

## తవ్వారు.. వదిలేశారు..

నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో గత కొన్ని నెలల కిందట తవ్విన తరువాత కంకర వేసి అలాగే వదిలేశారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి వాహనదారులు ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పురపాలక అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు వేయాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.
-న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

## నీరు నిలిచి.. ఇబ్బందులు

కొణిదేల గ్రామంలో రేణుకా ప్రైవేట్ పాఠశాల ఎదురుగా ఉన్న కాలనీకి వెళ్లే దారిలో నీటి సరఫరా వాల్వ్ మరలా లీకవ్వడంతో భారీగా నీరు వృథా అవుతూ రహదారిపై నిలుస్తోంది. దాంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నీటి వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

## సంక్షిప్త సమాచారం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాల వద్ద అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించాలని ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాసరావు, ప్రతాప్, వెంకటాద్రి కోరారు. తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐటీయూ క్యాలెండర్‌ను సీఐ సుబ్బారావు ఆవిష్కరించారు. చిన్నమారెన్న, నాగరాజు, యోబు పాల్గొన్నారు.

కొత్తపల్లి, న్యూస్‌టుడే: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రవీంద్రా తెలిపారు. సింగరాజుపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి భర్త ఇంటి నుంచి వెళ్లిపోయిందని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

మహానంది, న్యూస్‌టుడే: శ్రీనగరం గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసునమోదు చేసినట్లు ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 28 తేదీన మధ్యాహ్నం అనారోగ్యం కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయిందని తెలిపారు.

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా సున్నిపెంటలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల వెస్ట్రన్ కాలనీలో సబ్ ట్రెజరీ అధికారి ఆర్.వెంకటరమణ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.

నందికొట్కూరు గ్రామీణం,న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అప్పలరాజుపై పీడీ కేసు నమోదు చేయడం దుర్మార్గమని సీపీఎం మండల కార్యదర్శి సోమన్న అన్నారు.

శ్రీశైలం ఆలయం: టీడీఏకు చెందిన అంబులెన్స్‌ల్లో టెక్నీషియన్లను నియమించాలని చెంచు సంఘం నాయకులు సోమవారం ఏవీవో సురేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

మిడుతూరు,న్యూస్‌టుడే: మండలంలోని కడుమూరు గ్రామానికి చెందిన వ్యక్తి యాసిడ్ తాగగా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై సుబ్బయ్య తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ఆత్మకూరు పట్టణం: భాజపా మండలాధ్యక్షుడు వెంకట రామిరెడ్డి ఆదివారం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. భాజపా మైనార్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా వెంకటరామిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ఉత్తర ద్వార దర్శనానికి అందంగా అలంకరించిన ఆలయం

నంద్యాల పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో విద్యుత్తు దీపాలు



సంజీవనగర్‌లో ప్రత్యేక అలంకరణ

విద్యుత్తు దీపాలతో వెలిగిపోతున్న రామాలయం

మహానందిలో విద్యుత్తు అలంకారంలో ఉత్తర ద్వార దర్శనం

## ఇల వైకుంఠ వెలుగులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు ఆలయాలను సుందరంగా అలంకరించారు. సంజీవనగర్ కోదండ రామాలయం, గుడిపాటిగడ్డలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, రోజాకుంటలోని నాగలింగేశ్వర స్వామి ఆలయం, బైర్మల్ వీధిలోని ఉత్తరాది మఠం, తెలుగుపేటలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో మంగళవారం వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

## వైభవంగా మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు వైభవంగా వెండి రథోత్సవం నిర్వహించారు. రాత్రి 7గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి, సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. ఈవో ఎం.శ్రీనివాసరావు, ప్రధానార్చకులు వీరన్నస్వామి దంపతులు పాల్గొన్నారు.

స్వామి అమ్మవార్లకు వెండి రథోత్సవం నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు

## కార్యకర్తలే తెదేపాకు బలం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కార్యకర్తలే తెదేపాకు బలమని నంద్యాల పార్లమెంట్ తెదేపా బాధ్యుడు మాండ్ర శివానంద

మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తజయసూర్యతో కలిసి ప్రశంసా పత్రాలు చూపుతున్న కార్యకర్తలు

రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తజయసూర్య అన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో బూత్ స్థాయిలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల ఉత్తమ సేవలను గుర్తించి, సోమవారం అల్లూరులో ప్రశంసా పత్రాలను అందజేశారు.

## వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: 10 బొల్లవరం గ్రామంలోని కొలువైన వెంకటేశ్వరస్వామిని నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తజయసూర్య, నంద్యాల పార్లమెంట్ తెదేపా బాధ్యుడు మాండ్రశివానందరెడ్డిలు సోమవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, నందికొట్కూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

## క్రీడల్లో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ ఎల్.వలియా సోమవారం తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో 28వ

విద్యార్థులతో ప్రిన్సిపల్ వలియా

రీజినల్ క్రీడా పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. మొత్తం 11 విభాగాల్లో విద్యార్థులు సత్తా చాటారన్నారు. విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ గణేష్‌ను ప్రిన్సిపల్ ఎల్.వలియా అభినందించారు.

## జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా పేద ప్రజలు, వ్యవసాయ కూలీలకు ఆర్థికంగా చేయూత ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ పుదుచ్చేరి ఇన్‌ఛార్జి మధు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆత్మకూరులో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల్లో అరవై శాతం నిధులు రాష్ట్రాలు భరించాలని చెప్పటం పథకాన్ని నిర్వీర్యం చేయడమే అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పోటీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ చింతల మోహన్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షులు ఇబ్రహీం, అబ్రహం, నాయకులు రవి, షాజహాబేగం, అన్వర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మధు యాదవ్

## బాల్య వివాహాలతో అనర్థం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో అనర్థాలు కలుగుతాయని సీడీపీవో కోటేశ్వరి అన్నారు. ఆత్మకూరు అర్బన్‌కాలనీ అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. బాల్య వివా

అవగాహన కల్పిస్తున్న సీడీపీవో కోటేశ్వరమ్మ

హాల వల్ల కలిగే నష్టాలు, మహిళల్లో రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహారం, పిల్లల పోషణ గురించి తల్లులకు అవగాహన కల్పించారు.

బోయరేవుల(వెలుగోడు), న్యూస్‌టుడే: మహిళల్లో రక్తహీనత నివారించాలని ఐసీడీఎస్ పర్యవేక్షకులు జయలక్ష్మీ, వినోలియాలు అన్నారు. వెలుగోడు మండలంలోని బోయరేవుల అంగన్‌వాడి కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## ఉద్యోగాల భర్తీకి వినతి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్ డిమాండు చేశారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డిని కలిసి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, శశిధర్ రెడ్డి, మాబాష పాల్గొన్నారు.

## వసతి గృహ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని యస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం పరిధిలో వసతి గృహ నిర్మాణానికి భక్తులు రూ.లక్ష విరాళాన్ని అందజేసినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. సోమవారం కర్నూలు పట్టణానికి చెందిన పంచాగ్నుల మల్లికార్జున శాస్త్రి జ్ఞాపకార్థం కుమారుడు రమేష్ భరద్వాజ్ రూ.1,01,116 విరాళాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు.

## సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మిట్టకందాల గ్రామంలో 50 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగాల నాగరాజు డిమాండ్ చేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ పఠాన్‌బాబులకు వినతిపత్రం అందజేశారు.

## జైనఖ్ పరిశ్రమను అభివృద్ధి చేయండి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: జూపాడు బంగ్లా మండలం తంగడంచ రాష్ట్ర విత్తనోత్పత్తి భూముల్లో ఏర్పాటు చేసిన మెగా సీడ్ పార్క్ జైన్ ఇరిగేషన్ పరిశ్రమను అభివృద్ధి చేసి ఉపాధి కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గం సభ్యుడు రమేష్ కోరినట్లు తెలిపారు. సోమవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో ఏపీ వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజశేఖరును కలిసి వినతి పత్రం సమర్పించారు. తంగడంచ ఫారం రాష్ట్ర విత్తనోత్పత్తి క్షేత్రంలోని 1600 ఎకరాల ప్రభుత్వ భూములను అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరినట్లు చెప్పారు.

ప్రధాన కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

## ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసం పెరగాలి

తిమ్మాపురం, (మహానంది), న్యూస్‌టుడే: ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసం పెరగాలని శారదాపీఠం పీఠాధిపతి శివయోగీంద్ర సరస్వతీస్వామి పేర్కొన్నారు. మహానంది మండల కేంద్రం ఎం.తిమ్మాపురం అంకాళ పరమేశ్వరీదేవి ఆలయం ఆవరణంలో సోమవారం రెంటచింతల రామశర్మ అధ్యక్షతన హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వక్తలుగా హాజరైన నంద్యాల జిల్లా సక్ష్యం అధ్యక్షులు నేట్ల మహేశ్వరరెడ్డి, శివశక్తి ఆర్గనైజేషన్ సహ కార్యదర్శి కల్యాణ్‌కుమార్‌లు మాట్లాడారు. దేశాన్ని, ధర్మాన్ని, కాపాడుకోవడానికి హిందువులంతా ఏకం కావాలంటూ పిలుపునిచ్చారు. నూలు కవిత, మార్తల జనార్దన్‌రెడ్డి, చిన్నకాశయ్య, పెద్దకాశయ్య, ఉల్లి మధు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న నేట్ల మహేశ్వరరెడ్డి

## మహిళలు క్రీడల్లో రాణించాలి

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు క్రీడల్లో రాణించాలని దామగట్ల సర్పంచి సుశీలమ్మ అన్నారు. సీఎస్ఐ ఆధ్వర్యంలో అంతరాష్ట్ర స్థాయి మహిళ కబడ్డీ పోటీలు నిర్వహించారు. బాపట్ల జట్టు మొదటి బహుమతి, కృష్ణా జట్టు రెండో, కర్నూలు జట్టు మూడో, కడప జట్టు నాల్గవ బహుమతి సాధించారు.

గెలిచిన జట్టుకు బహుమతి అందజేస్తున్న సీఎస్ఐ సంఘం పెద్దలు

## క్రీడల్లో శివకీర్తి

### ఖోఖోలో జాతీయస్థాయిలో రాణిస్తున్న బాలిక

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు పట్టణానికి చెందిన శివకీర్తి ఖోఖోలో జాతీయ స్థాయిలో రాణిస్తోంది. చదువుతో పాటు ఖోఖోలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికైంది. ఆత్మకూరు పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని శివకీర్తి అండర్-18 విభాగంలో ఈనెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు బెంగళూరులో జరిగే 44వ జూనియర్ నేషనల్ ఖోఖో ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతోంది. ఖోఖో క్రీడపై శివకీర్తి ఆసక్తిని గుర్తించిన కోచ్ మహబూబ్ మరింత ప్రోత్సహించి సూచనలు, సలహాలు చేయటంతో జాతీయస్థాయికి ఎంపికైంది.

శివకీర్తి

### ప్రస్థానం ఇలా..

ఆత్మకూరు అర్బన్ కాలనీకి చెందిన రాజు, సుమలతల కుమార్తె శివకీర్తి. ఆత్మకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. గత ఏడాది అక్టోబరులో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అండర్-17 విభాగంలో మండల స్థాయి ఖోఖో పోటీల్లో రాణించడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గత ఏడాది నవంబరులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపింది. అనంతరం అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. సీనియర్ విభాగంలో గత ఏడాది డిసెంబరులో కర్నూలులో జరిగిన పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపింది. ఈ ఏడాది సెప్టెంబరులో గన్నవరంలో జరిగిన సౌత్ జోన్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. నవంబరులో 22, 23వ తేదీల్లో విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అండర్-18 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు బెంగళూరులో జరగనున్నాయి.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని తలారి వినోద్(34) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదివారం సాయంత్రం బుడగజంగాల కాలనీకి చెందిన కిరణ్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ పెద్ద చర్చి సమీపంలో కూర్చున్న తలారి వినోద్‌కు ఢీకొట్టాడు. దీంతో ఇరువురు ఘర్షణ పడ్డారు. ఆ తర్వాత కొంత సేపటికి వినోద్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అతన్ని స్థానిక జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి సరోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

(c) eenadu

# ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

## అభివృద్ధికి అందరూ సహకరించండి

మాట్లాడుతున్న సప్తశైల రాజేష్

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలని పట్టణ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయంలో పురపాలక ఛైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఐదింటి చెత్త సేకరణ, చెత్త వాహనాల మరమ్మతులు, నిధుల మంజూరు తదితర విషయాలను కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. అజెండాలో రూపొందించిన 25 అంశాలన్నింటిని కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కానీ టేబుల్ అజెండాలను ఒకటి, రెండు అంశాలను రూపొందించి కౌన్సిల్ ముందు ఉంచుతారు, ఒకే సారి మాదు టేబుల్ అజెండాల్లో 37 అంశాలను రూపొందించి కౌన్సిల్‌లో వినిపించాలని అధికారులు చూడటంతో.. వాటిని కౌన్సిల్ సభ్యులు వాయిదా వేశారు. వచ్చే కౌన్సిల్ సమావేశంలో ఆ అంశాలను పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, వైస్ ఛైర్మన్లు కె.హరికిషన్, జాకీర్‌హుస్సేన్ అధికారులు పాల్గొన్నారు.

## త్వరలో మౌలిక వసతుల కల్పన

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలో జరిగే వివిధ అభివృద్ధి పనులకు ఆయా వార్డు కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ పేర్కొన్నారు. నగర పంచాయతీ వార్డు కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. ముందుగా వివిధ అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద వచ్చిన రూ.2 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయని, వీలైనంత త్వరగా పట్టణంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు, పైప్‌లైన్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలో శిథిలావస్థకు చేరిన సీసీ రోడ్లకు మరమ్మతులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అంజి, రాంగోపాల్, ఎస్.కుమారి, ఏపీ మధుసూదన్‌రెడ్డి, మధుకుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్

## ప్రతి ఇల్లు విద్యుదుత్పత్తి కేంద్రం కావాలి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: గృహాలపై సోలార్ పలకాలు ఏర్పాటు చేసుకుని దాని ద్వారా ప్రతి ఇల్లు విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం కావాలని మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌లు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన ధ్రువ సోలార్ పవర్ సంస్థ వారు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ భవనంలో సౌర విద్యుత్తు ఉత్పత్తిపై అవగాహన సదస్సును నిర్వహించారు.

## మహిళల రక్షణ చట్టాలపై అవగాహన

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: విద్యాసంస్థల్లో అమ్మాయిలపై ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా హెచ్చరించారు. సోమవారం వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మహిళల రక్షణ, బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

# పేదల కాలనీలు.. లబ్ధిదారుల కన్నీళ్లు

ఉడుములపాడు వద్ద రహదారులు లేని కాలనీ

డోన్, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల నెరవేర్చుతామని గత వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీ(ప్రస్తుతం పీఎంఏవై- ఎన్టీఆర్ నగర్) పేరుతో ఇంటి పట్టాలు ఇచ్చింది. డోన్ పట్టణంతో పాటు కొన్ని గ్రామీణ ప్రాంతాల వారికి దొరపల్లెగుట్టతో పాటు ఉడుములపాడు సమీపంలో పట్టాలు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. దీంతో సొంతింటి కల నెరవేరుతుందని లబ్ధిదారులు అప్పులు చేసి మరీ ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పట్టణానికి సుదూరంగా ఉండటం, అక్కడ కనీస వసతులు సక్రమంగా లేకపోవటంతో నిర్మాణాలు పూర్తయినా, చివరిదశలో ఉన్న వాటిలోనూ ఎవరూ చేరలేక, ఇటు పూర్తి చేసుకోలేక వందలాది ఇళ్లు నిరుపయోగంగా మారాయి. వాటిలో కంపచెట్లు మొలిచి చిట్టడవిని తలపిస్తున్నాయి.

### రూ.13 కోట్లతో నిర్మాణాలు

● డోన్ పట్టణానికి దూరంగా దొరపల్లెగుట్టలో 1,553 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 765 వరకు ఇంటి నిర్మాణాలు పూర్తికాగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. 765 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేందుకు నిధులు ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల చొప్పున సుమారు రూ.13 కోట్లకు పైగా ఖర్చు చేశారు. కానీ ఇక్కడ నిర్మాణాలు జరిగినా నివాసం ఉండేందుకు లబ్ధిదారులు జంకుతున్న పరిస్థితి ఏర్పడింది.

● పట్టణానికి దూరంగా కొండ ప్రాంతంలో ఉండటం, కొందరు ఎలాగోల ధైర్యం చేసి ఉండేందుకు ప్రయత్నించినా దొంగల భయంతో అక్కడికి వెళ్లలేకపోతున్నట్లు వాపోతున్నారు. దీంతో ఖర్చు చేసిన రూ.13 కోట్ల నిధులు వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. కొండ ప్రాంతం కావటంతో రహదారులు సరిగా లేక నివసించేందుకు ప్రజలు జంకుతున్నారు.

### సౌకర్యాలు లేక అవస్థలు

● ఉడుములపాడు వద్ద నిర్మించిన జగనన్న కాలనీలో 1,009 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 500కు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి 1.80 లక్షల చొప్పున రూ.9 కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఇక్కడ వందలాది ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నా సరైన వసతులు లేక, ఇతర సమస్యలు, సుదూర ప్రాంతం కావటంతో నిర్మాణాలు నిలిచిపోయాయి.

● కాలనీలకు తాగేందుకు నీటి సౌకర్యాలు లేకపోవడం, వీధి దీపాల సమస్యలు, వర్షాలు వస్తే మట్టి దారులు అధ్వానంగా మారడం, కొండప్రాంతం కావటంతో పైకి ఎక్కాలంటే సరైన దారులు లేకుండాపోయాయి. అక్కడికి వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపటంలేదు.

## ఈ-శ్రమ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అసంఘటిత కార్మికులుగా పనిచేస్తున్న వారు కార్మికశాఖ అందించే ఈ-శ్రమ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని బనగానపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి శోభారాణి తెలిపారు. కార్డు ప్రయోజనాలు తెలుసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కార్మికశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆళ్లగడ్డ: 8008 574916 డోన్ పట్టణం: 94408 57790 బనగానపల్లె: 80085 73763

బేతంచెర్ల: ?ఇప్పన్నీళ్ల బావి సమీపంలో మురుగు కాల్వలో చెత్తను తొలగించాలి. - స్థానికులు
✔పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగిస్తాం. - మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.
శిరివెళ్ల: ?శిరివెళ్లలోని ఐనుకపల్లె- కొట్టాలపల్లె రహదారిలో వీధిదీపాలు వెలగడం లేదు. - నారాయణ.
✔: వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - రామవేంద్ర, పంచాయతీ కార్యదర్శి, చెన్నూరు.
బనగానపల్లి గ్రామీణం: ?పాతపాడు గ్రామ సమీపంలో యాగంటికి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. - వెంకటలక్ష్మి, కాలనీవాసి, పాతపాడు
✔: ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తాం. - శ్రీనివాసులు, ఏఈ, బనగానపల్లి.


డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లను సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎంఈవోలు ప్రభాకర్, రామనాయక్ చేతులమీదుగా యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాజీ లేని పోరాటాలు చేయడంలో యూటీఎఫ్ ప్రముఖపాత్ర వహిస్తోందని సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు తెలిపారు. సుదర్శన్, మనోహర్‌రెడ్డి, అంజన్న, సంజీవరాయుడు, రామమూర్తి పాల్గొన్నారు.

## అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్, న్యూస్‌టుడే: డోన్‌లో డిసెంబరు 31వ తేదీ రాత్రి, నూతన సంవత్సర వేడుకల్లో అల్లర్లకు పాల్పడిన ప్రజలు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తిస్తే చర్యలు ఉంటాయని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. రోడ్లపై ద్విచక్ర వాహనాలపై తిరగటం, పెద్దపెద్ద శబ్దాలు చేస్తే తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. రాత్రివేళ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తారని, కొత్త ఏడాది వేడుకలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

చాగలమర్రి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాదు తెలియజేశారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.

## పెచ్చులూడి.. పడుతున్నాయ్

దొర్నిపాడు మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో (స్పెషల్) పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వం నాడు- నేడు కింది ఎంపిక చేసి పనులు చేసింది. కానీ నాణ్యత లేకపోవటంతో కొన్ని రోజులకే పెచ్చులూడి కడ్డీలు బయట కన్పిస్తున్నాయి. దీంతో విద్యార్థులపై సిమెంట్ పెచ్చులు పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, దొర్నిపాడు

## ఇరుకు దారితో ఇక్కట్లు

ఆళ్లగడ్డ పురపాలికగా మారినా ఇంకా మాస్టర్ ప్లాన్ అమలుకు నోచుకోలేదు. రహదారుల విస్తరణ లేక ప్రధాన దారిలో 35 ఏళ్ల కాలం నాటి రహదారులే ఉన్నాయి. కొన్ని చోట్ల మరీ ఇరుకుగా కేవలం 30 నుంచి 40 అడుగులకే పరిమితమయ్యాయి. ఎదురెదురు వాహనాలు వస్తే రాకపోకలకు ఇబ్బందులు తప్పవు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధ్యమైనంత త్వరగా మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

## క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ఆటల్లో రాణించాలని బేతంచెర్ల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చక్రవర్తి పేర్కొన్నారు. ఈనెల 22న నంద్యాలలో జరిగిన రీజినల్ స్థాయి క్రీడా పోటీల్లో బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు కబడ్డీ, చదరంగం, పరుగు పందెం, లాంగ్‌జంప్ తదితర పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం స్థానిక కళాశాలలో అధ్యాపకులు అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ చక్రవర్తి

## అద్భుతంగా బెలుం గుహలు

రాజేశ్‌కుమార్‌సింగ్‌ను సన్మానిస్తున్న స్థానిక అధికారులు

కొలిమిగుండ్ల, బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పర్యాటక కేంద్రమైన బెలుం గుహలు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సంయుక్త కార్యదర్శి రాజేశ్‌కుమార్‌సింగ్ చెప్పారు. కుటుంబ సభ్యులతో ఆయన సోమవారం గుహలను సందర్శించారు. గుహలను ఇంకా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో దస్తగిరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళీశ్వరగౌడ్, గుహల యూనిట్ మేనేజర్ కిశోర్ పాల్గొన్నారు. అనంతరం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో రాజేష్‌కుమార్‌సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు.

## మాలధారుల పాదయాత్ర

పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

రుద్రవరం, బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రుద్రవరంలో వాసాపురం వెంకటేశ్వరస్వామి మాల ధరించిన భక్తులు సోమవారం ఇరుముడులు కట్టుకుని కాలినడకన వాసాపురం బయలుదేరివెళ్లారు. ఈ సందర్భంగా నృత్యాలు, భజనలు చేసుకుంటూ ఆలయానికి వెళ్లారు. నందవరం గ్రామానికి చెందిన పలువురు మద్దిలేటి స్వామి మాలధారులు ఆర్ఎస్ రంగాపురం మద్దిలేటిస్వామి ఆలయానికి సోమవారం పాదయాత్రగా ఇరుముడులతో వెళ్లారు.

## హుండీ ఆదాయం రూ.1.15 లక్షలు

పచ్చర్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: నల్లమలలోని సర్వనరసింహస్వామి ఆలయంలో దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆదేశానుసారం ఆలయ ఇన్‌ఛార్జి ఈవో సాయిజయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉప ఆలయ హుండీ లెక్కింపు జరిగింది. రెండు నెలల వ్యవధిలో రూ.1.15 లక్షల నగదు భక్తులు సమర్పించినట్లు ఇన్‌ఛార్జి ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, అర్చకులు రంగనాయకులు, పవన్‌కుమార్‌శర్మ, భాస్కర్‌రెడ్డి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఆర్ఎస్ రంగాపురం (బేతంచెర్ల), న్యూస్‌టుడే: మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు నిర్వహించారు. మొత్తం 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రమేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

బండలాగుడు పోటీల్లో పాల్గొన్న వృషభాలు

## ముక్కోటికి ముమ్మరంగా ఏర్పాట్లు

ఆళ్లగడ్డ మండలం అహోబిలంలో..

చాగలమర్రి బసవన్నకట్ట రామాలయంలో..

బేతంచెర్ల: మద్దిలేటయ్య క్షేత్రంలో సిద్ధమైన కల్యాణ మండపం

(గ్రామాలు, పట్టణాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఆలయాలను నిర్వాహకులు అందంగా తీర్చిదిద్దారు. పలు చోట్ల ఉదయం ఉత్తర ద్వార దర్శనం, కల్యాణోత్సవం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. క్యాలైన్లు విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఏర్పాటు చేశారు. భక్తులకు అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులు బందోబస్తు చేపట్టనున్నారు. ఆర్ఎస్ రంగాపురం, అహోబిలంలో ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, సంజామల, అవుకు, చాగలమర్రి, డోన్, ఉయ్యాలవాడ.

## తాగునీటికి అవస్థలు పడుతున్నాం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణం సమీపంలోని సాయినందనం కాలనీలో తాగునీటి వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో కుళాయి కనెక్షన్లను ఇవ్వాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ధనుంజయ, నాగభూషణం పాల్గొన్నారు.


**పత్రికా ప్రకటన**

కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి॥ డోన్ శాఖ ఖాతాదారులకు విజ్ఞప్తి

డోన్ బ్రాంచి కార్యాలయమును ప్రస్తుత భవనము నుండి దిగువ కనబర్చిన నూతన భవనములోనికి అతి త్వరలో మార్చబడును. కావున ఖాతాదారులందరూ ఈ యొక్క బ్రాంచి కార్యాలయ భవన మార్పును గమనించమనవి.

**నూతన కార్యాలయ భవన చిరునామా:**
**DOOR.No: 9-13-5, వార్డు 1, K.V.S. కాలనీ, డోన్**

ఖాతాదారులకు అత్యున్నత సేవలు అందించుటలో డి.సి.సి. బ్యాంకు నిరంతరము కృషి చేయునని తెలియజేయడమైనది. కార్యాలయ భవన మార్పు వల్ల కలుగు తాత్కాలిక అసౌకర్యానికి చింతిస్తున్నాము.

బ్రాంచి మేనేజరు, డి.సి.సి. బ్యాంకు లి॥ డోన్ బ్రాంచి. సెల్: 99516 16120.


## శుద్ధజలం అందించాలని వినతి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధజలం కరవైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ పేర్కొన్నారు. ఈ మేరకు శుద్ధ జల కేంద్రాల ఏర్పాటు కోరుతూ సోమవారం నంద్యాలలో డీఈవో జనార్దన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఎక్కువ శాతం ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని మరమ్మతులు చేయించి విద్యార్థులకు స్వచ్ఛ జలం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రవీణ్, శశిధర్‌రెడ్డి, మాబాషా పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

శిరివెళ్ల, న్యూస్‌టుడే: రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంఈవో నాగార్జునరెడ్డి సోమవారం తనిఖీ చేసి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతాన్ని పరిశీలించి సూచనలు చేశారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: స్థానిక పీహెచ్‌సీలో మలేరియా వ్యాధి నిర్మూలనపై ఆశా కార్యకర్తలు, సిబ్బందికి వైద్యాధికారి ముఖేశ్‌కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్సై నాగార్జున ప్రజలకు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

అవుకు, న్యూస్‌టుడే: భూసార పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం అవసరమని ఏవో కలీమున్నీసా తెలిపారు. సోమవారం వ్యవసాయ సిబ్బందితో సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కూరగాయలను రోజూ తినే ఆహారంతో తీసుకోవడం ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయం కమ్యూనికేషన్స్ అధికారి అభిషేక్‌రాజ్ తెలియజేశారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులను విక్రయించేందుకు స్టాల్ ఏర్పాటు చేశారు.

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: నేడు దిగువ అహోబిలంలోని యోగి వేమారెడ్డి నిత్య అన్నదాన సత్రంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సత్రం కమిటీ సభ్యులు తెలిపారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఉద్యానవనంలో ఉన్న 15వ శతాబ్దం నాటి శిలాశాసనాన్ని పురావస్తు శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని పరిరక్షించాలని మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డి కోరారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: చలో విశాఖపట్నం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎల్లయ్య కోరారు. సీఐటీయూ చేపట్టిన జీపుజాత సోమవారం బనగానపల్లి చేరుకుంది.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని 34 మోటార్ సైకిళ్లకు చట్టవిరుద్ధంగా సైలెన్సర్లు మార్పు చేసినట్లు పోలీసులు గుర్తించి.. రోడ్డు రోలర్ కింద తొక్కించారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో ఘర్షణ పడిన విషయంలో ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు సోమవారం చెప్పారు.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
బనగానపల్లి శాఖ - 01179, నంద్యాల జిల్లా.

**స్వాధీనత ప్రకటన (లాంఛనప్రాయం)**
రూలు 8(1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కొరకు)

A/c. No. 41775942671 HL తేదీ: 24.12.2025

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బనగానపల్లి శాఖ - 01179, నంద్యాల జిల్లా యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువసంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువుకోవల్సిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా మొత్తం రూ.22,98,407.00 (ఇరవై రెండు లక్షల తొంభై ఎనిమిది వేల నాలుగు వందల ఏడు రూపాయలు మాత్రమే) ప్లస్ 14.10.2025 నాటికి ఉన్న వడ్డీ మరియు 15.10.2025 నుండి కాంట్రాక్చువల్ రేటు వంతున భవిష్యత్ వడ్డీ మరియు దానిపై ఖర్చులను చెల్లించవల్సిందిగా రుణగ్రహీత: మాసాని పెద్ద సుబ్రమణ్యం తండ్రి ఎం.చిన్న సుబ్బరాయుడు, 1) ఇంటి నెం.12/137, మంగళవారం పేట, బనగానపల్లి (జిపి) & మండలం, నంద్యాల జిల్లా-518124. 2) ప్లాట్ నెం.21 ఈస్ట్, సర్వే నెం. 83 & 84 Pyki, వార్డు నెం.14, భానుముక్కల (గ్రా), బనగానపల్లి (జిపి) & మండలం, నంద్యాల జిల్లా-518124. వారిని కోరుతూ 14.10.2025 తేదీ గల డిమాండ్ నోటీసును జారీ చేశారు.

రుణగ్రహీత/ గ్యారంటరు సదరు మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనందున, రుణగ్రహీత/ గ్యారంటరు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుకోవల్సిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువసంతకందారు 24 డిసెంబర్ 2025న స్వాధీనపర్చుకున్నారు.

ముఖ్యంగా రుణగ్రహీత/ గ్యారంటరును మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తితో జరిపే ఎట్టి లావాదేవీలైనా ఈ స్వాధీనతా ప్రకటన జారీ తేదీ నాటికి మొత్తము రూ.22,98,407.00 ప్లస్ దానిపై వడ్డీ, ఖర్చులు వగైరా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బనగానపల్లి శాఖ - 01179, నంద్యాల జిల్లా చార్జికి లోబడి ఉంటాయి.

సెక్యూర్డ్ ఆస్తిని విడిపించుకోవటానికి గల సమయానికి సంబంధించి SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) లోని నిబంధనలను రుణగ్రహీతలు గమనించగలరు.

**రుణగ్రహీత డిమాండ్ నోటీసు జారీ చేసిన తర్వాత రూ.50,000/- మొత్తాన్ని చెల్లించారు.**

**స్థిరాస్తి వివరం**

నంద్యాల ఆర్.డి పరిధిలో నంద్యాల జిల్లా, బనగానపల్లి గ్రామ పంచాయతీ పరిధి మరియు మండలం, భానుముక్కల ఏరియా, వార్డు నెం.14లోని సర్వే నెం. 83 & 84 Pyki లో ప్లాట్ నెం.21 ఈస్ట్‌లోని ఇంటి ఆస్తి యావత్తు. ఎస్.ఆర్.డి నెం.4265/2022, తేది: 22.12.2022, విస్తీర్ణం: 75.55 చ.గజాలు. **ఇంటి కొలతలు: తూర్పు-పడమర:** 17 అడుగులు, **ఉత్తరం-దక్షిణం:** 40 అడుగులు. **సరిహద్దులు: తూర్పు:** రోడ్, **పడమర:** షేక్ అబ్బాస్ హుస్సేన్ స్థలం, **ఉత్తరం:** ప్లాట్ నెం.22, దక్షిణం: రస్తా.

తేది: 24.12.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: బనగానపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



ఓం నరసింహో విజయతే
దేవదాయ ధర్మదాయ శాఖ - ఆంధ్రప్రదేశ్

**శ్రీమద్దులేటి నరసింహస్వామి వారి దేవస్థానము**
ఆర్.యస్.రంగాపురం గ్రామము, బేతంచెర్ల (మం), నంద్యాల జిల్లా.

నారసింహ కీర్తనం సర్వపాప హరణం

**ముక్కోటి ఏకాదశి మహోత్సవములు - 2025**

పుష్యశుద్ధ అష్టమి ఆదివారం నుండి పుష్యశుద్ధ ద్వాదశి బుధవారము వరకు
అనగా 28-12-2025 నుండి 31-12-2025 వరకు

**ఆహ్వానము**
**ఉత్సవ కార్యక్రమములు**

తేది:30-12-2025 - పుష్యశుద్ధ ఏకాదశి మంగళవారం

ముక్కోటి ఏకాదశి

ఉదయం: 3.00 గంటల నుండి ప్రత్యేక పూజలు,
ఉదయం 4.00గంటలకు ఉత్తరద్వార దర్శనము,
ఉదయం 11.00 గంటల నుండి కళ్యాణ మహోత్సవము,
మధ్యాహ్నం 12.00గంటల నుండి అన్నదాన కార్యక్రమము.
సాయంత్రం 4.00 గంటల నుండి గ్రామోత్సవము,
రాత్రి 10.00 గంటల నుండి అఖండ భజన.

తేది 31-12-2025 పుష్యశుద్ధ ద్వాదశి బుధవారం - తెప్పోత్సవము
ఉదయం: 10.40 ని.లకు మహాపూర్ణాహుతి, శ్రీచక్ర స్నానము
సాయంత్రం 5.30 ని.ల నుండి దేవస్థానము పుష్కరిణి నందు తెప్పోత్సవము.

బండలాగు పోటీలు (రైతు సంఘాల ఆధ్వర్యంలో)

| కబడ్డీ పోటీలు | 6పళ్ల విభాగము | న్యూ కేటగిరి విభాగము |
|---|---|---|
| 1వ బహుమతి రూ.15,000-00 | 1వ బహుమతి రూ.50,000-00 | 1వ బహుమతి రూ.60,000-00 |
| 2వ బహుమతి రూ.12,000-00 | 2వ బహుమతి రూ.40,000-00 | 2వ బహుమతి రూ.50,000-00 |
| 3వ బహుమతి రూ.9,000-00 | 3వ బహుమతి రూ.30,000-00 | 3వ బహుమతి రూ.40,000-00 |
| 4వ బహుమతి రూ.6,000-00 | 4వ బహుమతి రూ.20,000-00 | 4వ బహుమతి రూ.30,000-00 |
| 5వ బహుమతి రూ.3,000-00 | 5వ బహుమతి రూ.15,000-00 | 5వ బహుమతి రూ.20,000-00 |
| | 6వ బహుమతి రూ.10,000-00 | 6వ బహుమతి రూ.15,000-00 |
| | 7వ బహుమతి రూ.5,000-00 | 7వ బహుమతి రూ.10,000-00 |
| | 8వ బహుమతి రూ.3,000-00 | 8వ బహుమతి రూ.8,000-00 |
| | | 9వ బహుమతి రూ.5,000-00 |

ముక్కోటి ఏకాదశి మహోత్సవములకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ మద్దులేటి నరసింహస్వామి అనుగ్రహం పొందురుగాక

గౌ॥శ్రీ కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి గారు
శాసనసభ్యులు, డోన్

అందరూ ఆహ్వానితులే
శ్రీ మద్దులేటి నరసింహ స్వామి వారి సేవలో..

శ్రీ యం.రామాంజనేయులు, M.Tech
ఉపకమిషనర్ & కార్యనిర్వహణాధికారి
వేదపండితులు, అర్చకులు మరియు ఇతర సిబ్బంది.

గమనిక: 30-12-2025న ఆర్.ఎస్.రంగాపురం నుండి దేవస్థానమునకు ఉచిత రవాణా సౌకర్యం కలదు.


(c) eenadu

# అభాగ్యులం ఆదుకోరూ!

✦ పింఛన్ల కోసం దండిగా అర్జీలు ✦ పీజీఆర్ఎస్‌లో ఇవే 50 శాతం

'నాకు రెండు కాళ్లు లేవు. రెండేళ్ల కిందట ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో వైద్యులు కాళ్లు తొలగించారు. వంద శాతం వైకల్యం ఉందని సదరం ధ్రువపత్రం ఉంది. పింఛన్ రావడం లేదు. దరఖాస్తు చేసుకున్నా. దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలి' అని బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన మేడేపల్లి సుధాకర్ కోరుతున్నారు.

'పక్షవాతం వచ్చి కాలు పడిపోయింది. నడవలేను. వైద్యులు 60 శాతం వైకల్యం ఉందని సదరం ధ్రువ పత్రం ఇచ్చారు. మేమిద్దరం వృద్ధులం. మాకు వేరే ఆధారం లేదు. పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి' అని సత్తెనపల్లికి చెందిన నాగులపాటి శ్రీనివాసరావు విన్నవిస్తున్నారు.

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వృద్ధులు, దివ్యాంగులు తరలి వస్తున్నారు. పింఛన్లు ఇప్పించాలని దరఖాస్తులు అందజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులు ప్రజాప్రతినిధులు, అధికారులకు అర్జీలు ఇస్తున్నారు.

ఎక్కడైనా సరే.. జిల్లాలోని ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు ఒక్కో వారం తమ నియోజకవర్గ పరిధిలో ప్రజాదర్బార్ పేరిట ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. ఇందులో ఎక్కువమంది పింఛన్లు ఇవ్వాలని అర్జీలు అందజేస్తున్నారు. అలాగే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో కనీసం 80కి తగ్గకుండా పింఛన్ల కోసం వినతిపత్రాలు వస్తున్నట్లు గణాంకాల బట్టి తెలుస్తోంది. మరోవైపు రూ.6 వేలు అందుకునేవారు తమకు వంద శాతం వైకల్యం ఉందని.. రూ.15 వేలు మంజూరు చేయాలంటూ మరికొందరు సదరం ధ్రువ పత్రాలతో వచ్చి కోరుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంజూరు చేస్తామని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి తెలిపారు.

## రెండేళ్లకే రెండుగా చీలింది

వైకాపా పాలకుల ధన దాహం... కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. వెరసి ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఆ ప్రభుత్వ హయాంలో నరసరావుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో వేసిన సీసీ రోడ్లు పగుళ్లతో నాణ్యత లోపాలు వెలుగుచూస్తున్నాయి. ఎనిమిదో వార్డులోని వెంకటరెడ్డినగర్ ప్రాంతంలో 2023లో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. కొద్దిరోజులకే నెర్రెలివ్వడం ప్రారంభమైంది. అప్పట్లో అధికారులు, పాలకులు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టి రెండేళ్లు పూర్తి కాక ముందే ఇప్పుడు రెండుగా చీలింది. దీనిపై మున్సిపల్ డీఈ రఫీ మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

# విచారణ దాచేసి.. రికార్డులు మార్చేసి..

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, గురజాల, దాచేపల్లి

### స్వాహా భూముల సక్రమం చేసుకునే యత్నాలు

వైకాపా హయాంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూముల్ని సొంతం చేసుకునేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిని సక్రమం చేసేందుకు గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఓ అధికారి ఉన్నారు. డివిజన్ పరిధిలో భూకబ్జాలపై జులైలో విచారణ మొదలు పెట్టారు. ఇప్పుడు ఆ విచారణ ఏమైందో తెలియదు. పాత కలెక్టర్ ఉన్నప్పుడు మొదలైన విచారణ కొత్త కలెక్టర్ దృష్టికి రాకుండా గుట్టుగా భూముల్ని సొంతం చేసుకునే ప్రయత్నం జరుగుతోంది.

వైకాపా హయాంలో ప్రభుత్వ భూముల్ని అడ్డగోలుగా ఆక్రమించారు. రిజిస్ట్రేషన్ చేయించుకుని పాసు పుస్తకాలు పొందారు. బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకున్నారు. ● దాచేపల్లి మండలం తంగెడ జడ్పీ ఉన్నత పాఠశాల పక్కన సర్వే నం.1188-4లో ఆర్ఎస్ఆర్ ప్రకారం 7.64 ఎకరాల భూమి ఉంది. ఆన్‌లైన్‌లో 12.60 ఎకరాలుగా నమోదు చేశారు. అదనపు భూమిని ఓ వైకాపా నేత పేరుతో చూపి, పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేశారు. ● గురజాల మండలం

రాత్రివేళ పనిచేస్తున్న రెవెన్యూ కార్యాలయం

దైద, తేలుకుట్ల, గొట్టిముక్కల గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి జాబితా సిద్ధం చేసి, విచారణ చేశారు. ● పొందుగలలో ఎర్రబోడు 163.5 ఎకరాలు ఉంటుంది. అందులో మాజీ సైనికులకు 63.07 ఎకరాలు, జగనన్న కాలనీకి 31 ఎకరాలు కేటాయించారు. మిగిలిన 69 ఎకరాలు ఆక్రమణకు గురైంది.

ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ భూ అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి నోటీసులు ఇచ్చాం. వారిలో కొందరు కోర్టుకు వెళ్లారు. విచారణ కొనసాగుతోందన్నారు.

**ఆదివారం కూడా..** గురజాల రెవెన్యూ పరిధిలోని ఓ తహసీల్దారు కార్యాలయం ఆదివారం కూడా తెరిచే ఉంచారు. అర్ధరాత్రి వరకు సిబ్బంది పనిచేయించారు. ఇదంతా వైకాపా హయాంలో జరిగిన ఆక్రమణలన్నింటినీ సక్రమం చేసే ప్రయత్నమేనన్న ఆరోపణ వినిపిస్తోంది. జులైలో కొందరికి నోటీసులిచ్చారు. వారితో రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఆక్రమణలు జరగలేదని రికార్డులు సృష్టించే పనిలో ఉన్నారు. ఎమ్మెల్యే, అధికారుల సమక్షంలో అసైన్‌మెంట్ కమిటీలు తీర్మానం చేసి, గ్రామ సభలు నిర్వహించి, ఏ1 నోటీసులు ప్రచురించాలి. తర్వాతే భూములు కేటాయించాలి. గత ప్రభుత్వంలో ఇవేవీ జరగలేదు. తీర్మానం జరిగినట్లు రికార్డులు సృష్టించే యత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

| | | |
|---|---|---|
| ☛ అన్యాక్రాంతం అయినట్లు గుర్తించిన ప్రభుత్వ భూములు: **427.44 ఎకరాలు** | ☛ పట్టా భూముల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించినవి: **942.13 ఎకరాలు** | ☛ నోటీసులు అందుకున్న వారు: **సుమారు 328 మంది** |

## ఒకరోజు ముందే నూతనోత్సాహం

### 31న పింఛన్ల పంపిణీ

నరసరావుపేట, అర్బన్: కొత్త సంవత్సరం తొలిరోజు ప్రజాప్రతినిధులు, అధికారుల కార్యాలయాల్లో హడావుడి ఉంటుంది. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి అవరోధాలు ఏర్పడతాయని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఒకరోజు ముందుగానే డిసెంబరు 31న లబ్ధిదారులకు నగదు అందించాలని నిర్ణయించింది. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మున్సిపల్, సచివాలయాల ఉద్యోగులు ఈ నెల 30న బ్యాంకుల నుంచి నగదు తీసుకుని.. 31న ఉదయం లబ్ధిదారుల ఇళ్లకెళ్లి బయోమెట్రిక్‌తో అందజేయాల్సి ఉంటుంది. జిల్లాలోని 538 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 2,71,112 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛను మంజూరైంది. మొత్తం రూ.119,16,31,500 పంపిణీ చేస్తారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పింఛన్ల నగదు ఉద్యోగులకు సకాలంలో అందేలా చొరవ చూపించి ఈ నెల 31న పంపిణీ పకడ్బందీగా జరిగేలా చూడాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి.

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని డిసెంబరు 31న చేపట్టాలని సెర్ప్ సీఈవో ఆదేశించారని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి తెలిపారు. ఈ నెల 31న పింఛన్లు అందిస్తామని మిగిలినవి.. జనవరి 2న ఇస్తామని వివరించారు.

## రైతుల భాగస్వామ్యం.. ఎత్తిపోతలకు మోక్షం

పసుమర్రు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: దశాబ్దకాలంగా మూలనపడిన పసుమర్రు ఎత్తిపోతల పథకానికి రైతుల సమష్టి కృషితో మోక్షం లభించింది. జిల్లాలో ఎత్తిపోతల పథకాలు మూలనపడిన విషయాన్ని గత అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రస్తావించారు. మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిధులు మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం ఈ ఏడాది పంటలకు నీరందలేదు. ఈ క్రమంలో గ్రామ రైతులు ఎమ్మెల్యేను కలిసి పరిస్థితిని వివరించారు. అందరూ కలిసి బాగు చేసుకుంటే తరువాత నిధులు రాగానే తీసుకోవచ్చని ఆయన సూచించారు. దీంతో రైతులు రూ.15 లక్షలు వెచ్చించి మరమ్మతులు పూర్తి చేశారు. సోమవారం పథకం కింద ఉన్న 2 వేల ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. రైతుల సమష్టి కృషిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అభినందించారు.

పసుమర్రు-2 ఎత్తిపోతల పథకం

పొలాలకు నీటి విడుదల

## నిలువెత్తు నిర్లక్ష్యం..
# నీరెలా శుభ్రం!

గ్రామీణులకు సురక్షిత తాగునీరు అందించాల్సిన పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ట్యాంకుల నిర్వహణను గాలికొదిలేశారు. పాచిపట్టి, నీరు కలుషితం అవుతున్నా పట్టించుకునేవారు లేరు. దాచేపల్లి మండలంలోని 16 గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు పాచిపట్టి, చుట్టూ మురుగు చేరి అపరిశుభ్రంగా ఉన్నాయి. పదిహేను రోజులకోసారి క్లోరినేషన్ చేయాలన్న విషయం మరిచిపోయారు. ప్రజలు ఫిర్యాదు చేసినప్పుడో, ఉన్నతాధికారుల పర్యటన సమయాల్లో హడావుడిగా శుభ్రం చేసి, ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారు. పలు ట్యాంకులకు మూతలు లేవు. దుమ్ముధూళి నీటిలో కలిసిపోతున్నాయి. ట్యాంకులను పర్యవేక్షించే బాధ్యతను సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అప్పగించారు. వారికి నీటి పరీక్ష కిట్లు అందించారు. వాటిని వినియోగించిన ఆనవాళ్లు కనిపించడం లేదు. ఫలితంగా గ్రామీణులు ప్రైవేటు ఆర్వో ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి ట్యాంకులు శుభ్రం చేయించి, సురక్షిత నీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రైల్వేస్టేషన్ రోడ్డు (దాచేపల్లి)

## ఎన్‌హెచ్ 544-డి విస్తరణకు
# మరో ముందడుగు

భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల

స్తూపం సెంటర్ (వినుకొండ), న్యూస్‌టుడే

అనంతపురం - గుంటూరు జాతీయ రహదారి 544-డి విస్తరణకు ముందడుగు పడింది. వినుకొండ నుంచి గుంటూరు వరకు ఇప్పుడున్న రెండు వరుసల రహదారిని నాలుగుగా మార్చేందుకు అవసరమైన భూసేకరణకు నోటిఫికేషన్ జారీ అయింది. దీనిలో భాగంగా జిల్లాలోని గ్రీన్‌ఫీల్డ్‌లో హద్దుల ఏర్పాటుకు (పెగ్ మార్క్ కోసం) నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా షెడ్యూల్ ప్రకటించి అధికార బృందాలను ఏర్పాటు చేసింది. జనవరి 9 నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. సర్వే పూర్తి చేసేందుకు స్థానిక రెవెన్యూ అధికారుల సహకారం కోరుతూ జిల్లా సంయుక్త కలెక్టర్‌కు ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం లేఖ రాశారు.

**85 కి.మీ. విస్తరణ..** వినుకొండ నుంచి గుంటూరు వరకు 85 కి.మీ. రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. దీనికి సంబంధించి ఈ ఏడాది మార్చిలో జాతీయ రహదారుల విభాగం 3ఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ తర్వాత డీపీఆర్ పూర్తి కావడంతో రహదారి నిర్మించేందుకు హద్దులను గుర్తించి స్తంభాలు పాతాలని నిర్ణయించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు వేర్వేరుగా షెడ్యూల్ విడుదల చేశారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ముగ్గురు అధికారులను నియమించారు.

వినుకొండ వద్ద జాతీయ రహదారి

### ఎప్పుడు ఎక్కడంటే..

పల్నాడు జిల్లాలో జనవరి 9వ తేదీ వరకు, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలో 10 నుంచి 12 వరకు రెండ్రోజుల్లో హద్దులు నిర్ణయించే ప్రక్రియ పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయా మండలాల సర్వే, రెవెన్యూ అధికారులు నష్ట పరిహారం చెల్లించేందుకు సేకరించిన భూముల విస్తీర్ణం, వాటి విలువలు లెక్కిస్తారు. తదుపరి ఈ ప్రక్రియ నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

# కనిపెంచలేదా.. కనిపించలేదా?

వేగు పంచిన అమ్మకు ప్రేమను పంచాల్సిన బిడ్డలు మనిషితత్వాన్ని మరిచారు.. పిడికెడు మెతుకులు పెట్టడానికి మనసు అంగీకరించక ముఖం చాటేశారు.. మసకబారిన కళ్లతో.. నడుము వంగి, ముడతలు పడిన దేహంతో ఆ శతాధిక వృద్ధురాలు పోలీసుల్ని ఆశ్రయించింది. న్యాయం చేయాలని కోరింది. సత్తెనపల్లి మండలం గర్నెపూడికి చెందిన పేరుపోగు అన్నమ్మ గోడు ఇది.

అన్నమ్మ, కృష్ణయ్య దంపతులకు ఏడుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సుమారు 45 ఏళ్ల కిందట కృష్ణయ్య మృతి చెందడంతో అన్నీ తానై అన్నమ్మ బిడ్డలను పెంచింది. వ్యవసాయ కూలీగా సమకూరిన దాంట్లో గుట్టుగా పిల్లలను తీర్చిదిద్దింది. అందరికీ వివాహాలు చేసింది. భర్త సంపాదించిన ఎకరన్నర పొలాన్ని విక్రయించి కుమారులకు పంచింది. ఇటీవల వందేళ్లు పూర్తి చేసుకున్న ఆమె ఆలనాపాలనా చూసేందుకు కొన్ని నెలలుగా కుమారులు వంతులు వేసుకోవడంతో కష్టాలు మొదలయ్యాయి. శరీరం సహకరించక మంచానికే పరిమితమైంది. గ్రామంలో ఆమె భర్త పేరున ఉన్న ఎనిమిది సెంట్ల స్థలం పంపిణీ వివాదం తోడైంది. ఆఖరికి ఆమెకు గుప్పెడు మెతుకులు పెట్టే విషయం.. స్థల వివాదంతో ముడిపడింది. ఇక చేసేందేమీ లేక ఆమె కుమార్తెలను వెంటబెట్టుకుని సత్తెనపల్లి గ్రామీణ పోలీసులను సోమవారం ఆశ్రయించింది. కుమారులకు భారమయ్యానంటూ కంటతడి పెట్టింది. ఆమె ఫిర్యాదు మేరకు కుమారులందరితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామంటూ పోలీసులు హామీ ఇచ్చారు.

- న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో భూమికి సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటుచేసిన రెవెన్యూ క్లినిక్‌తో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని, వారి సమస్యలకు తక్షణ పరిష్కారం దొరుకుతుందని కలెక్టర్ కృతికా శుక్లా ఆశాభావం వ్యక్తం చేశారు. పీజీఆర్ఎస్‌కు వస్తున్న అర్జీల్లో ఎక్కువగా భూ సమస్యలే ఉంటున్నాయని, వాటికి ఎక్కువ సమయం కేటాయించే పరిస్థితి లేదన్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా త్వరితగతిన సమస్యలు తీరుతాయన్నారు. తొలి రోజు అయిదు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఆధారాలను అధికారులకు సమర్పించాలని సూచించారు. వీటిలో తహసీల్దార్లు, ఆర్డీవోల వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా వారంలోగా పరిష్కరిస్తారని తెలిపారు. పరిష్కారం కాని వాటి విషయంలో ఏమి చేయాలన్నది సూచన చేస్తారని వివరించారు. మధ్యవర్తుల మాటలను విశ్వసించవద్దని హితవు పలికారు.

మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

భూగర్భ జలమట్టం ఆరు నుంచి ఎనిమిది మీటర్లలోపు ఉంటే ఆ ప్రాంతంలో నీటి వనరులకు ఇబ్బందులు ఉండవు. అంతకు పైబడి నీటి మట్టం ఉంటే నీటికి కటకట ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో జల సంరక్షణ చర్యల్ని గాలికి వదిలేశారు. ఇంకుడు గుంతలు, సేద్యపు గుంతల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ పనుల్ని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూగర్భం జల బ్యాంకుగా మార్చే పనులకు ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతి వర్షపు నీటిబొట్టును ఒడిసిపట్టేలా చర్యలు తీసుకుంటోంది.

# ప్రతి నీటిబొట్టు.. ఒడిసిపట్టేలా..

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

### జల సంరక్షణ చర్యలు

జిల్లాలోని 531 పంచాయతీల పరిధిలో 5,310 వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయాలనేది లక్ష్యం కాగా ఇప్పటికే 3,111 నిర్మాణాలు పూర్తి చేశారు. మరో 75 నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి. గురజాల, పిడుగురాళ్ల మండలాల్లో 96 శాతం, మాచవరం మండలంలో 90 శాతం ప్రగతి ఉంది.

✤ 2,549 పంట సేద్యపు గుంతల నిర్మాణాన్ని గతేడాది చేపట్టారు. ఈ సంవత్సరం మరో 2,500 సేద్యపు గుంతలు నిర్మించనున్నారు. 1,438 సేద్యపు గుంతల నిర్మాణానికి పరిపాలనా పరమైన అనుమతులు ఇచ్చారు.

✤ మొత్తం 54,590 సేంద్రియ ఎరువు గుంతల నిర్మాణం లక్ష్యం కాగా.. 1,757 పూర్తి చేశారు. మరో 5,837 నిర్మాణాలకు అనుమతులు మంజూరుచేశారు.

✤ వృథా నీటితో సాగు అవసరాలు తీర్చేందుకు చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపడుతున్నారు. మొత్తం 398 చెక్‌డ్యాంలకు ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. 292 నిర్మాణాలు జరుగుతున్నాయి.

✤ చెరువులు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. 1,051 పనులకు రూ.66.35 కోట్లు కేటాయించగా ఇప్పటికే రూ.15.72 కోట్లు వ్యయం చేశారు.

ఉపాధి నిధులు వంద శాతం వెచ్చించి జల సంరక్షణకు సుస్థిర పనులు చేపడుతున్నట్లు డ్వామా అధికారులు తెలిపారు.

# కొలువుదీరేలా అవకాశాలు

ఇంజినీరింగ్ విద్యార్థులకు కొలువుల జాతర వస్తోంది. కోర్ బ్రాంచిలైన సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈలో బీటెక్ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. చెన్నై, హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న నిర్మాణ, ఆటోమొబైల్, విద్యుత్తు పరికరాల తయారీ కంపెనీలు ప్రాంగణ నియామకాలు నిర్వహించి ప్రతిభావంతులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నాయి. వీరికి తక్కువ వేతనమే ఇస్తున్నా మూడు, నాలుగేళ్లు పనిచేస్తే.. పెద్ద కొలువులు సాధించే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ కోర్సులు చదివిన వందల మంది విద్యార్థులు ఐటీ కంపెనీల్లో కొలువులు దక్కించుకుంటున్నారు. ఇన్ఫోసిస్, టీసీఎస్, పెగా, యాక్సెంచర్, సదర్‌ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్, జెన్‌ట్రీ కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేపట్టాయి.

న్యూస్‌టుడే, బాపట్ల

ఉమ్మడి జిల్లాలో 50 ఇంజినీరింగ్ కళాశాలలు, అయిదు డీమ్డ్ విశ్వవిద్యాలయాలున్నాయి. బీటెక్ పూర్తిచేసి ఏటా 12 వేల మందికి పైగా పట్టభద్రులు బయటకు వస్తున్నారు. నిరుడితో పోలిస్తే ఈ సంవత్సరం ఐటీ కంపెనీలు నియామకాల్ని పెంచాయి. ఇంజినీరింగ్ చివరి సంవత్సర విద్యార్థులు సర్టిఫికేషన్ కోర్సులు చేసి ఆన్‌లైన్, మౌఖిక పరీక్షల్లో ప్రతిభ చూపి కొలువులు దక్కించుకుంటున్నారు. కొందరు మూడు కంపెనీలు నిర్వహించిన నియామక పోటీల్లో సత్తా చాటి ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. అత్యధిక వేతనం ఇచ్చే కంపెనీలో చేరడానికి మొగ్గు చూపుతున్నారు.

పెగా కంపెనీ ఏడాదికి రూ.11 లక్షలు వేతనం చెల్లించడానికి ముందుకు వచ్చింది. చివరి సంవత్సరం రెండో సెమిస్టర్ ఆరంభం అవుతున్న జనవరి మూడో వారం నుంచే ఉద్యోగాలకు ఎంపిక చేసిన విద్యార్థులను ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కింద తీసుకుంటోంది. ఈ సమయంలో నెలకు రూ.25 వేలు చెల్లిస్తోంది. ఇది పూర్తి కాగానే వేతన ప్యాకేజీ కింద చెల్లింపులు చేయనున్నారు.

### ఇంజినీరింగ్ కోర్ బ్రాంచిలు చదివిన వారికి ఉద్యోగాలు

❖ ఇంజినీరింగ్ కోర్ బ్రాంచిల్లో బీటెక్ పూర్తి చేస్తున్న విద్యార్థులకు నెలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వేతనంతో పాటు ఉచితంగా వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నాయి. వేతనం కొంత తక్కువగా ఉన్నా విద్యార్థులు ఆయా కంపెనీల్లో చేరడానికి ఇష్టపడుతున్నారు.

### పెగా కంపెనీలో కొలువుకే మొగ్గు

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో టీసీఎస్, యాక్సెంచర్, పెగా కంపెనీలు ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామక పరీక్షలు రాశా. బీటెక్‌లో తొమ్మిదికిపైగా జీపీఏ సాధించా. సీఎస్ఈ చదువుతూనే ప్రత్యేకంగా సిస్టమ్ ఆర్కిటెక్ట్, సీనియర్ సిస్టమ్ ఆర్కిటెక్ట్ సర్టిఫికేషన్ కోర్సులు చేశా. నైపుణ్యాలు పెంచుకోవటానికి ఎంతో ఉపయోగపడ్డాయి. మూడు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యా. పెగాలో ఏడాదికి రూ.11 లక్షల వేతనంతో పాటు 5 వేల షేర్లు ఇస్తామని ఆఫర్ చేశారు. ఈ కంపెనీలో ఉద్యోగంలో చేరుతున్నా.

- షేక్ అఫ్రీన్ షెహనాజ్, బీఈసీ సీఎస్ఈ విద్యార్థి

## కునుకు తీయొద్దు..
# ప్రమాదాలకు తావివ్వొద్దు

విశ్రాంతి లేని డ్రైవింగ్‌తో ప్రమాదాలు

రాజుపాలెం మండలం పెదనెమలిపురి వద్ద ఈ సంవత్సరం ఫిబ్రవరి 16వ తేదీ తెల్లవారు జామున సిమెంట్ ట్యాంకర్‌తో నెల్లూరు నుంచి దాచేపల్లికి వెళ్తూ డ్రైవర్ నిద్రమత్తులో సెంట్రల్ డివైడర్‌కు ఢీకొట్టాడు. వేగానికి ఆ ట్యాంకర్ రాంగ్ రూట్‌లోకి వెళ్లి అవతలి వైపున ప్రయాణిస్తున్న కారుపై బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం కొత్తపల్లికి చెందిన తల్లీ, ఇద్దరు కుమారులు మృతి చెందారు.

పల్నాడు జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 387 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో జాతీయ రహదారులపై 114, రాష్ట్ర రహదారులపై 122 నమోదయ్యాయి. ప్రమాదాల్లో 222 మృతి చెందగా.. 339 మందికి గాయాలయ్యాయి. ప్రమాదాలు ఏ సమయంలో ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసు అధికారులు విశ్లేషిస్తే.. సగానికి పైబడి అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున 5 గంటల్లోపు నమోదయ్యాయి. హెవీ వెహికల్స్ 100, బైకు ప్రమాదాలు 129 జరిగాయి. కునుకు పాటుతో జరిగే ప్రమాదాల తీవ్రత ఊహించనంతగా ఉంటుంది.

నరసరావుపేట, న్యూస్‌టుడే

దూరప్రాంతాలకు వెళ్లే వాహనాల డ్రైవర్లలో నాలుగోవంతు మందికి తగినంత నిద్ర ఉండట్లేదు. త్వరగా గమ్యం చేరాలనే ఒత్తిడి, ఇతర కారణాలతో నిద్ర లేకుండానే వాహనాలు నడిపేస్తున్నారు. కనురెప్ప మూసి తెరిచేలోపే ప్రమాదం జరుగుతోంది. ఇలాంటి ప్రమాదాలకు కళ్లెం వేసేందుకు జిల్లాలో భారీ వాహనాలు నడిపే డ్రైవర్లను తెల్లవారుజామున నిలుపుదల చేసి.. చల్లని నీళ్లతో ముఖం శుభ్రం చేయించి కునుకు భయం లేదన్న తర్వాతే ముందుకు పంపించేవారు. కొన్ని రోజులుగా ఆ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించట్లేదు. ఫలితంగా ప్రమాదాలు పునరావృతమవుతున్నాయి.

సత్తెనపల్లి: లారీ డ్రైవర్‌ను ఆపి నీటితో ముఖం శుభ్రం చేయిస్తున్న పోలీసులు

### ఈ జాగ్రత్తలు మరవొద్దు

● పగలు, రాత్రి ఏకధాటిగా విశ్రాంతి లేకుండా వాహనాలు నడపొద్దు. ప్రత్యామ్నాయ డ్రైవర్లతోనే దూర ప్రయాణాలు చేయాలి. ● హైవేలపై అధికారులు సూచించే విధంగా ఫేస్ వాష్ చేసుకోవాలి.
● పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, సరకు రవాణాతో పాటు వ్యక్తిగతంగా కార్లు నడిపేటప్పుడు మగతగా ఉన్నా.. కనురెప్పలు బరువు అనిపించినా వాహనాన్ని నిలిపేయాలి.
● కారులో కుటుంబం సహా రెండు, మూడ్రోజుల ట్రిప్‌నకు వెళ్తున్నప్పుడు మరో డ్రైవర్‌ను తీసుకెళ్లడం శ్రేయస్కరం.

# సోమవారం వైద్యానికి సెలవు!

### ఒక పీహెచ్‌సీ, 14 ఆరోగ్య ఉప కేంద్రాలు మూత

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే కూటమి ప్రభుత్వ ఆశయాన్ని వినుకొండ మండలంలోని వైద్యులు, సిబ్బంది నీరుగారుస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఎంత పర్యవేక్షణ చేస్తున్నా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణి వీడటం లేదు. మండలంలోని ఏనుగుపాలెం పీహెచ్‌సీ వద్దకు సోమవారం కొందరు వృద్ధులు వైద్యం కోసం వచ్చి ఉసూరుమంటూ వెనుదిరిగారు. 'న్యూస్‌టుడే' వైద్యశాలకు వెళ్లి చూడగా ఇద్దరు వైద్యులతో పాటు సిబ్బంది ఎవరూ లేరు. స్టాఫ్‌నర్స్ మాత్రమే విధుల్లో ఉన్నారు. వైద్యులు ఎక్కడికి వెళ్లారని ఆమెను అడిగితే వినుకొండలో సీహెచ్‌వో ఉద్యోగ విరమణ కార్యక్రమం ఉన్నందున అందరూ వెళ్లారని తెలిపారు. విధులకు సెలవు పెట్టకుండా అందరూ ఒకేసారి వెళ్తే రోగుల పరిస్థితి ఏంటని ప్రశ్నించగా తాను మందులు ఇస్తానని తెలిపారు. దీంతో పీహెచ్‌సీ పరిధిలో 14 ఉప కేంద్రాల పరిస్థితిపై ఆరా తీయగా అన్నీ మూతపడినట్లు తెలిసింది. ఈ విషయాన్ని డీఎంహెచ్‌వో రవి దృష్టికి తీసుకెళ్లగా ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఒకరి తర్వాత మరొకరు హాజరు కావచ్చని, వైద్యశాలలు మూసివేసి మూకుమ్మడిగా వెళ్లిపోవడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై విచారించి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఏనుగుపాలెంలో ఖాళీగా సిబ్బంది కుర్చీలు

(c) eenadu

# సిక్సర్లు కొట్టిన ఉత్సాహం

## ఫైనల్స్ నేడే

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
(Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor
Chalapathi Institute of Technology
AUTONOMOUS
MOTHADAKA CAMPUS
District Sponsor
Chalapathi Institute of Technology
MOTHADAKA CAMPUS
Beverage Partner
CMR SHOPPING MALL
The joy of life
Gift Partner
KL (DEEMED TO BE) UNIVERSITY
Digital Partner
ఈనాడు.నెట్
TV Partner
Organised by
ఈనాడు

EENADU SPORTS LEAGUE 2025
Aster Ramesh HOSPITALS

గుంటూరు (క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహిస్తున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025' క్రికెట్ టోర్నమెంట్ చివరి అంకానికి చేరుకుంది. సోమవారం జరిగిన సెమీ ఫైనల్స్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠ రగా సాగాయి. మంగళవారం జూనియర్, సీనియర్ పురుషులతో పాటు మహిళల విభాగంలో ఫైనల్స్ జరుగనున్నాయి.

**వీవీఐటీ మహిళా జట్టు గెలుపుబావుటా..** మహిళల విభాగంలో సెమీ ఫైనల్స్ మ్యాచ్ వీవీఐటీ(నంబూరు)-విజ్ఞాన్ యూనివర్సిటీ (వడ్లమూడి) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు బౌలింగ్ తీసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన వీవీఐటీ కళాశాల 10 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. తర్వాత విజ్ఞాన్ జట్టు 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులే చేసింది. వీవీఐటీ మహిళా జట్టులో రుచిత (4×4) 21 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించారు.

**ఎన్నారైటీ జట్టు విజయపథం..** జూనియర్స్ విభాగంలో సెమీఫైనల్స్ మ్యాచ్ ఎన్నారైటీ కళాశాల(వీరవల)-చలపతి డిప్లొమా కళాశాల (మోతడక) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన చలపతి కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఎన్నారైటీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. తర్వాత బరిలోకి దిగిన చలపతి జట్టు 6 వికెట్లు కోల్పోయి 80 పరుగులే చేసింది. చివరి ఓవర్‌లో విజయానికి 8 పరుగులు కావాల్సి ఉండగా.. చలపతి జట్టు లక్ష్యం అందుకోలేకపోయింది. వరుణ్ 23 బంతుల్లో (4×4) 25 పరుగులు చేసి ఎన్నారైటీ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

**ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..**

చరణ్ | రుచిత | బసవయ్య | శ్రీరామ్ | హర్ష

**నేడు జరిగే మ్యాచ్‌లు..** వేదిక: చలపతి హిల్‌వ్యూ స్టేడియం

గ్రౌండ్-1 ★ జూనియర్స్ ఫైనల్స్ ఉదయం 8 గంటలకు హిందూ కళాశాల × ఎన్నారైటీ ★ సీనియర్స్ ఫైనల్స్.. ఉదయం 11 గంటలకు జేసీ లా కళాశాల × కేఎల్ యూనివర్సిటీ

గ్రౌండ్-2 ★ మహిళల ఫైనల్స్ ఉదయం 10 గంటలకు వీవీఐటీ ఇంజినీరింగ్ కళాశాల × ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల.

**కేఎల్‌యూదే పైచేయి..** సీనియర్స్ విభాగంలో సెమీ ఫైనల్స్ మ్యాచ్ ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల జట్టు(గుంటూరు)-కేఎల్‌యూ యూనివర్సిటీ(వడ్డేశ్వరం) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కేఎల్‌యూ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. అనంతరం ఆర్‌వీఆర్‌జేసీ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 72 పరుగులకే పరిమితమైంది. హర్ష రెండో ఓవర్లో మూడు కీలక వికెట్లు తీయడంతో పాటు నాలుగో ఓవర్లో మరో వికెట్ తీసి జట్టు విజయానికి కారకుడయ్యాడు.

**హిందూ కళాశాల జట్టు జయకేతనం..** జూనియర్స్ విభాగంలో సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల(చీరాల)-హిందూ జూనియర్ కళాశాల (గుంటూరు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన హిందూ కళాశాల 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. బరిలోకి దిగిన సెయింట్ ఆన్స్ జట్టు 7 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. బసవయ్య 31 బంతుల్లో (7×4) 38 పరుగులు చేసి జట్టు విజయానికి ప్రధాన కారకుడయ్యాడు.

**కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జేసీ లా కళాశాల గెలుపు..** సీనియర్స్ విభాగంలో సెమీఫైనల్స్ కేబీఆర్ డిగ్రీ కళాశాల (నరసరావుపేట)-జేసీ లా కళాశాల(గుంటూరు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కేబీఆర్ కళాశాల జట్టు బౌలింగ్‌ను ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన జేసీ లా కళాశాల జట్టు 10 ఓవర్లకు ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 97 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బరిలోకి దిగిన కేబీఆర్ జట్టు 5 వికెట్లు కోల్పోయి 87 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్‌లో 6 బంతులకు 25 పరుగులు చేయాల్సి ఉండగా కేబీఆర్ కెప్టెన్ రజాక్ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టినా.. మూడో బాల్‌కి వికెట్ కోల్పోవడంతో ఓటమిపాలైంది. జేసీ లా కళాశాల కెప్టెన్ శ్రీరామ్ 35 బంతుల్లో (6×4, 4×6) 57 పరుగులతో జట్టుకు విజయం అందించాడు.

# పీజీఆర్ఎస్‌కు రెవెన్యూ సమస్యలే అధికం

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:** జిల్లాలో ప్రజలకు రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలే అధికంగా ఉంటున్నాయి. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్ కృతికాశుక్లా, అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివ్యాంగుల వద్దకే స్వయంగా వెళ్లి సమస్యలు విని అర్జీలు తీసుకున్నారు. పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే అర్జీలపై ఆడిట్ చేపట్టాలని, జిల్లా అధికారుల పరిధిలో పెండింగ్ లేకుండా చూడాలన్నారు. డీఆర్వో మురళి, ఆర్డీవో మధులత తదితరులు ఉన్నారు. వీటిలో రెవెన్యూ సంబంధిత అర్జీలు 72 ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**ఎన్నెస్పీ కాలువలకు మరమ్మతులు చేయరూ!** వినుకొండ మండలం వితంరాజుపల్లిలో ఎన్నెస్పీ కాలువ నీరు ఇళ్లలోకి వస్తుందని కాలువ కట్టలకు మరమ్మతులు చేయించాలని పీడీఎం నేతలు జలవనరుల శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. దశాబ్దాలుగా కాలువలకు మరమ్మతులు చేయలేదని, కొంత మేర ఆక్రమణ జరిగిందని అధికారుల దృష్టికి తెచ్చారు. పర్యవేక్షణ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సమస్య పరిష్కరించాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

**మహిళకు న్యాయం చేయండి..** రాజుపాలెం మండలం చౌటాపాపాయపాలేనికి చెందిన మహిళ కారసాని అనురాధకు 6 సెంట్ల స్థలం ఇప్పిస్తామంటూ ఆమె నుంచి రూ.12లక్షలు తీసుకుని మోసగించారని బాధితురాలు ప్రజా సంఘాల నేతలతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 282-2 సర్వే నంబర్‌లో శిఖా గోపి అనే వ్యక్తి నుంచి మధ్యవర్తులు చల్లంచర్ల సురేష్, శిఖా ప్రమీల కొనుగోలు చేయించారని తెలిపారు. స్థలం రిజిస్టర్ చేయకుండా ఇబ్బంది పెట్టడమే కాకుండా బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# కళాశాల డైరెక్టర్‌పై హత్యాయత్నం

## కుటుంబం కకావికలమైందని యువకుడి ఘాతుకం

**ఈనాడు డిజిటల్, నరసరావుపేట:** అల్లారుముద్దుగా చూసుకుంటున్న చెల్లెలు గత ఏడాది ఆత్మహత్య చేసుకుంది. ఆ దిగులుతో కొంత కాలానికి తండ్రి బలవన్మరణం చెందాడు. దీనికి చెల్లెలు చదివే కళాశాల యాజమాన్యమే కారణమని పగపెంచుకున్నాడో యువకుడు. అదును చూసి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. కత్తితో దాడి చేసి కటకటాలపాలయ్యాడు. నరసరావుపేట ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో భావన కళాశాల డైరెక్టర్ మైనేడి శ్రీనివాసరావుపై సోమవారం హత్యాయత్నం ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన హనుమంతరావుకు ఇంటర్ చదివే కుమార్తె అనూష, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో బీటెక్ చదివే కుమారుడు ఏడుకొండలు ఉన్నారు. రావిపాడులోని భావన క్యాంపస్‌లో ఇంటర్ చదివే అనూష పెన్ను దొంగిలించిందని తోటి విద్యార్థినులు నిందమోపడంతో భరించలేక గతేడాది నవంబరు 16న ఆత్మహత్య చేసుకుంది. అప్పటి వరకు హాయిగా సాగిపోతున్న వారి కుటుంబంలో ఇదో పెద్ద కుదుపు. కుమార్తెను అమితంగా ప్రేమించే తండ్రి హనుమంతరావు దిగులుతో గతేడాది డిసెంబరు 29న ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి పెద్ద దిక్కు అయిన తండ్రి చనిపోవడంతో ఫీజులు చెల్లించేవారు లేక ఏడుకొండలు బీటెక్ మానేసి ఈ ఏడాది వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాంలో చేరాడు. మరోవైపు గుంటూరులో ఉంటూ ఎస్ఎస్‌సీకి శిక్షణ తీసుకుంటూ ఓ సంస్థలో డెలివరీ బాయ్‌గా పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ అమ్మను చూసుకుంటున్నాడు. తమ కుటుంబం ఇలా కకావికలం కావడానికి కారణం కాలేజీ యాజమాన్యమే అని భావించి డైరెక్టర్‌ను చంపాలనుకుని పథకం వేశాడు. అతని కదలికలు గమనించాడు. ఉదయపు నడకకు ఎస్ఎస్ఎన్ కళాశాల మైదానానికి వస్తున్నట్లు గుర్తించాడు. సోమవారం కత్తితో దాడికి పాల్పడ్డాడు. వెంటనే అక్కడున్న వారు అప్రమత్తమై అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. అతని బ్యాగులో బొమ్మ తుపాకీని స్వాధీనం చేసుకుని, హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఫిరోజ్ తెలిపారు. తన తండ్రి సంవత్సరీకం రోజే చంపాలని ముందస్తు పథకం వేసుకున్నాడని, అతనిపై ఇంత వరకు ఎటువంటి నేరచరిత్ర లేదని దర్యాప్తులో తేలింది.

పొగాకు బోర్డు, గుంటూరు
వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య విభాగము, భారత ప్రభుత్వము (ఐ.యస్.ఓ.9001:2015 గుర్తింపు పొందిన సంస్థ)
జి.టి. రోడ్డు, గుంటూరు-522004. ఫోన్ : 0863-2358399, 2358499.
టెండరు నోటీసు
2025-26 FCV పొగాకు ఆక్షన్స్ కొరకు ఆంధ్రప్రదేశ్‌లో గల పొగాకు బోర్డు వేలం కేంద్రాల వద్ద 1) పొగాకు బేళ్ళను హ్యాండిల్ చేయుటకు మరియు 2) ట్రాలీస్ మరమ్మత్తులు/ సర్వీసింగు కొరకు అనుభవము కలిగిన కాంట్రాక్టర్లు మరియు ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.
పైన తెలుపబడిన పనుల కొరకు టెండరు ఫారములు తదితర వివరముల కొరకు రీజినల్ మేనేజరు, ఒంగోలు, రాజమండ్రి మరియు మేనేజరు(ఆక్షన్స్), పొగాకు బోర్డు, గుంటూరు వారిని సంప్రదించగలరు. టెండరు ఫారములు మరియు నియమ నిబంధనలు పొగాకు బోర్డు వెబ్‌సైట్ (www.tobaccoboard.com) నుండి కూడా పొందవచ్చును.
పైన తెలుపబడిన పనుల నిమిత్తము పూర్తి చేసిన టెండరు ఫారాలను టెండరు నియమ నిబంధనలలో తెలిపిన ధరావతు సొమ్ముతో సహా తేది.21-01-2026 సాయంత్రం గం॥3.00 లలోగా పొగాకు బోర్డు, గుంటూరు నందు టెండరు బాక్సులో డిపాజిట్ చేయవలెను. అసంపూర్తిగా ఉన్న టెండర్లు తిరస్కరించబడును మరియు ఏ విధమైన కారణం చూపకుండానే స్వీకరించిన టెండర్లలో ఏదైనా లేదా అన్నింటిని తిరస్కరించేందుకు కార్యనిర్వహణాధికారి, పొగాకు బోర్డు వారు సర్వహక్కులు కలిగియున్నారు.
స్థలము : గుంటూరు, తేది: 29-12-2025 సం/- కార్యదర్శి

# సీఎం చంద్రబాబుతో తెదేపా జిల్లా అధ్యక్షుడి భేటీ

**నరసరావుపేట అర్బన్:** తెదేపా జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన షేక్ జానీ సైదా సీఎం చంద్రబాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో పాటు కలిసి వెళ్లారు. పార్టీ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీని బలోపేతం చేసేందుకు, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని సాగాలని సీఎం సూచించినట్లు పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబుతో షేక్ జానీసైదా, ఎమ్మెల్యే ప్రవీణ్

# ఉరకలెత్తిన ఉత్సాహం

## హోరాహోరీగా సబ్ జూనియర్స్ విభాగం ఎడ్ల పోటీలు

**నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే:** పందెపు ఎడ్లను పోషించే రైతులకు భరోసాగా ఉండేందుకు, వారిలో ఉత్సాహం నింపేందుకు ఎడ్ల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. కోడెల శివప్రసాదరావు స్టేడియంలో నిర్వహిస్తున్న అఖిల భారత ఒంగోలు జాతి ఎద్దుల బండ లాగుడు పోటీలు సోమవారం నాటికి ఐదో రోజుకు చేరాయి. కలెక్టర్ కృతికాశుక్లా పోటీలను తిలకించారు. తొలుత కలెక్టర్‌ను ఎమ్మెల్యే, తెదేపా మహిళా నేతలు శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. విద్యుత్తు ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**న్యూకేటగిరీ విభాగంలో విజేతలు..** బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు 4534 అడుగుల దూరాన్ని లాగి రూ.50వేలు గెలుచుకున్నాయి. ప్రకాశం జిల్లా మద్దిరాలకు చెందిన ఆక్వా ఫార్మ్స్-పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లు 4,520 అడుగుల దూరాన్ని లాగి రూ.40వేలు గెలుచుకున్నాయి. గుంటూరు జిల్లా కొండ బాలవారిపాలెంకు చెందిన జీపీ చౌదరి బుల్స్- గూడవల్లి లక్ష్మీదీక్షిత చౌదరి ఎడ్లు 4,325 అడుగుల దూరాన్ని లాగి రూ.35వేలు గెలుచుకోగా, పిన్నెల్లి, కోదాడకు చెందిన పిక్కిలి తేజస్సు మురళి, నతమాద ఉత్తమ్ పద్మావతిరెడ్డి ఎడ్లు 4,218 అడుగుల దూరం లాగి రూ.30వేలు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వారికి నగదు, జ్ఞాపికలను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు తదితరులు అందజేశారు.

**సందడిగా స్టేడియం ..** పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎడ్లు సత్తా చాటుతున్నాయి. పోటీలు తిలకించటానికి వచ్చిన రైతుల కేరింతలు, చప్పట్లు, ఈలలతో ఎడ్లను ఉత్సాహపరుస్తున్నారు. నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల నుంచి వచ్చిన ఎడ్లకు జూనియర్ వీర నరసింహారెడ్డి, జూనియర్ ఇంద్రసేనారెడ్డిగా, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెద గొట్టిపాడు గ్రామానికి చెందిన ఎడ్లను సింగం, సింగమలైగా పిలిచినప్పుడు ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు.

కలెక్టర్ కృతికా శుక్లాకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే, మహిళానేతలు

బండ లాగుతున్న ఎడ్లు

EENADU e Classifieds

BUSINESS SERVICES

**బంగారం కొనబడును.** బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

**SENIOR Electrician:** Q: DIP in Electrical, Con: Arjuna solvent extraction pvt. ltd. Perecherla, Gnt. ✆ 96662 99986.

**తెనాలి దగ్గర** దుగ్గిరాలలోని ప్రముఖ కాఫీ పరిశ్రమలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ మరియు ప్యాకింగ్ బాయ్స్ కావలెను. రూమ్ మరియు క్యాంటీన్ సౌకర్యం కలదు. ✆ 92980 11777, 8096161777.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

**ప్రముఖ హోటల్‌లో** పనిచేయుటకు రూమ్ బాయ్స్ కావలెను. భోజనం వసతి సదుపాయం కల్పించబడును. సంప్రదించండి. ఫోన్: 9966846756, 7801062777.

**కుంకుపాడు అడ్డంకి** చుట్టుప్రక్కల పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం॥ డ్యూటీ, భోజనం + రూమ్ కలదు. 9149986335, 9652689259.

**గుంటూరులో నివాసము** ఉంటున్న పేషంట్స్‌ను చూసుకొనుటకు భార్య & భర్త మరియు ఆయాలు అర్జంట్‌గా కావలెను. సంప్ర॥ ✆ 7842845772.

**ఉద్యోగం చేస్తూనే** అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

**గుంటూరు మాస్టర్‌మైండ్స్** కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జిస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్ర. ✆ 89784 80429.

**గుంటూరు మాస్టర్** మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జిస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జిస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీ: 14000/- నుండి 21000/- వరకు. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యుండాలి. వివరముల కొరకు సంప్ర. ✆ 9248713335.

**బిజినెస్ మేనేజర్స్/** బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, ఫ్రెషర్స్, వేతనం: రూ.20,000/- + వెహికల్ అలెవెన్స్, 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

**గుంటూరు, AT** అగ్రహారం మా ఇంట్లో ఇంటి పని, వంట పనిచేయుటకు ఆడ పనిమనిషి కావలెను. హిందువులు మాత్రమే. ✆ 97037 54657.

**75సం॥ మహిళను** చూసుకొనుటకు మా ఇంటివద్దనే వుండి ఏ బాదరాబందీలేని 45సం॥లోపు ఒంటరి మహిళా కావలెను. భోజన, వసతి కలదు. 63054 95510.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

# అమృత్ పనుల్లో వేగం పెంచండి

రైల్వే ఉన్నతాధికారులతో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

**ఈనాడు డిజిటల్, నరసరావుపేట:** పల్నాడు జిల్లాలో అమృత్ పథకం కింద రైల్వేస్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్ణ, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యురాలు కొంకా రాధతో జరిగిన భేటీలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. గుంటూరు దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ కార్యాలయంలో రైల్వే ఉన్నతాధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పిడుగురాళ్ల, వినుకొండ, నరసరావుపేట, సత్తెనపల్లి, మాచర్ల, రైల్వేస్టేషన్లలో అమృత్ పనుల్లో జరుగుతున్న ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం త్వరగా పూర్తి చేసి మౌలిక వసతుల్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ

**దాచేపల్లి, న్యూస్‌టుడే:** పిడుగురాళ్ల నుంచి మాచర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సులో బంగారు నగలు చోరీకి గురయ్యాయి. మాచర్ల మండలం రాయవరం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బీ దాచేపల్లిలో నివసిస్తున్న తన కుమార్తెను చూసేందుకు వచ్చింది. సోమవారం సాయంత్రం తిరిగి తన ఊరికి వెళ్లడానికి ఆమె బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్టాండు నుంచి ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్‌కు బస్సు చేరుకునేలోపే ఆమె పర్సులో ఉన్న ఏడు తులాల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. విషయం గుర్తించిన ఆమె తోటి ప్రయాణికులకు చెప్పగా 100 నంబరుకు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ భాస్కర్, ఎస్సై పాపారావు చేరుకుని బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రయాణికులను విచారించి, వారి వివరాలు సేకరించారు. నగల ఆచూకీ లభించలేదని, విచారణ చేపట్టామని సీఐ తెలిపారు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

## అన్నదమ్ముల హత్య కేసులో మరో నలుగురికి రిమాండ్

**దుర్గి:** అడిగొప్పలలో అన్నదమ్ములు కొత్త శ్రీరామమూర్తి, హనుమంతు హత్యల కేసులో మరో నలుగురు నిందితులు కొనకంచి మహేష్, బండ్ల గురవయ్య, చల్లా సాయిశంకర్, రెంటాల రామాంజిలును పోలీసులు ఒప్పిచర్ల వద్ద అరెస్టు చేశారు. వీరిని సోమవారం మాచర్ల కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండు విధించినట్లు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సుధీర్‌కుమార్ తెలిపారు.

## భూ వివాదాలపై ఎక్కువ ఫిర్యాదులు

**మల్లమ్మ సెంటర్(నరసరావుపేట):** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించనున్నట్లు ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితుల గోడు ఆలకించి సత్వరమే పరిష్కారం చూపుతామన్నారు. భూమి సంబంధిత-21, ఆర్థిక వివాదాలు-17, ఆస్తి, భార్యభర్తల తగాదాలు-10 చొప్పున, ఇతర-28 మొత్తం 86 అర్జీలు అందినట్లు తెలిపారు.

సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణారావు

**ఆస్ట్రేలియన్ కంపెనీ పేరిట టోకరా..** నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తికి మూడు వారాల క్రితం ఓ మహిళ ఫోన్ చేసి ఆస్ట్రేలియన్ కంపెనీ పేరిట ట్రేడింగ్ చేస్తే రెట్టింపు నగదు వస్తాయని ఆశ చూపింది. మొదట కొంత నగదు పెట్టుబడి పెట్టగా రూ.40 వేలు లాభం చూపించారు. అనంతరం రూ.3.50 లక్షలు పెట్టుబడి పెట్టగా నగదు ఇవ్వకుండా మోసం చేసినట్లు బాధితుడి ఎస్పీ వద్ద వాపోయారు.

**చీటీల పేరిట నమ్మించి..:** నరసరావుపేట పట్టణం బాలయ్యనగర్‌కు చెందిన వ్యక్తి పట్టణానికే చెందిన మరొకరి వద్ద పదేళ్ల క్రితం రూ.14.50లక్షలకు రిజిస్టర్ చీటీలు వేశారు. చీటీల గడువు ముగిసి నగదు అడిగితే ప్రస్తుతానికి నగదు లేదని వడ్డీ వేసి డబ్బులు ఇస్తానని నమ్మించాడు. ఇప్పుడు అడుగుతుంటే నగదు ఇవ్వనని బెదిరిస్తున్నట్లు బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

# మైనింగ్ తవ్వకాల పరిశీలన

కొండ వద్ద తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ సిబ్బంది

**ఈనాడు డిజిటల్, నరసరావుపేట:** 'అనుమతులు గోరంత.. తవ్వకాలు కొండంత' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మైనింగ్ అధికారులు స్పందించారు. నకరికల్లు మండలం త్రిపురారం కొండ వద్ద జరుగుతున్న తవ్వకాలను సోమవారం పరిశీలించారు. కొలతల ఆధారంగా ఇచ్చిన అనుమతుల పరిధిలోనే తవ్వకాలు జరిగాయని, ప్రస్తుతం తవ్వకాలు జరగడం లేదని, ఇకపై ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఏడీ నాగయ్య చెప్పారు. ఇకపై ఎప్పటికప్పుడు సిబ్బందితో తనిఖీలు చేయిస్తామన్నారు.

**బ్రాయిలర్ ధరలు** (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 142, రిటైల్ ధర - 169, చికెన్ విత్‌స్కిన్ - 245, చికెన్ స్కిన్‌లెస్ - 279.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 147, 156, 167 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

# హత్యతో సంబంధం లేదు

## పోలీసు కస్టడీలో పిన్నెల్లి సోదరులు

**ఈనాడు డిజిటల్, నరసరావుపేట:** హత్యతో తమకేమీ సంబంధం లేదని ఇప్పటికే రెండుసార్లు చెప్పామని, మళ్లీ అదే చెబుతున్నామని పోలీసు కస్టడీ విచారణలో పిన్నెల్లి సోదరులు చెప్పినట్లు తెలిసింది. రెండ్రోజుల పోలీసు కస్టడీలో భాగంగా సోమవారం నెల్లూరు జైలులో మాచర్ల గ్రామీణ పోలీసులు విచారించారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెదేపా నేతలు జవ్విశెట్టి వెంకటేశ్వర్లు, జవ్విశెట్టి కోటేశ్వరరావు హత్యల కేసులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డి నెల్లూరు జైల్లో రిమాండులో ఉన్న విషయం తెలిసిందే. ఇదే కేసులో ఏ8 అయిన కండ్లకుంట సర్పంచి వెంకటరెడ్డిని పోలీసులు ఇటీవల విచారించారు. అందులో రాబట్టిన విషయాలతో పిన్నెల్లి సోదరులకు సంబంధంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

# నరసరావుపేట

•నరసరావుపేట •వినుకొండ •చిలకలూరిపేట

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

**నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే:** కోటప్పకొండపై త్రికోటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల మృతిచెందిన ఒప్పంద ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. కొండపై నిర్వహిస్తున్న అన్నదానం, శానిటేషన్ పనుల్లో అవినీతిపై ఆరోపణలు వస్తున్నాయని వాటిపై దర్యాప్తు చేయించాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లాకు అర్జీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన అధికార ప్రతినిధి షేక్ ఆదుర్ మాట్లాడుతూ ఒప్పంద ఉద్యోగులను ఆలయ ఈవో చంద్రశేఖరరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వ్యక్తిగతంగా ఇబ్బంది పెడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్కే యాదవ్, రామారావు, ఏడుకొండలు, కొండలు, రేణుక, నిర్మల, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో శారద ఉన్నత పాఠశాల బజారులోని బెస్తపేట కామమ్మ గుడి ప్రాంతంలో కుళాయిల్లో వస్తున్న నీరు మురుగు కలిసి దుర్వాసన వస్తోంది. నాలుగు రోజులుగా ఇబ్బంది పడుతున్నాం. **- రాఘవయ్య** ✔ పరిశీలించి కుళాయిల్లో నీరు మురుగు వాసన రాకుండా చర్యలు తీసుకుంటాం. **- అన్వర్, పురపాలక సంఘ ఏఈ** - న్యూస్‌టుడే, గాంధీపేట(చిలకలూరిపేట పట్టణం)

? సీతయ్యనగర్ ఒకటో లైన్‌లో ఖాళీ స్థలం కంప చెట్లతో నిండింది. పాముల బెడద పెరిగింది. **- సుజాత** ? విద్యానగర్ నాలుగో లైన్‌లో ఖాళీ స్థలంలో కంప చెట్లు పెరిగి అపరిశుభ్రంగా ఉంది. **- నారాయణ** ? విష్ణుకుండినగర్‌లో, డబ్బా స్తంభం సెంటర్‌లో కుక్కల బెడదతో ఇబ్బందిగా ఉంటుంది. **- రామారావు, ఇస్మాయిల్** ✔ ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో ముళ్ల కంపలు తొలగించాలని యజమానులకు నోటీసులు ఇస్తాం. కుక్కలను పట్టిస్తాం. **- ఇస్మాయిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, వినుకొండ పురపాలక సంఘం**

? నూజండ్ల రోడ్డులో రైల్వే అండర్‌పాస్‌లో నీరు నిలబడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- శ్రీనివాస్** ✔ రైల్వేశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. **- పి.ఆదినారాయణ, మున్సిపల్ ఏఈఈ, వినుకొండ** - న్యూస్‌టుడే, వినుకొండ

కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న చీఫ్ విప్ ఆంజనేయులు

## త్వరితగతిన ఆలయ నిర్మాణం పూర్తి చేస్తాం

**వినుకొండ, న్యూస్‌టుడే:** కొండపైన గుడి, ఘాట్ రోడ్డు త్వరితగతిన నిర్మాణం చేలా చర్యలు చేపడతానని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడుతూ గుడి ప్రాకారం, ఘాట్ రోడ్డుకు ప్రభుత్వం రూ.4కోట్లు వరకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గుడి నిర్మాణానికి రూ.33 లక్షలు విరాళం ప్రకటించారు. కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు తమ వంతు కృషి చేయాలని సూచించారు. జీడీసీసీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అయ్యర్ కోటేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఉప విద్యుత్తు కేంద్రానికి శంకుస్థాపన**

ఎరువుల కొరత పేరుతో వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అసత్య ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. టిడ్కో గృహ సముదాయం వద్ద రూ.2.85కోట్లతో నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణాత్మక విమర్శలను తాను ఆహ్వానిస్తానని వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కూటమి పాలనలో అన్ని సౌకర్యాలతో టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ గత వైకాపా పాలనలో బ్యాంకులో జరిగిన అవినీతిని బయటకు తీసుకొచ్చే దానిపై మాజీ ఎమ్మెల్యే బొల్లా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ పి.విజయ్‌కుమార్, ఈఈ రాంబాబు, డీఈఈలు సుబ్బారావు (టెక్నికల్), శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ షకీల, బడేసి దస్తగిర్ నాగేశ్వరరావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు బొంకూరి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# పైపులు పగులుతున్నాయ్!

**35 ఏళ్ల క్రితం వేసినవి కావడమే కారణం**

గాంధీపేట (చిలకలూరిపేట పట్టణం), న్యూస్‌టుడే

నీటిని పొదుపుగా వినియోగించాలి.. ప్రతి నీటి బొట్టు ఒడిసి పడితేనే భవిష్యత్తు తరాలకు నీటి కష్టాలు దరిచేరవంటూ పలు వేదికలపై ప్రజాప్రతినిదులు, అధికారులు ఉపన్యాసాలు ఇస్తుంటారు. కానీ ఆచరణలో అవి అమలుకావడం లేదు. చిలకలూరిపేట పురపాలక సంఘ పరిధిలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట పైపులైనుకు లీకులు ఏర్పడి తాగునీరు వృథా కావడం పరిపాటిగా మారింది. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట పైపులైన్ లీకులు, కుళాయిలకు హెడ్‌లు లేకపోవడం, వాల్‌పిట్ రిపేర్లు ఇలా తదితర కారణాలతో సుమారు 12లక్షల లీటర్ల నీరు వృథా అవుతోంది.

**ఏడాదికి రూ.25లక్షలు వెచ్చిస్తున్నా..**

చిలకలూరిపేట పురపాలక సంఘ పరిధిలో మంచినీటి పైపులైన్లు చాలా వరకు 35 ఏళ్ల క్రితం నాటివే. బాగా దెబ్బతిన్న పైపులైన్లను గుర్తించి అమృత్ పథకం కింద నూతన పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మొదటి ఫేజ్ కింద 15 కి.మీ, రెండో విడత 48 కి.మీ. మేర మొత్తం 63 కి.మీ. మేర కొత్త పైపులైన్లు వేశారు. అయితే కొన్నిచోట్ల పాత పైపులైన్లకు కొత్త పైపులైన్ల అనుసంధానం చేసే పనులు జరగలేదు. దీంతో పాత పైపులైన్లలోనే నీటి సరఫరా అవుతుండటంతో తరచూ ఎక్కడోచోట లీకులు ఏర్పడుతున్నాయి. వీటి మరమ్మతులకు ఏటా రూ.25లక్షల వరకు ఖర్చు చేస్తున్నా లీకులు మాత్రం ఆగడం లేదు. ఈ విషయమై పురపాలక సంఘ ఏఈ మణికుమార్‌ను సంప్రదించగా అమృత్ పథకం కింద త్వరగా పైపులైన్లు పనులు పూర్తిచేసి లీకులను అరికట్టి నీరు వృథా కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

చిలకలూరిపేట క్రీస్తుకాలనీలో లీకులకు మరమ్మతులు

| |
|---|
| చిలకలూరిపేటలో మొత్తం తాగునీటి పైపులైన్ పొడవు: **170** కి.మీ. |
| అమృత్ పథకం ఫేజ్-1, 2లో వేసిన కొత్త పైపులైన్లు: **63** కి.మీ. |
| పట్టణ జనాభా: **1.30** లక్షలు |
| ప్రతి వ్యక్తికి సరఫరా చేస్తున్న నీరు: **135** లీటర్లు |
| పట్టణంలో రోజువారీ నీటి సరఫరా: **170** లక్షల లీటర్లు |
| ప్రతిరోజూ వృథా అవుతున్న నీరు: **12** లక్షల లీటర్లు |
| ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా: **15** వేల లీటర్లు |

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు

నేడు

**వినుకొండ, చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే:** వినుకొండ పురపాలక సంఘం పాలకవర్గ సభ్యుల సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ దస్తగిరి తెలిపారు. ఎజెండాలోని అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. ✦ చిలకలూరిపేట పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని తెలిపారు. ఎజెండాలో పొందుపరిచిన 48 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

## విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**వినుకొండ రూరల్, న్యూస్‌టుడే:** మండలంలో విఠంరాజుపల్లి పరిధిలోని అన్ని విద్యుత్తు లైన్ల నవీకరణ, ఆధునికీకరణలో భాగంగా మంగళవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఉపాధి నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై విచారణ

**బొల్లాపల్లి, న్యూస్‌టుడే:** ఉపాధి హామీ పథకం కింద కనుమల చెరువు శివారు ఘాటి తండాలో నిధులు దుర్వినియోగం అయినట్లు జిల్లా అధికారులకు అందిన ఫిర్యాదుపై మంగళవారం విచారణ జరుగుతుందని ఎంపీవో లక్ష్మణరావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారి ఖాతాలకు నగదు జమ చేయడం, కుటుంబానికి కాకుండా వ్యక్తిగతంగా జాబ్ కార్డుల జారీ వంటి అంశాలపై గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ కార్యాలయంలో విచారణ జరుగుతుందని వివరించారు.

నరసరావుపేట: విజేత బాలురతో ఉపాధ్యాయులు

నరసరావుపేట: బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: ప్రతిభావంత విద్యార్థులతో డైరెక్టర్ రోజా, ప్రిన్సిపల్ శ్యామ్

## క్విజ్‌లో రాణించి.. బహుమతి పట్టి..

**సందడిగా 'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీలు**

**నరసరావుపేట అర్బన్, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యార్థులను ప్రోత్సహించేందుకు పాఠశాలల్లో 'ఈనాడు' నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటుతున్నారు. నరసరావుపేటలో ఎస్టీటీల మున్సిపల్ ఉన్నత పాఠశాల, శ్రీలిఖిత్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, చిలకలూరిపేట విట్ స్కూల్లో విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఎస్టీటీ పాఠశాలలో పార్థుశౌక్ (10వ తరగతి), ఇస్మాయిల్ (9వ తరగతి), వేదవ్యాస్ కార్తిక్ (10వ తరగతి) విద్యార్థులు రాణించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని చిట్టెమ్మ, ఉపాధ్యాయులు ఆంజనేయులు బహుమతులు అందించి అభినందించారు. ✦ ప్రకాశ్‌నగర్‌లోని శ్రీలిఖిత్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పి.గాయత్రి, బిలాల్, అబ్దుల్‌బాషా రాణించి తొలి మూడు స్థానాలు సాధించారు. వీరికి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని లక్ష్మీభారతి, ఉపాధ్యాయిని పావని బహుమతులు అందించి అభినందించారు. ✦ చిలకలూరిపేట విట్ స్కూల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎస్.శృష్టి, ఎ.అనన్య, సీహెచ్ ఆశ్రయ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి విట్ స్కూల్ డైరెక్టర్ రోజా, ప్రిన్సిపల్ శ్యామ్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించి అభినందించారు.

## హరిత రాయబారులకు జీవిత బీమా

**శావల్యాపురం, న్యూస్‌టుడే :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించే హరిత రాయబారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీడీవో పేరుపేన సీతారామయ్య తెలిపారు. మండలంలోని హరిత రాయబారులు, పెద్దమిత్రులకు ప్రభుత్వ తరఫున జీవిత బీమా చేయించే కార్యక్రమాన్ని శావల్యాపురం మన వ్యర్థాల కేంద్రం వద్ద సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మొత్తం 20 మందికి బీమా చేయించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ పంచాయతీ కార్యదర్శి బొద్దు యూజీబు, మండల కోఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**చిలకలూరిపేట (గ్రామీణ, న్యూస్‌టుడే):** మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్లి అప్పిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుంటి అనిల్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా కానుగుల అంకమ్మరావు, ఉపాధ్యక్షుడిగా వారణాసి హరినారాయణ, మహిళా ఉపాధ్యక్షురాలిగా అబ్బూరి రాజ్యలక్ష్మి, కార్యదర్శిగా కేలావత్ అంజనాయక్ ఎన్నికైన వారిలో ఉన్నారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

## ఎస్టీయూ కాలమానిని ఆవిష్కరణ

**శావల్యాపురం, న్యూస్‌టుడే :** ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించడంతో పాటు, టీస్‌లో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనరు రాజా రమేష్ తెలిపారు. శావల్యాపురం మండల వనరుల కేంద్రం వద్ద 2026కు సంబంధించిన ఎస్టీయూ కాలమానిని, గోడపత్రికను ఎంఈవో -1 మద్దిగుంట సాంబశివరావు, ఎంఈవో-2 పి.లలితకుమారి సోమవారం సంయుక్తంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రముట్ల వెంకటరత్నం, మండల శాఖ అధ్యక్షుడు నెమలికంటి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆర్.చెంచులక్ష్మి, కోశాధికారి ఆవుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కోమటినేనివారిపాలెంలో వృద్ధాశ్రమం

**చిలకలూరిపేట (గ్రామీణ, న్యూస్‌టుడే:** మండలంలో కోమటినేని వారిపాలెంలోని పాత భవాని స్కూలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాన్ని (వికాస్ ఇండియా కేర్ హోమ్) ఫాదర్ రాజేష్, ఫాదర్ జోజయ్య సోమవారం ప్రారంభించారు. దీని వ్యవస్థాపకులు, బెంగళూరుకు చెందిన సిస్టర్స్ లవీన, జ్యోతి మాట్లాడుతూ ఏ సమయంలోనైనా వృద్ధులను చేర్చుకుంటామన్నారు. వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం, వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల నాయకులు రంగనాథుల నాగేశ్వరరావు, మంగు ఏడుకొండలు, కుల్లి సూర్యవర్ధనరావు, కుల్లి ఏసుబాబు, కొప్పుల నాగేశ్వరరావు, వెలగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మ పరిరక్షకుడికి సత్కారం

**గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే:** నాదెండ్ల మండలం గణపవరం శివప్రియనగర్‌లో ఉన్న ఆశ్రమ గురువు నిత్య విద్యానంద భారతిస్వామికి అశోక్ సమాన్ అవార్డు దక్కింది. సనాతన ధర్మ పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ప్రపంచ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో న్యూదిల్లీలో ఈ నెల 27న జరిగిన జాతీయ సదస్సులో భారత్ గౌరవ్ శ్రీ కౌన్సిల్‌లో సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్రీయ అశోక్ సమాన్ అవార్డుతో సత్కరించింది.

## హ్యాకథాన్‌లో మెరిసిన జేఎన్‌టీయూ విద్యార్థులు

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:** ఐఐటీ దిల్లీ నిర్వహించిన ఐఐఐటీ హ్యాకథాన్ పోటీల్లో నరసరావుపేట జేఎన్‌టీయూ విద్యార్థులు రాణించి ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలకు చెందిన సీఎస్ఈ విద్యార్థులు కె.దీపక్ (ద్వితీయ బీటెక్), డి.వంశీ (బీటెక్ నాలుగో సంవత్సరం) ప్రదర్శించిన డిజైన్‌కు రూ.40వేలు నగదు బహుమతి లభించిందన్నారు. విద్యార్థులను కళాశాల విభాగాధిపతులు అభినందించారు.




తాము అందుకున్న బహుమతితో..

## ఏఎన్‌యూ బేస్‌బాల్ జట్టులో నరసరావుపేట క్రీడాకారులు

**నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే:** ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర కళాశాలల బేస్‌బాల్ టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు ప్రతిభ చూపి మూడో స్థానం సాధించిందని ప్రిన్సిపల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గుంటూరు శివారు చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో నిర్వహించిన ఏఎన్‌యూ అంతర కళాశాలల బేస్ బాల్ పోటీల్లో ఈ ఘనత సాధించినట్లు ఆయన వివరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన ఎల్.సతీష్, కె.నరేష్‌నాయక్ ఏఎన్‌యూ విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికయ్యారు. అలాగే స్థానిక ఎంఏఎం పీజీ కళాశాలకు చెందిన విద్యార్థి బి.సాగర్ వర్సిటీ జట్టుకు ఎంపికయ్యాడని ఆ కళాశాల అధినేత మేదరమెట్ల శేషగిరిరావు తెలిపారు. వీరు వచ్చే నెల 2న పుణెలోని సావిత్రిబాయి పులె విశ్వవిద్యాలయంలో జరగనున్న ఆల్ ఇండియా అంతర యూనివర్సిటీ పోటీలకు ఏఎన్‌యూ జట్టులో ఆడతారని వివరించారు.

ప్రతిభ చూపిన క్రీడాకారులతో వాగ్దేవి కళాశాల ప్రిన్సిపల్, కార్యదర్శి తదితరులు

ఎంఏఎం విద్యార్థి సాగర్

## రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్‌లో పసుమర్రు విద్యార్థి ప్రతిభ

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** తిరుపతిలో ఈ నెల 27న జరిగిన రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో చిలకలూరిపేట మండలం పసుమర్రు శ్రీమద్దికామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి షేక్ మొహమ్మద్ ముస్తాక్ నాయకత్వంలోని పల్నాడు జిల్లా బృందం ప్రథమస్థానం సాధించింది. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 37,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నుంచి రెండు టీమ్‌లు ప్రాతినిధ్యం వహించగా మొహమ్మద్ ముస్తాక్ నాయకత్వం వహించిన బృందం ప్రథమ స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్‌ఎం వై.హనుమంతరావు, పాఠశాల కమిటీ ఛైర్మన్ కోట సుదర్శన్, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు గద్దే హరిబాబు, వీరగంధం ధనుంజయరావు సోమవారం పాఠశాలలో అభినందించారు. మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా జ్ఞాపిక, ధ్రువపత్రం, రూ.5 వేల నగదు బహుమతి అందుకోవడం ఆనందంగా ఉందని విద్యార్థి తెలిపాడు.

## 150 టన్నుల ఎరువులు స్వాధీనం

**నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే:** నరసరావుపేటలో ఎరువుల నిల్వల్లో వ్యత్యాసం, సరైన రికార్డులు లేని రూ.40.7 లక్షల విలువైన 150 టన్నుల ఎరువులను వ్యవసాయాధికారులు స్వాధీనం చేసుకొని సదరు డీలరుపై 6ఏ కేసు నమోదు చేశారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నరసరావుపేటలోని సాయి కృష్ణ ఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణం, దుకాణానికి సంబంధించిన గోదాములు, నిల్వ కేంద్రాల్లో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ఏడీఏ మురళీకృష్ణ, ఏవోలు కె.వెంకట్రావు, ఐ.శాంతి తదితరులు ఎరువుల నిల్వలు, వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో ఎరువుల నిల్వల్లో వ్యత్యాసం, సరైన రికార్డులు లేకపోవటం గుర్తించి 150 టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేసినట్లు తనిఖీలో పాల్గొన్న అధికారులు తెలిపారు. ఏఈవో కె.బ్రహ్మయ్య తదితరులు వారి వెంట ఉన్నారు.

## యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా రామాంజనేయులు

**రొంపిచర్ల, న్యూస్‌టుడే:** యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా రొంపిచర్ల మండలం నుంచి ఎం.రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వినుకొండలో ఆదివారం నిర్వహించిన జిల్లా నాలుగో కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. జిల్లా కార్యదర్శిగా రామాంజనేయులు ఎంపిక కావడంపై రొంపిచర్ల, నరసరావుపేట ప్రాంత మండల శాఖల బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**మతుకుమల్లి (శావల్యాపురం), న్యూస్‌టుడే :** గంగినేని ఫౌండేషన్ సహకారంతో యూటీఎఫ్ రూపొందిన స్టడీ మెటీరియల్‌ను మండలంలోని మతుకుమల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు గంగినేని రాఘవ తెలిపారు. దాతలు అందచేస్తున్న మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురళీ మోహన్, యూటీఎఫ్ శాఖ అధ్యక్షుడు మాదాల రామకోటేశ్వరరావు, మాజీ సర్పంచి ముంద్రు హనుమంతరావు, పీఎంసీ ఛైర్‌పర్సన్ మల్నీడి రామాంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## 'సంగం' సేవలు సద్వినియోగం చేసుకోండి

**రొంపిచర్ల, న్యూస్‌టుడే:** సంగం డెయిరీ నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జీడీసీసీ బ్యాంకు మాజీ ఏజీఎం పాటిబండ్ల నాగేశ్వరరావు కోరారు. రొంపిచర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన సంగం పాల ఉత్పత్తుల శాఖను రీజినల్ మేనేజర్ నరేష్‌బాబు, డైరెక్టర్ గడిపూడి రామాంజనేయులు, రొంపిచర్ల మేనేజరు కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. రొంపిచర్లలో నూతనంగా సంగం డెయిరీ చిల్లింగ్ మిల్క్ సెంటర్ ఏర్పాటు చేశారని తెలిపారు.

## అప్ ఇప్

### కనీస వసతులు కరవు

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలో ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయని వాటిపై స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కలెక్టర్ కృతికాశుక్లాకు సోమవారం తెలిపారు. రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెంలో మౌలిక వసతుల కల్పన, పట్టణంలో తెదేపా వర్గీయులు సంఘవిద్రోహ చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంటూ వినతిపత్రాలు అందజేశారు. బుచ్చిపాపన్నపాలెం పంచాయతీ పరిధిలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

### ఉద్యోగ విరమణ సత్కారం

**వినుకొండ, న్యూస్‌టుడే:** ఎంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం కొందరికే ఉంటుందని నెల్లూరు జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి కృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టంగుటూరి ప్రభాకరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా కళాశాల వార్షికోత్సవ సభలో ఆయనను సన్మానించారు. ఎంతో మంది పేద పిల్లలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల జీవితాలనిచ్చిందని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభాకరరావు తెలిపారు.

### రసాయనశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్

**వినుకొండ, న్యూస్‌టుడే:** పట్టణంలోని గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడు వలపర్ల బాలయేసు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. సీఎస్ఐఆర్ ఫెలోషిప్‌తో ఆచార్యులు డి.శ్రీనివాసులు పర్యవేక్షణలో అల్జీమర్స్ వ్యాధిపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాలలో సోమవారం సత్కరించారు.

### విద్యతోనే అభివృద్ధి

**నూజండ్ల:** విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. నూజండ్ల మండల పరిషత్ కార్యాలయంలో అక్షరాంధ్ర ఉల్లాస్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చదువుకున్న కుటుంబాలే అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారని గమనించాలన్నారు. మండలంలో 3250 మందిని అక్షరాస్యులుగా మార్చాల్సి ఉందన్నారు. వాలంటీర్లు బాధ్యతగా పనిచేసి లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు.

# బడి పిల్లల ముస్తాబు

స్తూపం సెంటర్ (వినుకొండ), యడ్లపాడు, న్యూస్‌టుడే

విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యం పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని ఎస్టీ, ఎస్సీ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో 'ముస్తాబు' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా దీనిని అమలు చేస్తున్నారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలో ఓ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినుల మృతికి శాస్త్రీయ కారణాలను గుర్తించిన ఆ జిల్లా కలెక్టర్ పరిశుభ్రత పెంచడంతో పాటు విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టి మంచి ఫలితాలు రాబట్టారు. ఇది ప్రేరణగా అన్ని చోట్ల ఈ విధానం అమలుకు చర్యలు చేపట్టారు.

| జిల్లా వివరాలు.. |
|---|
| 1 నుంచి ఇంటర్ వరకు విద్యార్థుల సంఖ్య: 3.15లక్షలు |
| విద్యా సంస్థల సంఖ్య: 6674 |

| కేటగిరీ | గురుకులాల సంఖ్య | వసతి గృహాలు |
|---|---|---|
| ఎస్టీ | 13 | 12 |
| ఎస్సీ | 8 | 29 |

చేతులు శుభ్రం చేస్తున్న బాలికలు

### పరిశుభ్రతపై తనిఖీ

● ప్రతి తరగతికి ఇద్దరు విద్యార్థులను హౌస్ లీడర్లుగా నియమించి వసతి గృహం నుంచి తరగతికి వెళ్లే ముందు ప్రతి విద్యార్థి గోళ్లు కత్తిరించుకుని, ముఖం కడుక్కుని, తల దువ్వుకుని, శుభ్రమైన సమ వస్త్రాలు, బూట్లు ధరించేలా పర్యవేక్షించే ఏర్పాటు చేశారు. ఇవన్నీ పాటించిన వారిని తరగతి గదికి పంపిస్తారు. లేనివారిని అవి చేసిన తర్వాతనే అనుమతిస్తారు. ● ఉదయం ప్రార్థన, సూర్య నమస్కారాలు, ఇతర శారీరక వ్యాయామాలు తప్పనిసరిగా చేయాలి. ● సాయంత్రం అన్ని తరగతులకు చివరి గంట క్రీడలకు కేటాయించాలి. దీని ద్వారా శారీరక దృఢత్వం, టీం వర్క్, ఉత్సాహం పెరుగుతుంది. ● 'ముస్తాబు' కార్యక్రమంలో తరగతిలోని విద్యార్థులంతా పాల్గొనేలా హౌస్ మాస్టర్ చూడాలి. ప్రధానోపాధ్యాయులు ఆకస్మిక తనిఖీలు చేయాలి. ప్రతి శనివారం ఫొటోలు, వివరాలు జేఎన్‌బీ నివాస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

## అనుమానంతో భార్యపై హత్యాయత్నం

**చిలకలూరిపేట గ్రామీణ:** భార్య ప్రవర్తనపై అనుమానంతో భర్త హత్యాయత్నం చేసిన సంఘటన చిలకలూరిపేట మండలం వేలూరులో చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అల్లడి సాల్మన్ రాజు, భార్య పుష్ప కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. చాలా కాలం నుంచి భార్యపై అనుమానం పెంచుకున్న సాల్మన్‌రాజు ఆమెను హత్య చేయాలని ఉద్దేశంతో ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. నిద్రపోతున్న భార్య పుష్ప తలపై సోమవారం తెల్లవారుజామున రోకలిబండతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆమెకు ప్రాథమిక చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయాలైన వ్యక్తి మృతి

**చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే :** రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి మృతిచెందిన సంఘటన చిలకలూరిపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. ఈనెల 26న గణపవరానికి చెందిన షేక్ మస్తాన్‌వలి (52), మరో వ్యక్తి ద్విచక్రవాహనాలు చిలకలూరిపేట ఎన్నార్టీ కూడలిలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మస్తాన్‌వలి తలకు తీవ్ర గాయాలు కావడంతో తొలుత చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అతన్ని ఈనెల 28న గణపవరంలోని ఇంటికి తీసుకువచ్చారు. సోమవారం ఉదయం ఇంటి వద్ద మృతి చెందాడు. మృతుడి చిన్న కుమారుడు రబ్బాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## గొర్రెల కాపరి అదృశ్యంపై ఫిర్యాదు

**యడ్లపాడు, న్యూస్‌టుడే:** బాపట్ల జిల్లా మార్టూరు మండలం కోలలపూడికి చెందిన పాలపర్తి శ్రీరామమూర్తి గొర్రెలు మేపుతూ ఇటీవల యడ్లపాడు మండలం జగ్గాపురం వచ్చాడు. ఈనెల 11న తిమ్మాపురం శివారులో కనిపించకుండా పోయాడు. పరిసర ప్రాంతాల్లో గాలించడంతో పాటు బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల వద్ద విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

### దాడిపై కేసు

**మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే:** నరసరావుపేట పట్టణం శివుడి బొమ్మ సమీపంలో వాహనం అడ్డు తీసే విషయంలో వాగ్వాదం తలెత్తి పోట్లూరి శ్రీనివాసరావు అనే వ్యక్తిపై యువకులు నవీన్, అనిల్ దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.

### వివాహితపై అసభ్య ప్రవర్తన

**ఈపూరు, న్యూస్‌టుడే:** మండలంలోని ఓ గ్రామంలో వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనలో నిందితుడు ముద్దా తిరుపతిరావుపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వేణుగోపాల్ తెలిపారు. గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 27న మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

(c) eenadu

# సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

## ఉత్తమ సేవలకు గుర్తింపు

పురస్కారం అందుకుంటున్న వైద్యుడు భరత్‌కుమార్

**పిడుగురాళ్ల:** ఐఎంఏ పిడుగురాళ్ల బ్రాంచి అధ్యక్షుడు దూళిపాళ్ల భరత్‌కుమార్‌కు జాతీయ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ పురస్కారం అందజేసింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దిలీప్ బన్సాలి, కార్యదర్శి సర్వరిదత్ నుంచి పురస్కారం అందుకున్నారు. 2024-25లో పిడుగురాళ్ల బ్రాంచి అధ్యక్షుడిగా భరత్‌కుమార్ ఎక్కువ సభ్యులను అసోసియేషన్‌లో చేర్చడం, బ్రాంచి పరిపాలన విభాగాన్ని బలోపేతం చేయడం, పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం, వైద్యులకు అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహించడంతో గుర్తింపు పొందారు.

## రబీ పంటకు ఈకేవైసీ తప్పనిసరి

**వెల్దుర్తి, న్యూస్‌టుడే:** రబీ పంటను సాగు చేసే రైతులు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని ఏవో బాలాజీ గంగాధర్ అన్నారు. సోమవారం బోదిలవీడు, శిరిగిరిపాడు గ్రామాల్లో మొక్కజొన్న, కంది పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

## సామాజిక తనిఖీలకు సన్నద్ధం

**నకరికల్లు, న్యూస్‌టుడే:** మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులను తనిఖీ చేసేందుకు సామాజిక బృందాలు సోమవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఎం.బుక్కులు, మస్టర్లతోపాటు క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేయనున్నారు. జిల్లాలో అత్యధిక పని దినాలు నమోదైన మండలంగా నకరికల్లుకు పేరుంది. సామాజిక తనిఖీలు పక్కాగా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రికార్డులు సిద్ధం చేస్తున్న సిబ్బంది

## యార్డు అభివృద్ధికి కృషి

### నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

బాధ్యతలు చేపడుతున్న యార్డు ఛైర్మన్ బ్రహ్మయ్య

**దుర్గి, న్యూస్‌టుడే:** దుర్గి యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఛైర్మన్ లింగా బ్రహ్మయ్య తెలిపారు. సోమవారం యార్డు నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఛైర్మన్ బ్రహ్మయ్య, వైస్ ఛైర్మన్‌గా సత్యనారాయణతోపాటు మరో 12 మంది పాలకమండలి సభ్యులు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ రైతు పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు అని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ అన్నదాతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సభ్యుల సహకారంతో యార్డు అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. అంతకుముందు ఆయన జిల్లా అర్బన్ డెవలప్‌మెంటు ఛైర్మన్ మధుబాబు, పలువురు కూటమి నేతలతో కలిసి బస్టాండు కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి ప్రదర్శనగా యార్డుకు చేరుకున్నారు. నాయకులు జానకి రమణ, సాయిశంకర్, పుల్లయ్య, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## ఇటు బోధన.. అటు సాధన

### త్రోబాల్‌లో ఉపాధ్యాయినుల సత్తా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే:** ఒత్తిడి వదిలేలా.. బాల్యాన్ని గుర్తుకు తెచ్చేలా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయినులకు కూటమి ప్రభుత్వం తొలిసారిగా క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. గురువుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంది. పుస్తకాలకు కాస్తంత విరామమిచ్చి, తమకు ఇష్టమైన క్రీడలో సత్తెనపల్లి మండలంలోని ఉపాధ్యాయినులు రాణిస్తున్నారు. త్రోబాల్ పోటీల్లో ఏకంగా నలుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 16న గుడిపూడిలో జరిగిన డివిజన్‌స్థాయి పోటీలో బెల్లంకొండ, ముప్పాళ్ల, అమరావతి జట్లను ఓడించి సత్తెనపల్లి మండల జట్టు ప్రథమస్థానం సాధించింది. ఈనెల 22న నరసరావుపేటలో జిల్లాస్థాయి పోటీలోనూ ద్వితీయస్థానంలో నిలిచింది. వచ్చే నెల 3 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించేందుకు సాధన చేస్తున్నారు.

#### విద్యార్థి రోజులు గుర్తొచ్చాయ్

త్రోబాల్ పోటీల్లో పాల్గొనడంతో విద్యార్థి రోజులు గుర్తుకొచ్చాయి. ఎంతో ఆహ్లాదకర, ఉత్తేజ వాతావరణంలో పోటీల్లో పాల్గొన్నాం. తోటి ఉపాధ్యాయినులతో ఆరోగ్యకరంగా పోటీ పడ్డాం. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తాచాటి పల్నాడుకు వన్నె తెస్తాం. - విజయకమల, సత్తెనపల్లి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల

#### ప్రోత్సాహకాలు అందుకుంటాం

చక్కటి వాతావరణంలో ఇష్టమైన త్రోబాల్ పోటీలో రాణించాం. డివిజన్, జిల్లాస్థాయి పోటీలో విజయాలకు క్రీడా నైపుణ్యాలు దోహదం చేశాయి. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించడమే లక్ష్యం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందుకుంటాం. - అక్తరున్నీసా, సత్తెనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల

#### సమష్టితత్వంతోనే..

వేర్వేరు పాఠశాలల ఉపాధ్యాయినులు జట్టుగా విజయాలు సాధించేందుకు సమష్టి తత్వమే కారణం. వ్యాయామోపాధ్యాయులు కొన్ని మెలకువలు నేర్పించారు. ఇదే స్ఫూర్తిని విద్యార్థుల్లోనూ పెంపొందిస్తాం. - హిమబిందు, ఎంపీపీఎస్, దీపాలదిన్నెపాలెం

#### ఒత్తిడికి దూరం

గురువులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే ఆటలు కూడా ముఖ్యమే. ఒత్తిడిని దూరం చేయవచ్చు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇలాంటి పోటీలు తరచూ నిర్వహించాలి. రాష్ట్రస్థాయి పోటీలోనూ సత్తా చాటుతాం. - హాజారాబి, కంకణాలపల్లి

## నిధులు దుర్వినియోగమైతే సహించం

అర్జీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

**అమరావతి, న్యూస్‌టుడే:** గ్రామాభివృద్ధికి వినియోగించాల్సిన పంచాయతీ నిధులు దుర్వినియోగమైతే సహించేది లేదని, ఖర్చు చేసిన ప్రతి రూపాయికి లెక్కలు పక్కాగా ఉండాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. సోమవారం మల్లాది గ్రామంలో 'ప్రజల వద్దకే ప్రవీణ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరించారు. రైతులకు సంబంధించిన 150 ఎకరాలు 2019 నుంచి అసైన్డ్‌గా గుర్తించి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామ సచివాలయం, ఇతర ప్రభుత్వ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు తమ విధుల పట్ల నిబద్ధతతో ఉండి జవాబుదారీతనంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. సచివాలయానికి వచ్చే రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అక్రమంగా డబ్బు వసూలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు షేక్ జానీసైదా, తహసీల్దార్ డానియేలు, నాయకులు రాజా, వెంకటేశ్వరరావు, వెంకట్రామయ్య, వెంకయ్య, సదా, రామకృష్ణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ జిల్లా కార్యవర్గంలో చోటు

**పిడుగురాళ్ల:** యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎస్.కె.ఖాసింపీరాను ఎన్నుకొన్నారు. జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసరావు, రాష్ట్ర సౌహార్ద ప్రతినిధిగా షేక్ జమాల్, జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా కె.జ్యోతి అరుణాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

**దాచేపల్లి:** యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా వట్టెపు నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. వినుకొండలో నిర్వహించిన మహాసభల్లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో దాచేపల్లికి చెందిన నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మార్ఫింగ్ ఫొటోలతో వివాహితకు వేధింపులు

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే:** మార్ఫింగ్ ఫొటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుచేసి వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. కొత్తపేటకు చెందిన నరసింహారావుకు ఓ మహిళతో కొంతకాలంగా పరిచయం ఉంది. ఆ మహిళను అతడు వేధిస్తూ వస్తున్నాడు. ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి ఇటీవలే ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

## ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

పులిపాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయం

**గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే:** ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని మండలంలోని పులిపాడు వేంకటేశ్వరస్వామి, చర్లగుడిపాడులోని వేణుగోపాలస్వామి, జంగమహేశ్వరపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

**అచ్చంపేట:** స్థానిక సీతారామస్వామి ఆలయం ముక్కోటి ఏకాదశికి ముస్తాబైంది. ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం స్వామికి కొఠాయి సేవ, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

## ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

సత్తెనపల్లిలో క్యాలెండర్ ఆవిష్కరించిన నాయకులు, ఉపాధ్యాయులు

**సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే:** ఎస్టీయూ సత్తెనపల్లి మండలశాఖ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం వద్ద నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు. ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**అచ్చంపేట:** ఎస్టీయూ డైరీ, క్యాలెండర్, స్టిక్కర్లను ఎంఈవోలు ప్రసాదరావు, గణేష్ సోమవారం అచ్చంపేటలో ఆవిష్కరించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు గంధం గంగయ్య, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి ఆంజనేయులునాయక్, సాంబశివరావు, అజీజ్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## నమో వేంకటేశాయ

వడ్డవల్లిలో శ్రీవారికి అలంకరణ

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే:** పట్టణంలోని వడ్డవల్లి, రైల్వేస్టేషన్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని విశేషంగా అలంకరించారు. నమో వేంకటేశాయ, శ్రీమన్నారాయణ అంటూ భక్తుల నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

## పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

**అచ్చంపేట, న్యూస్‌టుడే:** నీలేశ్వరపాలెం ప్రాథమిక పాఠశాలకు స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.10 వేల విలువైన మైక్‌సెట్‌ను బహూకరించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోలు ప్రసాదరావు, గణేష్ ద్వారా ఉపాధ్యాయులకు అందజేశారు. స్నేహహస్తాలు ప్రతినిధి తుమ్మా శౌర్‌రెడ్డి సమన్వయకర్త కరిముల్లాబాబు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా భూసర్వే

వెల్దుర్తిలో మాట్లాడుతున్న తహసీల్దారు రాజశేఖర్‌నాయక్

**రెంటచింతల, న్యూస్‌టుడే:** మండలంలో మూడు గ్రామాల్లో రీసర్వే పనులు చేపట్టనున్నట్లు తహసీల్దార్ మేరి కనకం తెలిపారు. రెంటచింతల, పాలువాయి, గోలి గ్రామాల్లో అధికారులు ప్రజాప్రతినిధులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు.

**కొమెరపూడి(సత్తెనపల్లి గ్రామీణ):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వే పారదర్శకంగా జరుగుతుందని తహసీల్దారు చక్రవర్తి అన్నారు. కొమెరపూడిలో వచ్చే నెల 2న రీసర్వే ప్రారంభమవుతుంది. ఈ మేరకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలకు రీసర్వేపై సోమవారం అవగాహన కల్పించారు. తొలుత వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.

**వెల్దుర్తి:** నాలుగో విడత రీసర్వే వెల్దుర్తి, పట్లవీడు గ్రామాల్లో చేపట్టనున్నామని తహసీల్దారు రాజశేఖర్‌నాయక్ అన్నారు. సోమవారం వెల్దుర్తిలో గ్రామసభ నిర్వహించారు.

## రైల్వేస్టేషన్లలో మౌలిక వసతులు కల్పించరూ..

**పిడుగురాళ్ల, న్యూస్‌టుడే:** జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ, శావల్యాపురం, సత్తెనపల్లి, పెదకూరపాడు రైల్వేస్టేషన్‌ల్లో మౌలిక వసతులు కల్పించాలని దక్షిణమధ్య రైల్వే బోర్డు సభ్యురాలు కొంకా రాధ కోరారు. సోమవారం గుంటూరులోని దక్షిణ మధ్య రైల్వే డివిజన్ కార్యాలయంలో డివిజనల్ రైల్వే మేనేజరు సుదేశ్న, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఇతర అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయా స్టేషన్లలో జరుగుతున్న పనులు వేగవంతం చేయించాలని కోరారు.

## ఉపాధి పథకాన్ని కొనసాగించాలి

**మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు తహసీల్దారు కార్యాలయాల్లో సోమవారం వినతిపత్రాలు అందజేశారు. నాయకులు కోటేశ్వరరావు, రాజారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ బాధ్యుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధి పథకాన్ని కాపాడుకునేందుకు ఉద్యమాలు చేయనున్నామన్నారు.

## బ్యాంకుల సేవలపై అవగాహన

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే:** బ్యాంకుల సేవలపై విద్యార్థి దశలోనే అవగాహన పెంపొందించాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సాంబశివరావు అన్నారు. పట్టణంలోని రాఘవేంద్ర బాలకుటీర్ విద్యార్థులు క్షేత్రదర్శిని కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎస్‌బీఐని సందర్శించారు. బ్యాంకులో సేవలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

**దుర్గి, న్యూస్‌టుడే:** దుర్గి తహసీల్దార్‌గా డీవీబీ వరకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కరుణకుమార్ బదిలీపై గుంటూరు జిల్లాకు వెళ్లారు. పల్నాడు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న వరకుమార్‌ను నియమించారు. ఆయనను కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

## గౌట్‌కు ఆయుర్వేద చికిత్స

- న్యూస్‌టుడే, సత్తెనపల్లి, రెంటచింతల

శీతాకాలంలో చాలామందికి కాలు పెద్ద వేళ్ల వద్ద నొప్పిగా ఉంటుంది. సాధారణ నొప్పి అని నిర్లక్ష్యం చేస్తుంటారు. జాయింట్లను దెబ్బతీసే గౌట్ (వాతరక్తం లేదా వాత రక్త వికారం) వ్యాధి క్రమంగా పెద్దదై కీలక అవయవాలను దెబ్బతీస్తుందని ప్రభుత్వ సీనియర్ ఆయుర్వేద వైద్యుడు ఆర్.శ్రీనివాస్ చెప్పారు. ఆయుష్ డిస్పెన్సరిలకు వస్తున్న వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుందన్నారు. గౌట్ ఎందుకు వస్తుంది, లక్షణాలేంటి, చికిత్స ఎలా.. శీతాకాలంలో ప్రబలే వ్యాధుల బారినపడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో 'న్యూస్‌టుడే'కు ఆయన వివరించారు.

★ శరీరంలో యూరిక్ యాసిడ్ అధికంగా పేరుకుపోవడంతో గౌట్ వ్యాధి వస్తుంది. పెద్దవేలు జాయింట్ వద్ద, చిప్పల జాయింట్లు, మోకాళ్లు, మణికట్టు వంటి ఇతర జాయింట్లలో నొప్పి రావడం, ఉబ్బిన.. ఎర్రగా మారిన జాయింట్లు, తాకినా నొప్పిగా ఉండటం, వాపు ఉన్నచోట తీవ్ర వేడిగా ఉండటం, జ్వరంలా అనిపించడం దీని లక్షణాలు.



శ్రీనివాస్, వైద్యుడు

★ ఆయుర్వేదంలో కైసోరా గుగ్గులు, పునర్నవాది గుగ్గులు, గుడుచి, త్రిఫల, చంద్ర ప్రభావతి, దశమూలరెస్ట మాత్రలను మింగడం, గోక్షుర మాత్ర పౌడర్‌ను వాడటంతో వ్యాధి నుంచి బయటపడవచ్చు. గృహ వైద్యంగా వెల్లుల్లి రోజుకు రెండు నుంచి మూడు రెబ్బలు మింగడం, అల్లం టీ ఒకసారి తాగడం, చిన్న అల్లం ముక్కను ఉడకబెట్టి తేనెతో తీసుకోవడం, పుదీనా పానీయం తాగడం, మజ్జిగ, కరివేపాకు టీ, నీరు తాగడంతో యూరిక్ యాసిడ్‌ను నియంత్రణలోకి తీసుకురావచ్చు. ఉదయం లేచిన వెంటనే లేత గోధుమ గంజి తాగాలి. కనీసం అయిదు నిమిషాలు నడవాలి. మహా నారాయణ తైలం గోరువెచ్చని నీటితో కలిసి మసాజ్ చేయాలి.

### జాగ్రత్తలతో చలి నుంచి రక్ష

★ చలికాలంలో జలుబు, దగ్గు, గొంతునొప్పి, చర్మం పొడిబారడం వంటివి సాధారణంగా ఉంటాయి. వీటిని నివారించడానికి వెచ్చని ఆహారం (అల్లం, పుసుపు, మిరియాలు), ఆయుర్వేద నూనెలతో మసాజ్ (అభ్యంగం), అశ్వగంధ, తులసి వంటి మూలికలు కలిపిన గోరువెచ్చని నీరు తాగడం ఎంతో ముఖ్యం. శరీరాన్ని వెచ్చగా ఉంచే దుస్తులు ధరించాలి. వేడి పదార్థాలు, నెయ్యి, నువ్వుల నూనె, కొబ్బరి నూనె వంటివి తీసుకోవాలి. బార్లీ, గోధుమలతో చేసిన ఆహారం తీసుకోవడం మంచిది. చర్మాన్ని తేమగా ఉంచడానికి వెచ్చని నూనెలతో మసాజ్ చేసుకోవాలి.

## సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయండి

అమరావతిలో ద్విచక్ర వాహన ర్యాలీ

**మాచర్ల (కారంపూడి):** ఈ నెల 31 నుంచి విశాఖలో నిర్వహిస్తున్న సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని సోమవారం మాచర్ల శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. **అమరావతి:** అమరావతిలో సీఐటీయూ నాయకులు ర్యాలీ నిర్వహించారు. మహాసభలను జయప్రదం చేయాలని సూరిబాబు, రాంబాబు, శ్రీను, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్ కోరారు. **పిడుగురాళ్ల:** పట్టణంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు. శ్రీనివాసరావు, బాబు, పుల్లయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## • మూతలు లేక.. నీరు వృథా

కృష్ణానది మంచినీటి పథకంలో భాగంగా మాచవరంలో ఏర్పాటు చేసిన కుళాయిలకు మూతలు లేక నీరు వృథాగా పోతోంది. పంచాయతీ, తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది పట్టించుకోవడం లేదు. మాచవరం గ్రామ సచివాలయం ఎదుట కుళాయికి మూతలు లేక, ఆర్‌అండ్‌బీ రహదారిపైకి నీరు చేరుతోంది. స్థానికులు కర్ర పుల్లలు అడ్డుపెడుతున్నా, ఆగడం లేదు. - న్యూస్‌టుడే, మాచవరం

## ఆసుపత్రిలో ప్రైవేటు వ్యక్తుల హవా

**గురజాల, న్యూస్‌టుడే:** గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేటు వ్యక్తుల హవాపై చర్యలు తీసుకోవాలని ఎస్సీకాలనీ వాసులు కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు లిఖిత పూర్వక వినతి పత్రం అందజేశారు. ఈనెల 26వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఆసుపత్రికి వెళ్లిన సువార్తకు సరైన వైద్యం అందించకపోగా, ప్రశ్నించిన ఆమె భర్త ఎలిషాపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. డ్యూటీ డాక్టరు అందుబాటులో లేకపోగా.. ఆయన స్థానంలో ప్రైవేటు వ్యక్తులు ఉన్నారన్నారు. అందుబాటులో లేని వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

**మాచర్ల (కారంపూడి):** మాచర్ల పట్టణంలో 13 లేఅవుట్లు, 1100 భవనాలు అనధికారికంగా నిర్మాణాలు చేశారని, ఈ నెల 31లోపు క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు సూచించారు. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ పథకాలను అమలు చేస్తోందన్నారు. గడువు ముగిసిన తర్వాత అనధికారిక నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తెలుగు యువత నాయకుడి మృతికి సంతాపం

**క్రోసూరు(అచ్చంపేట):** మండల తెలుగు యువత నాయకుడు క్రోసూరుకు చెందిన మాగంటి శ్రీనివాసరావు(25) మృతి పట్ల ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను చరవాణి ద్వారా పరామర్శించారు.

## మాజీ కౌన్సిలర్ మృతి

**మాచర్ల (కారంపూడి):** మాచర్లకు చెందిన మాజీ కౌన్సిలర్ లెనిన్‌బాబు (53) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలియజేశారు.

## రోటరీ క్లబ్‌తో పేదలకు సేవ

మాట్లాడుతున్న మురళి

**విజయపురిసౌత్, న్యూస్‌టుడే:** రోటరీ క్లబ్ ద్వారా పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జె.మురళి తెలిపారు. సోమవారం విజయపురిసౌత్‌లో రోటరీక్లబ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పేదలకు కుట్టు మిషన్లు, కంటి వైద్య పరీక్షలు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ క్లబ్ ప్రెసిడెంట్ జ్ఞానమనోహర్, సెక్రటరీ గంజి వెంకటేశ్వర్లు, ట్రెజరర్ హరనాథ్‌బాబా, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పశువుల వాహనం పట్టివేత

**కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే:** అనుమతి లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై గోపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పాటిబండ్ల గ్రామానికి చెందిన నాగమల్లేశ్వరరావు సూర్యాపేట సంతలో ఏడు పశువులు(దున్నలు) కొనుగోలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పాటిబండ్లకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## క్విజ్‌లో ప్రతిభ చాటి.. బహుమతులు పట్టి

విద్యాకేంద్రం జూనియర్ కళాశాలలో విజేతలు

కృష్ణవేణి జూనియర్ కళాశాలలో..

మాచర్లలో విజేతలతో ఉపాధ్యాయులు

బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ మౌనిక

బ్రాహ్మణపల్లి జడ్పీ పాఠశాలలో..

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే:** వర్తమాన, సామాజిక అంశాలపై స్పృహతో వారు క్విజ్ పోటీలో ప్రతిభ కనబర్చారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యాకేంద్రం జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఎస్‌కే మహబూబ్ సుభాని, పి.రవి, పి.రోజ్‌మేరి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రోత్సాహక బహుమతులను ప్రిన్సిపల్ ఎస్‌కే మౌలాలి అందజేశారు. అలాగే కృష్ణవేణి జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఎస్‌కే అఫ్తరున్నీసా, సయ్యద్ కరిష్మా, సీహెచ్ హిమబిందు విజేతలుగా నిలిచి, ప్రిన్సిపల్ గంటా శ్రీనివాసరావు నుంచి ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు.

**పిడుగురాళ్ల:** 'ఈనాడు' ఆధ్వర్యంలో వర్తమాన వ్యవహారాలపై క్విజ్ పోటీలు జరిపారు. వికాస్ పాఠశాలలో బి.మణికంఠ, ఎం.దేవరాజు, వి.వసంతి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ మౌనిక బహుమతులు అందజేశారు. బ్రాహ్మణపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్.అభినవ వాసుదేవరెడ్డి, టి.తరుణ్‌శ్రీనాథ్, టి.విష్ణు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు జి.సైదారెడ్డి పంపిణీ చేశారు.

**మాచర్ల (కారంపూడి):** మాచర్లలోని బాలికోన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ప్రణతి, దివ్యశ్రీ, వెంకటరమణ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మల్లికార్జునరావు, నాగరాజు, అయేషా సుల్తానా, స్వరూప బహుమతులను ప్రదానం చేశారు.

## నిత్యం మురుగుతో తంటా

**మం**డలంలోని పిచ్చయ్యబావి తండాలోని ప్రధాన వీధిలో మురుగు కాలువల్లో పూడిక నిండి నీరు రోడ్లపైకి చేరుతోంది. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తండావాసులు వాపోతున్నారు. మురుగు ఇళ్ల ముందు నిల్వ ఉండటంతో దోమలకు ఆవాసంగా మారి వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వెల్దుర్తి

## ఎక్కడి చెత్త అక్కడే

**ప్ర**ముఖ ఆధ్యాత్మిక కేంద్రం అమరావతిలో పారిశుద్ధ్యం లోపించింది. ఎక్కడ చూసినా రోడ్డుపైనే వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. దుర్గావిలాస్ వెనుక ముస్లిం కాలనీలో మరీ అధ్వానంగా ఉంది. చెత్త కారణంగా కుక్కలు, పందుల బెడద పెరిగిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. - న్యూస్‌టుడే, అమరావతి

## సమస్యల పరిష్కారానికి నిధులివ్వాలి

సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ప్రవీణ్

**పెదకూరపాడు, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా గత 25 రోజులుగా పెదకూరపాడు నియోజకవర్గంలో 100 రోజులు 100 గ్రామాల పేరుతో ఎమ్మెల్యే ప్రవీణ్ చేపడుతున్న కార్యక్రమం ఆదర్శనీయమని సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం రాత్రి ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కార్యక్రమం జరుగుతున్న తీరు, సమస్యలపై వస్తున్న అర్జీల గురించి సీఎంకు వివరించారు. ఏళ్లుగా కొన్ని సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. నిధుల కేటాయింపునకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

## పార్టీని బలోపేతం చేద్దాం

ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి పూలబొకే ఇస్తున్న నాయకులు

**విజయపురిసౌత్:** నూతనంగా పదవులు చేపట్టిన నాయకులు తెదేపా బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. మాచర్ల మండలం రేగులవరం తండా గ్రామానికి చెందిన జబ్బార్‌నాయక్ తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనతోపాటు గిరిజన నేతలు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రంనాయక్, మాచర్ల మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుండలనాయక్ పాల్గొన్నారు.

(c) eenadu

# వస్తోంది.. లీగల్ క్లినిక్

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ప్రారంభించిన రెవెన్యూ క్లినిక్‌లకు మన్యం జిల్లాలోనే తొలుత శ్రీకారం చుట్టిన విషయం విదితమే. వీటికి అనుబంధంగా జిల్లాలో త్వరలో 'లీగల్ క్లినిక్'ను ఏర్పాటు చేసే దిశగా అడుగులు ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు పరిష్కరించలేని భూ వివాదాల విషయంలో న్యాయ సహాయాన్ని అందించేందుకు ఇవి దోహదపడతాయి. ఈ విషయాన్ని సోమవారం కలెక్టరు ప్రభాకరరెడ్డి పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో అధికారులతో పంచుకున్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం

కలెక్టరు ప్రభాకరరెడ్డిని జ్ఞాపికతో సత్కరిస్తున్న జేసీ, పీవో, డీడీ తదితరులు

## ఇదీ అవసరం

★ భూ సంబంధమైన సమస్యలను పరిశీలించినప్పుడు కనీసం 40 శాతం ఎటూ తేల్చలేక న్యాయస్థానాల్లో పరిష్కారం పొందాలని సూచించి ముగిస్తున్నారు.

★ న్యాయ స్థానానికి వెళ్లే అవకాశం కానీ, దిశా నిర్దేశం చేసే వారు కానీ అందుబాటులో లేక.. ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఫలితంగా న్యాయాన్ని పొందలేకపోతున్నారు.

★ ఈ విషయాన్ని ఇటీవల తన సర్వేలో పార్వతీపురం వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ దృష్టికి కలెక్టరు తీసుకెళ్లారు.

## ప్రీ-లోక్ అదాలత్

త్వరలోనే ప్రీ-లోక్ అదాలత్ (సివిల్ కోర్టు) ప్రారంభం కానుందని కలెక్టరు వెల్లడించారు. రాష్ట్రంలో ఇది ఒక వినూత్న కార్యక్రమంగా నిలుస్తుందన్నారు. సివిల్ వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకునేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. జనవరి 11, 12వ తేదీల్లో ఈ వ్యవస్థను ప్రారంభించే అవకాశం ఉందన్నారు.

★ న్యాయ సంబంధమైన సహాయాన్ని అందించడానికి వీలుగా 'లీగల్ క్లినిక్'ను రెవెన్యూ క్లినిక్ అనుబంధంగా నిర్వహించేలా న్యాయవాదులు ముందుకు వచ్చారు. ప్రతివారం వచ్చిన కేసుల్లో న్యాయస్థానం జోక్యం అవసరమైన కేసులను న్యాయవాది సాయంతో పరిష్కారం పొందేందుకు వీలుకలుగుతుందని భావిస్తున్నారు.

## అధికారులకు సత్కారం

రెవెన్యూ క్లినిక్‌ను విజయవంతంగా అంకితభావంతో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అమలు చేశారని కలెక్టరు అభినందించి, సత్కరించారు. సబ్‌కలెక్టర్లు వైశాలి, పవార్ స్వప్నిల్, డీఆర్వో హేమలత, తహసీల్దార్లు అందరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం వల్లే రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందామన్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు గుర్తింపు తెచ్చిన కలెక్టరును పీవోలు, డీడీ విజయశాంతి, గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏటీడబ్ల్యూవోలు సత్కరించారు. బొబ్బిలి వీణను బహూకరించారు.

## ఎస్సైలకు బదిలీ, నియామకాలు

పార్వతీపురం పట్టణం: జిల్లాలో 10 మంది ఎస్సైలకు బదిలీ, నియామకాలు జరిగినట్లు ఎస్పీ మాధవరెడ్డి సోమవారం తెలిపారు. శిక్షణ ఎస్సైలు ఎం. హేమలత, ఎల్. అర్జున్‌లకు సీతానగరం, పాచిపెంట స్టేషన్లకు నియమించారు. ఎం. రాజేష్‌ను సీతానగరం నుంచి పార్వతీపురం రూరల్‌కు, పి. దినకర్‌ను రూరల్ నుంచి డీఎస్‌బీ పార్వతీపురానికి బదిలీ చేశారు. ఎం. జగదీశ్‌నాయుడు వీఆర్ టౌన్ పీఎస్ నుంచి కొమరాడ, కె. నీలకంఠం కొమరాడ నుంచి పార్వతీపురం వీర్‌కు, కె. ప్రయోగమూర్తిని పాలకొండ నుంచి టౌన్‌కు, డి. వెంకన్నను పార్వతీపురం వీఆర్ నుంచి పాలకొండ, షణ్ముఖరావు వీఆర్ పార్వతీపురం నుంచి వీరఘట్టం, అక్కడ పనిచేస్తున్న కళాధర్‌ను వీఆర్ పార్వతీపురానికి బదిలీ చేశారు.

## పాడి పరిశ్రమతోనే సుస్థిర ఆదాయం

పార్వతీపురం, న్యూస్‌టుడే: వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో కూడా రైతులు సుస్థిర ఆదాయాన్ని పొందే రంగంగా పాడిపరిశ్రమ నిలుస్తుందని, రైతులు అంతా పశుపోషణ, పాడి అభివృద్ధి దిశగా చైతన్యవంతం కావాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి అన్నారు. సోమవారం పార్వతీపురంలోని ఓ వేడుక మందిరంలో జరిగిన పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, ఉపాధి హామీ శాఖలతో ఏకీకృత సమావేశంలో మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పశుపోషణ, పాడి పరిశ్రమపై అవగాహన కల్పించేలా కార్యాచరణను అమలుచేస్తే, భవిష్యత్తులో మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉపాధి హామీ పథకంలో 'గోశాలలు' అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవడానికి రైతు సంఘాలుగా ఏర్పడి ముందుకు రావాలన్నారు. గడ్డి ఉత్పత్తి, వ్యవసాయ వ్యర్థాలతో ఎరువుల తయారీ తదితర పరిశ్రమలను ప్రోత్సహించాలని చెప్పారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జేడీ మన్మథరావు, డ్వామా పీడీ రామచంద్రరావు, ఉద్యాన, వ్యవసాయ, మత్స్య శాఖల అధికారులు సత్యనారాయణరెడ్డి, అన్నపూర్ణ, సంతోష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టరు, జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఏహెచ్‌వో మన్మథరావు

## దుమ్ము రేగుతోంది.. దడ పుట్టిస్తోంది!

సీతానగరం మండల కేంద్రంలో సువర్ణముఖి నదిపై నూతన వంతెన నిర్మాణంలో భాగంగా చినభోగిల వైపు ఏర్పాటు చేసిన అనుసంధాన రహదారితో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. 36వ రాష్ట్ర రహదారిలోని కొంతభాగాన్ని కొత్తరోడ్డుకు అనుసంధానం చేయడానికి పనులు చేపట్టారు. కొన్ని రోజులుగా దీన్ని తడపక పోవడంతో వాహనాల వేగానికి దుమ్ము, ధూళి రేగుతోంది. త్వరలో తారు రోడ్డు పనులు చేపట్టాల్సి ఉన్నందున తడపడం లేదని ర.భ.శాఖ డీఈఈ అప్పాజీ తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

అమ్మవారి ఘటాన్ని తీసుకొస్తున్న పూజారి కుటుంబీకులు

## జాతరకు శ్రీకారం..

చదురుగుడికి చేరుకున్న పెదపోలమాంబ

మక్కువ, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ జాతరకు శ్రీకారం చుట్టారు. సోమవారం సాయంత్రం గ్రామంలోని నడిమి వీధిలో అమ్మవారి ఘటాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఆహ్వానం పలికారు. పూజారి కుటుంబీకుల పూజల అనంతరం మేళతాళాలతో చదురుగుడికి తీసుకొచ్చారు. మహిళలు పసుపు, కుంకుమ సమర్పించి పూజలు చేశారు.

### పెద పోలమాంబది తొలి వేడుక..

ఏటా శంబర పోలమాంబ జాతరకు ముందు ఆమె మేనత్త అయిన పెద పోలమాంబకు పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో పెద్దమ్మ వారిని గ్రామానికి తీసుకొచ్చి వారంరోజుల పాటు పూజలు నిర్వహిస్తారు. జనవరి 5న తొలేళ్లు, 6న ప్రధాన ఉత్సవం, 7న అంపకోత్సవం చేపడతారు. జనవరి 12న పోలమాంబను గ్రామానికి తీసుకొస్తారు. రెండు వారాల పాటు పూజలుంటాయి. జనవరి 26న తొలేళ్లు, 27న సిరిమానోత్సవం, 28న అంపకోత్సవం ఉంటుంది. ట్రస్టుబోర్డ్ ఛైర్మన్ నైదాన తిరుపతిరావు, ఈవో శ్రీనివాస్, ఎంపీటీసీ టి.పోలినాయుడు, ఉప సర్పంచి అల్లు వెంకటరమణ, పూజారి కుటుంబీకులు, భక్తులు పాల్గొన్నారు.

## బాధితులకు ఆర్థిక సాయం

పార్వతీపురం, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనాల కారణంగా ప్రమాదానికి గురై మృతి చెందిన, గాయపడిన బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక సాయాన్ని సోమవారం కలెక్టరు ప్రభాకరరెడ్డి చేతులు మీదుగా అందజేశారు. జిల్లాలో 10 హిట్ అండ్ రన్ కేసులు నమోదు కాగా, తొమ్మిది మందికి కేంద్రం అందించే పరిహారాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. మృతిచెందిన నలుగురు కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున రూ.8 లక్షలు, ఆరుగురు క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున జమ చేస్తున్నట్లు కలెక్టరు తెలిపారు.

# కాసులున్నా.. పారేది కన్నీరే..?

జిల్లాలో జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ(జైకా) ఆర్థిక సాయంతో సాగునీటి వనరుల ఆధునికీకరణ పనులు అయిదేళ్లుగా నానుతున్నాయి. దీంతో రూ. వందల కోట్లు అందుబాటులో ఉన్నా.. పనుల్లో కదలిక లేదు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో బిల్లుల చెల్లింపు కాలేదు. ఏళ్లు గడిచిపోవడంతో సామగ్రి ధర పెరిగి అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఆ నిధులతో పనులు చేయాలంటే నష్టపోతామని గుత్తేదారు ముందుకు రావడం లేదు. మన్యంలో నాలుగు మధ్యతరహా సాగునీటి పథకాలు నాలుగు రకాలుగా నలుగుతున్నాయి. వీటి భవిత ఏమిటో, రైతన్నకు సాగునీరు అందేదెన్నడో తెలియని దుస్థితి. – న్యూస్‌టుడే, పార్వతీపురం

జైకా బిల్లులు లేక గుత్తేదారుల వెనకడుగు

### చెల్లింపులే లేవు...

పెద్దగెడ్డ జలాశయం ఆధునికీకరణ పనులు 2020-21లో రూ. 28.18 కోట్లతో చేపట్టారు. 10 శాతం పనులు చేసి ఆపేశారు. గుత్తేదారుకు బిల్లులు చెల్లించలేదు. నిధులిస్తే పనులు పునఃప్రారంభం అయ్యే అవకాశం ఉంది. రూ. 1.12 కోట్ల బకాయి ఇంకా అపరిష్కృతంగా ఉంది.

### వెంగళరాయ ఒడ్డుకు చేరినట్లేనా?

మక్కువ, సీతానగరం, బొబ్బిలి మండలాలకు సాగునీరు అందించే వెంగళరాయసాగర్ జలాశయం ఆధునికీకరణ పనులను రూ. 63.50 కోట్లతో ప్రారంభించారు. 22 శాతం పూర్తిచేశారు. గుత్తేదారుకు చెల్లించాల్సిన రూ. 8.24 కోట్ల బకాయి ఇటీవలే ఇచ్చారు. పనులు మాత్రం ఇంకా పునః ప్రారంభించలేదు.

అసంపూర్తిగా పెద్దగెడ్డ కాలువ లైనింగు పనులు

### కమీషన్లే కారణమా?

కూటమి వచ్చిన తర్వాత రూ. 50 లక్షల లోపు బిల్లులను చెల్లించింది. ఆపై మొత్తానికి సంబంధించి అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేసినా.. రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోంది. దగ్గరుండి ఎంతో కొంత పనులు చేయించామంటూ నాయకులు గుత్తేదారు నుంచి కమీషన్ ఆశిస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల మధ్య బిల్లులు రానట్లు ఆరోపణలున్నాయి.

### ఒట్టిగెడ్డ బిల్లు ఇవ్వనేలేదు

జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు సాగునీరు అందించే ఒట్టిగెడ్డ జలాశయ పథకానికి రూ. 44.85 కోట్లు మంజూరయ్యాయి. 15 శాతం పనులు చేశారు. బిల్లులు ఇంకా సమర్పణ దశలోనే ఉన్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే తప్పా చెల్లింపులు జరుగుతాయా? లేదా? అనేది ప్రశ్నార్థకమే. రూ. 50 లక్షల బిల్లుల అప్‌లోడ్ ప్రక్రియలో అధికారులు తాత్సారం చేస్తున్నారు.

### పెదంకలాం ఎప్పుడో..

పెదంకలాం ఆనకట్ట ఆధునికీకరణకు రూ. 17.30 కోట్లు కేటాయించారు. కేవలం అయిదు శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. తక్కువ మొత్తం కావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 50 లక్షల లోపు బిల్లు కావడంతో గుత్తేదారుకు చెల్లించింది. కానీ అయిదేళ్ల క్రితం నాటి అంచనాలతో ఇప్పుడు పనులు చేయలేమని గుత్తేదారు అంటున్నారు.

### గుత్తేదారులను కోరుతున్నాం

పనులు చేపట్టాలని గుత్తేదారులను కోరుతున్నాం. పనులు పూర్తిచేయడానికి ఇది అనువైన కాలం. చెల్లింపులు కూడా జరుగుతున్నాయి. – ప్రదీప్, ఈఈ

## స్వేచ్ఛగా విన్నవించుకునేందుకే పీజీఆర్ఎస్

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: బాధితులకు తమ సమస్యలను స్వేచ్ఛగా విన్నవించుకునే అవకాశం కల్పించడమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రధాన లక్ష్యమని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వినతులు స్వీకరించారు. సాలూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నకిలీ గిరిజన సలహాదారుగా చలామణి అవుతున్నారని, నియోజకవర్గంలో గిరిజన రైతులు, రాజకీయ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని, అసాంఘిక కార్యక్రమాలను పురిగొల్పుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సాలూరు మండలం కుడుమూరు రెవెన్యూ పరిధిలోని పొలంవలసకు చెందిన వ్యక్తులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన భర్త అయిదారు నెలల క్రితం మృతిచెందారని, అతని మరణంపై తనకు అనుమానాలున్నాయని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. వీటితోపాటు భూ తగాదాలు, కుటుంబ కలహాలు, భార్యాభర్తల గొడవలు తదితర వాటిపై ఫిర్యాదులొచ్చాయి. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారితో ఫోనులో మాట్లాడి వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టి.. చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీఆర్బీ ఎస్సై రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఎస్పీ మాధవరెడ్డి

# ఈ పాజిటివ్ ప్రాణాంతకం!

న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

400... హెచ్ఐవీ బారినపడి పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి నెలా చికిత్సకు వస్తున్న రోగుల సంఖ్య. ప్రజలు అప్రమత్తం కావాల్సిన పరిస్థితిని ఈ సంఖ్య సూచిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు వరకు ఆసుపత్రి పరిధి ప్రాంతాల్లో 14 హెచ్ఐవీ పాజిటివ్ కేసులు నమోదుకావడం ఆందోళనకు గురిచేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో 3,864 మందికి హెచ్ఐవీ పరీక్షలు చేయగా.. 28 మందికి పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ య్యింది. 2023-24లో ఆ సంఖ్య 30.

హెచ్ఐవీ కేసులతో ఆందోళన

### గర్భిణులనూ వీడని మహమ్మారి

2024-25లో 1,936 మంది గర్భిణులను పరీక్షించగా.. ఒకరికి, 2023-24లో 1,774 మందికి నిర్వహించగా నలుగురికి హెచ్ఐవీ ఉన్నట్లు గుర్తించారు.

### ఈ ఏడాది ఇలా

| నెల | పరీక్షలు | పాజిటివ్ కేసులు |
|---|---|---|
| ఏప్రిల్ | 394 | 2 |
| మే | 407 | 3 |
| జూన్ | 354 | 3 |
| జులై | 331 | 1 |
| ఆగస్టు | 300 | 1 |
| సెప్టెంబర్ | 320 | 2 |
| అక్టోబర్ | 420 | 0 |
| నవంబర్ | 427 | 2 |

### జాగ్రత్తలు తీసుకుందాం

★ వివాహిత గర్భం దాల్చిన వెంటనే హెచ్ఐవీ పరీక్షలు చేయించాలి.
★ సురక్షితమైన లైంగిక చర్య
★ ఒకరికి వాడిన సూది, సిరంజిలు వేరొకరికి ఉపయోగించకూడదు.
★ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడం
★ నమోదిత రక్తనిధి కేంద్రాల నుంచి మాత్రమే సురక్షితమైన రక్తం పొందడం

### ఇలా వ్యాప్తి ఇలా..

★ తల్లి నుంచి శిశువుకు ★ సురక్షితం కాని లైంగిక చర్య ★ కలుషిత సూదులు, సిరంజిలు ★ కలుషిత రక్తమార్పిడి

### కౌన్సెలింగ్ ఇస్తున్నాం..

ఆసుపత్రికి వస్తున్న ప్రత్యేక రోగులు, గర్భిణులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వ్యాధిబారిన పడిన వారికి చికిత్స అందిస్తున్నాం. ప్రతి నెలా 400 మంది రోగులకు ఆసుపత్రిలో మందులు ఇస్తున్నాం. అందరూ అవగాహనతో ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. – శ్రీహరినాయుడు, ఐసీటీసీ కౌన్సెలర్, కె.చిరంజీవి (సూపరింటెండెంట్), ప్రాంతీయాసుపత్రి

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

పార్వతీపురం, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పర్వదినం నేపథ్యంలో మంగళవారం జిల్లాలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో భక్తులకు సులభంగా దైవదర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఇన్‌ఛార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను సోమవారం ఆదేశించారు. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, వారిని నియంత్రించేలా క్యూలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇబ్బందులు లేకుండా తాగునీరు, వైద్యసేవలు అందుబాటులో ఉంచాలన్నారు. దేవాదాయశాఖ, రెవెన్యూ, పురపాలక, పోలీసు శాఖలు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

రైతేరాజు 6లో

## ఎస్సీవీటీ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

సాలూరు, న్యూస్‌టుడే: ప్రైవేటుగా దరఖాస్తు చేసుకునేవారు, 2019లో ఎస్సీవీటీ పాస్ అయిన ఐటీఐ అభ్యర్థులు ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్ష రాసేందుకు అర్హులని జిల్లా ప్రభుత్వ ఐటీఐల ఇన్‌ఛార్జి కన్వీనర్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాన్నారు. 2026 జూలైలో ట్రేడ్ టెస్ట్ ఉంటుందన్నారు. సాలూరు ప్రభుత్వ ఐటీఐలో రూ.500లు చెల్లించి వచ్చే నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఉత్తీర్ణత సాధిస్తే ధ్రువపత్రాలు జారీచేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90525 08903, 63025 24423 నంబర్లను సంప్రదించాలన్నారు.

# ప్రైవేటు డ్రైవర్లు.. ప్రయాణికులు జాగ్రత్త!

సరైన శిక్షణ.. అనుభవం.. అర్హత ఉండదు.. అయినా ప్రైవేటు వాహనాల స్టీరింగ్ పట్టి.. రయ్‌మంటూ డ్రైవర్లు అయిపోతున్నారు. సిగ్నల్స్, రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన లోపంతో ప్రమాదాలకు కారణమవుతున్నారు. తక్కువ జీతానికే వస్తారన్న అత్యాశతో యజమానులు ఉద్యోగంలోకి తీసుకుని.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇటీవల కర్నూలు, అల్లూరి జిల్లాలో జరిగిన ప్రైవేటు బస్సుల ప్రమాదాలు కలచివేశాయి. రెండు ఘటనల్లో 28 మంది మృత్యువాతపడ్డారు. జిల్లా అధికారులు దృష్టి పెట్టి.. శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం

శిక్షణ, అర్హత లేకున్నా చోదకం

### విద్యార్థులకు తప్పిన ముప్పు

★ గత ఏడాది అక్టోబర్‌లో విక్రాంపురం వద్ద ప్రైవేటు పాఠశాల బస్సు, ఆటో ఢీకొన్నాయి. ముగ్గురు విద్యార్థులు, చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి.

★ గత ఏడాది డిసెంబరులో పార్వతీపురం మండలం బాలగుడబ వద్ద ఒక ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా పడి.. ఒక వ్యక్తి మృతి చెందాడు. ఆ సమయంలో పిల్లలున్నారు.

### జిల్లా వ్యాప్తంగా..

★ ఆర్టీసీ ప్రభుత్వ బస్సులు: 167, అద్దెవి (ప్రైవేటు): 72
★ ప్రైవేటు పాఠశాల బస్సులు: 51
★ వివిధ రకాల ప్రైవేటువి: సుమారు 30

**వివరించడం లేదు:** ఏదైనా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎక్కితే ప్రయాణికులకు ముందుగా అత్యవసర ద్వారం ఎక్కడ ఉందో చూపాలి. ప్రతి సీటు వద్ద ఒక సుత్తి ఉంచాలి. అనుకోని ప్రమాదం జరిగితే సుత్తితో కిటికీ అద్దం ఎలా పగలగొట్టాలి, బయటకు దూకి.. ప్రాణాలు ఎలా కాపాడుకోవాలనే దానిపై అవగాహన కల్పించాలి. దీన్ని ఎవరూ వివరించడం లేదు.

### ఆర్టీసీ విధానాలు అమలు చేస్తే మేలు

ఆర్టీసీకి సంబంధించి రాష్ట్రంలో జోనల్ ఉద్యోగుల శిక్షణ కళాశాలలున్నాయి. జోన్-1 కళాశాల విజయనగరంలోనే ఉంది. ఈ పరిధిలోని వారు ఇక్కడే శిక్షణ తీసుకుంటారు. 6-12 నెలల వ్యవధిలో ప్రతి డ్రైవర్ ఈ కేంద్రానికి వెళ్లి.. రెండ్రోజులపాటు వివిధ అంశాలపై శిక్షణ అందిస్తారు. ప్రతి డిపోలోని సేఫ్టీ డ్రైవింగ్ శిక్షకుడు తన పరిధి డ్రైవర్లకు బస్సులు నడిపేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు, విపత్తును ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పిస్తారు. గతంలో జరిగిన వివిధ ప్రమాద ఘటనలను విశ్లేషిస్తూ బోధిస్తారని జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రైవేటు వాహన డ్రైవర్లకు మాత్రం శిక్షణ ఉండటం లేదు. అనుభవం లేని వారికి యజమానులు పని కల్పిస్తున్నా చర్యల్లేవు.

### యజమానులకు బాధ్యత ఉండాలి

చోదకుడి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని యజమానులు ఉద్యోగం ఇవ్వాలి. వారు బాధ్యతగా ఉండి, అన్నీ ప్రామాణికంగా జరిగితే ప్రమాదాలను నివారించొచ్చు. వాహనం ఇంజిన్, బ్రేక్‌లతోపాటు చక్రాల్లో గాలి శాతాన్ని పరిశీలించుకోవాలి. మంచు తీవ్రత ఉన్నప్పుడు, నిద్ర వస్తున్నప్పుడు వాహనాన్ని పక్కన నిలపాలి. – దుర్గాప్రసాద్‌రెడ్డి, రవాణా శాఖ జిల్లా అధికారి

# గోగు సాగు.. రైతుల వెనకడుగు

న్యూస్‌టుడే– బొబ్బిలి

గిట్టుబాటు ధర లేక ఉమ్మడి జిల్లాలో గోగు సాగు ఏటేటా పూర్తిగా పడిపోతోంది. సాగు ఖర్చు ఎక్కువ రాబడి తక్కువ అవుతుండడంతో రైతులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ముడిసరకు కొరతతో దాదాపు జూట్ పరిశ్రమలు మూతపడ్డాయి. ముడిసరకు లేకపోవడం, దూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవడం భారంగా మారడంతో యాజమానులు మూసివేశారు. సాగు పెంచేందుకు జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ) ప్రణాళికలు రూపొందించడం లేదు. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి పంటకు కూడా మద్దతు ధర అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కొనుగోళ్లు లేని బొబ్బిలిలో జేసీఐ కార్యాలయం

గిట్టుబాటు ధర, ప్రోత్సాహకాలు అందక అవస్థలు

దాదాపు మూతపడిన జూట్ పరిశ్రమలు

### ప్రకటనలకే పరిమితం..

పార్వతీపురం రీజియన్‌లో అయిదేళ్ల కిందట 5 వేల ఎకరాల్లో పంట ఉండేది. రానురానూ కనుమరుగవుతోంది. ఎకరాకు సాగు ఖర్చులు రూ. 20 వేలు కాగా.. పంట విక్రయించగా రూ. 15 వేలు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో మిడిల్ రకం ఎక్కువగా పండుతోంది. క్వింటా రూ. 3860గా ఉంది. జేసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మధ్యవర్తులు క్వింటా వద్ద రూ. 200లు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. జేసీఐ తగు రాయితీలు కల్పించడం లేదు. ప్రోత్సహించేందుకు రెట్టింగు ట్యాంకులు, నాణ్యమైన విత్తనాలు, నారను వేరుచేసే యంత్రాలు అందజేస్తామని గతంలో ప్రకటనలకే పరిమితమయ్యాయి. రూ. కోట్లు ఖర్చుచేసి జూట్ టెక్నాలజీ మిషన్లు పార్వతీపురం, బొబ్బిలిలో ఏర్పాటు చేసినా.. వాటి సేవలు రైతులకు చేరువ కావడంలేదు.

| ఏడాది | సాగువిస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|
| 2022–23 | 1800 |
| 2023–24 | 1490 |
| 2024–25 | 1200 |
| 2025–26 | 1000 |

### ప్రణాళికలు రూపొందించాం..

సాగు విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం. ఆమదాలవలస నైర్ పరిశోధన కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకున్నాం. నాణ్యమైన విత్తనాలతోపాటు ఊరవేసేందుకు పౌడర్, ఇతర యంత్రాలు సరఫరా చేస్తాం. జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వం 'ఐ కేర్' పథకాన్ని అమలు చేయనుంది. దీంతో రైతులకు రాయితీలు అందుతాయి. – ఆర్.అరుణ్, ప్రాంతీయ ప్రబంధకుడు, జేసీఐ

● ఉమ్మడి జిల్లాలోని జూట్ పరిశ్రమలు: 17 ● ప్రస్తుతం పనిచేస్తున్నవి: నెల్లిమర్ల, రాజాంలో ఒక్కొక్కటి

(c) eenadu

# నేడే ఈఎస్ఎల్ తుది సమరం

## హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్స్

– న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

టాస్ వేస్తున్న శ్రీహాస్పిటల్ అధినేత డాక్టర్ జీవీఎన్.భూపతి

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్- ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)- 2025 క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. సోమవారం విజయనగరంలోని విజ్జీ మైదానంలో జరిగిన సెమీస్‌లో మిరాకిల్- ఎంవీజీఆర్, అవంతీస్- జీసీఎస్ఆర్ జట్ల మధ్య జరిగిన పోరు అలరించింది. అంతకుముందు శ్రీహాస్పిటల్ ఎండీ డాక్టర్ జీవీఎన్. భూపతి టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీజ్‌లోకి అడుగు పెట్టిన క్రీడాకారుల్లో బ్యాటర్లతో పాటు బౌలర్లూ మెరుగ్గానే రాణించారు. రెండు మ్యాచ్‌లలో తక్కువ స్కోర్లే నమోదైనా ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. ఇప్పటివరకు ఈ టోర్నమెంటులో 225 ఫోర్లు, 94 సిక్సర్లు నమోదయ్యాయి. నేడు జూనియర్స్, సీనియర్స్ ఫైనల్స్‌తో పాటు బాలికల విభాగంలో సత్య డిగ్రీ కళాశాల(విజయనగరం), సీతం ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య తుది సమరం సాగనుంది.

SUKHIBHAVA Hospitals CARING FOR LIVES 17-15-90, Jonnaguddi Road, Beside Reliance Mall, BALAJI JUNCTION, VIZIANAGARAM AP 535002 Contact : 7901224433

స్టంపింగ్ మిస్..

### ఎంవీజీఆర్‌దే పైచేయి..

విజ్జీలో జరిగిన తొలి సెమీస్‌లో మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల(భోగాపురం), ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల(చింతలవలస) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎంవీజీఆర్ ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. దీంతో బరిలోకి దిగిన మిరాకిల్ క్రీడాకారులు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేశారు. పి. సతీష్ 21 బంతుల్లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 28, బి.ప్రశాంత్ 25 బంతులాడి మూడు ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 37 పరుగులతో రాణించారు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన ఎంవీజీఆర్ 8 బంతులు మిగిలి ఉండగానే కేవలం 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ సాయికృష్ణ 25 బంతుల్లో రెండు భారీ సిక్సర్లతో 33 పరుగులు చేసి, జట్టును ఫైనల్‌కు చేర్చాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అతడికి కె.దేవుడు(23), వై.వర్షిక్(18) తమ వంతు సహకారం అందించడంతో విజయం సునాయాసమైంది.

సీహెచ్.సాయికృష్ణ

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వీరే

ఎ.మన్మథరావు

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

**30.12.2025 నేడు**

**జూనియర్ విభాగంలో..**

★ ఉదయం 8.30 గంటలకు: శ్రీ చైతన్య జూనియర్ కళాశాల రామన్‌భవన్ (విజయనగరం) V/s శ్రీ జి.సి.ఎస్.ఆర్. జూనియర్ కళాశాల (రాజాం)

**సీనియర్ విభాగంలో..**

★ ఉదయం 11.00 గంటలకు: ఎం.వి.జి.ఆర్. ఇంజినీరింగ్ కళాశాల (చింతలవలస) V/s అవంతీస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ అకాడమీ (భోగాపురం)

**బాలికల విభాగంలో..**

★ ఉదయం 9.30 గంటలకు: సత్య డిగ్రీ కళాశాల (విజయనగరం) V/s సీతం ఇంజినీరింగ్ కళాశాల (గాజులరేగ)

### ఫైనల్స్‌కు అవంతీస్..

రెండో మ్యాచ్‌లో జీసీఎస్ఆర్ కళాశాల(జీఎంఆర్- రాజాం), అవంతీస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ అకాడమీ (భోగాపురం) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జీసీఎస్ఆర్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసింది. మహేష్(16), వాసు(14) మాత్రమే రాణించారు. అవంతీస్ క్రీడాకారులు 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని(72 పరుగులు) ఛేదించారు. ఎ.మన్మథరావు 33 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఎస్పీ

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 31న రాత్రి బహిరంగ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట తరువాత రహదారులపై తిరగొద్దని, ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో ఉండాలని సూచించారు.

**వేగంగా వెళ్తే వాహనం సీజ్..**

జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్య కూడళ్లు, పట్టణాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో దాడులు చేపడతామన్నారు. వాహనాలతో వేగంగా వెళ్లినా, మద్యం తాగి నడిపినా, బైక్ రేస్‌లు నిర్వహించినా, ట్రిపుల్ రైడింగ్, మైనర్ చోదకం.. తదితర విషయాల్లో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వాహనాలను సీజ్ చేస్తామని చెప్పారు.

**ఇబ్బంది కలిగించొద్దు..**

నివాస స్థలాల మధ్య, బహిరంగ ప్రదేశాల్లో కేకులు కోయడం, నృత్యాలు చేయడం, రంగులు పూయడం, డీజే/లౌడ్ స్పీకర్ల ఏర్పాటు, బాణసంచా కాల్పులు, గుమిగూడడం చేస్తే అదుపులోకి తీసుకుంటామన్నారు. నిర్దేశించిన సమయాల్లోనే మద్యం దుకాణదారులు అమ్మకాలు చేపట్టాలన్నారు.

## నేడు మత్స్యకార సహకార సంఘం పాలక మండలి ఎన్నిక

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా మత్స్యకార సహకార సంఘం పాలక మండలి ఎన్నికలకు రంగం సిద్ధమైంది. విజయనగరంలోని ఆక్వాల్యాబ్‌లో మంగళవారం సాయంత్రం చేతులెత్తే పద్ధతిలో ప్రక్రియ జరగనుందని ఎన్నికల అధికారి ఎంఎస్ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఉన్న 66 మంది సహకార సంఘాల అధ్యక్షులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, 11 మందిని డైరెక్టర్లుగా ఎన్నుకుంటారన్నారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షుడి ఎంపిక సాగుతుందన్నారు. ఉదయం నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలు రూ.100, బీసీలు రూ.200, ఇతర వర్గాల వారు రూ.400 రుసుము చెల్లించాలని స్పష్టం చేశారు.

# రేణుకమ్మా.. ఇదేం పనమ్మా!

## గంజాయి స్మగ్లర్‌గా అవతారం ఎత్తిన గ్రామీణ యువతి

ఈనాడు, విజయనగరం: సామాన్య రైతు కుటుంబంలో పుట్టింది. చిన్న వయసులోనే నేరాలకు పాల్పడింది. చివరకు గంజాయి స్మగ్లర్‌గా అవతారమెత్తింది సంతకవిటి మండలం మోదుగులపేటకు చెందిన గడే రేణుక. ఏం చదివిందో ఎవరికీ తెలియదు. పదిహేడేళ్ల వయసులోనే దొంగతనాలకు పాల్పడి.. అది వెలుగులోకి రావడానికి కారణమైన కుటుంబానికి చెందిన చిన్నారిని హత్య చేసిన కేసులో ఇరుక్కుంది. ఆ తర్వాత రూటు మార్చింది. జల్సాలకు అలవాటు పడి గాడి తప్పింది. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలతో ఆమెపై నాలుగు కేసులు నమోదవడంతో వాటిని ఎదుర్కొంటోంది. తాజాగా అనకాపల్లి జిల్లా నాతవరం పోలీసులకు చిక్కిన ముఠాలో కీలక నిందితురాలిగా ఉంది. ప్రస్తుతం విశాఖ కేంద్ర కారాగారంలో ఊచలు లెక్కిస్తోంది.

**చిన్నారిని చంపేసి..**

నిందితురాలి వ్యవహారంపై గ్రామస్థులను కదిపినపుడు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా గ్రామీణ మహిళలు పొలం పనులకు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలను ఇంట్లోని బాక్స్‌ల్లో భద్రపరుస్తారు. ఒకామె ఇలానే చేసి పొలానికి వెళ్లింది. ఎవరూ లేని సమయంలో రేణుక ఆ ఇంట్లోకి ప్రవేశించి కాజేసింది. ఆ ఇంటికి ఎదురుగా ఉన్న మహిళ కంటపడింది. బాధితురాలు పొలం నుంచి ఇంటికొచ్చి చూడగా బంగారం కనిపించకపోవడంతో బోరుమంది. రేణుక లోపలికి వెళ్లినట్లు ఎదురింటి మహిళ చెప్పడంతో విషయం తెలిసింది. దీంతో కక్ష పెంచుకుని సాక్ష్యం చెప్పిన మహిళ ఏకైక కుమారుడి పీక నులిపి ఆ ఇంటి మేడపై పడేసింది. తర్వాత బిడ్డ మృతదేహాన్ని గుర్తించిన ఆ కుటుంబ సభ్యులు, అప్పటికి మైనర్ అయిన నిందితురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత బంధువులతో కలిసి కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది. తాత్కాలిక ఉపశమనం లభించడంతో రాజమహేంద్రవరంలో ఉంటున్న సోదరుడి ఇంటికి వలస వెళ్లింది.

**ఉద్యోగం చేస్తున్నట్లు నటించి..**

అక్కడి నుంచి బెంగళూరుకు మకాం మార్చి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నానని గ్రామస్థులకు చెప్పేది. బీటెక్ ఎక్కడ చదివిందో తమకు తెలియదని, తల్లిదండ్రులు గ్రామంలో ఉన్నా పదేళ్ల నుంచి రాలేదని స్థానికులు చెబుతున్నారు. సాలూరులో గంజాయి అక్రమ రవాణాతో ఒకసారి చిక్కినట్లు తమకు తెలిసిందన్నారు.

**విదేశాలకు రవాణా..**

ఏజెన్సీలో కొనుగోలు చేసిన గంజాయి తరలింపు ముఠాలో కొంత కాలంగా చురుగ్గా పనిచేస్తున్నట్లు తెలిసింది. తమిళనాడుకు చెందిన ఇద్దరు, అల్లూరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన మరికొందరితో జట్టు కట్టింది. వీరిలో ఇద్దరు మహిళలున్నారు. రైలు, రోడ్ల మార్గాల్లో సరకును చెన్నై చేర్చేవారు. అక్కడ తీరం నుంచి సముద్ర మార్గంలో శ్రీలంకకు చెందిన స్మగ్లర్లకు విక్రయించేవారు. తమ వద్దకు బోట్లలో వచ్చి తీసుకెళ్తారని నాతవరం పోలీసుల విచారణలో రేణుక వెల్లడించినట్లు సమాచారం. బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదులుకొని గంజాయి రవాణా చేయడం మొదలెట్టినట్లు విచారణలో అంగీకరించినా, ఆమె వ్యవహార శైలి, చదువు, ఉద్యోగంపై పోలీసులు సైతం అనుమానాలు వ్యక్తం చేయడం గమనార్హం.

## ఉద్యోగం రాలేదని యువకుడి బలవన్మరణం

అయ్యన్నపేట: ఉద్యోగం రాలేదని ఓ యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. ఈ విషాదకర ఘటన విజయనగరంలో జరిగింది. జీఆర్‌పీ ఎస్సై మధుసూదనరావు వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన విక్రమ్‌కుమార్ ప్రజాభత్(24) డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవాడు. తగిన ఫలితాలు రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. నెల రోజుల క్రితం విజయనగరంలో తన సోదరుడు నడుపుతున్న ఎలక్ట్రికల్ దుకాణంలో చేరాడు. సోమవారం గూడ్స్ షెడ్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: కుమార్తెను ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్తున్న క్రమంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయాడు. సీఐ నారాయణమూర్తి వివరాల మేరకు బొడ్డవర గ్రామానికి చెందిన దాసరి లక్ష్మణ్(35) తన కుమార్తెను ఈనెల 25న ఎస్.కోట ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్తుండగా.. పట్టణ శివారు పందిరప్పన్న కూడలి సమీపంలో వాహనంలో నుంచి జారి పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ వెల్లడించారు.

## వరి కుప్పల దగ్ధం

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలంలోని తోటవలస గ్రామ సమీప పొలాల్లో ధాన్యంతో ఉన్న వరికుప్పలు దగ్ధమవడంతో రూ.2.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. కొత్తవలసకు చెందిన రైతులు కర్రి బలరాము, ఎం.గోపాలం, తోటవలస గ్రామ రైతు సిగ్గారపు చిన్న కలిసి మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కుప్పలకు నిప్పు పెట్టడంతో దగ్ధమైనట్లు బాధితులు బోరుమన్నారు. విద్యుత్తు మోటార్ల తీగలను కోసి, రాగిని ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకట సురేశ్ తెలిపారు.

## కాఫీ పంటల పరిశీలన

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలంలోని గిరిశిఖర గ్రామాలైన సతాబి, తంగలాం రైతులు సాగు చేస్తున్న కాఫీ తోటలను జీసీసీ డీఎం జె.రామారావు ఆదేశాల మేరకు సాలూరు జీసీసీ ప్రబంధకుడు సీహెచ్.రాములు, సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి తోటలను పరిశీలించారు. సాగు విస్తీర్ణం, రైతు ఆధార్, బ్యాంకు ఖాతా తదితర వివరాలు సేకరించారు. గింజ నాణ్యత బట్టి ధర నిర్ణయించి జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా నిచ్చారు.

**చికెన్ ధరలు**

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 150 | 270 | 280 |

## వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలోని తితిదేకు చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు, సిబ్బంది తెలిపారు. భారీగా భక్తులు రానున్నారని, ఆ మేరకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

సీతంపేటలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం

**పూజా కార్యక్రమాల వివరాలివీ..**

★ తెల్లవారుజామున 3 గంటల నుంచి 3.30 వరకు తిరుప్పావడ సేవ ★ ఉదయం 3.30 నుంచి 5 వరకు: అర్చన తోమాల, సహస్రనామార్చన, మొదటి గంట ★ 5 నుంచి 12 వరకు: వైకుంఠ ద్వార దర్శనం ★ 12 నుంచి 12.15 వరకు: రెండో గంట ★ 12.15 నుంచి సాయంత్రం 6 వరకు: వైకుంఠ ద్వార దర్శనం ★ సాయంత్రం 6 నుంచి 6.45 వరకు: శుద్ధి, అర్చన తోమాల, మూడో గంట ★ రాత్రి 6.45 నుంచి 9 వరకు: వైకుంఠ ద్వార దర్శనం ★ రాత్రి 9 గంటలకు: శుద్ధి, ఏకాంత సేవ.

## నిజాయతీ చాటుకున్న సత్యనారాయణ దంపతులు

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరం మండలంలోని చిట్టాయవలస గ్రామానికి చెందిన సిరిపురపు సత్యనారాయణ(పెద్దయ్య) దంపతులకు దొరికిన రూ.2 లక్షల విలువైన 17 గ్రాముల బంగారు పుస్తెలతాడును సోమవారం పోలీసులకు అప్పగించి తమ నిజాయతీ చాటుకున్నారు. ఈనెల 14న విజయనగరం ఆర్టీసీ బస్టాండులో ఆభరణం దొరికింది. దీంతో ఎస్సైకు అందించి పోగొట్టుకున్న వారికి అప్పగించాలని కోరారు. విజయనగరం ఒకటో పట్టణ పోలీసుస్టేషనులో బాధితులు ఫిర్యాదు చేశారని, అక్కడి పోలీసుల ద్వారా వారికి చేరేలా చర్యలు తీసుకుంటామని సీఐ రమణ తెలిపారు. వారిని స్టేషన్ సిబ్బంది, పలువురు స్థానికులు అభినందించారు.

ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడుకు ఆభరణాన్ని ఇస్తున్న సత్యనారాయణ

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్రీమియం ఒగోటాముషు సాకి (బెన్నిన్) ముడి జీడిపప్పు (RCN) అత్యుత్తమ నాణ్యత, సరసమైన ధర, నేరుగా సరఫరా. బిజినెస్ వీసా, వసతి సౌకర్యాలు మేము ఏర్పాటు చేస్తాం. సంప్ర॥ 7893732377.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

HEALTH & CARE

NEURO

నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్
మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు
Dr.Nirmala Vangapandu M.D.(Gen.Med) DM (Neuro) JIPMER Specialist in Brain & Nerve Problems & General Physician
R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టీప్లెక్స్ వెనుక వైపు, VZM
FOR APPOINTMENT : 63054 71147

REAL ESTATE

FLAT FOR SALE

ధర్మపురి 80 అడుగుల రోడ్డుకు అతి దగ్గరలో 1000sft 2BHK E/F Flat అతి తక్కువ ధరలో అమ్మకానికి కలదు. ✆ 7995588192

PLOT FOR SALE

VZM, NML, మొయిద జం|| to జరజాపుపేట మెయిన్‌రోడ్డుకి ఆనుకొని వినాయకనగర్ లేఅవుట్‌లో 200 గ||లు-2 N/Fలో వెంటనే ఇల్లు కట్టుకోవడానికి ఇంటిస్థలాలు కలవు ✆7396629927

JOBS

వైజాగ్ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం.10,000-12,000+ఫుడ్ రూము. ✆ 9030588502/9704637370.

ఇంట్లో ఉండి అమ్మను చూసుకోవడానికి చీపురుపల్లిలో మాకు పనిమనిషి కావలెను. ఆకర్షణీయమైన జీతం+వసతి+ఫుడ్ సదుపాయం. C:7286099991.

విజయనగరంలో ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువతి యువకులు కావలెను. జీతం - 10,000-13,500. Ph: 9030588502, 9154296345.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

## రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో కీర్తి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖ పరిధిలో సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో భాగంగా క్లినిక్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు, ఆర్డీవోల సమక్షంలో అర్జీదారులకు న్యాయం చేస్తామన్నారు. వివరాలను డేటాబేస్‌లో నమోదు చేసి, వారాంతంలో సమీక్షిస్తామని చెప్పారు. ప్రజల సంతృప్తిస్థాయిని పెంచే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. 23 దరఖాస్తులు అందాయని ఆర్డీవో కీర్తి తెలిపారు. విజయనగరం డివిజన్‌కు 15, బొబ్బిలి- 05, చీపురుపల్లి డివిజన్‌కు మూడు వచ్చాయన్నారు.

## వివరాల సమర్పణకు ఆదేశాలు

భోగాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో పలు ప్రాథమిక సహకార సంఘాల్లో పాలక వర్గాల నియామక ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు ఏడు సంఘాలకు సంబంధించిన వివరాలను సమర్పించాలని ఆదేశాలు అందాయి. సంఘం పేరు, ఛైర్మన్, సభ్యులు, అర్హతలను తెలియజేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ మేరకు ఛైర్మన్ పదవులకు గానూ కుమిలి- గొర్లె శ్రీనివాస్, లంకలపల్లిపాలెం- పి.నారాయణస్వామి, భోగాపురం- పి.శ్రీనివాస్, పోలిపల్లి- కె.రామునాయుడు, డెంకాడ- గజపతి, జొన్నాడ- శ్రీనివాసరావు, తమ్మాయిపాలెం వి.ఎస్.ఎల్.వి.ఎన్.రాజు పేర్లను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

# ప్రకృతి సేద్యంతో లాభాల సిరులు

వీరఘట్టం, న్యూస్‌టుడే: కంకర గుట్టలను చదును చేసి.. ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయల పంటలు పండిస్తూ.. సిరులు కురిపిస్తున్నారు వీరఘట్టం మండలం జె.గోపాలపురానికి చెందిన అబలాసింగి అర్జునరావు. ప్రభుత్వం ఇచ్చిన డి.పట్టాభూమిని బాగుచేసుకుని వివిధ పంటలతోపాటు చేపల పెంపకంతోనూ ఆశించిన లాభాలను ఆర్జిస్తున్నారు.

గ్రామంలో ఉన్న 1.07 ఎకరాల భూమిలో కూరగాయలు, పండ్లను సాగుచేస్తున్నారు. తనే సొంతంగా నారు తయారు చేసుకుంటున్నారు. పూర్తిగా ప్రకృతి సాగు విధానాన్నే అనుసరిస్తున్నారు. రూ.లక్ష బ్యాంకు రుణం తీసుకుని ఆవు కొనుగోలు చేశారు. ఆవు పేడ, మూత్రం వినియోగించుకొని పంటకోసం వివిధ కషాయాలు స్వయంగా క్షేత్రం వద్ద తయారు చేసుకుంటున్నారు. పంటలను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు పొలం గట్లపై చీమపెండలం, ఆనప పండిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు.


క్షేత్రంలో ఆనప కాయల సాగు

**పెట్టుబడులు.. లాభాలు..:** చిక్కుడు 35 సెంట్లలో వేశారు. 117 కిలోల దిగుబడికిగానూ రూ.7 వేల లాభం వచ్చింది. బీర 35 సెంట్లలో వేయగా 117 కిలోల దిగుబడికి రూ.7వేలు వచ్చింది. పొలం గట్టుపై 10 మీటర్ల పొడవునా తాటితేగలు వేస్తే 240 కిలోల దిగుబడి వచ్చింది. కిలో రూ.40 వంతున విక్రయించగా రూ.9,600 వచ్చింది. డ్రాగన్‌ఫ్రూట్స్ 5 సెంట్లలో పండించారు. ప్రస్తుతం 190 పూత దశలో ఉన్నాయి. ఆనప 10 సెంట్లలో వేయగా 120 కాయలు పండాయి. రూ.2400 లాభం అందుకున్నారు. 22 సెంట్లలో కంది, పసుపు, ఉలవ వేశారు. కంది పంట చేతికి అందాల్సి ఉంది. పసుపు, ఉలవ విక్రయించగా రూ.14 వేల వరకు లాభం వచ్చింది.

**చేపలతో రూ.27వేలు:** పొలంలో చిన్న చెరువు తవ్వించుకున్నారు. ఇందులో 1400 బంగారు పాపలు, బొచ్చులు, రేగండ చేపపిల్లలు పెంచారు. అవి వృద్ధి చెంది 90 కిలోలు చేతికి అందాయి. కిలో రూ.150 వంతున విక్రయించారు. రూ.13,500 వచ్చింది. ఏడాదికి రెండు పంటలకు రూ.27 వేలు లాభం పొందారు.

**గిట్టుబాటు బాగుంది:** ప్రకృతి సాగులో పెట్టుబడి తక్కువగా ఉంది. ఉత్పత్తులు కుటుంబ అవసరాలకు పోనూ మిగిలినవి విక్రయిస్తున్నాం. ఇలా పండించడం వల్ల ఆరోగ్యంతో పాటు నాణ్యమైన పంటకు లాభం వస్తోంది. అన్ని పంటలపై సుమారు రూ.లక్ష వరకూ లాభం వస్తోంది. - అర్జునరావు, జె.గోపాలపురం.

## మిత్రపురుగులను కాపాడుకోండి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పురుగు మందుల వాడకంతో హానికర చీడపీడలతో పాటు పైర్లకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతాయని, వీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.తేజేశ్వరరావు సూచించారు. ★ పైర్లకు హాని కలిగించే పురుగులను కొన్ని మిత్రపురుగులు తినడంతో పాటు వాటి సంతానవృద్ధిని అడ్డుకుంటాయి. ★ సుడి, పచ్చ, తెల్లవీపు దోమలు, ఆకుముడత, రెల్లరాల్చే, కాండం తొలిచే పురుగులను మిత్ర పురుగులైన తోడేలు, సాలీడు, శివంగి సాలీడు, నాలుగు దవడల సాలీడు, అక్షింతల పురుగులు భక్షిస్తాయి. నేల బారు, పెంకుపురుగు, భక్షక ఇలకోడి, భక్షక నీటి నల్లులు, తూనీగలు, భక్షిత మిడత, చెవికాళ్ల జెర్రి తదితర పురుగులు రైతులకు మేలు చేస్తాయి. ★ చీడపీడల నివారణకు పురుగు మందులకు బదులు వేప సంబంధ కషాయాలు వాడితే మిత్రపురుగులను కాపాడుకోవచ్చు.

## ధాతు లోపాన్ని గుర్తిస్తే లాభం



అరటి పంటలో సూక్ష్మధాతు పోషక లోపాలు అధికంగా ఉంటాయి. ఎరువులను సమపాళ్లలో వేసుకుంటే ఈ సమస్యను అధిగమించవచ్చు. లీటరు నీటిలో 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్, 0.5 మి.లీ. జిగురుతో కలిపి ఆకుల మీద 4 నుంచి 5 సార్లు పిచికారీ చేయాలి. గెలలు వేసిన తోటల్లో ఆఖరి హస్తం విచ్చుకున్న తర్వాత ఒకసారి, 10 రోజుల తర్వాత మరోసారి లీటరు సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 5 గ్రాముల నీటిలో కలిపివేయాలి. శీతాకాలంలో గెలలు సరిగ్గా వృద్ధి చెందకపోతే కాయలు పండుబారుతాయి. నివారణకు లీటరు నీటిలో పొటాషియం ఆర్థోఫాస్ఫేట్ 5 గ్రాములు కలిపి గెలపై వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే మంచి దిగుబడి పొందవచ్చని రస్తాకుంటుబాయి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

## సస్యరక్షణతో చీడపీడలు దూరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: జీడి, మామిడి తోటల్లో ఎండుకొమ్మలు తొలగించి ముందస్తుగా సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడల నుంచి రక్షణ పొంది అధిక దిగుబడులు పొందొచ్చని మన్యం జిల్లా ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్ తెలిపారు. రైతుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

**? : ప్రశ్న:** మామిడి తోటల్లో చెట్లకు చెద పురుగులు పడుతున్నాయి. వీటి బారి నుంచి ఎలా కాపాడుకోవాలి? **- కె.రాము, డెంకాడ మండలం**

**సమాధానం:** చెద పురుగుల నుంచి చెట్లను కాపాడుకునేందుకు 19 లీటర్ల నీటిలో లీటరు క్లోరిపైరిఫాస్-7సి (20 శాతం ఈసీ) కలిపి చెట్ల మొదళ్లలో మట్టి తడిచేలా వేయాలి. కాండం మీటరు వరకు తడపాలి. చెట్ల మొదలులో ఒక పాలిథీన్ షీట్ చుట్టి, దానికి గ్రీజు రాస్తే పురుగు ఆశించదు.

**? :** జీడి పూత నిలవాలంటే ఏం చేయాలి? **- తవిటినాయుడు, సీతంపేట**

**☛ :** తొలగించిన కొమ్మల గాయాలపై లీటరు నీటికి బ్లైటాక్స్ 10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి. దీనివల్ల తెగుళ్లు సోకవు. కొత్త చిగుళ్లు వచ్చి పూత వస్తుంది. పశువుల గెత్తం 50 కిలోలు, సూపర్ ఫాస్ఫేట్ 2 కిలోలు, పొటాష్ కిలో చొప్పున కలిపి ఒక్కో చెట్టుకు వేయడంతో చిగురు బాగా వస్తుంది. లీటరు నీటికి మోనోక్రొటోఫాస్ లేదా క్లోరిపైరిఫాస్ 1.5 మి.లీ. సాఫ్ పొడి 2 గ్రా. కలిపి వేస్తే తెగుళ్లు, పురుగులను నివారించొచ్చు.

**? :** ఆయిల్ పామ్‌లో ఎలాంటి అంతర పంటలు వేసుకోవచ్చు? **- వెంకటనాయుడు, కొమరాడ**

**☛ :** వెలుతురు, నీరు, పోషక పదార్థాల కోసం పామాయిల్ మొక్కతో పోటీ పడని పంటను ఎంచుకోవాలి. సాధారణంగా కూరగాయలు, పొట్టి అరటి, పూల మొక్కలు, పొగాకు, మిర్చి, పసుపు, అల్లం, అనాస మొదలైనవి అంతర పంటగా వేయడానికి అనువైనవి. కోకో, మిరియాలు పండించవచ్చు.

**ఫోన్ కొట్టు.. సలహా పొందు**

వరి కోతల అనంతరం ఎలాంటి పంటలు వేయొచ్చు. రబీలో అపరాలు, వరి సాగులో సస్యరక్షణ, అధిక దిగుబడులకు పాటించాల్సిన చర్యలపై సలహాల కోసం 63034 02627 నంబరును సంప్రదించాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.స్రవంతి తెలిపారు.

(c) eenadu

## నిలువెత్తు నిర్లక్ష్యం.. అల్లుకుంటోంది

మక్కువ మండలంలో మంచినీటి పథకాలు నిర్వహణ లేక అధ్వానంగా మారుతున్నాయి. చప్పుబ్బిపేట పంచాయతీ పరిధి మోసూరువలస గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం గతంలో రక్షిత పథకం నిర్మించారు. నిర్వహణ లేకపోవడంతో లతలు అల్లుకుని ఇలా దర్శనమిస్తున్నాయి. ట్యాంకు నుంచి నీరు కారుతుండడంతో నాచు పట్టింది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి పోలినాయుడును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. శుభ్రం చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, మక్కువ

## రాళ్లు తేలి.. గుంతలుగా మారి..

సాలూరు పట్టణంలోని కోటవీధి నుంచి మెంటాడ వీధి, పెదహరిజనపేటకు వెళ్లే దారి రాళ్లుతేలి అధ్వానంగా మారింది. 15 ఏళ్ల కిందట నిర్మించిన రహదారి పూర్తిగా రాళ్లు తేలి అధ్వానంగా మారింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.6.50 లక్షలతో టెండర్లు ఖరారయ్యాయి. త్వరలో పనులు చేయిస్తామని పుర కమిషనర్ రత్నకుమార్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు

## పిల్లర్ల దశలో నిలిచిన పనులు

సాలూరు మండలం మావుడి పంచాయతీ కేంద్రంలో అయిదేళ్ల కిందట ప్రారంభించిన వెల్‌నెస్ కేంద్రం భవన నిర్మాణం ఇలా ప్రారంభ దశలోనే నిలిచిపోయింది. పునాదులు వేసి పిల్లర్ల కోసం ఇనుప గజాలు కట్టారు. నిధులు రాకపోవడంతో స్తంభించిన పనులు నేటికీ ప్రారంభించలేదు. విషయం పంచాయతీరాజ్ ఏఈ వరలక్ష్మి వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

## నిధులు వృథా.. యంత్రం మూలన

గత వైకాపా ప్రభుత్వ హయాంలో అనాలోచిత నిర్ణయాలతో ప్రజాధనం వృథా అయ్యింది అనడానికి ఇదే నిదర్శనం. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు వివిధ పదార్థాలతో కషాయాలు తయారు చేసుకునేందుకు జెడ్‌బీఎన్‌ఎఫ్ పేరిట గత ప్రభుత్వం యంత్రాలను అందించింది. వాటిని ఉపయోగించక పాడై మూలకు చేరాయి. ఇప్పటికీ సాలూరు మండలం మామిడిపల్లి, కొత్తవలస ఆర్‌ఎస్‌కేల్లో దర్శనమిస్తున్నాయి. చర్యలు తీసుకుంటామని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ఇన్‌ఛార్జి శ్రావణ్ చెప్పారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

## మలుపులతో భయం

బలిజిపేట బస్టాండు నుంచి పెదపెంకి గ్రామానికి వెళ్లే అయిదు కిలోమీటర్ల రహదారిలో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో ఎనిమిది చోట్ల మలుపులున్నాయి. ఇరువైపులా ముళ్లపొదలు, తుప్పలు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ద్విచక్ర వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. మలుపుల వద్ద పేరుకుపోయిన తుప్పలను తొలగిస్తామని ర.భ శాఖ జేఈ రామ్మోహనరావు చెప్పారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

**మేమున్నాం.. మీకు తోడుగా** (10 AM TO 1 PM)

| | |
|---|---|
| పార్వతీపురం | -8008566244 |
| పాలకొండ | -8008574299 |
| సాలూరు | -8008786820 |
| కురుపాం | -9849044696 |

? పట్టుచెన్నూరు పంచాయతీ దొంకలవెలగవలసలో రూ.11 లక్షలతో తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేసినా, కుళాయిలు ఏర్పాటు చేయలేదు. **- స్థానికులు**
★ నిధులు వస్తే పనులు చేస్తాం. **- గౌస్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్** – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

? పాలకొండ ప్రధాన రహదారిలో పగటిపూట విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. **- హరిశంకర్, విద్యార్థి** ★ చర్యలు చేపట్టి విద్యుత్తు వృథాను అరికడతాం **- దేవీవరప్రసాద్, నగర పంచాయతీ ఏఈ** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? పి.లేవిడి గ్రామంలోని పలు వీధి కాలువలు పూడికతో నిండిపోయి అధ్వానంగా ఉన్నాయి. **- స్థానికులు** ★ పూడికను తొలగించి, దోమల మందు పిచికారీ చేయిస్తాం. **- రమేష్‌బాబు, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

## దర్శనానికి వీలుగా ఏర్పాట్లు

స్పందనకు వందనం

కొమరాడ, న్యూస్‌టుడే: గుంప సోమేశ్వరాలయంలో శివయ్య దర్శనానికి అడ్డంగా పైపు ఏర్పాటు చేయడంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఈనెల 15న 'ఈనాడు'లో 'శివయ్య.. కనిపించవయ్యా' శీర్షికతో వచ్చిన వార్తకు జిల్లా దేవాదాయ శాఖ అధికారి స్పందించారు. అడ్డుగా ఉన్న పైపు తొలగించి.. దర్శనానికి వీలుగా ఏర్పాట్లు చేశారు.

## కాళ్లాడవు.. కన్నీళ్లు ఆగవు

పీజీఆర్‌ఎస్‌లో వచ్చే అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తస్థాయిని పెంచేలా శ్రద్ధ చూపించాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆదేశించారు. సోమవారం పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో అర్జీదారుల నుంచి కలెక్టరుతోపాటుగా జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టర్లు వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, డిప్యూటీ కలెక్టర్లు ధర్మచంద్రారెడ్డి, దిలీప్‌చక్రవర్తి వినతులు స్వీకరించారు. మొత్తం 144 వినతులను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. పీజీఆర్‌ఎస్‌కు హాజరుకాని అటవీశాఖ నోటీసు జారీ చేయాలని డీఆర్వోను ఆదేశించారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం, కురుపాం గ్రామీణం, సీతంపేట

జగ్గారావును కలెక్టరు ప్రభాకరరెడ్డికి చూపిస్తున్న గ్రామస్థులు

★ సీతానగరం మండలం పాపమ్మవలసకు చెందిన అప్పలనాయుడు దివ్యాంగుల పింఛను కోసం, భామినికి చెందిన సరస్వతి, పార్వతీపురం పట్టణానికి చెందిన రజని వితంతు పింఛను కోసం అభ్యర్థించారు.

### బతుకే భారమైంది సార్..

పార్వతీపురం మండలం డీకే పట్నానికి చెందిన దంగభద్ర జగ్గారావుకు మధుమేహం కారణంగా కంటిచూపు పోయింది. ఆపై క్రమంగా రెండు కాళ్లు కదలిక లేని స్థితికి చేరుకున్నాయి. మంచానికే పరిమితం అయ్యాడు. బతుకే కష్టమైంది. పింఛను మంజూరు చేస్తే కొంతవరకు ఇబ్బందులు తీరుతాయని, మంజూరు చేయాలని అతనితో వచ్చిన గ్రామస్థులు అధికారులను కోరారు. వైద్యుల ధ్రువీకరణ 40 శాతం వరకు ఉందని, ప్రభుత్వం కొత్త పింఛను మంజూరుకు అనుమతులు మంజూరు చేస్తే వస్తుందని చెప్పారు.

### దివ్యంగా 'చదివినా'..

ఇతని పేరు పట్నాన నాగేంద్ర. దివ్యాంగుడైనా చదువుల తల్లి ఆశీస్సులను పొంది, ఎంఏ బీఈడీ చదివారు. గత కొన్నాళ్లుగా ప్రయత్నిస్తున్నా.. తనకు ఇంతవరకు ఏ ఉపాధి లభించలేదని, తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కలెక్టరును కోరారు. ఆధారం చూపాలని అభ్యర్థించారు.

పట్నాన నాగేంద్ర, పాలకొండ

★ సీతంపేట మండలం ఉప్పరజమ్మిని కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరారు.
★ రెవెన్యూ క్లినిక్‌లో సబ్‌కలెక్టర్లు వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్ వినతులు పరిశీలించారు.
★ కురుపాం మండలం మొండెంఖల్లు గ్రామానికి రక్షిత తాగునీటి ట్యాంకును మంజూరు చేయాలని గిరిజన సంఘం నాయకులు లోవరాజు, ఐ.రామకృష్ణ, సీతారాం, చంద్రశేఖర్ డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

## రుణం ఇప్పించండి.. భవనం మంజూరు చేయండి

సమస్యలు తెలుసుకుంటున్న ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి చిన్నబాబు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం సహాయ ప్రాజెక్టు అధికారి(ఏపీవో) జి.చిన్నబాబు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు హాజరై తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై 15 వినతులు అందించారు. సీతంపేట మండలం జల్లాడకు చెందిన ఎం.విశ్వనాథం పవర్ వీడర్‌కు రుణం ఇప్పించాలని, కొంటికర్రగూడకు చెందిన ఎస్.గోపాల్ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో తన పేరు వేరే గ్రామంలో చూపిస్తున్నందున దాన్ని మార్చాలని, ఇదే గ్రామానికి చెందిన ఎస్.మంగయ్య ట్రాక్టర్‌కు రుణం ఇప్పించాలని, రోలుగుడ్డికి చెందిన నరేష్ సామాజిక భవనం మంజూరు చేయాలని, పనసగూడకు చెందిన జయరాజు మల్టీక్రాప్ థ్రెషర్‌కు రుణం ఇప్పించాలని కోరారు. ఈఈ రమాదేవి, సీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, డిప్యూటీ డీఈవో జె.రామ్మోహనరావు, క్రీడ అధికారి ఎన్.జాకోబ్ దయానందం, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి సందర్భంగా కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో క్షేమంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించానని చెప్పారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాదాన్ని ఆమె స్వీకరించారు.

## తొలిసారి కౌన్సిల్ సమావేశం వాయిదా

వాయిదా ప్రకటిస్తున్న అధ్యక్షురాలు గౌరీశ్వరి

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: తెదేపా సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక తొలిసారి కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. సోమవారం పుర అధ్యక్షురాలు బి.గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. వైకాపా నుంచి అధ్యక్షురాలితోపాటు ఏడుగురు సభ్యులు హాజరయ్యారు. పట్టణంలో పెద్దఎత్తున జరిగిన పలు తీర్మానాలు ఉండగా, నిబంధనలు పాటించాలని పారిశుద్ధ్య అధికారి కె.పకీరురావుని ఆదేశించారు. బెలగాం శివారులో అనధికారికంగా నిర్వహిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని టీపీఎస్ సీహెచ్ నారాయణరావుకి సూచించారు. అనుమతులు లేని నిర్మాణాలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. పుర కమిషనరు కె.కిషోర్‌కుమార్, ఉపాధ్యక్షులు ఐ.గున్నేష్, కె.రుక్మిణి, వైకాపా సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

## పోటీ పడ్డారు.. బహుమతి పట్టారు

విజేతలతో ప్రిన్సిపల్ హరగోపాల్, అప్పారావు

పాలకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ క్విజ్ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వి.లోహిత (ద్వితీయ ఎంపీసీ) ప్రథమ స్థానంలో నిలవగా.. ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్.పద్మశ్రీ, కె.పవన్‌సాయి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ వై.హరగోపాల్ బహుమతులు, ధ్రువపత్రాలను అందించారు. అధ్యాపకుడు వెలమల అప్పారావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పాలకొండ

## దుకాణాల్లో ఆహార తనిఖీలు

సాలూరు, గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ, మండల పరిధిలోని పలు దుకాణాల్లో జిల్లా ఆహార తనిఖీ అధికారి వినోద్‌కుమార్ దాడులు నిర్వహించారు. ఆహార నమూనాలు సేకరించారు. నిషేధిత రంగులు, టేస్టింగ్ సాల్ట్ వంటివి వాడకూడదని వ్యాపారులకు సూచించారు. నాణ్యత పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు.

## చట్టపరమైన అంశాలు తెలియాలి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువు, చట్టపరమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలని శక్తి టీం జిల్లా ప్రతినిధి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం చినబొండపల్లి విద్యార్థినులకు పోలీసు చట్టం, దిశ, శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. జిల్లా శక్తి టీం మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండల వనరుల కేంద్రం వద్ద ఏపీటీఎఫ్ రూపొందించిన క్యాలెండర్‌ను ఎంఈవో డి.గౌరునాయుడు సోమవారం ఆవిష్కరించారు. నాణ్యమైన విద్యా ప్రమాణాలు పాటించి.. మంచి ఫలితాలు సాధిస్తే ప్రజలకు ప్రభుత్వ బడులపై విశ్వాసం కలుగుతుందన్నారు. సభ్యులు ఉన్నారు.

## కిక్ బాక్సింగ్‌లో సత్తా

పతకాలు సాధించిన క్రీడాకారులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర కిక్ బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. బి.మైథిలి, రుత్విక్, ముస్కన్, నీరజ్, ఎన్.ప్రసాద్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. బి.సాత్విక్, గౌతం, చందు, సాంబశివ వెండి పతకాలు సాధించారు. మోహిత్, మనోజ్ కాంస్య పతకాలు గెలిచినట్లు శిక్షకుడు అనిల్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు జి.ఆనందబాబు పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

## చిట్టి చేతులు.. పెద్ద సాయం

పాలకొండ గ్రామీణం: పాలకొండలోని సిరి పాఠశాల చిన్నారులు మానవత్వాన్ని చాటుకున్నారు. కొత్తవీధికి చెందిన మూడో తరగతి విద్యార్థిని ఆర్.తేజశ్రీ అగ్నిప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతోంది. వైద్యం కోసం నగదు అవసరమన్న విషయం తెలుసుకున్న చిన్నారులు రూ.44 వేలు విరాళం సేకరించగా.. ఉపాధ్యాయులు రవి, చంద్రశేఖర్, మన్మథరావు సోమవారం అందజేశారు.

## పండగ రోజుల్లో అప్రమత్తత అవసరం

దస్త్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ రాంబాబు వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న పండగ రోజుల్లో చోరీలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాల వద్ద రద్దీ లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాలకొండ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించాలని చెప్పారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ చూడాలని సీఐ ఆమిటి ప్రసాదరావును ఆదేశించారు. ఎస్సైలు ఉన్నారు.

## సహ చట్టంపై అవగాహన

పాలకొండ, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ పరిధిలోని సిబ్బందికి జిల్లా కేంద్రంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, పౌర సమాచారాధికారి కె.శ్రీనివాస్ సహ చట్టంపై సోమవారం అవగాహన కల్పించారు. అధికారుల విధులు, చట్టంలోని సెక్షన్లు, సబ్‌సెక్షన్లు, పౌర సమాచారం, అప్పీళ్లు, ప్రతి కార్యాలయంలోని రిజిస్టర్లు తదితరాలపై వివరించారు.

## అరటి చెట్లు నరికేశారు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: తన అర ఎకరం పొలంలోని అరటి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారని బిత్రపాడు గ్రామానికి చెందిన నీరస చంద్రకళ ఆవేదన వ్యక్తం చేశారు. కాపు కాసి గెలలతో ఉన్నాయని, చేతికి వచ్చే సమయంలో ఇలా చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

# రైతు బేజారు.. అభివృద్ధి లేక అవస్థలు

ఇటు రైతులకు గిట్టుబాటు ధర అందించాలని, అటు కొనుగోలుదారులకు తక్కువ ధరకు కూరగాయలు ఇవ్వాలనే ధ్యేయంతో 2000లో తెదేపా ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేసింది. గత వైకాపా హయాంలో అయిదేళ్లపాటు వీటి అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వంలో వీటికి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, వీరఘట్టం, సాలూరు, పాలకొండ**

జిల్లాలోని రైతులు వివిధ రకాల కూరగాయలను 8 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పార్వతీపురం, కొమరాడ, వీరఘట్టం, సీతంపేట, భామిని, జియ్యమ్మవలస, సాలూరు తదితర మండలాల్లో సాగు ఎక్కువ. పార్వతీపురం రైతు బజారును 2000లో ప్రారంభించారు. తొలుత 46 దుకాణాలు ఏర్పాటు అయ్యాయి. రైతులకు రాయితీ విత్తనాలు అందించడంతోపాటు నీటి ఇంజిన్లు ఉన్నవారికి కిరోసిన్ తక్కువ ధరకే ఇచ్చేవారు. శుద్ధజల ప్లాంటు ఏర్పాటు చేయాలని భావించినా తరువాత ప్రభుత్వం మారడంతో దాని ఊసే లేదు. ధరలు తెలియజేసే డిజిటల్ బోర్డు ఏర్పాటు చేసినా ఒక్కసారి కూడా అది పని చేసిన దాఖలాలు లేవు. క్రమంగా దుకాణాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయాయి. ★ వీరఘట్టం మార్కెట్ యార్డు వద్ద బజారు నిర్మాణానికి రూ.39 లక్షలు మంజూరైనా.. నిర్మాణానికి నోచుకోలేదు. ★ సాలూరు రైతు బజారు షెడ్లు పట్టణానికి దూరంగా నిర్మించడంతో కొనుగోలుదారులు అక్కడికి వెళ్లలేక కొన్నేళ్లుగా మూతపడి ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదు. ★ పాలకొండలో ఏర్పాటు చేయాలని భావించినా స్థల సేకరణ జరగక మధ్యలోనే ఆగిపోయింది.

పార్వతీపురంలో పనిచేయని డిజిటల్ బోర్డు, అధ్వానంగా షెడ్లు

### దృష్టి పెడుతున్నాం

రైతు బజార్ల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం. వీరఘట్టం, జిల్లా కేంద్రంలోనూ రైతు బజార్ల సమస్యలు పరిష్కరించేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతాం. వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడతాం. – **ఏసురాజు, ఏడీ**

**తవ్వకాల పరిశీలన..** **కొమరాడ:** గుమడ వద్ద ఉన్న చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని సీపీఎం మండల కన్వీనరు కొల్లి సాంబమూర్తి అధికారులకు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఉప తహసీల్దారు పకీరు, గనుసర్వే నంబర్లను పరిశీలించి, రైతుల నుంచి వివరాలు సేకరించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ల శాఖ అధికారులు పరిశీలించారు. దీనికి అధికార పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెదేపా మండల కన్వీనరు శేఖర్ పాత్రుడు చెప్పారు. కొంత మంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

## ఉద్యోగాలకు 33 మంది ఎంపిక

మాట్లాడుతున్న శ్యాంబాబ్

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ, జేకేసీ ఆధ్వర్యంలో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉద్యోగ మేళా జరిగింది. 107 మంది హాజరు కాగా ఇంటర్వ్యూలో 33 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యుడు ఎం.శ్యాంబాబ్ మాట్లాడుతూ.. నైపుణ్యాలు ఉన్న వారికి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. తమ భావాలను అనర్గళంగా చెప్పగలిగే నేర్పు ఉండాలన్నారు. ఉప ప్రధానాచార్యురాలు బి.జయమణి, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వంతరాం విద్యార్థి ప్రతిభ

**బలిజిపేట:** పార్వతీపురం బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి స్పెల్‌బీ ఆంగ్ల పోటీల్లో బలిజిపేట మండలం వంతరాం ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.అమూల్య రెండో స్థానం సాధించింది. ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, సిబ్బంది అభినందించి.. జ్ఞాపిక అందజేశారు.

## రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**కురుపాం గ్రామీణం:** కురుపాం మండలంలోని పులిపట్టి, గోనుగూడ గ్రామాల రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్‌కుమార్ నాయకో సోమవారం శంకుస్థాపన చేశారు. తెదేపా మండల కన్వీనర్ కొండయ్య, నాయకులు, ఏఈ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు సాయం

**భామిని, న్యూస్‌టుడే:** పోలవరంలో ఇటీవల కద్రక అక్కమ్మ ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు సోమవారం రూ.పదివేలు విలువైన సరకులు అందజేశారు.

## గిరిజనులకు రూ.వేలల్లో కరెంటు బిల్లులా?

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలం డొకిశీల పంచాయతీలోని 16 గ్రామాలను అలానే కొనసాగించాలని గిరిజన సంఘ నాయకుడు రాము తదితరులు డిమాండు చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మాట్లాడారు. అందరం కలిసి ఉంటామని చెప్పారు. మరోపక్క కొండశిఖర నయ పంచాయతీ గూడ్డాం గ్రామానికి చెందిన గిరిజనులు విద్యుత్తు బిల్లుల మోతపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గూడ్డాం, సంకేసు పరిధిలో 300 కుటుంబాలు పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 7 ఏళ్ల కిందట ఎస్టీలకు ఉచిత కరెంట్ అని చెప్పారు. అప్పటి నుంచి తమ ప్రాంతంలో ఎవరూ చెల్లింపు చేయలేదని, రెండు నెలలు నుంచి విద్యుత్తు బిల్లులు చెల్లించాలని సిబ్బంది గ్రామానికి వచ్చి చెబుతున్నారని తెలిపారు. దాశరథి అనే వ్యక్తికి రూ.21,574 బిల్లు వచ్చిందని చూపించారు. ఇంట్లో రెండు బల్బులు, రెండు పంకాలు ఉన్నా కొంతమందికి రూ.2 వేలు చొప్పున బిల్లులు వచ్చాయని వాపోయారు.


రూ.వేలల్లో వచ్చిన విద్యుత్తు బిల్లులు చూపుతున్న గూడ్డాం గ్రామస్థులు

## రైతులే.. గండి పూడ్చించారు

పనులు చేయిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: నాగావళి పాత కుడి కాలువ పూడికతో నిండింది. సాగునీరు సక్రమంగా దిగువ భూములకు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరువెంట సైఫన్, శివ్వాం బొంగువానిబంద వద్ద పూడికతో నీరందడం లేదు. దీంతో రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు కదిలారు. రావుపల్లి మదుము వద్ద పడిన గండిని జేసీబీ సాయంతో పూడ్చించారు. కొత్తూరుకు చెందిన మాజీ ఎంపీపీ డి.ధనుంజయరావు, సాగునీటి సంఘం టీసీలు డి.భగవన్‌నాయుడు, దత్తి సత్యంనాయుడు, బి.సింహాచలం, లాస్కరు తదితరులు ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సాగునీటి కాలువ సమస్యలకు పరిష్కారం చూపాలని కర్షకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వివరణ కోసం ఇరిగేషన్ ఏఈ రమణకు 'న్యూస్‌టుడే' పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు.

## యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

పాలకొండ, న్యూస్‌టుడే: రబీ పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని జిల్లా వనరుల కేంద్ర సమన్వయకర్త బి.శారద పేర్కొన్నారు. పాలకొండ డివిజన్ పరిధిలోని మండలాల వీఏఏ, వీఎస్‌ఏ, వీహెచ్‌ఏలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. సరైన మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని పేర్కొన్నారు. అధిక మొత్తంలో వినియోగిస్తే భూసారం తగ్గుతుందని రైతులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి సృజన, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త అమృతవీణ, కె.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

## సమన్వయంతో పనిచేద్దాం

తేజోవతిని సత్కరిస్తున్న తెదేపా నాయకులు

వీరఘట్టం, న్యూస్‌టుడే: కంబర గ్రామంలో తోటపల్లి ప్రాజెక్టు ఛైర్మన్ పొదిలాపు విజయరమణి, తెదేపా సీనియర్ నేత కృష్ణమూర్తి నాయుడు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలితకుమారిని అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు తేజోవతి సోమవారం కలిశారు. అందరి సహకారం తీసుకొని పార్టీ అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దామని చెప్పారు. బూత్‌స్థాయి నుంచి తెదేపాను బలోపేతం చేసేందుకు ప్రణాళికాయుతంగా కృషి చేస్తానని తెలిపారు. ★ పాలకొండ గ్రామీణం: పాలకొండ తెదేపా నాయకులను తేజోవతి కలిశారు. పార్టీ నియోజకవర్గ బాధ్యురాలు పి.భూదేవి, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పల్లా కొండలరావు తదితరులు ఆమెను సత్కరించారు.

## ముడి సరకు విక్రయిస్తే చర్యలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: నాటుసారా తయారీలో వినియోగించే బెల్లం, ఇతర ముడి సరకును విక్రయించే వర్తకులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. కురుపాం మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ ఏడాదిలో నల్ల బెల్లం సరఫరా చేసిన అయిదుగురు వ్యాపారులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని, 14 మంది బెల్లం వర్తకులను బైండోవర్ చేసి, సొంత పూచీకత్తుపై అపరాధ రుసుము కింద రూ.45,000 వసూలు చేసినట్లు తెలిపారు. ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు


**ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ**
పార్వతీపురం మన్యం జిల్లా శాఖ, పార్వతీపురం, 535501

ఐ ఆర్ సీ ఎస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వారు ఆర్ఈసి ఫౌండేషన్ సహకారంతో పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు సంవత్సరాల కాలానికి అమలు చేయనున్న "మీ ఇంటికి - మీ డాక్టర్" ప్రాజెక్టు కోసం క్రింది పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.

డాక్టర్ - అర్హత: MBBS/MD, నెలవారీ వేతనం: రూ. 80,000/-
నర్స్ - అర్హత : GNM/B.Sc, నెలవారీ వేతనం: రూ. 25,000/-
ఫార్మసిస్ట కం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ -
అర్హత: B.Pharma/Diploma in Pharmacy,
నెలవారీ వేతనం: రూ. 18,000/-
డ్రైవర్ - అర్హత: భారీ వాహనాల డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి, కనీసం ఐదు సంవత్సరాల అనుభవం అవసరం.
నెలవారి వేతనం: రూ 18,000/-

ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, పార్వతీపురం మన్యం జిల్లా నందు సమర్పించవలసిందిగా కోరడమైనది.
For Queries: ircsparvathipuram@gmail.com

డా. యన్. ప్రభాకర రెడ్డి, ఐ.ఏ.యస్.,
జిల్లా కలెక్టర్ మరియు ప్రెసిడెంట్
IRCS, పార్వతీపురం మన్యం జిల్లా


(c) eenadu

# ఈనాడు

ఒంగోలు 30-12-2025 మంగళవారం సిటీ సంపుటి 24 సంచిక 180
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Ongole, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Mahaboobnagar, Chennai, Bengaluru

(c) eenadu

# చెలరేగిన బ్యాటర్లు.. ప్రేక్షకుల కేరింతలు!

ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు 'ఈనాడు' వేదిక మంచి అవకాశమని శ్రీ విష్ణు యమహా షోరూం మేనేజర్(ఒంగోలు) ఎస్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కళాశాల క్రీడా మైదానంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. క్విస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(ఒంగోలు), రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ కళాశాల), ప్రభుత్వ జూనియర్ కళాశాల(కొండపి) జట్లు గెలుపొందాయి. రెండు మ్యాచ్‌ల్లో బ్యాటర్లు పరుగుల వరద పారించారు. అవకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. వీలుదొరికినప్పుడల్లా బాల్ బౌండరీ దాటింది. మ్యాచ్ తిలకించిన వారికి చక్కటి ఉత్సాహాన్ని నింపారు.

–న్యూస్‌టుడే, సంతనూతలపాడు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీ విష్ణు యమహా షోరూం మేనేజర్ (ఒంగోలు) ఎస్.బ్రహ్మయ్య

Medical Partner
వెంకటరమణ నర్సింగ్ హోమ్ (ప్రై) లిమిటెడ్ SINCE 1969 CARING YOUR LIFE

క్రీడాకారుడికి వైద్య సేవలు అందిస్తున్న వెంకటరమణ నర్సింగ్ హోమ్ సిబ్బంది

విజయకేతనం చూపుతున్న క్విస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఒంగోలు)జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

సాయిరెడ్డి

**అవకాశమివ్వని బౌలర్లు..:** క్విస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఒంగోలు) జట్టు ఆంధ్రకేసరి విద్యాకేంద్రం డిగ్రీ అండ్ పీజీ కళాశాల(ఒంగోలు) జట్టుపై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత ఆంధ్రకేసరి జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగింది. 9.5 ఓవర్లకు కేవలం 10 వికెట్లు కోల్పోయి 37 పరుగులు మాత్రమే చేసింది. ప్రత్యర్థి క్విస్ బౌలర్ల దాటికి అభిషేక్ 14 బంతుల్లో 14 పరుగులు మినహా ఏ ఒక్కరు రెండంకెల స్కోర్‌ను చేయలేకపోయారు. బౌలింగ్‌లో సాయిరెడ్డి 1.5 ఓవర్లకు 6 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీయగా, చరణ్ 2 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌కు దిగిన క్విస్ జట్టు 5.1 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 38 పరుగులు చేసి గెలుపొందింది. వినయ్ 4 బంతుల్లో 11 పరుగులు, హుస్సేన్ షేక్ 15 బంతుల్లో 10 పరుగులు చేశారు. 3 వికెట్లు తీసిన సాయిరెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

గెలుపొందిన రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ కళాశాల) జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

మల్లేష్

**దంచికొట్టిన ట్రిపుల్ఐటీ మల్లేష్..:** రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ(ట్రిపుల్ ఐటీ కళాశాల) జట్టు బ్యాటింగ్, బౌలింగ్‌లో చక్కని ప్రతిభ చాటి ప్రత్యర్థి జట్టు రైజ్ కృష్ణ సాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌పై 61 పరుగుల తేడాతో విజయం సాధించింది. ట్రిపుల్ ఐటీ కళాశాల జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 10 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 102 పరుగుల భారీ స్కోర్ చేసింది. మల్లేష్ 37 బంతుల్లో 57 పరుగులతో చెలరేగాడు. రాము యాదవ్ 14 బంతుల్లో 23 పరుగులు చేశారు. వెంటనే బరిలోకి దిగిన రైజ్ ప్రకాశం జట్టు 10 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 41 పరుగులు మాత్రమే చేసింది. మల్లేష్ 2 వికెట్లు తీశారు. 57 పరుగులు, 2 వికెట్లు తీసిన మల్లేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

**ఉతికేసిన కొండపి అభిలాష్..:** బ్యాట్‌తో, బౌలింగ్‌లోనూ రాణించి ప్రభుత్వ జూనియర్ కళాశాల(కొండపి) జట్టు గౌతమి జూనియర్ కళాశాల(యర్రగొండపాలెం)పై 17 పరుగుల తేడాతో గెలుపొందింది. గౌతమి జూనియర్ కళాశాల టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లకు 10 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసింది. అభిలాష్ 24 బంతుల్లో 44 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో గౌతమి క్రీడాకారుడు తరుణ్‌నాయక్ 3 వికెట్లు తీశాడు. వెంటనే బ్యాటింగ్‌కు దిగిన గౌతమి కళాశాల జట్టు 10 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 80 పరుగులు మాత్రమే చేసింది. నరేంద్ర 20 బంతుల్లో 20 పరుగులు, శివశంకర్ 11 బంతుల్లో 14 పరుగులు చేశారు. బౌలింగ్‌లో సీహెచ్ జాన్ 2 వికెట్లు తీశారు. 44 పరుగులు చేసిన అభిలాష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

అభిలాష్

విజయానందంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల (కొండపి) జట్టు

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life
Gift Partner
KL UNIVERSITY (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor
City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor
QIS EDUCATIONAL INSTITUTIONS ONGOLE
Digital Partner
ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner
ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు క్రీడాకారులకు

పొగాకు బోర్డు, గుంటూరు
వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య విభాగము, భారత ప్రభుత్వము (ఐ.యస్.ఓ.9001:2015 గుర్తింపు పొందిన సంస్థ)
జి.టి. రోడ్డు, గుంటూరు-522004. ఫోన్ : 0863-2358399, 2358499.

టెండరు నోటీసు

2025-26 FCV పొగాకు ఆక్షన్స్ కొరకు ఆంధ్రప్రదేశ్‌లో గల పొగాకు బోర్డు వేలం కేంద్రాల వద్ద 1) పొగాకు బేళ్ళను హ్యాండిల్ చేయుటకు మరియు 2) ట్రాలీస్ మరమ్మత్తులు/ సర్వీసింగు కొరకు అనుభవము కలిగిన కాంట్రాక్టర్లు మరియు ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.
పైన తెలుపబడిన పనుల కొరకు టెండరు ఫారములు తదితర వివరముల కొరకు రీజినల్ మేనేజరు, ఒంగోలు, రాజమండ్రి మరియు మేనేజరు(ఆక్షన్స్), పొగాకు బోర్డు, గుంటూరు వారిని సంప్రదించగలరు. టెండరు ఫారములు మరియు నియమ నిబంధనలు పొగాకు బోర్డు వెబ్‌సైట్ (www.tobaccoboard.com) నుండి కూడా పొందవచ్చును.
పైన తెలుపబడిన పనుల నిమిత్తము పూర్తి చేసిన టెండరు ఫారాలను టెండరు నియమ నిబంధనలలో తెలిపిన ధరావతు సొమ్ముతో సహా తేది.21-01-2026 సాయంత్రం గం॥ 3.00 లలోగా పొగాకు బోర్డు, గుంటూరు నందు టెండరు బాక్సులో డిపాజిట్ చేయవలెను. అసంపూర్తిగా ఉన్న టెండర్లు తిరస్కరించబడును మరియు ఏ విధమైన కారణం చూపకుండానే స్వీకరించిన టెండర్లలో ఏదైనా లేదా అన్నింటిని తిరస్కరించేందుకు కార్యనిర్వహణాధికారి, పొగాకు బోర్డు వారు సర్వహక్కులు కలిగియున్నారు.
స్థలము : గుంటూరు, తేది: 29-12-2025 సం/- కార్యదర్శి

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎం. బ్రాంచ్
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ✆ 7901626759

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.
సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 17.01.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 17.01.2026, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 16.01.2026, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

1 ఋణగ్రహీతలు: 1) M/s శ్రీ లక్ష్మి గ్రానైట్ ఇండస్ట్రీస్, ప్లాట్ నెం.319, గుండ్లపల్లి, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా-523211. 2) శ్రీమతి అందె లక్ష్మి, భర్త: శ్రీ అందె వెంకటనరసింహారావు, 8-482, నిర్మల్ హైట్స్ అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం.401, నిర్మల్ నగర్ పార్క్, లాయర్స్‌పేట, ఒంగోలు. హామీదారు : శ్రీ అందె వెంకట నరసింహారావు, తండ్రి: లేటు శ్రీ రామారావు, 8-482, నిర్మల్ హైట్స్ అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం.401, నిర్మల్ నగర్ పార్క్, లాయర్స్‌పేట, ఒంగోలు.
బకాయి మొత్తం: రూ. 3,03,06,214/- తేది. 30.11.2025 నాటికి + తేది. 01.12.2025 నుండి తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.
బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :
ఆస్తి నెం-1: ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం, అన్నంగి గ్రామం, సర్వేనెం. 270 మరియు 271, ఫ్లాట్ నెం. 319 లో 2700.56 చ॥గ॥ల విస్తీర్ణంలోని గ్రానైట్ ఫ్యాక్టరీ యావత్తు ఆస్తి శ్రీమతి అందె లక్ష్మి, భర్త: శ్రీ అందె వెంకట నరసింహారావు పేరున కలదు. హద్దులు: ఉత్తరం: ఫ్లాట్ నెం.318, దక్షిణం: ఫ్లాట్ నెం.320, తూర్పు: ప్రస్తుతం ఉన్న 30 మీ॥ వెడల్పు రోడ్డు, పడమర: ఫ్లాట్ నెం. 316.
రిజర్వు ధర: రూ. 81,57,000/- ధరావత్తు సొమ్ము: రూ. 8,15,700/-
ఆస్తి నెం-2: ఒంగోలు, ముక్తినూతలపాడు, సర్వే నెం. 256/1, ఫ్లాట్ నెం. 69 & 70 లో 480.00 చ॥గ॥ల ఖాళీ స్థలం శ్రీ అందె వెంకట నరసింహారావు పేరున కలదు. హద్దులు: ఉత్తరం: ఈదర వంశీకృష్ణ యొక్క ఫ్లాట్ నెం 71 – ఈ వైపు 72', దక్షిణం: 33 అ॥ల రోడ్డు – ఈ వైపు 72', తూర్పు: ఫ్లాట్ నెం. 86 – ఈ వైపు 60', పడమర: 30 అ॥ల రోడ్డు – ఈ వైపు 72'.
రిజర్వు ధర: రూ. 17,28,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,72,800/-
మెషినరీ
రిజర్వు ధర: రూ. 39,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.3,90,000/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626759. 9901574353.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051. ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com
తేది: 29.12.2025, ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

బహుమతి అందుకుంటున్న ముండ్లపాడు పాఠశాల విద్యార్థులు

## రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో మొదటి బహుమతి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో జిల్లాలోని గిద్దలూరు మండలం ముండ్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించింది. విద్యార్థులు ప్రవీణ్‌కుమార్, ఎస్వీ మణికంఠ, డి.రామాంజనేయులు బీఎఫ్ఎస్ఐ అంశంపై ప్రదర్శించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ప్రథమంగా నిలిచింది. విద్యార్థులకు రూ.25వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా జీసీడీవో హేమలత పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, వృత్తివిద్య శిక్షకులు బ్రహ్మయ్యను ఏపీసీ దాసరి అనిల్‌కుమార్ అభినందించారు.

## ఉపాధిహామీ చట్టం పరిరక్షణకు ఉద్యమం తప్పదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా ఉద్యమం ద్వారా ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు పిలుపునిచ్చారు. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పార్లమెంట్ ఆమోదం పొందిన బిల్లును వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాల హక్కులను లాక్కునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ మాట్లాడుతూ.. భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఏటా బడ్జెట్‌లో నిధుల కోత విధిస్తూ చట్టాన్ని నీరు గార్చుతోందన్నారు. ప్రజలను కదిలించడానికి ఐక్య కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశంలో వామపక్ష నాయకులు ఆర్.మోహన్, ఎం.ఎస్.సాయి, చుండూరి రంగారావు, పాశం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పసుపు.. సస్యరక్షణతో తెగుళ్ల అదుపు

న్యూస్‌టుడే, కంభం

పసుపు పంటకు చల్లని వాతావరణ పరిస్థితులు, అధిక తేమ శాతం ఉన్న సమయంలో తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ తెలిపారు. వాటి నివారణకు తగిన సస్య రక్షణ చర్యలు తీసుకుంటే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు.

**తాటాకు మచ్చ తెగులు..:** ఈదురు గాలులతో కూడిన వర్షాలు, గాలిలో ఎక్కువ తేమ, ఉష్ణోగ్రత తక్కువగా ఉండడంతో త్వరగా వ్యాపిస్తుంది. సెప్టెంబర్ నుంచి ఇది ఎక్కువగా వస్తుంది. అండాకారపు పెద్ద మచ్చలు ఆకులపై అక్కడక్కడా కనిపిస్తాయి. మచ్చలు ముదురు గోధుమ రంగులో ఉంటాయి. చుట్టూ పుసుపు రంగు వలయం ఏర్పడుతుంది. ఆకు కాడపై మచ్చలు ఏర్పడి కిందకు ఆకు వాలుతుంది. మచ్చలు ఉన్న ఎండిన ఆకులను తొలగించి కాల్చివేయాలి. లీటర్ నీటికి 1 గ్రా. కార్బండిజిమ్ లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ అర్ధ మి.లీ. సబ్బు నీరు లేదా థయోఫనేట్ మిథైల్ 1 గ్రా. లేదా కార్బండిజిమ్, మాంకోజెబ్ లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. కలిపి ఉన్న మందులను సెప్టెంబర్ నుంచి 3, 4 సార్లు పిచికారీ చేయాలి.

**దుంప కుళ్లు..:** నివారణకు లీటర్ నీటికి 3 గ్రా. మెటలాక్సిల్ లేదా మాంకోజెబ్, 2 మి.లీ. మోనోక్రోటోఫాస్ లీటర్ నీటితో కలిపిన ద్రావణంలో కొమ్ములను 30 నుంచి 40 నిమిషాలు నానబెట్టి తర్వాత నీరు మార్చి లీటర్ నీటికి 5 గ్రా. ట్రైకోడెర్మా విరిడి కలిపి ఆ ద్రావణంలో 30 నిమిషాలు ఉంచి నీడలో ఆరబెట్టి నాటుకోవాలి. పంట మార్పిడి చేస్తే ప్రయోజనం ఉంటుంది. దుంపలు విత్తిన తర్వాత జీలుగ, జనుము, వేప, కానుగ మొదలైన పచ్చి ఆకులు లేదా ఎండు వరిగడ్డి, చెఱకు ఆకులను పొలంపై మొలకలు వచ్చేంత వరకు కప్పడం వల్ల తెగులు ఉద్ధృతిని తగ్గించవచ్చు.

సాగులో ఉన్న పసుపు పంట

**ఆకుమచ్చ..:** తాటాకు మచ్చ తెగులు సూచించిన కారణాలతోనే ఆకు మచ్చ రోగం వస్తుంది. ఆకులపై చిన్న చిన్న పసుపు రంగు చుక్కలు ఏర్పడతాయి. తర్వాత చిన్నపాటి గోధుమరంగు మచ్చలుగా మారతాయి. తెగులు ఎక్కువైతే ఆకు మాడిపోతుంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ తెగులు ఎక్కువగా వస్తుంది. నివారణకు వ్యాధి సోకిన ఆకులను కత్తిరించి నాశనం చేయాలి. తాటాకు మచ్చ తెగులుకు సూచించిన మందులతో పాటు 1 మి.లీ. ప్రోపికొనజోల్ లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

**ఎర్రనల్లి..:** దీని నివారణకు గంధకం 3 గ్రా. లీటర్ నీటికి కలిపి ఆకుల అడుగు భాగం తడిచేటట్లు ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

మీ కోసం

## మామిడికాయల రక్షణకు రాయితీపై కవర్లు!

న్యూస్‌టుడే, రాచర్ల

మామిడి పండ్లకు కవర్లు వాడడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని గిద్దలూరు, కంభం ఉద్యాన శాఖ అధికారిణి శ్వేత తెలిపారు. వాటిని ఉద్యాన శాఖ రాయితీపై రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. హెక్టారుకు రూ.25 వేలు అందజేస్తున్నట్లు చెప్పారు. వాటిని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కీటక దాడుల నుంచి పండ్లు దెబ్బతినకుండా ఉంటుంది. ఆంత్రోకోన్స్, పౌడరే మిడ్యే వంటి ఫంగల్ రోగాల ప్రభావం తగ్గుతుంది. కాయలకు కవర్లు ఉండడం వల్ల మందుల పిచికారీ తక్కువగా ఉంటుంది. దాంతో రైతులకు ఖర్చు తగ్గుతుంది. పండ్లపై మచ్చలు ఏర్పడకుండా, సమానమైన రంగుతో మంచి ఆకారంతో కాయలు వస్తాయి. అధిక వేడితో పండ్లు దెబ్బతినకుండా ఉంటాయి. పక్షులు కొరకకుండా ఉపయోగపడతాయి. ఎగుమతికి అనుకూలంగా మారతాయి. ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ సాధించడానికి ఉపయోగపడతాయి.

మామిడి కాయలకు కట్టిన కవర్లు

**గోళీల పరిమాణంలో ఉన్నప్పుడే వేయాలి..**

మామిడి కాయలు గోళీల పరిమాణంలో ఉన్నప్పుడే కవర్లు వేయాలి. సాధారణంగా డిసెంబర్, జనవరి మొదటి వారంలో పిందెలు వస్తాయి. కవర్లు వేయడానికి ముందస్తుగా ఒకసారి ఫంగిసైడు, ఇన్‌సెక్టిసైడ్ మందులు స్ప్రే చేసిన రెండు, మూడు రోజుల తర్వాత కవర్లు వేయాలి. తడి లేకుండా కాయ ఎండిపోయిన తర్వాతే కవర్లు వేయాలి. గాలి వెళ్లేలా కింది భాగంలో చిన్నరంధ్రాలు ఉన్న కవర్లను వాడాలి. ఆలస్యం చేసి కాయ బాగా పెరిగిన తర్వాత కవర్ వేస్తే పెద్దగా ఫలితం ఉండదు.

రైతేరాజు

## సేంద్రియ సేద్యం... లాభాలు తథ్యం!

ఒంగోలుకు చెందిన సింగంనేని రాధ అనే మహిళా రైతు కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామంలో ఎకరా భూమిని కౌలుకి తీసుకొని సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. అందుకుగాను చేస్తున్న కృషిని ఆమె మాటల్లోనే తెలుసుకుందాం. –న్యూస్‌టుడే, కొత్తపట్నం

ప్రకృతి సాగు విధానంలో వేసిన పంటలు

భూమిని ముందుగా దుక్కి దున్నించి సారం పెంచేందుకు పీఎండీఎస్(పంటకాలానికి ముందు నేలను సిద్ధం చేయడం) ద్వారా 30 రకాల విత్తనాలను పొలంలో చల్లాం. 40 రోజులు పూర్తయిన తరువాత వాటిని కలియ దున్నాం. ప్రధాన పంటలుగా వేరుశనగతో పాటు జొన్న, అలసంద, పొద్దుతిరుగుడు, సజ్జ సాగు చేపట్టాం. దీంతోపాటు నిరంతరం ఆదాయం వచ్చేలా అంతర పంటలుగా టమోటా, మిర్చి, వంగ, బెండ, గోరు చిక్కుడు, గోంగూర, చుక్కకూర, పాలకూర, మెంతుకూర, కొయ్యతోటకూర తదితర కూరగాయలు, ఆకుకూరల పంటలు వేశాం. వీటన్నింటికీ వారానికి ఒక సారి జీవామృతం, కషాయాలు తగిన మేరకు అందిస్తున్నాం. తద్వారా పంటలకు చీడపీడలు రాకుండా నివారిస్తున్నాం. మొత్తం అన్నింటికీ రూ.15 వేలు పెట్టుబడి అయింది. సేంద్రియ విధానంలో పండించిన ఉత్పత్తులైనందు వల్ల కూరగాయలు, ఆకు కూరలను తోట వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఇంకా మిగిలిన కూరగాయలను సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో మీకోసం కార్యక్రమం వద్ద విక్రయిస్తున్నాం. ప్రతి నెలా ఖర్చులు పోనూ రూ.12 వేలు ఆదాయం వస్తున్నట్లు ఆమె తెలిపారు.

## సమస్య-పరిష్కారం

**సమస్య :** మా గేదెలో తరచూ ఎద లక్షణాలు కనిపిస్తున్నాయి. కారణం ఏమిటి? నివారణ చర్యలు సూచించండి. –నరసింహులు, తురిమెళ్ల

**సమాధానం:** గేదెలో హార్మోన్ల అసమతుల్యం వల్ల ఎద లక్షణాలు చూపిస్తాయి. పశువైద్యుని సంప్రదించి చికిత్స చేయించాలి.

**సమస్య :** మా పెరటి కోళ్లలో నట్టల బెడద అధికంగా ఉంది. దాన్ని ఎలా నివారించాలి?

– సుబ్బయ్య, తురిమెళ్ల

**సమాధానం:** పెరటి కోళ్లలో నట్టలను నివారించేందుకు పైపరిజీన్ ఓరల్ పౌడర్‌ను నీటిలో కలిపి తాపాలి. పైపరిజీన్ పౌడర్ ఒక గ్రామును 100 మిల్లీ లీటర్ నీళ్లలో కలిపిన మిశ్రమం 100 కోళ్లకు సరిపోతుంది.

శ్రీధర్, పశువైద్యాధికారి, తురిమెళ్ల

–న్యూస్‌టుడే, బేస్తవారపేట గ్రామీణం

## ఉత్సాహంగా పాలిటెక్నిక్ విద్యార్థుల క్రీడా పోటీలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో భాగంగా రీజనల్ స్థాయి పోటీలు సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సత్ర శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన పోటీలను నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి తోడ్పడతాయన్నారు. దీని వల్ల విద్యార్థుల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుందన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. మంగళవారం ముగింపు కార్యక్రమానికి టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జి.గణేష్‌కుమార్, జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. తొలిరోజు ప్రారంభంలో ఇందిరా ప్రియదర్శిని, పేస్ కళాశాల మధ్య కబడ్డీ, డీఏ పాలిటెక్నిక్, అద్దంకి కళాశాల మధ్య వాలీబాల్ పోటీలు జరగ్గా విద్యార్థులు ఉత్కంఠగా తిలకించారు. అథ్లెటిక్స్ పోటీలను [illegible] ప్రాంగణంలో నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశంలోని పది కళాశాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. జనవరిలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు, కందుకూరు, అద్దంకి, చీరాల లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించి పోటీలను ప్రారంభిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు

## లక్ష్యం మేర రుణాలు మంజూరు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యం మేర రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేయాలని లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. అందుకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు జిల్లాలో రూ.25.45 వేల కోట్ల రుణ లక్ష్యం కాగా, అందులో ఇప్పటివరకు రూ.16.50 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. పీఎంఈజీపీ కింద వచ్చిన 102 దరఖాస్తులను పరిశీలించి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. సీఎస్ఆర్ భాగంగా ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పనకు ముందుకు రావాలన్నారు.

**ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)**

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 142, రిటైల్ లైవ్ - 169, చికెన్ విత్ స్కిన్ - 245, చికెన్ స్కిన్‌లెస్- 279

## వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

కనిగిరి, న్యూస్‌టుడే: తెలుగుదేశం నాయకులందరూ సమన్వయంతో ముందుకు సాగి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని ఒంగోలు పార్లమెంట్ తెదేపా అధ్యక్షులుగా నియమితులైన కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాల్లోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్లు, సీనియర్ నాయకులు సోమవారం రాత్రి కనిగిరిలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ అందరూ ఒకే మాటపై నిలబడి పేదలకు సేవ చేద్దామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారికి హితవు పలికారు. ఆయన్ను కలిసిన వారిలో జిల్లాలోని వివిధ మార్కెట్ యార్డులకు చెందిన వారు ఉన్నారు.

ఒంగోలు పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు ఉగ్ర నరసింహారెడ్డిని సన్మానించిన వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్లు

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి క్లినిక్

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. స్థానిక ప్రకాశం భవన్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌ను సోమవారం ప్రారంభించారు. పీజీఆర్ఎస్‌లో ఎక్కువగా రెవెన్యూ ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. ముందుగా జిల్లా స్థాయిలో నెల రోజుల పాటు నిర్వహించిన అనంతరం డివిజన్ స్థాయిలో ఈ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను ఈ క్లినిక్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఓబులేసు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఎస్‌డీసీలు శ్రీధర్‌రెడ్డి, కుమార్, జాన్సన్, కళావతి, విజయజ్యోతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరించారు. మొత్తం 399 అర్జీలు రాగా, అందులో రెవెన్యూ అంశాలపై 146 దరఖాస్తులు వచ్చాయి.

రెవెన్యూ క్లినిక్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, అధికారులు

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

Wanted: Administration Staff - 2, Food Products Marketing Executives - 2. Contact: 97034 02722

కేర్‌టేకర్ ముస్లిం మహిళ కావలెను. సీనియర్ సిటిజన్‌ని చూసుకోవటానికి & సర్వీసు చేయటానికి మాత్రమే కావలెను. కందుకూరు. Ph: 9398058081

ప్రముఖ హోటల్‌లో పనిచేయుటకు రూమ్ బాయ్స్ కావలెను. భోజనం వసతి సదుపాయం కల్పించబడును. సంప్రదించండి. ఫోన్: 9966846756, 7801062777.

కుంకుపాడు అద్దంకి చుట్టుప్రక్కల పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం॥ డ్యూటీ, భోజనం + రూమ్ కలదు. 9149986335, 9652689259.

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

ఒంగోలు, మంగమూరు రోడ్డులోని నారాయణ పబ్లిక్ స్కూలు నందు 6 to 8th వరకు తెలుగు & కంప్యూటర్ టీచర్ కావలెను. ✆ 9704363262. సమతా నగర్‌లోని శ్రీ గాయత్రి గ్రామర్ స్కూలు నందు 3rd to 5th వరకు గ్రాడ్యుయేట్ లేడీ టీచర్లు కావలెను. ✆ 9014404155

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్ర. ✆ 89784 80429.

DRIVERS

బాక్స్ ఆటోకి- 2 డ్రైవర్లు కావలెను. అనుభవం, లైసెన్స్, బ్యాడ్జ్ కలిగి ఉండవలెను. ✆ 97034 02722

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు ప్రకాశం
మంగళవారం 30 డిసెంబరు 2025


## డీసీఎంఎస్‌లో అక్రమాలపై విచారణకు ఆదేశం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)పై సెక్షన్ 51 విచారణకు కలెక్టర్ రాజాబాబు ఆదేశాలిచ్చారు. విచారణాధికారిగా సబ్ డివిజినల్ కోఆపరేటివ్ అధికారి డి.శ్రీనివాసరావును నియమించారు. గత వైకాపా ప్రభుత్వంలో సొసైటీలో భారీగా అక్రమాలు జరిగాయి. ఎరువుల విక్రయాలు, సొసైటీ స్థలాన్ని తక్కువ అద్దెకు లీజుకివ్వడం, రైతులు చెల్లించిన డబ్బులను సిబ్బంది కాజేయడం, నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరపడం తదితర అక్రమాలు జరిగాయి. గతంలో ఒకసారి విచారణ జరిపినప్పటికీ అక్రమాలు నిగ్గు తేలలేదు. నాటి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల జోక్యంతో అక్రమార్కులపై చర్యలు లేకుండా పోయాయి. దీనిపై కూటమి ప్రభుత్వం వచ్చాక వాస్తవాలను వెలికితీసి సొసైటీకి జరిగిన నష్టాన్ని తిరిగి రికవరీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కలెక్టర్ ఆదేశాలతో డీసీవో విచారణకు ఉత్తర్వులిచ్చారు.

## కార్యదర్శులకు నోటీసులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలకు చెందిన ఇంటి పన్నులు, పాత బకాయిలు వసూలులో కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలు వైఫల్యంపై జిల్లాలోని 27 మంది పంచాయతీ కార్యదర్శులతోపాటు డిప్యూటీ ఎంపీడీవోలకు సంజాయిషీ నోటీసులు జారీ చేసినట్లు డీపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. నోటీసు అందిన మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# కొత్త ఏడాది కానుక!

◆ మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదముద్ర
◆ దర్శి నియోజకవర్గమంతా ప్రకాశం జిల్లాలోనే కొనసాగింపు

తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతమున్న మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాలతో నూతన జిల్లా ఏర్పాటు కానుంది. జనవరి 1వ తేదీ నుంచి కొత్త జిల్లాలు ఏర్పాటవుతాయని మంత్రివర్గం స్పష్టం చేసింది. ఈ మేరకు తుది నోటిఫికేషన్ వెలువరించనుంది.
- ఈనాడు, ఒంగోలు

వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక జిల్లాగా ఏర్పాటైతే పరిపాలన ప్రజలకు చేరువ కావడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు అందనున్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు మార్కాపురం పర్యటనకు వచ్చినప్పుడు జిల్లా ఏర్పాటుతోపాటు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఓవైపు వచ్చే ఏడాది జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని లక్ష్యం పెట్టుకుని పనులు చేస్తుండగా, మరోవైపు జిల్లాకు ఆమోద ముద్ర లభించడంపై హర్షం వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న తమ కల ఫలించినందుకు ఆనందంగా ఉందని పశ్చిమ ప్రకాశం వాసులు చెబుతున్నారు.

### మేం ప్రకాశంలోనే ఉంటాం

దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చడంపై మార్కాపురం ప్రాంతం నుంచి తప్ప అక్కడి నుంచి ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ప్రకాశం జిల్లాలో ఉండేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ప్రభుత్వం నవంబరు 27న ప్రకటన ఇచ్చి డిసెంబరు 27వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించింది. ఏ ప్రాంతం నుంచి అభ్యంతరాలు పెద్దగా రాలేదు. మార్కాపురం వాసులు మాత్రం దొనకొండ, కురిచేడు మండలాలను కొత్త జిల్లాలో కలపాలని కోరారు. కనీసం ఆ రెండు మండలాల వాసులు కూడా కోరకపోవడంతో దర్శి నియోజకవర్గం మొత్తాన్ని ప్రకాశం జిల్లాలోనే కలిపారు.

### ఇప్పటికే భవనాల పరిశీలన

జిల్లా ఉన్నతాధికారులు జిల్లా కేంద్రం మార్కాపురంలో ఏయే భవనాలు అందుబాటులో ఉన్నాయో పరిశీలించారు. ఇప్పుడున్న సబ్ కలెక్టర్ కార్యాలయం, ఆర్అండ్‌బీ భవనాలు, పట్టు పరిశ్రమకు చెందిన కార్యాలయాలను పరిశీలించారు. పట్టణంలోని కళాశాలలను చూశారు. తుది నోటిఫికేషన్ వచ్చిన అనంతరం ఎక్కడ ఏయే కార్యాలయాలు పెట్టాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు.

**మార్కాపురం జిల్లా స్వరూపం**
నియోజకవర్గాలు: 04
మండలాలు: 21
రెవెన్యూ డివిజన్లు: 02
జనాభా: 11.42 లక్షలు

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో భాగంగా ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం రీజనల్ స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పది కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో తొలి రోజు కబడ్డీ, వాలీబాల్ అథ్లెటిక్ పోటీలు ఉత్కంఠంగా సాగాయి. సెయింట్ ఆన్స్, ప్రకాశం పాలిటెక్నిక్ కళాశాలల మధ్య జరిగిన కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులను చిత్రంలో చూడొచ్చు.
-న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

# జిల్లా వస్తోంది... అక్రమం వెలుస్తోంది!

◆ ఖాళీ స్థలాల్లో అనధికార లేఅవుట్లు
◆ పశ్చిమ ప్రకాశంలో అక్రమార్కుల దందా

మార్కాపురం జిల్లా ఆవిర్భావం పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల కోరిక. ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేరుస్తున్న తరుణంలో కొంత మంది అక్రమార్కులు ఎటువంటి అనుమతుల్లేకుండా రాత్రికి రాత్రే లేఅవుట్లు సిద్ధం చేసి ప్లాట్లను అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. నిబంధనలను పట్టించుకోకుండా ఖాళీ స్థలాలను లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. అధికారులు కంటి తుడుపు చర్యలుగా రెండు, మూడు అనధికార లేఅవుట్లను పరిశీలించి తొలగించినా పదుల సంఖ్యలో పుట్టుకొస్తుండడం గమనార్హం.
- న్యూస్‌టుడే, మార్కాపురం

జిల్లా కేంద్రంగా మారబోతున్న మార్కాపురం పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో అనధికార లేఅవుట్లు వెలుస్తున్నాయి. నియోజకవర్గంలోని పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు, మండలాలతో పాటు యర్రగొండపాలెం, గిద్దలూరు ప్రాంతాల్లోను అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. జాతీయ రహదారులు- 544, 565కిరువైపుల అనధికార వెంచర్లు వెలుస్తున్నాయి.

● మార్కాపురం పట్టణంలోని మార్కాపురం- తర్లుపాడు రహదారి, మార్కాపురం- కళాశాల రహదారి, దరిమడుగు, మార్కాపురం- కంభం రహదారి, మార్కాపురం- ఒంగోలు రహదారి, మార్కాపురం- కొండేపల్లి రహదారుల్లో అధిక సంఖ్యలో నూతన వెంచర్లు వెలుస్తున్నాయి. అనుమతుల్లేని విషయం తెలియని ప్రజలు మాత్రం కొనుగోలు చేసి నష్టపోతున్నారు. మార్కాపురం డివిజన్‌లో 2023, జనవరి నుంచి 2025, ఆగస్టు వరకు ఆన్‌లైన్‌లో రెవెన్యూ అధికారులకు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు కోసం 284 దరఖాస్తులొచ్చాయి. అనుమతులు లేని వెంచర్లలో ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

మార్కాపురంలో లేఅవుట్ ఏర్పాటుకు సిద్ధం చేసిన భూములు

# ఈతముక్కల.. ఖ్యాతి దక్కేలా!

ఎండాకాలంలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉంచడమే కాదు మన్నికగా ఉండే ఈతముక్కల గళ్ల లుంగీల గురించి ఎంత చెప్పినా తక్కువే. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఇక్కడ లుంగీలు తయారు చేసి మద్రాసు రాష్ట్రానికి ఎగుమతి చేసేవారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న గళ్ల లుంగీలకు భౌగోళిక గుర్తింపు (జీఐ) దక్కేవిధంగా ప్రయత్నాలు సాగుతున్నాయి.
- ఈనాడు, ఒంగోలు

● చేనేత గళ్ల లుంగీలకు భౌగోళిక గుర్తింపునకు కృషి
● సొసైటీ పరిధిలో హైదరాబాద్ బృందం అధ్యయనం

మగ్గంపై లుంగీలు నేస్తున్న చేనేతదారు

కొత్తపట్నం మండలం ఈతముక్కల చేనేత సహకార సంఘం 1946లోనే ఏర్పాటైంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనే సొసైటీ రిజిస్ట్రేషన్ జరిగింది. రంగు రంగుల గడుల్లో లుంగీని తయారు చేయడం ఇక్కడి ప్రత్యేకత. సహజ సిద్ధమైన నూలుకు రంగులు పట్టించి ఎంతో ఓర్పుగా నేర్పుగా వారం నుంచి పది రోజుల పాటు కష్టించి నేస్తారు. ఒక నేతలో 16 లుంగీల వరకు ఉత్పత్తి అవుతాయి. ఇక్కడ నుంచి వివిధ జిల్లాలకే కాకుండా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. గతంలో తమిళనాడు రాష్ట్రంలో నేసేవారు. అక్కడ నుంచి వచ్చినవారు ఇక్కడ నేత ఆరంభించారు. పరస్తుతం అక్కడ తయారీ నిలిచిపోవడంతో ఈతముక్కలలో మాత్రమే ప్రస్తుతం తయారవుతుండడంతో జీఐ కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి.

### దరఖాస్తుకు వివరాల సేకరణ

జీఐకు దరఖాస్తు చేయాలంటే ఉత్పత్తి విశిష్టతను తొలుత అధ్యయనం చేయాలి. హైదరాబాద్‌కు చెందిన ప్రత్యేక బృందం ఈతముక్కల గ్రామానికి వచ్చి చేనేత సహకార సంఘాన్ని సందర్శించింది. గ్రామంలో చేనేతదారులను కలిసి తయారీ విధానం పరిశీలించింది. ఎప్పటి నుంచి తయారు చేస్తున్నారు?. ఎంతమంది ఆధారపడి ఉన్నారు? తదితర వివరాలు బృందం సేకరించింది. కొత్తపట్నం రెవెన్యూశాఖాధికారులను కలిసి గ్రామపటం, మండలం తదితర వివరాలపై ఆరా తీసింది. జిల్లా కేంద్రంలోని అధికారులను కలిసి సమాచారం తీసుకుంది. ఈసమాచారమంతా క్రోడికరించి రూపొందించిన నివేదిక ఆధారంగా చెన్నైలోని జీఐ కార్యాలయానికి దరఖాస్తు చేయనుంది. దరఖాస్తు అనంతరం జీఐ బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తుందని చేనేత విభాగం ఏడీ ఎస్.రఘునంద పేర్కొన్నారు.

### తమ కష్టానికి గుర్తింపు

గళ్ల లుంగీల తయారీ, మిగతా చేనేత వస్త్రాలతో పోలిస్తే చాలా కష్టంతో కూడుకుందని, తాము తయారు చేసే లుంగీలకు గుర్తింపు వస్తుందంటే తమకు ఆనందంగా ఉందని చేనేత కార్మికులు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పడుతున్న తమ కష్టం బయట ప్రపంచానికి తెలుస్తుందన్నారు. సొసైటీలో 235 మంది వరకు సభ్యులుగా ఉన్నారని, అందరూ 50 ఏళ్లు పైబడిన వారేనని సొసైటీ మేనేజరు బ్రహ్మానందరావు చెబుతున్నారు. కొత్త తరానికి చెందినవారెవరూ ఈ వృత్తిలోకి అడుగుపెట్టడం లేదని చెబుతున్నారు.

## ఇసుక తవ్వకాలపై ఉక్కుపాదం: కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. పాలేరు నది నుంచి జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్నట్లు ఫిర్యాదులందడంతో స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం ఆయన ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి అధికారులతో సమీక్షించారు. వాగులు, ఇతర వనరుల్లో లభ్యమయ్యే ఇసుకను కేవలం 500 మీటర్ల పరిధిలోని స్థానికులు మాత్రమే వినియోగించుకునేవిధంగా ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చిందన్నారు. పాలేరులోని ఇసుకను వాగు ప్రవహిస్తున్న గ్రామాల ప్రజలే వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి ద్వారా రసీదు తెచ్చుకున్నవారికి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో గనులశాఖ జిల్లా అధికారి రాజశేఖర్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీటీసీ సుశీల, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గ్రానైట్ ఖనిజాలున్న కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. రాయలసీమ ప్రాంతానికి పగలు, రాత్రి తేడా లేకుండా తరలిస్తున్నారు. రసీదుల్లేకుండా కొన్ని, నకిలీ రసీదులతో మరి కొన్ని వాహనాలు సరిహద్దులు దాటుతున్నాయి. దీన్ని అరికట్టేందుకు తనిఖీలు చేస్తున్నా మామూళ్ల చేతులు మారుతున్న నేపథ్యంలో కేవలం రసీదులున్న వాటిని తనిఖీలు చేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - న్యూస్‌టుడే, కనిగిరి

శంకవరం ప్రాంతంలో యథేచ్ఛగా గ్రానైట్ తవ్వకాలు

# గ్రానైట్.. రైట్..రైట్!

● రాయలసీమకు అక్రమ రవాణా

### ఇష్టానుసారంగా తవ్వకాలు

కనిగిరి మండలం, పురపాలక సంఘం పరిధిలోని చింతలపాలెం, శంకవరం, పామూరు, మర్రిపూడి, కనిగిరి, పీసీపల్లి సీఎస్ పురం, దర్శి తదితర ప్రాంతాల్లో 25 వరకు క్వారీలున్నాయి. పరిమిత స్థాయిలో అనుమతులు తీసుకుని మూడింతలు తవ్వకాలు జరుపుతున్నారు. గ్రానైట్ అక్రమ రవాణాలో మామూళ్ల పేరుతో ఓ సమాంతర వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నారు. చాలా వరకు నాయకుల కనుసన్నల్లోనే జరుగుతుండగా, కొందరు నేరుగా అధికారులతో కుమ్మక్కవుతున్నారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించకున్న వీరికి మామూళ్లు చెల్లించకుంటే ఇబ్బందులు ఎదురవుతుండడం, మూడో వంతు చెల్లిస్తే అడ్డంకులు తీరిపోతుండటంతో వ్యాపారులు అటువైపు మొగ్గుతున్నారు.

### పట్టుకుంటే ఫోన్...

కనిగిరి నుంచి తరలిపోయే గ్రానైట్ రాళ్లు కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు తరలిస్తున్నారు. క్వారీ యజమానులు అధిక శాతం రాయలసీమ ప్రాంతానికి చెందినవారే కావడం విశేషం. బయలుదేరినచోట నుంచి గమ్యస్థానానికి చేరేవరకు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు లేకపోవడం గమనార్హం. ఒకవేళ ఎవరైన పట్టుకుంటే వెంటనే ఫోన్ వస్తుంది. వెంటనే అధికారులు వదిలి పెట్టడం మామూలే. 7 మీటర్ల రాయికి అనుమతి తీసుకుని 12 మీటర్ల రాయిని తరలిస్తున్నారు. కనిగిరిలో లభించే రాయికి క్యూబిక్ మీటరుకు రూ.3 వేల వరకు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ సైజు రాయికి మాత్రం రూ.వెయ్యి చెల్లించాలి. తూతూమంత్రంగా రాయల్టీ చెల్లించి పలుకుబడితో కనీసం నంబర్లు కూడా వేయకుండా తరలిస్తున్నారు. ఈ విషయమై కనిగిరి ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో గ్రానైట్ క్వారీలను గనులశాఖ చూసుకోవాలని, క్వారీలు, రాయి తరలింపులో తేడాలుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, పక్కన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

## సమష్టి కృషితోనే అత్యుత్తమ పనితీరు

◆ వార్షిక నేర సమీక్షలో కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమష్టిగా పనిచేయడంతో అత్యుత్తమ ఫలితాలొస్తాయని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. వల్లూరులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన వార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేరాల నియంత్రణతోపాటు కేసుల దర్యాప్తు సత్వరం పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయడం పోలీసుల విధిగా పేర్కొన్నారు. ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌తో జిల్లాలో నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని, గంజాయి అక్రమ రవాణా, విక్రయం, వినియోగం కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. 2024తో పోలిస్తే జిల్లాలో ఈ ఏడాది నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, శారీరక, ప్రాపర్టీ, మహిళలపై నేరాలతోపాటు రహదారి ప్రమాదాల సంఖ్య ఈ ఏడాది తగ్గినట్లు తెలిపారు. డయల్-112కు వచ్చిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఏడో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి టి.రాజావెంకటాద్రి న్యాయపరమైన అంశాలు, నూతన చట్టాలపై పోలీసులకు వివరించారు. సమీక్షలో డీఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, సాయిఈశ్వర్‌యశ్వంత్, రమణకుమార్, డీడీ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ప్రశాంతికుమారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్, ఏపీపీలు రఘునాథరావు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దీర్ఘకాలంగా భూ సమస్యలు వేధిస్తున్నాయి. వీటిని పరిష్కారిస్తామని గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే రెట్టింపు వెతలను తెచ్చిపెట్టింది. రైతులను మరింత అయోమయానికి గురిచేయడంతోపాటు భూవివాదాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో భూముల కొలతల్లో వాస్తవికతను యజమానులకు తెలియజేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో చేసిన సర్వేకు ప్రస్తుత రీసర్వేకు చాలా వ్యత్యాసం ఉందని, క్షేత్రస్థాయిలో తలెత్తిన లోపాలు సరిచేస్తామని అధికార యంత్రాంగం రైతుల్లో అవగాహన కల్పిస్తోంది. తొలి విడతగా ఈ ఏడాది జనవరిలో మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేయగా, రెండో విడతగా ఏప్రిల్‌లో ప్రతి మండలం నుంచి ఒకటి లేదా రెండు గ్రామాల్లో సర్వే చేశారు. మూడో విడత కింద అక్టోబరులో 25 మండలాల్లోని 35 గ్రామాల్లో చేపట్టారు. తాజాగా నాలుగో విడత కింద ఎంపికైన 123 గ్రామాల్లో గత రెండు రోజులుగా రెవెన్యూ శాఖాధికారుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో జనవరి 2వ తేదీ నుంచి రీ సర్వే చేయనున్నారు.
- న్యూస్‌టుడే, కలెక్టరేట్

# భూముల రీసర్వేకు శ్రీకారం!

● 2 నుంచి 123 గ్రామాల్లో 4వ విడత ప్రారంభం

భూముల రీ సర్వేపై టంగుటూరులో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

### సంయుక్త ఎల్‌పీఎంలతో ఇబ్బందులు

గత వైకాపా ప్రభుత్వ హయాంలో మూడు దశల్లో 298 గ్రామాల్లో రీసర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నలుగురు రైతులకు కలిపి సంయుక్త ఎల్‌పీఎం నంబరు ఇవ్వడం, భూ విస్తీర్ణంలో తేడాలు, ఉండాల్సిన విస్తీర్ణం లేకపోవడం, సరిహద్దు తేడాలు తదితర సమస్యలు ఎక్కువగా వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ సమస్యలను తగ్గించాలన్న ఉద్దేశంతో రీసర్వే జరిగిన గ్రామాల్లో గతేడాది నవంబరులో గ్రామసభలు నిర్వహించగా 2,750 అర్జీలొచ్చాయి. సగానికిపైగా అర్జీలు అపరిష్కృతంగా ఉన్నాయి. అన్ని గ్రామాల్లో డిసెంబరు 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభల్లో మొత్తం 5,437 అర్జీలొచ్చాయి.

### ప్రతి బ్లాక్‌కు ఒక బృందం

రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. 200 నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభజించారు. బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, వీఆర్వో, వీఆర్‌ఏ ఉంటారు. పొలాల గట్లు, విస్తీర్ణాన్ని పక్కాగా కొలుస్తారు. ఎక్కడికక్కడ ప్రజలు, భూ యజమానుల సమక్షంలోనే రీ సర్వే చేస్తారు. విస్తీర్ణం, రైతు వివరాలు, ప్రస్తుత భూ యజమాని, సెటిల్‌మెంట్ టైటిల్ డీడ్ వంటివి నిర్ధారణ చేయనున్నారు. ముందుగా సమాచారం ఆయా భూయజమానులకు తెలియజేసి వారి సమక్షంలోనే హద్దుల నిర్ధారిస్తారు. ఫిర్యాదులుంటే క్షేత్రస్థాయిలోనే పరిశీలించేవిధంగా ప్రణాళిక చేశారు.

**రీ సర్వే వివరాలు**
మొత్తం మండలాలు: 36
రెవెన్యూ గ్రామాలు: 123
విస్తీర్ణం: 3,95,526 ఎకరాలు
బృందాలు: 163

## తక్కువ మంది పిల్లలున్న పాఠశాలల మూసివేత?

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: అతి తక్కువ మంది పిల్లలున్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. బేసిక్ ప్రైమరీ స్కూల్స్ (1, 2 తరగతులు)లో అయిదుగురు కన్నా తక్కువ ఉన్నవాటిని, 1-5 తరగతులతో నడుస్తున్న ఫౌండేషన్ స్కూల్స్‌లో పది మంది లోపు, 6-8 తరగతులు నడుస్తున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో 30 మందిలోపు పిల్లలున్న వాటిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఈ మేరకు ఎంఈవోలకు యూడైస్‌ను బట్టి పాఠశాలల జాబితాలు పంపారు. జిల్లాలో ఈ తరహా పాఠశాలలు 30 వరకు ఉన్నట్లు సమాచారం. ఎంఈవోలు సమీపంలో ఉన్న ఏ పాఠశాలలో కలపవచ్చునేది మ్యాపింగ్ చేసి వివరాలు పంపాలని కోరారు. దీనిపై త్వరలో నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

## పాలు, మాంసం ఉత్పత్తి పెంపునకు చర్యలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో పాలు, మాంసం, కోడి గుడ్ల ఉత్పత్తిని పెంచేందుకు తాత్కాలిక, దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ ప్రగతిపై స్థానిక డీఎల్‌డీఏ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని పశు వైద్యాధికారులు, ఏడీ, డీడీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హరిత గోపాలం పథకం ద్వారా గడ్డి సాగు, పశు వసతి గృహాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు 15 శాతం వృద్ధి సాధించడంతోపాటు, ఉపాధిహామీ పథకం కింద పాతర గడ్డి పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. సంతానోత్పత్తి శిబిరాలు, పశు ఉత్పాదకత పెంపుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వరరావు, డీఎల్‌డీఏ ఈవో మురళీకృష్ణ, డీడీలు జయచంద్ర, రాఘవయ్య, ఎం.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులకు ఆదరణ పెరుగుతోంది. జిల్లాలోని రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో గతేడాది నూరు శాతం కొలువులు సాధించారు. ఒంగోలు నగరంలోని దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ (కోఎడ్యుకేషన్), కొత్తపట్నం మండలం ఈతముక్కలతో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. ఒంగోలులో నాలుగు బ్రాంచిల్లో కలిపి 360 సీట్లు ఉండగా, ఈతముక్కలలో మూడు బ్రాంచిల్లో కలిపి 110 సీట్లు ఉన్నాయి. రెండు కళాశాలల్లో గతేడాది చదివిన విద్యార్థులంతా ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.
-న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

# కొలువుల సాధన.. పెరిగిన ఆదరణ

● పాలిటెక్నిక్ విద్యకు భారీగా డిమాండు

మెకానికల్ ల్యాబ్‌లో విద్యార్థులు

### సీట్లన్నీ భర్తీ...

ఒంగోలు కళాశాలలో గతేడాది నాలుగు కోర్సుల్లో కలిపి 200 మంది చేరగా, ఈ ఏడాది 216 మంది ప్రవేశాలు పొందారు. ఈతముక్కల మహిళా కళాశాలలో సీట్లు మొత్తం భర్తీ అయ్యాయి. విద్యార్థులు ఎక్కువ మంది కంప్యూటర్ కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎలక్ట్రికల్ బ్రాంచిలో 60కి 60 సీట్లు భర్తీ అయ్యాయి. ఆటోమొబైల్, సివిల్‌లో 50 శాతం మంది చేరారు. మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, సీసీపీ కోర్సులకు డిమాండు ఎక్కువగా ఉంది. వీల్స్ ఇండియా, రాయల్ ఎన్‌ఫీల్డు, డైకిన్, ఇసుజి, టీవీఎస్ తదితర కంపెనీల్లో పలువురు కొలువులు సాధించారు. కంప్యూటర్ ఆధారిత కోర్సులను కేటాయించాలని ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు. విద్యార్థులు ఆ కోర్సులు కోరుకుంటున్నారు.

**ఆరు నెలలు శిక్షణ...** విద్యార్థులకు ఆరు నెలలు పారిశ్రామిక శిక్షణనిస్తూ నైపుణ్యాలు పెంచుతున్నాం. ప్రతిఒక్కరూ ప్రాంగణ ఎంపికల్లో కొలువు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పాలిటెక్నిక్ చేసినవారు ఇంజినీరింగ్ రెండో ఏడాది నేరుగా ప్రవేశం పొందవచ్చు.
- నర్రా శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

## ఒంగోలు.. సుందరీకరణకు అడుగులు

కిమ్స్ సమీపంలోని వంతెన పక్కన పచ్చదనం

కలెక్టరేట్ ఎదుట డివైడర్లపై దీపాల వెలుగులు

ఒంగోలు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలనే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సంకల్పం సాకారమవుతోంది. ఇటీవల సుమారు రూ.కోటిన్నర వ్యయంతో వివిధ పనులు చేపట్టారు. కర్నూలు రోడ్డు, ట్రంక్ రోడ్డులో అధిక వెలుగునిచ్చే ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. కడియం నుంచి పూలమొక్కలు తెప్పించి నాటారు. దక్షిణ బైపాస్ రోడ్డు నుంచి కర్నూలు రోడ్డులోని వంతెన వరకు వివిధ ప్రదేశాల్లో ఆకట్టుకునే సింహం, ఏనుగు, గుర్రాల బొమ్మలు ఏర్పాటు చేశారు. మొత్తం అయిదు కూడళ్లలో దాతల సహకారంతో ఫౌంటైన్లు, పచ్చదనం పెంపొందించే పనులు చేపట్టారు. కిమ్స్ ఆసుపత్రి సమీపంలోని రహదారి వంతెన కింద ఖాళీస్థలాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. మంగమ్మ కళాశాల కూడలి, బండ్లమిట్ట, వెంగముక్కపాలెం కూడలి, అద్దంకి బస్టాండు సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం కూడలిని అభివృద్ధి చేస్తున్నారు.
-న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

(c) eenadu

# మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

## ప్రతిభా పాటవ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయిని అమూల్య, తదితరులు

కంభం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పి.ఉమా మహేశ్వరి(9వ తరగతి) డి.అనిత(8వ తరగతి) వై.లావణ్య(8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయిని అమూల్య, ఉపాధ్యాయులు కేశవ, సీహెచ్.కృష్ణమోహన్‌రావు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ఎస్తేరురాణి, పద్మ, సుశీల బహుమతులు అందజేసి అభినందించారు.

## మందుబాబులకు జైలు, జరిమానాలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి గిద్దలూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.భరత్‌చంద్ర సోమవారం జైలుశిక్ష, జరిమానాలు విధించినట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు. ఒకరికి 34 రోజులు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా, మిగిలిన నలుగురికి 12, 13, 13, 15 రోజుల జైలు శిక్ష రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే శిక్ష తప్పదని హెచ్చరించారు.

**మేమున్నాం... మీకు తోడుగా..** (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

యర్రగొండపాలెం, కొనకనమిట్ల, పెద్దారవీడు, యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే

?: పట్టణంలోని బీసీ కాలనీలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడంలేదు. సమస్యను పరిష్కరించగలరు.
నాగయ్య, స్థానికుడు

✓: మరమ్మతులు చేయిస్తాం.
రామసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి

?: కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్‌లో రహదారి పక్కన వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తోంది. రహదారి వెంబడి చెత్త వేయకుండా చూడాలి.
రమణయ్య, పెదారికట్ల

✓ సమాధానం: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం.
శ్రీదేవి, ఈవోపీఆర్డీ.

?: కొర్రప్రోలు నుంచి నల్లగుంట్ల వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలు ఉన్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. – వెంకటేశ్వర్లు, నల్లగుంట్ల

✓: రహదారి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.
– ప్రసూనదేవి, ఎంపీడీవో, దోర్నాల

?: యర్రగొండపాలెం పట్టణంలో పలుచోట్ల వీధి దీపాలు పగలు వెలుగుతున్నాయి.
రాంప్రసాద్, స్థానికుడు

✓: పగలు వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం.
రామసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి

## అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన

కొత్తగా నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

తర్లుపాడు, న్యూస్‌టుడే: పల్లె నుంచి పెద్ద పట్టణం వరకు సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూ ముందుకు సాగుతోందని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మండలంలోని పోతలపాడులో రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును, మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. అంతకంటే ముందు కలుజువ్వల పాడు పంచాయతీలోని మేకలవారిపల్లెలో ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రియల్ పార్కును సందర్శించి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం గానుగపెంట గ్రామంలో 'రైతన్నా... మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ◗ కొనకనమిట్ల: కొనకనమిట్ల మండలంలోని గార్లదిన్నె గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోమవారం పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైకాపాకు చెందిన గార్లదిన్నె 30 కుటుంబాలు, వెలిగండ్ల 20 కుటుంబాలు తెదేపా చేరాయి. కార్యక్రమంలో బాషాపతి నాయుడు, కాశిరెడ్డి, మండల తెదేపా అధ్యక్షుడు బాబురావు, సర్పంచి సుఖదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# కాలువలు అధ్వానం.. అవస్థల్లో జనం

☛ ఇదీ మార్కాపురం మున్సిపాలిటీలో పరిస్థితి

న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

మార్కాపురం మున్సిపాలిటీగా ఏర్పడి దాదాపు 60 సంవత్సరాలు దాటినా.. ఇంకా మౌలిక వసతుల కల్పన పూర్తి స్థాయిలో జరగడం లేదు. దీంతో మురుగు నీటి కాలువలు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కానున్న నేపథ్యంలో పట్టణంలోని మురుగునీటి వ్యవస్థపై సమగ్ర ప్రణాళిక రచించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### 1964లో మొదటిసారిగా గ్రేడ్-3 మున్సిపాలిటీగా ఏర్పాటు

నిజానికి మార్కాపురం 1964లో తొలిసారిగా గ్రేడ్-3 మున్సిపాలిటీగా ఏర్పాటైంది. 1986వ సంవత్సరంలో దీన్ని గ్రేడ్-2 మున్సిపాలిటీగా మార్చారు. సౌకర్యాలు మాత్రం పూర్తిస్థాయిలో కల్పించకపోవడంతో.. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పాత కాలువలే దర్శనమిస్తున్నాయి. ◗ ప్రస్తుతం పట్టణ జనాభా అధికారంగా 70వేల ఉండగా..అనధికారంగా దాదాపు లక్ష పైమాటే. ఇలాంటి తరుణంలో సమగ్ర పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించడంతో ఇప్పటికీ పట్టణంలో సమగ్ర మురుగునీటి వ్యవస్థ లేదనే చెప్పాలి.

### ఇవిగో ఉదాహరణలు

కాలువలు సరిగ్గా లేక నిలిచిన మురుగు

కంభం రోడ్డులో చెత్తతో నిండిన కాలువ

పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం, పంచాయతీరాజ్ కార్యాలయం, సత్యనారాయణస్వామి గుడి, శివాలయం, గడియారస్తంభం, కంభం రోడ్డు, నెహ్రూ బజార్, పీఎస్‌కాలనీ, గొర్లగడ్డ, అమ్మవారిశాల వీధి, జవహర్‌నగర్, విజయాటాకీస్ ఏరియా, రాజ్యలక్ష్మికాలనీ తదితర ప్రాంతాల్లో మురుగునీటి వ్యవస్థ సరిగా లేదు. దీంతో ఎక్కడికక్కడ నీరు అక్కడ నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ◗ జడ్పీబాలికల ఉన్నత పాఠశాల వద్ద వ్యర్థాలతో కాలువ అధ్వానంగా తయారైంది. అక్కడ కాలువలలో వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ◗ 205మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నా వ్యర్థాలు తొలగించే విషయంలో సిబ్బంది చొరవ చూపడంలేదని పురప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పొదిలి ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

☛ వ్యాపారుల ఆందోళన

ర్యాలీ తీస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు, వ్యాపారులు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలో ఈనెల 24న ఎరువుల వ్యాపారులు యాదాల అవినాష్, కోటేశ్వరరావులను పొదిలి ఎస్సై వి.వేమన కొట్టడాన్ని నిరసిస్తూ సోమవారం వ్యాపారులు, ఆర్యవైశ్యులు ఆందోళన చేపట్టారు. మధ్యాహ్నం వరకు దుకాణాలు మూసివేశారు. ముందుగా అమ్మవారిశాల వద్ద ఉన్న గాంధీ, పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి చిన్నబస్టాండ్, పెద్దబస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ షాహీదాబేగంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అనంతరం ఒంగోలు వెళ్లి జిల్లా ఉన్నతాధికారులకు ఎస్సైపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బి.సుబ్బారావు, జి.సి.సుబ్బారావు, జి.భాస్కర్, మధుసూదనరావు, పలు మండలాల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### బాధితులకు హోం మంత్రి అనిత పరామర్శ

యాదాల కోటేశ్వరరావు, అవినాష్‌లను సోమవారం రాత్రి రాష్ట్ర హోంశాఖ మంత్రి వి.అనిత చరవాణిలో పరామర్శించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డి.రాకేష్ విజయవాడ నుంచి పొదిలి వచ్చి సంఘటన ఎలా జరిగిందని బాధిత కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చరవాణిలో హోం మంత్రి అనిత.. కోటేశ్వరరావు, రాకేష్‌లతో మాట్లాడారు. కుటుంబాలకు అన్నివిధాల ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. వారి వెంట స్థానిక ఆర్య వైశ్య సంఘం నాయకులు జి.భాస్కర్, మధుసూదనరావు, సత్యం, వ్యాపారులు, స్థానికులు తదితరులు ఉన్నారు.

### ఎస్సై వేమన వీఆర్‌కు బదిలీ..

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి ఎస్సై వి.వేమన వీఆర్‌కు బదిలీ అయ్యారు. సోమవారం వ్యాపారుల ఆందోళన అనంతరం ఉన్నతాధికారులు ఈ మేరకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## భగవద్గీతపై ఇంటింటి ప్రచారం

రాచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని చోళ్లవీడు గ్రామంలో త్రైత భగవద్గీత సిద్ధాంత ప్రచారం నిర్వహించారు. అన్ని మత గ్రంథాల సారం త్రైత సిద్ధాంత గ్రంథాల్లో ఉందని ప్రచారకర్తలు తెలిపారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక తత్వాన్ని పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గిద్దలూరు కమిటీ అధ్యక్షుడు శివకుమార్, వెంకటేష్, స్వాతి, సుభాషిణి, భాగ్యం, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## జ్ఞాన మార్గం వైపు నడవండి

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలందరూ దైవ జ్ఞానం పెంపొందించుకొని దుష్కర్మలను త్యజించాలని త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక, దొనకొండ నిర్వాహకులు ప్రచారం నిర్వహించారు. సోమవారం మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి, నికరంపల్లి, పెద్దనాగులవరం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత బోధనలు చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు టి.ఏడుకొండలు, చెన్నకేశవులు, బాలరంగయ్య, కాశీలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వంద రోజుల ప్రణాళికకు సూచనలు

రాచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని అనుమలవీడు జడ్పీ హైస్కూల్, అనుములపల్లి మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో గిరిధరశర్మ సోమవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల వంద రోజుల ప్రణాళికపై పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌ను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలి

కంభం: అంబేడ్కర్‌ను స్ఫూర్తిని తీసుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆర్.సుబ్బారావు అన్నారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఆధ్వర్యంలో విజయవాడలోని రిపబ్లిక్ ఆన్ పార్టీ కార్యాలయంలో సోమవారం కాలమానిని, దైనందిని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రిపబ్లిక్ పార్టీ ఏపీ అధ్యక్షుడు దేవిప్రసాద్, హైకోర్టు న్యాయవాదులు కర్రి రమేష్ బాబు, అల్లూరయ్య, సంజీవరావు, అజిత్‌కుమార్, హవిలారాణి పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

రాచర్ల: మండలంలోని చోళ్లవీడు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు చిన్ని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయుడు వెంకటరామిరెడ్డి, పూర్వ విద్యార్థి అద్దంకి మౌలాలీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, శ్రీనివాసులు, సొసైటీ అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## జిల్లాతో అన్ని విధాలుగా అభివృద్ధి

మార్కాపురం పట్టణం: మార్కాపురం జిల్లాతో ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం జిల్లాగా ప్రకటించిన సందర్భంగా సోమవారం రాత్రి పట్టణంలోని ఎస్టేట్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కాపురంను జిల్లాగా ప్రకటించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చారన్నారు.

ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా సబ్ రిజిస్ట్రార్ బాల ఆంజనేయులు

## మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి యంత్రాన్ని సోమవారం జిల్లా సబ్ రిజిస్ట్రార్ బాల ఆంజనేయులు ప్రారంభించారు. విద్యార్థులు చక్కగా చదివి మంచిమార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. పొదిలి సబ్ రిజిస్ట్రార్ వి.నీరజ వసతిగృహాన్ని దత్తత తీసుకున్నారు. నీటికష్టాలను తెలుసుకుని విద్యార్థుల కోసం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. వీటిని జిల్లా రిజిస్ట్రార్ చేత ప్రారంభోత్సవం చేయించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, పొదిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ కాలమానిని, డైరీల ఆవిష్కరణ

బేస్తవారపేట: ఏపీటీఎఫ్ మండల శాఖ 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన కాలమానిని, డైరీలను ఎంఈవో-1 మధుసూదన్‌రెడ్డి సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు.


**ది ప్రకాశం జిల్లా, సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్**
PDCCB
మార్కాపురం బ్రాంచి
**బంగారు నగల వేలం ప్రకటన**

ఈ క్రింద తెలియజేసిన వ్యక్తి మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణమును సకాలంలో తిరిగి చెల్లించలేదు. మీకు ఎన్నిసార్లు నోటీసులు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపినను తిరస్కరించబడి మరల బ్యాంకుకు తిరిగి వచ్చినవి. కావున తేది: 19-01-2026 సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మా బ్యాంకు ఆవరణములో బహిరంగ వేలము వేయబడును. ఈ ప్రకటన నిమిత్తం అయిన ఖర్చును ఖాతాదారుడే భరించవలెను. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5,000/- ధరావత్తు సొమ్ము చెల్లించవలెను. ఎటువంటి కారణములు తెలుపకనే వేలము వాయిదా వేయుటకు నిలుపుదల చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలవు.

| అకౌంట్ నెం | ఖాతా దారుని పేరు, చిరునామా | బంగారం లోన్ గ్రాస్‌వెయిట్ | లోన్ తేది |
|---|---|---|---|
| 206000555100 | బొగ్గరపు నరేంద్రకుమార్ S/o ఆంజనేయులు మార్కాపురం | 8.5 | 14-2-2023 |

సం/- బ్రాంచి మేనేజర్
తేది: 30-12-2025 PDCC బ్యాంక్, మార్కాపురం



**WANTED PRINCIPAL POST**

ప్రకాశం జిల్లా గిద్దలూరు సెయింట్ పాల్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ B.Ed, M.Ed కాలేజ్ నందు ఖాళీ అయిన ప్రిన్సిపల్ పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

G.o.M.S. No: 239 Education Depended
Dated: 8-11-1996 (A Christian Minority institution)
Recognised by N.C.T.E. Bangalore., Affiliated by
Andhra Kesari University, Ongole

**అర్హతలు**

Ph.D, M.A/M.Sc., M.Ed, S.E.T, N.E.T

అర్హత కలిగిన అభ్యర్థులు 16-1-2026వ తేదీ సాయంత్రం 5 గం॥లలోపు దరఖాస్తులు ఈ క్రింది అడ్రసుకు పంపవలసినదిగా కోరడమైనది.

**సెక్రటరీ & కరస్పాండెంట్**
**సెయింట్ పాల్స్ విద్యాసంస్థలు**
గిద్దలూరు, ప్రకాశం జిల్లా Pin: 523 357



SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
బ్రాంచ్: మార్కాపూర్, డి.నెం.7/308, కృష్ణా ప్లాజా, గ్రౌండ్ ఫ్లోర్, వాసవి స్కూల్ ఎదురు, పేరం బజార్, మార్కాపూర్-523316 (ఎ.పి), వెబ్‌సైట్ : www.shriramfinance.in

**భౌతికంగా స్వాధీనత ప్రకటన** రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తిపై)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ("శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" యన్‌సియల్‌టీ చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం చేయబడినది. తదనంతరం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరు ది.30-11-2022 నుండి "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్"గా అమలులోకి వచ్చే మార్చబడినది. ది.30-11-2022 నాటి ఇన్‌కార్పోరేషన్ సర్టిఫికేట్ ను చూడగలరు.) మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుబంధమైన రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలను కోరుతూ 26-06-2025 తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. ఋణగ్రహీతలు :
1) అద్దంకి శ్రీను, తండ్రి : అద్దంకి బాలయ్య, డి.నెం.1-547ఎ, యస్‌బిఐ లైను, త్రిపురాంతకం పోస్ట్ & మండలం, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్: 523326.
2) అద్దంకి అంజలి, భర్త : అద్దంకి శ్రీను, నివాసము: డి.నెం.1-547ఎ, యస్‌బిఐ లైను, త్రిపురాంతకం పోస్ట్ & మండలం, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్: 523326.
3) అద్దంకి శ్రీరాములు, తండ్రి : లక్ష్మయ్య, బ్రహ్మంగారి కాలని, త్రిపురాంతకం పోస్ట్ & మండలం, ప్రకాశం మండలం, పిన్‌కోడ్: 523326.

వారు ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన మొత్తము, అనగా లోన్ అకౌంట్ నెం. MRKPRTF2303240002 రూ. 32,33,939/- (అక్షరాల ముప్పై రెండు లక్షల ముప్పై మూడు వేల తొమ్మిది వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్ట్యువల్ చార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఈ నోటీసు జారీ చేయడమైనది.

ఋణగ్రహీతలు తమ బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైనందున, వారికి మరియు సాధారణ ప్రజలందరికీ ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద సంతకం చేసిన అధీకృత అధికారి, సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) ప్రకారం 8.11.2025 తేదీన సదరు ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, సదరు భూమి ఖాళీగా ఉన్నందున, మా కార్యనిర్వాహక సిబ్బంది సహాయంతో సదరు (చట్టం) లోని రూల్ 8(1) మరియు రూల్ 9 ప్రకారం, ఈ రోజు అనగా 27.12.2025న నేరుగా సదరు ఆస్తి యొక్క భౌతిక స్వాధీనాన్ని అధీకృత అధికారి చేపట్టారు.

సదరు ఈ ఆస్తి విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి ఋణగ్రహీతలకు హెచ్చరించడమేమనగా ఈ ఆస్తి పై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన రూ. 32,33,939/- (అక్షరాల ముప్పై రెండు లక్షల ముప్పై మూడు వేల తొమ్మిది వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ఛార్జికి లోబడి ఉండునని తెలియపరచడమైనది.

**స్థిరాస్తి వివరములు**

ఈ ఆస్థి దస్తావేజు నెం. 1350/2023 ప్రకారం అద్దంకి అంజలి, భర్త : శ్రీను వారి పేరుతో కలదు. పకాశం జిల్లా రిజిస్ట్రేషన్, మార్కాపూర్ రిజిస్ట్రేషన్ జిల్లా, యర్రగొండపాలెం సబ్-రిజిస్ట్రేషన్, త్రిపురాంతకం మండలం, త్రిపురాంతకం గ్రామ పంచాయితీ మరియు రెవెన్యూ గ్రామం, సర్వేనెం.134/2, డోర్ నెం.6-35 దగ్గర ఖాళీ స్థలం, తూర్పు నుండి పడమర వరకు 20 అడుగులు, ఉత్తరం నుండి దక్షిణం వరకు 54 అడుగులు, ఎ.సి.1-32 సెంట్లలో 120 చదరపు గజాల విస్తీర్ణం. దీనికి హద్దులు: తూర్పు: షేక్ పుల్లయ్య స్థలం, పడమర: కార్యనిర్వాహకుని స్థలం, ఉత్తరం: దూపాటి వెంకటేశ్వర్లు స్థలం, దక్షిణం: 14 అడుగుల వెడల్పు గల దారి.

తేది : 27-12-2025, సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: మార్కాపూర్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
(పూర్వపు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచ్: మార్కాపూర్, డి.నెం.7/308, కృష్ణా ప్లాజా, గ్రౌండ్ ఫ్లోర్, వాసవి స్కూల్ ఎదురు, పేరం బజార్, మార్కాపూర్-523316 (ఎ.పి), వెబ్‌సైట్ : www.shriramfinance.in

**డిమాండ్ నోటీసు**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది. ఎన్‌సిఎల్‌టి బెంచ్-II చెన్నై, తేది.09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు మార్కాపూర్ నందు బ్రాంచి ఆఫీస్ కలిగి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ/ఋణదాతగా సూచిస్తారు)

ఋణగ్రహీతలు/ సహ-ఋణగ్రహీత(లు) / హామీదార్లు /దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు/ హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3 తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్ధక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు/ హామీదారులకు/ తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత(లు)/ సహ- ఋణగ్రహీత(లు)/ హామీదార్ల యొక్క పేర్లు :
1) మద్దూరి నరేంద్రరెడ్డి, తండ్రి: లోకనాథ్‌రెడ్డి, నివాసము: డి.నెం.5-241, తిమ్మాపురం (విలేజ్ & పోస్ట్) దోర్నాల మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523331.
2) మద్దూరి లోకనాథ్‌రెడ్డి, తండ్రి: పుల్లారెడ్డి, నివాసము: డి.నెం.5-241, తిమ్మాపురం (విలేజ్ & పోస్ట్) దోర్నాల మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523331.
3) కల్లె ఏడుకొండలు, తండ్రి: కోటయ్య, నివాసము: డి.నెం.5-120, తిమ్మాపురం, (వి & పోస్ట్) దోర్నాల మండలం, ప్రకాశం జిల్లా, పిన్: 523331.
లోను అగ్రిమెంట్ నెం. MRKPRTF1812300006

| | |
|---|---|
| NPA తేది | 29-02-2020 |
| డిమాండ్ నోటీసు తేది | 27-11-2025 |
| బకాయి మొత్తం | రూ.56,72,909/-(అక్షరాల యాభై ఆరు లక్షల డెభై రెండు వేల తొమ్మిది వందల తొమ్మిది రూపాయలు మాత్రమే) తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర వ్యయాలతో కలిపి. |
| లోను ఋణం మొత్తం | రూ.15,00,000/- |

స్థిరాస్తి షెడ్యూల్: MRKPRTF1812300006 - షెడ్యూలు ఆస్తి మార్కాపురం సబ్-రిజిస్ట్రార్‌లోని దస్తావేజు నెం.175/2019 ప్రకారం మద్దూరి నరేంద్రరెడ్డి, తండ్రి: లోకనాథ్‌రెడ్డి పేరుతో కలదు.
ప్రకాశం జిల్లా, మార్కాపురం రిజిస్ట్రేషన్ జిల్లా, మార్కాపురం సబ్ జిల్లా, దోర్నాల మండలం, దోర్నాల గ్రామ పంచాయతి మరియు గ్రామ అకౌంట్స్, సమీప డి.నెం.1-106-ఎ, సర్వే నెం.122/2 నందలి మొత్తం 859.4 చ॥గ॥ల స్థలంలో, ప్లాట్ నెం.10, తూర్పు నుండి పడమరకు 30 అ॥లు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 41.5 అ॥లు కొలతలతో మొత్తం 180 చ॥గ॥లు లేదా 151.2 చ॥మీ॥ల విస్తీర్ణం, ఎక్స్‌టెన్షన్ ఏరియా నందు అన్ని అనుభుక్తపు హక్కులతో గల యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: వై.చెలోపల్లికి చెందిన ప్లాట్, పడమర: రోడ్డు, ఉత్తరం: తంగిరాల పోలిరెడ్డి యొక్క స్థలం, దక్షిణం: మద్దలకట్ట వెంకటరెడ్డి యొక్క ప్లాట్ నెం.9.

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.

సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అస్సెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం: మార్కాపురం సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచి ఆఫీస్: [illegible] మార్కాపురం, ప్రకాశం జిల్లా.

(రూల్ 8 (1) ప్రకారం) **భౌతిక స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

[illegible] ... MRKPRTF2305100004 ... రూ. 96,10,983/- ... 17-08-2025 ... 08-12-2025 ... 27-12-2025 ... [illegible]

తేది: 27-12-2025 అధీకృత అధికారి
ప్రదేశం : మార్కాపురం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
కార్యాలయ చిరునామా: హెచ్.నెం: 7/308, కృష్ణ ప్లాజా, గ్రౌండ్ ఫ్లోర్, వాసవి స్కూల్ ఎదురుగా, పేరం బజార్, మార్కాపురం, ప్రకాశం జిల్లా.

**డిమాండ్ ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

[illegible]

| ఋణగ్రహీత(లు) / సహ ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు | ఎన్.పి.ఏ తేదీ ఋణ మొత్తం | డిమాండ్ నోటీసు తేదీ బకాయి మొత్తం |
|---|---|---|
| 1. సయ్యద్ [illegible] రహిమాన్ ... 2. ... 3. ... 4. ... [illegible] | 09.07.2022 రూ. 12,00,000/- | 27-11-2025 రూ. 22,28,402/- |

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. MRKPRTF2111300005

[illegible]

ప్రదేశం: మార్కాపూర్ అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్


(c) eenadu

# చెలరేగిన బ్యాటర్లు.. ప్రేక్షకుల కేరింతలు!

ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు 'ఈనాడు' వేదిక మంచి అవకాశమని శ్రీ విష్ణు యమహా షోరూం మేనేజర్(ఒంగోలు) ఎస్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కళాశాల క్రీడా మైదానంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. క్విస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(ఒంగోలు), రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ కళాశాల), ప్రభుత్వ జూనియర్ కళాశాల(కొండపి) జట్లు గెలుపొందాయి. రెండు మ్యాచ్‌ల్లో బ్యాటర్లు పరుగుల వరద పారించారు. అవకాశం వచ్చిన ప్రతిసారీ బ్యాటర్లు చెలరేగి ఆడారు. వీలయినప్పుడల్లా బాల్ బౌండరీ దాటింది. మ్యాచ్ తిలకించిన వారికి చక్కటి ఉత్సాహాన్ని నింపారు. -న్యూస్‌టుడే, సంతనూతలపాడు

Medical Partner
వెంకటరమణ

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీ విష్ణు యమహా షోరూం మేనేజర్ (ఒంగోలు) ఎస్.బ్రహ్మయ్య

క్రీడాకారుడికి వైద్య సేవలు అందిస్తున్న వెంకటరమణ నర్సింగ్ హోమ్ సిబ్బంది

విజయకేతనం చూపుతున్న క్విస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఒంగోలు)జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

సాయిరెడ్డి

▶ **అవకాశమివ్వని బౌలర్లు..:** క్విస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఒంగోలు) జట్టు ఆంధ్రకేసరి విద్యాకేంద్రం డిగ్రీ అండ్ పీజీ కళాశాల(ఒంగోలు) జట్టుపై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత ఆంధ్రకేసరి జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగింది. 9.5 ఓవర్లకు కేవలం 10 వికెట్లు కోల్పోయి 37 పరుగులు మాత్రమే చేసింది. ప్రత్యర్థి క్విస్ బౌలర్ల దాటికి అభిషేక్ 14 బంతుల్లో 14 పరుగులు మినహా ఏ ఒక్కరు రెండంకెల స్కోర్‌ను చేయలేకపోయారు. బౌలింగ్‌లో సాయిరెడ్డి 1.5 ఓవర్లకు 6 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీయగా, చరణ్ 2 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌కు దిగిన క్విస్ జట్టు 5.1 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 38 పరుగులు చేసి గెలుపొందింది. వినయ్ 4 బంతుల్లో 11 పరుగులు, హుస్సేన్ షేక్ 15 బంతుల్లో 10 పరుగులు చేశారు. 3 వికెట్లు తీసిన సాయిరెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

గెలుపొందిన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ కళాశాల) జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

మల్లేష్

▶ **దంచికొట్టిన ట్రిపుల్‌ఐటీ మల్లేష్..:** రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ(ట్రిపుల్ ఐటీ కళాశాల) జట్టు బ్యాటింగ్, బౌలింగ్‌లో చక్కని ప్రతిభ చాటి ప్రత్యర్థి జట్టు రైజ్ కృష్ణ సాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌పై 61 పరుగుల తేడాతో విజయం సాధించింది. ట్రిపుల్ ఐటీ కళాశాల జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 10 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 102 పరుగుల భారీ స్కోర్ చేసింది. మల్లేష్ 37 బంతుల్లో 57 పరుగులతో చెలరేగాడు. రాము యాదవ్ 14 బంతుల్లో 23 పరుగులు చేశారు. వెంటనే బరిలోకి దిగిన రైజ్ ప్రకాశం జట్టు 10 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 41 పరుగులు మాత్రమే చేసింది. మల్లేష్ 2 వికెట్లు తీశారు. 57 పరుగులు, 2 వికెట్లు తీసిన మల్లేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

▶ **ఉతికేసిన కొండపి అభిలాష్..:** బ్యాటింగ్, బౌలింగ్‌లోనూ రాణించి ప్రభుత్వ జూనియర్ కళాశాల(కొండపి) జట్టు గౌతమి జూనియర్ కళాశాల(యర్రగొండపాలెం)పై 17 పరుగుల తేడాతో గెలుపొందింది. గౌతమి జూనియర్ కళాశాల టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లకు 10 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసింది. అభిలాష్ 24 బంతుల్లో 44 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో గౌతమి క్రీడాకారుడు తరుణ్ నాయక్ 3 వికెట్లు తీశాడు. వెంటనే బ్యాటింగ్‌కు దిగిన గౌతమి కళాశాల జట్టు 10 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 80 పరుగులు మాత్రమే చేసింది. నరేంద్ర 20 బంతుల్లో 20 పరుగులు, శివశంకర్ 11 బంతుల్లో 14 పరుగులు చేశారు. బౌలింగ్‌లో సీహెచ్ జాన్ 2 వికెట్లు తీశారు. 44 పరుగులు చేసిన అభిలాష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

అభిలాష్

విజయనందంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల (కొండపి) జట్టు


Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL
Gift Partner: KL UNIVERSITY
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: QIS EDUCATIONAL INSTITUTIONS ONGOLE
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు


# పసుపు.. సస్యరక్షణతో తెగుళ్ల అదుపు

న్యూస్‌టుడే, కంభం

పసుపు పంటకు చల్లని వాతావరణ పరిస్థితులు, అధిక తేమ శాతం ఉన్న సమయంలో తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ తెలిపారు. వాటి నివారణకు తగిన సస్య రక్షణ చర్యలు తీసుకుంటే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు.

▶ **తాటాకు మచ్చ తెగులు..:** ఈదురు గాలులతో కూడిన వర్షాలు, గాలిలో ఎక్కువ తేమ, ఉష్ణోగ్రత తక్కువగా ఉండడంతో త్వరగా వ్యాపిస్తుంది. సెప్టెంబర్ నుంచి ఇది ఎక్కువగా వస్తుంది. అండాకారపు పెద్ద మచ్చలు ఆకులపై అక్కడక్కడా కనిపిస్తాయి. మచ్చలు ముదురు గోధుమ రంగులో ఉంటాయి. చుట్టూ పసుపు రంగు వలయం ఏర్పడుతుంది. ఆకు కాడపై మచ్చలు ఏర్పడి కిందకు ఆకు వాలుతుంది. మచ్చలు ఉన్న ఎండిన ఆకులను తొలగించి కాల్చివేయాలి. లీటర్ నీటికి 1 గ్రా. కార్బండిజమ్ లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 1 మి.లీ. సబ్బు నీరు లేదా ప్రొపికొనజోల్ మిశ్రమం పిచికారీ చేయాలి. నాటడానికి ముందు విత్తన దుంపలను నీటిలో 30 నిమిషాలు ఉంచి నీడలో ఆరబెట్టి నాటుకోవాలి. పంట మార్పిడి చేస్తే ప్రయోజనం ఉంటుంది. దుంపలు విత్తిన తర్వాత జీలుగ, జనుము, వేప, కానుగ మొదలైన పచ్చి ఆకులు లేదా ఎండు వరిగడ్డి, చెఱకు ఆకులను పొలంపై మొలకలు వచ్చేంత వరకు కప్పడం వల్ల తెగులు ఉధృతి తగ్గించవచ్చు.

▶ **ఆకుమచ్చ..:** తాటాకు మచ్చ తెగులు సూచించిన కారణాలతోనే ఆకుమచ్చ రోగం వస్తుంది. ఆకుపై చిన్న చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. తర్వాత చిన్నపాటి గోధుమరంగు మచ్చలుగా మారతాయి. తెగులు ఎక్కువైతే ఆకు మాడిపోతుంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ తెగులు ఎక్కువగా వస్తుంది. నివారణకు వ్యాధి సోకిన ఆకులను కత్తిరించి నాశనం చేయాలి. తాటాకు మచ్చ తెగులుకు సూచించిన మందులతో పాటు 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

సాగులో ఉన్న పసుపు పంట

▶ **దుంప కుళ్లు..:** నివారణకు లీటర్ నీటికి 3 గ్రా. మెటలాక్సిల్ లేదా మాంకోజెబ్, 2 మి.లీ. మోనోక్రోటోఫాస్ లీటర్ నీటితో కలిపిన ద్రావణంలో కొమ్ములను 30 నుంచి 40 నిమిషాలు ఉంచాలి.

▶ **ఎర్రనల్లి..:** దీని నివారణకు గంధకం 3 గ్రా. లీటర్ నీటికి కలిపి ఆకుల అడుగు భాగం తడిసేటట్లు ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

మీ కోసం

# మామిడికాయల రక్షణకు రాయితీపై కవర్లు!

న్యూస్‌టుడే, రాచర్ల

మామిడి పండ్లకు కవర్లు వాడడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని గిద్దలూరు, కంభం ఉద్యాన శాఖ అధికారిణి శ్వేత తెలిపారు. వాటిని ఉద్యాన శాఖ రాయితీపై రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. హెక్టారుకు రూ.25 వేలు అందజేస్తున్నట్లు వివరించారు. వాటిని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కీటక దాడుల నుంచి పండ్లు దెబ్బతినకుండా ఉంటుంది. ఆంత్రాక్నోస్, పౌడరీ మిల్డ్యూ వంటి ఫంగల్ రోగాల ప్రభావం తగ్గుతుంది. కాయలకు కవర్లు ఉండడం వల్ల మందుల పిచికారీ తక్కువగా ఉంటుంది. దాంతో రైతులకు ఖర్చు తగ్గుతుంది. పండ్లపై మచ్చలు ఏర్పడకుండా, సమానమైన రంగుతో మంచి ఆకారంతో కాయలు పెరుగుతాయి. అధిక వేడితో పండ్లు దెబ్బతినకుండా ఉంటాయి. పక్షులు కొరకకుండా ఉపయోగపడతాయి. ఎగుమతికి అనుకూలంగా మారతాయి. ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ సాధించడానికి ఉపయోగపడతాయి.

మామిడి కాయలకు కట్టిన కవర్లు

## గోళీల పరిమాణంలో ఉన్నప్పుడే వేయాలి..

మామిడి కాయలు గోళీల పరిమాణంలో ఉన్నప్పుడే కవర్లు వేయాలి. సాధారణంగా డిసెంబర్, జనవరి మొదటి వారంలో పిందెలు వస్తాయి. కవర్లు వేయడానికి ముందస్తుగా ఒకసారి పంగనైడ, ఇన్‌సెక్టిసైడ్ మందులు స్ప్రే చేసిన రెండు, మూడు రోజుల తర్వాత కవర్లు వేయాలి. తడి లేకుండా కాయ ఎండిపోయిన తర్వాతే కవర్లు వేయాలి. గాలి వెళ్లేలా కింది భాగంలో చిన్నపాటి రంధ్రం ఉన్న కవర్లను వాడాలి. ఆలస్యం చేసి కాయ బాగా పెరిగిన తర్వాత కవర్ వేస్తే పెద్దగా ఫలితం ఉండదు.

రైతేరాజు

ఒంగోలుకు చెందిన సింగనేని రాధ అనే మహిళా రైతు కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామంలో ఎకరా భూమిని కౌలుకు తీసుకుని సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఆయుకూరాలు చేస్తున్న కృషిని ఆమె మాటల్లోనే తెలుసుకుందాం. -న్యూస్‌టుడే, కొత్తపట్నం

ప్రకృతి సాగు విధానంలో వేసిన పంటలు

**సమస్య-పరిష్కారం**

▶ **సమస్య :** మా గేదెలో తరచూ ఎద లక్షణాలు కనిపిస్తున్నాయి. కారణం ఏమిటి? నివారణ చర్యలు సూచించండి. -నరసింహులు, తురిమెళ్ల

**సమాధానం:** గేదెలో హార్మోన్ల అసమతుల్యం వల్ల ఎద లక్షణాలు చూపిస్తాయి. పశువైద్యుని సంప్రదించి చికిత్స చేయించాలి.

▶ **సమస్య :** మా పెరటి కోళ్లలో నట్టల బెడద అధికంగా ఉంది. దాన్ని ఎలా నివారించాలి? - సుబ్బయ్య, తురిమెళ్ల

**సమాధానం:** పెరటి కోళ్లలో నట్టలను నివారించేందుకు పైపరజీన్ ఓరల్ పౌడర్‌ను నీటిలో కలిపి తాపాలి. పైపరజీన్ పౌడర్ ఒక గ్రామును 100 మిల్లీ లీటర్ నీళ్లలో కలిపిన మిశ్రమం 100 కోళ్లకు సరిపోతుంది. -న్యూస్‌టుడే, బేస్తవారపేట గ్రామీణం

శ్రీధర్, పశువైద్యాధికారి, తురిమెళ్ల

# సేంద్రియ సేద్యం... లాభాలు తథ్యం!

భూమిని ముందుగా దుక్కి దున్ని సారం పెంచేందుకు పీఎండీఎస్(నవధాన్యాలు) విత్తనాలను ముందు నేలను సిద్ధం చేయడం ద్వారా 30 రకాల విత్తనాలను పొలంలో చల్లాం. 40 రోజుల పూర్తయిన తరువాత వాటిని కలియ దున్నాం. ప్రధాన పంటలుగా వేరుశనగతో పాటు కొర్ర, అలసంద, పొద్దుతిరుగుడు, సజ్జ సాగు చేస్తున్నా. దీంతోపాటు నిరంతరం ఆదాయం వచ్చేలా అంతర పంటలుగా టమోటా, మిర్చి, వంగ, బెండ, గోరు చిక్కుడు, గోంగూర, చుక్కకూర, పాలకూర, మెంతుకూర, కొయ్యతోటకూర తదితర కూరగాయలు, ఆకుకూరల పంటలు వేశాం. వీటన్నింటికీ వారానికి ఒక సారి జీవామృతం, కషాయాలు తగిన మేరకు అందిస్తున్నాం. తద్వారా పంటలకు చీడపీడలు రాకుండా నివారిస్తున్నాం. మొత్తం అన్నింటికీ రూ.15 వేలు పెట్టుబడి అయింది. సేంద్రియ విధానంలో పండించిన ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంది. ఆకు కూరలను తోట వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఇంకా మిగిలిన కూరగాయలను సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో మీకోసం కార్యక్రమం వద్ద విక్రయిస్తున్నాం. ప్రతి నెలా ఖర్చులు పోనూ రూ.12 వేలు ఆదాయం వస్తున్నట్లు ఆమె తెలిపారు.

# ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

న్యూస్‌టుడే, కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలిగొండ స్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమవుతాయని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు.

▶ త్రిపురాంతకం గ్రామీణం: ముక్కోటి ఏకాదశి పండుగతో పాటు జనవరి 15న గోదాదేవి కల్యాణం రోజున ఉత్తర ద్వారంనుంచి దేవుని దర్శనం చేసుకుంటారు. ధనుర్మాసంలో పూజలు చేస్తే పుణ్యం ప్రాప్తిస్తుందని త్రిపురాంతకం ఆలయ అర్చకులు ఎం.రామ శ్రీనివాసరావు తెలిపారు.

వెలిగొండ స్వామి, పీఠం మీద లక్ష్మమ్మవారి క్షేత్రం

# లక్ష్యం మేర రుణాలు మంజూరు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యం మేర రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలని లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. అందుకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు జిల్లాలో రూ.25.45 వేల కోట్ల రుణ మంజూరు లక్ష్యం కాగా, అందులో ఇప్పటివరకు రూ.16.50 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. పీఎంఈజీపీ కింద వచ్చిన 102 దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయాలని సూచించారు. సీఎస్ఆర్‌లో భాగంగా ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పనకు ముందుకు రావాలన్నారు.

**ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)**

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 142, రిటైల్ లైవ్ - 169, చికెన్ విత్ స్కిన్ - 245, చికెన్ స్కిన్‌లెస్- 279

బహుమతి అందుకుంటున్న ముండ్లపాడు పాఠశాల విద్యార్థులు

# రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో మొదటి బహుమతి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో జిల్లాలోని గిద్దలూరు మండలం ముండ్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించింది. విద్యార్థులు ప్రవీణ్‌కుమార్, ఎస్వీ మణికంఠ, డి.రామాంజనేయులు బీఎఫ్ఎస్ఐ అంశంపై ప్రదర్శించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ప్రథమంగా నిలిచింది. విద్యార్థులకు రూ.25వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా జీసీడీవో హేమలత పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, వృత్తివిద్య శిక్షకులు బ్రహ్మయ్యను ఏపీసీ దాసరి అనిల్‌కుమార్ అభినందించారు.

# యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా పిచ్చయ్య

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ మార్కాపురం జిల్లా కార్యదర్శిగా అల్లినగరం జెడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు మెర్రి పిచ్చయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఒంగోలులో జరిగిన యూటీఎఫ్ 51వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఈయనను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఎన్నికను జిల్లా ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులు ధృవీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.సత్యనారాయణ రెడ్డి, రమణా రెడ్డి, మూడు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు ఈయనను అభినందించారు.

# బైక్ మెకానిక్ దాతృత్వం

యర్రగొండపాలెం: పట్టణానికి చెందిన బైక్ మెకానిక్ వడ్లమూడి నాగలింగం గిరిజనుల విద్యార్థుల అవస్థలు చూసి చలించిపోయాడు. ఏపీ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 200మంది గిరిజన పిల్లలకు చలికోట్లు సోమవారం పంపిణీ చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

# లారీ ఢీకొని ఒకరికి గాయాలు

పొదిలి: ద్విచక్ర వాహనం - లారీ ఢీకొన్న సంఘటనలో పొదిలి మండలం ఆముదాలపల్లికి చెందిన కె.సాల్మన్ తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం రాత్రి పొదిలి - కర్నూలు రహదారిపై హైదరాబాద్ రెస్టారెంట్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108 సిబ్బంది పొదిలి సామాజిక వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

# ఎస్సై సైదుబాబుకు ఎస్పీ అభినందనలు

మార్కాపురం: మార్కాపురం పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు దొంగతనాలను అరికట్టడంతో పాటు సొమ్ము రికవరీ చేయడం, కేసును ఛేదించడంలో ప్రతిభ చూపుతున్నారు. ఒంగోలులో సోమవారం జిల్లా స్థాయిలో వార్షిక క్రైం సమావేశం జరిగింది. దీన్లో ఎస్సై సైదుబాబుకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. చోరీ సొమ్ము రికవరీలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఎస్సైని మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐ సుబ్బారావులు ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్సై సైదుబాబుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

# కుటుంబ కలహాలతో బలవన్మరణం

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన త్రిపురాంతకం మండలంలోని రామసముద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బంధుమిత్రులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కోట ప్రసన్న కుమార్ (24)కు భార్యకు మధ్య తరచూ గొడవలు జరుగుతండడంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి వచ్చేందుకు ఆమె అంగీకరించక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రసన్న కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యర్రగొండపాలెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# కారు ఢీకొని యువకుడి మృతి

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: ఎదురుగా వస్తున్న కారు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన త్రిపురాంతకం మండలం అన్నసముద్రం మెట్ట సమీపంలోని అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన ప్రశాంత్ బెహరా (27) మేడపి సమీపంలోని రామస్వామి హోటల్‌లో పనిచేస్తున్నాడు. నలతగా ఉందని మేడపికి టాబ్లెట్లు తీసుకువస్తానని వెళ్లాడు. ఈ క్రమంలో తిరిగి హోటల్ వద్దకు వస్తుండగా పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్ బెహరాను స్థానికులు అంబులెన్స్ సహాయంతో వినుకొండ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న ఎస్సై శివ బసవరాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి ప్రమాదం జరిగిన తీరు, కారు వివరాల కోసం విచారణ చేపట్టారు.


**పొగాకు బోర్డు, గుంటూరు**
వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య విభాగము, భారత ప్రభుత్వము (ఐ.యస్.ఓ.9001:2015 గుర్తింపు పొందిన సంస్థ)
జి.టి. రోడ్డు, గుంటూరు-522004. ఫోన్ : 0863-2358399, 2358499.

**టెండరు నోటీసు**

2025-26 FCV పొగాకు ఆక్షన్స్ కొరకు ఆంధ్రప్రదేశ్‌లో గల పొగాకు బోర్డు వేలం కేంద్రాల వద్ద 1) పొగాకు బేళ్ళను హ్యాండిల్ చేయుటకు మరియు 2) ట్రాలీస్ మరమ్మత్తులు/ సర్వీసింగు కొరకు అనుభవము కలిగిన కాంట్రాక్టర్లు మరియు ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.
పైన తెలుపబడిన పనుల కొరకు టెండరు ఫారములు తదితర వివరముల కొరకు రీజినల్ మేనేజరు, ఒంగోలు, రాజమండ్రి మరియు మేనేజరు(ఆక్షన్స్), పొగాకు బోర్డు, గుంటూరు వారిని సంప్రదించగలరు. టెండరు ఫారములు మరియు నియమ నిబంధనలు పొగాకు బోర్డు వెబ్‌సైట్ (www.tobaccoboard.com) నుండి కూడా పొందవచ్చును.
పైన తెలుపబడిన పనుల నిమిత్తము పూర్తి చేసిన టెండరు ఫారాలను టెండరు నియమ నిబంధనలలో తెలిపిన ధరావతు సొమ్ముతో సహా తేది.21-01-2026 సాయంత్రం గం॥ 3.00 లలోగా పొగాకు బోర్డు, గుంటూరు నందు టెండరు బాక్సులో డిపాజిట్ చేయవలెను. అసంపూర్తిగా ఉన్న టెండర్లు తిరస్కరించబడును మరియు ఏ విధమైన కారణం చూపకుండానే స్వీకరించిన టెండర్లలో ఏదైనా లేదా అన్నింటిని తిరస్కరించేందుకు కార్యనిర్వహణాధికారి, పొగాకు బోర్డు వారు సర్వహక్కులు కలిగియున్నారు.
స్థలము : గుంటూరు, తేది: 29-12-2025 సం/- కార్యదర్శి



**కెనరా బ్యాంక్ Canara Bank** (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
**స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్**
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ✆ 7901626759

**స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.
సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 17.01.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**ఇ-వేలం తేది: 17.01.2026, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు**
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 16.01.2026, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

1 ఋణగ్రహీతలు: 1) M/s శ్రీ లక్ష్మి గ్రానైట్ ఇండస్ట్రీస్, ప్లాట్ నెం.319, గుండ్లపల్లి, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా-523211. 2) శ్రీమతి అందె లక్ష్మి, భర్త: శ్రీ అందె వెంకటనరసింహారావు, 8-482, నిర్మల్ హైట్స్ అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం.401, నిర్మల్ నగర్ పార్క్, లాయర్స్‌పేట, ఒంగోలు. హామీదారు : శ్రీ అందె వెంకట నరసింహారావు, తండ్రి: లేటు శ్రీ రామారావు, 8-482, నిర్మల్ హైట్స్ అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం.401, నిర్మల్ నగర్ పార్క్, లాయర్స్‌పేట, ఒంగోలు.
బకాయి మొత్తం: రూ. 3,03,06,214/- తేది. 30.11.2025 నాటికి + తేది. 01.12.2025 నుండి తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.
బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :
ఆస్తి నెం-1: ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం, అన్నంగి గ్రామం, సర్వేనెం. 270 మరియు 271, ప్లాట్ నెం. 319 లో 2700.56 చ॥గ॥ల విస్తీర్ణంలోని గ్రానైట్ ఫ్యాక్టరీ యావత్తు ఆస్తి శ్రీమతి అందె లక్ష్మి, భర్త: శ్రీ అందె వెంకట నరసింహారావు పేరున కలదు. హద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.318, దక్షిణం: ప్లాట్ నెం.320, తూర్పు: ప్రస్తుతం ఉన్న 30 మీ॥ వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 316.

| రిజర్వు ధర: రూ. 81,57,000/- | ధరావత్తు సొమ్ము: రూ. 8,15,700/- |
|---|---|

ఆస్తి నెం-2: ఒంగోలు, ముక్తినూతలపాడు, సర్వే నెం. 256/1, ప్లాట్ నెం. 69 & 70 లో 480.00 చ॥గ॥ల ఖాళీ స్థలం శ్రీ అందె వెంకట నరసింహారావు పేరున కలదు. హద్దులు: ఉత్తరం: ఈదర వంశీకృష్ణ యొక్క ప్లాట్ నెం 71 - ఈ వైపు 72', దక్షిణం: 33 అ॥ల రోడ్డు - ఈ వైపు 72', తూర్పు: ప్లాట్ నెం. 86 - ఈ వైపు 60', పడమర: 30 అ॥ల రోడ్డు - ఈ వైపు 72'.

| రిజర్వు ధర: రూ. 17,28,000 /- | ధరావత్తు సొమ్ము: రూ. 1,72,800/- |
|---|---|

మెషినరీ

| రిజర్వు ధర: రూ. 39,00,000 /- | ధరావత్తు సొమ్ము: రూ.3,90,000/- |
|---|---|

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626759, 9901574353.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051. ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com
తేది: 29.12.2025, ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



**EENADU Classifieds**

**BUSINESS SERVICES**

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

**ప్రముఖ హోటల్‌లో** పనిచేయుటకు రూమ్ బాయ్స్ కావలెను. భోజనం వసతి సదుపాయం కల్పించబడును. సంప్రదించండి. ఫోన్: 9966846756, 7801062777.

**కుంకుపాడు అద్దంకి** చుట్టుప్రక్కల పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం॥ డ్యూటీ, భోజనం + రూమ్ కలదు. 9149986335, 9652689259.

**JOBS**

Wanted: Administration Staff - 2, Food Products Marketing Executives - 2. Contact: 97034 02722

**కేర్‌టేకర్ ముస్లిం** మహిళ కావలెను. సీనియర్ సిటిజన్‌ని చూసుకోవటానికి & సర్వీసు చేయటానికి మాత్రమే కావలెను. కందుకూరు. Ph: 9398058081

**ఉద్యోగం చేస్తూనే** అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

**ఒంగోలు, మంగమూరు రోడ్డులోని** నారాయణ పబ్లిక్ స్కూలు నందు 6 to 8th వరకు తెలుగు & కంప్యూటర్ టీచర్ కావలెను. ✆9704363262. **సమతా** నగర్‌లోని శ్రీ గాయత్రి గ్రామర్ స్కూలు నందు 3rd to 5th వరకు గ్రాడ్యుయేట్ లేడీ టీచర్లు కావలెను. ✆9014404155

**గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి** నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్ర. ✆ 89784 80429.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

**DRIVERS**

**బాక్స్ ఆటోకి**- 2 డ్రైవర్లు కావలెను. అనుభవం, లైసెన్స్, బ్యాడ్జ్ కలిగి ఉండవలెను. ✆ 97034 02722


(c) eenadu

# కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

## దేశ ఉన్నతికి శ్రమించిన వాజ్‌పేయి

దర్శి, న్యూస్‌టుడే: దివంగత ప్రధాని వాజ్‌పేయి దేశ ఉన్నతికి శ్రమించారని భాజపా జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు అన్నారు. సోమవారం దర్శిలో వాజ్‌పేయి స్మృతి సమ్మేళన్ కార్యక్రమంలో ఓబీసీ నాయకుడు దండు శ్రీనివాసులు, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు తీగల సత్యవతితో కలిసి ఆయన పాల్గొన్నారు. నాయకులు మాడపాకుల శ్రీనివాసులు, అశోక్‌రెడ్డి, నాగేశ్వరరావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

## దర్శి వైద్యశాలలో మార్చురీ గది నిర్మించరూ!

దర్శి, న్యూస్‌టుడే: దర్శి ప్రభుత్వ వైద్యశాలలో మార్చురీ గది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నిర్మాణం చేపట్టాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, డీటీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణానిధి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో ఎవరూ మృతి చెందినా శవ పరీక్ష నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు రావలసిందేనని, పాతది పడిపోవటం, కొత్త గది నిర్మించకపోవడంతో రేకుల షెడ్డులో శవపరీక్ష చేయవలసి వస్తోందన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, ఆంజనేయులు, గోపి పాల్గొన్నారు.

## జనసేనలోకి ఆర్యవైశ్య ప్రముఖులు

దర్శి: దర్శికి చెందిన పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు సోమవారం జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు సమక్షంలో పార్టీలో చేరారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు కోట హనుమంతరావు, కోట వెంకటరమణ, కొత్తమాసు సాయికుమార్, ఇన్నమూరి రాము, దేవరపు కోటేశ్వరరావు, రాధ, శిరీష, భావన, పూజిత, కుమారి తదితరులు పార్టీ తీర్థం తీసుకున్నారు. ఈ మేరకు పార్టీలో చేరిన 36 మందికి నాగబాబు కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానించారు.

నాగబాబు సమక్షంలో జనసేనలో చేరిన దర్శికి చెందిన హనుమంతరావు తదితరులు

## కారుమంచి సొసైటీ, ఛైర్మన్ల ఎన్నిక

టంగుటూరు, న్యూస్‌టుడే: కారుమంచిలోని ప్రాథమిక సహకార సొసైటీ, శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయం, శ్రీ అనంత కోదండరామ స్వామి ఆలయాలకు సోమవారం నూతన ఛైర్మన్లు ఎంపికయ్యారు. ప్రాథమిక సహకార సొసైటీ ఛైర్మన్‌గా గుమ్మడి బ్రహ్మయ్య, శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా ఈదర ఆనందరావు, శ్రీ అనంత కోదండరామ స్వామి ఆలయ ఛైర్మన్‌గా నాగినేని సుబ్బానాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు ప్రమాణస్వీకారం చేశారు. గ్రామ సర్పంచి మన్నం శ్రీనివాసరావు, తెదేపా నాయకులు ఈదర ప్రభాకర్, వల్లూరమ్మ ఆలయ ఛైర్మన్ బొజ్జ శ్రీనివాస్, ఆత్మకూరి శ్రీనివాసరావు, మేడికొండ రవీంద్ర, పాల్గొన్నారు.

ఎంపికైన వివిధ కమిటీల నాయకులు

## ఇసుక ట్రాక్టర్ల సీజ్

టంగుటూరు, న్యూస్‌టుడే: జరుగుమల్లి మండల కేంద్రంలోని పాలేరు పరివాహక ప్రాంతాల్లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ మురళి సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ట్రాక్టర్లను సీజ్ చేశారు.

## ఠాణా ముందునుంచే యథేచ్ఛగా..

❖ ఇసుక టిప్పర్ల పరుగులు

న్యూస్‌టుడే, జరుగుమల్లి :

నిఘా

**ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. యథేచ్ఛగా జేసీబీలతో తోడేస్తున్నా యంత్రాంగం మొద్దునిద్ర నటిస్తోంది. వాహనాలు పోలీస్ స్టేషన్ ముందునుంచే పరుగులు తీస్తున్నా ఆపేవారు కరవయ్యారు. దోపిడీదారుల ధాటికి పాలేరు నది ఛిద్రమవుతోంది.**

పోలీసు స్టేషన్ ముందునుంచే ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పరు

జరుగుమల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల మీదుగా ఇసుక అక్రమంగా తరలిపోతోంది. నిత్యం దాదాపు 150 వరకూ టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇసుక తరలించుకుపోతున్నారు. ఒక్కో భారీ టిప్పర్ ఇసుకను రూ.30 వేలకు, ట్రాక్టర్‌ను రూ. మూడు వేలకు విక్రయిస్తున్నారు. ఇలా లక్షల రూపాయల విలువైన సంపద దోపిడీదారుల పరమవుతోంది. ఎక్కువగా జరుగుమల్లి, చింతలపాలెం, పైడిపాడు, చతుకుపాడు గ్రామాల్లో ఈ తవ్వకాలు జరుగుతున్నాయి. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే మండల పరిధిలో ఎలాంటి తవ్వకాలు జరగడంలేదని చెప్పడం గమనార్హం. పక్క మండలాల నుంచి ఇసుక తీసుకొస్తున్నారని వారు జవాబు దాట వేస్తున్నారు.

పాలేరు నదిలో జేసీబీతో తవ్వకం

### అధికార పక్ష నేతలదే హవా

మండల పరిధిలో జరుగుతున్న అక్రమ తవ్వకాలన్నీ అధికార పక్ష నేతల కనుసన్నల్లో జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాలేరు నది ఛిద్రమవుతోందని వారంటున్నారు. భారీ యంత్రాల సాయంతో లోతు వరకూ తవ్వేస్తున్నా దాడులు కూడా నిర్వహించడం లేదన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పోలీసులకు చోరుల అప్పగింత

కురిచేడు: ఆలయంలో చోరీకి యత్నించిన ఇద్దరిపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పడమర వీరాయపాలెంలోని చౌడేశ్వరీ అమ్మవారి ఆలయంలో చోరీకి యత్నించిన ఇద్దరిని పట్టుకుని గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. వారిని ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన వారిగా గుర్తించి సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పామూరులో పార్టీ కార్యాలయం ప్రారంభం

పామూరు, న్యూస్‌టుడే : పామూరులోని నెల్లూరు రోడ్డులో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని సోమవారం కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. బొల్లా నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విజేతలైన చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

## క్విజ్‌లో సత్తా చాటారు

దర్శి, న్యూస్‌టుడే: 'ఈనాడు' క్విజ్ పోటీలు సోమవారం దర్శి మండలం చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పోటీలో ఎస్.గురువర్ధన్, ఉప్పు శివ, కె.రాజేశ్వరి సత్తా చాటి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. హెచ్ఎం గురుప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనిగిరి: కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు క్విజ్ పోటీల్లో విద్యార్థులు నిర్వహించారు. ఇందులో జి.బాలబ్రహ్మం (ద్వితీయ ఇంటర్) వి.నాని (ద్వితీయ ఇంటర్), ఎం.అవినాష్ (ద్వితీయ ఇంటర్) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సా ధించారు. వీరికి ప్రిన్సిపల్ రమణారెడ్డి బహుమతులందజేశారు. అధ్యాపకులు చెన్నకేశవులు, రవీంద్ర, పద్మజ, కాసింపీరా, హనుమంతరావు, రాజు పాల్గొన్నారు.

కనిగిరి : బహుమతులందజేస్తున్న ప్రిన్సిపల్ రమణారెడ్డి, అధ్యాపకులు

## పూర్వ విద్యార్థిని చేయూత

పీసీపల్లి, న్యూస్‌టుడే: పాఠశాలకు పూర్వ విద్యార్థిని తోడ్పాటు అందించడం స్ఫూర్తిదాయకమని గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతులూరయ్య అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థిని మదువని ప్రస్తుతం న్యాయశాస్త్రం పూర్తి చేశారు. సోమవారం తన తండ్రితో కలిసి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 70 మంది విద్యార్థులు అభ్యసన సామగ్రి అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## ప్రధాన సైడు కాలువ నిర్మాణానికి ఆమోదం

దర్శి, న్యూస్‌టుడే: దర్శి మున్సిపాలిటీలో గడియార స్తంభం కూడలి నుంచి పొదిలి రోడ్డులోని జీవిత బీమా కార్యాలయం వరకు సైడు కాలువ నిర్మాణానికి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ పిచ్చయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మేజర్ కాలువల పూడికతీత, తాగునీటి ట్యాంకులు శుభ్రపరచటం, మరమ్మతులు, ప్రస్తుతం కాలానుగుణ వ్యాధుల నిరోధానికి ఫాగింగ్, బ్లీచింగ్ చల్లడం తదితర పనులకు సమావేశంలో ఆమోదం తెలిపారు. ఇతర సమస్యలను పరిష్కరించి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## తెదేపాలో కార్యకర్తలే నాయకులు

దర్శి, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనని, వారే పార్టీకి నాయకులని పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి తెదేపా కార్యాలయంలో 60 మంది ఉత్తమ కార్యకర్తలకు సోమవారం డా.లలిత్‌సాగర్‌తో కలిసి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం 19వ వార్డులో రూ.30 లక్షలు, 4వ వార్డులో రూ.43 లక్షలతో సైడు కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. హ్యాపీహోమ్స్‌లో రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆమె ప్రారంభించారు. మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, ఏఎంసీ ఛైర్‌పర్సన్ నాగవేణి సుబ్బారావు, కమిషనర్ మహేష్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

## భైరవకోన అభివృద్ధిపై దృష్టి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవక్షేత్రం, పర్యాటక కేంద్రం భైరవకోన అభివృద్ధిపై దృష్టి సారిస్తానని నూతన ట్రస్టు బోర్డు ఛైర్మన్ ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు తెలిపారు. భైరవకోన నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం దుర్గాంబ ఆలయం వద్ద సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు సౌకర్యాల కల్పన, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే, దాతలు, భక్తుల సహకారంతో కోన అభివృద్ధికి పాటుపడతామన్నారు. అనంతరం భైరవకోన ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా ఎం.శ్యామ్‌సుందర్‌రాజు, పాలకమండలి సభ్యులుగా ఎం.శ్రీనివాసరాజు, ఎం.వెంకట్రాజు, ఎస్.వెంకటసుబ్బయ్య, జి.ఆదిలక్ష్మమ్మ, పి.శివ, జె.అంజమ్మ, కె.నాగమ్మ, పి.సరళ, డి.దానమ్మ, ఎక్స్ అఫీషియో సభ్యులుగా అర్చకులు కె.వెంకటనరసయ్యచే దేవాదాయ శాఖ కందుకూరు ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, ఈవో వంశీకృష్ణారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

❖ భైరవకోన అభివృద్ధికి నూతన పాలకమండలి పాటుపడాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పాలకమండలి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన భైరవకోనకు వచ్చి నూతన పాలకమండలికి అభినందలు తెలిపి సత్కరించారు. మండల తెదేపా అధ్యక్షుడు బి.రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు బి.వెంకటేశ్వర్లు, సర్పంచి కె.కొండయ్యరాజు, ఎం.శ్యామలమ్మ, సీహెచ్.వెంకటరెడ్డి, నాయకులు ఎన్‌సీ మాలకొండయ్య, వెంకట్రామరాజు, బి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న భైరవకోన పాలకమండలి సభ్యులు

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114, దర్శి: 9848671678, కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

**దొనకొండ, న్యూస్‌టుడే:**

?: దొనకొండలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల చిన్న పిల్లలపై దాడులకు దిగుతున్నాయి.

– డి.చిరంజీవి, దొనకొండ

✓: పంచాయతీలో తీర్మానంచేసి వాటిని పట్టించి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేలా చర్యలు తీసుకుంటాను.

– కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి

**హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:**

?: మండల కేంద్రం హెచ్ఎంపాడు నుంచి కొత్తూరు మీదుగా హాజీపురం వెళ్లే రహదారి గుంతలుపడి అధ్వానంగా మారింది. వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

– పొనుగోటి వెంకటరెడ్డి

✓: సర్పంచికు సూచనలిచ్చి ఆర్థికసంఘం నిధుల నుంచి తాత్కాలిక మరమ్మతులు చేయించి చర్యలు తీసుకుంటాం.

– బ్రహ్మయ్య, పంచాయతీరాజ్ ఏఈ

## చుక్క నీటికి భగీరథ యత్నం

పంట పొలాలకు నీటి తడులు అందించేందుకు రైతులు భగీరథ యత్నం చేస్తున్నారు. శంకరాపురం వద్ద మోదేపల్లి మేజరు కాలువ ద్వారా సాగర్ జలాలు అందించేందుకు నానా కష్టాలు పడుతున్నారు. కాలువ కట్టలపై ఆయిల్, ట్రాక్టర్ ఇంజిన్లు ఏర్పాటుచేసి దాదాపు కిలోమీటర్, అర కిలోమీటర్ మేర పైపులు ఏర్పాటు చేసి సుదూరంగా పొలాలకు నీళ్లు మళ్లిస్తున్నారు. కంది, పొగాకు, మిరప తోటలకు ఇలా నీరందిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ముండ్లమూరు

## రైలుతో కనిగిరివాసుల సెల్ఫీలు

కనిగిరివాసుల దాదాపు ముప్పై ఏళ్ల నాటి కల సాకారం అవుతోంది. పట్టణానికి రైల్వే సదుపాయం సమకూరుతుండటంతో వారు ఉద్వేగానికి గురవుతున్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనుల్లో భాగంగా కనిగిరి పామూరు మండలాల మధ్య యాభై కిలోమీటర్ల పరిధిలో ట్రాక్ నిర్మాణం పూర్తయింది. దీంతో ట్రయల్ రన్‌లో భాగంగా రైలు ఆదివారం కనిగిరికి వచ్చి సోమవారం అక్కడి నుంచి బయలుదేరింది. దీంతో పలువురు ఉత్సాహంగా వచ్చి సెల్ఫీలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, కనిగిరి

బొమ్మ పలుకు

## అమ్మో..మృత్యుమార్గాలు!

దర్శి మండల పరిధిలో పలు మార్గాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. దర్శి-గంగవరం మార్గంలో తూర్పువీరాయపాలెం, పోతకమూరు, బొట్లపాలెం గ్రామాల సమీపంలో మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. అక్కడ పలువురు మృతి చెందగా అనేక మంది గాయాల పాలయ్యారు. దర్శి-కురిచేడు ప్రధాన మార్గంలో వెంకటాచలంపల్లి సమీపంలో వేంకటేశ్వరస్వామి ఆలయం, కాశీనాయన ఆశ్రమం వద్ద మలుపుల వద్ద దుర్ఘటనలు జరుగుతున్నాయి. తక్షణం సూచికలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దర్శి,

## మురుగు కాల్వతో అవస్థలు

కనిగిరి పట్టణంలోని లాడ్ సాహెబ్ వీధిలో మురుగు కాల్వ అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే పూడిక పేరుకుపోవడంతో వృథా నీరంతా వీధుల్లోకి చేరుతోంది. దోమల బెడద కూడా ఎక్కువైందని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి పక్కా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే,కనిగిరి

## ప్రబల శక్తిగా తెదేపా : ఉగ్ర

కనిగిరి, న్యూస్‌టుడే: సచ్చరిత్ర ఉన్న ఎవరొచ్చినా స్వాగతం పలుకుతానని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. వైకాపాకు చెందిన నాయకులు పెద్దఎత్తున తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక అమరావతి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెలిగండ్ల ఎంపీపీ రామన మహాలక్ష్మి, వైస్ ఎంపీపీ ఎర్రబోయిన భారతి, వైకాపా కొటాలపల్లి సర్పంచి భాస్కర్‌రెడ్డితో సహా నాగూర్ యాదవ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామన తిరుపతిరెడ్డి, వైకాపా సీనియర్ నాయకులు నాగూర్ యాదవ్ తదితరులతో కూడిన 160 వైకాపా కుటుంబాలను ఆయన తెదేపాలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ అన్ని వర్గాలకూ సముచిత ప్రాధాన్యమివ్వడంతో పార్టీ ఓ ప్రబల శక్తిగా అవతరించిందన్నారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కాశయ్య, సలోమన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ❖ అనంతరం ఉత్తమ కార్యకర్తలు 114 మందికి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ప్రశంసాపత్రాలందజేశారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, తెదేపా నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, గాయం తిరుపతిరెడ్డి, ఫిరోజ్, ఆంజనేయులరెడ్డి, నజీముద్దీన్, గయాజ్ బాషా, తాజుద్దీన్ పాల్గొన్నారు.

తెదేపాలో చేరిన ఎంపీపీ, తదితరులతో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

## పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: అంబవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి ముదిరెడ్డి భాస్కర్, ఆయన గురువు పువ్వాడి కృష్ణమూర్తి రూ.40 వేలు విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. సోమవారం వారు పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయులు ఎస్ఎం షరీఫ్‌కు ఇచ్చారు. ఇప్పటికే పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించేందుకు పి.కృష్ణమూర్తి రూ.లక్ష నగదును అందజేశారు.

## విద్యార్థుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య అన్నారు. ఆయన సోమవారం కొండపి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అహర్నిశలు కష్ట పడుతున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం. వెంకటేశ్వర్లు, తెదేపా ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రామయ్య చౌదరి, వసంతరాయుడు పాల్గొన్నారు.

కొండపి గ్రామీణం : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఆర్‌కే యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, తెదేపా ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి పాల్గొన్నారు. తెదేపా నాయకులు వసంతరాయుడు, శ్రీనివాసరెడ్డి, సర్పంచి సుశీల, నాయకులు నారాయణ స్వామి, నరసారెడ్డి, నేతి రవికుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భోజనాలు వడ్డిస్తున్న మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య

మాట్లాడుతున్న ఎంపీడీవో జయమణి

## మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

సింగరాయకొండ గ్రామీణం: ప్రజాప్రతినిధులు సమావేశాలకు హాజరు కాకపోవడం తగదని ఎంపీడీవో జయమణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయములో సోమవారం ఎంపీపీ శోభారాణి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులు, అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కాలేదు.

## నారాయణస్వామి ఆదాయం లెక్కింపు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానానికి ఆదివారం ఆదాయం లెక్కించగా.. రూ.1,09,628 వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శన టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.45,370, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.14,830, శాశ్వత అన్నదాన పథకానికి రూ.27,364, పంచామృత అభిషేకానికి రూ.22,064 వచ్చిందని పేర్కొన్నారు.

## మద్యం అమ్మకాలు నియంత్రించరూ!

పామూరు, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా మద్యం అమ్మకాల వేళలను మార్చాలని ఐద్వా జిల్లా నాయకులు సోమవారం పామూరు పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ నెల 30, 31, జనవరి 1వ తేదీల్లో రాత్రి ఏడు గంటలకే మద్యం షాపులు మూసివేయాలని వారు కోరారు. మద్యం తాగి రోడ్లపై గందరగోళం సృష్టించడం వల్ల మహిళలు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మద్యం అమ్మకాలను నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు షమీ, కోటమ్మ, మస్తానమ్మ, ధనమ్మ, రమ్య పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం ఇస్తున్న మహిళా నేతలు

## విశేష సేవలందించిన వారికి ప్రశంసలు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: ప్రజలకు సేవలందించిన పోలీసు అధికారులను ఎస్పీ నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముండ్లమూరు ఎస్సై కె.కమలాకర్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినంధించారు. ఫైరింగ్‌లో ఆయన మంచి ప్రతిభ కనబరిచినందుకు రివార్డ్ ప్రకటించి ఒంగోలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో రూ.5వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందించారు. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, దర్శి సీఐ వై.రామారావు ఆయన్ను అభినందించారు. సి.ఎస్.పురం: సి.ఎస్.పురం ఎస్సై వెంకటేశ్వర నాయక్ కేసులు పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన పరిష్కరించినందుకు, లోక్ ఆదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసినందుకు గాను ఎస్పీ జి.హర్షవర్ధన్‌రాజు ప్రశంసాపత్రం అందజేశారు. **కురిచేడు:** ఉత్తమ ప్రతిభ కనబరిచిన కురిచేడు ఎస్సై శివకు ఎస్పీ ప్రశంసా పత్రం అందజేశారు. కీలక కేసులను త్వరితగతిన ఛేదించినందుకు ఈ గుర్తింపు దక్కిందని ఎస్సై శివ అన్నారు. **దర్శి :** దర్శి ఎస్సై ఎం.మురళి గుడ్ ఫైరింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా ఎస్పీ నుంచి రూ.5 వేల నగదు అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. **హనుమంతునిపాడు:** హెచ్ఎంపాడు ఎస్సై కె.మాధవరావు పనితీరును ప్రశంసిస్తూ ఎస్పీ పురస్కార పత్రాన్ని అందజేశారు.

ఎస్పీ హర్షవర్ధన్ నుంచి నగదు, ప్రశంసా పత్రం అందుకుంటున్నముండ్లమూరు ఎస్సై కమలాకర్, సీఎస్‌పురం ఎస్సై వెంకటేశ్వర నాయక్, కురిచేడు ఎస్సై శివ, దర్శి ఎస్సై మురళి, హెచ్ఎంపాడు ఎస్సై మాధవరావు

## ఖాతాల నిర్వహణ బాధ్యతల మార్పుపై విచారణ

టంగుటూరు, న్యూస్‌టుడే: గ్రూపు సభ్యులకు తెలియకుండా బ్యాంకు ఖాతా నిర్వహణ బాధ్యతలు మార్చారని కందులూరు-1 గ్రామ స్వయం సహాయక గ్రూపు సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సోమవారం విచారణ చేపట్టారు. ఈ మేరకు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ డిప్యూటీ కలెక్టర్ జె.పార్థసారథి టంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో గ్రూపు సభ్యులు, వెలుగు అధికారులు, సిబ్బంది సమావేశమయ్యారు. ఈ క్రమంలో పలువురు అభిప్రాయాలు తీసుకున్నారు. దీనిపై నివేదికను తయారుచేసి కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు ఏపీవో తెలిపారు.

వివరాలు సేకరిస్తున్న జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి

(c) eenadu

# ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

## సృజనాత్మకత వెలికితీతకు దోహదం

విజేతలతో ఉమామహేశ్వర కళాశాల డైరెక్టర్ మల్లేశ్వరరావు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు చేపట్టిన ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక ఉమామహేశ్వర జూనియర్ కళాశాలలో క్విజ్ పోటీ నిర్వహించారు. జనరల్ నాలెడ్జి, సమకాలీన అంశాలపై జరిగిన పోటీలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. పి.దీరజ్‌రెడ్డి ప్రథమ, పి.తన్మయ ద్వితీయ, ఎస్‌కే మహబీన తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ సి.మల్లేశ్వరరావు, కరస్పాండెంట్ సి.జయలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని డైరెక్టర్ పేర్కొన్నారు.

## సందడిగా క్రీడా పోటీలు

ఈతముక్కల కళాశాలలో క్రీడా పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డీపీఈవో ఆయేషా బేగం

ఒంగోలు నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీలు సోమవారం సందడిగా ప్రారంభమయ్యాయి. కబడ్డీ, వాలీబాల్, పరుగుపందెం, షాట్‌పుట్, డిస్కస్‌త్రో తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొత్తపట్నం మండలం ఈతముక్కల ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రీజనల్ స్థాయి మహిళా క్రీడాపోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీపీఈవో ఎస్.ఆయేషా బేగం హాజరయ్యారు. జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆటలతో ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. ప్రిన్సిపల్ యేసు ప్రసాదరావు, జె.శ్రీనివాసరెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు. -ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే, కొత్తపట్నం

ఒంగోలులో పరుగుపందెంలో యువకులు

షాట్‌పుట్ విసురుతూ..

డిస్కస్‌త్రో ఆడుతూ..

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మరమ్మతుల దృష్ట్యా ఒంగోలు నగర పరిధిలోని సత్యనారాయణపురం, దిబ్బలరోడ్డు, యాదవుల బజారు, కరవది బజారు, వెంకటేశ్వరనగర్, తెదేపా కార్యాలయం తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్తుశాఖ డీఈ పాండు రంగారావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

?:కొత్తపట్నం బస్టాండ్ డీవీస్ పోలీసు కార్యాలయం ఎదుట రహదారి పక్కన వరుసగా మూడు వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రివేళ రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. -జె.శ్రీనివాసరావు

✓:పరిశీలించి వెంటనే విద్యుత్తు విభాగం సిబ్బందిని పంపించి లైట్లకు మరమ్మతులు చేయిస్తాం. - వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ - న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

# నూతనోత్సాహం.. కారాదు విషాదం!

❑ కొత్త సంవత్సరం వేడుకల వేళ తీరంలో జాగ్రత్త

న్యూస్‌టుడే, కొత్తపట్నం, ఒంగోలు కర్నూలు రోడ్డు

కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం సముద్రతీరం

మరొక్క రోజులో 2025కు వీడ్కోలు పలికి 2026 సంవత్సరానికి స్వాగతం పలికేందుకు చిన్నా, పెద్ద అందరూ ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా కొత్త సంవత్సరం వేడుకలంటే యువత హడావుడి చెప్పక్కర్లేదు. అర్ధరాత్రి వేళ ద్విచక్ర వాహనాల సైరన్లు, శబ్దాలతో మోత మోగిస్తారు. ఒంగోలు నగరంలో అయితే సాంస్కృతిక ప్రదర్శనలు, కేకుల కర్తింపులు, స్నేహితులతో పెట్టపెట్టాలేసుకొని తిరుగులు.. ఒకటేమిటి డిసెంబర్ 31 రాత్రంతా అందరిలోనూ నూతనోత్సాహం ఉరుముతుంది. ఇదే సందర్భంలో కొందరు సముద్ర తీరానికి వెళ్లి ఆనందంగా గడపాలనుకుంటారు. బంధుమిత్రులతో కలిసి బీచ్‌లో సందడి చేస్తారు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రమాదాలు పొంచి ఉంటాయి. వేడుకల వేళ విషాదం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉంటుంది.

### వాహనాలపై దూసుకు రావొద్దు..

సముద్ర తీరంలోకి ఎక్కువమంది యువత ఇష్టపడతారు. కొత్తపట్నం మండలంలో మూడు బీచ్‌లు ఉన్నాయి. కె.పల్లెపాలెం, ఈతముక్కల, మడనూరు బీచ్‌లకు విద్యార్థులు సెలవు రోజుల్లో ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండానే చాలామంది వచ్చేస్తుంటారు. మరికొందరు స్నేహితులతో కలిసి మద్యం తాగుతూ సముద్ర స్నానాలు చేస్తుంటారు. వారికి తీర ప్రాంతాలపై సరైన అవగాహన లేకపోవడంతో నీట మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు ఒంగోలు, ఇతర ప్రాంతాల నుంచి కొత్తపట్నం పల్లెపాలెం బీచ్‌కు సరదాగా వచ్చేస్తుంటారు. తీరానికి చేరుకునే సమయంలో కొందరు అతి వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. అందువల్ల యువకులు రద్దీ ఉంటుంది. గత ఆయిదు నెలల్లో ఎంతో మంది కళాశాల విద్యార్థులు ఈ మూడు ప్రాంతాల్లో సముద్రంలోపలికి దిగి నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చారు. ఈ నెల 21న మడనూరులో పది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు సముద్రంలో స్నానాలు చేసేందుకు వచ్చారు. ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక అందులో చిక్కుకుని ఒక విద్యార్థి మృత్యువాత పడ్డారు. ఇలాంటి సంఘటనలు కొత్తపట్నం మండలంలోని తీరంలో తరచూ జరుగుతున్నాయి. దీనిపై కొత్తపట్నం మెరైన్ ఎస్సై సుబ్బారావును వివరణ కోరగా.. కొత్త సంవత్సరం వేళ కె.పల్లెపాలెం, మడనూరు, ఈతముక్కల తీరాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. తీరం వద్ద మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఎక్కడ గుంతలున్నాయో తెలియక..

కె.పల్లెపాలెం సముద్రతీరం జిల్లా కేంద్రం ఒంగోలుకు సమీపంలో ఉండడంతో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అదేవిధంగా మడనూరు, ఈతముక్కల బీచ్‌లకు సైతం కొత్త సంవత్సరం వేడుకల వేళ సందర్శకులు తరలివస్తుంటారు. మొంథా తుపాన్ వల్ల సముద్రంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నిర్దేశించిన ప్రాంతంలోనే సందర్శకులు సముద్రంలోకి దిగి స్నానాలు చేయాలి. పోలీసుల ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కారుణ్య నియామక పత్రాలు అందజేత

ఒంగోలు గ్రామీణం: ప్రభుత్వ సర్వీసులో ఉన్నవారు చిత్తశుద్ధితో విధులు నిర్వహించి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. కారుణ్య నియామక కోటా కింద ఉద్యోగాలు పొందిన ఏడిమిది మంది, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద పరిహారంలో భాగంగా ఉద్యోగాలు పొందిన ఇద్దరికి సోమవారం స్థానిక ప్రకాశం భవన్‌లో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మర్చిపోయిన ఫోన్ అప్పగింత

ఒంగోలు కర్నూలు రోడ్డు: దినకరి పూర్ణచంద్ర అనే వ్యక్తి ఒంగోలు నుంచి బెంగళూరు వెళ్లే రైలు ఎక్కేందుకు ఆదివారం రాత్రి ఒంగోలు రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రైలు రావడంతో హడావుడిగా ప్లాట్‌ఫాంపై కూర్చున్న చోట సెల్‌ఫోన్ వదిలేసి వెళ్లిపోయారు. దీరాల వరకు వెళ్లే సరికి గుర్తించి పక్కనున్న వారి ఫోన్‌తో కాల్ చేయగా.. ప్లాట్‌ఫాంపై రింగ్ అవుతుంది. ఆ సమయంలో విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి భద్రపరిచారు. సోమవారం ఫోన్‌కు సంబంధించిన పత్రాలను తీసుకొచ్చి చూపగా.. ఆర్పీఎఫ్ సిబ్బంది ఆ వ్యక్తికి ఫోన్ అప్పగించారు. సీఐ కొండయ్య తమ సిబ్బందిని అభినందించారు.

## మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న మీటర్ రీడర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా జరిగింది. ఏఐటీయూసీ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు, సోలార్ ఏర్పాటు కారణంగా 20 సంవత్సరాలుగా విద్యుత్తు రీడర్లుగా పనిచేస్తున్న కార్మికులు ఉపాధి దెబ్బతిన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రీడర్ల అర్హత ఆధారంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సంఘం నాయకులు కె.వెంకటేశ్వర్లు, సయ్యద్ హుస్సేన్, నాగార్జున పాల్గొన్నారు.

## ప్రకృతి సాగు వైపు మళ్లించాలి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతులు ప్రకృతి సాగువైపు మొగ్గుచూపేలా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని ఏవో కిశోర్‌బాబు సూచించారు. సోమవారం రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో కొత్తపట్నంలో మండల సమీక్ష కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. సంకువారి గుంట, గుండమాల, మోటుమాల, రాజుపాలెం, అల్లూరు గ్రామాలను ప్రకృతి సాగుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

## ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

ఉప్పుగుండూరులో పరిశీలిస్తున్న డీహెచ్‌ఎంవో వెంకటేశ్వర్లు, ఇంజినీర్ల బృందం

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పుగుండూరులో ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల నిర్మించాలని గ్రామ తెదేపా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు ఇంజనీర్ల బృందం ఆసుపత్రి నిర్మాణానికి సోమవారం స్థల పరిశీలన చేశారు. వాటర్‌ట్యాంకు సమీపంలోని స్థలం మట్టిగుంట రోడ్డు, చీరాల రోడ్డు, జూనియర్ కళాశాల వద్ద స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కనగాల శ్రీను, కాట్రగడ్డ చంద్రబాబు, భాస్కరరావు, పిన్నక శ్రీకాంత్, సెల్వం పాల్గొన్నారు.

## విద్యార్థులకు జ్ఞాపికలు అందజేత

ఒంగోలు కలెక్టరేట్: ప్రధాని నరేంద్రమోదీ దిల్లీలో నిర్వహించిన బాలల దైర్యం, త్యాగాన్ని స్మరించుకుంటూ వీర్ బాల్ దివస్-2025 వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర జిల్లా స్థాయిలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన బాలల పిల్లలకు కలెక్టర్ పి.రాజాబాబు చేతుల మీదుగా సోమవారం జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. బాలసదన్‌కు చెందిన వి.నిఖిత, కె.శిరీషకు 2025 పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550కు పైగా మార్కులు సాధించారు. బొమ్మలు కుంచెను వెంది మరో పది మంది జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రీడల్లో రాణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సువర్ణ, బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ రాజాబాబు

## సింహాచల ఆలయ ఆస్తులు పరిరక్షించాలని ధర్నా

ఒంగోలు కలెక్టరేట్: సింహాచల ఆలయ ఆస్తుల పరిరక్షణకై విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వీహెచ్‌పీ ప్రాంత సత్సంగ ప్రముఖ్ సోమ సుబ్బారావు మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణకు, దేవాలయ వ్యవస్థ సజావుగా సాగడానికి సింహాచల అప్పన్న దేవాలయానికి దాతలు భూములు ఇచ్చారని, సదరు భూములను ప్రభుత్వం లీజుపై గూగుల్ సంస్థకు 250 ఎకరాలు ఇవ్వడాన్ని ఖండించారు. ఆలయ ఆస్తుల సంరక్షణకు అధికారులు, ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు సరికాదన్నారు. దేవాదాయ ఆస్తులను వాటి అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం తమ నిర్ణయాలను పునఃసమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఈమని బలరాం, నాయకులు పి.వెంకటేశ్వర్లు, ఐ.సీతారామయ్య, గడ్డం శ్రీను, పి.పున్నారావు, రాధా రమణగుప్తా, ధనిశెట్టి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పి.రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు.

## ఎమ్మెల్యేతో తెదేపా నేతల భేటీ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు పార్లమెంట్ తెదేపా నూతన కమిటీలో నియమితులైన పార్టీ నాయకులు సోమవారం విదేశీ పర్యటన ముగించుకుని నగరానికి వచ్చిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు షేక్ అరిఫా, కార్యనిర్వాహక కార్యదర్శులు గార్లపాటి శ్రీనివాసరావు, కసుకుర్తి అంకరాజు, కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, మీడియా సమన్వయ కర్త పాటిబండ్ల రాజశేఖర్ తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిసిన తెదేపా పార్లమెంట్ నూతన కమిటీ సభ్యులు

## ఎస్పీ అభినందన

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నాగులుప్పలపాడు ఎస్సై రజియా సుల్తానా సున్నితమైన కేసులను లోక్ అదాలత్ ద్వారా ఎక్కువగా పరిష్కరించడంలో చొరవ కనబరిచారు. దీంతో సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఆమెను ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. దీనిపై ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సై రజియా సుల్తానాకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

## చెరువుకట్ట.. అల్లుకున్న చిల్లకంప!

కొత్తపట్నం మండలం సంకుమారిగుంట గ్రామంలో చెరువు కట్టపైన చిల్లచెట్లు పెరిగిపోయాయి. అటువైపు పొలాలకు రాకపోకలు సాగించే దారిపైనే చెట్ల కొమ్మలు ఆవరించడంతో అవస్థలు తప్పడం లేదని రైతులు, కూలీలు ఆందోళన చెందుతున్నారు. చెరువుకు సమీపంలోనే ఇళ్లు ఉండటంతో రాత్రి వేళల్లో పాములు, దోమలు వస్తున్నాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కట్టపై చిల్లచెట్లను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కొత్తపట్నం

## చెంతనే గుండ్లకమ్మ ఉన్నా..!

మద్దిపాడు మండల పరిధిలో రైతులు కాలువల ద్వారా నీరు రాకపోవడంతో పొగాకు మొక్కలను స్ప్రింక్లర్లతో నీటి తడులు అందిస్తున్నారు. తెల్లబాడు, బసవన్నపాలెం గ్రామాల చెంతనే గుండ్లకమ్మ జలాశయం ఉంది. కాలువల ద్వారా నీరు చేరే మార్గం లేక సుమారు కిలో మీటరు వరకు నీటిని పైపుల ద్వారా తరలిస్తున్నారు. పూడిక వల్ల కాలువలు పారడం లేదని, కంప చెట్లతో నిండిపోయాయని రైతులు వాపోతున్నారు. సాగునీటికి అదనపు ఖర్చు పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు. -న్యూస్‌టుడే, మద్దిపాడు

## వర్మీ కంపోస్టు.. ఆదాయంలో బెస్టు

సేంద్రియ వ్యవసాయం, స్వచ్ఛతపై అవగాహన పెంపొందించుకోవాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం అల్లూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వర్మీ కంపోస్టు విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణతోపాటు, వర్మీ కంపోస్టు తయారీ చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. తద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరనున్నట్లు తెలిపారు. జడ్పీ సీఈవో చిరంజీవి, డిప్యూటీ ఎంపీడీవోలు గోపాలకృష్ణమూర్తి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

## వైభవంగా ధనుర్మాస పూజలు

చీమకుర్తి మండలంలోని పలు ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆయా ఆలయాల్లో వేకువజాము నుంచే పూజలు ప్రారంభం అవుతున్నాయి. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతోంది. గోదాదేవి వ్రతాలు నిర్వహిస్తున్నారు. మహిళలు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. అగ్రహారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న సంతర్పణ చేస్తున్నారు. ఈ చిత్రం అగ్రహారం ఆలయంలోనిది. -న్యూస్‌టుడే, చీమకుర్తి

## సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం

మద్దిపాడు: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పారదర్శకంగా అమలు చేసేందుకే ఏటా సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులను గ్రామాల్లో ప్రత్యేక బృందాలు తనిఖీ చేస్తాయన్నారు. ఎస్ఆర్పీ బుజ్జి, డీఆర్పీలు హరిబాబు, సంజయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, పీఆర్ ఏఈ రవి, డిప్యూటీ ఎంపీడీవో హరిప్రసాద్, ఏపీవో వర్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## జనవరి 8 వరకు రైల్వే గేటు మూసివేత

కొత్తపట్నం: సూరారెడ్డిపాలెం రైల్వే స్టేషన్ వద్ద రైల్వే గేటు లెవల్ క్రాసింగ్ పనుల నిమిత్తం మంగళవారం నుంచి జనవరి 8 తేదీ వరకు ఉదయం 7 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూసివేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఈతముక్కల, రాజుపాలెం, మడనూరు తదితర గ్రామాల ప్రజలు ఒంగోలుకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గేటు మూసివేస్తున్న నేపథ్యంలో ఇటుగా వచ్చే వారు కొత్తపట్నం నుంచి లేదా.. సంకువారిగుంట, వాలేపల్లిపాడు నుంచి పెళ్లూరు మీదుగా ఒంగోలు వెళ్లేందుకు రోడ్డు ఉంది. వాహదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగించాలని సూచించారు.

## బాల్య వివాహాలపై అవగాహన అవసరం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలపై ప్రతి విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పాదర్తి గ్రామంలోని కేజీబీవీని సోమవారం సందర్శించారు. విద్యార్థినులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. న్యాయ సలహాదారులు రత్నప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థినులు అత్యవసర సమయాల్లో వినియోగించే టోల్‌ఫ్రీ నం. 1098, 100ల గురించి అవగాహన కల్పించారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్

## రీ సర్వేపై గ్రామసభ

ఎండ్లూరు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: గ్రామంలో జరిగే భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ మాబు సుభాని సూచించారు. సోమవారం ఎండ్లూరులో రీ సర్వేకు సంబంధించి గ్రామ సభ, ర్యాలీ నిర్వహించారు. జనవరి 2 నుంచి రీ సర్వే ప్రారంభమవుతుందన్నారు. రైతులు తమ భూమి హక్కు పత్రాలతో సర్వే చేసుకోవాలన్నారు.

## వాడపల్లి ఆలయ పాలకమండలి సభ్యురాలిగా పద్మావతి

వాడపల్లి (ఆత్రేయపురం): కూటమి పాలనలో దేవాలయాలు సమగ్రాభివృద్ధి సాధిస్తున్నాయని ఎంపీ హరిష్‌మాథుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాడపల్లి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పాలకమండలి అధ్యక్షుడిగా ఆత్రేయపురానికి చెందిన ముదునూరి వెంకటరాజు కాగా, ఒంగోలుకు చెందిన గంగవరపు పద్మావతి సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి ప్రధాన రహదారిలో ఇసుకవాగు శివాలయం సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి గాయపడిన ఎన్.చంద్రశేఖర్ (18) అసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కన్నుమూశాడు. కేసు సమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డి.ప్రసాద్ తెలిపారు.

## పార్శిల్ కార్యాలయాల్లో తనిఖీలు

చీమకుర్తి: చీమకుర్తిలోని పలు పార్శిల్ కార్యాలయాల్లో ఎక్సైజ్ పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సీఐ ఎం.సుకన్య మాట్లాడుతూ.. ఆయా కార్యాలయాల్లో గంజాయి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మద్యం సీసాలు దొరకలేదని చెప్పారు. పండగల వేళ కావడంతో అనుమానిత పార్శిళ్లు ఏమైనా వస్తే వెంటనే తమకు తెలియజేయాలని నిర్వాహకులకు ఆమె సూచించారు.

## నకిలీ పత్రాలతో స్థలం కాజేశారని ఫిర్యాదు

మద్దిపాడు, న్యూస్‌టుడే: నకిలీ పత్రాలతో తమ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని సోమవారం ఒంగోలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రాజాబాబుకు బాధితులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే.. మద్దిపాడు మండలం గుండ్లాపల్లికి చెందిన వృద్ధురాలు షేక్ అల్లెంబీకి చెందిన 96.8 చదరపు గదుల స్థలాన్ని సమీప బంధువు వాడపల్లి మీరావలి ఆక్రమించుకుని ఓ నాయకుడు, అధికారులతో కలిసి ఆమెను బెదిరించాడు. ఇరువర్గాల వారిని వివాద స్థలంలోకి ప్రవేశించవద్దని స్థానిక ఎస్సై బైండోవర్ చేయించారు. అయినప్పటికీ సదరు వ్యక్తులు స్థలాన్ని ఆక్రమించారు. దీనిపై గత సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను ఎస్సై సూర్య స్టేషన్‌కు పిలిపించి విచారణ చేసి పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేశారు. స్థల ధ్రువీకరణ పత్రం తన సంతకంతో ఫోర్జరీ చేశారని పంచాయతీ కార్యదర్శి లతీఫ్ తెలిపారు. అయినా అతడు దీనిపై ఫిర్యాదు చేయడంలో జాప్యం చేయడంతో బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే కలెక్టర్ ఎంపీడీవో జ్యోతిని విచారణ చేయమని ఫోన్‌లో ఆదేశించారు. దీంతో ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. తన సంతకం ఫోర్జరీ చేశారని తెలిపారు. సదరు విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆమె ఆదేశించారు. దీంతో కార్యదర్శి సోమవారం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## పెన్షనర్ల ప్రయోజనాలు కాపాడేందుకు కృషి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ప్రయోజనాలు కాపాడేందుకు కృషి చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్జీవో హోంలో బడె అంకిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ మార్చి లోపల తిరిగి సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని నిలుపుదల చేయడానికి ఉద్యమించాలన్నారు. కమ్యుటేషన్‌ను 12 లేదా 13 సంవత్సరాలకు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు మాట్లాడుతూ.. 12వ పీఆర్‌సీని వెంటనే వేసి, ఐఆర్ ప్రకటించాలని కోరారు. 11వ పీఆర్‌సీ, డీఏ బకాయిలు విడతల వారిగానైనా ఇవ్వాలన్నారు. జిల్లా ఖజానా అధికారి జగన్నాథరావు మాట్లాడుతూ.. పెన్షనర్లు జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 28 లోపు లైఫ్ సర్టిఫికేట్లు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ట్రెజరీకి రాకుండా వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపినా పరిష్కరిస్తామన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల సుబ్బారావు, ఎస్టీవో కృష్ణ, ఎ.రమణయ్య, జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. 75 ఏళ్లు నిండిన 40 మంది పెన్షనర్లను సత్కరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంకిరెడ్డి, సహాధ్యక్షులుగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కంచర్ల సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మన్నం హనుమంతరావు, కోశాధికారులుగా రామకోటేశ్వరరావు, ప్రభాకరరావు, గౌరవాధ్యక్షుడిగా వి.పున్నయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

75 ఏళ్లు నిండిన ప్రభుత్వ పెన్షనర్లను సత్కరించిన నిర్వాహకులు

## దారిపైకి జలం.. ఇబ్బందులమయం

న్యూస్‌టుడే, చీమకుర్తి

ఒంగోలు-కర్నూలు రహదారిపై పారుతున్న నీరు

గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే ద్రవ వ్యర్థాలతో ఒంగోలు-కర్నూలు రహదారిలో వాహన చోదకులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. చీమకుర్తి మండలం యల్లయ్యనగర్-మర్రిచెట్లపాలెం మధ్య గ్రానైట్ ఫ్యాక్టరీల్లోంచి ద్రవ వ్యర్థాలను కొంత కాలంగా రోడ్డుపైకి వదులుతున్నారు. ఈ రీతిలో వచ్చి చేరుతున్న వ్యర్థాలు రోడ్డుపై సుమారు 100 మీటర్ల దూరం సాగుతున్నాయి. నిత్యం ద్రవ వ్యర్థాలు వచ్చి చేరుతుండడంతో రోడ్డు గుంతలమయమైంది. నిత్యం రాక పోకలు సాగించే వారు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించడం... రెండు రోజులు తిరగకుండానే పరిస్థితి మళ్లీ మొదటికి రావడం జరుగుతోంది. కొన్ని నెలలుగా ఇలా వ్యర్థాలను రహదారిపైకి వదులుతున్నా పంచాయతీ అధికారులు, ఆర్‌అండ్‌బీ వారు గాని కనీస చర్యలు చేపట్టడం లేదని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఈఈ నాయక్‌ను వివరణ కోరగా.. పరిశీలించి తగు చర్యలు చేపడతామని తెలిపారు.

ఒంగోలు నగర పరిసర ప్రాంత ప్రజలకు, "బాంబేటెక్స్" వారి శుభవార్త
బాంబేటెక్స్
జంట్స్ క్లాత్ & కట్ పీసెస్ షోరూం
వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు
బాంబేటెక్స్ వారి క్రిస్మస్, నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో ఆఫర్.. ఆఫర్...
Raymond Phant 1.30 cut Rs. 500/-
Cotton shirt 1.60 Cut Rs. 300/-
BSL Phant 1.30 cut Rs. 500/-
Cotton shirt 1.60 Cut Rs. 300/-
OCM Phant 1.30 cut Rs. 500/-
Cotton shirt 1.60 Cut Rs. 300/-.
Vimal Phant 1.30 cut Rs. 350/-
Cotton shirt 1.60 Cut Rs. 300/-
Cotton Shirt 1.60 Cut 2+2=4 Shits Rs. 1000/-
Special Offer Linen Cotton Shirt 1.60 Cut Rs. 600/-
మా కసమర్స్, శ్రేయోభిలాషులు మరియు మిత్రులకు, ఈ అవకాశమును సద్వినియోగం చేసుకొని ఎప్పటివలె మా వ్యాపారాభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాము.
సరికొత్త స్టాకు వచ్చియున్నది
BOMBAYTEX
GENTS CLOTH & CUT PIECES SHOW ROOM
SHOP NO. 134 & 135, S.B.M.C. ONGOLE.
PROP:- K.V. SUBBA RAO, CELL:- 9966003542

(c) eenadu

## ఈనాడు క్రీడా సంరంభం

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్-2025 క్రికెట్ క్రీడా సంరంభం నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో గ్రౌండ్-1, గ్రౌండ్-2 వేదికలుగా సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైవో నందన్ ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించగా... రావూస్ విద్యా సంస్థల ఛైర్మన్ కోటేశ్వరరావు, డైరెక్టర్ శివ సంకేత్, నారాయణ వైద్య కళాశాల ఏజీఎం శేఖర్‌రెడ్డి, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ధనిక్‌భారత్ ప్రతినిధులు, 'ఈనాడు' నెల్లూరు యూనిట్ ఇన్‌ఛార్జి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

... గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అభినందనీయం ...6

| జిల్లా స్వరూపమిది.. | పేరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా | జిల్లా కేంద్రం నెల్లూరు | జనాభా 22,99,699 | అసెంబ్లీ నియోజకవర్గాలు: 8 (కోవూరు, నెల్లూరు నగరం, నెల్లూరు గ్రామీణం, సర్వేపల్లి, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, గూడూరు) | రెవెన్యూ డివిజన్లు: 4 (నెల్లూరు, కావలి, గూడూరు, ఆత్మకూరు) |
|---|---|---|---|---|---|

## 4 డివిజన్లు.. 36 మండలాలు!

గూడూరులోని మూడు మండలాలు నెల్లూరులోకి

ప్రకాశంలో చేరనున్న కందుకూరు నియోజకవర్గం

ఈనాడు, నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.. నూతన భౌగోళిక స్వరూపంతో పరిపాలనకు సిద్ధమైంది. 4 డివిజన్లు.. 36 మండలాలతో మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నెల 31వ తేదీ నుంచి తుది గెజిట్ విడుదల చేయనుంది. మార్పులు, చేర్పులన్నీ జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయని మంత్రులు ప్రకటించారు. గత ప్రభుత్వంలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లాగా చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత సమీపంలో ఉండటంతో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని సర్వేపల్లిని నెల్లూరులోనే ఉంచి.. మిగిలిన మూడు నియోజకవర్గాలను తిరుపతి జిల్లాలో కలిపారు. దానిపై గూడూరు ప్రజలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. తాము నెల్లూరు జిల్లాలోనే కొనసాగుతామని ఆందోళనలు చేశారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబునాయుడుతో పాటు యువగళంలో నారా లోకేశ్ గూడూరును తిరిగి నెల్లూరులోనే కలుపుతామని హామీ ఇచ్చారు. తొలుత గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలోనే ఉంచాలని భావించినా.. ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు రావడంతో.. వారి అభీష్టానికే ఆమోదం తెలిపింది. గూడూరు, కోట, చిల్లకూరు మండలాలను నెల్లూరులో కలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. వాకాడు, చిట్టమూరు మండలాలు తిరుపతి జిల్లాలోనే కొనసాగనున్నాయి.



కలువాయిలో దీక్షలు విరమింపజేస్తున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

### డివిజన్ల వారీగా మండలాలు

**నెల్లూరు:** నెల్లూరు నగరం, నెల్లూరు గ్రామీణం, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, సైదాపురం, రాపూరు

**కావలి:** కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి, జలదంకి, కలిగిరి, దుత్తలూరు, విడవలూరు, కొడవలూరు, వింజమూరు, కొండాపురం, వరికుంటపాడు

**ఆత్మకూరు:** ఆత్మకూరు, చేజర్ల, అనుమసముద్రంపేట, మర్రిపాడు, సంగం, అనంతసాగరం, ఉదయగిరి, సీతారామపురం, కలువాయి

**గూడూరు:** గూడూరు, కోట, చిల్లకూరు

### జనాభాలో రెండో స్థానం

గత విభజన ప్రకారం జిల్లా విస్తీర్ణం 10,441 చ.కి.మీ. కాగా.. జనాభా 24,69,707 లక్షల వరకు ఉంది. ఈ ప్రకారం అత్యధిక జనాభా కలిగిన జిల్లాల్లో మొదటి స్థానంలో నిలిచింది. కొత్తగా మార్పులు చేర్పులు చేసిన జిల్లాల ప్రకారం తిరుపతి అత్యధిక జనాభాతో ఉండగా.. నెల్లూరు జిల్లా 22,99,699తో రెండో స్థానంలో నిలిచింది.

### రెవెన్యూ డివిజన్లు ఇలా..

జిల్లాలో కావలి, నెల్లూరు, ఆత్మకూరు, గూడూరు.. నాలుగు డివిజన్లు ఉన్నాయి. కందుకూరు ప్రకాశంలోకి చేరడంతో.. ఆ డివిజన్‌లోని కొండాపురం, వరికుంటపాడు మండలాలు తిరిగి కావలి రెవెన్యూ డివిజన్‌లోకి చేరాయి. గూడూరు రెవెన్యూ డివిజన్‌లో గూడూరు, కోట, చిల్లకూరు మండలాలు ఉండగా- కలువాయి మండలాన్ని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో, రాపూరు, సైదాపురం మండలాలు నెల్లూరు డివిజన్‌లోనే ప్రస్తుతం కొనసాగించనున్నారు.



## ముక్కోటికి ముస్తాబు

ముక్కోటి ఏకాదశికి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. ఎక్కడికక్కడ ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో నేటి నుంచి పది రోజుల పాటు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. - ఈనాడు, నెల్లూరు

రైతేరాజు వరి.. సస్యరక్షణతో సిరి ..6

## మూడేళ్ల కష్టం.. మనోజ విజయం

చిన్ననాటి లక్ష్యం.. మూడేళ్ల అవిశ్రాంత శ్రమ.. నెల్లూరుకు చెందిన ఎం.మహాలక్ష్మి మనోజను విపరీత పోటీని సైతం అధిగమించి.. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యేలా చేశాయి. నగరానికి చెందిన ఎం.నరేంద్రబాబు, రమాదేవి దంపతుల కుమార్తె మనోజ.. ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. క్రికెట్ అంటే ఇష్టం.. దానికి తల్లిదండ్రుల సహకారం తోడైంది. 2022 ఆగస్టులో స్థానిక ఓ అకాడమీలో చేర్పించారు. సీనియర్ క్రికెటర్ రాజాకృష్ణ దగ్గర మెలకువలు తెలుసుకుని.. మూడేళ్లలోనే కీపర్ కమ్ బ్యాటర్‌గా రాణిస్తోంది. గత ఏడాది వెంకటగిరిలో జరిగిన అండర్-15 సౌత్‌జోన్, ఈ ఏడాది వైజాగ్‌లో జరిగిన అండర్-19 పోటీల్లో పాల్గొంది. తాజాగా నెల్లూరులో జరిగిన ఏసీఏ రాష్ట్ర (ప్రాబబుల్స్) పోటీల్లో 95, 70 పరుగులు చేసి చక్కటి ప్రతిభ కనబరిచింది. తద్వారా జనవరి 2వ తేదీ నుంచి నాగ్‌పూర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు వెళ్లే రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించింది. భారత జట్టులో ఆడాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది మహాలక్ష్మి మనోజ..

– న్యూస్‌టుడే, నెల్లూరు(వేదాయపాలెం)

## వ్యాపారం ప్రారంభిస్తున్నారా..?

రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం పొందండి ఇలా..

జిల్లాలో గత అయిదేళ్ల కాలంలో వ్యాపార సంస్థలు పెరిగాయి. చదువుకున్న యువత సైతం సొంత వ్యాపారాలు ప్రారంభిస్తున్నారు. చాలా మందికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) ఎక్కడ పొందాలి.. ఎలా దరఖాస్తు చేయాలో అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. జీఎస్టీ రాక ముందు క్లిష్టతరంగా ఉన్న ఈ ప్రక్రియను కేంద్రం సులభతరం చేసింది.

### మీరు చేయాల్సిందిలా..

● ఆధార్ కార్డు, పాన్ నంబరు, ఫొటోతో పాటు ఆధార్ భవనం పన్ను రసీదు, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సైట్‌లో పొందుపరచాలి. ● ఆ తర్వాత దరఖాస్తుదారుడి ఫోన్ నంబరుకు వచ్చిన ఓటీపీని నమోదు చేయాలి. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో కాంపోజిషన్ డీలర్ లేదా రెగ్యులర్ డీలర్ (జీఎస్టీ వ్యాపారం) అని ఎంపిక చేయాలి. ● నెలకు రూ.2.50 లక్షల లోపు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కోరే వ్యాపారులైతే కాంపోజిషన్ డీలర్‌గా, రూ.2.50 లక్షలకు మించి ఐటీసీ కోరే వారైతే రెగ్యులర్ డీలర్ (జీఎస్టీ)గా లైసెన్సు తీసుకోవాలి. ● ఏ తరహా వ్యాపారం చేయనున్నారు.. విక్రయించే సరకులు, దుకాణం చిరునామా వివరాలను అప్‌లోడ్ చేయాలి. ● దరఖాస్తు చేసిన వారంలోగా లైసెన్సు మంజూరవుతుంది. ● కాంపోజిషన్ డీలర్ అయితే ప్రతి మూడు నెలలకు ఒకసారి అమ్మకాలపై ఒక శాతం పన్ను చెల్లిస్తూ ఆన్‌లైన్‌లో రిటన్స్ దాఖలు చేయాలి. ● రెగ్యులర్ డీలర్ అయితే ప్రతినెలా 20వ తేదీలోపు గత నెలలో జరిపిన అమ్మకాలు, కొనుగోళ్ల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. ● జీఎస్టీ చెల్లిస్తూ రిటన్స్ దాఖలు చేయాలి. అలా చేయకపోతే రూ.2500 వరకు జరిమానా విధిస్తారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

## ఉపాధికి అండగా.. ఉద్యమ్ ఆధార్..!

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను.. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి పొందుతున్న మహిళల వ్యాపారాలను బలోపేతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. పరిశ్రమల ఏర్పాటు దిశగా అవగాహన, ఆదాయం పెంపు, రుణాల కల్పన తదితరాలే లక్ష్యంగా 'ఉద్యమ్' ఆధార్ నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు.

**కార్డు పొందాలంటే..** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఉద్యమ్ ఆధార్‌పై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడంతో పాటు నమోదు చేసి.. కార్డులు సైతం అందిస్తున్నారు. వీటి కోసం మహిళా సమాఖ్య కార్యాలయం, సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆధార్, పాన్‌కు లింకైన చరవాణి నంబరు తీసుకువెళ్లాలి. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ), మైక్రో స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్(ఎంఎస్ఎంఈ) పథకాల్లో రాయితీ రుణాలు పొందేందుకు ఈ కార్డు తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపారాలు చేసుకునే వారు రాయితీ రుణాలు పొందేందుకు కార్డు ఉపయోగపడనుంది.

### అవగాహన కల్పిస్తున్నాం

ఉద్యమ్ కార్డుతో ప్రయోజనాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 1500 మందికి అందించాం. పొదుపు సంఘాల ద్వారా వ్యాపారం చేసే వారి వివరాలు తీసుకుంటున్నాం.

– నాగరాజకుమారి, డీఆర్‌డీఏ, పీడీ

## ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రజాభిప్రాయసేకరణ నేడు

కొడవలూరు, న్యూస్‌టుడే: కొడవలూరు మండల పరిధిలోని ఇఫ్కో- కిసాన్‌సెజ్‌లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటులో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం దీనిపై పర్యావరణ అనుమతులు, స్థానిక గ్రామస్థుల అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. ఇప్పటికే పోలీసులు పలువురికి ముందస్తు నోటీసులిచ్చారు. ఉన్నతాధికారులు, కంపెనీ ప్రతినిధులు రానుండడంతో మంగళవారం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొన్నేళ్లుగా భూములు ఖాళీగా ఉన్నాయి. పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడంతో రైతుల్లో నిరాశ నెలకొంది. గత వైకాపా పాలనలో పరిశ్రమల ఏర్పాటు విషయాన్ని పూర్తిగా విస్మరించారు. కూటమి ప్రభుత్వం చొరవచూపి పారిశ్రామికవేత్తలతో చర్చించగా కొందరు ఏర్పాటుకు ముందుకొచ్చారు. దశాబ్దాలుగా రెండు వేల ఎకరాలకు పైగా భూములు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిలో పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు ఉపాధి లభిస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## విమానంలో ఎగరావచ్చు!

దగదర్తి విమానాశ్రయ భూసేకరణ నివేదికకు మంత్రివర్గం ఆమోదం

ఈనాడు, నెల్లూరు: దగదర్తి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందుకు సంబంధించిన భూసేకరణ సమగ్ర నివేదికను కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రభుత్వానికి నివేదించగా.. సోమవారం మంత్రివర్గం ఆమోదించింది. ప్రభుత్వపరంగా చేపట్టిన కార్యాచరణ, భూసేకరణ, పురోగతిని వివరించారు. తద్వారా జిల్లా ప్రజల చిరకాల కోరిక సాకారం కానుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన టెండరు ప్రక్రియ ప్రారంభం కాగా- త్వరలో గుత్తేదారుల ఎంపికను పూర్తి చేయనున్నారు. విమానాశ్రయం పూర్తయితే.. జిల్లా పారిశ్రామిక, పర్యాటక రంగాలకు ఊతం కానుంది. ప్రయాణికులతో పాటు సరకు రవాణా పెరుగుతుంది. కడప, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల ప్రజలు, పరిశ్రమలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

### రూ.916 కోట్లతో మొదటి విడత

విమానాశ్రయం మొదటి దశ పనులను రూ. 916 కోట్లతో చేపట్టనున్నారు. పీపీపీ విధానంలో చేపట్టాలని రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ లిమిటెడ్(ఏపీఏడీసీఎల్) నిర్ణయించింది. ఇందుకు సంబంధించి టెండరు పిలిచారు. నిర్మాణ సంస్థతో 15 ఏళ్లపాటు అమలులో ఉండేలా రాయితీ ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నారు. ప్రతి 15 ఏళ్లను ఒక దశ కింద పరిగణించి.. మూలధన ఖర్చును, భవిష్యత్తులో పెరిగే ప్రయాణికుల రద్దీ, కార్గో సేవలకు అనుగుణంగా సర్దుబాటు చేసేలా ప్రతిపాదించారు. మొదటి 15 ఏళ్లలో డిమాండ్ తక్కువగా ఉంటుందని, రెండో దశలో పెరుగుతుందని, మూడో దశలో గరిష్ఠస్థాయికి చేరుతుందని భావిస్తున్నారు. కొత్త విమానాశ్రయం నుంచి ప్రారంభంలో ఎయిర్‌బస్ ఎ-320/ఎ-321 రకం మీడియం సైజు విమానాలు నడపాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఒక రన్‌వే నిర్మాణానికి ప్రణాళికను సిద్ధం చేశారు.

దగదర్తి సమీపంలోని భూములను పరిశీలిస్తున్న ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు

● కలెక్టర్ హిమాన్షుశుక్లా మాట్లాడుతూ.. దగదర్తి విమానాశ్రయం నిర్మాణంతో జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది. జిల్లాలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని అన్నారు.

## భూ సమస్యపై రెవెన్యూ క్లినిక్

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో భూ సమస్యలు అధికమయ్యాయి. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలోనూ వీటిపై అధికంగా అర్జీలు వస్తున్నాయి. వాటిని సకాలంలో పరిష్కరించకుండానే ముగిస్తుండటం.. కొర్రీలు పెట్టి వెనక్కు పంపుతుండటంతో అర్జీదారుల్లో అసంతృప్తి నెలకొంది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో రెవెన్యూ క్లినిక్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ఇది పనిచేయనుంది.

రెవెన్యూ క్లినిక్‌లో ఆయా డివిజన్ల సిబ్బంది

| 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు వచ్చిన అర్జీలు |
|---|
| రెవెన్యూ సమస్యలపై 23,687 |
| సర్వేలోపాలపై: 10,670 |

### ఈ విధానంలో..

నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు డివిజన్ స్థాయి అధికారులు.. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో కూర్చుంటారు. అర్జీదారుల ఎదుటే.. సంబంధిత సిబ్బందికి సమాచారం ఇచ్చి.. పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటారు. కొన్నింటిని తక్షణమే సరిచేసే ప్రయత్నం చేస్తారు.

### 16 రకాల అంశాలపై...

రీ సర్వే లోపాలు, ఎఫ్-లైన్ పిటీషన్లు, అసైన్డ్ 1బీ, డీపట్టా, వెబ్‌ల్యాండ్‌లో విస్తీర్ణం నమోదు, డీ పట్టా భూముల ఆక్రమణలు, మ్యుటేషన్, తప్పుగా మ్యుటేషన్ చేయడం, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, 22ఏ నుంచి భూముల తొలగింపు, 1-70 చట్టం అమలు, ఆర్వోఎఫ్ఆర్ మంజూరు, జాయింట్ ఎల్పీఎంల విభజన, సింగిల్ ఎల్పీఎం విడదీయడం, హద్దుల సవరణ తదితర 16 రకాల భూ సమస్యలపై ఈ కౌంటరులో అర్జీలు ఇవ్వొచ్చు.

## ఇంటి గుట్టు వీడేనా?

జిల్లాలో నేడు, రేపు గృహ నిర్మాణశాఖ ఎండీ పర్యటన

ఈనాడు, నెల్లూరు: వైకాపా ప్రభుత్వంలో జిల్లాలో పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పేరుతో జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. కొందరు అధికారులు అధికార పార్టీ నాయకుల అండతో రెచ్చిపోయారు. సామాన్యులకు అండగా ఉండటం మాని.. గుత్తేదారులకు కొమ్ముకాశారు. స్టీలు, సిమెంట్, ఇసుకను పక్కదారి పట్టించారు. నాణ్యతను విస్మరించి ఇళ్లు కడుతున్నా.. అడ్డుకునే సాహసం చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వీటన్నింటిపై దృష్టిపెట్టినా.. ప్రయోజనం దక్కలేదు. విజిలెన్స్, థర్డ్ పార్టీ విచారణలో పలు లోపాలు గుర్తించినా.. బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. తాజాగా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి.. అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంతో పాటు పేదల ఇళ్ల నిర్మాణంలో పురోగతికి చర్యలు ప్రారంభించింది. ఆ క్రమంలోనే గృహ నిర్మాణశాఖ ఎండీ అరుణ్‌బాబు రెండు రోజులు జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం రాత్రి నెల్లూరుకు చేరుకుంటున్న ఆయన.. మంగళ, బుధవారాల్లో జిల్లాలో పరిస్థితిపై ఆరా తీయనున్నారు. దీంతో ఇప్పటికైనా గృహ నిర్మాణశాఖలో పరిస్థితి చక్కబడేనా అన్న చర్చ మొదలైంది.

### హౌసింగ్ పీడీ ఎవరు?

జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీగా ఉన్న టి.వేణుగోపాల్‌ను రిలీవ్ చేయడంతో పాటు రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేయాలని డిసెంబరు ఒకటో తేదీన ఎండీ అరుణ్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, ఆయన రిలీవ్ కాలేదు. దాంతో ప్రతివారం జరిగే సమీక్షా సమావేశానికి హాజరైన పీడీపై ఆ శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా రాష్ట్ర కార్యాలయంలో ఎందుకు రిపోర్టు చేయలేదని అడగడంతో పాటు.. అప్పటి వరకు జిల్లాపై సమీక్ష నిర్వహించబోనని తేల్చి చెప్పినట్లు సంబంధిత వర్గాలే చెబుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ నెల 18వ తేదీ పీడీని రిలీవ్ చేస్తూ.. టిడ్కో ఈఈ మహేష్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. టిడ్కో ఈఈ బాధ్యతలు చేపట్టలేదు. మరోవైపు పీడీ నిత్యం కార్యాలయానికి వెళుతున్నారు. దీంతో జిల్లాలో గృహనిర్మాణశాఖ అధికారి ఎవరనే దానిపై సందిగ్ధం నెలకొంది. ఎండీ అరుణ్‌బాబు జిల్లా పర్యటనతో వీటన్నింటికి ముగింపు పడుతుందని పలువురు గృహనిర్మాణశాఖ సిబ్బంది భావిస్తున్నారు.

## అలుగు వాగులో గలీజు

మందాటి చెరువు అలుగు ప్రవాహ మార్గంలో ఓ ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేస్తున్న టవర్ ఇది. అది ప్రభుత్వ స్థలం కాగా.. ఓ ఘనుడు ఆక్రమించి.. సదరు ప్రైవేటు సంస్థకు లీజుకిచ్చాడు. ట్రంకు రోడ్డు పక్కనే ఉండటంతో రూ. విలువ కోట్లలోనే పలుకుతోంది.

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని మందాటి చెరువు పరిసరాలను హస్తగతం చేసుకోవడానికి కబ్జాదారులు బరితెగిస్తున్నారు. అడిగేవారు లేరన్న ధీమాతో యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇటీవల పురపాలక సంఘం అధికారులు కొన్నింటిని తొలగించగా.. మరోవైపు కొత్తవి వెలుస్తూనే ఉన్నాయి. తాజాగా అలుగు ప్రవాహ మార్గం ఆక్రమణ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రెవెన్యూశాఖ ఇచ్చినట్లు నకిలీ ధ్రువీకరణ పత్రాలు చూపించి.. వాగు స్థలాన్ని ఓ ప్రైవేటు టెలికాం కంపెనీకి లీజుకు ఇచ్చారు. ఆ సంస్థ టవర్ ఏర్పాటు చేస్తుండగా.. జలవనరులశాఖ అధికారులు అడ్డుకున్నారు. వాదోపవాదాలు చోటు చేసుకోగా.. రెవెన్యూ సర్వేయరు వచ్చి.. కొలతలు వేసి.. అది జలవనరుల శాఖ స్థలమేనని నిర్ధారించారు. అయినా టవర్ నిర్మాణం జరుగుతుండటం గమనార్హం.

### వరదంతా నివాసాల్లోకే...

మందాటి చెరువు నిండితే.. అదనపు జలాలు ఆ మార్గంలోని పాపిరెడ్డి గుంతలోకి వెళతాయి. ఇప్పటికే ఆక్రమణలతో.. చెరువు నిండితే.. సమీప నివాసాల్లోకి వరద పోటెత్తుతోంది. ఇలాగే వదిలేస్తే ట్రంకురోడ్డుపైకి వరద చేరే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### ఆ స్థలం మాదే...

టవర్ నిర్మాణ ప్రాంతం మాదేనని సర్వేలో తేలింది. అందుకే అడ్డుకున్నాం. వాటిని పూర్తిగా తొలగిస్తాం. – జంపాని కిరణ్, సహాయ ఇంజినీరు, జలవనరులశాఖ, కావలి

## కొరవడిన శోధన... కానరాని పరిశోధన!

కావలి, న్యూస్‌టుడే: రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేయడంతో పాటు వారికి స్థిరమైన ఆదాయం అందించేందుకు 1974లో నేషనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ప్రాజెక్టు- నాన్ ప్లాన్ కింద కావలి పట్టణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ పరిశోధనా స్థానం(అగ్రికల్చరల్ రీసెర్చ్ స్టేషన్) లక్ష్య సాధనలో వెనుకబడింది. నిర్వహణ కొరవడటంతో.. దశాబ్దకాలంగా పరిశోధనల ఊసే లేకుండా పోయింది.

కావలిలోని ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం

### 54 ఎకరాల విస్తీర్ణంలో..

కావలి బాపూజీనగర్ ఐడీఎస్ ఎంటీ కాలనీని ఆనుకుని ఉండే ఈ స్టేషన్ 54 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో లేటరైట్ నేలలు అధికంగా ఉండటంతో.. వీటిలో పోషకాలు, నీటి భద్రతా సామర్థ్యాన్ని పెంచడానికి అనుకూలమైన, ఆర్థికంగా సమర్థమైన ఆగ్రో- ఫారెస్ట్రీ వ్యవస్థలను అభివృద్ధి చేయాలన్నది కేంద్రం లక్ష్యం. దీంతో పాటు పప్పులు, నూనె గింజలపై పరిశోధనలు జరగాలి. దశాబ్దం కింద పొగాకు, వేప చెట్లకు సంబంధించిన పరిశోధనలు జరగ్గా.. తర్వాత మొక్కల విక్రయాలు, వృక్ష ఫలాల సేకరణకు లీజుకు ఇవ్వడానికే పరిమితమైంది.

**మొక్కల విక్రయంతో...** ప్రస్తుతం నర్సరీ ఏర్పాటు చేసి.. పలు రకాల మొక్కలు పెంచి విక్రయిస్తున్నారు. మామిడి చెట్లను ఏటా లీజుకు ఇస్తున్నారు. సపోటా, వేప, జీడిమామిడి, చింత, ఎర్రచందనం, శ్రీగంధం తదితర వృక్షాలు ఉన్నా.. ఎలాంటి ఫలసాయం రావడం లేదు. జామాయిల్ మూడేళ్లకు ఒకసారి కోతకు వస్తుంది. మొత్తంగా ఈ ఏడాది అన్ని రూపాల్లో రూ. ఏడు లక్షల ఆదాయం రాగా.. సీఎఫ్ఎంఎస్ విధానంలో ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తున్నారు. ప్రస్తుతం ముగ్గురు కాపలాదారులు, ఓ క్లరికల్ సిబ్బంది, శాస్త్రవేత్త విధులు నిర్వహిస్తున్నారు.

● దీనిపై శాస్త్రవేత్త మల్లు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ... జామాయిల్ సాగుతో ఆదాయం వస్తోంది. పరిశోధనలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కేంద్రం చుట్టూ హద్దుగా కంచెల వంటి నిర్మాణాలకే రూ. కోటి అవసరమవుతుండటంతో.. ప్రతిపాదనలు పంపించాం అన్నారు.

(c) eenadu

EENADU SPORTS LEAGUE 2025

# గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అభినందనీయం

నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ ● ఘనంగా ప్రారంభమైన ఈఎస్ఎల్

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారుల్లో దాగిఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించడం అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ వైవో నందన్ పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో గ్రౌండ్-1, గ్రౌండ్ -2లో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)- 2025ను సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ముందుండే 'ఈనాడు' యాజమాన్యం యువతను ప్రోత్సహించేందుకు క్రీడాపోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. తొలుత కమిషనర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. రావూస్ విద్యాసంస్థల ఛైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నారాయణ వైద్య కళాశాల ఏజీఎం శేఖర్ రెడ్డి, రావూస్ విద్యాసంస్థల డైరెక్టర్ శివ సంకేత్, 'ఈనాడు' నెల్లూరు యూనిట్ ఇన్‌ఛార్జి దుర్గా ప్రసాద్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. గ్రౌండ్-1లో సీనియర్లకు, గ్రౌండ్-2లో జూనియర్లకు పోటీలు జరిగాయి.

నారాయణ మెడికల్ కాలేజ్ & హాస్పిటల్ చింతారెడ్డిపాలెం, నెల్లూరు.

బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభిస్తున్న కమిషనర్ నందన్

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor
City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Digital Partner
ఈనాడు.నెట్
TV Partner
ETV
District Sponsor
RAO'S EDUCATIONAL INSTITUTIONS NELLORE
Organised by
ఈనాడు

## ఆదిశంకర కళాశాల విజయకేతనం..

విజయానందంలో కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

సుమంత్

విక్రమ సింహపురి వర్సిటీ (కావలి), ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల(నార్తురాజుపాలెం) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన కావలి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆదిశంకర కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో అయిదు వికెట్లు కోల్పోయి 118 భారీ స్కోరు చేసింది. సుమంత్ 30 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 63 పరుగులు చేశారు. ఆ తర్వాత బరిలోకి దిగిన కావలి జట్టు పది ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసింది. 44 పరుగుల తేడాతో ఆదిశంకర కళాశాల జట్టు విజయకేతనం ఎగురవేసింది.

## కృష్ణచైతన్య గెలుపు..

ఆనందంలో డిగ్రీ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

సల్మాన్

సీనియర్స్ విభాగంలో కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల (నెల్లూరు), శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల(నార్తురాజుపాలెం) జట్ల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచిన కృష్ణచైతన్య కళాశాల జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత పది ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 126 భారీ స్కోరు చేసింది. సయ్యద్ ఆరిఫ్ సల్మాన్ 28 బంతుల్లో మూడు సిక్సులు, తొమ్మిది ఫోర్లతో 68 పరుగులు చేశారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల జట్టు పది ఓవర్లలో అయిదు వికెట్లు కోల్పోయి 63 పరుగులకే పరిమితమైంది. కృష్ణచైతన్య కళాశాల జట్టు విజయం సాధించింది.

### నేటి మ్యాచ్‌ల వివరాలు (30-12-2025)

| సీనియర్స్ A.C. Stadium (Ground-1) | జూనియర్స్ A.C. Stadium (Ground-2) |
|---|---|
| గాయత్రి డిగ్రీ కళాశాల, కందుకూరు x జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల, నెల్లూరు. 8.30 A.M. | వివేకానంద జూ॥ కళాశాల, అరవిందనగర్ x ప్రభుత్వ జూ॥ కళాశాల, బిట్రగుంట 8.30 A.M. |
| శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల, కావలి x ఆదిత్య డిగ్రీ కళాశాల, నెల్లూరు 11.00 A.M. | డి.బి.ఎస్. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (పాలిటెక్నిక్), కావలి x రామకృష్ణ జూ॥ కళాశాల, అల్లూరు. 11.00 A.M. |
| రావూస్ డిగ్రీ & పి.జీ. కళాశాల, కోవూరు x జవహర్ భారతి డిగ్రీ కళాశాల, నెల్లూరు. 2.00 P.M. | బి.ఎస్.ఆర్. జూ॥ కళాశాల, ఆత్మకూరు x విజ్ఞాన్ జూనియర్ కళాశాల, పొదలకూరు 2.00 P.M. |

## విజ్ఞాన్ కళాశాల విజయం..

జూనియర్స్ విభాగంలో విజ్ఞాన్ జూనియర్ కళాశాల (పొదలకూరు), శ్రీ వివేకా జూనియర్ కళాశాల (కందుకూరు) జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. శ్రీ వివేకా జూనియర్ కళాశాల జట్టు రాకపోవడంతో విజ్ఞాన్ జూనియర్ కళాశాలను విజేతగా ప్రకటించారు.

కళాశాల జట్టు హేల

## బీఎస్ఆర్ జూనియర్ కళాశాల జట్టు గెలుపు..

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

మహేష్

విజయం సాధించిన కళాశాల జట్టు

జూనియర్స్ విభాగంలో బీఎస్ఆర్ జూనియర్ కళాశాల (ఆత్మకూరు), వివేకానంద జూనియర్ కళాశాల (స్టోన్‌హౌస్ పేట) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన బీఎస్ఆర్ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కి దిగిన వివేకానంద జూనియర్ కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 57 పరుగులు సాధించింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన బీఎస్ఆర్ కళాశాల జట్టు 8.1 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించింది. పి.మహేష్ బ్యాటింగ్, బౌలింగ్ లోనూ ప్రతిభ చూపారు.

## డీబీఎస్ కళాశాల జట్టు విజయం..

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

కిరణ్

ఇంజినీరింగ్ కళాశాల జట్టు సంబరం

సీనియర్స్ విభాగంలో.. శ్రీ వై.కె.ఆర్ అండ్ కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కోవూరు), డి.బి.ఎస్. ఇంజినీరింగ్ కళాశాల (కావలి) జట్ల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచిన శ్రీ వై.కె.ఆర్. అండ్ కె ప్రభుత్వ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన డి.బి.ఎస్. ఇంజినీరింగ్ కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీ వై.కె.ఆర్. అండ్ కె ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల జట్టు పది ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి వంద పరుగులు చేసింది. ఆరు పరుగులతో డి.బి.ఎస్. ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించింది. జట్టులో కిరణ్ 41 పరుగులు సాధించారు.

## వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ విజయభేరి

జూనియర్స్ విభాగంలో.. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (వెంకటేశ్వరపురం), ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆత్మకూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు 9.4 ఓవర్లలోనే పది వికెట్లు కోల్పోయి కేవలం 66 పరుగులే చేయగలిగింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెంకటేశ్వరపురం జట్టు కేవలం 2.3 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి విజయం సాధించింది. అమర్ రెండు సిక్సులు, అయిదు ఫోర్లతో 36 పరుగులు చేశారు.

ఆనందం పంచుకుంటున్న కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

అమర్

## మినుము.. పండిందిగా..

అల్లూరు, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడితో మినుము సాగు చేసి అధిక లాభాలు సాధించారు మండలంలోని నార్తుఆములూరుకు చెందిన వెంకయ్య. రెండెకరాల్లో వేసి రూ.60 వేలు ఆదాయం పొందారు. సాగుకు ముందుగా పొలాన్ని మూడుసార్లు సేద్యం చేయించారు. దుక్కిలో ఎకరాకు ఒక బస్తా వంతున డీఏపీ వేశారు. యంత్రంతో ఎకరాకు 15 కిలోల చొప్పున విత్తనాలు వేయించారు. నాలుగు ఆకుల దశలో మిడతలు, పురుగులు ఆశించకుండా చర్యలు తీసుకున్నారు. పురుగుల సమస్య నివారణకు వేపనూనె చల్లించారు. పూత, పిందె దశలో తెగుళ్ల నివారణకు రసాయనాలు పిచికారీ చేశారు. 90 రోజులకు కోతకొచ్చింది. ఎకరాకి నాలుగు క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. క్వింటాల్ రూ.10 వేల చొప్పున విక్రయించగా 8 క్వింటాళ్లపై రూ.80 వేలు రాబడి సమకూరింది. ఇందులో పెట్టుబడి రూ.20 వేలు పోను, ఆదాయంగా రూ.60 వేలు మిగిలాయి. తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయం వచ్చిందని వెంకయ్య తెలిపారు.

## సమస్య-సమాధానం

**సమస్య:** వరిలో అగ్గి తెగులు నివారణకు ఏ మందు ఎంత మోతాదులో వాడాలి? **– రామయ్య, అల్లూరు**

**సమాధానం :** ట్రైసైక్లోజోల్ మందు 120 గ్రాముల వరకు వాడుకుంటే ఫలితం ఉంటుంది.

**సమస్య:** వరి పైరులో జింక్ లోపిస్తే మొక్కలు ఎలా మారతాయి. **- అబ్దుల్లా, నార్తుమోపూరు**

**సమాధానం :** పైరులో ఎదుగుదల మందగిస్తోంది. ఆకులపై తుప్పు మచ్చలు వస్తాయి.

**సమస్య:** వరి నాట్లు వేశాక ఎన్ని రోజులకు కలుపు మందు వేసుకోవచ్చు? **– సుధాకర్, అల్లూరు**

**సమాధానం:** మూడు రోజుల లోపు చల్లితే మంచి ఫలితాలు వస్తాయి. (రైతుల సందేహాలకు అల్లూరు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సమాధానాలు ఇచ్చారు.)

–న్యూస్‌టుడే, అల్లూరు

## వరి.. సస్యరక్షణతో సిరి

రైతేరాజు

సీతారామపురం, న్యూస్‌టుడే

జిల్లాలో వరి సాగు ప్రారంభమైంది. సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.లోకేశ్‌బాబు సూచించారు.

**ఆకుముడత:** రెక్కల పురుగులతో ఆకుముడత వస్తోంది. **నివారణ:** నత్రజని ఎరువులను సిఫార్సు మేరకే వాడాలి. పిలక దశలో చేనుకు అడ్డంగా 2-3 సార్లు తాడు లాగితే ఆకుల ముడతలు విడిపోయి పురుగులు (లార్వాలు) నీటిలో పడి చనిపోతాయి. ట్రైకోగ్రామా కార్డులు 35వ రోజు నుంచి 15 రోజుల వ్యవధిలో మొక్కలకు మూడు సారు అతికించాలి. పిలక దశలో క్లోరిఫైరిపాస్ 2.5 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్ట దశలో కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ వంతున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. క్వినాల్‌ఫాస్, ఫోరేట్ 10జి గుళికలు, కార్బొఫ్యూరాన్ 3జి గుళికలు వాడరాదు. **ఉల్లికోడు :** నారుమడి దశ నుంచి పిలక దశ వరకు నష్టపరుస్తోంది. పిలక దశలో 5 శాతం గొట్టాలు లేక దుబ్బుకి 1 ఉల్లికోడు సోకిన పిలక కనిపిస్తే సెంటు నారుమడిలో 160 గ్రాముల కార్బొఫ్యూరాన్ గుళికలు వేయాలి. నాటిన 10 నుంచి 15 రోజులకు ఎకరాకు కార్బొఫ్యూరాన్ లేదా లేదా ఫిప్రోనిల్ 0.3జి గుళికలు 10 కిలోలు వేయాలి.

రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త లోకేశ్‌బాబు

**జింక్‌లోపం :** ఈలోపంతో మూడు నుంచి నాలుగాకుల మధ్య ఈనె పాలిపోతుంది. **నివారణ:** ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోలు జింక్‌సల్ఫేట్ వేయాలి. పైరుపై జింకు లోపం కనిపిస్తే లీటరు నీటికి 2గ్రాముల జింక్‌సల్ఫేట్ కలిపి అయిదు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. భాస్వరం ఎరువుతో జింక్‌సల్ఫేట్‌ను కలిపి వేయరాదు. కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి. కలిపి వేస్తే రసాయన చర్యలతో ఫలితం ఉండదు.

## నిమ్మ.. ఇలా పండమ్మా!

చేజర్ల, న్యూస్‌టుడే: నిమ్మ తోటల సంరక్షణ, అధిక దిగుబడికి సస్యరక్షణే ప్రధానమని చేజర్ల ఉద్యానాధికారి కార్తీక్ వివరించారు. ప్రస్తుతం తోటలు పూత, పిందె దశలో ఉన్నందున కీటకాలు, తెగుళ్ల నుంచి కాపాడుకోవాలని సూచించారు. శిలీంధ్ర జాతి తెగుళ్ల కారణంగా ఆకు రాలిపోవడం, ఎండుపుల్లను నివారించడానికి రిడోమిల్ గోల్డ్ మిశ్రమాన్ని లీటరు నీటిలో రెండు గ్రాముల వంతున కలిపి పిచికారీ చేయాలి. చెట్ల పెరుగుదలలో పోషకాల ఒత్తిడి అధిగమించడానికి పొటాషియం నైట్రేట్‌ను చిన్నమొక్కలకు లీటరు నీటిలో అయిదు గ్రాముల వంతున, పెద్ద మొక్కలకు పది గ్రాముల వంతున కలిపి పిచికారీ చేయాలి. ఆకులు గిడస బారిపోతుంటే ఫార్ములా-4 సూక్ష్మ పోషక మిశ్రమాన్ని లీటరు నీటిలో అయిదు గ్రాముల వంతున కలిపి చెట్టంతా తడిసేలా కొట్టాలి. ఆకుముడత నివారణకు లీటరు నీటికి 2 మి.లీ డైకోఫాల్, ప్రొపెనోఫాస్ 1.5 మి.లీ కలిపి పిచికారీ చేయాలి. ఉష్ణోగ్రతలు పెరిగితే నల్లిజాతి కీటకాలు వృద్ధి చెందుతాయి. వీటి కారణంగా ఆకులు పసుపుగా మారి రాలిపోతాయి. కాయలు నాణ్యత కోల్పోతాయి. వీటి నివారణకు ప్రాపర్‌గైట్ మందును లీటరు నీటికి 1.5 మిలీ కలిపి చల్లాలి. కాయల ఎదుగుదలకు చెట్ల స్థాయిని బట్టి తగిన మోతాదులో ఎరువులు వేసుకోవాలి.

## పామారోజా లాభాల పరిమళం

వింజమూరు, న్యూస్‌టుడే: మండలంలోని నందిగుంటలో పామారోజా సాగులో అధిక లాభాలు గడిస్తున్నారు దివానపు శ్రీనివాసులు. 70 ఎకరాల్లో దీన్ని పెంచుతున్నారు. దీని గడ్డి నుంచి ఆయిల్ తీసి విక్రయిసున్నారు.

ఎకరాలో గడ్డి నుంచి 8 నుంచి 10 కేజీల తైలం వస్తోంది. ప్రస్తుతం దీని ధర కేజీ రూ. 3600. ఎకరానికి రూ. 15 వేలు ఖర్చు అవుతుంటే రూ. 30 వేలు రాబడి ఉంటుంది. సగటున ఎకరానికి రూ.15 వేల వరకు ఆదాయం వస్తోంది. మూడు కోతల్లో సంవత్సరానికి ఎకరానికి రూ. 45 వేలకు పైగా మిగులుతాయి.

**సాధారణ నేలల్లోనూ.. :** పామారోజా గడ్డి ఏ నేలలోనైనా పెరుగుతోంది. నాలుగైదు రోజులు నీరు నిల్వ ఉంటే నష్టం కలుగుతుంది. వర్షాకాలంలో నీరు పెట్టనక్కరలేదు. వేసవిలో 15 నుంచి 20 రోజులకు ఒక తడి ఇస్తే చాలు. వేసిన 100 రోజులకు తొలి కోత, రెండో కోత 50 రోజులకు వస్తోంది. ఒకసారి మొక్క నాటితే నాలుగేళ్లపాటు ఆరు కోతలకు పైగా వస్తాయి. కలుపు, చీడపీడలు, దొంగలు, జంతువులు, పశువుల తాకిడి భయం కూడా లేదు.

**మార్కెటింగ్ సమస్య లేదు:** దివానపు శ్రీనివాసులు



పామారోజా ఆయిల్‌కు మంచి డిమాండ్ ఉంది. సంబంధిత శాస్త్రవేత్తల సూచనలతో ఈ సాగు చేపట్టా. ఈ తైలాన్ని కొన్ని రకాల ఫేస్‌క్రీములు, కాస్మొటిక్స్, ఫెర్ఫ్యూమ్స్, మందులు, సబ్బులు, అగర్‌బత్తీలు, దోమల నివారణ కడ్డీలు తదితర వాటి తయారీలో వాడతారు. మూడు నెలలకోసారి ఎకరానికి రూ. 15 వేలకు తగ్గకుండా ఆదాయం వస్తోంది. తైలాన్ని బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు ఎగుమతి చేస్తున్నాం. ప్రసుతం ధర ఆశాజనకంగా ఉంది.

## రెవెన్యూ, పింఛన్ల అర్జీలపై దృష్టి సారించండి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయడంతో పాటు అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగశేఖర్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలు, పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

## విచారణ నిర్వహించి న్యాయం చేస్తాం: ఎస్పీ

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: చట్ట పరిధిలో విచారణ నిర్వహించి ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తామని ఎస్పీ అజిత వేజెండ్ల అన్నారు. సోమవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 111 మంది ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎస్పీకి అందజేశారు.

● ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలు వస్తాయని నమ్మించి కావలికి చెందిన నవీన్ రూ.7లక్షలు తీసుకుని నగదు తిరిగి ఇవ్వకుండా అడిగితే బెదిరిస్తున్నాడని కావలి గ్రామీణానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. మల్లికార్జున రెడ్డి అనే ధాన్యం వ్యాపారి తన వద్ద రూ.65లక్షలు విలువజేసే ధాన్యాన్ని కొనుగోలు చేసి నగదు ఇవ్వలేదని, పలువురు రైతుల వద్ద సుమారు రూ.కోటి విలువైన ధాన్యం కొనుగోలు చేసి ఎటో వెళ్లిపోయారని కోవూరుకు చెందిన రైతు ఎస్పీకి వినతి చేశారు. తమ ఇద్దరు కుమారులు మా బాగోగులు, జీవనోపాధి పట్టించుకోవడం లేదని సంగానికి చెందిన వృద్ధ దంపతులు ఫిర్యాదు చేశారు. భర్త, అత్తమామలు వేధిస్తున్నారని బుచ్చి, జలదంకికి చెందిన మహిళలు ఫిర్యాదు చేశారు. తన భర్త మున్వర్ నుంచి రక్షణ కల్పించాలని సంగానికి చెందిన మహిళ ఎస్పీ ఎదుట వాపోయారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

నెల్లూరు(విద్య), సంగం, చేజర్ల, న్యూస్‌టుడే: జోనల్ స్థాయిలో ఇటీవల ఒంగోలులో జరిగిన అడ్వెంచర్ స్పోర్ట్స్ సెలక్షన్స్ (మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ఫర్ చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్) కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రత్యేక అవసరాల చిన్నారులు పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని సమగ్రశిక్షా అభియాన్ ప్రాజెక్టు ఏపీసీ డాక్టర్ డి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఎంపికైన వారిలో జిల్లాలో తిమ్మారెడ్డిపల్లి పాఠశాల నుంచి అఫ్సర్, సంగం మండలం అన్నారెడ్డిపాళెం పాఠశాల నుంచి గున్నం ప్రతీక్, చేజర్ల పాఠశాల నుంచి ఎస్.నాగిరెడ్డి ఉన్నారని తెలిపారు. ప్రత్యేక అవసరాల చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్య సాహసాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు పోటీలు నిర్వహించారని తెలిపారు.

## అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం

వెంకటాచలం, న్యూస్‌టుడే: క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా... క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయని వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. వీఎస్‌యూలో సోమవారం నిర్వహించిన 'వీఎస్‌యూ కళాశాల నెల్లూరు ఇంట్రామ్యూరల్ టోర్నమెంట్' పోటీలను వీసీ ప్రారంభించి మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా వీఎస్‌యూలో క్రీడా వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు.

## ఆలస్యంగా రానున్న సింహపురి ఎక్స్‌ప్రెస్

బిట్రగుంట, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ నుంచి గూడూరుకు వచ్చే సింహపురి ఎక్స్‌ప్రెస్ మంగళవారం మూడు గంటలు ఆలస్యంగా రానున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. సోమవారం రాత్రి సికింద్రాబాద్‌లో 10.05కు బదులు అర్ధరాత్రి దాటాక 1.05 గంటలకు బయలుదేరుతుందని ప్రకటించారు. దీంతో మధ్యాహ్నం 12 గంటలకు వచ్చే అవకాశం ఉందని ప్రాథమిక అంచనా.

సమాచార స్రవంతి

### బంగారం ధరలు

| | |
|---|---|
| గ్రాముధర: | రూ. 13,171 |
| (3 శాతం జీఎస్టీ కలిసిన ధర) | |
| సవర ధర: | రూ. 1,05,368 |
| వెండి గ్రాము : | రూ. 245.40 |

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ | 160 |
| లేయర్ | 105 |
| బ్రాయిలర్స్ | 278 |
| బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్ | 306 |
| లేయర్ మాంసం | 178 |

పొగాకు బోర్డు, గుంటూరు
వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య విభాగము, భారత ప్రభుత్వము (ఐ.యస్.ఓ.9001:2015 గుర్తింపు పొందిన సంస్థ)
జి.టి. రోడ్డు, గుంటూరు-522004. ఫోన్ : 0863-2358399, 2358499.
టెండరు నోటీసు
2025-26 FCV పొగాకు అక్షన్స్ కొరకు ఆంధ్రప్రదేశ్‌లో గల పొగాకు బోర్డు వేలం కేంద్రాల వద్ద 1) పొగాకు బేళ్ళను హ్యాండిల్ చేయుటకు మరియు 2) ట్రాలీస్ మరమ్మత్తులు/ సర్వీసింగు కొరకు అనుభవము కలిగిన కాంట్రాక్టర్లు మరియు ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.
పైన తెలుపబడిన పనుల కొరకు టెండరు ఫారములు తదితర వివరముల కొరకు రీజినల్ మేనేజరు, ఒంగోలు, రాజమండ్రి మరియు మేనేజరు(ఆక్షన్స్), పొగాకు బోర్డు, గుంటూరు వారిని సంప్రదించగలరు. టెండరు ఫారములు మరియు నియమ నిబంధనలు పొగాకు బోర్డు వెబ్‌సైట్ (www.tobaccoboard.com) నుండి కూడా పొందవచ్చును.
పైన తెలుపబడిన పనుల నిమిత్తము పూర్తి చేసిన టెండరు ఫారాలను టెండరు నియమ నిబంధనలలో తెలిపిన ధరావతు సొమ్ముతో సహా తేది.21-01-2026 సాయంత్రం గం॥3.00 లలోగా పొగాకు బోర్డు, గుంటూరు నందు టెండరు బాక్సులో డిపాజిట్ చేయవలెను. అసంపూర్తిగా ఉన్న టెండర్లు తిరస్కరించబడును మరియు ఏ విధమైన కారణం చూపకుండానే స్వీకరించిన టెండర్లలో ఏదైనా లేదా అన్నింటిని తిరస్కరించేందుకు కార్యనిర్వహణాధికారి, పొగాకు బోర్డు వారు సర్వహక్కులు కలిగియున్నారు.
స్థలము : గుంటూరు, తేది: 29-12-2025 సం/- కార్యదర్శి

EENADU Classifieds

JOBS

కేర్‌టేకర్ ముస్లిం మహిళ కావలెను. సీనియర్ సిటిజన్‌ని చూసుకోవటానికి & సర్వీసు చేయటానికి మాత్రమే కావలెను. కందుకూరు. Ph: 9398058081

ప్రముఖ సోలార్ సంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్లు, లేడి టెలీకాలర్స్, టెక్నీషియన్స్ కావలెను. జీతం+ PF. సెల్: 90007 31560.

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

ఫోర్స్ మోటార్స్ కంపెనీ షోరూం నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ మరియు Tally Person కావలెను. అమృత మోటార్స్, బుజబుజ నెల్లూరు. 95812 99916,94929 34103

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జిస్, వార్డెన్స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్ర. ✆ 89784 80429.

టెలికాలింగ్ & డేటా ఎంట్రీ వర్క్ ఫ్రమ్ హోమ్ / ఆఫీసు M/F కావలెను.10th పైన, Age: 18 to 35, జీతం: 18 to 25K. ✆ 84640 16870, 86394 39870

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

DRIVERS

గూడ్స్ ఆటోకి అనుభవం, లైసెన్స్, బ్యాడ్జ్ కలిగిన డ్రైవర్లు కావలెను. శ్రీ దుర్గా ఫుడ్స్, నెల్లూరు. ✆ 88854 23099

SECURITY GUARDS

Secur సెక్యూరిటీ సర్వీసెస్ నెల్లూరు, నారాయణరెడ్డి పేట పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ ASOలు, సెక్యూరిటీ గార్డ్స్, లేడీ గార్డ్స్ కావలెను. Ph: 96665 83141

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు..
నెల్లూరు 80080 01790
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

# కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

## ఇన్‌ఛార్జి ఎంపీపీగా ఆనంగి రమణయ్య

**వింజమూరు :** వింజమూరు ఎంపీపీ ఇనగనూరు మోహన్‌రెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో పదవి నుంచి తొలగించారు. ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్యను ఇన్‌ఛార్జి ఎంపీపీగా నియమించారు. ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి సోమవారం ఆయనతో ప్రమాణం చేయించారు. **5న కొత్త ఎంపీపీ ఎంపిక :** నూతన మండలాధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల ఎంపిక సోమవారం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు.

## నేడు కొండాయపాలెంలో రెవెన్యూ గ్రామసభ

**ఉదయగిరి :** మండలంలోని కొండాయపాలెం పంచాయతీ గానుగపెంటపల్లి సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు వన్ మంత్- వన్ విలేజ్- ఫోర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు రామ్మోహన్ సోమవారం తెలిపారు.

## వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు

**వరికుంటపాడు, న్యూస్‌టుడే:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా వరికుంటపాడులో ఉన్న పద్మావతి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర ద్వారంలో శ్రీవారి దర్శనానికి సిద్ధం చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. తెల్లవారు జామున ఐదు గంటల నుంచే దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పెద్దాల సూర్యనారాయణ, కమిటీ సభ్యులు తెలిపారు.


మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698

కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944


**సమస్య:** మా పంచాయతీలో దోమల బెడద అధికంగా ఉంది. నివారణ చర్యలు తీసుకోవాలి. –రంగారావు, కలిగిరి

**సమాధానం:** సమస్యను పరిశీలించి విభిన్నతతో త్వరలో పరిష్కరిస్తాం. –రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, కలిగిరి

? రీ సర్వే చేసిన మా భూములపై హక్కు కల్పించాలని కోరుతున్నాం. – శ్రీను, రుద్రకోట

✓ భూసేకరణ త్వరలో జరుగుతుంది. ఆలోపు సమస్యలన్నీ పరిష్కరిస్తాం. – ఎం.సనీవంశీ కృష్ణ, ఆర్డీవో, కావలి – న్యూస్‌టుడే, కావలి

? మా గ్రామంలో చెరువు కట్ట నుంచి వచ్చే ఊట నీరు బస్టాండు సెంటరులో చేరి అధ్వానంగా మారింది. రోడ్డు కోతకు గురైంది. ఇబ్బందులు పడుతున్నాం.– వీరాస్వామి, కొమ్మి

✓ సమస్య మా దృష్టికి రాలేదు. పరిశీలించి పరిష్కరిస్తాం. – యూసఫ్ అంకమ్మ, సర్పంచి – న్యూస్‌టుడే, కొండాపురం

?మోపాడు సమీపంలో రహదారి పక్కనే వ్యర్థాలు వేస్తున్నారు. శుభ్రం చేయించగలరు. – రమేష్‌బాబు, స్థానికుడు

✓సమస్యను పరిశీలించి సిబ్బందితో శుభ్రం చేయిస్తాము. - సుధాకర్, పంచాయతీ కార్యదర్శి –న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

## తెదేపాలోనే కార్యకర్తలకు గుర్తింపు: ఎమ్మెల్యే

**కావలి:** తెలుగుదేశంలోనే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇటీవల ప్రకటించిన పార్టీ జిల్లా కమిటీలో వరుసగా రెండోసారి కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన ఏగూరు చంద్రశేఖర్ ఎమ్మెల్యేను సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ దక్కేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగన్, శానం హరి, సుప్రజ, విజయశాంతి, తదితరులు పాల్గొన్నారు.

### పార్టీకి శ్రేణులే బలం: కాకర్ల

**వింజమూరు :** కార్యకర్తలే తెదేపాకు బలమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గ్రామంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఇంటింటికీ సురక్షితపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నియోజకవర్గంలో బాగా పనిచేసిన కార్యకర్తలకు సీఎం చంద్రబాబునాయుడు పంపిన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని, ఆ దిశగా పని చేసినందుకు 90 వేల సభ్యత్వాలు చేయగలిగామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రిజిస్ట్రేషన్లలో అదనంగా వసూలు చేస్తే ఊరుకోం: ఇంటూరి

**కందుకూరు పట్టణం:** డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ ఫీజు కాకుండా అదనంగా వసూలు చేస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులను హెచ్చరించారు. కందుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్లకు భారీగా వసూలు చేస్తున్నారంటూ వస్తున్న అవినీతి ఆరోపణలపై సోమవారం 'ఈనాడు'లో "మైసలిస్తేనే పనులు" అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈమేరకు స్పందించిన ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. విశ్రాంత ఉద్యోగి కార్యాలయంలో పనిచేస్తున్నట్లు గమనించిన ఆయన సబ్‌రిజిస్ట్రార్ రామకోటయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని పామూరు రోడ్డులో జరుగుతున్న డివైడర్ పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు.

**ఉలవపాడు:** ఉలవపాడులో ఇటీవల గుండెపోటుతో మరణించిన తెదేపా నాయకుడు దార్ల మల్లికార్జున కుటుంబానికి, కార్యకర్త బొంది వెంకటరమణ కుటుంబసభ్యులను పరామర్శించారు.

## ఆదర్శ విద్యాలయం.. కష్టాల పాఠం

**న్యూస్‌టుడే, కావలి గ్రామీణం**

ఆధునిక రీతిలో తుమ్మలపెంటలో ఏర్పాటుచేసిన ఆదర్శ పాఠశాలలో సమస్యలు కొలువుదీరాయి. విద్యార్థులు కష్టాల పాఠాలు అభ్యసిస్తున్నారు. తరగతి గదుల కొరత, విద్యుత్తు సౌకర్యం, వసతిగృహాలకు కిటికీలు సక్రమంగా లేకపోవడంతో పాటు అవరణ అధ్వానంగా తయారైంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

పాఠశాలలో బాలికలు

ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి 10వ తరగతి వరకు 461 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. వీరికి 16 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. చిన్నారుల్లో విద్యాప్రమాణాలు పెంచడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఆరేళ్లుగా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. 2020-2021 2024-25 వరకు నూరుశాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

### సమస్యలు ఇలా..

పాఠశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. వీటిలో విషపురుగులు సంచరిస్తున్నందున బాలికలు భయపడుతున్నారు. ప్రహరీ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహాల కిటికీలు దెబ్బతిన్నాయి. దీంతో చలిగాలులతో రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నారు. భోజన హాల్లో గచ్చు పగిలిపోయి అధ్వానంగా తయారైంది. మట్టిలోనే కూర్చొని అన్నం తినాల్సిన దుస్థితి నెలకొంది. సోలార్ విద్యుత్తు వ్యవస్థ మరమ్మతులకు గురైంది. చదువుకోవడానికి వెలుతురు సరిగా లేక ఇబ్బందిగా ఉందని బాలికలు వాపోతున్నారు.

### అధికారులకు తెలిపాం : పద్మావతి, ప్రిన్సిపల్

ప్రహరీ, డైనింగ్‌హాల్ సక్రమంగా లేదని ఉన్నతాధికారులకు తెలిపాం. ప్రాంగణంలో దీపాలు వేయించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశాం. సదుపాయాలు కల్పిస్తే మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తాం.

పిచ్చిమొక్కలు పెరిగిన ప్రాంగణం

## స్పెల్ బి పోటీల్లో ప్రథమ స్థానం

**కొండాపురం, న్యూస్‌టుడే :** ఆంగ్ల భాషా నైపుణ్యంలో ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ ఏడాది చదువుతున్న బాలికలు ప్రతిభ చూపారు. ద్రాక్షాయణి, రమ్య జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా తెలిపారు. జోనల్ పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. **ఉదయగిరి :** జిల్లా స్థాయిలో నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆంగ్ల స్పెల్ బి పోటీల్లో మండలంలోని గండిపాలెం బాలుర గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదివే సీహెచ్ లోకేష్ ప్రతిభ చూపాడు. జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో టి.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. అతన్ని అభినందించి జోనల్ పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

## దాడి కేసులో భర్తకు రిమాండ్

**ఉదయగిరి, న్యూస్‌టుడే:** పట్టణంలోని రజక వీధిలో బీపీనాని తిరుపతమ్మపై కత్తితో దాడి చేసి గాయపర్చిన కేసులో ఆమె భర్త గురవయ్యను సోమవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. అతనికి న్యాయమూర్తి అంజయ్య 14 రోజుల రిమాండ్ విధించగా.. ఆత్మకూరు సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై అల శ్రీను తెలిపారు.

### సాగర స్నానంలో జాగ్రత్తలు తప్పనిసరి: సీఐ

**కావలి, న్యూస్‌టుడే:** సెలవుల్లో సరదాగా సముద్రానికి వెళ్లి స్నానం చేసేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని ఇస్కపల్లి మెరైన్ స్టేషన్ సీఐ వి.శేషయ్య సూచించారు. సోమవారం డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## నూతన చట్టంపై ఆందోళన

**ఉదయగిరి, న్యూస్‌టుడే :** నూతన ఉపాధి హామీ పథకం చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని లింగమనేనిపల్లిలో సోమవారం కూలీలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు వెంకటయ్య మాట్లాడుతూ పథకంలో చేసిన మార్పులతో భవిష్యత్తులో కూలీలకు పని దొరికే పరిస్థితి లేదన్నారు. కేంద్రం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున ఇచ్చే నిధులతో పథకం పనులు సాగడం కష్టమన్నారు. పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, లేకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

లింగమనేనిపల్లిలో ఆందోళన చేస్తున్న కూలీలు

## తెదేపా పట్టణ అధ్యక్షుడిగా ఖాజాసాహెబ్

**ఉదయగిరి, న్యూస్‌టుడే :** పట్టణ తెదేపా అధ్యక్షుడిగా షేక్ గాజుల ఖాజాసాహెబ్ (బాబు) నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో సోమవారం రాత్రి తెదేపా నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించి బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించాలి

**కావలి గ్రామీణం,న్యూస్‌టుడే:** పశుపోషణలో ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించాలని పశువైద్య ఉపసంచాలకులు మల్లారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో సోమవారం పాడి రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. రైతులకు పశుపోషణలో మెలకువలు వివరించారు. కార్యక్రమంలో కావలి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు కామేశ్వరరావు, సర్వాయపాలెం పశువైద్యాధికారి నాయక్, విశ్రాంత వైద్యులు వెంకట్రావు, మంగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

### తాటి గడపలా.. ఊళ్లకు హద్దుగా

వరుసగా ఉన్న ఈ తాటి చెట్లను చూశారా! ఇందులో విశేషమే ముందనేగా! ఇవి రెండు గ్రామాలకు హద్దు. బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ మజరా గ్రామాలైన అల్లిచర్లబంగారుపాలెం- పాతబంగారుపాలెం గ్రామాలను ఇవి విభజిస్తున్నాయి. వీటికి కుడి వైపు పాతబంగారుపాలెం, ఎడమవైపు అల్లిచర్ల బంగారుపాలెం ఉంది. ఇరువైపులా సిమెంట్ రోడ్లు కూడా ఉన్నాయి. **- బిట్రగుంట, న్యూస్‌టుడే**



### పని అక్కడ.. జీతమిక్కడ!

మండలంలోని కౌరుగుంట సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు డిప్యుటేషన్‌పై నెల్లూరులో పనిచేస్తున్నారు. సచివాలయం పరిధిలో కౌరుగుంట, దామవరం పంచాయతీలు న్నాయి. విద్యార్థులు, రైతులు వివిధ పత్రాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శిరోమణిని వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. **– న్యూస్‌టుడే, దగదర్తి**

### పగటి వెలుగులు కనిపించవా?

విద్యుత్తు స్తంభాలకున్న దీపాలు పగలే ఎలా వెలుగుతున్నాయో చూశారా! రేయింబవళ్లు వెలుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యుత్తు వృథా అవుతోంది. ఇదీ మైదుకూరు-సింగరాయకొండ 167బీ జాతీయరహదారిపై సీతారామపురం పంచాయతీ నూతివారికొట్టాలు నుంచి నారాయణప్పపేట వరకు నెలకొన్న పరిస్థితి. **– న్యూస్‌టుడే, సీతారామపురం**

### కాలువలు లేక.. మురుగు పారక

కలిగిరి పంచాయతీలోని కొప్పోలువారిపాలెంలో కాలువలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సిమెంటు రోడ్లు ఎత్తుగా వేయడంతో ఇళ్లు పల్లమయ్యాయి. వర్షం వస్తే నీరు బయటకు పోవడం లేదు. భారీ వర్షాల సమయంలో ఇళ్లలోకి నీరు చేరుతోంది. దీంతో దోమలు అధికంగా ఉంటున్నాయి. **– న్యూస్‌టుడే, కలిగిరి**

### కోతులు బాబోయ్ కోతులు

మండలంలోని జడదేవిలో కోతుల బెడద అధికమైంది. ఇళ్లలోకి చొరబడి వస్తువులను తీసుకెళుతున్నాయి. ఎవరైనా తరిమేందుకు ప్రయత్నిస్తే దాడి చేస్తున్నాయి. పాఠశాలకు వెళ్లాలన్నా చిన్నారులు భయపడుతున్నారు. గ్రామస్థులతో మాట్లాడి ఇబ్బంది లేకుండా చూస్తామని పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ తెలిపారు. **– న్యూస్‌టుడే, వరికుంటపాడు**

## హాజరు కారు.. గోడు వినరు

### పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా

ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కీలకమైన అధికారులు గైర్హాజరవుతున్నారు. వీరి తీరుతో సమస్యలు చెబుదామని వెళ్లిన ప్రజలకు నిరాశ ఎదురవుతోంది. కందుకూరు నియోజకవర్గంలో పరిస్థితులపై 'న్యూస్‌టుడే' పరిశీలనాత్మక కథనం. **– కందుకూరుపట్టణం, గుడ్లూరు, కందుకూరు గ్రామీణం, ఉలవపాడు, లింగసముద్రం, వలేటివారిపాలెం**

#### వెల్లువెత్తుతున్న విమర్శలు

కందుకూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. అప్పటికీ కొంతమంది ఆలస్యంగా వచ్చారు. పలుకూరుకు చెందిన ఓ వ్యక్తి.. తన స్థలం ముందు విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేయడంతో ఇబ్బందిగా ఉందని తొలగించాలని సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సబ్‌కలెక్టర్ ఆ శాఖ అధికారులను పిలిపించగా.. ఎవరూ రాకపోవడం గమనార్హం. వ్యవసాయశాఖ నుంచి అటెండర్‌స్థాయిఉద్యోగి, జలవనరులశాఖ నుంచి జూనియర్ అసిస్టెంట్ రాగా, మున్సిపాలిటీ నుంచి ఎఫ్1 మాత్రమే హాజరయ్యారు. ఇలా కీలకమైన అధికారులు హాజరు కాకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 19 అర్జీలు మాత్రమే వచ్చాయి.

కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులు

#### బోసిపోయిన కార్యాలయాలు

లింగసముద్రం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎం.కోటేశ్వరరావు, వీఆర్వోలు వచ్చారు. మిగిలిన మండల స్థాయి అధికారులు ఒక్కరూ హాజరు కాలేదు. ఉలవపాడులో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంఈవో రవణయ్య, వెలుగు సీసీ మాత్రమే హాజరయ్యారు. వలేటివారిపాలెం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అయిదుగురు మాత్రమే హాజరు కాగా ఒక్క అర్జీ కూడా రాలేదు. రానివారిపై ఆ శాఖల జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీవో శంకర్‌రావు తెలిపారు. గుడ్లూరులో ఉదయం 10 గంటలకు తహసీల్దారు బాలకిశోర్ హాజరుకాగా మిగిలిన వారు మరో గంట తర్వాత వచ్చారు. అయిదుగురు అర్జీదారులు రీసర్వే సమస్యలపై వినతులు అందజేశారు.

#### నమోదు చేయడం లేదు

కందుకూరు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ లావణ్యతో కలిపి అయిదుగురు మాత్రమే హాజరయ్యారు. తనభూమిలోకి వెళ్లే దారిని పక్కపొలం వ్యక్తి అడ్డుకుంటున్నాడని న్యాయం చేయాలని రెండు నెలలుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. మేము ఏమీ చేయలేమని అధికారులు సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వచ్చే అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా నేరుగా వీఆర్వోలకు ఇస్తున్నట్లు సమాచారం. కనీసం తీసుకున్నట్లుగా రిసిప్ట్ కూడా ఇవ్వటం లేదని పలువురు ఆరోపణలు చేస్తున్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు తిమ్మారెడ్డిపల్లె బాలిక

**వరికుంటపాడు, న్యూస్‌టుడే:** దివ్యాంగుల విభాగంలో సోమవారం ఒంగోలులో జరిగిన జోనల్ స్థాయి క్రీడల పోటీల్లో మండలంలోని తిమ్మారెడ్డిపల్లె పాఠశాల విద్యార్థిని షేక్ అఫ్సర్ ప్రతిభ చూపింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రత్యేకావసరాల ఉపాధ్యాయుడు పోలిబోయిన మనోహర్ తెలిపారు. బాలికలను ఎంఈవోలు కొండయ్య, రమణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలికతో ఉపాధ్యాయుడు

## ఎఫ్ఎల్ఎన్ సామగ్రి పంపిణీ

**ఉదయగిరి, న్యూస్‌టుడే :** స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులకు సోమవారం ఎంఈవో-2 శ్రీనివాసులు ఎఫ్ఎల్ఎన్ సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ 75 రోజుల ప్రణాళికలో భాగంగా కార్యాచరణ ప్రణాళిక బుక్‌లెట్లు, గణిత నంబరు, గేమ్ పుస్తకాలు, చార్టులు, ఫ్లాష్ కార్డులు, బ్యానర్లు అందజేశారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: డీఎస్పీ

**కావలి గ్రామీణం, న్యూస్‌టుడే:** నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని కావలి డీఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ రాత్రి వీధుల్లో తిరగడం, మద్యం తాగి కేకలు వేస్తూ ద్విచక్రవాహనాలు నడపడం, రోడ్లపై సంబరాలు చేయడం వంటివి నిషేధమన్నారు. వీటిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. **ఉదయగిరి :** నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. కూడళ్లు, సున్నిత ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేస్తామన్నారు.


**మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో**

E.P. No:- 63/2022

(Gajuvaka) O.S.No:- 308/2019

అట్ల పద్మ ..D.H.R.

V/s

పుచ్చకట్ల వెంకట వంశీ మల్లిఖార్జున .J.D.R.

**వేలం ప్రకటన**

పైన తెలుపబడిన కోర్టు నందు Dhr తనకు రావలసిన డిక్రీ వసూలు నిమిత్తం E.P. షెడ్యూలు దాఖల ఆస్తిని వేలం వేసి డిక్రీ బాకీ వసూలు చేయమని కోరుతూ E.P. దాఖలు చేసి ఉన్నది. కావున ఈ క్రింది కనబరిచిన E.P. దాఖల షెడ్యూలు ఆస్తిని 11-2-2026 తేదీన పై కోర్టు నందు ఉదయం 10.30 నిమిషాలకు వేలం వేయుదురు. కావున ఆసక్తిగల పాటదారులు ఆ రోజు వేలంపాటలో పాల్గొనవలసిందిగా కోరడమైనది. ఇది కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయబడినది.

**E.P. షెడ్యూలు ఆస్తి వివరములు**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్, గూడూరు మండలం వింధూరు గ్రామ పంచాయతీ మరియు గ్రామం సర్వే నెంబరు 485 విస్తీర్ణం: 1-00 (ఒక ఎకరా) ఎకరా మెట్ట భూమి దానికి హద్దులు తూర్పు: అట్ల రాధయ్య భూమి, దక్షిణం: భీమవరం మస్తానమ్మ భూమి, పడమర: గోర్తల శ్రీనివాసులు భూమి, ఉత్తరం: గోర్తల శ్రీనివాసులు భూమి.

D.H.R. Value: 26,00,000/-

Amina Value: 27,00,000/-

Upset Price: Rs.5,00,000/-

ఇటు

DHR తరఫున న్యాయవాదులు

కందనూరు వెంకటకృష్ణయ్య

కందనూరు నితిన్ సాయికృష్ణ

అడ్వొకేట్స్, గూడూరు.

Cell: 9440113977


## హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

**లింగసముద్రం, న్యూస్‌టుడే:** ఇటీవల గుండెపోటుతో మరణించిన హోంగార్డు కొండలరావు కుటుంబానికి కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది రూ.1.07లక్షల ఆర్థికసాయం అందజేశారు. సోమవారం పెదపవనిలోని మృతుని కుటుంబ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేసినట్లు ఎస్సై నారాయణ తెలిపారు. ఇందుకు సహకరించిన కందుకూరు డీఎస్పీ, గుడ్లూరు సీఐలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాలకొండ హుండీ ఆదాయం రూ.61,38701

**వలేటివారిపాలెం, న్యూస్‌టుడే:** మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన హుండీలను సోమవారం లెక్కించగా రూ.61,38,701 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఉప కమిషనరు, కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు. కానుకల ద్వారా రూ.58,87,491, అన్నదాన హుండీ ద్వారా రూ.2,51,270లు భక్తుల నగదు కానుకగా సమర్పించారన్నారు. బంగారం- 83 గ్రాములు, వెండి- 601 గ్రాములు, విదేశీ కరెన్సీ-143 డాలర్లు వచ్చాయన్నారు.

## ఆక్రమణల గుర్తింపు.. ఆపై తొలగింపు

**అల్లూరు, న్యూస్‌టుడే :** ఆక్రమణలపై సాగునీటి శాఖ అధికారులు కదిలారు. ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అల్లూరులో జలవనరుల శాఖ స్థలాలు, కాలువల్లో ఆక్రమణలు భారీగా ఉన్నాయి. ఎక్కడికక్కడ కబ్జా చేసి నిర్మాణాలు చేశారు. కొందరు వ్యాపారాలు చేసున్నారు. వీటన్నింటినీ తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అల్లూరు చెరువు నుంచి వచ్చే కాలువలకు ఇరువైపులా ఆక్రమణల కారణంగా పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయడంతో నీరు కలుషితమవుతుంది. దీనిపై అధికారుల దృష్టికి తీసుకుపోయినా చర్యలు లేవు. కాలువల్లో తొలగించిన పూడిక మట్టిని వేసేందుకు స్థలం లేకపోవడంతో సమస్యగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కనీసం కూలీలు తొలగించేందుకు వీల్లేకుండా ఆక్రమణలు ఉన్నాయి. వీటిని తొలగించాలని తాజాగా ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించినట్లు తెలిసింది. ప్రధాన రోడ్డుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సుమారు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేసేందుకు ఆక్రమణలు తొలగించాల్సి ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ విషయమై జల వనరుల శాఖ ఏఈ కాకు సుధీర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నీటి సంఘాలు ప్రతినిధులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

ఆక్రమణలతో కుచించుకుపోయిన నాగాలమ్మ కాలువ

## ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం వితరణ

**కలిగిరి, న్యూస్‌టుడే:** మండల కేంద్రమైన కలిగిరి ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న 80 మంది విద్యార్థులకు సోమవారం స్థానిక భారత్ జూనియర్ కళాశాల తరపున కరస్పాండెంట్ కామేశ్వరరావు అల్పాహారం సమకూర్చారు. మున్ముందు విద్యార్థులకు చేయూత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు విడనాడాలి

**సీతారామపురం, న్యూస్‌టుడే :** కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు విడనాడాలని సీఐటీయూ మండల కన్వీనర్ కోడె రమణయ్య డిమాండ్ చేశారు. గ్రామంలో నాయకులతో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు నిర్వహించే సీఐటీయూ ఆలిండియా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గోడపత్రాలు ఆవిష్కరించారు. ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు. 29 కార్మిక చట్టాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంటి, విజయ్, హజరత్తయ్య, మధుబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

## తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** విజయవాడలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు జరిగిన 40వ జాతీయ తైక్వాండో పోటీల్లో కందుకూరు క్రీడాకారులు సత్తా చాటారని శిక్షకుడు ఎం.డి.హఫీజ్ తెలిపారు. పది రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా, ఏపీ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. కందుకూరు నుంచి 8 మంది క్రీడాకారులు పాల్గొనగా, అభిషేక్, సమద్, మౌనిక, రామ్ చరణ్‌తేజ్, సూర్యతేజ్‌లు బంగారు పతకాలు, బి.మణిదీప్, రామ్‌శ్రీతేజ్‌లు వెండి, బి.నేహాల్ కాంస్య పతకం సాధించారని తెలిపారు.

## గుంతల దారి.. అవస్థలే మరి

**దగదర్తి, న్యూస్‌టుడే**

మండలంలోని కాలువలపై రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. వీటిలో రాకపోకలు సాగించేందుకు అన్నదాతలతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో నిర్మించిన బాటలు నిర్వహణ లేక రూపుకోల్పోయాయి. అడుగడుగునా గుంతలతో నడిచేందుకు కూడా వీల్లేని విధంగా మారాయి. అందుకు నిదర్శనమే మండలంలోని దగదర్తి - ముంగమూరు (డీఎం) కాలువ జీప్‌ట్రాక్. ఈ కాలువ పరిధిలో పది వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోంది. దీంతో నీటి సరఫరాను పరిశీలించేందుకు కట్టపై దారి ఏర్పాటుచేశారు. దీనిమీదుగా అధికారులు పరిశీలనకు వస్తుంటారు. ఈమార్గంతో పలు గ్రామాలకు రవాణా సౌకర్యం కలిగింది. దామవరం, నారాయణపురం తదితర గ్రామాల ప్రజలు వెళుతుంటారు. అయితే ఇది అధ్వానంగా తయారవడంతో సున్నపుబట్టి మీదుగా ఎనిమిది కి.మీ తిరిగి స్వగ్రామాలకు వెళుతున్నారు. జీప్‌ట్రాక్ మీదుగా అయితే అయిదు కి.మీ దూరం తగ్గుతుంది. గుంతల కారణంగా రైతులు అవస్థలు పడుతున్నారు. కాలువ ఆధునికీకరణ పనులంటూ రహదారిని గుంతలమయం చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు మిగతా కాలువలపై దారులు కూడా ఇలాగే ఉన్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వెంకటేశ్వర్లును వివరణ కోరగా అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

అధ్వానంగా రహదారి


**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

ప్రాంతీయ కార్యాలయం, 2వ అంతస్తు, ఇంపీరియల్ టవర్స్, మాగుంట లేఅవుట్, యస్‌పియస్ఆర్ నెల్లూరు-524003.

**మా విలువైన ఖాతాదారులు గమనిక నిమిత్తం ఇవ్వబడ్డ ప్రకటన**

మా ఖాతాదారులకు మరింతగా విస్తృత సేవలందించుటకు మా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** బ్రాంచ్ లలో కొన్ని పరిపాలనా సౌకర్యాలను పెంపొందించు ఉద్దేశ్యంతో మా **దుత్తలూరు బ్రాంచ్** ను

ప్రస్తుత చిరునామా : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దుత్తలూరు బ్రాంచ్, సర్వే నెం.1639/3, దుత్తలూరు- వింజమూరు రోడ్, మెయిన్ రోడ్, దుత్తలూరు,యస్‌పియస్ఆర్ నెల్లూరు జిల్లా-524222 వద్ద నుండి క్రింద తెలిపిన నూతన చిరునామాకు మార్పు చేయుచున్నాము.

నూతన చిరునామా : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దుత్తలూరు బ్రాంచ్, క్రింది అంతస్తు, సర్వే నెం: 1639/3, అసెస్‌మెంట్ నెం.1648, NH-565, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు ఎదురుగా, దుత్తలూరు- బద్వేలు రోడ్, దుత్తలూరు గ్రామం, దుత్తలూరు మండలం, యస్‌పియస్ఆర్ నెల్లూరు జిల్లా-524222

వద్దకు మార్పు చేస్తున్నాము మరియు **తేది.27-01-2026** నుండి సదరు **దుత్తలూరు బ్రాంచ్** క్రొత్త వసతి, క్రొత్త చిరునామా నుండి అన్నిరకాల సాధారణ బ్యాంకింగ్ వ్యాపార కార్యకలాపాలతో పనిచేస్తుందని తెలుపడమైనది.

మా **దుత్తలూరు బ్రాంచ్** లోని లాకర్ సదుపాయాలు గల ఖాతాదారులందరికీ మరలా మేము తెలియజేయడమేమనగా ఈ కొత్త చిరునామాలోకి లాకర్లు మారుస్తున్నప్పుడు కావాల్సిన జాగ్రత్తలు మేము తీసుకొంటాము. అయినప్పటికీ ఈ మార్పు వలన జరిగే రిస్కు మరియు నష్టాన్ని తగ్గించుకోవటానికి ఒకవేళ లాకరు ఉన్న ఖాతాదారు తాము భద్రపరిచిన వస్తువులను **తేది. 23-01-2026** న గాని లేదా అంతకుముందు గానీ స్వాధీనం చేసుకొని, కొత్త వసతికి మార్చిన తరువాత మరల బ్యాంకులో భద్రపర్చదల్చిన వారు **తేది. 27-01-2026** న గాని లేదా ఆ తరువాత గాని భద్రపరుచుకోగలరు.

ఈ విషయములో మీకు కలిగిన అసౌకర్యానికి మేము చింతిస్తున్నాం మరియు మా ఉన్నతమైన సేవలను అన్నివేళలా మీకు అందించగలమని మీకు హామీ ఇస్తున్నాము.

స్థలం: నెల్లూరు, తేది.29-12-2025. సం/-రీజినల్ హెడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


(c) eenadu

# కోవూరు
• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

## ఛాంపియన్ రైతులను ఆదర్శంగా తీసుకోవాలి

**పొదలకూరు, న్యూస్‌టుడే:** పొదలకూరు మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి ఒక ఛాంపియన్ రైతు తయారు కావాలని ఏడీఏ శివనాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరంతా కొత్త పద్ధతిలో ప్రకృతి వ్యవసాయంలో సేద్యం చేసి మిగిలిన రైతులకు ఆదర్శంగా నిలవాలన్నారు. సాగు ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. వ్యవసాయశాఖ నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో ఛాంపియన్ రైతులు పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం రాయితీపై అందించే నానో యూరియా, జింకు నానో డీఏపీ, లింగాకర్షక బుట్టలు, రైతులకు అందించారు. కార్యక్రమంలో ఛాంపియన్ రైతులు వెంకటరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుధాకర్ రెడ్డి, రవీంద్రబాబు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

**ఇందుకూరుపేట న్యూస్‌టుడే:** రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు కొత్తూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం మల్లికార్జున తెలిపారు. 24న వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'డిజిటల్ న్యాయస్థానం ద్వారా వేగవంతమైన పరిష్కారం' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ఆనందప్రియ(ప్రథమ), విమలశ్రీ(తృతీయ) స్థానాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పీడీ అరోరా, ఉపాధ్యాయ బృందం సోమవారం విద్యార్థులను అభినందించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

**సమస్య :** మర్రిపాడు మండలంలోని చుంచులూరులో నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. చెత్త సేకరణ జరగడం లేదు. – శ్రీను, స్థానికుడు

**సమాధానం :** సమస్య పరిశీలించి వినియోగంలోకి తీసుకువస్తాం. – నరసింహ నాయుడు, పంచాయతీ కార్యదర్శి

? సంగంలో ఉన్నత పాఠశాల వెనక విద్యుత్తు నియంత్రిక సమీపంలో తాగునీటి సరఫరా గొట్టం దెబ్బతిని లీకేజీ జరుగుతోంది. దాన్ని వెంటనే అరికట్టాలి. – మోహనరావు

✓ వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం. – ఆర్.నరసయ్య, పంచాయతీ కార్యదర్శి

? అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని బీసీ కాలనీలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. – శ్రీనివాసులు, గ్రామస్థుడు

✓ పరిశీలించి విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తాం. – తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరు రూరల్ పరిధిలోని మొగళ్లూరు గ్రామం వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి. – సురేంద్ర

✓ ఏర్పాటు చేయిస్తాం. – శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఏఈ

? రాపూరు పట్టణ పరిధిలోని మెయిన్ వీధిలో నివాసాల మధ్య చెత్త పేరుకుపోయింది. – రమణయ్య, స్థానికుడు

✓ శుభ్రం చేయిస్తాం. – భవాని, ఎంపీడీవో

? సైదాపురం మండలం కలిచేడు గ్రామం వద్ద రోడ్డు భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. – రాఘవ, స్థానికుడు

✓ మరమ్మతులు చేయిస్తాం. – సురేష్, ఏఈ

? పొదలకూరులోని మనుబోలు రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తున్న చెత్త పక్కనే ఉన్న పోట్టేలువాగులో పడి నీరు కలుషితంగా మారుతోంది. చెత్తదూరంగా వేయాలి. –వెంకయ్య, రైతు.

✓ సమస్య పరిశీలించి చెత్త కాలువలో వేయకుండా చూస్తాం. – అనిల్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ

## ప్రతిభ చూపారు.. బహుమతులు సాధించారు

విజేతలతో ఉపాధ్యాయులు

**అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే:** ఏఎస్‌పేట కేజీబీవీ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇంటర్ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.లక్ష్మీప్రియ, ఎం.సుకన్య, బి.సుజాతలు వరుసగా.. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ శ్రీలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు ప్రశాంతి, భార్గవి, రేఖ, తేజ బహుమతులు అందజేశారు.

## ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వ నిర్ణయం

రాపూరులో స్థానికుల సంబరాలు

**కలువాయి, రాపూరు, న్యూస్‌టుడే:** కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు కూడా ఇక్కడే కొనసాగుతాయని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. ప్రజల అభీష్టం మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వివరించారు. కలువాయిలో జరుగుతున్న ఐదే డీక్షలో సోమవారం పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు మండలాలు జిల్లాలోనే కొనసాగించాలని తెలియజేశామన్నారు. దీక్షను విరమించాలని సభ్యులను కోరారు. వారందరికీ కొబ్బరి బొండాలు అందజేసి దీక్ష విరమింపజేశారు. రాపూరులో సోమవారం రాత్రి ఐకాస ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి.

## యూరియా పంపిణీ చేయాలని ఆందోళన

**మనుబోలు:** నిష్పక్షపాతంగా యూరియా పంపిణీ చేయాలని అక్కంపేట రైతులు కోరారు. సోమవారం మండలంలోని గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద వివిధ పార్టీల నాయకులు ఆందోళన చేపట్టారు. గ్రామంలోని చిన్న, సన్నకారు రైతులకు యూరియా సక్రమంగా అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎకరాకు మూడు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకుల అక్రమంగా యూరియాను తరలిస్తున్నారని ఆరోపించారు.

## అధికారులు రారు.. వినతులు పట్టించుకోరు

**న్యూస్‌టుడే, పొదలకూరు, కోవూరు, విడవలూరు, మనుబోలు**

మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్‌ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ తరచూ సమావేశాల్లో ఆదేశిస్తున్నారు. కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో సంబంధిత అధికారులు గైర్హాజరవుతున్నారు. పరిష్కారం కోసం వచ్చిన ప్రజలు వెనుదిరుగుతున్నారు...

పొదలకూరులో వినతి పరిశీలిస్తున్న డీటీ సురేఖ

పరిశీలన

...జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి వచ్చే దిగువస్థాయి అధికారులు ఈ మూడు నియోజకవర్గాలకు చెందినవారే ఉన్నారు. ● కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, కార్యాలయాల్లో కొందరు అధికారులు హాజరై కానిచ్చేస్తున్నారు. రెవెన్యూ, దామరమడుగు, పెనుబల్లి, నార్త్‌రాజుపాళెం, గండవరం, చంద్రశేఖరపురం, కొడవలూరు, కొత్తూరు, మైపాడు పంచాయతీల పరిధిలో సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. విడవలూరులో తొమ్మిది వినతులు, కోవూరులో ఏడు వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు. రీసర్వేలో తప్పులు, ఇంటి స్థలాలపై విన్నవించారని పేర్కొన్నారు. ● జిల్లాకు మారుమూల మండలాలైన రాపూరు, కొల్లాయి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మనుబోలు తహసీల్దారు

● సర్వేపల్లి, వెంకటాచలం, మనుబోలు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల పరిధిలో భూసమస్యలు ఎక్కువగా ఉన్నాయి. గత వైకాపా పాలనలో రీసర్వే ఇష్టారాజ్యంగా చేశారు. అర్హులు భూములు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాలుగు వినతులు వచ్చాయని తహసీల్దారు రమాదేవి తెలిపారు.

● పొదలకూరు మండలంలో భారీగా భూసమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. మరుపూరు, తాటిపర్తి, బిరదవోలు తదితర గ్రామాల వారు నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. మూడు అర్జీలు రైతుల నుంచి వచ్చాయని ఉప తహసీల్దారు సురేఖ తెలిపారు. కనుపర్తిలో రీసర్వేకు సంబంధించి రెండు వినతులు, పట్టా, ఇంటి స్థలాలు కావాలని ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. కసుమూరు, వెంకటాచలం, సర్వేపల్లి, కాకుటూరు, తోటపల్లిగూడూరు, కోడూరు, నరుకూరు, వరిగొండ గ్రామాల్లో రీసర్వే సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. మర్రిపల్లెలో గ్రామస్థుల నుంచి వచ్చిన తొమ్మిది దరఖాస్తుల్లో ఏడింటిని పరిష్కరించినట్లు చెబుతున్నారు.

సైదాపురం, కలువాయిలో జరిగే కార్యక్రమాల్లో అధికారులు పాల్గొనడం లేదు. మద్దెలమడుగు, పంగిలి, పెంచలకోన, జోరేపల్లి, సిద్దవరం, కలువాయి, కుల్లూరు, తెలుగురాయపురం, పల్లంకొండ, సైదాపురం, కలిచేడు, చాగణం, గిద్దలూరు పంచాయతీల పరిధిలో సమస్యలు విన్నవిస్తున్నా స్థానిక సచివాలయ సిబ్బంది, మండల అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

## ఆరోపణలు నిరూపించుకుంటే చట్టపరమైన చర్యలు

ఇరిగేషన్ కార్యాలయం వద్ద తెదేపా నాయకులు

**పొదలకూరు, న్యూస్‌టుడే:** నీటిపారుదల పనుల్లో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు చేసి.. అవి నిరూపించకుంటే వైకాపా నాయకుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెదేపా నాయకులు డిమాండ్ చేశారు. రేవంత్ లేకపోవాలని ఇరిగేషన్ డీఈతో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గత పాలనలో పారిపోయిన పీఏసీఎస్ అధ్యక్షుడు మస్తాన్ బాబు అన్నారు. జిల్లాల వైకాపా నాయకులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన అనుచరులు ఇష్టానుసారంగా విమర్శలు చేశారు. వాటిని ఇరిగేషన్ కార్యాలయ అధికారుల సమక్షంలో నిరూపించాలని ఉదయం 11 గంటల నుంచి సుమారు 200 మంది తెదేపా కార్యకర్తలు రెండు గంటల సేపు ఎదురు చూసినా ఎవరూ రాలేదన్నారు. దీంతో మరో రెండురోజులు సమయం తీసుకొని అయినా నిరూపించాలని పేర్కొన్నారు. వైకాపా నాయకుడు పట్టా, ఎస్సీ, ఎస్టీ రైతుల పొలాలు దున్నుకునేందుకు ఉపయోగించాల్సిన ట్రాక్టరు, రోటవేటర్ సొంతానికి వినియోగించారని ఆరోపించారు. మరుపూరు గ్రామంలోని పొలాలకు వెళ్లేందుకు చెరువు కట్టకు రైతులు ఏర్పాటు చేసుకున్న ర్యాంపును తొలగించాలని మాజీ మంత్రి కాకాణి జిల్లా ఎస్‌ఈకి ఫిర్యాదు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, బక్కయ్యనాయుడు, కృష్ణ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయిదేళ్లకే తిరిగిరాని లోకాలకు..!

### టిప్పర్ ఢీకొని బాలుడి దుర్మరణం

ప్రమాదానికి కారణమైన టిప్పర్ (అంతరచిత్రంలో) మృతిచెందిన దక్షేష్

**సైదాపురం, న్యూస్‌టుడే:** అప్పటి వరకు సరదాగా ఆడుకుంటున్న అయిదేళ్ల బాలుడిని టిప్పర్ రూపంలో మృత్యువు కబళించిన విషాదకర ఘటన సైదాపురంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సైదాపురంలోని రాపూరు క్రాస్ రోడ్డు కాలనీకి చెందిన ఆదినారాయణ, సుమ్మల కుమారుడు దక్షేష్(5) ఇంటి వద్ద సరదాగా ఆడుకుంటూ బ్యాట్‌తో బాల్‌ను కొట్టగా రోడ్డు మీద పడడంతో తెచ్చుకునేందుకు వెళ్లాడు. అదే సమయంలో రాపూరు నుంచి కంకర లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొంది. తీవ్ర గాయాలవడంతో బాలుడిని చికిత్స నిమిత్తం గూడూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలుడి మృతితో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై కాంతికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభావతమ్మ

**సంగం, న్యూస్‌టుడే:** జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని బాలికల గురుకుల పాఠశాలల్లో పది, ఇంటరు విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామని జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయకర్త సి.ప్రభావతమ్మ తెలిపారు. సోమవారం సంగంలోని బాలికల గురుకులాన్ని పరిశీలించారు. వందరోజుల ప్రణాళిక అమలు తీరుపై ప్రధానాచార్యులు సుమతి, ఉపాధ్యాయులతో చర్చించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎనిమిది పాఠశాలల్లో పలు అభివృద్ధి పనులకు రూ.1.32 కోట్లతో పాలనానుమతి లభించిందన్నారు. సంగం పాఠశాలలో రక్షణ గోడ ఎత్తు పెంచడం, కంచె ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు.

## పెంచలకోనకు పాదయాత్ర

**రాపూరు, న్యూస్‌టుడే:** మండలంలోని పెంచలకోనకు నెల్లూరు నుంచి పెంచలస్వామి భక్త బృందం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని పాదయాత్ర చేపట్టారు. ఉప కమిషనర్ శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. పదేళ్లుగా నెల్లూరు నుంచి పెంచలకోనకు పాదయాత్రగా వస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## భాజపా యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా భరత్‌రెడ్డి

**ఆత్మకూరు :** భాజపా యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూరుకు చెందిన చింతలపల్లి భరత్‌రెడ్డిని ఎంపికయ్యారు. ఈ మేరకు భాజపా జిల్లా అధ్యక్షుడు ఎస్ వంశీధర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా భరత్‌రెడ్డి, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డుపై మురుగు...పరుగు

మండలంలోని మహిమలూరు గ్రామంలోని పడమటి కాలనీలో మురుగుకాలువలు లేకపోవడంతో సమీప గృహాల్లోని వృధానీరు రోడ్లపై చేరి అధ్వానంగా తయారైంది. ఈ దారిలో రాకపోకలు సాగించాలంటే స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు

## వంతెనపై పగుళ్లు.. వాహనదారులకు అవస్థలు

సౌలుచింతల వద్ద పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో వంతెనపై రోడ్డు పగుళ్లిచ్చి అధ్వానంగా మారింది. కడప, ఆత్మకూరు, బుచ్చి నుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు కొందరు వేగంగా వస్తూ అదుపుతప్పి పడిపోతున్నారు. రాత్రి సమయాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని పలువురు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

## అధ్వానంగా సాగునీటి కాలువ

కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం ప్రధాన రహదారి సమీపంలో ఉన్న సాగు నీటి కాలువ చెత్త, గుర్రపుడెక్కతో నిండిపోయింది. దిగువకు నీటి ప్రవాహం లేక సాగునీరందక అవస్థలు పడుతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులు పరిశీలించి కాలువ పూడిక తీయించాలని వారు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

## చెత్త సంపద కేంద్రం నిరుపయోగం

గత తెదేపా పాలనలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించారు. వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతో అధ్వానంగా మారాయి. పొదలకూరు, రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో ఎక్కడా వినియోగించడం లేదని రోడ్డుపై చెత్తకుప్పలు కనిపిస్తున్నాయి. జోరేపల్లి వద్ద ముళ్ల చెట్లు పెరిగి అధ్వానంగా ఉంది. అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

## నెల రోజులుగా తాగునీరు కలుషితం

తరచూ పైపులు లీకులు కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. పంచాయతీ అధికారులు శాశ్వత పరిష్కార మార్గం చూపడం లేదు. విడవలూరు ప్రధాన రహదారి కూడలిలో పైపులు లీకై నీరు ప్రవహిస్తూ బురదమయంగా మారుతోంది. నెల రోజులుగా పైపుల నుంచి లీకేజీతో నీరు కలుషితమవుతోందని, మండల అధికారులు ఈ మార్గంలో చూస్తూ వెళుతున్నారే తప్ప పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు

## మహిళ బలవన్మరణం

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** మండలంలోని అప్పారావుపాళెం ఎస్సీ కాలనీలో నివాసముంటున్న పెంచలమ్మ(30) సోమవారం ఇంటిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిందని ఎస్సై జిలానీ తెలిపారు. ఈ మేరకు సమాచారం అందిందన్నారు. ఆమె మృతికి కారణాలు ఇంకా తెలియరాలేదని దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## లభించని యువకుడి ఆచూకీ

**సంగం, న్యూస్‌టుడే:** సంగంలో శుక్రవారం రాత్రి నుంచి అదృశ్యమైన తురకా పవన్‌కుమార్ ఆచూకీ లభించక పోవడంతో కుటుంబసభ్యులు ఆవేదనకు గురవుతున్నారు. ఆరోజు అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఆటోతో సహా అదృశ్యమయ్యారు. శనివారం సాయంత్రానికి ఉడ్‌హవుస్‌పేట వద్ద బెజవాడ పాపిరెడ్డికాలువలో ఆటో లభించగా, దాన్ని వెలికి తీయించి పరిశీలిస్తే అతను కనిపించలేదు. అప్పటి నుంచి ఎస్సై పి.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో పాటు కుటుంబసభ్యులు కాలువ వెంబడి దగదర్తి మండలం వరకు సోమవారం గాలించినా ఆచూకీ తెలియలేదు.

## విద్యార్థుల్లో మానవీయ విలువలు పెరగాలి

ఆచార్యుడిని సన్మానిస్తున్న వీఎస్‌యూ వీసీ

**వెంకటాచలం, న్యూస్‌టుడే:** విద్యార్థులు కేవలం సాంకేతిక నైపుణ్యాలకే పరిమితం కాకుండా.. మానవీయ విలువలు, నైతికత కలిగి ఉండాలని వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు సూచించారు. వీఎస్‌యూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో... విద్యార్థులకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'కమ్యూనికేషన్ స్కిల్స్, జాబ్ రెడీనెస్, కెరీర్ గైడెన్స్' కార్యక్రమాన్ని సోమవారం వీసీ ప్రారంభించి మాట్లాడారు. ఆచార్యులను వీసీ సన్మానించారు. ● వీఎస్‌యూ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో 'క్రియేటివ్ రైటింగ్, ప్రొఫెషనల్ కంటెంట్ డెవలప్‌మెంట్' కోర్సులో భాగంగా విద్యార్థులకు రచనల మెరుగు, డెవలప్‌మెంటల్ ఎడిటింగ్, కాపీ ఎడిటింగ్, రీడింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎడిటింగ్ ప్రక్రియలో సాధారణంగా దొర్లే తప్పులను వివరించారు.

## ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

**అనుమసముద్రంపేట, సంగం, న్యూస్‌టుడే:** ఏఎస్‌పేట విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్)2026 క్యాలెండర్, డైరీని మండల విద్యాశాఖాధికారి జ్యోతి, ఎంఈవో 2 సాయిప్రసాద్‌లు ఆవిష్కరించారు. ● సంగంలోని రక్షణ సువార్త మందిరంలో సోమవారం పాస్టర్ ఉల్లాది నెహమ్యా ఆధ్వర్యంలో మహిళలు 2026 కాలమానిని ఆవిష్కరించారు. క్రైస్తవ భక్తిగీతాలు ఆలపించి ప్రార్థనలు చేశారు.

## ఉద్యోగులకు వర్గీకరణ ఫలాలు దక్కాలి

**ముత్తుకూరు, :** ఉద్యోగుల పదోన్నతుల్లో వర్గీకరణ ఫలాలు దక్కాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాల్మన్, ప్రధాన కార్యదర్శి కిరణ్ బాబు తెలిపారు. మండలంలోని ఏపీ జెన్‌కో పినాకిని అతిథి గృహంలో సోమవారం మాదిగ ఉద్యోగుల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించి వివిధ కమిటీలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా భూపతి, ప్రాంతీయ అధ్యక్షుడిగా శివశంకర్, కార్యదర్శిగా ప్రేమ్‌కుమార్, ట్రెజరర్‌గా మహేశ్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా శివకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా శీనయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బాలాజీ, మహిళా రిప్రజెంటేటివ్‌గా సుజాతను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏడీఈ శ్యాం కుమార్, ఈఈ మస్తాన్ రావు, ఏడీఈ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని నిరసన

విడవలూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

**విడవలూరు, న్యూస్‌టుడే:** పీఏసీఎస్‌ల ద్వారా రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు వెంటనే ప్రభుత్వం మాఫీ చేయాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో విడవలూరు తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మూలి వెంగయ్య, మండపర్తి అంకయ్య, తుళ్లూరు గోపాల్, ఖాదర్‌మస్తాన్, మస్తానయ్య, కుడుముల మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల్లో బయోమెట్రిక్ విధానం !

**పొదలకూరు, న్యూస్‌టుడే:** సచివాలయాలకు సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావడం లేదని, వీరి కోసం బయోమెట్రిక్ విధానం పెట్టేలా కలెక్టర్ దృష్టిపెట్టారని జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు అన్నారు. సోమవారం పొదలకూరు మండల పరిషత్తు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ఉన్న సచివాలయాలకు సిబ్బంది సకాలంలో రావడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక నుంచి ఆకస్మిక తనిఖీలు ఉంటాయని హెచ్చరించారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తి ఆక్రమించి గోడకట్టారని, తమకు అందిన ఫిర్యాదు మేరకు సర్వే చేసి ఆక్రమించిన స్థలం జిల్లాపరిషత్‌కు చెందినదిగా నిర్ధారించామన్నారు. అందుకు సంబంధించి తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్సై ఒక కమిటీగా ఏర్పడి ఆక్రమించిన స్థలాన్ని పాఠశాలకు అప్పగించాలని ఆదేశాలిచ్చామని ఆయన పేర్కొన్నారు.

## ధ్వంసం చేసి.. ఆక్రమించి

రివిట్‌మెంట్‌ను ధ్వంసం చేసి రోడ్డు వేశారిలా..

**అనంతసాగరం, న్యూస్‌టుడే:** సోమశిల గ్రామంలోని హిల్‌కాలనీ సమీపంలో ఉన్న హైలెవల్ కాలువను అక్రమార్కులు ధ్వంసం చేస్తున్నారు. పదేళ్ల క్రితం తెదేపా ప్రభుత్వం కాలువ రివిట్‌మెంట్ పనులు చేపట్టగా.. వైకాపా హయాంలో నిలిపేశారు. ఏళ్లుగా నిర్మాణం నిలిచిపోవడంతో స్థానికంగా ఉండే కొందరు కాలువ ఇరువైపులా రివిట్‌మెంట్ నిర్మాణాలను జేసీబీలతో ధ్వంసం చేసి కాలువను పూడ్చి వేశారు. ఏకంగా రోడ్డు వేసి ఆ ప్రాంతాన్ని ఆక్రమించారు. గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

## అంగన్‌వాడీలకు తొలగిన ఆన్‌లైన్ కష్టాలు

**న్యూస్‌టుడే, కోవూరు**

మాతా శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి.. కిశోరి వికాసం, ప్రధానమంత్రి మాతృవందన యోజన, సఖి వంటి వివరాలు యాప్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు నమోదు చేయాలి. గతంలో ఇచ్చిన చరవాణులు సక్రమంగా పనిచేయక ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేక అవస్థలు పడేవారు. ఇబ్బందులు తొలగించాలని ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపారు. అంగన్‌వాడీల కష్టాలను గమనించి వాటి పరిష్కారానికి అత్యాధునిక 5జీ సాంకేతికత ఉన్న చరవాణులను అందజేశారు. కోవూరు ప్రాజెక్ట్ పరిధిలో బుచ్చిరెడ్డిపాలెం, కొడవలూరు, కోవూరు, విడవలూరు మండలాల్లోని పర్యవేక్షకులు, కార్యకర్తలకు 333 చరవాణులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని ఇటీవల ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ● గత వైకాపా హయాంలో అందించిన చరవాణులతో అంతర్జాలం సరిగా అందక తరచూ సేవలకు అంతరాయం కలుగుతోంది. ఒక్కో పనికి ఒక్కో యాప్‌ను వినియోగించడంతో భారం పెరిగి తరచూ ఇబ్బందులు పడేవారు. వారు అనేక కష్టాలు పడుతూ ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టారు. వారు కొత్త ఫోన్లు ఇస్తామని హామీ ఇవ్వడంతో నిరసనలు విరమించారు. తాజాగా కూటమి ప్రభుత్వం 5జీ ఫోన్లు ఇవ్వడంతో సులువుగా చేస్తున్నామని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ● కోవూరు సీడీపీవో శారద మాట్లాడుతూ. . ప్రభుత్వం అందజేసిన చరవాణులు సిబ్బందికి అందజేశామన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా పనిచేయాలన్నారు. లబ్ధిదారులకు సత్వర సేవలందించాలని పేర్కొన్నారు.

## బీమా..అన్నదాతలకు ధీమా

**న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, కోవూరు**

రబీ సీజన్ 2024-25కు సంబంధించి సాగు చేసే పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ 31తో గడువు ముగియనుంది. వరితో పాటు మినుము, పెసలు, వేరుసెనగ తదితర పంటలకు బీమా సౌకర్యం కల్పించారు. వాటికి వాతావరణ ఆధారిత దిగుబడుల అంచనా మేరకు బీమా చెల్లిస్తారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) లబ్ధి పొందాలంటే అన్నదాతలు ప్రీమియం చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వరికి నెలాఖరు వరకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

● రబీ సీజన్‌లో జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం ఆరు లక్షల ఎకరాలు కాగా అందులో ఐదు లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. మిగతా విస్తీర్ణంలో మినుము,పెసలు, వేరుసెనగ తదితర పంటలు సాగుచేస్తున్నారు. ఎకరాకు బీమా మెత్తంలో 1.5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మిగతా వాటికి వాతావరణ ఆధారిత దిగుబడుల అంచనా మేరకు బీమా చెల్లిస్తారు.

**పంటల వారీగా వివరాలు.. (రూ.లో)**

| పంట రకం | బీమా మొత్తం | చెల్లించాల్సింది |
|---|---|---|
| వరి | 42,000 | 630 |
| మినుములు | 20,000 | 300 |
| పెసలు | 20,000 | 300 |
| వేరుసెనగ | 32,000 | 480 |

### దరఖాస్తు ఇలా..

రైతులు సంబంధిత గ్రామాల్లోని కామన్ సర్వీస్ సెంటర్, గ్రామ సచివాలయాల కేంద్రాలకు వెళ్లి రైతు ఆధార్ కార్డు, పొలం ధ్రువపత్రాలు, సీసీఆర్సీ కార్డు, సాగు ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసు పుస్తకం అందిస్తే బీమా సౌకర్యం కల్పిస్తారు. సాగు చేసినవి ఈ-పంటలో నమోదు చేసుకొని బీమా ప్రీమియం చెల్లిస్తే ప్రకృతి విపత్తులలో పంటకు నష్టం వాటిల్లితే బీమా పొందే అవకాశముంది. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు కోరారు.

తాటిపర్తిలో పంట పరిశీలిస్తున్న అధికారులు

## నెలాఖరులోగా క్రమబద్ధీకరణ చేసుకోండి

**కోవూరు:** అదనపు లోడ్ క్రమబద్ధీకరణ నెలాఖరులోగా చేయించుకోవాలని డిస్కం ఈఈ రమేష్ చౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా వినియోగదారులు తమ అదనపు లోడు 50 శాతం డెవలప్‌మెంట్ రాయితీతో క్రమబద్ధీకరించుకోవచ్చని పేర్కొన్నారు.

**డాక్యుమెంట్ పోయినది**

నేను మండువ మల్లిఖార్జునరావు, తండ్రి : మండువ రాఘవరావు, నివాస 4-16, త్రోవగుంట గ్రామం, ఒంగోలు మండలం, ప్రకాశం జిల్లా-523262, ఆం.ప్ర., నా యొక్క లింక్ డాక్యుమెంట్ నెం. 747/2016, తేది.11.05.2006 ముత్తుకూరు నందు రిజిష్టర్డ్ చేయబడినది. ఒంగోలు నుండి కసుమూరు దర్గాకు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో వెంకటాచలం నందు జిరాక్స్ తీయుచుండగా తేది.24.12.2025 న పోయినది. సదరు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినవారు పై చిరునామాకు అందజేయవలెను.

సంప్రదించండి: 97013 22104 / 97043 11221

(c) eenadu

# నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

## రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

**నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే :** నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదానం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విరివిగా రక్తదానం చేపట్టి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడాలని తెలిపారు. 150 యూనిట్ల రక్తం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హజరత్తయ్య, విభాగాధిపతులు వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి చంద్రమోహన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి చేద్దాం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

**నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే:** ఆలయ అభివృద్ధికి అందరూ నడుం బిగించాలని నెలూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ నూతన ట్రస్టుబోర్డు ఛైర్మన్ శిరీషతోపాటు పదిమంది సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఈవో జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సేవ చేయాలని కోరారు. ఛైర్మన్‌గా శిరీషా, కమిటీ సభ్యులుగా జి.నరేష్, డి.జమున, జి.దొరబాబు, ఎం.మానికల నాగమణి, బి.చంటి, ఆర్.రాధాకుమారి, ఎన్.చిన పెంచలయ్య, కె.వీరరాఘవేంద్ర, ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఎస్.రఘురామమూర్తి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, భాజపా జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాజానాయుడు, జనసేన నాయకులు గునుకుల కిశోర్, చంద్రశేఖర్‌రెడ్డి, నూనె మల్లికార్జునయాదవ్ పాల్గొన్నారు.

## న్యాయశాఖ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(లీగల్): న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రొబేషన్ పూర్తయిన ఉద్యోగులందరికీ జనవరిలో ఉద్యోగోన్నతులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాగరాణి, సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, పోలయ్య, సిహెచ్.వెంకటేశ్వర్లు, శివప్రసాద్‌బాబు, సురేంద్రబాబుయాదవ్, దినేష్‌కుమార్, మల్లికార్జునరావు, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## మొర వినండి.. న్యాయం చేయండి

**నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే:** పింఛన్లు కావాలని వృద్ధులు, దివ్యాంగులు, భూ సమస్యలపై రైతులు, ఇళ్ల పట్టాల కోసం మహిళలు పెద్దఎత్తున సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదని.. ఉన్నతాధికారులైనా స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

### కాళ్లు సహకరించక.. పనులు చేసుకోలేక

వెంకటాచలం మండలం గొలగమూడికి చెందిన **పొట్లపూడి వేణు**కి కాళ్లు సహకరించక.. బాధపడుతున్నాడు. పనులు చేయలేని కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. గతంలో కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వారు. ప్రభుత్వం స్పందించి పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

### జీవనాధారం లేక..

సైదాపురం మండలం కొమ్మిపాడు గ్రామానికి చెందిన **కుమ్మరగుంట ఈశ్వరయ్య** పేద దివ్యాంగుడు. పదేళ్ల క్రితం పక్షవాతం రావడంతో కాళ్లు పనిచేయక మంచానికే పరిమితమయ్యాడు. ఎలాంటి జీవనాధారం లేదు. ఎన్నిసార్లు గ్రామ సచివాలయంలో అర్జీలు ఇచ్చినా ఎలాంటి ఫలితం లేదు. తన దుర్భర పరిస్థితిని అర్థం చేసుకుని పింఛను మంజూరు చేయాలని వేడుకున్నారు.

### పింఛను అందించి ఆదుకోండి..

కలువాయి మండలం వేరుబొట్లపల్లికి చెందిన పేరం సుబ్బారెడ్డి వ్యవసాయ పనులు చేసుకునేవారు. ఒక కాలు దెబ్బతినడంతో పనులు చేయలేకపోతున్నారు. వైద్యులు పరీక్షించి అంగవైకల్యం ధ్రువీకరణ పత్రం ఇచ్చారని, అధికారులు పింఛను అందించి ఆదుకోవాలని కోరారు.

### సకాలంలో సహ చట్టం సమాచారం ఇవ్వాలి

సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు నిర్ణీత సమయంలోగా సమాచారాన్ని అందించాలని న్యాయవాది ఇర్ల వెంకటరమణయ్య, పెంచలయ్య, కొండలరావు, మధు కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధిగా సమాచార హక్కు బోర్డులు ఏర్పాటు చేసి జాప్యం లేకుండా పౌరులకు సమాచారం అందించాలని కోరారు.

## ప్రజాభీష్టం మేరకే జిల్లాల పునర్విభజన

**నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే:** ప్రజలు కోరుకున్న విధంగానే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జిల్లాల్లో మార్పులు చేసిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరులోనే కొనసాగించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గూడూరు నియోజకవర్గంలో ప్రధాన భాగమైన మూడు మండలాలను నెల్లూరులోనే కలపడం సంతోషంగా ఉందన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా గూడూరు ప్రజలకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చారని తెలిపారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలు మొదటి నుంచి ప్రకాశం జిల్లాలో ఉండాలనే కోరుకున్నారని.. వారి కోరికను కూడా ప్రభుత్వం తీర్చిందన్నారు.

## శాశ్వత చర్యలేవి?

### అభివృద్ధి పనుల పేరుతో రోడ్లు ధ్వంసం

న్యూస్‌టుడే, నెల్లూరు(ఏసీ నగర్, పద్మావతి సెంటర్)

జడ్పీకాలనీ నాలుగో వీధిలో రోడ్డు దుస్థితి

నగరంలో అభివృద్ధి పనుల కోసం అధికారులు రోడ్లు తవ్వి ఆ తరువాత శాశ్వత మరమ్మతులు విస్మరిస్తున్నారు. దీనివల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. నగరంలోని రైల్వే ఫీడర్స్ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. నిత్యం రైల్వేస్టేషన్‌కు వేలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ ఎస్బీఐ బ్యాంకు సమీపంలో నగరపాలక కార్మికులు రోడ్డుమధ్య భాగం వరకు తవ్వి మరమ్మతులు చేయకుండా మట్టితో పూడ్చి వేశారు. వాహనదారులకు దగ్గరకు వచ్చే వరకు కానరాక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానికులు దానిపై ఎండిన చెట్లకొమ్మలను ప్రమాదపు హెచ్చరికలుగా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో జిల్లా ప్రధాన రైల్వేస్టేషన్, జిల్లా అగ్నిమాపక, త్రీటౌన్ పోలీసు స్టేషన్, ఎస్బీఐ టౌన్ బ్రాంచి, ఎంపీడీవో, డివిజనల్ ఆర్అండ్‌బీ కార్యాలయం, వ్యవసాయశాఖ, ప్రభుత్వ పశువుల ఆసుపత్రి తదితర కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం అధికారులు తిరుగుతుంటారు. అయినా వారు పట్టించుకోవడం లేదు. నగరంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా సర్వేపల్లి కాలువ కట్ట ఐటీఐ కళాశాల వద్ద బాగా కోతకు గురైంది. వాహనదారులు పక్కకొస్తే ప్రమాదం జరిగి వాహనాలు కాలువలో పడిపోయే అవకాశం ఉంది.

**వాహనదారులకు ప్రమాదం**

నగరంలోని జడ్పీకాలనీ నాల్గో వీధిలో అండర్ డ్రైనేజీ పనుల కోసం రోడ్డు మధ్యలో తవ్వారు. తాత్కాలికంగా పూడ్చడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రాత్రి సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని అక్కడి స్థానికులు వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. నగర పాలక అధికారులు స్పందించి.. రోడ్లు, కాలువ గట్లు బాగుచేయాలని కోరుతున్నారు.

## అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు

**నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే:** నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలోని ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా వాటి పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ సూచించారు. సోమవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కమిషనర్ వైవో నందన్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. ప్రజలు అందించిన అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ నందన్ మాట్లాడుతూ 2025-26 రెండో అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలం పన్నులను ఈనెల 31వ తేదీ లోగా చెల్లించిన వారికి అపరాధ రుసుము ఉండదని, వచ్చేనెల నుంచి తప్పనిసరిగా విధిస్తామని తెలిపారు. పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని, డివైడర్ల మధ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని పూర్తిగా నిషేధించినట్లు పేర్కొన్నారు. మొత్తం 56 అర్జీలు అందుకున్నామని, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామమోహనరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి, ఇన్‌ఛార్జి సిటీప్లానర్ రఘునాథరావు, మేనేజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ నందన్

## అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు రవిప్రకాష్

**నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే:** నెల్లూరు నగరం సంతపేటలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో చదువుతున్న బి.రవిప్రకాష్ అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.లక్ష్మీప్రసూన తెలిపారు. సోమవారం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 3 నుంచి 6వ తేదీ వరకు విజయవాడలో జరిగే పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని.. కావలి జవహర్ భారతి కళాశాలలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.రవీంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వాసన భరించలేకున్నాం..

నెల్లూరు నగరం కొండాయపాలెం, స్నేహనగర్ ప్రాంతంలో శ్రీకళ పార్కు టవర్స్ ఎదురుగా ఖాళీస్థలంలో పెద్దఎత్తున కాలువల నీరు నిలిచిపోతోంది. దుర్వాసనతో పాటు దోమలతో చుట్టుపక్కల నివాసాలకు చెందిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి మురుగునీరు నిలబడకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట)

## ప్రమాదకరంగా ఫ్యూజ్‌బాక్స్

నగరంలోని పాత మినీ బైపాస్ సమీపం పరమేశ్వరి అవెన్యూలోని ప్రధాన వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా ఉంది. నాలుగు రోడ్ల కూడలిలో రహదారికి ఆనుకొని మలుపు వద్ద ఉండటంతో వాహనదారులు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉంది. గతంలోనూ ప్రమాదాలు జరిగాయని, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(విద్యుత్తు)

## మురుగులోనే కుళాయి

నగరంలోని పుట్టా ఎస్టేట్ ఆనుకొని ఉన్న దుర్గానగర్‌లో నీటి కుళాయి మురుగు నీటిలో ఉంది. స్థానికంగా, పెన్నా పొర్లుకట్టపై నివాసం ఉంటున్న వారు కుళాయిని వినియోగిస్తున్నారు. ఇక్కడ అపరిశుభ్రంగా ఉండటంతో రోగాలబారిన పడతామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(ఏసీ నగర్)

## బాబోయ్ దోమలు

నగరంలో ఖాళీ స్థలాలు వర్షపునీటితో నిండిపోయి తటాకాలను తలపిస్తున్నాయి. రోజుల తరబడి నీరు నిల్వ కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెడికవర్ ఆసుపత్రి ప్రాంతంలో వర్షపునీరు, మురుగునీరు చేరి దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

## భాజపా యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా భరత్‌రెడ్డి

వంశీధర్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకుంటున్న భరత్‌రెడ్డి

**నెల్లూరు(పద్మావతిసెంటర్), న్యూస్‌టుడే:** భాజపా యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ భరత్‌రెడ్డిని నియమించారు. నెల్లూరు నగరంలోని భాజపా కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి ఆయనకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా భరత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ యువత కోసం అమలు చేస్తున్న పథకాలు గ్రామస్థాయికి తీసుకెళతానని తెలిపారు.

## ఇథనాల్ పరిశ్రమతో ముప్పు

**నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే:** కిసాన్‌సెజ్‌లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని, దీనివల్ల పర్యావరణం దెబ్బతింటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి తెలిపారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతిని వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ ఎంఎల్ నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం కార్యదర్శి మూలం రమేష్, నాయకులు నందిపోగు రమణయ్య, పఠాన్ జిలానీఖాన్, లీలామోహన్, అహ్మద్, మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రూ.22 లక్షలతో సీసీ రోడ్డు

పనులకు శంకుస్థాపన చేస్తున్న గిరిధర్‌రెడ్డి

**నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 41వ డివిజన్‌లో రూ.5.45 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం 41వ డివిజన్ మనుమసిద్ధినగర్‌లో రూ.22 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, నాయకులు సురేష్, నాగేశ్వరరావు, ఈశ్వర్, సుబ్రహ్మణ్యం, బాబ్జి పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు

బాలాజీనగర్‌లో ఏడు ద్వారాలతో బాలాజీ దర్శనానికి ఏర్పాట్లు

**నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా నగరంలో ఆలయాలు ముస్తాబయ్యాయి. రంగనాథస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పది రోజులపాటు ద్వార దర్శనం ఉంటుంది. బాలాజీ నగర్‌లో కొలువుదీరిన సీతారాం మందిరంలో బాలాజీ దర్శనం కోసం ఏడు ద్వారాలను ఏర్పాటు చేశారు. మాగుంట లేవుట్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో వస్తారని ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. నగరంలోని శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయం నుంచి స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చి దగ్గరలో ఉన్న కోనేరులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. అనంతరం పల్లకీ సేవ, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## సకాలంలో బిల్లులు చెల్లిస్తే.. సర్ ఛార్జీలు ఉండవు: ఎస్ఈ

**నెల్లూరు(విద్యుత్తు):** వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లిస్తే సర్‌ఛార్జీలు ఉండవని విద్యుత్తు శాఖ ఎస్ఈ రాఘవేంద్రం పేర్కొన్నారు. వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు నగరంలోని విద్యుత్తు భవన్‌లో సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్తు సర్వీసులు, సోలార్ విద్యుత్తు, లో ఓల్టేజ్, గృహ సర్వీస్‌కు పేరు మార్చడం తదితర 6 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

## రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య

**నెల్లూరు(వేదాయపాలెం):** రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన సౌత్ రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 63 ఏళ్ల వయసు ఉంటుంది. పసుపు రంగు టీ షర్టుపై పాచి రంగు స్వెటరు, బులుగు రంగు అండర్ వేర్ ధరించి ఉన్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహం గుర్తుపట్టని విధంగా తయారైంది.

**ప్రమాదవశాత్తు కాలుజారి..:** నెల్లూరు(నేర విభాగం): నగరంలోని నజీర్ తోట డబ్బాల వీధిలో పి.రామమ్మ(75) ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఆదివారం ఇంట్లో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో తలకు గాయమై మృతి చెందారు. మృతురాలి మనుమరాలు విజయశాంతి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

## వ్యక్తిపై ముగ్గురి దాడి

**నెల్లూరు(వేదాయపాలెం):** నెల్లూరు రూరల్ కోడూరుపాడు అమరజీవి నగర్‌కు చెందిన జి.రాజేష్ ఆదివారం రాత్రి ఇంటికి వెళ్తూ రూరల్ మండల పరిధిలోని ఓ కేఫ్ సమీపంలో బహిర్భూమికి వెళ్లేందుకు ఆగారు. కేఫ్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆయనపై టార్చిలైట్ వేశారు. ఎందుకు వేశావని ప్రశ్నించినందుకు దాడి చేశారు. కేఫ్‌లో ఉన్న క్యాషియర్, మాస్టర్‌ను పిలిపించి ముగ్గురు కలిసి దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం నెల్లూరుగ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చంపేస్తానని రౌడీ షీటరు బెదిరింపు..

**నెల్లూరు(వేదాయపాలెం):** తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం కొక్కుపాలెంకు చెందిన ఎం.ప్రసన్న నెల్లూరుగ్రామీణ మండలం జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ కేఫ్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నారు. ఆదివారం పనిచేస్తున్న కేఫ్‌కు సమీపంలోని ఖాళీ స్థలంలో బహిర్భూమికి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తితో ఆయనకు గొడవ జరిగింది. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో కనుపర్తిపాడుకు చెందిన రవికిరణ్ అలియాస్ ఏలియా యువకుడి వద్దకు వచ్చి తాను రౌడీషీటరు అని.. తన వ్యక్తితో గొడవ పడినందుకు చంపేస్తానంటూ బెదిరించి జేబులోని రూ.700 దోచుకెళ్లాడు. బాధిత యువకుడు సోమవారం నెల్లూరుగ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి కృషి

**నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే:** జిల్లాలో సంతృప్తి చెందేలా ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి అధికారులు కృషి చేయాలని సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ రోణంకి గోవిందరావు సూచించారు. సోమవారం నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రేషన్‌దుకాణాలు, గ్యాస్ సరఫరా ఏజెన్సీల ద్వారా అందిస్తున్న పౌరసేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులతోపాటు ఆర్డీవోలు కూడా షాపులను తనిఖీ చేపట్టాలన్నారు. స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పౌరసరఫరాల సేవలపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోందని, సేవల్లో ఎటువంటి లోపం ఎదురైనా సంబంధిత అధికారులు, డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ అధికారిణి బి.లీలారాణి, ఏఎస్‌వోలు లక్ష్మీనారాయణరెడ్డి, పుల్లయ్య, సీఎస్‌డీటీలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ గోవిందరావు

## సంక్షిప్త సమాచారం

### అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

నెల్లూరు(నవాబుపేట): పెట్రోల్ బంకులపై నెలకొన్న అపోహలను వాహనదారుల్లో నివృత్తి చేస్తూ ఆయిల్ కంపెనీలు, ప్రభుత్వం పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నెల్లూరు జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లారెడ్డి ప్రసాద్‌రెడ్డి, తమ్మా రాజశేఖర్‌రెడ్డి కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

### వసతి కల్పించండి

నెల్లూరు(నగరపాలకసంస్థ): నెల్లూరు నగరపాలకసంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నగరానికి చెందిన నలుగురు దివ్యాంగులు దేవరకొండ గోపి, గోళ్ల హేమలత, మొండి రాములమ్మ, బెల్లంకొండ మమత మూడు చక్రాల బండిలో హాజరయ్యారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు దివ్యాంగులు ఇబ్బంది పడటాన్ని గుర్తించిన కమిషనర్ వైవో నందన్ స్వయంగా ప్రాంగణంలోని వారి వద్దకు వచ్చి వినతిపత్రాలను స్వీకరించారు. వారి వినతి మేరకు గృహాలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

### జేసీఐకు జాతీయ స్థాయి అవార్డు

**నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే:** జేసీఐ నెల్లూరు టౌన్‌కు చేసిన సేవలకు గాను జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. సోమవారం చెన్నైలోని హోటల్ తాజ్‌లో జరిగిన కార్యక్రమంలో జేసీఐ నెల్లూరు టౌన్ అధ్యక్షులు రావూరి జగన్మోహన్ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. బాధ్యతను పెంచిందని, మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

### ఉద్యోగులకు అందుబాటులో ఉంటా..

నెల్లూరు(నగరపాలకసంస్థ): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటానని ఇన్‌ఛార్జి మేయర్ రూప్ కుమార్‌యాదవ్ తెలిపారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలోని ఛాంబరులో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్ కిరణ్‌లు ఉద్యోగులతో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

### ముగిసిన అంత్యక్రియలు

**నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే:** ప్రముఖ ఇస్లామీయ పండితులు, న్యాయ నిపుణులు హజ్రత్ మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. సోమవారం మూలాపేటలోని జామియా నూరుల్ హుదా మద్రసా మసీదు ప్రాంగణంలో జుహర్ నమాజ్ అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. జనాజా నమాజ్‌కు జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మత పెద్దలు, ముస్లిం సోదరులు భారీగా తరలివచ్చి ఆయన దేహాన్ని సందర్శించారు.

### సీపీఎం నాయకుల అరెస్టు

నెల్లూరు(వేదాయపాలెం): జిల్లాలో నిర్మించబోతున్న ఇథనాల్ కర్మాగారానికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా సీపీఎం నాయకులను సోమవారం రాత్రి నగర పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అందులో భాగంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్‌ను నవాబుపేట పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. సీపీఎం నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు పహారా కాశారు.

## రాష్ట్రస్థాయి షటిల్ టోర్నమెంటులో అధికారుల ప్రతిభ

**నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే:** ఆప్కాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సహకార ఉత్సవ్ 3.0 క్రీడా సాంస్కృతిక పోటీలు ఈనెల 27, 28 తేదీల్లో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగాయి. పోటీల్లో సహకార శాఖ నెల్లూరు నుంచి ప్రాతినిధ్యం వహించిన జిల్లా సహకార శాఖాధికారి బి.గురప్ప, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మోసెస్ షటిల్ బాడ్మింటన్ వెటరన్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సహకారశాఖ అదనపు రిజిస్ట్రార్ ఎన్‌వీఆర్ ఆనంద్‌బాబు చేతుల మీదుగా జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందుకున్నారు. వారిని సహకారశాఖ సిబ్బంది అభినందించారు.


జ్ఞాపిక అందుకుంటున్న గురప్ప, మోసెస్

## కరుణించక.. కష్టాలు

దుకాణాల్లో పని చేసుకుంటూ వచ్చిన జీతంతో భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్న ఆ కుటుంబంలోని పెద్దదిక్కుకు అనారోగ్యం చేసింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక పరిస్థితికి వైద్య ఖర్చులు తోడు కావడంతో ఆ కుటుంబం చితికిపోయింది. మూడేళ్లుగా ప్రభుత్వమైనా భరోసా ఇస్తుందని తిరుగుతున్నా.. స్పందించకపోవడంతో చివరకు భార్య పనికి వెళ్లి పోషించాల్సిన వస్తోంది. నెల్లూరు కామాటివీధికి చెందిన ముత్తుపండి లక్ష్మణ్ నగరంలోని దుకాణాల్లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మూడేళ్ల క్రితం అనారోగ్యం బారిన పడి కాళ్లు చచ్చుబడిపోయాయి. అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యారు. పింఛను అందించాలని తిరుగుతున్నా.. కరుణించడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఇద్దరు బిడ్డలు ఉన్నారని, భార్య పనికి వెళ్లి పోషిస్తోందని, ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)

## బీమా పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** బీమా పథకాల్లో చేరడం ద్వారా ప్రజలకు ఆర్థిక భరోసా కలుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ చేరాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఏపీజీబీ బ్యాంకు నెల్లూరు ప్రాంతీయ కార్యాలయంలో ప్రధాన మంత్రి జన బీమా యోజన(పీఎంజేబీవై) తదితర బీమా పథకాలపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. రూ.2లక్షల చొప్పున బీమా క్లెయిమ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజ్ ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ బాలాజీ, ఖాతాదారులు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న బ్యాంకు అధికారులు

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

**సమస్య:** నెల్లూరు నగరంలోని వాకర్స్‌రోడ్డులో పశువులు ఉంటున్నాయి. రాత్రి పూట కన్పించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – రమేష్‌రెడ్డి, స్థానికుడు

**సమాధానం:** పశువులను గోశాలకు తరలిస్తాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? చంద్రబాబునగర్‌లో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. వ్యాధులు ప్రబలుతున్నాయి. – సునీత

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం.

– డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)


**ది నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్**

రిజిష్టర్డ్ నెం: 2319

హెడ్ ఆఫీస్: 16/1245, గాంధీనగర్, పొగతోట, నెల్లూరు-01. ఫోన్: 0861 - 2326536.

బ్రాంచ్ ఆఫీస్ : 25/2/702, బస్టాండ్ సెంటర్, వేదాయపాళెం, నెల్లూరు-04. ఫోన్: 0861 - 2336536.

IFSC: IBKL0337NCB www.ncubnlr.org e-mail: ncubnlr@gmail.com, ncubnlr@ncubnlr.com

నెల్లూరు
తేది: 30-12-2025

**మహాజనసభ నోటీసు**

ది నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ నెం.2319, నెల్లూరు యొక్క 110వ మహాజన సభ ఈ రోజు అనగా 30.12.2025 మంగళవారం, మధ్యాహ్నము 3.00 గం.లకు బ్యాంకు నందు జరుగును. కావున బ్యాంకు సభ్యులు అందరూ తమ ధ్రువీకరణ కార్డులు (పింక్ కలర్ కార్డులు) తీసుకొని మహాజనసభకు హాజరు కావలసినదిగా కోరడమైనది.

టి.ఆర్. గుణశేఖర్, B.Sc., B.L., CAIIB, సి.ఇ.ఓ.

అరిగెల నాగేంద్రసాయి, B.A., B.L., ఛైర్మన్, Cell: 98661 87036


(c) eenadu

ధర్మవరంలో ఓపీ కౌంటర్ వద్ద రోగుల నిరీక్షణ

ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే బృందం: జిల్లాలో చలితీవ్రత పెరుగుతుండటంతో ఆసుపత్రులకు రోగుల రద్దీ పెరుగుతోంది. కొన్నిచోట్ల అందుకనుగుణంగా సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం జిల్లాలోని కదిరి, మడకశిర, ధర్మవరం ప్రాంతీయ ఆసుపత్రులు, హిందూపురం జిల్లా ఆసుపత్రిని 'న్యూస్‌టుడే' బృందం పరిశీలించింది. హిందూపురం ఆసుపత్రి మినహా మిగిలినచోట్ల వివిధ సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

# ఓపిక నశిస్తోంది!

■ ఆసుపత్రుల్లో రోగుల రద్దీ
■ అసౌకర్యాలతో ఇబ్బంది

పరిశీలన

### వేచి ఉండలేక..

కేంద్రం: ధర్మవరం ఏరియా ఆసుపత్రి
వచ్చిన రోగులు: 1,150 మంది

ధర్మవరం ఏరియా ఆసుపత్రిలో రోజూ 800 మందికి పైగా ఔట్ పేషెంట్లు వస్తుంటారు. సోమవారం ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఓపీ చీటీలు ఒక్కచోటే రాస్తుండటంతో ఒక్కో రోగికి 30 నుంచి 40 నిమిషాలు పడుతోంది. వైద్యుల వద్ద కూడా మరో 40 నిమిషాల వరకు పడుతోంది. దీంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఓపీ చీటీలు రాసే కేంద్రాల సంఖ్య పెంచాల్సి ఉంది.

### ఇరుకు గదుల్లోనే వైద్యం

మడకశిర ఏరియా ఆసుపత్రి → 200

నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవనం పూర్తికాకపోవడంతో ఇరుకు గదుల్లోనే సేవలందిస్తున్నారు. దీంతో అటు వైద్యులు, సిబ్బంది, ఇటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ శస్త్రచికిత్సలు నిర్వహించకపోవడంతో ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారిని హిందూపురం జిల్లా ఆసుపత్రికి తరలించాల్సి వస్తోంది. గర్భిణులకు సాధారణ కాన్పులు మాత్రం చేస్తున్నారు.

### సేవలు పర్వాలేదు

హిందూపురం జిల్లా ఆసుపత్రి → 941

గత కలెక్టర్ చేతన్ కృషితో ఇక్కడ ఓపీ కేంద్రాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో సమస్య తొలగింది. రక్త పరీక్షలు చేయడంలో ఆలస్యం అవుతోంది. పిల్లల ఆసుపత్రిలో రోజూ ఐదు నుంచి ఎనిమిది వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. 200 పడకలు ఉండగా... 300 పడకల స్థాయిలో రోగులు వస్తున్నారు. ఉన్నంతలో సిబ్బంది సేవలందిస్తున్నారు.

### పరీక్షలకు అవస్థలు

కదిరి ఏరియా ఆసుపత్రి → 499

జ్వరాలు, జలుబు, దగ్గుతో రోగులు ఆసుపత్రికి వచ్చారు. వైద్యుల హాజరు పర్వాలేదు. రక్త పరీక్షల కేంద్రం వద్ద కొంత ఆలస్యం అవుతోంది. ఈసీజీ, ఎక్స్‌రే పరీక్షలు చేయాల్సినచోట ఐదుగురు నిపుణుల్లో నలుగురు మానేశారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- మధుసూదన, డీసీహెచ్ఎస్

ధర్మవరంలో ఓపీ కేంద్రాలు పెంచుకోవాలని ఇప్పటికే సూచించాం. స్థలం సమస్య ఉన్నందున ఆలస్యమైంది. మంత్రి దృష్టికి తీసుకెళతాం. కదిరిలో స్కానింగ్ కేంద్రాల్లో నిపుణుల కొరత సమస్య పరిష్కరిస్తాం. మడకశిరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే రోగులకు సమస్య ఉండదు. ఈ సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

## తాగు, సాగునీరు విడుదల

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల సరిహద్దులోని పీఏబీఆర్ కుడి కాలువకు అనుసంధాన తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ (టీబీసీ) ద్వారా పలు గ్రామాలకు తాగు, సాగునీటిని హెచ్ఎల్సీ ఎస్ఈ సుధాకర్, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ రామాపురం, కనుమక్క, చిల్లకొండయపల్లి, పెద్దకోట్ల గ్రామాల్లో తాగేందుకు నీరులేక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు టీబీసీ కాలువ ద్వారా నీటి విడుదలకు ఆదేశాలిచ్చారన్నారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ జిల్లా ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా చర్చించి నీటిని విడుదల చేయించారని హరీష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో తాడిమర్రి, ధర్మవరం రూరల్ భాజపా మండల అధ్యక్షులు దేవర రాము, చంద్ర వైస్ ఎంపీపీ కృష్ణమనాయుడు, నాయకులు ఆనంద్, గంగులప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

# ప్రాణాలకు పొగమంచు!

● ఉమ్మడి జిల్లాలో కలవరపెట్టిన ఘటనలు
● ప్రయాణ వేళ అప్రమత్తత అవసరం

పొగమంచు ఉమ్మడి జిల్లా వాసులను కలవరపెడుతోంది. దీనికి తోడు చలి గజగజ వణికిస్తోంది. నెల రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. రాత్రివేళల్లో వాతావరణ పరిస్థితుల కారణంగా జనం బయటికి రాని పరిస్థితి తలెత్తుతోంది. పొగ మంచుతో ఎదుటి వ్యక్తి స్పష్టంగా కనిపించని పరిస్థితి కొనసాగుతోంది. రాత్రివేళ ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. చోదకులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల నుంచి బయటపడవచ్చు.

- అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే

'ఇటీవల రోజుల కిందట ఓ యువతి బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనంపై హైదరాబాదుకు తెల్లవారుజామున వెళ్తుండగా శ్రీసత్యసాయి జిల్లా మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టింది. పొగమంచు కారణంగానే యువతి అక్కడికక్కడే మృతి చెందింది.'

'ఈనెల 20న 44వ జాతీయ రహదారిపై కర్ణాటక నుంచి మంత్రాలయం వెళ్తున్న కారును వెనక నుంచి వచ్చిన వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. అంతకంటే రెండు రోజుల ముందు పామిడి మండలం ఎద్దులపల్లి వద్ద ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో అవ్వ, మనవడు మృతిచెందారు. ఇవన్నీ పొగమంచు కారణంగానే జరిగాయి.'

### వాహనచోదకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పొగమంచు వల్ల గమ్యస్థానానికి చేరడం ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. నిర్ణీత సమయం కంటే కాస్త ముందుగానే బయలుదేరాలి. తొందరపాటును నివారించడం ద్వారా డ్రైవింగ్‌పై ఏకాగ్రత పెరుగుతుంది.
- ముందు వెళ్తున్న వాహనాలు, రోడ్డు స్పష్టంగా కనిపించవు. ఇలాంటప్పుడు అతివేగం, ఓవర్‌టేక్ అత్యంత ప్రమాదకరం.
- పొగమంచులో హైబీమ్ లైట్ల నుంచి వచ్చే కాంతి విచ్ఛిన్నమై చూపులో స్పష్టత లోపిస్తుంది. దీనికి 'లో బీమ్' హెడ్‌లైట్లు మాత్రమే వాడాలి. ఇదే రీతిలో ఫాగ్ లైట్లు శ్రేయస్కరం.
- ముందు.. వెనక వెళ్లే వాహనాలకు తగినంత దూరం ఉండాలి. దీనివల్ల వాహనాలు హఠాత్తుగా బ్రేక్ వేసినా, అంచనా తప్పినా దాన్ని ఢీకొనకుండా నివారించవచ్చు.
- వాహనాన్ని నడిపేటప్పుడు కిటికీ అద్దాలను కొద్దిగా దించడం వల్ల పొగమంచు ఒకే దగ్గర కేంద్రీకృతం కాకుండా విచ్ఛిన్నమవుతుంది. పొగమంచు ఎక్కువగా ఉంటే సురక్షిత ప్రదేశంలో ఆగిన తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించాలి.
- వాహనానికి ముందు, వెనుక ఉన్న కిటికీ అద్దాలను శుభ్రంగా ఉంచుకోవాలి. అవసరాన్ని బట్టి వైపర్లు, డీఫ్రాస్టర్లను వాడుతూ అద్దాలు స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి.

## భూములు చదును చేస్తున్నారని ఆందోళన

సోమందేపల్లి, న్యూస్‌టుడే: అన్ని రికార్డులు ఉన్నా, పంటలు సాగు చేస్తున్నా తమ పొలాల్లో కంపెనీ సిబ్బంది, అధికారులు సోమవారం పొక్లెయిన్‌లతో పనులు చేస్తున్నారని మండలంలోని చిన్నబాబయ్యపల్లి పేద రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు రామకృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి తదితరులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపారు. ఉప తహసీల్దార్ రెడ్డిశేఖర్‌ను కలిసి ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు, పాసుపుస్తకాలు, వన్‌బీ వంటి రికార్డులను చూపించారు. తమకు ఎలాంటి సమాచారం, తాఖీదులు అందించకుండా తుంగోడు ప్రాంత భూములను వదిలేసి యంత్రాలతో తమ భూములు చదును చేస్తున్నారని వాపోయారు.

## తెదేపా బలోపేతానికి కలిసికట్టుగా పని చేద్దాం: ఎంఎస్‌రాజు



ఎంఎస్‌రాజును సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాను తెదేపా కంచుకోటగా చేయడమే లక్ష్యంగా కలసికట్టుగా పనిచేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం సాయిసదన్‌లో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుల ఆత్మీయ పరిచయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధిష్ఠానం మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుందామన్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో తెదేపా నాయకులు, కార్యకర్తలు ఎన్నో కష్టాలు, ఇబ్బందులు పడ్డారని, అక్రమ కేసులతో జైలు కెళ్లారని, వారిని అన్నివిధాలా ప్రోత్సహిస్తూ ముందుకు నడుద్దామన్నారు. కార్యకర్తలే పార్టీకి ఇంధనమనే విషయాన్ని ఆచరణాత్మకంగా జిల్లాలో అమలుచేసి చూపించాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లాను ఆధ్యాత్మిక, పర్యాటక, పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమప్ప, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## భూసమస్యల శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్

■ పుట్టపర్తిలో ప్రారంభించిన కలెక్టర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలపై జిల్లా రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించింది. ఫిర్యాదుల్లో అత్యధికంగా వస్తున్న వీటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించడానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని కలెక్టరేట్‌లో సోమవారం రెవెన్యూ క్లినిక్‌ను ప్రారంభించారు. జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పెనుకొండ రెవెన్యూ డివిజన్ల వారీగా.. ఒక్కో డివిజన్‌కు ఐదు చొప్పున 20 కేంద్రాలు ఏర్పాటు చేయించారు. ఫిర్యాదుదారులు పెద్దఎత్తున తరలివచ్చారు. సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లను ఇక్కడికే రప్పించి ప్రతి ఫిర్యాదును పరిశీలించి, నమోదు చేయించారు. కలెక్టర్‌తోపాటు జేసీ మౌర్యభరద్వాజ్ పర్యవేక్షించారు. ప్రతినెలా నాలుగో సోమవారం కలెక్టరేట్లో ఈ కార్యక్రమం చేపడతామని, మిగతా రోజుల్లో ఆయా డివిజన్ స్థాయిలో జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో 286 అర్జీలు అందాయి.

| డివిజన్ | అర్జీలు | పరిష్కారం |
|---|---|---|
| పుట్టపర్తి | 79 | 09 |
| ధర్మవరం | 94 | 11 |
| కదిరి | 41 | 02 |
| పెనుకొండ | 72 | 21 |

రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

● ప్రజల అవగాహన కోసం 'మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్' కౌంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి ప్రతి న్యాయమైన సమస్యకు పరిష్కారం అందిస్తుందని భరోసా కల్పించారు. మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అడంగల్ సర్వీస్ ఏ విధంగా పొందాలో అర్జీదారుడికి చరవాణి ద్వారా కలెక్టర్ వివరించారు.

# అయ్యో పాపం

● కాన్పు తర్వాత బాలింత మృతి
● మృతదేహంతో వస్తుండగా ప్రమాదంలో శిశువు దుర్మరణం

**ఆ దంపతులది అన్యోన్య దాంపత్యం. వీరికి రెండేళ్ల కిందట వివాహం కాగా.. ఇల్లాలు తొలిచూరు కాన్పులో ఆడపిల్లకు జన్మనిచ్చింది. తర్వాత రెండో ప్రసవంలో మరో ఆడబిడ్డ పురుడు పోసుకుంది. ఆ ఇద్దర్నీ బాగా పెంచి మంచి బతుకునిద్దామనుకున్నారు. విధి చిన్న చూపు చూసింది.. కాన్పు సమయంలో తల్లి మృత్యుఒడికి చేరగా.. ఆమె మృతదేహాన్ని తీసుకొస్తున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో శిశువు సైతం మృత్యువాత పడటం అందర్నీ కలచివేసింది. చూసిన వారంతా అయ్యో పాపం అంటూ కన్నీరుకార్చారు.**

మృత శిశువుతో పెద్దమ్మ సల్మా

పెనుకొండ, న్యూస్‌టుడే : హిందూపురం మండలంలోని బసవనపల్లికి చెందిన నజ్మా(28)కు రెండేళ్ల కిందట బత్తలపల్లికి చెందిన కలీమ్‌తో వివాహం జరిగింది. వీరికి ఓ బాలిక సంతానం. రెండో ప్రసవం కోసం నజ్మా ఆదివారం హిందూపురం ప్రభుత్వ వైద్యశాలలో చేరింది. అదే రోజు సాధారణ ప్రసవం ద్వారా ఆడశిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తీవ్ర రక్తస్రావం, రక్తపోటు పెరగడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో బాలింతను పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. సోమవారం మహాప్రస్థానంలో బాలింత మృతదేహంతో బసవనపల్లికి వెళుతుండగా మార్గమధ్యలో పెనుకొండ వద్దకు రాగానే పొగమంచు కారణంగా అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈఘటనలో నవజాత శిశువు దుర్మరణం చెందింది. ఇదే ఘటనలో ఆశాకార్యకర్త పద్మావతి, బాలింత భర్త కలీమ్, బంధువులు సల్మా, సైపుల్లా, రిజ్వాన్, వాహన చోదకుడు శ్రీకాంత్ గాయాలపాలయ్యారు. వీరిని పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈఘటనపై పెనుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తప్పు చేస్తే తప్పించుకోలేరు

■ ఆధునిక నిఘానీడన శాంతిభద్రతల పర్యవేక్షణ
■ కొత్త ఏడాది నుంచి అందుబాటులోకి డ్రోన్లు, సీసీ కెమెరాలు

ఈనాడు, పుట్టపర్తి: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ శాంతిభద్రతల పరిరక్షణలో ఆధునిక పరికరాలను ఉపయోగించేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధమవుతోంది. బహుళ ప్రయోజనాలున్న డ్రోన్, సీసీ కెమెరాలను నూతన సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తూ సరికొత్త ఒరవడికి శ్రీకారం చుడుతోంది. మారుమూల ప్రాంతంలో సైతం చిన్న ఘటన జరిగినా వెంటనే తెలుసుకుని తగు చర్యలు చేపట్టనున్నారు.

### చీకట్లో సైతం పసిగట్టేలా..

● నైట్ విజన్ డ్రోన్లతో చీకట్లో సైతం నేరస్థుల జాడను తెలుసుకునే అవకాశం ఉంది. హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి పట్టణాలకు ఇప్పటికే వాటిని అందజేశారు. వీటి విలువ ఒక్కొక్కటి రూ.8 లక్షల వరకు ఉంటుంది. సత్యసాయి ట్రస్టు, సీఎస్ఆర్ నిధుల కింద దాతల సహకారంతో వీటిని అందుబాటులోకి తెచ్చారు. కదిరిలో ఇప్పటికే ఉంది.

● జిల్లాలోని అన్ని సర్కిల్ పరిధిలో డే డ్రోన్లు ఉన్నాయి. దాదాపు 3 కిలోమీటర్ల ఎత్తులో కిలోమీటరు పరిధిలో సంచరిస్తూ ఎక్కడ ఏం జరిగినా పసిగట్టగల సామర్థ్యం వీటికుంది. అంటే జూదం ఆడుతున్నా, గంజాయి సాగు చేస్తున్నా, ఘర్షణలకు దిగినా, జాతరలు, ఉత్సవాల సమయంలో రౌడీషీటర్లు, అనుమానితులుంటే సమాచారాన్ని చేరవేస్తాయి.

నైట్ విజన్ డ్రోన్

### సీసీ కెమెరాలతో నేరాల జాడ

జిల్లాలో 80 గ్రామాల్లో 3,678 ఆధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో కొన్ని దాతలు ఇవ్వగా ఎక్కువ భాగం ప్రభుత్వం సమకూర్చింది. వీటిని ప్రధాన కూడళ్లు, అనుమానిత ప్రాంతాలు, సమస్యాత్మక గ్రామాల్లో ఏర్పాటు చేశారు. చోరీలు, ప్రమాదాలు చేసి పారిపోయినా, వాహనాలకు నంబరు ప్లేట్లు లేకపోయినా, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించినా, హెల్మెట్ ధరించకపోయినా ఈ కెమెరాలు వెంటనే ఫొటోలు తీసి పంపిస్తాయి.

### కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ

ఈ వ్యవస్థనంతా పర్యవేక్షించడానికి ఎస్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. డ్రోన్లు, సీసీ కెమెరాల నుంచి వచ్చిన సమాచారం, ఫొటోలను పరిశీలించి అందుకనుగుణంగా తగు సూచనలు ఇచ్చేందుకు సీఐ స్థాయి అధికారిని నియమించారు.

### నేరస్థుల ఆటకట్టిస్తాం

- సతీశ్‌కుమార్, జిల్లా ఎస్పీ

జిల్లాలోని మారుమూల ప్రాంతంలో చిన్న నేరం జరిగినా వెంటనే స్పందించి నేరస్థుల ఆటకట్టించేందుకు చర్యలు చేపట్టాం. ఇందుకోసం ఆధునిక సాంకేతికను అందుబాటులోకి తెచ్చాం. కొండలు, గుట్టలు, సమస్యాత్మక ప్రాంతాలు, నేరాలు ఎక్కువ జరిగే ప్రదేశాలపై నిఘా ఉంచుతున్నాం. మ్యాట్రిక్స్ కెమెరాల కోసం కూడా ప్రతిపాదించాం. అవి వస్తే మరింత బలోపేతం అవుతాం.

## ఆన్‌లైన్ మార్కెటింగ్ మరింత చేరువ

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే : అతివలు ఉత్పత్తి చేసే ఏ తరహా ఉత్పత్తులకైనా ఆన్‌లైన్ మార్కెటింగ్ చేరువ చేస్తే విక్రయాలు పెరిగి జీవనోపాధులు మెరుగుపడతాయని సెర్ప్ జీవనోపాధుల రాష్ట్ర సంచాలకులు పద్మావతి పేర్కొన్నారు. సోమవారం శిక్షణ సాంకేతిక అభివృద్ధి కేంద్రంలో జీవనోపాధులపై అధికారులకు, ఏపీఎంలు, సీసీలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలు తయారు చేసిన వాటికి కచ్చితంగా మార్కెట్ సౌకర్యంతో పాటు ఈ కామర్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు శైలజ, అదనపు ప్రాజెక్టు డైరెక్టరు రాధారాణి, సెర్ప్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రాజశ్రీ, డీపీఎంలు గంగాధర్, రవీంద్రబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.






# పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

● ఆరునెలల్లోనే బాధితురాలికి న్యాయం

ధర్మవరం, పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన గుట్టకింద పల్లి గ్రామస్థుడు నరసింహులును దోషిగా నిర్ధారిస్తూ ఐదేళ్ల జైలుశిక్ష, రూ.6వేల జరిమానా విధిస్తూ అనంతపురం జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి చిన్నబాబు సోమవారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి ప్రభుత్వం ద్వారా రూ.75వేలు పరిహారం చెల్లించాలని ఆదేశించారు. వివరాలను శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడించారు. ధర్మవరం మండలం గొట్లూరు గ్రామ శివారులో మే 5న నాలుగేళ్ల బాలికతో నరసింహులు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ధర్మవరం గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు నరసింహులుపై పోక్సో కేసు నమోదైంది. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ, దర్యాప్తు అధికారి ఎస్సై శ్రీనివాసులు, కోర్టు మానిటరింగ్ సీఐ బొజ్జప్ప, కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ రామాంజినేయులు సమర్థంగా పనిచేశారని ఎస్పీ సతీష్‌కుమార్ కితాబు ఇచ్చారు. ఆరు నెలల వ్యవధిలోనే బాధితురాలికి న్యాయం జరిగిందని, దోషికి శిక్ష పడిందన్నారు. మైనర్లపై నేరాలకు పాల్పడే వారిపట్ల చట్టం కఠినంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.






# చూడకుండానే.. గీసేశారు

■ బృహత్తర ప్రణాళికలో లోపాలు..
■ పురం వాసులకు తప్పని ఇబ్బందులు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణాలు అభివృద్ధి చెందాలంటే టౌన్ ప్లానింగ్ విభాగం తయారు చేసే బృహత్తర ప్రణాళిక కీలకం. ఏ ప్రాంతం ఎలా ఉంది.. దేన్ని గ్రీన్ జోన్‌లో ఉంచాలి.. ఏది పారిశ్రామిక జోన్‌గా గుర్తించాలి.. ఏయే రహదారులు ఎన్ని అడుగులు ఉండాలి.. ప్రత్యామ్నాయ రహదారులు ఏవీ.. ఇలా అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలన జరిపి, అన్ని వర్గాల ప్రజలతో చర్చలు చేసి బృహత్తర ప్రణాళికను రూపొందించాలి. హిందూపురంలో మాత్రం టౌన్ ప్లానింగ్ అధికారులు ఇలాంటివేవీ పట్టించుకోలేదు. కేవలం నిబంధనల పుస్తకాన్ని ముందు పెట్టుకొని పట్టణ విస్తీర్ణంలో ఇంత శాతం గ్రీన్ జోన్, పారిశ్రామిక జోన్, ఇన్ని 80 అడుగుల రహదారులు, ఇన్ని 60 అడుగుల రహదారులు అని లెక్కలు కట్టి ప్రణాళిక రూపొందించారు. దీంతో పట్టణానికి ఎలాంటి ప్రయోజనం లేకపోగా, జనానికి ఇబ్బందులు తప్పడం లేదు.

### కాగితం మీద రహదారులు.. క్షేత్రస్థాయిలో ఇళ్లు, స్థలాలు

★ హిందూపురంలోని 35వ వార్డులో విజయనగర్‌కాలనీ నుంచి చౌడేశ్వరీ కల్యాణ మండపం వెనుక వైపున ఓ చిన్న రహదారి ఉంది. దాన్ని బృహత్తర ప్రణాళికలో కొట్నూరు గ్రామానికి కలిపేదిగా గుర్తిస్తూ 60 అడుగుల రోడ్డుగా చూపారు. రహదారిని విస్తరించాలంటే కిలోమీటరు పొడవునా భవనాలను తొలగించాల్సి ఉంటుంది. వీరంతా మున్సిపల్ అనుమతితోనే గతంలో బ్యాంకు రుణాలు తీసుకొని ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రణాళికలోని లోపాన్ని సరిదిద్దాలని ఆందోళనలు చేస్తున్నారు.

★ కొట్నూరులో సర్వే నంబరు 417, 418, 419ల్లో అనుమతి పొందిన ఓ లేఅవుట్‌లో రహదారి 40 అడుగులు ఉంది. అక్కడ ఈ రహదారి సరిపోతుంది. అయితే ప్లాన్‌లో 60 అడుగులుగా చూపారు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు అనుమతి రాక, ఇక్కడ ప్లాట్ల యజమానులు ప్లాన్‌లో మార్పు కోసం నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.

★ డి.ఆర్.కాలనీలో 80 అడుగుల రహదారిని బృహత్తర ప్రణాళికలో కనబరిచారు. క్షేత్రస్థాయిలో అక్కడ చిన్న రహదారి లేకపోగా, భారీ భవంతులు ఉన్నాయి. మరికొన్ని ఖాళీ స్థలాలు ఉన్నాయి. వారు ఇళ్లు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేస్తే ప్రణాళికలో రహదారి ఉండటంతో అనుమతులు రావడం లేదు. దీంతో లబోదిబోమంటున్నారు.

★ సడ్లపల్లి నుంచి గ్రామ చెరువులోకి వెళ్లడానికి రహదారులు ఉన్నా, సమీపంలోని బెంగళూర్ రోడ్డు నుంచి 80 అడుగుల రహదారిని ప్లాన్‌లో చూపారు. దీంతో స్థలాల యజమానులు నిర్మాణాలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### మార్పులు, చేర్పులకు చర్యలు

-మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, హిందూపురం

మాస్టర్ ప్లాన్‌లో కనబరిచిన కొన్ని రహదారులను విస్తరించడం కష్టమే. వాటి వల్ల స్థల యజమానులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేర్పులకు చర్యలు తీసుకుంటాం.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

## చట్టపరిధిలో అర్జీలకు సత్వర పరిష్కారం

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులను చట్టపరిధిలో నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులతో కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, భూ, ఆస్తి వివాదాలు తదితరాలపై 85 అర్జీలు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్లో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అంకిత సురాన, న్యాయ సలహాదారు సాయినాథరెడ్డి, ఎస్బీ సీఐ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.






(c) eenadu

# చదువుల్లో మేటి.. క్రీడల్లో సత్తా చాటి

## జాతీయ స్థాయి పోటీలకు పేదింటి విద్యార్థినులు

**కొడిగెనహళ్లి(పరిగి), న్యూస్‌టుడే:** వారంతా నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులు. చదువుతో పాటు, ఆటల్లో రాణిస్తూ క్రీడా పండితుల ప్రశంసలు అందుకుంటున్నారు. మండల పరిధిలోని ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అవంతి నెల్లూరులోని బుచ్చిరెడ్డిపాలెంలో ఈ నెల 16, 19వ తేదీల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అండర్ 14 వాలీబాల్ పోటీల్లో రాణించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది.

### అమ్మా, అక్కలను కంటికి రెప్పలా చూసుకుంటా

మా స్వగ్రామం పి.నరసాపురం పంచాయతీలోని ఎస్.బీరేపల్లి. మేము నలుగురం కుమార్తెలం. మా తండ్రి చేయూత లేకపోవడంతో తల్లి యశోధ రోజువారి కూలీ పనులకు వెళ్లి చదివిస్తోంది. ఉన్నత చదువు చదివి వ్యాయామ ఉపాధ్యాయినిగా ఉద్యోగం సాధించి తల్లిని, అక్కలను కంటికి రెప్పలా చూసుకోవాలన్నదే నా తపన. - అవంతి

### కబడ్డీ పోటీల్లో ప్రతిభ..

ప్రశంసాపత్రం అందుకుంటున్న మానస

● పరిగి కస్తూర్బాగాంధీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న మానస స్వగ్రామం మడకశిర మండలం ఉప్పార్లపల్లి. వ్యవసాయ కుటుంబ నేపథ్యం. మానస వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని తన సత్తాచాటుతోంది. పోటీల్లో లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, కబడ్డీలలో శిక్షణ తీసుకుంది. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

### పాఠశాలకు పేరుతెస్తా..

పాఠశాల ఎస్‌వో రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు అశ్విని ప్రోత్సాహంతో జిల్లా స్థాయిలో ఆరు సార్లు రాణించాను. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లోనూ ప్రతిభ చాటి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాను అక్కడా సత్తా చాటి పాఠశాలకు వన్నె తెస్తాను. - మానస

## ఆల్‌ఇండియా ట్రేడ్ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

**తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే:** అప్రెంటిస్ శిక్షణ ఇస్తున్న వివిధ రకాల సంస్థల్లో మూడేళ్ల పని అనుభవం ఉన్న అభ్యర్థులు ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్షకు ప్రైవేటుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఐటీఐ ప్రిన్సిపల్ రాయపురెడ్డి తెలిపారు. ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాలతో వివిధ ట్రేడుల్లో పరీక్ష రాయడానికి అవకాశం కల్పించినట్లు ఆయన వివరించారు. ఐటీఐకి సంబంధించిన ట్రేడుల్లో మాత్రమే ప్రైవేటుగా పరీక్షలు నిర్వహించి ఎన్‌టీసీ సర్టిఫికెట్ జారీ చేయడానికి ప్రభుత్వం అద్భుత అవకాశం కల్పించినట్లు తెలిపారు. అభ్యర్థులు పనిచేసిన కంపెనీలు, ట్రేడ్ వివరాలతో పాటు సర్వీస్ సర్టిఫికెట్‌ను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. వచ్చే నెల 28లోగా అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# క్రికెట్ తుది సంగ్రామం నేడే

## ఉత్కంఠ రేపుతున్న ఈఎస్‌ఎల్-2025 పోటీలు

**అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే:** ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సమర్పణలో ఈఎస్‌ఎల్-2025 జిల్లాస్థాయి క్రికెట్ తుది సమరానికి సర్వం సిద్ధమయ్యాయి. మంగళవారం జరిగే పోటీలకు అనంతలోని రాయలసీమ క్రికెట్ మైదానం ముస్తాబైంది. టర్ఫ్ పిచ్‌పై జరిగే సంగ్రామంలో జూనియర్, సీనియర్ విభాగంలో నాలుగు జట్లు పోటీ పడనున్నాయి. జూనియర్ విభాగంలో ఎస్ఎస్‌బీఎన్ జూనియర్ కళాశాల, అనంతపురం శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల జట్లు తలపడనున్నాయి. ఈఎస్‌ఎల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను ఎస్ఎస్‌బీఎన్ జట్టు ఐదుసార్లు సొంతం చేసుకుంది. రెండుసార్లు రన్నరప్ టైటిల్ సాధించింది. రాయలసీమ రాకర్స్‌గా మూడుసార్లు టైటిల్ నిలబెట్టుకుంది. ఎనిమిదోసారి ఫైనల్ పోరుకు సిద్ధమైంది. శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల జట్టు ప్రథమంగా ఫైనల్‌కు చేరుకుంది. ఈసారి ఛాంపియన్‌గా నిలవడానికి సిద్ధమైంది.

● డిఫెండింగ్ ఛాంపియన్లను మట్టి కరిపించిన ఎస్వీ, ఎస్ఎస్‌జీఎస్ జట్లు సీనియర్ విభాగం ఫైనల్‌కు ప్రథమంగా ప్రవేశించాయి.

హర్షిత మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ "మంచి చికిత్సకోసం అనువైన ప్రదేశం" 1వ క్రాస్, మారుతి నగర్, అనంతపురం.

### పోటీల వివరాలు

● ఉదయం 9 గంటలకు జూనియర్ విభాగం శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల × ఎస్ఎస్‌బీఎన్ జూనియర్ కళాశాల

● మధ్యాహ్నం ఒంటి గంటకు అనంతపురం ఎస్వీ డిగ్రీ కళాశాల × గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల

**వేదిక:** అనంత క్రీడా గ్రామంలోని రాయలసీమ క్రికెట్ మైదానం

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

## ఫ్లోర్‌బాల్ రాష్ట్ర జట్టులో బీఎస్‌ఆర్ విద్యార్థులు

జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో తలపడనున్న రాష్ట్ర జట్టులో తమ విద్యార్థినులు పదకొండు మంది చోటు సంపాదించినట్లు స్థానిక బీఎస్‌ఆర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జ్యోతి లక్ష్మి, పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. వారు సోమవారం ఇక్కడ మాట్లాడుతూ జనవరి 4 నుంచి 7వరకు దిల్లీలోని యువశక్తి మోడల్ పాఠశాలలో ఫ్లోర్‌బాల్ జాతీయ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయులు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్, సభ్యులు అభినందించారు.

- న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

## ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు అవసరం

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** జిల్లాలో రహదారుల భద్రతతో పాటు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ఆయన ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి జిల్లాస్థాయి రోడ్డు భద్రత సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ప్రమాద మృతి కేసులే ఉండకూడదన్నారు. బ్లాక్‌స్పాట్స్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు, మలుపుల వద్ద జంగిల్ క్లియరెన్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, ప్రమాదాల సంఖ్య తగ్గుతుందన్నారు. బ్లింకర్లు, ఫ్లాషెస్‌లు ఎక్కడెక్కడ అవసరమో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా నుంచి వెళ్లే ఎన్‌హెచ్ రహదారుల్లో లైటింగ్ పెంచాలన్నారు. వేగ నిరోధకాలు, సైన్‌బోర్డులు, సీసీ కెమెరాలు పెంచాలని సూచించారు. పాలసముద్రం క్రాస్ వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్‌హెచ్‌ల వారీగా ఎన్ని ట్రాక్‌బేలు ఉన్నాయి? సూచిక బోర్డులున్నాయా లేదా తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో గుర్తించి, తగు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రతి నెల తప్పనిసరిగా పాఠశాలల బస్సులను తనిఖీ చేయాలని, ప్రతి పెట్రోల్ బంకులో హెల్మెట్ ప్రయోజనాలను తెలిపే సూచిక బోర్డులు పెట్టాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు 518 ప్రమాదాలు జరిగాయని, 314 మంది చనిపోయారని, 580 మంది గాయపడ్డారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలను తెరపై ప్రదర్శించి వివరించారు. సమావేశంలో జిల్లా రవాణాధికారి కరుణసాగర్ రెడ్డి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ కార్యవర్గంలో పలువురికి చోటు

**ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) రాష్ట్ర, జిల్లా కార్యవర్గ కమిటీలో పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు చోటు కల్పించినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ నెల 28న మడకశిరలో యూటీఎఫ్ జిల్లా 4వ మహాసభలు జరిగాయి. ఇందులో నూతన కమిటీ సభ్యులను ఆ సంఘం నాయకులు ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణనాయక్, కార్యదర్శిగా అమర్ నారాయణ రెడ్డి ఎంపికయ్యారు. మహిళా జిల్లా కార్యదర్శిగా నాగేంద్రమ్మ, రాష్ట్ర కౌన్సిలర్‌గా మేరీ వరకుమారి, ఆడిట్ సభ్యులుగా ఆదినారాయణ, హరికృష్ణ, సీపీఎస్ కమిటీ మెంబర్‌గా రామాంజనేయులు, సాంస్కృతిక కోకన్వీనర్‌గా ఆదిశేషు, క్రీడా కమిటీ కన్వీనర్‌గా అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిటీ కన్వీనర్‌గా రామాంజనేయులు ఎన్నికైన వారిలో ఉన్నట్లు జయచంద్రారెడ్డి వెల్లడించారు. ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలని, ఆలస్యమైతే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

EENADU eClassifieds

REAL ESTATE

**అనంతపురంటౌన్‌లో** టవర్‌క్లాక్ దగ్గర కమలానగర్ నందు DCMS రోడ్లో 5 అంతస్థుల కమర్షియల్ బిల్డింగ్ అమ్మకానికి కలదు. స్థలం 10 సెంట్లు. 17,000 Sqf షెల్లార్ పార్కింగ్ కలదు. బాడుగలు నెలకు 5 లక్షలు. ✆ 9948266888

FLAT FOR SALE

**నూతన సంవత్సర** స్పెషల్ ఆఫర్ 3 BHK, 2 BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అనంతపురం నడిబొడ్డున గల మీనాక్షి అపార్ట్‌మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. సెల్: 7416560179, 9515651111.

PLOT FOR SALE

**హిందూపురంలో** వెల్‌డెవలప్ ఓపెన్ ప్లాట్స్ బెంగళూరు రోడ్‌లో, లేపాక్షి రోడ్‌లో, సేవమందిర్ రోడ్‌లో కావాలనుకునే వారు 8143917999కి కాల్ చేయ్యండి.

JOBS

**బెంగుళూరులో** పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854

**కావలెను:** M.G.B Mobiles (మహింద్రా కార్ షోరూమ్) నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేయుటకు డిగ్రీ పూర్తి చేసినవారు కావలెను. ఆటోమొబైల్ సేల్స్ నందు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకొనవచ్చును. సంప్ర: 8333929186.

**ATP టౌన్** నందు పనిచేయుటకు యువతి యువకులు అర్జెంటుగా కావలెను. Q: 10th to Degree Cell: 9703131570.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

## మహిళలను కించపరిచేలా పోస్టులు

### నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

**ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే:** సామాజిక మాధ్యమాల్లో అతివలను అవమానించేలా పోస్టులు పెట్టిన నిందితుడు నాగేంద్రను ఎస్సై మల్లికార్జునరెడ్డి అరెస్టు చేశారు. నల్లమాడ సీఐ శ్రీనివాస్ సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన కోటం నాగేంద్ర స్త్రీలను ఇష్టానుసారంగా వ్యాఖ్యానిస్తూ పోస్టులు పెట్టినట్లు ఓడీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అతడిపై నిఘా పెట్టిన పోలీసులు ఉదయం కదిరి ఆర్టీసీ బస్టాండులో అరెస్టు చేసినట్లు తెలిపారు. నాగేంద్ర స్త్రీలు, మహిళా ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతుంటాడని, గతంలోనూ శింగనమల పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదైనట్లు సీఐ వెల్లడించారు. నిందితుడిని కదిరి కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు. నల్లమాడ సర్కిల్ పరిధిలో ఎవరైనా మహిళలపై పోస్టులు పెట్టినా, అవమానకరంగా మాట్లాడినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం

మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ చిత్రంలో ఎస్పీ సతీష్ కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, జేసీ మౌర్య భరద్వాజ

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు రక్షణ, పునరావాసంతో పాటు దోషులకు శిక్ష విధించి సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు, పౌరహక్కులపై విస్తృత అవగాహన కల్పించేందుకు పర్యవేక్షణ కమిటీ సభ్యులు అంకితభావంతో పాటుపడాలన్నారు. సెప్టెంబరు 25 వరకు బాధితులకు పెండింగ్ ఉన్న పరిహారాలు అందజేశామన్నారు. ప్రతి నెలా 30న మండలంలోని ఓ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని తప్పకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 76 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనట్లు చెప్పారు. వీటిలో 2020, 2022లో రెండు కేసులు చొప్పున కోర్టు స్టేవల్ల పెండింగ్‌లో ఉన్నామని, మిగిలినవి సీసీ నంబర్లు కావాల్సి ఉందన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం చేయడానికి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు పూర్తిచేసి, నిర్దేశించిన సమయంలోపు ఛార్జ్‌షీటు దాఖలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సంరక్షణకు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ అట్రాసిటీ కేసులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతిస్తోందని, వాటి పరిష్కారానికి అధికారులు, కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. సమావేశానికి జేసీ మౌర్యభరద్వాజ్, ఆర్డీవోలు సువర్ణ, ఆనంద్, మహేష్, శర్మ, కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## దక్షిణ భారతస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపిక

ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న హెచ్ఎం తదితరులు

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండలోని కరిబసవస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత సహాయకునిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ దక్షిణ భారత స్థాయి గణిత విభాగం వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాడని హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. ఆయన ఉపాధ్యాయుల విభాగంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో అధికారులు, దక్షిణ భారతస్థాయికి 'టచ్ ఎంజాయ్ అండ్ లర్న్ మ్యాథ్స్' అంశంలో ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా సోమవారం చంద్రశేఖర్‌ను పలువురు ఘనంగా సత్కరించారు.

# సెల్‌ఫోన్ అపహరించాడని కొట్టి చంపారు

## ఎనిమిది మంది నిందితుల అరెస్ట్

నిందితులను చూపుతున్న సీఐలు

**హిందూపురం, న్యూస్‌టుడే:** సెల్‌ఫోన్ దొంగలించాడని కర్ణాటక ప్రాంతం చంద్రబావినగర్‌కు చెందిన మహిపాల్‌ను రెండు రోజుల కిందట మద్యం తాగించి కొట్టికొట్టి చంపేసిన కేసులో ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడు తెలిపారు. సోమవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టూటౌన్ సీఐ అబ్దుల్‌కరీం, గ్రామీణ సీఐ జనార్దన్, ఎస్ఐ శ్రీధర్‌లతో కలిసి సీఐ హత్యకేసు విషయాలు విలేకరులకు వివరించారు. ఈనెల 22వ తేదీ రాత్రి వాసుకుమార్ పట్టణం అంబేడ్కర్ కూడలిలోని సాయికిరణ్ బెడ్డింగ్ కేంద్రంలో పడుకొన్నాడు. 23వ తేదీ ఉదయం అతను లేచి చూసేసరికి సెల్‌ఫోన్ కనిపించకపోవటంతో విచారించారు. సెల్‌ఫోన్ ఆచూకీ తెలియకపోవటంతో 24వ తేదీన ఆ రోజు మంచం పక్కన పండుకొన్న మహిపాల్ దొంగలించాడని అదే బెడ్డింగ్ కేంద్రంలో 8 మాసాలుగా ఉంటున్న సురేశ్‌తో చెప్పి అతనితో తన ఫోను ఇప్పిస్తే మద్యం తాగిస్తానని చెప్పాడు. దీంతో సురేశ్‌కుమార్ మహిపాల్‌ను కొట్టడంతో అతను బోయపేటలో ఉందని చెప్పాడు. 25వ తేదీన సురేశ్, అదే బెడ్డింగ్ కేంద్రంలో ఉంటున్న టి.ప్రభాకర్, రవీంద్ర తన స్నేహితులు బాలాజీ, మనోహర్, శివకుమార్‌లతో కలిసి మహిపాల్‌ను కొట్టి ఆటోలో బెడ్డింగ్ కేంద్రం వద్దకు తీసుకొచ్చి తిరిగి కట్టెతో తలపై కొట్టడంతో రక్తగాయాలై చనిపోయినట్లు సీఐ వివరించారు. సంఘటనపై సమాచారం రావటంతో సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినిందితులను అరెస్ట్ చేసినట్లు వివరించారు.

### హత్యకేసు సీన్ రీకన్‌స్ట్రక్షన్

హత్యకేసు సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా సోమవారం ఉదయం పోలీసులు 8మంది నిందితులను తీసుకొని మహిపాల్ హత్యకు ముందు ఎక్కడైతే దాడిచేసి కొట్టిన ప్రాంతాల్లో నిందితులను తీసుకెళ్లి ఎలా కొట్టారో విషయాలు వారితోనే చెప్పించారు. ఈ సందర్భంగా పలుచోట్ల పోలీసులు రహదారిపై నిందితులను నడిపించుకొంటూ తీసుకెళ్లారు.

## తుది పోరుకు ఏఎస్‌ఏ, సదరన్ స్ట్రైకర్స్ జట్లు

**అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే :** ఏఎస్‌ఏ ఆహ్వాన క్రికెట్ పోటీల్లో అనంత స్పోర్ట్స్ అకాడమీ, సదరన్ స్ట్రైకర్స్ జట్టు విజయపరంపర సాగిస్తున్నాయి. సోమవారం జరిగిన సెమీఫైనల్ పోటీల్లోనూ ప్రత్యర్థులను చిత్తుచేసి ఫైనల్‌కు చేరాయి. అనంత క్రీడాగ్రామంలో జరిగిన తొలి సెమీస్‌లో సదరన్ జట్టు విజయవాడ జట్టుపై 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లకు 144 పరుగులు చేసింది. ఇంచార (28), వైదేహీ యాదవ్ (22) బ్యాటింగ్‌లో రాణించారు. తర్వాత బ్యాటింగ్ చేసిన సదరన్ జట్టు 6 వికెట్లకు 148 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. కొడాలి గీతిక (33), యషాదితి (33) రాణించి జట్టును గెలిపించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు యసాదితికి ప్రదానం చేశారు. మరో సెమీస్‌లో ఏఎస్‌ఏ జట్టు చిత్తూరు జట్టుపై 8 వికెట్ల తేడాతో సునాయసంగా నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 20 ఓవర్లలో 3 వికెట్లకు 101 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఏఎస్‌ఏ జట్టు 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. అర్షియా (54) అర్ధశతకంతో అలరించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకుంది. మూడోస్థానం కోసం నిర్వహించిన వర్గీకరణ పోటీలో విజయవాడ జట్టు చిత్తూరు జట్టుపై 9 వికెట్ల తేడాతో అవలీలగా గెలిచింది. ఇంచారా (71) అద్వితీయమైన బ్యాటింగ్‌తో అలరించి జట్టును గెలిపించింది. మూడోస్థానం సాధించిన విజయవాడ జట్టుకు ట్రోఫీని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ.యుగంధర్‌రెడ్డి, మాజీ రంజీ క్రికెటర్ షాబుద్దీన్, సీనియర్ అంపైర్ మహేష్, ఆర్డీటీ గ్రాస్‌రూట్ మేనేజరు వంశీకృష్ణల చేతుల మీదుగా అందజేశారు. ఫైనల్ పోటీ మంగళవారం జరుగనుంది.

## రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవోగా హఫీజ్‌బాషా

**జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే :** జేఎన్‌టీయూలోని రతన్‌టాటా ఇన్నోవేషన్‌హబ్ నూతన సీఈవోగా హఫీజ్‌బాష నియమితులయ్యారు. ఆయన సోమవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జనవరి 5 నుంచి ఆయన అధికారిక బాధ్యతలు స్వీకరించనున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పండ్లతోటలు, సూక్ష్మనీటి పారుదల, పునరుత్పాదకశక్తి ఆధారిత స్టార్టప్‌లపై దృష్టి సారించాలన్నారు. రైతుల ఆదాయం పెంపు, నీటి వినియోగసామర్థ్యం మెరుగుదల, శాశ్వత అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

## నైపుణ్య పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

నగదు చెక్కు అందుకుంటున్న రొద్దం విద్యార్థులు

**బుక్కపట్నం, న్యూస్‌టుడే:** రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా విద్యార్థులు రెండు విభాగాల్లో సత్తాచాటినట్లు ఏపీసీ దేవరాజ్ తెలిపారు. విజయవాడలో సోమవారం రాష్ట్రస్థాయి నైపుణ్యాల పోటీలు జరిగాయి. రొద్దం ఉన్నత పాఠశాల విద్యార్థులు అగ్రికల్చర్ అండ్ ట్రేడ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రూ.25వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. కదిరి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు 'బ్యూటీ అండ్ వెల్‌నెస్' విభాగంలో రెండో స్థానంలో నిలిచి రూ.15వేల నగదు, ప్రశంసాపత్రం స్వీకరించారు. విజేతలను ఏపీసీ దేవరాజ్, ఏజీసీడీఓ అనిత అభినందించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ది ఆంధ్రప్రదేశ్ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ మరియు కల్చరల్ సొసైటి
ప్లాట్ నెం.56, డోర్ నెం.54-16-1/18సి, రోడ్ నెం.2, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, లయోలా కాలేజ్ రోడ్, విజయవాడ -520008
టెండరు ప్రకటన
టెండరు ప్రకటన నెం.406/ ఎ.పి. శిల్పారామం/ పార్కింగ్ టెండర్/ ఎటిపి / 2025, ది.29-12-2025
శిల్పారామం, అనంతపురము వద్ద లీజు ప్రాతిపదికన "పార్కింగ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్" ఆపరేషన్ మరియు నిర్వహణ కోసం సమర్థులైన మరియు అర్హత కలిగిన ఏజన్సీల నుండి టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. పైన పేర్కొన్న టెండరు పత్రాన్ని AP SACCS website:https://shilparamam.ap.gov.in.నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండరు ధరఖాస్తును విజయవాడ శిల్పారామంలోని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కార్యాలయం నుండి రూ.5,000/- ధరఖాస్తు ధర ఏదైన షెడ్యూలు వాణిజ్య బ్యాంక్ నుండి "Chief Executive Officer, the APSACCS" పేరు మీద పొందిన డి.డి. విజయవాడలో చెల్లుబాటు అగునట్లు చెల్లించి పొందవచ్చును. టెండరు షెడ్యూల్ జారీ తేది.30.12.2025. టెండర్లు సమర్పించడానికి చివరి తేది.08.01.2026 మధ్యాహ్నం 3 గంటలు. మరిన్ని వివరాలకు విజయవాడలోని పరిపాలన అధికారి మొబైల్ నెంబరు: 88866 52023 ను సంప్రదించగలరు. సం/- ముఖ్య కార్యనిర్వహణ అధికారి

## బీటెక్ విద్యార్థి బలవన్మరణం

చరణ్

**కంబదూరు:** చదువుపై ఇష్టం లేక.. తల్లిదండ్రులకు ఎదురు చెప్పలేక.. మనస్తాపానికి గురై ఓ విద్యార్థి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చేటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల వివరాల మేరకు.. కంబదూరు మండలంలోని గూళ్యం గ్రామానికి చెందిన కమ్మ గోవిందు-సునీత దంపతులు ఏకైక కుమారుడు చరణ్(19) అనంతపురంలోని ఓ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల గ్రామంలో సుబ్రహ్మణేశ్వరస్వామి వేడుక సందర్భంగా ఇంటిల్లిపాదితో కలసి సంతోషంగా గడిపారు. చదువుపై ఇష్టం లేని చరణ్ సోమవారం కళాశాలకు వెళ్లకుండా.. ఉదయాన్నే టమాటా పంటకు నీరు పెట్టొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి అక్కడ చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని విగత జీవిగా ఉన్న కుమారుడిని చూసి విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై లోకేశ్ తెలిపారు.

## బావిలోపడి విద్యార్థి విషాదాంతం



చరణ్

**కొత్తచెరువు, న్యూస్‌టుడే:** మండలంలోని తలమర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్ (15) ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందాడు. పోలీసులు, ఉపాధ్యాయులు తెలిపిన మేరకు వివరాలు. . మీర్జాపురం గ్రామానికి చెందిన హనుమంతు, సాయిలీల దంపతుల కుమారుడు చరణ్ పదోతరగతి చదువుతున్నాడు. ప్రత్యేక తరగతులకు హాజరుకావడానికి సోమవారం ఉదయం 6.30 గంటలకే తలమర్ల పాఠశాలకు చేరుకున్నాడు. అప్పటికి తోటి విద్యార్థులు ఎవరూ రాకపోవడంతో పుస్తకాల సంచిని బడిలో ఉంచి బహిర్భూమికి వెళ్లాడు. అక్కడున్న వ్యవసాయ బావిలో దిగి జారిపడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. ఉపాధ్యాయులు హాజరు తీసుకునేటప్పుడు చరణ్ లేకపోవడంతో గైర్హాజరైనట్లు రిజిష్టర్‌లో నమోదు చేశారు. తోటి విద్యార్థులు చరణ్ పుస్తకాల సంచిని గమనించి ఉపాధ్యాయులకు తెలిపారు. వెంటనే వారు చరణ్ తండ్రికి ఫోన్‌చేసి ఆరా తీయగా, ఉదయమే పాఠశాలకు వెళ్లినట్లు చెప్పారు. కొద్ది సేపటికి కుటుంబ సభ్యులు పాఠశాలకు వచ్చారు. పరిసరాల్లో గాలించారు. వ్యవసాయ బావిలో చెప్పులు తేలుతుండటం గమనించారు. బావిలో పడిపోయి ఉంటాడని అనుమానించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సాయంతో ట్రాక్టర్లు, డీజిల్ ఇంజిన్లు ఏర్పాటుచేసి బావిలో నీటిని తోడారు. రాత్రి 7 గంటలకు విద్యార్థి మృతదేహం బయటపడింది. కొడుకు మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. విద్యార్థి ఆచూకీని కనుగొనడంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించారంటూ కుటుంబసభ్యులు ఆరోపణలకు దిగడంతో పోలీసులు, స్థానికులు సర్దిచెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని సీఐ మారుతి శంకర్ తెలిపారు.

## ఆటో బోల్తా.. వివాహిత దుర్మరణం

### మరో ఇద్దరికి గాయాలు

శశికళ

**సోమందేపల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని చాలకూరు వద్ద ర.భ రహదారిపై సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనం, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడి వివాహిత శశికళ(28) మృతి చెందారు. తాగునీటి కోసం వెళ్లి తీసుకొస్తుండగా ఈ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలిలా.. చాలకూరు గ్రామం అంబేడ్కర్ నగర్‌కు చెందిన శశికళ, మహేశ్‌లు భార్యాభర్తలు. వీరికి మూడేళ్ల చిన్నారి జెస్సీ ఉంది. ఆదివారం ఉదయం నుంచి చాలకూరులో విద్యుత్తు సరఫరా లేక ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈనేపథ్యంలో నీటికోసం తమ ఆటోలో భార్య శశికళతో కలిసి మహేశ్ గుడ్డంనాగేపల్లికి వెళ్లారు. బిందెల్లో నీరు పట్టుకొని తిరిగి వస్తుండగా చాలకూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద రహదారిపై ఆటో-ద్విచక్ర వాహనం బలంగా ఢీకొన్నాయి. శశికళ తీవ్రంగా గాయపడగా, ఆటో, ద్విచక్ర వాహనాల చోదకులు మహేశ్, వెలుగు సీసీ రంగేపల్లి నరసన్న గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను వెంటనే హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా శశికళ మృతి చెందింది. ఇరువురు చికిత్సలు పొందుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

## కారు ప్రమాదంలో భార్య మృతి

### భర్త, పిల్లలకు గాయాలు

**గోరంట్ల, న్యూస్‌టుడే:** గోరంట్ల మండల పరిధిలోని తమ్మినాయనపల్లి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన కారు బోల్తా ప్రమాదంలో భార్య అనిలా(35) అక్కడికక్కడే మృతిచెందింది. భర్త, రాజేంద్ర, కుమారుడు, కుమార్తె గాయాలతో బయటపడ్డారు. వివరాలిలా.. రాజేంద్ర, భార్య, ఇద్దరు పిల్లలతో సొంత డ్రైవింగ్‌తో కారులో అనంతపురం నుంచి బెంగళూరు వెళ్తున్నారు. మార్గమధ్యలో కారు అదుపుతప్పి ఎడమవైపున ఉన్న సిమెంటు దిమ్మెలను ఢీ కొట్టి పల్టీలు వేసి ప్రమాదానికి గురైంది. జాతీయ రహదారిపై వెళుతున్న మరో వాహనం వారు క్షతగాత్రులు ముగ్గురిని బాగేపల్లికి తీసుకెళ్లారు. ఏఎస్సై షెక్షావలి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

(c) eenadu

హిందూపురం
•హిందూపురం •పెనుకొండ •మడకశిర

## పాఠశాలకు కంప్యూటర్, సామగ్రి వితరణ

సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే కార్యదర్శి, ఐడీబీఐ బ్యాంకు అధికారులు

**హిందూపురం:** ముద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హిందూపురం ఐడీబీఐ బ్యాంకు శాఖ కంప్యూటర్, బీరువా, టేబుల్స్ ఇతర సామగ్రి అందించారు. ఈ సామగ్రిని సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యదర్శి బాలాజీ, 37వ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి, బ్యాంక్ మేనేజర్ మహేశ్ లు పాఠశాల హెచ్ఎం సుధారాణికి అందించారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, పాఠశాల పూర్వ విద్యార్థులు ఎం. బాబావృద్ధిన్, శ్రీనివాస్‌రెడ్డి, రంగనాయకులు, మల్లికార్జున, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యువమోర్చా అధ్యక్షుడికి సత్కారం

**పెనుకొండ:** భాజపా యువమోర్చా జిల్లా నూతన అధ్యక్షుడు బిల్లు కుళ్లాయప్పను సోమవారం పెనుకొండలో ఆపార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో యువసైన్యం బలోపేతం చేయడానికి సీనియర్లు సహకరించాలని కోరారు. నాయకులు రామకృష్ణ, రామాంజినేయులు, రవి, హనుమంతురాయుడ్, వేదవ్యాస్, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడు బిల్లుకుళ్లాయప్పను సత్కరిస్తున్న పార్టీశ్రేణులు

## మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

**సమస్య:** పీఎస్‌పోర్టు కూడలి వద్ద అపరిశుభ్రత నెలకొంది. **-నాగరాజు**
**సమాధానం:** హరితరాయబారుతో తొలగిస్తాం. **-అమరీశ్, పంచాయతీ కార్యదర్శి**
**సమస్య:** కొండల్లు బీసీ కాలనీలో పశువుల నీటి తొట్టిలో నీరు నింపడం లేదు. **-హనుమంతరాయప్ప**
**సమాధానం:** నీరు నింపి పశువుల దాహం తీర్చుతాం. **-కవితమ్మ, సర్పంచి, కొండల్లు**

## సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

**గుడిబండ:** మండలంలో నెలకొన్న సమస్యలను ఈనాడులో మేమున్నాం.. మీకుతోడుగా శీర్షిక ప్రచురించగా బాధ్యులు స్పందించారు. కొంకల్లు ఎస్సీ కాలనీలో వీధుల్లోని చెత్తాచెదారాన్ని సర్పంచి కవిత, శంకరగల్లు ఎస్సీ కాలనీలో సర్పంచి జయమ్మ హరితరాయబారుతో ముడుగును తొలగింపజేశారు. గుడిబండ ఇందిరమ్మ కాలనీలో సర్పంచి కరుణాకర్‌గౌడ్, కేఎన్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో సర్పంచి లక్ష్మీదేవమ్మ, నాచేపల్లి బీసీ కాలనీలో సర్పంచి తిప్పేస్వామి, ముతుకూరు తండాలో పంచాయతీ కార్యదర్శి అమరీశ్, కల్లురొప్పం బీసీ కాలనీలో సర్పంచి లక్ష్మీనారాయణ వీధిదీపాలు ఏర్పాటు చేయించారు. మద్దనకుంట రక్షిత నీటి పథకం బోరును పంచాయతీ కార్యదర్శి అమరీశ్ మరమ్మతు చేయించారు. దాసర్లపల్లి ఇందిరమ్మ కాలనీలో పంచాయతీ కార్యదర్శి కలందరశేఖర్ తాగునీటి సమస్య పరిష్కరించారు. దీంతో ఈనాడుకు స్పందించిన బాధ్యులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**మడకశిర గ్రామీణం:** విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని న్యాయవాది ఉమేశ్‌చంద్ర పేర్కొన్నారు. సోమవారం బీసీ బాలికల వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. వార్డెన్ సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మాజీ మంత్రి ఉష, నాయకులు, కార్యకర్తలు

## కొత్తపల్లి చెరువులో మట్టి తరలింపు ఆపాలి

**సోమందేపల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని కొత్తపల్లి చెరువులో యథేచ్ఛగా చేపడుతున్న అక్రమ మట్టి తరలింపును వెంటనే ఆపాలని మాజీ మంత్రి ఉష, నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా మట్టిని పొక్లెయిన్‌తో తవ్వి తరలించడం వలన భారీ గుంతల మయమైందని సోమవారం మండల పార్టీ శ్రేణులతో కలిసి ఆమె స్థానిక చెరువులో కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని కొద్దిసేపు ధర్నా చేసి తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

# జూడోలో పసిడి కాంతులు

## జోనల్ పోటీల్లో 5 బంగారు పతకాలతో కేజీబీవీ విద్యార్థినులు

**హిందూపురం, న్యూస్‌టుడే:** హిందూపురం పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో రెండు రోజులు జరిగిన జోనల్‌స్థాయి జూడో ఛాంపియన్‌షిప్ 2025-26 పోటీల్లో స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ విద్యార్థినులు ఐదుగురు బంగారు పతకాలు, ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకొని ఆదర్శంగా నిలిచారు. జూడో ప్రతి విద్యార్థినికి నేర్చుకోవాలని ఇది బాలికలకు ఆత్మరక్షణ, శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుందని, అందుకే ఈ క్రీడపట్ల తమ ఆసక్తి కనబరిచినట్లు క్రీడాకారులు తెలిపారు. దీనికి తల్లిదండ్రులు, విద్యాలయ ప్రత్యేక అధికారిణి, కోచ్, పీఈటీ సహకారం ఎనలేనిదని, వారి ప్రోత్సాహమే జోనల్ పోటీల్లో బంగారు పతకాలు సాధించేందుకు అవకాశం కలిగించిందన్నారు. విద్యార్థినులు ఏమంటున్నారో వారి మాటల్లోనే..

### ప్రతిరోజు ప్రత్యేక శిక్షణ

ప్రతి విద్యార్థినికి కరాటే లాగే జూడో అవసరం. అందువలన విద్యార్థినులు ఈ ఆటల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం జోనల్ స్థాయిలో సత్తా చాటిన జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తారనే విశ్వాసం ఉంది. అందువలన వారికి ప్రతి రోజూ ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాం. **-మాధవి, ప్రత్యేక అధికారిణి, కేజీబీవీ విద్యాలయం**

### ఉదయం, సాయంత్రం సాధన

జూడోలో ప్రత్యేక గుర్తింపు పొందాలని ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కోచ్ వద్ద శిక్షణ పొందుతున్నాం. గతంలో చదివిన పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించలేదని, ఇక్కడికి వచ్చిన నాలుగేళ్ల నుంచి రోజూ గంట శిక్షణ తీసుకొంటున్నాం. అందువలన ఎక్కడికి వెళ్లినా సులువుగా పతకాలు సాధిస్తున్నాం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఉంది. **-గౌతమి, భావన**

### ఇతరులకు సాయపడొచ్చు

జూడో నేర్చుకొంటే తనను తాను రక్షించుకొంటూ ఆపదలో ఉన్న వారిని రక్షించవచ్చు. 6వ తరగతి నుంచి మేము శిక్షణ పొందుతూ నేడు పోటీల్లో పాల్గొన్న ప్రతి చోట రాణిస్తున్నాం. జూడో క్రీడాకారులకు ప్రభుత్వం సహకారం అందించి ప్రతి పాఠశాలలో దీనిని అందుబాటులోకి తీసుకొస్తే బాలికలకు ఎంతో ఉపయోగపడుతోంది. **-జాహ్నవి, నిహారిక**

### తల్లి ప్రోత్సాహంతోనే..

మా అమ్మ ప్రోత్సాహంతోనే జూడో పట్ల ఆసక్తి చూపాను. ఆమె పోలీస్ ఉద్యోగానికి ఎంపికై వెనక్కి వచ్చింది. ప్రస్తుతం ఆ స్థానంలో నన్ను చూడాలని ఆశిస్తోంది. ఆమె కల నెరవేర్చడం నా బాధ్యత. అటు చదువు, ఇటు ఆటలో రాణిస్తూ భవిష్యత్తులో పోలీసు శాఖలో ఉన్నత ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను. **- సానియా, 10వ తరగతి**

## పారిశ్రామిక వాడలో కాలుష్య పరీక్షలు

కాలుష్య పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న న్యాయ సేవా సమితి సభ్యులు, తదితరులు

**హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణ సమీపంలోని తూముకుంట పారిశ్రామిక వాడలో పలు పరిశ్రమలు భారీగా కాలుష్యాన్ని వెదజల్లుతుండటంతో ఆ ప్రాంతంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి అండగా నిలిచేందుకు, కాలుష్య కోరలు నుంచి కాపాడేందుకు హిందూపురం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో పని చేసే జాగృతి విభాగం తరపున న్యాయవాది నవీన రెహమాన్ తదితరులు సాగిస్తున్న ప్రయత్నాలు ఫలించాయి. పారిశ్రామిక వాడలో గాలి కాలుష్యాన్ని అంచనా వేయడానికి కాలుష్య నియంత్రణ అధికారులు కాలుష్య పరీక్ష నిర్వహణను సోమవారం నిర్వహించారు. రెస్పిరబుల్ డస్ట్ సాంప్లర్ పరికరంతో పరీక్షలు చేపట్టారు. వాటిని ప్రయోగశాలకు పంపి, గాలి నాణ్యత అంచనా వేస్తామని తెలిపారు. కాలుష్యానికి కారణమయ్యే పరిశ్రమలపై చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. న్యాయవాదితో పాటు సామాజిక సేవా కార్యకర్తలు మహమ్మద్ బిలాల్, చంద్రమోహన్, గణేశ్, సురేశ్, తూముకుంట గ్రామ మాజీ సర్పంచి నరసింహ మూర్తి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత రక్తదానంలో ముందుండాలి

**పెనుకొండ, న్యూస్‌టుడే:** అత్యవసర సమయంలో ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడంలో ఎల్లవేళలా యువత ముందుండాలని స్థానిక పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జయప్ప అన్నారు. సోమవారం ఎన్ఎస్ఎస్, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో …

రక్తదానం చేస్తున్న విద్యార్థినితో ప్రిన్సిపల్, సిబ్బంది

హిందూపురం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి లక్ష్మీప్రసాద్‌రెడ్డి రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించారు. రక్తదానం చేసిన 28మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌రిబ్బన్‌క్లబ్ అధ్యక్షుడు హరీశ్‌బాబు, ఆత్మీయ రక్తదాతల వ్యవస్థాపకుడు ప్రతాప్, కళాశాల బోధనా సిబ్బంది, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థుల సత్తా

పీకేఎస్ఆర్‌లో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో..

**హిందూపురం, న్యూస్‌టుడే:** పట్టణంలోని పీకేఎస్ఆర్, ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'వర్తమాన అంశాలు, జనరల్ నాలెడ్జి' అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పీకేఎస్ఆర్‌లో 8వ తరగతి చదువుతున్న బి.సుశాంత్‌కుమార్ ప్రథమ, ఆర్.హేమంత్‌సింగ్ ద్వితీయ, 9వ తరగతి చదువుతున్న ఎన్.చరణ్ తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు కె.పెన్నోబలం, ఉపాధ్యాయులు సిద్దగిరి శ్రీనివాసులు, బాలకృష్ణ, సువర్చల, కిష్టప్ప, రమేశ్‌రెడ్డి, హరిత, నరేశ్, సతీశ్, భాగ్యలక్ష్మి బహుమతులు అందజేశారు.

● ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎం.గౌతమి ప్రథమ, 7వ తరగతికి చెందిన ఎస్.రుకయాఅఫ్రీన్ ద్వితీయ, 8వ తరగతి చదువుతున్న ఎస్.మధుసూదన్ తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగనాయకులు, ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, జగదీశ్, ఉషారాణి బహుమతులు అందజేశారు.

ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విజేతలతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు రామదాసు తదితరులు

**మడకశిర గ్రామీణం:** మండలంలోని హరేసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 7వ తరగతి ఎస్.ఎల్. నందిని ప్రథమ, 9వ తరగతి ఎస్.గగన ద్వితీయ, 7వ తరగతి ఎం.శ్రేయ తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రధానోపాధ్యాయులు రామాంజినేయులు, ఉపాధ్యాయులు వెంకటేశ్, దత్తాత్రేయ చేతుల మీదుగా విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు.

సిద్ధార్థ పాఠశాలలో విజేతలతో..

**మడకశిర:** పట్టణంలోని సిద్ధార్థ ఆంగ్ల పాఠశాలలో నిర్వహించిన పోటీలో 9వ తరగతి విద్యార్థిని గీతిక ప్రథమ, 7వ తరగతి హేమ్‌చరణ్ ద్వితీయ, 8వ తరగతి బాలాజీ తృతయ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు గోవిందరాజులు బహుమతులు ప్రదానం చేశారు.

# ప్రత్యేక నిధులతో మున్సిపాలిటీ అభివృద్ధి

**మడకశిర, న్యూస్‌టుడే :** మడకశిర నగర పంచాయతీకి పత్యేక అభివృద్ధి నిధుల ద్వారా రూ. 2కోట్లు మంజూరు చేస్తున్నారని 20వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఎం. ఎస్. రాజు తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ ఛైర్మన్ నరసింహరాజా అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే హాజరై వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రత్యేక నిధులతో పాత విద్యుత్తు స్తంభాల మార్పు, సీసీదారులు, డ్రైనేజీలు, అవసరం ఉన్నచోట విద్యుత్తు సరఫరాకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం 15, 11వ వార్డులు మారుతీనగర్, మాళేరొప్పం, యాదవకాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి వెనుక, టైలర్స్ కాలనీల్లో సీసీదారుల నిర్మాణానికి సంబంధించి పనులు కోసం టెండర్లు పిలవాలని అధికారులకు ఆదేశించారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, ఏఈ మురళీధర్, వైఎస్ ఛైర్మన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

# చెడు వ్యసనం.. కుటుంబం నాశనం

**గోరంట్ల, న్యూస్‌టుడే:** ఒకచిన్న చెడు ఆలోచన కుటుంబాన్ని నాశనం చేస్తుందని, తప్పుచేసేముందు క్షణం ఆలోచించాలని పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ మహల్‌లో సోమవారం ఏర్పాటుచేసిన మత్తు పదార్థం వినియోగంతో ఎదురయ్యే సమస్యలు వాటి బారినపడకుండా ఎలా నడచుకోవాలన్న విషయాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొన్నారు. మొదట విద్యార్థులు బస్టాండు నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తు నిర్దేశించుకోవాల్సిన వయసులో యువత పెడదారి పడితే జీవితం అంధకారం అవుతుందన్నారు. ఒకసారి పొగతాగడం, మద్యం, గంజాయి తీసుకోవడం అటవాటుపడితే, చివరకు బానిసలుగా మారి ఆరోగ్యం పూర్తిగా పాడుచేసుకోవాలన్నారు. జైలువరకు వెళ్లొస్తే మళ్లీ పరిస్థితిని చక్కదిద్దుకోవడం చాల కష్టంగా ఉంటుందన్నారు. క్రియేటర్ కృష్ణ ఉదాహరణలతో చక్కని సందేశాన్ని వినిపించారు. ఈగల్ టీం ఎస్సై హరి, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బలరాంగుప్తా, ప్రిన్సిపాల్ భకవత్సలం, చిలమత్తూరు ఎంఈవో, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప

## వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన

**మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే:** గౌడనహళ్లి పంచాయతీలో కూటమి ప్రభుత్వం అందించే వాట్సప్ గవర్నెన్స్‌పై సోమవారం సచివాలయ అధికారి గజేంద్ర, క్లస్టర్ కన్వీనర్ మురళీబాబు ప్రజలకు అవగాహన కల్పించారు. 33 శాఖలకు సంబంధించి వెయ్యికి పైగా సేవలను వాట్సప్ ద్వారానే ఎలా పొందవచ్చనే విషయాలను వివరించి ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎన్‌సీసీ క్యాడెట్లకు అల్పాహారం

**సోమందేపల్లి :** స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం ఎన్‌సీసీ క్యాడెట్లకు పరందామ హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. పలు గ్రామాల నుంచి విద్యార్థులైన ఎన్‌సీసీ క్యాడెట్లు అల్పాహారం చేయకుండా ఉదయం డ్రిల్ నిర్వహించారు. విషయం తెలుసుకొన్న ట్రస్ట్ అధ్యక్షుడు నిమ్మకాయల పరందామ, అతని మిత్రులతో కలిసి వారికి అల్పాహారం వడ్డించారు. ఎన్‌సీసీ రికార్డుల భద్రత కోసం ఆయన రూ.10 వేల విలువగల బీరువాను అందజేశారు. ఎన్‌సీసీ అధికారి/ పీఈటీ రమేశ్, మిత్రులు నవీన్, గణేశ్, సంతోశ్ పాల్గొన్నారు.

## కాలువల్లో పేరుకుపోయిన చెత్త

రొద్దం లోని కెనరా బ్యాంకు వీధిలో కాలువ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, వెళ్లే ఈ మార్గంలో రోజూ పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి గోవిందప్పను వివరణ కోరగా పరిశీలించి శుభ్రతకు చర్యలు చేపడతామన్నారు. **-న్యూస్‌టుడే, రొద్దం**

## కూలితే ప్రమాదమే..!

హేమావతి ఆలయ అతిథి గృహం ఆవరణలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు పిల్లర్లు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. ఏడాది కాలంగా ట్యాంకుకు నీరు నింపడం లేదు. ఇదే ఆవరణలో గ్రామ సచివాలయం నడుపుతున్నారు. ట్యాంకు ఒరిగి పోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనునాయక్‌ను వివరణ కోరగా ట్యాంకును కూల్చి ప్రమాదం జరగకుండా చూస్తామన్నారు. **-న్యూస్‌టుడే, అమరాపురం**

## కల్వర్టుకు మరమ్మతు చేపట్టండి

హెచ్‌ఆర్‌హట్టి, గుడిబండ మధ్య ఉన్న రోడ్డులో కల్వర్టు దెబ్బతినిందని ప్రయాణికులు, ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, ప్రత్యామ్నాయ మార్గం కూడా లేదన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ డా. కేశవరెడ్డి మాట్లాడుతూ ఇంజినీరు ద్వారా ప్రతిపాదనలు తయారు చేయించి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

## దారంతా మురుగే!

మడకశిర పట్టణంలోని పలు వార్డుల్లో మురుగునీటితో ప్రజలు సావాసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాయినగర్‌లో కాలువల్లో చెత్తపేరుకుపోవడంతో మురుగు రోడ్డెక్కి పారుతోంది. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. దుర్వాసన వెదజల్లుతూ, దోమలు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే శుభ్రం చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, మడకశిర**

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
గోరంట్ల బ్రాంచ్, శ్రీ సత్యసాయి జిల్లా.

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా **"స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా"** ఈ క్రింది బ్రాంచీలో **"బంగారు నగలు"** తాకట్టుపెట్టి అప్పు తీసుకొన్న ఈ దిగువ తెలిపిన ఖాతాదారుడు గడువు మీరిననూ, పలుమార్లు కోరిననూ, అప్పు తిరిగి చెల్లించనందులకు రిజర్వు బ్యాంకు వారి నిబంధనల ప్రకారం దిగువ కనబరచిన షెడ్యూలు ప్రకారం **31-12-2025వ తేది బుధవారం సా॥ 5.00 గం॥లకు బ్రాంచ్ ఆవరణం నందు బహిరంగ వేలము వేయబడును.**

| క్ర. సం. | ఖాతాదారుని పేరు, చిరునామా | అకౌంట్ నెంబర్ | అప్పు మొత్తం (సుమారుగా) రూ॥ |
|---|---|---|---|
| | గోరంట్ల బ్రాంచి, శ్రీ సత్యసాయి జిల్లా. మొబైల్ నెం: 7259215109 | | |
| 1 | కె.సతీష్‌నాయక్, తండ్రి: కె.శంకర్‌నాయక్, డోర్ నెం. 3, కరావులపల్లి తాండా, మందలపల్లి, గోరంట్ల. | 41943932935 | 1,57,000/- |

**వేలం షరతులు:** 1) వేలం నందు పాల్గొనదలచినవారు రూ॥ 10,000/- ధరావత్తు కట్టి వేలములో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తమును అదే రోజు నగదును చెల్లించి నగలను పొందవలెను. 3) ఈ ఖాతాదారుడు మరణించిన యెడల అతని వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 4) అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవచ్చును. 5) వేలం ద్వారా వచ్చిన సొమ్ము బాకీ మొత్తమునకు సరిపోనియెడల చట్టరీత్యా చర్యలు తీసుకొని మిగిలిన బాకీ మొత్తము రాబట్టుకొనబడును. 6) వేలం పాటలో పాల్గొనదలచినవారు ఏదైనా ఫోటో గుర్తింపు కార్డుతో రావలెను. 7) ఇందలి ఖాతాదారునకు ఏ ఇతర రుణములు ఉన్నచో మిగిలిన సొమ్ము ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును. 8) ఈ ప్రకటనకు అయ్యే ఖర్చు పైన తెలిపిన ఖాతాదారుని నుంచి వసూలు చేయబడును. 9) నగల బరువునకు, నాణ్యతకు బ్యాంకువారికి పూచీలేదు.
గమనిక: ఏ విధమైన కారణం చూపకుండానే షరతులు మార్చుకొనుటకుగానీ, వేలం వాయిదా వేయుటకుగానీ, వేలం రద్దు చేయుటకు గానీ ఆయా బ్యాంకు మేనేజర్ల గారికి పూర్తి అధికారము కలదు.

తేది: 29-12-2025 సం/- మేనేజర్
స్థలం: గోరంట్ల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోరంట్ల


# ముక్కోటి ఏకాదశికి ఆలయాల ముస్తాబు

## ఉత్తరద్వారంలో భక్తుల దర్శనానికి ఏర్పాట్లు సిద్ధం

**హిందూపురం గ్రామీణం, సాంస్కృతికం, న్యూస్‌టుడే:** హిందూపురం పట్టణ, గ్రామీణం, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని వివిధ ఆలయాల్లో మంగళవారం ముక్కోటి ఏకాదశి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్తరద్వారంలో భక్తులు దేవదేవుడిని దర్శించుకునేందుకు నిర్వాహకులు, సేవాకర్తలు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

పేట వెంకటరమణస్వామిని భక్తులు దర్శించుకోవడానికి ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటుచేసిన సప్తద్వారములు

### ఎక్కడెక్కడ దర్శనం ఉందంటే..

● హిందూపురం పట్టణంలోని ప్రధానరోడ్డులో ఉన్న శ్రీపేటవేంకటరమణస్వామి, శ్రీవిద్యానగర్, లక్ష్మీపురం, దండురోడ్డులో, మున్సిపల్ కార్యాలయం రోడ్డులో, బాలాజీ థియేటర్ రోడ్డులోని వెంకటేశ్వర, శ్రీనివాస ఆలయాల్లో, చిన్నమార్కెట్టులో శ్రీవేణుగోపాలస్వామి, సత్యనారాయణ పేటలో శ్రీసత్యనారాయస్వామి, ముద్దిరెడ్డిపల్లి పాతూరులోని శ్రీరుక్మిణీపాండురంగ స్వామి, గుడ్డంలోని శ్రీరంగనాథస్వామి ఆలయాల్లో వైకుంఠ ద్వారం ద్వారా భక్తులు దర్శనాలు చేసుకోవచ్చు.

● గ్రామీణంలోని లేపాక్షిలో వెలసిన తిరుమలదేవర, సి.కొడిగేపల్లి వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర, గుడ్డంపల్లి, చలివెందల గ్రామాల్లోని భూనీల, గవి రంగనాథస్వామి, తూముకుంట చెక్‌పోస్టులోని లక్ష్మీవెంకటేశ్వర, బారెడ్డిపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి విశేషపూజలు చేస్తారు.

● కర్ణాటక సరిహద్దులోని గౌరిబదనూరు, బాగేపల్లిలోని గడిదం వెంకటరమణస్వామి ఆలయాల్లో వైకుంఠ ద్వారం దర్శన పూజలు నిర్వహిస్తున్నారు.

## పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స

**మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని పి.గుండుమల గ్రామంలో సోమవారం పాడి పశువులకు ఉచిత గర్భకోశవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ అమర్, అనంతపురం వీఏఎస్, డీఎల్‌డీఏ డాక్టర్ శ్రీకాంత్, ఈఓ, డీఎల్‌డీఏ వెంకటేశ్‌లు పాల్గొని రైతులతో మాట్లాడారు. ఏడాదికి ఒక దూడ పుట్టాలంటే ఈనిన 45 రోజులకు ఎదసూది వేయించాలన్నారు. రైతులకు మంచి ఆదాయం వచ్చేందుకు కేవలం పెయ్యి దూడలు పుట్టే వీర్యం అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 45 పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించి రూ.20వేల విలువ చేసే మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి చంద్రప్ప, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న ఏడీ అమర్, డా. శ్రీకాంత్ తదితరులు


21 ANNIVERSARY
21st Anniversary
శ్రీయ డయగ్నోస్టిక్స్ 21వ వార్షికోత్సవం సందర్భంగా మమ్ము ఆదరిస్తున్న హిందూపురం మరియు పరిసర ప్రాంత ప్రజలకు సహకరిస్తున్న వైద్యులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులందరికీ మా హృదయపూర్వక ధన్యవాదములు.
SHRIYA DIAGNOSTICS
CLINICAL PATHOLOGY, AUTOMATED CELL COUNTER, FULLY AUTOMATED BIO-CHEMISTRY, MICRO-BIOLOGY & ECG
లేటెస్ట్ టెక్నాలజీతో అన్ని రకముల రక్త పరీక్షలు చేయబడును.
Timings Week days 07.00 AM to 09.00 PM
Sunday 07.00 AM to 01.00 PM
7-7-82/B Road Besides Head Post Office
VD Road, Hindupur - 515201
Email: gt_anil@yahoo.com
08556 - 223555, 9440243269


(c) eenadu

# పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో ఆకట్టుకున్న అలంకరణ

## ఆలయాలకు ముక్కోటి ఏకాదశి శోభ

ధర్మవరం, న్యూస్‌టుడే: ముక్కోటి వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, కొత్తపేట, శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంగళవారం స్వామివారిని ఉత్తర ద్వారా గుండా దర్శించుకునేందుకు క్యూలైన్లు సిద్ధం చేశారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీ సంఘటనలు తలెత్తకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు సీఐలు, 70 మంది పోలీసులను బందోబస్తుకు కేటాయించారు.

## క్విజ్ పోటీలో అదరగొట్టారు

విజేతలతో అధ్యాపకులు

కదిరి, న్యూస్‌టుడే: క్విజ్ పోటీల్లో ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఈక్రమంలో జనరల్ నాలెడ్జ్, వర్తమాన అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. చక్కగా సమాధానాలు ఇచ్చిన విద్యార్థులు పి.గణేష్, పి.విష్ణువర్ధన్ బాబు, కె.సాయిచరణ్ వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మహమ్మద్ బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు ఇక్బాల్, కృష్ణయ్య, రమేష్‌రెడ్డి, హమీద్, రషీద్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

## తెదేపా బలోపేతమే ధ్యేయం

తలుపుల, న్యూస్‌టుడే: తెదేపాను మరింత బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పార్టీ మండల కన్వీనర్ మేడా శంకర పిలుపునిచ్చారు. పెద్దన్నవారిపల్లి పంచాయతీ కొట్టాల గ్రామంలో సోమవారం ఆయన అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ వారీగా సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలు చూపడం, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపి రానున్న స్థానిక ఎన్నికల్లో అఖండ మెజార్టీ సాధించాలన్న పట్టుదల చూపాలని కోరారు. మండలంలో బూత్ వారీగా గ్రామసభలు నిర్వహిస్తామని, ప్రతి కార్యకర్త పాల్గొని జయప్రదం చేయాలన్నారు. గ్రామసభలో తెదేపా నాయకులు బార్గవ్‌రెడ్డి, ఓబులరెడ్డి, కిష్ణ, రమణ, గంగరాజు, నరసింహులు, రామమోహన్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పీఏబీఆర్ కాలువకు నీటి విడుదలపై నిర్లక్ష్యం

తాడిమర్రి, న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడికాలువ నీరు వదలకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనివల్ల బోర్లలో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదముందని ఏపీ రైతు సంఘం ప్రతినిధి పెద్దన్న ఆరోపించారు. ఆయన సోమవారం తాడిమర్రిలో మండల రైతు సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పీఏబీఆర్ కుడికాలువ నీటిని నమ్ముకుని రైతులు రకరకాల ఉద్యానవన పంటలను సాగు చేశారన్నారు. నీటి విడుదల ఆలస్యమైతే పంటలు ఎండిపోయి నష్టం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో రెండు నెలలైనా నీటిని విడుదల చేయలేదన్నారు. వచ్చే నెల 8న తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కాటమయ్య, నాయకులు గంగాధర్, కునుకుంట్ల రాజశేఖర్‌రెడ్డి, శంకర్, రామలింగారెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## టెకీలు.. ఆటల్లో జెట్టీలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

### నాన్న ప్రోత్సాహంతోనే గెలుపు

నా పేరు నక్షత్ర. కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ ప్రథమ ఏడాది చదువుతున్నా. నాన్న మహేష్‌బాబు ప్రైవేటు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అమ్మ అర్చన గృహిణి. తండ్రిని చూసి నాకు ఆటలపై ఆసక్తి కలిగింది. ఆయన ప్రోత్సాహంతో ఇటీవల జరిగిన అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల పోటీల్లో పాల్గొన్నా. 100 మీటర్ల పరుగు, బ్యాడ్మింటన్‌లో తొలి స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యా. వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచేందుకు సాధన చేస్తున్నా. -నక్షత్ర, అథ్లెటిక్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల ప్రోత్సాహం, శిక్షకుల తర్ఫీదుతో సాంకేతిక విద్యార్థులు క్రీడల్లోనూ విశేషంగా రాణిస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. వీరిలో నక్షత్ర అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. తిరుపతిలో జనవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడనుంది. మరో విద్యార్థి జిల్లాస్థాయి డిస్కస్‌త్రోలో మూడో స్థానంలో నిలిచి శభాష్ అనిపించుకున్నాడు. వారి స్ఫూర్తిదాయక గమనం వారి మాటల్లోనే విందాం.. రండి.

### క్రీడలంటే చాలా ఇష్టం

నా పేరు అజయ్. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ రెండో సంవత్సరం చదువుతున్నా. అమ్మానాన్నలు శ్రీరాములు, లక్ష్మీదేవి. చిన్నప్పటి నుంచి నాకు ఆటలంటే ఇష్టం. నా ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ప్రోత్సహించారు. సాంకేతిక విద్య చదువుతున్నా ఆటలకు ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో డిస్కస్‌త్రోలో మూడో స్థానంలో నిలిచా. జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలన్నది నా కల. ఆ దిశగా అడుగులు వేస్తున్నా. -అజయ్, డిస్కస్‌త్రో క్రీడాకారుడు

## ఖాద్రీశుడి ఉత్తర ద్వార దర్శనానికి సిద్ధం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, న్యూస్‌టుడే: ముక్కోటి వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వారం నుంచి ఖాద్రీశుడిని భక్తులు దర్శించుకొని తరించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కోరారు. ఆయన సోమవారం కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. మంగళవారం వేకువజామున 3.30 గంటలకు ప్రారంభంకానున్న వైకుంఠ ద్వార దర్శనానికి చేస్తున్న ఏర్పాట్లను చూశారు. ఆలయ అలంకరణ, క్యూలైన్లు, అన్న ప్రసాదం తయారీ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ఖాద్రీ క్షేత్రంలో ఏటా ముక్కోటి ఏకాదశిని కన్నులపండువగా జరుపుకొనేలా ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందేనన్నారు. ఆలయ అలంకరణకే కాకుండా భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనపైనా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏడాదిన్నరగా కూటమి ప్రభుత్వం ఆలయాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని గుర్తుచేశారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో మాదిరి రానున్న రోజుల్లో కదిరిలోనూ ఏఐ సాంకేతికతను వినియోగించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ శివనారాయణస్వామి, అర్చకులు నరసింహాచార్యులు, పార్థసారథి ఆచార్యులు, ఎంపీడీవో ఒలప్ప, కూటమి నాయకులు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో మహిళలే మహారాణులు



లబ్ధిదారులకు సిలిండర్, స్టవ్ అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి

అమడగూరు (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో స్త్రీలే మహారాణులని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. అమడగూరులోని చౌడేశ్వరి కల్యాణ మండపంలో సోమవారం గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, తెదేపా నేత శ్యామ్‌బాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఎం ఉజ్వల పథకం కింద 200 మంది పేద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.1.50లక్షలు లబ్ధి చేకూరుతోందన్నారు. అమడగూరు మండలంలో రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు పది అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.56.75లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో నియోజకవర్గానికి రూ.33.44 కోట్లు నిధులు విడుదలైనట్లు తెలిపారు. రూ.31 కోట్లతో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎల్‌పీజీ గ్యాస్ సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీవీ రాజేష్, ఎంపీడీఓ మునెప్ప, సర్పంచి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో శకుంతల తెలిపారు. పట్టణంలోని పాతూరులో సోమవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మంజుల, ఎంఈవో రమణప్ప, ఆర్డబ్ల్యూఎస్ జేఈ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు కనీస వసతులేవీ?

రహదారిపైనే కార్మికుల హాజరు తీసుకుంటున్న మేస్త్రీ

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మూడవ డివిజన్ (కొత్తపేట, రాంనగర్)లో పారిశుద్ధ్య కార్మికులకు కనీస వసతులు లేవని, ఇప్పటివరకు భవనం నిర్మించలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పారిశుద్ధ్య కార్మికులు మస్టర్ వేసే సమయంలో మేస్త్రీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు, కార్మికులు మాట్లాడుతూ విధుల సమయంలో అత్యవసరాలు, ఎండావానల రక్షణ పొందేందుకు భవనం లేకుండా పోయిందన్నారు. పట్టణంలో మిగతా మూడుచోట్ల భవనాలున్నా, వాటిల్లోనూ ఎలాంటి సౌకర్యాలు లేవని మండిపడ్డారు. మున్సిపాలిటీ ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో విధుల్లోకి చేరిన కార్మికులకు ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు జమచేయాలని విన్నవించారు.

## తాగునీటి సమస్య పరిష్కారం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ బాలప్పగారిపల్లి కాలనీలో తాగునీటి మోటారు మరమ్మతులు చేస్తుండగా బావిలో చిక్కుకుపోయి కొన్ని రోజులుగా గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో, సోమవారం ఆయన నూతన బోరు బావి తవ్వించారు. నీటి సమస్య తీరడంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## పరిశోధనల భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీ భవన నిర్మాణానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య అనిత సోమవారం భూమి పూజ నిర్వహించారు. పీఎం ఉషా నిధులు రూ.5కోట్లతో ఈ భవనం నిర్మించనున్నారు.

## జూడోలో విద్యార్థినులకు స్వర్ణ పతకాలు

పతకాలు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జూడోలో బంగారు పతకాలు సాధించారు. ఈమేరకు ప్రధానోపాధ్యాయిని రమాదేవి సోమవారం తెలిపారు. హిందూపురంలోని ఎంజీఎం పాఠశాలలో ఈ నెల 27, 28 తేదీల్లో ఆర్జీటీ ఆధ్వర్యంలో జోనల్ లెవల్ జూడో లీగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయన్నారు. తమ పాఠశాల నుంచి 14మంది విద్యార్థినులు పాల్గొని ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. -23 కేజీల విభాగంలో ఆరో తరగతి విద్యార్థిని హారిక, -40 కేజీల విభాగంలో ఏడో తరగతి చదువుతున్న కృతి బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. వివిధ విభాగాల్లో నలుగురు విద్యార్థినులు రజతం, మరో నలుగురు కాంస్య పతకాలు గెలుచుకున్నట్లు చెప్పారు. స్వర్ణ పతకాధారులు జనవరిలో అనంతపురంలో జరిగే సెంట్రల్ జోన్ పోటీల్లో తలపడతారని వివరించారు. విజేతలను ఎంఈవోలు వెంకటచలపతి, రమణప్ప, పీడీలు చాముండి, రేఖ, ఉపాధ్యాయులు అభినందించారు.

## వ్యయ నియంత్రణకు కృషి చేయాలి

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు

సమస్యలపై నిలదీస్తున్న పురపాలిక సభ్యుడు

కదిరి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీపై ఆర్థిక భారం పడకుండా ఖర్చులను తగ్గించాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం కౌన్సిల్ సమావేశం ఛైర్‌పర్సన్ దిల్దారున్నిసా అధ్యక్షతన జరిగింది. తొలుత 2026-27 ఆర్థిక ఏడాదికి రూపొందించిన రూ.59.24కోట్ల అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. అనంతరం 83 అంశాలతో కూడిన అజెండాపై చర్చించారు. ఈ సందర్భంగా సభ్యులు కిన్నెర కల్యాణ్, భుజాంగర్‌రెడ్డి మాట్లాడుతూ పార్నపల్లి నుంచి పట్టణానికి 72కి.మీల దూరం నుంచి నీరు సరఫరా అవుతోందన్నారు. గతంలో నీటి పంపింగ్‌కు స్టాండ్‌బైగా మోటార్లు ఉండేవని, వాటిని మరమ్మతులకు పంపితే తిరిగి రాలేదన్నారు. తరచూ రిపేర్ల పేరిట రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సమావేశంలో వాయిదా అంశాలపై చర్చించి, తిరిగి రూ.50లక్షలకు ప్రతిపాదించిన పలు పనులను తిరస్కరించారు. పట్టణ సమీప చెర్లోపల్లి రిజర్వాయరు నుంచి నీటి సరఫరాకు అమృత్ పథకం పనులు త్వరగా చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులకు ఎక్కువ మొత్తానికి వేసిన సింగిల్ టెండర్లను సభ్యులు తిరస్కరించారు. పట్టణ ప్రణాళిక విభాగం సేవలు అధ్వానంగా ఉన్నాయన్నారు. నిబంధనలు పాటించకుండా, సమావేశానికి హాజరుకాని టీపీవోను సరెండ్ చేయాలంటూ కౌన్సిలర్లు సంతకాలు చేశారు. అద్దె గదుల అంశంపై వాయిదా వేశారు. వ్యర్థాలు, పారిశుద్ధ్య కార్మికులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకోవాలంటూ కొందరు ప్రతిపాదించగా తిరస్కరించారు. కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చెర్లోపల్లి రిజర్వాయరు నుంచి ఏడాదిన్నరలోపు నీటి సరఫరా జరిగేలా చూస్తామన్నారు. మిగిలిన అంశాలపై కౌన్సిల్ సభ్యుల ఆమోదంతోనే ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ రాజశేఖరాచారి, కౌన్సిల్ సభ్యులు ఇస్మాయిల్, ముస్తఫా, షబ్బీర్, అధికారులు పాల్గొన్నారు.

## 'ఆర్టీసీలో కాంట్రాక్టర్ల విధానం వద్దు'

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ సంస్థలో పొరుగుసేవల కార్మికుల సమస్యలు తీరాలంటే కాంట్రాక్టర్ల విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ సంఘం సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్‌తో కలిసి అంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికులకు గుత్తేదారులు సక్రమంగా జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. జీతాల్లో రూ.2వేలు పట్టుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్మికులకు న్యాయం జరగాలంటే కాంట్రాక్టర్ల విధానాన్ని రద్దుచేసి, ప్రభుత్వమే నేరుగా జీతాలిచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## కిసాన్ డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ, వ్యవసాయాధికారులు

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండలంలోని ఎలుగుట్టవారిపల్లిలో రైతు లక్ష్మీనారాయణరెడ్డి సాగు చేసిన మొక్కజొన్న పంటలో కిసాన్ డ్రోన్‌తో నానో యూరియా పిచికారీపై సోమవారం అవగాహన ప్రదర్శన జరిగింది. ఏడీఏ సనావుల్లా, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త రమేష్‌నాయక్ ఎలా పిచికారీ చేయాలో ప్రత్యక్షంగా చూపారు. మొక్కజొన్న పంటను పరిశీలించి తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు సూచించారు. నానో యూరియాను మొక్కలు 20-25 రోజులున్నప్పుడు ఆకులపై పిచికారీ చేయాలని చెప్పారు. డ్రోన్ ద్వారా ఎకరాకు వేయడం కూడదన్నారు. యూరియా బస్తా ధర రూ.266.50 ఉండగా, నానో యూరియా లీటర్ రూ.225లకు లభిస్తుందన్నారు. బస్తా యూరియాలో నత్రజని 30-40 శాతం ఉండగా, నానో యూరియాలో 90 శాతం ఉంటుందన్నారు. డ్రోన్ ద్వారా తక్కువ ఖర్చుతో పిచికారీ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్సీ ఏడీఏ శైలకుమారి, ఏఓ చైతన్య, ఎంపీఈ సోమశేఖర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వేపై అవగాహన అవసరం

కదిరి గ్రామీణం: ర్యాలీలో పాల్గొన్న రైతులు, సిబ్బంది

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కదిరి బ్రాహ్మణపల్లిలో సోమవారం రీసర్వేపై అవగాహన ర్యాలీ జరిగింది. మండల సర్వేయర్ మైనొద్దీన్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలో అధికారులు మాట్లాడారు. రీసర్వేతో జాయింట్ ఎల్‌పీఎంలు, నకిలీ ఖాతా నంబర్లు, మల్టిపుల్ సర్వే నంబర్లు తదితర సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్, వీఆర్వో అరవింద్, స్థానిక నాయకులు చిన్నా నాయుడు, రఘునాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట: భూముల రీసర్వేపై రైతులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని డీటీ శరత్ సూచించారు. ఎక్కడ సర్వే జరుగుతుందో ఒకరోజు ముందుగా తెలిపితే పట్టాదారుల్లో ఉంటున్న వారికి సమాచారం చేరి వస్తారన్నారు. గ్రామంలో దండోరా వేయించాలన్నారు.

## ట్రాక్టర్ చోదకుడి ఆత్మహత్య

మనోహర్

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం మండలం తుంపర్తి గ్రామానికి చెందిన ట్రాక్టర్ చోదకుడు మనోహర్(27) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామీణ పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు.. మనోహర్ సోమవారం తుంపర్తి గ్రామ శివారులో పురుగు మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు బాధితుడిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. అప్పుల బాధ, కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన మనోహర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

## ప్రమాదంలో కర్ణాటక వాసులకు గాయాలు

తనకల్లు: మండలంలోని పరకులవాండ్లపల్లి వద్ద జాతీయ రహదారి 42పై బొలెరో వాహనం ఢీకొనడంతో కర్ణాటకకు చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని ఎనగలూరుకు చెందిన మునెప్ప, ప్రవీణ్ కదిరి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, పరకులవాండ్లపల్లి వద్ద బొలెరో వాహనం ఢీకొంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.

## వరి పంటకు నిప్పు

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని రామ్లానాయక్ తండాలో కోతకొచ్చిన వరి పంటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారంటూ సోమవారం బాధిత రైతు రమేష్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎకరం పొలంలో వరి సాగు చేశానని, మొత్తం కాలిపోయిందని బాధితుడు వాపోయారు. నిందితులను గుర్తించి తనకు న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించారు.

## అల్లర్లకు పాల్పడితే కేసులు

ధర్మవరం, న్యూస్‌టుడే: కొత్త ఏడాది వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించమని, కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రెండో పట్టణ సీఐ రెడ్డెప్ప హెచ్చరించారు. గతేడాది వేడుకల్లో అల్లర్లకు పాల్పడిన పదిమంది యువకులను గుర్తించి సోమవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తొలగించి పెద్ద శబ్దాలు చేస్తూ నడిపితే వాటిని సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. 31న రాత్రి గట్టి పోలీసు బందోబస్తు ఉంటుందని ఆయన వెల్లడించారు.

## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యం

మాట్లాడుతున్న పత్తి చంద్రశేఖర్

బుక్కపట్నం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర రాష్ట్ర డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. బుక్కపట్నంలో సోమవారం జనసేన కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు ప్రారంభించి మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పేదల కోసమే శ్రమిస్తున్నారని గుర్తుచేశారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి పార్టీని ముందుకు నడిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో జనసేన నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జయరాం, అనిల్, రమణ, అబ్బుల్, పెద్దన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'పార్టీ అభ్యున్నతికి కలిసి పనిచేద్దాం'

బుక్కపట్నం, న్యూస్‌టుడే: తెదేపా అభ్యున్నతికి కార్యకర్తలు నుంచి నాయకుల వరకు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి యశోదమ్మ పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అందరూ కలిసి పనిచేసి అభ్యర్థులను గెలిపించుకోవాలని కృషి చేద్దామని కోరారు. అనంతరం ఆమెను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. సమావేశంలో నాయకులు కేశవ, జయరాం, శ్రీనివాసులు, మంజు, శేఖర్, సుధీర్, నాగేంద్ర, అంజి తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడి...సృజనల ఒడి

### కార్పొరేటు స్థాయి శిక్షణతో దూసుకెళుతూ..

అబాకస్ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఉపాధ్యాయుడు శివశంకర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఆటలు చదువు ఇటు ప్రత్యేక నైపుణ్యాలలో ఆ సర్కారు పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లతో పోటీపడుతూ రాణిస్తున్నారు. అబాకస్, చిత్రలేఖనం, ఆంగ్లం, క్రీడల తదితర అంశాల్లో ప్రతిభ చూపుతున్నారు. దీనికి కారణం శివశంకర్ అనే ఉపాధ్యాయుడు. పుట్టపర్తి మండలం అమగొండపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న శివశంకర్ 18మంది విద్యార్థులకు అబాకస్, ఆంగ్లం, చిత్రలేఖనం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తూ మెరికల్లా తీర్చిదిద్దుతున్నారు. వినూత్న బోధన పద్ధతులతో పిల్లలతో పాటు తల్లిదండ్రుల మనసులను గెలుస్తున్నారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా సర్కారు బడి పిల్లలు రాణించాలనే తపనతో కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### నైపుణ్యాలు పెంచేందుకే తర్ఫీదు

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయడానికి చదువుతో పాటు ఇతర నైపుణ్యాలు, సృజనాత్మక అంశాల్లో శిక్షణ ఇస్తున్నా. పిల్లలు సాధారణంగా లెక్కలు, ఆంగ్లమంటే భయపడతారు. వారిలో ఆ భయాన్ని పోగొట్టడానికే అబాకస్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇస్తున్నాం. పిల్లలు చక్కగా నేర్చుకోవడం ఆనందంగా ఉంది. ఇప్పుడు వారు గణాంకాలు వేగంగా చేయడమే కాకుండా ఆంగ్ల పదాలను మాట్లాడుతున్నారు. -శివశంకర్, ఉపాధ్యాయుడు

### వేగంగా లెక్కలు చేస్తున్నా

నాకు మొదట్లో లెక్కలంటే కాస్త భయం ఉండేది. అబాకస్ నేర్చుకున్న తర్వాత కూడికలు, తీసివేతలతో పాటు గుణకారాలు వేగంగా చెప్పేస్తున్నా. కాలిక్యులేటర్ కన్నా ముందే సమాధానాలు ఇస్తున్నా. గణాంకాలు ఎక్కడి నుంచి అడిగినా ఇట్టే చెబుతున్నా. అబాకస్ నుంచి మా విభాగాల్లో పూర్తిస్థాయి శిక్షణ తీసుకుంటున్నా. -లాస్య, 3వ తరగతి

### ఏకాగ్రత పెరిగింది

అబాకస్‌లో శిక్షణ పొందడంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి బాగా పెరిగాయి. గణితంలోని లెక్కలు వేగంగా చేయగలుగుతున్నా. పాఠ్యాంశాలు బాగా అర్థమవుతున్నాయి. లెక్కలంటే భయం పోయింది. చిత్రలేఖనం కూడా నేర్చుకుంటున్నా. సార్ బాగా చెబుతున్నారు. -గీతిక, 5వ తరగతి

## 'ప్రాణాలకు రక్షణ కల్పించండి'

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: తమపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రాణాలకు రక్షణ కల్పించాలని తాడిమర్రి మండలం పుల్లప్ప పల్లికి చెందిన దంపతులు జయ, పార్వతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ నెల 24న తమ ఇంటి వద్ద అదే గ్రామానికి చెందిన కొందరు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా సరైనా న్యాయం జరగలేదన్నారు.

## 10న వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర సదస్సు



గోడ పత్రాలను విడుదల చేస్తున్న సంఘం ప్రతినిధులు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సులు అమలు చేయాలంటూ జనవరి 10న కర్నూలులో నిర్వహించనున్న వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ఆలోచనను కేంద్రం మానుకోవాలన్నారు. కూలీలకు ఉపాధి చూపాలని, అసైన్‌మెంట్ కమిటీల ద్వారా భూమిలేని పేదలందరికీ భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ, కార్మికుల సమస్యలపై జరగనున్న సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు బాలస్వామి, కుల్లాయప్ప, రమణ, కొండయ్య, చౌడప్ప, ఆదెప్ప, తిరుపాలు, చరణ్, తిప్పన్న పాల్గొన్నారు. అంతకుముందు సదస్సుకు సంబంధించిన గోడ ప్రతికల విడుదల చేశారు.

(c) eenadu

# ఈనాడు శ్రీకాకుళం



కొట్టేశారు
## నామరూపాల్లే కొండ..!

ఈ చిత్రంలో కనిపిస్తోంది. అక్రమ తవ్వకాలతో రూపుకోల్పోయిన గార మండలంలోని శాలిహుండం కొండ. జిల్లాలో అనుమతుల్లేకుండా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలకు ఇదే నిదర్శనం. ఈ కొండపై ఇప్పటికే కొన్ని నెలల నుంచి సుమారు 30 ఎకరాల వరకు భారీగా తవ్వేశారు. ట్రాక్టరు గ్రావెల్‌ను రూ.1,500 నుంచి రూ.2,500 వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం 50 ట్రాక్టర్లకుపైగా రవాణా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కళ్ల ముందే ఇంత జరుగుతున్నా అధికారులు కనీసం కన్నెత్తి చూడట్లేదని విమర్శిస్తున్నారు. అనుమతుల్లేకుండా గ్రావెల్ తవ్వకాలు, అక్రమ రవాణా చేసేవారిపై కేసులు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. - ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

## ముక్కోటి వెలుగులు

జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. వైకుంఠ ఏకాదశికి ఆలయాలను ముస్తాబు చేశారు. పూలు, రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. మహావిష్ణువును దర్శించుకునేందుకు ఉత్తర ద్వారాలను సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని నారాయణ తిరుమల వేంకటేశ్వరాలయం వెలుగులు, క్యూలైన్లను చిత్రంలో చూడొచ్చు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

## ఐదు తరగతులు.. ఐదుగురు విద్యార్థులు..!

ఆమదాలవలస మండలం కనుగులవలసలోని ఎంపీపీ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. 1 నుంచి 5 తరగతుల వారికి అన్ని సబ్జెక్టులు ఒక్కరే బోధిస్తున్నారు. ఒకే చోట పాఠాలు చెప్పడం కాస్త ఇబ్బందిగా ఉన్నా తప్పట్లేదు. గతేడాది ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఒకరిని మరోచోటకు పంపారు. ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని ఎంఈవో కె.రాములు తెలిపారు. - న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

రణస్థలం మండలం దోనిపేట, మెంటాడ వద్ద ఓ పరిశ్రమ పైపులు లీకవుతున్నాయి. నీరు కలుషితం కాకుండా సంచులు కట్టారు. వాటిని చూసి మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

## తీరాన వ్యర్థం.. తీరని అనర్థం..!

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, రణస్థలం, లావేరు, న్యూస్‌టుడే

కలుషితం అవుతున్న సముద్ర జలాలు

గంగపుత్రుల జీవనోపాధిపై ప్రభావం

పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు కాలుష్యానికి దారితీస్తున్నాయి. పైపులైన్ల లీకేజీలు భూగర్భ జలాలతో పాటు మత్స్యకారుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. విషయం తెలిసినప్పటికీ పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోవట్లేదు. అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా చర్యలు శూన్యం. ఇప్పటికే సమీప గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు

జిల్లాలో పైడిభీమవరం పారిశ్రామికవాడతో పాటు ఎచ్చెర్ల మండలంలో కొన్ని భారీ పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో కొన్ని రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా నేరుగా సముద్రంలోకి విడిచిపెడుతున్నాయి. ఫలితంగా సముద్రంలో ఉండే జీవరాశులు మృత్యువాతపడుతున్నాయి. దీని కారణంగా 2 నుంచి 3 కి.మీ. దూరం వెళ్లినప్పటికీ మత్స్యసంపద దొరకట్లేదని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లోని తీర గ్రామాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది.

**మండలాల్లో ప్రభావిత గ్రామాలు..**

రణస్థలం: మెంటాడ, కొవ్వాడ, జీరుపాలెం, నారువ, అక్కయ్యపాలెం, అల్లివలస
ఎచ్చెర్ల: డి.మత్స్యలేశం, రాళ్లపేట, కొత్తదిబ్బలపాలెం, కొంగరాం, చిలకపాలెం .. పొందూరు: కేశవదాసుపురం, బేరుపేట, అరిణాం అక్కివలస.

**చర్యలు తీసుకుంటాం..**

శుద్ధి చేయకుండా రసాయన వ్యర్థాలను నేరుగా విడిచిపెట్టకూడదు. వీటిపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. పైపుల లీకులు ఉన్నా.. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలు విడుదల చేస్తున్నట్లుగా గుర్తించినా సంబంధిత యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. - కరుణశ్రీ, ఈఈ, కాలుష్య నియంత్రణ బోర్డు

| | | | | |
|---|---|---|---|---|
| జిల్లాలో తీరం పొడవు: 193 | మండలాలు: 11 | మత్స్యకార గ్రామాలు: 104 | గంగపుత్రులు: 1.12 లక్షల మంది | భారీ పరిశ్రమలు: 17 |

## 555 చరవాణులు.. రూ.86 లక్షలు..

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, చిత్రంలో అధికారులు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్లు పోగొట్టుకుని ఫిర్యాదు చేసిన బాధితుల్లో 555 మందికి సుమారు రూ.86 లక్షల విలువ చేసే చరవాణులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అందజేశారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. '2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారిలో 2,442 మంది ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు 1,060 చరవాణులు రికవరీ చేసి బాధితులకు అప్పగించాం. మరో 330 గుర్తించిన రికవరీ చేయాలి. సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభించిన తర్వాత జిల్లాలో 4,770 ఫిర్యాదులు నమోదయ్యాయి. గతేడాది 1,600, ఈ సంవత్సరం 1,060 ఫోన్లు రికవరీ చేయగలిగాం' అని ఎస్పీ వివరించారు. ఈ విషయంలో కీలకంగా వ్యవహరించిన అదనపు ఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, సైబర్ సెల్ సీఐ బి.శ్రీను, ఐటీ, సైబర్ సెల్ సిబ్బందిని అభినందించారు.

## పూలదండలు, పుష్పగుచ్ఛాలు తీసుకురావొద్దు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి నిమ్మాడలో అందుబాటులో ఉంటామని కేంద్ర, రాష్ట్రమంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారు పూలదండలు, పుష్పగుచ్ఛాలు వంటికి తీసుకురావొద్దని సూచించారు.

## కిడ్నీలు కుంగుతూ.. కన్నీళ్లు ఇంకుతూ..!

టెక్కలి మండలంలో చాపకిందనీరులా విస్తరిస్తున్న మహమ్మారి

ముఖలింగాపురం పంచాయతీ పాలసింగి గ్రామానికి చెందిన **జన్ని మోహనరావు**కు ఇటీవల వివాహమైంది. ఆ తర్వాత కొన్ని రోజులకే కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు తెలియడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రిలో వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నారు. భర్త మంచం పట్టడంతో భార్యే కూలి పనులకు వెళ్లి వైద్యం చేయిస్తోంది.

గూడెం పంచాయతీ సన్యాసి నీలాపురానికి చెందిన **నీలాపు రవికుమార్** ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులకు వెళ్తుంటారు. నాలుగేళ్ల కిందట కిడ్నీ సమస్య తలెత్తడంతో ఇంటికే పరిమితమయ్యారు. అప్పులు చేసి వైద్యం చేయించుకోవాల్సి పరిస్థితి వచ్చింది. భార్య, ఇద్దరు ఆడపిల్లలతో ఎలా నెట్టుకురావాలో అర్థం కావట్లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు.

న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

ఆ పల్లెల్లో ఏ కుటుంబాన్ని కదిలించినా గుండెలు పిండేసే దీన గాథలు వినిపిస్తున్నాయి. ఇంటి పెద్దను కోల్పోయి కొందరు.. ఆదుకునేవారు లేక మహమ్మారితో పోరాడుతూ మరికొందరు.. అయినోళ్లు కళ్లెదుటే చిక్కి శల్యమైపోతుంటే చూడలేక ఇంకొందరు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఉన్నవి అమ్ముకుని.. అప్పులపాలై ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. టెక్కలి మండలంలో చాప కింద నీరులా విస్తరిస్తున్న కిడ్నీ మహమ్మారిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

● టెక్కలి జిల్లా ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తే మండలంలో మహమ్మారి ఏ విధంగా విజృంభిస్తుందనేది అర్థమవుతుంది. డయాలసిస్ చేయించుకునేవారిలో ఎక్కువ మంది టెక్కలి మండలానికి చెందిన వారే ఉంటున్నారు. టెక్కలి, తొలుసూరుపల్లి, తిర్లంగి, శాసనాం, సరియాపల్లి, బూరగాం గ్రామాల్లోనూ బాధితులు పెరుగుతున్నారు.

**మండలం: టెక్కలి**

వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న పంచాయతీలు: గూడెం, ముఖలింగాపురం, పోలవరం, లింగాలవలస.

గ్రామాలు: పాలసింగి, సన్యాసి నీలాపురం, గూడెం, కిట్టాలపాడు, సోమనాథపురం, పిట్టలసరియా.

మృతులు: 104 మంది (2019 నుంచి ఇప్పటి వరకు)

డయాలసిస్ రోగులు: 27 మంది

● పాలసింగి గ్రామంలో 18 కుటుంబాలు ఉండగా.. అందులో ముగ్గురు డయాలసిస్ చేయించుకుంటున్నారు. మరో నలుగురు ఇప్పటికే వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్నారు.

'కిడ్నీ సమస్యలున్న గ్రామాల్లో తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నాం కిట్టాలపాడులో శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేశాం' ఆర్‌డబ్ల్యూఎస్ టెక్కలి ఏఈ మోహన్ తెలిపారు.

● వ్యాధి కారణాలు అంతుచిక్కని ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు లేకపోవడంతోనే సమస్య వస్తోందని కొంత మంది భావిస్తుండగా, మితిమీరిన మందుల ప్రభావంతో కిడ్నీలు దెబ్బతింటున్నట్లు ఇంకొందరు చెబుతున్నారు.

## విజ్ఞానం విరిసి.. మేధస్సు మెరిసి..!

ఐతమ్‌లో అబ్బురపరిచిన ఆవిష్కార్ సీజన్-3

న్యూస్‌టుడే, టెక్కలి

48 గంటలు.. 18 రాష్ట్రాలు.. 53 విద్యార్థి బృందాలు.. సరికొత్త ప్రాజెక్టులతో ఆవిష్కార్ సీజన్-3 ఆకట్టుకుంది. టెక్కలి సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల వేదికగా మూడురోజులపాటు జరిగిన ఈ విజ్ఞాన ప్రదర్శనలో యువత నవ్య ఆవిష్కరణలకు ప్రాణం పోశారు. 48 గంటల పాటు సాగిన హ్యాకథాన్ సోమవారంతో ముగిసింది. ఐఐటీ హైదరాబాద్ డీన్ సి. మల్లారెడ్డి ముఖ్య న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి మార్గనిర్దేశం చేసి.. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, కోశాధికారి నాగరాజు, ఐతమ్ రైజ్ సీఈవో మనోజ్‌కుమార్ బడగర్వాలా పాల్గొన్నారు.

**క్యాన్సర్ నిర్ధారణకు మోసంబీ..**

అండాశయ క్యాన్సర్ బాధితులు ఏటా పెరుగుతున్నారు. కృత్రిమ మేధ ద్వారా వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు 'మైక్రో ఫ్లెడిడిక్ చిప్'ను రూపొందిస్తున్నారు తమిళనాడులోని వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ) విద్యార్థులు. కృతిదోషి, రచిత్ ఉపాధ్యాయ మోసంబీ పేరుతో రూపొందిస్తున్న ప్రాజెక్టులో బయో మైక్రోచిప్ వినియోగిస్తున్నారు.

రేను అప్‌లోడ్ చేస్తే ఫలితాలొస్తాయి. కృత్రిమ మేధ ద్వారా రోగి ఆరోగ్య పరిస్థితిని గుర్తిస్తారు. క్యాన్సర్ మరణాలను తగ్గించేందుకు ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు.

**నానో ఉపగ్రహం.. పక్కా లోకల్**

తమిళనాడులోని సత్యభామ విశ్వవిద్యాలయం విద్యార్థులు నవీన్‌కుమార్, సమీర్ దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో నానో ఉపగ్రహాన్ని తీర్చిదిద్దుతున్నారు. 'ఇది ఒక గ్రహం నుంచి మరో గ్రహానికి ప్రయాణించగలదు. వ్యవసాయ, రక్షణశాఖలకు పూర్తి సమాచారం ఇస్తుంది. ఇందులోని అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉపగ్రహాల ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించొచ్చు. పూర్తిగా దేశీయ ఇంధనం, ఉపకరణాలతో తయారు చేస్తున్నాం' అని వారు తెలిపారు.

**వెబ్‌సైట్‌తో ఊరట..**

విశాఖపట్నంలోని ఎన్ఎస్ఆర్ ఐటీలో చదువుతున్న చైతన్య, సాయికుమార్, జయంత్, ప్రసన్నకుమార్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఓ వెబ్‌సైట్‌ను రూపొందించారు. క్యూవిజన్ పేరుతో అభివృద్ధి చేస్తున్న ఈ పోర్టల్‌లో ఎక్స్

## నీడలా వెంటాడుతున్న బెంగ..!

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో రూ.4.50 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన తాటాకు పందిరి ఇది. భక్తులకు నీడనిస్తున్నప్పటికీ దీని ఏర్పాటు సమయంలో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో రోజురోజుకీ ప్రమాదాలకు ఆస్కారం కల్పించేలా మారుతోంది. సరుగుడు కర్రల సాయంతో వేసిన పందిరిపై బరువుకు ఇప్పటికే పలు చోట్ల కుంగింది. కొన్ని చోట్ల తాళ్లు వదులైపోయాయి. ఈదురుగాలుల సమయంలో పొరపాటున ఇది కూలితే అంతే సంగతి. దీంతో పాటు పందిరి సమీపంలోనే రావిచెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగిస్తున్నారు. ఏ మాత్రం నిప్పంటుకున్నా మూల్యం చెల్లించకోక తప్పని పరిస్థితి. దీని స్థానంలో జర్మన్ షెడ్ టెంట్ ఏర్పాటు చేయడం శ్రేయస్కరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ మాట్లాడుతూ తాటాకు పందిరి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

## నిధుల భారం.. నిర్వహణకు దూరం

జిల్లాలో ఎంతో ప్రాధాన్యమున్న గొట్టా బ్యారేజీ నిర్వహణకు నిధుల లేమి వెంటాడుతోంది. బ్యారేజీకి కుడివైపున ఉన్న గదుల చుట్టూ పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. కుడి ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటర్ కార్యాలయం వరకు విద్యుత్తు సరఫరా సక్రమంగా లేకపోవడంతో సమస్యలు నెలకొంటున్నాయి. 50 ఏళ్ల కిందట వేసిన స్తంభాలకు విద్యుద్దీపాలు లేక రాత్రిపూట అంధకారం నెలకుంటోందని పలువురు చెబుతున్నారు. సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని బ్యారేజీ డీఈఈ బి.సరస్వతి తెలిపారు. - న్యూస్‌టుడే, హిరమండలం

## సచివాలయ సేవల నుంచి విముక్తి కల్పించండి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: 'రెవెన్యూ శాఖ ఉద్యోగులైనప్పటికీ తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులు, పుర కమిషనర్ల ఆదేశాలతో నలిగిపోతున్నాం. వారి నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది' అని గ్రామ రెవెన్యూ అధికారులు కదం తొక్కారు. శ్రీకాకుళం నగరంలోని కలెక్టరేట్‌కు సోమవారం రాత్రి మూకుమ్మడిగా తరలివచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసు విషయాలకు వచ్చే సరికి తహసీల్దారు, డీడీవోలుగా పంచాయతీ కార్యదర్శి, పుర కమిషనర్లు వ్యవహరిస్తున్నారని.. ఎవరికి వారు తాము చెప్పిందే చేయాలంటూ వ్యవహరిస్తుండటంతో మానసిక క్షోభకు గురవుతున్నామని వాపోయారు. ప్రస్తుతం పని ఒత్తిడి తీవ్రంగా ఉందన్నారు. సచివాలయ సేవల విముక్తి కల్పించి రెవెన్యూ శాఖ పనులకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు.

## ఉద్యోగోన్నతులు కల్పించడంలో తాత్సారం

● పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు గ్రేడ్-3 ఏఎన్ఎంల ఫిర్యాదు

కలెక్టరేట్(శ్రీకాకుళం), శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. అన్ని జిల్లాల్లో గ్రేడ్-2 ఏఎన్ఎంలుగా ఉద్యోగోన్నతులు ఇచ్చారని.. ఇక్కడే తాత్సారం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో 163 వినతులు అందాయి. కలెక్టర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో లక్ష్మణమూర్తి అర్జీలు స్వీకరించారు.

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అధికారులు

● పొందూరు మండలం కృష్ణాపురం వీఆర్వో శంకరరావు ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పలువురు గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పెద్ద ఎత్తున ఆక్రమణలకు పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

● ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థి సృజన్ కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సంఘాల ఐకాస నాయకులు తైక్వాండో శ్రీను, కంఠ వేణు తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

**ఎస్పీ గ్రీవెన్స్‌కు 57 అర్జీలు..**

సమగ్ర శిక్షాలో ఉద్యోగాల పేరిట ఓ సంస్థ ప్రతినిధి సుమారు 8.50 లక్షలు తీసుకుని మోసం చేశారంటూ సంతబొమ్మాళికి చెందిన పలువురు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 57 అర్జీలు వచ్చాయి.

## సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ!

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

జనాన్ని దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజుకో పంథాను ఎంచుకుంటున్నారు. విద్యావంతుల్ని సైతం బుట్టలో పడేసి.. అవలీలగా రూ.లక్షలు దోచేస్తున్నారు. పోలీసుల ప్రజల్ని ఎంత చైతన్యపరుస్తున్నా.. వెంటనే మరో కొత్త మోసానికి తెరలేపుతున్నారు. తాజాగా నూతన సంవత్సర వేడుకల వారు మభ్యపెట్టే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

**వీటితో జర జాగ్రత్త..**

కొత్త సంవత్సరం సందర్భంగా ఉచిత కానుకలు పంపిస్తున్నామని లింక్‌లు పంపుతారు. ● బ్రాండెడ్ దుస్తులు, వస్తువులను తక్కువ ధరకే ఇస్తామని ఎర వేస్తారు ● చరవాణి నంబరుకు లాటరీ వచ్చిందంటూ ఫోన్ చేస్తారు. ● ప్రముఖ షాపింగ్ యాప్‌ల పేరిట నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి నమ్మిస్తారు.

**మోసపోతే 1930కి ఫోన్ చేయండి..**

నూతన సంవత్సరం, సంక్రాంతి పండగలను పురస్కరించుకుని ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారు అప్రమత్తంగా ఉండాలి. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయొద్దు. ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయడం, తెలియని యాప్‌లను చరవాణిలో ఇన్‌స్టాల్ చేయడం కూడా ప్రమాదమే. పొరపాటున మోసపోతే, ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే ప్రయోజనం ఉంటుందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచిస్తున్నారు.

## రూ.100కే వారసత్వ భూముల రిజిస్ట్రేషన్

● జిల్లాలో 3.70 లక్షల కుటుంబాలకు లబ్ధి

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

తాత, తండ్రి, తల్లి మరణించాక వ్యవసాయ భూములు వారసుల పేరిట రెవెన్యూ దస్త్రాల్లో నమోదు కాక భూముల మ్యుటేషన్ కావట్లేదు. దీంతో పట్టాదారు పాసు పుస్తకాలు రాక తర్వాత తరం ఇబ్బంది పడుతోంది. ఈ నేపథ్యంలో రైతులకు వారసత్వంగా సంక్రమించే వ్యవసాయ భూముల విషయమై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి పంపకం ఒప్పందాల రిజిస్ట్రేషన్ల విషయంలో మార్పులు చేస్తూ రూ.10 లక్షల లోపు విలువైన వ్యవసాయ భూమిని రూ.100కే రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశాన్ని కల్పిస్తూ జీవో జారీ చేసింది.

జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని ఇది అమల్లోకి వచ్చింది. వారసులు సంబంధిత ధ్రువపత్రాలతో అధికారులను సంప్రదిస్తే ప్రక్రియ పూర్తి చేస్తారు. ఈ నిర్ణయంతో జిల్లాలోని మ్యుటేషన్, 1బీలు లేక అవస్థలు పడుతున్న 3.70 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది.

**అప్పట్లో వైకాపా బాదుడు..**

ఆస్తిలో భాగం పంపిణీ రిజిస్ట్రేషన్‌లో 2021 నవంబరుకు ముందు హెచ్చువాటాకు మినహాయింపు ఉండేది. రూ.30 లక్షల విలువైన ఆస్తిని ముగ్గురు కుటుంబ సభ్యులు సమానంగా పంచుకుంటే అందులో రూ.10 లక్షలు మినహాయించి మిగిలిన రూ.20 లక్షలపై 1 శాతం స్టాంపు రుసుం చెల్లించాలి. భాగం పంపిణీ సమానంగా లేకున్నా మేజర్ విలువ కలిగిన ఆస్తికి మినహాయింపు ఇచ్చి మిగిలిన ఇద్దరి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువపై స్టాంపు రుసుములు వసూలు చేసేవారు. వైకాపా స్టాంపు రుసుమును 3 శాతానికి పెంచింది. అన్నింటికీ స్టాంపు రుసుం వసూలు చేసేలా ఉత్తర్వులిచ్చింది.

**వర్తింపు ఇలా..**

- తండ్రి వీలునామా రాయకుండా మరణించి, ఆయన పేరున 1బీ ఉండాలి.
- ఆ ఆస్తిని అతని భార్యతో సహా వారసులంతా పంచుకోవాలి.
- తండ్రి మరణ ధ్రువపత్రం, వారసులకు సంబంధించిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ సమర్పించాలి.
- భూమి విలువ రూ.10 లక్షలలోపు ఉంటే రూ.100 స్టాంపు డ్యూటీ, రూ.1000 ఫీజు, రూ.10 లక్షల కంటే ఎక్కువ విలువ ఉన్నా రూ.వెయ్యి స్టాంపు డ్యూటీ, రూ.వెయ్యి ఫీజు చెల్లించాలి.
- రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆటో మ్యుటేషన్ జరుగుతుందని, వారసత్వ భూములను రిజిస్ట్రేషన్‌కు అర్హులైనవారు సంబంధిత పత్రాలతో అధికారులను సంప్రదించాలని జిల్లా రిజిస్ట్రార్ ఎ.నాగలక్ష్మి తెలిపారు.

## అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు హరీష్



హిరమండలం, న్యూస్‌టుడే: గొట్ట గ్రామానికి చెందిన బత్తుల హరీష్ అండర్-23 విభాగంలో అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. దిల్లీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 28 వరకు పోటీలు జరిగాయి. ఫైనల్స్‌లో ఏపీ జట్టు ఉత్తరప్రదేశ్‌తో తలపడింది. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హరీష్‌ను మేలో శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు సెలక్టర్లు ఎంపిక చేశారు.

## ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

గార (అంపోలు), న్యూస్‌టుడే: ఖైదీలందరూ సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. గార మండలం అంపోలు సమీపంలో జిల్లా కేంద్ర కారాగారాన్ని 'బోర్డు ఆఫ్ విజిటర్స్' సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. నిబంధనల మేరకు దస్త్రాలు పరిశీలించారు. కేసు విచారణకు హాజరు కాని వారి వివరాలు, గరిష్ఠ శిక్షా కాలంలో అండర్ ట్రయల్ ఖైదీల సమాచారాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తగినంత న్యాయ ప్రాతినిధ్యం లేకపోతే బెయిల్ దరఖాస్తుకు, ఇతర ఉపశమనాలు పొందే అవకాశం కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.హరిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర కారాగారాన్ని సందర్శిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఉన్నతాధికారులు

(c) eenadu

# క్రికెట్ విజేతలు ఆర్జీయూకేటీ, ఐతమ్..

జూనియర్, సీనియర్స్ విభాగాల్లో సత్తా చాటిన జట్లు

ఉత్సాహంగా ముగిసిన ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025 క్రికెట్ టోర్నమెంట్

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, చిలకపాలెంలో శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025' క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా ముగిసింది. ఆరు రోజులుగా నిర్వహించిన పోటీల్లో ఆయా కళాశాల జట్లు నువ్వానేనా అన్నట్లుగా పోటీ పడ్డాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో సీనియర్ విభాగంలో టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల, జూనియర్ విభాగంలో ఎచ్చెర్ల ఆర్జీయూకేటీ జట్లు విజేతలుగా నిలిచాయి. చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల, నరసన్నపేట పద్మావతి జూనియర్ కళాశాల జట్లు ద్వితీయ స్థానం సాధించాయి.

టాస్ వేసి సీనియర్స్ తుది పోటీలను ప్రారంభిస్తున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డీజీఎం రావుల రవీంద్ర

## ఆర్జీయూకేటీ అదుర్స్..

జూనియర్ విభాగంలో ఆఖరి పోరులో నరసన్నపేట పద్మావతి జూనియర్ కళాశాల, ఎచ్చెర్ల (శ్రీకాకుళం క్యాంపస్) ఆర్జీయూకేటీ జట్లు పోటీ పడ్డాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పద్మావతి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 59 పరుగులు సాధించింది. ఆర్జీయూకేటీ జట్టు 2 వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసి విజయం సాధించింది. 2 ఓవర్లలో 6 పరుగులిచ్చి.. 5 వికెట్లు సాధించిన ఎస్.సాయిగణేశ్ ఉత్తమ బౌలర్‌గా నిలిచాడు.

హోరాహోరీగా సాగుతున్న తుది పోరు

## బ్యాటింగ్ చేసిన డీఎస్పీ

జెమ్స్‌హాస్పిటల్ రాగోలు

జూనియర్స్ తుది పోటీలను డీఎస్పీ సీహెచ్ వివేకానందరెడ్డి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో ఫైనల్స్‌ను ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ డీజీఎం రావుల రవీంద్ర టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ -2025' క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఎస్పీ మహేశ్వరరెడ్డి బహుమతులు అందజేశారు. ఉత్తమ బ్యాట్స్‌మన్, బౌలర్, ఫీల్డర్లను అభినందిస్తూ డీఎస్పీ వివేకానంద నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రకటించగా ఎస్పీ క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. యాళ్ల పోలినాయుడు, 'ఈనాడు' శ్రీకాకుళం యూనిట్ ఇన్‌ఛార్జి షేక్ కాలేషా వలి తదితరులు పాల్గొన్నారు.

బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ సీహెచ్ వివేకానంద

EENADU SPORTS LEAGUE 2025


Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET

Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"

Beverage Partner: CMR SHOPPING MALL The joy of life

Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in

Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)

Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT

TV Partner: ETV ఆంధ్ర ప్రదేశ్

Organised by ఈనాడు


## ఐతమ్ సూపర్ విజయం..

సీనియర్ విభాగంలో చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల.. టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య తుది పోరు నువ్వా.. నేనా అన్నట్లు సాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఐతమ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 106 పరుగులు సాధించింది. ఆ తర్వాత శ్రీ శివానీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 106 పరుగులు సాధించడంతో మ్యాచ్ టై అయింది. సూపర్ ఓవర్‌లో శ్రీ శివానీ జట్టు 5 పరుగులు చేయగా.. ఐతమ్ క్రీడాకారుడు బి.తనూజ్‌కుమార్ సిక్స్ కొట్టి 8 పరుగులతో జట్టుకు విజయం అందించాడు. 5 సిక్స్‌లు, 4 ఫోర్లతో 63 పరుగులు సాధించిన బి. తనూజ్ కుమార్ ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు.

## ఈనాడు చొరవ అభినందనీయం

ఆటల్లో గెలుపోటములు సహజం. వాటి నుంచి సమన్వయం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి. సమాజంలో ఎలా నడవాలో అలవర్చుకోవాలి. యువతను ప్రోత్సహిస్తూ ఆటలపై ఆసక్తి పెంపొందించేలా ఈనాడు సంస్థ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం. – ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్

ఉత్తమ బ్యాట్స్‌మెన్

తనూజ్‌కుమార్

ఉత్తమ బౌలర్

సాయిగణేష్

ఉత్తమ ఫీల్డర్

జయరాజ్

సీనియర్స్

సీనియర్ విభాగంలో విజేతగా నిలిచిన టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డీజీఎం రావుల రవీంద్ర, ఈనాడు శ్రీకాకుళం యూనిట్ ఇన్‌ఛార్జి షేక్ కాలేషా వలి

సీనియర్ విభాగంలో ద్వితీయస్థానం సాధించిన చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

జూనియర్స్

జూనియర్ విభాగంలో విజేతగా నిలిచిన ఎచ్చెర్ల ఆర్జీయూకేటీ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, రావుల రవీంద్ర, యాళ్ల పోలినాయుడు

జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన నరసన్నపేట పద్మావతి జూనియర్ కళాశాల జట్టు

# ఉద్యమాలను అణచి వేయడానికి కేంద్రం కుట్రలు

## సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఉద్యమాలను అణచి వేయడానికి కేంద్రం కుట్రలు పన్నుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. గతంలో నమోదైన ఓ కేసు విచారణకు సోమవారం శ్రీకాకుళం నగరంలోని జిల్లా కోర్టుకు హాజరైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మోదీ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చడానికి 50 ఏళ్ల నాటి ఉద్యమాలు, వాటి ఫలితాలు, వాటిని నడిపించే వ్యక్తుల వివరాలు కావాలని డీజీపీలకు కేంద్రం లేఖలు రాసింది. ఇది ప్రజాస్వామ్య హక్కుల్ని కాలరాయడమే. జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరు ఎందుకు తొలగించారో అడిగితే చెప్పలేకపోతున్నారు. ఈ నిర్ణయం స్వాతంత్ర్య సమరయోధులను తక్కువ చేయడమే. మోదీ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలి. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేసే యోచన విరమించుకోవాలి. అమరావతిలో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు 1,500 ఎకరాలు అవసరమని చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించడం హాస్యాస్పదం. అంత పెద్ద రైల్వేస్టేషన్ ప్రపంచంలో ఎక్కడైనా ఉంటుందా? అభివృద్ధికి వేల ఎకరాలు కావాలని అనడమే తప్ప ఎక్కడా ప్రగతి లేదు. రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వారి సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో నిర్మించి అక్కడే కార్గో విమానాశ్రయం నిర్వహిస్తే సరిపోతుంది. పచ్చని ఉద్దానంలో కార్గో విమానాశ్రయం నిర్మాణానికి వేల ఎకరాలు కావాలనడం హాస్యాస్పదంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినాయుడు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) రాష్ట్ర కార్యదర్శిగా పడాల తమ్మినాయుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేడాడ ప్రభాకరరావు, గురువు శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల కడపలో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో జిల్లాకు సముచిత స్థానం కల్పించారని పేర్కొన్నారు. తమ్మినాయుడు గతంలో జిల్లా అధ్యక్షుడిగా పని చేశారని గుర్తు చేశారు. లావేరు మండలం బుడుమూరులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారన్నారు.

## చికెన్ ధరలు

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రెస్‌డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 165 | 285 | 305 |

# వైద్య నిపుణులతో సేవలు అభినందనీయం

'ఈనాడు-ఈటీవీ భారత్' ఆధ్వర్యంలో విజయవంతంగా మెగా వైద్య శిబిరం

ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బస్సు సౌకర్యం కూడా లేని గ్రామాల్లో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి, వైద్యనిపుణులతో సేవలందించడం అభినందనీయమని తహసీల్దారు ఎన్. వెంకటరావు అన్నారు. 'ఈనాడు-ఈటీవీ భారత్' ఆధ్వర్యంలో ఆంధ్ర, ఒడిశా సరిహద్దు మండపల్లి గ్రామంలో సోమవారం మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మండపల్లి, దేవులమద్దిలి, లక్ష్మీపురం, మునిభద్ర, బుడ్డెపుపేట గ్రామాల ప్రజలు వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి తహసీల్దారు, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి వైద్యాధికారి డా.పాతిర్ల దేవేంద్రరెడ్డి మందుల పంపిణీ చేశారు. ఈదుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.వెచ్చా సంతోష్, పట్టణ ప్రముఖ వైద్యులు డా.జీవీ సుబ్బారెడ్డి, డా.నర్తు శేషగిరిలతోపాటు తోటూరు వైద్య నైపుణ్య కేంద్ర అధ్యక్షుడు డా.సంతోష్ సాహు వైద్య సేవలందించారు. 104 సంచార వైద్యాలయ అధికారి (డీఈవో) రాజేశ్వరి, రాంబాబు, బెల్లుపడ ప్రాథమిక వైద్యాలయం ఫార్మసిస్టు రఘునాథరావు, మండపల్లి ఎంఎల్‌హెచ్‌పీ హరిత, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు లక్ష్మి, ఝాన్సీ, కమల, పద్మ సేవలందించారు. సంభవామి యుగేయుగే యువజన సంఘ అధ్యక్షుడు రామారావు, మురళీపండా, శ్రీశారద విద్యాలయ విద్యార్థులు సహకారం అందించారు.

సేవలందిస్తున్న వైద్యులు జీవీ సుబ్బారెడ్డి, నర్తు శేషగిరి

మందుల పంపిణీ ప్రారంభిస్తున్న తహసీల్దారు వెంకటరావు, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి వైద్యాధికారి పాతిర్ల దేవేంద్రరెడ్డి, తోటూరు వైద్య నైపుణ్య కేంద్ర అధ్యక్షుడు సంతోష్ సాహు

## భళా.. సూక్ష్మ కళ..!

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక సంతపేటకు చెందిన సూక్ష్మచిత్ర కళాకారుడు వీరముల్లు శివనాగ నరసింహ ఆచారి పెన్సిల్ ముల్లుపై ఒక వైపు వేంకటేశ్వరస్వామి, మరో వైపు అలివేలుమంగమ్మ బొమ్మలు చెక్కారు. దీనికి గంట సమయం పట్టిందని ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, నరసన్నపేట

## ఆకతాయిల దుశ్చర్య

చేతి భాగం దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహం

శ్రీకాకుళం నేర వార్తా విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగర పరిధి హయాతీ నగరం బాలాజీ నగర్‌లో ఆకతాయిలు అంబేడ్కర్ విగ్రహ చేతి భాగాన్ని విరగ్గొట్టారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. సోమవారం స్థానికులు గుర్తించి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ పైడపునాయుడు, ఒకటో పట్టణ ఎస్సై హరికృష్ణ ఘటనా స్థలాన్ని సందర్శించారు. సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. విగ్రహం వద్ద మద్యం తాగుతున్న కొందరు యువకులు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వారు చెప్పిన వివరాల ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

### నిందితులను అరెస్టు చేయాలి

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తెదేపా నాయకులు కవ్వాడి సుశీల, నాగేంద్ర, కవ్వాడి రవి, బాలామణి, జనసేన నాయకుడు వరప్రసాద్, దళిత నాయకుడు తైక్వాండో శ్రీను తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి మాట్లాడారు.

## ఆపస్ కాలమానిని ఆవిష్కరణ

ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్య బోధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. శ్రీకాకుళం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కాలమానిని, దైనందిని ఆవిష్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు మురళి, జిల్లా కార్యదర్శులు రాజు, రవిభట్లు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

## ఏపీఎస్ఐడీసీ ఈఈగా కామరాజు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) శ్రీకాకుళం డివిజన్ ఈఈగా మనిగాం కామరాజును (పూర్తి అదనపు బాధ్యతలు) నియమిస్తూ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈయన శ్రీకాకుళం సబ్ డివిజన్ డీఈగా పనిచేస్తున్నారు. ఇంతకు ముందు ఈఈగా పనిచేసిన సుబ్రహ్మణ్యం పదోన్నతిపై విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈగా వెళ్లిన సంగతి తెలిసిందే.

## కార్గో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనలు రద్దు చేయాల్సిందే

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కార్గో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనలు రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని వామపక్షాల నాయకులు పేర్కొన్నారు. కాశీబుగ్గలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పచ్చని ఉద్దానంలో విధ్వంసం చేయడానికి ఎందుకు సిద్ధపడుతున్నారని ప్రశ్నించారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కోసం పాలకులు ప్రయత్నించడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు భూములు కట్టబెట్టి ప్రజలను నిరాశ్రయులుగా మార్చే కుట్ర జరుగుతోందన్నారు.


# స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI స్ట్రెస్స్‌డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 98482 49289.

## ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు భౌతిక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : మెస్సర్స్ శ్రీ విఘ్నేశ్వర దాల్ మిల్, ప్రొప్రయిటర్ : శ్రీ తర్ర జయరామ్, సర్వే నెం.117/27, శ్రీ ముఖలింగం రోడ్డు, బుడితి, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532247. శ్రీ తర్ర జయరామ్, తండ్రి : సత్యనారాయణ, డి.నెం.1-144, బిసి కాలనీ, కొండపోలవలస, జాలుమూరు, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532427. డిమాండ్ నోటీసు తేది: 17-09-2024

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.16-09-2024 నాటికి రూ.1,36,39,413/- + భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.22-12-2025 నాటికి రూ.1,51,15,645/- + తేది.23.12.2025 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు:

శ్రీ తర్ర జయరామ్, తండ్రి : సూర్యనారాయణ గారిచే తనఖా పెట్టబడిన స్థిరాస్తి: ఫ్యాక్టరీ భూమి మరియు భవనం : శ్రీకాకుళం జిల్లా, సారవకోట మండలం, బుడితి గ్రామం, ఆర్.ఎస్.నెం.117/27 (పాత నెం.753/3) లోని 2226.4 చ॥గ॥లు ఏరియా విస్తీర్ణంలో ఫ్యాక్టరీ షెడ్ మరియు ఆర్‌సిసి భవనంతో గల యావత్తు ఆస్తి రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.874/2013, తేది.28.05.2013 ప్రకారం శ్రీ తర్ర జయరామ్, తండ్రి : సూర్యనారాయణ గారి పేరున కలదు. ఆస్తికి హద్దులు: తూర్పు : వాన సింహాద్రి, తర్ర ఆనంద్ మరియు ఇతరుల భూమి, పడమర : కొర్ను అప్పన్న మరియు ఇతరుల భూమి, దక్షిణం : రోడ్డు, ఉత్తరం: తర్ర అప్పలరామయ్య గారి భూమి.

రిజర్వు ధర : రూ.1,03,00,000/- ధరావత్తు : రూ.10,30,000/- బిడ్ పెంపుదల : రూ.25,000/-

ఇ-వేలం తేదీ : 20-01-2026 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది: 30-12-2025 నుండి 19-01-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:23-12-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


## విద్యుదాఘాతంతో ఒకరి మృతి, నలుగురికి గాయాలు

మోటకొండూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ కార్మికుడు మృతి చెందగా.. నలుగురికి గాయాలైన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం దిలావర్‌పూర్‌లోని ఓ వెంచర్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై డి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన పోలంకి సీతారాం(45), మరో నలుగురు మండల కేంద్రంలోని 11కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఇక్కుర్తిలో నూతనంగా నిర్మించిన రైస్ మిల్లుకు కొత్తగా విద్యుత్తు లైను పనులకు వచ్చారు. ఈ క్రమంలో వారు విద్యుదాఘాతానికి గురయ్యారు. వీరిని ఆలేరులోని ఏరియా ఆసుపత్రికి తరలించగా.. పోలంకి సీతారాం అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మున్నా అన్సారి, బజ్రంగి, ముక్లే మోసిన్, సర్వయ్యలకు గాయాలవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరంతా మూసాపేటలో నివాసం ఉంటున్నారు. కొన్ని రోజులుగా అక్కడి నుంచి వచ్చి పనులు చేసి మళ్లీ తిరిగి వెళ్తుంటారు. గాయాలైన వారిలో ఇద్దరు పశ్చిమ బెంగాల్, ఒకరు శ్రీకాకుళం, ఒకరు కామారెడ్డి జిల్లా వాసులని సమాచారం.

## మహిళను మోసగించడంపై కేసు నమోదు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తనను ఓ వ్యక్తి మోసం చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ సన్యాసినాయుడు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహిళను ఒడిశాలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి సుమారు రూ.1.70 లక్షలు తీసుకున్నట్లు బాధితురాలు చెప్పారు. ఇటీవల వివాహం చేసుకోనని తెల్చి చెప్పడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సోమవారం పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గ్రామాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు.

## న్యాయవాదులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయండి

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: ప్రభుత్వం న్యాయవాదులకు ఆరోగ్య కార్డులు, ప్రమాద బీమా కల్పించాలనే అంశంపై జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రధాన తీర్మానం చేశారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం సంఘ అధ్యక్షుడు తంగి ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు నెలవారీ ఆదాయ, వ్యయాలను సభ్యులకు వివరించారు. జిల్లా న్యాయస్థానాల సముదాయంలో వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సంఘ ఉపాధ్యక్షుడు ఇప్పిలి సీతరాజు, కార్యదర్శులు మోటూరు భవానీ ప్రసాద్, కొమ్ము రమణమూర్తి, త్రిపురాన వరప్రసాద్, గురుగుబెల్లి వనజాక్షి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

తీర్మానం చదివి వినిపిస్తున్న జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాదరావు


ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

BUSINESS OFFER

ప్రకటన చిన్నదైనా స్పందన అతిపెద్దగా ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

# పలాస

• పలాస • ఇచ్ఛాపురం

## పోటీతత్వం అలవడాలి

విద్యార్థులు పోటీతత్వంతోనే ఏ రంగంలోనైనా రాణించగలరని విద్యావాహిని జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ పి.తిరుమలరావు అన్నారు. కళాశాల ఆవరణలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. వి.సరోజిని (ద్వితీయ ఇంటర్), పి.ధనుష్ (ద్వితీయ), ఏ.సాయి భాస్కర్ (ప్రథమ) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు కరస్పాండెంట్ పి.తిరుమలరావు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఏవో గిరిబాబు, అధ్యాపకులు జి.ధనంజయరెడ్డి, పి.సంధ్యారాణి, ఖగేశ్వరరావు, రాములు, పార్వతీశం పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పలాస

## డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ

హరిపురం (మందస), న్యూస్‌టుడే: డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణానికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసుశాఖ నేతృత్వంలో హరిపురంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డ్రగ్స్‌తో వచ్చే అనర్థాల గురించి వివరించారు. ముందుగా కొర్రాయిగేటు నుంచి హరిపురం వరకు జరిగిన అభ్యుదయం సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు యాత్ర చేపడుతున్న వారిని అభినందించారు. కాశీబుగ్గ డీఎస్పీ షేక్ షహబాద్ అహ్మద్, సీఐ తిరుపతిరావు, మందస ఎస్సై కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

హరిపురంలో అభ్యుదయం ర్యాలీలో పాల్గొన్న నేతలు, అధికారులు, విద్యార్థులు

## నాటుసారాతో ముగ్గురి అరెస్టు

సోంపేట, న్యూస్‌టుడే: కంచిలి, మందస మండలాల్లో సోమవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి నాటుసారా స్వాధీనం చేసుకున్నామని సోంపేట ఎక్సైజ్ సీఐ జి.వి.రమణ తెలిపారు. కంచిలి మండలం ఎం.ఎస్.పల్లిలో 40 నాటుసారా ప్యాకెట్లతో రత్నాల లక్ష్మి, మందస మండలం బహాడపల్లిలో 5 లీటర్ల నాటుసారాతో అప్పలస్వామి, నాటుసారా సరఫరా చేస్తున్న చాపరాయికి చెందిన సవర దుర్యోధనలను అరెస్టు చేసి సోంపేట కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ తెలిపారు. ఎస్సైలు జాన్‌ప్రసాద్, కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## నెలరోజులపాటు అల్పాహారం సరఫరా

ఎర్రముక్కాం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పది విద్యార్థులకు నెలరోజులపాటు అల్పాహారం అందించేందుకు సోంపేటకు చెందిన ఇటుకల వ్యాపారి జీకే నాయుడు ముందుకొచ్చారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదో తరగతి విద్యార్థులు పస్తులుండే అవసరం లేకుండా సత్తా చాటేదెలా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. సోమవారం హెచ్ఎం అనంత్ ఆధ్వర్యంలో నాయుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్, మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడు తమ్మారావు బిస్కెట్లు, సమోసా అందజేశారు. - న్యూస్‌టుడే, సోంపేట

## కొత్తగా.. సమగ్రంగా.. రాజముద్రతో

• భూమి హక్కు పత్రాల పంపిణీకి కూటమి ప్రభుత్వం చర్యలు

- న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం, కవిటి గ్రామీణం

గత వైకాపా ప్రభుత్వం భూ-రీసర్వే చేపట్టింది. అప్పట్లో ఆ పార్టీ నాయకులు వందేళ్ల నాటి భూ సమస్యలు పరిష్కరిస్తున్నామని ఊదరగొట్టారు. ప్రత్యేక యంత్రాలు, సిబ్బందిని నియమించి హడావుడిగా రీసర్వే చేసి కొన్నాళ్లకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేశారు. వాటిలో పొలం కొలతల్లో హెచ్చుతగ్గులు, విస్తీర్ణంలో మార్పులు, కొనుగోలు, వారసత్వం వంటి పేర్లలో తప్పులు దొర్లాయి. మరో పక్క బ్యాంకుల్లో రుణం తీసుకోవాలన్నా, పొలం కొనుక్కోవాలన్నా, అమ్ముకోవాలన్నా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తప్పులు సరిచేయాలని కోరుతూ రైతులు కాళ్లు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. చివరికి ప్రయోజనం లేక మిన్నకుండిపోయారు. దీనికి తోడు పుస్తకంపై అప్పటి సీఎం జగన్ ముఖచిత్రం, నవరత్నాల లోగో ముద్రించడంతో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

✤ అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించి అధికారుల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. అర్జీల ఆధారంగా రెవెన్యూ అధికారుల సాయంతో సమస్యలు పరిష్కరించింది. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు గతంలో మాదిరి పట్టాదారు పాసు పుస్తకాలపై రాజముద్ర వేసి సంబంధిత రైతులకు అందించనుంది.

### గ్రామసభల్లో రైతుల చేతికి..

✤ ఇందులో భాగంగా జనవరి 2 నుంచి 9 వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా పాసుపుస్తకాలు పంపిణీ చేపట్టనున్నారు. రెవెన్యూ అధికారులు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. 'రాష్ట్ర ప్రభుత్వం మరో పక్క భూసమస్యలు లేకుండా వాటిని పరిష్కరించేందుకు పూనుకుంది. ఈ క్రమంలో అప్పట్లో రీసర్వే చేయని గ్రామాల్లో ప్రస్తుతం సర్వే చేయిస్తోందని వజ్రపుకొత్తూరు భూ రీసర్వే డీటీ కె.శ్రావణ్‌కుమార్ తెలిపారు.

**నియోజకవర్గాల వివరాలు**

| మండలం | పంచాయతీలు | రెవెన్యూ గ్రామాలు | వచ్చిన పుస్తకాలు |
|---|---|---|---|
| ఇచ్ఛాపురం | 21 | 28 | 9,752 |
| కవిటి | 23 | 21 | 5,900 |
| సోంపేట | 23 | 38 | 6,923 |
| కంచిలి | 31 | 58 | 12,080 |
| పలాస | 19 | 36 | 8,695 |
| మందస | 41 | 92 | 7,674 |
| వజ్రపుకొత్తూరు | 37 | 59 | 5,005 |

## చెత్త నుంచి సంపదతో అదనపు ఆదాయం

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐవీ రమణ అన్నారు. నువ్వలరేవు సచివాలయాన్ని సందర్శించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించడంపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచి పూర్ణ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

మంత్రికి సమస్యలు వివరిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెదేపా పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షుడు సీపాన వెంకటరమణ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని క్యాంపు కార్యాలయంలో కవిటి మండల నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. మంత్రి స్పందిస్తూ సమస్యలపై దృష్టిసారిస్తామన్నారు. మండలాధ్యక్షుడు కృష్ణారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ చినబాబు, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజు, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రకాష్‌రావు, వెంకటరమణ పాల్గొన్నారు.

## ప్రమాద సంకేతంగా చెట్టు

ఇచ్ఛాపురం పుర పరిధి గోర్జీవీధిలో విద్యుత్తు తీగల స్తంభానికి ఎదిగిన చెట్టు ప్రమాద సంకేతంగా మారింది. గాలి వీచినా, చినుకులు పడినా ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్టుకొమ్మలు కత్తిరించాలని కోరుతున్నారు. సమస్యను విద్యుత్తు ఉపకేంద్ర ఏఈ కేవీ గోవిందరావు వద్ద ప్రస్తావించగా నిర్వహణ పనుల సమయంలో అవసరమైన చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## పొలం గట్టే ప్రధాన దారి

కొండపూరు పంచాయతీ తుంబవానిపేటకు నేటికీ కనీస రహదారి సౌకర్యం లేదు. దశాబ్దాలుగా పొలం గట్టునే కొంత వెడల్పు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ 35 నివాసాలుండగా.. 100 మంది వరకు నివసిస్తున్నారు. 108, 104 వంటి సేవలు వీరికి కరవయ్యాయి. గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలంటూ కోరుతున్నారు. దీనిపై పీఆర్ జేఈ నాగభూషణ్‌ను వివరణ కోరగా రహదారి అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

## స్తంభం వాలింది.. సరిచేయండి..

చినవంక ప్రాథమిక పాఠశాల ప్రహరీపై విద్యుత్తు స్తంభం వాలి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. పాత స్తంభం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ముఖ ద్వారం నుంచి వెళ్లాలంటే భయపడుతున్నామని విద్యార్థులు వాపోయారు. స్తంభం తొలగించేలా చొరవ తీసుకుంటున్నట్లు విద్యుత్తు శాఖ మండల ఏఈ వెంకటరమణ తెలిపారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

## ఈ భవనం పూర్తయ్యేదెప్పుడో..?

కవిటి మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద పదేళ్ల కిందట సర్వశిక్షా అభియాన్ పథకం కింద అదనపు భవనం మంజూరైంది. పనులు ప్రారంభించి సగంలోనే వదిలేశారు. దీంతో ఎమ్మార్సీలో చిన్న గదిలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. దీనిపై ఎంఈవో ధనంజయ మజ్జిని వివరణ కోరగా అసంపూర్తి భవనంపై ఉన్నతాధికారులకు తెలియజేశామని, నిధులు రాగానే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

? ఇచ్ఛాపురం పుర పరిధి గొల్లవీధి చివరలో రహదారి ఇబ్బందికరంగా ఉంది. గతంలో వేసిన రోడ్డు పాడైంది. **- ఎస్వీ రమణ, ఇచ్ఛాపురం** ★ పుర పరిధిని గుర్తించి, సమస్యను పరిష్కరిస్తాం. **- రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం** - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం కంట్రగాడలోని ప్రధాన వీధిలో డ్రైనేజీలు శుభ్రం చేయాలి: **గ్రామస్థులు** ★ రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం: **సద్గుణ, పంచాయతీ కార్యదర్శి, రెంటికోట** - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

? మండపల్లి ప్రధాన కూడలి వద్ద మురుగు నిల్వ ఉంటోంది. **- పరమేశ్, స్థానికుడు**

★ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి మురుగు తొలగిస్తాం. **- మధు, పంచాయతీ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

## ఆక్రమణలు తొలగిస్తాం

సీతమ్మగుడి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, పుర కమిషనర్ శ్రీనివాసులు

పలాస, న్యూస్‌టుడే: ప్రభుత్వ కాలువలు, భూములను ఆక్రమిస్తే వాటిని తొలగించేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, పుర కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. పలాస పట్టణ శివారు సీతమ్మ దేవాలయం రహదారి, వంశధార బట్టి ఆక్రమణలకు గురవుతున్నాయనే ఫిర్యాదులపై సోమవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. పట్టణ ప్రణాళిక నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలన్నారు. సర్వేయర్లు గిరిప్రసాద్, చంద్రశేఖర్, పట్టణ ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

## క్రియాశీలక పౌరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

సోంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులను క్రియాశీలక పౌరులుగా తీర్చిదిద్దడంతోపాటు లక్ష్యం కోసం పనిచేసే విద్యార్థుల సమూహం తయారు చేయడమే ఎక్టిజన్ క్లబ్ ప్రధాన ధ్యేయమని ఉత్తరాంధ్ర ఒడియా డీఐ డీపీ చౌదరి, ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు అన్నారు. సోమవారం సోంపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మాక్ పంచాయతీ, లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్, స్టార్ స్టేట్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గత నెలలో టాటా గ్రూపు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేత విద్యార్థులతో ఉపాధ్యాయులు

## రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కవిటి, న్యూస్‌టుడే: రాజపురం ఉపకేంద్రం పరిధిలో బుధవారం 11కేవీ మరమ్మతు పనుల నిమిత్తం బుధవారం వింధ్యగిరి, ఖైరిపురం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్తుశాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. గృహ, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

మందస, కిల్లోయి, పట్టులోగాం, చినకోష్ట ఉన్నత పాఠశాలల్లో ఏపీటీఎఫ్ మండల సభ్యులు సోమవారం 2026 సంవత్సర దైనందిని, కాలమానిని ఆవిష్కరించారు. భీమారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, మందస

## ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మకరాంపురంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో సోమవారం సోంపేట ఎఫ్‌సీసీ, బ్రహ్మపుర జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. సోంపేట జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్రహ్మపుర జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 145 పరుగులు చేయగా.. సోంపేట ఎఫ్‌సీసీ జట్టు 15.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. సోంపేట జట్టుకు చెందిన వేణుకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ వరించింది.

### వాజ్‌పేయీ ఆశయాలు ముందుకు తీసుకెళ్దాం

ఇచ్ఛాపురం: భారతదేశం గర్వించే నాయకుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ అని భాజపా నాయకులు పేర్కొన్నారు. అటల్ స్మృతి సమ్మేళన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక వీకేపీ సమావేశ మందిరంలో జిల్లా కోశాధికారి కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు ఢిల్లీ, జిల్లా మాజీ అధ్యక్షుడు రవిబాబ్జి పాల్గొన్నారు.

## అదనపు విద్యుత్తు ఫీడర్ ఏర్పాటు

సోంపేట: సోంపేట, జింకిభద్ర, బెంకిలి పంచాయతీలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు వీలుగా 11 కేవీ అదనపు ఫీడర్ ఏర్పాటు చేశారు. సోమవారం సోంపేట విద్యుత్తు ఉపకేంద్రంలో రూ.22 లక్షలతో ఏర్పాటు చేసిన అదనపు ఫీడర్‌ను ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ప్రారంభించారు. శ్రీకాకుళం కన్‌స్ట్రక్షన్ ఈఈ ఆనంద్, డీఈఈలు జగదీష్, నిరంజన్, ఏఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కౌశల్ పోటీల్లో ప్రతిభ

మందస, న్యూస్‌టుడే: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో సొండిపూడి విద్యార్థులు ఐదో స్థానంలో నిలిచి ప్రతిభ సాధించారు. పోటీల్లో ఈ పాఠశాల నుంచి విద్యార్థులు టి.నిఖిత, కె.ఉష, ఐ.ధనలక్ష్మి పాల్గొన్నారు. ప్రతిభ చాటిన వీరిని ప్రధానోపాధ్యాయుడు సుందర్ సోలమన్ సోమవారం అభినందించి ప్రోత్సాహకాలు అందించారు.

## వాక్చాతుర్యం.. నడత.. ఉన్నతికి మార్గాలు

ఇచ్ఛాపురం: ఉన్నతావకాశాలు అందుకునేందుకు నడత, వాక్చాతుర్యం, భావవ్యక్తీకరణ, స్నేహశైలి లక్షణాలు అవసరమని వ్యక్తిత్వ నిపుణులు కిరణ్, గౌతమి అన్నారు. స్వర్ణభారతి డిగ్రీ కళాశాల ఆవరణలో సంస్థ అధ్యక్షుడు చాట్ల తులసీదాస్ అధ్యక్షతన సోమవారం కెరీర్ ఛైన్‌పై పవర్ స్కిల్స్ అనే నైపుణ్య సదస్సును నిర్వహించారు.

### గణితంపై పట్టు సాధించాలి

కంచిలి: విద్యార్థులు బాల్యం నుంచే గణితంపై పట్టు సాధిస్తేనే గణిత అవధానిగా రాణించగలరని అవధాని మడ్డు తిరుపతిరావు తెలిపారు. సోమవారం గోకర్ణపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు కె.రాంబాబు ఆధ్వర్యంలో గణిత అవధానం నిర్వహించారు.

**ఉపాధి కల్పనే లక్ష్యం..** ఇచ్ఛాపురం గ్రామీణం: ఉపాధి పథకం ద్వారా వేతనదారులకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచి తులసీరామ్ తెలిపారు. తులసిగాంలో సోమవారం ఉపాధి పనులు ప్రారంభించారు. క్షేత్రసహాయకుడు పురుషోత్తం, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వలసయ్య పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం

మామిడిపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న కేజీబీవీ విద్యార్థులు

సోంపేట, న్యూస్‌టుడే: మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా బారువ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ యాత్ర ఆకట్టుకుంది. రాజాం కేజీబీవీ విద్యార్థినులు మామిడిపల్లి వద్ద మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. కొర్లాంలో కళాశాలల విద్యార్థులు డ్రగ్స్ వద్దు బ్రో అంటూ నినాదాలతో హోరెత్తించారు. మామిడిపల్లి నుంచి బారువ వరకు నిర్వహించిన యాత్రలో సీఐ మంగరాజు, ఎస్సై హరిబాబునాయుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, ఏఎంసీ ఛైర్మన్ ప్రతినిధి మద్దిల నాగేషు, పలు ఉన్నత పాఠశాలలు, బారువ డిగ్రీ, జూనియర్, కొర్లాం బాలకృష్ణ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యలక్ష్మికి పూజలు

ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల్లోని అన్నదాతలు ధాన్య రాశులను లక్ష్మీదేవిరూపంగా పూజలు చేసి ఆ తరవాత బస్తాల్లోకి చేర్చి భద్రపరిచారు. ఈ సంప్రదాయం ఉత్తరాంధ్ర, ఉత్కళాంధ్ర ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ముందుగా ధాన్యాన్ని రాశిగా పోసి పూలతో అలంకరించి దానిపై లక్ష్మీనారాయణులు, ధాన్యలక్ష్మి చిత్రాలను కొలువుతీర్చి నివేదించారు. కొత్తబియ్యంతో పరమాన్నం వండి, దేవతలకు సమర్పిస్తారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## ఆర్థిక సాయం అందజేత

వజ్రపుకొత్తూరు గ్రామీణం, కవిటి గ్రామీణం: గోవిందపురం పాఠశాలలో 1989-90లో పదో తరగతి చదువుకున్న పాత్రునివానిపేటకు చెందిన కణితి బాబూరావుకు ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం రూ.26,500 ఆర్థిక సాయం అందించారు. టెక్కలి ప్రాంతానికి చెందిన నానికి పీజేపురానికి చెందిన హ్యాండ్స్ టు గెదర్ సంస్థ సభ్యులు రూ.10వేలు అందించారు. ★ రామయ్యపుట్టుగలో నాగలక్ష్మి చికిత్స నిమిత్తం కేశుపురానికి చెందిన కాళీమాత సేవా సమితి రూ.12 వేలు ఆర్థిక సాయం అందజేసింది.

## నేడు వైకుంఠ ఏకాదశి

ధనుర్మాసంలో ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని విష్ణు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పంచభేరీ క్షేత్రమైన జగన్నాథస్వామి దేవస్థానంలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామిని మంగళవారం ఉత్తర ద్వారం వద్ద కొలువు తీర్చి పూజలు చేయనున్నారు. ఉదయం 9.30 నుంచి ఉత్తరద్వార దర్శనాలు జరుగుతాయి. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పూజలందుకుంటున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామికి ఉదయం 7.30 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనాలు ప్రారంభం కానున్నాయి. బొడ్డకాళిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ప్రభాకరరావు, రేజేటి ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం/గ్రామీణం

స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి

## లబ్ధిదారులతో మర్యాదగా ప్రవర్తించండి

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారులతో మర్యాదగా ప్రవర్తించాలని ఎంపీడీవో ఎల్.త్రినాథ్, వసంత కుమార్ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. సోమవారం కవిటి, పలాస మండల పరిషత్తు కార్యాలయంలో పింఛన్ల పంపిణీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 31న చేపట్టనున్న పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డిప్యూటీ ఎంపీడీవోలు వరప్రసాద్, మెట్ట వైకుంఠరావు, ఉమాపతి, ఏవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

(c) eenadu

# టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

## ఉత్తమ సేవలందించిన వారికి గుర్తింపు

పాతపట్నం, ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: తెదేపా ప్రగతికి సేవలందించిన కార్యకర్తలకు పార్టీ ప్రత్యేక గుర్తింపునిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. సోమవారం పాతపట్నంలోని కార్యాలయంలో నియోజకవర్గంలో ఉత్తమ సేవ లందించిన 43 కార్యకర్తలకు ఆయన ప్రశంసా పత్రాలను అందించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహించ డంపై సత్కరించారు.

## నిధులు కేటాయించాలి

కొత్తూరు, న్యూస్‌టుడే: లబ్బ, పాతపాడు రహదారులు దుర్భరంగా మారాయి. దీంతో కొన్ని సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఉప ఎంపీపీ ఎల్. తులసీవరప్రసాద్, మెట్టూరు బిట్-3 సర్పంచి కొయిలాపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బిల్లింగి సంజీవరావు, కె. సంజీవరావు పేర్కొన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. నిధులు కేటాయించాలని కోరారు.

**మేమున్నాం.. మీకు తోడుగా** (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం పెద్దతామరాపల్లి కూడలి వద్ద ఆర్టీసీ బస్సులు వంతెన మీద నుంచి వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అనుసంధాన మార్గం కింద నుంచి బస్సులు నడపాలి.
– సారంగధరుడు, నౌగాం

★ టెక్కలి బస్సు డిపోకు సంబంధించి బస్సులన్నీ వంతెన కింద నుంచే నడుపుతున్నాం. సమస్యను మిగతా డిపోల మేనేజర్లకు తెలియజేస్తాం. – శ్రీనివాసరావు, మేనేజరు, ఆర్టీసీ డిపో, టెక్కలి – న్యూస్‌టుడే, నందిగాం

## క్రమశిక్షణతో ముందుకెళ్లాలి

విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రమశిక్షణతో ముందుకెళ్లాలని పాతపట్నం పరిధి కొరసవాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రామారావు అన్నారు. విద్యాలయంలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో సమకాలీన అంశాలపై క్విజ్ పోటీలు జరిగాయి. జి.ధనుష్ (9వ తరగతి), ఎస్.కీర్తన (9వ తరగతి), జి.తరుణ్ (10వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వరరావు, ఎం.రామారావు, కృష్ణారావు, కృష్ణవేణి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

# ఆదాయం అంతంతమాత్రం.. అభివృద్ధికి గ్రహణం

– న్యూస్‌టుడే, పోలాకి, జలుమూరు, సారవకోట, నరసన్నపేట

మైనర్ పంచాయతీలకు వచ్చే ఆదాయం అంతంత మాత్రం కావడంతో అభివృద్ధి పనులు కోసం నిధులు లేక గ్రామాల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. మేజర్ పంచాయతీల్లో పరిస్థితి కొంత మేర మెరుగ్గా ఉంది. మైనర్ పంచాయతీల్లో వివిధ మార్గాల్లో రావాల్సిన నిధులకు సంబంధించి బకాయిలు పేరుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు, స్థానిక పాలకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి పన్నులు వసూలు చేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ పద్ధతి రావడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. కార్యదర్శులు పన్నుల వసూళ్లకు వెళ్తే ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో ఏమీ చేయలేక బకాయిల చిట్టాలో ఎంత మొత్తం రావాలన్నది రాసి, చేతులు దులుపుకొంటున్నారు. దీనికి తోడు ఏటా ఇంటి పన్నులు 5 శాతం చొప్పున పెంచడంతో యజమానులు కూడా చెల్లించడానికి ఉత్సాహం చూపడం లేదు. దీంతో బోర్లు బాగు చేయాలన్నా, వీధుల్లో రోడ్లు వేయాలన్నా సర్పంచులకు ఏమీ పాలుపోని పరిస్థితి నెలకొంది.

సీసీ రోడ్డు లేని పోలాకి పంచాయతీలోని నరసాపురం కాలనీ

### వనరులు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులు, ఆర్థిక కమిషన్ నుంచి విడుదలయ్యే గ్రాంట్లు విరాళాలు, డిపాజిట్లు, ఇంటి పన్నులు, కాటా రుసుం, ప్రకటనలు, గ్రంథాలయ పన్నులు, లైసెన్సు ఫీజులు, రహదారి రుసుం, వ్యవసాయ భూములపై విధించే పన్ను, ఖాళీ స్థలాలపై సెస్, ఆక్రమణల ఫీజు, లే అవుట్‌లు, భవన నిర్మాణానికి ఫీజు, లైసెన్సు లేని కుక్కలు, పందులపై రుసుం, తాగునీరు పంపిణీ, కేబుల్ టీవీపై రుసుం, సంతలు, సైకిల్ స్టాండు, కబేళాలు, చేపల చెరువులు, ఇసుక వేలాలు, స్టాంపు డ్యూటీ సర్‌ఛార్జీల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది.

**నరసన్నపేట నియోజకవర్గ వివరాలు**

| మండలం | పంచాయతీలు | పన్నుల లక్ష్యం (రూ.లక్షల్లో) | వసూలు | బకాయిలు |
|---|---|---|---|---|
| జలుమూరు | 40 | 72.48 | 11.45 | 61.03 |
| నరసన్నపేట | 34 | 279.33 | 26.83 | 252.50 |
| పోలాకి | 31 | 45.47 | 4.75 | 40.72 |
| సారవకోట | 35 | 54.61 | 17.02 | 37.59 |

### కార్యదర్శులదే బాధ్యత

పంచాయతీలకు రావాల్సిన ఆదాయాన్ని వసూలు చేయాల్సింది కార్యదర్శులే. ఈ విషయాన్ని సమావేశాల్లో వారికి గుర్తుచేస్తున్నాం. బకాయిలు వల్ల వీధి దీపాలు మార్చడం, తాగునీటి కుళాయిలకు మరమ్మతులు నిలిచిపోతున్నాయి. ఇతర సౌకర్యాలు ప్రజలకు అందకుండా పోతున్నాయి. ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు వీటిపై దృష్టి పెట్టాలి.
– గోపీబాల, డీఎల్‌పీవో, శ్రీకాకుళం

## రీసర్వేపై అవగాహన

నరసన్నపేట, న్యూస్‌టుడే: కోమర్తిలో రీసర్వేపై తహసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ దస్త్రాలను సరిచేసుకోవాలని సూచించారు. ఉప తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

## రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు సమీపంలో ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో గొలియాపుట్టి గ్రామానికి చెందిన బగ్గు దాలినాయుడు, ఆయన కోడలు రాధారమ గాయపడిన విషయం తెలిసిందే. వీరు ద్విచక్ర వాహనంపై చల్లవానిపేట నుంచి జలుమూరు వెళ్తుండగా శ్రీముఖలింగం నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన రాధారమ విశాఖపట్నంలో, దాలినాయుడు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి. అశోక్‌బాబు తెలిపారు.

## ఉన్నదే ఒకటి.. అదీ శిథిలం

నందిగాం మండలంలో ఏకైక తుపాను రక్షిత భవనం ప్రకాశవిశ్వనాథపురం పంచాయతీ చెరుకుపల్లిలో ఉంది. దీనిని 1986లో నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడుతుండటంతో తుపాను సమయం వస్తే ఎక్కడ తల దాచుకోవాలో తెలియడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. మండల ఇంజినీరింగ్ అధికారితో మాట్లాడి, ప్రతిపాదనలు పంపిస్తామని ఎంపీడీవో యు. కుమార్‌సామ్రాట్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

## పక్కకు వెళ్తే కాలువలోకే..!

జలుమూరు మండలం జర్జంగి- పింద్రువాడ మార్గంలో కరకవలస మలుపు వద్ద 10 ఆర్ కాలువపై వంతెన శిథిలావస్థకు చేరింది. ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, కొత్తగా వారధి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ర.భ.శాఖ జేఈ జి.సరోజ వద్ద ప్రస్తావించగా.. చర్యలు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, జలుమూరు

## చెరువే చెత్తనిల్వ కేంద్రం

నరసన్నపేట మండలం ఉర్లాంలోని మంచి నీటి కోనేరును కొంతమంది వ్యర్థాలతో నింపేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ చెరువు గ్రామస్థులకు తాగునీటి అవసరాలకు ఉపయోగపడేది. రేవుల్లో మెట్లు శిథిలమవడంతో చెత్త వేస్తున్నారని చెబుతున్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. స్థానికులతో మాట్లాడతామని పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ చెప్పారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

## మారని వీధి దీపాల కథ

నందిగాం మండలం హరిదాసు పురంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రాత్రి, పగలు తేడా సుమారు 20 బల్బులు వెలుగుతున్నాయి. దీంతో అవి వేగంగా పాడవటమే కాకుండా, పంచాయతీకి అధికంగా బిల్లులు వచ్చే అవకాశముందని గ్రామస్థులు చెబుతున్నారు. రాత్రి మాత్రమే వెలిగేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తామని పంచాయతీ కార్యదర్శి సురేష్ స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, నందిగాం

## స్పందించారు.. ఆకలి తీర్చారు

ఈనాడు కథనానికి స్పందన

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదో తరగతి విద్యార్థులు సాయంత్రం వరకు పాఠశాలలో చదువుతున్నారు. అల్పాహారం లేక ఇబ్బందులు పడుతుండటంపై 'ఈనాడు'లో ఈనెల 19న 'సత్తువ లేకుండా సత్తా చాటేదెలా' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో సారవకోటకు చెందిన జానకి లక్ష్మణరావు స్పందించారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం బిస్కెట్లు పంపిణీ చేశారు. హెచ్ఎం ఆర్. రామకృష్ణారావు ఉన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

## గిరిజన గ్రామాలతో పంచాయతీ ఏర్పాటుచేయాలి

గ్రామసభలో పాల్గొన్న ప్రజలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: మేమువరంను కేవలం గిరిజన గ్రామాలతో ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటుచేయాలని పలువురు కోరారు. సోమవారం మేమువరంలో జరిగిన పంచాయతీ విభజన సమావేశంలో వారు పాల్గొన్నారు. పంచాయతీలో 12 గ్రామాలుండగా, 10 గ్రామాల్లో గిరిజనులే అధికమని, ప్రత్యేక పంచాయతీ లేకపోవడంతో ఐటీడీఏ నుంచి కొన్ని పథకాలు, రాయితీలు అందడం లేదని వాపోయారు. కార్యక్రమంలో భాజపా నేతలు జన్ని పరమేశ్వర్, రంకిరి నీలయ్య, తెదేపా నేత కెల్లి శ్రీరాములు, యాళ్ల మల్లేష పాల్గొన్నారు.

## చిత్త శుద్ధితో విధులు నిర్వహించండి

పోలాకి, న్యూస్‌టుడే: కష్టపడి పనిచేసే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నరసన్నపేట, సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 47 మంది అంగన్వాడీ కార్యకర్తలకు శనివారం పదోన్నతి ఉత్తర్వుల పత్రాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. సేవల ద్వారా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకోవాలని సిబ్బందికి సూచించారు. త్వరలోనే ఖాళీలు భర్తీ చేస్తామని తెలిపారు. తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, సీడీపీవోలు శోభారాణి, వంశీప్రియ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

## వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

టెక్కలి పట్టణం, జలుమూరు, న్యూస్‌టుడే: టెక్కలి పట్టణంలోని కొండ గుట్టపై ఉన్న వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి పర్వదినానికి ముస్తాబైంది. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు విశేష పూజలు, అభిషేకాలు, కర్పూర మాలలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లను టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పర్యవేక్షిస్తుండగా, సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ★ వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా జలుమూరు మండలంలోని వివిధ ఆలయాల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్ఐ బి.అశోక్‌బాబు సోమవారం తెలిపారు. చిన్నదూరం కూర్మనాథుడు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, రామభద్రపురం, అల్లాడ, జలుమూరులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మెళియాపుట్టి, టెక్కలి పట్టణం, నందిగాం, న్యూస్‌టుడే: పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సీతంపేట ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు సూచించారు. సోమవారం పెద్దమడి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మెనూ, సరకుల నాణ్యత, నిల్వలను పరిశీలించారు. నందిగాం మండలం ఎస్ఎల్‌పురం, టెక్కలి ఆదిఆంధ్రావీధి సమీపంలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలను ఏపీవో పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, ముస్తాబు కార్యక్రమం సక్రమంగా అమలు చేయాలని ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ ప్రసాదరావును ఆదేశించారు.

పెద్దమడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు చేస్తున్న ఏపీవో చిన్నబాబు

## అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నరసన్నపేట, జలుమూరు, హిరమండలం, న్యూస్‌టుడే: ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడీ ఎల్వీ మధు హెచ్చరించారు. నరసన్నపేట పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన పరిశీలించి, దస్త్రాలు తనిఖీ చేశారు. వ్యవసాయాధికారిణి సూర్యకుమారి ఉన్నారు. ★ జలుమూరు మండలం చల్లవానిపేటలో ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి కె.రవికుమార్ పరిశీలించారు. రైతులకు సరిపడా నిల్వలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ★ రబీలో ఎరువులు కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని హిర మండలం వ్యవసాయ అధికారి బి.సంధ్య తెలిపారు. పింద్రువాడ రైతుసేవా కేంద్రంలో అన్నదాతలతో ఆమె మాట్లాడారు.

## పది రోజుల్లో మూడో తహసీల్దార్!

కొత్తూరు, న్యూస్‌టుడే: అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల బదిలీల పర్వం కొత్తూరులో కొనసాగుతునే ఉంది. గతంలో ఇక్కడ ఇక్కడ పనిచేసిన కొప్పల బాలకృష్ణ 45 రోజులు సెలవుపై వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ఈ నేపథ్యంలో పది రోజుల కిందట శ్యామ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం హిరమండలానికి ఈయన్ను కలెక్టర్ బదిలీ బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎన్ని జోగారావుని కొత్తూరు తహసీల్దార్‌గా నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## నందిగాం వాసికి గుర్తింపు

నందిగాం, న్యూస్‌టుడే: నందిగాంనకు చెందిన వైద్యుల మాదిని జయంతిరావు ఈ నెల 27, 28 తేదీల్లో ఒడిశాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని మాట్లాడారు. మానవుల్లో అకస్మాత్తుగా వచ్చే గుండెకు సంబంధించిన వ్యాధులను ఏఐతో ముందుగా ఏ విధంగా గుర్తించాలో వివరించారు. ఈ కార్యక్రమానికి సుమారు 100 మంది పరిశోధకులు హాజరయ్యారు. జయంతిరావు ప్రస్తుతం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, గ్రామస్థులు అభినందించారు.

## శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

జలుమూరు, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యమని ఎంపీడీవో బి.చిన్నమ్మడు అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి, వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తహసీల్దారు రామారావు, ఎంఈవోలు మాధవరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ సక్రమంగా జరగాలి

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ సక్రమంగా జరగాలని ఎంపీడీవో మోహన్‌కుమార్ సూచించారు. మండల పరిషత్తు సమావేశ భవనంలో సోమవారం సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి నగదు అందించాలన్నారు.

ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

## బహిరంగ సభ విజయవంతం చేయండి

కొత్తూరు, న్యూస్‌టుడే: వచ్చే నెల 4న విశాఖపట్టణంలో జరిగే సీఐటీయూ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం కొత్తూరులో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పలు గ్రామాల్లో ఆటోతో ర్యాలీ చేశారు. సిర్ల ప్రసాదరావు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ

నరసన్నపేట, న్యూస్‌టుడే: నరసన్నపేట లయన్ నారాయణశెట్టి చంద్రమౌళి సోమవారం స్థానిక సంతతోటలో 190 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ

నరసన్నపేట, న్యూస్‌టుడే: దేవాదిలో కల్వర్టు నిర్మాణానికి రూ.2 లక్షల మండల పరిషత్తు నిధులతో ఎంపీపీ ఆరంగి మురళీధర్ సోమవారం భూమిపూజ చేశారు. సర్పంచి మంతెన రాము, ఎంపీటీసీ సభ్యుడు గదిలి మల్లేశ్వరరావు, నాయకులు రాజాపు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు, గురువిల్లి గోవిందరావు, తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## శఠగోపం వితరణ

జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగేశ్వరస్వామికి శ్రీకాకుళానికి చెందిన ఎం.వెంకట శివ సంతోష్‌కుమార్ వెండి శఠగోపాన్ని సోమవారం అందించారు. దీని విలువ రూ.40 వేలు అని దాత తెలిపారు. ఆలయ ఈవో ఏడుకొండలు, అర్చకులు పాల్గొన్నారు.

## మొరాయించిన ఆర్టీసీ బస్సు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక పాత జాతీయ రహదారిపై ఇందిరా కూడలిలో ఆర్టీసీ బస్సు సోమవారం మొరాయించింది. టెక్కలి డిపోకు చెందిన ఈ బస్సు పలాస వెళ్లేందుకు కాంప్లెక్స్ నుంచి బయటకు వచ్చి కొన్ని మీటర్ల దూరం వెళ్లి నిలిచిపోయింది. ఎంతకీ ముందుకు కదలక పోవడంతో ప్రయాణికులు బస్సు దిగి ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కున్నారు.

## ఆర్థికసాయం అందజేత

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరు రెల్లివీధికి చెందిన నాగవంశం రవికుమార్ (చంటి) అనారోగ్యంతో విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబానికి నీలమణి దుర్గ లారీ, వ్యాన్ యజమానుల సంఘ ప్రతినిధులు సీహెచ్.వెంకటరమణ, ధర్మారావు రూ.10 వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందించారు.

## విద్యార్థులకు పోటీలు

టెక్కలి, న్యూస్‌టుడే: విద్యార్థులకు రామాయణంలోని అంశాలపై టెక్కలిలో క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యావికాస సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పోటీలకు 260 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల్లో వికాసాన్ని పెంచేందుకు వీటిని నిర్వహించినట్లు సంఘ కార్యదర్శి బొడ్డ అయ్యబాబు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

## సమస్యలు పరిష్కరించండి

టెక్కలి, కొత్తూరు, పాతపట్నం, న్యూస్‌టుడే: డీటీఎఫ్ కాలమానిని సంఘ జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసన్న టెక్కలి మండలం బూరగాం ఉన్నత పాఠశాలలో సోమవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు ఖగేష్, శ్రీరామ్మూర్తి, లోకనాథం, రాజేశ్వరి పాల్గొన్నారు. ★ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె. శాంతారాం, మండల శాఖ ప్రధాన కార్యదర్శి యు.బాలకృష్ణ, గున్నమ్మ అన్నారు. కొత్తూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరించారు. ఎంఈవోలు కె.గోవిందరావు, ఎన్.శ్రీనివాసరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు. ★ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ కాలమానిని, డైరీలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాతపట్నంలో ఆవిష్కరించారు. ఆపస్ రాష్ట్ర కార్యదర్శి దువ్వారి చలపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు పాడి, ఉపాధ్యాయులు ఎస్.సోమేశ్వరరావు, మురళీమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

కొత్తూరులో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కాలమానిని ఆవిష్కరణ

# బడి బాగుకు అపూర్వ సహకారం

పూర్వ విద్యార్థులు నిర్మించిన చల్లవానిపేట ఉన్నత పాఠశాల ప్రహరీ

– న్యూస్‌టుడే, జలుమూరు, సారవకోట, నరసన్నపేట గ్రామీణం

సొంత ఊరిలోని బడిలో చదువు నేర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకున్న కొందరు పూర్వ విద్యార్థులు పాఠశాలను బాగు చేయాలన్న సంకల్పంతో తమ వంతు సాయం అందిస్తున్నారు. అవసరాలను గుర్తించి, సొంత నిధులు వినియోగించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మేలు చేకూరేలా విద్యాలయం రుణం తీర్చుకుంటూ భావితరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

### కళావేదిక ఏర్పాటు

సారవకోట ఉన్నత పాఠశాలలో 1979-80 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థి, కోటబొమ్మాళిలో న్యాయవాదిగా పనిచేస్తున్న లఖినేని శ్రీనివాసరావు రూ.1.17 లక్షల వ్యయంతో కళావేదిక నిర్మించారు. గతంలో సమావేశాలకు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం ఆ బాధలు తీరాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు చెబుతున్నారు. చీడిపూడి ప్రాథమిక పాఠశాలలో స్థానికులు విద్యార్థులకు ఉపయోగపడేలా సిమెంటు బల్లలు వితరణగా అందించారు.

### రూ.5 లక్షలతో పనులు

జలుమూరు మండలంలో చల్లవానిపేట ఉన్నత పాఠశాలకు 40 మంది పూర్వ విద్యార్థులు రూ.5 లక్షల సొంత నిధులు వెచ్చించి పనులు చేయించారు. రక్షణగోడ, కళావేదిక, భోజనశాల, రక్షిత నీటి సౌకర్యం ఏర్పాటు చేసి బడి రుణం తీర్చుకున్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటు

నరసన్నపేట మండలం చెన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకున్న **టేకి శ్రీనివాసరావు** రూ.లక్ష వెచ్చించి బడిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. చిన్నతనంలో తనకు విద్యాబుద్ధులు నేర్పించిన పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు గొనప భాస్కరరావు చేతుల మీదుగా వాటిని ప్రారంభించి గురువుపై గౌరవం చాటుకున్నారు.

## వైద్య శిబిరానికి స్పందన

కొత్తూరు, ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: కొత్తూరు మండలంలోని పారాపురం గ్రామంలో శంకర్‌ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలకు వైద్యులు పరీక్షలు చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుంచాల నూకరాజు, నాయకులు తోట తులసీరామ్, లంక కాళీప్రసాద్ పాల్గొన్నారు. ★ కోటబొమ్మాళి మండలం తర్లిపేట పంచాయతీ చలమయ్యపేటలో రిలయన్స్ సంస్థ నేతృత్వంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కురుడు పశువైద్యాధికారి కిరణ్‌కుమార్ శిబిరంలో పాల్గొని మూగజీవాలను పరీక్షించి, మందులు అందించారు.

పారాపురంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

(c) eenadu

# శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

## 4న వైజ్ఞానిక సదస్సు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో వచ్చే నెల 4న విద్యా, వైజ్ఞానిక సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి మెటీరియల్, క్యాలెండర్ ఆవిష్కరణ, సాంఘిక శాస్త్ర నమూనాలు, సిక్కోలు సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించేలా ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు టి.కేశవరావు, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, గుణశేఖర్ పాల్గొన్నారు.

## తెరపై ఈనాడు

కిన్నెర: వృషభ కీర్తన: అనకొండ కీర్తిక: దండోరా మారుతి: శంబాల సూర్య: అవతార్ సన్‌మ్యాక్స్: ఈషాఎస్‌వీసీ(రామలక్ష్మణ): అఖండ-2 సరస్వతి: ఛాంపియన్
– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

## 27 నుంచి మహాలక్ష్మమ్మ జాతర

రణస్థలం, న్యూస్‌టుడే: కమ్మసిగడాం మహాలక్ష్మమ్మ ఆలయ జాతర ఘనంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఈశ్వరరావు అన్నారు. సోమవారం ఆలయం వద్ద కల్యాణ మండపంలో కమిటీ సమావేశం నిర్వహించారు. జనవరి 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు జాతర జరపాలని నిర్ణయించారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతిభ చూపారు.. ప్రశంసలు పొందారు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. జీవీఎస్‌కే అగస్త్యరామ్ (10వ తరగతి) సీహెచ్ జీవన్‌కుమార్ (9వ తరగతి) పి.మేఘన (8వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సీతంనాయుడు తదితరులు బహుమతులు అందజేశారు.

## సత్తా చాటారు..బహుమతులు అందుకున్నారు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ఏవీఎన్ఎంహెచ్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎస్.గోపాలకృష్ణ (9వ తరగతి), డి.సుప్రియ, జి.డిల్లేశ్వరి (8వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు తాతారావు తదితరులు బహుమతులు అందజేశారు.

## ఫాగింగ్ చేస్తే ఒట్టు..!

### దోమల బెడదతో విజృంభిస్తున్న జ్వరాలు

ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో 110 పంచాయతీలుండగా.. 76 గ్రామ సచివాలయాలున్నాయి. ఎక్కడా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు వినియోగించిన దాఖలాలు లేవు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదు. సీసీ రహదారులున్నా కాలువల్లేవు. ఫాగింగ్ చేయాలంటే నిధులు ఖర్చవుతుండటంతో యంత్రాల నిర్వహణ అదనపు భారంగా మారుతోందని పంచాయతీలు పేర్కొంటున్నాయి.

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, ఆమదాలవలస గ్రామీణం

గ్రామాల్లోని ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. మురుగు కాలువలు అపరిశుభ్రతతో నిండిపోయాయి. దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితులతో కాలానుగుణ వ్యాధులు పెరిగాయి. వర్షపునీరు, మురుగునీటి నిల్వల్లో దోమలు విజృంభిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వీటి నివారణకు పది రోజులకోసారైనా ఫాగింగ్ చేయాల్సి ఉండగా ఆ ఊసే ఎత్తడం లేదు. యంత్రాలు వినియోగంలో లేక చాలాచోట్ల మరమ్మతులకు గురై మూలకు చేరాయి.

సరుబుజ్జిలి మండల సచివాలయంలో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం

**సరుబుజ్జిలి:** మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో దోమల నియంత్రణకు ఫాగింగ్ యంత్రాలు అందజేశారు. ఇవన్నీ ఓ మూలకు చేరి నిరుపయోగంగా అట్టపెట్టెల్లో మూలుగుతున్నాయి. నందికొండ, షళంత్రి, కొత్తకోట, రొట్టవలస, మూలసవలాపురం, పాతపాడు తదితర పెద్ద పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి.

**ఆమదాలవలస:** 19 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. అన్నిచోట్లా పరికరాలు అందజేశారు. వీటిని ఒక్క రోజు కూడా వినియోగించిన దాఖలాలు లేవు.

**పొందూరు:** 29 పంచాయతీల్లో 27 గ్రామ సచివాలయాలు నిర్మించారు. దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ యంత్రాలను అందజేశారు. కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. మిగిలినవి అట్టపెట్టెల్లో మగ్గుతున్నాయి.

**బూర్జ:** 16 గ్రామ సచివాలయాలకు యంత్రాలు అందజేసినా ఎక్కడా ఉపయోగించడం లేదు. బూర్జ, పనుకుపర్త, నీలాపురం, కె.కె.రాజపురం, కొల్లివలస, మామిడివలస, తోటవాడ, అన్నంపేట గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది.

### వినియోగించాలని చెప్పాం..

ప్రతి గ్రామంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ యంత్రాలు వినియోగించాలని కార్యదర్శులకు సూచించాం. చాలా యంత్రాలు మరమ్మతులకు గురికావడం వాస్తవమే. వాటికి బాగు చేయించాలని ఆదేశించాం.

– ఎం.పావని, రామ్మోహన్, వాసుదేవరావు, ఆర్.తిరుపతిరావు సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల ఎంపీడీవోలు

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

సమస్య: మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ వారాంతపు సంతలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. -సూరపునాయుడు, స్థానికుడు

సమాధానం: త్వరలోనే సౌకర్యాలు కల్పిస్తాం. – టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

?: తిమ్మాపురం, లక్ష్ముడుపేట, పార్వతీశంపేట కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. - రమేష్, స్థానికుడు

●: త్వరలోనే ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. - బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

విద్యుద్దీపాల వెలుగులో కోదండ రామాలయం

## వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

శ్రీకాకుళం నగరం, శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీకాకుళం నగర పరిధిలో పలు ఆలయాల్లో వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. కోదండ రామాలయం, నారాయణ తిరుమల, రమ్యతిరుమల, చిన్నబజారులోని వేంకటేశ్వరస్వామి, విజయగణపతి ఆలయాలను ముస్తాబు చేశారు.

## ఏఐ, ప్రాంప్ట్ ఇంజినీరింగ్‌పై పట్టుసాధించాలి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: బీటెక్ విద్యార్థులు ఏఐ, ప్రాంప్ట్ ఇంజినీరింగ్‌పై పట్టుసాధిస్తే ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని బెంగళూరుకు చెందిన కాగ్నిజెంట్ ఏఐ ల్యాబ్స్ అసోసియేట్ డైరెక్టర్ రితుపర్ణ దత్త సూచించారు. మండలం చిలకపాలెం సమీపంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు 'ఏఐ మాస్టరింగ్ ప్రాంప్ట్ ఇంజినీరింగ్ ఫ్రమ్ కన్వర్సేషన్ టు ఏజెంటిక్ సిస్టమ్స్' అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యుడు వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ జి.టి.చంద్రశేఖర్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రితుపర్ణ దత్త

## పునాదులకే పరిమితం..!

పొందూరు మండలం తండ్యాం గ్రామంలో రైతు సేవా కేంద్రం పునాదులకే పరిమితమైంది. అద్దె గదిలో రైతులకు సేవలు అందిస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతు సేవా కేంద్రాన్ని పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై వ్యవసాయాధికారి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. – న్యూస్‌టుడే, పొందూరు

## చీకటిలో ప్రయాణం..!

జి.సిగడాం మండలం వాండ్రంగి-పొందూరు మధ్యలో ఉన్న రైల్వే వంతెనపై దీపాలు పాడైపోవడంతో చీకటిలో వాహనదారులు ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని నెలలుగా వంతెనపై బల్బులు పాడై చీకటిలో ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

## గోతులు పూడ్చండి

ఆమదాలవలస మండలం చీమలవలస-కొత్తవలస మధ్య రహదారి గోతులతో అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గుంతలు పూడ్చేలా చర్యలు చేపడతామని ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

## కంపు కొడుతోంది..

పొందూరు మండలం బురిడికంచరాం గ్రామంలో మురుగు కాలువ అధ్వానంగా తయారైంది. మురుగు నిల్వలతో కంపు కొడుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలలు తరబడి మురుగు కాలువలో నిల్వ ఉండటంతో దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా కార్యదర్శితో మాట్లాడి కాలువలో మురుగు తొలగిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

## పనికిరాని మొక్కలతో చిక్కులు

ఆమదాలవలస మండలం కొత్తవలస-ఎన్టీవాడ గ్రామాల మధ్య రహదారిలో పనికిరాని మొక్కలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. మార్గానికి ఇరువైపులా ఇవి ఏపుగా పెరగడంతో మలుపు వద్ద ఎదురొచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై ఎంపీడీవో రామ్మోహన్ వద్ద ప్రస్తావించగా ఉపాధి పనుల ద్వారా మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

## సుస్థిరశక్తి సాంకేతికతతోనే పర్యావరణ పరిరక్షణ

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: సుస్థిరశక్తి సాంకేతికతతోనే పర్యావరణాన్ని పరిరక్షించి దేశ భవిష్యత్తుకు బాటలు వేయగలమని డెన్మార్క్ బేస్డ్ ఆర్గనైజేషన్ 'డానిష్ ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంట్ పరిశ్రమ' ప్రతినిధి తనుగుంట్ల ప్రభాకర్ అన్నారు. ఎచ్చెర్ల వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం 'సుస్థిరశక్తి సాంకేతికతతో సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభాకర్ మాట్లాడుతూ సుస్థిర శక్తివనరులైన సౌర, పవన, జల విద్యుత్తు, భూ ఉష్ణ, బయోమాస్ వంటి పునరుత్పాదక ఇంధనాల వినియోగంతో కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణ సమతుల్యతను కాపాడొచ్చన్నారు. కళాశాల యాజమాన్య సభ్యుడు ఇప్పిలి కిశోర్, ప్రధానాచార్యుడు ఎస్.సి.వి.రమణమూర్తి నాయుడు, విద్యార్థులు హాజరయ్యారు.

## పీజీ పుస్తక రచయితగా గౌరీశంకర్



శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: తెలుగు పీజీ కోర్సు పుస్తక రచనకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తనను ఎంపిక చేసిందని భమిడిపాటి గౌరీశంకర్ తెలిపారు. ఆయన శ్రీకాకుళం గ్రామీణ మండలం మునసుబుపేట వద్ద గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో తెలుగు విభాగాధిపతిగా పని చేస్తున్నారు. గతంలో డిగ్రీ సెమిస్టర్లకు తెలుగు వచన రచన చేశారు. 100కు పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. పీజీ కోర్సు పుస్తక రచనకు ఎంపికైన సందర్భంగా గౌరీశంకర్‌ను గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు, కేవీవీ సత్యనారాయణ అభినందించారు.

## గుత్తేదారు లేబర్ లైసెన్స్ రద్దు చేయాల్సిందే

నిరాహార దీక్ష చేస్తున్న జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో (జీజీహెచ్) పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించని గుత్తేదారు సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని.. లేబర్ లైసెన్స్ రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ డిమాండ్ చేశారు. జీజీహెచ్ గేటు వద్ద సోమవారం కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్, ఇఫ్టూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జీవో 138 ప్రకారం నెలకు రూ.18,600 కనీస వేతనం చెల్లించాలని ఆదేశించినా గుత్తేదారులు అమలు చేయడం లేదని విమర్శించారు. యాజమాన్యం చర్చలకు రాకుంటే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపల్లి రాజుల, బగాది శ్రీనివాసరావు, ఇఫ్టూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు పి.ప్రసాద్, మద్ది శ్రీను, ఎస్.ప్రసాద్, సంతోషి, ఎస్.కృష్ణవేణి, జోగి వెంకటరమణ, జి.లక్ష్మణరావు, ఎం.సూర్యనారాయణ, ఎం.హైమారావు, సంధ్య, రాజేశ్వరి, శాంతికుమారి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బరాటం చెరువులో ఆక్రమణల తొలగింపు

శ్రీకాకుళం గ్రామీణ మండలం సానివాడ పంచాయతీ సైలాడ, గార మండలం అంపోలు రెవెన్యూ పరిధి బరాటం చెరువులో ఆక్రమణలను సోమవారం శ్రీకాకుళం, గార రెవెన్యూ అధికారుల సమక్షంలో తొలగించారు. ఆక్రమిత భూమికి అనుసంధానంగా ఉన్న చెరువు గట్టును పూర్తిగా కూల్చేశారు. చెరువుకు సంబంధించిన సుమారు 5.50 ఎకరాల భూమిని సానివాడకు చెందిన 12 మంది కొంత కాలంగా సాగుచేస్తున్నారు. 1975లో అప్పటి ప్రభుత్వం కేటాయించిందని.. ప్రస్తుతం అన్యాయంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. చెరువు గర్భాన్ని ఆక్రమించారని వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలు తీసుకున్నామని గార తహసీల్దారు ఎం.చక్రవర్తి తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం, గార

## యూరియా దొరకదనే ఆందోళన వద్దు

❖ విడతల వారీగా రైతు సేవా కేంద్రాలకు సరఫరా

❖ రణస్థలం వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు

– న్యూస్‌టుడే, రణస్థలం

రబీలో పంటలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రణస్థలం వ్యవసాయ శాఖ ఏడీ వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. విడతల వారీగా రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నామన్నారు. ఎవరూ ఎరువు దొరకదనే భయంతో నిల్వ చేయొద్దని సూచించారు. వ్యవసాయ సబ్‌డివిజన్‌లో అత్యధికంగా మొక్కజొన్న సాగు చేయడంతో యూరియా వినియోగం ఉంటుందన్నారు. జిల్లాకు వచ్చే సరకులో 80 శాతం ఇక్కడికే సరఫరా చేస్తున్నామన్నారు.

### 30,290 ఎకరాల్లో మొక్కజొన్న సాగు

డివిజన్‌లో 30,290 ఎకరాల్లో రబీలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. గతేడాది కంటే 5,592 ఎకరాలు అధికంగా సాగైంది. 6,815 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికే రైతు సేవాకేంద్రాల ద్వారా 1875.3 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు దుకాణాలు, సహకార సంఘాల ద్వారా 1489 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశాం. ఇంకా 3,451 మెట్రిక్ టన్నుల విడతల వారీగా సరఫరా చేయనున్నాం.

### ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు..

ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయించొద్దని ఇప్పటికే చెప్పాం. అలా చేస్తే చర్యలు తీసుకుంటాం. రాతపూర్వకంగా నోటీసులు అందించాం. వారి తెస్తున్న యూరియాను వ్యవసాయ శాఖ సిబ్బంది కూపన్లు ఇచ్చిన వారికే ఇవ్వాలని ఆదేశించాం. ఈ మేరకు సిబ్బందిని పర్యవేక్షించాలని సూచించాం. ప్రతిరోజూ మండల వ్యవసాయాధికారి, ఏడీఏ రెండేసి దుకాణాలను తనిఖీ చేయాలి. ఇందులో అలసత్వం వహిస్తే వారికి షోకాజు నోటీసులు జారీ చేస్తున్నాం.

### ధాన్యం ఇచ్చిన 24 గంటల్లో నగదు జమ

సబ్ డివిజన్ పరిధిలో 43 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 20,286 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేశాం. రైతుల ఖాతాల్లో రూ.48 కోట్లు వేశాం. 24 గంటల్లోపు సొమ్ము జమచేస్తున్నాం.

### ఈ-పంట నమోదు చేసుకోవాలి

మొక్కజొన్న పంటకు ఈ-పంట నమోదు ప్రారంభించాం. ఇప్పటికే 15 శాతం పూర్తయింది. రైతులంతా ఈపంట నమోదు చేసుకోవాలి. లేకుంటే రానున్న రోజుల్లో పంట విక్రయాలకు మద్దతు ధర పొందే అవకాశం ఉండదు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కూన

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస గ్రామీణం,న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం ఆమదాలవలస మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తమ్మినేని శారద అధ్యక్షతన అధికారులు నిర్వహించిన సాధారణ సర్వసభ్య, బడ్జెట్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మార్చి 31లోగా పనులు చేపట్టి, బిల్లులు పెట్టకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయన్నారు. కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టడం లేదని అధికారులపై మండిపడ్డారు. మండల పరిషత్ బడ్జెట్‌ను సభ్యులంతా ఆమోదించారు. నాగావళి ఆనకట్ట ప్రాజెక్టు ఛైర్మన్ సనపల డిల్లేశ్వరరావు, తెదేపా మండల అధ్యక్షుడు, కనుగులవలస సర్పంచి నూకరాజు, ప్రత్యేక సలహాదారులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, బొడ్డేపల్లి గౌరీపతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## మండల బడ్జెట్ ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కిల్లి రమాదేవి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: సరుబుజ్జిలి మండల పరిషత్తు 2026-27 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బడ్జెట్ వివరాలను ఎంపీడీవో ఎం.పావని, ఏవో ప్రసాద్ సభ్యులకు వివరిస్తూ 2025-26 సవరణ బడ్జెట్ 2026-27 అంచనా బడ్జెట్ వెల్లడించారు. 2026-27 అంచనా బడ్జెట్‌లో రూ.26,64,200 ప్రారంభ నిల్వతో సుమారు రూ.58 కోట్ల రాబడితో రూపొందించి, దానిలో సుమారు రూ.58 కోట్లు ఖర్చులు చూపుతూ రూ.27,15,200 మిగులు బడ్జెట్ చూపారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ మాట్లాడుతూ సభ్యులు గౌరవ వేతనాన్ని అధికారులు మంజూరు చేయడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. తహసీల్దార్ ఎల్.మధుసూదన, మండల ప్రత్యేక ఆహ్వానితులు కేవీజీ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గోవింద వెంకట శివానందమూర్తి పాల్గొన్నారు.

## చలో విశాఖ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ప్రచార ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

పొందూరు, న్యూస్‌టుడే: జనవరి 4వ తేదీన చలో విశాఖపట్నం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. పొందూరులో సీఐటీయూ అఖిల భారత మహాసభలు ప్రచారం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో ఈ సభలు జరుగుతాయని తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్సు అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రదర్శన అనంతరం మున్సిపల్ స్టేడియంలో భారీ బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు.

## ఇందిరా ప్రసాద్‌కు సత్కారం

స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు జి.ఇందిరాప్రసాద్ నిస్వార్థ సేవకుడని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ కొనియాడారు. శ్రీకాకుళం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడారు. రెండున్నర దశాబ్దాలుగా విభిన్న రంగాల్లో సేవలందిస్తున్నారన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జోగినాయుడు, ఉమామహేశ్వరరావు, మల్లిబాబు, మోహన్, లక్ష్మి, అప్పారావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

## కార్యకర్తలకు నియామక పత్రాలు

రణస్థలం, న్యూస్‌టుడే: మండల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పుచేసి ఆయా కేంద్రాల కార్యకర్తలకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ వారికి నియామక పత్రాలను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అందించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి రూపలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతులమీదుగా నియామక పత్రాలు అందుకుంటున్న కార్యకర్తలు

## 8 వేల నీటి కుంటల తవ్వకాలకు ప్రతిపాదనలు

రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ లోకేష్

లావేరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధి పథకంలో భాగంగా రైతుల వ్యవసాయ భూములు, కొబ్బరి, మామిడి తదితర తోటల్లో వర్షపునీటిని నిల్వ చేసుకునేందుకు జిల్లాలో 8 వేల నీటి కుంటల తవ్వకాలకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని ఏపీడీ లోకేష్ అన్నారు. లావేరు మండల కేంద్రంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో సోమవారం సాంకేతిక, క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి నిల్వ గుంతలు(ఫారం ఫండ్‌లు) కావాల్సిన రైతులు ఉపాధి సిబ్బందిని సంప్రదించాలన్నారు.

## ఆర్టీసీ పొరుగు సేవల ఉద్యోగుల సంఘానికి సహకరిస్తాం

బలగ(శ్రీకాకుళం): ఆర్టీసీ పొరుగు సేవల ఉద్యోగుల సంఘానికి సహకరిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ హామీ ఇచ్చారు. సంఘ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విజయనగరం జోనల్ ఛైర్మన్ దొన్ను దొరతో కలిసి కాలమానిని ఆవిష్కరించారు. తొలుత సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు శర్మ, అమరసింహుడు, సంఘ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ముత్యాలరావు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఈనాడు
తిరుపతి
మంగళవారం డిసెంబరు 30, 2025


# ఏడుకొండల వైభవం

## అర్ధరాత్రి 1.30 గంటలకు వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభం

తిరుమల, న్యూస్‌టుడే: ఏడుకొండల వాడి పది రోజుల వైకుంఠద్వార దర్శనానికి తిరుమల ముస్తాబైంది. అధికారులు కళ్లు చెదిరే ఏర్పాట్లు చేశారు. తిరుమల విద్యుద్దీపాలు, పూల అలంకరణలతో దేదీప్యమానంగా వెలుగుతోంది.

### ఎటుచూసినా పూలరాశులు..

శ్రీ రంగనాథస్వామి ఆలయ సెట్టింగ్‌ను పరిశీలిస్తున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

తితిదే ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పూల అలంకరణలు కట్టిపడేస్తున్నాయి. మందిరంలోని ధ్వజస్తంభం, బలిపీఠాన్ని చూడచక్కగా ముస్తాబు చేశారు. వైకుంఠదర్శన మార్గంలో ప్రత్యేకమైన పూలతో అలంకరించారు. వైకుంఠ ప్రదక్షిణ చేసే భక్తులకు దైవలోకాన్ని చూసిన అనుభూతి పొందేలా తితిదే ముస్తాబు చేసింది. తిరుమల వ్యాప్తంగా పదిరోజులపాటు 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల ఫలాలను, నాలుగు టన్నుల కట్ ఫ్లవర్స్ వినియోగించనున్నారు.

● తిరుమలలో ఏర్పాట్లను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం సాయంత్రం తితిదే బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, నరేష్‌కుమార్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్‌వో మురళీకృష్ణ తదితరులతో కలిసి పరిశీలించారు.

### వీఐపీలతో మొదలై..

సోమవారం అర్ధరాత్రి 1.30 గంటలకు వైకుంఠద్వార దర్శనాలను తితిదే ప్రారంభించింది. ముందుగా వీఐపీలకు అవకాశం ఇచ్చారు. ఇందులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ఉత్తర ద్వారం గుండా బయటకు వచ్చారు. ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయం నుంచి వెలుపలకు వస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

### గదుల కేటాయింపు ఇలా..

● తిరుమలకు చేరుకునే భక్తులకు వసతికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదటి మూడు రోజులు ఈ-డిప్ కలిగిన భక్తులకు తిరుమలలోని కేంద్రీయ విచారణ కేంద్రం (సీఆర్వో)లో ఈ-డిప్ టోకెన్, ఆధార్ కార్డులో రిజిస్ట్రేషన్ చేసుకుంటే మొబైల్‌కు వచ్చే ఎస్ఎంఎస్ ఆధారంగా గదులను కేటాయిస్తారు. గదులు అందుబాటులో ఉన్నంత వరకు మాత్రమే ఈ విధానంలో ఇస్తారు. దర్శన టికెట్లు కలిగిన వీఐపీలకు శ్రీపద్మావతి, ఎంబీసీ, సన్నిధానంలో గదులను కేటాయిస్తారు.

### భద్రతకు పెద్దపీట

భక్తుల భద్రతకు పోలీసు విభాగం నుంచి 2,000 మంది, తితిదే విజిలెన్స్ నుంచి 1,100 మందిని నియమించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లోని ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. ప్రతి రెండు గంటలకు ఒక పర్యాయం రద్దీ సమాచారాన్ని క్యూలైన్‌లోని భక్తులకు, తితిదే ఎస్వీబీసీ, మీడియా, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయనున్నారు.

### తెల్లవారుజాము నుంచే..

● ముందుగా వీఐపీ బ్రేక్ దర్శనాలకు అవకాశం ఇచ్చారు. ● ఈ నెల 30, 31, జనవరి 1వ తేదీ వరకు 1,89,000 మందికి దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ● క్యూలైన్‌లో ప్రవేశించే మార్గంలోనే టోకెన్లు స్కాన్ చేస్తారు. ● నిర్దేశిత సమయానికి క్యూలైన్‌లోకి వచ్చే భక్తులకు రెండు గంటల్లో దర్శనం కల్పించేలా ఏర్పాటు చేశారు. ● జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు సర్వదర్శనానికి భక్తులు ఎవరైనా రావచ్చు. వారికి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. ● సామాన్య భక్తుల కోసం పదిరోజుల్లో 182 గంటలు దర్శన సమయాన్ని కల్పించారు. ● 7,70,000 మందికి దర్శనం కల్పించడానికి తితిదే ఏర్పాట్లు పూర్తి చేసింది.

● ఈ-డిప్ కలిగిన భక్తులను మంగళవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఉదయం 11 గంటల వరకు కృష్ణతేజ ప్రవేశమార్గం నుంచి, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏటీజీహెచ్ అతిథి గృహం నుంచి అనుమతిస్తారు.

ఆలయం వెలుపల మంత్రి కేశవ్, నారా రోహిత్

### ఈ నంబర్లు సేవ్ చేసుకోండి..

తిరుపతి (తితిదే): వైకుంఠ ఏకాదశి దృష్ట్యా తిరుపతి, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సమయంలో ఏదైనా ఇబ్బంది కలిగినా లేదా సమాచారం కావాలన్నా ఈ నంబర్లు సంప్రదించవచ్చు.

● ప్రధాన సహాయ కేంద్రాలు (24/7 లభ్యత)
● తితిదే హెల్ప్‌లైన్ (టోల్ ఫ్రీ): 155257
● విచారణ కార్యాలయం: 0877-2277777

వైద్య సహాయం.. / తిరుమలలో అస్వస్థతకు గురైతే
● అశ్విని ఆసుపత్రి (తిరుమల): 0877-2263457, 2263458
● అంబులెన్స్ సేవలు: 0877-2263666 లేదా 108
● మెయిన్ హాస్పిటల్ (తిరుపతి): 0877-2287777

భద్రత మరియు పోలీసు.. / చోరీ జరిగినా.. ఎవరైనా తప్పిపోయినా
● విజిలెన్స్ ఆఫీస్: 0877-2263333
● తిరుమల క్రైమ్ పార్టీ: 0877-2263939
- తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్: 0877-2263833

### క్రీడానగరికి 28.37 ఎకరాలు

ఈనాడు- తిరుపతి: క్రీడ నగరి (స్పోర్ట్స్ సిటీ) కోసం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)కు దామినేడులో 28.37 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ కేబినెట్ సోమవారం నిర్ణయం తీసుకుంది. శెట్టిపల్లిలో ఇంటి స్థలాలు పొందుతున్న లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇచ్చారు. దొరవారిసత్రం, తడ మండలాల్లో కాళంగి నది పరిసర ప్రాంతాల్లో స్కూళ్లు, రోడ్ల నిర్మాణానికి అనుమతించారు. దుగరాజపట్నంలో గ్రీన్ ఫీల్డ్ నౌకాశ్రయం మరియు నౌకా నిర్మాణ కేంద్రం స్థాపనకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సముద్ర మండలికి అనుమతించింది.

### చలి పంజా.. రోగులు గజగజ

తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో రోగులు చలికి గజగజ వణుకుతున్నారు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో చల్లగాలి వచ్చేస్తుంది. వాటికి వస్త్రాలు కట్టినా ఏమాత్రం ప్రయోజనం ఉండటం లేదని రోగులు వాపోతున్నారు. 1) స్త్రీల శస్త్రచికిత్స విభాగంలో కిటికీలకు కట్టిన తెరలు. 2) కీళ్లు, ఎముకల విభాగంలో రోగుల అవస్థలను ఈ చిత్రాల్లో చూడొచ్చు.

- ఈనాడు, తిరుపతి

# ప్రజాభీష్టం.. పాలనా సౌలభ్యం

■ తిరుపతి జిల్లాలోకి రైల్వేకోడూరు నియోజకవర్గం
■ గూడూరులోని మూడు మండలాలు నెల్లూరులోకి
■ పుంగనూరులోని నాలుగు మండలాలు మదనపల్లెకు

ఈనాడు- తిరుపతి, చిత్తూరు: ప్రజాభీష్టం.. పాలనా సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకుని జిల్లాల పునర్విభజనకు కేబినెట్ సోమవారం ఆమోదం తెలిపింది. వైకాపా హయాంలో అస్తవ్యస్తంగా జరిగిన విభజనను సరిదిద్దేలా అడుగులు వేసింది. గూడూరు ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ఆ నియోజకవర్గంలోని గూడూరు, కోట, చిల్లకూరు మండలాలను నెల్లూరు జిల్లాలో కలపనున్నారు. వాకాడు, చిట్టమూరు మండలాలు మాత్రం తిరుపతిలోనే కొనసాగనున్నాయి. వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు గతంలో నెల్లూరు జిల్లాలో ఉండగా నవంబరు 27న ఇచ్చిన ప్రాథమిక గెజిట్‌లో తిరుపతి జిల్లాలో చేర్చాలని ప్రతిపాదించారు. ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. దీంతో వారి సెంటిమెంట్‌ను గౌరవిస్తూ ఆ మూడు మండలాలను నెల్లూరులోనే కొనసాగించాలని నిర్ణయించారు. గూడూరు రెవెన్యూ డివిజన్ అలాగే ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఈ నెల 31న జిల్లాల విభజనపై తుది నోటిఫికేషన్ విడుదల చేస్తారు. జనవరి 1 నుంచి ఈ మార్పులు అమలులోకి రానున్నాయి.

### నెరవేరిన కోడూరు ప్రజల ఆకాంక్ష

వైకాపా హయాంలో 2022లో జిల్లాల విభజన చేపట్టినప్పుడు రైల్వేకోడూరును అన్నమయ్య జిల్లాలో కలిపారు. ఇది 52 కి.మీ. దూరంలోని తిరుపతిలో చేర్చాలని ప్రజలు డిమాండ్ చేశారు. రాయచోటికి 93 కి.మీ. దూరంలో ఉండటంతో జిల్లా కేంద్రం చేరుకోవడానికి దాదాపు 3 గంటలు పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రతిపాదన ప్రాథమిక గెజిట్‌లో లేకున్నా ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా మంత్రివర్గం సానుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు, చిట్వేల్, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు మండలాలు తిరుపతి జిల్లాలో చేరతాయి. దీంతో ప్రస్తుతం ఉన్న 34 మండలాలు కాస్త 36కు పెరగనున్నాయి.




● గూడూరు నుంచి నెల్లూరుకు 51 కి.మీ. జాతీయ రహదారి బాగుండటంతో గంటలోనే అక్కడికి చేరుకోవచ్చు. ఇంత సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా గత ప్రభుత్వంలో 96 కి.మీ. దూరంలోని తిరుపతిలో చేర్చడంతో అప్పట్లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వంలోనూ ప్రాథమిక గెజిట్‌లో మార్పులు చేయకపోవడంతో ప్రజాసంఘాలు ఉద్యమించాయి. ఈ నేపథ్యంలో నాడు జరిగిన తప్పును ఇప్పుడు సరిదిద్దారు.

### నెల్లూరుకు క్రిస్‌సిటీ.. తిరుపతికి నౌకానిర్మాణ కేంద్రం

దీంతో కృష్ణపట్నం పారిశ్రామిక నగరం (క్రిస్ సిటీ) నెల్లూరు జిల్లాలోకే వెళ్లనుంది. వాకాడు మండలం తిరుపతిలోనే కొనసాగుతున్నందున దుగరాజపట్నంలోని నౌకా నిర్మాణ కేంద్రం ఇక్కడే ఉండనుంది.

### డివిజన్ల మార్పులు

చిట్టమూరు, వాకాడు మండలాలు సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లోకి; రైల్వేకోడూరు నియోజకవర్గం తిరుపతిలోకి; బంగారుపాళ్యం చిత్తూరు డివిజన్‌లోకి చేర్చుతారు.

### జిల్లాల స్వరూపం ఇలా..

| జిల్లా | డివిజన్లు | | మండలాలు | | జనాభా | |
|---|---|---|---|---|---|---|
| | పాత | కొత్త | పాత | కొత్త | పాత | కొత్త |
| తిరుపతి | 4 | 3 | 34 | 36 | 29,04,254 | 29,47,547 |
| చిత్తూరు | 4 | 4 | 32 | 28 | 18,72,951 | 16,43,224 |
| అన్నమయ్య | 3 | 3 | 30 | 25 | 16,97,308 | 14,22,605 |

### అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లె..

ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి ఉండగా మదనపల్లెకు మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ జిల్లాలో తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటితోపాటు పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం మండలాలు చేరుతాయి. పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలు మాత్రం చిత్తూరు జిల్లాలోనే ఉంటాయి. మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయాలని అక్కడి ప్రజలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. 2022లో జరిగిన జిల్లాల విభజన సమయంలోనూ ఉవ్వెత్తున ఉద్యమించినా నాటి ప్రభుత్వం తలొగ్గలేదు. కూటమి అధికారంలోకి వస్తే మదనపల్లె జిల్లా కావడం ఖాయమని ఎన్నికల సమయంలో చంద్రబాబు, నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగానే మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటు చేశారు.

### చిత్తూరు మరీ చిన్నగా అవుతుందనే..

నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, వడమాలపేట మండలాలు ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఉన్నాయి. నిండ్ర, విజయపురం, నగరి చిత్తూరులో కొనసాగుతున్నాయి. అటు పుంగనూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు అన్నమయ్య జిల్లాకు, ఇటు నగరిలోని ఈ మూడు మండలాలు తిరుపతిలో చేరితే చిత్తూరు జిల్లా మరీ చిన్నగా అవుతుంది. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం నిండ్ర, విజయపురం, నగరి మండలాలను తిరుపతిలో చేర్చే ప్రతిపాదనను విరమించుకుంది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో 32 మండలాలు ఉండగా తాజా నిర్ణయంతో ఈ సంఖ్య 28కు తగ్గింది.

# రాయుడు హత్య కేసుపై విచారణ

### శ్రీకాళహస్తిలో తమిళనాడు పోలీసులు

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి జనసేన పార్టీకి చెందిన పేట చంద్రశేఖర్‌ను తమిళనాడు పోలీసులు సోమవారం విచారించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని అతని మొబైల్ దుకాణానికి వచ్చిన పోలీసులు పలు విషయాలపై ఆరా తీశారు. జనసేన నియోజకవర్గ మాజీ సమన్వయకర్త వినుత కోట వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆ పార్టీ కార్యకర్త రాయుడు ఈ ఏడాది జులై 8వ తేదీన హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యోదంతంపై ఇప్పటికే వినుత కోట దంపతులు జైలుకు వెళ్లారు. కేసు విచారణ నేపథ్యంలో పేట చంద్రశేఖర్‌పై అభియోగాలు వచ్చాయి. ఈ విషయమై కేసు విచారణ నిమిత్తం తమిళనాడు పోలీసులు శ్రీకాళహస్తికి వచ్చి విచారణ జరిపారు. తొలుత రేణిగుంటలో విచారణ జరపాలని అనుకున్నా మళ్లీ నిర్ణయం మార్చుకొని శ్రీకాళహస్తికి వచ్చినట్లు తెలిసింది. చంద్రశేఖర్‌ను తమిళనాడుకు తీసుకెళ్లి విచారణ జరపాలని అనుకున్నారు. వారి వ్యక్తిగత న్యాయవాదులు విన్నపం మేరకు ఇక్కడే విచారించి వెళ్లిపోయారు.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వానేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

# కొండెక్కిన స్మార్ట్‌సిటీ

## పథకం రద్దుతో అసంపూర్తిగా ప్రాజెక్టుల పనులు

తిరుపతిలో స్మార్ట్‌సిటీ ఊసే లేకుండా పోయింది. తిరుపతి నగరపాలక సంస్థ ఆర్థిక సుస్థిరత సాధించే లక్ష్యంతో కేంద్రం దీన్ని ప్రకటించింది. 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం పనులు ప్రారంభించినా.. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఐదేళ్లలో రాష్ట్రం వాటా పైసా కూడా విడుదల చేయలేదు. అప్పటికే ఖాతాల్లో ఉన్న సొమ్ములనూ ఊడ్చేసింది. దీంతో అసంపూర్తి ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కేంద్రం స్మార్ట్‌సిటీ పథకాన్ని రద్దు చేయడంతో ఆ ప్రాజెక్టులన్నీ దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అసంపూర్తి పనులు చేయడానికి రూ.405 కోట్లు అవసరం. తితిదే నుంచి స్మార్ట్‌సిటీ పథకానికి రావాల్సిన రూ.53 కోట్లు కూడా అందలేదని తెలుస్తోంది.

– న్యూస్‌టుడే, తిరుపతి(నగరపాలిక)

అసంపూర్తిగా ఉన్న సీవోసీ భవనం

**దిష్టిబొమ్మల్లా భవనాలు**

మొత్తం ప్రాజెక్టులు: 97
ప్రాజెక్టు విలువ: రూ.1586 కోట్లు
పూర్తయినవి: 83
విలువ: రూ.1148 కోట్లు
అసంపూర్తి: 14
విలువ: రూ.438 కోట్లు

### ఆగిపోయినవి ఇవే..

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ రూ.180 కోట్లు, సిటీ ఆపరేషన్ సెంటర్ రూ.94.50 కోట్లు, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సెంటర్ రూ.52.50 కోట్లు, రూ.30 కోట్లతో నిరంతర నీటి సరఫరా తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు ప్రాజెక్టుతో పాటు వినాయకసాగర్‌లో అదనపు అంతస్తులు, కూరగాయల మార్కెట్, వ్యాయామశాల, విద్యుత్ దీపాలంకరణ ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయి. గొల్లవానిగుంట పునరుద్ధరణ పనులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల వినాయకసాగర్‌లో రూ.3 కోట్ల విలువైన ఈత కొలను, గ్లోగార్డెన్ పనులు పూర్తి చేశారు.

### తప్పుకొంటూ, తప్పించుకుంటూ...

● స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు పూర్తి చేయడం అసాధ్యమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఒక్కో ప్రాజెక్టు నుంచి అధికారులు తప్పుకొంటున్నారు.

● తూకివాకంలో రూ.22 కోట్లతో చేపట్టిన 6 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తి కాగా.. ఇప్పటికే రూ.14.30 కోట్లు బిల్లులు కూడా చెల్లించారు. పనులు చేయడంలో గుత్తేదారు నిర్లక్ష్యంతో టెండరు రద్దు చేశారు.

● కరకంబాడి రోడ్డులో రూ.2 కోట్లతో కూరగాయల మార్కెట్ నిర్మాణం ప్రాజెక్టు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గుత్తేదారు టెండరు రద్దు చేశారు.

● గొల్లవానిగుంటలో వద్ద రూ.2 కోట్ల స్టేడియం, రూ.2 కోట్ల క్రికెట్ మైదానాన్ని స్మార్ట్‌సిటీ నుంచి శాప్‌నకు అప్పగించారు.

● వినాయకసాగర్‌లోని రూ.1.76 కోట్ల విలువైన మల్టీపర్పస్ హాల్, రూ.2 కోట్ల విలువైన యోగా కేంద్రం, రూ.1.86 కోట్ల చిన్నారుల ఆటస్థలం ప్రాజెక్టులను రద్దు చేసినట్లు తెలుస్తోంది.

# వాట్సప్‌లో బస్ టికెట్

**మకోసం**

సంక్రాంతి పండక్కి సొంతూళ్లకు వెళ్లేవారికి బస్‌లో సీటు దొరకడమంటే గగనమే. ముందుగానే రిజర్వేషన్ చేయించుకోవడం తప్పనిసరి. ఎలాంటి అవస్థలు లేకుండా వాట్సప్ నుంచే టికెట్ పొందవచ్చని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

**ఇలా చేయండి..:** ● వాట్సప్ నంబరు 95523 00009ను సేవ్ చేసుకోవాలి. ఆ నంబరు చాట్‌లో 'హాయ్' అని పంపాలి. ● సేవను ఎంచుకొని.. 'ఏపీఎస్ఆర్టీసీ' సేవలపై క్లిక్ చేయాలి. ● బస్ టికెట్ బుకింగ్‌పై క్లిక్ చేసి నిర్ధారించాలి. ● టికెట్ బుకింగ్ ఎంపిక చేసుకుని ప్రయాణ వివరాలు, ప్రయాణికుల సమాచారం నమోదు చేయాలి. ● ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరపాలి. వెంటనే టికెట్ జనరేట్ అవుతుంది. ● బస్టాండ్లు, తదితర ప్రాంతాల్లో అతికించిన క్యూఆర్ కోడ్‌ను చరవాణిలో స్కాన్ చేయడం ద్వారా టికెట్ బుక్ చేసుకోవచ్చు.

న్యూస్‌టుడే, తిరుపతి(ఆర్టీసీ)

# నిల్వలున్నా.. నిర్వహణ నీరుగారుతోంది

## ఆయకట్టుకు పూర్తిస్థాయిలో అందని తెలుగుగంగ

నాయుడుపేట, న్యూస్‌టుడే:

తెలుగుగంగ బ్రాంచి కాలువలపై ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడటం, నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాల్లో 1.33 లక్షల ఎకరాలకు తెలుగుగంగ ఐదు, ఏడు బ్రాంచి కాలువల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ఈ ఏడాది సోమశిల, కండలేరు జలాశయాలకు పూర్తిస్థాయిలో నీటిమట్టం చేరడంతో రెండు నెలలుగా సాగునీరు విడుదల చేస్తున్నారు.

కాలువలో అడ్డంగా ఉన్న చెట్లు

### అధ్వానంగా కాలువలు

● బ్రాంచి కాలువల నిర్మాణం పూర్తయి 25 ఏళ్లు కావొస్తున్నా పూడిక తీయలేదు. ● కొన్ని ప్రాంతాల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ● కొందరు గట్లు ధ్వంసం చేయడంతో కాలువల్లో నీరు సాఫీగా వెళ్లడం లేదు. ● ఏడో బ్రాంచి కాలువ పరిధిలో పుదూరు, మిట్టకండ్రిగ, సీఎన్‌పేట, శ్రీనివాసపురం ప్రాంతాల్లో, ఐదు బ్రాంచి కాలువ పరిధిలో కొనేటిరాజుపాళెం, ముమ్మయపాళెం, ఓజిలి ప్రాంతాల్లో మైనరు కాలువలు మరమ్మతులకు గురయ్యాయి.

### నిండిన చెరువులకే మళ్లీ..

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిండిన చెరువులకు మళ్లీ నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పలుచోట్ల మధ్యలో కట్టలు తెగి నీరు వృథాగా పోతోంది. రైతులకు అవస్థలు తప్పడం లేదు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రధాన కాలువ నుంచి బ్రాంచి కాలువలకు సరఫరా చేసే నీటిని డీఈ, ఏఈ స్థాయిలో ఉన్న ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. ప్రణాళికాబద్ధంగా మేజరు, మైనర్ కాలువల ద్వారా చెరువులు, ఆయకట్టు భూములకు నీటిని సరఫరా చేయాలి. నీరు వృథా కాకుండా చూడాలి.

### ఆయకట్టు ఇలా..

| బ్రాంచికాలువ | కి.మీ | ఆయకట్టు |
|---|---|---|
| 7,7ఎ,7బి | 39.21 | 61,963 |
| 5, 5ఎ | 54.35 | 71,949 |

# సీజీఎస్టీ స్కామ్‌లో ఏడు సంస్థల లైసెన్సులు రద్దు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: సీజీఎస్టీ స్కామ్‌లో ఏడు బోగస్ సంస్థల లైసెన్సులను అధికారులు సోమవారం రద్దు చేశారు. నకిలీ సంస్థలు సృష్టించి దొంగ బిల్లులతో చేయని వ్యాపారాన్ని చేసినట్లు చూపి సీజీఎస్టీ రిటర్న్స్‌ను కాజేసినట్లు గుర్తించారు. జిల్లాలో హరిఓం ట్రేడర్స్, హేమ స్టీల్స్, సంతోష్ కాంట్రాక్ట్ వర్క్స్, సాయికృష్ణ కాంట్రాక్ట్ వర్క్స్, అభి ఎంటర్‌ప్రైజెస్, హేమచంద్ర కాంట్రాక్ట్ వర్క్స్, పెద్ద మస్తాన్ ఎంటర్‌ప్రైజెస్‌ల లైసెన్సులు రద్దు చేశారు. తుక్కు మాఫియా చేతిలో మోసపోయిన నగరానికి చెందిన విజయచక్రవర్తి వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ నుంచి ప్రధానమంత్రి వరకూ ఫిర్యాదు చేశాడు. తాజాగా పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

### మనీ లాండరింగ్‌పై అనుమానాలు..?

తుక్కు మాఫియా మనీ లాండరింగ్ కూడా చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. విదేశీ హవాలా మాఫియాతో సంబంధాలు ఉన్నట్లు ఆధారాలు సేకరించారు. అమాయకుల ఐడీ ప్రూఫ్‌తో వందల కొద్దీ నకిలీ సంస్థలను రిజిస్ట్రేషన్ చేయించి లావాదేవీలు జరపడంతో సదరు అక్రమాలు అమాయకుల మెడకు చుట్టుకుంటున్నాయి.




(c) eenadu

# పరుగే శ్వాసగా.. విజయమే లక్ష్యంగా..!

## రసవత్తరంగా ఈఎస్ఎల్ క్రికెట్ మ్యాచ్‌లు

సిద్ధార్థ, కేకేసీ జట్ల మధ్య మ్యాచ్

**తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే:** ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రజెంట్స్) 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్-2025)' క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్ క్రికెట్ మైదానం, ఎస్వీయూ స్టేడియం వేదికగా సీనియర్స్ విభాగంలో జరుగుతున్న పోటీల్లో పలు కళాశాలల జట్లు అద్భుత పోరాట పటిమను ప్రదర్శిస్తున్నాయి. సోమవారం జరిగిన 'ఈనాడు' క్రికెట్ మ్యాచ్‌ల వివరాలు ఇలా ఉన్నాయి.

EENADU SPORTS LEAGUE 2025

### గ్రౌండ్-1: ఎస్వీ హైస్కూల్ మైదానం

#### సిద్ధార్థ విజయకేతనం

విజేత సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వంశీ

తొలి మ్యాచ్‌లో కేకేసీ హోమియోపతిక్ వైద్య కళాశాల పుత్తూరు, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పుత్తూరు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన కేకేసీ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 70 పరుగులు చేసింది. విజయ లక్ష్యంగా బరిలోకి దిగిన సిద్ధార్థ జట్టు 7 ఓవర్లలో వికెట్ నష్టానికి 73 పరుగులతో విజయకేతనం ఎగురవేసింది. జట్టులో వంశీ 24 బంతుల్లో 36 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

#### శ్రీవిద్యానికేతన్ కైవసం

శ్రీవిద్యానికేతన్ జట్టు సంబరాలు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అద్వైత్

రెండో మ్యాచ్ గేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ తిరుపతి, శ్రీవిద్యానికేతన్ కళాశాల, తిరుపతి జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన గేట్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన శ్రీవిద్యానికేతన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన గేట్ జట్టు 9 ఓవర్లలో 32 పరుగులకు ఆలౌటైంది. శ్రీవిద్యానికేతన్ 61 పరుగుల తేడాతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. జట్టులో అద్వైత్ 22 బంతుల్లో 30 పరుగులు, ఒక ఓవర్‌లో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

#### విజయం సాధించిన అన్నమాచార్య

అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అజయ్

మూడో మ్యాచ్‌లో విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల చిత్తూరు, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ తిరుపతి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అన్నమాచార్య ఫీల్డింగ్ ఎంచుకుంది. విజ్ఞానసుధ నిర్ణీత 10 ఓవర్లలో 45 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్ చేసిన అన్నమాచార్య 5.1 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి విజయం సాధించింది. జట్టులో అజయ్ 7 బంతుల్లో 11 పరుగులు, రెండు ఓవర్లలో మెయిడెన్‌తో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY, MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE, www.mits.ac.in
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ FM Partner TV Partner
Organised by ఈనాడు

**గ్రౌండ్-1: ఎస్వీ ఉన్నత పాఠశాల మైదానం (సీనియర్స్)** — తేది 30.12.2025

- ఉదయం 8:00 : వేదవ్యాస డిగ్రీ కళాశాల, పుత్తూరు × ఎస్‌వీ హెచ్‌ఆర్ డిగ్రీ కళాశాల, తిరుపతి
- ఉదయం 10:30 : ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, గూడూరు × పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిత్తూరు
- మధ్యాహ్నం 2:00 : బీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, తిరుపతి × విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, చిత్తూరు

**గ్రౌండ్-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్)**

- ఉదయం 8:00 : ఎస్వీ ఎస్ఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూళ్లూరుపేట × ఎస్వీ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల, తిరుపతి.
- ఉదయం 10:30 : మోహన్‌బాబు యూనివర్సిటీ, రంగంపేట × సిద్ధార్థ ఎడ్యుకేషనల్ అకాడమీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సి.గొల్లపల్లి
- మధ్యాహ్నం 2:00 : విజయం డిగ్రీ కళాశాల, చిత్తూరు × ఎస్వీయూ కాలేజెస్, తిరుపతి

**గ్రౌండ్-1: ఎస్వీ ఉన్నత పాఠశాల మైదానం (సీనియర్స్, జూనియర్స్)** — తేది 31.12.2025

- ఉదయం 8:00 : సీకాం డిగ్రీ కళాశాల, తిరుపతి × ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరు (సీనియర్స్)
- ఉదయం 10:30 : ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, తిరుపతి × గీతం జూనియర్ కళాశాల, రామాపురం (జూనియర్స్)
- మధ్యాహ్నం 2:00 : శ్రీవివేకానంద జూనియర్ కళాశాల, పలమనేరు × ప్రభుత్వ ఐటీఐ, కుప్పం (జూనియర్స్)

**గ్రౌండ్-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్)**

- ఉదయం 8:00 : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి × ఎస్వీ కాలేజ్ ఆఫ్ కామర్స్, తిరుపతి
- ఉదయం 10:30 : చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి × నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, గూడూరు

### గ్రౌండ్-2: ఎస్వీయూ మైదానం

#### కుప్పం ప్రభుత్వ కళాశాల ప్రతిభ

కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విఘ్నేష్

తొలి మ్యాచ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కుప్పం, శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సీతమ్స్) చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సీతమ్స్ బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్ చేపట్టిన కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన సీతమ్స్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 70 పరుగులకే పరిమితమైంది. దీంతో కుప్పం డిగ్రీ కళాశాల జట్టు 26 పరుగుల తేడాతో గెలుపొందింది. జట్టులో విఘ్నేష్ (21 బంతుల్లో 4×3, 6×1) 38 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

#### వాక్ ఓవర్‌తో.. ఎన్‌బీకేఆర్ గెలుపు

వాక్ ఓవర్‌తో తదుపరి మ్యాచ్‌కు అర్హత సాధించిన ఎన్‌బీకేఆర్

రెండో మ్యాచ్ గోకులకృష్ణ కలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సూళ్లూరుపేట, ఎన్‌బీకేఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యానగర్ జట్ల మధ్య జరగాల్సి ఉండగా గోకులకృష్ణ జట్టు గైర్హాజరుకావడంతో ఎన్‌బీకేఆర్ జట్టుకు వాక్ ఓవర్ లభించింది.

#### కృష్ణతేజ కళాశాల సత్తా

కృష్ణతేజ ఫార్మసీ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎ.కార్తీక్

శ్రీవిద్య డిగ్రీ కళాశాల, పుత్తూరు, కృష్ణతేజ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, తిరుపతి జట్ల మధ్య జరిగిన మూడో మ్యాచ్ ఆసక్తికరంగా సాగింది. టాస్ గెలిచిన శ్రీవిద్య నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. 78 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కృష్ణతేజ జట్టు 7 ఓవర్లలో 2 వికెట్లు నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో ఎ.కార్తీక్ (19 బంతుల్లో 4×3, 6×2) 35 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

## మహిళా వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉష

**తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే:** శ్రీపద్మావతి మహిళా వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా బయోటెక్నాలజీ విభాగం ఆచార్యులు ఆర్.ఉష నియమితులయ్యారు. సోమవారం వీసీ ఆచార్య వి.ఉమ అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో రిజిస్ట్రార్ నియామకంపై నిర్ణయం తీసుకున్నారు. ఆచార్య రజని 2023 జనవరి 5 నుంచి రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. మూడేళ్ల కాలపరిమితి ముగియడంతో నూతన రిజిస్ట్రార్ అదేరోజు బాధ్యతలు తీసుకోనున్నారు. ఉష 21 ఏళ్ల బోధన, పరిశోధనానుభవంలో ఎన్నో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె పరిశోధనల్లో రెండింటికి పేటెంట్ పొందారు. ఆమె మార్గదర్శకత్వంలో 10 మంది పరిశోధక విద్యార్థినులు పీహెచ్‌డీలు అందుకున్నారు. ● పాలకమండలిలో ఇటీవల జరిగిన సీఏఎస్ ఎంపికలకు ఆమోదం లభించింది. ఐదుగురు అధ్యాపకులకు పదోన్నతులు లభించనున్నాయి. ఇంజినీరింగ్ కళాశాలలో రెండు అంతస్తుల భవన నిర్మాణానికి, ఇద్దరు ప్రొఫెసర్ల నియామకానికి ఆమోదం లభించింది.

**పురపాలక సంఘ కార్యాలయము, గూడూరు**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

టెండర్ నోటీసు Roc.No.325/2025/E1 తేది: 30.12.2025

గూడూరు పురపాలక సంఘం (తిరుపతి జిల్లా) పరిధిలో సాధారణ నిధులతో అంచనా విలువ రూ.5.00 లక్షలతో 1. Supply and delivery of IM2 power bore, 4 No hand bore pump and main pipe line leak materials, distribution water supply materials in all wards of Gudur Municipality అను పనికి గాను మొదటి పిలుపు టెండరు (Tender Id:881619) మరియు 15వ ఆర్థిక సంఘ టైడ్ 2020-21 మొదటి విడత నిధులతో అంచనా వ్యయం రూ.18.80 లక్షలతో 2. Supply and Delivery of 1100L of Capacity Galvanized steel compactor bins for collection of garbage in garbage transfer stations in Gudur Municipality అను పనులకు రెండవ పిలుపు టెండర్లు (Tender Id:881606) పిలవడమైనది. సదరు పనులకు టెండర్ షెడ్యూలు ప్రారంభ తేదీ: 30.12.2025 ఉదయం 10:30 గంటల నుండి మరియు బిడ్ దాఖలు చేయడానికి చివరి తేదీ 19.01.2026 సాయంత్రం 3:00 గంటల వరకు. ఇతర పూర్తి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అయిన www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 9885439447, 9100890511ను సంప్రదించగలరు.

కమిషనర్, గూడూరు పురపాలక సంఘం.

## భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

గరుడ కూడలి వద్ద పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

**తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే:** శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం గరుడ కూడలి, మెట్టు మార్గం, అప్పలాయగుంట ప్రాంతాల్లో పర్యటించి బందోబస్తుపై సమీక్షించారు. కమాండ్ కంట్రోల్ కేంద్రం పరిశీలించారు. రద్దీ సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కీలక ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను అనుసంధానించి నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్‌లోని ప్రత్యేక పోలీసు బృందాలు భక్తుల తాకిడిని గమనిస్తూ భద్రత కల్పించాలని ఆదేశించారు.

**చెక్‌పోస్టుల వద్ద నిఘా:** జిల్లా సరిహద్దుల నుంచి వచ్చే భక్తులపై పోలీసు శాఖ నిఘా పెట్టింది. దర్శన టికెట్లు లేకుండా వచ్చేవారు ఎందరు.. వారు ఎక్కడి నుంచి వస్తున్నారో ఆరాతీస్తున్నారు. టికెట్లు లేకుండా తిరుమలకు వెళ్తే ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు ఎక్కువగా వస్తుండగా ఇలాంటి వారిని తిరుమలలో రద్దీని బట్టి నిలువరించే అవకాశం ఉంది.

## శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టుల న్యాయమూర్తులు

**తిరుమల, న్యూస్‌టుడే:** శ్రీవారిని వివిధ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.ఎస్.హేమలేఖ, బాంబే హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రమేష్ డి ధనుకా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్‌సింగ్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో చెన్నై జపనీస్ కాన్సులేట్ జనరల్ మెర్లిన్ యెయెసీ రే రిచర్డ్, ఏపీ మాజీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, కర్ణాటక మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్, ఎంపీ ప్రభ మల్లికార్జున, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, తితిదే మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజుచ తదితరులు దర్శించుకున్నారు.

## శివయ్య సేవలో బాలకృష్ణ సతీమణి

వసుంధరకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** సినీనటులు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆమెకు సోమవారం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి, గోపీనాథ్ దగ్గరుండి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**తిరుపతి నగరపాలక సంస్థ**

**సీల్డ్ టెండరు మరియు బహిరంగ వేలము ప్రకటన**

ఆర్.ఓ.సి.నెం.767/2025/ఎ1, తేది: 28-12-2025

ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌నకు స్వాధీనము చేసిన తేదీ నుండి 31-3-2026 వరకు సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము నిర్వహించబడును.

సదరు సీల్డ్ టెండరు షెడ్యూల్ తేది: 03-01-2026 నుండి 05-01-2026 వరకు కార్యాలయ పని వేళల యందు జారీ చేయబడును. పూర్తి చేసిన టెండర్లు తేది 05-01-2026న ఉదయం 10.00 వరకు స్వీకరించబడును. తదుపరి సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము పద్ధతిలో కమిషనరు వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము తేది: 06-01-2026న ఉదయం 11.00 గంటలకు నిర్వహించబడును. బహిరంగ వేలము పూర్తి అయిన పిదప అందరి సమక్షములో సీల్డ్ టెండర్లు తెరవబడును. సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము నందు పాల్గొను టెండరుదారులు వారు ధరావత్తులను బ్యాంకర్ చెక్కు/డి.డి.ల ద్వారా మాత్రమే అందజేయవలయును. బహిరంగ వేలము నందు పాల్గొను టెండరు దారులు టెండర్ మొత్తముపై గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ అదనముగా చెల్లించవలయును. బహిరంగ వేలము మరియు సీల్డ్ టెండర్ నందు ఎవరైతే అధిక మొత్తము నమోదు చేయబడుదురో వారిని హెచ్చు పాట దారునిగా పరిగణించి స్టాండింగ్ కమిటీ వారి అనుమతికి లోబడి ఉత్తర్వులు జారీ చేయబడును.

| వ. నెం. | టెండర్ వివరములు | టెండర్ కాల పరిమితి | టెండరు షెడ్యూలు ఖరీదు | ఏదేని జాతీయ బ్యాంకు నుండి తీసిన బ్యాంకు గ్యారంటీ/సాలవెన్సీ సర్టిఫికేట్ ధ్రువపత్రము రూ॥లు | పాట సమయము నందు చెల్లించవలసిన ధరావత్తు మొత్తము మరియు గూడ్స్ & సర్వీస్టాక్స్ రూ॥లు |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1 | ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్టు సముదాయము (ఐ.డి.ఎస్.ఎం.టి. క్రింద కట్టిన 66 షాపులు తప్ప) | స్వాధీనము చేసిన తేదీ 31-03-2026 వరకు | 1,000/- | 25,00,000/- | 30,00,000/- |

షరతులు:

1. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్టు సముదాయము కేటాయింపు నగరపాలక సంస్థ చట్టం/తిరుపతి జిల్లా గెజిట్టులోని నిబంధనలకు/షరతులకు లోబడి వసూలు చేయవలెను.
2. టెండరులో పాల్గొను తేది: 03-01-2026 నుండి తేది: 05-01-2026 వరకు కార్యాలయ పనివేళలయందు మునిసిపల్ ఖజానా నందు టెండరు షెడ్యూలు ఖరీదు రూ.1000/- లు చెల్లించి టెండరు షెడ్యూలను ఉప కమిషనరు, నగరపాలక సంస్థ, తిరుపతి వారి నుండి పొందవచ్చు. పూర్తి చేసిన టెండర్లను తేది: 05-01-2026న ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటలలోగా సీల్డు కవర్లలో టెండరు బాక్స్ నందు వేయవలెను. బహిరంగ వేలము తేదీ 06-01-2026న ఉదయం 11.00 గంటలకు నిర్వహించబడును. టెండర్ ధరావత్తు మొత్తము రూ. 30,00,000/- టెండరులు బహిరంగ వేలము జరుగు తేదీన చెల్లించవలెను. ధరావత్తు చెల్లించిన వారి టెండర్లు మాత్రమే తెరువబడును. సదరు బహిరంగ వేలము పూర్తి అయిన తరువాత అందరి సమక్షములో కమిషనరు వారిచే గాని కమిషను వారు అనుమతించిన వారిచే గాని సీల్డు టెండరును, సీల్డు టెండరు మరియు బహిరంగ వేలము నందు ఎవరైతే అధిక తెరవబడును మొత్తముగా నమోదు చేయబడుదురో వారిని హెచ్చు పాటదారునిగా పరిగణించి స్టాండింగ్ కమిటీ కౌన్సిల్ వారి/ కౌన్సిల్ వారు ఆమోదించిన/ స్టాండింగ్ కమిటీ, అనుమతికి లోబడి ఉత్తర్వులు జారీ చేయబడును. 7 తేదీ నుండి దినముల లోపల రూ.25,00,000/-లు మొత్తమును ఏదేని గుర్తింపు పొందిన జాతీయ బ్యాంకు నుండి బ్యాంకు వారిచే ధృవీకరించబడిన బ్యాంకు గ్యారెంటీ పత్రమును సమర్పించవలెను. అట్లు సమర్పించని యెడల వారు చెల్లించిన ధరావత్తు మొత్తమును నగరపాలక సంస్థ నిధులకు జమచేసుకొని తిరిగి సీల్డు టెండరును ఆహ్వానించబడును. తరువాత జరుగు నష్టమునకు వారే బాధ్యత వహించవలెను. టెండరు షెడ్యూల్ ఫారముతో పాటు నివాస ధ్రువీకరణ పత్రములు మరియు రెండు పాస్ పోర్టు సైజు ఫోటోలు జతపరచి టెండరు బాక్సు నందు వేయవలయును.
3. ఇది వరకు బహిరంగ వేలము పాట/సీల్డు టెండరులో పాల్గొని నగరపాలక సంస్థకు బకాయిలు పడిన వారు మరియు ధరావత్తు రుసుము చెల్లించని వారు పాట/టెండరులో పాల్గొనుటకు అనర్హులు.
4. వేలములో పాల్గొనే గుత్త దారులు తప్పనిసరిగా జి.ఎస్.టి. రిజిస్ట్రేషన్ కాపీ, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీ మరియు పాన్ కార్డు జిరాక్స్ కాపీని తప్పనిసరిగా సమర్పించవలెను.
5. హెచ్చు పాటదారుడు పాట మొత్తముపై 2% శాతము Income Tax చెల్లించవలెను.
6. హెచ్చు పాటదారుడు నెలసరి పాట మొత్తమునకు సమానముగా తేదీలు వేయకుండా చెక్కులు సంతకము చేసి ఇవ్వవలెను.
7. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ పరిధిలోని చుట్టుప్రక్కల పడమట దిక్కున గల తిలక్ రోడ్డు, తూర్పు దిక్కున గల తాతయ్య గుంట గంగమ్మ గుడి రోడ్డు మరియు ఉత్తరాన మునిసిపల్ ఆఫీసు రోడ్డులో తప్ప మిగతా నగరములో ఎక్కడా వసూలు చేయకూడదు.

సం/- ఉప కమిషనరు, నగరపాలక సంస్థ, తిరుపతి

## ప్రతిపక్షాల అసత్య ఆరోపణలు తిప్పికొడతాం

### తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి

పనబాక లక్ష్మిని సన్మానిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**తిరుపతి (నగరం), న్యూస్‌టుడే:** దేశంలో ఎక్కడలేని విధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని... రాష్ట్రంలోని ప్రతిపక్షపార్టీలు మాత్రం అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని ఇకపై ఎప్పటికప్పుడు తిప్పికొడతామని తెదేపా పార్లమెంట్ నియోజకవర్గం నూతన అధ్యక్షురాలు పనబాక లక్ష్మి అన్నారు. సోమవారం తిరుపతిలోని కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నరసింహయాదవ్, సుగుణమ్మతో కలిసి ఆమె మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలో క్షేత్రస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఎమ్మెల్యేల సహకారంతో పార్టీని బలోపేతం చేయడంపాటు సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ వైకాపా నాయకులు అవినీతి, అక్రమాలంటూ కూటమి ప్రభుత్వంపై చేసుకున్న ఆరోపణలను నూతన కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు ఖండించాలన్నారు. అనంతరం పనబాక లక్ష్మిని ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, మాజీమంత్రి పరసారత్నం, సత్యవేడు ఇన్‌ఛార్జి శంకర్‌రెడ్డి, ఉపమేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు జేబీ శ్రీనివాస్, మహేష్‌యాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు, సుబ్బుయాదవ్, రుద్రకోటి సదాశివం తదితరులు కలిసి ఘనంగా సత్కరించారు.

**శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానము**
**శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా - 517 644**
RC.No.A2/5742/2025, Dated:24.12.2025.

**ఈ-ప్రొక్యూర్మెంటు మరియు సీల్డ్ టెండర్ల ప్రకటన**

శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానము నందు తేది:10-02-2026 నుండి తేది:23-02-2026 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు - 2026 సందర్భముగా అవసరమైన ఏర్పాట్ల నిమిత్తం క్రింది తెలిపిన వివరముల ప్రకారం టెండర్లు ఆహ్వానించడమైనది.

| | ఈ-ప్రొక్యూర్మెంటు టెండర్లు | EMD | టెండర్ తేది |
|---|---|---|---|
| 1. | ప్రత్యేక పూల అలంకరణ (తేది:10-02-2026 నుండి తేది:23-02-2026 వరకు 14 రోజులు) 2nd Call | రూ. 3,00,000/- | Bid downloading start: 30.12.2025 End:13.01.2026 Price bid open:14.01.2026 |
| 2. | తేది:15-02-2026న మహాశివరాత్రి రోజున రెండు ప్రదేశములలో ప్రత్యేక పూల మరియు పండ్లతో అలంకరణ. | రూ. 3,00,000/- | -do- |
| 3. | తేది:15-02-2026న మహాశివరాత్రి రోజున మూడు ప్రదేశములలో ప్రత్యేక పూల మరియు పండ్లతో అలంకరణ. | రూ. 3,00,000/- | -do- |
| 4. | ఫోటోలు, వీడియోలు కవరేజ్ (తేది:10-02-2026 నుండి తేది:23-02-2026 వరకు 14 రోజులు) 2nd Call | రూ. 2,00,000/- | -do- |
| 5. | మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు - 2026 సందర్భముగా సిబ్బందికి యూనిఫారము సరఫరా. | రూ. 50,000/- | -do- |
| | సీల్డ్ టెండరు | | |
| 6. | గొడుగులు, సూరిటీలు, కర్టెన్లు మరియు ఇతర అలంకరణ సామాగ్రి సరఫరా 2nd Call | రూ. 10,000/- | షెడ్యూలు దరఖాస్తు చివరి తేదీ: 08-01-2026, షెడ్యూలు జారీ చేయు తేది:13-01-2026 షెడ్యూలు టెండరు బాక్సు నందు సమర్పించు తేది: 14-01-2026 1.00 PM లోపల |
| 7. | మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు-2026 సందర్భముగా తేది:15-02-2026న మహాశివరాత్రి రోజున అనుబంధ ఆలయముల నందు ప్రత్యేక పూల అలంకరణ | రూ. 50,000/- | -do- |

ఆసక్తి గల వారు పై తెలిపిన టెండర్లకు సంబంధించి www.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు మరియు కార్యాలయపు పనివేళల యందు 9618515658/9866456141/9989414040 సంప్రదించవచ్చును.

సం/ - టి.బాపి రెడ్డి, కార్యనిర్వహణాధికారి

## పీజీఆర్ఎస్‌కు 428 వినతులు

**తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే:** కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 428 వినతులు వచ్చాయి. సోమవారం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, శివశంకర్‌నాయక్, సుధారాణి, రోజ్‌మాండ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## డయల్ యువర్ సీఎండీకి 50...

**తిరుపతి (నగరం):** ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి 50 వినతులు వచ్చాయి. సీఎండీ శివశంకర్ అధికారులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. డిస్కం పరిధిలోని తొమ్మిది జిల్లాల నుంచి వినియోగదారులు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు.

## ఆర్యవైశ్యులకు భద్రత కల్పించాలి

### మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్

**తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే:** రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులపై దాడులు, వేధింపులు జరుగుతున్నాయని, ఆర్యవైశ్యులకు భద్రత కల్పించాలని మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. తిరుపతి పర్యటనలో భాగంగా విచ్చేసిన ఆయన సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడారు. కూటమి పాలనలో ఆర్యవైశ్యులకు, ఆర్యవైశ్య వ్యాపారులకు భద్రత కొరవడిందని విమర్శించారు. పొదిలిలో అవినాష్ అనే దుకాణ యజమానిపై ఎస్సై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని, వెంటనే సస్పెండ్ చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

EENADU Classifieds

**HEALTH & CARE**

**PAEDIATRIC**

**శ్రీవిష్ణు చిన్నపిల్లల** హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

**TOURS AND TRAVELS**

**వేదవిద్యా పరిషత్‌వారిచే** కాశీయాత్ర ప్రతినెల & మహాశివరాత్రి ప్రత్యేక యాత్ర రుద్రహోమంతో.. 2) బద్రి-కేదార్ మొ॥ చార్‌దామ్‌యాత్ర 2026 సం॥ నమోదు రూ. 1000/- ఇతర యాత్రలకై సంప్ర॥ కాల్ & వాట్సాప్ ✆ 98737 90017, 93941 42516.

**REAL ESTATE**

**LAND FOR SALE**

**GENERAL**

**గూడూరుకు** 5 కి.మీ. పరిధిలో 1 3/4 ఎకరము పొలము అమ్మబడును. వివరములకు సెల్: ✆ 96522 14810.

**PLOT FOR SALE**

**GENERAL**

**తిరుపతికి అతి** సమీపంలో చెన్నై to తిరుపతి హైవే పక్కన కమర్షియల్ ప్లాట్ కొలతలు 100 x 170 (472 అం.) వెంగలరాజు కండ్రిగ. ✆7993145689.

**JOBS**

**బెంగుళూరులో పనిచేయుటకు** ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854

EENADU THE CLASSIFIEDS WAY — B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు. వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరుపతి
• తిరుపతి • చంద్రగిరి

## కపిలేశ్వరాలయంలో తెప్పోత్సవాల ప్రారంభం

తిరుపతి (తితిదే): తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం తెప్పోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజున సాయంత్రం శ్రీ వినాయక స్వామివారు, శ్రీచంద్రశేఖర స్వామివారు తెప్పపై విహరించి భక్తులను అనుగ్రహించారు.

తెప్పపై వినాయకస్వామి, శ్రీ చంద్రశేఖరస్వామి

## అన్న ప్రసాదాల వితరణ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: కపిలతీర్థం వద్ద భక్తులకు సోమవారం [illegible] విండ్ షర్ నిర్మాణ లిమిటెడ్ జనరల్ మేనేజర్ పసుపులేటి శివప్రసాద్ నిర్వహణలో అన్న ప్రసాద వితరణ చేశారు. పర్వదినాలు, పండగల సమయాలలో సంస్థ తరపున సేవా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు శివప్రసాద్ తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: **సమస్య:** పద్మావతి పురం వెళ్లే ప్రాంతంతోపాటు నగరంలో అనేక ప్రాంతాల్లోని రోడ్లపై గుంతలు ఎక్కువగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాల్లో రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉంది. [illegible] మరమ్మతులు చేయడం లేదు. **- రాజగోపాల్, బైరాగిపట్టెడ**

**సమాధానం:** నగరవ్యాప్తంగా ఏర్పడిన గుంతలు పూడ్చ దానికి చర్యలు చేపట్టాం. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది. **- శ్యామసుందర్, నగరపాలిక ఎస్ఈ**

**సమస్య:** గొల్లవానిగుంట ప్రాంతంలోని ఐదు వీధుల్లో మట్టి రోడ్లు ఉన్నాయి. వాటిలో రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది. వర్షంలో కాలు మోపలేం. **- నరసింహస్వామి, గొల్లవానిగుంట**

**సమాధానం:** కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సిమెంట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతాం. **- శ్యామసుందర్, నగరపాలిక ఎస్ఈ**

పాకాల, న్యూస్‌టుడే: **సమస్య:** పాకాలలో మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. స్థానికులకు ఇబ్బందిగా మారింది. - సదాశివ, చిరువ్యాపారి (బజాజ్‌షోరూం), పాకాల

**సమాధానం :** వెంటనే సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరిస్తాం. **- లావణ్యలత, పంచాయతీ కార్యదర్శి**

## సుసంపన్న మూలాలు.. భావిభారత సౌధాలు

ఘనంగా ముగిసిన భారతీయ విజ్ఞాన సమ్మేళనం

### అవగాహనకు బీజం

దేశంలోని పురాతన విద్య, వైద్య, ఆరోగ్య అంశాల గురించి ఈ సదస్సు ద్వారా నేటితరంలో చాలామందికి తెలిసింది. సైన్సు, రక్షణ, సాంకేతిక రంగాల్లో భారతదేశం సాధించిన గణనీయమైన అభివృద్ధిని వక్తలు అర్థమయ్యే రీతిలో విశదీకరించారు. ముఖ్యంగా ఇక్కడి స్టాళ్ల ద్వారా విద్యార్థులు స్ఫూర్తిపొందే అవకాశం ఏర్పడింది. **- బి.ఎన్.స్వాతిరెడ్డి, పరిశోధకురాలు**

### గతంలో చూడలేదు

ఎగ్జిబిషన్ విద్యార్థుల విజ్ఞానం పెంపునకు ఎంతగానో దోహదపడింది. సైన్స్‌కు సంబంధించిన అనేక అంశాలు సులువుగా అర్థమయ్యాయి. రాకెట్లు ఎలా ప్రయోగిస్తారు, రాడార్ల వల్ల ఉపయోగాలు ఏమిటి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భారతదేశం సాధిస్తున్న విజయాలు తెలుసుకోగలిగాం. **- ఎం.శ్రీజ, తొమ్మిదో తరగతి విద్యార్థిని**

### అలా కట్టిపడేసింది

సైన్స్ ఎగ్జిబిషన్‌తోపాటు భారతీయ ప్రాచీన వైభవాలకు సంబంధించిన చారిత్రాత్మక, సంప్రదాయ ప్రదర్శనశాల మమ్మలని అట్టే కట్టిపడేసింది. అప్పటి అంశాలు తెలుసుకుంటుంటే భారతీయుల ఘన చరిత్ర ఏమిటో అర్థమైంది. ఆలయాల విశిష్టత, సంప్రదాయాలు చాలా బాగున్నాయి. వాటిని సంరక్షించుకుంటూనే దేశం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. **- ఎస్.సార, విద్యార్థిని**

యుద్ధ ట్యాంకర్‌కు సంబంధించి తెలుసుకుంటున్న కంచి కామకోటి పీఠం విద్యార్థినులు

షార్ రాకెట్ నమూనాల వివరాలు రాసుకుంటున్న విద్యార్థులు

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: వికసిత భారత్ సాధనలో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో పాటు భావ కాలుష్యం, అవినీతి రాహిత్యం, విలువలు పాటించడం కీలకమని వక్తలు అభిప్రాయపడ్డారు. దేశంలో అన్ని రంగాల సర్వతోముఖాభివృద్ధిపై విస్తృత చర్చ జరిపేందుకు వేదికగా నిలిచిన భారతీయ విజ్ఞాన సమ్మేళనం సోమవారం ఘనంగా ముగిసింది. నాలుగురోజుల పాటు తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సాగిన సమ్మేళనం.. 32 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి విచ్చేసిన 1,250 మంది ప్రతినిధులు, ప్రముఖ పరిశోధన, విద్యా, వైద్య రంగాల ప్రదర్శనలతో ఆకట్టుకుంది. సదస్సులో భాగంగా పలు అంశాలపై 250 పరిశోధన పత్రాలు, 700 మంది అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తమ పోస్టర్లను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చి వైజ్ఞానిక స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు.

శ్రీవారి ఆలయ నమూనా వద్ద స్వీయచిత్రం తీసుకుంటున్న విద్యార్థులు, అధ్యాపకులు

### విజయాలకు వేదికగా..

నాకు సైన్సు, పరిశోధన, పరిజ్ఞానం అంటే చాలా ఇష్టం. ఈ సమ్మేళనంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ మమ్మల్ని మైమరిపించింది. ముఖ్యంగా ప్రపంచ దేశాలతో పోటీపడే రీతిలో భారతదేశం గగనతలంపై సాధించిన విజయాలు అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేశారు. ఇస్రో ఏర్పాటు చేసిన రాకెట్ లాంచర్ నమూనా ఎంతో జ్ఞానాన్ని తెలియజేసింది. **- కె.గౌతమ్‌నాయుడు, విద్యార్థి**

### సైంటిస్ట్‌గా ఎదగాలని ఉంది

శాస్త్రీయ పరిశోధనాంశాలు పుస్తకాల్లో ఎంత చదివినా తెలిసేది పరిమితమే. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటుచేసిన నమూనాలతో అనేక అంశాలు సులువుగా అర్థమయ్యాయి. నాకు సైంటిస్ట్‌గా ఎదగాలని ఉంది. ఇక్కడ ఏర్పాటు చేసిన పలు ప్రయోగాలకు సంబంధించిన అంశాలు ఆసక్తి పెంచాయి. ఆలోచనలు మెరుగుపరుచుకునేందుకు ఈ సమ్మేళనం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడింది. **- ఎస్.కుషల్‌కుమార్, విద్యార్థి**

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

తిరుపతి(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలోని ఎరువుల దుకాణాలపై ప్రత్యేక తనిఖీ బృందాలు సోమవారం మెరుపు దాడులు నిర్వహించాయి. రాష్ట్రంలో తలెత్తిన యూరియా సమస్యపై రాష్ట్ర వ్యవసాయశాఖ ఐదు జిల్లాలకు ప్రత్యేక తనిఖీ అధికారులను నియమించింది. ఎస్.వెంకటేశ్వర్లు నేతృత్వంలో రేణిగుంట, వెంకటగిరి, గూడూరు తదితర ప్రాంతాల్లో ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. 'ఓ'ఫామ్ లేకుండా విక్రయిస్తున్న 35 టన్నుల ఎరువుల విక్రయాలు నిలుపుదల చేశారు. వ్యవసాయ అధికారి .వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

**FOR SALE**
Mobile & Digital Showroom Sale, Very Primelocation excellent commercial location Balaji colony, Tirupati. Cell: 9866437896
**OLD MOBILES EXCHANGE OFFER**
Contact : 9494208296, 90002 31519, 89193 20437

**IN THE COURT OF THE Ist ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: TIRUPATI**
O.S.No.318 OF 2017
K.Sankar Reddy (Died) & other ...Plaintiffs
V/s
T.Ramamurthy & Others ...Defendants
**SUIT SUMMONS TO THE DEFENDANTS No.11 & 12**
To
D11
P.Prameela,
W/o Late P.Raja Reddy,
D12
P.Anil Kumar,
S/o Late P.Raja Reddy,
both are residing at D.No.20-1-287/A, Korlagunta, Tirupati, Tirupati District.
Please take suit summons in the above suit, it is posted to 08.01.2026 for your appearance and you have to appear before the said court on that day, either by yourself or through your advocate at about 10.30 a.m. or else you will be set exparte and the case will be proceeded in your absence.
Date of hearing: 08.01.2026
**M.VANI,**
**P.MURALIKRISHNA REDDY,**
**Advocates, Tirupati.**

## జనవరిలో విశేష పర్వదినాలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో వచ్చేనెలలో విశేష పర్వదినాలు జరగనున్నాయి. జనవరి 4న శ్రీవారి ప్రణయ కలహ మహోత్సవం, 8న పెద్ద శాత్తుమొర, 12న అధ్యయనోత్సవాల సమాప్తి, 13న తిరుమల నంబి సన్నిధికి వేంచేపు, 14న భోగి, 15న మకర సంక్రాంతి, సుప్రభాత సేవ పునఃప్రారంభం, 16న కనుమ, శ్రీవారు పార్వేట మండపానికి వేంచేపు, 18న పురందరదాసుల ఆరాధన, 23న వసంత పంచమి, 25న రథసప్తమి నిర్వహించనున్నారు.

## అమ్మవారి సేవలో అయ్యన్నపాత్రుడు

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారిని సోమవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్లు సురేష్ బాబు, ముని చెంగల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ చలపతి స్వాగతం పలికారు.

ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో స్పీకర్

శ్రీనివాసరాజుకు జ్ఞాపిక అందిస్తున్న సంఘం నేతలు

## క్షత్రియ సంఘ సర్వసభ్య సమావేశం

తిరుపతి (బైరాగిపట్టెడ): తిరుపతి రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక శ్రీబాలాజీ కల్యాణమండపంలో జరిగింది. ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ కేవీస్ శ్రీనివాసరాజు విచ్చేశారు. సంఘం అధ్యక్షుడు బలరామరాజు, ప్రధాన కార్యదర్శి సి.నారాయణ బాబు, కోశాధికారి సి.మనోహర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉప సభాపతికి స్వాగతం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: శ్రీనివాసపురంలోని తెదేపా సీనియర్ నేత జేబీ శ్రీనివాస్ నివాసానికి సోమవారం శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణమరాజు వచ్చారు. ఆయనకు తెదేపా నాయకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.

రఘురామకృష్ణమరాజుకు స్వాగతం పలుకుతున్న జేబీ శ్రీనివాస్

శివశంకర్ లోతేటిని సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

## నూతన డైరీ ఆవిష్కరణ

తిరుపతి (నగరం): క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ విద్యుత్ ఉద్యోగుల సంఘం నూతన డైరీని సోమవారం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు అనంత ప్రసాద్, కార్యదర్శి భాస్కర్ రాజు, కోశాధికారి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం ఎదుట హీరో రోషన్, నటి అనస్వర రాజన్, నటుడు మహేష్ తదితరులు

## శ్రీవారి సేవలో 'ఛాంపియన్' చిత్ర బృందం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఛాంపియన్ చిత్ర బృందం సోమవారం దర్శించుకుంది. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని చిత్ర హీరో రోషన్, నటుడు మహేష్, నటి అనస్వర రాజన్ దర్శించుకున్నారు. అనంతరం హీరో మాట్లాడుతూ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోందని, దీంతో శ్రీవారి ఆశీస్సులు అందుకునేందుకు వచ్చినట్లు చెప్పారు. జనవరిలో కొత్త చిత్రం వివరాలు వెల్లడిస్తామన్నారు.

## శ్రీవారి సేవలో న్యాయమూర్తి

ఆలయం ఎదుట జస్టిస్ రామకృష్ణారెడ్డి ఇతర కుటుంబ సభ్యులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణారెడ్డి సోమవారం దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు.

## వైకుంఠ.. వైభవం

అలిపిరి టోల్‌గేటు వద్ద ఈ-డిప్ టోకెన్ చూపుతున్న భక్తులు

అలిపిరి గరుడ కూడలిలో

శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పుష్పాలంకరణ

తిరుపతి (తితిదే), చంద్రగిరి, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆయా ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ప్రత్యేక క్యూలైన్లు, పుష్పాలంకరణలు పూర్తిచేశారు. శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఎస్పీ సుబ్బరాయుడు పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. దర్శన టోకెన్లు లేనివారిని తిరుమలకు అనుమతించకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన ఇబ్బందులు పడుతూ కనిపించారు. శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద టూరిస్టు బస్సులు ఆపి వంటావార్పు అనంతరం నిద్రిస్తున్నారు. తుమ్మలగుంటలోని కల్యాణవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని వైకుంఠ ఏకాదశికి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసినట్లు ఆలయ నిర్వాహకులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## తెదేపాకు కార్యకర్తలే మూలస్తంభాలు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తలే మూలస్తంభాలని... కార్యకర్తలు పని చేస్తేనే పార్టీ అధికారంలో ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఉత్తర కార్యకర్తల పేరుతో అవార్డులు అందజేశారు. నాయకులు చినబాబు, బుల్లెట్ రమణ, సూరా సుధాకర్‌రెడ్డి, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, దంపూరి భాస్కర్‌యాదవ్, మునిశేఖరఖ్ రాయల్, కుమారమ్మ, పుష్పావతి, మునిశేఖర్‌రాయల్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల కమిటీ రద్దు

తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు, జిల్లా కన్వీనర్ పత్తికొండ మురళి సోమవారం ప్రకటనలో తెలిపారు. తొమ్మిదిమంది న్యాయవాదులతో కన్వీనర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో నూతన కమిటీని ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

## న్యాయవాది మృతికి సంతాపం

తిరుపతి (లీగల్): తిరుపతి న్యాయవాది బి.మురళీమోహన్(48) మృతికి న్యాయమూర్తులు సోమవారం సంతాపం తెలిపారు. అయిదో అదనపు జిల్లా సెషన్సు జడ్జి జి.రామగోపాల్, న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టి గజేంద్ర, ప్రధాన కార్యదర్శి వి.విద్యానాథరెడ్డి, సెషన్సు జడ్జిలు జి.అర్చన, టి.రామచంద్రుడు, నరసింహమూర్తి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి డి.విజయసారథిరాజు, జూనియర్ డివిజన్ సివిల్ జడ్జిలు బి.వాణిశ్రీ, జి.శ్రీనివాస్, ఎస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నేడు కోర్టు విధుల బహిష్కరణ

తిరుపతి (లీగల్), న్యూస్‌టుడే: తిరుపతి కోర్టు విధులు మంగళవారం బహిష్కరిస్తూ తీర్మానం చేసినట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గొట్టి గజేంద్ర, ప్రధాన కార్యదర్శి వి.విద్యానాథరెడ్డి సోమవారం తెలిపారు. పత్తికొండ ఘటనకు నిరసనగా తీర్మానం చేసినట్లు చెప్పారు.

## ఆక్రమణలు తొలగించాలంటూ నోటీసులు

పాకాల, న్యూస్‌టుడే: చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మండలంలోని పోలిచెట్టిపల్లి, హైస్కూల్‌గేటు పరిసరాల్లో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలంటూ ఆ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. కొందరు అనధికారికంగా నిర్మాణాలు, రేకులషెడ్లు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నారు. విస్తరణకు ప్రతిపాదనలు వెళ్లినట్లు తెలియడంతో వ్యాపారుల్లో గుబులు మొదలైంది.

**In the Court of the Hon'ble I Additional Junior Civil Judge: Tirupati**
O.E.P. No: 114 of 2022
O.S.NO: 840 of 2018
M/s. C.K.Enterprises, Rep, by its Proprietor Mr.C. Santhi Lal, and by his power of Attorney agent Mr.K. Vimal Kumar ...Decree Holder.
V/s
i) M/s Arava Clothing Private Limited, Rep by its Directors,
ii) Mr. Pradeep Kumar Arava, Director of M/s Arava Clothing Private Limited.
iii) Mr. Reddeppa Reddy.M. Director of M/s Arava Clothing Private Limited, ...Judgement Debtors.
**Order 21 Rule 37 Notice to JDr No. 1 to 3.**
i) M/s Arava Clothing Private Limited, Rep by its Directors Holding Office at R.S. Junction, No. 89, T.K Street, Tirupati.
ii)Mr.Pradeep Kumar Arava, Director of M/s Arava clothing Private Limited, Holding office, at R.S Junction, No. 89, T.K. Street, Tirupati.
iii)Mr. Reddeppa Reddy.M, Director of M/s Arava Clothing Private Limited, Holding Office, at R.S Junction, No. 89, T.K. Street, Tirupati.
Sir, where as the Decree holder has made an application to this court for execution of Decree in the above matter for arrest Ep. U/o 21 Rule 37. Hence the Hon'ble court order for Rule 37 Notice to JDr No. 1 to 3 on Hence please be present on 08-01-2026 at 10:30 A.M. before the above said court either in person or through your Advocate failing which in your absence the matter will be Proceeded next step.
Hearing Date :08-01-2026
**CHITIPIRALLA POORNACHAND., LLM.**
Advocate / Notary, Tirupati.
Cell No: 9440410408.

పనబాక లక్ష్మి, దివాకర్‌రెడ్డి, నరసింహయాదవ్‌ను సత్కరిస్తున్న ఆర్సీ మునికృష్ణ, మహేష్‌యాదవ్.. సూర సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ తదితర నాయకులు

## పనబాక లక్ష్మిని కలిసిన నాయకులు

తిరుపతి (నగరం) : తెదేపా పార్లమెంట్ నియోజకవర్గం నూతన అధ్యక్షురాలు పనబాక లక్ష్మి సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇందులో భాగంగా పనబాక లక్ష్మి, దివాకర్‌రెడ్డిని ఉపమేయర్ ఆర్సీ మునికృష్ణ, గంగమ్మ గుడి ఆలయ ఛైర్మన్, మహేష్‌యాదవ్, నాయకులు సూర సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌వర్మ, బుల్లెట్ రమణ, బీజీ కృష్ణయాదవ్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, ఆనందబాబు యాదవ్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, కంకణాల రజనీకాంత్ నాయుడు, జేడబ్ల్యూ విజయకుమార్, పుష్పావతి యాదవ్, బ్యాంకు శాంతమ్మ, మునిశేఖర్‌రాయల్ తదితరులు కలిసి ఘనంగా సత్కరించారు.

## నేడు రీసర్వేపై అవగాహన

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: రాయలచెరువు గ్రామంలో భూముల రీసర్వేపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మధుసూదన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఎన్టీఆర్ రాజు కుటుంబ సభ్యులకు పరామర్శ

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకుడు, ఎన్టీఆర్ వీరాభిమాని ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను సోమవారం తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజు కుమారుడు శ్రీధర్‌వర్మ, ఇతర కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు.

## అదనపు కమిషనర్‌గా శారదాదేవి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా శారదాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ టిడ్కోలో జనరల్ మేనేజర్‌గా ఉన్న శారదాదేవిని ఇక్కడికి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం ఆమె కమిషనర్ ఎన్.మౌర్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ● కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 42 వినతులు అందాయి.

కమిషనర్ ఎన్.మౌర్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శారదాదేవి

## ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూముల్లోకి ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ మధుసూదన రావు అన్నారు. సొరకాయపాళెం సర్వే నెం. 88/4లో 0.57 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందని, అందులో ఎవరూ ప్రవేశించకూడదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి వైకుంఠద్వార దర్శనాల నేపథ్యంలో సోమవారం నుంచే చిన్నపిల్లలు, వృద్ధులకు జియో ట్యాగింగ్‌ను ప్రారంభించారు. స్థానిక బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేష్, భార్య, కుమారుడు కౌశిక్(5) తప్పిపోగా జియో ట్యాగింగ్ సాయంతో గుర్తించి అప్పగించారు. తిరుమల వ్యాప్తంగా బస్టాండ్‌లు, వసతి కేంద్రాలు, సీఆర్వో, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా పోలీసులు, స్వచ్ఛంద సేవకుల ద్వారా జియో ట్యాగింగ్ వేస్తున్నారు. ఈ పదిరోజులు ఇది కొనసాగనుంది.

శ్రీవారి ఆలయం ఎదుట చిన్నారులకు జియోట్యాగింగ్ వేస్తున్న మహిళా పోలీసులు

## శివయ్య దర్శనార్థం వస్తూ.. దుర్మరణం

☛ గరుడ వారధిపై టిప్పర్ ఢీకొనడంతో ఘటన

శ్యామలమ్మ

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: కపిలతీర్థంలోని శివయ్యను దర్శించుకొనేందుకు వస్తున్న మహిళను మృత్యువు టిప్పర్ రూపంలో కబళించింది. తూర్పు సీఐ శ్రీనివాసులు, ఎస్సై హేమాద్రి వివరాల మేరకు.. తిరుపతి ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ ఆదినాగరాజు భార్య శ్యామలమ్మ (53) స్థానిక భగత్‌సింగ్ కాలనీ నుంచి సోమవారం ఉదయం పక్కింటికి చెందిన రూపతో కలసి ద్విచక్ర వాహనంలో తిరుచానూరు అమ్మవారి దర్శనానికి వెళ్లారు. తదనంతరం కపిలేశ్వరాలయానికి వచ్చేందుకు మామిడికాయల మండీ వద్ద ఫ్లైఓవర్ ఎక్కారు. లక్ష్మీపురం కూడలి వద్దకు వస్తుండగా.. వెనుక నుంచి వేగంగా టిప్పర్ వచ్చింది. డ్రైవర్ అతివేగం.. నిర్లక్ష్య కారణంగా ద్విచక్ర వాహనానికి వెనుక నుంచి తగిలించారు. మహిళలిద్దరూ రోడ్డుపై పడగా వెనుక కూర్చున్న శ్యామలమ్మ తలపై టిప్పర్ వెనుకచక్రం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న రూప స్వల్ప గాయాలకు గురికాగా ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నాగలాపురం మండలం బీరకుప్పం గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ కుప్పయ్యను స్టేషన్‌కు తరలించారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం రుయాకు తరలించారు.

## జల్లికట్టు నిర్వహణపై ఘర్షణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: కొత్తశానంబట్లలో జల్లికట్టు నిర్వహణపై వివాదం నెలకొంది. ఉత్సవం కారణంగా ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయని, అంగవైకల్యం బారిన పడుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్, ఎస్పీలకు వేర్వేరుగా ఫిర్యాదులు అందజేశారు. సురక్షిత ప్రదేశంలో నిర్వహించుకోవాలని, ప్రజల ప్రాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. విషయం తెలియడంతో నిర్వాహకులు గ్రామంలో గొడవలకు తెగబడ్డారు. రెండువర్గాలుగా ఏర్పడి దూషణలకు దిగారు. గ్రామస్థులు 100కు ఫోన్ చేయడంతో సీఐ సురేష్ కుమార్ శాంతిభద్రతల పర్యవేక్షణకు చర్యలు చేపట్టారు.

## వాహనం అదుపుతప్పి ఉపాధ్యాయుడి మృతి

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే : వాహనం అదుపుతప్పి ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజాపవన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. దామలచెరువు మండలం మొగరాల గ్రామం, గరికనేట్టుకు చెందిన శ్రీనివాసులు(55) యర్రావారిపాలెం మండలం పచార్లవాండ్లపల్లిలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామానికి వెళ్తుండగా మంగళంపేట దారిలోని పూజారివాండ్లపల్లి వద్ద వాహనం అదుపుతప్పడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీకాళహస్తి
• శ్రీకాళహస్తి • సత్యవేడు

## స్థలాలు, పక్కాఇళ్లు మంజూరు చేయండి

తహసీల్దారు సుధీర్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న గిరిజనులు

**వరదయ్యపాళెం, న్యూస్‌టుడే:** ఏళ్ల కిందట నిర్మించుకున్న పక్కా ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడం, కుటుంబాలు పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని గిరిజనులు తహసీల్దారు సుధీర్‌రెడ్డికి సోమవారం విన్నవించారు. మండలంలోని వీకేఆర్‌కండ్రిగలో పోరాటకమిటీ ఆధ్వర్యంలో పలు సమస్యలు వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో బసిరెడ్డి పాల్గొన్నారు.

## మండలాభివృద్ధికి సహకారం అవసరం

**సత్యవేడు, న్యూస్‌టుడే:** మండలాభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఎంపీపీ ప్రతిమ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లోని సమస్యలను పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల పుదుప్పంలో డెంగీ ప్రబలితే.. తాత్కాలికంగా క్యాంపులు పెట్టారని కానీ శాశ్వత పరిష్కారం చూపలేదని వైస్ ఎంపీపీ శరవణ ఆరోపించారు. దయలరియాపై తప్పుడు నివేదికలు పంపారని రాజగోపాలపురం సర్పంచి మధుసూదన్ రావు స్పష్టం చేశారు. దాసుకుప్పం ప్రధాన రహదారిపై కోళ్ల వ్యర్థాలను విచ్చలవిడిగా పడేస్తున్నారని సర్పంచి దిలీప్‌రెడ్డి చెప్పారు. ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ రాజశేఖర్, త్రివిక్రమరావు, మునిరవికుమార్, మురళి పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడితే లైసెన్సుల రద్దు

దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారి వెంకటేశ్వర్లు, ఏడీఏ

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** ఎరువుల, పురుగు మందుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా దుకాణాల తనిఖీ అధికారి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను సోమవారం అధికారుల బృందంతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్‌ల నమోదు పకడ్బందీగా ఉండాలని, ఏమైనా తేడాలు ఉంటే కఠిన చర్యలు తప్పవని సూచనలు చేశారు. దుకాణాలను స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఏడీఏ వేణుగోపాల్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

విరాళాన్ని అందజేస్తున్న హైదరాబాద్ భక్తులు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదానానికి హైదరాబాద్ భక్తులు సోమవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. దర్శనార్థం వచ్చిన వెంకటరమణ, పద్మ దంపతులు వారి పిల్లలు ప్రశాంత్, ప్రియాంక పేర్లపై రూ. 50 వేలు, లోహితాక్ష్ పేరుపై మరో రూ.50 వేల నగదు చెక్కులను ఆలయ ప్రోటోకాల్ విభాగం ఏఈఓ మోహన్‌కు అందజేశారు. వీరికి ఆలయం తరఫున ప్రత్యేక దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

# సరిహద్దు వివాదం.. అభివృద్ధికి దూరం

వసతుల్లేని పేదల గృహ సముదాయం

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** తిరుపతి నగరపాలక సంస్థ, పంచాయతీ రాజ్ శాఖల సమన్వయ లోపం పేదలకు శాపంగా మారింది. ఏళ్ల తరబడి అసౌకర్యాల మధ్యనే కాలం వెల్లదీస్తున్నారు. గృహ సముదాయం నిర్మించిన ప్రాంతం మండల పరిధిలోనిది. లబ్ధిదారులు మాత్రం నగరానికి చెందిన వాళ్లు. దీంతో అటు నగరపాలిక పట్టించుకోక.. ఇటు మండలాధికారులు కన్నెత్తి చూడక ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది ఇళ్లు ఖాళీ చేసి మళ్లీ నగర బాట పట్టారు. సమస్యకు ఓ పరిష్కారం చూపాలని బాధితులు కోరుతున్నారు.

కాలనీలో నివాసాల చుట్టూ పెరిగిన ముళ్లపొదలు

### ఎవరిదీ పాపం..

నీలాద్రి గృహసముదాయంలో నివశిస్తున్న వారంతా తిరుపతి నగరానికి చెందిన వారు. ఓట్లు, ఆధార్ వివరాలు అక్కడే ఉన్నాయి. దీంతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు ఈ కాలనీ అభివృద్ధిపై దృష్టి సారించలేదు. అదేరీతిలో తిరుపతి ప్రాంత ప్రజాప్రతినిధులు సైతం ఎన్నికల సమయంలో కాలనీ ప్రజలపై కపట ప్రేమ ఒలకబోస్తున్నారు. తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడటంలేదు. రెండు ప్రాంతాల ప్రజాప్రతినిధుల చొరవ లేక అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

### ఇదీ సంగతి..

తిరుపతి నగరంలోని పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో నీలాద్రి గృహ సముదాయం నిర్మించారు. ఇందుకుగాను 2015లో రూ. 84కోట్లతో వికృతమాల సమీపంలోని 35 ఎకరాల విస్తీర్ణంలో 1800 ఇళ్లు, రెండు కమ్యూనిటీ భవనాలు నిర్మించారు. ఇందులో రెండు పాఠశాలలు, పార్కు సైతం ఏర్పాటు చేశారు. 2018 నాటికి నిర్మాణాలు పూర్తి చేసి 2019లో లబ్ధిదారులకు అప్పగించారు. దీంతో అద్దె ఇళ్లల్లో ఉంటున్న పేదలు సొంతింటి కల నేరివేరిందన్న ఆశతో వారికేటాయించిన ఇళ్లలో చేరారు. అయితే తర్వాత సమస్యలు చుట్టుముట్టినా పట్టించుకోక ఇబ్బందులు పడుతున్నారు.

### ప్రధాన సమస్యలు ఇవే..

కాలనీలో నివాసాల మధ్యలో ఏపుగా ముళ్ల పొదలు పెరగడంతో పాములు బెడద ఉంది. తాగునీటి సమస్య, నిత్యం విద్యుత్తు కోతలు, శివారు ప్రాంతం కావడంతో రవాణా సౌకర్యం లేదు. పిల్లలు పాఠశాల, కళాశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా సాయంత్రమైతే ఆకతాయిల ఆగడాలు అధికంగా మారుతుండటంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సి వస్తోంది.

### ఈ ఇళ్లు మాకొద్దు బాబోయ్..

వైకాపా పాలనలో నీలాద్రి గృహసముదాయం అభివృద్ధి గురించి గాలికి వదిలేయడంతో తిరుపతి నగరానికి చెందిన అధిక సంఖ్యలో పేదలు ఇక్కడి జీవనం సాగించలేక నివాసాలను వదిలి మరలా తిరుపతి నగరంలోని అద్దెగృహాల్లోకి వెళ్లిపోయారు. వందల సంఖ్యలో ప్రస్తుతం ఖాళీగా దర్శనమిస్తుండగా మరికొందరు సమస్యలతో సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా కాలనీ అభివృద్ధిపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) శ్రీకాళహస్తి: 80085 74555 నాగలాపురం: 98854 43308

**బీఎన్ కండ్రిగ, న్యూస్‌టుడే:** సమస్య: లక్ష్మీపురం ఎస్టీ కాలనీలోని మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకు పోయింది. దుర్వాసన, దోమలు ప్రబలుతున్నాయి.
– చెంచమ్మ, స్థానికురాలు

సమాధానం: వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. – పెంచలయ్య, పంచాయతీ కార్యదర్శి

### వెలిగిన దీపాలు

స్పందనకు వందనం

**తొట్టంబేడు, న్యూస్‌టుడే:** మండలంలోని బసవయ్యపాలెంలో వీధి దీపాలు మరమ్మతులకు గురై స్థానికులు రాత్రయితే అంధకారంలో అవస్థలు పడుతున్నారు. సమస్యపై 'మేమున్నాం-మీకుతోడుగా'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు పాత దీపాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. **కాలువల్లో పూడికతీత:** నాగలాపురం: భద్రావతీవీధిలో పంచాయతీ సిబ్బంది మురుగు కాలువల్లో పూడిక, వ్యర్థాలు తొలగించారు. సమస్యపై స్థానికుల ఫిర్యాదుతో సోమవారం 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. కథనానికి స్పందించిన సర్పంచి చిన్న దురైసుధ పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

## పంచాయతీ కార్మికుల సమ్మె

**రేణిగుంట, న్యూస్‌టుడే:** సమస్యల పరిష్కారం కోసం సోమవారం కార్మికులు సమ్మె చేపట్టారు. ఉదయమే వీరు పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని మస్టర్ వేసిన వెంటనే ఆందోళన చేపట్టారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పారిశుద్ధ్య పనులకు వెళ్లలేమని తేల్చి చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు ఇక్కడికి చేరుకుని కార్మికులతో చర్చించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో వారు సమ్మె విరమించారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**కేవీబీపురం, న్యూస్‌టుడే:** మండలంలోని ఆదవరం, కేవీబీపురం గ్రామాలకు చెంగారెడ్డి, ఆనందయ్యకు సీఎం సహాయ నిధి చెక్కులను నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కూరపాటి శంకర్ రెడ్డి ఆయన కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, సర్పంచి దొరబాబు నాయుడు పాల్గొన్నారు.

## మాజీ ఛైర్మన్ల దౌర్జన్యం

**శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు చెరువు మత్స్యకారుల సంఘం మాజీ ఛైర్మన్లు చెంగల్రాయరెడ్డి, రామిరెడ్డిలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెంకటాపురం గ్రామస్థులు సోమవారం ఆవేదన వ్యక్తంచేశారు. 2014లో జిల్లా అధికారులు స్కిల్ టెస్ట్ చేసి నూతన కమిటీలో 34 మందికి సభ్యత్వం కల్పించినప్పటికి మమ్మల్ని సంఘంలోని రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రికార్డులు సైతం కమిటీకి అందజేయకుండా అడిగిన వారిపై అనుచరులతో దాడికి పాల్పడుతున్నారని వాపోయారు.

## విజేతలై నిలిచి.. బహుమతులు సాధించి

క్విజ్ పోటీల్లో విద్యార్థినులు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** రాజీవ్ నగర్‌లోని ఏపీ గిరిజన బాలికల ప్రతిభా కళాశాలలో 'ఈనాడు- ఈటీవీ' సంయుక్త ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు జరిగాయి. కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన తేజబాయి, భవిత బాయి, అనుశ్రీలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరావు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు నగేష్ బాబు, మల్లీశ్వరి, బాలవేణి పాల్గొన్నారు.

విజేతలతో కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు

## త్రిమూర్తుల సేవలో న్యాయమూర్తులు

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** ఏకశిల్పంపై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కొలువుదీరిన గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు సోమవారం దర్శించుకున్నారు. జస్టిస్ రామకృష్ణారెడ్డి, జస్టిస్ పుల్లాకార్తీక్ కుటుంబ సభ్యులతో వేర్వేరుగా ఆలయానికి చేరుకోవడంతో అధికారులు న్యాయమూర్తులకు స్వాగతం పలికి శ్రీ ఆనందవల్లీదేవి సమేత శ్రీ పరశురామేశ్వరస్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

**ముక్కంటి సేవలో.. శ్రీకాళహస్తి:** వాయు లింగేశ్వరుని దర్శించుకునేందుకు వీఐపీలు బారులు తీరారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించడంలో ఆలయ అధికారులు తలమునకలయ్యారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రామకృష్ణారెడ్డి, జస్టిస్ పుల్లా కార్తీక్ (తెలంగాణ), జస్టిస్ నీరజ్ తివారి (అలహాబాద్), మాజీ న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీలు బాపిరాజు, గంగరాజులు, ఎస్పీ ఆర్బీ డైరెక్టర్ జనరల్ ఆర్కే మీనా కుటుంబ సభ్యులు, విశాఖపట్నం ఎమ్మెల్సీ కళ్యాణి కుటుంబ సభ్యులతో ముక్కంటిని దర్శించుకున్నారు. ● భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఈయనకు సోమవారం భాజపా నేతలు భాను ప్రకాష్ రెడ్డి, కోలా ఆనంద్, సామంచి శ్రీనివాసులు దగ్గరుండి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆలయం తరఫున తీర్థప్రసాదాలతో పాటు జ్ఞాపిక అందజేశారు

## సీఎంకు ముక్కంటి ప్రసాదం అందజేత

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** ఉమ్మడి చిత్తూరుజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి సోమవారం అమరావతిలో సీఎం నారా చంద్రబాబును కలిసి శ్రీకాళహస్తీశ్వరాలయ తీర్థప్రసాదాలు అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తానని గురవారెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. స్థానిక రాజకీయ పరిస్థితుల గురించి ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక అందజేసినట్లు తెలిపారు.

## మృత్యుంజయుడికి విశేషాభిషేకాలు

మృత్యుంజయ శివలింగానికి విశేష అలంకరణ

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువుతీరిన శ్రీ మృత్యుంజయ స్వామి శివలింగానికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం గోక్షీరం, పూజ ద్రవ్యాలతో శివలింగానికి అభిషేకాలు జరిపారు. ప్రత్యేక అలంకరణలు చేపట్టాక ధూప దీప నివేదనలు జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రఘురామకృష్ణరాజుకు ఘనస్వాగతం

**రేణిగుంట, న్యూస్‌టుడే:** శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుమల శ్రీవారి దర్శనార్థం ఆయన సోమవారం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు పలువురు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో ఆయన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

## విచ్చలవిడిగా గుట్కా వినియోగం

నాగలాపురం: ఆటోలో తరలిస్తున్న గుట్కా సంచులు

**నాగలాపురం, న్యూస్‌టుడే:** నిషేదమున్నా యథేచ్ఛగా గుట్కా రవాణా సాగుతోంది. తమిళనాడు సరిహద్దు మండలం కావడంతో ఆటోలతో విచ్చలవిడిగా తలిస్తున్నారు. నిబంధనలు ఉన్నా నాగలాపురంలో మాత్రం విచ్చలవిడిగా వ్యాపారం జరుగుతోంది. పుత్తూరు నుంచి నాగలాపురానికి తీసుకువచ్చి తమిళనాడుకు నిత్యం గోనెసంచులలో గుట్కాలను తరలిస్తున్నారు. జిల్లాలోనూ గతంలో దాడులు జరుగ్గా.. ప్రస్తుతం ఆహారభద్రత, పోలీసు శాఖలు పట్టించుకోకపోవడంతో మత్తును అందించే ఈ పొగాకు ఉత్పత్తులు అధికమయ్యాయి. అక్రమంగా రవాణా సైతం జరుగుతున్న వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## నిర్వహణ లేక.. మురుగు పారక

మండలంలోని ఓబుల రాజులకండ్రిగ అరుంధతి వాడలో పలు వీధుల్లోని మురుగు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువల్లో మట్టి పేరుకు పోయింది. ఇటీవల పిచ్చి మొక్కలు పెరిగి దర్శనమిస్తున్నాయి. ఇళ్ల నుంచి వచ్చే మురుగు వెళ్లక కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. పాములు, కీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కర దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, సత్యవేడు**

## నిరంతర విద్యుత్తు.. అదెక్కడా..?

**పిచ్చాటూరు, న్యూస్‌టుడే:** గ్రామాల్లో నిరంతర విద్యుత్తు సరఫరాకు నిర్దేశించిన నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులతో సరఫరా నిలిచి గ్రామాల్లో అంధకారం నెలకొంది. విద్యుత్తు స్తంభాలు, తీగల పునరుద్ధరణ అంటూ కాలయాపనతో జరుగుతున్న పనులు తమను వేధింపులకు గురిచేస్తున్నాయని గొల్లకండ్రిగ, రామగిరి, అడవికండ్రిగ, రెప్పాలపట్టు, టీకేపురం గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వేళల్లో పనులు చేసుకుని సాయంత్రానికి పనులను ముగించి సరఫరా చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. పగలు, రాత్రి తేడా లేకుండా రెండు నెలలుగా తమ గ్రామాల్లో నిత్యం పది గంటలు సైతం విద్యుత్ ఉండటం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గొల్లకొండ్రిగలో చీకటిలో బాలింత అవస్థలు

## 'చలో విశాఖ' గోడపత్రికల ఆవిష్కరణ

**వరదయ్యపాళెం, న్యూస్‌టుడే:** విశాఖపట్నంలో ఈ నెల 31వ తేదీ నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు జరిగే అఖిల భారత సీఐటీయూ 18వ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి దాసరి జనార్దన్ పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండు వద్ద సోమవారం చలో విశాఖ జాతీయ మహాసభల గోడపత్రికలు ఆవిష్కరించారు. నియోజకవర్గ కార్యదర్శి మెలుగు రమేష్ మాట్లాడారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధనంజయులు, ఐఎఫ్‌టీయూ నాయకులు బుర్రాకృష్ణమూర్తి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శాంతి పాల్గొన్నారు.

## వ్యాసరచనలో విద్యార్థుల ప్రతిభ

**నాగలాపురం, న్యూస్‌టుడే:** సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో నాగలాపురం విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఆదివారం నిర్వహించిన పోటీల్లో స్థానిక అక్షర జూనియర్ కళాశాల విద్యార్థులు షాహిన, బ్లెస్సీ మిత, సదా, లావణ్య, యామిని, అనిత సత్తా చాటారు. వీరిని సోమవారం కళాశాల ఆవరణలో కరస్పాండెంట్ హరిబాబు, ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు సన్మానించారు.

## బహుజనుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

**రేణిగుంట, న్యూస్‌టుడే:** సమాజంలో బహుజనుల సమస్యలు పరిష్కరించడమే తమ ధ్యేయమని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పుణ్యమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవిందస్వామి, ప్రకాష్ పాల్గొన్నారు.

## పెరటికోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

కోడి పిల్లలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

**రేణిగుంట, న్యూస్‌టుడే:** పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం సమకూరుతుందని రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కరకంబాడిలోని రాస్ కేవీకేలో ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా పెరటికోళ్ల పెంపకంలో మెలుకువలపై శిక్షణ నిర్వహించారు. శాస్త్రీయ విధానంలో సమయానికి తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రేణిగుంట, కేవీబీ పురం మండలాల ఎస్సీ రైతులకు 'అసిల్' రకం కోడిపిల్లలు పంపిణీ చేశారు. కార్వేటినగరం రైతులకు విత్తన కిట్లు పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు అనూష, సుధాకర్, రాముకుమార్ పాల్గొన్నారు.

## నియంత్రికల ఏర్పాటుకు చర్యలు

**కేవీబీపురం, న్యూస్‌టుడే:** మండలంలోని కలత్తూరు, ఒళ్లూరు, పాతపాలెం గ్రామాల్లో 24 మంది రైతులకు చెందిన 8 విద్యుత్తు నియంత్రికలు వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మాలతి అన్నారు. శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల సూచనల మేరకు పైగ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్తు నియంత్రికల్లో ఉన్న సామాగ్రిని అపహరించిన సంఘటనపై అధికారులు దృష్టికి సభ్యులు తీసుకువచ్చారు. ఎంపీడీవో స్పందించి సోమవారం విద్యుత్తు శాఖ ఏఈ మునికుమార్ కలిసి నాలుగు రోజుల్లో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

## ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడికి సత్కారం

**శ్రీకాళహస్తి:** ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికైన రాము గుప్తాను స్థానిక మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత సోమవారం శ్రీకాళహస్తికు వచ్చిన ఆయనను అసోసియేషన్ సభ్యులు కలసి అభినందనలు తెలిపారు. మధుసూదన్ రావు, గోపాల్, కార్తిక్ రెడ్డి పాల్గొన్నారు. రాము గుప్తాను ముక్కంటి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి, నారాయణ, భాను కలిశారు.

## పార్టీ బలోపేతానికి కృషి

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** జనసైనికులంతా కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి ఛైర్మన్ కొట్టెసాయిప్రసాద్ తెలిపారు. మండలంలోని కందాడలో సోమవారం జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాఘవయ్య, కిరణ్, మునిశేఖర్, కుమార్, నవీన్ పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన ఆలయ ఛైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, జనసేన కార్యకర్తలు

## తెలంగాణ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల

**రేణిగుంట, న్యూస్‌టుడే:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రత్యేక విమానంలో సోమవారం రాత్రి ఆయన కుటుంబ సమేతంగా ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, స్వాగతం పలికారు.

## గణితం వెన్నుముక వంటిది

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** ఆధునిక డేటా ఆధారిత సాంకేతిక నైపుణ్యాలకు గణితం వెన్నుముక వంటిదని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ తెలిపారు. తిరుపతి ఐఐటీలో సోమవారం నిర్వహించిన ఇనిట్ మ్యాథ్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై గణితం ప్రాముఖ్యత వివరించారు. యుగాలు మారినా గణితానికి తరగని డిమాండ్ ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో గణితాన్ని బోధించడంతో సత్ఫలితాలు లభిస్తాయని తెలిపారు. ప్రొఫెసర్ అరుణ్, సుకుమార్‌రెడ్డి, చంద్రశేఖరన్ పాల్గొన్నారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** ఇంట్లో మందలించారని యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఏర్పేడు మండలంలోని రాజులకండ్రిగలో సోమవారం జరిగింది. పోలీసులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన నరసింహులు(20)ను కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

## చికిత్స పొందుతూ ఆటో చోదకుడి మృతి

**రేణిగుంట, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో చోదకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. పట్టణ పోలీసుల కథనం మేరకు.. .. మండలంలోని కరకంబాడి పంచాయతీ రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన నన్నూరు వెంకటేశ్వర్లు ఆటో డ్రైవర్. ఈ నెల 25వ తేదీన భార్య మంజుల, గ్రామానికి చెందిన సావిత్రి అనే మహిళతో కలిసి కరకంబాడి నుంచి తిరుపతికి వెళ్తుండగా ఓ కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లారీ ఢీకొని తీవ్రగాయాలు

**నాగలాపురం, న్యూస్‌టుడే:** లారీ ఢీకొని ద్విచక్రవాహన చోదకుడు తీవ్రగాయాలపాలైన ఘటన మండలంలోని సురుటుపల్లి వద్ద సోమవారం జరిగింది. ఎస్సై సునీల్ కథనం మేరకు.. పిచ్చాటూరు మండలం అప్పంబట్టుకు చెందిన మన్నార్(42), గోపాల్(33) ద్విచక్రవాహనంపై ఊత్తుకోటకు వెళుతుండగా.. ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. బిహార్‌కు చెందిన డ్రైవర్ మహేష్‌కుమార్ మహతో ప్రమాదానికి కారణమయ్యాడు. మన్నార్ కాలికి తీవ్రగాయాలవడంతో అతడిని చికిత్స నిమిత్తం తిరువళ్లూరుకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## 'వైకుంఠ' వైభవానికి ఆలయాల ముస్తాబు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** ముక్కోటి ఏకాదశికి భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయాలు ముస్తామయ్యాయి. ముక్కంటి ఆలయానికి అనుబంధమైన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో ప్రత్యేకంగా క్యూలైన్లు అమర్చారు. ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆలయ అధికారులు చలువ పందిళ్లు వేశారు. కృష్ణ మందిరం, పట్టాభి రామస్వామి ఆలయాల్లోనూ ఏర్పాట్లు సిద్ధం చేశారు. **శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు):** తితిదేకు అనుబంధమైన తొండమాన్‌పురం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. వికృతమాల సంతాన సంపద శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఛైర్మన్ పసుపలేటి హరిప్రసాద్, సీఐ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. **నారాయణవనం:** శ్రీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. మంగళవారం సాయంత్రం తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. **బీఎన్ కండ్రిగ:** స్థానిక శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో దర్శనం ఏర్పాట్లు చేశారు.

శ్రీకాళహస్తి: అత్తి వరదరాజస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

వికృతమాల: ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ శ్రీకాంత్‌రెడ్డి, పసుపులేటి హరిప్రసాద్

నారాయణవనం: వైకుంఠ వాకిలి వద్ద మండపాలు

## రీసర్వేతో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం

**వరదయ్యపాళెం:** రీసర్వే భూవివాదాలకు శాశ్వత పరిష్కారంతో వివాద రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వాశయమని తహసీల్దారు సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కారిపాకం, మరదవాడ గ్రామాల్లో భూరీసర్వేపై గ్రామసభలు ఏర్పాటు చేసి మాట్లాడారు. **సత్యవేడు:** వీఆర్ కండ్రిగ గ్రామంలో జరిగిన రీసర్వే గ్రామసభలో తహసీల్దార్ రాజశేఖర్ సర్వేయర్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు. **రేణిగుంట:** తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌లో భాగంగా రెవెన్యూ క్లినిక్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 26 అర్జీలు వచ్చాయని, త్వరలో పరిష్కరిస్తామని వివరించారు.

(c) eenadu

గూడూరు
•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

## పశువుల ఆరోగ్యంపై అవగాహన

మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ అనిల్‌కుమార్

**పెళ్లకూరు, న్యూస్‌టుడే:** లింగ నిర్ధారిత వీర్య నాళికల ద్వారా పాడి పశువుల్లో పెయ్య దూడలు జన్మించే అవకాశం ఎక్కువ ఉంటుందని జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ ఎం.వి అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం పెళ్లకూరు మండలం పెరుమాళ్లపల్లి గ్రామంలో రాష్ట్ర గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ నిర్వహించిన ఉచిత గర్భకోశ చికిత్స శిబిరంలో పాల్గొన్నారు. పశువులకు రోగాలు రాకుండా ముందుగా టీకాలు వేయించాలన్నారు. పెళ్లకూరు, నాయుడుపేట ఏడీఏలు ధనంజయ, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

## కాలమానిని ఆవిష్కరణ

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయంలో సోమవారం నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన

**కోట, న్యూస్‌టుడే:** స్థానిక మహిళాశిశు సంక్షేమ కార్యాలయంలో సోమవారం బాల్య వివాహాలపై అంగన్‌వాడీ వర్కర్లకు సీడీపీవో మునికుమారి అవగాహన కల్పించారు. బాలికలకు చదువుల పట్ల అసక్తి పెంచాలని సూచించారు.

## గూడూరుని ముక్కలు చేయడం అన్యాయం

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** గూడూరును జిల్లా కేంద్రం చేయాలని ప్రజలు కోరుతుంటే నియోజకవర్గాన్ని ముక్కలు చేయడం అన్యాయమని పలువురు నాయకులు అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

## మారనున్న రూపురేఖలు

సంబరాలకు సిద్ధం చేసిన కటౌట్లు

**గూడూరు పట్టణం, వెంకటగిరి గ్రామీణ, న్యూస్‌టుడే:** జిల్లాల పునర్వ్యవస్థీకరణతో గూడూరు డివిజన్ రూపురేఖలు మరోసారి మారనున్నాయి. గతంలో వైకాపా ప్రభుత్వం గూడూరు నియోజకవర్గంలోని 5మండలాలు, వెంకటగిరి నియోజకవర్గంలోని 3మండలాలను కలిపి మొత్తం 8మండలాలతో డివిజన్ కేంద్రంగా చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వెంకటగిరిలోని 3 మండలాలను, గూడూరులోని వాకాడు, చిట్టమూరు మండలాలను తిరుపతి జిల్లాలో కలిపారు. ప్రసుత్తం ఉన్న గూడూరు, చిల్లకూరు, కోట మండలాలతో పాటు, గతంలో ఉన్న సైదాపురం, రాపూరు, కలువాయి, మనుబోలు మండలాలను కలుపుతారా? లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గూడూరు డివిజన్‌లో ఏఏ మండలాలు కలుస్తాయో రెండు రోజుల్లో తేలనుంది.

### నేడు తెదేపా సంబరాలు

గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయడంతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు చేసేందుకు తెదేపా నేతలు సిద్ధం అవుతున్నారు.

## ఒకరోజు ముందుగానే పింఛను

**నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే:** పురపాలిక పరిధిలో ఈనెల 31వ తేదీన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛను సొమ్ము పంపిణీ చేస్తామని కమిషనర్ ఎస్కే ఫజులుల్లా సోమవారం పేర్కొన్నారు.

## వాజ్‌పేయీ సేవలు అపారం

**వెంకటగిరి, న్యూస్‌టుడే:** దివంగత మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయీ దేశానికి ఎంతో సేవ చేశారని భాజపా కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. సోమవారం ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వాజ్‌పేయీ స్మృతి సమ్మేళనాన్ని నిర్వహించారు.

**గూడూరులో నిమ్మ ధరలు**
మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 25 వరకు
రెండో రకం: కిలో రూ. 15 నుంచి రూ. 20 వరకు

## కర్రసాములో విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన నాయుడుపేట విద్యార్థులు

**నాయుడుపేట పట్టణం, నాయుడుపేట, న్యూస్‌టుడే:** నెల్లూరులో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో నాయుడుపేట విద్యార్థులు ప్రతిభ చూపారు. నలుగురు ప్రథమ స్థానం, ముగ్గురు ద్వితీయ స్థానం, ఎనిమిది మంది తృతీయ స్థానంలో నిలిచారు. మొదటి బహుమతి సాధించిన వారు ఫిబ్రవరిలో కోయంబత్తూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ పవన్‌కుమార్ పేర్కొన్నారు.

## అధ్యక్షురాలిని కలిసిన నాయకులు

పనబాక లక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

**వాకాడు, న్యూస్‌టుడే:** తిరుపతి జిల్లా తెదేపా అధ్యక్షురాలిగా నియమితులైన పనబాక లక్ష్మికి సోమవారం గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, తెదేపా వాకాడు మండల అధ్యక్షుడు మధు రెడ్డి అభినందనలు తెలిపారు. ❖ గూడూరు నేతలు శరత్‌యాదవ్, కృష్ణప్రసాద్‌రెడ్డి, జనార్దన్ అభినందనలు తెలిపారు. **తడ:** సూళ్లూరుపేట తెదేపా నాయకులు వేనాటి సతీష్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కామిరెడ్డి మురళిరెడ్డి ఆమెను కలిసి సన్మానించారు.

## తెరచుకున్న వైకుంఠ ద్వారాలు

**నాయుడుపేట, న్యూస్‌టుడే**: పట్టణంలో పలు వైష్ణవ ఆలయాల్లో మంగళవారం వైకుంఠ ఏకాదశి సేవలు నిర్వహించనున్నారు. ❖ తుమ్మూరులో వెలిసిన శ్రీదేవి, భూదేవి, కరిమాణిక్యస్వామి ఆలయంలో తితిదే ఆధ్వర్యంలో రాజగోపుర ద్వార దర్శనం సేవలకు ఏర్పాట్లు చేశారు. ❖ తిమ్మాజీకండ్రిగ స్వర్ణముఖి తీరంలో ఉన్న అభయ వేంకటేశ్వరస్వామి ఆలయం ఉత్తర ద్వార సేవలు ప్రారంభం కానున్నాయి. **వెంకటగిరి:** తూర్పు వీధిలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** జనవరి 3వ తేదీ గూడూరులో జరిగే హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆహ్వాన సమితి సభ్యులు తెలిపారు. గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ప్రతినిధులు రామ్మోహన్‌రావు, పవన్‌కుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వేపై అవగాహన సభలు

**కోట:** రుద్రవరం, మద్దాలిలో సోమవారం భూముల రీసర్వేపై రైతులకు తహసీల్దారు జయజయరావు అవగాహన సభలు నిర్వహించారు. జనవరి 2వ తేదీ నుంచి మార్చి నెలఖారు వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. ఉప తహసీల్దారు మల్లికార్జునరావు, సర్వేయర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

This is to inform the general public that my clients, intends to purchase the schedule property mentioned below from its owner M/s.ANASUYA INVESTMENTS, a Partnership firm having its office at No.101, old No.50, 3rd Cross, Maramma Temple Street,K.G. Nagara,Bengaluru-560019,. represented by its partners Sri. Duvvuru Yugendar, Smt. Duvvuru Anuradha, Sri.Duvvuru Venkataramana Reddy, Sri.Sannareddy Rajgopal Reddy. All persons having any claim, objections, right, title or interest in respect of the schedule property or the transaction may file his/her / their objections in writing with documentary evidence to the under signed within 15 days from the date of Publication of this notice, failing which it will be deemed as no claims and my clients will proceed to complete the proposed transaction.

SCHEDULE PROPERTY

All that piece and parcel of the commercial property bearing EPID No.2908905644, Property No.49 (Old Site Nos.133, 135, 136, 137, 138, 139 & 140) situated at Kaniyara Colony Road, Chamrajpet, Ward No.141, Azad Nagar Bengaluru-560018, built on site measuring 53.5' x 99' totally measuring 5296 square feet, consisting of Stilt, Ground, First, Second and Third floor with total built up area of 17400 Square feet and bounded on: East by Kaniyara colony Road, West by: Private Property bearing old No.141 of Mrs. Kasthri, North by: Private Property & South by: Narrow Lane.

S. C. Rajesh Kumar,
Advocate
No. 387 & 388, 25th 'B' Main
22nd Cross, Sector-2, HSR Layout,
Bengaluru-560102. Mob.: 9448239153

Date: 30-12-2025 Bengaluru

**మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో**
E.P. No:- 63/2022
(Gajuvaka) O.S.No:- 308/2019

అట్ల పద్మ ..D.H.R.
V/s
పుచ్చకట్ల వెంకట వంశీ మల్లిఖార్జున ..J.D.R.

**వేలం ప్రకటన**

పైన తెలుపబడిన కోర్టు నందు Dhr తనకు రావలసిన డిక్రీ వసూలు నిమిత్తం E.P. షెడ్యూలు దాఖల ఆస్తిని వేలం వేసి డిక్రీ బాకీ వసూలు చేయమని కోరుతూ E.P. దాఖలు చేసి ఉన్నది. కావున ఈ క్రింది కనబరిచిన E.P. దాఖల షెడ్యూలు ఆస్తిని 11-2-2026 తేదీన పై కోర్టు నందు ఉదయం 10:30 నిమిషాలకు వేలం వేయుదురు. కావున ఆసక్తిగల పాటదారులు ఆ రోజు వేలంపాటలో పాల్గొనవలసిందిగా కోరడమైనది. ఇది కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయబడినది.

**E.P. షెడ్యూలు ఆస్తి వివరములు**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్, గూడూరు మండలం విందూరు గ్రామ పంచాయతీ మరియు గ్రామం సర్వే నెంబరు 485 విస్తీర్ణం: 1-00 (ఒక ఎకరా) ఎకరా మెట్ట భూమి దానికి హద్దులు **తూర్పు:** అట్ల రాధయ్య భూమి, **దక్షిణం:** భీమవరం మస్తానమ్మ భూమి, **పడమర:** గోర్తల శ్రీనివాసులు భూమి, **ఉత్తరం:** గోర్తల శ్రీనివాసులు భూమి.

D.H.R. Value: 26,00,000/-
Amina Value: 27,00,000/-
Upset Price: Rs.5,00,000/-

ఇట్లు
DHR తరఫున న్యాయవాదులు
కందనూరు వెంకటకృష్ణయ్య
కందనూరు నితిన్ సాయికృష్ణ
అడ్వొకేట్స్, గూడూరు.
Cell: 9440113977

## వాలిన స్తంభం.. కూలితే ప్రమాదం

కొమ్మినేనిపల్లి గ్రామం నుంచి పెద్దపడవకి వెళ్లే రహదారి మలుపు వద్ద విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. తీగలు కిందికి వాలిపోయాయి. రైతులు యంత్రాలు తీసుకుపోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. బలమైన గాలులు వీస్తే కూలిపోయే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

జడ్పీ బాలికల పాఠశాలలో..

## ప్రశ్నల పోటీల్లో.. చిన్నారి విజేతలు

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** జీఎస్ఆర్ మున్సిపల్ పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో హరిణి, సాయిరోహిత్, మోక్షిత్ నిలిచారు. ❖ పట్టణంలోని జడ్పీ బాలికల పాఠశాలలో జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఈశ్వరసాయి, హర్షియ, సమీమఖనమ్ గెలుపొందారు.

## చావుకెళ్లి తనువు చాలించి

**దొరవారిసత్రం, న్యూస్‌టుడే:** నెలబల్లి సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై సోమవారం ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్న ప్రమాదంలో శ్రీధనమల్లికి చెందిన వంశీ(30) మృతి చెందాడు. గ్రామంలో ఓ చావుకు వెళ్లి తిరిగి మోటారు సైకిల్‌పై వెళుతూ.. ప్రమాదంలో చనిపోయాడు. హెల్మెట్ ధరించకపోవంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు అతణ్ని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఓ పాప ఉన్నారు.

## పైపులు.. లీకులు

సూళ్లూరుపేట మండలంలోని కోటపోలూరు తూర్పు హరిజనవాడలోని ఓవర్‌హెడ్ ట్యాంకు పైపులకు పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో ట్యాంకు చుట్టుపక్కల ప్రాంతాలలో నీరు చేరి మురుగుగా మారుతోంది. దోమలు ఎక్కువై విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

# నగరానికి న్యూఇయర్ కళ

★ ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు
★ హోటళ్లలో గదులకు తీవ్ర డిమాండ్

ఈనాడు, విశాఖపట్నం : నగరానికి నూతన సంవత్సర కళ వచ్చేసింది. ఇప్పటికే బీచ్‌లో వేడుకల సందడి నెలకొంది. డిసెంబరు 31వ తేదీ రాత్రి ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. యువతను ఆకట్టుకునేలా, కుటుంబాలతో వచ్చే వారికి నోరూరించే విందు పార్టీలు సిద్ధం చేస్తున్నారు. బీచ్ రోడ్డులోని ప్రముఖ హోటళ్లు, రిసార్టులు ఇందుకు వేదికగా నిలుస్తున్నాయి. కొందరు రాత్రంతా సాంస్కృతిక వేడుకలు, ఫ్యాషన్ షోలు నిర్వహించడానికి పోలీసుల అనుమతి కోరారు.

★ **ఆకట్టుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు :** 31వ తేదీ రాత్రి బీచ్ రోడ్డులో కొన్ని చోట్ల జంగిల్ పార్టీ, కాస్మిక్ గాలా, ఫెస్టివ్ కలర్స్, డీజే సన్నీ, కార్నివాల్ బాష్ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈసారి ప్రత్యేకంగా డిన్నర్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. 31వ తేదీ రాత్రితో పాటు జనవరి 1న మధ్యాహ్నం ప్రత్యేక లంచ్ ఆఫర్లను అందుబాటులోకి తెచ్చారు. వీటిలో గాలా డిన్నర్, కౌంట్‌డౌన్ డిన్నర్, న్యూయర్ బ్రంచ్, ఈవ్ డిన్నర్, స్పెషల్ లంచ్ ఉన్నాయి. సోషల్ మీడియా వేదికగా వీటికి బుకింగ్‌లు జరుగుతున్నాయి.

★ **ఆకర్షించేలా మెనూలు:** పర్యాటక సీజన్ కావడంతో గత కొద్ది రోజులుగా విశాఖలోని హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. స్టార్ హోటళ్లలోనూ గదులకు డిమాండు పెరిగింది. జనవరి మూడో వారం వరకు ఇదే పరిస్థితి ఉందంటున్నారు. 'కొత్త సంవత్సరం వేళ వేడుకల నిర్వహణకు హోటళ్లు సిద్ధమయ్యాయి. ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు ప్రత్యేక మెనూలతో ఆకట్టుకోవడానికి ఏర్పాట్లు చేశారు' అని ఏపీ హోటళ్లు, రెస్టారెంట్ల సంఘం అధ్యక్షుడు **ఎంవీ పవన్‌కార్తిక్** చెప్పారు.

» నక్షత్ర హోటళ్లు : 24 » గదులు : 2056 » ఇతర హోటళ్లు : 124 » గదులు : 3626

బీ1 బోగీకి మంటలు అంటుకుంది: రాత్రి 12.45 గంటలు

**12: 55** ఎలమంచిలి స్టేషన్ ప్లాట్‌ఫాంపై రైలు ఆగింది

**1: 07** ప్రయాణికులు రైలు నుంచి దిగిపోయారు

**1: 15** మొదటి అగ్నిమాపక శకటం స్టేషన్‌కు రాక

**3: 25** అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేశారు

**4: 00** కాలిన బోగీలు రైలు నుంచి వేరు చేసింది

**5: 06** రైలులో ఒకరి మృతదేహం గుర్తింపు

**7: 41** ఎలమంచిలి నుంచి రైలు బయలుదేరింది

ట్రాక్‌పై రాకపోకల పునరుద్ధరణ ప్రారంభం: 11.00

అర్ధరాత్రి.. పట్టాలపై రైలు పరుగు తప్ప మరో శబ్దంలేదు.
అంతా అలసిసొలసి ఆదమరిచి నిద్రిస్తున్న వేళ..
ఉన్నట్టుండి కలకలం.. మంటలు అంటుకున్నాయనే కేకలు..
రైలు ఎక్కడాగిందో, ఏ ఊరు చేరిందో తెలియదు..
గబగబా రైలు దిగి చూస్తే.. కొద్దినిమిషాల క్రితం వరకు
తాము ప్రయాణించిన రైలులో అంతెత్తు మంటలు..
నోటమాట రాక అంతా భయంగా చూస్తుండిపోయారు.
ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఆదివారం అర్ధరాత్రి నాటి దృశ్యమిది.

పూర్తిగా కాలిపోయిన బోగీలు

# కదిలే రైలును కమ్మేసిన నిప్పు

సకాలంలో స్పందించిన యంత్రాంగం
✦ యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

ఈనాడు డిజిటల్ అనకాపల్లి, ఎలమంచిలి న్యూస్‌టుడే

'టాటా-ఎర్నాకుళం' ఎక్స్‌ప్రెస్‌లో అగ్నికీలలు రేగి రెండు బోగీలు దగ్ధమైన ఘటన సంచలనం కలిగించింది. ఈ రైలులోని బీ1, ఎం2 బోగీలకు నిప్పంటుకోవడం గమనించి హుటాహుటిన రైలులోని ప్రయాణికులందరినీ కిందకు దించేశారు. ఓపక్క వణికించే చలి.. మరోపక్క ఏం జరుగుతోందో.. ఎప్పటికి తిరిగి బయలుదేరతామో తెలియని అయోమయ పరిస్థితులతో ప్రయాణికులంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. నష్టం మరింత పెరగకుండా నివారించడం, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు అందించడంలో యంత్రాంగం సఫలమైంది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే రైల్వే, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించారు. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సొనాకియా, ప్రత్యేక రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, రైల్వే డీఐజీ బి. సత్యఏసుబాబు, జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, కలెక్టర్ విజయ్ కృష్ణన్ దగ్గరుండి సహాయక చర్యలు పర్యవేక్షించారు.

**సమగ్ర విచారణ చేస్తున్నాం:** ఎలమంచిలి స్టేషన్‌కు కొన్ని నిమిషాల్లో రైలు చేరుతుండగా.. సిబ్బంది మంటలను గుర్తించి స్టేషన్‌లో నిలుపుదల చేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని ప్రమాదాన్ని తగ్గించారు. మంటలు చెలరేగడానికి కారణాలపై సమగ్ర విచారణ తర్వాత వివరాలు వెల్లడిస్తాం.
**- సత్య ఏసుబాబు, డీఐజీ, రైల్వే**

**అరుపులు విని లేచాను..:** పశ్చిమబెంగాల్లో ఉంటున్న నేను [illegible] వెళ్లడానికి ఈ రైలు ఎక్కాను. బయలుదేరిన దగ్గర నుంచే ఆలస్యంగా నడుస్తోంది. దువ్వాడలో భోజనంచేసి పడుకున్నాం. గాఢ నిద్రలో ఉండగా బోగీలో ఒక్కసారిగా అరుపులు, కేకలు వినిపించడంతో ఉలిక్కిపడి లేచాను. అప్పటికే ఒకవైపు నుంచి బోగీలో మంటలు వస్తున్నాయి. దట్టంగా ఉన్న పొగతో దిగడానికి కూడా దారి సరిగా కనిపించలేదు. చాలా ఇబ్బంది పడ్డాం. మరో పదినిమిషాలు లోపల ఉంటే [illegible] వాసనతో వచ్చే ఆ పొగకి అక్కడే చనిపోయే వాళ్లం. ఇంతలో బోగీకి విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంతా చీకటిగా మారింది. - ఎస్.కె.రెహమాన్, ఎం1 బోగీలో ప్రయాణికుడు

**టీటీఈ నిద్ర లేపారు:** సేలం వెళ్లడానికి దువ్వాడలో రైలు ఎక్కాను. రైలు అప్పటికే బాగా ఆలస్యంగా రావడంతో ఎక్కిన వెంటనే పడుకున్నాను. బి1 లో ప్రయాణిస్తున్న నన్ను టీటీ వచ్చి రైలు కాలిపోతోంది, అత్యవసరంగా దిగిపోవాలని చెప్పారు. అప్పటికే బోగీలో మంటలు పెద్దగా వస్తున్నాయి. తలదగ్గర పెట్టుకున్న హ్యాండ్ బ్యాగ్ మాత్రమే తీసుకుని సీటు కింద ఉన్న లగేజి వదిలేసి బయటకు పరుగు తీశాను. నావెనుక చాలామంది కంగారుగా దిగారు. చిన్నతొక్కిసలాట జరిగింది. టీటీఈ సకాలంలో లేపడంతో ప్రాణాలతో బయటపడ్డాం.
– సూర్యప్రకాష్, విశాఖపట్నం



**కట్టుబట్టలే మిగిలాయి..:** భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి టాటానగర్ నుంచి ఎర్నాకుళం బయలుదేరాం. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయాం. దుస్తులు, డబ్బులు టికెట్లు అన్నీ బ్యాగ్‌లో ఉన్నాయి. బోగీలో మంటలు వస్తున్నాయని కోచ్ బాయ్ కంగారుగా వచ్చి చెప్పారు. ఇద్దరం చెరో బిడ్డను పట్టుకుని పరుగుపరుగున కిందికి దిగాం. తక్కువ సమయంలో మంటలు వ్యాపించాయి. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. చేతిలో రూపాయి లేదు. టికెట్లు, ఆధార్ కార్డులు, బ్యాగ్‌లో పెట్టిన ఫోన్ కాలిపోయాయి. భార్య బిడ్డలను స్టేషన్ బయట దింపి మళ్లీ బోగీ వద్దకు వెళ్లాను. బ్యాగులు తెచ్చుకుందామని చూసినా బోగీ ఎక్కడుందో కనిపించనంత దట్టంగా పొగ వ్యాపించింది. ప్రాణాలు పోతాయని సాహసం చేయలేదు. – [illegible], టాటానగర్

ప్లాట్‌ఫాంపై భారీగా నిరీక్షిస్తున్న ప్రయాణికులు

తిరిగి బయలుదేరే సమయాన రైలు ఎక్కుతూ..

■ అగ్నిమాపక సిబ్బంది ఆగమేఘాలపై తరలివచ్చారు. ఎలమంచిలి నుంచి శకటం వెనువెంటనే చేరుకుంది. దీనికి తోడు అనకాపల్లి నుంచి రెండు, నక్కపల్లి నుంచి ఒకటి చొప్పున అగ్నిమాపక వాహనాలు రప్పించారు. వీరంతా దాదాపు రెండుగంటలపాటు నిర్విరామంగా శ్రమించి ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

రైల్వేస్టేషన్‌లో సిబ్బందితో ఎస్పీ తుహిన్‌సిన్హా

■ **పోలీసులు :** సుమారు రెండు వేలమంది ప్రయాణికులతో స్టేషన్ ఆవరణ కిక్కిరిసింది. స్థానిక సీఐ ధనుంజయరావు సహాయక చర్యలకు ఆటంకం లేకుండా ప్రయాణికులు అందరినీ బయటకు పంపించారు. ఎవరైనా గాయపడితే వెంటనే వైద్యసేవలందించేలా అంబులెన్స్‌లు రప్పించారు.

కాలిన బోగీలో డీఆర్ఎం మోహిత్

■ **రైల్వే:** రైలు నుంచి పూర్తిగా కాలిపోయిన బోగీలతోపాటు పాక్షికంగా కాలిపోయిన బోగీలను తప్పించారు. ఆ బోగీల్లో ప్రయాణికులను తరలించడానికి మూడు పల్లెవెలుగు బస్సులను రప్పించారు. అందులో వీరిని సామర్లకోట తరలించారు. మిగిలిన ప్రయాణికులను ఎక్కించుకుని రైలు బయలుదేరింది. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా రైళ్ల రాకపోకలకు పెద్దగా ఆలస్యం కాకుండా పక్కట్రాక్‌పై నుంచి రాకపోకలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. 3.20 గంటలకు తొలిగా తిరుపతి-బిలాస్‌పూర్ రైలు ఎలమంచిలి స్టేషన్‌కు చేరుకుని తిరిగి పయనమైంది.

## ఏసీ బోగీల్లోనే అగ్ని ప్రమాదాలు

★ నిర్వహణపై తొలి నుంచి నిర్లక్ష్యం
★ గాలికొదిలేసిన గుత్తేదారులు

ఈనాడు, విశాఖపట్నం

★ గత ఏడాది విశాఖ రైల్వేస్టేషన్ నాలుగో నెంబరు ప్లాట్‌ఫాంపై ఆగి ఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్(18517)లో బీ7 ఏసీ బోగీ అగ్నికి ఆహుతైంది. ఆ సమయంలో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

★ ఇప్పుడు ఎలమంచిలిలో టాటా-ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్‌లో బీ1, ఎం2 ఏసీ బోగీలు దగ్ధమయ్యాయి.

రైళ్లలోని ఏసీ బోగీల్లోనే ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. [illegible]

**సిబ్బంది కొరత..** [illegible]

**ఫిర్యాదులొస్తేనే స్పందన:** రైళ్లకు సంబంధించి ప్రైమరీ, సెకండరీ [illegible]

## రైలు ప్రమాదంపై విజయవాడలో విచారణ

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్ పరిధిలోని ఎలమంచిలి రైల్వేస్టేషన్ వద్ద రైలు నంబరు 18189 టాటానగర్-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ఈ నెల 31, జనవరి 1వ తేదీల్లో విజయవాడలోని సత్యనారాయణపురం ఈటీటీసీలో విచారణ జరుగుతుందని రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్ష్యం ఇవ్వాలనుకునే వారు ఫోన్ నంబరు 040-27820104 లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# సహనం వహించు.. ప్రశాంతంగా స్వామిని దర్శించు..!

సింహాచలం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశికి సింహాచలం క్షేత్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణం, ధ్వజస్తంభం, ఉత్తర గోపురం, ఉత్తర ద్వారాలకు పుష్పాలంకరణ చేశారు. ఉత్తర ద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు రానుండటంతో పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. ఇటీవల సింహాచలం ఆలయం రద్దీగా మారుతోంది. ఈ నేపథ్యంలో క్యూలైన్లలో తోపులాటలు, రద్దీకి ఆస్కారం లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి దర్శనాలు కల్పించేలా చూడాలని నిపుణులు చెబుతున్నారు.

నేడు సింహగిరిపై ఉత్తర ద్వార దర్శనం
తరలిరానున్న వేలాది మంది భక్తులు

ముస్తాబైన ఉత్తర గోపుర ప్రాంగణం

▸▸ ఉత్తర ద్వార దర్శనానికి కేవలం ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులను మాత్రమే అనుమతిస్తున్నారు. టికెట్లు దొరకని వారి పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉచిత క్యూలైన్‌లో, ఉచిత ప్రసాదం పంపిణీ వద్ద, ప్రసాదం పంపిణీ కేంద్రాల వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉంది. గత ఘటనలను దృష్టిలో పెట్టుకుని తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసి తోపులాటలు జరగకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీసు సిబ్బంది పరిమితంగా ఉండటంతో సెక్యూరిటీ గార్డులు, సిబ్బందిని సమకూర్చాలని ఇప్పటికే పోలీసులు కోరారు.

**ట్రాఫిక్ నియంత్రణే కీలకం**

సింహగిరిపై తగినంత పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాల రద్దీ భక్తులను ఇబ్బంది పెడుతోంది. ఉత్తర ద్వార దర్శనం వేళ వేలాదిగా వాహనాలు వస్తాయి. దీనికి తోడు ప్రముఖుల తాకిడి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొండపైకి వాహనాల రాకపోకలు, పార్కింగ్ సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంది. భక్తుల కోసం కొండ కింద నుంచి పైకి 20 ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు తెలిపారు.

● **భక్తులు సహనంతో ఉండాలి..:** ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులు సహనం, సమన్వయంతో ఉండాలని పోలీసులు, ఆలయ అధికారులు కోరుతున్నారు. మెరుగైన దర్శనం కల్పించడానికి ఏర్పాట్లు చేశామని తోపులాటలు, తగాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని సిబ్బందికి తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

# ఆచితూచి ఎంపిక.. నైపుణ్యాలే ప్రాతిపదిక..!

● ప్రాంగణ ఎంపికల్లో ప్రస్తుత ట్రెండ్ ఇది
● ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇంటర్వ్యూల సందడి

ఈనాడు, విశాఖపట్నం: జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రాంగణ నియామకాల సందడి మొదలైంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలకే కంపెనీలు పెద్దపీట వేస్తున్నాయి. ఇంజినీరింగ్ చివరి ఏడాదిలో ఉండగానే విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంగణ నియామకాల సమయంలో విద్యార్థులు తమ నైపుణ్యాల గురించి కంపెనీల ప్రతినిధులకు తప్పని సరిగా వివరించాలని నిపుణులు చెబుతున్నారు.

**అన్నింటినీ ప్రస్తావిస్తేనే..:** విద్యార్థులు రెజ్యూమ్ తయారు చేసుకోవడంపై వివిధ కళాశాలల్లో శిక్షణ ఇస్తున్నారు. అందులో విద్యార్హత, చేపట్టిన ప్రాజెక్టులు, ఇతర నైపుణ్యాలను ప్రస్తావించాలి. నేర్చుకున్న అంశాలనే నిజాయతీగా అందులో పేర్కొనాలి. ఇంటర్వ్యూ సమయంలో ఆయా అంశాల గురించి కంపెనీ ప్రతినిధులు అడిగినప్పుడు తడబడకుండా సమాధానం చెప్పగలగాలి.

➤ జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు: 22
➤ ఏటా ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు: 20 వేలకు పైగా..

▸▸ **ఏదో ఒక నైపుణ్యం అవసరం:** మాక్ ఇంటర్వ్యూలతో విద్యార్థుల్లో మార్పు కనిపిస్తోంది. ఆత్మవిశ్వాసం పెరగడానికి ఇంటర్న్‌షిప్స్ ఉపయోగపడతాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు పోటీ ఎక్కువైంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఏదో ఒక నైపుణ్యం సాధించాలి. ప్రస్తుతం ఆన్‌లైన్ చదువులు పెరిగాయి. ఆన్‌లైన్‌లో చదివినప్పుడు బట్టీ పట్టకుండా సబ్జెక్టును అర్థం చేసుకోవాలి. **–డి.సరిత, జీవీపీ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగ డీన్**

**ప్రారంభం నుంచే దృష్టి పెట్టాలి »**

» విద్యార్థులు మొదటి ఏడాది నుంచే వర్క్‌షాప్‌లకు హాజరుకావాలి. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు పెంచుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. లేకుంటే ప్రశ్నలు అడిగినప్పుడు తడబడే అవకాశముంది.

» కొన్ని కళాశాలలు పాఠ్య ప్రణాళికలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశాయి. పరిశ్రమల్లో పనిచేసే సమయంలో కోడింగ్, ఇతర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

» కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సహకారంతో 3-2, 4-1 సెమిస్టర్లలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఒక్కో విద్యార్థికి 10 నుంచి 15 నిమిషాలు కేటాయించి ప్రశ్నలు అడుగుతున్నారు. చెప్పిన సమాధానాలు పరిశీలించి, విద్యార్థులు చేసిన పొరపాట్లు, సరిదిద్దుకోవాల్సిన అంశాలను వివరిస్తున్నారు.

» ఇంటర్వ్యూలో మార్కులు ఒక్కటే ప్రాతిపదిక కాదు. నైపుణ్యాలు, సాఫ్ట్‌స్కిల్స్, ఇతర అంశాలనూ పరిశీలిస్తారు. ఇంటర్వ్యూలో కొంతైనా ఇంగ్లిషులో మాట్లాడాలి. మొదటి ఏడాది నుంచే ఇంగ్లిషులో మాట్లాడటం సాధన చేస్తే కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెరుగుతాయి. ఇంటర్వ్యూకు వెళ్లేటప్పుడు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి.

# భూ సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

రెవెన్యూ క్లినిక్‌కు విశేష స్పందన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తమ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నిషేధిత జాబితా 22ఏ నుంచి మినహాయింపు ఇవ్వాలని కొందరు.. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ మరి కొందరు అర్జీదారులు గోడు వెళ్లబోసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్‌ను ప్రారంభించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు కౌంటర్లలో ఇద్దరు ఆర్డీఓలు, మరో నలుగురు ఉప కలెక్టర్లు, 11 మంది తహసీల్దార్లు, కలెక్టరేట్‌లో పనిచేస్తున్న తహసీల్దార్లు అర్జీలను స్వీకరించి సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. 72 మంది వినతులు అందజేశారు. ప్రభుత్వ, జిరాయితీ భూముల ఆక్రమణ, అసైన్ చేసిన భూములను ఫ్రీహోల్డ్ చేయాలని, జీఓ 296, 388 ప్రకారం భూ క్రమబద్ధీకరణ తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి.

వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓలు, ఉప కలెక్టర్లు, తహసీల్దార్లు

* సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న రెవెన్యూ సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపేందుకు రెవెన్యూ క్లినిక్‌లను ఏర్పాటు చేశామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఇక నుంచి ప్రతీ సోమవారం రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో బాధితుల సమస్యలను పరిశీలించి స్థితిగతులను తెలియజేశామన్నారు. తాను, జేసీ వినతుల స్వీకరణ ప్రక్రియను పర్యవేక్షిస్తామన్నారు. ఫిర్యాదుదారుల కోసం ప్రత్యేకంగా డెస్కు ఏర్పాటు చేశామని దరఖాస్తులు నింపేందుకు సహాయకులను నియమించామన్నారు.

**కరిగిపోతూ.. కలిసిపోతూ..!**

కెరటాల ఉద్ధృతితో ఆర్కేబీచ్ తరచూ కోతకు గురవుతోంది. కురుసురా సబ్‌మెరైన్ సమీపంలో ఇప్పటికే కొంత భాగం తీరంలో కలిసిపోయింది. దీని నివారణకు భారీ రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అయినా పరిస్థితి అదుపులోకి రాలేదు. అధికారులు స్పందించి మరిన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే రాళ్లు కూడా మిగలవని పర్యాటకులు చెబుతున్నారు. – ఈనాడు, విశాఖపట్నం

# అవినీతి ఎక్సైజ్ అధికారికి అండాదండ..!

ఈగ వాలనీయని ఉన్నతాధికారి, ప్రజాప్రతినిధి
విచారణపై అలముకున్న నీలినీడలు

ఈనాడు–విశాఖపట్నం: వైకాపా హయాంలో విశాఖ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా (ఈఎస్)గా చక్రం తిప్పి, తాజాగా అనకాపల్లిలో ఓ బార్ వివాదంలో ఇరుక్కున్న అధికారిపై లోతైన విచారణకు ఆశాఖ ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే మద్యం వ్యాపారులు, ఈఎస్ మధ్య పంచాయితీ చేసిన విశాఖకు చెందిన కీలక అధికారికి విచారణ బాధ్యతలు అప్పగించడం గమనార్హం. మరోపక్క ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకోవడంతో విచారణ సక్రమంగా జరిగేనా అనేఅనుమానాలు ఉన్నాయి.

★ **సంతకాలు పెట్టాలని ఒత్తిడి:** అనకాపల్లి ఈఎస్‌గా పనిచేస్తున్న సుధీర్, సీఐ జ్ఞానేశ్వరిలపై ఈనెల మొదటివారంలో అనకాపల్లిలోని కొందరు మద్యం వ్యాపారులు అమరావతిలోని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనకాపల్లిలో ప్రారంభించిన ఓ బార్‌కు అవసరమైన పెట్టుబడి కోసం ఒక్కో వైన్‌షాపు నుంచి రూ.1.20లక్షల చొప్పున 22 దుకాణాల నుంచి రూ.26లక్షలు వసూలు చేశారన్నది ప్రధాన ఆరోపణ. దీంతో రంగంలోకి దిగిన ఉన్నతాధికారి ఫిర్యాదు చేసినవారిలో నలుగురు మద్యం వ్యాపారులను పిలిపించి, వసూళ్లలో ఈఎస్ జోక్యం ఏమీ లేదని సంతకాలు చేయాలని ఒత్తిడి చేశారు. అయితే వ్యాపారులు సంతకాలు చేయకుండా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

**ఓ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బెదిరింపులు**

సంతకాలు చేయని వ్యాపారులను ఓ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బెదిరించడం చర్చనీయాంశమైంది. ఇటీవల భూ పంచాయితీలు, ఇతర వివాదాలు ఎదుర్కొంటున్న ఓ ప్రజాప్రతినిధి సైతం ఒత్తిడి తేవడంతో విచారణ ప్రక్రియపై నీలినీడలు అలముకున్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కాంపై సిట్ జరిపిన దర్యాప్తులోనూ ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపైనా ఆరా తీశారు. అలాంటి అధికారిపై ఈగ వాలనీయకుండా కూటమి ప్రభుత్వంలోనూ కొందరు నేతలు ప్రయత్నించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

★ ఎలమంచిలి ఎక్సైజ్ సీఐ నాలుగు నెలలుగా సెలవులో ఉండటంతో జిల్లా స్క్వాడ్ నుంచి జ్ఞానేశ్వరిని ఇన్‌ఛార్జిగా నియమించారు. తాజాగా వచ్చిన ఆరోపణ నేపథ్యంలో ఆమెను తప్పించి పాడేరు నుంచి ఓ సీఐని ఇన్‌ఛార్జిగా నియమించారు.

# వీపీఏ డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా అపరాంజి బాధ్యతల స్వీకరణ

కీలక స్థానంలో మహిళా అధికారి



వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా 2011 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి రోష్ని అపరాంజి కోరాటి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన దుర్గేష్‌కుమార్ దుబే పదవీ కాలం ముగియడంతో మాతృశాఖకు వెళ్లిపోయారు. అంతకు ముందు రోష్ని అపరాంజి విశాఖ ప్రత్యేక ఆర్థిక మండలి(వీసెజ్) జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. పోర్టు చరిత్రలో తొలిసారి ఒక మహిళా ఐఏఎస్ అధికారి డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. అసోం-మేఘాలయ క్యాడర్‌కు చెందిన రోష్ని అపరాంజి విశాఖకు చెందిన వారే. ఆమె తండ్రి విశాఖ పోర్టు హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేయడంతో ఆమె విద్యాభ్యాసమంతా విశాఖలోనే కొనసాగింది. ఏయూ జర్నలిజం స్కూల్ నుంచి మాస్టర్స్ డిగ్రీలో గోల్డ్‌మెడల్ సాధించారు. అసోంలోని జోర్హాట్ జిల్లా ఉప కమిషనర్‌గా, కలెక్టర్‌గా సేవలందించారు. గ్రామీణాభివృద్ధి, సంక్షేమ శాఖల్లో పనిచేసిన అనుభవం ఉంది. ప్రజా పరిపాలనలో అందించిన విశిష్ట సేవలకు 2018లో ప్రధాని అవార్డుతో పాటు పలు పురస్కారాలు అందుకున్నారు.

# సింగపూర్‌కు అదనపు విమాన సర్వీసులు

ఈనాడు, విశాఖపట్నం: సంక్రాంతి పర్వదినం వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు 'స్కూట్' ఎయిర్‌లైన్స్ అదనపు సర్వీసులు నడపనుంది. ప్రస్తుతం సోమ, బుధ, శుక్ర, శనివారాల్లో విశాఖ-సింగపూర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తున్నాయి. వీటికి అదనంగా జనవరి 11, 18 తేదీల్లో విశాఖ-సింగపూర్, సింగపూర్-విశాఖ మధ్య సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.

★ **హైదరాబాద్‌కు మరొకటి..:** విశాఖ-హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే విమాన సర్వీసుల సంఖ్య కూడా పెరగనుంది. ప్రస్తుతం రోజుకు ఇక్కడి నుంచి 7 నుంచి 8 సర్వీసులు నడుస్తున్నాయి. జనవరి 19 నుంచి 26 వరకు ఈ సంఖ్య 9కి చేరనుంది. తిరిగి మార్చి 29 నుంచి విశాఖ-హైదరాబాద్‌కు నేరుగా ప్రతి రోజు 9 సర్వీసులు బయలుదేరనున్నాయి. ప్రయాణికుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

(c) eenadu

# బౌండరీల మోత.. పరుగుల వరద..

ఉత్సాహంగా 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్'(ఈఎస్ఎల్)-2025

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానంలో 'ఈనాడు - ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో జరుగుతున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025' టోర్నీలో సోమవారం బ్యాటర్లు పరుగుల వరద పారించారు. వచ్చిన బంతిని వచ్చినట్టుగా చితక్కొడుతూ బౌండరీల మోత మోగించారు. తక్కువ బంతుల్లో అత్యధిక స్కోర్లు నమోదు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. 'ధనిక్ భారత్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే'గా క్రైట్స్ జూనియర్ కళాశాల క్రీడాకారుడు కె.ఆర్యన్ సోనీ మెరిశాడు.

**శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల వర్సెస్ వీడీఏ డిగ్రీ కళాశాల జట్టు:** ఈ మ్యాచ్‌లో శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు 23 పరుగుల తేడాతో వీడీఏ డిగ్రీ కళాశాలపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. జట్టులో ఎన్.సతీష్ 28, ఐ.సుధీర్ 25 పరుగులు చేశారు. వీడీఏ డిగ్రీ కళాశాల బౌలర్ జి.నందన్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వీడీఏ డిగ్రీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. జట్టులో వి.వినయ్ 29 పరుగులు చేశాడు. శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు బౌలర్లు ఎస్.సంపత్, ఐ.సుధీర్ చెరో 2 వికెట్లు తీశారు.

గెలుపొందిన శ్రీకశ్యప్ డిగ్రీ కళాశాల జట్టు

**క్రైట్స్ జూనియర్ కళాశాల వర్సెస్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల:** ఈ మ్యాచ్‌లో క్రైట్స్ జూనియర్ కళాశాల జట్టు 61 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆ జట్టు బ్యాటర్లు చెలరేగడంతో 10ఓవర్లలో రెండు వికెట్లకు 126 పరుగులు చేసింది. కె.ఆర్యన్ సోనీ అత్యధికంగా 30 పరుగులు, సీహెచ్.తేజేశ్వర్ 25 పరుగులు చేశారు. ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల జట్టు బౌలర్ రవీంద్ర ఒక వికెట్ తీశాడు. అనంతరం భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి కేవలం 65 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టులో సాయికుమార్ 24 పరుగులు చేశాడు. క్రైట్స్ జూనియర్ కళాశాల జట్టు బౌలర్ మౌర్య ఒక వికెట్ తీశాడు.

ప్రతిభ చూపిన క్రైట్స్ జూనియర్ కళాశాల జట్టు

**ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల వర్సెస్ మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల:** ఈ మ్యాచ్‌లో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 4 వికెట్ల తేడాతో మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది. జట్టులో జి.సాయి 16 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ జట్టు 8.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. మిసెస్ ఏవీఎన్ జూనియర్ కళాశాల జట్టు బౌలర్ కిరణ్ 2 వికెట్లు తీశాడు.

విజయం సాధించిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

కె. ఆర్యన్ సోనీ (30 పరుగులు)

**నేటి మ్యాచ్‌లు..**

■ **ఉదయం 8 గంటలకు:** సీనియర్ విభాగంలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ × గీతం డీమ్డ్ యూనివర్సిటీ ■ **ఉదయం 10 గంటలకు:** సీనియర్ విభాగంలో ఎన్ఎస్ఆర్ఐటీ(శొంఠ్యాం) × గాయత్రి విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కాలేజ్(రుషికొండ) ■ **మధ్యాహ్నం 12 గంటలకు:** జూనియర్ విభాగంలో శ్రీకశ్యప్ జూనియర్ కాలేజ్ × విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ కాలేజ్

**31-12-25 నాటి మ్యాచ్‌లు..**

■ **ఉదయం 8 గంటలకు:** సీనియర్ విభాగంలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ డిగ్రీ అండ్ పీజీ × బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ■ **ఉదయం 10 గంటలకు:** సీనియర్ విభాగంలో అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ × గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ కాలేజ్(ఎంవీపీ) ■ **మధ్యాహ్నం 12 గంటలకు:** సీనియర్ విభాగంలో ఏవీఎన్ డిగ్రీ కాలేజ్ × ఆంధ్ర మెడికల్ కాలేజ్

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Gift Partner: KL UNIVERSITY
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
Dolphin Diagnostic Services
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు ఈతరం క్లబ్

## నాలుగు ఇండిగో విమానాలు రద్దు

విశాఖపట్నం (ఎన్ఏడీకూడలి), న్యూస్‌టుడే: ఇండిగో సంస్థలో నెలకొన్న సాంకేతిక కార్యాచరణ కారణాల వల్ల సోమవారం ఒక్కరోజు నాలుగు విమానాలు రద్దయినట్లు విశాఖపట్నం విమానాశ్రయ డైరెక్టర్ పురుషోత్తం, టెర్మినల్ మేనేజర్ చాణిక్య తెలిపారు. బెంగళూరు-విశాఖ(6ఇ 217/6ఇ218), హైదరాబాద్-విశాఖ (6ఇ6408/6ఇ779, 6ఇ 6227/6ఇ216, 6ఇ6285/6ఇ6286) విమానాలు రద్దు చేసినట్లు తెలిపారు.

## రైల్వే భవన నిర్మాణాలపై జీఎం ఆరా

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: తూ.కో.రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ సోమవారం వాల్తేర్ రైల్వేలో తనిఖీలు నిర్వహించారు. డీఆర్ఎం లలిత్ బోహ్రాతో కలిసి కీలక ప్రాజెక్టుల నిర్మాణాలను పరిశీలించారు. ముడసర్లోవలో నిర్మాణంలో ఉన్న కొత్త జోన్ కార్యాలయం భవనాన్ని, డీజిల్ లోకోషెడ్ పనులను, వడ్లపూడి వ్యాగన్ వర్క్‌షాప్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. వాల్తేర్ రైల్వేలో సుమారు 400 మందితో నిర్వహిస్తున్న 4వ రాష్ట్ర స్థాయి స్కౌట్స్‌అండ్ గైడ్స్ శిబిరాన్ని పరిశీలించి అధికారులను అభినందించారు.

స్టేషన్ వద్ద పనులను పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

## యూట్యూబర్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే: సనాతన ధర్మం, సంస్కృతి, భారతీయ మహిళలను అవహేళన చేస్తూ మాట్లాడిన నా అన్వేషణ యూట్యూబర్ అన్వేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు అధ్వర్యంలో సోమవారం గోపాలపట్నం సీఐ లెంక సన్యాసినాయుడికి ఫిర్యాదు చేశారు. మతాలు, మహిళల వస్త్రాలు, భారతీయ సంప్రదాయాలను కించపరుస్తూ మాట్లాడిన అతనిని అరెస్టు చేసి చర్యలు చేపట్టాలని కోరారు.

## 6 నుంచి వైజాగ్ ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్‌పో

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జవహర్‌లాల్‌నెహ్రూ ఫార్మాసిటీ క్రీడా మైదానంలో జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు 'వైజాగ్ ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్‌పో (ఎగ్జిబిషన్) నిర్వహించనున్నారు. ఎక్స్‌పో భారీ వేదిక ఏర్పాటు పనులకు సోమవారం ఎగ్జివిజన్ మీడియా డైరెక్టర్ అతిజ్‌కుమార్‌శుక్లా, జవహర్‌లాల్‌నెహ్రూ ఫార్మాసిటీ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అసోసియేషన్ (జేఎన్‌పీసీఎంఏ) కార్యదర్శి జెట్టి సుబ్బారావు, విశాఖ ఫార్మాసిటీ సంస్థ డీజీఎం గిరిధర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎగ్జివిజన్ మీడియా ఆధ్వర్యంలో జేఎన్‌పీసీఎంఏ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఎక్స్‌పోలో ఫార్మా రంగంలో వస్తున్న తాజా ఆవిష్కరణలు, అధునాతన టెక్నాలజీపై విజ్ఞానం పెంపొందిస్తామన్నారు. 250 సంస్థలు ముందుకొచ్చి దేశవిదేశాల్లో తయారైన 2వేల అధునాతన ఫార్మా ఉపకరణాలను స్టాల్స్‌లో ప్రదర్శనగా ఉంచడంతో పాటు వాటి ఉపయోగాలపై అవగాహన కల్పిస్తాయన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాలోని ఫార్మా సంస్థల యాజమాన్యాలకు, వాటిలో పనిచేసే ఉద్యోగులకు, ఫార్మా అనుబంధ పరిశ్రమల నిపుణులకు, విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎగ్జిబిషన్ ప్రవేశానికి ఎలాంటి రుసుం లేదని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్స్‌పో వేదిక పనుల భూమి పూజలో పాల్గొన్న అజిత్‌కుమార్‌శుక్లా, సుబ్బారావు, గరిధర్ తదితరులు

## సింహగిరిపై నేటి నుంచి రాపత్తు ఉత్సవాలు

జనవరి 9 వరకు రాత్రి 7 గంటలకు దర్శనాలు నిలిపివేత

విద్యుద్దీపాలంకరణలో అప్పన్న ఆలయం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి రాపత్తు ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. వైకుంఠ ఏకాదశికి ముందు పది రోజులు పగల్ పత్తు ఉత్సవాలు, తర్వాత పది రోజులు రాపత్తు ఉత్సవాలు నిర్వహించడం ఆలయ సంప్రదాయం. పగల్‌పత్తు ఉత్సవాల్లో ఉదయం పూట అయ్యవారి సేవ జరిగింది. రాపత్తులో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి గ్రామ తిరువీధులు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వామివారు రోజుకొక అవతారంలో భక్తులను అనుగ్రహించడం విశేషం. రాపత్తు ఉత్సవాల సందర్భంగా జనవరి 9వ తేదీ వరకు రాత్రి 7 గంటలకు దర్శనాలు నిలిపివేస్తారు. 7 గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవని అధికారులు తెలిపారు.

## ప్రాణమున్నంత వరకు ప్రజా పాట రాస్తా..

### సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

సభలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కన్నుమూసే వరకు పెన్ను ఆగదు, ప్రాణం ఉన్నంత వరకు ప్రజాపాట రాస్తూనే ఉంటానని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ఏయూలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న శ్రామికోత్సవ్ సభలో సోమవారం ఆయన అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పెన్నుల్లో సిరా ఉంటే ప్రజా కవుల పెన్నుల్లో రక్తం, చెమట ఉంటుంది. సినీ గేయ రచయితల్లో కార్మిక, కర్షక, జానపాటలు శ్రీశ్రీ తర్వాత నేనే ఎక్కువ పాటలు రాశా. నేను ఇంటర్ చదువుతున్నప్పుడు రోజుకు రూ.3 కూలికి భవన నిర్మాణ కార్మికుడుగా వెళ్లేవాడిని. ఇక్కడకు రచయితగా కాకుండా కార్మికుడిగా వచ్చా. బిడ్డకు తల్లి పాలు పట్టడానికి బదులు కల్లు పట్టే దౌర్భాగ్య స్థితిలో ప్రస్తుతం ఉన్నాం. ఇన్నేళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఈ స్థితి ఉండడం సిగ్గు చేటు. దీన్ని సమైక్యంగా ఎదుర్కోవాలి. మార్పు రావాలి. కొనుక్కొనే ఓట్లు, సీట్లు రాజకీయాలపై ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతానే ఉంటా' అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన ప్రతి అంశాన్ని పాట రూపంలో ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, శ్రామిక ఉత్సవ్ కమిటీ కన్వీనర్ కె.రమాప్రభ, సీతాలక్ష్మి, దర్శకులు యాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

## పీజీఆర్ఎస్‌లో 262 అర్జీల స్వీకరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి 262 మంది వచ్చి తమ వినతులు అందజేశారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, హౌసింగ్ పీడీ సత్తిబాబు, జిల్లాలోని ఆయా శాఖల ఉన్నతాధికారులు అర్జీలు స్వీకరించారు. దివ్యాంగ పింఛన్లు మంజూరు చేయాలని, నిలిపివేసిన పింఛన్లను పునరుద్ధరించాలని, కరెంటు బిల్లు పెరిగిందని, ఇతర సామాజిక, వృత్తిగత, పోలీసు, జీవీఎంసీ, ఇతర శాఖలకు సంబంధించిన అంశాలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను పరిశీలన చేసి నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్దేశాలు, లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పని చేయాలన్నారు.

పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, జిల్లా ఉన్నతాధికారులు

## సంజీవిని నిధికి విరాళాలు ఇవ్వండి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని పేదలు, అనారోగ్య బాధితులకు సాయం చేయాలనే సంకల్పంతో నెలకొల్పిన సంజీవిని నిధి(డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్)కి స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులు, దాతలకు విజ్ఞప్తి చేశారు. నూతన ఏడాది 2026కు స్వాగతం పలికే సందర్భంలో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న మానవీయ, అర్థవంతమైన సంప్రదాయాన్ని ఈ సారి కొనసాగించాలన్నారు. అధికారులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు, పరస్పర శుభాకాంక్షలు తెలిపే సందర్భంలో పూలు, పండ్లు, బొకేలు, కేకులు, మొక్కలకు బదులుగా విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## వసతిగృహ విద్యార్థులకు ముస్తాబు కిట్ల పంపిణీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 23 వసతి గృహాల విద్యార్థులకు ముస్తాబు కిట్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం అందజేశారు. ఈ కిట్లలో అద్దం, దువ్వెన, తువ్వాలు తదితర సామగ్రి ఉంటాయి. వీటిని పెందుర్తి ప్రాంతానికి చెందిన బాదిరెడ్డి సూర్యప్రకాష్ వితరణగా అందజేశారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జేసీ మయూర్ అశోక్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ కె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్

## ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేయాలి

విశాఖ ఎంపీ శ్రీభరత్
ఉత్తమ కార్యకర్తలకు పురస్కారాల ప్రదానం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పని చేసే పార్టీ కార్యకర్తల సేవలను తెదేపా ఎప్పటికీ మరిచిపోదని, భవిష్యత్తు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసే కార్యకర్తలను ప్రోత్సహించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో తెదేపా ఉత్తరం నియోజకవర్గం కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. వివిధ స్థాయిల్లో పని చేస్తున్న 36 మంది కార్యకర్తలను వేదిక మీదకు ఆహ్వానించి పురస్కారం అందజేసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పురస్కారాలు అందుకున్న వారిపై మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. కార్యకర్తల్లో పోటీతత్వం పెంచడానికే వీటిని ఏర్పాటు చేశామని, పురస్కారాలు రాలేదని ఎవరూ నిరుత్సాహ పడవద్దన్నారు. కార్యక్రమంలో ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, తెదేపా విశాఖ లోక్‌సభ నియోజకవర్గం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన చోడె వెంకటపట్టాభిరామ్, లొడగల కృష్ణ, పొలమరశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యకర్త పురస్కారాలు పొందిన వారితో ఎంపీ ఎం.శ్రీభరత్, నాయకులు గండి బాబ్జీ, పట్టాభిరామ్, లొడగల కృష్ణ తదితరులు

## ముఖ్యమంత్రి దృష్టికి ఇళ్ల నిర్మాణ అంశం : మంత్రి నారాయణ

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే : నగరంలోని వెలంపేటలో నివాసం ఉంటున్న 177 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖమంత్రి నారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి ఆయన వెలంపేటలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మురికివాడల్లోని ప్రజల స్థితిగతులను తెలుసుకుంటున్నామన్నారు. వీలైనంత త్వరగా ప్రత్యేక ప్రాజెక్టుగా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇక్కడ నివాసం ఉన్నవారికి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఈ సందర్భంగా తమకు సరైన ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంత్రికి వివరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు తెదేపా అధ్యక్షుడు బి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలంపేటలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

EENADU Classifieds

BUSINESS SERVICES

**లోకేష్ గోల్డ్** లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

**శ్రీవల్లి గోల్డ్** లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

**ఆంధ్రప్రదేశ్‌లోGovt. ఉద్యోగస్తులకు,** రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదాలేదా నెలవారీవడ్డీకి పర్సనల్‌లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ 7386201191

REAL ESTATE

GENERAL

**సిటీ లిమిట్స్‌లో** గల బిల్డింగ్స్ పై గల ఓపెన్ స్పేస్ అమ్మదలచినవారు సంప్రదించండి మరియు మా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కొలేటరల్ సెక్యూరిటీ కావలెను. వివరాలకై : 9963585556.

FLAT FOR SALE

GENERAL

FLATS FOR SALE
3 BHK 1580 Sft. E/W/Facing, Premium Specifications, Walkable Distance from BRTS Road, SUJATHANAGAR.
Book Now to Avail Discount
9989077663, 9441935055

**2BHK 1200** Sft. New Flats All Eminities Ready to Occupy. Bank Loan. Nr. S.D.Peetam. Chinnamushidiwada. 9246671972, 8639234521

2BHK FLAT FOR SALE
2BHK Flat Sale in decent condition + Utility + 2 Balconies area of 1248 sft with carpark
@ DUTCH HOUSE APTS, Opp. Park Hotel, RK Beach Road, Vizag.
Agents not entertained
✆ 98440 97400

LAND FOR SALE

GENERAL

**పూసపాటిరేగ మం** గోవిందపురంరోడ్డు, హైవేకి ½km తార్రోడ్డుఫేసింగ్ 9ఎకరాలు కొబ్బరితోట & 4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం. 9440255187.

PLOT FOR SALE

VZM ROAD

**VZM-VSP NHకు** ప్రక్కన చెల్లూరు రాయపూర్ బైపాస్‌కు దగ్గర్లో VMRDA & RERA అప్రూవ్డ్ గేటెడ్ కమ్యూనిటి వెంచర్‌లో అన్ని ఫేసింగ్స్‌లో ప్లాట్లు కంపెనీ ధరకు అమ్మకమునకు కలవు. సంప్ర : 9492342274/ 8074112636.

JOBS

REQUIRED
A multi crore real estate company wanted staff immediately in our new projects.
❖WELL EXPERIENCED MARKETING STAFF
❖EXPERIENCED DIGITAL FEMALE MARKETERS
☛Age: 30 Years and above.
☛Qualifications: Any Degree
INTERVIEW : 30th & 31st Dec 2025
Time : 10 A.M. to 6 P.M
K. MADHU BABU, Dy. G.M
B.S. LAYOUT, VIZAG
✆7277275678

Job Opportunity: 30సంవత్సరముల అనుభవంగల రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు టీం కలిగి ఉన్న చీఫ్ మేనేజర్స్ కావలెను. 10,000 జీతం+ 2,40,000 ఇన్‌సెంటివ్. వయసు 35+ M/F. Con : 9346202030, 7675964466.

**ప్రముఖ రియల్** ఎస్టేట్ సంస్థ నందు మార్కెటింగ్ చేయుటకు స్త్రీలు/ పురుషులు కావలెను. ఆకర్షణీయమైన జీతము + ఇన్సెంటివ్స్ . సంప్ర: 9502911068.

**వైజాగ్ ప్రముఖ** షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం.10,000-12,000+ఫుడ్ రూము. ✆ 9030588502/9704637370.

**కౌంటర్ సేల్స్‌మెన్స్** (Q: ఇంటర్ / డిగ్రీ వ॥ 30స॥ లోపు) కావలెను. భువనేశ్వర్ పెయింట్స్ & హార్డ్‌వేర్, మర్రిపాలెం, వైజాగ్. సెల్: 9703009555.

**హోటల్ శ్రీకృష్ణ** ఎడెన్ కూర్మన్నపాలెంలో పనిచేయుటకు రూమ్‌బాయ్స్ 35 సం॥లు వయస్సులోపు వారు కావలెను. ఉచిత భోజనం & వసతి కల్పించబడును. ✆ 9866221503.

**విశాఖపట్నం (సిరిపురం,** ఆటోనగర్) ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్, SO లు కావలెను. జీతం:18,000-20,000, డ్యూటీ: 12 గం॥. PF+ESI కలదు. 7989870438.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

## సింటర్‌ప్లాంటుతో ఉత్పాదకత అభివృద్ధి

కన్వేయర్‌ను ప్రారంభిస్తున్న సీజీఎం రంజన్ మహంతి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు ఉద్యోగులు నిర్మించిన ఈ కన్వేయర్ సింటర్ ప్లాంటు ఉత్పాదకత అభివృద్ధిలో ముందడుగు అని ఉక్కు సీజీయం(వర్క్స్) రంజన్ మహంతి అన్నారు. సింటర్ ప్లాంటు విభాగం ఉద్యోగులు సింటర్ ఉత్పత్తి మరింత పెంచేందుకు అంతర్గత వనరులతో నూతనంగా ఒక కన్వేయర్ మార్గాన్ని నిర్మించారు. ఈ కన్వేయర్ వల్ల 1500 టన్నుల వరకూ అదనంగా లైమ్‌ను మాన్యువల్‌గా లోడింగ్ చేయవచ్చు. దీంతో సింటర్‌ప్లాంటులో అదనపు ఉత్పత్తికి దోహదం చేస్తుంది. దీనిని రంజన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పి.ఎస్.రావు, జి.ఎస్.రావు, ఎస్.కె.వి.ఎన్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా హోటల్స్, క్లబ్, పబ్‌ల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ హెచ్చరించారు. సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకలు నిర్వహించే నిర్వాహకులు సీసీ కెమెరాలను, ట్రాఫిక్ నియంత్రణకు సెక్యూరిటీ గార్డును నియమించుకోవాలన్నారు. అశ్లీల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయరాదన్నారు. మద్యం మత్తులో ఉన్న వారిని స్విమ్మింగ్ పూల్‌కు అనుమతించరాదన్నారు. డీజేలకు అనుమతి లేదని, ఆయుధాలను వినియోగించరాదని, పరిమితిని మించి సందర్శకులను అనుమతించొద్దని సూచించారు.

## బాలుడి ఆత్మహత్య

సింధియా, న్యూస్‌టుడే : ఓ బాలుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్త నక్కవానిపాలెంలో సోమవారం జరిగింది. దీనికి సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యోగేందర్(16) తల్లి 12 ఏళ్ల క్రితం చనిపోయింది. తండ్రి ఆకుల రాజు బాలుడిని వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఈ బాలుడు కొత్త నక్కవానిపాలెంలో ఉంటున్న తాతయ్య, అమ్మమ్మల వద్ద ఉంటున్నాడు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వద్ద హెల్పర్‌గా ఉండేవాడు. వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యూసీడీ ఇన్‌ఛార్జి పీడీగా సరోజిని

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగరపాలక సంస్థ యూసీడీ (పట్టణ సామాజికాభివృద్ధి) ఇన్‌ఛార్జి పథక సంచాలకురాలిగా సరోజినిని నియమిస్తూ కమిషనర్ కేతన్‌గార్గ్ ఉత్తర్వులు జారీచేశారు. అనకాపల్లి మెప్మా పీడీగా విధులు నిర్వహిస్తున్న ఆమెను జీవీఎంసీ పీడీగా నియమించారు. గతంలో ఆమె జీవీఎంసీ యూసీడీలో టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుత యూసీడీ పీడీ పీఎం సత్యవేణికి అదనపు కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించగా, ఆమె స్థానంలో సరోజినిని ఇన్‌ఛార్జి పీడీగా నియమించారు. సోమవారం జీవీఎంసీ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు.

## ఘనంగా ప్రాంతీయ పాలిటెక్నిక్ క్రీడా పోటీలు

గాల్లోకి బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ ఎం.శ్రీభరత్, తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రాంతీయ స్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలు సోమవారం కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంపీ ఎం.శ్రీభరత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పోటీలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 8 ప్రభుత్వ, 16 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 816 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో తలపడుతుండటం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు పోస్టుల భర్తీకి తనవంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కళాశాల విద్యార్థిని ఆర్.యోగిని ప్రదర్శించిన కూచిపూడి నృత్యం చూపరులను ఆకట్టుకుంది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ, అర్జున అవార్డు గ్రహీత శీరపు జయరాం, కళాశాల స్టూడెంట్ అడ్వయిజర్ ఎస్.వి.రమణ, ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, జనసేన ఉత్తరం ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, భాజపా నాయకురాలు దీపిక, 54వ వార్డు తెదేపా అధ్యక్షుడు కుట్టా కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 131 | 130 |
| లైవ్ | 158 | 150 |
| డ్రెస్‌డ్ | 229 | 270 |
| స్కిన్‌లెస్ | 261 | 280 |

# పెందుర్తి

**తెరపై ఈనాడు**

లక్ష్మీకాంత్ (స్క్రీన్-1): **శంబాలా** (మార్నింగ్, ఫస్ట్ షో), **ఈషా** (మ్యాట్నీ, సెకండ్ షో) స్క్రీన్-2: **ఛాంపియన్**

## ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను చెల్లింపునకు అవకాశం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీకి చెల్లించాల్సిన రెండవ అర్ధ సంవత్సర ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి ఛార్జీలను ఈ నెల 31వ తేదీలోగా వడ్డీ లేకుండా చెల్లించాలని పెందుర్తి జోన్ జెడ్సీ శంకర్రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా పన్నులను www.gvmc.gov.in పోర్టల్ ద్వారా క్రెడిట్, డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, యూపీఐ విధానాల్లో చెల్లించవచ్చని ఈ సదుపాయం కల్పించినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## డిగ్రీ కళాశాలలో నేడు ఉద్యోగ మేళా

పెందుర్తి, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి టి.ఢిల్లీశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి కళాశాల ఆవరణలో జరిగే ఈ మేళాలో 12 సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేస్తారని వివరించారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు అర్హతల వారీగా ఉద్యోగాలు కల్పిస్తారని తెలియజేశారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ.10 నుంచి మ. ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం శివారు చిన గొల్లలపాలెం వెళ్లే దారిలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద పెరిగింది. -వి.అప్పలనాయుడు, గొల్లలపాలెం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం.

?: సబ్బవరం జోడుగుళ్లు సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. -ఎస్.నాగేంద్ర, గొల్లలపాలెం. ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం.

పెందుర్తి, న్యూస్‌టుడే: ?: పురుషోత్తపురం మహతి పాఠశాల వెనుక ప్రాంతంలో డోర్ నంబరు 3-19 ఇంటి వద్ద వీధిదీపం కొన్నాళ్లుగా వెలగక రాత్రివేళల ఇబ్బంది పడుతున్నాం. - ఉషారాణి, పురుషోత్తపురం ✓: వెలగని వీధిదీపానికి త్వరలో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. - సౌమిక్, వీధిదీపాల నిర్వహణ ఏఈ, 95వ వార్డు

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ గొర్లివానిపాలెం జీఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉంది. - సంతోష్, ✓: వెంటనే శునకాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. - మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ

## 'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు..

**అల్పాహారం లేక ఆకలితో తప్పని అవస్థలు**

పరవాడ, న్యూస్‌టుడే

సర్కారు బడుల్లో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను డిసెంబరు 6 నుంచి అమలు చేస్తున్నారు. ఇందుకోసం విద్యార్థులకు సాధారణ తరగతులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఉదయం 8 గంటలకు పాఠశాలకు వచ్చి సాయంత్రం 5 గంటల వరకు విద్య అభ్యసిస్తున్నారు. వివిధ పాఠశాలల్లో ఉదయం బోధన (రెమిడియల్ టీచింగ్), సాయంత్రం వరకు చదివించడం, తర్వాత ఒక్కో సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితిలో పాఠశాల నుంచి విద్యార్థులు ఇంటికి తిరిగొచ్చేసరికి సాయంత్రం 6గంటలవుతోంది. దీంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడుతూ...నీరసించిపోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, దాతలు స్పందించి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించాలని తద్వారా ఆకలి ఇబ్బందులు తీరుతాయని చెబుతున్నారు.

లంకెలపాలెం హైస్కూల్లో అదనపు తరగతి నిర్వహిస్తున్న దృశ్యం

**నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు... వాటిలో పదో తరగతి విద్యార్థుల వివరాలు**

| మండలం | పాఠశాలలు | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| పెందుర్తి | 12 | 786 |
| పరవాడ | 13 | 798 |
| సబ్బవరం | 08 | 472 |
| మొత్తం | 33 | 2056 |

**ఎక్కువ శాతం మంది పేదవారే..**

పెందుర్తి నియోజకవర్గంలోని 32 జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో పదో తరగతి విద్యార్థులు 2056 మంది చదువుతున్నారు. మార్చి 16 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు సుమారు 75 రోజుల సమయం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులే చదువుతున్నారు. వీరి తల్లిదండ్రులు ఎక్కువ మంది రోజువారీ కూలీలుగా, వ్యవసాయదారులుగా పనిచేస్తున్నారు. విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి బస్సులు, సైకిళ్లు, ఆటోల తదితర వాటిపై పాఠశాలకు వస్తున్నారు. ఉదయం 8 గంటలకే పాఠశాలకు చేరుకోవాల్సి ఉండడం, ఇంటి వద్ద సమయానికి వంట కాకపోవడం, సమయం లేదని అల్పాహారం తినకుండా రావడం చేస్తున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం మినహా సాయంత్రం ఎలాంటి స్నాక్స్ లేకపోవడంతో ఆకలితో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

**కంపెనీల యాజమాన్యాలు స్పందించాలని వేడుకోలు**

ప్రత్యేక తరగతుల కారణంగా విద్యార్థులు బయట దుకాణాల వద్ద అల్పాహారం తింటున్నారు. డబ్బులు లేనివారు ఆకలితో ఉంటున్నారు. కొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో ఉదయం పూట అల్పాహారం అందిస్తున్నారు. సాయంత్రం ఉండడం లేదు. విద్యార్థుల గత్యంతరం లేక పాఠశాలలో పెట్టే మధ్యాహ్న భోజనంతోనే నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం, దాతలు ముందుకొచ్చి పది విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించినట్లయితే మరింత ఉత్సాహంగా చదివి.. నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఆరోగ్యంగా, చురుగ్గా ఉంటారని పలువురు ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా దాతలు, ఎన్టీపీసీ, ఫార్మా కంపెనీల యాజమాన్యాలు, ముందుకొచ్చి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించాలని కోరుతున్నారు.

## గడ్డల్లో ఆక్రమణలు అడ్డుకోవాలి

వేపగుంట (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ పెందుర్తి జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గెడ్డల ఆక్రమణలను అడ్డుకట్ట వేయాలని పలువురు ఫిర్యాదు చేశారు. వేపగుంటలోని జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జెడ్సీ శంకర్రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 16 అర్జీలు రాగా వాటిలో ఆక్రమణలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. పెందుర్తి బ్యాంకు కాలనీ, చినముషిడివాడ సప్తగిరినగర్, తదితర ప్రాంతాల్లోని గెడ్డల్లో ఆక్రమణలు తొలగించాలని పలువురు ఫిర్యాదు చేశారు. 95వ వార్డు శివాజీనగర్, 97వ వార్డు సుజాతనగర్ సీ-2 జోన్, చీమలాపల్లి సమీప వసంత కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించాలని మరికొందరు విన్నవించారు. ఇంటి పన్నులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని పలువురు అర్జీలిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ శంకర్రావు

## బాలల ఆరోగ్య సంరక్షణకు పటిష్ఠ చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భద్రతను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో బాలలకు సంబంధించిన అంశాలపై మూడు సమావేశాలు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జేసీ మయూర్ అశోక్, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అక్రమ రవాణా, బాల్య వివాహాల నిరోధం, పునరావాసం కోసం తగిన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ బాలికలకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు అన్ని రకాల టీకాలు వేయాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలు ఆవిష్కరించారు. ఐసీడీఎస్ జిల్లా అధికారి కె.వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పింఛనుదారులకు ఉచిత సేవలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జనవరి 5వ తేదీ నుంచి చినముషిడివాడలోని పెందుర్తి ప్రాంత ప్రభుత్వ పింఛనుదారుల సంఘం కార్యాలయంలో పింఛనుదారులకు ఉచితంగా జీవన ప్రమాణ ధ్రువీకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అల్లు కృష్ణారావు, వై.శామారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. చినముషిడివాడ కార్యాలయంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జీవన ప్రమాణ ధ్రువీకరణ సేవలు అందిస్తామన్నారు. అనారోగ్య కారణాలతో కార్యాలయానికి రాలేని వారు 83746 65696 నంబరుకు ఫోన్ చేసి చిరునామా తెలియజేస్తే ఇంటి వద్దకు వెళ్లి సేవలందిస్తామన్నారు. ఈహెచ్‌ఎస్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానం వల్ల వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఆ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

## 3డీ ప్రింటింగ్ నైపుణ్యంపై అవగాహన

వేపగుంట (పెందుర్తి), న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు 3డీ ప్రింటింగ్ నైపుణ్యాన్ని సాధించడం ద్వారా అదనపు అర్హత జోడించుకోవచ్చని అధ్యాపకులు పేర్కొన్నారు. నరవలోని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో 3డీ ప్రింటింగ్‌పై జరిగిన నాలుగు రోజుల కార్యశాల సోమవారం ముగిసింది. ఒడిశాకు చెందిన 3డీ ప్రింటింగ్ నిపుణులు షబ్బీర్ పాల్గొని మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు ఉచిత క్యాడ్ సాఫ్ట్‌వేర్ను ఉపయోగించుకునే విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రదీప్ వర్మ, విభాగాధిపతులు శాంతారావు, జీవన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

## మృతుడి నేత్రాలు దానం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం చింతలగ్రహారం గ్రామానికి చెందిన పుల మరశెట్టి శ్రీను (52) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం తెలుసుకున్న పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను మృతుడి కుటుంబ సభ్యులను సంప్రదించి నేత్రదానం చేయాలని కోరారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు నగరానికి చెందిన మోహిసిన్ నేత్రనిధి కేంద్రం టెక్నీషియన్ కృష్ణ మృతుడి కళ్ల నుంచి కార్నియా సేకరించారు. కుటుంబ సభ్యులకు నేత్రదానం ధ్రువీకరణపత్రం అందజేశారు.

మృతుడి బంధువులకు నేత్రదానం ధ్రువపత్రం అందిస్తున్న టెక్నీషియన్ కృష్ణ

## కళాశాలకు వితరణ

ఇస్లాంపేట(పరవాడ), న్యూస్‌టుడే: సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 77వవార్డు పరిధి ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.లక్ష వెచ్చించి బోటనీ, జువాలజీ ల్యాబ్‌కు చెందిన పరికరాల(సామగ్రి)ను వితరణగా సమకూర్చింది. ఈమేరకు కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ల్యాబ్ పరికరాలను ప్రిన్సిపల్ వివేకానందరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ఎన్టీపీసీ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమన్నారు. ఇటీవల సంబంధిత యాజమాన్యం ఫిజిక్స్ ల్యాబ్ పరికరాలు కూడా అందించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ పరికరాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ వివేకానందరావు

బాటజంగాలపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

## రీసర్వే సద్వినియోగం చేసుకోండి

సబ్బవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే కార్యక్రమానికి రైతులంతా హాజరై ఈ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. ఈ మేరకు సబ్బవరం మండలం బాటజంగాలపాలెంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడారు. ఎవరి భూములు వారు దగ్గరుండి నమోదు చేయించుకుంటే భవిష్యత్తులో తప్పులు దొర్లే అవకాశం ఉండదన్నారు. అనంతరం బాటజంగాలపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ వీరయ్య, సర్వేయర్ లాలం అప్పారావు, సర్పంచి పడాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సౌర విద్యుత్‌పై అవగాహన

సబ్బవరం, న్యూస్‌టుడే: సోలార్ ఎనర్జీని ఉపయోగించడం ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.రామకృష్ణ అన్నారు. ఆయన సోమవారం సబ్బవరం పంచాయతీ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై స్థానికులకు అవగాహన కల్పించారు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకునేందుకు విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్ ఎనర్జీ వినియోగించాలని కోరారు. అనంతరం సూర్యఘర్‌పై అవగాహన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ సబ్బవరం సెక్షన్ కార్యాలయం ఏడీఈ సురేష్, ఏఈలు దుర్గాప్రసాద్, నాయుడు, సర్పంచి డి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు తదితరులు

## వేంకటాద్రిపై నేడు ఉత్తర ద్వార దర్శనం

పెందుర్తి, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం వేంకటాద్రిపై ఉత్తర ద్వారంలో శ్రీనివాసుడి దర్శనానికి యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈవో నీలిమ, ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పుష్పాలంకరణతో ముస్తాబు చేశారు. వైకుంఠ ద్వారాన్ని చెరకు గడలతో తీర్చిదిద్దారు. వేకువజామున 3.30 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులు ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకోవచ్చని రామానుజాచార్యులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వేంకటాద్రిపై గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

చెరకు గడలతో తీర్చిదిద్దిన వైకుంఠ ద్వారం

ఆలయానికి పుష్పాలంకరణ

## అయ్యవారి సన్నిధిలో అమ్మవారి వైభవం

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం విశేష ఆరాధనలు, తిరుప్పావై సేవాకాలం జరిగింది. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు చేసి ధూపదీప సేవలు చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి విశేష ఆరాధనలు చేశారు. తిరుప్పావై 14వ పాశురాన్ని విన్నపం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సామూహిక తిరుప్పావై పాశుర పారాయణం చేశారు. అర్చకులు తీర్థగోష్ఠి నిర్వహించి ప్రసాద వితరణ చేపట్టారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈవో నీలిమ పేర్కొన్నారు.

వేంకటాద్రిపై పూజలందుకుంటున్న ఆండాళ్ అమ్మవారు

వేపగుంట, న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ఉత్తర ద్వారంలో భక్తులు దర్శించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. చింతలగ్రహారం, లక్ష్మీనరసింహనగర్ కృష్ణాలయాల్లో, సింహపురికాలనీ, వేపగుంట, నరవ, కోటనరవ, సత్తివానిపాలెం, గవరజగ్గయ్యపాలెం, ఆర్.ఆర్.వెంకటాపురం రామాలయాల్లో, దేవతామూర్తులు భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చేలా ఆలయకమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఆలయాలకు వెళ్లే సమయంలో భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలని, అవకాశం ఉన్నంతవరకు రద్దీ ప్రదేశాలకు బంగారు ఆభరణాలతో వెళ్లకపోవడమే మంచిదని పెందుర్తి పోలీసులు సూచించారు.

కల్యాణవేంకటేశ్వరస్వామి

## సమస్యలు పరిష్కరించరూ..

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: 79వ వార్డులో వీధిదీపాలు, రింగ్‌లైట్లు ఏర్పాటు చేయాలని వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు సోమవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

## రాకపోకలకు నిత్యం ఇక్కట్లే..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఊటగెడ్డ కూడలి నుంచి ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బి రహదారి శిథిలావస్థకు చేరుకుని గుంతలమయంగా మారింది. రహదారి పొడవునా గుంతలు పడడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ఎన్టీపీసీ కార్మికులు, ఉద్యోగులు, 20 గ్రామాల ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. ఎంతో ప్రాధాన్యం గల రహదారి దెబ్బతిని ప్రమాదకరంగా మారినా కనీస మరమ్మతులు చేపట్టలేదని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్టీపీసీకి వెళ్లే మార్గంలో రహదారి ఇలా..

## ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

సబ్బవరం, న్యూస్‌టుడే: ఈనెల 23 నుంచి అసకపల్లి శివారు నక్కవానిపాలెంలో సబ్బవరం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈసందర్భంగా ప్రిన్సిపల్ బి.శంకర్ వాలంటీర్లనుద్దేశించి ప్రసంగించారు. ఈ శిబిరం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ సొసైటీకి చెందిన బి.సంధ్యారాణి మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

## మృతుని కుటుంబానికి చేయూత

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన డి.వరహాలరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు వాడచీపురుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 2000-01 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి విద్యార్థులంతా మృతుని కుటుంబానికి రూ.63వేలు ఆర్థిక సాయం చేశారు. సంబంధిత మొత్తాన్ని సోమవారం మృతుని భార్యకు అందించి పిల్లల చదువుకు ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుమూర్తిరెడ్డి, మహాలక్ష్మినాయుడు, బంగార్రాజు, వరహాలరావు, నర్సింగరావు, దేముడు, కనకారావు, సంతోష్, కల్పన పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

## చలికాలం.. వ్యాధులతో జాగ్రత్త సుమా..!

**పెందుర్తి సీహెచ్‌సీ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ దొర**

**ముఖాముఖి**

చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. విశాఖ జిల్లాలోని పెందుర్తి మండలంలో ఇటీవల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలంతా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ హెచ్ఆర్‌కె దొర సూచించారు. పలు ఆరోగ్య పరమైన అంశాలపై సోమవారం 'న్యూస్‌టుడే' నిర్వహించిన ముఖాముఖిలో వెల్లడించిన వివరాలు, సూచనలు ఆయన మాటల్లోనే.

\- న్యూస్‌టుడే, పెందుర్తి

★ ఇటీవల ఆసుపత్రికి దగ్గు, జలుబు, జ్వరంతో వస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది. రోజుకు 300పైగా ఓపీ ఉండగా 8 నుంచి 10 మంది ఆసుపత్రిలో చేరుతున్నారు. సాధారణ వైరల్ జ్వరాలే అయినప్పటికీ జాగ్రత్తలు తీసుకోవాలి. వరుసగా రెండు రోజులు జ్వరం తగ్గకపోతే వెంటనే వైద్య సాయం పొందాలి.

★ చల్లని నీరు, శీతల పానీయాలు తాగకూడదు. గోరువెచ్చని నీరు తాగాలి. గొంతు నొప్పి అధికంగా ఉంటే ఉప్పు నీరు పుక్కిలించాలి. ముక్కు దిబ్బడకు వేడి నీటితో ఆవిరి పట్టాలి.

★ ఉదయపు నడకకు వెళ్లే వారు తప్పనిసరిగా తల, చెవులకు రక్షణ కల్పించాలి. 60ఏళ్లు దాటిన వారు చలిలో నడవకపోవడమే మంచిది. మంచు కారణంగా వర్టిగో సమస్య వచ్చి కింద పడిపోయే ప్రమాదం ఉన్నందున ఎండ వచ్చాక వాకింగ్‌కు వెళ్లడమే మేలు.

★ చిన్న పిల్లలు బయట ఆహారాన్ని పూర్తిగా విడనాడాలి. ప్రస్తుత కాలంలో జీర్ణశక్తి తక్కువగా ఉంటున్న నేపథ్యంలో గోరువెచ్చని నీరు పట్టాలి.

★ కాలంతో సంబంధం లేకుండా ఏడాదిలో ఎక్కువగా జ్వరం, జలుబు, గొంతునొప్పితో బాధపడే వారు వైద్యుల సూచన మేరకు ఇన్‌ఫ్లుయెంజా టీకా వేయించుకోవడం మంచిది.

★ పెందుర్తి ఆసుపత్రిలో గుండె జబ్బులకు సంబంధించిన స్టెమీ వైద్యం అందుబాటులో ఉంది. ఛాతి నొప్పి, భుజం లాగడం, చెమటలు పట్టడం, బీపీ అధికంగా ఉండడం వంటి సమస్యలున్న వారికి ఈసీజీ తీసి స్టెమీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తాం. గుండె వైద్య నిపుణుల సూచన మేరకు అవసరమైన వారికి రూ.35వేలు విలువ చేసే ఇంజక్షన్ చేసి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు పంపిస్తాం. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు 8 మందికి ఈ సేవలు అందించాం.

★ కుక్కకాటుతో జాగ్రత్తలు పాటించాలి. కుక్క కరిచిన వెంటనే చల్లని నీటితో గాయాన్ని కడగాలి. పెద్ద గాయమైతే కట్టు కట్టాలి. ఆసుపత్రికి వస్తే టీటీ ఇంజక్షన్ చేసి యాంటీ రేబిస్ టీకా ఇస్తాం. మరీ పెద్ద గాయాలైతే ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజక్షన్ చేస్తాం. కుక్క కాటు చికిత్సకు సంబంధించి నిర్ణీత గడువులో సూచించిన ప్రకారం తప్పనిసరిగా వైద్యం పొందాలి.

★ చాలా మంది మందుల దుకాణాలకు వెళ్లి అనారోగ్య సమస్యలకు యాంటీ బయాటిక్స్ వాడుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. వైద్యుల సలహా లేకుండా యాంటీ బయాటిక్స్ వాడడం సరికాదు. చిన్న పిల్లలు, ఇతర వ్యాధులున్న వారికి ఈ చర్య ప్రమాదకరం. వైద్యులను సంప్రదించి అవసరమైన మేరకే ఆయా మందులు వాడాలి.

## రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ★ **విశాఖ-అరకు (08525/26):** ఈనెల 30 నుంచి జనవరి 18 వరకు ప్రతి రోజు ఉదయం 8.40 గంటలకు విశాఖలో బయలుదేరి 12.30 గంటలకు అరకు చేరుకోనున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు మధ్యాహ్నం 2 గంటలకు అరకులో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు విశాఖ చేరుకుంటుందన్నారు.

## జీవీఎంసీకి 100 వినతులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 100 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ కేతన్‌గార్గ్ వాటిని స్వీకరించారు. భీమిలికి 6, మధురవాడకు 16, తూర్పు జోన్‌కు 15, పశ్చిమానికి 7, ఉత్తరానికి 6, దక్షిణానికి 12, పెందుర్తికి 7, అగనంపూడి జోన్‌కు 2, గాజువాకకు 7, అనకాపల్లికి 1, ప్రధాన కార్యాలయానికి 21 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో పరిపాలనకు 14, రెవెన్యూకు 11, ప్రజారోగ్యానికి 6, ప్రణాళికకు 43, ఇంజినీరింగ్‌కు 18, ఉద్యానవన విభాగానికి 3, యూసీడీకి 5 ఫిర్యాదులున్నాయి.

## నూతన నియామకం

సబ్బవరం, న్యూస్‌టుడే: ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అనకాపల్లి జిల్లాకు సంబంధించి సోమవారం సబ్బవరంలో ఎన్నిక జరగ్గా.. ఎన్‌జీవోల ఛైర్‌పర్సన్‌గా సబ్బవరం పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌సీ)గా పనిచేస్తున్న యడ్ల స్వర్ణలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

స్వర్ణలతను సత్కరిస్తున్న ఎన్జీవోలు, చిత్రంలో డాక్టర్ ఎన్ఎస్ఆర్ చక్రవర్తి తదితరులు


**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయ శాఖ శ్రీ సోమేశ్వరస్వామి వారి దేవస్థానం**

అప్పికొండ(V), పెదగంట్యాడ (M), విశాఖపట్నం జిల్లా

**టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన**

ఆర్.సి. నెం.4/2025-26 తేది: 29-12-2025

ఈ క్రింద వివరములు గూర్చి టెండరు కమ్ బహిరంగ వేలం తేది 09-01-2026 శుక్రవారం ఉదయం 10:00 గంటలకు దేవస్థానం వద్ద నిర్వహించబడును. సీల్డ్ టెండర్లు మరియు కొటేషన్లు తేది: 09-01-2026 శుక్రవారం ఉదయం 10:00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరువబడును. టెండరు షెడ్యూల్ తేది.01.01.2026 నుండి 09.01.2026 ఉదయం 08:00 గంటల వరకు విక్రయించబడును.

| క్ర.సం | వివరములు | లైసెన్సు కాలపరిమితి | ప్రథమ ధరావత్తు |
|---|---|---|---|
| 1 | పూల అలంకరణ (ప్రధాన ఆలయం, రెండు ఉపాలయాలు) | తేది:15.02.2026 | కొటేషన్ ప్రకారం |
| 2 | షామియానా పెండాల్స్ | తేది:15.02.2026 & తేది:16.02.2026 | కొటేషన్ ప్రకారం |
| 3 | రసవర్గములు సప్లై (అన్నదానం, పులిహోర ప్రసాదం, లడ్డుప్రసాదమునకు అవసరమైన సరుకులు సరఫరా చేయుటకు) | తేది:15.02.2026 & తేది:16.02.2026 | కొటేషన్ ప్రకారం |
| 4 | ప్రసాదం మరియు అన్నదానం తయారీ నిమిత్తం కుక్ మరియు సహాయకులు | తేది:15.02.2026 & తేది:16.02.2026 | కొటేషన్ ప్రకారం |
| 5 | భక్తులచే స్వామివారికి సమర్పించి వదలివేయబడిన కొబ్బరిచిప్పలు సగభాగం పోగు చేసుకొనుటకు | తేది:15.02.2026 & తేది:16.02.2026 | 10,000/- |
| 6 | తాత్కాలిక క్యూ లైన్లు నిర్మాణం & నిర్వహణ | తేది:15.02.2026 & తేది:16.02.2026 | కొటేషన్ ప్రకారం |

మరిన్ని సీల్డ్ టెండర్ల వివరముల కొరకు దేవస్థానం పనివేళలలో కార్యాలయము నందు సంప్రదించగలరు. మిగిలిన వివరములు దేవస్థాన కార్యాలయము నందు పనివేళలలో అడిగి తెలుసుకొనవచ్చును. దేవస్థానం కార్యాలయము ఫోన్ నెం: 8328319532.

విశాఖపట్నం
తేది: 29.12.2025

కె.పద్మావతి
కార్యనిర్వహణాధికారి


(c) eenadu

# భీమిలి

**సినిమాలు**

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్- **అవతార్**
రాములమ్మ- **శంబాలా**
తాతా- **ఈషా**
సప్తగిరి- **ఛాంపియన్**

## దేదీప్యమానంగా ఉత్తర రాజగోపురం

సింహాచలం: సింహాద్రినాథుడి ఉత్తర ద్వార దర్శనానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణం, ధ్వజస్తంభం, ఉత్తర గోపురం, ఆలయ ఉత్తర ద్వారాలకు పుష్పాలంకరణ చేశారు.

## బాలల ఆరోగ్య సంరక్షణకు పటిష్ఠ చర్యలు

వన్‌టౌన్: జిల్లాలో బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భద్రతను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో బాలలకు సంబంధించిన అంశాలపై మూడు సమావేశాలు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జేసీ మయూర్ అశోక్, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అక్రమ రవాణా, బాల్య వివాహాల నిరోధం, పునరావాసం కోసం తగిన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ బాలికలకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: అయోధ్యనగర్ (మధురవాడ)లోని కాలువల్లో పూడిక పేరుకుపోయింది. – స్థానికులు ✓: కాలువల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. – శ్రీను, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: కొత్తరోడ్డు నుంచి గొల్లల ఎండాడకు వచ్చే బస్సులకు సమయపాలన ఉండటం లేదు. – స్థానికులు ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. – మహేశ్వరరెడ్డి, డిపో మేనేజర్

?: మిథిలాపురి వుడాకాలనీ(మధురవాడ)లో వాసవ్య ఆసుపత్రికి వెళ్లే మార్గంలో గుంత ప్రమాదకరంగా మారింది. – కాలనీవాసులు ✓: త్వరలో రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – అయ్యప్పనాయుడు, జెడ్సీ

?: దసపల్లాలేఅవుట్ నుంచి సాగర్‌నగర్‌కు వెళ్లే దారిలో పలుచోట్ల విద్యుద్దీపాలు వెలగడం లేదు. – సుభాష్ ✓: దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – సాయిరాం, విద్యుత్ అధికారి

?: బోయపాలెం కూడలిలో ఆటోలు అడ్డదిడ్డంగా పెట్టేస్తున్నారు. – శ్రీకాంత్ ✓: ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూస్తాం. – ఆనందపురం, ట్రాఫిక్ పోలీసులు

## అటు శునకాలు.. ఇటు వరాహాలు

▼ వెంటపడటంతో జనం బెంబేలు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 పరిధిలో 5, 6, 7, 8 వార్డుల్లో ఏ వీధిలో చూసినా శునకాలు, పందులు, పశువుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జోనల్ కార్యాలయం, సచివాలయాలతో పాటు ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఆరుబయటే సంచారం..:** వార్డుల్లోని ఏ ఇంటి ముందు చూసినా పందులు, పశువుల మందలు తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోకి వస్తాయేమోనని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 5వ వార్డులో సాయిరాంకాలనీ, మారికవలస రాజీవ్‌గృహకల్ప, పరదేశిపాలెం, వైఎస్‌ఆర్‌నగర్, శివశక్తినగర్.. 6వ వార్డులో రిక్షాకాలనీ, కొమ్మాది, సేవానగర్, గురజాడనగర్, రేవళ్లపాలెం, బక్కన్నపాలెం, పీఎంపాలెం, ఆర్‌హెచ్‌కాలనీ.. 7వ వార్డులో స్వతంత్రనగర్, ప్రియదర్శినికాలనీ, వాంబేకాలనీ, చంద్రంపాలెం, మల్లయ్యపాలెం, మిధిలాపురివుడాకాలనీ.. 8వ వార్డులో బింద్రానగర్, ఎండాడ, సాగర్‌నగర్ తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలో పందులు సంచరిస్తున్నాయి. రాత్రివేళ పెంపకందారులు వీధుల్లోకి వదిలేయడంతో చెత్తకుప్పలు, కాలువల్లో స్వైరవిహారం చేస్తూ పరిసరాలను మరింత అధ్వానంగా మారుస్తున్నాయని చెబుతున్నారు.

కొమ్మాదిలో రహదారిపై శునకాలు ఇలా..

**వీధుల్లో భౌభౌ..:** ఎక్కడికక్కడ భౌభౌ అంటూ వీధి కుక్కలు వెంటపడుతున్నాయి. ఇప్పటికే చాలా మంది బాధితులు కుక్కకాటుకు గురై గాయాలపాలయ్యారు. విధుల్లో ఉన్న ఓ పారిశుద్ధ్య కార్మికురాలు ఇటీవల కుక్కకాటుకు గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో అడుగు పెట్టాలంటే వణుకు పుడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కకాటుకు గురైన పారిశుద్ధ్య కార్మికురాలు

**పశువులతో ఇక్కట్లు..:** గేదెలు, ఆవులను రహదారులపైకి వదిలేయడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అడ్డుగా రావడంతో వాటిని తప్పించే క్రమంలో ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

**ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..:**

పందులను జనావాసాలకు దూరంగా శివారు ప్రాంతాల్లో పెంచుకోవాలని పలుమార్లు పెంపకందారులకు సూచించాం. లేకుంటే పందులను చంపేస్తామని హెచ్చరిస్తున్నాం. పోలీసుల సహాయంతో పందుల నివారణకు చర్యలు చేపడుతున్నాం. కుక్కలు, పందులు, పశువుల సంచారాన్ని అరికడుతున్నాం. అన్ని వార్డుల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చర్యలు తీసుకుంటాం. –డాక్టర్ ఎల్.రాజారవికుమార్, ఏఎంహెచ్‌వో, జోన్–2

## ప్రతిభ చాటి.. బహుమతులు గెలిచి

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 8, 10 తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా ఎన్.భవానిశంకర్, ఎన్.హారిక, వి.చైతన్య నిలిచారు. వీరికి హెచ్‌ఎం పి.ఉషారాణి, ఉపాధ్యాయులు జి.శారద, బి.పద్మజ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు.

విజేతలతో హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## వేంకటేశ్వరుని కొండపై ఆర్వోప్లాంటు

చిప్పాడ (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: చిప్పాడ దివీస్ లేబొరేటరీస్ ఆర్థికసాయంతో రుషికొండ తితిదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్షిత తాగునీటి ప్లాంటును సోమవారం ప్రారంభించారు. ఆలయ అధికారులతో కలిసి దివీస్ జనరల్ మేనేజరు వైఎస్ కోటేశ్వరరావు ఈ జల ప్రసాదం యూనిట్లను ప్రారంభించి మాట్లాడారు. వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.29.30 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో టపర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, దివీస్ సీఎస్‌ఆర్ అధికారి డి.సురేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంటు ప్రారంభోత్సవంలో దివీస్ జీఎం కోటేశ్వరరావు, ఆలయ అధికారులు

## భీమిలి జెడ్సీగా బాధ్యతల స్వీకరణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి జోనల్ కమిషనరుగా **టి.నాగేంద్రకుమార్** సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గత ఏడు నెలలుగా పని చేసిన జెడ్సీ వి. అయ్యప్పనాయుడు జోన్-2 మధురవాడ జోనల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మధురవాడ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పని చేస్తున్న నాగేంద్ర కుమార్‌ను ఇక్కడ నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయంలో వివిధ విభాగాల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## దోమల నివారణకు చర్యలు

ఎండాడ, న్యూస్‌టుడే: పీఎంపాలెం ఆఖరి బస్‌స్టాప్ పరిసరాల్లో దోమలు, తీవ్ర దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ ఆయా ప్రాంతాల్లో క్రిమిసంహారక మందులు చల్లారు.

## ముగ్గురు విటుల అరెస్టు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో వ్యభిచారం జరుగుతుండగా ముగ్గురు విటులను సోమవారం భీమిలి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ బి. తిరుమలరావు తెలిపిన వివరాలిలా.. బీచ్‌రోడ్డులోని ఎస్.ఒ.ఎస్.రోడ్డులో ఉన్న ఒక హోటల్‌కు ముగ్గురు యువకులు ఒక యువతిని తీసుకొచ్చి వ్యభిచారం చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో అక్కడున్న ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్నారు. భీమిలి బీచ్‌రోడ్డులో హేచరీల వద్ద రొయ్యి పిల్లలు కొనుగోలు చేసేందుకు వచ్చి హోటల్లో బస చేసి ఈ చర్యలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. బాధితురాలిని విశాఖలోని ఎన్జీఓ గృహానికి తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## సంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని ఆశీలుమెట్ట సంపత్ వినాయగర్ ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రభావతి, ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు టీఆర్ చోళన్ సమక్షంలో ఆలయ సిబ్బంది, శివజ్యోతి సేవా సమితి సభ్యులు 30 రోజుల ఆదాయాన్ని లెక్కించారు. 227 గ్రాముల వెండి, రూ.19,81,566 నగదు, రూ.111 చెక్కు, 83 యూఎస్ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 10 సౌదీ రియాల్స్ వచ్చాయి.

## రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

✦ **విశాఖ-అరకు (08525/26):** ఈనెల 30 నుంచి జనవరి 18 వరకు ప్రతి రోజు ఉదయం 8.40 గంటలకు విశాఖలో బయలుదేరి 12.30 గంటలకు అరకు చేరుకోనున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు మధ్యాహ్నం 2 గంటలకు అరకులో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు విశాఖ చేరుకుంటుందన్నారు.

## ఆదమరిస్తే అపాయమే..

బీచ్‌రోడ్డు (జూపార్కు) ముఖద్వారం ఎదురుగా కాలువలపై వేసిన పలకలు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. దీంతో పర్యాటకులు, వాహనదారులను అప్రమత్తం చేయడానికి కొందరు అందులో కర్రలు పెట్టారు. వారం రోజులుగా ఇదే దుస్థితి ఉందని చెబుతున్నారు. జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి జూకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో రాత్రివేళ ఏమాత్రం ఆదమరిచి అటుగా వెళ్లినా ప్రమాదబారిన పడటం ఖాయమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువపై పలకలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎండాడ

బీచ్‌రోడ్డు జూపార్కు ముఖద్వారం ఎదురుగా ఇలా..

## వాహనదారులకు ఆంక్షలు

రుషికొండ తీరం నుంచి కొత్త రోడ్డులో వచ్చేలా..

రుషికొండ బీచ్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా టూరిజం అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక మెరైన్ పోలీసుస్టేషన్ సమీప బీచ్‌రోడ్డు నుంచి యధావిధిగా పాతమార్గం ద్వారా వాహనదారులు తిరిగి చేరుకుంటున్నారు. ఈ క్రమంలో శివాలయం పరిసర కొండవాలు ప్రాంతం నూతన రహదారి ద్వారా గాయత్రీ కళాశాల ఎదురుగా ఉన్న బీచ్‌రోడ్డుకు తిరిగి వచ్చేలా ఆంక్షలు విధించారు. ఈ మేరకు ఆయా మార్గాల ఆరంభంలో ప్రచారబోర్డులు ఏర్పాటు చేయాలని సందర్శకులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, సాగర్‌నగర్

## ఉచిత ఆటోలకు మెరుగులు

ఆర్కేబీచ్ (కోస్టల్ బ్యాటరీ) నుంచి సాగర్‌నగర్ వరకు బీచ్‌రోడ్డులో నడుస్తున్న జీవీఎంసీ ఉచిత ఆటోలకు మరమ్మతులు చేపడుతున్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం సహకారంతో 10 విద్యుత్ ఆటోలను జీవీఎంసీ అధికారులు ప్రవేశపెట్టారు. వీఎంఆర్‌డీఏ పార్కు, వాల్తేరుడిపో, అప్పుఘర్, తెన్నేటిపార్కు, జోడుగుళ్లపాలెం మీదుగా సాగర్‌నగర్ వరకు రాకపోకలు సాగించే ఈ ఆటోలో ఎవరైనా ఉచితంగా ప్రయాణించొచ్చు. ఆదివారం మినహా ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. మూడేళ్ల క్రితం నాటివి కావడంతో వీటి పరికరాలు కొంతమేర దెబ్బతిన్నాయి. సమర్థంగా తిరిగేలా రెండేసి ఆటోలు చొప్పున సింహాచలం ప్రాంతంలోని గ్యారేజీకి పంపించి పెయింటింగ్‌తో పాటు కొత్త పరికరాలను అమర్చి మెరుగులు దిద్దుతున్నారు. – న్యూస్‌టుడే, సాగర్‌నగర్

## కళాకృతులకు రక్షణగా..

భీమిలి జమ్మిచెరువు (జేసీ) పార్కులో నెలకొల్పిన కళాకృతులను ఆకతాయిలు విరగ్గొట్టకుండా ఉండేందుకు వాటికి రక్షణగా ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల ఈ పార్కులో రూ.42.50 లక్షలతో వ్యాయామ, క్రీడా పరికరాలతో పాటు పలు కళాకృతులను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. ఇందులో గౌతమ బుద్ధుని విగ్రహంతో పాటు గుర్రం బొమ్మల వద్ద పలువురు నిత్యం సెల్ఫీలను తీసుకుంటున్నారు. అలాగే పిల్లలు వీటిపైకి ఎక్కి, విన్యాసాలు చేయడంతో పాడవుతున్నాయి. దీంతో వీటి అందాలు పాడయ్యే అవకాశముండటంతో అధికారులు వీటి చుట్టూ ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే పార్కు పర్యవేక్షణ కోసం జీవీఎంసీ ఉద్యానవన విభాగం సెక్యూరిటీ, తోటమాలీలను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, భీమునిపట్నం

భీమిలి జేసీ పార్కులో గుర్రం బొమ్మ చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్

## ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో వెలిసిన బంగారమ్మతల్లి, భూలోకమ్మతల్లి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు విఘ్నేశ్వర సేవాసంఘం అధ్యక్షులు పిళ్లా రమణబాబు, కార్యదర్శి వాండ్రాసి చిట్టిబాబు, కోశాధికారి నాగోతి లక్ష్మణమూర్తి తదితరులంతా సంబంధిత విరాళం చెక్కును సోమవారం గ్రామపెద్దలకు అందించారు. ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని, సంక్రాంతి సంబరాలను ఈ ఏడాది మరింత ఘనంగా చేసేందుకు తమవంతు సహకారం అందిస్తామని సేవాసంఘం ప్రతినిధులు తెలిపారు.

గ్రామపెద్దలకు విరాళం చెక్కును అందిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

## భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శం

పద్మనాభం, న్యూస్‌టుడే: భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శమని ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకారిణి సభ్యులు దువ్వూరు యుగంధర్ అన్నారు. బుడ్డివలస పంచాయతీ లింగన్నపేట సమీపంలోని గాయత్రీమాత ఆలయంలో సోమవారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. హిందూ జీవన విధానం ప్రకృతితో ముడిపడి ఉంటుందన్నారు. సనాతన ధర్మంలో మహిళలకు విశిష్ట స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు టి.నరసింగరావు, కె.రామరాజు, బి.సత్యనారాయణ, కె.కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దువ్వూరు యుగంధర్

## అభివృద్ధికి నోచుకోని సత్యసాయినగర్

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధిలోని ఎండాడ ఎంతో అభివృద్ధి చెందుతోందని ప్రజాప్రతినిధులు పదే పదే చెబుతున్నా అది కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతోంది. ఇక్కడి సత్యసాయినగర్‌లో మాత్రం సమస్యలు తిష్ఠవేశాయి. ఈ ప్రాంతం కనీస మౌలిక వసతుల కల్పనకు నోచుకోవడం లేదు. సరైన రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టక స్థానికులు అవస్థలు పడుతున్నారు. రహదారులపైకి మురుగు ప్రవహిస్తూ అస్తవ్యస్తంగా తయారవుతోంది. పాదచారులు, వాహనచోదకులు అటుగా వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల ఇళ్లు లేని చోట ఖాళీ స్థలాలకు రోడ్లు వేస్తున్న అధికారులు జనావాసం ఉన్న ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం స్పందించి మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారి దుస్థితి ఇలా..

పోయే మార్గం లేక నిలిచిన మురుగు

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం జాతరగట్టుపై వెలిసిన దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవంలో తొలిరోజు శ్రీపంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పిలకోమటివానిపాలెం ప్రాంతానికి చెందిన మహిళలు కోలాటం ప్రదర్శించారు. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, పిళ్లా వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

## అయ్యవారి సేవలో అప్పన్న స్వామి వైభోగం

స్వామి, అమ్మవార్లు

మంగళవాయిద్యాల నడుమ స్వామివారి తిరువీధి వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాచలం క్షేత్రంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా సోమవారం అయ్యవారి సేవ వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేష ఆరాధనలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి బంగారు తొళక్కియాన్ పల్లకిలో అధిష్ఠింపజేశారు. వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తులను ఆలయ బేడామండపంలో చతుర్గతి నడకలతో ఊరేగించారు. ఆండాళ్ సన్నిధి వద్ద స్వామి, అమ్మవార్ల పూలదండలు మార్చి తాంబూలాది మర్యాదలు జరిపారు. ఆస్థాన మండపంలో కొలువుదీర్చి విశేష పారాయణలు చేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పాశుర విన్నపం, సేవాకాలం సంప్రదాయబద్ధంగా జరిగాయి.

## బీచ్‌లో పర్యాటక సమాచార కేంద్రం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌లో ఏపీ టూరిజం సమాచార, రిజర్వేషన్ కార్యాలయాన్ని ఇటీవల అధికారులు అందుబాటులోకి తెచ్చారు. స్థానిక మెరైన్‌పోలీసు టవర్ భవన సముదాయం దిగువ భాగంలో ఆయా కార్యకలాపాలకు అనువుగా కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. ఈ మేరకు రుషికొండతో పాటు ఆర్కేబీచ్, రైల్వేస్టేషన్‌ల్లోనూ నెలకొల్పిన కేంద్రాలు నిర్వహణలో ఉన్నాయి. రోడ్డు, రైలు మార్గాల్లో అరకు తదితర ప్రదేశాలకు ప్రయాణాలు, బీచ్ రోడ్డులో డబుల్‌డెక్కర్ బస్సుల్లో విహారం, హోటళ్లు, రిసార్ట్స్‌లు, కాన్ఫరెన్స్ మందిరాల్ని రిజర్వ్ చేసుకునే దిశగా ఈ సేవలను ప్రవేశపెట్టారు. ఏపీటీడీసీ నిర్దేశించిన మేరకు సదరు కేంద్రాల్లో నేరుగా నగదు చెల్లించి లేదా ఆన్‌లైన్, డిజిటల్ విధానాల ద్వారా టికెట్లు తీసుకుని సేవలు వినియోగించుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

సమాచార కేంద్రం

## 'జీవీపీ'లో ముగిసిన నైపుణ్య శిక్షణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల ఈసీఈ విభాగం, టీవీఎస్ వాహనాల కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన ప్లేస్‌మెంట్ శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.ఎస్.బోస్, డైరెక్టర్ ప్రొఫెసర్ పీవీ వినయ్, డీన్ ప్రొఫెసర్ డి.సరిత, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.ఎ.నాగేశ్వరరావు, టీవీఎస్ సీనియర్ ట్రైనర్ ఎస్.సెల్వరాజు మాట్లాడారు. యువత క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో నైపుణ్యాలు పెంపొందించుకుని చదువులో రాణిస్తే ఉన్నతస్థానంలో స్థిరపడడానికి దోహదపడతుందన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డీన్ ప్రొఫెసర్ సరిత తదితరులతో విద్యార్థులు

## ఆలయాల్లో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

శుభ్రం చేస్తున్న భీమిలి నరసింహస్వామి ఆలయ మెట్లు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. చిట్టివలస జ్యూటుమిల్లు రామాలయం, మంగమారిపేట వారిజాలోని శ్రీలక్ష్మీహయగ్రీవస్వామి ఆలయం, దాకమర్రి విష్ణుమూర్తి ఆలయం, తగరపువలస సత్యనారాయణ కొండపైన ఆలయం, తగరపువలస వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు ఉంటాయని ఆలయ కమిటీల ప్రతినిధులు చెప్పారు. కాగా ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## తీరప్రాంతాలు కళకళ

రుషికొండ, సాగర్‌నగర్ తదితర తీరాలతో పాటు బీచ్‌రోడ్డులోని పలు పర్యాటక ప్రదేశాలు గత కొద్ది రోజులుగా సందర్శకులతో కళకళలాడుతున్నాయి. సోమవారం బీచ్‌రోడ్డు పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. క్రిస్మస్ సెలవులు మొదలుకొని సంక్రాంతి పండగ ముగిసేవరకు ఏటా ఇలా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం వస్తుంటారు. ఈ నేపథ్యంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న డబుల్‌డెక్కర్ బస్సులు, స్పీడు బోట్లు ద్వారా విహరించడానికి మక్కువ చూపుతున్నారు. – న్యూస్‌టుడే, సాగర్‌నగర్

సాగరంలో బోటు విన్యాసం



బీచ్‌రోడ్డులో డబుల్‌డెక్కర్ బస్సులో ప్రయాణం

## సీఐటీయూ ద్విచక్రవాహన ర్యాలీ

కొమ్మాది, న్యూస్‌టుడే: ఈ నెల 31వ తేదీన ప్రారంభంకాబోతున్న సీఐటీయూ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. కొమ్మాది కూడలి నుంచి శివశక్తినగర్, చంద్రంపాలెం, మిధిలాపురి వుడాకాలనీ, కారుషెడ్, పీఎంపాలెం మీదుగా కొమ్మాది త్రిశక్తిదేవాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. జనవరి 4వ తేదీ వరకు జరిగే మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.రాజ్‌కుమార్, ఎస్.రామప్పాడు, జి.కిరణ్, సిహెచ్.శేషుబాబు, కే.సురేష్, కే.కామేష్, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది కూడలి నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలు

## జోన్-2 పీజీఆర్ఎస్‌కు 15 వినతులు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జెడ్సీ అయ్యప్పనాయుడు 15 అర్జీలను స్వీకరించారు. బింద్రానగర్‌లో ఎస్ఎస్‌పార్క్ వ్యూ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న జీవీఎంసీ పార్కును అభివృద్ధి చేయాలని, నగరంపాలెం ఆదిత్యనగర్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మిధిలాపురి వుడాకాలనీ సమీపంలో రెవెన్యూ లే-అవుట్‌లో అంతర్గత రహదారులు, కాలువలు నిర్మించాలని కోరారు. 6వ వార్డు పీఎంపాలెం, బక్కన్నపాలెం ప్రాంతాల్లో నీటి కొరత ఎక్కువగా ఉందని, చాలా మంది ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోతున్నారని, వెంటనే నీటి సమస్య లేకుండా చూడాలని భాజపా నాయకులు కె.ఎన్.పి.చక్రవర్తి విన్నవించారు. శ్రీనివాస్‌నగర్‌లో పార్కును అభివృద్ధి చేయాలని, పీఎంపాలెంలో రైతుబజారు కేటాయించాలని, కొమ్మాది టీచర్స్ లే-అవుట్‌లో వీధిదీపాలు అమర్చాలని కోరారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు.

జెడ్సీకి తాగునీటి సమస్యపై విన్నవిస్తున్న భాజపా నాయకుడు చక్రవర్తి

(c) eenadu

# విశాఖ తూర్పు

## భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం


శ్రీరాజా మురళీ మోహనరాజు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీరాజా మురళీమోహనరాజును నియమిస్తూ భాజపా అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో పార్టీలో చేరానని, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులుగా, రాష్ట్ర గిరిజన మోర్చా సెక్రటరీగా, ఉపాధ్యక్షులుగా పదవులు చేపట్టి పార్టీకి సేవలందించానన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్‌తో పాటు ప్రధాని మోదీ, జిల్లా అధ్యక్షులు పరశురామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 23వ వార్డు చైతన్యనగర్ రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయాయి. –నాగేశ్వరరావు, చైతన్యనగర్ ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. –సత్యనారాయణ, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు పరిధి దారపాలెం లేఅవుట్ శివారులో రెండు వీధి దీపాలు వెలగడం లేదు. – ప్రసాదరావు, దారపాలెం. ✓: వెలగని వీధి దీపాల స్థానంలో కొత్తవి మారుస్తాము. – ఎం.రామకృష్ణ, వీధి దీపాల పర్యవేక్షకులు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: ఎంవీపీకాలనీ ఏఎస్ రాజా మహిళా కళాశాలకు ఆనుకుని ఉన్న వీధిలో ఎక్కడికక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. – కిలాని యాదవ్ ✓: పరిశీలించి సమస్య లేకుండా చూస్తాం. – ప్రభాకర్, ట్రాఫిక్ సీఐ, ఎంవీపీ జోన్

ఇందిరానగర్, (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పదోవార్డు పాతడెయిరీ ఫారం కూడలి నుంచి విమ్స్ ప్రధాన గేటు వరకు రహదారిలో నాటుకోళ్లు, సరుగుడు కర్రలు అమ్మేవారితో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. – ప్రసాదరావు ✓: పరిశీలించి సమస్య లేకుండా చూస్తాం. – ధర్మేంద్ర, ట్రాఫిక్ ఎస్సై ఆరిలోవ జోన్

### స్పందనకు వందనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 15వ వార్డు సింహాద్రిపురం ప్రాంత కాలువల్లో కొద్ది రోజులుగా పూడికలు తొలగించడం లేదు. ఈ సమస్యపై సోమవారం 'ఈనాడు'లో వెలువడిన వార్తాంశానికి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్ స్పందించి సిబ్బందితో శుభ్రత చర్యలు చేపట్టారు.

### కుక్కల నియంత్రణకు చర్యలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పాత డెయిరీ ఫారం దరి రాజీవ్‌నగర్, ఇందిరానగర్‌లో వీధి కుక్కల బెడదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. పశుసంవర్ధక అధికారి డాక్టర్ రాజారవికుమార్ స్పందించి సిబ్బందితో కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టారు.

## పారిశుద్ధ్య సమస్యలకు తక్షణ పరిష్కారం

### జెడ్సీతో 'ఈనాడు-ఫోన్‌ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: తూర్పు జోన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల్ని నేరుగా జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 9 నుంచి 13 వార్డుల ప్రజలు తమ ప్రాంత సమస్యలను నేరుగా జెడ్సీకి తెలియజేయగా ఆయన తగిన పరిష్కార మార్గాలు సూచించారు. పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత విభాగాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తూర్పు జోన్ సహాయ వైద్యాధికారి బి.ప్రసాదరావు, ఏపీడీ ఎల్.రాము, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సాయిరాం, రెవెన్యూ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.



**సమస్య:** 13వ వార్డు శ్రీకాంత్‌నగర్ ప్రాంతంలో గెడ్డపై కాలిబాట వంతెన ఏర్పాటు చేయాలి. –బి.సత్యనారాయణమూర్తి, శ్రీకాంత్‌నగర్, 13వ వార్డు **జెడ్సీ:** వెంటనే సిబ్బంది పరిశీలించి నివేదిక పంపాక బడ్జెట్ కేటాయింపు జరిగేలా కృషి చేస్తాం.

?: ఎంవీపీకాలనీ సెక్టార్-12 ఏరియాలో డ్రైనేజీలు, కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. –బి.శ్రీనివాస్, ఎంవీపీకాలనీ, సెక్టార్-12 **జెడ్సీ:** వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం.

?: 13వ వార్డు రామకృష్ణపురం ప్రాంతంలోని ఇళ్లకు రిజిస్ట్రేషన్ జరగడం లేదు. –బాబూరావు, రామకృష్ణపురం **జెడ్సీ:** ప్రభుత్వ స్థలాలు, గెడ్డలు, వాగులున్న చోట ఇళ్లు నిర్మిస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు జరగవు. స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేస్తే పరిశీలిస్తాం.

?: ఎంవీపీ కాలనీ 104 సచివాలయంలో కంప్యూటర్లు పనిచేయక సేవలు అందడం లేదు. –సతీష్‌చౌదరి, ఎంవీపీకాలనీ **జెడ్సీ:** ఈ సమస్య వాస్తవమే. త్వరలో పరిష్కరిస్తాం.

?: 16వ వార్డు కేఆర్ఎం కాలనీ, శివాజీపాలెంలోని గెడ్డలపై సిమెంట్ పలకలు వేయడం వల్ల వ్యర్థాలు తొలగించడం లేదు. –రవి, కేఆర్ఎంకాలనీ, –నర్సింగరావు, శివాజీపాలెం **జెడ్సీ:** తక్షణమే ప్రజారోగ్య విభాగం సిబ్బందికి తెలియజేసి సమస్య పరిష్కరిస్తాం.

?: 13వ వార్డు ధారపాలెం, బంగారుతల్లి లేఅవుట్ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు నిర్మించాలి. –మధుసూదనరావు, ధారపాలెం **జెడ్సీ:** యూజీడీ పనులు జరుగుతున్నందున త్వరలో బడ్జెట్ కేటాయించి రోడ్లు, కాలువలు నిర్మిస్తాం.

ఈనాడు మీతోడు

?: హనుమంతువాక నుంచి దీనదయాళ్‌పురం వరకు నడక మార్గాలతో పాటు కూడళ్ల వద్ద ఆక్రమణలు పెరిగాయి. –ఎం.శంకరరావు, హనుమంతువాక **జెడ్సీ:** క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

?: చినవాల్తేరు తమిళ స్ట్రీట్‌లో కుక్కల బెడద అధికంగా ఉంది. –హరగోపాలరావు **జెడ్సీ:** సంబంధిత విభాగ సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం.

?: 16వ వార్డు కేఆర్ఎం కాలనీ, 23వ వార్డు చైతన్యనగర్ ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోల్ లీకులున్నాయి. –నాగరత్నం, కేఆర్ఎంకాలనీ; –కె.కృష్ణమూర్తి, చైతన్యనగర్. **జెడ్సీ:** సంబంధిత విభాగ ఏఈతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.

?: 17వ వార్డు ఇందిరానగర్ ప్రాంతంలో రహదారులు ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. –సంజయ్, ఇందిరానగర్ **జెడ్సీ:** తక్షణమే పరిష్కరిస్తాం.

?: 10వ వార్డు డెయిరీఫారం, ఆదర్శనగర్ రెండో వీధిలో విద్యుత్తు స్తంభాలు లేవు. –సత్యనారాయణ, పాత డెయిరీఫారం **జెడ్సీ:** సంబంధిత విభాగ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

?: 16వ వార్డులోని పలు ప్రాంతాల్లో యూజీడీ గోతులను సరిగా పూడ్చలేదు. –వై.అచ్యుతరావు, కేఆర్ఎం కాలనీ **జెడ్సీ:** సంబంధిత అధికారులచే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.

## క్రీడలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి

క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: క్రీడా పోటీలతో విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించగలరని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. సోమవారం విశాఖ వ్యాలీ పాఠశాలలో స్ఫూర్తి ప్లే ఫెస్ట్ పేరుతో క్రీడా దినోత్సవం నిర్వహించారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యాసంవత్సరంలో ప్రతిభావంతులతో పాటు క్రమశిక్షణ, ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. అనంతరం పరుగు, ఖోఖో, యోగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఈశ్వరీప్రభాకర్, బోర్డు సభ్యులు టీఎస్సార్ ప్రసాద్, నవోదయ ప్రిన్సిపల్ వైఎస్ఎస్ చంద్రశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నైపుణ్య శిక్షణ తరగతులతో సత్ఫలితాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్య శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి సంబంధించిన అంశంపై కళాశాల ప్రాంగణంలో బీబీఏ విద్యార్థులకు సోమవారం ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటివి ఏర్పాటు చేస్తున్నాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ జి.రాజ్‌కుమార్, కార్యక్రమ సమన్వయాధికారి డాక్టర్ గుడిపాటి శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపల్ విజయబాబు, అధ్యాపకులు

### నిత్యావసరాల పంపిణీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు విశాఖపట్నం వై.ఎం.సి.ఎ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం అక్కయ్యపాలెంలో లీలా ఛారిటుబుల్ ట్రస్ట్‌లో ఆశ్రయం పొందుతున్న 35 మంది అనాథ పిల్లలకు రేషన్ సరకులు అందజేశారు. గౌరవ సెక్రటరీ మాథ్యూ పీటర్, వైస్ ప్రెసిడెంట్ సదానంద మోజెస్, డైజీ బాబు కలిసి వీటిని అందించారు. వైఎంసీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులతో బాలలు

## నేలకొరిగిన స్తంభం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఈస్టుపాయింట్ కాలనీ కేడీపీఎం ఉన్నత పాఠశాల వెనుక వైపు రహదారిలో సౌర విద్యుత్తు స్తంభం నేలకొరిగింది. ఆ పక్కనే వ్యర్థాలు పేరుకుపోయాయి. కొంతకాలంగా సిబ్బంది వీటిని తొలగించకపోవడంతో స్థానికులు వీటికి నిప్పు పెట్టారు. దీంతో స్థానికంగా పొగ వ్యాపించడంతో ప్రాంతీయులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ వద్ద ప్రస్తావించగా రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## అపారిశుద్ధ్యం.. సందర్శకులకు అసౌకర్యం

పార్కు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు పరిధిలోని సంపత్ వినాయక ఆలయానికి ఎదురుగా ఉన్న వివేకానందనగర్ పార్కు వద్ద చెత్త కుండీ నిండిపోయి అధ్వానంగా తయారైంది. దీంతో పార్కుకు వచ్చే సందర్శకులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. స్థానికులు పారిశుద్ధ్య సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## తీరంలో భద్రతపై దృష్టి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో పర్యాటకుల కోసం పలు రకాలుగా భద్రత చర్యలు చేపడుతున్నారు. క్రిస్మస్, సంక్రాంతి పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తున్నారు. ఈ నేపథ్యంలో సముద్రంలో స్నానాలకు దిగుతుండగా ఏదైనా ఇబ్బంది కలిగితే తక్షణమే వారిని రక్షించేందుకు లైఫ్‌గార్డులను అందుబాటులో ఉంచారు. అలాగే ఎయిర్ ట్యూబ్‌లను ఏర్పాటు చేశారు

ఎయిర్‌ట్యూబ్‌లు

## బాలల ఆరోగ్య సంరక్షణకు పటిష్ఠ చర్యలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భద్రతను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో బాలలకు సంబంధించిన అంశాలపై మూడు సమావేశాలు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జేసీ మయూర్ అశోక్, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అక్రమ రవాణా, బాల్య వివాహాల నిరోధం, పునరావాసం కోసం తగిన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ బాలికలకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు అన్ని రకాల టీకాలు వేయాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలు ఆవిష్కరించారు. ఐసీడీఎస్ జిల్లా అధికారి కె.వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జేసీ తదితరులు

### ● రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. * విశాఖ-అరకు (08525/26): ఈనెల 30 నుంచి జనవరి 18 వరకు ప్రతి రోజు ఉదయం 8.40 గంటలకు విశాఖలో బయలుదేరి 12.30 గంటలకు అరకు చేరుకోనున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు మధ్యాహ్నం 2 గంటలకు అరకులో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు విశాఖ చేరుకుంటుందన్నారు.

### ● నూతన కార్యవర్గం ఏర్పాటు

ఛైర్మన్ బండి సత్యనారాయణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విశాఖ గూడ్స్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు వీఐపీ రోడ్డులోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించారు. అసోసియేషన్ ఛైర్మన్‌గా బండి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 10 మంది కమిటీ సభ్యులు, 5 ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. రెండు సంవత్సరాల పాటు నూతన కార్యవర్గం కొనసాగుతుంది.

### ● స్కేటింగ్‌లో వైద్య విద్యార్థినికి బంగారు పతకం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్యకళాశాల(ఏఎంసీ)-2023 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థిని వి.భవ్యశ్రీ ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ వేదికగా ఇటీవల జరిగిన 63వ జాతీయ స్థాయి అంతర్రాష్ట్ర స్కేటింగ్ పోటీల్లో పాల్గొని పతకాలను కైవసం చేసుకుంది. విజేతను సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, క్రీడల విభాగం ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, పీడీ ఎంఎస్ఎన్ పాత్రుడు అభినందించారు. భవ్యశ్రీకు క్రీడల కోటా కింద ఏఎంసీలో వైద్య సీటు లభించింది. ముమ్ముందు మరిన్ని పతకాలు సాధించాలని వైద్యాధికారులు సూచించారు.

## వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

విద్యుద్దీప అలంకరణలో చినగదిలి వేంకటేశ్వరస్వామి ఆలయం

ఆరిలోవ, న్యూస్‌టుడే: చినగదిలి రాధాకృష్ణనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఉదయం 4 గంటల నుంచి భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశామని కమిటీ సభ్యులు యు.శ్రీనివాసరావు తెలిపారు. వేంకటేశ్వర స్వామిగా చినగదిలిలో ఉన్న నార్త్ శిర్డీ సాయిబాబాను అలంకరించనున్నట్లు ఆలయ అధ్యక్షులు వానపల్లి అప్పారావు తెలిపారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: లాసెన్స్‌బే కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గోవిందరెడ్డి, ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

లాసెన్స్‌బే కాలనీలో...

ఆరిలోవ, న్యూస్‌టుడే: 12వ వార్డు పరిధి ఆరిలోవ శ్రీకాంత్‌నగర్ ఒకటో వీధిలో వేంకటేశ్వరస్వామి నమూనా దేవాలయం ఏర్పాటు చేశారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు కోటేశ్వరరావు తెలిపారు. సంబంధిత వివరాలను సోమవారం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జి.మురళి, ఎం సన్యాసిరావు, ఎస్ లక్ష్మణరెడ్డి వెల్లడించారు.

సమావేశంలో పాల్గొన్న నిర్వాహకులు

## దువ్వాడలో నిలిచిపోయిన పూరి-తిరుపతి రైలు

### ప్రయాణికుల అవస్థలు

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే : టాటా-ఎర్నాకుళం రైలు బోగీలు దగ్ధమవడంతో దువ్వాడ రైల్వే స్టేషన్‌కు సోమవారం తెల్లవారుజామున 4.55కు వచ్చిన పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు సుమారు రెండున్నర గంటలపాటు మొదటి ప్లాట్‌ఫాంపై నిలిచిపోయింది. దీంతో విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్, ఈస్ట్‌కోస్ట్ రైళ్లు రెండో నెంబరు ప్లాట్‌ఫాం మీదకు వచ్చాయి. ఆ సమయంలో ప్రయాణికులు ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం నుంచి ఉరుకులు.. పరుగులు పెడుతూ రెండో నెంబరు మీదకు చేరుకున్నారు. కోచ్ ఇండికేటర్లు కూడా లేకపోవడంతో బోగీలు గుర్తించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూరి-తిరుపతి రైలు ఎప్పుడు బయల్దేరుతుందో సమాచారం లేకపోవడంతో ఆ రైలు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు కె.ఈశ్వర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ అంకితా మిశ్రా దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు 7.45కు పూరి-తిరుపతి రైలు కదిలింది.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో మొదటి ప్లాట్‌ఫాంపై నిలిచిపోయిన పూరి - తిరుపతి రైలు

## హుద్‌హుద్ నివాసాల్లో కార్డెన్ సెర్చ్

కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మల్లేశ్వరరావు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పైనాపిల్ కాలనీలోని హుద్‌హుద్ నివాస సముదాయాల్లో సోమవారం ఆరిలోవ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. నేర నియంత్రణలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలో బయట వ్యక్తులు వచ్చి నేరాలు చేస్తున్నట్లు నిఘా అధికారుల హెచ్చరికల నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని ఏడు ద్విచక్రవాహనాలను గుర్తించామన్నారు.

## సంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపు

హుండీ ఆదాయం లెక్కిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలోని ఆశీలుమెట్ట సంపత్ వినాయగర్ ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రభావతి, ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు టీఆర్ చోళన్ సమక్షంలో ఆలయ సిబ్బంది, శివజ్యోతి సేవా సమితి సభ్యులు 30 రోజుల ఆదాయాన్ని లెక్కించారు. 227 గ్రాముల వెండి, రూ.19,81,566 నగదు, రూ.111 చెక్కు, 83 యూఎస్‌ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 10 సౌదీ రియాల్స్ వచ్చాయి.

## జనవరి 9న జిల్లా స్థాయి నృత్య పోటీలు

గురుద్వారా, న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జనవరి 9వ తేదీ నుంచి రెండు రోజుల పాటు విశాఖ, అనకాపల్లి జిల్లా స్థాయి నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ థియేటర్స్ ఆర్ట్స్ డైరెక్టర్ ఆర్.జానకి ఓ ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఏపీఎస్ఈబీ కాలనీ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి శాస్త్రీయ, జానపద, సోలో, డ్యూయెట్, ట్రియో(ముగ్గురు) అంశాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 12 ఏళ్లలోపు వారిని జూనియర్స్, 13 ఏళ్ల పైబడి సీనియర్స్‌గా పరిగణించి, ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, రెండు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలియజేశారు. జనవరి రెండో తేదీ లోపు 8522990123 నెంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

**CHANGE OF NAME**

I NARAMSITTI SATYANARAYANA S/o N. Ramakrishna Residing at Door No: 12-736, Gandhinagar Arilova, Visakhapatnam - 530013 Andhrapradesh. Has Changed my name from **NARAMSITTI SATYANARAYANA** to **NARAMSITTI SATTIBABU.** Hencefoth from now onwards I will be called as **NARAMSITTI SATTIBABU.**

అర్జీలను స్వీకరిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్

## వీఎంఆర్డీఏకు 9 అర్జీలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సిరిపురం వీఎంఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 9 అర్జీలను సంస్థ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ స్వీకరించారు. గడువులోగా ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం వహించకూడదన్నారు. న్యాయపరమైన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలన్నారు.

## పోలీస్ శాఖకు 110 ఫిర్యాదులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 110 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించి బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి చట్టపరంగా విచారణ చేపట్టి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్టు సీపీ పేర్కొన్నారు.

బాధితుల సమస్యలు వింటున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

## జీవీఎంసీకి 100 వినతులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 100 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ కేతన్‌గార్గ్ వాటిని స్వీకరించారు. భీమిలికి 6, మధురవాడకు 16, తూర్పు జోన్‌కు 15, పశ్చిమానికి 7, ఉత్తరానికి 6, దక్షిణానికి 12, పెందుర్తికి 7, అగనంపూడి జోన్‌కు 2, గాజువాకకు 7, అనకాపల్లికి 1, ప్రధాన కార్యాలయానికి 21 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో పరిపాలనకు 14, రెవెన్యూకు 11, ప్రజారోగ్యానికి 6, ప్రణాళికకు 43, ఇంజినీరింగ్‌కు 18, ఉద్యానవన విభాగానికి 3, యూసీడీకి 5 ఫిర్యాదులున్నాయి.

## రోలర్ స్కేటింగ్ విజేతకు అభినందన

విద్యార్థినిని అభినందిస్తున్న వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఇటీవల విశాఖలో జరిగిన జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం సాధించిన కె.బిందుమాధవిని ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సోమవారం తన ఛాంబరులో అభినందించారు. బిందుమాధవి ఏయూలో ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చదువుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, క్రీడలు, వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ పాల్గొన్నారు.

## స్పెషల్ డ్రైవ్ పరీక్షల రిజిస్ట్రేషన్ గడువు పెంపు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ పరీక్షలకు (యూజీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు) రిజిస్ట్రేషన్ ఫీజు గడువు జనవరి 5వ తేదీ వరకు పొడిగించినట్లు ఏయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విభాగం ఓ ప్రకటనలో తెలిపింది.

**అంతిమయాత్ర**

నా భార్య శ్రీమతి వాడాడ వసంతలక్ష్మి గారు తేది. 29-12-2025 (సోమవారం) స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీమతి వాడాడ వసంతలక్ష్మి గారు

జననం: 22-08-1963 మరణం: 29-12-2025

భర్త: వాడాడ సత్యనారాయణ

Retd. Deputy Commissioner of Excise Dept., Govt. of Andhra Pradesh

| | |
|---|---|
| బావగారు - అక్క | : వాడాడ నరసింగరావు - కృష్ణకుమారి |
| మరిదిగారు - చెల్లి | : వాడాడ వెంకట కోటేశ్వరరావు - ఉషారాణి |
| ఆడపడుచు - అన్నయ్య | : దుర్గుమహంతి జయలక్ష్మి - D.S.E. ప్రసాదరావు |
| కుమారుడు - కోడలు | : వాడాడ చంద్రశేఖర్ - తేజోశ్రావ్య |
| కుమార్తె - అల్లుడు | : యామిని - యస్. శ్రీనివాస్ |
| మనుమడు, మనుమరాలు | : రామ్‌విహాన్, మృదా |

కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

అంతిమయాత్ర: తేది. 30-12-2025 (మంగళవారం) ఉదయం 10 గం॥ల నుండి డో.నెం. 9-35-4, పిఠాపురం కాలనీ, కళాభారతి దగ్గర మా స్వగృహము నుండి బయలుదేరును.

(c) eenadu

# విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

## జనవరి 9న జిల్లా స్థాయి నృత్య పోటీలు

గురుద్వారా, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగను పురస్కరించుకొని జనవరి 9వ తేదీ నుంచి రెండు రోజుల పాటు విశాఖ, అనకాపల్లి జిల్లా స్థాయి నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ డైరెక్టర్ ఆర్.జానకి ఓ ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న ఏపీఎస్ఈబీ కాలనీ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి క్లాసిక్, జానపద, సోలో, డ్యూయెట్, ట్రియో(ముగ్గురు) అంశాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 12 ఏళ్ల లోపు వారిని జూనియర్స్, 13 ఏళ్ల పైబడి సీనియర్లుగా పరిగణించి, ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, రెండు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలియజేశారు. జనవరి రెండో తేదీ లోపు 8522990123 నెంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
విశాఖ ఉత్తరం: 8008574796
విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: బాలయ్యశాస్త్రి లేఅవుట్ రాధాకృష్ణనగర్‌లోని గెడ్డలో పూడికలు పేరుకుపోయాయి. దీంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. - రామారావు ✓: సిబ్బందితో పూడికలు తీయిస్తాం. - క్రాంతికుమార్, వార్డు పరిశుభ్రత అధికారి

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ సెక్టార్-8లో ఉన్న కాలువల్లో మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. - పి.రాంబాబు ✓: సిబ్బందిని పంపించి కాలువలను శుభ్రం చేయిస్తాం. - వి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

## సీఎంతో మర్యాదపూర్వక కలయిక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబును అమరావతిలో సోమవారం తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసినట్లు నజీర్ పేర్కొన్నారు.

## వైజాగ్ ఫొటో ట్రేడ్‌షో గోడపత్రిక ఆవిష్కరణ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: వైజాగ్ కన్వెన్షన్ వేదికగా వచ్చేనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరగనున్న వైజాగ్ ఫొటో ట్రేడ్ షో-2026 గోడ పత్రికను సోమవారం సాయంత్రం లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ శ్రీభరత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెషనల్ ఫొటో (గ్రాఫర్) అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ విశాఖపట్నం అధ్యక్షుడు మట్టా లోకేశ్వరరావు, కార్యదర్శి చల్లా నూకరాజు, ఉపాధ్యక్షుడు జయసురేశ్, నిర్వాహక కార్యదర్శి మణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

## రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. విశాఖ-అరకు (08525/26): ఈనెల 30 నుంచి జనవరి 18 వరకు ప్రతి రోజు ఉదయం 8.40 గంటలకు విశాఖలో బయలుదేరి 12.30 గంటలకు అరకు చేరుకోనున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు మధ్యాహ్నం 2 గంటలకు అరకులో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు విశాఖ చేరుకుంటుందన్నారు.

## టౌన్ హాల్‌ను అందుబాటులోకి తేవాలి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: పాతనగరంలోని టౌన్‌హాల్‌ను అందుబాటులోకి తేవాలని కోరుతూ జీవీఎంసీ 38వ వార్డు తెదేపా కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి జోన్-4 జెడ్సీ మల్లయ్యనాయుడుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయంత్రం జెడ్సీ టౌన్‌హాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇక్కడున్న టౌన్‌హాల్ ఎంతో పురాతనమైనదని, పేదలు శుభకార్యాలకు వినియోగించుకునే వారన్నారు. శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం రూ.లక్షలు ఖర్చుపెట్టి మరమ్మతులు చేశారని తక్షణమే దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

## ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మోసం

గురుద్వారా, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి యువత నుంచి రూ.లక్షలు వసూలు చేసి టోకరా వేసిన వ్యక్తిపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. సీఐ ఉమాకాంత్ తెలిపిన వివరాలు ప్రకారం.. బాధితులంతా గాజువాక, కొత్తవలస ప్రాంతాలకు చెందిన వారని తమ స్టేషన్ పరిధిలో ఓ ఇంటి నుంచి ఆన్‌లైన్‌లో అతనికి నగదు పంపించినట్లు తెలిపారు.

## వస్త్ర సంచుల వినియోగం అభినందనీయం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా పేదలకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేసేందుకు వీలుగా వివేకానంద సేవా సంస్థ తయారు చేసిన వస్త్ర సంచులను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సోమవారం ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వస్త్ర సంచులను వినియోగించడం అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు ఈశ్వరరావు, భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర సంచులను ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ, సంస్థ సభ్యులు

## ఉత్తర ద్వారం.. మోక్ష మార్గం..

వైభవపు ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

మురళీనగర్, మాధవధార, న్యూస్‌టుడే

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్జీజీవోస్ కాలనీ కప్పరాడ వైభవ వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో స్వామివారిని భక్తులు దర్శించుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. మంగళవారం తెల్లవారుజామున 2.45 గంటలకు మంగళ ధ్వని, సుప్రభాత సేవ, 5 గంటల వరకు సేవ అనంతరం 6.15 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనాలను కల్పించేలా అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. వివిధ సేవా సంఘాల సభ్యులు 200 మందితో అన్ని రకాల సేవలను అందించేలా చర్యలు తీసుకున్నట్లు ఈవో బండారు ప్రసాద్ తెలియజేశారు.

### పోలీసు బందోబస్తు.. సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

ఉదయం 5.30 గంటల నుంచి ఉచిత దర్శనం జరగనున్నాయి. విశిష్ట దర్శనానికి రూ.500, శీఘ్ర దర్శనానికి రూ.100 టికెట్లను విక్రయించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. నిరంతరం పర్యవేక్షణకు 16 సీసీ కెమెరాలను అమర్చారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు మంచినీళ్లు, మజ్జిగ అందజేయనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పోలీస్ బందోబస్తు, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 5 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

### భూసమేత విజయ వేంకటేశ్వరుడి సన్నిధిలో..

జీవీఎంసీ 51వ వార్డు అయ్యప్పనగర్‌లో వెలసిన భూసమేత విజయ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు స్వామి దర్శనాలు కల్పించనున్నారు. దర్శనాల కోసం వచ్చే భక్తుల కోసం క్యూలైన్లు, ప్రసాద వితరణ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యుత్తు దీపాలంకరణలో రాజగోపురం

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార సాయిబాబా మందిరంలోని వేంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని పూలమాలలతో సుందరంగా అలంకరించారు. దర్శనం తర్వాత ప్రసాద వితరణ జరుగుతుందని, ఉదయం నుంచి భక్తులను అనుమతిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు.

అయ్యప్పనగర్ భూసమేత విజయ వేంకటేశ్వరుడి సన్నిధిలో..

## 'వంద శాతం హామీల అమలు'

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ ఈ ఏడాది అమలు చేసిందని తెదేపా రాష్ట్ర బి.సి.సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేష్ పేర్కొన్నారు. అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులోని తెదేపా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాతా సుఖీభవ, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలెండర్లు, మత్స్యకార భరోసా, ఆటో డ్రైవర్ల సేవలో తదితర సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసిందన్నారు. ప్రజలు ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 44వ వార్డు తెదేపా మాజీ అధ్యక్షుడు కాళ్ల గౌరీశంకర్ నాయుడు, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో అకడమిక్ ఆడిట్

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : నగరంలోని జ్ఞానాపురం దరి సెయింట్ జోసెఫ్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న బోధన, సదుపాయాల్లోని నాణ్యత, భరోసా అంశాలపై అకడమిక్ ఆడిట్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఆడిట్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆచార్యులు డాక్టర్ ఎ.ఎ.అన్నపూర్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ టి.భాస్కరసుధను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కళాశాలలోని బోధనా విధానాలను అధ్యాపకురాలు ఎ.సీతాదేవి వివరించారు. అనంతరం కళాశాలలోని ల్యాబ్, తరగతి గదులు, గ్రంథాలయం, రికార్డులు పరిసరాలను పరిశీలించారు.

అకడమిక్ ఆడిట్ అధ్యాపకులను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

## బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న మత్స్యకారులను తీసుకొస్తాం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న 9 మంది మత్స్యకారులను సురక్షితంగా విశాఖకు రప్పిస్తామని, ఇందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు కూటమి ప్రభుత్వం చేస్తోందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తప్పుదోవ పట్టించే విధంగా కొంతమంది చేస్తున్న ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. చేపలరేవులో సోమవారం మధ్యాహ్నం 9 మంది మత్స్యకారుల కుటుంబాలతో పాటు బోటు యజమానికి ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు, రూ.4 వేలు విలువ చేసే నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడారు. బంగ్లాదేశ్-భారత్ మధ్య ఇటీవల జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో మత్స్యకారుల విడుదలలో కొంత ఆలస్యం అయిందన్నారు. కుటుంబ సభ్యుల పోషణ కోసం రూ.20 వేలు చొప్పున ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. బోటు ఆపరేటర్ల సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు, పీసీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నిత్యావసరాలు, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

## చదువుతో ఉన్నత శిఖరాలకు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: భారత్ వికాస్ పరిషత్(బీవీపీ) విశాఖ శాఖ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని వాగ్దేవి పాఠశాలలో సోమవారం 'గురువందన్ - ఛాత్రాభినందన్' కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎం.వి.వి.సత్యనారాయణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువు దైవంతో సమానమని, ప్రతి ఒక్కరూ గురువు పట్ల భక్తిభావంతో మెలగాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో బీవీపీ విశాఖ శాఖ అధ్యక్షుడు సీహెచ్.వి.సత్యనారాయణ, కార్యదర్శి పేర్ల భాస్కరరావు, కోశాధికారి జి.ఎస్.వి.మాణిక్యాలరావు, కన్వీనర్ ఎం.వి.రాజశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఎం.ఎస్.ఎల్.శైలజ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో నిర్వాహకులు, పాఠశాల యాజమాన్యం

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

## విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించండి

సీతంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) 2026 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు రాజేంద్రనగర్‌లోని తన నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ విశాఖ జిల్లా అధ్యక్షురాలు చంద్ర పద్మావతి, ఇమంది పైడిరాజు, ఉపాధ్యక్షులు పీఎస్ఎన్ రెడ్డి, పురుషోత్తం, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అవయవదానంపై వాకర్స్‌కు అవగాహన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వాకర్స్‌కు సోమవారం అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సావిత్రీబాయి పులే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అవయవదానంతో మరొకరికి పునర్జన్మ ప్రసాదించవచ్చునన్నారు. మరణించిన తర్వాత శరీరాన్ని దానం చేయడం ద్వారా వైద్య విద్యార్థుల జ్ఞాన సముపార్జనకు సహకరించినవాళ్లమవుతామన్నారు. అవయవదానం అంగీకారం కోసం ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రభుత్వం ధ్రువపత్రం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పోర్టు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

కరపత్రాలతో గూడూరు సీతామహాలక్ష్మి, వాకర్స్

## పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదుల వెల్లువ

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 110 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించి బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి చట్టపరంగా విచారణ చేపట్టి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

కార్పొరేషన్, న్యూస్‌టుడే : జీవీఎంసీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 100 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ కేతన్‌గార్గ్ వాటిని స్వీకరించారు. వాటిలో పరిపాలనకు 14, రెవెన్యూకు 11, ప్రజారోగ్యానికి 6, ప్రణాళికకు 43, ఇంజినీరింగ్‌కు 18, ఉద్యానవన విభాగానికి 3, యూసీడీకి 5 ఫిర్యాదులున్నాయి.

### సంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలోని ఆశీలుమెట్ట సంపత్ వినాయగర్ ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రభావతి, ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు టీఆర్ చోళన్ సమక్షంలో ఆలయ సిబ్బంది, శివజ్యోతి సేవా సమితి సభ్యులు 30 రోజుల ఆదాయాన్ని లెక్కించారు. 227 గ్రాముల వెండి, రూ.19,81,566 నగదు, రూ.111 చెక్కు, 83 యూఎస్ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 10 సౌదీ రియాల్స్ వచ్చాయి.

## స్కేటింగ్‌లో వైద్య విద్యార్థినికి బంగారు పతకం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్యకళాశాల(ఏఎంసీ)-2023 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థిని వి.భవ్యశ్రీ ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ వేదికగా ఇటీవల జరిగిన 63వ జాతీయ స్థాయి అంతర్రాష్ట్ర స్కేటింగ్ పోటీల్లో పాల్గొని పతకాలను కైవసం చేసుకుంది. విజేతను సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, క్రీడల విభాగం ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, పీడీ ఎంఎస్ఎన్ పాత్రుడు అభినందించారు. భవ్యశ్రీకు క్రీడల కోటా కింద ఏఎంసీలో వైద్య సీటు లభించింది. మున్ముందు మరిన్ని పతకాలు సాధించాలని వైద్యాధికారులు సూచించారు.

విజేత వి.భవ్యశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, వైద్యులు సునీల్‌కుమార్, ఎంఎస్ఎన్ పాత్రుడు

## 'వీర్ బాల్ దివస్' ముగింపు వేడుకలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: భాజపా వైద్య విభాగం ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న 'వీర్ బాల్ దివస్' ముగింపు వేడుకలను దండుబజార్‌లోని ఎంవీడీ పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఈఓ ప్రేమకుమార్ హాజరయ్యారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు దేశభక్తి అలవరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాబా జొరావర్‌సింగ్, బాబా ఫతేసింగ్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. అనంతరం పిల్లలు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, నాయకులు ఆర్.రవికుమార్, దానేష్, పల్లా చలపతిరావు, చంద్రశేఖర్, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డీఈఓ ప్రేమకుమార్

## నైపుణ్యాలతో ఆధునిక ప్రపంచంలో రాణింపు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నేటి ఆధునిక ప్రపంచంలో ఉన్నతంగా రాణించాలంటే విద్యతో పాటు నైపుణ్యం ఉండాలని విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.మంజుల అన్నారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' అనే అంశంపై డాటాప్రో ఎంపవరింగ్ స్కిల్స్ సహకారంతో సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు. అధ్యాపకులు బి.సంతోషి, అనూష, ఎల్.శరణ్య తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ముందు తరాలకు చెప్పాలి

సీతంపేట, న్యూస్‌టుడే: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ముందుతరాలకు చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. పౌర గ్రంథాలయంలో సమైక్య భారతి, అరసం, ఏపీ ప్రజా నాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 'సమైక్య తెలుగు దినోత్సవం' పేరిట సమావేశం నిర్వహించారు. ఏఎన్‌యూ పూర్వ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్ దాస్, ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్రం విభాగాధిపతి ఆచార్య పి.ప్రేమానందం, ఆచార్య బి.మంజులత, ఉప్పల అప్పలరాజు, బి.చిరంజీవులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నరసింహారావు, బాలమోహన్‌దాస్, ప్రేమానందం

## బాలల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భద్రతను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో బాలలకు సంబంధించిన అంశాలపై సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జేసీ మయూర్ అశోక్, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ బాలికలకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు అన్ని రకాల టీకాలు వేయాలన్నారు. ఐసీడీఎస్ జిల్లా అధికారి కె.వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, జేసీ మయూర్ అశోక్

## నీటి పారుదల శాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ నీటి పారుదల ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా కమిటీ రూపొందించిన 2026 క్యాలెండర్‌ను ఆ శాఖ విశాఖ సర్కిల్ ఈఈ పి.అప్పలనాయుడు సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యాలయంలో డిప్యూటీ ఈఈ టి.ఝాన్సీరాణి, నీటిపారుదల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు పిన్నింటి అప్పలరాజు, సంఘం నాయకులు పీవీ రమణమూర్తి, వి.ఈ.దానం, బి.శ్రీరామ్, కేవీఎస్ రత్నమాల, వర్క్ ఛార్జ్‌డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. నీటి పారుదల శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతులు కల్పించి భర్తీ చేసినందుకు ఈఈకు కృతజ్ఞతలు తెలిపారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఈ పి.అప్పలనాయుడు, ఎన్జీవో సంఘం రాష్ట్ర నాయకుడు పి.అప్పలరాజు తదితరులు

## మాస్టర్ సీవీవీ యోగ మార్గంపై ప్రసంగం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: అక్కయ్యపాలెం పాత పోస్టాఫీసు వీధిలోని మాస్టర్ ఇ.కె.ఉచిత హోమియో వైద్యాలయంలో మాస్టర్ సీవీవీ డిసెంబరు కాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ప్రార్థనలు చేశారు. జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు పాల్గొని మాస్టర్ సి.వి.వి.యోగ మార్గంపై ప్రసంగం చేశారు. పీఠం సర్వీసెస్ డైరెక్టర్ సీహెచ్.సత్యదేవ్ సీవీవీ భౌగోళిక ప్రణాళిక గురించి వివరించారు. ఆయన చూపిన అడుగుజాడల్లో ప్రజలంతా నడవాలని సూచించారు. ఆర్.ఎస్.కృష్ణమూర్తి, ఎం.హనుమంతురావు, కె.శ్రీనివాస్ డిసెంబరు కాల్ ప్రాముఖ్యతను వివరించారు.

సీవీవీ చిత్రపటానికి హారతి సమర్పిస్తున్న జగద్గురు పీఠం సర్వీసెస్ డైరెక్టర్ సీహెచ్.సత్యదేవ్, భక్తులు

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

గురుద్వారా, న్యూస్‌టుడే: వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించి గమ్యానికి సురక్షితంగా చేరుకోవాలని సినీనటుడు ప్రసన్నకుమార్ అన్నారు. నాలుగో పట్టణ ట్రాఫిక్ పోలీసులు సోమవారం ట్రాఫిక్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని వాహనదారులకు శిరస్త్రాణంతో కలిగే మేలును వివరించారు. శిరస్త్రాణం ధరించి ప్రయాణిస్తున్న వారిని అభినందించారు. ట్రాఫిక్ ఎస్సై సుదర్శన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహన చోదకుడికి శిరస్త్రాణం అందిస్తున్న ప్రసన్నకుమార్, ఎస్సై సుదర్శన్‌రావు

దుర్గారమేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు

## విద్యతోనే ఉజ్వల భవిత

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమవుతుందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఎం.దుర్గా రమేష్‌కుమార్ అన్నారు. ఏవీఎన్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఆహ్వాన్ ఫెస్ట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏవీఎన్ కళాశాలలో చదువుకున్న వారు ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. అనంతరం ఆయన్ను కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు సత్కరించారు. సమావేశంలో ఏయూ విశ్రాంత ఆచార్యులు ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కృష్ణకుమారి, సీఐ వరప్రసాద్, సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన క్రీడా, సాంస్కృతిక పోటీలు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 11వ ద్విరాష్ట్ర క్రీడా, సాంస్కృతిక పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా గాజువాక ఎస్ఎఫ్ఎస్ పాఠశాల నిలువగా, రన్నరప్ ట్రోఫీని సీతమ్మధార పాఠశాల కైవసం చేసుకుంది. నిర్వాహకులు రెవరెండ్ ఫాదర్ మనోజ్, పాఠశాలల జనరల్ మేనేజర్ ఫాదర్ బి.సురేశ్‌బాబు, బైనడైట్ డిసోజా ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రీడాకారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజేత జట్టుతో నిర్వాహకులు ఫాదర్ మనోజ్, ఫాదర్ సురేశ్‌బాబు

**IN THE COURT OF THE HON'BLE III ADDL. DISTRICT And SESSIONS JUDGE-CUM-PRINCIPAL FAMILY COURT MEDCHAL-MALKAJGIRI DIST, AT: KUKATPALLY**
**F.C.O.P.No. 101736 of 2015**

Between:
Mangipudi Venkata Ramana ...Petitioner
And
Smt.M.K.A.Visalakshi ...Respondent
To
Smt. M.K.A.Visalakshi, W/o M.Venkata Ramana, R/o C/o Sri. A.S.N.Murthy, 15-11-1/A, Krishna Nagar, Maharanipet, Visakhapatnam, Andhra Pradesh.
The petitioner filed a petition U/Sec.13(1)(a) of Hindu Marriage Act to grant a decree of divorce against you by dissolving the marriage dated 29-05-2004 between the petitioner and you (respondent). You refused to receive the notices sent by the Hon'ble Court through court and RP on several occasions, hence this Hon'ble Court ordered to send the notice to you by way of publication in Eenadu daily newspaper in limits of Visakapathnam in order to serve the notice to you about your apperarance before the court.
Please take notice that the above F.C.O.P.No.101736/2015, is posted to 28-01-2026 for your appearance before the above said court on 10.30 A.M. failing which the court will pass appropriate orders against you in your absence according to law.
(BY ORDER OF THE COURT)
Sd/- SRI B.D.L.NIRMAL KUMAR,
K.Narashima Murthy, Advocates
Plot No.78/B, Picket, Secudnerabad-500026. Cell. No.7093445493 / 9666524402

(c) eenadu

# గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

## 'దర్పణం' ధ్వంసం

అండర్‌పాస్ మలుపు వద్ద ధ్వంసమైన దర్పణం

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ రైల్వే అండర్‌పాస్‌లో కుంభకార దర్పణం(కన్వెక్స్ మిర్రర్)ను గుర్తుతెలియని ఆకతాయిలు ధ్వంసం చేశారు. ఇటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులకు మలుపు తిరిగే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించేలా బ్రిడ్జికి ఇరువైపులా అద్దాలు ఏర్పాటు చేశారు. గత కొన్నిరోజుల క్రితం మిర్రర్‌ను బద్దలు కొట్టడంతో మలుపులో ఏ వాహనం వస్తుందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## సంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలోని ఆశీలుమెట్ట సంపత్ వినాయగర్ ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రభావతి, ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు టీఆర్ చోళన్ సమక్షంలో ఆలయ సిబ్బంది, శివజ్యోతి సేవా సమితి సభ్యులు 30 రోజుల ఆదాయాన్ని లెక్కించారు. 227 గ్రాముల వెండి, రూ.19,81,566 నగదు, రూ.111 చెక్కు, 83 యూఎస్ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 10 సౌదీ రియాల్స్ వచ్చాయి.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే

**సమస్య:** వడ్లపూడి సమీప తిరుమలనగర్‌లో రోడ్‌నెంబరు.4లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. – మణికుమార్, తిరుమలనగర్. **సమాధానం:** సంబంధిత సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ కిరణ్‌కుమార్, ఎ.ఎం.ఒ.హెచ్.

?: మేము కైలాస్‌నగర్‌లో ఉంటున్నాం. 301 జీవో కింద ఇళ్ల పట్టాలు ఎప్పుడు ఇస్తారు? –స్థానికుడు. ✔: ప్రస్తుతం అర్హులకు కన్వేయన్స్ డీడ్స్ అందజేస్తున్నాం. మీద దరఖాస్తు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, తహసీల్దార్, గాజువాక

గోపాలపట్నం, న్యూస్‌టుడే : ?: జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్‌లో తుప్పలు, డొంకలను తొలగించాలి. – రమేశ్, గౌరీనగర్ ✔: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: జీవీఎంసీ 89వ వార్డు గణపతినగర్‌లో వీధిదీపాలు వెలగడం లేదు. – సుందరరావు, గణపతినగర్ ✔: దీపాల మరమ్మతులు చేపడతాం. – గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు.

## ఎక్కలేక మెట్లు.. లబ్ధిదారుల పాట్లు..

మేడలపై సచివాలయాలకు వెళ్లలేక ఆపసోపాలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : వార్డు సచివాలయాలు ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ధ్రువపత్రాలు.. ఇలా 11 రకాల సేవలు సచివాలయాల్లో అందుతాయి. ఈ పనుల కోసం నిత్యం లబ్ధిదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇలాంటి సచివాలయాలు చాలాచోట్ల మేడలపైన ఉండటం వల్ల వృద్ధులు పైకి ఎక్కలేక ఇబ్బంది పడుతున్నారు. వీటిని కింద ఉంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 78 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో సుమారు 28 వరకు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా.. మిగిలినవి ప్రభుత్వ సామాజిక భవనాలు, మినీ కల్యాణ మండపాల్లో సచివాలయ కార్యకలాపాలు సాగుతున్నాయి.

చంద్రనగర్‌లో ఒకటో అంతస్తులో ఉన్న రెండు సచివాలయాలు

**ఆపసోపాలు..** : గోపాలపట్నంలోని నరసింహనగర్, రామకృష్ణనగర్, చంద్రానగర్, కాకానినగర్, విమాన్‌నగర్ సచివాలయాలు బహుళ అంతస్తు భవనాల్లో నడుస్తున్నాయి. బాపూజీనగర్, పాతగోపాలపట్నంలోని సామాజిక భవనాలపైన సచివాలయాలు ఉన్నాయి. ఇలా అనేక చోట్ల సచివాలయాలు మేడలపైన ఉంటున్నాయి. దీంతో సచివాలయాలకు వెళ్లే వృద్ధులు, వికలాంగులు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. పైఅంతస్తులో ఉండే సచివాలయాలకు ఇబ్బంది పడుతూ.. మెట్లు ఎక్కినా... పైకి వెళ్లాక కాసేపు కూర్చోడానికి కనీసం కుర్చీలు ఉండవు.

**ఎవరు ఏ సమయంలో..:** సచివాలయంలో పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు పనిచేస్తుంటారు. ఏదైనా పనిమీద లబ్ధిదారు కష్టపడి మెట్లు ఎక్కి పైకి వెళ్లగా.. సంబంధిత విభాగ ఉద్యోగి అందుబాటులో లేకపోతే ఉస్సూరుమంటూ వెనుదిరిగి రావాల్సిందే. సచివాలయం కింద ఉంటే పర్వాలేదని.. పైకి కష్టపడి ఎక్కాక సంబంధిత ఉద్యోగులు లేకపోతే కష్టంగా ఉంటోందని వృద్ధులు వాపోతున్నారు.

గోపాలపట్నంలోని రెండో అంతస్తులో ఉన్న రెండు సచివాలయాలు

**మరుగుదొడ్లు కరవు..:** అద్దె భవనాల్లో సచివాలయ ఉద్యోగులకు తప్పా లబ్ధిదారులను దృష్టిలో ఉంచుకొని మరుగుదొడ్ల సౌకర్యం కల్పించలేదు. పాతగోపాలపట్నం, బాపూజీనగర్‌లోని సామాజిక భవనంపైన అర్జీదారులతోపాటు ఉద్యోగులకు కూడా మరుగుదొడ్ల సౌకర్యం లేదు. దీంతో మహిళలు అవస్థలు పడుతున్నారు.

## ప్రతిభ చూపారు.. ప్రశంసలు పొందారు

'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

క్విజ్ పోటీలో పాల్గొన్న రవీంద్ర ఇండియన్ ఆంగ్ల మీడియం పాఠశాల విద్యార్థులు... విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల ప్రిన్సిపల్ పరశురామ్, తదితరులు

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో గాజువాక రవీంద్ర ఇండియన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. క్విజ్, నాలెడ్జ్ అంశంపై నిర్వహించిన పోటీల్లో 7, 8, 9వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన దుర్గాప్రసాద్, మౌనిష్ సాయి, ఆశిష్‌లకు పాఠశాల ప్రిన్సిపల్ పరశురామ్, ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

### పెదగంట్యాడలో...

పెదగంట్యాడ శరత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు నిర్వహించారు. క్విజ్, నాలెడ్జ్ అంశంపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో 7, 8, 9వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలైన ప్రణతి, మేఘన, అంజలిలకు పాఠశాల డైరెక్టర్ అక్కేన రాము, ఉపాధ్యాయుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

పోటీలో పాల్గొన్న శరత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు.. విజేతలతో పాఠశాల డైరెక్టర్ అక్కేన రాము, కరస్పాండెంట్ యోగవర్ధన్

## పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థులు కుర్చీలు అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. పాఠశాలలో 1989-90వ ఏడాది చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల అవసరాల నిమిత్తం 50 కుర్చీలను ఉచితంగా అందజేశారు. పాఠశాల హెచ్ఎం కాంతం వారిని అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంద్రాన నూకరాజు, కాండ్రేగుల రాంబాబు, ఎస్పీ నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాఠశాల హెచ్ఎం కాంతం

## మెగా రక్తదాన శిబిరం

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక దరి చినగంట్యాడలోని ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏఎస్ రాజా బ్లడ్‌బ్యాంక్, ఎంవీఆర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని వైద్యులు రాధారాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు రామారావు, బాలకృష్ణ, కృష్ణ, తేజేశ్వరరావు, ఈశ్వరరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

● **పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి**

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని గాజువాక నియోజకవర్గ భాజపా సమన్వయకర్త కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. సోమవారం గొర్రెవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో 'వీర్ బాల్ దివస్' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పిల్లలందరికి వీర్ బాల్ దివస్ ఉద్దేశం వివరించారు. పిల్లలకు అవసరమైన పుస్తక సామగ్రిని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, ఉషారాణి, నాయకులు రామస్వామి, నాయుడు పాల్గొన్నారు.

● **ఉక్కు నిర్వాసిత కాలనీల సమస్యలు పరిష్కరించండి**

అక్కిరెడ్డిపాలెం, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ఉక్కు నిర్వాసిత కాలనీల్లో గల సమస్యలు పరిష్కరించాలని సంఘ నాయకులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుని కోరారు. సోమవారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, కాలువలను అభివృద్ధి చేయాలని, నిర్వాసిత ఉద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. సంఘ ప్రతినిధులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకట రమణారెడ్డి, యెల్లేటి శ్రీనివాసరావు, మొల్లి రమణ, పిట్ట కుంచారావు, నాయకులు పాల్గొన్నారు.

● **వీధి దీపాలు ఏర్పాటు చేయండి**

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి, దేశపాత్రునిపాలెం, లంకెలపాలెం ప్రాంతాల పరిధిలో కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గర్గ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం అగనంపూడి జోనల్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. పెద్ద వార్డు అయినందున తగినన్ని దీపాలు లేక ప్రజలు రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

● **వైకుంఠ ఏకాదశికి వేళాయె..**

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనానికి గాజువాక పరిసర ప్రాంత వేంకటేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. షీలానగర్ వీఎస్ఈఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో, బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్నగిరిపై, బానోజీతోటలోని శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.

★ అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి శంఖవరం కాలనీలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఏర్పాట్లు పూర్తి చేశారు.

★ మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం నిర్వహించనున్న స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు సోమవారం తెలిపారు.

## ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా..!

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 62వ వార్డు నేవీ కల్యాణి ఆసుపత్రి నుంచి త్రినాథపురం వైపుగా వెళ్లే ప్రధాన సేవా రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌బాక్స్ తీగలు బయటకు కనిపిస్తున్నాయి. దీనికి సరైన రక్షణ చర్యలు తీసుకోలేదు. చేతికి అందే ఎత్తులోనే ఇవి ఉన్నాయి. ఈ సమీపంలోనే పాఠశాలలు ఉన్నాయి. నిత్యం విద్యార్థులు ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బయట కనిపించకుండా చూడాలని కోరుతున్నారు.

## అటూ.. ఇటూ 'తుక్కు'.. సన్నరోడ్డే దిక్కు..

సింధియా(ఇండస్ట్రియల్ కాలనీ), న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీలో ఎదురెదురుగానే తుక్కు దుకాణాల నిర్వహణ కొనసాగుతోంది. ఈ రెండు దుకాణాలు కూడా కాలనీ రోడ్డు కూడలి మలుపునకు సమీపాన నిర్వహిస్తున్నారు. నిత్యం దుకాణాల నుంచి తుక్కుని వ్యాన్లు, ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలిస్తుండటం వల్ల ఆ వీధిలోంచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఇలాగైతే రాకపోకలు ఎలా?

గోపాలపట్నం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 90వ వార్డు బాజీ కూడలి నుంచి జీవీఎంసీ 91వ వార్డు పాతగోపాలపట్నం వెళ్లే రోడ్డులోని రైల్వేఅండర్‌పాస్‌లో మురుగునీరు స్తంభించిపోతుంది. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు బ్రిడ్జిలో రోడ్డు శిథిలమైంది. గోతులు ఉండడంతో ఏదీ గొయ్యో.. ఏదీ రోడ్డో తెలియడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అండర్‌పాస్‌లో మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పాతగోపాలపట్నం అండర్‌పాస్‌లో నిలిచిన మురుగునీరు

## భారీ వాహనాలతో ఇక్కట్లు

సింధియా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 58వ వార్డు శివారు కంపెనీలకు వెళ్లే దారి మొత్తం భారీ వాహనాలను నిలిపేయడంతో రాకపోకలు సాగించడానికి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవలే షిప్పింగ్ సంస్థల పరిసరాల్లో గోతుల రహదారిని పోర్టు యాజమాన్యం నిర్మాణం చేపట్టి ఒకింత వెతలను తీర్చింది. అలాగే పక్కనే ఉన్న మరో రహదారి ఇప్పటికీ గుంతలుగా ఉండటం, అలాగే ఈ ఇరుకు దారిలోనే భారీ ట్రాలర్లను ఉంచడంతో రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

రహదారిలో నిలిపిన భారీ ట్రాలర్లు

## గాజువాకను మోడ్రన్ సిటీగా తీర్చిదిద్దాలి

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అధికారులతో కలిసి సోమవారం పలు వార్డుల్లో సమస్యలను తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేసి గాజువాకను మోడ్రన్ సిటీగా తయారు చేసేందుకు అధికారులు, నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్సీ శ్రీధర్, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, తెదేపా నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, రాయలబాబు, రాజు, శివ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ గంధం శ్రీను, ప్రసాదుల శ్రీనివాస్

### అభివృద్ధి పనులకు భూమిపూజ

అక్కిరెడ్డిపాలెం, గాజువాక: జీవీఎంసీ 71వ వార్డులోని పలు అభివృద్ధి పనులకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ రాజాన రామారావుతో కలిసి భూమిపూజ చేశారు. శిలా ఫలకం ఆవిష్కరించి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేపట్టారు. సుమారు రూ.3.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, ఈశ్వరరావు, రాజారావు, కనకారావు, శంకర్రావు, స్థానికులు పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యతకు కృషి

సింధియా (జవహర్‌నగర్), న్యూస్‌టుడే : జాతీయ సమైక్యతకు భంగం వాటిల్లకుండా అన్ని వర్గాలు సమభావనతో మెలగాలని సెయింట్ ఆన్స్ కాలేజీ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారిణి వై.అనూరాధ అన్నారు. ఈ మేరకు సోమవారం 61వ వార్డు ప్రకాశ్‌నగర్ ప్రైమరీ పాఠశాలలో చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం మానవ హారాన్ని నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ అంగన్‌వాడీలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారిణి ఈపీఎస్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

## జోనల్ కార్యాలయంతో సుపరిపాలన

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడిలో జోనల్ కార్యాలయం ఏర్పాటుతో నగర శివారు ప్రాంత ప్రజలకు సుపరిపాలన అందుతుందని జీవీఎంసీ 85వ వార్డు కూటమి నాయకులు పేర్కొన్నారు. సోమవారం పెదమడక కాలనీలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న జోనల్ కార్యాలయ భవనాన్ని సందర్శించారు. వివిధ విభాగాల ఏర్పాటు పనులను పరిశీలించారు. త్వరలోనే కార్యాలయం ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తామన్నారు. వార్డు తెదేపా అధ్యక్షుడు కర్రి దేవేంద్ర, జనసేన అధ్యక్షుడు గవర సోమశేఖరరావు, కూటమి నాయకులు కరణం సత్యారావు, పిండుల రాజు, డొక్కా రమేష్, కె.తాతారావు, శీరంశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయం వద్ద కూటమి నాయకులు

## వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్

ఉక్కునగరం (స్టీల్ సెక్టార్–3), న్యూస్‌టుడే : ఉక్కు ఉద్యోగులకు జీతాల బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎల్ఐసీ కూడలిలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సంఘ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గించినా మొక్కవోని దీక్షతో లక్ష్యాన్ని మించి ఉత్పత్తులు చేస్తున్నారన్నారు. యాజమాన్యం తక్షణమే ఉత్పత్తితో ముడిపెట్టి జీతాలు చెల్లించేందుకు విడుదల చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డొక్కా నరసింగరావు, జె.రామకృష్ణ, టి.ఎస్.ఎన్, చీకటి శ్రీనివాస్, ఇందల శివ, వెంకటేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న డి.ఆదినారాయణ

## బైక్ ర్యాలీ ప్రారంభం

మల్కాపురం, న్యూస్‌టుడే : నగరంలో ఈనెల 31 నుంచి జనవరి 4వ వరకు జరగనున్న 18వ అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని సిటూ మల్కాపురం జోన్ అధ్యక్షులు, కార్యదర్శి బీఎస్ఎన్ రాజు, ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ కూడలిలో బైక్ ర్యాలీని ఇరువురు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సిటూ నాయకులు శ్రీనివాసరావు, నరేష్, లక్ష్మీ, వాసు, ఏసుబాబు, భాస్కరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

63వ వార్డు కాకరలోవలో జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిటూ నాయకులు రాజు, లక్ష్మణమూర్తి

## క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అగనంపూడి, న్యూస్‌టుడే : గాజువాక మండలంలోని ప్రయివేటు పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో అగనంపూడి శ్రీ విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 12 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా క్రికెట్, చెస్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యనారాయణ, స్థానిక స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు కె.హనుమంతురావు, బి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## బాలల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భద్రతను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో బాలలకు సంబంధించిన అంశాలపై మండల సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జేసీ మయూర్ అశోక్, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం, పునరావాసం కోసం తగిన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ బాలికలకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు.

## ముగిసిన క్రీడా, సాంస్కృతిక పోటీలు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 11వ ద్విరాష్ట్ర క్రీడా, సాంస్కృతిక పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా గాజువాక ఎస్ఎఫ్ఎస్ పాఠశాల నిలువగా, రన్నరప్ ట్రోఫీని సీతమ్మధార పాఠశాల కైవసం చేసుకుంది. నిర్వాహకులు రెవరెండ్ ఫాదర్ మనోజ్, పాఠశాలల జనరల్ మేనేజర్ ఫాదర్ బి.సురేశ్‌బాబు, బైనడైట్ డిసోజా ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రీడాకారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజేత జట్టుతో నిర్వాహకులు ఫాదర్ మనోజ్, ఫాదర్ సురేశ్‌బాబు

## సెంటుస్థలం ఇళ్ల పరిశీలన

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 89, 90, 91, 92వ వార్డులకు సంబంధించిన పేదలకు గుల్లలపాలెంలోని లేఅవుట్‌లో సెంటుస్థలం కేటాయించారు. ఈ నేపథ్యంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సంబంధిత అధికారులతో కలిసి సోమవారం ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, రాష్ట్ర కళింగ సంక్షేమ డైరెక్టర్ పొన్నాడ రమణ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

లేఅవుట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

## ఇంకుడుగుంతలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న సంఘ సభ్యులు

గోపాలపట్నం(ఆర్.ఆర్.వి.పురం), న్యూస్‌టుడే: గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఇంకుడుగుంతలపై అవగాహన కల్పించారు. జీవీఎంసీ 92వ వార్డు నందమూరినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలని సంఘ సభ్యులు కోరడంతో భవన యజమాని స్పందించి ఇంకుడుగుంత నిర్మించారు.

## విద్యార్థులకు పుస్తక సామగ్రి పంపిణీ

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (ఉక్కునగరం) ద్వారా 10వ తరగతి చదువుతున్న కశింకోట బాలికల హాస్టల్ విద్యార్థులకు రూ. 50 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్ అందజేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎం.అప్పలరాజు తెలిపారు. దాతల సహకారంతో ఇప్పటికే అనేక పాఠశాలలకు పుస్తకాలు, బల్లలు, ఇతర సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

తీసుకున్న పుస్తకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## పోలీస్ శాఖకు 110 ఫిర్యాదులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 110 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించి బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి చట్టపరంగా విచారణ చేపట్టి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్టు సీపీ పేర్కొన్నారు.

## దువ్వాడలో నిలిచిన పూరి-తిరుపతి రైలు

ప్రయాణికుల అవస్థలు

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే : టాటా-ఎర్నాకుళం రైలు బోగీలు దగ్ధమవడంతో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు సోమవారం తెల్లవారుజామున 4.55కు వచ్చిన పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు సుమారు రెండున్నర గంటలపాటు మొదటి ప్లాట్‌ఫాంపై నిలిచిపోయింది. దీంతో విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్, ఈస్ట్‌కోస్ట్ రైళ్లు రెండో నెంబరు ప్లాట్‌ఫాం మీదకు వచ్చాయి. ఆ సమయంలో ప్రయాణికులు ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం నుంచి ఉరుకులు.. పరుగులు పెడుతూ రెండో నెంబరు మీదకు చేరుకున్నారు. కోచ్ ఇండికేటర్లు కూడా లేకపోవడంతో బోగీలు గుర్తించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూరి-తిరుపతి రైలు ఎప్పుడు బయల్దేరుతుందో సమాచారం లేకపోవడంతో ఆ రైలు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు కె.ఈశ్వర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ అంకితా మిశ్రా దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు 7.45కు పూరి-తిరుపతి రైలు కదిలింది.

(c) eenadu

# కిల్తంపాలెంలో చెరువుల కబ్జా!!

ఆక్రమణలు తొలగించాలని కోరుతున్న సమితి నాయకులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఎస్.కోట మండలం కిల్తంపాలెంలో ఏడు చెరువులు ఆక్రమణకు గురయ్యాయని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం విజయనగరంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక కార్యదర్శి, వీఆర్వో, సర్వేయర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా.. స్పందించకపోవడం తగదన్నారు. ఎం.తిరుపతిరావు, అల్లు సత్యం తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు సౌకర్యాలేవీ?

జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థికసాయంతో పాటు దివ్యాంగ క్రీడాకారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందేలా చూడాలని పారా క్రీడల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కె.దయానంద్, అంతర్జాతీయ క్రీడాకారుడు యాళ్ల సత్తిబాబు కలెక్టర్ రాంసుందర్‌రెడ్డిని కోరారు.

### 232 అర్జీల రాక..

కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు వినతులు పోటెత్తాయి. రెవెన్యూశాఖకు అత్యధికంగా 136 అందాయి. పంచాయతీరాజ్- 26, పోలీసు- 10, ప్రజారోగ్యం- 10, పురపాలక- 09, మిగిలిన శాఖలకు కొన్ని వచ్చాయి. కలెక్టర్‌తో పాటు డీఆర్వో మురళి, ప్రత్యేక ఉపకలెక్టర్లు పాల్గొన్నారు.

# అంజలిని ఆదుకోండి.. కార్తిక్‌ను కాపాడండి

కలెక్టరేట్ వద్ద చిన్నారులతో తల్లులు

రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు వారివి. మరోవైపు పిల్లలు పుట్టుకతోనే వైకల్యం కారణంగా మంచానికే పరిమితమవడంతో మరింత కష్టాల్లోకి వెళ్లిపోయారు. దీనికి తోడు అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. వారి ఆలనా, పాలనా చూసేందుకు తల్లిదండ్రులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం నెలకు రూ.6 వేల చొప్పున పింఛను ఇస్తున్నా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే పూసపాటిరేగ మండలం రెల్లివలసకు చెందిన లింగాల అంజలి, డి.కార్తిక్ దివ్యాంగులు. అంజలికి తండ్రి లేకపోవడంతో తాను కూలి పనులకు వెళ్తూ చిన్నారిని చూసుకుంటున్నానని తల్లి రామ వాపోయారు. మూర్ఛ, థైరాయిడ్, ఇతర సమస్యలున్నాయన్నారు. ఏం తిన్నా ఊపిరితిత్తుల్లో ఇబ్బంది ఏర్పడుతోందని కార్తిక్ తల్లి రామయ్యమ్మ బోరుమన్నారు. సోమవారం కలెక్టర్ రాంసుందర్‌రెడ్డిని కలిసి అదనపు సాయం అందించాలని కోరారు. – న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

# కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఎరువుల విషయంలో కృత్రిమ కొరత సృష్టిస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి హెచ్చరించారు. అవసరమైన సరకు అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువులు, ధాన్యం కొనుగోలు, పీజీఆర్ఎస్ వినతులు, గృహప్రవేశాలు, పదోతరగతి వందరోజుల ప్రణాళికపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని బుధవారం నాటికి కొనుగోలు చేయాలని ఆదేశించారు. వినతుల పరిష్కారంపై అర్జీదారుల సంతృప్తి పెరగాలన్నారు. పదో తరగతిలో శతశాతం ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. డీఆర్వో మురళి, వ్యవసాయాధికారి వి.టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పింఛనుదారులకు లైఫ్ సర్టిఫికెట్ తప్పనిసరి

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: పింఛనుదారులంతా వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఖజానా శాఖ జిల్లా అధికారి వి.నాగమహేష్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ ఏడాది ఇచ్చినవి 2026 సంవత్సరానికి చెల్లుబాటు కావన్నారు. అవసరమైన పత్రాలు, పీపీవో నంబర్లు, ఆధార్, బ్యాంకు ఖాతా.. తదితర వివరాలతో రావాలన్నారు.

# ఈనాడు విజయనగరం



# గిరి ప్రదక్షిణకు వేళాయె!

నేటి ఉత్సవానికి ముస్తాబైన రామతీర్థం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసి, ఆస్థాన మండపం, ముఖ ద్వారం, ఉత్తర ద్వారం పూలతో అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనాలు కల్పిస్తారు. 8 గంటలకు మెట్లోత్సవం, గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుంది. అనంతరం అన్నసమారాధన ఉంటుందని ఈవో వై.శ్రీనివాసరావు కోరారు. ★ గిరి ప్రదక్షిణకు భక్తులు తరలిరావాలని సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ పిలుపునిచ్చారు. గిరిప్రదక్షిణ మార్గాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సేవా పరిషత్ వ్యవస్థాపకుడు జ్యోతిప్రసాద్, స్వామిజీలు పాల్గొన్నారు.

పూలతో అలంకరించిన స్వామివారి ఆస్థాన మండపం

# కాసులున్నా.. పారేది కన్నీరే..?

జైకా బిల్లులు లేక గుత్తేదారుల వెనకడుగు

జిల్లాలో జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ(జైకా) ఆర్థిక సాయంతో సాగునీటి వనరుల ఆధునికీకరణ పనులు అయిదేళ్లుగా నానుతున్నాయి. దీంతో రూ.వందల కోట్లు అందుబాటులో ఉన్నా.. పనుల్లో కదలిక లేదు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో బిల్లుల చెల్లింపు కాలేదు. ఏళ్లు గడిచిపోవడంతో సామగ్రి ధర పెరిగి అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఆ నిధులతో పనులు చేయాలంటే నష్టపోతామని గుత్తేదారు ముందుకు రావడం లేదు. మన్యంలో నాలుగు మధ్యతరహా సాగునీటి పథకాలు నాలుగు రకాలుగా నలుగుతున్నాయి. వీటి భవిత ఏమిటో, రైతన్నకు సాగునీరు అందేదెన్నడో తెలియని దుస్థితి. – న్యూస్‌టుడే, పార్వతీపురం

### చెల్లింపులే లేవు...

పెద్దగెడ్డ జలాశయం ఆధునికీకరణ పనులు 2020-21లో రూ.28.18 కోట్లతో చేపట్టారు. 10 శాతం పనులు చేసి ఆపేశారు. గుత్తేదారుకు బిల్లులు చెల్లించలేదు. నిధులిస్తే పనులు పునఃప్రారంభం అయ్యే అవకాశం ఉంది. రూ.1.12 కోట్ల బకాయి ఇంకా అపరిష్కృతంగా ఉంది.

### వెంగళరాయ ఒడ్డుకు చేరినట్లేనా?

మక్కువ, సీతానగరం, బొబ్బిలి మండలాలకు సాగునీరు అందించే వెంగళరాయసాగర్ జలాశయం ఆధునికీకరణ పనులను రూ.63.50 కోట్లతో ప్రారంభించారు. 22 శాతం పూర్తిచేశారు. గుత్తేదారుకు చెల్లించాల్సిన రూ.8.24 కోట్ల బకాయి ఇటీవలే ఇచ్చారు. పనులు మాత్రం ఇంకా పునః ప్రారంభించలేదు.

అసంపూర్తిగా పెద్దగెడ్డ కాలువ లైనింగు పనులు

### ఒట్టిగెడ్డ బిల్లు ఇవ్వనేలేదు

జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు సాగునీరు అందించే ఒట్టిగెడ్డ జలాశయ పథకానికి రూ.44.85 కోట్లు మంజూరయ్యాయి. 15 శాతం పనులు చేశారు. బిల్లులు ఇంకా సమర్పణ దశలోనే ఉన్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే తప్పా చెల్లింపులు జరుగుతాయా? లేదా? అనేది ప్రశ్నార్థకమే. రూ.50 లక్షల బిల్లుల అప్‌లోడ్ ప్రక్రియలో అధికారులు తాత్సారం చేస్తున్నారు.

### పెదంకలాం ఎప్పుడో..

పెదంకలాం ఆనకట్ట ఆధునికీకరణకు రూ.17.30 కోట్లు కేటాయించారు. కేవలం అయిదు శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. తక్కువ మొత్తం కావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.50 లక్షల లోపు బిల్లు కావడంతో గుత్తేదారుకు చెల్లించింది. కానీ అయిదేళ్ల క్రితం నాటి అంచనాలతో ఇప్పుడు పనులు చేయలేమని గుత్తేదారు అంటున్నారు.

### కమీషన్లే కారణమా?

కూటమి వచ్చిన తర్వాత రూ.50 లక్షల లోపు బిల్లులను చెల్లించింది. ఆపై మొత్తానికి సంబంధించి అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేసినా.. రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోంది. దగ్గరుండి ఎంతో కొంత పనులు చేయించామంటూ నాయకులు గుత్తేదారు నుంచి కమీషన్ ఆశిస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల మధ్య బిల్లులు రానట్లు ఆరోపణలున్నాయి.

### గుత్తేదారులను కోరుతున్నాం

పనులు చేపట్టాలని గుత్తేదారులను కోరుతున్నాం. పనులు పూర్తిచేయడానికి ఇది అనువైన కాలం. చెల్లింపులు కూడా జరుగుతున్నాయి. – ప్రదీప్, ఈఈ

రైతేరాజు 6లో

## అర్హుల జాబితా విడుదల

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరంలోని ప్రభుత్వ మహారాజా ఆసుపత్రి, వైద్య కళాశాలలో వివిధ ఉద్యోగాల భర్తీకి సంబంధించి దరఖాస్తు చేసిన వారిలో అర్హుల వివరాలను http://vizianagaram.nic.in, gmcvizianagaram.ap.gov.in వెబ్‌సైట్లలో పొందుపర్చినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.కె.పద్మలీల అన్నారు. అభ్యంతరాలుంటే ఈనెల 30, 31వ తేదీల్లో లేఖ పూర్వకంగా తెలియజేయాల్సిన్నారు.

## ఏడు రోజుల్లో పరిష్కారం

వినతులు పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించి, వారం రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ దామోదర్ అన్నారు. సోమవారం విజయనగరంలోని పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. భూతగాదాలపై 8, కుటుంబ కలహాలపై 3, ఇతర సమస్యలపై 8 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

# పోస్టుపై కన్నేసి పక్కాగా ప్లాన్ చేసి!

ఉద్యోగిని టార్గెట్ చేస్తూ మెమోలు

– ఈనాడు, విజయనగరం

ఏ ప్రభుత్వ శాఖలోనైనా విధి నిర్వహణలో అధికారి తప్పు చేస్తే ఉన్నతాధికారులు ఆయనను సెలవుపై వెళ్లమంటారు. ఆపై విచారణ జరిపి, అందిన నివేదికపై ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తారు. ఆరోపణలు రుజువు కాకుండానే జిల్లాలోని ఓ అధికారిని సెలవుపై వెళ్లమని ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. అనధికారికంగా శిక్ష విధించే ప్రయత్నం చేయడం జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

జిల్లా ట్రెజరీ కార్యాలయం నుంచి పదోన్నతిపై బొబ్బిలి సబ్ ట్రెజరీ అధికారిగా పద్మనాభం 2025 ఏప్రిల్ 2న చేరారు. ఇక్కడి అక్రమాలపై ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ పోస్టుపై కన్నేసిన ఇద్దరు ట్రెజరీ అధికారులు పద్మనాభంను ఎలాగైనా తప్పించి ఆ పోస్టులో నియామకానికి పావులు కదుపుతున్నారు. ఆయనపై తరచూ ఫిర్యాదులు చేయిస్తున్నారు. వాటిపై తొమ్మిది నెలల్లో ఏడు మెమోలు ఉన్నతాధికారుల నుంచి అందుకున్నారు. రెండు సార్లు విచారణ ఎదుర్కొన్నారు. ఈ ట్రెజరీ పరిధిలో కొందరు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు రెండు పింఛన్లు అందుకుంటున్నారు. రూ.18 లక్షలకు పైగా ప్రభుత్వ ఖజానాను పక్కదారి పట్టించారు. జిల్లాలో ఇలాంటి వాటిపై ఉన్నతాధికారులకు ఎస్టీవో పది రోజులకో ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో కార్యాలయాన్నే ఆయన నివాసానికి వాడుకుంటున్నారని ఆయనపై కొందరు ఫిర్యాదు చేయించారు.

### నకిలీ సంతకాలతో నగదు కాజేయాలని..

గిరిజన వీఆర్వో ఒకరు మృతి చెందడంతో, ఆ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక లబ్ధిపై బొబ్బిలి రెవెన్యూ ఉద్యోగిని ఒకరు కన్నేశారు. భార్య, ముగ్గురు పిల్లలు నిరక్షరాస్యులు కావడంతో వారి నుంచి బ్యాంకు పాస్ పుస్తకాలు, ఏటీఎం కార్డులన్నీ తీసుకుపోయారు. వారి వేలిముద్రలు, నకిలీ సంతకాలతో సబ్ ట్రెజరీ కార్యాలయంలో దరఖాస్తు కూడా చేశారు. వీఆర్వో పిల్లలు, ఒక న్యాయవాదితో ఆరా తీయించగా అసలు విషయం బయటపడింది. దీంతో సెలవుపై వెళ్లాలని భర్తపై ఒత్తిడి తెచ్చారని, దర్యాప్తు చేయాలని ఎస్పీ గ్రీవెన్స్‌లో ఎస్టీవో భార్య సోమవారం ఫిర్యాదు చేశారు. వీటిపై జిల్లా ట్రెజరీ శాఖ డీడీ నాగమహేష్ వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా బొబ్బిలి ఎస్టీవోపై ఫిర్యాదులు అందాయన్నారు. పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. రెండు పింఛన్ల వ్యవహారంలో రికవరీకి చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వో కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు.

2025-2026 Batch
B.Ed, M.Ed, సీట్లు కలవు
Last Chance, 1st sem Exams జనవరి
Cont: 8106729941

# వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

జిల్లాలో ఉన్న పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలోని తితిదే, శివాలయంవీధిలోని పైడితల్లి దత్తతాలయం, బాలాజీనగర్, అలకానందకాలనీ, దుప్పాడ శ్రీక్షేత్రంలో సర్వం సిద్ధం చేశారు. వేకువజామున 3 గంటలకు మేలుకొలుపు సేవ, ధనుర్మాస గోష్ఠి చేపడతారు. అనంతరం ఉత్తర ద్వార దర్శనాలుంటాయి. రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని కోనేరును పూలతో అందంగా తీర్చిదిద్దారు. – న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

పూలతో ఆలయంలోని కోనేరు (అంతర చిత్రం) వేంకటేశ్వరుడు, అమ్మవార్లు

# చేనేతకు చేయూత కరవు..!

న్యూస్‌టుడే– గరివిడి, గుర్ల

జిల్లాలో చేనేతకు చేయూత కొరవడుతోంది. నష్టమైనా, కష్టమైనా నేత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది. వస్త్ర ప్రపంచంలోకి బహుళజాతి సంస్థల రాకతో చేనేతకు కష్టకాలం దాపురించింది. ఒర్పు, నేర్పుతో కష్టాలను అధిగమించి తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్న నేతన్నలు ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఎన్నికలకు ముందు నేతన్నలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించి ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇంతవరకు అమలు కాలేదు. ప్రభుత్వ సాయం లేక, నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక, వచ్చే నష్టాలు భరించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని నేతన్నల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

జిల్లాలో చేనేత కుటుంబాల వివరాలు..

గుర్తింపు పొందినవి: 2,500

మగ్గం కలిగినవి: 1,500

మాస్టర్ వీవర్స్ దగ్గర పనిచేస్తున్న కార్మికులు: 1000 మంది

ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడినవారు: సుమారు 9 వేలు

### అందని ఉచిత విద్యుత్తు..

జిల్లాలో కోటగండ్రేడు, కొట్టక్కి, బొద్దాం, రాజాం, పెనుబాక సహకార సంఘాల్లో చేనేత వృత్తిని నమ్ముకుని వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మర మగ్గాలకు నెలకు 500 యూనిట్లు, సాధారణ మగ్గాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జీవో అమలు చేయాలని ముఖ్యమంత్రి చెప్పినా విద్యుత్తు శాఖ నుంచి స్పందన లేదు. ప్రస్తుతం సాధారణ మగ్గాలకు 100 యూనిట్ల వరకే ఉచిత విద్యుత్తు అందుతోంది.

### ఇవీ ప్రధాన సమస్యలు..

ఇటీవల తుపానుల సమయంలో ఇచ్చిన నిత్యావసరాలు కొన్ని కుటుంబాలకు అందలేదు. ★ ఆప్కో ద్వారా సహకార సంఘాలకు నూలు ఇవ్వకపోవడంతో కార్మికులపై భారం పడుతోంది. గతంలో ఆప్కో ద్వారా బేలు రూ.26 వేలకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.30 వేలకు కొంటున్నారు. ★ సహకార సంఘాలకు ఆప్కో నుంచి ప్రస్తుతం రూ.1.50 కోట్లు బకాయిలు అందాల్సి ఉంది.

### బకాయిలు అందేలా చూస్తాం..

చేనేత కార్మికులకు నేతన్న నేస్తం, విద్యుత్తు రాయితీలు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అమలు చేస్తాం. మగ్గం ఉన్న వారికే నిత్యావసర సరకులు అందించాం. సహకార సంఘాలకు ఆప్కో నుంచి చెల్లించాల్సిన బకాయిలు అందేలా చూస్తాం. – మురళి, ఏడీ, చేనేత జౌళిశాఖ, విజయనగరం

# గోగు సాగు.. రైతుల వెనకడుగు

న్యూస్‌టుడే– బొబ్బిలి

గిట్టుబాటు ధర లేక ఉమ్మడి జిల్లాలో గోగు సాగు ఏటేటా పూర్తిగా పడిపోతోంది. సాగు ఖర్చు ఎక్కువ రాబడి తక్కువ అవుతుండడంతో రైతులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ముడిసరకు కొరతతో దాదాపు జూట్ పరిశ్రమలు మూతపడ్డాయి. ముడిసరకు లేకపోవడం, దూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవడం భారంగా మారడంతో యాజమానులు మూసివేశారు. సాగు పెంచేందుకు జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ) ప్రణాళికలు రూపొందించడం లేదు. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి పంటకు కూడా మద్దతు ధర అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కొనుగోళ్లు లేని బొబ్బిలిలో జేసీఐ కార్యాలయం

గిట్టుబాటు ధర, ప్రోత్సాహకాలు అందక అవస్థలు

దాదాపు మూతపడిన జూట్ పరిశ్రమలు

### ప్రకటనలకే పరిమితం..

పార్వతీపురం రీజియన్‌లో అయిదేళ్ల కిందట 5 వేల ఎకరాల్లో పంట ఉండేది. రానురానూ కనుమరుగవుతోంది. ఎకరాకు సాగు ఖర్చులు రూ.20 వేలు కాగా.. పంట విక్రయించగా రూ.15 వేలు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో మిడిల్ రకం ఎక్కువగా పండుతోంది. క్వింటా రూ.3860గా ఉంది. జేసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మధ్యవర్తులు క్వింటా వద్ద రూ.200లు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. జేసీఐ తగు రాయితీలు కల్పించడం లేదు. ప్రోత్సహించేందుకు రెట్టింగు ట్యాంకులు, నాణ్యమైన విత్తనాలు, నారను వేరుచేసే యంత్రాలు అందజేస్తామని గతంలో ప్రకటనలకే పరిమితమయ్యాయి. రూ.కోట్లు ఖర్చుచేసి జూట్ టెక్నాలజీ మిషన్లు పార్వతీపురం, బొబ్బిలిలో ఏర్పాటు చేసినా.. వాటి సేవలు రైతులకు చేరువ కావడంలేదు.

| ఏడాది | సాగువిస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|
| 2022–23 | 1800 |
| 2023–24 | 1490 |
| 2024–25 | 1200 |
| 2025–26 | 1000 |

### ప్రణాళికలు రూపొందించాం..

సాగు విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం. ఆమదాలవలస నైర్ పరిశోధన కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకున్నాం. నాణ్యమైన విత్తనాలతోపాటు ఊరవేసేందుకు పౌడర్, ఇతర యంత్రాలు సరఫరా చేస్తాం. జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వం 'ఐ కేర్' పథకాన్ని అమలు చేయనుంది. దీంతో రైతులకు రాయితీలు అందుతాయి. – ఆర్.అరుణ్, ప్రాంతీయ ప్రబంధకుడు, జేసీఐ

● ఉమ్మడి జిల్లాలోని జూట్ పరిశ్రమలు: 17 ● ప్రస్తుతం పనిచేస్తున్నవి: నెల్లిమర్ల, రాజాంలో ఒక్కొక్కటి

# తుది దశకు ఆర్వోబీ పనులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: విజయనగరం- పాలకొండ రోడ్డులో చీపురుపల్లి వద్ద ఆర్వోబీ పనులు తుది దశకు చేరుకున్నాయి. వాహనాల రాకపోకలకు సిద్ధం చేస్తున్నారు. గతంలో ఆర్వోబీ శిథిలావస్థకు చేరుకోవడంతో నాలుగేళ్లుగా భారీ వాహనాల రాకపోకలను నిలిపేశారు. 30 నెలలుగా వంతెన పనులు చేపడుతున్నారు. విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, రాజాం, పాలకొండ, ఒడిశా ప్రాంతాలకు వెళ్లాల్సిన లారీలు, బస్సులు సైతం గరివిడి, గర్భాం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. పనులు కీలకదశకు చేరుకున్నాయి. వంతెనకు రెండువైపులా తారు రోడ్డు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. పాదచారుల మార్గంలో టైల్స్ వేస్తున్నారు. దీపాల ఏర్పాటుకు స్తంభాలు సిద్ధం చేస్తున్నారు. జనవరి 10 నాటికి వంతెన మీదుగా రాకపోకలకు వీలు కల్పించే అవకాశం ఉందని గుత్తేదారు ప్రతినిధులు చెబుతున్నారు.

ఆర్వోబీ వద్ద తారు రోడ్డు నిర్మాణ పనులు

(c) eenadu

# నేడే ఈఎస్ఎల్ తుది సమరం

## హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్స్

– న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)- 2025 క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. సోమవారం విజయనగరంలోని విజ్జీ మైదానంలో జరిగిన సెమీస్‌లో మిరాకిల్- ఎంవీజీఆర్, అవంతీస్- జీసీఎస్ఆర్ జట్ల మధ్య జరిగిన పోరు ఆసక్తికరంగా సాగింది. అంతకుముందు శ్రీహాస్పిటల్ ఎండీ డాక్టర్ జీవీఎన్.భూపతి టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీజ్‌లోకి అడుగు పెట్టిన క్రీడాకారుల్లో బ్యాటర్లతో పాటు బౌలర్లూ మెరుగ్గా రాణించారు. రెండు మ్యాచ్‌లలో తక్కువ స్కోర్లే నమోదైనా ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. ఇప్పటివరకు ఈ టోర్నమెంట్‌లో 225 ఫోర్లు, 94 సిక్సర్లు నమోదయ్యాయి. నేడు జూనియర్, సీనియర్ ఫైనల్స్‌తో పాటు బాలికల విభాగంలో సత్య డిగ్రీ కళాశాల(విజయనగరం), సీతం ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య తుది సమరం సాగనుంది.

టాస్ వేస్తున్న శ్రీహాస్పిటల్ అధినేత డాక్టర్ జీవీఎన్.భూపతి

SUKHIBHAVA Hospitals CARING FOR LIVES 17-15-90, Jonnaguddi Road, Beside Reliance Mall, BALAJI JUNCTION, VIZIANAGARAM AP 535002 Contact : 7901224433

స్టంపింగ్ మిస్..


Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 974 999 3483 | www.ggu.edu.in
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Organised by: ఈనాడు క్రికెట్


**30.12.2025 నేడు**

**జూనియర్ విభాగంలో..**
★ ఉదయం 8.30 గంటలకు: శ్రీ చైతన్య జూనియర్ కళాశాల (విజయనగరం) V/s జీ.సి.ఎస్.ఆర్. జూనియర్ కళాశాల (రాజాం)

**సీనియర్ విభాగంలో..**
★ ఉదయం 11.00 గంటలకు: ఎం.వి.జీ.ఆర్. ఇంజినీరింగ్ కళాశాల (విజయనగరం) V/s అవంతీస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ అకాడమీ (భోగాపురం)

**బాలికల విభాగంలో..**
★ ఉదయం 9.30 గంటలకు: సత్య డిగ్రీ కళాశాల (విజయనగరం) V/s సీతం ఇంజినీరింగ్ కళాశాల (గాజులరేగ)

### ఎంవీజీఆర్‌దే పైచేయి..

విజ్జీలో జరిగిన తొలి సెమీస్‌లో మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల(భోగాపురం), ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల(విజయనగరం) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎంవీజీఆర్ ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. దీంతో బరిలోకి దిగిన మిరాకిల్ క్రీడాకారులు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేశారు. పి.సతీష్ 21 బంతుల్లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 28, బి.ప్రశాంత్ 25 బంతులకు మూడు ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 37 పరుగులతో రాణించారు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన ఎంవీజీఆర్ 8 బంతులు మిగిలి ఉండగానే కేవలం 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ సాయికృష్ణ 25 బంతుల్లో రెండు భారీ సిక్సర్లతో 33 పరుగులు చేసి, జట్టును ఫైనల్‌కు చేర్చాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అతడికి కె.దేవుడు(23), వై.వర్షిక్(18) తమ వంతు సహకారం అందించడంతో విజయం సునాయాసమైంది.

### ఫైనల్స్‌కు అవంతీస్..

రెండో మ్యాచ్‌లో జీసీఎస్ఆర్ కళాశాల(జీఎంఆర్- రాజాం), అవంతీస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ అకాడమీ (భోగాపురం) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అవంతీస్ బ్యాటింగ్ ఎంచుకుంది. జీసీఎస్ఆర్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసింది. మహేష్(16), వాసు(14) మాత్రమే రాణించారు. అవంతీస్ క్రీడాకారులు 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని(72 పరుగులు) ఛేదించారు. ఎ.మన్మథరావు 33 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

**ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వీరే**

సీహెచ్.సాయికృష్ణ

ఎ.మన్మథరావు

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఎస్పీ

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 31న రాత్రి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత రహదారులపై తిరగొద్దని, ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో ఉండాలని సూచించారు.

**● వేగంగా వెళ్తే వాహనం సీజ్..**

జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్య కూడళ్లు, పట్టణాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో దాడులు చేపడతామన్నారు. వాహనాలతో వేగంగా వెళ్లినా, మద్యం తాగి నడిపినా, బైక్ రేసులు నిర్వహించినా, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ తదితర విషయాల్లో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వాహనాలను సీజ్ చేస్తామని చెప్పారు.

**● ఇబ్బంది కలిగించొద్దు..**

నివాస స్థలాల మధ్య, బహిరంగ ప్రదేశాల్లో కేకలు వేయడం, న్యూసెన్సు చేయడం, రంగులు పూయడం, డీజే/లౌడ్ స్పీకర్ల ఏర్పాటు, బాణసంచా కాల్చడం, గుమిగూడడం చేస్తే కేసులు పెడతామన్నారు. నిర్ణీత సమయంలోనే మద్యం దుకాణదారులు అమ్మకాలు చేపట్టాలన్నారు.

## నేడు మత్స్యకార సహకార సంఘం పాలక మండలి ఎన్నిక

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా మత్స్యకార సహకార సంఘం పాలక మండలి ఎన్నికలకు రంగం సిద్ధమైంది. విజయనగరంలోని ఆక్వాల్యాబ్‌లో మంగళవారం సాయంత్రం చేతులెత్తే పద్ధతిలో ప్రక్రియ జరగనుందని ఎన్నికల అధికారి ఎంఎస్ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఉన్న 66 మంది సహకార సంఘాల అధ్యక్షులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, 11 మందిని డైరెక్టర్లుగా ఎన్నుకుంటారన్నారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షుడి ఎంపిక సాగుతుందన్నారు. ఉదయం నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలు రూ.100, బీసీలు రూ.200, ఇతర వర్గాల వారు రూ.400 రుసుము చెల్లించాలని స్పష్టం చేశారు.

## కాఫీ పంటల పరిశీలన

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలంలోని గిరిశిఖర గ్రామాలైన సతాబి, తంగలాం రైతులు సాగు చేస్తున్న కాఫీ తోటలను జీసీసీ డీఎం జె.రామారావు ఆదేశాల మేరకు సాలూరు జీసీసీ ప్రబంధకుడు సీహెచ్.రాములు, సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి తోటలను పరిశీలించారు. సాగు విస్తీర్ణం, రైతు ఆధార్, బ్యాంకు ఖాతా తదితర వివరాలు సేకరించారు. గింజ నాణ్యత బట్టి ధర నిర్ణయించి జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా నిచ్చారు.

**చికెన్ ధరలు**

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 150 | 270 | 280 |

# రేణుకమ్మా.. ఇదేం పనమ్మా!

## గంజాయి స్మగ్లర్‌గా అవతారం ఎత్తిన గ్రామీణ యువతి

ఈనాడు, విజయనగరం: సామాన్య రైతు కుటుంబంలో పుట్టింది. చిన్న వయసులోనే నేరాలకు పాల్పడింది. చివరకు గంజాయి స్మగ్లర్‌గా అవతారమెత్తింది సంతకవిటి మండలం మోదుగులపేటకు చెందిన గడే రేణుక. ఏం చదివిందో ఎవరికీ తెలియదు. పదిహేడేళ్ల వయసులోనే దొంగతనాలకు పాల్పడి.. అది వెలుగులోకి రావడానికి కారణమైన కుటుంబానికి చెందిన చిన్నారిని హత్య చేసిన కేసులో ఇరుక్కుంది. ఆ తర్వాత రూటు మార్చింది. జల్సాలకు అలవాటు పడి గాడి తప్పింది. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలతో ఆమెపై నాలుగు కేసులు నమోదవడంతో వాటిని ఎదుర్కొంటోంది. తాజాగా అనకాపల్లి జిల్లా నాతవరం పోలీసులకు చిక్కిన ముఠాలో కీలక నిందితురాలిగా ఉంది. ప్రస్తుతం విశాఖ కేంద్ర కారాగారంలో ఊచలు లెక్కేస్తోంది.

### చిన్నారిని చంపేసి..

నిందితురాలి వ్యవహారంపై గ్రామస్థులను కదిపినపుడు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా గ్రామీణ మహిళలు పొలం పనులకు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలను ఇంట్లోని బాక్స్‌ల్లో భద్రపరుస్తారు. ఒకామె ఇలానే చేసి పొలానికి వెళ్లింది. ఎవరూ లేని సమయంలో రేణుక ఆ ఇంట్లోకి ప్రవేశించి కాజేసింది. ఆ ఇంటికి ఎదురుగా ఉన్న మహిళ కంటపడింది. బాధితురాలు పొలం నుంచి ఇంటికొచ్చి చూడగా బంగారం కనిపించకపోవడంతో బోరుమంది. రేణుక లోపలికి వెళ్లినట్లు ఎదురింటి మహిళ చెప్పడంతో విషయం తెలిసింది. దీంతో కక్ష పెంచుకుని సాక్ష్యం చెప్పిన మహిళ ఏకైక కుమారుడి పీక నులిమి ఆ ఇంటి మేడపై పడేసింది. తర్వాత బిడ్డ మృతదేహాన్ని గుర్తించిన ఆ కుటుంబ సభ్యులు, అప్పటికి మైనర్ అయిన నిందితురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత బంధువులతో కలిసి కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది. తాత్కాలిక ఉపశమనం లభించడంతో రాజమహేంద్రవరంలో ఉంటున్న సోదరుడి ఇంటికి వలస వెళ్లింది.

### ఉద్యోగం చేస్తున్నట్లు నటించి..

అక్కడి నుంచి బెంగళూరుకు మకాం మార్చి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నానని గ్రామస్థులకు చెప్పేది. బీటెక్ ఎక్కడ చదివిందో తమకు తెలియదని, తల్లిదండ్రులు గ్రామంలో ఉన్నా పదేళ్ల నుంచి రాలేదని స్థానికులు చెబుతున్నారు. సాలూరులో గంజాయి అక్రమ రవాణాతో ఒకసారి చిక్కినట్లు తమకు తెలిసిందన్నారు.

### విదేశాలకు రవాణా..

ఏజెన్సీలో కొనుగోలు చేసిన గంజాయి తరలింపు ముఠాలో కొంత కాలంగా చురుగ్గా పనిచేస్తున్నట్లు తెలిసింది. తమిళనాడుకు చెందిన ఇద్దరు, అల్లూరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన మరొకొందరితో జట్టు కట్టింది. వీరిలో ఇద్దరు మహిళలున్నారు. రైలు, రోడ్ల మార్గాల్లో సరకును చెన్నై చేర్చేవారు. అక్కడ తీరం నుంచి సముద్ర మార్గంలో శ్రీలంకకు చెందిన స్మగ్లర్లకు విక్రయించేవారు. తమ వద్దకు బోట్లలో వచ్చి తీసుకెళ్తారని నాతవరం పోలీసుల విచారణలో రేణుక వెల్లడించినట్లు సమాచారం. బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదులుకొని గంజాయి రవాణా చేయడం మొదలెట్టినట్లు విచారణలో అంగీకరించినా, ఆమె వ్యవహార శైలి, చదువు, ఉద్యోగంపై పోలీసులు సైతం అనుమానాలు వ్యక్తం చేయడం గమనార్హం.

## ఉద్యోగం రాలేదని యువకుడి బలవన్మరణం

అయ్యన్నపేట: ఉద్యోగం రాలేదని ఓ యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. ఈ విషాదకర ఘటన విజయనగరంలో జరిగింది. జీఆర్పీ ఎస్సై మధుసూదనరావు వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన విక్రమ్‌కుమార్ ప్రజాభత్(24) డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవాడు. తగిన ఫలితాలు రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. నెల రోజుల క్రితం విజయనగరంలో తన సోదరుడు నడుపుతున్న ఎలక్ట్రికల్ దుకాణంలో చేరాడు. సోమవారం గూడ్స్ షెడ్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: కుమార్తెను ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్తున్న క్రమంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయాడు. సీఐ నారాయణమూర్తి వివరాల మేరకు బొడ్డవర గ్రామానికి చెందిన దాసరి లక్ష్మణ్(35) తన కుమార్తెను ఈనెల 25న ఎస్.కోట ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్తుండగా.. పట్టణ శివారు పందిరప్పన్న కూడలి సమీపంలో వాహనంలో నుంచి జారి పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ వెల్లడించారు.

## వరి కుప్పల దగ్ధం

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలంలోని తోటవలస గ్రామ సమీప పొలాల్లో ధాన్యంతో ఉన్న వరికుప్పలు దగ్ధమవడంతో రూ.2.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. కొత్తవలసకు చెందిన రైతులు కర్రి బలరాము, ఎం.గోపాలం, తోటవలస గ్రామ రైతు సిగ్గారపు చిన్న కలిసి మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కుప్పలకు నిప్పు పెట్టడంతో దగ్ధమైనట్లు బాధితులు బోరుమన్నారు. విద్యుత్తు మోటార్ల తీగలను కోసి, రాగిని ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకట సురేశ్ తెలిపారు.

## నెల్లిమర్ల నగర పంచాయితీ షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.సి.నెం. 123/2024-ఇ. తేది.29.12.2025

నెల్లిమర్ల నగర పంచాయితీ పరిధిలో వీధి దీపముల మరమ్మత్తుల నిమిత్తం అవసరమగు మెటీరీయల్ సరఫరా కొరకు సాధారణ నిధులతో చేపట్టబోవు పనులకు tender.apeprocurement.gov.in ద్వారా షార్ట్ టెండర్లను ఆహ్వానించడమైనది.

| | | |
|---|---|---|
| మొత్తం పనులు | : | 2 పనులు |
| మొత్తం అంచనా విలువ | : | రూ. 3.98 లక్షలు |
| టెండర్ డాక్యుమెంట్లు అందుబాటు తేదీ మరియు సమయం | : | 30-12-2025 ది ఉదయం 10:30 గంటల నుండి |
| టెండర్లు స్వీకరించుటకు చివరి తేది మరియు సమయం | : | తే.05-01-2026 ది మధ్యాహ్నం 03:30 గంటల వరకు |
| టెండర్లు తెరచు తేది మరియు సమయం | : | తే 05.01.2026 ది మధ్యాహ్నం 04:00 గంటలకు |

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 1) కమిషనరు-9177687657 2) అసిస్టెంట్ ఇంజనీరు 8555001392 ఇతర వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.

సం/- కమిషనరు
నెల్లిమర్ల నగర పంచాయితీ

## నిజాయతీ చాటుకున్న సత్యనారాయణ దంపతులు

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరం మండలంలోని చిట్టాయవలస గ్రామానికి చెందిన సిరిపురపు సత్యనారాయణ(పెద్దయ్య) దంపతులకు దొరికిన రూ.2 లక్షల విలువైన 17 గ్రాముల బంగారు పుస్తెలతాడును సోమవారం పోలీసులకు అప్పగించి తమ నిజాయతీ చాటుకున్నారు. ఈనెల 14న విజయనగరం ఆర్టీసీ బస్టాండులో ఆభరణం దొరికింది. దీంతో ఎస్సైకు అందించి పోగొట్టుకున్న వారికి అప్పగించాలని కోరారు. విజయనగరం ఒకటో పట్టణ పోలీసుస్టేషనులో బాధితులు ఫిర్యాదు చేశారని, అక్కడి పోలీసుల ద్వారా వారికి చేరేలా చర్యలు తీసుకుంటామని సీఐ రమణ తెలిపారు. వారిని స్టేషన్ సిబ్బంది, పలువురు స్థానికులు అభినందించారు.

ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడుకు ఆభరణాన్ని ఇస్తున్న సత్యనారాయణ

## రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో కీర్తి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖ పరిధిలో సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో భాగంగా క్లినిక్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు, ఆర్డీవోల సమక్షంలో అర్జీదారులకు న్యాయం చేస్తామన్నారు. వివరాలను డేటాబేస్‌లో నమోదు చేసి, వారాంతంలో సమీక్షిస్తామని చెప్పారు. ప్రజల సంతృప్తిస్థాయిని పెంచే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. 23 దరఖాస్తులు అందాయని ఆర్డీవో కీర్తి తెలిపారు. విజయనగరం డివిజన్‌కు 15, బొబ్బిలి- 05, చీపురుపల్లి డివిజన్‌కు మూడు వచ్చాయన్నారు.

## వివరాల సమర్పణకు ఆదేశాలు

భోగాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో పలు ప్రాథమిక సహకార సంఘాల్లో పాలక వర్గాల నియామక ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు ఏడు సంఘాలకు సంబంధించిన వివరాలను సమర్పించాలని ఆదేశాలు అందాయి. సంఘం పేరు, ఛైర్మన్, సభ్యులు, అర్హతలను తెలియజేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ మేరకు ఛైర్మన్ పదవులకు గానూ కుమిలి- గొర్లె శ్రీనివాస్, లంకలపల్లిపాలెం- పి.నారాయణస్వామి, భోగాపురం- పి.శ్రీనివాస్, పోలిపల్లి- కె.రామునాయుడు, డెంకాడ- గజపతి, జొన్నాడ- శ్రీనివాసరావు, తమ్మాయిపాలెం వి.ఎస్.ఎల్.వి.ఎన్.రాజు పేర్లను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.


EENADU Classifieds

BUSINESS SERVICES | HEALTH & CARE | JOBS

BUSINESS OFFER
ప్రీమియం ఒగోబాముష సాకి (బెన్నిన్) ముడి జీడిపప్పు (RCN) అత్యుత్తమ నాణ్యత, సరసమైన ధర, నేరుగా సరఫరా. బిజినెస్ వీసా, వసతి సౌకర్యాలు మేము ఏర్పాటు చేస్తాం. సంప్ర॥ 7893732377.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

NEURO
నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్
Dr.Nirmala Vangapandu M.D.(Gen.Med) DM (Neuro) JIPMER Specialist in Brain & Nerve Problems & General Physician
మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు
R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టీప్లెక్స్ వెనుక వైపు, VZM
FOR APPOINTMENT : 63054 71147

REAL ESTATE

FLAT FOR SALE
ధర్మపురి 80 అడుగుల రోడ్డుకు అతి దగ్గరలో 1000sft 2BHK E/F Flat అతి తక్కువ ధరలో అమ్మకానికి కలదు. ✆ 7995588192

PLOT FOR SALE
VZM, NML, మొయిద జం॥ to జరజాపుపేట మెయిన్‌రోడ్డుకి ఆనుకొని వినాయకనగర్ లేఅవుట్‌లో 200 గ॥లు-2 N/Fలో వెంటనే ఇల్లు కట్టుకోవడానికి ఇంటిస్థలాలు కలవు ✆7396629927

JOBS
వైజాగ్ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం.10,000-12,000+ఫుడ్ రూము. ✆ 9030588502/9704637370.

ఇంట్లో ఉండి అమ్మను చూసుకోవడానికి చీపురుపల్లిలో మాకు పనిమనిషి కావలెను. ఆకర్షణీయమైన జీతం+వసతి+ఫుడ్ సదుపాయం. C:7286099991.

విజయనగరంలో ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువతీ యువకులు కావలెను. జీతం - 10,000-13,500. Ph: 9030588502, 9154296345.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609


# ప్రకృతి సేద్యంతో లాభాల సిరులు

వీరఘట్టం, న్యూస్‌టుడే: కంకర గుట్టలను చదును చేసి.. ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయల పంటలు పండిస్తూ.. సిరులు కురిపిస్తున్నారు వీరఘట్టం మండలం జె.గోపాలపురానికి చెందిన అబలాసింగి అర్జునరావు. ప్రభుత్వం ఇచ్చిన డి.పట్టాభూమిని బాగుచేసుకుని వివిధ పంటలతోపాటు చేపల పెంపకంతోనూ ఆశించిన లాభాలను ఆర్జిస్తున్నారు.

గ్రామంలో ఉన్న 1.07 ఎకరాల భూమిలో కూరగాయలు, పండ్లను సాగుచేస్తున్నారు. తనే సొంతంగా నారు తయారు చేసుకుంటున్నారు. పూర్తిగా ప్రకృతి సాగు విధానాన్నే అనుసరిస్తున్నారు. రూ.లక్ష బ్యాంకు రుణం తీసుకుని ఆవు కొనుగోలు చేశారు. ఆవు పేడ, మూత్రం వినియోగించుకొని పంటకోసం వివిధ కషాయాలు స్వయంగా క్షేత్రం వద్ద తయారు చేసుకుంటున్నారు. పంటలను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు పొలం గట్లపై చీమపెండలం, ఆనప పండిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు.

క్షేత్రంలో ఆనప కాయల సాగు

**పెట్టుబడులు.. లాభాలు..:** చిక్కుడు 35 సెంట్లలో వేశారు. 117 కిలోల దిగుబడికిగానూ రూ.7 వేల లాభం వచ్చింది. బీర 35 సెంట్లలో వేయగా 117 కిలోల దిగుబడికి రూ.7వేలు వచ్చింది. పొలం గట్టుపై 10 మీటర్ల పొడవునా తాటితేగలు వేస్తే 240 కిలోల దిగుబడి వచ్చింది. కిలో రూ.40 వంతున విక్రయించగా రూ.9,600 వచ్చింది. డ్రాగన్‌ఫ్రూట్స్ 5 సెంట్లలో పండించారు. ప్రస్తుతం 190 పూత దశలో ఉన్నాయి. ఆనప 10 సెంట్లలో వేయగా 120 కాయలు పండాయి. రూ.2400 లాభం అందుకున్నారు. 22 సెంట్లలో కంది, పసుపు, ఉలవ వేశారు. కంది పంట చేతికి అందాల్సి ఉంది. పసుపు, ఉలవ విక్రయించగా రూ.14 వేల వరకు లాభం వచ్చింది.

**చేపలతో రూ.27వేలు:** పొలంలో చిన్న చెరువు తవ్వించుకున్నారు. ఇందులో 1400 బంగారు పాపలు, బొచ్చులు, రేగండ చేపపిల్లలు పెంచారు. అవి వృద్ధి చెంది 90 కిలోలు చేతికి అందాయి. కిలో రూ.150 వంతున విక్రయించారు. రూ.13,500 వచ్చింది. ఏడాదికి రెండు పంటలకు రూ.27 వేలు లాభం పొందారు.

**గిట్టుబాటు బాగుంది:** ప్రకృతి సాగులో పెట్టుబడి తక్కువగా ఉంది. ఉత్పత్తులు కుటుంబ అవసరాలకు పోనూ మిగిలినవి విక్రయిస్తున్నాం. ఇలా పండించడం వల్ల ఆరోగ్యంతో పాటు నాణ్యమైన పంటకు లాభం వస్తోంది. అన్ని పంటలపై సుమారు రూ.లక్ష వరకూ లాభం వస్తోంది. **- అర్జునరావు, జె.గోపాలపురం.**

# రైతేరాజు

## మిత్రపురుగులను కాపాడుకోండి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పురుగు మందుల వాడకంతో హానికర చీడపీడలతో పాటు పైర్లకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతాయని, వీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.తేజేశ్వరరావు సూచించారు. ★ పైర్లకు హాని కలిగించే పురుగులను కొన్ని మిత్రపురుగులు తినడంతో పాటు వాటి సంతానవృద్ధిని అడ్డుకుంటాయి. ★ సుడి, పచ్చ, తెల్లవీపు దోమలు, ఆకుముడత, రెల్లరాల్చే, కాండం తొలిచే పురుగులను మిత్ర పురుగులైన తోడేలు, సాలీడు, శివంగి సాలీడు, నాలుగు దవడల సాలీడు, అక్షింతల పురుగులు భక్షిస్తాయి. నేల బారు, పెంకుపురుగు, భక్షక ఇలకొడి, భక్షక నీటి నల్లులు, తూనీగలు, భక్షిత మిడత, చెవికాళ్ల జెర్రి తదితర పురుగులు రైతులకు మేలు చేస్తాయి. ★ చీడపీడల నివారణకు పురుగు మందులకు బదులు వేప సంబంధ కషాయాలు వాడితే మిత్రపురుగులను కాపాడుకోవచ్చు.

## సస్యరక్షణతో చీడపీడలు దూరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: జీడి, మామిడి తోటల్లో ఎండుకొమ్మలు తొలగించి ముందస్తుగా సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడల నుంచి రక్షణ పొంది అధిక దిగుబడులు పొందొచ్చని మన్యం జిల్లా ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్ తెలిపారు. రైతుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

**? : ప్రశ్న:** మామిడి తోటల్లో చెట్లకు చెద పురుగులు పడుతున్నాయి. వీటి బారి నుంచి ఎలా కాపాడుకోవాలి? **- కె.రాము, డెంకాడ మండలం**

**సమాధానం:** చెద పురుగుల నుంచి చెట్లను కాపాడుకునేందుకు 19 లీటర్ల నీటిలో లీటరు క్లోరిపైరిఫాస్-7సి (20 శాతం ఈసీ) కలిపి చెట్ల మొదళ్లలో మట్టి తడిచేలా వేయాలి. కాండం మీటరు వరకు తడపాలి. చెట్ల మొదలులో ఒక పాలిథీన్ షీట్ చుట్టి, దానికి గ్రీజు రాస్తే పురుగు ఆశించదు.

**? :** జీడి పూత నిలవాలంటే ఏం చేయాలి? **- తవిటినాయుడు, సీతంపేట**

☛ : తొలగించిన కొమ్మల గాయాలపై లీటరు నీటికి బ్లైటాక్స్ 10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి. దీనివల్ల తెగుళ్లు సోకవు. కొత్త చిగుళ్లు వచ్చి పూత వస్తుంది. పశువుల గెత్తం 50 కిలోలు, సూపర్ పాస్ఫేట్ 2 కిలోలు, పొటాష్ కిలో చొప్పున కలిపి ఒక్కో చెట్టుకు వేయడంతో చిగురు బాగా వస్తుంది. లీటరు నీటికి మోనోక్రొటోఫాస్ లేదా క్లోరిపైరిఫాస్ 1.5 మి.లీ. సాఫ్ పొడి 2 గ్రా. కలిపి వేస్తే తెగుళ్లు, పురుగులను నివారించొచ్చు.

**? :** ఆయిల్ పామ్‌లో ఎలాంటి అంతర పంటలు వేసుకోవచ్చు? **- వెంకటనాయుడు, కొమరాడ**

☛ : వెలుతురు, నీరు, పోషక పదార్థాల కోసం పామాయిల్ మొక్కతో పోటీ పడని పంటను ఎంచుకోవాలి. సాధారణంగా కూరగాయలు, పొట్టి అరటి, పూల మొక్కలు, పొగాకు, మిర్చి, పసుపు, అల్లం, అనాస మొదలైనవి అంతర పంటగా వేయడానికి అనువైనవి. కోకో, మిరియాలు పండించవచ్చు.

## ధాతు లోపాన్ని గుర్తిస్తే లాభం

అరటి పంటలో సూక్ష్మధాతు పోషక లోపాలు అధికంగా ఉంటాయి. ఎరువులను సమపాళ్లలో వేసుకుంటే ఈ సమస్యను అధిగమించవచ్చు. లీటరు నీటిలో 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్, 0.5 మి.లీ. జిగురుతో కలిపి ఆకుల మీద 4 నుంచి 5 సార్లు పిచికారీ చేయాలి. గెలలు వేసిన తోటల్లో ఆఖరి హస్తం విచ్చుకున్న తర్వాత ఒకసారి, 10 రోజుల తర్వాత మరోసారి లీటరు సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 5 గ్రాముల నీటిలో కలిపివేయాలి. శీతాకాలంలో గెలలు సరిగ్గా వృద్ధి చెందకపోతే కాయలు పండుబారుతాయి. నివారణకు లీటరు నీటిలో పొటాషియం ఆర్థోఫాస్ఫేట్ 5 గ్రాములు కలిపి గెలపై వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే మంచి దిగుబడి పొందవచ్చని రస్తాకుంటుబాయి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు తెలిపారు.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

**ఫోన్ కొట్టు.. సలహా పొందు**

వరి కోతల అనంతరం ఎలాంటి పంటలు వేయొచ్చు, రబీలో అపరాలు, వరి సాగులో సస్యరక్షణ, అధిక దిగుబడులకు పాటించాల్సిన చర్యలపై సలహాల కోసం 63034 02627 నంబరును సంప్రదించాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.ప్రవంతి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి- 80085 74348

? పిట్టాడలోని కాలువల్లో మురుగు నిలిచి దోమల బెడద ఎక్కువైంది. - **రామునాయుడు** ★ కాలువల్లో పూడిక తీసేందుకు చర్యలు తీసుకుంటాం. - **విమలకుమారి, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, మెంటాడ

? రాజాం పట్టణంలోని పొనుగుటివలస వార్డు సచివాలయం వద్ద చెత్త పేరుకుపోయింది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ★ చెత్తను తొలగిస్తాం. ఇబ్బంది లేకుండా చూస్తాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

? బూసాయవలస జాతీయ రహదారిపై వాహనాలు నిలిపేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - **స్థానికులు** ★ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం. - **ప్రసాదరావు, ఎస్సై** – న్యూస్‌టుడే, రామభద్రపురం

? చినమానాపురం, నీలావతి గ్రామాల్లోని కాలువల్లో మురుగు పారక దుర్గంధం వస్తోంది. - **స్థానికులు** ★ శుభ్రం చేయిస్తాం. - **విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? తెర్లాం- తమ్మయ్యవలస రహదారిలో జగ్గారావు చెరువు పక్కన చెత్త వేస్తున్నారు. దుర్గంధం వస్తోంది. - **యువకులు** ★ ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. - **రవికుమార్, ఈవో** – న్యూస్‌టుడే, తెర్లాం

? బొబ్బిలి కోరాడవీధికి వెళ్లే పైపులైను మరమ్మతులకు గురై రెండు రోజులుగా తాగునీరు పోతోంది. లీకులు కనిపించకుండా పైన రాయి ఉంచారు. - **స్థానికులు** ★ లీకులు అరికట్టేందుకు ప్రణాళికలు రూపొందించాం. - **రామలక్ష్మి, పుర కమిషనర్** – బొబ్బిలి

## వేడుకలు శాంతియుతంగా నిర్వహించాలి

గరివిడి, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా రాత్రి పార్టీలు, డీజేలు, రోడ్‌షోలు, బైక్‌ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని పేర్కొన్నారు. ★ రాజాం, గజపతినగరంలో ఆయా సీఐలు ప్రకటన విడుదల చేశారు.

# బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

## కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో సోమవారం కూరగాయల ధరలు (కి.లో రూ.లలో).. ✦ టమాటా: 60 ✦ వంకాయలు: 40 ✦ దొండ: 40 ✦ బీర: 55 ✦ బెండ: 55 ✦ కాకర: 50 ✦ చిక్కుడు: 50 ✦ ఆనపకాయ (ఒకటి): 30 ✦ అరటి (జత): 20 ✦ మునగ: 100 ✦ ఉల్లి: 35 ✦ బంగాళదుంపలు: 25 ✦ అల్లం: 80 ✦ వెల్లుల్లి: 120 ✦ పచ్చిమిర్చి: 70 ✦ క్యాబేజీ: 30/40 – న్యూస్‌టుడే, రాజాం

## తెరపై ఈనాడు

★ ఎస్‌వీసీ సీతారామా: **శంబాల** ★ ఎస్‌వీసీ సీతారామా మినీ: **ఛాంపియన్** ★ ఎస్‌వీసీ అప్సర: **అఖండ-2** – న్యూస్‌టుడే, రాజాం

బొబ్బిలిలో.. ★ లక్ష్మీ థియేటర్: **ఛాంపియన్** ★ వాసవి: **ఈషా** ★ టీబీఆర్ స్క్రీన్-1: **అఖండ- 2** ★ టీబీఆర్ స్క్రీన్-2: **వృషభ** – న్యూస్‌టుడే, బొబ్బిలి

## పట్టణం విస్తరిస్తున్నా.. అవస్థలేనా?

న్యూస్‌టుడే – రాజాం

రాజాం పట్టణం రోజురోజుకూ విస్తరిస్తున్నా ప్రజల కష్టాలు మాత్రం తీరడంలేదు. రహదారులు, కాలువలు వంటి కనీస వసతులు కూడా కరవే. పారిశుద్ధ్య, వీధి దీపాల సమస్యలు వేధిస్తున్నాయి. నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడంలేదు. కొండంపేట, అమ్మవారికాలనీ, ఆదర్శనగర్, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. నిధులు కేటాయించామని, అభివృద్ధి పనులు చేపడతామని చెబుతున్నా.. ఆచరణలో పట్టాలెక్కడం లేదు. రాజాం- బొబ్బిలి రహదారి నుంచి కొండంపేటకు వెళ్లే ప్రధాన మార్గాన్ని బీటీ రోడ్డుగా నవీకరించాలని కోరుతున్నా ఆచరణలోకి రాలేదు. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. ప్రధాన రహదారి పక్కన వరద కాలువ నిర్మించాల్సి ఉంది.

సీసీ రహదారి లేని అమ్మవారికాలనీ

### ఇళ్లముందే వ్యర్థాలు..

అమ్మవారి కాలనీ ఆరు, ఏడు లైన్లలో కాలువలు, రహదారులకు నిధులు కేటాయించామని అధికారులు చెబుతున్నా.. పనులు మొదలు కాలేదు. ఆరోలైనులో ఇళ్ల ముందు పెంటకుప్పలు నిల్వ చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. పందులను కట్టడి చేయడంలేదు. ● ఆదర్శనగర్, టీచర్స్ కాలనీ, నవ్యనగర్‌లలో పలు వీధులకు రోడ్లు, కాలువలు లేవు. రాజాం రక్షిత తాగునీటి పథకం పైపులైను విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది.

**పనులు పట్టాలెక్కిస్తాం..** పట్టణంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి, మౌలిక వసతులు కల్పిస్తాం. చాలా పనులకు టెండర్లు పిలిచాం. వెంటనే పనులు పట్టాలెక్కించేలా చర్యలు తీసుకుంటాం. – **ఆకురాతి రామచంద్రరావు, కమిషనర్, రాజాం పురపాలిక**

### రహదారులు దారుణం..

కొండంపేట నుంచి జీఎంఆర్ కేర్ ఆసుపత్రికి వెళ్లే రహదారి అత్యంత దారుణంగా దెబ్బతింది. వర్షం కురిస్తే నీళ్లు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పెద్దవీధి, చిన్నవీధి, గెడ్డవీధి, చర్చివీధి, శాంతినగర్ కాలనీల్లో సమస్యలు పేరుకుపోయాయి. కొన్నిచోట్ల సీసీ రహదారులు లేవు. మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వీధి దీపాల సమస్య పీడిస్తోంది. ఇంటింటి చెత్త సేకరణ సజావుగా సాగడంలేదు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారబోస్తున్నారు. కాలువల్లో పూడికలు పేరుకుపోతున్నా తీయడం లేదు. మురుగు నీరు దిగువకు పరుగు తీసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రధానంగా ఈ ప్రాంతాలకు అవుట్‌లెట్ల సమస్య వేధిస్తోంది. ప్రాంతం విస్తరించడంతో విద్యుత్తు వినియోగం పెరిగింది. దీనికి అనుగుణంగా నియంత్రికల సంఖ్య పెంచకపోవడంతో లోఓల్టేజీ సమస్య ఉత్పన్నమవుతోంది. కోనేరు నీరు బయటకు పోయే మార్గం లేక దుర్గంధంగా మారుతోంది.

## ప్రతిభ చూపి.. ప్రశంస పొంది

బొబ్బిలి పట్టణంలోని సింహాలతోట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం "ప్రతిభా పాటవ పోటీలు" జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కె.శ్యామల (8వ తరగతి), పి.అంజలి (9వ తరగతి), ఎస్.కృపసత్య (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.జ్యోతి కుమారి, ఉపాధ్యాయులు శారదాదేవి, సుశీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

## మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. సోమవారం చీపురుపల్లిలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనర్థాలను విద్యార్థులకు తెలియజేశారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, కష్టపడాలని సూచించారు. అనంతరం ప్రతిభా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మానవీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు, సీఐ జి.శంకరరావు, ఎస్సై ఎల్.దామోదరరావు, భాజపా నియోజకవర్గ కో-కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు, ప్రధానాచారిణి బి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

## పరిసరాలిలా.. ఆరోగ్యం ఎలా?

రాజాం మండలం గుయ్యానవలసలో సీసీ రహదారులు, కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాడుకనీరు ఇళ్ల ముందు నిల్వ ఉండటంతో వీధుల్లోని పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడదతో వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. విషయం ఎంపీడీవో ఆనందరావు వద్ద ప్రస్తావించగా.. కాలువల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

## రహదారి కష్టాలకు మోక్షం

రామభద్రపురం, న్యూస్‌టుడే: మండలంలోని పలు రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. ప్రమాదాలు జరిగేవి. దీనిపై 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. రామభద్రపురం, బాడంగి, బొబ్బిలిలోని రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం రూ.4.5 కోట్లు మంజూరుచేసిందని, పనులు జరుగుతున్నాయని ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రణయ చెప్పారు.

## స్పందనకు వందనం – వ్యర్థాల తొలగింపు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గంట్యాడ మండలం పెనసాం సచివాలయం వీధిలో వ్యర్థాలు పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డుపై మురుగు నీరు నిలిచిపోయేది. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

## విద్యార్థులు అంకితభావంతో చదవాలి

చిన్నారులతో మాట్లాడుతున్న కూర్మారావు

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్ననాటి నుంచే కష్టపడి అంకితభావంతో చదవాలని కర్ణాటక రాష్ట్ర ఎస్ఎస్‌పి ఎస్పీడీ కూర్మారావు అన్నారు. సోమవారం తమ స్వగ్రామం పోరాలిలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. పాఠశాలకు ఏవైనా అవసరాలు ఉంటే తనకు తెలియజేయాలని ఉపాధ్యాయులను కోరారు. జిల్లా ఎస్ఎస్‌ఏ అధికారి రామారావు, ఎంఈవో వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లీకులు.. తాగునీటికి తిప్పలు

సంతకవిటి మండలం గరికిపాడు గ్రామంలోని తాగునీటి పైపులైను మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామంలోని కొన్ని వీధులకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రామచంద్ర వద్ద ప్రస్తావించగా.. చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

## ఇరువర్గాల కొట్లాట: ఏడుగురికి గాయాలు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం మండలం రాజయ్యపేటలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన కొట్లాటలో ఏడుగురు గాయపడినట్లు ఎస్సై పి.ఉమావెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆదివారం కోడాడ ఆదయ్య ఇంటి ముందు కుటుంబ సభ్యులు కల్లాపు నీళ్లు చిలకరిస్తుండగా పక్కింటి వైపు వెళ్లడంతో మాటా మాటా పెరిగి కొట్లాటకు దారి తీసింది. ఒక వర్గానికి చెందిన దుర్గారావు, రాము, ఆదయ్య, మరో వర్గానికి చెందిన అన్నపూర్ణ, రమణమ్మ, లక్ష్మణ, రాముడు గాయాలపాలయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదయ్య, రాము ఫిర్యాదులపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తికి..

వంగర, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్తు తీగలు తగిలి వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన వంగర మండలంలో చోటుచేసుకుంది. తలగాం గ్రామానికి చెందిన పైల చక్రపాణి సోమవారం సాయంత్రం కోళ్ల ఫారం వద్ద నీరులేకపోవడంతో వాటర్ ట్యాంకు ఎక్కేందుకు ప్రయత్నించాడు. సమీపంలోని తీగలు తగలడంతో మెడ, కుడికాలుపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు.

## సత్యవతమ్మ మృతికి నివాళి

బాడంగి, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే తెంటు జయప్రకాశ్ భార్య సత్యవతమ్మ ఇటీవల మృతిచెందారు. సోమవారం నిర్వహించిన సంతాప సభలో ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే [illegible] పాల్గొన్నారు. సత్యవతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

## మూగజీవాల అక్రమ రవాణా

వంగర, న్యూస్‌టుడే: అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న వాహనాన్ని సోమవారం వంగరలో పోలీసులు పట్టుకున్నారు. గుమ్మలక్ష్మీపురం నుంచి వంగర మీదుగా రాజాం ప్రాంతానికి 9 మూగజీవాలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై షేక్‌శంకర్ తెలిపారు. వాహనదారుడితో పాటు పి.ప్రదీప్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

## రైతులకు యూరియా పంపిణీ

సంతకవిటి, న్యూస్‌టుడే: సువరం సచివాలయానికి వచ్చిన 440 యూరియా బస్తాలను ఏవో యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. రైతుల ఆధార్, 1బీ ప్రకారం పంపిణీ జరిగిందన్నారు. అవసరం మేరకు యూరియా తెప్పిస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## రక్తదానం.. ప్రాణదానం

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని ఆదిత్య స్వచ్ఛంద సంస్థ, విద్యా సంస్థల ఆధ్వర్యంలో సోమవారం గౌరీదేవి క్యాంపులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్‌ఎన్‌ఎస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు చింత శారద ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 144 మంది రక్తదానం చేశారు. రాజా కళాశాల, ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. కరస్పాండెంట్ ఎం.కె.నాయుడు, స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్, బ్లడ్ బ్యాంక్ ప్రబంధకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అడ్డంగా లారీ.. ఏదీ దారి?

బొబ్బిలి పట్టణంలోని పైవంతెనపై సోమవారం ఉదయం లారీ మరమ్మతులకు గురై అడ్డంగా ఆగిపోయింది. వాహనాలు బారులుతీరాయి. పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు చేరుకుని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. రైల్వే వంతెనపై తరచూ ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని చోదకులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

## ఎన్నికల్లో విజయమే ధ్యేయం

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. సోమవారం శ్యాంపురంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో 140 కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరాయి. సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన 80, వంగర మండలం అరసాడకు చెందిన 60 కుటుంబాలు చేరాయి. వీరికి ఎమ్మెల్యే కండువాలు వేసి, ఆహ్వానించారు. అనంతరం 49 మంది ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. నాయకులు కోళ్ల అప్పలనాయుడు, సుమల వెంకట మన్మథరావు, గట్టిబాను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌తో పార్టీలో చేరినవారు

## పొమ్మని పొగ పెట్టడంలే..!

న్యూస్‌టుడే– గరివిడి, వంగర

గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా దోమలను అరికట్టేందుకు గతంలో సరఫరా చేసిన ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరాయి. నిర్వహణ భారం, వినియోగంపై సిబ్బందికి అవగాహన లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దోమల విజృంభణతో గ్రామాల్లో వ్యాధులు వ్యాపిస్తున్నాయి. కాలువల్లో వ్యర్థాలు, నివాసాల మధ్యలో మురుగు నిలిచిపోతుండడంతో ఇబ్బందులు తప్పడంలేదని వాపోతున్నారు.

| మండలం | మొత్తం యంత్రాలు | మూలకు చేరినవి |
|---|---|---|
| చీపురుపల్లి | 20 | 18 |
| గరివిడి | 30 | 26 |
| గుర్ల | 24 | 21 |
| మెరకముడిదాం | 18 | 18 |
| రాజాం | 21 | 19 |
| రేగిడి | 39 | 19 |
| సంతకవిటి | 34 | 14 |
| వంగర | 29 | 24 |

గత ప్రభుత్వ హయాంలో చీపురుపల్లి, రాజాం నియోజవర్గాల్లోని 215 సచివాలయాలకు ఒక్కో చోట రూ.38 వేలు విలువచేసే ఫాగింగ్ యంత్రాలను రెండు విడతల్లో ఇచ్చారు. వినియోగించకపోవడతంతో 159 సచివాలయాల్లో మరమ్మతులకు గురై మూలనపడ్డాయి.

వంగర: కొండచాకరపల్లిలో మూలకు చేరిన యంత్రం

### పంచాయతీలపై భారం..

ఈ యంత్రాలతో గంటపాటు ఫాగింగ్ చేయాలంటే లీటరు పెట్రోల్, నాలుగు లీటర్ల డీజిల్ అవసరమవుతోంది. దోమల నివారణకు అవసరమైన మందుకు లీటరుకు రూ.వెయ్యి వెచ్చించాల్సి వస్తోంది. చిన్న పంచాయతీలో ఫాగింగ్ చేయాలంటే రూ.20 వేలు, మేజరు పంచాయతీలో రూ.40 వేలు వరకు అవుతోందని కార్యదర్శులు చెబుతున్నారు.

**వినియోగించేలా చూస్తాం..:** పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు వినియోగించకపోవడం వాస్తవమే. ఇందుకు ఆర్థిక పరమైన కారణాలను చూపుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, యంత్రాలు వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. – హేమసుందర్, డీడీవో, చీపురుపల్లి

## పంట వేస్తేనే ఎరువులు ఇవ్వాలి

సమావేశంలో ఎమ్మెల్సీ, సభ్యులు

రేగిడి, న్యూస్‌టుడే: మొక్కజొన్న పంట వేసినవారికే ఎరువులు అందించాలని మండల పరిషత్తు సభ్యులు ఏవో లోకేష్‌తో అన్నారు. సోమవారం రేగిడి మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంత ఎరువు అవసరమో గుర్తించడంలో విఫలమయ్యారా అని ఎమ్మెల్సీ విక్రాంత్ ప్రశ్నించారు. 152 టన్నుల ఎరువు ఆర్‌ఎస్‌కేల్లో ఉందని, పంపిణీలో జాగ్రత్తలు తీసుకుంటామని ఏవో చెప్పారు. పాడైన విద్యుత్తు స్తంభాలు మార్చడంలో ఆలస్యం చేస్తున్నారని సభ్యులు అన్నారు. ఇప్పటికే 12 గ్రామాల్లో 103 స్తంభాలు అమర్చామని ఏఈ సురేష్ చెప్పారు. ఉపాధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీడీవో శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో సీఐటీయూ మహా సభలు

గజపతినగరం, దత్తిరాజేరు, న్యూస్‌టుడే: విశాఖలో జనవరి 4 నుంచి జరగనున్న సీఐటీయూ మహాసభల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి వి.లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం గజపతినగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వంతెన, మెంటాడ రోడ్డు మీదుగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేపట్టారు. ★ నాయకులు జ్యోతి, రాములమ్మ పెదమానాపురం, కె.కొత్తవలస అంగన్‌వాడీ సెక్టారు పరిధిలో గోడప్రతులు విడుదల చేశారు. ★ **రేగిడి:** సంకిలి చక్కెర కర్మాగారం నుంచి ఉంగరాడమెట్ట వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. నాయకులు సురేష్, త్రినాథ పాల్గొన్నారు. ★ **బొబ్బిలి:** సిటు జిల్లా ఉపాధ్యక్షుడు పి.శంకరరావు ఆధ్వర్యంలో బొబ్బిలిలో ర్యాలీ చేపట్టారు.

## గొయ్యి.. ప్రమాదమేనోయి

రాజాం మండలంలోని గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యే పైపులైను పట్టణంలోని బొబ్బిలి రహదారిలో మరమ్మతులకు గురైంది. పనుల నిమిత్తం భారీ గుంత తవ్వి మరమ్మతులు చేసి పూడ్చకుండా వదిలేశారు. నిత్యం ఈ మార్గంలో రాకపోకలు అధికంగా ఉంటాయి. రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను గ్రామీణ నీటి సరఫరా విభాగం జేఈ జగన్మోహనరావు వద్ద ప్రస్తావించగా.. గొయ్యిని పూడ్చుతామని చెప్పారు. – న్యూస్‌టుడే, రాజాం

## గౌరవాధ్యక్షుడిగా ఎన్నిక

చీపురుపల్లి, న్యూస్‌టుడే: యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా చీపురుపల్లి మండలం ఇటకర్లపల్లి గ్రామానికి చెందిన మీసాల అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 28న విజయనగరంలో జరిగిన యూటీఎఫ్ 51వ కౌన్సిల్ సమావేశంలో ప్రతినిధులంతా కలిసి ఎన్నుకున్నట్లు సోమవారం తెలిపారు. నాలుగు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు అభినందించారు.

## యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

సంతకవిటి, న్యూస్‌టుడే: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ 2026 ఏడాదికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను కార్యవర్గ సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరావు, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.శ్రీనివాసం, కార్యదర్శి ఎస్.బాబూరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

గుర్ల, న్యూస్‌టుడే: గరికివలస ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.లక్ష్మీప్రసన్న, ఎస్.పూజిత ఈనెల 30 నుంచి జనవరి 3 వరకు బెంగళూరులో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ బి.మల్లికార్జునరావు తెలిపారు. హెచ్‌ఎం శ్రీదేవి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు విద్యార్థులను అభినందించారు.

## భవనం పూర్తయ్యేదెన్నడో?

గజపతినగరం మండలం మల్లునాయుడుపేటలోని మండల పరిషత్తు పాఠశాల భవనంపై చెట్టు కూలి పడిపోవడంతో భవనం ప్రమాదకరంగా మారింది. దీంతో 2018లో ప్రభుత్వం కొత్త భవనం మంజూరు చేసింది. స్లాబ్ వరకు పనులు చేసి గుత్తేదారు వదిలేశారు. అసంపూర్తి భవనంలో చదువులు సాగించలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, త్వరగా పూర్తి చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. విషయం ఎంఈవో విమలమ్మ వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

## ఆరు వెల్‌నెస్ కేంద్రాలు మంజూరు

వంగర, న్యూస్‌టుడే: వంగర మండలానికి కొత్తగా ఆరు వెల్‌నెస్ కేంద్రాలు మంజూరైనట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి సుస్మిత దయానా తెలిపారు. సోమవారం వంగరలో మాట్లాడారు. కింజంగి, కొప్పర, మడ్డువలస, వీవీఆర్‌పేట, మరువాడ, శ్రీహరిపురం గ్రామాలకు కేంద్రాలు మంజూరయ్యాయని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు.

## బాలభవన్ విద్యార్థిని ప్రతిభ

గరివిడి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఈనెల 28న స్టైల్ ఇండియా సంస్థ నిర్వహించిన 5 నుంచి పదేళ్ల లోపు పిల్లల సౌత్ ఇండియా స్థాయి లిటిల్ మిస్టర్ స్టైల్ పోటీల్లో గరివిడికి చెందిన అయిదేళ్ల చిన్నారి రెడ్డి చరిష్మా ద్వితీయ స్థానం సాధించింది. బాలిక బాలభవన్ కేంద్రంలో నృత్య శిక్షణ పొందుతోంది. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి పాల్గొన్నారు. తండ్రి శివ వ్యాపారం చేస్తుంటారు. తల్లి లక్ష్మి గృహిణి. బాలభవన్ డైరెక్టర్ ఎస్.రమేష్ చిన్నారిని అభినందించారు.

## రీసర్వేకు సహకరించాలి

గుర్ల, న్యూస్‌టుడే: రైతులు రీసర్వేకు సహకరించాలని సర్వేయర్ శివ కోరారు. సోమవారం గుర్ల మండలం పెనుబర్తి, తాతావారికిత్తలి గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. నాలుగో విడత రీసర్వే జనవరి 2 నుంచి చేపట్టనున్నట్లు తెలిపారు. రైతుల సమక్షంలోనే ప్రక్రియ చేపడతామని, పొలం వద్దకు సిబ్బంది వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ★ **మెంటాడ:** ఉప తహసీల్దారు వై.హేమంత్‌కుమార్ మెంటాడ, ఆగూరు, జి.టి.పేట గ్రామాల్లో అవగాహన కల్పించారు. ★ **దత్తిరాజేరు:** ఎస్.బూర్జవలస, కోరప, మరడాం, గుచ్చిమి, సరయ్యవలస, తిమిటేరు గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు ఉప తహసీల్దారు రత్నకుమారి చెప్పారు. రీసర్వే విజయవంతంగా చేసేందుకు రైతులు, ప్రజాప్రతినిధులు సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

(c) eenadu

# విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

## రబీ సాగుకు సమస్యలా.. ఇదిగో పరిష్కార మార్గం

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

రబీ సీజన్‌లో నెల్లిమర్ల మండలం పరిధిలోని గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అన్నదాత సుఖీభవ, రబీ సీజన్‌లో పంటల సమస్యలు, మొక్కజొన్న సాగులో పాటించాల్సిన పద్ధతులు.. సకాలంలో యూరియా అందడం లేదా? ఇతర సమస్యలుంటే మండల వ్యవసాయాధికారిణి శ్రీలక్ష్మి దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' మీకు కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఫోన్ చేయడమే. - న్యూస్‌టుడే, నెల్లిమర్ల

★ తేదీ: 30.12.25(మంగళవారం) ★ సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు..

★ ఫోన్ నంబర్: 83310 56304

## అందుబాటులోకి పండ్లు, పూల మొక్కలు

ఉడాకాలనీ: జిల్లా మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో అలంకరణ, పండ్లు, పూల మొక్కలు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 31 నుంచి జనవరి 15 వరకు విక్రయిస్తామని, కావాల్సినవారు 80082 01398ను సంప్రదించాలని సమాఖ్య అధ్యక్షురాలు మాధవి తెలిపారు.

## తెరపై ఈనాడు

★ ఎస్వీసీ: ఛాంపియన్ ★ శ్రీకృష్ణ: ఈషా ★ ఆదిత్య: దండోరా ★ లీలామహల్: వృషభ ★ రంజనీ స్క్రీన్- 1: ఛాంపియన్, అవతార్ ★ శివరంజనీ స్క్రీన్-2: వృషభ, అఖండ 2, అనకొండ ★ హిమగిరి: శంబాల ★ సప్తగిరి: అఖండ 2 - న్యూస్‌టుడే, కంటోన్మెంట్

| మేము న్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) | |
|---|---|
| విజయనగరం పట్టణం | 80089 02900 |
| విజయనగరం గ్రామీణం | 80085 74317 |
| ఎస్.కోట | 80085 74326 |
| భోగాపురం | 70959 54646 |

★ కొండకరకం శివారు ప్రాంతాల్లో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. - స్థానికులు ★ పరిశీలించి, శుభ్రం చేయిస్తాం - రామకృష్ణ, కార్యదర్శి - న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

## పోటీల్లో ప్రతిభ.. ప్రశంసల వెల్లువ

విజయనగరంలోని ఉడాకాలనీ చాణక్య పాఠశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 7, 8, 9, 10 చదువుతున్న విద్యార్థులు క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శృతి సాహు(ఎనిమిదో తరగతి), ఎ.రోహిత్(తొమ్మిదో తరగతి), ఎస్.వైభవ్(ఏడో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కరస్పాండెంట్ ఎస్.వి.లక్ష్మి, ప్రధానోపాధ్యాయిని వి.విజయకరుణ, ఉపాధ్యాయులు పి.రమణ, ఎం.హరిబాబు విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

## నాడు సుస్తీ.. నేడు ఆరోగ్యప్రాప్తి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే

నగరపాలక సంస్థ పరిధిలోని రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు పూర్తయితే నగరవాసులకు వైద్య సేవలు చేరువ కానున్నాయి. ప్రశాంతినగర్, స్టేడియంపేటలోని ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఎలక్ట్రికల్, శానిటరీ పనులు ఇంకా జరగాల్సి ఉంది. స్టేడియంపేట దగ్గర ఫ్లోరింగ్ చేస్తున్నారు. ఇవి జనవరి నాటికి పూర్తి కానున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు పేర్కొన్నారు. వైకాపా హయాంలో గుత్తేదారులకు బిల్లులు విడుదల చేయకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో సిబ్బంది అద్దె గదుల్లో అసౌకర్యాల నడుమ వైద్య సేవలు అందించాల్సి వస్తోంది.

ప్రశాంతినగర్‌లో తుది దశలో పట్టణ ఆరోగ్యకేంద్రం పనులు

### ఏడింటికి ప్రతిపాదనలు..

గత ప్రభుత్వంలో ఏడింటిని నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపగా మెడికల్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ పరిపాలనా ఆమోదం తెలిపింది. ఒక్కొక్క యూపీహెచ్‌సీని రూ.80 లక్షలతో నిర్మించడానికి ప్రతిపాదనలు చేశారు. తదుపరి ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం ఈ నిధులు చాలకపోవడంతో ఒక్కోదానికి రూ.20 లక్షలకు పైబడి అదనంగా నగర పాలక సంస్థ కేటాయించింది. ఇందులో అయిదింటి నిర్మాణాలు పూర్తిచేయగా, రెండు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుతం కొత్తపేట కుమ్మరివీధి, గాజులరేగ, వీటీ అగ్రహారం, ఎల్‌బీ కాలనీ, కేఎల్‌పురంలో వైద్య సేవలు అందుతున్నాయి.

### రూ.1.15 కోట్లతో..

ప్రశాంతినగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర నిర్మాణం రూ.1.15 కోట్లతో చేపట్టారు. ఇందులో రూ.35 లక్షలు శానిటరీ, ప్రహరీగోడ, ఎలక్ట్రికల్ తదితర పనుల కోసం కేటాయించారు. ★ తొలుత స్టేడియం పేట దగ్గర స్లాబ్ దశకు వచ్చి పనులు నిలిచిపోయాయి. మిగిలిన నిధులతో నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

### త్వరలో అప్పగిస్తాం..

ఈ రెండు ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే వీటిని పూర్తిచేసి వైద్యారోగ్య శాఖకు అప్పగిస్తాం.

- పి.నల్లనయ్య, కమిషనర్, నగరపాలక సంస్థ

## కాలమానిని ఆవిష్కరణ

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా అధికారుల టేబుల్ కాలమానిని సోమవారం కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. అధికార యంత్రాంగం తరపున జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ దీనిని రూపొందించారు. డీఆర్వో మురళి, డీఈవో యు.మాణిక్యం నాయుడు, గృహ నిర్మాణశాఖ పీడీ జి.మురళీమోహన్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిల కల్వర్టులతో ముప్పు

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో శిథిల కల్వర్టులు భయాందోళనకు గురి చేస్తున్నాయి. నిర్వహణ లేకపోవడంతో పలకలు దెబ్బతింటున్నాయి. పాదచారులు, చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. స్థానిక బాలాజీనగర్‌లో ఎక్కడికక్కడే ఈ పరిస్థితి కనిపిస్తోంది. చిన్నారులు, వృద్ధులు రాకపోకలు సాగించలేకపోతున్నారని ఆ కాలనీ వాసులు చెబుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

## మట్టిరోడ్లే శరణ్యమా..?



విజయనగరం మండలం మలిచర్ల శివారు కాలనీల్లో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. విశాఖపట్నం వెళ్లే మార్గంలో ఈ పంచాయతీ ఉండటంతో కొన్నేళ్లలోనే అపార్టుమెంట్లు, ఇళ్లు వెలిశాయి. ఇక్కడి నుంచి నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. పక్కా దారులు లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాల సమయంలో బురదమయంగా మారుతున్నాయని చెబుతున్నారు. ఈ సమస్యను ఇన్‌ఛార్జి ఎంపీడీవో మోహన్‌కుమార్ వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. - న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

## నిర్మించి నిరుపయోగం

భోగాపురం మండలంలోని రెడ్డి కంచేరులో నిర్మించిన హుద్‌హుద్ భవన సముదాయం శిథిలావస్థకు చేరుకుంది. తుపాను బాధితుల కోసం గతంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదు. అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో లబ్ధిదారులకు అందజేయలేదు. అక్కడికి ఎవరూ వెళ్లకపోవడంతో మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారాయి. బాధితులు అద్దింట్లో అవస్థలు పడుతున్నారు. దీనిపై గృహ నిర్మాణ శాఖ ఏఈ వర్మను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఆదేశాలు వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, భోగాపురం

## ప్రతిభ వెలికితీసేందుకే పోటీలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

భోగాపురం, న్యూస్‌టుడే: ప్రతిభకు వేదికగా పల్లె పండగ 2.0 నిలిచేలా క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. మండలంలోని ముంజేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పల్లెల్లో ఉత్సాహాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇవి చేపడుతున్నామన్నారు. జనవరి 2 నుంచి 13 వరకు కందివలస సమీప ఎస్ఎంఎస్ పరిశ్రమ ఎదురుగా క్రికెట్, వాలీబాల్, క్విజ్, ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు. నాయకులు కోట్ల రఘు, బాల అప్పలరాజు, పి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన సినీ సంగీత విభావరి

అమర గాయకుడు ఘంటసాల 103వ జయంతిని పురస్కరించుకుని విజయనగరంలోని గురజాడ కళాక్షేత్రంలో 'అజరామరం ఆ స్వరం- అమృతపానం ఆ గానం' పేరిట సినీ సంగీత విభావరి జరిగింది. నారీ భేరి సంగీత సంస్థ నిర్వాహకురాలు కింతలి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సీవీ రాజేశ్వరి, శైలజ సిరాజ్, పుండరీ కుమార్, చింతపల్లి సత్యనారాయణ, పెమ్మరాజ్, రామారావు తదితరులు ఘంటసాల గీతాలను ఆలపించి అలరించారు. నగర ప్రముఖులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కంటోన్మెంట్

## తెదేపా బలోపేతానికి కృషి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో తెదేపా బలోపేతానికి కార్యకర్తలే కీలకమని, మరింత ఉత్సాహంగా పనిచేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న ఉత్తమ కార్యకర్తలను సోమవారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పంపించిన ప్రశంసాపత్రాలు అందజేశారు. నాయకులు విజ్జపు ప్రసాద్, నారాయణప్పుడు, ఆల్తి బంగారుబాబు, కనకల మురళీ, ముద్దాడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ★ అభివృద్ధే ఎమ్మెల్యే అదితి అజెండా అని తెదేపా విజయనగరం నియోజకవర్గ నాయకులు గంటా రవి, ప్రసాదుల వరప్రసాద్, ఐవీపీ.రాజు అన్నారు. క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

## దళితులకు ప్రభుత్వ భూములు అందించాలి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: పేద దళిత కుటుంబాలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సొర సాంబయ్య, ఏబీయూసీ శ్రామిక మహిళా ఉమ్మడి జిల్లా కన్వీనర్, స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బలగ రాధానాయుడు డిమాండు చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. ఉపాధి కల్పించాలని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో అమలైన పథకాలను పునరుద్ధరించాలన్నారు. నాయకులు ఎండ గోపాలరావు, బసవ సూర్యనారాయణ, కోరాడ కృపామణి, దువ్వాన రమాదేవి, ఎర్రపు ఆనందరావు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

భోగాపురం,(డెంకాడ): అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న అక్కివరం గ్రామానికి చెందిన పిన్నింటి రాజుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.81,419ల చెక్కును సోమవారం ఎమ్మెల్యే లోకం మాధవి అందజేశారు.

## ఆవిర్భావ దినోత్సవం

అయ్యన్నపేట: విజయనగరం ఆర్టీసీ సముదాయం వద్ద పొరుగుసేవల అసోసియేషన్ రెండో ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు కేకు కోసి, మిఠాయిలు పంచిపెట్టారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బహూకరణ

కంటోన్మెంట్: విజయనగరం దాసన్నపేటలో కొలువుదీరిన శ్రీచిన్న ఆంజనేయస్వామికి రూ.20 వేల విలువైన రాగి కవచాన్ని దాతలు బహూకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. 108 మంది మహిళలు దీపారాధన చేపట్టారు.

## బాధిత రైతులకు ఆర్థిక సాయం

వేపాడ: అరిగిపాలెంలో జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన రైతులు ఎం.శ్రీను, అప్పారావుల పశువుల శాలలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ సోమవారం బాధితులకు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

## రసాభాసగా కౌన్సిల్ సమావేశం

ఛైర్‌పర్సన్‌తో వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్లు

జరజాపుపేట(నెల్లిమర్ల), న్యూస్‌టుడే: ఛైర్‌పర్సన్ బంగారు సరోజని అధ్యక్షతన సోమవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశం రసాభాసగా సాగింది. 7 అంశాలతో కూడిన ఎజెండాను చదివి వినిపించగా, నాలుగింటికి ఆమోదం తెలిపారు. ఆరో అంశంలో బంగారు అప్పలరాజుకు నగర పంచాయతీలో ఉద్యోగం కోసం పెట్టగా కౌన్సిలర్లు తిరస్కరించారు. గతంలో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు ఇవ్వాలన్నారు. జరజాపుపేటలో గ్రంథాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని వైస్ ఛైర్మన్ ఎస్.రామారావు కోరారు. వైస్ ఛైర్మన్ కారుకొండ కృష్ణారావు, కమిషనర్ జనార్దనరావు, అధికారులు పాల్గొన్నారు.

## రీసర్వేలో తప్పుల నమోదు..

వినతి పత్రాలతో రాకోడు గ్రామ రైతులు

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: రీసర్వేలో తన భూమిని ప్రభుత్వ భూమిగా నమోదు చేశారని బొండపల్లి మండలం ఒంపిల్లికి చెందిన ఎస్.అప్పలనాయుడు కలెక్టరేట్ పీజీఆర్ఎస్ అర్జీ అందించారు. సర్వే నంబరు 221/20లో 78 సెంట్లు తన పేరున ఉండగా.. రీసర్వే తరువాత 1బీ రావడం లేదన్నారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదన్నారు.

**ఇలాగేనా న్యాయం?..** గతనెలలో పీజీఆర్ఎస్‌ను ఆశ్రయించినా నేటికీ న్యాయం జరగలేదని విజయనగరం మండలం రాకోడు గ్రామ రైతులు వాపోయారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు డబ్బులు డిమాండు చేస్తున్నారని చెప్పినా స్పందన లేదన్నారు. విచారణలో ఒక్క ఫిర్యాదుదారుడి నుంచే వివరాలు సేకరించారన్నారు. వీఆర్వో, ఆర్ఎస్‌డీటీ భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు.

**5 ఫిర్యాదులు..** విజయనగరం పట్టణం: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అయిదు ఫిర్యాదులు వచ్చాయని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

### అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి

కొత్తవలస: చినరావుపల్లి, పెదరావుపల్లి రెవెన్యూల్లో అక్రమ మైనింగ్, అనధికారికంగా పేలుడు చేస్తున్నట్లు పి.వెంకటేష్ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్‌కి వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. కొన్ని నెలలుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందని, పేలుళ్ల వల్ల స్థానికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అనారోగ్య సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

శృంగవరపుకోట: పోతనాపల్లి గ్రామానికి చెందిన జి.సత్తిబాబును ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడిగా ఎంపిక చేస్తూ రాష్ట్ర ఛైర్మన్ పి.శ్రీనివాస చక్రవర్తి నుంచి ఉత్తర్వులు అందినట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎరుకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## అధ్యక్షుడిగా నియామకం



కంటోన్మెంట్: విజయనగరంలోని అయ్యన్నపేట శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా వల్లూరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈయన గతంలో ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. కార్యదర్శిగా జి.గోవిందరావు, కోశాధికారిగా ఆర్.సి.హెచ్.అప్పలనాయుడుతో పాటు మరో 13 మందికి కొత్త కార్యవర్గంలో చోటు దక్కింది.

## పీజీఆర్ఎస్‌కు డుమ్మా

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు పలు విభాగాల అధికారులు డుమ్మా కొట్టారు. ప్రతి వారం ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కొందరు ఆలస్యంగా హాజరవుతున్నారు. దీంతో అర్జీదారులు ఇబ్బంది పడుతున్నారు.

## కేసులు నమోదు చేస్తాం

కొత్తవలస, నెల్లిమర్ల(డెంకాడ): ఈ నెల 31న రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మత్తులో వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని సీఐ సీహెచ్.షణ్ముఖరావు సోమవారం తెలిపారు. రేసుల పేరిట వాహనాలు అతివేగంతో నడపొద్దన్నారు. పట్టణ పరిధిలో డ్రోన్ కెమెరాలు ఎగరేసి మద్యం తాగుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

## విద్యార్థులకు అవగాహన..

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: నగరంలోని గాజులరేగ నారాయణ పాఠశాలలో బాల్య వివాహాలను నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.నారాయణరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు 1098 ఆకృతిలో కూర్చుని అలరించారు.

## రీసర్వేకు సిద్ధంగా ఉండాలి

విజయనగరం గ్రామీణం: విజయనగరం మండలం జమ్మునారాయణపురం రెవెన్యూలో జనవరి 2 నుంచి రీసర్వే నిర్వహించడానికి రెవెన్యూ, సర్వే అధికారులు సిద్ధమవుతున్నారు. ఈక్రమంలో అన్నదాతలు అందుబాటులో ఉండి సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి తహసీల్దారు గాంధీ తెలిపారు.

## చెత్త తొలగింపు

విజయనగరం పట్టణం: వినాయకనగర్ వద్ద ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త గుట్టలు, మురుగునీటి పారుదలకు పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు తీసుకున్నారు. 'ఈనాడు'లో ఈనెల 26న కాలనీలు సమస్యల వాకిళ్లు శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

## పలకల ఏర్పాటు

స్పందనకు వందనం

జామి: స్థానిక బజారు వీధిలో కాలువపై పలకలు లేక పోవడంతో ప్రజల ఇబ్బందులపై ఈనాడులో ప్రమాదం పలకరిస్తోంది శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆదేశాల మేరకు ఈవో ప్రసాదరావు పలకలు వేయించారు.

## కల్వర్టుకు మరమ్మతులు

విజయనగరం పట్టణం: నగరంలోని బాబామెట్ట ఉడాకాలనీ ఫేజ్- 2లో కల్వర్టు పలక ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. దీనిపై 'ఈనాడు'లో ఈనెల 23న ప్రచురితమైన చిత్ర కథనానికి డీఈఈ శ్రీనివాసరావు స్పందించి, బాగు చేశారు.

## వినియోగంలోకి మరుగుదొడ్డి

ఎల్.కోట: మండలంలోని గేదెలవానిపాలెం, రంగాపురం సచివాలయానికి సంబంధించి ఆర్ఎస్‌కే వద్ద మరుగుదొడ్డి వినియోగంలోకి తీసుకొచ్చారు. భవనం నిర్మించినా నీరు లేక ఎవరూ వాడటం లేదు. దీనిపై ఈనాడులో వార్త రావడంతో అధికారులు స్పందించి రూ.లక్ష వెచ్చించి వినియోగంలోకి తెచ్చినట్లు రక్షితమంచినీటి విభాగం ఇంజినీరు సన్యాసిరావు తెలిపారు.

## వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు

వేపాడ, శృంగవరపుకోట, జామి, ఉడాకాలనీ, కొత్తవలస, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని పలు వేంకటేశ్వర ఆలయాలు ముస్తాబయ్యాయి. మంగళవారం వేపాడ, శృంగవరపుకోట మండలాల్లోని వేంకటేశ్వర, వేణుగోపాల, జనార్ధన, గాయత్రి, విజయనగరం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, కొత్తవలస మండలంలోని పలు దేవస్థానాలు, భీమసింగి కల్యాణ వేంకటేశ్వరస్వామి, పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు.

పుణ్యగిరిలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి

## ధాన్యం కొనుగోలుకు చర్యలు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పౌర సరఫరాల ఉప తహసీల్దారు ఇందిర, వ్యవసాయాధికారి హరికృష్ణ తెలిపారు. సోమవారం వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. 40 వేల గోనె సంచులు అవసరమని గుర్తించారు. మిల్లర్లకు 1:3 కొనుగోలుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ట్రక్ షీట్లు జారీలో ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. చీపురుపల్లి, గంట్యాడ మిల్లులను జోడించామని, రైతులు సహకరించాలన్నారు.


**డాక్యుమెంట్ పోయినది**

నా క్లయింట్ బాడితమాని రాజమ్మ W/o. రాము ఇచ్చిన సమాచారం ప్రకారం ఆమె తన ఇంటి నెం. 5-60.బ్లాకు పెద తాడివాడ గ్రామ పంచాయతీ, డెంకాడ మండలం, విజయనగరం జిల్లా మరియు అసెస్‌మెంట్ నెం. 864 గల ఇంటి తాలూకా డాక్యుమెంట్ నెం. 1697/2003 తన పాత ఇంటి నుండి ఇంటికి షిఫ్ట్ అవుతుండగా ఆ డాక్యుమెంట్ పోయినది అని విజయనగరం జిల్లా డెంకాడ మండలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసియున్నారు. కావున పై లింకు డాక్యుమెంట్ ఎవ్వరికైనా దొరికిన క్రింది అడ్రస్‌వారికి సమాచారం ఇవ్వగలరని పై డాక్యుమెంట్‌తో ఎవరైనా ఎటువంటి వ్యవహారము జరిపిన అది చెల్లుబాటు కాదని మరియు నా క్లయింటును బంధింపజాలదని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము.

K.H.V.A.Naidu, B.Com,B.L Advocate & Notary
# 5-5-6, Gavara Veedhi, Vizianagaram - 535 001
Cell: 94401 43107, Ph:08922-233107


## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

క్రీడాకారులతో భీశెట్టి బాబ్జీ, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పౌరవేదిక జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. సోమవారం నగరంలోని నేషనల్ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల జిల్లా స్థాయి ఖోఖో పోటీలను ప్రారంభించారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. పాఠశాల డైరెక్టర్ వెంకటరావు, ప్రిన్సిపల్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## దైనందిని ఆవిష్కరణ

కొత్తవలస, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(ఏపీ యూటీఎఫ్) కొత్తవలస మండల శాఖ ఆధ్వర్యంలో 2026 కాలమానిని, దైనందినిలను ఎంపీపీ ఎన్.గోపమ్మ, ఎంఈఓ-2 బి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ జి.జయప్రకాష్ నారాయణ సోమవారం విడుదల చేశారు. ఆ శాఖ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఈశ్వరరావు, బి.సురేష్ కుమార్, గౌరవ అధ్యక్షురాలు సీహెచ్.నిర్మలాదేవి, సహాధ్యక్షులు పి.కనకరత్నం, కోశాధికారి పి.సూరి అప్పారావు, జి.పార్వతి, జి.వెంకటనాయుడు పాల్గొన్నారు.

## గ్రామాలను విడదీయొద్దు

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

విజయనగరం ఉడాకాలనీ, జామి, న్యూస్‌టుడే: జామి మండలం భీమసింగి పంచాయతీ పరిధిలోని తెలగపాలెం, కంది శ్రీరామపురం గ్రామాలను శాసనాపల్లి పంచాయతీలో సోమయాజుపాలెం కలిపి ప్రత్యేక పంచాయతీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం తగదని భీమసింగి, శాసనాపల్లి సర్పంచులు జొన్నాడ వెంకటలక్ష్మి, బసవ వెంకట అప్పారావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆయా ప్రాంతాల వారితో కలిసి నిరసన తెలిపారు. స్థానిక నాయకులు తప్పుడు నివేదిక పంపించారని, గ్రామస్థుల ఆమోదం లేకుండా విడదీయడం సరికాదన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విజయనగరం పట్టణం: నిర్వహణ పనుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ టౌన్ డివిజన్ ఈఈ పి.త్రినాథరావు తెలిపారు. బ్యాంకు కాలనీ, శ్రీరామ్‌నగర్, గోపాల్‌నగర్, ఇందిరానగర్, నాగోజీపేట, రైల్వేస్టేషన్ రోడ్, బొత్సపేట, సెంట్రల్‌బ్యాంకు ఏరియా, తిరుమల ఆసుపత్రి, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీనగర్, నరసింహానగర్, సాయినగర్, నాయుడు కాలనీ, షిర్డీకాలనీ, సిద్ధార్థనగర్‌కు సరఫరా ఉండదన్నారు.

## కార్మిక హక్కుల పరిరక్షణే లక్ష్యం

పూసపాటిరేగ, నెల్లిమర్ల, వేపాడ: కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా సిటూ పోరాటాలు చేస్తుందని ఆ సంఘ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ అన్నారు. 31న విశాఖలో నిర్వహించనున్న అఖిల భారత మహాసభల నేపథ్యంలో పూసపాటిరేగలో సోమవారం బైక్ ర్యాలీ చేపట్టారు. నెల్లిమర్ల, వేపాడలోనూ ఆ పార్టీ నాయకులు కార్యక్రమాలు చేపట్టారు.

(c) eenadu

# ఈనాడు పశ్చిమగోదావరి

మంగళవారం డిసెంబరు 30, 2025




# గిరి.. భక్తజన ఝురి

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల క్షేత్రంలో కొలువైన శ్రీవారి గిరి ప్రదక్షిణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ తొలిమెట్టు వద్ద నుంచి ప్రారంభమైన ప్రదక్షిణ శేషాచల పర్వతం చుట్టూ ఆరు కి.మీ. మేర సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు గోవింద నామస్మరణతో తరించారు.

**వైభవంగా శేషాచల ప్రదక్షిణ**

కిటకిటలాడిన భక్తజనం, అంతరచిత్రంలో స్వామివారు

తొలుత శ్రీవారి రథాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రచార రథంలో కొలువైన స్వామికి అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో మూర్తితో కలిసి జెండా ఊపి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు, గోవింద స్వాములు స్వామిని శరణు వేడుతూ అత్యంత భక్తి శ్రద్ధలతో శేషాచలం చుట్టూ తిరిగారు. ప్రచార రథంలో కొలువుతీరిన స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించిన భక్తకోటి పరమానందాన్ని పొందింది. మార్గం మధ్యలో భక్తులకు దాతల సహకారంతో టీ, కాఫీ, పాలు, తాగునీరు అందించారు.

స్వామివారి నిజరూప దర్శనం.. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం భక్తులకు, గోవింద స్వాములకు శ్రీవారి నిజరూప దర్శన భాగ్యం కల్పించారు. ఈఈ భాస్కర్, డీఈ సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## దీవించమ్మా.. మావుళ్లమ్మ

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ అమ్మవారు సోమవారం భక్తులకు పునఃదర్శనమిచ్చారు. ఉదయం 11.30 గంటలకు ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ, ఆగమ పండితుడు జంధ్యాల గంగాధర్‌శర్మ, వేదపండితులు పూజలు నిర్వహించారు. తొలిగా ఆవు దూడలతో అమ్మవారికి దర్శనం కల్పించారు. భక్తులు అద్దంలో అమ్మవారి ప్రతిబింబాన్ని చూసిన తర్వాత మావుళ్లమ్మను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అమ్మవారిని దర్శించుకున్నారు. జనవరి 13 నుంచి ఆలయ వార్షిక మహోత్సవాల ప్రారంభం సందర్భంగా మూలవిరాట్‌కు, ఆభరణాలకు ప్రత్యేక ముస్తాబు చేసే నిమిత్తం ఈ నెల 17 నుంచి దర్శనం నిలిపివేశారు.

## మహిళా సమాఖ్యలకు ఆర్థిక దన్ను

**నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే:** ఆదర్శ మహిళా సమాఖ్యలను ఆర్థికంగా బలపరిచేలా ప్రభుత్వం స్థిరీకరణ నిధి(రివాల్వింగ్ ఫండ్) ద్వారా అదనపు రుణాల మంజూరుకు చర్యలు చేపట్టింది. క్రమం తప్పని పొదుపు, ఆదర్శ నిర్వహణతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న మండల సమాఖ్యలను ప్రోత్సహించడంతో పాటు వాటి ద్వారా మహిళా సంఘాలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసింది.

**స్థిరీకరణ నిధితో అదనపు రుణాలు**

**మూడు విడతల్లో..** జిల్లాలో ఎంపిక చేసిన క్లస్టర్ స్థాయి ఫెడరేషన్ నమూనా మండలాలకు మూడు విడతల్లో రూ.5 లక్షల చొప్పున అందించనున్నారు. తొలి విడతలో తణుకు, ఆచంట, తాడేపల్లిగూడెం, నరసాపురం, రెండో విడతలో అత్తిలి, యలమంచిలి, పాలకోడేరు, ఉండి, మూడో విడతలో అత్తిలి, యలమంచిలి మండల సమాఖ్యలకు నిధులు మంజూరయ్యాయి. వీటి నుంచి ప్రతి సభ్యురాలికి రూ.50 వేల చొప్పున రుణంగా అందించనున్నారు. ప్రతి నెలా వాయిదాల రూపంలో అసలు, వడ్డీ తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. మండల సమాఖ్యల బలోపేతానికి, సభ్యులు అదనపు రుణాలు పొందేందుకు ఈ నిధి ఉపయోగపడుతుందని డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ తెలిపారు.

## ఆ చావులు.. సారాజ్యంలోనివే!

- తేల్చిన సిట్
- 25 కుటుంబాల్లో తీరని విషాదం

ఈనాడు ఈటీవీ కథనం

**2022 మార్చి...** ప్రశాంతమైన జంగారెడ్డిగూడెం ఉలిక్కిపడింది.. ఏ ఇంట చూసినా.. రోదనలు.. ఆర్తనాదాలు.. ఏం జరిగిందని తెలుసుకునే లోపే.. 25 ప్రాణాలను బలితీసుకుంది సారా.. ఈ విషాదకర ఘటన జరిగి మూడేళ్లయినా.. ఇంకా ఆ కుటుంబాల్లో కన్నీటిధారలు ఇంకా తడారలేదు.

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** గత వైకాపా ప్రభుత్వం వీటిని సారా మరణాలు కాదని కొట్టిపారేసింది. ప్రతిపక్షాలు, ప్రజలు గగ్గోలు పెట్టినా కాదని బుకాయించింది. కొందరు న్యాయంపై ఆశతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. అప్పటి పోస్టుమార్టం నివేదిక, మృతుల శరీర భాగాల్లో గుర్తించిన రసాయనాల ఆధారంగా.. అవి కల్తీ సారా మరణాలని దర్యాప్తు బృందం తాజాగా నిర్ధరించింది.

**వీధిన పడ్డ కుటుంబాలు..** మృతుల్లో అత్యధికులు శ్రామికులు, రోజు వారీ కూలీలు. ఇంటికి ఆధారమైన రక్త సంబంధీకులను కోల్పోయిన కుటుంబాల పరిస్థితి ఒక్కసారిగా తల్లకిందులై వీధిన పడ్డాయి. భర్తలను కోల్పోయిన భార్యలు తమ పిల్లల కోసం చిన్నచిన్న పనులు చేస్తూ నెట్టుకొస్తున్నారు.

**రేపు ఇంట్లో వేడుకనగా..** మా అబ్బాయి పితాని రమణ చనిపోయాక మా మనవలు ఇద్దరినీ చదివించలేక మాన్పించాం. నా కోడలు విజయలక్ష్మి హోటల్‌లో పనిచేస్తోంది. నేను పాఠశాలలో పారిశుద్ధ్య పనులు చేస్తున్నా. రేపు మా మనవరాలి పుష్పాలంకరణ వేడుకనగా ముందు రోజు నా కొడుకు చనిపోవడం మా కుటుంబంలో తీరని వేదన మిగిల్చింది. **- పితాని లక్ష్మి**

**ఒడిశా నుంచి వచ్చి ఒంటరిగా..** పొట్ట కూటి కోసం ఒడిశా నుంచి వచ్చాం. నా భర్త ఉపేంద్ర బైల్న్ ఆటోకింద పని చేసేవారు. మాకు ఇద్దరు పిల్లలు. కల్తీసారా తాగి చనిపోయే నాటికి 30 ఏళ్లు. ఆయన బతికుండగా నేను ఎప్పుడూ గడప దాటలేదు. ఇప్పుడు ఇద్దరు పిల్లలతో దుర్భర జీవితం అనుభవిస్తున్నాం. కూలికి వెళ్తే రోజు రూ.200 ఇస్తున్నారు. **- సునాని ప్రియ**

**పోస్టుమార్టం నివేదికా ఇవ్వలేదు** మా నాన్న అప్పారావు చనిపోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోస్టుమార్టం నివేదిక మాత్రం ఇవ్వలేదు. అప్పట్లో చంద్రబాబు చేసిన రూ.లక్ష సాయం అమ్మ వెంకటలక్ష్మికి వైద్యం చేయించడానికి ఉపయోగపడింది. ప్రస్తుతం పక్షవాతం, బోదకాలుతో ఇబ్బంది పడుతోంది. **- ఎం. లీలాప్రకాష్**

**దుర్భర జీవితం నెట్టుకొస్తున్నాం..** మా అబ్బాయి చదువు మానేసి పనులు చేసుకుంటున్నాడు. మా అమ్మాయిని 8వ తరగతితోనే మాన్పించేశా. నా భర్త పోలయ్య జీవించి ఉంటే మా పిల్లలకు ఈ దుస్థితి వచ్చేది కాదు. వంట పనులు చేసే ఆయన మమ్మల్ని ఎంతో బాగా చూసుకునేవారు. ఆయన చనిపోయాక మేము వీధిన పడ్డాం. దుర్భర జీవితంతో బతుకుతున్నాం. **- వెంకటలక్ష్మీ దుర్గ**

## గల్లీ నుంచి దిల్లీకి చిన్నారుల ప్రాజెక్టు

నగదు చెక్కు నమూనా అందుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల బృందం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ఉండి మండలం చెరుకువాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆలోచన దిల్లీకి చేరనుంది. రాష్ట్రస్థాయిలో ప్రథమం సాధించి విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి రూ. 25 వేలు నగదు బహుమతి పొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు సమగ్ర శిక్ష ఏపీసీ పి.శ్యాంసుందర్ తెలిపారు. వృత్తి విద్య పాఠ్యాంశాలు అమలవుతున్న పాఠశాలలకు జిల్లాస్థాయిలో నవంబరులో పోటీలు నిర్వహించగా.. ఎంపికైన ఎనిమిది బృందాలను రాష్ట్రస్థాయికి పంపించారు. వాటిలో ఒకటైన చెరుకువాడ పాఠశాల విద్యార్థుల స్మార్ట్‌హౌస్ ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైంది. దిలీప్, జోసెఫ్‌రాజు, కేశవ్‌హృదయ్, సాత్విక్ తదితర విద్యార్థులతో పాటు ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ నిశాంతకుమార్‌ను ప్రధానోపాధ్యాయుడు అక్బర్ చక్రవర్తి, సమగ్రశిక్షా సీఎంవో చంద్రశేఖర్, ఒకేషనల్ విద్య జిల్లా నోడల్ అధికారి దీవెనమ్మ అభినందించారు.

## మూడో శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ప్రతి నెలా మూడో శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. వికలాంగుల చట్టం-2016 పుస్తకాన్ని ఆమె సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రత్యేక గ్రీవెన్స్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాడు కట్టలేదు.. నేడు పట్టలేదు

### అసంపూర్తిగా పాఠశాలల భవనాల పనులు

పరిశీలన

**భీమవరం పట్టణం, నరసాపురం, పాలకొల్లు, న్యూస్‌టుడే :** కార్పొరేట్.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతామంటూ నాటి వైకాపా సర్కారు చెప్పుకొచ్చింది. నాడు-నేడులో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టింది. నిధులివ్వక పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. దీంతో మొండిగోడల మధ్య విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు. కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరిన బడులకు ప్రతిపాదనలే చేయలేదు. పట్టణాల్లో అధునాతన భవనాల మధ్య ఉన్న పాఠశాలల్లో చేపట్టిన పనులను 'న్యూస్‌టుడే' పరిశీలించింది.

'నాడు- నేడు' కార్యక్రమంలో తొలి దశలో 2019-20 సంవత్సరంలో పనులు ప్రారంభించారు. రెండో దశలో 2022-23లో ఇంకొన్ని పాఠశాలలు ఎంపిక చేశారు. మూడో దశలో మరికొన్ని ఎంపిక చేసినా పనులు పూర్తికాలేదు. కొన్నిచోట్ల పనులను వదిలేయడంతో ఇటుకలు, ఇనుప ఊచల్లో విషసర్పాలు ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. దాంతో విద్యార్థులు భయపడుతున్నారు.

- నరసాపురంలోని పీచుపాలెం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో దాదాపు 65 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ మూడు తరగతి గదులే ఉన్నాయి. దీంతో గదుల మధ్యలో ప్లైవుడ్ అట్టలు ఏర్పాటు చేసి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు.

- భీమవరం ఝాన్సీలక్ష్మీబాయి బాలికోన్నత పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా నిలిచిన భవనమిది. ఐదు తరగతులకు 567 మంది విద్యార్థినులు ఉన్నారు. 15 గదులు ఉండాలి. ప్రస్తుతం ఉన్న 10 గదుల్లోనే కూర్చొంటున్నారు.
- నరసాపురం లెనిన్ ఉన్నత పాఠశాల ఆవరణలో నాలుగు అదనపు తరగతి గదుల పనులు నిలిచాయి. ప్రభుత్వం రూ. 42 లక్షలు మంజూరు చేసినా నిధులు రాక బేస్‌మెంట్‌లోనే పనులు ఆగిపోయాయి. ఇక్కడ ఉన్న గదుల్లోనే విద్యార్థులు సర్దుకుంటున్నారు.
- తాడేపల్లిగూడెం, పాలకొల్లులోని పలు పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో బకాయిలు రూ.6 కోట్లు ఉన్నాయని.. మరో రూ. 50 కోట్లు అవసరమని ప్రభుత్వానికి పంపామని' సమగ్ర శిక్షా ఏపీసీ పి. శ్యాంసుందర్ తెలిపారు.

| మొత్తం పాఠశాలలు | తొలివిడత ఎంపికైనవి | రెండో దశ | మూడో విడత |
|---|---|---|---|
| 1372 | 588 | 635 | 149 |

మొత్తం కేటాయించిన నిధులు రూ.254.70 కోట్లు
విడుదల కావాల్సింది- రూ. 6 కోట్లు

## కొయ్యలగూడెంలో ఆయుధాగారం

**ఏర్పాటుకు నౌకాదళ అధికారుల సంసిద్ధత**

**ఈనాడు-ఏలూరు:** కేంద్ర రక్షణ శాఖకు సంబంధించిన నౌకాదళ ఆయుధాగారాన్ని కొయ్యలగూడెం మండలంలో ఏర్పాటు చేయడానికి విశాఖ నేవీ అధికారులు అంగీకరించారు. ఈ ప్రాంతంలో నేవీ డిపో ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదని జిల్లా యంత్రాంగానికి తెలియజేశారు. ఈనెల 18న వారు కొయ్యలగూడెం వచ్చి స్థలాన్ని పరిశీలించారు. పర్యటన విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఇంతకు ముందే జీలుగుమిల్లి మండలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించగా... ఆ ప్రాజెక్టు వద్దని గిరిజన సంఘాలు ఆందోళనలు చేశాయి. ప్రాజెక్టు చేజారిపోకుండా ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ప్రత్యామ్నాయంగా కొయ్యలగూడెం మండలంలో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ముందుగానే అక్కడి రైతులతో సంప్రదింపులు జరిపి భూములు ఇవ్వటానికి స్థానిక నాయకులు, రైతులను ఒప్పించారు.

**రెండు జాతీయ రహదారుల మధ్య..** కొయ్యలగూడెం మండలం మీదుగా ఒకవైపు ఖమ్మం-దేవరపల్లి, మరోవైపు జీలుగుమిల్లి వయా బుట్టాయగూడెం, పోలవరం వెళ్లే జాతీయ రహదారులు ఉన్నాయి. దీంతో వీటి మధ్య ఉన్న ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఉండటంతో రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తవని నేవీ అధికారులు భావించి ఇక్కడ ఏర్పాటుకు సంసిద్ధం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రూ. 2500 కోట్లతో ఈ ప్రాజెక్టు పెట్టడానికి ఏడాది క్రితమే కేంద్రం అంగీకరించింది.

**భూసేకరణకు చర్యలు..** ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతం కొయ్యలగూడెం మండలంలో ఉన్నా జాతీయ రహదారులకు అనుసంధానం కావడానికి కొంత పక్కనే ఉన్న గోపాలపురం నియోజకవర్గంలో 2, 3 గ్రామాల పరిధిలో భూములు సేకరించాల్సి వస్తోంది. ఈ మేరకు భూసేకరణకు చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు సూచించినట్లు ఎంపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## తలవని రోజుండదు.. ఏడవని ఘడియ ఉండదు

- గర్భశోకం మిగుల్చుతున్న యువత
- ఏడాది చివరిలోనే ప్రమాదాలెక్కువ

➡ ఈ నెల 22న పెనుమంట్ర మండలం పొలమూరు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు యూత్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న తర్వాత స్పోర్ట్స్ బైక్‌పై వెళ్తూ అదుపు తప్పడంతో గోడను ఢీకొట్టి మరణించారు.

➡ ఏలూరు జిల్లా భీమడోలు మండలం సూరప్పగూడెం సమీపంలో శనివారం ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. పూల డెకరేషన్ వృత్తితో కుటుంబాలకు ఆసరాగా ఉంటున్న వీరి మృతితో తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలింది.

➡ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి రెండేళ్ల కిందట స్వగ్రామం గరగపర్రుపాలెం వచ్చిన శ్రీనివాస్ మిత్రులతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పాలకోడేరు మండలం గొల్లలకోడేరు వంతెన దగ్గర లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనతో అతనిపై ఆధారపడిన భార్య, ఇద్దరు పిల్లలు నిరాశ్రయులయ్యారు. కుటుంబ సభ్యులు మానసిక క్షోభలోనే ఉండగా, కుమారుడు సాయి తండ్రిని నిత్యం తలచుకుంటూ రోదిస్తూనే ఉన్నారు.

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే**

గత ఏడాది చివరలో పోలీసులు విడుదల చేసిన నేర నివేదికలో ప్రమాదాలతో ఎక్కువ మంది మృతి చెందినట్లు తేలింది. మృతుల్లో యువత అధికంగా ఉండటం ఆందోళన కలిగించింది. రెండేళ్లుగా పరిశీలిస్తే ఏడాది పొడవునా జరిగిన ఘటనలతో పోల్చితే డిసెంబరు, జనవరి నెలల్లో అంటే పండగలు, కొత్తేడాది వేడుకల సమయాల్లో అయినవే అధికంగా ఉన్నాయి. శిరస్త్రాణం ధరించకుండా ముగ్గురు, నలుగురు యువకులు ద్విచక్రవాహనాలపై కంటికి కనిపించనంత వేగంగా వెళ్లిపోతున్నారు. స్నేక్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. కొత్త సంవత్సరంలోకి అడుగెడుతున్న వేళ తల్లిదండ్రులు, పోలీసులు అప్రమత్తం కావాలి.

| ఏడాది | ప్రమాదాలు | అందులో యువత | డ్రంక్ అండ్ డ్రైవ్ |
|---|---|---|---|
| 2023 | 554 | 410 | 954 |
| 2024 | 538 | 442 | 922 |
| 2025 | 440 | 342 | 740 |

**తీవ్రత ఎందుకు..?**

జిల్లాలోని రహదారుల్లో 60 కిలోమీటర్ల వేగానికి మించి వాహనం వెళ్తే నియంత్రణ కోల్పోతారు. స్పోర్ట్స్‌బైక్‌లు అయితే ఇక వేగానికి హద్దు లేదు. నిర్మానుష్య రోడ్లపై గతంలో కనిపించే ర్యాష్ డ్రైవింగ్ ఇప్పుడు రద్దీ వేళల్లోనూ ఉంటోంది. 50 శాతం ప్రమాదాలకు మత్తు కారణమంటున్నారు.

## ఇక హలో.. హలో

**కుక్కునూరు, కొయ్యలగూడెం, న్యూస్‌టుడే**

హలో హలో.. సిగ్నల్ సరిగా లేదు. ఎత్తైన ప్రదేశానికి వచ్చి చేస్తా.. జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం మండలాల్లోని మారుమూల గ్రామాల వారికి ఫోన్ చేస్తే... తరచూ వినిపించే మాటలివి. ఈ మూడు మండలాల్లో సమాచార సంబంధాలు లేని పల్లెలు కోకొల్లలు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాకు 45 సెల్‌టవర్లు మంజూరు చేసింది. 'డిజిటల్ భారత్ నిధి' పథకం కింద కేంద్రం కొత్త టవర్ల ఏర్పాటు ఖర్చును భరిస్తుండగా, కావాల్సిన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోంది.

**సర్వేలు పూర్తి...** కొత్త టవర్లలో ఎక్కువ శాతం సమాచార వ్యవస్థ అందుబాటులో లేని ఏజెన్సీ గ్రామాల్లో ఏర్పాటు చేయబోతున్నారు. సామర్థ్యానికి మించి ఫోన్లు ఉండి, తరచూ అంతరాయం ఏర్పడుతున్న మైదాన ప్రాంతాల్లోనూ కొన్నింటిని నిర్మించనున్నారు. ఈ టవర్ల ఏర్పాటుకు సంబంధించి సర్వేలు దాదాపు పూర్తయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఒక టవర్ ఏర్పాటు చేయనున్నారు.

## సత్వర పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌లు

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** రెవెన్యూ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడం కోసం కలెక్టరేట్‌లో సోమవారం రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్ నాగరాణి వాటిని ప్రారంభించారు. జిల్లాలో ఎక్కువగా భూసంబంధ సమస్యలుంటున్నాయని వీటి ద్వారా వాటిని త్వరగా పరిష్కరించొచ్చన్నారు. మొదటి రోజు వాటి ద్వారా 59 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. తర్వాత పీజీఆర్ఎస్‌లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 221 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## భూములు కరిగి.. తోటలు ఒరిగి!

గోదావరి నది కోతకు అద్దం పట్టే చిత్రమిది. యలమంచిలి, ఆచంట, నరసాపురం మండలాల్లో వశిష్ఠ గోదావరిని ఆనుకుని వందల ఎకరాల్లో కొబ్బరితోటలు ఉన్నాయి. ఇవి సారవంతమైన నేలలు కావడంతో ఎకరా ధర ప్రస్తుతం రూ.కోటి వరకు పలుకుతోంది. కొబ్బరి ధరలు కూడా రెండేళ్లుగా పెరగడంతో రైతులకు కనీస ఆదాయానికి ఢోకా లేదు. ఇంతటి విలువైన భూములు గోదావరి కోతకు గురై నదీగర్భంలో కలిసిపోతుండటం రైతన్నలను ఆవేదనకు గురిచేస్తోంది. కోత నివారణకు గ్రోయన్లు నిర్మించాలని అన్నదాతలు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, పాలకొల్లు**

## అమ్మను తలచి.. భక్తితో కొలిచి..!

ఏలూరు పడమర వీధి గంగానమ్మ జాతర నేత్రపర్వంగా సాగుతోంది. అమ్మవారు కొలువుదీరిన మేడ ప్రాంగణంలో పంబలి రామారావు మహిళా వేషధారణలో సోమవారం రేడ కపిరి ముగ్గు వేశారు. నృత్యం చేస్తూ జాతర చరిత్రను వివరించారు. **- న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం**

## పండగ ప్రయాణమా?

**వాట్సాప్‌లో ఆర్టీసీ బస్సు టికెట్లు పొందండి**

**నూజివీడు, మండవల్లి, న్యూస్‌టుడే:** సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు అదనంగా బస్సులు నడపనుంది. టికెట్ బుకింగ్ కోసం బస్టాండ్, నెట్ సెంటర్‌కు వెళ్లి సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సులువుగా టికెట్ పొందే అవకాశం కల్పించారు. సాధారణ సమయాల్లోనూ ఈ సేవలను పొందొచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారిణి షేక్ షబ్నం తెలిపారు.

**ఇలా చేయాలి..** వాట్సాప్ ద్వారా ఆర్టీసీ బస్సు టికెట్లు బుక్ చేసుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన 95523 00009 నంబరును సేవ్ చేసుకోవాలి. దానికి వాట్సాప్‌లో హాయ్ అని సంక్షిప్త సందేశం పంపి.. ఆర్టీసీ సేవలను క్లిక్ చేస్తే టికెట్ బుకింగ్ ఐచ్ఛికం వస్తుంది.

ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే నిర్ధారణ సందేశం మీ వాట్సాప్‌కే వస్తుంది.

## యూరియా సరఫరాలో లోటుపాట్లు రాకూడదు

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** రబీ సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచాలని, ఎలాంటి లోపం తలెత్తకుండా చూడాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వారితో సోమవారం జేసీ గూగుల్‌మీట్ నిర్వహించారు. మండలం వారీగా ఎంత అవసరమో ప్రణాళిక రూపొందించాలన్నారు. ఒక్కో రైతు సేవా కేంద్రం పరిధిలో పది మంది రైతులతో ముఖాముఖి కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు, పౌరసరఫరాల సంస్థ డీఎం ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు. భీమవరం రైతుబజారులో కూరగాయల ధరలు బయటిమార్కెట్ కంటే తక్కువగానే ఉన్నాయని జేసీ పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అక్కడ అందుతున్న సేవలపై చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సంతృప్తిగా ఉందన్నారు.

(c) eenadu

## గోడలే పుస్తకాలు.. బొమ్మలే పాఠ్యాంశాలు!

ప్రాథమిక పాఠశాలల్లో బీఏఎల్ఏ విధానం

నరసాపురం, పట్టణం, పెనుమంట్ర, మొగల్తూరు, న్యూస్‌టుడే: పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం పలు సంస్కరణలను అమల్లోకి తెచ్చింది. ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా కొత్త తరహా బోధన పద్ధతులను ప్రవేశపెట్టింది. తెలుగు పదాలు చదవడం, ఆంగ్ల అక్షరాలు, చిన్న పదాలు చదవడం, లెక్కల్లో కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం సులువుగా నేర్చేలా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) విధానాన్ని వచ్చే ఏడాది మార్చి 24 వరకు ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించనున్నారు.

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు: 1,195

నరసాపురం: గోడలపై చిత్రాల ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయిని

**ఆసక్తి పెంచేలా..** పాఠ్యాంశాలపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచడంతో పాటు వాటిని సులువుగా నేర్చుకునేలా తరగతి గది గోడలపై అక్షరాలు, పదాలను రాయించడంతో పాటు చెట్లు, జంతువులు, వస్తువుల బొమ్మలు వేశారు. ఉపాధ్యాయులు వాటి ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఈ విధానంతో పాఠ్యాంశాలను చిన్నారులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**అన్ని చోట్లా అమలు..** ఈ విధానాన్ని జిల్లాలో అన్ని పాఠశాలల్లో అమలు చేయనున్నారు. దీని ద్వారా చిన్నారులకు పాఠ్యాంశాలపై ఆసక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పిల్లలు ఉన్నత పాఠశాలలకు వెళ్లే సరికి ఆయా అంశాలపై పూర్తిస్థాయి పట్టు సాధించేలా చేయడమే ఈ విధాన లక్ష్యం. - నారాయణ, డీఈవో

## పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం

ఏపీనిట్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పాలిటెక్నిక్ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలున్నాయని.. సాంకేతిక విద్యలో ప్రపంచం మెరుగుపడుతుందని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025ను జిల్లా క్రీడల పరిశీలకుడు గుణరంజన్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఆర్ట్స్, సైన్స్, సాంకేతిక తదితర రంగాల విద్యకు సంబంధించిన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 12 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 550 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, షటిల్, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ పశుపతి ప్రసాద్, ఏపీ ట్రైబల్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

## 11న రాష్ట్రస్థాయి శరీర సౌష్టవ పోటీలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లులో జనవరి 11న రాష్ట్ర స్థాయి శరీర సౌష్టవ (బాడీ బిల్డింగ్) పోటీలు నిర్వహిస్తున్నట్లు నవ్యాంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జిందపల్లి వాసు తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బాడీ బిల్డింగ్‌లో 8 కేటగిరీల్లో, మెన్స్ ఫిజిక్‌కు సంబంధించి రెండు విభాగాల్లో నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రంలో అన్ని జిల్లాలకు చెందిన యువత పాల్గొంటారన్నారు. ఎంపికైనవారు జనవరి 26న చెన్నైలో జరిగే దక్షిణ భారతదేశ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

## ఖర్చులపై నివేదిక కోరిన ఉన్నతాధికారులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పాలకొల్లు ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకురాలిగా విధుల నిర్వహణ సమయంలో చేసిన వివిధ ఖర్చులకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని డాక్టర్ సి.గీతా కుమారిని ప్రభుత్వం కోరింది. ప్రస్తుతం భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో పనిచేస్తున్న గీతాకుమారి 2019లో పాలకొల్లు ప్రాంతీయ ఆసుపత్రిలో పనిచేశారు. అప్పట్లో డైట్ ఛార్జీలు, చెడు మందు బిల్లులు, ఆరోగ్యశ్రీలో చికిత్స పొందిన రోగులకు చెల్లించిన బిల్లుల వివరాలను కోరుతూ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

## కలెక్టర్ పేరిట నకిలీ ఖాతా

అధికారిక పేజీ నిలుపుదల

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు సామాన్యులే కాదు.. కలెక్టర్లనూ మోసగిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా అధికారుల పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. ఏకంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతా తెరిచి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపుతున్నారు. వాటిని అంగీకరించిన వారిని బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్నారు. కలెక్టర్ పేరిట జిల్లా ఉన్నతాధికారులకు సందేశాలు పంపుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ దృష్టికి వెళ్లింది. ప్రజల సౌలభ్యం నిమిత్తం వెట్రిసెల్వి పేరుతో కలెక్టరేట్ సిబ్బంది కలెక్టర్ పేజ్‌(ఎఫ్‌బీ) ఖాతా క్రియేట్ చేశారు. ఇందులో పాలనాపరమైన విషయాలు పోస్టు చేస్తుంటారు. దీన్ని అవకాశంగా తీసుకున్న సైబర్ నేరగాళ్లు నకిలీ ఖాతా సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నారు. అధికారిక పేజీ నిలుపుదల చేసినట్టు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. తన పేరిట ఏదైనా పోస్టులు వస్తే స్పందించవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నారు.

## గిన్నిస్‌బుక్‌లో నాట్యమయూరాలు

భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం-2 పేరిట హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల 4,608 మంది కళాకారులు 40 నిమిషాల పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. కైకలూరు శ్యామలా నాట్య కళామండలి నిర్వాహకురాలు కె.లక్ష్మీజ్యోతి ఆధ్వర్యంలోని సుమారు 20 మంది చిన్నారులు ఈ వేడుకలో నృత్య ప్రదర్శన చేసి. . గిన్నిస్ బుక్ ప్రతినిధుల చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు తదితరులు చిన్నారులకు అభినందనలు తెలియజేశారు. - న్యూస్‌టుడే, కైకలూరు

## అర్జీలు పునరావృతం కానీయొద్దు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను చట్ట పరిధిలో పరిష్కరించి ఆ వివరాలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని అదనపు ఎస్పీ వి.భీమారావు ఆదేశించారు. భీమవరం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమానికి 21 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిపై సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడారు. అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు, ఎస్.బి సీఐ కె.వి.వి.ఎన్ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ భీమారావు

## స్వల్ప కాలం.. అధిక లాభం..

బంతిపూల సాగులో సత్ఫలితాలు సాధిస్తున్న యువ రైతు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన బి.నరేశ్‌కు చిన్నతనం నుంచి వ్యవసాయమంటే చాలా ఇష్టం. దీంతో తండ్రికి తోడుగా నడిచారు. స్వల్ప కాలంలోనే ఆదాయం వచ్చే రకాలను సాగు చేయాలనే దృఢ నిశ్చయంతో ముందుకు సాగుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూరగాయలతోపాటు పూలతోటల పెంపకం తదితర వాటిని నిశితంగా పరిశీలించారు. దీంతో బంతిపూల సాగును చేయాలని నిశ్చయించుకున్నారు. ఇక్కడి వాతావరణం బంతి పూలకు అనువుగా ఉంటుందో లేదో తెలుసుకునేందుకు తాను కౌలుకు తీసుకున్న ఎకరంలో మట్టి నమూనా పరీక్షలు చేయించడంతోపాటు తోటి రైతుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. అంతా బాగా ఉందని తేలడంతో బెంగళూరు నుంచి బంతిపూల మొక్క ఒక్కోటి రూ.4కి కొనుగోలు చేసి ఎకరాకు 8 వేల మొక్కలు నాటారు. ప్రస్తుతం ఆదాయం బాగుండటంతో బంతితో పాటు చామంతి తదితర పూల తోటలను పెంచేందుకు ప్రణాళిక చేశారు.

జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో నరేశ్ పండిస్తున్న బంతి తోట

**ఉత్తమ సస్యరక్షణ చర్యలతో..** మొక్కలు నాటే ముందు భూమిలో పశువుల పేడ, ఇతర వ్యర్థాలను వేసి దున్నుతారు. అనంతరం మొక్కలు నాటి వాటి మొదట్లో కొంచెం పశువుల పేడ, ఇతర సేంద్రియ ఎరువులను మొక్క ఎదుగుదలకు వాడుతున్నారు. చీడపీడల నివారణకు జీవామృతం, ఇతర సేంద్రియ కషాయాలతోపాటు రసాయనాలను వినియోగించి ఎకరాకు 3 టన్నులకు పైగా దిగుబడి సాధిస్తున్నారు.

**ఖర్చులు తక్కువ..**

'పూల సాగుకు కూలీలతోపాటు ఎరువుల ఖర్చులు చాలా తక్కువ. అంతరపంటగా వేస్తే బాగుంటుంది. ఏడాది పొడవునా పూలు పూస్తాయి. రూ.2 లక్షలు ఆదాయం వస్తోంది.' అని రైతు నరేశ్ తెలిపారు.

పండిన పూలను బస్తాల్లో నింపి జంగారెడ్డిగూడెం మార్కెట్‌లో కిలో రూ. 50కు పైగా విక్రయిస్తున్నారు.

## రైతేరాజు

**ప్రశ్న:** మినప పంటలో ఆకులపై రంధ్రాలు పడి మచ్చలు వస్తున్నాయి. నివారణ ఎలా ?

**- కోరాడ సోములు, లింగపాడు**

**సమాధానం:** వరి మాగాణుల్లో నేరుగా విత్తిన మినుము ఆకులు, కొమ్మలను పొగాకు లద్దె పురుగు కొరికి తినేస్తాయి. దీని వల్ల ఆకులకు రంధ్రాలు పడతాయి. వీటి నివారణకు ఎకరానికి 1500 పీపీఎం వేప నూనె లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెలుగు నివారణకు మెటలాక్సిల్+మాంకోజెబ్ 2 గ్రా./లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

## వరి సాగులో నారే కీలకం

మార్టేరు, న్యూస్‌టుడే: ఆరోగ్యకరమైన నారు తయారు చేసుకోవడం ద్వారా వరిలో సాగులో మంచి దిగుబడి పొందేందుకు అవకాశం ఉంటుందని మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. నారుమడి తయారీ, విత్తన మొలక, ఇతర విషయాలను ఆయన వివరించారు. దృఢమైన నారును పొందాలంటే నేలను విత్తేందుకు 10-12 రోజుల ముందు బాగా దున్ని, కలుపు లేకుండా చదును చేయాలి. ప్రతి 100 చదరపు మీటరు(రెండున్నర సెంట్లు) ఒక కిలో నత్రజని విత్తనం జల్లే ముందు వేసుకోవాలి. అరకిలో భాస్వరం, అరకిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే సమయాల్లో భాస్వరం రెట్టింపు వేయాల్సి ఉంటుంది. ప్రతి సెంటుకు ఐదు కిలోల విత్తనం అవసరం. విత్తనం ఎక్కువ అయితే నారు బలహీనంగా తయారవుతోంది. నాటిన తర్వాత మూన తిరగడం ఆలస్యమవుతుంది. మొలక కట్టిన విత్తనం వేయడం మంచిది. విత్తనాన్ని 16-24 గంటల నీటిలో నానబెట్టి 36 గంటలు మండి కట్టినట్లయితే మొలక త్వరగా వస్తుంది.

## పండుగప్పలో నష్ట నివారణ ఇలా

నరసాపురం, న్యూస్‌టుడే: ఆక్వా చెరువుల్లో సాగుచేస్తున్న పండుగప్ప (సీబాస్) చేపలకు ఇటీవల వ్యాధులు విజృంభిస్తున్నాయి. తాటాకు, జలగ, రెడ్‌డిసీజ్ వంటివి సోకి అవి మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల వాటికి ఆహారంగా రొయ్య తలకాయలు, ఇతర వ్యాధికారక చేపలు వినియోగిస్తున్నారు. వీటి ప్రభావంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వాటిలో వ్యాధుల ఉద్ధృతి తగ్గించి నష్టాల నుంచి గట్టెక్కవచ్చని భీమవరానికి చెందిన ఆక్వా నిపుణుడు అడబాల గోపాలరావు సూచించారు.



వ్యాధి సోకిన చేపలు

**ఇవీ కారణాలు**

స్ట్రెప్టోకోకస్, విబ్రియో వంటి బ్యాక్టీరియా ప్రభావంతో పండుగప్ప చేపలకు రెడ్‌డిసీజ్ సోకుతుంది. దీని ప్రభావంతో చేప శరీరంపై ఎర్రటి మచ్చలు, పుండ్లు ఏర్పడతాయి. వాటి కళ్లు పైకి పొడుచుకువస్తాయి. పేగు వరుపు వస్తుంది. ఫ్లావో, కాలమ్‌నారె అనే బ్యాక్టీరియా ప్రభావంతో పండుగప్పలకు తాటాకు తెగులు సోకుతుంది. దీని ప్రభావంతో మొప్పల మొప్పైలపై, కింద భాగంలో మచ్చలు ఏర్పడి పాలిపోతాయి. తోకభాగము తినేసినట్లు ఉంటుంది. మొప్పలకు లెర్నాంత్రోపస్ వంటి పరాన్న జీవులు అతుక్కుని రక్తం పీల్చడంతో చేపలు బలహీనపడి వ్యాధులు సోకుతాయి.

**నిపుణుల సూచనలతో..**

నీటి నాణ్యత బాగుండేలా చూడటం, చెరువు నీటిలో విషవాయువులు పెరగకుండా చూడటం ద్వారా రెడ్‌డిసీజ్, తాటాకు తెగులు సోకకుండా నివారించవచ్చు. ఈ తెగుళ్ల నివారణకు ప్రభుత్వ అనుమతి ఉన్న వ్యాధి నిరోధక మందులు, జలగ నివారణకు పురుగు మందులను నిపుణుల సూచనల మేరకు వినియోగించాలని గోపాలరావు సూచించారు.

## చలిలో జీవాలు జాగ్రత్త

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: శీతాకాలంలో చలిగాలులతో గొర్రెలు, మేకలకు రోగాలు సోకే ప్రమాదం ఉంది. ఈక్రమంలో సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యుడు కర్పూరం విజయకుమార్ తెలిపారు. మేకలు, గొర్రెలకు చలిగాలులు తగలకుండా ఆవాసాలు ఏర్పాటు చేయాలి. బలవర్థకమైన గ్రాసం అందించాలి. ✦ జీవాలకు న్యూమోనియా సాధారణం. దీని నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. వాటి కడుపులో పాముల నివారణకు ఔషధాలు వేయాలి. పీపీఆర్, పొంగు నివారణకు తప్పకుండా టీకాలు వేయించాలి. ✦ మగ జీవాలు, గర్భిణులు, పిల్లలు, పెరుగుతున్న గుంపులను వేర్వేరు కొట్టాల్లో ఉంచాలి. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం సమయాల్లో కాకుండా 10గంటల నుంచి మధ్యాహ్నం వరకే మేపాలి. ✦ చలి, తేమ ప్రభావంతో ఫుట్ రాట్(కాలి తెగులు) సోకే ప్రమాదం ఉంది. దీని నివారణకు 5శాతం కాపర్ సల్ఫేట్, 10శాతం జింక్ సల్ఫేట్‌తో వాటి కాళ్లు, డెక్కలు శుభ్రపరచాలి.

కొలువుదీరిన పాలకమండలి సభ్యులతో ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు

## కూటమి పాలనలో ఆలయాల సమగ్రాభివృద్ధి

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కూటమి పాలనలో దేవాలయాలు సమగ్రాభివృద్ధి సాధిస్తున్నాయని ఎంపీ హరీశ్‌మాథుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాడపల్లి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని వసతి గదులు, డార్మిటరీ ఏర్పాటు, నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. పాలకమండలి అధ్యక్షుడిగా ఆత్రేయపురానికి చెందిన ముదునూరి వెంకటరాజు, సభ్యులుగా కొత్తపేట నియోజకవర్గానికి చెందిన శిస్థా సూర్యకుటుంబరావు, కాసా చాముండేశ్వరి, పెండెం కుమారి, సలాది నాగేశ్వరరావు, సరెళ్ల సరిత, ఏపుగంటి విజయకుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, యెల్లమిల్లి చంద్రకుమారి, మస్కపల్లి త్రిమూర్తులు (ప్రత్యేక ఆహ్వానితులు), కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ (పెద్దాపురం, కాకినాడ జిల్లా), దళపర్తి శ్రీలక్ష్మి (పామర్రు, కృష్ణా జిల్లా), గోసాల అప్పలనరస (పాయకరావుపేట, అనకాపల్లి జిల్లా), చలుమూరి రాంబాబు (ఆచంట, ప.గో జిల్లా), పెండ్యాల భవాని (పాలకొల్లు, ప.గో జిల్లా), గంగవరపు పద్మావతి (ఒంగోలు, ప్రకాశం జిల్లా), కొండపల్లి రామచందర్‌రావు (మహబూబాబాద్, తెలంగాణ), వాడపల్లి సుందర శేషావతారం (ఎక్స్ అఫీషియో, ఆలయ అర్చకుడు)లతో ఈవో నల్లం సూర్యచక్రధరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

## 4 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ఆరాధనోత్సవాల కర పత్రాలు ఆవిష్కరిస్తున్న అకాడమీ ప్రతినిధులు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: భీమవరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జనవరి 4 నుంచి 9 వరకు త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు అకాడమీ ప్రతినిధులు తెలిపారు. ఆర్యవైశ్య యువజన సంఘ భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో అకాడమీ అధ్యక్షుడు ఉద్దరాజు కాశీవిశ్వనాథరాజు, కార్యదర్శి కారుమూరి ఆదిత్య సభ్యులు కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. త్యాగరాజ భవనంలో 4న స్వామివారి ఊరేగింపుతో ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. సాయంత్రం మోహినీ భస్మాసుర నృత్య రూపకం, 5న చెన్నైకు చెందిన గాత్ర విద్వాంసులు పతంగి బ్రదర్స్ గాత్ర కచేరి ఉంటుందన్నారు. గౌరవాధ్యక్షుడు డాక్టర్ గంధం వెంకట విశ్వేశ్వరరావు, కోశాధికారి కారుమూరి సూర్యప్రకాశరావు, చెరుకువాడ వెంకట్రామయ్య, కారుమూరి బాబు, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సంక్రాంతి పండుగకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ● 07460 కాకినాడ టౌన్-వికారాబాద్ ప్రత్యేక రైలు జనవరి 8వ తేదీ సాయంత్రం 6.20 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి 9వ తేదీ ఉదయం 8 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది. ● 07461 వికారాబాద్-పార్వతీపురం ప్రత్యేక రైలు జనవరి 9, 11 తేదీల్లో వికారాబాద్‌లో రాత్రి 8.30గంటలకు బయలుదేరి 12వతేదీ మధ్యాహ్నం 2.30గంటలకు పార్వతీపురం చేరుకుంటుంది. ● 07462 పార్వతీపురం-వికారాబాద్ ప్రత్యేక రైలు జనవరి 10 తేదీల్లో సాయంత్రం 6.30 గంటలకు పార్వతీపురంలో బయలుదేరి 11వ తేదీ ఉదయం 11.30 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది. ● 07463 పార్వతీపురం-కాకినాడటౌన్ ప్రత్యేక రైలు 12వ తేదీ సాయంత్రం 6.30కి పార్వతీపురంలో బయలుదేరి 13వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు కాకినాడ టౌన్ చేరుతుంది. ● 07464 సికింద్రాబాద్-పార్వతీపురం ప్రత్యేక రైలు జనవరి 8వ తేదీ రాత్రి 10 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి 09వ తేదీ మధ్యాహ్నం 2.30గంటలకు పార్వతీపురం చేరుకుంటుంది.

## యూటీఎఫ్ జిల్లా కమిటీ నియామకం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పి.ఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శిగా పోలిశెట్టి క్రాంతికుమార్ నియమితులైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కౌన్సిల్ సమావేశం పెంటపాడులోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిందన్నారు.

## నేడు ఉత్తర ద్వార దర్శనం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 30న ముక్కోటి పర్వదినాన భక్తులు ఆలయ ఉత్తర ద్వారం నుంచి వెండి గరుడ వాహనంపై కొలువైన శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఇందుకోసం శ్రీవారి ఆలయం ముస్తాబైంది. రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. మంగళవారం ఉదయం 5 గంటలకు ఆలయ ఉత్తర ద్వారాలు తెరిచి దర్శనం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 35 వేల మందికి పైగా భక్తులు వస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా తాత్కాలిక క్యూలు ఏర్పాటు చేశారు. శ్రీవారి ఉత్తర ద్వారాన్ని, ఆలయ ప్రాకారాన్ని పుష్పాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

విద్యుద్దీపకాంతులతో ఆలయం

## నేత్రపర్వం.. శ్రీవారి గ్రామోత్సవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తొళక్కం వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ వేడుక కనుల పండవగా జరిగింది. మహిళా భక్తులు అడుగడుగునా కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. గ్రామంలో ఊరేగుతున్న స్వామిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించారు.

### నేటి నుంచి అధ్యయనోత్సవాలు

ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 9 వరకు అధ్యయనోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ ఉత్సవాల సమయంలో సాయం కాలం జరగాల్సిన ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## ప్రతి భక్తుడికీ సంతృప్తికర దర్శనం : కలెక్టర్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి రోజున ప్రతి ఒక్క భక్తుడికి సంతృప్తికరమైన దర్శనం కలిగేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయంలో ముక్కోటి ఏర్పాట్లను ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం దేవస్థానం అతిథి గృహంలో అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీవారిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకునే అవకాశం ఉందన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్లలో భక్తుల మధ్య తోపులాటలు లేకుండా, చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భద్రతను పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాల ద్వారా అన్ని ప్రదేశాల్లో పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ, డీఎంహెచ్‌వో డా.పి.జె.అమృతం, డీఎస్పీ శ్రావణ్ కుమార్, ట్రైనీ ఐపీఎస్ జయశర్మ, ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న వెట్రిసెల్వి, ప్రతాప్ శివకిశోర్, వెంకటరాజు

## విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

ప్రధానోపాధ్యాయుడిపై కేసు

పోడూరు, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడిపై సోమవారం పోడూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై సుధాకరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో ఓ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న మైలే నాగేశ్వరరావు ఈ నెల 26న 4, 5 తరగతులు చదువుతున్న బాలికలను పాఠశాల భవనం పైకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించారు. భయాందోళనలకు గురైన ఆ బాలికలు భవనంపై నుంచి కిందకు వచ్చి అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినికి విషయం చెప్పారు. ఆమె విద్యార్థినుల తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో సోమవారం గ్రామస్థులు, విద్యాకమిటీ ఛైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలకు వచ్చి హెచ్ఎంను నిలదీయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

## ప్రేమ పేరిట వంచన

యువకుడిపై కేసు

పోడూరు, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట యువతిని నమ్మించి మోసగించిన యువకుడిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పోడూరు పోలీసులు తెలిపారు. ఎస్సై సుధాకరరెడ్డి కథనం ప్రకారం.. పోడూరు మండలంలో ఓ గ్రామానికి చెందిన ఓ యువతి, అదే ప్రాంతానికి చెందిన చిలకలపూడి కేశవ ప్రేమించుకొన్నారు. కేశవ ఆ యువతిని తనతో బయటకు రావాలని పలుమార్లు బలవంతం చేశాడు.. రాకపోతే హత్య చేస్తానని బెదిరించి నరసాపురం తదితర ప్రాంతాలకు తీసుకువెళ్లి ఆమెతో ఏకాంతంగా గడిపాడు. ఈ నేపథ్యంలో వివాహం చేసుకోవాలని అడిగితే నిరాకరించాడు. దీంతో బాధిత యువతి పోలీసులను ఆశ్రయించారు. కేశవతో పాటు చిలకలపూడి మసేన్, సరోజనిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## కారుమూరి సహా 13 మందిపై కేసు

తణుకు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సహా 13 మందిపై తణుకు గ్రామీణ ఠాణాలో కేసు నమోదు చేశామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 25న రాత్రి తేతలి వైజంక్షన్‌లోని ప్రభుత్వ భూమిలో సెక్షన్ 30 అమలులో ఉండగా వైకాపా నాయకులు గుమిగూడి వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా వద్దని పైడిపర్రు వీఆర్‌వో అడ్డుకున్నారు. అయినా వినకుండా ధర్నా నిర్వహించి ప్రజా రవాణాకు ఆటంకం కలిగించారని పైడిపర్రు వీఆర్‌వో మహమ్మద్ మొహిద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, సీతారాం, పాండు, వెంకటేశ్వరరావు అలియాస్ జగన్, అరిగెల రాజేశ్, పాల్, మరిశెట్టి గిరి, జల్లూరి జగదీష్, పులవర్తి కుమార్, యిండుగుపల్లి బలరాం, స్వామి, లోకేశ్, పంజా శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని మృతి

ఎల్.అగ్రహారం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఒకరు మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి సోదరుడు ఈగల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం ఈగల గణేష్(21)కు తండ్రి లేకపోవడంతో తల్లితో కలిసి ఉంటున్నాడు. ఇటీవల ఇల్లు నిర్మాణం చేపట్టి అప్పుల పాలయ్యాడు. తిరిగి చెల్లించలేక మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై తాడేపల్లిగూడెం గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై జేవీఎన్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మాదకద్రవ్యాల విక్రేత అరెస్టు

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తిని బాలాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా కుర్మల్‌గూడ మల్లాపూర్‌లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నారన్న సమాచారంతో సోమవారం బాలాపూర్ పోలీసులు దాడులు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతానికి చెంది... నగరంలోని కొండాపూర్‌లో నివాసముంటున్న నాగిడి జానకీ శ్రీరామ్‌ను అరెస్టు చేసి సోదా చేయగా మాదకద్రవ్యాలు లభించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడు జానకీశ్రీరామ్

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

వెహికల్ ఫర్ సేల్ In as is where is Condition 2023 SCV TATA ACE HT Diesel. రిజి.నెం. AP 39 UP 7303. సుందరం ఫైనాన్స్ లి॥, భీమవరం. ✆ 94409 09782, 94935 45721.

JOBS

ప్రముఖ వ్యాపార సంస్థకు అనుభవంగల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (Male) కావలెను. Q: ఇంటర్, డిగ్రీ. ✆ 95504 29786, 96763 93938.

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీ సర్వీసెస్ తణుకులో పనిచేయుటకు 25మంది సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8గం॥డ్యూటీ. W/H. జీతం: 15000/- + PF +ESI. ✆ 95818 58667

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE

LAND FOR SALE

2 ఎకరాల 20 సెంట్లు చేపల చెరువు అమ్మకం. దొడ్డనపూడి గ్రామం కాళ్ల మండలం, భీమవరం, ప॥ గో॥ జిల్లా, సెల్: 8500405678, 9885912559

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.65 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

## కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

**వీరవాసరం, న్యూస్‌టుడే:** సంక్రాంతి ముసుగులో కోడి పందేలు, ఇతర జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఏవీ.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి బాధ్యులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పండుగ నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందేలు, ఇతర జూదాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించినట్లు తెలిపారు.

## నిబంధనలు పాటించండి: సీఐ

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, వేగంగా దూసుకెళ్లినా, శబ్దాలు చేసినా కేసులు నమోదు చేస్తామని ప్రకటనలో తెలిపారు.

# భీమవరం

• భీమవరం • ఉండి

## సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి బి. జాయ్‌కుమార్ సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మంగం వేణు తెలిపారు. జనవరి 3 నుంచి 6 వరకు కె.ఎల్.యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

| | |
|---|---|
| భీమవరం పట్టణం: 80085 74471 | భీమవరం గ్రామీణం: 80085 74474 |
| భీమవరం మండలం: 80085 74533 | వీరవాసరం: 80085 74475 |
| పాలకోడేరు: 80085 74467 | ఉండి: 80085 74526 |
| ఆకివీడు: 80085 74525 | కాళ్ల: 94401 04042 |

**వీరవాసరం, న్యూస్‌టుడే:** ? వీరవాసరం పశ్చిమ పంట కాలువలోకి స్థానికులు మురుగు నీటి గొట్టాలు ఏర్పాటు చేయడంతో కాలువ కలుషితమవుతోంది. - వెంకటరమణ

✔ పరిశీలించి కాలువలోకి ఏర్పాటు చేసిన మురుగునీటి గొట్టాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - జి. సత్యనారాయణ, జలవనరుల శాఖ ఏఈ, వీరవాసరం

? పెద్దగొల్లపాలెం - తలతాడితిప్ప రహదారి రెండు వైపులా గ్రామాలకు చెందినవారు చెత్త వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం మీదుగా ప్రయాణిస్తుంటే దుర్వాసన వస్తోంది. - వెంకటేశ్వరరావు

✔ వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - రాము, పంచాయతీ కార్యదర్శి, పెద్దగొల్లపాలెం

? ఆకివీడు: ఆకివీడు రైల్వే స్టేషన్ రోడ్డులో పలు చోట్ల చెత్త గుట్టలు, డ్రెయినేజీలో ఆటంకాలను సక్రమంగా తొలగించడం లేదు. -చిన్ని

✔ తొలగింపు పనులను చేయిస్తాం. -సాకేత్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆకివీడు

## హమ్మయ్య...సమస్య తీరింది

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి ప్రధాన పంట కాలువలో చెరుకుగుట్టపాలెం వద్ద అల్లుకుపోయిన తూడు తొలగింపు పనులు ఎట్టకేలకు చేపట్టారు. ఈనెల ఏడో తేదీన 'మేమున్నాం .. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు జలవనరులశాఖ ఏఈ పవన్ శంకర్ స్పందించి చర్యలు తీసుకున్నారు. ● ఈనెల 28న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తలకు అధికారులు స్పందించారు. ● ఎల్లమ్మ చెరువుకు వెళ్లే రహదారిలో వ్యర్థాలు పేరుకుపోవడంతో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి స్పందించి, పారిశుద్ధ్య కార్మికులతో వ్యర్థాల తొలగింపు పనులు చేయించారు. ● రాయకుదురులో చెత్తకుప్పలు, మురుగు కాలువల కారణంగా దోమలు వృద్ధి చెందుతుండగా.. పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ స్పందించి దోమల మందు పిచికారీ చేయించారు.

## పంట కాలువలో ప్రక్షాళన

**ఉండి, న్యూస్‌టుడే:** పెదపుల్లేరు పంట కాలువలో చెత్త ప్రక్షాళన పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈనెల 26న 'పూడికపోని పెదపుల్లేరు పంట కాలువ' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. ఉండి నుంచి పెదపుల్లేరు గ్రామం వరకూ మూడు కిలోమీటర్ల మేర ప్రవహించే ఈ పంట కాలువలో చెత్త ప్రక్షాళన తరువాత నీరు సాఫీగా ముందుకెళ్లింది. ఉండి, పెదపుల్లేరు గ్రామాల్లోని సుమారు రెండు వేల ఎకరాల్లో వ్యవసాయం, ఆక్వా సాగుకి ఈ కాలువలోని నీరే ప్రధాన ఆధారం. చెత్త ప్రక్షాళన తరువాత వ్యవసాయ పనులు అన్నిచోట్ల ప్రారంభమవుతాయని అన్నదాతలు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ఆకివీడులో అయిభీమవరం కూడలి సమీపంలోని శ్మశానవాటికకు వెళ్లే రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే సీసీ రోడ్డు నిర్మాణ పనులను గత శుక్రవారం ఏఎంసీ ఛైర్మన్ బొల్ల వెంకట్రావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు గండం ఉమా ప్రారంభించారు. తాను కొబ్బరికాయ కొట్టకుండా పనులను ప్రారంభించడంపై ప్రొటోకాల్ పాటించలేదని ఆకివీడు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధికారులపై ఆగ్రహించి పనులను నిలిపివేసిన విషయం విదితమే. ఈ విషయం తెదేపా నాయకులు ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఉపసభాపతి ఆదేశాలతో అధికారులు సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించారు.

## ప్రజల చెంతకే పుర సేవలు

### యాప్ వినియోగంతో ప్రయోజనాలు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే**

రెస్ట్ హౌస్ రోడ్డు, ఇందిరమ్మకాలనీ దగ్గర చెత్త వేసే డబ్బాలు పాడైపోయాయి. వాటి స్థానే కొత్తవి ఏర్పాటు చేయాలని జె.మహేశ్‌కుమార్ ఫిర్యాదు చేయగా, అధికారులు పరిష్కరించారు.

భీమవరం 28వ వార్డు నుంచి యనమదుర్రు వెళ్లే దారి గత కొన్నేళ్లుగా గుంతలతో ఉండేది. రహదారి అభివృద్ధి చేయాలని, కనీసం మరమ్మతులైనా చేయాలంటూ పి.రాంబాబు పురమిత్ర యాప్‌లో ఫిర్యాదు చేశారు. రహదారిని పూర్తిస్థాయిలో నిర్మించారు.

**డౌన్‌లోడ్ ఇలా..** మొబైల్ ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి pura mitra యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ సమయంలో ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసి, వినియోగించుకోవచ్చు. పట్టణంలోని సమస్యలను నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాల్సిన పని లేకుండా సేవలను యాప్ ద్వారా పొందవచ్చు. ఫిర్యాదులు పురపాలక ఆన్‌లైన్లో నమోదవుతాయి. సమస్యను చిత్రం రూపంలో అప్‌లోడ్ చేయొచ్చు.

**8 విభాగాల్లో 119 సేవలు..** పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకుని వాటిని పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం 'పుర మిత్ర' యాప్‌ను అందుబాటులో ఉంచింది. దీని ద్వారా సమస్యలు తెలియజేస్తే సంబంధిత పర్యవేక్షణ అధికారులు స్పందించి, పరిష్కార చర్యలు చేపడతారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పట్టణ ప్రణాళిక, పరిపాలన, ఇంజినీరింగ్, వీధి దీపాలు, రెవెన్యూ, పైపులైన్ లీకేజీలు, ఆక్రమణ నిర్మాణాలు, ప్రభుత్వ భూములు ఇలా 8 విభాగాల్లో 119 సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇంటి పన్ను చెల్లింపు, నీటి ఛార్జీలు చెల్లింపు, వ్యాపార లైసెన్సు దరఖాస్తు తదితర సేవలు పొందవచ్చు.

**సత్వర పరిష్కారం..** ఫిర్యాదులన్నీ ఏపీ పురపాలక ఎన్ఫ్యూర్ యాప్‌కు చేరతాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కేవలం గంటల వ్యవధిలోనే పరిష్కరించాల్సి ఉంటుంది. అలా చేయకపోతే పురపాలక సంబంధిత విభాగాధికారి, ఆపైన అధికారులకు ఫిర్యాదు వెళ్తుంది. సచివాలయ సిబ్బంది, అధికారులు సమన్వయంతో ఫిర్యాదులు పరిష్కరిస్తున్నారు. - కె.రామచంద్రారెడ్డి, పురపాలక కమిషనర్, భీమవరం

గత ఆరు నెలల్లో వచ్చిన ఫిర్యాదులు: 84 పరిష్కారమైనవి: 72

**ఎక్కువగా వచ్చే ఫిర్యాదులు:** చెత్త తరలింపు, ఖాళీ స్థలాలు, కుళాయి నీటి ఇబ్బందులు, వీధి దీపాలు వెలగకపోవడం.

జేపీ రోడ్డులో విద్యుత్తు కాంతుల్లో వేంకటేశ్వర ఆలయం

## ముక్కోటి ఏకాదశికి ఆలయాలు సిద్ధం

**భీమవరం సాంస్కృతికం, పాలకోడేరు, న్యూస్‌టుడే:** ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. భీమవరంతోపాటు వీరవాసరం మండలంలోని పాలకోడేరు, పెన్నాడ, గరగపర్రు, విస్సాకోడేరు, శృంగవృక్షం తదితర చోట్ల ఆంజనేయస్వామి, రామాలయం ఆలయాలను పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ఆవరణలో చలువ పందిర్లు ఏర్పాటు చేసి విద్యుత్తు దీపాలతో అలంకరించారు. మంగళవారం నుంచి ఆయా ఆలయాల్లో ముక్కోటి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి.

## క్విజ్‌లో మెరిశారు

### 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను భీమవరంలోని శ్రీకాకతీయ మెరిట్ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. క్విజ్ పోటీలో పి.కార్తికేయ(7వ తరగతి), ఎస్.హృతిక్(9వ తరగతి), ఆర్.చరణ్‌కుమార్(9వ తరగతి), వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా బహుమతులను పాఠశాల ఛైర్మన్, డైరెక్టర్ అక్కినేని కృష్ణకిశోర్ పర్యవేక్షణలో ఏవో పి.రమాదేవి, ఏడీ పి.రమేష్ అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న శ్రీకాకతీయ ప్రతినిధులు

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** ఆధ్యాత్మిక చింతన అందరూ అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సతీమణి సత్యవాణి అన్నారు. నాచువారి కాడలిలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవంలో సోమవారం ఆమె పాల్గొని మాట్లాడారు. స్వామివారిని దర్శించుకున్న ఆమెను కమిటీ సభ్యులు గద అందించి సత్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. వేడుకలు ముగింపు సందర్భంగా మంగళవారం అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

## రైతులకు అండగా నిలవాలి: ఎమ్మెల్యే

**అనాకోడేరు(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సూచించారు. ఈలంపూడి సహకార సంఘం ఛైర్మన్ మంతెన త్రినాథరాజు, డైరెక్టర్లు యర్రంశెట్టి లక్ష్మణ్, బొక్కా శ్రీనివాస్‌లతో ఆయన సోమవారం ప్రమాణస్వీకారం చేయించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు రైతులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



కమిటీ ప్రతినిధులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రామాంజనేయులు

## రాళ్ల కుప్పలా.. రైల్వే ట్రాక్

**వీరవాసరం, న్యూస్‌టుడే:** వీరవాసరం - పెనుమంట్ర రహదారిలో వీరవాసరం రైల్వే గేటు ట్రాక్ అధ్వానంగా ఉంది. రైలు పట్టాలకు ఇరువైపులా కుప్పలా పోసిన రాళ్లు, ట్రాక్‌కు రెండు వైపులా దెబ్బతిన్న రహదారి కారణంగా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే గేటు ప్రాంతంలో రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే ఇంజినీరింగ్ విభాగం పాలకొల్లు సెక్షన్ సీనియర్ ఇంజనీర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రాక్ మధ్య మరమ్మతులకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## మురుగు..రోడ్డుపై పరుగు

**శృంగవృక్షం(పాలకోడేరు), న్యూస్‌టుడే:** శృంగవృక్షం దుర్గమ్మ ఆలయం వీధిలో రోడ్డు మలుపు వద్ద డ్రెయిన్ నిండిపోవడంతో మురుగు నీరంతా రోడ్డు పైకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లల్లోని చెత్త, వ్యర్థాలు డ్రెయిన్‌లో వేయడంతో మలుపు వద్ద అడ్డుపడి పై నుంచి వస్తున్న మురుగు నీరంతా ప్రధాన రహదారిపైకి ప్రవహిస్తుందని స్థానికులు వాపోతున్నారు. దీంతో దోమలు, దుర్వాసనతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. డ్రెయిన్‌లోని చెత్త, వ్యర్థాలు తొలగిస్తేనే కాని మురుగు సమస్య పరిష్కారం కాదని స్థానికులు తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి కార్యదర్శి వెంకట్రాజు తెలిపారు.

## కార్లకు కట్టడి

**భీమవరం(కాళ్ల), న్యూస్‌టుడే:** నిత్యం రద్దీగా ఉండే భీమవరం ఫుట్‌పాత్ వంతెనపై నాలుగు చక్రాల వాహనాలు వెళ్లకుండా నిరోధించారు. వంతెన దిగువ భాగంలో పోలీస్ స్టేషన్లు, కోర్టులు, ఏరియా ఆసుపత్రి ఉండటంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉండేవి. దీంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోవడంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ పోలీసులు కార్లకు కట్టడి చర్యలు తీసుకున్నారు.

## రూ.1.99 కోట్లతో సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి ఏఎంసీలో రైతుల సంక్షేమం కోసం నూతన సదుపాయాల కల్పనకు రూ.1.99 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదిస్తూ పాలకవర్గం తీర్మానించింది. ఉండిలో ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు(శ్రీనుబాబు) అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో అక్టోబరు, నవంబరు నెలల్లో ఆదాయ, వ్యయ వివరాలను కార్యదర్శి ఎన్.మావుళ్లు సమర్పించారు. ఛైర్మన్ శ్రీనుబాబు మాట్లాడుతూ ఏఎంసీ ప్రాంగణంలో ఏడీఏ, ఏవో కార్యాలయాలు, ఆర్ఎస్కే, వ్యవసాయ ప్రయోగశాల, డీసీఎంఎస్ ఎరువులు, పురుగు మందుల దుకాణాలుండటంతో చిన్న, సన్నకారు, రైతులు అధికసంఖ్యలో వస్తున్నారన్నారు. అధికవర్షాలకు పిల్లర్లు ఒరిగిపోయి నిరుపయోగంగా ఉన్న కవర్డు షెడ్‌ని రైతుల సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ హాలుగా, ఓపెన్ ప్లాట్‌ఫామ్‌ను రైతుల విశ్రాంతి, భోజనశాలగా మార్చేందుకు ఉపసభాపతి, గౌరవాధ్యక్షులు రఘురామకృష్ణరాజు, పాలకవర్గం చర్చించి అంచనాలు తయారీకి ప్రతిపాదించామన్నారు. ఈనిర్మాణాలకు రూ.1.99 కోట్లు అవసరమని ఇంజనీర్లు తేల్చారన్నారు. వైస్ ఛైర్మన్ యడవల్లి వెంకటేశ్వరరావు, పాలకోడేరు సహకార సంఘం సభ్యుడు, ఏఎంసీ డైరెక్టర్ కొత్తపల్లి నాగరాజు, ఇతర సభ్యులు సమావేశంలో మాట్లాడారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు ఆకస్మిక మృతికి సంతాపంగా సమావేశం మౌనంలో పాటించారు. సాంబశివరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాంబశివరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాలకవర్గ సభ్యులు, అధికారులు

## క్రీడల్లో మరింత రాణించాలి: కలెక్టర్

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** విశాఖపట్నంలో డిసెంబరు 15 వరకు జరిగిన జాతీయ స్కేటింగ్ ఇన్‌లైన్ హాకీ, రోలర్‌హాకీ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు సోమవారం కలెక్టర్ నాగరాణిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె వారిని అభినందించారు. భవిష్యత్తులో క్రీడల్లో మరింత రాణించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సత్కారం

**రాయకుదురు(వీరవాసరం), న్యూస్‌టుడే:** విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీసేలా ఉపాధ్యాయులు పని చేయడం అభినందనీయమని జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాశ్‌నాయుడు, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన రాయకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.సాయిసుజిత్ డి.జయసాయిశ్రీనివాస్, ఎం.వినాయకభాస్కర్, ఎన్ఎల్ఎస్.సాయికుమార్‌లను సోమవారం పాఠశాలలో సత్కరించారు. గైడ్ ఉపాధ్యాయులుగా వ్యవహరించిన పి.గజేంద్ర గడ్కర్, ఎన్‌పీవీఎల్.లక్ష్మీ దుర్గలను ఉపాధ్యాయులు అభినంధించారు. సర్పంచి గెడ్డం భారతి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోలిశెట్టి సత్యనారాయణ, సొసైటీ ఛైర్మన్ తోట బుజ్జి, ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ శలా భవాని, ఉపాధ్యాయులు దేవిరెడ్డి పుల్లారావు పాల్గొన్నారు.

## బోధనోపకరణాలతో ఉత్తమ ఫలితాలు

**సీసలి(కాళ్ల), న్యూస్‌టుడే:** బోధనోపకరణ సామగ్రిని ఉపయోగించి కృత్యాధార బోధన జరపడం ద్వారా ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలు సాధించొచ్చని ఏపీసీ శ్యాంసుందర్ అన్నారు. సీసలి ఎంపీపీ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి జీఎఫ్ఎల్ఎన్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎంవో చంద్రశేఖర్, హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మద్యం అమ్మకాల సమయాన్ని సవరించండి

**ఆకివీడు, న్యూస్‌టుడే:** డిసెంబరు 30 నుంచి జనవరి 1వ తేదీ వరకు మద్యం అమ్మకాలను రాత్రి 7 గంటలకు ముగించాలని ఐద్వా ఆకివీడు పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. నూతన సంవత్సర వేడుకల పేరుతో అనేక మంది మద్యం తాగి రోడ్లపై మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ.. ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని, రోడ్డు ప్రమాదాలకు గురై కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని వివరిస్తూ సోమవారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి ఉదయ కుమారి, లావణ్య, కళ్యాణి, పద్మ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## అఖిల భారత మహాసభలను విజయవంతం చేయండి

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** విశాఖపట్టణంలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి డి.కల్యాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం గొల్లలకోడేరులో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి నినాదాలు చేశారు. సభలకు భారీ సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు తరలిరావాలని ఆమె కోరారు.

నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**భీమవరం గ్రామీణ :** విశాఖపట్నంలో జనవరి 4న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు వెంప, పెదగరువు, తుందుర్రు తదితర గ్రామాల్లో సోమవారం మోటారుసైకిళ్లయాత్ర చేసి ప్రచారం చేశారు.

## అదో తూతూమంత్రం తంతులా

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం) కార్యక్రమానికి కొన్ని మండలాల్లో పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకావడం లేదు. హాజరైనట్లు సంతకాలు పెట్టేసి వెళ్లిపోతున్నారు. మరికొన్ని శాఖల అధికారులు వారి సహాయకులను మాత్రమే పంపుతున్నారు. సోమవారం ఆకివీడు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీ-కోసం కార్యక్రమంలో కూడా ఇదే తంతు కనిపించింది. దీంతో వ్యయప్రయాసలకోర్చి దూరంగా ఉన్న భీమవరం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలోనే ఎక్కువగా అర్జీలు అందజేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాజరుకాని అధికారులు వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో బాబూరావు తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 8 అర్జీలు అందాయని తెలిపారు.

కొద్ది మందే హాజరైన అధికారులు

## కార్మిక చట్టాలు వర్తింప చేయాలి

**భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** గ్యాస్ డెలివరీ బాయ్స్‌పై వేధింపులు ఆపాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతోపాటు కార్మిక చట్టాలు వర్తింపచేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సీఐటీయూ అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలంటూ భీమవరం గ్యాస్ డెలివరీ బాయ్స్ యూనియన్ సభ్యులు సోమవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీతారామయ్య, సింహాచలం, చంద్రరావు, వెంకన్న, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్‌లో ప్రథమం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల మహిళా జట్టు ప్రథమస్థానంలో నిలిచిందని పీడీ పి.సత్యనారాయణరాజు తెలిపారు. విజయవాడ వి.ఆర్ సిద్ధార్థ ఆవరణలో ఈ నెల 26, 27 తేదీల్లో పోటీలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారిణులు పెన్మెత్స రక్షిత, కె.తేజస్విని, ఎ.జాహ్నవిని డైరెక్టర్ ఎం.జగపతిరాజు, తాత్కాలిక ప్రిన్సిపల్ బీహెచ్.వి.ఎస్ రామకృష్ణంరాజు, సహాయ పీడీలు సీహెచ్ హరిమోహన్, జి.సారిక తదితరులు అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న జగపతిరాజు, రామకృష్ణంరాజు

### అవి ఇవి అన్నీ

## రేపు మండల సర్వసభ్య సమావేశం

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు ముఖ్య అతిథిగా పాల్గొనే ఈసమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వీరవాసరం, న్యూస్‌టుడే:** పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా రూ.2.90 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పీఏసీ ఛైర్మన్, భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారని ఎంపీడీవో వైభవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**లోసరి(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే:** నిర్మాణంలో ఉన్న లోసరి విద్యుత్తు కేంద్రం పనుల్లో భాగంగా అక్కడ విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో గొల్లవానితిప్ప ఉపకేంద్రం పరిధిలోని దెయ్యాలతిప్ప, లోసరి, తోకతిప్ప, గరవల్లదిబ్బ, నాగేంద్రపురం గ్రామాలతో పాటు వాటి పరిధిలోని ఆక్వా, పారిశ్రామిక లైన్లకు మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

## పంచాయతీపై బురద జల్లొద్దు

**సీసలి(కాళ్ల), న్యూస్‌టుడే:** సీసలి పంచాయతీలో అవకతవకలపై మాజీ సర్పంచి శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదు, ఆరోపణలలో వాస్తవం లేదని విచారణలో నిజాలు వెలుగు చూస్తాయని పంచాయతీ సభ్యులు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం వారు సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీలకు అతీతంగా గ్రామంలో ఉచితంగా పైపులైను కనెక్షన్లు ఇచ్చామని ఉద్దేశపూర్వకంగా బోర్డుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ అధికారులు వెంటనే విచారణ జరిపి నిజనిర్ధారణ చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచి బిళ్లకుర్తి ధనలక్ష్మి, ఉప సర్పంచి మాణిక్యాలరావు, సభ్యులు రాంబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రేమ, దయాగుణం...క్రీస్తు చూపిన మార్గం

**భీమవరం సాంస్కృతికం:** సాటివారిపై ప్రేమ, దయాగుణం ఏసుక్రీస్తు తెలిపిన మార్గం అని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు అన్నారు. పీపీ రోడ్డులో ఉన్న రూపాంతర దేవాలయంలో శ్రీవిజ్ఞాన వేదిక, అరసవల్లి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో ఆయన అతిథిగా పాల్గొని కేకు కోసి మాట్లాడారు. పేరిష్ పాస్టర్ నక్కా అశోక్‌బాబు ప్రత్యేక ప్రార్థన చేసి క్రీస్తు సందేశం ఇచ్చారు. ట్రస్టు ప్రతినిధులు, కూటమి నాయకులు, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ర్యాంపు ఏర్పాటుపై హర్షం

**భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** భీమవరం కలెక్టరేట్ సముదాయం వద్ద వికలాంగుల కోసం ర్యాంపు ఏర్పాటు చేయడం పట్ల వికలాంగుల సంక్షేమ సంఘం విసాస్ సదన్ జిల్లా అధ్యక్షుడు మద్దాల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉద్యాన రైతులకు అవగాహన సదస్సు..

**యలమంచిలి, న్యూస్‌టుడే:** దొడ్డిపట్లలో రైతుసేవా కేంద్రం వద్ద ఉద్యాన రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు టి.నాగలక్ష్మి, ఎస్.ఆదర్శ, జి.రంగన్న పాల్గొని మాట్లాడారు. కొబ్బరిలో తెల్లదోమ నివారణకు ఇసారెయా ద్రావణాన్ని లీటరు నీటికి 5. మి.లీ. కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తమలపాకు తోటల్లో ఎర్రనల్లి నివారణకు వెట్టబుల్ సల్ఫర్‌ను లీటర్ నీటిలో 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ

**ఉణుదుర్రు(ఉండి), న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు లయన్స్ ప్రతినిధులు విద్యా సామగ్రిని అందజేయడం శుభపరిణామమని ఉణుదుర్రు సర్పంచి పిన్నంరాజు నాగలక్ష్మి తెలిపారు. ఉణుదుర్రు, యండగండి గ్రామాల్లో ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి, హోమియో మందులు సోమవారం పంపిణీ చేశారు. లయన్స్ అధ్యక్ష, కార్యదర్శులు గాదిరాజు రంగరాజు, పెన్మెత్స రంగ ప్రసాదరాజు, మాజీ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు కె.వామనమూర్తి, ఎంకే శ్రీలక్ష్మి తదితరులు మాట్లాడారు.

ఉణుదుర్రులో లయన్స్‌క్లబ్ అందజేసిన పుస్తకాలతో విద్యార్థులు

## కరుగుతున్న మట్టి గుట్టలు

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి గ్రామ శివారు ఉప్పుగుంట వెళ్లే రహదారికి ఇరువైపులా కొండల్లా పేరుకుపోతున్న మట్టి, చెత్త గుట్టల తరలింపు పనులు అధికారులు ఎట్టకేలకు చేపట్టారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు అవాంతరాలు తొలగిపోనున్నాయి. ఈ ఏడాది అక్టోబరు 15న 'ప్రహసనంలా చెత్త సేకరణ', నవంబరు 17న 'మొక్కుతా. .ఆపనేదో చేయండి' శీర్షికన 'ఈనాడు'లో వార్తలు ప్రచురితం కాగా. . మట్టి, చెత్త తరలింపునకు అనువైన పల్లపు ప్రాంతాలను ప్రజాప్రతినిధులు గుర్తించారు. వాటిలో చినుకుపడితే చెరువులా మారిపోతున్న జడ్పీ స్థలాన్ని మెరక చేయడానికి నిర్ణయించి మట్టిపూడిక పనులు ప్రారంభించారు.

## నిమ్మనపేటలో చోరీ

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి నిమ్మనపేటలో తాళాలు వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. పేడ్డ రాము వ్యవసాయ కూలీ. ఉపాధి పనుల కోసం కుటుంబ సభ్యులతో కలిసి దూర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఆ క్రమంలో కొన్ని రోజుల కిందట వేరే ఊరు వెళ్లి సోమవారం ఉదయాన్నే ఇంటికొచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. లోపల భద్రపరిచిన 4 కాసుల బంగారం, వెండి వస్తువులు అపహరణకు గురైందనే సమాచారాన్ని పోలీసుస్టేషన్‌కు అందించారు. సంఘటనాస్థలిని ఉండి పోలీసులు, వేలిముద్ర నిపుణులు వచ్చి పరిశీలించారు. ఈసంఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

## చెరుకువాడలో ఇద్దరి మధ్య వివాదం

### కొట్టు ధ్వంసం .. నలుగురిపై దాడి

**చెరుకువాడ(ఉండి), న్యూస్‌టుడే :** చెరుకువాడలో సిగరెట్ కొనడానికొచ్చిన వ్యక్తికి.. దుకాణదారుకి మధ్య రేగిన వివాదం పెద్దదై నలుగురిని కొట్టి ఆ దుకాణాన్ని ధ్వంసం చేసిన సంఘటనపై సోమవారం కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. వారిచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. చెరుకువాడ గ్రామంలో ఆరేపల్లి శివ నాగు వెంకట సర్వేశ్వరరావు కిళ్లీ కొట్టు నడుపుకొంటున్నాడు. ఆకివీడుకు చెందిన జేమ్స్ అనే వ్యక్తి సోమవారం వచ్చి సిగరెట్ అడిగారు. ఆ దశలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు చెబుతున్నారు. జేమ్స్ మధ్యాహ్నం మరో 15 మందితో తిరిగొచ్చి సర్వేశ్వరరావుతో తిరిగి గొడవపడ్డాడు. ఆ దశలో సర్వేశ్వరరావు, అతని తల్లి, కుమారుడు, మరో వ్యక్తిని కొట్టి దుకాణాన్ని ధ్వంసం చేశారని నిందారోపణ. ఈసంఘటనపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## అందరి హృదయాల్లో నిలిచిన ఘంటసాల

**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** అందరి హృదయాల్లో నిలిచిన గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని డీఎస్పీ రఘువీర విష్ణు అన్నారు. ఘంటసాల జయంతి సందర్భంగా సోమవారం రాత్రి ఆనంద ఫంక్షన్ హాల్‌లో ఘంటసాల గాన గౌతమి ఆర్కెస్ట్రా ఆనంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సంగీత విభావరి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఘంటసాల గాయకుడు చిప్పాడ నాగేశ్వరరావు, గాయకులు ఆలపించిన ఆలనాటి పాత మధురాలు అందరినీ ఆకట్టుకున్నారు.

**దస్తావేజు పోయినది**

తోకల శ్రీనివాసరావు s/o సుబ్బారావు, డోర్ నం.2-1, అప్పారావుపేట, గుమ్ములూరు, ఆకివీడు మండలం, ప.గో.జిల్లా అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా. నా ఇంటి స్థలంకు సంబంధించి ఒరిజినల్ దస్తావేజు నెం.2019/2007 నెంబరు గల ఒరిజినల్ దస్తావేజు ది.25.12.25 న జిరాక్స్ నిమిత్తం మా ఇంటి వద్ద నుండి గుమ్ములూరు సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం వెళ్ళగా మార్గమధ్యలో పడిపోయినది దయచేసి దొరికిన వారు పై అడ్రస్‌కు సంప్రదించగలరు

ఇట్లు., తోకల శ్రీనివాసరావు

**CHANGE OF NAME**

I, TATAVARTHI SATYAVENI W/o. Tatavarthi srinivasu,D.No: 3-153, Main Road, Juvvalapalem, Kalla Mandalam, W.G.Dist - 534 236, A.P. I have changed my name from SATYAVANI NAREKEDAMILLI (Old name) to TATAVARTHI SATYAVENI (New name).Hence forth Iam being called TATAVARTHI SATYAVENI W/o.Tatavarthi srinivasu for all purposes.

(c) eenadu

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

## రబీ సాగుకు ఎరువులు సిద్ధం

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** రబీ సాగుకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ఎ.జోష్లిల తెలిపారు. మండలంలో 153 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రయివేటు డీలర్ల వద్ద 43 మెట్రిక్ టన్నులు, సహకార సంఘాలు, డీసీఎంఎస్ స్టోర్లలో 105 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. యూరియా బస్తాకు రూ.266.50 మాత్రమే చెల్లించి రైతులు కొనుగోలు చేయవచ్చన్నారు. ఎవరైనా అదనపు ధరకు విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ముత్యాలమ్మ గ్రామోత్సవం

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** మొగల్తూరులో కొలువైన నడివీధి ముత్యాలమ్మ గ్రామోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వచ్చే నెలలో అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు అంకురార్పణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

బాధ్యతలు స్వీకరించిన వెంకటరామిరెడ్డి

**నరసాపురం, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని నరసాపురం పురపాలక కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పురపాలక కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రధాన సమస్యలపై సిబ్బందిని ఆరా తీశారు. ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో డంపింగ్ యార్డు, పారిశుద్ధ్యం, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేసి పట్టణానికి మంచి గుర్తింపు తెచ్చేలా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయ సిబ్బంది, పలువురు అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత కమిషనర్ ఎం.అంజయ్య ఇటీవల అనంతపురం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

## శివదేవస్వామికి పంచామృతాభిషేకాలు

**పాలకొల్లు గ్రామీణ, ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో పార్వతీ సమేత శివదేవస్వామి ఆలయంలో సోమవారం ఉదయం పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని పట్టువస్త్రాలు, పూల మాలలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాలతో అభిషేకాలు, రుద్రాక్షలతో పూజలు నిర్వహించారు. 'హరిగాడు హరికథ' సినిమా హీరోయిన్ ప్రియాహెగ్డే, యూనిట్ సభ్యులు స్వామిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

**బసవేశ్వర స్వామి ఆలయంలో.. నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే:** నరసాపురం పట్టణంలోని బసవేశ్వర స్వామి ఆలయంలో సోమవారం క్షీరాభిషేకాలు, సహస్ర నామార్చనలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామికి పంచ హారతులు ఇచ్చారు.

## వైభవంగా ముక్కోటి మహోత్సవాలు

**నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే:** నరసాపురం పట్టణంలోని రాజగోపాల స్వామి, ఆదికేశవ ఎంబెరుమనార్ స్వామి ఆలయాల్లో ముక్కోటి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామివార్లకు పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు చేసి తులసి, పుష్పమాలలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

**నేడు ఉత్తర ద్వార దర్శనం:** ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామి ఆలయంలో ఉత్తర దర్శనం మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు ప్రారంభమవుతుందని అర్చకులు తెలిపారు.

**ఆచంట, న్యూస్‌టుడే:** ఆచంట పరిధి కాపులపాలెం రామాలయంలో లక్ష తులసి పూజ నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల్లోని ఆలయాల్లో ముక్కోటి మహోత్సవాలు శుక్రవారం వరకు కొనసాగనున్నాయి. కొడమంచిలిలో రథోత్సవం జరగనుంది.

### మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

| | |
|---|---|
| నరసాపురం :80085 74504 | ఆచంట :90631 44737 |
| పాలకొల్లు :80085 74510 | పెనుగొండ :80085 74469 |
| పోడూరు :90631 44741 | పెనుమంట్ర: 91212 29087 |

**నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే:** ? శివాలయం వీధిలో డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి సక్రమంగా తొలగించడం లేదు. మురుగు నిలిచిపోతోంది. **- బి. ఏసురాజు, నరసాపురం**
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- పాతుఝ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** ? గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంకు ప్రాంగణం అపరిశుభ్రంగా ఉంది. **- పి.సత్యనారాయణ, తూర్పుతాళ్లు (బందరుపేట)**
✔ ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేయించేలా గ్రామ కార్యదర్శికి సూచిస్తాం. **- కె.నాగేంద్రకుమార్, ఈఓపీఆర్డీ**

**పెనుగొండ, న్యూస్‌టుడే:** ? పెనుగొండ శివారు [illegible]బ్బులో ఆరు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- ఎన్.గంగారావు, స్థానికుడు**
✔ మరమ్మతులు చేయిస్తాం. **- సూర్యనారాయణ మూర్తి, ఎంపీడీవో**

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** ? ఇంజేటివారి పాలెంలో పలుచోట్ల వీధిదీపాలు పగటి పూట వెలుగుతున్నాయి. **- రాంబాబు**
✔ మరమ్మతులు చేయిస్తాం. **-మహేశ్, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి**

## పత్రికా పఠనంతో విజ్ఞానం
### 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

**నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే:** దిన పత్రికల పఠనంతో వర్తమాన వ్యవహారాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ విజ్ఞానం పొందవచ్చని అధ్యాపకులు పేర్కొన్నారు. నరసాపురంలోని శ్రీసూర్య కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'వర్తమాన అంశాలు- జనరల్ నాలెడ్జ్'లలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో బి. సూర్యప్రకాశ్ (జూనియర్ ఎంపీసీ), బి. శ్రీరామ్ (జూనియర్ ఎంపీసీ), పి. హాసిని (సీనియర్ బైపీసీ)లు విజేతలుగా నిలిచారు. కళాశాల కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, ప్రిన్సిపల్ యు. లక్ష్మీకాంత్, అకడమిక్ అడ్వయిజర్ బోయి రామచంద్రారెడ్డి, అధ్యాపకులు విజేతలకు బహుమతులు అందజేశారు.

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** పాలకొల్లు మండలం ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులు కేఎస్ఎస్ ధర్మన్, ఏఎస్ లలితాంజలి, డి.ప్రవీణ్‌రెడ్డి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ ఎంఎస్ వాసు, హెచ్ఎం ఎస్.వసంతలక్ష్మి, ఉపాధ్యాయిని ఎస్.ఉషాకుమారి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

## ఆగలేక.. ముందుకు సాగలేక!
### రూపు కోల్పోతున్న పంట కాలువలు

రాజుగారితోట పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

**పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, ఆచంట, నరసాపురం మండలాల్లో పంట కాలువలను చూస్తే రబీ పంట గట్టెక్కడం కష్టమనిపిస్తోంది. ఒక పక్క ఆక్రమణలు, మరోపక్క నిర్వహణ లోపాలతో నీటి వనరులన్నీ అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల రైతులు స్వచ్ఛందంగా ఉప కాలువలను బాగు చేసుకుంటున్నా ప్రధాన కాలువల్లో అవరోధాలు తొలగడం లేదు.

☛ పోడూరు మండల పరిధిలో 10 కిలోమీటర్ల మేర విస్తరించిన చించినాడ ఛానల్ 10 గ్రామాల సాగు, తాగునీటి అవసరాలకు ప్రధాన ఆధారం. ఈ కాలువ పొడవునా ఆక్రమణలు పెరిగిపోయాయి. మధ్యలో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరిగిపోయి అస్తవ్యస్తంగా మారింది. నీటి ప్రవాహం ముందుకు సాగకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

☛ నరసాపురం మండలంలో రుస్తుంబాద-సీతారాంపురం గ్రామాల మధ్య పంటకాలువ కనీస నిర్వహణ లేక అధ్వానంగా తయారైంది. రబీ సాగుకు అవసరమయ్యే నీరు అందక రైతులు సతమతమవుతున్నారు.

**ఎక్కడ చూసినా ఆక్రమణలే..** పల్లెల్లో పంట కాలువలకు ఇరువైపులా స్థలాలను కొందరు ఆక్రమించుకొని మెరక చేసి కొబ్బరి, అరటి మొక్కలు వేస్తున్నారు. దీంతో కాలువలు ప్రవాహ సామర్థ్యం కోల్పోతున్నాయి. ఆక్రమణల ప్రభావంతో బ్యాంక్ కెనాల్, వడ్డిలంకఛానల్‌లలో పూర్తిస్థాయి నీటిమట్టాలు ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ఈ అంశంపై జలవనరుల శాఖ ఏఈ నరేశ్ స్పందిస్తూ కాలువల్లో అవరోధాలు తొలగించేలా అవసరమైన ప్రతిపాదనలు చేస్తామన్నారు.

## కార్మికుడికి ఆర్థిక సాయం

**పోడూరు, న్యూస్‌టుడే:** పోడూరుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు గుబ్బల మోహనరావు నాలుగు నెలల క్రితం ప్రమాదానికి గురై మంచానికే పరిమితమయ్యారు. అతడికి వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట్రామరాజు సమకూర్చిన రూ.20 వేల ఆర్థిక సాయాన్ని ఆ సంస్థ ప్రతినిధులు సోమవారం అందజేశారు.

## తెదేపా విజయమే లక్ష్యం

ఎమ్మెల్యే పితానిని సత్కరించిన దుర్గాభవాని దంపతులు

**పోడూరు, న్యూస్‌టుడే:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా విజయమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సూచించారు. పార్టీ పశ్చిమగోదావరి జిల్లా పార్లమెంటరీ కమిటీ కోశాధికారిగా నియమితులైన పెనుగొండకు చెందిన కట్టా దుర్గాభవాని, గణేశ్ దంపతులు సోమవారం కొమ్ముచిక్కాలలో ఎమ్మెల్యే పితానిని కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యాన రైతులకు అవగాహన సదస్సు

**యలమంచిలి, న్యూస్‌టుడే:** దొడ్డిపట్లలో రైతుసేవా కేంద్రం వద్ద ఉద్యాన రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు టి. నాగలక్ష్మి, ఎస్. ఆదర్శ, జి. రంగన్న పాల్గొని మాట్లాడారు. కొబ్బరిలో తెల్లదోమ నివారణకు ఇసారెయా ద్రావణాన్ని లీటరు నీటికి 5.మి.లీ. కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తమలపాకు తోటల్లో ఎర్రనల్లి నివారణకు వెట్టబుల్ సల్ఫర్‌ను లీటర్ నీటిలో 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. దొడ్డిపట్ల, కనకాయలంక గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## వ్యాస రచన పోటీల్లో ప్రతిభ

జేసీ నుంచి బహుమతి అందుకుంటున్న దేవీశ్రీ

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో పాలకొల్లు దాసరి నారాయణరావు మహిళా డిగ్రీకళాశాలలో బీకాం రెండో సంవత్సరం విద్యార్థిని చిట్టూరి దేవీశ్రీ ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో మూడోస్థానం పొందారు. ఆమె సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి నుంచి నగదు బహుమతిని సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, అధ్యాపకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

## అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

మాట్లాడుతున్న సూర్యకుమారి

**ఆచంట, న్యూస్‌టుడే:** ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని ఎంపీపీ డి.సూర్యకుమారి అధికారులకు సూచించారు. మండలంలో అభివృద్ధి పనుల పురోగతి, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. గ్రామ సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఎంపీడీవో బి.కృష్ణమోహన్, మండల స్థాయి అధికారులు కె.బులిసూరన్న, ఏడుకొండలు, రాజేశ్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖులకు పుస్తకాల అందజేత

**ఆచంట, న్యూస్‌టుడే:** ఆచంటకు చెందిన వైట్ల కిశోర్ కుమార్ రచించిన 'విప్లవ నాయకి' పుస్తకాన్ని ఇటీవల మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ పుస్తకాల ప్రతులను సోమవారం చెన్నైలోని డీఎంకే కేంద్ర కార్యాలయంలో ప్రముఖులకు, సీనియర్ నటులు కేఆర్ విజయ, ప్రభ తదితరులకు సోమవారం అందజేసినట్లు కిశోర్‌కుమార్ తెలిపారు.

## విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

**పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే:** పాలకొల్లు మండలం దగ్గులూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కె.రామచంద్రరాజు, లావణ్య దంపతులు సోమవారం దుప్పట్లు అందజేశారు. ఎంపీపీ అవతారంరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** మహిళల రక్షణకు ఉద్దేశించిన చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఐసీడీఎస్ అధికారిణి ఎం.ఉమ అన్నారు. ఐసీడీఎస్, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో పాలకొల్లు ఎంఎకేఎన్ఎం ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాలతో తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించారు. సంస్థాగత సేవల రక్షణ అధికారిణి పి.మమతశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## తేల్చరు.. కూల్చరు!

**యలమంచిలి, న్యూస్‌టుడే:** యలమంచిలి మండలం మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో ఉన్న సిబ్బంది నివాస భవనాలివి. ఇక్కడ నాలుగైదు భవనాలు 20 ఏళ్లుగా నిరుపయోగంగా మారి క్రమంగా శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ప్రాంగణంలో పొదలు పెరిగి చిట్టడవిలా తయారైంది. శిథిల భవనాలను తొలగించి ఆసుపత్రి ప్రాంగణాన్ని బాగుచేయించాలని రోగులు కోరుతున్నారు.

## రాళ్లు తేలి.. అధ్వానంగా మారి!

**పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే:** నడిపూడి- మిద్దెవారిపాలెం రహదారి కిలోమీటరు పరిధిలో ఇలా రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలకు స్థానికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ అంశంపై నడిపూడి పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి వై.కిశోర్‌బాబు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని, అనుమతులు రాగానే మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు.

## ఫొటోగ్రాఫర్ల సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** పాలకొల్లు ప్రాంత ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం పాలకొల్లు సామాజిక భవనంలో సోమవారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా పెచ్చెట్టి శ్యామ్, అధ్యక్షుడిగా శీలం గంగాధర్, కార్యదర్శిగా వర్ధినీడి దుర్గారామ్, కోశాధికారిగా చెల్లబోయిన యుగంధర్ శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా చిట్నీడి రమా సత్యఫణికుమార్, పిట్టా కిరణ్ వెస్లీ, సహాయ కార్యదర్శిగా బొక్కా రవికృష్ణ, జాలెం చిట్టిబాబు, పలువురు కార్యవర్గసభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ నెల 8న సంఘం కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

## కుక్కల స్వైర విహారం.. పలువురికి గాయాలు

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** గత మూడు రోజులుగా పాలకొల్లు పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను గాయపరుస్తున్నాయి. కంచర్లవారి వీధిలో జయలక్ష్మి, నాగేశ్వరరావు, అంజిబాబులతో పాటు మరికొందరు కుక్కల దాడిలో గాయపడినట్లు స్థానికులు తెలిపారు. 12వ వార్డు పరిధి సూర్యతేజస్ నగర్‌లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు చెప్పారు. దీనిపై స్థానికులు పురపాలక కమిషనర్ బి.విజయసారథికి ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి కుక్కలను పట్టే బృందాలను ఆయా ప్రాంతాలకు పంపి సమస్య పరిష్కరించారు.

## వినతుల పరిష్కారంలో జాప్యం వద్దు

సమస్య తెలుసుకుంటున్న ఆర్డీవో రాజు

**నరసాపురం, న్యూస్‌టుడే:** ప్రజల నుంచి అందిన వినతులను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆర్డీవో దాసి రాజు సూచించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా వినతుల పరిష్కార వేదిక'లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 36 మంది వినతులు అందించినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. పలువురు సంక్షేమ పింఛన్ల కోసం, రీ సర్వే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందించారు.

## రీ సర్వేకు సహకరించండి

అవగాహన ప్రదర్శనలో అధికారులు, ప్రజాప్రతినిధులు

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** గ్రామాల్లో చేపట్టిన భూముల రీ సర్వేకు సహకరించాలని తహసీల్దారు కె.రాజకిశోర్ రైతులు, ప్రజలకు సూచించారు. ముత్యాలపల్లిలో సోమవారం రీ సర్వేపై అవగాహన సదస్సు, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రైతులు సర్వే సమయంలో తమ భూములకు సంబంధించిన పత్రాలు తీసుకురావాలని సూచించారు. సర్పంచులు అడ్డాల సూరిబాబు, పడవల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు తిరుమాని స్వామి, లింగం ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా తుంగా

నియామకపత్రం అందిస్తున్న గణేశ్‌భవానీ

**యలమంచిలి, న్యూస్‌టుడే:** ఆర్.కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా యలమంచిలి మండలం గుంపర్రుకు చెందిన తుంగా నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఆయనకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దాడ గణేశ్‌భవానీ యాదవ్ నుంచి సోమవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా గణేశ్‌భవానీ మాట్లాడుతూ రాష్ట్రంలో 139 బీసీ కులాలున్నాయని, వారికి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జనగణనలో భాగంగా కుల గణనను పారదర్శకంగా చేయాలన్నారు. నాయకులు శిడగం రవి, పొన్నమండ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో మునిగి దివ్యాంగుడి మృతి

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** ప్రమాదవశాత్తు కాలువలో మునిగి దివ్యాంగుడు మృతి చెందారు. ఎస్సై జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపాలేనికి చెందిన దివ్యాంగుడు కుక్కల భాస్కరరావు (45) సోమవారం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మునిగిపోయారు. ఆయన ఆచూకీ కోసం గాలించగా మృతదేహం లభ్యమైంది. దీనిపై అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## పోషణ భారంగా ఉంది.. ఆదుకోండి

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** దివ్యాంగులం.. ఏ పనీ చేయలేం. ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న సాయం చాలా వరకు మందులకి, వైద్యానికే సరిపోతుంది. పోషణ భారంగా మారింది. అదనపు సాయం అందేలా చేసి ఆదుకోండి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు కలెక్టర్‌కు చేసుకున్న విన్నపాలు ఇవి.

నాకు పోలియో ఉంది. ఏ పనీ చేసుకోలేను. వివాహం అవ్వలేదు. వృద్ధ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాను. ఈ వయసులో వారిపై ఆధారపడాల్సి వస్తుంది. ఇప్పుడిస్తున్న ఆరువేల పింఛను మందులకు సరిపోతుంది. అదనపు పింఛను ఇప్పించాలి
**- గుబ్బల బుద్ధుడు, పెనుమదం**

★ పుట్టుకతోనే నాకు పోలియో ఉంది. అయినా కష్టపడి ఎంబీఏ చదివాను. రూ.15వేల పింఛను ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నా.
**- వై సుజాత, నరసాపురం**

## కోడి పందేలు ఆపాలంటూ వినతి

**నరసాపురం, గ్రామీణ న్యూస్‌టుడే:** నరసాపురం మండలం కొప్పర్రులో సంక్రాంతి పండగ రోజుల్లో కోడిపందేలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రామస్థులు, స్థానిక నాయకులు నరసాపురం ఆర్డీవో దాసి రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. చింతపల్లి శ్రీనివాసు, ఉపసర్పంచి అందె కవికుమార్, పోలిశెట్టి గోపీనాథ్, యాదంరెడ్డి సూరిబాబు, నల్లి జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలు వర్తింప చేయాలి

**భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** గ్యాస్ డెలివరీ బాయ్స్‌పై వేధింపులు ఆపాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు కార్మిక చట్టాలు వర్తింపచేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సీఐటీయూ అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలంటూ భీమవరం గ్యాస్ డెలివరీ బాయ్స్ యూనియన్ సభ్యులు సోమవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీతారామయ్య, సింహాచలం, చంద్రరావు, వెంకన్న, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## జూదరుల అరెస్టు

**ఆచంట, న్యూస్‌టుడే:** ఆచంట పరిధిలో దేవ రోడ్డులో నిర్వహిస్తున్న జూద స్థావరంలో సోమవారం దాడిచేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు.

**పోడూరు, న్యూస్‌టుడే:** పోడూరు మండలం అప్పిచెరువు ప్రాంతంలో కోడి పందేల స్థావరంపై సోమవారం దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సుధాకరరెడ్డి తెలిపారు.

## డ్వాక్రా మహిళలకు విలీన కష్టాలు
### మంజూరు కాని కొత్త రుణాలు

| గ్రామాల వారీగా సంఘాల వివరాలు | | |
|---|---|---|
| గ్రామం | గ్రూపులు | సభ్యులు |
| కొంతేరు | 98 | 980 |
| అడవిపాలెం | 68 | 680 |

**పోడూరు, పాలకొల్లు, న్యూస్‌టుడే:** పాలకొల్లు పట్టణంలో గతంలో విలీనం చేసిన పంచాయతీల్లో డ్వాక్రా బృందాలకు రుణాలు అందక మహిళలు ఆందోళన చెందుతున్నారు. యలమంచిలి మండలంలో కొంతేరు, అడవిపాలెం గ్రామాలను పాలకొల్లు పురపాలక సంఘంలో విలీనం చేశారు. అప్పట్లోనే సంబంధిత గ్రామ సంఘాలను మెప్మాకు అనుసంధానం చేశారు. కానీ కొందరు కోర్టును ఆశ్రయించడంతో గ్రామాల ప్రక్రియ నిలిచిపోయింది. తరువాత ఈ గ్రామాల్లో సంఘాలకు కొత్త రుణాలు అందడం లేదు. ఆయా సంఘాల సభ్యులంతా ప్రతి నెలా యథావిధిగా పొదుపు సొమ్ము చెల్లిస్తూనే కొత్త రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఆన్‌లైన్‌లో గ్రూపుల వివరాలు నమోదైతేనే కొత్త రుణాలు ఇస్తామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. గతంలో మెప్మాకు అనుసంధానం చేయడంతో కొంతేరు, అడవిపాలెం గ్రామాల పరిధిలో గ్రూపుల వివరాలు ఆన్‌లైన్లో నమోదు కాలేదు. తాము పాత రుణం పూర్తిగా చెల్లించి ఆరు నెలలు గడిచినా కొత్తగా రుణం ఇవ్వడం లేదని కొంతేరు గ్రామానికి చెందిన తామాడ లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

**మంత్రి నిమ్మలకు వినతి**

ఇటీవల ఈ గ్రామాలకు చెందిన మహిళలు మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి రుణాల సమస్యపై వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఆయన స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడారు. కొంతేరు, అడవిపాలెం గ్రామాలను మెప్మా నుంచి మండల సమాఖ్యకు బదిలీ చేసి కొత్త రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయమై యలమంచిలి మండల ఏపీఎం సతీశ్‌కుమార్‌ను సంప్రదించగా ఈ గ్రామాల పరిధిలో గ్రూపుల వివరాలను జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నవీకరిస్తున్నామని, త్వరలోనే కొత్త రుణాలు మంజూరవుతాయని పేర్కొన్నారు.

## ముస్తాబుకాని పురపాలక బడులు!

ఎస్‌కేపీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శారీరక శుభ్రతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం 'ముస్తాబు' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా పలు ప్రాంతాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో అద్దం, దువ్వెన, కొబ్బరినూనె, ఫేస్ పౌడరు ఉండే కిట్లను ఏర్పాటు చేయగా విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొంటున్నారు. పురపాలక పాఠశాలల్లో మాత్రం ఈ కార్యక్రమం ఇప్పటికీ మొదలు కాలేదు. పాలకొల్లు పట్టణంలో ప్రాథమిక, ఉన్నతపాఠశాలలను 'న్యూస్‌టుడే' సోమవారం పరిశీలించగా ఎక్కడ 'ముస్తాబు' కిట్ల జాడ లేదు. ఉపాధ్యాయులను ఆరాతీయగా దీనిపై తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదన్నారు. ఈ అంశంపై మండల విద్యాశాఖాధికారి గంగాధరశర్మ స్పందిస్తూ అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసేలా ఆదేశాలు జారీచేస్తామన్నారు.

## క్రీడల్లో మరింత రాణించాలి: కలెక్టర్

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** విశాఖపట్నంలో డిసెంబరు 15 వరకు జరిగిన జాతీయ స్కేటింగ్ ఇన్‌లైన్ హాకీ, రోలర్‌హాకీ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు సోమవారం కలెక్టర్ నాగరాణిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె వారిని అభినందించారు. భవిష్యత్తులో క్రీడల్లో మరింత రాణించాలని వారికి సూచించారు.

## ర్యాంపు ఏర్పాటుపై హర్షం

**భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** భీమవరం కలెక్టరేట్ సముదాయం వద్ద వికలాంగుల కోసం ర్యాంపు ఏర్పాటు చేయడం పట్ల వికలాంగుల సంక్షేమ సంఘం విసాస్ సదన్ జిల్లా అధ్యక్షుడు మద్దాల శ్రీనివాస్ సోమవారం కృతజ్ఞతలు తెలియజేశారు. ర్యాంపు ఏర్పాటు చేయడానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అల్లాడి నటరాజు ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులకు వినతులు అందజేశామని పేర్కొన్నారు.

## సందడిగా క్రిస్మస్ వేడుకలు

**నరసాపురం, గ్రామీణ, న్యూస్‌టుడే:** ఏసు ప్రభువు చూపిన ప్రేమతత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ పేర్కొన్నారు. లిఖితపూడిలో న్యాలైఫ్ మినిస్ట్రిస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ★ నరసాపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, వార్డు కౌన్సిలర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## సిమెంటు బెంచీల ఏర్పాటు

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** పాలకొల్లు పట్టణంలోని ఎనిమిది చోట్ల చవాకుల ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. రైల్వేగేటు కూడలి, టిడ్కో గృహాల సముదాయం తదితర ప్రాంతాల్లో ప్రయాణికులు, పాదచారులు సేదతీరడానికి వీటిని ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ ఛైర్మన్ సూర్యసురేశ్‌బాబు తెలిపారు.

(c) eenadu

# తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

## మెరిసిన ప్రతిభ

బహుమతులు అందుకున్న విద్యార్థినులు

తణుకు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వర్తమాన అంశాలు, సాధారణ పరిజ్ఞానం, క్విజ్ పోటీలు నిర్వహించగా ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరచిన ఎండీ.సమీరా, కె.రజిత, కె.లక్ష్మీ లావణ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, సభ్యులు చిట్టూరి సుభాషిణి, ప్రిన్సిపల్ హిమబిందు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు గృహలక్ష్మి, సుధారాణి, గీతా నాగవల్లి పాల్గొన్నారు.

తణుకు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం స్థానిక లిటిల్ ప్యారడైజ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వర్తమాన అంశాలు, సాధారణ జ్ఞానం, క్విజ్ పోటీలు నిర్వహించగా 7 నుంచి 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన ఎస్.అమృత, యు.స్నేహిక, ఆదర్శరాజ్‌సింగ్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ కె.పద్మావతి, డైరెక్టర్ కె.శషాంక్, సమన్వయకర్త జి.ప్రశాంతి బహుమతులు అందజేశారు.

## తాడేపల్లిగూడెం పట్టణాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

అర్జీలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని శాసనసభ్యుడు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ఆయన ప్రారంభించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సంబంధిత సమస్యల్ని సత్వరమే పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ప్రధాన రహదారులన్నీ పూర్తిస్థాయిలో నిర్మిస్తామని, రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి వచ్చే వేసవి నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు, లేఔట్లు తదితర ఆస్తులకు సంబంధించి క్రమబద్ధీకరించుకొని పురపాలక సంఘానికి సహకరించాలన్నారు. అర్హులందరికీ సామాజిక పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. టిడ్కో లబ్ధిదారులకు మంజూరైన ఇంటి దస్తావేజులను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, ఎంహెచ్‌వో ఎన్.రాజు, మేనేజర్ రవి సుధాకర్, డీఈ పవన్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అర్బన్ జీఎస్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, భవనంపై ఏర్పాటు చేసిన సౌరవిద్యుత్తు ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు.

## కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తూ..

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కొబ్బరి తోటలోని ఈవీఎం హైస్కూల్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. 9, 10 తరగతుల విద్యార్థులు సుమారు 60 మంది హాజరయ్యారు. ముఖ్య వక్తగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు తాడేపల్లి మోహనరావు హాజరై విలువలతో కూడిన విద్య గురించి విద్యార్థులకు సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మెరిట్ విద్యార్థులకు ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జనపరెడ్డి రాజేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. కార్యదర్శి మిరియాల కిశోర్, కోశాధికారి ఎర్ర ఆంజనేయులు, జుబిడి సతీష్, పాండురంగారావు, యెగ్గిన శరత్‌బాబు, గాజుల మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

ఇరగవరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ప్రతి వినతికీ జవాబుదారిగా ఉంటామని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు అన్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు మంజూరు కాలేదంటూ కాకిలేరుకు చెందిన కానూరి నరసింహమూర్తి వినతిపత్రం అందించారు. ఈమేరకు ఎంపీడీవో సోమవారం కాకిలేరులో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దరఖాస్తును ఆన్‌లైన్ చేశామని, ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే అందిస్తామని దరఖాస్తుదారుడికి వివరించారు.

## ఖజానాకు కన్నం.. చర్యలు శూన్యం

- పుట్టగొడుగుల్లా వెలిసిన అనధికార లేఅవుట్లు
- గత పాలనలో అధికారుల ప్రేక్షక పాత్ర

న్యూస్‌టుడే, అత్తిలి గ్రామీణం: అత్తిలి మండలం వ్యాప్తంగా సుమారు 70కి పైగా అనధికార లేఅవుట్లు ఉన్నట్లు గత వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారులు గుర్తించారు. ఫిర్యాదులు వచ్చిన గ్రామాల్లో నోటీసులు జారీ చేసి మమ అనిపించారు తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దాన్నే ఆసరాగా తీసుకున్న పలువురు అక్రమార్కులు గ్రామాల్లో మరిన్ని అనధికార లేఅవుట్లు వేసి విక్రయాలు చేపట్టారు. ఈ మండలంలో అనుమతులున్న లేఅవుట్లు 25 మాత్రమే ఉన్నాయని.. మిగిలినవన్నీ అనధికారికమేనని అధికారులు చెబుతున్నారు.

మంచిలి మార్గంలో లేఅవుట్లకు పంట కాలువపై వంతెన ఏర్పాటు

**ప్రభుత్వ స్థలాలు సైతం**

అత్తిలి, మంచిలి, ఉరదాళ్లపాలెం, కె.సముద్రపుగట్టు, గుమ్మంపాడు, బల్లిపాడు, తిరుపతిపురం, పాలూరు, ఆరవల్లి, ఉనికిలి, లక్ష్మీనారాయణపురం చుట్టుపక్క గ్రామాల్లో అత్యధిక సంఖ్యలో లేఅవుట్లు వెలిశాయి. అత్తిలిలో ప్రస్తుతం సెంటు రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ధర పలుకుతోంది. దీంతో జిరాయితీ భూములను ఆనుకొని ఉన్న ప్రభుత్వ, పోరంబోకు, నీటిపారుదల శాఖ స్థలాలను కూడా ఆక్రమించి లేఅవుట్లలో కలిపేస్తున్నారు. పలుచోట్ల వాటి నిర్వహణకు పంట కాలువలు, బోదెల మీద సైతం వంతెనలు నిర్మించేస్తున్నారు. వాటిపై స్థానిక అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా మీనమేషాలు లెక్కిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫలితంగా రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కూడా కనుమరుగవుతున్నాయి.

**మోసపోతున్న సామాన్యులు**

అనుమతులు లేకపోయినా పలువురు లేఅవుట్ యజమానులు బోర్డులు పెట్టి విక్రయాలు నిర్వహించడంతో చాలా మంది అమాయకులు స్థలాలు కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు రాకపోవడంతో మామూళ్లు ముట్టజెప్పాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకొని ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని ఆయా యజమానుల నుంచి రాబట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

అనధికార లేఅవుట్ల వద్ద అనుమతులు లేవని తెలిపే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు సూచిస్తున్నారు. ఈ క్రమంలో అనధికార లేఅవుట్లను గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రారంభిస్తున్న రాజేష్ తదితరులు

గణేష్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: గణేష్‌నగర్‌లో గొర్రెల లక్ష్మీనారాయణ క్రికెట్ టోర్నమెంట్‌ను తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ నిర్వహణలో తాడేపల్లిగూడెం జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్లో సుమారు 52 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈతకోట తాతాజీ, తిరుమల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

తణుకు, న్యూస్‌టుడే: ఇరగవరం, అత్తిలి మండలాల్లోని విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో లైన్ల మరమ్మతుల కోసం మంగళవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు డివిజనల్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరగవరం మండలంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్ని గ్రామాల్లో సరఫరా ఉండదని, అత్తిలి మండలంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంతం, మసీద్ వీధి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంతం, బ్యాంక్ వీధి, ఓల్డ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అత్తిలి పెదపేట ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## జలధారలో రిజర్వాయర్ల నిర్మాణం

ఇరగవరం, న్యూస్‌టుడే: అమరజీవి జలధార-జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇరగవరం మండలంలో 9 ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ స్టోరేజీ రిజర్వాయర్లు నిర్మిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీఎస్ పవన్‌కుమార్ చెప్పారు. రేలంగి శివారు ప్రాంతాల్లో నాలుగు చోట్ల, కత్తవపాడు, యర్రాయి చెరువు, ఏలేటిపాడు శివారు జి.ఖండ్రిక, తూర్పు విప్పర్రు శివారు నారాయణపురం ప్రాంతాల్లో 60 వేల లీటర్ల సామర్థ్యంతో వీటిని నిర్మిస్తామన్నారు. అంతేగాక కె.కుముదవల్లి గ్రామంలో 40 వేల కిలో లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తోపాటు 200 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన సంప్, పవర్ హౌస్ నిర్మిస్తామని ఆయన వివరించారు.

## ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

ప్రత్తిపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని హెబ్రోను బాప్టిస్టు చర్చిలో ఐక్య క్రిస్మస్ వేడుకలను జగత్ సోమశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముందుగా క్రిస్మస్ కేకు కోసి దైవజనులకు, సేవకులకు, సంఘ కాపరులకు అందజేశారు. అనంతరం ప్రేమ విందు అందజేశారు.

## అప్పలరాజుపై పీడీ యాక్ట్ ఉపసంహరించుకోవాలి

నిరసన తెలుపుతున్న నాయకులు

తణుకు, న్యూస్‌టుడే: అప్పలరాజుపై అక్రమంగా పెట్టిన పీడీ చట్టం ఉపసంహరించి, వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక వెంకటేశ్వర కూడలి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టి అనంతరం మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో బల్క్ డ్రగ్స్ కంపెనీ ఏర్పాటు కోసం ఇచ్చిన భూముల రైతులకు అప్పలరాజు మద్దతు ఇచ్చినందుకు పీడీ యాక్ట్ పెట్టి అరెస్టు చేశారని విమర్శించారు. నాయకులు రంగారావు, మునిస్వామి, గోపి, రాజా, నాగరత్నం, చిన్నారావు, నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

| | |
|---|---|
| తాడేపల్లిగూడెం | 99488 53114 |
| తణుకు | 85558 50851 |
| తణుకు గ్రామీణం | 63005 79402 |
| అత్తిలి | 91548 46774 |

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం ఇండేన్ గ్యాస్ రోడ్డు అధ్వానంగా మారి రాకపోకలు సాగించడానికి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు - ఆత్మీరామ్

✔ త్వరిత గతిన రహదారి నిర్మాణానికి కృషి చేస్తాం - ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్

? కడకట్ల హెచ్‌పీ గోదాము రోడ్డులో పందుల సంచారంతో పరిసరాలు కాలుష్యమవుతున్నాయి - బాపూజీ

✔ పందుల సంచారాన్ని అరికడతాం - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

## ఆకతాయిల అడ్డా

**పర్యవేక్షణ లేమితో రెచ్చిపోతున్న మందుబాబులు**

గణపవరం మండలం జల్లికాకినాడలోని అసంపూర్తి రైతు సేవా కేంద్రం వద్ద పగిలిన మద్యం సీసాలున్న చిత్రమిది. గణపవరం, సరిపల్లె, కాశిపాడు తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితులున్నాయి.

న్యూస్‌టుడే, గణపవరం: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ప్రాంగణాలే లక్ష్యంగా చేసుకొని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. పది గంటలు పూర్తవగానే తమ అడ్డాగా మార్చుకుంటున్నారు. మద్యం దుకాణాల వద్దనున్న గదుల్లా వినియోగించుకుంటున్నారు. రాత్రివేళల్లో పోలీసుల పహారా తక్కువగా ఉండటంతో.. మందుబాబులు అక్కడే పూటుగా మద్యం తాగుతున్నారు. ఆహార పదార్థాలు తిని విసిరేస్తుండడంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా, దుర్గంధభరితంగా తయారవుతున్నాయి.

అప్పన్నపేట ప్రాథమిక పాఠశాల భవనంపై మద్యం సీసాలు పేరుకుపోతున్నాయి. రోజూ ఆకతాయిల ఆగడాలు సాగుతున్నా ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. తెల్లారేసరికి భవనమంతా పగిలిన సీసాలు, చిందరవందరగా మాంసాహార పొట్లాలు ఉంటున్నాయి.

**యథేచ్ఛగా కార్యకలాపాలు**

గ్రామాల్లో నిర్మానుష్య ప్రాంతాల మధ్యనున్న ప్రభుత్వ కార్యాలయాలు, అసంపూర్తి నిర్మాణాలు, ప్రహరీల్లేని చోట్ల కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఎక్కడ చూసినా మద్యం అలవాటు దటం ఆకతాయిలకు నిదర్శనం. 'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం' అని నిడమర్రు సీఐ నక్కా రజనీ కుమార్ తెలిపారు.

## నేడు శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం

ఈడూరు వరాల వేంకటేశ్వరుడు

బల్లిపాడు మదనగోపాలుడు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ముక్కోటి సందర్భంగా వైష్ణవాలయాలను శోభాయమానంగా అలంకరించారు. అత్తిలి శ్రీభూ సమేత వేంకటేశ్వరుడు, రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలుడు, ఈడూరు వరాల వేంకటేశ్వరుడు, బల్లిపాడు మదన గోపాలస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు ఏర్పాటు చేశామని ఆలయ అర్చకులు తెలిపారు.

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి లక్ష్మీ నృసింహస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు, తూర్పు విప్పర్రు వెంకటేశ్వరస్వామి, ఇరగవం కేశవస్వామి ఆలయాలను మామిడి తోరణాలు కట్టి, పూలతో అలంకరించారు.

## వీరేశ్వరుడికి విశేష అలంకరణ

కొండ్రుప్రోలు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ధనుర్మాస సంకీర్తన

పాల్గొన్న భక్తులు

తణుకు, న్యూస్‌టుడే: పైడిపర్రు శివాలయం ప్రాంగణంలోని కోదండ రామాలయంలో ధనుర్మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ధనుర్మాస నెల పురస్కరించుకొని సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు భక్తులు పుర వీధుల్లో నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు తొలగించండి

పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడులో రహదారులకు ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని సామాజిక కార్యకర్త కళింగ లక్ష్మణరావు అధికారులను కోరారు. ఈ మేరకు మండల ఉప తహసీల్దార్ సీతారత్నానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వెళ్లే రహదారిలో భారీ వాహనాలు తిరుగుతుండడంతో ఫ్లెక్సీల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. తక్షణం అధికారులు ఫ్లెక్సీలు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఇక ఉపాధి పండగే

**పథకంలో మార్పులతో శ్రామికులకు మేలు**

పెంటపాడు (తాడేపల్లిగూడెం టూటౌన్), న్యూస్‌టుడే : తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం పరిధిలోని శ్రామికులు ఖరీఫ్, రబీ సీజన్లు ముగిసిన తరువాత పనుల్లేక వలసలు వెళ్లేవారు. 2005లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం ద్వారా వారికి పనులు కల్పించి ఆర్థికంగా తోడ్పాటు అందించింది. ఈ పథకం పేరును వీబీ-జీ రామ్‌జీ (వికసిత్ భారత్ రోజ్‌గార్, అజీవికా హామీ మిషన్) గ్రామీణగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్లో ఆమోదించింది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు వేతనదారులకు ఏడాది 100 రోజులు పని కల్పించారు. కొలత ప్రకారం పని చేస్తే రోజుకు రూ.307 లభిస్తుంది. ప్రస్తుతం జాబ్ కార్డుకు 125 పని దినాలు కల్పిస్తూ కేంద్రం చర్యలు చేపట్టింది. దీని వల్ల అదనపు ఆదాయం సమకూరనుంది.

**మండలాల వారీగా వివరాలు**

| మండలం | జాబ్ కార్డులు | శ్రామికులు |
|---|---|---|
| పెంటపాడు | 8,713 | 12,443 |
| తాడేపల్లిగూడెం | 13,596 | 17,256 |

**త్వరలో అమల్లోకి..**

ఉపాధి హామీ పథకం పేరు మార్పుతో పాటు, కూలీలకు పని దినాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో త్వరలో ఇది అమల్లోకి రానుంది. వ్యవసాయ పనులు లేనప్పుడు గ్రామాల్లో పేద ప్రజల జీవనానికి ఈ పనులే ఆధారం.

**ఏ పనులు చేస్తారు**

ఉపాధి హామీ పథకంలో కాలువలు, చెరువుల శుభ్రత, గ్రామాల్లో తుప్పలు తొలగించడం, మొక్కలు నాటే పనులు, భవనాలు, రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు.

## కార్యదర్శికి సత్కారం

తణుకు, న్యూస్‌టుడే: నాలుగేళ్లుగా ఇరగవరం మండలం కంతేరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై పెనుమంట్ర మండలానికి వెళ్తున్న వంగా రాజుకు కంతేరు సర్పంచి దంపతులు గుడిమెట్ల ఆదిలక్ష్మి, సత్యనారాయణరెడ్డి, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. అనంతరం రాజు దంపతులను సత్కరించారు. కూటమి నాయకులు సత్తి సోమశేఖర రెడ్డి, ముప్పిడి నరసింహమూర్తి, పెచ్చెటి దుర్గాప్రసాద్, జరుగుల శ్రీను, వార్డు సభ్యులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## జనవరి-2 నుంచి రీ సర్వే

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జనవరి-2 నుంచి తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌లో రీ సర్వే ప్రారంభం కానుందని ఆర్డీవో ఖతీఫ్ కౌసర్‌బానో సోమవారం తెలిపారు. తాడేపల్లిగూడెం మండలంలో కడియద్ద, కృష్ణాయపాలెం, ఇరగవరం మండలం ఇరగవరం, తణుకు మండలం వేల్పూరు గ్రామాల్లో రీ సర్వే చేసేందుకు బృందం వస్తుందని తెలియజేశారు. ముందుగా రైతులకు తెలియజేస్తారని.. వారు చెప్పిన తేదీకి రైతులు దస్త్రావేజులతో హాజరు కావాలని సూచించారు.

## సూచిక లేక.. ఎదురుగా కనిపించక..

అత్తిలి మండలంలో రహదారులు ఎక్కువ మలుపులు ఉండడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. హెచ్చరిక బోర్డులు లేకపోవడం దీనికి ప్రధాన కారణం. అత్తిలి నుంచి మంచిలి మీదుగా కంచుమర్రు, స్కిన్నెరపురం, కోరుకొల్లు అత్తిలి నుంచి పాలూరు, కొమ్మర, ఈడూరు మీదుగా కోరుకొల్లు తదితర ప్రాంతాల్లో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దీంతో పాటు రహదారులకు ఇరువైపులా గుబురుగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపుల్లో వేగ నియంత్రికలతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అత్తిలి గ్రామీణం

## నుయ్యి కాదు.. అది గొయ్యే

తాడేపల్లిగూడెం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి ఆనుకుని ఉన్న పుంతరోడ్డు అత్యంత దారుణంగా తయారైంది. కె.ఎన్.రోడ్డు నుంచి గణేష్‌నగర్‌ను కలుపుతూ ఉన్న ఈ మార్గంలో నిత్యం అనేక విద్యా సంస్థల బస్సులు, కార్లు తిరుగుతుంటాయి. ఈ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి పూర్తిగా ధ్వంసమైంది. ఈ మార్గంలోని ఓ పెద్ద గుంతలో వాహనాలు దిగివాలిపోతూ రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రమాదాలు జరగకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం మరమ్మతులైనా చేయించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్

## సేవకు తగ్గ గుర్తింపు

తణుకు, న్యూస్‌టుడే: సహకార రంగంలో విశిష్ట సేవలకుగానూ తణుకు నియోజకవర్గం ఇరగవరం మండలం రేలంగి సొసైటీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పురస్కారం లభించింది. ఈ ప్రాంతంలోని రైతులకు అందించిన సేవలను గుర్తించి ఉత్తమ ఎఫ్‌పీవోగా అవార్డు అందుకున్నందుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ రేలంగి సహకార సంఘం సిబ్బందికి, రైతులకు అభినందనలు తెలిపారు.

## పుంత దారి.. అధ్వానంగా మారి

పుంత రహదారులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో వ్యవసాయోత్పత్తుల తరలింపులో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ఇరగవరం నుంచి ఏలేటిపాడు వంతెనకు చేరే క్రమంలో రహదారిని ఆనుకుని ఉన్న ఓగిడి ఎస్సీ కాలనీకి వెళ్లే పుంత మార్గం అభివృద్ధిని కొన్నేళ్లుగా విస్మరించారు. దీంతో వర్షాకాలంలో పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. మట్టి మార్గం కావడంతో ధాన్యం తరలించే క్రమంలో ట్రాక్టర్లు, లారీలు దిగబడిపోతున్నాయని వాపోతున్నారు. రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఇరగవరం

## 'తప్పుడు కేసులకు భయపడం'

తణుకు, న్యూస్‌టుడే: అధికార పార్టీ నాయకుల తప్పుడు కేసులకు వైకాపా నాయకులు, కార్యకర్తలు భయపడబోరని, వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వైకాపా పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారమ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఫ్లెక్సీ వివాదంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతోపాటు మరో 12 మందిపై కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. వైకాపా తణుకు లీగల్ సెల్ సభ్యుడు సాయిబాబా రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు పార్టీ తరపున శుభాకాంక్షలు చెప్పే ఫ్లెక్సీ ఏర్పాటు చేయడానికి వెళ్తే ప్రజలకు ఇబ్బందులు కలిగించారని తప్పుడు కేసులు బనాయించారన్నారు.

## రబీ సాగు ముమ్మరం

నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలం

న్యూస్‌టుడే, అత్తిలి గ్రామీణం: అత్తిలి మండలంలో రబీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో రైతులు 13,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కొంత శాతం మాత్రమే వరినాట్లు ప్రారంభమయ్యాయి.

**అనువైన విత్తన రకాలు**

ఎంటీయూ 1121, 3626, 1153, 1010, 1156, ఎన్‌ఎల్‌ఆర్ 34449, 40024 వరి వంగడాలు సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచించారు.

**యాజమాన్య పద్ధతుల ద్వారా**

యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో 3 దఫాలుగా దమ్ముచేసి, చదును చేసి నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

**సరిపడా ఎరువులు**

మండలానికి సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయి. ఇప్పటి వరకు యూరియా కొరత లేదు. రాబోయే పంట కాలంలో కూడా ఎటువంటి కొరతా రాదు. సాంకేతికంగా అభివృద్ధి చేసిన నానో యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులోకి తెచ్చాం.
- రాజేష్, మండల వ్యవసాయాధికారి

## భవనాలు శిథిలం.. సేవలు దయనీయం

అత్తిలిలో ప్రమాదకరంగా రిజిస్ట్రేషన్ కార్యాలయం

న్యూస్‌టుడే, అత్తిలి గ్రామీణం: ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు గత ఐదేళ్ల వైకాపా పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోక దయనీయస్థితికి చేరాయి. దీంతో ఆయా భవనాల్లో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోందని అధికారులు, సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్తిలి మండలంలోని రిజిస్ట్రేషన్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్వహణ లేక శిథిలమైంది. దీంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని గాలికొదిలేశారు. ప్రస్తుతం భవనం పూర్తిగా పాడైపోయింది. లోపల ఉన్న కలప సామగ్రి మొత్తం ధ్వంసమైంది.

రైతుల ఆందోళన.. కంచుమర్రులో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న పశుసంవర్ధక శాఖ భవనానికి మరమ్మతులు లేక శ్లాబ్‌పై పెద్ద మొక్కలు పెరిగిపోయాయి. వర్షం పడితే శ్లాబ్ కారిపోతూ దస్త్రాలతోసహా సామగ్రి పాడైపోతున్నాయి. కిటికీలు, గుమ్మాలు ఇప్పటికే ఊడిపోయాయి. దీంతో రైతులు, ఉద్యోగులు భవనంలోకి రావడానికి భయాందోళన చెందుతున్నారు.

కంచుమర్రులో పశువైద్యశాల దుస్థితి

ఆర్థికంగా ఇబ్బందులు.. భవనం శిథిలావస్థకు చేరడంతో వైద్యులెవరూ రాకపోవడంతో పశువులకు వైద్యం చేయించడానికి పోషకులు ఉనికిలి, అత్తిలి వెళ్లాల్సివస్తోంది. దీంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. పశు వైద్యులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. - కేతా రాఘవ, రైతు, కంచుమర్రు

**ప్రతిపాదనలు పంపాం**

కంచుమర్రులో పశువైద్యశాల నూతన భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. మంజూరైన వెంటనే భవనం నిర్మిస్తాం
- రామాంజనేయులు, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, అత్తిలి

(c) eenadu

## శాస్త్రోక్తం.. అధ్యయనోత్సవం

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** పవిత్ర ధనుర్మాసంలో భాగంగా పదకొండో రోజైన సోమవారం ఒంటిమిట్ట కోదండ రామాలయంలో అధ్యయనోత్సవాలు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత సీతారామలక్ష్మణ మూర్తులను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి రంగ మండపంలో కొలువుదీర్చారు. రాములోరి దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. కనులారా తిలకించి పారవశ్యం చెందారు.

## హాకీ.. పోటాపోటీ

**పులివెందుల, న్యూస్‌టుడే:** అస్మిత ఖేలో ఇండియా సౌత్ జోన్ సబ్ జూనియర్ బాలికల హాకీ పోటీలు పులివెందులలో హోరాహోరీగా సాగుతున్నాయి. కేరళ - కర్ణాటక, తమిళనాడు - ఆంధ్రప్రదేశ్ జట్లు సోమవారం నాల్గవ రోజు తలపడ్డాయి. కేరళపై కర్ణాటక ఏడు గోల్స్ తేడాతో విజయం సాధించింది. తమిళనాడుపై ఆంధ్రప్రదేశ్ జట్టు ఆరు గోల్స్ చేసి విజయం సాధించింది.



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు

## కొనసాగింపునకు క్షీరాభిషేకం

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను వైఎస్సార్ కడప జిల్లాలోనే కొనసాగించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంపై ఒంటిమిట్టలో తెదేపా నాయకులు సంబరాలు చేసుకొని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. తమ ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేర్చడం చాలా సంతోషంగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ బాషా, శ్రీహరి, శివరామకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం, రమణ, గఫూర్, మల్లేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

## పింఛన్లకు రూ. 111 కోట్లు

**కడప గ్రామీణ, న్యూస్‌టుడే:** ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకుని ఈ నెల 31నే పంపిణీ చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకున్నారు. జిల్లావ్యాప్తంగా 2,55,083 మంది లబ్ధిదారులకుగాను రూ. 111,10,89,500 విడుదలైంది. గతంలో పింఛన్లు తీసుకుంటూ మృతి చెందిన వారి స్థానంలో అతని భార్యకు కొత్తగా మంజూరు చేశారు. జిల్లావ్యాప్తంగా ఇలాంటి పింఛన్లు కొత్తగా 314 ఉన్నాయి.

## మదనపల్లె కేంద్రంగా.. అవతరించే అన్నమయ్య

◆ ఐదు నియోజకవర్గాలు.. 25 మండలాలు
◆ నూతన సంవత్సరం నుంచే కార్యకలాపాలు




**ఈనాడు, కడప, న్యూస్‌టుడే- మదనపల్లె గ్రామీణ:** గత వైకాపా ప్రభుత్వం హేతుబద్ధత లేకుండా ఆరు నియోజకవర్గాలతో 2022లో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేసింది. అప్పట్లో పార్లమెంట్ కేంద్రంగా జిల్లా కేంద్రాలు ఏర్పాటవ్వగా.. అన్నమయ్యలో మాత్రం రాజంపేటను కాదని రాయచోటిలో నెలకొల్పారు. వైకాపా చేసిన ఆ తప్పిదాన్ని ప్రజాభిప్రాయ సేకరణ మేరకు కూటమి ప్రభుత్వం సరిదిద్దాల్సిన పరిస్థితి తలెత్తింది. జిల్లా కేంద్రం ఏర్పాటు చేసిన మూడేళ్లకే మార్పు చేయాల్సిన ఆవశ్యకతను తెలిపింది. ఈ నేపథ్యంలో మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా మార్పుచేర్పులతో కొత్తగా మళ్లీ అవతరించనుంది. ఈ మేరకు ఆంగ్ల నూతన సంవత్సరమైన జనవరి 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించే దిశగా అధికారులు ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు.

● పునర్విభజనలో భాగంగా మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాలతో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేస్తూ... రాయచోటి స్థానంలో మదనపల్లెను జిల్లా కేంద్రంగా నిర్ణయిస్తూ రాష్ట్ర మంత్రి మండలి సోమవారం ఆమోదించింది.

● మంత్రి మండలి నిర్ణయంతో ఇప్పటి వరకు రాయచోటి కేంద్రంగా ఉన్న జిల్లాలోని రైల్వేకోడూరు తిరుపతిలో విలీనమవుతుంది. రాజంపేట కడపలో కలుస్తుంది.

● కొత్తగా చిత్తూరు నుంచి పుంగనూరు అన్నమయ్యలోకి వచ్చి చేరింది.

● మొత్తంగా మదనపల్లె కేంద్రంగా జిల్లా 25 మండలాలతో జిల్లా ఏర్పాటవుతోంది.

● మదనపల్లె, రాయచోటితో పాటు కొత్తగా ఏర్పాటయ్యే పీలేరు రెవెన్యూ డివిజన్లు ఇందులో ఉండనున్నాయి.

● రాయచోటి(6), పీలేరు(6), తంబళ్లపల్లె(6), మదనపల్లె(3), పుంగనూరు నుంచి సదుం, సోమల, పుంగనూరు, చౌడేపల్లి మండలాలు అన్నమయ్య జిల్లాలో చేరనున్నాయి.

● పుంగనూరులోని మరో రెండు మండలాలైన రొంపిచెర్ల, పులిచెర్ల చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోనే ఉండనున్నాయి.

● **ఖరారైన కార్యాలయాలు!:** మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వేదికగా నూతన కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు కానుంది. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయ ముఖద్వారం ఉన్న బోర్డును సోమవారం తొలగించారు. కొత్త బోర్డు ఏర్పాటు చేయనున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని డీడీవో భవనంలోకి మార్పు చేయనున్నారు. ఎస్పీ కార్యాలయాన్ని బీటీ కళాశాల లేదా రుక్మిణీదేవి అరుందలే కాలేజ్(రేస్ కళాశాల)లో ఏర్పాటు చేసేలా ప్రతిపాదించారు. రాయచోటి కేంద్రంగా ఉన్న జిల్లాలో పని చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, వివిధ విభాగాధిపతులు ఇకపై మదనపల్లె నుంచి విధులు నిర్వహిస్తారు.

అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం బోర్డును తొలగిస్తున్న కూలీలు

## మారిన కడప గడప

**36 నుంచి 40కి పెరిగిన మండలాలు**

**ఈనాడు, కడప:** మదనపల్లె కేంద్రంగా మళ్లీ అవతరించనున్న అన్నమయ్య జిల్లాతో వైఎస్సార్ కడప స్వరూపంలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. వైకాపా హయాంలో 2022లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. అప్పట్లో పులివెందుల, కమలాపురం, కడప, మైదుకూరు, బద్వేలు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాలతో వైఎస్సార్ కడప ఏర్పాటు చేశారు. 11,228 చదరపు కి.మీ విస్తీర్ణంలో 36 మండలాలు, ఒక నగర కార్పొరేషన్, 7 పురపాలక సంఘాలు, 557 గ్రామ పంచాయతీలు, 20.61 లక్షల జనాభాతో అవతరించింది. తాజా మార్పులతో ప్రస్తుతం 36 మండలాలు ఉండగా.. ఇకపై ఆ సంఖ్య 40కి పెరగనుంది. ● అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య కూడా ఏడు నుంచి ఎనిమిది కానుంది. రాజంపేటను కడప జిల్లాలో కలపడంతో ఈ సంఖ్య పెరిగింది. ఒక నగర, 5 పురపాలక సంఘాలున్నాయి. ఇవి కూడా 6 కానున్నాయి. కొత్తగా చేరిన మండలాల్లో రాజంపేట, నందలూరు, సుండుపల్లి, వీరబల్లి ఉండనున్నాయి. రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో ఆరు మండలాలు మాత్రమే ఉండనుండగా.. అట్లూరు చేర్చాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఇందుకు సంబంధించిన తుది నోటిఫికేషన్ బుధవారం వెలువడనుంది. గతంలో రాజంపేట నియోజకవర్గం ఉమ్మడి కడప జిల్లాలోనే ఉండేది. తాజా మార్పులతో మళ్లీ కడప చెంతనే చేరినట్లైంది.

రైతేరాజు 6లో

## దోజర్లతో దోచేస్తున్నారు

**పెన్నాలో తిష్ఠ వేసిన ఇసుక తోడేళ్లు**

సిద్దవటంలోని గాండ్లపాలెం పెన్నాలో ఇసుక నింపుకొంటున్న ట్రాక్టర్లు, పక్కన దోజర్ యంత్రం

**సిద్దవటం, న్యూస్‌టుడే:** సిద్దవటంలో ఉచిత ఇసుక ముసుగులో కొందరు జోరుగా అక్రమ రవాణా సాగిస్తున్నారు. పట్టపగలే యంత్రాలతో ఇసుక తవ్వకాలు సాగిస్తూ పెన్నాను కొల్లగొడుతున్నారు. ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేసి జేబులు నింపుకొంటున్నారు. యంత్రాలతో యథేచ్ఛగా సాగిస్తున్న తవ్వకాలతో నది నీటి ఉద్ధృతికి ఒడ్డున ఉన్న సాగు భూములు భవిష్యత్తులో కోతకు గురై తాము నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● **యథేచ్ఛగా యంత్రాలతో తవ్వకాలు:** గాండ్లపాలెం పెన్నానదిలో కొందరు దోజర్లతో కొన్ని నెలలుగా తవ్వకాలు సాగిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు ఇటుగా కన్నెత్తి చూడడం లేదు. పెన్నా నదిలోకి ట్రాక్టర్లు రాకుండా గతంలో పలుమార్లు స్థానికులు అడ్డుకున్నా.. అక్రమార్కులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపట్టకుండా అధికారులు అరికట్టే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ.. గాండ్లపాలెం పెన్నాలో ఇసుక తవ్వకాల విషయం దృష్టికి వచ్చిందన్నారు. అక్రమ తవ్వకాలపై నిఘా పెట్టి అరికట్టే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు సాగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 7,298 మంది ఉల్లి రైతులకు ఊరట

**కడప వ్యవసాయం, న్యూస్‌టుడే:** ఉల్లి సాగు కోసం రైతులు ఖరీఫ్‌లో ఈ ఏడాది రూ. వేలు వెచ్చించారు. పంట చేతికొచ్చే సమయానికి ధరలు పతనం కావడంతో పెట్టుబడి మొత్తం కోల్పోవాల్సి వచ్చింది. గడ్డలు వెలికితీసేందుకు కూలీల ఖర్చు కూడా రాదని భూమిలోనే దున్నేసిన కర్షకులూ ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆరంభంలో ప్రభుత్వం కర్నూలు జిల్లా రైతులకు హెక్టార్‌కు రూ. 50 వేల సాయాన్ని ప్రకటించింది. జిల్లాలోని పరిస్థితిని కలెక్టర్ శ్రీధర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాయం ప్రకటించింది. 5,681 హెక్టార్లలో పంటలు సాగుచేసిన 7,298 మంది రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం జిల్లాకు సుమారు రూ. 28 కోట్లు మంజూరు చేసింది. ఈ విషయమై ఉద్యాన శాఖ ఉప సంచాలకులు మాట్లాడుతూ.. మంజూరైన నిధులను ప్రభుత్వమే నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు.

## ఆత్మబంధువులు.. ఆ నలుగురు

◆ 6,800 మృతదేహాలకు అంతిమ సంస్కారం

● 2024 మే 09: ఈశ్వరమ్మ(60) అనే వృద్ధురాలు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. అంతిమ సంస్కారానికి అయినవారు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ స్థాపకుడు మోరే లక్ష్మణరావు విషయం తెలుసుకుని హిందూ శ్మశాన వాటికలో శాస్త్రోక్తంగా కార్యక్రమాలను పూర్తి చేశారు. అదే రోజు చిన్నా(32) అనే యువకుడికి అంత్యక్రియలను పూర్తి చేశారు.

● 31 మార్చి 2025: మైలవరం మండలం దొమ్మర నంద్యాలలో లక్ష్మి(64) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందారు. అంత్యక్రియలకు ఎవరూ స్పందించక పోవడంతో మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులు ముందుకొచ్చి నిర్వహించారు.

మైలవరం మండలం వేపరాలలో వృద్ధురాలి అంత్యక్రియలు చేసేందుకు రంగు నీళ్ల కాలువ దాటేందుకు ఇబ్బంది పడుతున్న మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** జమ్మలమడుగు యూనియన్ బ్యాంకు(ఆంధ్రా బ్యాంకు)లో పనిచేస్తున్న మోరే లక్ష్మణరావు 2014 మార్చి 3న మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ స్థాపించారు. ఇప్పటి వరకు సుమారు 6,800 అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తిచేసి ఆత్మబంధువులుగా నిలుస్తున్నారు. సంస్థలో 364 మంది సభ్యులున్నారు. వీరంతా జమ్మలమడుగుతో పాటు ప్రొద్దుటూరు, ముద్దనూరు, ఎర్రగుంట్ల, మైదుకూరు, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాలకు వెళ్లి అంతిమయాత్రలో మేమున్నామంటున్నారు. వీటితోపాటు రక్తదానం, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, పెళ్లిళ్లలో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి పేదలకు అందించడమూ చేస్తున్నారు.

### ఆ ఘటనతో ముందుకొచ్చాం

కరోనా సమయంలో అంత్యక్రియల నిర్వహణకు అంతా ఇబ్బంది పడ్డారు. వైరస్ భయంతో అయినవారూ కానివారయ్యారు. అనంతరపురంలో ఓ మృతదేహాన్ని ముళ్లపొదల్లో పడేశారు. ఆ ఉదంతాన్ని చూసి చలించాం. ఫౌండేషన్ స్థాపించి అంతిమ సంస్కారాలకు ముందుకొచ్చాం.

**- మోరే లక్ష్మణరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు, మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్, జమ్మలమడుగు**

### కుటుంబ సభ్యుల ప్రోత్సాహం

వేళకాని వేళల్లో అనాథ శవాలకు అంత్యక్రియలు చేయాలని ఫోన్లు వస్తుంటాయి. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో అటువంటి వాటిని పూర్తి చేయగలుగుతున్నాం. **- షేక్. అహ్మద్ హుసేన్, జమ్మలమడుగు పట్టణ అధ్యక్షుడు, మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్**

### కుళ్లిన వాటినీ మోస్తుంటాం

భిక్షాటన చేసేవారు, రోడ్డు ప్రమాదాల్లో చనిపోయినవారి మృతదేహాలను తీసుకుపోయేందుకు ఎవరూ రారు. సమాచారం అందగానే మేము అంత్యక్రియలను చేస్తున్నాం. కొన్నిసార్లు కుళ్లిపోయిన శవాలనూ మోస్తుంటాం. **- కుళ్లాయిరెడ్డి, జమ్మలమడుగు ఉపాధ్యక్షుడు, మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్**

## వేడుకల్లో హద్దు మీరొద్దు

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** కొత్త సంవత్సరం వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని.. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ● నివాసాల్లో వేడుకలు నిర్వహించుకోవాలి. ● అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ● డిసెంబరు 31వ తేదీ రాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తారు. ● పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేస్తారు. ● అర్ధరాత్రి 12.30 గంటల్లోపు కార్యక్రమాలను పూర్తి చేసుకోవాలి. ● మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. ● టపాసులు, డీజేలు నిషేధం. ● మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తే కఠిన చర్యలు తప్పవు. ● నిర్లక్ష్య డ్రైవింగ్, బైక్ రేసింగ్, ట్రిబుల్ రైడింగ్, పొగ గొట్టాలు తొలగించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. ● బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తాం' అని స్పష్టం చేశారు.

## రాళ్ల సీమలో రతనాల పంటలు

రాయలు ఏలిన నేల.. రతనాల సీమగా పేరొందిన ప్రాంతం. సరైన నీటి వనరులు లేక ఇక్కడి భూములు గతంలో బీడుగా పడి ఉండేవి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ప్రాజెక్టులు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు విస్తారంగా పంటలు సాగు చేస్తున్నారు. గోపవరం చెరువు ఆయకట్టులో రైతులు ప్రస్తుతం రబీలోనూ వరి సాగు చేస్తున్నారు. ఒకవైపు నారు తీస్తుంటే.. మరోవైపు నాట్లు వేస్తున్నారు. దీంతో పంట పొలాల్లో రైతులు, కూలీలతో సందడి వాతావరణం నెలకొంది.

**- ఈనాడు, కడప**

## అరచేతిలో పల్లె ప్రగతి

**యాప్‌కోసం**

**కలికిరి, న్యూస్‌టుడే:** పల్లె సీమలు ప్రగతికి పట్టుగొమ్మలు. గ్రామాలు బాగుంటేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. ఊళ్లో చేపడుతున్న పనులు.. వాటికి ప్రభుత్వం కేటాయించిన నిధులు. ఎంత ఖర్చు చేశారో మీకు తెలుసా? ఈ వివరాలు తెలుసుకోవాలనే ప్రయత్నం చేసినా కొందరు అధికారులు చెప్పరు. అలాగని నిరాశ చెందాల్సిన పని లేదు. చరవాణి ద్వారా మీ గ్రామ ఆర్థిక పరిస్థితి.. ప్రగతి వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు.

● **ఉందిగా స్వరాజ్ యాప్:** ఊరి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు '2020'లో కేంద్ర ప్రభుత్వం 'గ్రామ స్వరాజ్య' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్లే-స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీలను వరుసగా ఎంచుకోవాలి. అనంతరం అప్రూవ్డ్ యాక్టివిటీస్‌పై క్లిక్ చేస్తే పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఇతర పనులకు ఎంత వెచ్చించారో తెలుస్తుంది.

● కొన్ని సందర్భాల్లో యాప్‌లోనూ సమాచారం ఉండకపోవచ్చు. అప్పుడు వెనక్కి వచ్చి ఫైనాన్షియల్ ప్రోగ్రెస్‌ను తెరవాలి. ఇందులో ఆర్థిక సంవత్సరాన్ని ఎంపిక చేసుకుంటే పంచాయతీకి ఎన్ని నిధులు వచ్చాయి? ఎంత ఖర్చయింది. ఏయే పనులకు ఎంత వెచ్చించారనే సమాచారం తెలుస్తుంది.

## కస్తూర్బాలకు కాస్మోటిక్స్ కానుక

| |
|---|
| ● జిల్లాలోని కేజీబీవీలు: 17 |
| ● మొత్తం విద్యార్థినులు 4,468 |
| ● విడుదలైన నిధులు రూ. 47.60 లక్షలు |
| ● ఆదర్శ వసతి గృహాలు: 03 |
| ● అందులోని విద్యార్థినులు 292 |
| ● పది, ఇంటర్ పరీక్షలు రాయనున్నది 2,033 |
| ● విడుదలైన రవాణా రుసుం: రూ.7,11,550 |

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థినుల మోము సంతోషంతో మురిసిపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాలికలకు కాస్మోటిక్స్ కొనుగోలు కోసం, రవాణా రుసుం చెల్లించడానికి అవసరమైన నిధులను విడుదల చేసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కాసుల కోసం నిరీక్షణ చేసినా నిరాశే మిగిలింది. అదిగో నిధులిస్తాం. ఇదిగో చెల్లిస్తాం అంటూ ఊరించి ఉసూరుమనిపించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి పది నెలలకు చెల్లించాలని నిర్ణయించింది.

● **ఒక్కో విద్యార్థినికి రూ. వెయ్యి:** పది నెలల జిల్లాలో 17 కేజీబీవీలున్నాయి. ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే ఒక్కో విద్యార్థినికి ప్రతి నెలా రూ.100 చొప్పున చెల్లించాలి. వైకాపా పాలనలో చిల్లిగవ్వ విదిల్చింది లేదు. కూటమి ప్రభుత్వం పది నెలలకుగాను ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున వారి తల్లుల ఖాతాల్లో జమ చేయడానికి సమగ్ర శిక్షా అధికారులతో ఏర్పాట్లు చేయించింది. ఈ మొత్తంతో విద్యార్థినులు తమకు కావాల్సిన నూనె, సబ్బులు, శాంపులు, పౌడర్ వంటివి కొనుగోలు చేసుకోవచ్చని సమగ్ర శిక్షా ఏపీసీ ప్రేమంత్‌కుమార్, జీసీడీవో డి. రూత్ ఆరోగ్య మేరీ చెప్పారు. అదేవిధంగా మూడు ఆదర్శ వసతి గృహాలుంటే.. వీరికి కూడా నెలకు రూ.100 మేర ఇవ్వనున్నట్లు తెలిపారు.

### ముందస్తుగా రవాణా భత్యం

జిల్లాలో ఉన్న కేజీబీవీల్లో పది, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులు పబ్లిక్ పరీక్షలు రాయడానికి ఇతర కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుంది. పేద పిల్లలపై రవాణా భారం పడకుండా కూటమి ప్రభుత్వం అవసరమైన నిధులిచ్చింది. ఒక్కో విద్యార్థికి రూ. 350 చొప్పున చెల్లించాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదివరకు పరీక్షలు పూర్తయిన తర్వాత చెల్లిస్తుండగా ఈ దఫా మాత్రం ముందస్తుగా ఇవ్వనుంది.

## మేం చెప్పినట్టు రాస్తేనే సంతకం పెడతాం

**ఈనాడు, కడప: ములకలచెరువు, మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే:** ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌రావు(ఏ1)తో పాటు జగన్మోహన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాస్‌రావు, రమేష్‌బాబు, అల్లాబక్షులను విచారణ నిమిత్తం ఎక్సైజ్ పోలీసులు నాలుగు రోజుల క్రితం కస్టడీకి తీసుకున్నారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు తంబళ్లపల్లె కోర్టులో వీరిని హాజరు పరచాల్సి ఉంది. నిందితులు వెల్లడించిన అంశాలతో పోలీసులు స్టేట్‌మెంట్ తయారు చేశారు. అయితే పోలీసులు తాము చెప్పిన విషయాలతో కాకుండా తమ ఇష్టం వచ్చినట్లు రిపోర్ట్ తయారు చేశారని, తాము చెప్పినట్లు చేస్తేనే సంతకాలు చేస్తామంటూ నిందితులు పట్టుబట్టినట్లు సమాచారం. ఈ పరిణామంతో కార్యాలయంలో కొద్దిసేపు ఉత్కంఠ ఏర్పడింది. స్టేట్‌మెంట్ మళ్లీ నమోదు చేయడంతో సంతకాలు చేసినట్లు సమాచారం.

## వినియోగించుకుంటే అధనం

**అదనపు లోడు క్రమబద్ధీకరణకు 31 గడువు**




**ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** సాధారణంగా కిలోవాట్‌కు రూ. 2 వేలు, డిపాజిట్ రూ. 200, దరఖాస్తు రుసుం రూ. 50 చొప్పున మొత్తం రూ. 2,250 దరఖాస్తుదారు చెల్లిస్తే విద్యుత్తు మీటరు మంజూరవుతుంది. అనంతరం చాలా మంది తమ ఇళ్లలో టీవీ, ఫ్రిజ్, ఎయిర్ కూలర్, ఏసీ, గీజర్, హీటర్, మైక్రోవేవ్స్ తదితర విద్యుత్తు ఉపకరణాలు వినియోగిస్తుంటారు. దీంతో దరఖాస్తు చేసుకున్న కిలోవాట్ కన్నా అధికంగా వినియోగమవుతుంది. ఈ ప్రభావం వేసవిలో ఆయా ప్రాంతాల్లోని నియంత్రికలపై పడుతుంటుంది. అదనపు లోడు పెరిగి సరఫరాలో అంతరాయం తలెత్తుతుంటుంది. ఈ నేపథ్యంలో నియంత్రికల సామర్థ్యం పెంపుతో పాటు.. అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు భర్తీకి స్వచ్ఛంద అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ చొప్పున చెల్లింపునకు అవకాశం కల్పించారు. కేటగిరీ-1లో నిర్దేశిత కిలోవాట్ కన్నా అధికంగా విద్యుత్తు వినియోగించే వారు స్వచ్ఛంద క్రమబద్ధీకరణ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన రెండో దఫా పొడిగింపు గడువు ఈ నెల 31తో ముగియనుంది. ఉమ్మడి జిల్లాల పరిధిలో గత మార్చి నుంచి జూన్ అనంతరం ఆగస్టు నుంచి ఈ నెల 29 వరకు మొత్తం 3,733 మంది వినియోగదారులు ఎస్పీడీసీఎల్‌కు రూ. 73.81 లక్షలు చెల్లించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీలోపు గడువు ముగియనున్నందున మిగిలిన వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లేకుంటే సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి రాయితీలతో సంబంధం లేకుండా రుసుం వసూలు చేస్తారని తెలిపారు.




## కేఎస్ఆర్ఎం సునాయాస విజయం

కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల (కడప) జట్టు పది వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు) జట్టు పది ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 34 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో అనిల్ 12 పరుగులు చేశారు. కేఎస్ఆర్ఎం బౌలర్లలో డి.గణేష్, జగదీష్, వి.గణేష్ తలా ఒక్కో వికెట్ తీసుకున్నారు. అనంతరం కేఎస్ఆర్ఎం జట్టు 1.2 ఓవర్లలో వికెట్లేమి కోల్పోకుండా 36 పరుగులు చేసింది. జట్టులో వి.గణేష్ 8 బంతుల్లో అజేయంగా 29 పరుగులు(4-ఫోర్లు, 2-సిక్సులు) చేసి జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు.

## రమణ రాణింపు.. రిమ్స్ గెలుపు

లయోలా డిగ్రీ కళాశాల (పులివెందుల) టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాల (రిమ్స్, కడప) జట్టు పది ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. జట్టులో రమణ 41 పరుగులు (2-ఫోర్లు, 3-సిక్సులు) చేశారు. లయోలా డిగ్రీ కళాశాల బౌలర్ చైతన్య 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం లయోలా కళాశాల బ్యాటింగ్ చేపట్టి పది ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 52 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో ఇర్ఫాన్ అజేయంగా 16 పరుగులు(2-ఫోర్లు) చేశారు. రిమ్స్ మెడికల్ కళాశాల బౌలర్లు అజయ్, దినేష్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. రమణ బ్యాటింగ్‌లో రాణించడంతో రిమ్స్ మెడికల్ కళాశాల జట్టు 62 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

# ఆకాశమే హద్దుగా చెలరేగారు

### ఆసక్తికరంగా ఈనాడు క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: యువ క్రికెటర్లు తమ సత్తా చాటుకునేందుకు వేదికగా నిలుస్తున్న ఈనాడు మెగా క్రికెట్ టోర్నీలో గెలుపే లక్ష్యంగా.. ఆకాశమే హద్దుగా యువ క్రికెటర్లు చెలరేగి ఆడుతున్నారు. ఒక పక్క బ్యాటర్లు తమ జోరును కొనసాగిస్తూ పరుగుల వరద పారిస్తుండగా.. మరో వైపు బౌలర్లు చెలరేగి బంతులను విసురుతూ సత్తా చాటుతున్నారు. ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (జెఇఎస్) ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025 క్రికెట్ పోటీలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాల్లో సీనియర్ మెన్ విభాగంలో జరుగుతున్న ఈ పోటీల్లో సోమవారం స్టార్ ఆఫ్ ది క్రికెటర్లుగా పార్థసారథి, శివతేజ నిలిచారు.

## పార్థసారథి మెరిసె.. ఆదిత్య గెలిసె

మొదట బ్యాటింగ్ చేసిన శ్రీవెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ (ప్రొద్దుటూరు) జట్టు పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. జట్టులో విష్ణు 36 పరుగులు (2-ఫోర్లు, 3-సిక్సులు) చేశారు. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (మదనపల్లె) బౌలర్లు అశోక్ 2 వికెట్లు తీసుకోగా.. పార్థసారథి, తేజవర్ధన్ చెరో వికెట్ తీసుకున్నారు. అనంతరం ఆదిత్య కళాశాల జట్టు బ్యాటింగ్ చేసి 7.3 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 91 పరుగులు చేసి గెలుపొందింది. జట్టులో పార్థసారథి 19 బంతుల్లోనే అజేయంగా 39 పరుగులు (1-సిక్స్, 6-ఫోర్లు), తేజవర్ధన్ అజేయంగా 23 పరుగులు (1-ఫోర్, 1-సిక్స్) చేశారు. పార్థసారథి ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరచడంతో ఆదిత్య కళాశాల జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది.

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

పార్థసారథి (39 పరుగులు నాటౌట్, ఒక వికెట్)

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

శివతేజ (3 వికెట్లు, హ్యాట్రిక్)

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Beverage Partner: CMR SHOPPING MALL
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ TV Partner: ETV
Organised by ఈనాడు

★ నేటి మ్యాచ్‌లు (30-12-2025): కేఎస్ఆర్ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్స్): ◆ ఉదయం 8.00 గంటలకు : గవర్నమెంట్ డెంటల్ కాలేజ్ (రిమ్స్), కడప - స్కిల్స్ డిగ్రీ కాలేజ్ (కడప) ◆ ఉదయం 10.00 గంటలకు : సీకాం డిగ్రీ కాలేజ్ (కడప) - ఫాతిమా మెడికల్ కాలేజ్ (కడప) ◆ మధ్యాహ్నం 1 గంటకు : ఎస్‌డీహెచ్ఆర్ (రాయచోటి) - అన్నమాచార్య (రాజంపేట)
కేఓఆర్ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్స్): ◆ ఉదయం 8.00 గంటలకు : పి.రామిరెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (కడప) - నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (కడప) ◆ ఉదయం 10.00 గంటలకు : వైఎస్ఆర్ ఫైన్ ఆర్ట్స్ కాలేజ్ (కడప) - వైష్ణవి ఇంజినీరింగ్ కాలేజ్ (ప్రొద్దుటూరు) ◆ మధ్యాహ్నం 1 గంటకు : కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజ్ (కడప) - శ్రీహరి డిగ్రీ కాలేజ్ (కడప)

## సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలదే హవా

తొలుత బ్యాటింగ్ చేసిన సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాల (ప్రొద్దుటూరు) జట్టు పది ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. జట్టులో సుబ్బారెడ్డి 20 పరుగులు (1-ఫోర్, 1-సిక్స్), లోకనాథ్ 15 పరుగులు (3-ఫోర్లు) చేశారు. సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల (కమలాపురం) బౌలర్లు రేవంత్‌కుమార్‌రెడ్డి 3, విష్ణు 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల జట్టు బ్యాటింగ్ చేసి 9 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో ఆర్లో 39 పరుగులు (4-ఫోర్లు, 1-సిక్స్), శేషాద్రి అజేయంగా 19 పరుగులు (2-ఫోర్లు) చేశారు. సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది.

## షామీర్ ఆల్‌రౌండ్ ప్రతిభ.. గెలిచిన శ్రీవైష్ణవి కళాశాల

షామీర్‌బాషా ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరచడంతో శ్రీవైష్ణవి డిగ్రీ కళాశాల జట్టు (రాజంపేట) 49 పరుగుల తేడాతో ఘన విజయాన్ని సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీవైష్ణవి కళాశాల జట్టు 8 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. జట్టులో షామీర్‌బాషా 24 బంతుల్లో అజేయంగా 46 పరుగులు (6-ఫోర్లు, 1-సిక్స్), వెంకటేష్-21 పరుగులు (4-ఫోర్లు), యల్లమ్మరాజు అజేయంగా 19 పరుగులు (1-ఫోర్, 1-సిక్స్) చేశారు. శ్రీవేదవ్యాస డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు) జట్టులో రవి రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం శ్రీవేదవ్యాస జట్టు 8 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 57 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులో భువనేష్, రవికుమార్ చెరో 11 పరుగులు చేశారు. శ్రీవైష్ణవి కళాశాల బౌలర్లు షామీర్‌బాష, లోకేష్, కైఫ్ తలా ఒక్కో వికెట్ తీసుకున్నారు.

## హ్యాట్రిక్ వికెట్లు తీసిన శివతేజ.. గెలిచిన ఎస్ఆర్ఎన్‌బీ

శివతేజ వరుస బంతుల్లో వికెట్లు తీసి హ్యాట్రిక్ సాధించాడు. ఇతను 1.3 ఓవర్లు బౌలింగ్ చేసి పది పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసి.. ఎస్ఆర్ఎన్‌బీ డిగ్రీ కళాశాల (బద్వేలు) గెలుపులో ముఖ్య భూమిక పోషించాడు. మరో బౌలర్ ప్రశాంత్ రెండు వికెట్లు తీసి అతనికి అండగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఎస్ఆర్ఎన్‌బీ జట్టు పది ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి సరిగ్గా వంద పరుగులు చేసింది. జట్టులో నాసీర్ 20 పరుగులు (3-ఫోర్లు), వినయ్‌వర్ధన్ 17 పరుగులు (1-ఫోర్, 1-సిక్స్) చేశారు. ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాల(కడప) బౌలర్ నవీన్ 4, చెన్నకేశవ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 58 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులో గిరివర్ధన్ 12 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో ఎస్ఆర్ఎన్‌బీ జట్టు 42 పరుగుల తేడాతో గెలిచింది.

## ఆర్థికసాయానికి మహిళ వినతి / స్పందించిన మంత్రి నారా లోకేశ్

బద్వేలు, న్యూస్ టుడే: బద్వేలుకు చెందిన వెంకటమ్మ వైద్యఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించాలని ఆమె తరపున ఓ మహిళ మంత్రి నారా లోకేశ్‌కు ట్విట్టర్‌లో ట్యాగ్ చేశారు. అనారోగ్య సమస్యలతో రూ.3 లక్షలకు పైగా ఖర్చు అయిందని ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నానని ఆదుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి నారా లోకేశ్ వెంకటమ్మకు అండగా నిలిచి సాయమందిస్తామని సమాధానమిచ్చారు.



## జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు చురుగ్గా ఏర్పాట్లు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జనవరి 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మైదానం సిద్ధమవుతోంది. మైదానంలో పనులు చివరిదశకు చేరుకున్నాయని గ్రౌండ్ ఇన్‌ఛార్జి అంకాల్‌రెడ్డి తెలిపారు. జాతీయస్థాయి అండర్-14 బాలికల వాలీబాల్ పోటీలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వాలీబాల్ ఆడేందుకు మూడు కోర్టులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు 22 జట్లు పేర్లను నమోదు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ సాయంత్రం వరకు గడువు ఉందన్నారు. ప్రతి రోజూ 20 మ్యాచ్‌లు జరిగేలా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

వీల్‌ఛైర్‌లో వచ్చిన వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

## ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల-పరిష్కార వేదిక నుంచి సంబంధిత ఠాణాలకు బదలాయించే ఫిర్యాదులపై పోలీసులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కరించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ స్వయంగా మాట్లాడారు. నడవలేని వృద్ధులను వీల్‌ఛైర్‌లో ఎస్పీ వద్దకు తీసుకొచ్చారు. ఎస్పీ వారి వద్దకు వెళ్లి వారి ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కార నిమిత్తం ఆయా ఠాణాలకు బదలాయించారు. జిల్లా వ్యాప్తంగా 106 ఫిర్యాదులొచ్చాయి. నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్‌బీ డీఎస్పీ సుధాకర్, మహిళా ఠాణా డీఎస్పీ బాలస్వామిరెడ్డి తదితరులున్నారు.

# నేరాలు చేస్తే చూస్తూ ఊరుకోం...

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓ యువకుడిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి నగర రోడ్లపై తిప్పారు. వారిని మాచుపల్లె బస్టాండ్ నుంచి కృష్ణా కూడలి వరకు నడిపించారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే వారందరికీ ఇదే పరిస్థితి ఎదురవుతుందని రెండో పట్టణ సీఐ ప్రసాద్‌రావు హెచ్చరించారు. కడప శంకరాపురానికి చెందిన నల్లిపోగు పవన్ తన అమ్మమ్మతో కలిసి మాసాపేటలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 25న మాసాపేట సమీపంలోని సమాధుల వద్ద అదే ప్రాంతానికి చెందిన హర్ష, కీర్తన్, ఏసుబాబులు మద్యం తాగుతున్నారు. వారి వద్దకు వెళ్లిన పవన్ వారితో కలిసి మద్యం తాగాడు. వారిలోని హర్ష తన గురించి బయట చెడుగా ఎందుకు చెబుతున్నావని పవన్‌పై వాగ్వాదానికి దిగాడు. దీంతో అక్కడి నుంచి పవన్ బయల్దేరి వెళ్తుండగా ముగ్గురు వెంబడించారు. హర్ష తన వద్ద ఉన్న పిడిబాకుతో పవన్ ఛాతీపై పొడవడానికి యత్నించగా తప్పించుకునే ప్రయత్నంలో తలకు తగిలి తీవ్రరక్తస్రావమైంది. కీర్తన్, ఏసుబాబులు పవన్‌పై విచక్షణరహితంగా దాడి చేశారు. స్థానికులు రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వారిలో హర్ష, కీర్తన్‌ను అరెస్టు చేసి నగర రోడ్లపై నడిపించామని సీఐ వివరించారు.

హత్యాయత్నం కేసులో నిందితులను నగర రోడ్లపై తిప్పుతున్న రెండో పట్టణ పోలీసులు

రాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.No. 16/2025
పసుపులేటి వెంకటేష్, తండ్రి పి.వెంకటేష్, వయస్సు 40 సంలు, R/o D.No. 52/99-63, మాసనగర్, కె.రామాపురం, రాయచోటి (టౌన్ & మం), అన్నమయ్య జిల్లా. ... పిటీషనర్
V/s
1. కల్లూరు ముబారక్, తండ్రి గఫూర్, ముస్లిం, R/o D.No.12/30, దూదేకులపల్లి, కె.రామాపురం, రాయచోటి (టౌన్ & మం), అన్నమయ్య జిల్లా, సెల్ : 9502065209
2. కె.మోహన్‌కుమార్, తండ్రి వెంకటరాజు, ప్రొ॥ ఆఫ్ శ్రీ బాలాజి డిజిటల్స్, O/o D.No. 9-91-15, దామినేడు, తిరుపతి రూరల్ & జిల్లా సెల్ : 9849046429.
3. బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, O/o 2వ అంతస్తు, సాయి ఆర్కేడ్ నెం. 42/112113114, మెయిన్ రోడ్, SKDR కాలనీ, ఎన్జీవో కాలనీ, కడప టౌన్, వై.ఎస్.ఆర్.కడప జిల్లా.
4. HDFC Bank Ltd., IFSC Code HDFC0002380, O/o D.No. 24/127-1, షిఫా హాస్పిటల్ ప్రక్కన, రాజంపేట రోడ్, రాయచోటి (టౌన్ & మం), అన్నమయ్య జిల్లా.
5. Axis Bank Ltd., O/o D.No. 37/215, కడప-చిత్తూరు హైవే, సబ్ స్టేషన్ ఎదురుగా సంజీవనగర్ కాలనీ, రాయచోటి (టౌన్ & మం), అన్నమయ్య జిల్లా.
6. Cholamandalam Investment & Finance Company Ltd., O/o D.No. 39/622-75-1, RTC బస్టాండ్ రోడ్, వై.ఎస్.నగర్, కడప టౌన్ & జిల్లా.
7. ఎ.నాగభూషణం, తండ్రి తెలియదు, హిందూ, వ్యాపారం, R/o మంగళ కాలనీ, కె.రామాపురం, రాయచోటి (టౌన్ & మం), అన్నమయ్య జిల్లా.
8. రెడ్డిచెర్ల సరస్వతి, భర్త రవికుమార్, హిందూ, వ్యాపారం, R/o మంగళ కాలనీ, కె.రామాపురం, రాయచోటి (టౌన్ & మం.), అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్స్
నోటీసు ప్రకటన
పై నెంబరు దావాలో రెస్పాండెంట్స్ అయిన మీపైన పిటీషనర్‌ను ఇన్‌సాల్వెన్సీగా తీర్మానించమని ఐ.పి. పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 16.01.2026వ తేదీ ఉ॥ 10.30 గం॥లకు సదరు కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా ఖండితముగా తెలియజేయడమైనది.
ఇట్లు : శ్రీ పి.సునీల్‌కుమార్‌రెడ్డి, B.A., B.L.,
శ్రీ పి.నాగార్జున, M.A., LL.B.,
పిటీషనర్ తరపున అడ్వకేట్స్, రాయచోటి.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. చెన్నూరుకు చెందిన కర్నాటి నాగేశ్వరరెడ్డి (75) సోమవారం ఆర్టీసీ జోనల్ వర్కుషాపు వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన కుమార్తె లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో శనివారం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ చిన్నపెద్దయ్య వివరాల మేరకు.. కడప కోఆపరేటివ్ కాలనీకి చెందిన సురేష్(27)కు కొన్నేళ్ల కిందట సునీత అనే మహిళతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. సురేష్ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో దంపతుల మధ్య వచ్చిన కలహాలతో సునీత పుట్టింటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన సురేష్ శనివారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. స్థానికులు సోమవారం గుర్తించి ఒకటో పట్టణ పోలీసులకు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలి

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొనే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి ఫోన్లు చేసిన వినియోగదారులకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఆయా ప్రాంత అధికారులకు ఫోన్లు చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ మధుసూదన్, డీఈలు మోహన్, నాగమునిస్వామి, జేఈ సుధీర్ పాల్గొన్నారు.

ఆర్.ఓ.సి. 1882/2019–E 1, తేదీ : 29.12.2025
ప్రొద్దుటూరు పురపాలక సంఘము
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు నెం.82 to 89 / 2025-26 / E1,
dt: 29.12.2025 & 80/2025-26/E1. dt: 27.11.2025 (2nd Call), dt: 29.12.2025
ప్రొద్దుటూరు పురపాలక సంఘము - సాధారణ నిధుల క్రింద రూ.16.04 లక్షలతో 9 పనులు చేపట్టుటకు అర్హులైన వారి నుండి టెండర్లు ఆన్‌లైన్‌లో పిలువడమైనది. షెడ్యూలు డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ: 30.12.2025 ఉ॥ 10.00 గంటల నుండి, షెడ్యూలు డౌన్‌లోడింగ్ ఆఖరు తేదీ: 07.01.2026 సా॥ 3.00 గంటల వరకు, షెడ్యూలు స్వీకరించుటకు ఆఖరు తేదీ : 07.01.2026 సా॥ 3.30 గంటల వరకు, అర్హత ప్రమాణాలు, నియమ నిబంధనలు, తదుపరి వివరముల కొరకు www.apeprocurement.gov.in నందు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్‌లో పొందవచ్చును.
కాంటాక్ట్ సెల్ నెం. 9849908181 - మునిసిపల్ ఇంజినీరు, ప్రొద్దుటూరు మునిసిపాలిటీ, ప్రొద్దుటూరు.
సం/- కమిషనర్, ప్రొద్దుటూరు పురపాలక సంఘము

EENADU e Classifieds

TO LET
కడప, చిన్నచౌకు, MS రోడ్డు, ఆంజనేయస్వామి గుడి వద్ద కమర్షియల్ భవనం బాడుగకు కలదు. హాస్పిటల్స్, ఏజెన్సీస్, స్కూల్స్‌కు. ✆ 9885357707.

COMMERCIAL
సిద్ధవటం కోర్టు సమీపమున మెయిన్ రోడ్డులో ఉషా గార్డెన్, ఫంక్షన్ హాలు, రూములు బాడుగకు గానీ లీజుకు ఇవ్వబడును. Cell : 9949741939.

JOBS
Wanted Wardens Male-2, Female-2 Kadapa. Contact No: 9154944970, 9154944955.
RK Service (Servise Partner to Amazon) Supervisor - Porumamilla, Delivery Boys - Porumamilla, Badvel, Vempalli, Proddatur, Mydukur. Contact: 9666011667,9010120150.

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854
కడపలో డా॥ పరమేశ్వర రావు ENT (చెవి, ముక్కు, గొంతు) హాస్పిటల్ నందు పని చేయుటకు ఇద్దరు నర్సులు, కాంపౌండర్స్ & ఇంట్లిలో పని చేయుటకు ఇద్దరు ఆడవారు కావలెను. కడప వారికి ప్రాధాన్యత. ✆ 9492410402

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి పెట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చటపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

## మిరప తెగుళ్లను నివారిద్దాం!

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మారుతున్న వాతావరణం దృష్ట్యా మిరప పంటను తెగుళ్లు కాటేస్తున్నాయి. రసం పీల్చే పురుగుల వ్యాప్తి చెందటంతో చీడలు ఆశించి నష్టాన్ని కలుగజేస్తున్నాయని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.మానస తెలిపారు. ఆకుముడత (జెమిని వైరస్) ఇది తెల్ల దోమ ద్వారా సోకుతుంది. ఈ వైరస్ ఆశించిన మొక్కల లేత ఆకులు ముడుచుకుపోతాయి. ఈ వైరస్ సోకిన మొక్కలకు పూత రాదు, వచ్చినా పిందె కట్టదు. మిరపలో ఆకుముడత అనే లక్షణం వైరస్, తామర పురుగు, సూక్ష్మ పోషకాల లోపంతో వచ్చిందా అని రైతులు గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి. కుకుంబర్ మొజాయిక్ వైరస్ పేనుబంక సంక్రమిస్తుంది. మొక్కల్లో ఎదుగుదల ఉండక పొట్టిగా ఉంటాయి. ఆకు ఆకారం మారి.. కొనలు సాగి ఉంటాయి. పూత, కాత సక్రమంగా రాదు. మొవ్వకుళ్లు తామర పురుగుల ద్వారా వస్తుంది. ప్రధాన పొలంలో నారు నాటిన రెండు వారాల తరువాత 15 రోజుల వ్యవధిలో నాలుగుసార్లు మందులను పిచికారీ చేయాలి. వేపపిండి వేసుకోవాలి. పేనుబంక నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా మిథైల్ డెమటాసిన్ 2 మి.లీ, ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగులను అదుపు చేయాలంటే ఫిప్రోనిల్ 0.3 శాతం గుళికలు నాటిన 15 రోజులకు, 45 రోజులకు ఎకరాకు ఎనిమిది కిలోలు చొప్పున భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు వేయాలి. ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా డైఫెన్థియురాన్ 1.5 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి తామర పురుగులను కట్టడి చేయవచ్చు. తెల్లదోమ ఉంటే 5 శాతం వేపగింజల కషాయం, ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రాములు పిచికారీ చేసి అదుపు చేయవచ్చునన్నారు.

చిట్కా

**ప్రశ్న: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంటను మారుకా మచ్చల పురుగు, శనగ పచ్చ పురుగులు ఆశించి నష్టాన్ని కలుగజేస్తున్నాయి. నివారణకు ఏ రకం మందులు పిచికారీ చేయాలో తెలియజేయండి?**
- ఎస్.చెన్నకృష్ణారెడ్డి, రైతు, ముద్దనూరు

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

సమాధానం: ప్రస్తుతం పూత దశలో పంట ఉంది. మారుకా మచ్చల పురుగు ఆశించకుండా రైతులు నివారణ చర్యలు చేపట్టాలి. తొలి పూత దశలోనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేదా పూత/కాయ దశలో నొవాల్యురాన్ 1 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలపాలి. వీటిల్లో ఒక రకం మందును ఎంపిక చేసుకొని 13-0-45 రకం పోషకాన్ని కలిపి పిచికారీ చేస్తే పురుగును అదుపు చేయవచ్చు.
- డాక్టర్ వి.మాధురి, డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధనా స్థానం, ఊటుకూరు
- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

# చామంతి.. చీడ వదిలిద్దామిలా!

వేరుకుళ్లు సోకిన మొక్కలు

కడప, న్యూస్‌టుడే: చామంతి పూలకు ఈ సీజన్‌లో మంచి గిరాకీ ఉంటుంది. అయితే ఈ తోటకు చీడలు ఆశించడంతో చామంతి మొగ్గల రంగు, పరిమాణం తగ్గి పంట దిగుబడిని దెబ్బతీస్తున్నాయి. సకాలంలో రైతులు స్పందించి యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపడితేనే పూల నాణ్యత పెరిగి మంచి గిరాకీ లభిస్తుంది. చామంతి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మానస సూచించారు.

**ఆకుమచ్చ :** నల్లని లోతైన గుండ్రని మచ్చలు ఆకులపై ఏర్పడి పత్రాలు ఎండిపోతాయి. నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తెల్లతుప్పు:** ఈ రకం చీడ ఆశించిన మొక్కలు సరిగ్గా ఎదగవు. ఆకుల అడుగు భాగంలో తెల్లని ఉబ్బెత్తు మచ్చలు కనిపిస్తాయి. నివారణకు అజాక్సీస్ట్రోబిన్ 1 మి.లీ లేదా ట్రైఫ్లోఆక్సీస్ట్రోబిన్+ట్రిబ్యూకొనజోల్ 0.75 గ్రాములు లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

**ఫైటోప్లాస్మా :** ఈ తెగులు సోకిన మొక్కల్లోని అన్ని భాగాలు, పుష్పాలు ఆకుపచ్చగా మారి గుబురుగా కనిపిస్తాయి. ఈ తెగులును అరికట్టడానికి ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**వేరుకుళ్లు :** భూమిలో తేమ, వర్షాల వేళ, మంచు కురిసే సమయంలో ఈ వ్యాధి సోకుతుంది. పూల మొక్కలు వాడిపోయి, ఆకులు రాలిపోతాయి. నివారణకు పొలంలో నీరు నిల్వకుండా, పారుదలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మెటలాక్సిల్ ఎం.జడ్‌ను 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్టు మొదల్లో పోయాలి. ట్రైకోడెర్మావిరిడిని రెండు కిలోలను పశువుల ఎరువుతో కలిపి వేసుకోవాలి. ఇలా చేస్తే వెంటనే తెగులు తగ్గుముఖం పడుతుంది.

**ఎండు తెగులు:** ఈ చీడ లక్షణాలు కనిపించిన మొక్కల నుంచి తీసుకున్న కొమ్మ కత్తిరింపుల ద్వారా ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. రసాయన ఎరువుల, పురుగు మందుల పిచికారీ అధికంగా చేయడం, పంట మార్పిడి చేయకుండా ఒకే భూమిలో చామంతిని సాగు చేయడంతో తెగుళ్లు అధికమవుతాయి. ట్రైకోడెర్మావిరిడి రెండు కిలోలతోపాటు పశువుల ఎరువుతో కలిపి వేసుకోవాలి. ఇలా చేయలేని పక్షంలో ద్రవ రూపంలో ట్రైకోడెర్మావిరిడిని ఎకరాకు లీటరు చొప్పున బిందు పరికరాల ద్వారా నీటిలో విడుదల చేయాలి. రిడోమిల్ 2 గ్రాములు లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లు బాగా తడిచేలా పోయాలి. ఇలా చేస్తే ఈ తెగులును అదుపు చేయవచ్చు.

# వల పన్నుదాం.. దానిమ్మను కాపాడుకుందాం!

రైతేరాజు

పందిరి కాదు..దానిమ్మ పంటకు రక్షణగా ఉంచిన గ్రోకవర్లు

లింగాల, న్యూస్‌టుడే: శీతాకాలంలో పొగ మంచు, తెగుళ్ల ప్రభావం నుంచి 'దానిమ్మ' పంటను రక్షించుకోవడానికి వినూత్నంగా పార్నపల్లె, వెలిదండ్ల, లింగాల, కర్ణపాపాయపల్లె, నల్లపురెడ్డిపల్లె గ్రామాల పుడమిపుత్రులు తెరలు ఏర్పాటు చేస్తున్నారు. దానిమ్మ పంటలో మంచి నాణ్యమైన దిగుబడులు తీయడానికి ఇప్పటి వరకు రైతులు చీరలను పంటపై కప్పి కాపాడుతూ వచ్చారు. తాజాగా దానిమ్మ చెట్లపై గ్రోకవర్లు రక్షణగా ఉంచుతున్నారు. తద్వారా దానిమ్మకు సంకటంగా మారిన బ్యాక్టీరియా, మచ్చ తెగులు నుంచి రక్షణ కలుగుతోంది. ఇలా చేయడం ద్వారా చెట్లకు పొగ మంచు, గాలుల ప్రభావం తగ్గి కాయలకు కొమ్మల రాపిడి, ముళ్ల రాపిడి నుంచి నష్టం ఉండదు. రసం పీల్చే పురుగులైన తామర పురుగు, నల్లి, దోమ నష్టం తగ్గుతుంది. కాయలపై సూర్యరశ్మి తీవ్రత తగ్గి కాయలకు మంచి రంగు, రుచిని తాజాదనం సంతరించుకుంటాయని పార్నపల్లెకు చెందిన రైతు జొన్నలగడ్డ రంగానాయుడు, వెలిదండ్లకు చెందిన రైతు శివరామకృష్ణారెడ్డి తెలిపారు. మొక్క నాటిన ఏడాదిన్నర తర్వాత దిగుబడులు అందుతాయని, క్రమేణా 10 టన్నుల వరకు దిగుబడులు పొందవచ్చని చెప్పారు. గ్రోకవరు పలుచటి వస్త్రంలా ఉంటుందని, వీటిని వాడటం ద్వారా సస్యరక్షణ ఖర్చు తగ్గుతోందని పులివెందుల ఉద్యానాధికారి గువ్వా రాఘవేంద్రారెడ్డి తెలిపారు.

ప్రొద్దుటూరు
● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

జమ్మలమడుగు సబ్‌జైలులో రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

## ఉప కారాగారాల పరిశీలన

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** ఖైదీలు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ సూచించారు. జిల్లా ప్రధాన న్యాయ మూర్తి డాక్టర్ సి.యామిని సూచన మేరకు సోమవారం జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఉపకారాగారాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలో వారికి సూచించారు.

## బేతాయపల్లెలో రీసర్వేపై అవగాహన

**గోపవరం న్యూస్‌టుడే:** బేతాయపల్లెలో భూ సమస్యలు పరిష్కరించేందుకు సోమవారం గోపవరం తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రీసర్వేపై రైతులతో మాట్లాడి వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు గ్రామసభ నిర్వహించామని అధికారులు తెలిపారు. అనంతరం ర్యాలీ చేశారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న అధికారులు, రైతులు

## ప్రతిభా పాటవ పోటీల్లో సత్తా

**మైదుకూరు, న్యూస్‌టుడే :** ఈనాడు ఆధ్వర్యంలో సోమవారం సెయింట్ అల్ఫోన్స్ లిగోరి హైస్కూల్‌లో క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు జె.గురుసాయి వంశిక, ఎస్.ఉమేష్‌యాదవ్, ఎస్.సూరైన్ వరుస విజేతలుగా నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఎం.ఎం.బాషా, కోఆర్డినేటర్ నిరంజన్‌రెడ్డి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

విజేతలతో సెయింట్ అల్ఫోన్స్ లిగోరి కరస్పాండెంట్ ఎస్.ఎం.ఎం.బాషా, కోఆర్డినేటర్ నిరంజన్‌రెడ్డి

## అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

**బద్వేలు, న్యూస్‌టుడే:** జనవరి 2వ తేదీ అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు సిద్ధం చేసినట్లు ఆర్టీసీ డీఎం చైతన్య నిరంజన్ సోమవారం తెలిపారు. రానూపోనూ కడప నుంచి రూ.1150, బద్వేలు నుంచి రూ.1250 టిక్కెట్టు ఉందన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి జనవరి 19 వరకు డోర్ డెలివరీ మాసోత్సవాల సందర్భంగా 50 కిలోల లగేజీ 10 కిమీ దూరం వరకు ఉచిత డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి నేపథ్యంలో బెంగళూరు, హైదరాబాద్‌లకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

## ఉపాధి పనులు రద్దు చేయొద్దు

**వల్లూరు, న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనిని రద్దు చేసి కరవు ప్రాంతమైన రాయలసీమ ప్రాంతానికి అన్యాయం చేయొద్దని కోరుతూ సోమవారం రాయలసీమ కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్‌రెడ్డి తహసీల్దారు శ్రీవాణికి వినతి పత్రాన్ని అందించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వల్లూరు తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందించినట్లు చెప్పారు.

## పన్ను వసూళ్లు.. ఇక పారదర్శకం

**స్వర్ణ పంచాయతీ యాప్‌తో ప్రయోజనం**

కొత్తపల్లె-I గ్రామ సచివాలయ కార్యాలయం

| డివిజన్‌లోని మండలాలు | ఇంటిపన్ను చెల్లింపుదారులు | ఆస్తి పన్ను డిమాండ్ (రూ.లక్షల్లో) | నగదు రహిత వసూళ్లు |
|---|---|---|---|
| ప్రొద్దుటూరు | 33,414 | 655.26 | 112.73 |
| ఎర్రగుంట్ల | 10,787 | 233.76 | 28.17 |
| మైలవరం | 11,870 | 90.42 | 80.25 |
| దువ్వూరు | 13,815 | 53.50 | 18.58 |
| ముద్దనూరు | 9,270 | 52.18 | 13.11 |
| జమ్మలమడుగు | 7,840 | 33.51 | 14.43 |
| చాపాడు | 10,083 | 27.48 | 9.76 |
| పెద్దముడియం | 9,365 | 27.43 | 14.74 |
| రాజుపాళెం | 8,778 | 20.70 | 8.17 |
| కొండాపురం | 5,251 | 11.98 | 4.51 |

**ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** గత వైకాపా ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు కీలకమైన ఇంటి పన్నుల మదింపుతో పాటు ప్రజలు చెల్లిస్తున్న నగదు లావాదేవీలకు పారదర్శకత, జవాబుదారీతనం కరవైంది. సిబ్బంది చేతివాటంతో కొల్లోతున్న రాబడిపై ఆ శాఖ అధికారులు చోద్యం చూశారు. దీంతో ఆర్థిక వనరుల లేమితో మెరుగైన అభివృద్ధి పనులు చేపట్టని దుస్థితి కొనసాగింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో గ్రామ పంచాయతీల పరిధిలోని ఇంటి పన్నులకు కొలతలు, యజమాని చరవాణి వివరాలను అంతర్జాలంలో నమోదు చేశారు. దీంతో డిజిటల్ పద్ధతిలో క్యూఆర్ కోడ్ ద్వారా గత సెప్టెంబరు నుంచి నగదు రహిత చెల్లింపులకు శ్రీకారం చుట్టారు.

❖ వార్షికంగా నిర్దేశిత వసూళ్ల లక్ష్యంలో భాగంగా జమ్మలమడుగు డీఎల్‌డీవో పరిధిలోని పది మండలాల పరిధిలో 1,20,473 అసెస్‌మెంట్లు ఉండగా రూ.1,206.22 లక్షల డిమాండు ఉంది. ఈ నెల 27 వరకు రూ.304.45 లక్షలు ఖజానాకు చేరింది. ఈ విషయమై ప్రొద్దుటూరు డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ మరో మూడు నెలల వ్యవధిలో పూర్తి స్థాయిలో లక్ష్యం అధిగమించేలా పర్యవేక్షిస్తామన్నారు.

## రేడియం స్టిక్కరు ఏర్పాటు

స్థానిక మైదుకూరు రోడ్డులోని లక్ష్మీనగర్ సమీపంలో డివైడర్‌కు ఎట్టకేలకు రేడియం స్టిక్కరును అధికారులు ఏర్పాటు చేయించారు. ఇక్కడి సమస్యపై ఈ నెల 29న 'ఆదమరిస్తే ప్రమాదమే' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ర.భ.శా డీఈ లక్ష్మీనరసింహులు సిబ్బందితో డివైడర్ వద్ద సిల్వర్ స్తంభానికి రేడియం స్టిక్కరు ఏర్పాటు చేయించారు.

స్పందనకు వందనం

### స్తంభానికి మరమ్మతులు

స్థానిక ఆంధ్రకేసరిరోడ్డు నుంచి ఆటోనగర్ మలుపు వద్ద ఒరిగిపోతున్న స్తంభాలకు మరమ్మతులు చేపట్టారు. ఇక్కడి సమస్యపై ఈ నెల 27న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈనాడులో ప్రచురితమైంది. స్పందించిన ఈఈ రమణారెడ్డి, డీఈ శ్రీనివాసులురెడ్డి ఆదేశాలతో ఏఈ కృష్ణకుమార్ తమ సిబ్బందితో ప్రమాద స్థితిలో ఉన్న స్తంభాలను నిటారుగా ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

## ఎంజీనరేగా కొనసాగించాలని వినతి

**ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే:** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజీనరేగా) కొనసాగించాలని రాయలసీమ మహిళా సంఘం కార్యదర్శి తస్లీమ్ కోరారు. ఈ మేరకు ఎర్రగుంట్ల తహసీల్దారు శోభన్‌బాబుకు సోమవారం విన్నవించారు. ఈ సందర్భంగా తస్లీమ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కొనసాగించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

**బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే:** స్థానిక పోలేరమ్మ అమ్మవారిని సోమవారం అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమపూజ, అర్చనలు, పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలను అందుకున్నారు. ✶ శివాలయం ఆలయ కమిటీ ఛైర్మన్ వంగల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కశెట్టి వారసుడు సుబ్రహ్మణ్యం, కుటుంబసభ్యులు హాజరయ్యారు.

### వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

ప్రొద్దుటూరు పట్టణం, జమ్మలమడుగు, బద్వేలు గ్రామీణ, మైదుకూరు, న్యూస్‌టుడే : వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రొద్దుటూరులోని చెన్నకేశవ, శ్రీ కృష్ణాలయం, ప్రసన్న వేంకటేశ్వర, పాండు రంగ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జమ్మలమడుగు నారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయానికి విద్యుత్తు దీపాలతో అలంకరించారు. బద్వేలులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి, మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలు, మైదుకూరు మాధవరాయస్వామి, తిరుమలనాథ స్వామి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

### ఆలయాల్లో హుండీ ఆదాయం లెక్కింపు

**ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి ఆలయాల్లో వేర్వేరుగా హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించగా రూ.2,67,314లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్, ఆలయ కమిటీ ఛైర్మన్ రాజారెడ్డిలు తెలిపారు. సుంకు వెంకట సుబ్బయ్య సత్రం అనుబంధ ఆలయమైన దత్తాత్రేయ స్వామి దేవస్థానంలో హుండీ లెక్కించగా రూ.50,236 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీధర్ చెప్పారు.

## ప్రజల నుంచి వినతుల స్వీకరణ

రాజుపాళెం: రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

**రాజుపాళెం, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యలను పరిష్కరించడమే పీజీఆర్ఎస్ లక్ష్యమని ఆర్డీవో సాయిశ్రీ పేర్కొన్నారు. రాజుపాళెం రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో తహసీల్దార్ మనోహరరెడ్డి, ఎంపీడీవో రామనాథరెడ్డి, వీఆర్వోలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

*2 నుంచి పట్టా పాసు పుస్తకాల పంపిణీ*

జనవరి 2 నుంచి 9 వరకు రాజుపాళెం మండలంలో పట్టా పాసు పుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. ఈ మేరకు రాజుపాళెంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తామని స్పష్టం చేశారు.

**బద్వేలు :** బద్వేలు తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి ప్రజలు తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజుకు వినతిపత్రాలను అందజేశారు.

## హిందువులు ఐక్యత చాటాలి

కొండాపురం: తాళ్లప్రొద్దుటూరులో మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త జానకిరామయ్య

**కొండాపురం, న్యూస్‌టుడే:** సనాతన హిందూ ధర్మం ప్రాచీనమైనదని ఆధ్యాత్మికవేత్త, వేద పండితులు రాచకొండ జానకీరామయ్య పేర్కొన్నారు. సోమవారం తాళ్లప్రొద్దుటూరు ఆర్అండ్ఆర్ కాలనీలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద కూటమి మండల ఇన్‌ఛార్జి శివనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. సనాతన ధర్మం, దేవాలయాలు, వాటి ఆస్తులను రక్షించడం ప్రతి హిందువు కర్తవ్యమని వక్తలు పేర్కొన్నారు. హిందువులంతా ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జయపాల్‌రెడ్డి, చైతన్యశివాని, హిందువులు పాల్గొన్నారు.

**దువ్వూరు:** హిందువులంతా ఐక్యత చాటాలని ఈశ్వరీదేవి మఠం పీఠాధిపతి శ్రీ వీర శివకుమార స్వాములు, ప్రధాన వక్త వేణుగోపాల నాయుడు పిలుపునిచ్చారు. దువ్వూరు ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. అంతకు ముందు దువ్వూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం అలరించింది.

దువ్వూరు: ర్యాలీలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

## వివేకానంద జీవితం యువతకు ఆదర్శం

**పోరుమామిళ్ల, న్యూస్‌టుడే:** స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని వివేకానంద ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు వీరస్వామి విద్యార్థులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం 'విద్యార్థులకు వివేకానంద బోధనలు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉన్నతమైన లక్ష్యాలను సాధించడానికి ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థులకు వివేకానంద బోధనల పుస్తకాలను అందజేశారు. వివేకానంద ఫౌండేషన్ సభ్యులు హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు మహబూబ్‌చాంద్ పాల్గొన్నారు.

కలసపాడులో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వీరస్వామి

## ఆప్టికల్స్ దుకాణం ప్రారంభం

**ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే:** ప్రొద్దుటూరు గాంధీరోడ్డులో ఏర్పాటు చేసిన న్యూ నాగేంద్ర ఆప్టికల్స్ దుకాణాన్ని సోమవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి ప్రారంభించారు. మొదట దుకాణ యజమానులు గుత్తి చిన్నరాముడు, గుత్తి నాగేంద్రయాదవ్, రామకృష్ణ యాదవ్ పూజలు నిర్వహించారు. అన్ని రకాల కళ్లజోళ్లు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయన్నారు.

ఆప్టికల్స్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి

## పురపాలక భవనం.. 16 ఏళ్లకే శిథిలం

**ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే :** ఎన్నో భవనాలు వందేళ్లు దాటినా చెక్కు చెదరనివి ఉన్నాయి. . కానీ ప్రస్తుత కట్టడాలకు ఆ పరిస్థితి లేదు. పట్టుమని పదేళ్లవ్వక ముందే శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ దుస్థితి ప్రొద్దుటూరు పురపాలక సంఘం కార్యాలయ భవనానికి పట్టింది. ✶ ఈ భవనాన్ని రూ.2.31 కోట్లతో నిర్మించి 2009 ఫిబ్రవరి 28న ప్రారంభించారు. భవనం పైకప్పు బలహీనపడి సిమెంటు పెచ్చులూడి కూలిపోయేస్థితికి చేరింది. కౌన్సిల్ సమావేశ భవనం సీలింగ్‌కు సెంటర్ ఏసీలు ఏర్పాటు చేశారు. పైకప్పు పెచ్చులూడి ఏసీ పరికరం కిందపడి ధ్వంసమైంది. దీంతో కౌన్సిల్ సమావేశాన్ని అసౌకర్యాల ఇరుకైన భవనంలో నిర్వహిస్తున్నారు. భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తే సౌకర్యంగా ఉంటుందని కౌన్సిలర్లు, అధికారులు కోరుతున్నారు.

పెచ్చులూడిన ప్రొద్దుటూరు కౌన్సిల్ భవనం పైకప్పు

సిమెంట్ పెచ్చులూడడంతో కనిపిస్తున్న పైకప్పు ఇనుప కడ్డీలు

## నీడ దొరక్క.. నిలవక తప్పదు..!

జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఎండకు ఎండుతూ వర్షానికి తడవాల్సి వస్తోంది. ఇక్కడి నుంచి ముద్దనూరు, పులివెందుల తదితర ప్రాంతాలకు ప్రయాణికులు వెళ్తుంటారు. బస్సులు, ఆటోల కోసం విద్యార్థులు, ప్రజలు నిత్యం ఇక్కడే నిరీక్షిస్తుంటారు. అధికారులు స్పందించి బస్‌షెల్టరు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

## హడావుడిగా బడ్జెట్ అంశాల ఆమోదంపై మండిపాటు

**ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** స్థానిక మున్సిపల్ బడ్జెట్‌లోని అంశాలపై సమగ్రంగా చర్చ లేకుండా పది నిమిషాల వ్యవధిలో హడావుడిగా ఎందుకు ఆమోదించారని నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త, కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా మండిపడ్డారు. సోమవారం ఇస్లాంపురంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైకాపా, తెదేపాల మధ్య అవినీతి రహస్య ఒప్పందాలు ఉండటంతోనే ఈ పరిణామాలకు దారితీస్తున్నట్లు విమర్శించారు. ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదురెడ్డి ప్రజాధనం పరిరక్షణకు సంబంధం లేన్నట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు.

## ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

**దువ్వూరు, న్యూస్‌టుడే :** దువ్వూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఏపీటీఎఫ్ నూతన ఆంగ్ల సంవత్సరం కాలమానిని, డైరీలను ఆవిష్కరించారు. ఎంఈవో రమణయ్య చేతుల మీదుగా సంఘం నాయకులు క్యాలెండర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల శాఖ ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబహాన్, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో రమణయ్య, ఏపీటీఎఫ్ నాయకులు

## విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో పోటీలు

**ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే:** రాయలసీమపై అవగాహన కల్పించడంలో భాగంగా విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రాణితిరుమలదేవి డిగ్రీ కళాశాలలో సోమవారం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. శ్రీబాగ్ ఒడంబడికపై వ్యాసరచన, రాయలసీమ సంస్కృతి, జలవనరులు, రాజధానులు, ప్రాజెక్టులు, ఖనిజాలు వంటి అంశాలపై విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించినట్లు విద్యావంతుల వేదిక ప్రతినిధులు మహమూద్, జగదీష్‌లు తెలిపారు. జనవరి 4న కర్నూలులో జరిగే మహాసభల నేపథ్యంలో యువకుల్లో అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

## అర్ధరాత్రి వరకు మద్యం విక్రయించొద్దని ఆందోళన

**ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే:** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం షాపులను అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచొద్దని మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక రాజీవ్‌సర్కిల్ వద్ద ఉన్న మద్యం దుకాణం ముందు మహిళలు ఆందోళన చేపట్టారు. సంఘం జల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి జనవరి ఒకటో తేదీ వరకు మద్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. యువత మద్యం అధికంగా తాగి రోడ్లపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ప్రజలకు, మహిళలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నారని ఆరోపించారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే తాట తీస్తామని హెచ్చరించిన ప్రభుత్వం గ్రామాల్లో సైతం వాటిని ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. నూతన వేడుకల పేరుతో మద్యం దుకాణాల సమయాన్ని పెంచకుండా రాత్రి 7గంటలకే మూసివేయాలన్నారు. సంఘ నాయకురాళ్లు గుర్రమ్మ, ప్రమీలమ్మ, విజయకుమారి, ఝాన్సీ, అన్నపూర్ణ, సూరమ్మ, వెంకటలక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు. ✦ బ్రహ్మంగారిమఠం : నూతన సంవత్సర వేడుకల్లో మద్యం అమ్మకాల సమయాన్ని తగ్గించాలని సోమవారం డీవైఎఫ్ఐ మండల నాయకులు అజయ్, నరసింహులు స్థానిక ఎస్సై శివప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించారు.

మద్యం దుకాణం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

## ఆక్రమణలపై చర్యలకు డిమాండ్

**ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** స్థానిక అమృతానగర్‌లో ఓ ప్రార్థనా మందిరం ఏర్పాటుకు గతంలో కలెక్టరు మంజూరు చేసిన స్థలాన్ని ఆక్రమించినట్లు స్థానిక ఎస్సీలు తెలిపారు. ఆక్రమణదారులను ప్రశ్నిస్తే తమపై బెదింపులతోపాటు దౌర్జన్యం చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రార్థనా మందిరానికి ఇచ్చిన స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి సంరక్షించాలని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు గంగయ్యకు రాతపూర్వకంగా వారు ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీలోని వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన స్థలాలను గుర్తించడంతోపాటు ఆక్రమణలు, ఆక్రమణదారుల నుంచి పరిరక్షణకు 9 మంది సభ్యులతో హైపర్ కమిటీ ఏర్పాటు చేయాలని తహసీల్దారుకు ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి వినతి పత్రాన్ని సమర్పించారు. పీడీఎస్ బియ్యం, చక్కెర, రాగులు, జొన్నలు నల్లబజారుకు తరలించకుండా కఠిన చర్యలు చేపట్టాలని రాయలసీమ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ఖాజీపేట, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన ఖాజీపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. సినిమా షూటింగ్ నిమిత్తం నెల్లూరు నుంచి జమ్మలమడుగు సమీపంలోకి లఘు చిత్రం బృందం వచ్చింది. షూటింగ్ ముగించుకుని ఖాజీపేట మండలం జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ లాడ్జిలో బస చేశారు. సోమవారం సాయంత్రం సొంత పనిమీద ఖాజీపేటకు లఘుచిత్రం హీరో పాత్ర పోషిస్తున్న నటుడు త్రినయ్, తోటి సిబ్బంది పెద్దినాయుడులు ద్విచక్రవాహనంపై వెళ్తూ రోడ్డు క్రాస్ చేస్తుండగా తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొంది. ఘటనలో గాయాలైన వీరిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

## శివారు కాలనీలు.. అపరిశుభ్రతకు నిలయాలు

**బద్వేలు పురపాలకలో దుస్థితి**

**బద్వేలు, గోపవరం న్యూస్‌టుడే:** బద్వేలు పురపాలక శివారు కాలనీల్లో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాలువల వ్యవస్థ లేక మురుగు నీరు అస్తవ్యస్తంగా పారుతోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ✦ పురపాలక శివారు ప్రాంతాలు లక్ష్మీపాళెం, శీలంవారిపల్లె, బుచ్చిరెడ్డిపాళెం, రూపారాంపేట ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. సుమారు మూడు వేల వరకు జనాభా ఉంది. వార్డు సచివాలయం వద్ద పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందంటే ఇక మిగిలిన వీధుల్లో పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకనే అర్థమవుతోంది. శీలంవారిపల్లె వార్డు సచివాలయంలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆరోపణలున్నాయి. ఆ కార్యాలయం ఆవరణలో మురుగునీరు వెళ్లే మార్గం లేక నిలిచిపోయింది. వర్షం వస్తే వార్డు సచివాలయానికి వెళ్లాలంటే అడుసు తొక్కాల్సిన పరిస్థితి. ప్రజలు అధికారులకు సమస్యలు తెలిపినా పరిష్కారం చూపడం లేదని పురజనులు వాపోతున్నారు. లక్ష్మీపాళెంలో సీసీ రోడ్లు నిర్మించినా మురుగు కాలువలు ఏర్పాటు చేయలేదు. కుళాయిల నీరు, దుస్తులు ఉతికిన నీరు రహదారులపై ప్రవహిస్తూ అపరిశుభ్రంగా ఉంటోంది. ఈ దారిపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం దర్శనం కోసం భక్తులు నిత్యం వస్తుంటారు. వర్షం వస్తే ప్రాథమికోన్నత పాఠశాల వద్ద అపరిశుభ్రంగా ఉంటోంది. రూపారాంపేటలో ఎప్పుడో వేసిన రహదారులే దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో రాకపోకలు సాగించాలంటే పురజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

శీలంవారిపల్లె సచివాలయం ఆవరణలో మురుగు నీరు

## పొలాల్లో చోరీలు.. ఆందోళనలో రైతులు

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** చలితీవ్రత పెరగడంతో రైతులు రాత్రి వేళల్లో పొలాలకు రావడం లేదు. దీంతో చోరులు రెచ్చిపోతున్నారు. విద్యుత్తు తీగలు, నియంత్రికలను ధ్వంసం చేసి రాగి తీగలను ఎత్తుకెళ్తున్నారు. ఓ వైపు ప్రకృతి విపత్తులు, మరో వైపు దొంగల దాడులతో అన్నదాతలు నష్టపోతున్నారు. తమ పొలాల్లో దొంగతనం జరిగితే సకాలంలో పంటలకు నీటి తడులు అందించలేని పరిస్థితి ఉందని బాధితులు వాపోతున్నారు. రాగి తీగలు చోరీకి గురైన నియంత్రికలను మార్చుకునేందుకు బాధిత రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. వాటిని తిరిగి ఏర్పాటు చేసుకునేందుకు ఖర్చు కావడంతోపాటు జాప్యం జరుగుతోంది. ఇంతలో పొలంలో పంటలు ఎండుతున్నాయని బాధపడుతున్నారు.

✶ ఈ నెల 22వ తేదీ పెద్దముడియం మండలం మేడిదిన్నెలో కరివేపాకు తోటలో దొంగలు పడి స్టార్టర్, విద్యుత్తు తీగలు, పరికరాలు ఎత్తుకెళ్లారు. సుమారు రూ.10వేలు నష్టం జరిగిందని బాధిత రైతు హరికుమార్ వాపోయారు. గతంలోనూ పదిసార్లు తన పొలంలోనే తీగలను ఎత్తుకెళ్లారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్.ఉప్పలపాడులో మోటారు వైరు ఎత్తుకెళ్లిన దొంగలు

✶ కొద్ది రోజుల కిందట జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడులో రైతు మస్తాన్‌కు చెందిన విద్యుత్తు నియంత్రికను ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన శాంతయ్య, జమాల్ అనే రైతులు బాధితులే.

### పోలీసులకు ఫిర్యాదు చేయాలి

పొలంలో విద్యుత్తు సామగ్రి చోరీకి గురైతే వెంటనే వారి పరిధిలోని పోలీసులకు ఫిర్యాదు చేయాలి. స్టేషన్‌లో కేసు నమోదు చేయగానే అందుకు సంబంధించి ఎఫ్ఐఆర్ ప్రతిని అందజేస్తే తిరిగి పొందేందుకు అవకాశం ఉంటుంది. - రాజగోపాల్, డీఈఈ, జమ్మలమడుగు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

# కడప

• కడప • పులివెందుల • కమలాపురం

## ఎస్టీయూ దైనందిని ఆవిష్కరణ

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో షంషుద్దీన్, నాయకులు

**కడప విద్య, న్యూస్‌టుడే:** రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రూపొందించిన డైరీ, క్యాలెండర్లు ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటాయని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్, డీఈవో షంషుద్దీన్ అన్నారు. కడప నగరంలోని వారి కార్యాలయాల్లో సోమవారం ఎస్టీయూ నాయకులతో కలిసి ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, పాలకొండయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్ఎండీ ఇలియాస్‌బాషా, వేణుగోపాల్‌రెడ్డి, భాస్కర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## రూ. 2.5 కోట్లతో సీసీ రహదారులు

పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి

**చెన్నూరు, వల్లూరు, న్యూస్‌టుడే:** చెన్నూరు మండలంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి చెన్నూరులో సోమవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా రూ. 2.5 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ★ తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వల్లూరు మండలం గొల్లఓబాయపల్లెకు చెందిన జయసుబ్బారెడ్డిని ఎమ్మెల్యే తన కార్యాలయంలో సన్మానించారు. ప్రజలకు సేవ చేస్తూ పార్టీలో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## కూడళ్లలో అపాయం.. ఆలోచిస్తారా ఉపాయం!

### నగరంలో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

అప్సర కూడలిలో నిత్యం రద్దీ ఇలా...

**బిల్టప్,కడప న్యూస్‌టుడే:** నగరంలోని కూడళ్లు ప్రమాదకరంగా మారాయి. వన్‌టౌన్ కూడలి, రెండో గాంధీ బొమ్మ కూడలి, అప్సర సర్కిల్ నుంచి సంజన సర్కిల్ (మినీ బైపాస్) మధ్య గల ప్రధాన రహదారిలో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. ఈ కూడళ్ల వద్ద ఎక్కడో ఓ చోట ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ● గత వైకాపా పాలనలో కూడళ్ల ఆధునికీకరణ పనులు చేపట్టినా నామ మాత్రంగా పనులు చేశారు. నిత్యం రద్దీగా ఉన్న సంజన కూడలి (మినీబైపాస్), అప్సర కూడళ్ల మధ్యలో 15 ఏళ్ల కిందట పాక్షికంగా విస్తరించారు. సుమారు 600 మీటర్ల పొడవున్న ఈ మార్గంలో వివిధ ప్రాంతాల్లో కొన్ని నిర్మాణాలు తొలగించడంలో అధికారులు విఫలమయ్యారు. ఇక్కడ సేకరించిన స్థలంలో ఇప్పటికీ రహదారి నిర్మాణాలు పూర్తి చేయలేదు. తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు పలుమార్లు తవ్వి మరమ్మతులు చేసి వదిలేశారు. ● అప్సర కూడలి మార్గంలో డివైడర్ కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. నిత్యం ప్రమాద ఘటనలు చోటుచేసుకుంటున్నా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పాలకులు, అధికారులు దృష్టి సారించి కూడళ్ల విస్తరణకు చర్యలు చేపట్టి, రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని నగరవాసులు కోరుతున్నారు.

**ప్రమాదాలు నివారించండి :** నగరంలో అత్యంత కీలకమైన కూడళ్లు ఇరుకుగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్లపైనే ఆటోలు నిలుపుతున్నారు. పాదచారులు, ద్విచక్రవాహనదారులు, రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి, ప్రమాదాలు నివారించాలి.
**- ఆనంద్, వాహనదారుడు**

**ఆక్రమణలతో ఇబ్బందులు... ;** నిత్యం పనుల కోసం అప్సర కూడలి వద్ద కూలీలు వేచి ఉంటారు. మరోవైపు చిరు వ్యాపారులు తోపుడు బండ్లతో రహదారిని ఆక్రమించారు. దీంతో కూడళ్లు ఇరుకుగా మారాయి. బస్సులు, ఇతర వాహనాలు మలుపు తిరుగుతున్న సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి నివారణకు చర్యలు తీసుకోవాలి. **- నాగేంద్ర,కడప**

## ముక్కోటి ఏకాదశికి ముస్తాబు

ఒంటిమిట్ట రామాలయంలో బలిపీఠం వద్ద పుష్పాలంకరణ చేస్తున్న కార్మికులు

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకల నిర్వహణకు ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తితిదే అధికారులు క్యూలైన్లు, బారికేడ్లు, చలువ పందిళ్లు సిద్ధం చేశారు. ఆలయంలో జరుగుతున్న పనులను డిప్యూటీ ఈవో ప్రశాంతి, ఈఈ సుమతి, ఏఈ అమరనాథ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఒంటిమిట్ట పుర వీధుల్లో పురుషోత్తముడి గ్రామోత్సవాన్ని ఉదయం 8.30 గంటల నుంచి వైభవంగా నిర్వహిస్తామని ఆలయ తనిఖీ అధికారి తెలిపారు.
**కమలాపురం:** స్థానిక రైల్వే గేట్ సమీపంలోని రాధాకృష్ణ మందిరంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ వ్యవస్థాపకుడు, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఆయన తనయుడు ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో పాటు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఉదయం సుప్రభాత సేవ, ఉత్తర ద్వార పూజ అనంతరం, ఉత్తరద్వార దర్శనం కల్పిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. రామాపురంలోని వెంకటనారాయణ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
**పులివెందుల:** పులివెందులలో ప్రముఖ పురాతన చరిత్ర కలిగిన శ్రీరంగనాథస్వామి ఆలయం, శ్రీపద్మావతిసమేత కల్యాణ వెంకటరమణస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామి, ఉలిమెల్ల కొండపై వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

## ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం అధ్యాపకుడికి పురస్కారం

అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న వీసీ జయరామిరెడ్డి, సైరో ఫౌండర్ ఛైర్మన్ మారుతీప్రసాద్‌రెడ్డి

**వైవీయూ, న్యూస్‌టుడే:** డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో యానిమేషన్ విభాగానికి చెందిన డాక్టర్ శివకృష్ణారెడ్డి సైరో సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ఉత్తమ యంగ్ రీసెర్చ్ అవార్డు అందుకోవడం విశ్వవిద్యాలయానికి ఎంతో గర్వకారణమని విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య జయరామిరెడ్డి అన్నారు. స్థానిక విశ్వవిద్యాలయంలోని ఆయన కార్యాలయంలో సోమవారం ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీతో పాటు ఇతర అధ్యాపకులు శివకృష్ణారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటి వరకు పదికి పైగా జాతీయ అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో ఆయనవి పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయన్నారు.

## సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

**వేంపల్లె, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్రంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ప్రధాని మోదీ పాలనలో 2025 విఫల సంవత్సరం అయిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోయిందన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నుంచి మహాత్మాగాంధీ పేరు తొలగించి జాతిపితను అవమానించారన్నారు. ఇది జాతిమొత్తాన్ని అవమానించడమే అని ఆయన అభిప్రాయపడ్డారు.

## పేదల సాగు భూములు తిరిగివ్వాలి

**అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే:** పేదలు సాగు చేసుకుంటున్న భూములను తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, ఉపాధ్యక్షుడు నర్సయ్య డిమాండ్ చేశారు. కడప ఆర్డీవో జాన్ ఇర్విన్‌ను సోమవారం వారు కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందించారు. అధికారులు స్పందించి భూములను తిరిగి పేదలకు ఇచ్చేలా చూడాలని కోరారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

**కడప గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యుత్తు సంస్థ పరిధిలో మీటర్ రీడింగ్ తీసే రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా అన్నారు. విద్యుత్ భవన్ ఆవరణలో సోమవారం మీటర్ రీడర్ల ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నా సంస్థ ముందుకెళ్తోందన్నారు. నగర కార్యదర్శి మద్దిలేటి, మీటర్ రీడర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు గపూర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.
**వేంపల్లె:** ట్రిపుల్ ఐటీలో దశాబ్దాల నుంచి పని చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సత్వరం జీత భత్యాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తాను ఉద్యోగులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఎనిమిదేళ్లుగా తమకు వేతనాలు పెంచలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

## చిన్నారుల అత్యవసరాల కోసం 1098

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌ఛార్జి జేసీ విశ్వేశ్వరనాయుడు, ఐసీడీఎస్ పీడీ రమాదేవి తదితరులు

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** చిన్నారుల అత్యవసరాల కోసం ప్రభుత్వం 1098 కేటాయించిందని.. దాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి జేసీ విశ్వేశ్వరనాయుడు అన్నారు. కడప కలెక్టరేట్‌లో బాలల పరిరక్షణ సమితి రూపొందించిన బాలల సహాయవాణి 1098 గోడపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీసీపీవో సుభాష్‌యాదవ్, పీవోలు సునీత, కృష్ణప్రతిరూప్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్, ఎస్డీసీలు శిరీషా, ప్రేమంత్‌కుమార్, రంగస్వామి పాల్గొన్నారు.

## ఎస్వీ యూనివర్సిటీ పాఠ్య ప్రణాళికా సంఘం సభ్యుడి నియామకం

రామ్‌ప్రసాద్‌రెడ్డి

**వైవీయూ, న్యూస్‌టుడే:** యోగివేమన విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ ఆచార్యులు తప్పెట రామ్‌ప్రసాద్‌రెడ్డి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని విదేశీ భాషలు, భాషా శాస్త్రం విభాగానికి చెందిన పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యులుగా నియమితులయ్యారు. ఈయన గతంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మద్రాస్ విశ్వవిద్యాలయం, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయంతో పాటు పలు స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాలల తెలుగు శాఖలకు పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యులుగా, బోధనా సిబ్బంది నియామక (బీవోఏ) సభ్యులుగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను వైవీయూ వీసీ రాజశేఖర్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, వివిధ శాఖల ఆచార్యులు అభినందించారు.

## దివ్యాంగులకు కుక్కర్ల పంపిణీ

**పులివెందుల, న్యూస్‌టుడే:** పులివెందులలోని దివ్యాంగుల నెట్‌వర్క్ కార్యాలయంలో సోమవారం దివ్యాంగులకు దాతలు కుక్కర్లు పంపిణీ చేశారు. దేవిరెడ్డి లక్ష్మీనరసమ్మ జ్ఞాపకార్థంగా ఆమె కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి దివ్యాంగులకు విద్యుత్తు రైస్ కుక్కర్లు పంపిణీ చేశారు.

సిద్దవటంలో టపాసులు కాలుస్తున్న జేఏసీ నాయకులు, ప్రజలు.. ఒంటిమిట్ట బస్టాండ్ సమీపంలో సంబరాలు చేసుకుంటున్న జేఏసీ నాయకులు

## కడప జిల్లాలో విలీనంపై సంబరాలు

**సిద్దవటం, న్యూస్‌టుడే:** సిద్దవటం మండలాన్ని కడప జిల్లాలోనే కొనసాగించేలా క్యాబినెట్ ఆమోదం తెలపడంతో సోమవారం సిద్దవటం మండల ప్రజలు సంబరాలు చేసుకున్నారు. జేఏసీ నాయకులు, అన్నివర్గాల ప్రజలు సిద్దవటంలో టపాసులు పేల్చి హర్షం వ్యక్తం చేశారు. మాధవరం-1లో జేఏసీ నాయకులు, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు.
**ఒంటిమిట్ట:** ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప జిల్లాలోనే కొనసాగించాలని రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలపడంతో మండలానికి చెందిన జేఏసీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఉద్యమంలో భాగస్వామ్యమైన నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచిపెట్టారు.

## కుటుంబ వ్యవస్థ బలోపేతానికే హిందూ సమ్మేళనం

మాట్లాడుతున్న భువనేశ్వరి పీఠాధిపతి నాగేంద్ర మహోదర స్వామి

వేముల : ద్విచక్ర వాహనాల ర్యాలీలో పాల్గొన్న హిందువులు

**వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే:** కుటుంబ వ్యవస్థ బలోపేతానికి హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని చలమారెడ్డిపల్లె భువనేశ్వరి పీఠాధిపతి నాగేంద్ర మహోదర స్వామి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత ఒంటిగారి వెంకటసుబ్బానాయుడు మాట్లాడుతూ.. హిందుత్వం కాలక్రమేణా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో చిన్న సవరణలు చేసుకుంటే హిందుత్వాన్ని నిలబెట్టుకోగలుగుతామన్నారు.
**వేముల:** సనాతన ధర్మ పరిరక్షణ కోసం వేములలో సోమవారం హిందువులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక శివాలయం వద్ద మంగళవారం సాయంత్రం నిర్వహించే సమ్మేళనానికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

## పోలీసు కార్యాలయ ఏవో మృతికి సంతాపం

ఏవో కేవీ రమణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** జిల్లా పోలీసు కార్యాలయ ఏవో కేవీ రమణ(56) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఒకటో పట్టణ సీఐ చిన్న పెద్దయ్య తదితరులున్నారు.

## రైతుబజారులో కూరగాయల ధరలు

**కడప వ్యవసాయం, న్యూస్‌టుడే:** రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా... బంగాళదుంప-40, క్యాబేజి-30, క్యారెట్-50, 65, బీన్స్-60, బీట్‌రూట్-40, కీర-40, దోస-40, దొండకాయలు-55, ముల్లంగి-35, అల్లం-80, కాలీఫ్లవర్-30, క్యాప్సికం-70, టమాట-34, మిరపకాయలు 38, వంకాయలు-25, బెండకాయలు-40, బీర-40, నాటుకాకర-50, హెచ్‌బి కాకర-38, మటిక్కాయ-40, చిక్కుడు-30, అలసందకాయలు-40, అనపకాయలు-45, ఉల్లిపాయలు-25.

## ఉపాధి పనులు రద్దు చేయొద్దు

**వల్లూరు, న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనిని రద్దు చేసి కరువు ప్రాంతమైన రాయలసీమ ప్రాంతానికి అన్యాయం చేయొద్దని కోరుతూ సోమవారం రాయలసీమ కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తహసీల్దారు శ్రీవాణికి వినతి పత్రాన్ని అందించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వల్లూరు తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందించినట్లు చెప్పారు.

## భూ సమస్యలపై 163 ఫిర్యాదులు

**తొండూరు, న్యూస్‌టుడే:** భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవో చిన్నయ్య తహసీల్దార్ బి.రామచంద్రుడిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు స్పందన లభించింది. ఆయా గ్రామాల్లోని రైతుల నుంచి 163 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించారు. విచారించి సత్వరమే న్యాయం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీటీ రామకృష్ణారెడ్డి, ఆర్ఐ నాగరాజు పాల్గొన్నారు.

## బ్రౌన్ గ్రంథాలయం సందర్శన

**వైవీయూ, న్యూస్‌టుడే:** నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు సోమవారం సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించినట్లు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి తెలిపారు. గ్రంథాలయంలోని పుస్తకాలను, తామ్రపత్రాలను, తాళపత్రా గ్రంథాలను చేతితో తయారు చేసిన రాతప్రతులను వారు పరిశీలించారు.

## సేవను ఉన్నత లక్ష్యంగా భావించిన సుబ్బారావు

చిన్నసుబ్బారావును సన్మానిస్తున్న వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్, పాలకమండలి సభ్యులు

**వైవీయూ, న్యూస్‌టుడే:** మానవ సేవను అత్యున్నత లక్ష్యంగా భావించి మానవసేవే మాధవసేవగా కొనసాగిస్తున్న వ్యక్తి వైవీయూ పాలకమండలి సభ్యుడు కొండపల్లి చిన్న సుబ్బారావు అని వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఇటీవల బద్వేలు ఆర్యవైశ్య వర్తక సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికైన సుబ్బారావును వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ తన కార్యాలయంలో సోమవారం ప్రత్యేకంగా సన్మానించారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, వైవీయూ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సీ సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించకుండా వారి సంక్షేమానికి కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కడప కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి న్యాయం చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో బాధ్య జేసీ విశ్వేశ్వరనాయుడుకు వినతి పత్రం అందించారు.

## విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించాలి

**కడప విద్య, న్యూస్‌టుడే:** విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోటిరెడ్డి మహిళా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సలీంబాషా అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో సోమవారం ఐక్యూ ఏసీ, కెరీర్ గైడెన్ సెల్ సంయుక్తంగా వేంపల్లె డిగ్రీ కళాశాలతో కలిసి కెరీర్ గైడెన్స్, రెజ్యూమ్ బిల్డింగ్ స్కిల్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ ధనుష్‌గుప్తా రెజ్యూమ్ బిల్డింగ్ ఆవశ్యకత గురించి విద్యార్థులకు జాబ్‌కి కావాల్సిన రెజ్యూమ్ తయారుచేయడానికి మెలకువలు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ గంగాధర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి, పీఎం ఉషా కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోటిరెడ్డి మహిళా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సలీంబాషా

## పుష్పగిరిలో ప్రమాదాల కట్టడికి చర్యలు

**వల్లూరు, న్యూస్‌టుడే:** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తరలి వచ్చే భక్తులు నదిలో దిగి ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కడప ఎస్‌డీపీవో( డీఎస్పీ) వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వల్లూరు, కమలాపురం ఎస్సైలు శివనాగిరెడ్డి, విద్యాసాగర్‌లతో కలిసి పుష్పగిరి కొండపై వెలసిన శ్రీలక్ష్మిసమేత చెన్నకేశవస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లను పరిశీలించారు.

## సమస్యలివి.. పరిష్కరించండి

### కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** సమస్యలే అజెండాగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఉన్నట్లుంది. సమస్యలు మాత్రమే తీసుకుంటున్నప్పటికీ పరిష్కారం మాత్రం అందనంత దూరంలో ఉందని పలువురు అర్జీదారులు వాపోతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఇన్‌ఛార్జి జేసీ విశ్వేశ్వరనాయుడు సూచించారు. కడప కలెక్టరేట్‌లోని సభాభవనంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లాలోని పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. జడ్పీసీఈవో ఓబులమ్మ, ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, రిమ్స్ పర్యవేక్షణాధికారి రంగస్వామి, కుడా కార్యదర్శి శిరీషా, ఏపీసీ ప్రేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

**నా భూమిని ఆన్‌లైన్ చేయించండయ్యా! :** సావిశెట్టిపల్లెలోని సర్వే నంబరు 86లో ఉన్న 1.81 ఎకరాల భూమిని నా పేరుతో కాకుండా వేరేవారి పేరుతో ఉందని, రెవెన్యూ, సచివాలయ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. బద్వేలు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడంలేదు. తక్షణమే స్పందించి నా భూమిని నా పేరుతో ఆన్‌లైన్ చేయించాలని వేడుకుంటున్నా... **- చంద్రశేఖర్‌రెడ్డి, వడ్డెమాను**

**వృద్ధులకు బియ్యం అందట్లేదు ;** కడపలో నివాసం ఉంటూటక్కోలు చౌక దుకాణ డీలరు వృద్ధులకు నిత్యావసర వస్తువులు ఇవ్వట్లేదు. ఇదేమని ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వట్లేదు. వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వీఆర్వోకు ఖాజీపల్లె, డేగనవాండ్లపల్లె ప్రజలు స్వచ్ఛందంగా చెప్పినా పరిష్కారం చూపలేదు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి వృద్ధులకు సకాలంలో బియ్యం, చక్కెర ఇచ్చేలా చేసి డీలర్‌పై చర్యలు తీసుకోవాలి. **- శ్రీనివాసరెడ్డి, ఖాజీపల్లె**

## వేతనాల మంజూరు కోరుతూ ఆందోళన

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు, నైట్‌వాచ్‌మెన్లు, మధ్యాహ్న భోజన పథక కార్మికులకు వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాలు వీధినపడుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి కనీస వేతనాలు అందకపోవడంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలోని కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. సంక్రాంతి పండుగలోగా కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు మద్దిలేటి, చాంద్‌బాషా, లక్ష్మీదేవి, లింగన్న, సులోచనమ్మ, రమణ, మస్తాన్‌బాషా, గౌసియా, నాగలక్ష్మి, కుమారి, నరసయ్య, మురళి, గుర్రప్ప పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

## కూటమి ప్రభుత్వంపై ఎంపీ విమర్శలు

**పులివెందుల, న్యూస్‌టుడే:** కూటమి నేతలు వైకాపా ప్రజాప్రతినిధులపై విమర్శలు చేయకుండా.. అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హితవు పలికారు. పులివెందులలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. పులివెందుల ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పురపాలక ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు కోరితే తెదేపా నియోజకవర్గ బాధ్యుడు, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చిత్తశుద్ధితో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ ఇసుక రవాణా, అక్రమ మైనింగ్, మట్కా, జూదం, దొంగతనాలు అధికమయ్యాయని ఆరోపించారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

(c) eenadu